శ్రీ కృష్ణావతార తత్త్వము



చిలుకూరు వెంకటేశ్వర్లు

శ్రీ కృష్ణావతార తత్త్వం

రచయిత :

చిలుకూరు వెంకటేశ్వర్లు

శ్రీ రామకృష్ణ తపోవనం

20, రేస్‌కోర్స్ రోడ్, గిండీ, చెన్నై - 600 032.

ఫోన్ : 9884708559

Email : chvenkateswarlu30@gmail.com

website : www.Sriramakrishnatapovanam.org

శ్రీకృష్ణావతారతత్త్వం

తొలి ముద్రణ : 2011

పబ్లిషర్స్ :
శ్రీ రామకృష్ణ తపోవనం
20, రేస్ కోర్స్ రోడ్డు,
గిండీ, చెన్నై – 600 032
ఫోన్ : 9884708559
Email : chvenkateswarlu30@gmail.com
website : www.sriramakrishnatapovanam.org

డి.టి.పి.
ఆర్. అనురాధా రఘురామ్ (9441186831)

నామాట

నేను శ్రీమద్రామాయణాన్ని వచన రూపంలో వ్రాసే ప్రయత్నం చేస్తున్నప్పుడు గురువరేణ్యులు శ్రీ కుప్పా వెంకట కృష్ణమూర్తి గారిని ఆ గ్రంథానికి ఉపయోగపడే REFERENCE పుస్తకాలేమైనా ఉంటే SUGGEST చెయ్యమని కోరాను. వారు వెంటనే స్పందిస్తూ శ్రీజనమంచి శేషాద్రి శర్మగారు "శ్రీరామావతార తత్త్వం" అన్న శీర్షికతో 12 భాగాలు వ్రాశారని, ప్రస్తుతమా గ్రంథం OUT OF PRINT కావడం వలన మొదటి భాగాన్ని XEROX తీయించి పంపుతానని, ఉపయోగంగా ఉంటే మిగిలిన భాగాలు కూడా XEROX తీయించి పంపుతానన్నారు. వారు అన్నట్లుగానే మొదటి భాగాన్ని XEROX తీయించి పంపారు. దానితో పాటు అదే రచయిత వ్రాసిన "శ్రీకృష్ణావతార తత్త్వం" కూడా పంపారు. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఆ గ్రంథాలు రెండూ చదివిన తర్వాత నాకిలా అనిపించింది. 1. శ్రీ శర్మ గారు ఎంతో శ్రమించి ఈ గ్రంథాలు వ్రాశారని, వారు చేసిన తత్త్వ విచారణ తీరు అద్భుతంగాను, ప్రమాణబద్ధంగాను ఉన్నాయని, 2. వారు జీవిత కాలమంతా మధించి వ్రాసిన ఈ గ్రంథాలు మలి ముద్రణకు నోచుకోకుండా మరుగున పడిపోవడం ఎంతో బాధ కలిగించింది. శ్రీరామావతార తత్త్వం గాని, శ్రీకృష్ణావతార తత్త్వం గాని ఈతరం ఆతరం అని కాకుండా అన్ని తరాల వారికి విధిగా అందజెయ్యాల్సిన పారమార్థిక నిధి అనిపించింది. అయితే సామాజిక అవసరాల్ని బట్టి భాషగాని, శైలిగాని, చెప్పే తీరులో గానీ కొద్దిపాటి మార్పులు అవసరం పడవచ్చు. 3. శ్రీ శర్మగారీ గ్రంథాల్ని సుమారు ఓ ఎనభై సంవత్సరాలకు పూర్వం వ్రాశారు. కాబట్టి వారు ఆ కాలానికి అనువుగా ఉండే గ్రాంథిక భాషలో వ్రాశారు. ఈ తరం వారికి ఆమోదయోగ్యంగా తేవాలంటే గ్రంథాన్ని సరళీకృతం చేస్తూ వ్యావహారికంలో వ్రాయాల్సి ఉంటుంది. అంతే కాకుండా వారు ఒక్కొక్క గ్రంథాన్ని 5000 పేజీల్లో వ్రాశారు. కొన్ని వర్ణనల నిడివి ని ప్రమాణాల సంఖ్యను తగ్గిస్తే గ్రంథాన్ని ఎక్కువ మంది పాఠకులు ఆసక్తిగా చదువుకొని లబ్ధి పొందగలరనిపించింది. నిజానికి ఇది ఓ నిరంతర ప్రక్రియ.

ధర్మానికి కీడు కలిగినప్పుడల్లా నేను అవతరిస్తూనే ఉంటానని భగవంతుడు స్పష్టం చేశాడు. భగవత్తత్త్వాన్ని పూర్తిగా తెలుసుకోవడం ఎట్లా సాధ్యం కాదో అట్లాగే భగవదవతారాల్ని

కూడా ఎవరూ లెక్క కట్టి చెప్పలేరు. భగవదవతారాలన్నింట్లోకీ శ్రీరామావతారం, శ్రీకృష్ణావతారం అతి పెద్దవి. ఈ అవతార పురుషులిద్దరూ మన మధ్యనే జీవిస్తూ ధర్మాన్ని వారు ఆచరించి మనచేత ఆచరింపజేసిన పరబ్రహ్మ స్వరూపులు.

శ్రీకృష్ణావతరాన్ని మహాయోగులే కాకుండా నాలాంటి పామరులు కూడా ఇష్టపడతారు. ఎందువల్లనంటే శ్రీకృష్ణుడు ప్రదర్శించిన అమానుషలీలలు ఆబాలగోపాలాన్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తుతాయి. అవతారపురుషులు మానవావతారం ధరించినా బహు కొద్దిమంది మహర్షులే వారిని భగవంతుడని గుర్తించగలిగారు. భగవదవతారాన్ని సామాన్యులు గుర్తించలేరని చెబుతూ భగవదవతారాన్ని, వేదం నటుడితో పోల్చి చెప్పింది. నటుడు ఏ పాత్ర ధరిస్తాడో ఆ పాత్రకు తగిన వేషభాషలతో ప్రేక్షకుల్ని అలరిస్తాడు. ఆ పాత్రలో ఏదైనా పాటగానీ, పద్యంగానీ పాడాల్సి వస్తే అతడు తన స్వంత ప్రతిభతో పాడుతాడు. అదే విధంగా భగవంతుడు మానవరూపంలో మన మధ్య తిరిగేటప్పుడు సుఖదుఃఖాలకు లోనైనట్లు నటిస్తాడు. కానీ ఏవైనా అమానుష లీలల్ని ప్రదర్శించాల్సి వచ్చినప్పుడు తన స్వంత తేజస్సు చేతనే ఆయా లీలల్ని ప్రదర్శిస్తాడు. వెంటనే తన ముగ్ధమోహన మాయచేత మరపుతో కప్పేస్తాడు. అట్లాగే ఆరేళ్ళ బాలకృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తాడంటే అది తన స్వంత తేజస్సు చేతనే ఆ లీలను ప్రదర్శించి మనలో భక్తి బీజాలు నాటడానికేనని మనం గ్రహించాలి.

శ్రీకృష్ణ లీలల్ని, తత్త్వాన్ని అనేక గ్రంథాలు అనేక విధాలుగా కీర్తించాయి. ఆంధ్రదేశంలో శ్రీభాగవతానికి లభించినంత ప్రచారం మరే గ్రంథానికి లభించలేదు. భగవత్తత్త్వాన్ని ఒక్కొక్క గ్రంథం ఒక్కొక్క కోణంలో ఆస్వాదించాయి. మనకుండే పనుల ఒత్తిడి వల్ల ఆయా గ్రంథాలన్నీ చదివి జీర్ణించుకోవాలంటే ఒక జీవిత కాలం సరిపోక పోవచ్చు. అట్లాగని శ్రీకృష్ణునిపై గల భక్తిని ప్రేమను తగ్గించుకోలేం గదా! అందువల్లనే శ్రీ శర్మగారు అరచేతిలో వైకుంఠం చూపించినట్లు ఆయా గ్రంథాల్లోని సారాన్నంతా ఒక చోటుకు చేర్చి 'శ్రీకృష్ణావతారతత్త్వం' గా మలచారు. మనం రుచి చూడబోయే గ్రంథాల వివరాలిలా ఉన్నాయి. 1. శ్రీ భాగవతం. 2. దేవీ భాగవతం 3. బ్రహ్మపురాణం 4. బ్రహ్మాండ పురాణం 5. బ్రహ్మవైవర్త పురాణం 6. నారద పురాణం 7. విష్ణుపురాణం 8. హరివంశం 9. గర్గసంహిత 10. కూర్మ పురాణం 11. పద్మ పురాణం 12. శ్రీమహాభారతం.

శ్రీ శేషాద్రి శర్మగారు సుమారు ఓ వంద సంవత్సరాలకు పూర్వం కడప మున్సిపల్ హైస్కూలులో ప్రధాన ఆంధ్రోపాధ్యాయులుగా పనిచేశారు. బ్రతుకు తెరువు కోసం

బడిపంతులుగా పనిచేసినా, జీవిత కాలమంతా శ్రుతుల్ని, స్మృతుల్ని భగవద్గీతాది గ్రంథాలను మథించి 'కావ్య స్మృతి తీర్థ' బిరుదాంకితులయ్యారు. రామాయణ, భారత భాగవతాది మూల గ్రంథాల్లో ఎన్నెన్ని శ్లోకాలున్నాయో శ్రీ శర్మ గారు కూడా అన్ని పద్యాలు వ్రాసి ఆంధ్రీకరించారు.

శ్రీ శర్మ గారీ గ్రంథ రచనను సంకల్పించి శ్రీ సత్యధ్యానతీర్థ స్వాముల వారి ఆశీర్వాద బలంతో శ్రీకారం చుట్టారు. కడపలోని శ్రేయోభిలాషులందర్నీ ఒకచోట చేర్చి తన గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహాయం కొరకు పూనుకొమ్మని కోరారట. కానీ గ్రంథరచన పూర్తి అయినా ఒక్కరూ ముందుకు రాకపోవడంతో కొంత మనస్తాపానికి గురి అయినా,

శా॥ ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై
యారంభించి పరిత్యజింతురు విఘ్నాయాయత్తులై మధ్యముల్,
ధీరులక్ష విఘ్ననిహన్యమాను లగుచున్ ధృత్యున్నతోత్సాహుల్
ప్రారబ్ధార్థము లుజ్ఝజగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్,

అన్న స్ఫూర్తితో, నిరుత్సాహపడకుండా, సరాసరి చెన్నపట్టణానికి పోయి శ్రీయుతులు కాశీనాథుని నాగేశ్వరరావు గారి సహకారాన్ని కోరారు. పంతులుగారు వీరి అభ్యర్థనను మన్నించి 'ఆంధ్రపత్రిక' లో గ్రంథ ముద్రణకు సహాయాన్ని కోరుతూ ఒక సంవత్సరం పాటు ఉచితంగా ప్రకటనలిచ్చారు. పంతులుగారు చేసిన ఈ సహాయంతో ఆంధ్రదేశం నలుమూలలనుండి గ్రంథ ముద్రణకు తగినంత సహాయం పొందగలిగారు.

శ్రీ శేషాద్రి శర్మ మాష్టారు తమ జ్ఞాన సంపదనంతా గ్రంథరూపంగా అనేక విశేషార్థాల్లో పొందుపరిచారు. అయితే ఈనాడు వారి గ్రంథాలేవీ పాఠకులకు అందుబాటులో లేక వారి శ్రమంతా మరుగున పడిపోయి 'ఈనగాచి నక్కలపాలు చేసినట్లయింది.' శ్రీరామ, శ్రీకృష్ణ భక్తులున్నంతకాలం వారి తత్త్వాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉంటూనే ఉంటుంది. అందుకని ఇటువంటి గ్రంథాలు అన్ని కాలాల్లోనూ భక్తులకు అందుబాటులో ఉండాలన్నది నిర్వివాదాంశం. అప్పుడే భగవద్భక్తి కూడా నిత్యనూతనంగా కళకళలాడుతూ ఉంటుంది.

రామకృష్ణ మఠం హైదరాబాదు వారు ఆధ్యాత్మిక ప్రచారమే ధ్యేయంగా పెట్టుకొన్న ధార్మిక సంస్థ. ఇటువంటి సంస్థలైతే భక్తుల అభీష్టం మేరకు పారమార్థిక గ్రంథాలను భక్తులకు అన్నికాలల్లోను అందుబాటులో ఉంచగలరనిపించింది. వెంటనే హైదరాబాదు రామకృష్ణ మఠం అధ్యక్ష మహాశయులు స్వామి జ్ఞానానంద మహరాజ్ గారిని కలసి నా

గ్రంథాల్ని ప్రచురించవలసిందిగా కోరడం జరిగింది. వారు నాకోరికను దయతో మన్నించి వెంటనే ఈ గ్రంథాన్ని ప్రచురణకు స్వీకరించారు. వారికి వినయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

శ్రీ శర్మగారి గ్రంథాలు చదువుతున్నంతసేపు పూర్వజన్మలో వారితో ఏదో గురుశిష్య సంబంధం ఉన్నదేమోననిపించింది. ఆ భక్తి భావంతో, శ్రీశర్మగారు పుట్టి పెరిగిన కడప పట్టణంలో వారిపేరుతో ఏదైనా జ్ఞాపిక నేర్పాటు చేసి గురు ఋణం తీర్చుకోవాలన్న సంకల్పం కలిగింది. తత్ఫలితంగానే కడప రామకృష్ణ మిషన్ వారికి ఓ లక్షరూపాయలు (Cheque No.38394, Dt.09.08.2008) విరాళంగా అందజేసి శ్రీ శర్మగారి పేరుతో బీద విద్యార్థులకు ఉపకార వేతనాలిమ్మని కోరాను. గత రెండు సంవత్సరాలుగా విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని తెలపడానికి ఎంతో సంతోషిస్తున్నాను.

శ్రీరామకృష్ణుల భక్తులంతా ఆయనొక పెద్ద Magnet అంటూ ఉంటారు. నా విషయంలో ఆ మాట అక్షర సత్యమైంది. అదెట్లాగో చూడండి.

సుమారు ఓ ఎనభై సంవత్సరాలకు పూర్వం కృష్ణాజిల్లాలోని తోట్లవల్లూరు గ్రామంలో శ్రీనోరి సూర్యనారాయణ, సీతమ్మ గార్లకు చివరి సంతానంగా జన్మించాను. మా పూర్వీకులంతా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టినవారే. కృష్ణానది మావూరి గుండానే ప్రవహిస్తూ ఉంటుంది. కృష్ణా నదికి రెండో ప్రక్క గుంటూరు జిల్లాలో పిడపర్రు అనే గ్రామం ఉంది. ఏటికి అడ్డంపడి వెళ్తే సుమారు రెండు మైళ్ళుంటుంది. ఆ వూళ్ళో చిలక్కూరు శ్యామలాంబ గారని ఓ వితంతువు ఉండేవారు. ఆమెకు సంతానం లేకపోవడం వలన ఎర్రగా బుర్రగా ఉంటానని నా తల్లి తండ్రుల మెడలు వంచి నా ఏడో ఏట నన్ను తన దత్తు కుమారుణ్ణిగా చేసుకుంది. అప్పటినుండి ఆమెయే నన్ను పెంచి పెద్ద చేసి పెళ్ళిపేరంటం చేసి ఓ ఇంటివాణ్ణి చేసింది.

డిగ్రీ చదువు కాగానే కులవృత్తి బడిపంతులుగా చేరమన్నారు. నేను కాదు కూడదన్నా. దాంతో దిగివచ్చి ఉద్యోగం పురుష లక్షణం కాబట్టి మరేదైనా ఉద్యోగం చేపట్టమన్నారు. వ్యాపారం తప్ప మరో పనేదీ చెయ్యనని ఒంటికాలి మీద నిలబడ్డాను.

అందరిమాట పెడచెవిన పెట్టి చిన్నా చితకా వ్యాపారాలెన్నో చేశాను. అనుభవశూన్యుణ్ణి కావటాన "బ్రాహ్మణ వ్యవసాయం, శూద్ర సంతర్పణ" అని ఎందుకన్నారో తెలిసొచ్చింది. పళ్ళు బిగపట్టుకొని మద్రాసు పోయి రంగులు తయారు చేసే Factory

స్థాపించి అక్కడే స్థిరపడ్డాను. ఓ నలభై ఏళ్ళు శ్రమపడి చేతులు కాల్చుకోకుండా, కాస్తో కూస్తో మిగులుచకోగలిగాను.

అప్పుడే శ్రీరామకృష్ణ పరమహంస తమ ప్రభావాన్ని నాపై చూపడం ప్రారంభించారు. ఉన్నకాస్తా 60వ ఏటనే భార్యా పిల్లలకు ఇప్పించి, ఓ మూడేళ్ళ పాటు తమ సేవల్లో నియుక్తుల్ని చేసుకున్నారు. ఆ తర్వాత సూదంటురాయి ఇనుపముక్కను పట్టి లాగినట్లు నన్ను భవసాగరం లోనుండి బయట పడేశారు. ఉన్నట్లుండి ఒకే ఒక్క క్షణంలో వైరాగ్యం చేత అందర్నీ వదిలేసి ఏకాంతవాసం (Solitude) లో అడుగుపెట్టేట్లు చేశారు. భార్యా పిల్లలపైనే కాకుండా ధనంపైన కూడా వైరాగ్యం కలిగేట్లు చేసారు. సుమారు ఓ దశాబ్దం నుండి నాతో ఆధ్యాత్మిక గ్రంథ పఠనంపై ఆసక్తి కలిగించారు. పొట్టపొడిస్తే అక్షరముక్క లేని నా చేత అక్షర వ్యవసాయం చేయించారు. అదెట్లాగంటారా, అనగా మద్రాసు చేరినప్పటినుండి తెలుగులో ఉత్తరాలు రాయడం కూడా అలవాటు తప్పిపోయింది. అటువంటి నాచేత రాత్రింబవళ్ళు శ్రీరామకృష్ణుల వారే దగ్గరుండి సుమారు పదివేల పేజీల వరకు భాగవత, భారత, రామాయణాది మహాగ్రంథాలన్నీ విసుగు విరామం లేకుండా వ్రాయించారు.

పై స్వీయ రామాయణం అంతా ఎందుకు వ్రాయాల్సి వచ్చిందంటే, నా వంటి లౌకికుడికి ఉన్న పళంగా వైరాగ్యం కలిగించే శక్తి ఆ మహా Magnet కు తప్ప మరొకరికుండదు. అట్లాగే పొట్ట పొడిస్తే అక్షరమ్ముక్క లేని నాబోటి వాడిచేత మహాగ్రంథాలెన్నింటినో పదివేల పేజీలకు పైగా వ్రాయించగల సత్తా ఆ 'మహా సూదంటు రాయి' కి మాత్రమే ఉంటుందని సవినయంగా మనవి చేస్తున్నాను. అట్టి భగవత్స్వరూపులైన శ్రీరామకృష్ణ పరమహంసల వారి పాదపద్మములకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

- చిలుకూరి వెంకటేశ్వర్లు.

ప్రస్తావన

శ్రీకృష్ణావతార తత్త్వమన్న పేరు వినగానే ఈ గ్రంథంలో ఏం చెప్పదలచుకున్నారో స్పష్టంగా తెలుస్తూనే ఉంది. భగవత్తత్త్వం ఇదమిత్థమని నిర్ణయించి చెప్పగలమా? అని అడిగేవాళ్ళుంటారు. శ్రుతులు కూడా భగవంతుని అవాఙ్మానస గోచరమనే స్పష్టం చేస్తున్నాయి. అట్లాగని ఊరకే ఉండగలమా? శ్రీరామకృష్ణ పరమహంస గారు “ ఈ జన్మలోనే భగవంతుని తెలుసుకొనే ప్రయత్నం చెయ్యకపోతే మానవ జీవితమే వ్యర్థమ” ని బోధించారు. మహాభక్తుడు పోతనగారు కూడా “ విబుధ జనుల వలన విన్నంత కన్నంత తెలియవచ్చినంత తేటపఱతు” అన్నారు. కనుక శక్తి మేరకు పరమాత్ముని తెలుసుకొనే ప్రయత్నం చేస్తే గానీ కృతకృత్యులు కాలేరు. అందువలన మనం కూడా ‘ఉడుతా భక్తి’ అన్నట్లుగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

ఈ గ్రంథంలో శ్రీకృష్ణుని కథలు ఆయా పురాణాల్లో నుండి గ్రహించి సాటి భక్తులకు అందించాలన్నదే ఈ ప్రయత్నం. గ్రంథానికి తత్త్వం అన్న పేరు సార్థకం కావాలంటే, ఆయా కథల్లోని సారాన్ని చర్చించి, వాటికి ప్రమాణములను చూపినచో తత్త్వమన్న శబ్దానికి సార్థకత ఏర్పడుతుంది. అయితే ఆ తత్త్వమంతా ఈ గ్రంథంలో కనిపిస్తుందా అని ప్రశ్నించకూడదు. ఎందువల్లనంటే, ఇటువంటి విషయాలనే ఈ గ్రంథం బోధిస్తోందని ముందే తెలుపుకున్నాం. అంతే కాకుండా పరమాత్ముడే ఆయా ఘట్టాల్లో ప్రమాణాల్ని చూపి తన పరమేశ్వర తత్త్వాన్ని నిరూపించుకున్నాడు.

ఈ పరిశ్రమ వలన లోకానికి, భక్తులకు మేలు కలుగుతుందా? అని ఆలోచించాలి. అయితే అందరూ ఒకే తీరున ఉండరు. ఒక్కొక్కరి కర్మ ఒక్కొక్క విధంగా ఉంటుంది. అట్లాగే కర్మము అనేక విధాలుగానూ ఉంటాయి. వాటిని నిర్ణయించడం సాధ్యం కాదు. అందువల్లనే భగవానుడు “ ...గహనా కర్మ కో గతిః” అని గీతాశాస్త్రంలో తెలిపాడు. ఆ కర్మ మూలంగా మనోగతులు తారుమారవుతూ ఉంటాయి. కనుక దైవభక్తి అన్నది కూడా ఒకే విధంగా ఉండదు. అందువల్లనే మనపెద్దలు బహువిధాలైన దేవతా మూర్తులను ఆరాధించే మార్గాల్ని ఉపదేశించారు. ఆ మార్గాలన్నీ కూడా సమాన ఫలాన్నే ఇస్తాయి గానీ, అందులో హెచ్చు తగ్గులుండవు. భగవద్గీత తొమ్మిదవ అధ్యాయం కూడా ఈ భావాన్నే తెలుపుతోంది. కాబట్టి భగవద్భక్తి దేవతా నామ భేదాలున్నంత మాత్రాన ఫలమివ్వడంలో హెచ్చుతగ్గులుండవు.

అయితే కర్మలు అనేక విధాలు కనుకనే ఒక్కొక్క పురాణంలో ఒక్కొక్క దేవతను ప్రధానంగా చెప్పబడుతుంది. అందులో ఏ పురాణాన్ని అనుసరించినా, ఏ దేవతను ఆరాధించినా సర్వదేవతా స్వరూపునిగా ధ్యానించే వారందరికీ ఫలం సమానంగానే ఉంటుందని స్పష్టమవుతోంది. శ్రుతి తాత్పర్యం ఇదేనని ముందే చెప్పుకోవడం జరిగింది. ఈ విషయాన్నే ఈ కృష్ణావతార తత్త్వం కూడా బోధిస్తుంది.

శ్రీకృష్ణ చరిత్ర :

శ్రీకృష్ణుని చరిత్ర పరమ పావనమైనది. భగవదవతారాలన్నింట్లోకి సాటిలేనిది. పామరులు గాని, నాస్తికులు గాని ఒకరిద్దరు శ్రీకృష్ణుని చరిత్రను నిందించినంత మాత్రాన ప్రపంచం ఏమీ తలక్రిందులు కాదు. ఎందువల్లనంటే వేదాలే శ్రీకృష్ణుని స్తుతించాయి. సజ్జనులకవే ప్రమాణాలు. కాబట్టి దానిని స్మరించినవారు తరించగలరు. గోపికా వస్త్రాపహరణము, రాసలీలల ఘట్టాలు నిందింపదగినవి కాదా? అని ప్రశ్నించే వారికి ఈ గ్రంథంలోనే ఆయా భాగాల్లో దీటుగా సమాధానం చెప్పబడింది. ఆ సమాధానాలు తృప్తి పరచ లేకపోతే అది నా దోషమే కాని ఆ పరాత్పరుని చరిత్ర దోషం కాదు.

ఈ గ్రంథానికి ప్రేరణ :

ఈ గ్రంథాన్ని వ్రాసి పేరు ప్రతిష్ఠలు సంపాదించు కోవాలని ప్రారంభించలేదు. శ్రీకృష్ణ చరిత్ర అనేక గ్రంథాల్లో నిక్షిప్తమై ఉంది. ఆ చరిత్రనంతా కలిపి ఒక చోటకు తేవాలన్న తాపత్రయమే ఈ గ్రంథ రచనకు ప్రేరణ. అంతకన్నా గొప్ప విశేషమేమీ లేదు.

ఒక్కొక్క గ్రంథంలోని కథ ఒక్కొక్క నీతిని బోధిస్తుంది. అటువంటి గ్రంథాలన్నింట్లో తెలిపిన కథలన్నింటినీ ఒకచోట చేర్చడమే నేను చేసిన పని. అంతకు మించి ఈ పరిశ్రమలో చెప్పుకోదగిన గొప్పదనమేమీ లేదు. ఈ పరిశ్రమ ఎవరికి ఉపయోగపడుతుందంటే, అన్ని గ్రంథాలు చదువకుండానే ఆయా గ్రంథాల్లోని శ్రీకృష్ణ చరిత్ర తెలుసుకోవాలనుకునేవారికి, నాకన్నా ఎక్కువ పాండిత్యం లేనివారికి, పామరులకు, విదుషీమణులు కాని పురంధ్రులకు, బాలురకు ఉపకారం కలిగించే భాగ్యం కలగటం నా పూర్వజన్మ సుకృతమని భావిస్తున్నాను.

అవతారములు :

శ్రీకృష్ణుడు భూమి మీద అవతరించే సమయాన, అంటే ద్వాపరం అంతమయ్యే ముందు దుర్మార్గులైన రాక్షసులతోను, అధర్మ పరులైన రాజులతోను భూభారం

పెరిగిపోయింది. ఆ విషయాన్నే భూదేవి మిగిలిన దేవతలందర్ని వెంటబెట్టుకొని వెళ్ళి బ్రహ్మతో మొరపెట్టుకొంది. ఇక్కడ భూమి అంటే మనం అనుకునే నేల, కొండలు, అడవులు కావు. భూమికి అధిష్ఠాన దేవత అని అర్థం. దానికి భగవంతుని సహాయం ఉంటేగానీ సాధ్యం కాదు. అందువల్లనే భగవంతుని ప్రార్థించారు. వారి ప్రార్థనను మన్నించి భగవంతుడు మానవ రూపంలో అవతరించాడు. అధర్మ ప్రవర్తకుల వలన బాధలు పడేవారిని ఆదుకోవడానికే భగవంతుడు అర్జునునికి గీతాశాస్త్రాన్ని బోధించాడు. అధర్మాన్ని అణచడం, ధర్మాన్ని ప్రతిష్ఠాపన చెయ్యడం, భావితరాల వారికి ఉపయోగపడే పద్ధతుల్ని ఉపదేశించడం వంటివే శ్రీకృష్ణుని అవతారఫలమని మనం తెలుసుకొని ఆ పరాత్పరుని ఆరాధించాలి. ఇదే అవతారఫలం.

గోపికలు :

శ్రీకృష్ణుని చరిత్ర తెలుసుకొనేటప్పుడు గోపికలకొక విశిష్ట స్థానమున్నదని అందరూ ఎరిగిన విషయమే. పదహారు వేలమంది గోపికలు శ్రీకృష్ణునికి భార్యలయ్యారు. అయితే గోపకుల భార్యలు శ్రీకృష్ణుని వరించారని ఎక్కడా లేదు. లోకం దృష్టితో చూస్తే బహుభార్యత్వం దోషమయితే కావచ్చునేమో కాని, శ్రుతులు దోషమని ఎక్కడా చెప్పలేదు. శ్రీరామావతారంలో శ్రీరాముని దివ్య మంగళ విగ్రహాన్ని చూసి మోహ పరవశులైన వారంతా శ్రీకృష్ణావతారంలో గోపికలయి వివాహం చేసుకున్నారని కొందరు, మహర్షులే గోపికా రూపాన్ని పొంది శ్రీకృష్ణుని వివాహమాడారని మరికొందరు అంటారు. ఏది ఏమైనా శ్రీకృష్ణుడు ఏకకాలంలో ఈ పదహారు వేలమందితో సంసార జీవితాన్ని గడిపినట్లు నారదమహర్షియే ప్రత్యక్షంగా చూసి వచ్చిన ఉదంతం ఈ గ్రంథంలోనే చోటుచేసుకొన్నది. కనుక శ్రీకృష్ణునికి బహుభార్యత్వ దోషంగాని, జారత్వ నిందగాని వాటిల్లదు. శ్రీకృష్ణుని చరిత్రను అంగీకరించే వాళ్ళు ఆయన మహిమల్ని కూడా అంగీకరించాలి. కొంత అంగీకరించి కొంత అంగీకరించమనడం బుద్ధిమంతుల లక్షణం కాదు. శ్రీకృష్ణుని అద్భుత లీలల చేతనే అతడు పరమాత్మ అని స్పష్టమవుతోంది. కనుక ఎవరు ఎన్నెన్ని ఆరోపణలు చేసినా భగవద్భక్తులు పరితపించాల్సిన పనిలేదు.

పురాణాలు :

శ్రీకృష్ణుని చరిత్ర అనేక గ్రంథాల్లో కనిపిస్తుంది. వాటిలో ముఖ్యమైనవి. 1. శ్రీభాగవతం 2. దేవీ భాగవతం 3. బ్రహ్మ 4. బ్రహ్మాండ 5. బ్రహ్మవైవర్త 6. నారద

7. కూర్మ 8. విష్ణు 9. పద్మ పురాణాలు 10. మహాభారతం 11. హరివంశం 12. గర్గసంహిత ఇంకా అనేక పురాణాల్లో శ్రీకృష్ణ చరిత్ర ఉంది.

ప్రతి పురాణం కూడా భగవత్కథల్ని తెలుపుతూనే ఉన్నది. అయితే అన్నీ ఒకే రీతిగా లేవు. అనేక భేదాలు కనిపిస్తాయి. ఎందువలన? శ్రోతల్ని బట్టి ఉపదేశాలుంటాయి. ఆ చెప్పేతీరు వినేవారి స్థాయిని బట్టి ఉంటుంది. అట్లాకాకుండా కొన్ని దాని మాహాత్మ్యాన్ని కూడా తెలుపుతాయి. కొన్ని కేవలం మాహాత్మ్యాన్నే తెలుపుతాయి. మరికొన్ని సారాన్ని గ్రహించి కథను చిన్న చిన్న మార్పులు చేసి దానినుండి గ్రహింపదగిన సారాన్ని వెల్లడిస్తాయి. పురాణాలు ఈ విధంగా భగవత్కథను తెలుపుతూ ఉంటాయి. కథలో వచ్చే చిన్న మార్పుల వలన ఒకదానికొకటి విరుద్ధంగా ఉన్నాయనిపిస్తుంది. కనుక చరిత్ర తెలుసుకొని అందులోని సారాన్ని గ్రహించి ఆ ప్రకారం భగవంతుణ్ని ఆరాధించడమే ప్రధానం.

రాధాదేవి :

శ్రీకృష్ణ చరిత్రలో రాధాంబిక ప్రభావం విశేషంగా ఉంటుంది. ఆ విశేషాలీ గ్రంథంలో కనిపిస్తాయి. కొందరు రాధాంబిక శ్రీకృష్ణుని భార్యయే కాదంటారు. మరికొందరు రాధ శ్రీకృష్ణునికి మేనత్త అవుతుందంటారు. ఈ రెండు వాదాలకు ప్రమాణాల్లేవు. రుక్మిణీ దేవియే శ్రీకృష్ణుని ధర్మపత్ని అంటారు. శ్రీభాగవతంలోను, విష్ణు పురాణంలోను బ్రహ్మ పురాణంలో రాధాదేవి ప్రసక్తి కనిపించదు. కాబట్టి రాధాదేవి పాత్ర కల్పితమని మరికొందరి వాదన. తెలిసినంతలో వీటికి సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తాను.

పురాణాలన్నింట్లోకి బ్రహ్మ పురాణం మొదటిదని అందరూ అంగీకరిస్తారు. ఇక భాగవతం అంటే శ్రీభాగవతమా? దేవీభాగవతమా? ఈ రెండూ ప్రమాణాలే. అయితే రాధాదేవి ప్రసక్తి ఏయే పురాణాలలో కనిపిస్తుందో విచారించి చూద్దాం. సాత్త్విక, రాజసిక, తామస పురాణాలని మూడు విధాలుగా ఉన్నాయి. ఇవి కాకుండా పద్మపురాణంలో రాధాదేవి మాహాత్మ్యం కనిపిస్తుంది. దేవీభాగవతంలో రాధాదేవి చరిత్రసారం ఉంది. పురాణాల్లో బ్రహ్మాండ, బ్రహ్మ వైవర్తములు, బ్రహ్మపురాణం చేరిఉన్నాయి. వీటిలో రాధాదేవి ప్రస్తావన విశేషంగాను, గోలోక ప్రస్తావన కొద్దిగాను ఉన్నది. బృహన్నారదీయంలో 82వ అధ్యాయంలో శ్రీరాధాకృష్ణ సహస్ర నామ స్తోత్రం ఉన్నది. 83వ అధ్యాయంలో మంత్రారాధనా పూర్వకంగా ఉన్నది. 88వ అధ్యాయంలో గోలోక నివాసి తత్త్వనిరూపణం కనిపిస్తుంది. బ్రహ్మ వైవర్త

పురాణంలోను శ్రీకృష్ణ జన్మఖండం లోను పూర్తిగా రాధాదేవి చరిత్ర ఉంది. పద్మ పురాణంలో రాధను గూర్చి విస్తారంగా ఉంది. భాగవతంలో గానీ, విష్ణు పురాణంలో గాని రుక్మిణీ మాహాత్మ్యమే ఎక్కువగా చెప్పబడింది.

సాత్త్విక పురాణాలందు విశేషించి రాధమాహాత్మ్యం చెప్పబడి ఉండగా రాధాదేవి శ్రీకృష్ణుని భార్యయే కాదనడం పొసగదు.

శ్రీ భాగవతంలో చెప్పనంత మాత్రాన అసలు రాధాంబయే లేదనడం సబబుకాదు. ఒక్క పురాణాల్లోనే కాదు, ఇతర ఆగమాలందు కూడా రాధాదేవి ప్రస్తావన ఉంది. ఈ విషయాలన్నీ ఆయా ఘట్టాల్లో వివరించడం జరిగింది.

ఉపదేశములు :

శ్రీకృష్ణుడు లోకానుగ్రహం కొరకు సకల ధర్మాలను ఉపదేశించాడు. భగవద్గీత, అనుగీతలు అర్జుననకుపదేశించినవి. భగవద్గీత దేశభాషలందే కాక విదేశీ భాషలలోకి కూడా అనువదించబడింది. మతస్థాపకులు ముగ్గురూ భగవద్గీతకు భాష్యం వ్రాశారు.

ఆంధ్రీకరణములు :

పరమ భాగవతులైన పోతనామాత్యులు భాగవతాది గ్రంథములను తెలుగులోకి అనువదించి కృతార్థులయ్యారు. ముక్కుతిమ్మన హరివంశం కథను చమత్కారంగా తెలుగులోకి అనువదించి చరితార్థులయ్యారు.

విషయసూచిక

శ్రీకృష్ణావతార తత్త్వం

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 2,3,4,5,6,7 &8 అధ్యాయాలనుండి గ్రహించబడింది.)

కంసుడు తల్లిదండ్రులను చెరసాలలో బంధించాడు. తన ప్రాణాలు హరించేందుకు శ్రీహరి యాదవులవంశంలో పుట్టబోతున్నాడని నారదుని వలన తెలుసుకొని ప్రలంబుడు, బకుడు, చాణూరుడు, తృణావర్తుడు, అఘాసురుడు, ముష్టికుడు, అరిష్టుడు, ద్వివిదుడు, పూతన, కేశి, నరకాసురుడు మొదలైన రాక్షసరాజులందర్నీ సమావేశపరచి యాదవులకు శాంతిలేకుండా చెయ్యమని ఆజ్ఞాపించాడు. కంసుడు, అతడి అనుచరులు పెట్టే బాధలు పడలేక యాదవులంతా కురు, పాంచాల, సాల్వ, కేకయ, విదర్భ, నిషిధ, కోసల దేశాలకు వలసపోయారు. కొందరు కంసుని రాజ్యంలోనే అతడికి విధేయులై బ్రతుకుతున్నారు.

వ్రేపల్లెలోకూడా యాదవులకు కంసుని వలన జీవితం దుర్భరమైపోయింది. భగవంతుడు వారి మొర ఆలకించి యోగమాయను పిలిచి "కల్యాణీ! వసుదేవుని భార్య, మరికొందరు కంసుని బారినుండి తప్పించుకోవాలని గోకులంలో నివసిస్తున్నారు. నా అంశను దేవకీ గర్భంలో ప్రవేశపెట్టాను. నువ్వా అంశను బయటకు తీసి రోహిణి గర్భంలో ప్రవేశపెట్టు. నువ్వు నందుని భార్య అయిన యశోద గర్భంలో ప్రవేశించు. దేశంలోని ప్రజలంతా నిన్ను కోరిన వరాలనిచ్చే అధిదేవతగా పూజిస్తారు. లోకంలో ఇక నిన్ను దుర్గ, కాళి, విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక, మాయ, నారాయణి, ఈశాని, శారద, అంబిక మొదలైన పేర్లతో ఆరాధిస్తారు" అన్నాడు.

రోహిణి యందు జన్మించేవాడు నీచేత సంకర్షించబడతాడు కాబట్టి సంకర్షణుడు అని పిలువబడతాడు. అతడు గోపికలందర్నీ సంతోషపెట్టేవాడవడం వల్ల రాముడని, అధిక బలసంపన్నుడు కావడం వలన బలభద్రుడని ప్రజలు పిలుచుకొంటారు. ఈలోగా కంసుని ఆస్థానంలోని వారంతా దేవకికి గర్భస్రావం అయిందని దుఃఖిస్తారు. భగవంతుడు ఈ విధంగా దేవకి, రోహిణుల గర్భాలలో ఒకే సమయాన జన్మించాడు.

పరమేశ్వరుడు వసుదేవుని హృదయంలో ప్రవేశించగానే వసుదేవుడు కోటి సూర్యుల తేజస్సుతో ప్రకాశించాడు. వసుదేవుడా తేజస్సును దేవకి యందు ప్రవేశపెట్టాడు. ఆ క్షణం నుండీ దేవకి తేజస్సు ఉదయించే సూర్యునిలా ప్రకాశించింది. ఆమెలో ఇంతకుపూర్వం ఉండే దుఃఖం గాని, దైన్యంగాని లేకుండా మాయమయ్యాయి. కంసుడామెలో వచ్చిన మార్పును గమనించాడు. శ్రీహరి దేవకిలో ప్రవేశించాడని ఊహించాడు. తన ప్రాణాలు తీసేవాడిని దేవకి భరిస్తోందని భయపడిపోయాడు.

ఆమెనే అంతం చేద్దామా? అని కూడా ఆలోచించాడు. కానీ ఆమె స్త్రీ అయిపోయింది. స్త్రీ హత్య చెయ్యడానికి మనసొప్పలేదు. పైగా సోదరి. అందునా గర్భవతి. అయితే ఆమె విషయంలో జాగ్రత్తగా ఉంటూ శిశువు బయటకు రాగానే అంతం చెయ్యడమొక్కటే మార్గమని భావించాడు. అప్పటినుండీ కంసునిలో ప్రాణభయం అధికమైంది. ఆకలి దప్పికలు లేకుండాపోయాయి. ఎటుచూసినా శ్రీహరే కనిపించేవాడు. బ్రహ్మమహేశ్వరాది దేవతలంతా వచ్చి ఇట్లా స్తుతించారు. ఓ దేవా! నువ్వు సత్య సంకల్పుడవు. సత్యవ్రతుడవు. సృష్టి, స్థితి, లయములందు సమ భావం కలవాడవు. పంచభూతాల ఉత్పత్తికి కారకుడవు నీవే. ప్రళయకాలంలో నువ్వొక్కడివే మిగిలి ఉంటావు. అందువల్ల సత్యాత్మకుడవైన నిన్ను శరణువేడుతున్నాను.

సీ॥ సత్యవ్రతుని నిత్య సత్య సంప్రాప్తి సాధనుఁ
గాలత్రయమునందుఁ గలుగువాని
భూతంబు లైదును బుట్టుచోటగు వాని
నైదుభూతంబులం దమరువాని
నైదు భూతంబులు నడఁగిన పిమ్మటఁ
బరఁగువానిని సత్యభాషణంబు
సందర్శనంబును జరిపెడు వానిని
నిన్నాశ్రయింతుము, నీ యధీన

– బమ్మెర పోతనామాత్యుడు

దేవా! ప్రకృతి ద్వారా సమిష్టి, వ్యష్టి శరీరాల రూపంలో ప్రపంచమనే మహావృక్షాన్ని సృష్టించావు. సత్త్వ రజస్తమోగుణాలే ఆ వృక్షానికి వేళ్ళు. పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారాలనే ఎనిమిది కొమ్మలుగా విస్తరించావు. పృథివి, జలము, తేజస్సు, మరుత్తు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారాలు సంధులయ్యాయి. ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు రసాలతో కూడిన సుఖదుః ఖాలనే ఫలాలను ప్రసాదించావు. జీవేశ్వరులనే పక్షుల జంటకు నివాసస్థానమయ్యావు. అట్టి భగవానునికి నమస్కరిస్తున్నాను. దేవా! నీ మాయచే కప్పబడిన జనులు నీ నిజస్వరూపాన్ని తెలుసుకోలేరు. అందువల్ల బ్రహ్మ రుద్రుల రూపంలో దర్శిస్తారు. నీ అనుగ్రహానికి పాత్రులైన వారికి మాత్రమే జ్ఞానాన్ని ప్రసాదించి నువ్వు అద్వితీయుడవని, సర్వ స్వతంత్రుడవని తెలుసుకొనేట్లు చేస్తావు.

మాధవా! ఈ భూమి నీ పాదపద్మాలనుండి ఉద్భవించింది. అటువంటి ఆ పృథ్వి అంతా దుష్టులతోను, దుర్జనులతోను నిండిపోయింది. భూదేవి ఆ భారాన్ని భరించలేకుండా ఉంది. నువ్వు పూర్వం మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, హయగ్రీవ, హంస, పరశురామ, రామ, వామన అవతారాలను స్వీకరించి మమ్మల్నందర్నీ, ముల్లోకాలను, పృథివిని రక్షించావు. పరమ పావనమైన నీ పాదములు ఎప్పుడు ఈ భూమి మీద మోపుతావో ఆ వెంటనే భూదేవి హృదయవేదనంతా తొలగిపోతుంది.

అంతట బ్రహ్మ దేవకీ దేవితో "తల్లీ! దేవకీ! మాకు శుభాలు కలుగజేయటానికే సాక్షాత్తూ పరమ పురుషుడైన ఆ భగవానుడు శ్రీకృష్ణ బలరాముల రూపాల్ని ధరించి, యాదవుల దుఃఖాల్ని కూడా తొలగించగలడని" తెలిపి అదృశ్యుడయ్యాడు.

శ్రీకృష్ణావతారం

దిక్కులు, గ్రహాలు, నక్షత్రాలు శుభస్థానాల్లో ఉండగా అర్ధరాత్రి సమయంలో పద్మలోచనుడు, నాలుగు భుజాలతో, శంఖచక్రగదాదుల్ని ధరించి, పీతాంబరధారియై, వైడూర్యాది మణులతో శోభిల్లుతూ ఉండే బాలుని రూపంలో వసుదేవుని యెదుట సాక్షాత్కరించాడు.

శ్రీహరిని పుత్రరూపంలో చూసిన వసుదేవుని నేత్రాలనుండి ఆనందభాష్పాలు ప్రవహిస్తూ ఉండగా శ్రీకృష్ణుని దర్శించిన సంతోషంలో మనస్సులోనే బ్రాహ్మణులకు పదివేల గోదానాలు చేశాడు. శ్రీహరిని వసుదేవుడీవిధంగా స్తుతించాడు.

దేవా! నువ్వు ప్రకృతికి అతీతుడవు. సర్వాంతర్యామివి. నీ ఇచ్ఛాశక్తియే మాయారూపంలో ఉంటూ నువ్వు చెప్పినట్లల్లా నడిపిస్తూ ఉంటుంది. ఆ మాయయే గుణత్రయ ప్రభావంచేత జగత్తును సృష్టించి నడిపిస్తోంది. అట్టి నీ మాయ, నీ శక్తి స్వరూపమే. శక్తిని విడిచి శక్తిమంతుడుండడు. శక్తిమంతుని విడిచి శక్తి ఉండదు. దేవకి గర్భమందు నీ ప్రవేశం కూడా నీ లీలయే కాని మరొకటి కాదు. ఈ రహస్యం తెలియనివారు నువ్వు దేవకి గర్భంలో ప్రవేశించి అందరిలాగానే అక్కడ నుండి జన్మించావని అనుకుంటారు. నిజానికి నువ్వు దేవకి గర్భం నుండి రాలేదు. అది ఎట్లాగంటే, ఆకాశం సర్వవ్యాపకం. అదిలేని చోటు లేదు. అయినప్పటికీ సూర్య చంద్రాదుల వలన ఆకాశం నీళ్ళల్లో ఉన్నట్లు తెలుస్తుంది.

దేవా! కారణం ఉన్నప్పుడు కార్యం కలుగుతుంది. యశోదాదులు కారణమైతే బ్రహ్మాండం కార్యమవుతుంది. బ్రహ్మాండం లోపల ఉండే మహదాదులన్నీ అంతర్భూతాలే గదా! అనగా అవన్నీ మాయకల్పితాలే. పదార్థాలన్నీ గుణముల యొక్క కార్యాలు. నువ్వు గుణాలలో ఉన్నా అవి నిన్నెరుగవు. ఇంద్రియాలున్నాయంటే, అవి పదార్థాల్ని గ్రహించడం వరకే. కాబట్టి నువ్వు ఇంద్రియాలకు అతీతుడవు.

దేవా! అఖిలేశ్వరా! నువ్వు భూలోకాన్ని రక్షించేందుకు నా ఇంట జన్మించావు. క్షత్రియులన్న పేరుతో అసురులెంతోమంది భూమికి భారమయ్యారు. వాళ్ళందర్నీ నాశనం చెయ్యి. నువ్వు దేవకి గర్భాన జన్మిస్తున్నావని తెలుసుకున్న కంసుడు నీకన్న ముందు పుట్టిన వాళ్ళందర్నీ సంహరించాడు. ఇప్పుడు నీ జనన వార్త తెలుసుకొని కంసుడు హుటాహుటిన ఇక్కడకు వస్తాడు" అంటూ శ్రీహరిని స్తుతించాడు.

అప్పుడు దేవకి ఇలా అంది, "దేవా! నువ్వు కారణాలన్నింటికీ మూలకారణానివి, కాలాతీతుడవు. బ్రహ్మరుద్రాదులకైనా కాలపరిమితి ఉందిగానీ నీకులేదు. మహాభూతాలన్నీ సూక్ష్మంలోను, ఆ సూక్ష్మం ప్రధానంలోను విలీనమవుతాయి. కానీ నువ్వు మాత్రం మిగిలి ఉంటావు. అందుకే నీకు శేషుడు అనే

పేరు వచ్చింది. దేవా! కాలమంటే నీ లీలావిశేషమే గాని, లోకులనుకునే మాసాలు, సంవత్సరాలు కాదు. అట్టి నీ పాదపద్మాలనే ఆశ్రయించాను.

దేవా! నీ అలౌకిక రూపాన్ని సామాన్యుల నేత్రాలకు కనిపించకుండా చెయ్యి. ఎందువల్లనంటే నువ్వు నాకు జన్మించినట్లు దుర్మార్గుడైన ఆ కంసుడు తెలుసుకుంటే నీకేదైనా అపకారం తలపెట్టవచ్చు. కావున నీ అలౌకిక రూపాన్ని ఉపసంహరించు" అన్నది. దేవకీ వసుదేవుల మాటలు విన్న భగవానుడు

"దేవీ! స్వాయంభువ మన్వంతరంలో నువ్వు పృశ్ని గాను, వసుదేవుడు సుతపుడు గాను జన్మించారు. అప్పుడు సుతపుడు ప్రజాపతిగా ఉండేవాడు. అప్పుడు మీరిద్దరూ నా గూర్చి తపస్సు చేశారు. నేను మీ తపస్సుకు మెచ్చి ఇదే రూపంతో దర్శనమిచ్చాను. మీరప్పుడు నన్ను ముక్తిని కోరుకోలేదు. నావంటి పుత్రుడు కావాలని కోరుకున్నారు. నాకంటే అధికులుగాని, నాకు సాటి అయినవారుగాని ఎవరూ ఉండరు. అందువల్ల పృశ్ని గర్భుడన్న పేరుతో నేను మీకు పుత్రుడుగా జన్మించాను. మీరు రెండవ జన్మలో అదితి, కశ్యపులుగా జన్మించారు. ఆ జన్మలో మీకు ఉపేంద్రుడుగా జన్మించాను. ఆ జన్మలో నన్నంతా వామనుడన్న పేరుతో పిలిచేవారు. ఇది మీకు మూడవ జన్మ. మీకు పూర్వ జన్మల జ్ఞాపకాలు తెలియజెప్పటానికే ఈ రూపంలో దర్శనమిచ్చాను. ఇదే మీకు ఆఖరు జన్మ. మరణానంతరం మీరిద్దరూ ముక్తిని పొందగలరు.

అమ్మా! కంసుని గూర్చి భయపడకు. అతడు మేలుకొనే లోపుగా నన్ను గోకులంలో యశోద వద్దకు చేర్చండి. అక్కడ యశోదకు నా మాయాశక్తి ఆడశిశువుగా జన్మించి ఉంటుంది. ఆ శిశువును ఇక్కడకు తీసుకుని రండి. కావలి వాళ్ళు మీకు అడ్డుచెప్పరు. యమునా నది మీకు దారి ఇస్తుంది. మీరీ కార్యాన్నంతా క్షణాల్లో ముగిస్తారు. నేనిక ప్రాకృత శిశువుగా మారిపోతున్నాను" అని శిశువుగా మారిపోయాడు.

శ్రీహరి భగవానుడు శిశువుగా మారిపోగానే వసుదేవుడు ఆ బాలుని తీసుకొనిపోయి యశోద ప్రక్కలో పడుకోబెట్టి, ఆమె ప్రక్కలో ఉన్న ఆడశిశువును తెచ్చి దేవకి ప్రక్కలో పడుకోబెట్టాడు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

క॥ ఆ పురిటి యిల్లు మొవడి, పాపనిఁ కొనుచుఁ బఱరచెననుచున్
చూపింప నందు భార్యకుఁ, బాప యగుచు యోగమాయ ప్రభులించెన్నృపా.

-- బమ్మెర పోతనామాత్యుడు

వసుదేవుడా పాపను దేవకి ప్రక్కలోకి చేర్చగానే వసుదేవుని కాళ్ళకు సంకెళ్ళు బిగుసుకున్నాయి. ద్వారాలన్నీ మూసుకుపోయాయి. ద్వారపాలకులు నిద్రలోంచి లేచి కూర్చున్నారు. దేవకీ వసుదేవులు కూడా జరిగిందంతా మరచిపోయారు.

యోగమాయ అంతర్ధానం - కంసుని తడబాటు :

చెరసాల ద్వారాలన్నీ పూర్వం వలెనే బంధించబడ్డాయి. దేవకి గదిలోనుండి శిశువు ఆక్రందనం వినిపించింది. భటులంతా పరుగున పోయి కంసునకీవార్త తెలిపారు. ఈ వార్త కోసమే కాచుకొని కూర్చున్న కంసుడు ఖడ్గాన్ని చేతపట్టుకొని చెరసాల వద్దకు వచ్చాడు.

దేవకి ఆడశిశువును అన్న చేతిలో పెట్టి "అన్నా! ఇది ఆడశిశువు. నువ్వు భయపడినట్లు మగశిశువు కాదు. ఈ ఆడశిశువు వలన నీకు ప్రాణాపాయం ఉండదు. అందువల్ల నీ మేనకోడలిని చంపవ"ద్దని ప్రార్థించింది. దేవకి ఎంత దీనంగా రోదించినా కంసుని మనస్సు చలించలేదు. ఆ శిశువును నేలకేసి బలంగా కొట్టాడు.

యోగమాయ అయిన ఆ శిశువు నేలపైన పడకుండా ఆకాశమార్గాన ఎగిరి ఎనిమిది చేతులతో దర్శనమిచ్చింది.

ఆ దేవి వెలలేని ఆభరణాల్ని ధరించింది. పీతాంబరధారియై ఎనిమిది చేతుల్లోను ధనుస్సు, శూలము, బాణములు, చర్మము, ఖడ్గము, శంఖము, గద, చర్మములను ధరించింది. ఆ యోగమాయ కంసునితో ఇలా అంది.

"మూర్ఖుడా! నిన్ను సంహరించేవాడు ఇప్పటికే పుట్టి ఇంకోచోట పెరుగుతున్నాడు. నీకు చావుతప్పదు. శిశువుల్ని వృథాగా ఎందుకు చంపుతున్నావు?" అని అంటూనే ఆకాశమార్గాన పోయి కాశీలో అన్నపూర్ణగాను, మిగిలిన క్షేత్రాల్లో అనేక నామరూపాలతో దేవదేవిగా ఆరాధించబడుతోంది.

యోగమాయ మాటలతో కంసునిలో ఉన్న మత్తు వదలిపోయింది. ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత పశ్చాత్తాపం కలిగింది. దేవకీ వసుదేవులతో "సోదరీ! ఆనాడు అశరీరవాణి మాటలకు మోసపోయాను. నాలో రాక్షస ప్రవృత్తి విజృంభించింది. నిర్దయతో నీ సంతానాన్నంతా చంపాను. ఈ శిశుహత్యా పాతకం నన్ను విడిచిపెట్టదు. వసుదేవా! స్నేహితుడా! జరిగిపోయిన శిశుహత్యలకు విచారించకండి. ప్రారబ్ధానికి తగినట్లు జరిగిపోయిందని మనసు రాయి చేసుకోండి. ప్రాణాలెప్పుడూ దైవాధీనాలే. ఇందులో నేను కేవలం నిమిత్తమాత్రుణ్ణి మాత్రమే.

లోకంలో మట్టితో చేసిన కుండలు పగిలిపోయినా మళ్ళీ మట్టిలోనే కలసిపోతూ ఉంటాయి. అట్లాగే పంచభూతాలతో చెయ్యబడ్డ ఈ శరీరం నశించినా జీవాత్మ ఎప్పుడూ వికారం చెందదు. అది తెలుసుకోలేక జీవాత్మ బుద్ధితో బంధుపుత్రుల దేహాలపై బంధాలు కల్పించుకొని దుఃఖిస్తూ ఉంటారు.

ఆత్మ జ్ఞానం పొందని వాళ్ళంతా నేను చంపాననో, లేక నేను చంపబడ్డాననో అనుకొని దుః ఖిస్తూ ఉంటారు. ఇప్పుడే మిమ్మల్ని బంధవిముక్తుల్ని చేస్తున్నాను.

కంసుని మాటలు విన్న వసుదేవుడు నవ్వుతూ "ప్రాణులకు అహంభావం అనేది అజ్ఞానం వలన ఏర్పడుతుంది. జీవాత్మ భావం వలన 'నేను' 'నువ్వు' అనే భేదభావం కలుగుతోందని నువ్వు చెప్పిన మాట యథార్థమైనదే. ఆ భేదభావం వల్లనే ప్రాణులు సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు, లోభమోహాదులకు లోనై చంపడం హింసించడం జరుగుతోంది. పారమార్థికంగా ఆలోచిస్తే వీటన్నింటికీ సూత్రధారుడు వేరుగా ఉన్నాడని, మనం నిమిత్తమాత్రులమేనని తెలుస్తుంది.

శా॥ *బావా! నీవచనంబు నిక్కము సుమీ, ప్రాణుల్ గతజ్ఞానులై*
నీవే నంచును లోభ మోహ మద భీనిర్మితతా మోద శో

కావేశంబుల నొండొరుం బొడుతు రేకాకారుఁడై సర్వ రూ
పావిష్టుండగు నీశ్వరుం దెలియలేర న్యోన్య విభ్రాంతులై.

-- బమ్మెర పోతన

దేవకీ వసుదేవులు కంసుని మాటల్ని విన్నారు. గతాన్నంతా మరచి తిరిగి స్నేహభావంతో కంసుని సౌధానికి వెళ్ళారు. మర్నాడు మంత్రులందర్నీ పిలిచి "నన్ను చంపేవాడెక్కడో పెరుగుతున్నాడు. నాకు మరణం తప్పదు" అని యోగమాయ చెప్పినదంతా వాళ్ళకు చెప్పాడు. మంత్రులు కంసునికి అనేక విధాలుగా ధైర్యం చెప్పారు. గ్రామ గ్రామాలకు మన భృత్యుల్ని పంపుదాం. పది దినాల వయసున్న పిల్లల్నందర్నీ చంపించేద్దాం.

క॥ *ఇట్టయినఁ దడయనేటికిఁ? పట్టణముల మంధలందుఁ బల్లెలనెల్లన్*
బుట్టెడి పెరిగెడి శిశువులఁ, బట్టి వధియించెదము మమ్ముఁ బంపు మధీశా!

రాజా! దేవతలంతా యుద్ధమంటే భయపడ్తారు. బయట ఎన్ని ప్రగల్భాలైనా పలుకుతారు. నువ్వు ధనుస్సు పట్టుకొని నిలబడితే పారిపోయి విష్ణువును శరణు వేడుకుంటారు. కనుక రోగలక్షణాలు కనిపించగానే దాన్ని నిర్మూలించాలే గాని ఉపేక్షించరాదు. గోవులున్నచోట, బ్రాహ్మణులుండే చోట, తపస్సు, సత్యం, దమము, శమము, శ్రద్ధ, సహనము, యజ్ఞము ఎక్కడైతే ఉంటాయో అక్కడల్లా విష్ణువుంటాడు. కాబట్టి మనం గోవుల్ని, బ్రాహ్మణుల్ని, తపస్వుల్ని హింసిద్దాం. యజ్ఞాలు యాగాలు ధ్వంసం చేద్దాం. దాంతో మనం విష్ణువును అవమానపరచినట్లే అవుతుంది. కాబట్టి వెంటనే పని మొదలు పెడ్తామని సలహా ఇచ్చారు.

నంద వసుదేవుల సమావేశం :

పుత్రోదయం నందుడికెంతో ఆనందాన్నిచ్చింది. వ్రేపల్లెలోని గోపికలంతా సంతోషంతో వేడుకలు జరుపుకున్నారు. వ్రజ మంతా పండుగ వాతావరణం నెలకొంది. అంతా ఇళ్ళు అలుక్కొని ముగ్గులు పెట్టారు. మామిడాకుల్తో తోరణాలు కట్టారు. పశువులన్నింటినీ శుభ్రంగా కడిగారు. కొమ్ములను బంగారు తాపడాలతో అలంకరించారు. సామూహికంగా నృత్యాలు చేశారు.

నందుడు స్నానాదికాలు ముగించుకొని బ్రాహ్మణుల చేత పుణ్యాహవాచం చేయించి, పుత్రునికి జాతక కర్మలు చేయించాడు. విప్రులకు రెండు లక్షల గోవుల్ని, కనక, రత్న వస్త్రాలను విరివిగా దానం చేశాడు.

దానాదులు చెయ్యడంలో ఆంతర్యం ఏమంటే, ప్రారబ్ధ పాపఫలరూపంలో ఆత్మను మనస్సు ఆవరించి ఉంటుంది. దోషాలు రకరకాలుగా ఉంటాయి. కొన్నింటిని స్నానంతో శుద్ధి చేసుకోవచ్చు. కొన్నింటిని శౌచంవలన, కొన్నింటిని సంస్కారాల వలన, కొన్నింటిని తపస్సు వలన, కొన్నింటిని దానం వలన తొలగించుకోవచ్చు. దోషాలు తొలగిపోగానే మనస్సుకు శుద్ధి కలుగుతుంది. ఆత్మకు పట్టిన దోషం తొలగడం వలన ఆత్మ శుద్ధి కలుగుతుంది. మనస్సు శుద్ధి చేత సంతోషం ఆత్మ శుద్ధి చేత జ్ఞానం కలుగుతాయి. అందువల్ల దానాలు చేస్తారు.

గోపకులంతా తమ ఆనందాన్ని తెలియజెయ్యటానికి కానుకలిచ్చారు. గోపికలంతా బాలునిచూచి చిరకాలం వర్ధిల్లమని దీవించారు. మమ్మల్ని కాపాడమని వేడుకున్నారు. నృత్య సంగీతాలతో వ్రేపల్లె అంతా మారుమ్రోగింది. నందుడు అతిథులందర్నీ సత్కరించిపంపాడు.

శ్రీహరి గోకులంలో నివసించటానికి రాగానే ఆయనతోపాటు లక్ష్మీదేవి కూడా ఇక్కడే నివసించాలని వచ్చింది. ఆమె వచ్చి స్థిరపడగానే వ్రజమంతా సర్వలక్ష్మీమయమై రాధాదేవి ఆవిర్భవించింది.

నందుడు ప్రతి సంవత్సరం కంసుడికి కప్పం కట్టి తన విధేయతను ప్రకటించుకోవాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం కూడా గోకులాన్నంతా గోపకుల సంరక్షణలో వదిలి తాను కప్పం ధనం తీసుకొని మథురకు ప్రయాణమై వెళ్ళాడు. నందుడు వచ్చినట్లు తెలుసుకొని అతడి ప్రాణమిత్రుడైన వసుదేవుడు వెళ్ళి కౌగలించుకొని సాదరంగా ఆహ్వానించాడు. "సోదరా! నందరాజా! నువ్వు సంతానం పైన ఆశలు వదులుకున్నావు. అటువంటి సమయంలో భగవదనుగ్రహంతో పుత్రోదయం అయిందని విని ఎంతో సంతోషించాను. నిన్ను చూడగానే ప్రాణాలు లేచి వచ్చినట్లయింది. మన కలయిక ఎంత ఆనందాన్నిచ్చినా ఇప్పుడో కాసేపటికో విడిపోవాల్సిందేగదా అని విచారిస్తున్నాను. ఏమైనా ఈ కలుసుకోవడాలు, విడిపోవడాలు శాశ్వతమైనవి కావు. కర్మానుసారం ప్రవాహాల్లో కొట్టుకుపోయే గడ్డిపరకలాంటి వాళ్ళం. సమయం రాగానే ఎవరి దారిన వాళ్ళు పోవాల్సినవాళ్ళమే గదా.

కం॥ సంతతి లేదని మును ఘన, చింతనముల మునిగి ముదిసి చిక్కిన నీకున్
సంతతి గలిగెను భాగ్యము! సంతతిహీనునికి సౌఖ్య సంతతి గలదే?

– బమ్మెర పోతనామాత్యుడు

నందా! నువ్విప్పుడు నివాసం బృందావనానికి మార్చావని విన్నాను. అక్కడ పశువులు ఆరోగ్యంగా తిరుగుతున్నాయా? పచ్చగడ్డి బీడులు పుష్కలంగా ఉన్నాయా? రోగాలు రొప్పులు లేకుండా పాలు సమృద్ధిగా ఇస్తున్నాయా? వర్షాలు సకాలంలో కురిసి నేల సస్యశ్యామలంగా ఉంటోందా?

సోదరా! రోహిణి, యశోదలు, వారి శిశువులు క్షేమంగా ఉన్నారు గదా? మీతో వారు అరమరికలు లేకుండా తల్లిదండ్రులతో ఉన్నట్లు చనువుగా మెలుగుతున్నారు గదా? బంధువుల కోసం సంపాదించిన ధర్మార్థ కామాలు వాస్తవమైనవని శాస్త్రాలు చెబుతున్నాయి. అట్లాకాకుండా అవన్నీ తమ స్వప్రయోజనాలకే వాడుకుంటే అవి సుఖాలనివ్వవు" అని వసుదేవుడు అన్నాడు.

నందుడిట్లా అన్నాడు. "అన్నా! నీకు, దేవకికీ పుట్టిన బిడ్డలందర్నీ కంసుడు సంహరించాడు. చివరగా పుత్రిక కలిగిందట గదా! పోనీ ఆ బాలికనైనా మీకు దక్కనివ్వలేదు. ఆ పిల్ల అంతా చూస్తూ ఉండగానే ఆకాశమార్గాన ఎగిరిపోయి అంతర్ధానమయిందట. ఇదంతా చూస్తుంటే ప్రాణికోటి అంతా అదృష్టంపైనే ఆధారపడి ఉంటుందన్నమాట నిజమేననిపిస్తోంది. ఈ నిజాన్నెరిగిన వారు సుఖదుః ఖాల్ని సమభావంతో చూస్తారు."

వసుదేవుడన్న మాటల్లోని అంతరార్థాన్ని నందుడు గ్రహించినట్లు లేదు. బలరామకృష్ణులు తమ బిడ్డలేనన్న భావనలో ఉన్నాడు. వసుదేవుడు, "మిత్రమా! నందరాజా! కంసునికి పన్ను చెల్లించే సందర్భంలో నువ్వు మథురకు రావడం, నేను నిన్ను కలుసుకోవడం జరిగాయి. నాకు చాలా ఆనందంగా ఉంది. సోదరా! నువ్వు గోకులంలో లేకుండా ఉండటం మంచిది కాదు. ఏ క్షణంలో ఏ అనర్థమైనా జరుగవచ్చు. కావున నువ్వు వెంటనే వ్రజకు చేరుకో" అన్నాడు.

పూతన సంహారం :

పూతన ఒక రాక్షసి. అది కామరూపిణి. ఆమె కంసుని అధీనంలో ఉంటుంది. కంసుడామెను పిలిపించి "పూతనా! నీ కామరూప విద్యల్ని ప్రదర్శించే సమయం వచ్చింది. నన్ను సంహరించే బాలుడొకడు పుట్టి పెరుగుతున్నాడు. కావున నువ్వు గ్రామగ్రామానికి వెళ్ళు. ప్రతి ఇల్లు సోదా చెయ్యి. ఎవరింట్లో పది రోజుల పసిగుడ్డు ఉంటుందో ఆ శిశువును నువ్వు నిర్దాక్షిణ్యంగా చంపెయ్యి" అని ఆదేశించాడు.

పూతన కామరూప విద్య చేత సుందరమైన యువతి రూపాన్ని ధరించింది. పల్లెలు పట్టణాలు తిరుగుతూ అనేకమంది బాలకుల్ని చంపి ఈ రోజునే గోకులంలో ప్రవేశించింది.

పూతన అందమైన స్త్రీ రూపాన్ని ధరించింది. బిగుతైన పిరుదులు, బరువైన స్తనద్వయం. సన్నని నడుము, పలుచనైన పట్టు వస్త్రాలు, విలువైన ఆభరణాలను ధరించి నందుని ఇంట్లోకి ప్రవేశించింది. చూసిన గోపికలంతా లక్ష్మీదేవియే శ్రీకృష్ణుని వెతుక్కుంటూ వచ్చిందని హాస్యాలాడారు.

శిశుహంతకి పూతన స్వేచ్ఛగా నందుని ఇంట్లో ప్రవేశించింది. మంచంపై పడుకున్న శ్రీకృష్ణుని చూసింది. వెంటనే ఒడిలోకి తీసుకుంది. విషపూరితమైన తన స్తనాన్ని శ్రీకృష్ణుని నోటికి అందించింది. భగవానుడు వచ్చిందెవరో తెలుసుకున్నాడు. స్తనాన్ని నోటి కందించగానే ప్రాణానికి మూలమైన హృదయాన్ని పట్టి గట్టిగా పీల్చాడు. ఆ రాక్షసి మరణ యాతనను భరించలేక "చాలు, చాలు, విడిచిపెట్టు" అంటూ కేకలు పెట్టింది. అంతలోనే నోరు తెరుచుకొని, జుట్టు విరియబోసుకొని రాక్షస రూపంలో చచ్చిపడింది.

క॥ *నిబ్బరపు దప్పి మంటలు, ప్రబ్బిన ధృతిలేక నేత్రపదహస్తంబుల్*
గొబ్బున వివృతములుగ నా, గుబ్బ చున్నట్టి కూఁతఁ గూలెన్ నేలన్.

ఆమె ముఖాన రెండు పెద్ద కోరలున్నాయి. ముక్కులు రెండూ పర్వతగుహల్లా ఉన్నాయి. స్తనాలు రెండూ తెగిపడిన పర్వతశిఖరాల్లా ఉన్నాయి. భుజాలు రెండూ భయంకరంగా ఉన్నాయి. పొట్ట నీరులేని సరస్సంత ఉంది. పూతన భయంకర శరీరాన్ని చూసి అంతా భయపడ్డారు. అటువంటి పూతన వక్షాలపైన బాలకృష్ణుడు ఆడుకుంటున్నాడు. ఆ దృశ్యం చూసిన గోపికలంతా భయభ్రాంతులై బాలుణ్ణి ఇంట్లోకి తీసుకొని వెళ్ళారు. గోమూత్రము, గోధూళితో స్నానంచేయించారు. ఒళ్ళంతా గోమయం వేసి రుద్దారు. ఆ తర్వాత శుభ్రంగా స్నానం చేయించి ఆ పిమ్మట గోపికలు ఆచమనం చేసి తమ అవయవాలయందు బీజన్యాసం చేసి అటుపిమ్మట శ్రీకృష్ణుని అవయవాలయందు కూడా చేశారు. బీజన్యాసం అనగా –

"నీ పాదాలను బ్రహ్మదేవుడు, జానువులను మణిమంతుడు, ఊరువులను యజ్ఞుడు, కటితటములను అచ్యుతుడును, హయగ్రీవుడు ఇతర ప్రదేశాల్ని, హృదయాన్ని కేశవుడు, వక్షఃస్థలాన్ని ఈశుడు, కంఠ ప్రదేశాన్ని సూర్యుడు, భుజములను విష్ణువు, ముఖమండలాన్ని ఉరుక్రముడు, మస్తకాన్ని ఈశ్వరుడు, ముందు భాగాన్ని చక్రి, వెనుక భాగాన్ని గదాధరుడు, నలువైపులా నిన్ను రక్షింతురుగాక. హృషీకేశుడు ఇంద్రియాల్ని, నారాయణుడు ప్రాణాలను, శ్వేతద్వీపాధిపతి చిత్తాన్ని, యోగీశ్వరుడు నీ మనస్సును రక్షింతురుగాక! వృష్ణి గర్భుడు బుద్ధిని, పరమేశ్వరుడు నీ ఆత్మను రక్షించుగాక. గోవిందుడు క్రీడావస్థయందు, ఆధవుడు శయనావస్థయందు నిన్ను రక్షింతురు గాక! వైకుంఠుడు నడిచేటప్పుడు, శ్రీపతి కూర్చున్నప్పుడు యజ్ఞభుక్కు భోజన సమయమందు నిన్ను రక్షింతురుగాక!

నందుడప్పుడే ఇంట్లో అడుగుపెట్టాడు. పూతన శవాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. "ఆహా! వసుదేవుడెంతో జ్ఞాని అయి ఉండాలి. లేకపోతే నన్ను అతడు హెచ్చరించినట్లే జరుగుతుందా?" అని ఆశ్చర్యపోయాడు. పూతన శవాన్ని గొడ్డళ్ళతో నరికి బయటకు జేర్చి దహనం చేశారు. ఆమె చితిపై నుండి అగరు, సుగంధద్రవ్యాల వాసనలు వస్తూ ఉంటే జనులంతా ఆశ్చర్యపోయారు. అనగా శ్రీకృష్ణుని ఎవరెవరు పుత్రభావంతో చూస్తారో వారంతా సంసారం నుండి ముక్తులవడం తథ్యం.

శ్రీకృష్ణుడు పూతన శరీరాన్ని అణచిపెట్టి ఆమె స్తన ద్వయాన్ని పానం చేశాడు. పూతన రాక్షసే అయినా, స్తనములలో విషాన్ని నింపుకొని వచ్చినా, తల్లులకు లభించే స్థానాన్ని ఆమెకు ప్రసాదించి తద్వారా స్వర్గలోక ప్రాప్తిని కలిగించాడు.

క॥ *హరిఁగని చన్నులు గుడిపెడు, తరుణులు ప్రాప్తించు పదము దలఁపఁగ వశమే?*
వారి యారగించుటకుఁ బా, ల్గురిసిన ధేనువులు ముక్తికొనలఁ జరించున్.

– బమ్మెర పోతనామాత్యుడు

శకటాసురుడు :

భగవంతుని లీలలు ఇట్టివనిగాని, ఇన్ని అనిగాని చెప్పడం సాధ్యం కాదు. కనుక ప్రధానమైన కొన్నింటిని తెలుసుకుందాం.

శ్రీకృష్ణుడికి నేలపై పొర్లాడే వయస్సు వచ్చింది. ఆ వేడుకను ఘనంగా జరపాలనుకున్నారు నందయశోదలు. గోప గోపికలందర్నీ ఆహ్వానించారు. బ్రాహ్మణులు వచ్చి స్వస్తి వాచకాలు పలికారు. గోపికలంతా కలసి శ్రీకృష్ణునికి మంగళస్నానాలు చేయించారు. పిల్లవాణ్ణి ఉయ్యాల్లో పడుకోబెట్టారు. వచ్చే బంధువుల్ని ఆహ్వానించడంలోను, వెళ్ళే బంధువుల్ని సాగనంపడంలోను యశోద క్షణం తీరిక లేకుండా ఉంది. ఈ సందడిలో పిల్లవాడు ఏడవడం ఎవరికీ వినిపించలేదు. పిల్లవాడికి తల్లిమీద కోపం వచ్చింది. కాలు గట్టిగా ఝాడించి కొట్టాడు. ఉయ్యాల ప్రక్కనే బండి ఒకటి ఉంది. పిల్లవాడి కాలు పోయి బండిని తాకింది. అంతే, బండి ఆకాశమార్గాన పోయి అల్లంత దూరాన పడింది. ఆ బండిలోనుండి భయంకరంగా శబ్దం చేస్తూ ఒక రాక్షసుడు చచ్చిపడిపోయాడు. ఈ సంఘటన చూస్తున్న గోప గోపికా జనమంతా ఆశ్చర్యపోయారు. అంతవరకు శ్రీకృష్ణుడితో ఆడుకుంటున్న

గోపబాలురు వచ్చీరాని మాటలతో "శ్రీకృష్ణుడే ఆ బండిని కాలితో తన్నా" దని చెప్పారు. యశోద కృష్ణుని చేతిలోకి తీసుకొని పాలిచ్చి మళ్ళీ ఉయ్యాల్లో పడుకోబెట్టింది. పిల్లవాడికి క్షేమాన్ని, పూర్ణాయుర్దాయాన్ని కోరుకుంటూ బ్రాహ్మణుల్ని పిలిపించి వేదమంత్రాలతో ఆశీర్వచనాలు చేయించారు. మంగళస్నానాలు చేయించి స్వస్తి వాచకాలు చెప్పించారు. రక్షలు కట్టి శాంతి హోమాలు చేయించారు. బ్రాహ్మణులంతా బాలుని దీవించి వెళ్ళారు.

ఇతణ్ణి కూడా కంసుడే పంపాడు. ఇతడి పేరు శకటాసురుడు. ఈ విధంగా శకటాసుర సంహారం జరిగింది.

బాలకృష్ణుడు జన్మించి అప్పుడే ఒక సంవత్సరం అయింది. ఆ వేడుకలు జరిపిస్తూ యశోద బాలుని ఒడిలో పెట్టుకొని కూర్చుంది. ఇంతలో ఆ బాలుడి బరువు భరించలేకపోయింది. పర్వతం అంత బరువెక్కిన పిల్లవాణ్ణి నేలపై పడుకోబెట్టి మనస్సులో శ్రీమన్నారాయణుణ్ణి స్మరించింది.

కంసుని అనుచరుల్లో మాయావి అయిన తృణావర్తుడనేవాడుండేవాడు. కంసుడు శ్రీకృష్ణుని వధకు అతడిని నియోగించాడు. తృణావర్తుడు వ్రేపల్లెకు వచ్చాడు. ఆ సమయంలో యశోద శ్రీకృష్ణుని ఒళ్ళో పెట్టుకొని ముద్దాడుతోంది. తృణావర్తుడు రావడం, అతడి ఆలోచనలన్నింటినీ శ్రీకృష్ణుడు కనిపెట్టాడు. పర్వతంలా బరువెక్కిపోయాడు. యశోద నేలపై పడుకోబెట్టి ఇంట్లోకి వెళ్ళింది.

ఇంతలో తృణావర్తుడు మాయాజాలంతో పెద్ద సుడిగాలిని ప్రేరేపించాడు. ఆ వేగానికి ఆకాశం అంతా దుమ్ముతో కప్పేసింది. క్షణాల్లో అంతా బీభత్సంగా తయారైంది. చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. కన్నుపొడుచుకున్నా ఎదురుగా ఉన్న వస్తువు కనిపించడం లేదు. ఇంతలో యశోద బాలుడికోసం చూసింది. పడుకోబెట్టిన చోట బాలుడు లేడు. భయంతో, దుఃఖంతో గుండెలు బాదుకుంది. నాలుగు దిక్కులా వెదుకుతూ ఉంటే ఆ వార్త ఊరు ఊరంతా ప్రాకింది. గ్రామస్థులంతా కలసి వెదికారు. వాళ్ళతోపాటు నందుడూ యశోద కూడా అటూ ఇటూ పరుగులు తీశారు.

ఊరు ఊరంతా ఈ విధంగా గగ్గోలు పెడుతూ ఉండగా ఆకాశంలో పెద్ద శబ్దం అయింది. అంతా తలలు పైకెత్తి చూశారు. పెనుభూతంలా ఒక పెద్ద శరీరం నేలపైన పడింది. ఆ భూతానికి ఒంటినిండా గాయాలై రక్తం కారుతోంది. ఆ భూతం తనకన్నా పెద్దదైన పర్వతాన్ని దేన్నో ఢీకొట్టుకొని మరణించినట్లు తెలుస్తోంది. అంతలో ఈ భూతం పైన కాళ్ళతో త్రొక్కుతూ చేతుల్తో పిడిగుద్దులు గుద్దుతూ బాలకృష్ణుడు కనిపించాడు. గోపికలంతా పరుగు పరుగున పోయి బాలకృష్ణుని తెచ్చి యశోద చేతుల్లో పెట్టారు. నందుడా బాలుని ముద్దాడి వసుదేవుని హెచ్చరికల్ని మనసులోనే తలచుకొని బాలుని విడిచిపెట్టి ఒక్క క్షణమైనా ఉండరాదని నిశ్చయించుకున్నాడు.

ఒక రోజున యశోద బాలునికి పాలు త్రాగించి తొడపై పడుకోబెట్టుకొని చిచ్చికొడ్తోంది. ఇంతలో ఆ బాలుడు ఆవులించాడు. తెరచుకున్న బాలుని నోట్లో భూమి, ఆకాశం, స్వర్గం, నరకం, సూర్యుడు, చంద్రుడు అన్నీ తిరుగుతూ ఉండటం యశోద చూసింది. ఆశ్చర్యపడింది. ఇంతలోనే మహామాయ కమ్మేసింది.

సీ॥ *జననాథ! యొకనా డు చన్ను చేఁపినఁ దల్లి చిన్ని ముద్దుల కృష్ణుఁ జేరఁ దిగిచి*
యెత్తి పెందొడలపై నిడికొని ముద్దాడి చన్నిచ్చి నెమ్మోము సక్క నివిరి
యల్లని నగవుతో నావులించిన బాలు వదన గహ్వరమున వారినిధులు
దిశలు భూమియు, వనద్వీపశైలంబులు నేఱులు గాలియు నినుఁడుశశియు
ఆ॥ *దహనుఁ డాకాసంబుఁ దారలు గ్రహములు, నఖిలలోకములుఁ జరాచరంబు*
లైన భూతగణబు లన్నియు నుండుటఁ జూచి కన్నుమోడ్చి చోద్యపడియె.

శ్రీకృష్ణుని బాల్య లీలలు :

యాదవులకు పురోహితుడు, మహా తపస్వి అయిన గర్గమహాముని నందుని ఇంటికి వచ్చాడు. నందుడాయనకు అతిథి మర్యాదలు చేసి సత్కరించాడు. నందుడు గర్గమునితో "మహాత్మా! మీవంటి మహాత్ములు ఎల్లప్పుడూ దైవధ్యానంలోనే ఉంటారు. అట్టి మీరు ఆశ్రమాన్ని విడిచి మాబోటి గృహస్థుల గృహం పావనం చేయదలిచారంటే కేవలం అది మమ్మల్ని అనుగ్రహించడానికీ, ఆశీర్వదించడానికేనని నేను భావిస్తున్నాను.

క॥ ఊరకరారు మహాత్ములు, వా రధముల యిండ్లకడకు వచ్చుట లెల్లం
గారణము మంగళములకు, నీరాక శుభంబు మాకు నిజము మహాత్మా!

దేవా! నువ్వు అతీంద్రియ వస్తు జ్ఞానం కలిగిన జ్యోతిశ్శాస్త్రాన్ని రచించావు. నీవు పూర్వజన్మల రహస్యాల్ని తెలుసుకోగలవు. నువ్వు బ్రాహ్మణులలో శ్రేష్ఠుడవు. కావున నా ఇద్దరి పుత్రులకు జాతక నామ సంస్కారాలు దగ్గరుండి జరిపించమని ప్రార్థించాడు. అందుకు గర్గమహర్షి ఇలా అన్నాడు. "నందుడా! నేను యదువంశానికి పురోహితుణ్ణి. నువ్వు, వసుదేవుడు మంచి స్నేహితులు. ఈ రెండు విషయాలు అందరికీ తెలిసిందే. నువ్విప్పుడు నీ పిల్లలిద్దరికీ నామకరణం వైభవోపేతంగా చేయించవద్దు. ఎందుకంటే వీళ్ళిద్దరూ దేవకీ పుత్రులే అయి ఉంటారని అనుమానించవచ్చు" అన్నాడు. అందుకు నందుడు "మహాత్మా! మీరు చెప్పినట్లే జరిపించండి. నేనీ విషయాన్ని రహస్యంగానే ఉంచుతాను. అయితే బాలురిద్దరికీ స్వస్తివాచక పూర్వకంగా నామకరణ సంస్కారాన్ని మీరే దగ్గరుండి జరిపించండి" అని ప్రార్థించాడు.

అందుకు గర్గమహర్షి "నందా! రోహిణియందు జన్మించిన వాడు జనులను రంజింపజేస్తాడు కావున రాముడని పిలవండి. శారీరకంగా గొప్ప బలాఢ్యుడవుతాడు. ఇందుమూలంగా బలుడని కూడా పిలువబడతాడు. పైగా ఇతడు యాదవులందర్నీ కూడగట్టుకొని ఒక్కతాటి మీద నడిపించగలుగుతాడు.

శ్రీమహావిష్ణువు గడచిన యుగాల్లో, శుక్ల, రక్త పీత వర్ణాలను ధరించాడు. ఈ యుగంలో కృష్ణ వర్ణంలో అవతరించడం చేత 'కృష్ణుడు' అనే పేరు యశోదా తనయునికి సార్థకమవుతుంది. వసుదేవుని పుత్రుడవడం వల్ల వాసుదేవుడని, నందుని ఇంట పెరగటం వలన "నందనందనుడని" పిలుస్తారు. ఇవికాక అతని గుణాల్ని బట్టి అనేక పేర్లతో పిలువబడతాడు. నందా! ఇతడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడేనని తలచి మసలుకుంటూ ఉండు.

గర్గముని మాటలు విన్న నందుడు పరమానంద భరితుడయ్యాడు. బాలురిద్దరూ రోజురోజుకూ పెరిగి పెద్దవారవుతున్నారు. నేలపై పడి పారాడే వయస్సు వచ్చింది. వాళ్ళు మొలకు కట్టిన గజ్జెల ధ్వనితో ఇల్లంతా పారాడుతున్నారు. యశోదా రోహిణులిద్దరూ వారికే ఆపదా రాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. రామకృష్ణులిద్దరూ గోపబాలురతో కలసి ఆడుతూ ఉంటే గోపికలు ఆనందం పట్టలేక మా పిల్లల్ని ఏడిపిస్తున్నాడని కృష్ణుని అల్లరిని యశోదకు ఫిర్యాదు చేసేవారు.

కొందరు గోపికలైతే "అమ్మా! యశోదా! మీ కృష్ణయ్య మా ఇంట్లో పాలు, వెన్న, పెరుగు తిన్నంత తిని మిగిలింది స్నేహితులకు పంచిపెడుతున్నాడు అని, ఇంకా ఎంతోమంది ఎన్నో విధాలుగా చాడీలు చెప్పేవారు.

క॥ మీ పాపఁడు మా గృహముల, నా పోవఁగ బాలుఁద్రావ నగపడ కున్నం
గోపించి పిన్నప డుచుల, వాపోవఁగఁ జిమ్ముకొలుచు వచ్చెం దల్లీ.

మ॥ పుట్టి పుట్టఁడు నేఁడు దొంగిలఁ బోయి మా యిలు సొచ్చి తా
నుట్టి యందక ఱోళ్ళుఁ బీఁటలు నొక్క ప్రోవిడి యెక్కి చే
వెట్టఁ జాలక కుండ క్రిందొక పెద్ద తూఁటొనరించి మీ
పట్టి మీఁగడ పాలు జేరలఁ బట్టి ద్రావెఁ దలోదరీ!

బాలకృష్ణుని అద్భుత లీలలు

(ఈ కథాభాగం శ్రీభాగవతం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు తన లీలామాహాత్మ్యాన్ని గోకులంలో ఎన్నిసార్లు ప్రదర్శించినా వారెవ్వరు తన సర్వజ్ఞత్వాన్ని గుర్తించడం లేదు. ఒకరోజున గోపికలంతా కలసి కృష్ణుని ఆగడాలను అడ్డుకోవాలను కున్నారు. కృష్ణుడు వెన్నదొంగిలించేందుకు ఎవరింటికి వచ్చినా కట్టిపడేసి అంతాకలసి యశోదకు చెప్పాలనుకున్నారు. పెరుగు, పాలు, వెన్న వంటి మధుర పదార్థాలన్నింటినీ కృష్ణుడికి అందకుండా ఒక గదిలో ఉంచి తాళం వేశారు. అటుపైన ఈ వెన్నదొంగ ఏదారిన వస్తాడా అని ఎదురు చూస్తూ కాపలా కాశారు. వారంతా పామరులని, అజ్ఞానులని కృష్ణుడికి తెలుసు. అయితే వారికి మాత్రం ఆ సంగతి తెలియదు, పూర్వజన్మజ్ఞానం కొద్దిగాకూడా పనిచెయ్యడంలేదు. సారంలేని సంసారంలో సారంకోసం వెదుక్కొంటున్నారు. ఇటువంటి బాలుడు ఇంతకు పూర్వం ఎక్కడా పుట్టిఉండలేదనివారికి అనిపించినా కూడా, అల్లరి పిల్లవాడని అనుకుంటున్నారేగాని కృష్ణుని నిజతత్త్వాన్ని గూర్చి ఎవ్వరూ ఆలోచించలేదు. వాళ్ళంతా పామర బుద్ధితోనే ఆలోచించేవారు. ఎంత మాత్రం దూరదృష్టి లేనివారై స్త్రీలుచంచల స్వభావులన్న లోకోక్తి యథార్థంచేశారు.

అందువలనే కాబోలు మహర్షులు, స్త్రీ ధర్మాన్ని ఉపదేశించారు. భగవల్లీలలు తెలుసుకోలేక కృష్ణుని చేష్టల్ని తప్పుపడుతూవచ్చారు. యశోదమ్మ మనస్సు కూడా కలతచెందే విధంగా మాట్లాడేవారు. అయినా బాలకృష్ణుడు తన లీలలు చూపుతునే ఉన్నాడు. ఒకానొక రోజున యశోద ఇంటి పనులలో తలమునకలై ఉండగా గోపికలంతా గుంపుగా వచ్చి పడ్డారు.

ఎన్నిసార్లు తాను అద్భుతాలు ప్రదర్శిస్తున్నా తెలుసుకోలేని ఆ గోపికలకు కొద్దిగా జ్ఞానం కలిగించాలనుకొన్నాడు. కృష్ణభగవానుడు ఒక ఇంట్లో వేణుగానం, ఇంకో ఇంట్లోకి ప్రవేశించి నవ్వులతోనూ, ఇంకో గృహంలో గోపికలతోపరాచకాలు, మరో ఇంట్లో పిల్లికూతలు, మరో ఇంట్లో పక్షి అరుపులతోను ఈ విధంగా తన సర్వజ్ఞత్వాన్ని ప్రకటించాడు. కాని పుట్టు గృడ్డికి అద్దం చూపినట్లు గోపికల్లో ఒకరు కూడా భగవత్తత్త్వాన్ని తెలుసుకోలేకపోయారు. ఒక్క బాలుడు వాళ్ళ కళ్ళముందరే ఇన్ని విచిత్రవిన్యాసాలు చేస్తున్న ఒక్కరూ ఆ సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అతీంద్రియజ్ఞానం గలవారి మాటలన్నింటిని అసత్యాలనడం కన్నా అజ్ఞానం మరొకటి ఉంటుందా? మహాత్ములైన మునీశ్వరులు చిరకాలజీవులు. అందువలన వారి జీవిత కాలమంతా పరిశోధించి ఆచరించాల్సిన ధర్మాల్ని స్మృతుల రూపంలో ప్రమాణాలుగా బోధించారు. అటువంటి బోధలను అంగీకరించాల్సి ఉంటుంది. వారి బోధలను అంగీకరిస్తే, స్త్రీ బుద్ధికూడా చపలమైనదేనని ఒప్పుకోక తప్పదు. ఈ విషయాన్ని గోపికలు చర్యల వలన స్పష్టం చేశారు.

శ్రీకృష్ణుని సర్వవ్యాపకత్వము

భగవంతుడు ఎన్ని అద్భుతాలు ప్రదర్శించినా గోకులం అంతా తన్ను సామాన్య బాలకృష్ణుణిగానే భావిస్తున్నారు. అయినా శ్రీకృష్ణుడు తన లీలలను మళ్ళీ మళ్ళీ ప్రదర్శిస్తూనే ఉన్నాడు. గోపికలంతా కృష్ణుడు తమ ఇళ్ళకు వస్తాడని పట్టి బంధించి యశోద ఎదుట దోషిగా నిలబెట్టాలని వాడవాడంతా కృతనిశ్చయులయ్యారు. కృష్ణుడు వారి అమాయకత్వానికి నవ్వుకున్నాడు. నన్ను ఎట్లా బంధిస్తారో చూస్తానని యథాప్రకారం వారి ఇళ్ళల్లోకి ప్రవేశించాడు. ఇంకేముంది. ఎప్పుడొస్తాడా బంధిద్దామని ఎదురు చూస్తున్న గోపికల పంటపండనే పండింది. కృష్ణుడు వెళ్ళి వాళ్ళ వలలో కావాలనే చిక్కుకున్నాడు. అందులో ఒకావిడ "కృష్ణా ! నీవు నా చేతికి చిక్కావులే. ఇంకెక్కడికి తప్పించుకొనిపోతావు? దొంగతనంగా వెన్నంతా తిని పారిపోదామని ఆశపడ్డావు. వచ్చి నా చేతిలో చిక్కుకు పోయావు. నిన్ను మీ అమ్మ దగ్గరకు ఈడ్చుకొనిపోయి వీపు చిట్లేట్లుగా కొట్టిస్తాను. దాంతో గాని పొగరణగదు. ఇక ఎన్నటికీ మా ఇళ్ళకు దొంగతనానికి రాకుండా బుద్ధి చెప్పిస్తాను." అంటూ చెయ్యి పుచ్చుకొని బలవంతాన యశోద ఇంటికి ఈడ్చుకుంటూ పోయింది. మిగిలిన గోపికలదీ ఇదే తంతు. ఎవరికి వారు కృష్ణుడు తమకు మాత్రమే చిక్కాడని సంబరపడిపోయారు. అంతా కలసి యశోద ఇంటికి వెళ్ళారు. అప్పుడే ఆమె కృష్ణుడికి పాలిచ్చి పెరట్లో ఆడుకొంటూ ఉంటే తనివితీరా బాలుణ్ణే చూసుకుంటూ ఇంటి పనిలో తలమునకలై ఉంది. ఇంతలోనే వాడలో ఉన్న గోపికలంతా కృష్ణుని వెంట బెట్టుకొని యశోద వద్దకు పోయారు. అప్పటికే కృష్ణుడు యశోద వద్ద ఆడుతూ పాడుతూ కనిపించాడు. కృష్ణుని చూస్తూనే వాళ్ళల్లో ఒక్కరికీ నోట్లో నుండి మాటరాలేదు. ఎందువల్లనంటే తాము కష్టపడి బంధించి తెచ్చిన కృష్ణుడు వాళ్ళదగ్గర లేనేలేడు. వారిదంతా భ్రాంతియేనని అనుకుంటూ సిగ్గుపడిపోయారు. శ్రమ అంతా వృథా అయిపోయిందేనని వాపోయారు.

ఈ అద్భుత చర్యల్ని నమ్మేవాళ్ళు ఉంటారు నమ్మనివాళ్ళూ ఉంటారు, ఎవరేమనుకున్నా శ్రీకృష్ణుని సర్వవ్యాపకత్వం స్పష్టమవుతోంది. ప్రతి గోపిక ఇంట్లోనూ ప్రవేశించాడు. ప్రతిగోపిక కృష్ణుణ్ణి పట్టుకొంది. యోగమాయ వాళ్ళందర్నీ బాలకృష్ణుడు మానవ మాత్రుడే నన్న భ్రాంతిలో పడేసింది. ప్రతి గోపికకు కృష్ణుడు తమ ఇళ్ళల్లో వెన్నదొంగిలించి తింటున్నాడని తెలుసు. అయినా ఇతడికి అజీర్తి వ్యాధి లక్షణాలేవీ కనిపించడంలేదేమిటా అని వారికి అనిపించనైనా అనిపించలేదు. వారి లక్ష్యం అంతా కృష్ణుణ్ణి ఎట్లాగైనా పట్టుకొని యశోదకు అప్పజెప్పాలని, ఆమె దండిస్తూ ఉంటే చూసి సంతోషించాలన్నదే వారి తపన. తీరా పట్టుకొని యశోద వద్దకు తీసుకు పోతే అక్కడే ఆడుకుంటున్న కృష్ణుని చూసి పడ్డశ్రమ అంతా వృథా అయిందే అన్న వ్యథతో సిగ్గుపడి వెళ్ళిపోయారు. ఆహా! యోగమాయ వాళ్ళందర్ని ఎట్లా మోహింపజేసిందో చూడండి.

శ్రీకృష్ణుడు తన సర్వ వ్యాపకత్వాన్ని, సర్వ నియంతృత్వాన్ని, అద్భుత లీలల్ని ప్రకటించినా గోపికలు మాయా మోహితులై తెలుసుకోలేకపోయారు. అనేక పర్యాయాలు యశోదతో ఫిర్యాదు చేస్తూ వచ్చారు. అంతేకాకుండా ఈడుకు మించిన పనులు చేస్తున్నాడు జాగ్రత్త అని హెచ్చరించేవారు.

అటువంటి సమయాల్లో గోపికలందరికీ తన లీలల్ని ప్రదర్శిస్తూ తల్లికి మాత్రం ముద్దులు మూటగడ్తూ నటించేవాడు.

సీ॥ *తనువున నంటిన ధరణీ పరాగంబు పూసిననెఱి భూతి పూఁతగాఁగ*
ముందఱ వెలుఁగొందు ముక్తాలలామంబు తొగలసంగడికాని తునుక గాఁగ
బాలభాగంబుపైఁ బరఁగుకావిరిబొట్టు కాముని గెల్చిన కన్ను గాఁగఁ
గంఠమాలికలోని ఘననీల రత్నము కమనీయ మగుమెడకప్పుగాఁగ

ఆ॥ *హారవల్లురగ హారవల్లులు గాఁగ । బాల లీలఁ బ్రౌఢ బాలకుండు*
శివుని పగిదినోపె శివునకుఁ దనకును । వేఱులేమిఁదెల్ప వెలయునట్లు

తన కొంగు చాటునే ఆడుకుంటున్న బాలుణ్ణి చూసి ఓర్వలేక గోపికలంతా ఒకటై ఫిర్యాదులు చేస్తున్నారని యశోద భావించేది. అంతలోనే గోపికలంతా ఒకటై వచ్చి మళ్ళీ ఫిర్యాదు చెయ్యడాన్ని పోతనగారు ఎంత రమణీయంగా చిత్రించారో చూడండి.

క॥ *కడులచ్చి గలిగె నేనియుఁ । గుడుతురు కట్టుదురుగాక కొడుకుల నగుచున్*
బడుగుల వాడల పైఁబడ । విడుతురె రాకాంతలెందు విమలేందుముఖీ

క॥ *ఓయమ్మాఁ నీకుమారుడు । మాయిండ్లను బాలుపెరుగు మననీఁడమ్మా*
పోయెద మెక్కడికైనను । మా యన్నుల సురభులాన మంజులవాణీ

అంతట యశోద బాలకృష్ణుని వైపు నిశితంగా చూసింది. ముద్దులొలికిస్తున్న పుత్రుణ్ణి చూస్తూ యశోద మనస్సు ద్రవించిపోయింది. తన కుమారుడు ఏ తప్పూ చేయలేదని నమ్మింది. గోపికలతో మెల్లగాను, మృదువుగాను, దృఢమైన స్వరంతో ఇలా అన్నది. "గోపికలారా! మీకు కృష్ణుడి ఈడు పిల్లలే ఉన్నారుకదా! ఎందుకు నా చిన్ని కృష్ణుడిపైన ఇంతలేసి అభాండాలు వేస్తున్నారు? పిల్లలకిది తెలిసీ తెలియని వయస్సు గదా. తోచిందల్లా చేస్తూ ఉంటారు అది సహజమే. కానీ ఈ కుమారుడు,

క॥ *చన్ను విడిచి చనఁడిట్టుల । నెన్నడు పొరుగిండ్ల త్రోవ లెఱుంగడు నేడుం*
గన్నులు తెఱవని మాయీ । చిన్ని కుమారకుని ఱవ్వసేయందగునే

కాబట్టి

తే॥ *అన్య మెఱుఁగఁడు తనయంత నాడుచుండు । మంచివాఁడీతఁ డెగ్గులు మానరమ్మ*
రామలార, త్రిలోకాభిరామలార । తల్లులార, గుణవతీమ తల్లులార,

శ్రీకృష్ణుడు తనకేమి తెలియనట్లు నటిస్తూ

ఉ॥ *కాంతలు తల్లితోఁ దనవికారములెల్ల గణింప భీతుఁడై*
శాంతుని సొంపునం బరమ సాధుని పెంపున గోలమాడ్కివి
భ్రాంతుని కైవడిన్, జడుని భంగిఁ గుమారకుఁ దూరకుండె నే
నింతయు లేక తల్లి కుచవేదికపైఁ దలమోపి యాడుచున్

శ్రీకృష్ణుని బాల్యలీలలు

గోకులంలో కృష్ణబలరాములతో గోపబాలురంతా ఆటపాటల్లో గడిపేస్తున్నారు. ఒకానొక రోజున కొందరు గోప బాలకులు పోయి యశోదతో కృష్ణుడు మన్ను తింటున్నాడని చెప్పారు. వాళ్ళల్లో బలరాముడు కూడా ఉండటంతో యశోద నమ్మకుండా ఉండలేక పోయింది. కోపావేశంతో ఉన్న పళంగా కృష్ణుడి వద్దకుపోయి " మన్ను తింటున్నావా? నీకు మన్ను తిన వద్దని ఎన్నిసార్లు చెప్పాను. ఇప్పుడే కదా కడుపునిండా అన్నం పెట్టాను. ఇంతలోనే అంత ఆకలైందా" అంటూ గద్దించింది. శ్రీకృష్ణుడు "నేను మన్ను తిన లేదమ్మా వీళ్ళంతా అబద్ధాలు చెబుతున్నారు" అంటు భయం నటించాడు. "ఎందుకురా నువ్వు ఇటువంటి పాడు బుద్ధులన్నీ నేర్చుకుంటున్నావు? వీళ్ళంతా అబద్ధాలు చెప్పారే అనుకో, నీ అన్న బలరాముడు కూడా చెప్తున్నాడే " అంటూ మళ్ళీ గద్దించి అడిగింది. దాంతో కృష్ణుడు " అమ్మా! నువ్వు నా మాటలు నమ్మడం లేదు. వాళ్ళమాటల్నే నమ్ముతున్నావు. నేనే మన్ను తిని ఉంటే నీకు వాసన తెలియదా?చూడు నానోరు" అన్నాడు.

శా॥ అమ్మా మన్నుదినంగ నే శిశువునో యాఁకొంటినో వెఱ్ఱినో
నమ్మంజూడకు వీరి మాటలు మదిన్ నన్నీవు కొట్టంగ వీ
రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు కాదేనిన్ మదీయాస్యగం
ధమ్మాఘ్రాణము చేసినా వచనముల్ తప్పైన దండింపవే.

కృష్ణుడు అందరూ చూస్తూండగా మన్ను తిన్నట్లుగా నటించాడు. వాళ్ళంతా నిజమని నమ్మారు. బలరాముడుతో సహా అంతాపోయి యశోదకు చాడీలు చెప్పారు. యశోద కృష్ణుణ్ణి నిలదీస్తే " నేను మన్ను తినలేద "ని గారాలు పోతూ చెప్పాడు. ఇది అసత్యంకాదా? అని అడుగ వచ్చు. అసత్యంకాదు ఎందువల్లనంటే, " ఈ భూమి అంతా నా పొట్టలోనే ఉన్నప్పుడు, ఇంకా నేను మన్ను తినే ప్రసక్తి ఎక్కడిదని" కృష్ణుని భావమని వ్యాఖ్యాతలు వ్రాశారు. ఈ అర్థం చెప్పుకోకపోతే అసత్యం పలికినట్లే అవుతుంది గదా. ఈ అర్థం శ్లోకంలో ఉన్నదా? అని ప్రశ్నించే వారుండవచ్చు " మదీయాస్య గంధమ్మాఘ్రాణము చేసి" అన్న వాక్యంలో ఈ అర్థం ధ్వనిస్తోందని గ్రహించాలి.

ఆమాటలు విన్న యశోదకు కృష్ణుడు చెప్పింది న్యాయమేనని పించింది. నోరు తెరిపించి మన్ను తిన్నాడని నిర్ధారణ చేసుకున్న తర్వాతనే దండించ వచ్చు లెమ్మనుకొని "ఏదీ, నీ నోరు తెరు చూస్తాను" అన్నది. శ్రీ కృష్ణుడు నోరు తెరచి చూపాడు. యశోదకు ఆ బాలకృష్ణుని నోట్లో సముద్రాలు, పర్వతాలు, భూగోళాలు, సూర్యచంద్రాది గ్రహాలు, నక్షత్రాలన్నీ కనిపించాయి. మనస్సు మోహం చెందింది. ఇంద్రియాలు మొద్దుబారాయి. నిశ్చేష్ట అయింది. ఆశ్చర్యంతో " ఇదేమిటి? చిత్రంగా ఉంది. వీడు కృష్ణుడేనా? నేను యశోదనేనా? నేను గోకులంలో ఉన్నానా? ఇది నిజమా? నేను కలగనడం లేదుగదా? ఇతడి ముఖం అంతాకలిపి నా అరచెయ్యంతలేదు. అందులో ఇన్ని బ్రహ్మాండాలున్నాయా? వీడు బాలుడని, నాకుమారుడన్న భ్రమలో ఉన్నానేమో, నిజానికి ఈ బాలుడు పరమేశ్వరుడేనేమో? నాకడుపున అపరమేశ్వరుడే ఈ రూపాన జన్మించాడా? గోపికలు చెప్పేమాటల్ని

నేను నమ్మడం లేదు. అవన్నీ నిజమేననిపిస్తోంది" అని అనుకుంటూ ఉండగా, తల్లి ఊహల్ని పసిగట్టిన శ్రీకృష్ణుడు ఆమెకు యోగమాయ ఆవరించేట్లు చేశాడు. అంతట యశోద, ఇట్లా ఆలోచిస్తూ ఆబాలుణ్ణి తన ఒళ్ళో పడుకోబెట్టుకొని ముద్దాడింది. అయితే ఆమె, చూసిన విశ్వరూప సందర్శనం మాటే మరచిపోయింది.

క॥ *జడను పడి యెఱుక సెడియా । పడఁతుక సర్వాత్ముఁ డనుచుఁ బలుకక యతనిం*
గొడుకని, తొడపై నిడుకొని । కడువేడుకతోడ మమత గాంచె

కొందరు శ్రీకృష్ణుడు తల్లికి తన నోట్లో బ్రహ్మాండాలన్నీ చూపడం ఓ కనికట్టు విద్య అయి ఉంటుందని, లేక ఏ పరకాయ ప్రవేశం వంటి సిద్దియో అయి ఉంటుందని, అంతేగాని ఓ బాలుడి నోట్లో ఇవన్నీ చూడటం అసంభవమని అనవచ్చు. అయితే వారట్లా అనుకోవడంలో తప్పులేదు. ఎందువల్లనంటే సామాన్య దృష్టితో చూస్తే అంతా ఓ కట్టు కథగానో, పరిహాసంగానో అనిపిస్తుంది. అయితే సూక్ష్మదృష్టితో చూసే వాళ్ళకు అందులో ఆశ్చర్యపడేందుకేమీ లేదనే అనిపిస్తుంది. శ్రీకృష్ణుడు భగవంతుడని నమ్మిన వారికి ఈ అద్భుతలీలల్లో ఎటువంటి సందేహాలు ఉండవు. నమ్మనని పట్టు పట్టికూర్చునే నాస్తికుల్ని నమ్మించే ప్రయత్నం చెయ్యడం వృథాకాలయాపనే అవుతుంది. సాధ్యాసాధ్యాలు మానవులకే. భగవంతునికి అసాధ్యమనేదే ఉండదు. భగంతుడు ఘటనాఘటన సమర్థుడు గదా. నాస్తికులు కూడా ఆపదలొచ్చిపడ్డప్పుడు ఆస్తికులై పోతూఉంటారు. ప్రకృతిచే మోహితులైన మానవులు ఈ దేహమే శాశ్వతమని నమ్మి తరుణోపాయాన్ని విస్మరించడంలేదా. ఇటువంటి వారు ప్రకృతికి అతీతుడైన భగవంతుని విషయమై నిర్ణయాలు చెయ్యగలమని చెప్పుకోవడం ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరినట్లుంటుంది. భగవంతుడంటేనే మనస్సుకు బుద్ధికి అందనివాడని అర్థం. అటువంటి బ్రహ్మపదార్థాన్ని ప్రపంచ జ్ఞానంతో నిర్ణయించగలమా? అది యోగంచేతనే సాధ్యమవుతుంది.

కావున యోగి అయితేగాని భగవత్తత్త్వాన్ని తెలుసుకోలేడు. అందువల్ల యోగాభ్యాసం చేసి అనుభవం సంపాదించినవారికి భగవత్తత్త్వం కరతలామలకం అవుతుంది. **శ్రీరామకృష్ణ పరమహంస** తమ శిష్యులకు ఇలా బోధించారు.

> "నమ్మకం ఉంచడంలో శిశువులాగా ఉంటేనేగాని భగవద్దర్శనం కాదు. తల్లి బిడ్డతో ఎవరినైనా చూపించి " ఇతడు నీ అన్న" అని చెబితే ఆ బిడ్డ తల్లిమాటను పూర్తిగా నమ్ముతాడు. అటువంటి బిడ్డకు ఉండే విశ్వాసం ఎవరిలో ఉంటుందో, అతడు మాత్రమే భగవత్కరుణకు పాత్రుడవుతాడు. అన్ని విషయాల్లోను లాభనష్టాలు చూసే స్వభావం ఉంటే ఈశ్వరానుగ్రహం పొందలేడు.
>
> ఒక లౌకికుడు, జ్ఞానివలె గొప్ప జ్ఞానాన్ని, కలిగిఉండవచ్చు. ఒక యోగివలె ఎన్నో శ్రమల కోర్చి సాధనలు చెయ్యవచ్చు: ఒక సన్యాసివలె ఆడంబరం లేకుండా జీవించవచ్చు. పైన చెప్పిన మార్గాలన్నీ భగవంతుని పొందడానికి కాకుండా కేవలం సిరి సంపదల కోసమో, కీర్తి ప్రతిష్టలకోసమో చేస్తున్నట్లయితే అతడి శ్రమ అంతా వ్యర్థమైపోతుంది."
>
> **– శ్రీరామకృష్ణ పరమహంస**

యశోద శ్రీకృష్ణుని దండించుట

(ఈ కథాభాగం భాగవతంలో 9వ అధ్యాయం నుండి గ్రహించబడింది. మరియు, బ్రహ్మపురాణం, శ్రీకృష్ణ జన్మఖండము, విష్ణుపురాణాలలోని విశేషాలు కూడా పొందుపరచబడ్డాయి.)

ఒకానొక రోజున యశోద పనివాళ్ళందరికీ పనులు పురమాయించి పెరుగు తానే స్వయంగా చిలుకుతోంది. "కర్మాంతర నియుక్తాను నిర్మ మంథ స్వయం దధి" అనిమూలం. అనగా ఆకాలంలో రాజాంతః పురస్త్రీలు కూడా ఇంటి పనులు చేసుకొంటూ ఉండేవారని తెలుస్తోంది. అనగా కేవలం భోగాలకే పరిమితం కాకుండా రాజపత్నులు, చిన్నాచితక పనులు స్వయంగా చేసుకుంటూ ఆరోగ్యవంతులుగా ఉండేవారు. సోమరితనం ప్రోత్సహించేవారుకారు.

యశోద పెరుగు చిలుకుతూ ఉండగా శ్రీ కృష్ణుడు ఒక్క పరుగున వచ్చి మెడను గట్టిగా కౌగిలించుకొని తనకు పాలిమ్మని వేధించాడు. యశోద కూడా చేతిలో ఉన్న పనిని అక్కడే వదిలేసి కృష్ణుణ్ణి అక్కున చేర్చుకొని పాలిచ్చింది. ఇంతలో పొయ్యిమీద పాలు పొంగిపోతూ ఉంటే యశోద కృష్ణుణ్ణి, ప్రక్కన కూర్చోబెట్టి పొయ్యిపై నుండి పాలుదింపేందుకు పరుగున పోయింది. తనను నిర్లక్ష్యం చేసి వెళ్ళినందుకు కృష్ణుడికి తల్లిమీద గొంతు వరకు కోపం వచ్చింది. వెంటనే ఒక రాయితో ఉట్టి పై నున్న వెన్న కుండ కేసి కొట్టాడు. దాంట్లోనుండి వెన్న కారి నేలపై పడిపోయింది. తల్లి వచ్చే ముందే తుర్రున బయటకు పారిపోయాడు. యశోద పాలు పొయ్యిపై నుండి దింపి వచ్చి చూస్తే, కృష్ణుడు అక్కడ లేదు. ప్రక్కవారింటికి పోయాడేమోనని పోయి చూసింది. రోలు తిరగేసి దానిపైన నిలబడి ఉట్టినందుకొని మెల్లగా అందులోని వెన్న కోతికి, పిల్లికి పెడ్తూ కనిపించాడు.

మ॥ *కనిచేతన్ సెలగోలఁ బట్టుకొనుచుం గానిమ్ము కానిమ్ము రా*
తనయా యవ్వరి యందుఁ జిక్కుపడ నే దండంబునుం గాన,
నే, విని వారంబును బొంద నే వెఱపునే విభ్రాంతియుం జెంద
ము, నన్నియో నీవిటు నన్నుఁ గైకొనుమ నేఁడారీతి సిద్ధించునే

-- బమ్మెర పోతనామాత్యులు

శ్రీకృష్ణుడు బెత్తం పుచ్చుకొని దండించడానికి వస్తున్న తల్లిని చూశాడు. ఇంతకుముందే కృష్ణుడి నోట్లో బ్రహ్మాండాలన్నీ చూసిన విషయాన్ని పూర్తిగా మరచిపోయింది. తల్లిని చూస్తూనే శ్రీకృష్ణుడు భయాన్ని అభినయించాడు. తల్లికి దొరక్కుండా పరిగెత్తాడు. అట్లా చేస్తేనేగాని ముందు జరగాల్సిన కార్యాలు జరుగవని ఆ సర్వజ్ఞుడు ఊహించాడు కాబోలు. కపటనాటక సూత్రధారి అన్న పేరు అప్పట్నించే సార్థకం చెయ్యదలచినట్లున్నాడు. భయాన్ని నటిస్తూ పరుగు తీస్తూ ఉంటే మొలలో గజ్జెలు ఘల్లుఘల్లుమని మ్రోగుతున్నాయి. "నననయ మాప మోగినాం క్షమం ప్రవేష్టుం తపసేరితం మనః" అన్న మూలాన్ని మహాకవి పోతనగారు ఎంత రసవత్తరంగా తెనిగించారో చూడండి.

సీ॥ *బాలుండీతండని భావింతు నందునా యే పెద్దలును నేర రేక్రమంబు*
వెఱ పెఱుంగుటకునై వెఱపింతు నందునా కలగి లేకొక్కఁడు గాని వేఁడు

వెఱపుతో నాబుద్ధి వినిపింతు నందునా తనుఁదానయై బుద్ధి తప్పకుండు
నొండెఱుంగక యింట నుండెడి నందునా చొచ్చి చూడని దొక చోటులేదు
ఆ॥ *తన్ను నెవ్వరైనఁ దలపోయఁ బాఱెడి । యోజలేదు భీతి యొకటి యెఱుఁగఁ*
డెలమ నూరకుండఁ డెక్కసక్కెము లాడుఁ । బట్టి శాస్తి సేయ భంగి యెట్లు?

యశోద అట్లా ఊహించిఉంటుందని కవి వ్రాయడం సమంజసమేనని పిస్తుంది. ఎందువల్లనంటే అప్పటికే గోపికలు బాలకృష్ణుని ఆగడాలను గూర్చి చెప్పారు. తానిప్పుడు కళ్ళారా చూస్తోంది. ఇప్పుడైనా దండించకుండా ఊరుకోకూడదని లేకపోతే ఇంకా పెద్దపెద్ద అపరాధాలకు అలవాటుపడి చెడిపోతాడని అనుకుంది. తానిప్పుడే కడుపునిండా పాలిచ్చి వచ్చింది. దాంతో తృప్తి చెందకుండా ఉట్టి పైనున్న వెన్న కుండను పగుల కొట్టాడు. ఎక్కడున్నాడో చూద్దామని పొరుగింటికిపోతే వెన్నదొంగిలించడమే కాకుండా కోతులకు, పిల్లులకు పంచి పెడుతున్నాడు. దీనిని బట్టి గోపికలు చెప్పినవన్నీ చాడీలుకావని నిజాలే అయి ఉంటాయనుకుంది. కృష్ణుడు అల్లరి పనులు చేస్తున్నాడని నమ్మింది. వీడికి దుర్బుద్ధులన్నీ ఎట్లా పట్టుబడ్డాయా అని ఏ తల్లి అయినా బాధపడక మానదు. వాడిని ఎట్లా మంచి మార్గానికి త్రిప్పటమా అని అనుకోవడం సాధారణ లోక ప్రవృత్తికి విరుద్ధంకాదు. ఈ విధంగా ఆలోచించే మహాకవి తన ప్రతిభను పై విధంగా చాటుకున్నాడు.

యశోద కృష్ణుని రోటికి బంధించుట

యశోద చాలాసేపు తల బ్రద్దలు కొట్టుకుంది. ఈ కృష్ణుడి పైన చాడీలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వీడికంటే పెద్దవాడు బలరాముడు బుద్ధిగా ఉంటున్నాడు. వీడే చెడిపోతున్నాడు. ఏదో ఒకటి చేసి వీడిని దారిలో పెట్టకపోతే పూర్తిగా చెడిపోతాడనుకుంది. నయానోభయానో పట్టుకొని బంధించి వాడిలో మార్పు తేవాలని ఆలోచించి కృష్ణుని వెంటపడింది. "నాయనా! బాలగోపాలా! కృష్ణా! అట్లా పరిగెత్తకు. నీతో పరిగెత్తలేను" అని బ్రతిమాలింది. చేతిలో ఉన్న బెత్తాన్ని ఝుళిపిస్తూ "నిన్ను చూడు ఏం చేస్తానో" అంటూ భయపెట్టింది. నీకీ రోజు నాచేతుల్లో దెబ్బలు రాసిపెట్టి ఉన్నవి లెమ్మంటూ " కఠినంగా మాట్లాడింది.

శ్రీకృష్ణుడు తల్లిని త్రిప్పినంత సేపూ త్రిప్పాడు. ఇక తల్లిని కష్టపెట్ట కూడదని పరుగు వేగం తగ్గించి, భయపడుతున్నట్లు నటించి, బెదురు చూపులు చూశాడు. ఏ ప్రక్క పరుగెత్తడమా అని ఆలోచించినట్లు నటిస్తూ నాలుగు ప్రక్కలా చూశాడు. భయంతో గుటకలు మ్రింగినట్లు నటిస్తూ వెలవెలబోయే ముఖంపెట్టి దుఃఖంతో ఆమెకు చిక్కిపోయాడు. "అమ్మా! ఇక నుండి అల్లరి చెయ్యను. బుద్ధిగా ఉంటాను." అంటూ కాళ్ళ బేరానికి వచ్చాడు.

సీ॥ *స్తంభాదికంబులు తనకు నడ్డంబైన నిట్టిట్టు చనిపట్ట నీనివాని*
నీతప్పు సైరింపు మింక దొంగిలఁ బోవ నేనని మునుముట్ట నేడ్చువానిఁ
గాటుక నెఱయంగఁ గన్నులు నులుముచు వెడలు కన్నీటితో వెగచు వాని
నే దెస వచ్చునో యిదియని పలుమాఱు నురుఁగుచుఁ గ్రేఁగంటఁ జూచువానిఁ

ఆ॥ *గూడఁ బాఱి పట్టుకొని వెఱపించుచుఁ జిన్ని వెన్నదొంగ చిక్కెననుచు*
నలిగి కొట్టఁజేతులాడక పూఁబోఁడి కరుణతోడ బాలుఁ గట్టఁ దలచి

ఇక్కడ మూలాన్ని విస్తరిస్తూ ఆ భావాన్ని మహాకవి ఈ విధంగా వ్రాశారు. మూలంలో "అపాగురదితి పాఠాంతరే అపగోరణం మనసా ద్రోహ చింతన మకరోదిత్యర్థః" అని వ్యాఖ్య. అయితే ఈ భాగానికి అంత ప్రాముఖ్యం లేదని పోతనగారు వదిలేశారు.

ఈ విధంగా యశోద కృష్ణుని పట్టుకున్నదేగాని, దండించేందుకు మనసురాలేదు. అట్లాగే వదిలేస్తే ఇంకా చెడిపోతాడేమోనని అనుకుంది. ఏదోవిధంగా భయపెట్టి దారిలో పెట్టాలనుకుంది. అయితే కృష్ణుడు భయపడుతున్నట్లు ముఖం పెట్టడంతో జాలి కూడా కలిగింది.

యశోద పరిహసిస్తున్నట్లుగా అభినయిస్తూ దండించి " నాయనా! గోపికలందరి ఇళ్ళల్లోనూ దొంగతనంగా వెన్న తినివచ్చావు. వాళ్ళంతా వచ్చి అడిగితే, లేదమ్మా, నేను దొంగిలించలేదు, తినలేదని బుకాయించావు గదా! ఇప్పుడు నేను నా కళ్ళతో స్వయంగా చూశాను. ఇప్పుడేమంటావు. ఇంతకు పూర్వం నువ్వు చెప్పినవన్నీ అబద్ధాలే గదా? నీవంటివారు లోకంలో ఎక్కడన్నా ఉంటారా? అని నేరారోపణ చేసి అంతటితో ఆగకుండా,

క॥ *వీరెవ్వరు శ్రీకృష్ణులు గారా యెన్నఁడును వెన్నఁగాన రఁటకదా*
చోరత్వం బించుకం తయును నేరరఁట ధరిత్రి నిట్టి నియతులు గలరే.

"వత్సా! ఎంతటివారికైనా నువ్వు చిక్కవు. అయితే నిన్ను పట్టుకోవడం నాకు తప్ప మరెవ్వరికీ సాధ్యం కాదు సుమా! ఇది సామాన్యార్థం. ఇక **విశేషార్థం** ఏమంటే, ఇతరులంతా శత్రువులు. అనగా భక్తిశూన్యులు. భక్తి కూడా ప్రేమకు రూపాంతరమే కదా. నీ యెడల ప్రేమపూర్వకమైన భక్తిలేని వారికి నువ్వు పట్టుబడవుగదా! నువ్వు పరాత్పరుడవేగానీ హృదయాల్ని దోచేవాడవు కావు. నేను ఎన్నో పుణ్యములు చేసుకొని ఉండటం వల్లనే నిన్ను పుత్రునిగా పొందగలిగాను. నిన్ను చిన్నతనం నుండి ఎత్తుకొని, పెంచి పెద్ద చేసే భాగ్యం కలిగింది. నీతో ఇంత దగ్గరగా జీవించే అదృష్టం నాకు తప్ప మరెవ్వరికీ కలుగదుగాక కలుగదు. మహాతపస్వులకు కూడా ఇట్టి భాగ్యము లభించదు. కనుక నాకు తప్ప నువ్వు మరెవ్వరికీ చిక్కవు అన్నదే అంతరార్థమని మనం గ్రహించాలి.

ఇట్లా అంటూనే మహామాయచేత మోహితురాలై, స్వాంత అయినా కూడా వాసనా బలంచేత పొంగి పొరలి వస్తున్న మాటలను ఆపుకోలేక

క॥ *ఎక్కడైనను దిరిగెద వొక్కయెడన్ గుణమము గలిగియుండవు నియమం*
బెక్కడిది నీకు మఱచినఁ జిక్కఁగఁ బోయెదవు పెక్కు జాడలఁ బుత్రా!

కుమారా!అని అంటూనే ఇట్లా అంటోంది. ఇందులోని విశేషార్థం ఏమంటే, "అంతర్బహిశ్చ తత్సర్వం వాప్య నారాయణ స్థితః" అన్నట్లు నువ్వు సర్వత్రా వ్యాపించి ఉన్నవాడవు. సామాన్యుల వలె ఒక్కచోట గుణం కుదిరి ఉండవు. ఎందువల్లనంటే, ఎవరెవరు నిన్ను ధ్యానం చేస్తూ ఉంటారో నువ్వువారందర్నీ తృప్తి పరచేందుకై వెళ్తూ ఉంటావు. వారి వారి పుణ్యకర్మలననుసరించి దర్శనం ఇస్తూ ఉంటావు. నీకు నియమంలేదు అని అంటే, శ్రుతి, స్మృతి నియమాలు నిన్ను బాధించవు. ఈ

నియమాలన్నీ నీ ఇచ్ఛా శక్తి అయిన మహా ప్రకృతికే వర్తిస్తాయి. అనగా నువ్వు విరాట్టువే. సగుణ బ్రహ్మవై ఉన్నావని భావం. భక్తులు పరతంత్రులై ధ్యానిస్తూ ఉంటే నిన్ను నువ్వే మరిచిపోతావు. వారివారి మార్గాలన్నింట్లోకి పోయి వారిని అనుగ్రహిస్తావు. కావున నీకు ఒక మార్గం సరిపోదు. అన్ని మార్గాలూ నీవేనని భావం.

అయితే యశోదకు ఇన్ని భావాలు తెలుసా? అని ప్రశ్నించరాదు. ఎందువల్లనంటే భగవంతుని సమక్షంలో తన ప్రయత్నం లేకుండానే అటువంటి భావాలు గల మాటలు దొర్లుతాయి. అప్పుడు వారంతా మాయా మోహితులై ఉంటారు. కాబట్టి వారికి తెలియకుండానే ఆయా అర్థాలు దొర్లేట్లుగా మాట్లాడుతారు. భగవన్నామస్మరణయే సకల పాపాలను తొలగిస్తూ ఉంటే, ఇక భగవంతునితోనే జీవిస్తున్న యశోదవిషయంలో ఇన్ని మాటలు చెప్పాలా? ఈ విధంగా యశోద లేని కోపాన్ని నటిస్తూ, కృష్ణుణ్ణి దండించడమా? వదిలెయ్యడమా?

కొడుకును కొట్టేందుకు చేతులాడలేదు. వదిలేస్తే గోపికల ముందు చులకనైపోతానన్న భయం. పైగా కృష్ణుడు దొంగిలించడం తానే స్వయంగా చూసింది. కావున దోషిని వదిలెయ్యడం వలన తనకు లోక నింద తప్పదు. అందువలన కృష్ణుని నడుము కో త్రాడు బిగించి కట్టి, రెండో ప్రక్క ఓ రోటికేసి కట్టాలనుకుంది. అనగా ఆ రోటి బరువుకు అటు ఇటు పరుగులు పెట్టకుండా ఒకచోట పడిఉంటాడనుకొంది.

ఇటువంటి బాలుణ్ణి ఏ విధాన కట్టి పడేసిందో బోధపడదు. అయితే లోకాచారాన్ని బట్టి అది సాధ్యమే. వేదాంతవేద్యుడన్న అర్థాన్ని భక్తులు బాల్య లీలల నుండి గ్రహించగలుగుతారన్నదే గ్రంథకర్త లిద్దరి అభిప్రాయాలని తెలుస్తోంది. పరమ భక్తుడైన లీలాశుకుడు తన శ్రీకృష్ణ కర్ణామృతంలో, ఒక్కొక్క భక్తునికి ఒక్కొక్క రూపంపై ప్రీతి ఉంటుందని తెలిపాడు. ఈ ఘట్టంలో యశోద శ్రీకృష్ణుని వెన్నదొంగగా నిర్ధారించి అపరాధి అని నిర్ణయించినప్పుడు, శ్రీకృష్ణుడు ఎట్లా ఉంటాడో వర్ణించిన విధం.

లోకంలో ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపం ఇష్టంగా ఉండటం సహజమే. అయితే లీలా శుకునికి అన్ని రూపాలూ ఇష్టమే. శ్రీకృష్ణుని రూపాలన్నీ ఆ మహనీయుడు ధ్యానంలో దర్శించినవే. ఒక్కొక్కరి కర్మ ఫలాలు ఒక్కొక్కరీతిగా ఉండటం వలన శ్రీకృష్ణుని లీలలు కూడా అనేకంగా కనిపిస్తాయి. ఒక్కొక్కరు పుణ్యకర్మల్ని కోరికలతో చేస్తూఉంటారు. మరికొందరు భగవదార్పణ బుద్ధితో చేస్తారు. అభీష్ట రూపమే ధ్యానమై గమ్యమవుతుంది. కొందరు కోరికలు లేకుండా ధ్యానం చేస్తారు. అటువంటి వారికి జ్ఞానరూపమే ధ్యానమవుతుంది. ప్రతి భక్తుడూ నిరంజనాది శబ్దాలతో స్తుతిస్తాడు. కానీ అతడి అర్చనారూపం కర్మ ఫలాన్ని బట్టే ఉంటుంది. కొందరు రాధామాధవుడని, మరికొందరు బాలకృష్ణుడని, ఇంకొందరు గోపికా లోలుడని ధ్యానంచేస్తారు. ఎందువల్ల? కవి వర్ణనను బట్టియే అతడి పూర్వకర్మను తెలుసుకొనవచ్చు. కొందరి పట్టుదలను మనం గమనిస్తూనే ఉంటాం. శ్రీకృష్ణుడే పరబ్రహ్మమంటారు. అటువంటివారికి ఆరూపానికి తగిన మంత్రాన్నే గురువు ఉపదేశిస్తాడు. వారి ధ్యానంకూడా ఆరూపాన్నే కోరుకుంటుంది. అయితే వారు ఇతర రూపాలను ద్వేషించరు. వారి భక్తి, దృఢమైన ప్రేమ మాత్రమే ఆ మూర్తిని వారి మనోఫలకం పై నిలబెట్టేట్లు చేస్తుంది. అందుకే కాబోలు, "సుపరీక్షిత శిష్యాయ

వదేన్మంత్రం మనోహరం" అని పెద్దలు బోధించారు. శిష్యుని మనోభావాన్ని ఎరిగి, అతడి నుండి కొన్ని సంవత్సరాలపాటు సేవలందుకుంటూ అతడి గుణగణాలను కనిపెట్టి అతడికి ఏ దేవత యందు విశ్వాసమున్నదో తెలుసుకొని అందుకు అనుగుణమైన మంత్రాన్ని ఉపదేశించడం సద్గురువు లక్షణమని శాస్త్రాలు చెబుతున్నాయి. అట్లా కాకుండా గురుదక్షిణ పేరుతో కొంత ధనం సంగ్రహించి ఏదో ఒక మంత్రాన్ని ఉపదేశిస్తే దానివల్ల మేలు కలుగకపోగా కీడే జరుగుతుంది. కావున భక్తులకు ఆయా భగవద్రూపాలే ధ్యేయమని గ్రహించడమే ఇందులోని సారం.

యశోద ఆ బాలకృష్ణుని త్రాడుతో గట్టిగా బంధించడమొక్కటే మార్గమనుకొంది. పోయి ఒక త్రాడుపట్టుకు వచ్చింది. తీరా కృష్ణుని మొలకు కట్టబోగా అది రెండంగుళాలు తక్కువైంది. ఇంట్లోకి పోయి మళ్ళీ ఇంకో త్రాటిని మొదటి దానితో ముడివేసి కృష్ణుడి మొలకు కట్టబోయింది. మళ్ళీ అదికూడా రెండంగుళాలు తగ్గింది. ఈ విధంగా యశోద ఇంట్లో ఉన్న త్రాటి ముక్కలన్నింటి నీ తెచ్చి ముడులు వేసినా మళ్ళీ అది రెండంగుళాలు తగ్గుతోంది. యశోద విసుక్కోలేదు. ఎక్కడలేని ఓర్పుతెచ్చుకుంది. కృష్ణుణ్ణి కట్టిపడేసే ప్రయత్నం మాత్రం మానలేదు. భగవంతుడు అంతా నిర్లిప్తంగా నిలబడి చూస్తున్నాడు.

తల్లి పడుతున్న అవస్థనంతా చూస్తూన్న పరమాత్మ చివరగా ఆమెకు చిక్కాలనే సంకల్పించాడు. అంతే ఆమె తనశ్రమ ఫలించిందని సంతోషించిందే గాని, భగవంతుడు అనుగ్రహించాడని అనుకోలేదు.

"జ్ఞానినాం చాత్మపోతానాం యథా భక్తిమతా మిహ " అన్నట్లు భగవంతుడు భక్తులకు వశుడైనట్లుగా మహా జ్ఞానులైన వారికి కూడా వశుడుకాడు. అదే పరమాత్ముని శపథం. కావున శ్రీకృష్ణుడు తల్లి చేతికి చిక్కినట్లు నటించాడు. అయితే భక్తి, జ్ఞానం కన్నా, తపస్సు కన్నా గొప్పదా? అన్న సందేహం కలుగచ్చు.

జ్ఞానం అంటే వస్తు తత్త్వావబోధకమని, భక్తి అంటే పరమేశ్వరుని యందు పరమ ప్రేమ అని నిఘంటువులన్నీ చెప్తున్నాయి. "జ్ఞానాన్ముక్తిః" అన్నమాట ఎందరికి తెలుసు? అటువంటి జ్ఞానుల కంటే భగవంతుణ్ణే ఎల్లవేళలా మనస్సు నిండా నింపుకొని మననం చేస్తూ ఉండే మునుల కంటే భక్తుడు ఎట్లా ఎక్కువైన వాడవుతాడన్నదే ప్రశ్న. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు మూడు వరుసగా సోపానాల వంటివి. ఒకదానికంటే మరొకటి గొప్పదని వాదించుకుంటూ ఉంటారు. వీటన్నింటికంటే యోగమేశ్రేష్ఠమని మరికొందరంటారు. "తస్మాద్యోగే భవార్జున"అని భగవద్వాక్యం గదా అన్నది వీరికి ప్రమాణం. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అని శృతులు చెప్తున్నాయి గదా అని జ్ఞానం ఉత్కృష్టమైనదని వాదించేవారీ ప్రమాణాన్ని చూపుతారు. ఈ విధంగా ఎవరు పడితేవారు ముక్కుమీద గుద్దినట్లు చెప్తూఉంటే మనం ఏమనగలం? ఈ వాదాలన్నీ అనాదిగా వస్తున్నవే. కాబట్టి ఇందులో ఎవరికేది అనుకూలమో దానిని స్వీకరించి తరించడం ఉత్తమం. అయితే ఇతరుల నమ్మకాలకు అడ్డు పడరాదు.

కొంత మంది భగవద్గీతను గోడమీద పిల్లి వాటంగా ఉంటుందంటారు. అది సరైన మాట కాదు. భగవంతుడేగాని, శాస్త్రాలేగాని, ఏ విషయాన్ని చెప్పినా ఉత్తమతనే బోధిస్తాయి. పరిపక్వత పొందినవారు మాత్రమే ఆ ఉపదేశాన్ని ఉత్తమ మార్గంగా ఎంచి శిరసావహించి ఆచరిస్తారు. ఆప్రకారమే

భగవత్సేవ చేస్తారు. ఆ ఉపదేశం తప్ప రెండో మార్గంవారికి రుచించదు. ఆదే సరి అయిన పద్ధతి. పరిపక్వత చెందని వారి విమర్శలకు మనం ఏమని సమాధానం చెప్పగలం?

> అనగా భక్తి జ్ఞాన వైరాగ్యాలు మూడు సమానమైన ఫలాన్నే ఇస్తాయి. బ్రహ్మ విష్ణుమహేశ్వరుల్లో ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ ఎట్లా కారో, అట్లాగే ఈ మూడు మార్గాల్లో కూడా ఎక్కువ తక్కువలుండవు. సమాధి భక్తి జ్ఞానాలు కలిసే సంధి
>
> **– శ్రీరామకృష్ణ పరమహంస**

సిద్ధాంతము

శ్రీ శంకర, రామానుజ, మధ్వాచార్యులు ముగ్గురూ మూడు మతాలు స్థాపించినా ముఖ్య విషయంలో మాత్రం భేదం లేదు. ఈ మూడు మార్గాల్లో ఏయే వ్యక్తి ఏత్రోవ మనస్సుకు ప్రీతి కలిగిస్తుందో అతడా మార్గాన్ని అనుసరించవచ్చు. అంతేగాని రెండవదానిని దూషించకూడదు. అట్లా దూషించడం భక్తుని లక్షణమేకాదు. భగవత్సేవ చెయ్యడమే అన్ని మతాల సారం అని గ్రహించాలి. భగవత్సేవా విధుల్లో తేడాలున్నాయి కాబట్టి మూడు మతాలుగా ఏర్పడ్డాయి. అయితే ఇందులోని భక్తులు మాత్రం అనేక మతాలుగా చీలిపోయారు. ఒక్కొక్క పురాణం ఒక్కొక్క మతాన్ని ప్రధానంగా చెపుతుంది. వీటిలో ఏ విధానాన్ని అనుసరించినా ఫలం సమానమే. భక్తి అన్నింటికన్నా గొప్పదని, జ్ఞానికన్నా భక్తుడే హెచ్చని చెప్పడం మాత్రం ప్రమాదం. అయితే భక్తి లేనివాడు జ్ఞాని కాలేడు. జ్ఞానం లేనివాడికి భక్తి అబ్బదు. భక్తి జ్ఞానాలకు ఫలమే వైరాగ్యం. కాబట్టి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడకూడదు. భక్తులూ జ్ఞానులే, జ్ఞానులూ భక్తులే, ఈ రెండూ ఉన్నవారే వైరాగ్య సంపద గలవారవుతారు. ఈ ముగ్గురికీ భగవత్ప్రసాదమ్ అభీష్ట ఫలం. అందుకు ఈ ముగ్గురూ పాత్రులే. ఈ మూడింటిలో ఏది దృఢంగా లేక పోయినా అభీష్టఫలం సిద్ధించదు. వేదోక్తమైన కర్మాచరణ వ్యర్థమనడం, అది భగవంతుని వద్దకు చేర్చలేదనడం పాపం చేసినట్లే అవుతుంది. ఎందుకంటే వేదం భగవద్రూపం కావున, వేదోక్త కర్మలే ఫలాన్నివ్వకపోతే మరేదీ అభీష్ట ఫలాన్నివ్వలేదు. శాస్త్రాన్ని ఉల్లంఘించడం, వేదాన్ని నిందించడం అంటే భగవంతుని నిందించినట్లే అవుతుంది. " మీరు ఏ శాస్త్రాన్ని అనుసరిస్తారు" అని ఓ భక్తుడు **శ్రీరామకృష్ణ పరమహంస** ను అడిగాడు. అందుకు పరమహంస ఇలా అన్నారు. "నేను ఏ శాస్త్రాన్నీ అనుసరించడం లేదు. నా హృదయంలో నివసిస్తున్న దైవం నుండి అనుమతి తీసుకొని జీవితాన్ని గడుపుతున్నాను. అందువల్ల నేను దారి తప్పడం లేదు. నా జీవితం శాస్త్రానికి వ్యతిరేకంగా ఉండదు" అన్నారు.

నియమహీనమైన మాట ఎట్లా నిష్ఫలమవుతుందో అట్లాగే భగవదాజ్ఞమీరినా చేసిన సాధనలన్నీ వ్యర్థమైపోతాయి. కావున యజ్ఞాలుగాని, శ్రుతి నిర్దేశించిన కర్మలుగాని వ్యర్థమని, వాటికన్నా భక్తియే గొప్పదనడం అజ్ఞానము, తెలివితక్కువతనము. భక్తుడైనవాడెవ్వడూ ఈ విధంగా మాట్లాడడు. అనగా ఏ కార్యాలు, ఏ మార్గాన చేసినా భగవదర్పణ బుద్ధితోచెయ్యాలన్నదే తాత్పర్యం. భగవంతుడు ఇంద్రియాలకు అతీతుడు. మానవులు ఇంద్రియ వశులు. కావున వీరు వేదాలను తప్పు పట్టడం

తెలివితక్కువదనం కాక మరేమవుతుంది? భగవంతుని కరుణకు పాత్రులమయ్యేందుకు అనేక మార్గాలున్నాయి. అందులో మనకు అనుకూలంగా ఉండేదాన్నిదేన్నైనా ఆశ్రయించి ఆయన కరుణకు పాత్రులం కావచ్చు. వారివారి అభీష్ట మార్గాలు కూడా పూర్వకర్మానుసారంగానే ఏర్పడతాయని మనం తెలుసుకోవాలి. ఆ మాటకు వస్తే మనం చేసే ప్రతి పనిలోను భక్తి, శ్రద్ధ ఉండాలి. ఏ పని చేస్తున్నా కర్తవ్యం తనపైన వేసుకోకుండా, భగవదాజ్ఞననుసరించే చేస్తున్నానన్న భావన కలిగి కర్మలు చేస్తే ఏ దోషము అంటదు. కాబట్టి కర్మాచరణ చేసే వారిని ఆక్షేపించరాదు. భక్తి అన్నింట్లోనూ ఉన్నది. అది లేకపోతే ఏ కార్యాన్నీ సాధించలేము.

యశోద శ్రీకృష్ణుని ఓ సామాన్య బాలునిగా తలచింది. కృష్ణుడి నడుముకు కట్టిన త్రాటిని రెండో ప్రక్క రోటికేసి బిగించి కట్టింది " ఇంకా బయటకు ఎట్లాపోతావో చూస్తాను. నీకీ శాస్తి జరుగవలసినదేనని" అంటూ తను ఇంట్లోకి పోయింది. శ్రీ కృష్ణుడు కూడా తల్లి అక్కడ ఉన్న కాసేపు భయపడుతున్నట్లుగా బిక్కమొహం వేసి చూశాడు. ఆమె అటు పోగానే తనలో ఇలా అనుకున్నాడు. నారదుని శాపం మూలంగా చాలాకాలం నుండి కుబేరుని పుత్రులు మద్ది వృక్షాలై పడి ఉన్నారు. నేను ఎప్పుడు భూలోకంలో అవతరిస్తానా అని తాము చేసిన దుష్కృత్యాల్ని తలచుకొని దుఃఖిస్తున్నారు. " నేనిప్పుడు వారికి శాపవిమోచనాన్ని కలిగిస్తాను" అని అనుకొని జంటగా ఉన్న ఆ రెండు వృక్షాల నడుమకు ఈ రోటిని ఈడ్చుకొని పోయాడు. ఈ రోలు ఆ రెండింటినడుమ పట్టలేదు. రోలు వాటి మధ్యన ఇరుక్కుంటుంది.

మద్ది వృక్షాలు నేల కూలుట

కృష్ణుని అల్లరి లేకుండా కొంతసేపు ప్రశాంతంగా ఇంటి పనులు చేసుకోవచ్చునని యశోద ఇంట్లోకి పోయింది. ఇంతలో కృష్ణుణ్ణి యశోద రోటికేసి కట్టేసిందని విన్న గోపికలందరూ ఒక్కరొక్కరే వచ్చి పరామర్శించిపోతున్నారు. నాయనా! కృష్ణా! మీ అమ్మ నీ నడుముకు ఓ రోలు కట్టేసిపోయింది గదా! ఇప్పుడు పరుగులు తియ్యి, చూద్దాం అంటూ పరిహాసంచేసిపోయారు. ఇంకొకళ్ళైతే " నాయనా! ఇప్పుడు మా యింట్లో వెన్నంతా తిన్నట్లున్నదా?" అని నిష్ఠూరాలాడిపోయారు. బ్రహ్మాదులకే కాదు, మహామాయకు కూడా పట్టుబడని శ్రీ కృష్ణుడు తల్లిని సంతృప్తి పరిచేందుకు పట్టుబడిపోయాడు. ఇక చెయ్యాల్సిన కార్యాన్ని గూర్చి ఆలోచించాడు. అమ్మేమో ఇంట్లో పని చేసుకుంటోంది. గోపికలంతా నన్ను ఆట పట్టించి ఇళ్ళకు పోయారు. ఇక ఆలస్యం చెయ్యకూడదు. చాలా కాలంగా పరితపిస్తున్న ఆ కుబేర పుత్రుల్ని శాప విముక్తుల్ని చేయడమే నా అవతారఫలం. ఇక ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా ఈ వృక్షాలు రెండింటినీ కూల్చేస్తాను. దీనులను కాపాడతాననే గదా ప్రతిజ్ఞ చేశాను.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్" అని తలచి మెల్లగా ఆ రోటిని ఈడ్చుకుంటూ ఆ మద్ది చెట్ల సమీపానికి పోయి తాను ఆ రెండు చెట్ల నడుమ దూరాడు. రోటిని మాత్రం ఆ రెంటికి మధ్యని తగిలించి ఒక్క గుంజు గుంజాడు. దాంతో ఆ చెట్లు రెండూ నేల కూలాయి. ఆ రెండు వృక్షాలు ఫెళఫెళ శబ్దం చేస్తూ నేలకూలగానే శ్రీకృష్ణుడు ఏమీ ఎరుగనివాడిలా ఉండిపోయాడు.

అప్పుడా వృక్షాలలో నుండి అగ్నివంటి తేజస్సుతోకూడిన జ్ఞాన సంపన్నులిద్దరు బయటకు వచ్చి భక్తి వినయాలతో చేతులుజోడించి శ్రీకృష్ణుని ఈ విధంగా ప్రార్థించారు. " శ్రీ కృష్ణా! పరమేశ్వరా! నీవే ఆది పురుషుడవు. మహా యోగివి. అందరికన్నా ఉత్కృష్టుడవు. వ్యక్తావ్యక్తమైన జగత్తంతా నీ స్వరూపమే. సకల భూతాలకు, ఆత్మలకు, ఇంద్రియాలకు, ప్రాణాలకు నువ్వే ప్రభువు. కాలస్వరూపకుడవూ నీవే, వినాశంలేని వాడవు, సర్వవ్యాపకుడవు, నీ ఇచ్ఛా శక్తియే మహా ప్రకృతి. సత్వరజస్తమోమయమైన సూక్ష్మ ప్రకృతివి కూడా నువ్వే. సర్వాధ్యక్ష పురుషుడవు నువ్వే. సర్వక్షేత్ర వికార కర్తవు నువ్వే. సర్వాధ్యక్ష పురుషుడవు నువ్వే. గుణ సంవృతుడైన వాడెవ్వడూ నిర్గుణుడవైన నిన్ను తెలుసుకోలేడు. పరబ్రహ్మవై వాసుదేవుడవైన నీకు నమస్కారములు. ఆత్మజ్యోతకము, గుణచ్ఛన్న మహితాత్మకమైన నీకు వందనములు. శరీరములన్నింటిలోను అశరీరుడవుగా ఉంటూ నీ అవతారములను ప్రకటిస్తూ ఉంటావు. సర్వదేహముల యందు సాక్షీభూతుడుగా ఉండే వాడవు నీవే. అట్టి నీవు ఆ జీవులన్నింటికీ పుట్టుక, వృద్ధి, క్షయములకు కారణభూతుడవైన ఓ పరమ కళ్యాణ మూర్తీ! విశ్వమంగళ కర్తవైన నీకు వందనములు. వాసుదేవుడిగా ప్రఖ్యాతి చెంది శాంతిరూపుడవై యదు వంశ నాయకుడవైన నీకుపాదాభి వందనములు. మేము నీ భక్తులము, కింకరులము మమ్ము అనుగ్రహించు. నారద మహర్షి ఆగ్రహమే, అనుగ్రహమై నీ దర్శన భాగ్యం మాకు లభించింది." అని స్తోత్రం చేశారు. వ్యాఖ్యానంలో "ఆస్మత్సంగినాం సర్వేషా మిత్యభిప్రాయేణ బహువచనమ్" అని ఉన్నది. ఆ వ్యాఖ్యను పరిశీలించిన మహాకవి బహువచన ప్రయోగం చేశాడేగాని, అక్కడ కుబేర కుమారులు (నలకూబర, మణిగ్రీవులు) ఇద్దరున్నారనికాదు. భక్తులెప్పుడూ " సర్వేజనా సుఖినోభవంతు" అనే గదా కోరుకుంటూ ఉంటారు.

ఇట్లు స్తుతించిన ఆ భక్తులిరువుర్ని చూసిన భగవంతుడు కృపాకరుణలు ఉట్టి పడుతూ ఉండగా ఇలా అన్నాడు. భక్తులారా! మీరు ధనమదంతో నారదమహర్షిని దూషించడం వల్లనే నేడు మీకు నా దర్శన భాగ్యం లభించింది. నా దర్శన భాగ్యం ఎన్నటికీ వ్యర్థం కాదు. రాబోయేకాలంలో అనేక శుభాలు కలుగుతాయి. నా భక్తులై, నిస్సంగులై సమభావం గలవారే నాకు ప్రీతిపాత్రులవుతారు. అటువంటి నా భకుల్ని సందర్శించిన వారికి కూడా నా దర్శన భాగ్యం లభ్యమవుతుంది. మీకు శాపవిమోచనమైనది. కావున ఇక కుబేరుని పట్టణానికి వెళ్ళండి. నా భక్తి కూడా మీకు స్థిరంగా ఉండుగాక" అని పలికి వారిని సాగనంపాడు.

ఈ కథ శ్రీమద్భాగవతం నుండి గ్రహించబడింది.

రెండు మద్ది చెట్లను కూల్చడం భాగవతంలోను, విష్ణుపురాణంలోను ఉన్నది.

బ్రహ్మవైవర్త పురాణంలో మాత్రం యశోద శ్రీకృష్ణుని రోటికేసి కట్టి పడేసిందని, ఆ కట్టేయడం కూడా ఆ వృక్షాల క్రిందనేననియూ, అది ఒకే ఒక వృక్షమని, శ్రీకృష్ణుడు ఆ రోటిని ఆ వృక్షానికి తాకించగానే అది పడిపోయిందని, అందులో నుండి ఒక పురుషుడు బయటకు వచ్చి శ్రీకృష్ణుని స్తుతించాడని, అతడే నలకుబేరుడనియూ దేవర్షి అయిన నారదుని శాపం మూలంగా వృక్షమై పోయాడని తెలుపబడింది.

నలకూబరుని వృత్తాంతము

(ఈ భాగం భాగవతం పదవ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

కుబేరుడు పరమ శివునికి భక్తుడు, మిత్రుడు. దేవతలకు ధనాధిపతి. ముందు అతడు లంకానగరంలో నివసిస్తూ ఉండేవాడు. అతడి సవతి సోదరులైన రావణకుంభకర్ణులు వరగర్వంతో అతణ్ణి లంకానగరం నుండి వెళ్ళగొట్టారు. అప్పుడతడు తండ్రి వద్ద అనుమతి తీసుకొని కైలాసానికి పోయి శివుని ఆరాధించాడు. శివుడు ప్రసన్నుడై అతనికి ఉత్తర దిక్కుకు దిక్పాలకునిగా నియమించి కైలాసంలోనే నివసించేందుకు అనుమతించాడు. కుబేరునికి ఇద్దురు పుత్రులు. వారే నలకూబర మణిగ్రీవులు. వాళ్లిద్దరు మహాదేవునికి కింకరులుగా ఉంటూ శివసాన్నిధ్యంలోనే మెలగేవారు. వారి పూర్వ జన్మ దుష్కృతం చేత స్త్రీలోలులయ్యారు. కైలాసంలోను, భూలోకంలోనూ సరస్సులు, నదీతీరాలు, వనాలన్నింటిలోనూ స్త్రీలతో కలసి విచ్చలవిడిగా విహరిస్తూ ఉండేవారు.

వారొకనాడు తమ స్త్రీలతో కలసి దిగంబరులుగా విహరిస్తూ ఓ సరస్సులో జలక్రీడలలో మునిగిపోయారు. అదేసమయానికి నారద మహర్షి ఆ తటాకంలోనే పాద ప్రక్షాళనకై దిగాల్సి వచ్చింది. అప్పటికే నలకూబర మణిగ్రీవులిద్దరూ గొంతువరకు మద్యం సేవించి దిగంబరంగా తటాకంలో కేరింతలు కొట్టుచున్నారు. వారు మహర్షిని చూచికూడా అభివాదం చేయలేదు. వారు చేస్తున్న అనాచారానికి సిగ్గుపడలేదు. వారిని చూచిన మహర్షి మనస్సులో ఇలా అనుకొన్నాడు. “వీరు కుబేరుని పుత్రులు. శివ భగవానునికి కింకరులుగా ఉంటున్నారు వీరు నివృత్తి మార్గాన్ని వదిలేసి సిగ్గు లజ్జ లేకుండా దిగంబరులై తిరుగుతున్నారు. నన్ను చూసికూడా అభివాదమైనా చెయ్యకుండా మదాంధులయ్యారు. వీళ్ళని ఇట్లాగే వదిలేస్తే ఎందుకూ పనికిరాకుండాపోతారు. వీరికి గట్టిగా బుద్ధిచెప్పి ఈ దురాచారం నుండి తప్పించి భగవదనుగ్రహం కలిగేట్టుచెయ్యాలని సంకల్పించాడు. ఎందువల్ల నంటే దుర్వృత్తిలో ఉన్నవారిని మందలించి సద్వృత్తిలోకి మరల్చడం సాధువులకు పరమ ధర్మంకదా.

విషయాసక్తులైనవారికి రజోగుణంకన్నా అపకారం చేసేది మరొకటి ఉండదన్నది పరమ సత్యం. అటువంటివారికి ఐశ్వర్యం కూడా తోడైతే వారికి పట్టపగ్గాలుంటాయా? ఉన్నత కులంవారై, అధికారంకూడా సంక్రమిస్తే వారు స్త్రీలోలురు కాక తప్పదుకదా? అందుకే **శ్రీరామ కృష్ణులు** “కాంతా కాంచనాలే మనిషిని అధ:పతనానికి తీసుకుపోతాయని” తమ శిష్యులుకు తరచుగా బోధించేవారు. రజోగుణంతో విర్రవీగేవారంతా ఈ శరీరం అశాశ్వతమని గుర్తించరు. ఇంద్రియాలకు బానిసలై పశువుల్లా ప్రవర్తిస్తారు. అవ్యక్తంలో పుట్టి అవ్యక్తంలోనే నశించే దేహాన్నే ఆత్మగా భావించి సాటివారి ని(జీవుల్ని) హింసిస్తూ ఉంటారు. ఇట్లా ధనమద గర్వంలో విర్రవీగేవారికి దరిద్రాన్ని గురించి, కష్టాల గురించి ఆవగింజంతైనా అవగాహన ఉండదు. దరిద్రుడైతే తను స్వయంగా కష్టాలు అనుభవిస్తాడు కనుక తోటివారి కష్టాలను అర్థంచేసుకొని హింసకు పాల్పడడు. ముల్లు గుచ్చుకొన్నవాడికే ముల్లు బాధతెలుస్తుంది. ఆ అనుభవం లేనివాడు ఆ బాధ గుర్తించకపోగా హింసిస్తాడు. అహంకారాన్ని జయించదలచిన దరిద్రునికి కష్టాలు సంభవించినా అదే అతని పాలిట తపస్సు అవుతుంది. ఆకలిచేత

కృశించి అన్నం కోసం అలమటించే దరిద్రుడి అవయవాలు నీరసించిపోతాయేకాని హింసకు పాల్పడవు. అటువంటివాడు అప్రయత్నంగానే సాధు సాంగత్యాన్ని పొందుతాడు. కోరికలు నశించినవాడై శోకవిముక్తుడవుతాడు. సూర్యరశ్మి సోకేటంత వరకు నేత్రాలు వస్తువుల్ని చూడలేవు. అట్లాగే భగవత్ దర్శనానికై తపించే వారితాపంకూడా సాధుజనుల దర్శనభాగ్యం కలిగేంతవరకే ఉంటుంది. ఆ పిమ్మట బంధాలు అతణ్ణి బంధించవు. వీళ్ళిద్దరూ కావటానికి కుబేరుని పుత్రులే అయినా ఇంద్రియాలకు దాసులై స్త్రీలోలులైయ్యారు. మద్యం సేవించి కళ్ళు మూసుకుపోయి ప్రవర్తిస్తున్నారు. ఒంటిమీద బట్టలుకూడా లేకుండా దిగంబరులై తిరుగుతున్నారు. వీళ్లు స్థావరాలుగా పడి ఉండుగాక అదే వీరికి తగిన శిక్ష. ఆతర్వాత వాళ్లు ఇటువంటి దుష్కార్యానికి పాల్పడకుండా ఉండేందుకు వీరికి పూర్వ స్మృతి ఉండేటట్లు చేస్తాను. నూరు దివ్య సంవత్సరాలు వారట్లా స్థావరాలుగా ఉంటారు. ఆతర్వాత శ్రీకృష్ణుని స్పర్శచేత శాపవిముక్తులై కృష్ణ భక్తి పరాయణులై మళ్ళీ దైవత్వాన్ని పొందుతారు," అని పల్కి దేవర్షి నారదుడు నారాయణాశ్రమానికి వెళ్లిపోయాడు. ఆ నలకూబర మణిగ్రీవులే ఇక్కడ గోకులంలో మద్దివృక్షాలై పుట్టారు.

ఈ ఘట్టాన్నే మహాకవి పోతనగారుఆంధ్రీకరిస్తూ తాత్పర్యాన్ని మాత్రమే స్వీకరించి అతి క్లుప్తముగాను, స్వతంత్రముగాను తమ రచనను సాగించారు. వీరేకాదు అనేకమంది సంస్కృత కావ్యాలను తెలుగులోకి అనువదించారు. ఇట్లాంటి అనువాద వాఙ్మయాన్నంతా పెద్దలు మూడువిధాలుగా విభజించారు.

1. కథానువాదం :- వీరు సంస్కృతం నుండి కథాసారాంశాన్ని మాత్రమే గ్రహిస్తూ అనవసరం అనుకున్నచోట సంక్షిప్తం చేస్తూ, అట్లాగే అవసరం అనుకున్నప్పుడు పెంచి వ్రాస్తూ ఉంటారు. మహాభారతాన్ని అనువదించిన కవిత్రయం ఈ కోవకు చెందినవారే.

2. భావానువాదం :- వీరు సంస్కృత మూలంలోని ప్రతిశ్లోకాన్ని చదివి భావాన్ని గ్రహిస్తూ అనువదిస్తారు. వీరు మూలానికి విధేయులుగా ఉండరుగాని స్వతంత్రాన్ని ప్రకటించుకోరు. కవిసార్వభౌముడైన శ్రీనాధుడ్ని భావానువాదకునిగా పెద్దలు చెప్తారు.

3. యథాతథానువాదం :- వీరు పదాలకు ఎక్కువ గౌరవం ఇస్తారు. మూలంలోని ప్రతి పదాన్ని అనువదిస్తూ పోతారు. అందువల్ల మూలాన్నికూడా పరిశీలిస్తూ ఉంటేగాని వీరి భావాల్ని పూర్తిగా అర్థంచేసుకోలేం.

పోతనామాత్యులు పరమ భాగవతులు అవడం చేత భక్తిపరమైన ఘట్టాల్లో భగవానుని స్తుతిస్తూ మూలంలో ఉన్నదానికన్నా పెంచి వ్రాశారు. అట్లాగే రుక్మిణి బాల్య యవ్వనదశల గూర్చి 23 పద్యాలు పెంచి వ్రాశారు. వీటిద్వారా ఆయనకాలంలో ఆంధ్రదేశంలో అవివాహితులైన కన్యలాచరించే క్రీడల్ని రమణీయంగా వర్ణించి చెప్పారు. అట్లాగే శ్రీకృష్ణ కుచేలులిద్దరూ గురుకులంలో తమ అనుభవాల్ని గుర్తుచేసుకోవడం మూలంలో కనపడదు. పోతనగారు పెంచివ్రాశారు. అంతేకాదు, నరకాసురునితో యుద్ధానికి సత్యభామను కూడా తీసుకొనివెళ్ళినట్లు మూలంలో లేదు, పోతనగారు ఊహించి పెంచి వ్రాశారు.

**(ఈ క్రింది కథాభాగం శ్రీకృష్ణ జన్మ ఖండం 14వ అధ్యాయం నుండి గ్రహించబడింది.
పైన భాగవతంలో చెప్పిన కథకు ఇందులో తెలిపిన నలకూబర ఉదంతానికి కొద్దిపాటి తేడాలున్నాయి.
ఈ కథనంతా శ్రీమన్నారాయణుడు నారదునికి తెలిపినట్లుంటుంది. ఇందులో ఒకటే మద్ది వృక్షం
ఉంటుంది. ఆ వృక్షంలోనుండి సుందరాకారుడైన ఓ దివ్య పురుషుడు బయటకువస్తాడు.
ఈ భాగంలోని పూర్వాపరాలను తిలకించండి.)**

గోపికలంతా ప్రతి నిత్యం కృష్ణుడు తమ ఇళ్ళల్లో వెన్న దొంగిలిస్తున్నాడని చెప్తున్నా యశోద నమ్మేదికాదు. ఒకానొకరోజున పొరిగింట్లో శ్రీకృష్ణుడు వెన్నదొంగిలిస్తూ యశోదకు పట్టుబడతాడు. ఆ కోపంతో శ్రీ కృష్ణుని ఓ మద్ది వృక్షానికి కట్టేస్తుంది.

యశోద శ్రీకృష్ణుని మద్ది వృక్షానికి కట్టేసి తను ఇంట్లో పనిచేసుకోవడానికి వెళ్ళింది. యశోద అక్కడ ఉన్నంత సేపు కృష్ణుడు దు:ఖాన్ని, భయాన్ని నటించాడు. ఆమె అటుపోగానేపోయి ఆ వృక్షాన్ని తాకాడు. వెంటనే ఆ వృక్షంకాస్తా నేలకూలింది. అందులోనుండి ఓ సుందరాకారుడైన దివ్యపురుషుడు బయటకు వచ్చాడు. అతడు కృష్ణుని పాదాలకు నమస్కరించి అనేక విధాలుగా స్తుతించి పూజించాడు. అంతలోనే ఆ దివ్యపురుషుడికోసం ఓ విమానం వచ్చింది. శ్రీకృష్ణుని వద్ద అనుమతి తీసుకొని అతడా విమానంలో వెళ్ళిపోయాడు. మద్ది వృక్షం నేలకూలడంతో భయంకరమైన శబ్దం అయింది. ఆ శబ్దానికి భయపడుతూ యశోద పరుగున ఇంట్లోనుండి బయటకు వచ్చింది. కృష్ణుడికేమీకానందుకు సంతోషంతో ఎత్తుకొని గుండెలకుహత్తుకుంది. ఆ శబ్దానికి చుట్టుప్రక్కల ఇళ్ళల్లో నుండి గోపికలు, గోపాలురు, పిల్లలు, వృద్ధులు అంతా పరుగు పరుగునవచ్చారు.

కృష్ణుడు క్షేమంగా ఉన్నాడు. యశోద ఎత్తుకుని ఓదార్చడం చూశారు. వాళ్ళంతా కృష్ణుడికి ప్రమాదం తప్పినందుకు ఎంతో సంతోషించారు. యశోదకు అంతా తలో సలహా చెప్పి వెళ్ళిపోయారు. శిశువుకు బాలగ్రహదోషాలు కలుగకుండా ఉండేందుకు శాంతికృత్యాలు చేయించమన్నారు. కొందరైతే "యశోదా! నీకు వయస్సుబాగా ముదిరిపోయిన తర్వాత ఈపిల్లవాడు పుట్టాడు. ధనధాన్యాలు, రత్నాలవంటి సంపదలన్నీ పుత్రునికోసమేనంటారు. అటువంటి పిల్లలు కొద్దో గొప్పో అల్లరిచేయకుండా ఉంటారా? ఇంట్లో పాలు పెరుగు, వెన్న సమృద్ధిగా ఉన్నాయిగదా! అవన్నీ పిల్లలు అనుభవించకపోతే ఇంకా ఆ సంపదలకు ప్రయోజనం ఏముంటుంది? నువ్వేమో కొద్దిగా వెన్నతిన్నాడని కఠినంగా శిక్షించి ఆ చెట్టుకు కట్టి నీపాటికి నీవు ఇంట్లో పనులు చూసుకుంటున్నావు. ఇంత పెద్ద వృక్షం నేలకూలింది. భగవంతుని కృపచేత పిల్లవాడికి ఏమీకాలేదు. ఎంతటి ప్రమాదం తప్పిపోయిందోచూడు. ఈ పిల్లవాడే దక్కకపోయిన తర్వాత ఈ సిరిసంపదలన్నీ ఏంచేసుకుంటావు. అంటూ అసలే భయపడుతున్న యశోదను మరీ భయపెట్టారు. వెంటనే బ్రాహ్మణులను పిలిపించి ఆశీర్వచనాలు చెప్పించారు. వందిమాగధులు వచ్చి స్తోత్రపాఠాలు వల్లించారు. ఈ విధంగా ఎవరికి తోచిన విధంగావారు మాట్లాడి ఇళ్ళకు వెళ్ళారు."

ఇంతలోనే నందుడు వచ్చి యశోదపై మండిపడ్డాడు. దుర్మార్గురాలా! నేను నాకొడుకును చంకనే వేసుకొని తీర్థయాత్రలకు పోతాను. లేదంటావా, నువ్వు వెంటనే నీ పుట్టింటికి వెళ్లిపో. ఇంతటి అఘాయిత్యం చేసిన నీతో కలసి బ్రతకలేను. నూరు నూతులు ఒక వాపికతో సమానం,

అట్లాంటి నూరు వాపికలు ఒక సరస్సుతో సమానం. అటువంటి వంద సరస్సులకంటే ఒక యజ్ఞం గొప్పది. వంద యజ్ఞాలకంటే ఒక పుత్రుడు ఉత్తముడు. తపస్సు, దాన ధర్మాల వలన మరణానంతరం గాని సుఖాలు పొందలేరు. అయితే పుత్రునివలన ఇహపరలోకాలు రెండింటిలోనూ సుఖాలు పొందవచ్చు.

పుత్రుడి కంటే ఉత్కృష్టమైన బంధువు ఉండడు. ఇది సత్యము అంటూ నిప్పులుచెరిగాడు. అంతట యశోద తన అపరాధాన్ని మన్నించమని వేడుకుంది. నందుడుకూడా తెగేదాకా లాగరాదనుకున్నాడో ఏమో సమాధానపడి శాంతించాడు, అని శ్రీమన్నారాయణమూర్తి వివరించగా " నారదుడు మహానుభావా! ఆ మద్ది వృక్షమునుండి బయటకు వచ్చిన ఆ సుందరాకారుడు ఎవరు? ఎందువలన అతడు గోకులంలో వృక్షమై పడివుండాల్సివచ్చింది" అని అడిగాడు. తిరిగి నారాయణుడు నలకూబరుని వృత్తాంతమంతా ఈ రీతిగా తెలిపాడు.

నలకూబరుని వృత్తాంతము

నలకూబరుడు దిక్పాలకుడు, ధనాధిపతి అయిన కుబేరుని పుత్రుడు. సుందరాంగులలో సుందరుడని ప్రఖ్యాతి చెందాడు. అట్లాగే స్త్రీలలో రంభను మించిన అందగత్తె ముల్లోకాలలోను లేదుగదా. వారిద్దరూ ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకున్నారు. వారు నిర్జనారణ్యాలలో విచ్చలవిడిగా శృంగారక్రీడలు జరపాలనుకొని నందన వనానికి వెళ్ళారు. ఆ వనంలో ఎక్కడ చూచినా సరస్సులే, పూ పొదరిళ్ళే వనమంతా పూలపరిమళాలు వెదజల్లుతుంటే మదం రెట్టింపైంది. రంభ ధరించిన కుండలాల రత్నకాంతులలో నలకూబరుడు పున్నమిచంద్రుడిలా ప్రకాశించాడు. వారిద్దరూ అట్లా విహరిస్తూ దేవల ముని ఆశ్రమానికి చేరుకున్నారు. అక్కడ అడవిపూలన్నీ రాలి నేలంతా మెత్తటి తివాచీలా అమిరాయి. వాటి పరిమళాలు కస్తూరి కుంకుమ పరిమళాలను మించిపోయాయి. అటువంటి పూలపాన్పు పైన నలకూబరుడు రంభతో కలసి అష్టవిధములైన శృంగారాలను, షట్ప్రకారాలైన చుంబనాలను, అంగ ప్రత్యంగ సంయోగ త్రివిధశ్లేషణాలను, నఖదంతకర క్రేతులతోను, సమ్యత్క్రమ రతిభేదాలతోను ఆ రసిక శిఖామణులిద్దరూ నింగికి నేలకు భేదము తెలియకుండా విహరించారు. ఈ విధంగా రతిసుఖజలధిలో మునిగి తేలుతున్న రంభా నలకూబరులకు అనుకోకుండా దేవలముని ఆ సరస్సుకే రావటం కనపడింది. ఆ సరస్సులో విరబోసుకున్న కురులతో వంటిమీద నూలుపోగైనా లేకుండా నఖదంతక్షతాంగియై మత్తెక్కి తదేకంగా ప్రియుని కళ్ళల్లోకే చూస్తున్న రంభ ఆ ముని కంటపడ్డది. నలకూబరుడు కూడా రంభ బిగికౌగిలి విదిల్చుకొని బయటికి వచ్చి మునికి నమస్కరించలేదు. లేవనైనా లేవలేదు. సౌమ్యుడైన ఆ మునికి వీరి దుష్ప్రవర్తన వలన కోపం కట్టలు తెంచుకుంది. కామాతురయైన రంభను చూస్తూ "ఓసి రంభా నువ్వు మానవలోకంలో జనమేజయ మహారాజుకు భార్యవై జన్మించు. తిరిగి నువ్వు ఇంద్రునితో సంభోగించిన తరువాత నీ నిజలోకానికిపోతావు" అని శపించాడు. నలకూబరుని చూస్తూ "ఓరీ! పాపి. నువ్వు గోకులంలో వృక్షమై పడివుండు. శ్రీకృష్ణుని స్పర్శవలన తరిగి నీ పూర్వపు రూపాన్ని పొందుతావు. మీ ఇద్దరి దుష్ప్రవర్తనకు ఇదే తగిన శిక్ష " అని శపించాడు.

శ్రీమన్నారాయణుడు నలకూబరుని వృత్తాంతంచెప్పి ఆ తర్వాత రంభ వృత్తాంతాన్నికూడా నారదునికి ఇలా వివరించాడు.

రంభ భూలోకంలో సుచంద్రుని పుత్రికగా జన్మించి జనమేజయ మహారాజును వివాహమాడింది. జనమేజయుడు అశ్వమేధయాగం తలపెట్టి యాగాశ్వాన్ని విడిచాడు. (ఈ జనమేజయుడు పరీక్షిత్మహారాజు పుత్రుడుకాడు) ఆ అశ్వాన్ని ఇంద్రుడు అపహరించి కొన్నాళ్ళు తన వద్దనే ఉంచుకొని తాను ఆ అశ్వంలో ప్రవేశించి ఆ అశ్వాన్ని యజ్ఞశాలకు చేర్చాడు. అశ్వం చాలా అందంగా ఉందని నలుగురూ చెప్పుకుంటూ ఉంటే విన్న రాజపత్ని ఒంటరిగానే యాగాశ్వాన్ని చూడటానికిపోయింది. రాజపత్ని మహాపతివ్రత అని తెలిసికూడా అశ్వంలోఉన్న ఇంద్రుడు కామించి ఆమెను బలాత్కారంచేసి అనుభవించాడు. ఆమెతోరతిస్తున్న ఇంద్రునికి కాలమే తెలియలేదు. అనంతరం రంభకూడా తన యోగబలంచేత దేహత్యాగం చేసింది. ఇంద్రుడు తను చేసిన పనికి సిగ్గుపడి వెంటనే దేవలోకానికి వెళ్ళిపోయాడు. రాణి మరణవార్త విన్న జనమేజయుడు భార్య మృతకళేబరంపై పడి దుఃఖించాడు. తలపెట్టిన యజ్ఞాన్ని ఎట్లాగో పూర్తిచేసి బ్రాహ్మణులకు విరివిగా దక్షిణలిచ్చి పంపేశాడు. రంభకూడా మానవ దేహం విడువగానే స్వర్గానికిపోయి తన నిజరూపాన్ని పొందింది. "ఓ నారదమునీ! శ్రీకృష్ణుని కృపచేత నలకూబరుని శాపవిమోచన వృత్తాంతాన్ని, రంభ వృత్తాంతాన్నితెలిపాను. ఈ కృష్ణ చరిత్రము పుణ్యప్రదము."

(ఈ క్రింది కథాభాగం విష్ణుపురాణం 16వ అధ్యాయంలో ఇలా చెప్పబడింది)

అనగా ఈ కథాంశం కూడా భాగవతంలో చెప్పిన కథతో సరిపోతుంది. అయితే ఈ భాగాన్నే బ్రహ్మ పురాణంలో 76వ అధ్యాయంలో వివరిస్తూ ఈ శ్లోకాలనే విష్ణుపురాణంలోనూ చెప్పడం జరిగింది. దీన్నిబట్టి విష్ణుపురాణానికి బ్రహ్మ పురాణమే మూలమని తెలుస్తోంది. హరివంశం 7వ అధ్యాయంలో కూడా చెప్పడం జరిగింది. ఈ క్రమంలో బ్రహ్మ, విష్ణు, భాగవత, హరివంశాలలోని కథావృత్తాంతం అంచీ0ఒకే విధంగా ఉన్నదని స్పష్టమౌతోంది. అయితే బ్రహ్మవై వర్త పురాణంలో మాత్రం కథాభాగంలో కొద్దిపాటి వ్యత్యాసం ఉన్నా సారాంశం ఒకటేనని తేలుతోంది.అయినా ఈ పురాణంలో చెప్పిన కథావిశేషాన్ని కూడా స్థూలంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

నలకూబరుడు కుబేరునిపుత్రుడు. కుబేరుడు దిక్పాలకుల్లో ఒకడు. పైగా ధనాధిపతి. సచ్చరిత్రుడన్న ప్రసిద్ధిగలవాడు. అతడి కుమారుడు నలకూబరుడు తన ప్రేయసి అయిన రంభతో కలసి నిర్జనారణ్యంలో, నిర్లజ్జతో విహరించాలనుకున్నాడు. అది నిర్జనారణ్యంకావటాన తాము ఎవరికంటా పడమన్నది అతగాడి నమ్మకం. అతడి ప్రియసఖి అయిన రంభ కూడ రతిలంపటురాలు. ఆ విషయాల్లో తన నాయకుణ్ణే మించిపోయింది. వాళ్ళు దేవతలు కాబట్టి నిద్రాహార బాధలు వారిని పీడించలేదు. దాంతో మరీ రెచ్చిపోయారు. ఎంత నిర్జనారణ్యమైనా అవన్నీ తపోధనులైన మహర్షులకు స్థావరాలన్నమాట మరచిపోయారు. తమకు అడ్డువచ్చేవారే లేరనుకున్నారు. అసలే ధనాధిపతి కొడుకు, నవయవ్వనంలో ఉన్న జగదేకసుందరుడు. అన్నిటినీ మించి దిక్పాలకుని కుమారుడన్న అధికారగర్వంతోవారికి బాహ్యస్మృతి లేకుండా పోయింది.

భగవంతుడు కర్మ స్వరూపుడు. సర్వ సాక్షి. ఆయనకు తెలియని రహస్యాలుండవు. ఆయన లేని చోటంటూ ఉండదు. ఎవరెవరి ప్రవర్తన లోకానికి ఉపకారం చేస్తుందో, ఆమహనీయునికి తెలుసు. తానుమాత్రం సాక్షిగా ఉంటూ ఇతరులను ప్రేరేపించి ఆయాపనులు చేయిస్తూఉంటాడు. వారివారి కర్మఫలాలు అనుభవిస్తూఉంటే చూసి ఆనందిస్తూ ఉంటాడు. ప్రాణుల కర్మలను పరీక్షిస్తూ దానికి తగిన ఫలాన్నివ్వటమే భగవత్కృత్యం, దానివల్ల ఆయనకేమిలాభం అని అడిగితే అదే ఆయన లీల అనో, క్రీడ అనో చెప్పుకోవాల్సిందే. ఇదే కర్మ సిద్ధాంతం. దీనిని తప్పించుకోవటం ఎవరి తరమూ కాదు.

రంభ నలకూబరులు సుఖాలనే పరమానందమని భావించారు, రాత్రి పగలు అన్న తేడాలేకుండా విహరించారు. ఇది లోక విరుద్ధమని అనుకోలేకపోయారు. చూసేవాళ్ళు ఏమంటారోనన్న బెరుకుకూడా లేకుండా ప్రవర్తించారు. రతిశాస్త్రమే శాస్త్రాలన్నిటిలోను ఉత్తమమైనదని తలచి ప్రవర్తించారు. భగవంతుడీ విషయాన్ని గ్రహించాడు. వాళ్ళకు తగిన ప్రాయశ్చిత్తం చేయాలని భావించాడు. నారదమహర్షి ఆదారిన వెళుతూ వారు అయన కంటపడేటట్లుగా సంకల్పించాడు. రంభ నలకూబరులు కూడా నారదుణ్ణి చూడకుండా ఉండేటట్లుగా మాయ ఆవరించేట్లు చేశాడు. ఆ ప్రభావంచేతనే వాళ్ళిద్దరూ కాలోచిత కర్మల్ని భగవత్ప్రార్థనను విస్మరించి విహరించారు. కామాంధులైనవారికి తగిన ఫలం ఇవ్వనిచో లోకానికి అపకారం జరుగుతుందని నారదునికి ఊహ కలిగించాడు. కావున వారిద్దరూ శాపానికి అర్హులేనని నారదమహర్షి భావించాడు. దూరమాలోచించి కదలకుండా ఒక చోట ఉండేట్లుగాను, పక్షుల మలమూత్రాలను భరిస్తూ ఎండా, వర్షం, చలి మొదలైనశీతోష్ణ బాధలనుభరిస్తూండే వృక్ష రూపాన్ని పొందమని ఆ నలకూబరుని శపించాడు. రంభ స్వైరిణి కాబట్టి మనుష్య జన్మ నెత్తమని శపించాడు. శపించగానే విష్ణుమాయ ఆతణ్ణి వదిలింది. వెంటనే తన సహజ స్వభావమైన దయ కలిగింది. దాంతో వారికి విముక్తిని కూడా ప్రసాదించాలని భావించాడు. వారి ప్రార్థనకు ఎదురు చూడకుండానే, శ్రీకృష్ణ స్పర్శ చేతనే పూర్వరూపం పొందుతావని శాప విమోచనాన్ని అనుగ్రహించాడు. అట్లాగే రంభకు కూడా మహేంద్ర సంయోగంచేత నిజ దేహాన్ని పొందుతావని అనుగ్రహించాడు. అంతటితో అది పూర్తికాలేదు. ఆ కర్మమే యశోదను కృష్ణుని వృక్షానికి బంధించేట్లుగా ప్రేరేపించింది. అట్లాగే మహేంద్రుణ్ణి యాగాశ్వాన్ని అపహరించేట్లుగాను, తానందులో ప్రవేశించి రాజ పత్నితో సంగమించేట్లుగాను పురికొలిపింది కూడా ఆ కర్మమేకదా. కర్మకు ఇంతటి శక్తిఎట్లా వచ్చింది. అనగా కర్మయే భగవత్స్వరూపం అని చెప్పడంకన్నా వేరే కారణం ఏమిలేదు. ఎంతటివారైనా కర్మను తప్పించుకొని తిరుగలేరుగదా.

దీనినిబట్టి లోకంలో ఎటువంటి పనులు చేసినా లోకసమ్మతంగాను, స్వభావానికి విరుద్ధం కాకుండాను ఉండాలన్నదే మనమీ భాగం నుండి గ్రహించాలి. కర్మ పరతంత్రుడై జీవుడెప్పుడూ పరిభ్రమిస్తూ ఉంటాడు. కావున కర్మ ఫలాన్ని భగవంతునికి అర్పించ కుండాతానే కోరుకోవడం అవివేకం కాదా?

రంభా నలకూబరులు నారదునికి ఏవిధమైన అపకారము చేయ్యలేదుగదా. అటువంటివారికి శాపమివ్వడం పాపంకాదా? అని అడిగేవాళ్ళుండవచ్చు. మనకు ధనం ఎంత విలువైనదో మహర్షులకు

తపోధనం కూడా అంతే విలువైంది. కావునవారుదాన్ని వృథాగా ఖర్చుచెయ్యరుగదా! లోకోపకారానికే వినియోగిస్తారు. వారు ఎప్పటికప్పుడు భగవదాజ్ఞానుసారం ధర్మం చక్కగా నడుస్తోందా లేదా అని పరీక్షిస్తూఉంటారు.అదువల్లనే వారిలో భగవత్కళ ఉట్టిపడుతూఉంటుంది. వారు సంకల్పమాత్రం చేతనే త్రిలోక సంచారం చేస్తూ భగవదాజ్ఞను జనులు పాటించేట్లు ప్రేరేపిస్తూ ఉంటారు. అందువల్లనే వారి దర్శనమాత్రం చేతనే భగవంతుడుకూడా లేచి ఎదురుగా వెళ్ళి అర్ఘ్యపాద్యాలతో గౌరవిస్తూ ఉంటాడు. దుష్టులైన రాక్షసులు కూడా నారదాది మహర్షుల్ని చూడగానే ఎదురేగి అభివాదం చెయ్యడం మనం పురాణాల్లో వింటూ ఉంటాం. ఇక చక్రవర్తులు, సామాన్య ప్రజల మాట ప్రత్యేకంగా చెప్పాలా? అందుకు వారియందు ప్రజ్వరిల్లే దివ్య తేజస్సే తప్ప మరొకటి కాదు. అంతేకాదు మహర్షులకు శాపానుగ్రహశక్తి కూడా ఉంటుంది. అందుచేతవారియెడల భక్తే కాకుండా భయంతో కూడా ప్రవర్తిస్తారు. అటువంటి మహనీయులు ఎదురైనప్పుడు ఇంద్రియలోలురై మెలగడం నేరం కాదా. కామాంధులైనవారిని ఉద్ధరించి విజ్ఞాన సంపన్నులనుగా చెయ్యడం మహాత్ముల స్వభావం. అంతేకాదు. నారదదాది మహర్షులకు భగవంతుడు కొన్ని ప్రత్యేకమైన అధికారాలు, భాధ్యతలుకట్టపెడ్తూ ఉంటాడు. అందువల్లనే ఎక్కడెక్కడ దుష్టకార్యాలు జరుగుతున్నా వారు తెలుసుకొంటూ తమకు తగిన రీతిలో కట్టడి జేస్తూ ఉంటారు.వారి శక్తికి మించిన కార్యాలు ఎదురైనప్పుడు భగవంతుణ్ణి అర్థిస్తారు. అందువల్లనే నారద మహర్షి వాళ్ళను చూసినప్పుడు నాకేమి అపకారంచెయ్యలేదనో, నాకెందుకులెమ్మనో అనుకోలేదు. వారు దండనకు తగినవారని తోచి శపించాడు. రాగద్వేషాలకు అతీతులు కాబట్టి వారు ప్రార్థించే వరకు వేచి ఉండకుండా వెంటనే శాపవిమోచనాన్ని కూడా అనుగ్రహించాడు. అదువలన నారద మహర్షిని పాపాత్ముడనో, క్రూరుడనో చెప్పరాదు. ఇటువంటి మహనీయులు భూమిపై ఎక్కువ మంది ఉంటే భగవదవతారాలతో పని ఉండకపోవచ్చును. భగవంతుడే మానవ రూపంలో అవతరించినా అందరూ ఆయన్ను భగవంతుడని తెలుసుకోలేరుగదా. ఈ కారణాలను దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే నారద ముని ఇచ్చిన శాపం వలన అయనకు పాపం రాక పోగా ఇటువంటి అనాచారాలకు పాల్పడే వారిని శిక్షించినందుకు పుణ్యమే కలుగుతుంది.

ఇక శాపం ఇచ్చింది నారదమహర్షియా? లేక దేవలమునియా? అన్న ప్రశ్నఒకటి మిగిలి ఉంటుంది. అనేక పురాణాల్లో ఇటువంటి సందేహాలు అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటాయి. పురాణాల ముఖ్యోద్దేశ్యం నీతిని ఉపదేశించడమే గాని వేరొకటి కాదు. పురాణాలన్నీ ఒక్కరోజున చెప్పినవికావు. ఒక్కొక్క పురాణం ఒక్కొక్క కాలంలో చెప్పి ఉంటారు. బ్రహ్మ, విష్ణు, శ్రీభాగవత, హరివంశములు ఒక విధంగా చెప్పాయి. ఒక్క శ్రీకృష్ణజన్మఖండంలో మాత్రమే ఈవ్యత్యాసం కనిపిస్తుంది. అయితే అన్నింటిలోని సారాంశం ఒక్కటేనని తెలుపుతోంది. ఒకే చరిత్ర ఎన్నిపర్యాయాలు ఎన్నెన్నియుగాల్లో జరిగి ఉంటాయో చెప్పడం కష్టం. శ్రీకృష్ణావతార గాథల్ని తెలిపే పురాణాలన్నింటిలోకి బ్రహ్మవైవస్వతపురాణం ప్రధానమైనది. అందులో శ్రీకృష్ణజన్మఖండం అనేక అంశాలను తెలియజేస్తుంది. కావున అందులో తెలిపిన ఈ గాథ ప్రమాణం కాదనడానికి వీల్లేదు. అట్లాగని భాగవతాది గ్రంథాలు అప్రమాణాలన్నా కూడా అది పాపహేతువే అవుతుంది.

భాగవతంలో నలకూబర మణిగ్రీవులు అనేకమంది స్త్రీలతో స్వేచ్ఛగా విహరిస్తున్నట్లు చెప్పబడింది. శ్రీకృష్ణజన్మఖండంలో రంభా నలకూబరులు నందనవనంలో దిగంబరులుగా విహరిస్తున్నట్లు చెప్పబడింది. శ్రీమద్రామాయణం ఉత్తరాకాండంలో, రావణ సంవాదంలో రంభ నలకూబరుణ్ణి గాఢంగా ప్రేమిస్తున్నట్లు అతడితోకలిసి సుఖించేందుకే వెళ్తున్నానని చెప్పడం కనిపిస్తుంది. దీనివలన రంభానలకూబరుల ప్రేమానుబంధం స్పష్టమవుతోంది. ఇక మద్దివృక్షాల కథ భాగవతంలో చాలాప్రసిద్ధి చెందిన ఘట్టాల్లోఒకటి. అయితే భాగవతం సుప్రసిద్ధ గ్రంథం కావడం వలన అందులో వర్ణించిన ఈ కథ కూడా ప్రసిద్ధిచెందింది. ఈ రెండుగ్రంథాలు ఒకే విషయాన్ని బోధిస్తున్నాయి. శ్రీకృష్ణుని స్పర్శచేత శాపవిమోచనం కావడమే ఈరెండింటిలోనిసారం. ఈ మాత్రం మనం ఊహించుకుంటేచాలు. లేనిపోని కుశంకలకు తావివ్వడంవల్ల భక్తికి చేటువాటిల్లే ప్రమాదం ఉంది. కాబట్టి అందులోని భక్తిని గ్రహించడమేశ్రేయస్కరం. అనుమానాల పైన అనుమానాలు, ప్రశ్నలపైన ప్రశ్నలు, సమాధానాలపైన సమాధానాలు చెప్పుకుంటూ పోతే నేలవిడిచి సాముచేసినట్లుంటుందే కాని సాధించే ప్రయోజనం ఏమీఉండదు. కావున భగవద్భక్తులమైన మనమంతా భక్తిరసాన్ని ఆస్వాదించాలేగాని ఇటువంటి కుశంకల జోలికి పోరాదు.

భగవంతుడు ఈ విధంగా తన కర్తృత్వాన్ని ప్రకటించుకున్నాడు. ఇట్లా చెయ్యడం దంభమో, అహంభావమో అనకూడదు. ఎందువల్లనంటే ఇతడో గోపబాలుడన్న మందబుద్ధి మనలో నశించాలి. కొందరైనా భగవంతుడని తెలుసుకొని తరిస్తారని భగవంతుని ఆశయం. బాలకృష్ణుడు రెండు మద్దిచెట్ల మధ్యన రోటిని ఇరికించి వాటిని నేలకూలుస్తాడు. ఓ బాలుడు గట్టిగా లాగినంత మాత్రాన క్రింద పడిపోతాయా? అని కొందరు ఆక్షేపిస్తారు. మానవ బుద్ధిచేత దైవశక్తిని ఊహించడం సాధ్యంకాదు. పరాత్పరుని లీలల్ని, అనుమానించి అవమానించకూడదు. పిడుగు అనే చిన్న పదార్థం పెద్ద కొండనే పిండి చేయడంలేదా? వజ్రం కావడానికి చాలా చిన్న పదార్థమే అయినా దానిని ఏవస్తువూ ఛేదించలేదు. అందుకేనేమో వజ్రాన్ని వజ్రంతోనే ఛేదించాలంటారు. ఒక చిన్న మూలిక ఇనుమును బంగారం చేస్తుంది. ఇటువంటి శక్తి ఆ వస్తువులకు ఎక్కడ నుండి వచ్చింది. భగవంతుడు వీటన్నిటినీ సృష్టించి తన అపార అనన్యశక్తిని చాటడంలేదా? అటువంటి భగవానుడు (చిన్న పిల్లవాడి ఆకారంతో కనిపిస్తున్నా) రెండు వృక్షాల్ని ఛేదించలేడా? ప్రపంచమంతటినీ తన తాపంతో తపింపచేసే సూర్యుడిని ఒక చిన్న మేఘం కప్పివేస్తూందంటే అర్థం ఏమిటి? ఇటువంటి దుర్వాదములతో మనం భగవత్తత్వాన్ని తెలుసుకోలేకపోతున్నాం. ప్రకృతి విశిష్టుడైన పరమాత్మకు బ్రహ్మాండాలన్నిటిని కల్పించి వినోదించడమే ఆయన యథార్థతత్వం. అటువంటి భగవంతుణ్ణి తెలుసుకునేట్లు చెప్పమని ఆయన పాదారవిందములను ఆశ్రయించడమే మన కర్తవ్యం.

భగవానుడు గీతాశాస్త్రంలో బోధించాడు “మామేకం శరణం వ్రజ” అనుచో ఏకం అద్వితీయం మాం శరణం వ్రజ అన్న అర్థాన్ని గ్రహించాలేగాని “మామేకం శరణం వ్రజ ” అన్న అర్థాన్ని స్వీకరించరాదు. అట్లా గ్రహించని పక్షంలో ఇతర దేవతల్ని తిరస్కరించినట్లవుతుంది. సర్వ దేవతా స్వరూపుడనైన నన్ను ఆశ్రయింపుము అన్న అర్థం సమంజసం కాదనడం మూర్ఖత్వమే అవుతుంది.

కావున అఖండ దివ్యస్వరూపుడైన పరమాత్మను ఆరాధించడానికి మించిన ధర్మం మరొకటి ఉండదు.

ఈ నలకూబరుని వృత్తాంతంద్వారా గ్రహించదగిన నీతులన్నిటినీ తెలుసుకోగలిగాం. ఎన్ని మార్పులు చేసినా ఎన్నితెలుసుకున్నా చివరిగా తెలుసుకోదగింది భగవత్ తత్త్వమొక్కటే.

లీలాశుకుని వృత్తాంతము

పూర్వం శుకుడు అనే మహారాజు ఉండేవాడు. అతడికి వన విహారాలన్నా, వేటాడటమన్నా ఎంతో ఇష్టం. ఒకానొక రోజున భటులందర్నీ వెంటబెట్టుకొని వేటకుపోయాడు. వింధ్యారణ్యప్రాంతంలో విహరిస్తూ ఉండగా రెండు జింకలు ఒక చెట్టు క్రింద ప్రశాంతంగా పడుకొని ఉన్నాయి. శుకుడు ధనస్సు సంధించి ఆ జింకల పై ఓ బాణాన్ని వదిలాడు. ఆ బాణం తగిలి అందులో ఓ జింక గిల గిలా కొట్టుకొని మరణించింది. అది మరణించే ముందు కృష్ణా! అంటూ ఆక్రోశించింది. ఆ కృష్ణ నామం వింటూనే పక్షులు, జంతువులు, వృక్షాలు అన్నీ ఒక్క పెట్టున 'కృష్ణా' అంటూ అరణ్యం అంతా మారు మ్రోగేట్లుగా రోదించాయి. ఆ శబ్దం రాజు చెవిన కూడా పడింది. ఆ కృష్ణ నామ మహిమ ఎట్లాంటిదోగాని, ఆ క్షణానే శుకునికి కృష్ణునిపై అనురాగ బీజం నాటుకుంది. తాను చేసిన పని తప్పేమో నన్న భావన కలిగింది. గడ్డి గాదం తింటూ చెట్టు నీడన విశ్రాంతి తీసుకునే మృగాలను వధించడం తప్పేకాదు, పాపమన్న భావన కలిగింది. ఆ పాపకార్యాన్నుండి మనస్సు ఎట్లా మరల్చటమా అని తీవ్రంగా ఆలోచించాడు. ఏ కృష్ణ శబ్దం చేత మనస్సులో ఇటువంటి ప్రకంపనాలు కలుగుతున్నాయో ఆ కృష్ణుని నామస్మరణ చేతనే మృగవధను మానుకోవాలనిపించింది. వేరే మార్గం లేదని మనసుకు గట్టిగా తట్టింది. వెంటనే ధనుర్బాణాలను అవతలపారేశాడు. "కృష్ణా! నన్ను ఉద్ధరించు. నిన్నే నమ్ముకున్నాను. నువ్వు తప్ప నాకు వేరే దిక్కులేదు" అని గట్టిగా అర్థించాడు. అప్పుడు "అదే నీకు తరుణోపాయం, అంతకన్నా నీకు వేరే మార్గం లేదు" అని అశరీర వాణి పలికింది. రాజు మనస్సులో అప్పటికప్పడే పెను మార్పులు చోటు చేసుకున్నాయి. తాను ఒంటరిగా కృష్ణ నామాన్నే జపిస్తూ అడవుల్లో సంచరిస్తూ మరణించాడు.

ఆ తరువాతి జన్మలో లీలా శుకుడుగా జన్మించాడు. పుట్టకతోనే భగవద్భక్తుడయ్యాడు. సంసార వాంఛలు బొత్తిగాలేని వాడయ్యాడు. నిత్యం భగవన్నామ పారాయణంలోనే కాలం గడుపుతూ ఉండగా ఒక మహాత్ముడు గోలోక వృత్తాంతాన్ని తెలిపి శ్రీ కృష్ణమహిమను బోధించాడు. ఆ మహనీయుని ఉపదేశం వలన భగవల్లీలలు కరతలామలకమై కళ్ళకు కట్టినట్లు కనిపించేవి. ఏ లీల కన్నెదురుగా కనిపిస్తుందో దాన్నే శ్లోకంగా చెప్పి భగవంతుని ఆరాధించేవాడు. శ్రీ కృష్ణావతారంలో శృంగార చేష్టలు ఎన్ని ఉన్నాయో అన్నింటినీ లీలా శుకుడు వర్ణించాడు. ఇట్లా కొంతకాలం గడచిపోయింది. ఒకానొక రోజున ఓ మహానుభావుడు ఎదురుపడి "వత్సా! నువ్వు శ్రీకృష్ణ భక్తుడవే, కానీ ఇంకా కర్మఫలానుభవం పూర్తిగా నశించలేదు. మూడవ జన్మలోగాని నువ్వు భగవత్పదాన్ని పొందలేవు" అని బోధించాడు. జీవితాంతం రాధామాధవులను సేవిస్తూనే ప్రాణాలు వదిలాడు. **శ్రీరామకృష్ణ పరమహంస**

ఇలా అంటారు "ఎవరైతే నీలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని మేల్కొల్పుతాడో, అతడే మానవ రూపంలో వచ్చిన సచ్చిదానందమని తెలుసుకో " అని.

మరుజన్మలో జయదేవుడనే పేరుతో ఓ రాజవంశంలో జన్మించాడు. ఈ జన్మలో అష్ట పదులను గేయరూపంగా రాధామాధవులను స్తుతిస్తూ జీవించాడు. రాధాకృష్ణుల శృంగార లీలలన్నీ అందులో కడురమ్యంగా వర్ణించాడు. ఆ జన్మ అంతా రాధాకృష్ణులనే సేవిస్తూ తనువు చాలించాడు. అటు పిమ్మట నారాయణతీర్థులుగా జన్మించాడు. కర్మ సన్యాసం చేసి మృదంగం వాయిస్తూ తరంగాలనే గేయాలను పాడుకుంటూ, శ్రీకృష్ణ పరమాత్ముని పాదారవిందములనే గజ్జెలు ధరించి నృత్యం చేస్తూ పోయిపోయి కాశీలోని మణికర్ణికా ఘట్టం చేరుకున్నాడు. అక్కడ భగవంతుడు నీళ్ళల్లో పడిపోతున్నట్లు ఊహకలిగింది. ఆ ఊహలోనే తానూ గంగలో పడి భగవంతునిలో ఐక్యమయ్యాడు.

ఈ మహనీయుడు కర్ణామృతంలో రాధాదేవిని ప్రధానంగా వర్ణించాడు. గో లోకంలో రాధా దేవియే భగవంతుని భార్య. ఆమెయే పరాశక్తి. జగజ్జనని, లోకపాలిని ఆ రాధాదేవియే. కావుననే శ్రీకృష్ణ జన్మఖండంలో రాధాకృష్ణుల భగవల్లీలలే ప్రధానంగా వర్ణించబడ్డాయి. ఆ రాధాదేవియే శాపాంతమున శ్రీకృష్ణుని పెండ్లి చేసుకొన్న చరిత్రను ఇక్కడ చెప్పుకుందాం.

రాధాకృష్ణుల వివాహం

(ఈ భాగము శ్రీకృష్ణ జన్మఖండము 15వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు భూలోకంలో అవతరించడానికి ముందే రాధాదేవి అవతరించింది. ఆ సమయంలోనే యమునా తీరాన అనేక వృక్షాలతో కూడిన వనం ఒకటి రాధాకృష్ణుల విహారానికై ఏర్పడింది. అదే బృందావనం, శ్రీకృష్ణుడు జన్మించిన తర్వాత నందుడు తన పరివారంతో కలిసి ఆ బృందావనంలోనే నివాసమేర్పరచుకున్నారు. అక్కడ పచ్చిక మేస్తూ విహరించిన గోవులన్నీ జరారోగ భయాల్లేనివై మూడు పూటలా సమృద్ధిగా పాలు ఇస్తూ ఉండేవి.

రాధాదేవి మొదలైన వారంతా ముందుగానే అవతరించారు. భూమిపై బృందావనం సిద్ధమయింది. నందుని నివాసమైన గోకులాన్ని బృందావనానికి మార్పించాడు. ఆ తర్వాతనే అది బృందావనంగా ప్రసిద్ధి చెందింది. గోపకులు, గోపికలంతా గోకులంలో స్థిరపడ్డారు. గోపికలతో కలసి విహరించేందుకు యమునాతీరాన బృందావనం ఏర్పాటైంది. ఒకటేమిటి భగవంతుడు విహరించేదుకు సర్వ పరికరాలు సిద్ధమయ్యాయి. ఆ పిమ్మట శ్రీకృష్ణుడు అవతరించాడు. ఇకమీదట బృందావనంలో రాధామాధవుల వివాహం జరగటమొక్కటే మిగిలి ఉంది. రాధ శాపవశంచేత కొంతకాలం అక్కడా ఇక్కడా గడిపింది. ఇక భగవంతునితో కలసిపోయే సమయం దగ్గర పడింది. కావుననే భగవంతుడు బృందావనంలో ప్రవేశించాల్సొచ్చింది. అయితే లీలామానుష విగ్రహుడైన ఆ గోపబాలుడు వయస్సులో చిన్న పిల్లవాడై పోయాడు. కనుక తన్ను బృందావనం తీసుకొని వెళ్ళేందుకు కావలసిన పరిస్థితుల్ని కల్పించి గోకులం అంతా బృందావనానికి తరలిపోయేట్లు సంకల్పించాడు.

మహర్షుల సంకల్పాలే సత్ఫలితాలనిస్తూ ఉంటే ఇక భగవంతుని సంకల్పం గూర్చి ప్రత్యేకంగా చెప్పాలా? ఆయన సంకల్పం చేతనే బ్రహ్మాండాలన్నీ పుడుతున్నాయి, గిడుతున్నాయి. అట్టి పరాత్పరుడు రాధా వియోగానికి ఇక స్వస్తి వలకాలను కున్నాడు, గోకులమంతా బృందావనానికి తరలిపోయేట్లు సంకల్పించాడు.

ఒకానోక రోజున నందుడు శ్రీకృష్ణుని తీసుకొని బృందావనానికి వెళ్ళాడు. ఆ వనంలో 'ఖాండీర'వనం బహుసుందరమైనది. శృంగార ప్రియులకు అత్యంత ప్రీతిపాత్రమైనది. అట్టి బృందావనం గోవుల్ని మేపుకొంటూ గోధనాన్ని వృద్ధి చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని నందుడు భావించాడు. అందువల్లనే తన ప్రియ పుత్రుడైన శ్రీకృష్ణుని కూడా తీసుకొనిపోయి ఆ అరణ్యం అంతా త్రిప్పి చూపించాడు. అక్కడున్న అద్భుత జలాశయాలలో నుండి కడుపునిండా నీరుతాగారు. చివరగా కుమారునితో కలసి ఒక చెట్టునీడకుపోయి విశ్రాంతి తీసుకున్నాడు. ఆ లీలామానుష విగ్రహుడు నందుని గుండెలపైన ఆడుకుంటూ ఆకాశం అంతా దట్టమైన మేఘాలు ఆవరించేట్లుగా సంకల్పించాడు.

ఆకాశం మేఘావృతం అయింది. కుండపోతగా వర్షం ప్రారంభమయింది. వర్షం ఏనుగు తొండంలో నుండి వస్తోందా అన్నట్లు ఎడతెరిపి లేకుండా కురుస్తూంటే, జలాశయాలన్నీ నిండిపోయాయి. మహావృక్షాలన్నీ కూకటి వ్రేళ్ళతో సహా నేల కూలుతున్నాయి. ఈ భీభత్స వాతావరణానికి శ్రీకృష్ణుడు భయపడుతున్నట్లు నటిస్తూ తండ్రి మెడకు చుట్టుకొని ఏడవడం మొదలు పెట్టాడు. నందుడి మనస్సు పిల్లవాడిని తీసుకొని త్వరగా ఇంటికి చేరుకోవాలని ఆరాటపడుతున్నా గోవులను వదిలి వెళ్ళేందుకూ మనసు రావడం లేదు. అటు గోవులకోసం ఆగిపోతే ఈ వర్షంలో పిల్లవాడు తడిసిపోతున్నాడే అని మధనపడిపోతున్నాడు. ఇంతలో బాలకృష్ణుడు భయపడినట్లు నిటిస్తూ కెవ్వున కేక పెట్టి పెద్దగా ఏడవడం మొదలు పెట్టాడు.

ఆ సమయంలో ఎక్కడ్నించి వచ్చిందో తెలియదు; రాధాదేవి నందుడి ముందుకు వచ్చి నిలబడింది. ఆమె నడక రాజహంసకు నడకలు నేర్పేట్లున్నది. ఆమె ముఖారవిందం శరత్కాల చంద్రబింబాన్ని వెక్కిరిస్తూన్నట్లున్నది. ఆమె నేత్రాలు రెండూ శరత్కాలంలో మధ్యాహ్నం వేళ పూర్తిగా విచ్చుకున్న పద్మాల్లాగా ఉన్నాయి. అటువంటి రాధాదేవి అందచందాలను వర్ణించడం బ్రహ్మకు కూడా సాధ్యంకాదు. ముఖమంతా కస్తూరి చందనాదిలేపనాలతో గుబాళిస్తోంది. కామశాస్త్రానుసారం భ్రూభంగము యోగీంద్ర చిత్తములను సైతం మోహపరవశుల్ని చేయ సమర్థమై ఉంది. భగవంతుని దర్శించేందుకా అన్నట్లు రత్నఖచితమైన దర్పణాన్ని చేతిలో ధరించింది.

ఇట్టి సుందరాకారి అయిన ఆ రాధను చూడగానే నందుని మనస్సు సంభ్రమాశ్చర్యాలతో నిండిపోయింది. ఈ నిర్జన వనంలో ఈ సుందరి ఎక్కడి నుండి వచ్చింది? ఎవరికోసం వెదుకుతోంది? ఇట్లా అనేక ఆలోచనలు పెనవేసుకొని ఉండగా నందుని మనస్సు మోహం చెందింది. ఆ రాధాదేవికి నమస్కరిస్తూ ఇలా అన్నాడు.

"అమ్మా! నువ్వు లక్ష్మీదేవివే కదా? శ్రీహరికి అత్యంత ప్రియురాలివని గర్గ మహర్షి చెప్పగా విన్నాను. ఈ బాలుడు నిర్గుణుడు. పరాత్పరుడైన అచ్యుతుడేనని తెలుసుకున్నాను. ఇతడు నీ ప్రాణనాథుడే. ఇతడితో కలసి పూర్వం వలెనే సుఖంగా ఉండు. నీతో ఇట్లా అంటూ ఉండగానే విష్ణుమాయ నన్ను ఆవరించేస్తోంది. అశక్తుడనై పోతున్నాను. తెలిసీ తెలియని స్థితిలో పడిపోతున్నాను. నీమనోరథం తీరిన తర్వాత ఈ బాలుని నా కివ్వు" అన్నాడు.

నందుడు ఇట్లా అంటూ ఉండగానే భయంతో బిగ్గరగా ఏడుపు లంకించుకున్న బాలుణ్ణి రాధ తన బాహువుల్లోకి తీసుకొని ముద్దాడి నందునితో ఇలా అన్నది. "నందభూపాలా! నువ్వు అనేక జన్మలుగా ఎన్నో సుకృతాలు చేశావు. అందువల్లనే నన్ను తెలుసుకోగలిగావు. నువ్వు నాగురించి గర్గమహర్షి ద్వారా తెలుసుకున్నావంటే నువ్వెంత ప్రాజ్ఞుడవో చెప్పకయే చెప్తోంది. అయినా నీకు మా పూర్వాపరాలు తెలియదు. మా ఇద్దరి చరిత్రను గోకులంలో ఎవరికీ చెప్పకు. ఇది దేవరహస్యం. నువ్వు సచ్చరిత్రుడవు. వరం పొంద దగినవాడు. ఏదైనా వరం కోరుకో. నీ అభీష్టం దేవతలకు కూడా దుర్లభమైనాసరే, ప్రసాదించే శక్తి నాకున్నది. కోరుకో" అన్నది.

రాధాదేవి ఇచ్చిన అభయానికి పరమానంద భరితుడై నందుడు ఇలా అన్నాడు. " తల్లీ! మీ ఇద్దరి పాదాలను స్థిరంగా సేవించుకునే భక్తి ప్రేమలను నాకు ప్రసాదించు. మీతో కలసిమెలసి జీవించే భాగ్యం దేవతలకు కూడా లభించదు కదా. అంతకన్నా పెద్దవరం ఏముంటుంది? ఈ వరం నాకు, యశోదకు కలిగేట్లుగా అనుగ్రహించు. నువ్వు జగజ్జననివి. పరమేశ్వరివి. మహాప్రకృతివి " అని స్తుతించాడు. అందుకా రాధాదేవి ఇలా అంది "అసమానమైన దాస్యాన్ని, స్థిరమైన భక్తిని ప్రసాదిస్తున్నాను. మీ ఇద్దరి మనసు ఎల్లవేళలా మా పాదారవిందాలనే ధ్యానిస్తూ ఉండేట్లు అనుగ్రహిస్తున్నాను. ఎన్ని జన్మలెత్తినా నీకు ఈ స్మృతి ఉండేట్లు అనుగ్రహిస్తున్నాను. నా వర ప్రభావం చేత విష్ణుమాయ నిన్ను ఆవహించదు. ఈ జన్మకాగానే భార్యతో కలసి గోలోకానికి చేరుకుంటావు. ఆ తర్వాత నీకిక జన్మలుండవు" అని పలికి శ్రీకృష్ణుని గుండెలకు హత్తుకొని సంతోషంతో రాసమండలాన్ని చేరుకుంది.

రాసమండలమంతా స్వచ్ఛంగాను శీతలంగాను ఉంది. రత్నకుంభాల నిండా పరిమళ ద్రవ్యాలున్నాయి. ఆ సువాసనల నడుమ శ్యామసుందరుడైన బాలుడొకడు బంగారు తూగుటుయ్యాలలో పడుకొని ఉన్నాడు. ఆ బాలుడి శరీరం అంతా దివ్య చందన పరిమళాలతో గుబాళిస్తోంది. అతిలోక సుందరుడైన ఆ బాలుడు పూలపాన్పుపై శయనించి ఉండటం రాధాదేవిచూసి తన ఒడిలో ఉన్న బాలుడి కోసం చూసింది. ఒడిలో ఉండే బాలుడు అంతలోనే మాయమైపోయాడు. రాధకు దుఃఖం ఆగలేదు. ఇంతలో ఆ ఉయ్యాలలోని బాలుడు కూడా మాయమై నవయవ్వనుడైన శ్యామసుందరుడుగా కనిపించాడు. సర్వస్మృతి స్వరూపిణి అయిన ఆ రాధాదేవికి దుఃఖం మాయమై ఆశ్చర్యంతో మనోహరమైన ఆ రూపానికి మోహపరవశురాలైంది. ఆమెలో కోరికలు కట్టలు తెంచుకుంటూండగా కళ్ళతోనే అతణ్ణి అక్కున చేర్చుకుంది.

అంతట శ్రీకృష్ణుడు ఊహల్లో విహరిస్తున్న రాధాదేవి వద్దకు పోయి ఇట్లా అన్నాడు. " దేవ సభలో గోలోక వృత్తాంతాన్ని స్మరించావు. నువ్వు పూర్వం కోరుకున్న కోరికను ఇప్పుడు నెరవేరుస్తాను. నీ కంటే

నాకు ప్రాణాధికులు ఎవరూలేరు. నువ్వే నా ప్రాణాధికమైన ప్రియురాలవు. నా కోరికలన్నీ తీర్చగల సమర్థురాలవు. నీకూ నాకూ భేదం లేదు. నువ్వెంతో నేనూ అంతే. పాల నుండి తెల్లదనాన్ని వేరు చేయలేనట్లు, అగ్ని నుండి దహన శక్తిని వేరు చేయలేనట్లు, భూమినుండి గంధాన్ని వేరు చేయలేనట్లే నిన్ను కూడా ఎవ్వరూ నానుండి వేరుచేయలేరు. మన్ను లేకుండా కుండలు చెయ్యడం ఎట్లా సాధ్యం కాదో, బంగారం లేకుండా చెవికుండలాల్ని చెయ్యడం ఎట్లా సాధ్యం కాదో అట్లాగే నువ్వు లేకుండా నేను ఏపనీ చేయలేను. నేను నిస్సంగుడను. నీ సహాయం లేకుండా నేను సృష్టి కార్యాన్ని చెయ్యలేను. సృష్టికి నేను బీజాన్నైతే నువ్వు ఆధార భూతురాలవు. కావున ఓ సుందరీ, రాధాదేవీ! వచ్చి నా ప్రక్కన కూర్చో. నాశయనము నలంకరించు. నన్ను నీ వక్షమున జేర్చుకో. నాకు శోభా స్వరూపురాలవుకమ్ము. నాకు రూపం నీ వల్లనే ఏర్పడుతుంది. నువ్వులేని నన్ను కృష్ణుడంటారు. నీతో కలసి ఉండే నన్ను శ్రీకృష్ణుడంటారు. అనగా నువ్వేనా “శ్రీ”వి. నువ్వేనా సంపత్తివి. ఆధారస్వరూపిణివి. సర్వశక్తి స్వరూపవు. సర్వరూపుడనైన నేను ‘అక్షరుడ’ను. నేను తేజస్వరూపుడనైతే నువ్వే తేజస్సువి. నేను దేహాన్ని ధరించినప్పుడు నువ్వే ఆ దేహానివి. సుందరీ! నేను సర్వబీజ స్వరూపుడను. నీవు శక్తి స్వరూపిణివి. సర్వ స్త్రీ స్వరూపిణివి. నువ్వే నా దేహాంశ స్వరూపవు.

మూల ప్రకృతివి. ఈశ్వరివి. శక్తిలో, బుద్ధిలో, జ్ఞానంలో నువ్వు నాతో సమానమైన దానవు. అంబికా! మనిద్దరికీ భేదముందని ఏ నరాధముడైనా అంటే అతడు కాల సూత్ర నరకంలో సూర్యచంద్రులున్నంత కాలంపడి ఉంటాడు. అంతేకాదు అతడికి ముందు ఏడు తరాల వాళ్ళు అతడి తర్వాత ఏడు తరాల వాళ్ళుకూడా ఆనరక కూపంలో పడిపోతారు. అప్పటికీ వాడి పాపం నశించదు. కోటి జన్మల నుండి చేసుక్ను పుణ్యం కూడా హరించుకుపోతుంది. తెలివి తక్కువగా ఏ నరాధముడు మనిద్దర్నీ నిందిస్తాడో వాడు పునరావృత్తి లేని ఘోర నరకానికి పోతాడు. ఎవడు పాపభీతి గలవాడై తెలిసో తెలియకో ‘రా’ అన్న ఒక్క అక్షరం పలికినంత మాత్రానే అతడికి నిశ్చల భక్తిని ప్రసాదిస్తాను. ఎవరైతే ‘రాధా’ అని ఉచ్చరిస్తారో వారికి నేను ప్రత్యక్షమవుతాను. నన్ను షోడచారములతో సేవించే వారిపై నాకు ఎటువంటి ప్రేమ కలుగుతుందో నీ నామాన్ని ఉచ్చరించేవారిపైన కూడా అంతే ప్రేమను చూపిస్తాను. ప్రేయసీ! అటువంటి నీకంటే కూడా నాకు నాభక్తుడే అధికుడు. బ్రహ్మ, అనంతుడు, శివుడు, ధర్ముడు, నరనారాయణులు, కపిలుడు, గణపతి, కార్తికేయుడు, లక్ష్మి, సరస్వతి, దుర్గ, సావిత్రి, ప్రకృతి, దేవతలు నాకు ఎంతో ప్రీతిపాత్రులు. అటువంటి వారందరి కంటే కూడా రాధా మంత్రోపాసకులంటే నాకు ప్రేమ అధికం. పైన చెప్పినవారంతా నాకు ప్రాణంతో సమానం. అయితే నువ్వు నా ప్రాణానికన్నా అధికమైన దానవు. వాళ్ళంతా నా శరీరంలో ఒక్కొక్క భాగంలో ఉంటారు. లక్ష్మిని వక్ష స్థలంలో భరించే శ్రీ మహా విష్ణువును నేనే, ఆ లక్ష్మివే నువ్వు. ఇప్పుడు కృష్ణ రూపాన్ని ధరించిన నాకొరకు రాధారూపాన్ని ధరించి వచ్చావు అని శ్రీకృష్ణుడు ఈ విధంగా అంటూ మనోహరమైన శయ్యపై శయనించాడు. ఇట్లా అంటున్న శ్రీకృష్ణునితో రాధాదేవి ఇలా అన్నది. “ నువ్వు సమస్తము రాధాస్వరూపమేనని చెప్పావు. అట్టి నేను ఎల్లవేళలా నీ పాదారవింద ప్రసాదాన్నే అయిఉంటాను. పరమేశ్వరా భగవంతుడవైన నీకు ప్రియులు, అప్రియులు ఉంటారా?

ఎవరు నన్ను స్మరింపరో వారునీ కృపకు పాత్రులు కారన్నావు. నాథా! నువ్వు గడ్డిపోచను పర్వతంగాను, పర్వతాన్నిగడ్డిపోచగాను చెయ్యగల సమర్థుడవు. అయినా, యోగ్యాయోగ్యసంపత్తిని అందుకు తగినంత కృపను వారికి ప్రసాదిస్తూనే ఉంటావు.

నా వక్షస్థలం పైన, శిరస్సుపైన నీ పాదపద్మాలుంచి నన్ను అనుగ్రహించు. నా మనస్సంతా నీ పై విరహంతో తపించిపోతుంది. నా దృష్టి అంతా నీ పాద ద్వయం పైనే కేంద్రీకృతమై ఉంది. వేరే వస్తువేదీ నా కంటికి కనిపించడం లేదు. ప్రభూ! నీ పాదాల నుండి నా దృష్టి క్రమంగా నీ శరీరాన్నంతా దర్శిస్తూ ఇప్పుడు నీ ముఖారవిందంపై కేంద్రీకృతమై ఉంది. ఎంత సేపు చూసినా నాకు తృప్తికలగడం లేదు." అన్నది.

ప్రియురాలైన రాధాదేవి మాటలు విన్న భగవంతుడు చిరునవ్వు నవ్వుతూ మృదు మధురంగా ఆ రాధాదేవితో ఇలా అన్నాడు. " ప్రేయసీ! నేను చెప్పిన మాటల్ని ఎవరూ ఖండించలేరు. నీ కోరక తీరే సమయం సమీపించింది. ఎవరికేది జరగాల్సి ఉంటుందో అది ఆ కాలం సమీపిస్తే గాని నెరవేరదు. దానిని మీరటం నాకే శక్యంకాదు. ఇక బ్రహ్మవిష్ణుమహేశ్వరుల మాట వేరే చెప్పాలా? ఎందువల్లనంటే ఎవరికేది వ్రాయబడుతోందో అవిధికి నేనే విధాతను. కావున ఇంకొద్ది సమయంలోనే నీకు హితాన్ని చేకూరుస్తాను" అని శ్రీకృష్ణుడు రాధాదేవితో మాట్లాడుతూ ఉండగా బ్రహ్మ వారిముందు ప్రత్యక్షమయ్యాడు. శ్రీకృష్ణ భగవానుని స్తుతించి, చేతులు జోడించి నమస్కరించాడు. పిమ్మట రాధాదేవి పాదాలకు నమస్కరించి కమండలంలో నుండి ఉదకం తీసుకొని ఆ జగజ్జనుని పాదాలను అభిషేకించి ఇలా విన్నవించుకున్నాడు.

"తల్లీ! శ్రీకృష్ణుని కృప చేత అతి దుర్లభమైన నీ పాదములను దర్శించగలిగాను. జననీ! నేను ఒకానొక కాలంలో భూలోకానికి పోయి 60వేల సంవత్సరాలు శ్రీమహావిష్ణువుని ధ్యానించి తపస్సు చేశాను. శ్రీహరి నా తపస్సుకు మెచ్చి నా ముందు ప్రత్యక్షమయి నన్ను వరం కోరుకొమ్మని అనుగ్రహించాడు. నేనప్పుడు "స్వామీ! బహుదుర్లభమైన రాధాదేవి పాదాలను దర్శించే భాగ్యం కలిగించమని వేడుకున్నాను. అందుకు శ్రీహరి "వత్సా! త్వరలో నీ అభీష్టం నెరవేర గలదని" అనుగ్రహించాడు. కావున జననీ! దైవ వాక్కు వ్యర్థం కాదుకదా. ఆ వరప్రభావం చేత ఇప్పుడు నీ పాదాలకు నమస్కరించుకునే భాగ్యం కలిగింది. దేవీ! రూపంతో కూడిన వస్తువులన్నీ ప్రకృత్యంశలే. ప్రకృతే అందరికీ జన్మనిచ్చేది. అట్టి ప్రకృతిని సృష్టించేది కూడా రాధా దేవియే. అమ్మా! రాధాదేవి! నీవు శ్రీకృష్ణాంశ సంభూతురాలవు. అన్ని విషయాల్లోనూ శ్రీకృష్ణునితో సమానమైన దానవు. అనగా నీవే శ్రీకృష్ణమూర్తివి. శ్రీకృష్ణుడే రాధాదేవి. ఈశ్రీకృష్ణుడే శ్రీమహావిష్ణువు. ఈ విషయాలన్నీ వేదాలలో చెప్పినవే కాని కొత్తవేమీ కావు.

బ్రహ్మ రాధను స్తుతించుట

బ్రహ్మాండానికి పై భాగాన గోకులం ఉంటుంది. గోకులం అన్నింట్లోనూ ఎట్లా సర్వోత్కృష్టమైనదో, అట్లాగే నువ్వూ శ్రీహరి ఆద్యంతాలు లేనివారు. జీవరాసులన్నీ కృష్ణాంశతో ఉండగా

నువ్వు ఆ జీవరాసులన్నింటిలోను శక్తి రూపంలో ఉంటావు. పురుషులంతా హరి అంశ సంభూతులైతే, స్త్రీలంతా నీ అంశాసంభూతులు. ఆత్మచేతనే నువ్వు దేహాన్ని ధరించావు. శరీరానికి ఆధార భూతురాలవు నువ్వే. శరీరానికి ప్రాణానివి నువ్వు. ఆ ప్రాణముతో జేరి ఈశ్వరుడుంటాడు. ఏ కారణంచేత నిర్మించబడ్డావో ఆ హేతువు పరమాత్మయే. ఆ పరమాత్మే శ్రీహరి. శ్రీహరి శాశ్వతుడైనట్లే నువ్వూ శాశ్వతవు. శ్రీహరి అంశ నువ్వైతే, నీ అంశే శ్రీహరి. నేను సృష్టికర్తను. దేవతలను సృష్టించినవాడను. శ్రీహరిని స్తుతించడం చేతనే జనులు పండితులవుతున్నారు. భగవంతుని గుణాలలో వెయ్యోవంతైనా ఎవరూ స్తుతించలేరు. వేదములుగాని, పండితులుగాని నిన్ను పూర్తిగా తెలుసుకొని స్తుతించలేరు. స్తవములకు పుట్టినిల్లు జ్ఞానము. బుద్ధి జ్ఞానానికి తల్లి, నువ్వు బుద్ధికి తల్లివి. అటువంటి నిన్నెవరు తెలుసుకో గలరు? లోకంలో కనిపించే వస్తువుల్నే కదా పండితులు వర్ణించి చెప్పగలుగుతారు? కనబడని వస్తువుల్ని ఎవ్వరు స్తుతించగలరు? నేనుగాని, మహాశివుడుగాని, అనంతుడుగాని నిన్ను తెలుసుకోలేము. సరస్వతి, వేదాలు కూడా నిన్ను తెలుసుకోలేవు. ఇక నిన్నెవడు వినుతింపగలడు? వేదాల్లో ఉన్నదున్నట్లుగా చెపుతున్నానని ఆక్షేపించవద్దు. ఈశ్వరులందరికీ ఈశ్వరుడైన భగవంతునికి యోగ్యాయోగ్యములందు కృప సమానంగా ఉంటుంది. జననీ జనకులారా! పుత్రుల దోషాల్ని మీరు పట్టించుకోక క్షమిస్తూ ఉంటారు" అని బ్రహ్మదేవుడు ఈ విధంగా స్తుతించి జగజ్జననియైన రాధాదేవి పాదాలకు నమస్కరించాడు.

ఈ స్తోత్రము బ్రహ్మచే స్తుతించబడినది కావున మూడు సంధ్యలయందు పారాయణం చెయ్యాలి. అట్లా చేసిన వారికి రాధాకృష్ణుల పాదభక్తి, దాస్యము లభిస్తాయి. అందు మూలంగా కర్మ నిర్మూలనమై మృత్యువును జయించి సర్వోత్తమమైన గోలోకానికి చేరుకోగలుగుతారు.

అని శ్రీమన్నారాయణుడు నారదునికి తెలిపి మళ్ళీ ఇలా అన్నాడు. మునివర్యా! బ్రహ్మ చేసిన స్తోత్రానికి సంతోషించిన ఆ రాధాదేవి బ్రహ్మతో ఇలా అన్నది. " ఓ బ్రహ్మ ! నీ మనస్సులో ఏదో కోరిక ఉన్నట్లున్నది. అదేదో చెప్పు అనుగ్రహిస్తాను" అన్నది. అంతట బ్రహ్మ " ఓ తల్లీ! మీ ఇద్దరిపైనా దృఢభక్తి శాశ్వతంగా నిలచిపోయేట్లు అనుగ్రహించు."అని ప్రార్థించాడు. అంతట రాధాదేవి "తథాస్తు" అని ఆశీర్వదించింది. అటు పిమ్మట వారి మధ్యనే అగ్ని హోత్రాన్ని చేసి యథావిధిగా హోమాన్ని చేశాడు. భగవానుడు కూడా శయ్యపై నుండి లేచివచ్చి బ్రహ్మ ప్రక్కనే కూర్చున్నాడు. అంతట బ్రహ్మ వేదోక్తమైన మంత్రాలను పఠిస్తూ శ్రీకృష్ణ హోమం చేశాడు. హోమం పూర్తి అయిన తర్వాత బ్రహ్మ ఆ ఆదిదంపతులిద్దరికీ ప్రదక్షిణ నమస్కారం చేశాడు. ఆ తర్వాత రాధాదేవికి విడిగా ప్రదక్షిణ నమస్కారం చేసి వారిద్దరినీ వారిశయ్యపైన శయనింపజేశాడు. శయ్యను జేరిన ఆ రాధా దేవి హస్తాన్ని కృష్ణ భగవానుని చేతిలో ఉంచాడు. ఆ తర్వాత వేదోక్త మంత్రసప్తకాన్ని పఠించి రాధాదేవి చేతిని పరమేశ్వరుని హృదయంపై ఉండేట్లు చేసి, అట్లాగే శ్రీకృష్ణుని హస్తాన్ని జగన్మాత మెడ చుట్టూ ఉండేట్లు చేస్తూ అందుకు సమయోచితమైన మంత్రాలను పఠిస్తూ రాధాదేవి చేత ఆ మంత్రాలను పఠింపజేశాడు. శ్రీహరి కంఠం చుట్టూ రాధాదేవి చేతిని వేయించాడు. మహదానందంతో ఆ దంపతులకు నమస్కరించి మనోహరమైన కల్ప ప్రసవమాలికను శ్రీకృష్ణుడు రాధాదేవి కంఠాన అలంకరించేట్లు చేశాడు. వారిద్దర్ని

ఆసనంపై కూర్చోబెట్టి అందు శ్రీకృష్ణుని వామ పార్శ్వమున రాధాదేవి దోసిలొగ్గి పంకజాతయై కూర్చోగా బ్రహ్మ వారిద్దర్ని వేదోక్తంగా స్తుతించాడు. ఆ తర్వాత ఇద్దరి చేత పంచమంత్రములు పఠింపజేశాడు. శాస్త్రానుసారం తండ్రి కన్యను కన్యాదానం చేస్తూన్నట్లు రాధాదేవిని శ్రీహరికి సమర్పించాడు.

ఆ సమయాన దేవతలంతా నాట్యం చేశారు. దుందుభులు మ్రోగించారు. వాద్యాలు వాయించారు. గంధర్వులు గానం చేశారు. అంతా కలసి శ్రీహరిని స్తుతించారు. అప్పుడు బ్రహ్మ, జగన్నాథా! మీ ఇద్దరి పాదాల యందు నాకు దృఢమైన భక్తిని ప్రసాదించమని వేడుకున్నాడు. అంతట శ్రీహరి బ్రహ్మకు అభీష్టాన్ని ప్రసాదించి, బ్రహ్మలోకానికి సాగనంపాడు.

శ్రీహరి ఆజ్ఞను శిరసావహించిన బ్రహ్మ తన లోకమునకు వెళ్ళగానే రాధాదేవి చిరునవ్వులతో శ్రీహరిని క్రీ గంట చూస్తూ సిగ్గుతో ముఖం చాటు చేసుకుంది. అంతలోనే దేవి ఒళ్ళంతా పులకించి కామ పీడిత అయింది. శ్రీహరికి నమస్కరించి ప్రక్కలో నెమ్మదిగా చోటుచేసుకొంది. శ్రీహరి వక్షస్థలం నుండి పరిమళాలు వెదజల్లుతున్నాయి. బంగారు పాత్రలోని అమృతాన్ని శ్రీహరికి సమర్పించింది. రాధాదేవి సమర్పించిన ఆ అమృతాన్ని శ్రీహరి ప్రీతితో గ్రహించాడు. పచ్చకర్పూరం వంటి అనేక సుగంధద్రవ్యాలతో కూడిన తాంబూలాన్ని ప్రేమతో రంగరించి రాధాదేవి శ్రీకృష్ణుని నోటికి చిలకలు చుట్టి అందించింది. స్వామి వాటిని అత్యంత ప్రీతితో ఒకటొకటిగా స్వీకరించాడు. శ్రీహరి కూడా అత్యంత ఆదరంతో తాంబూలాన్ని రాధాదేవి నోటికి అందించగా ఆమె ఆదరంగా స్వీకరించింది. శ్రీహరి తాంబూలాన్ని(తమ్మ) రాధాదేవి నోటికందించగా ఆమె దానిని ప్రీతితో స్వీకరించింది. తిరిగి ఆమెను తమ్మను తనకిమ్మని స్వామి ఎంతో ఆప్యాయంగా కోరినా రాధాదేవి సిగ్గుపడి చిరునవ్వులు చిందిస్తూ క్షమించమని వేడుకుంది. చందనాగరుకస్తూరీ కుంకుమలతో కూడిన గంధాన్ని శ్రీహరి రాధ ఒళ్ళంతా పూశాడు. ఏ పాదారవిందాన్ని కాముడు ఎల్లప్పుడూ సేవిస్తూ ఉంటాడో ఆ పాదమీనాడు శ్రీహరివశమైపోయింది. శ్రీహరి కుతూహలంతో ఆమె మోమును తన వక్షంపై ఉంచుకొని కామోద్రేకం కలిగిస్తూ అనేక విధాలుగా రమించాడు. వారి క్రీడలన్నీ వర్ణనాతీతం; ఇచ్ఛామాత్రం. ఆ సమయంలో రాధాదేవి శరీరం అంతా పులకాంకితమై తన్ను తానే మరచిపోయింది. అది ప్రథమ సంగమం గదా. వారిద్దరికీ రాత్రేదో పగలేదో, తెలియకుండా విహరించారు. తన సంకల్పంచే తానే సృష్టించుకున్న కల్పనల్లో ఆ పరమాత్మ సుఖాన్ని అభినయించాడు.

ఆ విధంగా ఆనంద డోలికలలో ఎంతసేపు క్రీడించారో వారికే తెలియదు. చివరకు స్మృతి తెచ్చుకున్నదై ఆ రాధాదేవి కోరచూపులుచూస్తూ బడలికతో ఒళ్ళువిరుచుకుంది. శ్రీకృష్ణుని చిలిపి చేష్టలన్నింటినీ రాధాదేవి సమర్థంగా త్రిప్పికొట్టింది. రాధాదేవి తన అందాల్ని రత్న దర్పణంలో చూసుకొంటూ తన్ను విస్మరించడం భగవానుడికి నచ్చలేదు. అంతే ఆమె చేతిలోని దర్పణాన్ని బలవంతాన లాక్కున్నాడు. రాధాదేవి మాత్రం ఊరికే ఉంటుందా? శ్రీకృష్ణుని చేతులోని మురళిని లాక్కుంది. ఓహో నీ పని ఇట్లా ఉన్నదా అని స్వామి రాధాదేవి మనస్సునే దొంగిలించారు. రాధకూడా రాసమండలంలో విహరిస్తూన్న శ్రీహరి చిత్తాన్ని అపహరించింది.

ఈ విధాన నవ్వుతూ త్రుళ్ళుతూ కేరింతలు కొడుతూ క్రీడలన్నీ అయిన తర్వాత రాధాదేవి "నాథా! నీ మురళి ఎక్కడ? చూపించు " అని అడిగింది. భగవంతుడు మురళి కోసం వెతుక్కుంటున్నట్లు నటిస్తూ ఉండగా, రాధాదేవి తన చేతిలోని మురళిని స్వామికి సమర్పించుకుంది. అట్లాగే శ్రీకృష్ణుడు కూడా రాధాదేవిని రత్న దర్పణినికై బ్రతిమాలించుకొని దాన్ని ఆమెకు ఇచ్చేశాడు. ఆ శృంగార రచన విశ్వకర్మకే బోధపడలేదంటే ఇక సామాన్యుల మాట వేరుగా చెప్పాలా?

ఇట్లా ఉంటూ ఉండగా ఒకానొక రోజున రాధాదేవి శ్రీకృష్ణుని అలంకరిచేందుకు వెళ్ళింది. అప్పుడా దేవ దేవుడు శిశువు రూపంలో కనిపించాడు. అనగా నందుడు శ్రీకృష్ణుని తన చేతిలో ఏ రూపంలో పెట్టాడో ఇప్పుడదే రూపంలో కనిపించాడు. ఆ శిశువును చూస్తూనే రాధాదేవిలో దుఃఖం కట్టలు తెంచుకుంది. " ఒమాయేశ్వరా! నీ సేవకురాలితో ఆటలాడుతున్నావా? నీ మాయలన్నీ నా యందు ప్రదర్శిస్తున్నావా?" అంటూ నేలపై పడి దొర్లుతూ విలపించింది. రాధతో పాటు కృష్ణుడూ నేలపై పడి పోరుతూ విలపించాడు. అప్పుడు అశరీరవాణి ఇలా పలికింది. "రాధా! విలపించకు శ్రీకృష్ణునే మనస్సులో ధ్యానిస్తూ ఉండు. రాసమండలంలోని గోకులాన్నే స్మరిస్తూ ఉండు. రాత్రికాగానే మళ్ళీ భగవంతుడు తానే వచ్చి నీ దుఃఖాన్ని పోగొడ్తాడు. దుఃఖాన్ని విడిచిపెట్టి శ్రీకృష్ణుని భుజాన వేసుకొని ఇంటికి పో " అని పలికింది.

అశరీరవాణి వాక్కులు విన్న రాధాదేవి శ్రీకృష్ణుని భుజాన వేసుకొని నందుని ఇంటికి వెళ్ళింది. రాధాదేవి పరమేశ్వరుని ఇచ్ఛాశక్తి కాబట్టి ఆమె మనస్సులో సంకల్పంచెయ్యగానే రాసమండలం నుండి నందుడి ఇంటికి కనుమూసి తెరిచే లోపుగానే చేరుకుంది. యశోదతో " అమ్మా! నువ్వే బాలుణ్ణి చేతుల్లోకి తీసుకో. బాగా ఆకలితో ఉన్నాడు. అందుకనే గుక్కపట్టి ఏడుస్తున్నాడు. పశువుల్ని మేపుతూ నంద మహారాజే నాకీ బాలుణ్ణి ఇచ్చాడు. అమ్మా! ఈ బిడ్డ నెత్తుకొని వచ్చేదారిలో పడరాని పాట్లు పడ్డాను. కుంభ వృష్టిగా వర్షం కురిసింది. దారంతా బురదమయమై కాలు తీసి కాలు వెయ్యలేకపోయాను. అందువల్ల ఇతడు బాలుడే అయినా మోయలేనంత బరువనిపించాడు. అమ్మా! నేను ఇల్లువదలి చాలాసేపైంది. ఇక వెళ్ళివస్తాను. బాలుని జాగ్రత్తగా చూసుకో" అని చెప్పి వెళ్ళిపోయింది.

విశేషార్థం : ఇందులో భగవంతుని లీలామానుష విగ్రహత్వాన్ని తెలిపే అనేక విషయాలున్నాయి. అయితే వాటితోపాటు అనేక సందేహాలు కూడా బయటకు వస్తాయి. అయినా మన బుద్ధికి తోచినంతవరకూ ఆ సందేహాలన్నింటినీ నివృత్తి చేసుకుందాం.

రాధాదేవి శాపగ్రస్తురాలై భూలోకాన వృషభానునికి కుమార్తెగా జన్మించింది. ఆమెకు శాప విముక్తి అయ్యే సమయం సమీపించిందని మనం గ్రహించాలి. అందువల్లనే నందుడు సంతోషంతో బాలకృష్ణుని భుజాన వేసుకొని బృందావనానికి వెళ్ళాడు.

నందుడు శ్రీకృష్ణుని బృందావనానికి తీసుకొని వెళ్ళినది మొదలు తిరిగి రాధాదేవి శ్రీకృష్ణుని యశోద చేతిలో పెట్టే వరకూ జరిగిన కథ అంతా అర పూటలో జరిగిందని పాఠకులు ముందుగా గమనించాలి. అయితే ఈ కాస్త వ్యవధిలోనే బ్రహ్మదేవుని పౌరోహిత్యంలో రాధాకృష్ణుల వివాహం

కావడం, వాళ్ళిద్దరూ ప్రథమరాత్రిని సుఖసంతోషాలతో గడుపుకోవడం నమ్మశక్యం కానిదే అయినా, అది సాధ్యమే. ఎట్లాగంటే, శ్రీకృష్ణుడు పరాత్పరుడైనప్పుడు ఇక సంభవాసంభవాలంటూ ఎక్కడ ఉంటాయి? భగవంతునికి అసంభవాలంటూ ఉండవు గదా. నందునికి శ్రీకృష్ణుణ్ణి బృందావనానికి తీసుకువెళ్ళాలనే ఆలోచన కలగడం ఆ పరాత్పరుని సంకల్పమే. రాధాదేవిని చూడగానే నందునిలో దివ్యానుభూతులు కలగడం, బాలుణ్ణి రాధాదేవి చేతిలో పెట్టడం మొదలైన ఘటనలన్నీ మానవ మేధస్సుకు అసంభవాలే కావచ్చు. కానీ భగవానునికి అది సంభవమే. ఎందువల్లనంటే దట్టమైన మేఘాలు, మేఘగర్జనలు, విద్యుత్కాంతిని మించిన మెరుపులు, కుంభవృష్టితో కురుస్తుండగా నవ యవ్వనంలో ఉండే ఓ యువతి ఇల్లు వదలి బృందావనంలో తిరుగుతూ కనబడటం రాధకు శాపవిమోచన కాలం సమీపించడం వలననే పరిస్థితులన్నీ దానికి అనుగుణంగానే సమకూరాయి. గోకులంలో వరమిచ్చేటప్పుడే రాధతో శ్రీకృష్ణుడు “ నీకు రాత్రులందు మాత్రమే కనిపిస్తూ ఉంటానని” అనుగ్రహించాడు. అందుకు తగినట్లుగానే, నందుడు బృందావనానికి బాలకృష్ణుని తీసుకొని వచ్చాడు. వనానికి రాగానే కుంభవృష్టిగా వర్షం పడింది. ఇది చాలదన్నట్లుగా శ్రీకృష్ణుడు గుక్కపెట్టి ఏడవడం మొదలుపెట్టాడు. ఈ బాలుణ్ణి ఎలా కాపాడుకోవడమా అని నందుడు సతమతమవుతూ ఉండగా రాధాదేవి అక్కడకు వచ్చింది. ఆ పరదేవిని చూడగానే నందునికి జ్ఞానోదయం అయింది. తమోగుణం పటాపంచలయింది. ఆ విజ్ఞానం చేత ఆ బాలుడే పరాత్పరుడని, రాధాదేవియే మూల ప్రకృతి అని తెలుసుకోగలిగాడు. మహాత్ముల దర్శన భాగ్యం చేతనే జ్ఞానం కలుగుతుంది. అటువంటిది పరమేశ్వరి దర్శనం చేత జ్ఞానోదయం కావడంలో ఆశ్చర్యమేముంటుంది.

శ్రీకృష్ణుడు గోలోకంలో రాధకు వరమిచ్చేటప్పుడు రాత్రులందు మాత్రమే నన్ను చూడగలుగు తావని వరమిచ్చాడు. ఇప్పుడా శాపమిమోచన కాలం సమీపించడంతో అందుకు అనుకూలమైన పరిస్థితులన్నీ ఏర్పడుతున్నాయి. నందుడు వర్షం నుండి తప్పించుకోలేక పోవటం, బాలకృష్ణుడు గుక్కపట్టి ఏడుస్తూ ఉండటం, ఇంటికి చేరడం ఎట్లాగా అని విచారిస్తూ ఉండగా రాధాదేవి దర్శనం అయింది. అమె దర్శనంతో అతడికి జ్ఞానోదయం కూడా అయింది. తమోగుణం పటాపంచలయింది. ఈ బాలుడు పరాత్పరుడేనని, ఈ రాధాదేవి ఆయన ఇచ్ఛా శక్తి అయిన మూల ప్రకృతే నన్న జ్ఞానం కలిగింది. మహాత్ముల్ని దర్శించినప్పుడు సామాన్యుల్లో కూడా జ్ఞాన నేత్రం తెరుచుకోవడం మనం వింటూ ఉంటాం. అటువంటి నందుడు ప్రకృతి పురుషుల్ని ఒకేచోట చూసినప్పుడు అతడికి జ్ఞానం కలగడంలో ఆశ్చర్యమేముంటుంది? ఇక్కడ జాగ్రత్తగా గమనించండి. భగవంతుడు రాధతో మాట్లాడుతూ, మనిద్దరికీ భేదం లేదన్నాడు. నానుండి నిన్ను ఎవరూ వేరు చేసి చూడలేరన్నాడు. అది ఎట్లాగంటే, అగ్ని నుండి వేడిని, పాలనుండి తెల్లదనాన్ని, వేరుచెయ్యలేరని సోదాహరణంగా చెప్పాడు. నువ్వులేకపోతే నాకు రూపమే లేదు కదా? అని అంటూ మన్ను లేకుండా కుండల్ని ఎవరైనా చెయ్యగలరా?అని ఉపదేశించాడు. అనగా దీనిలోని భావం ఏమిటి? నేను సాక్షాత్తూ విరాట్పురుషుణ్ణే అయినా, మూల ప్రకృతివైన నువ్వులేకుండా నేను ఏకార్యాన్నీ చెయ్యలేననే సారం.

“తథాత్వయా వినా సృష్టి మహం కర్తుం నచ క్షమవి” అని నొక్కిచెప్పాడు. అయితే మత దురభిమానులు విష్ణువుకన్నా గొప్పవాడు లేడని, శివుడి కన్నా ఉత్కృష్టుడు మరొకడు లేడని సమయాన్ని

వ్యర్థం చేసుకోవడమే కాదు, దైవదూషణ వలన పాపం కూడా మూట కట్టుకుంటున్నారు. పరమాత్ముడు ఒక్కడేనని, ఆయనకు అనేక నామరూపాలున్నాయని, కావున మనం దేనినీ దూషించరాదని, మనం ఆయారూపాల్లో దేన్ని ఆరాధించినా ఆ మహనీయుడు కరుణించి కటాక్షం చూపుతాడని భావిస్తే ఏ చిక్కులూ ఉండవు.

శ్రుతి ఏకత్వాన్నే చాటిచెప్తోంది. "ఏకో నారాయణః ద్వితీయా స్తికశ్చిత్" అని చెప్తూనే "ఏకదైవరుద్రోన ద్వితీయాయ తస్థే" అని కూడా శ్రుతియే చెప్తోంది. దీనిని బట్టి, సర్వదేవతా స్వరూపుడే విరాట్పురుషుడని, శ్రుతులు నెత్తిన నోరు పెట్టుకొని మొత్తుకుంటున్నాయి. అటువంటిది మనం దేవతా భేదాన్ని కల్పిస్తూ వారికి ఉత్తమ, మధ్యమ, అధమ అధమాధములని విభజించి చెప్పడం ఎంత హాస్యాస్పదమో ఆలోచించండి. నామ రూపాలన్నీ కల్పితాలని, ఆ భగవంతుడు నామ రూపక్రియాశూన్యుడన్న దృఢ భావం ఉంటే చాలు. ఆ నామ రూపాల్లో దేన్ని దూషించినా ఆతత్త్వాన్ని దూషించినట్లే అవుతుంది. ఇదే పరతత్త్వం.

ఇంతేకాకుండా రాధాకృష్ణుల సంవాదం నుండి గ్రహించాల్సిన విషయాల్లో మరికొన్ని ఉన్నాయి. రాధయే మూల ప్రకృతి అని, శ్రీకృష్ణుడే విరాట్పురుషుడని తేలుతోంది గదా. రాధే ఆత్మ అని కూడా తెలుతోంది. కాబట్టి రాధా మాధవులకు ఎటువంటి భేదము లేదన్నది స్పష్టము. విరాట్పురుషుడు సృష్టి చెయ్యాలని సంకల్పించినప్పుడు పరమాత్ముని ఇచ్ఛాశక్తి మూల ప్రకృతియే సృష్టి కృత్యాన్ని నిర్వహిస్తుంది. అనగా భగవంతుని సృష్టిసంకల్పానికి ముందు ఇద్దరూ ఒక్కటే. అగ్నిలో ఉండే ఉష్ణ శక్తి విడిగా కనిపించదు గదా. దీనిని బట్టి సృష్టి అనగా భగవంతుని సంకల్పమేనని (ఇచ్ఛాశక్తి) ఆయనకా సంకల్పం కలిగినప్పుడే మూల ప్రకృతి ఆవిర్భవిస్తుంది. ఆమెతో కలసి ఉన్నప్పుడు భగవంతుణ్ణి మనం ఏమని పిలుస్తాం? సగుణ బ్రహ్మమనేగదా? బ్రహ్మమనే శబ్దం నపుంసకలింగం అన్నచో దాని భావం ఏమని తెలుసుకోవాలి. పురుషుడు లోకంలో చేసే పనుల వంటివేవీ ఆ పరబ్రహ్మము చెయ్యడనే గదా? అనగా తానుగా సృష్టి చెయ్యడు. అయితే ఈ సృష్టి అంతా ఎట్లా ఏర్పడుతుంది? అనగా ఇచ్ఛా మాత్రం చేతనే మూల ప్రకృతి వివిధ రూపాలలో సృష్టిస్తుంది. అయితే ప్రకృతి స్వతంత్రురాలా? కాదు. మరి ఎవ్వరు? ఆ విరాట్పురుషుని ఇచ్ఛకు ఆధీనురాలు. అనగా ఆ విరాట్పురుషుని ఇచ్ఛయే ప్రకృతి. ప్రకృతి విరాట్పురుషునిలో లయమవడం అంటే మహాప్రళయం. అనగా భగవంతునికి సృష్టియందు విముఖత్వం కలగటాన్నే ప్రళయమని భావం. ఎప్పుడు సృష్టిపై విరాట్పురుషునికి ఇచ్ఛ ఉండదో, అప్పుడు మూల ప్రకృతి భగవంతునిలో లీనమవుతుంది. కాబట్టి సృష్టి అంతా నశిస్తుంది.

ఆ పరమపురుషుడు పరాశక్తితో కలసి లేడని అంటే నిరాకార పరబ్రహ్మమని అర్థం. సృష్టిచేసే ఊహలేనివాడై సకల బ్రహ్మాండాలను తనలోనే లయం చేసుకొని యోగ నిద్రలో ఉంటాడని సారాంశం. సృష్టి రహస్యమంతా ఈ విధంగా ఉంటే మన వాళ్ళు విష్ణువు గొప్పా లేక శివుడు గొప్పా అని వాదించుకోవడం తెలివితక్కువ. త్రిమూర్తులకు, సకల బ్రహ్మాండాలకు ప్రభువై నిర్గుణుడై, జగత్సాక్షియై సకల కార్యములకు కారణ భూతుడై ఆ విరాట్పురుషుడు ఉంటాడని ఉపనిషత్తులు, పురాణాలు,

ఇతిహాసాలు ఘోషిస్తున్నాయి. కావున నిశ్చల భక్తిగల వారమైతే ఫలం దక్కుతుంది. లేకపోతే చేసే పూజలన్నీ నిష్ఫలాలే అవుతాయి. " అంధం తమః ప్రవిశంతియే విద్యాముపాసతే" అని ఉపనిషత్తు బోధిస్తోందని కొందరు వాదిస్తూ ఉంటారు. ఇంతకన్నా మూర్ఖమైన ఆలోచన మరొకటి ఉండదు. ఏ దేవతను పూజించినా ప్రకృతిని పూజించినట్లే, ఎందువల్లనంటే పూజలన్నీ సగుణ తత్త్వానికే. నిర్గుణ తత్త్వానికి పూజలే ఉండవు. అది అవ్యక్తము, అచింత్యము, అనంతము కాబట్టి ఆవాహనం చేసే అవకాశమే లేదు గదా. ఏ దేవతనైనా పూజించాలంటే నామరూపాలతో భావన చేసుకొనే పూజించాలి. వేరే మార్గాంతరమే లేదు. అయితే రూపంతో కూడుకున్న వస్తువులన్నీ ప్రకృతి చే ఏర్పడినవేగదా కాబట్టి లోకంలో అంతా శాక్తులనే అనాలి. మేము శాక్తులం కామని ఎవరైనా అన్నారంటే తమను తాము తెలుసుకోలేని వారని అర్థమవుతుంది. అటువంటి పూజలన్నీ బూడిదలోపోసిన పన్నీరు వలే వ్యర్థమే గదా.

ప్రకృతి అంటే ఒక్క పార్వతి మాత్రమే కాదు. లక్ష్మి అన్నా, సరస్వతి అన్నా అంతా ఒక్కటే. నామాలన్నీ ఆ పరాదేవికి చెందినవే. పరాదేవి అంటే పరమాత్ముని ఇచ్ఛాశక్తియేగాని వేరొకరుకాదు. అందువల్లనే "ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపిణీ" అని చెప్పారు. విష్ణు భక్తులు విష్ణువే పరమాత్మ అని, అయన ఇచ్ఛాశక్తియే ప్రకృతి అని లేక శ్రీమహాలక్ష్మి అని భావించుకోవడంలో ఎంతమాత్రం దోషంలేదు. అట్లాగే శైవులు శివపార్వతుల్ని, జ్ఞానులు బ్రహ్మ సరస్వతుల్ని విరాట్పురుషులని ధ్యానించుకోవచ్చు. అందులో ఎటువంటి దోషం ఉండదు. ఏ పూజలైనా సద్భక్తి కలిగినప్పుడే ఫలిస్తాయి. కాబట్టి శాక్తులనగా వేరన్న భ్రాంతి చెందాల్సిన పనిలేదు. అందరూ శాక్తులే. శాక్తులు కాని వారు ఏ మతంలో ఉండరు. శాక్తులనగా సర్వాధార స్వరూపిణి అయిన పరదేవియే. యోగమే ఆ మతానికి ప్రధానం. జితేంద్రియత్వమే దానికి ఫలం. అది సాధించేందుకే అనేక విధాలుగా అనేక పూజావిధులు చెప్పబడ్డాయి. అయితే తంత్ర విధులన్నీ అతి భయంకరంగా ఉంటాయి కదా కారణం ఏమిటని అడగవచ్చు.

ఏ పూజలు చెయ్యాలన్నా యోగ్యతని బట్టి అధికార భేదాలుంటాయి. అన్నీ ఒకే తీరున ఉండవు. ఎందువల్ల? అందరి కర్మలు ఒకే విధంగా ఉండవు గదా. వారి వారి కర్మఫలానుసారం బుద్ధిలో తేడాలుంటూ ఉంటాయి. అందర్నీ తరింపజెయ్యాలన్నదే భగవంతుని ఆశయం. అందువల్లనే వారివారి బుద్ధి భేదాలను బట్టి అనేక మంది దేవతలు ఏర్పరచబడ్డారు. అనేక విధాలైన పూజలూ ఏర్పాటయ్యాయి. అప్పుడే ఎవరెవరి యోగ్యతలననుసరించి వారికి అనుకూలమైన పూజలందు ఆసక్తి ఏర్పడుతుంది. అనగా వారివారి కర్మ ఫలానుసారమే కొందరికి తపస్సు అతి తక్కువ కాలంలో ఫలిస్తుంది. కొందరు చాలా కాలం తపస్సు చేస్తేగాని ఫలాన్ని పొందలేరు. మరికొందరికైతే వారి తపస్సు ఫలించనే ఫలించదు. దీని వలన మనం గ్రహించాల్సిందేమంటే, ఎవరెవరు పూర్వజన్మలలో చక్కటి కృషి చేసి ఉంటారో వాళ్ళందరికీ వేగంగా తపస్సు ఫలిస్తుంది. ఎవరైతే పూర్వ జన్మలలో తపస్సు కొరకు అత్యల్పమైన కృషి చేసి ఉంటారో వారందరికీ ఈ జన్మలో ఎక్కువ కాలంలో కృషి చేస్తే గాని ఫలితం లభించదు. ఎవరైతే పూర్వజన్మలలో కృషి చేయకుండా సంకల్పం మాత్రమే చేసి

ఉంటారో అటువంటి వారు ఈ జన్మలో కృషి ప్రారంభిస్తారేగాని దాని ఫలాన్ని పై జన్మల్లోనే పొందగలుగుతారు. అంతేగాని కృషి వ్యర్థంకాదు. దీని వలన మనం గ్రహించాల్సిందేమంటే ఫలానికి కారణం మంత్రోపదేశమో, తంత్రభేదాలుమాత్రం కాదు. కావున తప్పు ఆలోచనలు చేయరాదు. అటువంటి ఆలోచనల వలన ముక్తి లభించదు.

శాక్తమున అనేకమైన పూజా విధానాలున్నాయి. ధ్యాన భేదాలున్నాయి. స్తుతి భేదాలున్నాయి. అవన్నీ వారి వారి యోగ్యతలకు తగ్గట్టుగా ఏర్పడ్డాయి. అంతేకాకుండా కులాన్ని బట్టి కూడా పూజావిధానాల్లో తేడాలున్నాయి. భగవతికి మద్యమాంసాలంటే ఇష్టమని చెప్పబడింది. అవి క్షత్రియుల కొరకు ఏర్పడ్డ తంత్రాలు. అందువల్లనే " బ్రాహ్మణో మదిరాం దత్వా బ్రాహ్మణ్యా దేవహీయతే" అని కాళీ పురాణం తెలుపుతోంది. సిద్ధాంతములు, తంత్రాలు క్షత్రియాదుల కొరకు ఏర్పడ్డాయి. అట్లాగే శుభాగవపంచకము బ్రాహ్మణుల కొరకు ఏర్పడ్డది. అందులో మద్య మాంసాల ప్రసక్తి ఉండదు. చండి అన్న పేరు అందరికీ తెలిసిందే. అయితే చండి అనగా లక్ష్మి, సరస్వతి, కాళి అను దేవతల సమిష్టి రూపం. ఇక్కడ చండి అనగానే వైష్ణవులకు కోపం వస్తుంది. వారికి కాళి ఇష్ట దేవత కాకపోవచ్చును. లక్ష్మి అన్న భావనతో చండిని పూజించవచ్చు. అందువలన శాక్తమనగా ప్రకృతిని ఉపాసించడమేనని సారాంశం. విష్ణు భక్తులకు లక్ష్మి ద్వారా అభీష్టాలు సిద్ధిస్తాయి. అంతేగాని విష్ణు భగవానుడు తాను స్వయంగా ఇవ్వడన్నది వైష్ణవుల నమ్మకం. అంటే దాని అర్థం ఏమిటి? శ్రీమన్నారాయణుడే పరమాత్మ అని, లక్ష్మియే ఆయన హృదయేశ్వరి. కావున ఆ మహాదేవిని ఆశ్రయించినచో వారి అభీష్టాలన్నీ నెరవేరుతాయని గదా వారి నమ్మకము. ఈ భావన శాక్తం కాదా? శాక్తమనే మాటను అంగీకరించకపోయినా ఫలితం ఒకటే గదా. కావున వైష్ణవులైనా కూడా శాక్తులేగాని వేరుగాదు. శక్తి అనగా పార్వతి మాత్రమే కాదు. లక్ష్మి, సరస్వతి కూడానని మనం గ్రహించాలి. ఒక్క వైష్ణవులేకాదు, సర్వమతాలవారూ శాక్తులే. శాక్తులంటే హింసా వాదులని, భావించడం పొరపాటు. ఈ విషయాన్నే శ్రీకృష్ణుడు రాధకు తెలుపుతాడు.

రాధాదేవిని ఆరాధించేవారు శాక్తులుకారా? మన బుద్ధి భేదములే మనను బాధిస్తున్నాయి కాని శాస్త్రం కాదు. కావున ఈ దివ్య గాథ నుండి రాధాదేవి భగవంతుని అర్ధాంగి లక్ష్మీదేవియేనని, శాపవశమున భూలోకంలో జన్మించిందని మనం తెలుసుకోవాలి. లీలా శుకులుస్తుతించి ధ్యానించినది ఈ రాధాకృష్ణులనే నని మనం గ్రహించాలి. రాధాకృష్ణుల దివ్యగాథను పఠించడం వలన కృష్ణ భక్తి ఏర్పడుతుంది.

గోకులం నుండి బృందావనానికి

(ఈ భాగం హరివంశంలోని విష్ణుపర్వంలో ఎనిమిదవ అధ్యాయం నుండి గ్రహించబడినది.)

శ్రీకృష్ణబలరాములు క్రమంగా శైశవం నుండి కౌమారంలో అడుగుపెట్టారు. యశోద నందులు పూర్వంలాగా వీళ్ళకోసం వెతుక్కుంటూ ఊరంతా తిరగడం లేదు. మద్ది వృక్షాలు పడిపోవడంగాని, ఇతర అద్భుతాల్ని జనం అంతా మర్చిపోయారు. వీళ్ళు మిగిలిన గోపబాలకుల్లో ఒకరన్న భావనలోనే ఉంటున్నారు. నందుడు కూడా రాధాదేవిని దర్శించడం, ఆమె నుండి వరాలను పొందడం వంటి

విషయాల్ని మరచిపోయాడు. శ్రీకృష్ణబలరాములు తన పిల్లలేనని అనుకుంటున్నాడు. అందర్నీ మహామాయ ఆవరించింది. ఎంత మాయా వశులైనా భగవత్సాంగత్యం వృథాకాదు గదా.

యశోదానందులకు సంతానం లేక లేక ఎంతో కాలానికి శ్రీకృష్ణుడు జన్మించాడు. అందునా అతడు ఆ పల్లెకు రాజు. కావున శ్రీకృష్ణబలరాముల అలంకారాల విషయంలో ప్రత్యేకత కొట్టొచ్చినట్లు కనబడేది. కాళ్ళకు, చేతులకు వేసిన కడియాల్లో చిరుగంటలుండేవి. వాళ్ళుకదిలినప్పుడల్లా అవి ఎంతో మనోహరమైన శబ్దాలు చేస్తూ ఉంటాయి. ఎప్పుడూ పట్టు వస్త్రాలు ధరించి నెత్తిమీద నెమలి పింఛం ధరించి పిల్లన గ్రోవి చేత బట్టుకొని తిరుగుతూ ఉంటే ఊరంతా తన్మయులై చూసేవారు.

ఆటపాటల్లో శ్రీకృష్ణబలరాములెప్పుడూ కలిసి మెలిసి ఉండేవారు. మిగిలిన గోపబాలకులంతా వీరిని అనుసరించి తిరుగుతూ ఉండేవారు. శ్రీకృష్ణబలరాములిద్దరూ భగవత్స్వరూపులే. ఇక వారిలో భేదాన్వెరు చెప్పగలరు? ఆవిధంగా వారు లోకానికి సోదర ప్రేమను చాటి చెప్పారని అదే అవతార ప్రయోజనాల్లో ఒకటని పెద్దలంటారు. నందుడు, యశోద, రోహిణులతోపాటు ఊరూ వాడా అంతా శ్రీకృష్ణుని బాల్యక్రీడల్ని చెప్పుకొని ఆనందిస్తూ ఉండేవారు. ఈ మాటలు ఆనోటా, ఈనోటా దేవకీవసుదేవుల చెవిన కూడా పడుతూ ఉండేవి. వారి ఆనందాన్ని ఎవరు వర్ణించి చెప్పగలరు?

వైష్ణవ మాయ ప్రపంచాన్నంతా కప్పేసింది. భగవంతుడు వారి మధ్యనే తింటూ తిరుగుతూ ఉన్నా కూడా ఎవరూ గుర్తించలేక పోయేవారు. భగవంతుడు భూలోకంలో అవతరించాడంటే అతడు చెయ్యాల్సిన కార్యాలు అనేకం ఉంటాయి. ఆయా సమయానికల్లా ఆయా కార్యాలు జరిగిపోతూండాలి. పూతన సంహారం వంటి కార్యాలెన్నో గొల్లపల్లె నుండే నిర్వహించాడు. అయితే అవతార కార్యాలన్నీ ఉన్న చోటు నుండే చక్రం త్రిప్పడం కుదరదు. తాను అఖిలాండ బ్రహ్మాండ నాయకుడే అయినా, లోకం దృష్టిలో ఇంకా కౌమార దశలోనే ఉన్నాడు. కాబట్టి స్వయంగా బయటకు పోయి కార్యాలు సాధించుకు రావడం కుదరదు. అందువల్ల తాను చెయ్యాల్సిన కార్యాలు ఎక్కడెక్కడ జరగాలో అక్కడకు తాను తల్లి దండ్రులతోను, పల్లె వాసులందరితోను కలసి వెళ్ళాల్సి ఉంటుంది. అందుకు తగినట్లుగా పరిస్థితుల్ని కల్పించాలి.

ఆ రోజుల్లో అక్కడక్కడా రాక్షసులు తలెత్తి సామాన్యుల్ని, సాధుపుంగవుల్ని పీడిస్తూ ఉండేవారు. వాళ్ళంతా మాయోపాయాలు తెలిసినకామరూపులు. అందువల్ల వారిని పసిగట్టి తగిన పరిస్థితులు కల్పించి వారిని మట్టుపెట్టాలి. అందుకోసం కృష్ణబలరాములిద్దరూ గోపకుల్తో కలసి గోవుల్ని మేపేందుకు అడవుల్లోకి వెళ్తూ వస్తూ ఉండేవారు. వాళ్ళందరితో కలసి మెలసి ఉంటూ తింటూ ఆడుకుంటూ కొంతకాలం గడిపారు. ఆ వనాలకు కొంత దూరరో అనగా బృందావన ప్రాంతంలో బకాసురుడనే రాక్షసుడు ప్రజల్ని, పీడిస్తున్నాడు. ఇటువంటి ప్రజాకంటకుల్ని సంహరించి ప్రజలకు సుఖశాంతులు కల్పించడం కూడా అవతార ప్రయోజనమే కదా. తాను బృందావనానికి వెళ్తేగాని ఆ కార్యం సానుకూలపడదు. అందువల్ల గొల్లపల్లెను బృందావనంకు తరలించాలని భగవంతుడు సంకల్పించాడు. దానికేదైనా బలమైన కారణం ఉండాలి. తాను సాక్షీభూతుడుగా ఉండటం భగవంతుని స్వభావం. కర్మమే వారిని ఆడిస్తుంది. భగవంతుడు సర్వద్రష్ట. కావున సాక్షిగా ఉంటూ ఆనంద స్వరూపుడై ఉంటాడు. కాబట్టి అటువంటి పరిస్థితులు ఏర్పడాలి.

శ్రీకృష్ణుడు మానవరూపం దాల్చి అప్పుడే ఏడు సంవత్సరాలైంది. బలరామకృష్ణులు పట్టు పీతాంబరాలే ధరించేవారు. చందన కర్పూరాది లేపనాలన్నీ ఒంటికి పట్టించుకొని ముగ్ధమనోహరంగా తోటి బాలురతో కలసి గోవుల్ని తోలుకొని వనాలకు వెళ్తూ వస్తూ ఉండేవారు. బాలురంతా తలో వాద్యాన్ని చేత బుచ్చుకొని వెళ్ళేవారు. శ్రీకృష్ణుడైతే మురళిని విడిచిపెట్టేవాడే కాదు. తలలో నెమలి పింఛాన్ని అలంకరించుకొని మురళీగానం చేస్తూంటే తోటి బాలురు ప్రక్కవాద్యాలు వాయించేవారు. మిగిలినవాళ్ళంతా మైమరచి నాట్యం చేసేవారు. ఈ విధంగా కాలం సుఖంగా, సంతోషంగా గడచిపోతోంది. ఒకనాడు శ్రీకృష్ణుడు బలరాముడితో ఇలా అన్నాడు " అన్నా! మనం ఈ అడవిలో ఇంతకాలం గోవుల్ని మేపుకుంటూ ఆడుతూపాడుతూ తిరుగుతూ వచ్చాం. ఇక ఈ ఆనందం ఎంతోకాలం నిలిచేట్లు లేదు. ఎందువల్లనంటే ఇక్కడుండే బీడు భూములన్నీ మోడుబారిపోయాయి. మళ్ళీ చిగిర్చే ఆశలు కూడా కనిపించడం లేదు. పచ్చిగడ్డి బీళ్ళు లేకపోతే ఇక గోవుల్నెట్లా బ్రతికించుకుంటాం? గోవుల్లేకుండా మనం ఎట్లా జీవించగలం? అడివంతా పచ్చదనాన్ని కోల్పోయింది. మహా వృక్షాలన్నీ ఎండిపోయి ఒకదానికొకటి రాసుకొని దావానలం పుట్టోంది. అంతే కాదు ఇక్కడ ఉండే జలాశయాలన్నీ ఎండిపోతున్నాయి. కావున రాబోయే రోజులు ఏమాత్రం సుఖంగా గడిచేట్లు లేవు. ఈ వనంలో నివసిస్తున్న పశుపక్ష్యాదులన్నీ ఆహారాన్ని నీటిని వెతుక్కుంటూ వేరే వనాలకు వలసపోతున్నాయి. ఈ గ్రామస్తులంతా చెట్లు కొట్టి కట్టెలమ్ముకొని జీవిస్తున్నారు.

గొల్లపల్లెలే పర్వతాలకు అలంకారం. దట్టంగా పెరిగిన అడవులు, పచ్చికబీడులు, మహావృక్షాలే గొల్లపల్లెలకు ఆధారం. అనగా గోవులే మనకు జీవనాధారం. నీరు, పచ్చిక బీడులు ఎక్కడ సమృద్ధిగా ఉంటాయో అక్కడే మన గోవులు సుఖంగా ఉంటాయి. దీన్ని బట్టి మనం ఎక్కడా స్థిరంగా ఉండే వాళ్ళం కాదు. గోవుల కోసం మంచి నీటి వసతిని, సమృద్ధిగా ఉండే పచ్చిక మైదానాన్ని వెతుక్కుంటూ పోతాం. అక్కడే గృహాల్ని నిర్మించుకొని జీవిస్తాం.

అన్నా! ఈ గోవుల్ని పరిశీలించి చూడు. ముందుగా మూత్రం వదిలి ఆపైన పేడవేస్తూన్నాయి. దీన్నిబట్టి గడ్డిలో క్షారాలు ఎక్కువగా వున్నాయి. ఇక్కడి దొరువుల్లో నీళ్ళు కూడా స్వచ్ఛంగా లేవు. గోవులు కూడా మేసిన చోట మళ్ళీ మేయడం లేదు. మేసిన గడ్డికి చిగుళ్ళు రావడం లేదు. గోవులు ఈ దొరువుల్లోని నీళ్ళు త్రాగకుండా అంబా అని అరుస్తున్నాయి. దీన్ని బట్టి మన గోవులు కూడా క్రొత్త ప్రదేశాలకు పోవాలని కోరుకుంటున్నాయి. ఇక్కడ ఉండేందుకు ఇష్టపడటం లేదనిపిస్తోంది.

ఈ వనాలన్నీ దాటుకుంటూ పోతే బృందావనమనే ప్రాంతం వస్తుందట. అక్కడి పచ్చిక బీడులన్నీ తివాచీలు పరచినట్లు దట్టంగా ఉంటాయట. అక్కడ అనేక రకాలైన ఫల వృక్షాలున్నాయట. ఏకాలంలోనైనా పండ్లు సమృద్ధిగా దొరుకుతాయట. నీరు పుష్కలంగా లభించే తటాకాలు ఆ వనంలో అనేకం ఉన్నాయట. ఆ వనం మధ్యగా యమునా నది గల గలా ప్రవహిస్తూ ఉంటుందట. మనోహరమైన ఆ యమునా తీరం, సువాసనలతో చల్లగా వీచే పిల్లగాలిలో విహరించేందుకు మన గోపికలు ఎంతో ఇష్టపడతారు. వారి విహారానికి బృందావనంలో ఇంకా ఎన్నో ఉపవనాలున్నాయట. ఈ బృందావనంలోనే గోవర్ధన పర్వతం ఉంది. దాని శిఖరాలు ఆకాశాన్నంటుతూ నందన వనంలోని

మందరాద్రిని పోలిఉంటుంది. ఆ గోవర్ధనం పైన ఓ పెద్ద వట వృక్షం ఉంది. దాని శాఖలు నూరుయోజనాల మేర విస్తరించుకొని ఉంటాయి. దాన్నే అక్కడి వారంతా 'భాండీర'మని పిలుస్తారు. ఆగోవర్ధన పర్వతానికి యమునా నది చక్కగా పాపట తీసినట్లుంటుందట. ఈ యమునానది నందనవనంలోని దివ్య సరస్సులను మరిపిస్తుందట. ఆ గోవర్ధన పర్వతాన్ని, భాండీర వటవృక్షాన్ని, గల గల పారే యమునా తీరాన తనివితీరా విహరించాలనిపిస్తోంది. అక్కడే మన గోపకులందరికి ఇళ్ళు నిర్మిద్దాం. ఎడారిగా మారిపోయిన ఈ వనాన్ని త్వరగా వదిలేద్దాం. మన పెద్దలు ఒక పట్టాన ఇక్కడ నుండి కదలటానికి ఇష్టపడకపోవచ్చు. అందువల్ల నయానో భయానో వారిని మనం ఒప్పించాలి" అని శ్రీహరి బాలరాముడితో అన్నాడు.

శ్రీకృష్ణుడు ఇట్లా సంకల్పించగానే భయంకరమైన తోడేళ్ళ మందలు వేలకు వేలు పుట్టుకొచ్చాయి. అవన్నీ గోవుల్ని, గోపకుల్ని, గ్రామాన్ని చుట్టి వాళ్ళందర్నీ భయభ్రాంతుల్ని చేశాయి. గోపికలు, గోపకులంతా ఒక్కసారిగా హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. ఆ తోడేళ్ళు రాత్రిళ్ళు దాడి చేస్తూ గోవుల్ని చంపితినేవి. గోపికల్ని భయపెడుతూ ఉండేవి. చిన్న పిల్లల్ని నోటకరచుకుపోతూ ఉండేవి. ఈ విధంగా గ్రామాన్నంతా చికాకుపరుస్తూ వచ్చాయి.

గోపకులంతా నిస్సహాయులైపోయారు. గోవుల్ని అడవులకు తోలుకు పోవాలంటే ధైర్యం చాలేదికారు. గ్రామంలో కూడా చీకటి పడితే బయటకు రావడానికే భయపడేవారు. గోవుల్ని, పిల్లల్ని రక్షించుకోవడం పెద్ద సమస్యగా మారింది. గ్రామంలో ఉండలేని పరిస్థితులేర్పడ్డాయి. భయంకరమైన తోడేళ్ళు గ్రామాన్నంతా చుట్టబెడ్తూ ఉంటే ఒక్క అంగుళం కూడా కదల్లేని పరిస్థితులేర్పడ్డాయి.

దీనిని బట్టి భగవంతుని సంకల్పబలమెటువంటిదో ఆయన లీలలు ఎట్లా ఉంటాయో ఎవరూ తెలుసుకొనలేరు గదా. " ఇచ్ఛామాత్రం ప్రభోస్సృష్టిః"అన్న న్యాయం ప్రకారం భగవంతుడు క్షణంలోనే బ్రహ్మాండాల్ని సృష్టించి లయించగలడు. ఇక ఈ తోడేళ్ళు సృష్టి ఒక లెక్కా. భగవంతుడు అవతరించిన తర్వాత ఒక్క క్షణం కూడా వృథాచెయ్యడు. గోకులంలో చెయ్యాల్సిన కార్యాలన్నీ పూర్తయ్యాయి. పూతన వంటి వారి సంహారం, బాల్య క్రీడలతో గోపికల్ని ఆట పట్టించడం వంటి లీలలన్నింటినీ ప్రదర్శించాడు. తన సర్వేశ్వరతత్త్వాన్ని ప్రదర్శించుకున్నాడు. కావున భగవంతుడు గొల్లపల్లెను బృందావనానికి తరలించాలని సంకల్పించాడు. అప్పుడే బకాసురుని వంటి దుష్టరాక్షసుల్ని సంహరించడానికి వీలవుతుంది. వాళ్ళను సమయం సందర్భం చూసుకొని అక్కడికక్కడే సంహరించాలి. ఎందువల్లనంటే వారంతా కామరూపులు. మాయోపాయాలెరిగినవారు. అయితే భగవంతుడు తాను స్వయంగా ఏ పనీ చెయ్యడు. భగవంతుడు సంకల్పించగానే ఆయన ఇచ్ఛాశక్తి అయిన మహా ప్రకృతే కార్యాన్ని చేస్తుంది. చరాచర బ్రహ్మాండాలన్నీ ఆమె సృష్టియే. కావున సృష్టి రహస్యాలు తెలుసుకోవడం ఎవరితరం? ఆమహా ప్రకృతిని ఆరాధించి భగవత్సృష్టిని ఆస్వాదించేవాళ్ళే. అందుకే శ్రీరామకృష్ణ పరమహంస తమ భక్తులతో ఇలా అంటారు. "మీలో అంతా చక్కెర తినేందుకు ఇష్టపడతారేగాని, చక్కెర అయ్యేందుకు ఇష్టపడటంలేదు" అని.

బలరామునితో ఈ విధంగా అంటూ ఉండగానే భగవంతుని సంకల్పమాత్రం చేతనే భయంకరమైన తోడేళ్ళు మందలు మందలుగా వృద్ధి అయి గోకులాన్నంతా నిలువ నీడలేకుండా చేశాయి. గోకులంలోని వృద్ధులు, బాలురు, స్త్రీలు, పురుషులు అందరూ ముక్తకంఠంతో మేమిక ఇక్కడి ఉండలేమని తీర్మానించుకున్నారు. శ్రీకృష్ణబలరాములు నోరు మెదపకుండా వారంతటవారే క్రొత్త స్థావరంకు పోయేందకు సిద్ధమయ్యారు. దీనిని బట్టి దైవ సంకల్పం ఎంత బలమైనదో స్పష్టమవుతుంది.

బకాసుర వధ

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 16వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

గోకులంలోని వారు అంతా బృందావనానికి వచ్చి స్థిరపడ్డారు. శ్రీకృష్ణబలరాములు గోపకులతో కలసి గోవులను తోలుకొనిఅడవుల్లో మేపుకొని వస్తున్నారు. గోవులన్నింటినీ పచ్చికలో వదలి బాలురంతా కలసి వినోదాల్లో మునిగి తేలుతూ ఉండేవారు.

ఆ వనానికి లోపలగా కొద్ది దూరంపోతే మధువనం ఉన్నది. ఆ వనంలో బకాసురుడనే రాక్షసుడు ఆ దారిన పోయే జనుల్ని, తపోధనులైన మునులను హింసిస్తూ వారి ప్రాణాలు తీస్తున్నాడని శ్రీకృష్ణునికి తెలిసింది. భగవంతుడి దృష్టిలో పడ్డాడంటే వాడి కాలం తీరిందనే చెప్పుకోవాలి. కాలం సమీపించే వరకూ భగవంతుడు కూడా అతణ్ణేమీ చెయ్యలేడు. భగవంతుడికి అంతటి శక్తి లేదా అని అడుగరాదు. కర్మ సిద్ధాంతాన్ని ఆజ్ఞాపించిందే భగవంతుడు గదా. కనుక తన ఆజ్ఞను తానే మీరేందుకు ఇష్టపడడు. అందువలన అతడి కాలం తీరే వరకు వేచిఉంటాడు. శ్రుతులు, స్మృతులు కూడా భగవదాజ్ఞలే గదా.

"శృతిస్మృతీయమై వాజ్ఞేయస్తే ఉల్లంఘ్య వర్తతే" అన్న వాక్యం ప్రసిద్ధమే కదా.

ఒకానొక రోజున శ్రీకృష్ణుడు తోటి గోపకులతో ఈ రోజు మనం ఆ మందల్ని తీసుకొని మధువనానికి పోదామని ప్రతిపాదించాడు. ఈ విధంగా వారంతా మధువనంలో ప్రవేశించి కడుపునిండా నీరు త్రాగి, గోవులకు త్రాగించి వారంతా ఆటల్లో పడ్డారు. అయితే శ్రీకృష్ణుడు ఆనాడు ఈ వనానికి ఎందుకు తీసుకొని వచ్చాడో ఎవరికీ తెలియదు. బలరామునికి తెలిసినా తెలియనట్లే నటించాడు.

వారంతా మధువనానికి చేరుకున్నారు. గోవులన్నింటికి కడుపు నిండా నీరు త్రాగించి పచ్చిక మేసేందుకు వదిలేశారు. శ్రీకృష్ణబలరాములు కూడా మిగిలిన పిల్లలతో కలసి ఆటపాటల్లో మునిగిపోయారు. ఆ మధువన ప్రాంతంలో బకాసురుడనే రాక్షసుడు నివసిస్తున్నాడు. అతడు వికృతాకారి, అమిత బలశాలి, వాడు గొంతెత్తి అరిస్తే పర్వతాలు వనాలు ప్రతి ధ్వనించేవి. వాడి పేరు వింటే పక్షులు నీళ్ళు త్రాగేవికావు. బలరామ కృష్ణులు గోవుల మందల్ని తోలుకు రావడం వాడు చూశాడు. వారిని చూసీ చూడటంతోనే వాళ్ళిద్దర్నీ చంపితినాలన్న కాంక్ష కలిగింది. అతడు తన బలాన్ని చూసుకున్నాడేగాని ఎదుటి వారి బలాన్ని అంచనా వెయ్యలేదు. కేవలం బాలురే గదా అన్న చులకన భావం ఏర్పడింది.

అంతట ఆ బకాసురుడు శరీరాన్ని మేరు పర్వతమంత పెంచి శ్రీకృష్ణుణ్ణి మ్రింగేశాడు. బలరాముడు మిగిలిన బాలురంతా శ్రీకృష్ణుడు కనపడక భయంతో నాలుగు దిక్కులకూ పరుగులు దీశారు. ఆకాశంలో దేవతలంతా హాహాకారాలు చేశారు. దేవేంద్రుడు వచ్చి వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. అయినా ఆ వజ్రం రాక్షసుడి ప్రాణాలు తీయలేక పోయింది. చంద్రుడు వచ్చి నీహారకాస్త్రాన్ని ప్రయోగించగా వాడి శరీరంఅంతా మంచుగడ్డలా చల్లబడిపోయిందే గాని పౌరుషం చావలేదు. ఇంతలో యముడు తన పాశాన్ని ప్రయోగించాడు. అయినా చావలేదు. అగ్ని ఆగ్నేయాస్త్రాన్ని, వాయువు వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించి కూడా ఆ రాక్షసుణ్ణి హతమార్చ లేక పోయారు. మహర్షులు, మునులు, శ్రీకృష్ణునికి ఎటువంటి తాపాలు కలుగకూడదని ఆశీర్వదించారు. అతడి మరణం శ్రీకృష్ణుని వలన జరగవలసి ఉండటంచేత వారి ప్రయత్నాలేవీ ఫలించలేదు. చివరగా శ్రీకృష్ణుడు ఆ బకాసురుని కుక్షిలో ఉంటూనే బ్రహ్మతేజస్సును సృజించి తాను బయటకు నడచి వచ్చేశాడు. శ్రీకృష్ణుడు బయటకురాగానే ఆరాక్షసుడు భస్మమై పోయాడు. అంతట శ్రీకృష్ణుడు ఆ గోపాలురతో కలసి గోవులను తోలుకొంటూ కదంబవనంలో ప్రవేశించారు.

విశేషార్థం : మహాశయులారా! ఈ భాగంలో కర్మసిద్ధాంతంఎంత చక్కగా పనిచేసిందో మనం పరిశీలించి చూద్దాం. ప్రాణులన్నీ వారి వారి కర్మానుసారం శరీర ధారణ చేస్తూ ఉంటారు. శరీర ధారణతో పాటే వారెప్పుడు ఏవిధంగా మరణించాలో కూడా నిర్ణయించ బడుతుంది. దీనికి విరుద్ధంగా ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఫలించవు. అందువల్లనే,

హరిణాపి హరేణాపి బ్రహ్మణాపి సురైరపి, లలాట లిఖితా రేఖా పరిమార్ష్టుం శక్యతే.

అన్న సూక్తి ప్రసిద్ధి చెందింది. ఎవరివల్ల ఏ పని జరగాల్సిఉంటుందో వారిని విధియే ఈడ్చుకుపోతుంది. పామరులైతే వాళ్ళకు తెలియకుండానే ఆ చోటుకు ఈడ్చుకొని పోబడతారు. భగవంతుడు సర్వజ్ఞుడు కాబట్టి తానే కారణాన్ని కల్పించుకొని ఆ చోటుకు పోతాడు. అష్టదిక్పాలకులు బకాసురుణ్ణేమీ చెయ్యలేక పోయారు. ఎందువల్ల ?వారి ఆయుధాలు శక్తివంతమైనవి కావా? అని అనరాదు. అతడి మరణం శ్రీకృష్ణుని చేతిలో రాసిపెట్టి ఉంది. అటువంటి భగవదాజ్ఞను కాదనే ప్రజ్ఞ భగవంతుడకే లేదు. కావున అందరికన్నా కర్మమే బలమైనది. ప్రాణులన్నీ కర్మబద్ధులు కాబట్టే ఆ కర్మమే వారి మెడకు త్రాడుకట్టి ఆడిస్తూ ఉంటుంది. అదే భగవంతుని క్రీడ. మనం చేసే కర్మలన్నింటికి కర్తవ్యాన్ని మనపైనే వేసుకొని విర్రవీగుతూఉంటాం. ఆ కర్మ ఫలాన్ననుభవించేందుకే శరీరాన్ని ధరిస్తాం. శరీరాన్ని ధరించి మళ్ళీ కర్మలు చేస్తూ ఉంటాం. శరీరాన్ని ధరించిన వాడు మరణించక తప్పదు. ఇదే జననమరణ వలయం. కర్తవ్యాన్ని మనపై వేసుకోకుండా కర్మలు చేస్తూ కర్మఫలాన్ని భగవంతునికే అర్పిస్తే జనన మరణాలుండవంటారు. అదే ముక్తి ; మోక్షం.

బకాసురుడనే రాక్షసుడున్నాడని భగవంతునికి తెలుసు. వెంటనే సంహరించవచ్చు గదా?ఎందుకు తన్ను మ్రింగేవరకూ చూస్తూ కూర్చున్నాడని అడిగేవారుండవచ్చు. బకాసురుడు కనిపించగానే సంహరించాడే అనుకోండి. తనకు ఎటువంటి అపకారం చెయ్యని నిరపరాధిని చంపాడన్న అపకీర్తి వస్తుంది గదా. భగవంతుడు చేసే పనులన్నీ లోకానికి ఉదాహరణ భూతంగా ఉండాలే గాని

దోషాలతో కూడుకున్నదిగా ఉండరాదు. అందువల్లనే మ్రింగబడ్డాడు. భగవంతుణ్ణి కూడా మ్రింగే వాడుంటాడా? అని అడక్కూడదు. ఎందువల్లనంటే కారణం లేకుండా కార్యాలుండవు గదా. ఇంకో ముఖ్యమైన విషయమేమంటే, ఆపత్కాలంలో మనల్ని కాపాడుకునే ప్రయత్నాన్ని మనమే చేసుకోవాలన్న నీతి కూడా మనం గ్రహించాలి. ఈ సందర్భంలో శ్రీ మహాభారతంలో కర్ణుడు అర్జునునితో యుద్ధం చేస్తూ ఉండగా రథచక్రాలు భూమిలోకి క్రుంగిపోతాయి.

దీనినిబట్టి ఒక్కొక్కప్పుడు ధర్మం రక్షించలేని పరిస్థితులేర్పడ్డాకూడా దాన్ని మనం నిందించ కూడదు. ఎందువల్లనంటే ధర్మాన్ని మించిన బంధువో, స్నేహితుడో లోకంలో మనకు కనబడడు. కాబట్టి దేవతలెన్ని ప్రయత్నాలుచేసినా, ఆత్మశక్తియే భగవంతుణ్ణి కాపాడింది. కాబట్టి ఎప్పుడూ స్వశక్తినే నమ్ముకోవాలేగాని ఇతరులపై ఆధారపడరాదు.

వృషభాసుర సంహారం

(ఈ క్రింది కథాభాగం శ్రీకృష్ణ జన్మఖండం 16వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

బకాసురుడు మరణించగానే గోపాలురంతా పరమానందభరితులయ్యారు. ఇంద్రాదులంతా పరాత్పరుని మహిమను వేనోళ్ళకొనియాడారు. మహర్షులంతా శ్రీహరిని ధ్యానించి స్తుతించారు. అంతట శ్రీకృష్ణబలరాములు గోపాలురతో కలసి గోవులతో కదంబారణ్యంలో ప్రవేశించారు. అక్కడ ప్రలంబాసురుడనే ఓ రాక్షసుడు వృషభరూపంలో సంచరిస్తున్నాడు. అతడు కూడా మహాబలవంతుడు, పర్వతాకారుడు. వాడు వృషభ రూపంలో తిరుగుతూ ఉండటంచేత ఎవరూ తెలుసుకోలేక పోయేవారు. ప్రాణులు కనిపించగానే వేగంగా పోయి కొమ్ములతో పొడిచి చంపుతూ ఉండేవాడు. అందువల్లనే అతడు వృషభాసురుడన్న సార్థకనామంతో ప్రసిద్ధి చెందాడు.

శ్రీకృష్ణుడు బకాసురుణ్ణి సంహరించాడన్న వార్తను వృషభాసురుడు జీర్ణించుకోలేకపోయాడు. అప్పటి నుండి శ్రీకృష్ణుడి పై పగపట్టాడు. ఇప్పుడు అతడే బాలురతో కలసి తన వనంలో ప్రవేశించగా వాడి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వేగంగా వచ్చి కొమ్ముల మధ్యన శ్రీకృష్ణుని ఉంచుకొని గిరగిరా కుమ్మరి సారె వలె త్రిప్పాడు. గోపబాలురంతా భయంతో శ్రీకృష్ణుడి కోసం బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టారు. బలరామునికి శ్రీకృష్ణుడెవరో తెలుసు. ఈ వృషభాసురుని బలమెంతో గూడా తెలుసు. అందువల్ల చిరునవ్వుతో ఆ వినోదం చూస్తూ నుంచున్నాడు. గోపబాలురందర్నీ భయపడవద్దని ధైర్యం చెప్పాడు.

ఇది ఇట్లా ఉండగా శ్రీకృష్ణుడు ఆ రాక్షసుడి కొమ్ములు రెండూ గట్టిగా పట్టుకొని గిరగిరా త్రిప్పుతూ ఆకాశంలోకి ఎగురేశాడు. అప్పుడా వృషభాసురుడి శరీరం గాలిలో ఎంతో దూరం పోయి నేలపై పడింది. దాంతో ఆ దానవుడి ప్రాణాలు గాలిలో కలసి పోయాయి. బాలురంతా శ్రీకృష్ణుని చుట్టుముట్టి అభినందించారు. బలరాముడు కూడా వచ్చి శ్రీకృష్ణుని కౌగలించుకొని అభినందించాడు. ఆ తర్వాత వారంతా ఆడుతూ పాడుతూ నాట్యం చేశారు. అక్కడి నుండి వారంతా గోవుల్ని తీసుకొని ఖాండీర వనానికి బయలు దేరారు.

విశేషార్థం : బలరాముడు అవతారపురుషుడే అయితే అతడి సామర్థ్యం అతడికి తెలియకుండా ఉంటుందా? అతడి ప్రవర్తనను బట్టి అతడు భగవదవతారం కాదేమోనన్న అనుమానం కలగవచ్చు. అది పొరపాటు. బలరాముడు దశావతారాల్లో ఎనిమిదవ అవతారమని పెద్దలు చెప్తారు. అనంతుడంటే భగవత్స్వరూపమేనని కొందరు, కాదు ఆదిశేషువని కొందరు అంటారు. అనంతుడంటే భగవంతుడేనని మనం తెలుసుకోవాలి. " బలలోజహాస బువాన్ జ్ఞాత్వా భ్రాతరమేశ్వరమ్ " అన్న వాక్యాన్ని పరిశీలిస్తే భ్రాంతులన్నీ తొలగిపోతాయి. సోదరుణ్ణి ఈశ్వరుడుగా తెలుసుకోగలిగిన వాడు సర్వజ్ఞుడు కాక మరేమవుతాడు?ఎవరెవరు శ్రీకృష్ణుని చేతిలో మరణిస్తారో, ఎవరెవరు తన చేతిలో మరణిస్తారో బలరాముడికి తెలుసు. అందువల్లనే చిరునవ్వులు నవ్వుతూ వినోదించాడు. లేక పోతే సోదరుడు ప్రాణాపాయ స్థితిలో ఉంటే ఎవరైనా వినోదిస్తూ కూర్చుంటారా? వీడో తుచ్ఛ దానవుడు. ఇతడుపోయి పరమేశ్వరునికి బాధ కలిగించడమా? అని బలరాముడు మనస్సులో అనుకొని చిరునవ్వునవ్వాడు.

కేశిదైత్యుని సంహరించుట

(ఈ క్రింది కథాభాగం శ్రీకృష్ణ జన్మఖండం 16వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణబలరాములు గోపబాలకులు, గోవులతో కలసి భాండీర వనంలో ప్రవేశించారు. ఆ వనం అంతా కేశి అనే రాక్షసుడి అధీనంలో ఉండేది. వాడికి గుర్రం అంటే చాలా ప్రీతి. అందువల్ల తాను ఎప్పుడూ గుర్రం రూపంలోనే సంచరిస్తూ అనేక మందిని హింసిస్తూ ఉండేవాడు. వాడావిధంగా సంచరిస్తుండగా శ్రీకృష్ణ బలరాములు ఆవనంలో ప్రవేశించడం చూశాడు. వెంటనే పరుగు పరుగున పోయి శ్రీకృష్ణుని గట్టిగా పళ్ళతో కరిచాడు. భగవంతుని మృదువైన దేహం ఆ క్షణాన వజ్రంవలె కఠినమైంది. దాంతో వాడి పళ్ళన్నీ రాలి పడ్డాయి. అప్పుడు శ్రీకృష్ణునికి వాడిపై కోపంవచ్చి వాడివంక తీక్షణంగా చూశాడు. ఆ తేజస్సు చేత కాలి బూడిదయ్యాడు. అతడి చావుకు యక్షులు గంధర్వులు ఆనందంతో నాట్యం చేశారు. దేవతలు దుందుభులుమ్రోగించారు. శ్రీకృష్ణ బలరాములపై పూలవాన కురిపించారు.

అప్పుడు ముగ్గురు విష్ణుకింకరులు ఆకాశంలో కనిపించారు. వారు ముగ్గురూ విష్ణు పార్షదులు. పట్టు పీతాంబరాలను, కవచ కుండలాలనూ ధరించారు. మణులతో పొదిగిన కిరీటాన్ని ధరించి ప్రసన్నమైన ముఖవర్చస్సు గలవారై ప్రత్యక్ష మయ్యారు. రథం కూడా నానావిధములైన రత్నాలతో అలంకరించబడి విద్యుత్కాంతులతో మెరిసిపోతోంది. ఆపార్షదులు ముగ్గురూ భాండీర వనంలో ప్రవేశించి గోపబాలురతో కలసి ఉన్న శ్రీకృష్ణుని మహావిష్ణువుగా దర్శించారు. శ్రీహరి పాదారవిందాలకు నమస్కరించి అనేక విధాలుగా స్తుతించారు. వారంత వరకు ధరించిన రాక్షస దేహాల్ని వదిలేసి వైష్ణవ దేహాల్ని ధరించారు. వాళ్ళ ముగ్గురూ కారణాంతరాల చేత రాక్షసులై శ్రీకృష్ణుని అనుగ్రహం చేత తిరిగి గోలోకానికి వెళ్ళిపోయారు.

శ్రీమన్నారాయణుడు నారదునికి ఈ వృత్తాంతాన్నంతా వివరించగా నారదుడు ఇలాఅడిగాడు. మహానుభావా! నారాయణా! వైష్ణవరూపాన్ని ధరించిన ఆ దివ్యపురుషులెవరు?నాకు వారి వృత్తాంతం

అంతా వినాలనిఉన్నది. దయచేసినాకు తెలుపమని ప్రార్థించాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు ఇట్లా వివరించాడు. ఓ దేవర్షీ! వీరివృత్తాంతం అంతా అద్భుతమైనది. వీరి విచిత్రమైన ఇతిహాసాన్నిచెప్తాను. ఈ వృతాంతాన్నే పూర్వం శివభగవానుడు పుష్కర తీర్థంలో సూర్యగ్రహణ సమయంలో మాకు చెప్పాడు. అపుడు నేను, ధర్ముడు, బ్రహ్మ, ఇంకా ఎందరో మునులు కూడా ఉన్నారు. నీకా వృత్తాంతాన్ని వివరంగా చెప్తాను విను.

బక, ప్రలంబ, కైశి రాక్షసుల పూర్వ జన్మవృత్తాంతం

పూర్వం గంధవాహుడనే గంధర్వరాజు గంధమాదన పర్వత రాజ్యాన్ని పాలిస్తూ ఉండేవాడు. అతడికి నలుగురు పుత్రులు. వారు వసుదేవుడు, సుహోత్రుడు, సుదర్శనుడు, సుపార్శ్వకుడు. వీరంతా శ్రీహరి పాద సేవా పరాయణులు. వారికి అహోరాత్రులు, స్వప్నంలో కూడా శ్రీకృష్ణ స్మరణ తప్ప, రెండో ధ్యాస ఉండేది కాదు. వీరిలో పెద్దవాడైన వసుదేవుడు దుర్వాస మహర్షి శిష్యుడై నిష్ఠతో బ్రహ్మచర్యాన్నాచరిస్తూ తపస్సిద్ధి సాధించాడు. మరణానంతరం శ్రీకృష్ణ పార్షదుడయ్యాడు. మిగిలిన ముగ్గురూ పుష్కర తీర్థానికి పోయి శ్రీకృష్ణుని ఆరాధిస్తూ వచ్చారు. ఒకానొక రోజున వీరు ముగ్గురూ చిత్ర సరోవరానికి పోయి శ్రీకృష్ణుని ఆరాధనకి ఆ సరస్సులోని దివ్య కమలాన్ని కోస్తూ ఉండగా వారిని శివకింకరు డడ్డగించి శివభగవానుని వద్దకు తీసుకొని పోయాడు. అప్పుడు గంధర్వ సోదరులు ముగ్గురూ శంకరుని దర్శనం కాగానే సాష్టాంగనమస్కారం చేశారు. శివభగవానుడు వారిని ఆశీర్వదించి వారితో ఇలా అన్నాడు. " భక్తులారా! పార్వతీ సరోవరంలో పద్మాలను అపహరించిన మీరెవరు ? పార్వతి వ్రతం కొరకు ఆ సరస్సులో పద్మాల్ని కాపాడేందుకు లక్షమంది యక్షులు కాపలా కాస్తూ ఉంటారు. పార్వతి ప్రతిరోజు వెయ్యి పద్మాల్ని శ్రీహరి పాద పద్మాలకు సమర్పిస్తూ ఉంటుంది. భర్త సౌభాగ్యాన్ని కోరి ఆమె ఈ వ్రతాన్ని మూడు మాసాలుగా చేస్తోంది. అటువంటి సరస్సులో నుండి మీరీ పద్మాలను ఎందువలనఅపహరించారు" అని ప్రశ్నించాడు.

మహాదేవుని మాటలు విన్న ఆ గంధర్వులు వినయ విధేయతలతో వంగి నమస్కరిస్తూ ఇట్లా విన్నవించుకున్నారు. "మహాప్రభూ! మేము గంధర్వులం. గంధవాహుని పుత్రులం. మేము ప్రతిరోజు శ్రీహరి పాదాలకు పద్మాలను సమర్పిస్తేగాని పచ్చి మంచి నీళ్ళయినా ముట్టం. అయితే ఈ సరస్సు పార్వతీదేవి వ్రతం కొరకు రక్షించ బడుతోందన్న విషయాన్ని మేమెరుగం. ఇదిగో ఈ పద్మాలను నీ పాదాల వద్ద సమర్పించుకుంటున్నాం. మా యందు దయతో స్వీకరించి మాకు ఫలాన్ని ప్రసాదించు. ఈరోజున శ్రీహరికి ఎట్లాగూ పద్మాలను సమర్పించుకోలేం. అయినా సరే నీరు త్రాగే సాహసం చేస్తాం. ఎందువల్లనంటావా, ఈ కమలాల్ని నీకర్పిస్తున్నాం కాబట్టి శ్రీకృష్ణునికి అర్పించినట్లే అవుతుంది. మేం ప్రతిరోజూ ఏ భగవంతుని పాదాలాశ్రయించి ఈ పద్మాలతో పూజిస్తామో, ఆ పాదాలు నీపాదాలు ఒక్కటే. కాబట్టి మేం పవిత్రులమయ్యామనే భావిస్తాం. ఓ పరమేశ్వరా ! పరబ్రహ్మమొక్కడేగదా, అనగా అద్వితీయం. దానికి దేహం ఉండదుగదా. ఆ తత్వానికి రూపం ఏర్పడటం అంటే భక్తుల్ని అనుగ్రహించేందుకు ఆ పరబ్రహ్మమే భక్తుల అభీష్ట రూపాన్ని ధరిస్తాడు. కావున ఓ పరమ శివా ! ఈ కమలాలన్నింటినీ నీ పాదాల వద్ద సమర్పించుకుంటున్నాం. స్వీకరించు. మమ్మల్ని అనుగ్రహించు.

మాకు నీలో కృష్ణుడే కనిపిస్తున్నాడు. కావున నువ్వే మాకు ప్రభువ్వి. మనోహరమైన పీతాంబరాల్ని ధరించి, శ్యామసుందరుడవై, చేతిలో మురళిని ధరించి, మాకన్నులకు పండుగచెయ్యి. కౌస్తుభాన్ని వక్షంలో ధరించి, నెమలి పింఛాన్ని తలపై అలంకారం చేసుకొని, పారిజాత మాలల్ని మెడలో ధరించి, రాధాదేవిని వక్షస్థలంలో ఉంచుకొని, భక్తాభీష్ట వరదుడవై, స్వాత్మారామమై, పూర్వకామమై, బ్రహ్మాదులచే స్తుతించబడుతూ ఉండే రూపంలో భక్తులమైన మాకు దర్శనమిచ్చి అనుగ్రహించమని" ప్రార్థిస్తూ శివునిముందు దోసిలి పట్టి నిలబడ్డారు.

గంధర్వులు శ్రీకృష్ణుని రూపాన్ని వర్ణించి స్తుతిస్తూ ఉంటే వింటున్న శంకరుని కన్నుల్లో ఆనందభాష్పాలు రాలాయి. " ఓ గంధర్వులారా ! మీరు శ్రీకృష్ణుని భక్తులని, వైష్ణవ ప్రవరులని గ్రహించాను. నాకు కూడా శ్రీకృష్ణుడన్నా, అతడి రూపమన్నా అమితప్రియం. అతడి లీలలు ఎన్నిసార్లు విన్నా ఇంకా వినాలనే ఉంటుంది. మీరు శ్రీకృష్ణుని గుణగణాలను స్తుతించి నన్నెంతో ఆనందపరచారు. మీ పాదధూళి ముల్లోకాల్నీ పవిత్రం చేస్తుంది. మీ పాద ధూళిచేతనే భూలోకవాసుల పాపాలన్నీ పటాపంచలై పోగలవు. శ్రీకృష్ణ భక్తులైన సాధువులంటే నాకు, పార్వతికి, దేవతలకు కూడా పరమప్రియము. యథార్థంగా, నేను నా భక్తులకన్నా విష్ణుభక్తులంటేనే ఎక్కువ ఇష్టపడతాను. అయినా పూర్వం నేను ఇచ్చిన శాపం వృథాగా పోదు. ఆ శాప వృత్తాంతాన్ని మీకు వివరించి చెప్తాను, వినండి. ఈ సరోవరంలోని పద్మాలన్నీ పార్వతీదేవి వ్రతంకోసం ఏర్పాటు చెయ్యబడ్డాయి. వాటిని ఎవ్వరైనా తెలిసిగాని, తెలియకగాని సంగ్రహిస్తే వెంటనే వారు రాక్షసులై జన్మిస్తారని శపించాను. అందువలన నేను ఇచ్చిన శాపం వ్యర్థం కారాదు.

కృష్ణభక్తులకు అశుభం ఎన్నటికీ కలుగదు. అయినా మీరు భూలోకంలో కొంతకాలం దానవులుగా ఉంటూ శాపానంతరం గోలోకం చేరుకుంటారు. మీరు కృష్ణభక్తులు కావున, శ్రీకృష్ణుని రూపాన్ని కన్నులారా దర్శించండి. ఆయన చేతిలోనే మరణాన్ని పొందిన పిమ్మట దివ్య విమానాలు వచ్చి మిమ్మల్ని గోలోకానికి తీసుకొని వెళ్తాయి. మీయందు నాకు అమితమైన ప్రీతికలిగింది. కనుక మీరు కోరుకున్నట్లే శ్రీకృష్ణుని రూపాన్ని నా హృదయ ఫలకంపై చూపుతాను. దర్శించి కృతార్థులుకండి" అని వారికి శ్రీకృష్ణ దర్శన భాగ్యాన్ని కలిగించాడు. అటు పిమ్మట వారు పరమ శివునికి నమస్కరించి భూలోకానికి పోయి సహోత్రుడు బకాసురుని గాను, సుదర్శనుడు ప్రలంబాసురునిగాను, సుపార్శ్వకుడు కేశిదానవుడుగాను జన్మించారు. ఓ నారదా ! నువ్వు కోరినట్లుగా బక, కేశి, ప్రలంబాసురుల శాప విమోచనా వృత్తాంతాన్ని చెప్పాను. ఈ కథవిన్న వారికి పాపహరణమయి కృష్ణభక్తి గలవారవుతారు.

ఈ కథకు, భాగవతంలో చెప్పిన కథకు కొద్దిపాటి తేడాలు ఉన్నాయి. భాగవతంలో కేశికాసురుడు కంసుడు పంపగా బృందావనానికి వెళ్ళినట్లు చెప్పబడింది. ఇంతకు మించి కథాభాగంలో ఎటువంటి మార్పులూ లేవు. ముగ్గురూ శ్రీకృష్ణుని చేతిలోనే మరణిస్తారు. ఈ కథలను పరిశీలించి చూస్తే మనం తెలుసుకోదగిన విషయాలు కొన్ని ఉన్నాయి. గంధర్వులు ముగ్గురూ పరమ భక్తులే. కృష్ణభక్తులే అయినా శివుణ్ణి చూడగానే, నీ పాదాలను పూజిస్తే శ్రీ హరిని పూజించి నట్లేనన్నారు. నీకూ శ్రీకృష్ణుడికి భేదం లేదన్నారు. నువ్వేమాకు ప్రభువని పాదాక్రాంతులయ్యారు.

దీనిని బట్టి భక్తుల్ని అనుగ్రహించేందుకు ఆ విరాట్పురుషుడే, అనేక నామరూపాలతో దర్శనమిస్తూ ఉంటాడని తేటతెల్లమవుతోంది. ఇక హరిహర బ్రహ్మాది రూపాల్లో భేదమెట్లా ఉంటుంది? త్రిమూర్తులు ఆ తత్త్వాన్ని సంబంధించిన వారు కారంటే భేదాన్ని అంగీకరించవచ్చు కానీ, వేదాలు, వేదాంతశాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు ఈ నామరూపాలన్నీ ఆ విరాట్పురుషుడివేనని తెలుపుతున్నాయి. అనగా మనం ఏ రూపాన్ని భావన చేసుకొని ఆరాధిస్తామో ఆరూపాన్నే ఆ విరాట్పురుషుడు ప్రత్యక్షమై దర్శనమిస్తాడన్న దృఢ విశ్వాసం కలిగి ఉంటే ఫలం సిద్ధిస్తుంది. లేదంటే లేదు. "యతోనోమాన సంపూర్ణం తద్రూపం దర్శయాచ్యుత," అని మూలం.

"ఓ శంకరా ! మేము ఇంతకాలం ఏరూపాన్ని ధ్యానిస్తున్నామో ఆ రూపంలో దర్శనమిమ్ము" అని కదా వేడుకున్నారు. అంతేకాకుండా అచ్యుతా! అని కూడా శంకరుణ్ణి సంబోధించారు. దీన్నిబట్టి అచ్యుత అన్న నామం ఒక శ్రీహరికే చెల్లుతుందనుకోవడం సరికాదని తేలుతోంది. శివకేశవుల్లో భేదాన్ని సృష్టిస్తే మిగిలిన నామరూపాలన్నీ వ్యర్థమై పరమేశ్వర తత్త్వమే నశిస్తుందిగదా ! అంతేకాకుండా బాలకృష్ణుని రూపంలో కనిపించమని కూడా వేడుకుంటారు. శంకరుడు ఆ రూపంలోనే దర్శనమివ్వగా ఆనందభాష్పాలు జాలువారాయి. కావున శివకేశవులకు భేదంలేదని స్పష్టమవుతోంది. అనగా ఎవరేనామ రూపాలతో ధ్యానించినా ఫలం ఒక్కటేనని గ్రహించాలి. సకల దేవతా స్వరూపుడు ఆ పరమాత్మ ఒక్కడే. ఎక్కువ తక్కువలని భేదాలు కల్పించుకోవడం, ఇతర దేవతల్ని దూషించడం పాపకార్యమే అవుతుంది, అనగా ఆ విరాట్పురుషుణ్ణి దూషించినట్లే అవుతుంది.

అంతట నారదుడు, "మహాత్మా ! నీ కృపచేత అద్భుతమైన కథావిశేషాల్ని తెలుసుకున్నాను. నాకు పార్వతి తలపెట్టిన వ్రతాన్ని గూర్చి కూడా తెలుపవలసింది. ఎవర్ని భావనచేసి ఆరాధించింది? ఆ దేవదేవుని నామరూపాలేవి? ఆ వ్రత విధానం, ఏమిటి? ఎంతకాలం ఆవ్రతాన్ని ఆచరించాలో చెప్ప" మని అడిగాడు. అంతట శ్రీమన్నారాయణమూర్తి ఈ విధంగా తెలిపాడు.

పార్వతీదేవి ఆచరించిన శ్రీకృష్ణవ్రతం

(ఈ క్రింది కథాభాగం శ్రీకృష్ణ జన్మఖండం 16వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

"ఓ నారదమునీ ! ఈ వ్రతాన్ని మూడుమాసాలు ఆచరించాలి. పార్వతి భర్త సౌభాగ్యాన్ని కోరి ఈవ్రతం చేసింది. ఆమె రాధాకృష్ణులను ధ్యానించి వ్రతం చేసింది. ఈ వ్రతాన్ని విషువత్కాలంలో ప్రారంభించి దక్షిణాయణంలో పరిసమాప్తం చెయ్యాలి. ముందురోజంతా ఉపవాసం ఉండి, గృహకృత్యాలన్నీ తీర్చుకొని మర్నాడు వైశాఖసంక్రాంతి నాడు జాహ్నవీ నదిలో స్నానంచేసి సంకల్పం చేసుకోవాలి. వ్రతం చేసేవారు భగవంతుని మణియందుగాని, కళశమందుగాని, సాలగ్రామమందుగాని ఆవాహనం చేసుకొని పూజించాలి. ముందుగా పంచదేవతల్నీ పూజించి ఆపైన ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణుని పూజించాలి. సామవేదంలో చెప్పినట్లుగా ధ్యానంచెయ్యాలి. "ఓ రాధామనోహరుడా ! రాధదేవిని వక్షస్థలంలో ఉంచుకొని, బ్రహ్మ, అనంతుడు, ఈశ్వరులచే పూజించబడువాడైన ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని ధ్యానిస్తున్నా" నని పూజించాలి. ఆతర్వాత రాసమండల వాసియై రసాధిష్ఠాన దేవతవై రాసేశ్వర

వక్షస్థల స్థితవై, రసికయు, రసికప్రియయు, రసికప్రవరయు, రమ్యాంగియు, రమయు, రమకోత్సుక యును అయిన ఓ రాధాకృష్ణా నిన్ను ధ్యానిస్తున్నాను. శరత్కాల పద్మాల వంటి కన్నులు గలవాడా, శరద్కాల పూర్ణచంద్రునివలె ప్రకాసిస్తూ ముఖాన చిరునవ్వులుచిందిస్తూ, చందన చర్చలు నీసౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తూఉండగా, కస్తూరితో సింధూరాన్ని ధరించి చిరునవ్వులు చిందించే రాధామాధవ మూర్తిని అష్టోత్తర శతనామాలతో పూజించాలి. మంగళవాద్యాలు వాయిస్తూ నామ సంకీర్తనం చెయ్యాలి.

ఈ విధంగా భక్తి శ్రద్ధలతో మూడుమాసాలు చేసి ఆపైన ప్రతిష్ఠ చెయ్యాలి. ప్రతిష్ఠచెయ్యాల్సిన విధానం చెప్తాను, విను. ఏమాత్రం వాడని తొమ్మిదివేల కమలాల్ని సేకరించాలి. తొమ్మిదివేలమంది సత్‌బ్రాహ్మణుల్ని పిలిచి చక్కగా పూజించి భోజనం పెట్టాలి. ఆతర్వాత 9027 ఫలాల్ని సేకరించాలి. ఇవికాకుండా రకరకాలైన మధురమైన పిండివంటలు చేసి నైవేద్యం చెయ్యాలి. ఆ పిమ్మట సంస్కృతాగ్నిలో హోమం చేయ్యాలి. ఇంతేకాకుండా యజ్ఞం సూత్ర ఫలాన్వితమైన గంధపుష్పాలతో తొంభై దండలు, తొంభై కుంభాలను, సమర్పించాలి.

ఈ వ్రతాన్ని ఈ విధంగా ఆచరించి వశిష్ఠునికి వేదంలో ప్రతిపాదించిన విధంగా దక్షిణిలివ్వాలి. వెయ్యిగోవుల్ని తెప్పించి వాటి కొమ్ములకు బంగారు తొడుగు వేయించి వెయ్యిమంది బ్రాహ్మణులకు దానమియ్యాలని వేదాలు చెప్తున్నాయి. ఓ నారదమునీ! ఈ విధంగా మూడుమాసాలపాటు ఈ వ్రతాన్ని శ్రద్ధతో చెయ్యాలి.

ఈ వ్రతం ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలేమిటో కూడా చెప్తాను విను. ఇది సౌభాగ్యవర్ధనం. పరిశుద్ధమైన సంతానాన్ని పొందుతారు. నూరు జన్మల్లోనూ భర్తతో కూడి సౌభాగ్యవతులుగా ఉంటారు. ఈ వ్రత ప్రభావం వల్ల నూరు జన్మల వరకు భర్తతోగాని, పిల్లలతోగాని భేదం కలుగదు. అనగా భర్త తాను గీచిన గీటు దాటని వాడవుతాడు. ఇక పుత్రులంతా సేవకులై సమస్తమైన సేవలు చేస్తారు. ఇంతేకాదు, ఆ స్త్రీ ప్రతి క్షణం రాధాకృష్ణుల యెడల భక్తిగలదై ఉంటుంది. హరిభక్తి గలదవుతుంది. ఈ వ్రత విధివిధానాలన్నీ సామవేదంలో చెప్పబడ్డాయి. నేనూ, లక్ష్మీ ఈ వ్రతాన్ని ఆచరించాం. పూర్వం స్వయంభువమనువు, శతరూపలు అగస్త్యుణ్ణి పురోహితుడుగా పెట్టుకొని ఈ వ్రతం చేశారు. ఆ తర్వాత దేవహూతి, అకూతి అను నారీరత్నాలు కూడా పులస్త్య మహర్షిని పురోహితుడిగా చేసుకొని ఆచరించారు. రోహిణీదేవి క్రతుమహర్షిని పురోహితునిగా ఈ వ్రతాన్ని ఆచరించింది. రతీదేవికి గౌతముడు పురోహితుడుగా వ్యవహరించాడు. బృహస్పతి భార్య తారకు వశిష్ఠుడు పౌరోహిత్యం నడిపాడు. శచీదేవి ఆచరించిన వ్రతానికి బృహస్పతి పురోహితుడయ్యాడు. వీరందర్నీ తలదన్నేట్టుగా స్వాహాదేవి మరీచి మునిని పురోహితునిగా పెట్టుకొని ఈ వ్రతాన్ని చేసింది.

శంకరుని వలన వ్రత విశేషాలన్నీ తెలుసుకున్న పార్వతి, సంతోషంతో, వినయంగా చేతులొగ్గి శివ భగవానునితో ఇలా అన్నది. " జగన్నాయకా! మీరు చెయ్యమన్న ఈ వ్రతాన్ని సంతోషంతో చేస్తాను. అంతేకాకుండా మీకూ నాకూ కూడా శ్రీకృష్ణుడు ఎంతో ఇష్టమైనవాడు. కావున అటువంటి శ్రీకృష్ణ వ్రతాన్ని నేను తప్పక ఆచరిస్తాను. శ్రీహరి వ్రతం సర్వమంగళాలను చేకూరుస్తుంది. ఇష్టదానాలుగాని, వేదపఠనాలుగాని, తీర్థయాత్రల నెపంతో భూమినంతా చుట్టి వచ్చినా కూడా ఈ

వ్రతంలో నూరో వంతు ఫలం అయినా దక్కదు. నాథా! రాత్రింబవళ్ళు ఎవడు శ్రీహరి నామాన్ని తలచుకుంటూ ఉంటాడో అటువంటివాడు జీవన్ముక్తుడవుతాడు. ఆ పుణ్యాత్మునకు భగవద్దర్శనమై ముక్తిని పొందుతాడు. అటువంటి భక్తుని పాదధూళి శిరస్సున ధరించినంత మాత్రానే వారిపాపాలన్నీ పటాపంచలైపోతాయి. ఆ భక్తుడు ముల్లోకాల్ని పవిత్రం చెయ్యగలవాడవుతాడు. బ్రహ్మ, విష్ణువు, ధర్ముడు, శేషుడు, నువ్వు, గణపతి మొదలైనవారంతా ఏ పరాత్పరుని పాదాలు సేవించి తేజస్వంతులయ్యారో వారంతా గుణంలోగాని, తేజస్సు చేతగాని, బుద్ధిచేతను, జ్ఞానం చేతను శ్రీకృష్ణుని తో సమానులవుతారని పెద్దలంటారు. కావున, ప్రాణేశ్వరా! శ్రీకృష్ణుని ధ్యానం, స్మరణం,తపం, సేవల వల్లనే నీవంటి భర్తను పొందగలిగాను. చక్కటి సంతానాన్ని పొందాను. నేను కన్నకలలన్నీ సఫలమయ్యాయి. శ్రీకృష్ణాంశ గల హిమవంతుడు నాకు తండ్రి అయ్యాడు. దేవతల సర్వసేనాని, కార్తికేయుడు, గణపతి నాకు పుత్రులు కలిగారు. ఇంకా నాకు దుర్లభమైన దేదీ లేదు.

పార్వతి మాటలు విన్న శంకరుడు పులకాంకితుడై ఇలా అన్నాడు. “ ఓ దేవీ! నువ్వు మహాలక్ష్మీస్వరూపురాలవు గదా. ఇక నీకు అసాధ్యం అంటూ ఏదైనా ఉంటుందా? నువ్వు సర్వ సంపత్స్వరూపిణివి కదా. అనంత శక్తి స్వరూపిణివి. ఇటువంటి నువ్వు ఎవరింట్లో ఉంటావో అతడు సకల సంపదలతో తులతూగుతాడు. ఎవని ఇంట్లో లక్ష్మీదేవి నిలువదో వాడు జీవచ్ఛవమే. నేను, బ్రహ్మ, విష్ణువు, కూడా నీభక్తులం కావడం వల్లనే ప్రళయకాలంలో కూడా నాశనం లేని వారమై అక్షయులంగా మిగిలాం. ఎవరెవరు పతివ్రతలని శ్రుతులు ఘోషిస్తున్నాయో వారందరూ నీయెడల భక్తి శ్రద్ధలు గలవారే. నువ్వు కోరుకున్నట్లే వ్రతాన్ని వెంటనే ప్రారంభించు. ఇంతవరకు ఎవరెవరు ఈ వ్రతాన్ని చేశారో వారందరికన్నా విలక్షణంగా చెయ్యి. నువ్వు చేయబోయే ఈ వ్రతానికి సనత్కుమారుణ్ణి పురోహితుణ్ణిగా చేసుకో. వ్రతానికి కావలసిన కమలాల్ని, బ్రాహ్మణుల్ని, వస్తు సంచారాలన్నీ నేనే స్వయంగా ఏర్పాట్లు చేస్తాను. కుబేరుణ్ణి కోశాధిపతిగా నియమించు. దానాలకు సంబంధించిన విషయాలన్నింటినీ నేను స్వయంగా చూసుకుంటాను. లక్ష్మీదేవి ధనాన్ని కటాక్షిస్తుంది. బ్రహ్మపాఠకుడవుతాడు. వరుణుడు జలాలను ఏర్పాట్లు చేస్తాడు. షడాననుడు, యక్షులకు అధ్యక్షుడుగా ఉంటాడు. స్థాన సంస్కారాలన్నీ పవమానుడే నిర్వహిస్తాడు. ఏయే పనులు ఏయే సమయాల్లో నిర్వహించాలో శుక్రుడు చూసుకుంటాడు. చంద్రుడు అధిష్ఠాపకుడుగా వ్యవహరిస్తాడు. సూర్యుడు దానాన్ని చెయ్యాల్సిన సమయాన్ని నిర్దేశిస్తాడు. భగవంతునికి ప్రీతిపాత్రములైన పుష్పాలు మొదలైన సామాగ్రినంతా శ్రద్ధతో భగవంతునికి సమర్పించి, అంతకన్నా యోగ్యులైన బ్రాహ్మణులను ఆరాధించు. వ్రతం పూర్తి అయిన తర్వాత పురోహితుని రత్నాలతో ఘనంగా సత్కరించు.

విశేషార్థం : ఏ వ్రతాన్ని గూర్చి చెప్పినా, వ్రతాలన్నింటిలోకి ఈ వ్రతం ఉత్తమోత్తమం అని చెప్పారు. ఎందువల్ల? పార్వతి శంకరునితో ‘ ఈ వ్రతరాజాన్ని నీ అనుమతితో చేస్తున్నానని ’ అంటుంది. శంకరుడు ఆ వ్రతానికి అనుమతి ఇస్తూ,

“అహం బ్రహ్మేచ విష్ణుశ్చ త్వయి భక్త్యాశుభప్రదే,
సంహారసృష్టికాలేచ త్వ త్ప్రసాదా ద్వయం క్షమాః ”

అని అంటాడు. అనగా హరిహర బ్రహ్మాదులందరూ ప్రకృతి బద్ధులేనని తెలుస్తోంది. ప్రకృతి అనగా శక్తియే కదా. అనగా విరాట్పురుషుని ఇచ్ఛా సంకల్పమే ఈ ప్రపంచం. బ్రహ్మాండాలు వాటి పాలకులు కూడా ఆ ఇచ్ఛా శక్తి ఆధీనంలోనే ఉంటారు. కాబట్టి సమస్తమూ ప్రకృతి నిబద్ధులేగాని వేరుకాదు. ప్రకృతికి అతీతమైన దేదైతే ఉందో అదే పరబ్రహ్మం. కాబట్టి ఈ రూపాన్నే ధ్యానించు. నువ్వే ఆదిశక్తివి, మహాలక్ష్మివి కూడా. అట్లాగైతేనే నీ వ్రతం ఎందుకు చెయ్యాలని అడుగరాదు.

"యద్యదా చరతిశ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః, సయత్ప్రమాణం కురుతే లోక స్త దనువర్తతే."

అన్నమాట అందరూ ఎరిగిందేగదా. పార్వతియే ఈ వ్రతాన్ని ఆచరించిందని లోకంలో అంతా ఆచరిస్తారు. దాని వలన లోకంలో భగవద్భక్తి వృద్ధి చెందుతుందన్నదే భావం. ఇందులో పార్వతియే సర్వశక్తులు గల పరదేవత అని చెప్పబడింది. దీన్ని బట్టి మనం గ్రహించాల్సిందేమంటే ఎవరు ఏ నామ రూపాలను పూజించినా ఫలం సమానమే నన్నదే ఇందులోని సారం. పూర్వకర్మానుసారం ఎవరికి ఏ దేవత పై దృఢ భక్తి కుదురుతుందో, అతడు ఆ దేవతనే ఆరాధించి తరిస్తాడు. కావున ఒక దేవత అధికమనో మరో దేవత అథమమనో చెప్పరాదు. అన్ని రూపాలూ ఆ పరబ్రహ్మ స్వరూపాలేనన్న నమ్మకంతో పూజిస్తే ఫలం సిద్ధిస్తుంది.

శ్రీకృష్ణుడు ఈ విధంగా ఆ ముగ్గురు రాక్షసుల్ని సంహరించి గోవుల్ని తీసుకొని గోకులానికి చేరుకున్నాడు. తోటి గోప బాలురంతా శ్రీకృష్ణుడు ముగ్గురు రాక్షసుల్ని సంహరించిన అద్భుత వృత్తాంతాన్నంతా వారి పెద్దలకు చెప్పారు. గోపగోపికలంతా ఆశ్చర్యపోయారు. కానీ నందుడు మాత్రం భయంతో వణికి పోయాడు. ఇంకా గోకులంలో ఉండటం ప్రమాదమని భావించాడు. గోకులంలోని పెద్దలందర్నీ సమావేశ పరచి బృందావనానికి పోవటానికే నిశ్చయించాడు.

బృందావనానికి ప్రయాణం

(ఈ క్రింది కథాభాగం శ్రీభాగవతం దశమస్కంధం 11వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

నందుడు, మిగిలిన పెద్దలంతా గోకులాన్ని వదలి బృందావనానికి పోవడమే క్షేమమని తీర్మానించారు. ఈ విషయాన్నే భాగవతంలో కొద్దిపాటి తేడాతో చెప్పబడింది. భాగవత మూలంలో10వ స్కంధం, 11వ అధ్యాయంలో 4 శ్లోకాల్లో చెప్పిన విషయాన్నే పోతనగారు క్లుప్తంగా ఒకే ఒక్క పద్యంలో ముగించారు.

ఉ॥ *ఇక్కడ నుందురే మనుజు లీమనకృష్ణున కెగ్గుచేయగాఁ*
రక్కసురాలు చన్నోఁగెఱాలపయిన్ సుడిగాలివీచే ఁ బై ఁ
గ్రిక్కిఱి యందరుల్ పడియెఁ గేశవుసత్కృఁ దప్పెఁ జాలునేఁ
డెక్కడకైనఁ బోవలయు నింకిట గోపకు లారవింటిరే.

పోతనగారిది మక్కికి మక్కి వ్రాసే స్వభావం కాదు సారాన్ని మాత్రమే గ్రహిస్తూ భక్తి శృంగారాలు చెప్పాల్సివచ్చినప్పుడల్లా పెంచి వ్రాశారు.

భగవంతుడు ఏది సంకల్పిస్తాడో అది జరిగి తీరాల్సిందేగదా. ఏక్షణాన శ్రీకృష్ణుడు బలరామునితో బృందావనానికి నివాసాన్ని మార్చాలన్నాడో ఆక్షణాన్నే నందుని మనస్సులో భయాందోళనల బీజం నాటుకుంది. ఆ పైన అనుమానంపై మరొక అనుమానం రావడం మొదలైయింది. మిగిలినవారు కూడా నందుని శంకలన్నింటిని బలపరుస్తూ బృందావనానికి పోయేందుకే నిశ్చయించారు. దాంతో ఊరు ఊరంతా బృందావనానికి ప్రయాణంఅయింది. పిల్లలంతా శ్రీకృష్ణ బలరాములను అనుసరించారు. వారంతా ఆడేవారు ఆడుతుంటే పాడేవారు పాడుతున్నారు. కొందరు మేళాలు వాయిస్తే ఇంకొందరు తాళాలువేశారు, మరికొందరు లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ గుంపులుగుంపులుగా బయలుదేరారు. గోపికలంతా ఆనందంతో నృత్యాలు చేశారు. వృద్ధులు నడవలేనివారు బండ్లపైకూర్చొని ప్రయాణంచేశారు.

రాధాదేవి అంతరంగ చెలికత్తెలు కొందరు ముందుగానే నందుని గొల్లపల్లెలో జన్మించారు. వీరంతా దివ్యాలంకారాలను ధరించి పట్టుపీతాంబరధారులై గొల్లపల్లెలో శ్రీమంతులకు సతీమణు లయ్యారు. రాధాదేవికి ఇష్టసఖులు కావటాన పుట్టుకతోనే రాధాకృష్ణుల ఎడల భక్తిప్రపత్తులు గలవారైయారు. వాళ్ళల్లో కొందరు పల్లకీల్లోనూ, కొందరు రథాల్లోను బృందావనానికి ప్రయాణమయ్యారు.

భాండీరవనంలో శ్రీకృష్ణుని నందుని వద్దనుండి తీసుకొని యశోద చేతిలో పెట్టిన నాటినుండి రాధాదేవి నందుని ఇంటికి రాకపోకలు సాగిస్తూనే వుంది. యశోద రోహిణిలిద్దరూచక్కగా అలంకరించుకొని బంగరు రథంలో బృందావనానికి బయలుదేరారు. నందుడు, సునందుడు, శ్రీధాముడు, గిరిధాముడు, విభాకరుడు, వీరభానుడు, చాండభానుడు, గజాస్యుడు మొదలైనవారంతా గోపికలను, యశోదారోహిణులను అనుసరించి ముందుకు సాగిపోయారు. వారితోపాటు వేలాది గొల్లపల్లెవాసులు, లక్షలాదిసోధవము, గుర్రాలు, ఏనుగులు, కంచరగాడిదలు వేల లక్షలసంఖ్యలో వారిననుసరించి బృందావనాన్ని చేరుకున్నాయి. అక్కడ వారికి ఇల్లు వాకిలి లేకపోవడం వలన పెద్దపెద్ద వృక్షాలనీడలోనే బసచేశారు. ఇంతలోనే శ్రీకృష్ణుడు వచ్చి, " పెద్దలారా! మీరంతా వనదేవత చండికను భక్తి శ్రద్ధలతో ప్రార్థించండి. ఆ దేవి మీకోసం చక్కటి ఇళ్ళు కట్టించి సిద్ధం చేసింది. మనమంతా వనదేవతకు ధూపదీప నైవేద్యాలతో మన కృతజ్ఞలను తెలుపుకుందాం. అప్పుడే ఆ గృహాలన్నీ మన కళ్ళకుకన్పిస్తాయి. అందులో మీరంతా సుఖంగా నివసించండి " అన్నాడు. అనంతరం వారందరూ వనదేవతను ఆరాధించి చక్కగా భోజనాలన్నీ చేసుకొని చెట్లక్రిందనే సుఖంగా నిద్రించారు. మరునాడు ఉదయాన్నే వారంతా బృందావన సౌందర్యాల్ని ఆస్వాదిస్తూ గుంపులు గుంపులుగా యథేచ్ఛగా విహరించారు. వారికా రోజంతా ఒక్క క్షణంలా గడచిపోయింది.

విశేషార్థం : రాధాదేవి శాపకారణంగా శ్రీధాముడి పుత్రికగా జన్మించింది. శ్రీధాముడు మొదలైన పెద్దలంతా నందుడి అనుచరులేగదా. కాబట్టి వారంతా కూడా నందుణ్ణి అనుసరించి బృందావనానికి బయలుదేరారు. గ్రామాల్లో ఉండే తాపం వనాల్లో ఉండదు. చల్లగానూ సుఖంగాను ఉంటుందనడంలో సందేహం లేదుగదా. వారిమధ్య ఎదుర్కొంటున్న విపత్తులేవీ బృందావనంలో లేవు. పైగా వారికి, గోవులకు యమునా నదిలో కోరినంత చల్లటి నీరు లభిస్తోంది. గోవులకుగూడా యథేచ్ఛగా మేసేందుకు

కావలసినన్ని పచ్చికబయళ్ళున్నాయి. నివాసానికి మంచి గృహాలమిరితే అన్ని విధాల బృందావనంలో జీవనం సుఖంగా సాగిపోతుందనడంలో ఎటువంటి సందేహములేదు.

శ్రీకృష్ణుడు గోపకులందరితో ఇళ్ళులేవని విచారించవద్దు. వనదేవత అయిన చండికాదేవిని భక్తిశ్రద్ధలతో పూజించండి. తెల్లవారేటప్పటి కల్లా చక్కని భవనాలు మీకంటికి కనిపిస్తాయి. అందులో సుఖంగా నివసించండి అన్నాడు. " దేవీంచవటమూలస్థాం పూజాం కురత చండికామ్ " అని మూలంలో శ్రీకృష్ణవాక్యం కనిపిస్తుందిగదా. ఇందులోని రహస్యం ఏమిటో తెలుసుకుందాం.

శ్రీకృష్ణుడు లీలామానుష విగ్రహుడైన పరమాత్మ. అటువంటి పరమాత్మయే, వటమూలస్థితమగు చండికను పూజించమన్నాడు. ఎందువల్ల? దీన్ని బట్టి జనసాంద్రతగల పల్లెలు పట్టణాల్లోనే కాకుండా దేవతలు అడవుల్లో కూడా ఉంటారని తేలుతోంది. అనగా దేవతలు లేని ప్రదేశమే ఉండదు. దేవతలు అన్ని ప్రదేశాల్లోనూ ఉంటారని, ఆయా(క్రొత్త) ప్రదేశాలకు పోయినప్పుడు ఆయా దేవతల్ని పూజించాలని వేదాలు పైశ్లోకాలలో తెలుపుతున్నాయి. ఇల్లు కట్టుకోవడానికి కలపను సేకరించే పద్ధతుల్ని వాస్తుశాస్త్రం ఇలా బోధిస్తోంది. వృక్షాన్ని కొట్టి కలపసేకరించాలనుకొన్నవాడు ఆవృక్షానికి పూజలుచేసి ఆరాత్రి ఆచెట్టునీడనే సుఖనిద్రచెయ్యాలి. ఆరాత్రి అతడికి స్వప్నంలో వనదేవత ఆజ్ఞఅయితే ఆవృక్షాన్ని కొట్టి కలప సేకరించవచ్చు. లేనిచో మరోవృక్షాన్ని ఆశ్రయించాలని వాస్తు శాస్త్రం చెబుతోంది. దీనిని బట్టి కూడా వనదేవతలుంటాయనియు, వటవృక్షం త్రిమూర్తులకు ప్రతీక అని తెలుస్తోంది. వటవృక్షానికి ప్రదక్షిణలు చేయడం వలన అనేక బాధలు తొలగిపోతాయని ప్రజల నమ్మకం. వృక్షాలకుండే శక్తికంటే, వనాధి దేవతల శక్తి అధికం. దేవతలు భక్తికి సంతృప్తులవుతారు. కాబట్టి వారిని భయభక్తులతో సేవించినట్లైతే దుష్టగ్రహాబాధలనుండి విముక్తి కలుగుతుంది. అయితే కర్మశేషం ఉన్నవారికి ఫలితం దక్కదు. అట్లాగని పూజలు నిష్ఫలమని చెప్పరాదు. కర్మశేషం అయిన తర్వాత ఫలప్రాప్తి కలుగుతుంది. వట,అశ్వత్థాదిమహా వృక్షాలలో అనేకమంది దేవతలుంటారని శ్రుతులు ఘోషిస్తున్నాయి. శాస్త్రాలు చెప్తున్నాయి. అందువలన వృక్షాల్ని సేవించినందువల్ల ఏంప్రయోజనమని అనరాదు.

భగవంతుడు నిరాకారుడు, నిర్లిప్తుడు, నిర్గుణుడు, నిరంజనుడు, సర్వాంతర్యామి. అటువంటి భగవంతుని ఆరాధించటం సాధ్యంకాదు. అట్లాగైతే తరించడం ఎట్లా? అని భగవంతుడు ఆలోచించాడు. భక్తుల్ని అనుగ్రహించేందుకై తానే అనేక నామరూపాల్లో వెలిశాడు. స్త్రీ పురుషరూపాల్లాగానే పశుపక్షి, వృక్షరూపాలుకూడా ధరించాడు. అయా కర్మలు చేసినవారు ఫలానుభవం కోసం తగురీతుల్లో ఉపాసించి తరిస్తారు. కొందరు ఐహిక సుఖాల్ని పొందుతారు. మరికొందరు ఆముష్మికఫలాన్ని పొందుతారు. ఇందుకు కారణం ఆయాదేవతలు కాదు. ఉపాసకుని కర్మమే ఆయా ఫలాలనిస్తుంది. ఫలాన్నికోరిచేసేతపస్సు ముక్తి నివ్వలేదు. కర్మల్ని భగవదార్పణ బుద్ధితో చేసేవారే ముక్తికి ప్రాత్రులవుతారు. కావుననే భగవద్గీతలో,

"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః"

అని బోధించాడు. దేవతల్లో కౄరత్వం ఉండదు. కానీ ఆయా కార్యములందు మాత్రమే కౄరత్వం కనిపిస్తుంది. నృసింహమూర్తిని ఆరాధించేవారికి ముక్తి లభించదని చెప్పగలమా? అనగా కార్యాన్నిబట్టి

భగవంతుడు తగిన ఆకారాన్ని ధరిస్తూ ఉంటాడు. అట్లాగే కాళికాదేవిని ఉపాసించేవారికి శాంతముండదని చెప్పరాదు. కాబట్టి వివిధ నామరూపాలతో వ్యవహరించబడే సర్వేశ్వరుణ్ణి సగుణ బ్రహ్మమని పిలుస్తాం. భగవానుడు ప్రకృతితోకలసి సగుణుడై ఉన్న స్థితిలో నిష్కాముడై ఆరాధించినవానికి ముక్తి కరతాలామలకమవుతుంది.

ఇకప్రస్తుతానికి వస్తే, శ్రీకృష్ణుడు చండికాంబను పూజించమని ఆదేశించాడు. చండిక అనగా లక్ష్మీసరస్వతుల విశిష్టరూపం. అనగా సత్త్వరజస్తమోగుణ విశిష్టరూపమని భావం. అటువంటి చండికను పూజించడమా? అని కొందరు వైష్ణవులు సందేహపడవచ్చు. వారు అటువంటి కుశంకలు పెట్టుకోవల్సిన అవసరం లేదు. ఎందువల్లనంటే శాక్తమంటే ప్రకృతిని పూజించడమనే అర్థం. శక్తి అంటే ఒక్క పార్వతి అనే అర్థం చెప్పకూడదు. లక్ష్మీ, సరస్వతులు కూడా శక్తిరూపాంతరాలే. రూపాన్ని కల్పించుకొని పూజంచడాన్నే శాక్తమంటారు. కావున వైష్ణవులతో సహా అందరూ శాక్తులనే చెప్పాలి. శాక్తంకాని మతం ప్రపంచంలో ఎక్కడా ఉండదు. నిరాకారుణ్ణి ఉద్దేశించి నామరూపాలతో ఉపాసించలేంకదా. కాబట్టి సగుణబ్రహ్మమును ఉపాసించడమే శాక్తము. శాక్తులంతా మద్యపానం చేస్తారని, మాంసభక్షకులని చెప్పరాదు. క్షత్రియాదులకు మాత్రమే ఆ పూజావిధి చెప్పబడింది.

"బ్రాహ్మణోమదిరాందత్వా బ్రాహ్మణ్యా దేవహీయతే " అని కాళీవాక్యం.

"యదన్నం పురుషో భుజ్క్తే తదన్నం తస్యదేవతాః "

అన్నది అసంగతమా? విధిననుసరించి మానవుడు ఏ అన్నాన్ని భుజిస్తాడో ఆ అన్నాన్ని తాను పూజించే దేవతకు అర్పించవచ్చని, ఆయాదేవతలు అంగీకరిస్తారని భావం. కావున వర్ణాశ్రమధర్మాలననుసరించి శాక్తులు పూజిస్తారు. శబరిఇచ్చిన ఫలాల్ని పరబ్రహ్మమైన శ్రీరాముడు ఆరగించలేదా? కాబట్టి అన్నిమతాల్లోనూ శాక్తమున్నది. నేను శాక్తుణ్ణి కాదని చెప్పడం బుద్ధి మంతుల లక్షణం కాదు.

"నేను ప్రత్యేకమైన జీవుడను అని చెప్పుకోవడం ఎట్లా ఉంటుందంటే," అఖండ గంగా ప్రవాహంలో ఓ చిన్నభాగానికి ఆనకట్ట కట్టి ఆకట్టలో ఉండే నీటిని తనగంగ అనిచెప్పుకున్న ట్లుంటుంది" అని **శ్రీరామకృష్ణ పరమహంస** బోధించారు.

వైష్ణవశాక్తం

శ్రీమహావిష్ణువే విరాట్పురుషుడు. శ్రీమహాలక్ష్మియే మూల ప్రకృతి. ఈ బ్రహ్మాండాలు దేవతలు ఆమహాప్రకృతి అంశాభూతాలే. వేదాలు భగవన్మహిమను తెలుపుతాయి. భగవత్కృప పొందాలంటే దేవి కృప అవసరం. ఎందువలన? ప్రకృతి విశిష్టుడైనప్పుడే భగవంతుడు రూపం గలవాడవుతాడు. లేకపోతే నిరాకారుడేకదా. నిరాకారుడైన తత్త్వాన్ని ఉపాసించడం సాధ్యం కాదుకదా. అందువలననే విష్ణు భక్తులు శ్రీదేవిని ఉపాసిస్తారు. శ్రీదేవి అంటే శ్రీమహావిష్ణువు ఇచ్ఛాశక్తియే. కాబట్టి విష్ణువు అనగా శ్రీదేవి అన్నమాట. ఇట్లా పూజించేవారంతా శాక్తులే. ఇది అన్నిమతాలవారికి శ్రీమద్రామానుజాచార్యులవారు గ్రంథాలన్నిటిని పరిశీలించి శ్రీదేవికి ప్రాధాన్యాన్నిచ్చి భక్తుల

నుద్ధరించారు. దేవతలందరినీ ఉపాసించడం ఎవరికైనా అసాధ్యమే. కనుక ఆచార్యులవారు శ్రీమహావిష్ణువును ఉపాసించారు. అయినా అటువంటి మహానుభావులకు దేవతల ఎడల బేధభావముండదు కదా. ఈవిధంగా శాక్తమంటే భగవదుపాసినేనని మతాల ధర్మాలన్నీ ఒకటేనని మనం గ్రహించాలి.

శ్రీకృష్ణుడు తన (ఛాయా) శక్తి అయిన చండికను పూజించమని తనవాళ్ళందరికీ ఆజ్ఞాపించాడు. చండికయే దుర్గాదేవి. అటువంటి దుర్గలు తొమ్మండుగురని వీరిలో వనదుర్గయే ప్రధాన దేవత అని పెద్దలంటారు. అందువల్లనే వటమూలంలో నివసిస్తున్న చండికను ఉపాసించమని, ఆమె అనుగ్రహములేకపోతే గృహాలు కంటికి కనపడవని తెలిపాడు. శ్రీకృష్ణుని ఆదేశాన్ననుసరించి నందాది గోపగోపికలంతా వనదేవతలకు పూజలుచేసి ఆ వటవృక్షనీడలో సుఖంగా విశ్రాంతి తీసుకొన్నారు. ఆ అడవి అంతా నానావిధాలైన ఫలవృక్షాలు లెక్కకు మించి ఉన్నాయి. యాదవులకు గోవులే ధనం. ఆ గోవులు మేసేందుకు ఆవనమంతా పచ్చిక బీడులు తివాచీలు పరచినట్లున్నాయి. ఎక్కడ చూచినా మధురమైనజలాశయాలేకాకుండా ఆ ప్రక్కనే యమునానది పరవళ్ళ త్రొక్కుతూ ప్రవహిస్తోంది. దాంతో యాదవులంతా పరమానందభరితులైయ్యారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా వినోదాలతో కాలక్షేపంచేశారు.

బృందావన వర్ణన

(ఈ భాగం శ్రీకృష్ణజన్మఖండము 17వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

శ్రీమన్నారాయణుడు నారదమహర్షికి శ్రీకృష్ణ లీలల్ని తెలుపుతూ ఇలా అన్నాడు. " మునివర్యా! బలరామకృష్ణుల్ని తీసుకొని నందాదులు బృందావనానికి చేరుకున్నారు. నీకాబృందావన శోభను తెలియజేస్తాను, విను.

శ్రీకృష్ణుని ఆదేశాన్ననుసరించి నందాది యాదవులంతా వనదేవతను పూజించి సుఖంగా పడుకొని నిద్రపోయారు. కొందరు భర్తలతో కలసి పడుకొన్నారు. ఇంకొందరు పిల్లల్ని ప్రక్కలో పెట్టుకొని పడుకున్నారు. కొందరు గోపికలు స్నేహితురాండ్రతో కలసి నిద్రించారు. ఇంకొందరు బండ్లలోనే ప్రక్కలు పరుచుకొని పడుకొన్నారు. రాత్రి మూడవజామున ఓ విచిత్రం జరిగింది. శ్రీకృష్ణ భగవానుని సంకల్పం మేరకు, గురువులకు గురువు, శిల్పగణాచార్యుడు అయిన విశ్వకర్మ వేలాది శిష్యగణాలను వెంటబెట్టుకొని వచ్చాడు. ఆమహాత్ముడు మనోహరమైన రత్నమాలల్ని ధరించాడు. రత్నకుండలాల దివ్యకాంతులు విరజిమ్ముతూ ఉండగా వయస్సు చేతను, జ్ఞానంచేతను వృద్ధుడైనా మన్మథుణ్ణి తలదన్నేట్లున్నాడు. అతడి తేజస్సు ఇతడో ఆరితేరిన శిల్పాచార్యుడని చెప్పకయే చెప్తోంది. వారంతా యక్షులు. కుబేరుని కింకరులు. వారంతా వివిధ మణిహారాల్ని ధరించారు. కొందరు పరశుహస్తులు కాగా, మరికొందరు లోహాసారాల్ని ధరించారు. వీరంతా మూడుకోట్ల మందిదాకా ఉంటారు.

విశ్వకర్మ అక్కడున్న సాధన సామాగ్రినంతా పరిశీలించి చూశాడు. మనస్సులో శ్రీకృష్ణుని ధ్యానించాడు. భూమండలంలోనే అత్యంత రమణీయమైన నగరాన్ని నిర్మించేందుకు ఐదుయోజనాల విస్తీర్ణం గల చోటును ఎంపికచేసుకొన్నాడు. అది ఉత్తరోత్తరా పరమపుణ్యక్షేత్రమయ్యేట్లుగా సంకల్పించాడు. భక్తుల కోరికలన్నీ తీర్చే నగరాన్ని ఒక్కక్షణంలో నిర్మించాడు. కొన్ని మందిరాలకు మహా ద్వారాలను అమర్చాడు. కొన్నింటికి కల్పద్వారాలు, వాటికి స్ఫటికాకారంలో మణులతో కూడిన స్తంబాలను లోహంతో చేసిన ద్వారాల్ని అమర్చాడు. కొన్ని భవనాల్ని ఆనంద నిలయాలుగా నిర్మించాడు.

ఆ బృందావనంలో వృషభానునికి ఓ దివ్యసౌధ నిర్మాణం ప్రారంభమయింది. ఆ సౌధాన్ని ఆరుఅంతస్తుల భవనంగా తీర్చి దిద్దాడు. అందులో దివ్యప్రాకారాలు, అగాధాలు, పరిఖలు ఉండేటట్లు నిర్మించారు. భవనానికి నాలుగు ప్రక్కలా విశాలమైన ద్వారాలు అమర్చాడు. రత్న వైఢూర్యాలు పొదిగిన హంసతూలికా తల్పాలు, సుందరమైన సువర్ణాకార మణినిర్మితాలతోను మనోహరంగా రూపొందాయి. నిర్జనమైన ఆ బృందావనంలో మృదు, లత, చంపకాది వృక్షాలతో విలసిల్లి, కలావతీదేవి సుఖవిహారాలకు తీర్చిదిద్ద బడింది. "శ్రీమన్నారాయణుడు బృందావన వైభవాన్ని వివరించి చెప్పగా నారదుడు ఇలా అడిగాడు.

కళావతీ వృత్తాంతం

నారదుడు : మహాత్మా ! కళావతి ఎవరు? ఆమె భర్త ఎవరు? విశ్వకర్మ ఆమెకోసం ఆ దివ్య సౌధాల్ని ఏకారణం చేత నిర్మించాడు? ఆమె చరిత్రనంతా నాకు తెలుపవలసింది.

శ్రీమన్నారాయణుడు : నారదమునీ ! కళావతి పితృదేవతల మానసపుత్రిక. కమలాంశతో జన్మించింది. కళావతి అన్న పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆమె వృషభానుని భార్య. మహాపతివ్రత. ఆమె పుత్రికయే శ్రీకృష్ణునికి ప్రాణాధికమైన రాధాదేవి. ఆమె శ్రీకృష్ణునిలో అర్ధభాగము, తేజస్సు చేత సంపూర్ణాంశ. రాధాదేవి పాదరేణువుల చేత ఈ బృందావనమంతా పరమపవిత్రమయింది. జనులంతా ఆదేవియెడల దృఢభక్తినే కోరుకుంటారు.

నారదమహర్షి : మహాత్మా ! పితృదేవతల మానస పుత్రిక అయిన కళావతి ఏకారణంచేత భూలోకంలో ఉండాల్సి వచ్చింది? వృషభానుడు ఎటువంటి పుణ్యాలు చేసి కళావతిని భార్యగా పొందగలిగాడు? ఏకాలంలో ఈ వృషభానుడు వ్రజవాసులకు రాజయ్యాడు? రాధాదేవిని పుత్రికగా పొందేందుకు ఎటువంటి పుణ్యకార్యాలు ఆచరించాడు? నాకు వివరంగా చెప్పవలసింది.

శ్రీమన్నారాయణుడు : దేవర్షీ ! పితృదేవతలకు ముగ్గురు పుత్రికలు. వారే కళావతి, రత్నమాల, మేనకలు. వీరిలో రత్నమాల జనకుని, మేనక హిమవంతుని వివాహమాడారు. రత్నమాల కుమార్తె, అయిన సీతాదేవియే శ్రీరామునికి ధర్మపత్ని అయింది. మేనక కుమార్తెయే పార్వతీదేవి. ఈమెకూడా అయోని సంజాతమే. ఆదేవి శివభగవానుని వివాహమాడింది. మనువంశ సంభూతుడైన సుచంద్రుని కళావతి వివాహమాడింది. ఆ కళావతి అందచందాలు గాని, వేషభాషలుగాని, కోమలత్వంగాని మాటలతో వర్ణించి చెప్పలేం. హస్తములు పాదములు రక్తవర్ణంలో ఉండేవి. అధరములు దొండపండ్లు, ఆమెనేత్రాలు పద్మాలనే వెక్కిరించేట్లుండేవి.

అటువంటి కళావతిని చూడగానే ఆ రాజేంద్రుడు కామపీడితుడయ్యాడు. కళావతి కూడా తనయెడల అత్యంత ప్రేమపాత్రురాలుకాగా, ఆమెను వెంటబెట్టుకొని మనోహరమైన ప్రదేశాలన్నింటి లోనూ విహరించారు. ఆ రాజేంద్రుడు రతిశాస్త్రపండితుడు కావడం వలన రాత్రింబవళ్ళు స్వర్గసుఖా లనుభవిస్తూ విహరిస్తూ వెయ్యి సంవత్సరాల్ని ఒక్కక్షణంగా గడిపేశారు. అటుపిమ్మట ఐహిక సుఖాలపై విరక్తి కలిగింది. భార్యను తీసుకొని వింధ్యపర్వతాలకుపోయి పులహమహర్షి ఆశ్రమంలో వేయి దివ్య సంవత్సరాలు ఘోరతపస్సు చేశాడు.

శ్రీకృష్ణుని పాదములనాశ్రయించి నిరాహారుడై ఉండటంచేత స్పృహతప్పి పడిపోతూ ఉండేవాడు. అతడిపైన చీమలు పుట్టలు పెట్టేవి. భార్య ప్రక్కనే కూర్చుని వాటిని తొలగించి శుభ్రం చేస్తూఉండేది. రానురాను రాజుశరీరంలో రక్తమాంసాలన్నీ కరిగిపోయాయి. ఎముకల ప్రోగయ్యాడు. రోజురోజుకూ రాజుస్థితి క్షీణించి పోతూ ఉండటంతో కళావతి బిగ్గరగా విలపించేది.

కళావతి రోదన బ్రహ్మమనస్సును ద్రవింపజేసింది. వెంటనే ప్రత్యక్షమై కమండలము నుండి నీటిని తీసుకొని మంత్రించి రాజు శరీరమంతా తడిసేట్లు జల్లాడు. వెంటనే రాజు ఎదురుగా ఉన్న బ్రహ్మను చూసి వినయంతో నమస్కరించి పరిపరి విధాలుగా స్తోత్రం చేశాడు. బ్రహ్మ సంతృప్తుడై వరం కోరుకొమ్మన్నాడు. రాజు బ్రహ్మతో " మహాత్మా ! విజ్ఞాననిధీ ! వరం కోరుకోమన్నావు. నిర్వాణమే నా అభీష్టం" అన్నాడు. అంతట మహాపతివ్రత అయిన కళావతి బ్రహ్మతో ఇలా అన్నది.

కళావతి : కమలోద్భవా ! నాభర్తకు మోక్షాన్నిచ్చి నీతో తీసుకుపోతే, ఆయన్నే నమ్ముకొని బ్రతుకుతున్న నాగతి ఏమిటి? భర్త లేని భార్య ఒంటరిగా జీవించగలదా? పతివ్రతకు భర్తయే వ్రతమన్నది శ్రుతిప్రసిద్ధమే గదా? ప్రాణేశ్వరుడే నాకు గురువు, ప్రీతిపాత్రుడు. భర్తను మించిన ప్రియబంధువు మరొకడు ఉండడు గదా? ధర్మాలన్నింటిలోకీ పతిసేవే అతిముఖ్యమైన ధర్మం. భర్తసేవచెయ్యలేని భార్య ఎన్నివ్రతాలు చేసినా, దానాలుచేసినా అన్నీ వృథా అవుతాయి. ఒక్కసారి పతిచుట్టూ ప్రదక్షిణం చేయడం వల్ల సర్వతీర్థాలలో స్నానంచేసిన పుణ్యం లభిస్తుంది. సర్వయజ్ఞ దీక్ష, మహాదానాలు, వేదపఠనాలు, తపస్సు, వేదవేత్తలైన బ్రాహ్మణులకు వండి వడ్డించడం వంటి మహాకార్యాలు ఎన్ని చేసినా భర్త సేవా పుణ్యంతో సరిసమానం కాదు. ఏ స్త్రీ భర్తసేవా పరాయణురాలు కాదో ఆస్త్రీ కాలసూత్ర నరకానికి పోతుంది. ఆ ప్రాణిని పెద్దపెద్ద పురుగులు రాత్రింబవళ్ళు కుడుతూనే ఉంటాయి. ఇట్లా ఎంతోకాలం కష్టాలు అనుభవిస్తూ నూరు జన్మలైనా ఎత్తుతారు. ఓ బ్రహ్మదేవా! నేనో సామాన్య స్త్రీనవటం వల్ల ఈమాత్రమే తెలుసుకోగలిగాను. నువ్వు వేదాలనే సృష్టించినవాడవు. గురువులకు గురువువు. విద్వాంసులకే విద్వాంసుడవు. జ్ఞానులలో జ్ఞాన నిధివి. ఇట్టి సర్వజ్ఞుడవైన నీకు నేను చెప్పదగిన దాననుకాను. ప్రాణాధికుడైన నాభర్త ముక్తుడైతే నాకు రక్షకుడెవరు? నాధర్మానికి, నాయవ్వనానికి రక్షకుడెవరు? స్త్రీకి బాల్యంలో తండ్రి, వివాహం అయిన తర్వాత భర్తయే సర్వరక్షకుడవుతాడు. భర్తలేని సమయాన పుత్రుడు రక్షకుడవుతాడు. అనగా స్త్రీలకు ఈ మూడు దశల్లోనూ రక్షకుడు మానవుడే. ఈధర్మాన్ని కాదని ఏస్త్రీఅయినా స్వతంత్రంగా జీవిస్తే ఆ స్త్రీ నశిస్తుంది. అటువంటి స్త్రీని ధర్మాలన్నీ బహిష్కరిస్తాయి. అటువంటి వారు పూర్వం నూరు జన్మల నుండి చేసుకొన్న

పుణ్యాలన్నీ నశిస్తాయి. యవ్వనంలో పుత్రప్రేమ ఎట్లాంటిదో వృద్ధాప్యంలో పతివ్రతలయిన స్త్రీలకు భర్త అటువంటివాడు. దేవదేవా! తల్లులకు పిల్లలయెడల ప్రేమ అధికంగా ఉంటుంది. అయితే భర్త ప్రేమలో అది పదహారో వంతే, పాలిచ్చేంత వరకే పిల్లలపై ప్రేమ ఉంటుంది. భోజనంపైన ఇష్టం భోజనం చేసేంతవరకే ఉంటుంది. అయితే భర్తపైన ఉండే ప్రేమ మేలుకున్నా, నిద్రించినా, స్వప్నంలో కూడా తరిగేదికాదు. బంధువిభేదం దుఃఖాంతం. దానికంటే అధికమైనది పుత్రులపైన ఉంటుంది. స్వామి విషయకమైన దుఃఖం భయంకరం. అంతకన్నా భయంకర మైన దుఃఖం ఉండనేఉండదు. భర్త కౄరుడైతే ఆమెమనస్సు కాలే కట్టెవలె కాలుతూ బూడిద అవుతుంది. ఎందువల్లనంటే విరహం ఆ అగ్నికన్నా భయంకరమైనది. సాధ్వియైన స్త్రీ భర్తలేని యెడల అన్నంతినదు, నీరు ముట్టదు. ఎండిన కట్టెవలె ఆ విరహాగ్నిలో పతివ్రతల చిత్తము కాలి బూడిద అవుతుంది.

పతికన్నా దగ్గర బంధువుగాని, స్నేహితుడుగాని, దైవంగాని, గురువుగాని, ధర్మంగాని, ధనంగాని, ప్రాణాలుగాని ఉండవు. చివరకు ముక్తిని కూడా కోరదు. వీటన్నింటికన్నా అధికుడు భర్త. విష్ణుభక్తులకు శ్రీకృష్ణుని పాదపద్మాలెట్లాగో, ఒకే ఒక సంతానమున్న స్త్రీకి పుత్రులపై మమకారం ఎట్లాఉంటుందో? విటులకు వేశ్యలపై ఎట్లా వలపు ఉంటుందో, లోభికి ధనంపై ఆశ ఎట్లా ఉంటుందో, పిరికి వారికి భయంపై మనస్సు ఎట్లా కేంద్రమై ఉంటుందో, శిశువులకు తల్లిపాలపై ఎట్లా మక్కువ ఉంటుందో, శిల్పికి తన శిల్పాలపై మనస్సు ఎట్లా లగ్నమై ఉంటుందో, వ్యభిచారి అయిన స్త్రీ ముసలితనాన్ని ఎట్లా అసహ్యించుకుంటుందో, అంతకన్నా ఎక్కువగా పతివ్రతల మనస్సు భర్తపై ప్రీతిపాత్రమై ఉంటుంది. అటువంటి భర్తను వదలి జీవించలేదు. భర్తను వదలినస్త్రీకి మరణమే జీవనం. జీవించటం మరణంకన్నా అధికం ". అని కళావతి తన సాధ్వీత్వాన్ని తెలుపగా, బ్రహ్మ ఆమె మాటల్లోని బాధను, దుఃఖాన్ని అర్థం చేసుకున్నాడు. ఆమెతో ఇలా అన్నాడు.

బ్రహ్మ : కాంతామణీ ! నిన్ను ఒంటరిగా వదలి నీభర్తకు ముక్తిని ప్రసాదించను. అయితే మీ ఇద్దరికీ ముక్తినిచ్చే అధికారం నాకులేదు. కావున మీఇద్దరూ కొంతకాలం స్వర్గభోగాలు అనుభవించండి. ఆతర్వాత మీఇద్దరూ మళ్ళీ భూలోకంలో జన్మిస్తారు. మీకు ఏనాడైతే రాధాదేవి కుమార్తెగా జన్మిస్తుందో ఆనాడే మీ ఇద్దరూ జీవన్ముక్తులవుతారు. ఆపిమ్మట గోలోకానికి పోగలరు.

ఓ రాజేంద్రా ! నువ్వు ఇంకా కొంతకాలం కళావతితో కలసి సుఖాలనుభవించు. ఈమె మహాపతివ్రత, నన్నుకూడా శపించగల సమర్థురాలు. నీకటువంటి సమర్థతలేదు. కావున మీఇద్దరూ కొంతకాలం సుఖాలనుభవిస్తూనే శ్రీకృష్ణుని పాదాపద్మాలను సేవించండి. భక్తులైనవారు శ్రీహరికి దాసులుగా ఉండేందుకే ఇష్టపడతారేగాని, ముక్తిని కోరుకోరు. అంతట ఆ రాజదంపతులిద్దరూ బ్రహ్మకు నమస్కరించి తమ నిజగృహానికి వెళ్ళారు. బ్రహ్మ వారిని ఆశీర్వదించి సత్య లోకానికి వెళ్ళాడు. వారిద్దరూ ఎంతోకాలం సుఖాలనుభవించి భూలోకంలో జన్మించారు. లోకాలన్నింటిలోనూ, భూలోకం పరమపావనమైనది. బ్రహ్మాదులకు కూడా భరతఖండంపై ప్రీతి ఎక్కువ. ఆ సుచంద్రుడే వృషభానునిగా పద్మావతి సురభానువులకు పుత్రుడుగా జన్మించాడు. ఆవృషభానుడు హరిఅంశతో శుక్లపక్ష చంద్రునివలె దినదినాభివృద్ధి చెందుతూ పెరిగాడు. సర్వజ్ఞునిగాను, మహాజ్ఞానిగాను, మహాయోగియు అయిన శ్రీహరిని సేవించసాగాడు.

కళావతి కూడా భూలోకంలో కన్యాకుబ్జమందు భానందనుడనే రాజుకు అయోనిజ పుత్రికగా జన్మించింది. భానందుడు యజ్ఞం తలపెట్టగా అక్కడ యజ్ఞకుండమునందు కనిపించింది. అంతట భానందుడు పరమానంద భరితుడై ఆమెను పుత్రికగా స్వీకరించాడు. మహారూపవతియై వెలసిన ఆ బాలిక మహా తేజస్వియై దిక్కులన్నీ ప్రకాశించేట్లు చేసింది. పుటముపెట్టిన బంగారు కాంతులతో నున్న ఆ బాలికను రాజపత్ని అయిన మాలావతి చేతిలో పెట్టాడు. ఇంతలో అశరీరవాణి ఇలా పలికింది. "రాజా ! ఈ కన్యకకు కళావతి అని నామకరణం చెయ్యి" అని రెండుసార్లు పలికింది. రాజు పరమానంద భరితుడై బ్రాహ్మణులకు భిక్షువులకు, వందిమాగధులకు విరివిగా దానాలిచ్చి సంతోషపెట్టాడు. ఆబాలిక దినదిన ప్రవర్ధమానమై యౌవ్వనంలో ప్రవేశించింది. అతి సుందరాంగియై, చెంపకు చారడేసి కళ్ళతో విలసిల్లే కళావతి రాజమార్గాన పోతోంది. జితేంద్రియుడును, జ్ఞానియు అయిన నందగోపుడు ఆ కళావతిని చూశాడు. ఎవ్వరీ సుందరి? ఎవరి కుమార్తె? ఎవరి భార్య? అని ఆదారినపోయే వారిని వివరాలడిగాడు. " ఓ నంద భూపాలా ! ఈమె భానందుని పుత్రిక. ఈమె పేరు కళావతి. కమలాంశ చేత రాజవంశంలో జన్మించింది. అవివాహిత" అని చెప్పివారి దారిన వాళ్ళు పోయారు. అనంతరం నందుడు చాలా సంతోషించి రథం దిగి భానందుని రాజమందిరానికి వెళ్ళాడు. నందుని చూడగానే భానందుడు పరమానంద భరితుడై ఎదురు వెళ్ళి అతిధి మర్యాదలు చేసి గౌరవించాడు. కుశల ప్రశ్నలైన తర్వాత నందుడు వినయంగా ఇలా అన్నాడు. "రాజేంద్రా! నీ కుమార్తె కళావతికి తగిన వరుణ్ణి గూర్చి చెప్పబోతున్నాను. నువ్వీ మాటల్ని శ్రద్ధగా విను. సురభానుని కుమారుడు వృషభానుడు. అతడు వ్రజకు ప్రభువు గదా! ఆ వృషభానుడు నారాయణాంశా సంభూతుడు. సుందరాకారుడు. మహాపండితుడు. మంచి యౌవ్వనంలో ఉన్నవాడు. యోగి. జాతిస్మరుడు, ప్రాయపు పురుషుడు. నీ కుమార్తె అంటావా! అయోనిజ సంభూత. యజ్ఞకుండంలో జన్మించింది. పరమ పవిత్ర చరిత్ర గలది. శాంతమూర్తి కమలాంశతో జన్మించిన నీకుమార్తెకు ఆ వృషభానుడు తగిన వరుడు. రాజా! ఇంకొకమాట. విదగ్ధుడగు వరునికి విదగ్ధమైన కన్యక నివ్వడం ఎంతైనా సబబుగా ఉంటుంది. ఒకరికోసం మరోకరు జన్మించారా?అని నా కనిపిస్తోంది. నువ్వు నా మాటల్ని శ్రద్ధగా ఆలోచించి మంచి నిర్ణయానికి రమ్ము."

నందుని మాటలు విని భానందుడు వినయంతో ఇలా అన్నాడు. "వ్రజాధినాథా! వివాహాలను విధాత ముందే నిర్ణయిస్తాడంటారు. నేను నిమిత్తమాత్రుణ్ణి. ఏ కన్యకు ఏ వరుని సమకూర్చాలో కర్మఫలాన్ననుసరించి ఆ విధాతయే వ్రాసి పంపుతాడు. కాదగినది కాకమానదని వేదాలు ఘోషిస్తున్నాయి. ఎవరైనా అసమర్ధుడు విధిని ఎదిరించి కార్యాన్ని చేసినా అది విఫలమవుతుంది. కావున వృషభానునికి విధాత నా కుమార్తెను భార్యగా నిర్ణయించి పంపితే కాదనేందుకు నేనవడను? నేను కేవలం ఈ కన్యకు జన్మకారకుణ్ణి మాత్రమే" అని బదులు చెప్పి నందునికి విందు చేసి సకల మర్యాదలతో సాగనంపాడు. నందుడు అక్కడ నుండి సురభానుని ఇంటికి పోయి, తాను భానందునితో మాట్లాడిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పి వివాహానికి ఒప్పించాడు. దైవానుగ్రహం చేత ఆ సంబంధం కుదిరింది.

ఆ కలావతీ వృషభానుల వివాహం అతివైభవంగా జరిగింది. భానందుడు కళావతితోపాటు మహాగజములను, జాతి అశ్వములను, మణిమయ భూషణిములను వృషభానునికిచ్చి గౌరవించాడు. వృషభానుడు కళావతితో కలసి అనేక నిర్జన స్థలాలలో రాత్రింబవళ్ళు విహరించాడు. కళావతి భర్తను విడిచి క్షణమైన ఉండలేకపోయేది. అట్లాగే వృషభానుడు కూడా ఊపిరిని నిగ్రహించగలిగేవాడేమోగాని కళావతిని స్మరించకుండా ఉండలేకపోయేవాడు. ఆ విధంగా వారి స్నేహం దిన దినాభివృద్ధి చెందింది. కళావతి ప్రతిక్షణం సకామ కావడం, ఆమె భర్త కూడా అట్లాగే కాముకుడు కావడం చేత వారి దాంపత్యం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లింది. ఆ పుణ్యదంపతులకే కొంత కాలానికి రాధిక అను పుత్రిక జన్మించింది. పూర్వం గోలోకంలో సుదాముని శాపం మూలంగాను, శ్రీకృష్ణుని ఆజ్ఞను శిరసావహించి భూలోకంలో భానందుని ఇంట శ్రీకృష్ణుని ప్రేయసిగా రాధాదేవిగా జన్మించింది. రాధాదేవికి తల్లిదండ్రులైన అదృష్టం చేత వారిద్దరూ ముక్తులయ్యారు.

ఓ నారదా! నీకు కలావతీ వృత్తాంతాన్నంతా వివరించాను. ఆమె పుత్రికయే రాధాదేవి అనికూడా తెలుసుకున్నావు. ఇక ప్రకృత కథాంశాన్ని చెప్తాను విను. ఈ కథ విన్నవారి పాపాలన్నీ కాలిబూడిదైపోతాయి. కోరిన కోరికలన్నీ సిద్ధిస్తాయి.

దేవశిల్పి అయిన విశ్వకర్మ తన భృత్యుల్ని వెంటబెట్టుకొని వృషభానుణ్ణి కలుసుకున్నారు. రాజు కోరిక మేరకు నందునికో నగరాన్ని నిర్మించమని ఆదేశించారు. విశ్వకర్మ శిల్పి మాత్రమేకాదు, గొప్ప తత్త్వ విద్వాంసుడు కూడా. ఒక క్రోసెడు మేరలో నగరం అంతా అమిరేట్లుగా ఒక మనోహరమైన ప్రదేశాన్ని ఎన్నుకున్నాడు.

అందులో నందునికో మందిరాన్ని నిర్మించాడు. అది శ్రీ కృష్ణనివాసం కూడా కావడం చేత నిర్మాణంలో ప్రత్యేకమైన శ్రద్ధ వహించాడు. దానికి తగినట్లుగా ఇతర గృహసముదాయాల్ని కట్టాలనుకున్నాడు. ఆ నగరానికి చుట్టూ కందకం త్రవ్వించి అందులో ఎల్లప్పుడూ నీరు ప్రవహించేట్లు చేశాడు. దాని తర్వాత ఎత్తైన ప్రాకారాన్ని నిర్మించి లోపల నగరాన్ని నిర్మించాడు. ఆ నగరంలోపల సువాసనలు విరజిమ్మే పుష్పోద్యానాన్ని, అవన్నీ నదీ ప్రవాహానికి అనుకొని ఉండేట్లు జాగ్రత్తలు తీసుకున్నాడు. ఆ వనం నిండా చంపక వృక్షాల పూల ఘుమఘుమలు నగరం అంతా వ్యాపించేవి. ఇవి కాకుండా అన్ని ఋతువుల్లోను ఫలపుష్పాలతో విలసిల్లే వృక్షాలెన్నో నాటించాడు. ఆ ఉద్యానవనాల్లోనే అనేక క్రీడా మందిరాలు, నర్తనశాలలు నిర్మించి చూపరులను ఆ కట్టుకునే విధంగాను, మనోహరంగా ఉండేట్లుగాను నిర్మాణాలు జరిగాయి. అంతేకాదు కందకాల నుండి వారివారి గృహాలకు పోయేందుకు రహస్య మార్గాన్నేర్పాటు చేశాడు. నగరంలో సుందరమైన మందిరమొకటున్నది. దానిపైన మణి స్థంభాల్ని ఏర్పాటుచేశాడు. ఆ స్థంబాలన్నీ చిత్ర విచిత్ర వస్తు జాలాలతో విరాజిల్లాయి. కానీ పరీక్షగా చూస్తే అక్కడేమీ ఉండదు. ఆ మందిరానికి నాలుగు వైపులా ఈ మణిస్థంబాలమర్చాడు.

ఆ పరిఖ చుట్టూ ఉండే ప్రాకారం నేత్ర పర్వంగా ఉంటుంది. దానిపైన రాత్రింబవళ్ళు ధనస్సు బాణాలు ధరించిన రక్షక భటులుండేట్లు చేశాడు. ఆ ప్రాకారాలన్నీ యుద్ధ సమయాల్లో అప్రమత్తులుగా ఉండేందుకు ఉపయోగపడుతాయి. మణిసారాల్ని కవాటాలకు అమర్చగా, ఇంద్రనీల మణుల్ని ద్వారాలకమర్చి చూసే వాళ్ళను ఆశ్చర్యచకితుల్ని చేసేవి.

ప్రాకారాలకే ఇంత శ్రద్ధ తీసుకుంటే, ఇక నందుని గృహం ఎంత సుందరంగా నిర్మించబడిందో ఊహించండి. రాజమార్గానికి రెండువైపులా చల్లని నీడనిచ్చే మహావృక్షాల్ని నాటించాడు. నదీ తీరమంతా, సూర్యతాపాన్నుండి ఉపశమనం పొందేందుకు అనేక వేదికలున్నాయి. మార్గానికి రెండువైపులా కూడా ఈ వేదికలున్నాయి. ఇవికాక విశ్వకర్మ బృందావనంలో రాసమండలాన్నేర్పాటు చేశాడు. ఇక్కడి రాసమండలంలో కూడా ఎన్నో యోజనాల దూరం కనిపించేట్లుగా వలయాకారంలో మణిమయ వేదికల్ని, రత్నమండపాల్ని సిద్ధంచేశాడు. శృంగార ప్రియులు మెచ్చుకునే రీతిలో చిత్రాల్ని, రతికళాశాస్త్రాన్ని శిల్పాలుగా మలిచారు. ఈ విధంగా దేవతలకు కూడా ఆశ్చర్యం కలిగించేట్లుగా బృందావనంలో రెండో రాసమండలం సిద్ధమయింది.

ఆ బృందావనంలో కొన్ని నిర్జన వనాల్ని శృంగార కలాపాలకోసం సృజించాడు. వారంతా బసచేసిన వటవృక్షానికి కూతవేటు దూరంలోను, సరోవరానికి పశ్చిమతీరాన రాధాకృష్ణులకై ప్రత్యేక సౌధం ఏర్పాటైంది. అక్కడి వనం అంతా చంపక వృక్షాలతో నిండి కేతకీవన మధ్యభాగంలో ఒక నూతన రత్నమండలం ఏర్పాటయింది. దానిచుట్టూ ఉండే వేదికలకు అన్నివైపుల నుండి ఎత్తైన కవాటాలున్నాయి. అది తొమ్మిది అంతస్తులతో కూడిన దివ్యసౌధం. దాని చివరి భాగాన పతాకాలు, తోరణాలు, శ్వేతచామరలు అలంకరించారు. ఆ దివ్యక్షేత్రం కన్నుల పండుగగా తయారైంది.

అక్కడ కుంకుమాగరు కస్తూరీ మొదలైన పరిమళ వస్తుసముదాయంతో నవవిధశృంగారాలకు యోగ్యమైఉంది. కామాన్ని ప్రకోపింపజేసే కర్పూర తాంబూలాలన్నీ రత్నమయప్రాంతాల్లో అమర్చబడ్డాయి. మణిమయ సింహాసనాలు, చంద్రకాంత శిలా పాత్రల్లో సువాసనలు వెదజల్లే పానీయాలున్నాయి. ఒకటేమిటి శృంగారానికి భోగానికి అవసరమయ్యేపదార్థాలన్నీ అక్కడ ఉన్నాయి. ఈవిధంగా రాధాకృష్ణులకు ప్రత్యేకంగా క్రీడామందిరాన్ని ఏర్పాటుచేసి సంతృప్తిచెంది శిష్యులతో కలసి విశ్వకర్మ, శ్రీకృష్ణ పరబ్రహ్మను దర్శించి నమస్కరించి తన నగరానికి వెళ్ళిపోయాడు.

నారదా! ఈ నగరాన్ని నిర్మించిన తీరు విధానం ఎవరికైనా ఆశ్చర్యం కలిగించక మానదు. ఈశ్వరేచ్ఛ చేత అట్లా జరిగింది. భగవత్కృపతో జరిగితే కార్యాలన్నీ ఆశ్చర్యజనకంగానే ఉంటాయి. ఇది శ్రీహరి చరితం. శుభప్రదం, మంగళకరం, పాపహరం, మునివర్యా ఇంకేమైనా తెలుసుకోవాలని ఉందా?

విశేషార్థం : ఇందులో తెలిపిన కథావృత్తాంతమేకాకుండా ఇంకా ఎన్నోతెలుసుకోదగిన రహస్య విషయాలున్నాయి. భరతఖండంలో స్త్రీలకు పాతివ్రత్యానికి మించినఅలంకారం లేదు. మతాచారాలన్నీ స్త్రీలనాధారం చేసుకొనేఉంటాయి. పవిత్ర వృత్తిని నేర్పడం తల్లులకు వెన్నతో పెట్టిన విద్య. వారంతా పవిత్రజనితులైతేగాని పావన చరితులుకాలేరు. అనగా సద్విద్యవారి అధీనంలో ఉంటుంది. కుటుంబ సుఖశాంతులు వారి అధీనంలోనే ఉంటాయి. మాతృసహాయ సహకారం లేకుండా ఏ శిశువు వర్ధిల్లి పవిత్ర చరిత్రులుకాలేరు. అందువల్లనే ఆమెను ఇల్లాలు అని అన్నారు. కుటుంబం అంటేనే ఇల్లాలు అందువల్లనే ఒక కవివర్యుడు ఇలా అన్నాడు.

" ఇల్లుచూచినఁ దోఁచు నిల్లాలి శుచివృత్తి కూతురు ప్రకటించు మాతగుణము " అని

మొదట సుచంద్రుడు కాముకుడై కళావతితో కలసి విహరించని ప్రదేశంలేదు. వేయిదివ్య సంవత్సరాల్ని ఒక్క క్షణంగా గడిపేశాడు. కొంతకాలానికి ఆ సుఖాలన్ని తుచ్ఛమనితోచాయి. మనస్సును ప్రవృత్తి మార్గంనుండి నివృత్తిమార్గంవైపు మళ్ళించి బ్రహ్మదేవుని ధ్యానిస్తూ తపస్సుచేశాడు. కామకళలను ఎంతతీవ్రంగా పోషించాడో అంతకు నూరు రెట్లు అధికంగా తపస్సుపై మనస్సు లగ్నం చేశాడు. చీమలు తనపై పుట్టలు పెట్టడంకూడా తెలుసుకోలేక పోయాడు. అప్పుడుకూడా ఆసాధ్వి కష్టాలన్నీ ఓర్చుకుంటూ పతిసేవలో నిమగ్నురాలైంది. సుచంద్రుడు నిరసన దీక్షపూని తూలి పడిపోయాడు. దాంతో భర్త ప్రాణాలు విడిచాడని రోదించింది. ఆమెరోదన విన్న బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై కమండలములోని మంత్రజలంతో సుచంద్రుని ప్రాణాలు నిలిపాడు. బ్రహ్మదేవుని చూస్తూనే సుచంద్రుడు ముక్తిని కోరుకున్నాడు. అది విన్న కళావతి పతివ్రతా ధర్మాలను చెప్పి బ్రహ్మను మెప్పించింది.

కావున భార్యను విడిచిపెట్టడం భర్తలకు అనుచిత కార్యమని మనకు బోధిస్తుంది. నాభర్తను నానుండి విడదీసి ఆతడికి ముక్తి ఎట్లా ఇస్తావని బ్రహ్మను నిలదీసింది. ఆమెకాశక్తి ఎక్కడి నుండి వచ్చింది? పాతివ్రత్యమే ఆమెకంతటి శక్తిని ప్రసాదించింది. ముల్లోకాలను గడగడలాడించే శక్తి కళావతి సంతరించుకుంది. పతివ్రతకు త్రిమూర్తులు కూడా భయపడతారు. కళావతి బ్రహ్మతో వాదించిన ధర్మాలన్నీ మనదేశంలో ఒకప్పుడు వాడుకలో ఉండేవి. అట్టి పతివ్రతలకు శాపానుగ్రహ సమర్ధత ఉండేది. ఇప్పుడు వివాహనియమాల్లో మార్పులు రావటం వల్ల ఆశ్చర్యంగా ఉంటుంది. నమ్మశక్యంకాదు. సదాచారాలన్నీ విపరీతంగా అనిపిస్తాయి. కళావతి బ్రహ్మకుపదేశించిన ధర్మాలు ఏకాలానికైనా ఉదాహరణ భూతములే. వారు ఆత్మశక్తి కలిగి ఉంటారు. క్షమగలవారై ఉంటారు. శాపానుగ్రహశక్తి కలిగి ఉంటారు.

నారదుడు : దేవా ! శ్రీమన్నారాయణా ! ఈ వనానికి బృందావనమన్న పేరు ఎట్లా వచ్చింది? ఆపేరులో ఏదైనా తత్త్వం ఇమిడిఉన్నదా?

శ్రీమన్నారాయణుడు : నారదా ! కృతయుగంలో కేదారుడనే రాజు ఉండేవాడు. అతడు సప్తద్వీపాలను పాలించే రాజులందరిలోను అగ్రగణ్యుడు. అతడు సత్యధర్మ నిరతుడు. అతడికి అనేకమంది భార్యలు, వారికి అనేకమంది పుత్రులు ఉండేవారు. ప్రజలంతా అతడి పాలనలో సుఖ శాంతులతో వర్ధిల్లేవారు. నూరు యజ్ఞాలు చేసినా ఇంద్రపదవిని కోరుకోలేదు. అనేక సత్కర్మలు చేసినా, కర్తవ్యం తనపైన వేసుకోకుండా బ్రహ్మార్పణ బుద్ధితో చేశాడు. ఆ కేదారమహారాజు రాజ్యభారాన్ని పుత్రులపై ఉంచి, తల్లిని కంటికి రెప్పలా చూసుకోండని హెచ్చరించి తాను తపస్సు చేసుకొనేందుకు అడవులకు వెళ్ళాడు. అతడు శ్రీహరికి ఏకాంత భక్తుడు. అందువలన అతడు రాత్రింబవళ్ళు ఆ శ్రీహరినే ధ్యానిస్తూ చివరకు శ్రీహరి కృపకు పాత్రుడై గోలోకాన్ని చేరుకున్నాడు. అతడి పేరు మీదనే కేదారక్షేత్రమేర్పడి ప్రసిద్ధి చెందింది.

బృందావన చరిత్రము

ఆ కేదార మహారాజుకు బృంద అనే కుమార్తె ఉన్నది. తండ్రివలెనే ఆమెకూడా గొప్ప విష్ణుభక్తురాలైంది. ఆమె యోగశాస్త్ర విశారదయై భగవత్కృపకు పాత్రురాలైనా కూడా ఏ వరాన్నీ

కోరుకోలేదు. ఆమె దుర్వాస మహర్షి నుండి దుర్లభమైన హరినామమంత్రాన్ని పొంది తీవ్రమైన తపస్సు చేసింది. బాల్యంలోనే ప్రపంచంపై విరక్తి కలిగి, అరణ్యాలకు పోయి తపస్సు ఆచరించింది. శ్రీకృష్ణుడు ఆమె తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమయి వరం కోరుకోమన్నాడు. ఆమె శ్రీకృష్ణుని దివ్య మంగళ విగ్రహాన్ని చూసి పరవశురాలై ఆ మోహం చేతనే కామపీడితురాలై " ఓ రాధాపతీ ! నేను నీకు భార్యను కావాలని కోరుకుంటున్నాను. నా కోరిక మన్నించమని"పరిపరి విధాలుగా ప్రార్థించింది. భగవానుడు 'తథాస్తు' అని పలికి ఆమెతో కలసి అదృశ్యరూపంలోనే ఆవనమంతా విహరించాడు. అంతటితో ఊరుకోకుండా ఆమెతో కలసి గోకులానికి వెళ్ళాడు. ఆమె అందాల రాసి. అందచందాల్లో రాధాదేవితోనే పోటీ పడగలదయింది. అందువల్లనే శ్రీకృష్ణుని వివాహమాడి గోపికాస్త్రీలలో శిరోమణి అయింది.

కేదార భూపాలుని కుమార్తె అయిన బృందాదేవి ఏచోట తపస్సు చేసిందో ఆ వనమంతా బృందావనంగా ప్రసిద్ధిచెందింది. శ్రీకృష్ణుడు ఆమెతో కలసి విహరించడం మూలంగా బృందావనంగా ప్రఖ్యాతి చెందింది. బృందావనమనేపేరు ఎలా వచ్చిదో తెలిపే మరో ఉదంతంకూడాఉంది.

భూలోకంలో కుశధ్వజుడనేరాజు ఉండేవాడు. ఆరాజుకి తులసి, వేదవతి అను ఇద్దరు కుమార్తెలు. వారిద్దరు ధర్మశాస్త్ర విశారదులే. వారు పుట్టిన నాటినుండి ఐహికసుఖాలపై విరక్తిగలవారై ఘోరతపస్సు చేశారు. వారిలో వేదవతి శ్రీమన్నారాయణుని భర్తగా పొందింది. కాలాంతరంలో ఆమె జనకుని కుమార్తె సీతాదేవిగా అవతరించింది.

తులసి కూడా శ్రీహరిని గూర్చి ఘోర తపస్సు చేసింది. విధివశమున దుర్వాసమహర్షి శాపానికి గురిఅయి శంఖచూడుడనే రాక్షసుణ్ణి భర్తగా పొందింది. అటు పిమ్మట శ్రీహరిని భర్తగా పొందగలిగింది. ఆ తులసియే శ్రీహరి శాపంవలన తులసివృక్షంగా అవతరించింది. శ్రీహరి కూడా తులసీ శాపం చేత సాలగ్రామరూపాన్ని దాల్చాడు. అప్పుడా తులసి శిలావక్షమున నివసించింది. ఇందుమూలంగా నువ్వు తులసి చరిత్రనుకూడా తెలుసుకున్నావు. ఆమె ఈ వనంలో తపస్సు చేసింది. కాబట్టి దీనికాపేరు వచ్చింది. బృందావనం అన్నపేరు ప్రసిద్ధి చెందడానికిపై రెండు కారణాలు కాక మరో కారణంకూడా ప్రచారంలో ఉంది. రాధాదేవికిగల పదహారు పేర్లలో బృందావనీ అన్న నామం కూడా ఒకటి. ఈ రాధాదేవికి గల బృందావనీ నామాన్ని శ్రుతికూడా సమర్థిస్తోంది. ఆ రాధాదేవి క్రీడించిన వనం కావడంవలన బృందావనం అయింది. భూలోకంలో శ్రీకృష్ణుడు రాధాదేవిపైగల అనురాగంతో బృందావనాన్ని క్రీడా వనంగా నిర్మించాడు.

రాధాషోడసనామములు

రాధాదేవి సహస్రనామాలు సామవేదంలో చెప్పబడ్డాయి. మరి ఈ పదహారు నామాలు ఎక్కడనుంచి వచ్చాయన్న సందేహం కలుగవచ్చు. అవి ఇట్లా ఉన్నాయి. 1 రాధా, 2. రాజేశ్వరి, 3. రాసవాసిని, 4.రసికేశ్వరి, 5. కృష్ణవామాంగ సంభూత, 6 పరమానందరూపిణీ, 7.శ్రీ కృష్ణప్రియ 8.బృందావని, 9.బృందా, 10. బృందావనవినోదినీ,11.చంద్రావతీ, 12. చంద్రకాంతా,

13.శతచంద్రనిభాననా, 14.కృష్ణప్రాణాధిక, 15.కృష్ణప్రియ, 16.కృష్ణ స్వరూపిణి, ఈ పదహారు రాధాదేవికి అత్యంత ప్రియమైన నామాలు. ఇక అయానామాలలోని అంతారార్థాలను గ్రహిద్దాం.

1. రాధా :

రా కారం దానవాచకము. సహజంగా ముక్తిని ప్రసాదించేది కావున జగత్‌ప్రసిద్ధిచెందింది.

2. రాజేశ్వరీ :

రాచము అంటే విహార స్థలము దానికి అధిపతి శ్రీకృష్ణపరమాత్మ. ఆయనకు భార్య కావటంవలన రాజేశ్వరి అన్న నామము ప్రసిద్ధిచెందింది.

3.రసవాసినీ :

రాసమే రాధాదేవికి నివాస భూతమై రాసవాసినీ అన్నపేరుతో ప్రసిద్ధిచెందుతోంది.

4. రసికేశ్వరీ :

రసికలనగా గోకులంలో నివసిస్తూ భగవత్ప్రీతికిపాత్రులైన కాంతామణులు వారికథిపతి కాబట్టి రసికేశ్వరీ అయింది.

5. కృష్ణవామాంగ సంభూతా :

శ్రీకృష్ణుడే కృష్ణప్రాణాధిక" అని పిలిచాడు. అనగా శ్రీకృష్ణునకు అత్యంత ప్రియమైన ప్రియురాలు.

6. పరమానంద రూపిణీ :

ఇది సర్వదేవతలు వచించిన నామము.

7. కృష్ణా :

శ్రీకృష్ణ రూపాన్ని విలాసంగా ధరించు శక్తిగలది. అనగా సర్వాంశలచేత కృష్ణసదృశి. ఆవిధంగా రాధాదేవికి ఆనామం ప్రఖ్యాతి వహించింది.

8. బృందావనీ :

బృందావనాధి దేవతగా బృందావనిగా ప్రఖ్యాతి చెందింది.

9. బృందా :

ఎవరి విహారాల వలన బృందా నామంతో పిలువబడుతుందో ఆమె బృందావనీ అని పిలువబడుతోంది.

10. బృందావన వినోదినీ :

బృందావన విహారాలు రాధాదేవికి మిక్కిలి వినోదం కలిగిస్తాయి. కాబట్టి బృందావన వినోదినిగా ప్రసిద్ధి చెందింది.

11. చంద్రావతీ :

నఖచంద్ర సముదాయం, వక్త్రచంద్రుడు కలిగి ఉన్నందున రాధ చంద్రావతీ నామాన్ని పొందింది.

12. చంద్రకాంతా :

శ్రీకృష్ణ మహదానందంలో రాధను చంద్రకాంతా అని పిలిచేవాడు

13. శతచంద్రనిభాననా :

శరచ్చంద్ర కాంతి రాధ ముఖమున ఎల్లప్పుడూ కనిపిస్తూ ఉండేది. కాబట్టి మునివరులంతా శరశ్చంద్రప్రభాననా (శతచంద్రుని భావనా) అన్న నామము సార్థకమైంది.

14. కృష్ణ ప్రాణాధికా :

శ్రీకృష్ణుడే ఆమెనాపేరుతో పిలిచాడు. కాబట్టి ఆపేరామెకు సార్థకమైంది.

15. శ్రీకృష్ణ ప్రియ :

శ్రీకృష్ణుడే ప్రియుడిగా గలదికాన శ్రీకృష్ణ ప్రియగా ప్రసిద్ధిచెందింది.

16. కృష్ణస్వరూపిణీ :

పరమానందరాశియై తాను శరీరాన్ని ధరించింది కాబట్టి పరమానందరూపిణీ అన్న పేరు సార్థకమైంది. శ్రుతులు కూడా ఈ విషయాన్ని సమర్థించాయి.

ఈ నామపరంపర అంతా సంప్రదాయానుసారం లభించింది.

నారదుడు : ఓ పరమపురుషా ! నారాయణా ! దుర్లభమైన స్తోత్రాన్ని చెప్పి తరింపజేశావు. ఇక దయతో కవచాన్ని కూడా అనుగ్రహించు. తెల్లవారి లేవగానే ఆదివ్యనగరాన్ని చూసిన యాదవుల మనోభావాలు ఎట్లాఉన్నాయి? శ్రీకృష్ణలీలలు ఇంకా ఏమైనా ఉన్నాయా? అవికూడా చెప్పి తరింపజెయ్యి.

శ్రీమన్నారాయణుడు : నారదమునీ ! విశ్వకర్మ నగరనిర్మాణమంతా రాత్రికి రాత్రే పూర్తిచేసి తన పనివాళ్ళందర్నీ వెంట పెట్టుకొని వెళ్ళిపోయాడు. యాదవులంతా ఆదమరచి నిద్రపోయారేమో తెల్లవారి లేవగానే చూసి ఆశ్చర్యపోయారు. ఎవరినోట విన్నా ఇదేమాట. తెల్లవారేటప్పటికల్లా ఇంత పెద్ద నగరం ఎట్లా నిర్మించారు. ఇది నిజమా? కలా? లేక వైష్ణవమాయా? అని చిన్నాపెద్దా అంతా ఇదేమాట. నందుడికి మాత్రం గర్గమహర్షి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ఇది శ్రీకృష్ణునిలీల తప్ప మరొకటికాదని మనస్సులోనే నమస్కరించుకొన్నాడు. ఎవరిపాద పద్మాలను బ్రహ్మ, అనంతుడు, ధర్ముడు మొదలైన వారంతా ధ్యానిస్తూ ఉంటారో అటువంటి మహావిష్ణువుకు అసాధ్యమేముంటుంది? ఆ విరాట్పురుషుడే మాయా మానుష రూపధారియైన శ్రీకృష్ణుడని తలచాడు.

అంతట నందుడు నగరమంతా తిరిగి చూశాడు. ఒక్కొక్క ఇంటికి ఒక్కొక్కరి పేరు వ్రాసి ఉండటం చూసి పరమానంద భరితుడయ్యాడు. వారందర్నీ ఆయా గృహాల్లో ఉండమని చెప్పాడు. బృందావన వాసులంతా తమతమ ఇళ్ళలో ప్రవేశించి మనోహరములైన ఆ గృహాలను పరిశీలించి ఆనంద సాగరంలో మునిగిపోయారు. బాలబాలికలంతా ఆనందంతో గంతులువేశారు. బలరామకృష్ణులు పిల్లలందర్నీ తీసుకొని ఆటపాటలలో మునిగితేలారు. గోపికల క్రీడావిహారాలకు అనుకూలంగా బృందావనం మలచబడింది.

మనం రాధాదేవి మహిమను గూర్చి తెలుసుకున్నాం. ఆ దేవీ మంత్ర మాహాత్మ్యాన్ని తెలుసుకున్నాం. బృందావనానికి ఆ పేరు ఎట్లాసార్థకమైందో తెలుసుకున్నాం. తులసీదేవి చరిత్ర తెలుసుకున్నాం. బృందాదేవి కేదారమహారాజు పుత్రిక. బాల్యం నుండి దైవభక్తిగలదై, వైరాగ్యంకలిగి

యోగశాస్త్రవిశారద అయింది. ఘోరమైన తపస్సు చేసింది. శ్రీకృష్ణ పరబ్రహ్మ ప్రత్యక్షంకాగా, ఆ పరమాత్మనే భర్తవు కమ్మని కోరుకుంది. శ్రీహరి ఆమె కోరికను మన్నించి గోలోకానికి తీసుకొనిపోయాడని మనం తెలుసుకున్నాం.

విశేషార్థం: దీనినిబట్టి పూర్వకాలంలో కొందరు స్త్రీలు వివాహం చేసుకోకుండానే తపస్సుపై మనస్సు లగ్నంచేసుకొనేవారని తెలుస్తోంది. అట్లాగే ఇప్పుడు మాత్రం వివాహంచేసుకోకుండా ఉంటే తప్పేమిటని అడిగేవారుండవచ్చు. అయితే అవివాహితులుగా ఉంటూ తపస్సిద్ధిపొంది భగవత్సాక్షాత్కారం పొందనవారి పూర్వచరిత్రను, పూర్వ జన్మలసుకృతాలను తెలుసుకుంటే ఇటువంటి ప్రశ్నలు ఉదయించవు. అటువంటివారు ఈ శాస్త్ర నియమాలను పాటించాల్సిన అవసరం లేదు. అనగా, పూర్వజన్మల సుకృతఫలానుభవం వలన తపస్సుచేత జ్ఞానులై యోగాన్నభ్యసించి దృఢభక్తికలిగిన వారికి సామాన్యధర్మాన్ని పాటించాల్సిన పనిలేదు. అటువంటి వారిని ఆక్షేపించడంకన్నా పాపం మరొకటి ఉండదు. వేదాంతులమని, యోగులమని, జ్ఞానులమని, సర్వసంగపరిత్యాగులమని చెప్పుకుంటూ యోగాన్నిగూర్చి పొడిమాటలు ఉపన్యసిస్తూ ఉంటారు. నూటికి తొంభైతొమ్మిదిమంది భక్తిలేనివారే. వారి మనస్సంతా ధనాకర్షణపైనే ఉంటుంది. **శ్రీరామకృష్ణ పరమ హంస** ఇలా ఉపదేశించారు. "లౌకికుడికి జ్ఞానికి ఉన్నంత జ్ఞానంఉండవచ్చు. యోగిపడేటంత శ్రమపడొచ్చు, సన్యాసులకుండేంతటి త్యాగబుద్ధి ఉండవచ్చు. కానీ అవన్నీ ధనార్జనకొరకో, కీర్తి కాంక్షతోనో చేస్తే అతడి శ్రమ అంతా వ్యర్ధమే అవుతుంది. ఎందువల్లనంటే అతడి శక్తిసామర్థ్యాలన్నీ పెడత్రోవ పట్టిపోయాయి. అతడు పడేపాట్లన్నీ భగవంతుని కోసంకాకుండా ధనార్జనకోసమే వినియోగిస్తూ ఉంటాడు". భగవద్భక్తులకు భగవంతునిపై దృఢభక్తిఏర్పడాలి. కుచేలునివంటి హరిభక్తుడు, సక్తుప్రస్థుని వంటి నియమముడు, దుర్వాసునివంటి యోగి, వసిస్ఠునివంటి జ్ఞాని, దధీచివంటిదాత, కర్ణునివంటి పరోపకారి, హనుమంతుని వంటి సేవకుడు, భరత లక్ష్మణుల వంటి సోదర ప్రేమ, శ్రీరాముడు ధర్మరాజుల వంటి జేష్ట భ్రాతులు, రుక్మాంగదుని వంటి వ్రతపరాయణులు, అంబరీషుని వంటి హరిసేవకులు, సుగ్రీవునివంటి మిత్రుడు, విదురునివంటి మంత్రి, సూతునివంటి కథకుడు, శౌనకాదులవంటి శ్రోతలు, చంద్రమతివంటి పతివ్రత, వాల్మీకి వంటి కవి, శుకుని వంటి అవధూత, రావణునివంటి వేదవేత్త, అశ్వద్ధామ వంటి కృతజ్ఞుడు, యయాతి వంటి తండ్రి, సుమంత్రుని వంటి సారధి, గుహుని వంటి పక్షపాతి, అగస్త్యునివంటి శక్తిమంతుడు, జాంబవంతుని వంటి ధర్మ విశ్లేషకుడు, భీమునివంటి ధీరుడు, ఇటువంటి సద్గుణసంపత్తిగలవారు పూర్వకాలంలో ఎంతోమంది ఉండేవారు. పూర్వపు సదాచారాలన్నీ ఇప్పటివారికి ఆశ్చర్యంగానూ, శంకించదగినట్లుగాను అనిపిస్తాయి.

బృందా కన్య తపస్సు చేసినచోట పరమపవిత్రమైనది. ఎందువలన? శ్రీకృష్ణపరమాత్ముని పాదరేణువులు పడినచోటు. ఎవరి ఘనకీర్తి వారి మరణానంతరము కూడా ప్రఖ్యాతి కలిగిఉంటాయో అటువంటి వారి చరిత్రయే పరమ పవిత్రము. అటువంటి చరిత్రను మనం నిలుపుకోవాలి.

విప్ర పత్నులు

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 18వ అధ్యాయంనుండి గ్రహించబడింది.)

నారదుడు:- మహాత్మా! నారాయణా! శ్రీకృష్ణుని దివ్య చరిత్ర ఎంత విన్నా ఇంకా తృప్తి కలగడంలేదు. నాయందు దయతో ఇంకా ఏవైనా కృష్ణ కథల్ని చెప్పు. వినాలనిఉంది.

నారాయణుడు:- దేవర్షీ! భగవచ్చరిత్రమును, ఆ శ్రీహరితత్త్వాన్ని ఎవరికీ తెలియకుండా ఉంచాలనే శ్రీకృష్ణుడు అనుకున్నాడు. కానీ ఆ గోపబాలకులతో ఆటపాటల్లో మునిగితేలకపోతే వారికి తరించేమార్గం లేదు. వారంతా గోకులం నుండి వచ్చి శ్రీకృష్ణునితో విహరించేందుకే అవతరించారు. కావున వారి కోరిక తీరాలంటే వారితో ఆడుకోవాల్సిందే. ఆసందర్భంలో జరిగిన ఓకథ చెప్తాను విను.

ఒకానొకరోజున శ్రీకృష్ణబలదేవులు గోపబాలురతో కలసి గోవుల్ని తోలుకొని మధువనానికి వెళ్ళారు. ఆ వనం యమునా తీరంలో ఉంది. కొంతసేపు ఆటలాడుకున్న తర్వాత ఆబాలకులంతాపోయి శ్రీకృష్ణునితో "కృష్ణా ! మాకు బాగా ఆకలిగా ఉంది. ఈ ఆకలిబాధ తీరేమార్గం ఏదైనాచూడు" అని వేడుకున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు వారితో ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు : బాలకుల్లారా ! ఇక్కడకు సమీపంలోనే విప్రులు నన్ను గూర్చి యజ్ఞం చేస్తున్నారు. వారంతా ఆంగిరసులు. శ్రుతులందు ఆరితేరినవారు. నిస్పృహులు, విష్ణుభక్తులు, ముముక్షువులు కావున నన్ను ధ్యానించియే ఆయజ్ఞం చేస్తున్నారు. వారిని మాయ ఆవరించి ఉండటం వలన, నేను మాయామానుష విగ్రహుడనై ఇక్కడున్నానని వారు తెలుసుకోలేక పోతున్నారు. మీరు ఆ యజ్ఞవాటికకు పోయి కృష్ణుడికి ఆకలిగా ఉన్నదని, అన్నం పెట్టమని అడగండి. వారు యజ్ఞం చేస్తూ మిమ్మల్ని పట్టించుకోకపోతే వారి భార్యలనడగండి. వారు శిశువుల యెడల దయగలవారు. మీకు తప్పక అన్నం పెడ్తారు. వెళ్ళండి.

శ్రీకృష్ణుని మాటలు విని గోపబాలురంతా పరుగుపరుగున యజ్ఞం జరిగే చోటుకు వెళ్ళారు. బ్రాహ్మణోత్తములతో ఇలా అన్నారు. " విప్రవరులారా ! మాకు, కృష్ణుడికి ఆకలిగా ఉంది. అన్నంపెట్టి మాప్రాణాలు నిలపండి " అని వినయంగా వేడుకున్నారు. వాళ్ళమాటల్ని ఆ బ్రాహ్మణులు పట్టించుకోలేదు. విన్నాకొంతమంది విననట్లే ఊరుకున్నారు. ఆకలిబాధకు తట్టుకోలేక ఆబాలురంతా వంటశాలవైపు వెళ్ళారు. వారక్కడ విప్రపత్నుల్ని చూశారు. వారికి దగ్గరగా పోయి వినయంతో నమస్కరించి ఇలాఅన్నారు." తల్లులారా! మేము ఆకలి బాధను ఓర్వలేకుండా ఉన్నాం. మమ్మల్ని మీ పిల్లలుగా భావించండి. వెంటనే అన్నపెట్టి మా ఆకలిబాధను తీర్చండి ". అని వేడుకున్నారు. ఆ విప్రభార్యలంతా పిల్లలందర్నీ ఎంతో ప్రేమపూర్వకంగా చూస్తూ చిరునవ్వులతో ఇలాఅన్నారు.

విప్రపత్నులు : బాలకులారా ! మీరెవరు? మీమీపేర్లేమి? మీరు ఎవరు పంపగా వచ్చారు. మా వద్ద రుచికరమైన పదార్థాలు చాలా ఉన్నాయి. వాటన్నింటినీ మీరు కడుపునిండా తినవచ్చును.

గోపబాలకులు : తల్లులారా ! మేము శ్రీకృష్ణుడు పంపగా వచ్చాం. మాకు బాగా ఆకలేస్తోంది. శ్రీకృష్ణ బలరాములు కూడా బాగా ఆకలితో ఉన్నారు. అలసిపోయి ఉండటం వలన ఇక్కడకు దగ్గర్లోనే ఓ చెట్టునీడన విశ్రాంతి తీసుకుంటున్నారు. మీరు దయతలచి అన్నంపెడితే మేము వెంటనేవెళ్ళి శ్రీకృష్ణుని ఆకలి తీర్చాలి. తల్లులారా ఆలస్యం చెయ్యకుండా అన్నంపెట్టండి.

గోపబాలకుల మాటలు విన్న విప్రపత్నులు సంభ్రమాశ్చర్యాలతో నోటమాట పెగల్లేదు. కొన్నిక్షణాల్లో తేరుకొని ఇలా అన్నారు.

విప్రపత్నులు : బాలకులారా ! ఏమిటి మీరు మాట్లాడుతుంది? శ్రీకృష్ణ బలరాములు ఈ సమీప వనంలో ఉన్నారా? ఆకలితో ఉన్నారా? అన్నంతెమ్మని మిమ్మల్ని పంపారా? మీమాటలన్నీ నిజమేనా? ఇదిగో మేమంతా పాయసం, రుచికరమైన పిండివంటలు, చిక్కటిపెరుగు, పాలు, నెయ్యి, తేనె, అన్నం తీసుకొని మీవెంటనే వస్తున్నాం. పదండి.

ఈ విధంగా విప్రపత్నులంతా తమజన్మ ధన్యమైనదని భావించి ఆబాలుర వెంట బయలుదేరి వెళ్ళారు. శ్రీకృష్ణపరమాత్మను దర్శించినంత మాత్రానే వారికోరికలన్నీ నెరవేరుతాయని వారి దృఢవిశ్వాసం. ఆ విప్రభార్యలంతా పదార్థాలన్నీ తీసుకొని పరుగుపరుగున పోగా శ్రీకృష్ణుడో వటవృక్ష చ్ఛాయలో పున్నమి చంద్రునివలె ప్రకాశించాడు. ఆయన చుట్టూ ఉన్న గోపబాలకులంతా నక్షత్రాల్లా వెలిగిపోతూ కనిపించారు. పరమేశ్వరుని కన్నులారాచూడగలిగామని తమ జన్మ ధన్యమైందన్న సంతృప్తితో ఆ సాధ్వీమణులందరూ శ్రీకృష్ణునికి నమస్కరించారు. తమ యోగ్యతకు తగిన రీతిలో ఈ విధంగా స్తుతించారు.

విప్రపత్నుల స్తోత్రం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 18వ అధ్యాయంనుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణా ! నీవే పరబ్రహ్మము. పరమపదమన్ననీవే, నిరీహుడవు, నిరహంకృతివి, నిర్గుణుండవు, సాకారుడవు, సగుణుడవు, సాక్షీరూపుడవు, నిర్లిప్తుడవు, పరమాత్మవు, నిరాకారుడవు, ప్రకృతివి, పరమపురుషుడవు, సమస్త కారణాలునీవే. బ్రహ్మవిష్ణుమహేశ్వరులు తద్వంశలూ నీవే, ఓ ఈశ్వరా ! సకల బ్రహ్మాండాలు నీకుక్షిలో ఉంటాయి. తేజస్సు తేజస్వి రెండూనువ్వే. జ్ఞానము, జ్ఞాని, తత్పరుడవు నీవే. వేదమందు అనిర్వచనీయుడవు. నిన్నెవరు వినుతించగలరు? మహదాది సృష్టి సూత్రములు నీ అధీనం. సర్వశక్తి బీజ స్వరూపుడవు. సర్వశక్తీశ్వరుడవు పర్వశక్త్యాశ్రయుడవు. నీవు స్వయం జ్యోతివి. ఆనంద స్వరూపుడవు. సనాతుడవు. మహాపురుషా ! ఆకారాలన్నీ నీవే అయినాకూడా నువ్వు నిరాకారుడవు. ఇంద్రియాలన్నీ నీ అధీనంలో ఉంటాయి కానీ నీకు ఇంద్రియాలే లేవు. నిన్ను స్తుతించడం మూలంగా సరస్వతీదేవి జడస్వరూపి అయింది. మహేశ్వరుడు జడీభూతుడయ్యాడు. శేషుడు, ధర్ముడు, విధిభూతుడయ్యారు. పార్వతీ, రమాదేవి, రాధ, వేదమాత మొదలైన వారంతా జడీభూతులయ్యారు. అటువంటి నిన్ను స్తుతించేందుకు పండితులే ఆశక్తులైతే ఇక అబలలం మేమెంతటి వారం? ప్రాణేశ్వరా ! మాకు ప్రసన్నుడవు కమ్ము. దీనబంధూ, మాయెడల కృపచూపించు.

శ్రీకృష్ణుడు : సాధ్వీమణులారా ! మీభక్తి నాకు సంతోషాన్ని కలిగించింది. మీకు ప్రియమైన వరాన్ని కోరుకోండి.

విప్రభార్యలు : శ్రీకృష్ణా ! మాకు వరాలేవీవద్దు. నీ పాదాలను సేవించే అదృష్టంచాలు. నీకు దాస్యం చేసుకొనే భాగ్యం కలిగించు. అందువల్ల ప్రతిరోజూ నీముఖారవిందాన్ని దర్శించుకునే భాగ్యం కలుగుతుంది. నువ్వు మాకావరం ఇచ్చేవరకూ మేము ఇంటికి వెళ్ళం.

శ్రీకృష్ణుడు : అట్లే అగుగాక ! అన్నాడు. భక్తితో వారు తెచ్చిన మధురమైన భక్ష్యాలన్నీ గోపబాలురకు పంచి, తానుకూడా ప్రీతితో భుజించాడు. ఇంతలో బంగారు రథం రావడం ఆ సాధ్వీమణులంతా చూశారు. అందులోనుండి విష్ణుపార్షదులు దిగి శ్రీకృష్ణునికి సమస్కరించారు.

విష్ణుపార్షదులు : తల్లులారా ! విప్రపత్నులారా ! రండి రథంపై కూర్చోండి. మిమ్మల్ని గోలోకం తీసుకుపొమ్మని ప్రభువులసంకల్పం అయింది.

అంతట ఆ విప్రపత్నులంతా శ్రీకృష్ణునికి నమస్కరించి గోలోకానికి వెళ్ళారు. వారు రథం ఎక్కగానే వారి మానవదేహాలు అదృశ్యమై గోపీ దేహధారులయ్యారు.

అంతట శ్రీకృష్ణుడు వారిఛాయలను విష్ణుమాయచే కప్పి వారి భర్తల వద్దకు వెళ్ళేందుకు అనుమతించాడు. ఇంతలో విప్రులంతా తమ భార్యలు కనబడక పోవడం వలన వారికోసం వెదుకుతూ ఉండగా విప్రభార్యలు వారికి ఎదురు పడ్డారు. తమ భార్యలను చూసిన విప్రుల ఆనందానికి అవధుల్లేవు. ఎక్కడకు పోయారని ఎంతో ఆర్తితో అడిగారు. విప్రపత్నులంతా వినయంతో భర్తలకు నమస్కరించి జరిగిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పారు. పరమానంద భరితులైన ఆ విప్రులు ఇలా అన్నారు.

విప్రులు : పతివ్రతలారా ! మీరు ధన్యులు. మీకు భగవద్దర్శనం కలిగింది. మా బ్రతుకులే వ్యర్థం అయ్యాయి. మావేదపఠనం నిష్ఫలమేగదా. తపము, జపము, వ్రతము, దానము, జ్ఞానము, వేదాధ్యయనము, అర్చనము, తీర్థస్నానము, మొదలైన వాటన్నింటికీ ఫలప్రదాత ఈశ్వరుడు. శ్రీకృష్ణ దర్శనం అయినవానికి ఈ తపఃఫలాలతో పని ఏముంటుంది. కల్పవృక్షమే తనవద్ద ఉన్నప్పుడు ఇతర వృక్షాలను కోరుకుంటారా? సముద్రాన్నే దాటగలవానికి పంటకాలువ ఓ లెక్కా?

అని తమ భార్యల అదృష్టాన్ని వేనోళ్ళకొనియాడుచూ వారితో కలసి జీవించారు. అయితే వారిలో ఒక్కరుగూడా తమ్ముమాయ ఆవరించిందని తెలుసుకోలేక పోయారు. వారిని తమ నిజభార్యలుగానే స్వీకరించి జీవించారు.

నారాయణుడు : ఓ నారదమునీ ! శ్రీకృష్ణుని లీలలో ఇదొకటి.

నారదుడు : మహానుభావా! విప్రపత్నులకు ఇంతటి అదృష్టం ఎట్లా కలిగింది? ఇందుకు పూర్వజన్మలలో వారు చేసిన పుణ్యకర్మలు ఎటువంటివి? అంతటి పవిత్రమూర్తులు భూలోకంలో ఎందువల్ల జన్మించారు? వారు చేసిన పారకర్మం ఎట్లాంటిది?

విప్రపత్నుల పూర్వ వృత్తాంతం

నారాయణుడు : నారదా ! పూర్వం సప్తర్షుల భార్యలు జగదేక సుందరీమణులుగా ఉండేవారు. వారి అందచందాలను చూసిన మహర్షులే మోహితులయ్యేవారు. ఒకానొక సమయంలో అగ్నిదేవుడు మదన పీడితుడై మహర్షుల భార్యల్ని కామించాడు. హోమం చేసేందుకు వారు అగ్నికుండం దగ్గరకు రాగా, అగ్ని తన జ్వాలలచే వారిని తాకుతూ కామపరవశుడయ్యేవాడు. ఇట్లా కొంతకాలం జరిగింది. ఒకనాడు అంగీరసుడనే మహర్షి అగ్ని హోత్రుని మనోభావాన్ని పసిగట్టాడు. అగ్నిహోత్రునితో ఇలా అన్నాడు.

అంగీరసుడు : హవ్యవాహనా ! సిగ్గులేకుండా అకార్యంచేశావు. అందుకు ఫలంగా నువ్వు సర్వభక్షడవు కమ్ము. ఓ మునిపత్నులారా ! మీరు తెలిసి చెయ్యక పోయినా, మీపాతివ్రత్యానికి మచ్చఏర్పడింది. కావున మీరంతా భూలోకంలో మానవులుగా జన్మించండి. మంచి కులంలో జన్మిస్తారు. సచ్ఛీలురైన బ్రాహ్మణులే మిమ్మల్ని పెండ్లాడుతారు.

మహర్షి శాపం విన్న ముని పత్నులంతా విలపించారు. చేతులు జోడించి మహర్షికి నమస్కరించారు.

మునిపత్నులు : మునివర్యా ! మేము ఏ పాపము ఎరుగం. భక్తుల్ని, సేవకుల్ని శిక్షించకూడదు. మహాత్మా ! మళ్ళీ మీపాదసేవ చేసుకొనే భాగ్యం ఎన్నటికి కలుగుతుంది? పతివ్రతలకు భర్త నుండి దూరం చెయ్యడంకన్నా కత్తితో పొడిచి చంపడమే మేలుగదా. భర్తృవియోగాన్ని భరించలేం, బ్రహ్మవేత్తలు, గుణవంతులు, మహాత్ములు,మహర్షులు అయిన మీ తేజస్సుకు దూరమై భూలోకంలో బ్రతకలేం. మళ్ళీ ఇక్కడకు ఎప్పుడు ఏ తీరున చేరుకోగలమో ఆశాప విమోచనాన్ని కూడా ప్రసాదించు. పూర్వం ఇంద్రుని మోసానికి గురి అయిన అహల్య కూడా పరిశుద్ధురాలైంది. తెలియక అగ్నిచే తాకబడటం వలన మేము శాపానికి గురి అయ్యాం. నువ్వు వేద వేదాంగ పారంగతుడవు, ధర్మిష్ఠుడవు, విశ్వకర్మ పుత్రుడవు, నీకు తెలియని ధర్మాధర్మాలు లేవు. ఇతరులువల్ల భయం ఏర్పడితే భర్తను శరణుకోర్తాం. భర్తే ఈవిధంగా భయపెడ్తూంటే ఇంకా మాకు దిక్కెవరు? ధర్మాత్మా! మా భయాన్నిపోగోట్టి అభయాన్నివ్వు. శిష్యునికి, పుత్రునికి, భార్యకు దండన విధించవచ్చునా? ప్రబలుడైనా, దుర్బలుడైనా తన వస్తువులకు అధిపతి కదా. తాము అనుభవించాల్సిన వస్తువుల్ని ఎవరైనా అమ్ముకొనే అధికారం ఉండదుకదా!

మునిపత్నులంతా కన్నీరు మున్నీరుగా విలపించటం చూచిన అంగీరసుని మనస్సు ద్రవించింది. ఆ దుఃఖంతో మూర్ఛపోయాడు. వేదవేదాంగములనెరిగినవాడు, జ్ఞానులలోనూ, యోగులలోను ఉత్తముడైన అతడు మిగిలిన మహర్షులతో ఆలోచించి ఇలా అన్నాడు.

అంగీరసుడు : పతివ్రతలారా నేను చెప్పేమాటలు జాగ్రత్తగా వినండి ఇవి సత్యమైన మాటలు. స్వకర్మ పరిభోగము శ్రుతిసిద్ధము. అది మరో కర్మ ఆచరించేంతవరకే ఉంటుంది. కాబట్టి శాపాన్ని మరల్చడం అసంభవం. ఆ సమయం మించిపోయింది. శుభాశుభకర్మలు భూలోకంలో అనుభవించక

తప్పదు. పరుల భార్యను ఏ అధముడు కోరుకుంటాడో వాడు కాలసూత్ర నరకంలో సూర్యచంద్రులున్నంతవరకు ఉంటాడు. అట్టి స్త్రీ చేతివంట దైవకార్యానికిగాని, పితృకార్యానికిగాని పనికిరాదు. అట్టి స్త్రీని ఆలింగనం చేసుకున్నా కూడా ఆ భర్త సంపదలన్ని పోగొట్టుకొన్నవాడగుతాడు. అటువంటివాడు సమర్పించేహవ్యములను దేవతలు, పితృదేవతలు స్వీకరించరు. ఏవిధంగానూ సుఖపడలేరని బ్రహ్మ శాసించాడు. కావున భర్త తప్పనిసరిగా భార్యను రక్షించుకోవాలి. అట్లా రక్షించుకోలేని భర్త పాపాత్ముడవుతాడు. నరకాన్ని అనుభవిస్తాడు. కావున భార్యను, హవ్యములుండే పాత్రలను ఎంతో జాగ్రత్తతో రక్షించుకోవాలి. పరపురుష స్పర్శతో స్త్రీ అపవిత్రురాలవుతుంది. భర్త స్పర్శచేత పవిత్రురాలవుతుంది. ఏ స్త్రీ తన భర్తను వద్దని పరపురుషుని పొందు కోరుకుంటుందో ఆ స్త్రీ కుంభీపాకమనే నరకాన్ని పొందుతుంది. పరుల భార్యను ఏ అధముడు కోరుకుంటాడో వాడు కాలసూత్ర నరకములో సూర్యచంద్రులున్నంతకాలం పడివుంటాడు.

కాంతామణులారా ! మీరు పోయి భూలోకంలో బ్రాహ్మణ పత్నులుగా జన్మించండి. మీకు ఏనాడైతే శ్రీకృష్ణుని దర్శన భాగ్యం కలుగుతుందో ఆనాడే గోలోకానికి పోగలరు. విష్ణుమాయచేత మీ ఛాయలు మాత్రం ఆయా విప్రులభార్యలుగా ఉంటారు. మీరు మాత్రం శాశ్వతంగా గోలోకానికి చేరి మాకు భార్యలుకాగలరు. ఇది సత్యము. అంతేకాదు నా శాపం వలన మీకు శ్రీకృష్ణుని సేవించుకునే భాగ్యం కలుగుతుంది. కావున నా శాపమే మీ పాలిట వరమని తెలుసుకోండి.

శ్రీమన్నారాయణుడు : నారదా ! అటుపిమ్మట ఆ ఋషిపత్నులంతా భూలోకంలో విప్రపత్నులుగా జన్మించారు. శ్రీకృష్ణునికి భక్తితో తీసుకెళ్ళిన ఆహారాన్నంతా నివేదించి ఉపచారాలు చేశారు. దాంతో వారంతా హరివాసానికి పోగా, విష్ణుమాయచేత వారి ఛాయలు విప్రులవద్దకు వెళ్ళారు.

నారదా ! నువ్వుకోరినట్లుగా మరో శ్రీకృష్ణలీలను చెప్పాను. శ్రీహరి చరితం ఎప్పుడువిన్నా క్రొత్తగానే ఉంటుంది. వినే వాళ్ళకు విసుగనిపించదు. నేను నాగురువుల నుండి ఏపాటి తెలుసుకున్నానో అదంతా నీకు చెప్పాను.

విశేషార్థము : ఈ వృత్తాంతం నుండి తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. వాటిని విమర్శించుకుందాం. ఎవరి కర్మ పరిపక్వమవుతుందో వారికి మాత్రమే జ్ఞానోదయం అవుతుంది. విప్రులు యజ్ఞం చెయ్యడం వరకే గాని, ఆజన్మవారికి చివరిదికాదు. అందువల్లనే వారు సత్కర్మానుష్టానానికి పూనుకున్నారు. అయితే వారు బాలకుల ఆకలిని శ్రీకృష్ణలీలగా గుర్తించలేకపోయారు. పరిపక్వం కాని వారి మనస్సు ఏది ఉత్కృష్టమైన కర్మయో, ఏదికాదో తెలుసుకోలేకపోయింది. శ్రీకృష్ణ సందేశాన్ని గుర్తించలేక పోయారు. బాలుర ఆకలితీర్చే ప్రయత్నం చెయ్యలేదు.

అదే విప్రపత్నులు ముక్తి పథానికి చేరువలో ఉన్నారు. అందుచేతనే "ఆకలిగా ఉంది, అన్నంపెట్టండి, మమ్మల్ని శ్రీకృష్ణుడు పంపాడు" అని అనగానే, భర్తలకు మాటమాత్రంగానైనా చెప్పకుండా అన్నం తీసుకొని పోయి భగవద్దర్శనం చేసుకున్నారు; ముక్తిని పొందారు. విప్రులెవ్వరూ దగ్గర్లోనే ఉన్న భగవంతుని తెలుసుకోలేక పోయారు. భగవంతుడు పంపిన పిలుపు అందుకోలేకపోయారు. భగవంతుడు ఏలోకానో ఉన్నాడనుకుంటూ యజ్ఞయాగాది కర్మల్లో తలమునకలై ఉన్నారు. కావుననే

వారు పరిపక్వజీవులు కాలేకపోయారు. అంతేకాకుండా వారి దృష్టిలో తారతమ్యాలు అడ్డుగోడలుగా నిలచాయి. జ్ఞాన నిష్ఠుడైన వాని మనస్సు ఎల్లప్పుడూ సమత్వం కలిగి ఉంటుంది. అది నీటిపైభాగంవలె సమత్వం కలిగి ఉంటుంది. నీటి ఉపరితలంపై ఎత్తు పల్లాలుండవుగదా. విప్రపత్నులంతా నిమిత్తం దొరకగానే అంది పుచ్చుకొని ముక్తులయ్యారు. పరిపక్వం పొందని మనస్కులైన విప్రులు నిమిత్తం ఎదురైనా తెలుసుకోలేక మూఢులుగా మిగిలి పోయారు. శ్రీరామకృష్ణ పరమహంస ఇలా బోధించారు. "అజ్ఞానులు భగవంతుడు ఎక్కడో దూరాన స్వర్గంలో ఉన్నాడని అనుకుంటారు. అదే జ్ఞానిఅయితే భగవంతుడు తన హృదయంలోనే ఉన్నాడని తెలుసుకుంటాడు. భగవదన్వేషకుడు ముందుగా తనలోనే దర్శిస్తాడు."

ముని పత్నులు పతివ్రతలు కదా? భర్తలకు చెప్పకుండా అన్నంతీసుకొని వెళ్ళవచ్చునా? యజ్ఞం చేసేవారి భార్యలకు కూడా యజ్ఞదీక్ష ఉంటుంది కదా. మరి బయటి ప్రదేశాలకెట్లావెళ్ళారు? అని అడిగేవారుంటారు. వినండి, సామాన్యంగా మునులు చేసేవన్నీ సత్రయాగాలు. అవి దేవయజ్ఞాలు కావు. తపోధనులైన మునీశ్వరులకు స్వల్ప నియమాలుండవు. వారికి సత్యమే ప్రధానం. సత్యాన్ని వదలనంతవరకు ఏయజ్ఞాలు వారికి కర్తవ్యాలు కావు. అంతేకాదు మహర్షులు ధర్మాలు ఆచరిస్తారేగాని, ఫలాన్నాసించరు. లోకోపకారం చెయ్యాలని సంకల్పించినప్పుడల్లా దీర్ఘసత్రయాగాన్ని తలపెడ్తారు. పురాణాలన్నీ ఆ సమయాల్లో చెప్పుకునేవే, వారప్పుడు మానవ ధర్మాల్ని, భగవద్భక్తిని బోధిస్తారు. నీతి ప్రధాన బోధకమవుతుంది. వారు ప్రవచించే ఆమాటలే శాస్త్రాలవుతాయి. కావున మహర్షులు చేసే ఈ యజ్ఞాల్లో మనం ఊహించుకొనే నియమాలుండవు. అటువంటి యజ్ఞాల్లో వారి పత్నులకు కూడా యజ్ఞదీక్షలంటూ ఉండవు. యథావిధిగా దిన కృత్యాలు చేసుకున్నట్లే హోమకాలంలో కూడా సంసిద్ధులై ఉంటారు.

లోకంలో కొన్ని సామాన్య నియమాలు, కొన్ని విశేషవిధులు ఉంటాయి. విశేష విధుల్లేని సామాన్యశాస్త్రం ప్రపంచంలో ఎక్కడా ఉండదు. కేవలం పరిపక్వచిత్తం కలిగి దర్శన మాత్రం చేతనే ముక్తిని పొందే జీవుల విషయంలో సామాన్యశాస్త్రం అన్వయించలేము. లోకం దృష్టిలో విప్రపత్నుల కార్యం తప్పుగా అనిపించవచ్చు. కానీ విశేష దృష్టితో చూసినప్పుడు అందులో దోషమేమీ కనిపించదు. ఈ క్రింది ఉదాహరణలను పరిశీలించి చూడండి.

ప్రహ్లాదుడు తండ్రిమాట మీరడం; శ్రీరాముడు తల్లిమాటను మన్నించకపోవడం; విభీషణుడు పితృసమోజ్యేష్ఠః " అన్న ధర్మాన్ని కాలదన్నడం, నలుడు కట్టుకున్న భార్యను నట్టడవిలో వదిలేసిపోవడం, విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అయికూడా హరిశ్చంద్రునిచే అసత్యం చెప్పిస్తానని శపథం చెయ్యడం కర్ణుడు మహాసంగ్రామంలో ధర్మ, భీమ, నకుల, సహదేవుల్ని చంపకుండా వదిలేయడం; భరతుడు తల్లిని తూలనాడటం; శ్రీకృష్ణుడంతటివాడు చక్రాన్నడ్డుపెట్టి అర్జునుని చేత సైంధవుణ్ణి చంపించడం, పరాశరుడంతటి మహాతపశ్శాలి ఉదయాన్నే మత్స్యగంధిలో సంగమించడం మొదలైనవన్నీ విశేషవిధుల క్రిందేవస్తాయి. సామాన్యశాస్త్రాలు వారికి వర్తించవు.

భర్త అనుమతి లేకుండా వెళ్ళడం తప్పే. భర్త అంటే దైవంతో సమానుడుగదా ! అని అనవచ్చు.

పతియే దైవం అని అంటే, ఉపాస్యదేవత యందు ఎటువంటి భక్తి విశ్వాసాలుంటాయో భర్తయెడలకూడా అటువంటి భక్తి విశ్వాసాలుండాలన్నదే సారంగానీ, భర్తను దేవతలా విగ్రహాలప్రక్కన కూర్చోబెట్టి పూజించాలనికాదు. అట్లాగే పతిని తప్ప భగవంతుణ్ణి ఉపాసించరాదన్న అర్థాన్ని చెప్పరాదు.

" సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ "

అన్నసూక్తి విప్రపత్నుల వంటి నారీమణులకు ప్రమాణమవుతుంది. అటువంటి వారే పునరావృత్తి లేకుండా శాశ్వత పరమపదాన్ని పొందుతారు. కావున సందర్భానుసారం సామాన్య శాస్త్రాల్ని చూడకుండా విశేషవిధులనే గ్రహించాలి. సామాన్య ధర్మాలు ఎంతకాలం ఆచరించినా ముక్తినివ్వలేవు. కానీ విశేష విధుల్ని పాటించిన వారు ముక్తికి అర్హులవుతారు.

అఘాసుర వధ

(ఈ భాగం శ్రీ భాగవతం దశమస్కందం 12వ అధ్యాయమునుండి గ్రహించబడింది)

ఒకానొక రోజున బలరామ కృష్ణులు ఆలమందల్ని తోలుకొని అడవికి వెళ్ళారు. ఆరోజున గోపబాలురతో కలసి దాగుడుమూతలాట ఆడాలనుకున్నారు. శ్రీకృష్ణుడు ఒక్కడూఎవ్వరికీ కనపడకుండా దాక్కోవాలని మిగిలినవారంతా వెతికి పట్టుకోవాలని, పట్టుకున్నవాడు జయించినట్లని నియమాలు పెట్టుకొన్నారు.

ఆ ప్రకారం శ్రీకృష్ణుడు వాళ్ళకు కనపడకుండా పోయి ఎక్కడ దాక్కున్నాడో బాలురంతా ఆయనను వెతికేందుకు నాలుగుమూలలా పరుగులుతీశారు. ఈ ఘట్టం మూలంలో ఇలా ఉంది.

యత్పాదపాంసు ర్బహుజన్మకృచ్ఛ్రం ధృతాత్మభి ర్యోగిభి రప్యలభ్య:
సఏవ యద్దృగ్విషయే స్వయంస్థితి: కింవర్ణ్యతే దిష్ట మహో వ్రజౌకసామ్.

దీనికి మహాకవి పోతనగారు,

ఉ ॥ *ఎన్నఁడునైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయుం,*
గన్నులఁ గానరట్టి హరిఁ గౌఁగిటఁ జేర్చుచుఁ జెట్టఁ బట్టుచుం,
దన్నుచు గ్రుద్దుచున్ నగుచుఁ దద్దయుఁ బైఁ బడి కూడియా డుచున్,
మన్ననసేయు వల్లవ కుమారుల భాగ్యము లింతయొప్పునే.

అని వ్రాయడమే కాకుండా,

క ॥ *విందులకును బ్రహ్మసుఖా నందంబై భక్తగణమునకు దైవతమై*
మందులకు బాలుఁడగు హరి పొందుఁ గనిరి గొల్ల లిట్టి పుణ్యులు గలరే

అని వ్రాశారు. ఇక్కడ మొదటి పద్యంలోని రెండు మూడు పాదాలను మూలంలో ఉండే "యద్దృగ్విషయే స్వయస్థితః " అన్నదానికి ఆంధ్రీకరణం. ఇక్కడ పోతనగారి వైదుష్యానికి లోకజ్ఞానాన్ని మెచ్చని వారుండరు. మహాపండితులు కూడ శిరసా వహించదగినది. భక్తి రసాన్ని గూర్చి చెప్పాల్సివస్తే పోతనగారికే అగ్రతాంబూలం ఇవ్వాలి. శాస్త్రాలు తెలియని పామరులకు కూడా భక్తితత్వాన్ని బోధించ

గలదిట్టవు. మహాత్మా ! నీజన్మ ధన్యము. ఇక రెండవ పద్యానికి వస్తే అది పూర్తగా పెంచివ్రాసిందే. అయితే అందులోని భావమంతా ఉపనిషత్సారమే. ఆహా ! పోతనగారు ఎంతటి పుణ్యాత్ముడోగదా.

ఆ విధంగా బాలురంతా తలోమూల శ్రీకృష్ణుడికోసం వెదుకుతున్నారు. శ్రీకృష్ణుడు పుట్టినప్పటి నుండి ఎన్నో మహాద్భుతాలు చేస్తూనేఉన్నాడు. అయితే ఎప్పటికప్పుడు వైష్ణవమాయ వాళ్ళందర్నీ కప్పేస్తూనే ఉంది. అందువల్లనే వారు శ్రీకృష్ణుణ్ణి తమతోటి బాలుడిగానే చూస్తున్నారేగాని భగవంతుడని గుర్తించలేక పోతున్నారు. వైష్ణవమాయ అంటే ప్రకృతి. వైష్ణవమంటే చరాచర బ్రహ్మాండాలన్నింటినీ నడిపించే శక్తి. కాబట్టి ప్రకృతి చేసే చిత్రాలను ఎవడు తెలుసుకోగలడు? ఈ విషయాన్ని శ్రీ శంకర భగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలో

శ్లో ॥ *తనీయాంసం పాంసుం తవచరణ పంకేరుహభవం*
విరించిస్సంచిన్వన్ విరచయతి లోకానవికలమ్,
వహత్యేనం శౌరిః కథమపి సహ స్రేణ శిరసాం
హరస్సంక్షు ద్యైనం భజతి భసితోద్ధూళన విధిమ్.
త్వదన్యః పాణిభ్యా మభయ వరదో దైవతగణ
స్త్వమే కానైవాసి ప్రకటితపరాభీత్యభినయా,
భయా త్రాతుం దాతుం ఫలమపి చ వాంఛాసమధికం
శరణ్యే లోకానాం తవహి చరణావేవని పుణౌ.

మహాత్ములంతా ఈ విధంగా వివరించి చెప్తూ ఉండగా, మేమంతా ప్రకృతికి అతీతులం, బ్రహ్మమునే ఉపాసిస్తాం అని కొందరు అంటూ ఉంటారు. ఎందువలన? ప్రకృతి అంటే శక్తి అని వారి భావన. పార్వతిని ఉపాసించడం అంటే శాక్తమని వారి అభిప్రాయం. త్రిమూర్తులతో సహా నామరూపాలు కలిగినవారంతా శాక్తులేనని వారు గ్రహిస్తే ఎటువంటి శంకలూ ఉండవు. భగవంతుని నోటిలో సకలబ్రహ్మాండాలను చూపించి తల్లిని ఆశ్చర్యచకితురాల్ని చేసి అంతలోనే వైష్ణవమాయ చేత కప్పి వేయగా యశోద అంతామరచి తన పుత్రుడనే అనుకుంది. మాయాశక్తి ఎట్లాంటిదో తెలుసుకోవడానికి ఈ ఒక్క ఉదంతం చాలదా? అటువంటి ప్రకృతిని అతిక్రమిస్తాననడం వెర్రితనం కాదా?

బాలకులంతా కలసి శ్రీకృష్ణునితో సంతోషంగా ఆడుకుంటున్నారు. ఆవనంలోనే మహాబలవంతుడు, మహాక్రూరుడు, సకల భూతాలను పీడిస్తున్నవాడు అయిన ఓ భయంకర రాక్షసుడు ప్రవేశించాడు. దేవతలంతా అతడి చావుకోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు. ముందు శ్రీకృష్ణుని చంపడానికి ప్రయత్నించి భంగపడ్డ పూతన, బకాసురుల సోదరుడీతడు. వీనిపేరు అఘాసురుడు. వీడు సహజంగానే క్రూరుడు. తనసోదరుణ్ణి, సోదరిని పొట్టన పెట్టుకున్న ఈ శ్రీకృష్ణుణ్ణి విడిచిపెట్టకూడదని క్రూరత్వాన్ని ఇంకా పెంచుకున్నాడు. శ్రీకృష్ణుడు ఆడుకుంటున్న వనానికి చేరుకుని శరీరాన్ని విపరీతంగా పెంచేశాడు. శ్రీకృష్ణుణ్ణి చంపేసి తన పగ తీర్చుకునే సమయం వచ్చిందిగదా అని తెగ సంతోషపడిపోయాడు. ఆ అఘాసురునకు కొండచిలువ ఆకారమంటే ఇష్టం. అందుకని

పెద్దకొండచిలువ ఆకారాన్ని ధరించాడు. దాని పొడవు ఒక యోజనం మేర విస్తరించింది. దాని ఎత్తు ఓ పర్వతమంత ఉంది. నోరు, తెరచిన ఓ పెద్ద గుహఅంత ఉంది. కోరలు వాడిగాను భయంకరంగాను ఉన్నాయి. దాని నిట్టూర్పులకు ప్రక్కనుండే పెద్దపెద్ద కొండలు కంపించేవి. ఆ పన్నగానికి చిక్కి బ్రతికి బయట పడ్డవాళ్ళులేరు. నోట్లోనుండి వెలువడే విషపుగాలుల తాపానికి దూరాన ఉండే జంతువులు కూడా చనిపోయేవి. అటువంటి అఘాసురుడు శ్రీకృష్ణుని, గోపబాలుల్ని మట్టుబెట్టి తన ప్రభువైన కంసుడికి సంతోషాన్ని చేకూర్చాలనుకున్నాడు.

క్రూరాత్ముడైన అఘాసురుడు శ్రీకృష్ణుడు, గోపబాలురువచ్చే దారిలో నోరు తెరుచుకొని త్రోవకడ్డంగా పడుకున్నాడు. అయితే ఆ గోపబాలురంతా దూరాన్నించే పర్వతాకారంలో ఉన్న కొండచిలువను చూశారు. భయంతో దీన్ని దాటుకుంటూ ఎట్లా వెళ్ళడమా అని భయపడ్డారు. కొందరైతే ధైర్యం చేసి " ముందుకు పోదాం, ఏదైనా ప్రమాదం ఎదురైతే కృష్ణుణ్ణి శరణువేడుకుందాం " అని ముందుకు పోయారు. వారిలో కొందరు అదో కొండగుహ అనుకున్నారు. వారు లోపలకు ప్రవేశించిన కొద్దీ ఆ అఘాసురుడు నోటిని పొట్టను విపరీతంగా పెంచేస్తున్నాడు. కొందరు బాలకులు ముందుపోయే గోపబాలకుల్ని, గోవత్సాలను చూస్తూ నిలబడ్డారు. ఇంతలో ఆ గోవత్సాలన్నీ ఏదో ప్రమాదంలో చిక్కుకున్నట్లుగా అంబారాలు చేశాయి. దాంతో వారి మనస్సులు మరీ వికలమైపోయాయి. దూడలు కనబడక పోతే తల్లులు తట్టుకోలేవని మిగిలిన గోవత్సలను కాపాడాలనుకున్నారు.

బాలురంతా తన్నే నమ్ముకొని పోతున్న గోపబాలకుల్ని గోవత్సాల్ని శ్రీకృష్ణుడు చూశాడు. వారు అది కేవలం సర్పమనే భ్రాంతిలో ఉన్నారు. అందులో ఓ క్రూర రాక్షసుడున్నాడని వారెరుగురు. శ్రీకృష్ణుడు ఇక ఆలస్యం చెయ్యకుండా వెంటనే అఘాసురిడి నోట్లో ప్రవేశించి తన శరీరాన్ని విపరీతంగా పెంచి గొంతుకడ్డం పడి వాడికి ఊపిరి సలపకుండా బంధించాడు. దాంతో ఆ రాక్షసుడికి ఊపిరి ఆడలేదు. ఇక బ్రతుకనేమోనన్న భయంతో పెనుగులాడాడు. ఎంత పెనుగులాడినా అనంతుని శక్తి ముందు వాడు అశక్తుడై పోయాడు. ఇట్లా కొంతసేపు పెనుగులాడి ప్రాణాలు విడిచాడు. ఆ తర్వాత వాడి నోట్లోనుండి శ్రీకృష్ణుడు, గోవత్సాలు, గోపబాలురతో కలసి బయటకు వచ్చాడు. ఈ ఉదంతం శ్రీభాగవతంలో లేకపోయినా మహాకవి పోతన భక్తిభావం ఉట్టిపడేట్లుగా ఈ క్రింది పద్యాన్ని పెంచి వ్రాశారు.

ఆ ॥ *అమర వరుల కొరకుఁ గమల జాండం బెల్ల । బలిఁ దిరస్కరించి బలియ వడుగు*
గోపసుతుల కొరకుఁ బాపపుఁ బెనుబాము । గళము దూటుగట్టి బలియకున్నె.

విశేషార్థం: ఇందులో భగవంతుడు ఆర్తత్రాణపరాయణుడన్న భావం స్పష్టమవుతోంది. దేవతల కోసం శ్రీహరి బలిని యాచించి బ్రహ్మాండాన్ని ఆవరించినవాడు, గోపబాలకులకోసం ఓ సర్పాన్ని తుదముట్టించడా? అన్నదేసారం. ఇందు మూలంగా ఆయనకు దేవతలకన్నా గోపకులంటేనే ప్రీతి అధికమని తెలుస్తుంది. సఖులు, సేవకులు, ఆశ్రితులు, మిత్రులు, ఈవిధంగా వారితో శ్రీకృష్ణుని అనుబంధం ఎన్నోవిధాలుగా పెనవేసుకొని ఉంది. ఇటువంటి వారికోసం ఎట్లాంటి పనినైనా చేసి వారిని రక్షిస్తాడన్నదేసారం. ఈ భావం మూలంలో లేదే అనిఅనవచ్చు. అదే పోతనామాత్యులవారి

చమత్కృతి.

"ముక్కస్య ముక్కార్థః " అన్నట్లుగా తెనిగిస్తే పాఠకుణ్ణి రంజింపజెయ్యలేదుగదా. పాఠకుడికి చాలు, చాలు అనేంతవరకు చెప్పినవాడే కవి. ఆ అఘాసురుని కపాలం నుండి ప్రాణములు సూర్యదేవుని మించిన తేజస్సులో బయటకువచ్చి శ్రీకృష్ణునిలో లీనమై పోయింది. ఇదంతా ఆకాశం నుండి వీక్షిస్తున్న దేవతలు శ్రీకృష్ణునిపై పుష్పవర్షం కురిపించారు. దుందుభులు మ్రోగాయి. గంధర్వులు గానం చేశారు. బ్రహ్మాది దిక్పాలకులు శ్రీహరిని "సర్వేశ్వరా! నీ అద్భుత చరిత్ర తెలుసుకోవడం ఎవరితరం? కృతార్థులమయ్యాం" అని స్తుతించారు.

బ్రహ్మ గోవత్సములను హరించుట

(ఈభాగం శ్రీభాగవతం దశమస్కంధము 13వ అధ్యాయం నుండియు, శ్రీకృష్ణజన్మఖండము 20వ అధ్యాయం నుండియు గ్రహించబడింది)

శ్రీకృష్ణుని గోపబాలురు గోవత్సాలన్నింటికీ కడుపునిండా నీళ్ళు త్రాగించి పచ్చికపై మేతకు వదిలి వచ్చి భోజనాలకు కూర్చున్నారు. శ్రీకృష్ణుడి చుట్టూ గోపబాలురంతా చేరారు. వాళ్ళు తెచ్చుకున్న చద్దిమూటలన్నీ విప్పి ఒకరి అన్నం మరొకరితో పంచుకుంటూ మహదానందంతో భోజనాలు చేస్తున్నారు. ఈ భాగంలో పోతనగారు,

సీ॥ *మాటిమాటికివ్రేలు మడిచి యూరించుచు । నూరు cగాయలు దినుచుండునొక్కc*
డొకని కంచములోని దొడిసి చయ్యనమ్రింగి । చూడు లేదని నోరు చూపునొక్కc
డేగు రార్గురచల్దు లెలమిcబన్నిదమాడి । కూర్కొని కూర్కొని కుడుచు నొక్కc
డిన్నియుండగc బరచి యిడుట నెచ్చెలితన । మనుచు బంతెనగుండులాడు నొకడు

ఆ॥ *కృష్ణుc జూడు మనుచుcగికురించి పరుమ్రోల । మేలి భక్ష్యరాశి మొనcగు నొకcడు*
నవ్వుcనొకడు సఖుల నవ్వించు నొక్కడు । ముచ్చటాడు నొకడు మురియు నొకcడు

వ॥ *ఆసమయంబునందు,*

సీ॥ *కడుపునదిండుగాc గట్టినవలువలో లాలితవంశనాళంబుc జొనిపి*
విమల శృంగంబును వేత్రదండంబును జాతిరానీక డాచంక నిఱికి
మీcగడ పెరుcగుతో మేళవించినచల్ది ముద్ద డాపలిచేత మొనయ నునిచి
చెలరేcగి కొసరి తెచ్చిన యూరుcగాయలు వ్రేళ్ళ సందులయందు తెలియనిఱికి

ఆ॥ *సంగడీల నడుమ c జక్కcగcగూర్చుండి । నర్మభాషణముల నగవు నెఱపి*
యాగభోక్త కృష్ణుc డమరులు ఎఱుcగంద ।శైశవంబు మెఱసి చల్ది గుడిచె

అని వర్ణించారు. ఈ భావజాలమంతా మూలంలోలేదు. అయినా ఇదిసహజమైన ఆచారం కాబట్టి తన పాండిత్యాన్ని జోడించి ఎంతో కమనీయంగా వర్ణించి చెప్పారు. ఈవిధంగా బలరామకృష్ణులు తోటివారి చద్ది అన్నాలను ఆరగిస్తూ అందరి ఇళ్ళల్లోని వంటకాల్ని రుచి చూశారు. వారంతా చద్దన్నాలు తింటూ ఆడుతూ, పాడుతుంటే వారికి ప్రొద్దే తెలియలేదు. అవులన్నీ సహజ చాపల్యం చేత అటూఇటూ తిరుగుతూ మేస్తున్నాయి. అప్పుడు అవి మేస్తున్న చోటు కన్నా కొద్దిదూరంలో ఇంకా ఏపుగా ఎదిగిన

పచ్చికలున్నట్లు కనిపించాయి. ఒక్కొక్కటే ' అంబా' అనుకుంటూ ఆవైపుగా వెళ్ళాయి. అక్కడకు పోతే మళ్ళీ అట్లాగే కొద్ది దూరంలో పచ్చగా కనిపించింది. అట్లా పచ్చిక కోసం వెంటాడుతూ ఆ అడవిలో చాలాదూరం పోయాయి. సాయంత్రం అయింది. గోపబాలురు ఇళ్ళకు పోదామని గోవత్సాలకోసం చూస్తే అవి ఎక్కడా కనిపించలేదు.

భూలోకంలో గోలోకవాసి అయిన శ్రీకృష్ణుడు మానవరూపం దాల్చి బాల్యంనుండీ అనేక లీలల్ని ప్రదర్శిస్తూ ముల్లోకాలవారినీ ఆనందాశ్చర్యాల్లో ముంచెత్తుతున్నాడు. బ్రహ్మ ఈ బాలుని మహిమల్ని తాను స్వయంగా వీక్షించాలనుకున్నాడు. అట్లాగే శ్రీకృష్ణ మహిమను తెలుసుకోలేని వారికి తన ద్వారా తెలుసుకునేట్లు చెయ్యాలనుకున్నాడు. శ్రీకృష్ణుని లీలావిలాసాలు బ్రహ్మకు బాగా తెలుసు. అయినా లోకంలో ప్రత్యక్షప్రమాణాల్నే నమ్మేవారు చాలామంది ఉంటారు కాబట్టి వాళ్ళుకూడా శ్రీకృష్ణుని లీలలు తెలుసుకునేట్లు చెయ్యాలనుకున్నాడు. అందుకే గోవత్సాలను మాయంచేసి లోకంలో నమ్మనివారికి కూడా శ్రీకృష్ణుని లీలలు తెలుసుకునేట్లు చేశాడు.

ఇట్లా మేస్తూ గోవులకు కనబడకుండా గోవత్సాలు చాలా దూరం వెళ్ళాయి. శ్రీకృష్ణుడు బ్రహ్మమనస్సులో ఉన్న ఆలోచనను పసిగట్టాడు. మంచిది, బ్రహ్మకోరినట్లే నాలీలల్ని చూపిస్తానని అనుకున్నాడు. గోపబాలకులతో ఇలా అన్నాడు. " బాలకులారా ! మనం ఇక్కడకూర్చొని చద్దులు తింటూ ఉండగా గోవత్సాలు అడవిలో చాలాదూరం పోయాయి. ఇది మహారణ్యం. క్రూరజంతువులు కూడా ఉంటాయి. మీరంతా ఇక్కడే కూర్చోండి. నేను వెళ్ళి వెదికి తోలుకొస్తాను " ఈ భాగంలో భగవదాకారాన్ని మూలంలో కన్నా పోతన గారు తెలుగులో చక్కగా వర్ణించారు.

శా॥ కర్ణాలంబితకాకపక్షములతో గ్రైవేయహారాళితో
స్వర్ణాభాసితనేత్రదండకముతో సత్శృంభ ధామంబుతోఁ
బూర్వోత్సాహముతో ధృతాన్నకబళోత్ఫుల్లాబ్జ హస్తంబుతో
దూర్ణత్వంబుననేగె లేగలకునై దూరాటవీవీధికిన్.

బ్రహ్మదేవుని మనోగతాన్ని కనిపెట్టిన శ్రీకృష్ణుడు గోవత్సాల్ని వెదికేందుకు ఒంటరిగా అడవిలోకి వెళ్లాడు. సామాన్య మానవుడిలాగనే అవి మేసేచోట్లు, నీరుత్రాగే ప్రదేశాల్నీ అవి విశ్రాంతి తీసుకొనే వృక్షఛాయలన్నీటినీ పరిశీలించాడు. కాని ఎక్కడా గోవత్సాలు కనిపించలేదు. అహా ఇది బ్రహ్మ పన్నిన పన్నాగమేనని గ్రహించాడు. ఇళ్లకు వెళ్ళేవేళైయింది. బాలురు లేకుండా ఇళ్లకు పోతే తల్లిదండ్రులు " మా పిల్లలేరి " అని అడుగుతారు. గోవత్సాలు లేకుండా గోవులు పాలివ్వవు. కనిపించలేదంటే నిన్ను నమ్మి పంపించామంటారు. ఎటో తప్పించుకొనిపోయారంటే " నువ్వెందుకు వాళ్ళను పోనిచ్చావని " నిలదీస్తారు, పోని ఉన్నది ఉన్నట్లుగా ఇదంతా బ్రహ్మ మాయ అని అంటే వాళ్ళు నమ్మరు.

ఏదోఒకటి చేసి బ్రహ్మకు తన లీలల్ని చూపి సంతృప్తిపరచాలని సంకల్పించాడు. భగవంతుడు సంకల్పించాడో లేదో, మహామాయ క్షణకాలంలో భగవానుని ఆత్మరూపమున గోవత్సాలుగా, సృష్టించబడ్డాయి. పూర్వం వలనే సంపూర్ణమైన మందను సమకూర్చాడు. సూర్యాస్తమయానికల్లా గోవత్సాలు, గోపకులు, ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నారు. లేగలన్నీ తల్లులవద్దకు పోయి పాలుత్రాగాయి

గోపకుల తల్లులందరూ పిల్లలకు స్నానంచేయించి అన్నంపెట్టారు. ఇట్లా ఓసంవత్సరంపాటు జరిగిపోయింది. ఎవరికీ ఎటువంటి అనుమానం కలుగలేదు. అయితే బలరాముడొక్కడికే తెలుసు. ఈ గోవత్సాలు, గోపకులు అంతా శ్రీకృష్ణుడేనని, బ్రహ్మమాయకు దీటుగా కృష్ణమాయను ప్రవేశపెట్టాడని బలరాముడికి తెలిసినా తెలియనట్లే నటించాడు. అయితే శ్రీకృష్ణుడు మాత్రం బలరాముణ్ణిచూసి "అన్నా ! నీకు తెలియని విషయాలేముంటాయా? " అన్నట్లుగా చిరునవ్వులు నవ్వేవాడు. మానవులకది ఓసంవత్సర కాలమైనా, బ్రహ్మకుమాత్రం అది ఓ తృటిమాత్రమే అయింది.

శ్రీకృష్ణబలరాములు ఎప్పటికిమల్లేనే గోవత్సాల్ని అడవుల్లోకి తోలుకెళ్తున్నారు. గోపకులు కూడా యథారీతిగా కృష్ణబలరాములతో ఆడుకుంటున్నారు. ఇదంతా చూస్తున్న బ్రహ్మకి ఆశ్చర్యం కలిగింది. తను దారితప్పించిన గోవత్సాలు, గోపబాలకులంతా తన అధీనంలో ఈ గుహలోనేఉన్నారు. అయితే ఆ గోవత్సాలు గోపబాలురంతా ఏమీజరగనట్లుగా శ్రీకృష్ణబలరాములతో ఆడుకుంటున్నారు. ఇదంతా అయోమయంగా ఉంది. ఇది కృష్ణ మాయా లేక కలా అని తెలియకుండా ఉంది. సృష్టికర్తను నేనేగదా. మరి నాతో నిమిత్తం లేకుండా వీళ్ళనెవరు సృష్టించారు? ఇక్కడ ఇంకో బ్రహ్మకనిపించడంలేదే! ఆహా ! ఇదివిష్ణుమాయే అయి ఉంటుంది. నేను శ్రీహరిని మోహింపచేద్దామని విఫలప్రయత్నం చేశాను. నిజానికి శ్రీహరియే నన్ను మోహితుణ్ణి చేశాడు. " హనుమంతుని ముందు కుప్పిగంతులా?" అన్నట్లు, మాయయే భగవంతుని ఇచ్ఛ. ఇక అట్టి భగవంతుణ్ణి మోహింపజెయ్యటమా?

బ్రహ్మఇట్లా ఆలోచిస్తూ ఉండగానే, ఆ గోపబాలకులు, గోవత్సాలన్నీ, నీలమేఘశ్యాములై పీతాంబరాల్ని ధరించి, నాలుగుభుజాల్లోనూ శంఖచక్రగదారాజీవములను ధరించి కిరీటములు కుండలాలతో ప్రకాశించారు. మెడలో రత్నహారాలు ధరించినవారై బ్రహ్మకు కనిపించారు. ఆవింతను చూసిన చతుర్ముఖుడు ఆశ్చర్యపోయాడు. అంతా శ్రీకృష్ణ స్వరూపులుగానే కనిపించారు. తనకు బుద్ధిచెప్పేందుకే పరమేశ్వరుడు తనరూపాన్ని అనేకవిధాలుగా కనిపించేట్లు చేశాడనిపిస్తోంది. సకలబ్రహ్మాండాల్నీ సృష్టించిన ఆపరమాత్మ తనరూపాన్నే అనేకరూపాలుగా విస్తరించి చూపడంలో ఆశ్చర్యమేమీలేదు. నేనేమో అతడు ప్రదర్శిస్తున్న లీలల్ని పరీక్షించాలని వచ్చాను. నన్నే అతడి లీలల్లో పావునుగా వాడుకొని నన్ను ఆటపట్టించాడు. ఔరా! నేను ఎంతటి మూఢుడను? ఎంత తొందరపడ్డాను? బ్రహ్మకు భక్తిపారవశ్యంతో ఒళ్ళు పులకించిపోయింది. వినయంతో శిరస్సు వంచి నమస్కరిస్తూ ఇలా అనుకున్నాడు. ఈ బృందావనం అంతా కృష్ణమయంగా కనిపిస్తోంది. గోవులు, గోవత్సాలు గోపాలురు, లతలు, గుల్మాలు, పొదరిళ్ళు అన్నీ కృష్ణ మయంగా కనిపిస్తున్నాయి. ఎక్కడచూసినా శ్యామసుందరవిగ్రహమే కనిపిస్తోంది. అనగా కృష్ణుడుకాని దేదీ అక్కడ లేదు. అయిందేదో అయిపోయింది. ఇప్పుడు నేనేంచేయ్యాలో ఆలోచించాలి." అని అనుకున్నాడు.

ఇట్లా ఆలోచించిన బ్రహ్మ జపం చెయ్యాలని తలచాడు. వెంటనే పద్మాసనాన్ని కల్పించుకొని, భక్తి భావంతో కన్నీరు వర్షిస్తూ ఉండగా, ధీనుడై, మూలాదార స్వాధిష్ఠాన, మణిపూరకాది షట్చక్రాలను బంధించి, ఒకదానినుండి మరొక చక్రానికి లంఘన పద్ధతిన దాటుతూ వాయువును బ్రహ్మరంధ్రంవద్ద

నిలిపి, మధ్యను హృదయకమలమందునిలిపి ఆవాయువును మరలించి మధ్యలో అనుసంధానంచేశాడు. పూర్వం శ్రీహరి ప్రసాదించిన మంత్రాన్నే దశాక్షరిగా జపించాడు.

ఈ విధంగా ఓ ముహూర్తకాలం జపించి శ్రీకృష్ణపాదారవిందములను ధ్యానించి హృదయ పీఠంపై భగవంతుని తేజ:పుంజముగా దర్శించాడు. ఆ తేజస్సు మధ్యన మనోహరమైనరూపాన్ని దర్శించాడు. హృదయం లోపలాబయటా కూడా ఒకే విధంగా కనబడగా ఆశ్చర్యంతో విష్ణు భగవానుని ఈవిధంగా స్తుతించాడు.

బ్రహ్మ శ్రీకృష్ణుని స్తుతించిన భాగం శ్రీకృష్ణ జన్మ ఖండంలోను, భాగవతంలో కూడా విస్త ృతంగా కనిపిస్తుంది.

కాళీయమర్దనం

(ఈభాగం శ్రీకృష్ణజన్మఖండం, హరివంశం, విష్ణుపురాణము బ్రహ్మపురాణం, శ్రీభాగవతాల్లోని విశేషాంశాలను ఇక్కడ తెలుపబడ్డాయి)

నారాయణుడు: నారదా! శ్రీకృష్ణుడు బ్రహ్మకు జ్ఞానోదయం కలిగించి పంపేశాడు. తాను సకల బ్రహ్మాండాలను రక్షించేవాడే అయిన గోరక్షకుడై తిరుగుతున్నాడు. తాను సకల దేవతలచేత పూజించబడేవాడే అయినా గోపకులను సేవిస్తున్నాడు. గోవుల్నికాస్తూ గోసంరక్షకుడై అడవులలో తిరుగుతూ తన మాహాత్మ్యాన్ని రెండోకంటివాడికి తెలియనివ్వకుండా ప్రవర్తిస్తున్నాడు. నందునికి యశోదకు వృద్ధాప్యంలో జన్మించడం వలన శ్రీకృష్ణుని తమ శిశువుగానే భావించి పెంచుకుంటున్నారే కాని అతడు బ్రహ్మాండ నాయకుడనిగాని, కేవలం పరబ్రహ్మమేనన్న జ్ఞానం వారికి కలగడం లేదు. మానావాతీత మహిమల్నిఎన్నో చూపిస్తూన్నా కూడా కుమారా! పాదరక్షలు తెచ్చిపెట్టు, నాయనా, నాచేతికర్రఎక్కడపెట్టానో వెతికితీసుకురా అంటూ సేవలు చేయించుకుంటున్నారు. కృష్ణుడు ప్రదర్శిస్తున్న మహిమలన్నింటిని మరుక్షణంలోనే మరిచిపోతున్నారు. కొన్నాళ్లు యిట్లా గడచిపోయాయి.

ఒకానొకరోజున భగవంతుడు జనుల్ని పీడించే జంతువుల్ని కూడా శిక్షించాలనుకున్నాడు. భగవంతుడు సంకల్పించాలేగానీ అతడికి సాధ్యాసాధ్యాలుండవు. ఇతరులతో ఆలోచన చేయాల్సిన అవసరం అసలేఉండదు. అసలు రెండోవాడుంటే కదా ఇంకొకరితో ఆలోచించడానికి. శ్రీకృష్ణ పరబ్రహ్మము అద్వితీయుడుకదా. " కర్తు మకర్తు మన్యాథా కర్తుం సమర్థ: " అన్న మాట భగవంతునికే చెల్లుతుంది.

ఒకరోజున శ్రీకృష్ణుడు గోపబాలురతో కలసి గోవత్సాలను తీసుకొని యమునా తీరానికి వెళ్లాడు. యమునానదిలో ఓ మడుగు ఉంది. అందులో కాళీయుడనే సర్పరాజు తన పరివారంతో ఉంటున్నాడు. అతడికి వెయ్యి శిరస్సులు ఉన్నాయి. నోరంతా భయంకరమైన విషంతో నిండి ఉంటుంది. ఆ విషాన్నంతా ఆ మడుగులోని నీళ్ళల్లో కక్కుతూ ఉంటాడు. దాంతో ఆ నీరంతా కలుషితమై విషంగా మారిపోయింది. ఆనీరు ఎవరు త్రాగినా వెంటనే మరణించేవారు. అటువంటి వనానికి శ్రీకృష్ణుడు గోపబాలురతోను, గోవత్సాలతోను కలసివెళ్ళాడు. అక్కడ వృక్షాలకుండే పండ్లన్నీ

కోసుకుతిన్నారు. ఆడారు పాడారు, దప్పికగా వుండటంతో అంతా ఆ మడుగుకే నీరు త్రాగుదామని బయలుదేరారు. వారికా నీరు విషతుల్యమని తెలియదు. అప్పటికే మడుగులోకిదిగి నీళ్ళు త్రాగిన గోవత్సాలు గిలగిలా కొట్టుకొని మరణించాయి. ఆ భయంకర దృశ్యం చూసిన బాలకులంతా పరుగున పోయి శ్రీకృష్ణుడితో మొరపెట్టుకున్నారు. "మధుసూధనా, నీవేకాపాడాలి. గోవుల్ని మమ్మల్ని రక్షించు" అని వేడుకున్నారు వాళ్లందర్ని విష్ణు మాయ కప్పేసింది. వాళ్ళెవ్వరికి శ్రీకృష్ణుడు భగవంతుడన్న జ్ఞానం లేదు. అయినా ఆక్షణంలో శ్రీ కృష్ణుడొక్కడే తమని కాపాడగల సమర్థుడని నమ్ముకున్నారు. ఆ యమునాతీరం అంతా మనోహరంగా ఉన్నా, ఆ మడుగు ఒక్కటి మాత్రం అంతకు పదిరెట్లు భయంకరంగా ఉంది. తరచుగా ఆ కాళీయుడు విడిచే విషవాయువులతో తీరంలోని వృక్షాలు కూడా మాడిపోతూఉండేవి. ఆ మడుగు మీదుగా ఏవైనా పక్షులు ఎగురుతున్నా అవికాస్తా మరణించి మడుగులో పడేవి.

దానదీనా ఒక్క కాళీయుడి పరివారంతప్ప (సర్పాలు) ఆమడుగులో ఇంకొక జీవి ఏది బ్రతికి బట్ట కట్టేదికాదు. మరణ దేవత అక్కడ నాట్యం చేస్తూఉండేది. తెలిసో తెలియకో ఏప్రాణి అయినా ఆ మడుగులో నీరు త్రాగితే అక్కడికక్కడే మరణించేవి. అటువంటి భయంకరమైన యమునా తీరానికి శ్రీకృష్ణుడు గోపబాలకులతోను, గోవత్సాలతోను వెళ్ళాడు. ఆ మడుగు నానుకొని ఓ పెద్ద వటవృక్షం ఉంది. దాని కొమ్మలు ఆకాశాన్నంటేవి. చూడటానికదో పెద్ద కారుమేఘంలా కనిపించేది. ఆ వటవృక్షశాఖలు కొన్ని మడుగులోపలిదాకా విస్తరించాయి. అయితే విషవాయువులవలన కొమ్మలన్నీ మాడిపోయి ఉండేవి. ఒడ్డున ఉండే కొమ్మలుమాత్రం మలయమారుత స్పర్శ తగలడంవలన మాడిపోలేదుగాని వాడిపోయాయి. ఆ వృక్షాన్ని అంతా'భాండీరమని పిలుస్తారు.

ఆ వృక్షాన్ని చూడగానే శ్రీకృష్ణుడికి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలనిపించింది. వృక్షానికి నడుం ఆనించివేణువునుతీసి గానంచేశాడు. అంతే అప్పటికే మరణించిన గోవత్సాలన్నీ చెంగు చెంగున ఎగురుతూ వచ్చాయి. అవన్ని బ్రతికి రావడం చూసిన గోపబాలుర ఆనందానికి హద్దులులేవు. శ్రీకృష్ణుని మెచ్చుకుంటూ అతనిచుట్టూ చేరి నాట్యంచేశారు. ప్రాణులన్నింటినీ ఆ భయభ్రాతుల్ని చేస్తున్న ఆ కాళీయునికి బుద్ధి చెప్పాలనుకొని శ్రీకృష్ణుడు ఆమడుగువైపుగా అడుగులువేశాడు. ఇక ఆలస్యం చెయ్యరాదని సంకల్పించి ఆ వటవృక్షానెక్కేశాడు. భాగవతం మూలంలో ఇలాఉంది.

శ్లో॥ *తం చండవేగ విషవీర్య మవేక్ష్యతేన దుష్టాం నదీంచ ఖలసంయమనావతారః,*
కృష్ణః కదంబ మధిరుహ్యతతో తితుంగ మాస్ఫోట్యగాఢరశనో భ్యపతద్వి ద్విషోదే.

మహాకవి పోతనగారు దీని అర్థాన్ని గ్రహించి ఇట్లా,

మ॥ *కటిచేలంబు బిగించి పింఛమును జక్కం గొప్పుబంధించి దో*
స్తటసంస్ఫాలన మాచరించి చరణ ద్వందంబుగేలించి త,
త్కుటశాఖాగ్రము మీద నుండి యుఱికెన్ గోపాల సింహంబు ది,
క్తటముల్ మ్రోయ హ్రదంబులో గుబగుబ ధ్వానం బనూనంబుగన్

వ్రాశారు. భగవంతుని ప్రయత్నాలు ఎట్లాంటివైనా లోక సామాన్యమైనవాడుకలను పరిశీలించి

ఈ పద్యాన్ని స్వభావోక్త్యలంకారాన్ని దృష్టిలో ఉంచుకొని వ్రాసినట్లు కనబడుతోంది. మూలంలో నుండి మచ్చుకు ఒక్క ముక్కైయినా వాడలేదు. అయినా ఔరా? ఎంతటి సాహసం, ఎంతటి చమత్కారము, భగవంతుని విషయంలోనేకాదు భాషాంతరీకరణమందుకూడా, ఎంత స్వతంత్రంగా వ్యవహరించారు? సరసకవి అని మెచ్చదగిన జ్ఞాన నిధి అని ప్రశంశించవచ్చు. మహాత్మా! అని సంబోధించదగు. భక్తచూడామణి అని నమస్కరించవచ్చు! రామ భక్తులలో అగ్రగణ్యుడా! నీకివేమావందనములు. అంతట శ్రీహరి బాలురతో ఒక్కమాటైనాచెప్పకుండా బరబరా కదంబ వృక్షం పైకి ఎక్కి ఎండిన కొమ్మపై ప్రాకుతూ యమునానదీ మధ్యభాగానికి చేరుకున్నాడు. తాను సంకల్పించిన కార్యం నిర్భయంగా చెయ్యదలచాడు. ఒక్క గెంతు గెంతి మడుగులోకిదూకాడు. ఉప్పొంగిన యమునానదీ తుంపరలు తన నూరు హస్తాలను పైకెత్తి శ్రీకృష్ణభగవానునికి నమస్కరించినట్లుంది. అంతలోనే తేరుకొని మహదానందంతో ఆహా రాధారమణుడు నన్ను పవిత్రంచేయడానికే తన పాదాల్ని నాపై మోపాడని పైకి తేలిన నురగ సంతోషంతో నవ్వుతున్నట్లు కనిపించింది.

ఈ ఘట్టంలో పోతనగారు, మూలానికి దగ్గరగా ఉండేట్లు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

శా॥ *బాలుండొక్కఁడు వీఁడు నామడుఁగు విభ్రాంతోచ్చల త్కీర్ణక,*
ల్లోలంబై కలగం జరించె నిటనే లోనుంటఁ జూడండు మ,
త్కీలాభీలవిశాలదుస్సహ విషాగ్ని జ్వాలలన్ భస్మమై,
కూలంజేసెద నేఁడు లోకులకు నాకోపంబు దీపింపఁగన్

వ॥ *అని తలంచి విజృంభించి.*

ఉ॥ *ఘోరవిషానల ప్రభలు, గొబ్బునఁగ్రుమ్మఁగ సర్పసైన్యవి,*
స్ఫారుడు కాళియోరగుఁడు పాఱి వడిం గఱచెం బయో ధరా,
కారుఁ బయోవిహారు భయ కంపవిదూరు మహాగ భీరు నా,
భీరకుమారు వీరు నవపీతశుభాంబర ధారు ధీరునిన్

అని వ్రాశారు. వారిప్రతి మాటలోను భక్తిరసం ఉప్పొంగిపోతోంది. భగవంతుని అపూర్వశక్తిని వెల్లడిజేస్తోంది. మహాకవి సహజపండితుడన్న మాట ఎంతోసముచితమని తెలుపుతోంది.

శ్రీకృష్ణుని స్పర్శచేత ఆమడుగంతా అల్లకల్లోలమైంది. ఉప్పొంగిన తరంగాల వల్ల నీరుకట్టలు తెంచుకొని పారింది. దాంతో కాళీయుడికి కోపంవచ్చింది. "దుష్టుడు, ఆయుర్ధాయం క్షీణించిన వాడెవ్వడో నామడుగులోకి ప్రవేశించాడ"ని కాళీయుడు తలపోశాడు. ఆదుర్మార్గుణ్ణి ఎదుర్కొమ్మని తనసైన్యాన్ని ఆదేశించి తానూ బయలుదేరాడు. కాళీయుని చూడగానే శ్రీహరి "వీడి గర్వం అణగగొడ్తాను. ఇకపైన పశుపక్షాదులు భయంలేనివై సంచరించగలవు. ఇటువంటి ధూర్తుల్ని శిక్షిస్తేనేగదా అవతారఫలం దక్కేది. అజ్ఞానంతో ప్రజాకంటకుడైన ఈ సర్పరాజుకు బుద్ధిచెప్పి సన్మార్గంలో నడుచుకునేట్లు చేస్తాను. శిష్టరక్షణ అంటే ఇదే. శిష్టరక్షణమంటే శిష్టుల్ని రక్షించడమని కొందరు అర్ధంచెప్తారు. అదిచాలదు, దుష్టుల్ని కూడా శిష్టుల్నిచేసి రక్షించడమే నా అవతారానికి సంపూర్ణఫలం.

ఈ సర్పరాజు గర్వాన్ని అణచి శాంతాత్ముడుగా చెయ్యాల్సిన సమయం ఆసన్నమైంది. వీడికి గుణపాఠం చెప్తాను" అని భగవంతుడు తలపోశాడు.

అంతట లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణుడు తన శరీరాన్నిపెంచి ఈదుతుంటే జలరాశిఅంతా అతలాకుతలమైంది. నిర్భయంగా ఈదులాడుతున్న శ్రీహరిని చూసి, కాళీయునికి పట్టరానికోపంవచ్చింది. ఆక్రోధాన్ని బయటకు కక్కేశాడు. దానినుండి అగ్నిజ్వాలలు బయలుదేరాయి. సామాన్యులు ఆతాపాన్ని భరించలేరు. ఆసెగకు ప్రైప్రాణాలు పైనేపోతాయి. కాళీయుడు మనస్సులో ఇలా ఊహించుకున్నాడు. " ఔరా ! ఏమి వీని కండకావరము ! ఏమి వీని ధైర్యము ! వీడిని చూస్తూ ఉంటే జడమతిలా కనబడుతున్నాడు. నన్నుగూర్చి ఎరుగడా? లేకతెలిసే మరణాన్ని కోరుకుంటున్నాడా? " అని ఆలోచించి తనశరీరాన్ని పెంచి శ్రీకృష్ణుని మట్టుపెట్టాలని పోరుకు సిద్ధమయ్యాడు. శ్రీకృష్ణుణ్ణి సామాన్య మానవుడి లాగానే భావించి మనుష్యుల్ని బంధించేతీరులోనే బంధించాడు. ఏమి ఆశ్చర్యము. తనచావును కూడా తెలుసుకోలేకుండా ఉన్నాడుగదా. అందువల్లనే పెద్దలు,

క॥ *"క్రోధము తపముం జెఱచును । గ్రోధమె యణిమాదు లైన గుణముల c బాపున్*
గ్రోధమె ధర్మక్రియలకు । భాధయగున్.

అని వ్రాశారు. శాంతం ఏవిధంగా సర్వార్థాలకూ మూలమో, క్రోధం కూడా అనర్థాలన్నింటికీ మూలమవుతుంది. అటువంటి క్రోధానికే కాళీయుడు లొంగాడు. శ్రీభాగవతంలో,

" తన్నాగ భోగపరివీత మదృష్టచేష్టమ్". అనిమాత్రమే ఉన్నది. అయితే పోతనగారు తెలుగులో,

క॥ *కఱచి పిఱుతివక మఱియును । వెఱువక నిజవదనజనిత విషదహనశిఖల్*
మెఱయcదన నిడుదయొడలిని । నెఱి హరిc చెనcగొనియె భుజగనివహ పతి వడిన్

అని క్రోధమున్నవాడు తన చేత చిక్కిన శత్రువును ఎట్లా బాధిస్తాడో చెప్పడానికే ఇట్లావ్రాసి ఉంటాడని పిస్తోంది.

అంతట ఆ కాళీయుడు భగవంతుని జుట్టుపట్టుకొని దంతాలతో కొరికాడు, తోకతో కొట్టి, పడగలతో పొడిచి పరిపరి విధాలుగా భగవంతుని పీడించాడు. మర్మావయాలన్నింటినీ మరింత గట్టిగా నొక్కుతూ తనకు తెలిసిన పద్ధతులన్నీ ప్రయోగించి శ్రీహరిని బాధించాడు. దీంతో ఆ బాలకుడు ఉక్కిరిబిక్కిరి అయిపోతాడని కాళీయుడు భావించాడు. పరమేశ్వరుడు ఆ బాధలకోర్వలేనట్లుగా నటిస్తూ నిశ్చేష్టుడయ్యాడు. ఏమో బాధపడుతున్నట్లుగా నటించాడు. నిజానికి శ్రీకృష్ణునికి కొంచంకూడా తాపం కలుగలేదు.

ఈ విధంగా సర్వేశ్వరుడు నిశ్చేష్టుడై ఉండే కొద్దీ ఆ కాళీయుడిలో కోపం పెరిగి ఇంకా గట్టిగా కరిచాడు. అయితే బ్రహ్మతేజస్సు సోకడం వలన ఆవిషం అంతా నీరుకారిపోయింది. దాంతో వాడికి వెర్రిఎక్కినట్లయింది. ఆ సర్పరాజు ఎన్ని ప్రయత్నాలు చేసినా శ్రీహరి పలుకకుండా ఉన్నాడు. అంతట కాళీయుని పరివారం కూడా శ్రీకృష్ణుని కరిచిన చోట కరవకుండా శరీరంఅంతా కరిచేశాయి. అయినా భగవంతుడు మారుపలుకలేదు. అయితే కరిచిన సర్పాలన్నీ రక్తం కక్కుకున్నాయి. చావుకు సిద్ధమయ్యాయి. కాళీయుని దురవస్థ వర్ణనా తీతం. అతనిలో రానురాను శక్తి నశిస్తోంది.

దంతాలూడిపోయి రక్తం కారుతోంది. ఆ సర్పరాజుకు ప్రాణభయం పట్టుకుంది. ఇతడెవ్వడో సామాన్యుడుకాడు. నేను ఇంత విషం ఎక్కించినా ఏమీకానట్లు సంచరిస్తున్నాడు. అని అనుకున్నాడు.

ఇక్కడి పరిస్థితి ఇట్లాఉంటే అక్కడ ఒడ్డున ఉన్న బాలురంతా కృష్ణుడికోసం విలపిస్తున్నారు. కొందరైతే తాముకూడా నీళ్ళల్లో దూకేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో నీళ్ళల్లో నుండి కాళీయుని ఫణి బయటకు రావడం కనిపించింది. వారంతా స్పృహతప్పి పడిపోయేట్లున్నారు. ఒంట్లోనుండి వణుకు పుట్టుకోస్తోంది. గొంతు ఎండిపోతోంది, నోట్లోనుండి మాటరావడం లేదు. ఇంతలో బాలగోపాలుడు ఆసర్పరాజు పడగపై నిలబడి కనిపించాడు. కృష్ణుడు కనిపించగానే అంతా ఒక్కసారిగా ఎలుగెత్తి "కృష్ణా ! మాతో మాట్లాడు, మేము ఇంటికి పోతే యశోదాదేవి నాబిడ్డడేడంటే ఏమనిచెప్పం? అని ఏడ్చారు. అందులో కొంతమంది ఏడుస్తూ పోయి యశోదానందులకు జరిగిందంతా తెలిపారు. ఈ వార్త వ్రజమంతా దావానలంలా ప్రాకింది. యశోదానందుడు, బలరాముడు, గోపగోపికలంతా యమునా తీరానికి పరుగులు తీశారు. భగవంతుడైన బలరాముడు సర్వజ్ఞుడు కావున విచారం లేనివాడై ఒడ్డునే వినోదంచూస్తూ నిలబడ్డాడు.

అంతట గోపికలంతా యశోదను చుట్టిముట్టి శ్రీకృష్ణుని బాల్యక్రీడల గూర్చి చెప్పుకుంటూ విలపించారు. శ్రీభాగవతం మూలంలోని " వ్రజప్రియకథా:" అన్న ఒక్కవాక్యాన్ని ఆధారం చేసుకొని,

సీ ॥ ఎదురవచ్చినఁ జాల నెదురుగాఁ జనుదెంతు వెదురువచ్చిన నేఁడదేలరావు
చూచిన c గృపతోడ జూచుచుందువు నీవు చూచినఁ గనువిచ్చి చూడవేల
డాసిన నఱలేక డాయంగవత్తువు డాసిన నేటికిఁ డాయ విచటఁ
జీరిన నోయని చెలరరేఁగి పలుకుదు విదియేమి చీరిన నెఱుఁగకుంట
ఆ॥ తలఁపు చేయునంత ఁదలపోయుచుందువు । తలఁపు సేయ నేఁడు తలఁప వకట
యనుచు భక్తివివశ లాడెడ్కికైవడి । వ్రేతలెల్ల నాడి వివశలైరి

పోతన గారిది అనువాదంగా వ్రాసిందికాదు. తనస్వంత భావజాలాన్ని ప్రవేశపెట్టి భావకవిత్వంగా వ్రాశారు. " ప్రియ కథాః "అన్న మూలాన్ని ఆధారం చేసుకొని శ్రీకృష్ణుని చర్యల్ని వర్ణించిచెప్పారు.

ఈ విధంగా గోపగోపికలంతా దుఃఖించేవారు దుఃఖిస్తున్నారు. హాహాకారాలు చేసేవాళ్ళు హా హా కారాలు చేస్తున్నారు. అంతేగాని ఒక్కరుకూడా శ్రీకృష్ణుని రక్షించేందుకు నీళ్ళల్లోకి దూకే సాహసం చెయ్యలేదు.

(ఈభాగం బ్రహ్మపురాణంలో నుండి గ్రహించబడింది)

అప్పుడు బలరాముడు అక్కడున్నవారి దైన్యస్థితిని చూసి, " భగవంతుడైన మాఇద్దరి మహిమను తెలుసుకోలేక పోతున్నారుగదా" అని విచారించి శ్రీకృష్ణునితో అందరూ వినేట్లుగా ఇలా అన్నాడు. " కృష్ణా ! దేవదేవా ! నువ్వెందుకు సామాన్య మానవుడిలా ప్రవర్తిస్తున్నావు? నీమహిమను ఎందువల్ల మరుగుపరుస్తున్నావు? ఎందువల్ల మమ్మల్నందర్నీ దు:ఖసాగరంలో ముంచాలనుకుంటున్నావు? ఇక

నీనటనలు చాలించు. నీ నిజస్వరూపాన్ని బహిర్గతంచెయ్యి. ఈ జలములన్నింటికీ ఆధారభూతుడవు. దేవతలందరికీ ఆశ్రయభూతుడవు. సకల బ్రహ్మాండాలను సృజించి, పోషించి లయించువాడవు. లోకాలన్నీ నీస్వరూపాలే. త్రిమూర్తి స్వరూపుడవు నువ్వేగదా. మహాప్రభూ ! ఈ లోకంలో అవతరించిన మనిద్దరికీ ఈ గోపకులేకదా బంధువులు. వీరంతా గోలోకం నుండి మనకోసం అవతరించిన వారేగదా! వీరుకాక మరెవరు మనకు దేహబంధువులవుతారు. గోపికలంతా మనల్ని నమ్ముకొని అవతరించిన వారే. వారంతా ఇప్పుడు నీకోసం దు:ఖిస్తున్నారు. వారంతా అనన్య గతిక బంధువులు. వారిని ఉపేక్షించవద్దు. ఇంతవరకు మానవమాత్రుడుగా అభినయిస్తూ వచ్చావు. బాలచేష్టల్ని చూపిస్తూ మురిపిస్తూ వచ్చావు. ఇకచాలు. యశోదాది బంధుజనులందరి దు:ఖము చూడలేకుండా ఉన్నా. కృష్ణా ! సర్వలోకాధిపతీ ! త్వరగా ఆ కాళీయుని మదమణగకొట్టి బంధుజనులందరికీ సంతోషాన్ని కలిగించు". అని బలరాముడు స్వస్వరూపాన్ని జ్ఞాపకం చేశాడు. శ్రీకృష్ణుడు కూడా నందాదుల శోకాన్ని, గోపకుల దు:ఖాన్ని గ్రహించాడు. బాలకుల ఆక్రందనం విన్నాడు. గోవుల ఆర్తనాదాన్ని గుర్తించాడు. బలరాముని హితోపదేశం ఫలించింది. మానుషత్వాన్ని విసర్జించి స్వీయమహిమను స్మరించాడు.

ఈ పరిస్థితుల్లో ఆ సర్పరాజు పరిస్థితి ఎట్లా ఉన్నదంటే, బాలగోపాలుని కేవలం మానవ మాత్రుడుగా భావించాడు. తన సహజ గర్వంతో విర్రవీగి శ్రీకృష్ణుని చుట్టుకొని బంధించాడు. కసికొద్దీ కనబడిన చోటంతా కరిచాడు. దాంతో పన్నగరాజు బలంక్షీణించింది. కరచికరచి కోరలూడిపోయాయి. నోట్లోనుండి రక్తం ధారకట్టి పోతోంది. నిలబడే శక్తి కూడా లేకపోయింది. భయంభ్రాంతుడయ్యాడు. ఇక తనగతి ఏమటన్నదిగులు పట్టుకుంది. బుద్ధిగడ్డితిన్నది; బాలగోపాలుణ్ణి ఓ మానవమాత్రునిగా భావించాను. ఇతడు భగవంతుడేనని నాకనిపిస్తోంది". అని తపలపోస్తూ శ్రీకృష్ణుని చుట్టుకున్నట్లుగా నటిస్తూ మరణావస్థలో కొట్టుమిట్టాడాడు.

తే॥ పద్మరాగాది రత్న ప్రభాసమాన । మహితకాళియ ఫణి ఫణామండపమున
నళినలోచన విఖ్యాత నర్తకుండు । నిత్యనై పుణ్యమున చేర్చి నృత్యమాడె

శా॥ కుక్షిన్ లోకములున్న గౌరవముతో గోపాల యాకృతిం బోల్చు
నా, రక్షోహంత వడిన్ మహాఫణి ఫణారంగ ప్రదేశంబుపై,
నక్షీణోద్ధతి నాడో జెలగున్ హాసంబుతోడంబద,
ప్రక్షేపంబులు చేయు గేళిగతులం బ్రాణైక శేషంబుగన్.

అంతట శ్రీకృష్ణుడు బలరామ ప్రేరితుడై మానవదేహాన్ని విడిచి తన స్వస్వరూపాన్ని ధరించి శరీరాన్ని పెంచేశాడు. దాంతో సర్పరాజు బంధాలన్నీ పటాపంచలయ్యాయి. రెండుచేతులతో కాళీయుని శిరస్సుపట్టి వంచి కంఠాన్ని బిగించి ఉంచాడు. దాంతో ఆ సర్పరాజు విషానికి బదులుగా రక్తం క్రక్కాడు. శరీరంలోని బలం పూర్తిగానశించింది. అప్పుడు శ్రీకృష్ణుడు ఒకచేత్తో పడగనువంచి రెండోచేత్తో తోకను పట్టుకొని వంచి పడగపై పాదాన్నుంచి నాట్యం చెయ్యడం మొదలుపెట్టాడు. ఆనాట్యాన్ని నేత్రపర్వంగా చూడవలసిందేగాని వర్ణింపనలవికాదు. అడుగెత్తి మరల దానిపై ఉంచినప్పుడల్లా

కడవలతో కుమ్మరించినట్లు రక్తం కక్కాడు. ఆజగన్మోహనాకారుని మహానాట్యాన్ని మూలంలో వర్ణించిన విధం ఇలాఉంది.

శ్లో॥ ఏవం పరిభ్రమహత్‌జసమున్న తాంస । మానమ్య తత్పృథుశిరస్స్వ ధిరూఢ ఆద్య,
తన్మూర్ధరత్న నికరస్పర్శాతి తామ్ర । పాదాంబుజో ఖిలకళా దిగురుర్ననర్త.

ఈ ఘట్టాన్నే ఆంధ్రభాగవతంలో పోతనగారు

సీ॥ ఘనయమునాదీకల్లోలఘోషంబు సరసమృదంగఘోషంబు గాఁగ
సాధు బృందావన చరచంచరీకగా నంబు గాయకసుగానంబు గాఁగ
గలహంస సారసకమనీయమంజుశ బ్దంబులు తాళశబ్దములు గాఁగ
దివినుండి వీక్షించు దివిజగంధర్వాది జనులు సభాసీనజనులుగాఁగఁ
తే॥ బద్మరాగాదిరత్న ప్రభాసమాన । మహిత కాళియఫణిఫణామండపమున
నళినలోచన విఖ్యాత నర్తకుండు । నిత్య నైపుణ్యమునఁ బేర్చినృత్య మాడె
శా॥ కుక్షిన్ లోకములన్న గౌరవముతో గోపకృతిం బొల్చునొ,
రక్షోహంత వడిన్ మహాఫణిఫణారంగ ప్రదేశంబుపై,
నక్షీణోద్ధతి నాడుఁ చాడుఁ జెలఁగున్ హాసంబుతోడం బద,
ప్రక్షేపంబులు చేయుఁ గేళిగతులం బ్రాణైక శేషంబుగన్.

మహాకవి పోతనామాత్యుని అనువాదంలో సహజత్వం ఉట్టిపడుతుందని మరో మారు రుజువైంది. కపటవేషాలు వేసేవారిమాటలైతే చప్పగా ఉంటాయేమోగాని, పోతనగారు భక్తిరసంతో భాషాంతరీకరణం చేశారు. కనుక వారి రచనలు వీనులవిందై రసప్రవాహమై ప్రసరించింది. మూలంతో పోల్చకుండా పద్యాలు చదివినట్లైతే వ్యాస తాత్పర్యానికి మెరుగులు పెట్టినట్లుంటుంది.

ఆ మహానాట్యం దేవతలందర్నీ ఆనందపరచింది. వారంతా శ్రీకృష్ణునిపై పూలవర్షం కురిపించారు. దుందుభులు మ్రోగించారు. పాడారు, నాట్యంచేశారు. "పరమేశ్వరా! నీమహిమ తెలియతరమా! నీ ఆనందం నువ్వే ఎరుగవుగదా. పాపాత్ములను కూడా తరింపచేసే కరుణ నీకు తప్ప మరెవ్వరికి ఉంటుంది? సర్వేశ్వరా!దీనుడైన ఈ సర్పరాజును కాపాడు" అంటూ పరిపరి విధాలగా ప్రార్థించారు. శ్రీకృష్ణుడు కాళీయుని పడగపై ఒక్కొక్క అడుగు పడినప్పుడల్లా దాని గర్వం అణగారుతూవచ్చింది. చేష్టలుడిగిపోయాయి. నురగలు కక్కాడు, నోట్లోనుండి రక్తంకారింది. బలం క్షీణించింది. దేహంకృశించింది. అప్పటికిగాని కాళీయునిగర్వం మొదలంటా నశించలేదు.దానిస్థానంలో శాంతి చేకూరింది. ఎప్పుడైతే శాంతం నెలకొందోయుక్తాయుక్త పరిజ్ఞానం ఉదయించింది. చరాచరములకు గురువు పురాణపురుషుడు అయిన నారాయణుని ధ్యానించాలన్న జ్ఞానం ఉదయించింది.అప్పుడు మనస్సులో " సర్వేశ్వరా! నీవేదిక్కు " అని ప్రార్థించాలనిపించింది. భగవత్తత్త్వం తెలిసొచ్చింది. తాను చేసిన క్రూరకర్మలన్నీ ఒక్కటొక్కటే జ్ఞాపకానికొచ్చాయి. వాటి ఫలమే ఇప్పుడు కలిగిందన్న విశ్వాసం కుదిరింది. నమస్కరించి ప్రార్థించాలనిపించింది కానీ నోటమాట రావడంలేదు.

మనస్సులోనే " ఆపద్బాంధవా! శ్రీకృష్ణపరమాత్మా! " అని ప్రార్థించాడు. అతడికి మరణం దగ్గరపడిందని అతడి బంధువులంతా గ్రహించారు.

ఆ సమయంలో కాళీయపత్నులంతా భగవత్కృప తప్ప మరేదీ తమ భర్తను కాపాడలేవని తెలుసుకున్నారు.

ఇక శ్రీకృష్ణ పరమాత్ముని శరణు జొచ్చి కరుణ సంపాదించితేగాని బ్రతుకు తెరువులేదని పించింది. ఆలస్యంచేస్తే భర్త ప్రాణాలు గాలిలో కలిసిపోవడం తథ్యమని తెలుసుకున్నారు. అందువల్ల వారంతా భగవంతుని ముందు నాట్యం చేస్తూ ప్రార్థించారు. సాష్టాంగముగా ప్రణమిల్లారు. రెండుపాదాలుపట్టుకొని " జగద్రక్షకా! కరుణాసింధూ! కాపాడుమా " అంటూ ప్రార్థించారు. వారిలో పెద్దభార్య అయిన సురస ఇలా ప్రార్థించింది.

(ఈ భాగం శ్రీ భాగవతం నుండి గ్రహించబడింది)

"జగత్సంతోషకరచరిత్రుడవు. నా భర్తను కాపాడు. మానదా! శ్రీకృష్ణా! స్త్రీలకు భర్తే ప్రాణాధికుడు. భర్తనుమించిన బంధువు ఈ లోకంలో లేడు. నా ప్రాణనాథునికి ప్రాణదానం చేసి నా మర్యాద కాపాడు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులను సృజించినవాడవు. ఆదిశేషుడు, కుమారస్వామియు, సరస్వతీదేవి కూడా నిన్ను స్తుతించ అశక్తురాలుగదా. నేను బుద్ధిలేనిదానను. నీతత్త్వం తెలుసుకోవాలన్న కోరిక మాత్రం ఉంది. నారీమణులలో అధమురాలను. జగన్నాథుడవైన నిన్ను నా సామాన్య నేత్రాలతో దర్శించలేను. త్రిమూర్తులచే స్తుతించబడే నిన్ను, మూఢురాలనైన నేనుకూడా స్తుతించపూనుకోవడం అవివేకమేగదా. పార్వతీదేవి నిన్ను స్తుతించేందుకు భీతి చెందుతూ ఉండగా ఇక నేనెంత? వేదమాత అయిన పద్మ కూడా నిన్ను వినుతింపజాలనప్పుడు, ఇక నేనెట్లు వినుతించగలను. వేదవేదాంగ శాస్త్ర జ్ఞానం లేనిదాన్ని అయినా నిన్ను స్తుతించాలనుకోవడం వెర్రితనం కాదా? రత్నాలు పొదిగిన శయ్యపై శయనించిన వాడవు. రత్నవైఢూర్యాలతో అలంకరించుకున్న వాడవు వక్షమున రాధాదేవిని నిలుపుకున్నవాడివైన నిన్ను ప్రార్థిస్తున్నాను. దేవాదిదేవా మహాదేవా, నిన్ను వేదములే వినుతింపజాలవు. ఇక నేర్పరులగువారు జడీభూతులగుట ఒక లెక్కా, జమ. అట్టి అనిర్వచనీయమైన మహిమలు గలవాడవైన నిన్ను ఈ నాగాంగన స్తుతించగలదా? స్వామీ! నీపాదారవిందములకిదియే వందనము. స్వయం ప్రకాశకుడవు, పరాత్పరుడవు, పరమశివునకు పరమేశ్వరుడవు. సకల దేవేశ్వరుడవు. ఇట్టి నీకొరకు నమస్కారములర్పిస్తున్నాను. శ్రీకృష్ణా! సకలామరాధినాథా ! చతుర్ముఖప్రభూ! అనంతవిభూ ! సకలప్రజా విభూత్తమా ! మునీశా ! మనువిభూ ! చరాచరనాయకా! సిద్ధసంఘప్రభూ ! సిద్ధప్రభూ ! గణేశా ! నన్ను రక్షింపుమా ! ఇది సంగ్రహంగా నాగపత్నీకృత స్తోత్రం. దీనిని ఎవడు మూడు వేళలా పఠిస్తాడో అతడు తప్పక హరిపదాన్ని చేరుకుంటాడు.

శ్రీకృష్ణుడు నాగపత్నికి వరమిచ్చుట

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండము నుండి గ్రహించబడింది)

నారదుడు : నారాయణా ! పరాత్పరా ! నాగపత్ని శ్రీకృష్ణుని స్తుతించిన తర్వాత జరిగిన వృత్తాంతాన్ని చెప్పవలసింది.

నారాయణుడు : నారదా ! ఈ అద్భుతవృత్తాంతం వినదగినది. ఆ నాగపత్ని స్తుతించగా, మధుసూధనుడు సుప్రసన్నుడయ్యాడు. భయంతో వణికిపోతున్న ఆ నాగకాంతను చూసి ఇలా అన్నాడు.

"ఓ సురసా? నాగపత్నీ? లెమ్ము, నీభక్తికి ప్రసన్నుడనయ్యాను, వరమడుగు. భయపడవద్దు, తల్లీ ! ఇదుగో నీభర్త, తీసుకొమ్ము. నా అనుగ్రహం చేత నీభర్తకు ముసలితనంగాని, మృత్యువుగానిరావు. ఈతడు ఈ మడుగులో నివశించడం వల్ల దీనికి కాళందీమడుగన్న పేరు సార్ధకమయింది కదా. ఇకపైన మీరెవ్వరూ ఈ మడుగులో నివశించరాదు. దీనిని వదిలి బంధు మిత్రులతో కలసి మీ స్వస్థానానికి వెళ్ళండి. ఈనాటి నుండి నువ్వునాకు పుత్రికతో సమానం. ఈ కాళీయుడు నాకు అల్లుడు కాగలడు. నీ భర్త పడగపై నాపాదపద్మముల చిహ్నాలు చిరస్థాయిగా ఉంటాయి. నా పాదముద్రలు చూడగానే గరుత్మంతుడు మీకు అపకారం చెయ్యడు. మీదు మిక్కిలి సమస్కరించి పూజిస్తాడు. వెంటనే మీరీమడుగు వదిలి పోండి ". శ్రీహరి నుండి వరదానాన్ని పొందిన సురస భక్తి భావం ఉట్టిపడుతూ ఇలాఅన్నది.

సురస : జగన్నాథా ! వరదా ! ఈశ్వరా ! నీపాదములందు దృఢమైన భక్తిని ప్రసాదించు. నామనస్సెప్పుడూ భ్రమరం వలె నీపాదాల చుట్టూ తిరుగుతూ ఉండాలి. నామనస్సు ఎల్లవేళలా నీ నామాన్నే స్మరిస్తూ ఉండాలి. మహానుభావా! నా సౌభాగ్యమంతా నాభర్తే. నేనీ నాగరాజుకు భార్యను. కావున నీజ్ఞానము మాకు కలిగేట్లు వరం అనుగ్రహించు. ఇదే నేను కోరుకునే వరం.

నాగపత్ని సురస ఈ విధంగా ప్రార్ధించి చేతులు జోడించి శ్రీహరి యెదుట నిబడింది. శ్రీకృష్ణుని దివ్య మంగళవిగ్రహాన్ని దర్శించిన ఆ సురస నేత్రాలు ద్రవించాయి. పుత్రవాత్సల్యం కలిగింది. మళ్ళీ తన్నుతాను మరచి ఇలా అన్నది.

సురస : మహానుభావా ! రమణకస్థానానికి వెళ్ళమని మాత్రం చెప్పకండి. అక్కడకు వెళ్ళినచో నాకు ఎటువంటి ప్రయోజనమూ కలుగదు. అక్కడకు నా భర్త పోయిఉంటే ఉంటాడు. నన్నుమాత్రం నీసేవకురాలిగా స్వీకరించు. నాకు ముక్తిపై కాంక్ష లేదు. కృష్ణా ! ఆ ముక్తి అనేది నీపాదసేవా భాగ్యంలో నూరోవంతు ఆనందాన్ని కలిగించదు. ఎవడు నీపాదసేవ తప్ప వేరొకటి కోరుకుంటాడో అటువంటి వానికి భరతభూమిపై చోటులభించదు.

నాగపత్ని మాటలు విన్న పరమేశ్వరుదు చిరునవ్వులు చిందిస్తూ, ప్రసన్నవదనుడై " అట్లే కానిమ్ము " అని అంటూ ఉండగానే ఆకాశంలో ఓ దివ్య రథం ప్రత్యక్షమైంది. అందులో విష్ణుపార్షదులు వేలకు వేలమంది ఉన్నారు. వారంతా శ్యామసుందరుని కింకరులు. దిగివచ్చి శ్రీకృష్ణునికి నమస్కరించి ఆ నాగపత్నిని రథమెక్కించి గోలోకానికి తీసుకుపోయారు, అట్లాగే నాగపత్ని ఛాయను కల్పించి కాళీయుని వద్ద ఉండమని ఆజ్ఞాపించాడు. విష్ణుమాయచే మోహితుడైన ఆకాళీయుడు తన భార్య గోలోకానికి వెళ్ళినట్లు తెలియక ఆ ఛాయనే భార్యగా పరిగ్రహించాడు.

అంతట కాళీయుని పడగపై నుండి దిగిన శ్రీకృష్ణుడు అభయహస్తాన్ని ప్రసాదించాడు. వెంటనే కాళీయుడు పూర్వపు జవసత్త్వాలు గలవాడయ్యాడు. ఎదురుగా శ్రీకృష్ణుని దర్శించగలిగాడు. శ్రీకృష్ణునికి

నమస్కరించి హృదయం ద్రవించగా కన్నీరు ఏరులైపారింది. కాళీయునితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు: కాళీయ సర్పరాజా! భగవద్దర్శనం వృథాకాదుగదా. నీకేంకావాలో కోరుకో. నువ్వు నాకుభక్తుడవుకావటంవలన ప్రాథాధికుడవయ్యావు. ఎవడు నాభక్తుడో అతడ్ని కష్టపెట్టి పరీక్షించిగాని భక్తకోటిలోచేర్చుకోను. నాపాద చిహ్నములుగల నీజాతి సర్పాలను ఎవ్వడు హింసిస్తాడో వాడు బ్రహ్మహత్యతో సమానమైనపాపాన్ని అనుభవిస్తాడు. లక్ష్మీదేవి వాడి ఇంట్లో ఉండేందుకు ఇష్టపడదు. ఆయుర్ధాయము యశస్సు క్షీణిస్తాయి. నూరు సంవత్సరాలు కాలసూత్ర నరకంలో పడిఉంటాడు. అంతేకాదు వానికి నీ అంతటి బలశాలి అయిన సర్పం కాటేస్తుంది. పాపఫలం అనుభవించిన తర్వాత సర్పంగా జన్మిస్తాడు. ఆ వంశస్థులందరూ సర్పదోషంతో బాధపడతారు. ఎవరు నా పాద చిహ్నాలున్న నీ వంశీయుల్ని చూడగానే నమస్కరిస్తాడో వారు పాపవిముక్తులవుతారు. భుజంగరాజా! నువ్వు నీ రమణిక స్థానానికి పొమ్ము. నా పాద చిహ్నాలు చూసి గరుడుడు నీకు నమస్కరిస్తాడు. నీకే కాదు నీ వంశస్థులందరికీ గరుడభీతి ఉండదు. ఇంకా ఏంకావాలో నిర్భయంగా కోరుకో. శ్రీకృష్ణుని మాటలకు కాళీయుడు ఇలా అన్నాడు.

కాళీయుడు : పరమాత్మా! వరదప్రదా! నీ దర్శనం, స్పర్శ, అనుగ్రహం కలిగాక ఇంకా నాకు ఏంకోరికలుంటాయి? నీయెడల భక్తి, సేవా భాగ్యం తరిగి పోకుండా ఉండేట్లు అనుగ్రహించు. నీ భక్తుడైనవాడు ఎటువంటి జన్మపొందినా ఫలం సమానమే. నీ పాదసేవ యందు ఎవనికి రుచి ఏర్పడుతుందో వానిజన్మమే ధన్యము. నీపాద సేవకు నోచుకోని వానికి స్వర్గవాసం కూడా నిష్ఫలమే అవుతుంది. కృష్ణా! నీ పాదముద్రలు నా తలకు అలంకారమే అయ్యాయి. అపక్వభక్తిగల నన్ను గరుత్మంతుడు పరిపక్వ భక్తునిగా చెయ్యదలచి దూరదేశాలకు పంపాడు. ఇప్పుడు నీ పాదచిహ్నాలు చూసి నన్ను పరిపక్వ భక్తునిగా పరిగణించి వదలగలడు. మాకున్నదంతా గరుడభయమొక్కటే. ఏ పరమాత్ముని, దేవేంద్రాది దిక్పాలకులు, మహర్షులు, మునులు మొదలైన వారంతా నిన్ను స్వప్నంలో నైనా చూడలేరో అటువంటి పరాత్పరుడవైన నిన్ను చూడగలిగాను, నిన్ను తాకగలిగాను.

భక్తుల్ని అనుగ్రహించేందుకు సాకారుడవయ్యావేగాని నీకు దేహమెక్కడిది? ప్రకృతి విశిష్టుడవైనప్పుడు సాకారుడవుగా ఉంటావు. నిర్గుణుడవైనప్పుడు నిరాకారుడవుతావు. నీవు స్వేచ్ఛామయుడవు, సర్వధాముడవు, సర్వబీజమయుడవు, సనాతనుడవు, సర్వేశ్వరుడవు, సర్వసాక్షివి, సర్వాత్మవు, సర్వరూపధారివి, బ్రహ్మ శేషేంద్రా, వేదవేదాంగపారంగతులంతా నిన్ను వినుతించి మందమతులవుతారు. అటువంటి నిన్ను ఈసర్పమెట్లు స్తుతించగలదు? దీనబంధూ, కరుణా సింధు! ఈ నీచుని క్షమించు. అజ్ఞానంచేతను, జాతి స్వభావంచేతను నిన్నుకరిచాను. ఆకాశం ఏవిధంగా అస్త్రానికి లక్ష్యం కాదో అదేవిధంగా నువ్వుకూడా కొరుకుడుపడవు. మరణం నిన్నుచేరదు. నిన్నెవరూ తాకలేరు. కరవలేరు. నీరూపం తేజోమయం. అని పలికి ఆ కాళీయుడు శ్రీకృష్ణుని పాదాలపై పడి వేడుకున్నాడు. శ్రీహరి కూడా అతడడిగిన వరాలన్నీ ఇచ్చి అనుగ్రహించాడు. ఈ నాగరాజు స్తోత్రాన్ని ఎవరు ఉదయాన్నే పఠిస్తారో అతడికి సర్పభయం ఉండదు. నాగగ్రస్తుడుగాని, నాగ ద్రష్టుడుగాని,

విషభోజనంచేసి ప్రాణాపాయ స్థితిలోఉన్నవాడుకాని ఈ స్తుతిని స్మరిస్తే ఆ బాధలన్ని పోతాయి. హరిభక్తియు, హరిస్మృతి ఉంటేవారికి కూడా సర్పభీతి ఉండదు. అని పలికి తిరిగి నారాయణుడు ఇలా అన్నాడు.

నారాయణుడు: నారదమునీంద్రా! ఆవిధంగా భగవానుడు కాళీయుని రమణిక పదమునకు పొమ్మని ఆదేశించగా, అతడు బంధువులను, సేవకుల్ని వెంటబెట్టుకొని యమునా జలమార్గంలో పయనించి రమణిక పథాన్ని చేరాడు. ఆ పిమ్మట యమునా జలాలన్నీ అమృతతుల్యమయ్యాయి. పశుపక్షాదులన్నీ నిర్భయంగా యమునా జలాలు కడుపునిండా త్రాగి స్వేచ్ఛగా తిరిగాయి. కావున నారదమునీంద్రా! శ్రీహరి చరిత్రను నీవు కోరినట్లే చెప్పాను. ఇంకా ఏమైనా వినాలనుకుంటున్నావా?

నారదుడు: మహాత్మా! కాళీయుడు రమణిక పదాన్ని వదలి యమునా తీరానికి ఎందుకు వచ్చాడు? వినాలనివుంది నాకు వివరంగా చెప్పవలసింది.

నారాయణుడు: మునివర్యా! పూర్వం మలయపర్వత సమీపంలో మునుల మహాసభ జరిగింది. ఆనాడు సూర్యగ్రహణం. ఆసభలో ధర్ముడు ఈ కథచెప్పాడు. నేను అప్పుడు అక్కడే ఉన్నాను. నేను విన్నది నీకు చెప్తాను విను.

పూర్వం ఆదిశేషుడు సర్పజాతికి గరుడునికి సంధి చేశాడు. ఆ ఏర్పాటు ప్రకారం ప్రతిసంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున పుష్కరతీర్థంలో స్నానంచేసి నాగులంతా పుష్పాలతోను, ధూపదీప నైవేద్యాలతోను గరుడిని పూజించాలి. అయితే కాళీయుడు మాత్రం గర్వంతో గరుడపూజ కోసం సిద్ధంచేసిన పదార్థాలన్నీతినబోయాడు. నాగులంతా అతడిని వారించారు. అయినా వారి మాటల్ని పెడచెవినపెట్టగా వాడి గర్వమణచేందుకు గరుడుడే అక్కడ ప్రత్యక్షమయ్యాడు. కాళీయుణ్ణి రక్షించేందుకు నాగులంతా గరుడునితో యుద్ధానికి సంసిద్ధులయ్యారు. అయితే గరుడుని తేజస్సు ముందు నిలువలేక అందరూ అనంతునివద్దకు పోయి శరణువేడుకున్నారు. నాగులంతా పారిపోవడంతో కాళీయుడు శ్రీహరిని మనస్సులో ధ్యానించి గరుడుడితో పోరాడాడు. వారి మధ్య పోరు ఓ ముహూర్తకాలం అతి భయంకరంగా నడిచింది. చివరకు గరుడితేజస్సు ముందు కాళీయుడు నిలువలేకపోయాడు. ఇక చంపుతాడేమోనన్నభయంతో త్వరత్వరగా యమునానాదిలోకి దూకి ఈ మడుగులోచేరి తలదాచుకున్నాడు. కాళీయుడికి ఈ మడుగు క్షేమము, సుఖప్రదము అయింది. ఎందువల్లనంటే పూర్వం సౌభరిముని ఈ మడుగులోనికి ప్రవేసిస్తే మరణిస్తావని గరుడినికి శాపమిచ్చాడు. అప్పటి నుండి గరుడుడు ఈ మడుగులో అడుగుపెట్టలేదు. కాళీయుడు ఈ మడుగులోకి వచ్చి చేరగానే అతడి బంధువులు కూడా వచ్చి ఇక్కడే నివాసముంటున్నారు. అందువల్లనే ఇది కాళీయ మడుగుగాప్రసిద్ధి చెందింది.

సౌరభముని గరుత్మంతుని శపించుట

నారదుడు: దేవదేవా! సౌరభముని ఎందువలన గరుత్మంతుని శపించాడు? భగవంతుని వాహనమైన గరుడునికి ఈమడుగు ఎందువల్ల నిషిద్ధ ప్రదేశమైంది?

నారాయణుడు: నారదమునీ! వెయ్యి దివ్య సంవత్సరాలకు పూర్వం సౌరభముని యమునాతీరంలో శ్రీకృష్ణుని మనస్సులో ధ్యానిస్తూ తపస్సు చేశాడు. ఖగేంద్రుడైన గరుత్మంతుడు ఆకాశంలో విహరిస్తూ నేలపైకి వచ్చి ఆ మహర్షికి నమస్కరించి పోతూ ఉండేవాడు. ఒకానొకరోజున మహర్షికి నమస్కరించి పోతూ పోతూ ఒక చేపను ముక్కున కరచుకొనిపోయాడు. అది సౌరభముని కంటపడింది. ముని కోపాగ్నికి వణికిపోతూ గరుత్మంతుడా చేపను నీటిలో విడిచేశాడు. మళ్ళీ మనసు మార్చుకున్న గరుడుడు ఆ చేపను పట్టుకునే ప్రయత్నంచేశాడు. అప్పుడా చేప ప్రాణభయంతో ఆ ముని పాదాలపైడి శరణుకోరింది. అంతట సౌరభముని ఇలా అన్నాడు.

సౌరభముని: ఓ ఖగరాజా! దూరంగా వెళ్ళు ఈ చేప నన్ను శరణుకోరింది. ఇక్కడనుండి వెళ్ళిపో. నువ్వు శ్రీకృష్ణుని వాహనం అయితే కావచ్చును. కానీ మేమంతా శ్రీకృష్ణుని భక్తులమేగాని, నీవలె సేవకులంకాదు. నీలాంటివారిని శ్రీకృష్ణుడు కోటిమందిని సృజించి కోటిమందిని భస్మంచెయ్యగలడు. ఖగేంద్రా! ఇకమీదట నువ్వీ మడుగులోకి వస్తే మాడి భస్మమైపోగలవు.

మునీశ్వరుని శాపం విన్న గరుడుడు నిలువెల్లా ఒణికిపోయాడు. శ్రీకృష్ణుని పాదపద్మాలను స్మరించుకుంటూ, మునీశ్వరునకు భక్తితో నమస్కరించి వెళ్ళిపోయాడు. ఆనాటి నుండి ఖగపతి ఈ మడుగులో కాలుమోపలేదు.

నారదా! కాళీయుడి కోసం శ్రీకృష్ణుడు ఆ మడుగునుండి బయటకు రాలేదు. బాలురంతా ప్రాణాలు బిగపెట్టుకొని శ్రీకృష్ణుడి కోసం ఎదురుచూస్తున్నారు. కొందరైతే ప్రాణాలకు తెగించి యమునానదిలో దూకేందుకు సిద్ధమయ్యారు. కొందరు వాళ్ళని అడ్డగించి ఆపారు. కొందరు కృష్ణుడు లేకుండా జీవించలేమని విలపించారు. యశోద నదిలో దూకుతానని పట్టుబట్టింది. గోపికలంతా ఆమెను ఓదార్చి బలవంతంగా ఆపారు. రాధకూడా ప్రాణనాథుడు కనిపించక పోవడం వలన ప్రాణత్యాగానికి సిద్ధపడ్డది. నందుడు మితిమీరిన దు:ఖంతో మూర్ఛపోయి పడిపోయాడు.

అటువంటి హృదయ విదారకమైన ఏడుపుల మధ్య జ్ఞాని అయిన బలరాముడు ఇలా అన్నాడు." గోపికలారా! గోపాలులారా ! గోపబాలకుల్లారా ! నందరాజా ! మహాత్మా ! మీరంతా నామాటలు శ్రద్ధతో వినండి. గర్గమహర్షి దివ్యజ్ఞానంతో చెప్పినమాటలు గుర్తుచేసుకొని ధైర్యంగా ఉండండి. భూమండలాన్నే మోయు ఆదిశేషుడు, సంహారకర్త శంకరునికే తండ్రి అయిన మహానుబావునికి అపజయం ఉంటుందా? పరమాణువునుండి మహాస్థూలం వరకు ఉండే మహాతత్వమేదో దానికి ఎవరైనా బాధకలిగించగలరా; ఉండియు లేనిదై యోగులకు సంయోగాన్ని కల్పించే తత్వానికి క్షతి అంటూ ఉంటుందా? దిక్కులు ఏవిధంగా కలవవో, ఆకాశాన్నేవిధంగా తాకలేమో, అట్లాగే సర్వేశ్వరుణ్ణి బాధించడం ఎవరితరమూ కాదు. ఏ అస్త్రమూ ఆమహాతత్వాన్ని తాకలేదు; అగ్ని కాల్చలేదు. హింసింప శక్యముకాదని మహాత్ములు చెప్తూ ఉంటారు.

"విగ్రహో స్త్యైవకృష్ణస్యభక్త ధ్యానార్థమేవచ, జ్యోతిస్స్వరూపస్య విభో ర్నాద్యంత మధ్య మాత్మనః " అని మూలం.

పెద్దలారా ! శ్రీకృష్ణుని రూపం భక్తులు ధ్యానం చేయుటకే కల్పించబడింది. భగవంతుడు జ్యోతిస్వరూపుడు అటువంటి పరమేశ్వరునికి ఆదిమధ్యాంతములుంటాయా? బ్రహ్మాండాలన్నీ జలమయంకాగా జనార్ధనుడు ఆ జలాలో శయనించిఉంటాడు. ఏమహాపురుషుని నాభికమలంనుండి బ్రహ్మ జన్మించాడో అటువంటి మహాత్మునికి ఈ మడుగు హానికలుగిస్తుందా? తండ్రీ ! దోమ ఈ బ్రహ్మాండాలన్నింటినీ మ్రింగగలిగితే, పరమేశ్వరునికీ సర్పం ఏదైనాహాని తలపెట్టగలదేమో. పరమేశ్వరుని ఈ సర్పము మ్రింగలేదని నమ్ము. ఇదే ఆధ్యాత్మిక తత్త్వము. అతిరహస్యము. దురూహము, యోగులు కూడా దీనిని బయలు పరచరు. శంకలన్నింటికీ మూలకారణం ఇదే.

బలదేవుని ఊరడింపుమాటల్లో గర్గుడి ప్రస్తావన రావడంతో నందుడిలో పూర్వజ్ఞాపకాలు గుర్తుకొచ్చి ఊరటచెందాడు. గోపకులు, గోపికలు స్వస్థులయ్యారు. కానీ యశోద, రాధల దు:ఖం తగ్గలేదు. వారికి కృష్ణవియోగ దు:ఖం కృష్ణదర్శనంతో తగ్గాల్సిందేగాని ఓదార్పు మాటలతో తగ్గేదికాదు. ఇటువంటి పరిస్థితుల్లో శ్రీకృష్ణుడు నీటిపైకి రాగా గోపాలురంతా జయజయ ధ్వానాలు చేశారు. వారి ముఖాలన్నీ పున్నమి చంద్రునిలా వెలిగిపోయాయి. ఏమి ఆశ్చర్యము ! బాలకృష్ణుని ముఖాన చిరునవ్వులు చెరగలేదు. వస్త్రాలు, ఆభరణాలు తడవలేదు. తలమీద నెమలిపింఛం అట్లాగేఉంది. పూలహారాలు వాడిపోలేదు. శ్రీచందనం కరగలేదు. బ్రహ్మతేజస్సు ప్రకాశిస్తూ ఉండగా, చూచి అందరూ ఆనంద సాగరంలో ఓలలాడారు. ఆకాశంనుండి దేవతలు పుష్పవర్షం కురిపించారు. నందుడు, యశోద మొదలైనవారంతా గబగబాపోయి బాలకృష్ణుని ఎత్తుకొని ముద్దాడారు. ఊరంతా అక్కడే సామూహికంగా వంటలు చేసి భుజించి ఆచెట్లనీడలో విశ్రాంతి తీసుకున్నారు.

విశేషార్థం: యమునా హ్రదంలో గోవులు నీరు త్రాగి చచ్చిపోవడం మళ్లీ బ్రతికి రావడం ఒక్క శ్రీకృష్ణ జన్మ ఖండములోనే కనిపిస్తుంది. దీన్నిబట్టి కాళీయుడు బాల కృష్ణునిచే చుట్టబడి నిశ్చేష్టుడై ఉన్నట్లు నటించగా, బాలకులంతా భయపడి నందాదుల్ని పిలుచుకొనివచ్చారని తెలుస్తుంది. గోవులు కూడా ఆ మడుగులో నీరు త్రాగి చచ్చిపడున్నాయి. ఆయితే శ్రీకృష్ణుడు వాటిని బ్రతికించాడుగదా, గోపబాలురు ఆ మాట నందాదులకు ఎందుకు చెప్పలేదన్న ప్రశ్నలు రావచ్చు. గొల్లపల్లెలో శ్రీ కృష్ణుడు అనేక అద్భుతాలు చేశాడు. అయితే విష్ణు మాయచేత వాటన్నిటిని ఎప్పటికప్పుడే మర్చిపోతున్నారు. ఇట్లా అద్భుతాలు చూడటం, మరచిపోవడం అలవాటైపోయింది. గోవులన్ని ఆ మడుగులో నీళ్ళు త్రాగి పడిపోయాయి. బాలురంతా వచ్చి కృష్ణునిదగ్గర మొరపెట్టుకున్నారు. శ్రీకృష్ణుడు వెంటనే వారందరిని వెంటబెట్టుకొని మడుగుదగ్గరకు పోయి గోవులన్నిటిని బ్రతికించాడు. అయితే ఇదో అద్భుతమని వాళ్ళు అనుకోలేదు. ఎందువల్లనంటే గోవులు అడవుల్లో మేతకుపోయు నప్పుడు మేయకూడనిదేదో మేయడం లేదా త్రాగకూడనిదేదో త్రాగడం, ఆపైన ఆ పశువులు చేష్టలుడిగి పడపోవడం జరుగుతూనేవుంటుంది. దానికి విరుగుడు కూడా ఆ వనాల్లోనే దొరుకుతుంది. ఈ విద్య గోపకులందరికి తెలిసిందే. గోవులు చేష్టలుడిగి పడిపోవడం అన్నది అతి సామాన్య విషయంగా భావించిన బాలురు ఈ విషయాన్ని నందాదులకు చెప్పలేదని మనం ఊహించాలి. కృష్ణుడామడుగులోకి దూకాడని, తిరిగా రాలేదని భయంతో పోయి చెప్పారు.

ఆరోజున బలరాముణ్ణి శ్రీకృష్ణుడు వెంట తీసుకొని పోకుండా ఎందుకు వెళ్ళాడన్నది రెండో ప్రశ్న. సాధారణంగా బలరామకృష్ణులిద్దరు కలసి ఆడుకుంటూ ఉంటారు. ఆనాడే తానొక్కడూ అడవికి వెళ్ళాడు. బలరాముడు ఇంటి దగ్గరే ఉన్నాడు. ఎదువలన? బలరామునికి శ్రీకృష్ణుని తత్త్వము తెలుసు అతడు మాత్రమే పూర్తి చేయాల్సిన కార్యాలు కొన్ని ఉన్నాయని అతడికి తెలుసు. అందువల్లనే అతడితో పట్టుపట్టి పోలేదు. కారణం తెలుసుకోవాలని అనుకోలేదు. వీరిద్దరికి భేదమేలేదు. ఇద్దరు అనంతులే. భగవంతుడేకాని మరొకడు కాడు. భగవంతుడు అఖండ శక్తి సంపన్నుడే అయినా ఏ కార్యానికి ఎంత శక్తి ఉపయోగించాలో ఆ మాత్రం శక్తినే ఉపయోగిస్తాడు. అదీ కాకుండా, బలరాముడు ఇంటి పట్టునే ఉండడం వల్లనే యశోద నందాదుల్ని ఓదార్చి వాళ్ళప్రాణాలు నిలిపాడు. లేనిచో ప్రాణత్యాగం చేసి ఉండేవారే. బలరాముని మాయచేతనే వారెవ్వరు మూర్ఛపోకుండా నిలబడగలిగారు. “ ప్రహస్యకించిన్నోవాచ ప్రభావాజ్యో నుజస్యస: ” అన్న ప్రమాణాన్ని పరిశీలించినట్లయితే ఈ విషయం బయట పడుతుంది. “ అత్రా కతీనకధమో: కృష్ణ గోపా పవహి బాంధవా:” అన్న బలరాముని మాటలే శ్రీకృష్ణునికి తనకు భేదం లేదని చెప్పకనే చెప్తోంది. అందువల్లనే బలరాముడావార్త విన్నాకూడా తాను దుఃఖించకపోగా మిగిలినవారందరిని ఓదార్చగలిగాడు. పూర్వము మద్దివృక్షాలు పడినప్పుడు ఎవ్వరు ఇంతగా దుఃఖించలేదు. ఎందువలన? కాళీయుని శక్తి చిన్నలకు పెద్దలకు అందరికీ తెలుసు. ఆ విషవాయువులకు ఆ మడుగుమీదుగాపోయే పక్షులుకూడా మాడి నేల కూలుతూ ఉంటాయి. అటువంటి వాడి దగ్గరకు పోయి చిక్కుకున్నాడు. కాళీయుడే శ్రీకృష్ణుని చుట్టచుట్టి బంధించి ఉంటాడని అంతా నమ్మారు. అందువల్లనే బలరాముని ఇంటిదగ్గరుంచి ఆనాడు తానొక్కడే వెళ్ళాడు. నందాదులు దుఃఖిస్తున్నా తాను నిబ్బరంగా ఉంటూ బలరాముడు,

“దర్శితో మనుషోభావో దర్శితం చాలబాపలమ్, । తదయం దమ్యతాం కృష్ణ దురాత్మా దశనాయుద్ధ:”

అని ఉపదేశించగా పరమాత్ముడు లేచి కాళీయుని మదాన్నిఅణిచాడు. బలరామునికి తనకు భేదం లేదన్నదే అందులోను అంతరార్థం కాబట్టి శ్రీ కృష్ణుడు దూరమాలోచించి అన్నగారిని ఇంటి దగ్గరే వదలి తానొక్కడే వెళ్ళాడని మనమూహించాలి.

ఇక మూడవ ప్రశ్న: సురస భర్త ప్రాణాలు పోగొట్టుకొనేముందు వచ్చి భర్తకు ప్రాణదానం చెయ్యమని ప్రార్థించింది. మహా పతివ్రత అయితే శ్రీకృష్ణుడు మడుగులోకి దూకగానే ప్రార్థించి ఉండవచ్చును గదా అన్న ప్రశ్న ఉదయించవచ్చు. ఎంతటివారికైనా కర్మానుభవం అయితేగాని జ్ఞానోదయం కాదుకదా. అందువల్ల సురసకుగాని, కాళీయునకుగాని, బుద్ధి వికసించలేదు. అంతెందుకు, భగవంతుడు కూడా అటువంటి పనికి పూనుకోలేదు.

“శ్రుతి స్మృతీ మమై వాజ్ఞేయస్తే ఉల్లంఘ్య వర్తతే,। అజ్ఞాచ్ఛేది మనుద్వేషీ సమే వద్యతమోమత:”

అన్న తన ప్రతిజ్ఞను తానే అతిక్రమించడానికి ఇష్టపడడు. చేసిన పాపాలకు ఫలం అనుభవించిన తర్వాత ఆ పాపం నశిస్తుంది. అటుపైన బుద్ధి వికసించి పుణ్యకార్యాలపై మనస్సు లగ్నమవుతుంది. అప్పటి నుండి భగవత్తత్త్వంబోధపడి అంతర్దృష్టి ప్రతిఫలిస్తుంది. దానివలన అతి

సూక్ష్మమైన విషయాలు కూడా అద్దంలో చూసినట్లు స్పష్టంగా కనిపించి తన అజ్ఞానం తెలుసుకోగలుగుతాడు. అప్పుడా కర్తవ్యం బోధపడుతుంది. అటువంటి సమయంలో సత్కర్మలు బలీయమైనవైతే భగవదానుగ్రహం కలిగే కర్మలు చేయ్యాలనే జ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞానం ముక్తికి దారి తీస్తుంది. ఎవరెన్ని విదాలుగా వాందించినా చివరకు ఈ సిద్ధాంతానికి వశులై సన్మార్గాన్ని అవలంభిస్తారు.

కాళీయుని భార్య సురసకు తన భర్త పడగపైఎక్కి నాట్యం చేయగలిగినవాడు భగవంతుడైన నారాయణమూర్తి తప్ప వేరొకరు కాదన్న జ్ఞానం కలిగింది. పతివ్రత కనుకనే భగవద్దర్శనం కాగానే ముక్తిని కోరుకోకుండా భర్త ప్రాణాలనే కోరుకుంది.

"హేజగత్కాంత కాంతం మే దేహి మానంచ
మానద, పతి: ప్రాణాధిక స్త్రీణాం నాస్తి బంధుశ్చతత్పర:"

అని ప్రార్థించింది. మొదటగా "ఓ జగత్కాంతా" అని భగవంతుణ్ణి సంబోధించింది. నువ్వే జగత్తులన్నింటికీ భర్తవుకదా. నువ్వులేకుండా జగత్తులన్నీ ఎట్లా ఉండవో అట్లానే నా భర్త లేకుండా నేనుకూడా జీవించలేను. రెండవసారి 'మానదా' అని సంభోదించింది. అనగా మర్యాదను ప్రసాదించే భగవంతుడవు, నాకు మర్యాదను ప్రసాదించు అని ప్రార్థించింది. స్త్రీల మర్యాద భర్తతో ముడిపడిఉంటుంది. కావున నా భర్తను కాపాడటంమూలంగా నా మర్యాద కాపాడినవాడవవుతావు సుమా! అని ఆమె భావం. భగవంతుడామె పాతివ్రత్యానికి సాధ్వీమణిగా గుర్తించాడు. దీనినిబట్టి ఎవరేపని చెయ్యాలోవారాపనిచేస్తే భగవంతుడు సంతుష్టుడవుతాడని, లేకపోతే కాదని సారం.

భగవంతుడు సురస చేసిన స్తుతికి సంతోషించలేదు. ఆమెలోని సద్భక్తికి సంతుష్టుడయ్యాడు. ఆమె శ్రీకృష్ణపాదారవింద దాశ్యాన్నే కోరుకుంది. అది విన్నంతనే భగవంతుడు పరమ సంతుష్టుడయ్యాడు. ఆమె పరమ భక్తికి ప్రసన్నుడై వెంటనే ఆమెకు గోలోకాన్ని ప్రసాదించాలనుకున్నాడు. ఆయన సంకల్పించగానే అక్కడ విమానం ప్రత్యక్షమయింది. ఆమెకు గోలోకం పోయేందుకు అనుమతినిచ్చి, అప్పటికప్పుడే ఆమెచ్ఛాయను నిర్మించి కాళీయునివద్దకు పంపాడు. ఇదంతా సాధ్యమా? అని అంటే భగవంతునికి అలవిగానిదంటూ ఉంటుందా? భగవంతుణ్ణి శంకించడంకన్నా మహాపాపం మరొకటి ఉండదుగదా!

సురస చేసిన స్తుతుల సారాన్ని గ్రహిస్తే భగవంతుని స్తుతించడం సాధ్యమేననితేలుతోంది. మనస్సుకు,వాక్కుకు అతీతుడైన పరమేశ్వరుని ఎట్లా స్తుతించడం? పోనీ సాధ్యంకాదుగదా అని ఊరికే ఉండవచ్చునా? కూడదు. ఎవరి శక్తికి తగినట్లుగా వారా పరమేశ్వరుని కీర్తించుట మన కర్తవ్యమేనని తేలుతోంది. ఈ విషయాన్నే శ్రీ శంకర భగవత్పాదులవారు,

శ్లో ॥ *త్వద్యాత్రయా సర్వగతాహతాతే ధ్యానే నచేత: పరతాహతాతే,*
స్తుత్యానయా వాక్పరతాహతాతే క్షమస్వశంభో త్రివిధాపరాధమ్,"

అని తెలిపారు. శ్రీశంకరులు ఒకప్పుడు కాశీనగరానికి వెళ్ళారు. ఆ నగరాన్నేలే పరాత్పరుని పేరు విశ్వేశ్వరుడని విన్నారు. ఆ భగవంతుని రూపాన్ని గూర్చి కొద్దిసేపు ఆలోచించి ఆయన

నిరాకారుడని గ్రహించారు. అట్టి నిరాకార పరబ్రహ్మమును సాకార పరబ్రహ్మముగా ఆరాధించడం ఎట్లాగా? అని ఆలోచించారు. ఆ నిరాకార పరబ్రహ్మమునకు నామరూపాలు కల్పించుకుంటేగాని సామాన్య జనులు ఆరాధించలేరని ఆయనకు తెలుసు. అప్పుడు సామాన్యజనులను ఉద్ధరించేందుకై ఆ పరబ్రహ్మాన్ని ఇలా ప్రార్థించారు. "ఓ శంకరా! నీ దర్శనానికై కాశీక్షేత్రానికి వచ్చాను. అనగా సర్వవ్యాపకుడవైన నిన్ను ఈ కాశీనగరంలో, దేవాలయంలో ఓ మూల ఉంటావని వెతుక్కుంటూ వచ్చాను. నువ్వు సర్వవ్యాపకుడవుకావనేకదా నాభావన. ఇంతకన్నా ఘోరమైన అపరాధం ఇంకోటి ఉంటుందా? ఇది మొదటి అపరాధమైతే, ఇక రెండో అపరాధమేమంటే, నువ్వు ఫలానారూపంలో ఉంటావని నువ్వీ ఆయుధాలు ధరించిఉంటావని రూపకల్పన చేసుకొని ధ్యానించాను. అనగా భగవంతుడు మనస్సుకు చిక్కిపోయినట్లేగదా. నువ్వు మనస్సుకు చిక్కేవాడివైతే భగవంతుడు"చేతః పరుడు" అన్నమాట అసత్యమవుతోందిగదా? తుచ్ఛమైన మనస్సు ద్వారా నిన్ను తెలుసుకోగలమా? ఇట్లా భావించడం అపరాధం కాదా? ఇక నా మూడోఅపరాధం ఏమంటే, నిన్ను నీగుణగణాల్ని ఈ నోటితో స్తుతించాను. అనగా వాక్కుచేత పట్టుపడతావనేగదా నా భావన. అట్లాగయితే రాగాతీతుడవైన నిన్ను వాక్కుచేత వశుణ్ణి చేసుకొనే ప్రయత్నం చేశానుగదా. శంకరా! ఎంతటి తప్పుచేశాను? ఇది అపరాధం కాదా? ఈ మూడు అపరాధాలు నావలన జరిగాయి. నన్ను క్షమించు. అయితే మహానుభావా! ఈ మూడు అపరాధాలు చెయ్యకుండా ఏభక్తుడూ తరించలేడు. అనగా యాత్రలు చెయ్యాల్సిందే, నిన్ను సద్గుణునిగా కల్పించుకోవడం కన్నా మాకు గత్యంతరంలేదు. అయితే విజ్ఞానులకు ఇది అపరాధంగా అనిపిస్తుంది," అని శ్రీ శంకర భగవత్పాదులవారు బోధించారు.

సర్వ శాస్త్రాలు, వేదాలు, పురాణాలన్నీ భగవంతుడు నిరాకారుడు, నిరంజనుడు, సర్వవ్యాపకుడు అనే ఘోషిస్తున్నాయి. అట్టి మహనీయమూర్తికి రూపకల్పన ఎట్లా చేస్తావు? అన్నదానికి సమాధానం ఏమంటే ముందుగా విగ్రహాన్నేర్పరచుకొని ఆ రూపాన్నే చూస్తూ హృదయపీఠంపై నిలబెట్టుకోవాలి. ఏమిటీ ఏర్పాటని అడుగుతారా? ఇది మనస్సును నిశ్చలంచేసుకోవడానికి పెద్దలు అనుగ్రహించిన సాధనం. ఇది గ్రహించిన వాడే కృతార్థుడవుతాడు. భక్తి జ్ఞాన వైరాగ్యాలు ముక్తికి సోపానాలని చెప్పడానికి ఇదే కారణం.

ఇట్లు సురసకు వరములిచ్చి కాళీయునితో ఇలా అన్నాడు. "నాగరాజా ! నీకు ఇక భయంలేదు నీ తలపైన నా పాదముద్రలు చూడగానే గరుడుడు తొలిగిపోతాడు నిన్నేకాదు నీ వంశస్తులనుకూడా గరుడుడు బాధించడు. " అనగా భగవంతునికి ఆగ్రహానుగ్రహాలు రెండూ సమానమే. గర్వమణిచేందుకు ఆగ్రహాన్ని ఆపాదించుకుంటాడు. గర్వం తొలగించగానే భక్తునిగా స్వీకరించి అనుగ్రహిస్తాడు. దీనినిబట్టి భగవంతుడు శత్రుత్వం, మిత్రుత్వాలకు అతీతుడు. అందర్నీ తరింప చేయడమే ఆ పరాత్పరుని ఆశయం. కర్మపరిపక్వం కాగానే భగవత్కరుణ వారిపై ప్రసరిస్తుంది. దాంతో వాడు భగవద్భక్తుడవుతాడు. భగవత్పాదసేవే పరమ భాగ్యమని భావిస్తాడు. దాని వలన ముక్తుడవుతాడు.

ఈ ఘట్టంనుండి మనం గ్రహించదగిన విషయం ఏమంటే, సర్పం క్రూరజంతువు కాబట్టి కనిపించగానే చంపడం మంచిది కాదు. కనికరం చూపి దాని దారిన అది పోయేటట్లుగా

వదిలివేయడం మంచి లక్షణం. అదే భగవద్గీతలో భగవానుడు ఇలా అంటాడు.

విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని, । శునిచైవ శ్వపాకేచ పండితా సమ దర్శిన:"

అని ఈ వాక్యాన్నే తిక్కనగారు మూలానికి మెరుగుపెడుతూ ఇలా అంటారు.

చ॥ వినయము విద్యయుం గలగు విప్రునియందును గోవునం దునో,
ప్పునఁ దగుహస్తియందు నొకపోకకుఁ బోవని కుక్కయందుదా,
ని నడఁచిదెచ్చి తిను నీచపు మాలని యందుఁదుల్యద,
ర్శనులు తదంతరాత్మని నిరంజనునిం గను నట్టి పండితుల్

ఇక సౌరభముని కృష్ణ భక్తుడే. గరుత్మంతుడు విష్ణుదేవుని వాహనమని ఎరుగు. అయితే ముని చాలాకాలంగా ఈ మడుగులోనేస్నానంచేసి తపస్సు చేసుకుంటున్నాడు. ఈ మడుగులోని చేపలన్నీ ఆమూలనుండి ఈమూలకు ఈదులాడుకొంటూ ఆనందంగా గడిపేవి. అవి మహర్షినెప్పుడూ బాధించలేదు. కావున వాటికి రక్షణకల్పించేందుకే గరుత్మంతుని విషయంలో కఠినంగా ప్రవర్తించాడు. అందువల్లనే శపించాడు. అయితే అది గరుడునిపాలిట వరమే అయ్యింది. దీని వలన గరుడునికి నష్టము లేదు. మీనములకు పరమలాభములు చేకూర్చింది. ఈ శాపంవలన మునితపస్సుకూడా నశించదు.

గోపకులను దావాగ్ని నుండి కాపాడుట

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 19వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

గోపగోపికలంతా ఆనాడు కాళిందీ తీరాన్నే గడపాలనుకున్నారు. వంటలు చేసేవారు వంటలు చేస్తున్నారు. ఆడేవారు ఆడుతున్నారు. పాడేవారు పాడుతున్నారు. కొందరు గోపబాలురు మడుగులోకిదూకి ఈతలు కొడుతున్నారు. ఒడ్డున ఉన్న బాలురు అడుగో కాళీయుడు ఇడుగో కాళీయ సర్పం అని భయపెడుతున్నారు. గోవత్సవులుకూడా తృప్తిగా నీరు త్రాగి నీళ్ళలో జలకాలాడాయి. కాళీయుడికి తగిన ప్రాయశ్చిత్తమే జరిగిందని సంతోషించారు. ఒకడు కాళీయుడి వేషంకట్టాడు. ఇంకొకడు కృష్ణుడి వేషం వేశాడు. గోపికలంతా కాళీయుని భార్యలుగా నటిస్తూ వేడుకలు చేసుకున్నారు.

నందాదులు మాత్రం శ్రీకృష్ణుని విడవకుండా పట్టుకొని కూర్చున్నారు. జరిగిన ప్రమాదాన్ని తలచుకొని తలచుకొని గుండెలుబాదుకుంటూ ఒకరికొకరు చెప్పుకున్నారు. వారంతా భగవన్మాయామోహితులయ్యారు. ప్రక్కలో భగవంతుణ్ణిపెట్టుకొని కూడా భగవన్మహిమను గుర్తించలేకపోతున్నారు. అయితే నందుడికి మాత్రం గర్గవాక్యం గుర్తు వచ్చినప్పుడల్లా శ్రీకృష్ణుడు సామాన్య యాదవ బాలుడు కాదని భగవంతుడే ఈ రూపంలో తన ఇంట అవతరించాడని అనుకుంటూ ఉన్నాడేగాని ఇంతలో భగవన్మాయ ఆవరించి ఆవిషయాలన్నీ మరిచిపోతుండేవాడు. యశోదాదులు మాత్రం శ్రీకృష్ణుడీ జలగండంనుండి బయట పడ్డాడని సంతోషించి కులదైవాన్ని మరింత భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఆ సంఘంలో ఒక్క బలరామునికి తప్ప మరెవ్వరికి శ్రీకృష్ణుడే భగవంతుడన్న జ్ఞానం లేదు. ఆ రాత్రికి బలరామ కృష్ణులకు అన్నం పెట్టి మెత్తటి పక్క పరచి నిద్రపుచ్చారు.

బలరామకృష్ణులు పడుకొని నిద్రపోయినట్లే నటించారు. శ్రీకృష్ణ బలరాములకు ఆ రాత్రి జరగబోయే దురవస్థ కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది దాంతో వారా రాత్రి నిద్రపోనేలేదు. గోకులవాసులు, గోవులు అంతా నిద్రకుపక్రమించారు. ఇంతలో కార్చిచ్చు అడవిలో ప్రవేశించింది. ఆనాడు కర్మం కాలి, కాలం తీరిన జంతువులన్నీ ఒక చోటుకు చేరాయి.అవన్నీ ప్రశాంతంగా సుఖనిద్రలో మునిగిపోయాయి. ఇట్లా ఉండగా తటాలున ఓ పెద్ద శబ్దం అయింది. జంతువులన్నీ ఒకే దిక్కుకు పరుగులు తీశాయి. పక్షులు, కీటకాలన్నీ అదే త్రోవ. ఆక్షణాన ఆ అడవి పరిస్థితి వర్ణించనలవికాని దురవస్థ ఏర్పడింది. వృక్షాలన్నీ మండి కాలి విరిగిపోతున్నాయి. వాటినుండి వచ్చే చిట పట శబ్దాలు అడవంతా వ్యాపించాయి. దావాగ్ని చెలరేగింది. అగ్నిజ్వాలలు నాలుకలు చాపి అందిన ప్రాణులన్నింటినీ మ్రింగుతున్నాయి. వృక్షాలు నేలకొరుగుతున్నాయి. పొదరిళ్ళన్నీ భస్మమయ్యాయి. అగ్నిశిఖలు ఆకాశాన్నందు కుంటున్నాయి. ప్రాణికోటి, వృక్షాజాలాలన్నీ నేలకొరిగి భూమిని కౌగలించుకుటున్నాయి. మంటల్తో దిక్కులన్నీ ఒక్కటయ్యాయి. జీవులన్నీ ప్రాణాలు కాపాడుకునే ఆరాటంలో తల్లి పిల్లా అనుబంధాలు తెంచుకొని పరుగుతీశాయి ఎటుచూసినా హాహాకారాలే; కారు చిచ్చే అర్ధరాత్రి దావానలం అయి అడవంతా ఆవరించి గోపకులున్న అడవినికూడా చుట్టుముట్టాయి. గోపగోపికలంతా ఆర్తితో హా కృష్ణా! నువ్వే దిక్కు. అనన్య గతికులమన్న మాట మరువకుండా దీనులై గొంతెత్తి " హా! కృష్ణా! మహాప్రభో!బలరామా! దీనబంధూ! ఈ దావాగ్ని బాధ భరించలేకుండా ఉన్నాం మిమ్మల్నే నమ్ముకున్నాం. అనన్యగతికులం, దుర్బలులం త్వరగా మమ్మల్ని కాపాడి ఉద్ధరించు. నువ్వు ఒక్కక్షణం ఆలస్యంచేసినా మాప్రాణాలు గాలిలో కలసిపోతాయి. మహాత్మా! లోకనాథా! దీనబంధూ! ఆపన్నార్తి హరా! శ్రీకృష్ణా! బలరామా! త్వరగా కాపాడండి" అని మొరపెట్టుకున్నారు. ఈఘట్టాన్ని పోతనగారిట్లా చెప్పారు.

క॥ నీ పాదంబుల నమ్మిన నాపద లెక్కడివి జనుల కత్యుగ్రమహా
దీపితదావజ్వలనము పై పడకుండెడివిధంబు బావింపగదే

ఈ పద్యములో పోతనగారు మూలంలోని అర్థం చెడిపోకుండా తెలుగుభాషా స్వభావాన్ని వదిలిపెట్టకుండా రెండు భాషలకు చక్కగా న్యాయం చెయ్యడం ఆ మహాత్మునికి చక్కగా తెలుసు. అందువల్లనే ఆయన సహజకవే కాకుండా సరసజనహృదయ రంజకుడుకుడుగా కూడా రుజువుచేసుకున్నారు.

శ్రీకృష్ణ పరమాత్మ గోపకుల ఆర్తనాదాన్ని వారి ప్రార్థనను అంగీకరించాడు. ఆర్తులను కాపాడటమే తన అవతారఫలమని తలచి, మెల్లగా పోయి మీదకు ఎగసివస్తున్న ఆ దావాగ్ని నంతా నీరు త్రాగినట్లు త్రాగేశాడు. అంతే ఆ అగ్నిశేషాలు మచ్చుకైనా కనబడలేదు. పశుపక్ష్యాదులన్నీ దావాగ్నిచే తామంతా మాడి మసిఅయ్యారన్నమాట మరచి, నిద్రలోపోయి లేచినట్లులేచాయి. కృష్ణుడుంటే మనకు ఆపదలెట్లావస్తాయని గోపకులంతా వేనోళ్ళకొనియాడారు.

విశేషార్థం : శ్రీహరి దావాగ్నినంతా త్రాగేశాడని తెలుసుకున్నాము. అసలాసమయంలో దావాగ్ని ఎందుకు సంభవించాలి? దాన్ని శ్రీకృష్ణుడు త్రాగి ప్రాణులన్నింటిని ఎందుకు కాపాడాలి? అని ప్రశ్నలు వస్తాయి. దావాగ్ని రగులుకోవడమనేది అపమృత్యువునకు సంబంధించినది. అయినాకూడా,

గోపకులకు కలిగే కష్టాలన్నింటినీ తొలగించి కాపాడటం శ్రీహరి అవతారఫలాలలోఒకటిగదా. గోపగోపికలంతా ఆరాత్రి ఆదమరచి నిద్రిస్తూండగా దావాగ్ని చుట్టుముట్టింది. వారంతా లేచి "శ్రీకృష్ణా! నువ్వు తప్ప మాకు వేరేదిక్కులేదు. నిన్నే శరణువేడు తున్నాము అని ప్రార్థించారు.

"అనన్యా శ్చింతయంతో మాం మేజనా: పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్"

అన్నది భగవంతుని ప్రతిజ్ఞగదా. గోపకులకు అహంకారం ఉన్నాదా? లేక తన్నే నమ్ముకున్నారా? అని పరీక్షించిచూశాడు. వారంతా శ్రీహరితప్ప వేరొకదిక్కులేదని వేడుకున్నారు. భగవంతునికీ కార్యం ఏమంత గొప్పది కాదు అత్యల్పం. తన ప్రతిజ్ఞను సార్థకం చేసుకున్నాడు.

గ్రీష్మఋతువు :

కాళీయుని మదమణచిన తర్వాత గోపకులంతా విశ్వకర్మ నిర్మించిన ఇళ్లల్లో సుఖంగా ఉంటున్నారు. రానురాను సూర్యుని ప్రతాపం వృద్ధికాజొచ్చింది. లోకబాంధవుడు తన అసమాన ప్రజ్ఞచే జీవులలోతాపం వృద్ధి అయింది. అయితే అది బహిర్తాపం మాత్రమే. శరీరాల్లోపల శీతలంగా ఉంటూ బలాన్ని వృద్ధిచేస్తుంది. వృక్షాలన్నీ చిగురుటాకులు, పూలు పండ్లతో వర్ధిల్లాయి. ప్రకృతి అందాలు చూడటానికి రెండు కళ్ళు చాలడంలేదు. అటువంటి గ్రీష్మ ఋతువు తాపం పుట్టించేదిగా ఉన్నా, బృందావన వాసులు మాత్రం విశ్వకర్మ ఇళ్ళల్లో ఉండుటవలన వారికి ఎండవేడి తెలియడం లేదు. నిజానికి గ్రీష్మంలో వేడికి వారి చర్మాలు వాడినా, రక్తం శుద్ధి చెంది ఆరోగ్యవంతులుగా జీవించారు. పోతనగారు గ్రీష్మాన్ని ఎంత మనోహరంగా వర్ణించారో చూడండి.

సీ॥ *దినము లంతంతకు దీర్ఘంబు లైయుండె । దిననాథుఁ డుత్తరదిశఁ జరిఁచె*
నాఁటికినాఁటికి నెండ నవ్యమై ఖరమయ్యె । వెచ్చనిగాడ్పులు విసరఁజొచ్చె
మేదినీరేణువుల్ మంట సంకులమయ్యె । నేఱులుఁ గొలఁకులు నిగరిపోయె
బానీయశాలలఁ బథిక సంఘము న్చిఁ । జప్పరంబుల భోగిచయము డాఁగెఁ

ఆ॥ *దరులఁ గుసుమచయము దళములతో వాడె । మిథున కోటికి రతి మెందు దోఁచె*
నఖిల జంతుభీష్మ మైన గ్రీష్మము రాకఁ । గేలి యడవులందుఁ గేళిసలిపె

ఆ॥ *వాడిరుచులు గలుగు వానివేఁడిమి గ్రీష్మ । కాలమందు జగము గలయబడియె*
బ్రహ్మ జనులకొఱకు బ్రహ్మాండఘటమున । నుష్ణరసముఁ దెచ్చి యునిచె ననఁగ

అటువంటి గ్రీష్మఋతువులో కూడ శ్రీకృష్ణుడు నివాసం కావడం వలన బృందావనం అంతా చల్లగాను మనోహరంగా ఉంది. వృక్షాలు, లతలు, పొదలన్నీ రకరకాలైన పుష్పజాతులతో విలసిల్లి అందంగా సింగారించుకొన్న కల్యాణ మండపంలా ఉంది. పక్షులు కిలకిలారావాలతో పెండ్లివిడిదిలా సందడిగా ఉంది. యమునా తరంగాలన్నీ ఎగిరిపడుతూ కమలముల పుప్పొడిని తమతో తీసుకుపోతుంటే సుగంధాలు మందంగా వ్యాపించాయి.

బలరామకృష్ణులు గోపబాలులతో కలసి ఆటపాటలతో గోవుల్ని మేపుతూ, గోసంపద వృద్ధికి తోడ్పడుతున్నారు. భూమిమీద గోవువంటి జంతువొకటి లేదంటే అతిశయోక్తి కాదు. జంతువులన్నీ ఏదోఒకనాటికి మనుష్యజన్మ ఎత్తుతాయని, కీటక పశుపక్ష్యాదులన్నింటికీ గోజన్మమే చివరదని, గోవుజన్మ

తర్వాతది మానవ జన్మమేనని పెద్దలంటారు. దాని క్షీరధారలే కాదు గోమయ మూత్రదధ్యాజములు కూడ సకల పాప క్షయములని స్మృతులు ప్రతిపాదిస్తున్నాయి. గోవులను పూజించడం వలన పాపాలు తొలిగిపోవడమే కాకుండా, ఆరోగ్యాభివృద్ధికి కూడ ప్రధానకారణమని సిద్ధాంతం చెప్పబడ్డది.

(ఈఘట్టాన్నే శ్రీభాగవతం పదవ స్కందం 16వ అధ్యాయంలోఇలా చెప్పబడింది. ఈ వనదహనం రెండుసార్లు జరిగినట్లుగా శ్రీ భాగవతంలో ఉన్నది. శ్రీకృష్ణ జన్మఖండములో కూడా 16వ అధ్యాయంలో ఈ కథ చెప్పబడింది.)

శ్రీకృష్ణుడు దావాగ్నిని మ్రింగుట

(ఈ భాగం శ్రీభాగవతం దశమస్కంధం 19వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

బలరామకృష్ణులు గోపబాలురతో కలసి గోవులను మేపుకుంటూ ఆటపాటలతో బృదావనమంతా విహరిస్తూ ఉండేవారు. అయితే వారి విహారాలు సామాన్య గోపకుల విహారాల్లాంటివికావు. అనన్య సామాన్యంగా ఉంటాయి. వారావిధంగా ఒకనాడు గోవుల్ని తోలుకొని యమునాతీర అరణ్య ప్రాంతాల్లో విహరిస్తూండగా అగ్నిదేవుడు ఉన్నట్లుండి విజృంభించాడు. దహనకాండ ప్రారంభమైయింది. పూర్వము ఒకసారి గోపాలురంతా దావాగ్ని బాధను రుచిచూశారు. అందువల్లనే దావానలాన్ని చూడగానే వారిపైప్రాణాలు పైనేపోయాయి.

గోపికలంతా ఈవిధంగా తల్లడిల్లిపోతూ శ్రీకృష్ణబలరాములవద్దకు పోయి తమ దైన్యస్థితిని ఇలా చెప్పుకున్నారు.

(ఈస్తోత్రం శ్రీజన్మఖండం 16వ ఆధ్యాయంనుండి గ్రహించబడింది.)

"కృష్ణా ! జగత్పతీ! ఇంతకుపూర్వం మహాత్ములందరిని ఎన్నో ఆపదలనుండి రక్షించావు. అట్లాగే ఇప్పుడుకూడా ఆదరించు. ఈ దావాగ్ని మా ప్రాణాలను హరిస్తుందని గట్టిగా నమ్ముతున్నాం. ఓ మధుసూధనా! ఈ ఆపదలనుండి కాపాడు. మాకు ఇష్టదైవమైనా కులదైవమైనా నువ్వే గదా! సృష్టికర్తవు, పాలకుడవు, సంహారకర్తవుకూడా, జగన్నాథా! అగ్నివి నువ్వే, వరుణ సూర్యచంద్ర యమ కుబేర వాయు బ్రహ్మేశ శేషధర్మేంద్రులు, మనువులు, మునీంద్రులు, మునులు, దానవులు, యక్షరాక్షసకిన్నెరులన్నీ నువ్వే, వీరుకాక సమస్త మండలాల్లోని చరాచరములన్నీ నీ విభూతులే. పుట్టడం, గిట్టడం అనేవన్నీనీ ఇష్టానుసారమే జరుగుతూ ఉంటాయి.గోవిందా! మాకందరికీ అభయదానమివ్వు; ఈ దావాగ్ని తాపాన్నుండి కాపాడు. నిన్నే శరణువేడుకుంటున్నాం. శరణాగతులను రక్షించటమే గదా నీ ప్రతిజ్ఞ." అని ప్రార్థించారు.

(ఇదే ఘట్టంలో శ్రీ భాగవతంలో చేసిన స్తుతి ఇలాఉంది.)

శా॥ *నీచుట్టాలకు నాపదల్ కలుగునే నే మెల్ల నీవారమ*
న్యాచారంబు లెఱుంగ మీశుఁడవు మాకాభీల దావాగ్ని నేఁ
డేచందంబున నింక దాటుదుము మ మ్మీక్షించి రక్షింపవ
న్నా ! చంద్రాభ ! విపన్నులన్ శిఖివితాన చ్ఛన్నులన్‌ఖిన్నులన్.

పై పద్యంలో 'అన్నా' అన్న పదాన్ని మహాకవి పదపూరణానికే వాడాడని, ఇట్లాంటి విపత్కర పరిస్థితుల్లో బాలకులు శ్రీకృష్ణుని ఈ విధంగా సంభోదించి ఉండరని విమర్శించారు. ఇది పదపూరకానికి చేసిన ప్రయోగంకాదు. ఆపత్సమయాల్లో కూడా స్వభావంలో మార్పురాదు. చిన్నప్పటినుండి ఆటపాటల్లో మునిగితేలినవారు కాబట్టి బలరామకృష్ణుల్ని "అన్నా" అన్న వరస కలిపి సంభోదించడంలో విరుద్ధమేమిలేదు. అంతేకాకుండా దాని ప్రక్కనే "చంద్రాభ" అన్న పదాన్నికూడా ప్రయోగించాడు. ఓ శ్రీహరీ! నువ్వు చల్లని వాడవు. ఈదావాగ్నిజ్వాలలు మమ్మల్ని కాల్చేసేటట్లున్నాయి. నువ్వే మమ్మల్ని కాపాడి చల్లగా చూడాల్సినవాడవు అని 'చంద్రాభ' అన్న పదాన్ని వాడారు. అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ, తస్మా త్కారుణ్యే భావేన రక్షరక్ష జనార్ధన అని మొరపెట్టుకున్నారు.

శ్రీహరి వారి ప్రార్థన లన్నింటినీ సావధానంగా విన్నాడు. **"మీరు నిర్భయంగా ఉండండి, దావాగ్ని మిమ్మల్నేమీ చెయ్యలేదు."** అనిఅభయమిచ్చాడు. గోపబాలురతో "బాలకులారా మీరంతా ఓక్షణం కళ్ళుమూసుకోండి. మీరు కళ్ళుతెరిచిన తర్వాత జరిగిందంతా మీకు బోధపడుతుంది. నేను చెప్పేవరకు కళ్ళు తెరవకండి" అని ఆ దావానలంవైపు తన శీతల దృష్టిని సారించాడు. దాంతో దావాగ్ని అంతా మటుమాయం అయింది. కాలిబూడిద అయ్యాయనుకున్న లతావృక్షాలన్నీ యథాపూర్వంలాగా కళకళలాడుతూ కనిపించాయి. మరణించిన పశుపక్ష్యాదులన్నీ నిద్రపోయిలేచినట్లుగా లేచి తిరిగాయి. ఇటువంటి శరణాగత రక్షకుని రూపాన్ని మహా భక్తాగ్రేశ్వరుడైన లీలాశుకుడు ఇలా వర్ణించారు.

శ్లో॥ *అమునాభిల గోపగోపనార్థం యమునారోధసి నందనందనేన,*
దమునా వనసంభవః పపేనః కిము నాసౌ శంణార్థినాం శరణ్యః"

– శ్రీకృష్ణ కర్ణామృతం.

వర్షర్తువు :

శ్రీకృష్ణబలరాములు గోపకుమారులతో కలసి బృందావనమంతా తిరుగుతూ ఆడుతూ పాడుతూ గోవులను మేపుకుంటూ కాలం గడుపుతున్నారు. వారూ గోపబాలకుల్లో ఒకరుగా మెలుగుతున్నారేగాని భగవత్స్వరూపాన్ని తెలియనివ్వడం లేదు. బాలకులు కూడా మాయా మోహితులై వారిద్దర్ని సామాన్య బాలకుల్లాగానే భావిస్తున్నారు. కొన్నాళ్ళిట్లా గడిచిపోయాయి. గ్రీష్మఋతువు పోయి వర్షఋతువు ప్రారంభం అయింది.

వర్షఋతువు గూర్చి పెద్దగా తెలుసుకో వాల్సిందేముంటుందని కొట్టిపారేయకండి. పామరులంతా జేరి శ్రీకృష్ణుడు గోపికాలోలుడనే పట్టం కట్టారు. అది ఎంత తెలివి తక్కువ ఆలోచనో మహాకవి ఇక్కడి వివరించి చెప్పుచున్నాడు. అనగా నోటికి వచ్చినట్లల్లా మాట్లాడ కూడదు. దేనినైనా సత్‌బుద్ధితో తర్కించి గుణదోషాలను పరిశీలించాలి. పరమార్థంతో కూడుకున్న ఈ అర్థాన్ని పెద్దలు ఎట్లా చెప్పారా అని నిష్పక్షపాతంగా పరిశీలించి నిర్థారణ చేసుకోవాలి. ఆ అర్థం శాస్త్ర సమ్మతమవునా కాదా అని ఆలోచించాలి. ఇదే భావాన్ని పూర్వం బద్దెన ఇలా చెప్పాడు.

కII *వినఁ దగు నెవ్వరు చెప్పిన । వినినంతనే వేగపడక వివరింపఁదగుం*
గని కల్ల నిజము దెలిసిన । మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో సుమతీ.

గ్రీష్మ ఋతువు బృందావనవాసులకు అంతో ఇంతో ఆహ్లాదం కలిగించేదిగా ఉన్నా, జనసామాన్యానికి మాత్రం మరింత తాపాన్ని కలిగించేదిగానే ఉంటుంది. అయితే ఆ కాలం అంతా కూడా ఆరోగ్యపరంగా ఆహ్వానించదగ్గదే అయితే బహిర్తాపాన్ని భరించలేక పోయినా అంతర్ధాంతి కలిగి సంవత్సరం అంతా సంపూర్ణారోగ్యవంతులుగా ఉంటారు. ఈ 60 రోజులూ ఎట్లా గడుస్తాయా అన్నంత గడ్డుగా గడుస్తాయి. కాలం మహోత్తమము; దానికి ఆద్యంతాలుండవు. కాలం భగవత్స్వరూపం గదా. కావున కాలానికి ఆద్యంతాలు తెలుసుకునే ప్రయత్నం చెయ్యడం తెలివి తక్కువ తనమే. అనగా భగవంతునికి ఆద్యంతాలు తెలుసుకోవడం ఎవరి శక్యమూ కాదు. శ్రీరామకృష్ణ పరమహంస ఇలా బోధించారు. " సముద్రం లోతు కనుక్కోవడానికి ఒక ఉప్పు బొమ్మకు త్రాడుకట్టి సముద్రంలోకి వదిలారట. అది ఇంతవరకూ తిరిగి రాలేదు. అట్లాగే భగవద్దర్శనం అయిన వ్యక్తి భగంతునిలో లీనమైపోతాడు. తన అనుభవం చెప్పేందుకు తిరిగిరాడు" అని. అందువల్లనే భగవంతుని ఆద్యంతా లెవ్వరికీ తెలియవని శ్రుతులు ఘోషిస్తూన్నాయి. తెలియని దానిని తెలిసినట్లు మోసం చెయ్యడం కన్నా పాపం మరొకటి ఉండదు. ఇక వర్ష ఋతువు దాని లక్షణాల గూర్చి చర్చిద్దాం.

తాపం కలిగించే రోజులన్నీ పోయాయి. ఆకాశం మేఘావృతం అయింది. సూర్యకిరణాల్లోని తాపం కూడా తగ్గింది. అంతేకాదు ఎండలో కూర్చుంటే సుఖంగా కూడా అనిపిస్తోంది. శ్రీ భాగవతం దశమస్కంధం 20వ అధ్యాయంలోని 3,4 శ్లోకాలకు వ్యాఖ్య ఇలా ఉంది. " సర్వేషాం ప్రాణినాం సముద్భవః, ఉత్పత్తితః జీవనశ్చ. సగుణం గుణైరాజ్ఞన్నం జీవనాఖ్యం, విద్యుర్గర్జితాం బుదానాం సత్త్వ రజస్తమోభరుపమా" అని. వర్ష ఋతువుతో బాటు శరదృతువును ఎందువలన వర్ణించాలో శ్రీధరాచార్యుల వారు " ప్రావృట్చరదృతు శ్రీ మోర్వర్ణనం త్వద్భుతైశ్వర్య కృష్ణ లీలా వివక్షయా" అని వ్రాశారు. అనగా మానవ రూపం దాల్చి భగవల్లీలల్ని ప్రకటించేందుకే ఈ ఋతువర్ణనలు చేశారని మహానుభావులు ప్రకటించారు. వీరి భావాలనే పోతనగారు ఎలా వర్ణించారో తిలకించండి.

సీII *తూర్పు వాయువులు ప్రభూతంబులై వీచెఁ బటమట నింద్రచాపంబు దోఁచెఁ*
బరివేషయుక్తమై భానుమండల మొప్పె మెఱపు లుత్తరదిశ మెఱవఁ దొడఁగె
దక్షిణగాములై తనరె మేఘంబులు జలచరానీకంబు సంతసించెఁ
జాతకంబులపిపాసలు కడవలఁ జేరెఁ గాంతారవహ్నుల గర్వ మడఁగె

ఆII *నిజరాళివలన నీరజబంధుండు దొల్లిపుచ్చుకొన్న తోయమెల్ల*
మరల నిచ్చుచుండె మహి కర్షకానంద కందమైనవాన కందువ నొగి.

ఆ ఋతువంతా ఆకాశం నిండా కారు మేఘాలు క్రమ్ముకొని జీవరాసుల తాపాలన్నీ తొలగించేదిగా ఉంటుంది. జలజలవాన చినుకులు పడుతూ ఉంటే ఆకాశంలో ఇంద్ర ధనస్సులు ఏర్పడుతుంటాయి. మేఘాలు గర్జిస్తూ ఉంటే పర్వతాలన్నీ ఉలిక్కి పడుతుంటాయి. నేలంతా జలమయమై దారులన్నీ మూసుకుపోయాయి. చెరువులు, తటాకాలు, గుంటలన్నీ నిండి జల సమృద్ధిని

తెలుపుతున్నాయి. జలధారలకు వృక్షాల కొమ్మలన్నీ నేలపై వ్రాలుతూ ఉంటాయి. వృక్షశాఖలనాధారం చేసుకున్న పక్షుల కిలకిలారావములతో అడవున్నీ మారుమ్రోగుతాయి. అనగా సర్వప్రాణులు వర్షఋతువుచే సంతోషంగా ఉన్నాయని తేటతెల్లమవుతుంది. ఆంధ్ర భాగవతంలో పోతనగారు స్వభావాలం కారాన్నాశ్రయించి ఇలా తెలిపారు.

క॥ *వాడక వ్రాలక తెవులులఁ గూడక తగనల్ల గెఱులుగొని నవకములై*
చూడఁగ భద్రము లగుచును వీడెన్ సస్యంబు లిడుమ వీడెం బ్రజకున్,

ఆ విధంగా బలరామకృష్ణులు గోపబాలురతో కలసి అడవుల్లో గోవుల్ని మేపుకుంటూ ఆడుతూ పాడుతూ సంచరించారు.

శా॥ *ఆ వర్షాగమమందు గోవుల నరణ్యాంతంబులన్ మేపుచున్*
గోవిందుండు ప్రలంబవైరియుతుఁడై గోపాలవర్గంబుతోఁ
బ్రావీణ్యంబునఁ గందమూల ఫలముల్ భక్షించుచున్ మంజుల
గ్రావాగ్రంబులఁ బ్రీతిఁ జల్ది గుడిచెం గాసారతీరంబులన్.

మూలంలో దధ్యోదనమని ఉంది. అనగా పెరుగు కలిపిన అన్నమని అర్థం. అయితే చల్ది అన్నాన్ని చతుర్విధ సాధక సహితముగ భుజించే ఆచారం ఏకాలంలోనూ లేదు. ఈ పదాన్ని ఆధారం చేసుకున్న శ్రీవైష్ణవులు భగవంతునికి దధ్యోదనము ప్రీతికరమని ఆరాధనాక్రమంలో చేర్చి ఉంటారు. ఆ విధంగా గోపబాలకులు శ్రీహరితో కలిసి చల్దిభోజనాలు చేస్తు గోవుల్ని కాచుకుంటూ హాయిగా తిరిగే వారు. భగవంతునిలో ఉంటూ, తింటూ ఆడుకునే ఆనంద ఘడియలు ఎన్నో పూర్వజన్మల సుకృతం ఉంటేగాని రావు. అటువంటి సమయాల్లో భగవానునికి మురళీ గానం అంటే ఇష్టం. అందువల్లనే గోలోకంలో మురళీగానం ప్రాశస్త్యాన్ని సంతరించుకుంది. శ్రీహరి వారికా ఆనందాన్ని తరుచుగా ప్రసాదించేవాడు.

ఆ వేణు రంధ్రాల నుండి వచ్చే అపూర్వనాదాలు పరబ్రహ్మాన్ని ఆయిన పరివారాన్నే పరవశుల్ని చేస్తూ ఉంటే ఇక ఈ గోపకులోక లెక్కా. వేణుగానాన్ని పోతనగారు వర్ణించిన విధానాన్ని తిలకించండి.

సీ॥ *విశ్వమోహనమైన వేణునినాదంబు సరసగంభీర గర్జనము గాఁగ*
మహనీయ నిర్మల మందహాసద్యుతి లలిత సౌదామనీలతికగాఁగఁ
దలచుట్టు చాగుగఁదనరు పింఛపుదండ శైల భేదనశరాసనము గాఁగఁ
గరుణాకటాక్ష వీక్షణ సుధావర్షంబు సలిల ధారా ప్రవర్షంబు గాఁగ
తే॥ *జాడ నేతెంచు గోపాల జనమునీంద్ర చాతకంబుల దురవసఁ జక్కఁ జేసి*
కృష్ణ మెఘంబు బహుతరకీర్తి నొప్పె విమల బృందావనాకాశ వీథియందు
క॥ *గోవుల వృషవత్సంబుల వావిరిఁ బూజించి పిదప వర్షాకాల*
శ్రీవనితను చూజించెను శ్రీవల్లభు ఁ దయ్యు గోపశేఖరు ఁ దధిపా.

అని వ్రాశారు. సమయోచితంగాను, కల్పనా చాతుర్యంతోను రచించిన సరస కవిశేఖరుడన్న పేరు సార్థకం చేసుకున్నారు. భగవద్వర్ణనల విషయంలో ఎంత వర్ణించినా పోతనగారికీ, వేణునాదాన్ని

ఎంత ఆస్వాదించినా గోపీ గోపకులకు తృప్తి కలగడం లేదు. ఈ సందర్భంలో కవి తిలకుదు లీలాశుకుడు వర్ణించిన విధానాన్ని చూడండి.

శ్లో॥ *వ్యత్యస్తపాద మవతంసితబర్హి బర్హం । సాచీకృతానన నివేశిత వేణు రంధ్రమ్,*
తెజః పరం పరమ కారుణికం పురస్తాత్ । ప్రాణప్రయాణ సమయే మమ సన్నిధత్తామ్.

అని కొనియాడారు. ఇక్కడ " ప్రాణ ప్రయాణ సమయే" అనగా తేజోరూపుడైన భగవంతుడు మరణకాలంలో ఎదురుగా వచ్చుగాక అని... అంటే ఇతర సమయాల్లో వద్దనా? అని కాదు. ఇతర సమయాల్లో తోడుగా ఉండే భగవంతుడు మరణ సమయంలో కూడా నన్ను వెన్నంటి ఉండమన్నదే సారం.

శ్లో॥ *అంతకాలేచ మా మేవ స్మరన్ ముక్త్వా కళేబరం,*
యః ప్రయాతి సమద్భావం యాతినా స్త్వత్ర సంశయః
యంయం వాపిస్మరన్ భావం తృజ త్యన్తే కళేబరం,
తంత మే వైతి కౌంతేయ సదా తద్భావ భావితః

-- భగవద్గీత - అక్షర పరబ్రహ్మయోగము.

అన్న ఈ ప్రమాణాన్ని స్వీకరించినా కూడా, ప్రాణప్రయాణ సమయంలో " శ్రీహరీ నీ ఈ రూపాన్ని సాక్షాత్కరింపజెయ్యి " అని కోరదగినదే.

ఈ విధంగా శ్రీ కృష్ణబలరాములు బృందావనంలో వర్షాకాలమంతా వెళ్ళబుచ్చారు. బృందావనం భూలోకంలో ఉన్నా స్వర్గాన్ని మించి సుఖసంతోషాలతో విలసిల్లింది. వేణుగాన మాధుర్యానికి పక్షులకు ఆకలి దప్పులు తెలియడం లేదు. సర్పములా గానంలో మైమరచి తమను తొక్కుకుంటూ వెళ్ళినా గ్రహించలేక తదేకధ్యానంలో ఆలకిస్తూన్నాయి.

"*శిశుర్వేత్తి పశోర్వేత్తి వేత్తి గానరసం ఫణిః*" అన్నారు గదా.

ధేనుకాసుర వధ

(కథ శ్రీకృష్ణ జన్మ ఖండము 22వ అధ్యాయం నుండియు,
బ్రహ్మపురాణం 78వ అధ్యాయం నుండి గ్రహించబడ్డది.)

ఒకానొకప్పుడు శ్రీకృష్ణబలరాములు గోపబాలకులతో ఇలా అన్నారు. " మిత్రులారా! ఇక్కడకు సమీపంలోనే తాళవనం ఉన్నదని చెప్పగా విన్నాను. అక్కడ ఆ తాళ్ళ తోపులో సారవంతమైన పచ్చిగడ్డి దట్టంగా మొలచి ఉంది. ఆ గడ్డిని మేసేందుకు గోవులు బాగా ఇష్టపడతాయి. మనకు పాలు కూడా మూడింతలు అధికంగా ఇస్తాయి. కనుక మనమంతా ఆ వనానికి గోవుల్ని తోలుకుని పోదాం" అన్నాడు. ఇంకేముంది గోపబాలురంతా పోదాం అంటే పోదామన్నారు. ఎప్పుడెప్పుడు ఆ తాళ్ళ వనం చూద్దామా అని ఉవ్విళ్ళూరారు.

ఆ తాళవృక్షాలన్నీ పక్వానికొచ్చిన తాటి పళ్ళ గెలలతో సమృద్ధిగా ఉన్నాయి. తాటాకులన్నీ దట్టంగా పరచుకొని పందిరి వేసినట్టుంది. ఆ చుట్టు ప్రక్కల అనేక దివ్య సరోవరాలున్నాయి. ఆ

తాళవనాన్ని ఆశ్రయించుకొని ధేనుకాసురుడనే ఓ రాక్షసుడు నివసిస్తునాడు. పూర్వజన్మ వాసనలచేత వాడికి గాడిద రూపంపైన ప్రీతి అధికంగా ఉండేది. అందువల్ల వాడు గాడిద రూపంలోనే సంచరిస్తూ ఉంటాడు. ఆ ధేనుకాసురుడు సింహబలుడు. వాడి బలంతో లోగడ దేవతల్ని ఎన్నోసార్లు ఓడించి పంపాడు. దూరాన్నించి చూసే వారికి వాడో కదిలే పర్వతంలా కనిపిస్తాడు. కోరలు వంకర తిరిగి నాగలిని పోలి ఉండేవి. లోతైన కళ్ళతో చూసేవారికి జగుప్స కలిగేట్లుంటుంది వాడి రూపం. ఆ తాళవనానికి వాడే రాజుగా వ్యవహరించేవాడు. వాడి కుటుంబం తప్ప కొత్తవారెవరు వనంలో అడుగుపెట్టినా వాళ్ళను వేధించుకొని తినేవాడు.

బలరామకృష్ణులతో కలసి గోపబాలురంతా గోవుల మందలను తోలుకొని ఆ వనంలో ప్రవేశించారు. కృష్ణబలరాములకు తప్ప మిగిలినవారెవ్వరికీ ధేనుకాసురుడి గూర్చి తెలియదు. వారంతా ఆ వనం చేరుకోగానే గోపబాలుర ఆనందం వెయ్యిరెట్లు పెరిగింది. శ్రీ కృష్ణునితో " శ్రీకృష్ణా! కరుణా సింధూ! దీన బంధూ! జగన్నాథా! మేమంతా బాగా ఆకలితో ఉన్నాం. బాలకులం. ఆకలి భాధ తట్టుకోలేం. కావున ఒక్క క్షణం ఆగు ఈ తాటిపండ్లు కోసుకొనితిని మా ఆకలి బాధ తీర్చుకుంటాం. అని ప్రాధేయ పద్దారు. శ్రీకృష్ణుడు బాలురతో ఇలా అన్నాడు. బాలకులారా మీరంతా నా సంరక్షణలో ఉన్నారు. మీ ఇష్టంవచ్చినట్లు ఆకలి బాధ తీర్చుకోండి. మీకు ఎటువంటి కష్టం వచ్చినా నేను మిమ్మల్ని ఆదుకుంటాను. తాటి ఫలాలన్ని బాగా పండిపోయి ఉన్నాయి. వృక్షాన్ని పట్టుకొని గట్టిగా ఊపండి. పండ్లు వాటంతట అవే రాలి పడతాయి. మీరంతా నిర్భయంగా ఆ పండ్లన్ని తిని ఆకలి బాధ తీర్చుకోండి"అన్నాడు. కృష్ణుని నోట్లో నుండి ఆమాట వచ్చిందో లేదో బాలకులంతా ఆ వృక్షానికి చివరవరకుప్రాకి పండ్లను నేలరాల్చారు. బాలకులంతా ఘుమ ఘుమలాడే ఆ పండ్లన్నీ ఆర్తితో తిన్నారు. ఆకలి తీరినవారంతా ఆటలాడుతూ పాటలుపాడారు. కొందరు నాట్యంచేశారు. ఇంతలో భయంకరమైన రాక్షసుడొకడు వాళ్ళకు ఎదురుపడ్డాడు. అతడు గాడిద ఆకారంలో ఉండి చూసేవారికి ఓ పర్వతమే కదలి వస్తున్నట్లుగా అనిపించింది. ఆ రాక్షసుణ్ణి చూడగానే పండ్లన్నీ అక్కడేపారేసి భయంతో కృష్ణుడువున్నచోటుకు పరుగుపెట్టారు. "ఓ కృష్ణా! గోపాలా! మధుసూధనా! త్వరగా రా! మమ్మల్ని కాపాడు. వీడు మమ్మల్నందర్నీ తినేసేట్లున్నాడు. భయంతో మా పైప్రాణాలు పైనే పోతున్నాయి. ఓ బలరామా! సంకర్షణా! మమ్మల్ని ఉద్ధరించు. మా ప్రాణాలు నిలుపు ఓ మురారీ, శ్రీహరి, శ్రీకృష్ణా, దామోదరా, దీనబంధూ, గోపీశా! గోపీశ్వరా! అనంతా! నారాయణా! గుణసింధూ! సర్వోత్కర్షకా ! భయాభయాల్లోనూ, శుభా శుభాల్లోనూ, సుఖదుఖాల్లోనూ నువ్వేదిక్కు, ఓభక్తైబంధు, మేమంతా మీభక్తులం బాలకులం వచ్చి కాపాడు. దానవకులాధిపతివైన ఈ దానవుని చంపు అంటూ వేడుకున్నారు.

శ్రీకృష్ణ బలరాములు వారి దీనాలాపనను విన్నారు. భయపడవద్దని అభయ మిచ్చారు. శ్రీకృష్ణుడు బలరామునితో ! అన్నా!బలదేవా ఈ దానవుడు బలి కుమారుడు. గొప్ప బలశాలి మాత్రమేకాదు. పాపాత్ముడుకూడా కనుక మనం ఈతనిని చంపాల్సిందే. నేనిప్పుడే వీడిని సంహరించి బాలుర భయాన్ని పోగొడతాను. నువ్వు వాళ్ళందరిని తీసుకొని కొద్ది దూరంగా నిలబడు అన్నాడు. శ్రీకృష్ణుడు

చెప్పినట్లుగానే బలరాముడు బాలకులందరిని తీసుకొని దూరంగా వెళ్ళాడు. శ్రీకృష్ణుని చూడగానే ఆ దానవేంద్రుడు ఓండ్రు పెడుతూ ప్రళయాగ్నిలా నిప్పులుకక్కుతూ మీద పడ్డాడు. వారిద్దరి మధ్య పోరు ఘోరంగా సాగింది. మహా తేజస్వి అయిన ఆ దానవుడు శ్రీహరిని మ్రింగే ప్రయత్నం చేశాడేకాని వాడి వల్లకాలేదు. అంతలో బ్రహ్మతేజస్సుతో వుట్టిపడుతున్నవాడును, జగన్మోహనాకారుడును అయిన శ్రీకృష్ణపరబ్రహ్మ దర్శనం కాగానే ఆ దానవుడిలో పూర్వజన్మ స్మృతి కలిగింది. ఇతడో సామాన్య గోపబాలుడు కాడని జగత్కారకుడైన శ్రీహరి యన్న జ్ఞానం కలిగింది. తన స్వీయ వృత్తాంతమంతా అతడి కళ్ళఎదుట కనిపించింది. పరాత్పరుడైన శ్రీకృష్ణుని చూడగానే ఆ దానవుడు పరామానంద భరితుడయ్యాడు. ఆ పరాత్పరుని తత్త్వం కొద్దిగా బోధపడింది. వెంటనే శ్రీహరినుద్దేశించి ఇలా అన్నాడు. మహాత్మా! నువ్వెవరవో లీలగా నాకు గుర్తుకు వస్తోంది. నా తండ్రి అయిన బలిచక్రవర్తి యాగం చేస్తూ వుంటే దానం పుచ్చుకొన్న వామనమూర్తివి నీవే. నా తండ్రినుండి రాజ్యలక్ష్మిని హరించావు. బలి చక్రవర్తి భక్తికి పరవశుడవయ్యావు. సుతలాన్ని ప్రసాదించావు. నువ్వే సిద్ధేశ్వరుడవు. భక్తవత్సలుడవు. కృష్ణా! నన్ను త్వరగా వధించు. పాపాత్ముడను. శాపకారణంగా గార్దభరూపములో తిరుగుతున్నాను. ఈ దేహాన్ని ఛేదించి దుర్వాసమహర్షి ఇచ్చిన శాపాన్నుండి విముక్తిచెయ్యి. నీవల్లనే శాపవిముక్తు డనవుతానని మహర్షి శెలవిచ్చాడు. నీ కాల చక్రంతో నా తల నరికెయ్యి మోక్షప్రదాయకా! సద్బుద్ధిని ప్రసాదించు. వరాహరూపం ఎత్తి హిరణ్యాక్షుడ్ని చంపి భూదేవిని ఉద్ధరించావు. నృసింహరూపాన్ని దాల్చి ప్రహ్లాదుని కాపాడావు. మత్స్యావతారాన్నిదాల్చి వేదాలను కాపాడి నృపునకు జ్ఞానాన్నిచ్చి దేవతల్ని బ్రాహ్మణుల్ని కాపాడావు. ఆదిశేషునకు ఆధారభూతమైన కూర్మావతారాన్ని ధరించావు. ఈ విశ్వం అంతా నువ్వే. దశరథపుత్రుడైన రాముడవి నువ్వే. దశకంఠుని సంహరించి జానకిని ఉద్ధరించిన వాడవునువ్వే. అంశావతారం పరశురాముడవయ్యావు. అట్లాగే భగవదాంశంతో కపిలుడుగా అవతరించి తల్లికి జ్ఞాన ప్రదానం చేసి, యోగశాస్త్రాన్ని రచించావు. నరనారాయనులనే మునుల రూపంలో అవతరించినదీ నువ్వే. ధర్మసుతుడవై ధర్మాన్నుపదేశించావు. ఇప్పుడు పరిపూర్ణావతారుడుగా శ్రీకృష్ణ పరబ్రహ్మముగా జన్మించావు. గోపకులందరికి ప్రాణప్రియుడవు. రాధాదేవికి ప్రాణనాథుడవు. వసుదేవతనయుడవు. దేవకీదేవి దు:ఖాలను అంతంచేసినవాడవు. అయోని సంభూతుడవు. రాధానాథా! కురుణించు. ముక్తిని ప్రసాదించు. నీభక్తుడైన బలిచక్రవర్తి పుత్రుడను. మూర్ఖుడను. దైత్యుడను. గార్ధభయోనిలోనుండి జన్మించినవాడను. మూర్ఖుడనైన నేను నిన్ను ఏవిధంగా స్తుతించగలను? దేవదేవా! నీపాదారవిందాలను దర్శించినంతమాత్రానే పునర్జన్మఉండదు. బ్రహ్మచే స్తుతించబడే నువ్వు, ఈనాడీ ఖరాసురిడిచే స్తుతించబడుతున్నావు. ఇది పరిహాసంగా లేదా! సాధువులకు ప్రభువ్వి, జ్ఞానస్వరూపుడవగు నీకు యోగ్యా యోగ్యులిద్దరియందు సమాన కరుణ ఉంటుంది."

ఆ ఖరాసురుడు ఈ విధంగా భగవంతుని స్తుతించి భగవంతుని సమీపాన నిలబడ్డాడు. వెంటనే భగవంతుడా ఖరాసురునికి పూర్వజన్మల స్మృతులన్నింటినీ హరించాడు. ఎందువల్లనంటే, జ్ఞానవంతుని వధించడం వలన భగవంతునికి కూడా పాపం చుట్టుకుంటుంది.

విష్ణుమాయచేత ఆ దానవేంద్రుని పూర్వ స్మృతులన్నీ మరుగున పడ్డాయి. దాంతో

వాడినోటినుండి భగవద్దూషణలు ప్రారంభం అయ్యాయి. "ఓరీ! కృష్ణా! దుర్బుద్ధీ! నీకు మరణం దగ్గరపడింది. నన్ను తప్పించుకొని బ్రతికి బయటపడినవాడొక్కడూ లేడు. ప్రళయ కర్త అయిన శివుడే నన్ను చూసి భయపడ్డాడు. బ్రహ్మ, విష్ణువులు నాపేరు వింటేనే వణికిపోతారు. బాలుడవు నువ్వో లెక్కా" అంటూ శ్రీకృష్ణుని మెడపుచ్చుకొని పైకెత్తి విసిరి అవతల పారేశాడు. పడిపోయిన శ్రీకృష్ణుని పైబడి ముట్టెతో కుమ్మాడు. శ్రీకృష్ణుని స్పర్శతగలగానే వాడి దంతాలన్ని విరిగిపోయాయి. భగవత్తేజం తాకగానే వాడి ముఖం మాడిపోయినట్లై తాపంతో ముట్టెతో నేలను గీరాడు. ఆ తాపంతో శ్రీకృష్ణుని వదిలి బాలకులపైకి దుమికాడు. వాళ్ళంతా భయభ్రాంతులుకాగా, బలరాముడు వారికి అభయమిచ్చి ఆ ధేనువును తానొక్కడే ఎదుర్కొన్నాడు. బలరాముడు దానిని పిడికిలితో గుద్దగా ఆ బాధ భరించలేక మళ్ళీ శ్రీకృష్ణుని వద్దకే పరుగెత్తి శ్రీకృష్ణుని ముట్టెతో పైకిలేపి నేలపైన పడేశాడు. అప్పుడా కృష్ణుడుతాటిచెట్టునొకదానిని పెళ్ళగించి దాంతో ఆధేనువును చావమోదాడు. దాంతో అతడి దేహంనుండి రక్తం కారి మూర్ఛపోయాడు. ఇంతలోనే తేరుకొని ఒక చిన్నపాటి పర్వతాన్ని ఎత్తి శ్రీకృష్ణునిపై పడేశాడు. శ్రీకృష్ణుడా పర్వతాన్ని ఓ బంతివలే పట్టుకొని తిరిగి వాడిమీదకే విసిరేశాడు. ఈ విధంగా వారి మధ్యపోరు భీకరంగా సాగింది. అంతట శ్రీకృష్ణుడు వాడిపై కరుణచూపుతూ "ఓ దానవేంద్రా! నువ్వు నాభక్తుడైన బలిచక్రవర్తి పుత్రుడవు. నిన్ను ధన్యుణ్ణిచేస్తాను. ముక్తిపొందు. నాదర్శనమే స్వస్తి బీజము. అది ముక్తికి కారణమయింది. మనోజ్ఞము, పరమానందదాయకమూ అయిన నా పరమపదాన్నిపొందు " అని అనుగ్రహించాడు.

శ్రీకృష్ణుడు ఈ విధంగా అంటూ సుదర్శన చక్రాన్ని స్మరించాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కూడా సంహరించలేని ఆ ధేనుకాసురుణ్ణి సుదర్శనచక్రం వాని తలను శరీరంనుండి వేరుచేసింది. అతడి శిరస్సు ఎగిరి భూమిపై పడింది. అప్పుడు వాడి శరీరంలో నుండికోటి సూర్యుల ప్రకాశంతో సమానమైన తేజస్సు బయటకు వచ్చి గోలోకాన్ని చేరుకుంది. దేవతలంతా సంతోషించి పూలవాన కురిపించారు.

అంతట బాలకులంతా తాళఫలాలను తెచ్చి శ్రీకృష్ణ బలరాములకు సమర్పించుకున్నారు. ఆఫలాల్ని అంతాకలసి ఆరగించారు.

మహాశయులారా! ఈ ధేనుకాసురుణ్ణి బలరాముడు చంపినట్లుగా భాగవతంలో ఉంది.

శ్లో॥ *చరణా వపరౌ రాజన్ బలాయ ప్రాక్షిపద్రుషా,*
సతం గృహీత్వా పదయోర్భ్రామయిత్వైక పాణినా,
చిక్షేప తృణరాజాగ్రే భ్రామేణత్యక్త జీవితమ్.

--తృణరాజస్తాళః --అనివ్యాఖ్య.

బ్రహ్మపురాణంలో ఇలా ఉంది :

శ్లో॥ *గృహీత్వా భ్రామణేనైన చాంబరే గతజీవితమ్,*
తస్మి న్నేవ ప్రచిక్షేప వేగేన తృణిరాజని,

దీనిని బట్టి కూడా బలరాముడే చంపినట్లున్నది, కానీ వాని జ్ఞాతుల్ని మాత్రం కృష్ణుడే చంపినట్లున్నది.

హరివంశంలో ఇలా ఉంది :

శ్లో॥ *జఘానోరసి దైత్యేంద్రహిణేయం నిరాయుధం ।*
తాద్భ్యా మేవ సజగ్రాహ పదైంతం ర్థత్య గర్భభమ్,
ఆవర్జిత ముఖస్కంధం ప్రేరయం స్థాలమూర్ధని ।
సంభగ్నోరుకటిగ్రీవో భగ్నపృష్ఠో దురాకృతిః
ఖరస్తాలఫలైస్సార్ధం పపాత ధరణీతలే. ।
తం గతాసుం గతశ్రీకం పతితం వీక్ష్యగర్దభమ్,
జ్ఞాతీం స్తథా పరాంస్తస్య తృణరాజనిపో క్షితమ్.

– విష్ణుపర్వం–౧3 అధ్యాయం.

దీనిని బట్టి గూడా బలరాముడే చంపినట్లు స్పష్టమవుతోంది. ఒక్క శ్రీకృష్ణ జన్మఖండంలో మాత్రం శ్రీకృష్ణుడే ధేనుకాసురుణ్ణి చంపినట్లున్నది. అయితే ఇందులో ఏది ప్రమాణం అన్న ప్రశ్నరావచ్చు. శ్రీకృష్ణ జన్మఖండాన్ననుసరించి రెండో ప్రకరణంలో బలిపుత్రుడు, సాహసికునికి దుర్వాసుడు శాపమిచ్చినట్లు, శ్రీకృష్ణుని ద్వారా శాపవిముక్తిని పొందేట్లుగాను ఉన్నది. అందువల్ల శ్రీకృష్ణుడు చంపాడని అనుకోవడమే సరిపోతుందనుకోవాలి. అయినా శ్రీకృష్ణ బలరాములకు భేదం లేదు.

కావున కథా భేదాన్ని పాటించకుండా ధర్మాన్ని విడువకుండా, సదా భగవన్నామస్మరణమునే చేసుకుంటూ ముక్తిమార్గాన్ని గ్రహించాలి. భక్తులందరికీ శ్రీకృష్ణపరామాత్మ ఆయురారోగ్యైశ్వర్యములను ప్రసాదించుగాక.

ఇంద్ర యాగ విఘ్నము

(ఈ భాగాన్ని శ్రీకృష్ణ జన్మఖండం 21వ అధ్యాయము నుండి, బ్రహ్మ పురాణం 79వ అధ్యాయం నుండి, హరివంశం 16వ అధ్యాయం నుండి శ్రీ భాగవతం దశమస్కంధం 24వ అధ్యాయం నుండి, విష్ణు పురాణం నుండి గ్రహించడమైనది.)

శ్రీకృష్ణ బలరాములు బృందావనానికి చేరిన తర్వాత కొంత కాలం ప్రశాంతంగా గడచి పోయింది. భగవంతుడు తన అవతార ఫలాన్ని లోకానికిచ్చేందుకే అవతరిస్తాడు కాని కేవలం భూలోకంలో కాలక్షేపానికి అవతరించడు. కాబట్టి సందర్భానుసారంగా తను తలపెట్టిన కార్యాలను ప్రదర్శిస్తాడు. భగవత్సంకల్పాన్ని బట్టి మూల ప్రకృతి ఇతరుల చేత కూడ కొన్ని కార్యాలు చేయిస్తూ ఉంటుంది. అయితే ఆ విషయం వారు తెలుసుకోలేక అహంకారంతో తామే ఆయా కార్యాలను చేశామని విర్రవీగుతూ ఉంటారు. భగవత్సంకల్పాన్ని తెలుసుకోలేక బ్రహ్మాదులే తల్లడిల్లి పోతూ ఉంటే ఇక మనమో లెక్కా! ఒకానొక రోజున నందుడు ఇంద్ర యాగాన్ని తలపెట్టాడు. ఊళ్లో ఉన్న పెద్దలందర్నీ పిలిపించాడు. తన మనసులో మాట చెప్పాడు. అందర్నీ ఆ యాగానికి కావలసిన సామాగ్రినంతా సమకూర్చమని ఆదేశాలిచ్చాడు. యాగానికి కావలసిన దధిక్షీరఘృత, నవనీతాల వంటివన్నీ ఎవరింట్లో నుండి ఎంతెంత సమకూర్చాలో మాట్లాడుకున్నారు. ఏయే పనులు ఎవరెవరు నిర్వహించాలో నిశ్చయించుకున్నారు. నగరంలోని గోపకులు, గోపికలు, బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్రులు, వృద్ధులు, బాలలు, బాలికలందరూ భక్తి శ్రద్ధలతో ఆ యాగంలో పాలుపంచుకోవాలనుకున్నారు. యాగశాలకు స్థలం నిర్ణయమైంది. యాగం మహేంద్రుణ్ణి ఉద్దేశించి చెయ్యాలనుకున్నారు.

నందుడు స్నానం చేసి, పట్టు వస్త్రాలు ధరించి సంధ్యావందనాది నిత్య కర్మలన్నీ పూర్తి చేసుకొని యాగశాలకు పోయి యజ్ఞకర్తకు నిర్ణయించిన స్వర్ణపీఠంపైన ఆసీనుడయ్యాడు. పూజాద్రవ్యాలన్నీ వివిధ పాత్రల్లో అమర్చారు. నగరంలోని పౌరులంతా రకరకాల పదార్థాలను సేకరించుకొని యాగశాలకు చేరుకున్నారు. వారిలో బ్రహ్మతేజస్సు ఉట్టి పడే మునిపుంగవులు, శాంతరసం ఉట్టిపడే శిష్యపరివారాలు, వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణోత్తములు ఉన్నారు. గర్గ, గాలవ, శాకల్య, శాకటాయన, గౌతమ, కరుళ, కణ్వ, దాత్స్య, కాత్యాయన, సౌభరి, వామదేవ, యాజ్ఞవల్క్య, పాణిని, ఋష్యశృంగ, గౌరముఖ, భరద్వాజ, వామన, కృష్ణద్వైపాయన, శృంగి, సుమంతు, జైమిని, కచ, పరాశర, మైత్రేయ, వైశంపాయనాది మహర్షులంతా ఆ యాగానికి విచ్చేశారు. వీరు కాక బ్రాహ్మణులు, భిక్షకులు, వందిమాగధులు, రాజులు, వైశ్యులు, శూద్రులు ఆ మహోత్సవాన్ని తిలకించాలన్న ఉబలాటంతో వచ్చారు.

మహర్షులందర్నీ నందుడు సాదరంగా ఆహ్వానించాడు. వారికి ఎదురేగి వినయంగా నమస్కరించి అర్ఘ్య పాద్యాలతో పూజించి, ఉచితాసనాలపై కూర్చో పెట్టాడు. పాకశాస్త్రంలో పాండిత్యం గల నూరుగురు బ్రాహ్మణులకు వంటశాలను అప్పగించాడు. అగ్నిహోత్రాల్లో నుండి వచ్చే పొగతో యాగశాల అంతా చీకట్లు క్రమ్ముకున్నాయి. నవ్య, భవ్య పదార్థాలతో తయారైన నైవేద్యాలతో యజ్ఞశాల అంతా

పరిపూర్ణమైంది. తిలలతో చేసిన లడ్లు, చక్కెరతో నింపిన కలశాలు, గోధుమ పిండితో నింపిన ఘటములు, నేతితో నిండిన పాత్రలు, ఇవికాక మధురమైన అనేక పదార్థాలు ఒక్కొక్కటీ వెయ్యి పళ్ళాల నిండా అమర్చి అక్కడకు చేర్చారు. చెట్టుకే మాగిన అనేక జాతుల ఫలాలను బండ్ల నిండా నింపి తోలు కొచ్చారు. మంచి వస్త్రాలు, ఆభరణాలు, అనేక రకాలైన వాయిద్యాల్ని అక్కడ సిద్ధం చేశారు. యాగాన్ని చూసేందుకు వచ్చిన వారి సౌకర్యం కోసం యజ్ఞవేదికను అమర్చారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేటందుకు రక్షక భటులంతా అప్రమత్తులై ఉన్నారు. ఆ యజ్ఞాన్ని చూసేందుకు రంభ, ఊర్వశి, ఘృతాచి, మేనక, మోహిని, రతి, ప్రభావతి, భానుమతి, విప్రచిత్తి, తిలోత్తమ, చంద్రప్రభ, సుప్రభ, రత్నమాల, మదాలస, రేణుక, రమణి మొదలైన అప్సరసలంతా వచ్చి గీతాలు ఆలపించి నృత్యాలు చేశారు.

యాగానికి కావలసిన సామాగ్రినంతా సమకూర్చుకున్నారు. మిగిలిన ఏర్పాట్లన్నీ అయ్యాయి. ఆ సమయంలో కృష్ణ బలరాములు యాగశాలలోకి వచ్చారు. వారిని చూసిన సభాసదులంతా పరమానంద భరితులయ్యారు. ఆ సోదరుల ముఖారవిందాలు కూడా ప్రశాంతంగా ఉన్నాయి. కస్తూరి, అగరు, చందనాది ద్రవ్యాలతో చేసిన తిలకాన్ని నుదుట దిద్దుకున్నారు. ఆ పరిమళాలు యాగశాల అంతా వ్యాపించాయి. శ్రీకృష్ణుడు హృదయంపై కౌస్తుభమణి, రత్నమాలల్ని అలంకరించుకున్నాడు. ఆ శ్యామసుందర విగ్రహాన్ని జనులంతా కళ్ళార్పకుండా తిలకించారు.

అటువంటి శ్రీకృష్ణ పరబ్రహ్మము రాగానే విప్ర, క్షత్రియ, వైశ్య, శూద్రులు, మహర్షులు, గోపాలురు లేచి నమస్కరించారు. జ్యోతి స్వరూపుడై, సనాతనుడై ప్రకాశించే ఆ శ్రీకృష్ణుని కుశల ప్రశ్నలు వేసి పలుకరించారు. మహర్షులంతా ఆ రూపాన్ని హృదయఫలకంపైనే ముద్రించుకొని ధ్యానించారు. అంతట శ్రీకృష్ణుడు ఆ మహాయాగాన్ని చూస్తూ ఆశ్చర్యపోయినట్లు నటిస్తూ ఇలా ప్రశ్నించాడు.

శ్రీకృష్ణుడు : నందమహారాజా! సువ్రతా! ఈ మహాయాగం ఎందుకు తలపెట్టారు? ఈ యాగంలో మీరు ఏ దేవతామూర్తిని ఆరాధిస్తున్నారు? ఆ పూజాపద్ధతికేమైనా ప్రమాణాలున్నాయా? ఏ ఫలాన్ని ఆశించి ఈ యాగం చేస్తున్నారు? మీకు ఈ యాగం చేయటం వలన కలిగే ఫలం ఏ పురుషార్థానికి చెందుతుంది? అనగా ధర్మార్థకామమోక్షాల్లో ఈ యాగం వల్ల ఏ ఫలం సిద్ధిస్తుంది? ఒకవేళ ఈ యాగానికి ఏదైనా ఉపద్రవం సంభవిస్తే ఏ దేవుడికైనా కోపం వస్తుందా? అయితే ఆ దేవుడి పేరేమిటి? ఆ దేవుడికి కోపం వస్తే కలిగే అనర్థం ఏమిటి? ఆ దేవుణ్ణి సంతృప్తి పరిస్తే మనకు కలిగే ఫలం ఏమిటి? మనకు కలిగే ఆ సత్ఫలం ఈ లోకంలో అనుభవించేదా? లేక పరలోకాల్లో అనుభవించేదా? ఎందువల్లనంటే కొందరు దేవతలు ఈ లోకంలో అనుభవించ గలిగే సుఖాల్నే ఇవ్వగలరు. మరికొంత మంది పరలోక సుఖాలనే ఇవ్వగలరు. మరికొందరు దేవతలు ఈ రెండూ ఇవ్వగలరు. వేదవిహితం కాని పూజలన్నీ దుష్ఫలాల్నే ఇస్తాయని పెద్దలంటారు. ఇప్పుడు చేస్తున్న పూజ ఈ మధ్యకాలంలో సృష్టించబడిందా? లేక సనాతనాచారమా? ఈ పూజ చెయ్యడం వల్ల ఆ దేవుడు ప్రత్యక్షమవుతాడా? నువ్వు సమర్పిస్తున్న ఈ ఆహారాలన్నీ అతడు స్వీకరించి భుజిస్తాడా? ఏ పూజ చేస్తే దేవుడు స్వయంగా

వచ్చి భోజనం చేస్తాడో అటువంటి పూజల్ని చేయడం ఉత్తమం కాదా? జనార్ధనుడు బ్రాహ్మణ రూపంలో ఉంటాడు. అనగా బ్రాహ్మణుడు సంతృప్తుడైతే దేవతలంతా సంతృప్తులైనట్లే కదా! నిత్యం బ్రాహ్మణుల్ని పూజించేవారికి ఇన్ని పూజలు అవసరమా? ఎవడు విప్రుల్ని భక్తిశ్రద్ధలతో పూజిస్తాడో, అతడు దేవతలందర్నీ పూజించినవాడవుతాడు. ఎవడు దేవతలకు నైవేద్యం చేసి కూడా బ్రాహ్మణులకు భోజనం పెట్టడో అటువంటి వాని పూజ, నైవేద్యం బూడిదలో పోసిన పన్నీరవుతుంది. దేవునికి నివేదన చేసిన ఆహారాన్ని ద్విజునకు సమర్పించినట్లయితే భగవంతుడు సంతోషించి వరాలిచ్చి తన దారిన తాను పోతాడు. ఏ మూఢుడు దేవతలకు నైవేద్యం చేసి తానొక్కడే భోజనం తింటాడో, వాడు దేవుని సొమ్ము అపహరించినంత పాపాన్ని మూటకట్టుకుని నరకానికి పోతాడు. దేవదత్త నైవేద్యాన్ని తానొక్కడే భుజించరాదు. ఇంతమంది దేవతల నైవేద్యాన్ని తినడం కన్నా ఒక్క శ్రీహరి నైవేద్యాన్ని భుజించడం ఉత్తమోత్తమం. ఏ ఆహారం విష్ణువుకు అర్పించరో అది మేధ్యతరము, విశేషించి బ్రాహ్మణులకీ నీతి విశేషంగా చెప్పబడింది. ఏ బుద్ధిమంతుడు దైవానికర్పించకుండా బ్రాహ్మణునికే అర్పిస్తే దేవతలంతా ఆ బ్రాహ్మణుని ద్వారా స్వీకరించి కర్తకు స్వర్గప్రాప్తి కలిగిస్తారు. కావున బ్రాహ్మణ పూజకే ప్రాధాన్యమివ్వు. దాని వలన ఇహలోకంలోనూ, పరలోకంలో కూడా జపతపోదాన పూజాయజ్ఞాది మహోత్సవాలకన్నా విప్ర పూజయే ఉత్తమం. బ్రాహ్మణుల శరీరమంతా దేవతలకు నివాసస్థానమే. బ్రాహ్మణుల పాదాల వద్ద సకల పుణ్యతీర్థాలూ ఉంటాయి. వారి పాద ధూళి సర్వ పాపహరం. పాద ప్రక్షాళన చేసిన ఉదకాన్ని తీర్థంగా స్వీకరించడం వలన రోగాలన్నీ నశిస్తాయి. గత ఏడు జన్మలలో చేసిన పాపాలు కూడా నశిస్తాయని వేదాలు చెపుతున్నాయి. ప్రాజ్ఞుడైనా, అప్రాజ్ఞుడైనా బ్రాహ్మణుడు విష్ణు విగ్రహుడు. విష్ణువును సేవించే బ్రాహ్మణుల్ని శ్రీహరి ప్రాణాధికుడిగా భావిస్తాడు. బ్రాహ్మణుల్ని ఆలింగనం చేసుకోవడం, మాట్లాడటం, వినడం వారు భుజించిన తర్వాత భుజించడం, వారిని దర్శించడం, స్పృశించడం వంటివన్నీ పాపాలన్నింటిని నశింపజేస్తాయి. "అన్యంచ సర్వజీవేభ్యః పుణ్యార్థం దాతుమర్హతి, దత్వా విశిష్ట జీవేభ్యో విశిష్టం పుణ్యమశ్నుతే" అని శ్రీకృష్ణ జన్మఖండంలో చెప్పబడింది. అనగా అన్నం సర్వ జీవులకు సమర్పిస్తే పుణ్యం లభిస్తుంది. అదే పరిశుద్ధ జీవులకిస్తే విశిష్టమైన పుణ్యం లభిస్తుందని తాత్పర్యం. భక్తుడు తృప్తి చెందతే శ్రీహరి కూడా తృప్తి చెందుతాడు. అట్లాగే శ్రీహరి తృప్తి చెందితే సర్వదేవతలు తృప్తి చెందుతారు. అది ఎట్లాగంటే, చెట్టు మొదట్లో పోసిన నీరు కొమ్మలకు ఎట్లా చేరుతుందో అట్లాగే భగవంతునికి సమర్పించిన ద్రవ్యములన్నీ పవిత్రమవుతాయి. ఎంతమంది దేవతలకు ఏ పాటి కోపం వచ్చినా ఏమీ చెయ్యలేరు. ఇది సత్యం. ఇంకో మాట కూడా చెప్తాను. వినండి.

గోమాహాత్మ్యము :

యాగానికి మీరు సమకూర్చిన సామాగ్రిలో సగం గోవర్ధన పర్వతానికి సమర్పించండి. ఎందువల్ల నంటే, ఆ పర్వతం ఉండటం వల్లనే గోవులు వృద్ధి చెందుతున్నాయి. అందువల్ల భూలోకంలోని పర్వతాలన్నీ గోవర్ధన పర్వతం లాంటివేనని చెప్పుకోవచ్చు. ఈ పర్వత రాజము ప్రతి రోజూ పచ్చటి గడ్డిని తయారు చేసి మన గోవుల నోటికి రుచిగా అందిస్తోంది. తీర్థ స్నానాలు చేస్తే ఏ పుణ్యం

లభిస్తుందో, బ్రాహ్మణ సంతర్పణల వలన ఎటువంటి పుణ్యలోకాలు సంప్రాప్తమవుతాయో ఉపవాసాలుంటూ వ్రతాలు చెయ్యడం వలన ఎటువంటి ఫలం లభిస్తుందో, శ్రీహరి పాదసేవ చేసుకునే భక్తులకు ఎటువంటి సద్గతులు కలుగుతాయో, సత్యవాక్కు వలన ఎటువంటి ప్రయోజనం చేకూరుతుందో, యజ్ఞాల వలనా, దీక్షల వలనా ఎటువంటి సత్ఫలితాలు కలుగుతాయో, ఆ సత్ఫలితాలన్నీ గోవులకు గడ్డి వేసినంత మాత్రానే కలుగుతాయి. అంతే కాదు; ఎవడు గోవు నోటి ముందు గడ్డిని తీసివేస్తాడో అట్టి అధముడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంటుంది. అటువంటి వాడు శ్రుతుల్లో చెప్పిన విధంగా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. లేకపోతే సూర్యచంద్రులున్నంత కాలం ఆ పాపం తొలగిపోదు. గోవుల శరీర భాగాలన్నిటిలోనూ దేవతలు నివసిస్తారు. తీర్థాలన్నీ గోపాదంలో ఉంటాయని వేదాలు చెప్తున్నాయి. దాని గుహ్యములందు లక్ష్మీదేవి స్వయంగా నివసిస్తుంది. ఎవడు గోధూళిని నుదుట రాసుకుంటాడో వానికి సకల తీర్థాలలోనూ స్నానమాచరించిన ఫలం వెంటనే కలుగుతుంది. ఎక్కడ గోవులు నివశిస్తాయో ఆ ప్రదేశమే తీర్థమవుతుంది. గో బ్రాహ్మణుల్ని ఏ అధముడు హింసిస్తాడో వాడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంటుంది. శ్రీకృష్ణుడు చెప్పినదంతా విన్న నందుడిట్లా అన్నాడు.

నందుడు: వత్సా! మన మిప్పుడు తలపెట్టిన యాగం క్రొత్తది కాదు. వంశపారంపర్యంగా వస్తున్నదే. మనకు సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని మహేంద్రుడిని ప్రార్థిస్తూ ఈ యాగం చేస్తున్నాం. ఎందువల్లనంటే వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే పంటలు పండుతాయి. అనగా పంట పొలాలన్నీ భూదేవికి అలంకారాలే. పంటలు మానవులందరికీ ప్రాణాధారం. అట్లాగే గోవులకు కావలసిన గడ్డి కూడా వర్షాల వల్లనే లభిస్తుంది. అందువలన మన వ్రజల్లో ఉండే వాళ్లంతా మహేంద్రుణ్ణి పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇంద్రుని తృప్తి పరిచేందుకు ఏడాదికోసారి ఈ యాగం చేస్తూ ఉంటాం.

(ఈ భాగం బ్రహ్మపురాణం నుండి గ్రహించబడింది)

వరుణుడు జలాధిపతి. ఆ వరుణునికి ప్రభువు ఇంద్రుడు. కావున ఇంద్రుని ఆజ్ఞ చేత మేఘాలు వర్షిస్తాయి. ఆ వర్షాల వల్ల లభించే పాడిపంటలతో మనమంతా జీవిస్తున్నాం. అందుకు కృతజ్ఞులమై దేవతల్ని ఆరాధిస్తున్నాం. మనకీ గోవులు పాలిస్తున్నాయంటే ఆ వర్షాల వల్లనే గదా. గోవత్సాలన్నీ హాయిగా ఉంటూ గోసంపద పెరుగుతుందంటే అందుకు వర్షాలే కదా మూలకారణం. ఏ దేశంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయో ఆ దేశాలన్నీ సుభిక్షంగా ఉంటాయి. "యాభిరాదిత్య స్తపతిరశ్మిభిస్తాభి" అని శ్రుతి చెప్తుంది.

(ఈ భాగం శ్రీ భాగవతంలో ఇలా వివరించబడింది)

"య ఏవం విసృజేద్ధర్మం పారం పర్యాగతం నరః
కామాల్లోభాద్భయాద్వేషాత్సవై వాప్నోతి శోభనమ్" అని.

ఎవడు పరంపరగా వస్తున్న ఈ ధర్మాన్ని విడిచిపెడ్తాడో వాడు శుభాలను పొందలేడు. కుమారా! మరొక్కమాట విను. మహేంద్రుడు త్రిలోకాధిపతి. అతడి ఆజ్ఞలేకుండా మేఘాలు వర్షించవు.

మనకు గోవు లెట్లాంటివో అతడికి మేఘాలు అటువంటివి. సరిఅయిన సమయాల్లో మేఘాల ద్వారా వర్షాన్ని కురిపించి భూదేవిని తృప్తి పరుస్తున్నాడు. మహేంద్రుడు సంతృప్తుడు కాకపోతే మేఘాలు ఓవింత శబ్దాన్ని చేస్తాయి. దాన్నే మనం మేఘాలు గర్జిస్తున్నాయంటాం. మనం ఈ యజ్ఞం ద్వారా దేవేంద్రుణ్ణి తృప్తిపరుస్తున్నామని తెలుసుకో.

శ్రీకృష్ణుడు: తండ్రీ! నీ మాటలు అద్భుతంగా ఉన్నాయి. లోకులు అనుకునే ఈ ధర్మాన్ని చూసి వేదాలు నవ్వుతాయి. వర్షాలకు కారకుడు ఇంద్రుడని ఏ శాస్త్రము చెప్పడం లేదు. ఈ గొప్ప విషయాన్ని ఈనాడు నువ్వు చెప్పగా వింటున్నాను. వేదవిహితంగానిదేదీ ప్రమాణం కాదు. శ్రుతులేం చెప్తున్నాయో చెప్తాను విను. సామవేదంలో మంత్రాలు అనేక రీతుల్లో చెప్పబడ్డాయి. ఏ మంత్రంలో కూడా వర్షాలు ఇంద్రుని ప్రభావం చేత కురుస్తున్నాయని చెప్పలేదు. సూర్యుని వలనగదా వర్షాలు కురుస్తున్నాయి. ఆ వర్షాల వల్లనే పంటలు పండుతున్నాయి. వృక్షాలు అట్లాగే వర్ధిల్లి మానవాళికి పండ్ల నందిస్తున్నాయి. సూర్యుడు తన కిరణముల ద్వారా సముద్రం నుండి నీటిని గ్రహించి మళ్ళీ మేఘాల ద్వారా వర్షం భూమిపై కురిపిస్తున్నాడు. దీనిని బట్టి నీటికి కారణభూతుడు సూర్యుడని తేలుతోంది. మేఘాదులన్నీ బ్రహ్మచే సృష్టించబడ్డాయి. ప్రతి సంవత్సరం నియమిత కాలంలో మేఘాలు వర్షిస్తున్నాయి. ఈ ప్రక్రియ యుగయుగాలుగా జరుగుతోంది. ఏ కల్పంలోనైనా ఇదే తీరున భగవదిచ్ఛననుసరించి వర్షిస్తుంది. ఆ భగవదిచ్ఛ కనుక విరుద్ధమైతే ప్రతిబంధక మేర్పడుతుంది. ఇవన్నీ కర్మానుసారం ఆ విధాత సృష్టిస్తూ ఉంటాడు. దాన్నెవరూ అడ్డుకోలేరు. ఆ విధాత కూడా ఈశ్వరాజ్ఞ చేతనే చరాచర ప్రపంచాన్నంతా సృష్టిచేస్తాడు. విధాత ముందుగా భక్ష్యాన్ని సృష్టించి ఆ తర్వాతనే జీవుణ్ణి పుట్టిస్తుంటాడు. ఇది భగవంతుని స్వభావం. ఆ పరాత్పరుడు జీవుల కర్మానుసారం సుఖదుఃఖానుభవాలకై జీవులను కాలానుసారం సృజిస్తాడు. యాతనా జన్మ యందు మరణ రోగ శోక భయాల్ని, కీర్తి అపకీర్తుల్ని, పుణ్య పాపాల్ని, స్వర్గ నరకాల్ని కర్మానుసారం జీవులకు నిర్ణయిస్తాడు. భుక్తి, ముక్తి శ్రీహరి దాస్యం కూడా కర్మానుసారమే నిర్ణయించబడతాయి. మానవులకు భుక్తి, ముక్తి శ్రీహరిదాస్యం చెయ్యడం వల్లనే సంప్రాప్తమవుతాయి. బ్రహ్మకు కూడా ఫలదాత భగవంతుడే. ఏ విరాట్పురుషుని సంకల్పము వలన జగత్తులన్నీ సృష్టించబడ్డాయో, ఆది కూర్మము, శేషువు, భూమి మొదలైన తత్త్వాలన్నీ ఆ విరాట్నిర్మితాలే. ఏ మహాత్ముని ఆజ్ఞ చేత మరుత్తు, కూర్మము, శేషువును భరిస్తుందో ఆ మహాపురుషుని సంకల్పానికి తిరుగులేదు. ఆ పరమేశ్వరుని ఆజ్ఞ చేతనే ఆది శేషువు భూమిని భరిస్తోంది. ఆ భూదేవి సమస్త చరాచర ప్రపంచాన్ని భరిస్తోంది. ఆ మహాత్ముని ఆజ్ఞ చేతనే జగత్ప్రాణుడు జగత్తును కాపాడుతున్నాడు. సూర్యచంద్రులు ఆ పరమేశ్వరుని ఆజ్ఞానుసారమే ప్రకాశిస్తున్నారు. వృక్షాలన్నీ మొలవడం, పుష్పించడం, ఫలాలనివ్వడం జరుగుతోంది. సముద్రాలన్నీ తమ స్థానాలను వదలక తమ క్రింద ఉండే పదార్థాలన్నింటినీ చల్లగా కాపాడుతున్నాయి. అటువంటి పరాత్పరుణ్ణి భక్తి ప్రేమలచేత సేవించు. ఏ మహానుభావుడు మృత్యువుకే మృత్యువో అట్టి మహానుభావుని సేవించు. కాల కాలుడు విధాతకే విధాత. కావున ఆ సర్వేశ్వరుణ్ణి సర్వ శరణ్యునిగా సేవించు. ఆ కరుణానిధి నిన్ను తప్పక సంరక్షిస్తాడు. తండ్రీ! 28 మంది ఇంద్రులు నశించిన తర్వాత ఏ సనాతనునికి

ఒకరాత్రి ఒక పగలు అవుతుందో, నిర్గుణుడై, సర్వాత్ముడై, ఏ మహాపురుషునికి ఒక్కనిమిషంలో లక్షలాది బ్రహ్మలు పుట్టి నశిస్తారో, అటువంటి మహాపురుషుడు ఈ జగత్తులోనే ఉన్నపుడు ఇంద్రుణ్ణి పూజించడం హాస్యాస్పదం కాదా?

తండ్రీ! ఇంకో మాట విను. మనం అడవుల్లో నివసిస్తూ ఉంటాం. గోవుల్ని పోషించుకుంటూ జీవనయాత్ర సాగిస్తాం. అంటే గోవులే మన పాలిట దేవతలు. గోవులకు ఆహారన్నందించే వనాలు,పర్వతాల్ని మనం పూజించాలి. వ్యవసాయదారులకు వ్యవసాయం వృత్తి; వ్యాపారస్తులకు వాణిజ్యం వృత్తి; అట్లాగే గోపాలన మనకు వృత్తి. ఏ విద్య చేత ఎవడు జీవిస్తాడో ఆ విద్యయే దైవంతో సమానమని వేదాలు చెప్తున్నాయి. అట్లా కాకుండా తను జీవించే వృత్తిని కాదని మరో వృత్తిని గౌరవిస్తాడో అతడు రెంటికీ చెడ్డ రేవడవుతాడు. అందుమూలంగా ఇహానికి పరానికీ కూడా పనికిరాకుండా పోతాడు.

"యోऽన్యస్య ఫలమశ్నానః కరోత్యన్యస్య సత్క్రియా,
ద్వావనర్థే సలభతే ప్రేత్య చేహచమానవః" అని హరివంశం విష్ణు పర్వంలో చెప్పబడింది.

దేశం కృషితో కూడుకొని ఉంటుంది. అట్లాగే అడవులు దేశంలో భాగం అయినట్లుగానే పర్వతాలు కూడా అడవుల్లో భాగాలవుతాయి. కావున ఆ పర్వతాలే మనకు జీవనాధారం. కొన్ని పర్వతాలు పులులు సింహాలు మొదలైన జంతువులను పోషిస్తూ అడవుల్ని నరికేవారిని భయపెడుతూ తన్ను తాను కాపాడుకొంటూ ఉంటాయి. ఆ క్రూర జంతువులకు భయపడి అడవుల్ని నాశనం చేసేందుకు ఎవరూ సాహసించరు. అట్లాగే బ్రాహ్మణులకు మంత్ర యజ్ఞాదులు విధి లిఖితం. కర్షకులకు వ్యవసాయమే యజ్ఞం. గోపాలకులకు గోసంరక్షణమే యజ్ఞం. కాబట్టి మనం అడవుల్ని, పర్వతాల్ని పూజించాలి. మనంకూడా ఇప్పుడు ఈ పర్వతానికి యజ్ఞం చేద్దాం. వృక్షాలను, గిరి పాదాలను పూజిద్దాం. ఆ పూజ యందు మేధ్య పశువుల్ని సమర్పిద్దాం. విశాల వేదికల్ని ఏర్పాటు చేసి గోపాలురందరం కలసి యజ్ఞం చేద్దాం. ఇక మిగిలిన ఆలోచనలనన్నీ కట్టి పెట్టండి. నామాట వినండి.

గోవులన్నింటినీ పూలదండలతో అలంకరించి పర్వతానికి ప్రదక్షిణ చేయిద్దాం. శరత్కాలం వచ్చింది. జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉంది. అడవులన్నీ పచ్చికలతో దట్టంగా తివాచీలు పరచి నట్లున్నాయి. గోవులు సమృద్ధిగా పాలిస్తున్నాయి. ఎడ్లన్నీ మదంతో రంకెలు వేస్తున్నాయి. అడవులన్నీ రెట్టించిన పంటలతో సమృద్ధిగా వర్ధిల్లుతున్నాయి. సరస్సులన్నీ కమలాలతో నిండి కన్నుల పండుగగా ఉన్నాయి. మనుష్యులంతా ప్రసన్నులై ఉంటున్నారు. ఇంకో విశేషమేమంటే, వర్షాకాలం పోయి శరత్కాలం ప్రారంభమైంది. దాంతో సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని భూమిపై చాటుతున్నాడు. పక్షుల కిలకిలా రవములతోనూ, మనోహరమైన పుష్పముల సుగంధములు దశదిశల వ్యాపిస్తున్నాయి.

కావున ఓ గోపాలకులారా! శుభాలను కోరుకుంటూ మనమంతా గోవుల్ని పూజిద్దాం. పర్వతయజ్ఞాన్ని చేద్దాం. ఇంద్రుణ్ణి దేవతలంతా పూజిస్తూనే ఉంటారు గదా! మనం మానవ మాత్రులం. పర్వతాల్ని గోవుల్ని పూజించుకుందాం. నామీద నమ్మకం ఉంచి పర్వతారాధనకు పూనుకోండి. నామీద

మీకే మాత్రం అభిమానం ఉన్నా నా మాటల్ని విశ్వసించండి. గోపూజలకు పూనుకోండి. మనందరికీ తప్పక శుభం కలుగుతుంది. ఇది సత్యం.

శ్రీకృష్ణుని మాటలు విన్న నందుడు పులకించి పోయాడు. కండ్లనిండా ఆనందబాష్పాలు నిండాయి. ఏ తండ్రికైనా పుత్రుడి చేతిలో పరాజయం పొందడం కన్నా కావలసిందేముంటుంది? సభాసదులంతా శ్రీకృష్ణుని వాదాన్ని బలపరచడంతో నందుడు కూడా పర్వత యజ్ఞం చేసేందుకు అంగీకరించాడు. మొదటగా మునీంద్రులకు, పర్వతాలకు పూజలు చేశారు. ఆ తర్వాత బ్రాహ్మణులకు గోవులకు పూజలు చేశారు. పూజలు పూర్తి కాగానే మహాక్రతువును ప్రారంభించారు. జయ జయ ధ్వనుల మధ్య శంఖాలు పూరించారు. శ్రీకృష్ణుణ్ణి స్తుతించి పూజించారు. పండితులు వేదమంత్రాలు పఠించారు. వందిమాగధులు మంగళాష్టకాల్ని గట్టిగా నలుదిశలకు వ్యాపించేట్లు వినిపించారు.

శ్రీకృష్ణుడు పర్వతం వద్దకు పోగానే తన్ను రెండుగా విభజించుకున్నాడు. ఒక మూర్తిని పర్వతంలో ప్రవేశపెట్టి ఆహారాన్నంతా భుజించాడు. రెండో మూర్తితో నందుని వద్దకు పోయి " తండ్రీ! మనముందున్న పర్వతాన్ని ఏదైనా వరం కోరుకో. తప్పక నీకోరిక సిద్ధిస్తుంది" అని అన్నాడు. నందుడు పరమానంద భరితుడై చేతులు జోడించి పర్వతానికి నమస్కరించి హరిభక్తిని, హరి దాస్యాన్ని కోరుకున్నాడు. అప్పుడా పర్వతం మానవాకారాన్ని ధరించి నందుని ముందు నిలచి "నందా! నీవు కోరిన కోరిక మహోత్కృష్టమైనది. నీకా వరాన్ని ప్రసాదిస్తున్నాను" అని పలికి అంతర్ధానమయ్యాడు. ఆ తర్వాత గోపకులు, మునులు, బ్రాహ్మణులంతా కలసి అక్కడున్న పదార్థాలన్నీ పర్వతానికి నివేదించి మేధ్యపశువుల్ని బలి యిచ్చారు. ఈ క్రతువంతా ముగియగానే మేఘాలు చక్కగా వర్షించాయి. శ్రీకృష్ణుడే పర్వతరూపుడుగా మానవ రూపంలో వచ్చి పదార్థాలన్నీ ఆరగించి వెళ్ళాడు. బ్రాహ్మణులంతా తృప్తిగా భోజనం చేసి సమృద్ధిగా దక్షిణలు తీసుకొని వాళ్ళదారిన వాళ్ళు వెళ్ళారు. శ్రీకృష్ణుని అనేక విధాలుగా స్తుతించారు. శ్రీకృష్ణుడు వారందరికీ వినయ పూర్వకంగా నమస్కరించి ఆనంద పర్చాడు. గోపబాలకులతో కలసి విందులారగించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు దివ్య మాల్యానులేపనాలన్నీ ధరించి పర్వత శిఖరం పైనుండి తన దివ్యత్వాన్ని ప్రదర్శించి "సంతృప్తుడనయ్యాను" అని అన్నాడు. పర్వత శిఖరం పై శ్రీకృష్ణుని దివ్యరూపాన్ని చూసి గోపబాలురంతా సంతోషం పట్టలేక పర్వతం పైకి ప్రాకుతూ శిఖరాన్ని చేరుకుని శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళారు. శ్రీకృష్ణుడు వారందర్నీ సాదరంగా ఆహ్వానించి ప్రక్కన కూర్చోబెట్టుకొని వారందరితో కలిసి పర్వత రూపంలో ఉన్న తనకే నమస్కరించుకున్నాడు. ఆశ్చర్యపడుతూ గోపాల బాలురు, "కృష్ణా! భగవానుడా! మేమంతా నీ వశంలో ఉన్నాం. మేము ఏంచేయాలో శాసించు. మేమంతా భగవత్సేవకులం" అన్నారు. వారి మాటలు విని పర్వతం నుండి వస్తున్నట్లు శ్రీకృష్ణుడు వారితో ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు: గోపాలులారా! నేను చెప్పేది శ్రద్ధగా వినండి. మీకు మీ గోసంపద లక్షల్లో కోట్లలో వృద్ధి చెందాలంటే నామాటలు విశ్వసించండి. నేనే మీకు మీ గోవులకు కావలసినవన్నీ సమకూర్చి పెట్టే దేవతను. నా అనుగ్రహం ఉన్నంత కాలం మీకే లోటు రాదు. నన్ను మీరు ప్రతి సంవత్సరం ఇదే విధంగా పూజించండి. నా అనుగ్రహం మీకు ఎల్లప్పుడూ ఉండేలా అనుగ్రహిస్తాను. అదృశ్యంగా

మీ వెన్నంటి ఉంటూ మీరు ఏ వనాల్లో సంచరిస్తున్నా మీకూ మీ గోవులకూ ఏ ఆపదా రాకుండా కాపాడతాను. త్వరలో గోవులన్నీ దూడలతో కలసి నా వద్దకు రావాలని ఆశీర్వదిస్తున్నాను.

ఆ మాటలు వినగానే గోపబాలకులంతా సంతోషంతో గుంపులు గుంపులుగా వచ్చి పర్వతదేవతకు నీరాజనాలర్పించి పోతున్నారు. వృషభాలను వెంటబెట్టుకొని పర్వత దేవతకు ప్రదక్షిణలు చేశారు. వారి వెనుకనే తోకలు పైకెత్తుకొని గోవులు గోవత్సాలు అనుసరించాయి. బలరామకృష్ణులు కూడా వారిలో ఒకరుగా అనుసరించారు. గోపకులు, గోపికలంతా శ్రీకృష్ణుణ్ణి సాక్షాత్తూ భగవత్స్వరూపంగా భావించి సత్కరించారు.

అంతట వందిమాగధులు నందుని అనేక విధాలుగా స్తోత్రం చేసి తృప్తి పరిచారు. బ్రాహ్మణులను, మునులను నందుడు యథారీతిగ పూజించి గౌరవించాడు. డిండి అనే వంది ప్రవరుడ్ని ధన వస్తు కనక వాహనాలను సమర్పించి తృప్తి పరిచాడు. అంతట నందుడు శ్రీకృష్ణ బలరాములతో కలసి తమ నివాసానికి చేరుకున్నాడు. అప్సరసలా వేడుకలన్నీ తిలకించి ఇంద్రుని దగ్గరకు పోయి పూసగ్రుచ్చినట్లు అన్నీ వివరంగా చెప్పారు. ఈ వృత్తాంతం అంతా విన్న ఇంద్రుడు మండిపడ్డాడు. తన కోసం ప్రారంభించిన యజ్ఞాన్ని నిలిపి వెయ్యటమే కాకుండా తన్ను నిందించారన్న మాటను జీర్ణించుకోలేకపోయాడు. ఏదైనా ప్రతీకార చర్య తలపెట్టి ఆ గోపాలకులకు గట్టిగా బుద్ధి చెప్పాలనుకొన్నాడు. తను ఏమీ పట్టనట్లు ఊరుకుంటే మానవులే కాదు దేవతలు కూడా తనను లక్ష్య పెట్టరు. ఏం చెయ్యాలా అని తల పగులకొట్టుకోగా చివరకో ఆలోచన తట్టింది. వెంటనే మేఘాలన్నింటినీ వెంట బెట్టుకొని బృందావనానికి ప్రయాణమయ్యాడు. ఎప్పుడేం అవసర పడుతుందోనని దేవతలంతా తమ తమ ఆయుధాలను ధరించి ఇంద్రుని వెంట బయలు దేరారు.

మేఘ గర్జనలతోనూ, దేవతల యుద్ధనినాదాలతోనూ నంద నగరం అంతా మారు మ్రోగింది. వ్రజ వాసులంతా వణికి పోయారు. ఇదేదో ప్రళయం ముంచుకొచ్చిందని, ఇక తమకు మరణం తప్పదన్న నిర్ణయానికి వచ్చారు. ఈ గండం నుండి ఎట్లా బయట పడాలో ఎవరికీ అర్థం కాలేదు. నందాదులు కూడా భయపడి పోయారు. నందుడు యశోదాదేవిని, రోహిణీ దేవిని పిలిపించి "ఇదేదో ప్రళయం వచ్చేట్లుంది. నేను ఇక్కడే వ్రజ వాసులతో కలసి ఉంటాను. మీరిద్దరూ బలరామకృష్ణులిద్దర్నీ తీసుకొని ఎక్కడికైనా దూరంగా వెళ్ళండి. నేనూ గోపాలకులం నగరాన్ని కాపాడుకొంటూ ఉంటాం. అప్పటికీ మాకు చెయ్యి దాటిపోయిందన్న అనుమానం వస్తే మేమూ మీరున్న చోటుకే వస్తాం" అని మనస్సులో శ్రీకృష్ణుని స్మరించుకున్నాడు. అట్లాగే మహేంద్రుణ్ణి కూడా తెలిసో తెలియకో జరిగిన అపరాధాన్ని మన్నించమని ప్రార్థించాడు.

(శ్రీకృష్ణ జన్మ ఖండంలో 21వ అధ్యాయంలో ఇంద్ర స్తుతి విస్తృతంగా ఉంది.)

నందుడు ఇంద్రుని స్తుతించడం శ్రీకృష్ణుడు విన్నాడు. తండ్రిపై కోపం వచ్చింది. అయినా తమాయించుకొని తండ్రితో ఇలా అన్నాడు.

"తండ్రీ! ఎందుకు అంతగా భయపడుతున్నావు. స్తుతించ తగని వారిని ఎందుకు స్తోత్రం చేస్తున్నావు? నీ ప్రక్కన నేనుండగా నీకు భయం ఎందుకు? గోవుల్ని గోపబాలుర్నీ గోపకుల్ని

గోపికలందరూ కలసి ఒక్క క్షణం పాటు గోవర్ధన పర్వత గుహలో విశ్రాంతి తీసుకోండి. మిగిలిన పనులన్నీ నేను చక్కపెడతాను నువ్వు నిర్భయంగా ఉండు" అన్నాడు.

శ్రీకృష్ణుని మాటలు నందుడికి నందుని పరివారానికి కూడా కొండంత ధైర్యం కలిగించాయి. గోవర్ధన పర్వత గుహలో తలదాచుకోవడం కన్నా, గోవర్ధన పర్వతం క్రింద ఉండటమే మీకు క్షేమకరమనీ చెప్తూ ఆ గోవర్ధన పర్వతాన్ని ఎత్తి తన ఎడమ చేతి చిటికెన వ్రేలిపై నిలిపి ఉంచాడు. అప్పుడు నందాది గోపకులు గోపికలు గోవులు గోవత్సాలన్నీ ఆ పర్వతం క్రిందకు చేరాయి. ఇంతలో శ్రీకృష్ణుడు తన అపార మహిమ చేత ఇంద్రాదులంతా సిగ్గు పడేట్లు చేశాడు. మహామునీంద్రులంతా కొనియాడారు. గోపాంగనల శరీరాలన్నీ పులకించాయి. బ్రహ్మాండాలన్నింటినీ తన కడుపులో దాచుకున్న ఆ పరమాత్ముడు తమ పుత్రుడు గదా అని నందుని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గోపాలకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని తన ఎడమ చేతి చిటికిన వ్రేలు పై నిలిపి విలాసంగా చిరునవ్వులు చిందిస్తూ నిలబడ్డాడు.

ఈ కథను చెప్పడంలో ఒక్కొక్క గ్రంథంలో కొద్దిపాటి భేదాలున్నాయి.

1. దధార లీలయాకృష్ణశ్ఛత్రాక మివ బాలకః అని శ్రీ భాగవతంలో ఉంది.
2. సధృతస్సంగతోమేఘైర్గిరి స్సవ్యేన పాణినా – అని హరివంశంలో ఉంది.
3. సంస్తూయమాన చరితః కృష్ణ శ్శైలమధారయత్ – అని బ్రహ్మపురాణంలోనూ
4. ఇతి కృత్వామతిం కృష్ణో గోవర్ధన మహీధరం, ఉత్పాట్యైక కరే ణైవ ధారయామాస లీలయా – అని విష్ణు పురాణం
5. హరిర్దధార శైలంతం వామహస్తేన దండవత్ – అని శ్రీకృష్ణ జన్మఖండం

ఇలా చిన్న చిన్న భేదాలతో చెప్పబడ్డా కథావృత్తంలో మాత్రం తేడాల్లేవు.

గోవర్ధనోద్ధరణము

(ఈ ఘట్టం శ్రీ భాగవతం లో ఇలా ఉంది)

అథాహ భగవాన్ గోపాన్ హేఽంబతాత వ్రజౌకసః
యథోప జోషం విశత గిరివర్తం సగోధనాః
నత్రాస ఇహ వః కార్యోమద్ధస్తాద్రినిపాతనాత్,
హతవర్షభయేనాలం తత్త్రాణం విహితం హి వః

అన్న ఈ భాగవత శ్లోకాన్ని పోతన ఇలా ఆంధ్రీకరించారు.

శా॥ *బాలుం డాడుచు నాతపత్రమని సంభావించి పూగుత్తి కెం*
గేలం దాల్చినలీల లేనగవుతోఁ గృష్ణుండు తా నమ్మహా
శైలంబున్ వలకేలఁ దాల్చి విపుల చ్ఛత్రంబుగాఁ బట్టె నా
భీలా భ్రమ్యతదుశ్శిలా చకిత గోపీ గోపంక్తికిన్

వ॥ ఇట్లు గోత్రంబు ఛత్రంబుగా బట్టి గోపజనులకు గోపాల శేఖరుండిట్లనియె.

క॥ *రా తల్లి రమ్ము తండ్రీ వ్రేతలు గోపకులు రండు వినుఁ డీగర్త*
క్ష్మాతలమున నుండుఁడు గో వ్రాతముతో మీరు మీకు వలసిన యెడలన్.

శా॥ *బాలుం డీత డు కొండ దొడ్డది మహాభారంబు సైరింపఁగాఁ*
జాలండో యని దీనిక్రింద నిలువన్ శంకింపఁగాఁ బోల దీ
శైలాంభోనిధిజంతు సంయుతధరాచక్రంబుపై బడ్డ నా
కేలల్లాడదు బంధులారా! నిలుఁ డీక్రిందం బ్రమోదంబునన్

కృత్వా ఉద్ధృత్య ఛత్రాకం శిలీంద్రం యథా" అని వ్యాఖ్య. ఛత్రాకం, శిలీంధ్రము – అన్న రెండు పదాలకు అర్థం పుట్టగొడుగనే. అనగా బాలుడు పుట్టగొడుగును పుచ్చుకొన్నట్లు అవలీలగా ఎత్తి పట్టుకున్నాడని తాత్పర్యం. తెలుగులో విపుల ఛత్రము అన్న పదాన్ని ప్రయోగించారు. అనగా గోవర్ధన పర్వతాన్ని గొడుగుతో పోలిస్తేనే బాగుంటుందని మహాకవి ఊహించారు. కుండపోత వర్షానికి తట్టుకోలేని వ్రజవాసులు, గోవులకు ఆ పర్వతాన్ని ఒక గొడుగుగా శ్రీకృష్ణ పరమాత్మ ఎడమ చేతి వ్రేలితో పట్టుకున్నాడని భావం. లోకాచారాన్ని దృష్టిలో ఉంచుకొని మహాకవి ఈ ఊహ చేసి ఉంటారు. మూలంలో చెప్పినంత నిగూఢంగా చెప్పకుండా తెలుగులో చెప్పేటప్పుడు బాలురు కూడా అర్థంచేసుకొనేటట్లు చెప్పడం పోతనగారి స్వభావం. " బాలుం డీతఁడు కొండ దొడ్డది" ఇది ఆయన స్వతంత్ర శైలికి అద్దం పడుతుంది. వర్ష బాధలకు తట్టుకోలేక కుయ్యో మొర్రో అనే వ్రజ వాసులందర్నీ కొండనెత్తి ఈ కొండ క్రింద తలదాచుకోమన్నాడు. ఇతడు బాలుడు గదా! ఈ కొండను ఎంతకాలం ఎత్తి పట్టుకోగలడు? బాలుడు ఓర్చుకోలేక విడిస్తే అంతా కలసి చస్తామేమో అనిపిస్తే అనిపించి ఉండవచ్చు. అయితే ఈ బాలుడు సామాన్య బాలుడు కాడే. సాక్షాత్తూ పరమేశ్వరుడేనన్న భావం వాళ్ళలో తప్పక కలిగి ఉంటుంది. అనగా మూలంలో సూక్ష్మంగా అంటీ ముట్టనట్లు చెప్పినదాన్నే పోతనగారు తెలుగులోకి అనువదిస్తూ అందరికీ అర్థమయ్యేట్లుగా విడమర్చి చెప్పారు. అదే పోతనగారి కవిత్వంలోని నేర్పరితనం. అందుకే ఇంతగా వివరించిన మన పోతనగారి ఘనతకు మరోసారి జోహార్లర్పిద్దాం.

ఈ విధంగా శ్రీకృష్ణ పరబ్రహ్మము గోవర్ధన పర్వతాన్నెత్తి తన చిటికెన వ్రేలుపై నిలుపగా గోపకులు, గోపికలు, వృద్ధులు, బాలురు అందరూ గోవుల్ని, గోవత్సాలనూ తీసుకొని దాని క్రింద ఆశ్రయం తీసుకున్నారు. వాళ్ళంతా వాళ్ళ ఇళ్ళలో ఉన్న భావన కలిగిందే కానీ, అడవిలో పర్వతం క్రింద ఉంటున్నట్లుగా అనిపించలేదు. అయినా పర్వతం పైనుండి వర్షధారలు ఏనుగుతొండాలనుండి పడుతున్నట్లుగా పడుతున్నాయి. నేలపై పడ్డ నీరంతా మహాప్రవాహమై యమునా నది వైపు పరుగులు తీస్తూంటే యమునానది సముద్రం వైపుగా ప్రవహిస్తోంది. ఇది సాధారణ వర్షం కాదు. జల ప్రళయమా అన్నట్లు ఎక్కడా నేల కనిపించకుండా జలమయమైంది. మేఘాలనుండి వర్షధారలు పర్వతాలపై పడి పిడుగుల్లా ధ్వని చేస్తూన్నాయి. ఇంత భీభత్సం జరుగుతున్నా నందాదులంతా ఎంత మాత్రం భీతి లేని వారై నిశ్చింతగా ఉన్నారు. ఆ కారు చీకట్లో కన్ను పొడుచుకున్నా కనిపించని గాఢాంధకారం

నెలకొంది. అయినా గోవర్ధన పర్వతం క్రింద మాత్రం భగవంతుడే ప్రత్యక్షంగా ఉండటం చేత భగవత్తేజస్సు ప్రకాశించింది. నందాదులంతా భగవత్కృత్యానికి ఆశ్చర్యపోయినా బలరాముడు మాత్రం ఆ లీల తనదే కాబట్టి చిరునవ్వులు చిందిస్తూ వినోదించాడు.

అంతేకాదు మూలంలో "రాధాస్తుతం" అనడం వల్ల రాధాకృష్ణుల అవినాభావ సంబంధాన్ని కూడా సూచిస్తోంది. ఈ విధంగా లీలా శుకులు రాధాకృష్ణుల యెడల ప్రకృతి పురుష సంబంధాన్ని తెలిపారు. కొంత మంది భగవంతుడొక్కడేనని, ప్రకృతి అంటూ ప్రత్యేకంగా ఏదీ లేదని భగవంతుని ఇచ్ఛా శక్తి, ఉపాస్య దేవత అయిన ప్రకృతే లేదంటే వారంతా నేల విడిచి సాము చేస్తున్నట్లే అవుతుంది.

శ్రీహరి గోవర్ధన గిరిని ఎత్తి పట్టుకున్నప్పుడు ఇంద్రుని ఆజ్ఞచే కురుస్తున్న వర్షధారలకు పెద్ద పెద్ద బండరాళ్ళు విరిగి నేలపై పడ్డాయి. వృక్షాలు వర్షధాటికి తట్టుకోలేనివై కూకటి వ్రేళ్ళతో సహా పెళ్ళగించబడి జలప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఆకాశంలో నుండి చూస్తున్న కిన్నెర కింపురుషులంతా మేఘాలు గర్జిస్తున్నాయా లేక కొండలు విరిగి శబ్దాలు చేస్తున్నాయా? అని సందేహపడుతున్నారు. ఆ ధ్వనులకు పశు పక్ష్యాదులన్నీ విలవిలలాడిపోయాయి. ఆ విధంగా పర్వతం కంపించి దాని క్రింద వున్న గోపకులంతా భయభ్రాంతులై "కృష్ణా! ఆర్తజన శరణ్యా! దీనబంధూ! కృపాసింధూ! మమ్మల్ని కాపాడు" అని మొరపెట్టుకున్నారు. భగవంతుడు సర్వజ్ఞుడు కావున భక్తుల భయాందోళనల్ని తొలగించాలని పర్వతాన్ని కదలకుండా స్తంభింప చేశాడు. దాంతో ఆ పర్వతం నిద్రకుపక్రమించి నట్లయింది. మేఘాలు మాత్రం ఆ పర్వతం పై విడవకుండా వర్షిస్తూనే ఉన్నాయి. మహేంద్రుడీ విషయాన్ని గ్రహించాడు. తన ప్రయత్నం విఫలం అవడంతో అతడు కోపంతో అట్టుడికి పోయాడు. ఆగ్రహం కట్టలు తెంచుకుంది. "గోవర్ధన పర్వతాన్ని ఈ పిల్లవాడు చేతి మీద నిల బెట్టాడు. కాబట్టి నా వజ్రాయుధాన్ని ఉపయోగించి కృష్ణుడి చేతిని నరికేస్తాను. అప్పుడు పర్వతం పర్వతం క్రింద ఉన్న వాళ్ళూ నాశనమవుతారు" అని మనసులో అనుకున్నాడో లేదో భగవంతుడు అతడి ఆలోచనల్ని పసిగట్టాడు. "నేను వజ్రాయుధాన్ని నిర్వీర్యం చెయ్యరాదు. ఎందువల్ల నంటే ఆ దివ్యాయుధం మహర్షి వెన్నెముకతో చేయబడింది. ఆ మహర్షిని అవమానించి నట్లవుతుంది కావున ఇంద్రుని చెయ్యినే లేవకుండా చేస్తాన" ని భగవంతుడు సంకల్పించాడు. అంతే మహేంద్రుడి బాహువులు రెండూ స్తంభించి పోయాయి. ఆయుధాలు ధరించి ఇంద్రుడి చుట్టూ చేరిన దేవతలక్కూడా చేతులు బిగుసుకు పోయాయి. బొమ్మల్లా ఎక్కడివారక్కడ అతుక్కుపోయారు.

ఇంద్రుడు, దేవతలూ ఈ విధంగా స్తంభింపబడటంతో వారిలో పేరుకున్న క్రోధానికి బదులు భక్తి చోటు చేసుకుంది. దాంతో బ్రహ్మాండాలన్నీ శ్రీకృష్ణమయంగా కనిపించాయి. క్రోధంతో మూసుకున్న ఇంద్రుని కళ్ళు ఇప్పుడిప్పుడే తెరుచుకుంటున్నాయి. శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని సగుణ రూపంలో దర్శించాడు. భగవానుడు పీతాంబరధారియై, రత్నాలంకారములతో భక్తానుగ్రహతత్పరుడై, విరాజిల్లే శ్రీకృష్ణ పరమాత్మను దర్శించాడు. ఆ అద్భుతాకారాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. పూర్వం గురువువద్ద నేర్చుకున్న మంత్ర రాజాన్ని అనుష్ఠానం చేశాడు. "పద్మకోశ ప్రతీకాశగ్ంం హృదయం చాప్యధోముఖం, అధోనిష్ట్యావితస్త్యాంతే నాభ్యాముపరితిష్ఠతి, తస్య మధ్యే మహానగ్నిర్విశ్వార్చిర్విశ్వతో ముఖః" అని శ్రుతి. సహస్ర పద్మములు

గలది, దేదీప్యమానమైన తేజస్సుతో కనపడింది. దాని మధ్యలో దివ్యరూపమొకదానిని దర్శించాడు. ఆ రూపము మిగుల మనోహరము, నవీన జలదాకారమూ, శ్యామసుందర విగ్రహము. భక్తి ప్రవాహంలో మునిగి చేతులు జోడించి శ్రీకృష్ణుని ఇలా ప్రార్థించాడు.

ఇంద్రుడు శ్రీకృష్ణుని స్తుతించుట

(శ్రీకృష్ణ జన్మఖండంలో ఇంద్రుడు చేసిన శ్రీకృష్ణ స్తుతి ఇలా ఉంది.)

అక్షరమై, నిరుపమానమై పరబ్రహ్మమై జ్యోతి స్వరూపంలో ప్రకాశిస్తూ ఉంటావు. సనాతన గుణాలకతీతుడవై, నిరాకారుడవై అంతము లేనివాడవై స్వేచ్ఛా విహారివైన నీకు నమస్కారము. భక్తులు ధ్యానించేందుకై అనేక నామ రూపాలను ధరిస్తూ ఒక్కొక్క యుగానికి ఒక్కొక్క తీరుగా శుక్లరక్తపీత శ్యామ వర్ణాలు దాల్చే నీకు వందనములు. కృతయుగంలో శుక్ల తేజస్వరూపుడవై వెలసిన సత్యస్వరూపుడవు నువ్వే. త్రేతాయుగంలో కుంకుమాకృతిని ధరించి, బ్రహ్మతేజస్సుతో ప్రకాశిస్తున్న పరబ్రహ్మము ద్వాపర యుగంలో, పీతవర్ణంలో, పీతవస్త్రాన్ని ధరించిన పరమాత్ముడవు నీవే. కలియుగంలో కృష్ణవర్ణమున్ను శ్రీకృష్ణ నామాన్ని ధరించు శ్రీకృష్ణ పరబ్రహ్మమైన నిన్ను ధ్యానిస్తున్నాను. శ్యామసుందర రూపాన్ని దాల్చి, నంద మహారాజు పుత్రుడవై, యశోదాదేవికి ఆనందాన్ని సమకూర్చిన ప్రభుడవై, గోపికాలోలుడవై, రాధికాప్రాణనాథుడవై, మురళీ నాదముచే లోకాలన్నిటినీ మోహింపచేసిన వాడవు, నవరత్న ఖచితభూషణాలను ధరించి సాటిలేని జగన్మోహనాకారుడవైన నీకు మ్రొక్కెదను. కోటి మన్మథుల సౌందర్యంతో శాంతుడవై, ఈశ్వరుడవై, రాధాదేవితో కూడి ఒకప్పుడు బృందావనములోనూ, మరొకప్పుడు నిర్జనారణ్యాల్లోనూ, ఒకప్పుడు రాధా వక్షస్థలంలోనూ, మరొకప్పుడు జలక్రీడలయందు ఆసక్తి గలవాడవై, మరొకప్పుడు రాధాదేవికి పాదములు వత్తుతూ, ఎల్లప్పుడూ తాంబూల చర్వణమందు ఆసక్తిచూపే వాడవు నీవు, రాధాదేవి చిరునవ్వులనే ఆహారంగా గ్రహిస్తూ, ఆమె కంఠమాలికల్ని సరిచేస్తూ మహదానందంతో ఆరాధిస్తూ రాసమండలంలో నివసిస్తూ, గోపికలతో రాసలీలలు సలుపుతూ సంచరించు నీకు వందనములు. విప్ర పత్నులు సమర్పించిన ఆహారాన్ని పరమ ప్రీతితో భుజించావు. గోప బాలకులతో కలసి తాళఫలముల నాస్వాదించావు. గోపికల వస్త్రాలను అపహరించి వ్రత ఫలం దక్కేటట్లు చేశావు. కాళీయుని మదమణచి సురసకు గోలోకాన్ని ప్రసాదించిన నీకు నమస్కారములు. అని పరిపరివిధాలుగా స్తుతించి ఇలా అన్నాడు. పూర్వం వృత్రాసురుడితో నేను యుద్ధం చెయ్యాల్సి వచ్చినప్పుడు బృహస్పతి నాకో మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రాన్నే నువ్వు బ్రహ్మకుపదేశించావని, బ్రహ్మ కుమారస్వామికి, కుమారస్వామి అంగీరసునకు, అంగీరసుడు బృహస్పతికి, బృహస్పతి నాకు ఉపదేశించాడు అని వినయంగా నివేదించుకున్నాడు.

(శ్రీ భాగవతంలో ఇలా ఉంది)

ఇంద్రుడు కొంత సేపు మౌనంగా ధ్యానం చేసి ఆ తర్వాత ఇట్లా స్తోత్రం చేశాడు. " శ్రీకృష్ణా! మహాబాహూ! జ్ఞానులకు మహదానందాన్నిచ్చే నీ రూపాన్ని దర్శించగలిగాను. నా ఆజ్ఞ చేతనే ఈ మేఘాలన్నీ కుండపోతగా వర్షించాయి. ప్రళయాన్ని సృష్టించాయి. నా ప్రయత్నాలన్నింటినీ

తృణప్రాయంగా భావించి గోపకుల్నీ గోవుల్నీ కాపాడావు. స్వామీ! పర్వాతాన్ని పైకెత్తి పట్టి గోపకులకు, గోవులకు ఆసరా కల్పించావు. నీ ప్రభావాన్ని ఎవరు మెచ్చుకోకుండా ఉండగలరు? నాకు చేరాల్సిన యజ్ఞానికి అంతరాయం కల్పించిన వారికి గుణపాఠం నేర్పాలని ఈ మేఘాల్ని ఆదేశించాను. నా ఈ దోషాన్ని మన్నించు. శ్రీకృష్ణా ! పరమేశ్వరా! నువ్వు మానవ రూపాన్ని ధరించావు. నీ వైష్ణవ తేజస్సంతా ఈ మానవ రూపంతో ప్రకటించావు. దేవకార్యాన్ని సాధించేందుకు అవతరించావు. మానవ రూపంలో అవతరించిన నిన్ను సేవించినవారంతా ధన్యులు. దేవతలకు నువ్వే రక్షకుడవు. సర్వలోకాధిపతివైన నీవు సనాతనుడవు. దేవతల కార్యాలను సాధించకలవాడు మరొకడు లేడు. మా అందరికీ నీవే దిక్కు. గరుడవాహనా! ఆపదల్లో చిక్కుకున్న దేవతల్ని కాపాడేందుకు కంకణం కట్టుకున్నావు. ఇక మాకు భయమెక్కడిది? ఈ బ్రహ్మాండాలన్నీ నీ శరీరంలో ఒక భాగమే కదా? బుద్ధి చేతనూ, వయస్సు చేతనూ ఆలోచించి చూస్తే నువ్వే సాక్షాత్తూ స్వయంభువువు. కుంటివాడు పరుగెత్త లేనట్లు, నిన్నెవడు అనుకరించగలడు? పర్వతాల్లో హిమాలయాలు శ్రేష్ఠం. జలాశయాల్లో సముద్రం శ్రేష్ఠం. పక్షుల్లో గరుత్మంతుడు శ్రేష్ఠుడు. దేవతలలో నువ్వు శ్రేష్ఠుడవని వేదాలు చెప్తున్నాయి. అన్నిటి కంటే లోతైనవి సముద్రాలు, ఎత్తైనవి పర్వతాలు. నాగముల పైన భూమి. దానిపైన పార్థివ తత్త్వమనబడే మనుష్యులు ఉంటారు. మనుష్యలోకంలో ఊర్ధ్వభాగాన పక్షులు సంచరిస్తాయి. వాటిపైన సూర్యుడుంటాడు. ఆ సూర్యుణ్ణే స్వర్గద్వారమంటారు. అటువంటి సూర్యునిపైన స్వర్గం ఉంటుంది. మహాదేవా! నన్ను ఆ స్వర్గంలోనే కదా అమరాధిపతిగా నియమించావు. స్వర్గానికి పైన బ్రహ్మలోకం ఉంటుంది. అందులో బ్రహ్మర్షి గణాలుంటాయి. అక్కడ సోముడు జ్యోతి రూపంలో ప్రకాశిస్తూ ఉంటాడు. అటువంటి బ్రహ్మలోకానికి పైన గోలోకం ఉంటుంది. ఆ లోకాన్ని సాధ్యులు పాలిస్తూ ఉంటారు. అదే మహాకాశమై మహత్తరమై విరాజిల్లుతూ ఉంటుంది. దానిపైన తపోమయమైన గతి నీకే ఉంది. బ్రహ్మకు కూడా ఈ తత్త్వం తెలియక వణికి పోతున్నాడు. భూలోకానికి క్రింద దుష్కృత్యాలకు ఆలవాలమైన నాగలోకం ఉంది. అతి భయంకరమైనది. కర్మశీలురకు ఈ భూమండలం దివ్య క్షేత్రం. అదే చపల చిత్తులకు ఆకాశం వంటిది. శమ దమ వంతులకు గతి. సత్కర్మలు చేసేవారికి ఇదే స్వర్గం. బ్రహ్మతపోయుక్తులకు ఈ భూమండలమే పరాగతి అయిన బ్రహ్మలోకం. గోవులకు మాత్రమే గోలోకం ఉత్తమం. ఆ గోలోకాన్ని నువ్విప్పుడు ఇక్కడే నిర్మించావు. ఎటువంటి ఉపద్రవాలనైనా పారద్రోలి నీ ప్రభావాన్నిక్కడ నిలిపావు. ఆకాశమున ఉన్న గోవులన్నీ నీ మహత్కార్యములచేత మహదానందాన్ని చెందాయి. గోవర్ధన పర్వతం క్రింద భాగమంతా గోలోకమయిపోయింది. ఇక నుండి గోవత్సాలతో గోసంపద వృద్ధి పొందుతుంది. వృషభములచే జరిగే ఈ మహోపకారం వలన కర్షకులును, దివ్య పయస్సులచే దేవతలును, సంతృప్తి చెందుతారు. కావున నువ్వే మాకు గురువువు; ప్రాణప్రదుడవు. శ్రీకృష్ణా! ఇక నుండి మాకు ఇంద్రుడు ప్రభువు కాడు. నువ్వే మాకు ప్రభువ్వని బ్రహ్మ చెప్పమన్నాడు.

శ్రీకృష్ణా! ఇక నే చెప్పదలచింది కూడా చెప్తాను. విను. నాచే సమర్పించబడిన ప్రయః ప్రపూర్ణ కాంచన ఘటములతో అభిషేకించబడే నేను ఇంద్రుడనైతే నీవు గోవులకు ఇంద్రుడవు. ఇకపై నిన్ను అంతా గోవిందుడని పిలుస్తారు. కీర్తిస్తారు. పూజిస్తారు. నా వలన నువ్వు గోవులకు

ఇంద్రుడవు కావడం వలన నీవు ఉపేంద్రుడవని కూడా ప్రఖ్యాతి చెందుతావు. మానవులు ఏటా నాలుగు మాసములు నన్ను పూజిస్తూ ఉంటారు. అందులో రెండు మాసాలను నీకు సమర్పించు కుంటున్నాను. ఆ రెండు మాసాలను శరత్కాలమని పిలుస్తారు. మానవులు ఇకపైన నన్ను రెండు మాసాలు మాత్రమే పూజిస్తారు. ఇంద్ర ధ్వజారోహణం అయిన పిదప రెండు మాసాలు నిన్ను పూజిస్తారు. నీ పూజాకాలమైన శరత్కాలంలో నెమళ్ళు క్రేంకారం చేస్తూ విహరిస్తాయి. శరత్కాలంలో అంతా సుఖశాంతులతో వర్ధిల్లుతారు. త్రిశంకువు, అగస్త్య మహర్షి సంచరించే దక్షిణదిక్కునందు దక్షిణాయనమున సూర్యుడుండే సమయమే శరత్కాలానికి సమయమవుతుంది. ఆ సమయంలో నెమళ్ళు క్రేంకారాలతో వనాలన్నీ మారుమ్రోగుతూ ఉంటాయి. నదుల్లో ప్రవాహాలు తగ్గుముఖం పడ్తాయి. హంసలు, సార పక్షులు స్వేచ్ఛగా విహరిస్తూ ఉంటాయి. వృషభములు మదంతో బలిసి రంకెలు వేస్తాయి. గోవులు కడవల నిండా పాలిస్తాయి. భూమాతకు సమృద్ధిగా నీటినిచ్చి మేఘాలు విశ్రాంతి తీసుకుంటాయి. ఆకాశం నిర్మలమై ప్రకాశిస్తుంది. సరోవరాలన్నీ నీటితో సమృద్ధిగా ఉండి కమలములు విరగపూస్తాయి. హంసలకది ఆనంద సమయం. వ్యవసాయ క్షేత్రాలన్నీ పసిడి పంటల భారానికి ఒదిగి ఉంటాయి. వర్షాలు వెనుకబడి భూతల మంతా స్వర్గాన్ని మరిపించే టట్లుంటుంది. భూతలమంతా ఈ విధంగా స్వర్గతుల్యమై ఉంటూ ఉండగా యజ్ఞాలు తలపెట్టే వారంతా నీకు, నాకు యజ్ఞ హవిస్సులను అర్పిస్తూ ఉంటారు. ఎవరైతే ఇంద్రుడనైన నన్నూ ఉపేంద్రుడవైన నిన్నూ సత్కరిస్తారో వారంతా అన్యాయ పాలననుండి రక్షించబడతారు.

అంతట మహేంద్రుడు బంగారు పాత్రల నిండా నీరు తీసుకొని ఆ ఉపేంద్రుని అభిషేకించాడు. ఆ అభిషేకోత్సవాన్ని తిలకిస్తున్న గోవుల పొదుగులన్నీ స్రవించి ఉబికి వస్తున్న పాలతో అభిషేకం చేశాయి. ఆకాశం నుండి మేఘాలు స్వచ్ఛమైన జలాలను వర్షించి అభిషేకించాయి. వృక్షరాజాలన్నీ పుష్పవృష్టిని కురిపించి తమ భక్తిని చాటుకున్నాయి. మునీశ్వరులంతా తమ దివ్యవాక్కులతో స్తుతించారు. ఆకాశంలో దేవతలు దుందుభులు మ్రోగించారు. సముద్ర జలాలన్నీ నిర్మలమయ్యాయి. వాయు స్పర్శ మలయమారుతములతో సుఖప్రదమైంది. సూర్యకిరణాలు చంద్ర కిరణాల్లా చల్లగా స్పృశించాయి. పశు పక్ష్యాదులు సంతోషంతో నాట్యం చేశాయి. పర్వతాల్లోని ధాతువులన్నీ కాంతులు వెదజల్లాయి. ఈ విధంగా శ్రీకృష్ణాభిషేక మహోత్సవం ముల్లోకాలవారికి సంతోషాన్ని కలిగించింది. అభిషిక్తుడైన గోవిందుణ్ణి చూసి మహేంద్రుడు ఇలా అన్నాడు.

మహేంద్రుడు: కృష్ణా! గోవులయందు ప్రథమ నియోగం చెయ్యడమే నా రాకకు ప్రథమ కారణం. ఇక రెండవ ప్రార్థన ఏమంటే, లోక కంటకుడు, కౄరాతికౄరుడూ అయిన కంసుని సంహరించు. కేశి మొదలైన దానవులందర్నీ సమూలంగా సంహరించి భూమండలాన్నంతా పరిపాలించు.

ఇంకొక్క మనవి. నా అంశన కుంతీ గర్భమందు నీ మేనత్త కొడుకుగా అర్జునుడు జన్మించాడు. నాయందు కృపచూపినట్లే అతడి యందు కూడా నీ అనురాగం చూపి కాపాడుతూ ఉండు. నువ్వు చెప్పినట్లే నడుచుకోవడం వలన అత్యధికమైన కీర్తిప్రతిష్ఠల్ని పొందగలడు. నీ కరుణ లేకపోతే అతడు వర్ధిల్లలేడు. ఈ భరత ఖండ భవిష్యత్తు అంతా మీ ఇద్దరి పైనే ఆధారపడి ఉంది. కౄరాత్ములైన

రాజులందర్నీ మీరిద్దరూ సంహరించి లోక కళ్యాణం చేస్తారని మునులు దేవతలు వింటూ వుండగా ప్రతిజ్ఞ చేశాను. కావున ఓ గోవిందా! అర్జునుని నీవాడుగా చేసుకో. నువ్వు చెయ్యదగిన కార్యాలన్నీ అతడి ద్వారా చేయించుకో. గొప్ప సంగ్రామములన్నింటిలోనూ నువ్వు అతడి ప్రక్కనే ఉన్నంత కాలం మృత్యువు కూడా అతడి దగ్గరకు రాలేదు. అర్జునుని నన్నుగానే భావించి రక్షించు. నేను నీ ఆత్మలో ఆత్మను కదా! అర్జునుడు కూడా అంతే. మహాత్మా! బలిచక్రవర్తి నుండి త్రిలోకాధిపత్యాన్ని నాకిచ్చావు. నన్ను పెద్దవాడిని చేశావు. అట్లాగే సత్యమును నిలబెట్టడానికి, ధర్మాన్ని రక్షించడానికి కంకణం కట్టుకున్నావని నాకు తెలుసు. దేవతలంతా సత్యాన్నే ఆశ్రయించి ఉంటారు. కావున నా పుత్రుడైన అర్జునుని యుద్ధ సమయాల్లోనూ, శాంతి సమయాల్లో కూడా వెన్నంటి కాపాడు. ఒక్క కంసుని సంహరిస్తే మిగిలిన రాజులందర్నీ కూడా సులభంగా దారికి తీసుకురావచ్చును. శ్రీకృష్ణుడు ఇంద్రుని మాటలు విని ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు: మహేంద్రా నీవు చెప్పిన మాటలన్నీ నన్ను సంతృప్తుణ్ణి చేశాయి. దేవకార్యం సిద్ధించడానికి అర్జునుని ఆవశ్యకత ఎంతో నేనెరుగుదును. నా మేనత్త అయిన కుంతీదేవిని నేనెరుగుదును. ధర్మనిరతుడైన యుధిష్ఠిరుడు నాకు తెలుసు. వాయుదేవతాంశతో జన్మించిన భీమసేనుని నేనెరుగుదును. అశ్వనీదేవతల నుండి ప్రభవించిన నకుల సహదేవులు నాకు చాలా ఇష్టులు. ధృతరాష్ట్ర పుత్రులంతా యుద్ధోన్మాదులై ఉండటం నాకు తెలుసు. మహేంద్రా! నువ్వు నాకు క్రొత్తగా చెప్ప వలసిందేమీ లేదు. నువ్వు పోయి దేవ కార్యము నిర్వహించేందుకు స్వర్గానికి వెళ్ళు. నా ప్రక్కనున్నంత వరకు అర్జునుని ఎవ్వరూ ఏమీ చేయలేరు. అర్జునునకు శత్రువుండడు. నా మాటలు విశ్వసించి వెంటనే స్వర్గానికి వెళ్ళు.

మహేంద్రా! నీ పుత్రుడు నన్ను ఏయే కార్యములు చేయమని కోరుతాడో నేను వాటి నన్నింటినీ సేవకుని వలె చేస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు.

అంతట ఇంద్రుడు శ్రీకృష్ణునికి నమస్కరించి స్వర్గానికి వెళ్ళిపోయాడు.

(ఈ క్రింది భాగం శ్రీకృష్ణ జన్మఖండం నుండి గ్రహించబడింది)

అంతట పర్వతం క్రింద తలదాచుకున్న వ్రజ వాసులంతా కలసి బృందావనానికి పోయి సుఖంగా ఉన్నారు. ఇంద్రుడు ప్రార్థించిన తర్వాత శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని యథాస్థానంలో ఉంచగా, ఇంద్రుడు ఆకాశం నుండి చూసి సంతృప్తి చెందినవాడై స్వర్గానికి వెళ్ళిపోయాడు. పరబ్రహ్మము, సనాతనుడు అయిన శ్రీకృష్ణుని చూసిన నందుడు భక్తి పూర్వకంగా ఇలా స్తుతించాడు.

నందుడు శ్రీకృష్ణుని స్తుతించుట

బ్రహ్మణ్య దేవుడవై, గో బ్రాహ్మణ హితకరుడవై, కృష్ణుడవని, గోవిందుడవనీ పూజించబడే నీకు నమస్కారము. బ్రహ్మమై, పరమాత్మవై అనంతకోటి బ్రహ్మాండములనే గృహముగా జేసుకొనే నీకు వందనములు. మత్స్యాది రూపములకు జీవరూపుడవై, సర్వసాక్షివై నిర్లిప్తుడవై నిర్గుణుడవై నిరాకారుడవై, అతి సూక్ష్మరూపుడవై స్థూలములన్నిటికంటే స్థూలమై, సర్వేశ్వరుడవై, తేజోరూపుడవై

ప్రత్యక్ష రూపమున యోగిజనులకు కూడా ధ్యానాధ్యక్షుడివై, బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు కూడా వంద్యుడవై, నిత్య రూపుడవై నాలుగు వర్ణాలకు, నాలుగు యుగములందు నివాసభూతుడవై, శుక్ల రక్త పీత శ్యామల దేహములను యుగక్రమంబున దాల్చి, యోగివై, యోగరూపుడవై యోగిగురువై సిద్ధేశ్వరుడవై, సిద్ధ గురువై, అసమాన ప్రభావుడవై యొప్పు నీకు నమస్కారము. బ్రహ్మ విష్ణు రుద్ర శేషువు, ధర్ముడు రవి లంబోదరుడు, షడాననుడు, సనకాది మునివర్యులు కూడా నిన్ను స్తుతించలేరో, నరనారాయణాది మునులు కూడా నిన్ను వినుతించలేరో అట్టి నిన్ను జడమతులమైన నాబోటి వారు వినుతించాలనుకోవడం సాహసమేకదా? వేదములు, వాగ్దేవి, లక్ష్మీ, సరస్వతి, రాధాదేవి కూడా నిన్ను స్తుతించ లేరంటే ఇక విద్వాంసుల మాట వేరుగా చెప్పాలా? ఓ పరబ్రహ్మమా! ప్రతి క్షణం నేను చేసే అపరాధాల్ని క్షమించు. కరుణాసింధూ! దీనబంధూ! సంసార సాగరం నుండి నన్ను ఉద్ధరించు. పూర్వజన్మలలో పుణ్య క్షేత్రాలలో తపస్సు చేసి నిన్ను పుత్రునిగా పొందగలిగాను. నీ పాదకమలములందు భక్తి, దాస్యము అనుగ్రహించు. బ్రహ్మత్వం గాని, దేవత్వం గాని, సాలోక్యాది లోకాలు గాని నీ పాదసేవ ముందు సరి తూగవు. సురత్వం గాని, ఇంద్రత్వం గాని, రాజత్వంగాని, చిరంజీవత్వం గాని లెక్కచేయను. నీ దాస్యాన్నే కోరుకుంటాను. ఎవడు నీ భక్తుడో వాడు నీతో సమానం. అటువంటి నీ కరుణను ఏమని వర్ణించగలను? మహానుభావా! నా పూర్వ జన్మ సుకృతముల చేత నీయందు భక్తి అంకురించింది. అది నశించకుండా క్షణక్షణము వృద్ధి అయ్యేట్లు అనుగ్రహించు. పరబ్రహ్మవైన నువ్వు నీ భక్తుల కోరికల్ని సఫలం చెయ్యడానికే అవతరించావు. నేను నీ దాసుడనైతే నాకు నీ దాస్యం లభిస్తుంది" అని స్తుతించి వినయంతో ఆ కృష్ణునే తదేకంగా ధ్యానిస్తూ నందుడు నిలబడ్డాడు. అంతట కృష్ణుడు ఆ స్తుతికి ప్రసన్నుడై అతడి కోరికను మన్నించాడు. ఈ నంద కృతమైన స్తోత్రాన్ని పఠించిన వారికి దృఢభక్తి ఏర్పడి దాస్యం సంప్రాప్తమవుతుంది.

దేవతలు: దేవతలు అనేక విధాలుగా ఉంటారు. కొందరు దేవతలు అల్ప ఫలాన్ని ఇవ్వగలరు. ఇంద్రాదులు ఉత్తమ ఫలాలనివ్వగలరు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాలను ప్రసాదించగలరు. ఫలములన్నీ భక్తి కర్మానుసారంగా లభిస్తాయి. ఏయే లోకాల్లో ఎటువంటి సుఖాలు అనుభవించవచ్చునో, దానికి తగిన భక్తి కుదురుతుంది. ఏ భక్తుడు సర్వ దేవతా స్వరూపుడైన ఆ విరాట్పురుషుని ఉపాసిస్తాడో ఆ భక్తుడు ఏ దేవతను ప్రార్థించినా సకల పురుషార్థాలు లభిస్తాయి. కారణమేమంటే, ఆ భక్తుని చిత్తమునందు దేవతా భేదాలుండవు. ఫలానా నామ రూపాలతో భగవంతుడుంటాడని ఊహించుకొని ప్రార్థిస్తారు. వాస్తవానికి పరాత్పరుడైన ఆ భగవంతుడు ఒక్కడే అయినా భక్తుల కోసం అనేక నామ రూపాల్లో విలసిల్లుతూ ఉంటాడు. భక్తుడి దృఢవిశ్వాసం కూడా అటువంటిదే కావడం వలన సకల పురుషార్థాలను ఆయా దేవతల యందే లభించేట్లు ఆ భగవంతుడే ఏర్పరుస్తాడు. ఇది సర్వ శాస్త్ర సమ్మతము.

బ్రాహ్మణ ప్రశంస

శ్రీహరి బ్రాహ్మణ ప్రశంస చేశాడు. అనగా దాని అర్థ మేమిటి? బ్రాహ్మణులు బ్రహ్మ సాక్షాత్కారము పొందినవారు కాబట్టి పూజ్యులయ్యారు. వేదవేదాంగవిదులగు వారికే పూజ్యత్వము కాని, జన్మచే

బ్రాహ్మణుడైనందువల్ల కాదు. జ్ఞాని విద్వాంసుల కంటే పూజ్యుడు. ఎందువలన? చదువుకోవడమే కాకుండా, ఆ ప్రకారము ఆచరించి దాని అనుభవాన్ని పొందడమే ప్రధానమని మన పూర్వుల అభిప్రాయము. ఈ విషయాన్నే మనుస్మృతి కూడా వివరించి చెప్తుంది.

అజ్ఞులంటే ఏదో కొద్దిపాటి విద్య నభ్యసించినవారు. వారికంటే గ్రంథపఠనం సమగ్రంగా అభ్యసించినవారు ఉత్తములు. వారికన్నా చదివిన దాన్ని జీర్ణించుకొన్నవారు పై శ్రేణి వారికంటే ఉత్తములు. వారికంటే నధికులు గ్రంథార్థాన్నెరిగినవారు శ్రేష్ఠులు. వీరందరి కంటే దాన్ని అనుష్ఠానం చేస్తూ ఆచరించే వారు ఉత్తమోత్తములు. అని స్మృతి భావము. అంతే కాకుండా సందేహాలు వచ్చినప్పుడు ఎట్లా నిర్ణయించాలో ఇట్లా చెప్పబడింది. వేదార్థ ధర్మజ్ఞుడైన వాడు ఒక్కడైనా ఏది ధర్మమని నిర్ణయిస్తాడో అదే ధర్మమవుతుంది. వేదం తెలియని వాళ్ళు వెయ్యి మంది చెప్పినా అది ధర్మం కాదు.

దీని సారాంశ మేమంటే వేదవేదాంగాలు చదివి అర్థం తెలుసుకొని నిత్యం అనుష్ఠించే వాడే బ్రాహ్మణుడని, అటువంటి వాడే జగత్పూజ్యుడని తాత్పర్యం. అటువంటి వారిని ఆక్షేపించే వారుండరు గదా? అటువంటి బ్రాహ్మణోత్తములనే శ్రీకృష్ణుడు ప్రశంసించాడు. అటువంటివారికి దేవతా నైవేద్యాలు పెట్టాలని ఆదేశించాడు. ఎవడైతే దేవతానైవేద్యాలను అటువంటి బ్రాహ్మణుడెదురుగా ఉన్నా పెట్టకుండా వాడొక్కడే భుజిస్తాడో అటువంటి వాడు మహాపాపి అని సిద్ధాంతం చేసి చెప్పాడు. ఎవరైతే జ్ఞాని అయిన బ్రాహ్మణునికి దేవతా నైవేద్యాలు పెడతాడో అట్టి బ్రాహ్మణుని ముఖంనుండి దేవతలు భుజించి తృప్తి చెందుతారు. అట్లాగే అనేక మంది దేవతలకు నైవేద్యం పెట్టడం కన్నా విష్ణు మూర్తి ఒక్కడికి నివేదించడం ఉత్తమం. "ప్రశస్తం సర్వదేవేషు విష్ణునైవేద్య భోజనమ్" అని చెప్పబడింది. అనగా విష్ణువుకు నివేదించిన భోజనం శ్రేష్ఠమని తాత్పర్యం. ఇక్కడ విష్ణువు అంటే త్రిమూర్తుల్లో ఒకడైన విష్ణువు కాదు. సర్వవ్యాపి, సర్వాంతర్యామి, సర్వసాక్షి, సర్వకారణుడు ఎవరో ఆ పరాత్పరుడేనని భావం. ఆ పరాత్పరుడే విరాట్పురుషుడని గ్రహించాలి. ఏ నామరూపాలతో ధ్యానించినా ఆ పరాత్పరుని చేరుతుంది.

గోప్రశంస :

శ్రీకృష్ణుడు బ్రాహ్మణ ప్రశంస చేసిన తర్వాత "తండ్రీ! ఇప్పుడు మనం యాగానికి సమకూర్చుకున్న వస్తువుల్లో సగం గోవర్ధన పర్వతానికివ్వాలని చెప్తూ గోమహిమను గూర్చి ఇలా చెప్పాడు. పుణ్యకార్యాలన్నింటిలోకి ఉత్తమమైనది గోవులకు మేత వేయడం.కావున గో సంరక్షణం ఉత్తమోత్తమ సేవగా పేర్కొనబడింది. నాలుగు కాళ్ళ జంతువుల్లో గోవు జ్ఞానం గల జంతువని అందరూ అంగీకరించేదే. దానాలన్నింటిలోనూ గోదానం ఉత్తమమని పెద్దలంటారు.

ఈ విధంగా గోదానాన్ని చెప్పి దాని ఫలాలను కూడా వర్ణించి చెప్పారు. గోదానం మహాఫలం కావడానికి కారణం దానివలన కలిగే అనేక శుభఫలాలే. ఆ ఫలాలన్నీ మానవులకు అవసరం కావడం వల్ల దానాలన్నింట్లోనూ గోదానం ప్రాచుర్యం సంతరించుకుంది. అటువంటి మహోపకారాల్ని ప్రసాదించే జంతువుకు ఏ మాత్రం అపకారం తలపెట్టినా తల్లికి అపకారం చేసినట్లుగా జనులు

భావించాలి. గోవుకు మేత వెయ్యడం కోసం గడ్డి దొంగిలించాల్సి వచ్చినా పాపం రాదని మనువు ఉపదేశిస్తున్నాడు.

గోవు కోసం గడ్డి దొంగిలించినా పాపం రాదనడంలో ఆంతర్య మేమంటే గడ్డి దొంగిలిస్తే వచ్చే పాపంకన్నా గోవుకు ఆహారాన్ని సమకూర్చడం వల్ల ఎన్నో రెట్లు పుణ్యం అధికంగా ప్రాప్తిస్తుందని మనువు ఆంతర్యం. పరాశర స్మృతి కూడా పై అర్థాన్నే సమర్థిస్తోంది. అనగా తన్ను తాను రక్షించు కోవడం కన్నా గోవును రక్షిస్తే ఫలం అధికమన్నదే పరాశరుని ఆంతర్యము. అన్ని కార్యాలలోనూ తన్ను తాను రక్షించుకోవడం అత్యంత ముఖ్యమని శాస్త్రాలన్నీ చెప్తున్నాయి. అటువంటిది గోవును ముందు రక్షించి ఆ తర్వాతే తన్ను తాను రక్షించుకోవాలని పరాశరుడు శాసిస్తున్నాడు. కాబట్టి గోవు పరమ పవిత్రమైన జంతువని, గోపూజ చేత మహత్తరమైన పుణ్యఫలాలు చేకూరుతాయని తేలుతోంది. సనాతన ధర్మాలన్నింటిలోనూ గోపూజకు అత్యంత ప్రాధాన్యమివ్వబడింది.గోశాలలు గోవులుండే ప్రదేశాలన్నీ పుణ్యతీర్థాలేనని చెప్పబడింది. గోధూళితో స్నానం చేయడం పరమ పవిత్రమని పరాశర స్మృతి చెప్తుంది.

స్నానాలు అయిదు విధాలనీ అందులో గోధూళి స్నానము వాయవ్య స్నానమని అంటారని దీని భావం. గోశాలల్లో మరణించిన వారికి ముక్తి లభిస్తుందని శ్రీహరి ఉపదేశించాడు. గోవులు నారాయణాంశతో జన్మించాయని స్మృతులన్నీ చెప్తున్నాయి. మనుష్య జాతిలో జ్ఞానులతో సమానంగా గోవును పోల్చిచెప్పడం జరిగింది. ఇంతటి గౌరవం పశుజాతిలో మరి ఏ జంతువుకైనా లభించిందా? అశ్వత్థ వృక్షం, శమీ తరువు, వటవృక్షం, గోవు వీటికి ప్రదక్షిణం చేస్తే పిశాచాది భయాలు తొలగిపోయి శుభాలు కలుగుతాయి.

వనములు - పర్వతములు :

అంతట శ్రీకృష్ణుడు గోవును పూజించాలని ఉపదేశించి అటుపిమ్మట వనాలను, పర్వతాలను పూజించాలని హరివంశము విష్ణు పర్వము 16వ అధ్యాయములో తెలుపబడింది.

ఇది సామాన్యమైన ఉపదేశం కాదు. ఇందులో అనేక విశేషార్థాలున్నాయి. ఎవరెవరు ఎక్కడ నివసిస్తూ ఉంటారో, దేని సహాయంచేత జీవనం సాగిస్తూ ఉంటారో అదే అతడికి పరమగతి అవుతుందని భావించాలి. దానినే భగవత్స్వరూపంగా తలచాలి. లేకపోతే అతడు భగవత్కరుణకు పాత్రుడు కాడు. ఎందువల్లనంటే ప్రతిజీవికి జీవితాన్ని ఆ భగవంతుడే ప్రసాదిస్తాడు. భగవత్కళ లేనిదే జీవించలేడు. మనం ఏ కొద్దిపాటి సహాయం ఎవరివల్ల పొందినా కృతజ్ఞులమై ఉండాలి. అటువంటిది సర్వ జీవులకు సర్వము ప్రసాదించే ఆ పరాత్పరుని యెడల ఎంత కృతజ్ఞులమై ఉండాలి? అట్లాకాని యెడల కృతఘ్నుడవుతాడు. గోపకులంతా వనాల్లో నివసిస్తూ ఉంటారు. గోవులే వారికి ధనం. గోవులు వనాల నాధారం చేసుకొనే జీవిస్తాయి. మనుష్యులు కూడా వనాల నుండి ఫలాలు మొదలైన వన సంపదల్ని అనుభవిస్తూ జీవిస్తారు. కావున వారంతా వనాలను పూజించక పోతే కృతఘ్నులవుతారు కదా! వ్యవసాయదారుడు భూమినే భగవంతుడని భావించాలి. గోపకులు వనాలను, పర్వతాలనే

భగవంతుడని విశ్వసించాలి. మిగిలిన అన్ని వృత్తులు ఇటువంటివే. వనములను పూజించకపోతే మనకు వచ్చే నష్టం ఏమిటి? అని భావించరాదు. ఎందువల్లనంటే వనరూపంలో ఉండే భగవంతుడే కృతఘ్నులను శిక్షిస్తాడు. అనగా మనకు దేని వలన అపకారం జరుగుతుందో అదే భగవత్స్వరూపము అని భావించాలి అన్నదే దీని సారం. ఇందు మూలంగా భగవంతుడు సర్వ వ్యాపకుడని, ఏరూపంలో ఉపకారం పొందినా అందుకు భక్తి చూపని వారు వృద్ధిలోకి రారన్నదే తాత్పర్యం. శ్రీకృష్ణుడు ఈ ఉపదేశం ద్వారా ధర్మాన్ని బోధించాడు. వృక్షాలకు కూడా ప్రాణం ఉంటుందని ఈ కాలపు శాస్త్రవేత్తలు అంగీకరించిందే; అయితే ఆ విషయాన్ని మన ప్రాచీనులు "అంతస్సంజ్ఞా భవంత్యేతే సుఖదుఃఖ సమన్వితాః" అని అన్నారు.

ఇక పర్వతాలు మాట్లాడతాయంటే వినడానికి విచిత్రంగా ఉండొచ్చు గానీ, భగవంతుడు ఏరూపంలో ఉండాలనుకొన్నా ఆ రూపంలో ఉండగలడు. కాబట్టి శ్రీకృష్ణుడే పర్వతంలో ప్రవేశించి గోపకులతో మాట్లాడాడు. ఇదంతా నందాదులను ఉద్ధరించడానికి, లోకంలో భగవద్భక్తిని నెలకొల్పడానికే భగవంతుడు ఈ నాటకమంతా ఆడాడు. అట్లాగే గోవర్ధన పర్వతాన్ని శ్రీకృష్ణుడు ఎత్తి పట్టుకోవడంలో విశేషం ఏమీ లేదు. భగవంతునికది అల్ప కార్యమే. భగవంతునికి సాధ్యాసాధ్యాలుండవు కదా. ఇంతటి మహాద్భుతాల్ని ప్రకటిస్తున్నా నందాదులు ఇంకా శ్రీకృష్ణున్ని బాలునిగా ఎందుకు భావిస్తున్నారన్న సందేహం కలుగవచ్చు. పుట్టిన ప్రతి జీవి మరణించక తప్పదన్న సత్యం మనకందరకు తెలిసిందే. అయినా మాయామోహాలలో పడి సంసారంలో చిక్కుకోవడం లేదా? ఇదీ అంతే, లోకాలన్నింటినీ మహామాయ ఎల్లవేళలా ఆవహించి ఉంటుంది: జగన్నాటకమంతా నడిపిస్తూ ఉంటుంది.

ఏది ఏమైనా ఈ శంకలేవీ భక్తికి ముక్తికి ఉపకారం చేసేవి కావు. అందువలన ఆ పరాత్పరుణ్ణి సకల దేవతా స్వరూపునిగా భావించి ధ్యానించుట మేలు. దేవతలకు ఉచ్చత్వనీచాలు ఆపాదించకుండా పరమేశ్వరుని ధ్యానించడం అన్ని యుగాల వారికి తరుణోపాయం.

"భక్తధ్యానాయ సేవాయై నానారూపధరం పరం" అన్న ఈ సూక్తి ననుసరించి కర్మానుసారం జీవులు ధ్యానిస్తూ ఉంటారు. వారిని అనుగ్రహించేందుకు భగవంతుడు ఆయా రూపాలను ధరిస్తాడని గ్రహించాలి. కాబట్టి దేవతల్లో ఉచ్చనీచాలుండవు. అటువంటి భావం ముక్తికి అడ్డుగా నిలుస్తుంది. ఎవరికి జన్మ బందీ కాదో వాళ్ళందరికీ ఇటువంటి సందేహాలే కలుగుతూ ఉంటాయి.

దుర్వాసుడు కాముకుడగుట

(ఈ కథ శ్రీకృష్ణ జన్మఖండము 24వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదుడు: మహాత్మా! నారాయణా! దుర్వాసుని చరిత్ర ఎంతో గుహ్యమైనదని అంటూ ఉంటారు. ఆ వృత్తాంతాన్ని నీ ద్వారా తెలుసుకోవాలని ఉంది.

శ్రీమన్నారాయణుడు : నారదా! దుర్వాసుని చరిత్ర అతి రహస్యము. నీకు వివరంగా చెప్తాను విను. దుర్వాస మహర్షి ఊర్ధ్వరేతస్కుడు. అయినా భార్యా సంయోగం కలిగింది. ఇంతకన్నా విచిత్రం ఏం కావాలి? ఆ విచిత్ర కథనాన్నే చెప్తాను. సావధానుడవై విను. దుర్వాసుడు తపస్సు చేసుకొనే

ఆశ్రమానికి అతి సమీపంలో మేనక సాహసికుడు స్వేచ్ఛగా విహరించ సాగారు. అప్పుడు మేనక కాలి గజ్జెల ధ్వని మహర్షి తపస్సుకు భంగం కలిగించింది. మహర్షి మనస్సు వికలమైంది. అశాంతి రేకెత్తింది. మోహపరవశుడయ్యాడు. అయినా తమాయించుకొని వారిని శపించాడు. ఆ తర్వాత కూడా మహర్షి మనస్సు కుదుట పడలేదు. మనస్సు మేనకాసాహసికుల శృంగార చేష్టల వైపే పరుగులు తీసింది. కలవరపాటు చెందిన మనస్సుతో ఎంత ప్రయత్నించినా పూర్వపు నిశ్చల స్థితికి రాలేకపోయాడు. దాంతో మహర్షి కాముకుడయ్యాడు. ఊర్ధ్వరేతస్కుడు, మహాతపశ్శాలి అయినా కూడా భగవన్మాయను తెలుసుకోలేక పోయాడు. ఎంతటి వారినైనా భగవంతుడు మోహపరచి వారి ద్వారా లోకానికో నీతిని బోధించాలన్నదే భగవంతుని ఆశయం. అనగా ఎంతటి మహర్షులకైనా మనో నిగ్రహం అంత సులభంగా అలవడదని తెలుపుటయే ఇందులో నీతి. ఆతర్వాత కథ విను.

మహర్షి జితేంద్రియుడే అయినా, కాముకుల సాంగత్య దోషం వల్ల కాముకుడయ్యాడు. మనో నిగ్రహాన్ని కోల్పోయాడు. స్త్రీ సంపర్కం కోసం పరితపించాడు. మనస్సును స్వాధీనంలోకి తెచ్చుకొని తిరిగి తపస్సు ప్రారంభించాలని విశ్వప్రయత్నం చేశాడు. కానీ, మన్మథుని ముందు తలవంచాడు. కళ్ళు మూసినా తెరచినా స్త్రీయే అతడి కెదురుగా ప్రత్యక్షమయ్యేది.

దుర్వాసుడి పరిస్థితి ఇలా ఉండగా, ఔర్వుడనే మహర్షి తన పుత్రికను తీసుకొని ఆ దారినే పోవటం తటస్థించింది. ఆ బాలిక అతిలోక సుందరి. సత్పురుషుడైన వాడిని చూసి ఆ పిల్లకు పెండ్లి చెయ్యాలని ఔర్వమహర్షి ఊరూరా తిరుగుతున్నాడు. బ్రహ్మదేవుని సృష్టిలో సృజించబడిన మొదటి వారిలో ఔర్వుడు కూడా ఒకడు. బ్రహ్మ ఊరువుల నుండి సృష్టించబడ్డాడు కాబట్టి ఆ మహర్షికి ఔర్వుడన్న పేరు సార్థకమైంది. ఆ మహర్షి జన్మించినది మొదలు తపస్సు నందే మనస్సు లగ్నంచేసి ఊర్ధ్వరేతస్కుడయ్యాడు. ఆ మహర్షి తపస్సు చేస్తూ ఉండగా అతడికో పుత్రిక కావాలని మనస్సులో కోరిక కలిగింది. వెంటనే అతడి జానువు (మోకాలు) నుండి ఓ పుత్రిక ఉదయించింది. అప్పటి నుండి ఆమె 'కందళి' అన్న పేరుతో జగద్విఖ్యాతి పొందింది. ఆమెకు బుద్ధి తెలిసినప్పటి నుండి దుర్వాసునే భర్తగా ఊహించుకుంటూ వచ్చింది. ఆమె దుర్వాసుని తప్ప వేరొక పురుషుని కలలో కూడా ఊహించుకోలేక పోయేది. మహర్షి తన పుత్రికను వెంటపెట్టుకొని దుర్వాసుని ఆశ్రమానికి వచ్చి మహర్షిని కలుసుకున్నాడు. ఎదురుగా జ్వాలాదగ్నిశిఖ వలె మహా తేజస్వియై నిలచిన ఔర్వ మహర్షిని చూసి దుర్వాసుడు ఆశ్చర్యపోతూ దిగ్గున లేచి నిలబడి నమస్కరించి మహదానందంతో అతిథి మర్యాదలు చేశాడు. ఔర్వమహర్షి కూడా పరమానందభరితుడై దుర్వాసుని కౌగలించుకొని ఇలా అన్నాడు.

ఔర్వమహర్షి: మునీంద్రా! ఈమె నా కుమార్తె కందళి. అయోజనిత. ఈమె జన్మ ఎటువంటిదో నువ్వే తెలుసుకోగలవు. మహాసౌందర్యవతి. త్రికరణశుద్ధిగా నిన్నే కోరుకుంటోంది. ఈమె సర్వగుణ సంపన్నురాలు. అయితే ఈమెలో ఒక దోషం ఉంది. అది ఏమంటే కలహాలంటే మహా ఇష్టం. కోపం వచ్చినప్పుడీమె మాటలు ఈటెల్లా కఠినంగా పొడుచుకుంటాయి. "నానా గుణ యుతం ద్రవ్యం న త్యజేదేక దోషతః" అనగా లోకంలో ఎంతటి సద్గుణ సంపన్నులైనా ఏదో ఒక్కదోషం ఉన్నదిగదా

అని దాన్ని వదులుకోరాదని దీని భావం.

ఔర్వమహర్షి మాటలు విన్న దుర్వాసుడు కందళిని పరికించి చూచాడు. ఆమె రూపలావణ్య రాశియై శరత్కాల చంద్రుని సహితం వెక్కిరించే ముఖ సౌందర్యం, వికసించిన పద్మాల వంటి కన్నులు, చిరునవ్వులొలికించే పలువరుస, దొండపండు వంటి పెదవులు గల ఆ బాలిక అందచందాలు మహర్షిని కట్టి పడేశాయి. కందళి కూడా సిగ్గుతో తలవంచుకున్నా ఓరకన్నులతో మహర్షి అందచందాలను త్రాగేసింది. దుర్వాసుడు మోహపరవశుడయ్యాడు. హృదయం కలచి వేస్తున్నా పైకి మాత్రం బిగువు చూపిస్తూ ఇలా అన్నాడు.

దుర్వాసుడు : స్త్రీ మోక్షానికి ప్రతి బంధకమని ముల్లోకాలు ఎరిగిన సత్యమే. మోహకారణం కావడం చేత తపస్సుకూ ఆటంకమే. స్త్రీ అనేది సంసారమనే చెరసాలలో సంకెళ్ళ వంటిది. స్త్రీ పాశాన్ని జ్ఞాన ఖడ్గంతో కూడా ఖండించ లేము. శంకరుని వంటి మహాత్ములే స్త్రీకి లోబడిపోయారు. భోగాలు, ఆకర్షణలన్నింటిలోకి స్త్రీ వ్యామోహాన్ని మించింది లేదు. ఇంద్రియాలు, విద్య, బుద్ధి కూడా భోగాలనుండి తప్పించుకోలేవు. సంగినీచ్ఛాయ ఆయాదేహాల్లో ఉండేదే. భోగము భోగాంతమే. దేహేంద్రియములు జీవాంతములు, దుశ్శీలుని విద్య వరించదు గదా. మనస్సు కూడా దుశ్శీలాంతమే. పైన చెప్పిన వన్నీ ఈ జీవితంతో పాటు నశించేవే. అయితే సుస్త్రీ మాత్రం ఎన్ని జన్మలెత్తినా విడచిపెట్టి పోదు. సుస్త్రీకు డెంతవరకు జీవిస్తాడో అంతవరకు జన్మఖండనము లేకుండా ఉంటుంది. అనగా జీవుడెంతవరకు బ్రతుకుతాడో అంతవరకూ ఈ రోగం సుఖంగా అనిపిస్తుంది. మహర్షీ! అన్నిటికంటే శ్రీహరి పాదపద్మాల నాశ్రయించడమే ఉత్కృష్టము. ఏ పూర్వజన్మల పాపఫలమో శ్రీకృష్ణుని పాదాలనాశ్రయించిన నాకు విఘ్నం కలిగింది. ఈ విఘ్నం ఎట్లా కలిగిందంటే, సాహసికుడనే దానవుడొకడు పుంశ్చలితో విహరిస్తుండగా వారి శృంగార చేష్టలు నాకంట పడ్డాయి. దాంతో నా తపస్సుకు విఘ్నం కలిగింది. మనస్సు చంచలమై స్త్రీవాంఛ మొదలైంది.

మునీంద్రా! నీ కుమార్తెకు వివాహంపై మనస్సు మళ్ళింది. నేనా ఊర్ధ్వరేతస్క వ్రతాన్నవలంభిస్తున్నాను. నీ కుమార్తె మనోవాంఛను ఏ విధంగా తీర్చగలను? స్త్రీ మనోవాంఛలను తీర్చలేని వాడి కన్నా లోకంలో నిందితుడు మరొకడుండడు గదా! సదాచారపరుల్లో అతడు తలెత్తుకొని తిరుగలేడు. అయినా ఎన్ని అవమానాలు ఎదురైనా, నీ ఆజ్ఞను శిరసావహించి నీ కన్యకను వివాహమాడ్తాను. "ఉపేతాం కామినీం త్యక్త్వా కాలసూత్రం వ్రజేన్నరః" అనగా తన్ను కోరి వచ్చిన కన్యను కాదని నిరాకరిస్తే కాలసూత్ర నరకం ప్రాప్తిస్తుంది. కులట అయినా సరే ఒంటరిగా వచ్చి తన కోరిక తీర్చమని కోరినప్పుడు జితేంద్రియుడైనా కూడా ధర్మహాని జరుగుతుందేమోనని ఆమెను నిరాకరిస్తే వాడు నరకానికి పోతాడు.

దుర్వాసుని మాటలు విన్న ఔర్వ మహర్షి వేదోక్తంగా తన కుమార్తెను దుర్వాసునికిచ్చి వివాహం చేశాడు. దుర్వాస మహర్షి కూడా సంతృప్తుడై ఆ కన్యకను భార్యగా స్వీకరించాడు. కన్యాదానం అయిన తర్వాత కందళి తండ్రిని కౌగలించుకొని గట్టిగా రోదించింది. ఆమె రోదన చూస్తున్న ఔర్వముని కూడా ఓ ముహూర్త కాలం నిశ్చేష్టుడయి తేరుకుని ఇలా అన్నాడు.

ఔర్వమహర్షి: అమ్మా! వేదవిహితమైనది, పరమ దుర్లభమైనది, అయిన నీతి నీకొకటి చెప్తాను, విను. కన్యకకు వివాహం అయిన తర్వాత భర్తే పరమ బంధువు. అనగా ఇహ పరలోకాల్లో ఇంతకన్నా బంధువు మరొక్కడుండడు. భర్తను మించిన స్నేహితుడుగాని, ప్రేమాస్పదుడుగాని మరొకడుండడు. భర్తే పరమ గురువు. దేవతలను పూజించడం తపస్సు చేసుకోవడం, ఉపవాసాలుండటం, జపం చేయడం పుణ్యతీర్థాలలో స్నానం చేయడం, సర్వమఖదీక్ష, భూప్రదక్షిణం, బ్రాహ్మణులను, అతిథుల్ని సేవించడం వంటి మహత్కార్యాలు చెయ్యడం వలన కలిగే పుణ్యం పతిసేవ చేయడం వలననే కలుగుతుంది. ఎప్పుడు భార్య మనస్సు కలత చెందుతుందో అప్పుడు భర్తను తలచుకోవాలి. వెంటనే తొలగిపోతుంది. అట్లాగే సుఖాల్ని కోరుకున్న మనస్సు భర్తను స్మరించగానే సుఖాలు సంప్రాప్తమవుతాయి. ఇది ప్రథమ కర్తవ్యం. పతిసేవే పరమ ధర్మం. ఇది సర్వ శాస్త్ర సమ్మతం. భర్తను నారాయణుని కంటే అధికునిగా భావించుకోవాలి. భర్త పాదాలను సేవించుకోవాలి. పరిహాసం చేత గాని, కోపంతో గాని, అనుమానం వలన గాని, ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని కటువుగా మాట్లాడరాదు. అట్లా మాట్లాడిన స్త్రీ పాపాత్మురాలవుతుంది. కామమున వాగ్యోని దుష్టయగు కామానికి వేదోక్తమైన ప్రాయశ్చిత్తం లేదు. నూరు బ్రహ్మకల్పాల పాటు నరకం ప్రాప్తిస్తుంది. ధర్మాలన్నీ బాగా తెలిసినవే అయినా భర్తతో పరుషంగా మాట్లాడే స్త్రీ నూరు జన్మలనుండి సంపాదించుకున్న పుణ్యాన్ని పోగొట్టుకుంటుంది.

ఈ విధంగా కుమార్తెకు హితోపదేశం చేసి ఔర్వుడు తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. అంతట దుర్వాసుడు కూడా భార్యతో కలసి తన కామవాంఛలన్నింటినీ యథేచ్ఛగా సాగించుకొంటూ విహరించాడు. దుర్వాసుడు పుట్టిన నాటి నుండి నేటి వరకు స్త్రీ సాంగత్యం లేని వాడే అయినా ఇప్పుడు మాత్రం కామ శాస్త్ర విశారదుడై భార్యను రతి సుఖాలతో ముంచెత్తేవాడు. రతి తంత్రములతో కూడిన బహువిధములైన శృంగార క్రీడలలో తేలియాడాడు. ఈ విధంగా కందళీ దుర్వాసులు రేయింబవళ్ళు విహరిస్తూ కొంతకాలం రతి సుఖాలన్నీ అనుభవించారు. దుర్వాసమహాముని తపస్సు వదలి గృహస్థుగా మారిపోయాడు. కందళి తన నిజ స్వభావం చేత మహర్షితో కలహం నిత్య కృత్యం అయ్యింది. అయినా మహర్షి ఎంతో ఓర్పుతో ఆమెకు అనేక విధాలుగా నీతులు బోధించేవాడు. మహర్షి బోధించే నీతులు గాని, తండ్రి చేసిన హితబోధలు గాని కందళిని ప్రభావితం చెయ్యలేకపోయాయి. తండ్రి ఎన్ని హిత వాక్యాలు బోధించినా స్వభావంచేత వచ్చే గుణం పోదు కదా. కారణం ఉన్నా లేకపోయినా కందళి రోజూ పోట్లాడుతూనే ఉండేది. ముల్లోకాలను తన కోపంతో గడగడలాడించిన దుర్వాసమహర్షికి ఎక్కడలేని సహనం ఓర్పు అలవడ్డాయి. అయినా కందళిలో మార్పు రాకపోగా ఆమె తిట్లూ శాపనార్థాలు మితిమీరిపోయాయి. పోనుపోనూ మహర్షిలో ఓర్పు నశిస్తోంది. ఒకానొకరోజున ప్రారబ్ధ కర్మము కూడా తోడవడంతో కోపాన్ని అణచుకోలేని మహర్షి కందళిని భస్మరాశి కమ్మని శపించాడు. ముని నోటి నుండి ఆ మాట బయటకు వచ్చిందో లేదో ఆమె అక్కడికక్కడే భస్మరాశి అయిపోయింది.

కందళి శరీరం భస్మరాశియై ఆత్మ మాత్రం ఆకాశంలో నిలబడి దుర్వాసునితో ఇలా అంది.

కందళి (జీవుడి రూపంలో) : నాథా! నువ్వు మహాతపస్వివి. నీకు తెలియని విషయాలు ఉండవు. సర్వజ్ఞుడవు. నీకు చెప్పదగిన దానను కాను. సరసమైన మాట గాని, పరుషమైన మాట గాని తాపం గాని, సంతాపం గాని, లోభం గాని, మోహం గాని, కామంగాని, మహాకార్యాలుగాని, నాశము గాని, దృశ్యాదృశ్యమైనదేదైనా సరే శరీర ధర్మమే గాని, ఆత్మ సంబంధమైనది కాదు. శరీరం సత్త్వ రజ స్తమో గుణాలతో కూడుకొని గుణాత్మకమైనది. ఈ మూడు గుణాలు ఎక్కడా సమానంగా ఉండవు గదా. ఒక్కొక్కప్పుడు ఒక్కోగుణం ఎక్కువగాను, మరొక్కటి తక్కువగాను ఉంటూ ఉంటాయి. సత్త్వగుణ ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మోక్షంపైనా? రజోగుణ ప్రభావం అధికంగా ఉన్నప్పుడు కర్మలపైనా? తమోగుణ ప్రభావం అధికంగా ఉన్నప్పుడు జీవహింస పైనా కోరిక కలుగుతూ ఉంటుంది. తమోగుణం కలవారిలో కోపం , అహంకారం అధికంగా ఉంటాయి. కోపం వచ్చినప్పుడు పరుషమైన మాటలు వెలువడుతూ శత్రుత్వానికి దారితీస్తుంది. ఈ కోపతాపాలు, శత్రుత్వాలన్నీ జీవునకు అంటవుగదా. జీవుడికి ఈ లోకంలో అపకారిగాని, ఉపకారిగాని, శత్రుత్వం, మిత్రత్వంగాని ఉండవు. ఎందువల్ల నంటే శత్రుత్వ మిత్రత్వాలన్నింటికీ మూలం ఇంద్రియాలు. స్త్రీలకు ప్రాణాధికుడు భర్త. అట్లాగే పురుషునికి ప్రాణాధికురాలు భార్య. అటువంటి దంపతులకు పరుషోక్తులు గాని, శత్రుత్వంగాని క్షణభంగురాలు కావాలి. నాథా! నా అపరాధాలన్నింటినీ మన్నించు. ఇప్పుడు నా గమ్యం ఏది? నేను ఎటువంటి జన్మనెత్తబోతున్నాను? నేను ముల్లోకాల్లో ఎక్కడ జన్మించినా నీ భార్యగానే జన్మించాలని కోరుకుంటున్నాను.

ఆ మాటలు విన్న దుర్వాసునికి దుఃఖమాగలేదు. క్షణకాలం నిశ్చేష్టుడై తేరుకుని ఆ దుఃఖావేశంలో ప్రాణత్యాగానికి సిద్ధపడ్డాడు. అక్కడే పద్మాసనం వేసుకొని వాయుధారణ చేయగా అప్పుడొక బ్రాహ్మణ బాలుడు అతడి ఎదుట నిలబడ్డాడు. ఆ బ్రాహ్మచారి దండాన్ని ధరించి, ఛత్రధారియై, ముఖానికి ఉత్తమమైన తిలకాన్ని దిద్దుకొని చిరునవ్వులు చిందిస్తూ నిలబడ్డాడు. ఆ బాలుడి ముఖాన బ్రహ్మతేజస్సు ఉట్టి పడుతోంది. ముక్కుపచ్చలారని బాలుడే అయినా అతడు వేదవేదాంగ పారంగతుడు, మహాజ్ఞానిగా ప్రకాశించాడు. ఆ బాలుని చూడగానే దుర్వాసమహర్షి దిగ్గున లేచి నమస్కరించి ఆసీనుడవుకమ్మని ప్రార్థించాడు. భక్తి ప్రపత్తులతో ఆర్ఘ్యపాద్యాది మర్యాదలతో అతిథిని పూజించాడు.

దుర్వాసుడి పూజలందుకొన్న ఆ బ్రాహ్మచారిని చూడగానే దుర్మాసునిలోని దుఃఖాలన్నీ నశించాయి. ముని మనస్సు తేట పడింది. అంతట ఆ వటువు మునిని చూసి వేద విహితములైన పలుకులిలా పలికాడు.

దుర్వాసునికి హితముపదేశించుట :

వటువు: సర్వజ్ఞా! గురుకృప చేత నువ్వు సర్వజ్ఞుడవయ్యావు. అయినా శోక పీడుతుడవయ్యావంటే నేనేమి మాట్లాడను? బ్రాహ్మణులకు తపస్సే పరమ ధర్మం. తపస్సు చేత వారు ముల్లోకాలను జయించగలరు. అటువంటి నువ్వు స్వధర్మాన్ని విడిచిపెట్టి ఏం చేయబోతున్నావు? ఒక్కమాట చెప్పు. ఎవరికెవరు భార్య? ఎవరికెవరు భర్త? ఇదంతా విష్ణు మాయ కాదా? నీకు భార్య ఎక్కడుంది? ఓ క్షణకాలం విష్ణుమాయచే నీకు భ్రాంతి కల్పించబడింది. నిజానికి నీకు భార్యలేదు; నువ్వు ఎవరికీ

భర్తవు కావు. వసుదేవ పుత్రికయు, శ్రీహరి సోదరియు, పార్వతి అంశతో జన్మించేదియు, సుశీలయు, చిరంజీవియు అగు సుందరి ప్రతి కల్పంలోను నీకు భార్య అవుతుంది. ఇంకా కొన్నాళ్ళ పాటు తపస్సు చెయ్యి. నువ్వు ఎవరిని తలచుకొని దుఃఖిస్తున్నావో ఆ కందళియే అరటి జాతిలో పుట్టి నీకు సర్వశుభాలు కలుగజేస్తుంది. అంతే కాదు పరమ శాంత స్వభావురాలవుతుంది. కల్పాంతం వరకు నీతో ఉంటుందని పలికి వటు రూపంలో వచ్చిన భగవంతుడు అంతర్ధానుడయ్యాడు. దాంతో మహర్షి మోహం నుండి విముక్తి పొందాడు. తపస్సుపై మనస్సు లగ్నం చేశాడు. మునిపత్ని కందళి భూలోకంలో అరటి జాతిలో జన్మించింది. దానవేంద్రుడైన సాహసికుడు శ్రీకృష్ణుని చక్రాయుధంతో భగవత్సాన్నిధ్యాన్ని పొందాడు. తిలోత్తమ కూడా బాణాసురుని పుత్రికగా జన్మించి శ్రీకృష్ణుని పౌత్రుడైన అనిరుద్ధునకు భార్య అయ్యింది.

అంతా విన్న తర్వాత శ్రీకృష్ణ తత్త్వంలో దుర్వాసుని కథ ఎందుకు చెప్పారన్న సందేహం ఎవరికైనా కలుగవచ్చు. ఇదీ శ్రీకృష్ణుని లీలయే గదా. అందువల్లనే శ్రీమన్నారాయణుడు నారదుని ద్వారా మనకు చెప్పించాడు. ఈ కథలో ఇంకొన్ని విశేషాలున్నాయి.

దుర్వాసుడు తన తపశ్శక్తి చేత సాహసికుని మేనకను శపించాడు. వారు ప్రార్థించగా తిరిగి శాపవిమోచనాన్ని కూడా అనుగ్రహించాడు. అయితే తాను జితేంద్రియుడనన్న గర్వం ఆ దుర్వాసుడిలో కలిగింది. ఎప్పుడైతే అతడిలో అహంకారం పొడసూపిందో ఆ క్షణానే సర్వాంతర్యామియు సర్వ సాక్షియు అయిన శ్రీకృష్ణ పరమాత్మ ఇతడి గర్వ మణచాలని లేనిచో ఇతడు తరించలేడని తలచాడు. మేనకకు సాహసికునికి శ్రీకృష్ణుడే శాప విమోచనం కూడా అనుగ్రహించగలడు. అయినా తాను శాపవిమోచన మివ్వలేదు. ఎందువలన? దుస్సాహసం చేస్తే దోషిగా నిలబడక తప్పదని లోకులకు ఉపదేశించాలన్నదే శ్రీకృష్ణుని ఆశయమని మనం గ్రహించాలి. ఇక రెండవది క్షణ కాలమైనా దుర్వాసుడు కాముకుల చిత్త చాంచల్యాన్ని చవి చూశాడు. మరి దాని ఫలం అనుభవించాలి గదా. అంతే కాకుండా కాముకులకు విఘ్నం కలిగించి పాపం మూటకట్టుకున్నాడు. కాబట్టి ఆ ఫలం కూడా ముని అనుభవించాల్సి ఉంది. తాను మహర్షి. ఇతరులందు దోషాలున్నా తాను క్షమించి విడిచెయ్యాలే గాని దండించరాదు. అట్లా కాకుండా ఈ ముని వారిని శపించాడు. దాంతో అందరూ పాపఫలం అనుభవించాల్సిన వారయ్యారు. ఇదే దైవ సంకల్పం.

దుర్వాసుడు కాముకులను చూసి తానూ కాముకుడయ్యాడు. చేస్తున్న తపస్సును వదిలేశాడు. అయితే ఇంతకాలం చేసిన తపస్సు నిష్ఫలం కాదు గదా. భగవత్సంకల్పం చేత ఔర్వముని తనకుమార్తె అయిన కందళిని తీసుకొని ఆత్రోవనే పోయేట్లు చేశాడు. ఔర్వముని కూడా తన కుమార్తెలో ఉండే ఒకే ఒక్క దోషాన్ని కుండపగులకొట్టినట్లు చెప్పే కన్యాదానం చేశాడు.

శ్లో॥ *యస్తు దోషవతీం కన్యామనాఖ్యాయోపపాదయేత్*
తస్య తద్వితథం కుర్యాత్కన్యాదాతుర్దు రాత్మనః

-- మనుస్మృతి

(దానం తత్ప్రత్యర్పణేన వ్యర్థం కుర్యాత్, అని వ్యాఖ్య)

అన్న స్మృతి వాక్యాన్ని దృష్టిలో ఉంచుకునే ఔర్వమహర్షి ఉన్నదున్నట్లుగా తన కుమార్తె కటువుగా మాట్లాడి కలహాలు సృష్టిస్తుందని చెప్తూనే తన్ను వివాహమాడవచ్చిన కన్యను కాదనడం దోషమన్న న్యాయాన్ని కూడా చెప్తూ దుర్వాసుణ్ణి ఇరకాటంలో పడేశాడు. ఔర్వముని కుమార్తె వివాహం అయినా కూడా ఆమెను వదలి పోలేక విలపించాడు. అనగా మహర్షు లైనా ఇటువంటి సమయాల్లో ప్రేమబంధాన్ని తెంపుకోలేరని, అది పామరులలో ఉండటం దోషం కాదని చెప్పడమే ఇందులోని నీతి. శకుంతల హస్తినాపురానికి వెళ్ళే ముందు నైష్ఠిక బ్రహ్మచర్య నిరతుడైన కణ్వ మహర్షి కూడా ఇట్లాగే విలపించాడు గదా. ఇక్కడ ఔర్వముని కుమార్తెకు ఉపదేశించిన నీతులన్నీ వనితలకు స్త్రీ ధర్మాన్ని బోధించడమేనని గ్రహించాలి. కందళి విద్యావతి అయినా, సకల ధర్మాలు తెలిసిన ప్రౌఢయే అయినా, తండ్రిచే ముందుగానే వారించబడినదే అయినా భర్తలో క్రోధాన్ని ప్రజ్వలింప జేసింది. అనగా "స్వభావో దుర్నివారః" అన్న సూక్తి యథార్థమయింది. మునికి ఒకానొక రోజున క్రోధం రానే వచ్చింది. భస్మరాశివి కమ్మని శపించాడు. కందళి దేహాన్ని వదిలిన తర్వాత జీవుని రూపంలో చెప్పిన నీతులు అత్యంత న్యాయశాస్త్ర సమ్మతమైనవి. ఆహా! ఇటువంటి జ్ఞాని అయిన భార్యను పోగొట్టుకున్నాను గదా అని దుర్వాసుడు కూడా దేహ త్యాగానికి సిద్ధపడ్డాడు. అప్పుడు శ్రీకృష్ణ పరబ్రహ్మమే వటువు రూపంలో వచ్చి దుర్వాసునికి ఉపదేశం చేశాడు. భగవానుడు వచ్చి నీకీ భార్య "మిథ్యారూపిణి" అన్న ఒక్క మాట చాలదా? సంసారం మిథ్య; భ్రాంతి అని లోకులకు ఉపదేశించి అంతర్ధానుడయ్యాడు. దాంతో దుర్వాసమహర్షి ఆ వచ్చిన బాలుడు శ్రీకృష్ణ పరబ్రహ్మమేనని గ్రహించగలిగాడు.

శ్రీకృష్ణ పరమాత్మ కొందరికి ఉపదేశం మూలంగానూ, కొందరిని వధించి, కొందరితో స్నేహ సంబంధం తోను ముక్తిని ప్రసాదిస్తూ ఉంటాడు. కావున మనం ఘోరమైన తపస్సు చెయ్యలేకపోయినా ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మమును స్మరించుకుంటూ, ఆయన కథలను పఠించుకుంటూ, ఆయన మహిమలను, లీలలను కథలుకథలుగా చెప్పుకుంటూ కాలాన్నంతా సద్వినియోగం చేసుకోవడం ఎంతైనా అవసరం.

దుర్వాసునకు శాపము కలుగుట

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 25వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదుడు: శ్రీమన్నారాయణా! జగద్రక్షకా! తన కుమార్తె మరణించిందని తెలుసుకున్న ఔర్వమహర్షి ఏం చేశాడో తెలుసుకోవాలనుకుంటున్నాను. తెలుపవలసింది.

శ్రీమన్నారాయణుడు: నారదా! ఔర్వముని సరస్వతీ నదీ తీరంలో తపస్సు చేసుకుంటున్నాడు. ఉన్నట్లుండి ఒక వస్త్రం ఆకాశంనుండి ఆయన ప్రక్కనే పడింది. ఆయనా వస్త్రాన్ని పరిశీలించి దివ్యదృష్టిచేత అంతా తెలుసుకున్నాడు. పుత్రికా శోకం మహర్షిని శోక సముద్రంలో ముంచేసింది. స్పృహ తప్పి పడిపోయాడు. శోకావేశంలో ఒళ్ళు తెలియలేదు. ఆఘమేఘాలమీద దుర్వాసుని ఆశ్రమానికి వెళ్ళాడు. "ఓ కందళీ! కుమారీ!" అని గొంతెత్తి పలుమార్లు పిలిచాడు. ఔర్వముని కంఠస్వరాన్ని గుర్తించిన దుర్వాసుడు త్వరగా బయటకు వచ్చి మామగారిని చూసి భయంతో వణికిపోయాడు.

అంతలోనే తేరుకుని చేతులు జోడించి నమస్కరించి కందళి వృత్తాంతమంతా వివరించాడు. కందళి భస్మరాశి అయిందని విన్న ఔర్వమహర్షి జ్ఞాన నిధియే అయినా కూడా దుఃఖాన్ని ఆపుకోలేక ఓ ముహూర్తకాలం నిశ్చేష్టుడై ఆ తర్వాత తేరుకొని ఇలా అన్నాడు.

ఔర్వముని: ఓ బ్రాహ్మణుడా! అత్రి వంశంలో పుట్టావు. జగత్పతికి పౌత్రుడవు. నీవు శంకరాంశాసంభూతుడవు. ఆ శంకరునికి శిష్యుడవు. వేద వేదాంగ పారంగతుడవు. సర్వజ్ఞుడవు. గుణవంతుడవు. నీ తల్లి అనసూయా దేవి. కమలాంశ సంభూతురాలు. మహాసాధ్వి. అటువంటి వారికి జన్మించిన వాడవై ఉండి కూడా, నా కుమార్తె చేసిన చిన్న దోషానికి అతి పెద్ద దండన విధించావు. గుణవంతులైన తల్లిదండ్రులకు జన్మించిన నీవు దయాహీనుడవయ్యావు. నా ప్రాణాల కంటే అధికంగా ప్రేమించిన నా కుమార్తెను నీకు సమర్పించాను. కఠినంగా మాట్లాడే స్త్రీని వదిలెయ్యాలని స్మృతి చెప్తోంది. నువ్వు వదిలేసినా ఆమెను రక్షించుకోవడానికి తండ్రిని నేనున్నాను కదా. రక్షకుడను నేను ఉన్నానని తెలిసి కూడా నువ్వామెను భస్మరాశిని చేశావు. ఆ కారణంగా నీకు అతి పెద్ద పరాభవం జరుగును గాక. ఇదే నా శాపము. అని దుఃఖిస్తూ తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

ఔర్వముని వెళ్ళిపోయిన తర్వాత దుర్వాసుడు తన దురవస్థకు ఎంతగానో విలపించాడు. తన్ను తానే ఓదార్చుకునేందుకు ప్రయత్నించాడు. చివరకు మనస్సు తపస్సుపై కేంద్రీకరించాడు. అయినా కొద్దికాలంలోనే అతడికి మహా పరాభవం జరిగింది.

అంబరీషుని చరిత్ర :

నారదుడు: నారాయణా! మహాత్మా! దుర్వాసుడు శంకరాంశ సంభూతుడు గదా. తేజస్సు చేత శంకరునితో సమానుడు. అటువంటి మునికి ఎవరివలన పరాభవం జరిగింది?

శ్రీమన్నారాయణుడు: మునివర్యా! విను. అంబరీషుడు సూర్యవంశంలో జన్మించిన రాజేంద్రుడు. శ్రీకృష్ణునికి పరమ భక్తుడు. అతడు భార్యాబిడ్డలపైన గానీ, రాజ్యంపైన గాని ప్రజల యందు గాని సత్కర్మ ఫలములందు గాని ఎంత మాత్రం ఆసక్తి లేకుండా ఉండేవాడు. నిద్రపోయినా మేల్కొని ఉన్నా కూడా అతడి మనస్సు ఎల్లప్పుడూ శ్రీకృష్ణుని పాద పద్మాలనే ధ్యానిస్తూ ఉండేది. జితేంద్రియుడు, శాంతుడు, విష్ణువ్రత పరాయణుడు కావడం వలన గొప్ప జ్ఞాని అయ్యాడు. శ్రీకృష్ణుని పూజించడం కన్నా అతడికి రెండో ధ్యాస ఉండేది కాదు. ఎటువంటి కర్మలు చేసినా ఫలాన్ని భగవదార్పణ బుద్ధితో చేస్తూ శ్రీకృష్ణ పాదారవిందములవద్దనే విడిచేసేవాడు. హరితుల్య తేజస్వి అయిన అంబరీషుడు శ్రీకృష్ణుని సుదర్శన చక్రంచే రక్షించబడుతూ ఉండేవాడు. దుష్టులు తలెత్తినప్పుడెల్లా ఆ సుదర్శన చక్రమే వారిని అణచి వేస్తూ ఉండేది. అందువల్ల ఆ రాజేంద్రునికి రాజ్యపాలన కష్టం అనిపించేది కాదు.

అంబరీషుడు ఏకాదశీ వ్రతాన్ని విధిగా ఆచరించేవాడు. ఉదయాన్నే స్నానం చేసి శ్రీకృష్ణ పరబ్రహ్మమును పూజించేవాడు. నిష్ణాతులైన బ్రాహ్మణులకు సువర్ణ రజతాదికములను దానాలిచ్చి వారికి భోజనం పెట్టించి సంతృప్తి పరచి ఆపైన తాను తినేవాడు. అంబరీషుడు ఏకాదశీ వ్రతం

చేస్తూ ఉండగా దుర్వాసమహర్షి వచ్చాడు. ఆ సమయాన ఆ మహర్షి ఆకలి దప్పికలతో అలమటించి పోయాడు. మహర్షిని చూడగానే అంబరీషుడు ఎదురేగి నమస్కరించి అర్ఘ్య పాద్యాదులతో అతిథి మర్యాదలు చేసి కూర్చోవడానికి ఆసనం చూపాడు. "మహాత్మా! దుర్వాసమహర్షీ! ఏమి ఆజ్ఞ" అని వినయంతో ప్రశ్నించాడు. అందుకు దుర్వాస మహర్షి "రాజేంద్రా! నాకు ఆకలిగా ఉంది; పట్టెడన్నం పెట్టు. చాలు. ఇదుగో నేను నదికి పోయి స్నానం, అనుష్ఠానం ముగించుకొని వస్తాను," అని చెప్పి వెళ్ళాడు. ముని ఎంతకూ రాలేదు. రాజేంద్రునికి మనసులో దిగులు పట్టుకొంది. ఎందువల్లనంటే, ద్వాదశి ఘడియలు దాటి పోతున్నాయి.. ద్వాదశి ఘడియలు దాటి భోజనం చేస్తే వ్రత భంగమవుతుంది. ఏమి చెయ్యాలా? అని చింతిస్తూ ఉండగా రాజగురువు విచ్చేశాడు. రాజువలన ముని వృత్తాంతాన్ని తెలుసుకున్నాడు. అంబరీషుని పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. అప్పుడా రాజగురువు వేద ప్రతిపాదితమైన వాక్యాలను తెలిపాడు.

రాజగురువు: రాజేంద్రా! ద్వాదశి ఘడియలు దాటిన తరువాత త్రయోదశి ఘడియల్లో ఎవడు భోజనం చేస్తాడో అతడి పుణ్యం నశిస్తుంది. అంతే కాకుండా వ్రతం ఆచరించినవాడు కూడా నశిస్తాడు. దాని వలన బ్రహ్మ హత్యా పాతకం కూడా చుట్టు కుంటుంది. ఇది వేదంలోని మాట సుమా. త్రయోదశి వచ్చిన తర్వాత ఏ వ్రతపరాయణుడు అన్నాన్ని ముట్టుకుంటాడో ఆ అన్నం సురాపానంతో సమానం. ఈ మాట బ్రహ్మయే శాసించాడు. ఏ మూఢుడు అతిథికి అన్నం పెట్టకుండా త్వరపడి భోజనం చేస్తాడో వాడు కుంభీపాక నరకానికి పోయి అక్కడ ఆరు సంవత్సరాల పాటు చండాలత్వాన్ని పొందుతాడు. అంతేకాదు. వ్యాధిపీడితుడై ప్రతిజన్మలోనూ దరిద్రుడవుతాడు. కాబట్టి రాజేంద్రా! ఇటువంటి మహాకష్టతరమైన పరిస్థితులకు శ్రుతి ప్రతిపాదితమైన ధర్మ సూక్ష్మ మొకటున్నది. ఆ ధర్మాన్ని చెప్తాను విను. శ్రీకృష్ణ పరబ్రహ్మ పాదాలను అభిషేకించిన పాదోదకాన్ని త్రాగి ఉపవాస ఫలాన్ని రక్షించుకోవచ్చు. అనగా పాదోదకం నీరే కదా! జలములను పానం చెయ్యడం వలన భోజనం చేసినట్లు కాదు.

అంబరీషుడు గురు వచనం విని శ్రీకృష్ణ పాదోదకాన్ని పానం చేశాడు. ఇంతలో దుర్వాసుడు స్నానం ముగించుకొని వచ్చాడు. జరిగినదంతా తెలుసుకున్నాడు. క్రోధావేశంతో జుట్టు పీక్కుంటూ అందులో ఒక జడను ఊడపెరికి నేలకేసి కొట్టాడు. ఆ జటలో నుంచి ఒక పురుషుడు పుట్టుకొచ్చాడు. చూడటానికి ప్రజ్వలించే అగ్నిలా భయంకరంగా ఉన్నాడు. చేతిలో ఖడ్గం ధరించి రాజు పైకి లంఘించాడు. అంతలోనే శ్రీహరి చక్రం కోటి సూర్యుల ప్రకాశంతో, కాంతిని మించిన వేగంతో వచ్చి ఆ పురుషుని ఛేదించింది. సుదర్శన చక్రాన్ని చూడగానే దుర్వాసుడు భయకంపితుడై పరుగుతీశాడు. సుదర్శన చక్రం మునిని వెంబడించింది. ముని బ్రహ్మాండాలన్నీ దాటుకుంటూ పోయి బ్రహ్మ పాదాలపై పడి శరణు కోరాడు. అప్పుడు బ్రహ్మ ఇలా అన్నాడు. "మునీంద్రా! దుర్వాసుడా! శ్రీహరి భగవానుడు ఎల్లవేళలా విష్ణు భక్తుల్ని కాపాడుతూ ఉంటాడు. అటువంటి విష్ణు భక్తుని సంహరించాలనుకున్నావు. నువ్వు చేసిన ఈ మహాపరాధాన్నుండి నిన్ను రక్షించేవాడు ముల్లోకాల్లోనూ లేరని నమ్ము. అల్పులైనా, అధికులైనా శ్రీహరి చక్రం ఎల్ల వేళలా విష్ణు భక్తుల్ని రక్షిస్తూ ఉంటుంది. ఏ మూఢుడు హరి భక్తుని

ద్వేషిస్తాడో అతడిని శ్రీహరి సంహరించి తీరుతాడు. ఎందువల్ల నంటే శ్రీహరికి భక్తులంటే తన ప్రాణాలకన్నా అధికం కాబట్టి ఈ ఆపద నుండి నిన్ను రక్షించగల శక్తి నాకు లేదు. త్వరగా బ్రహ్మలోకాన్ని విడిచి వెళ్ళిపో. లేకపోతే ఆ సుదర్శనం మనిద్దర్నీ సంహరించగలదు" అన్నాడు. అంతట దుర్వాసుడు ప్రాణాలరచేతిలో పెట్టుకొని శివ భగవానుని శరణు కోరాడు. శివభగవానుడు ఇలా అన్నాడు. "ద్విజోత్తమా! కలత చెందకు. నేను చెప్పేది శ్రద్ధగా విను. నువ్వు అత్రి తనయుడవు; జగత్పతికి పౌత్రుడవు, వేదవేదాంగములెరిగిన వాడవు. నువ్వు చేసిన పని పరమ మూర్ఖులు కూడా చెయ్యరు. ఎవరు సర్వేశ్వరుడని పురాణాలు, ఇతిహాసాలు ఘోషిస్తున్నాయో అతడినే నువ్వు తెలుసుకోలేకపోయావు. నేను, బ్రహ్మ, ఇంద్రాది దేవతలు, వసువులు, ఆదిత్యులు, మునీంద్రులంతా ఆ పరబ్రహ్మము కనుసైగ చేసినంత మాత్రానే పుడ్తూ ఉంటాం. సర్వేశ్వరుడు భక్తులంటే ప్రాణము కన్నా అధికంగా ప్రేమిస్తాడు. నువ్వు అజ్ఞానం చేత శ్రీకృష్ణ పరబ్రహ్మము యొక్క భక్తునికి అపకారం తలపెట్టావు. నేను, బ్రహ్మ, పార్వతి, సరస్వతి మొదలైన వారంతా కూడా ఆ భక్తునికన్నా ఎక్కువైన వారం కామని తెలుసుకో. ఆ మాటకొస్తే శ్రీహరి, లక్ష్మి కూడా వారి భక్తుని కంటే అధికులు కారు. అందువల్లనే శ్రీహరి సుదర్శన చక్రం విష్ణు భక్తు లందర్నీ అహర్నిశలు రక్షిస్తూ ఉంటుంది. భక్త సంగమం కన్నా మించిన ఆనందం శ్రీహరికి మరొకటి లేదు. శ్రీహరికి లక్ష్మీ దేవి ప్రాణాధికురాలే అయినా, భక్తుల్ని ద్వేషిస్తే ఆమెను వదులు కోవడానికి కూడా వెనుకాడడు. ఇది సత్యము. ఇంకో మాట కూడా విను. భక్తులందరిలోనూ విప్రులు భగవంతునికి అత్యంత ప్రియులు. అనగా తనకన్నా కూడా బ్రాహ్మణులంటే అధిక ప్రీతి. మునీశ్వరా! ఈశ్వరునికి మిత్రులు ఉండరు, శత్రువులు ఉండరు. ముల్లోకాల్లోనూ తన్ను ఎవడు ధ్యానిస్తూ ఉంటాడో, ఎవడు జీవులన్నింటిని సమదృష్టితో చూస్తాడో అతణ్ణి అనుసరించి ఉంటాడు. ఓ బ్రహ్మర్షీ! బ్రహ్మాండాలన్నీ జల ప్రళయంలో మునిగి ఉన్నప్పుడు జీవరాసులన్నింటినీ తన ఆత్మలో పెట్టుకొని కాపాడుతాడు కాబట్టి వారికి నాశనముండదు. కావున నువ్వు వెంటనే గోవిందుని శరణు కోరు. ఆ మహనీయుని పాదాలను కొలువు. శ్రీహరి స్మరణ చేస్తే ఆపదలన్నీ తొలగిపోతాయి. నువ్విక అక్కడా ఇక్కడా తిరగకుండా సరాసరి వైకుంఠానికి పోయి శ్రీహరి పాదాలనాశ్రయించు. ఆ మహనీయుడు కరుణాసాగరుడు. తప్పక నిన్ను కరుణించి కాపాడగలడు. శివభగవానుడు ఈ విధంగా ఉపదేశిస్తూ ఉండగానే సుదర్శన చక్రం కైలాసంలో ప్రవేశించింది. దాని జ్వాలల చేత కైలాసం అంతా కోటి సూర్యుల కాంతితో ప్రకాశించింది. ఆ సుదర్శన చక్ర తేజస్సుకు కైలాస వాసులు నిలువలేక పోయారు. కైలాసవాసులందర్నీ ఆ తేజస్సు కాల్చేస్తూ ఉంటే వారంతా పోయి శంకరునితో మొరపెట్టుకున్నారు. శంకరుడు కరుణానిధి కావడం వలన ఆ విప్రుని చక్ర బాధలంటకుండా ఇలా ఆశీర్వదించాడు. "ఇతడు తపస్సుచేత నావలన సంపాదించుకున్న తేజస్సు సత్యమే అయితే ఈ బ్రాహ్మణుడు ఈ చక్రబాధ నుండి విముక్తి పొందుగాక" అని. పార్వతి కూడా ఇలా ప్రతిజ్ఞ చేసింది. "యత్ప్రభోర్మమ పుణ్యేషు బ్రాహ్మణశ్శరణాగతః మమా శిషా మహాభీత్యా శీఘ్రం భవతు విజ్వరః" అనగా నా ప్రాణనాథుని యొక్క నాయొక్క పుణ్యములచే శరణాగతుడైన ఈ బ్రాహ్మణుడు భీతిలేనివాడై చక్రబాధల నుండి విజ్వరుడగు గాక. అని పలికింది. అంతట దుర్వాసుడా పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించి వైకుంఠానికి వెళ్ళాడు.

పార్వతి పరమేశ్వరుల ఆశీర్వాదాన్ని పొంది, సుదర్శనుడు వెంబడిస్తూన్నా కూడా మనోవేగంతో వైకుంఠాన్ని చేరుకున్నాడు. రత్న సింహాసనంపై ఆసీనుడై లక్ష్మీదేవి సేవిస్తూ ఉండగా ప్రసన్నవదనుడై ఉన్న శ్రీహరి భగవానుని దుర్వాసమహర్షి సందర్శించాడు.

అటువంటి మహామహితాన్వితుడైన లోక నాయకునికి దుర్వాసముని సాష్టాంగ నమస్కారం చేశాడు. సామవేదోక్తంగా స్తుతిస్తూ ఇలా అన్నాడు.

"ఓ కమలాకాంతా! కరుణానిధీ! దీనబంధూ! నన్నీ చక్ర బాధ నుండి రక్షించు. నువ్వు మృత్యు దేవతకే మృత్యువు. సంహార కర్తనే సంహరించు సర్వేశ్వరుడవు. సర్వకారకుడవు. మహావిష్ణువనే వృక్షానికి బీజరూపంలో ఉండే భగవంతుడా, నారాయణా నన్ను ఉద్ధరించు. భవసాగరంలో మునిగి ఉన్నాను. శరణాగత శోకార్త భయత్రాణ పరాయణుడవు. వేదములు ఏ వస్తువాయిద్యమని స్తుతించబడిందో, తెలిపాయో, ఎవనిని వేదాలు కూడా స్తుతించలేవో, సరస్వతి కూడా నిను వినుతింప అసమర్థురాలో అటువంటి నిన్ను ఇక పండితులు మాత్రం నుతించగలరా? వెయ్యితలలు గల ఆదిశేషువే నిన్ను నుతించ లేక జడుడై పోగా నేనెంతటి వాడను? వేదములు, స్మృతి కర్తలే నిన్ను నుతించలేక పోయారంటే వేదాల్ని పఠించిన వాడను, శిష్యుడన దగిన వాడనైన నేను నిన్ను ఎటుల స్తుతించగలను?" అని దుర్వాసమహర్షి భగవంతుని పాదముల చెంత నిలబడి వలవల ఏడ్చాడు. ఈ దుర్వాస మహర్షి చేసిన పరమేశ్వర స్తుతి సామవేదోక్తము. జగన్మంగళకారకము. పుణ్యప్రదము. దుర్వాసుడీ విధంగా ప్రార్థించగా దయామయుడైన భగవంతుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు.

విష్ణు భగవానుడు: మునీంద్రా! నీకు మేలు జరుగుతుంది. సజ్జనుల నుండి శాస్త్రాన్ని తెలుసుకొంటే అది ఇతరులకు జ్ఞానాన్ని కలిగిస్తుంది. వేద విరుద్ధమైన కర్మలన్నీ దోషభూయిష్టమైనవి; నింద్యములే. విద్వాంసుడై యుండి కూడా ఎవడు అటువంటి కర్మలను ఆచరిస్తాడో అతడు జీవించి ఉన్నాకూడా మృతునితో సమానమే. ఓ బ్రాహ్మణుడా! అన్ని పురాణాల్లోనూ, ఇతిహాసాల్లోనూ విష్ణు భక్తుని మహిమలు వర్ణించి చెప్పబడ్డాయి గదా. నేను నా భక్తులకు ప్రాణంతో సమానం. నాకు కూడా భక్తులంటేనే ప్రాణం. కాబట్టి నా భక్తుల్ని ఎవడు హింసిస్తాడో వాడు నన్ను హింసించినట్లే. భార్యాబిడ్డల్ని, రాజ్యాన్ని సిరిసంపదల్ని విడిచేసి ఎవడైతే నన్ను ధ్యానిస్తాడో అతడు నాకు అత్యంత ప్రీతి పాత్రుడవుతాడు. నాకు భక్తులకన్నా ప్రాణాలెక్కువ కాదు. ఆ మాట కొస్తే లక్ష్మీ, సరస్వతి, బ్రహ్మ, దుర్గ, గణపతి, విప్రులు, గోపికలు, రాధ మొదలైన వారంతా గూడా నా భక్తులతో సమానం కాదు. ఇది సత్యం. నేను అందర్నీ ప్రభావితం చేసే వాడను. ఈశ్వరుడను. పరిపాలకుడను. అయినా నేను స్వతంత్రుణ్ణి కాను. రాత్రింబవళ్ళు భక్తుల అధీనంలో ఉంటాను. గోలోకంలో రెండు భుజాలతోనూ, వైకుంఠంలో నాలుగు భుజాలతోనూ ఉంటాను. మునీంద్రా! నా దేహం మాత్రమే ఆయా లోకాల్లో ఉంటుంది. నా ప్రాణం మాత్రం భక్తుల హృదయాలలో ఉంటుంది. భక్తులు ఏ పదార్థాలను సమర్పిస్తారో అదే నాకు ఆహారం. భక్తులు కాని వారు ఏది ఇచ్చినా నేను గ్రహించను.

రాజేంద్రుడైన అంబరీషుడు నిరీహుడు. అహింసకుడు. దయాళుడు. అటువంటి దయామయునికి అపకారం చేసేందుకు నీకు మనస్సు ఎట్లా ఒప్పింది? సర్వ భూతాలకు ఎవరు

అపకారం చేస్తారో వారిని నేనే స్వయంగా శిక్షించగలను. కానీ నా భక్తులనెవ్వడు హింసిస్తాడో అటువంటి వాడిని రక్షించే శక్తి నాకు లేదు. కాబట్టి నువ్వు భక్తుడైన అంబరీషుణ్ణే శరణువేడుకో. అతడే నిన్ను రక్షించగల సమర్థుడు.

(ఈ భాగం శ్రీ భాగవతం నవమ స్కంధం, 4వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

మునిచంద్రా! మరొక మాట కూడా విను. భక్తులు నాయందే మనస్సు లగ్నంచేసి సర్వ భూతాలను సమభావంతో చూస్తూ నన్ను వశపరచుకుంటారు. పతివ్రతలైన స్త్రీలు భర్తల నెట్లా లొంగదీసుకొంటారో భక్తులు కూడా నన్నారీతిలోనే వశపరచుకుంటారు. నేను కూడా వారిని వదలి ఉండలేను. వారికి ముల్లోకాలపైనా ఆధిపత్యం లభించినా వారు దానిని కోరుకోకుండా నా దాస్యాన్నే కోరుకుంటారు. దాని ఫలాన్ని కోరుకోరు. శ్రీ పోతనామాత్యులు

కం॥ *పంచేంద్రియముల తెరువుల వంచించి మనంబునందు పరమతులు ప్రతి*
షించి వహింతురు నన్నును మంచి వరుం బుణ్యసతులు మరగిన భంగిన్

శ్లో॥ *యే దారాగార పుత్రాప్తాన్ ప్రాణాన్ విత్తమిమం పరం*
హిత్వామాం శరణం యాతాః కథం తాం స్త్యకుముత్సహే

అన్న ఈ శ్లోకానికి పోతనగారు

ఆ॥ *తనువు మనువు విడిచి తనయులఁ జుట్టాల । నాలి విడిచి సంపదాలి విడిచి*
నన్న కాని యన్య మెన్నఁడు నెఱుఁగని । వారి విడువ నెట్టి వారినైన

అని వ్రాశారు. ఎందువల్లనో పోతనగారు మూలార్థాన్ని వదలి వేశారు. "సమదర్శినః" అన్న పదానికి తెలుగులో సరైన పదం కనపడదు. "సాధవః" అన్న పదానికి "వరమతులు" అని వ్రాశారు. "మయి నిర్బద్ధ హృదయాః" అన్న వాక్యానికి కందపద్యంలో మూడు పాదాలుగా వ్రాయబడింది. "సత్స్త్రియస్సత్పతిం యథా" అన్న దానికి "మంచి వరుం బుణ్య సతులు మరగిన భంగిన్" అని వ్రాశారు. పురంధ్రీమణులు సత్పతిని వశపరచుకొన్నట్లు నా యందు సంబద్ధ హృదయులై సమదృష్టి గలవారై యుండు సత్పురుషులు నన్ను వశపరుచుకున్నారని శ్లోకంలోని భావం. మరగిన భంగిన్ అన్న వాక్యం సరసంగా లేకపోయినా విధి లేక చెప్పవలసి వచ్చింది.

సాధువులే నా హృదయం. సాధువుల హృదయమే నేను. నేను తప్ప మరో పదార్థం వారికి తెలియదు. నేను కూడా వారికంటే అన్యమైన పదార్థమేదీ ఎరుగను. నువ్విప్పుడు హింసించింది అంబరీషుణ్ణి కాదు; నన్నే. కావున నువ్వు అంబరీషుని వద్దకు వెళ్ళు. సాధువుల పై ప్రయోగించిన తేజస్సు ప్రయోగించిన వారికే అమంగళాన్ని తెచ్చి పెడ్తుంది.

పోతనా మాత్యులు ఈ విధంగా తెనిగించారు.

కం॥ *సాధుల హృదయము నాయది సాధుల హృదయంబు నేను జగముల నెల్లన్*
సాధుల నేన యెఱుంగుదు సాధు లెఱుంగుదురు నాదు చరితము విప్రా.

మొత్తంమీద పోతనామాత్యులు ఆంధ్రీకరించడంలో చాలా సంగ్రహపరిచారని తెలుస్తోంది.

దుర్వాసా! తపస్సు, విద్య బ్రాహ్మణునికి మేలు చేకూరుస్తాయి. అయితే అహంకారం, క్రోధావేశాలు గల వానికి అవి విపరీత ఫలాల నిస్తాయి. కావున నువ్వు అంబరీషుని వద్దకే వెళ్ళి శరణుకోరు. నీకు తప్పక మేలు కలుగుతుంది.

(ఈ క్రింది భాగం శ్రీకృష్ణజన్మ ఖండము నుండి గ్రహించబడింది. శ్రీ భాగవతంలో ఈ భాగం ఉండదు.)

అంబరీషుడు శ్రీకృష్ణ పరబ్రహ్మమును మనస్సులో ధ్యానిస్తూ నిలబడ్డాడు. అప్పుడే శివ పార్వతులు, బ్రహ్మ, ధర్ముడు, ఇంద్రుడు మున్నగు దేవతలంతా వచ్చి నిలబడ్డారు. బ్రహ్మ ఇలా అన్నాడు. "ఆత్మ స్వరూపుడవైన ఓ ప్రభూ! నీవు నిర్లిప్తుడవు. భక్తులను అనుగ్రహించుటలో ఆసక్తి చూపువాడా! నీ భక్తునికి అపకారం చేసిన ఈ బ్రాహ్మణుని కరుణించు" అని ప్రార్థించాడు. అంతట శివభగవానుడు "దీనబంధూ! జగన్నాథా! క్రూరకార్యం చేసిన ఇతడు విప్రుడు కాదు. అయినా దీనుడై శరణాగతిని కోరుతున్నాడు. కావున ఇతణ్ణి కృపతో కరుణించి కాపాడు" అని వేడుకున్నాడు. అంతట పార్వతీ దేవి, "దేవా! అంబరీషుడు నీకు భక్తుడు. ద్విజులకన్నా, మాకన్నా గూడా భాగవతోత్తములే నీకు పరమ భక్తులు. నువ్వు సర్వేశ్వరుడవు కాబట్టి అపరాధం చేసినా కూడా ఈ విప్రుని కాపాడు" అని ప్రార్థించింది. అనంతరం ధర్ముడు, వినయంతో నమస్కరిస్తూ "సర్వభూతాలకు నీవు జనకుడవు. రక్షించేది నువ్వే; దండించేది నువ్వే. నీ పిల్లలలో ఒకడు ఇంకొకడికి అపకారం చేస్తే వాడిని సంహరించవు గదా. ఆ న్యాయాన్ననుసరించి ఈ విప్రుని కాపాడు" అని ప్రార్థించాడు. అనంతరం ఇంద్రుడు, "ప్రభో! సర్వజీవుల యందు నీకు సమభావం ఉంటుంది. ఈ మహర్షి ఇప్పటికే తను చేసిన అపకారానికి శిక్ష అనుభవించాడు. దేవా! విప్రుడు అపరాధం చేసినా చంపదగినవాడు కాదని వేదం చెబుతోంది. విప్రుడు కనుక అవమానించబడితే దేవతలందరూ జీవన్మృతులు కావలసి వస్తుంది" అని ప్రార్థించాడు. దుర్వాసమహర్షి తండ్రి అయిన అత్రి మహర్షి వచ్చి "పరమేశ్వరా! నువ్వే నాకీ పుత్రుణ్ణి ప్రసాదించావు. నీ యెడల తప్పు చేసినా ఇతడు నీ సేవకుడే సుమా! లోకంలో నీ తేజస్సుకు భయపడని వస్తువంటూ ఉండదు గదా!" అని ప్రార్థించాడు. అట్లాగే లక్ష్మీదేవి, లోకపాలకులు, పార్షదులు మున్నగు వారంతా వచ్చి చేతులు జోడించి విష్ణుభగవానుని ప్రార్థించారు.

(ఇకపై నడిచే కథలో శ్రీభాగవతానికి, శ్రీకృష్ణ జన్మఖండానికి స్వల్పమైన తేడాలున్నాయి. అందువలన, రెంటినీ సమన్వయం చేసి వ్రాయడం జరిగింది)

అందరి ప్రార్థనలు విన్న శ్రీమన్నారాయణుడు ఇలా అన్నాడు. "దేవతలారా! మహర్షులారా! సుఖాంతమయ్యేది, నీతియుక్తమైన మాట ఒకటి చెప్తాను. వినండి. మీ అభీష్టాన్ని మన్నించి విప్రుని రక్షిస్తాను. ఇతడితో పాటు మీరంతా కలసి అంబరీషుని ఇంటికి వెళ్ళండి. ఈ దుర్వాసుడు రాజర్షియైన అంబరీషునికి అన్నం కలిపి పెట్టాలి. ఎందువల్లనంటే ఈ ముని అంబరీషుని ఇంటికి పోయి నిష్కారణంగా అతణ్ణి వధించే ప్రయత్నం చేసి ఇప్పటికి ఒక సంవత్సరం అయింది. అప్పటి నుండి నా సుదర్శన చక్రం ఇతడిని వెంటాడుతోంది. ఇతడు కూడా ప్రాణభయంతో ముల్లోకాలు

తిరుగుతున్నాడు. అక్కడ అంబరీషుడు అతడి భార్య మాత్రం ఈ సంవత్సర కాలం ఆహారం లేకుండా ఉపవాసాలు చేస్తున్నారు. ఇక నా మాటంటారా? నా భక్తుడు ఉపవాసాలు చేస్తూ ఉంటే నేను మాత్రం భోజనం ఎట్లా చేస్తాను? బిడ్డకు పాలివ్వకుండా తల్లి భోజనం చేస్తుందా? ఈ విప్రుని ఇప్పుడే ఆశీర్వదిస్తున్నాను. ఇకపైన నా చక్రము ఇతడిని బాధించదు. ఇక నేను కూడా భోజనం చేసి నిశ్చింతగా ఉంటాను. భక్తుడిచ్చే పదార్థమేదైనా అమృతంలా భావించి తృప్తి చెందుతాను. నాకు లక్ష్మీదేవి ఇచ్చే పదార్థం కంటే భక్తుడిచ్చిన పదార్థమే సంతృప్తుణ్ణి చేస్తుంది.

అంతట శ్రీమన్నారాయణుడు దుర్వాసునితో "మునీంద్రా! వత్సా! మహాప్రాజ్ఞా! నువ్వు ఈ దేవతా గణములందరినీ వెంటబెట్టుకొని అంబరీషుని ఇంటికి వెళ్ళు" అని పలికి తాను అంతఃపురం లోకి వెళ్ళిపోయాడు. దేవతలూ మునులూ అంతా కలసి అదృశ్య రూపంలో అంబరీషుని అంతః పురానికి చేరుకున్నారు. సుదర్శన చక్రం కూడా దుర్వాసుని వెంటే వెళ్ళింది కానీ భగవదాజ్ఞను శిరసావహించి ఆ విప్రునేమీ బాధించలేదు. అక్కడ "ఉపోష్య వత్సరం రాజా శుష్క కంఠోష్ఠతాలుకః" అనగా సంవత్సరం నుండి ఉపవాసం ఉండటం వలన శరీరం శుష్కించినా, పరిపాలనా వ్యవహారాల్లో అశ్రద్ధ వహించకుండా అంబరీషుడు సింహాసనంపై ఆసీనుడై ఉన్నాడు. దూరాన్నుంచే దుర్వాస మహర్షిని, ఆయన్ను వెన్నంటి వస్తున్న సుదర్శన చక్రాన్ని చూసి సంభ్రమాశ్చర్యాలతో లేచి ఎదురు వెళ్ళి సాదరంగా ఆహ్వానించాడు.

(ఈ క్రింది భాగం శ్రీ భాగవతం నుండి గ్రహించబడ్డది.)

అంతట దుర్వాసుడు రాజేంద్రా! నువ్వు సుకృతివి అని పలికి నమస్కరించాడు. రాజేంద్రుడు మాత్రం శ్రీహరి చక్రాన్ని ఇలా స్తోత్రం చేశాడు. "ఓ సుదర్శనమా! నువ్వే అగ్నివి, నువ్వే సూర్యుడవు, చంద్రుడవు, జలము, వాయువు, భూమి, ఆకాశం అన్నీ నీవే. ఓ సుదర్శనా! నువ్వు వెయ్యి అంచులుగల భగవంతుని ఆయుధానివి. భగవంతుని సంకల్పానికి కార్యరూపాన్నిచ్చి సాధించేవాడవు. నీతేజస్సు ముందు ఏ ఆయుధము నిలువలేదు. నువ్వే పృథ్వీపతివి కాబట్టి ఈ విప్రునిపై కరుణ చూపించు. ధర్మము, ధైర్యము, సత్యము, యజ్ఞము నీవే. యజ్ఞకర్తవు, లోకపాలకుడవు, సర్వాత్మకుడవు నీవే. తేజస్సు పౌరుషం నువ్వే. అఖిల ధర్మ స్వరూపా! త్రైలోక్య రక్షకుడవు నువ్వే. విశుద్ధ మనస్కుడవు. అద్భుత కర్మలను చేయువాడవు. ధర్మమయమైన నీ తేజస్సు చేత తమస్సు నశిస్తుంది. మహాత్ములకు ప్రకాశమిచ్చే వాడవు నువ్వే. ఓ వాక్పతీ! నీ మహిమ దురత్యయము. పరాత్పరుడవు నీవే. భగవంతుడు ప్రయోగించగా ఎదిరింప శక్యముకాని అనేక మంది దైత్యుల శిరస్సులను ఖండించినవాడవు. ఇట్టి నీకు వందనములర్పిస్తున్నాను.

ఈ ఘట్టంలో పోతనగారు,

ఆ॥ *కలఁగిలో నిద్రపోవఁ గలలోన వచ్చిన నిన్నుఁ జూచి దీర్ఘనిద్రపోదు*
రసురవరులు శయ్య లందున్న సతులు ప్ర భాతమందు లేచి పలవరింప

అని వ్రాశారు. ఈ భావం మూలంలో కనిపించదు గానీ, "ఖల ప్రహాణయేని రూపితః" అన్న మాటను ఆధారంగా చేసుకొని తన చమత్కారాన్ని జోడించి వ్రాశారనిపిస్తుంది.

"ఓ జగత్ప్రాణమా! భగవంతుని గద, ఖడ్గం మొదలైన ఆయుధాలున్నా దుష్ట సంహారానికి నిన్నే ఉపయోగిస్తాడు. ఓ చక్రరాజమా! ఈ బ్రాహ్మణుడు నాకు కులదైవము. ఇతడికి శుభాలను కలిగించు. ఆ శుభాలన్నీ నాకే కలిగినట్లు భావిస్తాను. నేను ధర్మ బుద్ధితో ప్రవర్తించే వాడినే అయితే, ఈతడు నా కులదైవమైన బ్రాహ్మణుడే అవడం నిజమైతే ఈ బ్రాహ్మణునకు నీ నుండి భయం తొలగుగాక. నీ కృప ఇతడిపై ప్రసరించుగాక. అద్వితీయుడు, సర్వగుణాభిరాముడు అయిన శ్రీహరి నాకు ప్రసన్నుడైనట్లైతే ఈ విప్రుణ్ణి నీ భయం నుండి విముక్తి చేయుగాక." అంబరీషుడు ఈ విధంగా దుర్వాసుని యెడల ఓర్పును, ప్రేమను కనబరుస్తూ విష్ణు చక్రమైన సుదర్శనుణ్ణి ప్రార్థించగా, సుదర్శనుడా విప్రుని విడచి పెట్టాడు. విముక్తుడైన దుర్వాసుడు అంబరీషునితో ఇలా అన్నాడు.

దుర్వాసుడు: ఓ భక్తవర్యా! రాజేంద్రా! శ్రీహరి దాస్యం లభించిన పరమ భక్తుల మాహాత్మ్యం ఎట్లాంటిదో నేనిప్పుడు తెలుసుకున్నాను. నేను తెలిసీ అహంకారంతో క్షమించరాని అపరాధాన్ని చేసినా నువ్వు ఎంత మాత్రం క్రోధావేశాలకు లోనుకాకుండా నాకు శుభాలను కలుగ చెయ్యమని చక్రాన్ని ప్రార్థించావు. రాజా! సాధువులమై ఉండి కూడా మాలాంటి వారు పొందలేని శ్రీహరి దాస్యాన్ని నువ్వు పొందగలిగావు. శ్రీహరిని వశపరచుకున్నావు. ఏ భగవంతుని నామస్మరణ చేసినంత మాత్రానే భక్తులకు నిర్మల మనస్సు కలుగుతుందో. అటువంటి పరమాత్ముని పవిత్ర పాదములను సేవించే నీవంటి భక్తులకు ఏవిధమైన కొరత ఉండదు గదా. మహారాజా! నీచేత అనుగ్రహించబడ్డాను. నీ హృదయం నవ్యనవనీతమని తెలుసుకున్నాను. నేను నీయెడల చేసిన మహాపరాధాన్ని కూడా మరచి నన్ను రక్షించావు. ఈ ఘట్టంలో శ్రీపోతనా మాత్యులు,

మ॥ *ఒకమా టెవ్వనిపేరు కర్ణములో నొయ్యారమై సోఁకినన్*
సకలాఘంబులుఁ బల్లటిల్లి తొలఁగున్ సంభ్రాంతితో నట్టిస
త్సుకరున్ మంగళ తీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశునిన్
అకలంకస్థితి గొల్చు భక్తులకు లేదడ్డంబు రాజాగ్రణీ

అని వ్రాసి తన సర్వతోముఖ పాండిత్యాన్ని చాటి చెప్పారు. భక్తి రసాన్ని వెల్లడి చేశారు. భక్తి ఎట్లా కుదుర్చుకోవాలో "ఒకమాటెవ్వని పేరు కర్ణములో నొయ్యారమై సోఁకినన్" అన్న ఒక్కమాటలో అనువదించి తేటపరచిన మహాకవి! నీకివే జోహార్లు.

దుర్వాసుడు రాజేంద్రుని స్తుతించిన పిదప, మునికి మృష్టాన్న భోజనాలు పెట్టి సత్కరించాడు. పిమ్మట తాను కూడా భోంచేశాడు. భగవదాజ్ఞను శిరసావహించి సిగ్గుపడుతూనే ముని భోజనం చేసి రాజు వద్ద వీడ్కోలు తీసుకుంటూ,

మ॥ *కంటిన్ నేఁటికి నిన్ను నీవచనముల్ కర్ణద్వయం బ్రీతిగా*
వింటిన్నన్నముఁ గొంటినీగృహమునన్ వేడ్కన్ ఫలం బబ్బె నే
మంటిం బోయెద నీ చరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై
మింటన్ మేదిని సన్నుతింపఁగల రీమీఁదన్ నరేంద్రాగ్రణీ!

అని పలికి తన దారిన తాను వెళ్ళిపోయాడు. పోతూ తనలో "ఆహా! విష్ణు భక్తుల మాహాత్మ్యము తెలుసుకోవడం అసాధ్యం గదా. ఇకపైన విష్ణుభక్తుల జోలికి పోరాదు. బుద్ధి వచ్చింది. అంబరీషుని వంటి పుణ్యాత్ముడు ముల్లోకాలు వెదకినా కనిపించదు గదా" అని తలచుకుంటూ తన ఆశ్రమానికి పోయాడు.

విశేషార్థము: "కథాచ్ఛలేన బాలానాం నీతి స్తదిహకథ్యతే" అని సూక్తి. కావున కేవలం కథ తెలుసుకున్నంత మాత్రాన ప్రయోజనం ఉండదు. అందులోని నీతిని తెలుసుకొని మనసున నిలుపుకొని ఆచరించడమే ప్రధానమని మనం గ్రహించాలి.

పూర్వం ఔర్వముని పుత్రికను విడిచి ఉండలేక తపస్సుపై మనస్సు మరల్చుకొనే ప్రయత్నం చేశాడు. కుమార్తె భర్తతో కలసి సుఖంగా సంసారం చేసుకుంటోంది కదా అని సరిపెట్టుకున్నాడు. కానీ ఇక్కడ దుర్వాసుని ఆశ్రమంలో పరిస్థితులు వేరే విధంగా ఉన్నాయి. దుర్వాసుడు ఎంత కోపిష్ఠి అయినా కందళి విషయంలో ఎంతో ఓర్పు వహిస్తూ వచ్చాడు. దుర్వాసుడు ఎంత సహనాన్ని అవలంభిస్తున్నాడో కందళి అతడి పట్ల అంతకు పది రెట్లు కలహం పెంచుకుంటూ పోయేది. క్రోధమనేది అంతఃశ్శత్రువు కదా. దాన్ని జయించినవాడే నిజమయిన విజయాన్ని సాధించగలుగుతాడు. కానీ దుర్వాసుడు ఎంత ఓర్పు వహించినా విడవకుండా గిల్లి కజ్జాలు పెట్టుకొని వేధిస్తూ ఉంటే ఏం చెయ్యగలడు? క్రోధం ఓర్పును అణగద్రొక్కింది. ముని ఒళ్ళంతా క్రోధంతో నిండిపోయింది. దానికి తోడు కర్మము కూడా కందళిని మరింత ప్రోత్సహించింది. ముని క్రోధ వివశుడై శపించాడు.

ముని తపః ఫలం చేత కందళి దేహం క్షణంలో దగ్ధమైపోయింది. పోనీ అంతటితో ముని కష్టాలు తీరాయా? అంటే తీరలేదు. అధికమయ్యాయి. కందళిలోని జీవాత్మ మహర్షికి నీతిని బోధించింది. అంతటితో ఆగితే భగవత్సంకల్పం నెరవేరదు గదా. కందళి ధరించిన వస్త్రం గాలికి కొట్టుకుపోయి సరిగ్గా ఔర్వుడి ముందే పడింది. ఇట్లాకూడా జరుగుతుందా? అని సందేహ పడేవాళ్ళుంటారు. భగవంతుడు సంకల్పిస్తే బండ్లు ఓడలు కాగలవు, ఓడలు బండ్లూ కాగలవు. సముద్రాలు పొంగటం, పర్వతాలు కదలాడటం, భూమి క్రుంగటం వంటివి మనం చూడటం లేదా? వీటన్నింటికీ కారణం భగవంతుడు కాదా? ఇంకొకరి వల్ల ఈ పనులు సాధ్యమవుతాయా? ఔర్వముని దుఃఖ పరవశుడయ్యాడు. దుర్వాసుని ఆశ్రమానికి పోయి జరిగిన అనర్థాన్ని తెలుసుకున్నాడు. దాంతో ఔర్వముని కోపం కట్టలు తెంచుకొంది. "నీకు పరాభవము కలుగుగాక" అని శపించాడు. ఈ కథ వలన క్రోధమే మనకు పరమ శత్రువని, క్రోధానికి లోబడనివాడే ధన్యుడని, క్రోధానికి లోబడినవాడు దుష్ఫలితాలు అనుభవించక తప్పదని మనం గ్రహించాలి. అంతే కాకుండా, ఎంతటి తపస్సంపన్నులైనా, నిరూహులైనా కూడా ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా దేహాత్మ సంబంధాన్ని విస్మరించే వాడీ లోకంలో ఉండరని తెలుస్తోంది. ఎంతటి జ్ఞాన సంపన్నుడైనా దేహదుఃఖానికి వశుడై వివేకాన్ని కోల్పోయిన వారికి దేహ తాపములు అంటుతాయని ఔర్వుని ఉదాహరణముగా చెప్పవచ్చును.

"జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్" అన్న ఈ లోకోక్తి కూడా ఇక్కడ చెప్పదగ్గదే. దుర్వాసుడు తన క్రోధానికి శపించబడ్డాడు. దుర్వాసుడు శాపఫలం అనుభవించకుండా తప్పించుకోలేదు. కావున అతడి కర్మమే అతడిని అంబరీషుని వద్దకు వెళ్ళేట్లు చేసింది.

అంబరీషుడు భక్తవర్యుడు. అహంకారం లేనివాడు. ఇంద్రియాలన్నింటినీ జయించినవాడు. పక్షపాత రహితుడై రాజ్యపాలన చేస్తున్న రాజేంద్రుడు, నియమం ప్రకారం దేవతా పూజలు చేస్తూ మహారాజ్య దురంధరుడని ప్రఖ్యాతి గాంచినవాడు.

ఏకాదశీ వ్రతం చేసి ద్వాదశి ఘడియలలో భగవత్పూజ చేసి బ్రాహ్మణులకు భోజనాలు పెట్టి, పిదప తాను భుజిస్తూ ఉండటం ఆ రాజర్షికి అలవాటు. ఆ రోజుల్లో అతిథికంటే ముందుగా యజమాని భోజనం చెయ్యరాదన్న నియమం ఉండేదని మనకీ కథ మూలంగా తెలుస్తోంది.

కావున అతిథి పూజకు మన పూర్వీకులు ఎంతటి ప్రాముఖ్యాన్నిచ్చారో మనుస్మృతి(3వ అధ్యాయము) తెలుపుతుంది. అతిథి తిన్న తర్వాతనే మిగిలిన ఆహారాన్ని గృహస్థుడు భుజించాలని స్పష్టమవుతుంది. అంబరీషుడు ఈ ఆచారాన్నే అనుసరించాడు. భగవంతుడు తన భక్తుల్ని ఇటువంటి విషయాల్లోనే పరీక్షిస్తూ ఉంటాడు. ఎందువల్లనంటే ఇటువంటి క్లిష్ట సమయాల్లోనే భక్తుల ఇంద్రియ నిగ్రహం నిశ్చల మనస్సు వ్యక్తమవుతాయి. "హేమ్నస్సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధి శ్శ్యామికాపి వా" అన్న కాళిదాసోక్తి వ్యర్థం కాదు గదా. అంబరీషుణ్ణి పరీక్షించేందుకు కూడా ఇదే సమయమని భగవంతుడు ఊహించాడు. బ్రాహ్మణ భోజనం పూర్తయింది. ద్వాదశి ఘడియలు ఉన్నంతవరకు అతిథు లెవరైనా వస్తారేమో చూసి ఆపైన తాను భోంచేద్దామనుకున్నాడు. ఇంతలో కర్మము ప్రేరేపించగా దుర్వాసుడు రానే వచ్చాడు. ముని తనకు ఆకలిగా ఉన్నదని స్నానం చేసి వస్తానని వెళ్ళినవాడు ద్వాదశి ఘడియలు దాటి పోతున్నా తిరిగి రాలేదు. ఇదే భగవంతుడు పరీక్షించే సమయం. ముని తిరిగి వచ్చే సమయానికి అంబరీషుడు శ్రీకృష్ణ పాదోదకాన్ని స్వీకరించి తన్ను అవమానించాడని ముని క్రోధుడయ్యాడు. ఇటువంటి అవివేకిని క్షమించరాదని నిశ్చయించాడు.

రాజుకు మునిపైన భక్తి విశ్వాసాలు లేవా? అన్న ప్రశ్న ఉదయించవచ్చు. ఇది సరికాదు. భగవంతుడు ఎన్నో కఠినమైన పరీక్షలు పెడితేనే గాని పూర్తి ఫలాన్నివ్వడు. ఇక రెండవది మునికి శాప ఫలానుభవం కావాలి. ఈ వృత్తాంతం ద్వారా లోకులకు గుణపాఠం చెప్పడం తద్వారా భగవద్భక్తిని కలిగించడం మూడవది. ఈ మూడూ ఈ వృత్తాంతానికి ఫలములని మనం గ్రహించాలి. అందువల్ల, ముని ఖడ్గం ధరించి ఓ వీరుణ్ణి అంబరీషుడిపైకి ప్రయోగించాడు. ఈఘట్టాన్ని భాగవతంలో శక్తి ఉదయించిందని, శ్రీకృష్ణ జన్మఖండంలో ఒక పురుషుడుదయించాడని ఉంది. ఈ భేదానికి గల కారణమేమిటని ఎవరైనా ప్రశ్నించవచ్చు. వినండి. క్రూరకార్యాలను ఆభిచారిక కృత్యాలని పిలుస్తారు. అనగా ఇతరులను హింసించే కార్యాలన్నింటినీ ఆ పేరుతోనే పిలుస్తారు. అనగా ఇటువంటి కార్యాలు చేసే వారికి స్త్రీ పుంల్లింగ భేదాలుంటాయేగానీ విషయ భేదముండదు. వారు చేసే హింసా కార్యాల్లో కూడా భేదముండదు. అట్లాగే దైవతమన్నా దేవత అన్నా ఎట్లా భేదముండదో అదే విధంగా శబ్ద భేదానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన పని లేదు. కావున విషయ సంగ్రహణమే ప్రధానమని మనం గ్రహించాలి.

దుర్వాసుని క్రోధం రాజును వధించాలని చూసింది గానీ, భగవదనుగ్రహమే చక్రరూపంలో అక్కడ ప్రత్యక్షమైంది.

ముని ఒక శక్తిని సృష్టించి రాజును అక్రమ మార్గంలో సంహరించాలని ప్రయత్నించాడు. ప్రతిక్రియగా భగవంతుడు దాన్ని నిరోధించాల్సి వచ్చింది. అంతే కాకుండా కోటి సూర్యుల తేజస్సుతో సుదర్శన చక్రం మునిని వెంబడించింది. ప్రాణాలు కాపాడుకోవడానికి ముని ముల్లోకాలకు పరుగులు తీశాడు. కానీ మహర్షిని చంపడం భగవంతుని ఆశయం కాదు. మునికి, తద్వారా లోకానికి గుణపాఠం నేర్పాలన్నదే భగవంతుని ఆశయం. అందువల్లనే చక్రం భయపెడుతూ వెంటపడిందే కానీ మహర్షిని తాకనైనా లేదు. తేజస్సు చేత దహించలేదు. దహిస్తుందేమోనన్న భీతిని కలిగించింది. ముల్లోకాలు పరుగులు తీయించింది. విష్ణు చక్రాన్ని ఆపే శక్తి సామర్థ్యాలు బ్రహ్మకు ఉన్నాయా లేదా అని మునికి తెలియక పోలేదు.

"ప్రాయస్సమాపన్న విపత్తి కాలే ధియోఽపి పుంసాం మలినా భవంతి"

అన్న సూక్తిని లోకులకు నేర్పే ఉద్దేశ్యంతోనే మునిని విష్ణుమాయ ఆవహించింది. కాబట్టి ముని జ్ఞాన నిధియే అయినా పామరుడి వలె ముల్లోకాలు తిరిగాడు. ముల్లోకాల వారూ పోయి విష్ణువునే శరణుకోరుకొమ్మని సలహా ఇచ్చి పంపారు. చివరకు భగవానుడు శ్రుతి సారమైన "నేను భక్తుల అధీనంలో ఉంటాన"న్న మాట తెలిపాడు. అనగా భక్తి లేకుండా ఎన్ని శ్లోకాలు చదివినా నేను లోబడేవాడను కానని లోకులకు ఉపదేశం చేశాడు. భక్తి లేకుండా లోకుల్ని ఆకర్షించే విధంగా స్తోత్రాలు పఠించినంత మాత్రాన ఎటువంటి ప్రయోజనం కలుగదు. ధ్యానం చేస్తున్నట్లు నటించినంత మాత్రాన ఎటువంటి ప్రయోజనం చేకూరదు. నిర్మల భక్తి మాత్రమే భగవంతుణ్ణి మెప్పిస్తుంది. సాధువులు సమర్పించిన పదార్థాన్నే ఆరగిస్తాను. ఇతరులిచ్చినవి ఎంతటి విలువైన వైనా వాటిని స్వీకరించను ఇదే భగవద్వాక్యము.

కం॥ దళమైనఁ బుష్పమైనను ఫలమైనను సలిలమైనఁ బాయని భక్తిన్

గొలిచిన జను లర్పించిన నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్

అన్న భాగవత వాక్యం కూడా పై భావాన్నే సమర్థిస్తుంది.

భగవంతుడు ఈ విధంగా ఆ మునికి అన్ని విధాలా బుద్ధి చెప్పాడు. అభిమానాన్ని పోగొట్టే నెపంతోనే భక్తుడైన అంబరీషుని వద్దకు పొమ్మని ఆదేశించాడు. అతడు భోజనం చేసి సంవత్సరం అయ్యింది. అతిథివైన నీకు భోజనం పెట్టి గాని తాను తినడు. అతను తృప్తి చెందితే గాని నేను తృప్తి చెందలేను. అనగా అతడు తింటే గాని నా ఆకలి తీరదని స్పష్టం చేస్తున్నాడు.

అంబరీషుడు ఒక సంవత్సరం పాటు భోజనం లేకుండా ఉండగలడా? అని మాత్రం ప్రశ్నించకండి. ఎందువల్లనంటే ఈ కాలంలో మనం ఉండలేం కాబట్టి పూర్వులు కూడా మనవలెనే ఉంటారని ఊహించడం సబబు కాదు. ఈ కాలంలో యోగాన్ని గూర్చి ఉపన్యసించేవారే గాని యోగాన్ని అభ్యసించినవారు మచ్చుకైనా దొరకరు. యోగం వలన వాయు నిరోధం చెయ్యవచ్చు. లంబికాది యోగాలు కూడా అటువంటివే. అట్టి యోగాభ్యాసం చేత ఎన్నాళ్ళైనా ఆకలి దప్పికలు లేకుండా ఉండగలుగుతారు. కాబట్టి యోగాభ్యాసాన్ని గూర్చి ఏమాత్రం అవగాహన ఉన్నా ఇది కష్టమనిపించదు.

భగవదాజ్ఞను శిరసావహించి మహర్షి అంబరీషుని వద్దకు వెళ్ళాడు. అదృశ్యరూపంలో దేవతలు కూడా వెళ్ళారు. రాజేంద్రుడు ఏమీ జరగనట్లే నదికి స్నానానికి వెళ్ళి వచ్చినంత సామాన్యంగా తీసుకున్నాడు. సాదరంగా ఆహ్వానించి సత్కరించాడు. మృష్టాన్నంతో భోజనం పెట్టాడు. తానూ తిన్నాడు. మహర్షి శ్రేయస్సు కోరి భగవంతుణ్ణి ప్రార్థించి పంపాడు. ఇదే మునికి గర్వభంగం. అంబరీషుని భక్తి ఆచంద్రార్కం. సామాన్యులకు భగవద్భక్తిని పరిజ్ఞానాన్ని కలిగించాయి. ఇందువల్ల శ్రీకృష్ణ మహిమను తెలిపే ఈ అంబరీష చరితము పరమ పావనమైంది.

ఏకాదశి వ్రత మహిమ

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 26వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదుడు: దేవదేవా! శ్రీమన్నారాయణా! ద్వాదశి నాడు భోజనం చేయకుండా ఉంటే కలిగే దోషాన్ని గూర్చి చెప్పావు. దుర్వాసమహర్షి పరాభవాన్ని గూర్చి తెలిపావు. కృష్ణ భక్తుడైన అంబరీషుని కాపాడిన విధం విన్నాను. అయితే, ప్రజలంతా కోరుకునే ఏకాదశి వ్రతాన్ని గూర్చి చెప్తే వినాలని ఉన్నది. వేదాలకే ఆధారభూతుడవైన నీ నోట ఈ విశేషాలను వినాలని ఉన్నది. నన్ను కరుణించి చెప్పు.

శ్రీమన్నారాయణుడు: మునీంద్రా! ఈ ఏకాదశీ వ్రతం దేవతలకు కూడా దుర్లభమైనది. శ్రీకృష్ణునికి బహు ప్రీతిపాత్రమైనది. తాపస్వులకు తపస్సు కన్నా శ్రేష్ఠం. దేవతల్లో శ్రీకృష్ణుడు ఎట్లా అధికుడో అట్లాగే దేవేరులలో ప్రకృతి అధికురాలు. "దేవానాం చ యథా కృష్ణో దేవీనాం ప్రకృతిర్యథా" ఆశ్రమాల్లో బ్రాహ్మణుడూ, విష్ణు భక్తులలో శంకరుడు, పూజ్యుల్లో గణేశుడు, పండితుల్లో శారాదాదేవి, శాస్త్రాల్లో వేదాలు, తీర్థాల్లో జాహ్నవి, లోహాల్లో బంగారం, జీవుల్లో వైష్ణవులు, ధనములలో విద్య, సంగులలో ప్రియురాలు, ప్రమథులలో రుద్రుడు, శ్రేయస్సుల్లో మతి, ఇంద్రియాల్లో ఆత్మ, చంచల పదార్థాల్లో మనస్సు, గురు స్త్రీలలో తల్లి, బంధువుల్లో భర్త, బలిష్ఠుల్లో దైవం, లెక్కింపదగిన వారిలో గాలం, మిత్రుల్లో సుశీలం, శత్రువుల్లో రోగం, కీర్తిమంతుల్లో కీర్తి, గృహస్థులలో గృహం, హింసించే వారిలో ఖలుడు, దుష్టుల్లో పుంశ్చలి, తేజస్సుల్లో సూర్యుడు, సహిష్ణుల్లో భూమి, భక్షకాల్లో అమృతం, దాహకాల్లో అగ్ని, ధనదాతల్లో శ్రీ, పతివ్రతల్లో పార్వతి, ప్రజేసుల్లో బ్రహ్మ, జలాల్లో సాగరం, శ్రుతుల్లో సామము, ఛందస్సుల్లో గాయత్రి, వృక్షాల్లో అశ్వత్థము, పుష్పాల్లో తులసి, మాసాల్లో మార్గశీర్షము, ఋతువుల్లో వసంతం, ఆదిత్యుల్లో సూర్యుడు, రుద్రుల్లో శంకరుడు, వసువుల్లో భీష్ముడు, వర్షముల్లో భరత వర్షము, దేవర్షుల్లో నారదుడు (నువ్వు) బ్రహ్మర్షులలో భృగువు, నృపులలో రాముడు, సిద్ధులలో కపిలుడు, యోగులలోనూ జ్ఞానులలోనూ సనత్కుమారుడు, గజేంద్రములలో ఐరావతం, పశువుల్లో శరభము, పర్వతాలలో హిమాలయాలు, మణులలో కౌస్తుభం, నదుల్లో సరస్వతి, గంధర్వుల్లో చిత్రరథుడు, యక్షులలో కుబేరుడు, రాక్షసుల్లో సుమాలి, నారీమణుల్లో శతరూప, మనువుల్లో స్వాయంభువు, అందగత్తెల్లో రంభ, మాయలలో మహామాయయు ఎట్లా శ్రేష్ఠమో అట్లాగే ఏకాదశీ వ్రతం వ్రతాల్లో శ్రేష్ఠమైనది. దీన్ని నాలుగు వర్ణాలవారు ఆచరించవచ్చు. యతులు, విష్ణు భక్తులు, బ్రాహ్మణులు ఈ

వ్రతాన్ని విధిగా ఆచరించాలి. "సత్యం సర్వాణి పాపాని బ్రహ్మహత్యాది కాని చ, సంత్యే వౌదన మాశ్రిత్య శ్రీకృష్ణ వ్రతవాసరే" అని మూలం. బ్రహ్మహత్యాది పాపాలన్నీ శ్రీకృష్ణ వ్రతం నాటి అన్నాన్ని ఆశ్రయించి ఉంటాయి. అటువంటి హరిపూజాన్నమును ఎవడు భోజనం చేస్తాడో అట్టి మూర్ఖుడు ఆ పాపాలన్నింటినీ భోజనం చేసినవాడవుతాడు. ఈ యుగంలో ఎన్ని ఏకాదశులు వస్తాయో అన్ని సంవత్సరాలు కుంభీపాక నరకంలో పడి ఉంటాడు. అటుపిమ్మట చండాలుడుగా జన్మిస్తాడు. వ్యాధిగ్రస్థుడై ఏడు జన్మలు కష్టపడతాడు. ఇది బ్రహ్మ శాసనం. ఇవన్నీ కూడా ఏకాదశినాడు భుజించిన వానికి పట్టే దుర్గతులు. ఇక ద్వాదశి నాడు భోజనం చెయ్యకుండా ఉపవాసం ఉండే వాడి ఇంట్లో లక్ష్మీ దేవి ఉండేందుకు ఇష్ట పడక శపించి మరీ పోతుంది. ఈ జన్మలో వంశనాశనము, పై జన్మలలో నూరు జన్మలు అంధకార కూపంలో నివశిస్తాడు. ఇది వేద సారము. దశమి, ఏకాదశి, ద్వాదశి తిథులు ఏ రోజున ఉంటాయో ఆ రోజున భుజించి రెండోనాడు ఉపవాసముండి వ్రతం చెయ్యాలి. ఆ మరునాడు భోజనం చెయ్యాలి. వైష్ణవేతరులు శుక్ల పక్ష ఏకాదశీ వ్రతాన్నే ఆచరిస్తారు. వారు కృష్ణ పక్ష ఏకాదశి వ్రతం ఆచరించ నక్కరలేదు. శయనైకాదశి (ఆషాఢశుక్ల ఏకాదశి) బోధనైకాదశి (కార్తీక శుక్ల ఏకాదశి) మధ్యన వచ్చే కృష్ణ ఏకాదశి నాడు ఉపవాసం ఉండాలి. మిగిలిన కృష్ణ పక్ష ఏకాదశి దినాల్లో గృహస్థులు ఉపవాసం ఉండనక్కరలేదు.

నారదా! శ్రుతి విధించిన విధానాన్ని నీకు తెలిపాను. ఇకపైన వ్రతం చెయ్యాల్సిన విధానాన్ని చెప్తాను. విను. ముందురోజు అగ్నిహోత్రాది నిత్య కర్మలు నిర్వర్తించి భుజించాలి. ఆపైన మంచినీరైనా త్రాగరాదు. ఒంటరిగా దర్భలపై శయనించాలి. ఆ రాత్రంతా నక్త నియమంతో గడపాలి. ప్రాతః కాలానే బ్రహ్మీ ముహూర్తంలో లేవాలి. సంధ్యావందనాది నిత్యకృత్యాలన్నీ ముగించుకోవాలి. అటుపిమ్మట వ్రతోపవాసాన్ని శ్రీకృష్ణ పరమాత్మ ప్రీతికోసం ఈ వ్రతాన్ని ఆచరిస్తున్నానని సంకల్పం చేసుకోవాలి. విధిపూర్వకంగా షోడశోపచార పూజలతో సంతుష్ట పరచి పగలంతా గడిపేయాలి. రాత్రంతా వ్రతం చెయ్యాలి. అదెట్లాగంటే, పరిశుద్ధమైన ఆసనంపై కూర్చుని ఉతికి ఆరేసిన వస్త్రాన్ని ధరించాలి. శ్రీహరిని ధ్యానించి నమస్కరించి ఆచమనం చేయాలి. శ్రీహరి పటానికి పూలతో అలంకరించాలి. పెద్దలందరి సమక్షంలో వేదోక్తంగా పూజించి శ్రీహరి వ్రతాన్ని చెయ్యాలి. శ్రీహరితోపాటు గణేశుణ్ణి, సూర్యుణ్ణి, అగ్నిని, శివపార్వతులు మొదలైన దేవతలందర్నీ పూజించాలి. ఇతర దేవతల్ని పూజించకుండా శ్రీహరినొక్కడినే పూజిస్తే వ్రతం నిష్ఫలమవుతుంది. మునీంద్రా! వ్రత విధానాన్ని వివరించి చెప్పాను. ఇక వ్రతాన్ని గూర్చి చెప్తాను విను.

ముందుగా శ్రీహరిని సామవేదోక్తంగా ధ్యానం చెయ్యాలి. పూజాపుష్పాన్ని శిరస్సున ధరించి మళ్ళీ ధ్యానం చెయ్యాలి. ఈ పర్యాయం చేసే ధ్యానం అతి రహస్యమైనది. శ్రీహరి భక్తులు కాని వారికి తెలుపరాదు.

ఆవాహనం: "నవనీరద శ్యామ సుందర విగ్రహుడు, శరత్పార్వణ చంద్రుని అధిగమించు ముఖారవిందము, సూర్యకిరణాల చేత వికసించిన కలువల వంటి కన్నులు గలవాడు, రత్న భూషణాల నధిగమించే స్వీయ కాంతులతో ప్రకాశిస్తూ రతిపై ఆసక్తి గలిగిన గోపికలచే క్రీగంట చూడబడినవాడు,

వారి ప్రాణాలను తన ప్రాణాలకన్నా ఎక్కువగా భావించుకొనేవాడూ రాసమండల మధ్యస్థుడు రాసోల్లాసమున మునిగి తేలువాడై కౌస్తుభమును వక్షస్థలమున ధరించిన వాడును, పారిజాతమాలా సువాసనలచే విరాజిల్లువాడు, లలిత మణి సారములతో నిర్మించిన కిరీటమును ధరించినవాడు, వినోదంగా మురళీగానం చేసేవాడు, సురాసురులకు పూజ్యుడు సర్వకారణ కారుణుడై వెలయు పరమాత్ముడైన శ్రీకృష్ణ పరబ్రహ్మమును సేవిస్తున్నాను" అని శ్రీహరిని హృదయ పూర్వకంగా స్తుతించి, ఆవాహనం చేసి, షోడశోపచారముల పూజించి ఆపైన మంత్రోక్త పూజ చెయ్యాలి.

ఉపచారములు: రత్న వైఢూర్యాలతో చిత్ర విచిత్రమైన పుష్పాలతో ఆసనాన్ని సమర్పించాలి. రాధా మాధవా! విలువైన పట్టు వస్త్రాలను సమర్పిస్తున్నాను స్వీకరింపుమా అని ప్రార్థించి వస్త్రాలనివ్వాలి. పరిమళ వస్తువులతో కూడిన శుక్ల పుష్పం నీకు ప్రీతి కలిగిస్తుందని సమర్పిస్తున్నాను. భక్తవత్సలా! స్వీకరించమని ప్రార్థించాలి. పరిమళ వస్తువులతో కూడుకున్న ధూపాన్నిస్తున్నాను. పరమేశ్వరా! ప్రతిగ్రహింపుమా అని ధూపాన్నివ్వాలి. రత్నములచే అలంకరించబడి పునర్ధ్వాంతనాశబీజమైనట్టి దీపాన్నిస్తున్నాను అంగీకరించమని దీపారాధన చెయ్యాలి. నానావిధాలైన చోష్యాదులను నైవేద్యం పెడుతున్నాను; ఓ ఆత్మారామా! అంగీకరించమని నైవేద్యాన్నివ్వాలి. సర్వావయవ భూషణమై కాంతులతో ప్రజ్వరిల్లే యజ్ఞోపవీతాన్ని సమర్పిస్తున్నాను. ఓ నందనందనా అవధరింపుమా అని యజ్ఞోపవీతాన్ని సమర్పించాలి. కర్పూరాది సువాసనా యుతమైన తాంబూలాన్ని గైకొనుమా అని అర్పించాలి. మధురమైన మధువును, అటుపిమ్మట నిర్మలమైన గంగాజలాన్ని అర్పిస్తూ మధుసూధనా! అంగీకరింపుమా అని ఇవ్వాలి.

ఓ మహాప్రభూ! నీ పాదపద్మాలను శరణు కోరుకుంటున్నాను. భక్తిహీనమైనా, క్రియాహీనమైనా, వేదవిధిగా నేను ఆచరించిన ఈ వ్రతాన్ని సంపూర్ణమయ్యేట్లు అనుగ్రహించు. ముక్తిని ప్రసాదించుమని ప్రార్థించాలి. బ్రాహ్మణులకు దక్షిణలిచ్చి శ్రీకృష్ణుని గుణగణాలను కీర్తిస్తూ జాగరణ చెయ్యాలి. ఎవడైతే వ్రతాన్ని చేసి రాత్రి నిద్ర పోతాడో, లేక జలపానం చేస్తాడో అతడికి సగం ఫలమే లభిస్తుంది. శ్రీకృష్ణుని పాదపద్మాలను స్మరిస్తూనే వంటలు చెయ్యాలి. అనగా విష్ణురూపమైన నీవు నాకు వ్రత ఫలాన్నిమ్మని ప్రార్థిస్తూ అన్నాన్ని వండాలి. దీనివలన అటు ఏడుతరాల వారు ఇటు ఏడు తరాల వారు ముక్తిని పొందుతారు. ఓ నారదమునీ! ఇదే ఏకాదశీ వ్రతమహిమ. ఇది అతి సులభంగా ముక్తిని పొందే మార్గం. ఇదే భగవత్కథాసారమని గ్రహించు.

విశేషార్థం: భక్తి కలిగి శ్రీకృష్ణ పరమాత్మను పూజించడమే దీని సారం. అంతే కాకుండా మనం ప్రతినిత్యం తీసుకొనే ఆహారం మాని ఉపవాసాలకలవాటు పడటానికే వ్రతాలలో ఉపవాసాలను ఏర్పరచారు. ఆహారం తినకపోతే ప్రాణాలు నిలవవేమో నన్న దైన్యాన్ని తొలగించడమే ప్రధాన లక్ష్యం. మనకు దేహం లోబడి పని చెయ్యాలే గాని, మనం దేహానికి బానిసలం కారాదు. దేహాన్ని లోబరచుకోవడం వలన మనస్సు కూడా నియమబద్ధం అవుతుంది. అంతే కాకుండా అహారం లేకుండా మనం జీవించగలమా? లేదా? అని పరీక్షించుకోవడానికి కూడా ఇదో అవకాశంగా భావించాలి. ఇంద్రియాలు అలసిపోయిన తర్వాత మనస్సు స్వాధీనమవుతుందా? భక్తి కుదురుతుందా? అనీ,

ఆహారం మానినా జీవించగలమన్న ధైర్యం కలిగితే ఇక ఉపవాసాలు అక్కరలేదు. భగవత్కరుణకు పాత్రుడైన కొద్దీ సమత్వం అలవడుతుంది. ఇదే దీని రహస్యం. మనో నిగ్రహాన్ని అభ్యాసం చేయడానికి ఈ వ్రతాలు పనికి వస్తాయి. తాను భగవంతునిపై స్థిర భక్తి ఏర్పడినవాడే అయినా, లోకులు అతణ్ణి చూసి అనుకరించడానికైనా తాను సదాచారాలను ఆచరిస్తూ ఉండాలి. అట్లాకాని పక్షంలో అతడి జ్ఞానం కేవలం మాటలకే పరిమితం అవుతుంది.

గీ॥ చదువు చదువనేల సన్న్యాసి గానేల । షణ్మతములఁ జిక్కి చావనేల
యతని భజన చేసి యాత్మలోఁ దెలియఁడీ । విశ్వదాభి రామ వినురవేమ.

అని వేమన కవి చెప్పాడు. ఆహా! వేమన యోగీశ్వరుడెంతటిజ్ఞాని. షణ్మతములు కల్పితములు. వీటిని చచ్చేవరకు ఆచరించాల్సిన పని లేదని తాను తెలుసుకొని ఆ పిదప బోధించాడు. సర్వవ్యాపకుడైన భగవంతుణ్ణి ఆత్మారామునిగా తెలుసుకొని ధ్యానిస్తే గాని ముక్తి లభించదని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. ఇంతకన్నా తెలుసుకోదగిన విషయం ఏ శాస్త్రంలో మాత్రం ఉంటుంది? అనగా పాండిత్యం తరుణోపాయానికి పనికివచ్చేదిగా ఉండాలే గాని దంబాచారాలకు కాదు.

శ్రీకృష్ణుడు ఇంద్రుని యాగాన్ని భంగం చేసిన విధాన్ని, దుర్వాసునికి జ్ఞానోపదేశం చేసిన కథను తెలుసుకున్నాం. ఆ తర్వాత భగవత్పూజ చేసే విధానాన్ని, భగవంతుడికి భక్తులపై ఉండే అవ్యాజ ప్రేమను తెలిపే కథల్ని పఠించాం.

ఇంద్రుని యాగానికి విఘ్నం కలిగించిన పిదప నందాదులంతా శ్రీకృష్ణుడు భగవంతుడేనని తెలుసుకున్నారు. కానీ శ్రీహరి వారికా జ్ఞానం నిలిచి ఉండటానికి ఇష్టపడలేదు. విష్ణుమాయ చేత కప్పివేశాడు. దాంతో మళ్ళీ వారంతా కృష్ణుడో సామాన్య బాలుడేనని విశ్వసించడం ప్రారంభించారు. ఎందువల్లనంటే అందరికీ తాను భగవంతుడేనన్న భావన కలిగితే తన అవతార ఫలం లోకానికి లభించదు. దుష్ట సంహారానికి అడ్డుగా ఉంటుంది. గోలోకం నుండి తన్ను నమ్ముకొని వచ్చిన గోపికల ఆశ తీరదు. వారి వారి కర్మానుసారం వారి కోరికలు ఫలించేట్లు చేయడం భగవంతుని పనే కదా! అటు మహర్షి కోరిన కోరికా తీర్చాలి. ఇటు కుబ్జకు కలిగిన కోరికా తీర్చాలి. రెండూ ఒక తీరున ఉండేవి కాదు గదా. అయితే అవి నెరవేరినప్పుడు వారికి కలిగే తృప్తి మాత్రం సమంగానే ఉంటుంది.

బృందావనంలో శ్రీకృష్ణ బలరాములతో కలసి నందాదులు, గోప గోపికలంతా సుఖంగా ఉన్నారు. ఇంద్రయాగం భగ్నమైన తరువాత నందాదుల ఆనందానికి అవధుల్లేవు. గోవర్ధన పర్వతాన్ని గోవుల్ని పూజించడం వారికి నిత్యకృత్యమైంది. అడవుల్ని కాపాడితే గాని గోసంపద వృద్ధికాదు. గోవులు వృద్ధి చెందితేగాని గోపకులు సుఖసంతోషాలతో ఉండలేరు. అందువల్ల పర్వతాలు, అరణ్యాలను కాపాడుకోవడం అత్యవసరమని శ్రీకృష్ణబలరాములు తలచారు. వీళ్ళు బాలురే లెమ్మని నిర్లక్ష్యం చెయ్యడం లేదు. “బాలాదపి సుభాషితమ్” అన్న మను వాక్యాన్ని ఆదరించి కృష్ణ బలరాములు చెప్పినట్లే నడచుకొంటున్నారు. గోవర్ధన పర్వతాన్ని గోవుల్ని పూజిస్తున్నారు. దాంతో వారంతా

బృందావనంలో సుఖంగా ఉండగలుగుతున్నారు.

ఇంతవరకు శ్రీకృష్ణుడు రాక్షస సంహారం పైనే దృష్టి పెట్టాడే గాని, గోపికల విషయంలో శ్రద్ధ చూపలేదు. అతడు బాలుడు కావడం కూడా అందుకో కారణం కావచ్చు. ఇప్పుడు వయస్సు రావడంతో ఆ వైపు దృష్టి సారించాడు. వర్షఋతువు పోయి శరదృతువు ప్రారంభం అయ్యింది. శరత్కాలం కావటాన బృందావనం అంతా ముగ్ధమనోహరంగా ఉంది. మన్మథుడు తన పరివారాన్ని వెంటబెట్టుకొని వేటాడే సమయం కూడా ఈ ఋతువే. ఇక గోపికల మాట చెప్పాలా?

గోపికా వస్త్రాపహరణము

(ఈ భాగం శ్రీ భాగవతం 10 వ స్కంధం నుండి గ్రహించబడింది)

హేమంత ఋతువు ఓ విచిత్రమైన కాలం. ఎటువంటి వారిలోనైనా శృంగార పవనాలు వీచే సమయమది. ఈ విపరీతం ఒక్క పురుషులకే కాదు. అటు స్త్రీల పరిస్థితి ఇంతే. అటువంటి మనోహరమైన కాలంలో గోపికలంతా కలసి యమునానదీ జలాల్లో స్నానమాడి ఇసుకతో ఓ మూర్తిని తయారు చేసుకొని ఆ ప్రతిమకు కాత్యాయనీ అని నామకరణం చేసుకొన్నారు. గంధపుష్పాక్షితలతోను ధూపదీపనైవేద్యాలతో పూజించి అనేక రకాలైన ఉపహారాలను నైవేద్యంపెట్టి తృప్తురాలను చేసి చేతులు జోడించి "ఓ కాత్యాయనీ దేవి! మహామాయా! ఓవన దేవతా! నీవు యోగి సమారాధ్యవు. మా అందరి ప్రార్థనల్ని స్వీకరించి శ్రీకృష్ణుని మాకు ప్రాణేశ్వరునిగా అనుగ్రహించు" అని ప్రార్థించారు. ఈ ప్రార్థన్నే ఒక మంత్రంగా స్వీకరించి జపించారు. భక్తి భావంతో మ్రొక్కారు. ముందు ముందు ఇంకా ఎన్నెన్నో ఉపహారాల్ని సమర్పించుకుంటామని ఆశ చూపారు.

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 27 వ అధ్యాయం నుండి గ్రహించబడ్డది)

శ్రీమన్నారాయణుడు: నారద మునీంద్రా! శ్రీకృష్ణుని లీలల్ని తెలిపే అద్భుతమైన లీల నొకదాన్ని చెప్తాను విను. ప్రతిరోజు ప్రాతఃకాలంలో ఇదే విధంగా కాత్యాయనీ పూజ చేస్తూ హేమంత ఋతువులో మొదటి నెల అంతా గోపికలు కామమోహితులై భక్తితో అనేక విధములైన భక్ష్యాలను వండి భగవంతునికి నివేదన చేసి తాము ప్రసాదంగా స్వీకరిస్తూ ఉండేవారు.

కాళిందీ తీరాన ఇసుకతో పార్వతీదేవి మూర్తిని తయారు చేసుకొని అమ్మవారిని ఆ విగ్రహంలోకి ఆవాహన చేసి "భగవతీ! దేవీ! జగజ్జననీ! సృష్టి స్థిత్యంతకారిణీ! సువ్రతా! నందగోపుని పుత్రుడైన శ్రీకృష్ణుని మాకు భర్తగా ప్రసాదించమని ప్రార్థించేవారు. ఇవే వారి కొచ్చిన మంత్రాలు. వారు భక్తితో పఠించేదీ ఈ మంత్రాన్నే. జపం అయిన తర్వాత సాష్టాంగ నమస్కారాలు చేసేవారు.

సర్వమంగళ మాంగల్యే సర్వ కామప్రదే శివే
దేహిమే వాంఛితం దేవి నమస్తే శంకర ప్రియే

అన్న ఈ మంత్రార్థాన్నే జపిస్తూ నమస్కరించి బ్రాహ్మణులకు దక్షిణలిచ్చి అన్నదానం చేసేవారు.

ఓ నారదమునీ! గోపికలంతా పార్వతిని ఎంతో సంతుష్టి పరిచారు. పూర్వం ప్రళయ కాలంలో సర్వం జలమయమై ఉండగా ఆ జలములపైన పరమేశ్వరుడు అద్వితీయుడై పవళించాడు. ఆ పిమ్మట

శ్రీమన్నారాయణుడు, ఆయన నాభి కమలం నుండి బ్రహ్మ ఉద్భవించాడు. మధుకైటభులు బ్రహ్మను బాధించారు. అప్పుడు బ్రహ్మ కూడా మూల ప్రకృతి అయిన ఈశ్వరినే ధ్యానించాడు. నారదా! నీకా స్తోత్రాన్ని చెప్తాను విను. ఓ దుర్గా! శివా! అభయా! మాయా! నారాయణీ! సనాతనీ! జయా! సర్వమంగళా! నాకు శుభములు కలిగించు. దకారము, దైత్య ధ్వంసకము, ఉకారం విఘ్నాలన్నింటినీ నాశనం చేస్తుంది. రేఫము రోగనివారకము, గకారము పాపాలను నశింప జేసేది. అకారము భయ శత్రు నాశకము. ఈ అర్థాన్ని ధ్యానిస్తూ నీ నామాన్ని స్మరించినచో ఫలం తప్పక లభిస్తుంది. అందువల్లనే దుర్గ హరిశక్తి అని శ్రీహరియే స్వయంగా సిద్ధాంతం చేశాడు. దుర్గ శబ్దం విపత్తి వాచకం. ఆకారం నాశవాచకం. దుర్గము నశింప జేయునది కావుననే దుర్గ అని పిలువబడింది. దుర్గ శబ్దం దైత్యేంద్ర వాచకము. ఆకారము నాశవాచకము. దైత్యుల్ని పూర్వం నశింపజేసింది కాబట్టి దేవతల చేత దుర్గ అని స్తుతించబడింది. శకారము కళ్యాణ వాచకము. ఇకారముత్కృష్ట వాచకము. వకారము సమూహబోధకము. ఆకారము దాతృవాచకము. శ్రేయఃపరంపరలను అతిశయంగా ప్రసాదిస్తుంది. కాబట్టి శివా అనబడింది. అభ శబ్దము భయనాశకము. ఆకారము దాతృవాచకము అప్పుడే అభయాన్ని ఇవ్వగలుగుతుంది. కాబట్టే నా జనని అభయా అని వినుతింపబడుతుంది. మా అనే అక్షరం ప్రాపణ వాచకము ఆ దేవి మాయా నామంతో ప్రసిద్ధి చెందింది. "మా" అనే వర్ణం మోక్షార్థ బోధకము. యాకారము ప్రాపణవాచకము. దానిని కల్పించేది కాబట్టి మాయ అనే పేరుతో కీర్తించబడుతోంది. నారాయణార్ధాంగభూతయై, నారాయణుని తేజస్సుచే వర్ధిల్లుతూ ఉండటం చేత నారాయణీ అన్న నామాన్ని సార్థకం చేసుకుంది. సనాతన శబ్దము నిత్య నిర్గుణ వాచకము. ఎల్లప్పుడు నిర్గుణము, నిత్యము అయినది కాబట్టి ఆ దేవిని సనాతనీ అని అంటారు. జయ శబ్దం చేత కళ్యాణ వాచకము. ఆ కారము దాతృ వాచకము ఎల్లప్పుడు జయాన్నే ఇచ్చేది కనుక జయ అన్న పేరు ఆ పరదేవికి సార్థకమైంది. సర్వమంగళ శబ్దం సంపూర్ణైశ్వర్య వాచకము. ఆ కారము దాతృ వాచకము. సర్వ మంగళ దాత్రి కావటాన సర్వమంగళాభిధానము ఆ పరదేవికే చెల్లింది.

నారదా! ఇది నామాష్టకం. సహస్రనామ సారం. అందువల్ల బ్రహ్మ దేవునికీ స్తుతిని బోధించి ఆ జగత్పతి నిద్రకుపక్రమించాడు. మధుకైటభులు మహా పరాక్రమవంతులు. వారు బ్రహ్మపై దాడి చేశారు. అప్పుడు బ్రహ్మ భక్తితో నమస్కరించి ఆ పరదేవిని స్తుతించాడు. అప్పుడు దుర్గ ప్రత్యక్షమై ఈ కవచాన్ని ప్రసాదించింది. అదే శ్రీకృష్ణ కవచము. ఆ కవచం దివ్యమైనది. సర్వ రక్షణ కరము. అటువంటి కవచాన్ని మహామాయ బ్రహ్మకిచ్చి అంతర్ధానమైంది. అంతట బ్రహ్మ కవచం చేత రక్షించబడిన వాడై స్తోత్రప్రభావం చేత మధుకైటభుల నుండి నిర్భయుడయ్యాడు. అంతట శంకరుడు దుర్గాంబతో కలసి నందివాహనంపై ప్రత్యక్షమయ్యాడు. శంకరుణ్ణి చూడగానే బ్రహ్మకు భయం పోయింది. జయాంబ జయాన్నిచ్చింది. బ్రహ్మ ఈ స్తోత్రకవచములను శంకరునికి ఉపదేశించాడు. త్రిపురాసురలతో యుద్ధం చేసినప్పుడు శంకరుడు పడిపోగా, బ్రహ్మాస్త్రాన్ని గ్రహించి నిద్రాయుతుడైన శ్రీహరిని స్మరించాడు. శ్రీహరి వలన స్తోత్రకవచాలను పొంది త్రిపురాసురులను వధించాడు.

గోపికలు ఈ విధంగా దుర్గాంబా స్తవాన్ని జపం చేసి శ్రీకృష్ణుని భర్తగా పొందారు. వారికా మహాదృష్టం కలగటానికి కారణం ఈ స్తోత్ర ప్రభావమే. ఇది గోపకన్యాకృత స్తోత్రం. సర్వమంగళ కారకము. సర్వ విఘ్నాలను తొలగించేది. మూడు పూటలా ఈ స్తవాన్ని ఎవరు జపిస్తారో వారంతా ముక్తిని పొందుతారు. భుక్తికి లోటు లేనివారవుతారు. శైవుడైనా, వైష్ణవుడైనా, శాక్తుడైనా ఈ దుర్గా ప్రసాదం చేత కర్మల నుండి విముక్తుడవుతాడు. ఈ లోకంలో హరి భక్తి కలిగి పరలోకమున శ్రీకృష్ణ దాస్యం లభిస్తుంది.

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం నుండి గ్రహించబడింది. ఈ వ్రత నియమాలన్నీ శ్రీ భాగవతంలో లేవు. గోపికా వస్త్రాపహరణం భాగవతంలో బాల లీలగా ఉంటుంది. కానీ శ్రీకృష్ణ జన్మఖండంలో మరోవిధంగా చెప్పబడింది. కావున ఈ రెండు గ్రంథాల్లోని విషయాలను ఉచితరీతిలో గ్రహించడం జరిగింది. ఈ భేదాన్ని పాఠకులు గ్రహించ ప్రార్థన)

గోపికలందరూ పూజాద్రవ్యాల్ని, నైవేద్యాన్ని యమునా తీరానికి చేర్చారు. తీరమంతా ధూపదీప సింధూర కుంకుమలతో నిండి చూసేవారికి ఆహ్లాదం కలిగించే విధంగా ఉంది. ఇంతలో వారందరికీ యమునానదిలో స్నానాలు చెయ్యాలనిపించింది. వస్త్రాలన్నీ ఒడ్డున పెట్టుకొని స్నానాలు చెయ్యడం వారి అలవాటు. కాత్యాయనీ దేవిని ఆరాధించి శ్రీకృష్ణుని భర్తగా పొందడమే వారి లక్ష్యం. అనగా నాటి గోపికల లక్ష్యం మహా యోగీశ్వరుల లక్ష్యాన్ని మించిపోయింది. ఇందులో అతిశయోక్తి ఏమీ లేదు. ఎందువల్లనంటే పరమ భక్తి ఏర్పడ్డప్పుడు చేయ తగిందేదో; చేయతగనిదేదో వారు ఆలోచించలేరు. అదే పరాకాష్ఠ. అప్పుడే కదా భగవత్ప్రాప్తి కలిగేది. ఇది శాస్త్రవిహితమే. గోపికలు వ్రతం చేసే విషయంలో రెండు గ్రంథాలు భద్రకాళిని పూజించినట్లే తెలుపుతున్నాయి.

స్తోత్రము, కవచము, దానికి సంబంధించిన కథాంశము ఎక్కువగా శ్రీకృష్ణ జన్మఖండంలో కనబడింది. అయితే ఇకపై చదవబోయే కథలో కొంత భేదం కనబడుతుంది. శ్రీహరి గోపికల మనోభావాలను గుర్తించాడు. వాళ్ళ సంకల్పం ధృఢమైనది ఔనా కాదా అని పరీక్షించి తెలుసుకోవాలనుకున్నాడు. అందువల్లనే గోపాల బాలురను వెంటబెట్టుకొని యమునా తీరానికి వెళ్ళాడు. అక్కడ వస్త్రాలు, నగలు గుట్టలు గుట్టలుగా ఒడ్డున పడి ఉన్నాయి. వారంతా శ్రీకృష్ణుణ్ణి కోరుకునే వారే. అయితే కాత్యాయనీ దేవిని ఎందుకు ఆశ్రయించారో తెలుసుకోవాలనుకున్నాడు. దాంతో గోపబాలురందర్నీ గోపికల వస్త్రాలన్నీ తీసుకురమ్మని ఆదేశించాడు. కాత్యాయనీ దేవి నివేదనకై తీసుకొని వచ్చిన ఆహారన్నంతటినీ గోప బాలురతో కలసి తినేశాడు. ఆ పిమ్మట వారంతా కొంత దూరం పోయి కూర్చుని సుఖంగా విశ్రాంతి తీసుకున్నారు. కొందరు వస్త్రాల్ని తీసుకుని వృక్షాలెక్కి కూర్చున్నారు. వాళ్ళల్లో శ్రీదాముడు, సుదాముడు, వసుదాముడు, సుబలుడు, సుపార్శ్వుడు, శుభాలనుడు, సుందరుడు, చంద్రభానుడు, వీరభానుడు, సూర్యభానుడు, వసుభానుడు, రత్నభానుడు అను పన్నెండు మంది గోపాలురు శ్రీకృష్ణునితో పాటు గోలోకం నుండి భూలోకంలో భగవంతునికి సేవ చేసేందుకు ఆయనతో పాటే వచ్చారు. ఇట్లా గోలోకం నుండి వచ్చిన వాళ్ళు చాలా మంది ఉన్నారు. వాళ్ళల్లో ఈ పన్నెండు మంది ఆంతరంగికులు. వీళ్ళందరికీ శ్రీకృష్ణ పరమాత్మయే ప్రధాన నాయకుడు.

ఆ గోపాల బాలురంతా ఆ వస్త్రాలన్నింటినీ తీసుకొని కంటికి కనిపించేటంత దూరంగా పోయి కూర్చున్నారు. శ్రీకృష్ణుడు వాటిలో కొన్ని ముఖ్యమైన దుస్తుల్ని తీసుకొని ఓ కదంబ వృక్షాన్నెక్కి కూర్చుని గోపికల వంక విలాసంగా చూస్తూ ఇలా అన్నాడు.

(ఈ ఘట్టం శ్రీ భాగవతం నుండి గ్రహించబడింది)

శా॥ *ఉద్యద్గంధ గజేంద్ర గౌరవముతో యోషాంబరంబుల్ ని*
ఖుం, డాద్యుం డర్భకుభంగి నర్భకులతో హాసార్థియై
కొంచుఁ ద, న్నద్యంభః కణశీత వాత జనితా నందంబుతో
నెక్కెఁ దా, సద్యోముక్తదురంత పాదపజను స్సంతాపమున్ నీపమున్

అని పోతనామాత్యుడు వ్రాశారు. దీన్ని బట్టి భక్తుడైన పోతన భగవచ్చేష్టల్ని ఎన్నివిధాలుగా వర్ణించి చెప్పాడో మనం గ్రహించగలుగుతాం. భగవత్కథాపటనం భక్తులకు ఒళ్ళు తెలియని ఆనందాన్నిస్తుందని దీన్ని బట్టి మనకు అర్థమవుతుంది.

ఈ ఘట్టాన్నే పోతన గారు, శ్రీకృష్ణుడు వస్త్రాలను అపహరించి చెట్టెక్కి కూర్చుంటే వారే ఆయన వద్దకు పోయి మా వస్త్రాలు మా కిమ్మని పరిపరివిధాలుగా బ్రతిమాలుకున్నట్లు వ్రాశారు. తన్మయులైన పోతన గారు తనలోకి భక్తి భావాన్నే గోపికల నోటి వెంట పలికించారా? అని అనిపిస్తుంది. మచ్చుకు మూడు నాలుగు పద్యాలు తిలకించండి.

క॥ *మామా వలువలు ముట్టకు । మామా కొనిపోకు పోకు మన్నింపుతగన్*
మామాన మేల కొనియెదు । మామానస హరణ మేల మానుము కృష్ణా

సీ॥ *బహుజీవనముతోడ భాసిల్లియుండుటో । గోత్రంబు నిల్పుటో కూర్మితోడ*
మహి నుద్ధరించుటో మనుజసింహంబ వై । ప్రజలఁ గాచుటో కాక బలిఁ దెరల్చి
పిన్నవైయుండియుఁ బెంపువహించుటో । రాజుల గెల్చుటో రణములందు
గురునాజ్ఞ చేయుటో గుణనిధివై బల । ప్రఖ్యాతిఁ జూపుటో భద్రలీల

ఆ॥ *బుధులు మెచ్చ భువిఁ బ్ర బుద్ధత మెఱయుటో । కల్కితనము చేయ ఘనత గలదే*
వావి లేదు వారు వారు నావారను । నెఱుక వలదె వలువ లిమ్ము కృష్ణ

క॥ *కొంటివి మా హృదయంబులు । కొంటివి మానంబు లజ్జఁ గొంటివి వలువల్*
కొంటివిఁక నెట్లు చేసెదో । కొంటెవు గద నిన్ను నెఱిఁగి కొంటిమి కృష్ణా

సీ॥ *రాజసంబున నీవు రంజిల్లు టఱుఁగమే । చెలరేఁగి వింతలు చేయుచుండ*
సత్త్వసంపద గల్గి జరగుటఁ దలఁపమే । సిరిగల్గి యన్యులఁ జెనకుచుండ
గురుతరశక్తియుక్తుఁడ వౌట యెఱుఁగమే । తామసంబున నెగ్గు దలఁచుచుండ
నొకభంగితో నుండ కుంటఁ జింతింపమే । మాయావి యై మాఱు మలయు చుండ

ఆ॥ *నేమి జాడవాఁడ వేపాటిగలవాఁడ । వేగుణంబు నెఱుఁగ వెల్లయెడల*
నొదిగియుండ నేర వోరంతప్రొద్దును । బటము లీఁగదయ్య పద్మనయన

పోతనగారు సందర్భం వచ్చినప్పుడల్లా భగవంతుని దశావతార లీలల్ని వర్ణిస్తూ ఉండటం

పరిపాటి. భక్తిపారవశ్యం లేని కవులు ఈ విధంగా చెప్పలేరు. అందువల్లనే పోతనామాత్యులు భక్తిభావం చెప్పాల్సి వచ్చిన ప్రతి చోటా పెంచి వ్రాశారు. ఈ విషయంలో పోతనగారికి పోతనగారే సాటి అని చెప్పక తప్పదు.

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం నుండి గ్రహించబడింది)

శ్రీకృష్ణుడా కదంబ వృక్షం పైనుండి గోపికలతో ఇలా అన్నాడు. "గోపికలారా! మీరు చేస్తున్న వ్రతానికి కొన్ని నియమాలున్నాయి. మీరు వాటిని అతిక్రమించారు. ముందా వ్రత విధానం ఏమిటో చెప్తాను. వినండి. ఆ తర్వాత మీ ఇష్టం వచ్చినట్లు నదిలో దిగి స్నానాలు చెయ్యండి. ఇది మార్గశీర్ష మాసం. ఈ మాసం మాసాలన్నింట్లోకి ఉత్తమమైనది. అటువంటి మాసంలో మంగళకరమైన వ్రతాన్ని ప్రారంభించారు. మీరు ప్రారంభించిన వ్రతానికి కొన్ని నియమాలున్నాయి. మీరంతా వివస్త్రలై స్నానానికి నదిలో దిగారు. పూజాద్రవ్యాలు మొదలైన పదార్థాలన్నీ తీసుకొనివచ్చారు. ఎందుకు? వ్రతానికే కదా? వ్రత నియమాల్ని ఉల్లంఘిస్తే ఈ వస్తువుల వలన ఏం ప్రయోజనం ఉంటుంది. అన్నింటికన్నా నియమం ముఖ్యం గదా. మీరీ విధంగా వివస్త్రలై స్నానాలు చెయ్యడం వలన నియమానికి భంగం కలుగుతుంది. "వ్రతేతు నగ్నా యా స్నాతి తాం రుష్టో వరుణస్స్వయం, వరుణానుచరాశ్చక్రుర్వా సోవస్తూపనిర్వృతిమ్" అని మూలం. వ్రతం చేసే ఏ స్త్రీ అయితే వివస్త్రగా స్నానం చేస్తుందో ఆ స్త్రీ పై వరుణుడు క్రోధం గలవాడై అపకారం తలపెడతాడు. ఎప్పుడైతే వరుణుడు కోపగించుకున్నాడో అతడి అనుచరులు వస్త్రాలను, ఇతర పూజాద్రవ్యాలను అపహరించుకుపోతారు. అట్లా జరిగితే వివస్త్రలై మీరీ వ్రతాన్నెట్లా చేస్తారు? ఇళ్ళకు ఎట్లా వెళ్తారు? మీరు ఎవరినైతే ఆరాధిద్దామని అనుకుంటున్నారో ఆ దేవత మీ వస్త్రాలను ఎందుచేత రక్షించలేకపోయింది. అటువంటి దేవిని మీరు ఈశ్వరిగా స్వీకరించి ప్రార్థిస్తున్నారే! ఆ దేవి మీకు ఫలాన్నెట్లా ఇవ్వగలదు? ఏవిధంగా పూజ్యురాలవుతుంది? ఎవరు వ్రతానికి ఫలాన్నివ్వగలరో ఆమెయే కదా దేవత అని అనిపించుకుంటుంది? అటువంటి అశక్తురాలైన దేవతను పూజిస్తే లాభం ఏముంటుంది? అన్న శ్రీకృష్ణుని మాటలకు గోపికలంతా కోపాన్ని నటిస్తూ ఇలా బెదిరించారు. ఆ బెదిరింపు మాటల్ని పోతనగారి మాటల్లో వినండి.

క॥ *రాజుల నెఱుఁగవు బలిమిని । రాజిల్లెదు చీరలీవు రమణుల మింకన్*
రాజున కెఱిఁగించెద మో । రాజీవదళాక్ష నీవు రాజువె ధరకున్

అనగా, నీవు చిన్న పిల్లవాడవు. రాజుగారి సంగతి నీకు తెలియదు. చిన్న తప్పుకైనా పెద్ద దండన విధిస్తాడు. మా చీరలన్నీ చాలా విలువైనవి. అంతఃపురాల్లో మహారాణులు ధరించే వస్త్రాలేకానీ సాదాసీదా చీరలు కావు. అందునా మేమంతా స్త్రీలం. స్త్రీలకు ఏమాత్రం అపచారం జరిగినా అది మహాపరాధమవుతుందని తెలుసుకో. నువ్వు ఇంకా మూర్ఖంగా ప్రవర్తిస్తే మేమంతా నందమహారాజు వద్దకు పోయి నీ ఆగడాలన్నీ చెప్తాం. కాబట్టి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మా వస్త్రాల్ని మాకిచ్చెయ్యి. మహాదండన నుండి నిన్ను నువ్వు కాపాడుకొని, నీతోటి బాలురను కూడా కాపాడు.

కాబట్టి రాజు దండించకుండా విడిచిపెట్టడానికి వీలు లేదు. అందువల్ల వారు రాజుకు చెప్తామని అనడం ధర్మ సమ్మతమేనని గ్రహించాలి. ఓ తామర రేకులవంటి కనులు కలవాడా!

నువ్వింకా బాలుడివి. ఏది అపరాధమో ఏది కాదో తెలుసుకోలేని వయస్సు.

విశేషార్థం: కృష్ణా! బలంలోనూ, తేజస్సులోను నీకు నువ్వే సాటి. భూమిపై నువ్వుండగా ఇంకొకడు రాజుగా ఉండగలడా? అనగా బ్రహ్మాండాలన్నింటికీ నువ్వే ప్రభువు అయిన నువ్విక రాజును గూర్చి ఎట్లా తెలుసుకోగలవు. కనుక రాజును గూర్చి నువ్వు ఎరుగవు. అటువంటి నువ్వు మా వస్త్రాలను ఇవ్వ వలనసిందిగా ప్రార్థిస్తున్నాం.

శ్లో॥ అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం

అన్న నీ ప్రతిజ్ఞను మర్చిపోయావా? అని తాత్పర్యం. "రాజున కెఱింగించెదమో రాజీవదళాక్ష" అనగా నువ్వు తామర రేకుల వంటి కన్నులు గలవాడవు. నీ అపరాధాన్ని మేము చంద్రుని దగ్గర మొరపెట్టుకుంటాం. చంద్రుడు ప్రత్యక్షమై నీ కన్నులు మూత పడేట్లు చేస్తాడు. అప్పుడు నువ్వేం చెయ్యగలవు? "నీవు రాజువె ధరకున్" గోవర్ధన పర్వతాన్ని ఎత్తానన్న గర్వం నీకున్నది కాబోలు. అంతమాత్రం చేత నువ్వు గోవర్ధన పర్వతానికి అధిపతివి కాదు సుమా అని ఒక అర్థమైతే ఇక నీ కన్నులు మూతపడేట్లు చేస్తామన్నమది రెండవ అర్థం. ఇట్లా చమత్కారం ధ్వనించేట్లుగా మహాకవి పద్యరత్నాలను మనకు ప్రసాదించాడు.

శ్రీకృష్ణుని మాటల్ని నీళ్ళల్లో నుండే గోపికలంతా విన్నారు. ఒడ్డున పెట్టుకున్న వస్త్రాలు, ఇతర పదార్థాలు కనబడటం లేదు. ఏమైపోయాయా? అని వారందరికీ దిగులు పట్టుకొంది. వారంతా నీళ్ళల్లోనే ఉంటూ తమ దైన్యానికి దుఃఖించారు. అప్పుడు వారంతా శ్రీకృష్ణుని ఇలా ప్రార్థించారు. "ఈశ్వరా! మేమంతా నీ భక్తులం, సేవకులం, మా వస్త్రాలు మాకిచ్చి మమ్మల్ని కరుణించు. ఓ పరమాత్మా! నువ్వు మా ఆత్మలను పరిశోధించవచ్చు. అంతే కానీ మా వస్త్రాల్ని తాకరాదు సుమా! ఇంకా అక్కడ వ్రతం కోసం సమకూర్చుకున్న పదార్థాలున్నాయి. అవన్నీ భగవంతునికి సమర్పించేందుకు సిద్ధం చేసుకున్నాం. కాబట్టి వాటన్నింటినీ నివేదన చెయ్యకముందే నువ్వు తినరాదు. నువ్వు వేదవేత్తవు. నీకు తెలియని విషయాలంటూ ఉంటాయా? మహాత్మా! నువ్వు తినాలనుకుంటే నీకు పదార్థాలకు కరువా? దేవతార్చన కోసం సిద్ధం చేసుకున్న ఈ పదార్థాలనే తినాలని ఎందుకు పట్టుపడుతున్నావు కాబట్టి మా వస్త్రాలను మాకు ఇచ్చేస్తే మా తిప్పలేవో మేం పడతాం.

గోపికలీవిధంగా వేడుకుంటూ ఉండగానే సుదాముడు తన వద్దనున్న వస్త్రాల్ని వాళ్ళకు ఇచ్చినట్లే ఇచ్చి వాటిని తీసుకొని పారిపోయాడు. సుదాముడీవిధంగా వస్త్రాలను తీసుకొని పారిపోతూ ఉంటే రాధాదేవికి కోపం ముంచుకొచ్చి గోపికలతో ఇలా అంది. "ఓ సుశీలా! ఓ శశికళా! ఓ చంద్రముఖీ! మాధవీ! కదంబమాలా! కుంతీ! యమునా! సర్వమంగళా! పద్మ ముఖీ! సావిత్రీ ! పారిజాతా! జాహ్నవీ! కథాముఖీ! పద్మా! గౌరీ! స్వయంప్రభా! కాళికా! కమలా! దుర్గా! సరస్వతీ! భారతీ! అపర్ణా! రతీ! గంగా! అంబికా! సతీ! సుందరీ! కృష్ణప్రియా! మధుమతి! చంపా! చందన నందినీ! మీరంతా పరుగున పోయి సుదాముణ్ణి కట్టి తీసుకురండి. త్వరగా వెళ్ళండి. వాడిని బంధించి నా దగ్గరకు తీసుకురండి" అని ఆజ్ఞాపించింది. రాధాదేవి నోటి నుండి ఆ మాట వచ్చిందో లేదో వారంతా నీళ్ళల్లో నుండి

బయటకు వచ్చి వివస్త్రలుగానే సుదాముణ్ణి వెంబడించారు. వీళ్ళను చూడగానే సుదాముడా వస్త్రాల్ని తీసుకొని శ్రీకృష్ణుని వద్దకు పరుగుతీశాడు. శ్రీకృష్ణుడు ఆ వస్త్రాలన్నింటినీ తీసుకొని చెట్టు పైకెక్కి కూర్చుని గోపికలతో ఇలా అన్నాడు. "గోపికలారా! ఇప్పుడు నేను చెప్పినదంతా జరగనే జరిగిందికదా. ఇప్పటికైనా రెండుచేతులూ జోడించి ప్రార్థించండి. మీకు ఇష్టం లేకపోతే మీ నాయకురాలైన రాధికాదేవి వద్దకు పోయి ప్రార్థించండి. మీకు నిజంగా వస్త్రాలు కావాలనుకుంటే ఆమెనే మరీ మరీ ప్రార్థించండి. మీ రాధికాదేవి నన్ను ఏపాటి ఆజ్ఞాపిస్తుందో చూస్తాను. లేదా మీరు ఏ కాత్యాయనీ దేవిని ధ్యానించి వ్రతం చెయ్య బోతున్నారో ఆమె వద్దకే పోయి చెప్పుకోండి. ఆ దేవి నన్నేమి చెయ్యగలదో చూస్తాను. మీరంతా పోయి మీ రాధా దేవికి ఇవన్నీ నా మాటలుగా చెప్పండి. వెళ్ళండి. నేను చెప్పింది చేసేంతవరకూ మీ వస్త్రాలు మీకు దక్కవు" అని శ్రీకృష్ణుడనగా వారంతా పోయి యథాతథంగా రాధాదేవికి నివేదించారు. కామ పీడిత అయిన ఆ రాధాదేవి శ్రీకృష్ణుని మాటలు విని ఫక్కున నవ్వింది. అంతలోనే సిగ్గుతో మొగ్గయిపోయింది. శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళేందుకు ఎంత మాత్రం ఇష్టపడలేదు.

అంతట రాధాదేవి ఆ నీళ్ళల్లోనే పద్మాసనం వేసుకొని శ్రీకృష్ణుని పాదారవిందాలను ధ్యానించింది. ఆ నిర్గుణ పరబ్రహ్మాన్ని ఇట్లా ప్రార్థించింది.

రాధాకృత శ్రీకృష్ణ స్తుతి :

ఓ గోలోకాధిపతీ, నువ్వు నా ప్రాణేశ్వరుడవు. అంతేకాదు, నా ప్రాణాలకన్నా కూడా అధికుడవు. దీనులకు బంధువవు. సర్వేశ్వరుడవు. ఇట్టి నీకు నమస్కరిస్తున్నాను. ఓ గోపాలక ప్రభువా! యశోదాదేవికి ఆనందాన్ని చేకూర్చేవాడవు నువ్వే. నందకుమారా! నందనందుడవు, నిత్యానందుడవు, ఇట్టి నీకు వందనములు. ఇంద్రుని గర్వమణచినవాడవు. బ్రహ్మ అహంకారాన్ని నిర్మూలించావు. కాళీయుని మదమణచావు. ప్రాణనాథా! శ్రీకృష్ణా! శివునికి, అనంతునికి, బ్రహ్మకు, బ్రాహ్మణులకు నువ్వే అధిపతివి. పరాత్పరుడవంటే నువ్వే. బ్రహ్మ స్వరూపుడవూ నీవే. నీవు బ్రహ్మజ్ఞుడవు. బ్రహ్మదేవుని సృష్టికంతా నీవే ఆధారభూతుడవు. ఇట్టి నీకు మ్రొక్కుచున్నాను. చరాచర సృష్టి అనే మహా వృక్షానికి బీజానివి నువ్వే. గుణాతీతుడవు నీవే. గుణాలకు అధిపతివీ నీవే. ఇట్టి నీ పాదాలకు నమస్కరిస్తున్నాను. అణిమాది సిద్ధులకు అధిపతివి నీవే. సిద్ధులకు సిద్ధ స్వరూపుడవు నీవే. తపస్సూ నీవే; తపస్సుకు బీజమూ నీవే. ఇట్టి నీకు అంజలి ఘటిస్తున్నాను. నిర్వచించగలిగేవాటికి నిర్వచించలేనివాటికి కూడా నువ్వే ఆధారభూతుడవు; సర్వ బీజరూపుడవు. అట్టి నీకు అభివాదము. స్వామీ! నేనూ, సరస్వతి, లక్ష్మీ, దుర్గ, గంగానది ఏ పాదాలను అర్చించుకుంటూ ఉంటామో అట్టి నీ పాదాలకు నా నమస్కారము. ఎవరిని ధ్యానించడం చేత నీ భక్తులు పవిత్ర తీర్థాలవుతారో అట్టి నీకు సాష్టాంగప్రణామములు. అని పలికి ఆ యమునా పావన జలాలతోనే శ్రీకృష్ణ విగ్రహాన్ని నిర్మించుకొని, అందు మనఃప్రాణాలను నిక్షేపించి ధ్యానమందు నిలిచిపోయింది. దీన్నే రాధాకృత శ్రీకృష్ణ స్తోత్రమని అంటారు. ఆ స్తోత్రం శ్రీహరికెంతో ప్రీతిపాత్రమైనది. రాధాదేవి శ్రీకృష్ణుని ధ్యానించి కన్నులు తెరువగానే ప్రపంచం అంతా శ్రీకృష్ణమయంగా కనిపించింది. యమునా తీరమంతా తిరిగి వస్త్రాలతోనూ

పూజాద్రవ్యాలతోనూ నిండిపోయింది. రాధాదేవికిది నిజమా? కలా? అన్న అనుమానం కలిగింది. కానీ ఎదురుగా కంటికి కనిపిస్తూ ఉంటే నమ్మకుండా ఉండలేకపోయింది. దాంతో ఆమె ఒళ్ళంతా పులకించిపోయింది. పరమానందభరితురాలయింది. గోపికలందరికీ కూడా ఇదే అనుభూతి కలిగింది. దాంతో గోపికలంతా నీళ్ళల్లోనుండి బయటకు వచ్చి వస్త్రాల్ని ధరించారు. యథావిధిగా ఆ వ్రతాన్నాచరించారు. కాత్యాయనీ దేవి నుండి వారు కోరుకున్న వరాలన్నీ పొంది ఇళ్ళకు పోయారు.

(ఈ ఘట్టం శ్రీ భాగవతంలో ఇలా ఉంది. ఈ కథ కూడా చెప్పకుంటే గానీ గోపికా వస్త్రాపహరణంలోని అంతరార్థం బోధపడదు. నిజానికి భేదం పెద్దగా లేదు గానీ, ఉన్నట్లు కనిపిస్తుంది.)

శ్రీకృష్ణుడు గోపికలందర్నీ నీళ్ళల్లో నుండి బయటకు వచ్చి వస్త్రాల్ని తీసుకొని పొమ్మన్నాడు. మీరు వివస్త్రలుగా స్నానం చెయ్యకూడదనీ బోధించాడు. అందుకు పరిహారంగా నమస్కారం చేసుకొమ్మని ఉపదేశం చేశాడు. దాంతో గోపికలంతా బయటకు వచ్చి శ్రీకృష్ణుని ఉపదేశాన్ననుసరించి నమస్కరించారు. అయితే వారు నమస్కరించిన తీరు క్రొత్తగా ఉంది. అనగా ఒంటి చేత్తోనే నమస్కరించారు. ఈ పద్ధతి మన దేశాచారం కాదు గదా. అయితే శ్రీకృష్ణుడు వారి చేష్టలను చూసి నవ్వుతూ ధర్మయుక్తంగా ఇలా అన్నాడు. "గోపికలారా! మీరీవిధంగా నమస్కారం చెయ్యడం ధర్మ సమ్మతం కాదు. "ఏకేన పాణినా యోవై ప్రణమేద్దేవ మచ్యుతం తస్య దండః కరచ్ఛేద ఇతి ధర్మవిదో విదుః" అని మూలంలో ఉంది అనగా ఎవడు ఒకచేత్తో భగవంతుడైన అచ్యుతునికి నమస్కరిస్తాడో వాడి చేతిని నరికెయ్యడమే సరి అయిన దండన అని ధర్మవిదులు చెప్తారు. కాబట్టి మీరంతా రెండు చేతులతో నమస్కారం చేస్తేనే నాకు ఇష్టం. అంతే కాకుండా మీరీ పాపాన్నుండి బయటపడలేరు కూడా. కావున మీరీ పాపం నుండి బయట పడాలనుకుంటే రెండు చేతులతోనూ నాకు నమస్కరించండి. ఆ తర్వాత మీ వస్త్రాల్ని మీరు తీసుకొని వెళ్ళవచ్చు" అని శ్రీకృష్ణుడు వారికి హితోపదేశం చేశాడు. అనగా, ఆ గోపికలంతా శ్రీకృష్ణుని ఉపదేశాన్ని స్వీకరించి వ్రతభంగం కావడానికి ఇష్టపడక శ్రీకృష్ణునికి రెండు చేతులూ ఎత్తి నమస్కరించారు. అనగా శ్రీకృష్ణుడే పాపాలన్నింటినీ పరిహారం చేసేవాడని పరిపూర్ణ విశ్వాసంతో నమ్మారు. ఈ విధంగా వారంతా నమస్కరించగానే శ్రీకృష్ణుడు వారి వస్త్రాలను వారికిచ్చేశాడు. వారందరికీ వ్రతఫలం దక్కేట్లుగా చేసి వారిపై తనకు గల కరుణను స్నేహాన్ని ప్రకటించుకున్నాడు. నీళ్ళల్లో నుండి బయటకు వచ్చేట్లు చేసి వారితో పరిహాసాలాడినట్లు పైకి అనిపించినా అవన్నీ ధర్మయుక్తమైనవేనని గ్రహించారు. శ్రీహరిపై దోషబుద్ధిని ఆరోపించక ఎంతో ఆదరంతో స్వీకరించారు. ప్రాణానికన్నా ఎక్కువైనవాడని భావిస్తున్న ప్రియుడు ఈ విధంగా వినోదించడమే పురుషార్థమని భావించారు. అంతేగాని ఈ విధమైన కష్టాలు కలిగించి తమ్ము బాధపెట్టాడని కోపగించుకోలేదు. ఈ భాగాన్ని ఆంధ్రానువాదం చేసిన పోతనగారు వివరించిన తీరు ఎట్లాంటిదో తిలకించండి.

సీ॥ *శృంగారవతులార సిగ్గేల మిముఁ గూడి । పిన్ననాఁటనుగోలెఁ బెరిఁ గినాఁడ*
నెఱుఁగనే మీలోన నెప్పుడు నున్నాఁడ । నేను జూడనిమర్మ మెద్ది గలదు
వ్రతనిష్ఠలై యుండి వలువలు గట్టక । నీరు సొత్తురె మీరు నియతి దప్పి

కాత్యాయనీ దేవిఁ గల్లసేయుట కాక । యీరీతి నోఁచువా రెందుఁ గలరు
ఆ॥ వ్రతఫలంబు మీరు వలచినఁ జక్కఁగ । నింతులెల్లఁ జేతు లెత్తి మ్రొక్కి
చేరి పుచ్చుకొనుఁడు చీరలు సిగ్గు పో । నాడనేల యెగ్గు లాడనేల
ఆ॥ చీర లపహరించి సిగ్గులు విడిపించి । పరిహసించి యైనఁ బరఁగ మనకు
ఘనుఁడు నోము కొఱఁత గాకుండ మ్రొక్కించె । ననుచు హరి నుతించి రబల లెల్ల.
క॥ ఉల్లములు నొవ్వ నాడినఁ । గల్లలు చేసినను నగినఁ గలఁచిననైనన్
వల్లభులు చేయు కృత్యము । వల్లభలకు నెగ్గుగాదు వల్లభ మధిపా

చూశారు గదా? మూలాన్ని కొంత పెంచి కొంత వదిలేసి లోకుల అభిరుచులను దృష్టిలో ఉంచుకొని వ్రాశారు.

ఈ విధంగా గోపికలంతా శ్రీహరి నుండి తమ వస్త్రాల్ని తీసుకొని ఆనందపరవశంతో ప్రియుడ్ని క్రీగంట చూస్తూ కాలు కదల్చలేకపోయారు. తన పాదాలకు నమస్కరించుకొనిగానీ పోరన్న వారి అంతరంగాన్ని శ్రీకృష్ణుడు గ్రహించాడు.

"కాంతలారా! మీరంతా నన్ను అర్చించుకోవాలని కోరుకుంటున్నారు. ఆ విషయం నేనెరుగుదును. మీ కోరికను అంగీకరించి మీకు తప్పక ఫలం చేకూరేట్లు చేస్తాను. అంతేకాదు. ఎవరికి నాయందు నిశ్చల భక్తి కలుగదో వారి కోరికలు కేవలం కోరుకున్నంతవరకే ఫలాన్నిస్తాయి. నాయందు ఆసక్తులయ్యే వారికి సకలార్థ ఫలాన్ని ప్రసాదిస్తాను. ఉడికించిన విత్తనాలు నాటితే మొలకెత్తవు. అట్లాగే కోరికలతో సంకల్పించిన సంకల్పం ఫలించదు. నిష్కామ సంకల్పం మాత్రమే సకలార్థ ఫలాలనిస్తుంది. కావున ఓ గోపికలారా! మీ వ్రతం ఫలించింది. తృప్తిగా సంతోషంతో వ్రజకు వెళ్ళండి. మీరీ రాత్రులు నాతో విహరించగలరు. మీరు వ్రతాన్ని చేసి కాత్యాయనీ దేవిని కోరుకున్న కోరిక ఇదే కదా? ఆ దేవి మీకీ వరాన్నే ప్రసాదించింది. మీరు సంతోషంగా ఇళ్ళకు వెళ్ళండి. మీరందరూ మహా పతివ్రతలుగా ప్రశంసించబడతారు" అన్న శ్రీకృష్ణుని మాటలు విన్న గోపికలంతా సఫల మనోరథలై శ్రీకృష్ణుని వదిలి వెళ్ళలేక అతి కష్టంమీద వ్రజకు చేరుకున్నారు.

పాఠక మహాశయులారా! శ్రీకృష్ణ వస్త్రాపహరణం వివిధ పురాణాల్లో ఉండే చిన్నపాటి భేదాల్ని తెలుసుకున్నారు. ఇందులోని సారాంశమేమంటే, గోపికల వస్త్రాపహరణం వలన శ్రీకృష్ణుని చరిత్రకు మచ్చ ఏర్పడిందని కొందరి అభిప్రాయం. ఇందులో ముఖ్యంగా తెలుసుకోదగినది అనన్య భక్తి. మిగిలిన విషయాలన్నీ అంత ప్రధానం కాదు. ఇక సారాంశం వినండి.

హేమంత కాలం ప్రారంభం అయ్యింది. ప్రాతఃకాలంలో స్నానం చేసేవారికి అదే పరీక్షా సమయం. అందువల్లనే కాబోలు "కంపంతం తంపు నీమ హే" అని భగవంతుడు తెలిపాడు. గ్రీష్మంలో పంచాగ్నుల మధ్యను, హేమంతంలో చన్నీటిలో గొంతు వరకు దిగి ధ్యానం చెయ్యడం అనేది భక్తుల చిత్త వృత్తుల్ని పరీక్షించడానికే నని పెద్దలంటారు. నియమాలు అర్థంలేనివి కావు. అప్పుడే శ్రీహరిపైగల భక్తి తెలుసుకోవచ్చని వారి అనుభవం అయి ఉంటుంది. కొందరు వేదాంతులు చెప్పిన మాటల్ని చిత్తగించండి.

కII త్వానైతే పరిశుద్ధుఁడు । మేనైతే ముట్టుబోకి మేనో తానో
వూనికఁ జేసెడి తీర్థ । స్నానం బది యెవరికన్న సంపగిమన్నా

అన్న ఈ పద్యం వారికి శరణములు. ఈ ఉదాహరణలు ఎట్లా ఉన్నాయంటే కోటి బ్రహ్మ హత్యలు చేసి 'శివా' అన్నంత మాత్రాన అవన్నీ నశిస్తాయని చెప్పినట్లుంటుంది. ఇవన్నీ అజ్ఞానంతో కూడుకున్న ప్రమాణాలు. ఈ ప్రమాణాలన్నీ దేహాభిమానం గలవానికి స్నానం ప్రధానం కాదని చెప్పినట్లుంటుంది. అట్లా కాకుండా హేమంత కాలంలో ప్రాతః స్నానానికీ అయితే అది వంచన చేయడానికి కాక మరేమవుతుంది? దొంగతనం చేసి ఇది తప్పుకాదా? అని అడిగితే "అమేధ్యాదపి కాంచనమ్" అని మనుస్మృతిలోని ఒక వాక్యాన్ని ప్రమాణంగా చూపించినట్లుంటుంది. అనగా బంగారాన్ని సంపాదించడం కోసం ఏ మార్గాన్నైనా అవలంబించవచ్చని సమర్థించుకోవడం అన్నమాట. కాబట్టి మహా జ్ఞానులకు మాత్రమే చెప్పబడిన ధర్మాన్ని గృహస్థులకు సరిపోదు. అజాతి భిక్ష సర్వసంగ పరిత్యాగం చేసిన మహాత్ములకే గాని గృహస్థులకు కాదు. కాంతా కాంచనాలపైన ఆశలేనివాడే జ్ఞాని. అటువంటి వారికి చెప్పిన ధర్మాల్ని అందరూ ఆచరించలేరు. మహాత్ములు జ్ఞానులు కూడా లోకానికి బోధించేందుకు సదాచారాల్ని పాటిస్తూ ఉంటారు. ఎందువల్లనంటే తమను చూసి ఇతరులు కూడా నేర్చుకుంటారు. అంతే కానీ శుష్క వాక్యాలు చెప్పేవారి మాటల్ని పాటించరాదు. శ్రీశంకర భగవత్పాదులు "సన్న్యస్య శ్రవణం కుర్యాత్" అంటూ, వేదాంత విషయాలు వినాలన్నా కూడా వైరాగ్య సంపద కావాలంటారు. కాబట్టి స్మృతులు చెప్పిన ధర్మాలు తప్పక ఆచరించాల్సినవేనని తేలుతోంది.

విశేషార్థం : హేమంత కాలం రాగానే గోపికలంతా తెల్లవారుజామునే లేచి యమునా నదికి పోయి స్నానం చేసి ఇసుకతో కాత్యాయనీ ప్రతిమను చేసి శ్రీకృష్ణుడే తమకు భర్త అయ్యేట్లు అనుగ్రహించమని ప్రార్థించారు. ఒక్క కాత్యాయనీ దేవినే కాక సర్వదేవతల్నీ కూడా ప్రార్థిస్తూ మార్గశీర్ష మాసం అంతా పూజించారు. చివరి రోజున అంబకు నైవేద్యానికి వివిధములైన వస్తువుల్ని తెచ్చి ఒడ్డున పెట్టుకొని వివస్త్రలుగా నదికిపోయి స్నానం చేశారు. శ్రీకృష్ణుడు 12 మంది స్నేహితులతో కలసి వచ్చి పదార్థాలన్నీ తిని వస్త్రాల్ని అపహరించుకు పోయాడు. గోపికలంతా ప్రార్థించగా మీ వస్త్రాల్ని కాపాడలేని దేవి మీ అభీష్టాల్ని ఎట్లా తీరుస్తుందని ప్రశ్నిస్తాడు. అనగా ఎవరైనా ఒక్కదేవతనే ప్రార్థించాలనీ ఒక్కొక్క కోరికకు ఒక్కొక్క దేవతను ప్రార్థించదగదని సర్వాంతర్యామి అయిన భగవంతుని ఏ రూపంలో ధ్యానించినా సమాన ఫలితమే లభిస్తుందన్నదే శ్రీకృష్ణుని ఉపదేశం. కావున మీరంతా ఎందువలన కాత్యాయనిని పూజించారని ప్రశ్నించాడు. జలక్రీడలు చేసే సమయాల్లో వివస్త్రలుగా విహరించవచ్చును గాని, దైవప్రార్థనల కోసం చేసే స్నానాలు మాత్రం వివస్త్రలుగా చెయ్యరాదని, అట్లా చేశారు కాబట్టి దుష్ఫలితం అనుభవించక తప్పదని శ్రీకృష్ణుడు లోకులకు ఉపదేశించాడు. "యే ప్రచరంతి తీర్థాని సృకావంతో నిషంగిణః" అని యజుర్వేదం చెప్తుంది. నీళ్ళల్లో ఉండగా మూత్రాదులు విసర్జిస్తే అక్కడ ఉండే దేవతలు కోపగిస్తారని శ్రుతి చెప్తోంది. అదే అర్థాన్ని ఇప్పుడు శ్రీకృష్ణుడు గోపికలకు తెలిపాడు. అందువల్లనే సుదాముణ్ణి వస్త్రాలు తీసుకొని పరుగెత్తమని ఆదేశించాడు.

క॥ క్రోధము తపముం జెఱచును । క్రోధమె యణిమాదులైన గుణములఁ బాపుం
గ్రోధము ధర్మ క్రియలకు । బాధయగుం గ్రోధిగాఁ దపస్వికి జనునే

అన్న మహాభారతంలో చెప్పిన దాన్నే ఇక్కడ గుర్తు చేసినట్లయింది. కావున భగవత్కార్యాల్లో కూడా క్రోధాన్ని ప్రదర్శించరాదని, శాంతంగా ఉండాలని స్మృతి హెచ్చరిస్తుంది.

రాధాదేవి క్రోధంతో సుదాముణ్ణి వెంబడించి పట్టుకోమని గోపికలను ఆజ్ఞాపించింది. వాళ్ళు కూడా ఒంటిమీద నూలు పోగైనా లేదన్న జ్ఞానం కూడా లేకుండా సుదాముడి వెంటపడ్డారు. వాళ్ళంతా పోయి పోయి శ్రీకృష్ణుడున్న చోటుకే వచ్చి చేరారు. అప్పుడు సుదాముడేమన్నాడు? "ఇప్పుడు మీరేం చెయ్యగలరు?" అన్నాడు. అనగా దాని అర్థం ఏమిటి; వ్రతభంగం అయింది గదా వ్రతఫలం మీకెట్లా దక్కుతుందనే గదా? అర్థం. ప్రాయశ్చిత్తంగా అపరాధాలన్నింటికీ కలిపి ఓ నమస్కారం చెయ్యమని భగవంతుడు ఆదేశించాడు. అనగా నమస్కార శబ్దానికి అర్థం ఏమిటి? "మత్తస్త్వముత్కృష్టస్త్వత్తోకహమప కృష్ణః" అనగా నా కంటే నువ్వుగొప్పవాడవు, నేను నీకంటే అల్పుడననే గదా అర్థం. ఈ భావం కనబరిస్తేనే క్షమిస్తానన్నాడు. ఈ మాటకు రాధిక ఏమంటుందో కనుక్కుందామని వారంతా రాధిక వద్దకు పోయి శ్రీకృష్ణుడన్న మాటలన్నీ చెప్పారు. ఆమె విని ఫక్కున నవ్వింది. ఎందువల్ల? ఆ మాటలు విన్న తర్వాత గాని రాధాదేవికి కూడా ఆత్మజ్ఞానం కలుగలేదు. భర్తను మించిన దైవం ఉండదు గదా? అటువంటిది భర్తను వదిలేసి వెర్రిదాననై ఇంకో దేవతను ప్రార్థిస్తున్నానే అని నవ్వు వచ్చింది. దాంతో పూర్వస్మృతి కలిగి జ్ఞానోదయమై అక్కడికక్కడే నీళ్లల్లోనే యోగాసనం వేసుకొని శ్రీకృష్ణుని పాదాలపైనే ధ్యానాన్ని నిలిపి గోలోకనాథా! నా అపరాధాన్ని క్షమించు" మని పరిపరివిధాలుగా ప్రార్థించింది. దాంట్లోనే తాను శ్రీకృష్ణునికి ప్రియమైన భార్యనని గుర్తు చేసింది. దాంతో శ్రీకృష్ణుడు సంతోషించి ప్రసన్నుడయ్యాడు. ఇకచాలు రాధాదేవికి జ్ఞానోదయమైంది. నా పరీక్షకు నిలిచిందని అనుకున్నాడో లేదో, రాధాదేవికి ప్రపంచం అంతా శ్రీకృష్ణమయంగా కనిపించింది. వస్త్రాలు పదార్థాలన్నీ ఇదివరకు ఉండేచోటులోనే ఉన్నట్లు గ్రహించారు. వెంటనే నీళ్ళల్లో నుండి బయటకు వచ్చి వ్రతాన్ని పూర్తి చేశారు. కాత్యాయనీ అనుగ్రహాన్ని పొందినవారై ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళారు.

తత్త్వ జిజ్ఞాసువులారా! ఇందులో ఉండే విశేషాన్ని గ్రహించండి. యమునా తీరాన ఉండాల్సిన వస్త్రాలు పదార్థాలు అక్కడే ఉన్నాయి. స్నానాలు చేస్తున్నవారంతా అక్కడే ఉన్నారు. అయితే వారికా భ్రాంతి కలిగేటట్లు చేసి, నగ్నంగా స్నానాలు చెయ్యరాదన్న భావాన్ని ఉపదేశించాడు. ఆ భ్రాంతిని తొలగించడమే జ్ఞానం. రాధకు స్వరూపజ్ఞానం కలుగగానే ఆమె భ్రాంతిని తొలగించాడు. దాంతో వస్త్రాలు, వస్తువులన్నీ యథాతథంగా కనిపించాయి. కనుక కథాభాగం భగవంతుని మహిమను ఆ మహనీయుని సర్వజ్ఞత్వాన్ని వేనోళ్ళ చాటుతోంది. దీంతో శ్రీకృష్ణుని తప్పుపట్టే వారినోళ్ళు మూయించినట్లువుతోంది. అంతే కాకుండా మహాభారతంలోని ఈ ఘట్టాన్ని తిలకించండి.

ద్రౌపది పిలుపు విని మాన సంరక్షణ మొనరించిన మహాత్ముడు కరుణానిధీ అయిన శ్రీకృష్ణుని గోపికల విషయంలో దూషించడం క్షమించరాని నేరమే అవుతుంది. రాధాదేవి ధ్యానం చెయ్యగానే వస్త్రాలన్నీ అక్కడే కనిపించాయి కదా. కనిపించకుండా పోవడం భ్రాంతి మాత్రమే. ఇందు మూలంగా

భగవంతుని ఉపదేశం ఏమంటే, నమ్ముకున్న దేవతను వదలి అన్యదేవతలను ఆశ్రయించడం అవివేకమని తేలుతోంది. కోరినవన్నీ ఇచ్చే భగవంతుడినే ఆశ్రయించమని శ్రీకృష్ణుని ఉపదేశ సారం. అనగా చంచలత్వాన్ని వదలమని ఆదేశం. ఇదే కాకుండా మరో నీతి ఏమంటే గోపికలంతా ఇసుకతో కాత్యాయనీ ప్రతిమను చేసి పూజించాలనుకున్నారు. ఇంతకాలం సర్వవ్యాపి అయిన పరమాత్ముని ఆరాధిస్తూ వచ్చారు. అటువంటి వారిప్పుడు ఓ ఇసుక ప్రతిమను పూజించాలనుకున్నారు. ప్రతిమను పూజించడం దోషంకాదు గాని, ఈ విధానం ప్రారంభదశలో ఉండే సాధకులకు మాత్రమే కాని, రాధాదేవి గోపికల వంటి వారికి కాదని భావం. అదే శాశ్వతమైన ఆరాధన అనుకొని స్థిరపడిపోకూడదు.

"అంతరర్చన సుప్రీతో బహిరర్చనలోలుపా" అని శ్యామా మహిమలో చెప్పబడింది. "అంతర్ముఖసమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా" అని లలితా సహస్రంలో కనిపిస్తుంది. అంతస్స్వాత్మ ప్రవణం ముఖం చిత్తవృత్తి ర్యేషాం తై స్సమ్యగారాధ్యా. బహిర్విషయైక ప్రవణం ముఖం యేషాం తేషాం సుదుర్లభా అని భాష్యం.

సమయహుతం అంటే బాహ్య పూజలు మాని ఇష్టదైవాన్ని దేహంలో ఉండే షట్చక్రమందే యథారూపంగా దర్శించి ధ్యానించి పూజించాలని ఉపదేశం. దీనిని బట్టి మానవులందరూ ముందుగా మనస్సులో ఇష్టదేవతా రూపాన్ని నిర్మించుకునే ముందు బాహ్యపూజల ద్వారా సాధనలు ఉధృతం చేసుకుంటూ కొంత కాలమైన తర్వాత ఆ రూపాన్నే మనస్సులో నిలుపుకోవాలి. అనగా చిన్నప్పుడు నేర్చుకున్న పాఠాన్నే చనిపోయే వరకూ వల్లించమని కాదు. దీనిని బట్టి శ్రీకృష్ణుడు రాధాదేవితో "మళ్ళీ విగ్రహారాధనలు మొదలు పెట్టావా?" అని బుద్ధి చెప్పినట్లుంది. భగవంతుని అభిప్రాయాన్ని గ్రహించిన రాధాదేవి యమునా నదిలో యోగాసనం వేసుకొని శ్రీకృష్ణుని మనస్సులో ధ్యానించి కళ్ళు తెరవగానే వస్త్రాలన్నీ యథాపూర్వంగా కనిపించాయి. అంతే కాకుండా. స్తుత్వైవం చక్షురున్మీల్య దృష్ట్వా కృష్ణమయం జగత్ అని ధ్యానించి కళ్ళు తెరవగానే ప్రపంచం అంతా శ్రీకృష్ణమయంగా కనిపించింది.

గౌరీ వ్రత విధానము :

నారదుడు: మహాత్మా! నారాయణా! గోపికా వస్త్రాపహరణ కథ అందలి అంతరార్థాన్ని చక్కగా వివరించి చెప్పావు. రాధాదేవి ఆచరించిన వ్రతం పేరేమిటి? ఆ వ్రత విధానం ఎట్లాంటిది? ఆ వ్రత ఫలితం ఆచరించినందువల్ల కలిగే ఫలం ఎటువంటిది? ఆ వ్రతం చేయటానికి ఏమేం ద్రవ్యాలు కావాలి? దక్షిణ ఎంత? వ్రతం అంతా అయిన తర్వాత చెయ్యాల్సిన విధివిధానాలు ఏమైనా ఉన్నాయా? తెలుపవలసింది.

నారాయణుడు: నారదా! దేవర్షీ! నువ్వడిగిన ఈ వ్రత విధానం గూర్చి వివరంగా చెప్తాను విను. ఈ వ్రతాన్నే గౌరీ వ్రతం అని అంటారు. ఈ వ్రతాన్ని ఎక్కువగా స్త్రీలే ఆచరిస్తారు. అట్లాగని పురుషులకీ వ్రతం నిషిద్ధం కాదు. మార్గశీర్ష మాసంలో ధర్మార్థకామమోక్షాలనాశించి ఈ వ్రతాన్ని చేస్తారు. ఈ వ్రతం చేయడం వలన శ్రీకృష్ణభక్తి దృఢమవుతుంది.

ముందురోజు ఉపవాసం ఉండాలి. ప్రాతఃకాలాన్నే లేచి స్నానాదులు పూర్తి చేసుకొని పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి దేవి ప్రతిమకు అలంకారాదులు చేసి కలశం లోకి ఆవాహనం చెయ్యాలి. గణపతిని, సూర్యుణ్ణి, అగ్నిని, నారాయణుని, శంకరుని, దుర్గను పంచోపచారములతో పూజించి వ్రతాన్ని ప్రారంభించాలి. కలశానికి క్రింద పిండిపోసి చతురస్రంగా చేసి అందులో చందనం, అగరు, కస్తూరి కుంకుమ మొదలైన సుగంధాలతో అర్చిస్తూ ఈ మంత్రాన్ని జపించాలి.

"హే గౌరి శంకరార్ధాంగీ యథాత్వం శంకరప్రియా
తథా మాంకురు కల్యాణి కాంతకాంతాం సదుర్లభామ్" అని.

ఈ ధ్యానవిధానం అతి రహస్యమైనది. సర్వకామ ప్రదము. ఇది సామ వేదోక్తము. మునీంద్రులు కూడా ఎరుగని ఈ వ్రతాన్ని గూర్చి చెప్తాను, శ్రద్ధగా విను. ఈ స్తోత్రం చేతనే సిద్ధులు దుర్గను ఆరాధిస్తారు. బ్రహ్మాదులచేత వినుతించబడుతూ, సూర్యకోటి ప్రభాసమానమైన ఆ పరాదేవిని భజిస్తున్నానని ధ్యానం చేసుకొని శిరస్సున పుష్పాలుంచుకొని, మళ్ళీ చేతుల్లో పుష్పాలను తీసుకొని ధ్యానం చేయాలి. ఆ తర్వాత షోడశోపచారాలతో పూర్వోక్త మంత్రాలు పఠించి ధ్యానం చేసుకోవాలి. పూర్వోక్త స్తోత్రంతోనే నమస్కరించాలి. ఆ తర్వాత ఇంద్రియాలన్నింటినీ అదుపులో పెట్టుకొని కథ వినాలి. నారదా! నీకు ఆ వ్రత కథనంతా వివరంగా చెప్తాను. విను.

గౌరీ వ్రత కథ: నారదా! పూర్వం కుశధ్వజుని కుమార్తె అయిన వేదవతి ఈ వ్రతాన్ని చేసింది. వ్రతం కాగానే ఆ జగదంబ శతకోటి సూర్యుల తేజస్సుతో ప్రత్యక్షమైంది. ఆ పరమేశ్వరి మందహాసం చేస్తూ ఇలా అంది. "ఓ వేదవతీ! నీవు చేసిన ఈ వ్రతానికి సంతోషించాను. నీకు శుభాలు కలుగుతాయి. నీ మనోవాంఛ తీరగలదు" అని పలుకగా వేదవతి ఇలా అంది. "భగవతీ! కాత్యాయనీ! శ్రీమన్నారాయుణ్ణి నాకు భర్తగా ప్రసాదించు. ఇదే నా ఏకైక కోరిక. శ్రీహరిపై నాకు దృఢ భక్తిని ప్రసాదించు" అని వేడుకుంది. వేదవతి మాటలకు జగదంబిక ఫక్కున నవ్వింది. రథం దిగి వచ్చి ఇలా అంది. "ఓ వేదవతీ! జగన్మాతా! నువ్వు సాక్షాత్తూ లక్ష్మీ దేవివే. ఈ భూమండలాన్ని పవిత్రం చెయ్యడానికే నీ పాద పద్మాలను ఈ నేలపై మోపావు. నీ పాదధూళి చేత ఈ భూమి అంతా పరమ పవిత్రమయింది. తీర్థాలన్నీ పవిత్రమయ్యాయి. నువ్వీ వ్రతాన్ని చెయ్యడం లోకులకు బోధించేందుకే గానీ నీ కొరకు కాదు. కొంతకాలం తపస్సు చెయ్యి. ప్రతి అవతారంలోనూ నువ్వే శ్రీమన్నారాయణునికి భార్యవు కాగలవు. ముని శాపం చేత రాక్షసులైన వారందర్నీ శ్రీరాముడుగా అవతరించి సంహరించాల్సి ఉంది. ఆ రాముడు త్రేతాయుగంలో దశరథుని పుత్రుడై అయోధ్యా నగరంలో జన్మిస్తాడు. నువ్వీ రూపాన్ని సంగ్రహపరచుకొని మిథిలానగరంలో శిశువుగా ఉండు. శిశువుగా ఉండే నిన్ను మిథిలానగరాధిపతి అయిన జనక మహారాజు తన పుత్రికగా స్వీకరిస్తాడు. అయోని సంభూతురాలవైన నిన్ను పుత్రికగా పొందడం వలన జనకమహారాజు జన్మ పావనమవుతుంది. నీవప్పుడు సీత అన్న పేరుతో ప్రసిద్ధి చెందుతావు. నువ్వు యుక్త వయస్కురాలవు కాగానే శ్రీరాముడు మిథిలకు వచ్చి నిన్ను వివాహం చేసుకుంటాడు. అంతేకాదు ప్రతి కల్పంలోనూ నువ్వే శ్రీమన్నారాయణుని భార్యవవుతూ ఉంటావు" అని ఆ వేదవతిని పార్వతీ దేవి ఆలింగనం చేసుకొని తన నిజస్థానానికి వెళ్ళింది.

అంతట ఆ వేదవతియే మిథిలా నగరానికి పోయి శిశు రూపంలో నాగటి చాలు నాశ్రయించి సుఖంగా విశ్రమించింది. విష్ణుమాయ చేత ఎవరి కంటపడకుండా సమయం కోసం ఎదురు చూస్తూ నివసించింది. జనకుడు ఆ కన్యను చూసి సంతోషంతో గుండెలకు హత్తుకొని ఇంటికిపోతూ ఉండగా "ఓ జనకమహారాజా ! ఈ అయోనిసంభూతను లక్ష్మీదేవిగా తెలుసుకో. నీకు శ్రీమన్నారాయణుడే అల్లుడు కాబోతున్నాడు" అని అశరీరవాణి వినపడింది. అశరీరవాణి మాటలకు జనకమహారాజు పరమానందభరితుడై ఆ కన్యకను తీసుకొని పోయి భార్య చేతిలో పెట్టాడు. ఆమెకు యవ్వనం రాగానే శ్రీరాముని భర్తగా పొందింది. అటు పిమ్మట ముని శ్రేష్ఠుడైన వసిష్ఠుడే ఈ వ్రతాన్ని ప్రచారంలోకి తెచ్చాడు. ఆ వ్రతాన్నే రాధాదేవి ఆచరించి శ్రీకృష్ణుని భర్తగా పొందగలిగింది. గోపికలు కూడా ఇప్పుడా వ్రతాన్నే ఆచరించి శ్రీకృష్ణుని భర్తగా కోరుకున్నారు.

నారద మునీంద్రా! గోపికలు ఈ వ్రతాన్ని పారాయణం చేసేవారు. చివరి రోజున వ్రత సమాప్తి చేస్తూ గణ్యశాఖాప్రోక్త స్తోత్రంతో ఆ పరమేశ్వరిని ప్రార్థించారు. ఏ స్తోత్రంతో సీతాదేవి ఆ పరమేశ్వరిని ప్రసన్నురాలిని చేసుకొని శ్రీరాముణ్ణి పొందిందో ఆ స్తోత్రాన్నిప్పుడు రాధాదేవి గోపికలతో కలసి ఈ వ్రతాన్ని పూర్తి చేసింది. బ్రాహ్మణులకు దక్షిణలను వెయ్యి గోవుల్ని, బంగారం, రత్నాలు దానాలిచ్చారు. వెయ్యి మంది బ్రాహ్మణులకు సాదరంగా భోజనాలు పెట్టారు.

వ్రత సమాప్తం కాగానే నూరు మంది యోగినులతో కలసి దుర్గాదేవి ఆకాశంలో బ్రహ్మ తేజస్సుతో ప్రత్యక్షమైంది. ఆ దుర్గాంబ రథం నుండి దిగివచ్చి రాధాదేవిని కౌగలించుకొని నీ మనోభీష్టం నెరవేరుగాక అని దీవించింది. అట్లాగే మిగిలిన గోపికలకు కూడా వరాలిచ్చి వారందర్నీ సంతృప్తి పరచి రాధాదేవితో ఇట్లా అన్నది. "రాధాదేవి! నువ్వు సర్వేశ్వరునికి ప్రాణానికంటే అధికురాలవు. మాయా మానుషరూపిణివి. జగన్మాతవు. శ్రీకృష్ణుని అర్ధాంగివి. తేజస్సు చేత శ్రీకృష్ణునితో సమానురాలవు. ఇప్పుడు మానవ రూపంలో అవతరించావు. నువ్వీ వ్రతాలన్నీ నీ కోసం చెయ్యడం లేదు. లోకానికి ఉపదేశం చేసేందుకే ఈ వ్రతాన్ని తలపెట్టావు. మీ కిద్దరికీ భేదం లేదని శ్రుతులు చెప్తున్నాయి. అందువలన నువ్వు కేవలం మానవ మాత్రురాలవన్న భ్రమ విడిచిపెట్టు. పూర్వం బ్రహ్మ దేవుడు 60 వేల సంవత్సరాలు తపస్సు చేసి నీ పాదాలను తెలుసుకోలేక పోయాడు. అటువంటి నువ్వు మానవ స్త్రీవన్న భ్రాంతిలో ఎట్లా ఉన్నావు? శ్రీకృష్ణుడు గోకులంలో జన్మించగా నువ్వు కూడా ఆయనతో పాటే భూలోకానికి వచ్చావు. నీ మంత్రాన్ని జపిస్తూ నీ కవచాన్ని పారాయణం చేస్తూ పరశురాముడు 21 సార్లు భూలోకం అంతా జైత్రయాత్ర జేసి దుష్ట క్షత్రియులందర్నీ సంహరించాడు. పరశురాముడు నీ మంత్రాన్ని ఈశ్వరుని అనుగ్రహం వలన పుష్కర తీర్థంలో పొంది కార్తవీర్యుని జయించాడు. పూర్వం నేను కోపంతో లోకాలన్నింటినీ భస్మం చెయ్యబోతూ ఉండగా, నీ భక్తుడైన శంకరుడే లోకాలను రక్షించాడు. అటువంటి నువ్వు మానవకాంతనని ఎట్లా అనుకుంటున్నావు? నువ్వు ప్రతి కల్పంలోనూ శ్రీకృష్ణుడే నీ భర్తగా కావాలని ఈ వ్రతం చేస్తున్నావు. నువ్వావిధంగా ఈ వ్రతం చేయడం లోకహితం కోసమేనని తెలుసుకో. శ్రీదాముని శాపం వల్లనే కదా భూలోకాన అవతరించావు. అటువంటి నువ్వు ఒక మానవస్త్రీనన్న భ్రాంతిలో ఉండటం ఆశ్చర్యంగా ఉంది.

నువ్వు అయోని సంభూతురాలవు సుమా. నీకు జనన మరణాలెక్కడివి? ఓ జగదాంబ! రాధాదేవి! ఈనాటి నుండి మూడు మాసాల పాటు గోపికలతో కలసి రాసమండలంలో రాత్రులందు బృందావనంలోనే శ్రీహరితో విహరించు. నీ మూలంగా భూమండలంలో రాసక్రీడ జరగాలని బ్రహ్మ రాసి పెట్టాడు. ఇక శ్రీహరితో నీ రాసక్రీడను ఆపగలవారెవ్వరూ లేరు. నువ్వు స్వేచ్ఛగా శ్రీహరితో విహరించు. నువ్వు శంకరుడికి ఎట్లా సౌభాగ్యాలు ప్రసాదించావో అట్లాగే శ్రీకృష్ణునికి కూడా అటువంటి సౌభాగ్యాలే కల్పించు. పాలకు తెల్లదనం, అగ్నికి దాహక శక్తి భూమికి గంధము, నీటికి శైత్యము ఎట్లా స్వభావాలో అట్లాగే శ్రీహరి యందు నీ ఉనికి కూడా స్వభావమై ఉంటుంది. నా వర ప్రభావంచేత పరాత్పరుడు, గుణాతీతుడు, బ్రహ్మాది వందితుడు అయిన శ్రీకృష్ణుడు నీకు అధీనుడు కాగలడు. స్త్రీ జాతిలో నీకన్నా భాగ్యవతి మరొకరు ఉండరని నీకు వరం ఇస్తున్నాను అని పార్వతీదేవి అదృశ్యురాలైంది.

రాధాదేవి అక్కడ నుండి గోపికలతో కలసి ఇంటికి వెళ్ళగా, రాధా సౌధంలో శ్రీకృష్ణుడు ఎదురు చూస్తున్నాడు. శ్యామసుందరాకారుడు, మనోహరుడు, గుణాతీతుడు, పరబ్రహ్మ స్వరూపుడు, బ్రహ్మణ్యుడు, అవ్యక్తుడు జ్యోతి స్వరూపుడు మంగళాలకు మంగళ హేతువు అయినట్టి ఆ శ్రీకృష్ణునికి రాధాదేవి నమస్కరించింది. కామ మోహితమై లజ్జతో శ్రీకృష్ణుడు రాధతో ఇలా అన్నాడు. "ప్రాణాధికురాలా! రాధా! ఏమికావాలో కోరుకో. ఓ గోపికలారా! మీరు కూడా వరాలు కోరుకోండి" అని శ్రీకృష్ణుడు అనగానే రాధిక, గోపికలంతా వరాలు కోరుకున్నారు. అంతట రాధ చేతులు జోడించి నమస్కరిస్తూ "దేవా! జన్మజన్మలకు నువ్వే నాకు ప్రాణనాథుడవు కావాలి. నీ పాదాలపై ఎల్లప్పుడూ నిశ్చల భక్తి కలిగి ఉండాలి. జాగ్రదృస్వప్నాలలో కూడా నీ గుణాలనే కీర్తిస్తూ ఉండాలి" అని కోరుకుంది. గోపికలిట్లా అన్నారు. "కృష్ణా! నువ్వు రాధ నెట్లా గైతే ప్రాణాధికంగా భావిస్తావో, మమ్మల్ని కూడా అట్లా రాత్రింబవళ్ళు ప్రేమిస్తూ ఉండు. జన్మ జన్మలకు నువ్వే మాకు ప్రాణనాథుడవు కావాలి." అని వేడుకున్నారు.

వారందరి మాటలు విన్న శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ "అట్లే అగుగాక. నేటి నుండి మూడు నెలలు మీరంతా నాతో కలసి బృందావనంలో రాసమండలమున క్రీడింపగలరు. నేనెంతో మీరూ అంతే. నా ప్రాణంతో సమానమైన వారవుతారు. ఈ వ్రతం లోకులకు బోధించడానికే గాని, తన ప్రయోజనాల కోసం కాదు. మీరంతా గోలోకం నుండి వచ్చారు. నాతో పాటే తిరిగి గోలోకానికి తిరిగి వస్తారు. ఇక మీరంతా ఇళ్ళకు పోండి. ప్రతి జన్మలోనూ నేనే మీకు భర్తను కాగలను" అని పలికిన శ్రీకృష్ణుణ్ణి చూస్తూ అక్కడే నిల్చుండిపోయారు. కళ్ళతోనే శ్రీకృష్ణముగ్ధమోహన రూపాన్ని త్రాగేశారు.

పాఠకులారా! రాధాదేవితో కలసి గోపికలు ఆచరించిన గౌరీ వ్రతాన్ని గూర్చిన కథ చదువుకున్నారు. దీన్నిబట్టి గౌరీ దేవి కోరిన కోరికలు తీర్చే పరాదేవి అని తెలుసుకున్నాం. ఏ వ్రతాన్ని గమనించినా ఉపవాసదీక్ష తప్పక ఉంటూ ఉంటుంది. ఎందువల్లనంటే, ఉపవాసం వలన ఇంద్రియాలు బలహీనపడి మనస్సు ఏకాగ్రమవుతుంది. ఎన్ని బ్రహ్మ కల్పాలు ప్రయత్నం చేసినా

సాధ్యం కాదు. అయితే మనస్సును స్వాధీనం చేసుకోవడం అంత తేలికైన పని కాదు. మనకుండే నూరు సంవత్సరాల ఆయుర్దాయమే కాదు. ఎన్ని బ్రహ్మ కల్పాలు ప్రయత్నంచేసినా సాధ్యమయ్యేది కాదు. అందువల్లనే మనస్సును ఏకాగ్రం చెయ్యడానికే పెద్దలు ఉపవాసాలనే నియమాన్ని ప్రవేశ పెట్టారు. పెద్దలు చెప్పింది చెప్పినట్లు ఆచరించి సత్ఫలితాల్ని పొందడం సాధుమార్గం. ప్రతి వ్రతంలోనూ ఓ కథ ఉంటుంది. అది ఎందుకంటే, మానవులు ఏ పని చేసినా ఏదో ఒక ప్రయోజనాన్నాసించే చేస్తారు. మనం ఈ కార్యాన్ని సాధించగలమా? అన్న సందేహాన్ని వారికి కలుగకుండా ఉండటానికే పూర్వం ఈ వ్రతం చేసిన వారి ఉదాహరణలను చెప్పినట్లైతే వారికి కొండంత ధైర్యం కలుగుతుంది. ఎన్ని కష్టాలకైనా ఓర్చుకొని భగవంతుని ఆరాధించి కృతార్థులైన వారి కథల్ని చెప్తూ ఉంటుంది. అటువంటి కథల్ని విన్న వారికి తమ కోరికలు కూడా నెరవేరుతాయన్న నమ్మకం ఏర్పడుతుంది. అటువంటి నమ్మకం కలగటమే కథాశ్రవణానికి ఫలం. ఏదో విధంగా భగవద్భక్తిని కలిగించడమే మన పూర్వుల ఆంతర్యమని మనం తెలుసుకోవాలి. వారి వారి కర్మఫలాలకు దగినట్లుగా వ్రతాలపై అభిరుచి కలుగుతూ ఉంటుంది. ఇక్కడ సీత గౌరీ వ్రతం చేసిందనీ, వేదవతే సీత అని మనం గుర్తుంచుకుంటే చాలు. తపస్సు చేస్తే గాని భగవదనుగ్రహం కలుగదన్న మాట నిజం. తపస్సు చేసేందుకు అనేక మార్గాలున్నాయి. శివుడు తారక మంత్రాన్ని జపించాడనీ, విష్ణువు శివనామాన్నే పారాయణం చేసేవాడని మనకు పురాణాలు బోధిస్తున్నాయి. దీన్ని సమర్థిస్తున్నట్లుగానే పై వ్రత కథలో సర్వ లోకాలకూ చతుర్విధఫలాలనిచ్చే మహాలక్ష్మి కూడా గౌరీ వ్రతాన్ని చేసింది. దేవతా భేదాలన్నీ మనం కల్పించినవే గాని దేవతలకుండవని మనకీ వ్రత కథ బోధిస్తుంది. గౌరీ దేవి ప్రత్యక్షమై వేదవతితో "వ్రతం తే లోక శిక్షార్థం మాయా మానుష రూపిణి" అని చెప్పడంలోని అంతరార్థం ఏమిటి? మహాలక్ష్మి వంటి జగన్మాత ఇటువంటి వ్రతాలు ఆచరించాల్సిన పని లేకపోయినా, తన్ను ఉదాహరణగా తీసుకొని అనేక మంది స్త్రీలు ఈ వ్రతాన్ని ఆచరించి కృతార్థులు కాగలరనే. అట్లాగే గౌరీదేవి కూడా లక్ష్మీ దేవిని పూజించి తన అభీష్టాన్ని పొందిందని కొన్ని పురాణాలు బోధిస్తాయి. దీనిని బట్టి ఏ పురాణమైనా, ఏ వ్రతమైనా ఒక్కదేవతనే వర్ణించి చెబుతాయి. ఎవరికి ఏ పురాణకథ పైన ఏ వ్రతం పైన ఆసక్తి కలుగుతుందో వారా విధిని ఆచరిస్తారు. తద్వారా వారి కోరికలు నెరవేర్చుకుంటారు. ఇందుమూలంగా పరదేవతా దూషణ కూడా తొలగిపోతుంది. సమత్వం అలవాటు అవుతుంది. దాంతో భగవదనుగ్రహానికి పాత్రులవుతారు. కావున శ్రీకృష్ణ పరమాత్మను సర్వదేవతా స్వరూపునిగా భావించి దృఢభక్తితో ఉపాసించాలి.

రాధా మంత్ర మహిమ

(ఈ భాగం దేవీ భాగవతం నవమ స్కంధము 50వ అధ్యాయము నుండి గ్రహించబడింది)

నారదమహర్షి: నారాయణా! మహాత్మా! ప్రకృతిని గూర్చిన కథలు అనేకం విన్నాను. వాటన్నింటిలోనూ రాధాదుర్గా విధానం రహస్యము లన్నింటిలోనూ రహస్యమైనదని విన్నాను. ఏ ఇద్దరి అంశచేత ఈ బ్రహ్మాండాలన్నీ నడుస్తున్నాయో, ఎవరి భక్తిచేత ముక్తి కలుగుతుందో అటువంటి రాధాదుర్గా మంత్ర మహిమను గూర్చి తెలుపవలసింది.

నారాయణుడు: నారదమహర్షీ! నువ్వడిగిన ప్రశ్నకు సమాధానం చెప్తాను విను. ఇది పరమ పావనమైనది. మూల ప్రకృతియే సృష్టికంతటికీ మూలం. ముందుగా ప్రాణ బుధ్యధి దైవతమగు శక్తి ఉద్భవించింది. అదే సర్వ చరాచర జీవులందర్నీ శాసిస్తూ ఉంటుంది. సృష్టి అంతా ఆ ప్రకృతి అధీనంలోనే ఉంటుంది. "తదధీనం జగత్సర్వం విరాడాది చరాచరమ్" అని మూలం. అనగా విరాట్టు మొదలు చరాచర వస్తువులన్నీ ఆ జగన్మాత అధీనంలోనే ఉంటాయి. ఆ దేవతలిద్దరి అనుగ్రహం లేకుండా ముక్తి సాధ్యం కాదు. కాబట్టి ఇహపరాలు కోరే వారంతా నిత్యం ఆ జగన్మాతలిద్దరినీ సేవిస్తూ ఉండాలి.

రాధామంత్రం: నారదా! నీకిప్పుడు రాధా మంత్ర మహిమను గూర్చి చెప్తాను. ఏ మంత్రాన్నైతే బ్రహ్మ విష్ణు మొదలైన దేవతలు సేవిస్తారో ఆ మంత్రాన్ని గూర్చి చెప్తాను. విను. మున్ముందుగా లక్ష్మీ బీజమునుచ్చరించి ఆ తర్వాత చతుర్థ్యంతమగు రాధా శబ్దాన్ని పలికి ఆ తర్వాత వహ్ని భార్య నుచ్చరించాలి. ఇదే రాధా షడక్షర మంత్రం. ధర్మార్థకామమోక్షప్రదం. ఈ మంత్రానికి ముందుగా మాయా బీజాన్ని చేర్చి ఉపాసిస్తే కోరిన కోరికలన్నీ నెరవేరుతాయి. ఎన్ని జన్మలెత్తినా ఈ రాధామంత్ర మాహాత్మ్యాన్ని వర్ణించలేరు. ఈ మంత్రాన్ని ముందుగా శ్రీకృష్ణుడే రాసమండలంలో మూలా దేవి నుండి గ్రహించాడు. శ్రీకృష్ణుడా మంత్రాన్ని శ్రీమహావిష్ణువుకు ఉపదేశించాడు. విష్ణువు నుండి విరాట్టయిన బ్రహ్మ ఈ మంత్రాన్ని స్వీకరించాడు. బ్రహ్మనుండి ధర్ముడు, ధర్ముని నుండి నేను (నారాయణుడు) గ్రహించాం. దీన్నే గురు పరంపర అని గూడా గ్రహించాలి. నేనా మంత్రాన్ని జపిస్తూ ఉండటం చేత నేను ఋషినయ్యాను. రాధామంత్రాన్ని అర్చించకుండా శ్రీకృష్ణుణ్ణి అర్చించరాదు. విష్ణుభక్తులైన వారంతా ముందుగా రాధాదేవినే అర్చించాలి. రాసేశ్వరియే అతడికి నిత్యేశ్వరి. కనుక ఎవరు రాధాదేవిని అర్చిస్తారో పరమేశ్వరుడు వారికి అధీనుడవుతాడు. రాధాదేవి నుండి ఎవరూ ఆ పరమాత్ముని విడదీయలేరు. "రాధ్నోధి సకలాన్ కామం స్తస్మాద్రాధేతి కీర్తితా" అని మూలం. సకల కామాలను ఇచ్చేది కాబట్టే ఆమె రాధగా ప్రసిద్ధి చెందింది. ఈ రాధా మంత్రాలు అనేకం ఉన్నాయి. వాటన్నింటికీ ఋషిని నేనే (నారాయణుడు). గాయత్రి ఛందస్సు. రాధయే దేవత. తారయే బీజము. శక్తి బీజమే ఈ మంత్రానికి శక్తి అని అంటారు. మూల మంత్రం చేతనే షడంగన్యాసము చేయదగినది. ఈ రాధాదేవి స్తుతి సామవేదార్థము.

నారదా! ఎవరైతే కార్తీక పూర్ణిమ దినాన శ్రీరాధాదేవి జన్మ దిన వేడుకలు జరుపుకుంటాడో అతడి హృదయమందు ఆ రాసేశ్వరీ దేవి నివసిస్తూ ఉంటుంది. కారణాంతరముల వలన ఆ రాధాదేవి భూలోకంలో వృషభానునికి పుత్రికగా జన్మిస్తుంది. కానీ ఆ దేవి గోలోక వాసినియేనని గ్రహించు. నారదా! ఈ రాధా మంత్ర రాజాన్ని సదా జపం చేస్తూ హోమం చెయ్యాలి.

నారదుడు: మహాత్మా! నారాయణా! ఆ దేవి ఏ స్తోత్రం చేత ప్రసనున్నరాలవుతుందో నాకారాధికా స్తోత్ర రాజాన్ని తెలియజెయ్యి.

నారాయణుడు: నారదమహర్షీ! ఈ రాధా స్తోత్రాన్ని మూడు పూటలా ఎవరు పఠిస్తారో వారికి ఇహ లోకాన సర్వ సుఖాలు చేకూరడమే కాకుండా మరణానంతరం గోలోకం ప్రాప్తిస్తుంది.

దీనిని బట్టి మనం తెలుసుకోదగిన విషయమేమంటే రాధాదేవి సర్వశక్తి వంతురాలని, రజస్తమోశక్తులచేత దుర్గ అనియు మనం గ్రహించాలి. వారిద్దరిలో తారతమ్యాలున్నాయని భావించరాదు. అనగా నిర్గుణుడైన ఆ భగవంతుడే సర్వసాక్షియై ప్రకృతిద్వారా తన సంకల్పాలన్నింటినీ కార్యరూపం దాల్చేట్లు చేస్తాడన్నదే సారం. ఈ విషయాన్నే శ్రీ శంకరభగవత్పాదులు,

"శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
నచే దేవం దేవో నఖలు కుశల స్పందితుమపి."

అన్న ఈ వాక్యం చేత దృఢపరుస్తున్నారు. దీనిని బట్టి రాధ, దుర్గ, పార్వతి అన్న పేర్లన్నీ ఆ భగవానుని ఇచ్ఛాశక్తియేనని గ్రహించాలి.

శ్రీకృష్ణుడు నందుని విడిపించుట

(ఈ కథా భాగం శ్రీ భాగవతము దశమ స్కంధం 28వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

కొంతకాలం పాటు బృందావనం అంతా బాలుర ఆటపాటలతో ప్రశాంతంగా ఉంది. శ్రీకృష్ణుడు క్రొత్తగా తన లీలలేవీ ప్రదర్శించడం లేదు. కారణం లేకుండా కార్యాలుండవు గదా! అందువల్ల బాల కృష్ణుని ఆటపాటలు చూసుకుంటూ యశోదానందులు ప్రశాంతంగా కాలం గడిపారు.

ఒకానొకనాడు నందుడు ఏకాదశీ వ్రతాన్ని తలపెట్టాడు. విధిననుసరించి శ్రీహరిని పూజించాడు. ఆనాడంతా ఉపవాస దీక్ష చేపట్టాడు. ఎందువల్ల నంటే, ఇంద్రయాగ సమయంలో శ్రీకృష్ణుని ఉపదేశాలు ఇంకా చెవిలో మ్రోగుతూనే ఉన్నాయి. అదీకాకుండా శ్రీకృష్ణుడే భగవంతుడన్న గర్గముని మాటలు అప్పుడప్పుడు జ్ఞాపకానికొస్తూనే ఉన్నాయి. దాంతో శ్రీకృష్ణుని యెడల పుత్రప్రేమ మాత్రమే కాకుండా భగవత్ప్రీతితో కూడా గౌరవిస్తూ ఉండేవాడు. దాంతో ఆనాడు ఏకాదశీ వ్రతం విధి ప్రకారం చేశాడు. ఆ మరునాడు ద్వాదశి ఘడియల్లోనే భోజనం చెయ్యాలి. అయితే ఆనాటి రాత్రి భగవన్నామం చేస్తూ యమునానదికి వెళ్ళాడు. అది స్నానం చేసే సమయం కాదన్న విషయాన్ని నందుడు మరచి పోయాడు. నందుడితో పాటు గోపకులు కూడా అతణ్ణి అనుసరించి వెళ్ళారు.

వరుణుడు జలాధి దేవత. నీళ్ళల్లో ఎవరు దిగినా వరుణుని ప్రార్థించి దిగాలి. అది కూడా సకాలమైతేనే. ఇది భగవదాజ్ఞ. దీన్ని వరుణుడు కూడా మీర లేడు. ఈ విషయాన్ని ఆ సమయాన నందుడు మరచిపోయాడు. వేళకాని వేళల్లో వరుణ దూతలు నీళ్ళల్లో కాపలా కాస్తూ ఉంటారు. ఒకానొక వరుణ దూత నందుడు అకాలంలో స్నానం చెయ్యడం చూసి, నందుని బంధించి క్షణాల్లో వరుణుడి ముందు నిలబెట్టాడు. గోపకులంతా నందుడు నీళ్ళల్లో నుండి బయటకు రాక పోవడం చూసి గాబరా పడ్డారు. అంతా వెదికారు. చివరకు వేరే దిక్కుతోచక ఏడుస్తూ కృష్ణా! బలదేవా! అంటూ అర్థించారు.

గోపకుల ఆర్తనాదాల్ని శ్రీకృష్ణుడు విన్నాడు. తండ్రి వృత్తాంతాన్నంతా తెలుసుకున్నాడు. దుఃఖించవద్దని గోపకులందరికీ ధైర్యం చెప్పి, తాను వరుణ పురానికి వెళ్ళాడు. శ్రీకృష్ణుడు వరుణ పురంలో కాలు పెట్టగానే వరుణుడు పరమానందంతో ఎదురు వెళ్ళి శ్రీకృష్ణుణ్ణి పూజించాడు.

"కృతకృత్యోఽస్మి" అన్నాడు. పాదోదకాన్ని తలపై జల్లుకున్నాడు. ఆహా! నాజన్మ ధన్యమైంది గదా అంటూ మురిసిపోయాడు. ఈ ఘట్టాన్ని శ్రీ భాగవతంలో పోతన గారెలా స్పందించి వ్రాశారో చూడండి.

ఉ॥ ఏ పరమేశ్వరున్ జగము లన్నిటిఁ గప్పిన మాయ కప్పగా
నోపక పారతంత్ర్యమున నుండు మహాత్మక! యట్టి నీకు ను
ద్దీపిత భద్రమూర్తికి సుధీజన రక్షణ వర్తికిం దనూ
తాపము పాయ మ్రొక్కెద నుదారత తపోధన చక్రవర్తికిన్.

శ్రీ పోతన గారు ఈ పద్యాన్ని ఎంతో పెంచి వ్రాశారు. 'ఉద్దీపిత భద్రమూర్తికిన్' అన్న మాటను ప్రాస కోసం వాడింది కాదు. దీనికో విశేషార్థాన్ని కవి ఊహించి ఉంటారు. మూలంలో ఉన్న 'తుభ్యం' అన్న పదానికి 'నీకొరకు' అని తెలుగులో వ్రాస్తే సరిపోతుందా? అంటే చాలదనే చెప్పాలి. ఎందుకంటే, సకల శుభాలకు నిలయమైన వాడంటేనే సందర్భోచితంగా ఉంటుంది. 'పరమాత్మనే' అన్న పదానికి 'సుధీజన రక్షణ వర్తికిన్' అని తెలుగులో వ్రాశారు. ఆహా! ఈ ప్రయోగం ఎంత సొగసుగా ఉంది? ఈశ్వరుడు అంటే రక్షకుడనే గదా భావం. పరమ అన్న శబ్దానికి నిరుపమాన మైన అని అర్థం. అనగా దీని తాత్పర్యం ఏమిటి? సుధీజన రక్షణ వర్తికిన్ అన్న అర్థమే అతికినట్లుంటుంది. ఆహా! ఇది గదా భాషాంతరీకరణ మంటే?

ఈ విధంగా స్తోత్రం చేసిన వరుణుడు "ఓ శ్రీహరి! కరుణానిధీ! మీతండ్రి అని తెలియక నా సేవకుడు ఈ తప్పు చేశాడే గాని, తెలిసి చెయ్యలేదు. ఇది మహాపరాధమే అయినా, మా పాలిట అదృష్టంగానే భావిస్తున్నాం. ఎందువల్ల నంటే, నా భృత్యుని వలన జరిగిన అపరాధం మూలాన నువ్వు స్వయంగా నా గృహాన్ని పావనం చేశావు. తెలియక చేసిన ఈ దోషాన్ని మన్నించి నన్ను, నా భృత్యుణ్ణి కాపాడు." అని ప్రార్థించాడు. శ్రీహరి వరుణుని వంక ఆప్యాయంగా చూసి, ప్రేమతో మాట్లాడి, తండ్రిని తీసుకొని తన వ్రజకు చేరుకున్నాడు. నందుడు ఊళ్ళో వాళ్ళందరికీ శ్రీకృష్ణుడు తన్ను ఆ జలగండం నుండి ఎట్లా విడిపించాడో ఒళ్ళు గగుర్పాటు చెందేట్లుగా వర్ణించి చెప్పాడు. నందుడి ఆనందానికి అవధుల్లేవు. శ్రీకృష్ణుడు పరబ్రహ్మమే నని నందుడితో పాటు గోపాలకులంతా విశ్వసించారు. పరమానంద భరితులయ్యారు. శ్రీకృష్ణుడు కూడా వారికి విష్ణుమాయ కప్పకుండా చేసి వారి ఆనందానికి అంతరాయం కలగకుండా చేశాడు. వీరంతా సంసార బంధాల్లో చిక్కుకొని ముక్తి మార్గం తెలుసుకోకుండా ఉన్నారని గ్రహించి వారందరికీ తన గోలోకాన్ని దర్శింప జేశాడు. మహాకవి పోతన గారిలా వ్రాశారు.

మ॥ అని చింతించి దయాళువైన హరి మాయాదూరమై జ్యో
తియై, యనిరూప్యంబయి సత్యమై యెఱుకయై యానంద
మైబ్రహ్మయై, యనఘాత్ముల్ గుణనాశ యందుఁ గను నిత్యా
త్మీయ లోకంబు గ్రక్కునఁ జూపెం గరుణార్ద్ర చిత్తుఁడగుచున్ గోపాలక శ్రేణికిన్.

అంతట నందాదులంతా శ్రీకృష్ణుడు భగవంతుడేనని నమ్మి పూజించారు. అనేక విధాలుగా స్తుతించారు. ఈ పరమాత్ముని రూపాన్ని మనస్సులో నిలుపుకొని ధ్యానించారు. ఈ కథ భగవల్లీలను

తెలిపేదే అయినా, ఇందులోని విషయాలు పరమార్థానికి, లౌకిక జీవనానికి కూడా ఉపయోగపడతాయి. నందుడు వ్రతాన్ని చేసి ఉపవాసమున్నాడు. నందుడు ప్రతి ఏకాదశీ వ్రతం చేసేవాడా? అన్న మీమాంస ఇక్కడ అవసరం లేదు. ఎందువల్ల నంటే భగవంతుని ఆరాధించే వ్రతాలు అనేక విధాలు. అందులో ఏకాదశీ వ్రతం కూడా ఒకటి. మహర్షులు ఈ వ్రతాన్ని ఆచరిస్తున్నట్లు మనకు పురాణాల్లో కనిపించదు. ఉపవాసాలు చేస్తూ మనస్సును భగవంతునిపై లగ్నం చేయడం వారికి సర్వ సాధారణం. అందువల్ల వారెవరూ దీన్నో మహా వ్రతమని భావించి ఉండరు. దీన్ని బట్టి ఈ వ్రతాన్ని గృహస్థులకోసమే చెప్పినట్లు బోధపడుతుంది.

నందుడు ఉపవాసాన్ని విడిచి ద్వాదశి నాడు భోజనం చేయకుండా అకాలంలో నదీస్నానానికి వెళ్ళాడు. దాంతో వరుణ దూతలు నందుణ్ణి బంధించి తీసుకుపోయారు. మానవులకు ఆహార విహారాల్లోను, నిద్రా మైథునాల్లోనూ కొన్ని నియమాలున్నాయి. ఇవన్నీ శరీర పోషణకు ఉపయోగపడేవే. ఈ నియమాలు పాటించక పోతే శరీరాన్ని నిలుపుకోలేరు. అన్నిటా నిద్రే ఎంతో విలువైనది. ఉపవాసం అనేక వ్రతాలకు చెప్పినా, జాగరణా నియమం మాత్రం కొన్ని వ్రతాలకే చెప్పారు. నిద్రకు విఘ్నం కలిగిస్తే మహా పాపం కలుగుతుందని పురాణాల్లో చెప్పారు.

శ్లో॥ నిద్రాభంగః కథాచ్ఛేదో దంపత్యోః ప్రీతి భేదనమ్

శిశు మాతృ విభేదశ్చ బ్రహ్మ హత్యా సమం స్మృతమ్.

అని దేవీ భాగవతం తెలుపుతోంది. అందువల్లనే నిద్రపోయే వాళ్ళను తటాలున లేపగూడదంటారు. ఒక్కొక్కప్పుడు వ్యక్తి మరణించినా మరణించవచ్చు. అందువల్లనే ఈ ఆచారానికి విరుద్ధంగా నడచుకునేట్లయితే దేవతలు ఆగ్రహిస్తారని పెద్దలంటారు. ఇక్కడి కథా భాగంలో నందుడు ఉపవాసం ఉంటూ నిద్ర పట్టకుండా జాగరణ చెయ్యాలనే ఉద్దేశ్యంతోనే నదీ స్నానానికి బయలు దేరి ఉంటాడని మనం ఊహించుకోవాలి. "కష్టాత్కష్టతరం క్షుధా" అన్న సూక్తి అందరూ ఎరిగినదే. అకాలంలో నదీ స్నానం చెయ్యరాదన్న నియమాన్ని మరచాడు. జలచరాలకు కూడా మనకున్నట్లే ఆహార నిద్రా నియమాలుంటాయి. ఆ విధంగా జలచరాలు నిద్రించే సమయంలో నిద్రా భంగం కలిగిస్తే దోషమని చెప్పారు. అనగా ప్రాణుల ఆరోగ్యానికి బాధ కలుగకుండా ఉండేందుకే ఈ ఆచారం కల్పించబడిందని మనం ఊహించాలి. అందువల్ల నియమం తప్పి నదిలో స్నానానికి వచ్చిన నందుని చూచి వరుణ దూతలు నియమాన్ని ఉల్లంఘించాడు కాబట్టి తమ ప్రభువైన వరుణుడి ముందు నిలబెట్టారు. విషయం తెలుసుకున్న శ్రీకృష్ణుడు తన తండ్రిని విడిపించుకొని రావడానికి వెళ్ళడంలో ఆశ్చర్యమేమీ లేదు.

వేణుగానము

(ఈ ఘట్టము శ్రీ భాగవతం దశమ స్కంధం, 26వ అధ్యాయం నుండి గ్రహించబడింది. శ్రీకృష్ణ జన్మఖండంలో ఈ ఘట్టం కనిపించదు.)

శ్రీకృష్ణుడు భూలోకంలో అవతరించిన సమయంలో తన విరహాన్ని భరించలేని వారే ఆయనతో పాటు భార్యలందరూ భూలోకంలో అవతరించారు. అయితే భూలోకంలోని వయోభేదాలను బట్టి

వారంతా బాలకృష్ణుని కంటే శారీరకంగా పెద్దవారయ్యారు. అందువల్ల వారంతా గోపకులకు భార్య లయ్యారే గానీ వారి మనస్సంతా శ్రీకృష్ణుని పైనే లగ్నమై ఉండేది. వీరంతా భూలోకంలో పుట్టడం వలన తన పైన ఉండే ప్రేమా, భక్తి అట్లాగే ఉన్నాయా? లేక తరిగి పోయాయా?అని శ్రీకృష్ణుని కనిపించింది. అందువల్ల వారిని పరీక్షించి చూడాలనుకున్నాడు. వీరంతా గోలోకంలో ఉన్నప్పుడు తనతో కలసి విహరించేవారు. భూలోకంలో జన్మించినా వారి పూర్వ జ్ఞాపకాలు నశించక పోవడం వల్ల శ్రీకృష్ణుడంటే పరితపించేవారు. సర్వజ్ఞుడైన భగవంతునకు ఈ విషయం తెలిసినా వాళ్ళను పరీక్షించాలనుకున్నాడు. ఈ పరీక్ష లోకులకు ఉపదేశించేందుకే గాని, తనకొరకు కాదు. ఆ విషయాన్నే ఈ ఘట్టం మనకు బోధిస్తుంది.

శరత్కాలం ప్రవేశించింది. ఈ కాలంలో అందరూ సుఖానుభవాల్నే కోరుకుంటారు. అందులోనూ పూర్ణిమ తిథి మాట ప్రత్యేకం చెప్పాల్సిన పని లేదు. భాగవతంలో "శరన్మల్లికలు విరహోద్దీపకములు"గా అన్న మాటను అలంకార శాస్త్రజ్ఞులు వాడుతూ ఉంటారు. నిజానికి మల్లికాలతలు వసంతకాలంలోనే విరియబూస్తాయి. అయితే ఇక్కడ శరత్కాలంలో కూడా ఒకరకమైన మల్లికలు పూస్తాయని, వాటి సువాసనలు అత్యంత పరిమళంగా గుబాళిస్తాయని మనం ఊహించాలి. ఈ జాతి మల్లికలు బృందావనంలో యమునా తీరాన ఉండే మహావృక్షాలను పెనవేసుకొని ఉండి ఉంటాయి. అట్టి మల్లికల పరిమళాలు, నిర్మలమైన యమునా జలాలు, చల్లని మలయ మారుతాలు, ఎంతటి కఠినాత్ముణ్ణయినా మార్చగలిగినప్పుడు, ఇక రసిక శిఖామణుల మాట ప్రత్యేకంగా చెప్పాలా? అటువంటి శరత్కాలంలో శ్రీకృష్ణుడొక రోజున తాను నిర్లిప్తుడై యోగమాయను ఆశ్రయించాడు. యోగమాయ లీలల్ని వర్ణించడం ఎవరి తరం? కొండల్ని గూడా నీళ్ళపై తేలేట్లు చెయ్యగలదు. ఎందువల్ల నంటే ఆ మహామాయ భగవానుని ఇచ్ఛా శక్తి యే కాబట్టి.

ఆ రోజు శరత్కాల పూర్ణిమ అయింది. అందులో యమునా తీరం, బృందావనంలో వీచే మలయమారుతాలు, ఇవన్నీ కలసి ఒకచోట ఏర్పడ్డప్పుడు దాని మహిమ చెప్పతరమా? దానికదే సాటి. కావున యోగమాయ నాశ్రయించిన భగవంతుడు గోపికా జనాలను పరీక్షించాలనుకున్నాడు. విరహాన్ని ప్రకోపించే పదార్థాల్లో చంద్రుణ్ణి కూడా చేర్చుకోవచ్చు. అందులోనూ శరత్కాల పున్నమి నాటి మాట వేరే చెప్పాలా? ఈ విషయాల్ని పోతన గారు హృదయాలను కదిలించేట్లుగా వ్రాశారు. ఉదాహరణముగా ఒకటి రెండు పద్యాల్ని తిలకించండి.

ఆ॥ *కామతంత్ర టీక కలువలజోక కం । దర్పధాక విటుల తాల్మి పోక*
చకిత చక్రశాక (వాక) సంప్రీత జనలోక । రాక వచ్చె మేలురాక యగుచు

క॥ *పతి తన కరములఁ గుంకుమ । సతి మొగమున నలఁదు భంగి సముదయ వేళాం*
చితకర ఆగమున నిశా । పతి రంజించెన్ నరేంద్ర ప్రాక్సతి మొగమున్

మూలాన్ని విడిచి స్వతంత్రంగా పోతనగారి పద్యాలు చదువుకుంటే ముద్దులు మూటకట్టి నట్లుంటుంది. ఈ క్రింది పద్యాలకు మూలమే లేదు. కానీ అతిశయ రస ప్రవాహమని వర్ణించవచ్చు.

సీ॥ విటసేనపై దండు వెడలెడు వలఱేని గొల్లెన పై హేమ కుంభ మీనఁగఁ
గాముక ధృతి వల్లి కలు ద్రెంప నెత్తిన శంబరాంతకు చేతి చక్రమనగ
మారుండు పాంథుల మానాటవులు గాల్పఁ గూర్చిన నిప్పుల కుప్ప యనఁగ
విరహిమృగమ్ముల వేటాడ మదనుండు తెచ్చిన మోహన దీప మనఁగ

ఆ॥ వింత నునుపు గల్గి వృత్తమై యరుణమై । కాంతితోఁ జకోరగణము లుబ్బఁ
బొడుపుఁ గొండ చక్కిఁ బొడిచె రాకా చంద్ర । మండలంబు గగనమండలమున

ఆ పూర్ణ చంద్రోదయ సమయంలో జగన్నాటక సూత్రధారియైన శ్రీకృష్ణుడు మురళిని చేత పట్టుకొని అవ్యక్తమైన మధుర గానాన్ని ఆలపించాడు. ఆ పాట గోపికలకు మాత్రమే వినపడింది. ఇతరులెవ్వరికీ వినబడలేదు. అనగా ఆ గానం గోలోకం నుండి వస్తోంది. కాబట్టి గోపికలకు మాత్రమే వినబడింది. యోగమాయ వారి భర్తలందర్నీ చెవిటి వారినిగా చేసింది. ఇది నమ్మ శక్యమేనా? అని అడుగరాదు. ఎందువల్ల నంటే భగవంతుడు సర్వశక్తి సంపన్నుడు గదా! దీని వలన శ్రీకృష్ణుని సర్వజ్ఞత్వం వెల్లడి అవుతోంది. అట్టి భగవంతుని, పరుల భార్యల్ని ఆకర్షించాడనడం వెర్రితనం కాదా? గోపికలకు మాత్రమే వినబడేట్లు గానం చేశాడు. ఎందువలన? ఇందు మూలంగా వారి భక్తి ఏపాటి స్థిరమో పరీక్షించాలనుకున్నాడు.

శ్రీకృష్ణుడు వేణుగానం చేసే సమయానికి ఇంకా రాత్రి బాగా ప్రొద్దు పోలేదు. ఎవరు మటుకు వారు తానొక్కత్తే ఆ గానం విన్నా నని, రెండోకంటి వాడికి తెలియ కుండా పోయి శ్రీకృష్ణుని ఒళ్ళో వాలాలనే తాపత్రయంలో ఉన్నారు. ప్రక్కనున్న వాళ్ళకు చెబితే తమ ఏకాంతానికి భంగం కలుగుతుందేమోనని ప్రాణ స్నేహితురాలికైనా చెప్పకుండా పరుగులాంటి నడకతో బయలు దేరారు. దారిలో ఎవరైనా ఎదురుపడినా వారినెవ్వరూ అనుమానించలేదు. వేణుగానం వారి చెవుల్లో పడే సమయానికి ఒక గోపిక భర్తకు సేవలు చేస్తోంది. మధ్యలోనే ఆ సేవల్ని నిలిపి వేసి పరుగు తీసింది. మరో గోపిక పాలు పితుకుతూ ఉండగా ఆ వేణుగానాన్ని విన్నది. అంతే, అక్కడ నుండి సరాసరి యమునా తీరానికి పోయింది. మరొక గోపిక పిల్లకు పాలిస్తూ, మధ్యలోనే వదిలేసి పోయింది. ఇంకో గోపిక దూడను పాలు త్రాగేందుకు విప్పి అట్లాగే యమునా తీరానికి పోయింది. ఒకామె వంట మధ్యలోనే ఆపేసి పరుగుతీసింది. ఒకావిడ అన్నం వడ్డించుకొని వేణుగానం వినగానే వదిలేసి వెళ్ళింది. అందర్దీ ఒకటే లక్ష్యం. అదే కృష్ణుడి వద్దకు త్వరగా చేరుకోవడం. శ్రీకృష్ణుని సాన్నిధ్యం కన్నా ఈ పనులన్నీ అంత ముఖ్యమా? అన్నదే వారి ఆలోచన. ఆ క్షణంలో భర్త గాని, తల్లి దండ్రులు గాని, సోదరుడు గాని ఆక్షేపిస్తారేమోనన్న బెరుకు వాళ్ళల్లో ఏ కోశాన కనిపించలేదు. ఎందువల్ల నంటే వారి మనస్సంతా శ్రీకృష్ణుడి భావనతో నిండిపోయింది. తమ ముందు వెళ్తున్న గోపికను కూడా వాళ్ళు గుర్తించలేక పోతున్నారు. తమ వెనుక ఎవరైనా ఉన్నారేమోనన్న స్పృహకూడా లేదు. బహుశః ఇటువంటి సందర్భంలోనే "ఎవరికి వారే యమునా తీరే" అన్న నానుడి పుట్టి వుంటుందేమో. వాళ్ళందరి మనస్సుల్లోనూ ఆ శ్రీకృష్ణుడితో క్రీడిస్తున్నట్లే అనిపించింది. మనస్సులోనే శ్రీకృష్ణుడిని కౌగలించుకున్న అనుభూతిని పొందారు. ముక్తిని పొందే అర్హత సంపాదించుకున్నారు. ఈఘట్టంలో

అన్న ఈ మూలానికి పోతనా మాత్యులు, ఇలా ఆంధ్రీకరించారు.

ఆ॥ *బాంధవమున నైనఁ బగ నైన వగ నైనఁ । బ్రీతి నైనఁ బ్రాణభీతి నైన*
భక్తి నైన హరికిఁ బరతుంత్రు లై యుండు । జనులు మోక్షమునకుఁ జనుదు రధిప

గోపికలంతా వేణుగానానికి ఆకర్షితులై ఒకరికి తెలియకుండా ఒకరు వేగంగా పోయారు. దీన్నే శ్రీహరి దివ్యగానమని, శరద్గానమని కూడా అంటారు. శ్రీహరి చేతిలోని మురళియే కేంద్ర బిందువై దాంట్లోనుండి వచ్చే ధ్వని యే నాదమై వేణువుకుండే రంధ్రాలను అనుసంధానం చేయడమే ఒక కళ అని వీటినే నాదబిందు కళలని వేదాంతులు అంటారు. ఈ గోపికలంతా ఆనాటి రాత్రి పరమ హంసలయ్యారు. మౌన వ్రతాన్నవలంబించి శ్రీకృష్ణ పాద పద్మములపైనే మనస్సు నిలిపి యమునా తీరానికి చేరుకున్నారు. శ్రీకృష్ణుడు అక్కడొక ఇసుక తిన్నె పై కూర్చుని మురళీ గానం చేస్తున్నాడు. అప్పటికప్పుడే వేలాది గోపికలు బిల బిల మంటూ వచ్చి ఆ శ్రీకృష్ణుని చుట్టూ చేరారు. అయితే అక్కడకు చేరిన గోపికలంతా ఒకరినొకరు చూసుకోలేదు; పలకరించుకోలేదు. "కృష్ణ గృహీత మానసాః" అన్న మాట తెలిసిందే కదా! ఎందు వల్ల నంటే వారి మనస్సులు వారి వశంలో లేవు. అందువల్లనే ముందుపోయే గోపికల్ని గుర్తించలేక పోతున్నారు. మనస్సు ఏయే ఇంద్రియాల్లో ప్రవేశిస్తుందో ఆ ఇంద్రియం మాత్రమే పని చేస్తుంది. మిగిలిన ఇంద్రియాలన్నీ దాన్ని అనుసరించి పని చేస్తూ ఉండటం మనం ఎరిగిందే. అదే విధంగా ఇప్పుడు గోపికల మనస్సులన్నీ శ్రీకృష్ణునే కోరుకుంటున్నాయి; చూస్తున్నాయి. కాబట్టి వారికి ఎవరు ఎదురు పడ్డా వారంతా కృష్ణమయంగానే కనిపిస్తున్నారు.

ఈ విధంగా అక్కడకు చేరిన గోపికలు ఒకరూ ఇద్దరూ కాదు. వందల్లో వేలల్లో ఉన్నారు. వారంతా ముక్తి సామ్రాజ్య ప్రదమైన శ్రీకృష్ణ పాదాలనే చూస్తూ మోహితులయ్యారు. ఆ గానామృతాన్ని ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నారు. అదొక అనిర్వచనీయమైన ఆనందం. ఆ పరమానందానికి భాష ఉండదు. ఆ అమృతాన్ని నిర్వచించ గలిగింది ఒక్క భక్తి మాత్రమే. ఆ భక్తికి దేహముండదు. కాబట్టి తనలో తానే ఆనందిస్తూ ఉంటుంది. అట్లాగే గోపికలంతా ఆత్మలందే ఆనందాన్ని అనుభవిస్తున్నారు. ఈ భక్తి నే "పరాకాష్ట" అంటారు. తన్ను తాను మరచి పోయి ఆనందించడాన్నే పరమానందం అంటారు. దానికదే సాటి. అటువంటి మోహితులైన ఆ గోపికలందర్నీ శ్రీకృష్ణ పరమాత్మ పరీక్షించాలనుకున్నాడు.

విశేషార్థం : ఓ అదృష్టవంతులారా! మీకన్నా అదృష్ట వంతులు ఎక్కడెక్కడ వెదికినా కనిపించరు. ఎందువలనంటే మీ అందరికీ నా ఏకాంత సేవ లభించింది. ఇది మహా యోగులకు కూడా సాధ్యం కానిది. కాబట్టి నన్ను ఏకాంతంలో కలుసుకొని ఆనందం అనుభవించే అదృష్టం మీకే దక్కింది. ఊరికి దూరంగా నట్టడవిలో ఒంటరిగా కూర్చున్న నన్ను చూసేందుకు మీరంతా తరలి వచ్చారు. మీరెంతో అదృష్టవంతులు? ఎంతటి భక్తి పరవశులు? ఆహా! మీరంతా పూర్వ వాసనలు మర్చిపోలేకుండా ఉన్నారు గదా? సంసారంలో పడి కొట్టుకుపోకుండా మెలకువ గలవారై నన్ను చేరుకున్నారని శ్రీకృష్ణుని భావం. మిమ్మల్ని స్వాగతిస్తున్నాను. అనగా మీరాక వలన నాకు ఆనందంగా ఉందని భావం. మీరంతా మానవులుగా జన్మించినా, లోకాచారాన్ని పాటించకుండా భర్తను కూడా లెక్క చేయకుండా

ప్రియుడనైన నన్ను వెతుక్కుంటూ వచ్చారు. అందుకే స్వాగతిస్తున్నానని భావం. అనగా మీరు లోకాతీతులనే గదా భావం. లోకాతీత మంటే గోలోకులని చెప్పకుండానే చెప్పి నట్లయింది. బంధాలన్నీ తెంచుకొని ముక్తిని కోరి నా దగ్గరకు వచ్చారు. ఇంత కన్నా ఆనందం మరేముంటుంది. శుభాగమనమన్న పదానికి ఈ అర్థాన్నే మనం గ్రహించాలి.

మీరంతా నా ఏకాంతాన్ని కోరే వచ్చారని నాకు తెలుసు ఇది కాకుండా మరే కోరిక కోరుకున్నా ఇవ్వగలను. కానీ మీరు మరేది కోరుకోరు. భక్తులు ఎప్పుడూ నా దాస్యాన్నే కోరుకుంటారు. మీరంతా నాకోసం ఘోరమైన తపస్సు చేసి నా ఏకాంతాన్ని కోరుకున్నారు. నేను కూడా మీకా వరాన్నిచ్చాను. అందువల్లనే మీకీ గోకులంలో నివాసం ఏర్పాటు చేశాను. అయినా మీరు నా ఎడబాటును సహించలేక ఇక్కడ బృందావనంలో జన్మించి, నే పెట్టిన పరీక్షలో నెగ్గారు. "వాచః పేశైర్వియోహయన్" అని ముందే చెప్పిన వాక్యాన్ని దృష్టిలో ఉంచుకొని అన్వయించుకోవాలి.

భగవంతుడు లోకాచారాన్ని పాటిస్తూ ఇంకా పరీక్షించాలనుకున్నాడు. మీ నివాసాలకేదైనా ప్రమాదం సంభవించిందా? జంతువులేవైనా మీ ఊరిపై దాడి చేశాయా? అని అడిగాడు. విశేషార్థమేమంటే, బృందావన వాసుల్ని బాధిస్తున్న వారందర్నీ సంహరించాను. వారందరూ శాపవిముక్తులై ఉత్తమలోకాలు పొందారు. ఇంకా మీకు బాధలు కలిగించే వారెవ్వరూ లేరు గదా? మరి ఎందువలన మీరంతా ఈ వేళప్పుడు కట్ట కట్టుకొని ఊడిపడ్డారు. అని పరిహాసంగా అన్నాడు. అనగా అన్ని విషయాలు తెలిసినా తెలియనివాడిలా నటిస్తున్నాడు. మీ మనస్సులోని మాట బయట పెట్టమని అడిగాడు. మహాకవి పోతనగారీ ఘట్టంలో,

శా॥ *మేలా మీకు భయంబు పుట్టదు గదా మీమందకున్ సింహశా,*
ర్దూలానేక పముఖ్యముల్ దిరిగెడిన్ దూరంబు లేతెంతురే,
యేలా వచ్చితి రీ నిశాసమయ మందిచ్చోట వర్తింతురే,
చాలుం జాలు లతాంగులార! చనుడీ సంప్రీతితో మందకున్

ఒక్కొక్క మాటకు ఎంతెంత అర్థాన్ని ఇమిడ్చి చెప్పారో మనం ఊహించుకోవచ్చు. ఈ కథకు రస పోషణ చెయ్యాలంటే ఈ చమత్కారాలు అవసరమే. అంతే గాని శ్రీకృష్ణుడంతటి వాడు పర భార్యలతో సరసాలాడాడని అనరాదు. కాబట్టి భగవత్కథలను భక్తితో గ్రహిస్తేనే ఫలితం దక్కుతుంది.

పురంధ్రీ మణులారా! రాత్రి ప్రొద్దుపోయింది. కౄర జంతువులు స్వేచ్ఛగా తిరిగే సమయం. కాబట్టి మీరంతా త్వరగా ఇళ్ళకు చేరండి. మీరంతా స్త్రీలు మాత్రమే కాదు, అందగత్తెలు కూడా. అందువల్ల మీ తల్లిదండ్రులు, సోదరులు, భర్తలు కూడా ఆందోళన చెందుతూ ఉండవచ్చు. కావున వెంటనే వెనుతిరిగి ఇళ్ళకు పోండి.

విశేషార్థం : ఈ రాత్రి సమయం అతి భయంకరమైనది. అయితే ఏకాంతంలో భగవంతుని ధ్యానం చేసే సమయం కూడా ఇదే. మహర్షులంతా ఈ సమయంలోనే నిశ్చల మనస్కులై ధ్యానిస్తూ ఉంటారు. ఎందువల్లనంటే ఈ కాలం లోనే మనస్సు చంచలం కాకుండా ఉంటుంది. భగవద్ధ్యానానికి

అదే సరైన సమయం. కాబట్టి ఈ రాత్రి భయంకరంగా కనిపిస్తున్నా ధ్యానానికి అనువైన సమయమిది. ఈ సమయంలో క్రూర జంతువులకు భయపడి పారిపోవడం కన్నా సర్వ భూతములలో నివసించే ఆ పరాత్పరునిపై భక్తి కుదిరిందా లేదా అని పరీక్షించుకోవడానికి సరి అయిన సమయం. అనగా క్రూర జంతువుల ఆత్మను మనం ప్రేమించగలిగితే ఆ జంతువు కూడా మనల్ని ప్రేమిస్తుంది. అప్పుడింకా క్రూరమన్న మాట ఎక్కడుంటుంది? అనగా ఇది క్రూర సత్త్వముల కలయిక యని శ్రీహరి భావము. 'వ్రజం ప్రతి యాత' అంటే ఇళ్ళకు తిరిగి పొమ్మని కాదు. నన్ను సేవించాలని వచ్చారు. దాంతో నాపైగల భక్తి ప్రేమలు స్పష్టమయ్యాయి. మీరు భూలోకానికి వచ్చిన పని నెరవేర్చుకొని (నాతో రాస క్రీడలు జరిపి) గోలోకానికి వెళ్ళండి అని. మీరు స్త్రీలు కావడం వలన రాసమండలమే మీకు సరైన నివాసం. మీరు కనిపించకపోతే మీ తల్లి దండ్రులు మీకోసం వెదుకుతూ ఉంటారు. అనగా ఇది ప్రత్యుపకారానికి ఉదాహరణమని చెప్పవచ్చు. అనగా మీరందరూ నాయెడల ఏవిధంగా నమ్మకం ఉంచారో అదే విధంగా మీ వాళ్ళకు కూడా నాపైన విశ్వాసం కలిగేట్లు చేయండి. అదే వారి ఋణం తీర్చుకొనే పద్ధతి. "స్వయం తీర్ణం పరాన్ తారయతి" అన్న సామెత వ్యర్థంగా చెప్పింది కాదు గదా. అనగా మీకు నాయందు ఏవిధంగా అనన్య భక్తి కుదిరి తరించారో అదే విధంగా వారికి కూడా కుదిరి తరించేట్లు చేయమన్నదే శ్రీకృష్ణుని ఆశయం.

ఈ సందర్భంలో పోతనామాత్యులు వ్రాసిన రెండు మూడు పద్యాలను తిలకించండి.

సీ॥ *ప్రాణేశుఁ డెఱిఁగినఁ బ్రాణంబునకుఁ దెగు । దండించు నెఱిఁగిన ధరణి విభుఁడు*
మామ యెఱింగిన మనులెల్లఁ జెడిపోవుఁ । దలవరి యెఱిఁగినఁ దగులు చేయు
తలిదండ్ర ంలెరిగిన దలలెత్త కుండదు । రేరా లెఱింగిన నెత్తి పొడుచు
నాత్మజు లెఱిఁగిన నాదరింపరు చూచి । బంధువులెరిఁగిన బహి యొనర్తు

ఆ॥ *రితరు లెఱిఁగిరేని యెంతయుఁ జుల్కఁగాఁ । జూతురింద నంద సుఖము లేదు*
యశము లేదు నిర్భయానందమును లేదు । జారుఁ జేరఁ జనదు చారుముఖికి

మహాకవి ఇంతకు ముందే ఈ అర్థం వచ్చే పద్యాన్ని వ్రాసినా తృప్తి చెందక ఇలా వివరించారని మనం అర్థం చేసుకోవాలి. అవకాశం దొరికినప్పుడల్లా నీతిని బోధించడం ఆ మహానుభావుని స్వభావంగా తెలుస్తోంది. వారికిదే మన నమస్సుమాంజలులు.

గోపికలారా! అడవి పూలతో ఈ బృందావన మంతా గుబాళిస్తోంది. పున్నమి చంద్రుని వెన్నెలకు కాళిందీ జలాల నుండి వీచే మలయమారుతాలు మత్తెక్కిస్తున్నాయి. విరబూసిన ఈ పూవులన్నీ ఎంతో మనోహరంగా ఉండటం మీరంతా తిలకించారు. ఈ బృందావనం అందచందాలన్నీ అనుభవించ దగినవే. ఇకచాలు. ఇళ్ళకు వెళ్ళండి. ఓ పతివ్రతలారా! ఇళ్ళకు పోయి మీ భర్తలకు పిల్లలకు సేవలు చేసుకుంటూ గడిపేయండి. మీరు వచ్చి చాలా సేపైంది. మీరు కనిపించక పోవడం వల్ల మీ పిల్లలు ఏడుస్తూ ఉంటారు. మీ భర్తలు గాబరా పడుతూ ఉంటారు. గోరక్షణ చేయండి. గోవత్సాలకు పాలు త్రాగించండి.

సుచరిత్రులారా ! నాయందుగల స్నేహాన్ని పురస్కరించుకొని రాత్రి పూట ఇంత దూరం వచ్చారు. సకల జీవరాసులు నాయెడల ప్రీతి కలిగే ఉంటాయి. అందువల్ల మీరంతా రావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. మంచి పనే చేశారు. అయినా కూడా స్త్రీలంతా కపటం లేనివారై భర్తల్ని ప్రేమిస్తూ ఉండాలి. అదే వారికి పరమ ధర్మం. స్త్రీలకు అంతకు మించిన ధర్మం లేదు. అనగా అటువంటి సేవల్లో ప్రతిఫలాపేక్ష ఉండదు. భగవంతుణ్ణి సేవించినట్లే సేవించాలి. అట్లా సేవించిన భాగ్యమతులకు దైవాన్ని సేవించినందువల్ల కలిగే ఫలమే కలుగుతుంది. అందువల్లనే భర్తను మించిన దైవం లేదని శాస్త్రాలు చెప్తున్నాయి. ఇక మీరు ఇళ్ళకుపోయి, మీ భర్తలనే నన్నుగా భావన చేసుకొని సేవించండి. నేనప్పుడు మీమనస్సులోని కోరికలన్నీ తీరుస్తాను. సంశయించకండి. లోకాచారాన్ని కూడా మీరంతా పాటించాలి. దుష్ట స్త్రీలు పరాయి పురుషుల వద్దకు పోయి మిమ్మల్ని ఉదాహరణముగా చూపిస్తారు. అటువంటి వాళ్ళకు కూడా సదాచారాలు అలవాటయ్యేట్లుగా మీరు ప్రవర్తించాలి సుమా! అందువల్లనే మహర్షులు కూడా పామరులను ఉద్ధరించడం కోసమే సదాచారాల్ని పాటిస్తూ ఉంటారు. ఇంకొక మాట కూడా వినండి. పతి సేవ వలన లోకానికి మేలు కలుగుతుంది. బంధువులంతా ఆనందంగా ఉంటారు. అప్పుడే సంతానాన్ని చక్కగా పోషించ గలుగుతారు. దీని వల్ల భగవత్ప్రీతి కలిగించిన వారవుతారు. ఎట్లా అంటే సదాచారాలను పాటించే వారియెడల భగవంతుడెప్పుడూ ప్రీతి గలవాడవుతాడు.

మహాకవి పోతనామాత్యులు,

చ॥ *వనితలు, నన్నుఁ గోరి యిట వచ్చితి రింత కొఱంత లేదుమే*
లొనరెఁ, సమస్త జంతువులు నోలిఁ బ్రియంబులు గావె నాకునై
నను, నిలువంగఁ బోలదు సనాతన ధర్మము లాఁడు వారికిం
బెనిమిటులన్ భజించుటలు పెద్దలు చెప్పుచునుందు రెల్లెడన్

అని ఎంత చక్కగా ఆంధ్రీకరించారో చూడండి.

పురంధ్రులారా! ఇంకోమాట. భర్త దురాచార నిరతుడైనా, అదృష్ట హీనుడైనా, వృద్ధుడైనా జడుడైనా రోగియైనా నిర్ధనుడైనా స్త్రీలు అతణ్ణి విడిచిపెట్టరాదు. ఏ స్త్రీ అటువంటి వాణ్ణి వదలక ప్రేమిస్తుందో అటువంటి స్త్రీనే పుణ్యవతి అని అంటారు. ఓ కులకాంతలారా! నా చరిత్ర విన్నా, నన్ను దర్శించినా, మనస్సులో తలచుకొని ధ్యానం చేసినా, నా నామస్మరణ చేసినా నా కృపకు పాత్రులవుతారు. నా సన్నిధానంలోనే ఉండాలని అనుకోకండి. మనస్సే ప్రధానము. దానితో నన్ను చూసిన చాలు. కళ్ళెదుట చూస్తే కలిగే ఫలం లభిస్తుంది. అనగా పరిశుద్ధమైన మనస్సే ప్రధానం. మీరంతా నాకోసం వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. అట్లాగే మీరంతా ఇళ్ళకు పోయి నే చెప్పినట్లుగా నడచుకోండి. అది నన్ను ఇంకా ఎక్కువ సంతోష పెడుతుంది.

గోపికలు శ్రీహరిని ప్రార్థించుట :

శ్రీకృష్ణుని మాటలు విన్న గోపికల ముఖాలు వెలవెల పోయాయి. ఆ మాటలు వారికి ఊరట కలిగించ డానికి బదులు దుఃఖాన్నే కలిగించాయి. హృదయాలన్నీ భగ్నమై పోయాయి. చింతాసముద్రంలో

మునిగి పోయారు. దుఃఖభారంతో హృదయాలు పగిలిపోయాయి. నిట్టూర్పులతో ముఖాలు మాడిపోయాయి. కాటుక కళ్ళనుండి కారిన కన్నీటి ధారల్తో వక్షస్థలాలన్నీ తడిసి పోయాయి. భగవంతుని మాటలు వారిని తృప్తి పరచ లేక పోయాయి. వారు మాయా మోహితులు, భగవంతుడు మాయాతీతుడు. వారికి భగవత్ కటాక్షమే ప్రధానం. ఆ సమయంలో వారంతా గోలోకవాసులమన్న మాట మరచారు. కోపంతో కనుబొమలు ముడిచి శ్రీకృష్ణునితో ఇలా అన్నారు.

పోతన గారు వ్రాసిన పద్యాలను తిలకించండి.

సీ॥ *విరహాగ్ని శిఖలతో వెడలు నిట్టూర్పుల ।*
ముమ్మరంబుగఁ దాఁకి మోము లెండఁ
గన్నుల వెడలెడి కజ్జల ధారలు కుచకుంకుమంబులఁ ।
గ్రొబ్బి పాఱఁ జెక్కులఁ జేర్చిన చేతుల వేడిమి మోము ।
దమ్ముల మేలి మురవు డిందఁ బొరిబొరిఁ బుంఛాను పుంఖంబులై తాఁకు ।
మదను కోలల ధైర్య మహిమ చెదరే

తే॥ *దుఃఖభరమున మాటలు తొట్రుపడఁగఁ ।*
బ్రియము లాడని ప్రియుంజూచి బెగ్గడిల్లి
చరణముల నేల వ్రాయుచు సంభ్రమమునఁ ।
గాంత లెల్లను వగల నాక్రాంత లగుచు.

అని వ్రాశాడు.

భగవానుడా! లోకవిభో! సర్వము నువ్వేనని నమ్ముకొని నీ పాదాలనాశ్రయిచాము. నిర్దాక్షిణ్యంగా మమ్మల్నిప్పుడు పొమ్మనడం న్యాయమా? ముక్తిని కోరే వారిని నువ్వెట్లా కరుణిస్తావో అట్లాగే మాకు కూడా సంసారం నుండి విముక్తి కలిగించు. శ్రీకృష్ణా! ప్రభో! నువ్వే దిక్కని నమ్ముకొని వచ్చాం. నువ్వు ఆది పురుషుడవు. భర్తను పిల్లల్ని అనుసరించి బ్రతకడమే స్త్రీకి ధర్మమని బోధించావు. ధర్మాలన్నీ ఎరిగిన ధర్మాత్ముడవు. నువ్వామాటలు ఉపదేశించడం భావ్యమా? నీకిది న్యాయమా? మరొక్క మాట విన్నవించుకుంటున్నాం. ఓ పరమేశ్వరుడా! దేహాలన్నింటిలోనూ ఉండే ఆత్మ బంధువవు నీవే గదా. అటువంటి నీయందే మా సర్వస్వాన్ని అర్పించి కొలిచే మమ్మల్ని కాదని విడిచిపెట్టి మాకు వేరే తత్త్వాన్ని ఎందుకు ఉపదేశిస్తున్నావు? నేర్పరితనం గలవారు నీయందే రతి కలిగి ఉంటారు. ఆత్మ యందు నిన్నే ధ్యానిస్తూ ఉంటారు. భర్త అని పిల్లలని సంసారంలో పడేసి ఎందుకు మమ్మల్ని బంధితుల్ని చేస్తున్నావు? పతి పుత్రాదులను దగ్గరకు చేర్చుకున్న కొద్దీ కష్టాలు పెరుగుతూ పోతాయేగాని తరగవు గదా. అట్లా కాకుండా నీయెడల అనురాగం కలిగి ఉంటే కష్టాలన్నీ తొలగిపోతాయి. అందువల్లనే మేమంతా నిన్ను ప్రేమించాం. పరమేశ్వరా! మా ఆశలలో నీళ్ళు పోయకు. నువ్వు అరవింద నేత్రుడవు. నీ చూపుల్లో దయారసం ఉట్టి పడుతూ ఉంటుంది. అట్టి దృక్కులతో మమ్మల్ని ఉద్ధరించు. నిన్నే పరమేశ్వరుడవని నమ్ముకున్నాం. అటువంటి మమ్మల్ని తిరిగిపొమ్మని చెప్పవద్దు. ఆశ్రిత రక్షకుడన్న

బిరుదు నీకున్నది. అటువంటి నువ్వు మమ్మల్ని ఇళ్ళకు పొమ్మనడం న్యాయమా? ప్రభూ! మరొక సారి ఆలోచించు. మేమంతా అబలలం. మాకోరిక మన్నించి మమ్మల్ని ఉద్ధరించు. మా ఆశలపై నీరు చల్లవద్దు. ఇదే నీకు నమస్కారము. మా హృదయాలే పద్మాలు. వాటితో నీ పాదాలను అర్చించుకుంటాం. ఇంతవరకు మా ఇళ్ళల్లో సుఖంగానే ఉన్నాం. అటువంటి మాహృదయాల్ని అపహరించావు. మేము భర్తల్ని పిల్లల్ని అన్నీ వదలి నీ పాదాలవద్దకు వచ్చి చేరాం. అటువంటి మేము ఎట్లా తిరిగి వెళ్ళగలం? ఎక్కడకని వెళ్ళగలం? నీపాదాలని స్పృశించిన మా చేతులు ఇకపైన గృహకృత్యాలు నెరవేర్చలేవు. ఇది నిశ్చయము. ఈ ఘట్టంలో మహా కవిపోతన గారు

సీ॥ *నీపాదకమలంబు నెమ్మి డగ్గఱఁగాని । తరలి పోవంగఁ బాదములు రావు*
నీ కరాబ్జంబులు నెఱి నంటితివఁ గాని । తక్కిన పనికి హస్తములు రావు
నీవాగమృత ధార నిండఁ గ్రోలఁగఁ గాని । చెవులన్య భాషలు చేరి వినవు
నీ సుందరాకృతి నియతిఁ జూడఁ గఁ గాని । చూడ దన్యంబులఁ జూడ్కి కవలు.

ఆ॥ *నిన్న కాని పలుక నేరవు మా జిహ్వ । లొల్లననుచుఁ బలుక నోడవీవు*
మామనంబులెల్ల మరపించి దొంగిలి । తేమి సేయు వార మింక గృష్ణ.

అన్న గోపికలు అంతటితో తృప్తి చెందక తమ చమత్కారాన్ని ఇంకా ఇలా చూపించారు. స్వామీ! మమ్మల్ని తిరిగిపొమ్మని ఆజ్ఞాపించావు. గదా? మాపాదాలు నీ ఆజ్ఞల్ని ఉల్లంఘిస్తున్నాయి. అందువల్ల మా అందరికీ కలిగే పరితాపాన్ని కూడా నువ్వే పరిగ్రహించాలి. నువ్వు ఆ వేణువు కిచ్చిన అధరామృతంతోనే మా అందరి తాపాన్ని కూడా తీర్చు. అనగా ఇంటికి పొమ్మనకుండా చక్కని మాటల్తో మమ్మల్ని ఆనందసాగరంలో ముంచు. దాంతో మా దేహాల్లో జీర్ణించుకు పోయిన సంసార తాపం నశిస్తుంది. ఇదే గదా భగవంతుని కోరదగినదని భావం. అవ్యక్తమైన నీ మధుర గీతం హృదయ సంతాపాగ్నిని ఆర్పేస్తుంది. మనో దుఃఖాలు లేకుండా చేస్తుంది. దాంతో మా అందరికీ నీ దాస్యం లభిస్తుంది. రాసమండలమే మాకు ముక్తి స్థానం. అంతకు మించిన కోరికలు మాకు లేవు. మా కోరికతీరేంత వరకు నీపాదపద్మాలను విడిచిపెట్టం. రాత్రింబవళ్ళు నిన్నే ధ్యానం చేస్తాం. 'అన్యధా శరణం నాస్తి' నిన్నే సేవించుకుంటూ ఇక్కడే ఉంటాం. నీ సేవా భాగ్యం కలిగేట్లు అనుగ్రహించు. ఆ సుఖాన్నే ముక్తిగా భావిస్తాం.

కృష్ణా! నీపాద ధూళిని సేవించడం చేతనే శ్రీమహాలక్ష్మి నీ వక్షఃస్థలాన్ని ఆక్రమించుకో గలిగింది. మేంగూడా ఆ దేవి కటాక్షాన్ని, నీ పాద ధూళిని కోరుకుంటున్నాం. ఇతర దేవతల అనుగ్రహం మాకు వద్దు. మళ్ళీ ఇళ్ళకు పోయి సుఖంగా ఉండమని ఆజ్ఞాపించకు.

విశేషార్థం: ఓ శ్రీహరీ! భక్తులు నీ పాద ధూళినే కోరుకుంటారు. ఎందువలన? ఆ ధూళి చేత రజస్సు నశిస్తుంది. లక్ష్మీదేవి నిన్నావిధంగా సేవించి నీ హృదయాన్ని పొందగలిగింది. అనగా నీ మనస్సును రంజింప చేయగలిగి నీకరుణకు పాత్రురాలైంది. అంతే కాని విష్ణువు గుండెలలో గూడు కట్టుకుని కూర్చుందని అర్థంకాదు. అనగా ఆ పరమాత్మ హృదయంలో స్థానం సంపాదించుకున్న

అదృష్టవంతురాలని భావం. భక్తులెప్పుడూ భగవంతుని పాదసేవనే కోరుకుంటారు. అదే ప్రపత్తి మార్గం. అదే ముక్తి మార్గానికి సోపానం. రజోగుణం పూర్తిగా నశిస్తుంది. ఇక తమోగుణం ఎక్కడ ఉంటుంది? అందువల్లనే భక్తుల్ని రజోగుణాన్ని జయించమని పెద్దలంటూ వుంటారు. అది పూర్తిగా నశిస్తే గానీ భగవత్కరుణ లభించదు. అందువల్లనే గోపికలు శ్రీహరి పాద సేవనే కోరుకున్నారు.

ప్రాణేశా! నీ మోహన రూపం, మందహాసం మమ్మల్నందర్నీ కామ పరవశులుగా చేసింది. మాకందరికీ నీ దాస్యమొక్కటే శరణ్యం. కావున నీ దాస్యాన్ని ప్రసాదించు. నువ్వు బంధాలనుండి విముక్తి కలిగించే వాడవని నమ్ముకొని ఇళ్ళను సంసారాలను వదలుకొని నీవద్దకు వచ్చాం. కాబట్టి నిన్ను సేవించుకోవాలనే ఆశ చావదు. మామనస్సులు నీ దాస్యానికే త్వరపడుతున్నాయి. నీవు గండస్థలం, మణికుండలాలతో అలంకరించుకుంటావని, అమృతాన్ని చిందించే నీ చిరునవ్వులు లక్ష్మీదేవికి స్వంతమని వింటూ ఉండే వాళ్ళం. అటువంటి నీముగ్ధ మనోహర రూపాన్ని దర్శించ గలిగాము. ఏ బాహువులతోనైతే ఎల్లప్పుడూ భక్తులకు అభయమిస్తూ ఉంటావో అట్టి బాహువుల్ని చూడగలిగాము. నీకు భక్తులమై నీ దాస్యాన్ని కోరుతున్నాం. సాధువులందరూ భగవంతుని ముక్తి నాథా అని పిలుస్తూ ఉంటారు. యోగులు నిన్ను జ్యోతి స్వరూపునిగా ధ్యానిస్తారు. మునులు నిన్ను జ్ఞానమయునిగా భావన చేసుకొని వేడుకుంటారు. కవులంతా లోకనాయకా అంటూ వర్ణిస్తారు. స్త్రీలంతా నీ ముగ్ధమనోహర మందహాసాలనే వాంఛిస్తూ ఉంటారు. భగవంతుడవైనా నీపై అందరి కోరికా ఒక్కటే. వారి కోరికలో భేదము ఎంత మాత్రము కనిపించదు. నువ్వు అన్నింటికి పాత్రుడవే. భగవంతుణ్ని ఎన్ని విధాలుగా ప్రార్థించినా సంకల్ప మొక్కటే సుమా!

విశేషార్థం: కృష్ణా! నువ్వు పాపనాశకుడవు కదా. సంసారం పాపాలకు ఆలవాలం. ఆ పాపాలనుండి బయట పడాలంటే సంసారం నుండి బయట పడాలి కదా. జనార్ధన నామం కూడా నీకున్నది. మేమటు పాపాలను తొలగించుకోవాలని వచ్చాం. ఇదేమి గొంతెమ్మ కోరిక కాదు గదా? మా ఈ కోరిక కోరరానిదని ఎట్లా అంటావు? నీ మందహాసం మాకు మత్తెక్కిస్తుంది. ఈ అపరాధం మాదా? లేక నీ మందహాసానిదా? మాకున్న కోరికంతా నీ దాస్యమే. అది క్షణక్షణం తీవ్రతరమవుతుంది. అదే కదా భక్తి కి లాభం. అది మాకు కలిగింది. అట్లాంటి మమ్మల్నందర్నీ అక్కున చేర్చుకోవడం నీ విధి కాదా? ఇక్కడ కామమంటే కోరిక అని అర్థం. అది, 'పురుష భూషణ దేహిదాస్యం' అన్న వాక్యం చేత గ్రహించాల్సి ఉంటుంది అనగా మన్మధార్తి అని అర్థం చెప్పినట్లయితే వారుకోరేది దాస్యం కాదు. స్త్రీ పురుష కలయిక నే కోరుకునే వారు. అట్లాకాకుండా దాస్యాన్ని కోరారు. దీన్ని బట్టి గోపికల్ని కామ పరతంత్రలని ఎట్లా చెప్పగలం? మహా భక్తి పరవశులు. పురుష భూషః అంటే, 'పరమ పురుషా' అని అర్థం. ముక్తిని కోరకుండా దాస్యాన్నే కోరడం కేవలం భక్తుల లక్షణం. అటువంటి వారికి భర్తలను వదలి వచ్చిన పాపాన్ని ఎట్లా ఆపాదిస్తాం? సర్వసంగ పరిత్యాగం చేసి భగవంతుణ్ణే ఆశ్రయించాలనే గదా శ్రుతులు చెప్తున్నాయి? "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అన్న భగవద్వాక్యం ఈ స్త్రీల విషయంలో అన్వయం కాదా? కాబట్టి మనమిక్కడ హేయమైన అర్థాన్ని ఒక్కమాట కూడా తీసుకోరాదు. అదే బుద్ధిమంతుల లక్షణం.

నీ అందచందాలకు ముగ్ధమనోహర రూపానికి సాటి అయిన వారు ముల్లోకాల్లోనూ లేరు. అంతెందుకు వృక్షాలు, పశుపక్ష్యాదులు కూడా నీ యెడల మోహితులు కాకుండా ఉండలేవు. అంతేకాదు నీ వేణుగానం కూడా అత్యంత మనోహరం. ఎంతటి పతివ్రత అయినా నీవేణుగానం విన్న తర్వాత చపలచిత్త కాకుండా ఉండలేదు. మేమే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. కాబట్టి మాకోరిక మన్నించు. కృష్ణా! నువ్వు ఆదిపురుషుడవు. సురలోకరక్షకుడవు. అటువంటి నువ్వు ఈ గోకులంలో నివసిస్తున్నవారము, ఆర్తులము అయిన మమ్ము కృతార్థులను చెయ్యడానికే అవతరించావు. కాబట్టి నువ్వు ఆర్త బంధువు అని పిలిపించుకో దగ్గవాడవు. నీ దివ్య హస్తాలను మా శిరస్సులపై ఉంచి ఆశీర్వదించు; హృదయాలపై ఉంచి ఊరట కలిగించు. మేమంతా నీ దాసీలం. మాకోరికలు తీర్చడం నీ విధి అని వేడుకున్నారు.

విశేషార్థం: మూడులోకాల్లోనూ నీ రూపము వంటి రూపం గలవాడు కనబడుతాడా? నీరూపం అంటే వేదాంత వేద్యమే గదా. నిర్మలమైన నీరూపాన్ని దర్శించిన గోవులు, పక్షులు, వృక్షాలు మృగాలు కూడా తమను తాము మరచి పోయి హర్షం ప్రకటిస్తాయి. ఇక మిగిలిన వారి మాట వేరుగా చెప్పాలా? నీ వేణుగానం అవ్యక్తం. ఇట్లా ఉంటుందని వర్ణించి చెప్పలేం. ఉపనిషత్తుల సారం అంతా నీ వేణుగానంలో జొప్పించావు. కావున ఆ గానాన్ని విన్న స్త్రీలు నిన్ను చూడాలను కోకుండా ఉండగలరా? అనగా ప్రకృతి విశేషంగా స్త్రీలయందే కనిపిస్తూ ఉంటుంది. అందువల్లనే నీ గానమాధుర్యాన్ని మేము ఆస్వాదించినట్లు ఇతరులు ఆస్వాదించలేరు. సచ్చరిత్రులంతా నిన్ను కోరుకుంటారు. మహర్షులే నిన్ను తలచినంతనే ముగ్ధులై పోతారు. అటువంటిది, నీ ముగ్ధమనోహర రూపాన్ని ప్రత్యక్షంగా చూసిన మేము నిన్నెట్లా వదలుకొని ఇళ్ళకు వెళ్ళగలం? అనగా నీ దర్శన మైన తరువాత తిరిగి ఈ ఘోర సంసార సాగరంలో పడకుండా ఉండటమే గదా నీ దర్శన ఫలమని గోపికల భావము.

ఈ ఘట్టంలో మనం విమర్శించుకోవలసిన విషయం ఒకటుంది.

అదేమంటే, గోపికలంతా శ్రీకృష్ణుని తలను తమ వక్షఃస్థలంపై ఉంచమని వేడుకున్నారు. ఈ మాటను పట్టుకొని కొందరు శ్రీకృష్ణుడు జారుడు కాదా? అని ప్రశ్నించారు. కాదు. అదెట్లాగో చిత్తగించండి.

దీనికి మహాకవి పోతన,

క॥ అమరులఁ గాచిన హరి క్రియఁ । గవేక్షణ నీవు నేఁడు కరుణ నభయహ
స్తము మాయురముల శిరములఁ । బ్రమదంబున నిడుము మూర్ఛ పాల్పడ కుండన్

చూశారు గదా పోతన గారు ఆ భావాన్ని ఎటువంటి రసంతో గ్రహించారో. ఆహా! మహాకవీ! నీవు పరమ భక్తుడవు. ఉపనిషర్థాన్ని గ్రహించి ఆంధ్రప్రజానీకాన్ని పునీతుల్ని చేశావు. నీకిదే నా నమస్కార సహస్రములు.

శ్రీమన్నారాయణునికి నాలుగు భుజాలు. ఆ నాలుగు భుజాలూ శంఖ చక్ర గదా పద్మాలను

ధరించాయి. ఇదేమీ క్రొత్త విషయం కాదు. పద్మ హస్తం అంటే అభయ హస్తమని అర్థం. 'కరపంకజ' మన్న మూలానికి అభయ హస్తమని చెప్పడం సమంజసం కాదనవచ్చు. భగవంతునికి అభయ హస్తం లేదని ఎవ్వడూ చెప్ప లేడు గదా. అట్లాగని అయిదు హస్తాలున్నాయని చెప్పలేం గదా. భగవంతుడు అభయ హస్తుడు కాదనడం కన్నా వేరే పాపం ఏమీ ఉండదు. అందువల్లనే గోపికలు ఓ కృష్ణా! నీ అభయ హస్తాన్ని మా తప్త స్తనములపై ఉంచమని ప్రార్థించారు. అనగా నువ్వెక్కడ కనిపించకుండా పోతావో నన్న తపనతో మా హృదయాలన్నీ తపించి పోతున్నాయి. కావున తపించే మా హృదయాలు శాంతించేట్లుగా అభయ హస్తముంచమని వేడుకున్నారు. స్తనములపై ఉంచమనడం కామ వికారం కాదా? అని ఆక్షేపించకూడదు. అట్లాగే అభయ హస్తాన్ని శిరస్సు పైన కూడా ఉంచమని ప్రార్థించారు అనగా భగవంతుణ్ణి ప్రార్థించేటప్పుడు లజ్జ ఉండరాదు. గోపికలు అత్యంత భక్తి పరవశులు కావడం వలన వారికి భగవంతుని పట్ల ఎటువంటి దేహభ్రాంతి ఉండదు. భక్తిలో కపటం ఉండదు. శరణాగతి భావం ఉట్టిపడుతూ ఉంటుంది. అందువల్లనే నీ అభయ హస్తాన్ని మా స్తనములపై ఉంచమని ప్రార్థించారు.

అనగా భక్తి భావమే ముఖ్యంగాని, విపరీతార్థాలు భగవంతుని దగ్గరకు తీసుకొని పోలేవు. శిరస్సుపై హస్తముంచుమా? అంటే అర్థం ఏమిటి? గురువు శిష్యునికి ఉపదేశం చేసే టప్పుడు శిరస్సున అంటే బ్రహ్మరంధ్రాన్ని దక్షిణ హస్తంతో తాకి ఉపదేశిస్తాడు. దానికే హస్తమస్తక సంయోగమని అంటారు. ఇక్కడ కూడా మనం ఆ అర్థం తోనే స్వీకరించాలి. అనగా ఓ శ్రీహరీ! నువ్వు మాకు పరమ గురుడవు. మాకు మంత్రాన్ని ఉపదేశించి తరింప జేయుమని వేడుకున్నారు. అంతేగాని శ్రీకృష్ణుడు గాని, గోపికలు గాని కామాతురులు కానే కారని మనం గ్రహించాలి.

గోపికలంతా ముక్త కంఠంతో నిన్ను విడిచి మేము ఇళ్ళకు పోనే పోము. మళ్ళీ మమ్మల్ని ఆ సంసార సముద్రంలోకి నెట్టకు అని ప్రార్థించారు. దైన్యంతో వారు మాట్లాడిన మాటలన్నీ చిరునవ్వుతో వింటూ భగవంతుడు వారి అంతరంగాన్ని గ్రహించాడు. మాయా మోహితులైనా కూడా స్వరూపజ్ఞానం గలవారిగా తెలుసుకున్నాడు. వారికున్న పట్టుదలను బట్టి గురుశిష్య సంబంధమే స్పష్టమవుతోంది. భగవంతుడు కూడా వీరి పరితాపాన్ని చల్లార్చాలనే నిశ్చయించుకున్నాడు. యోగేశ్వరేశ్వరుండగు శ్రీకృష్ణ పరమాత్మ పక్కున నవ్వి తన ఆత్మారామత్వాన్ని వాళ్ళందరికి కనబడేట్లు చేసి సంతృప్తుల్ని చేశాడు.

విశేషార్థం: *ఇతి విక్లబితం తాసాం శ్రుత్వా యోగేశ్వరేశ్వరః*
ప్రహస్య సదయం గోపీ రాత్మారమో వ్యరీరమత్

అని మూలం. ఇందుకు "ఆరీరమత్ = రమయా మాస" అన్నది వ్యాఖ్య. తాసాం= ఆ గోపికల యొక్క విక్లబితం = పారవశ్యం చేత ఒళ్ళు తెలియని స్థితిలో వాడిన పదజాలం. శ్రుత్వా = విని, యోగేశ్వరేశ్వరః= యోగేశ్వరులకే అధిపతి అయిన వాడా! అనగా ధ్యానానికి గమ్యమైన వాడా! శ్రీకృష్ణమూర్తి అని. ఆత్మారామః = తానే ఆత్మారాముడయి కూడా, సమస్త జీవరాశులయందు విహరించువాడు కావున. గోపీః = గోపికలకు, అరీరమత్ = సంతోషాన్ని కలిగించువాడు. ఎట్లా? ప్రహస్య = నవ్వి, అనగా యోగీశ్వరులంతా తన్ను ధ్యానం చేస్తుంటే సర్వ భూతాంతర్యామి అయిన

శ్రీకృష్ణ పరమాత్మ ఆ గోపికల ఆర్తనాదాన్ని విని ఇక ఆలస్యం చేయరాదని తలచాడు. వీరి మనస్సులు పరిపక్వమై ఉన్నాయి. ఇక వీరికి ఉపదేశం చెయ్యక తప్పదు. అయినా వీరికిప్పుడే ముక్తి ని ప్రసాదించరాదు. ఎందువల్ల నంటే తాను చెయ్య వలసిన దేవకార్యం సిద్ధించదు. కాబట్టి వీరిని ఇంకా కొంతకాలం సంసారంలో కొనసాగేట్లు చెయ్యాలి. నేను ఈ లోకాన్ని వదలి గోలోకానికి పోయేటప్పుడు నాతో తీసుకొని పోవచ్చులెమ్మని తలచాడు. తానే ఆత్మారాముడు కాబట్టి వారిలో ఉండే తన రూపాన్ని ప్రకాశింపజేశాడు. తన మాయ చేత వారిష్టానుసారం సంతుష్టుల్ని చేశాడు. తెలుగులో మహాకవి పోతన 'గోపీః' అన్న ద్వితీయా బహువచనాన్ని తృతీయా బహువచనం గా మార్చి "గోపికలతో రమించె' అని ఆంధ్రీకరించాడు. ఇదే 'బాహ్య క్రీడలొనరించెన్' అంటే ప్రమాదం వాటిల్లేది. ఆత్మారాముడే కనుక వారిని సంతుష్టచిత్తులను చేశాడంటే వచ్చే ప్రమాదం ఏమీ లేదు.

అప్పుడు శ్రీహరి యేగీశ్వరులకు ధ్యాన గమ్యులు కావడం చేత వారిమనస్సుల్లో తన తేజస్సును ప్రవేశపెట్టి వాళ్ళందరికీ అదో ఆటలాగ అనిపించేట్లు చేశాడు. ఇటువంటి చేష్టలకు శ్రీహరి పెట్టింది పేరు. కనుకనే తానచ్యుతుడయ్యాడు. అనగా జారిపోయే స్వభావం కానివాడని భావం. అంతేకాదు తన అసమానమైన చిరునవ్వు వలన కనబడే పలువరుసల చేత నక్షత్రాలతో కూడిన శరశ్చంద్రునివలె ఆ గోపికలతో కలసి ఆ దివ్య భూముల్లో విహరించాడు. అప్పుడు ఆ గోపికలు కూడా తాము ఆశించిన పరమేశ్వరుడు తమ కధీనుడవటం వలన ఆనందంతో వారి ముఖాలన్నీ వికసించాయి.

పూర్ణ చంద్రుడు నక్షత్రాలతో కలసి విహరించినట్లుగా అనగా నక్షత్రముల కాంతి తగ్గి చంద్రుని ప్రకాశానికవి లోబడి పోయాయన్నదే భావార్థం. అట్లాగే భగవంతుని తేజస్సు గోపికలందు ప్రవేశించగా, వారెవ్వరూ వారి స్వాధీనంలో లేరని, భగవంతుడు ఆడించినట్లల్లా ఆడే బొమ్మలై పోయారని మనం గ్రహించాలి. అనగా విష్ణుమాయ కప్పివేయగా వారంతా శ్రీహరి ఆడించినట్లల్లా ఆడుతున్నారని భావసారం. ఇందుమూలంగా భగవంతుని సర్వ నియంతృత్వము స్పష్టమవుతుంది. పరమేశ్వరత్వము సిద్ధాంతమవుతుంది. అంతేగాని శ్రీకృష్ణుడు కామపరతంత్రుడై పరభార్యలతో కలసి క్రీడించే జారుడని అనరాదు. ఈభావం ఎంత మాత్రం కనిపించదు. భగవంతునికి వక్ర భాష్యాలు చెప్పడం పాప హేతువవుతుంది. అనగా తోలు బొమ్మ లాటలో సూత్రధారుడు బొమ్మలనాడించినట్లు ఆడించాడన్న భావమే ఇక్కడ కనిపిస్తుంది. ఆ విధంగా మైమరచి పోయిన గోపికలు ఆడమన్నట్లల్లా ఆడుతూ, పాడమన్నట్లల్లా పాడుతూ ఒక వనం నుండి మరొక వనానికి అక్కడ నుండి ఇంకొక వనానికి త్రిప్పుతూ బృందావనమంతా కలియ తిరిగారు. యమునా తీరాన జుట్టు విరబోసుకుని ఇసుక తిన్నెలపై కూర్చుని నీళ్ళపై నుండి వచ్చే చల్లని మలయ మారుతాలను తనివితీరా ఆస్వాదించారు.

విశేషార్థం: లోకంలో దీక్షా విధి ప్రకారం గురువు శిష్యునికి ఉపదేశిస్తాడు. ఆ ఉపాసనకే ఖండములని కూడా అంటారు. అవి నాలుగు విధాలు 1. మంత్ర ఖండము 2. న్యాస ఖండము 3. పూజాఖండము 4. హేమ ఖండము అని పిలుస్తారు. ఇక్కడ గోపికలంతా శరణాగతులు కాగా, శ్రీకృష్ణుడు వారికి ఏకాంతంలో మంత్రోపదేశం చేశాడు. ఆ మంత్రోపదేశం ద్వారా వారిని గోలోకవాసానికి అర్హులుగా చేశాడని భావం. అంతేకాని విపరీతార్థాలకు ఇక్కడ చోటు లేదు. ఉపదేశ

క్రమంలో వారందరికీ ఆత్మ మంత్రాన్నే ఉపదేశించాడు. దీన్నే తారక మంత్రమని కూడా అంటారు. వారంతా శ్రీకృష్ణుణ్ణే భర్తగా వరించారు. భర్త అంటే నాలుగు ముద్దలు అన్నం పెట్టే వాడు కాదు. సంసార నివృత్తి ద్వారా ముక్తి మార్గాన్ని తెలిపి కాపాడే వాడన్న అర్థాన్ని మనమిక్కడ గ్రహించాలి.

గోపికలంతా తాము కోరుకున్నట్లే భగవంతుని భర్తగా పొందగలిగారు.దాంతో వారి ఆనందానికి అవధుల్లేవు. దాంతో వారికి రవ్వంత గర్వం కూడా కలిగింది. "లోకంలో మాఅంతటి భాగ్యశాలురు మరొకరుండ" రన్న భావం వారి మనసులో తొణికిసలాడింది. భగవంతుడిది గ్రహించాడు. వీళ్ళకి గర్వం ఉండకూడని గర్వాన్ని తొలగించి రక్షించాలని అనుకున్నాడు. భగవదనుగ్రహానికి అందరూ పాత్రులు కావాలన్న కోరిక అభినందించ దగిందే గాని, మేము మాత్రమే ధన్యులమని ఎవరూ భావించరాదన్నదే భగవంతుని ఆశయం. గోపికలకు ఈ నీతిని బోధించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నట్లుండి అంతర్హితుడయ్యాడు.

విశేషార్థం: "అను పరీక్షిత శిష్యాయం దేయం మంత్రం సమాహితః" మొదలైన ప్రమాణాలు వేలకు వేలున్నాయి. అసలు ఈ పరీక్షలన్నీ అవసరమా? అని అడిగేవాళ్ళు ఉండవచ్చు. తప్పకుండా పరీక్షించాల్సిందే ఎందువల్లనంటే ఈ గోపికల కోరిక సాదా సీదాకోరిక కాదు. కామ పరమైనది అంతకన్నా కాదు. వారు కోరుకున్నది భగవద్దాస్యం ఉపదేశ సమయంలో గురువు శిష్యుడు పరిపక్వ జీవి అవునా? కాదా? అని పరీక్షించాలి. పరీక్షించడమే దీనికి ఫలం. గురువు శిష్యుని శిరస్సును స్పృశిస్తాడు. ఇలా స్పృశించడం వల్లనే మాయా వలయాలన్నీ పరిశుద్ధమవుతాయి. దీన్నే న్యాస ఖండమని అంటారు. న్యాసమంటే మంత్ర బీజాన్ని ఆయా అవయవాల యందు ఉంచడం అని అర్థం. అనగా ఆ మంత్రాన్ని ఉచ్చరిస్తూ ఆయా అవయవాలను స్పృశించడాన్ని న్యాస ఖండమంటారు. అప్పుడా అవయవాలు పరిశుద్ధమవుతాయి. శ్రీకృష్ణ పరమాత్మ తన ఉపదేశాన్ని న్యాస ఖండ పద్ధతిన చేయబడింది. ఎందువల్ల నంటే ఉపదేశాన్ని కోరినవారు స్త్రీలు. అందులోనూ వయస్సులో ఉన్నవారు. అందునా వారు కోరేది భగవద్దాస్యం. ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు. కేవలం భగవత్ సాహచర్యాన్ని కోరుకుంటున్నారు. కావున భగవంతుడు వారికా అర్హత ఉన్నదా? లేదా?అని పరీక్షించి గాని తారక మంత్రాన్ని ఉపదేశించరాదు. పరీక్ష అంటే న్యాస ఖండమున కావాల్సిన పని. ఏ అవయవం కూడా ప్రాపంచిక విషయాలపైకి పోకుండా నియంత్రించ గలగటమే ఇక్కడ ముఖ్యమైన విషయం. భగవంతుడీ విషయాన్ని పరీక్షించకుండా తెలుసుకోలేడా అని అడుగరాదు. ఎందువల్ల నంటే, లోకులకు సదాచారాలను నేర్పడమే భగవంతుని పని. దాన్ని ఉదాహరణ పూర్వకంగా నేర్పడమే భగవంతుని ఆశయమని మనం గ్రహించాలి. న్యాస ఖండము ననుసరించి భగవంతుడు గోపికల అంగములను స్పృశించాడు. అప్పుడు గురుశిష్యులకు తండ్రీకొడుకుల భావం ఉంటుంది. ఇది మాటలలో చెప్పేది కాదు. అనుభవ పూర్వకంగా తెలుసుకోవాల్సిందే. కాబట్టి శ్రీకృష్ణుడు వారికి తారక మంత్ర రాజాన్నే ఉపదేశించాడనడం సిద్ధాంతము. యోగీశ్వరేశ్వరః, ఆత్మారామః, అచ్యుతః, భగవాన్, సురలోక గోప్తా అన్న నామాలన్నీ శ్రీకృష్ణ పరమాత్మకు ఈ ఘట్టంలో ఉపయోగించడం జరిగింది. అప్పుడు గోపికలు కూడా "దేహి దాస్యమ్" అని కోరారే గాని, మా కామం తీర్చమని

అడుగలేదు. దేహి దాస్యమన్నది ప్రపత్తి మార్గం. ముక్తిని కూడా కోరరాదని ప్రపత్తి మార్గ సిద్ధాంతం. అనగా భగవంతుడు ముక్తిని కోరకుండానే ఇస్తాడని భావం.

"భగవతః, మహాత్మనః, కృష్ణాత్" అన్న పదాన్ని చూడండి. వ్యాస మహర్షి శృంగార చేష్టల్ని వర్ణించదలచుకుంటే ఈ ప్రయోగం చెయ్యడు. "మహాత్మనః = అనాసక్త చిత్తత్వాదితి భావః" అని వ్యాఖ్య అనగా ఏ కార్యమందు ఆసక్తి లేని వాడని భావం. ప్రపంచాన్ని నడిపించడం ఒక క్రీడయే కాని ఆసక్తి కాదన్నదే భావతాత్పర్యం. దీని వలన భగవంతుని సర్వాతిశాయిత్వం ప్రకటితమవుతోంది. ఇట్టి భగవంతుని ప్రసాదం పొందగలిగాంగదా అన్న అహంకారం గోపికలకు కలిగింది. వీరికీ అహంకారం కలగటం మంచిది కాదని భగవంతుడు ఊహించాడు. ఒక ప్రక్క తారక మంత్రోపదేశం పొందారు. దానికి ఫలమైన భగవత్సాంగత్యాన్ని పొందారు. దాంతో వారి ఆనందానికి అంతు లేకుండా పోయింది. ఆ ఆనందంలో మా కన్నా అదృష్టవంతులు లేరన్న అహంకారం తలెత్తింది. భగవద్దాస్యాన్ని కోరుకున్న ఈ గోపికలకు అణువంతైనా అహంకారం ఉండరాదని భగవంతుని ఆశయం. వారి మనస్థితిని పరీక్షించాలనుకున్నాడు. అందువల్లనే ఉన్నట్లుండి అదృశ్య మయ్యాడు. ఈ పరీక్ష వారిని రక్షించేందుకే. ఈ ఘట్టాన్ని మనం ఈ విధంగానే అర్థం చేసుకోవాలి.

భగవచ్ఛక్తి ఇలాంటిది అని ఎవరూ చెప్పలేరు. ఆయన లీలలు మన ఊహకందవు. వేణుగానాన్ని పూర్ణిమ రాత్రి వేళనే ఎందుకు చేశాడు? అన్న సందేహం ఎవరికైనా కలుగవచ్చు. నిండు పూర్ణిమ నాటి వేళల్లోనే తారక మంత్ర రాజాన్ని ఉపదేశించాలి. అదే సరైన సమయం. అప్పుడు శ్రీకృష్ణుడు తన లీలా మానుషత్వాన్ని ప్రదర్శించాలనుకున్నాడు. అందువల్లనే ఆ వేణునాదం పురుషులకు గాని పిల్లలకు గాని మరెవ్వరికీ వినిపించలేదు. ఒక్క గోపికలకు మాత్రమే వినిపించింది. అంతేకాకుండా ఆ వేణుగానం చేసిన సమయం కూడా మరీ అర్ధరాత్రేమీ కాదు. అప్పుడే రాత్రి ప్రవేశిస్తుంది. ఇళ్ళల్లో నుండి వందలాది గోపికలు బయటకు వెళ్తుంటే ఒక్కరూ వారిని అడ్డుకోలేదు. బయట ఎదురు పడ్డ వాళ్ళు కూడా ఒక్కరూ 'ఎక్కడికిపోతున్నా' రని అడగలేదు. ఎందువల్ల? అదే భగవానుని లీలామానుషత్వం. భగవన్మాయ వారిని కప్పేసింది.

గోపికలంతా పరుగెత్తి భగవంతుణ్ణి ఏకాంత ప్రదేశంలో దర్శించారు. వేణునాదాన్ని ఆస్వాదించారు. వారంతా శ్రీకృష్ణునికి నమస్కరించి "దేహి దాస్యమ్" అని వేడుకున్నారు. ఏకాంత భక్తులు కోరాల్సిన వరం అదే. వారు కోరిందీ ఆ పరమ పురుషార్థాన్నే. నిజానికి వారంతా శ్రీకృష్ణున్ని వదలి ఉండలేకనే కృష్ణుడితో పాటు గోలోకం నుండి గోకులానికి వచ్చారు. మనం ఆ మాట మరువరాదు. ఇకపోతే, గోపికలతో క్రీడించాడన్న వాదాన్ని కూడా కొద్దిగా చర్చిద్దాం. గోపికలంతా వందలు వేలల్లో ఉన్నారు. శ్రీకృష్ణుడొక్కడే అటువంటి సమయంలో ఒక్క పురుషుడు వేలాది గోపికలతో ఆలింగనాది క్రీడల్తో సంతోష పెట్టాడనడం నమ్మదగ్గదిగా లేదు. అంతేకాదు ఈ వనం నుండి ఆ వనానికి, ఆవనం నుండి మరో వనానికి తిరిగారని కూడా మూలంలో ఉంది. సకల సుఖాలతో సంతోషపెట్టాడంటే అర్థం ఏమిటి? తానే ఇన్ని రూపాలను ధరించి అంతమందితోనూ క్రీడించాడని చెప్పాలి. అందరికీ అన్ని రూపాలుగా కనబడి సంతోషపెట్టాడంటే, వాళ్ళందరికీ అంతకంటే కావల్సింది ఏముంటుంది?

భగవంతుడు గోలోక వాసుల్ని మాత్రం ఆహ్వానించి వారికి తారక మంత్రాన్ని ఉపదేశించాడనియు, అటుపిమ్మట వారు సంసారంలో ప్రవేశించలేదనియు మనం తెలుసుకోవాలి.

ఈ భగవల్లీలల వలన ఆయన సర్వవ్యాప్తిత్వము, సర్వ నియంతృత్వము మనకు తేటతెల్లమవుతున్నాయి.

గోపికలు శ్రీకృష్ణుని వెదుకుట

(ఈ ఘట్టం శ్రీ భాగవతం దశమ స్కంధం, 30వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

భగవంతుని ఊహల్ని తెలుసుకోవడం ఎవరితరం కాదు. కనీసం ఊహించనైనా ఊహించలేం. శ్రీకృష్ణుడు ఏ కారణం చేత అదృశ్యుడయ్యాడో మనమెట్లా నిశ్చయించగలం? అయితే ఎవరికి తోచింది వారు వ్యాఖ్యానించారు. అందులోని నిజానిజాలు మాత్రం ఆ భగవంతుడొక్కడికే తెలుసు. కృష్ణుడు ఉన్నట్లుండి ఆ నాటకరంగం నుండి తప్పుకున్నాడు. దాంతో గోపికలంతా అనాథులమయ్యామని విలపించారు. వారి హృదయమంతా కృష్ణ ప్రేమతో నిండిపోయింది. అందువల్లనే ఎవరికి వారు తామే శ్రీకృష్ణుడని భావించుకున్నారు. ఆ భావనతోనే శ్రీకృష్ణుని చేష్టలన్నీ చేసి చూపారు. హావభావల్లోనైతేనేమి, నడకలోనైతేనేమి, మాట మన్ననలోనైతేనేమి, తేనెలొలికే మధురమైన సంభాషణల్లోనైతేనేమి, విలాస చేష్టలలో నైతేనేమి, ఆహారవిహారాల్లోనూ ఆ పరమాత్ముని అనుకరించి చూపారు. వారి మనస్సు వారి స్వాధీనంలో లేదు. ఎవరికి వారు "నేనే శ్రీకృష్ణుణ్ణి" ని చాటుకున్నారు. వారి మనస్సంతా భగవంతుని పైనే ఉంది.

విశేషార్థం: దీన్ని బట్టి గోపికలు భ్రమర కీటక న్యాయాన్ననుసరించి శ్రీకృష్ణుని రూపాన్ని పొంది ఉంటారనియు, అందువల్లనే కృష్ణుడు ప్రవర్తించినట్లే ప్రవర్తించారు. కనిపించే ప్రతి వస్తువులోను వారంతా శ్రీకృష్ణుణ్ణే చూశారు. దీన్నే భగవత్కళ అంటారు. దానికి లోబడని వారీలోకంలో ఉండనే ఉండరు.

ఉన్నట్టుండి శ్రీకృష్ణుడు అదృశ్యమయ్యాడు. క్షణక్షణానికి వారిలో తపన, ఆరాటం వృద్ధి పొందుతోంది. ఆకాశం వలె సర్వ జీవులకు లోపలా బయటా ఆవరించి ఉండే ఆ పరాత్పరుని కోసం వెదికారు. వృక్షాలు మనుషుల్లాగా మాట్లాడలేవని వాళ్ళకు తెలిసినా, ఒక్కొక్క వృక్షము వద్దకు పోయి శ్రీకృష్ణుడు ఈ త్రోవన పోయాడా? అని అడిగారు. ఈ ఘట్టంలో పోతనామాత్యులు,

క॥ భూతలములోన వెలిఁ బ్ర । ఖ్యాతుండగు నట్టి వానిఁ గాంతలు కాళిం
దీ తీరవనాంతరములఁ । భ్రాంతిన్ వెదకంగఁ జనిరి పాడుచు నధిపా.

అని వ్రాశారు. ఈ విధంగా తిరుగుతూ ఒక వనంలో నుండి మరో వనానికి పోతూ దారిలో కనిపించిన చెట్టు చేమలన్నింటినీ పేరుపేరునా పిలిచి శ్రీకృష్ణుడు ఏ దారిన పోయాడో చెప్పమన్నారు. ఓ అశ్వత్థమా! భగవంతుని జాడ నీకేమైనా తెలుసా? ఓ జువ్వి వృక్షమా! శ్రీహరి నెక్కడైనా చూశావా? ఓ వటవృక్షమా! లక్ష్మీపతి మమ్మల్నందర్నీ ప్రేమ సముద్రంలో ముంచి ఎక్కడికో జారుకున్నాడు. నీవేమైనా చూశావా? ఓ అశోక వృక్షమా, ఓ నాగవృక్షమా, ఓ పున్నాగ వృక్షమా, ఓ చంపకమా,

మా అందరి దర్పాన్నీ హరించిన గోపాలకృష్ణుడు ముసిముసినవ్వులు నవ్వుకుంటూ ఈ దారిన పోవటం మీరు చూశారా? మీరంతా రాత్రనక పగలనక ఇక్కడే ఉంటారు కదా. మరి శ్రీకృష్ణుడు ఈ దారిన పోతే మీ కంట పడకుండా ఉంటాడా? మీరు చూస్తే చెప్పి పుణ్యం కట్టుకోండి అంటూ దీనంగా వేడుకున్నారు. వారి ఆరాటం అంతా చంచల మనస్తత్వాన్ని చెప్తోందే కాని భగవన్మహిమను తెలుసుకోలేక పోతున్నారు. పోతనగారి పద్యాన్ని చూడండి.

సీ॥ పున్నాగ కానవే పున్నాగ వందితుఁ దిలకంబ కానవే తిలకనిటలు
ఘనసార కానవే ఘనసారశోభితు బంధూక కానవే బంధుమిత్రు
మన్మథ కానవే మన్మథాకారుని వంశంబ కానవే వంశధరునిఁ
గుందంబ కానవే కుందరదను

తే॥ నింద్రభోజమ కానవే యింద్రవిభవుఁ । గువలవృక్షమ కానవే కువలయేశుఁ
బ్రియక పాదప కానవే ప్రియవిహారు । ననుచుఁ గృష్ణుని వెదకి రయ్యబ్జ ముఖులు.

పై పద్యాల్లోని భావాన్ని చూశారు గదా! మూలంలో "రామానుజో మానినీనాం గతో దర్పహర స్మితః" అని ఉంది. ఇందులో ఇంకో చమత్కారం కూడా ఉంది. రామానుజః అని ప్రయోగించబడింది. బలరాముని తమ్ముడు అని చెప్పడం చప్పగా ఉంటుంది. వాస్తవంగా, రామా = గోపికలమైన మమ్మల్ని, అను = అనుసరించి, జః = భూలోకంలో పుట్టినవాడు అని అర్థం చెప్పుకోవాలి. అనగా గోలోకం నుండి ముందుగా మేమంతా వచ్చాం. మాతర్వాత శ్రీహరి అవతరించాడు కాబట్టి మాకు నువ్వు ప్రాణవల్లభుడవు. అందుకే నీకోసం వెదుకుతున్నాం. అటువంటి గోలోక నాథుడైన శ్రీకృష్ణపరమాత్మను మీరెవరైనా చూశారా? అని వృక్షాలన్నింటినీ అడిగారు. ఇట్లా అన్వయించుకుంటేనే కథలో రక్తి ఉంటుంది. "మానినీనాం దర్పహరస్మితః" అన్న వాక్యంలో అర్థం దండిగా వుంది. వృక్షరాజముల్లారా! మా అందరిలో రవ్వంత గర్వం చోటుచేసుకుంది. అటువంటి మా గర్వాన్ని చిరునవ్వులతోనే హరించేశాడు. ఇప్పుడు మా గర్వం అంతా మాయమైపోయింది. భగవంతుని పాదపద్మాలను దర్శించేందుకు తహతహలాడుతున్నాం. ఓ వృక్షరాజములారా! మీరు భగవంతుని ఎరుగుదురు కనుక మీకుండే గర్వం మాకు లేదు. మీరంతా పరోపకారానికై అహర్నిశలు శ్రమిస్తూ ఉంటారు. అందువల్లనే మీరు వృక్షరాజములయ్యారు అని గోపికల భావం. ఇదే శిష్యునికి పరీక్షా సమయం. ఇందులో గోపికల ప్రవర్తనలో గాని, శ్రీకృష్ణుని చరిత్రలో గాని కొంచమైనా దోషాన్ని ఆపాదించలేం. అంతేకాకుండా భగవంతుని సర్వ వ్యాపిత్వం స్పష్టంగా తెలుస్తోంది. స్థూలంగా చెప్పాలంటే ఉపదేశానంతరం వారిద్దరిదీ మర్కట కిశోర న్యాయామని చెప్పవచ్చనిపిస్తుంది.

ఇట్లా కొంతదూరం పోయిన తర్వాత వాళ్ళకు తులసి మొక్క కనిపించింది. భక్తితో వారా వృక్షానికి నమస్కరించి "ఓ తులసీ వృక్షరాజమా! గోవిందుని పాదాలంటే నీకు పరమ ప్రీతి. భక్తులంతా నీ దళాలనే మాలలుగా కట్టి పరమాత్ముణ్ణి అలంకరిస్తారు. భగవంతుడికి కూడా నీ దళాలంటే పరమ ప్రీతి. ఎంత ప్రీతి అంటే, నీమీదుండే మక్కువ కొద్దీ ఎన్ని వేల గండు తుమ్మెదలు రొద

చేస్తున్నా భరిస్తాడు. నీకు కూడా అచ్యుతుడే కదా నాథుడు". అనగా నిన్ను వదలి పోడని భావం. కావున నీకంటే కళ్యాణ ప్రదమైన వృక్షం మరొక్కటి ఉండదు గదా.

విశేషార్థం: "ప్రపచ్ఛు రాకాశ వదంతరం బహిర్భూతేషు సంతం పురుషం పురాణమ్" అని మూలం. అనగా గోపికలు అంతకుముందే శ్రీకృష్ణుని ఉపదేశాన్ని పొందారు. దాంతో వారు శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని సర్వభూతాల్లోనూ దర్శించ గలుగుతున్నారు. కాబట్టి వారు వృక్షాలను ఆర్తితో అడగడంలో ఏమి ఆశ్చర్యం లేదు. బాహ్య దృష్టికి అది లోక విరుద్ధంగా కనిపించ వచ్చుకానీ, ఆ క్షణాన గోపికలు లోకానికి అతీత స్థితిలో ఉన్నారన్న విషయం మనం మరచిపోరాదు. అనగా పరమాత్ముడు కేవలం మనుషుల్లోనే కాకుండా వృక్షాల్లో కూడా ఉన్నాడని వారు గ్రహించారు. అదే భగవదుపదేశ ఫలం. సామాన్యమైన గురుదేవుల ఉపదేశంతోనే శిష్యునకు జ్ఞానోదయం అవుతూఉంటే, సాక్షాత్తూ శ్రీకృష్ణ పరబ్రహ్మమే ఉపదేశించినప్పుడు గోపికలకు జ్ఞానం అబ్బడంలో ఆశ్చర్యమేముంటుంది? "అతస్సంజ్ఞా భవంత్యే తే సుఖ దుఃఖ సమన్వితాః" అన్న భగవద్వాక్యం అందరికీ తెలిసిందే గదా. కావున గోపికలు వృక్షములతో సంభాషించడం న్యాయమేనని మనం గ్రహించాలి.

ఈవిధంగా గోపికలంతా భగవంతుని కోసం తహతహలాడుతూ కనబడ్డ వృక్షాలన్నింటినీ అడుగుతూ వనాలన్ని తలోమూలా తిరుగుతూ అంతా ఒక చోటికి చేరారు. నీకు కనిపించాడా? అంటే నీకు కనిపించాడా? అని అడిగారు. నాకు కనపడలేదంటే నాకూ కనపడలేదన్నారు. దాంతో నీరు కారి పోయారు. దుఃఖంతో కళ్ళంబడి నీళ్ళు ధారలు కట్టాయి. భక్త్యావేశం కట్టలు తెంచుకుంది. ఒకతె నేనే శ్రీకృష్ణుణ్ణని నాట్యం చేసింది. ఇంకొకతె నేనే పూతన నంది. ఈ విధంగా గోకులంలో జరిగిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలన్నింటినీ అభినయించి చూపారు. ఈ ఘట్టంలో మహాకవి పోతన గారు మూలాన్ని అనుసరిస్తూనే తన పద్య మాలను భగవంతునికర్పించాడు. చిత్తగించండి.

సీ॥ *ఈ చరణంబులే ఎందినిభానన సనకాది ముని యోగ సరణి నొప్పు*
నీపాద తలములే యెలనాఁగ శ్రుతివధూ సీమంత వీధులఁ జెన్ను మిగులు
నీ పదాబ్జంబులే యిభకులోత్తమయాన పాలేటి రాచూలిపట్టుఁ గొమ్మ
లీ సుందరాంఘ్రులే యిందీవరేక్షణ ముక్తి కాంతా మనో మోహనంబు

ఆ॥ *లీయడుగుల రజమె యింతి బ్రహ్మేశాది । దివిజవరులు మౌళి దిశలఁ దాల్తు*
రనుచుఁ గొందఱబల లబ్జాక్షుడేగిన । క్రమము గనియు నతనిఁ గానరైరి.

పై పద్యాల ద్వారా మహాకవికి గల భగవద్భక్తి అపారమని స్పష్టమవుతోంది. కావున శ్రీహరి దివ్య చరిత్రమును మనసారా ఆస్వాదించి కృతార్థులు కావడం కన్నా కావలసిందేముంటుంది? కావున కృష్ణా అని ఒక్కసారి మనసారా స్మరిస్తే సంసార తాపాలన్నీ నశిస్తాయి. ఇది సత్యం.

భగవదవతార ఫలం :

పూర్వం మనం నరనారాయణుల చరిత్రను చదువుకున్నాం. అందులో నారాయణుడే శ్రీకృష్ణుడుగా ఇప్పుడవతరించాడు. ఇక నేడో రేపో నరుడు కూడా అవతరించాల్సిందే. ఎందువల్లనంటే

వారిద్దరూ కలిసే దుష్ట సంహారం, శిష్ట పరిత్రాణం తద్వారా భూభారాన్ని తగ్గించాలి. ఇదే స్థూలంగా భగవదవతార ఫలం. పరమాత్మ శ్రీకృష్ణుడిగా అవతరించడం, గోకులంలో కొన్ని బాల్య లీలలు చూపించడంతో భగవదవతారానికి పూర్తి ఫలం దక్కదు. ఇక భూభారం తగ్గడం అంటారా? అందుకో యుద్ధం అవసరం. యుద్ధం అంటే రెండు పక్షాలుండాలి. అట్లాగే ఆ రెండు పక్షాల్లోను ప్రధాన పురుషులు కొందరుండాలి. దుర్యోధనాధుల పూర్వ చరిత్రల వివరాలన్నీ మనకు ముందే తెలుసు. నిజానికి భూభారం తగ్గేది దుష్ట చరిత్రుల సంహరణ వలనేనని చెప్పుకోవాలి. వారే లేకపోతే, ఒకచేత్తో చేసే చప్పుడు ఎట్లా శబ్దం చెయ్యదో, అట్లాగే యుద్ధ ప్రసక్తే రాదు. భూభార హరణము జరుగదు.

ఎప్పుడైతే శ్రీకృష్ణుడు గోలోకం నుండి భూలోకానికి వచ్చాడో ఆకాలంలోనే ఆయనకు సహాయపడటం కోసం గోలోక వాసులు భూమిపై అవతరించారు. వారంతా దేశంలో అనేక ప్రాంతాల్లో, అనేక నామరూపాలతో జన్మించారు. దేవతలు కూడా వారి వారి అంశలతో కొందరు ప్రముఖులకు జన్మనిచ్చారు. ఎవరెవరు లేకపోతే భూభారం తగ్గేది కాదో, వారి గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

పాండవుల జననం :

ధర్మ దేవత తన అంశ చేత ఒక పుత్రుని ఈ లోకానికి ప్రసాదించాడు. అతడు సకల ధర్మము లెరిగిన వాడు. అతడీ ధర్మాలను నీతులను తానాచరిస్తూ లోకానికి ఉదాహరణ భూతంగా ఉండాలని భగవంతుని ఆశయం. భగవంతుడు ప్రచ్ఛన్నంగా నేర్పదలచిన సదాచారాలన్నీ వేద, పురాణ నీతి శాస్త్రసారమని మనం గ్రహించాలి.

అంబిక అంబాలిక, అనే వారిద్దరూ కాశీరాజు పుత్రికలు. వీరిద్దరూ విచిత్రవీర్యునికి భార్యలయ్యారు. విచిత్ర వీర్యుడు సంతానము లేకండానే పరమపదించాడు. ఆ మహా సామ్రాజ్యానికి వారసులు లేకుండా పోతారే అని అతడి భార్యలు దుఃఖిస్తూ ఉండేవారు. అప్పటికే ఆ మహారాజు పెద్ద కుమారుడు, భీష్ముడు, భీకర బ్రహ్మచర్య వ్రతాన్ని స్వీకరించాడు. అతడిని తిరిగి వివాహం చేసుకొని రాజ్యానికి వారసుణ్ణి కనమని, శంతనుని భార్య, సత్యవతి ఎంత ప్రోత్సహించినా అతడు తన పట్టు విడువలేదు. అప్పుడామె తన తొలి సంతానమైన శ్రీకృష్ణద్వైపాయణ్ణి మనస్సులో స్మరించింది. స్మరణ మాత్రం చేతనే ఆ మహనీయుడు ప్రత్యక్షమయ్యాడు. వంశ వృద్ధి ఆగి పోతోందని దుఃఖించి వంశాన్నెట్లాగైనా నిలుపమని పుత్రుణ్ణి వేడుకొంది. తల్లి మాట కాదనలేక, వాళ్ళ మనసులు కలుషితం కాకుండా ఉండాలని వారికో వ్రతాన్నుపదేశించి ఒక సంవత్సరం పాటు ఆ వ్రతాన్ని శ్రద్ధగా చేయమన్నాడు. అంబా, అంబాలిక లిద్దరూ ఆ వ్రతాన్ని నియమాన్ననుసరించి ఒక సంవత్సరం పాటు ఆచరించారు.

మహాత్ముడైన ఆ కృష్ణద్వైపాయనుడు తల్లి అనుమతితో అంబికకు పుత్ర సంతానాన్ని ప్రసాదించదలిచాడు. ఆ సమయంలో ముని ముఖం వికృతంగా కనిపించి చూడటానికి ఇష్ట పడక కళ్ళు మూసుకుంది. అందువల్ల ఆమెకు పుట్టబోయే పిల్లవాడు మహా బలవంతుడే అయినా తల్లి చేసిన దోషానికి పుట్టు గ్రుడ్డిగా పుడతాడని తల్లితో చెప్పాడు. ఆ తర్వాత ఆ మహర్షి అంబాలిక

వద్దకు వెళ్ళాడు. ఆమె కూడా ముని రూపాన్ని చూడలేక ఒళ్ళంతా పాలిపోయింది. అంతట ఆ పరాశరుడు తల్లి వద్దకు పోయి "అమ్మా మాతృదోషం చేత పాండు వ్యాధితో జన్మిస్తాడ" ని చెప్పాడు. అంతట సత్యవతి చేసిన ప్రయత్నమంతా విఫలం కావడం చేత అంబికకు మరొక పుత్రుణ్ణీయమని వేడుకుంది. పరాశరుడు తల్లి అనుమతితో అంబికవద్దకుపోగా, అంబిక ముని రూపానికి భయపడి తనకు బదులుగా తన దాసిని పంపింది. జరిగిందంతా తల్లికి చెప్పి ఆ దాసీకి సకల ధర్మాలు తెలిసిన పుత్రుడు కలుగుతాడని అతడు శూద్రుడవుతాడని తల్లికి చెప్పి వెళ్ళిపోయాడు.

వరుసగా ధృతరాష్ట్రుడు, పాండురాజు జన్మించారు. విదురుడు యముని అంశతో పుట్టాడు. భీష్ముడు వారి ముగ్గురికీ దగ్గరుండి విద్యాబుద్ధులు నేర్పించాడు. ముగ్గురికీ యుక్త వయస్సు రాగానే సుబలుని కుమార్తె గాంధారి నిచ్చి ధృతరాష్ట్రునకు వివాహం చేయించాడు. ఆ గాంధారి మహా సాధ్వి. భర్త చూడలేని లోకాన్ని తానూ చూడలేనని జీవితాంతం కళ్ళకు గంతలు కట్టుకుంది. వసుదేవుని సోదరి అయిన కుంతిని పాండురాజునకిచ్చి వివాహం చేశాడు. కుంతీ దేవి వివాహానికి పూర్వము ఆమె మేనమామ వద్ద పెరిగింది. అప్పుడామెను పృథ అని పిలిచేవారు. ఒకానొక రోజున వారింటికి దుర్వాసమహర్షి అతిథిగా వచ్చాడు. పృథయే ఆయనకు సుశ్రూషలు చేసింది. మహర్షి పృథ సేవలకు సంతృప్తి చెంది ఆమెకో మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రాన్ని జపించి ఏ దేవతను మనసులో తలచుకుంటే ఆ దేవత ప్రత్యక్షమై తన అంశతో పుత్రుణ్ణి ప్రసాదిస్తాడని మహర్షి చెప్పి తనదారిన తాను పోయాడు. ఒకనాడామె మందాకినీ నదిలో స్నానం చేస్తూ ఉండగా ఆ మంత్రాన్ని పరీక్షించి చూడాలనుకుంది. వెంటనే మంత్రాన్ని పఠించి సూర్య భగవానుని స్మరించింది. సూర్యభగవానుడు ప్రత్యక్షమై "ఓ పృథా! నా అంశతో నీకో పుత్రుణ్ణి ప్రసాదిస్తున్నాను. అయితే నీ కన్యాత్వానికేమీ కళంకం రాదని" చెప్పి అంతర్ధానుడయ్యాడు. క్షణాల్లో ఆమెకు సూర్యుని తేజస్సుతో సమానమైన పుత్రుడు కలిగాడు. లోక మర్యాదకు భయపడిన పృథ ఆ పిల్లవాడిని గంగానదిలో వదిలి వేసింది. ఆ పిల్లవాడు ప్రవాహంలో కొట్టుకుపోయి ఓ సూతుడి వలలో చిక్కుకున్నాడు. సూతుడా శిశువును తీసుకొని పోయి భార్య అయిన రాధ చేతుల్లో పెట్టాడు. రాధచే పెంచబడ్డాడు కాబట్టి రాధేయుడు గాను, కన్యకు జన్మించాడు కాబట్టి గానీనుడిగాను పిలువ బడ్డాడు. అతడే కాలక్రమంలో కర్ణుడుగా విశ్వవిఖ్యాతి గాంచాడు. ఆ తర్వాత పృథ పాండురాజును వివాహమాడి కుంతి అన్న పేరుతో ప్రసిద్ధి చెందింది. అటుపిమ్మట మద్ర రాజ తనయ అయిన మాద్రిని కూడా వివాహమాడాడు. ధృతరాష్ట్రుని రాజుగా ఉంచి పరిపాలనంతా పాండురాజే నిర్వహిస్తూ వచ్చాడు. విదురుడు మంత్రిగా ఉంటూ ధర్మబద్ధమైన పాలనకు సహకరించాడు. పాండురాజుకు సంతానం కలుగకుండా ఉండేట్లు శాపం కలిగింది. దాంతో రాజ్య పరిపాలన యందు విముఖుడయ్యాడు. అప్పుడు కుంతి తనకు దుర్వాసమహర్షి ఉపదేశించిన మంత్రాన్ని గూర్చి తెలిపింది. దాంతో భర్త అనుజ్ఞ పొంది కుంతి మంత్రాన్ని జపించి ధర్మాలన్నింటికి ప్రభువైన యమధర్మరాజును స్మరించింది. ఆ ధర్మ దేవత ప్రత్యక్షమై సకల ధర్మాలు తెలిసిన పుత్రుణ్ణి పొందగలవని వరమిచ్చాడు. అతడే ధర్మరాజు. అటుపిమ్మట మరల మంత్రాన్ని జపించి వాయుదేవుని స్మరించింది. ఆ వాయుదేవుని వరప్రసాదం చేత భీముణ్ణి పుత్రుడుగా పొందింది.

మూడవ సారి త్రిలోకాధీశుడైన ఇంద్రుని ధ్యానించి అర్జునుని పుత్రుడుగా పొందింది. ఈ విధంగా ధర్మ భీమార్జునులు జన్మించిన తర్వాత మాద్రి కూడా ఆ మంత్రాన్ని జపించి అశ్వనీ దేవతల వలన నకుల సహదేవులను పొందింది. ఈ అయిదుగురు పాండవులుగా ప్రసిద్ధి చెందారు.

అంతకు ముందే గాంధారి గర్భవతి అయినా కూడా ఎంతకాలానికీ ప్రసవించ లేకపోయింది. అప్పటికే పాండురాజు పుత్రుల్ని కనడం వలన ఓర్వలేక అసూయతో గర్భాన్ని రెండు చేతులతో బాదుకుంది. దాంతో గర్భ విచ్ఛేదం అయి ఒక మాంస ఖండం బయట పడింది. అప్పుడా దారినే పోతున్న పరాశర మహర్షి ఆ పిండాన్ని పరీక్షించి, అందులో నూరుగురు పుత్రులు, ఒక పుత్రిక ఉన్నారని ఆపిండాన్ని సంరక్షించాల్సిన విధానాన్ని తెలిపి తన దారిన తాను పోయాడు. వారే దుర్యోధనాది నూరుగురు కుమారులు దుశ్శల అనే కుమార్తెగా ప్రసిద్ధి చెందారు.

ఏరోజున దుర్యోధనాదులుదయించారో ఆ క్షణానే శ్రీకృష్ణుడు తన కరుణా కటాక్షాలను పాండుపుత్రులపై ఉంచాడు. వారి పరిరక్షణ అంతా తన భుజాలపైన వేసుకున్నాడు. భగవత్కటాక్షం చేత వారి కొచ్చిన ఆపదలన్నీ కొండంతలైనా మంచువలె కరిగి పోయేవి. దుర్యోధనుడు భీముణ్ణి తన సహజ శత్రువుగా భావించేవాడు.

ధృతరాష్ట్రుని పుత్రులంతా కౌరవులుగాను, పాండు పుత్రులంతా పాండవులుగాను పిలువబడ్డారు. వారందరి విద్యాభ్యాసం ద్రోణాచార్యుని వద్ద జరిగింది. గురువైన ద్రోణుని ఆశీర్వాదం చేత అర్జునుడు విలు విద్యలో సాటి లేని మేటి అయ్యాడు. అంతట ధృతరాష్ట్రుడు పాండవులందరికీ కొంత రాజ్యాన్నిచ్చి కాశీనగరాన్ని రాజధానిగా చేసుకొని పాలించుకొమ్మన్నాడు. దుర్యోధనాదులు వారికక్కడ కష్టాలు కలిగించారు. పాండవులు వాటిని తట్టుకోలేక అడవులు పట్టి పోయారు. లోకులకు కష్టాలు కలిగించే రాక్షసుల్ని సంహరిస్తూ కాలక్రమంలో పాంచాల దేశం చేరుకున్నారు. అక్కడ ద్రౌపదీ స్వయంవరంలో పాల్గొని ద్రుపద రాజపుత్రిక ద్రౌపదిని గెల్చుకొన్నారు. కుంతీదేవి అనుమతి ప్రకారం అన్నదమ్ములైదుగురూ ద్రౌపదిని వివాహం చేసుకొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ధృతరాష్ట్రుడు ధర్మరాజును పిలిచి రాజ్యమిచ్చి గౌరవించాడు. క్రమంగా కృష్ణార్జునుల సఖ్యత, పాండవుల పరాక్రమం వృద్ధి చెందాయి.

రాక్షసాంశతో జన్మించిన రాజులంతా దుర్యోధనుని పక్షాన చేరారు. శ్రీకృష్ణుని అండదండల వలన యాదవులంతా పాండవ పక్షాన చేరారు. అట్లాగే పాంచాలురంతా కూడా పాండవ పక్షానే చేరారు. దుర్యోధనుడు గదా యుద్ధంలో భీముణ్ణి జయించగలనన్న ధీమాతో ఉండేవాడు. కర్ణుడు తన పక్షాన ఉండటం వలన అర్జునుని సునాయాసంగా జయించగలడన్న నమ్మకం పెంచుకున్నాడు. ఈ విధంగా ఎవరి బలానికి వారే పొంగిపోతూ యుద్ధానికి సన్నద్ధులయ్యారు. ఆయుద్ధంలో మరణించాల్సిన జీవులన్నీ ఇరుపక్షాల్లోను చేరారు. ఇదంతా కూడా భగవదవతార ఫలమే. ఇదంతా మహాభారత కథే అయినా భగవత్కథకు సంబంధం ఉండటం వలన ఈ మాత్రంగా వ్రాసి సరిపెట్టాల్సి వచ్చింది. అంతే గాని మహాభారతాన్నిక్కడ జొప్పించడం మా అభిమతం కాదు. ఇకపైన మనం బృందావనానికి పోయి శ్రీకృష్ణునని రాసక్రీడల్లో మిగిలిన భాగాలను పరిశీలిద్దాం. ఇవన్నీ బాలక్రీడలుగా అనిపించినా ముక్తి మార్గాన్ని చూపేవని మనం తెలుసుకోవాలి.

రామాయణంలో పిడకల వేట అన్నట్లు ఈ రాసక్రీడల్లో పాండవుల ప్రస్థావన ఎందుకని మీరడుగవచ్చు. మనం శ్రీకృష్ణ చరిత్రనే గదా చర్చించుకుంటున్నాం. ఆయన అవతార ఫలం పాండవుల చరిత్రతో ఎంతో ముడి పడి ఉందని అందరికీ తెలిసిందే. అందువల్ల ఏదో కొద్దిపాటి విషయ వ్యావర్తనాన్ని దృష్టిలో ఉంచుకొని పాండవుల చరిత్ర టూకీగా చెప్పడం జరిగింది.

గోపికా గీత :

భగవంతుని లోకవ్యవహారాల ప్రవృత్తిని వ్రాయరాదు. కాబట్టి ఇక్కడ గోపికల ధ్యానాన్ని గూర్చి ప్రస్తావించుకుందాం. గోపికలానాటి రాత్రి శ్రీకృష్ణుడు కనిపించక పోవడంతో అందరూ ఒకచోట చేరారు. శ్రీకృష్ణుడు మనల్ని మోసం చేశాడని తీర్మానించుకున్నారు. మనవల్ల ఏదైనా అపరాధం ఉంటే చెప్పాలేగాని ఇట్లా మోసం చెయ్యవచ్చునా? అంటూ నిష్ఠూరాలాడారు. స్త్రీలకు నిష్ఠురాలాడటం వారి స్వభావమే గదా. అయితే ఇక్కడ గోపికల హృదయ వేదనలో ఎన్నో అంతరార్థాలున్నాయి. వాటిని పరిశీలిద్దాం.

1. ప్రాణేశా! నువ్వీ గోకులంలో జన్మించడం వల్ల అనామకులమైన మాకో గుర్తింపు లభించింది. నువ్వు మాతో ఉన్న కారణంగా లక్ష్మీదేవి కూడా ఇక్కడే నివాస మేర్పరచుకుంది. మేమంతా నీపై ప్రాణాలు నిలుపుకొని బ్రతుకుతున్నాం. కావున వెంటనే మాముందుకు వచ్చి నిలు.

విశేషార్థం: సురతనాథా! నువ్వు ఆత్మస్వరూపుడవు. నువ్వీ భూలోకంలో అవతరించడం చేత భూమాత ధన్య అయింది. నీకారణంగా భూలోకం కన్నా ఉత్కృష్టమైన లోకం ఎన్ని బ్రహ్మాండాలు వెదికినా కనిపించదు. ప్రకృతి పురుషులైన మిమ్మల్ని నమ్ముకొని మా ప్రాణాలన్నీ నీయందే నిలుపుకున్నాం. మా భక్తిని స్వీకరించి మాయెదుట సాక్షాత్కరించు. మేము నిన్ను తెలుసుకోగలమన్న అహంకారంతో వనాలన్నీ తిరిగి తిరిగి వేసారిపోయాం. మా అహంకారం అంతా నశించింది. మాయందు కరుణ చూపి మమ్మల్ని ఉద్ధరించు.

2. సురతనాథా! సుష్ఠురత అంటే ధృఢమైన అనురాగం అని భావం. అనగా కరుణానిధి అని సారము. వరదా! నువ్వు కోరికలన్నీ తీర్చేవాడవు. మేమంతా కోరేది నిన్ను ప్రత్యక్షం కమ్మనే. న్యాయమైన మా కోరికను మన్నించు. దీనులమైన మమ్మల్ని బాధించడం న్యాయమా? నువ్వు వరదుడవు. అనగా కోరిన కోరికలన్నీ తీర్చేవాడవు. అటువంటి నువ్వు మమ్మల్ని బాధించడం నీ స్వభావానికి విరుద్ధం కాదా? ఇట్లా బాధించడం కన్నా మా ప్రాణాల్నే హరించరాదా? అంటూ దీనాతిదీనంగా ప్రార్థించారు. ఈ ఘట్టంలో మహాకవి పోతనగారి పద్యాన్ని తిలకించండి.

క॥ శారద కమలోదర రుచి । చోరకమగు చూపువలన సుందర మిమ్మున్
గోరి వెల యీని దాసుల । ధీరత నొప్పించుటిది వధించుట గాదే

3. మహానుభావా! నువ్వు మమ్మల్ని కాపాడిన సందర్భాలు ఒకటా రెండా? ఎన్నని చెప్పం? కాళీయుణ్ణి ఆ మడుగులోనుండి వెళ్ళగొట్టి అమృతం వంటి యమునా జలాన్ని మాకు, గోవులకు ప్రసాదించావు. ఇంద్రుడికి కోపం వచ్చి కుండపోతగా వర్షం కురిపిస్తే గోవర్ధన పర్వతాన్నే చిటికిన

వ్రేలుపై నిలిపి మా అందరికీ ఆశ్రయం కల్పించావు. అఘాసురుడి వంటి అనేక మంది రాక్షసుల బారి నుండి మమ్మల్ని కాపాడావు. ఇందువలన మా బాధలు తొలిగాయి. కాని నీవేణుగానం అటువంటిది కాదు. భయంకరమైన సంసార తాపంతో తపించి పోతున్న మాకు మహోపకారం చేసింది. నిజానికిదే నువ్వు మాకు చేసిన మహోపకారం. భర్తను, పిల్లల్ని, బంధువుల్ని ఎక్కడి వాళ్ళను అక్కడే వదలివేసి నీ పాదాలవద్దకు పరుగు పరుగున వచ్చాం. నీకు శరణాగతులమయ్యాం. మా అందరికీ రసానుభవం కల్గిస్తానని మాట ఇచ్చావు. మేమంతా మోహితులమై ఉండగా, అదృశ్యుడవయ్యావు. ఇంతకూ మేం చేసిన అపరాధం ఏమిటి? నీ యెడబాటు మాకు భయంకరమైన నరకం కన్నా ఎక్కువ అని నీవు ఎరుగవా? ఎందుకు మమ్మల్నందర్నీ ఈ విధంగా మోసం చేశావు? మమ్మల్ని ఇట్లా బాధించడం కన్నా మాప్రాణాలనే హరించుకు పోరాదా? నీ వియోగాన్ని భరించలేకుండా ఉన్నాం. కావున, కరుణించి మాకు దర్శనం ఇవ్వు. మమ్మల్ని ఉద్ధరించు అన్నదే గోపికల దీనాలాపమని మనం గ్రహించాలి.

4. సఖుడా! నువ్వు మా యశోదమ్మ కుమారుడవు కాదు. భూతాలన్నింటిలోనూ సాక్షీభూతుడుగా ఉండే పరమాత్ముడవు. బ్రహ్మ మొర ఆలకించి భూలోకంలో ధర్మరక్షణకై అవతరించావు. నందుడి ఇంట జన్మించి యాదవ కులాన్నే పవిత్రం చేశావు. సాక్షాత్తూ భగవంతుడివే.

విశేషార్థం: సఖుడా! అనగా కష్టాలను తొలగించే వాడా! సుఖాలనిచ్చేవాడా! అని అర్థం. నువ్వు నందుని కుమారుడవు కావు. సర్వ కారణాలకు కారణ భూతుడవు. సర్వ సాక్షివి. పరాత్పరుడవు. బ్రహ్మ కోరిక పైన ఈ భూలోకాన అవతరించావు. ఓ పరమ పురుషా! వృష్ణి వంశరక్షణ భారాన్ని స్వీకరించావు. సంసార సాగరం నుండి బయట పడాలని నీ పాదాలను ఆశ్రయించాము. లక్ష్మీదేవిని చేపట్టిన నీ పరమ పవిత్ర మైన హస్తాన్ని మా శిరస్సు పై ఉంచు. ఈ ఘట్టాన్ని పోతన గారు ఎలా పోషించారో చూడండి.

ఆ॥ *చరణ సేవకులకు సంసార భయమును । బాపి శ్రీకరంబు పట్టు గలిగి*
కామదాయి యైన కరసరోవరంబు మా । మస్తకముల నునిచి మనుపు మీశ!

5. వ్రజ జనార్తి హరా! మహాత్మా! వీర శేఖరా! దుర్మార్గుల మదాన్ని నీ చిరునవ్వుతో అణచిన భగవంతుడవు. సఖుడా నీకింకరులము. మమ్మల్ని కరుణించు. స్త్రీలమైన మమ్మల్ని నీ అక్కున జేర్చుకో.

శ్లో॥ *వ్రజ జనార్తిహన్ వీరయోషితాం నిజజనస్మయధ్వంసనస్మిత*
భజ సఖే భవత్కింకరీః స్మ నో జలరుహాననం చారు దర్శయ.

అని మూలం.

"భవ త్కింకరీః నః అస్మాక భజ ఆశ్రయ" అని వ్యాఖ్య. ఆశ్రయించడం అంటే భక్తుల ననుసరించి ఉండటమే భగవల్లక్షణం. ఈ వాక్యానికి పోతనగారు,

క॥ *మగువల యెడ నీ క్రౌర్యము । దగునే నిజ భక్త భీతి దమనుఁడ వకటా*
తగదు భవద్దాసులకును । నగుమొగముం జూపి కావు నళిన దళాక్ష.

అని వ్రాశారు. ఈ పద్యంలో కూడా మమ్మల్ని ఉద్ధరించమన్న విన్నపమే ధ్వనిస్తుంది. అంతేకాని మమ్మల్ని రతి కేళులలో ముంచెత్తమని కోరుకోలేదు.

విశేషార్థం : యాదవుల కష్టాలు తొలగించే వాడవు అనగా యాదవుల కష్టాలు తొలగించేందుకే అవతరించావు. ఓ వీరుడా! ఆ కష్టాల్ని తొలగించడం నీ కేమీ కష్టమైన పని కాదు. నువ్వు వీరుడవు కాబట్టి శత్రువుల వలన కలిగే కష్టాలన్నీ తొలగించగలవు. స్వజనులమంటే, నీతో కలసి భూలోకాన అవతరించిన గోలోక వాసులం. మా కష్టాలను తొలగించు. అనగా భూలోక వాసమే ఒక కష్టమని భావసారం. ఈ కష్టాలన్నీ కూడా నువ్వు ఒక చిరునవ్వుతో జయిస్తావు. అటువంటి శ్రీకృష్ణుణ్ణి సఖుడా అని సంబోధించడం చేత కష్టాల్ని తొలగించి సుఖాల్ని కల్పించేవాడవని అర్థం. మేము నిన్ను ఎట్లా ఆశ్రయించామో నువ్వు కూడా అట్లాగే మమ్మల్ని ఆశ్రయించు. ఎందువల్ల నంటే, భక్తుల నాశ్రయించడం నీకేమి క్రొత్త కాదు గదా. కావున ముగ్ధమనోహరమైన నీ చిరునవ్వులతో దర్శనమివ్వు. అనగా మాకు దర్శనమిచ్చి మమ్మల్ని ఉద్ధరించు అని.

6. భక్తుల పాపాలన్నింటినీ పోగొట్టే వాడవన్న ఖ్యాతి నీకుంది. శ్రీనిలయమైనది, కాళీయ నాగరాజము యొక్క శిరస్సుపై ఉంచినట్టిది, గోవులను వనాలకు తోలుకుపోయే నీ పాదాన్ని మా వక్షోజములపై ఉంచు. మాకామ తాపాన్ని చల్లార్చు.

విశేషార్థం : పాపనాశకము, ప్రఖ్యాతము, సంపదాలవాలము, కాళీయ పడగయందుంచినదియు అయిన ఈ విశేషణాలన్నీ శ్రీహరి పాదారవిందాల గూర్చి చెప్పబడ్డాయి. అట్టి నీ పాదాల్ని మా స్తనాలపై ఉంచి మా కామాన్ని నశింప చేయమని కోరుకున్నారు. అయితే గోపికలెవ్వరూ కామ పరతంత్రులు కారు. పోనీ శ్రీకృష్ణుని ముగ్ధమోహన అందానికే దాసులయి పొందు కోరారు అన్న అర్థము స్ఫురిస్తోందా? నిజంగా గోపికలకు ఉన్నట్లయితే, ఓ కృష్ణా! కాళీయుడంతటి పాపాత్ముణ్ణి ఉద్ధరించిన నీ పాదాలను మా కుచములపై ఉంచు. ఇందులో కామ పరమైన మాట ఒక్కటి కూడా లేదు. ఈ వాక్యం ద్వారా భగవంతునికి భక్త రక్షణే ప్రధానమని తెలుస్తోంది. తమకు రక్షణ కలిగించ గలిగేది భగవత్పాదమేనని గోపికల భావం.

7. పుండరీకాయత లోచనా! మనోహరమైన మధుర వాక్కులతో పండితుల్ని రంజింప చేస్తావు. నీయందే మనస్సు నిలిపి ధ్యానం చేసే నీ దాసీలమైన మమ్ము నీ అధరామృతం చేత సంతృప్తుల్ని చెయ్యి.

విశేషార్థం : "అధరశీధునా ప్యాయయస్వనః" అని మూలం. కొందరీ శ్లోకానికి గోపికలు కామపరతంత్రులై శ్రీకృష్ణుని కోసం వెదికారన్న అర్థాన్ని చెప్పారు. పూర్వాపరాలను పరిశీలించినప్పుడు వీరి వ్యాఖ్య సరికాదని తెలుస్తుంది. "బుధజ్ఞానయా" అని ఉన్నది. బుధులంటే పండితులైన జ్ఞానులు. జ్ఞానులెప్పుడూ మోహితులు కారు. కావున పై భావాన్ని స్వీకరించలేము. ముహ్యధీః = ఇట్టి వాక్కుచే నిరోధించబడ్డాం. అటువంటి నీ అధరములచేత మా తాపాన్ని తీర్చు. ఎల్లవేళలా నిన్నే ధ్యానించు మమ్మల్నందర్నీ నీ అధరామృతముతో సంతృప్తిపరచు. అనగా, మధురము, అమృతతుల్యమైన నీ మాటలతో మా తాపాన్ని అణచుమా అని భావం. సద్గురూపదేశం అనే అమృత ధారలచేత మా

హృదయతాపాన్ని తొలగించమన్నదే సారం. ఉపనిషదర్థాలే జ్ఞానులకు సంతోషాన్ని కలిగిస్తాయి. అట్టి జ్ఞాన ధారలతో మా సంసార తాపాన్ని తొలగించమని భావం. ఇదే సజ్జనులు గ్రహించాల్సిన తీరు. విపరీతార్థాలు చెప్పి భక్తులను పెడత్రోవన పెట్టరాదు. దీని తర్వాత శ్లోకం చదివితే ఈ భావమే మరింత స్పష్టమవుతుంది.

8. గోలోకనాథా! సంసార తాపత్రయాల్లోన మునిగి పోయిన వారికి నీ కథామృతాన్ని పఠించడం కన్నా శ్రవణమే శ్రేష్టమని శ్రవణం కన్నా నీ దర్శనమే సర్వోత్కృష్టమని, సర్వ పాపాలను పోగొట్టేదని, నీ కథామృతాన్ని ఆస్వాదించడమే చెవులకు సార్ధకం. ఇటువంటి నీ కధాసుధను తృప్తిగా కీర్తించేవారే ఈ లోకంలో పుణ్యాత్ములు ఇంతకన్నా పుణ్యకార్యం లేదు. ఈ ఘట్టాన్నే పోతనగారు ఇలా వ్రాశారు.

మ॥ ఘన లక్ష్మీయుతమై వినన్ శుభదమై కామాది విధ్వంసియై
సనకాది స్తుత మై నిరంతర తపస్సంతప్త పున్నాగజీ
వనమై యెప్పుడు నీ కథామృతము త్రావంగల్గనే భూరిదా
న, నిరూఢత్వము లేనివారలకు మా నారీమనోహారకా

అని వ్రాశారు.

విశేషార్థం:

శ్లో॥ తవ కథామృతం తప్త జీవనం కవిభిరీడితం కల్మషాపహం
శ్రవణ మంగళం శ్రీమదాతథం భువి గృణందియే భూరిదా జనాః

అని మూలం. ఈ శ్లోకాన్ని చక్కగా పఠించినట్లైతే కామా పరతంత్రత లేశమంతైనా కనబడదు. గోపికల భక్తి పరతంత్రతే అడుగడుగునా కనిపిస్తుంది. కల్మషావహమ్ = కామాతురతతో తహతహలాడే నారీమణులైతే వారి నోటి వెంట ఈ మాట వెలువడుతుందా? భగవంతుణ్ణే కోరుకోవడం కాబట్టి అందులో దోషం లేదు. అంతేకాదు వ్యాఖ్యాతలు "కవిభిరీడితమ్" అన్న పదానికి "బ్రహ్మ విద్భిరీడితం స్తుతం" అని వ్యాఖ్యానించారు. కావున ఈ ఘట్టంలో గోపికలేవిధంగా ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని ధ్యానించారో మనం గూడా అదే విధంగా ధ్యానించి కృతార్థులమవుదాం.

9. ప్రీతి పాత్రుడా! ఓ గోపాల బాలకా! నీ మహిమలు తెలుసుకోవడం ఎవరితరం కాదు. ఓ భగవంతుడా! నీ చిరుమందహాసం సంతోషాన్ని కలిగిస్తుంది. నీ ప్రేమ అనిర్వచనీయం. సర్వమంగళమైన నీ ధ్యానం మనస్సుకు అపరిమితానందాన్ని కలిగిస్తుంది. నీ సంకేతాలు మా మనసుల్ని కేరింతలు కొట్టిస్తున్నాయి.

విశేషార్థం: ఓ కపట వర్తనుడా! నీ తత్త్వం ఎవరికీ అర్థం కాకుండా ఉండేట్లు ప్రవర్తిస్తున్నా వెందుకు? నీ సంగతి మాకు తెలియదనుకొంటున్నావా? మాదగ్గర నీ ఆటలు సాగనివ్వం. ఎట్లాగంటావా? మేమంతా గోలోకం లోని రాసమండలంలో నీతో విహరించిన వాళ్ళమే. కావున నీ పాదారవింద సేవలచే నీ తత్త్వాన్నంతా బాగా ఎరిగిన వాళ్ళమే. మేం నీనుండి కోరుకునే దల్లా, నువ్వెప్పుడు కనిపించినా నీ కటాక్షవీక్షణములచే మమ్మల్ని అనుగ్రహిస్తూ ఉండు. చిరునవ్వులు చిందించే

నీ ముఖారవిందం మాకు కావాలి. ముక్తి కాదు. నీ రహస్య చరితాన్ని మామనసులు స్మరించ గలిగేట్లు చెయ్యి. మా అందరి మనస్సులు నీ దర్శన భాగ్యం కోసం త్వరపడుతున్నాయి అన్నదే సారం.

10. మనోహరుడా! నీ పాదాలు నళిన సుందరములైనవి. నువ్వు గోవుల్ని తోలుకు పోయేటప్పుడు వరి పొలాల్లోని వరి వెన్నులు, రాయి రప్పా నీ చిరు పాదాల్ని ఎక్కడ నొప్పిస్తాయో? అని విలవిల లాడి పోయే వాళ్ళం. నీ కోసం అంతగా బాధపడే మమ్మల్ని ఇట్లా బాధ పెట్టడం నీ కేమైనా బావుందా? ఇప్పటికైనా మాకు నీ దర్శన భాగ్యాన్ని కలిగించు.

విశేషార్థం: “శిల తృణాంకురైః” అని మూలం. శిల అన్న శబ్దం ఇక్కడ నపుంసక లింగం. అయితే ఇక్కడ శిల అన్నది శబ్దం కాదు. వరి కోసిన తర్వాత క్రింద పడిపోయిన వెన్నులు అన్న అర్థాన్ని గ్రహించాలి. శిలోంఛవృత్తులన్న చోట, వరివెన్నుల నుండి రాలిన వరిధాన్యాన్ని ఏరుకొని జీవనం చేయటం అని అర్థం. అంతేకాని పాషాణాలను ఏరుకొని జీవించమడమని కాదు. ఈ ఘట్టాన్ని తెనిగిస్తూ మహాకవి పోతన,

ఆ॥ ఘోషభూమి వెడలి గోవుల మేపంగ । నీరజాభమైన నీ పదములు
గనవు శిలల దాఁకి కడునొచ్చునోయని । కలఁగు మామనములు కమల నయన

అని వ్రాశారు. శిలలు పాషాణాలనే వారి భావం. శిలతృణాంకురైః అన్నప్పుడు “శిలైః కణికై” అని వ్యాఖ్యాతలు ఎందువల్ల వ్రాశారో. మహాకవి ఎందువల్ల ఈ విధంగా వ్రాశారా! అన్న సందేహం కలుగవచ్చు. అనగా వారికి లభించిన పుస్తకంలో ఆ పాఠ్యభేదముండవచ్చు. అదే యథార్థమైతే దాని ప్రక్కనున్న తృణ శబ్దం రసప్రదం కాదు. తృణము గుచ్చుకొని బాధిస్తాయని సంశయిస్తూ ఉండగా, దాన్ని పాషాణంగా భావించుకోవడం సందర్భోచితంగా ఉండదు.

11. వీరుడా! నువ్వు గోవుల్ని తోలుకొని ఇంటికి వస్తుంటే నల్లని నీ వెంట్రుకలు, ముఖం గోధూళితో నిండి మాకు ఎర్రగా కనిపిస్తూ ఉండే వాడివి. అటువంటి నీ ముఖారవిందాన్ని దర్శించాలని సాయంకాలాలు ఎదురుచూస్తూ నిలబడేవాళ్ళం. మాకందరికీ నీ పాత జ్ఞాపకాలను గుర్తు చేసే వాడవు.

విశేషార్థం: స్మరం యచ్ఛసి అన్న మూలానికి కేవలం స్మరం యచ్ఛసి అర్పయపి నతు సుఖం దదాపి కపట ఇతి భావః” అని వ్యాఖ్య. ఈ వ్యాఖ్య మూలంగా గోపికలు కామాతురలే అని కొందరి వాదం. అది పొరపాటు. ఎందువల్లనంటే ‘వీర’ అన్న సంబోధనే నువ్వు లోకైక శూరుడని అర్థం చెప్తోంది. అటువంటి నీవు గోవుల్ని మేపుకుంటూ అడవులన్నీ తిరిగి తిరిగి సాయంత్రానికి ఇంటికి చేరుకుంటావు. మా గోధూళి అంతా నీ నల్లని వెంట్రుకలకు పట్టి ఎర్రగా మారేవి. ఎర్రబడిన ముఖంతోనీవు తిరిగి రావడం చూస్తూ ఉంటే మాకు నీ గోలోక వృత్తాంతాన్ని గుర్తు చేసేది. “స్మరం యచ్ఛాసి” అనగా స్మృతి అని అర్థం చెప్పవచ్చునా అంటే చెప్పవచ్చనే చెప్పాలి. అట్లాకాని పక్షంలో వీరా! అన్న ప్రయోగానికి అర్థమే ఉండదు.

12. ఆధిహరుడా! (మానసిక రోగాలన్నీ పోగొట్టేవాడా) రమణా!(ప్రీతిని కలిగించేవాడా) నీకు నమస్కరించిన వారందరి కోరికలు తీరుస్తావు. బ్రహ్మదేవుని చే పూజించబడే వాడవు. భూలోకానికే అలంకార ప్రాయమైన వాడవు. ఆపద సమయాల్లో నిన్ను తలచినంత మాత్రానే సుఖాలు కలిగిస్తావు. అటువంటి పురుషోత్తముడవైన నీ పాదారవిందాలను మా వక్షోజాలపై ఉంచు. ఈ ఘట్టంలో మహాకవి పోతన గారు,

ఆ॥ భక్త కామదంబు బ్రహ్మసేవిత మిలా । మండనంబు దుఃఖ మర్ధనంబు
భద్రకరమునైన భవదంఘ్రి యుగము మా । యురములందు రమణ యునుప దగదె.

అని వ్రాసి తన భక్తిని వ్యక్త పరిచారు. దీన్ని బట్టి పోతనామాత్యులు ఎంతటి భక్తులో ఎంతటి భావజ్ఞుడో మనకర్థం అవుతుంది.

13. ఓ శూరుడా! నీ వేణునాదంతో సర్వజనుల హృదయాల్ని ఆనందింప జేస్తావు. నువ్వు వేణువును పెదవుల మధ్య పెట్టుకుంటే చాలు, లోకంలో ఉండే శోకమంతా మాయమై పోతుంది. దుఃఖాలన్నీ మరిపించే అనిర్వచనీయమైన ఆనందాన్నిచ్చే నీ అధరామృతాన్ని మాకు ప్రసాదించు.

విశేషార్థం: ఇక్కడ కూడా గోపికలు కామాసక్తులయ్యారని కొందరంటారు.

శ్లో॥ సురతవర్ధనం శోకనాశనం స్వరిత వేణునా సుష్ఠు చుంబితం
ఇతర రాగ విస్మారణం నృణాం వితర వీర నస్తేఽధరామృతం.

అని మూలం. సురతవర్ధనం అంటే, సురతచ్ఛేదకమని భావం. అనగా శోకనాశనమన్న విశేషార్థమే ఇక్కడ గ్రహించాలి. ఇతర రాగవిస్మారణమ్" అనగా నీయందలి అనురాగం వలన ఇతర దేవతలెవ్వరినీ స్మరించలేకున్నాం. ఇందుమూలంగా గోపికల అనన్య భక్తినే చాటుతోంది. అంతే గాని కామపరమైన అర్థం ఎంత వెదికినా కనిపించదు.

14. ఓ కృష్ణా! పగలంతా నువ్వు అడవులకు పోతావు. మళ్ళీ సాయంత్రానికి గానీ రావు. నువ్వు వచ్చేవరకు మాకు క్షణమో యుగంగా గడుస్తుంది. నుదుటిపై పడే నీ ముంగురులు నీ ముఖానికే క్రొత్త అందాల్ని తెచ్చి పెడుతాయి. అటువంటి నీ మోహన రూపాన్ని చూస్తూ మాకళ్ళపై రెప్పలు పడటం లేదు.

విశేషార్థం: దీనివల్ల మనకర్థమయ్యేదేమంటే గోపికలంతా శ్రీకృష్ణుని నిరంతర దర్శనాన్నే కోరుకుంటున్నారు. "తీక్ష్ణసూచ్యాబ్జ పత్రస్య దళవేధస్త్రుటిర్భవేత్" అన్న సిద్ధాంతం ప్రకారం తామరపువ్వు లోని మెత్తటి దళాలకు సన్నని సూదితో రంధ్రాలు చేసినంత కాలమని అర్థం. అనగా అత్యల్ప కాలమని భావం. ఇటువంటి మాకు కనురెప్పలు లేకుండా ఉంటేనే బాగుంటుందన్నదే భావసారం.

15. ఓ అచ్యుతా! భర్తను, పుత్రుల్ని, బంధువుల్ని సోదరుల్ని వదలి నీ వేణునాదం వినగానే వచ్చి నీముందు వాలాం. మా ఒళ్ళు మేమే మరచిపోయాం. నువ్వు తప్ప మాకు వేరే గతి లేదని నమ్మివచ్చాం. ఓ శూరుడా! ఎవరైనా రాత్రి సమయంలో వచ్చిన స్త్రీలను ఇళ్ళకు పొండని అంటారా? ఆలోచించు.

విశేషార్థం: కొందరు ఈ మాట పట్టుకొని గోపికల మోహాన్నే తేటపరుస్తోందంటారు. అది సరైన మాట కాదు. గోపికలంతా భగవద్దాస్యాన్నే కోరుకుంటున్నారనే చెప్పాలి. ఈ అర్థాన్ని ఎలా చెప్తావని అడిగే వాళ్ళుంటారు.

శ్లో॥ *పతిసుతాన్వయ భ్రాతృ బాంధవా నతి విలంఘ్య తే హ్యచ్యుతా గతాః*
గతినిద స్తవోద్గీత మోహితాః కితవ యోషితః కస్త్యజే న్నిశి

అని మూలం. అచ్యుతా!అన్న పదాన్ని చూడండి, చ్యుతి అంటే నాశనం లేనిదని అర్థం. అందువల్లనే నువ్వు అచ్యుతుడవు. అనగా పరమాత్మవు. ఓ పరమాత్మా! బంధువలందర్నీ వదలి "అతివిలంఘ్య" చక్కగా వదలి అని భావసారం. ఉద్గీతామోహితాః = ఉద్గీత మంటే ఉపనిషత్తని అర్థం. ఉపనిషద్భావం చేత ఒళ్ళు తెలియని వారమై అని అర్థం. తలి విదః = మాకు నువ్వే గతి అని తెలుసుకున్నాం. నీ పాదాలవద్దకు వచ్చి వాలాం. నిశిః = అజ్ఞానాంధకారంతో కూడుకున్న ఈ లోకంలో "యోషితః = ధైర్యం లేని వారమై. అటువంటి మమ్మల్ని వదిలేస్తే నిన్ను కుత్సితుడంటారు. ఘాతకుడంటారు. అనగా సాధువులు నిందిస్తారని భావం. అందువల్ల మాకు ముక్తిని ప్రసాదించమని గోపికలు ప్రార్థించారు.

16. ఓ శ్రీహరి! నీ రహస్య సంకేతాలు కోరికల్ని రేకెత్తించే నీచిరునవ్వులు, కళ్ళల్లోకి చూస్తూ ఒలకబోసే వాడి చూపులు, సర్వ మంగళాలకు నిలయమైన నీ వక్షఃస్థలాన్ని చూస్తున్న కొద్దీ మా మనస్సులు స్వాధీనం తప్పుతున్నాయి. కోరికలు గుర్రాలై పరుగులు తీస్తున్నాయి. గోకులంలో నువ్వు కాలుపెట్టగానే మా దుఃఖాలన్నీ పటాపంచలయ్యాయి. ఆపైన మాకు అన్నీ మంగళాలే. ఇవన్నీ ప్రత్యక్షంగా చూసిన తర్వాతనే మనస్సులన్నీ నీపైన పారేసుకున్నాం. ఆ విధమైన మనోవ్యాధితో బాధ పడుతున్న మేమంతా నీయెడల శరణాగతులమయ్యాం. అటువంటి మనోవ్యాధితో బాధపడే మాకందరికీ కరుణతో కూడిన వీక్షణమే సరిఅయిన మందు. అనగా మా మనోవ్యాధి అంతా ఈ గోకులంనుండి ఎప్పుడు గోలోకానికి పోతామా! అనేదే మా ఆరాటం. ఎప్పుడైతే నీ కృపాకటాక్షవీక్షణం మాపై ప్రసరిస్తుందో ఆక్షణానే మేము బ్రహ్మానందాన్ని ఆస్వాదించ గలుగుతాం. ఓ ప్రియమిత్రుడా! మా మీద దయ తలచి మృదువైన నీ పాదాన్ని మా వక్షః స్థలంపై ఉంచు. మా వక్షః స్థలాలన్నీ కఠినాతి కఠినంగా ఉంటాయి కాబట్టి నవనీతం లాంటి నీ సున్నితమైన పాదాలకు నొప్పి కలుగుతుందేమో నన్న బాధ మాకు లేకపోలేదు. అయినా నువ్వు గోవుల్ని తోడుకొని అరణ్యాలకుపోవడం లేదా? ఆదారిలో మాత్రం రాయి రప్పా గుచ్చుకొని నీ పాదాలు కందిపోవడం లేదా? మా వక్షఃస్థలాలు ఎంత కఠినంగా ఉన్నా అడవుల్లో నువ్వు తిరిగే ప్రదేశాలకన్నా కఠినంగా ఉండవులే. భయపడకు అంటూ వారంతా శ్రీకృష్ణునిపై ఉండే ప్రేమ చేత పరవశులయ్యారు.

ఇంతవరకు మనం గోపికా గీతాల్ని గూర్చి తెలుసుకున్నాం. అందులో ఇమిడి ఉండే విశేషార్థాల్ని గూర్చి విచారణ చేద్దాం. వేలాది గోపికలు ఒక పురుషుడి కోసం వనాలన్నీ వెదికారు. అతడి కోసం ఆరాట పడ్డారు. ఇదంతా లోకవిరుద్ధంగా అనిపించవచ్చు. కానీ భగవద్విషయాల్లో దోషాలు ఎన్నడమంటే పాపం మూట కట్టుకొన్నట్లవుతుంది. అయితే వీటిలో ఏవో విశేషార్థాలు ఉండి ఉంటాయి. మనం వాటిని వెతికి చూద్దాం.

శ్రీకృష్ణ పరమాత్మ ఉన్నట్టుండి అదృశ్య మయ్యాడు. గోపికలంతా కలసి వారి మనోభావాల్ని గుంపుగా వ్యక్తం చేశారు. వీటినే గోపికా గీతాలంటారు. వారొక చోట పరమాత్మా! అని సంబోధించారు. మరొక చోట లోకనాయకా అంటారు. దీన్ని బట్టి వాళ్ళల్లో కాముకత్వం ఉన్నదని చెప్పలేం. శ్రీకృష్ణునిపై వారికుండే అపారమైన భక్తి ప్రేమ మాత్రమే కనిపిస్తాయి. వీరంతా గోలోకవాసులేనని వీరి నాయిక రాధాదేవియే నని స్పష్టమవుతోంది. ఓ శ్రీహరీ నీపాదాన్ని మా వక్షస్థలంపై ఉంచమని ప్రార్థిస్తారు. భక్తి భావంతోనే వారలా ప్రార్థించారు. భగవద్విషయాల్లో పెడర్థాలు చెప్పడం గాని, అసూయ చెందడం గాని సాధులక్షణం అనిపించుకోదు. వేలాది స్త్రీలతో ఒకే పురుషుడు ఒకే సమయంలో క్రీడించాడంటే అతడి అమానుషశక్తి ని, భగవత్తత్త్వాన్నే వెల్లడి చేస్తాయి.

గోపికలంతా తల్లి దండ్రులకు చెప్పలేదు. భర్తల అనుమతి తీసుకోలేదు. లోకాపవాదానికి వెరువలేదు. రాత్రి వేళ అని భీతి చెందలేదు. గోపికలంతా ఒంటరిగానే వెళ్ళారు. గుంపులుగా వెళ్తున్నా ఒకరినొకరు గుర్తించుకోనేలేదు. వారికంతా కృష్ణమయంగానే కనిపించింది. అంతేకాదు వాళ్ళని భర్తగాని, తల్లిదండ్రులు గాని అడ్డుచెప్పలేదు. తోడు సాయం వస్తామనలేదు. ఎందుకంటే వాళ్ళందర్లోనూ భగవత్కళ ప్రవేశించింది. భగవంతుడు భక్త పరాధీనుడు గదా. అతడి దివ్య చరితం అత్యద్భుతం. అటువంటి పరాత్పరుడికి అసాధ్యం అంటూ ఉంటుందా? వాళ్ళంతా గోలోకవాసులే. తన వేణుగానంతో మోహితుల్ని చేసి ఆకర్షించాడు. ఆ వేణునాదానికి ఉండే శక్తి మరే గానానికీ ఉండదు. అందువల్లనే ఆ నాదబ్రహ్మము పరమేశ్వరుడొక్కడికే చెల్లింది. ఆ గానం చెవిని పడగానే గోపికలంతా పరవశించి పరుగెత్తారు. ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని దర్శించి తన్మయులయ్యారు. భగవంతుడు వారిభక్తి ని పరీక్షించాలనుకున్నాడు. ఆయన వేసిన ప్రశ్నలన్నీ లోకాచారానికి లోబడే ప్రశ్నించాడు. వాళ్ళుకూడా నదురూ బెదురూ లేకుండా సమాధానాలు చెప్పారు. ఆ తర్వాత వాళ్ళంతా భగవంతుడితో సరస సల్లాపాలాడారు. ఆడారు, పాడారు. అనేక విధాలుగా క్రీడించారు. వారి ఆనందం పరాకాష్ఠ చెందే సమయానికి అదృశ్యుడయ్యాడు. ఆ వియోగంతో వారి దుఃఖం కట్టలు తెంచుకుంది. ప్రేమావేశం పొంగి పొర్లింది. అవే గోపికాగీతాలుగా వెలువడ్డాయి.

శ్రీకృష్ణుడు ప్రత్యక్షమగుట

(ఈ ఘట్టం శ్రీ భాగవతం దశమ స్కంధం 32వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు గోపికల భక్తిని పరీక్షించాలనుకొని అదృశ్యుడయ్యాడు. అయినా గోపికలు ఇళ్ళకు పోలేదు. రాత్రంతా అక్కడే జాగారం చేశారు. భక్తి శ్రద్ధలుట్టి పడేట్లు ప్రార్థించారు. నిష్ఠురాలాడారు. ప్రాణ త్యాగమైనా చేసుకుంటాం గానీ, నిన్ను విడిచిపెట్టి పోమన్నారు. నిన్ను వెతికి పట్టుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. విసిగి వేసారి పోయి "నువ్వు భక్త పరాధీనుడవు గదా. ఈ విధంగా మమ్మల్ని బాధించడం నీకు న్యాయమా"? అని నిలదీశారు.

శ్రీకృష్ణుడు లోకానికి గురుశిష్య సంబంధాన్ని బోధించాలనుకున్నాడు. గోపికలకు ఈ పరీక్ష పెట్టి తద్వారా లోకానికా సదాచారాన్ని నేర్పాలన్నదే భగవదాశయం. అయితే గోపికల అనన్య భక్తి

పొంగిపొర్లింది. భగవంతుడు ఇక నిలువలేక పోయి వారిముందు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడా శ్రీకృష్ణుని దర్శించిన వారి జన్మ ధన్యం. ముఖాన చిరునవ్వులు చిందాయి. పట్టు పీతాంబరాలు ధరించాడు. మెడనిండా పుష్పహారాలు వ్రేలాడుతున్నాయి. ఆ మాలల నాశ్రయించి వేలాది గండు తుమ్మెదలు ఝుంకారాలు చేశాయి. అట్టి శ్రీహరిని చూడగానే గోపికల ప్రాణాలు లేచి వచ్చాయి. అంతా శ్రీకృష్ణుణ్ణి చుట్టు ముట్టారు. ఒక గోపిక శ్రీకృష్ణుని భుజాలు రెండూ పట్టుకొని గట్టిగా ఊపుతూ ఎక్కడ దాక్కున్నావని నిగ్గదీసింది. మరొకతె శ్రీకృష్ణుని రెండు చేతులూ తీసుకొని తన ముఖానికి కప్పుకుంది. ఇంకో వనిత గోపబాలుడు నములుతున్న తాంబూలాన్ని అడిగి దోసిట్లో వేయించుకుంది. మరొకతె శ్రీకృష్ణుని పాదాలను తన వక్షః స్థలంపై ఉంచుకుంది. ఇంకో సుందరాంగి తమకంతో శ్రీకృష్ణుని అధరాల్ని గట్టిగా కొరికింది. ఈ ఘట్టంలో పోతనా మాత్యులు ఎట్లా వివరించారో చూడండి.

సీ॥ *ఎలయించి ప్రాణేశ యెందుఁబోయితివని । తోరంపుటలుకతో దూఱెనొకతె*
జలజాక్ష ననుఁబాసి, చనఁగ నీపాదంబు । లెట్లాడెనని వగ నెయిదె నొకతె
నాథ నీవరిగిన నాప్రాణమున్నది । కూర్మియే యిదియని కుందెనొకతె
యీశ్వర, నను నిన్ను నిందాఁకఁబాపెనే । పాపపువిధియని పలికెనొకతె

ఆ॥ *తలఁగి పోవునట్టి తప్పేమి చేసితి । నధిప పలుకు ధర్మ మనియె నొకతె*
మేమి నోము ఫలమొ హృదయేశ నీమోము । మరలఁగంటి ననుచు మసలెనొకతె

తైజపావస్థలో ఉండే జీవుడు సుషుప్తిలో కూడా సాక్షియైన పరమేశ్వరుని దర్శించినట్లు, భగవద్విరహాన్ని అధిగమించి గోపాల బాలుడితో మళ్ళీక్రీడించారు. అప్పుడు శ్రీకృష్ణ పరబ్రహ్మము శుద్ధ సత్త్వాన్ని స్వీకరించి పరమాత్ముని వలె ప్రకాశించాడు. ఆప్తులై తనకోసమే పరితపిస్తున్న గోపికలతో కలసి, ప్రకృతితో కూడిన విరాట్టు వలె ప్రకాశించాడు. అనన్య గతికులైన గోపికలందరితో కలసి కాళిందీ తీరాన గల ఇసుక తిన్నెలపై విహరించాడు. పరమాత్ముని సాక్షాత్కారం అయిన తర్వాత వారిలోని తాపమంతా నశించింది. పరమాత్మతో సంలీనమై ప్రపంచాన్నే మరచారు. పూర్ణకాముకులైన ఆ వనితలంతా పమిటి కొంగుల్ని పరచి కుచకుంకుమలతో పరమాత్ముడికి ఆసనాన్ని కల్పించారు.

విశేషార్థం:

తద్దర్శనా హ్లాద విధూత వృద్రుజో మనోరధాంతం శ్రుత యోయధాయముః
స్వైరుత్తరీయైః కుచ కుంకుమాంతి తైర చిక్లి పన్నా సన మాత్మబంధవే

అని మూలం. ఆత్మ బంధవే = అంతర్యామినే అని వ్యాఖ్య. ఇక్కడ గోపికలకు శ్రుతులకు ఉపమాన ఉపమేయ భావం చెప్పబడింది. ఇది వ్యాస కల్పితం కాబట్టి కామ పరమైన కాంతల్ని వేదాలతో పోల్చి చెప్పడానికి ఆస్కారం లేదు. అదీ గాక, భగవద్దర్శనం అయిన తర్వాత కామం పూర్తిగా నశిస్తుందేకాని వృద్ధి చెందదు కదా. అందువల్లనే భగవత్సాక్షాత్కారం అయిన తర్వాత పరమానందం అనుభవిస్తారని ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. అట్లాగే శ్రీకృష్ణ పరబ్రహ్మ సాక్షాత్కారం వలన గోపికలంతా పరమానందాన్ని అనుభవించారని చెప్పడమే ఇందులోని సారాంశము. ఇందుమూలంగా ఆ గోపికలంతా వ్యభిచార వృత్తి గలవారు కాదని స్పష్టమవుతోంది. మహాయోగుల హృదయాల్లో నివశించే ఆ వాసుదేవుడు గోపికల

పూజలన్నీ చక్కగా గ్రహించాడు. మమ్మల్నందర్నీ అనాథలుగా వదలి ఎక్కడికి పోయావని నిష్ఠురాలాడుతూ ఉంటే చిద్విలాసంగా చిరునవ్వులు చిందించాడు.

గోపికల ప్రశ్నలు :

మహానుభావా! లోకంలో తమను సేవించేవారిని గౌరవిస్తారు. మరికొందరు తమను సేవించకపోయినా కూడా గౌరవిస్తారు. ఇంకా కొందరు తమను సేవించే వారిని సేవించని వారిని కూడా గౌరవిస్తారు. ఇందుకు గల కారణం ఏమిటి?

విశేషార్థం: నువ్వు నరశింహావతారంలో నిన్నే నమ్మి సేవించే ప్రహ్లాదుణ్ణి చేరదీసి ఆదరించావు. రామావతారంలో జటాయువు, కబంధుడు మొదలైన వారంతా నిన్ను సేవించకపోయినా వారికి ఉత్తమగతుల్ని ప్రసాదించావు. ఈ అవతారంలో (కృష్ణావతారం) నిన్నే నమ్ముకొని సేవించే మమ్మల్నందర్నీ, సేవించని రాధాదేవి మొదలైన వారిని కూడా ఎందుకు ఆదరిస్తున్నావు? ఈ అవతారంలో మాత్రమే ఈ ఆచారాన్ని ప్రవేశపెట్టావు. ఎందువలన?అని ప్రశ్నించారు. అనగా మేము మాత్రము నీ యెడల భక్తి పారవశ్యత చెందలేదా? మాకా విషయం తేటపరచి మమ్మల్ని ఉద్ధరించు అన్నదే ఇందులోని భావసారం.

శ్రీకృష్ణుని సమాధానం :

గోపికలారా! మీరంతా మంచి ప్రశ్నే వేశారు. సేవించని వారిని ఆదరించని వారు కొందరుంటారన్న మాట సత్యమే. వారు, 1.జ్ఞానులైన ఆత్మారాములు. 2. భోగేచ్ఛ లేని పూర్తి కాములు 3. కృతఘ్నులు 4. మహాక్రూరులు అని నాలుగు విధాలుగా ఉంటారని పెద్దలు అంటారు.

ధనం లేని వాడు ఉన్న కొద్దిపాటి ధనాన్ని కూడా పోగొట్టుకొని మనస్సంతా దానిపైనే లగ్నం చేస్తూ ఉంటాడు. అట్లాగే నిరంతరం నన్నే ధ్యానం చేస్తున్న వారు అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతోనే వారి సంగతి తెలిసి కూడా పట్టించుకోను. దీని వెనుక నా ఆనాదరణ ఉండటం చేత ఇది అపరాధం కాదు. లోకాచారాన్ని బట్టి చూస్తే మీరంతా ధర్మాధర్మాలను, బంధువులను వదలి నాయందే అత్యంత భక్తిని ప్రదర్శించారు. నాపై మీకుగల ప్రేమాదరణలు శాశ్వతంగా ఉండాలనే మీకు కనిపించకుండా పోయాను. నేను మీకంటికి కనిపించక పోయినా మీ ప్రేమాలాపాలన్నీ వింటూనే ఉన్నాను. మీకు నాయెడల గల ప్రేమ ఇంకా దృఢం కావాలనే మిమ్మల్నీవిధంగా పరీక్షించాను. త్యజించడానికి సాధ్యం కాని సంసార తాపాల్ని వదలి నాదగ్గరకు పరుగు పరుగున వచ్చారు. నాకు మీరు చేసిన సేవారూపమైన ఈ ఉపకారానికి మీ మంచి ప్రవర్తనే ప్రత్యుపకారమవుతుంది.

కొందరు ఉపకారాన్ని పొంది ప్రత్యుపకారం చేస్తారు. వాళ్ళ విషయంలో వేదోక్త మైన ధర్మం అంటూ ఏదీ ఉండదు. అది ఎట్లాగంటే, లోకంలో తండ్రులు పుత్రులనుండి ఉపకారం కోరకుండానే ప్రేమను వ్యక్తం చేస్తారు. అట్లాగే ఒకరు తమను సేవించకపోయినా ఉపకారం చేస్తూనే ఉంటారు. అటువంటి వారి విషయంలో కొంచమైనా ధర్మ లోపం కనిపించదు. పైపెచ్చు సుహృద్భావమే కనిపిస్తుంది.

భక్తుడు తన్నాశ్రయించినా కూడా భగవంతుడు అతణ్ణి ఆదరించడు. ఎందువలన? అతడి ప్రవృత్తిని పరీక్షించేందుకు ఇదే మార్గం. ఏ భక్తుడు భగవంతుని యందు భక్తి పరుడై ప్రతిఫలాన్ని ఆశించని వాడై, పట్టు విడువని వాడై ఉంటాడో ఆ భక్తునికి సౌశీల్యాదులు వృద్ధి చెందుతాయి. ఇది భగవంతుడు చేసే పరీక్షయే నని మనం గ్రహించాలి. ఈ సందర్భంలో భగవదవతార విశేషాలను పరిశీలించి చూద్దాం. నృశింహావతారంలో ప్రహ్లాదుడు ఎన్ని కష్టాలు ఎదురైనా భగవంతుణ్ణే ఆశ్రయించాడు. ప్రహ్లాదుడి ద్వారా శత్రు వధ జరిగింది. కావున ముక్తిని ప్రసాదించి ప్రత్యుపకారం చేశాడని గ్రహించాలి. రామావతారంలో జటాయువు, కబంధుడు మొదలైన వారు శ్రీరాముని సేవించకపోయినా, తానే వారికి ఉత్తమ లోకాలనిచ్చాడే గాని ముక్తిని ప్రసాదించలేదు. ఇక్కడ ముక్తి అంటే భగవద్దాశ్యమనే గ్రహించాలి. కృష్ణావతారంలో గోపికలు నిరంతరం శ్రీహరిని సేవించారు. అటువంటి వారికి కనబడకుండా అదృశ్యుడయ్యాడు. వారంతా అర్ధరాత్రి వేళ మహారణ్యంలో అనాథలుగానే నిలబడ్డారు. అటువంటి స్థితిలో కూడా భర్తలను గాని, బంధువుల్ని గాని స్మరించలేదు.

తమను తాము ఆత్మ పీఠంలో నిలుపుకొని, నిశ్చల హృదయంతో ధ్యానించే వారి మనస్సుకు, అర్ధరాత్రి, నట్టడివిలో ఉన్నామే అన్న భావనే వారికి కలుగలేదు. మాంసాహారి భక్తుడైతే భగవంతుడు అతడు స్వీకరించే ఆహారాన్నే ప్రీతితో స్వీకరిస్తాడు. "యదన్నం పురుషోఽశ్నాతి తదన్నం తస్య దేవతా" అన్న సూక్తి అందరికీ తెలిసిందే. శబరి, అంబరీషాదులు అటువంటి వారే. ఇంకొకడు హృదయంలోనే భగవంతుని నిలుపుకొని, కల్పించుకున్న ద్రవ్యాలనే భగవంతునికి అర్పించి 'ధన్యోస్మి' అని అనుకుంటాడు. దానికే ఆ పరమపురుషుడు సంతుష్టి చెందుతాడు. శుకమహర్షి సుదాముడు మొదలైన వారంతా అటువంటి వారే. కావున భక్తుల భక్తి దృఢంగా ఉండాలి, సేవా భేదాల్ని భగవంతుడు లెక్క చేయడు.

అనగా గోపికలంతా తమ వద్ద ఉండే విలువైన వస్త్రాల వంటి వస్తువులన్నింటినీ శ్రీహరి ముందు పీఠంగా పరిచారు. వారంతా లజ్జ వదిలేసిన వారై శ్రీహరి పాదాలను తమ వక్షఃస్థలంపై మోపమని ప్రార్థించారు, అనగా వారి హృదయజాడ్యం నశించగలదని వారి అభిప్రాయం. నీ కోమల హస్తాలను మా శిరస్సుపై ఉంచమన్నారు. అందువల్ల ముక్తి కలుగుతుందని భావించారు. అంతే గాని మాతో భోగించమన్న అర్థాన్ని తీయరాదు. వారి ప్రార్థనలన్నీ వేదాంత పరములైన నామాలతోనే సంబోధించారే గాని, శృంగార పరమైన నామాలు కావు. భగవంతునికి పక్షపాతముండదు; హృదయాలు నిర్మలమైతే యోగుల్ని, సామాన్య మానవుల్ని సమానంగానే ఆదరిస్తాడు.

రాసక్రీడా వృత్తాంతం :

గోపికా వస్త్రాపహరణ ఘట్టంలో శ్రీకృష్ణుడు రాధాదేవికి ప్రత్యక్షమై మూడు నెలల తర్వాత వసంత ఋతువులో నాతో కలసి రాసక్రీడానుభవం కలుగుతుంది. నీతో పాటు గోపికలు కూడా ఆ దివ్యానందాన్ని అనుభవిస్తారని అనుగ్రహించాడు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు వేణునాదాన్ని వినిపించడం, గోపికలంతా గీతాలు వినడం, భగవంతుడు అదృశ్యమై తిరిగి ప్రత్యక్షం కావడం, వంటి విషయాలన్నీ చదువుకున్నాం. ఇక రాసక్రీడా వృత్తాంతాన్ని గూర్చి తెలుసుకుందాం.

"రాసము" అంటే గోలోకవాసుడైన భగవానుని భూలోక క్రీడా స్థానమని అర్థం. ఇది ఉపాసనా పరులకు ఒక అర్చనాస్థానం. ఆ యంత్రమందు గోలోక నాయకుడైన శ్రీకృష్ణపరమాత్మను ఇతర పరివార దేవతల్ని ధ్యానించి పూజిస్తారు. ఆ పూజ చేయడానికి కార్తీక పూర్ణిమనాడు ఉత్కృష్టమైన దినంగా చెప్పబడింది. అంతమాత్రాన ఇతర దినాల్లో అది నిషిద్ధం కాదు.

శ్రీగోలోక నాయకుని పూజాయంత్రంలో ఇదే ప్రధానం. ఈ పూజావిధానానికి కేవలం భక్తియే ప్రధానం. ఇందులో రాధామాధవులిద్దరూ ప్రధాన దేవతలు. గోపికలు, గోపకులు పరివార దేవతలు. ఈ యంత్రంలో మాధవుణ్ణి అర్చించడం శ్రీకృష్ణుని కెంతో ప్రీతి. ఈ యంత్రానికే "రాసమండలమ"ని పేరు. దీన్ని అర్చించిన వారికి ఫలం అనంతం. ఇందులోని దేవినే రాధాదేవి అని, రసికేశ్వరి అని, రాసేశ్వరి అని అంటారు. అయితే ఇక్కడ రాధామాధవులకు భేదం లేదు. భక్తుల అభీష్టాలన్నీ శ్రీకృష్ణుడు రాధద్వారా అనుగ్రహిస్తాడు. అందువల్లనే భక్తుల వాంఛితాలన్నింటినీ భగవానుడు 'శ్రీ' ద్వారా ప్రసాదిస్తాడన్న వైష్ణవ సంప్రదాయం ఏర్పడింది. శాక్తమంటే కూడా ఇదే సారం. అనగా శివశక్తి అన్నా కూడా రాధాదేవియే. శివశక్తి అంటే మంగళములను ప్రసాదించేదని అర్థం. అంతే గాని శివుని భార్య శక్తి అని కాదు. దీన్ని బట్టి రాధాదేవియే మూల ప్రకృతి అని, శ్రీకృష్ణుడే విరాట్పురుషుడని మనం గ్రహించాలి. అనగా విరాట్పురుషుని సంకల్ప శక్తిచేతనే ఈ ప్రపంచం ఏర్పడింది. వీరిద్దరికీ భేదం చెప్పరాదు. సమాన భక్తితో పూజించాలి. ఇటువంటి పరాదేవి పరమాత్ములను పూజించడమే రాసము. ఇటువంటి రాసమును అనన్య భక్తితో ధ్యానించిన వారికి మోక్షం కరతలామలకం.

శ్రీకృష్ణుడు భూలోకంలో అవతరించడానికి ముందే రాధాదేవి, గోపికలు గోపకులు, రాసమండలం బృందావనానికి చేరారు. అనగా నందాదులు మాత్రం దీన్ని బృందావనమని పిలుచుకొనే వారు. అయితే బృందావనం లోనే ఒకభాగంలో రాసక్రీడలు జరుపుకుంటూ దాన్నే రాసమండలమని పిలుచుకునే వారు. ఇవన్నీ వారు తెలిసి చేసినవి కావు. కారణాంతరాలచేతనే ఆ విధంగా ఏర్పడ్డాయి. అనగా గోలోకంలో శ్రీకృష్ణుడు చేసే విహారమే ఇక్కడ భూలోకంలో కూడా జరిగే ఏర్పాటు జరిగింది. అంతేకాని ఇదేదో ఒక విహారస్థలం కాదు. భగవన్మహిమ అనే మనం గ్రహించాలి.

శ్రీమన్నారాయణుడు చెప్పిన కథ

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మ ఖండం 28 వ అధ్యాయం నుండి, శ్రీ భాగవతం దశమ స్కంధం 33వ అధ్యాయంనుండి విష్ణుపురాణం పంచమాశ్వాసం నుండి, బ్రహ్మపురాణంలో 81 వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

నారదుడు: మహాత్మా! నారాయణా! "మూడునెలలైన తర్వాత రాధాదేవితోను, గోపికలతోను రాసక్రీడలు జరుపుతానని భగవంతుడు ప్రతిజ్ఞ చేశాడు గదా. అయితే బృందావనానికి అంతటి మాహాత్మ్యం ఉన్నదా? రాసమండల విధానం ఎటువంటిది? శ్రీహరి ఒక్కడేగదా? అంతమంది గోపికలతో రాసక్రీడలు ఎట్లా జరిపాడు? వినాలని కుతూహలంగా ఉంది.

శ్రీమన్నారాయణుడు : నారదమునీ! శ్రీహరి రాసయాత్ర అంతా పురాణాలసారమని తెలుసుకో. శ్రీహరి కథలన్నీ శ్రుతి మనోహరములు. గోపికలంతా వారి వారి అభీష్టాలననుసరించి శ్రీకృష్ణునితో రాత్రంతా గడిపి ఉదయాన్నే ఇళ్ళకు పోయేవారు. పగలంతా భర్తతోను, పిల్లలు బంధువులతో సంతోషంగా గడిపే వారు. క్రిందటి రాత్రి ఏం జరిగిందో వాళ్ళకు జ్ఞాపకముండేదే కాదు. వాళ్ళు రాత్రి కాగానే ఎవరికి వాళ్ళే మంత్రించినట్లుగా బృందావనానికి చేరుకునే వారు. రాత్రంతా ఏ వనాల్లోనో, యమునా తీరాల్లోనో విహరించే వారు. ఎవరికి ఏ తీరున ఉండాలని కోరుకునే వారో, శ్రీకృష్ణుడితో వారా విధంగా విహరిస్తూ వారి మనోరథాలను తీర్చుకునే వారు. ఈ విధంగా మూడు నెలలు గడచి పోయాయి. భర్తలు గాని, బంధువులు గాని రాత్రంతా మీరెక్కడ తిరిగి వస్తున్నారని అడిగిన పాపాన పోలేదు. రాత్రి ఏం జరిగిందో వాళ్ళకు తెలిస్తే గదా ఎక్కడకు పోయావని నిలదియ్యడానికి. భగవన్మాయ వాళ్ళందర్నీ కప్పివేస్తే వారేం చెయ్యగలరు? ఏమని అడగ్గలరు? మూడు నెలలు ఒక్క క్షణం లాగ గడచి పోయాయి.

బృందావన వర్ణనము :

రాసమండలం : ఒకానొక రోజున బాల గోపాలుడు బృందావనంలో మురళి చేత బట్టుకొని ఊరికి బాగా దూరంగా వెళ్ళాడు. ఆ రోజు శుక్లపక్ష త్రయోదశి. వనమంతా పండువెన్నెల పిండి ఆరబోసినట్లుంది. చిగుళ్ళు తిని మదించిన కోయిలలన్నీ కుహూకుహూ అంటూ ఎడతెరపిలేకుండా గానం చేస్తున్నాయి. వనమంతా మల్లికలు, మాలతీలతలు వృక్షాల్ని పెనవేసుకుని విరగ పూశాయి. ఆ పూల గుబాళింపుల్ని మలయ మారుతాలు వనమంతా చేరవేస్తున్నాయి. ఆ పరిమళాలకు మత్తెక్కిన గండు తుమ్మెదలు ఝుంకారాలు చేస్తున్నాయి. దూరంనుండి నెమళ్ళ క్రేంకారాలు వినిపిస్తున్నాయి. రత్న దీపాలు వెలుగుతున్నాయి. అగరు ధూపాల వాసన ఘుమ ఘుమ లాడుతూ గుబాళిస్తోంది. ఈ ఏర్పాట్లతో ఆ వనమంతా వర్తులాకారంలో ఉంది. అదే రాసమండలం. ఆ రాసమండల మంతా కస్తూరి, కుంకుమ, చందనాలతో అలంకరించబడింది. అందులో అనేక పుష్పోద్యానాలున్నాయి. వాటి మధ్యన క్రీడాసరోవరాలున్నాయి. ఆ సరోవరాలన్నీ హంసకారండాది పక్షి సమూహాలతో నిండిపోయాయి. వాటి కిల కిలారవాలతో వనమంతా మారుమ్రోగిపోతోంది. ఆ సరోవరాల్లోని జలాలు స్పటికంలా నిర్మలంగాను, మంచువలె చల్లగాను ఉన్నాయి. ఆ రాసమండలం చుట్టూ మామిడాకుల తోరణాలు కట్టారు. సింధూరం, చందనం మొదలైన పరిమళ ద్రవ్యాలన్నీ కడవల్లో నింపి ఉంచారు. అయినా రాసమండలంలో మధురమైన ఫలాలు రాసులు పోసి ఉన్నాయి. అటువంటి రాసమండలాన్ని చూసిన శ్రీకృష్ణుడు పక్కున నవ్వాడు.

ఈ ఏర్పాట్లైతే అద్భుతంగానే ఉన్నాయి. అయితే ఈ ఏర్పాట్లన్నీ నందమహారాజు చేయించాడా? లేక గోపకులు అలంకరించారా? నిజానికి ఎవరూ ఏర్పాటు చెయ్యలేదు. ఇది రాసమండలం కదా. అనగా ఇదొక పూజా చక్రం. అనగా ఇష్టదేవతను ఆరాధన చేసుకొనేందుకు చేసుకున్న ఏర్పాట్లనే "యంత్రం". ఆ యంత్రంలో ఇష్టదేవతను ఉపాసించే స్థలాన్ని బిందువు అంటారు. అదే మధ్య స్థానం. ఆ దేవత చుట్టూ ఆ దేవతకు సంబంధించిన పరివారదేవతలుంటారు. ఈ రాసమండలమే

గోపాల చక్రం. అందులో మధ్యన బిందు స్థానంలో రాధామాధవులుంటారు. ఆ చక్ర దళాలలో గోపికలుంటారు. ప్రతి దళము పూజించదగినదే. అదెట్లాగంటే, కేంద్రబిందువులో రాధాదేవితో కలసి మాధవుడు ఎట్లా పూజించబడుతూ ఉంటాడో, అట్లాగే ప్రతి దళంలోనూ మాధవుడు గోపికలతో కూడి పూజించబడుతూ ఉంటాడు. అటువంటి యంత్రాన్ని పూజించాలి. ఇదే పూజా పద్ధతి. ఆ పూజా పద్ధతినే రాసక్రీడ అంటారు. ఇక్కడ పూర్ణ కుంభాలు, చందనాది పరిమళ ద్రవ్యాలు, రకరకాలైన పండ్లు ఉన్నాయని చెప్పబడింది గదా. ఇటువంటి ఏర్పాట్లు రతిక్రీడల కోసం చేస్తారని మనమే గ్రంథాల్లోనూ చదువలేదు; వినలేదు; చూడలేదు. ఇంతమంది స్త్రీలు ఒక్క పురుషుడితో రతి సుఖాలు పొందడమంటే ఆశ్చర్యంగా ఉండదా? అనగా ఇదంతా ఆ పురుషుని సర్వవ్యాపిత్వాన్నే తెలుపుతోంది. ఆ పరమ పురుషుడే ఈ శ్రీకృష్ణపరబ్రహ్మము. అతడే ఇక్కడ ఆరాధ్య దైవం. గోపికలే పరివార దేవతలు. రాధా దేవియే భగవానుని ఇచ్ఛాశక్తి. రాధామాధవులది అవినాభావ సంబంధం. అటువంటి ఈ దేవతారాధనయే రాసక్రీడ అని, రాసకేళి అని, రాసోత్సవమని పిలుస్తూ ఉంటారు. గోపికలను ఉద్ధరించాలనే భగవానుడు సంకల్ప మాత్రం చేతనే ఇదంతా కల్పించాడు. ఈ అలంకారాలన్నీ భగవత్సంకల్పాలే. దీన్నే భవద్గోష్ఠి అని కూడా అంటారు. అంతే కాని వ్యభిచారం కాదు. ఇక్కడ శ్రీకృష్ణ పరబ్రహ్మము గోపికలకు తన సర్వ వ్యాపిత్వాన్ని చూపిస్తాడు. దీన్నే విశ్వరూప సందర్శనం అని కూడా అంటారు. భక్తులైన వారు ఈ కథను జపం చేసుకునే సమయాల్లో స్మరిస్తూ శ్రీకృష్ణ తారక మంత్రంగా భావించాలి. దీన్నే వైష్ణవ శాక్తమంటారు. ఇక్కడ పరికరాలతో పనిలేదు. శ్రద్ధాసక్తులే ద్రవ్యాలు.

పరమ పురుషుని ధ్యానించేందుకు ఈ గోపికలంతా ఎందుకు? అన్న ప్రశ్న రాకమానదు. శాక్తంలో 'మ'కార పంచకాలుంటాయనడం అందరూ ఎరిగిందే. అవి, మంత్రము, మననము, మద్యము,మాంసము,మైథునము. ఈ మాటలు వినగానే వెగటుగా అనిపిస్తుంది. వీటిలోని అంతరార్థాలు తెలుసుకుంటే అంతా పవిత్రమే. ఉదాహరణకు రుచికరంగా కనిపించే పదార్థాల తత్త్వాన్ని విమర్శించి చూస్తే అంతా కల్మషంగానే తెలుసుకుంటాం. కళ్ళకు ఇంపుగా లేని పదార్థాల్ని పరిశీలిస్తే నిర్మలంగా అనిపిస్తాయి. ఇందుకు మన దేహాన్ని, హృదయాన్ని ఉదాహరణములుగా చెప్పుకోవచ్చు. ఇక మకార పంచకాల్ని గూర్చిన రహశ్యార్థాలను విచారిద్దాం. మంత్రం అంటే స్మరించిన వారిని కాపాడేదని అర్థం. ఇదే భగవద్రూపం. ఇక మననం అంటే ఉపాస్యదేవతా రూపాన్ని మనసులో నిలుపుకోవడం. మద్యం అనగా భగవత్పాదోదకమని భావం. అదే గంగాజలంగా కూడా భావన చేసుకోవాలి. ఆ నది మన దేహం లోనే ఉంది. ఇడా పింగళ సుషుమా నాడులే త్రివేణి సంగమం. కాబట్టి కాశీకో, త్రివేణికో పోనక్కరలేదు. మానసిక పూజయందే భగవత్పాదోదకాన్ని అమృతప్రాయంగా స్వీకరించాలి.

ఇటువంటి ఉపాస్యదేవతా పాదోదకంతో స్నానం చెయ్యాలి. అట్లా చెయ్యడంవలన స్మృత్యాచమనం చేసినట్లవుతుంది. ఇది అత్యంత పవిత్ర స్నానం. నిశ్చల భక్తితో మానసిక పూజ చెయ్యడమే ఇందులోని సారం.

కావున అటువంటి మద్యం మానసిక పూజలందు ప్రధానం. ఇక మాంసం అనగా హృదయ గ్రంథిని భగవంతునికి అర్పించడమే. అంతేకాని జంతువుల్ని చంపి ఆ మాంసాన్ని వండి భుజించాలని కాదు. ఇక మైథునమనగా ప్రకృతి పురుష సంయోగమనే భావాన్నే గ్రహించాలి. ఈ జగత్తు అంతా ఇటువంటిదేనని, ఇది శాశ్వతం కాదని భావించడమే ఉపాసనా ఫలం. ఇదే దాని రహస్యార్థం. అంతేగాని, జపం చేస్తూ సురాపానం చేసి, మద్యాన్ని సేవిస్తూ, మైథున కార్యాల్లో పాల్గొమ్మని కాదు.

ఇక ప్రస్తుత కథాభాగానికి వద్దాం. రాసమండలంలో శ్రీకృష్ణ పరమాత్మను ఉపాసిస్తే వచ్చే లాభం ఏమిటి? అని అడుగవచ్చు. జితేంద్రియత్వం సిద్ధిస్తుంది. అంతకన్నా ఫలం ఏం కావాలి.? అది ఎట్లాగంటే, గోపికలంతా మనోహరమైన సౌందర్యరాసులు. వారంతా ఒక్కొక్క దళంలో ఉంటూ సర్వవ్యాపకుడైన సర్వేశ్వరుణ్ణి ధ్యానం చేస్తారు. దాంతో విషయ సుఖాలపై విముఖులై ఉపాసనయందే మనస్సు నిలిపి శ్రీకృష్ణ పరతత్త్వాన్ని వెల్లడిస్తుంది. ఇంతకన్నా గొప్ప ఫలం ఎక్కడుంటుంది?

ఆ గోపబాలుడు అటువంటి రాసమండలాన్ని చూసి పక్కున నవ్వి వేణుగానం చేశాడు. భక్తులకు ఆ మురళీ గానమే ఉపనిషన్నాదమవుతుంది. అంతే కాకుండా శరీరం పాషాణం లాగా నిశ్చలమవుతుంది. “భభూవ స్థాణువద్దేహోధ్యానైక తాన మానసా” అని శ్రీకృష్ణజన్మఖండంలో చెప్పారు. రాధాదేవికి ఆ నాదం విని ఒళ్ళంతా పులకించి పోయింది. చేతుల్లో ఉన్న పని అక్కడే వదిలేసి ఆ గానం వచ్చే దిక్కుగా నడిచిపోయింది. గోపికలు కూడా కులధర్మాన్ని వదలి, శంకలన్నీ ప్రక్కనపెట్టి కృష్ణ చిత్తులై ఇళ్ళనుండి బయటకు వచ్చేశారు. వారంతా హరినామస్మరణ చేస్తూ శ్రీకృష్ణుడున్న చోటుకు చేరుకున్నారు. శ్రీకృష్ణుడు రాధాదేవిని అల్లంత దూరానే చూసి సంతోషంతో చిరునవ్వు నవ్వుతూ ఎదురువెళ్ళి ఆహ్వానించాడు. రసిక శిఖామణి అయిన గోపాలకృష్ణుడు రాధికను రాసమండలానికి వెంట తీసుకొని వెళ్ళాడు. ఆ రాసమండలంలో వారికో ప్రత్యేక స్థానం ఏర్పరచబడింది. అక్కడ రత్నదీపాలు వెలుగుతున్నాయి. చారు చంపక శయ్యలక్కడ పరచి ఉన్నాయి. భోగానికి ఉపయోగపడే అనేక పదార్థాలక్కడ అమర్చారు. అటువంటి ఏకాంత ప్రదేశంలో శ్రీహరి రాధాదేవితో కలసి నివసించాడు. రసికేశ్వరి శ్రీహరికి తాంబూలం ఇవ్వగా, పరమేశ్వరుడు తాను నమిలిన తాంబూలాన్ని రాధకిచ్చాడు. ఆమె దాన్ని భక్తి శ్రద్ధలతో ప్రసాదంగా స్వీకరించింది. శ్రీకృష్ణుడు కూడా రాధాదేవి నములుతున్న తాంబూలాన్నివ్వమని కోరగా రాధాదేవి నిరాకరించి ఆయన పాదాల నాశ్రయించి మన్నించమని వేడుకుంది. ఆ రసికనాయకుడామెను అక్కున చేర్చుకొని రతి తల్పానికి తీసుకొని వెళ్ళాడు. వారిరువురు కామశాస్త్ర విశారదులే కావడాన, తగిన మోతాదుల్లో ఆనందించారు.

శ్రీకృష్ణ భగవానుడు రాధాదేవితో ఏరీతి క్రీడల్లో విహరించాడో, అదే రీతిలో గోపికలందరితోను విహరించాడు. అక్కడ గోపికలంతా 18 లక్షల మంది ఉన్నారు. వారందర్నీ వలయాకారంగా నియమించి ఆ యోగీశ్వరుడు 9 లక్షల రూపాలతో విలసిల్లాడు. ఇద్దరు గోపికల నడుమతాను నిలబడి ఇరుప్రక్కల గోపికలుండేట్లు నియంత్రించాడు. అనగా నారీనారీ నడుమ ఓ మురారి ఉంటూ వచ్చాడు. తన రెండుచేతుల్నీ ఇద్దరు గోపికల భుజాలపై ఉంచుతూ ప్రతి ఒక్కొక్క గోపికకు శ్రీహరి తన చెంత మాత్రమే ఉన్నాడన్న ఊహ కల్పించాడు. వేణుగానంతో వారందర్నీ మైమరపించాడు. ఈ

వేడుకను చూసేందుకు దేవతలంతా తమ భార్యల్ని వెంటబెట్టుకొని ఆకాశంలో బారులు తీరి నిలబడ్డారు. అప్పుడా రాసమండలం (యంత్రం) ఎంతో విశాలంగా కనిపించింది. ఒక్కొక్క కోణంలో ఇద్దరేసి గోపికలు ఒక కృష్ణుడు కనిపించారు. ఆ దృశ్యానికి వివశులైన దేవతలు పుష్ప వర్షం కురిపించారు. యక్షులంతా గానం చేశారు. కిన్నెర కింపురుషులంతా నాట్యం చేశారు.

ఆ మహోత్సవంలో ఒక గోపిక ఆనందం పట్టలేక చక్కటి గీతాన్నొకటి ఆలపించింది. భగవంతుడా గీతానికి ధృవతాళంతో స్వరాలాపన చేసి లోకానికందించి, ఆ విధంగా ఆ గోపికను సన్మానించాడు. ఆ సమయంలో పరవశించిన లీలా శుకులు ఆ దృశ్యాన్ని అనేక శ్లోకాల్లో వర్ణించారు.

వేరొక పురంధ్రీమణి శ్రీకృష్ణుడు చేతులకు పూసుకొన్న నల్ల కలువ పరిమళంతో కూడిన చందనాన్ని తృప్తిగా ఆఘ్రాణించి తన్మయురాలై ముద్దాడింది.

ఇంకో ప్రియురాలు శ్రీకృష్ణుణ్ణి ఆటపట్టిస్తుంటే ఆమె చెవి కుండలాలకున్న రత్నకాంతులతో మెరిసిపోతున్న చెక్కిళ్ళను శ్రీకృష్ణుని చెంపలకానించి తన్మయురాలైంది. మరోలలనామణి శ్రీకృష్ణుడు నమిలే తాంబూలాన్ని పెదవులతో అందుకొని తన్మయురాలైంది.

మరొక గోపిక నృత్యం చేస్తూ ఉంటే వడ్డాణానికున్న చిరుగంటలు మ్రోగుతూ ఉండగా పరమపవిత్రమైన శ్రీకృష్ణుని కర కమలాలను తన హృదయ పీఠంపై ఉంచుకుంది..

ఈ విధంగా ఆ గోపికలంతా పరమానందాన్ని అనుభవిస్తూ, అనేక విధములైన ఆటపాటల్లో మునిగి తేలారు. ఆ భక్తవత్సలుని, ఏకాంతవల్లభుని లీలల్ని ముక్త కంఠంతో కీర్తించారు. ఆయన బాహువుల్ని తమ కంఠాలపై ఉంచుకున్నారు. నాట్యం చేస్తుండగా ముంగురులన్నీ ముఖాన పడ్డాయి. జడముడులు ఊడిపోయి పూలన్నీ నేలపై రాలాయి. కంకణాల ధ్వనులు, నూపురాల ధ్వనులే వాద్యాలయ్యాయి. వారి గీతాగానాలే తుమ్మెదల ఝుంకారాలయ్యాయి. అప్పుడా రాసమండలంలో గోపికలంతా శ్రీహరితో కలసి ఒక్కుమ్మడిగా నాట్యం చేశారు. పసి పిల్లవాడు తన ముఖాన్ని అద్దంలో చూసుకొని కేరింతలు కొట్టినట్లు, శ్రీకృష్ణుడు ఆ గోపికలతో కలసి మహదానందాన్ని పొందుతున్నట్లు నటించాడు. ఈ విధంగా భగవంతుని స్పర్శ చేత గోపికలంతా మహదానందాన్ని పంచుకున్నారు. జడముడులు విడిపోవడం చీరముడి జారిపోవడం వారెరుగరు. జారిపోతున్న రవికల్ని సరిచేసుకోవాలన్న స్పృహ వారెవ్వరికీ కలుగలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే వారి ఉనికిని పూర్తిగా మరచి పోయారు. భగవత్సాంగత్యంలో ఉండటం చేత తామే భగవంతుడన్న భావనలో విహరిస్తూ ఉచితానుచితాలకు అతీతులయ్యారు.

విశేషార్థం:

ఏవం పరిష్వంగనం కరాభి ర్మర్మస్నిగ్ధేక్షణోద్దామ విలాస హాసైః
దేమే రమేశో వ్రజసుందరీభిర్యధార్భకస్స్వ ప్రతిబింబ విభ్రమః

అని మూలం.

యదార్ధక ఇతి స్వప్రతిబింబైర్విభ్రమః క్రీడాయస్య స ఇత్య
న్నైనైతద్దర్శితమ్ స్వయమేవ సర్వకళా కౌశలం
సౌగంధ్య లావణ్య మాధుర్యాది చ తాను సంచర్య
తాభిస్సహరే రేమే యధార్భ్భకస్స్వప్రతిచుంబైరితి

అని వ్యాఖ్య. బాలుడు, అద్దంలోగాని, అద్దం వంటి నిర్మలమైన పదార్థాల్లోగానీ, తన ప్రతిబింబాన్నే చూస్తూ అందులో ఇంకో బాలుడున్నాడని ఎట్లా ఆడుకుంటూ ఉంటాడో, అట్లాగే శ్రీకృష్ణుడు గోపికల్ని తన ప్రతిబింబంగానే భావించి వారితో లీలావినోదాలతో మునిగితేలాడని భావం. ఈ భావనతో స్వీకరిస్తే ఇక జారత్వానికి చోటెక్కడిది? కొంటెవారి మాటలకు అర్థాలేముంటాయి? ఈ విధంగా శ్రీకృష్ణుడు గోపికలెందరున్నారో తాను అన్ని రూపాల్లోనూ కనిపిస్తూ సర్వాంతర్యామియై ఆ రాసమండలంలో విహరించాడు. అలసి సొలసి ఉండే ఆ గోపికల ముఖాల్ని ప్రేమతో నిమిరి వారందరినీ ఆనందసాగరంలో ఓలలాడేట్లు చేశాడు.

ఎటు చూసినా ఈ క్రీడయందు విపరీతార్థం కనిపించదు. అనగా ప్రసన్న చిత్తులైన ఆ గోపికలంతా శ్రీకృష్ణ పరబ్రహ్మంతో కలసి సాదరంగా రాసగోష్ఠులు జరిపారు.

ఆ సమయంలో రాసమండలం గోలోకాన్ని పోలి ఉన్నది. రాసమండలంలో మహాపూజ అనగా నృత్య గీతాలే. అందులోని అధిదేవత రాధాదేవియే. కాబట్టి భగవంతుడు అక్కడ తన పరివార దేవతలతో కలసి ఒళ్ళు మరచి నృత్య గీతాలు ఆలపించారు. జడముడులు, చీరముడులు విడిపోవడం వారెరుగరు. రవికలు జారిపోకుండా సరిచేసుకోవాలన్న స్పృహ వారికి కలుగ లేదు. మహదానందాన్ని అనుభవిస్తున్నా అది ఎటువంటిదో, ఆ అనుభవమేమిటో కూడా వారెరుగరు. ఈ విధంగా రాసమండల విహారం పూర్తి అయింది.

మహాశయులారా! ఈ రాసక్రీడ ఎట్లాంటిదో తెలుసుకున్నాం. వ్యాఖ్యాతల భావాల్ని తెలుసుకున్నాం. ఇకపైన అందులోని అంతరార్థాన్ని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. రాసమండలం అనగా భగవదర్చన కోసం కల్పించుకున్న చక్రమని కూడా తెలుసుకున్నాం. ఇందులో రతి పరమైన అర్థం చెప్పడానికి కొంచం కూడా ఆస్కారం లేదు. లీలా శుకులు "సంజగే వేణునా దేవకీనందనః" అని తమ భావాన్ని తెలిపారు. ఇందులో వేణుగానం, భక్తి పరవశులైన గోపికలు, వారు చేసిన నృత్యగీతాలేనని తేటపడుతోంది. ఆ మహాచక్రంలో అనేక దళాలున్నాయి. ఒక్కొక్క దళానికి ఇద్దరేసి గోపికలు ఒక కృష్ణుడు నిలబడి ఉంటారు. ఈ విధంగా ఎన్ని ఆవరణలున్నాయి? ఆయా దళాల్లో ఉండే అధిదేవతలు గాని, వారి పేర్లతో ప్రస్తుతానికి మనకు అవసరం లేదు. శ్రీకృష్ణుడు ఆనంద పరచే చోటునే రాసమండల మంటారు. నృత్యగీతాలతోనే శ్రీకృష్ణుణ్ణి పూజించే విధానాన్ని వారంతా ఎన్నుకున్నారు. అనగా భగవద్గుణగణాలను గీతాలుగా పాడుకుంటూ, తదనుగుణంగా నాట్యం చేస్తూ తన్మయత్వంలో మునిగిపోతారని భావసారం. ఒక్క శ్రీకృష్ణుణ్ణి అర్చించే విధానంలో తప్ప మరే పూజా విధానాల్లోనూ నృత్య గీతాల ప్రాధాన్యం కనబడదు. అందుకు కారణం ఏమిటన్న ప్రశ్న ఉదయించవచ్చు. నారదమహర్షి ఎందువలన వీణా గానంతో భగవంతుణ్ణి అలరిస్తున్నాడు?

అనగా అది కూడా ఒక పూజావిధానమేనని మనకు తెలుస్తోంది. లేకపోతే ఆయన కూడా ఓ చెట్టు క్రింద ధ్యానం చేస్తూ కూర్చునే వాడే గదా. ఎందువల్ల నంటే, రాగయుక్తంగా గానం ద్వారా భగవంతుని గుణ గణాలను స్తుతించడం కూడా ఒక యోగ విద్యయే. ఇంకా చెప్పాలంటే యోగాభ్యాసం కన్నా ఈ విధానం శ్రేష్ఠమైనదని శ్రుతులు చెప్తున్నాయి.

అనగా నృత్య గీతాదులచే దృఢ భక్తి కలవాడైతే మోక్షానికర్హుడేనన్నదే ఈ స్మృతి సారం. ఏ పని చేసినా ఏకాగ్రత ముఖ్యంగదా. అది లేని యెడల ఏమీ సాధించలేరు. కాబట్టి నృత్య గీతాదులు కూడా భగవద్భక్తికి తద్వారా మోక్షానికి మార్గాలేనని ఈ స్మృతుల సారం.

శంకరుడు సాయం సమయాల్లో బ్రహ్మ, విష్ణువుతో కలసిన దేవతా సమూహంలో త్రిపురసుందరీదేవిని అధిష్ఠాన దేవతగా నిలుపుకొని తాండవం చేసేవాడని మనకు అనేక పురాణాలు బోధిస్తున్నాయి.

శ్లో॥ నృత్తావసానే నటరాజ రాజో నవాద ఢక్కాం నవపంచవారం
ఉద్ధర్తుకామ స్సనకాది సిద్ధా నేతద్విమర్శే శివ సూత్ర జాలమ్

అని వ్యాకరణ శాస్త్రం తెలుపుతోంది. వ్యాకరణ సూత్రాలన్నీ నటరాజ ఢక్కా నాదాలనుండి, శంకరుని నృత్యాన్నుండీ వెలువడ్డాయని పలువురు శాస్త్రకర్తలు నిర్ధారించారు. అందువల్లనే శంకరుని దర్శనానికి ప్రదోషకాలమే ప్రశస్తమైనదని, అప్పుడే ముక్కోటి దేవతల్ని సందర్శించవచ్చని చెప్పబడింది. శివ భగవానుని అభిషేకంతో పూజించాలనుకుంటే శివుని లింగాకారునిగాను, స్తుతుల చేత పూజించాలనుకునే వారు మహాదేవుడని, నాట్యం ద్వారా పూజించాలనుకునేవారు నటరాజస్వామి గాను ఆరాధిస్తారు. భక్తుడికి ఏ రూపంపైన మక్కువ ఉంటుందో ఆ నామరూపాలతోనే ఆరాధించవచ్చు. ఏవిధంగా ఆరాధించినా భగవంతుడు సంతృప్తుడవుతాడు. ఈ మాట సకల శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలన్నీ అంగీకరించేదే. కావున రాధామాధవులను నృత్య గీతాల ద్వారా పూజించవచ్చు. అయితే ఇతర మార్గాల కన్నా ఇదే ఉత్కృష్టమైనదని మిగిలిన మార్గాలు తక్కువైనవనీ అనకూడదు. కాబట్టి భగవద్గీతాలను ఆడి, పాడి భగవంతుని తృప్తి పరచవచ్చు. ఈ రాసక్రీడ కేవలం ఇంద్రియ సుఖాలకోసమే ఏర్పడినదయితే, దేవతలు భార్యలతో కలసి వచ్చి ఆకాశం నుండి వీక్షిస్తారా?

దేవతలు భార్యలతో కలసి వచ్చి వేడుకలు చూడటమే కాకుండా దుందుభులు కూడా మ్రోగించారు. పూల వాన కురిపించారు. గంధర్వులు భార్యలతో కలసి శ్రీహరిని కీర్తిస్తూ గీతాలు పాడారు. ఏ శృంగార ప్రబంధాల్లోనైనా రతిక్రీడల్ని వర్ణించేటప్పుడు దేవతలు వచ్చి చూసే వారని వర్ణించారా? రాసక్రీడలు యథార్థంగా రతిక్రీడలే అయితే, వాటిని చూసేందుకు దేవతలు, గంధర్వులు భార్యల్ని వెంటబెట్టుకొని వస్తారా? కావున ఇది రతిక్రీడకాదని స్పష్టంగా చెప్పవచ్చు. ప్రతి గోపిక తన గీతాలతోను, నృత్యాలతోను శ్రీహరిని తృప్తి పరచినట్లుందే గాని, రతిక్రీడలద్వారా కాదు. ఈ రాస క్రీడల్ని వర్ణిస్తూ లీలా శుకులు ఎనిమిది శ్లోకాలు చెప్పారు. చివరగా "సంజగే వేణునా దేవకీనందన" అని భగవంతుని వర్ణించారు. కాబట్టి రాసక్రీడ అన్నది భగవత్పూజలో ఒక భాగమేనని స్పష్టమవుతుంది. ఈ రాసక్రీడా భాగంలో పోతన గారు వ్రాసిన ఈ పద్యాన్ని చూడండి.

చ॥ *ప్రమద యొకర్తు మాధవుఁడు పాడ విపంచి ధరించి కేల*
సం, భ్రమమున దంత్రి మీటుచుఁ దిరంబుగ తాయము
చేసి యొక్కరా, గము దగ నాలపించి సుభ గస్వరజా
తులు వేఱు వేఱుకా, నమరఁగఁ బాడెఁదన్ రమణుఁ
న్దేనన దారువు లంకురింపగన్

గోపికలతో జలకాలాడటం :

రాసక్రీడలలో శ్రీహరి ప్రవృత్తిని గూర్చి తెలుసుకున్నాం. దానిలోని అంతరార్థాల్ని గ్రహించాం. రాసమండలంలో లక్షలాది గోపికల్ని శ్రీహరి మూర్తులతో కలసి విహరించాడాన్ని తెలుసుకున్నాం. ఇందువల్ల శ్రీకృష్ణపరమాత్మ జగత్కారణత్వం ప్రదర్శితమైంది. ప్రతి ఇద్దరి గోపికల నడుమ ఒక కృష్ణమూర్తి నిలిచిందంటే అర్థం ఏమిటి? సర్వజగద్రూపత్వాన్ని ప్రదర్శించడమే గదా. కావున మనం భగవంతుని యెడల కలిగిన అనన్య గతికమైన భక్తి పరతత్త్వాన్ని మాత్రం వదులుకోరాదు. "తాళజ్ఞశ్చాప్రయాసేన మోక్షమార్గం నియచ్ఛతి" అన్న స్మృతి వాక్యాన్ని మరువరాదు. యోగానికి వీణావాదనం ఉపయోగిస్తుందనడానికి కారణం ఏమంటే, మనస్సును స్థిరంగా నిలుపగలుగుతుందనే. రాధాదేవిని లోక జననిగాను, మూల ప్రకృతిగాను మనసులో నిలుపుకోకపోతే భగవత్కృపకు అర్హుడుకాలేడు. కావున ముందుగా ప్రకృతిని ఉపాసించి ఆమె కరుణకు పాత్రులం కావాలి. ఆ తర్వాతనే మనకు భగవత్కరుణ లభ్యమవుతుంది.

శ్రీరామానుజులవారు కూడా ఈ విషయం స్వానుభవం చేత తెలుసుకున్నారు. అందువల్లనే శ్రీదేవి ద్వారానే భగవత్కాటాక్షం ప్రసరిస్తూ ఉంటుందని బోధించారు. ఆయన ఈ విషయాన్ని స్వానుభవం చేత తెలుసుకున్నారు. ముందుగా భగవంతుణ్ణి ఉపాసించారు. ఫలం దక్కలేదు. అందువల్ల ముందుగా భగవతిని ఉపాసించాలన్న జ్ఞానం కలిగింది. ఆ పిమ్మట భగవంతుని ఉపాసించి భగవంతుని కృపకు పాత్రులయ్యారు. అందువలన భగవత్కృపకు అందరూ పాత్రులే నన్న సమబుద్ధి కలిగింది. భక్తి మార్గమే సులభమైనదని గ్రహించారు. శ్రీ మధ్వాచార్య, శ్రీ శంకరాచార్యులవారు కూడా భక్తి ప్రధానమన్న అభిప్రాయాన్నే బోధించారు. అయితే మధ్వాచార్యుల వారు మాత్రం భగవంతుడే అన్నిటికీ గతి అన్న భావాన్ని వ్యక్తపరిచారు. అనగా శ్రీదేవి కరుణా కటాక్షాలు లేకుండానే భగవంతుణ్ణి పొందవచ్చునన్నది వీరి అనుభవం. అయితే ఈ ముగ్గురిదీ మార్గ భేదమే గాని గమ్యం ఒక్కటే. దీన్ని బట్టి ఎవరికి ఏ మార్గం అనుకూలమో దాన్నే ఆశ్రయించి భగవత్కరుణ పొందవచ్చు. కావున భక్తి రస ప్రధానులైన రాధామాధవుల్ని రాసమండలంలో సకల దేవతా రూపులుగా ధ్యానించడం ఇహానికి పరానికి శ్రేయస్కరం.

స్త్రీలకు తండ్రిగాని భర్తగాని మంత్రోపదేశం చెయ్యాలి. ఒకవేళ భర్త అనర్హుడైతే అతడి అనుమతితో ఇతరుల నుండి మంత్రోపదేశాన్ని పొందవచ్చు. ఇది లోకాచారం అయితే ఈ లోకాచారాన్ని శ్రీకృష్ణుడు అతిక్రమించాడు కదా? అని అడిగే వాళ్ళుంటారు. అయితే ఈ సామాన్య నియమం పరాత్పరునకు వర్తించదు. జలక్రీడలు కేవలం కాముకులకే కదా? అని అడిగేవాళ్ళుండవచ్చు. జలక్రీడలు సామాన్యంగా

పగటిపూట చేస్తారే గాని అర్ధరాత్రి వేళకాదు. అందులోనూ ఇది శరత్కాలంలో తులామాసం. చలి ప్రారంభం అయ్యే రోజులు. అది యమునాతీరం. ఆ నదీ జలాలు మంచల్లే చల్లగా ఉంటాయి. అటువంటి అర్ధరాత్రి సమయంలో జలక్రీడలు ఆరంభం అయ్యాయి. దీన్ని బట్టి ఇది భూలోకంలో ఆచారం కాదని తెలుస్తోంది. అందులోనూ ఒక్క గోపిక, ఒక కృష్ణుడు కాదు. 18లక్షల మంది గోపికలకు 9లక్షల మంది కృష్ణులు. కావున ఇవి సామాన్యులు అనుకునే జలక్రీడలు కావు. ఇందులో ఏదో లోకాతీతమైన రహస్యం ఉంది.

విశేషార్థం : యజ్ఞం చేసిన తర్వాత అవభృథ స్నానం చెయ్యాలి. అది చెయ్యకపోతే యజ్ఞం పూర్తయినట్లు కాదు. భక్తితో చేసే మహాయజ్ఞం జపయజ్ఞం. "యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి" అన్న భగవద్వాక్యం అంతా ఎరిగినదే. దాంట్లో భాగమే ఈ పూజాయజ్ఞం. ఈరెండూ రాత్రి వేళనే జరిగాయి. మరి ఆపిమ్మట అవభృథస్నానం చెయ్యాలిగదా. దానికే జలక్రీడ అని పేరు. మనమీ అర్థాన్నే స్వీకరించాలి. లేనియెడల లోకాచారానికి విరుద్ధంగా జలక్రీడ జరిగిందని చెప్పాల్సి ఉంటుంది. మంత్రోపదేశమే ఒక దీక్ష. పూజించడమే ఓ యజ్ఞం. ఆటపాటలే భగవత్సేవలు. వీటి తర్వాత భగవంతుడితో కలసి స్నానం చెయ్యాలి. ఇదే యజ్ఞ ఫలానికి చివరి క్రతువు. అందుకే భగవంతుడు గోపికల్ని తనతో యమునా తీరానికి తీసుకుపోయాడని మనం గ్రహించాలి.

(ఈ భాగం శ్రీ భాగవతం, మరి కొన్ని గ్రంథాలనుండి గ్రహించబడింది.)

గోపికలంతా ఆడి పాడి అలసిపోయారు. అప్పటికే వారి మనస్సులన్నీ కృష్ణార్పితాలైనాయి. శ్రీకృష్ణుడు వారి శ్రమ పోగొట్టాలని భావించాడు. లోకాచారాన్ని అధిగమించి వాళ్ళందరికీ శాశ్వతమైన ఆనందం కల్పించాలనుకున్నాడు. అందుకే రాసమండలం నుండి బయటకు నడిపించాడు. వాళ్ళ శరీరాలకుండే పరిమళలాన్నీ పూలహారాలకు అంటుకొనగా ఆ పరిమళాలన్నీ రెట్టింపయి యమునా తీరమంతా వ్యాపించాయి. ఆ పరిమళాలకు భ్రమరాలు గుంపులు గుంపులుగా మూగి ఆనందంతో ఝుంకారాలు చేశాయి.

కాళిందీ హ్రదానికి రాధామాధవులు ముందు నడుస్తుంటే గోపికలంతా వారిని అనుసరించారు. కాళిందీ హ్రదంలో ప్రవేశించగానే శ్రీకృష్ణుడు నదీ జలాల్ని చేత్తో తీసుకొని గోపికలపై చల్లాడు. భగవంతుని చేతుల మీదుగా జారిన జలాలన్నీ నదిలో కలసి నది అంతా పరమ పవిత్రమయింది. అదే అవభృథస్నాన లక్షణం. ఆ తర్వాత ఆ గోపికలంతా దోసిళ్ళతో నీళ్ళుతీసుకొని పరమాత్మపై చల్లారు. ఆ జలాలన్నీ భగవంతుణ్ణి తాకి పరమ పవిత్రమయ్యాయి. ఈ విధంగా వారంతా పరస్పరానురాగంతో యమునా జలాల్లో విహరించారు.

ఈ విధంగా పరమేశ్వరుడు నిరంజనుడయినా ఆ సమయంలో మాత్రం ఆ స్త్రీ పరివారంతో కలసి విహరిస్తున్నట్లు నటించాడు. దేవతలంతా ఆకాశం నుండి చూస్తూ పూలవాన కురిపించారు. వీరి జల విహారంలో భ్రమరాలు ఝుంకారం చేస్తూ వారిని వదలి పోవడానికి ఇష్టపడలేదని, ఆ విహారంలో శ్రీహరిని గజరాజమని, గోపికల్ని ఆడ ఏనుగులని కవులు వర్ణించారు.

దేవతలు ఆకాశం నుండి వీక్షించుట :

ఆ గోపాలబాలుడు అనేక రూపాలు ధరించి లక్షలాది గోపికల్ని గాన నృత్య రూపాలతో అలరించాడు. విహారాలన్నీ పూర్తయి అలసిపోయి ఉన్న గోపికలందర్నీ జలక్రీడల పేరిట అవభృధ స్నానాలు చేయించేందుకు యమునా తీరానికి తీసుకొని పోయాడు. వారందర్నీ భక్తి పరవశుల్ని చేస్తూ తన సర్వవ్యాప్తిత్వాన్ని ప్రదర్శించాడు. ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు ఆకాశమంతా దేవతలు బారులు తీరారు.

పార్వతీదేవి పరమశివుని సగభాగాన్ని ఆక్రమించుకొని అర్ధనారీశ్వర తత్త్వాన్ని ప్రదర్శిస్తూ, రత్న ఖచిత రథాన్నెక్కి వచ్చారు. శంకరుని వామపార్శ్వంలో మహాకాళుడు, దక్షిణ భాగాన నందీశ్వరుడు, పురోభాగాన కార్తికేయుడు, పింగళాక్షుడు వంటి పార్షదులు, అష్టభైరవులు, క్షేత్రపాలకులు ఉన్నారు. బ్రహ్మ, సరస్వతీ హంసవాహనాన్నెక్కి రాగా, ఆయన వామభాగాన సప్తర్షులు, దక్షిణ భాగాన సనకాది బ్రహ్మమానస పుత్రులు ఉన్నారు. కర్మ సాక్షి అయిన ధర్ముడు, ఆయన వక్షఃస్థలంలో సతీ దేవి, సకామయు, వక్రలోచన అయి ఉంది. శచీదేవితో కలసి ఇంద్రుడు, రోహిణితో కలసి చంద్రుడు, స్వాహాదేవితో కలసి అగ్నిదేవుడు, సంజ్ఞాదేవితో కలసి సూర్యభగవానుడు, రతీ దేవితో కలసి మన్మథుడు వచ్చారు. వీరుకాక గ్రహాలు, దిక్పాలకులు వారి వారి భార్యలతో కలసి వచ్చారు. రాసమండలంలో చెలరేగుతున్న నృత్యగీతాలను, వరదలై పారే భక్తి పారవశ్యాన్ని వీరంతా ఆకాశం నుండి వీక్షించారు. ఆనందాన్ని తట్టుకోలేని వారు కొందరు మూర్ఛపోయారు. కొందరు ఆనందాతిశయంతో ఆడారు, పాడారు. ఆకాశం నుండి చందన పుష్పాదుల్ని వర్షంగా కురిపించారు. దేవతా స్త్రీలు రాసమండలంలోని గోపికల స్థితి తమకూ కావాలని కోరుకున్నారు.

శ్రీకృష్ణుడు రాసమండలాన్నంతా ప్రేమరసంలో నింపేశాడు. రాధతో కలసి యమునా తీరానికి బయలుదేరాడు. తాను పరబ్రహ్మమై, సనాతనుడై నడుస్తుంటే మాయాదేవి అయిన రాధ వెంటనడువగా గోపికలంతా వారిని అనుసరించి వెళ్ళారు. వారంతా యమునానదిలో జలకాలాడారు. శ్రీహరి దోసిళ్ళతో నీటిని రాధపై జల్లాడు. రాధకూడా మూడు దోసిళ్ళ నిండా యమునా జలాలను శ్రీకృష్ణపరబ్రహ్మంపై చల్లి నదినంతా పవిత్రం చేసింది. అప్పుడు శ్రీహరి రాధాదేవి పమిట పట్టుకొని లాగగా చీరముడి కాస్తా ఊడిపోయింది. చీర సర్దుకునే సమయానికే జడముడికూడా ఊడిపోయింది. దాంతో శరీరం అంతా స్నానానికి యోగ్యమైంది. కనుబొమల రంగు కరిగిపోయింది. క్రింది పెదవిపై రక్తం స్రవించి కెంపుల్లా ప్రకాసించింది. కళ్ళకాటుకంతా నీళ్ళపాలైంది. అనగా ఇది వ్రతాంగస్నానంకాదని, విహారస్నానమని శ్రీహరి నోటితో చెప్పకుండా ఈవిధంగా చేసి చూపాడు. ఆ తర్వాత రాధాదేవితో కలసి నీళ్లలో మునకవేశాడు. అప్పుడా రాధ తనవలె నగ్నంగా వున్న మరొక గోపికను శ్రీహరికి చూపి పక్కున నవ్వింది. ఈ క్రీడనంతా చూస్తున్న ఆ గోపిక దగ్గరగా వచ్చి శ్రీహరిపై మురిపెంతో నీళ్ళు చల్లింది. ఆపైన చేతిలో ఉన్న మురళిని లాక్కుని దూరంగా పారిపోయింది. అంతట ఆ జగన్నాయకుడు ఆ గోపికను అక్కున జేర్చుకొని నీళ్ళలో మునిగాడు. వెంటనే పైకి లేచి ఆ గోపికను దగ్గరకు తీసుకొని సరసాలాడాడు. అనగా శ్రీకృష్ణుని మూర్తులే శ్రీకృష్ణునితో క్రీడించారు. రాధాదేవిచేత

బ్రతిమాలించుకొని ఆమె చీరనామెకిచ్చాడు. అట్లాగే శ్రీహరికూడా రాధాదేవిని యాచించి తన పట్టువస్త్రాలను పొంది వాటిని ధరించాడు. ఆ రాసేశ్వరి శ్రీహరి ఒళ్ళంతా చందనం పూసింది. ఆసనం చూపి కూర్చోపెట్టి ఆపిమ్మట జడముడి సరిచేసుకుంది. శ్రీహరి మాలతీ మాలికలతో ఆమె కురులను అలంకరించాడు. కస్తూరీతిలకాన్ని ఆమె ఫాలభాగానదిద్ది, దానిక్రింద చందనపు బొట్టుపెట్టి ఆమె తలను తన వక్షఃస్థలంపై ఉంచుకొని ప్రేమతో లాలించాడు.

ఈవిధంగా ఆ గోపబాలుడొక్కడే గోపికలందరికీ అన్ని రూపాల్లో కనపడేట్లుగా నటిస్తూ మళ్ళీ వారందర్నీ రాసమండలానికి తీసుకొని పోయాడు. వారంతా రాధాదేవితో కలసి అనేక పుష్పోద్యానాలలోను, సరోవర తటాకాల్లోను ముప్పైమూడు దినాలపాటు విహరించారు. భగవద్దర్శనం వారికి తృప్తిని కలిగించలేదు. అగ్ని హోత్రంలో నెయ్యి ధారగా పోస్తూఉంటే అగ్ని వృద్ధి చెందుతుందే గాని తరుగదుగదా. అట్లాగే గోపికల తృష్ణ కూడా వృద్ధి చెందుతోందేగాని తరగడం లేదు. దేవతలంతా ఆ పరాత్పరునికి ధన్యవాదాలు తెలిపారు. వారి భార్యలంతా రాధాదేవి దర్శనమైందిగదా అని సంతోషించి ఇళ్ళకు పోయారు. మునులంతా భగవద్దర్శనమయినందుకు "ధన్యోస్మః" అను కుంటూ వెళ్ళారు. దేవతలంతా రాసక్రీడను పరిపరివిధాలుగా శ్లాఘించారు.

నారదా! ఇది రాసమండల విహారతత్త్వము నువ్వు కోరినట్లే అంతా వివరంగా చెప్పాను. నానుండి ఇంకేమైనా వినగోరుతున్నావా? చెప్పు.

నారదుడు: అష్టావక్రమునికి శ్రీకృష్ణ భగవానుడు ఎందువలన సంస్కారాలు చేశాడు?

శ్రీకృష్ణుడు అష్టావక్రుని ఉద్ధరించుట

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 26వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

శ్రీమన్నారాయణుడు: నారదమునీంద్రా! గోపికలంతా తమకు రాధామాధవుల ఏకాంత సేవాభాగ్యం లభించింది గదా అని సంతోషించారు. భగవన్మాయ ఆవరించి ఉండటం చేత రాధామాధవుల్ని శ్రీకృష్ణ పరబ్రహ్మంగా తెలుసుకోలేక పోయారు. శ్రీహరి రాధతో కలసి ఓ సరోవరానికి పోయి జలక్రీడలు చేస్తుండగా సహస్రదళములు గల కమలాన్నొకటి రాధాదేవికి బహూకరించి తానొకటి ధరించాడు. ఆ సరస్సులో నుండి బయటకు వచ్చి దగ్గరలో ఉన్న ఓ వటవృక్షం వద్దకు వెళ్ళారు. ఆ వృక్షం అతి పురాతనమైనది. అనేక శాఖోపశాఖలతో ఎంతో దూరం విస్తరించుకొంది. ఆ వృక్ష చ్ఛాయ అనేక జీవరాసులకు ఆలవాలమైంది. ఆ వృక్ష చ్ఛాయలో నుండి ఒక పురాణపురుషుడు శ్రీకృష్ణుని దర్శనానికి బయలుదేరాడు. ఆ మునీశ్వరుని ముఖము, నేత్రాలు ప్రసన్నంగా ఉన్నాయి. ధ్యానంలో శ్రీకృష్ణుని హృదయ పీఠంపై దర్శించ లేకపోయాడు. అందువల్ల ధ్యాన సమాధి నుండి బయటకు వచ్చి శ్రీకృష్ణ దర్శనార్థమై బ్రహ్మాండాలన్నీ తిరుగుతూ చివరగా ఈ రాసమండలం చేరుకున్నాడు. ఆ ముని నీలవర్ణంలో ఉన్నాడు. అవయవాలన్నీ వంకర తిరిగి ఉన్నాయి. తలంతా జడలు కట్టింది. దిగంబరంగా కనిపిస్తున్నాడు. ముఖం బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతోంది. అటువంటి

అష్టావక్రమునిని చూసి రాధాదేవి నవ్వగా శ్రీహరి ఆమెను వారించాడు. అప్పుడాముని గోవిందునికి నమస్కరించి పూర్వం శంకరుడుపదేశించిన శ్రీకృష్ణ స్తుతిని ఈవిధంగా కీర్తించాడు.

అష్టావక్ర కృత శ్రీకృష్ణ స్తుతి

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 26వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

ఓ శ్రీహరీ! నువ్వు గుణాతీతుడవు. సర్వగుణాధారుడవు. గుణబీజుడవు. గుణాత్మకుడవు. గుణాలకీశ్వరుడవు. ఇట్టి నీకు నమస్కారము. సిద్ధాత్మకుడవు. సిద్ధ్యంశమవు. సిద్ధిబీజభూతుడవు. సిద్ధి సిద్ధ గుణాధీశ్వరుడవు. సిద్ధులకు గురుడవు. పరాత్పరుడవు. ఇట్టి నీకు వందనములు. వేదబీజుడవై, వేదజ్ఞుడవై, వేదవిద్వద్వరుడవై, వేదజ్ఞాతాద్యరూపేశుడవైన నీకు నమస్కరిస్తున్నాను. బ్రహ్మానంతేశ శేషేంద్ర ధర్మాదుల కధీశ్వరుడవు, సర్వేశ్వరుడవై, బ్రహ్మాండ బీజ భూతుడవై అలరు నీకు నమోవాక్కములు. నీవే ప్రకృతివి, ప్రకృతీశ్వరుడవు. సంసార వృక్ష రూపుడవు; తద్బీజమువు. తత్ఫల రూపుడవు. ఇట్టి నీకు జోహార్లు. సృష్టి స్థిత్యంతబీజేశ్వరా! సృష్టిస్థిత్యంత కారణా! మహావిరాడ్రూపా! రాధికేశ్వరా! నీకివే నమస్కారములు. ఏ పరమాత్మునకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ మూదు స్కంధాలో వేదాలు శాఖోపశాఖలో, తపస్సులు కుసుమములో, సంసార ఫలములే ప్రకృత్యంకురములో, అట్టి మహా విరాడ్వృక్షమైన నీకు ప్రణామములు. తేజోరూపా! మహాత్మా! నీకివే ప్రణామాలు. అని స్తుతించిన ఆ మునీశ్వరుడు భగవంతుని పాదపద్మాలపై పడి యోగము ద్వారా దేహాన్ని త్యజించాడు. అతడి శరీరంనుండి ప్రకాశవంతమైన ఓ తేజస్సు అంచెలంచెలుగా పద్మూలేస్తూ శ్రీకృష్ణుని పాదపద్మాలపై పడి ఆ పరమాత్మునిలో లీనమయింది.

అష్టావక్రుని వృత్తాంతము

(ఈ ఘట్టము శ్రీకృష్ణజన్మఖండము 30వ అధ్యాయం నుండి గ్రహించబడింది. అయితే ఈ కథ బ్రహ్మాండ, విష్ణు పురాణాల్లోను, శ్రీభాగవతంలోను, దేవీభాగవతంలోను, హరివంశంలోను కనిపించదు.)

శ్రీకృష్ణుడు రాధాదేవితో కలసి రాసమండలంలో విహరించిన తరువాత అష్టావక్రమహర్షి అక్కడకు వచ్చి శ్రీకృష్ణుని పాదపద్మాలపై ప్రాణాలు విడిచేశాడు. మహర్షి 60వేల సంవత్సరాలు ఘోరతపస్సు చేయడం వల్ల శరీరంలో రక్తమాంసాలే కాదు ఎముకలు కూడా క్షీణించిపోయాయి. శరీరం కేవలం ఒక ఆకువలె మిగలగా అందులోనుండి ప్రాణాలు శ్రీకృష్ణపరమాత్మలో విలీనం అయ్యాయి. శరీరం ఒక ఎండుటాకు వలె నేలకొరిగింది. శ్రీకృష్ణుడా శరీరాన్ని ఎత్తి పట్టుకొని హృదయానికి హత్తుకొని ఆ తర్వాత చందనపు కట్టెలతో దహన సంస్కారాలు చేశాడు. అతడి శరీరం భస్మమై పోతూ ఉంటే శ్రీకృష్ణుడు దుఃఖం ఆపుకోలేక పోయాడు. ఇంతలో గోలోకం నుండి ఓ దివ్య రథం వచ్చింది. అందులో అనేక మంది విష్ణు పార్షదులున్నారు. శ్రీకృష్ణునే పోలి ఉన్న వారంతా రాధామాధవులకు నమస్కరించారు. సూక్ష్మరూపంలో ఉన్న మహర్షిని ఆ దివ్య రథంలో ఎక్కించుకొని గోలోకానికి తీసుకుపోయారు. ఆకాశం నుండి దేవతలు పుష్పవర్షాన్ని కురిపించారు.

మరునాడు ఆ రాధాంబ శ్రీకృష్ణునితో ఇలా అంది. "ప్రాణనాథా! ఈ మహర్షి అవయవాలన్నీ వికృతంగా ఉన్నాయి. చూడగా కుత్సితుడల్లే కనిపిస్తున్నాడు. ఈయన శరీరంలో నుండి తేజస్సు బయటకు వచ్చింది. ఎందువలన? ఈ మహర్షి ఎవరు? ఈ మహర్షి తేజస్సు నీ పాదారవిందాల్లో విలీనం కావడానికి గల కారణం ఏమిటి? ఈ పుణ్య పురుషుడెవరు? ఈతడికి గోలోక ప్రాప్తి కలగటానికి ఇతడు చేసిన పుణ్యకర్మలు ఎటువంటివి? నువ్వు స్వాత్మారాముడవు గదా. అట్టి నీవు కన్నీటితో సంస్కారం చేశావు. ఇందుకు కారణం ఏమైనా ఉందా? ఇతడి వృత్తాంతం అంతా నాకు తెలుపవలసింది" అని అడిగింది. అంతట శ్రీకృష్ణుడు అష్టావక్రుని వృత్తాంతాన్నీవిధంగా తెలిపాడు.

శ్రీకృష్ణుడు : ప్రాణేశ్వరీ! అష్టావక్రముని చరిత్ర వినదగిందే. ముందు ముందు ఈ చరిత్ర ముల్లోకాలవారు పండితుల ద్వారా తెలుసుకొంటారు. నువ్వు వినాలని కుతూహల పడ్తున్నావు కాబట్టి నేనే స్వయంగా చెప్తాను. దప్పికగా ఉన్న వాడికి పాలిస్తే దప్పిక తీరుతుందా? అట్లాగే వినాలని కుతూహలపడుతున్నావు కాబట్టి నేనే నీకు స్వయంగా చెప్తాను విను.

పూర్వం ఈ సృష్టినంతా నాలో విలీనం చేసుకొని ఉన్నప్పుడు అంతా జలమయంగా ఉండేది. ముందుగా శ్రీ మహావిష్ణువును, ఆయన నాభికమలంలో నుండి బ్రహ్మను సృష్టించాను. ఆ బ్రహ్మకు నలుగురు మానస పుత్రులు పుట్టారు. బ్రహ్మ మనస్సులో సంకల్పం చేసినంత మాత్రానే జన్మించిన వారు కాబట్టి వారిని మానస పుత్రులన్నారు. వారంతా అయిదు సంవత్సరాల లోపు పిల్లలే అయినా బ్రహ్మతత్త్వ విశారదులు. వారే సనక, సనంద, సనాతన, సనత్కుమారులుగా ప్రసిద్ధి చెందారు.

బ్రహ్మవారిని సృష్టి ప్రారంభించమన్నాడు. వారికి ప్రవృత్తి మార్గం నచ్చలేదు. నన్ను గూర్చి (శ్రీమన్నారాయణుడు) తీవ్రంగా తపస్సు చేశారు.

వారావిధంగా వేరొక ప్రదేశానికి పోయి తపస్సు చేయసాగారు. పిల్లలు తన మాట కాదన్నందుకు బ్రహ్మకు ఎక్కడలేని దుఃఖం కలిగింది. పట్టువిడువని బ్రహ్మ తపోధనులైన మరికొందరు పుత్రుల్ని పుట్టించాడు. వారంతా పుడుతూనే వేద వేదాంగ వేత్తలయ్యారు. బ్రహ్మతేజస్సుతో వెలిగిపోయారు. వారే అత్రి, పులస్త్యుడు, పులహుడు, వోఢువు, మరీచి, భృగువు, అంగీరసుడు, క్రతువు, వశిష్టుడు, కపిలుడు, అసురి, కవి, శంకువు, శంఖుడు, పంచశిఖుడు, ప్రచేతసుడు గా ప్రసిద్ధిచెందారు. ఈ పదహారుగురు తండ్రి అయిన బ్రహ్మ ఆజ్ఞను శిరసావహించి తపస్సుచేసి ఆ పిమ్మట సృష్టి ప్రారంభించారు. భార్యలతో కలసి సంసారం చేస్తూ తామర తంపరగా పిల్లల్ని కన్నారు.

పైన చెప్పిన బ్రహ్మ పుత్రుల్లో ప్రచేతసుండనే మహర్షికి నశయుడనే కుమారుడు కలిగాడు. ఈతడు భార్యతో కలసి వెయ్యి దివ్య సంవత్సరాలు తపస్సు చేసినా పుత్రుడు కలుగలేదు. విసిగిపోయిన నశయుడు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డాడు. అప్పుడు అశరీరవాణి ఇలా పలికింది. "ఓ మునీ! తొందరపడి ప్రాణత్యాగం చెయ్యకు. నువ్వు శివభగవానుని సన్నిధికి వెళ్ళి ఆయన కృపకు పాత్రుడవై మంత్రోపదేశం పొంది శ్రద్ధాభక్తులతో ఆ మంత్రాన్ని ఉపాసించు. ఆ మంత్రదేవత ప్రత్యక్షమై నీకోరిక నెరవేరేట్లు అనుగ్రహిస్తుంది. కావున వెంటనే శంకరుని సన్నిధికి పో" అని ప్రకటించింది. శివలోకానికి చేరుకోవడం యోగీశ్వరులకు కూడా అసాధ్యమే. అటువంటి శివసాన్నిధ్యానికి భార్యతో కలసి బయలుదేరాడు. యోగివలె శివుణ్ణి స్తోత్రాల చేత ప్రసన్నుణ్ణి చేసుకున్నాడు. భక్తితో హృదయమంతా నింపుకున్నాడు. దీనుడై కన్నీరు మున్నీరుగా విలపించాడు.

"ఓ శంకరా! నువ్వు జగద్గురుడవు. శివుడవు. మంగళప్రదుడవు. నువ్వు యోగీంద్రులకే గురుడవు. గురువులకే గురుడవు. మృత్యువుకు మృత్యువువు. మృత్యురూప సంసార ధ్వంసకుడవు. మృత్యుప్రదుడవు. లెక్కించువారికి కాలరూపుడవు. కాలకాలేశ్వరులకు కారణభూతుడవు, కాలాతీతుడవు. కాలకాలుడవు. గుణాతీతుడవు. గుణాధారుడవు. గుణబీజుడవు. పరబ్రహ్మస్వరూపం నీవే. బ్రహ్మజ్ఞుడవు నీవే. బ్రహ్మభావ తత్పరుడవు నీవే. ఇట్టినీకు నమస్కారములు".

దీన్నే సంసార కవచమంటారు. శంకరుడు ఈ కవచాన్ని ఉపదేశించి, త్వరలో నీకీ మంత్రాధిదేవత ప్రత్యక్షమై నీ అభీష్టాన్ని నెరవేరుస్తుంది అని చెప్పగా ఆముని భార్యతో కలసి తపస్సు చేసుకోవడం కోసం వెళ్ళాడు.

ఈ కవచానికే సంసార విజయమని కూడా పేరు. శంకరుడీ మంత్రాన్ని ఆమునికి ఉపదేశించి వెళ్ళాడు. అంతట ముని ఈ కవచాన్ని నూరు సంవత్సరాలు జపం చేశాడు.

ఓ రాధాదేవి! ఆ మంత్రాధి దేవతవు నీవే. నువ్వామునికి మహాజ్ఞాని కాగలవని ఆశీర్వదించి గోలోకానికి వచ్చేశావు. కొంతకాలానికి శివాంశతో ఆ మునికి ఒక కుమారుడు కలిగాడు. అతడికి దేవలుడు అని నామకరణం చేశాడు. ఆ బాలుడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆ బాలుడు రాజపుత్రిక

అయిన రత్నమాలను వివాహం చేసుకున్నాడు. అతడామెతో అనేక ప్రదేశాల్లో విహరిస్తూ ఆమె మనస్సు రంజింప చేశాడు. ఇట్లా వారు కొన్ని వందల సంవత్సరాలు స్వర్గ సుఖాలు అనుభవించిన తర్వాత ఒకానొక రోజున సంసారంపై విరక్తి కలిగింది. శ్రీహరి యెడల ఆసక్తి గలవాడై సంసారాన్ని విడిచి గంధమాదన పర్వతాలకు పోయి దీర్ఘకాలం తపస్సు చేశాడు. మర్నాడు లేవగానే దేవలుడి భార్య భర్త లేకపోవడం వలన విరహాగ్ని చేత శరీరం అంతా మంటలు మండినట్లయింది. ఆమె అన్నంతినలేదు. నీళ్ళు త్రాగలేదు. చివరకు ప్రాణత్యాగం చేసింది.

జితేంద్రియుడైన ఆ ముని గంధమాదన పర్వతానికి తపస్సు చేసుకోవడానికి ఉద్యుక్తుడవగా సుందరాంగుడైన ఆ దేవలమునిని చూసి రంభ ముచ్చట పడింది. దగ్గరకు పోయి నేను కామినీ జాతికి చెందిన రంభను. "మునిచంద్రా! దేవలమహర్షీ! నామాటలు ఆలకించు. నేను ఇవ్వలేని సుఖాలుండవు. కావున నువ్వు ఈ కఠోరమైన తపస్సును కట్టిపెట్టు. సుందరాంగులలో సుందరాంగుడివైన నువ్వు నన్ను వివాహం చేసుకో. నన్ను సుఖపెట్టి నువ్వు సుఖపడు. రసికురాలైన యువతికి రసికుడు లభించడం దుర్లభం. స్వర్గసుఖాల్ని ఆశించే రాజులు యజ్ఞాలు చేస్తూ ఉంటారు. అనగా స్వర్గసుఖాలకు మూలం మేమే కదా. అట్లాగే భోగాలకు సారం కూడా మేమే. మా అవయవాలన్నీ భోగసాధనాలే. అన్ని సుఖాల్లోను స్త్రీ రసమే సుఖసారమని తెలుసుకో. చిరునవ్వు లొలికించే చంద్రబింబం లాంటి నాముఖారవిందాన్ని చూస్తే ఎవడు మోహం చెందడు? నిర్జన వనాల్లో కోరిన రసికులతో సుఖాలనుభవించడం అంటే పూర్వజన్మల సుకృతమనే భావించాలి. మానవుడేగాని, రాక్షసుడేగాని, దేవతేగాని స్త్రీ సుఖమేమిటో తెలియని వాడైతే లోకం అతణ్ణి నిందిస్తుంది. జితేంద్రియుడే అయినా రహస్యస్థలంలో తన్ను కోరివచ్చిన కాంతను ఎవడు కాదంటాడో వాడు కుంభీపాక నరకంలో అనేక సంవత్సరాలు పడి ఉంటాడు. అంతేకాదు స్త్రీహత్యా పాతకం కూడా చుట్టుకుంటుంది. సృష్టికర్త అయిన బ్రహ్మ స్త్రీశాపం చేతనే గదా ముల్లోకాల్లోనూ పూజలకు అర్హుడు కాకుండా పోయాడు. కోరివచ్చిన స్త్రీని నిరాకరిస్తే ఆ స్త్రీకంటి చూపుతో అతడి బంధు జనాన్నంతటిని నాశనం చెయ్యగలదు. ఓ దేవలమునీంద్రా! పుంశ్చలి పురుషులందరిలో రసికుణ్ణి ప్రియుడుగా కోరుకుంటుంది. అటువంటి స్త్రీని ఎవడు తిరస్కరిస్తాడో అతడా స్త్రీని హత్య చేసిన వాడవుతాడు. స్త్రీహత్యా పాతకం జన్మజన్మల్లోనూ వెంటాడుతుంది. ఎవడు కోరిన వనితపై దయలేనివాడై ఉంటాడో అతడి కంటే పాపాత్ముడు మరొకడుండడు. ఓ మునిశ్రేష్ఠా! ధ్యానాన్ని విడిచిపెట్టు. నా ధ్యానంలోకి వచ్చి సుఖాలనుభవించు. రంభ ఈవిధంగా తన చాతుర్యాన్నంతా ప్రదర్శించింది. చెవిలో గూడుకట్టుకొని పలికిన రంభ మాటలు దేవలుని తపస్సుకు భంగం కలిగించింది. శాపమిచ్చేందుకు ఇష్టపడలేదు. నీతి వాక్యాలతోనే ఆమె మనస్సు మార్చి పంపెయ్యాలనుకున్నాడు.

దేవలుడు : రంభా! నువ్వు చెప్పినదంతా విన్నాను. తపస్వులకు బ్రాహ్మణులకు వేదోక్తంగా నిర్ణయించబడిన ధర్మం చెప్తాను విను. బ్రాహ్మణులు, తపస్వులు యుక్తవయస్కు లయ్యేంతవరకు వేదసారములైన ధర్మాల్నే ఆచరించాలి. యుక్తవయస్కులైన తర్వాత వివాహమాడి భార్యలతో కలసి రతిసుఖాలు అనుభవించవచ్చు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులలో ఎవడు పర భార్యలందు ఆసక్తి

చూపుతాడో అతడి ఇంట్లో లక్ష్మీదేవి ఉండదు. ఈ ధర్మం ముల్లోకాలవారికి వర్తిస్తుంది. ఎవడీ ధర్మాన్ని అతిక్రమిస్తాడో అతడీ లోకంలో నిందలపాలవడమే కాకుండా, పరలోకాన అంధకూపమనే నరకానికి పోతాడు. తన్ను వరించి వచ్చిన కాంతను వివాహమాడాలన్న ధర్మం గృహస్తులకే వర్తిస్తుంది గాని, మునులకు తపస్వులకు వర్తించదు. కాబట్టి ఆ కాంతలిచ్చే శాపాలు మునులకు తపస్వులకు వర్తించవు. బ్రహ్మ అంతటి వాడు గృహస్తుడు కావడాన వనితను కాదని శాపానికి గురి అయ్యాడు. కానీ మేము తపస్వులం కాబట్టి మాకటువంటి పాపం అంటదు. ఎవడైతే భార్యను వదిలేసి పరభార్యలతో కులుకుతాడో వాడి యశస్సు, ధనం, ఆయుర్దాయం నశిస్తాయి. తపస్వులకు యశస్సుపైగాని, రాజభోగాలపైగాని కాంక్ష ఉండదు. అమ్మా! నేనా కోరికలు లేనివాడిని. వృద్ధుడను. ఇటువంటి నాతో నువ్వేం సుఖపడగలవు. అందుచేత, మంచి అందగాడిని, సరసుడ్ని వయస్సులో ఉన్నవాడిని చూసి కోరుకో. అప్పుడే నీ మనోరథం నెరవేరుతుంది.

దేవలముని మాటలు రంభకు కోపంతో పెదవులదిరాయి. మునితో ఇలా అంది.

రంభ : మునీంద్రా! నీవు వృద్ధుణ్ణి అన్నావు. కానీ రూపలావణ్యాల్లోగానీ, అంద చందాల్లోగానీ మన్మధుణ్ణే తలదన్నావు. తపఃప్రభావం గల నీవంటి పురుషపుంగవుడంటేనే స్త్రీలు ఆత్మార్పణ చేసుకుంటారు. అటువంటి నిన్ను వదలి వేరొక పురుషుణ్ణి ఊహల్లోనైనా తలుచుకోలేను. పుంశ్చలియైన ఈ రంభ నిన్నువదలి ఎట్లా జీవించగలదనుకంటున్నావు? ఓ మునిచంద్రా! నిన్ను చూసింది మొదలు కామాగ్నితో మలమల మాడిపోతున్నాను. ఇదినిజం. నామాట విశ్వసించు. నన్ను త్వరగా స్వీకరించు. నా కామాగ్నిలో నీళ్ళుపోసి చల్లార్చే ప్రయత్నం చెయ్యకు. నువ్వెంతటి వేదవేదాంగ విశారదుడవయినా, నన్ను తృప్తి పరచని యెడల నా శాపం నుండి తప్పించుకోలేవు. ఆత్మ దుఃఖిస్తుందని తెలుసుకో. కావున నా శాపం వృథా కాదు. మరల్చడం బ్రహ్మతరం కూడా కాదు.

రంభ మాటలు విన్న దేవలముని మారుమాట్లాడకుండా ధ్యానంలో నిమగ్నుడయ్యాడు. దాంతో రంభకు పుండుపై కారం చల్లినట్లయింది.

రంభ : ఓ విప్రోత్తమా! స్త్రీ కోరివస్తే తలతిక్క మాటల్తో తప్పించుకోవాలని చూస్తున్నావు. నీ రూపలావణ్యాలన్నీ నశించి స్త్రీపొందుకు పనికిరాకుండాపోతావు. నీబుద్ధిలాగానే నీ అవయవాలు కూడా వక్రమైపోవుగాక. నీ బుద్ధి పెడదార్లుపట్టింది. అందువల్ల నీ శరీరం వికృతాకారం పొంది లోకులు నిన్ను చూసి అసహ్యించుకుంటారు. ఇంతవరకు నువ్వు చేసిన తపస్సంతా నశిస్తుంది.

రంభ ఈవిధంగా మునిని శపించి తనలోకానికి పోయింది. దేవలముని తపస్సంతా నాశనం కావడం వల్లనేమో ఎంతకాలం తపస్సు చేసినా హరిపదాన్ని చేరుకోలేకపోయాడు. అందుకు రంభ శాపమే కారణమై ఉంటుందని ఊహించాడు. అవయవాలన్నీ వంకర్లు తిరిగి పోవడంతో ఇంక జీవించడం వ్యర్థం అనుకున్నాడు. దేహత్యాగానికై చితిని పేర్చుకున్నాడు. అగ్ని ప్రవేశం చెయ్యబోయే సమయానికి శ్రీకృష్ణ పరబ్రహ్మము (నేను) అతడి ముందు ప్రత్యక్షమయి "మునీంద్రా! అగ్ని ప్రవేశం చెయ్యకు. రంభ శాపాన్ని గూర్చి మనోవ్యథ చెందకు. నేనిప్పుడే నీకు ధర్మబోధ చేసి దివ్యజ్ఞానాన్ని

ప్రసాదిస్తాన"ని చెప్పాను. ఓ రాధాదేవీ! దాంతో ఆముని శాంతుడయ్యాడు. అతడి ఎనిమిది అవయవాలు వంకర తిరిగి ఉండటం చూశాను. అప్పటికప్పుడే అతడికి "అష్టావక్రుడ"ని నామకరణం చేశాను.

ఆ తర్వాత నా అనుమతితో ఈ దేవలముని మలయ పర్వతాలకు పోయి 60వేల సంవత్సరాలు సుదీర్ఘమైన తపస్సు చేశాడు. ఆ తర్వాత ఇప్పుడు నన్ను దర్శించగలిగాడు. మహాప్రళయమే సంభవించినా కూడా నా భక్తుడు నశించడు. కొంచమైనా ఆహారం లేకుండా 60వేల సంవత్సరాలు తపస్సు చేయడం వలన అతడిలో జఠరాగ్ని రాజుకుంది. రక్తమాంసాలన్నీ భస్మమయ్యాయి. నన్ను చూడటానికి మలయ పర్వతంనుండి వచ్చి నా పాదపద్మాలవద్ద ప్రాణాలు విడిచాడు. అందువల్లనే నేనతడికి సంస్కారం చేశాను. రాధా! అష్టావక్రుడి వంటి భక్తుడు ఈ భూమిపై ఇంతవరకు పుట్టలేదు. ఇకపై పుట్టబోడు. ఈ మహాముని పుంశ్చలీ శాపం వలన ఇటువంటి దుస్థితి కొంతకాలం అనుభవించాడు.

విశేషార్థం : ఈ అష్టావక్రుని ఉదంతంలో మనమొక అద్భుతాన్ని చూస్తాం. భగవంతుడు భక్త వరదుడు కాబట్టి దేవలమునిని కౌగలించుకొని ముక్తిని ప్రసాదించాడు. భగవంతుడికిదేం క్రొత్త కాదు. అట్లాగే నిద్రాహారాలు మాని 60వేల సంవత్సరాలు తపస్సు చేసిన వారికి రక్తమాంసాలు జీర్ణమై పోవడంలోకూడా ఆశ్చర్యమేమీలేదు. ఎందువల్ల నంటే తన్ను నమ్ముకున్న వారిని కడతేర్చడం భగవంతుడి స్వభావం. రామావతారంలో జటాయువుకు, విరాధునికి సంస్కారాలు చెయ్యలేదా? శబరిని ఉత్తమలోకాలకు పంపలేదా? అటువంటి కరుణానిధి ఈ అష్టావక్రునికి సంస్కారం చెయ్యడంలో ఏమీ ఆశ్చర్యంలేదు. వీళ్ళంతా లోకాతీత పురుషులు. సామాన్య ధర్మాలు వీరికి వర్తించవు. అంతెందుకు బ్రహ్మమానస పుత్రులైన సనక సనందన సనాతన సనత్కుమారులు తండ్రిమాటను లక్ష్యపెట్టకుండా నివృత్తి మార్గాన్నెన్నుకొని తపస్సు చేసుకోవడానికి పోవడం కూడా ఆశ్చర్యంగానే కనిపిస్తుంది. ఇదే సామాన్యుల విషయంలో అయితే కడుపున చెడపుట్టారంటారు. అయితే ఈ నలుగురు తండ్రి మాట వినకపోయినా కూడా లోకంలో పూజ్యులే అయ్యారు. ఎందువల్ల? సామాన్య ధర్మాలు లోకాతీత పురుషులకు వర్తించవనే గదా. అయితే వారికి కూడా ధర్మాన్ని అతిక్రమిస్తున్నామన్న భావన ఉండదు. అందువల్ల వారిని ఆక్షేపించరాదు. భగవదారాధనే ప్రధానమని నమ్ముకున్న వారు ఇతర ధర్మాలు పాటించరు. ఈ విషయంలో సామాన్యులు మాత్రం వీరిని ఉదాహరణగా చెప్పి ధర్మాన్ని అతిక్రమించరాదు.

ఒక మహా తపస్విని ఒక వేశ్య శపించడమే ఈ కథలోని మహాద్భుతం. రంభ చెప్పిన నీతులు కొట్టిపారెయ్యాల్సినవి కావు. రంభలో బలమైన కోరిక కలిగింది. ముని ఆ కోరిక తీర్చక పోతే తనకు చావు తప్పదనుకొంది. ప్రాణం పోతోందన్న భీతితోనే అంత తీవ్రమైన శాపాన్నిచ్చింది. పుంశ్చలి అంటే స్వేచ్ఛగా తిరిగే స్త్రీ అని అర్థం. అనగా వెలయాలు లేక కులట అని కూడా చెప్పుకోవచ్చు. అటువంటి స్త్రీ తన ప్రాణాలు నిలుపుకోవడం కోసం చెప్పిన ధర్మాలన్నీ సామాన్య మానవులకే గాని, తపస్వులకు వర్తించరాదు. పుంశ్చలి పరభార్య కాదు. ఎందువల్ల నంటే ఆమె దాసి వంటిది. ఎవరి సేవలో ఎన్నాళ్ళుంటుందో అన్ని రోజులు వారికామె స్వంతం అవుతుంది. అయినా కూడా పుంశ్చలితో

సంగమాన్ని గృహస్థులు ఆచరించినా అది ధర్మం కాదు. లంపటులు ఈ ధర్మాన్ని అడ్డుపెట్టుకొంటూ ఉంటారు. అటువంటి కులట, ఒక వెలయాలు మహాతపస్వి అయిన మునికి ఎట్లా శాపం యిచ్చింది? ఆ ముని కూడా ఆ శాపఫలాన్ని ఎందువల్ల అనుభవించాల్సి వచ్చింది. అన్న ప్రశ్నలుదయించకమానవు. "గహనా కర్మణోగతిః" అని శ్రీకృష్ణ పరమాత్మ ఆజ్ఞాపించాడు. కర్మ సిద్ధాంతం అన్నింటికన్నా బలమైనది. త్రిమూర్తులు కూడా ఆ కర్మ ఫలానికి లోబడి ఉండాల్సిందే. ఇక అష్టావక్రుని మాట ప్రత్యేకం చెప్పేందుకేముంటుంది? అష్టావక్రుని పూర్వ జన్మల కర్మఫలం రంభ శాపం ద్వారా అనుభవించాడు. ఆ కర్మ ఫలానుభవం తీరగానే శ్రీకృష్ణ పరబ్రహ్మము పాదాలవద్దకు వచ్చి వాలాడు. ఆయన దయకు పాత్రుడయ్యాడు. ముక్తుడయ్యాడు.

మానవులు మంచి పనులు చెడ్డ పనులు రెండూ చేస్తూ ఉంటారు. మంచి పనుల ప్రభావం ఎక్కువైతే భగవద్భక్తి కలుగుతుంది. కాబట్టి సంసారమనే సముద్రంలో భక్తి అనేది నౌక. ఆ మహానౌకను ఆశ్రయిస్తే ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా ఒడ్డుకు చేరుస్తుంది. కాబట్టి భక్తి మార్గాన్ని ఆశ్రయించి భగవద్దర్శనానికి ప్రతిమానవుడు కృషి చెయ్యాలి.

బృందావనమన్నది గోలోకంలో శ్రీకృష్ణ పరబ్రహ్మము క్రీడించే విహారస్థలం. అందులో రాసమండలం కూడా ఒక భాగమే. భూలోకాన రాసమండలంలో రాధాదేవి గోపికలు విహరిస్తూ ఉండగా అష్టావక్రముని శ్రీకృష్ణుని పాదాల నాశ్రయించాడు. భగవంతుడాతనికి ముక్తిని ప్రసాదించాడు. ఆ తర్వాత భగవంతుడు ఏయే లీలలను చూపాడన్నదే ముఖ్యం. అందులోని అద్భుత విషయాన్ని మనమిప్పుడు చర్చిద్దాం.

శ్రీహరి సాన్నిధ్యంలో రాధాదేవి, గోపికలు రాసక్రీడలలో అలౌకికానందాన్ని పొందారు. వారంతా గోలోకం నుండి వచ్చినవారే కదా. గోపికల వేషంలో ఉండే లతలు, గుల్మాలు, ఓషధులు కూడా ఉన్నాయి. అయితే వాళ్ళందర్లో ఎవరు వ్రజవాసులో ఎవరు వనవాసులో తెలుసుకోవడం ఆ బ్రహ్మాతరం కూడా కాదు. నిజానికి శ్రీహరి అసంగుడే అయినా, బృందావనంలో జీవిస్తున్నాడు కాబట్టి తాను కూడా వారితో క్రీడలు కోరుకుంటున్నట్లుగా నటించాడు. ఆ యమునా తీరమంతా కదంబ వృక్షాలతోను, మందమారుతాలతోను, వెదురుపొదలతోను దట్టంగా అలముకొని ఉంటుంది. అటువంటి రమణీయ ప్రదేశాల్లో శ్రీకృష్ణుడు రాధాదేవితో కలసి రాసక్రీడలు జరిపాడు. వారిద్దర్నీ చుట్టుముట్టి గోపికలంతా తమ జన్మ ధన్యమైందిగదా అని సంతోషించారు. ఆ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కొందరు వీణావాద్యాలు మ్రోగించారు. కొందరు నాట్యం చేశారు. జయ జయ ధ్వానాలు చేశారు. శ్రీహరి లీలల్ని స్తుతించారు. పరమాత్ముడికి మంచి రుచికరమైన ఫలాలను సమర్పించారు. పూవులిచ్చారు. తేనెలు త్రాగించారు. కొందరు బలవంతంగా శ్రీకృష్ణుని ముద్దుపెట్టుకున్నారు. కొందరు పాదాలను సేవించారు. పూలు లతలతో కూడిన హారాలను శ్రీకృష్ణపరబ్రహ్మానికి సమర్పించుకున్నారు. ఇవి చాలవన్నట్లు ఆకాశం నుండి తిలకిస్తున్న దేవతలు ఆనందంతో పూలవాన కురిపించారు. ఈవిధంగా గోపికల మనోరథాలన్నీ ఈడేరాయి. భక్తవత్సలుడైన ఆ సర్వేశ్వరుణ్ణి సేవించుకోవడంతో భగవత్ప్రసాదం అందరికీ లభించినట్లైంది.

అసురముని వృత్తాంతం :

అసురముని నారద పర్వతంపైన శ్రీకృష్ణుని గూర్చి తపస్సు చేశాడు. రాధాకృష్ణులిద్దర్నీ హృదయపీఠంపై జ్యోతిరూపునిగా నిలుపుకొని ధ్యానం చేస్తూ ఉండేవాడు. కొంతకాలానికి రాధాకృష్ణులు ఆ మునికి సమాధిలో దర్శనం ఇస్తూ ఉండేవారు. ఒకరోజున భగవంతుని ధ్యానిస్తూ ఉండగా శ్రీహరి దర్శనం కాలేదు. మళ్ళీ మళ్ళీ ధ్యానాన్ని తీవ్రతరం చేసి ధ్యానించాడు. అయినా శ్రీహరిని దర్శించలేకపోయాడు. దాంతో మునికి మనసంతా దుఃఖంతో నిండిపోయింది. కాళ్ళూ చేతులాడలేదు. నారద పర్వతంపై ఉండలేకపోయాడు. వెంటనే బదరికిపోయి నారాయణాశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ కూడా శ్రీహరి దర్శనం కాలేదు. అక్కడుండే విష్ణుపార్షదుల్ని భగవంతుడెక్కడ? అని అడిగాడు? వారెవరూ తమకు తెలియదన్నారు. దాంతో ఆ ముని అక్కడ ఒక్క నిమిషం కూడా నిలవలేక అక్కడ నుండి శ్రీహరిని వెతుక్కుంటూ క్షీరసాగరంలోని శ్వేత ద్వీపానికి పోయాడు. అనంతుడిపై శయనించి ఉండాల్సిన భగవంతుడు అక్కడకూడా కనిపించలేదు. అక్కడనుండి సరాసరి వైకుంఠానికే వెళ్ళి విచారించగా లక్ష్మీనారాయణుల జాడే కనిపించలేదు. పట్టువిడువని అసురముని గోలోకానికి పోయాడు. అక్కడా పరాత్పరుణ్ణి చూడలేక పోయాడు. అక్కడి పార్షదుల్ని విచారించగా భగవానుడు వామన బ్రహ్మాండంలో ఉన్నాడని చెప్పారు. కొండంత ఆశతో పోయిన అసురమునికి అక్కడ కూడా నిరాశే ఎదురయ్యింది. ముని అక్కడ నుండి కైలాసానికి వెళ్ళి అక్కడ శ్రీకృష్ణుణ్ణే ధ్యానిస్తున్న శివభగవానుని చూసి మహదానందంతో నమస్కరించి ఇలా అన్నాడు. "మహాదేవా! బ్రహ్మాండాలన్నీ తిరిగాను. గోలోకానికి పోయాను. వైకుంఠంలో వెదికి చూశాను. ఎక్కడా శ్రీకృష్ణ పరమాత్మ దర్శనం కాలేదు. నువ్వు సర్వ వేత్తవు కాబట్టి శ్రీకృష్ణ భగవానుడెక్కడున్నాడో తెలిపి పుణ్యం కట్టుకోమ్మని ప్రార్థించాడు." మహాదేవుడు అసురమునితో ఇలా అన్నాడు. "అసురమనీ! నువ్వు ధన్యాత్ముడవు. శ్రీకృష్ణునిపై నీకు భక్తి కుదిరింది. శ్రీకృష్ణ దర్శనం కొరకు వ్యాకుల పడి బ్రహ్మాండాలన్నీ తిరిగి వచ్చావు. కోరికలు గల వారికా స్వామి కనిపించడు గదా. కాబట్టి కర్మేంద్రియాల ద్వారా భగవంతుని చూడలేవు. అతడిది నిర్గుణ తత్త్వము. ఆ మహానుభావుడు ప్రస్తుతం బృందావనంలో రాధాదేవి, గోపికలతో విహరిస్తున్నాడు. ఇప్పుడా మహామహుని రసికేశ్వరుడంటారు. ఆయనీరాత్రిని ఆరు నెలల కాలంగా ఉండాలని సంకల్పించాడు. అనగా విష్ణు మాయచేత ఈవిధంగా చేశాడు. నేను ఇప్పుడాయన్ను చూసేందుకు బయలు దేరుతున్నాను. నీవుకూడా నాతో రావలసింది. నీ మనోరథం కూడా ఫలిస్తుంది" అన్నాడు.

విశేషార్థం : రాసక్రీడలో కోట్లాది గోపికలున్నట్లు చెప్పబడింది. రాసమండలం అంటే భగవంతుని పూజించే చక్రమని మనం చెప్పుకున్నాం. కావున ఆ చక్రంలోని దళాలకు సరిపడా అధిదేవతలుండాలి. అన్ని కోణాల్లోనూ వారుంటేనే గాని చక్రకోణములు దేవతా పరివృత్తాలు కాజాలవు. అటువంటి చక్రానికో అధినాయకుడుగా అలరారుతున్న శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని దర్శించేందుకు ఇంద్రాది దేవతలు, మహర్షులు, యక్ష గంధర్వులు ఇట్లా ఊర్ధ్వలోకంలో ఉండే వారంతా ఈ సంబరం చూసేందుకు బారులు తీరి నిలబడ్డారు. ఆ పరమ పురుషుని సంకల్ప మాత్రం చేతనే రాధాదేవి లతల్ని, గుల్మాలను, పొదలను గూడా గోపికలుగా మార్చి రాసమండలాన్ని నింపింది. ఇక్కడ రాధాదేవియే భగవదిచ్ఛ అయిన మాయాదేవి.

శ్రీకృష్ణుడే పరమపురుషుడు. సగుణ బ్రహ్మరూపంలో వ్యవహరించబడుతున్నాడు. శ్రీ శంకరాచార్యులవారు కూడా ఈ సిద్ధాంతాన్నే ప్రతిపాదించారు. శ్రీ రామానుజాచార్యులవారు కూడా శ్రీపరతాన్ని సాధించారు. అనగా ఈ సిద్ధాంతం సర్వజనామోదం పొందినదే. కావున కోట్లాది గోపికలు ఎక్కడనుండి వచ్చారు? వీరంతా ఇతరుల భార్యలా? రాసక్రీడలంటే జారత్వమా? అనే ప్రశ్నలన్నీ అర్థం లేనివేనని తేలుతోంది గదా. ఈ రాసక్రీడ అంతా భగవంతుని ఇచ్ఛ ప్రకారం ఆరునెలలు సాగింది. అనగా ఆ రాత్రి ఆరునెలల వరకూ తెల్లవారకుండా ఉండేట్లుగా సాగింది. అనగా మానవుల కాలమానం ప్రకారం ఆరునెలల కాలం నాలుగు యామములుగా పరిగణించబడిందని తాత్పర్యం.

ఇక అసురమునికి ఎందువల్ల దర్శనమియ్యలేదని ప్రశ్నించే వారుంటారు. భగవంతుడు ఒక్కొక్క పుణ్యకర్మకు ఒక్కొక్కచోట దర్శనమిస్తూ ఉండటం ఆయన స్వభావం. బృందావనంలో రాసక్రీడలు జరిపే ప్రదేశంలో ప్రకృతి ప్రక్కనే ఓ రూపాన్ని దాల్చి ఉండగా దేవతలు దర్శించి ఆనందించదగిన స్థలం. అందువల్లనే ఇంద్రాది దేవతలంతా దర్శించి కృతార్థులమైనామని సంతోషపడ్డారు. ఇటువంటి స్థలంలో ఆ మునికి దర్శనమివ్వాలని తలచాడు. అంతేకాకుండా అసురముని దృఢభక్తిని పరీక్షించాలనుకున్నాడు. అందుకోసమే బ్రహ్మాండాలన్నీ తనకోసం వెదికేట్లు చేశాడు. విష్ణుభగవానుడు భక్తుల్ని తీవ్రమైన పరీక్షలకు గురిచేసి దృఢభక్తి ఏర్పడిన తర్వాతేగాని కరుణించడు. ఆ పరీక్షలో ఒక భాగంగా మునికి దర్శనం కాకుండా చేశాడు. శ్రీకృష్ణుడు సర్వశబ్ద వాచ్యుడన్న నమ్మకంతో శ్రీకృష్ణ రూపాన్ని దర్శిస్తూ, నామాన్ని జపిస్తూ మనోఫలకంపై నిలుపుకోవాలి. ఇదే సనాతన ధర్మ మార్గం. ఉపనిషద్వారము ఇదే.

శంకరుడు శ్రీకృష్ణుని సేవించుట

(ఈ భాగం గర్గ సంహిత నుండి గ్రహించడమైంది. మరే గ్రంథంలోను ఈ కథ కనిపించదు.)

శివభగవానుడు, అసురముని బృందావనాన్ని చేరుకున్నారు. అక్కడ కోట్లాది గోపికలు సందడిగా తిరుగుతున్నారు. గోపీత్వం పొందని వారెవ్వరికీ రాసమండలంలో ప్రవేశించరాదని అక్కడి వారంతా చెప్పారు. వారి మాటల్ని మన్నించి శంకరుడు అసురముని మానస సరోవరంలో స్నానంచేసి గోపీత్వాన్ని పొంది రాసమండలంలో ప్రవేశించారు. ప్రాంగణమంతా దీపస్థంభాలమర్చారు. తీరైన వీధులను ఏర్పాటు చేశారు. సెలయేర్లు పారుతున్నాయి. తటాకాల్లో నీరు స్ఫటికంలా నిర్మలంగాను, మంచువలె చల్లగాను ఉంది. ఆ సరస్సులో సహస్ర దళ కమలాలున్నాయి. వాటిపైనుండి వచ్చే పరిమళాలు గాలిలో కలసి రాసమండలమంతా వ్యాపించింది. రాధాదేవి వెంటరాగా శ్రీకృష్ణ పరబ్రహ్మమా రాసమండలంలో ప్రవేశించాడు. కోట్లాది మంది గోపికలు రాధామాధవుల్ని సేవిస్తున్నారు. శ్రీకృష్ణ పరబ్రహ్మను దర్శించగానే శివభగవానుడు, అసురముని నమస్కరించి ఇలా స్తోత్రం చేశారు.

ఓ కృష్ణా! మహాయోగివి. గోవిందుడవు. జగత్పతివి. పుండరీకాక్షుడవు. గరుడధ్వజుడవు. ఇట్టి నీకు నమస్కారములు. మహాత్మా! దేవాది దేవా! నీవిప్పుడే పరిపూర్ణ స్వరూపుడవయ్యావు. భూభారాన్ని

తగ్గించేందుకే అవతరించావు. సత్పురుషులకు శుభాలు కలిగించాలని సంకల్పించావు. ఈ రెండు మహత్తర కార్యాలను సాధించేందుకు నంద గోకులంలో అవతరించావు. గోలోకనాయకా! లోకాలన్నీ నీ అంశచేతను, అంశాంశములచేత విశ్వాన్నంతటిని భరిస్తున్నావు. ఈ రాసమండలాన్ని ఆసక్తితో అలంకరించావు. బృందావనమంతా నీ తేజస్సుతో నిండి ఉంటుంది. గోవర్ధనోద్ధారకా! పరమాత్మ స్వరూపా బృందావనంలో నిత్యం విహరించే వాడా. రాధామనోనాయకా! గోవిందుడవైన నీకు నమస్కారము. పరమ పురుషా! శ్రీరాధాంచహృదయ విభూషణుడవు. శ్రీ రాసమండల నాథుడవు. వ్రజమండల పతివి. బ్రహ్మాండ మండల మహీ పరిపాలకుడవు. ఇట్టి నీపాదారవిందములకు నమస్కారము.

మహాత్మా! నువ్వు పరిపూర్ణుడవైనా అఖండ తేజోవిరాజితుడవైనా ఈ బృందావనంలో గోపికలతో కలసి ఆసక్తితో రాసమండల విహారాలు చేస్తున్నట్లుగా నటిస్తున్నావు. నీ తేజస్సు అంతటా వ్యాపించి ఉంటుంది. ఇప్పుడిక్కడ ఉన్నట్లుగా కనిపిస్తున్నావు. ఇట్టి నీకు వందనములు. అని ప్రార్థించగా, గోవిందుడు, రాధాదేవి ఎంతో ఆనందించారు. వారితో భగవానుడు ఇలా అన్నాడు.

"మహాత్ములారా! మునివర్యా 60వేల సంవత్సరాలు నిష్ఠతో తపస్సు చేశావు. నా దర్శనం కాలేదు. మీరు ఏవిషయంలోను ఆపేక్ష లేనివారు గదా. ఎవరైతే కోరికలు లేనివాడై, శత్రువులు లేనివాడై ఉంటాడో అటువంటి వాడే నాకు మిత్రుడు. కావున మీరిద్దరూ నాకు అత్యంత ఆప్తమిత్రులు. ఏదైనా వరం కోరుకోండి ఇస్తాను" అని అన్నాడు. అందుకు శంకరుడు, అసురముని ఇలా బదులు చెప్పారు.

"కృష్ణా! మీ ఇద్దరి పాదపద్మాలకు నమస్కారం చేసే భాగ్యం కలిగించి మేముకూడా నీతోపాటే బృందావనంలో ఉండేందుకు అనుగ్రహించు. రాధామాధవుల పాదాలకు ఇవే మా నమస్కారములు" అని అన్నారు.

వారిమాటలు విన్న శ్రీహరి "అట్లే అగుగాక" అని అనుగ్రహించాడు. ఆనాటి నుండి శంకరుడు, అసురముని బృందావనంలో యమునా తీరాన ఆ వటవృక్షచ్ఛాయలో చాలాకాలం నివసించారు.

ఈ రాసలీలా కాలం ఒక్క రాత్రియే. కానీ శ్రీకృష్ణుని మహిమచేత ఆరుమాసాలకు సమానమయ్యింది. గోపికలందరికీ ఆ రాత్రి క్షణకాలంగా గడచిపోయింది. ఆనందపరవశులయ్యారు. సూర్యోదయం కాగానే గోపికలంతా ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు. శ్రీకృష్ణుడు తెల్లవారుతూనే నందభవనానికి చేరుకున్నాడు. రాధాదేవి కూడా తెల్లవారగానే వృషభానుని పురంలోని తండ్రి ఇంటికి చేరుకుంది. ఇదే శ్రీకృష్ణ పరమాత్మ ఆడించిన రాసక్రీడ. దేవతలంతా మనోజ్ఞమైన ఆ వేడుకల్ని తిలకించారు. ఇక సామాన్యుల మాట ప్రత్యేకంగా చెప్పాలా?

పూర్వం రామావతారంలో శ్రీరాముడిని చూసిన మునులంతా మోహపరవశులయ్యారట. శ్రీరాముడిని కౌగలించుకోవాలన్న ప్రగాఢ వాంఛను తెలియపరచారట. వారి భావాన్ని పసిగట్టిన శ్రీరాముడు భవిష్యత్కాలంలో కృష్ణావతారంలో మీ కోరిక తీరగలదని చెప్పినట్లు లోకంలో ఒక కథ

ప్రచారంలో ఉంది. అయితే రామాయణంలో ఇది కనిపించదు. అయితే ఈ కథలో ఒక విశేషం కనిపిస్తుంది. అదే, శంకరుడు, అసురముని గోపికలుగా మారడం. వినడానికిది విచిత్రంగా కనిపిస్తుంది. అయితే లోతుగా విచారిస్తే ఇందులో విచిత్రమేదీ లేదని తెలుస్తుంది.

శివుడు, అసురముని కైలాసం నుండి బృందావనానికి వచ్చారు. అక్కడ రాసమండలమే ప్రధానం. రాసక్రీడ శ్రీకృష్ణ పరమాత్ముకు అత్యంత ప్రీతిపాత్రమైన క్రీడ. అక్కడ శ్రీకృష్ణుడు ఒక్కడే పురుషుడు. మిగిలిన వారంతా శ్రీకృష్ణాంశతో కూడిన గోపికలు. శ్రీకృష్ణుడు వారికి ఆనందాన్ని చేకూర్చడమే ఆ క్రీడ. ఆ క్రీడలో ప్రధానదేవత రాధాదేవి. మిగిలిన పరివార దేవతలంతా ఆమె ఇచ్ఛానుసారం మెలిగేవాళ్ళే. శ్రీకృష్ణుడే అందరికీ అన్ని రూపాలుగా కనిపిస్తూ అలరిస్తాడు. అటువంటి సర్వాంతర్యామి అయిన పరాత్పరుని లీల చూడటానికే దేవతలంతా భార్యలతో కలసి వచ్చారు. ఇంతమంది దేవతలు మహర్షులు రాసమండలంలో క్రీడిస్తున్న భగవంతుణ్ణి చూసి తరించాలనుకున్నారు. ఎందువల్ల?

నిర్గుణ పరబ్రహ్మమును ఉపాసించడం సాధ్యం కాదు. అనగా నామరూపాలు లేని స్థితి. ఆ తత్త్వం సర్వత్రా వ్యాపించి ఉంటుంది. భక్తులు సేవించే అవకాశం కల్పించేందుకే ఆ తత్త్వం ప్రకృతిని ఆశ్రయించి నామ రూపాలను పొందుతుంది. నామరూపాలు పొందిన ఆ తత్త్వాన్ని సగుణ బ్రహ్మము అంటారు.

"బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున
తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ పరంతప

– భగవద్గీత

(ఓ అర్జునా! నీకూ నాకూ అనేక జన్మలు గడచిపోయాయి. పరంతపా! వాటన్నింటినీ నేనెరుగుదును. కానీ నువ్వెరుగవు.)

అని భగవానుడు అర్జునునకు ఉపదేశించాడు. ఆ జన్మములనగా అసంగుడైన పరబ్రహ్మము లోకం కోసం సంగుడవుతాడని చెప్పడమే దీని సారం. భక్తులు అటువంటి అవతారాల్ని ఆశ్రయించి తరించాల్సి ఉంటుంది. ప్రకృతితో కూడి ఉన్నప్పుడే పరమాత్ముడు భక్తుల కోరికలు తీర్చగలుగుతాడు. అనగా తాను సాక్షీభూతంగా ఉంటూ కార్యభారాన్నంతా ప్రకృతికి అప్పగిస్తాడు. ఆమె శక్తి అపారం. భగవత్కరుణ పొందాలంటే ఆమె అనుగ్రహాన్ని పొందాలి. ప్రకృతి అంటే కేవలం భగవంతుని ఇచ్ఛా శక్తియే. ఈ మాట వేదాలంగీకరించాయి.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోపి సన్
ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మ మాయయా॥

– భగవద్గీత

(నేను చావు పుట్టుకలు లేనివాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను. అయినప్పటికీ, నాప్రకృతిని వశపరచుకొని ఆత్మ మాయచేత అవతరిస్తూ ఉంటాను.)

"యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్

– భగవద్గీత

(ఓ భరతకుల శ్రేష్ఠుడా! ఎప్పుడు ధర్మం నశించి అధర్మం వృద్ధి చెందుతుందో, అటువంటి సమయాల్లో నన్ను నేను సృష్టించుకుంటూ ఉంటాను. అనగా అవతరిస్తాను.)

"వీతరాగ భయక్రోధా మన్మయా మాముపాశ్రితాః
బహవో జ్ఞాన తపసా పుతా మద్భావ మాగతాః"
యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహం
మమవర్మాను వర్తంతే మనుష్యాః పార్థ సర్వశః

(అనురాగము, భయము, క్రోధము వదలి నాయందే మనస్సు లగ్నంచేసి నన్నే ఆశ్రయించే సత్పురుషులు జ్ఞాన యోగం చేత పరిశుద్ధులై నా సాన్నిధ్యాన్ని పొందారు. ఎవరెవరు నన్ను ఏయే విధంగా తెలుసుకోవాలనుకుంటున్నారో వారిని ఆయా విధాలుగా అనుగ్రహిస్తున్నాను. కావున పార్థా! మానవులు ఎల్లప్పుడూ నన్ను అనుసరిస్తూనే ఉన్నారు.)

అని భగవంతుడు గీతాశాస్త్రంలో బోధించాడు. అనగా దీని భావం ఏమంటే, నేను పుట్టుక లేని వాడినే అయినా నా ఇచ్ఛా శక్తిని (ప్రకృతిని) ఆశ్రయించి నామరూపాలతో పుడ్తున్నాను. అన్న ఈ భగవద్వాక్యం పై భావాన్నే తెలియజేస్తోంది.

రాసమండల విహారం అనగా భగవంతుడు తన ఇచ్ఛను మహాప్రకృతి అయిన రాధాదేవితో కలసి విహరించడమేనని మనం అర్థం చేసుకోవాలి. అనగా సర్వం శక్తి మయం. అటువంటి శక్తి విలాసాన్ని దర్శించాలన్న కుతూహలంతోనే దేవతలంతా ఆకాశంలో బారులు తీరారు. భగవంతుడు ప్రకృతిలో కలసి నామరూపాలు సంతరించుకోని యెడల ఎటువంటి ఫలాన్ని ఇవ్వలేడు. ఆకారణంగానే ప్రకృతి అంటేనే పరాపర రహస్య యోగిని అని పెద్దలంటారు. అట్లాగే భగవంతుని ఇచ్ఛానుసారం ఆ జగజ్జననియే భక్తుల కోరికల్ని తీరుస్తూ ఉంటుంది. దీనివలన ప్రకృతి పురుషుల అభేదం మరోసారి స్పష్టం చేసినట్లవుతుంది. ఈ విషయాన్నే శ్రీ శంకర భగవత్పాదుల వారు సౌందర్యలహరిలో స్పష్టం చేశారు. శ్రీమద్రామానుజాచార్యుల వారు కూడా భగవత్కరుణ శ్రీదేవి ద్వారానే ప్రసరిస్తుందని స్పష్టంగా బోధించారు. శక్తి అన్నంత మాత్రాన పార్వతి అని భావించరాదు. అది విరాట్పురుషుని ఇచ్ఛా శక్తి అని గ్రహించాలి.

ప్రస్తుత రాసక్రీడ యందు రాధాదేవియే మూల ప్రకృతి. శ్రీకృష్ణ పరబ్రహ్మమే ఆ పరమ పురుషుడు. ఆ ప్రకృతీ పురుషులను ఆరాధించే సమయమంతా సంగీత నృత్యాలే ప్రధాన పూజావిధానమయింది. ఆ పూజా చక్రము నృత్య గేయ చక్రమైంది.

ఆ చక్రమందు వాగ్దేవతలంతా అధిష్ఠాన దేవతలయ్యారు. విరాట్పురుషుడు తప్ప అక్కడ సర్వం దేవీమయమే. అనగా మహాప్రకృతి పరమ విలాసం. ప్రకృతి విలాసాన్ని కన్నులారా చూడాలని దేవతలంతా భార్యలతో కలసి వచ్చారు. ప్రకృతి విసిష్టుడై యున్న ఆ పరాత్పరుని దర్శించినంత

మాత్రానే ముక్తి లభించగలదు. సగుణ పరబ్రహ్మాన్ని ఉపాసించ కుండా మానవుడు ఏ ఘనకార్యాన్నీ సాధించలేడు. సగుణ బ్రహ్మమంటేనే ప్రకృతి విసిష్టుడని సారం.

"తదను ప్రధాన ద్వారా రాజ దర్శనం కర్తవ్యమ్"

అన్న సూక్తి అందరూ ఎరిగినదే. రాజదర్శనం కావాలంటే ఏవిధంగానైతే మంత్రి సాయపడతాడో అదేవిధంగా బ్రహ్మ సాక్షాత్కారానికి ప్రకృతిని ఉపాసిస్తే గాని పొందలేడని భావం. తల క్రిందులుగా తపస్సు చేసినా ఇందులో మార్పు ఉండదు. మనసులో నిలుపుకోవడానికైనా ఒక రూపముండాలి గదా. ఆకారాలుండేవన్నీ ప్రకృతి విశిష్టములే. అనగా రూపాన్ని ఉపాసిస్తున్నావంటే, ప్రకృతిని ఉపాసిస్తున్నట్లే అవుతుంది. రాముణ్ణో, కృష్ణుణ్ణో పూజిస్తున్నామంటే, ఆయా నామాలను ధరించిన ప్రకృతిని పూజించినట్లే అవుతుంది. మనకు తెలిసి ఉపాసించినా తెలియక ఉపాసించినా ఆ పరదేవి పాదారవిందాలకే జేరుతుంది. సర్వ శబ్ద వాచ్యుడా పరమేశ్వరుడే. కావున శ్రీకృష్ణ పరమాత్మను సర్వదేవతా రూపునిగాను, రాధాదేవిని పరదేవిగాను ధ్యానించి, వారిద్దరూ కలసిన చోటే పరమ పవిత్రమైనదని తలచి సర్వదేవతలు ఆకాశాన బారులు తీరినిలబడ్డారు. మనం కూడా ఈ రాసమండలము పరమ పవిత్రమని ఎంచి కృతార్థులమయ్యెదముగాక. భక్తాగ్రేసరుడైన లీలాశుకులు కూడా పరబ్రహ్మాన్నే ధ్యానించి కృతార్థులయ్యారు.

రాధామాధవులు విహరిస్తున్నట్లుగా భావన చేసుకుంటూ ధ్యానం చేయాలి. అదే తపస్సు. అదే యోగుల ధ్యాన పద్ధతి. ఎవరైనా అట్లా ధ్యానం చేస్తేనే గాని కృతార్థులు కాలేరు. అంతేగాని బృందావనానికి యాత్రగా పోయి వచ్చినంతమాత్రాన ఒరిగేదేమీ ఉండదు. ఇటువంటి ధ్యానం ప్రథమ సోపానం. ఆ తపస్సునే ఉధృతం చేసుకోవాలి. ఆ తర్వాత ఆ బింబాన్ని హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. ఈ పద్ధతిని అలవాటు చేసుకోని వానిది ప్రథమ జన్మయే గాని చివరి జన్మకాదని పెద్దలంటారు. మన పెద్దలు సాలగ్రామమును పూజించడం మనం చూస్తూ ఉంటాం. ఎందులన? సాలగ్రామమునకు అవయవాలుండవు. అటువంటి ఆకారం ధ్యానానికి యోగ్యమైనది. ఇందువలన ధ్యాన పద్ధతి క్రమక్రమంగా వృద్ధి చెందుతుంది. ముక్తిని కోరుకునే వారు చివరివరకూ విగ్రహారాధన చెయ్యరాదు. భగవంతుని సర్వవ్యాపకునిగా భావించుకొని ఆ పరమాత్ముని మనోపీఠంపై నిలుపుకొని ధ్యానం చెయ్యడాన్ని అలవాటు చేసుకోవాలి.

శ్లో॥ *శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప।*
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే

--- భగవద్గీత

(పరంతపా! ద్రవ్య యజ్ఞం కన్నా జ్ఞాన యజ్ఞం మేలైనది. పార్థా! కర్మలన్నీ జ్ఞానంతో అంతమవుతాయి.)

శ్లో॥ *తస్మాదజ్ఞాన సంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః*
ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత॥

---భగవద్గీత

(ఓ అర్జునా! నీ హృదయంలో కలిగిన ఈ సంశయాలన్నీ అజ్ఞానం చేత కలిగాయని గ్రహించి జ్ఞానమనే ఖడ్గంతో ఛేదించు. అర్జునాః ఇక లెమ్ము)

అని శ్రీకృష్ణ పరమాత్మ గీతాశాస్త్రంలో బోధించాడు. యోగమే కదా. అటువంటి భగవద్వాక్యాన్ని నమ్మి భగవంతుని ఆరాధించాలి.

గోప, నంద, వృషభానుల సంవాదము

(ఈ భాగం గర్గ సంహిత నుండి గ్రహించబడింది. దీన్నే నారద బహుళాశ్వ సంవాదమని కూడా అంటారు.)

రాసమండల విహారమంతా ఒక్క రాత్రిలో గడచిపోయింది. ఉదయాన్నే ఏమి ఎరుగనట్లుగా ఇంటికిపోయి నందనందనుడుగా నటించాడు. శ్రీకృష్ణుడు బాల్యం నుండి ప్రదర్శిస్తున్న అమానుష చర్యలు గోపకుల మనస్సుల్లో అనేక సందేహాలు తలెత్తేట్లు చేశాయి. వారంతా నందుడి వద్దకు పోయి "మహాత్మా! మీ వంశంలో పూర్వం ఎవరూ ఓ పర్వతాన్ని అవలీలగా ఎత్తి పట్టుకున్న చరిత్ర లేదు. **ఏడు సంవత్సరాల** వయస్సుగల నీకుమారుడే ఈ అద్భుతాన్ని ప్రదర్శించాడు. ఒక పూలమాలను ఎత్తినంత సుళువుగా గోవర్ధనాన్ని ఎత్తి పట్టుకున్నాడు. అంతే కాకుండా నువ్వు యశోదా దేవి తెల్లగా ఉంటారు. కానీ నీకుమారుడైన కృష్ణుడు నల్లగా ఉంటాడు గదా. ఇందుకు గల కారణం ఏమిటి? పోనీ బలరాముడంటావా, చంద్రవంశంలో పుట్టడం చేత శ్వేత వర్ణంలో ఉండటాన్ని మేము అర్థం చేసుకోగలం. ఇప్పుడే మాకీ శ్రీకృష్ణ జన్మ రహస్యాన్ని తెలుపు. నందరాజా నువ్వు నిజం చెప్పకపోతే తప్పక నీకు పాపం చుట్టుకుంటుంది సుమా.

గోపకుల మాటలు విన్న యశోద భయంతో వణకిపోయింది. నందుడు కొద్దిగా తమాయించుకొని ఇలా అన్నాడు. "గోపకులారా! గర్గముని నాతో పూర్వం అన్న మాటలు మీకు యథాతథంగా చెప్తాను. ఆమాటలు వినగానే మీసందేహాలన్నీ మంచులా కరిగిపోతాయి. ముందుగా "కృష్ణ" శబ్దానికి నిర్వచనం చెప్తాను. వినండి. 'క' కారానికి కమలా కాంతుడని అర్థం. 'ఋ' కారానికి రాముడని అర్థం. 'ష' కారానికి షడ్గుణపతి అని అర్థం. శ్వేతద్వీప వాసి అని కూడా అర్థం వస్తుంది. 'ణ' కారానికి నారసింహుడన్న అర్థం వస్తుంది. 'అ' కారానికి అక్షరుడని అర్థం. విసర్గములకు నరనారాయణులని అర్థం తెలుపుతుంది. కృష్ణ శబ్దంలోని ఈ ఆరు అర్థాలను గ్రహిస్తే పూర్ణుడని తెలుపుతుంది. భగవంతుడు నాలుగు యుగాల్లోను శుక్ల, రక్త, పీత కృష్ణ వర్ణాలను స్వీకరిస్తాడు. ద్వాపర, కలియుగ సంధి కాలంలో శ్రీహరి కృష్ణ వర్ణంలో ఉంటాడు. అందువల్లనే గర్గముని చెప్పినట్లుగా కృష్ణుడు అని నామకరణం చేశాం. వసువులే ఆయన ఇంద్రియాలు. దేవతలే ఆయన చిత్తము. ఇన్ని మాహాత్మ్యాలు కలవాడు కావడం వలన వాసుదేవుడిగా ప్రసిద్ధి చెందుతాడు. రాధ వృషభానుని పుత్రికగా జన్మించింది. కృష్ణుడే ఆమె భర్త. ఆ విధంగా రాధాపతి అన్న పేరు సార్థకమవుతుంది. పరిపూర్ణుడు, భగవంతుడు అయిన ఈ కృష్ణుడు బ్రహ్మాండ నాయకుడవుతాడు. గోలోకాధిపతియైన ఆ భగవంతుడే నీ పుత్రుడుగా జన్మిస్తాడు. ఇతడు వలన కంసుడు మొదలైన రాజులందర్నీ సంహరించి భూభారాన్ని తగ్గిస్తాడు. సాధు సంరక్షణ, ధర్మ సంస్థాపనము చేస్తాడు. ఇతడికి వేదోక్తమైన నామాలు అనేకం

ఉంటాయి. ఇతడు సాధించే ఒక్కొక్క కార్యానికి ఒక్కొక్క సార్ధక నామం ఏర్పడుతుంది." అని గర్గముని నాతో చెప్పాడు. ఆ ముని మాటలు వేద వాక్కులతో సమానం. అందువల్లనే ఎటువంటి భయాలుగాని, అనుమానం గాని లేకుండా నిశ్చింతగా ఉన్నాను. నందుడి మాటలు విన్న గోపకులు "నందరాజా! శిశువుకు నామకరణం చేయించడానికే నీవు గర్గమునిని పిలిపించావు. అప్పుడే నీకాయన ఈ విషయాలన్నీ విశదపరచాడు. అప్పుడే ఈ విషయాలన్నీ మాకు చెప్పి ఉండవచ్చునుగదా? ఇన్నాళ్ళు ఎందుకు రహస్యంగా ఉంచావు" అని నందుని మాటలు విశ్వసించక వారంతా వృషభానుని నగరానికి వెళ్ళారు. వృషభానుడు వారందర్నీ సాదరంగా ఆహ్వానించి అతిథి మర్యాదలు చేశాడు. గోపకులంతా ఇలా అన్నారు. " ఓ వృషభానూ! నువ్వు మా అందరికీ అత్యంత ఆత్మీయుడవు. మనజాతి అభివృద్ధిని కోరుకునే వాళ్ళల్లో ముఖ్యమైన వాడవు. మనజాతి అంతా క్షేమంగాను, సురక్షితంగాను ఉండాలంటే నందుని మనజాతి నుండి వెలివెయ్యి" అని క్రోధంలో తలో మాట మాట్లాడారు. వారితో వృషభానుడు ఇట్లా అన్నాడు. "గోపకులారా! మీరు చెప్పనదంతా విన్నాను. నందుడు వెలివెయ్య తగినంత నేరం ఏం చేశాడు? ఎంత ఆలోచించినా అతడి యందు నాకే దోషము కనిపించడం లేదు. అదీ కాకుండా గోపకులలో అతడు ఎంతో గౌరవించతగినవాడు. పైపెచ్చు నాకు అత్యంత ఆప్తమిత్రుడు." వృషనందుని మాటలు విన్న గోపకులిట్లా అన్నారు. "రాజా! నువ్వు నందుని వెలివెయ్యక పోతే మేమంతా కలసి నిన్ను వెలివేస్తాం. ఆడపిల్లను ఇంట్లో పెట్టుకొని పెళ్ళి మాటైనా తలపెట్టకుండా కూర్చున్నావు. నిన్నువెలివెయ్యడానికి ఈ ఒక్క కారణం చాలు. నువ్వు ధనవంతుడివి కాబట్టి నిన్నెవరు ప్రశ్నిస్తారన్న అహంభావమా? ఇది నీయందున్న మహాదోషం. ఈనాటి నుండి వ్రజలో నీపేరుకూడా ఎవరూ తలవరాదని తీర్మానం చేస్తాం. నిన్ను మా కులం నుండి వెలివేస్తాం. నువ్వు ఈ దండన నుండి బయట పడాలంటే వెంటనే నందుని పరిత్యజించి మా అందరితో కలసి మెలసి ఉంటూ సుఖంగా ఉండు" అన్నారు. వృషభానుడు వారి మాటలన్నీ సావధానంగా విని వారిని అనునయిస్తూ ఇలా అన్నాడు. "గోపకులారా! గర్గముని చెప్పిన విషయాల్ని మరొక సారి సావధానంగా ఆలోచించండి. మీ అనుమానాలన్నీ తీరిపోతాయి. శ్రీకృష్ణుడు అనేక బ్రహ్మాండాలకు నాయకుడని, గోలోకాధిపతి అని పరాత్పరుడని చెప్పాడు. అటువంటి బ్రహ్మాండనాయకుడే నందుడి ఇంట్లో శిశువుగా జన్మించాడని వెల్లడి చేశాడు. కంసుని వంటి క్రూరాత్ము లెందర్నో చంపి భూభారం తగ్గించనున్నాడన్నది గర్గముని వచనమే గదా. బ్రహ్మ దీనంగా బ్రతిమాలడం వల్లనే భూలోకంలో అవతరించిన భగవంతుడే గాని సామాన్యమానవుడు కాదు. అదీకాక, గోలోకాధి దేవత అయిన రాధ నాకు కుమార్తెగా జన్మించిందట. వీరివివాహం కూడా నేను జరిపిస్తానట. ఖాండీరవనంలో వారి వివాహం జరుగుతుందట. బృందావనంలో యమునా తీరాన ఉండే ఆ ఖాండీర వనంలో బ్రహ్మ దగ్గర ఉండి వీరి వివాహం జరిపిస్తాడట. అటుపిమ్మట నా కుమార్తె అయిన రాధయే గోలోకాధి నేత్రి అయి కాగల కార్యాలన్నీ నెరవేరుస్తుందట. అంతేకాదు. మీరంతా కూడా శ్రీకృష్ణుని విడిచి ఉండలేని వారై గోలోకం నుండి ఈ వ్రజలో శ్రీకృష్ణుని కంటే ముందుగానే జన్మించారట. మిత్రులారా! గోకులంలో ఉండే గోవులన్నీ గోపికలేనట. రాధాదేవి ఆజ్ఞ మేరకు భూలోకంలో జన్మించారట. ఇవన్నీ గర్గముని ఎన్నడో చెప్పిన

మాటలే కాని నేడు కల్పించి చెప్పినవి కావు. మునిమాటలు వేద వాక్యములే సుమా. ఆయన మాటలు భూలోకంలో ప్రమాణాలుగా ప్రజలు విశ్వసిస్తారు. కావున గోపకులారా! మీరు ఇంకా ఏమి అడగదలచుకున్నారో అడగండి." అన్నాడు.

నంద, గోప, వృషభానుల సంవాదాన్ని విన్నాం. గోపకులందరికీ శ్రీకృష్ణుని భగవతత్త్వం తెలుసు. బాల్యలీల లన్నీ వారెరుగుదురు. వారే కొన్ని లీలలను ఏకరువు పెట్టారు. ఏ కాలంలోనైనా, ఏ జాతిలోనైనా కొందరు సంశయాత్ములుంటారు. శ్రీకృష్ణుని మాయచేత మోహితులయ్యారు. శ్రీకృష్ణుడు వారి ద్వారా లోకానికో నీతి బోధించాలనుకున్నాడు. అందువల్లనే వారినోట కొన్ని సంశయాలు పలికించి వాటికి నంద, వృషభానుల ద్వారా సమాధానపరిచాడు. నందుని వంశంలో కృష్ణవర్ణం గల శిశువు ఎట్లా జన్మించిందని వారి సందేహం. తల్లి దండ్రుల ఛాయ శిశువుకు రావాలన్నది వారి ప్రగాఢ విశ్వాసం. అట్లాగని వారు యశోదను సందేహించలేదు. కృష్ణవర్ణంలో శిశువు పుట్టడానికి కారణమేమనే వారి సందేహం. రాజ కుటుంబాల్లోని వారి ప్రవర్తన పరిశుద్ధంగా ఉండాలని పూర్వాచారాలున్నాయి. వారు ప్రజలకు ఉదాహరణ భూతులు కావాలన్నది వారి విశ్వాసం.

రాజ కుటుంబాన్ని ఉదాహరణగా తీసుకొని యితరుల ప్రవర్తన ఉంటుంది. కాబట్టి అటువంటి రాజకుటుంబంపై వారికి ఎటువంటి శంకలు ఉండరాదన్నదే వారి ఆశయం. అందువల్లనే దాచుకోకుండా మనసులోని మాటను బయటపెట్టారు. నందుడు, వృషభానుడు గర్గముని వాక్యాలనే తెలిపి వారిని సంతృప్తి పరచే ప్రయత్నం చేశారు. దాంతో శ్రీకృష్ణ మాయ విడిచి పెట్టగా, వారికి శ్రీకృష్ణ పరబ్రహ్మ తత్త్వంపై నమ్మకమేర్పడింది.

శ్రీహరికి పరీక్ష

(ఈ భాగం గర్గ సంహిత గిరిరాజ ఖండము నుండి గ్రహించడమైంది.)

వృషభానుని మాటలు విన్న గోపకులు సంతృప్తి చెందారు. "రాజా! నువ్వు చెప్పిన వృత్తాంతం అంతా యథార్థమేనని నమ్ముతున్నాం. రాధ నిజంగానే భగవంతునికి భార్య కాగల భాగ్యశాలి. ఆ విషయం నీ ఇంట జన్మించిన మరుక్షణంలోనే తెలిసింది. రాధ నీఇంట పుట్టిన నాటి నుండి నీ సంపదలు నూరింతలు పెరిగాయి. ఆ మాటకొస్తే నందరాజు కూడా నీకు సాటిరాడు. నీవద్ద ఉన్నట్టి ఏనుగులు, గుర్రాలు, గోసంపద ఆ నందుడికి లేవుగదా. నీ ఐశ్వర్యం చూసి కంసమహారాజే జంకుతున్నాడు. నువ్వు ఛలందన మహారాజుకు జామాతవు. కుబేరుడంతటి ధనసంపన్నుడవు. రాజా! నందుడి పుత్రుడు శ్రీహరి సంపూర్ణావతారమా? కాదా? అన్న విషయాన్ని నువ్వే పరీక్షించి మాకు చెప్పు. మేమంతా నీ మాటపై విశ్వాసం ఉంచుతున్నాం" అన్నారు గోపకులు.

వృషభానుడు గోపకుల మాటలు విన్నాడు. నందమహారాజు వైభవాన్ని పరీక్షించాలనుకున్నాడు. విలువైన రత్నాలను, హారాలను, మణుల్ని బంగారు పాత్రలనిండా పోసి దూతల ద్వారా నందరాజుకు బహూకరించాడు. దూతలు నందరాజుతో ఇలా అన్నారు.

"దేవా! వృషభాను మహారాజు గారి కుమార్తె రాధాదేవి వివాహానికి సిద్ధంగా ఉంది. ఆమె జగదేక సుందరి. ఆమెకు తగిన వరుని అన్వేషిస్తూ, ఆ ప్రయత్నంలో మీ పుత్రుని గూర్చి విన్నారు. కృష్ణుడు మన్మథాకారుడని, గోవర్ధన పర్వతాన్నెత్తిన బలశాలి అని విని పరమ సంతృప్తులై రాధనిచ్చి వివాహం చేయాలని నిశ్చయించారు. అందుకోసం ఈ విలువైన రత్నహారాలు బహుమానంగా పంపారు. మీరు వీటిని స్వీకరించి మీరు కన్యకు ఇవ్వదలచిన బహుమతులేమైనా ఇస్తే గ్రహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇది మా కులాచారమని మీతో చెప్పమని మరీ మరీ చెప్పారు" అని అన్నారు. దూతల మాటలు విన్న నందుడు పరమానందభరితుడయ్యాడు. ఆ రత్న హారాలన్నీ తీసుకొనిపోయి యశోదకు చూపాడు. యశోద కూడా రాధ కోడలవుతోందంటే ఆనంద పరవశురాలైంది. తమ అంగీకారాన్ని తెలుపుతూ వారికి తమ వంతు కూడా కొన్ని బహుమతులు పంపాలి. అదే మర్యాద. అయితే వారి వద్ద అంత విలువైన నగలు లేవు. ఏం చెయ్యాలో తోచలేదు. వారిద్దరూ మధన పడుతూ ఉండగానే శ్రీకృష్ణుడు అదృశ్యరూపంలో వచ్చి అందులో నుండి విలువైనవి ఓ వంద రత్నాలు చేత బుచ్చుకొని బయట పొలంలో నాటాడు.

ఇంతలో నందుడు రత్నాలన్నీ లెక్క పెట్టగా ఓ వంద తగ్గాయి. ఏమైనాయా? అని మధనపడుతూ పోయి బలరాముణ్ణి నువ్వేమైనా రత్నాలు తీశావా? అని అడిగాడు. బలరాముడు తనకు తెలియదన్నాడు. ఇంతలో శ్రీకృష్ణుడక్కడకు వచ్చి " తండ్రీ! మనం వ్యవసాయదారులం గదా. పొలంలో విత్తనాలు నాటి వాటినుండి సమృద్ధిగా పంటలు పండించడం మన వృత్తి. అందువల్లనే రత్నాలను నేలలో నాటాను. అప్పుడే అవి మొక్కలు మొలచి రత్నాలు పండాయి. నాతో రండి. చూపిస్తాను" అని వారందర్నీ తీసుకొనిపోయి పెరిగిన వృక్షాల నిండా రత్నాలు వ్రేలాడుతూ ఉండటాన్ని చూపాడు. అవన్నీ నక్షత్రాల్లాగా మెరుస్తూ గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. నందుడు చెట్లకు వ్రేలాడే రత్నాలను దగ్గరగా పోయి పరీక్షించి చూశాడు. అవన్నీ వృషభానుడు పంపిన రత్నాలకన్నా దృఢంగాను ప్రకాశవంతం గాను ఉన్నాయి. వాటన్నింటినీ బండ్లపై ఎత్తించి వృషభానునికి తమ వంతు కానుకగా పంపాడు. దూతలు ఆ రత్నరాసులను వృషభానునికి అందిస్తూ, నందుని వైభవాన్ని నిండు సభలో ప్రశంసించి తెలిపారు. ఈ అద్భుత వార్త విన్న గోపకుల సంశయాలన్నీ మంచులా విడిపోయాయి. వారంతా వృషభానుని అనేక విధాలుగా కొనియాడారు. రాధ శ్రీకృష్ణుని భార్య అని ఆమె శ్రీకృష్ణుని కొరకే పుట్టిందని నమ్మారు. ఆనాటి నుండి రాధాకృష్ణులు గోలోకం నుండి అవతరించారని ఆ బాలగోపాలం నమ్మారు. శ్రీకృష్ణుడు ఏ ప్రదేశంలో రత్నాల్ని విత్తనాలుగా నాటాడో ఆ క్షేత్రమే ముత్యాల సరోవరంగా ప్రసిద్ధి చెందింది. ఎవరు ఆ తీర్థంలో ముత్యాలను దానం చేస్తారో వారికి లక్ష ముత్యాల విలువైన ఫలం లభిస్తుంది. ఇదే గిరిరాజ వైభవము.

ఈ కథ విచిత్రంగా అనిపించినా, శ్రీహరి అద్భుత లీలల్లో ఇదొకటి. ఇందులో మరోసారి భగవంతుడు తన సర్వశక్తిత్వాన్ని ప్రదర్శించాడు. పైకథ చదివిన కొందరు నాగరికులు అపహాస్యం చెయ్యవచ్చు. కాని వారికి భగవత్తత్త్వం తెలియదని చెప్పడం కన్నా మరేమి చెప్పలేం. భగవంతుడు ఘటనాఘటన సమర్థుడు గదా. ఒక మహాత్ముడు భగవంతుని దూతగా వచ్చి భయంకరమైన కుష్ఠురోగాన్ని తన హస్త స్పర్శ చేతనే కుదర్చగా మనమంతా విశ్వసిస్తూనే ఉన్నాం గదా. ఒక దేవ

దూతయే అటువంటి అద్భుతం చేయ సమర్థుడైతే, ఇక భగవంతుని శక్తి సామర్థ్యాలను మనం విలువ కట్టగలమా? కావున మనుషులకు సాధ్యంకాని పనులు కూడా భగవంతునికి సాధ్యమేనని మనం నమ్మాలి. అట్లా నమ్మనంటే అతడికి భగవత్తత్త్వాన్ని గూర్చి అణుమాత్రమైనా తెలియదనుకోవాలి.

సామాన్య జనానికి అప్పుడప్పుడూ సంశయాలు కలుగుతూ ఉంటాయి. ఏదో ఒక మార్గంలో వారి సంశయాల్ని తీర్చాలి. అప్పుడే జనులు రాజభక్తి పరాయణులవుతారు. రాజ్యం సురక్షితంగా ఉంటూ దానివలన ధర్మాన్ని రక్షించినట్లవుతుంది. ఈ ఫలాన్ని లోకాని కందించేందుకే భగవంతుడు అవతరిస్తూ ఉంటాడు. ఏ కార్యాన్ని ఏరూపంలో చేసి లోకానికి ఫలాన్నందించాలో ఆ మహాత్మునికి తెలుసు. ఒక్కొక్కరూ కర్మానుసారం ఫలాన్ననుభవిస్తూ ఉంటే భగవంతుడు సాక్షిగా చూస్తూ ఉంటాడు. శిక్షాస్మృతి కూడా భగవదిచ్ఛ ప్రకారమే జరుగుతుంది. సుందోపసుందుల సఖ్యత తిలోత్తమ ద్వారాను, రావణుని కామప్రవృత్తిని నలకూబరుని శాపం ద్వారాను, కుంభకర్ణుని నిద్రారూపంగాను, హిరణ్యకశిపుని పరాక్రమాల్ని పుత్రుని రూపంలోను, అనుభవించేట్లు చేశాడు. అట్లాగే శ్రీకృష్ణుడు ఈ అద్భుత కార్యాన్ని చూపి గోపకుల సంశయాలను తీర్చి వారిలో రాజభక్తిని నెలకొల్పాడు.

గోవర్ధన తీర్థం

(ఈ భాగం గర్గసంహిత 3వ ఖండం 7వ అధ్యాయం నుండి గ్రహించడమైంది.
దీనినే నారద, బహుళాశ్వ సంవాదమని కూడా అంటారు.)

పర్వతాలన్నింట్లోను గోవర్ధన పర్వతం ఎంతో ఉత్కృష్టమైనది. ఆ పర్వత రాజం అనేక పుణ్య తీర్థాలకు పుట్టినిల్లు. బృందావనమంతా పరచుకొని ఉంటుంది. శ్రీకృష్ణుడు గోవులను ఈ పర్వతం పైనే మేపేవాడు. అందువల్ల శ్రీకృష్ణ పాదధూళి పడి పరమ పావనమైంది. శ్రీకృష్ణుడు ఇంద్రయాగాన్ని నిలిపి గోపకుల చేత ఈ పర్వతరాజానికే పూజలు చేయించాడు. మానస గంగ, గోవిందకుండము, చంద్రసరోవరము, రాధాకుండము, కృష్ణకుండము, లలితా కుండము, గోపాలకుండము, కుసుమాకర తీర్థాలన్నీ గోవర్ధన పర్వతం నుండి పుట్టినవే. అన్ని నదులూ భూమి తల్లిని సస్యశ్యామలం చేస్తున్నాయి. శ్రీకృష్ణుడు తరచుగా విహరించే ఓ శిలనేటికీ మౌళీ చిహ్న శిలయని ప్రసిద్ధి చెందింది. ఈ శిలాఫలకం పైననే శ్రీకృష్ణుడో కళాఖండాన్ని చిత్రించాడని దానినే విచిత్ర శిల్ప కళాఖండమని పిలుస్తూ ఉంటారు. శ్రీకృష్ణుడు ఏ శిలపై కూర్చుని మురళీగానం చేసేవాడో ఆ శిలను నేటికీ వాదినీ శిల అని పిలుస్తూ ఉంటారు. గోపబాలురతో కలసి ఎక్కడ కందుక క్రీడలాడే వాడో ఆ ప్రదేశాన్ని కందుకమని పిలుస్తున్నారు. ఆ కందుకమును దర్శించిన వారు ఇంద్రలోకాన్ని పొందుతారని, భక్తితో నమస్కరించిన వారికి ముక్తి కరతలామలకమని ప్రసిద్ధి. శ్రీకృష్ణుని పాదధూళి పడిన చోట్లన్నీ పరమ పవిత్ర క్షేత్రాలయ్యాయి. శ్రీకృష్ణుడు గోపబాలకులతో ఆడిన ప్రదేశాలన్నీ పాప పరిహార క్షేత్రాలయ్యాయి.

శ్రీకృష్ణుడు వేణుగానం చేస్తూ ఉండగా గోపిక గోపబాలురంతా ఆ గానామృతాన్ని ఆస్వాదించారు. అంతట శ్రీకృష్ణుడు తనకు కరదానం చెయ్యమని అడిగాడు. గోపికలా మాటను

అభయ హస్తమన్న భావంలో గ్రహించి "కృష్ణా! నువ్వు కుటిలుడవు. నువ్వూ నీ గోపబాలురంతా కలసి మా దగ్గరున్న పెరుగు, వెన్న తినాలని ఇటువంటి కుటిలమైన మాటలు మాట్లాడుతున్నావు" అన్నారు. శ్రీకృష్ణుడు వారిచేతిలోని కుండలు బలవంతంగా లాక్కుని తాను తిన్నంత తిని మిగిలింది గోపబాలురకు పంచాడు. కోపం నటిస్తున్న గోపికలు "ఈ బాలుడు గర్వపోతు, బొత్తిగా భయభక్తులు లేనివాడు. మనముందు పులిలా ఉంటాడు. తండ్రి ఎదుట పిల్లి అయిపోతాడు. వీడి పొగరుమోతుతనం అంతా మనముందే. మనమంతా యశోదతో చెప్దాం. ఆవిడే వీడికి తగిన శాస్తి చేస్తుంది" అంటూ ఇళ్ళకు పోయారు. కదంబ పత్రాల్ని దొన్నెలుగా చేసుకొని చిక్కటి పెరుగంతా త్రాగేశారు. అందువలన ఆ ప్రదేశమే ద్రోణక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రాన్నే కదంబ ఖండ తీర్థం అని కూడా అంటారు.

ఏ చోట రాధాదేవితో కలసి రాసవిహారాలు జరిపాడో ఆ ప్రదేశాలన్నీ శృంగార మండలాలుగా ప్రసిద్ధి చెందాయి. భక్తి శ్రద్ధలతో ఆరాధించిన వారికి శ్రీహరి గోవర్ధనాన్ని ఎత్తిపట్టుకున్న రూపంలో దర్శించవచ్చు. గోవర్ధన పర్వత క్షేత్రాల్లో శ్రీకృష్ణుని లీలావిలాసాలను స్మరించినంత మాత్రానే ఆయా రూపాలను నేత్ర పర్వంగా దర్శింపగలరు. వారంతా కృతార్థులు కావడం తథ్యం. ఈ భారత భూమియందు జగన్నాథ, రంగనాథ, ద్వారకానాథ, బదరీనాథ పేర్లతో నలుమూలలా వెలయుదురు. వారి మధ్యన ఈ గోవర్ధన నాథుడుంటాడు. వీరంతా పంచనాథులుగా ప్రసిద్ధి చెందుతారు. ఈ పంచనాథులను దర్శించిన నరుడు నారాయణుడే అవుతాడు.

నారదుడు: ఓ బహుళాశ్వ రాజేంద్రా! గోవర్ధన పర్వతంలోని తీర్థాలన్నింటినీ నీకు సవిస్తరంగా తెలిపాను. ఇవే గిరిరాజుకు అవయవాల్లాంటివి. వీటిని సేవించిన భక్తునికి శ్రీకృష్ణుని అనుగ్రహం సంపూర్ణంగా లభించి దృఢభక్తి ఏర్పడుతుంది.

గోవర్ధన తీర్థ ప్రశంస

(ఈ భాగం పూర్వఖండంలో 8వ అధ్యాయం నుండి గ్రహించడమైంది)

బహుళాశ్వుడు : నారదమహర్షీ! గోవర్ధన పర్వత క్షేత్రంలో ఏయే తీర్థాలు, ఏయే యుగాల్లో ప్రసిద్ధి చెందాయో తెలుపు.

నారదుడు : రాజేంద్రా! గోవర్ధన గిరిరాజుకు కూడా బ్రహ్మవలె అంగములుండవు. అయితే విభూతులతో కూడిన అంగాలుంటాయి. వాటిని చెప్తాను విను.

రాసమండలం జరిపిన చోట శృంగార మండలానికి క్రింద గోవర్ధన గిరిరాజు ముఖం ఉంటుంది. అనగా భగవంతుడు వ్రజవాసులతో కలసి భుజించిన ప్రదేశం. కృష్ణ కుండమే గడ్డం. రాధాకుండం జిహ్వ. లలితా సరస్సు కపోలాలు. గోపాలకుండం చెవులు. కుసుమాకర తీర్థం చెవి కుండలాలు. మౌళి చిహ్న శిలయే లలాటం. చిత్రశిల శిరస్సు. వాదనీశిల కంఠం. కందుక కుండం చేతులు. ఔష్ణీషమే కటి ప్రదేశం. ద్రోణప్రదేశం పృష్ఠదేశం. లౌకిక తీర్థమే ఉదరం. కదంబ ఖండమే మురః ప్రదేశం. శృంగార మండలమే జీవం. శ్రీ పాద చిహ్నమే ఆ మహాత్మునకు మనస్సు. హస్త

చిహ్నములే బుద్ధి. పుచ్ఛ కుండమే పుచ్ఛము. వత్స కుండమే బలం. రుద్రకుండమే క్రోధం. శక్ర సరోవరమే కామం. కుబేర తీర్థమే ఉద్యోగం. బ్రహ్మతీర్థమే ప్రసన్నం. యమతీర్థమే అహంకారం.

ఇవే పర్వతరాజు అంగములు; గిరిరాజ విభూతి. ఈ గిరిరాజు శ్రీహరి వక్షస్థలం నుండి ఉద్భవించి పులస్త్యముని తేజస్సుచేత ఇక్కడ ప్రతిష్ఠించబడింది. ఈ గిరిరాజు దర్శనం చేసిన వారికి పునర్జన్మ ఉండదు. ఈ రెండు కథల్నీ విన్న తర్వాత నమ్మశక్యం కాదనిపిస్తుంది. సూక్ష్మంగా ఆలోచిస్తే ఇందులో కొన్ని విశేషాలు కనిపిస్తాయి.

విశేషార్థం : ఈ రెండు కథల్నీ స్థూలదృష్టితో చూస్తే చిన్న పిల్లలకు చెప్పే కథల్లా కనిపించవచ్చు. కానీ సూక్ష్మ దృష్టితో చూస్తే అంతకన్నీ ముఖ్యమైన అర్థాలు కనిపిస్తాయి.

"భావనా మాత్ర సంతుష్ట హృదయా పరమేశ్వరీ" అని దేవి విషయంలో చెప్పబడింది. భగవంతుని విషయంలో కూడా అదే వర్తిస్తుంది.

దీనిని బట్టి భావం ప్రధానమని తెలుస్తోంది. శ్రీశంకర భగవత్పాదులు వారు కూడా తమ భాష్యంలో ఇదే భావాన్ని వ్యక్తం చేశారు. ఏ క్షేత్రానికి పోయినా, ఏ నదిలో మునకవేసినా, ఇది భగవత్స్వరూపమన్న నమ్మకంతో చేస్తే ఫలం తప్పక లభిస్తుంది. అనగా సకల తీర్థాలు, క్షేత్రాలు, పర్వతాలు మొదలైన వన్నీ భగవత్స్వరూపాలన్న నమ్మకం ఉండాలి. మునులు భగవంతుని తపస్సు చేసి మెప్పిస్తారు. యోగులు హఠయోగం వంటి వాటిని అభ్యసించి పరమేశ్వరుని ఆరాధిస్తారు. మాంత్రికులు మంత్ర తంత్రాల చేత మహాదేవుని ఉపాసిస్తారు. గృహస్థులు, సాధువులు తీర్థయాత్రల రూపంలో ఆ సర్వేశ్వరుని దర్శిస్తారు. వీరందరూ భగవద్భక్తులే. అయితే దృఢభక్తి ఏర్పడిన వారినందరినీ భగవంతుడు తప్పక కడతేరుస్తాడు. ఒకవేళ భక్తుల కోరికల్లో తేడాలుంటే అందుకు సరిపడా ఫలాన్నే ఇస్తాడు. వీళ్ళల్లో ఎవరైనా పరమ పురుషార్థమైన ముక్తిని కోరినట్లైతే ముక్తినే ప్రసాదిస్తాడు. దీనిని బట్టి భావనే ప్రధానమని, మార్గాలు ముఖ్యంకాదని తేలుతోంది. పిడికెడు అటుకుల నిచ్చిన కుచేలుడు, సర్వాత్మునిగా భావించిన శుక మహర్షి, యోగం ద్వారా ఉపాసించిన దధీచుల ఆరాధనా పద్ధతులు వేరైనా, భక్తి సమానమే. భావనకూడా సమానమే.

శ్లో॥ *పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి*
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః

– భగవద్గీత

ఎవరు నాకు పత్రము, పుష్పము, ఫలము లేక నీరు భక్తితో సమర్పించుకుంటారో అటువంటి పవిత్రమైన మనస్సుగల వారు సమర్పించే వాటిని నేను ప్రీతితో ఆరగిస్తాను. అనగా అనేక ద్రవ్యాల్ని సేకరించి భక్తిలేనివాడు యజ్ఞాలు చేసినా నేను తృప్తిపడను. భక్తి గలవాడు అల్పమైన ద్రవ్యాలను సమర్పించినా నేను వాటిని ప్రీతితో ఆరగిస్తాను. అన్న భగవద్వాక్యాన్ని బట్టి పదార్థాలు ప్రధానం కాదని భక్తియే ప్రధానమని స్పష్టమవుతోంది గదా. కావున భక్తితో ఆరాధించే మార్గమేదైనా భగవంతుడు తృప్తి పడతాడు. కాబట్టి తీర్థయాత్రలు వ్యర్థం కావు. కావున గోవర్ధన పర్వతంపై గల తీర్థాలలో

భగవంతుడు ఏయే రూపాల్లో విహరించాడో ఆయా తీర్థాలలో ఆయా భగవద్రూపాలను భావించి ధ్యానించాలి. అదే ముక్తికి మార్గం.

మన పూర్వులు ప్రకృతిని ఆరాధించేవారు. అనగా పర్వతాలు, వృక్షాలు, సర్పాలు, గోవులు మొదలైన వన్నీ ప్రకృతికి ప్రతీకలే కదా. ఈ విధమైన ఆరాధనల్ని నేటి నాగరికులు ఆక్షేపిస్తారు. సమభావం లేకపోవడం వలన వారినే అనాగరికులని చెప్పాల్సి ఉంటుంది.

"స సర్వ విద్ధజతి మాం సర్వ భావేన భారత" అని భగవద్వాక్యం తెలిసిన వారెవ్వరూ అట్లా మాట్లాడరు. భగవంతుడు సర్వభూత, సర్వ తీర్థ స్వరూపుడని నమ్మి సేవిస్తే వారికి తప్పక భతవత్కరుణ సిద్ధిస్తుంది.

గోవర్ధనోత్పత్తి

(ఈ భాగం గర్గసంహిత 3వ ఖండం 9వ సర్గ నుండి గ్రహించడమైంది)

బహుళాశ్వరాజేంద్రుడు : మహర్షీ! నారదా! లోకంలో ఎన్నో పర్వతాలున్నాయి. అన్నింట్లోకి శ్రీకృష్ణ పరమాత్మకు గోవర్ధన మంటేనే ఎందువలన అంత ప్రీతిపాత్రము. ఎందువలన ఆ పర్వతాన్నే ఎత్తి పట్టుకున్నాడు. ఆ పర్వతం పైనే విహరించాడు?

నారదుడు : రాజేంద్రా! నీకీ విషయాలన్నీ తెలియాలంటే ముందుగా నువ్వు గోవర్ధన పర్వత వృత్తాంతాన్నంతా సావధానంగా తెలుసుకోవాలి. చెప్తాను విను.

శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని నిర్గుణుడని, ఆద్యంతాలు లేనివాడని, ప్రకృతి కంటే అతీతుడని, పరిపూర్ణుడని భగవంతుడని కీర్తిస్తూ ఉంటారు. ఆయన్ను ప్రతగ్ధాముడని కొందరు, స్వయం జ్యోతి అని కొందరు, కాలరూపుడని సాంఖ్యులు, ఆత్మారాముడని యోగీశ్వరులు ధ్యానిస్తూ ఉంటారు.

మున్ముందుగా అనంతుడు ఆవిర్భవించాడు. అతడు మహా మహిమాన్వితుడు. ఏ అనంతుని భజించి జననమరణాల నుండి విముక్తిని పొందుతారో ఆ అనంతుడే శ్రీకృష్ణుడు. అతడే అఖండ బ్రహ్మాండ నాయకుడైన గోలోకాధిపతి. అటువంటి శ్రీకృష్ణ పాదాలనుండి పుట్టిన పవిత్ర గంగానదియే మూడు పాయలుగా చీలి అందులో ఒకటి కృష్ణానదిగా ప్రవహిస్తూ ప్రసిద్ధురాలైంది. శ్రీహరి గుల్ఫం నుండి రాసమండలం ఉద్భవించింది. ఆ రాసమండలం హేమ రత్న విభూషితమై నానా విధ శృంగారములకు నిలయమైంది. శ్రీకృష్ణుని జంఘభాగం నుండి పొదరిళ్ళతో కూడిన సభాప్రాంగణాలు, మండపాలు, ఏర్పడ్డాయి. శ్రీహరి మోకాలు నుండి బృందావనం ఉత్పత్తి అయింది. భగవంతుని తొడ నుండి అద్భుతమైన సరోవరం ఏర్పడింది. పరాత్పరుని కటి ప్రదేశం నుండి స్వర్ణ భూమి పుట్టుకొచ్చింది. పరమేశ్వరుని ఉదరరోమమునుండి మాధవీ లతల వంటివి అనేకం ఉత్పత్తి అయ్యాయి. ఆ లతలు ఝుంకారం చేసే భ్రమరాలకు, మధురమైన ఫలాలకు, పుష్పాలకు ఆలవాలమయ్యాయి. ఆ పరాత్పరుని నాభినుండి కమలములుత్పత్తి అయ్యాయి. గోలాకానికివే అలంకారాలు. భగవంతుని త్రివళీ ప్రదేశం నుండి చల్లని మలయమారుతాలుత్పత్తి అయ్యాయి. ఆ మహాత్ముని మూపురం నుండి ద్వారక, మధురా నగరాలు ఉద్భవించాయి. శ్రీకృష్ణుని బాహువుల నుండి ఎనిమిది మంది పార్షదులు

పుట్టుకొచ్చారు. శ్రీహరి మణి బంధాలనుండి నందులు, ఉపనందులు ఉదయించారు. శ్రీకృష్ణుని రోమకూపముల నుండి గోపగణాలు, శ్రీపతి మనస్సు నుండి గోవులు, వృషభములు పుట్టాయి. పరమేశ్వరుని బుద్ధినుండి తృణ గుల్మాలు, తద్వార మాంసాలు పుట్టాయి. వాటినుండి తేజస్సు ఉదయించింది. విరజయ నుండి హరిప్రియ ఉదయించింది. ఆమెనే లీలావతి అని, రాధ అని కూడా అంటారు. రాధాదేవి భుజాల నుండి విశాఖ అనే సఖి వెలువడింది. రాధాదేవి నూగారు నుండి చెలికత్తెలు, గోపికలు ఉత్పత్తి చెందారు.

ఈవిధంగా మధుసూధనుడు గోలోకాన్ని నిర్మించి రాధాదేవితో కలసి విహరించాడు. తాను పరిపూర్ణుడే అయినా, సకల బ్రహ్మాండ నాయకుడే అయినా రాధాదేవితో కలసి రాసమండలంలో విహరిస్తూ ఉంటాడు. ఆ రాసమండలం శృంగార క్రీడలకు పెట్టింది పేరు. ఆ రాసమండలంలో సుందరీ మణులతో కలసి విరాజిల్లే శ్రీకృష్ణుడితో రాధాదేవి ఇలా అంది. "ప్రాణేశ్వరా! నువ్వీ రాసమండల విహారాలతో సంతృప్తుడవైతే నాదోమనవి. బృందావనంలో రాసవిహారం చేసేందుకు అనువైన రహస్య స్థలాన్ని ఏర్పాటు చెయ్యి. ఇదే నా విన్నపము" అని ప్రార్థించింది. రాధాదేవి కోరికను విన్న పరమేశ్వరుడు రాసమండలాన్ని మనోహరంగా నిర్మించేందుకు అనువైన పద్ధతిని గూర్చి ఆలోచించాడు. అప్పటి కప్పుడే గోపికలంతా చూస్తూఉండగా శ్రీకృష్ణుని హృదయం నుండి అనురాగం అంకురాలై సకల తేజస్సుతో ఆ రాసమండల మంతా వ్యాపించింది. ఆ తేజస్సే పర్వతాకారాన్ని దాల్చింది. ఈపర్వతం అంతా రత్న ధాతువులతో నిండి ఉంది. ఆ పర్వత రాజం ఎన్నో యోజనాల దూరం విస్తీర్ణంలో వ్యాపించింది. ఆదిశేషువు శరీరం వలె విస్తరించుకున్న ఆ గిరిరాజము ఒక్క క్షణంలో ఏర్పడింది. ఆ పర్వత రాజము అనేక వేల శిఖరాలతో విలసిల్లింది. దానిపేరే గోవర్ధనము. కొందరు శతశృంగ పర్వతమని కూడా అంటారు.

ఆపర్వతాన్ని రాధ మనస్సు ఆనంద పడేట్లుగా అభివృద్ధి చెందమని భగవంతుడు ఆశీర్వదించాడు. ఆ పెరుగుదల చూసి గోపికలు భయపడిపోయారు. అంతట భగవంతుడు పర్వతాన్ని ఎదుగుదల నిలిపెయ్యమని ఆదేశించాడు. ఆ గిరిరాజాన్ని చూసి రాధ పరమానంద భరితురాలైంది. ఆ పర్వతం ప్రక్కనే రాసమండల రహస్య స్థలం రాధాదేవి కోసం నిర్మితమైంది. ఆదేవి శ్రీహరితో కలసి విహరిస్తూ ఉంటుంది.

ఓ బహుళాశ్వరాజా! ఆ పర్వతమే ఈ గోవర్ధనం. శ్రీకృష్ణునిచే నిర్మించబడింది. ఆ పర్వతం పై లేని తీర్థమే లేదు. దేవతలందరికీ ప్రియమైన ప్రదేశం. భారతదేశానికి పశ్చిమంగా ఉంటుంది. ఆ పర్వతం కాళిందీ తీరాన ఉంటే బాగుంటుందని పులస్త్యముని భగవంతుని ప్రార్థించాడు. భగవంతుడు ఆ ముని ప్రార్థనను మన్నించి యమునా తీరాన ఉండేట్లు చేశాడు. ఇదీ గోవర్ధనోత్పత్తి వృత్తాంతం.

గోవర్ధనము భగవంతుని హృదయమనియు, అందువల్లనే బృందావనము, రాసమండలము అక్కడే ఏర్పాటయ్యాయి. అనగా ఆస్థలం పరమ పవిత్రమని మనం తెలుసుకోవాలి. భగవంతునికి ఆనందభూమి అని స్పష్టమవుతోంది. భగవంతుడుసర్వాంతర్యామి యే అయినా, అన్ని ప్రదేశాలు ఆయనకు ఇష్టమైనవే అయినా కొన్ని మాత్రం భక్తుల్ని ఉద్ధరించేవై ఉంటాయి. అక్కడ భగవత్కళ విశేషంగా ఉంటుందని మనం భావించాలి. అటువంటి చోట్ల భక్తితో భగవంతుని ప్రార్థిస్తే ఫలితం

అత్యల్ప కాలంలోనే పొందగలుగుతారని సారాంశం. కాశీ, రామేశ్వరం వంటి క్షేత్రాలు ఈ భావం చేతనే పరమ పవిత్రాలయ్యాయి. భగవంతుడు అక్కడే ఉంటాడని చెప్పడం పామరులకు విశ్వాసాన్ని కలిగించడానికేనని మనం తెలుసుకోవాలి. జ్ఞానులు "సర్వత్రా సమదర్శనః" అన్న సూక్తిని లక్ష్యంగా చేసుకుంటారు. ఇటువంటి జ్ఞానులకు తీర్థయాత్రలతో పని ఉండదు. అంతేకాదు, భగవంతుడు ఫలాన క్షేత్రంలో ఉంటాడని చెబితే అది భగవంతుని అద్భుత శక్తిని తగ్గించి చెప్పినట్లే అవుతుంది. పామరులకు భక్తి కుదిరేందుకే ఆ విధంగా చెప్తారే గాని, భగవంతుడు సర్వవ్యాపి అని వారికి తెలియక కాదు. విధులు అందరివిషయాల్లోనూ ఒకే తీరున ఉండవు గదా. అదే కర్మ సిద్ధాంతం. దాని నుండి తప్పించుకోవడం ఎవరితరమూ కాదు. కర్మము, కర్మఫలాలు అనేక రీతుల్లో ఉంటున్నప్పుడు భగవదారాధనము ఒకే రీతిలో ఉండటం సాధ్యం కాదు. అందువల్లనే భగవదారాధన అనేక రీతుల్లో నిర్ణయించబడింది. అందులో భాగంగానే పుణ్యక్షేత్రాలు ఏర్పడ్డాయి. ఏ క్షేత్రంలో ఏవిధంగా పూజించేటటువంటి కర్మల్ని ఎవడైతే చేస్తాడో అతడికి అటువంటి పుణ్యక్షేత్రము, ఆరాధన రుచిస్తాయి. అటువంటి ఆరాధనలో అతడి మనస్సు నిశ్చలమై తృప్తి చెందుతుంది. ఈ విధానాన్ని ముందుగా ఎవరూ ఇతమిత్థంగా చెప్పలేరు. అయితే అతడు చేసే ఆరాధనలను బట్టి ఇతడి కర్మఫలం ఇట్టిదిగదా అని ఊహించవచ్చు.

గోవర్ధన పర్వతరాజము, బృందావనము, రాసమండలము లందు భగవత్కళ విశేషంగా ఉంటుంది. అందులోనూ అది రాధాదేవితో కలసి విహరించిన ప్రదేశం కావటాన పరమ పావనమని చెప్పవచ్చు. రాధా దేవియే మూల ప్రకృతి. కావున ఆమె సన్నిధానంలో ఉండే పురుషోత్తముడు, అనగా ప్రకృతి విసిష్ఠుడు, ఫలాలనివ్వగల సమర్థుడు. అదే మూల ప్రకృతి ప్రక్కన లేని అనగా ప్రకృతి విశిష్ఠుడు కాని, పరమాత్ముడు నిర్గుణుడవుతాడు. నిర్గుణ పరబ్రహ్మము ఫలాలనివ్వసమర్థుడు కాడు. నిర్గుణపరబ్రహ్మమునే విరాట్పురుషుడంటారు. అట్టి విరాట్పురుషుని ఆరాధించి ఫలం పొందటం యోగులకే శక్యము కాదన్నచో ఇక ఇతరుల మాట ప్రత్యేకంగా చెప్పాలా? కొందరు ప్రకృతిని ఉపాసించడానికి అంగీకరించరు. అయితే చతుర్భుజుడైన శ్రీమహావిష్ణువంటే భక్తి ప్రదర్శిస్తారు. అయితే, ప్రకృతితో కలసి ఉండనిచో విష్ణుమూర్తికైనా నామరూపాలు, చతుర్భుజాలు ఉండవన్న విషయాన్ని వారు గుర్తించరు. మూర్ఖంతో కూడిన మతాభిమానమే వారిని తిప్పలు పెడుతుంది. వారేవిధంగా ఊహించినా భక్తి ప్రధానం కాబట్టి ఫలం కలుగుతుంది. ఈ విషయాన్నే స్వానుభవం ద్వారా కనుకనే శ్రీరామానుజాచార్యులవారు శ్రీయే ప్రధానమని సిద్ధాంతం చేశారు. కావున నామరూపక్రియా విశిష్టమంతా కూడా ఆ మహాప్రకృతేనని మనం ముందుగా గ్రహించాలి. ప్రకృతితో కూడిన పరమాత్మను దృఢభక్తితో ఆరాధించాలి. తద్వారా మనం నిర్గుణ పరబ్రహ్మాన్ని పొందగలుగుతాం.

గోవర్ధన పర్వతమే శ్రీకృష్ణపరమాత్మ హృదయం. ఆయన తేజస్సే పర్వతంగా వెలిసింది. కావున భగవత్ప్రీతి విశేషంగా వ్యాపించి ఉందని మనం తెలుసుకోవాలి. రాసమండలం అనగా, ప్రకృతీ పురుషుల సమ్మేళనం తప్ప మరొకటి కాదు. అది పరమ పావనం. ఆవిషయాన్నే ఈ కథ తెలియ జేస్తోంది. రాధాదేవి రాసమండలాన్ని నిర్మించమని ఎందుకు అడిగింది? భగవంతుని ఇచ్ఛాశక్తియే మూలప్రకృతి. ఆమె

తలచినంత మాత్రానే క్షణ కాలంలో బ్రహ్మాండాలన్నీ సృష్టించి పాలించి సంహరించగలదు. కావున అటువంటి మూల ప్రకృతే ఈ రాధాదేవి. భక్తుల అభీష్టాలేమిటో ఆ జగన్మాతకు తెలుసు. ఏయే భక్తులు రాసమండల విహారాన్ని కోరుకుంటారో వారి కొరకే ఆ జగన్మాత పరమేశ్వరుని రాసమండలాన్ని నిర్మించమని కోరింది. అనగా సగుణ బ్రహ్మాన్ని కోరడం అనగా భగవంతుడు ప్రకృతి విశిష్టుడై ఉన్నాడు. కనుక తన్ను తానే కోరుకున్నట్లు (సంకల్పించినట్లు) అయింది.

శ్రీకృష్ణుని పట్టమహిషుల్లో రుక్మిణీ దేవియే ప్రధానురాలని, మిగిలిన భార్యలలో రాధాదేవి పేరైనా శ్రీభాగవతంలో ప్రస్తావించలేదని కొందరు విమర్శిస్తారు. వారి వాదన సరియైనది కాదు. శ్రీభాగవతం పరీక్షిత్తుకు ముక్తిని ప్రసాదించడం కొరకు ప్రత్యేకంగా చెప్పబడిన గ్రంథము. ఆ మాటకొస్తే భాగవతంలో రుక్మిణిని గూర్చి ఎక్కడా అప్రతిమాన శక్తి ఉన్నట్లు చూపలేదు. శీలాన్ని ప్రధానంగా లోకానికి చెప్పవలసి వచ్చినప్పుడు రుక్మిణి కథలు చెప్పారు. ఆవిధంగా ఆలోచిస్తే రాధాదేవి ప్రాధాన్యాన్ని తెలిపే పురాణాలున్నాయి. అందులో రాధాదేవి సహస్ర నామాలు, రాధాకవచాలు, స్తుతులు ఉన్నాయి. అంతేకాకుండా రాధాదేవియే మహాప్రకృతి అన్న కథలు కనిపిస్తాయి. రాధాదేవి చరిత్ర అంతా కల్పితం అన్నవారంతా అవివేకులనే చెప్పాల్సి ఉంటుంది. లీలా శుకుల వంటి మహాభక్తులు రాధానామాన్ని జపించే తరించారు. అంతమాత్రాన రాధ రుక్మిణి కన్నా ఉత్కృష్టురాలని చెప్పడానికి సాహసించడంలేదు. ఇక్కడ మనం గ్రహించాల్సిన విషయం ఏమంటే ఒక్కొక్క గ్రంథం ఒక్కొక్క పరమార్థాన్ని దృష్టిలో ఉంచుకొని లోకానికి బోధిస్తుంది. ముక్తిని కోరుకునే పరీక్షిన్మహారాజుకు శుకమహర్షి శ్రీకృష్ణుని చరిత్ర చెప్పి తరించేట్లు చేశాడు. చతుర్విధ పురుషార్థాలను ప్రధానాంశాలు చేసుకొని చెప్పే పురాణాలు రాధాదేవి మహిమను విశేషించి తెలిపాయి. అందువల్ల వీటిలో ఉత్తమ, మధ్యమ, వ్యవస్థకు తావేలేదు. భాగవతంలో రుక్మిణీ దేవి శ్రీకృష్ణునకు ప్రాణప్రియ అని అంటాడు. శ్రీ భాగవతం కుచేలోపాఖ్యానంలో ఇలా ఉంది.

ఇందులో శయ్యాతల్పంపై ఉన్న లక్ష్మీదేవిని వదలి కుచేలుణ్ణి కౌగలించుకున్నాడని, అంతః పుర దాసీ జనం అనుకొన్నట్లుగా చెప్పబడింది. ఇక్కడ "శ్రియమ్" అన్న ఒక్కమాటను ఆధారం చేసుకొని రుక్మిణియే లక్ష్మీదేవి అని చెప్పవచ్చు. అందువల్ల రాధాప్రసక్తి శ్రీ భాగవతంలో లేనంత మాత్రాన రాధాదేవి విష్ణు పత్ని కాదని చెప్పవచ్చునా? రాధామాధవుల పేర్లు సనాతనములు. దేవీ భాగవతంలో దుర్గకు, రాధకు భేదం లేదని ప్రతిపాదించబడింది. విష్ణుపత్నులలో ఏ ఒక్కర్నీ ఎక్కువని గాని, తక్కువని గాని చెప్పడం అజ్ఞానమే అవుతుంది. ఇటువంటి భావనలు భగవత్ప్రీతికి దూరం చేసినా చేస్తాయి. లీలా శుకమహర్షి రాధాదేవిని నుతించి ముక్తిని పొందగలిగాడు.

శ్లో॥ *రాధా పునాతు జగదత్యుతద త్త చిత్తా మంధాన మాకలయతీ దధిరిక్త పాత్రే*
తస్యా స్త్సవస్త బక పంచలలోల దృష్టి ర్దేవోకపి దోహనధియా వృషభం నిరుంధన్హి

ఇందులోని అంతర్భావాన్ని ఇలా స్వీకరిద్దాం. భక్తుని భావాలెట్లా ఉంటాయో తెలిపిన విధం చూడండి.

విశేషార్థం : రాధాదేవి (మహాప్రకృతి) అక్షరుడగు భగవంతుని యందే మనసు పెట్టి, కాళీ కుండలో కవ్వం పెట్టి పెరుగు చిలికి నట్లుగా ఉన్నది. అనగా అస్థిరమైన ప్రపంచాన్ని

నిర్మించపూనుకున్నది అని భావం. ఇక్కడ దేవః అని కవి ప్రయోగించాడు. అనగా స్వయం ప్రకాశం చేత వెలుగువాడనే గదా భావం? రాధాదేవి పాలిండ్ల బంతిపై ఆసక్తిగా చూస్తూ ఆ పరధ్యానంలో పాలుపితికేందుకు ఎద్దువద్దకు పోయాడని అనగా కుసుమ స్తబకం వంటి ప్రకృతిని ఆసక్తితో చూస్తూ అని అర్థం చేసుకోవాలి. స్తనము అన్న శబ్దాన్ని లక్షణ పరంగా హృదయమని చెప్పుకోవాలి.

లీలా శుకులు పరమ భక్తుడు. ఆయన రాధాకృష్ణుల్ని అత్యంత మనోహరంగా ఇలా తెలిపారు. ఈ ప్రకృతీ పురుషులిద్దరూ ప్రపంచాన్ని పవిత్రం చేయుదురు గాక. అని మనస్సులో భావించాడు. రాధా దేవియే మహాప్రకృతి. అక్షరుడైన భగవంతుని యందే మనసు నిలిపి, అనగా ఆయన సంకల్పం ఏమిటో తెలుసుకొనే ప్రయత్నం చేసి వట్టి కుండలో కవ్వం పెట్టి చిలికినట్లుగా, అస్థిరమైన ప్రపంచాన్ని నిర్మించాలని పూనుకుంది. కవి కూడా భగవంతుని దేవః అని ప్రయోగించాడు. అనగా స్వయం ప్రకాశకుడు అని భావం. భగవంతుడు ఆ రాధాదేవి పాలిండ్ల బంతిపై ఆసక్తిగా చూస్తూ, అనగా కుసుమ స్తబకం వంటి ప్రకృతి హృదయాన్ని ఆసక్తితో చూస్తున్నాడని తాత్పర్యం. ఇక్కడ స్తన శబ్దాన్ని హృదయమనే గ్రహించాలి. దీనికే "జహత్స్వార్థ లక్షణా" నామమని పేరు. అనగా, కుసుమ కోమలమైన ప్రకృతి హృదయాన్ని చూస్తున్నాడని విశేషార్థం. పరధ్యానంలో ఎద్దును పాలు పితికే ప్రయత్నం చేస్తూ అసాధ్యమైన కార్యాన్ని చెయ్యమని ఆజ్ఞాపించాడని భావం. భగవంతుడికి అసాధ్యమంటూ ఏమీ ఉండదు గదా. ఆ పరమ పురుషుడు ఎద్దును ఆవుగాను, ఆవును ఎద్దుగాను మార్చగల సమర్థుడు కావున ఆ ప్రకృతీ పురుషులిద్దరూ కరుణాదృష్టి ప్రసరింపచేసి పాపాత్ముల పాపాలన్నింటినీ నశింప జేయుదురుగాక అని అంతరార్థం.

లీలాశుకుల మనోభావం ఈ అర్థం కాని యెడల ఆయన అవివేకి అనే మనం ఊహించాల్సి ఉంటుంది. ఎందువల్ల నంటే ఆయన పరమ భక్తుడు. కావుననే అందర్నీ భక్తులుగా అనుగ్రహించమని రాధామాధవులను ప్రార్థించాడు. ఈ శ్లోకంలోని సారాంశమేమంటే, భగవంతుడు సృష్టిని ప్రారంభించమని ప్రకృతిని ఆదేశించాడు. అట్టి ప్రకృతి లో తాను సాక్షీభూతుడుగా మాత్రమే ఉంటూ ఉంటాడు. మూల ప్రకృతి తన అపార శక్తి చేత బ్రహ్మాండాలన్నింటినీ సృష్టిస్తుంది. ఈ స్థితి యందు ఆ జననికి బ్రహ్మ అని పేరు. అట్టి సృష్టిని ఆ తల్లియే పాలిస్తూ ఉంటుంది. అటువంటి స్థితిలో ఆయమ్మ పేరు విష్ణుప్రియ అని అంటారు. మరల తాను సృష్టించిన బ్రహ్మాండాలన్నింటినీ సంహరిస్తుంది. అట్టి సంహారక స్థితి యందా తల్లిని రుద్రుడంటారు. ఈ బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే లోకులు త్రిమూర్తులని పిలుస్తూ ఉంటారు. వీళ్లందరికీ మూల కారణం మూలప్రకృతే. అందువల్లనే "కారణ కారణంత్వామ్" అని పెద్దలంటారు. అనగా కారణాలన్నింటికీ కారణభూతుడు భగవంతుడేనని భావం. ఈ అర్థాన్నే పై శ్లోకం చెప్తోంది. ఈ భావాన్ని గ్రహించిన వానిని భక్తుడంటారు. లేనిచో కాముకుడంటారు. ఇటువంటి భగవంతుని భార్య అయిన రాధాదేవిని గుర్తించకుండా అసలు రాధపేరే లేదనే వారిని ఏమనాలి? ఇటువంటి పామరుడు ఇహపరాలకు రెంటికీ చెడతాడు. కావున రాధాదేవి ఎవరో క్రొత్తదని భావించక రాధామాధవులను ఆరాధించాలి. అట్లాగని రుక్మిణీ మాధవులను ఆరాధించ రాదని ఏ మూర్ఖుడూ చెప్పడు. ఇక్కడ మనం గ్రహించాల్సిన విషయం ఏమంటే, రుక్మిణికి, రాధకు భేదం

లేదు. అట్లాగే రాముడికి కృష్ణుడికి కూడా భేదం లేదు. ఎవరికే నామమందు ప్రీతి ఉంటుందో వారానామరూపాలను ఆరాధించవచ్చు. నామ రూపాలన్న వస్తువులన్నీ ఆ మూల ప్రకృతియే. కనుక ఏ నామరూపాన్ని ఆరాధించినా అది ఆ మూల ప్రకృతికే చెందుతుంది. ఆరాధనకు తగిన ఫలం తప్పక లభిస్తుంది.

మహాశయులారా! ఇంత వరకు శ్రీకృష్ణ పరమాత్మ పుట్టుకకు హేతువులు, సహాయానికై దేవతలు అవతరించడం, భగవదవతారం, బాలక్రీడలు, రాసక్రీడలు, మొదలైన కథలన్నింటినీ తెలుసుకున్నాం. వేణుగానం ఆ గానానికి గోపికలంతా తమ పనులు మానుకొని పరుగులు పెట్టడం, మొదలైన విషయాలను గూర్చి కువిమర్శలకు తావులేదని తెలుసుకోగలిగాం. శ్రీకృష్ణుని మహిమల గూర్చి చెప్తునప్పుడల్లా గోపికలను గూర్చి ఇంకా ఒకటో రెండో అనుమానాలు ఉంటూనే ఉంటాయి. అవికూడా నిర్మూలం కావాలంటే, గోపికల ఉత్పత్తిని గూర్చి తెలుసుకుంటే గాని, ఆ శంకలన్నీ తొలగవు. గోపికలంతా గోలోకం నుండే ఉత్పత్తి అయ్యారని ముందే చెప్పుకున్నాం. అయినా వారి చరిత్రలు ఇంకా విపులంగా వ్రాస్తే గాని సమంజసంగా ఉండదు. అందువలన మనం ఇప్పుడు గోపికా చరిత్రను గూర్చి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

శ్రుతిరూప గోపికల చరిత్ర

(ఈ కథను గర్గసంహిత మాధుర్య ఖండం మొదటి అధ్యాయం నుండి గ్రహించడమైంది. ఈ కథకూడా బహుళాశ్వ రాజుకు నారదునకు మధ్య జరిగిన సంవాదమేనని గ్రహించాలి.)

బృందావనంలో జన్మించిన గోపికలంతా శేషశాయి వరప్రసాదితులు. అందువల్లనే నందుడు పరిపాలిస్తున్న గోపకులంలో జన్మించారు. బృందావనాధి దేవత అయిన బృందాదేవిని నందనందనుడైన గోపాల కృష్ణుని దర్శించి వరాలను పొందాలనుకున్నారు. బృందాదేవి కూడా వారి అభీష్టాన్ని గ్రహించి వారికి వరాలిచ్చింది. ఆమె వరప్రభావం చేతనే వారికి భగవదనుగ్రహం లభించింది. వాళ్ళందరితో రాసక్రీడలు జరిపేందుకు శ్రీకృష్ణుడు అంగీకరించి ప్రతిరోజూ వారిళ్ళకు వస్తానని వాగ్దానం చేశాడు. ఒకనాడు రాత్రి పరమాత్మ వారిళ్ళకు వెళ్ళేందుకు ఆలస్యమైంది. ప్రొద్దు పోయినా కూడా భగవానుడు వారిళ్ళకు వెళ్ళడు.

"పప్రచ్ఛుః పరయా భక్త్యా గిరా మధురయా ప్రభుమ్" అని మూలం. వారంతా జగన్నాథుని రాకకై ఎదురు చూస్తూ, స్వామి దర్శనం కాగానే ఉప్పొంగి పోయారు. భగవంతుని అనేక విధాలుగా పూజించారు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ కుతూహలం ఆపుకోలేక "పాపధ్వంసకా! ఈ రోజు ఇంత ప్రొద్దు పోయే దాకా ఎందుకు రాలేదయ్యా? నీకోసం స్వాతి వానకు ముత్యపు చిప్పల్లా మేమంతా ఎదురు చూస్తూ ఉంటామని నువ్వెరుగవా? ఏం రాచకార్యాలు వెలగబెట్టుతున్నావు? అని గోముగా నిలదీశారు. వారి ప్రేమాతిశయాలకు ఎంతో సంతోషించిన భగవానుడు "గోపికలారా! ఎవరైనా వారి మనస్సునిండా ఒకరిని నింపుకుంటే ఆ వ్యక్తి ఎంత దూరాన ఉన్నా వారి ప్రక్కనే

ఉన్నట్లు లెక్క . ఉదాహరణకు, సూర్యుడు ఆకాశంలో ఉంటాడు. కమలాలేమో భూమిపైన ఉంటాయి. తెల్లవారగానే కమలాలు వికసిస్తాయి. ఏకారణం చేతనైనా సూర్యుడు కనిపించకపోయినా, కమలాలు వికసించడం మానవు. ఎందువలన? సూర్యుడు ఎల్ల వేళలా వాటి హృదయాల్లో నిండి ఉంటాడు. అందువల్లనే అవి వికసిస్తాయి.

ఖాండీర వనానికి నా గురువైన దుర్వాసమహర్షి వచ్చి బస చేశాడు. నేను వెళ్ళి ఆయన్ను దర్శించుకొని సేవలు చేసి వచ్చేందుకు ఇంత సమయం అయింది. గోపికలారా! గురువే బ్రహ్మ గురువే మహేశ్వరుడు. అటువంటి గురువుకు నమస్కరించాలి. అజ్ఞానాంధకారంలోనుండి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే గురువుకు వందనములు. లోకంలో ఎవరైనా సరే తన గురువును నన్నుగా (శ్రీకృష్ణునిగా) భావించాలి. ఎటువంటి పరిస్థితుల్లో కూడా గురువును అగౌరవ పరచరాదు. ఇతడు మనలాంటి మనిషే కదానన్న భావం కలుగ కూడదు. ముక్కోటి దేవతలు గురుముఖాన ఉంటారన్న నమ్మకం కలిగి ఉండాలి. కాబట్టి నేనుకూడా నా గురువును సేవించిన తర్వాతనే ఇక్కడకు వచ్చాను. అందువల్లనే ఇంత ఆలస్యం అయింది" అని శ్రీకృష్ణుడన్నాడు.

శ్రీకృష్ణుడి మాటలకు గోపికలంతా ఆశ్చర్యపోయారు. చేతులు జోడించి నమస్కరిస్తూ "మహాత్మా! నువ్వే పరిపూర్ణుడవు గదా. అటువంటి నీకే ఓ గురువున్నాడంటే మాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. అటువంటి దుర్వాసమహర్షిని దర్శించి నమస్కరించాలని మామనసులు ఉరకలు వేస్తున్నాయి. ఇప్పటికిప్పుడే ఆ మహనీయుని దర్శించాలని ఉన్నది. అయినా ఖాండీరవనానికి పోవాలంటే యమునానదిని దాటి ఆవలి ఒడ్డుకు పోవాలి. ఇంత రాత్రి సమయంలో అది ఎట్లు సాధ్యమా? అని దిగులుగా ఉంది. మాకేదైనా మార్గాంతరం చూపి మాకా మహనీయుని దర్శన భాగ్యం కలిగించమని ప్రార్థించారు. అంతట శ్రీకృష్ణుడు "గోపికలారా! మీరంతా నా ప్రియురాండ్రు. మీరు ఎప్పుడు మహర్షి దర్శనం కావాలనుకుంటే అప్పుడే దర్శించ వచ్చు. మీరు యమునా నది వద్దకు పోయి "శ్రీకృష్ణుడు సర్వ దోష విసర్జితుడగు బాలయతి అవడమే కనుక యదార్థమైతే, ఓ యమునా నదీ మాకు మార్గమిమ్ము" అని ప్రార్థించండి. పదవలతో పని లేకుండానే మీరంతా నది దాటి పోవచ్చు" అని అన్నాడు.

శ్రీకృష్ణుని మాటలువిన్న గోపికలంతా శ్రీకృష్ణుని అనుజ్ఞతీసుకొని యమునా తీరానికి వెళ్ళారు. గురుపూజకు అవసరమయ్యే పూజా సామాగ్రి, నైవేద్యానికి కావలసిన పదార్థాలన్నీ పళ్ళాల్లో ఉంచుకొని కాళిందీతీరానికిపోయి, శ్రీకృష్ణుడు చెప్పమన్నట్లే చెప్పారు. అప్పుడు యమునానది వారికి దారి ఇచ్చింది. వారంతా దుర్వాసమునిని దర్శించి పూజించారు. తాము తెచ్చిన ఆహారాన్ని సమర్పించి ఆరగించమని ప్రార్థించారు. అప్పుడాముని "గోపికలారా! నేను పరమ హంసాశ్రమంలో ఉన్నాను. నా పనులు నేను చేసుకోవడం ఎప్పుడో మరచిపోయాను. కాబట్టి నాకేమైన సమర్పించాలనుకుంటే, మీరే మీ చేతులతోనే కలిపి నానోట్లో పెట్టండి" అన్నాడు. అప్పుడు ఆ గోపికలందరూ తాము తెచ్చిన ఆహారాన్నంతా ఆయన నోటి కందించారు. ఆయన కూడా ఆకలి బాధకు తట్టుకోలేని వాడిలా వారు సమర్పించిన ఆహారాన్నంతా కొంచమైన మిగల్చకుండా తినేశాడు.

అంతట ఆ గోపికలంతా శాంత స్వభావుడైన ఆ మునితో ఇలా అన్నారు. "మునీంద్రా! మీ గూర్చి వినగానే మిమ్మల్ని దర్శించాలన్న కుతూహలం కలిగింది. మా కోరిక తెలుకున్న శ్రీకృష్ణుడు నదిని దాటేందుకు చెప్పమన్న ప్రకారం చెప్పగా నది మా అందరికీ దారిని ఇచ్చింది. ఇప్పుడు మళ్ళీ మేమంతా నది దాటి ఇళ్ళకు పోవడం ఎట్లా? అన్న బాధ మమ్మల్ని పీడిస్తోంది" అని భక్తి భావంతో ప్రార్థించారు. అంత మునీంద్రుడిలా అన్నాడు. "గోపికలారా! మీరు యమునా తీరానికి వెళ్ళండి. భక్తి భావంతో "ఓ మహానది! దుర్వాసుడు దుర్వారసం మాత్రమే త్రాగి నిరాహారుడై వ్రత పరాయణుడై, పచ్చిగంగైనా ముట్టకుండా ఉండటం యథార్థమే అయితే మా అందరికీ దారి ఇవ్వు" అని ప్రార్థించండి. మీకు ఆ నది దారి ఇస్తుంది" అని అన్నాడు. అంతట గోపికలంతా నదీ తీరానికి పోయి ముని చెప్పమన్నట్లే చెప్పారు. నది వారికి దారి ఇచ్చింది. వారంతా మహదానందంతో నదిని దాటి శ్రీకృష్ణుని వద్దకు పోయి "శ్రీనాథా! దుర్వాసమహర్షిని దర్శించాం. మీరిద్దరూ చెప్పినట్లే యమునా నదితో చెప్పాం. ఆ మహానది మాకు దారి ఇచ్చింది. అయితే మమ్మల్నో సందేహం పట్టి పీడిస్తోంది. విన్నవించుకుంటున్నాం. వినండి. 'ప్రభూ! నువ్వు బాల్యం నుండి గోకులంలో నందుని ఇంటనే పెరిగావు. మేమంతా చూస్తూనే ఉన్నాం. అటువంటి నువ్వు బాలయతివి ఎట్లా అయ్యావు? ఎప్పుడు అయ్యావు? సెలవిమ్ము. అంతేకాదు. ఆ మహాముని కూడా మేము మా చేతులతో సమర్పించిన ఆహారాన్నంతా తిన్నాడు. దుర్వారసాన్ని మాత్రమే త్రాగిన నిరాహారుడనన్నాడు. నది కూడా మాకు దారి ఇచ్చింది. ముని నిరాహారుడెట్లా అయ్యాడు? నువ్వు ఈ సందేహాలు రెండూ తీర్చవలసింది" అని ప్రార్థించారు.

గోపికల సందేహాలు రెండూ విన్న శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు. " గోపికలారా! నేను మమ కారం లేని వాడిని. నాకు అహంకారం లేదు. అందరి యెడల సమభావం గలవాడిని. సర్వవ్యాపకుడను. సర్వోత్కృష్టుడను. గుణరహితుడను. వైషమ్యమనేది ఏ కోశాన ఉండదు. అయినా కూడా భక్తులు నన్ను ఎట్లా ప్రేమిస్తారో నేనూ వాళ్ళను అట్లాగే ప్రేమిస్తాను. దుర్వాసుడు కూడా నాకు మల్లేనే సాధుయతి, వైషమ్య రహితుడు. ఆత్మ జ్ఞానం గల సజ్జనుడు. ఫలాపేక్ష తనకు లేకపోయినా, కర్మలు చేస్తూ, ఇతరుల చేత చేయిస్తూ ఉండాలి. కర్మల్ని చేస్తున్నా కూడా, దానికి కారణమైన సంకల్పాలు లేనివాడుగా ఎవరైతే ఉంటాడో అటువంటి వాడు జ్ఞానం అనే అగ్నితో కర్మల్ని దగ్ధం చేస్తాడని, అటువంటి వాడే పండితుడని బ్రహ్మవేత్త లంటారు. ఆశలు లేనివాడై, అంతఃకరణము ననే ఆత్మను నియంత్రించుకొని ఏవిధమైన బంధాలు కల్పించుకోకుండా శరీర పోషణకు అవసరమయ్యే కర్మల్ని మాత్రమే చేస్తున్నట్లైతే ఆతడికి పాపం అంటదు. జ్ఞానానికి మించిన పవిత్ర వస్తువు మరొకటి ఈ ప్రపంచంలో లేదు. అటువంటి జ్ఞానాన్ని కర్మయోగం చేతను, సమాధి యోగం చేతను సంస్కరించబడిన వాడై పోనుపోను తానే తెలుసుకోగలుగుతాడు. ఎవడైతే కర్మల్ని ఆచరిస్తూనే ఫలాన్ని ఆశించకుండా పరమేశ్వరార్పణ బుద్ధితో ప్రవర్తిస్తాడో అతడు తామరాకుపై నీటి బొట్టు వలె పాపం అతడికి ఉండదు. కావున దుర్వాసుడు మీ క్షేమాన్ని కోరి ఆ పదార్థాలన్నీ భుజించాడు. అంతేకాని అతడికి భోజనంపై కోరిక లేదు. అతడు శరీర పోషణకి దుర్వారసం మాత్రమే త్రాగుతూ జీవిస్తాడు" అని తెలుపగా గోపికలంతా జ్ఞానవంతులయ్యారు.

విశేషార్థం : భగవంతుడే జగద్గురువు. అటువంటి భగవంతుడే తనకో గురువున్నాడని, ఆ గురుసేవలు ముగించుకొని రావడం వలన ఆలస్యమైందని గోపికలకు సమాధానం చెప్తాడు. ఇవి అసత్యం కాదా? అని ఎవరికైనా అనిపించవచ్చు. అయితే భగవదవతారాలన్నీ ధర్మ సంస్థాపనం కోసమే కదా. ధర్మం అంటే ఓ రూపాయో, అర్ధ రూపాయో దానమివ్వడం కాదు. చేయదగిన పని అన్నదే ధర్మ శబ్దానికి అర్థం. భగవంతుడు తానాచరించి ఇతరులకు ఉపదేశిస్తూ ఉండటమే అవతార ఫలం.

శ్లో॥ యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనౌ సయ త్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే.

(అనగా ఉత్తములైన వారు దేన్ని ఆచరిస్తారో ఇతరులు దానినే ఆచరిస్తారు. ఉత్తముల ప్రమాణాలే లోకానికి కూడా ప్రమాణాలవుతాయి.)

అన్న గీతా వాక్యాం పై భావాన్నే బలపరుస్తోంది. గురుపూజ లేకుండా భక్తి కుదరదు. "నా ద్వైతం గురుసన్నిధౌ" అన్న సూక్తి అందరూ ఎరిగిందే. గురుభక్తి యే తపస్సిద్ధికి కారణం. "శివే రుష్టే గురుస్త్రాతా గురౌ రుష్టే న కశ్చన" అన్న యోగ శాస్త్ర సూక్తి కూడా ఈ అర్థాన్నే ప్రతిపాదిస్తోంది.

గురువును పూజించాలని, అట్లా పూజించడం వృద్ధి హేతువని ప్రమాణాలెన్నో బోధిస్తున్నాయి. ఇక్కడ 'గురువు' అంటే ఏదో ఒక మంత్రాన్ని ఉపదేశించిన వాడు గురువు కాడు. ఎవరి ఉపదేశం చేతనైతే జ్ఞానోదయం కలుగుతుందో అటువంటి వానినే గురువని చెప్పాలి. **శ్రీరామకృష్ణులు** "ఎవరివల్లనైతే ఆధ్యాత్మిక చైతన్యం మేలుకొంటుందో అతడే మానవ రూపంలో వచ్చిన సచ్చిదానందమని గుర్తుంచుకో" అని బోధించారు. అన్నం పెట్టి వేదం నేర్పినవాడే గురువని స్మృతులు చెప్తున్నాయి. శిష్యునికి తగిన మార్గంలో నడిపించకపోతే గురువుకు పాపం చుట్టుకుంటుందని కూడా స్మృతులు చెప్తున్నాయి. అయితే గురువు చెప్పిన మార్గంలో నడచుకోని శిష్యుని పాపం గురువు కంటదు.

తనను ఆదర్శంగా తీసుకొని ప్రజలు నడుచుకొనేట్లు చెయ్యడమే భగవంతుని ఆశయం. అయితే తన ఆలస్యానికి కారణం తన గురువేనని శ్రీకృష్ణుడంతటివాడు గోపికలకు చెప్పాలా? అని అడిగేవాళ్ళుంటారు. భక్తుల్లో సంశయాలు ఏమాత్రం మిగిలి ఉన్నా భగవదనుగ్రహానికి పాత్రులు కాలేరు. ఆ విధంగా గోపికల సంశయాలన్నీ తొలగించినప్పుడే గదా వారిని భక్తురాండ్రుగా స్వీకరించగలుగుతాడు. లోకంలో వేషధారులు కూడా జ్ఞానుల్లాగా నటించి సన్మానాలందుకుంటూ ఉంటారు. నిజమైన జ్ఞానులెవరో గోపికలంతా ఆలోచించి తెలుసుకోవడానికే ఈ పరీక్ష ద్వారా శ్రీహరి వారికి తెలియజేశాడు. గోపికలంతా తన్ను భర్తగా భావించారు. తనేమో వాళ్ళలో బాలయతినని చెప్పాడు. అక్కడ దుర్వాసముని కడుపునిండా తిని తాను నిరాహారినైతే దారి ఇమ్మని యమునా నదిని ప్రార్థించమన్నాడు. వారిద్దరూ చెప్పిన మాటలూ విన్న యమునానది వారికి దారినిచ్చింది. అనగా శ్రీకృష్ణ పరమాత్మ వారందరికీ చక్కని ఉపదేశాలు చెయ్యడం మాత్రమే కాకుండా ఈ ప్రత్యక్ష ప్రమాణం ద్వారా వారి సంశయాలన్నీ తీర్చాడు. దాంతో వారంతా శ్రీకృష్ణుడు పరమాత్మయే నని విశ్వసించారు.

అందరి యెడల సమభావం కలిగి ఉండేవాడే జ్ఞాని. ఇతరుల ధనాన్ని కాజేద్దామని ఆలోచనలు చేసే వారు వేదాంతులు కారు. ఎవరి మనస్సు ఎల్లవేళలా భగవంతుని పాదారవిందములపై నిలచి ఉంటుందో అతడే భక్తుడు. కాంతా కాంచనాల విషయంలో విరక్తుడైతే గాని అంతఃకరణం పరిశుద్ధం కాదు. భగవంతుడు అఘటనా ఘటన సమర్థుడు. అతడు చేసే కార్యాలను మానవ మాత్రులు చేసే కార్యాలతో పోల్చుకోరాదు. పదహారు వేలమంది గోపికల ఇళ్లలో ఒకేసారి కనిపించి వారి మనసుల్ని రంజింప చేశాడు గదా. ఇది మానవ మాత్రులకు సాధ్యమా? ఒక్క మాటలో చెప్పాలంటే, గురుభక్తి లేకుండా దైవభక్తి కుదరదని, భక్తి లేని వానికి జ్ఞానం కలుగదని మనకీ కథ బోధిస్తుంది. గోపికల మనసుల్లో భక్తి కుదర్చడమే భగవంతుని ఆశయం. అంతేకాని కాముకుడనే వారికిదో చెప్పుదెబ్బ వంటిది. శ్రీహరిని పరయా భక్త్యా అన్నారు గదా. అంటే అర్థం ఏమిటి? భక్తి అంటే కాముకత్వమనా అర్థం?

కావున గోపికా విహారమంతా గురుశిష్యుల సంబంధాన్నే తెలుపుతోందే గాని రతికేళులన్న సూచన లెక్కడా కనిపించవు. అనగా గోపికలు భగవంతుని భక్తి భావంతో కొలిచారు. మనం కూడా అట్లాగే నమ్మి సేవించి తరించాలి. ఇక్కడ మనం మర్కట కిశోర న్యాయాన్నే గ్రహించాలి.

ఋషిరూప గోపికలు :

రామావతారంలో శ్రీరాముని జగన్మోహనాకారాన్ని చూసిన మునులు కొందరు 'ఈ మూర్తిని స్త్రీల దృష్టితో చూస్తే ఎట్లా ఉంటుందో గదా' అని కోరుకున్నారు. రామావతారంలో వారికా అవకాశం కలుగలేదు. వారి భావనకు "రాబోయే కృష్ణావతారంలో మీకా అవకాశం కలుగుతుం" దని అశరీర వాణి పలికింది. ఆ మహర్షులే ద్వాపర యుగంలో గోపికలై జన్మించారు.

నారదుడు : బహుళాశ్వ మహారాజా! కృష్ణ భక్తిని వృద్ధి చేసే ఉపాఖ్యానమొకటి చెప్తాను విను.

పూర్వం వంగదేశంలో మంగళుడు అనే గోపకుడుండేవాడు. అతడు మహా విద్వాంసుడు. అమిత ధనవంతుడు. మహానుభావుడు. అతడి వద్ద తొమ్మిది లక్షల గోవులుండేవి. అతడికి అనేక మంది భార్యలుండేవారు. ఒకానొక సమయంలో అతడికి కష్టాలు వచ్చి పడ్డాయి. అతడి గోసంపదలో కొంత భాగం దొంగ లెత్తుకు పోయారు. ఏవో కారణాలు చూపించి రాజే కొన్ని గోవుల్ని తన అధీనంలోకి తీసుకున్నాడు. అతడీవిధంగా పుట్టెడు దుఃఖంలో మునిగి ఉండగా, దండకారణ్యంలో ఉండే ఋషులంతా ఈ మంగళుడికి కుమార్తెలుగా జన్మించారు. పోయిన యుగంలో వారంతా దండకారణ్యంలో తపస్సు చేసుకుంటూ ఉండగా శ్రీరాముణ్ణి చూసి మోహితులయ్యారు. మీరంతా గోపికలుగా జన్మించండి, కృష్ణావతారంలో మీకోరిక తీరుతుందని శ్రీరాముడు అనుగ్రహించాడు. అయితే మంగళుడు తన సంపదలన్నీ అడుగంటి పోయిన తర్వాత జన్మించిన ఈ గోపికలందరికీ పెళ్ళిళ్ళు ఎట్లా చెయ్యడమా? అని దిగులు పడ్డాడు.

ఆ తరుణంలో మధురానగర ప్రాంతం నుండి ఓ గోపాలకుడు తీర్థయాత్రలు చేస్తూ మంగళుణ్ణి కలుసుకోవడం తటస్థించింది. అతడి పేరు విజయుడు. వయోవృద్ధుడు, బుద్ధిమంతుడు మంగళుడితో

మాట్లాడుతూ ప్రసంగవశాన నందగోపుడి వైభవాన్ని గూర్చి చెప్పాడు. విజయుని మాటలు మంగళుడికి అమృతంలా పనిచేశాయి. పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది. వెంటనే పుత్రికలందర్నీ నందగోపుని ఇంటికి పంపాడు. నందగోపుడు కూడా వారందర్నీ ఎంతో ఆప్యాయంగా ఇంట్లోనే ఉండమన్నాడు. అందరికీ నగా నట్రా చేయించి ఇంట్లో మనుషుల్లాగాను, ఆప్త బంధువుల్లాగాను ఆదరించాడు. వారంతా ఇంటిపనులు చేసుకుంటూ గోకోట్టాలు శుభ్రం చేస్తూ కాలక్షేపం చేసేవారు. ఇందువల్ల వారికి రోజూ శ్రీకృష్ణుని దర్శించే భాగ్యం కలిగేది. వారంతా తమ తపస్సు సిద్ధించాలని కాళిందీ నదిని వేయి విధాలుగా వేడుకుంటూ ఉండేవారు. వీరి భక్తికి సంతుష్టురాలైన కాళింది నది స్త్రీరూపంలో ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకొమ్మంది. అందుకా కన్యకలు "ఓ మహానదీ! ఈ వ్రజకు ప్రభువైన నందగోపుని పుత్రుడు మా అందరికీ భర్త అయ్యేట్లుగా అనుగ్రహించమని" వేడుకున్నారు. ఆ మహానది వారికా వరాన్ని ప్రసాదించి అదృశ్యమయింది. పూర్వం శ్రీహరి మునుల కిచ్చిన వర ప్రసాదాన్ని సార్థకం చెయ్యడానికే రాసమండల విహారం ఏర్పడింది.

ఈ కథను కొందరు ఆక్షేపిస్తే ఆక్షేపించవచ్చు. అయితే పురాణేతి హాసాలను పరిశీలిస్తే వారీ ఆక్షేపణలు చేసి ఉండరు. శ్రీరామావతార కాలంలో దండకారణ్యంలోని మహర్షులంతా శ్రీరాముని ముగ్ధ మనోహర రూపాన్ని స్త్రీల దృష్టితో చూసి తరించాలని ఆరాటపడ్డారు. ఆ అవతారంలో శ్రీరాముడు ఏకపత్నీ వ్రతుడు కావడం వలన కృష్ణావతారంలో మీ కోరిక తీరుస్తానని వరదానం చేశాడు. అయితే ఈ కథ రామాయణంలో ఉన్నదా? అని అడిగే వారంటారు. లేదనే చెప్పాలి. అయితే రామాయణం కాకుండా ఇతర పురాణాల్లో రామ కథలున్నాయి. వాటిని ప్రమాణాలు కావని చెప్పలేం గదా. పురాణాలు ఎన్ని ఉన్నప్పటికీ కథ చెప్పే విధానంలో కొన్ని తేడాలుండచ్చేమో కాని, వీటిలో తేడాలుండవు. భక్తి కోరుకునేవారు ఇటువంటి వాద ప్రతివాదాల్లో చిక్కుకుంటే భక్తికి దూరమవుతారు.

దండకారణ్యంలో మహర్షులంతా తమకు స్త్రీత్వం ప్రసాదించమని వరం కోరారంటే అర్థం ఏమిటి? శ్రీరాముడు శపిస్తే వారంతా స్త్రీలవుతారే గాని అనుగ్రహం చేత కాదు గదా. కృష్ణావతారంలో ఆవిధంగా జరుగ గలదని వరదానమిచ్చాడని, అందుమూలంగా భగవంతుని సౌందర్యాన్ని తిలకించే మహద్భాగ్యాన్ని కలిగించాలన్నదే సారాంశం. అంతే కాకుండా భగవంతుని సాహచర్యం కూడా ముక్తి హేతువే కదా. భక్తుల్లో అధిక భాగం భగవంతుని దాస్యాన్నే కోరుకుంటారు. అట్లాగే, దండకారణ్యంలోని ఋషులంతా దాస్యాన్ని స్త్రీరూపంలో కోరుకున్నారని మనం ఊహించాలి. ఆ మహర్షులే ఈ కథాంశంలోని గోపికలుగా జన్మించి శ్రీకృష్ణుని భార్యలయ్యారంటే అందులో దోషమేమీ లేదు.

అయితే ఈ గోపికలంతా కాళిందీ నదిని ఎందువలన ప్రార్థించారన్నది మరో ప్రశ్న. నీరు భగవత్స్వరూపమని, సర్వ పాపహరమని శ్రుతి చెప్తోంది. అంతేకాకుండా శ్రీకృష్ణ పాదారవిందాలచేత కాళిందీ జలాలు పరమ పావనాలయ్యాయి. తదధి దేవతయే కాళింది. జలాధిదేవత అనగా మహాప్రకృతే గదా. అటువంటి మహాప్రకృతిని ఆరాధించిన వారికేమీ కొరతలుండవు గదా. అందునా వారు కోరేది భగవంతుణ్ణే అయినప్పుడు అది భగవతికి ఇష్టమే కదా. అందువల్లనే ఆదేవి వర ప్రదానం చేసి అదృశ్యమైంది. అదీ కాకుండా, భగవతిని ఆశ్రయిస్తే గాని భగవత్సాక్షాత్కారం కాదు గదా.

మైథిలి గోపికలు

(ఈ కథ గర్గసంహిత మాధుర్యఖండం నుండి గ్రహించబడింది)

నారదుడు : బహుళాశ్వరాజా! నీకిప్పుడు మైథిలీ గోపికల వృత్తాంతాన్ని చెప్తాను విను.

శ్రీరాముని వరప్రభావం చేత తొమ్మిది మంది గోపికలు నందుని వ్రజలో జన్మించారు. వాళ్ళంతా మార్గశీర్ష మాసంలో మట్టితో కాత్యాయనీ విగ్రహాన్ని సృష్టించుకొని పూజిస్తూ ఉండేవారు. సూర్యోదయ సమయాల్లో యమునా నదిలో స్నానాలు చేసి ఇళ్ళకు పోయి షోడశోపచారలతో కాత్యాయనీ దేవిని ఆరాధించే వారు. ఒకరోజున గోపికలంతా యమునా నదికి పోయి, వస్త్రాలన్నీ తీసి ఒడ్డున పెట్టుకొని వివస్త్రలుగానే నదిలో స్నానం చేస్తున్నారు. శ్రీకృష్ణుడు దొంగలాగా చప్పుడు చెయ్యకుండా వచ్చి వాళ్ళ గుడ్డలన్నీ మూటకట్టుకొని పోయి కదంబ వృక్షంపై కూర్చుని "గోపికలారా! మీరంతా వచ్చి మీ గుడ్డలు తీసుకుపోండి" అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న గోపికలంతా ఉలిక్కిపడ్డారు. చలికి ఒణికిపోతూ శిరస్సులు వంచి "నందనందనా! శ్యామసుందరా! నువ్వైతే వచ్చి మా వస్త్రాలు తీసుకుపొమ్మన్నావు. కానీ మేమంతా వివస్త్రలమే. ఎట్లా నీ ఎదుటకు రాగలం? అదీ కాకుండా మేమంతా నీ పాద దాసీలం గదా. నువ్వు మమ్మల్నిట్లా ఏడిపిస్తే వెన్న దొంగవన్న పేరుతో పాటు గోపికల వస్త్రాలు కూడా దొంగిలిస్తాడన్న పేరు స్థిరపడుతుంది. కృష్ణా! నీకన్నా గొప్ప రసికుడెక్కడైనా ఉంటాడా? అటువంటి నీకు భయం ఎక్కడుంటుందిలే. సరి సరి ఇప్పటికిది చాలు. ఇకనైనా మా వస్త్రాలు మాకివ్వు. లేకపోతే మధురాధిపతికి ఫిర్యాదు చేస్తాం. ఈ అన్యాయాన్నెవరూ సహించరు" అని విలపించారు.

గోపికల మాటలు విన్న శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "గోపికలారా! సుందర వదనులారా! మీరు నిజంగానే నా దాసీలైతే ఇటువంటి మాటలు మాట్లాడేవారా? మీకు వస్త్రాలు కావాలంటే ఈ కదంబ వృక్షం వద్దకు వచ్చి మా గుడ్డలు మాకిమ్మని ప్రార్థించండి. లేదంటారా, ఈ గుడ్డలన్నీ మీ ఇళ్ళకు చేరుస్తాను. మీరిక ఇళ్ళకు ఎట్లా వెళ్తారో చూస్తాను" అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న గోపికలంతా సూర్యోదయం కాబోతోందేనని భీతి చెందారు. ఎముకలు కొరికే చలిలో యమునా జలాల్లో వివస్త్రలై చలికి వణికి పోయారు. ఇక ఈ పిల్లవాడు తన పట్టు విడువడని తలచి చేతులతోనే శరీరాన్ని కప్పుకొని కదంబ వృక్షం దగ్గరకు పోయి నిలుబడ్డారు. శ్రీకృష్ణుడిచ్చిన వస్త్రాలు ధరించారు. భగవన్మాయ మోహితులై శ్రీకృష్ణుని ముందు నిలబడ్డారు. వారి మనోభావాల్ని గ్రహించిన భగవంతుడు ఇలా అన్నాడు.

"గోపికలారా! మీరంతా కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించారు. మీ వ్రతం సఫలమవుతుంది. అనగా నన్ను పొందటానికే ఈ వ్రతం చేశారు. ఈ నాటి నుండి మూడోరోజున బృందావనంలో యమునా తీరాన మీతో కలసి మనోహరమైన రాసక్రీడ జరుపుతాను" అని పలికి అదృశ్యుడయ్యాడు.

మైథిలీ గోపికా వాఖ్యానంలోని తొమ్మిది మంది గోపికలు, మైథిలీ నగరంలో శ్రీరాముని అందచందాలను చూసి మనమే సీత అయి ఉంటే రామపత్నులమయ్యేవాళ్లంగదా అని తలపోశారు.

వారంతా గోపికలై పుట్టారని కొందరంటారు. కాదు కాదు సీతాంశ సంభూతులని కొందరు అర్థం చెప్తారు. ఏమైనా ఇది కూడా గోపికా వస్త్రాపహరణ కథే తలపింపచేస్తోంది. భగవంతుడు గోపికలారా! మీరు నా దాసీలే అయితే ఇట్లా మాట్లాడుతారా? అని అంటాడు. అనగా అర్థమేమంటే, నాపాద సేవకులకు నావిషయంలో లజ్జ ఉంటుందా? అని. ఇందులోని గంభీరార్థం ఏమంటే, లజ్జాదుల్ని వదిలే గాని నాభక్తురాండ్రు కాలేరని భావం. అనగా ద్వంద్వాలైన మానాభిమానాల యెడల సమబుద్ధి కలిగిఉండాలని, అదే భక్తికి సారం అని, భగవంతుని ముందు లజ్జ ఉంటే ఇక లజ్జను వదిలేదెప్పుడు? అని ఉపదేశం.

ఇంకో అంతరార్థం ఏమంటే వస్త్రాలనగా శరీరాన్ని కప్పుకునేవనే గదా. అనగా అవి అజ్ఞాన స్థానాలు. అట్లాగే దేహంలో అంతర్గతంగా ఉండే పరమాత్మను తెలుసుకోనివ్వకుండా అజ్ఞానం కప్పి ఉంటుంది. దాన్ని తొలగించే ఉపాయం ఆలోచిస్తే గాని అది తొలగదు. అది తొలిగితే గాని నిర్మల జ్ఞానం కలుగదు. ఆ నిర్మల జ్ఞానం కలిగితేనే గాని భగవత్సాక్షాత్కారం కాదు. కావున ఈ స్వల్పమైన దేహాభిమానమే వదలకపోతే నా పాదసేవకు అర్హులు కాలేరని భగవంతుని ఆశయం. నా పాదసేవ అంటేనే ముక్తిప్రదం. సాధారణంగా అవధూతలే దిగంబరంగా ఉంటారు. శుకమహర్షి ప్రవర్తనను ఇక్కడ ఉదాహరణముగా చెప్పుకోవచ్చు. "-- మాయ నంగీకరించిన భంగి వసనంబు గట్టక వచ్చువాడు" అని గదా చెప్పారు. వస్త్రధారణం దేహాభిమానాన్నే కదా తెలుపుతుంది. ఇటువంటి భగవదభిప్రాయాన్ని వక్రీకరించి శ్రీకృష్ణుడు జారుడని చోరుడని నిందించడం పాపహేతువే అవుతుంది.

కోసల గోపికలు

(ఈ కథను నారదుడు బహుళాశ్వరాజునకు చెప్పాడని గర్గసంహిత మాధుర్య ఖండంలో తెలుపబడింది)

కోసల దేశంలో ఉండే స్త్రీలు కొందరు శ్రీరాముని వర ప్రభావం చేత నందుడు పాలించే గోకులంలో జన్మించారు. వారంతా ఆ వ్రజలోని గోపకుల్నే పెండ్లాడారు. అయినా వారంతా శ్రీకృష్ణుని దివ్య సుందర విగ్రహాన్ని చూడగానే మోహితులయ్యారు. శ్రీకృష్ణుడు వారి మనోభావాలను కనిపెట్టాడు. అందువల్లనే గోకులంలో వీథుల్లో తిరిగే టప్పుడు వాళ్ళను చూసి చిరునవ్వులు చిందించే వాడు. పరిహాసాలాడి వారి మనస్సుల్ని దోచుకుంటూ ఉండేవాడు. పాలు పెరుగు అమ్ముకొనేందుకు వీథుల్లో తిరుగుతున్నాకూడా శ్రీకృష్ణునే మనసులో నింపుకొనే వారు. గాలిలో, నిప్పులో, నీళ్ళల్లో నేలపైన నింగిలో దిక్కులలో వృక్షాల్లో ఎక్కడైనా శ్రీకృష్ణుడు కనిపిస్తాడేమోనని తొంగి చూసేవారు. వారిలో కృష్ణప్రేమ లక్షణాలు సంపూర్ణంగా ఉన్నాయి. ఎనిమిది రకాలైన సాత్త్విక భావాలు వారిలో కనబడేవి. ప్రేమాతిశయం చేత పరమ హంసల మార్గం తొణికిస లాడేది. కృష్ణానందంతో వీథుల్లో పరుగులు తీసేవారు. చూసేవాళ్ళకు వారి జడస్వభావానికి పిశాచం ఆవహించిందేమోననుకునే వారు. శ్రీకృష్ణ ధ్యానంలో ఉండే వారికి లజ్జగాని, దుఃఖం గాని బాధించవు. ఒక్కొక్కప్పుడు దారిన పోయే బాలకృష్ణుని ఆపి ముద్దుపెట్టుకొనే వారు. ఆవిధంగా వారు పూర్తి తన్మయత్వాన్ని పొందారు.

ఓ బహుళాశ్వ మహారాజా! ఆ గోపికల తపస్సును ఏమని వర్ణించి చెప్పను? శ్రీకృష్ణ పరబ్రహ్మం పై వారి మనస్సులు సంపూర్ణంగా లగ్నమయ్యాయి. భగవంతునిపై వారిప్రేమ అవిచ్ఛిన్నం. లోకాచారాలన్నింటినీ మరచి భగవంతుని భుజాలపై చేతులుంచి ఆలింగనం చేసుకొని స్పర్శా సుఖంతో మైమరచేవారు. భగవంతుని సంసర్గంలో ఇంద్రియాలు పనిచెయ్యడం మానేసేవి. ఆ స్పర్శానందమే మహా తపస్సులకు ఫలంగా భావించారు. యోగం చేతనూ, సాంఖ్యము చేతనూ, న్యాయవైశేషికముల వంటి తత్త్వజ్ఞానం చేతగాని, పుణ్యకర్మల ఫలం చేత గాని భగవంతుని ఆరాధించి ఏ ఫలాన్ని పొందుతారో ఆ ఫలాన్నే ఆ గోపికలు కూడా పొందగలిగారు. అనగా భగవంతుడు గోపికల భక్తి భావానికే వశుడయ్యాడు. భగవంతుని చేరే మార్గాలన్నింటి లోనూ భక్తి మార్గమే ఉత్తమోత్తమమైనదని అందరూ ఎరిగిందే. అందుకు ఈ గోపికలే ఉదాహరణము.

ఏ వేదంబు పఠించె లూత, భుజంగంబే శాస్త్రముల్చాచె, దా
నే విద్యాభ్యసనం బొనర్చెఁ గరి, చెంచే మంత్ర మూహించె, బో
ధా విర్భావనిదానముల్ చదువులయ్యా? కావు! మీ పాదసం
సేవాసక్తియో కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

నిదానంగా ఆలోచిస్తే భక్తితో నిన్ను సేవించుకోవడమే ప్రధానం. ఆ మాటకొస్తే సాలెపురుగు ఏ వేదాలు పఠించింది? పాము ఏ శాస్త్రాలు చదివింది? ఏనుగు ఏ విద్యల్లో ప్రావీణ్యత పొందింది? చెంచువాడైన తిన్నడు ఏ మంత్రాలు జపించాడు? కేవలం నీ యెడల నిశ్చల భక్తి ఉండటం చేత మోక్షాన్ని పొందలేదా? అంటాడు శతక కారుడు.

ఈ ఉపాఖ్యానం నుండి భగవదారాధనా పద్ధతులు అనేకం ఉన్నాయని, అందులో భక్తిమార్గం ఉత్తమమైనదని మరోసారి స్పష్టమైంది. ఈ గోపికలంతా గోకులంలో పుట్టి గోపకుల్ని వివాహం చేసుకొని సంసారాలు చేస్తున్నారు. అటువంటి వారితో అనగా పరభార్యలతో భగవంతుడు కలసి మెలసి ఉండటం న్యాయ విరుద్ధం కాదా? అని అడిగే వాళ్ళుంటారు. పరస్త్రీతో సంభాషణం మహాపాపమని విధి చెప్తోంది. అయితే ఆ విధి సామాన్య మానవులకే గాని భగవంతునికి కాదు. అతిశయించిన భక్తి భావంతో వారంతా లోకాచారాల్ని మరచిపోయారు. వారి ఇంద్రియాలు కూడా పనిచెయ్యడం మానేశాయి. అనగా భగవంతునే మది నిండా నింపుకొన్నారు. ఇదే తపస్సు. ఇదే సత్కర్మానుష్ఠానం. భగవత్సాంగత్యమే తపస్సుకు ఫలం. ఎన్ని మార్గాల నవలంభించినా భగవత్కృప కొరకే గదా? ఈ గోపికలు ప్రేమ మార్గాన్ని ఎన్నుకున్నారు. అందువలన వారిని కులటలనరాదు. శ్రీకృష్ణ పరబ్రహ్మమే సంపూర్ణ తత్త్వమని నమ్మారు. ఎన్నో జన్మల తపస్సు ఈ జన్మలో ఫలించింది. భగవంతుడితో రాసమండలంలో విహరించారు. ఆనంద సాగరంలో ఈదులాడారు. ఎన్ని విధాలుగా విమర్శించుకున్నా అన్ని చోట్లా భక్తిభావమే కనిపిస్తుంది. ఒక్కచోట కూడా గోపికలలో గాని, శ్రీకృష్ణునిలో గాని కామాతురత కనిపించదు. ఎక్కడా శ్రీకృష్ణునితో కలసి సుఖించారని చెప్పలేదు. బ్రహ్మానందాన్ని అనుభవించారనే తెలుపుతుంది. విమర్శకులనుకునే సుఖం ఎట్లాంటిదంటే "ఒక దుఃఖానికి మరో దుఃఖానికి మధ్య ఉండే చిన్న వంతెన వంటిది. భగవదానందం అంటే అనంతమైన బ్రహ్మానందం".

కోసల దేశ వాసులలో పరిపక్వ జీవులే శ్రీరాముని కోరుకున్నారు. శ్రీరాముడు కూడా వారిని అనుగ్రహించాలనుకున్నాడు. ఎందువలన? వారంతా తల్లి వంకవారు కదా.

అయోధ్యా గోపికలు

(ఈ కథాభాగం గర్గసంహిత మాధుర్య ఖండంలోని నారద బహుళాశ్వ మహారాజుల సంవాదం నుండి గ్రహించబడింది.)

నారదుడు: బహుళాశ్వ మహారాజా! పూర్వం సింధు దేశంలోని చంపక నగరాన్ని విమలుడనే రాజు పాలించేవాడు. అతడి ధన సంపదలు కుబేరుణ్ణి మించి ఉండేవి. ప్రహ్లాదుడంతటి విష్ణు భక్తుడు. ప్రజలంతా 'ప్రహ్లాదుడే మళ్ళీ అవతరించాడు' అని అనుకునే వారు. అట్టి విమల మహారాజుకు అరవై వేల మంది భార్యలు. అయితే ఒక్కరూ సంతానవతులు కాలేదు. సంతానం కోసం ఆ రాజు చెయ్యని యజ్ఞం లేదు. రాణులు ఆచరించని వ్రతమూ లేదు. ఇట్లా కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. ఒకానొక రోజున యాజ్ఞవల్క్య మహర్షి ఆరాజును చూడడం జరిగింది. అప్పుడా మహర్షి రాజు మనస్సులోని దుఃఖాన్ని గ్రహించినవాడై "రాజా! నీకీ జన్మలో పుత్ర సంతానం కలుగదు. అయితే నువ్వు ఎన్నివేలమంది కుమార్తెల్ని కోరుకుంటావో అంతమంది కన్యకలు జన్మిస్తారు. అయ్యో! పుత్రికలా? అని అధైర్యపడకు. త్వరలో శ్రీహరి శ్రీకృష్ణుడుగా భూమిపైన అవతరించబోతున్నాడు. నీ పుత్రికలందర్నీ ఆ మహనీయుని కిచ్చి కృతార్థుడవు కమ్ము" అని ఉపదేశించాడు. మహర్షి మాటలు విన్న విమలుడు "మహర్షీ! శ్రీహరి భూలోకంలో ఎప్పుడు అవతరించబోతున్నాడు? అతడు ఎవరి కడుపున జన్మిస్తాడు? అతడు ఏ కులంలో జన్మిస్తాడు? అతడి రూపురేఖ లెట్లా ఉంటాయి? భగవంతుడు అవతరించడానికి ఇంకా ఎన్ని సంత్సరాలు పడుతుంది?" అని అడిగాడు. అందుకు మహర్షి "రాజా! ఇప్పుడు ద్వాపరయుగంలో ఉన్నాం. ఈ యుగం ముగియడానికి 115 సంవత్సరాలు మిగిలి ఉండగా శ్రీహరి యాదవుల వంశంలో జన్మిస్తాడు. మధురా నగరంలో భాద్రపద బహుళ అష్టమి తిథి నందు రోహిణీ నక్షత్రాన వృషభ లగ్నంలో అర్ధరాత్రి సమయంలో దేవకీ దేవి గర్భాన శ్రీకృష్ణ నామధేయంతో శ్రీహరి జన్మిస్తాడు. ఆ బాలుడు నీలమేఘ వర్ణంలో, నాలుగు భుజాలు గలవాడై పట్టు పీతాంబరాలు ధరించి ఉద్భవిస్తాడు. అప్పుడు నీ పుత్రిక లందర్నీ ఆ శ్రీహరి భగవానునికిచ్చి వివాహం చెయ్యి. నువ్వు అంత కాలం జీవించి ఉంటావు" అని తెలిపి మహర్షి వెళ్ళిపోయాడు.

మహర్షి మాటలకు చంపకాధిపతి పరమానంద భరితుడయ్యాడు. కుమార్తెలందర్నీ చూసుకొని ఎంతో గర్వపడేవాడు. వారంతా శ్రీరామ చంద్రుని అనుగ్రహానికి పాత్రులైన వారని తెలుసుకున్నాడు. ఇంతలోనే వారికి వివాహ సమయం రానే వచ్చింది. యాజ్ఞవల్క్యమహర్షి మాటల్ని గుర్తు చేసుకొని మధురానగరానికి దూతల్ని పంపాడు. ఈ దూతలు మధురానగరానికి పోయి విచారించి విమల మహారాజు వద్దకు పోయి ఇలా చెప్పారు. "అయ్యా! దేవకీ వసుదేవులకు చాలా మంది కుమారులు జన్మించారు. కంసుడు వారందర్నీ పురిటిలోనే చంపాడట. చివరగా ఒక ఆడ శిశువు జన్మించింది. ఆ శిశువును కూడా చంపేందుకు కంసుడు వెళ్ళగా ఆ శిశువు ఆకాశంలోకి ఎగిరిపోయింది. దేవకీ

వసుదేవులు మాత్రం ఇంకా చెరసాలలోనే ఉంటున్నారు. ఈ విషయాలెవరైనా మాట్లాడితే కంసుడు శిక్షిస్తాడట. అందువలన కొంతమంది నాతో రహస్యంగా చెప్పారు. అయితే రాజా! తిరిగి వస్తూ బృందావనం మీదుగా వచ్చాను. అక్కడ అనుకోకుండా నేనో బాలుణ్ణి చూశాను. నువ్వు చెప్పిన లక్షణాలన్నీ ఆ బాలుడిలో కనిపించాయి. అయితే ఈ బాలుడికి రెండు భుజాలు మాత్రమే ఉన్నాయి. చతుర్భుజుడు కాడు. అయినా ముని మాటలు వ్యర్థం కావు కదా! బాగా ఆలోచించి ఏం చెయ్యాలో మీరే నిర్ణయించుకోండి" అని అన్నాడు.

దూత చెప్పిన మాటలు విమలుడు విన్నాడు. యాజ్ఞవల్క్య మహర్షి చెప్పిన మాటలు వృథా కావని నమ్మాడు. అదే సమయానికి సింధు దేశాన్ని జయించి వస్తూ భీష్ముడు విమల మహారాజుకు అతిథిగా వచ్చాడు. విమలుడు తన సందేహాన్ని భీష్ముడి ముందుంచాడు. పరమ భాగవతోత్తముడు, జితేంద్రియుడు, గాంగేయుడు అయిన భీష్ముడు మహాజ్ఞాని. శ్రీకృష్ణ ప్రభావాన్ని పూర్తిగా ఎరిగిన వాడు. "రాజా! ఈ వృత్తాంతం అతి రహస్యమైనది. వేద వ్యాసుడు చెప్పగా నాకీ విషయం తెలిసింది. నువ్వు ఆపదలో ఉన్నావు కాబట్టి నీకా కథ చెప్తాను విను. దానవ సంహారానికి దేవతలను కాపాడటానికి శ్రీహరి వసుదేవుని ఇంట్లో అర్థరాత్రి సమయాన ఆవిర్భవించాడు. వసుదేవుడు కంసభయం చేత ఆ శిశువును గోకులంలో నందుని ఇంటికి చేర్చాడు. ఆ శిశువే యశోదా నందులకు తనయుడై పెరుగుతున్నాడు. అప్పుడే వారికి పుట్టిన ఆడ శిశువును మధురానగరంలో కంసుని ఇంటికి చేర్పించాడు. గోకులంలో ఆ బాలుడు పదకొండు సంవత్సరాలు రహస్యంగా పెరిగి ఆ పిమ్మట మధురానగరానికి పోయి కంసుని వధిస్తాడు. కంసవధ తర్వాత తన అవతారాన్ని ప్రకటించుకుంటాడు. ఎవరైతే శ్రీరాముని అనుగ్రహం చేత నీకు పుత్రికలై పుట్టారో వారంతా శ్రీకృష్ణుని వివాహం చేసుకుంటారు" అనితెలిపి భీష్ముడు హస్తినాపురానికి వెళ్ళాడు. అటుపిమ్మట విమల భూపాలుడు తన దూతను నందుని వద్దకు పంపాడు.

వివాహ ప్రయత్నం

(ఈ కథాభాగం గర్గ సంహిత మాధుర్య ఖండంలో సప్తమాధ్యాయం నుండి గ్రహించబడింది)

విమల భూపతి దూత మధురానగరం నుండి బృందావనానాకి వెళ్ళాడు. అక్కడ ఇక్కడా తిరుగుతున్న శ్రీకృష్ణుణ్ణి దర్శించి ఇలా విన్నవించుకున్నాడు. "శ్రీకృష్ణా! నువ్వు పరమాత్మవు. పరబ్రహ్మవు. సామాన్యులు నిన్ను గుర్తించలేరు. అనేక జన్మల పుణ్యఫలం గలవారికే నువ్వు కనిపిస్తావు. అట్టినీకు నమస్కారం. గోవుల్ని, విప్రుల్ని, దేవతల్ని ఉద్ధరించి ధర్మ సంరక్షణ చెయ్యడానికే అవతరించావు. ప్రభూ! నిన్ను పుత్రుడుగా పొందిన నందుడెంతో ధన్యుడు గదా. నీతో ఆడుతూ పాడుతూ, నీమాటలు వింటూ, నిన్ను తాకుతూ తిరిగే ఈ వ్రజ వాసుల సుకృతాన్నేమని చెప్పను? నీరాకతో ఈ గోకులమే ధన్యమైంది. ఈ బృందావనం ధన్యమైంది. ఈ గోవర్ధనం ధన్యమైంది. అట్టి నిన్ను చూచిన నాకన్నులు ధన్యమయ్యాయి. కస్తూరి కనపడకపోయినా దాని పరిమళం వ్యాపించినట్లు నీ మహిమలు సుప్రసిద్ధమయ్యాయి. జనులలో చైతన్యంగా ఉంటూ క్షేత్రజ్ఞుడవని పిలువబడుతున్నావు. దేహధారులందరికీ సాక్షివి. అయినా గూడా మా రాజు మాటలు విన్నవించుకుంటాను" విను.

సింధు దేశంలో చంపకానగరం ప్రసిద్ధి చెందింది. అది సౌభాగ్యంతో స్వర్గాన్నే మరిపిస్తుంది. అట్టి పురాన్ని విమలుడనే మహారాజు పాలిస్తున్నాడు. విష్ణు ప్రీతికై అనేక యజ్ఞాలు చేశాడు. అనేక తీర్థాలను దర్శించి విప్రులను భక్తితో పూజిస్తూ ఉంటాడు. అటువంటి భూపతిని అనుగ్రహించు. ఆ రాజుకు అనేకమంది కన్యలున్నారు. వారంతా నిన్నే కోరుకుంటున్నారు. కావున వ్రజనాథ! నువ్వు వారందర్నీ వివాహమాడి ఉద్ధరించు. సింధుదేశ ప్రజలకు నీ దర్శన భాగ్యాన్ని ప్రసాదించు. మేము చేయదగిన కర్తవ్యమేదో ఆదేశించు అని ప్రార్థించాడు. దూత మాటలు విన్న శ్రీహరి చిరునవ్వుతో క్షణకాలంలో దూతతో కలసి చంపకానగరాన్ని చేరుకున్నాడు. ఆ సమయంలో విమల మహారాజు యజ్ఞం చేస్తున్నాడు. యజ్ఞవాటిక అంతా వేదఘోషలతో మారుమ్రోగిపోతోంది. అటువంటి సమయంలో దూతతో కలసి శ్రీహరి ప్రవేశించి విమలుడితో ఇలా అన్నాడు.

“సాధుమతీ! యాజ్ఞవల్క్య మహర్షి చెప్పినట్టే నీకు నాదర్శనం లభించింది. నీ మనసులోని కోరిక తెలుపు” మని అనగానే విమల భూపతి మహదానందం చెందాడు. “కృష్ణా! దేవ దేవా! నీపాదాల వద్ద తిరుగాడే భ్రమరం వలె నామనస్సు నీకోసం తపిస్తోంది. ఆ తపన అట్లాగే నిశ్చలంగా నిలుచుగాక. తనకున్న రథాల్ని, అశ్వాలను, గజాలను, ధనాన్నంతా భగవంతునికర్పించి వాటితో పాటు తన ఆత్మను కూడా నివేదించుకున్నాడు. శాస్త్రోక్తంగా తన కన్యలందర్నీ అర్పించుకున్నాడు. వినయంగా నిలబడి భక్తి ప్రపత్తులతో నమస్కరించాడు. యజ్ఞవాటిక అంతా జయ జయ ధ్వనులతో నిండిపోయింది. ఆకాశం నుండి దేవతలు పూలవాన కురిపించారు. విమలుడు అప్పటికప్పుడే కోటి సూర్యుల తేజస్సుతో భార్యలందర్నీ వెంటబెట్టుకొని గరుడవాహనంపై వైకుంఠాన్ని చేరుకున్నాడు.

ఆవిధంగా విమల భూపతికి ముక్తిని ప్రసాదించి అతడి కుమార్తెలందర్నీ వెంటబెట్టుకొని శ్రీకృష్ణుడు గోకులానికి చేరుకున్నాడు. విమలుని పుత్రికలెందరో అన్ని రూపాల్లో కనిపిస్తూ ఆ బృందావన రాసమండలంలో విహరించారు. వారావిధంగా విహరిస్తూ ఉండగా ఆ ప్రదేశంలో ఒక కొలను ఏర్పడింది. అందులో స్నానం చేసి, కొద్ది జలాన్ని చేతిలోకి తీసుకొని ఆచమించినా భూలోకంలో చేసిన పాపాలన్నీ భస్మమై పోతాయి.

ఈ కథలో శ్రీకృష్ణుడు దూతతో కలసి క్షణకాలంలో చంపకానగరం చేరుకున్నాడని చదివినప్పుడు ఆశ్చర్యంగా అనిపించవచ్చు. సిద్ధులు పొందిన సామాన్య మానవులు కూడా ఈ విధంగా వెళ్ళి రాగలరు. ఇక భగవంతుని విషయంలో ప్రత్యేకంగా చెప్పవలసిందేముంటుంది? శివోక్తములైన ఇంద్రజాల తంత్రమనే సిద్ధులు పొందవచ్చని తెలుపబడింది. ఇవికాక ఘటికా సిద్ధి, పాదుకాసిద్ధి, అంజన సిద్ధి మొదలైన సిద్ధులెన్నో ఉన్నాయి. మంత్రరూపంలోనే కాక, ఓషధుల రూపంలో కూడా సిద్ధులుంటాయి. ఇవన్నీ ఈ కాలంలో కనుమరుగయ్యాయి. కారణం ఏమిటి? ముందుగా భగవంతుని యందు భక్తి , గురువు యెడల విశ్వాసము నశించాయి. భరత ఖండంలో ఏదో ఒకనాటికి ఈ సిద్ధులన్నీ బీజభూతములుగా ఉండక మానవు. నాస్తికులు ఆస్తికులు కాకపోరు. మనది భక్తి జ్ఞాన వైరాగ్యములకు ఆటపట్టు. అటువంటి ఈ భూభాగంలో అక్కడక్కడా మహర్షులుండి పురాతన సద్విద్యలు నశించి పోకుండా కాపాడుతూ ఉంటారు. **శ్రీరామకృష్ణులు** ఇలా ఉపదేశించారు. “భగవన్నామం

అఖండమైన శక్తి గలది. తక్షణమే ఫలం కలుగక పోవచ్చు. కానీ భవనంలో గోడమీద ఎక్కడో ఓ విత్తనం పడి ఉంటుంది. బహుశ ఎప్పుడో భవనం గోడలు బీటలు వారి ఆ విత్తనం నేలపై పడి చెట్టై ఫలిస్తుంది. కానీ వృథాగా పోదు.

యజ్ఞ సీతా గోపికోపాఖ్యానము

(ఈ భాగం గర్గ సంహిత మాధుర్యఖండం 8వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

దక్షిణ ప్రాంతంలో అనుశార దేశమొకటి ఉండేది. ఆ దేశంలోని గోపకులంతా ధనవంతులే. అయినా ఒకానొక సమయంలో తీవ్ర అనావృష్టి ఏర్పడి గోసంపదంతా నశించి పోసాగింది. అప్పుడు వారంతా బృందావనానికి వలస పోయి అక్కడ నివాసం ఉండేందుకు నందగోపుని అనుమతి పొంది నివసించసాగారు. అక్కడ పుట్టిన గోపికలంతా నవ యౌవ్వన సంపన్నులయ్యారు. శ్రీకృష్ణ పరమాత్ముని సౌందర్యానికి ఆశ్చర్యపోయారు. శ్రీహరినే వివాహమాడాలన్న కోరిక గాఢమైంది. రాధాదేవి వద్దకుపోయి "ఓ వృషభాను పుత్రీ! ఏ వ్రతం చేస్తే శ్రీకృష్ణుని భర్తగా పొందగలుగుతామో, మాకా వ్రతాన్ని ఉపదేశించ" మని ప్రార్థించారు. అందుకు రాధాదేవి "గోపికలారా! మీరు ఏకాదశీ వ్రతం నెలనెలా చేయండి. ఆ వ్రతం చేసినట్లయితే శ్రీకృష్ణుడు మీకు తప్పక వశమవుతాడు. మీకు ఆ వ్రత విధానాన్ని కూడా చెప్తాను. శ్రద్ధగా వినండి."

మార్గశీర్ష మాసంలో కృష్ణ పక్షంలో దుష్టసంహారానికై మహావిష్ణువు దేహం లోనుండి ఏకాదశి తిథి ఉద్భవించింది. ఇది వ్రతాలన్నింటిలోకి ఉత్తమమైనది. ఈ వ్రతం ఆచరించడం వలన ఉత్పత్తి, మోక్షం, సఫలం జయము, విజయము, మొదలైన 26 నామాలు పఠించడం వలన సకల శుభాలు కలుగుతాయి. ఇక ఏకాదశి వ్రత నియమాలను గూర్చి వినండి.

ఏకాదశి వ్రతం చెయ్యాలనుకునే వాళ్ళు దశమి నాడు ఒకపూట భోజనం చెయ్యాలి. జితేంద్రియులై నేలమీదనే పడుకోవాలి. బ్రహ్మ ముహూర్తంలోనే లేచి స్నానం చేసి తెల్లని వస్త్రాన్ని ధరించి నిర్మలమైన మనస్సుతో శ్రీహరిని ప్రార్థించాలి. నీచులతోను పాషండులతోను మాట్లాడరాదు. భక్తి ప్రపత్తులతో కేశవునికి నైవేద్యం అర్పించాలి. బ్రాహ్మణుల వలన భగవత్కథలు వింటూ రాత్రంతా జాగరణం చెయ్యాలి. ద్వాదశి ఘడియల్లో ఉపవాసాన్ని త్యజించి భుజించాలి. ఈ నియమాలు పాటిస్తూ వ్రతం చెయ్యాలి. ఈ వ్రతాన్ని గూర్చి విన్నంత మాత్రానే వాజపేయం చేసిన ఫలం కలుగుతుంది. ఈ వ్రతం చేసిన వారికి 80 వేల మంది విప్రుల్ని సేవించిన ఫలం కలుగుతుంది. సప్త సముద్రాలతో పాటు భూమండల మంతా దానమిచ్చిన ఫలం కలుగుతుంది. పాప పంకిల మైన సంసారం నుండి విముక్తు లవుతారు. ఇవి కాకుండా అనేక శుభ ఫలాలు కలిగించే ఈ వ్రతాన్ని మీరు త్వరగా ఆచరించండి" అని రాధాదేవి వారికి బోధించింది.

పుళిందికా గోపికలు

(ఈ కథ గర్గసంహిత మాధుర్య ఖండము దశమాధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదుడు : బహుళాశ్వ మహారాజా! పూర్వం పుళిందలు వింధ్య పర్వతాల్లో ఉంటూ రాజుకు చేరవలసిన సంపదల్ని అపహరిస్తూ ఉండేవారు. అట్లా అపహరించిన ధనంలో కొంత భాగమైనా బీదలకు ఖర్చు చేయకుండా వారే అనుభవిస్తూ ఉండేవారు. వీరి దుర్మార్గాలు మితిమీరి పోగా వింధ్య దేశాధిపతికి కోపం వచ్చింది. పెద్దపెట్టున సైన్యంతో పోయి వారిని ఎదిరించాడు. రాజు బలగాన్ని తట్టుకోలేక పుళిందులంతా మగధాధిపతి అయిన కంసుని సాయం కోరారు. కంసుడు తన కింకరుల్లో అతి బలశాలి మాయావి అయిన ప్రలంబాసురుని పంపాడు. వాడు మాయోపాయం చేత శరీరాన్ని పర్వతమంత పెంచాడు. కాలయముని వలె నాలుక అల్లల్లాడుస్తూ ఘోరమైన ఆకారాన్ని కలిగి పర్వతంపై నుండి బండరాళ్ళను దొర్లిస్తూ సైన్యాన్నంతటినీ భయభ్రాంతుల్ని చేశాడు. వింధ్యాధిపతి ప్రలంబాసురుని ధాటికి నిలువ లేక వెనుతిరిగి పోయాడు. అంతట ప్రలంబాసురుడు పుళిందులను మధురానగరానికి తీసుకొనిపోయి కంసునికి భృత్యుల్ని చేశాడు. శ్రీరాముని వర ప్రభావం చేత మహర్షులు అనేక మంది ఆ పుళిందలకు కన్యకలుగా జన్మించారు. వారంతా లక్ష్మీదేవి అంతటి రూపవతులయ్యారు. వారు సదా శ్రీకృష్ణునే మనస్సులో ధ్యానిస్తూ శ్రీకృష్ణ దర్శనానికై ఎదురు చూస్తూ కొంతకాలానికి భగవత్కృపకు పాత్రులై రాసక్రీడల సమయంలో శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని సేవించగలిగారు. ఆ పుళింద కన్యకల భాగ్యానికి యోగీశ్వరులంతా ముక్కున వేలేసుకున్నారు. సాధుపుంగవులెవరూ భూలోకాధిపత్యాన్ని గాని పాతాళాధిపత్యాన్ని గాని చివరకు సత్యలోకాధిపత్యాన్ని కూడా కోరుకోరు. కేవలం శ్రీహరి పాదసేవనే కోరుకుంటారు. అదే పునర్జన్మ లేకుండా చేసేది.

ఊర్ధ్వలోక గోపికలు :

నారదుడు : బహుళాశ్వ మహారాజా! మరికొంత మంది గోపికలు భూలోకంలో జన్మించారు. నీతివిధుడు, మార్గదుడు, శుక్లుడు, పతంగుడు, దివ్యవాహనుడు, గోపేష్టుడు అను వృషభానువులు ఆరుగురు గోలోకవాసులు. భగవంతునికి సహాయంగా ఉండేందుకు గోకులంలో జన్మించారు. వారి ఇళ్ళల్లో విష్ణు మూర్తి ప్రభావం చేత అనేక మంది గోపికలు జన్మించారు. వారంతా కూడా వైకుంఠంలో లక్ష్మీదేవికి చెలికత్తెలే. వీరంతా పుట్టుకతోనే శ్రీకృష్ణ భక్తులయ్యారు. శ్రీకృష్ణ వరప్రసాదాన్ననుసరించి వారంతా మాఘవ్రతాన్ని ఆచరించారు. శ్రీహరి వారిని పరీక్షించాలనుకున్నాడు. ఒంటినిండా విభూతి పూసుకొని, పులి చర్మాన్ని కప్పుకొని వేణువునూదుతూ వాళ్ల వీథిలో తిరుగుతున్న శ్రీహరిని చూసి గోపికలంతా మోహితులయ్యారు. ఆ సుందరాకారుణ్ణి మళ్ళీ మళ్ళీ చూడాలని తహ తహలాడారు. భగవద్దర్శనం వలన వారిలో ప్రేమానందం పెల్లుబికింది. ఇతడు వేషం మార్చి తిరుగుతున్న శ్రీకృష్ణుడేమోనని సందేహ పడ్డారు . వాళ్ళల్లో వాళ్ళు మళ్ళీ గుస గుస లాడుకొని మృధు మధురంగా అతడితో "ఓ యోగీశ్వరా! నువ్వెవడవు? నీ పేరేమిటి? నీవు ఇట్లా విరక్తుడవై తిరుగుతూ ఉంటే నీ

తల్లి దండ్రులు సహించగలరా? నీవిరక్తికి గల కారణం ఏమిటి? నువ్వేమైనా తపస్సు చేశావా? తపస్సిద్ధి పొందగలిగావా? నువ్వెక్కడ ఉంటావు? ఎందుకు ఈవిధంగా ఉన్మాదిగా తిరుగుతున్నావు? నీ గురించి తెలుసుకోవాలని ఉంది. ఏదీ దాచకుండా చెప్పు వింటాం. గోపికల మాటలు వన్న యోగీశ్వరుడు "గోపికలారా! నేను పరమ హంసలతో కలసి తిరుగుతూ ఉంటాను. నాకు దివ్యజ్ఞానం ఉంది. ఆ జ్ఞానంతో భూత భవిష్యద్వర్తమానాలన్నీ చూసినట్లు చెప్పగలను. ఉచ్చాటన, మారణ, మోహన, స్థంభన సిద్ధులన్నీ నాకు కరతలామలకము. వశీకరణ విద్యకూడా నేనెరుగుదును. ఇంకేమైనా తెలుసుకోవాలని అనుకుంటున్నారా?" అని అడిగాడు. అప్పుడా గోపికలు "యోగీంద్రా! నీకే అంత శక్తి ఉంటే మా మనసులో ఏముందో చెప్పు. నువ్వు సరిగా చెప్తే నువ్వు యోగీశ్వరుడవేనని నమ్ముతాం" అన్నారు. అందుకా సిద్ధుడు "గోపికలారా! మీ మనసులో ఉన్నదున్నట్లు చెప్పగలను. అయితే అది పరమ రహస్యం కనుక దాన్ని రహస్యంగానే మీ చెవిలో మాత్రమే చెప్పగలను. కానీ మీకేమి ఇబ్బంది లేదంటే అంతా వినేట్లుగానే చెప్తాను" అన్నాడు. గోపికలంతా అతణ్ణి యోగీశ్వరుడుగానే అంగీకరించారు. అయితే ఓ యోగీశ్వరా! నీ మంత్ర సామర్థ్యాన్ని కూడా పరీక్షించాలనుకుంటున్నాం. ఆ పరీక్ష ఏమంటావా? మేము మనస్సులో ఎవరిని కోరుకుంటున్నామో అతణ్ణి ఇక్కడకు రప్పించు. అప్పుడే నీ మంత్ర సామర్థ్యాన్ని ఒప్పుకుంటాం. వారి మాటలు విన్న సిద్ధుడు ఓ గోపికలారా! మీరు నాకు చాలా పెద్ద పరీక్ష పెట్టారు. సాధువులం అన్న మాట నిలబెట్టుకుంటాం. అయితే నేను చెప్పే వరకు మీరంతా కళ్ళుమూసుకోండి. మనస్సులో ఏ సందేహాలు పెట్టుకోకండి. నాపై విశ్వాసం ఉంచి కళ్ళుమూసుకోండి. మీకోరిక ఫలిస్తుంది. సందేహపడకుండా కళ్ళు మూసుకోండి. సాధువు మాటలు విన్న గోపికలంతా పరమ సంతోషంగా కళ్ళు మూసుకున్నారు. అంతట శ్రీహరి ఆ యోగి రూపాన్ని వదిలి తన నిజస్వరూపంతో నిలబడ్డాడు. గోపికలు కళ్ళు తెరచి చూడగానే వాళ్ళముందు శ్రీహరి ప్రత్యక్షమై ఉండటంతో మహదానందం పొందారు. శ్రీహరి దివ్య తేజస్సుకు మోహితులయ్యారు. కలో నిజమో తెలుసుకోలేకపోయారు. ఆ మాఘమాసం, రాసమండలంలో శ్రీహరి వారందరితో విహరించి ఆనందపరచాడు.

మనమింతవరకు శ్రుతిరూప, ఋషిరూప, మైథిలీ, కోసల, ఆయోధ్యా, యజ్ఞసీతా, పుళింద గోపికలగూర్చి తెలుసుకున్నాం. వీరి వృత్తాంతం కాక ఏకాదశీ వ్రత మాహాత్మ్యాన్ని గూడ తెలుసుకున్నాం. అయితే ఏకాదశీ వ్రత మాహాత్మ్యాన్ని గూర్చి ఇంతకు పూర్వమే తెలుసుకున్నాం అయితే మళ్ళీ ఎందుకు వ్రాయాల్సి వచ్చిందని అడుగవచ్చు. చదవండి. ఏకాదశీ వ్రతం నిత్యమని కొందరు కామ్యమని కొందరు అభిప్రాయ పడుతున్నారు.

నిత్య కర్మలకు ఫలం ఉండదు. సంధ్యావందనం చెయ్యడం నిత్యకృత్యమే. చెయ్యకపోతే పాపం వస్తుంది. అయితే పుణ్యాన్ని కోరి చెయ్యం కాబట్టి ఫలం ఉండదు. పూర్వ మీమాంసా శాస్త్రంలో దురితాక్షయ రూపమైన ఫలం ఉన్నదని చెప్పబడింది. దీన్ని కామ్యము అని చెప్పడానికి వీలులేదు. ఎందువల్లనంటే కోరుకున్నా కోరుకోకపోయినా ఆ ఫలం లభించితీరుతుంది. కావున ఏకాదశీ వ్రతానికి నిత్యత్వము, కామ్యత్వం రెండూ కల్పించబడ్డాయి. ఈ విషయాన్ని వేద భాష్యకర్త లయిన విద్యారణ్యుల

వారు కూడా సిద్ధాంతం చేశారు. కావున ఈ వ్రతం భుక్తిని, ముక్తిని కూడా ప్రసాదిస్తుందని స్పష్టమవుతోంది.

గోపికల చరిత్రల గూర్చి పరిశీలిద్దాం. లక్ష్మీదేవి చెలికత్తెలే గోపికలుగా అవతరించారని కనిపిస్తోంది. అయితే లక్ష్మీదేవి అవతారమైన రాధాదేవి సేవలకై వారీ లోకానికి వచ్చినట్లు కనబడదు. రాసమండలంలో భగవంతుని పాదాల్ని సేవించుకోవడానికి వచ్చారు. అయితే వీరు అన్ని లోకాల నుండి వచ్చి భగవంతుని సేవించుకున్నారు. ఒక్క కృష్ణావతారంలో తప్ప మరే అవతారంలోను లోకాంతరాలనుండి భూలోకంలో స్త్రీలుగా అవతరించినట్లు కనబడదు. ఆ రసేశ్వరి అయిన రాధాదేవియే పరాపర రహస్య యోగినిగా చెప్పబడింది. అటువంటి రాధామాధవులే సంపూర్ణావతారం దాల్చారు. ఏ అవతారంలోను ఇటువంటి వింతలు గాని, లీలలు గాని ప్రదర్శించబడలేదు. అందువల్లనే కృష్ణావతారాన్ని దశావతారాల్లో చేర్చకుండా ప్రత్యేకంగా కీర్తించారు. అన్ని లోకాల్లోని భక్తులకు వారి అభీష్టాల్ని ప్రసాదించిన అవతారమిది. శ్రీహరి రూపాన్ని తెలుసుకో గోరిన భక్తులందరికీ, వారేలోకవాసులైనా, ఈ రాసమండలంలో తన అపర స్వరూపమైన రాధాదేవితో కలసి దర్శనమివ్వడమే కాకుండా వాళ్ళందరితో కలసి ఆడాడు పాడాడు. ఎవరైనా శ్రీకృష్ణుడు మనుష్య మాత్రుడే అని అంటే, ఇందులో ఏ ఒక్క కార్యమూ మానవ మాత్రుల వల్ల అయ్యేది కాదు. బ్రహ్మాండాలన్నింటినీ ఒక క్షణంలో సృష్టించి, పెంచి నిర్మూలించగల భగవంతునికి రాసకార్యం ఒక లెక్క లోనిది కాదు. వారంతా వివాహితలే అయినా, వారి వారి భార్యలు వారి భర్తల వద్దనే ఉన్నారు. ఇక్కడ విహరించిన వన్నీ వారి జీవాత్మలే. అవన్నీ భగవంతునితోనే విహరించాయి. మిగిలిన వారెవ్వరికీ కనిపించవు. గోపాల బాలుడా సమయాన సుమారు పదకొండు సంవత్సరాల బాలుడు. తల్లితో మాట్లాడుతూనే ఉంటాడు. అదే సమయంలో రాధాదేవితో రాసమండలంలో విహరించాడు. అప్పుడే గోవుల్ని తీసుకొని అడవులకు వెళ్ళి గోపబాలకులతో ఆడుకునేవాడు. నందుని వద్ద కూర్చుని తియ్యగా మాట్లాడుతూ ఆనంద పరచే వాడు. ఇన్ని పనులు ఒకే సారి ఎవరైనా చెయ్యగలరా? అందువల్లనే భర్తలు గాని మరెవ్వరు గాని సందేహపడలేదు. ఇన్ని పనులు ఒక్క సారి చెయ్యగలిగిన వాడు సర్వాంతర్యామి కాక మరెవ్వరు? సర్వ నియంత్రుడు కాడా? కావున శ్రీకృష్ణుని విషయంలో ఎటువంటి సందేహాలకు చోటులేదు. అయినా సందేహించే వారున్నారంటే, అది వారి పూర్వ జన్మ పాపకర్మ ఫలమనే చెప్పాలి. కావున శ్రీహరి కథలు అసత్యమన్నమాటకు హృదయంలో చోటీయరాదు. శ్రీకృష్ణుడు పరాత్పరుడనే నమ్మి ఆ మహాత్ముని లీలల్ని పఠించి మనస్సు ఆయన పాదాలపై నిలిపి కృతార్థులం కావాలి. భగవన్నామం సకల పాపహరమని మనం పూర్తిగా విశ్వసించాలి. భూత దయ, అహింస అన్న రెండూ దృఢభక్తికి దివ్య ప్రమాణాలు. వాటితోనే శ్రీహరిని ప్రసన్నుణ్ణి చేసుకోవాలి. అదే తరుణోపాయం. అదే సత్యం.

భూమి గోపికలు

(ఈ కథ గర్గసంహిత మాధుర్య ఖండం 12వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదుడు : బహుళాశ్వ మహారాజా! వీరుకాక భూమి గోపికలు కొందరున్నారు. వారిని గూర్చి చెప్తాను విను. ఉపనందుడి వ్రజలో వీతి హోత్రుడు, అగ్నిభుక్కు , సాంబుడు, శ్రీకరుడు, గోపతి, శుభుడు, వ్రజేశుడు, పావనుడు, శాంతుడు, అనుగోపకులు జన్మించారు. వీరందరూ రూపవంతులు, ధనవంతులు, వేద వేదాంగాలు పఠించిన వారు, దాన పరాయణులు, శీలవంతులుగా ప్రఖ్యాతి చెందారు. భగవదాదేశం వలన వారి ఇళ్ళల్లో అనేక మంది బాలికలు జన్మించారు. వారిలో సత్త్వ రజస్తమో గుణాలతో వర్థిల్లే వారిని భూమి గోపికలని పిలిచేవారు. మరికొందరు దేవలోకం నుండి శ్రీకృష్ణ పాదసేవకై భూలోకంలో అవతరించారు. రాధాదేవికి చెలికత్తెలయ్యారు. ఆరోజు హోళీ కామ మహోత్సవం జరుగుతోంది. దాంతో అంతా పండుగ వాతావరణం నెలకొంది. అప్పుడీ గోపికలంతా శ్యామ సుందరుణ్ణి చూసి రాధాదేవితో ఇలా విన్నవించుకున్నారు. రాధాదేవీ! ఇక అలంకారాలన్నీ కట్టిపెట్టు. వ్రజభూషణుడు, నందనందనుడు అయిన పరమాత్ముడు మురళి చేత పట్టుకొని వచ్చేస్తున్నాడు. అమ్మా! ఇక లేచి ఎదురుగా వెళ్ళి ఆహ్వానించు. అమ్మా! ఇటువంటి మహద్భాగ్యం అన్నప్పుడల్లా రాదు. పుణ్యనదీ ప్రవాహంలో కాళ్ళూ చేతులూ ఎట్లా శుద్ధి చేసుకుంటామో అదేవిధంగా ఈ మహానుభావుని దర్శించడం వలన అంతఃకరణమే శుద్ధి అవుతుంది.

రాధాదేవి చెలికత్తెల మాటలతో ఈ లోకంలోకి వచ్చింది. అభిమానం విడిచిపెట్టింది. చెలికత్తెలతో కలసి ఎదురు వెళ్ళి సాదరంగా ఆహ్వానించి తీసుకువచ్చి ఆసనం చూపింది. శ్రీఖండం, అగరు, కస్తూరి, కుంకుమలతో కలసిన పూర్ణ కుంభాన్ని పట్టుకొని చెలికత్తెలు వెంటరాగా ఆ మహోత్సవాన్ని ప్రారంభించారు. కొందరు యువతులు హోళీ గీతాలు పాడారు. కొందరు పరమేశ్వరుని సచ్చరిత్రను కీర్తించారు. కొందరు భగవంతుని ఆట పట్టిస్తూ హాస్యాలాడారు. కొందరు భక్తి ప్రపత్తులతో అర్చించారు. కొందరు పిడికిళ్ళ నిండా కుంకుమ, కస్తూరి వంటి సుగంధాల్ని తీసుకొని శ్రీకృష్ణుని పై చల్లగా భూమ్యాకాశాలన్నీ ఎరుపురంగులో కనిపించాయి. భగవంతుని అర్చించుకునేందుకు ఎంత మంది గోపికలా ఇంట్లో సమావేశమయ్యారో శ్రీకృష్ణుడు అంత మంది కి అన్నిరూపాలుగా దర్శనమిచ్చి కృతార్థుల్ని చేశాడు. గోపికలు వారి వారి అధికారాన్ని బట్టి ఎన్ని విధాలుగా అర్చిస్తున్నారో భగవంతుడు కూడా అన్ని తీరుల్లోను సంతోషించాడు. శ్రీహరి రాధాదేవి చేసిన పూజలన్నింటినీ గ్రహించి గోపికలందర్నీ వెంటబెట్టుకొని నందుని భవనానికి బయలు దేరాడు.

హోళికాంబ అంటే ఆ పరదైవమనే అర్థం. ఆ దేవిని ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ నాడు పరిమళ వస్తువులతో అర్చించుకోవాలి. ఆ పూజకు సాయంకాలమే సరైన సమయం. పగటిపూట గోపూజలు చేసుకొని, సాయంత్రం ఇల్లంతా దీపాలతో అలంకరించుకోవాలి. ఈ విషయాన్ని "నిర్ణయామృతం", "జ్యోతిర్నిబంధం" ఇంకా అనేక స్మృతులు సమర్థిస్తున్నాయి. ఆమె తేజస్వరూపిణి కాబట్టి సాయంత్రం వేళల్లో దీపకాంతుల మధ్య పూజించాలి. ఆవిధంగా హోళికాదేవిని అర్చించుకుంటే ఆ పరదేవి దేశాన్ని

ఆ సంవత్సరమంతా శుభాలనిస్తూ కాపాడుతుంది. రాధాదేవి ఈ హోళికార్చన చేసింది? అనగా భగవంతుడు తేజస్స్వరూపుడు. యోగులాయన్ను హృదయంలో తేజస్స్వరూపునిగా ఆరాధిస్తారు. హోళికాదేవిని దీపములలో ఆరాధించడమనగా తేజస్స్వరూపిణిగా ఆరాధించడమేనని మనం భావించాలి. విగ్రహపూజలు ప్రాథమిక భక్తులకొరకు ఉద్దేశించ బడినవి. కావున రాధాదేవి ముందుగా విగ్రహరూపంలో భగవంతుణ్ణి పూజించి లోకానికి ఉదాహరణముగా నిలచింది. భగవంతుడు తపస్సు చేశాడంటే అర్థమేమిటి? తన స్వరూపాన్నే దర్శిస్తున్నాడని భావం. అట్లా కాదంటే భగవంతుడు ప్రార్థించేందుకు రెండవవాడు లేడు కదా. కావున తన్నుతానే ధ్యానించుకున్నాడని సారం. అట్లాగే ప్రకృతి కూడా రూపాంతరంగా ఉండే తనను తానే పూజించుకుంటుంది. లోకులకు ఈ సదాచారాన్ని నేర్పడమే భగవంతుని ఆశయం. శ్రీకృష్ణాదులు కూడా లోకానికి సదాచారాల్ని నేర్పేందుకు దేవతా పూజలు చేస్తూ ఉంటారు.

ఈ హోళివేడుకలు శ్రీకృష్ణ మహిమల్ని చాటి చెప్తున్నాయి. స్వర్గ, మర్త్య, పాతాళ లోకాల్లో, శ్రీకృష్ణుని ఆరాధించే భక్తులందరికీ సుకృత ఫలంగా గోకులంలో గోపికలుగా జన్మించారు. ఆ హోళి ఉత్సవ సమయంలో రాధా దేవి ఇంటికి వెళ్ళి వివిధములైన సుగంధ ద్రవ్యాలతో శ్యామ సుందర మూర్తిని ఆరాధించారు. శ్రీకృష్ణుని గుణ గణాలను మనసారా కీర్తించారు. ఎంతమంది తన్ను ఆరాధించారో అంతమందికి అన్నిరూపాల్లో వారిపూజలందుకొని ఆనందపర్చాడు. శ్రీకృష్ణుడు జారుడు కాడు. చోరుడు కాడు. అయితే ఎట్లాంటి జారుడంటే, వారి వారి హృదయాల్లోని భావాల్ని గ్రహించి వారి హృదయాల్ని హరిస్తూ ఉంటాడు. ఆ విధంగా అతడు జారుడే. అంతే కాదు భక్తుల పాపరాసులన్నింటినీ అపహరిస్తాడు కావున అతడు చోరుడు కూడాను. ఈ రెండూ లోకుల దృష్టిలో అపకీర్తే అయినా ఆ పరమాత్ముడికి మాత్రం అలంకారాలే అయ్యాయి. ఈ ఒక్క విషయాన్ని మనస్సుకు పట్టించుకుంటే చాలు. ఇక భక్తుడు తరించినట్లే. భగవంతుని సర్వ వ్యాపకత్వము స్పష్టమవుతున్నా కూడా నిందించడం కన్నా పాపం మరొకటి ఉండదు. కావున నిందు మనసుతో శ్రీకృష్ణుని ధ్యానించి కృతార్థులమవ్వడమే మన కర్తవ్యం.

దేవాంగనా గోపికలు :

నారదుడు : బహుళాశ్వమహారాజా! దేవాంగనా గోపికల గూర్చి చెప్తాను. విను. పూర్వం మాళవ రాజ్యంలో నందుడు అనే గోపకుడు ఉండేవాడు. అతడికి దివస్పతి అనే మరో సార్థక నామం కూడా ఉండేది. అతడిని అనేక మంది గోపస్త్రీలు వివాహమాడారు. నందగోపకుడు గొప్ప గోసంపద కలిగిన వాడు. గొప్ప శీలవంతుడు. మీదుమిక్కిలి విష్ణు భక్తుడు. అతడొక సమయంలో తీర్థయాత్రలు చేస్తూ మధురానగరానికి వెళ్ళాడు. అక్కడ వ్రజాధీసుడైన నందరాజును గూర్చి విన్నాడు. స్వయంగా బృందావనానికి పోయి ముగ్ధుడయ్యాడు. నందరాజు అనుమతితో బృందావనంలో గోకోష్టాలను నిర్మించుకొని గోసంరక్షణ చేస్తూ ఆనందంగా నివసించాడు.

ఆ దివస్పతికి దేవలముని అనుగ్రహం చేత దేవకన్యలాంటి పుత్రికలు కలిగారు. వారంతా గుణవంతులుగానూ రూపవంతులుగాను ప్రఖ్యాతి పొందారు. ఆ గోపికలంతా శ్రీకృష్ణుని చూసిన

నాటి నుండి అతడిపైనే మనసు నిలుపుకున్నారు. తమ కోరిక సఫలం కావాలని వారంతా మాఘ వ్రతాన్ని తలపెట్టారు. వారంతా సూర్యోదయానికి ముందే యమునానదికి స్నానానికి వెళ్ళేవారు. స్నానం చేసి మనసారా శ్రీకృష్ణుని గుణగణాలను కీర్తించే వారు. ఒకరోజున శ్రీకృష్ణుడు వారెదుట ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. శ్రీకృష్ణ దర్శనంతో మహదానందం చెంది నమస్కరించి ఇలా ప్రార్థించారు. కృష్ణా! నిన్ను యోగీశ్వరులు కూడా పొందలేరు. నువ్వే పరమేశ్వరుడవు. కారణాలకే కారణమైన వాడవు. మురళిని చేత పట్టుకొని ఎల్లప్పుడూ మా ముందు కనిపించేటట్లు వరం ప్రసాదించు అని ప్రార్థించారు. పరమాత్ముడు వారు కోరినట్లే వరాన్ని ప్రసాదించి వారు కోరుకున్నప్పుడల్లా దర్శనమిస్తూ వచ్చాడు. వారికి కూడా హృదయం నిండా శ్రీకృష్ణుడే నిండి ఉండేవాడు. మురళి పట్టుకొని ఎదురుగా కళ్ళకు కనిపించేవాడు. శ్రీహరియే శ్రీకృష్ణరూపంలో అవతరించాడని వారు విశ్వసించారు.

ఓ బహుళాశ్వ మహారాజా! భగవంతుడు ఒక కార్యాన్ని సాధించేందుకై అవతరించి అనేక కార్యాలు జనులకు సాధించి పెట్టాడు. భగవంతుడు భక్తి కి మాత్రమే వశుడవుతాడు. ఇందుకు గోపికలే ప్రత్యక్ష ప్రమాణం. గోపికలు సాంఖ్యాన్ని గాని, యోగాన్ని గాని పఠించి భగవంతుని హృదయంలో స్థానం సంపాదించలేదు. కేవలం భక్తితోనే భగవంతుని లోబరచుకున్నారు. కావున ఓ రాజా! నువ్వుకూడా పరమేశ్వరుని భక్తితో ఆరాధించు.

శ్రీకృష్ణుని రాసమండలంలో సేవించుకోవడానికే భూమిపై అవతరించారన్నదే ఈ కథా సారం. త్రికాలవేత్త, మహాజ్ఞాని అయిన దేవలముని భగవత్సేవకు భూలోకమే ఉత్కృష్టమైనదని దివస్పతి అనే గోపకునికి కన్యకలుగా జన్మించేట్లు అనుగ్రహించాడు. ఎవరెవరైతే భగవత్సేవ కోరుకున్నారో వారంతా బృందావనంలో పుట్టారు. ఎవరు భగవంతుని ద్వేషించారో, కృత కర్మలనే నమ్ముకున్నారో వారంతా కంసుని పక్షాన చేరారు. అయితే భక్తులు, కౄరాత్ములు ఇద్దరూ కూడా శ్రీకృష్ణుని చేత ముక్తిని పొందారు. వారి ప్రవృత్తిని బట్టి, కర్మఫలాల్లో భేదమేకాని, ఫలప్రాప్తిలో భేదముండదు. అనగా, ఎవరెవరు శ్రీకృష్ణుని ద్వారా ముక్తిని పొందగల పుణ్యం చేశారో వారంతా సేవలు చేసిగాని, విభేదించిగాని మోక్షపదాన్ని చేర్తారని స్పష్టమవుతుంది. ఇందుకు ఉదాహరణముగా శ్రీకృష్ణావతారంలో విరోధించి శిశుపాలాదులు, రామావతారంలో దండకారణ్యంలో భగవద్దర్శనం చేత మునులు, విరోధించి ఖరదూషణాది రాక్షసులు ముక్తిని పొందారు. కావున గోపికలంతా భగవత్సేవకై అవతరించారని వారంతా భగవంతుని ఏకాంత భక్తులై, ప్రేమికులై ఆరాధించారు. భగవంతుడు భక్తికి మాత్రమే వశుడవుతాడని అందువలన గోపికలవలె నిష్కపట భక్తిని అలవాటు చేసుకోవాలన్నదే ఇందులో సారం.

జాలంధరీ గోపికలు

(ఈ భాగం గర్గ సంహిత మాధుర్యఖండం 14వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

నారదుడు : బహుళాశ్వ మహారాజా! ఇప్పుడు జలంధరీ గోపికల గూర్చి చెప్తాను విను.

సప్తనదీ తీరాన రంగపురం అనే నగరం ఉండేది. ఆ నగరం సర్వ సమృద్ధితో దేవేంద్రుని అమరావతీ పట్టణంతో సమానంగా ఉండేది. ఈ నగరాన్ని రంగోజీ అనే గోపాలుడు తన అధీనంలో ఉంచుకొని తన సంపదలో కొంత భాగాన్ని ప్రతి సంవత్సరం ధృతరాష్ట్ర మహారాజుకు చెల్లిస్తూ ఉండేవాడు. కొంత కాలం పోయిన తర్వాత ధన గర్వంతో కప్పం కట్టడం మానేశాడు. అంతేకాదు ప్రతి సంవత్సరం జరిగే వార్షికోత్సవాలకు కూడా పోకుండా ముఖం చాటేశాడు. దాంతో ధృతరాష్ట్రుని ఆగ్రహానికి గురి అయ్యాడు. భటులు ఆ రంగోజీని బంధించి తీసుకొని పోయి మహారాజు ఎదుట నిలబెట్టారు. రాజతడికి కారాగార శిక్ష విధించాడు. ఎన్ని చిత్రహింసలకు గురి చేసినా, ఎన్ని సంవత్సరాలైనా "తప్పయి పోయింది, కప్పం కడ్తానని" అతడి నోటి వెంట రాలేదు. నిర్భయుడై స్థిర చిత్తంతో శిక్ష అనుభవిస్తూ వచ్చాడు. ఒకానొక రోజున ఆ గోపకుడు చెరసాలలో నుండి తప్పించుకొని తన పట్టణానికి చేరుకున్నాడు. విషయం తెలిసిన రాజు ఆ గోపకుణ్ణి బంధించి తెమ్మని భటుల్ని పంపాడు. అయితే ఈ పర్యాయం గోపకుడా రాజ భటుల్ని దీటుగా ఎదిరించాడు. అయినా సైన్య బలం ముందు నిలువలేక పోయాడు. ఏదో ఒక ఉపాయంతో తప్పించుకోవాలను కున్నాడు. రహస్యంగా కంసుని వద్దకు ఓ దూతను పంపాడు. ఆ దూత మధురానగరానికి పోయి రాజదర్శనాన్ని పొందగలిగాడు. కంస భూపతికి వినయంగా నమస్కరించి "మహారాజా! రంగపురాధీశుడైన రంగోజీ శత్రువుల చేత ముట్టడించబడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. నీ శరణు కోరమని నన్ను దూతగా పంపాడు. నువ్వు దీనులను రక్షిస్తానని కంకణం కట్టుకున్న మహారాజువు. నీ బలం ముందు శత్రువెంతటి వాడైనా నిలువలేడు. మహాపరాక్రమ శాలురైన దేవతల్ని, రాక్షసుల్ని కూడా జయించావు. నీకు నువ్వే సాటి. నీ పరాక్రమాన్ని ఎవరితోనూ పోల్చి చెప్పలేను. ఆకలి గొన్నవాడు అన్నాన్ని కోరినట్లు మా రాజు నిన్నాశ్రయించాడు" అని విన్నవించుకున్నాడు.

దూత ప్రార్థన విన్న కంసమహారాజు ధృతరాష్ట్రుని సైన్యాన్ని ఎదుర్కొన వలెనని నిశ్చయించుకొన్నాడు. రంగోజీకి అభయమిచ్చి దూతను పంపేశాడు. శత్రువు బలం ఎరిగిన వాడు కాబట్టి తానే స్వయంగా బయలు దేరాడు. కువలయాపీడమనే గజరాజాన్ని అధిరోహించాడు. చాణూర ముష్టికులు, కేశి, వ్యోమ, వృషాసురులను వెంట బెట్టుకొని రంగపురానికి చేరుకున్నాడు. కురుసేనల్ని బాణాలతోను, ఖడ్గాలతోను, శూలాలతోను బాధించాడు. కంసుడు గదను ధరించి ఎండిపోయిన అరణ్యంలోకి అగ్ని ప్రవేశించినట్లు కురుసైన్యంలోకి దూసుకుపోయాడు. ఇంద్రుడు వజ్రాయుధంతో కొండల్ని పిండిచేసినట్లు శత్రువుల రథాలను, గజతురగాలను, అశేష సైన్యాన్ని తన గదా ప్రహారాలతో మట్టుపెట్టాడు. అతడి అనుచరులైన కేశి వ్యోమాది దానవులు కూడా చెలరేగి యుద్ధం చేస్తూ ఉండగా కురుసేనలు నిలబడలేక నలుదిక్కులకు పరుగులు తీశారు.

యుద్ధం ముగిసింది. రంగోజీని కుటుంబ సహితంగా తనతో మధురానగరానికి తీసుకుపోయాడు. కంసుడా రంగోజీకి బర్హిషదమనే నగరానికి రాజునుగా చేసి సత్కరించాడు. రంగోజీ చాలా కాలం ఆ నగరంలోనే నివసించాడు. జాలంధరీ స్త్రీలు అతడికి పుత్రికలుగా జన్మించారు. వారందరూ శ్రీహరి వర ప్రభావం చేత జన్మించినవారే. ఆగోపికలంతా గోపకుల్ని వివాహమాడారు. కానీ వారి మనస్సులు మాత్రం శ్రీకృష్ణుని పై లగ్నమై ఉన్నాయి. వారి మనస్సు నెరిగిన శ్రీకృష్ణుడు చైత్రమాసంలో బృందావన రాసమండలంలో వారందరితో విహరించాడు.

మనకీ వృత్తాంతంలో చాలా సందేహాలు కలుగుతాయి. జాలంధరీ వనితలందరూ శ్రీహరి వర ప్రభావంచేత భూలోకంలో అవతరించారు. వారందర్నీ గోపకులే పెండ్లి చేసుకున్నారు. వారంతా రూపవతులు యౌవనంలో ఉన్నవారు. వారందరితో శ్రీకృష్ణ పరబ్రహ్మము బృందావనంలో విహరించాడంటే ఇది జారత్వం కాదా? అని ఎవరికైనా సందేహం కలుగవచ్చు. కానీ సూక్ష్మదృష్టితో విచారిస్తే అందులో దోషమేమీ కనిపించదు. గోపకులంతా శ్రీకృష్ణాంశ సంభూతులు. శ్రీకృష్ణునితో పాటు భూలోకానికి వచ్చి గోపకులుగా పిలువబడ్డారు. ఇక గోపికలెవరు? శ్రీరాధాదేవి కళా సంభూతులు. కొందరు పద్మావతీ కళా సంభూతులు, ఇంకొందరు శ్రీకళా సంభూతులు. రాధ, పద్మావతి, శ్రీ అన్న పేర్లు వేరు వేరుగా కనిపిస్తున్నాయే కాని నిజానికి భగవంతుని ఇచ్ఛా శక్తియే. శ్రీకృష్ణ పరబ్రహ్మానికి భార్యలయ్యారు. భక్తుల సౌకర్యం కోసం వారి వారి అభీష్ట రూపనామాలతో ఆ భగవతి అనుగ్రహిస్తుంది. పరమ పురుషుడు కూడా అంతే. కాబట్టి ఆయా నామరూపాలకు భేదాల్ని కల్పించుకొని దేవతా దూషణకు పూనుకుంటే పుణ్యానికి బదులు పాపాన్నే మూటకట్టుకుంటారు.

ఆ గోపికలంతా వివాహితలు. వివాహానికో వ్యవస్థ ఉంది. వివాహ విధి విహితం. కన్యాదానం చేసే అధికారం ఒక్క తల్లి దండ్రులకే ఉంది. బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యుల్ని ద్విజులు అంటారు. వేద పఠనం అన్నది ఈ మూడు తెగల వారికి విధి విహితం. అనగా ఇష్టా ఇష్టాలతో సంబంధం లేదు. అందువలన బ్రాహ్మణ వైశ్యులకు ఒక విధంగాను, క్షత్రియులకు ఇంకో విధంగాను వివాహ విధులు ఏర్పడ్డాయి. యాదవులంతా రాజులే. యయాతి శాపకారణంగా రాజ్యాధికారాన్ని కోల్పోయారు. అయితే కులానికి సంబంధించిన ధర్మాలకు అర్హత కోల్పోలేదు. ఈ జాలంధరీ గోపికలందరికీ తండ్రి వివాహం చేశాడు. దాంతో వారంతా ప్రౌఢలయ్యారు. వారందరికీ మనో వికాసం కలిగింది.వారికి పూర్వ పుణ్యం తోడయ్యింది. వారి మనసులు శ్రీహరిపై స్నేహభావం కలిగి అదృష్టవంతులయ్యారు. వారి పూర్వ పుణ్య విశేషం చేత బృందావనంలో శ్రీకృష్ణునితో విహరించారు. అనగా రాసమండలంలో విహరించారని భావం. రాసమండలం క్రీడా స్థానం కాదని శ్రీకృష్ణుడు భక్తులతో నృత్యం చేసే మహాయంత్రస్థానమని పురాణాలన్నీ ఘోషిస్తున్నాయి.

"జారధర్మేణ సుస్నేహం శ్రీకృష్ణే తాః ప్రచక్రిరే" అని ఉన్నదిగదా అని అనవచ్చు. కులట జారుని యందు ఎటువంటి స్నేహాన్ని చూపుతుందో అట్టిదనగా గాఢ స్నేహమనే అర్థం చెప్పుకోవాలి. వారంతా కులటలై జారుడైన శ్రీకృష్ణుని యందు ప్రేమ కనబరచారని చెప్పరాదు. లేనిపోని అర్థాలు కల్పించకుండా వారు గాఢమైన స్నేహాన్నే కనబరచారన్న యథార్థాన్నే మనం గ్రహించాలి.

సుదర్శనోపాఖ్యానము

(ఈ కథ గర్గసంహిత మాధుర్య ఖండం 23వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

అష్టావక్ర చరిత్ర తర్వాత గర్గసంహిత నుండి గోపికల పూర్వ చరిత్రలన్నీ తెలుసుకున్నాం. ఎందువలన? శ్రీకృష్ణుడు జారుడు చోరుడు అన్న దురభిప్రాయాన్ని తొలగించి శ్రీకృష్ణుని యెడల భక్తి ప్రేమ వృద్ధి చేసుకునేందుకు తోడ్పడతాయి. కనుకనే మనం వీరి చరిత్ర లన్నీ తెలుసుకున్నాం. ఈ గోపికల చరిత్రములన్నీ కూడా శ్రీకృష్ణ మహిమల్నే తెలుపుతాయి. అయితే రాసమండలం తర్వాత భగవంతుడు ఏయే కార్యాలు చేశాడో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

శ్రీకృష్ణుడు రాసమండల విహారాలు పూర్తి చేసి గోకులంలో ఇంటిపట్టునే ఉంటున్నాడు. భగవంతుడు అంతకు పూర్వం చేసిన అద్భుతాలన్నింటినీ వ్రజవాసులు మరచిపోయారు. అందుకు కారణం మహామాయ వారిని ఆవరించడమే. యశోదానందులు శ్రీకృష్ణుని ముద్దుమాటలు వింటూ, చేష్టలకు తన్మయులవుతూ కాలం గడిపేస్తున్నారు. కాలం ఈ విధంగా గడిచిపోతోంది. అయితే ఇట్లా వృథా కాలక్షేపం చెయ్యడం భగవంతుని ఆశయం కాదు గదా. ఒకానొక రోజున వృషభానుడు, నందుడు ఇంకా గోకులం నుండి అనేక మంది బండ్లు కట్టుకొని అంబికా వనానికి వెళ్ళారు. అక్కడ వెలసి ఉన్న భద్రకాళి, పశుపతి నాథుని పూజించారు. భగవత్కథలు చెప్పుకుంటూ ఆ రాత్రి అక్కడే నిద్రించారు.

అంతా గాఢనిద్రలో ఉండగా ఆ చుట్టుప్రక్కల పొదలలోనుండి భయంకరమైన సర్పమొకటి వచ్చి నందుని కాలు వదలకుండా పట్టుకొంది. నిద్రలో నుండి హఠాత్తుగా లేచి నందుడు గట్టిగా కాలు విదిల్చాడు. అయినా ఆ సర్పం అతడికాలు విడువలేదు. ఆ తర్వాత భయంతో కృష్ణా! కృష్ణా! అని అరిచాడు. ఆ ప్రక్కనే పడుకున్న గోపకులంతా లేచి కర్రలతో కొట్టారు. అయినా పాము పట్టు విడువలేదు. ఇంతలో నందుడి ప్రక్కనే పడుకున్న బాలగోపాలుడు లేచి కాలితో ఒక తన్ను తన్నాడు. శ్రీకృష్ణుని స్పర్శ తగలగానే ఆ సర్పం ఓ విద్యాధరుడుగా ప్రత్యక్షమయ్యాడు. ఆ విద్యాధరుడు భక్తి ప్రపత్తులతో శ్రీకృష్ణుని పాదాలకు నమస్కరించి "పరమేశ్వరా! నేను సుదర్శనుడనే విద్యాధరుణ్ణి, అష్టావక్రమహాముని వికృత రూపాన్ని చూసి పరిహసించాను. అందుకా ముని కోపించి సర్పమై పొమ్మని శపించాడు. నేనా శాపానికి భయపడి ఆయన పాదాలమీద పడి శాపవిముక్తికై ప్రార్థించాను. ఆ ముని అనుగ్రహించి శ్రీకృష్ణుని పాదస్పర్శతగలగానే నీపూర్వ రూపాన్ని పొందుతావని అనుగ్రహించాడు. ఆ శాపఫలమే నీ సందర్శన భాగ్యాన్ని కలిగించింది. నీ పాద స్పర్శచేతను, నీదర్శన భాగ్యం చేతనే నాకు ముక్తి లభించింది. అని భక్తి పూర్వకంగా నమస్కరించి వైకుంఠానికి చేరుకున్నాడు. ఈ విచిత్రాన్నంతా చూస్తున్న నందాదులు శ్రీకృష్ణుని పరమేశ్వరునిగా తెలుసుకుంటూ ఉండగానే వారిని విష్ణుమాయ క్రమ్మేసింది. శ్రీకృష్ణుడో గోపబాలుడే అనుకున్నారు.

శ్రీకృష్ణుడు భగవంతుడేనని నందుడు మొదలైన వారికి తెలిసినా కూడా జ్ఞానం చాలాసేపు నిలువదు. అందువలన ఈ ఉదంతాన్ని మనకు మహర్షులు తెలిపారు. అయితే నందాదులంతా

శ్రీకృష్ణుడు తమను ఏ కష్టాలనుండి అయినా తప్పించగల సమర్థుడని నమ్మేవారు. అందువల్లనే అర్ధరాత్రి పాము కరవగానే కృష్ణా! కృష్ణా! రక్షించు అంటూ కేకలు పెట్టాడు.

బ్రహ్మకు శాపకారణం

(ఈ కథ శ్రీకృష్ణ జన్మఖండం 31,32 వ అధ్యాయాలనుండి గ్రహించబడింది)

రాధాదేవి : పరమేశ్వరా! బ్రహ్మకు శాపం ఎందుకు కలిగింది? ఆయన ముల్లోకాలకూ సృష్టికర్త గదా? అంతేకాకుండా తపస్సు చేసే వారందరికీ సరస్వతీ కటాక్షాన్ని ప్రసాదిస్తూ సకల సౌకర్యాల కలిగించే బ్రహ్మకు పూజ్యత లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. నా సందేహాలు తీర్చు. బ్రహ్మ ఉదంతాన్నంతా తెలుపు.

శ్రీకృష్ణుడు : రాసేశ్వరీ! బ్రహ్మ ఉదంతాన్నంతా వివరంగా చెప్తాను విను. పూర్వం రైవత మన్వంతరంలో సుచంద్రుడనే రాజు ఉండేవాడు. అతడు మహాతపస్వి. గొప్పజ్ఞాని. విశేషించి విష్ణు భక్తుడు. మహాధార్మికుడైన ఆ మహారాజు భరత ఖండంలోని మలయ పర్వత ప్రాంతానికి వచ్చాడు. ఆ మనోహర వాతావరణంలో వెయ్యి సంవత్సరాలు తపస్సు చేశాడు. కఠోర తపస్సు చేత ఆ రాజేంద్రుని శరీరమంతా కృశించి పోయింది. అతడిపైన పుట్టలు పెరిగాయి. బ్రహ్మకు అతడిపై కరుణ కలిగి ప్రత్యక్షమై తన కమండలంలో నుండి పవిత్ర జలాలతో ఆ మహర్షి శరీరం అంతా తడిసేట్లుగా పోశాడు. ఆ జలాలు సామాన్యమైనవి కావు. నా (శ్రీకృష్ణుని) పాదాలు కడిగిన జలాలవి. వెంటనే ఆ రాజేంద్రుడు పూర్వపు జవసత్త్వాలతో లేచి నిలబడ్డాడు. ఎదురుగా నిలచిన బ్రహ్మను చూసి భక్తితో నమస్కరించాడు. బ్రహ్మ ఆ రాజేంద్రుణ్ణి కరుణతో లేవనెత్తి "రాజా! నువ్వు ఎంతో కఠినమైన తపస్సు చేసి నన్ను సంతృప్తుణ్ణి చేశావు. ఏం వరం కావాలో కోరుకో" అన్నాడు. అందుకా రాజేంద్రుడు "మహాత్మా! నాకు శ్రీకృష్ణుని యెడల నిశ్చల భక్తి, శ్రీకృష్ణ దాస్యాన్ని ప్రసాదించు" అని వేడుకున్నాడు. బ్రహ్మ రాజేంద్రునికా వరాన్నిచ్చి తనలోకానికి వెళ్ళిపోయాడు. ఇంతలో ఆకాశం నుండి ఒక రథం వచ్చింది. అందులో నుండి విష్ణు పార్షదులు బిల బిల బయటకు వచ్చారు. వారంతా చతుర్భుజులు పీతాంబరాల్ని ధరించారు. సుచంద్రుడు వారందరికీ నమస్కరించాడు. అట్లా నమస్కరిస్తూ ఉండగానే ఆ రాజేంద్రునికి కూడా నాలుగు చేతులు మొలిచాయి. పట్టు పీతాంబరాలు ధరించాడు. పార్షదుల్లో ఒకడయ్యాడు. ఈ దృశ్యం చూసిన దేవతలు పూల వర్షం కురిపించారు. గంధర్వులు పాడారు. అప్సరసలు నాట్యం చేశారు. ఋషులు, మునులు, సిద్ధులు పరమానందంతో "ఓ రాజా! ధన్యుడవయ్యావు! అని ఆశీర్వదించారు. పార్షదులు సుచంద్రుని రథంలో ఎక్కించుకొని గోలోకానికి వెళ్ళారు. అక్కడ పార్షదుడై శ్రీకృష్ణ సేవకుడయ్యాడు.

సుచంద్రుడికి వరాలిచ్చి బ్రహ్మ సత్యలోకానికి ప్రయాణమయ్యాడు. నందనవనం మీదుగా పోతూ ఉండగా సుగంధాల మత్తు ఆ వనమంతా వ్యాపించింది. అప్పుడు మోహిని ఆ వనంలోనే ఒంటరిగా విహరిస్తోంది. ఆమె ముల్లోకాలను మోహింప చేయగల దిట్ట. నిత్య యవ్వని. అటువంటి

మోహినియే బ్రహ్మను చూసి మోహితురాలై మూర్ఛపోయి పడిపోయింది. బ్రహ్మ జితేంద్రియుడు కావడం వలన ఆమెను చూసినా పట్టించుకోకుండా తన దారిన తాను పోయాడు. బ్రహ్మపై మనసు పారేసుకున్న మోహిని అన్నోదకాలు మరచిపోయింది. కంటిపైన కునుకే కరువైంది. కళ్ళు తెరచినా మూసినా బ్రహ్మే కనిపించేవాడు. దాంతో శ్రీహరిని పూర్తిగా మరచి పోయింది. బ్రహ్మపై కోరిక క్షణక్షణం వృద్ధి కాసాగింది. ఇది ఇట్లా ఉండగా దేవ వేశ్య అయిన రంభ ఆదారినే వెళ్తూ కామపీడిత అయిన మోహినిని చూసి, "సఖీ! నువ్వే ముల్లోకాల్నీ మోహింప చేసే దానవు గదా. నువ్వే ఈ విధంగా పడి ఉండటం ఏమైనా బాగుందా? నేను రంభను మాట్లాడుతున్నాను. నన్ను గుర్తుపట్టావా? మనమంతా కులటలం. మనం అందరికీ సర్వ సౌభాగ్యాలు సుఖాలు ఇచ్చేవాళ్ళమే గాని, కుటుంబ స్త్రీలం కాదు గదా. అంతా సుఖాల్ని కోరుకునే ఇంద్రియాలకు బానిసలవుతారు. కాల క్రమంలో అంతా పోయేవాళ్ళమే. ఇక మనకు లజ్జ ఎందుకు? ఎవరికైనా ఆత్మ కంటే ఉత్కృష్టమైన స్నేహితుడుంటాడా? ఎవరియందు ప్రేమను పెంచుకున్నావో అందుకు ఆత్మేకదా కారణం. ఏ పదార్థం పైన ఆత్మ సంబంధం పెట్టుకుంటుందో అంతవరకే స్నేహం నిలుస్తుంది. తన మనస్సును ఎవరిపైన నిలుపుకుంటుందో అతడే ఆమెకు పంచప్రాణాలు. నేను నీకు స్నేహితురాలిననే విషయం మర్చిపోకు. నువ్వు దేనికోసం ఇంతగా పరితపిస్తున్నావో నాతో చెప్పు. ముగ్ధమనోహరంగా అలంకారం చేసుకో. నీమనసు కోరే వాడి దగ్గరకే స్వయంగా వెళ్ళు. మనసులో మాట చెప్పు. అతణ్ణి వశం చేసుకో. ముల్లోకాల్లోనూ స్త్రీ తలచుకుంటే సాధించలేనిదేమీ లేదు. ఇటువంటి విషయాలు నీకూ, నాకు తప్పమూడో కంటివాడికి తెలియగూడదు. కాబట్టి నాతో చెప్పినందువలన నీకే నష్టమూ వాటిల్లదు. పైగా దోషం కూడా కాదు. ఇట్లా మాటా పలుకు లేకుండా పడుంటే అంతా నిన్ను చూసి నవ్విపోతారు.

రంభ మాటలతో మోహిని దుఃఖం నూరింతలు పెరిగింది. చివరకు "ఓ రంభా! నువ్వు నా ప్రాణసఖివి. నా దుఃఖాన్ని నీతో కాక మరెవరితో పంచుకుంటాను. విను. ఒకానొక రోజున సత్యలోకాధిపతి అయిన బ్రహ్మను చూశాను. అతణ్ణి చూస్తూనే నాలో మదన జ్వాలలు భగ్గుమన్నాయి. మనసంతా చచ్చు పడిపోయింది. ఆ క్షణం నుండి అన్నపానాలు మానేశాను. ఏ వస్తువు తిందామన్నా రుచించదు. అసహ్యం వేస్తుంది. తినబుద్ధి కావడంలేదు. పున్నమి వెన్నెలలో కూడా వడగాడ్పులు వీస్తున్నాయి. సూర్య చంద్రులు ఎప్పుడు ఉదయిస్తున్నారో ఎప్పుడు అస్తమిస్తున్నారో తెలియడం లేదు. మనసు దేహం పంచప్రాణాలు ఆ బ్రహ్మదేవుని ఆలింగనాన్నే కోరుకుంటున్నాయి. బంగారం వంటి నాదేహ ఛాయ మన్మథ తాపానికి వడలి నల్లబడింది. ఇక్కడ ఉండాలని అనిపించడంలేదు. ఎక్కడికైనా పోదామంటే శరీరం నా స్వాధీనం కావడం లేదు. ఆహా! కులట జీవితం కన్నా నీచమైన జన్మ మరొకటి ఉండదు గదా! ఓ రంభా! నా కోరిక తీరే మార్గమేదో నువ్వే చెప్పి పుణ్యం కట్టుకో. నీమేలు మరువను" అని అన్నది.

మోహిని మనోవేదన నంతా విన్న రంభ మోహినికి ఏదో విధంగా సాయపడాలనుకుంది. దీర్ఘంగా ఆలోచించి ఒక మంచి ఆలోచన చెప్పింది. "మోహినీ! ఇంత చిన్న విషయానికి చిన్న పిల్లలా విలపిస్తున్నావా? నీ దుఃఖం అంతా దూది పింజలా ఎగిరిపోయే ఆలోచన చెప్తాను. విను.

ముందు చక్కగా స్నానం చేసి అలంకరించుకో. బ్రహ్మ జితేంద్రియులందరిలోను మేటి. పైగా శ్రీమన్నారాయణుని అంశతో జన్మించాడు. అతణ్ణి వశం చేసుకోవాలంటే తపస్సొక్కటే మార్గం. వెంటనే పుష్కరిణికి వెళ్ళు. అక్కడ మన్మథుణ్ణి గూర్చి తపస్సు చెయ్యి. అతడు పరమదయాళువు. స్త్రీలంటే ప్రాణాలిస్తాడు. కావున తప్పక ప్రసన్నుడై నీకోరిక తీరే మార్గం చూపుతాడు" అని సలహా చెప్పింది. మోహినికి ఆ సలహా నచ్చింది. వెంటనే తపస్సుకై పుష్కరిణికి బయలు దేరింది.

మోహిని పుష్కరిణికి పోయి మన్మథుని గూర్చి తపస్సు చేసింది. మన్మథుడు ప్రత్యక్షమై మోహినికి వరదానం చేశాడు. ఇద్దరూ కలసి బ్రహ్మ వద్దకు వెళ్ళారు. మోహిని బ్రహ్మను ఆకర్షించేందుకు శ్రీహరిని కీర్తిస్తూ నాట్యం చేసింది. అంగాంగ ప్రదర్శన చేసింది. ఇదంతా గమనిస్తున్న బ్రహ్మ మోహిని మనసులో కోరికను పసికట్టాడు. ఏదో విధంగా తగిన సత్కారం చేసి మంచిమాటలు చెప్పి పంపాలను కున్నాడు. మోహినికి బ్రహ్మ తీరు నచ్చలేదు. తన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరయింది గదా అని తన్ను తాను నిందించుకుంది. ఆవేదనలో మన్మథుని మనసులోనే స్మరించుకొని " ఓ మన్మథుడా! నువ్వు ఇంద్రియాలకు ప్రభువ్వు. విష్ణు భగవానుని అంశలో జన్మించావు. మనస్సుకు ప్రభువ్వి. కర్మలన్నింటికీ నువ్వే బీజము. అట్టి నీకు నమస్కారము. జ్ఞాన రూపుడైన మహేశ్వరునకు ఆత్మవు నీవే. జగత్తులన్నీ నీవల్లనే సృష్టించబడుతున్నాయి. ఇట్టి నీకు నమస్కారము. యోగీశ్వరులకు దృష్టి కూడా నువ్వే. నిన్ను జయించే వారు ఏలోకంలోనూ లేరు. నువ్వే జగత్తులన్నింటినీ జయించగల సమర్థుడవు. రతీ దేవికి ప్రాణ వల్లభుడవు. రతి ప్రియుడవైన నీకు నమస్కారము." అంటూ పరిపరివిధాలుగా ప్రార్థించింది.

ఆవిధంగా మోహిని చేసిన స్తోత్రానికి మన్మథుడు సంతృప్తుడయ్యాడు. ఆకాశంలో నుండే వింటిని సంధించి బాణాలను బ్రహ్మపై విడిచాడు. బ్రహ్మ కూడా ఆ అస్త్ర మహిమకు చలించాడు. కళ్ళు తెరచి మోహినిని పరికించి చూశాడు. అంతలోనే జ్ఞానం మేల్కొంది. శ్రీహరిని స్మరించాడు. మనసులో కలిగిన మన్మథ వికారాల్ని తెలుసుకున్నాడు. కావడానికి తనపుత్రుడే అయినా మదనుడిపై ఆగ్రహం కలిగింది. "ఓరీ మన్మథా! నీకు యౌవన గర్వం తలకెక్కింది. ఉచితానుచితాలు మరిచావు. నన్నే అవమానించాలనుకున్నావు. నీకు గర్వభంగమగు గాక. వసంతుడితోకలసి విఫల ప్రయత్నుడవవుతావు." అని బ్రహ్మ శపించాడు. బ్రహ్మ శాపానికి మన్మథుడు నిలువెల్లా వణికిపోయాడు. బ్రహ్మ మోహినితో "తల్లీ! మోహినీ! నీ ప్రయత్నాలేవీ కొనసాగవు. ఇక నీ ప్రయత్నం విరమించుకొని ఇక్కడ నుండి వెళ్ళిపో. వేదాలు నిషేదించిన పనులేవీ నేను చెయ్యను. నేను వేద వ్యవస్థకే కారణమైన వాడిని. అనగా నేనే వేద కర్తను. నువ్వు తలపెట్టిన కార్యం వేదజ్ఞులకు అపకీర్తి తెచ్చిపెట్టేది. రసికుడైన వాడి దగ్గరకు పోయి ఏ స్త్రీ అయినా తన కోరిక తీర్చమని కోరినట్లైతే అతడు ఆమె కోరిక తీర్చాలని ప్రమాణాలున్నాయి. అంతే గాని తపస్వులైన వారిని కోరినట్లైతే అటువంటి స్త్రీని త్యజించాలని శ్రుతులు ఘోషిస్తున్నాయి. అదే పుంశ్చలి (కులట) అయితే గృహస్థులు కూడా త్యజించాల్సిందే. ఎందువల్ల నంటే పుంశ్చలితో స్నేహం వలన ధనము, ఆయుర్దాయము, ప్రాణాలు, యశస్సు కూడా నాశనమవుతాయి. అంతే కాక, అటువంటి స్త్రీ ఏ ఉపాయం చేత నైనా తన పబ్బం గడుపుకోవడమే

కాకుండా ఎదుటి వారికి అన్ని రకాలైన ఆపదల్నీ కలిగించి నాశనానికి కారణ భూతురాలవుతుంది. ఆకాశంలో మెరిసే మెరుపులు, లోభం వల్ల కలిగే స్నేహం ఇతరులను మోసగించి సంపాదించిన ధనం కులటలతో ప్రేమ ఎక్కువ కాలం నిలవ్వు. క్షణభంగురాలే. ఎవడు కులట యందు విశ్వాసం కలిగి ఉంటాడో వాడు క్షణక్షణం నరకాన్ని అనుభవిస్తూనే ఉంటాడు. ఓ మోహినీ! నువ్వు రూపవతివి. ధన్యురాలవు. యౌవనంలో ఉండేవారికి ఆనందాన్నిస్తావు. అయితే తపస్వులకు నీతో స్నేహం విషంతో సమానం. అప్సరసల్లో ఎన్నదగిన దానవు. నిత్య యౌవన వంతురాలవు. నీలో కలిగే కోరికలు న్యాయమైనవే. అయితే ఎవరైనా రసికుణ్ణి ఎన్నుకొని సుఖపడు. కాంతామణీ! నేను వృద్ధుణ్ణీ, తపస్విని, విష్ణు భక్తుణ్ణి, విప్రుణ్ణి స్వతంత్రుణ్ణి కాను, పరాధీనుణ్ణి ఇటువంటి నా బోటి వానితో నువ్వేం సుఖపడతావు?

ఓ మన్మథుడా! సృష్టికర్తనైన నాకు నువ్వు పుత్రుడితో సమానం. నన్ను విడిచిపెట్టు. ఎవరైనా కామశాస్త్రంలో విశారదులైన వారిని రతి కర్మల్లో నిష్ణాతులైన వారిని ఎన్నుకో. వారు నీ సహాయాన్ని స్వాగతిస్తారు. లోకంలో పురుషులు స్త్రీలను కోరుకోవడం సహజం. కానీ స్త్రీయే తనకు తానై వచ్చి పురుషుణ్ణి కోరడం విపరీతంగా కనిపిస్తుంది. లోకంలో లభించే రత్నాలన్నింట్లోనూ స్త్రీరత్నం అతి దుర్లభమైనది. దాని కోసం పురుషుడు పరితపిస్తూ ఉంటాడు. ఏ స్త్రీ తానే పోయి స్వయంగా పురుషుని కోరుకుంటుందో ఆ స్త్రీకి సమాజంలో మర్యాద ఉండదు. వేద విరుద్ధమైన పనులు చేస్తే స్నేహితులే విరోధులౌతారు. వేదోక్తమైన పనులు చేస్తే శ్రీహరి ప్రేమిస్తాడు. అనగా శ్రీహరియే ప్రేమించిన వానిని లోకమంతా ప్రేమిస్తుంది. కులటలు, సాధ్వీమణులంటూ వేరువేరుగా ఉండరు. వారు చేసే పనులను బట్టి ఆ జాతులు ఏర్పడతాయి. ఎవతె నిందించ దగిన ప్రవర్తన గలదవుతుందో ఆమెనే పుంశ్చలి అంటారు. ఎవరు మంచిప్రవర్తన గలవారై ఉంటారో వారినే పతివ్రతలంటారు. పుంశ్చలుల్లో మూడురకాలు. వారిలో దేవ జాతి పుంశ్చలి తానై పోయి పురుషుణ్ణి కోరినట్లు కనబడదు. అటువంటి స్త్రీ ఏ జాతిలో ఉన్నా నిందితురాలే అవుతుంది.

ఈ విధంగా ధర్మాలన్నింటినీ చెప్పి బ్రహ్మ తనపని తాను చూసుకుంటున్నాడు. మోహినికి క్రోధంతో కళ్ళు ఎర్రబడ్డాయి. బ్రహ్మతో ఇలా అంది. " ఓ బ్రహ్మదేవా! ఇప్పుడు నీ బండారమంతా బయట పడింది. నీ ఉపదేశాలేవీ నాకు రుచించవు. నిన్ను చూసి వలచిన నా కళ్ళు లోకంలో మరే పురుషుణ్ణీ వరించలేవు. నా శరీరమంతా కోరికతో సలసలా కాగిపోయింది. ఇప్పుడో కాసేపటికో నన్ను దహించి వేస్తుందనగా రంభ వచ్చి నాకీ ఉపాయాన్ని చెప్పింది. నాకు సహాయకుడుగా వచ్చిన మన్మథుడు నీశాపం వలన హతుడయ్యాడు. నేనట్లా మధ్యలో వదిలి పోయేదాన్ని కాదు. ఎందువల్ల నంటే నీపై పెంచుకొన్న మోహం నా శరీరంలో అణువణువునా వ్యాపించింది. కావున ఓ కరుణాసింధూ! ఇట్టి నాపైన కరుణ చూపించు. నన్ను ఈవిధంగా నిలువునా చంపెయ్యడం నీకు న్యాయం కాదు. ఒక్కసారి నన్ను ఆలింగనం చేసుకుంటే చాలు. నాలోని బాధలన్నీ చేత్తో తీసేసినట్లు పోతాయి. నువ్వా సృష్టికర్తవు. నేనా కర్మ వశాత్తు కులటనయ్యాను. కొందరు రాజులై పన్ను వసూలు చేస్తారు. మరికొందరు సామాన్యులై పన్నులు కడుతూ ఉంటారు. కొందరు పల్లకీలో ఎక్కి వెళ్తుంటే ఇంకొందరు

పల్లకీ మోస్తూ ఉంటారు. ఇవన్నీ కర్మవశం చేత జరుగుతూ ఉంటాయి. ఆ కారణంగానే నువ్వు తపస్వివి. సృష్టికర్తవు కూడా అయ్యావు. వేరొకతె తన శరీరాన్ని అమ్ముకొని జీవిస్తుంది.

ఓ బ్రహ్మదేవా! నేను దేవ వేశ్యను. సురభోద్యను. పూజ్యురాలను. సర్వైశ్వాలింగనం చేతనే కర్మలన్నీ తీరిపోతాయి. మనస్సుకు స్వభావమే బీజం. ఆ స్వభావమే కర్మకు కూడా బీజం. అనగా కర్మ కు రావలసిన ఫలానిక్కూడా ఆ స్వభావమే బీజం. అందరికీ జనకుడైన శ్రీహరి భగవానుడే కర్మలన్నింటికీ ఫలాన్నిస్తాడు. కావున అందరి కంటే బలవంతుడు, కర్మ స్వరూపుడు, భగవంతుడు అయిన శ్రీహరియే నని మనంగ్రహించాలి.

ఇది ఇట్లా ఉండగా నేనొక్కర్తెనే ఏదో నేరం చేసినట్లుగా నన్ను ఎందుకు దూషిస్తావు? యోగులైన వారు గూడా నాపాదాలను దర్శించలేరు గదా? నువ్వు భగవంతుడవు కావున నీ దర్శనం చేసుకు పోదామని వచ్చాను. నీవంటి వాని పాద ధూళి చేతనే పాపులు కూడా పరమ పవిత్రులవుతారు గదా? ఆవిధంగా నేను పవిత్రురాలనైనట్లే గదా. మరి నన్ను ఎందువలన తొలగిపొమ్మన్నావు?" అని కోపంతో త్వర త్వరగా పోయి శ్రీహరిని దర్శించింది. బ్రహ్మకూడా ఆమె కోపానికి భీతి చెందాడు.

మోహినీ వృత్తాంతం ఇట్లా ఉండగా బ్రహ్మ మోహినిని అవమానించినందుకు మన్మథుడు కూడా కృద్ధుడయ్యాడు. అదృశ్య రూపంలో బ్రహ్మ వద్దకు వచ్చి పంచబాణాల్ని ప్రయోగించాడు. అదే సమ్మోహనము, సముద్వేగము, బీజస్థంబకారణము, ఉన్మత్త బీజము, చేత సహారకం. తన సేవకులైన వసంతుణ్ణి, కోకిలను, భ్రమరాన్ని, సుగంధాన్ని బ్రహ్మకు మోహింప జెయ్యమని ఆదేశించి తాను అంతఃకరణంలో ప్రవేశించి వికారాన్ని కలిగించాడు. దాంతో బ్రహ్మ మనస్సు నిశ్చలంగా నిలిపి సృష్టి కార్యం చెయ్యలేకపోయాడు. భీతుడై శ్రీహరిని స్మరించాడు. ఓ శ్రీహరీ! కామంతో వికారమైన నన్ను కాపాడు. ఈ కామం ముక్తి ద్వారాన్ని కూడా మూసివేస్తుంది. ఈ కామం ప్రారంభంలో ఎంత అమృతప్రాయంగా అనిపిస్తుందో, పోనుపోను ఘోరమైన విషంగా మారుతుంది. మధుసూదనా ప్రసన్నుడవు కమ్ము. సత్యలోకం కర్మక్షేత్రం కాదు. జ్ఞానరాశి అయిన నాకు కామ వికారం కలిగింది. ఈ కామం భక్తిని నశింపజెయ్యగలది. ఓ కరుణాసింధూ! నాకు కలిగిన ఈ వికారాన్నొక పీడకలగా చెయ్యి. నువ్వు సర్వజ్ఞుడవు. నాపై కరుణ చూపించు" అని నన్ను ఆశ్రయించాడు. ఓ రాధాదేవీ! నీకు బ్రహ్మ తదుపరి వృత్తాంతాన్ని చెప్తాను విను.

బ్రహ్మకు గర్వభంగమగుట

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 33వ అధ్యాయము నుండి గ్రహించబడింది)

శ్రీకృష్ణుడు: రాధాదేవీ! బ్రహ్మ ఈ విధంగా మోహిని చేత పీడించబడి నన్ను ప్రార్థించాడు. నేనప్పుడు మోహిని అనే మత్త గజాన్ని అదుపులో ఉంచేందుకు బ్రహ్మకు జ్ఞానం అనే అంకుశాన్నిచ్చాను. బ్రహ్మ ఆ అంకుశంతో మోహినిని అదుపులో పెట్టే ప్రయత్నం చేశాడు. అప్పుడు మోహిని బ్రహ్మతో "జగన్నాథా! లోకంలో స్త్రీ మనస్సును కళ్ళతోనే చదివి శారీరకంగా ఆక్రమించుకున్నవాణ్ణి ఉత్తమ

నాయకుడు అంటారు. స్త్రీ తన మనస్సు విప్పి మాటల్లో బయటపడితే ఆమెను కామలీలల్లో ప్రోత్సహించేవాణ్ణి మధ్యమ నాయకుడంటారు. స్త్రీ కామార్తియై పలుమార్లు శృంగార ప్రసక్తి తెచ్చినా ఎవడైతే స్పందించడో వాడిని నపుంసకుడంటారు. గృహస్థు గాని, తపస్విగాని, కాముకుడు గాని కోరివచ్చిన స్త్రీని కాదని మరొక స్త్రీని కోరుకుంటాడో అతడు నరక కూపంలో పడిపోతాడు. అతడి మగసిరి నశించిపోవాలని ఆ స్త్రీ శపిస్తుంది. కావున ఓ జగన్నాథా! లెమ్ము.నేను కామసాగరంలో మునిగిపోతున్నాను. నా చెవికి ఇంపైన మాటలు మాట్లాడు. నిర్జన ప్రదేశాలకు నన్ను తీసుకొనిపో. నన్ను సుఖపెట్టు. జన్మ జన్మలకు నీకు దాసినై పుడ్తాను" అంటూ బ్రహ్మకు సమీపంగా వచ్చి అంగ సౌష్టవాన్నంతా ప్రదర్శించింది. ఆమె భయంకరమైన ఆలోచనల్ని పసిగట్టిన బ్రహ్మ భయభ్రాంతుడై "ఓ మోహినీ! నీమాటల తో లోకంలోని స్త్రీలంతా సిగ్గుతో తలలు వంచుకునేట్లు చెయ్యకు. అమ్మా! నేనా ముసలి వాడిని. కోరికలు లేనివాడిని. నీ బిడ్డ లాంటి వాడిని. ఇటువంటి నన్ను బాధించకు. భార్య భర్తకు గర్భాదానం వంటి అనేక శుభకరమైన కార్యాల్ని సాధించి పెడుతుంది. కావున యోగ్యుణ్ణి, రసికుని, యవ్వన వంతుణ్ణి చూసి వరించు. అటువంటి భర్త మూలంగా నీకు మంత్రము, శిల్పము సంతానము లభిస్తాయి" అని ఇంకా ఏమేమో చెప్తూ ఉండగానే మోహిని బ్రహ్మను తన పైకి లాక్కుంది. సరిగ్గా అదే సమయంలో అత్రి, పులస్త్యుడు, పులహుడు, వసిష్ఠుడు, క్రతువు, అంగీరసుడు, కపిలుడు, పంచశిఖుడు, రుచి, వాసురి, ప్రచేతసుడు, శుక్రుడు, బృహస్పతి, మతథ్యుడు, కరకుడు, కణ్వుడు, కశ్యపుడు, గౌతముడు, సనక సనందులు, కర్ధమ సనాతనులు, సనత్కుమారుడు మొదలైన ప్రముఖులంతా బ్రహ్మ పాదాలను సేవించుకునేందుకు వచ్చారు. వీళ్ళందర్నీ చూసిన మోహిని బ్రహ్మను విడిచి సిగ్గుపడుతూ దూరంగా పోయింది. బ్రహ్మ వారందరిని గౌరవించి కూర్చునేందుకు ఆసనాలు చూపాడు. వారంతా బ్రహ్మకు భక్తి పూర్వకంగా నమస్కరించి, మోహిని అక్కడ ఉండటానికి గల కారణమేమిటని అడిగారు.

బ్రహ్మ వారికి తగిన రీతిలో సమాధానం చెప్తూ "మహర్షులారా! ఈ మోహిని నా కుమార్తె. ఆమె నాట్య సంగీతాలతో నన్ను అలరిస్తూ ఉండగా మీరంతా వచ్చారు" అంటూ ఓ చిరునవ్వు నవ్వాడు. మునులంతా సర్వజ్ఞులు గదా. బ్రహ్మ నవ్వును మోహినీ చరిత్రనంతా తెలుసుకున్నారు. బ్రహ్మ మనస్సు కూడా తెలుసుకోగలిగారు. దాంతో అంతా కలసి ఒక్కసారిగా పక్కున నవ్వారు. వాళ్ళంతా అట్లా నవ్వడంతో మోహినికి కోపం కట్టలు తెంచుకుంది. ఒళ్ళంతా కారం పూసుకున్నట్లయింది. వాళ్ళముందుకు వచ్చి బ్రహ్మతో ఇలా అన్నది. ఓ విధాతా! నువ్వు వేదకర్తవు గదా. వేదవిహిత ధర్మమేది? ఒక్క ప్రక్క నేను నీ కూతుర్నని చెప్తున్నావు. మరొక ప్రక్క నర్తకినని చెప్పినవ్వుతున్నావు.

భగవంతుడే నన్ను దేవ వేశ్యగా నియమించాడు. శరణాగతురాలనైన నన్ను చూసి నవ్వావు కాబట్టి నిన్నీరోజు నుండి ఎవరూ పూజించరాదు. శ్రీహరి త్వరలోనే నీకు తగిన శాస్తి చేస్తాడు. దేవతల్ని సంవత్సరానికి ఒకరోజైనా పూజిస్తారు. నిన్ను ఆ ఒక్కరోజు కూడా పూజించరు గాక. ఈ కల్పంలోగాని, మరే కల్పంలో గాని ఎన్ని జన్మలెత్తినా నువ్వు పూజార్హుడవు కాజాలవు" అని శపించి

మోహిని మన్మథుడున్న చోటుకు పోయింది. అతడితో కొంత కాలముండి చివరకు “ఆహా! జగత్ సృష్టి కర్తను తొందరపడి శపించాను గదా” అని పశ్చాత్తాప పడింది.

మోహిని శాపానికి బ్రహ్మ దుఃఖించాడు. అక్కడకు చేరిన మునులు కూడా బ్రహ్మ కేదైనా ఉపాయం చెప్పాలను కున్నారు. వారంతా ఓ కమలసంభవా! నీవు శ్రీహరిని శరణు కోరమని సలహా ఇచ్చారు. అంతట ఆబ్రహ్మ శ్రీహరి వద్దకుపోయి తన వృత్తాంతాన్నంతా నివేదించుకున్నాడు. అంతావిన్న శ్రీమన్నారాయణ మూర్తి పక్కున నవ్వి “పంకజ వల్లభా! నువ్వు వేదవేత్తవు. గురువులకు గురువువు. స్త్రీ జాతి అంతా ప్రకృతి అంశతో జన్మించిన వారే. అటువంటి స్త్రీని పరిహాసం చేస్తే ప్రకృతిని అపహాస్యం చేసినట్టే గదా. నువ్వుండేది బ్రహ్మలోకం. అది క్రీడా క్షేత్రం. అక్కడ ఇంద్రియ నిగ్రహానికి చోటెక్కడుంది. అయితే భారత వర్షం కర్మభూమి. మోహిని వచ్చి నిన్ను భరత వర్షంలో కలసి ఉంటే నువ్వనే ఇంద్రియ నిగ్రహం అన్న మాటకు అర్థం ఉంటుంది. నిన్నురహస్య స్థలానికి రమ్మని బలవంతం చేస్తే ఆమెను త్యజించ వచ్చు. జితేంద్రియత్వం అన్న మాట నీకు చెల్లుతుంది. రహస్య స్థలంలో ఉన్నప్పుడు కామార్తురాలైన స్త్రీని త్యజించరాదు. అట్లా చేస్తే నరకం తప్పదు. ఇది నియమం. దుఃఖితురాలైన ఆ స్త్రీ శాపం ఇవ్వగలదు. భార్య ఉన్నాకూడా ఎవరు ఇతరుల భార్యను కామంచేత గాని, లోభం చేతగాని కోరుకుంటారో అతడ్ని అధముడంటారు. ఏ స్త్రీ అయితే మాయోపాయాలతో పర పురుషుణ్ణి వశపరచు కుంటుందో ఆ స్త్రీ సూర్యచంద్రులున్నంత కాలం అంధకూపంలో నరకాన పడి ఉంటుంది. దేవ వేశ్య లంతా స్వర్గవాసులే. దేవ వేశ్యను పరాభవించిన వాడు అపరాధి అవుతాడు. అందువల్లనే నువ్వు శపించబడ్డావు. దానినుండి బయటపడే మార్గం చెప్తాను విను.

ఓ చతురాననా! నువ్వు పాపులుండే సంసారంలో క్షణకాలం ఉండాలని అంటూ ఉండగానే, ద్వారపాలకుడొకడు వచ్చి శ్రీమన్నారాయణునితో “ప్రభూ! మరొక బ్రహ్మాండాధిపతి అయిన దశముఖ బ్రహ్మ వచ్చి మీ దర్శనం కోరుతున్నాడు” అని చెప్పాడు. శ్రీహరి అనుజ్ఞ ఇవ్వగా ద్వారపాలకుడు పోయి దశముఖ బ్రహ్మను వెంటబెట్టుకొని వచ్చాడు. ఆ దశముఖ బ్రహ్మ వినయంగా నమస్కరించి శ్రీహరిని అనేక విధాలుగా స్తోత్రం చేశాడు. అందులో చాలా స్తోత్రాలు చతుర్ముఖ బ్రహ్మకూడా ఎరుగడు. శ్రీహరి అనుజ్ఞ పొంది చతుర్ముఖ బ్రహ్మ కెదురుగా కూర్చున్నాడు. ఇంతలో మరొ శతముఖ బ్రహ్మ వచ్చి శ్రీహరికి నమస్కరించి అనేక స్తోత్రాలు చేశాడు. ఆ స్తోత్రాలన్నీ ఎంతో మనోహరంగా ఉండి ఆనందంతో కంటతడి పెట్టించాయి. ఈ శతముఖ బ్రహ్మ మిగిలిన ఇద్దరు బ్రహ్మలకు ఎదురుగా కూర్చున్నాడు. వీరంతా కూర్చుని మాట్లాడుతూ ఉండగా మరో బ్రహ్మాండం నుండి మరో బ్రహ్మ వచ్చి వీళ్ళెవరూ ఎరుగని స్తుతి పాఠాలు వల్లించి కూర్చున్నాడు. అంతట శ్రీమన్నారాయణుడు వివిధ బ్రహ్మాండాలనుండి వచ్చిన బ్రహ్మలందర్నీ వారి వారి దేవతా గణాలను గూర్చి విచారించాడు. ఆ సంభాషణంతా వింటున్న చతుర్ముఖ బ్రహ్మ తన్ను మించిన బ్రహ్మలున్నారు గదా అని భావించాడు. పూర్వం తానొక్కడే విష్ణుతుల్యుడన్న గర్వం ఉండేది. ఇప్పుడు గర్వభంగమయ్యింది గదా అని తలచాడు. అనగా ఇంకా ఎన్నో బ్రహ్మాండాలున్నాయని, ఇంకా ఎందరో బ్రహ్మలున్నారని, భగవంతుని ముందు నేను అల్పుడనన్న జ్ఞానం కలిగింది. దాంతో దీనుడైన చతుర్ముఖునకు గర్వమణగిపోయింది.

ఓ రాధాదేవీ! ఈ శరీరంలో ఎన్ని రోమాలున్నాయో అన్ని బ్రహ్మాండాలున్నాయి. అన్ని బ్రహ్మాండాలకు అంతమంది బ్రహ్మలున్నారు. ఈ విషయం తెలుసుకోకుండా గర్వించడం వలన బ్రహ్మకు గర్వభంగమయింది. తలకొట్టేసినట్లయింది. కొంతసేపటికి మిగిలిన బ్రహ్మలంతా నాకు నమస్కరించి వారి వారి బ్రహ్మాండాలకు వెళ్లిపోయారు. చతుర్ముఖుడు తన శక్తి అత్యల్పమని తెలుసుకొని సిగ్గుతో తల వంచుకున్నాడు. శ్రీహరి బ్రహ్మను చూచి ఓ పంకజాననా! నువ్విప్పుడు చూసినదంతా ఒక కలవలె అనిపించడం లేదా? అని అడిగాడు. బ్రహ్మ రెండు చేతులూ జోడించి భూత భవిష్య వర్తమానాలన్నీ నీ మాయా కల్పితాలేనని తెలుసుకున్నాను. శ్రీమన్నారాయణుడు బ్రహ్మకు ఉపశమనం కలిగించాలనుకున్నాడు.

శంకరాదులు వైకుంఠానికి వచ్చుట

(ఈ కథ శ్రీకృష్ణ జన్మ ఖండము 34వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

అదే సమయంలో శంకరుడు నంది వాహనంపై దేవతా గణాలందర్నీ వెంటబెట్టుకొని వైకుంఠానికి వచ్చాడు. అతడితో పాటు ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సిద్ధులు, చారణులు కూడా వచ్చారు. అప్పుడు శంకరుడు స్వరయుక్తంగా అనేక స్తుతి గీతాలు పఠించాడు. రాధాదేవీ! అవన్నీ మన రాసమండల విహార గాథలే సుమా. ఆ గీతాలన్నీ శంకరుడే స్వయంగా రచించి గానం చేశాడు. ఎక్కడా సంగీత శాస్త్ర మర్యాదల్ని అతిక్రమించలేదు. ఆ గీతాలు వింటున్న దేవగణాలన్నీ మోహపరవశులయ్యారు. రుద్రరూపులయ్యారు. వైకుంఠమంతా రసమయమైంది. ఆరసంలో నుండి జలాధిదేవత మందాకిని సాక్షాత్కరించింది. ఆ దేవి ముముక్షువులకు ముక్తిని ప్రసాదిస్తుంది. భక్తులకు భక్తిని ప్రసాదిస్తుంది. ఒక్క మునకతో కోటి జన్మల పాపాలన్నీ నశిస్తాయి. గంగా స్నాన ఫలం ఎటువంటిదో నీకు వివరిస్తాను విను.

మందాకినీ (గంగ) మహిమ :

ఓ రాధాదేవీ! తీర్థాలన్నింటిలోనూ పుష్కరిణి తీర్థం ప్రధానమైనది. భగీరథుడు ప్రయత్నం చేత భూలోకానికి తీసుకొని రావడం వలన భాగీరథీ అని గంగానదికి పేరు కలిగింది. భూలోకంలో ప్రవహించడం వలన గంగానది అన్న పేరు సార్థకమైంది. జహ్నుముని కోపానికి గురికావడం వలన జాహ్నవి అన్న పేరుతో పిలువబడుతోంది. భీష్ముని పుత్రుడుగా పొందడం వలన భీష్మసువు అని పిలుస్తారు. నా ఆజ్ఞానుసారం (శ్రీమహావిష్ణువు) స్వర్గ, భూలోక, పాతాళంలో ప్రవహిస్తోంది కాబట్టి త్రిపథ గామిని అయింది. స్వర్గంలో ప్రవహించే టప్పుడు మందాకిని గాను, వైకుంఠం నుండి బ్రహ్మలోకానికి, బ్రహ్మలోకంనుండి స్వర్గానికి, అక్కడినుండి హిమాలయాలపైన అక్కడనుండి భూమిపైన ప్రవహిస్తుందే ధారనే అలకనంద అంటారు. భూలోకంలో మరణకాలం దాపురించిన వారి శిరస్సుపైన పాదాలపైనా చల్లి తీర్థంగా ఒక గుటక వేసినా వైకుంఠానికి పోతాడని ప్రతీతి. పరమ పాపాత్ముడైనా గంగా స్నానం చెయ్యడం వలన పరిశుద్ధుడవుతాడు. అయితే అతడు మళ్ళీ పాపాలు చెయ్యరాదు.

గంగానది కలియుగంలో అయిదు వేల సంవత్సరాలు ఉంటుంది. ఆ తల్లి ఈ నేలపై ప్రవహించినంత కాలం భారతవర్షంలో కలి ప్రభావం ఉండదు. అతలానికి పోయే ధారను భోగవతి అని అంటారు. ఆధార జలాలు అతి వేగంగాను, నురుగుతో నిండి ఉంటుంది. ఈ నదీ గర్భంలో రత్నాలుంటాయి. ఈ నదీ తీరమంతా నాగ కన్యలు విహరిస్తూ ఉంటారు. గంగానది ఒక భాగం వైకుంఠాన్ని చుట్టి ప్రవహిస్తుంది. ప్రళయంలో కూడా ఈ ధార నశించదు. ఓ రాధా! ఇదీ గంగా మాహాత్మ్యము.

బ్రహ్మశాపవిమోచనమగుట

(ఈభాగం శ్రీకృష్ణ జన్మఖండం 35వ అధ్యాయంనుండి గ్రహించబడింది)

శంకరాది దేవతలంతా తమ తమ స్థానాలలో కూర్చున్నారు. శ్రీమన్నారాయణుడు బ్రహ్మతో ఇలా అన్నాడు. ఓ చతుర్ముఖా! లెమ్ము విచారాన్ని విడిచిపెట్టు. నీకు శుభం కలుగుతుంది. నువ్వు ప్రకృతిని అవమానించావు. ఫలితంగా శాపాన్ని పొందావు. నువ్వు వెంటనే లేచి మందాకిని లో స్నానం చెయ్యి. అదే ప్రకృతి నీకు శాపవిముక్తి కలిగిస్తుంది. నేను ఆజ్ఞాపిస్తున్నాను. లేచి వెళ్ళు. తీర్థాలన్నీ విష్ణుమయమని తెలుసుకో. ఎంతటివారికైనా అహంకారమే పాపానికి మూలం. స్నానం చేసి వెంటనే గోలోకానికి వెళ్ళు. అక్కడ నా ఆలయం ఉన్నది. అక్కడే ప్రకృతికి ప్రతిరూపమై సర్వమంగళాలను ప్రసాదించే భారతి నెలకొని ఉన్నది. సృష్టి బీజస్వరూపురాలైన ఆ ప్రకృతిని సేవించు. కల్పాంతం వరకు తపస్సు చేశావు. అయినా ఆ మోహినీ శాపం నుండి తప్పించుకోలేక పోయావు. ఓ విధాతా! నువ్వు సృష్టి కర్తవు కదా. అందువలన ఎవరే దేవతను పూజించినా నిన్ను పూజించినట్లే అవుతుంది సుమా. స్త్రీల ఆత్మయందుండే వాడవు నీవే గదా. నువ్వు పరమ పూజ్యుడవు. నీకు పూజార్హత లేదన్న విచారాన్ని విడిచిపెట్టు. వెంటనే మందాకిని లో స్నానం చెయ్యి గోలోకానికి వెళ్ళు.

అన్న శ్రీమన్నారాయణుని మాటలు విని శ్రీహరికి నమస్కరించి మందాకినిలో స్నానం చేసి వెంటనే గోలోకానికి వెళ్ళాడు. అక్కడ నన్ను దర్శించి (విష్ణువును) నమస్కరించాడు. బ్రహ్మ అటు గోలోకానికి వెళ్ళగానే శంకరాది మునులు, దేవతలంతా తమ తమ నివాసాలకు వెళ్ళారు. బ్రహ్మ గోలోకంలోని భారతి దేవిని దర్శించి నమస్కరించాడు. ఓ రాధాదేవి! ఆ భారతీ దేవి ఎవ్వరో కాదు నా ముఖము నుండి వెలువడిన సర్వ విద్యాధి దేవత. ఆమెనే వాగేశ్వరి అనికూడా అంటారు. అటువంటి వాగేశ్వరీ దేవిని సేవించిన బ్రహ్మ ఆమెవల్ల కామాస్త్ర వ్యాపారాన్ని నేర్చుకున్నాడు. ఆ పిమ్మట శ్రీహరి దగ్గరకు వచ్చి నమస్కరించి ఆ జగదేక సుందరి అయిన మోహినితో కలసి విహరించాడు. ఆమెను సంతృప్తురాలను చేసి పంపేశాడు. ఆ తర్వాత వాగేశ్వరీ దేవి వద్దకుపోయి "దేవీ! నువ్వే సృష్టి కర్త్రివి. నిత్య యౌవన వతివి. పరమ పతివ్రతవు" అని ఆమెను స్తుతించి ఆమెతో కలసి సత్యలోకానికి వెళ్ళాడు. బ్రహ్మలోక వాసులంతా ఆ పరదేవిని శారద అని అంటారు. ఆమె దేహఛాయ తెలుపు. చిరునవ్వులు పరిశుద్ధము. వీణ, పుస్తకము ఆ చేతిలోని అలంకారాలు. ఇంకో చేతిలో వ్యాఖ్యాన ముద్ర పట్టి ఉంటుంది. ఆ దేవి బ్రహ్మలోకం ప్రవేశించగానే ఆలోక వాసులంతా

మహదానందంతో నగర ప్రవేశ మహోత్సవం చేశారు. బ్రహ్మ కూడా భారతి రాకతో బ్రహ్మానంద భరితుడయ్యాడు.

ఓ రాధాదేవీ! నువ్వడిగిన వృత్తాంతం అంతా వివరంగా చెప్పాను. నీవు ఇంక ఏమైనా వినాలని అనుకుంటున్నావా? అని శ్రీకృష్ణుడు అడిగాడు. అందుకు రాధాదేవి చిరునవ్వు నవ్వుతూ ప్రాణేశ్వరా! బ్రహ్మ కర్మ క్షేత్రంలో తపస్సు చేసే వారందరికీ వరాలిచ్చే వేలుపు కదా. సర్వ ధర్మాలు తెలిసినవాడు. తానున్నది కర్మ క్షేత్రం కాదని తెలుసు. అయినా త్రికరణ శుద్ధిగా తన్నే కోరివచ్చిన స్త్రీని ఎందుకు నిరాకరించాడు? దీనికి సమాధానం చెప్పి నా సందేహాన్ని నివృత్తి చెయ్యి అన్నది. అందుకు శ్రీకృష్ణుడు ప్రేయసీ! నీకు పాద్మకల్ప వృత్తాంతాన్ని గూర్చి చెప్తాను. దాంతో నీ సందేహం కూడా తొలగిపోతుంది.

పూర్వం సృష్టి కార్యం ప్రారంభించమని నేను బ్రహ్మను ప్రేరేపించాను. నా ఆజ్ఞననుసరించి మనసు చేతనే పుత్రుల్ని సృష్టించాడు. వారే సనక, సనంద, సనాతన, సనత్కుమార, కవి, పంచశిఖుడు, అసితుడు, కపిలుడు, సిద్ధుడు అనే వారు బ్రహ్మ జ్ఞానులు. వీరినే బ్రహ్మ మానస పుత్రులని అంటారు. వాళ్ళకు ఎప్పుడూ అయిదు సంవత్సరాల వయసు మించి ఉండరు. అందువల్ల ఎప్పుడూ దిగంబరులుగానే తిరుగుతూ ఉంటారు. వాళ్ళను పిల్చి బ్రహ్మ సృష్టి కార్యం ప్రారంభించమని ఆదేశించాడు. వారంతా సృష్టి చేయడానికి ఇష్ట పడక శ్రీహరిని సేవించేందుకు వెళ్ళిపోయారు. వాళ్ళంతా వెళ్ళిపోయిన తర్వాత బ్రహ్మ మళ్ళీ పుత్రుల్ని సృష్టించాడు. వాళ్ళే ఏకాదశ రుద్రులు. వాళ్ళు కూడా సృష్టి చేయడానికి దుఃఖించారు. అందువల్లనే వాళ్ళకు రుద్రులని పేరు సార్థకమైంది. అప్పుడు బ్రహ్మ నన్ను ధ్యానించి తపస్సు చేశాడు. ఆ పిమ్మట వశిష్ట, పులహ, క్రత్యంగి, పులస్త్య , దక్ష , కర్థమ, మరీచి, భృగు అను పుత్రుల్ని పొందాడు. వారందర్నీ సృష్టి చేయమని ఆజ్ఞాపించాడు. ఆ తరువాత ఒక కుమార్తెను, ఆ తర్వాత ఒక పుత్రుని సృష్టి చేశాడు. ఆ పుత్రుడే కామ దేవుడు. అతడు మిక్కిలి పరాక్రమ సంపన్నుడు. ఆతడితో బ్రహ్మ కుమారా! స్త్రీ పురుషులకు క్రీడామోదం కలిగించేందుకే నిన్ను సృష్టించాను. హృష్టియోగం చేత నువ్వందరిలోను నివసిస్తూ ఉంటావు. స్త్రీ పురుషులు ఒకరిపై మరొకరు సమ్మోహం కలిగించే విద్యలో నువ్వు ప్రావీణ్యత పొందుతావు. నావర ప్రభావం చేత నీచే వృద్ధి పొందే వీర్యం అత్యంత శక్తి వంతమైనదవుతుంది. ఈ ప్రక్రియ చక్కగా నిర్వర్తించేందుకు నీకు అయిదు బాణాలనిస్తున్నాను. ఈ బాణాల వలన ప్రభావాలన్నీ నీలో నిక్షిప్తమై ఉంటాయి అని చెప్తూ పుత్రికకు కూడా కొన్ని మాటలు చెప్పాలను కున్నాడు.

ఇంతలోనే కాముడు తండ్రి ఇచ్చిన బాణాల్ని ప్రయోగించి వాటి ప్రభావమెంతో పరీక్షించి తెలుసుకోవాలనుకున్నాడు. ఎదురుగా తండ్రి ఉన్నాడు కాబట్టి ఆ బాణాల్ని తండ్రిమీదే ప్రయోగించాడు. ఆ బాణాలు మంత్ర పూరితాలు కావడం వలన శరీరానికి తగలగానే బ్రహ్మ నిశ్చేష్టుడై మూర్ఛపోయాడు. కొద్ది క్షణాల్లోనే తేరుకొని ఎదురుగా ఉన్న కూతుర్ని చూశాడు. చూసీ చూడగానే ఆమెతో విహరించాలన్న కోరిక కలిగింది. బ్రహ్మ మనసులోని ఆలోచన పసిగట్టిన కూతురు భయంతో పరుగులు తీసింది. బ్రహ్మ కూడా ఆమె వెనకనే పరుగెత్తాడు. ఆ పిల్ల తపస్సు చేసుకుంటున్న సనక, సనందాదుల వద్దకు పరిగెత్తింది. తన దుఃఖమంతా వారి ముందు వెళ్ళబోసుకుంది. వారామెకు అభయమిచ్చి తండ్రితో ఇలా అన్నారు.

తండ్రీ! ఏమిటి నువ్వింత నీచానికి పాల్పడ్డావు? సత్పురుషులైన వారు పరస్త్రీని కూడా తమ పుత్రికగా ఆదరిస్తారే. అటువంటి వారేగదా జితేంద్రియులై పూజించ బడతారు. వేదాలనే సృష్టించిన నువ్వే నీ స్వంత కూతుర్నే ప్రేమిస్తున్నావా? కుమార్తెయే వేద సిద్ధాంతాన్ననుసరించి మాతృ మూర్తి అవుతుంది. గురుపత్ని, రాజపత్ని, విప్రపత్ని, సోదరుని భార్య, పుత్రుని భార్య మొదలైన వారంతా మాతృమూర్తులేనని వేదాలు ఘోషిస్తున్నాయి. కన్యాదాత, అన్నదాత, జ్ఞానదాత, అభయప్రదాత, జన్మదాత, మంత్రదాత జేష్ఠభ్రాత అనువారంతా కూడా తండ్రితో సమానం. ఈ తల్లులను, తండ్రులను ఎవరు గౌరవించరో వారు రౌరవాది నరకాలకు పోతారు. నువ్వే సృష్టికర్తవు. యముణ్ణి కూడా శిక్షించగలవు. అటువంటి నువ్వు స్వంతకూతుర్నే మోహిస్తున్నావా? కాముకుడవయ్యావు కనుక మా ఎదుట నిలవద్దు. వెంటనే ఇక్కడ నుండి పో. మేము తలచుకుంటే నిన్ను ఇక్కడికిక్కడే భస్మం చెయ్యగలం. కేవలం తండ్రివన్న కారణంగా అట్లా చెయ్యడం లేదు. గురువు యందు వెయ్యి దోషాలున్నా క్షమించి వదలాలని పెద్దలంటారు. గురువు సర్వస్వం దొంగిలించినా శపించినా కూడా సాధువులాతనిని హింసింపరు సరికదా నమస్కరిస్తారు. దేవతల కన్నా అధికుడవైన గురువును ఎవరు దూషిస్తారో ద్వేషిస్తారో వారు అంధకూప నరకానికి పోతారు. అని పలికి తండ్రికి నమస్కరించి తపస్సుకు వెళ్ళారు. బ్రహ్మ తను చేసిన పనికి సిగ్గుపడిపోయాడు. శరీరాన్ని త్యాగం చెయ్యాలనుకున్నాడు. మనస్సులో శ్రీహరిని స్మరించి ఓ భగవంతుడా! నేను ఇతరుల ద్రవ్యాలను ఆశించకుండా ఉండే బుద్ధిని ప్రసాదించు. సజ్జనులైన వారికి ప్రాణత్యాగం కన్నా అపకీర్తి మరొకటి ఉంటుందా? అని అనుకుంటూ దేహత్యాగం చేశాడు. యోగబలం చేత షట్చక్రాలను బంధించి ప్రాణాలన్నింటినీ నిరోధించి వాటిని బ్రహ్మరంధ్రం వద్దకు చేర్చి శరీర త్యాగం చేశాడు. ప్రాణాలు పరబ్రహ్మమందు లీనమయ్యాయి. ఆ కన్యక కూడా తండ్రి మరణానికి దుఃఖించి ప్రాణత్యాగం చేసి పరబ్రహ్మంలో లీనమైంది. అంతట తమ కళ్ళ ముందే మృతులైన తండ్రి సోదరిలను తలచుకొని ఆ మునీశ్వరులంతా శ్రీహరిని ప్రార్థించారు.

ఓ రాధాదేవీ! నా అంశా సంభూతుడైన నారాయణుడు బ్రహ్మను తిరిగి బ్రతికించాడు. సజీవుడైన బ్రహ్మ నారాయణునికి నమస్కరించి నీ పాద దాస్యాన్ని నీయెడల నిశ్చల భక్తిని ప్రసాదించమని వేడుకున్నాడు.

సృష్టి చేయడంలో విఫలమవుతున్న బ్రహ్మను చూసి నారాయణుడు కరుణ చూపుతూ ఇలా అన్నాడు. పంకజాననా! నీకు ఉపయోగపడే మాటలు నాలుగు చెప్తాను. శ్రద్ధగా విను. సత్కీర్తి అయినా అపకీర్తి అయినా, ఉపద్రవమయినా, అప్రతిష్ఠ అనేవి మహాత్ములకు, సామాన్యులకు కూడా వస్తూ ఉంటాయి. అన్నింటికీ కర్మయే కారణం. అందువల్లనే సాధువులు ఎప్పుడూ సత్కర్మల్నే చేస్తూ ఉంటారు. ముందు చేసిన కర్మలకు ఫలాన్ననుభవించాలి. చెడుకర్మలుచేస్తే అప్రతిష్ఠ కలుగుతుంది. దానిమూలంగా అభిమానం దెబ్బతిని సిగ్గు పడాల్సి వస్తుంది. అదే మంచిపనులు చేస్తే సత్కీర్తి లభిస్తుంది. ఒక్కొక్కప్పుడు ఆ సత్కీర్తి లోకాంతరాలకు కూడా వ్యాపిస్తుంది. రజో గుణం వలన రూపము, బలము కలుగుతాయి. వాటివలన మోహము, అపకీర్తి కలుగుతుంది. పోను పోను శారీరక, మానసిక ఆర్థిక బాధలు అపవాదులు కలుగుతాయి. వీటినుండి మహాత్ములైనా తప్పించుకోలేరు.

పరస్త్రీల యందు, పర వస్తువుల్లోనూ అపకీర్తి నివసిస్తూ ఉంటుంది. అయితే సజ్జనులు అపకీర్తి, కష్టాలు కలిగినప్పుడు దుఃఖించరు. నన్ను స్మరిస్తే అన్నిటియెడల సమ భావం ఏర్పడుతుంది. ఓ బ్రహ్మా! నీ మనస్సు ఇతరుల వస్తువులపై ఆశపడకుండా ఉండేట్లు చూసుకో. నా మాయయే స్త్రీ రూపంలో వస్తూ ఉంటుంది. అది అందర్నీ మోహింపజేస్తుంది. అనురాగవంతులైతే నానావిధాలైన సుఖాన్ని చూపిస్తుంది. ఆ తర్వాత రతి కుదిరేట్లు చేస్తుంది. స్తనాలంటే మాంసపు ముద్దలు కాక మరేమిటి? లాలాజలంతో తడిసి ఉండే అపరిశుద్ధమైన ప్రదేశాన్నే దొండపండు వంటి పెదాలని వర్ణిస్తారు. మొల పిరుదులనే కామదేవాలయాలని ఊహించుకుంటారు. అందువల్లనే ధర్మాత్ములైన వారు వాటివంక కన్నెత్తి అయినా చూడరు. పరస్త్రీపైన ఆసక్తి చూపేవాడికి ధర్మం ఎక్కడ నుండి వస్తుంది? యశస్సు ఎట్లా వస్తుంది? తపస్సెట్లా సిద్ధిస్తుంది? అతడు చేసే దానాలకు ఫలం ఎక్కడిది? అటువంటి వారికి ఈ లోకంలో అపకీర్తి, పరలోకాన నరకము కలుగుతాయి.

సుఖమే దుఃఖానికి బీజమని మూఢులు తెలుసుకోలేరు. విసుగు విరామం లేకుండా పరస్త్రీలను సేవిస్తూనే ఉంటారు. అన్నింటికన్నా నా పాదసేవయే ఉత్తమం. సత్కర్మానుష్ఠానాలు మధ్యమం. పరస్త్రీ సేవనం అధమం. పరస్త్రీ వ్యామోహం ఉన్నవాడికే పరవస్తువులపై కూడా ప్రీతి కలిగి విపత్తులకు లోనవుతూ ఉంటారు. ఎవడు పరస్త్రీని చూడగానే హరిస్మరణ చేస్తాడో ఎవడు బంగారాన్ని ముట్టుకొన్న చేతుల్ని వెంటనే శుద్ధి చేసుకుంటాడో అటువంటి వాడు పరిశుద్ధుడవుతాడు. తపస్వులు తపస్సునందు, పండితులు శాస్త్ర చర్చలయందు, యోగులు యోగచింతందు, వైదికులు వేదార్థాల్ని తెలుసుకోవడంలోను పతివ్రతలు పతి సేవలందు గృహస్థులు గృహకృత్యాల్లోను, విషయాసక్తులు విషయాల్లోను, నా భక్తులు నన్ను సేవించడంలోను తమ కాలాన్నంతా సద్వినియోగం చేసుకోవాలి. దీనికి విరుద్ధంగా ప్రవర్తించడం అనాచారమవుతుంది. వేదోక్తమైన ఆచారాల్నే సజ్జనులు ఆచరిస్తారు. వారిని సన్మార్గులందరూ ప్రశంసిస్తారు. దుర్మార్గపరులకు చదువు సంధ్యలు రాని వారుకూడా దూరంగాపోతారు.

ఓ చతుర్ముఖా! ఈరోజునుండి నా వరప్రభావం చేత నీ మనస్సు నిర్మలమవుగాక. నేను చెప్పినట్లల్లా నడచుకుంటూ ఉండు. ఈ కన్యక కాముడికి కామిని అవుతుంది. ఈమెను లోకులంతా రతి అని పిలుస్తారు. ఈ రతి ఒక అధిష్ఠాన దేవత అవుతుందని బ్రహ్మను ఊరడించి నేను (విష్ణువు) వైకుంఠానికి వెళ్ళాను.

శంకర గర్వభంగము

(ఈభాగం శ్రీకృష్ణ జన్మ ఖండం 36వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

రాధాదేవి : నాథా! కృష్ణా! నువ్వు చెప్పిన వృత్తాంతం లో బ్రహ్మ మోహినిని పరిత్యజించాడు. ఆ కులట ఇచ్చిన శాపాన్ననుసరించి బ్రహ్మ పూజకు అర్హుడు కాకుండా పోయాడు గదా. అతడికి గర్వభంగం ఎట్లా అయింది?

శ్రీకృష్ణుడు : రాధా! ప్రాణనాయికా! పూర్వం బ్రహ్మ నా గురించి తపస్సు చేసి నావరదానం చేత సృష్టిని అనేక విధాలుగా వృద్ధి చేసాడు. దాంతో లోకాలన్నీ విధాత అన్న పేరుతో గౌరవిస్తూ

వచ్చాయి. తపస్సు చేసేవారికి వరాలనివ్వగల శక్తి వంతుడయ్యాడు. లోక కంటకులకు శాపమివ్వగల సమర్థుడయ్యాడు. దాంతో తానే పరబ్రహ్మమన్న గర్వం అతడి మనసులో మెదిలేది. గర్వం కన్నా చెడ్డ వస్తువు మరొకటి ఉండదు. అది బ్రహ్మాండాలన్నింటికంటే పెద్దది. గర్వం ఎవరెవరిలో తలెత్తు తుందో గమనిస్తూ నేను వారి గర్వాన్ని అణచివేస్తూ ఉంటాను. వారికి జ్ఞానోదయం కలిగేట్లు చూస్తాను. మొదట బ్రహ్మ గర్వాన్ని తొలగించాను. ఆ తర్వాత శంకరుడికి, పార్వతికి, సూర్య చంద్రులకు అగ్ని హోత్రునికి, దుర్వాసునికి, ధన్వంతరికి ఆయా సమయాల్లో గర్వభంగం చేశాను. ఆ విధానం అంతా నిగూఢమైన దైనా నీకు చెప్తాను విను. రాధా! గర్వమనేది మహాత్ములకే కాదు. అల్పులకు కూడా ఉండకూడదు. ఎట్లాంటి వారికైనా గర్వం తలెత్తగానే దాన్ని భంగపరుస్తూ ఉంటాను.

రాధ : మహానుభావా! సర్వజన దర్పభంజనా! నాకా పద్ధతి విపులంగా చెప్పు.

శ్రీకృష్ణుడు : రాధా! బ్రహ్మ గర్వభంగాన్ని ముందే చెప్పాను గదా. ఇప్పుడు శంకరుని గర్వభంగాన్ని గూర్చి చెప్తాను విను.

శంకరుడు కూడా నా అంశా సంభూతుడే. సృష్టి కార్యంలో లయ కర్త. నా అంతటి తేజస్సు గలవాడు. గుణ జ్ఞాన సంపన్నుడు. అందువల్లనే గురువులకు గురువైన యోగీశ్వరుడయ్యాడు. జ్ఞానానంద స్వరూపుడు. అనేక వేల యుగ సంవత్సరాలు తపస్సు చేసి నా అంతటి తేజస్సు పొందాడు. భక్తుల పాలిట కల్పతరువని పేరు పొందాడు. యోగీశ్వరులా మహనీయుని ధ్యానించి తేజోరాసి మధ్యన ఆ శంకరుని దర్శించి ధన్యులవుతారు. ఆ ఈశ్వరుడు కోరిన వారికి కోరినట్లల్లా సంపదలిస్తూ ఉంటాడు. ఇట్లా కొంతకాలం గడచిపోయింది. నా అంత వాడు లేడన్న గర్వం శంకరునిలో కలిగింది. ఒకానొక సమయంలో ఓ రాక్షసుడు శివుని గూర్చి ఘోరమైన తపస్సు చేశాడు. శంకరుడు ఆ దానవుడి ముందు ప్రత్యక్షమై వరమేదైనా కోరుకోమన్నాడు. ఆ రాక్షసుడు పరమ దుర్మార్గుడు దీర్ఘంగా ఆలోచించి "ఓ పరమేశ్వరా! నాచేతులు ఎవరి నెత్తిన పెడ్తానో వారు భస్మమయ్యే వరాన్ని ప్రసాదించ" మని కోరాడు. శంకరుడా వరాన్ని వెంటనే ప్రసాదించాడు. ఆ దానవుడు ఆ వరాన్ని పరీక్షించాలనుకొని శివుని నెత్తిమీదే చెయ్యి పెట్టే ప్రయత్నం చేశాడు. శంకరుడే తలచుకొంటే వాడిని అక్కడే భస్మం చేసి ఉండేవాడే. కానీ శంకరుడు భక్త వత్సలుడు కావున ఆ పనికి పూనుకోలేదు. వాడి బారినుండి తప్పించుకొని నన్నే స్మరిస్తూ నా శరణు కోరాడు. నేను నా మాయ చేత ఆ రాక్షసుని మోహింప జేశాను. వంచితుడైన ఆ రాక్షసుడు వాడినెత్తిన వాడిచేతులే పెట్టుకొని అక్కడికక్కడే భస్మమై పోయాడు. ఆ సమయంలో దేవాసురులంతా నన్ను ప్రశంసించారు. శివుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. నేను శంకరునికి హితబోధ చేసి పంపాను.

మరికొంతకాలానికి శివుడు గర్వంతో త్రిపురాసురుల్ని చంపడానికి వెళ్ళాడు. తాను మృత్యుంజయుడనని ఆ రాక్షసాధములు అల్పులని శంకరుడు భావించారు. నేను ఇచ్చిన కవచాన్ని త్రిశూలాన్ని ధరించి, చాలా కాలం యుద్ధం చేశాడు. ఆ మహా యుద్ధంలో ఇరువురి బలం సమానమని తేలింది. శంకరుడు ప్రయోగించిన ధనుర్బాణాలన్నింటినీ ఆ రాక్షసుడు ధ్వంసం చేశాడు. శంకరుని రథాన్ని విరుగ గొట్టాడు. శంకరుడు కృద్ధుడై ఆ రాక్షసుణ్ణి పిడికిటితో ఒక్క గుద్దు గుద్దాడు. రాక్షసుడు

తేరుకొని శంకరుని పట్టుకొని నేలకేసి కొట్టాడు. అప్పుడు దేవతలు, ఋషులు భీతి చెంది నన్ను ధ్యానం చేసి స్మరించి శంకరుని కాపాడమని వేడుకున్నారు. అదే సమయంలో శివుడు కూడా నన్ను స్మరించి శరణుకోరాడు. అప్పుడు నేను వృషభరూపం దాల్చి నా కొమ్ములతో శివుని పైకి లేవనెత్తి నాపై స్థిరంగా కూర్చునేట్లు చేశాను. నా కవచాన్ని శివుడికి వస్త్రంగా కప్పాను. వాటిని స్వీకరించి శివుడు నన్ను స్మరిస్తూ శూలంతో ఆ రాక్షసుడిని చంపాడు. నాకు శివుడికన్నా ప్రియమైన వాడు మరొకడు లేడు. అందువలన వృషభరూపంలో శివుని మోస్తూ త్రిపురాసుర సంహారానికి తోడ్పడ్డాను. బ్రహ్మానా మనస్సైతే శివుడు నాకు జ్ఞాన స్వరూపుడు. భగవతి అయిన దుర్గే నాకు బుద్ధి స్వరూపిణి. ఆమెయే మూలప్రకృతి అయిన ఈశ్వరి. సర్వ శక్తులు ఈ మహాప్రకృతి కళలే. సరస్వతియే నా వాగాధిష్ఠాన దేవత. పరమార్థమే నా ధర్మం. భక్తుడే అగ్నిహోత్రుడు. గోలోకవాసులంతా నా ఐశ్వర్యస్వరూపులు. ఓ రాధాదేవీ! నువ్వే నా ప్రాణాధిష్ఠానదేవతవు. గోపికలంతా నీ అంశలే. గోలోకంలో నన్ను పూజించేవారంతా గోపకులయ్యారు. నా తేజస్సే సూర్యుడు. ప్రాణాలే వాయువు. వరుణుడే జలాధిదేవత. ఇంద్రాది దేవతలంతా నా అంశాసంభూతులే. అనగా అన్నింటికీ నేనే బీజాన్ని. జీవుడు నా ప్రతిబింబమే. కర్మ ఫలాన్ననుభవించే వాడతడే. నేను సాక్షీ మాత్రంగానే ఉంటాను. అంతేకాని కర్మానుభవం నాది కాదు. భక్తులు నన్ను ధ్యానించుకోవడానికే వారు కోరుకున్న రూపాలన్నీ ధరిస్తూ ఉంటాను. నిజానికి నా సంకల్పమే మహాప్రకృతి. మహాపురుషుణ్ణి కూడా నేనే. శివకేశవులమైన మా ఇద్దరికీ భేదం లేదు. పరాత్పరుడను నేనే.

రాధాదేవి : ఓ భగవానుడా! నువ్వు సర్వ బీజ స్వరూపుడవు. సనాతనుడవు. శంకరుడు జ్ఞాన స్వరూపుడు సర్వతత్త్వనిధి. మృత్యుంజయుడు, కాలపురుషుడు అయిన శంకరుడు త్రిలోచనుడు, దిగంబరుడు, జటాధారి ఎట్లా అయ్యాడు? ఆయన కూడా నీ అంతటి వాడే గదా? ఏదైనా మంచి వాహనాన్ని ఎన్నుకోకుండా ఎందువల్ల వృషభారూఢుడై సంచరిస్తూ ఉంటాడు. నీకుమల్లే పీతాంబరాలు కట్టడు. కేవలం శార్దూల చర్మాన్నే ధరిస్తాడు. పారిజాతం వంటి పరిమళ పుష్పాల్ని కాదని ఉమ్మెత్త పూలంటే ఇష్టపడతాడు. చక్కటి మణిమాణిక్యాలు పొదిగిన కిరీటాలు ధరించక కేవలం జటలనే ధరిస్తాడు. సుందర ఉద్యానవనాల్ని కాదని స్మశానాల్లో ఎందుకు విహరిస్తాడు? చందనం వంటి సుగంధాల్ని కాదని బిల్వపత్రాలంటే ఇష్టపడతాడు ఎందువలన? పరమేశ్వరా నా సంశయాలన్నింటినీ తీర్చు.

శంకర మాహాత్మ్యం :

శ్రీకృష్ణుడు : ప్రాణేశ్వరీ! శంకరుడు నన్ను మనస్సులో ధ్యానిస్తూ ఆరువేల యుగాలు తపస్సు చేశాడు. నేనప్పుడు అతని ఎదుట శ్యామ సుందరుడనై, చక్కటి ముంగురులతో ముగ్ధమనోహర రూపంతో ప్రత్యక్షమయ్యాను. అప్పుడా శంకరుడు నన్ను తన మూడు నేత్రాలతో చూసినా తృప్తి లేని వాడయ్యాడు. కనురెప్పలు పడటం లేదు. తన్మయుడై భక్తి పారవశ్యంతో ప్రేమ వరదలై పారింది. అప్పుడు శంకరుడు ఇలా ప్రార్థించాడు. 'ఓ పరమేశ్వరా! వేయి కన్నులతో నిన్ను దర్శించే అనంతుడు నాకన్నా భాగ్యశాలి గదా. నాలుగు ముఖాలతో నిన్ను సేవించే బ్రహ్మ నాకన్నా అదృష్టవంతుడుగదా.

వారు నిన్ను అనేక ముఖాలతో స్తుతించగలరు. కానీ నిన్ను మూడు నేత్రాలతోనే దర్శించగలుగుతున్నాను. వారంతా నా కన్నా భాగ్యశాలురే గదా అని వాపోయాడు. అప్పుడు అతడికి పూర్వం ఉండే నాలుగు ముఖాలతో పాటు మరో ముఖం కూడా ఏర్పడి ఐదు ముఖాలయ్యాయి. ఒక్కొక్క ముఖంలోనూ మూడేసి నేత్రాలు అమరిఉన్నాయి. అందువల్లనే శంకరుణ్ణి పంచవక్త్రుడని త్రిలోచనుడన్న నామాలు ప్రసిద్ధి చెందాయి. శంకరుడు శ్యామసుందర విగ్రహాన్ని స్తుతించడం కన్నా దర్శించేందుకే ఎక్కువ ఇష్టపడ్డాడు కాబట్టి ముఖాలకంటే నేత్రాలెక్కువగా అమిరాయి. అనగా ఆ పరమ శివుని నేత్రాలే గుణాలకు ప్రతీకలు. అనగా సత్త్వ రజ స్తమో గుణ రూపాలయ్యాయి. సత్త్వ గుణ నేత్రంతో సజ్జనుల్ని రక్షిస్తూ ఉంటాడు. రజోగుణ నేత్రంతో రజోగుణ వంతుల్ని కాపాడుతూఉంటాడు. తమో నేత్రంతో తమో గుణ ప్రధానులైన జంతుజాలాన్ని చల్లగా చూస్తూ ఉంటాడు. సతీదేవి ఆయన భార్యకదా. ఆమె యోగాగ్ని చేత కాలి బూడిదైపోయింది. శివుడామె యెడల ప్రీతితో ఆ భస్మం అంతా ఒంటికి పూసుకున్నాడు. ఆమె అస్థికల్ని మాలగా ధరించి ఒక సంవత్సరం పాటు సతీదేవి దేహాన్ని పట్టుకొని తిరిగాడు.

ఆ సతీదేవి అవయవాలు ఏయే ప్రదేశాల్లో పడ్డాయో ఆయా స్థలాలన్నీ సిద్ధ పీఠాలయ్యాయి. సర్వ సిద్ధుల్ని ప్రసాదించే క్షేత్రాలయ్యాయి. ఆమె కళేబరాన్ని గుండెలకు హత్తుకొని ఒకచోట పడుకున్నాడు. నేనప్పుడు అక్కడకు పోయి శంకరునికి శోకం పోయేట్లుగా బోధించాను. అతడిలోని దివ్యజ్ఞానాన్ని మేల్కొల్పి అతడి లోకానికి పంపాను. ఆ సతీదేవియే రూపాంతరం చెంది మరల భార్య అయింది. దివ్య మాలాలంకృతుడు కావున పూలమాలలందు ప్రీతి లేని వాడయ్యాడు. నిత్యమూ తపస్సులోనే గడుపుతూ ఉండటం చేత జటాధారుడయ్యాడు. అనగా యోగులు కేశ సంస్కారానికి ఇష్టపడరు. అటువంటి వారికి చందనమన్నా రత్నాలన్నా, సమభావమే ఉంటుంది. గరుడుని శత్రువులైన సర్పాలు శంకరుని శరణు జొచ్చాయి. కృపానిధి కావడం వలన వాటిని తానే ధరించి రక్షణ కల్పించాడు. నేనే అతడి వృషభ వాహనాన్ని. ఎందువల్ల నంటే ఆ మహానుభావుని వేరెవ్వరూ మోయలేరు. త్రిపురాసుర సంహార సమయంలో పారిజాతం వంటి సుగంధ పుష్పాలన్నింటినీ నాకు కానుకగా సమర్పించాడు. అందువల్ల మళ్ళీ ఆ పుష్పాల నతడు ముట్టలేదు. బిల్వ పత్రాలు, బిల్వ గంధం పరిమళం లేనివని అంతా ఆక్షేపిస్తారు. అందువల్లనే ఆయన ఆ గంధాన్నే ఇష్టపడతాడు. నిర్లిప్తుడైన శంకరునికి, దివ్య తల్పాలపైన ప్రీతి లేనివాడై, స్మశానాల్లోనే నివసిస్తాడు. అంతేకాదు స్మశానం అతి రహస్య స్థలం కావడం చేత ఎల్లప్పుడూ అక్కడే నివసిస్తూ అనిర్వచనీయమైన నారూపాన్నే ధ్యానిస్తూ ఉంటాడు. బ్రహ్మ నశించేంతవరకు శివుడు ఉంటాడు కాబట్టి అతడి ఆయుః ప్రమాణమెంతో నాకు తెలియదు. ఇక వేదాలేమి చెప్పగలవు? మృత్యుంజయుడైన ఆ పరమ శివుడు జ్ఞాన శూలాన్ని ధరిస్తాడు. ఆ త్రిశూలం నేను ఇచ్చిందే కాబట్టి అది నా తేజస్సుతో సమానమైనది. కావున శంకరుని నేను తప్ప మరెవ్వరూ జయించలేరు. శంకరుడే నా పరమాత్మ. నా చిత్తము ఎల్లప్పుడూ శంకరునిపైనే లగ్నమై ఉంటుంది. నాకు అంతకంటే ప్రియమైన వాడు మరొకడు లేడు. నాప్రాణానికన్నా అధికుడు. శంకరుడు సృజించిన బ్రహ్మాండాలన్నింటినీ ఆవరించి ఉంటాను. అటువంటి శంకరుని మోహింప చేయగలవాడు

లేనే లేదు. ఓ రాధా! నేను గోలోకం లో గాని, వైకుంఠంలో గాని, నీ వక్షఃస్థలం పై గాని ఉండను. శివుని హృదయంలో మాత్రమే ఉంటాను. శంకరుడు ఎల్లప్పుడూ పంచముఖాలతో నన్ను స్తోత్రం చేస్తూ శ్రావ్యంగా పాడుతూ ఉంటాడు. అందువల్లనే నేను ఎల్లప్పుడూ అతడి ప్రక్కనే ఉంటూ ఉంటాను. ఏ శివుడు తన కంటి చూపుతో బ్రహ్మాండాలన్నింటినీ ఒక్క క్షణంలో సృష్టిస్తూ ఒక్క క్షణంలో నాశనం చెయ్యగలడో అటువంటి శంకరుని కంటే పరమ యోగి మరెవ్వరుంటారు? దేవతలందర్నీ పుట్టించి గిట్టించే శంకరుని కన్నా జ్ఞాని మరొకడు లేడు. శంకరుడు నా భక్తిని, దాస్యాన్ని ముక్తిని సకల సంపదలనివ్వగల దాత. నాకు శంకరుని కన్నా గొప్పభక్తుడు లేడు. నేను, నా సుదర్శనం శివ తేజస్సుకు సమానం. బ్రహ్మ సృష్టి కర్తయే అయినా కూడా శంకరునితో సమానుడు కాడు.

రాధామాధవుల నామ మహిమ

(ఈభాగం శ్రీకృష్ణ జన్మఖండం 52వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదుడు : ప్రభూ! శ్రీమన్నారాయణా! లోకంలో రాధానామం ముందుగా ఉచ్ఛరిస్తారు ఎందువలన?

నారాయణుడు : నారదా! ముల్లోకాలలోనూ తండ్రి కన్నా తల్లిని నూరు రెట్లు అధికంగా గౌరవించే ఆచారం వస్తోంది. ఇది కేవలం ఆచారం మాత్రమే కాదు. వేదం కూడా అదే చెప్తోంది. రాధా కృష్ణులు, గౌరీ శంకరులు అన్న మాటే వినిపిస్తుంది. ఒక్క సామవేదంలో మాత్రం "రోహిణీ చంద్రా" అని "సంజ్ఞాహిత భాస్కరా" నేనిచ్చే అర్ఘ్యాన్ని స్వీకరింపుమా అన్న ప్రార్థన వినబడుతుంది. 'రా' అన్న శబ్దం విన్నంతనే మధుసూధనుడు ఉత్సాహభరితుడవుతాడు. 'ధ' శబ్దం వినబడగానే పరుగున పోయి అక్కడకు చేరుకుంటాడు. ఎవడు ముందుగా పురుషుడి పేరు చెప్పి ఆ తరువాత తల్లి పేరు ఉచ్ఛరిస్తాడో వాడు వేదాన్ని అతిక్రమించిన వాడై నరకానికి పోతాడు. అంతే కాకుండా బ్రహ్మ అంతటి వాడు రాధా నామాన్ని మనస్సులో ధ్యానం చేస్తూ అరవై వేల సంవత్సరాలు తపస్సు చేశాడు. కావున ముందుగా రాధా నామాన్నే ఉచ్చరించాలి. ఇందులో భగవన్నామ మహిమ మాత్రమే కాకుండా మరో రహస్యం కూడా ఉంది. అదే వ్యాకరణ శాస్త్రాన్ననుసరించి అల్పాచ్చులు గల శబ్దాల్ని ముందుగా ఉచ్చరించాలన్న సిద్ధాంతం కూడా ఒకటున్నది. ప్రస్తుతానికి మనమా సిద్ధాంతాన్ని విస్మరిద్దాం. భగవంతునికి (వేదం) కోపం వస్తుందన్న మాటే సమంజసంగా కనిపిస్తోంది. అది ఎట్లాగంటే, భగవంతుడికి నామ రూపాలు ఎట్లా ఏర్పడుతున్నాయి? ప్రకృతితో చేరి ఉన్నప్పుడే గదా. అట్లాగే సృష్టి కార్యంలో ప్రధాన పాత్ర ఎవరిది? ప్రకృతిదే కదా. భగవద్గీతలోను, ఉపనిషత్తుల్లోనూ అనేక ప్రమాణాలున్నాయి. ప్రఖ్యాత వ్యాఖ్యాతలు శ్రీ శంకర భగవత్పాదుల వారు, శ్రీధరాచార్యుల వంటి వారి వ్యాఖ్యానాలు కూడా ఈ వాదాన్నే బలపరచాయి. ప్రకృతి అనగా భగవంతుని ఇచ్ఛా శక్తియే గదా. అయితే భగవంతుడు మాత్రం సృష్టి స్థితి లయల్లో నిర్లిప్తుడై సాక్షీభూతంగా మాత్రమే ఉంటాడు. అందువలన రాధా మాధవులనే పారాయణం చెయ్యాలని అప్పుడే సంపూర్ణ ఫలం

లభిస్తుందన్నదే సారం. అందువల్లనే శ్రీ శంకరాచార్యులవారు ప్రకృతీ పురుషులను ఉపాసించే క్రమాన్ని ఆజ్ఞాపించారు. పూర్వ సంస్కారం లేని వారికీ వాదం రుచించదు. ఏ జన్మలో అది రుచిస్తుందో ఆ జన్మలో భగవతిని ఉపాసించాలన్న సద్బుద్ధి కలవారవుతారు. పరమేశ్వరునకు కూడా రాధానామం పై అత్యంత ప్రీతిఅని మనం ముందే తెలుసుకున్నాం. కాబట్టి రాధామాధవుల నామాన్నే స్మరించి ధ్యానం చెయ్యాలి. పరమేశ్వరుడు కూడా రాధానామం పైనే ఎక్కువ ప్రీతి గలవాడు.

ఖాండీర వనం

(ఈభాగం శ్రీకృష్ణ జన్మఖండం 53వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదుడు : పరమేశ్వరా! శ్రీమన్నారాయణా! భగవంతుడు రాసవిహారం కల్పించడంలో గల ఆంతర్యాన్ని వివరించు.

శ్రీమన్నారాయణుడు : రాసేశ్వరుడు, రసిక శిఖామణి అయిన శ్రీకృష్ణ పరబ్రహ్మము రాసమండల విహారాన్ని ముగించుకొని భక్తులందర్నీ సంతృప్తి పరచి వారితో కలసి యమునా తీరానికి వెళ్ళాడు. ఆనంతరం గోపికలంతా భగవంతుని అనుమతితో వారివారి ఇళ్ళకు వెళ్ళారు. శ్రీకృష్ణుడు రాధతో కలసి ఖాండీర వనానికి వెళ్ళాడు. ఆవనంలో అతి సుందరమైన ప్రదేశమొకటుంది. దాన్నే మాలతీ వనం అంటారు. ఆ మాలతీ వనం నుండి వాసంతీకా వనానికి వెళ్ళారు. అక్కడ నుండి బృందావనానికి వెళ్ళి ఆ రాత్రి అక్కడే బస చేశారు. ఆ మరునాడు చంపక వనానికి, అక్కడ నుండి పద్మవనానికి పోయి ఆ రాత్రికి అక్కడే నిద్రించారు. అక్కడ నిద్రిస్తున్న రాధాదేవి ముఖాన పట్టిన చెమట బిందువులు ముత్యాల్లాగా ప్రకాశించాయి. ఆ స్వేద బిందువులు రాధాదేవి ముఖానికో వింత కాంతిని చేకూర్చాయి. అట్టి రాధాదేవికి పరమాత్మ మెల్లగా విసురుతూ సేద తీర్చాడు. రాధాదేవి ముఖాన్ని తన హృదయానికి హత్తుకొని ఆమె ముఖసౌందర్యాన్ని రత్న దర్పణంలో చూపించాడు. రాసమండల విహారంలో భగవతి తనకిచ్చిన పారిజాత పుష్పాలతో దేవిని అభిషేకించాడు. శంకరుడిచ్చిన పద్మాలను రాధాదేవి ఎడమ చేతిలో ఉంచాడు. ధర్ముడిచ్చిన కౌస్తుభరత్నాన్ని ప్రియురాలికిచ్చి ఆమెకు ప్రీతిని కలిగించాడు. బ్రహ్మ ఇచ్చిన పుష్పహారాన్ని ఆమె కంఠమాలగా చేసి అలంకరించాడు.

ఈవిధంగా రాధాదేవికి వివిధ వస్తువులనిచ్చి సంతోషపరుస్తూ ఉండగా బిలబిల మంటూ అరవై వేల మంది గోపికలు భగవంతుని సేవించుకున్నారు. వారంతా భగవంతునికి చందనం పూశారు. చామరం వీచారు. సంగీతం వినిపించారు. నాట్యం చేసి సంతోషపెట్టారు. వారంతా రాధాదేవిని సేవించుకోవడానికి గోలోకం నుండి వచ్చిన వారే. పలువిధాలైన శృంగార చేష్టలతో ఆనంద సాగరంలో మునిగిపోయారు.

ఈ రాసలీలా విహారాలనుండి గ్రహించదగిన విషయం ఒక్కటే ఉంది. అదేమంటే, ఈ విలాసమంతా మహాప్రకృతి అయిన రాధాదేవి భగవంతునితో కలసి చేసిన విలాసమే. అనగా ఈ రాసలీల ప్రకృతి విలాసమే గాని ఇందులో భగవంతుడు ఆనందించేందుకో, విహరించడం వంటి

వేవీ లేవు. నిర్లిప్తుడైన భగవంతుడు తాను కూడా ఆసక్తుడైనట్లుగా నటించాడు. ఈ విలాసాలేవీ భగవత్కల్పితాలు కావని, ప్రకృతిచే కల్పించబడ్డవేనని మనం గ్రహించాలి. అయితే భగవంతుడు ఎప్పుడూ తన సర్వసాక్షిత్వాన్ని వెల్లడిస్తూనే ఉంటాడు. అంతా భగవదిచ్ఛ చేత కల్పించబడినవే గదా. అందువలన భగవంతుడైన శ్రీకృష్ణుని దూషించడమంటే వారి పూర్వజన్మ పాప ఫలమే కాని మరొకటి కాదు. శ్రీరాధామాధవుల పాద సేవ భుక్తి, ముక్తి ప్రదం. సంసార సాగరాన్నుండి ఒడ్డుకు చేర్చగల మరొక నౌక లేదన్నది సిద్ధాంతం. ఇదీ బృందావన విహారం.

కృష్ణావతారంలో ఫలం అనేక విధాలు. బాల్యం లోనే పూతన వంటి వారిని సంహరించాడు. మద్ది వృక్షాల్ని నేలకూల్చి గంధర్వునికి శాపవిమోచనం కల్పించాడు. రాసక్రీడల పేరుతో తన సర్వ వ్యాపికత్వాన్ని ప్రదర్శించాడు. ఇట్లా ఇంకా ఎన్నెన్నో ఫలాల్ని మనం తెలుసుకోబోతున్నాం. దానికి ముందు శ్రీకృష్ణ మహిమను గూర్చి తెలుసుకుందాం.

శ్రీకృష్ణ మహిమ

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 55వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

శ్రీమన్నారాయణుడు : నారద మునీంద్రా! శ్రీకృష్ణుడే భగవంతుడు. సర్వాంతర్యామి. పరమ పురుషుడు సకల సుఖాలనిచ్చేవాడు. భక్తజన సులభుడు. అటువంటి భగవంతుని చరిత్ర తెలుసుకోవడం అంత సులభం ఏమీ కాదు. ఆ మహాత్ముని మాయచేత బ్రహ్మాండాలన్నీ మోహితులై ఉన్నాయి. ఆ మాయను తెలుసుకోవడం ఎవరితరమూ కాదు. ఆ మాయా శక్తి చేతనే నిరాధారంగా ఉన్న భూమిని మహాకూర్మం భరిస్తోంది. వెయ్యి శిరస్సులు గలిగిన పురుషునకు ఒకే శిరస్సుతో ఉంటున్నాడు. సప్త ద్వీపాలు, సప్త సముద్రాలు, సప్త మహాపర్వతాలు, అరణ్యాలు, అతల సుతల పాతాళాది లోకాలు, ఇతర బ్రహ్మాండాలన్నీ భగవదాజ్ఞననుసరించే ప్రవర్తిస్తున్నాయి. బ్రహ్మ వంటి సృష్టి కర్తల్ని, బ్రహ్మాండాల సంఖ్యల్ని లెక్కించడం ఎవరితరమూ కాదు. ఆ పరాత్పరుని ఆజ్ఞచేతనే బ్రహ్మ సృజిస్తాడు, విష్ణువు పాలిస్తాడు, రుద్రుడు ఉపసంహరింపజేస్తాడు. సూర్యునికి తపించే శక్తిని, అగ్నికి దహించే శక్తిని, ఇంద్రునికి వర్షించే శక్తిని, యమునికి శాసించే శక్తిని, మృత్యువుకు నిహరించే శక్తిని ఆపరాత్పరుడు ప్రసాదించినవే. కావున ఆ పరమేశ్వరుని ఆశయాన్ని ఎవరైనా తెలుసుకోగలరా? బృందావనాన్ని వదలి మధురకు పోయి ప్రాణాధికురాలైన రాధను, గోపికల్ని ఎట్లా వదిలేశాడో, నందుడు యశోద మొదలైన బంధువులందర్నీ విడిచి మధురలో ఎట్లా ఉండగలిగాడో, సుధాముని శాపఫలంగా రాధాదేవి దర్పాన్ని ఎట్లా అణచివేశాడో, మందబుద్ధులు తెలుసుకోగలరా? భావనా బలం చేతనే బ్రహ్మ ప్రాప్తిని కలిగించేవాడు పరమాత్మ. అటువంటి పరమాత్మ బ్రహ్మకు గర్వభంగం కలిగించాడు. శంకరునికి, శేషునికి, ధర్మునికి యమ, సాంబ, సూర్య, చంద్ర, దుర్వాసులు, జయవిజయుల దర్పాన్ని భంగపరచిన ఆ పరాత్పరుని ఎవరు తెలుసుకోగలరు? ఇక సామాన్యుల గర్వాన్నణచడం ఆ పరమేశ్వరునకొక లెక్కా? కర్తయు, హర్తయు, పాలకుడు, సంహారకుడు అయిన ఆ పరమ పురుషుని తెలుసుకోవడం

అయిదు శిరస్సులు గల శివునికి గాని, చతుర్ముఖుడైన బ్రహ్మకుగాని, వెయ్యి శిరస్సులున్న శేషునికి గాని సాధ్యం కాదు. ఆపరాత్పరుని ప్రభావాన్ని వేదాలే తెలుపలేవు. సరస్వతి చెప్పబోయి చెప్పలేక మహాపరాధం చేశానని సిగ్గుపడింది. నారదా! నిర్గుణుడైన శ్రీకృష్ణ భగవానుని ప్రభావమిది అని వర్ణించడం ఎవరితరమూ కాదు.

భగవంతుని ప్రభావం తెలపడం ఎవరివల్లా కాదని చెప్పడమే ఇందులోని సారం. దేనిలో నైనా సమానమైన వస్తువు మరొకటి ఉంటే పోల్చి చెప్పవచ్చు. భగవంతుడు అద్వితీయుడు గదా. మరి పోల్చి చెప్పడం ఎట్లా సాధ్యం. ఏదో చెప్పడం కోసమే నాలుగు మాటలు చెప్పినా అవి నిస్సారంగా ఉంటాయి.

శ్రీకృష్ణుడు విష్ణువు మున్నగువారి గర్వాన్ని తొలగించడం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మ ఖండం 56వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదుడు : భగవంతుడా! నారాయణా! శ్రీకృష్ణుడు విష్ణువు మొదలైన వారి గర్వాన్ని ఎట్లా భంగపరచాడో తెలుపు.

నారాయణుడు : నారదా! ఒకానొక సందర్భంలో ఈ లోకాలన్నీ తన రోమ కూపాల్లోంచి పుట్టాయి కాబట్టి ఆయాలోకాలన్నింటికీ తానే ప్రభువునన్న గర్వం విష్ణువులో తొంగి చూసింది. ఈ గర్వం విష్ణువుకు మంచిదికాదని శ్రీకృష్ణ పరబ్రహ్మం తలచాడు. వెంటనే సంహార భైరవుడై విష్ణువు శరీరాన్నంతా మ్రింగేశాడు. ఇంకా తల మాత్రమే మిగిలిఉంది. అప్పుడు విష్ణువుకు తన లోపమేమిటో తెలిసి వచ్చింది. లోకాలన్నింటికీ తానే ప్రభువునన్న భావనే నన్నింత అధోగతి పాలు చేసిందని గ్రహించి శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని ప్రార్థించాడు. ప్రసన్నుడైన భగవంతుడు విష్ణు శరీరాన్ని పూర్వపు స్థితిలో ఉంచేశాడు. పూర్వం బ్రహ్మకు కూడా తాను వేద కర్త నని, సృష్టి కర్తనని గర్వం చూపాడు. ఆ విషయం తెలిసిన శ్రీకృష్ణ భగవానుడు బహుముఖ బ్రహ్మల్ని గోలోకానికి రప్పించి చతుర్ముఖ బ్రహ్మ గర్వం అణిగేట్లు చేశాడు.

శ్రీమహావిష్ణువుకు జగత్తులను పాలించే వాడినన్న గర్వం కలిగింది. రామావతారంలో ఆత్మ విస్మృతి కలిగించి ఆ దోషాన్ని తొలగించాడు. ఆది శేషువుకు ప్రపంచాన్నంతటినీ తానే భరిస్తున్నానన్న గర్వం కలిగింది. గరుడుని ప్రయోగించి నాగుల గర్వమణచాడు. ఇదీ అనంతుని గర్వభంగ విధానం. అట్లాగే భగవంతుని కరుణ కూడా అపారం. గర్వమణగిన నాగులకు గరుడ భయం లేకుండా చేశాడు. శంకరునిచేత జితేంద్రియుడనన్న గర్వాన్ని తొలిగేట్లు చేశాడు. శ్రీకృష్ణ పరమాత్మ తన మాయచేత శివుణ్ణి మోహితుని చేసి దక్ష పుత్రిక అయిన సతి మరణించేట్లు చేయగా, వివుడా కళేబరాన్ని భుజాన వేసుకొని ఓ సంవత్సరం పాటు తిరిగాడు. ఆ సతీదేవికే రూపాంతరం కల్పించి శివునికి భార్యగా పార్వతి అన్న పేరుతో లోక విఖ్యాతి కల్గించాడు. త్రిపురాసురుడనే రాక్షసుడితో యుద్ధం చేసేటప్పుడు సాయపడి త్రిపురారి అన్న పేరుతో ప్రఖ్యాతి చెందేట్లు చేశాడు. భస్మాసురునకు తొందరపాటుతో

ఇచ్చిన వరాన్నుండి కాపాడాను. దక్షయజ్ఞంలో గర్వితుడైన శివుని కంఠం పట్టుకొని దర్ప నివారణ చేశాను. ఇదీ శంకరుని గర్వ భంగ కథ.

ధర్మ దేవత కేదార కన్య శాపం మూలంగా కృష్ణ పక్ష చంద్రుడిలా కృశించి పోసాగింది. శ్రీకృష్ణుని మనసారా ధ్యానించి తన శాప భయాన్ని తొలగించమని ప్రార్థించాడు. అంతట భగవంతుడు కృతయుగంలో నాలుగు పాదాలు ఉండేట్లుగాను, త్రేతా యుగంలో మూడుపాదాల ఉండేట్లు, ద్వాపరయుగంలో రెండు పాదాలా ఉండేట్లు కలియుగంలో ఒక పాదం ఉండేట్లు కలియుగాంతంలో పూర్తి గా క్షీణించి మళ్ళీ కృతయుగం ప్రారంభంకాగానే ధర్మం పుంజుకుంటుందని చెప్పి ధర్ముడ్ని స్వస్తుడిగా చేశాడు. ఇదీ ధర్ముని గర్వభంగం.

యముడు గర్వించగా మాండవ్యముని శాపం వలన శూద్రుడుగా పుట్టమని, ఓ వంద సంవత్సరాల తర్వాత శాపవిమోచనమవుతుందని అనుగ్రహించాడు. సాంబుడు విమాద్రుని శాపం వలన కళాహీనుడవు కమ్ము అని శపించగా శ్రీకృష్ణుడు అతనిని కాపాడి ఆ దోషాన్ని తొలగించాడు. చంద్రుడు కాముకుడై గురుపత్ని సంయోగం చెయ్యగా క్షయరోగగ్రస్తుడయ్యాడు. సూర్యుడు తేజోగర్వం చేత వీరభద్రుణ్ణి చంపాలనుకున్నాడు. తన కిరణములను తీవ్రతరం చెయ్యగా అవిపోయి సుమాలి అనే దైత్యుణ్ణి వేధించాయి. అప్పుడా దైత్యుడు పరుగున పోయి శంకరుని శరణు కోరాడు. సూర్యుడు ఆ దైత్యుణ్ణి వెంబడిస్తూ కాశీనగరం చేరగానే శివుడు సూర్యుని తన శూలంతో పొడిచాడు. దాంతో సూర్యుడు మూర్ఛ పోయాడు. అప్పుడు లోకాలన్నీ అంధకారంతో నిండిపోయాయి. శివుడు కరుణ గలవాడు కావడం వలన సూర్యునిపై జాలిపడి అతడిపై చలిగాలులు ప్రసరింప జేసి మూర్ఛ నుండి తేరుకునేట్లు చేశాడు. సూర్యుడు తెప్పరిల్లి తన తొందరపాటుకు సిగ్గుపడి శివుణ్ణి కీర్తించాడు. అంతట సంతృప్తుడైన శివుడు సూర్యుని ఆశీర్వదించి తన నివాసానికి వెళ్ళాడు. ఈ విధంగా సూర్యుని దర్పమణిగేట్లు చేశాడు.

శంకరుడు గరుడుని గర్వమణచ దలచాడు. అందుకు గాను నందీశ్వరునితో కలసి వైకుంఠానికి వెళ్ళాడు. శివభగవానుడు నందీశ్వరునితో పాటు గరుడుని దాటుకుంటూ వైకుంఠానికి వెళ్ళాడు. దాంతో గరుడుని దర్పం అణచాడు. అగ్నికి కలిగిన గర్వానికి భృగుమహర్షి సర్వ భక్షకుడవు కమ్మని శాపమిచ్చి అగ్నిదేవుని గర్వాన్నణచాడు.

జయవిజయులు ఒకానొకప్పుడు శ్రీహరి పార్షదులుగా ఉండేవారు. వారి మనసులో గర్వం తొణికిస లాడింది. వారికి గర్వం కలుగరాదని భగవంతుడు భావించాడు. అందువల్లనే మునులను ప్రేరేపించి శాపానికి గురిచేశాడు. మళ్ళీ ఆ భగవంతుడే తన భక్తుల్ని (పార్షదుల్ని) కరుణించి అదే మునుల ద్వారా మూడు జన్మలు భగవంతునితో విరోధం వహించి ఆ మూడు జన్మలు కాగానే తిరిగి వైకుంఠానికి చేరుకునేట్లు అనుగ్రహించాడు. వారే హిరణ్యాక్ష హిరణ్య కశిపులు; రావణ కుంభకర్ణులు; శిశుపాల దంతవక్త్రులుగా జన్మించి చివరగా భగవస్సాన్నిధ్యాన్ని పొందారు. నారదా! నువ్వు బ్రహ్మకు పుత్రుడవయ్యావు. పితృ శాపం చేతనే గంధర్వుడుగాను, శూద్రుడుగాను జన్మించావు. శ్రీకృష్ణ పరమాత్మ కరుణ చేత మళ్ళీ ఇప్పుడు నారదుడవయ్యావు. దీనిని బట్టి అరిష్టాలన్నింటికీ గర్వమే కారణంగా

కనిపిస్తుంది. ధనుర్విద్యలో నన్నుమించిన వాడు లేడన్న లక్ష్మణుని గర్వాన్ని రామ రావణ యుద్ధంలో అణచివేశాడు. తిరిగి శ్రీరాముడు భగవంతుని స్తుతించి లక్ష్మణుని బ్రతికించాడు. పరశురాముని ప్రోత్సహించి కార్తవీర్యుని దర్పాన్నణచాడు. అదే పరశురాముని గర్వాన్ని శ్రీరాముని ద్వారా హరించాడు.

విశేషార్థం : విష్ణువు మొదలైన వారి గర్వాన్ని శ్రీకృష్ణుడు పోగొట్టినట్లుగా మనకీ కథ తెలుపుతుంది. ఇక్కడ మనం విష్ణువెవ్వరు? కృష్ణుడెవ్వరు? అన్న చర్చకు పోరాదు. ఇక్కడ శ్రీకృష్ణ పరబ్రహ్మమంటే రూప నామ క్రియా శూన్యుడైన ఆ ఆది తత్త్వమని మనం ఊహించాలి. మనమా భావన చేసినప్పుడు విష్ణువు మున్నగువారంతా తదాంశ సంభూతులే గదా. త్రిమూర్తులు మున్నగు దేవతా గణాలన్నీ లోకులచే ఉపాసించదగిన దేవతా మూర్తులు. అయితే భగవంతునికి తేజస్సే రూపం. ఆ తేజోతత్త్వమే ప్రకృతిని సృజిస్తుంది. అనగా సృష్టి చెయ్యాలని సంకల్పిస్తుంది. ఆ సంకల్పాన్నే ప్రకృతి అని, మహామాయ అని అంటారు. ఆ మహాప్రకృతే త్రిమూర్తుల్ని సృజిస్తుంది. ఆ త్రిమూర్తులే బ్రహ్మాండాలన్నింటికీ ఆధారభూతులు. మనకంటే శక్తి వంతులైన త్రిమూర్త్యాది దేవతల్ని అధికులని ఆరాధిస్తామో, అట్లాగే వారికంటే శక్తివంతుడైన భగవంతుని వారుకూడా ఆరాధిస్తారు. వీరందర్నీ సృష్టించిన వాడు నిర్గుణ పరబ్రహ్మం. ఆయన్నే సర్వసాక్షి అని అంటారు. త్రిమూర్తులకు కూడా ఒక్కో సమయంలో త్రిగుణాల్లో ఏదో ఒక గుణానికి లోను కాకుండా ఉండలేరు? రజోగుణం పాలు అధికమైతే అహంకారం పుట్టకుండా ఉంటుందా? అదికూడా ఉండరాదన్నదే భగవంతుని ఆశయం. కావున భగవంతుడు వీరందరిలోని గర్వాన్ని నిర్మూలించాడంటే అందులో ఆశ్చర్య పడటానికేముంటుంది? ఈ విషయాన్ని చక్కగా విచారిస్తే, ఈ లోకంలో కూడా ఎవరైనా తనంతటి వాడు లేడని భావిస్తే భగవంతుడు తగిన శాస్తి చెయ్యక మానడు సుమా. మనం ఏమూల కూర్చుని గర్వించినా ఆయనకు కనిపిస్తుంది. ఎందువల్ల నంటే భగవచ్ఛక్తి ఇంత అని చెప్పలేంగదా. దుర్జేయమని ఉపనిషత్తులు కూడా బోధించాయి. కావున ఆ మహత్తత్త్వానికి బ్రహ్మవిష్ణుమహేశ్వరుల గర్వభంగం చెయ్యడం ఒక అల్పకార్యం మాత్రమే.

మహాలక్ష్మి పతివ్రతా మహిమ

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 57వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

ఒకానొక రోజున జయవిజయులనే ద్వారపాలకులు శ్రీమహాలక్ష్మిని శ్రీమన్నారాయణుని సన్నిధికి పోకుండా అడ్డుకున్నారు. అందుకు జగన్మాతకు విపరీతమైన కోపం వచ్చింది. ఆ అవమానాన్ని సహించలేక పోయింది. సర్వ సముడు, నిర్గుణుడు, సర్వాత్మ, సదానందుడు అయిన భగవంతునికి భార్యనైతే మాత్రం ఏం ప్రయోజనం? ఆ పరాత్పరునకు అనేక మంది సేవకులున్నారు. నేను కూడా వాళ్ళల్లో ఒకర్తెను. కేవలం ద్వారపాలకుల చేత తిరస్కరించబడ్డాను. ఇంకా నేను బ్రతికుంటేనేం? చస్తేనేం? ఏం సాధించాలని బ్రతకాలి? కావున దేహత్యాగమొక్కటే నాకు శరణ్యం. ఎందువల్లనంటే, లోకంలో ఏ పతివ్రత భర్త ఆదరణ కోల్పోతుందో, అటువంటి స్త్రీ జీవించరాదు. ఇకపైన అటువంటి స్త్రీ కడుపునిండా తిన లేదు. కంటి నిండా నిద్రపోలేదు. ఇక సుఖమెక్కడిది? సుఖం లేని జీవితం

వ్యర్థమే కదా? ఎవతెకు భర్త ఆదరణ లభించదో అట్టి స్త్రీ అపవిత్రురాలనే భావించాలి. ధర్మ విహీనయే అవుతుంది. కర్మలన్నింటికీ దూరమవుతుంది. పతివ్రతకు తల్లిదండ్రులు, తోడపుట్టినవారు సానుభూతి చూపగలరేమో గాని భర్తకు సమానులు కాలేరు. ఓదేవతలారా! ఒక్క పతివ్రత మాత్రమే భర్తను భగవంతునిగా భావిస్తుంది. మంచి కుటుంబంలో జన్మించిన ఏ స్త్రీ అయినా పరుషమైన మాటలు మాట్లాడి గాని, ధనం కోసం గాని భర్తను దూషించదు. భర్త విష్ణువుతో సమానుడు, పరమ గురువు అయిన భర్తను ఏ స్త్రీ దూషిస్తుందో ఆ స్త్రీ కుంభీపాక నరకానికి పోతుంది. అటువంటి స్త్రీ ఎన్ని వ్రతాలు చేసినా, గొప్ప తపశ్శాలియే అయినా, జీవితాంతం సత్యవ్రతం ఆచరించేదే అయినా పతి భక్తి లేనిదైతే ఆమె చేసే పూజలన్నీ బూడిదలో పోసిన పన్నీరు వలె నిరర్థకమే అవుతాయి. పతివ్రత అయిన స్త్రీకి పతిసేవయే వ్రతం, తపస్సు. అందువలన భగవంతుని సేవకులు అవమానించబడినా కూడా నేను భర్తను దూషించను. దేహత్యాగమొక్కటే ఇందుకు పరిష్కారం. ఇది నిశ్చయము.

ఏ స్త్రీ అయినా భర్త తినగా మిగిలిన ఆహారాన్ని భుజిస్తుందో అటువంటి స్త్రీ ని దర్శించేందుకు దేవతలు బారులు తీరి నిలబడతారు. ఆమె నిలచిన చోటే తీర్థమవుతుంది. ఆమెను దర్శించినంత మాత్రానే సర్వ పాపాలు నశిస్తాయి. మహాలక్ష్మి అన్నమాటలను విన్న బ్రహ్మ భయపడిపోయాడు. వినయంగా తలవంచి "తల్లీ! నువ్వు జయవిజయుల్ని శపించవద్దు. వారు దానికి తగిన ఫలాన్ని ముందు ముందు పొందగలరు. అపరాధి అని తెలిసి కూడా ఎవరు అతణ్ణి శపించరో, వారి యెడల ఉదాసీనంగా ఉంటారో అదే వారికి తగిన దండన. శపించక పోవడం వలన వారి సకల సంపదలు నశిస్తాయి. త్వరలో వారా శిక్ష అనుభవించబోతున్నారు. భగవంతుడనైన నేను శపించలేనా? కావున నువ్వుగా శపించవద్దు. పాపం చేసిన వాడిని ధర్మమే దండిస్తుంది. నామాట విని నువ్వు మహావిష్ణువు వద్దకు వెళ్ళు" అని నచ్చ చెప్పి వెంటబెట్టుకొని విష్ణు భగవానుని వద్దకు వెళ్ళాడు. శ్రీమహావిష్ణువు "కమల సంభవా! నేను సర్వజ్ఞుడను సర్వాత్మకుడను, అందర్నీ పాలించే వాడిని కావున నా కంతా తెలుసు. నాకు భక్తుడైనా, భార్య అయినా, బంధువైనా అంతా సమానమే. వీరిలో భక్తుడే నాకు అధిక ప్రియుడు. ద్వారపాలకులను నీ పుత్రులే శిక్షించగలరు. ఓ మహాలక్ష్మీ! శాంతం వహించి ఓర్పుగా ఉండు. వాళ్ళు చేసిన అపరాధాన్ని నేను చేసినట్లుగా భావించు. వాళ్ళు నా భక్తులు కాబట్టి వాళ్ళు క్షమార్హులు. వాళ్ళెల్లవేళలా నా చక్రం చేత రక్షింపబడుతూ ఉంటారు" అని అంటూ మహాలక్ష్మిని దగ్గరకు తీసుకొని ఓదార్చాడు. ద్వారపాలకుల్ని పిలిపించి 'భక్తులారా భయపడకండి. మీరు నాభక్తులు. నేను మీకు అండగా ఉంటాను. నా భక్తుల్ని ఎవరూ శిక్షించలేరు. ఇక మీరు వెళ్లి మీ పనులు చూసుకోండి' అన్నాడు. అందులో జయుడన్న వాడు భగవంతునితో ఇలా అన్నాడు. మహానుభావా! జగదీశ్వరా! నేను దేవతలకు గాని, లక్ష్మీదేవికి గానీ మహర్షులకు గాని భయపడేవాడను కాను. ఎందువల్లనంటే నా మనస్సు ఎల్లప్పుడూ భగవంతుని పాదాలపైనే లగ్నమై ఉంటుంది. అందువల్ల ఎదుటి వారెవరన్న ధ్యాసే నాకుండదు" అని పలికి భగవదారాధనలో నిమగ్నమయ్యాడు.

ఇదో విచిత్రమైన కథ. ఇందులో విశేషం ఏమంటే సాక్షాత్తూ మహాలక్ష్మినే ఒక ద్వారపాలకుడు అడ్డగించడం. అందుకు మహాలక్ష్మి తీవ్ర మనస్తాపం చెందడం. అయితే భగవంతుడికి తెలియకుండా

ఇదంతా జరుగుతుందా? అన్న సందేహం కలుగవచ్చు. అయితే భగవంతుని సంకల్ప వికల్పాలనెవ్వరైనా తెలుసుకోగలరా? శ్రీరామకృష్ణ పరమహంస ఇలా ఉపదేశం చేశారు "సముద్రం లోతు తెలుసుకోవడానికి ఉప్పుతో చేసిన బొమ్మ నొకటి సముద్రంలోకి విడిచిపెట్టారు. ఆ బొమ్మ తిరిగి రాలేదు. అట్లాగే భగవంతుని తెలుసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు" అయితే ఈ కథవలన మనం తెలుసుకోదగిన నీతి ఏమంటే భగవంతుడు భక్త జన పక్షపాతి అన్నదే. భగవంతుడు సర్వ సముడని, సర్వసాక్షి అన్న భావాన్ని సిద్ధాంతం చేస్తోంది. దుర్జనులకు సజ్జనులకు సముడని గ్రహిస్తే అవలక్షణ సిద్ధాంతంగా ఉంటుంది. అనగా వారి వారి కర్మానుసారంగా జీవులు సుఖదుఃఖాలు అనుభవిస్తూ ఉండటాన్ని భగవంతుడు చూస్తూ ఉంటాడన్నదే సారం. భగవంతుణ్ణి దృఢ భక్తితో సేవిస్తే అతడి భక్తియే అతడి పాపాల్ని తొలగించి సాధుమతిని చేసి భగవదనుగ్రహానికి పాత్రునిగా చేస్తుంది. భగవంతుని సర్వ సమత్వ సిద్ధాంతాన్ని మనమీవిధంగా తెలుసుకోవాలి. ఇందులో లక్ష్మీదేవి పతివ్రతా ధర్మాలను ఉపదేశించింది. జయుడన్న ద్వారపాలకుని పిలిచి భగవంతుడు చేసిన ఉపదేశమంతా వేద సారమే. అనగా భగవద్భక్తునకు కీడు చేసేవాడీ ప్రపంచంలో లేడన్నదే సారం.

భూదేవి మొదలగు వారి గర్వ మణచుట

(ఈకథా భాగం శ్రీకృష్ణ జన్మఖండం లోని 58వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీమన్నారాయణుడు : నారదా! పూర్వం భూదేవికి సృష్టికి తానే ప్రధాన భూతురాలనన్న గర్వం ఉండేది. భగవంతుడు పృథు చక్రవర్తి ద్వారా ఆమెకు గర్వభంగం చేశాడు. సావిత్రికి తాను వేదమాతననే అభిమానం ఉండేది. భగవంతుడామెను జనులకు కనబడకుండా ఉండేట్లు చేశాడు. గంగానదికి ముక్తి నివ్వగల సామర్థ్యం గలదానననీ గర్వించేది. ఆమె దర్పాన్ని జాహ్నుముని ద్వారా అణచాడు. మనసాదేవి దర్పాన్ని దుర్గాదేవి ద్వారా పోగొట్టాడు. రాధాదేవి దర్పాన్ని సుధాముని శాపం ద్వారా పోగొట్టాడు. ఆ కారణంగానే భూలోకంలో వృషభానుని పుత్రికగా రాధ జన్మించింది. రాధాదేవి ప్రార్థనను మన్నించి శ్రీహరి నందుని ఇంట పెరిగాడు.. శ్రీకృష్ణుని మనసులో ఏముందో ఎవరూ ఊహించలేరు. మధురానగరంలో పుట్టి గోకులానికి ఎట్లా వెళ్ళాడో ఎవరికి తెలుసు? శ్రీకృష్ణుడు తిరిగి మధురానగరానికి ఎట్లా వెళ్లాడో, నందుడు, యశోదా ఆ వియోగానికి ఎంతగా విలపించారో; గోపులు, గోపికలు, గోవులు, బృందావనులు భగవత్సాంగత్యాన్ని ఎలా పొందగలిగారో ఇప్పుడు మీకు తెలియజేస్తాను. శ్రీకృష్ణుడు మధురానగరానికి వెళ్ళగానే తాము విహరించిన జలాశయాలు, రాసమండలం మొదలైన ప్రదేశాలన్నింటినీ దుఃఖంతో వెతికేది. చెట్లను పుట్టలను శ్రీకృష్ణుని చూపమని వేడుకునేది.

ఈ కథకూడా ముందు చెప్పినట్లే తామే భగవంతునికి ప్రీతి పాత్రులమని భావించి అహంకారం తెచ్చి పెట్టుకుంటే భగవంతుడు తప్పకుండా ఆ దర్పాన్ని భంగం చేస్తాడన్నదే నీతి.

ఇంద్ర గర్వభంగం

(ఈ కథ శ్రీకృష్ణ కర్ణామృతం 59వ అధ్యాయాన్నుండి గ్రహించబడింది)

శ్రీమన్నారాయణుడు : నారదా! విన్నావు కదా! శ్రీహరికి అహంకారులంటే అస్సలు పడదు. వాళ్ళెంతటి వారైనా సరే. వాళ్ళ దర్పాన్ని తొలగించి వాళ్ళను తన మార్గంలోకి తెచ్చుకొనడమే భగవంతుని ఆశయం. ఒకప్పుడు ఇంద్రుడు నిండు సభలో ఉండగా దేవగురువు బృహస్పతి ఆ సభలో ప్రవేశించాడు. గురువంటే భగవంతుడి వద్దకు చెయ్యి పుచ్చుకొని తీసుకొని వెళ్ళేవాడే గదా. అందులో బృహస్పతి బ్రహ్మజ్ఞాని. అటువంటి దేవగురువు సభలో ప్రవేసిస్తూ ఉంటే ఇంద్రుడు ఎదురువెళ్ళి స్వాగతం పలుకలేదు. బృహస్పతికి ఎంత కోపం వచ్చినా ఇంద్రుడిపై ఉండే ప్రేమ చేత శపించలేదు. అటువంటి వారు ప్రత్యేకంగా శపించకపోయినా వారి మనస్తాపమే ఎదుటి వారిని దహిస్తుంది. ధార్మికుడైన వాడు అపరాధం చేసిన వాడిని శపిస్తే తన ధర్మాన్ని పోగొట్టుకుంటాడు. అందువలన ధార్మికులు శపించకుంటే ఆ ధర్మమే అపరాధిని శిక్షిస్తుంది. గురువును అవమానించిన పాపం వల్లనే ఇంద్రుడికి బ్రహ్మహత్యా దోషం వెంటపడింది. దాంతో భయపడి ఓ సరోవరంలో తలదాచుకున్నాడు. అది విష్ణు సరోవరం. బ్రహ్మహత్య ఆసరోవరంలోకి అడుగుపెట్టలేదు. దాన్నే పుష్కర తీర్థమని కూడా పెద్దలంటారు. ఇంద్రుడు స్వర్గాన్ని వదిలి పారిపోయాడని తెలుసుకున్న నహుషుడు స్వర్గాన్నాక్రమించుకున్నాడు. ఒకానొక రోజున ఇంద్రుని భార్య శచీదేవి మందాకినీ నదిలో స్నానానికని వెళ్తోంది. ఆ దారినే పోతున్న నహుషుడు ఆమెను చూసి మనసు పారేసుకున్నాడు. అదే సమయమని గ్రహించిన మన్మథుడు నహుషుని ఆక్రమించుకున్నాడు. కాముకుడైన నహుషుడు ఆమె ఎదుట మోకరిల్లి "సుందరీ! బ్రహ్మ ఎంత ప్రజ్ఞాశాలి. నీవంటి సుందరిని సృజించడంలోనే ఆయనెంత భావకుడో తెలుస్తోంది. బ్రహ్మ ఒకే ఒక్క జగదేక సుందరిని సృజించాడు. అదే నువ్వు. నేను నీకు దాసుడనయ్యాను. గోలోకంలో శ్రీకృష్ణుడు రాధాదేవిని ఎట్లా వక్షఃస్థలంలో నిలుపుకున్నాడో అట్లాగే నేను కూడా నిన్ను నాహృదయంలో నింపుకున్నాను. స్త్రీ తన భర్త కంటే బలవంతుడైన రసికుణ్ణే వరిస్తుంది. ముల్లోకాల్లోని రహస్య స్థలాలన్నింట్లోనూ విహరించాలని కోరుకుంటుంది.

ఓ శచీదేవీ! పరమేశ్వరుని వర ప్రభావం చేత జరామరణాలను జయించాను. అట్టి నన్ను భర్తగా స్వీకరించు. నేను ఎన్నడూ పరస్త్రీల యెడల కన్నెత్తి అయినా చూడలేదు. ఇప్పుడు నిన్ను చూడగానే నా మనస్సు చలించింది. నువ్వు లేకుండా బ్రతుకలేననిపిస్తుంది. నా సర్వ సంపదలు, శక్తి సామర్థ్యాలు నీ పాదాల వద్ద ఉంచుతున్నాను. నన్ను కరుణించు" అని ప్రార్థించాడు.

దీనుడై నహుషుడు పలికిన మాటలన్నీ విని శచీదేవి "వత్సా! మహారాజా! తండ్రీ! నామాటలు శ్రద్ధగా విను. నా భర్త విధి వశమున స్వర్గ రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు. ఇప్పుడా స్వర్గాన్ని నువ్వు పాలిస్తున్నావు. ప్రభువ్వి. అనగా జనులకు తండ్రివి. రక్షకుడవు. గురుపత్ని, రాజపత్ని, దేవపత్ని, కుమార్తె, శిష్యుని భార్య, సేవకుని భార్య, మాతులి భార్యయు, పితృత్వసయు, పితరుల భార్యలు, సోదరుల భార్యలు, భాగినియు, కోడలు, గర్భధాత్రియు, ఇష్టదేవియు, తల్లులని చెప్పబడ్డారు. అంతే

కాకుండా నువ్వు మానవుడవు. నేను దేవభార్యను. నీకు తల్లిని. నువ్వు దేవతగా ఆరాధించాల్సిన దానను. ఓ నహుషుడా! నువ్వు అంతగా కావాలనుకుంటే నా తల్లి అదితి వద్దకు పోయి ప్రేమించు. లోకంలో ఏ పాపానికైనా ప్రాయశ్చిత్తం ఉంది గాని తల్లితో సంపర్కం పెట్టుకున్నవాడికి ప్రాయశ్చిత్తంలేదు. అటువంటి పాపాత్ముడు కుంభీపాక నరకానికి పోతాడు. ఇది బ్రహ్మ వాక్కు. ముముక్షువులకు ముక్తి, తపస్వులకు తపస్సు, బ్రాహ్మణులకు బ్రాహ్మణ్యం, మునులకు మౌనం, వైదికులకు వేదాధ్యయనం, కవులకు కావ్యరచన, వైష్ణవులకు విష్ణుదాస్యం, పరమ సుఖాలుగా పెద్దలు నిర్ణయించారు. విష్ణు భక్తులు విష్ణుదాస్యాన్ని కాదని ముక్తిని కోరు కోరు. అట్లాగే పుణ్య భారత భూమిలో రాజవంశంలో పుట్టావు. బహుజన్మల సుకృతంగా స్వర్గాధిపత్యం లభించింది. అట్టినువ్వు మలభూయిష్టమై, దుఃఖాలకు ఆలవాలమైన స్త్రీల శరీరంపై వ్యామోహం పెంచుకోవచ్చునా?

వర్ణ ధర్మాలు :

మూడు పూటలా సంధ్యావందనం చెయ్యడం, విధి విహితంగా శ్రీహరికి సమర్పించిన తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తూ పవిత్రంగా జీవనయాత్ర చేయడం బ్రాహ్మణుల విధి. ఏకాదశి, శ్రీకృష్ణ జన్మదినాన, శివరాత్రి నాడు ఉపవసిస్తూ ఉండటం బ్రాహ్మణులకు ధర్మం. ఇది బ్రహ్మచే నిర్ణయించబడింది. పతివ్రతలకు పతి సేవయే వ్రతం. అదే తపస్సు. పరపురుషులు పుత్రునితో సమానం. ఇక రాజులు ప్రజలందర్నీ తమ బిడ్డల్లా ప్రేమించాలి. పరస్త్రీలను తన తల్లివలె గౌరవించాలి. విష్ణు యజ్ఞం అంటే దేవతల్ని, విప్రుల్ని సేవించడమే. దుష్టుల్ని శిక్షిస్తూ, శిష్టుల్ని కాపాడుతూ ఉండటం రాజధర్మం. ఇది రాజులకు పరమ ధర్మమని బ్రహ్మ శాసించాడు. వైశ్యులకు వ్యాపార వాణిజ్యాలు, శూద్రులకు పెద్దల సేవ పరమధర్మం. వివేక వైరాగ్యాలు కలిగి ఉండటం, మర్నాటికి ఏదీ దాచుకోకుండా ఉండటం సన్యాసులకు ధర్మం. వారు భిక్షలో ఏది లభిస్తే అదే తినాలి. అంతేకాని ఏ పదార్థం పైనా మక్కువ పెట్టుకోరాదు. ఇది సన్యాసులకు ధర్మమని బ్రహ్మ శాసించాడని శచీదేవి నహుషునికి బోధించింది.

అంతట నహుషుడు శచీదేవితో "దేవీ! నువ్వు చెప్పినదంతా విపరీత ధర్మం. యథార్థమైనది, వేద విహితమైన ధర్మాల్ని నేను చెప్తాను విను. కర్మలన్నింటికీ ఫలం భోగమే. ఇది స్వర్గమైనా, పాతాళమైనా భూతలమైన కర్మసిద్ధాంతంలో మార్పుండదు. భూమండలంలో పుణ్యకర్మలు చేసి వేరొక లోకంలో ఫలం అనుభవిస్తూ ఉంటారు. వారంతా కర్మఠులు. అనగా వారు తలపెట్టిన కార్యం నెరవేరేవరకూ వదలక చేస్తూనే ఉంటారు. ఆవిధంగా గొప్ప పుణ్యం సంపాదించుకొని స్వర్గానికి చేరుకుంటారు. ఇక్కడ స్త్రీలతో కలసి స్వర్గసుఖాలనుభవించేందుకు మానవ దేహాన్ని వదలి స్వర్గానికి వస్తుంటారు. నేను అట్లాంటి వాడిని కాను. నేను మానవ దేహంతోనే స్వర్గంలో ప్రవేశించాను. దీన్ని బట్టి నా పుణ్యకర్మ లెట్లాంటివో ఆలోచించుకో. అనేక పుణ్యకర్మల ఫలం చేత నువ్వు నాకంట పడ్డావు. భారత వర్షంలా ఇది కర్మభూమి కాదు. ఇది స్వర్గం. భోగ ప్రదేశం. భోగస్థలానికి వచ్చి భోగ కాంక్ష గలవారిని ఇది తగదని చెప్పడం నీతి కాదు. నువ్వు భావాను కర్తవు. రసికురాలవు. భోగులకు భోగ్యురాలవు. భోగ్యమూ, సుఖప్రదము అయిన ద్రవ్యం దొరికినప్పుడు ఎవడో మందమతి తప్ప తక్కినవారెవ్వరూ విడిచిపెట్టరు. కావున ఓ శచీదేవీ! నా ఇంటికి రమ్ము. రసికుడనైన నన్ను స్వర్గసుఖాల్లో

ముంచెత్తు. పనికిమాలిన సందేహాలు పెట్టుకోకు. నా కంటూ ఉండే అమూల్య వస్తువు లన్నింటినీ నీ అధీనంలోకి తీసుకో" అంటూ నహుషుడు శచీదేవి మార్గానికి అడ్డుగా నిలిచాడు.

నహుషుని ప్రేలాపాలకు దుఃఖిస్తూ శచీదేవి ఇలా అంది. ఓరీ మూఢుడా! నీకు కామంతో కళ్ళూ మనసూ రెండూ మూసుకుపోయాయి. మధువుతో మత్తెక్కినవాడు, కామంచేత మత్తెక్కినవాడికి ఉచితానుచితాలు తెలియవు. వారిలో కాముకుడు మరణాన్ని కూడా లెక్క చేయడు. నేను నీకు తల్లి వంటిదాన్ని. అదీ కాకుండా ఇవి నాకు ఋతుదినాలు. నేడే మొదటి రోజు. స్త్రీ మొదటి రోజున చండాలితో సమానం. రెండవ నాడు మ్లేచ్ఛతో సమానం. మూడవనాడు రజకీతుల్య అంటారు. నాలుగవదినాన పరిశుద్ధురాలవుతుంది. గాని దైవారాధనకు యోగ్యురాలు కాదు. ఋతుదినాల్లో మొదటిరోజున ఎవడు కామిస్తాడో వాడు బ్రహ్మ హత్యా పాతకం కలిగి కర్మానుష్ఠానానికి అర్హత కోల్పోతాడు. యశస్సు నశిస్తుంది. రెండవరోజున రజస్వలను కోరుకున్నట్లయితే గోహత్యా పాతకాన్ని పొందుతాడు. అటుంటి వాడు దేవ పితృకార్యాలు చేసే అర్హతను జీవితకాలమంతా పోగొట్టుకుంటాడని అంగీరసుడు శాసించాడు. మూడవనాడు రజస్వలను కామించిన వాడు భ్రూణ హత్యా పాపాన్ని పొందుతాడు. నాలుగవనాటి స్త్రీని యశచ్ఛూద్ర అంటారు. కావున అటువంటి స్త్రీని కోరరాదు.

మూర్ఖుడా! తల్లి వంటి నన్ను బలవంతంగా పొందాలనుకుంటున్నావు. అంత మూర్ఖంగా పట్టుబడుతున్నావు. కాబట్టి ఋతుకాలం నాలుగు దినాలు గడచిన తర్వాత నీ ఇష్టం వచ్చిట్లు చేసుకో అని అన్నది. శచీదేవి మాటలు విన్న నహుషుడు నవ్వుతూ ఇలా అన్నాడు. ఓ శచీదేవీ! నువ్వు చెప్పే ధర్మాలన్నీ మానవ కాంతలకు వర్తిస్తాయి. రజస్వలా నియమాలన్నీ కర్మక్షేత్రమైన భారత దేశం లోనే పాపంగా పరిగణిస్తారు. భారత దేశంలో కూడా వేదోక్త కర్మలు చేస్తూ బ్రహ్మ తేజస్సులైన విష్ణు భక్తులకు అన్వయించరాదు. ఎండిన సమిధలు ప్రజ్వరిల్లే అగ్నిలో కాలి బూడిదైనట్లుగా పాపాలన్నీ విష్ణు భక్తునిలో భస్మమవుతాయి. అగ్నికన్నా, సూర్యునికన్నా, విప్రునికన్నా కూడా విష్ణు భక్తుడు తేజోవంతుడు. అతణ్ణి విష్ణు చక్రం కాపాడుతూ ఉంటుంది. ఎటువంటి పాపకర్మలు చేసినా కూడా అతణ్ణి బాధించవు. ఈ విషయాలన్నీ యజుర్వేదం గౌతమీ భాగంలో వివరించబడ్డాయి. అదీ కాకుండా దేవకాంతలు ఎప్పుడూ పరిశుద్ధులే. శయనంలోగాని ఆహార విహారాల్లోగాని దేవకాంతలందరూ పరిశుద్ధలేనని మానవుల విశ్వాసం.

చంద్ర వంశస్థులంతా వైష్ణవులే. వారు బ్రాహ్మణులైనా, క్షత్రియులైనా మరేజాతి వారైనా వైష్ణవులే. వారు శ్రీహరిని తప్ప మరెవ్వరినీ ఆరాధించరు. మంచి కుటుంబంలో పుట్టిన బ్రాహ్మణుడుగాని, క్షత్రియుడుగాని, విష్ణుమంత్రాన్ని జపించకుండా పచ్చినీరైనా ముట్టడు. నన్ను ఏ మంత్రమూ, ఏదేవతా శాసించలేదు. నేనే ఇతరులను దండిస్తానేగాని ఇతరులెవరూ నన్ను దండించలేరు. ఒక్క త్రిమూర్తుల్ని మాత్రం నేను శాసించలేను. మిగిలిన వారంతా నా శాసనానికి లోబడినవారే. కావున ఓ సుందరీ! త్వరగా ఇంటికి వెళ్ళి ప్రక్కనేర్పాటు చేయి. నేను కూడా వెంటనే అక్కడకు వస్తాను. నువ్వు చెప్పినట్లే ఋతుదినాల్లో ఉన్నా నీతో సంగమించడం వలన ఎటువంటి పాపం వచ్చినా నేను లెక్క చేయను అని చెప్పి నందనవనానికి వెళ్ళాడు. దుఃఖితయైన శచీదేవి తన ఇంటికి పోకుండా దేవ గురువైన

బృహస్పతి ఇంటికి వెళ్ళింది. ఆ సమయంలో దేవ గురువు దర్భాసనంపై కూర్చుని శ్రీకృష్ణుణి ధ్యానిస్తూండగా శచీదేవి ఆయనకి నమస్కరించి తనగోడు ఇలా వెళ్ళబోసుకుంది.

గురుప్రభావం :

మహాత్మా! రక్షించు. నీ శరణు కోరుతున్నాను. నువ్వే దిక్కు. నేను నీ దాసిని. దుఃఖాల్లో ఉన్నాను. నా భర్త బలవంతుడైనా బలహీనుడైనా పదవిలో ఉన్నా లేకపోయినా ఇంద్రుడు నీకు శిష్యుడు. బ్రహ్మహత్యా దోషాన్ని తొలగించుకోవడానికి దూరదేశాలకు పోయాడు. దాంతో స్వర్గము, నాఇల్లు, అమరావతి అన్నీ శూన్యంగా అయ్యాయి. నేనూ అనాథనయ్యాను. శత్రువు చేతిలో చిక్కుకున్నాను. నన్నీ ఆపద నుండి కాపాడి రక్షించు. నీ శిష్యుని పిలిపించు. శుభాశీస్సులనిమ్ము. నీ పాద సేవ చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించు. లోకంలో జన్మనిచ్చిన తండ్రి ఆత్మ బంధువు. జన్మనిచ్చిన తల్లి అతడికన్నా వందరెట్లు అధికురాలు. అట్టి తల్లికన్నా మంత్రోపదేశం చేసి జ్ఞానోదయం కలిగించిన గురువు వెయ్యిరెట్లు అధికుడు. అట్టి గురువుకు నమస్కరిస్తున్నాను. విద్యామంత్రాన్నుపదేశించి సంసార సాగరాన్ని దాటించగల సమర్థుడు. గురువు బ్రహ్మ, గురువు విష్ణువు, గురువు మహేశ్వరుడు, గురువే ధర్మం, గురువులోనే సర్వాత్మయు, నిర్గుణుడు అయిన దైవమే గురువవుతాడు. గురువులోనే తీర్థాలన్నీ ఉంటాయి. దేవతలంతా నివసిస్తారు. కావున సర్వ దేవతా స్వరూపుడు శ్రీహరియే గురువు రూపంలో వస్తాడు. అభీష్ట దేవత ఆగ్రహిస్తే గురువు కాపాడగలడు. కానీ గురువు కోపగిస్తే ఏ దేవతా కాపాడలేదు. ఆఖరుకు ఆత్మకూడా గురువుకన్నా ప్రియమైంది కాదు. శిష్యుడికి పరమగతి గురువేనని గ్రహించాలి. గురువు జన్మ జన్మల్లోను శిక్షించగలడు. ఎట్లాగైతే మంత్రము, విద్యాగురువు దేవత పూర్వజన్మల పుణ్యంచేత లభిస్తారో, స్త్రీకి భర్తకూడా అట్లాగే.

మహానుభావా! నువ్వు విప్రుల్లో శ్రేష్ఠుడవు. తపస్వులలో గర్వించదగిన వాడవు. బ్రహ్మ వేత్తలలో బ్రహ్మిష్ఠుడవు. ధర్మాత్ముల్లో ధర్మిష్ఠుడవు. ఓ మహర్షీ! నన్నూ ఇంద్రుణ్ణి రక్షించు. నువ్వు సంతుష్టుడవైతే దేవతలంతా ఆశీర్వదిస్తారు. అంటూ పడిపడి ఏడ్చింది. అంతట కరుణామయుడైన బృహస్పతి శచీదేవిని లేవనెత్తి దీవిస్తూ, అనేక ఆధ్యాత్మిక రహస్యాల్ని బోధించాడు. త్వరలోనే మహేంద్రుణ్ణి పొందగలవని దీవించాడు. ఈ కథనుండి మనం గ్రహించాల్సింది గురుభక్తి. రెండవది ఐశ్వర్యమే గర్వానికి మూలకారణం అని.

గురుభక్తి :

దేవతలు మంత్రానికి బద్ధులై ఉంటారు. మంత్రం అనగా మననం చేసేది, మనల్ని రక్షించేది. మంత్రాలలో ఆయా అధిష్ఠాన దేవతలకు ప్రీతికరంగా కూర్చబడుతుంది. భక్తుడు భక్తితో ఈ మంత్రాన్ని జపించినప్పుడు ఆ అధిష్ఠాన దేవత భక్తుని కనికరిస్తుంది. భక్తుని నుండి అధిష్ఠాన దేవత ఉండే స్థలం వరకూ భగవత్కళ చేత అనుసంధానం చేయబడుతుంది. భక్తుని మనస్సు నిశ్చలమై దృఢతరం కాకపోతే ఫలాన్ని పొందలేడు. ఇందుకు గురుకృప ఎంతైనా అవసరం. వృక్షానికి మూలం నశిస్తే వృక్షమంతా ఎట్లా నశిస్తుందో అదేవిధంగా గురుభక్తి సన్నగిల్లిందంటే చేసిన తపస్సంతా వ్యర్థమవుతుంది.

సామాన్యంగా జపం ఫలించకుండా ఉండేందుకు ఈ కారణాలను పెద్దలు కనుగొన్నారు. పరుల అన్నంపై ఆశించడం, పరస్త్రీవాంఛ, ద్రవ్య ప్రతిగ్రహం. గురువును ప్రశంసిస్తూ మూడవకన్ను లేని శివుడుగాను, నాలుగు భుజాలు లేని విష్ణువని, నాలుగు ముఖాలు లేని బ్రహ్మ అని అంటారు. అనగా త్రిమూర్తులతో సమానమైన వాడని సారం. శ్రీ శంకర భగవత్పాదుల వారు కూడా "నా ద్వైతం గురు సన్నిధౌ" అని తెలిపారు.

దేవత కోపగించినా కూడా గురువు రక్షిస్తాడనటంలో అంతరార్థమేమంటే, మంత్రం జపించే నియమాన్ని వదలి తన ఇష్టానుసారం జపిస్తూ తన అభీష్టాన్ని కోరేటప్పుడు మంత్రాధిదేవత ఉపాసన కూడా ఎదుట ప్రత్యక్షమవుతాడు. అటువంటి సమయాల్లో ఉపాసకుడు భయంకరమైన రూపాలను దర్శిస్తాడు. అట్టి సమయాల్లో గురువు ఉపాసకునికి నియమాల్ని తెలిపి ఆదుకుంటాడు. అదే గురుభక్తి లేని వాడైతే ఈ స్థితిలోనే అధోగతి పాలవుతాడు. కావున గురుభక్తి వల్లనే సర్వార్థాల్ని సాధించ గలుగుతామన్నదే సారాంశం.

గర్వ కారణాలు :

లోకంలో గర్వానికి ఐశ్వర్యమే మూలకారణంగా తెలుస్తోంది. ఎంతటి జ్ఞాన సంపన్నుడైనా ధనరాశులు చేకూరగానే గర్వం చోటు చేసుకుంటుంది. పూర్వ జన్మ పుణ్య విశేషాలచేత ఆ గర్వాన్ని కొద్దిగానో పూర్తిగానో నియంత్రించుకోవచ్చు. అట్లా నియంత్రించుకోలేక లోబడిపోయినవాడు నశించిపోతాడు. దేవేంద్రుడికి గురువుపైన అచంచల భక్తి విశ్వాసాలు ఉండేవే. అయినా ఒకానొక సమయంలో అహంకారానికి లోబడిపోయాడు. దాంతో భ్రష్టుడయ్యాడు. నహుషుడు కూడా ఎంతో శాంత స్వభావం గలవాడు. అనేక అశ్వ మేధ యాగాలు చేశాడు. ఇంద్రుడు స్వర్గాన్ని వదలి పోయినప్పుడు దేవతలంతా కలసి నహుషుని ఇంద్రునిగా వ్యవహరించమని ప్రార్థించారు. ముల్లోకాలకు ఆరాధ్యుడైన నహుషుడంతటివాడు మదాంధుడై మహాపతివ్రత అయిన శచీదేవిని తన భార్యవు కమ్మని నిర్బంధిస్తూ పతనాన్ని పొందాడు. పై ఉదాహరణల మూలంగా పదవి, ఐశ్వర్యాలే గర్వానికి కారణాలవుతాయని రూఢిచేస్తున్నాయి. ఈ సందర్భంగా మహాకవి పోతనగారు ఆంధ్ర భాగవతంలో ఏం చెప్పారో చూడండి.

శా॥ సంపన్నుండొరుఁ గానలేఁడు తనవున్ సంసారమున్ నమ్మి హిం
సింపం జూచు దరిద్రు డెత్తు వడీశుష్కీ భూతుఁడై చిక్కి హిం
సింపం దన్యుల నాత్మకున్ సములు గాఁ జింతించు నట్లౌట నీ
సంపన్నాంధున కంజనంబ వినుమీ దారిద్ర్య మూహింపఁగన్

ఇన్ని యజ్ఞయాగాలు చేసి, మహర్షులతో స్నేహం చేస్తూన్నా కూడా ఐశ్వర్యం రాగానే జ్ఞానం నశించి మదాంధకారుడయ్యాడు. అయితే శచీదేవి ఇది ఋతు దినాలు. కాబట్టి నాలుగురోజులు పోయాక నీ కోరిక గూర్చి ఆలోచించు అని అంటుంది. అనగా శచీదేవి అంగీకరించినట్లా? లేక అసత్యమాడినట్లా? అన్న సందేహం కలుగవచ్చు. శచీదేవి భావం అదేది కాదు. ఈ నాలుగురోజులలో ఇతడి బుద్ధి మారవచ్చు. లేదా పెద్దల నాశ్రయించి జ్ఞానవంతుడు కావచ్చు. కావున ఏ కారణం

చేతనైనా ఈ నాలుగు రోజుల్లో మనసు మార్చుకున్నాడా బ్రతికిపోతాడు. లేదా ఆ రోజే శపించవచ్చు లెమ్మనుకుంది. అయినా దీనికి శాపమొక్కటే మార్గాంతరమా? లేక ఇంకేదైనా మార్గం ఉన్నదా? అని తెలుసుకోవడం కోసమే ఇంటికి పోకుండా దేవగురువైన బృహస్పతి ఇంటికి వెళ్ళింది.

గురుకృప

(ఈభాగం శ్రీకృష్ణ జన్మ ఖండం 60వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

ఇంద్ర పత్ని శచీదేవి ప్రార్థన విన్న దేవగురువు బృహస్పతి ఇట్లా అన్నాడు. పుత్రికా! భయపడకు. నేను ఉన్నంత వరకూ నీపై ఈగను కూడా వాలనీయను. నాకు కచుడి భార్య ఎట్లాంటిదో నువ్వూ అంతే. గురువుకు పుత్రుడన్నా శిష్యుడన్నా సమభావమే ఉంటుంది. శిష్యుడు కూడా పుత్రుని వలెనె తర్పణాలివ్వడానికి, పిండ ప్రదానం చెయ్యడానికి, దానాల విషయంలోగాని, పాలన పరితోషణములలో గాని సమానాధికారం కల్గి ఉంటాడు. ఈ విషయాన్ని కణ్వ శాఖలో బ్రహ్మ శాసించాడు. తల్లి, తండ్రి శిశువు, అనాథ, బంధువుల్ని పురుషుడైన వాడు ఎల్ల వేళలా పోషించాలి. లేనిచో బ్రహ్మ శాసనాల్ని ధిక్కరించిన వాడై కర్మలు చేసే అధికారాన్ని కోల్పోతాడు. ఎవడు తల్లిదండ్రుల్ని గురువును సామాన్య మానవులుగా భావిస్తాడో వారి కర్మలన్నీ నిష్ఫలాలవుతాయి. సంపదల మదంతో ఎవడైతే గురువును పరాభవిస్తాడో అతడు సర్వస్వాన్ని కోల్పోతాడు. శచీదేవీ! ఇంద్రుడు నిండు సభలో నన్ను అవమానించాడు. ఆ ఫలాన్నిప్పుడు అనుభవిస్తున్నాడు. ఇప్పుడే ఇంద్రునికి దోషవిముక్తి, నీకు దుఃఖ విముక్తిని కలిగిస్తాను. చూస్తూ ఉండు. ఎవరైతే శపించేందుకు, రక్షించేందుకు కూడా సమర్థుడో అటువంటి వానినే గురువు అంటారు. ఓ శచీదేవీ! పతివ్రతా తిలకమా! హృదయ శుద్ధిగల నీవంటి స్త్రీలు చాలా తక్కువ మంది ఉంటారు. నీకు దుర్గాదేవి వంటి మాహాత్మ్యము మహాలక్ష్మి వంటి ప్రతిష్ఠ రాధాదేవి వంటి సౌభాగ్యం రోహిణి వంటి ఆపేక్ష, భారతి వంటి పూజ్యత సావిత్రి వంటి నిర్మలత్వం కలుగు గాక.

బృహస్పతి ఈ విధంగా శచీదేవిని ఆశీర్వదిస్తూ ఉండగా నహుషుని వద్ద నుండి దూత ఒకడు వచ్చి ఇలా అన్నాడు? మహాత్మా! నహుషుడు శచీదేవితో కలసి నందన వనంలో విహరించాలని నిశ్చయించాడు. అందుకు మంచి ముహూర్తం నిర్ణయించుకొని రమ్మని నన్ను పంపాడు అన్నాడు. ఆ దూత మాటలు వినగానే దేవ గురువుకు పాదాలనుండి శిఖ వరకూ కంపరమెత్తిపోయింది. నిలువెల్లా క్రోధంతో ఊగిపోయాడు. పెదవులదిరాయి. దూతతో ఇట్లా అన్నాడు. దూతా! నువ్వు పోయి నహుషునితో నామాటగా చెప్పు. బాగా అలంకరించిన పల్లకీ నొకటి సిద్ధం చేసుకోమను. సప్తర్షులు ఆ పల్లకిని మోయాలి. అటువంటి పల్లకినెక్కి చక్కగా నవ మన్మథునిలా వెళ్ళమని చెప్పాడు. దేవగురువు మాటలు విన్న నహుషుడు పరమానంద భరితుడై ఆ దూతనే సప్తర్షుల్ని వెంటబెట్టుకొని రమ్మని పంపాడు. సప్తర్షులంతా హుటాహుటిన నహుషిని వద్దకు వెళ్ళారు. వారితో నహుషుడిట్లా అన్నాడు. మీరంతా బ్రహ్మ పుత్రులు. బ్రహ్మ తేజస్సు గలవారు. బ్రహ్మకు నీడవంటి వారు. నారాయణునికి

పరమ భక్తులు. శుద్ధ సత్త్వ గుణం గలవారు. మోహమాత్సర్యాలు మీదగ్గరకైనా రావు. దర్పాహంకారాల్ని విడిచి పెట్టేశారు. కృప కరుణ ప్రేమలే మీకు ఆభరణాలు. ఈవిధంగా మీరంతా శ్రీమన్నారాయణుని తో సమానమైన వారు అని అంటూ దుఃఖాన్నంతా దిగమ్రింగుకుంటూ ప్రణామం చేశాడు. ఇతరుల దుఃఖాన్ని చూడలేని వారవడం వలన మహర్షులందరికీ నహుషునిపై కరుణ పుట్టుకొచ్చింది. నహుషునితో ఇట్లా అన్నారు. వత్సా! నువ్వెందుకో బాధ పడుతున్నావు. నీ మనసులోని కోరిక ఏమిటో చెప్పు. మాకు అసాధ్యమైనదేదీ లేదు. ఇంద్రత్వంగాని, మమత్వంగాని, దీర్ఘాయుర్ధాయం గాని శాశ్వత సుఖంగాని, సప్తద్వీపాధిపత్యం గాని ఏది కావాలన్నా ఇవ్వగల సమర్థులం, కావున నీకేం కావాలో కోరుకో, నీ పని అయిన తర్వాత మేమంతా పోయి తపస్సు చేసుకుంటాం. శ్రీకృష్ణుని ధ్యానం లేకుండా క్షణం కూడా ఉండలేము. శ్రీకృష్ణుని ధ్యానం చెయ్యని దినమే మాకు దుర్దినం. భగవత్సేవ మాని మరొక విషయంలో ఎవడు కాలం వెళ్ళదీస్తాడో వాడు బ్రతికిఉన్నా చచ్చిన వాడితో సమానం. బ్రహ్మ, శివుడు, ధర్ముడు, విష్ణువు మహావిరాట్టు మొదలైన వారంతా ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మము యొక్క పాదసేవనే కోరుకుంటారు. వారి మాటలు విన్న నహుషుడు సిగ్గుపడుతూ ఇలా అన్నాడు. మహానుభావులారా! మీరంతా భగవత్స్వరూపులు. ఏమడిగినా ఇవ్వగల సమర్థులు. ఇప్పుడు నా మనస్సంతా శచీదేవి ఊహలతో నిండిపోయింది. నాకా శచీదేవి నివ్వండి. అదే నాకోరిక. సప్తర్షుల చేత మోయబడే పల్లకీలో నేనామెవద్దకు రావాలని కోరుకుంటోంది. నాకీ వరం ఇచ్చి అనుగ్రహించండి అని ప్రార్థించాడు.

నహుషుని మాటలు విన్న మహర్షులంతా ఒకరిముఖాలు ఒకరు చూసుకొని పక్కున నవ్వారు. ఇతణ్ణి విష్ణుమాయ ఆవహించిందని అనుకున్నారు. మహర్షులు కరుణామయులు కాబట్టి అట్లాగే మోస్తామన్నారు. నహుషుడెక్కిన పల్లకీని మహర్షులంతా భుజానికెత్తుకున్నారు. మహర్షుల నడక నత్తనడకలా నడవడం నహుషుడికి నచ్చలేదు. శచీదేవి వద్దకు త్వరగా చేరుకోవాలని మనసు తొందర పెడుతోంది. అందువల్ల గొంతులో మునపటి మార్దవం పోయింది. వారంతా మహర్షులన్న మాట మరచిపోయాడు. త్వరగా నడవాలని మందలించడమే కాకుండా అవమానకరంగా మాట్లాడాడు. దాంతో దుర్వాసుడనే మునికి కోపం వచ్చింది. నహుషా! నీకు ఐశ్వర్య గర్వం తో పాటు మదం కూడా తలకెక్కింది. అందువల్లనే మమ్మీ నీచకార్యానికి ఆదేశించావు. అది చాలదన్నట్లుగా ఈటెల లాంటి మాటలతో మమ్మల్ని బాధిస్తున్నావు. కావున నీవొక కొండచిలువవై పడి ఉండమని శపించాడు. నువ్వా సర్ప రూపంలో కొంతకాలముండి ధర్మ పుత్రుని దర్శనం కాగానే ముక్తిని పొంది వైకుంఠాన్ని చేరుకుంటావని వారి దారిన వారు పోయారు.

ఆ ముని నోటా మాటలు రాగానే నహుషుడు పెద్ద కొండచిలువ అయి నేలపై దొర్లసాగాడు. ఈ విషయం గురువు వలన తెలుసుకున్న శచీదేవి అమరావతికి వెళ్ళింది. అంతట బృహస్పతి ఇంద్రుడుండే సరోవరానికి పోయి, సురేశ్వరా! ఇంద్రా! నేను నీగురువు బృహస్పతిని. నేనుండగా నువ్వు దేనికీ భయపడాల్సిన పనిలేదు. నిన్ను రక్షించడానికే వచ్చాను. బయటకు రమ్ము! అన్నాడు. గురువాజ్ఞ తలదాల్చిన ఇంద్రుడు మహదానందంతో బయటకు వచ్చాడు. భీతుడై గురుపాదాలపై పడి

కన్నీటితో గురుపాదాలను కడిగాడు. అప్పుడా దేవ గురువు ఇంద్రుని స్వర్గసింహాసనం పై కూర్చోబెట్టగా దేవతలంతా వచ్చి మహేంద్రుని అభినందించారు. భర్త రాకతో శచీదేవి కూడా పరమానంద భరితురాలైంది. నారదా! ఇదే ఇంద్రుని గర్వ భంగ కథ. లేదా శచీదేవి పాతివ్రత్య కథ.

ఇంద్రుడు సహస్రాక్షుడగుట

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 61వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

శ్రీమన్నారాయణుడు : నారదమునీంద్రా! ఇంద్రుడి గర్వభంగాన్ని గూర్చి తెలిపాను. శ్రీకృష్ణుడు ఇంద్రుని గర్వాన్ని మరోసారి భంగ పరిచాడు. అదెట్లాగో చెప్తాను విను.

శ్రీహరి క్షీరసాగరాన్ని మధించి అమృతాన్ని దేవతలకు ఇచ్చాడు. అంతే కాకుండా దైత్యులందర్నీ చంపి దేవతలకు ఎదురు లేకుండా చేశాడు. దాంతో మహేంద్రుడిలో నా అంతటివాడు లేడన్న గర్వం కలిగింది. శ్రీహరి ఇంద్రుని గర్వమణచాలని బలి చక్రవర్తి ని ప్రేరేపించి స్వర్గాన్ని ఆక్రమించుకునేట్లు చేశాడు. దాంతో ఇంద్రుడి గర్వ మణగి శ్రీకృష్ణుని పాదాలు పట్టుకొని శరణు కోరాడు. బృహస్పతి కూడా భగవంతుని ఆరాధించాడు. అదే సమయాన అదితి శ్రీహరిని తనకు పుత్రుడుగా జన్మించమని ప్రార్థించింది. అందరి ప్రార్థనలు మన్నించేందుకు అదితి గర్భాన వామనుడుగా అవతరించాడు. బలి చక్రవర్తికి దాన ధర్మాలంటే ఎక్కువ ఇష్టం. అందువలన బలిని యాచన ద్వారా జయించాలనుకున్నాడు. దాంతో బలి నుండి ముల్లోకాలను స్వాధీనం చేసుకొని తిరిగి ఇంద్రుని గర్వాన్ని భంగపరచాడు.

మళ్ళీ ఇంద్రుడిలో గర్వం తలెత్తింది. తనంత వాడు లేడన్న భావం నెలకొంది. శ్రీహరి ఆ దర్పాన్ని దుర్వాసుని ద్వారా పోగొట్టాడు. మరల దేవేంద్రుడు కాముకుడయ్యాడు. దాంతో గౌతముని భార్య అయిన అహల్యను కామించాడు. గౌతముడు ఇంద్రుని అంగం లేని వాడవు కమ్మని శపించాడు. అంగం లేని ఇంద్రుని చూసి మునులు, మనువులు, పకపకానవ్వారు. దేవతలక్కూడా తలవంపులయింది. అటు పిమ్మట ఇంద్రుడు సూర్యుని ధ్యానించి వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసి సూర్యుని ప్రభావం చేత సహస్రాక్షుడయ్యాడు.

నారదుడు : దేవ దేవా! నారాయణా! ఇంద్రుడు గౌతముని భార్యను ఎట్లా కామించాడు? అహల్య మహాసాధ్వి గదా. ఆమె ముల్లోకాల్లోను పూజ్యురాలు. ఇటువంటి మహాసాధ్విని ఏ అవివేకి అయినా కన్నెత్తి చూస్తాడా? అహల్య అంటే కేవలం లక్ష్మీ అంశా సంభూతురాలు గదా. నాకా చరిత్ర చెప్పు.

శ్రీమన్నారాయణుడు : నారదా! ఒకానొక సూర్య గ్రహణం రోజున పుష్కర తీర్థంలో అహల్య వివస్త్రగా స్నానం చేస్తుండడం ఇంద్రుడు చూశాడు. ఆమె అందచందాలకు దాసుడై పోయి ఆమెతో ఇలా అన్నాడు. “సుందరీ! నీ రూపలావణ్యాలు వర్ణనాతీతం. నీ అంతటి సౌందర్యవతిని నేనెక్కడా

చూడలేదు. పురుషుల మనసులో వికారాలు కలిగించే నీ కొంటె చూపులు నిజంగా మెచ్చుకోతగ్గవే. ఆచి తూచి నువ్వు అడుగులు వేస్తూ ఉంటే నీ మందగమనాన్ని చూసి మదపుటేనుగులు కూడా నడకలు నేర్చుకుంటాయి. ఆహా! గౌతముడు ఎటువంటి తపస్సులు చేసి నిన్ను పొందాడో గదా. నీవంటి అందగత్తెను ఎవరైనా కామశాస్త్ర విశారదుడైతే సుఖపెట్ట గలడేమోకాని గౌతముడందుకు ఎంతమాత్రం తగినవాడు కాదు. అతడికి తెలిసిందల్లా శ్రీహరిని స్మరించడం, తపస్సు చేయడం మాత్రమే. మరినేనో! ముల్లోకాల్లోను అందగత్తె అని పేరు పొందిన ఊర్వసి నన్నే ముందుగా కోరుకుంటుంది. ఓ దేవీ! నువ్వు అంగీకరిస్తే శచీదేవిని నీకు దాసిగా చేస్తాను. ముల్లోకాల ఆధిపత్యాన్ని నీ పాదాల ముందుంచుతాను. నామాట విను. మనస్సు కుదుట పరచుకో. ఎట్లాగో అట్లా ఆ ముసలి బ్రాహ్మణ్ణి వదలించుకో. అతడు రసికుడు కాడు, కాముకుడూ కాడు. అతడితో ఉంటే నీ అందమంతా అడవి కాచిన వెన్నెలవుతుంది. అంతే కాకుండా బ్రహ్మ కూడా ముసలివాడై మతి స్థిమితం ఉండటం లేదు. అందువల్లనే ఏ వస్తువును ఎక్కడకు చేర్చాలో తెలియక నిన్నే ముసలి బ్రాహ్మడికి కట్టబెట్టాడు అన్న మహేంద్రుని మాటలు విన్న అహల్య ఇలా అంది.

ఓ దేవనాయకా! కశ్యపుని దురదృష్టం కొద్దీ నువ్వు అదితి కడుపున పుట్టావు. ఎవరు స్త్రీలోలుడవుతాడో అటువంటి వానికి తపస్సు, దేవతారాధన, తీర్థస్నానాల వంటి సత్కర్మలన్నీ నిష్ఫలమవుతాయి. స్త్రీ విలాసాలకే సృష్టించబడిందని కాముకుల భావన. స్త్రీలేనిదే సృష్టియే నశిస్తుందని బ్రహ్మ శాసించాడు. కావున స్త్రీయే మహాప్రకృతి స్వరూపం. స్త్రీయే తపస్సు నశింపజేసే వస్తువు. ఈమెను మహామాయే నిర్మించింది. చేపల్ని పట్టడానికి గాలం ఎట్లాంటిదో, పురుగుల్ని ఆకర్షించేందుకు దీపం ఎట్లాంటిదో అట్లాగే పురుషులకు స్త్రీ అటువంటిది. స్త్రీతో సాంగత్యం ముందు మధురంగానే ఉంటుంది. చివరకు సర్వ దుఃఖాలకు అదే బీజమని తెలుసుకుంటారు. నరకానికి చివరిమెట్టు. అందువల్లనే నేమో సనకాది మునులంతా మాకు స్త్రీయూ, సంసారమూ వద్దని నివృత్తి మార్గాన్ని చేపట్టారు. పరస్త్రీపై ఎవడైతే కన్నేస్తాడో వాడి పుణ్యాలన్నీ నశిస్తాయి. యశస్సంతా ఆవిరైపోతుంది. అని చెప్పి ఆ మహాసాధ్వి కాముకుడైన ఇంద్రుని వదలి తన ఇంటికి వెళ్ళింది. తపస్వి అయిన భర్తకు ఈ వార్తను తెలియజేసింది. ఆ మహర్షి ఇంద్రుని వెకిలి చేష్టలకు కృద్ధుడయ్యాడు.

ఒకానొక రోజున గౌతమ మహర్షి శంకరాలయానికి వెళ్ళాడు. ఆ విషయం పసిగట్టిన ఇంద్రుడు గౌతముని రూపంలో ఆశ్రమానికి వెళ్ళి అహల్యతో సంగమించాడు. జ్ఞాననిధి అయిన గౌతముడీ విషయాన్ని దివ్య దృష్టి చేత తెలుసుకొని వడివడిగా ఆశ్రమానికి వెళ్ళాడు. అప్పుడే బయటకు వస్తున్న ఇంద్రుడు మునికంటపడ్డాడు. కోపంతో ఇంద్రుని నీ అవయవాలన్నీ యోని ఆకారంగా కనిపించుగాక అని శపించాడు. భయంతో కంపించిపోతున్న అహల్యను జూచి శిలవై పొమ్మని శపించాడు. ఇంద్రుడు శాపాన్ని నెత్తిన వేసుకొని సిగ్గుపడుతూ తన నగరానికి పోయాడు. శోకంతో అహల్య ఇలా ప్రార్థించింది. ధర్మజ్ఞుడవైన ఓ మహాత్మా! ఇందులో నాదోషం ఏమీ లేదు. నీరూపంలో వచ్చిన ఇంద్రుని తెలుసుకోలేక పోయాను. నేను నీ పాద దాసిని. నువ్వు వేదవిదులలో ఉత్తముడవుగదా. నా యెడల దయ చూపు అని ప్రార్థించింది.

గౌతమ ముని : ఓ అహల్యా! నీ మనస్సు నేనెరుగుదును. నువ్వు పరిశుద్ధురాలవే. పతివ్రతవు అయినా పరపురుషుని వీర్యాన్ని భరిస్తున్నావు. పరభోగ్య అయిన స్త్రీ కర్మలు చెయ్యడానికి పనికిరాదు. అపవిత్రురాలే అవుతుంది. అట్టి స్త్రీతో కలసి ఉన్న పురుషుడు నరక దుఃఖాన్నే అనుభవిస్తాడు. ఆమె చేత్తో పెట్టే అన్నం మలంతో సమానం. ఆమె తాకిన నీరు మూత్రంతో సమానం. అటువంటి స్త్రీని తాకనైనా తాకరాదు. అట్లా తాకినట్లైతే అంతవరకు చేసుకున్న పుణ్యమంతా నశిస్తుంది. తెలియక పరపురుషునితో శృంగారంలో పాల్గొంటే ఆమె పతివ్రతే అయినా దుష్టురాలే అవుతుంది. నువ్వు దేవేంద్రుని భర్తగా భావించి అతడితో సుఖించావు. నన్ను చూసిన తర్వాతనే అతడు కపట వేషంలో వచ్చిన వాడన్న జ్ఞానం కలిగింది. ఇదే యథార్థంగా జరిగింది. కనుక ఇకపోయి ఒక బండరాయిగా పడి ఉండు. రాబోవు కాలంలో భగవంతుడు రామావతారం దాల్చి వస్తాడు. ఆ మహాత్ముని పాద స్పర్శచేత నువ్వు మళ్ళీ పవిత్రురాలవవుతావు. అటుపిమ్మట నాతో కలసి జీవించగలవు. అనిపలికి ఆముని తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోయాడు. ఇదీ మహేంద్రుని గర్వభంగం. ఆ సురాధిపతి మళ్ళీ శ్రీకృష్ణుని అనుగ్రహం చేత మహేంద్రత్వాన్ని పొందాడు.

విశేషార్థం : ఈ అహల్యా ఉదంతం శ్రీమద్రామాయణంలో వివరించిన కథ కంటే కొంచం వ్యత్యాసం కనిపిస్తుంది. మహర్షులు ఒక్కొక్క విషయాన్ని ఒక్కొక్క గ్రంథంలో కొద్దిగా మార్పులు చేర్పులూ చేస్తూ ఉంటారు. అయితే ప్రధానమైన విషయాన్ని మాత్రం మార్చరు. వారికి కథాసారము, నీతిని బోధించడమే ప్రధాన లక్ష్యం. అహల్య-ఇంద్ర సంవాదంలో అహల్య చెప్పిన నీతులన్నీ వేదసారమనే చెప్పుకోవాలి. నీవంటి అవివేకిని కొడుకుగా పొందడంవలన మీవంశమంతా అపకీర్తి పాలవుతుంది గదా అంటుంది. అనగా "అపకీర్తి భాజనంబైన పుత్రుండు పుట్టనేమి యతండు గిట్టనేమి" అని గదా సూక్తి. స్త్రీని చూడగానే మోహితులవడం సహజం. అయితే ధీరుడైన వాడు ఇంద్రియాల్ని నియంత్రించి అటువంటి మోహానికి లోను కాదని తెలుపుతోంది. ఇంద్రుడంతటి వాడు పాదాక్రాంతుడైనా లక్ష్యపెట్టకుండా ఇంటికిపోయి భర్తకు జరిగినదంతా చెప్తుంది. అయినా ఇంద్రుడు పట్టువిడువకుండా గౌతముడి వేషంలో వచ్చి అహల్యతో సంగమించాడు. అయితే ఇందులో అహల్యా దోషం ఏమీ లేదు. అయితే పరపురుషుని వీర్యాన్ని భరిస్తున్నావు కాబట్టి నిన్ను వదిలేస్తున్నానన్నది గౌతముడి వాదం. ఇది న్యాయమా? అన్నదే ప్రశ్న. సామాన్య శాస్త్రం ప్రకారం చూసినా, విశేష శాస్త్రం ప్రకారం చూసినా కారణాలు ఏవైనా పరులతో సంగమించిన స్త్రీ దుష్ట అని స్మృతులు తెలుపుతున్నాయి. ఎందువల్లనంటే అటువంటి స్త్రీ శ్రౌత స్మార్త కర్మలకు అనర్హురాలవుతుంది కాబట్టి దుష్టురాలే అవుతుందని మహర్షుల అభిప్రాయం. అయితే ఆమె మనస్సులో ఎటువంటి దుష్టభావాలు లేవు. కావుననే ఆమె భగవంతుని పాదస్పర్శ చేత పవిత్రురాలైంది. అందువల్లనే మహర్షి ఆమెపై కరుణతో అటువంటి శాపవిముక్తిని ప్రసాదించాడు. మహర్షి త్రికాలజ్ఞుడు కావుననే శ్రీరామావతారాన్ని ముందుగానే తెలుసుకోగలిగాడు. నిర్దోషి అయిన భార్య అహల్యకు భగవద్దర్శనాన్ని దయతో ప్రసాదించాడు. ధర్మ మార్గాలు సూక్ష్మంగా ఉంటాయి. వాటి తీరుతెన్నులు అందరూ తెలుసుకోలేరు. రామావతారంలో ఆ మహాత్ముని దర్శనం చేత ఎవరెవరు పవిత్రులు కావాలో ముక్తులు కావాలో

వారంతా ఏదో ఒక కారణంతో ఒక్కొక్క అపరాధం చేసి ఉంటారు. కావున వారంతా ఆ అపరాధాలకు గురి అయి తద్వారా భగవంతుని దర్శనం పొంది పవిత్రులవుతూ ఉంటారు. అదేవిధంగా అహల్యకూడా అంతో ఇంతో అపరాధం చేసి ఉంటుంది. అయితే అంతకు పదింతలు పుణ్యం చేయబట్టే పరమ యోగీశ్వరులకు కూడా దుర్లభమైన శ్రీరామ దర్శనం పొందగలిగింది. అందువల్లనే కృతార్థురాలైంది.

అహల్య శాపవిమోచనం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 62వ అధ్యాయంనుండి గ్రహించబడింది)

నారదుడు : భగవంతుడా! శ్రీమన్నారాయణమూర్తీ! గౌతముడు ఏ యుగానికి చెందిన వాడు. శ్రీరాముడు ఏ యుగంలో అహల్య కు శాపవిమోచనం కలిగించాడు? సూక్ష్మంగానైనా రామావతార విశేషాల్ని చెప్పి నన్ను ధన్యుణ్ణి చెయ్యి.

శ్రీమన్నారాయణుడు : నారదా! శ్రీమహావిష్ణువు బ్రహ్మ ప్రార్థన నాలకించి దశరథునికి పుత్రుడుగా జన్మించాడు. అది త్రేతా యుగం. కౌసల్యకు శ్రీరాముడు, కైకకు భరతుడు, సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులు జన్మించారు. రామ లక్ష్మణులు విశ్వామిత్రుని వెంట సీతా స్వయంవరానికి వెళ్తూండగా ఆ దారిలో పోతూ ఉండగా పాషాణ రూపంలో ఉన్న ఒక స్త్రీమూర్తిని చూశాడు. అప్పుడు విశ్వామిత్రుడు ఆమె వృత్తాంతాన్నంతా శ్రీరాముడికి తెలిపి ఆ పాషాణాన్ని తాకమంటాడు. శ్రీరాముడు పాదస్పర్శ చేత పాషాణంగా ఉన్న అహల్య మానవరూపం దాల్చి శ్రీరామునికి అర్ఘ్యపాద్యాలిచ్చి గౌరవించి భర్తవద్దకు వెళ్తుంది. భార్యను చూసిన గౌతముడు శ్రీరాముడు అవతరించాడని తెలుసుకొని భార్యను ఆదరించి శ్రీరామునికి శుభాశీస్సులు పలుకుతాడు. శ్రీరాముడు అక్కడ నుండి మిథిలానగరానికి పోయి శివధనుస్సును విరిచి సీతను వివాహమాడుతాడు. వృద్ధుడైన దశరథుడు సకల సుగుణాభిరాముడైన శ్రీరాముడికి యువరాజ్యాభిషేకం తలపెట్టాడు. ఆ అభిషేకం తనకుమారుడైన భరతునికే చెయ్యాలని కైక పట్టుబడుతుంది. దశరథుడు ససేమిరా అంగీకరించనంటాడు. అప్పుడు శ్రీరాముడు తండ్రికి ఈవిధంగా ధర్మోపదేశం చేసి వనవాసానికి సిద్ధమవుతాడు. మహారాజా! వెయ్యి తటాకాల్ని దానం చేస్తే కలిగే ఫలం ఒక్క బావి తవ్వించడం వలన కలుగుతుంది. అనేక బావులు తవ్వించడం వలన ఎటువంటి పుణ్యం కలుగుతుందో ఒక్క కన్యాదానం వలన అంతటి పుణ్యం లభిస్తుంది. పది కన్యాదానాలు చేస్తే కలిగే పుణ్యం ఒక యజ్ఞం వలన కలుగుతుంది. వంద యజ్ఞాల వలన కలిగే పుణ్యం సత్యపాలన వలన కలుగుతుంది. అనగా సత్యాన్ని మించిన పుణ్యం లేదు. అసత్యాన్ని మించిన పాపం లేదు. తండ్రీ! గంగానదితో సమానమైన తీర్థం గానీ, కేశవుణ్ణి మించిన దైవం గాని, సత్యాన్ని మించిన బంధువు గాని ఉండదు. కావున నువ్వు ధర్మాన్ని కాపాడు. ఒక్క ధర్మాన్ని రక్షిస్తే సకల శుభాలు కలుగుతాయి. యశస్సు ప్రతిష్ఠ పెరుగుతాయి. ప్రతాపం మర్యాద లభిస్తాయి. 14 సంవత్సరాలు సంతోషంగా వనవాసం చేసి తిరిగి వస్తాను. దాంతో నువ్వు సత్యాన్ని

ఆచరించిన వాడవవుతావు. తెలిసి ఎవడు సత్యాన్ని పాలించడో అతడి జన్మ వ్యర్థమవుతుంది. అని పలికి శ్రీరాముడు సీతా లక్ష్మణునితో కలసి వనవాసానికి వెళ్ళాడు. శ్రీరాముడు అటువనాలకు వెళ్ళగానే ఆదుఃఖంతో ఇక్కడ దశరధుడు మరణించాడు. దండకారణ్యంలో శూర్పణఖ శ్రీరాముణ్ణి వరించింది. శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. శూర్పణఖను ఎట్లాగైనా వదిలించుకోవాలని పోయి లక్ష్మణుని వివాహమాడమంటాడు. ఆమె లక్ష్మణుని వద్దకుపోయి ప్రార్థించగా అతడు రాముణ్ణే చేసుకోమంటాడు. అంతట శూర్పణఖ క్రోధంతో "కామాతురనై కోరివచ్చిన నన్ను మీరిద్దరూ తిరస్కరించారు కావున ఘోర విపత్తులలో చిక్కుకుపోతారని" అన్నది.

శూర్పణఖ కుబ్జగా పుట్టుట :

శూర్పణఖ ఈ విధంగా మాట్లాడుతూ ఉండగా శ్రీరాముని అనుజ్ఞ తీసుకొని లక్ష్మణుడు ఆమె ముక్కు చెవులు కోసి పంపాడు. తన అక్కకు జరిగిన పరాభవానికి కోపగించిన ఖరాసురుడు 14వేల మంది రాక్షసుల్ని వెంటబెట్టుకొని రాముడిపైకి యుద్ధానికి వచ్చాడు. ఆ యుద్ధంలో రాముడొక్కడే రాక్షసులందర్నీ మట్టుబెట్టాడు. అంతట శూర్పణఖ లంకకుపోయి ఖరదూషణాదుల మరణాన్ని రావణునికి తెలిపి అక్కడ నుండి పుష్కర తీర్థానికి పోయి బ్రహ్మను గూర్చి తీవ్రంగా తపస్సు చేసింది. శూర్పణఖ తపస్సుకు బ్రహ్మ ప్రత్యక్షమై "శూర్పణఖా! నువ్వు శ్రీరాముని కోరి ఇంత ఘోరమైన తపస్సు చేస్తున్నావు. శ్రీరాముడనగా బ్రహ్మవిష్ణు మహేశ్వరులకే ఈశ్వరుడు. సగుణ పరబ్రహ్మము. ప్రకృతికి భర్త. శ్రీరాముడు ఈ అవతారంలో ఏక పత్నీ వ్రతుడు. కావున రాబోయే అవతారంలో నువ్వతణ్ణి పొంది సుఖపడగలవు" అనిపలికి బ్రహ్మ తనలోకానికి పోయాడు. అంతట శూర్పణఖ చితిని పేర్చి అగ్నిని ప్రజ్వలింపజేసి అందులో శరీర త్యాగాన్ని చేసింది. ఆ శూర్పణఖయే జన్మాంతరంలో కుబ్జగా మధురానగరంలో పుట్టింది.

విశేషార్థం : శ్రీకృష్ణావతార తత్త్వంలో రామకథ ఎందుకని అనిపించవచ్చు. ఇంద్ర గర్వభంగం తర్వాత భగవన్మహిమలు తెలిపే కథలు అనేకం ఉన్నాయి. అందులో కుబ్జ ఉదంతం తెలిపే ముందు ఆమె ఎవరో, ఆమె పూర్వ చరిత్ర ఏమిటో తెలుసుకోవడం ఉచితంగదా అని సూక్ష్మంగా ఈ కథ చెప్పాల్సి వచ్చింది. శూర్పణఖ ఎంతటి దుష్టాత్మురాలే అయినా, భగవంతుణ్ణి కన్నులారా చూసింది. మాట్లాడింది. ఆ సుకృతం వృథాగా పోతుందా? అందువల్లనే ఏ కోరికనైతే కోరుకుంటాడో అతడికా కోరిక తీరుస్తానని భగవంతుడే భగవద్గీతలో స్పష్టం చేశాడు.

శ్రీరామావతారంలో మహర్షులంతా శ్రీరాముని దివ్యమంగళ విగ్రహాన్ని చూసి మోహితులై ఆహా! స్త్రీరూపం ధరించి శ్రీరామునితో విహరిస్తే ఎంత బాగుంటుందోగదా అని మనసారా కోరుకున్నారు. వారే గోపికలై జన్మించారని మనం చదువుకున్నాం. ఎన్నడో త్రేతాయుగం లో మరణించిన శూర్పణఖ ద్వాపరయుగాంతంలో మధురలో జన్మించిందంటే, ఇంతకాలం ఎక్కడుందని అడిగేవారుంటారు. భగవంతుని తలచుకుంటూ మరణించే వారికి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయనీ, ఎప్పుడైతే భగవంతుడు అవతరిస్తాడో ఆ సమయానికి వాళ్ళు మరల పూర్వ లక్షణాలతో జన్మిస్తారని చెప్పాల్సి ఉంటుంది. అంతే కాని ఇందుకు ప్రమాణాలేవీ లేవు.

కంసునికి పీడకలలు రావడం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం, గర్గ సంహిత, బ్రహ్మ పురాణం నుండి గ్రహించబడింది. ఈ కథ భాగవతంలో కొద్దిగా మార్పుకనిపిస్తుంది. హరివంశం మాత్రం సర్వ స్వతంత్రంగా వ్యవహరించింది. అన్నింటినీ కలగా పులగం చేసి వ్రాయడమైంది.)

శ్రీకృష్ణ పరబ్రహ్మం బృందావనంలో మహదానందాన్ని అనుభవిస్తున్నాడు. మూలప్రకృతి అయిన రాధాదేవి అతడికి తోడుగా ఉంది. శ్రీకృష్ణ సాంగత్యంలో గోపికలు, గోపకులు గోపబాలురు అంతా మహదానందాన్ని అనుభవిస్తున్నారు. కంసుడు పంపిన పూతనాది దానవులంతా హతులయ్యారు. అయినా జగత్తునంతా మహామాయ ఆవరించి ఉంది. అందువల్ల శ్రీకృష్ణుడు ఎన్ని అమానుష చర్యలు చేసినా వాటన్నింటినీ అప్పుడే మరచిపోతున్నారు. తిరిగి శ్రీకృష్ణుడు సామాన్య యాదవ బాలుడేనని భావిస్తూ వచ్చారు. యశోద మాత్రం నాయనా!రారా! అంటూ ఒళ్ళో పడుకోబెట్టుకుంటోంది. నందుడు మాత్రం చిన్నా చితకా పనులు చేయించుకుంటూ పుత్రానందాన్ని పొందుతున్నాడు.

మధురానగరంలో పరిస్థితి మరొకలా ఉంది. కంసుడు శ్రీకృష్ణుని చంపటానికి పంపిన పూతనాది దానవులంతా సముద్రంలో వేసిన ఉప్పు బొమ్మల్లా ఆయనలోనే లీనమై పోయారు. కృష్ణుణ్ణి ఎట్లా మట్టుపెట్టడమా అని కంసుడు తలపగులకొట్టుకుంటున్నాడు. ఇది ఇట్లా ఉండగా ఒకరోజున భయంకరమైన కల వచ్చింది. దాంతో కంసుడిలో భయం రెట్టింపయ్యింది. బంధుజనాన్ని, హితుల్ని, పురోహితుల్ని పిలిపించి ఇలా అన్నాడు “మీరంతా నా మేలు కోరే వారే అయితే నేను చెప్పేది శ్రద్ధగా వినండి. రాత్రి నాకో భయంకరమైన కల వచ్చింది. ఆ కలలో రాక్షసొకటి ఎర్రటి పుష్పమాలల్ని ధరించి, రక్త చందనాన్ని పూసుకొని చేత్తో ఖడ్గాన్ని పట్టుకొని నాట్యం చేస్తూ నామీద కొచ్చింది. ఆ రాక్షసి జుట్టంతా విరబోసుకుంది. ఆమె ముక్కు కోసుకుంది. నల్లటి శరీరంపైన రక్తపు మరకలు ఎండి నల్లగా కనిపించాయి. ఆ మహా శూద్రి నన్ను గట్టిగా కౌగలించుకొంది. మ్లేచ్ఛుడొకడు ఆమెకు మద్యం అందిస్తున్నాడు. బ్రహ్మదేవతలందరితో కలసి వచ్చి పూర్ణ కుంభాన్ని నేలకేసి కొట్టాడు. బ్రహ్మ నన్ను శపిస్తుంటే దేవతలంతా హర్షం తెలిపారు. మధురానగరం అంతా బూడిద వర్షించి ఎక్కడ చూసినా భస్మం రాసులై కనిపించింది. కాకులు, కోతులు, కుక్కలు, భల్లూకాలు, పందులు భయంకరంగా అరుస్తూ అప్రదక్షిణంగా తిరిగాయి. దిగంబరులైన భూతాలు చీమల బారుల్లా మధురానగరంలో ప్రవేశించాయి. సూర్య చంద్రులిద్దర్నీ రాహువు ఒకేసారి మింగేశాడు. ఓ పురోహితుల్లారా! బంధువుల్లారా! తోకచుక్కలు ఎన్నో నేలవ్రాలాయి. మహా వృక్షాలెన్నో కూకటివేళ్ళతో నేలకొరిగాయి. తలలేని మొండాలు మధురానగరంలో ప్రతి ఇంట్లోనూ కనిపించాయి. ప్రళయ కాలంలో జరుగుతాయని చెప్పుకొనే మహోత్పాతాలెన్నో నా స్వప్నంలో చూశాను అని చెప్పాడు.

కంసుడి స్వప్న వృత్తాంతం విన్న పురోహితుడు పెదవి విరిచాడు. బంధువులంతా బావురుమన్నారు. పురపెద్దలంతా కంసుడికి రోజులు దగ్గర పడ్డాయని రూఢి చేసుకున్నారు.

విశేషార్థం: ఈ దుస్వప్న వృత్తాంతం భాగవతాది గ్రంథాల్లో కనబడదు. ఆ గ్రంథాలన్నింట్లోను బలరామకృష్ణుల్ని చంపేందుకు కంసుడు చేసే విఫల ప్రయత్నాలన్నీ చూస్తున్న నారదుడు దేవలోకం నుండి వచ్చి కంసుడితో ఇలా చెప్తాడు. మహారాజా! నువ్వు దేవకి కూతురని ఒక పిల్లను చంప బోయావు. అప్పుడా పిల్ల ఆకాశంలో కెగిరిపోతూ చెప్పిన మాటలు మరచిపోయావా? నిన్ను చంపేందుకే పుట్టిన వాడు ఈ ప్రాంతంలోనే పెరుగుతున్నాడని చెప్పలేదా? అతడే శ్రీకృష్ణుడు. అతడే యథార్థంగా దేవకీదేవికి కుమారుడు. వసుదేవుడు నీకు భయపడి తనకు పుట్టిన బిడ్డను తీసుకొని పోయి నందుడికిచ్చాడు. ఆ బిడ్డే శ్రీకృష్ణుడుగా గోకులంలో పెరుగుతున్నాడు. నందుని పుత్రికను తెచ్చి నీకు చూపాడు. ఆ పిల్ల ఆకాశాన్నుండి అదృశ్యురాలైంది. కృష్ణ బలరాములిద్దరూ నందుడి రాజ్యంలో దిన దిన ప్రవర్ధమానులై పెరుగుతున్నారు. శ్రీకృష్ణుణ్ణి బాల్యంలోనే చంపాలని పూతనను, శకటాసురుణ్ణి ఇంకా అనేక మందిని పంపి విఫలుడవయ్యావు. ఈ మోసం అంతా వసుదేవుడు కావాలనే చేశాడు. నన్ను నమ్ము అన్నాడు. నారదుని మాటలు విన్న కంసుడు ఉద్రేకంతో లేచి కత్తి తీసుకొని వసుదేవుణ్ణి చంపేందుకు బయలు దేరాడు. నారదుడు కంసుని ఆపి నాయనా! నువ్వు మహారాజువు. నువ్వు ఇటువంటి చెయ్యరాని పనులు చెయ్య కూడదు. నామాట విను. ఒకవేళ శ్రీకృష్ణుడే నిన్ను మేనమామవు గదా అని క్షమించి వదిలెయ్యవచ్చు. కానీ నువ్విప్పుడు వసుదేవుణ్ణి చంపితే కృష్ణుడి చేతిలో నీకు చావు తప్పదు. కాబట్టి ఉద్రేకం తగ్గించి నిదానంగా ఆలోచించు అన్నాడు.

కంసుడు నారదుడి మాటలు విన్నాడు. నారదుడికి ఎదురు మాట్లాడితే ఎక్కడ శాపం పెడ్తాడో నని అప్పటికా ప్రయత్నం విరమించాడు. దేవకీ వసుదేవుల్ని మళ్ళీ చెరసాలలో పెట్టించాడు. తను వచ్చిన దేవకార్యం అయిందిగదా అని సంతోషించి నారదుడు దేవలోకానికి వెళ్ళాడు. బలరామ కృష్ణులను సంహరించే మార్గాలనన్వేషిస్తూ కంసుడు విశ్రమించడానికి వెళ్ళాడు.

కంసుడు ధనుర్యాగం చేయుట

(ఈ కథ శ్రీకృష్ణ జన్మఖండం, బ్రహ్మ పురాణం, విష్ణుపురాణం, భాగవతం, గర్గసంహిత, హరివంశముల నుండి గ్రహించబడింది. అన్నింట్లోని విశేషాలను సంగ్రహంగా తెలుపడం జరిగింది)

పురోహితుడైన సత్యకుడు కంసుని స్వప్న వృత్తాంతం విన్నాడు. శుక్రాచార్యుల శిష్యుడు కాబట్టి నీతి శాస్త్రాన్ననుసరించి ఈవిధంగా ఉపదేశించాడు. మహారాజా! భయపడకు. నేను నీకు పురోహితుణ్ణి. నీకు హితంగా ఉండేది. న్యాయ సమ్మతమైనది అయిన సలహా చెప్తాను. నువ్వు ధనుర్యాగం చెయ్యి. ఈ యాగం సర్వారిష్టాలను తొలగిస్తుంది. మహేశ్వరునికి ప్రీతిపాత్రమైనది. బాగా అన్నదానం చెయ్యి. బ్రాహ్మణులకు విరివిగా దక్షిణలివ్వు. స్వప్నంలో నువ్వు చూసిన దుశ్శకునాల పీడ నశిస్తుంది. ఈ యాగం చేసిన వారికి శత్రు భయం ఉండదు. ఆధ్యాత్మికము, ఆధిదైవము, ఆధిభౌతికమనే తాపాలనుండి ఉపశమనం లభిస్తుంది. మహైశ్వర్యాలు చేకూరుతాయి. యజ్ఞం పూర్తి కాగానే మహేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు. అప్పుడు నువ్వు జరామృత్యుభయాలు లేకుండా ఉండేట్లు వరం కోరుకో. సమస్త

సంపదల్ని ప్రసాదించే మహేశ్వరుడే దర్శనమిచ్చిన తర్వాత ఇంకా కొరత ఏమి ఉంటుంది?

ఈయాగాన్ని మహాబలుడైన బాణాసురుడు చేశాడు. ఇంకా నంది, పరశురాముడు, భల్లుడు కూడా ఈ యాగాన్ని చేశారు. రాజా! మనవద్ద ఉన్న ఈ ధనుస్సును పూర్వం శివుడు నందికి ఇచ్చాడు. ఆ నంది బాణాసురునకిచ్చాడు. ఆ బాణాసురుడు భగవదనుగ్రహాన్ని పొంది ఈ ధనుస్సును పరశురామునకిచ్చాడు. ఆ పరశురాముడే నీకిచ్చాడు. ఆ ధనస్సు వెయ్యి హస్తాల పొడుగుంటుంది. వజ్రం కన్నా కఠినం. నువ్వీ యాగం చేస్తే శంకరుడు తృప్తి చెందుతాడు. కాబట్టి వెంటనే ధనుర్యాగాన్ని, శంకరుని పూజలు ప్రారంభించు. ఆ యాగానికి చిన్నా పెద్దా అందర్నీ ఆహ్వానించు. నీ స్వప్న దుర్నిమిత్తాలన్నీ పోవడమే కాకుండా నువ్వు జరామరణాలు లేని వాడవవుతావు. అయితే ఒక ముఖ్యమైన విషయాన్ని నువ్వు మనసులో పెట్టుకో. ఈ యాగం జరిగే సమయంలో ధనుస్సుకు ఏవిధమైన అపచారం జరుగ కూడదు. ఒకవేళ అట్లా జరిగిందంటే యజమానికి మరణం తప్పదు. కావున ధనస్సుకు గట్టి కాపలా ఉంచు. నిత్యం పూజలు చేయించు. తలపెట్టిన యాగమే భగ్నమైతే ఇక ఫలం ఇచ్చేదెవరు? ఆ ధనస్సు మూలంలో బ్రహ్మ, నడుమ విష్ణువు పైభాగాన రుద్రుడు ఉంటారు. ఆ ధనస్సు త్రిమూర్తి స్థానమని తెలుసుకో. ఈ ధనుస్సు ధరించే శంకరుడు త్రిపురాసురుల్ని సంహరించాడు. కావున నిర్భయంగా సర్వ మంగళాలు చేకూరేందుకు నువ్వీ యాగాన్ని వెంటనే ప్రారంభించు.

పురోహితుడైన సత్యకుడు చెప్పినట్లుగా ధనుర్యాగాన్ని చెయ్యడానికే నిశ్చయించుకొని బంధుమిత్రులు శ్రేయోభిలాషులతో ఇలా అన్నాడు. ఆప్తులారా! నన్ను చంపేవాడొకడు పుట్టి నందుడి ఇంట్లో నందుడి పుత్రుడిగా పెరుగుతున్నాడు. నా బంధువులైన పూతన మొదలైన వారిని పంపిచూశాను. ఆ బాలుడు వారికంటే బలవంతుడై వారందర్నీ మట్టు పెట్టాడు. తర్వాత ఆ బాలకుడే మహాబలశాలియై గోవర్థన పర్వతాన్ని ఎత్తి పట్టుకున్నాడని విన్నాం. దాంతో మహేంద్రుడంతటివాడే పరాభవం పాలయ్యాడు. నూతన బ్రహ్మగా సృష్టిచేసి పురాతన బ్రహ్మనే మతి భ్రమించేట్లు చేశాడు. దీనిని బట్టి నాకు ఈ లోకంలో ఈ బాలుడు తప్ప వేరే శత్రువెవ్వడూ లేడు. అనేక మంది రాజులు మహారాజులతో నాకు స్నేహాలున్నాయి. చివరకు త్రిమూర్తులు కూడా నా యెడల వాత్సల్యం చూపేవారే. నందకుమారుడుగా పిలువబడుతున్న ఈ బాలుణ్ణి కనుక మట్టుపెడితే ఇక నన్ను ముల్లోకాల వారు పూజిస్తారు. సప్త ద్వీపాలకు చక్రవర్తిని కాగలను. దేవేంద్రుణ్ణి కూడా ఓడించి మహేంద్రుణ్ణవుతాను. సూర్యుణ్ణి జయించాలన్నది నా లక్ష్యమూ కాదు చంద్రుణ్ణి జయించాలన్న కోరికా లేదు. కావున ఓ సత్యకా! ఇప్పుడే నువ్వు నందవ్రజమునకు వెళ్ళిరా. నందుని పుత్రులు గా పెరుగుతున్న బలరామకృష్ణుల్ని యాగానికి ఆహ్వానించి తీసుకొనిరా.

సత్యకుడు : మహారాజా! నేను నందవ్రజానికి వెళ్ళడం బాగుండదు. అక్రూరుణ్ణి గాని, ఉద్ధవునిగాని, వసుదేవుణ్ణి గాని పంపించు. అట్లా చేస్తే నందుడు కూడా సంతోషిస్తాడు.

సత్యకుడి మాటలు విన్న కంసుడు, వసుదేవా! విన్నావు కదా సత్యకుడు చెప్పిన మాటలు. నువ్వు నీతి శాస్త్ర విశారదుడవు. చక్కగా ఉపాయాలన్నీ తెలిసిన వాడవు. నువ్వు నందవ్రజానికి నా తరపున వెళ్ళి వృషభానుణ్ణి, నందుణ్ణి, బలుని, నందనందనులను ఇంకా గోకులంలో ఉండే పెద్దల్నీ

ధనుర్యాగానికి ఆహ్వానించు. దూతలు నాలుగు దిక్కులకు వెళ్ళి రాజులకు, మహారాజులకు ఆహ్వానాలిచ్చి వస్తారు. అని చెప్పాడు. కంసుడన్న మాటలకు వసుదేవుని మనస్సు మొద్దుబారిపోయింది. నాలుక తడారిపోయింది. కాళ్ళూ చేతులు చల్లబడ్డాయి. దీనంగా ఇలా అన్నాడు. మహారాజా! ఈ పనికి నన్ను పంపించకండి. అది న్యాయసమ్మతంగా ఉండదు. నందుడు నందకుమారులు నీ ఆహ్వానాన్ని మన్నించి వచ్చినా మీకు వారికి తప్పక యుద్ధం జరుగుతుంది. ఒకవేళ నువ్వే అతణ్ణి జయించినట్లైతే కొడుకును పిలుచుకొచ్చి మహారాజుచేత చంపించాడన్న అపవాదు నాకు కలుగుతుంది. అట్లా కాకుండా అతడి వల్ల నీకే హాని సంభవిస్తే వసుదేవుడు కొడుకును పురికొలిపి రాజును చంపించాడని లోకులంటారు. ఏది ఏమైనా మీ ఇద్దరిలో ఎవరో ఒకరికి చావు తప్పదు. దాంతో యాగశాల మహాసంగ్రామంగా మారి రక్తం ఏరులై పారుతుంది. కనుక ఈ మహా కార్యానికి నన్ను పంపకండి అని కూర్చున్నాడు.

వసుదేవుని మాటలకు కంసుని నేత్రాలు చింతనిప్పులయ్యాయి. ఖడ్గం తీసుకొని వసుదేవుణ్ణి చంపేందుకు వెళ్ళాడు. సభలో హాహాకారాలు చెలరేగాయి. ఉగ్రసేనుడు సింహాసనం పైనుండి వడివడిగా వెళ్ళి కంసుని వారించాడు. తండ్రి వారించడంతోపాటు నారదుడు చేసిన హితోపదేశం కూడా జ్ఞాపకానికి వచ్చి శాంతించాడు. అంతట కంసుడు అక్రూరుని పిలిచి నందవ్రజానికి పొమ్మని ఆదేశించాడు. అందుకు అక్రూరుడు బృందావనం వెళ్ళేందుకు అంగీకరించాడు.

(ఈ కథ బ్రహ్మ పురాణం నుండి గ్రహించబడింది)

కంసుడు ఆగ్రహంతో ఊగిపోయాడు. యాదవ వంశస్థులందర్నీ చులకన చేసి మాట్లాడాడు. ఈ యాదవ రాజుల్ని నేను గౌరవించడమా? రామకృష్ణులు ఎంత బలశాలురైనా వారిద్దర్నీ మట్టుపెట్టేందుకు ప్రయత్నాలన్నీ గట్టిగా చేస్తాను. ఈ బాలకులిద్దరూ ఎట్లా బ్రతికి బట్ట కడతారో చూస్తాను. దీంతో కంసుడి సామర్థ్యమేమిటో లోకమంతా తెలుసుకొని ముక్కున వ్రేలేసుకునేట్లు చేస్తాను. మహావీరుడైన చాణూర ముష్టికులతో మల్లయుద్ధం ఏర్పాటు చేసి వారిచేత ఈ బాలురిద్దర్నీ చంపిస్తాను. అందుకు ఏదో ఒక ఉపాయం పన్ని రామకృష్ణులు మధురకు వచ్చేట్లు చెయ్యాలని మనసులో ఊహించుకొని అక్రూరునితో ఇలా అన్నాడు. దానపతీ! నా హితం కోరే వాళ్ళల్లో నువ్వు ముందు వరుసలో ఉంటావు. నీతో చెప్పిన పని ఏదీ ఇంతవరకు సానుకూలం కాకుండా పోలేదు. నువ్వు ఇక్కడ నుండి నందగోకులానికి వెళ్ళి వసుదేవుని కుమారులిద్దరూ విష్ణు అంశతో జన్మించారట. వాళ్ళిద్దరూ నన్ను సంహరించేందుకే పుట్టారని అంతా చెప్పుకుంటున్నారు. రాబోయే చతుర్దశి నాడు ధనుర్యాగాన్ని తలపెట్టాను. ఆనాటికి వాళ్ళిద్దర్నీ మధురకు తీసుకొనిరా. వాళ్ళిద్దరూ నగర ప్రవేశం చెయ్యగానే చాణూర ముష్టికులతో మల్లయుద్ధానికి ప్రేరేపిస్తారు. ఈ మల్లయుద్ధం జనమంతా చూస్తూ ఉండగా బాహాటంగా జరుగుతుంది. ఒకవేళ వారి చేతిలో వాళ్ళిద్దరూ చావు తప్పించుకున్నా ఆ వెంటనే కువలయపీడమనే గజరాజు వీరిని చంపేస్తుంది. వాళ్ళిద్దరూ చావగానే వసుదేవుని, నందుని, నా తండ్రి ఉగ్రసేనుని కూడా చంపేస్తాను. వీళ్ళంతా నాతో ఉంటూ, నేను పెట్టే తిండితింటూ నాకు కీడు తలపెడ్తూ ఉంటారు. అందువలన వీరిని చంపడం వలన పాపం రాదు. వారిని చంపి వారి

గోధనాన్ని ఇతర సంపదలన్నీ స్వాధీనం చేసుకుంటాను. దాంతో లోకంలో నాకు ఎదురు చెప్పే వారే ఉండకుండా పోతారు. నేను ఇవన్నీ సాధించాలంటే నీవీ సహాయం నాకు తప్పకుండా చెయ్యాలి. ఈ పనులన్నీ చక్క బెట్టిన తర్వాత నీ ఋణముంచుకోను. నిన్ను గొప్పగా గౌరవిస్తాను. కావున ఓ దానపతీ! నేను కోరినట్లుగా వెంటనే నందుని గోకులానికి వెళ్ళు. వాళ్ళందర్నీ యాగానికి కావలసిన పాలు, పెరుగు, వెన్న తెమ్మని నా ఆజ్ఞగా చెప్పు. పనిలోపనిగా ఆ బాలకులిద్దర్నీ నువ్వే దగ్గరుండి వెంట తీసుకొనిరా.

అక్రూరుడు పరమ భాగవతోత్తముడు. శ్రీకృష్ణ పాదసేవ భాగ్యాన్ని సదా కోరుకుంటూ ఉంటాడు. ఇక శ్రీకృష్ణ దర్శన భాగ్యమే కలుగబోతోంది గదా అని మనసులో సంతోషించాడు. అదే జన్మ ఫలమని భావించాడు. శ్రీకృష్ణ దర్శనానికి మనసు తొందర పెట్టింది. శ్రీకృష్ణుని జన్మ రహస్యం అతడెరుగు. కంసునికి శ్రీకృష్ణునిచేతిలో మరణం తథ్యమని తెలుసు. అందువల్ల కంసునితో మహారాజా! మీ ఆజ్ఞను శిరసావహిస్తున్నాను. నేను మీ సేవకుడను. మీ హితం కోరడం నాకు పరమధర్మం. నా శక్తి వంచన లేకుండా మీరు చెప్పిన కార్యాన్ని సాధించుకొని వస్తాను. అని చెప్పి రథమెక్కి నందగోకులానికి ప్రయాణమయ్యాడు. రథంలో పోతూ అక్రూరుడు మనసులో ఇలా అనుకున్నాడు. ఓ మధురానగరమా! ఇకపైన నువ్వు జగద్విఖ్యాతి గాంచబోతున్నావు. శ్రీహరి పాదపద్మాల్ని నీపై మోపుతాడు. దాంతో నీ జన్మ ధన్యమవుతుంది. నేను వెళ్లి ఆహ్వానించగానే శ్రీకృష్ణ పరబ్రహ్మం బయలుదేరి నీ నగర ప్రవేశం చేస్తాడు. క్రూర దానవులందర్నీ నిర్మూలిస్తాడు. దాంతో మధురానగరం అంటే ఏమిటో ముల్లోకాల్లోనూ ప్రసిద్ధి చెందుతుంది అని అనుకుంటూ నందగోకులానికి ప్రయాణమయ్యాడు.

అక్రూరుడు నందగోకులానికి వెళ్ళగానే దూతలు ఆయా దేశాధిపతులకు ఆహ్వానాలందజేశారు. కంసునాజ్ఞను పరమానందంతో అంగీకరించి వచ్చిన వారు కొందరైతే మరికొందరు కంసుడికి ఎక్కడ కోపం వస్తుందో నని భయపడుతూ వచ్చినవారు. ఆవిధంగా కంసుని ఆహ్వానాన్నందుకొని వచ్చిన ప్రముఖుల్లో దాంభికుడు, శిశుపాలుడు, భీష్మకుడు, భగదత్తుడు, ముద్గలుడు, ధార్తరాష్ట్రుడు, ధూమకేశుడు, ధూమ్రకేతుడు, శంబరుడు, శల్యుడు, సత్రాజితుడు, శంకువు, భూరిశ్రవసుడు, కేశలుడు మున్నగువారున్నారు. వీరుకాక బ్రాహ్మణులు, తపోధనులు అనేక మంది వచ్చారు. వారిలో సనక, సనంద, వోఢు, పంచశిఖ, సనత్కుమార, కపి, పైల, సుమంతు, సనాతన, పులహ, పులస్త్య భృగు, కశ్యప, మరీచాదులు ముఖ్యులు.

అక్రూరుడు గోకులానికి ప్రయాణం కావడం

(ఈ కథ శ్రీకృష్ణ జన్మఖండం 65వ అధ్యాయం నుండి, ఇతర పురాణాల నుండి గ్రహించబడింది)

కంసుని ఆజ్ఞను శిరసావహించిన అక్రూరుడు రథమెక్కి ఇంటికి పోతూ ఇలా ఆలోచించాడు. ఈ రోజు నా జీవితంలో మహత్తరమైనది. బ్రాహ్మణులు, దేవతలు తప్పక నన్ను అభినందించగలరు.

కోటి జన్మల పుణ్యం ఈనాడు నన్ను వరించింది. సంసార సాగరం నుండి ముక్తుడనై హరిపాద పద్మాల వద్దకు చేరుకోబోతున్నాను. శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని కన్నులార దర్శించడమే కాదు, అతిథి పూజల్ని కూడా అందుకోబోతున్నాను. కంసుని లోని రాక్షస ప్రవృత్తియే నాకీ మహద్భాగ్యాన్ని కలిగిస్తోంది. ఆవిధంగా కంసునికి జన్మ జన్మలకూ ఋణపడి ఉంటాను. ఏ మహాత్ముని పాద పద్మాలను బ్రహ్మ విష్ణు మహేశ్వరులు హృదయంలో నిలుపుకొని పూజిస్తారో అట్టి పరమాత్ముని దర్శించబోతున్నాను. ఏ మహాత్ముని ఆది మధ్య అంతాలను ఎవరూ తెలుసుకోలేరో అటువంటి మహనీయునితో మాట్లాడబోతున్నాను. ఏ భగవంతుని స్తుతించేందుకు సరస్వతీ దేవి మాటలు రాక మూగదైపోతుందో, ఏ జ్ఞాన రూపుని దాస్యం చేసేందుకు లక్ష్మీదేవి నియోగించబడిందో, పవిత్ర గంగానది ఏ పరమ పురుషుని పాదోదకమై ప్రవహించిందో అట్టి పరమేశ్వరునిచే అర్ఘ్యపాద్యాదులను అందుకోబోతున్నాను.

అక్రూరుని మహదానందము

(ఈ భాగము శ్రీకృష్ణ జన్మఖండం 65వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ప్రియబంధూ! ఉద్ధవా! మాయామానుష రూపి, సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, ప్రకృతి విష్టుడు, జ్యోతి స్వరూపుడు, నిర్గుణమై, నిరీహమై, పరమానందమై వెలయునా పరమాత్మను స్పృశించగలను. అట్టి పరాత్పరుని, వేదాంత వేద్యుని చూడబోతున్నాను. ఓ ఉద్ధవా! పూర్వం శంకరుడు చిరకాలం తపస్సు చేసి ఆ గోకుల వాసుని దర్శించి సర్వ తత్త్వ సారాన్ని పొందగలిగాడు. భక్త వత్సలుడైన పరమాత్మ సదాశివుని ఆత్మసమునిగా చేశాడు. అట్టి శ్రీకృష్ణపరబ్రహ్మాన్ని దర్శించబోతున్నాను. ధర్ముడు కూడా అనంత కాలం తపస్సు చేసి సకల ధర్మ కర్మ ప్రదాతయై శిక్షకుడై, ఫలదాతయై ఉండేట్లుగా వరాలను పొందాడు. అనంతమైన ఆయుర్దాయం కలిగిన బ్రహ్మ ఏ భగవంతునితో నిముషం సేపు లీనమై ఉంటాడో అట్టి పరమేశ్వరుణ్ణి దర్శించ బోతున్నాను. ఓ ఉద్ధవా! బ్రహ్మాండాలను లెక్క పెట్టడం చేతకాదు. బ్రహ్మ లెందరో చెప్ప శక్యం కాదు. ఒకప్పుడైనా వీటిని చెప్ప గల మేమోగాని, వీటన్నింటికీ ఆధారభూతుడైన విరాట్టును తెలుసుకోగలనా? ఎన్నో బ్రహ్మాండాలున్నాయి. ప్రతి బ్రహ్మాండానికీ బ్రహ్మ విష్ణు మహేశ్వరులున్నారు. మునులు, తపస్వులు ఉన్నారు. వారెవ్వరూ ఆ మహాత్ముని ప్రభావాన్ని అణువంతైనా తెలుసుకోలేకపోయారు. అట్టి పరాత్పరుని చూడబోతున్నాను.

ఈ కథ మనకు భక్తుని లక్షణాల్ని తెలుపుతుంది. భగవద్దర్శనం కన్నా సంతోషమైన కార్యం మరొకటి లేదన్నది సిద్ధాంతం. గోకులంలో పెరుగుతున్న లీలా మానుషవిగ్రహుని వెంటబెట్టుకుని రమ్మని రాజాజ్ఞ. దాంతో అక్రూరుని ఆనందానికి హద్దుల్లేవు. ఇంటికి పోవడానికి మనస్కరించలేదు. తన సంతోషాన్ని పంచుకునేందుకు మహా భక్తాగ్రేసరుడైన ఉద్ధవుడింటికి వెళ్ళి తన ఆనందాన్ని పంచుకున్నాడు.

బ్రహ్మాదులు శ్రీకృష్ణుని దర్శించుట

(ఈభాగం శ్రీకృష్ణ జన్మఖండం 69వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీమన్నారాయణుడు : నారదమునీ! భగవంతుడు రాధాదేవిని సంతృప్తి పరచాలనుకొని తిరిగి సాకారుడై కార్యాలన్నింటినీ చక్కబెడుతూ రాధాదేవిని సంతృప్తి పరుస్తూ వచ్చాడు. సరస్వతి ఎట్లా చతుష్షష్టి కళల్లో ప్రావీణ్యురాలో రాధాదేవి కూడా అట్లాగే శృంగార కళయందు ఆరి తేరింది. రాధాదేవిని ఎంతోమంది మునీశ్వరులు కీర్తించి అంతా తలా ఒక సార్థక నామాన్నీ ప్రకటించారు.

ఇది ఇట్లా ఉండగా భగవంతుణ్ణి వెతుక్కుంటూ బ్రహ్మ, శంకరుడు మొదలైన దేవతలంతా వచ్చి శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని ఇలా స్తుతించారు. జగదీశ్వరా! నిర్గుణా! నిరాకారా! స్వేచ్ఛా మయా! నీకు నమస్కారము అంటూ బ్రహ్మ ఇలా అన్నాడు. ఓ నందనందనా! నిత్యానందా! ఇక బృందావనాన్ని వదలిపెట్టు. సుదాముడి శాపాన్ని గుర్తు పెట్టుకో. నువ్వు రాధాదేవితో ఓ వంద సంవత్సరాలు వియోగం తర్వాత మీ ఇద్దరూ తిరిగి గోలోకానికి పోతారు. నీకోసం అక్రూరుడు నందవ్రజానికి బయలుదేరాడు. అతడు పితృతుల్యుడు. మాన్యుడు. గొప్ప విష్ణు భక్తుడు. నీకు అతిథిగా ఉండబోతున్నాడు. నువ్వు అతడితో కలసి మధురానగరానికి పోవాల్సి ఉంది. అక్కడ ధనుర్యాగం జరుగబోతోంది. ఆయాగంలో నువ్వు శివధనుర్భంగం చెయ్యాలి. శత్రువులందర్నీ సంహరించాలి. ముఖ్యంగా కంసవధ నీ అవతార ఫలాల్లో ఒక్కటి. పోయి దేవకీ వసుదేవులను ఓదార్చు. ఆ పిమ్మట ద్వారకానగరాన్ని నిర్మిస్తావు. రుక్మిణీదేవిని చేబట్టుము. ఓ కమలాక్షా! లోకానికి నీ అవతార ఫలాన్నందించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. కావున ఇప్పుడు రాధను వదులు. రాధాదేవి నిద్ర లేవక ముందే నువ్వు కార్యోన్ముఖుడవు కమ్ము. భగవంతుడు బ్రహ్మ వాక్యాల్ని ఆదరంతో విన్నాడు. దాంతో దేవతలంతా ఆనందంతో శ్రీకృష్ణ పరబ్రహ్మంపైన పూల వర్షం కురిపించారు. కొంతసేపటికి రాధాదేవి నిద్ర లేచి శ్రీకృష్ణుడు కనిపించక పోవడంతో కంటికి మంటికి ఏకధారగా కన్నీరు పెట్టుకొంది. చెలికత్తెలు ఓదార్చే ప్రయత్నాలన్నీ ఆమె దుఃఖాన్ని పెంచాయే గాని ఉపశమనం కలుగలేదు. ఇంతలో శ్రీకృష్ణుడే వచ్చి రాధను దగ్గరకు తీసుకొని ఇలా ఓదార్చాడు. నేను సర్వేశ్వరుడనే అయినా, ఘటనాఘటన సమర్థుడనే అయినా విధిని మార్చలేను. ముందు సుధాముడు నీకిచ్చిన శాపకారణంగా మనిద్దరం ఓ వంద సంవత్సరాలు పాటు వియోగ దుఃఖం అనుభవించక తప్పదు. అయితే నీ మీద నాకుండే ప్రేమ వలన పగటి వేళనే మనం వియోగ దుఃఖాన్ని అనుభవిస్తాం. ప్రతిరోజు స్వప్నంలో నాతో కలసి నువ్వు విహరిస్తూ ఉంటావు. కావున దుఃఖాన్ని విడిచిపెట్టు. నిన్నీ శోకం నుండి విముక్తురాల్ని చేసేందుకే నీకు ఆధ్యాత్మిక విద్యనుపదేశించాను. నేనిప్పుడు నందుని మందిరానికి వెళ్ళాలి అని చెప్పి శ్రీకృష్ణుడు నందుని ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులకు నమస్కరించాడు.

పండితులు కొందరు ఈ రాధా ఉదంతమంతా కల్పితమని కొట్టి పారేస్తారు. అయితే రాధా విలసాన్ని ఎన్నో పురాణాలు తెలియజేస్తున్నాయి. బ్రహ్మాండ, బ్రహ్మ వైవర్త, పద్మ, పురాణాల్లోనూ, దేవీ భాగవతంలోను రాధామహిమను విశేషంగా కొనియాడాయి. నారద పురాణంలో అయితే రాధా సహస్రనామాలు కూడా ఉన్నాయి. కావున శ్రీకృష్ణావతారంలో శ్రీ రాధికా చరిత్రకున్నంత ప్రాముఖ్యం మరే చరిత్రకూ లేదని మనమంతా విశ్వసించాలి.

నారద శ్రీకృష్ణ సంవాదము

(ఈభాగం బ్రహ్మ పురాణం శ్రీ భాగవతం నుండి గ్రహించబడింది)

ఒకానొక రోజున శ్రీకృష్ణుడు గోకులంలో ఒంటరిగా ఉన్న సమయంలో నారదుడు వచ్చి పరమాత్మునితో ఇలా అన్నాడు. జగన్నాథా! అచ్యుతా! కేశి రాక్షసుడు దేవతలందర్నీ గడ గడలాడించాడు. ప్రజలంతా వాడు పేట్టే బాధలు పడలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతికేవారు. అటువంటి భయంకరుణ్ణి అవలీలగా చంపేశావు. అంతేకాదు వాడికి స్వర్గ ప్రాప్తి కూడా కలిగించావు. కావుననే నీకు కేశవ అన్న నామం సార్థకమైంది. నువ్విక గోకులాన్ని వదిలిపెట్టు. అక్రూరునితో మధురకు బయలుదేరు. నిన్ను మట్టు బెట్టడానికి కంసుడు చేసే ప్రయత్నాలేవీ సఫలం కావు. చివరగా మీ ఇద్దరికీ భీకరమైన పోరుసాగనుంది. కంసుడు నీ చేతిలోనే కడతేరుతాడు. కంసుడు మరణించిన తర్వాత ఇంకా ఎంతో మంది రాజుల్ని హతమార్చి భూభారాన్ని తగ్గిస్తావు. రాక్షస సంహారం, సాధుజనుల పరిరక్షణమే నీ అవతార ఫలం. నువ్వు నరకాసురుని సంహరించడం, పారిజాతాపహరణాన్ని, ఇంద్రుడి గర్వాన్నణచడం కన్నులారా చూడాలని ఉంది. వీర కన్యలనేక మందిని వివాహం చేసుకోబోతున్నావు. బందీలైన రాజులెందర్నో విడిపించి వారికి ఆనందాన్ని చేకూర్చబోతున్నావు. శమంతకమణితో బాటు సత్యభామను కూడా చేజిక్కించుకుంటావు. పౌండ్రక వాసుదేవుని పొగరణచబోతున్నావు. శిశుపాల దంతవక్త్రులు నీచేతిలో ముక్తిని పొందనున్నారు. నువ్వు ద్వారకా నగరాన్ని నిర్మించి నీ అద్భుత లీలను లోకానికి చాటుతావు. నువ్వే కాలరూపుడవై కురుక్షేత్రయుద్ధంలో పార్థ సారధి వై భూభారాన్ని తగ్గించడాన్ని చూడబోతున్నాను. మహాత్మా!నువ్వీ కార్యాలన్నీ సాధించేందుకే మానవ రూపంలో అవతరించావు. యాదవ వృష్ణి వంశాలను పవిత్రం చేశావు. భగవంతుడా! నీకివన్నీ తెలియదని కాదు. నా ఆత్మ తృప్తికై నిన్నీవిధంగా స్మరించుకుంటున్నాను. మహాత్మా! నీ నామస్మరణ చేస్తూ సంచరిస్తాను. నన్ను ఆశీర్వదించి సెలవియ్యి అని నమస్కరించి దేవలోకానికి వెళ్ళాడు.

అక్రూరుడు ఉద్ధవుడి వద్ద సెలవు తీసుకొని గోకులానికి బయలు దేరాడు. దారిలో అన్నీ శుభ శకునాలే కనిపించాయి. ఆడమగ నక్కలు జంటలుగా పోవడం. బ్రాహ్మణస్త్రీ భర్త పిల్లల్ని వెంటబెట్టుకొని ఎదురవడం, దారిలో హరినామ సంకీర్తనల్ని మధురమైన సంగీతాన్ని వినడం. ఒకటేమిటి అన్నీ శుభశకునాలే. దాంతో తన మనోరథం సఫలమవుతుంది గదా అని సంతోషించాడు. ఇట్లా ఆలోచిస్తూ ఉండగానే రథం బృందావనంలోకి ప్రవేశించింది. రథాన్ని కొద్దిసేపు ఆపమన్నాడు. రాసమండలాన్నంతా కన్నులారా దర్శించాడు. ఆహా! ఇది గదా భగవంతుడు విహరించే క్రీడావనం అనుకున్నాడు. అక్రూరుడి మనోభావాల్ని పోతనగారు ఎట్లా చిత్రీకరించారో చూడండి.

క॥ ముందట గనె ఘనచందన । కుంద కుటజతాల సాల కురవకవటమా
కందన్ నందిత బల గో । విందన్ వికచారుణార విందన్ బృందన్.

అటువంటి బృందావనంలో నందుడి మందిరాలున్నాయి. అనగా శ్రీకృష్ణాదులుండే ఆనంద వ్రజమన్నమాట. అయితే వైకుంఠం కూడా ఇట్లాగే ఉంటుంది కాబోలని ఊహించుకుంటూ ఉంటే

అక్రూరుడిలో భక్తిభావం పొంగిపొర్లింది. కన్నులు చెమ్మగిల్లాయి. ఈ మందిరాలు, పురనిర్మాణం అంతా మానవమాత్రులు కట్టినట్లుగా కనిపించడంలేదు. అక్రూరుని రథంతో పాటు మనోరథం కూడా అంతకన్నా వేగంగా సాగిపోతోంది.

ఆహా! నా అదృష్టాన్ని ఏమని వర్ణించగలను? శూద్రుడికి వేద పఠనం వలె, సామాన్యులకు భగవద్దర్శనం కూడా అసాధ్యమే. కామం ఉన్నచోట రాముడుండడు. రాముడున్న చోట కామం ఉండదంటారు. అయినా అధముల్లోకి అధముణ్ణయిన నాకే శ్రీకృష్ణదర్శన భాగ్యం కలుగబోతోంది గదా. అనగా నదీ ప్రవాహంలో కొట్టుకుపోయే గడ్డిపరకల్లో ఒకటో అరో ఒడ్డుకు చేర్తాయి గదా! అట్లాగే నాకీ అదృష్టం పట్టి ఉంటుందేమో. ఈ రోజు నా జన్మ ధన్యం కాబోతోంది. యోగీశ్వరులకు మాత్రమే సాధ్యమయ్యే శ్రీకృష్ణ పాద దర్శనాన్ని నేను కూడా ఈ రోజు దర్శించబోతున్నాను. ఇది జన్మ జన్మల పుణ్యఫలం కాక మరేమిటి? కంసుడు ఎంత దుర్మార్గుడైనా నాకు మహోపకారమే చేశాడు. కృష్ణుణ్ణి పిలుచుకురమ్మని వేరెవ్వరినైనా పంపించినా, లేక మరో పన్నాగమేదైనా పన్నినా నాకీ భాగ్యం కలిగేది కాదు గదా. కావున కంసుడు నాకు మహోపకారమే చేశాడు. అందువల్లనే నాకీ నాడు భగవద్దర్శనం అవుతోంది. సకల బ్రహ్మాండాల్ని తన పొట్టలో పెట్టుకొని ఏమీ ఎరుగని వాడిలా నందుడి ఇంట్లో సర్దుకుపోతున్నాడు. ఆహా! ఈ నందుడి మందిరం ఎంత పుణ్యం చేసుకుందో. నందుడు పూర్వజన్మల్లో ఎన్నెన్ని పుణ్యాలు చేశాడో గదా అని అనుకుంటూ నందుడి ఇంటి ముందుకొచ్చాడు.

నందుడు, వృషభానుడు, రామకృష్ణులు ఇంకా వ్రజలోని పెద్దలంతా అక్రూరునికి ఎదురుగా వెళ్ళి పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వానించారు. అప్పుడా రామకృష్ణుల తేజస్సు చూసిన అక్రూరుడి ఆనందానికి అంతులేదు. ఈ ఘట్టాన్ని పోతనగారు ఎలా వర్ణించారో చూడండి.

మ॥ కనె నక్రూరుడు పద్మనేత్రులను రంగద్గాత్రులన్ ధేనుదో
హన వాటీగతుల న్నలంకృతుల నుద్యద్భాసులం బీతనీ
లవీనోజ్జ్వలవాసులం గుసుమ మాలాధారులన్ ధీరులన్
వనితా కాములఁ గృష్ణరాముల జగద్వంద్యక్రమోద్దాములన్॥

అక్రూరుడు బలరామకృష్ణుల్ని మహదానందంతో ఆలింగనం చేసుకొని ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. నుదుట ముద్దు పెట్టుకున్నాడు. పులకాంకితుడై ఆనందబాష్పాలు కార్చాడు. ఆహా! కృతార్థుడనయ్యాననుకున్నాడు. మళ్ళీ కళ్ళు నులుముకొని చూశాడు. చతుర్భుజాలతో, మెడలో వనమాలల్ని ధరించిన శ్రీమన్నారయణుని రూపం హృదయ ఫలకంపై కనిపించింది. ఇంకో క్షణమాగి చూస్తే ఐదు ముఖాలతోను, మూడు నేత్రాలతోను, సర్పహారాల్ని ధరించి, ఒళ్ళంతా భస్మం పూసుకొని దిగంబరంగా ఉన్న పరమశివుడుగా కనిపించాడు. ఈ విధంగా సర్వ దేవతా మూర్తుల్నీ ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మంలో అక్రూరుడు దర్శించాడు. ప్రతి క్షణం ఒక్కొక్క దేవతామూర్తిగా దర్శనమిస్తున్న ఈ శ్రీకృష్ణుడు సాక్షాత్తూ పరబ్రహ్మమేనని తలచాడు. ఆ భావంతోనే ధ్యానించి హృదయంలో నిలుపుకున్నాడు. వెంటనే లేచి శ్రీకృష్ణుని పాదపద్మాలపై శిరస్సు వంచి సర్వదేవతా స్వరూపునిగా

భావించి నమస్కరించాడు. నందుడు చూపించిన రత్న ఖచిత సింహాసనం పై కూర్చున్నాడు. శ్రీకృష్ణమాయ చేత ఇదంతా క్షణంలో జరిగిపోయింది.

(హరివంశంలో ఈ విధంగా ఉంది)

పిమ్మట అక్రూరుడు శ్రీకృష్ణుని ఈ విధంగా స్తుతించాడు. ఈ బాలుడే శ్రీహరి. ఈ పరాత్పరుని దివ్యమంగళవిగ్రహాన్నే పురాణాలన్నీ, వేనోళ్ళ పొగిడాయి. వేదాంతులు నిన్ను వివరించి చెప్పలేక, 'అవ్యక్త' రూపమన్నారు. లోకోపకారంచెయ్యడానికే గోలోకం నుండి ఈ రూపాన అవతరించావు. క్షీణించిపోతున్న యాదవ వంశాన్ని ఉద్ధరించాలనుకున్నావు. అందువల్లనే ఈ గోకులంలో పూర్ణావతారంగా అవతరించావు. నా కళ్ళకు ఇతడే శ్రీమన్నారాయణుడుగా కనిపిస్తున్నాడు. అని వేయి విధాల స్తుతించి ఆ ఆనంద పారవశ్యంలో మైమరచిపోయాడు. లోపలా బయటా కూడా ఆత్మరూపంలో ఆశ్యామ సుందరునే దర్శించ గలుగుతున్నాను. మైమరచి మూర్ఛపోయిన అక్రూరుని నందుడు మెల్లగా లేవనెత్తి సింహాసనంపై కూర్చుండబెట్టాడు.

అంతట అక్రూరుడు పెద్దలందరికీ నమస్కరించాడు. రామకృష్ణుల్ని దీవించినా మనస్సులో మాత్రం శతకోటి నమస్కారాలు సమర్పించుకున్నాడు. బంధువులందరికీ దేవకీ వసుదేవుల క్షేమ సమాచారాన్ని తెలిపి సంతోష పెట్టాడు.

(ఈ భాగం శ్రీభాగవతం నుండి గ్రహించబడింది)

శ్రీకృష్ణుడు అక్రూరునితో "అక్రూరా! ప్రయాణం బాగా సాగిందా? అలసి పోయినట్లు కనిపిస్తున్నావు" అని అన్నాడు. మరి పోతన గారేమన్నరో చూడండి.

మ॥ *శుభమే నీకుఁ బ్రమోదమే సఖులకుం జుట్టాలకున్ సేమమే*
యభయంబే ప్రజకెల్ల గోత్రజుల కాత్మానందమే మామము
క్షభయుండే వసుదేవదేవకులు తత్కారాగృహంబందు మ
త్ప్రభవవ్యాజ నిబద్ధులై బ్రదికిరే ప్రాణానిలోపేతులై.

మ॥ *నెఱి నేఁ డిక్కడ నీవు రాఁగ వగతో నీతోడ నేమైన నా*
కెఱుఁగంజెప్పు మటంచుఁ జెప్పరు కదా యే మందురావార్తయే
తెఱఁగున్ లేదని డస్సిరో వలచిరో దీనత్వముం జెందిరో
వెఱతో నా తలిదండ్రు లెట్లు పడిరో విన్పింపు మక్రూరకా.

అక్రూరుడు నందాదులడిగిన క్షేమ సమాచారాలన్నింటికీ తగు విధంగా బదులు చెప్తూ శ్రీకృష్ణునితో మహాత్మా! మధురలో మేమంతా క్షేమంగానే ఉన్నాం. దేవకీ వసుదేవులు కూడా క్షేమమే. ప్రజల్లో కంస భయం అంతగా లేదనే చెప్పవచ్చు. ఉగ్రసేనమహారాజు మాత్రం సుఖంగా లేరు. ఎందువల్ల నంటే వారి హృదయతాపం అందరకూ తెలిసిందేగదా. మొత్తం మీద ప్రజలంతా సుఖశాంతులతో ఉన్నట్లే చెప్పవచ్చు. దేవ దేవా! కంసుడు ధనుర్యాగాన్ని తలపెట్టాడు. ఆ యాగానికి మిమ్మల్నందర్నీ ఆహ్వానించి వెంట బెట్టుకొని తీసుకురమ్మని నన్ను పంపాడు. దీంతో నాకు ఇహ పరాలు రెండూ అందివుచ్చు కున్నట్లయింది. యాదవులందర్నీ యాగానికి ఆహ్వానించి తీసుకురమ్మని కంసమహారాజు

నన్ను పంపాడు. తర్వాత కొంతసేపు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ నిద్రకు ఉపక్రమించారు. ఉదయాన లేస్తూనే బలరామకృష్ణులకు అభివాదం తెలిపాడు. మళ్ళీ తాను వచ్చిన పని నందమహారాజుకు గుర్తు చేశాడు. అంతట నందుడు, వృషభానుడు, సునందుడు, చంద్రభానుడు, బలరామకృష్ణులు మధురకు ప్రయాణానికి సిద్ధమయ్యారు. గోకులంలోని యాదవులంతా పాలు పెరుగు మొదలైన పంచామృతాలన్నీ బండ్ల కెక్కించారు. కంసునికి ఈ విధమైన కానుకల్ని పంపడం యాదవులకు కులాచారం. మధురానగరానికి ప్రయాణాన్ని చాటించారు. రథాల్ని సిద్ధం చేశారు. మృదంగ, ఢక్కా దుందుభుల వంటి మంగళవాద్యాల మధ్య ప్రయాణం ప్రారంభమైంది. అయితే కంసుడు ఎందుకు ఈ ధనుర్యాగం తలపెట్టాడో గోకులంలోని యాదవుల్ని ముఖ్యంగా రామకృష్ణుల్ని ఎందుకు ఆహ్వానించాడో ఎవరికీ తెలియదు.

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం నుండి గ్రహించబడింది)

అక్రూరుడు మధురనుండి వచ్చాడని, రామకృష్ణుల్ని తనతో మధురకు తీసుకొని వెళ్తున్నాడన్న వార్త వ్రజంతా గుప్పుమంది. రాధాదేవి దుఃఖానికి అంతే లేదు. వాళ్ళ ప్రయాణం ఎట్లా ఆపాలో తెలియలేదు. కృష్ణుడే వ్రజలో లేకపోతే గోకులాన్నెవరు రక్షిస్తారని తలచి గోపికలందర్నీ పిలిపించింది. దాంతో గోపికలంతా ఒకటయ్యారు. గోపికలతో ఇలా అంది. నెచ్చెలులారా! ఈ వచ్చినవాడు అక్రూరుడని పేరు పెట్టుకున్నాడే గాని, నిజానికతడు క్రూరుడే సుమా. మీరంతా ఒకటిగా వెళ్ళండి. రథాన్ని అడ్డుకోండి. ప్రయాణం సాగకుండా ఉండేందుకు మీకు ఎట్లా తోస్తే అట్లా చెయ్యండి. ఇది నా ఆజ్ఞ. వెంటనే బయలు దేరండి అంది.

వెంటనే గోపికలంతా పోయి రథాన్ని ముట్టడించారు. శ్రీకృష్ణుడు బుద్ధిమంతుళ్ళా అక్రూరుడి ప్రక్కనే కూర్చున్నాడు. గోపికలంతా సుడిగాలిలా రథాన్నెక్కి శ్రీకృష్ణుని భుజాలు పట్టుకొని క్రిందకు లాగారు. పోవడానికి వీల్లేదు ఇది రాధాదేవి ఆజ్ఞ అని చెప్పారు. రాధాదేవి ఇంటికి రమ్మని బ్రతిమాలారు. ఇంకొందరు అక్రూరుని క్రిందకు లాగారు. రథాన్ని విరగ్గొట్టారు. అక్రూరుణ్ణి అందినచోటల్లా కొట్టి హింసించారు. నువ్వు అక్రూరుడవు కావు; మహాక్రూరుడవని నిందించారు. అక్రూరుడికి పై ప్రాణాలు పైనే పోయాయి.

శ్రీకృష్ణుడు పరిస్థితి చెయ్యిదాటి పోతోందని గ్రహించాడు. గోపికలందరినీ ఓదార్చాడు. అక్రూరుడికి అభయాన్నిచ్చాడు. అక్కడ నుండి రాధాదేవికి ఆధ్యాత్మిక బోధ చేసేందుకు రాధ ఇంటికి వెళ్ళాడు. ఎంతో వినయం ఉట్టిపడేట్లు నమ్రతగా రాధాదేవితో నటించాడు. కాసేపు సరసల్లాపాలాడాడు. రాధాదేవి హృదయంలో శాంతిని నెలకొనేట్లు చేశాడు. ఆ తర్వాత ఆమెకు ఉద్ధవుడి శాపాన్ని గుర్తు చేశాడు. ఆ శాప ఫలమే ఈ వియోగానికి కారణమని నమ్మపలికాడు. ఎంతటి వారైనా కర్మఫలం అనుభవించాల్సిందే గదా అని ఉపదేశం చేశాడు. మొత్తం మీద రాధాదేవిని ఒప్పించి ఆమె అనుమతితో మధురకు ప్రయాణమయ్యాడు.

అప్పుడు ఆకాశంలో నుండి ఓ దివ్య రథం వచ్చింది. దాన్ని విశ్వకర్మ నిర్మించాడు. భగవంతుడొక్కడే అధిష్ఠించగలిగిన రథమది. అక్రూరుని కూడా ఆ రథంలో కూర్చోబెట్టుకొని మధురకు

ప్రయాణమయ్యాడు. దేవతలంతా ఆ రథంపై పూలవాన కురిపించారు. నంద గోకులమంతా పండుగచేసుకున్నారు.

(ఈ భాగం శ్రీ భాగవతం, బ్రహ్మ పురాణం, ఇతర పురాణాల నుండి గ్రహించబడింది)

వ్రేపల్లెలోని గోపికలంతా ఒక చోట చేరారు. శ్రీకృష్ణుడు ఎప్పుడు తిరిగివస్తాడన్నదే వారి సమస్య. కొందరు ఇక రాడని, అక్కడే ఉండిపోతాడన్నారు. ఇంకొందరు అక్కడనుండి రాచకార్యాలు వెలగబెట్టేందుకు ఇంకా ఏయే ఊళ్ళు తిరుగుతాడో ఎవరికి తెలుసు అని నిష్టూరాలాడారు. కొందరి మనసులు కలత చెందాయి. ఇట్లా తలకొక విధంగా మాట్లాడుకున్నారు. ఈ ఘట్టంలో పోతనామాత్యులు ఎలా వర్ణించారో చూడండి.

ఉ॥ మేటి గృహస్థు బ్రహ్మ యని మిక్కిలి నమ్మితి మమ్మచూడ నే
పాటియు లేదు మాకుఁ బరిపాలకుఁ డైన సరోజనేత్రు ని
చ్చోట వసింపనీక యొకచోటికిఁ బో విధియుంచి పిన్న బి
ట్టాటలు చేసే నీదుడుకు లక్కట! భారతికైనఁ జెప్పరే.

వ॥ అని విధిం దూఱుచు మదన తాపాయ చిత్త చిత్తలై

ఉ॥ రమ్మని చీరినంతన పురంబున కేగెడుఁగాని నన్ను నీ
కొమ్మలు నమ్మినారు మరుకోలల కగ్గము చేసి పోవఁగా
ముమ్మర మైనతాపమున మ్రొగ్గుదురోయనఁ దంబజాక్షుఁడా
యమ్మలు గోపవృద్ధులుఁ బ్రయాణము వల్లన రైరి చెల్లరే.

శా॥ అక్రూరుండని పేరుపెట్టుకొని నేఁ డస్మన్మనోవల్లభుం
జక్రిన్ మాకడఁ బాపి కొంచునరుగం జర్చించి యేతెంచి నాఁ
డక్రూరుం డట క్రూరుఁ డీతఁడు నిజం బక్రూరుఁ డేనేని ని
ర్వక్రత్వంబునఁ గృష్ణుఁబెట్టి తనత్రోవం బో విచారింపఁడే

(ఈ భాగం బ్రహ్మ పురాణం నుండి గ్రహించబడింది)

బలరామకృష్ణులు అక్రూరునితో పాటు రథంలో కూర్చుని ఉండగా గోపికలంతా చేరి ఒకరితో మరొకరు ఇలా చెప్పుకున్నారు. "సోదరీమణులారా! మధురానగరానికి వెళ్ళిన తర్వాత కృష్ణుడు మళ్ళీ గోకులానికి వస్తాడంటారా? రాడని నా నిశ్చితాభిప్రాయం. ఎందువల్లనంటే, పట్టణాల్లో ఉండే కాంతామణులు మధురంగా మాట్లాడుతారు. మనకుమల్లె నోటికి వచ్చిందల్లా మాట్లాడరు. అంతే కాకుండా వాళ్ళంతా చదువు కున్న వాళ్ళు. సంగీత సాహిత్య నృత్య గానాదుల్లో ఆరితేరిన వాళ్ళై ఉంటారే గాని, మనకుమల్లే పేడ పిసుక్కుంటూ, పాలుపితుక్కునే వారై ఉండరు. మనకృష్ణుణ్ణి తేలిగ్గా వాళ్ల వలలో వేసుకుంటారు. మనం వాళ్ళు మాట్లాడినంత మధురంగా మాట్లాడలేం గదా. వాళ్ళనని ఏం ప్రయోజనం. ఇంతకూ ఆ బ్రహ్మదేవుడికి మనమీద దయాదాక్షిణ్యాల్లేవు. సోదరీమణుల్లారా! అటుచూడండి. మనమంతగా మథన పడుతన్నా అక్కడ ఆ బాలుడు ఎంత ఠీవిగా అక్రూరుడి

ప్రక్కన కూర్చున్నాడో చూడండి. మనం అతడి కోసం పరితపిస్తున్నామే గాని, అతడికి మనపైన కొంచమైనా కరుణ లేదు గదా. ఏమయితే అదవుతుంది. మనమంతా కలసి అతడి రథాన్ని అడ్డుకుందాం. వ్రజలో ఉన్న వారంతా ప్రయాణమైపోతున్నారు. అదృష్టహీనులమైన మనం మాత్రమే మిగిలి పోతున్నాం. మనకు ఉపకారం చేసే వారు ఒక్కరుకూడా లేరు గదా. ఈ రాత్రి మధురా నగరవాసులకు శుభప్రదం. ఆ నగర నారీ మణులకు నేత్ర పర్వం కాబోతుంది. అక్కడ నగరవాసులకూ కన్నుల పండుగ అవుతూంటే ఇక్కడ మన అంతఃకరణములు నీరుకారి పోతున్నాయి. అయ్యో! మనం వెళ్ళే లోపలే క్రూరుడైన ఈ అక్రూరుడు రథాన్ని త్వర త్వరగా నడిపిస్తున్నాడే అంటూ గోపికలంతా ఈ విధమున ఆర్తనాదాలు చేశారు.

గోపికలంతా భక్తి పారవశ్యంతో ఒళ్ళంతా కళ్ళు చేసుకొని పరమేశ్వరుడ్ని వీక్షిస్తూ ఉంటే, గోపకులంతా నందుడు చెప్పినట్లుగా ప్రతి ఇంట్లో నుండి కానుకల్ని సేకరించి బండ్లపై ఎక్కిస్తున్నారు. వీధులన్నీ రథాలతోను, గోపగోపికల్తోనూ, గోపబాలురతోను క్రిక్కిరిసిపోయాయి. రామావతారంలో రామ వనవాస ఘట్టాన్ని తలపింపజేస్తోంది. ఇంతవరకు మనం గోకులంలో జరిగిన ప్రయాణపు ఏర్పాట్లను చూశాం. ఇకపైన మధురా నగర ప్రవేశాన్ని గూర్చి తెలుసుకొని తరిద్దాం.

మునులు గోపికలుగా పుట్టుట

(దండకారణ్యంలోని మునులంతా శ్రీరాముని తేజస్సుకు మోహితులై గోకులంలో గోపికలుగా పుట్టారన్న ప్రచారం ప్రబలంగా ఉంది. అయితే ఈ విషయం రామాయణంలో ఎక్కడా కనిపించదు. కానీ పద్మ పురాణంలో ఈ విషయం విస్తృతంగా చెప్పబడింది. అయితే కథాభాగానికి అట్టే ఉపయోగించే విషయం కాదు కాబట్టి సూక్ష్మంగా వివరించడం జరిగింది. పద్మ పురాణంలో పార్వతికి పరమశివుడు వివరిస్తున్నట్లు చెప్పబడింది)

పరమశివుడు : పార్వతీ! ఉగ్రసేనుడనే ముని కఠినమైన నియమాల్ని పాటిస్తూ శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని ధ్యానించి తపస్సు చేశాడు. అతడే గోకులంలో సునందునికి పుత్రికగా జన్మించాడు. ఆమెయే సునందగా పిలువబడింది.

సత్యవ్రతుడనే ముని ఎండిపోయిన ఆకుల్ని మాత్రమే తింటూ శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని రమాకాంతునిగా ఊహించుకుంటూ తపస్సు చేసి జన్మాంతరంలో సుభద్రుడికి కుమార్తెగా పుట్టాడు. అతడామెకు 'భద్ర' అని నామకరణం చేశాడు.

శంధాముడనే ముని ఆహారాన్ని పూర్తిగా విసర్జించి శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని మాయా బీజంతో అనుసంధానం చేసి కఠోరంగా తపస్సు చేశాడు. అతడే గోకులంలో గోపాలుని పుత్రికగా జన్మించాడు. అతడామెకు రంగవేణి అన్న పేరుతో పిలిచేవాడు.

పూర్వం జాబాలి అనే మునీశ్వరుడుండే వాడు. అతడొక గొప్ప బ్రహ్మ వేత్త, యోగేశ్వరుడు. కొంతకాలమైన తర్వాత ఆ సమీపంలోనే ఒక తపస్విని తపస్సిద్ధి పొంది ఉండటం చూశాడు. ఆమె దేహత్యాగం చేసే సమయానికి ఆమె వద్దకు పోయి శ్రీకృష్ణుని ఉపాసనా విధిని బోధించమని

ప్రార్థించాడు. ఆమె కరుణించి తెలిపిన ఉపాసనావిధి ప్రకారం తపస్సు చేసి గోకులంలో ప్రచండాఖ్యుడనే గోపకునికి పుత్రికగా జన్మించి చిత్రగంధ అన్న పేరుతో పిలువబడ్డాడు.

శుచిశ్రవసు, సువర్ణుడు అన్న మునులిద్దరూ కుశధ్వజుని పుత్రులు శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని హృదయంలో నిలుపుకొని జన్మాంతరంలో సువీరుడనే గోపకునికి పుత్రికలుగా జన్మించారు.

జటిలుడు, జంఘభూతుడు, ఘృతాశి, గర్భవు అనే నలుగురూ శ్రీకృష్ణ మంత్ర రాజాన్ని జపించి మూడు కల్పాల తర్వాత గోకులంలో గోపికలుగా జన్మించారు.

దీర్ఘతపుడు అనే ముని మరుసటి కల్పంలో వ్యాసుడుగా పుట్టాడు. ఆ వ్యాసుడి కుమారుడే శుకమహర్షి. శుకమహర్షి నిరాహారుడై భగవంతునికి మానసికంగా ఉపచారాలు చేస్తూండగా శ్రీకృష్ణ పరబ్రహ్మం ప్రత్యక్షమై, ఓ 'శుకా! కల్పాంతంలో నువ్వు గోకులంలో సునందుని పుత్రికగా జన్మిస్తావు. గుంజావలి అన్న పేరుతో ప్రసిద్ధురాలవై నన్ను భర్తగా పొందుతావు అని వరదానం చేశాడు.

శ్వేతకేతువు కుమారుడు శ్రీ గోవింద శక్తిని, శ్రీదేవిని దృఢభక్తితో ధ్యానించి రెండు కల్పముల తర్వాత గోకులంలో జన్మించాడు. ఆ గోపిక భూపుత్రి అని పిలువబడింది.

చంద్రప్రభుని కుమారుడు చిత్రధ్వజుడు అష్టాక్షరీ మంత్రాన్ని శ్రద్ధతో జపించగా శ్రీహరి ప్రత్యక్షమై రాజకుమారా! నా అంశాభూతురాలవై కాంతారూపంలో నన్ను ధ్యానించు. కల్పాంతాన గోకులంలో వీరగుప్తునికి పుత్రికవై చిత్రకళ అన్న పేరుతో నాకు ప్రియురాలవు కాగలవు. నీతో రాసక్రీడ జరుపుతానని వరమిచ్చాడు.

పుణ్యశ్రవ వసువన్న ముని గొప్ప ఈశ్వర భక్తుడు. శివుడు ప్రత్యక్షమై ఆర్యా! నీకు కలుగబోయే పుత్రుడు గొప్పకృష్ణ భక్తుడు కాగలడు. కావున ఉపనయనం చేసి విద్యాగోపాల మంత్రాన్ని ఉపదేశించు. ఆ మంత్ర ప్రభావంచేత వాక్సుద్ధి కలుగుతుంది అని ఉపదేశించాడు. అదే విధంగా ఆ ముని పుత్రుడు నందసోదరులింట్లో లవంగ అన్న పేరుతో జన్మించి శ్రీకృష్ణునికి ప్రియురాలైంది.

ఈ విధంగా ఎవరెవరు శ్రీకృష్ణుని వివాహమాడారో వారంతా భార్యలయి అంతర్భూతులుగా ఉంటారు. మిగిలిన వారంతా భగవద్ధాస్యాన్ని పొందే అదృష్టం గలవారై భగవత్సేవకులుగా ఉంటారని పరమేశ్వరుడు పార్వతీదేవికి ఉపదేశించాడు.

శ్రీకృష్ణ అర్జున సంవాదం

(ఈ భాగం పద్మ పురాణం నుండి గ్రహించబడింది)

అర్జునుడు : కృష్ణా! గోకులంలో నీకు అనేక మంది ప్రియురాళ్ళున్నారని విన్నాను. వారిలో ఎవరంటే నీకు అత్యంత ప్రీతి? మొత్తం మీద నీ ప్రియురాళ్ళంతా ఎంతమంది. వారి పేర్లేమిటి? వారితో కలసి ఏయే ప్రదేశాల్లో విహరిస్తావు. వాటిలో ఏ ప్రదేశం అంటే నీకు ఇష్టం ఎక్కువ?

శ్రీకృష్ణుడు : అర్జునా! నువ్వడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పగలను. చెప్పినదగ్గరనుండి ఆ ప్రదేశాలన్నీ చూడాలని పట్టుబడతావు. అయితే ఆ ప్రదేశాల్ని దర్శించడం ఆ బ్రహ్మతరం కూడా

కాదు. ఒక మానవ మాత్రుడవు నువ్వెంత? అయినా తెలుసుకొని ఏం చేస్తావు? కాబట్టి నువ్వు ఆ జోలికి వెళ్ళకుండా ఉండటమే మంచిది.

అర్జునుడు : కృష్ణా! నువ్వు ఇంతగా చెప్పిన తర్వాత నాకు చూడాలన్న కుతూహలం రెట్టింపయింది. నువ్వా వివరాలు చెపితే గాని వదలను. ఎందువల్లనంటే నాకంటే ఆప్తుడు ముల్లోకాలు వెదికినా కనిపించరు. నేనంటే నీకు పంచప్రాణాలని నాకు తెలుసు.

శ్రీకృష్ణుడు : అయితే విను ఏదేవి అనుగ్రహంతో సృష్టిస్థితి లయకారణాలు జరుగుతున్నాయో ఆ దేవియే త్రిపురసుందరీ దేవి. నువ్వాదేవిని ధ్యానించు ఆ దేవి కరుణ లేకుండా నేనైనా ఆ ప్రదేశాల్లో అడుగుపెట్టలేను.

శ్రీకృష్ణుని అనుమతితో అర్జునుడు త్రిపుర సుందరీ దేవిని గూర్చి మనస్సులో ధ్యానం చేసి ఆమె అనుగ్రహం పొందగలిగాడు. ఆ దేవి ఒక ఉన్నతమైన వేదికపైన కూర్చుంది. ఆ వేదిక అంతా మణిమయరత్నాలతో పొదగబడిఉంది. ఆమె ఒక విచిత్రమైన కిరీటాన్ని ధరించింది. ఆ కిరీటంలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు రత్నాలవలె పొదగబడి ప్రకాశిస్తున్నారు. ఆమె దర్శనం కాగానే వినయంతో నమస్కరించాడు. తన్ను గూర్చి తన కోరికగూర్చి ఆమెకు విన్నవించుకున్నాడు. ఆ మహాప్రకృతిని చూస్తున్నకొద్దీ ఇంకా చూడాలనిపిస్తోంది. ఆ మహాదేవికి పదే పదే నమస్కరించాలన్న బుద్ధి పుట్టి మళ్ళీ మళ్ళీ నమస్కరించాడు.

త్రిపురసుందరి : వత్సా! ఎన్నో యజ్ఞాలు చేసి ఈ శ్రీహరిని ప్రసన్నుని చేసుకున్నావు. భగవంతుడు నీపై చూపిన కరుణ ఎన్నడూ ఏ భక్తునిపైనా చూపలేదు. నువ్వీ దేవి వెంట వెళ్ళు. ఆమె కులకుండమనే సరస్సు చూపిస్తుంది. నువ్వు ఆ సరస్సులో స్నానం చేసి రా.

దేవి చెప్పినట్లే అర్జునుడు వెళ్ళి ఆ సరస్సులో స్నానం చేసి వచ్చాడు. అప్పుడా జగజ్జనని అర్జునునకు 'బాలా' విద్య నుపదేశించింది. ఆ మంత్రాన్ని అనుష్ఠానం చేసే విధానాన్ని చెప్పింది. హోమ పద్ధతుల్ని ఉపదేశించింది. ఆమె చెప్పినట్లే ఉపాసించి ఆ దేవి అనుగ్రహం పొందాడు. దాంతో శ్రీకృష్ణుని లీలల్ని దర్శించే అధికారాన్ని పొందగలిగాడు. పిమ్మట ఆ దేవి ఒక పరిచారిక నిచ్చి అర్జునుణ్ని రాధాపతి వద్దకు పంపింది. అక్కడకు వెళ్ళేందుకు యోగులకే సాధ్యం కాదు. అనగా ఆ ప్రదేశం గోలోకానికి పై భాగాన ఉంది. అది శాశ్వతమైన ప్రదేశం. సర్వసుఖాలు ప్రసాదించే దివ్యక్షేత్రం.అదే బృందావనం. అందులోనే రాసమండలం ఉంటుంది. ఆ మండలంలో ఎల్లప్పుడూ ప్రేమ వరదలై ప్రవహిస్తూ ఉంటుంది. అర్జునునితో కూడా వచ్చిన పరిచారిక, పార్థా! ఈ దివ్య సరోవరంలో స్నానం చెయ్యి. ఆ తర్వాత జరిగే వింతలు విశేషాలన్నింటినీ నువ్వే తెలుసుకుంటావు. గోవిందుడు కూడా ఈ సరోవరంలోనే స్నానం చేస్తాడు. కావున దేవి ఆజ్ఞాపించినట్టు ముందీ సరస్సులో స్నానం చెయ్యి. అటుపిమ్మట మొదటి సరస్సు వద్దకు పోయి ఆ జలాలతో ఆచమనం చెయ్యి. ఆ తర్వాత నీవు కోరినవన్నీ సిద్ధిస్తాయి. వెళ్ళి త్వరగా స్నానం చేసిరా అంది.

అర్జునుడు స్త్రీ కావడం :

తన కూడా వచ్చిన పరిచారిక చెప్పినట్లే పోయి సరస్సులో స్నానంచేసి బయటకు వచ్చాడు. తీరా బయటకు వచ్చి చూస్తే ఆ పరిచారిక కనిపించలేదు. తన్నుతాను చూసుకొని ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు తనకొక అందమైన స్త్రీ రూపం ఏర్పడింది. ఓహో ఇదంతా కృష్ణమాయ అయి ఉంటుందని అనుకుంటూ ఉండగా అశరీరవాణి ఇలా వినిపించింది. "సుందరీ! నువ్వు వచ్చిన దారినే తిరిగి వెళ్ళు. నువ్వు మొదట చూసిన సరోవరం కనిపిస్తుంది. ఆ జలాన్ని తీసుకొని ఆచమనం చెయ్యి. ఆ తర్వాత నువ్వు మనస్సులో ఏమేం కోరుకుంటున్నావో వాటన్నింటినీ దర్శిస్తావు" అని.

అర్జునుడు ఆ స్త్రీ రూపంతోనే మొదట చూసిన సరస్సు వద్దకు వెళ్ళి అశరీర వాణి పలికినట్లే ఆ నీటితో ఆచమనం చేశాడు. ఉన్నట్లుండి ఆ సరస్సు నుండి మధురమైన సంగీతం వినిపించింది. ఆ తర్వాత ఆ సంగీతాన్ని ఆలపిస్తున్న సుందరీమణులు ఆ సరస్సులోనుండి బయటకు వచ్చారు. వాళ్ళంతా విలువైన రత్నాలతో అలంకరించుకున్నారు. అందరూ అతిలోక సుందరులే. వాళ్ళలో ఒకర్తె అర్జునుణ్ణి చూస్తూ "సఖీ! నువ్వెవరవు? ఎవరి ప్రియురాలవు? నువ్వు ఎక్కడినుండి వచ్చావు? నిన్నెవరు తీసుకొని వచ్చారు? ఎందుకు విచారిస్తున్నావు? దుఃఖించకు. నీ వివరాలన్నీ చెప్పు" అన్నది. అర్జునుడికి ఏమీ అర్థం కావడంలేదు. అయినా ఆ సుందరితో "నీ ప్రశ్నల్లో దేనికీ నా వద్ద సమాధానాల్లేవు. అయినా నాకు తెలిసిందంతా చెప్తాను" విను. ఒకదేవినాతో పరిచారికనిచ్చి నన్ను ఆమెతో వెళ్ళమంది. నన్నామె ఓ సరస్సు వద్దకు తీసుకొని వెళ్ళి అందులో స్నానం చేసిరా. అంతానీకే అర్థమవుతుంది అన్నది. నేను ఆమె చెప్పినట్లే స్నానం చేసి బయటకు వచ్చాను. ఆ పరిచారిక మాయమైంది. నా కీ స్త్రీ రూపం వచ్చింది. నాకు ఏంచెయ్యాలో తోచక దిక్కులు చూస్తూ ఉంటే ఓ అశరీర వాణి పలుకులు వినిపించాయి. ఆ వాణి నన్నీ సరస్సు వద్దకు పోయి ఈ జలాలతో ఆచమించ మని చెప్పింది. ఆమె చెప్పినట్లే చేశాను. ఆ తర్వాత ఈ సరస్సులో నుండి మీరంతా బయటకు రావడం చూస్తున్నాను. ఇప్పుడు మీరు నా ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పండి. "మీరంతా ఎవరు? మీ తల్లిదండ్రులెవరు? మీ రెవరి భార్యలు?" అని అడుగగా ఆ సరోవర స్త్రీ ఇలా అన్నది.

ప్రాణ సఖీ! మేమూ నీకు మల్లేనే ప్రభువుకు ప్రాణ సఖుల మయ్యాం. బృందావనంలో విహరిస్తూ ఉంటాం. ఆ పరమ పురుషుడు మమ్మల్నందర్నీ ప్రేమతో లాలిస్తూ ఉంటాడు. మేమంతా గొల్ల పిల్లలం. ఇక్కడి వారంతా రాధాదేవి భర్త అయిన శ్రీకృష్ణుని సేవించే వాళ్ళే. ఆయనకు ప్రియురాళ్ళే. ఆ కనిపించేదే పూర్ణ రసాదేవి. ఆమె ప్రక్కనున్న పడతియే రసమందరాఖ్య. అవతలి తరుణినే రసాలయ అంటారు. ఈ ప్రక్కనున్నదే రసవాపిక. ఆమెకు కుడి ప్రక్కనున్న అంగనే రసవిహ్వల. ఆ తర్వాతిది అనంగమాలిని. ఈమె కలావతి. ఈ లలన రతికల. ఈమె కామకళ. ఈ వనిత కామదాయిని. వీరంతా వరుసగా రతి చింతామణి, నిత్యానంద, నిత్యరసప్రేమప్రద, యుద్గీత, సుగీత, కలసుర, కలకంఠ, క్రమపద, బహూహుత, బహుకళ, క్రియావతి. వీరంతా శ్రీకృష్ణుని ప్రియురాళ్ళే.

ఓ సుందరవదనా! మాతో కలసి విహరించు. వచ్చి స్నానం చెయ్యి. ఆ తర్వాత విధి ప్రకారం మంత్రోపదేశం చేస్తాం. ఆ మంత్రాన్ని పఠించి విధులన్నీ నిర్వర్తించు. నువ్వు సిద్ధులన్నీ

పొందగలుగుతావు. లక్షలకొద్దీ ఆ దేవిని ధ్యానం చెయ్యి. కరివీర పుష్పాలతో హోమం చెయ్యి అన్నారు. అర్జునుడు వారు చెప్పినట్లే జపహోమాలతో ధ్యానించి ఆ దేవి సాక్షాత్కారాన్ని పొందాడు. ఆ దేవి "బాలికా! నా చెలికత్తెలు చెప్పినట్లే చేశావు. నాకు ప్రియసఖి వయ్యావు. నీ మనోవాంఛ లన్నింటినీ తీరుస్తాను" అన్నది. ఆమె మాటలు వింటున్న అర్జునుడు పులకించిపోయి ఆ దేవి పాదాలపై పడ్డాడు. అతణ్ణి కరుణించిన ఆ దేవి ఓ చెలికత్తెను పిలిచి ఇలా అంది.

ఓ సఖీ! ఈ బాలికకు స్నానం చేయించండి. సంకల్ప పూర్వకంగా పూజలు చేయించండి. గోకులనాథ మంత్రాన్ని ఉపదేశించండి. గోకులనాథ వ్రతాన్ని చేయించండి. ఆ పిమ్మట శ్రీకృష్ణుని ధ్యానించేట్లు చెయ్యండి. పిమ్మట రాధాదేవి "ప్రియంవదా! ఈ బాలిక మంత్ర జపం పూర్తి అయ్యేంతవరకు కంటికి రెప్పలా కాపాడు" అని చెప్పి అంతర్ధానమయింది. రాధాదేవి చెప్పినట్లే ప్రియంవద అర్జునుని చేత విధి ప్రకారం పూజ, జపం,హోమం, ధ్యానం చేయించింది. అంతట రాధాదేవి శారద అనే చెలికత్తెను పిలిచి బాలిక రూపంలో ఉన్న అర్జునుణ్ణి తీసుకొని రమ్మంది. అక్కడ బృందావనంలో శ్రీకృష్ణుని దర్శనం చేయించింది. అంతలోనే భగవంతునిపై మోహం పెరిగిపోయింది. శ్రీకృష్ణుడు శారదతో "ఈ బాలికను ఈ క్రీడా సరోవరంలో స్నానం చేయించి తీసుకొని రమ్ము" అన్నాడు. ఆమె భగవంతుడు చెప్పినట్లే స్నానం చేయించి బయటకు తీసుకొని రాగానే అర్జునుడు తన పూర్వ రూపాన్నిపొందాడు. విచారవదనంతో ఉన్న అర్జునుణ్ణి దగ్గరకు తీసుకొని శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "అర్జునా! నువ్వింత కాలం శ్రీకృష్ణునికి నీకన్నా గొప్ప మిత్రుడు లేడని భావిస్తూ వచ్చావు. నీకు గుణపాఠం చెప్పేందుకే ఇదంతా చూపించాను. నీ అనుభూతుల్ని ఎవరికీ చెప్పకు" అని చెప్పి అదృశ్యుడయ్యాడు.

పరమశివుడు : కావున ఓ పార్వతీ! శ్రీకృష్ణ పరబ్రహ్మానికి విహారస్థానం బృందావనం. రాధాదేవే అతడి హృదయేశ్వరి.

విశేషార్థం : ఈ భాగంలో కృష్ణార్జునుల మైత్రిని గూర్చి ప్రస్తావించలేదు. బృందావన ప్రస్తావనంకు ప్రాముఖ్యమివ్వబడింది కాబట్టి రాధాదేవికే ప్రాముఖ్యం ఇవ్వబడింది. అనగా మాయా ఆవరణం తొలగిపోతేగాని భగవంతుని పొందలేరన్నది మరొక సారి స్పష్టమైంది. కావున ముందుగా ప్రకృతిని ఉపాసించి జ్ఞానాన్ని సంపాదించుకొని ఆ పిమ్మటనే భగవంతుని పొందాలి. దీని సారమేమంటే సగుణ బ్రహ్మాన్ని ఉపాసించి జ్ఞానం పొందిన తర్వాతనే నిర్గుణ తత్త్వాన్ని తెలుసుకోగలుగుతాం. ముందుగా అర్జునుడు త్రిపురసుందరిని ఉపాసించాడు. ఆ తర్వాతనే శ్రీకృష్ణుని నివాసాన్ని తెలుసుకోగలిగాడు. అట్లాగే శ్రీకృష్ణుని ఉపదేశమంతా వేదసారమే. నాకు తెలియని విషయం లేదన్న దురభిమానం ఉండకూడదు. ఈ విషయాన్ని అర్జునుడు స్వయంగా తెలుసుకొని జ్ఞానవంతుడయ్యాడు. గర్వాన్ని విడిస్తే గాని భగవద్భక్తి ఫలించదు.

రామకృష్ణుల మధురా ప్రయాణం

(ఈ భాగం బ్రహ్మ పురాణం, శ్రీకృష్ణ జన్మఖండం, శ్రీ భాగవతం, విష్ణుపురాణం, గర్గసంహిత, హరివంశం మొదలైన పురాణాల నుండి గ్రహించబడింది)

రామకృష్ణులు అక్రూరుడితో కలిసి మధురానగరానికి ప్రయాణమయ్యారు. నిస్సహాయులైన గోప గోపికలు శ్రీకృష్ణుని ఎడబాటుకు సహించలేక హృదయవిదారకంగా విలపించారు. గోపబాలురంతా మళ్ళీ కృష్ణుడితో ఆటపాటల్లో గడిపే రోజులు ఎప్పుడు వస్తాయా అని శ్రీకృష్ణుని వైపు దిగులుగా చూశారు. నేలమీద పరిస్థితి ఇట్లా ఉంటే నింగిమీద దేవతలంతా జేరి త్వరగా భూభారాన్ని తగ్గించమని ఆ పరమేశ్వరుణ్ణి ప్రార్థించారు. పూలవాన కురిపించారు. నెమ్మదిగా రథం ముందుకు సాగింది. వీరి మనోగతాల్ని గ్రహించిన అక్రూరుడు రథాన్ని వేగంగా ముందుకు నడిపాడు. ఈ సంఘటన ఆనాటి రామ వనవాస ఘట్టాన్ని తలపింపజేస్తోంది. ఈ ఘట్టంలో పోతనగారు ఎలా స్పందించారో చూడండి.

చ॥ *అదె చనుచున్న వాఁడు ప్రియుఁడల్లదె తేరదె వైజయంతియ*
ల్లదే రథఘోటకాంఘ్రిరజమాదెస మార్గముం జూడుఁడంచు
లో, నొదవెడి మక్కువన్ హరిరథోన్ముఖులై గములై
వ్రజాంగనల్, గదలక నిల్చి చూచిరటు కన్నుల కబ్బిన యంత దూరమున్

అక్రూరుని యమునా స్నానం :

అక్రూరుని రథం యమునా తీరానికి చేరే సమయానికి మధ్యాహ్నమయింది. అక్రూరుడు రథాన్నాపి బలరామకృష్ణులతో కుమార రత్నములారా! మీరు రథంలోనే కూర్చోండి. నేను నదిలో స్నానం చేసి మధ్యాహ్నిక సంధ్యావందనాది విధుల్ని ఆచరించుకొని వస్తాను. నేను తిరిగి వచ్చేంతవరకు ఇక్కడే రథంలో సుఖంగా కూర్చొని ఉండండి, అని వారినుండి అనుమతి తీసుకొని కాళిందీ జలాలవైపుగా వెళ్ళాడు. అక్రూరుడు యమునానదిలో స్నానం చేసి ఏకాగ్ర చిత్తంతో భగవంతుని ప్రార్థించాడు. ఇట్లా ధ్యానం చేస్తూ ఉండగానే వెయ్యి తలలతో వాసుకి బలరాముడు రూపంలో కనిపించాడు. ఆ అనంతునిపైన పట్టుపీతాంబరాలు ధరించి, శ్రీవత్సము మెడలో వ్రేలాడుతూ నవరత్న ఖచిత కిరీటాన్ని ధరించిన శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని దర్శించాడు. ఆ పరమాత్ముణ్ణి సనక సనంద సనత్కుమారాది యోగి పుంగవులు సేవిస్తున్నారు. వాళ్ళిద్దరూ బలరామకృష్ణులేనని అక్రూరుడు తెలుసుకున్నాడు. ఆశ్చర్యపోయాడు. తను వాళ్ళిద్దర్నీ రథంలో కూర్చోబెట్టి నదీ స్నానానికి వచ్చాడు. ఇంతలో వారిద్దరూయమునా జలాల్లో కనిపించారు. ఇది సాధ్యమా? లేక నా బుద్ధి ఏమైన మోహించిందా? లేక ఇదేనా కృష్ణమాయ అంటే? అని అనుకుంటూ నిశ్చేష్టుడయ్యాడు. ఈ ఘట్టాన్ని పోతనగారు ఎంత రసవత్తరంగా చిత్రించారో చూడండి.

ఉ॥ *పోషిత బాంధవుండు యదుపుంగవుఁడా జలములందుఁ గాంచె స*
ద్భాషు సహస్ర మస్తక విభాసితభూషు నహీశు భూమి భృ

ద్వేష గృపాభిలాషుఁ బ్రతినీరచమూవిజిగీషు నిత్యసం
తోషు నరోషు నిర్ధళిత దోషు ననేక విశేషు శేషునిన్.

సీ॥ *ఆ భోగి భోగసర్యంక మధ్యంబున వలనొప్పు పచ్చని వలువ వాని*
మేఘంబుపైనున్న మెఱుఁగుచందంబున నురమున శ్రీదేవి యొప్పు వాని
ముసరు తేఁటులు విచ్చుముఖ చతుష్కము గల తనయుఁ డాడెడి బొడ్డుఁ దమ్మివాని
గదలిన బహు ప్రదక్రమ విశేషంబుల రవము చూపెడి నూపురముల వాని

ఆ॥ *జలజగర్భ రుద్రసనకసనందన । సద్విజామర ప్రశస్య మాన*
చరియుఁడైన వాని సౌందర్యఖనియైన । వానినొక్క పురుష వర్యుఁ గాంచె.

ఈ విధంగా అక్రూరుడు నదిలో దిగి మధ్యాహ్నిక కృత్యాలు తీర్చుకుంటూ ఉండగా ధ్యాన నిష్ఠలో బలరామకృష్ణులు దర్శన మిచ్చారు. ఆశ్చర్యపోతూ అక్రూరుడు త్వరత్వరగా ఒడ్డుకు వచ్చి రథంవైపు చూశాడు. అన్నదమ్ములిద్దరూ అన్యోన్యంగా మాట్లాడుకుంటూ కనిపించారు. వారు రథంపై నుండి దిగనైనా దిగినట్టు లేదు. ధ్యానంలో కనిపించిన శ్రీకృష్ణ పరబ్రహ్మమే మానవాకారం లో రథం పై కనిపించాడు. అక్రూరుడు మళ్ళీ నదీ తీరానికి పోయి ధ్యానం చెయ్యగా మళ్ళీ వేయి పడగలు గల శేషశాయిపై పవళించిన శ్రీకృష్ణ పరబ్రహ్మం దర్శన మిచ్చాడు. ఆ పరబ్రహ్మాన్నే గంధర్వులు, కిన్నెరలు, కింపురుషులు, సిద్ధ విద్యాధరులు సేవించుకుంటారు. అక్రూరునికి ఆ తత్త్వ మేదో బోధ పడింది.

(ఈ భాగం బ్రహ్మ పురాణం నుండి గ్రహించబడింది)

సర్వజ్ఞానమయుడైన అచ్యుతుని ఇలా కీర్తించాడు. జ్ఞాన స్వరూపుడవైన ఓ శ్రీకృష్ణ పరబ్రహ్మమా! నీకు నమస్కారము. నీ మహిమ నెవ్వరూ తెలుసుకోలేరు. నువ్వు అద్వైతుడవు. భక్తులను సంతోష పెట్టేందుకు నువ్వు అనేక నామరూపాల్ని ధరిస్తావు. నువ్వు ఒక్కడివే సుమా. నువ్వు తప్ప రెండవ వారు లేరు. ఇట్టి నీకు వందనములు. ఓ కృష్ణా! నువ్వు ప్రకృతికన్నా అతీతుడవు. జ్ఞాన స్వరూపుడవు. సకల భూతాకారుడవు. సకలేంద్రియ స్వరూపుడవు. ఆత్మలన్నింటికీ ప్రధానమైన వాడవు. ఇట్టి నీకు నమస్కరిస్తున్నాను. మహానుభావా! శ్రీకృష్ణా! బ్రహ్మ రుద్రులచే అనేక నామ రూపాలతో పిలువబడుతూ ఉంటావు. నిన్ను తెలుసుకోవడం గానీ, నిన్ను కీర్తించడంగాని, నీ లీలకు ఫలమిది అని చెప్పగలవారు లేరు. నీకెన్ని నామరూపాలున్నాయో ఎవరికీ తెలియదు. అట్టి పరబ్రహ్మవు. నీవు నిర్వికారుడవు. అజుడవు. కృష్ణుడని, అచ్యుతుడని, విష్ణువని ఇంకా అనేక నామాలతో నిన్ను కీర్తిస్తూ ఉంటారు. నీ తత్త్వమిది అని తెలుసుకోవడం బ్రహ్మాదులకు కూడా శక్యం కాదు, ఇక నావంటి వాని మాట వేరే చెప్పాలా? ఈ సృష్టి అంతా నీస్వరూపమే. పశుపతి, యముడు ఇంద్రాదులు నువ్వే. నువ్వు కానిది ఈ లోకంలో ఏదీ లేదు. బ్రహ్మాండాలన్నీ నీ స్వరూపాలే. పరమేశ్వరా! వేద వేదాంగాలే నీ మహిమను అణుమాత్రమైనా తెలుసుకోలేకుండా ఉన్నాయి. ఇక నాబోటి వాడు నిన్ను ఏమని కీర్తించగలడు. కావున నా అజ్ఞానాన్ని క్షమించు.

అక్రూరుడు ఈ విధంగా ధ్యానించి మనస్సులోనే పుష్పాలతో పూజించి, మనస్సు పరబ్రహ్మమందు నిశ్చలమైనందుకు మహదానందపడుతూ రథం వద్దకు చేరుకున్నాడు. అక్కడ రథంపైన అన్నదమ్ములిద్దరూ మాట్లాడుకుంటూ ఉండటం చూశాడు. సంభ్రమాశ్చర్యాలతో మునిగి ఉన్న అక్రూరుణ్ణి చూసి శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "మామా! అక్రూరా! ఎందుకంత ఆశ్చర్యపోతున్నావు? నదిలో ఏమైనా వింతలు విశేషాలు చూశావా? ఆ విశేషాలు చెప్పి మమ్మల్ని కూడా సంతోషపెట్టు. యమునా నదిని ప్రక్కనే పెట్టుకొని స్నానం చేసి రావడానికి ఇంతసేపు పట్టిందా? ఎందుకు ఇంత ఆలస్యం చేశావు?" అని నవ్వుతూ అడిగాడు. కృష్ణుడి మాటలకు అక్రూరుడు చేతులు రెండూ జోడించి నమస్కరిస్తూ ఇలా అన్నాడు. "ఓ మహాత్మా! యమునా నదిలో దేన్ని చూసి నేను ఆశ్చర్యపోయానో ఆ వస్తువును ఇక్కడ కూడా చూస్తున్నాను. ఏ పరాత్పరుని విలాసంచేత ఈ బ్రహ్మాండాలన్నీ నడుపబడుతున్నాయో ఆ పరాత్పరుడే మానవ రూపంలో నా ప్రక్కనే కూర్చున్నాడు. మహానుభావా! కృతకృత్యుడనయ్యాను. హరిహర బ్రహ్మాదులే నీ విలాసాన్ని తెలుసుకోలేరు. ఇక నేనెంత? అయితే ఇంతవరకు నేను అనుభవించిన ఆనందం మరెవ్వరూ అనుభవించి ఉండరని నమ్ముతున్నాను " అని పరిపరివిధాలుగా స్తుతించి మధురకు ప్రయాణాన్ని కొనసాగించారు.

విశేషార్థం : అక్రూరుడు మొదట్నుంచీ శ్రీకృష్ణుడు పరబ్రహ్మమనే నమ్ముకున్నాడు గదా. అటువంటి వాడికి మళ్ళీ దర్శనమివ్వాల్సిన అవసరం ఏముంటుంది? అన్న ప్రశ్న రావచ్చు.

లోకంలో పెద్దలు చెప్పిన మాట మీద గాని, శాస్త్రం చెప్పిన ఉపదేశం పైన గాని విశ్వాసం ఏర్పడుతుంది. అయితే అది చాలాకాలం నిలవదు. మనస్సు బుద్ధి ఎప్పుడు ప్రత్యక్ష ప్రమాణానికే పెద్దపీట వేస్తుంది. అట్లా ఏర్పడిన విశ్వాసం శాశ్వతంగా ఉండిపోతుంది. తన భక్తులనుకున్న వారికి అటువంటి విశ్వాసాన్ని కలిగించడం భగవంతుని ఆశయం. అందులోను మానవరూపంలో వచ్చిన అవతారపురుషునికి విధికూడా. అదే ఇప్పుడు శ్రీకృష్ణుడు చేసింది కూడా. అనగా శ్రీకృష్ణుడే పరబ్రహ్మమన్న దృఢ విశ్వాసం అక్రూరునిలో ఇంతవరకు ఏర్పడి ఉండదు. ఇంకా అటువంటి అనుమానలెన్నో ఉండవచ్చు. వాటన్నింటినీ తొలగించి అక్రూరునికి దృఢవిశ్వాసం కలిగించి కృతార్థుడ్ని చెయ్యాలని భగవంతుడు ఊహించాడు. అందువల్లనే అతడి ధ్యాన నిష్ఠలో తన సర్వవ్యాపకత్వాన్ని కనబరచాడు. శ్రీకృష్ణుడు శేషశాయి పై దర్శనం ఇవ్వడం మూలంగా అక్రూరునికి రామకృష్ణుల అవినాభావ సంబంధాన్ని తేటతెల్లం చేసినట్లయింది. అక్రూరుడా రూపాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. మరి రథంపై నున్న వారేమయ్యారని ఒడ్డుకొచ్చి రథంలో చూశాడు. వాళ్ళిద్దరూ అక్కడే మాట్లాడుకుంటున్నారు. మళ్ళీ నీళ్ళ లోకి పోయి కళ్ళు మూసి ధ్యానం చేసినా అనంతుని శయ్యగా చేసుకున్న శ్రీకృష్ణుడే కనిపించాడు. దాంతో వీరిద్దరి తత్త్వం ఒక్కటేనన్న విశ్వాసం దృఢపడింది. భక్తులకు కలిగే సందేహాలు కూడా ఈ విధంగానే ఉంటాయి. కావున శ్రీకృష్ణుడు వారి సందేహాలు కూడా నిర్మూలించినట్లైంది. ఇది శ్రీకృష్ణుడు ప్రత్యక్ష ప్రమాణం ద్వారా అక్రూరుడి సందేహాలన్నింటినీ నిర్మూలించాడు. భగవంతుడు ఇటువంటి సందేహాలు తొలగిస్తే గాని భక్తుని మనస్సు నిశ్చలం కాదు.

నీళ్ళల్లోనించి బయటకు వచ్చి రథంలో రామకృష్ణుల్ని చూడగానే, పరమేశ్వరుడతణ్ణి పరీక్షించాలనుకున్నాడు. అక్రూరుడు భక్తి నమ్రతలతో ఏమన్నాడో పోతనగారి మాటల్లో వినండి.

క॥ నీలోన లేని చోద్యము । లేలోకమునందుఁ జెప్ప రీశ్వర నీటన్
నేలన్ నింగిని నున్నవె । నీలోఁ జోద్యంబుల లెల్ల నెగడె మహాత్మా.

ఎప్పుడైతే అక్రూరుడు శ్రీకృష్ణుని పరబ్రహ్మంగా గుర్తించి స్తుతించాడో శ్రీకృష్ణుడు సంతృప్తి చెందాడు. భక్తుడు తన తత్త్వాన్ని తెలుసుకునేంత వరకు ఉపదేశిస్తూనే ఉంటాడు. అతడు తెలుసుకున్న తర్వాత తన సంతోషాన్ని వ్యక్తం చేస్తాడు. భగవంతుని సర్వవ్యాపకునిగా, బ్రహ్మాండాలన్నింటికీ నాయకుడుగా, సర్వభూతమయునిగా తెలుసుకోగలిగినవాడే భక్తుడు. అక్రూరుడి విషయంలో అదే జరిగింది. అందువల్లనే భగవంతుడు తన హర్షం ప్రకటించాడు.

రథం మధురానగర ప్రాంతానికి రాగానే అక్రూరుడు శ్రీకృష్ణునికి నమస్కరించి ఇలా అన్నాడు. "శ్రీకృష్ణా! ఇదే మధురానగరం. మొదటగా నీ పాదం మోపటం చేత ధన్యమవబోతోంది. నీ తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులుండే నగరం కూడా ఇదే. మహాత్మా! నిన్నీ మధురానగరానికి తీసుకురావడంలో కృతకృత్యుడనయ్యాను. అందువలన నా జన్మ చరితార్థమైంది. ఇకనుండి మధురానగర వాసులను కూడా కృతకృత్యుల్ని చెయ్యి.

రథంలో భగవంతుణ్ణి చూస్తున్న మధురానగర వాసులంతా సంతోషంతో జయజయ ధ్వానాలు చేశారు. నందాదులంతా మధురానగరంలోని ఓ ఉద్యాన వనంలో అక్రూరుని రథం కొరకు ఎదురు చూస్తున్నారు. రామకృష్ణుల్ని చూడగానే వాళ్ళకు ప్రాణాలు లేచి వచ్చినట్లుయింది. అక్కడకు చేరుకున్న వేలాది ప్రజలు కూడా తమ హర్షాన్ని ప్రకటించారు.

శ్రీకృష్ణుడు అక్రూరునితో "దానపతీ! నువ్వు రథాన్ని తీసుకొని ముందుకుపో. మేము మధురానగరంలోని విశేషాలన్నీ చూస్తూ ఉదయానికల్లా వస్తాం. ఈ మాటలు విన్న అక్రూరుని ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేనట్లుగా వెలవెల బోయింది. ఇలా ప్రార్థించాడు. "పరమేశ్వరా! నన్ను ఒంటరిగా పొమ్మని ఆజ్ఞాపించవద్దు. నా ఇంటికి వచ్చి నా ఆతిథ్యాన్ని స్వీకరించు. నన్ను, నాయింటిని మావంశాన్ని పవిత్రం చెయ్యి. నీపాద స్పర్శ చేత బలి చక్రవర్తి సాటిలేని ఐశ్వర్యాన్ని పొందాడు. నీ పాదోదకాన్నే శంకరుడు శిరస్సున పెట్టుకున్నాడు" అని ప్రార్థించాడు. అందుకు పరమేశ్వరుడు "ఓ అక్రూరా! నేను బలరాముడు ముందుగా కంసుని వధించి ఆ తర్వాత నీ ఇంటికి వస్తాం. నీకు సంతోషాన్ని కలిగిస్తాను. పోయిరా" అన్నాడు అంతట అక్రూరుడు శ్రీకృష్ణునికి నమస్కరించి మధురానగర ప్రవేశం చేశాడు.

మధురానగర ప్రవేశం :

శ్రీకృష్ణ బలరాములు వెనుక యదువంశీయులంతా వెంటరాగా వారంతా మధురా నగరంలో ప్రవేశించారు. ఆనగరం అతి సుందరమైనది. విశ్వకర్మ దాన్ని నిర్మించాడు. రాజమార్గాలన్నీ విశాలంగా ఉన్నాయి. శ్రీకృష్ణుడు ఆ రోజు వస్తున్నాడని నగరంలోని చిన్నా పెద్దా అందరికీ ముందే తెలుసు.

అందువల్ల భగవద్దర్శనానికై జనం అంతా గుంపులు గుంపులుగా వెంట నడిచారు. స్త్రీలంతా మేడలెక్కి పైభాగం నుండి పూల వాన కురిపించారు. మధురానగరంలో అనేక ఉద్యానవనాలున్నాయి. నగరం చుట్టూ పెద్ద ప్రాకారాలుండి శత్రు దుర్భేద్యంగా నిర్మించబడ్డది. ఈవిధంగా వారంతా మధ్యాహ్నం వరకు కలసి తిరిగారు. ఆ తర్వాత బలరామకృష్ణులు మాత్రమే యాగశాలవైపుగా బయలుదేరారు. దారిలో భగవద్దర్శనానికై నిలబడ్డ స్త్రీలంతా శ్రీకృష్ణుని చూసి ఆనందబాష్పాలు రాల్చారు. గోకులంలో నివసించే గోపికలు ఎంత అదృష్టవంతులో గదా అని సుందరీమణులు కొందరు ఈర్ష్యపడ్డారు. ఇన్నాళ్ళకు ఈ నగరం కృతార్థత చెందింది గదా అని కొందరు సంతోషించారు.

ఈ ఘట్టాన్ని మహాకవి పోతన గారు,

ఉ॥ *నంద తపః ఫలంబు సుగుణంబుల పుంజము గోపకామినీ*
బృందమునోముపంట సిరివిందు దయాంబుధి యోగిబృందముల్
డెందములందుఁ గోరెడు కడిందినిధానము చేరవచ్చె నో
సుందరులార రండు చని చూతము కన్నుల కోర్కిదీఱఁగన్.

సీ॥ *వీఁడటే! రక్కసి విగత జీవఁగఁ జన్నుఁ బాలుద్రావిన మేటి బాలకుండు*
వీఁడటే! నందుని వెలఁదికి జగమెల్ల ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు
వీఁడటే! మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దాఁపరీఁడు
వీఁడటే! యలయించి వ్రేతల మానంబు చూఱ లాడిన లోక సుందరుండు

తే॥ *వీఁడు లేకున్నపుర మటవీస్థలంబు*
వీని బొందని జన్మంబు విగతఫలము
వీనిఁ బలుకని వచనంబు విహగరుతము
వీనిఁ జూడని చూడ్కులు వృథలు వృథలు.

మ॥ *చెలియా గోపిక లీకుమారతిలకున్ జింతిచుచుం బాడుచున్*
గలయం బల్కుచు నంటుచున్ నగుచు నాకర్షించుచున్ హ
స్తగా, మలక క్రీడకుఁ దెచ్చి నిచ్చలును సమ్మానంబులం బొం
దఁగా, దొలి జన్మంబున నేమినోచిరోకదె దుర్గ ప్రదేశంబులన్.

అని శ్రీకృష్ణుని వర్ణించి కృతార్థుడయ్యాడు. మహాకవి మనోభావాల్ని మనం ఇట్లా అన్వయించుకోవచ్చు

ఈ మాటలన్నీ మధురానగరంలోని స్త్రీలు గోకులంలోని గోపికల్ని గూర్చి ఊహించి ఉంటారని పోతనగారి భావన. "ఈ గోపికలంతా భగవంతుని సేవించేందుకు గోలోకం నుండి వచ్చి గోపికలుగా జన్మించారు. బాలుని రూపంలో ఉండే భగవంతుణ్ణి తలచుకుంటూ గుణగణాల్ని పాటలుగా పాడుకుంటూ, పరమాత్ముని తత్త్వాన్ని మరీమరీ తలచుకుంటూ సేవిస్తున్నారు. ఆహా! వారి అదృష్టం ఏమని వర్ణించగలం? ఆ గోపబాలురంతా మనోహరుడైన ఈ బాలుణ్ణి తాకుతూ, ఆడుతూ, పాడుతూ ఆ భగవంతునిపై ఎడతెరిపిలేని ప్రేమామృతాన్ని కురిపిస్తున్నారు. గోపికలంతా హృదయ పీఠాన్ని

అలంకరించమని, నాపూజల్ని అందుకోమని, ముందుగా నాకు దర్శనమిమ్మని ఆ భగవంతుని చెయ్యి పట్టుకొని లాగుతున్నారు గదా. యోగీశ్వరులకు కూడా దుర్లభుడైన భగవంతుడు వీరికింత సులభంగా చిక్కాడే? వీళ్ళంతా పూర్వ జన్మల్లో ఏ యే వ్రతాలు, నోములు నోచారో గదా. ఎన్ని కఠోరమైన తపస్సులు చేశారో గదా."

మనమీ అర్థాన్ని గ్రహించకపోతే భగవన్మహిమను తగ్గించి చెప్పుకున్నట్లవుతుంది. స్త్రీలు భగవంతుని ప్రేమతో పూజిస్తారు. మునీశ్వరులు ధ్యానం ద్వారా అర్చన చేస్తారు. భగవంతుడు రెంటికీ ఫలం సమానంగానే ఇస్తాడు. పూర్వ జన్మల్లో సుకృతాలు చెయ్యని వారికి భాగ్యం కలుగదు.

రజకునికి విముక్తి :

శ్రీకృష్ణ బలరాములు మధురానగర రాజ వీథుల్లో నుండి పోతూ ఉండగా వారికో రజకుడు (చాకలి) ఎదురుపడ్డాడు. కంసుడికి వస్త్రాల్లోనే రాజఠీవి ఉట్టి పడేట్లు వాటిని శుభ్రం చెయ్యడంలో గొప్ప నేర్పు సంపాదించాడు. అందువల్లనే కంసుడి వస్త్రాలను శుభ్రం చేసే హోదాకు ఎదగ్గలిగాడు. అతడినైపుణ్యానికి తోడు రాజాదరణ కూడా లభించడంతో అతడి నోటి దుడుకు తనానికి అడ్డులేకుండాపోయింది.

ఆనాడు కూడా కంసుని వస్త్రాలు శుభ్రం చేసి అంతఃపురానికి తీసుకొని వెళ్తున్నాడు. వాడిని చూసి శ్రీకృష్ణుడు "ఓ రజకా! నీవద్ద చాలా వస్త్రాలున్నాయి గదా. అందులో మా ఇద్దరికీ సరిపోయే దుస్తులనివ్వు. మేమా వస్త్రాల్ని ధరించడం వలన ఆ వస్త్రాలకే కొత్త అందాలు వస్తాయి. అంతేకాదు నువ్వు మాకీ వస్త్రాలనివ్వడం వలన నీకు గొప్ప శ్రేయస్సు చేకూరుతుంది." అసలే ఆ చాకలి వాడు గర్విష్ఠి. అందుమూలంగా తన్ను యాచించిన వాడు పరిపూర్ణుడని, పరాత్పరుడని, లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణ పరమాత్మ అని తెలుసుకోలేకపోయాడు. వాడికి పూర్వజన్మ సుకృతాలు ఉన్నా కొద్దో గొప్పో దుష్కృతాలు గూడా ఉండి ఉంటాయి. వాడి దుష్కృత ఫలంచేత మాయ అతణ్ణి కప్పేసింది. శ్రీకృష్ణుణిపై కోపంతో ఇలా అన్నాడు.

మీరంతా అడవుల్లోను కొండల్లోను ఉండేవాళ్ళు. ఇటువంటి వస్త్రాల్ని కట్టలేరు సరిగదా. కనీసం కళ్ళతోనైనా చూసి ఉండరు. అందువల్లనే మూర్ఖుల్లా వచ్చి బట్టలిమ్మని అడుగుతున్నారు. ఈ వస్త్రాలన్నీ ఎవరివో తెలుసా? వింటే మీ పై ప్రాణాలు పైనే పోతాయి. వీటిని కంసమహారాజు కోసం తీసుకొని వెళ్తున్నాను. వీటిని ఎవరైనా కన్నెత్తి చూసినా రాజభటులు వారిని ఇక్కడికిక్కడే చంపేస్తారు. మీరేదో పల్లెటూరి వాళ్ళు. రాజభటుల కళ్ళు పడకముందే ఇక్కడ నుండి పోయి ప్రాణాలు కాపాడుకోండి అన్నాడు.

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం నుండి గ్రహించబడింది)

ఆ రజకుడు ఇంకా ఇలా అన్నాడు. నువ్వు గోకులం నుండి వస్తున్నావని తెలుస్తూనే ఉంది. ఆ పల్లెలో వాళ్ళు నిన్ను నెత్తిన పెట్టుకొని పూజించవచ్చు. దాంతో నువ్వు గోపికలందరితో సరసాలాడుతూ ఉంటావని కూడా విన్నాను. అనగా నీ అంతటి విషయ లంపటుడు ఇంకోడుండడు.

నీ తిరుగుళ్ళన్నీ బృందావనంలో అయితే చెల్లు తాయేమోగాని మా మధురానగరంలో నీఆటలు సాగవు.మా రాజేంద్రుడు చండశాసనుడు. దుష్టుల్ని ఎంత మాత్రం క్షమించడు. కావున త్వరగా ఇక్కడ నుండి వెళ్ళిపో.

వాడి మాటల్ని బట్టి వాడెంత అజ్ఞానియో బలరాముడు గ్రహించాడు. జాలితో నవ్వగా, గోపబాలుడు కూడా పకాలున నవ్వాడు. రజకుడు ఉక్రోషంతో వాళ్ళపై చెయ్యి చేసుకున్నాడు. దీంతో అతడి సుకృతాలు ఫలించే సమయం వచ్చింది. శ్రీకృష్ణుడు ఆ రజకుడు ఎత్తిన చేతిని పట్టుకొని రెండో చేత్తో వాడి తలపైన అరచేత్తో కొట్టి ముక్తిని అనుగ్రహించాడు. ఆ తర్వా త అతడి వద్దనున్న వస్త్రాలన్నింటినీ తాను బలరాముడు ధరించి మిగిలినవన్నీ గోపబాలురకు పంచాడు. వారా వస్త్రాల్ని ధరించగానే గోలోకం నుండి విమానం వచ్చి రజకుని ఆత్మనందులో కూర్చోబెట్టుకొనగా విష్ణు పార్షదులు అతణ్ణి గోలోకానికి తీసుకుపోయారు.

విశేషార్థం : ఆ రజకుని శిరస్సున తన అరచేత్తో చరిచి చంపినట్లు పురాణాలన్నింట్లోను ఒకే విధంగా ఉంది. గురువు కూడా తన అరచేతిని శిష్యుని తలపై ఉంచి ఉపదేశిస్తాడు. దీన్నే హస్త మస్తక సంయోగమంటారు. శిరస్సున బ్రహ్మరంధ్రం ఉండే చోటినే సహస్రారం అంటారు. ఇక్కడ సహస్రారంలో ఉండే వస్తువూ, అరచేత్తో తట్టినదీ కూడా భగవంతుడే, అందువల్ల ప్రకృతి విశిష్టుడైన జీవుడు అక్కడ నుండి లేచి స్వస్థానాన్ని చేరుకోవడమన్నమాట. శ్రీశంకరభగవత్పాదుల వారు తమ సౌందర్యలహరిలో ఇలా ఉపదేశిస్తారు.

మూలాధార స్వాధిష్ఠాన మణిపూరక అనాహత, విశుద్ధ, జ్ఞానాత్మకములను వీటిని షట్చక్రాలని అంటారు. పృథ్వి, అగ్ని, నీరు, వాయువు, ఆకాశము అను వీటిని మనస్తత్త్వాత్మకములు అని అంటారు. ఇవి ఆయా చక్రములందు తన్మాత్రలుగా ఉంటాయి. తన్మాత్రములంటే గంధము, రూపము, స్పర్శ, రసము, శబ్దములు. ఆజ్ఞా చక్రంలో ఉండే మనస్తత్వం ఈ పదకొండు ఇంద్రియాల్ని గ్రహిస్తుంది. వీటినే ఏకవింశతి తత్త్వాలని అంటారు. మూలప్రకృతి వెయ్యి దళాలు గలిగిన పద్మమందు విరాట్పురుషునితో విహరిస్తూ ఉంటుంది. ఇందులో నాలుగు తత్త్వాలుంటాయి. అవి మాయ, శుద్ధ విద్య, మహేశ్వర, సదాశివాత్మకములు. ఈ నాలుగు తత్త్వాలతో కలసి మొత్తం ఇరవై అయిదు తత్త్వాలయ్యాయి. ఇవన్నీ మాయ చేత ఆవరించబడి ఉంటాయి. అనగా ప్రకృతి అధీనంలో ఉండేవి కనుక ప్రాకృతములని అంటారు. మాయ భగవంతుడితో కలసి జీవాత్మ అవుతుంది. అయినా కూడా అట్టి జీవుడు ప్రకృతి విశిష్టుడే అవుతాడు. (భగవంతుడు కాడు) శుద్ధ విద్య సదాశివునితో కలసినప్పుడు దానిని సాదాఖ్య కళ అంటారు. అనగా మూలప్రకృతి (భగవతి) అనే అర్థం. ఆ భగవతి అధీనంలో ఉండే చతుర్వింశతి తత్త్వాల్ని దాటితే గాని, షడ్వింశతి తత్త్వంగా ప్రసిద్ధి చెందిన పరమాత్మను దర్శించలేము.

ఈ విధంగా శ్రీకృష్ణుడు రజకుని సహస్రార కమలంలో మాయతో కలసి ఉన్న తన నిజస్వరూపాన్ని తట్టి లేపాడు. అనగా ఆ రజకునికి ముక్తిని ప్రసాదించాడు.

ఇక్కడ ఇంకో విషయం కూడా విమర్శించుకోవాలి. అదేమంటే, రజకుడు రాజసేవకుడు. రాజు గుడ్డల్ని రాజు వద్దకు తీసుకొని పోతున్నాడు. దారిలో బలరామకృష్ణులు ఆ వస్త్రాల్ని తమకిమ్మన్నారు. రజకుడు ఆగ్రహంతో చెప్పిన మాటలన్నీ న్యాయంగానే ఉన్నాయి. అంత మాత్రానికే శ్రీకృష్ణుడు వాడిని చంపవచ్చునా? అని అడుగవచ్చు. దీంట్లో ఉన్న తత్త్వాన్ని ఆలోచించాలి.

భగవంతడు మధురా నగరంలో అనేక మందికి ముక్తిని ప్రసాదాదించాలని సంకల్పించాడు. అందువల్లనే అక్రూరుడు ఎంత ప్రార్థించినా అతడితో వెళ్ళకుండా బలరామకృష్ణులు విడిగా మధురానగర ప్రవేశం చేశారు. అందువల్లనే భగవంతుడు రజకుని శిరస్సును తాకి మాయతో కలసి ఉన్న తన నిజస్వరూపాన్ని తట్టిలేపి తనలో ఐక్యం చేసుకున్నాడు. దీనికి పోతనగారు ఎలా స్పందించారో చూడండి.

క॥ ఘోరకరాగ్రతలంబున । ధీరుఁడు కృష్ణుండు శిరము తెగిపడఁ గొట్టెం
బౌరుల గుండెలు పగులఁగ । వీరోద్రేకిన్ మదావివేకం జాకిన్.

శ్రీకృష్ణుడు రజకునికి ముక్తిని ప్రసాదించి గోపబాలకులతో పోతూఉండగా ఒకచోట ఓ సాలెవాడు కనిపించి శ్రీకృష్ణుని భక్తితో పూజించాడు. తనవద్దనున్న వస్త్ర ఆభరణాలతో బలరామకృష్ణుల్ని అలంకరించాడు. రామకృష్ణులప్పుడు సూర్యచంద్రుల్లా వెలిగిపోయారు. భగవంతుడతణ్ణి కరుణించి మరణానంతరం ముక్తిని ప్రసాదించాడు.

మాలాకారుని పూజలు :

శ్రీకృష్ణ బలరాములు నగరవీథుల్లో వెళ్తూ ఉంటే దారిలో ఒక పుష్పహారాల దుకాణాన్ని చూశారు. సుదాముడనే ఆ మాలాకారుడు గొప్ప విష్ణు భక్తుడు. కంసునికి పూలహారాలు సమర్పించుకుంటూ జీవనయాత్ర సాగిస్తున్నాడు. అతడు రామకృష్ణులను చూడగానే సంభ్రమాశ్చర్యాలతో ఎదురువెళ్ళి నమస్కరించాడు. అర్ఘ్యపాద్యాదులతో పూజించాడు. పరమాత్ముడితో ఇలా అన్నాడు. మహాత్మా! నా జన్మ ధన్యమైంది. నా వంశమంతా తరించింది. నీ రాక వలన నాకు సమస్త సుఖాలు చేకూరాయి. లోకాన్ని ఉద్ధరించేందుకు అవతరించిన పరమేశ్వరుడవు నీవే. ఓ జగదేక ప్రభువుల్లారా! నేను మీ సేవకుణ్ణి నన్ను ఆజ్ఞాపించండి. నా సేవలు స్వీకరించండి" అంటూ అనేక విధాలుగా స్తుతించాడు.

భగవంతుడు సుదాముని సేవలకు సంతోషించి అతడుసమర్పించిన మాలలను ధరించాడు. వరదులు కాబట్టి నీకేం వరం కావాలో కోరుకోమన్నారు. సుదాముడు కోరుకున్న వరాన్ని పోతనగారెలా వర్ణించి చెప్పారో చూడండి.

క॥ నీ పాదకమల సేవయు । నీ పాదార్చకులతోటి నెయ్యమును నితాం
తాపార భూతదయయును । దాపసమందార నాకు దయచేయఁగదే.

అతడు కోరిన వరములు భక్తి ప్రపూర్ణములు. కావున శ్రీకృష్ణుడు వాటిని సంతోషంగా ఇచ్చాడు. భక్తి ప్రపత్తులతో తనకున్న సంపదనే (పూలమాలలు) సమర్పించుకున్నాడు. భగవంతుడు వాటికే పరమానంద భరితుడయ్యాడు. ఇక్కడ పూలమాలల విలువ కట్ట వచ్చునే గాని అతడి భక్తి వెలకట్టలేము.

అందువల్లనే భగవంతుడు తృప్తి చెందాడు. వరం కోరుకోమంటే అతడు కోరుకున్న వరాలెట్లాంటివి? భగవత్పాదసేవ, భగవత్పాదసేవకులతో మైత్రి, సర్వ భూతముల యెడల దయయు, కలగాలని కోరుకున్నాడు. వీటిలో ఏ ఒక్క కోరికకైనా ముక్తికి యోగ్యుడయ్యేవాడే. కావున నిర్మల భక్తినే భగవంతుడు మెచ్చుతాడు.

కుబ్జకు వరమిచ్చుట :

బలరామకృష్ణులు రజకుడి నుండి రాజవస్త్రాల్ని, మంచి సుగంధాలు వెదజల్లే పుష్పమాలల్ని ధరించి రాజమార్గాన వెళ్తున్నారు. అట్లా వెళ్తూ ఉండగా వికృతాకారంలో ఉన్న ఒక స్త్రీ ఎదురైంది. ఆమె శరీరం మూడు వంకర్లు తిరిగి ఉంది. ముఖసౌందర్యంలో మాత్రం దేవకన్యల్ని మించిన అందగత్తె. ఆమె పేరు కుబ్జ. కంసుని ఆస్థానంలో సుగంధాలు, విలేపనాలు తయారు చేసే సైరంధ్రి. ఈ విద్యలో ఈమెను మించిన వారీ రాజ్యంలోనే లేరు. అందువల్లనే కంసుడు తనకు కావలసిన విలేపనాలన్నీ తయారు చేసేందుకు ఈమెను నియమించాడు. ఆ రోజున సుగంధాలు వెదజల్లే విలేపనాల్ని తీసుకొని అంతఃపురానికి పోయే కుబ్జను బలరామకృష్ణులు చూశారు. రామకృష్ణుల అందానికి కుబ్జ పరవశురాలైంది. శూర్పణఖ గా పుట్టి శ్రీరాముని అందచందాలకు మోహించిందేకాని పొందలేకపోయింది. తన కోరిక నెరవేర్చుకోవటానికి కృష్ణావతారం వరకు వేచి ఉంది. ఆమెయే ఈ జన్మలో కుబ్జగా పుట్టి శ్రీకృష్ణుని రాక కోసం ఎదురు చూస్తోంది. శ్రీకృష్ణుడు ఆమె వద్దకు పోయి ఓ సుందరీ! నువ్వెవరవు? ఈ లేపనాలన్నీ ఎవరి కొరకు తీసుకొని వెళ్తున్నావు? మా ఇద్దరికీ ఈ లేపనాలివ్వు. అందువల్ల నువ్వు ఉత్తమమైన శ్రేయస్సును పొందగలుగుతావు అన్నాడు. పోతనగారు ఇలా వ్రాశారు.

ఉ॥ *చక్కనివాఁడ వౌదు సరసంబుల నొంపకు మెల్ల వారికిం*
జక్కఁదనంబు లెక్కడివి చారు శరీర త్రివక్ర యంద్రు నే
నిక్కము కంసుదాసిని వినిర్మల లేపనవిద్యదాననన్
మిక్కిలి రాజు మెచ్చుఁ దగ మీరు విలేపనంబులు ధరింపరే.

శ్రీకృష్ణుని మాటలు విన్న కుబ్జ సుందరాకారా! నేను కంసుని దాసిని. అనులేపనాలు తయారు చెయ్యడంలో దిట్టని. నన్ను త్రివక్ర అంటారు. నేను చేసే అనులేపనాలంటే కంసునికి చాలా ఇష్టం. ఇంతవిలువైన లేపనాల్ని ధరించేందుకు మీరే తగినవారు అన్నది. అంతేకాదు శ్రీకృష్ణుని మాటలకు, సౌందర్యానికి రసికత్వానికి మోహితురాలైంది. మనస్సు పరవశమైంది. కంసుదంటే భయం పోయింది. వస్తువులన్నీ ఆ సోదరులిద్దరికీ సంతోషంతో సమర్పించింది. ఈ వస్తువులు ధరించేందుకు వీరు తప్ప ముల్లోకాల్లోనూ ఎవరూ లేరన్నది.

రామకృష్ణులిద్దరూ ఆ లేపనాలను తీసుకున్నారు. చక్కగా శరీరం అంతా పూసుకున్నారు. ఆ పూత వలన మరింత ప్రకాశవంతంగా కనిపించారు. వారిని చూస్తుంటే కుబ్జ కళ్ళు జిగేల్ మన్నాయి. శ్రీకృష్ణునికి ఆమెపై కరుణ కలిగింది. ఆమె శరీర దోషాల్ని సరిచెయ్యాలనుకున్నాడు. ఆమెపై చల్లటి చూపుల్ని ప్రసరింపజేశాడు. ఆమె పాదాలపైన తన బొటన వేళ్ళతో గట్టిగా నొక్కి పెట్టాడు. ఆమె

గడ్డం క్రింద తన చూపుడు వ్రేలు ఉంచి పైకి ఎత్తాడు. భగవానుడి పాదస్పర్శ, హస్త స్పర్శతో ఆమెలో ఉండే సకల దోషాలు పోయాయి. దేవకన్యల్ని తలదన్నే సౌందర్యవతి అయింది. తన అందానికి తానే మురిసిపోయింది. శ్రీకృష్ణునిపై మోహిత అయింది. తేరుకుని కుబ్జ శ్రీకృష్ణునితో ఇలా అంది.

మహాత్మా! లోకనాథా! నా ఇంటికి వచ్చి నా గృహాన్ని పావనం చెయ్యి. నిన్ను వదలి వెళ్ళేందుకు మనస్సు అంగీకరించడం లేదు. పురుషోత్తమా! నా మొర ఆలకించు. నన్ను కృతార్థురాలను చెయ్యి అని ప్రార్థించింది. భగవంతుడు బలరాముని వంక చూసి చిరునవ్వు నవ్వాడు. కుబ్జతో ఇలా అన్నాడు. సుందరీ! నేనిప్పుడో రాచకార్యంపైన వచ్చాను. వచ్చిన పని పూర్తిచేసుకొని తప్పక వస్తాను. మాబోటి బాటసారులకు నీ ఆశ్రయం ఎంతైనా అవసరం కదా అని ఆమెను సమాధాన పరచి ముందుకు సాగాడు.

ఈ ఘట్టంలో పోతనగారేం రాశారో చూడండి.

క॥ *కామిని తిగిచినఁ గృష్ణుఁడు । రాముని వీక్షించి నగుచు రాజానన! మ*
త్కామితముఁ దీర్చి, పిదపన్ । నీ మందిరమునకు వత్తు., నేఁ డలుగకుమీ.

ధనుర్భంగము :

బలరామకృష్ణులు మధురా నగర సౌందర్యాన్నంతా చూసుకుంటూ, ధనుర్యాగమెక్కడ జరుగుతుందో ప్రజలనడిగి తెలుసుకుంటూ యాగశాలకు చేరుకున్నారు. ఆ ధనుస్సు నుంచిన భవనాన్ని రాజభటులు ఏమరుపాటు లేకుండా కాపలా కాస్తున్నారు. ఎందుకంటే కంసుడు తన ఆశలన్నీ ఆ ధనుస్సు పైనే పెట్టుకున్నాడు. అది శివధనుస్సు. తమకు వంశపారంపర్యంగా సంక్రమిస్తోంది. శివధనుస్సు వలన ఇంతకాలం తనకు తన వంశానికి సర్వ శుభాలు చేకూరుతున్నాయి. ధనుర్భంగం కాకుండా కాపాడుకుంటే గాని యజ్ఞఫలం దక్కదని పురోహితుడు చెప్పిన మాటలు నమ్మాడు. దాన్ని జాగ్రత్తగా కాపాడుకున్నంత కాలం రామకృష్ణులే కాదు, ముల్లోకాల్లో ఎవరూ తన్ను ఎదిరించలేరని నమ్మాడు. అందువల్లనే మల్ల రంగాన్ని కూడా అక్కడే ఏర్పాటు చేసి చాణూర ముష్టికులనే మల్లయోధుల్ని కూడా కాపలా కాస్తూ ఉండేట్లు ఏర్పాటు చేశాడు.

శ్రీకృష్ణ బలరాములు ధనుస్సు ఉంచిన భవనంలోకి ప్రవేశిస్తుంటే రక్షక భటులెవ్వరూ అడ్డుకోలేకపోయారు. శ్రీకృష్ణుడు ధనుస్సు వద్దకుపోయి ఆ ధనుస్సును విలాసంగా ఒక చేత్తో పట్టుకొని నారి సంధించాడు. ఏమిటీ విచిత్రమని జనమంతా చూస్తూ ఉండగానే ఆ ధనస్సు విరిగి నేలపై పడి భయంకరమైన శబ్దం వచ్చింది. దాంతో భటులంతా ఒక్కసారిగా బలరామకృష్ణులపై విరుచుకుపడ్డారు. ఆ బాలురిద్దరూ ఆ భటులందర్నీ దీటుగా ఎదుర్కొని యమలోకానికి పంపారు. వారి ధాటికి తట్టుకోలేక మిగిలిన భటులంతా పరుగులు తీశారు.

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మ ఖండం నుండి గ్రహించ బడింది. ఈ కథలో శ్రీకృష్ణుడు కుబ్జ ఇంటికి ఈ రాత్రే వెళ్ళినట్లు చెప్పబడింది. అయితే శ్రీ భాగవతంలో మాత్రం కంసవధ తర్వాత ఉద్ధవుడితో కలసి వెళ్ళినట్లు చెప్పబడింది)

ఈ విధంగా ధనుర్భంగమైన తర్వాత రామకృష్ణులిద్దరూ మధురానగర వైభవాన్ని చూస్తూ పురవీధులన్నీ తిరిగారు. వీళ్ళిద్దరి తేజస్సూ చూస్తున్న ప్రజలంతా ఆశ్చర్యపోయారు. అప్పటికే

సూర్యాస్తమయం కావస్తోంది. అన్నదమ్ములిద్దరూ వారి విడిదికి పోయి క్షీరాన్నాన్ని భుజించి సుఖంగా నిద్రపోయారు. అంతా నిద్ర పోయారు కానీ, కృష్ణుడు మాత్రం నిద్రపోలేదు. ఎందువల్లనంటే ఆ మహనీయుడు అవస్థలకు (జాగ్రత్స్వప్న సుషుప్తులకు) అతీతుడు గదా. అందువల్ల నిద్రిస్తున్నట్లే నటించి తాను మాత్రం కుబ్జ ఇంటికి వెళ్ళాడు. ఆ సమయాన కుబ్జకూడా దీర్ఘ నిద్రలో ఉంది. కుబ్జ పడక చుట్టూ ఆమె దాసీ జనం పడి నిద్రపోతున్నారు.

భగవంతుడు కుబ్జ వద్దకు పోయి "ఓ కుబ్జా! నిద్రలెమ్ము! నీకు మాట ఇచ్చినట్లే నీ వద్దకు వచ్చాను. పూర్వం నువ్వు శూర్పణఖవు. రావణుని సోదరివి. రామావతారంలో నన్ను గాఢంగా కోరుకున్నావు. ఘోరమైన తపస్సు చేశావు. ఆ తపః ఫలంగా నిన్ను సంతోష పెట్టేందుకే వచ్చాను. లేచి కూర్చో. నాతో పాటు గోలోకానికి రా. గోలోకంలో వారికి వృద్ధాప్యంగాని, రోగభయంగాని, మరణం గాని ఉండవు అంటూ ఆమెను తన హృదయానికి హత్తుకున్నాడు. ఆమె శ్రీకృష్ణుని ఒడిలో నగ్నంగా ఉన్నట్లు తెలుసుకొని సిగ్గుపడ్డది. దాంతో ఈమెకూడా లక్ష్మీదేవి వలెనే అత్యంత ప్రీతి పాత్రురాలైంది. ఆమె తృప్తి మీర ఆ దేవ దేవునితో విహరించింది. ఆమెకు రాత్రింబవళ్ళన్న జ్ఞానం నశించింది. తెల్లవారు జామున ఒక దివ్యరథం వచ్చి ఆమెను చంద్రలోకం దాటి గోలోకానికి తీసుకుపోయింది. భగవంతుడు మాత్రం తన పరివారంతో కలిసి నిద్రపోతూనే ఉన్నాడు.

విశేషార్థం : కుబ్జ చరిత్రను తెలుసుకున్నాం కదా. మనం ఇదివరకే శూర్పణఖ కుబ్జగా పుట్టి భగవంతుని పొందాలన్న కోరికను నెరవేర్చుకుంది. శ్రీకృష్ణుడు మాత్రం కుబ్జ ఇంటికి పోయి ఆమె కిచ్చిన వరదానాన్ని నెరవేర్చాడు. దీన్ని బట్టి శ్రీకృష్ణుని ప్రవృత్తి ఎటువంటిదో చిత్తగించండి.

లోకమంతా నిద్రలో ఉంది. ప్రక్కనే బలరామాదులంతా నిద్రిస్తున్నారు. శ్రీకృష్ణుడు మాత్రం కుబ్జను గూర్చిన ఆలోచన లో ఉన్నాడు. ఆమెకూడా నిద్రపోతున్నట్లుగా ఊహించాడు. నిద్రపోతున్న కుబ్జకు కూడా శ్రీకృష్ణుడు తన ప్రక్కనే ఉన్నట్లుగా అనుభూతి కలిగించాడు. అంతేగాని శ్రీకృష్ణుడి శరీరం బలరామాదుల ప్రక్కనే ఉంది. శ్రీకృష్ణుడు ప్రక్కనున్నాడన్న భావన వలన ఆమెలో పూర్వ జన్మ స్మృతుల్ని జ్ఞాపకానికొచ్చాయి. తను శ్రీరామచంద్రుని కోరుకున్న దానికి ఫలాన్ని ఇప్పుడు పొందుతున్నట్లు గా నిద్రావస్థలో అనుభూతి చెందింది. అనగా భావనలోనే ఆమె శ్రీరాముడిని కోరుకోవడం వెంటనే శ్రీకృష్ణుణ్ణి పొందటం కూడా జరిగాయి. ఇవన్నీ భావనచేతనే. అందువల్లనే శ్లోకంలో "జగన్నాథ ప్రియాం సతీం" అని ఉంది. అనగా శ్రీకృష్ణునికి ప్రీతిపాత్రురాలైన పతివ్రత అని అర్థం గదా. శ్రీకృష్ణుడు పతివ్రతల్ని చెరిచేవాడు కాదు గదా. భగవంతుడు స్త్రీ సుఖాలను కోరుకున్నాడనడం పాపహేతువే అవుతుంది. అయితే దీని సారమేమంటే, భగవంతుడు కుబ్జ కోరిన కోరిక సమకూరుగాక అని సంకల్పించాడు. వెంటనే శ్రీకృష్ణుని రూపాన్ని నిద్రావస్థలో దర్శించింది. స్వప్నంలోనే శ్రీకృష్ణుడు తనకు భర్త అయినట్లు తెలుసుకుంది. భగవంతుని స్పర్శా సుఖం కూడా అనుభవించింది. ఆ భావనతోనే గోలోకానికి పోయింది. అనగా రామావతారంలో శ్రీరాముణ్ణి కోరుకున్నందుకు ఫలంగానే ఈ స్వప్నం, భావనా రూపం కలిగాయి.

భావనా మాత్ర సంతుష్టహృదయః పరమేశ్వరః

అనిగదా సూక్తి. భక్తులు భగవంతుణ్ణి భావన చేతనే సందర్శిస్తారు. భక్తుడు ఆత్మశుద్ధి చేతనే

గదా మహదానందాన్ని పొందుతాడు. అందువల్లనే ఆమె సమర్పించిన లేపనాలను సంతోషంగా స్వీకరించి సంతృప్తి చెంది ఆమె కోరిక నెరవేర్చి ముక్తిని ప్రసాదించాడు.

(ఈ భాగం శ్రీభాగవతంలో నుండి గ్రహించబడింది)

సర్వ వ్యాపకుడు, సర్వ ద్రష్ట అయిన శ్రీహరి సైరంధ్రి (కుబ్జ) యొక్క మనో వికారాన్ని గ్రహించి ఉద్ధవునితో కలసి ఆమె ఇంటికిపోయి ఆమెను సంతృప్తురాలను చేసి ఉద్ధవుడితో కలసి తిరిగి తన ఇంటికి వెళ్ళాడన్నది కథా సారం. అయితే కుబ్జ సర్వేశ్వరుడైన శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని ముక్తి కోరక పోవడం వలన ఆమె దురదృష్టవంతురాలని శుకమహర్షి భావం. అయితే కథ నుండి మనం తెలుసుకోదగిన నీతి ఏమైనా ఉన్నదా? రామావతార శూర్పణఖ పూర్వజన్మ వృత్తాంతాన్నంతా ఒకప్రక్కన పెడ్దాం.

ప్రస్తుత కథా భాగంలో శ్రీకృష్ణుడు సైరంధ్రి మనోతాపాన్ని తొలగించేందుకు ఉద్ధవుడితో కలసి ఆమె ఇంటికి వెళ్ళాడని గదా సారాంశం. ఉద్ధవుడు కృష్ణ భక్తుల్లో అగ్రగణ్యుడు. అటువంటి వాడు శ్రీకృష్ణునితో కలసి వెళ్ళాడు. రతికేళికి వెళ్ళేవాడెవడైనా ఒంటరిగానే పోతాడు. అంతేగాని తనంటే అనన్య భక్తి కలిగిన భక్తాగ్రేసరుణ్ణి వెంటబెట్టుకుపోడు గదా. ఒకవేళ ఎవడైనా కూడా తీసుకుపోయినా మరొక రసికుణ్ణే వెంట తీసుకొని వెళ్ళేవాడు. అయితే ఇందులోని సారమేమంటే,

కుబ్జ భగవంతుణ్ణి చూడగానే భక్తి పరవశురాలైంది. శ్రీకృష్ణుడు అంగరాగాలనిమ్మనగానే, ఇదిగో తీసుకో. వీటిని ధరించేందుకు ముల్లోకాల్లోనూ నీకంటే యోగ్యుడు మరొకరు లేరని వెంటనే తన దగ్గర ఉన్నవస్తువులన్నింటినీ ఇచ్చేసింది. భగవంతుని చూడగానే ఆమెలో భక్తి పరవళ్ళు తొక్కింది. తన ఇంటికి రమ్మని ప్రార్థించింది. ఉద్ధవుడు కుబ్జ చూపిన ఆసనంపై కూర్చోకుండా నేలపై కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు మాత్రం ఆమె మంచంపై కూర్చున్నాడు. ఆమె శయ్యాగృహానికి భగవంతుడు ఒంటరిగాపోలేదు. ఆ సమయంలో ఆమె భక్తి పరవశ అయింది. లోకజ్ఞానం పూర్తిగా నశించింది. శ్రీహరి సర్వాంగములనుదర్శించి కృతకృత్యురాలు కావాలని కోరుకుంది. భగవంతుడికా విషయం తెలుసు అందువల్లనే

"*తస్యై కామవరం దత్వా మానయిత్వాచ మానదః*" అన్న సూక్తిని సార్థకం చేశాడు. ఆమె కోరికను వరదానం చేయమన్నదే గాని రతిసుఖాలనే కోరుకునే దయితే అక్కడ 'మానదః' అన్న విశేషకాన్ని వాడి ఉండాల్సిన అవసరం లేదు. మానాన్నిచ్చే వాడనగా మర్యాద కాపాడే వాడని భావం. కామాన్ని తీర్చుకోవడమే కనుక మర్యాద అయితే అట్టి మర్యాదనెవరైనా కోరుకుంటారా? అక్కడితో ఆగకుండా "మానయిత్వా" అనికూడా అన్నది. అనగా ఆమెభక్తికి మెచ్చి మర్యాద చేసి మన్నించమని భావం. ఇటువంటి సందర్భాల్లో భగవంతుని లీలలెట్లా ఉంటాయోనన్నదే మనకీ శ్లోకం బోధిస్తోంది.

భక్తురాలు, యౌవనంలో ఉన్నా వృద్ధురాలైనా, అందగత్తె అయినా వికారి అయినా, భగవంతుడిపైన భక్తి భావం పొంగిపొరలి వస్తూ ఉంటే పరిపరి విధాలుగా సంబోధిస్తారు. "రారా నా తండ్రీ! నా ఒళ్ళో కూర్చోరా!" అనవచ్చు. "నాయనా నా ప్రక్కలో పడుకో. నన్నుఆలింగనం చేసుకో"

అనవచ్చు. మహాత్మా! నన్నీ సంసార సాగరం నుండి ఉద్ధరించు" అని ప్రార్థించవచ్చు. గోపకులన్నట్లుగా నీ పాదాలను నా వక్షఃస్థలంపై ఉంచు అనవచ్చు. ఈ ప్రార్థనలన్నీ భాషలో వ్యత్యాసమే గాని భక్తిభావం ఒక్కటే. అనగా ప్రాప్తి స్థానం ఒక్కటే. పదాలను విరిచి పెడార్థాలు తియ్యడమంటే వారి అజ్ఞానాన్ని ప్రదర్శించుకోవడమే. భగవంతుడి పట్ల అపచారం చేసినట్లే అవుతుంది. అనగా చెప్పేవారి మనోభావాలే అట్లాంటి అర్థాలిస్తాయే గాని, ఆ కుబ్జ భావమది కాదు. శ్రీరామకృష్ణ పరమహంస "మనం ఏది తింటామో ఆ త్రేన్పులే వస్తాయి వెల్లుల్లిపాయ తిన్నవాడికి వెల్లుల్లి త్రేన్పులే వస్తాయి" అని. కాబట్టి కుబ్జ భగవత్కైంకర్యాన్నే కోరుకుంది. ఆమె అభీష్టాన్ని నెరవేర్చేందుకే ఉద్ధవుడితో కలసి వెళ్ళి ఆమెకు ముక్తిని ప్రసాదించాడు. కావున కుబ్జ కిచ్చిన వరదానాన్ని భగవల్లీల గానే గ్రహించి భక్తిని దృఢతరం చేసుకోవాలి.

కంసుని పీడకలలు

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండంలో మాత్రమే కనిపిస్తుంది. శ్రీభాగవతంలో సూచనగా చెప్పబడింది)

మధురానగరంలో ఆనాటి వార్తా విశేషాలన్నీ కంసుని దృష్టికి వచ్చాయి. రజకుణ్ణి వధించడం, మాలాకారుణ్ణి సన్మానించడం, కుబ్జను సుందరాంగిని చెయ్యడం, చివరగా శివధనుర్భంగం. కంసునికి కంటిమీద కునుకు లేకుండా చేశాయి. విధులన్నీ ముగించుకొని ఎట్లాగో శయ్యామందిరం జేరాడు. సుఖనిద్ర కరువైతే మిగిలేది దుఃఖంతో కూడుకున్న కలత నిద్రే. దానికి తోడు ఒక స్వప్నం. ఆస్వప్నంలో కంసుడి పాలిట మృత్యువే ద్యోతకం అయిందని చెప్పవచ్చు.

ఆ స్వప్నంలో ఆకాశాన ఉండాల్సిన సూర్యుడు నేలపైన నాలుగు ముక్కలుగా కనిపించాడు. చంద్రబింబమైతే పది ముక్కలుగా కనిపించింది. దిగంబరులైన పురుషులు పాశాలు చేత బట్టుకొని కనిపించారు. వారంతా వికృతంగా ఉన్నారు. ముక్కు చెవులు తెగిన శూద్ర విధవ స్త్రీ ఒకతె దిగంబరంగా కనిపించింది. మెడలో ఎముకలు, పుర్రెలతో కూడిన మాలలు ధరించి వికృతంగా నవ్వుతోంది. వాళ్ళంతా కంసుడికి ఎదురు వస్తున్నట్లు కనిపించారు. గాడిదలు, ఎడ్లు, దున్నపోతులు, పందులు, కాకులు, గ్రద్దలు, కోతులు, కనిపించాయి. బూడిద రాసులుగా పోసి ఉన్నట్లు కాలుతున్న శవాలు నీళ్ళులేని చెరువులు కనిపించాయి. కోపంతో మండిపోతున్న బ్రాహ్మణుడు, శపిస్తున్న గురువు మొదలైన వారంతా ఆ స్వప్నంలో కనిపించి భయపెట్టారు. ఈ స్వప్నాలన్నీ తెరలు తెరలుగా వచ్చేవి. ఒక్కొక్క స్వప్నానికి ఉలిక్కిపడి లేచి కూర్చునేవాడు. అప్పుడప్పుడూ తల్లికి, భార్యకు, తమ్ముళ్ళకు పిలిచి చెప్పుకున్నాడు. ఈ పీడకలలన్నీ తనకు కీడు చేసేవని నమ్మాడు. బలరామకృష్ణుల్ని కనుక చంపేస్తే ఇక తనకు ఎదురే ఉండదని నమ్మాడు. రేపు రామకృష్ణుల్ని అంతం చేస్తే గాని తనకు మనుగడ లేదనుకున్నాడు. మర్నాడు ఉదయాన్నే కువలయపీడుడనే మదించిన గజరాజును చాణూరక ముష్టికులనే మల్లయోధులు మాత్రమే తన్ను కాపాడగలవారని నమ్మాడు. దుస్స్వప్నాలకు శాంతి చేయిస్తే ఫలముండవచ్చని భావించాడు. ఈవిధంగా ఆలోచిస్తూ ఉండగానే భళ్ళున తెల్లవారింది.

మంత్రుల్ని, ఇతర అధికారుల్ని పిలిపించి కువలయపీడుని ముఖద్వారం వద్ద నిలబెట్టమన్నాడు. చాణూరముష్టికులతో మల్ల యుద్ధం ప్రజల సమక్షంలో జరగాలని, వాళ్ళు కూర్చుని మల్లయుద్ధం చూసేందుకు మంచెలు కట్టించమని ఆజ్ఞాపించాడు. బలరామకృష్ణుల్ని ప్రజల సమక్షంలోనే మట్టుపెట్టాలని అందువల్ల తనకు చెడ్డపేరు రాదని కంసుని ఊహ. పురోహితుల చేత భగవత్ప్రార్థనలు చేయించాడు. తానుకూడా కాలకృత్యాలు తీర్చుకొని రామకృష్ణుల్ని చంపించేందుకు ఉత్సాహంగా బయలుదేరాడు. అలంకారాలన్నీ కన్నుల పండువగా చేయించాడు. ఎటువిన్నా మంగళ వాద్యాలే వినిపించేట్లు చేశాడు. ధర్మం గెలుస్తుందని నలుగురికీ చెప్పుకూంటూ సంతృప్తి పడుతున్నాడు. ఈ విధంగా కంసవధకు రంగం సిద్ధమయింది.

ధనుర్యాగానికి వచ్చిన రాజులంతా కంసుని దర్శించి కానుకలర్పించుకున్నారు. మల్లరంగంలోని వారంతా తమతమ స్థానాల్లో ఆసీనులయ్యారు. వారి తర్వాత పౌరులు, జానపదులు మల్లయుద్ధం చేసేందుకు ఉత్సాహంగా వచ్చారు. రక్షక భటులు అప్రమత్తులై రక్షణ ను పర్యవేక్షిస్తున్నారు. మధ్యగా మల్లరంగం ఉంది. అందులో మహాబలాఢ్యులైన మల్లయోధులు నిలబడ్డారు. వాళ్ళంతా మహాబలాఢ్యులే గాని వారు తలబడబోయేది మాత్రం వారికా బలాన్ని ప్రసాదించిన పరమాత్ముడే నన్న విషయం వారికి తెలియదు.

రాజ చిహ్నాలన్నింటినీ ధరించి కంసుడు ఉన్నతాసనం పైన ఆసీనుడయ్యాడు. అతడికి సమీపంలోనే సోదరులు మంత్రులు సేనాధిపతులు, బ్రాహ్మణులు, రాజపురోహితుడు మొదలైన వారంతా కూర్చున్నారు. న్యాయాన్యాయాలు చూడవద్దని ఎట్లాగైనా సరే రామకృష్ణుల్ని చంపి తీరాల్సిందేనని శాసించాడు. అన్యాయమైనా తన్ను సమర్థించే రాజులు అనేక మంది ఉన్నారన్న ధైర్యం చెప్పాడు. ప్రజల్లోనుండి వ్యతిరేకత రాకుండా రక్షక భటుల్ని యుద్ధసైనికుల్ని నియమించాడు. నందాది గోపకులంతా వారి వారిస్థానాల్లో కూర్చున్నారు. రామకృష్ణులు కూడా సిద్ధంగా ఉన్నారు.

కువలయపీడుడనే ఏనుగును వధించుట :

రామకృష్ణులు ముఖద్వారం వద్దకు వచ్చారు. వాళ్ళిద్దర్నీ చూడగానే కువలయపీడుడిపై నున్న మావటి వాడు ఏనుగును వారిపై పురిగొలిపాడు. ఆ మదపుటేనుగు కూడా అమితోత్సాహంతో వారిపైకి దాడిచేసింది. దాంతో శ్రీకృష్ణుడు మావటి వాడితో బిగ్గరగా 'మావటివాడా! ఏనుగు మాపైకి వస్తోంది. దాన్ని ప్రక్కకు నడిపించి మాకు దారి ఇవ్వు. లేకపోతే నిన్ను, నీ ఏనుగును కూడా యమలోకానికి పంపుతాను. జాగ్రత్త అన్నాడు. ఇందుకు పోతనగారు ఎలా వ్రాశారో చూడండి.

శా॥ *ఓరీ కుంజరపాల! మాదెసకు నీయుద్యన్మదేభేంద్రముం*
బ్రేరేపం బనిలేదు త్రిప్పు మరలం బ్రేరేచినన్ నిన్నుఁ గం
ఠీరోగ్రాశనితుల్య ముష్టి హతులన్ భేదించి నేఁ దంతకుం
జేరం బుత్తు మహోత్తర ద్విపముతో సిద్ధంబు యుద్ధంబునన్.

కృష్ణుని మాటలకు మావటి వాడికి కోపం వచ్చింది. దాంతో వాడా గజరాజాన్ని మరింత రెచ్చకొట్టాడు. యమ ధర్మరాజులా ఆ గజరాజము కృష్ణుని వైపు దూసుకు వచ్చింది. వచ్చీరావడంతోనే

ఆ గోపాల బాలుణ్ణి తొండంతో చుట్టి గిరగిరా త్రిప్పింది. శ్రీకృష్ణుడు ఎట్లాగో తొండంలో నుండి బయటపడి కనిపించిన చోటల్లా పిడిగుద్దులు గుద్దాడు. కాలితో బలంగా తన్నాడు. ఆ ఏనుగు మళ్ళీ తొండంతో పట్టుకునే ప్రయత్నం చేస్తే తప్పించుకొని వెనగ్గా పోయి దానితోక పట్టుకొని బరబరా ఈడ్చుకుంటూ ఇరవై అయిదు ధనస్సుల దూరం ఈడ్చుకుపోయాడు. అంతలో అది వెనక్కు తిరిగి కృష్ణుణ్ణి పట్టుకునే ప్రయత్నం చేసింది. కానీ దానివల్ల కాలేదు. తలను ఎడమ వైపుగా త్రిప్పితే కుడిప్రక్క నుండి తప్పించుకుంటున్నాడు. కుడిప్రక్కకు తిరిగితే ఎడమప్రక్కకు తప్పించుకుంటున్నాడు. ఈ లోపుగా అందిన చోటల్లా అందినట్లు పిడిగుద్దులు గుద్దాడు. ఆ గజరాజము పడుతూ లేస్తూ కృష్ణుణ్ణే నేలపై పడేసినట్లుగా భావించి సంతోషంతో ఘీంకారాలు చేసింది. ఈ పడిలేవడంలో గజరాజు దంతాలు నేలలో గుచ్చుకు పోతున్నాయి. మావటి వాడు ఏనుగు బలం క్షీణిస్తోందని గ్రహించి ఇంకా ఎక్కువగా పురికొలిపాడు. ఇక వీళ్ళ ఆటలు సాగనివ్వరాదని భగవంతుడు గజరాజాన్ని నేలపై పడేట్లుగా ఒక తన్ను తన్నాడు. అనుకోని ఈ పరిణామానికి ఏనుగు పట్టుతప్పింది. అదే అదనుకొని తొండంపై కూర్చుని దాని దంతాన్ని ఊడపెరికి దాంతోనే దాన్ని చచ్చేట్లుగా కొట్టాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక గిలగిలా కొట్టుకుంటూ చచ్చిపడింది. ఆ దంతాన్ని భుజాన వేసుకొని ఏనుగుపై నుండి నేలపైకి దూకాడు. భుజాన పొడవాటి ఏనుగు దంతం ఒళ్ళంతా రక్తం. ముఖమంతా చెమటలతో శ్రీకృష్ణుడు చూడముచ్చటగా కనిపించాడు.

చాణూర ముష్టికుల వధ :

శ్రీకృష్ణుడు కువలయపీడుని వధించి బలరాముణ్ణి గోపబాలుర్ని వెంటబెట్టుకొని మల్లరంగంలోకి ప్రవేశించాడు. పోతనగారు ఆ పరాత్పరుడు మల్ల రంగంలో ప్రవేశించిన తీరును ఇలా వర్ణించారు.

సీ॥ మహిత రౌద్రంబున మల్లురకశనియై నరుల కద్భుతముగ నాథుఁడగుచు
శృంగారమునఁ బురస్త్రీలకుఁ గాముఁడై నిజమృత్యువై కంసునికి భయముగ
మూఢులు బీభత్సమును బొంద వికటుఁడై తండ్రికిఁ దయరాఁగ దనయుఁ డగుచు
ఖలులకు దిరసంబుగా దండియై గోప కులకు హాస్యంబుగాఁ గులజుఁ డగుచు
ఆ॥ బాంధవులకుఁ బ్రేమభాసిల్ల వేలుపై । శాంత మొనర యోగిజనుల కెల్లఁ
బరమతత్త్వమగుచు భాసిల్లె బలునితో । మాధవుండు రంగమధ్యమందు.

మహాకవి నవరసాల్ని పోషిస్తూనే దానికి గల కారణాల్ని కూడా వివరించాడు. శ్రీకృష్ణుడు కువలయపీడుని చంపి దాని దంతాన్ని భుజాన వేసుకొని, శరీరం అంతా రక్తంతో తడిసి పోయి ఉండగా మల్లరంగంలోకి ప్రవేశించాడు. అప్పుడా పరాత్పరుణ్ణి అందరూ ఒకే విధంగా చూడలేదు. అనగా వారి మనోభావాలు ఏ విధంగా ప్రసరించాయో ఆ విధంగా వారి కళ్ళకు కనిపించాడని పోతనగారి అభిప్రాయం. భగవంతుని చంపాలనుకుంటున్న మల్లయోధులకు శ్రీకృష్ణుడు భయంకరాకారుడుగా కనిపించాడట. అనగా మనమీతణ్ణి చంపలేమన్న భీతి కలిగిందని సారం. (భయానకరసం). సామాన్య జనానీకానికందరికీ ప్రభువుగా కనిపించాడట. అనగా రక్షకుడని భావం. (అద్భుత రసం) సామాన్య స్త్రీలకు మన్మథుడు వలె కనిపించాడట. అనగా శివుని కంటి మంటకు బూడిదయి పోయిన

వాడికి మళ్ళీ దేహం పుట్టుకొచ్చిందా అని ఊహించి మన్మథునికి సంబంధించిన ఊహ కాబట్టి శృంగార రసమని చెప్పవచ్చు. గోపకులంతా ఆ పరాత్పరుణ్ణి తమ జ్ఞాతిగా భావించారట. అనగా హాస్యరసమని చెప్పవచ్చు. ఎట్లానంటే సర్వాంతర్యామి అయిన భగవంతుని తమ జ్ఞాతిగా కట్టిపడెయ్యడం హాస్యాస్పదం కాదా? దుష్టులైన రాజులందరికీ మృత్యువుగా కనిపించాడట. అనగా భగవంతుడీ రాజులందర్నీ వధించి భూభారాన్ని తగ్గించడమే కదా అవతార ఫలం. అందువల్ల వారందరికీ మృత్యుదేవతగా కనిపించాడు. తండ్రి అయిన నంద వసుదేవులకు కుమారుడన్న భావమే కలిగింది. మల్లయుద్ధంలో పుత్రుడే జయించాలన్న కరుణారసంతో చూశారని చెప్పవచ్చు. కంసుడికి మాత్రం వీడివల్లనే కదా నాకు మరణ భయం ఏర్పడిందని ఇక్కడ భయానక రసం చూపబడింది. మూఢులు విరాట్టువుగా భావించారని భావం. అనగా బీభత్స రసాన్ని సూచిస్తోంది. పరమ యోగులైన వారు ఆ బాలుని చూసి పరతత్త్వమని భావించారు. అనగా భక్తి రసాన్ని సూచించడమైంది. యోగులు ఆ శ్రీకృష్ణుని తేజోరూపులుగా ధ్యానించి పరతత్త్వమనే భావిస్తారు. బంధువులు, వృష్ణిక రాజులు శ్రీకృష్ణుని మల్లయుద్ధానికి తయారై వచ్చిన పరదేవత అనే భావించారు.

భగవంతుడు నిష్పక్షపాతి అని తెలియచెప్పడానికి పోతనగారు ఒక్క పద్యంలో చాటి చెప్పారు. ఎవరెవరు ఏ విధంగా భావిస్తారో వారికల్లా ఆయా విధంగా కనిపిస్తూ వారి యోగ్యతాను సారం ఫలాన్నిస్తూ ఉంటాడన్నదే సారం.

చాణూర ముష్టిక సంహారం :

మల్లరంగంలో కంసుడు ఉన్నతాసనంపై ఆసీనుడయ్యాడు. ఈ పిల్లలిద్దరూ కువలయపీడుడ్ని చంపారని వినగానే నవనాడులూ క్రుంగిపోయాయి. మనసంతా వికలమై పోయింది. చాణూర ముష్టికులిద్దర్నీ తన వద్దకు పిలిపించుకున్నాడు. మల్లరంగంలో ఏదో విధంగా వారిద్దర్నీ చంపెయ్య మన్నాడు. న్యాయమా? అన్యాయమా? అని చూడొద్దన్నాడు. లేకపోతే వాళ్ళు నా ప్రాణాలు తీస్తారన్నాడు. కావున వాళ్ళిద్దర్నీ చంపి నా కానందాన్ని కలుగచెయ్యమన్నాడు. ఆ తర్వాత మీకు ఏంకావాలన్నా ఇస్తాను. అర్థరాజ్యమిచ్చి రాజ్యంలో మీరు ఆడింది ఆట పాడింది పాటగా చెలామణి అయ్యేట్లు చేస్తాను. మీరు మాత్రం నాకీ ఉపకారం చెయ్యండి అన్నాడు. ఇలా ఉండగా రామకృష్ణులిద్దరూ మల్లరంగంలోకి ప్రవేశించారు. వారి దివ్య మంగళ విగ్రహం చూడగానే జనమంతా పరవశులయ్యారు. అహా!వీరి తల్లిదండ్రులు ఎంతటి ధన్యాత్ములో గదా అని వాళ్ళల్లో వాళ్ళే అనుకున్నారు. ఇంకొందరైతే "ఈ పిల్లవాడు పుట్టడమైతే దేవకి కడుపునే పుట్టాడట గానీ పెరగడం మాత్రం నందుని ఇంట్లో పెరుగుతున్నాడట. అయితే ఈ పిల్లవాడు నందుడి ఇంటికి ఎప్పుడు వెళ్ళాడో, ఎట్లావెళ్ళాడో ఎవరికీ తెలియదు. అని గుసగుసలాడుకున్నారు. శ్రీకృష్ణుని బాల్యలీలల్ని గూర్చి ప్రచారంలో ఉన్నకథలన్నింటినీ ఒకరికొకరు చెప్పుకున్నారు. వారేమేమి చెప్పుకున్నారో పోతనగారి మాటల్లో విందాం.

సీ॥ *చంపెరక్కసిఁ బట్టి చక్రవాకునిఁ గూల్చె బడఁద్రొబ్బె ముద్దుల బకుని జీరె*
నఘదైత్యుఁ బొరిగొనె నడరి వత్సకుఁ ద్రుంచె గిరి యెత్తి దేవేంద్రుఁ గ్రిందు పఱచె

గాళియు మర్దించె గహనా నిలముఁ ద్రావెఁ గేశి నంతకు పురికేవ కనిచె
మయు పుత్రుఁ బరిమార్చె మఱియును దానవ భటుల మర్దించి గోపకులఁ గాంచె
తే॥ *గోపకాంతల మనముల కోర్కెఁదీర్చె । నీసరోరుహలోచనుం డీశుభాంగుఁ*
డీ మహామహుఁ డేదిగ్గజేంద్రనిభుఁడు । మనుజమాత్రుఁడె తలపోయ మాధవుండు.

జనులంతా ఈ విధంగా అనుకుంటూ ఉండగా, ఇంతలో కంసుని అనుమతితో కుస్తీ పోటీని ప్రకటించారు. రామకృష్ణులు అప్పుడే రంగప్రవేశం చేశారు. అప్పటికే చాణూరక ముష్టికులిద్దరూ బల గర్వంతో రంగంలో పచార్లు చేస్తున్నారు. ఎప్పుడెప్పుడీ బాలులిద్దర్నీ చంపి సగం రాజ్యాన్ని సంపాదిస్తామా అని ఉవ్విళ్ళూరుతున్నారు. పిల్లలిద్దరూ రంగప్రవేశం చెయ్యడంతో వారి ఉత్సాహం రెట్టింపయ్యింది. వారిలో మాటకారి అయిన చాణూరకుడు ఇలా అన్నాడు. ఓ నందకుమారుల్లారా! మీరిద్దరూ బాహుయుద్ధంలో నేర్పరులని, మహా పరాక్రమశాలురని కంస మహారాజు మిమ్మల్ని పిలిపించాడు. రాజును సంతోషపెట్టడం ప్రజలమైన మనబాధ్యత. మనోవాక్కాయ కర్మల్లో ఏమార్గంలో నైనా రాచకార్యాలకు ప్రజలు సహకరిస్తూ ఉండాలి. లేకపోతే దేశం అరాచక మవుతుంది. మీరంతా గోసంపదను వృద్ధి చేస్తూ వనాల్లో ఉంటూ మల్లయుద్ధంలో ప్రావీణ్యత సంపాదిస్తూ ఉంటారు. అందువల్ల మీ ప్రావీణ్యాన్ని చూసి ఆనందించాలని మహారాజు ఉవ్విళ్ళూరుతున్నాడు. కాబట్టి మహారాజుకు ఆనందం చేకూర్చడం మనందరి విధి. మా వంతు మేం కూడా మా ప్రావీణ్యతను ప్రదర్శించే ప్రయత్నం చేస్తాం. రాజు ఆనందిస్తే సర్వ భూతాలు ఆనందిస్తాయి. రాజంటే విష్ణు స్వరూపుడు గదా అంటూ తన వాక్చాతుర్యాన్నంతా ప్రదర్శించాడు.

పోతనగారు,

మ॥ *వన మార్గంబున గోపబాలకులతో వత్సంబులన్ మేపుచున్*
బెనఁగన్ మిక్కిలి నేర్చినా రనుచు నీపృథ్వీజనుల్ సెప్ప మా
మనుజేంద్రుండిటు మిమ్ముఁ జీరఁ బనిచెన్ మల్లాహవ క్రీడకుం
జనదే కొంత పరాక్రమింప మనకున్ సభ్యుల్ విలోకింపఁగన్.

మ॥ *జవసత్త్వంబులు మేలె సాముగలదే సత్రాణమే మేను భూ*
ప్రవరుం బోనన మిమ్మనంగవలెనే పాలీ లభీష్టంబులే
పవివో కాక కృతాంత దండకమవో ఫాలాక్షు నేత్రాగ్నివో
నవనీతంబుల ముద్దగాదు మెసఁగన్ నా ముష్టి గోపార్భకా.

విశేషార్థం : ఓ బాలకులారా! మీతో పోట్లాడగల వారు లేరు. ఐనా కూడా ఇక్కడ కూర్చొని ఉన్న పెద్దలందరి మనసు రంజింపజేసేందుకు కొంతసేపు వినోదాన్ని కల్పించడం మన బాధ్యత. ఇంతకాలం మమ్మల్ని పోషిస్తున్న కంస మహారాజును కూడా సంతోషపెట్టినట్లువుతుంది. ఇంతకాలం రాజు పెట్టింది తింటూ కండలు పెంచుకున్న మా నేర్పరి తనాన్ని కూడా ప్రజల ముందు ప్రదర్శించే అవకాశం కలుగుతుంది. బాలకులారా! మీ చేతుల్లో మేం ఓడిపోతే మేమది అవమానంగా భావించం. ఎందువల్ల నంటే ఇహంలో కీర్తి పరంలో ముక్తి లభిస్తాయి అని మహాకవి చాణూరుని నోట పలికించాడు.

శ్లో॥ *నిత్యం ప్రముదితా గోపా వత్సపాలా స్తథా స్ఫుటం ।*
వనేషు మల్ల యుద్ధేన క్రీడంత శ్చారయంతి గాః ॥

అనగా ప్రతిరోజు గోవత్సాలను మేపుకుంటూ అడవులన్నీ తిరుగుతూ ఆడుతూ పాడుతూ మల్లయుద్ధాలు చేసుకుంటూ గడుపుతూ ఉంటారు. ఇది సామాన్యార్థం. ఇక ఇందులో విశేషార్థమేమంటే,

వత్సములు అంటే అసమర్థులు లేదా తమ్ము తాము పోషించుకోలేని వారు. అనగా సమస్త జీవరాసులని అర్థం. వాటిని మేపుకుంటూ అనగా సకల ప్రాణుల్నీ కాపాడే వారని అర్థం. తథా=అట్లే, సగుణ బ్రహ్మగా ఉంటూ ఈ బ్రహ్మాండాలన్నీ ఎట్లా పాలిస్తావో అట్లాగే ఈ లీలామానుష విగ్రహుడవైన నువ్వు ఇప్పుడు మమ్మల్ని ఉద్ధరించు. మల్లయుద్ధేన క్రీడంతః=(ఇక్కడ తృతీయహేత్వర్థమని గ్రహించాలి) మల్లయుద్ధమనే క్రీడ ద్వారా దుష్టసంహారం చెయ్యడమే నీ అవతార ఫలం. అనగా నీకు ఆయుధాలతో పనిలేదు. సంకల్పంతోనే భూభారాన్ని తగ్గించగలవు అన్న భావం ఇక్కడ సూచించబడింది. గాః చారయంతః=గోవులను పెంచుకుంటూ వాటితోపాటు తిరుగుతూ అనగా భూతములన్నీ పశువులని, భగవంతుడే పశుపతి అని రహస్యార్థం. భూతాలన్నింటినీ అటు ఇటు తిరిగేట్లు చేస్తూ, అనగా అక్కడక్కడా పుట్టిస్తూ అని అర్థం. నువ్వు గోలోకం నుండి వచ్చిన గోవుల్ని, గోపకుల్ని ఎట్లా రక్షిస్తున్నావో మల్లయుద్ధానికి నీతో తలపడుతున్న మా ఇద్దర్నీ కూడా రక్షించు అని. ఆ గోపకులకు ప్రసాదించే ఆనందాన్నే మాకూ ప్రసాదించు. ఈ అర్థాన్నే ఈ క్రింది శ్లోకం కూడా సమర్థిస్తోంది.

శ్లో॥ *తస్మాద్రాజ్ఞః ప్రియం యూయం వయం చ కరవామహే*
భూతాని నః ప్రసీదంతి సర్వభూతామయో నృపః

శ్లోకానికి అర్థం : ఓ కృష్ణా! అందువలన మనమందరమూ రాజుకి సంతోషాన్ని కలిగించే పనులుచేస్తూ సంతృప్తుణ్ని చెయ్యాలి. మనం గనుక ఈ భావంతో చేస్తే సర్వభూతాలు మనయెడల ప్రసన్నమవుతాయి. తస్మాత్=అందువల్ల, యూయం మయంచ=మన నలుగురం (రామకృష్ణ, చాణూర ముష్టికులు) రాజ్ఞఃప్రియం=ఈ యుద్ధంలో మీ ఇద్దర్నీ మాద్వారా చంపించి శాశ్వతంగా హితాన్ని పొందాలని కోరుకుంటున్నాడు. అయితే మీరే అతణ్ణి చంపి ముక్తి అనే శాశ్వత హితాన్ని చేకూర్చండి. కరవామహే=చేకూరుద్దాం. (మేము హితాన్ని చేకూరిస్తే ఐహిక సుఖాలు అనుభవిస్తాడు) అట్లాచేస్తే, నః=మమ్మల్ని, భూతాని=చరాచర భూతాలన్నీ, ప్రసీదంతి=మెచ్చుకుంటాయి. అనగా, అట్లాచేస్తే ప్రజలంతా మమ్మల్ని మెచ్చుకుంటారు. అనగా మల్లజాతి వారిని పోషించి నందుకు రాజుకు ప్రత్యుపకారం చేశామని లోకులు మమ్మల్ని మెచ్చుకుంటారు.

విశేషార్థం : మల్లయుద్ధమనే నెపంతో ఇంతమందిని రప్పించి మీ ఇద్దర్నీ మాచే చంపిచాలన్నదే రాజు ఆశయం. అట్లాకాకుండా మీరే మమ్మల్ని, రాజును కూడా చంపితే రాజుకు ముక్తి లభిస్తుంది. ప్రజలు దుష్టసంహారానికి సహాయపడిన మమ్మల్ని కూడా మెచ్చుకుంటారు. సర్వభూతమయోనృపః =రాజు సర్వభూతాలకు రక్షకుడు. అటువంటివాడు కుటిలుడైతే, సర్వభూతాత్మకుడవైన పరమాత్మచేతిలో

మరణించి ముక్తిని పొందుతాడు. దుష్టుడి సంహారానికి సాయపడిన మమ్మల్ని కూడా మల్లజాతి మెచ్చుకుంటుంది

శ్రీకృష్ణుడు చాణూరుని మాటలు విన్నాడు. యుద్ధానికి తన అంగీకారాన్నితెలిపాడు. అయితే సందర్భోచితంగా చాణూరకునితో ప్రజలంతా వినేట్లుగా ఇలా అన్నాడు. ఓ మల్లయోధుడా! చాణూరకుడా! మీరంతా కంస మహారాజుకు ఎట్లా లోబడి జీవిస్తున్నారో, అడవుల్లో జీవిస్తున్న మేము కూడా ఆ మహారాజు పాలనలోని పౌరులమే. కాబట్టి రాజుకు ప్రియాన్ని చేకూర్చే పనులు చెయ్యడం మావిధి. ఈ అవకాశాన్నిచ్చిన మహారాజుకు వనచరుల మందరము కృతజ్ఞులం. చాణూరకా! మేము బాలురం. మావయసు వారితో పోటి పెడితే యథోచితంగా ఉంటుంది. మల్ల ధర్మాధికారులు కూడా నామాట మన్నిస్తారని భావిస్తున్నాను అని చమత్కరించాడు.

ఇక్కడ శ్రీకృష్ణుని అభిప్రాయం విన్నారు గదా. చాణూరుని సంభాషణలో ఏదో ఒక రహస్యార్థం ఉన్నదని శ్రీకృష్ణుడు కూడా దానికి తగినట్లుగానే మాట్లాడాడు. "చాణూరకా! రాజుకు అందరి ప్రజల్లాగానే వనచరులమైన మేము కూడా రాజుకు విధేయులమే అన్నది సామాన్యార్థం. విశేషార్థం ఏమంటే, "వయం చాపి వనే చరాః" అనగా అడవుల్లో తిరిగే మేముకూడా రాజుకు విధేయులంగా ఉండాలా? అన్న అర్థం స్ఫురిస్తుంది. ఎందువల్లనంటే 'అపి' అన్న శబ్దాన్ని ప్రశ్నార్థంకంగా గ్రహించాల్సి ఉంటుంది. మేము వనచరులమనగా కేశవ స్వరూపులమని భావం. ఎప్పుడూ రాజుకు శ్రేయస్సు కలిగించడమే మా అభిమతం. "మీ రాజులకు ఏది ప్రియమో దానిని మేము చేస్తాము." అనగా మీ రాజుకు ప్రియమైనది శాశ్వత సుఖమే కదా. దాన్ని ఇంకొన్ని ఘడియల్లోనే ప్రసాదిస్తాం. అదే మా పరమానుగ్రహం. మాకు మిత్రులు గాని శత్రువులు గాని ఉండరు. మా కరుణ అందరి యెడల సమానమే అన్నదే ఇందులోని రహస్యం. ఈ క్రింది శ్లోకాన్ని చూస్తే మీకే అర్థమవుతుంది.

శ్లో॥ *ప్రజాభోజపతేరస్య వయం చాపి వనేచరాః*
కరవామ ప్రియం నిత్యం తన్నః పరమనుగ్రహః.

సామాన్యార్థం : మేము వనచరులమే అయినా కూడా ఈ భోజరాజు యొక్క ప్రజలం కావడం వలన ఆయనకు ప్రియం చేకూర్చడం మావిధి. మేమట్లా ప్రవర్తిస్తేనే రాజానుగ్రహాన్ని పొందగలుగుతాం. దీని తర్వాతి శ్లోకం కూడా కలిపి చదివితే

శ్లో॥ *బాలా వయం తుల్య బలైః క్రీడిష్యామో యథోచితమ్*
భవేన్న యుద్ధ మాధర్మః స్పృశేన్మల్ల సభాసదః.

సామాన్యార్థం : మేము బాలురం. కావున మా ఈడు వారితోనే పోటీ పడగలం. అదే న్యాయమైన యుద్ధమవుతుంది. మల్ల సభలో ఉన్న పెద్దలు అన్యాయాన్ని సహించరు గదా.

విశేషార్థం : భగవంతుడిక్కడ తన సర్వేశ్వరత్వాన్ని తెలియజేశాడు. నేను, మా అన్న అని అన్నప్పుడు "అవామ్" అనవచ్చుగదా. అట్లా అనలేదు. "వయమ్" అన్నాడు. ఎందువల్ల. మీకు బాలకుల్లా కనిపిస్తున్నా మేము సర్వవ్యాపకులం. తుల్య బలైః క్రీడిష్యామః యథోచితమ్=మాతో సమాన బలం

గలవారితో పోటీ పడతాం. అనగా మాతో తలబడబోయే వారు అత్యల్పులని, మీతో మాకు పోటీ ఏమిటి? ఒకవేళ మీతో మల్లయుద్ధం చెయ్యాల్సి వస్తే అది అధర్మమే అవుతుంది. సుమా! ఇంకో విషయం ఏమంటే, మీతో యుద్ధానికి మేము సిద్ధమే గాని లోకానికి ఉదాహరణం కాకూడదు గదా.

భావగర్భితంగా మాట్లాడిన శ్రీకృష్ణుని మాటలకు చాణూరుడు ఇలా అన్నాడు. కృష్ణా! నువ్వు బలరాముడు బాలలూ కారు. శిశువులూ కారు. అమిత బలాఢ్యులని మీరిప్పుడే రుజువు చేసి వచ్చారు. ఎట్లాగంటే, వెయ్యిఏనుగుల బలం కలిగిన కువలయపీడుని సునాయాసంగా చంపారు. అట్టి మిమ్మల్ని బాలురని గాని, పాలుత్రాగే శిశువులని ఎవరైనా అనగలరా. వృథా కాలయాపన ఎందుకు, పోరు ప్రారంభిద్దాం రా.

శ్లో॥ *తస్మాద్భువ ద్భ్యాం బలభిర్యోద్ధవ్యం నానయో7త్రవై*
వుయి విక్రమ వార్ష్ణేయ బలేన సహ ముష్టికః

సామాన్యార్థం : అందువలన మీరిద్దరూ మహాబలవంతులరమైన మాతో యుద్ధం చెయ్యాలి. కృష్ణా! ఇక్కడ అధర్మం జరుగదు. నువ్వు నాతోను, బలరాముడు ముష్టికునితోను యుద్ధం చెయ్యండి.

విశేషార్థం : చాణూరకుడి మనసులో మాటేమిటంటే, నువ్వన్నట్లుగానే మేము లోకం దృష్టిలో బలశాలురం. అయితే మీరో? అసామాన్య బలశాలురు. మీరు బాలురుగా కనిపిస్తున్నంత మాత్రాన మాకంటె తక్కువ బలశాలురు కాదు. అందువల్ల మనమధ్య యుద్ధం లో అధర్మం గాని, అన్యాయంగాని ఏదీ లేదు. తుచ్ఛులమైన మా ఇద్దర్నీ ఉద్ధరించడానికైనా మాతో పోరాటానికి అంగీకరించు. మేము మా మేలుకోరుకునే యుద్ధం చేస్తాం. అట్లాగే మీరుకూడా మా మేలుకోరి యుద్ధం చెయ్యండి. మిమ్మల్ని చూడగానే మాకు జ్ఞానోదయమైంది. మీరే ఆర్తత్రాణ పరాయణులన్న జ్ఞానం కలిగింది. ఇక మానవ మాత్రుల్ని సేవించాలన్న కోరిక నశించింది. మాకు నీ దాస్యాన్ని ప్రసాదించు. అంటూ చాణూరకుని మాటలు శ్రీకృష్ణుని కొక విధంగాను, కంసునికి మరోవిధంగాను అర్థమయ్యాయి.

అయితే ఈ భాగంలో మూలానికి పోతనగారి అనువాదానికి భేదం కనిపిస్తుంది. అదేమంటే, మూలంలో చాణూరుడే యుద్ధం ఎవరెవరితో చెయ్యాలో నిర్ణయించినట్లుగా చెప్పగా, పోతనగారు శ్రీకృష్ణుడే ఆ నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు.

పోతనగారు వ్రాసిన కొన్ని పద్యాలను చూద్దాం.

క॥ *నీతోడుత నేఁ బెనఁ గెదఁ । బ్రీతిన్ ముష్టికుని తోడఁ బెనఁగెడి బలుఁ డు*
గ్రాతత మల్లాహవమున । భూతల నాథునికి మెచ్చుఁ బుట్టింతు సభన్

శ్రీకృష్ణుని మాటలు చాణూరునకు కోపాన్ని తెప్పించాయి. అంతా వినేట్లుగా తన పరాక్రమాన్ని ఇట్లా ప్రకటిస్తాడు.

శా॥ *నాతోఁ బోరఁగ నెంతవాఁడ విసిరో నాపాటియే నీవు వి*
ఖ్యాతుండం గులజుండ సద్గుణుఁడ సత్కర్మ స్వభావుండ నీ
కేతాదృగ్విభవంబు లెల్లఁ గలవే యీ వీటఁ బోరాడుటల్
వ్రేతల్ చూడఁగఁ గుప్పిగంతులిడుటే వీక్షింపు గోపార్భకా!

చాణూరుడు అంతటితో ఊరుకోకుండా భక్తి పరాక్రమం ఉట్టి పడేట్లుగా ఇలా మాట్లాడాడు.

సీ॥ *చలమున నను దాసి జలరాశిఁ జొరరాదు నిగిడి గోత్రము దండ నిలువరాదు*
క్రేడించి కుంభిని క్రిందికిఁ కేఁబోరాదు మనుజసింహుఁడ నని మలయరాదు
చేరినఁ బడవైతుఁజెయి చాఁపగారాదు బెరసి నాముందటఁ బెరుఁగరాదు
భూనాథ హింసకుఁ బోరాదు ననుమీఱి శోధింతుఁ గానలఁ జొరఁగరాదు

ఆ॥ *ప్రబలమూర్తి ననుచు భాసిల్లఁగా రాదు । ధరఁ బ్రబుద్ధుఁడనని తలఁపరాదు*
కలికి తనము చూపి గర్వింపఁగారాదు । తరము గాదు కృష్ణ తలఁగు తలఁగు.

కృష్ణా! నువ్వు శ్రీమన్నారాయణమూర్తివే అయితే,

సీ॥ *మహిమతో నుండంగ మధురాపురము గాని పొలు పార వైకుంఠపురము గాదు*
గర్వంబుతో నుండఁ గంసుని సభగాని సంసార రహితుల సభయుఁ గాదు
ప్రకటించి వినఁగ నా బాహునాదము గాని నారదు వీణా స్వనంబు గాదు
చదురులాడఁగ మల్ల జన విగ్రహము గాని రమతోడి ప్రణయ విగ్రహము గాదు.

తే॥ *వెలసి తిరుగంగ వేదాంత వీథి కాదు । మొఱఁగి పో మునిమనముల మూలగాదు*
సాఁగి నడువంగ భక్తుల జాడ కాదు । శౌరి నా మ్రోల నీ వెందుఁజనియె దింక.

ఈ పద్యాలను బట్టి చూడగా భగవంతుడే శ్రీకృష్ణుని రూపంలో అవతరించాడని చాణూరుడు భావించాడని, కనిపిస్తుంది. పైకి మాత్రం కంసునికి సంతోషాన్ని కలిగించేందుకు తన ప్రతాపాన్ని చాటుకుంటున్నట్లుంది.

ఈ విధంగా శ్రీకృష్ణుడు చాణూరకుడితోను, బలరాముడు ముష్టికుడితోను పోరు ప్రారంభించారు. కొంతసేపు ధర్మబద్ధంగాను, మల్లయుద్ధనీతిననుసరించే నడిచింది. ఆ తర్వాత మల్లయుద్ధ నీతుల్ని, సామాన్య ధర్మాలనన్నింటినీ అతిక్రమించింది. మల్లుల అవినీతిని బాహాటంగా ప్రకటించుకున్నారు. వారి యుద్ధం ఆకాశం నుండి వీక్షిస్తున్న దేవతలకు కూడా ఆశ్చర్యాన్ని కలిగించింది. ప్రజలు కూడా ఇటువంటి అన్యాయం ముందెన్నడూ చూడలేదని ముక్కున వ్రేలేసుకున్నారు. స్త్రీలు తమలో తాము ఇలా అనుకున్నారు. "ఇదేమి సభ? ఇదెక్కడి అన్యాయం? వీళ్ళేమో బాలకులు, అర్భకులు. వీరితో పోరాడేదేమో మదించిన ఏనుగుల్లాంటి బలాఢ్యులు. ఈ అన్యాయాన్ని ఖండించేందుకు ఈ సభలో పెద్దమనుషుల్లేరా? రాజు కళ్ళముందే ఇంతటి అన్యాయమా? ఇక్కడ అధర్మమే ధర్మమై నడుస్తోంది. అధర్మం జరిగే చోట నిలచి ఉన్నా ఆ అధర్మంలో పాలు పంచుకోవాల్సి ఉంటుంది. దోషమని తెలిసికూడా చెప్పకపోతే పాపం చుట్టుకుంటుంది. కావున బుద్ధిమంతుడా సభకు పోరాదు. ఈ ఘట్టంలో పోతనగారు వ్రాసిన పద్యాలను చూడండి.

సీ॥ *వేణు నాళములపై వెలసిన మాధవుం డధరామృతము లిచ్చి యాదరించుఁ*
బింఛధామముల మై పెరిఁగిన వెన్నుడు మస్తకంబునఁ దాల్చి మైత్రి నెఱపుఁ
పీతాంబరముల మై బెరసిన గోవిందుఁ డంస భాగమునఁ బాయక ధరించు
వైజయంతికల మై వాలినఁ గమలాక్షుఁ డతికుతూహలమున నఱుతఁ దాల్చుఁ

తే॥ *దనరు బృందావనంబునఁ దరుల మైనఁ । గృష్ణుఁ డానందంబునఁ జేరి క్రీడసల్పు*
నెట్టి నోములనైన మున్నిట్టి విధము ।లేల కామైతిమో యమ్మ యింక నెట్లు?

అక్కడ జేరిన అమ్మలక్కలంతా గోపికల మహద్భాగ్యాన్ని గూర్చి ఒకరికొకరు ఇలా చెప్పుకున్నారు. గోపికలు ఎటువంటి తపస్సు చేశారో గదా. ప్రతిరోజూ శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని దర్శించుకుంటూ ఉంటారు. వాళ్ళంతా పాలుపితుకుతూ ధాన్యాలు దంచుకుంటూ, పిల్లల్ని సంరక్షించుకోవడం వంటి లౌకిక వ్యాపారాలు చేస్తూనే మనసు మాత్రం పరమేశ్వరునిపైన లగ్నంచేస్తూ ఉంటారు. శ్రీహరి కీర్తనలు పాడుకుంటారు. ఆహా! వీరి భాగ్యమే మని చెప్పగలం అంటూ ఒకరికొకరు చెప్పుకున్నారు. వీళ్ళ సంభాషణలను బట్టి గోపికల వ్యాపకం ఎంతైనా మెచ్చుకోదగిందని మనకు తెలుస్తుంది. ఇందులో నీతి ఏమంటే గోపికలు ఎన్నెన్ని పనుల్లో నిమగ్నమై ఉన్నా వారి మనస్సు మాత్రం శ్రీకృష్ణుని యందే నిశ్చలమై ఉంటుంది. శ్రీరామకృష్ణ పరమహంస భక్తులకు ఇలా ఉపదేశించేవారు. "గ్రామాల్లో వడ్రంగి స్త్రీలు అటుకుల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఒక చేత్తో రోకటి పోటు వేస్తూ ఉంటారు. రెండో చేత్తో ధాన్యాన్ని రోట్లోకి తోస్తూ ఉంటారు. పిల్లలు ఏడిస్తే పాలిస్తూ ఉంటారు. ఇంతలో అటుకులు కొనేందుకు వ్యాపారి వస్తే అతడితో బేరసారాలు చేస్తారు. అయినా ఆమె ధ్యానమంతా రోకటిపోటు చేతి మీద పడకుండా జాగ్రత్తపడటంలోనే ఉంటుంది. అట్లాగే లౌకిక వ్యాపారాలు ఎన్ని చేసినా మనసు మాత్రం భగవంతునిపై నుండి మరల్చరాదు."

కావున ఏ పనిచేస్తున్నా దానియందు ఆసక్తి పెంచుకోకుండా, మనస్సు భగవంతుని పైన నిలుపుకోవటాన్నే పరాకాష్ఠ అని అంటారు. అందువల్లనే బృందావనం లోని గోపికలు ఎన్ని పనులు చేస్తున్నా, మనస్సు శ్రీకృష్ణుని పైన నిలుపుకుంటూ భక్తి పరవశులయ్యారు. మల్లయుద్ధం చూడటానికి వచ్చిన స్త్రీలు కూడా భగవంతుని దర్శనం కాగానే భక్తి పరవశులయ్యారు. రామకృష్ణులు ఈ దుర్మార్గుల్ని ఎంత త్వరగా జయిస్తారా అని ఉవ్విళ్ళూరసాగారు. అటు దేవతలు, మహర్షులు కూడా ఈ శత్రువుల్ని చంపి లోకాన్ని కాపాడమని ఆ పరమేశ్వరుని ప్రార్థించారు. శ్రీకృష్ణ పరమాత్మ కూడా చాణూరకుణ్ణి, ముష్టికుణ్ని అంతమొందించాలని మనస్సులో సంకల్పించాడు. దాంతో చాణూర ముష్టికుల బలం క్రమక్రమంగా క్షీణించడం మొదలైంది.

(ఈ భాగం గర్గసంహిత నుండి గ్రహించబడింది)

చాణూర ముష్టికుల శరీరాల్లో ఉండే జ్యోతిర్విశేషం కాస్తా శ్రీకృష్ణునిలో లీనమై వారిద్దరూ నేలకొరిగారు. (ఈవిచిత్రాన్ని ఆ సభలో ఉన్న సాధుపుంగవులు పరమ భక్తులు మాత్రం చూడగలిగారు. సామాన్యులు ఈ దృశ్యాన్ని చూడలేకపోయారు. సభలో ఉన్న మల్లయోధులంతా అవాక్కయ్యారు. వారిలో కొందరు శ్రీకృష్ణ బలరాములపై తలబడ్డారు. పరమమేశ్వరుడు వారందర్నీ హతమార్చి దేవతలకు ఆనందాన్ని చేకూర్చాడు. ఆకాశం నుండి దేవతలు పూలవర్షం కురిపించారు. ఈ ఘట్టంలో పోతనగారెలా స్పందించారో చూడండి.

ఉ॥ *మల్లురఁ జంపి గోపక సమాజములో మృగరాజురేఖ శో*
భిల్లఁగఁ బాదపద్మములఁ బెల్లుగ నందెలు మ్రోయవచ్చు నా
వల్లవ రాజనందనుల వారక చూచి మహీసురాదు ల
ల్లల్లన స్తుతించిరి ప్రియంబుగఁ గంసుడు తక్కనందఱున్.

నేటితో ఈ దుర్మార్గులు బాధ తొలగిపోయింది గదా అని సభలోని పెద్దలు, స్త్రీలు, భక్తులంతా సంతోషించారు. అయితే కంసుని మనుషులు మాత్రం క్రోధంతో ఊగిపోయారు.

కంస వధ :

చాణూర ముష్టికులను సంహరించి శ్రీకృష్ణుడు, బలరామ సుదామాదులతో కలసి నందాదులకు ఆనందాన్ని కలిగించాడు. దేవకీ వసుదేవులు కూడా పుత్రుని విజయగాథల్ని విని పరమానందం చెందారు. ఇంతవరకు వారూ వీరూ చెప్తూంటే వినడమే గాని బాలుర రూపంలో ఉన్న ఆ బ్రహ్మాండ నాయకుణ్ణి కన్నులార చూడలేక పోయామని వాపోయారు. సభలో ఉన్న పెద్దా చిన్నా సభాసదులంతా ఏనుగుల్లాంటి చాణూరముష్టికులను రంగంలో చూడగానే ఈ పసిబాలురకు ఏం అపకారం తలపెడ్తారో నని వాపోయారు. మళ్ళీ కృష్ణుడి బాల లీలలన్నింటినీ గుర్తుచేసుకొని ధైర్యాన్ని కూడగట్టుకున్నారు. ఇక కంసవధ వృత్తాంతం విచిత్రమైనదే కాదు, తన అవతార ఫలాల్లో ముఖ్యమైన వాటిలో ఒకటి గదా.

(ఈ కథ శ్రీభాగవతం, శ్రీకృష్ణ జన్మఖండం, బ్రహ్మ వైవర్త పురాణాల నుండి గ్రహించబడింది)

చాణూర ముష్టికుల మరణం తర్వాత మిగిలిన మల్లయోధులంతా చచ్చిన వారు చావగా, మిగిలిన వారంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగెత్తారు. ఏ ప్రక్కన చూసినా శ్రీకృష్ణుణ్ణి అభినందిస్తూ జయధ్వానాలు చేసేవారే, కంసుడి కంటికి మల్లరంగం అంతా కృష్ణ మయంగా కనిపిస్తోంది. శ్రీకృష్ణ జయధ్వానాలు కర్ణ కఠోరంగా వినిపించాయి. చాణూర ముష్టికులంతటి వారే మరణిస్తే ఇక తను ఎవరిపైన ఆధారపడాలో కంసుడికి బోధపడలేదు. బుద్ధి పనిచెయ్యడం మానేసింది. అయినా రాజునన్న అహంకారం చావలేదు. ఓటమిని ఒప్పుకోవడానికి మనసు ఎదురు తిరుగుతోంది. తనకంటే అధికుడు జీవించి ఉండకూడదన్నదే అతడి ఆశయం. కృష్ణుడు భగవంతుడన్న ఊహ హృదయంలో ఏదో మూల వినిపిస్తోంది. కానీ అభయం కోరేందుకు మనస్సు అంగీకరించడం లేదు. అహంకారం ఉన్నచోట భక్తి నిలువదుగదా. ప్రజలంతా బలరామకృష్ణులకు జయజయధ్వానాలు పలికారు. అనందంతో నాట్యం చేశారు. పరిస్థితి చెయ్యిదాటిపోతోందని కంసుడు భయపడ్డాడు. కోపంతో నిలువెల్లా ఊగిపోయాడు. గోకులంపై యుద్ధం ప్రకటించాడు. గుర్రాల్ని, ఏనుగుల్ని, రథాల్ని, సిద్ధం చెయ్యమన్నాడు. సేనాధిపతుల్ని దగ్గరుండి యుద్ధం నడిపించమని ఆజ్ఞాపించాడు. నందాదుల్ని దేశబహిష్కారం చెయ్యమని సైనికులకు ఆజ్ఞాపించాడు. మళ్ళీ అంతలోనే 'చాణూర ముష్టికులే ఈ బాలురిద్దర్నీ ఏమీ చెయ్యలేకపోయారే' అని నీరుకారి పోయాడు. బలరామకృష్ణులిద్దరూ నగరంలో ఉంటే తనకెక్కడ ప్రాణహాని తలపెడ్తారో నని నగరం నుండి బహిష్కరించమని సోదరులతో చెప్పాడు. జనమంతా కంసుడికి ప్రాణభయంతో మతిభ్రమించిందని తలచారు. ఈ సందర్భంలో పోతనగారు ఎలా వ్రాశారో చూడండి.

ఉ॥ పల్లవ బాలురన్ నగరి వాకిటికిన్ వెడలంగ ద్రొబ్బుఁడీ
గొల్లల ముట్టికోల్ గొనుఁడు క్రూరుని నందునిఁ గట్టుఁ దుర్వికిం
దెల్లము గాఁగ నేఁడు వసుదేవునిఁ జంపుఁడు తండ్రిగాఁడు వీఁ
డెల్ల విధంబులం బరుల కిష్టుఁడు కావకుఁ డుగ్రసేనునిన్

దుర్గుణాలన్నింటికీ కోపమే ప్రధమ శత్రువు. అందుకే పోతనగారు రెండవపాదంలో 'నందుని గట్టుఁదుర్వికిన్' అంటారు. ఇది కంసుని ఆక్రోశాన్ని తెలుపుతోంది. అతడి చిత్తవృత్తిని గూర్చి ప్రజలనుకునే మాటే మహాకవి కూడా చెప్పారు. అనగా నందాదుల్ని తన పొలిమేరలు దాటి పోకుండా కట్టడి చెయ్యమని కంసుడాజ్ఞాపించాడన్నదే మహాకవి భావం.

(ఈభాగం శ్రీకృష్ణ జన్మఖండంలో మాత్రమే కనిపిస్తుంది.)

తాను మహారాజునన్న గర్వంతో మతిభ్రమించి మాట్లాడాడు. అతడు మృత్యువు నోట్లో ఉన్నా ఇంకా కంసునికి విధేయులు అతడి చుట్టూ ఉన్నారు. కంసుడు వసుదేవుని, ఉగ్రసేనుణ్ణి చంపమని ఆజ్ఞాపించాడు. గోపాలకుల ఆస్తులన్నీ కొల్లగొట్టమన్నాడు. నందాదుల్ని నగరం నుండి బహిష్కరించ మన్నాడు. కృష్ణబలరాములు తప్పించుకుపోకుండా కట్టడి చేయమన్నాడు. సర్వాంతర్యామి అయిన భగవంతుడు కంసుని ఊహలు పసిగట్టాడు. అనగా కంసుని ఆజ్ఞలకు వారి సలహాలు కూడా తోడై ఉంటాయని శ్రీకృష్ణుడు భావించాడు. ఇంకా ఇతణ్ణి ఉపేక్షించరాదని తలచాడు. అతడిలో ఉంటున్న ఆత్మకూడా నా తేజస్సే కదా. ఇకపైన నా తేజస్సు ఆ దేహంలో ఉండరాదని సంకల్పించాడు.

శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణుడు శుద్ధ సత్త్వమూర్తి. వెంటనే కంస సంహారానికై రజోగుణాన్ని ఆపాదించుకున్నాడు. మల్లరంగంలో ఎత్తైన మంచెపై కూర్చున్న కంసునిపై కొదమ సింహంలా లంఘించాడు. మీదిమీదికి వస్తున్న శ్రీకృష్ణుని చూడగానే కంసుడు కత్తి డాలు చేతిలోకి తీసుకొని యుద్ధానికి సిద్ధమయ్యాడు. కృష్ణుడి నుండి తప్పించుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నాడు. ఇంతకు పూర్వం ఎన్నో యుద్ధాలు చేసిన నైపుణ్యం, చాతుర్యం, వీర్యాలన్నీ మసకబారిపోయాయి. ఇప్పుడు జయించడం కంసుడి లక్ష్యం కాదు. ప్రాణరక్షణే పరమ లక్ష్యం. కృష్ణుడు కంసుని తలముడి పట్టుకొని నవరత్న కిరీటాన్ని నేలపై పడత్రోశాడు. కంసుడి ఎముకలన్నీ విరిగేట్లుగా కొదమ సింగంలా పైన బడ్డాడు. ఆ పాటుకే కంసుడి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఏనుగు శరీరాన్ని సింహం లాక్కుపోతున్నట్లుగా కృష్ణుడు కంసుని శరీరాన్ని ఈడ్చుకుపోతూ ఉంటే జనం అంతా హర్షధ్వానాలు చేశారు. కంసుడి పక్షం వారంతా హాహాకారాలు చేశారు. కంసుడు ఇంతకాలం రాత్రింబవళ్ళు శ్రీకృష్ణుడు ధ్యాసలోనే ఉండేవాడు. అన్నంతిన్నా, నీళ్ళుత్రాగినా, పరివారంతో కూర్చున్నా, ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో కూడా కృష్ణుడే కనిపించేవాడు. ఎంతటి పాపిష్ఠి అయినా మనస్సు నిండా విష్ణు భగవానుని నింపుకుంటే అది ఫలితం ఇవ్వకుండా ఉంటుందా? కంసుడా ఫలాన్ని పొంది పరమాత్మలో ఐక్యమయ్యాడు.

బ్రహ్మపురాణం, విష్ణు, హరివంశ, గర్గ సంహిత మొదలైన పురాణాలన్నింట్లోను కంసవధ ఈ విధంగానే వర్ణించబడింది. ఒక్క శ్రీకృష్ణ జన్మఖండంలో మాత్రం, కంసునికి అంతా కృష్ణ మయంగా కనిపిస్తోంది. అప్పుడే సుదర్శన చక్రం అతడి కంఠాన్ని నరికేస్తుంది. దాంతో వాడి ప్రాణాలు

అనంతవాయువులో కలసిపోతాయి. ఈ స్వల్పభేదం తప్ప అన్ని పురాణాలు కంసవధను ఒకే రీతిగా చెప్పాయి. మహాపాపులకు కూడా సారూప్యము లభిస్తుందని భాగవతం, భగవద్గీత మొదలైన పురాణాలన్నీ ఘోషిస్తున్నాయి. కావున కంస, చాణూరక, ముష్టిక, కువలయపీడుడు, మున్నగువారంతా మోక్షపదాన్ని పొందారన్నది నిర్వివాదాంశం.

కంసవధ అయిన తర్వాత శ్రీకృష్ణునికి బాల్యం పూర్తి అయ్యిందని చెప్పుకోవచ్చు. అట్లాగే బాల్యలీలల్లోని చమత్కారాలు కూడా ముగిసినట్లే. ఇకపైన రాజనీతి, తత్త్వబోధ మొదలవుతాయి. ఏయే కార్యాలు ఎట్లాచెయ్యాలో లోకులకు ఉపదేశరూపంలో బోధిస్తూ ఉంటాడు.

కంస పత్నులు శోకించుట :

కంసవధ తర్వాత సుదాముడు మొదలైన గోపబాలురు మల్లరంగమంతా తిరుగుతూ శ్రీకృష్ణునికి జయ జయ ధ్వానాలు చేశారు. వాళ్ళల్లో వాళ్ళే మల్లయుద్ధాలు చేసి జనాల్ని రంజింప జేశారు. ప్రజలు కూడా వారి ఆటపాటల్లో పాలు పంచుకుంటూ ఆనందించారు. అయితే కంస పక్షపాతులు ముఖ్యంగా కంసుని సోదరులంతా గోపకుల గోల భరించలేకపోయారు. కంసుడి సోదరులు ఎనిమిది మంది ఉన్నారు. వారంతా అమిత బలాఢ్యులు. ఈ గోపబాలకుల్ని బలరామకృష్ణుల్ని వధించి అన్నగారికి ఆత్మ శాంతి కలిగించాలని రకరకాలైన ఆయుధాల్ని తీసుకొని వారిపై లంఘించారు. బలరాముడిదంతా కనిపెట్టాడు. తమ్ముడికి శ్రమ ఇవ్వదలచుకోలేదు. తానొక్కడే ఎదిరించాలనుకున్నాడు. లేళ్ళపై దుమికే సింహంలాగా వారిపై దుమికాడు. క్షణాల్లో కంస సోదరులు ఎనిమిది మందిని కూడా వధించాడు. ఇక కంసుని పక్షాన పని చేసిన వాళ్ళంతా ప్రాణభీతితో శ్రీకృష్ణుణ్ణి ఆశ్రయించారు. దేవతలంతా ఆకాశాన గుమికూడి పుష్పవర్షాన్ని కురిపించారు. గంధర్వులు యక్షు, చార్వాకాది సమూహాలన్నీ ఆడుతూ, పాడుతూ తమ ఆనందాన్ని తెలియజేశారు.

ఇంతలో కంసుడు, కంస సోదరులు మరణవార్త అంతఃపురానికి చేరింది. వారి భార్యలంతా నెత్తీనోరు కొట్టుకుంటూ విలపించారు. నువ్వులేని ఈ నగరం మాకు మల్లేనే విధవ అయిందని వాపోయారు. ఏ అపరాధం చెయ్యని ప్రాణుల్ని ఎన్నింటినో పొట్టన పెట్టుకున్నారు. అందుకే మీకీ గతి పట్టిందని దుఃఖించారు.

అంతలోనే కృష్ణ దర్శనం మూలంగా వారిని ఆవరించిన మాయ తొలగి జ్ఞానోదయం అయింది. సర్వ భూతములకు సృష్టి స్థితి లయములకు శ్రీకృష్ణుడే కారకుడు అని గ్రహించారు. అటువంటి అవ్యయుడైన జగదీశ్వరునకు అపకారం తలపెట్టి ఎవరైనా బ్రతుకగలరా? అని దుఃఖిస్తూ ఇళ్ళకు పోయారు.

కంసవధ అనంతరం బలరామకృష్ణులు తమ విడిదికి వెళ్ళారు. ఆనాడు మధురానగరం అంతా శ్రీకృష్ణుని ఆజ్ఞల ప్రకారం నడిచింది. కంసాదులకు ఉత్తర క్రియలు జరుపమని శ్రీకృష్ణుడు ఆదేశించాడు. అంతఃపురానికి తన మనుషుల్ని పంపి కంసుడు, కంస సోదరుల మరణానికి సంతాపాన్ని తెలియజేశాడు. అక్రూరాది కృష్ణ భక్తుల ఆనందానికి అంతేలేదు. కంసుని రాజ్యాన్ని (రాజ్యాన్నంతయు) మంచి రాజ్యంగా చేయ సంకల్పించాడు. భగవత్సంకల్పానికి ఎదురుంటుందా?

అంతట కంసుని తల్లి, బంధువులు, భార్యలు కంసుని శరీరంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించారు. మమ్మల్ని అనాథల్ని చేసి పోవద్దని వేడుకున్నారు. అంతలోనే దైవికంగా జ్ఞానోదయమై ఇలా పలికారు. సమస్త బ్రహ్మాండాల్ని క్షణకాలంలో ఎవరు సృష్టించి పాలించి సంహరిస్తారో. ఎవడు సకల భూతస్వరూపుడో, యోగీశ్వరులు, మునీశ్వరులు, ఇంద్రాది దేవతలు ఏ పరమ పురుషుని పూజిస్తారో, ప్రకృతికెవడు అతీతుడో, ఎవడు నరీహుడు, నిర్గుణుడు, నిరంజనుడో ఆ పరబ్రహ్మమే భూభారాన్ని తగ్గించేందుకు ఈ కృష్ణుడి రూపంలో అవతరించాడు. ఆ కృష్ణుడే నిన్ను చంపితే ఇక నిన్ను రక్షించే వాడెవడుంటాడు? అని పలుకగా అందరి దుఃఖము మాయమై విజ్ఞానులయ్యారు.

ఉగ్రసేనుని పట్టాభిషేకము

(కంస వధ అనంతరం శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవులను చూసి ఆ తర్వాతనే ఉగ్రసేనునికి పట్టాభిషేకం చేసినట్లు భాగవతంలోను విష్ణుపురాణాల్లో తెలుపబడింది. ఒక్క శ్రీకృష్ణ జన్మఖండంలో మాత్రమే ముందుగా ఉగ్రసేన మహారాజుకు పట్టాభిషేకం చేసి ఆ తర్వాతే వసుదేవాదుల్ని సందర్శించినట్లుంటుంది.)

కంసుడు మరణించిన తర్వాత దేశం రాజు లేకుండా ఉండరాదు. అందువలన భగవంతుడు ఆలోచించి రాజన్వంతునగా చేస్తే గాని రాజ్యం సుభిక్షంగా ఉండదని తలచి ఉగ్రసేనుని మహారాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. ఒక్క క్షణం దేశానికి రాజులేక పోయినా అనేక అనర్థాలు కలుగుతాయి. దురాచారాలు పెరిగిపోతాయి. సజ్జనులకు సుఖసంతోషాలుండవు. అందువలన భగవంతుడు పట్టాభిషేకానికి ప్రాధాన్యాన్ని ఇచ్చాడు. అంతేకాకుండా భగవంతుడు చేసే ప్రతిపని లోకానికి సదాచారాన్ని బోధించేదిగా ఉండాలి గదా. పట్టాభిషేకానికి అర్హుడు ఉగ్రసేనుడే నని భగవంతుడు నిర్ణయించాడు. ఎందువల్ల నంటే, వంశపారం పర్యంగా రాజ్యాధికారాన్ని అనుభవించినవాడు. పుత్రులు దుష్టులైనప్పుడు నిర్భయంగా న్యాయాన్ని ధర్మాన్ని చెప్పాడు. అందుకు కారాగార శిక్ష కూడా అనుభవించాడు. అంతే కాకుండా ధార్మికుడు, విష్ణుభక్తుడు అందువల్ల ఇతడే రాజ్యాధికారానికి అర్హుడని శ్రీకృష్ణ పరబ్రహ్మం నిర్ణయించాడు. ఉగ్రసేనుడు పదవులు కోరలేదు. అయినా శ్రీకృష్ణుడు అతడికే పట్టం కట్టేందుకు నిశ్చయించాడు. శ్రీకృష్ణుడే స్వయంగా ఆనిర్ణయం తీసుకుంటే అతడికింకా కొదవేముంటుంది? అనగా రాజ్యము, సంపదలు కావు, భగవద్దాస్యం లభించినట్లే.

మరునాడు గోపాలకులందర్నీ వెంటబెట్టుకొని ఉగ్రసేనుని సందర్శించి ఇలా అన్నాడు: రాజేంద్రా! మేమంతా నీ ప్రజలం. మేము ఏయే సేవలు చెయ్యాలో ఆజ్ఞాపించు. ఇంకొ మాట ఏమంటే, యాదవులకు (మనందరికీ) రాజ్యాధికారం ఉండరాదని యయాతి శపించాడు. అందువల్ల యాదవులెవరూ అశ్వమేధ యాగం చెయ్యడానికి కూడా యోగ్యులు కారు. ఎందువల్ల నంటే రాజు కాని వాడు అశ్వమేధ యాగం చెయ్యరాదు. నేను నీకు సేవకుడిగా ఉన్నంతకాలం దేవతలు గూడా నీకు సామంతులుగా ఉంటూ కప్పం కడ్తారు. ఇక రాజుల మాట ప్రత్యేకంగా చెప్పాలా? అని పలికి ఆ ఉగ్రసేనుని మహారాజును చేశాడు. ఉగ్రసేనుడు కూడా శ్రీకృష్ణుని మాటను శిరసా వహించి

రాజ్య పాలనాభారాన్ని స్వీకరించాడు. శ్రీకృష్ణుడు వాయుదేవుని పిలిచి వాయుదేవా! నువ్వు వెంటనే స్వర్గానికి వెళ్ళి నా నిర్ణయాన్ని నలుగురికీ చెప్పు అన్నాడు. అంతట వాయుదేవుడు ఆఘమేఘాల మీద స్వర్గానికి వెళ్ళి శ్రీకృష్ణ పరబ్రహ్మ శాసనాన్ని తెలియ జేశాడు. దేవేంద్రుడా ఆజ్ఞనను శిరసావహిస్తున్నాని తెలిపాడు.

అటుపిమ్మట శ్రీకృష్ణుడే స్వయంగా ఉగ్రసేన మహారాజును సింహాసనంపై కూర్చోబెట్టాడు. అప్పటికే సామంతులంతానగరంలో ఉండటాన అంతా పట్టాభిషేకానికి హాజరయి కానుకలు సమర్పించారు. శ్రీకృష్ణుడు అప్పుడా మహారాజును పూజించాడు. అనగా తాను పూజిస్తే అంతా పూజిస్తారని భగవంతుని ఆశయం.

శ్రీకృష్ణుడు తల్లిదండ్రులను ఓదార్చుట :

ఉగ్రసేనుని రాజ్యాభిషిక్తునిగా చేసి బంధువులందరికీ తృప్తి కలిగించి, ఆయా శాఖలకు తగిన వారిని నియమించి రాజ్యము అరాచకము కాకుండా కట్టుదిట్టముచేసిన పిమ్మట బలరామకృష్ణులు తల్లిదండ్రులను ఓదార్చేందుకు బయలుదేరారు. మల్ల యుద్ధం జరిగిన రోజున కూడా దేవకీ వసుదేవులు నిర్బంధంలోనే గడిపారు. బలరామకృష్ణులు ఇప్పుడు వారున్న చోటుకు వెళ్ళి వారికి బంధవిముక్తిని కలిగించారు. వారిద్దరికీ సాష్టాంగనమస్కారం చేశారు. శ్రీకృష్ణుడిలా అన్నాడు జననీ జనకులారా! ఎవరైతే తల్లిదండ్రుల్ని, విద్యాదాతను, మంత్రదాతను, గురువును విస్మరిస్తాడో వాడి జన్మ నిరర్థకమవుతుంది. పూజ్యులందరిలో తండ్రియే ప్రథముడు, మహాగురువు. తండ్రికంటే నూరింతలు పూజ్యురాలు తల్లి. తల్లి అంటే భూమాతే. అనగా అందరి హితాన్ని కోరేది. అందువల్ల తల్లిని మించిన బంధువు దొరకడు. విద్యా మంత్ర దానం చేసినవాడు తల్లికన్నా పూజ్యుడు. అని మళ్ళీ బలరాముడితో కలసి తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించారు. దేవకీదేవి వాళ్ళిద్దర్నీ అక్కున జేర్చుకొని ముద్దాడింది. తండ్రి ప్రేమపూరితమైన మాటలతో దగ్గరకు తీసుకున్నాడు. అమ్మా! కారణాంతరాల వలన మేము నీ ఒడిలో పెరిగే అవకాశం కలుగలేదు. అట్లామీరు కూడా మాతో ఆడుకుంటూ మా బాల్యక్రీడల్ని తిలకించే మహద్భాగ్యాన్ని కోల్పోయారు. తల్లిని, వృద్ధుడైన తండ్రిని పతివ్రత అయిన భార్యను, వయసురాని కొడుకును, గురువులను ఆశ్రయించని బ్రాహ్మణుని సమర్థుడై కూడా ఎవరు పోషించరో అటువంటి వాడు జీవన్మృతునితో సమానమని పెద్దలంటారు. అమ్మా! కంసుని భయం వలన మనం తలోచోట తలదాచుకోవలసి వచ్చింది. నేటితో ఆ కంస భయం అంతమయింది. మా అపరాధాన్ని మన్నించు.

బ్రహ్మాండ నాయకుడైన పరమేశ్వరుడు అట్లా అంటూ ఉంటే దేవకీ వసుదేవులిద్దరూ ఆనందబాష్పాలు రాలుస్తూ ముద్దాడారు. నోటమాటరాక మూగవారయ్యారు. వసుదేవుడు బ్రాహ్మణులని పిలిచి మహాదానాలు అనేకం చేసి తన సంతోషాన్ని చాటుకున్నాడు.

ఈ కథలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చెయ్యడం మహాపాపమని, సమర్థుడయి కూడా రక్షించదగిన వారిని రక్షించకపోవడం వలన జన్మనిరర్థకమని భగవంతుడు లోకానికి బోధించాడు.

నందునికి అధ్యాత్మిక బోధ

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం నుండి గ్రహించబడింది. శ్రీ భాగవతం ఇతర పురాణాల్లో ఈ కథ కనిపించదు)

నందాదులు మధురానగరానికి వచ్చినప్పటి నుండి ఎన్నెన్నో చిత్రవిచిత్రమైన విషయాలు చూడటం జరిగింది. దాంతో నందుడి దుఃఖం రెట్టింపయింది. మధురలో శ్రీకృష్ణునికి ఇంకా ఎంతమంది శత్రువులు ప్రచ్ఛన్నంగా ఉన్నారోనన్నది ఒక బెంగ. ఇక రెండవది, శ్రీకృష్ణుడు ఇంతకాలం తన పుత్రుడనే అనుకుంటూ వచ్చాడు. ఉగ్రసేనుని పట్టాభిషేకం అయిన తర్వాత శ్రీకృష్ణ బలరాములు పోయి దేవకీ వసుదేవుల్ని ఓదార్చి వచ్చారు. ఇంతకుపూర్వం శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవుల బిడ్డ అని ఆనోట ఈనోట వినడమే గాని రూఢిగా తెలియదు. ఇప్పుడది కాస్తా బట్టబయలైంది. అందువల్ల కృష్ణుడు తనతో వస్తాడో రాడోనన్నది మరో దుఃఖం.

శ్రీకృష్ణుడీ విషయాన్ని తెలుసుకున్నాడు. నందుని దుఃఖాన్ని నివారించాలనుకొని, నందమహారాజా! దుఃఖాన్ని విడువు. ఇదుగో ఈ మణిని స్వీకరించు. ఇదే చింతామణి అనే మణిరత్నం. ఇది దగ్గర పెట్టుకున్నవారికి దుఃఖాలుండవు. ఆనందంగా కాలం వెళ్ళదీస్తారు. మహారాజా! అర్థంలేని శంకలతో దుఃఖించవద్దు. ఆనందంగా ఉండు. మనం ఆనందాన్ని ఆస్వాదించాలి. జ్ఞానాన్ని ఆశ్రయించాలి. పెద్దలు చెప్పిన మాటలన్నింటినీ మననం చేసుకుంటూ ఉండు. గర్గముని మాటలకు తోడుగా నేనుకూడా కొన్ని మాటలు చెప్తాను. చిత్తగించు. పూర్వం ఈ జ్ఞానాన్నే బ్రహ్మదేవునికి యోగేశ్వరులకు ఉపదేశింపబడింది. దాన్నే నీకిప్పుడు చెప్తాను శ్రద్ధగా విను.

నందరాజా! ఎవడు ఎవరికి పుత్రుడు కాడు. ఎవరెవరికి తండ్రి కాడు. ఎవతె ఎవరికి తల్లి అవుతుంది? ఎవతెకు ఎవరు కొడుకవుతాడు? వీళ్ళకి ఈ సంబంధాలు ఎట్లా ఏర్పడతాయి? ఎవరెవరికర్మానుసారం వారంతా వస్తూ ఉంటారు. పోతూ ఉంటారు. కర్మాన్ని బట్టియే జీవుడికి స్థానభేదము, రూపభేదము కలుగుతూ ఉంటుంది. కర్మఫలాన్ననుసరించే యోగీంద్రుల వంశంలో ఓ ప్రాణి పుడుతుంది. రాజ కుటుంబంలో మరొక ప్రాణి పుడుతుంది. అట్లాగే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్ర స్త్రీలందు కూడా ప్రాణులు పుడుతూ ఉంటాయి. పశుపక్ష్యాదులందు క్రిమి కీటకాలయందు పుడుతూ ఉంటాయి. ఈ పుట్టడం అనే ప్రక్రియకు కర్మ ఫలమొక్కటే కారణం. మరే ఇతర కారణాలు ఉండవు. జీవుల కష్టసుఖాలకు అభివృద్ధికి నాశనానికి కర్మమే సర్వకారణం. ఇది అందరికీ తెలిసిందే. అయినా అవ్యక్తాన పడుతూ ఉంటారు. కర్మవల్లనే క్రూరజన్మలు గాని సాధుజన్మలు గాని కలుగుతూ ఉంటాయి. నందరాజా! దేహధారులందరూ నా మాయ చేతనే విషయవాంఛలకు బానిసలవుతూ ఉంటారు. బంధుత్వాలు పెంచుకొని మోహితులవుతారు. బంధువియోగం చేత దుఃఖిస్తూ ఉంటారు. ఈవిధంగా ప్రతిక్షణం మూఢులవుతూ ఉంటారు. నామాయలో చిక్కుకున్నవాడు జ్ఞాని కాలేడు. ఎవడైతే నాకు భక్తుడై ఇంద్రియాలకు లోబడక, నా మంత్రాన్ని జపిస్తూ సేవిస్తాడో వాడిని నా మాయ ఆవరించదు. జ్ఞాని అయి తరిస్తాడు. నా శాసనానికి లోబడే గాలి వీస్తుంది, సూర్యచంద్రులు ప్రకాశిస్తారు, వరుణుడు వర్షిస్తాడు, అగ్ని దహిస్తుంది. వృక్షాలు కాలాన్ననుసరించి పుష్పించి ఫలిస్తాయి. ఇక నా

కల్పన గూర్చి విను. వాయువు నిరాధారం. కచ్ఛపమునకు (తాబేలు) వాయువు ఆధారం. శేషుడు కూర్మాన్నాధారం చేసుకుంటాడు. పర్వతాలు శేషుడ్నధారం చేసుకుంటాయి. పాతాళ లోకాలన్నీ పర్వతాల్ని ఆధారం చేసుకుంటాయి. జలం నిశ్చలం కాబట్టి వసుంధర (భూమి) నీటిలో ఉంటుంది. స్వర్గాలు భూమిని ఆధారం చేసుకొని ఉంటాయి. జ్యోతిశ్చక్రమంతా గ్రహాల నాశ్రయించి ఉంటాయి. వైకుంఠం నిరాధారం. అది బ్రహ్మాండాలన్నింటికి పైభాగాన ఉంటుంది. దీనితో పోల్చి చెప్పతగింది మరొకటి లేదు. దానిపైన గోలోకం ఉంటుంది. దీని విస్తీర్ణం సుమారు అయిదు వందల కోట్ల యోజనాలు. ఇది నిరాధారము, నిరాశ్రయము కూడా. ఇది ఏడు ద్వారాలు, ఏడు సారములు, ఏడు పరిఖలతో విలసిల్లుతూ ఉంటుంది. లక్షలాది ప్రాకారాలుంటాయి. రత్నవైఢూర్యాలతో నిండిన ఆ పర్వతానికి వెయ్యి శిఖరాలుంటాయి చుట్టూ విరజానది ప్రవహిస్తూ ఉంటుంది. ఆ పర్వత శిఖరాలన్నీ మణి మాణిక్యాలు, రత్న వైఢూర్యాలతో పొదగబడి ఉంటాయి. ఆ పర్వతం ఎత్తు సుమారు వందయోజనాలుంటుంది. ఆ పర్వత శిఖరాల పైననే రాసమండలం ఉంటుంది. ఆ మండలం అంతా చంద్ర బింబంలాగా గుండ్రంగా ఉండి రత్నాలు పొదగబడి ఉంటాయి. ఇక కల్పవృక్షాల్ని లెక్క బెట్టడం సాధ్యం కానే కాదు. ఆ రాసమండలంలో మూడుకోట్ల భవనాలుంటాయి. ఆ భవనాల్లో కోట్లాది గోపికలుంటారు. ఆ భవనానికి రక్షక భటులు కూడా గోపికలే. అక్కడుండే పాత్రలు అమృతంతో నిండి ఉంటాయి.

నందరాజా! గోకులాన్ని గూర్చిగాని, దాని అందచందాల్ని గూర్చిగాని చెప్పగలవాడొక్కడు కూడా లేడు. దాని తత్త్వమెరిగిన వాడు ఆ వ్రజేశ్వరుడొక్కడే. అక్కడి రత్న మందిరాలన్నీ రాధాదేవి కొరకే నిర్మించబడ్డాయి. ఆ సౌధంలో రాధాదేవి స్వర్ణ సింహాసనంపై ఆసీనురాలై ఉంటుంది. లక్షలాది గోపికలామెను సేవిస్తూ ఉంటారు. అటువంటి రాధాదేవి సుధాముడి శాపం వలన గోకులంలో వృషభానునికి పుత్రిక అయి జన్మించింది. ఆ శాపకారణంగా మేమిద్దరం నూరు సంవత్సరాలు వియోగాన్ని అనుభవించాల్సి ఉంటుంది. తండ్రీ! ఆ దేవితో కలసి భూబారాన్ని తగ్గించేందుకే నీకు పుత్రుడనయ్యాను. నాఅవతార ఫలం సిద్ధించగానే రాధాదేవితో కలసి గోలోకానికి వెళ్తాం. మాతో పాటు నువ్వు, యశోదాదేవి, వృషభానుడు, కలావతి, గోపకులు, గోపికలు ఇతర బంధువులంతా గోలోకానికి వస్తారు. ఈ విషయాలన్నీ యశోదా దేవికి కూడా తెలుపు. కావున తండ్రీ! నువ్వు శోకాన్ని విడిచి పెట్టు. గోపకుల్ని వెంటబెట్టుకొని గోకులానికి వెళ్ళు. అందరిలో ఉండే ఆత్మను నేనే. సాక్షీభూతుడుగా ఉంటాను. నిర్లిప్తుడనే అయినా అందరి హృదయాల్లోనూ ఉంటాను. జీవుడనగా నా ప్రతి బింబమే. నా సంకల్పమే ప్రకృతి. అనగా ఆ ప్రకృతే నేను. నాకూ ప్రకృతికి ఉండే సంబంధం పాలకు తెల్లదనమున్నట్లు, అగ్నియందు దాహక శక్తి ఉన్నట్లు, ఆకాశానికి శబ్దమున్నట్లు, భూమియందు గంధమున్నట్లు, సూర్యునియందు ప్రకాశం ఉన్నట్లు, చంద్రునిలో చల్లదనమున్నట్లు, నాయందు ప్రకృతి కూడా అంతే. ఆ మూల ప్రకృతినే నా ఇచ్ఛా శక్తి అని అంటారు.

నందభూపాలా! ఇకపైన నా పరమ ఐశ్వర్యాన్ని గూర్చి చెప్తాను విను. పూర్వం బ్రహ్మకు చెప్పిందే ఇప్పుడు నీకూ చెప్తున్నాను. దేవతలందరికీ ప్రభువైన నేను గోలోకంలో రెండు భుజాలతో

ఉంటాను. వైకుంఠంలో నాలుగు భుజాలతో విష్ణువుగాను, కైలాసంలో నన్ను శివుడని, సత్యలోకంలో బ్రహ్మ అని అంటారు. తేజోవంతుల్లో, సూర్యుణ్ణి నేనే. పవిత్రమైన వాటిల్లో నేను అగ్నిని, ద్రవాల్లో నీటిని, ఇంద్రియాల్లో మనస్సును, దండకర్తల్లో యముణ్ణి, అక్షరాల్లో 'అ' కారాన్ని, వేదాల్లో సామవేదాన్ని, పరిపాలకుల్లో ఇంద్రుణ్ణి, ధనవంతుల్లో కుబేరుణ్ణి, వ్యాపకులలో ఆకాశాన్ని, మణుల్లో కౌస్తుభాన్ని, అర్చనా వస్తువుల్లో సాలగ్రామాన్ని, తీర్థాల్లో పుష్కర తీర్థాన్ని, పుష్పాలలో పారిజాతాన్ని, తిథులలో ఏకాదశిని, వృక్షాలలో కల్పవృక్షాన్ని కామధేనువుల్లో సురభిని, బ్రహ్మర్షుల్లో భృగువుని, నా సేవకుల్లో శ్రీదాముణ్ణి నేనే, నా బంధువుల్లో ఉద్ధవుణ్ణి నేనే. పశుజంతువుల్లో గోవును నేనే. ఈవిధంగా వస్తువులన్నీ నా ఆకారాలు సర్వభూతాల్లోనూ నేనే ఉంటాను. సర్వకారణ స్వరూపుడను నేనే. సర్వేశ్వరునకు ఈశ్వరుణ్ణి నేనే. నేను ఉన్నంత వరకే దేహికి వీటన్నింటికి ఆకలి దప్పికలు ఉంటాయి. నేను వెళ్ళిపోగానే అవీ వెళ్ళిపోతాయి.

తండ్రీ! నేను చెప్పినదంతా జ్ఞాన సారమని తెలుసుకో. ఇక మనస్సులో ఏ శంకలు పెట్టుకోకుండా వ్రజకు తిరిగి వెళ్ళు. యశోదా దేవికి, రాధకు కూడా ఈ జ్ఞానాన్ని తెలియజెయ్యి. జ్ఞానవంతుడైన నందుడు దుఃఖాన్నంతా విడిచిపెట్టాడు. మహదానందాన్ని పొందాడు. గోకులానికి వెళ్ళాడు. రాధకు, యశోదకు ఈ ఉపదేశ సారాన్ని తెలిపాడు. వారుకూడా శోకాన్ని వదలి మహదానందాన్ని పొందారు.

నంద కృష్ణ సంవాదము

(ఈ సంవాదం శ్రీకృష్ణ జన్మఖండంలో మాత్రమే కనిపిస్తుంది. నారదుడు అడిగిన ప్రశ్నకు నారాయణుడిచ్చిన సమాధానమిది. చెప్పిందే మళ్ళీ చెప్తున్నట్లనిపించినా కొన్ని తెలుసుకోదగిన విషయాలుండటం వలన ఈ భాగం కూడా గ్రహించబడింది)

నారాయణుడు : నారదా! శ్రీకృష్ణుడు పరిపూర్ణుడు, పరమాత్మ. భూభారాన్ని తగ్గించేందుకు అవతరించిన నిర్గుణుడు, ప్రకృత్యతీతుడు, అట్టి శ్రీకృష్ణుడు కంసవధానంతరం తన అవతార ఫలాన్ని లోకానికి మధుర నుండి ప్రారంభింప సంకల్పించాడు. నందుని వేదనను అర్థం చేసుకొని అనుగ్రహించాలనుకున్నాడు. ఈ విధంగా ఉపదేశం చేశాడు.

నందరాజా! శోకాన్ని విడిచిపెట్టు దుఃఖభరితమైన ఈ సంసారాన్ని నమ్మకు. సత్యమైనది, నిరుపమానమైన జ్ఞానాన్ని నీకు ప్రసాదిస్తాను. శ్రద్ధగా విను. పృథ్వి, వాయువు, తేజస్సు, జలము, ఆకాశమనే అయిదింటినీ పంచభూతాలంటారు. దేహాలన్నీ ఈ పంచభూతాలతో చేయబడినవే. అయితే ఈ దేహాలన్నీ మిథ్య. అనగా భ్రమ మాత్రమే. కృత్రిమమైనవి. స్వప్నం లాగానే మాయమైపోయేవే. ప్రాణుల దేహాలన్నీ ఈ పంచభూతాలచే గ్రహించబడినవే. ప్రపంచ వస్తువులన్నింటిపైనా భ్రమతోకూడిన జ్ఞానాన్ని కలిగిస్తాయి. మరి అంతా భ్రమే అయినప్పుడు ఎవరు ఎవరికి తండ్రి? ఎవరు ఎవరికి పుత్రుడు? ఎవరు ఎవరికి భార్య? అవుతారు. కర్మలచేత ప్రాణులు పరిభ్రమిస్తూ ఉంటాయి. అనేక జన్మలెత్తాల్సి ఉంటుంది. ప్రాణి కర్మలచేతనే పుడుతుంది. కర్మలచేతనే లయిస్తుంది. సుఖ దుఃఖాలు

కర్మల వల్లనే కలుగుతూ ఉంటాయి. ఆ కర్మల్ని బట్టే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్ర జాతులందు పుడ్తూ ఉంటారు. కొన్ని ప్రాణులు క్రిమి కీటకాలైతే కొన్ని పశుపక్ష్యాదులవుతాయి. దీని కంతకూ కర్మమే కారణం ఎవరు చేసుకున్న కర్మల్ననుసరించి పుట్టడం, గిట్టడం జురుగుతూ ఉంటాయి. నా భక్తుడైన వాడు కర్మలు చేస్తాడు గాని కర్మఫలాన్ని నాకే సమర్పిస్తాడు. అనగా కర్తవ్యం తన పైన వేసుకోడు.

కాలాన్ని నాలుగు యుగాలుగా విభజించారు. అవే సత్య, త్రేతా, ద్వాపర కలియుగాలు. ఇట్లాంటి యుగాలు 25 యుగాలైన తర్వాత ఒక మనువు మరణిస్తాడు. ఇంద్రుడు కూడా మనువు ఉన్నంత కాలం ఉంటాడు. అట్లాంటి మనువులు ఇంద్రులు పద్నాలుగురు మరణిస్తే బ్రహ్మకు ఒక పగలవుతుంది. ఒకరాత్రి కావాలన్నా తిరిగి అంతే సమయం పడుతుంది. మాసాలు, సంవత్సరాలు వంటి కాలమానం కూడా నిర్ణయించబడ్డాయి. పై కాలక్రమాన్ననుసరించి బ్రహ్మ ఆయుర్ధాయం కూడా వంద సంవత్సరాలే. దీన్నే పరమాయువు అంటారు. నాకు ఒక నిముషం అయితే బ్రహ్మకు నూరు సంవత్సరాలు. ఆ తర్వాత అతడూ మరణిస్తాడు. అనగా బ్రహ్మ నుండి గడ్డిపరక వరకు నా చేతనే సృష్టించి లయించబడ్డాయి. సత్యమనగా నేనే. పరమాత్మ అన్నా నేనే. నా మంత్రోపాసన చేసిన భక్తుడు సత్య స్వరూపుడై దేహాన్ని, ధనాన్ని వదిలేసి గోలోకానికి చేరుకుంటాడు. పూర్వ కర్మల ఫలాలన్నింటినీ ఛేదిస్తే గాని గోలోకానికి రాలేడు. అనగా కర్మ ఫల శేషం ఉండరాదు. బ్రహ్మాదులు నశిస్తారు. కానీ నా లోకానికి చేరిన భక్తుడు నశించడు. అతడి దేహం నిత్యము. జనన మరణాలుండవు. నందమహారాజా! నాభక్తునికి అమంగళా లెన్నటికి జరుగవు. ఎందువల్లనంటే నా సుదర్శన మతణ్ణి ఎల్లప్పుడూ కాపాడుతూ ఉంటుంది. నా భక్తుడెప్పుడూ నా కన్నా బలవంతుడే. నేనతినికి స్వామినే గాని నాకు స్వామి ఎవ్వరూ లేరు. నాకు తండ్రి కూడా లేడు. కావున ఓ నందా! నన్ను పుత్రుడిగా ఊహించుకోవడం మానెయ్యి. బ్రహ్మ స్వరూపునిగా ప్రార్థించు. అప్పుడే నువ్వు గోలోక వాసానికి యోగ్యుడవవుతావు. నీకు కలిగిన జ్ఞానాన్నే యశోదకు, గోపగణానికి బోధించు. అంతట సర్వజ్ఞుడైన భగవానుడు సకల వేద సారమైన ఆహ్నికమును బోధించాడు. శ్రీకృష్ణుని ఉపదేశాన్ని పొంది ఆనందపరవశుడయ్యాడు.

నందుడి చిత్తం సంసారంలో కూరుకుపోయింది. సంసారంలోనే మహదానందం లభిస్తుందని నందుడే కాదు చాలామంది అభిప్రాయం. అనగా జ్ఞానసారాన్ని గ్రహించేందుకు మనస్సు పరిపక్వం కాదు. అందువల్లనే శ్రీకృష్ణుడు రెండవసారి జ్ఞానోపదేశం చేశాడు. అనగా భ్రాంతి జ్ఞానం నశిస్తే గాని నిర్మల జ్ఞానం వికసించదు. కర్మలు రెండు రకాలు. ఒకటి బలనమైన కర్మలు. రెండవది బలహీనమైన కర్మలు. దృఢమైన కర్మల్ని ఎన్ని ప్రయత్నాలు చేసినా తప్పించుకోలేరు. అనుభవించి తీరాల్సిందే. అయితే వాటిని తట్టుకొని నిలబడగలిగే శక్తిని ప్రసాదించమని సర్వేశ్వరుని ప్రార్థించవచ్చు. బలహీనమైన కర్మలు ప్రాయశ్చిత్తాల్లాంటి కొద్దిపాటి ప్రయత్నం వలన తప్పించుకోవచ్చు. బలమైన కర్మలు ఎట్లా ఉంటాయో ఒక ఉదాహరణ చెప్తాను.

పూర్వం విజయుడనే రాజు దాయాదుల వలన రాజ్యాన్ని పోగొట్టుకొని అడవుల పాలయ్యాడు. తిరిగి రాజ్యాన్ని సంపాదించాలంటే అర్థబలం లేదు. అంగబలం లేదు. తాను అడవుల పాలయ్యాడు కనుక దైవ బలంపైనే ఆధారపడాలనుకున్నాడు. ఏదేవుని ఆశ్రయించాలన్న ప్రశ్న ఉదయించింది. అతడు తనలో ఇలా అనుకున్నాడు. అవతారమూర్తులంతా తమ అవతారఫలం కాగానే వెళ్ళిపోయేవారే. ఇకపోతే హనుమంతుడొక్కడే చిరంజీవిగా ఉండేవాడని నమ్మి ఆంజనేయుని గూర్చి తపస్సు చేశాడు. కొంతకాలానికి హనుమంతుడు ప్రత్యక్షమై విజయుణ్ణి వరం కోరుకోమన్నాడు. విజయుడు ఇలా అన్నాడు. దేవా! హనుమంతుడా! నేను దాయాదుల వలన రాజ్యం పోగొట్టుకున్నాను. తిరిగి నా రాజ్యాన్ని పోయిన ప్రతిష్ఠను ప్రసాదించమని అడిగాడు. అందుకు హనుమంతుడు ఇలా అన్నాడు. వత్సా! నీ పూర్వ జన్మలో కర్మలు చాలా బలమైనవి, కావున నువ్వు తలక్రిందులుగా తపస్సు చేసినా రాజ్యాన్ని, ప్రతిష్ఠను తిరిగి పొందలేవు. ఎందువల్లనంటే కర్మము భగవత్స్వరూపం. దాన్ని ఆ పరమేశ్వరుడుకూడా మార్చలేడు. అయితే వచ్చే జన్మలో నీ కోరిక తీర్చగలను అని అన్నాడు. అందుకు విజయుడు దేవా! హనుమంతా! వచ్చే జన్మ ఎట్లాఉంటుందో, ఎప్పుడు ఉంటుందో ఎవరు చూశారు. ఈ జన్మకీ అవమాన భారం తప్పదు గదా అని విలపించాడు. అందుకు హనుమంతుడు వత్సా! విలపించకు నీ దుఃఖాన్ని అర్థం చేసుకున్నాను. అయితే వచ్చే జన్మలో నీకోరిక తీర్చగలను, తిరిగి రాజ్యాన్ని ప్రతిష్టను పొందేట్లు చేస్తాను. ఎట్లా గంటావా, నీ రథ పతాకం పైన నేనుంటాను. నా దృష్టి పడినంతనే దూరాన నీ శత్రువులు నశిస్తారు. మహావీరుల్ని కూడా సంహరిస్తావు. నీరాజ్యాన్ని కీర్తిని తిరిగి పొందుతావు. నీకు వచ్చే జన్మలో కూడా ఇదే పేరు ఉంటుంది. అని పలికి హనుమంతుడు అంతర్థానమయ్యాడు. ఆ విజయుడే పాండవ మధ్యముడైన అర్జునుడు. దీని వలన బలమైన కర్మఫలాలు ఎంత తీవ్రంగా ఉంటాయో తెలుసుకోవచ్చు. నందుని సంసార బంధాలనుండి విముక్తుణ్ణి చెయ్యాలని భగవంతుడూహించి రెండవ పర్యాయం కూడా ఉపదేశించాడు. నిర్మల జ్ఞానం కలిగేట్లు చేశాడు. దాంతో వసుదేవునిపై కలిగిన అసూయ నాశనమైంది. శ్రీకృష్ణ పరబ్రహ్మంపై నందుడు పుత్ర భావాన్ని వదిలిపెట్టాడు. ఇంకా జ్ఞానబోధ చెయ్యమని ప్రార్థించాడు. దీనిని బట్టి ఎవరికైనా సాధుబోధ తలకెక్కకపోతే ఇంకోసారి చెప్పించుకొని తెలుసుకోవాలి. అప్పటికీ బోధపడకపోతే మూడవ పర్యామే కాదు, జ్ఞానం కలిగే వరకు తెలుసుకుంటూనే ఉండాలి. అంతేకాని ప్రయత్నం మానకూడదు. అప్పుడు గాని భగవద్భక్తి, జ్ఞానం స్థిరపడదు.

రామకృష్ణులు గురుకులమున ప్రవేశించుట

(ఈభాగం శ్రీ భాగవతం దశమ స్కంధం 45వ ప్రకరణం నుండి గ్రహించబడింది.)

కంసుడు మరణించిన తర్వాత రామకృష్ణులిద్దరూ చెరసాలకు పోయి దేవకీ వసుదేవులను బంధవిముక్తుల్ని చేసి సాష్టాంగ నమస్కారం చేశారు. దేవకీ వసుదేవులకు తమ నిజతత్త్వం తెలియకుండా ఉండేట్లు 'ఉన్ముఖ మోహిని' అనే మాయను వారిపై ప్రసరింప జేశారు. ఆ పిమ్మట "జననీ జనకులారా! ఇంతవరకు మీరు మా గురించి ఎంతో ఆందోళన చెందారని విన్నాం. అందువల్లనే మా బాల్యక్రీడలేవీ మీరు అనుభవించలేకపోయారు. అనగా బాల్య, శిశు, కౌమార దశల్లో ఏ దశలోనూ మిమ్మల్ని సంతోషపెట్టలేకపోయాం. అందుమూలంగా మేము చాలా దురదృష్టవంతులమని భావిస్తున్నాం.

జననీ జనకులారా! ఏ శరీరం వల్ల మానవులు సర్వ ధర్మాలు పొందుతారో అటువంటి శరీరాన్ని ప్రసాదించిన తల్లిదండ్రుల్ని వంద సంవత్సరాలు సేవించినా వారి ఋణాన్ని తీర్చుకోలేం. సమర్థుడై ఉండికూడా ఎవడు తల్లిదండ్రుల్ని సంతోషపెట్టలేడో అతడు తప్పక నరకాన్ని పొందుతాడు. సమర్థుడైన పురుషుడు తల్లి, తండ్రి, కుటుంబంలో వృద్ధుల్ని, పతివ్రతలైన స్త్రీలను, గురువును, బ్రాహ్మణుని పోషించని యెడల అటువంటి వాడు జీవించి ఉన్నా మరణించిన వాడితో సమానం. మేము ఇన్నాళ్లూ కంసుని భయం చేత మిమ్మల్ని పూజింపలేకపోయాం. అందువల్ల బాల్యాది అవస్థలన్నీ వ్యర్థమైపోయాయి. మా అపరాధాన్ని క్షమించండి.

పుత్రుల మాటలు విన్న దేవకీ వసుదేవుల హృదయం పొంగి కన్నీరు మున్నీరుగా ఆనందబాష్పాలు కారుస్తూ వాళ్ళిద్దర్నీ కౌగిలించుకొని ముద్దాడారు. అక్కడనుండి అంతాకలసి తాతగారైన ఉగ్రసేన మహారాజు వద్దకుపోయి ఆయన్ను బంధవిముక్తుల్ని చేసి రాజుగా అభిషేకించారు. అంతట శ్రీకృష్ణుడు ఉగ్రసేన మహారాజుతో "మహారాజా! మేమందరం నీ ప్రజలం. మమ్మల్ని కాపాడుతూ రాజ్యపాలన చెయ్యండి. యయాతి శాపం వలన యాదవులు రాజ్యపాలనాధికారం కోల్పోయారు. కావున మేమందరం నీ భృత్యులం. ఇకపైన భూమిపైన ఉండే రాజులే కాదు స్వర్గాన ఉండే దేవతలుకూడా నిన్ను పూజిస్తారు" అన్నాడు. కంసునికి భయపడి పారిపోయిన యాదవులందర్నీ తిరిగి మధురకు రమ్మని ఆహ్వానించాడు. ప్రతిరోజు భగవంతుని కన్నులారా చూస్తూ, ఆయన సాన్నిహిత్యంలో రోజులు సుఖంగా గడచిపోతున్నాయి. ఒక రోజున శ్రీకృష్ణుడు నందుని వద్దకుపోయి "తండ్రీ! నువ్వు, (యశోద) అమ్మ మమ్మల్ని ఎంతో ఆదరంతో పెంచి పెద్దవాళ్ళను చేశారు. మీ కష్ట సుఖాల్ని కూడా లెక్క చెయ్యకుండా మాకోసం శ్రమించారు. తండ్రీ! మీరిద్దరూ ఇప్పుడు వ్రజకు పొండి. నేను, రాముడు ఇక్కడ కొన్ని రాచకార్యాలు చక్కబెట్టాల్సి ఉంది. ఆ పనులన్నీ చక్కబెట్టుకొని వస్తా మని తల్లిదండ్రులకు నచ్చజెప్పి" వ్రజ వాసులందరినీ తగువిధంగా సత్కరించి పంపాడు. నంద, యశోదలు బలరామకృష్ణుల్ని విడిచి వెళ్ళలేక కన్నీరు పెట్టుకుంటూ వ్రజకు తిరిగి వెళ్ళారు.

ఆ తర్వాత కొన్ని రోజులకు పురోహితులైన గర్గాచార్యులను పిలిపించి ఉపనయన సంస్కారాలు జరిపించారు. గర్గాచార్యులు రామకృష్ణులకు గాయత్రీ మంత్రాన్నుపదేశించారు. "రామకృష్ణులారా! మీరు

సర్వజ్ఞులు. మీ జ్ఞానం సహజసిద్ధం. అయినా మానవరూపంలో అవతరించడం వలన లోకాచారాన్ని పాటించి మీరు గురుకులవాసం చెయ్యాలి. గురుముఖంగా ధర్మ మార్గాన్ని నేర్చుకోవాలి" అన్నాడు. రామకృష్ణులు గర్గాచార్యుల ఆదేశాన్ని శిరసావహించి కాశీనగరంలోని సాందీపుని ఆశ్రమానికి విద్యార్థులై వెళ్లారు.

జితేంద్రియులైన రామకృష్ణులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆయన వద్ద విద్యాభ్యాసం చేశారు. సాందీపమహర్షి కూడా వారి వినయ విధేయతలకు ఎంతో సంతోషించాడు. షడంగ సహితంగా ఉపనిషత్తులను, వేదాలను ఉపదేశించాడు. మంత్ర శాస్త్రం, వేదాంతం, రాజనీతిని బోధించాడు. వారు అరవై నాలుగు కళల్ని అరవై నాలుగు రోజుల్లో గ్రహించారు.

శా॥ *వేదశ్రేణియు నంగకంబులు ధనుర్వేదంబుఁ దంత్రంబు మ*
న్వాది వ్యాహృత ధర్మశాస్త్రములు నుద్యన్న్యాయముం దర్క వి
ద్యా దక్షత్వము రాజనీతియును శుద్ధ ప్రక్రియం జెప్పె నా
భూదేవాగ్రణి రామకృష్ణులకు సంభూత ప్రమోదంబునన్.

ఈ విధంగా రామకృష్ణులు విద్యాభ్యాసం పూర్తి చేసుకొని గురువుకు నమస్కరించి "మహాత్మా! మీ వలన సమస్త విద్యలు నేర్చుకున్నాం. గురుదక్షిణ ఏమి కావాలో కోర" మని ప్రార్థించారు. అందుకు సాందీపమహర్షి "మీరు సర్వజ్ఞులు. నా అదృష్టం కొద్దీ నాకు శిష్యులయ్యారు. మిమ్మల్ని కోరరానిదిగాని, మీరు తీర్చలేనిదిగాని ఏమీ ఉండదు" అని భార్యను సంప్రదించి "రామకృష్ణులారా! నాకు ఒక కొడుకుండేవాడు. మేము ప్రభాస తీర్థంలో సముద్రస్నానానికి వెళ్ళినప్పుడు ఆ బాలుడు స్నానానికని నీళ్ళల్లో దిగి తిరిగి రాలేదు. ఇది జరిగి చాలా సంవత్సరాలైంది. నా భార్య ఆ కుమారునిపై ఎంతో ప్రేమ పెంచుకుంది. మీరు కనుక ఆ బాలుని తీసుకొని వస్తే నా భార్య సంతోషిస్తుంది.

రామకృష్ణులు గురువాజ్ఞను తలదాల్చి సముద్ర తీరానికి వెళ్ళి కూర్చున్నారు. కొద్దిసేపట్లో సముద్రుడు మానవ రూపంలో వచ్చి నమస్కరించి పూజించాడు. సముద్రునితో "సాగరుడా! కొద్ది సంవత్సరాల క్రితం ప్రభాస తీర్థంలో నా గురువు సాందీపుల వారి పుత్రుడు నీలో ప్రవేశించి తిరిగి రాలేదు. కావున నీవా కుమారుని తీసుకొని రమ్మ"ని ఆజ్ఞాపించారు. అందుకు సముద్రుడు "దేవా! నే నా సాందీపతనయుణ్ణి నావద్ద దాచుకోలేదు. పంచజనుడనే రాక్షసుడా బాలుని తీసుకొని వెళ్ళాడు. వాడు శంఖం రూపంలో ఉంటాడు. కావున నీవు నా జలాలలోకి ప్రవేశించి పాంచజన్యుని వద్దనుండి తీసుకొని వెళ్ళు" అని లోపలకు వెళ్ళేందుకు దారి ఇచ్చాడు. రామకృష్ణులిద్దరూ సముద్రమంతా వెదకి పాంచజన్యుని వధించి వాడి ఉదరమంతా శోధించారు. వారికి బాలుడు కనిపించలేదు గానీ ఒక శంఖం మాత్రం వాడి పొట్టలో కనిపించింది. వారా శంఖాన్ని తీసుకొని యమలోకానికి పోగా ఆ శంఖనాదం విని యమధర్మరాజు పూజాద్రవ్యాలు చేతబట్టుకొని వచ్చి రామకృష్ణులను పూజించాడు. శ్రీకృష్ణుడు "యమధర్మరాజా! నా గురుపుత్రుడు ప్రారబ్ధ కర్మచేత నీవద్ద ఉంటున్నాడు. అతడి ప్రారబ్ధాన్ని, మిగిలిన కర్మ ఫలాన్ని నాశనం చేస్తున్నాను. నువ్వు వెంటనే ఆ బాలుణ్ణి తీసుకొనిర" మ్మని ఆజ్ఞాపించాడు. అంతట యమధర్మరాజు ఆ గురుపుత్రుని తెచ్చి ఇవ్వగా రామకృష్ణులా బాలుని గురువుకు సమర్పించారు.

అంతట రామకృష్ణులు సాందీపుని మరొక వరం కోరమని అడిగారు. అందుకు సాందీపుడు “వత్సలారా! నేను కోరిన గురుదక్షిణ ఇచ్చారు గదా. మీ వంటి శిష్యులుండగా ఇంకా నాకేం కోరికలుంటాయి? ఇది చాలు. ఇక మీరు ఇంటికి వెళ్ళండి. మీ కీర్తి చిరస్థాయిగా ఉంటుంది. వేదములెప్పుడూ ప్రకాశవంతమై ఉండుగాక” అని దీవించాడు. అంతట రామకృష్ణులు గురువువద్ద సెలవు తీసుకొని ఇంటికి వెళ్ళి తల్లిదండ్రుల్ని, బంధువుల్ని సంతోషపెట్టారు.

కుబ్జను అనుగ్రహించటం

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 48వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

కంసుని సంహరించేముందు భగవంతుని కుబ్జ తన ఇంటికి వచ్చి తన ఆతిథ్యాన్ని స్వీకరించమని కోరుకుంది. భగవంతుడు ఎవరు ఏది కోరితే దాన్నే అనుగ్రహిస్తాడు గదా! భగవంతుడు కల్పతరువు. భక్తురాలైన కుబ్జ కూడా అటువంటి కోరికే కోరింది.

ఒక రోజున భగవానుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం ఉద్ధవుని వెంటబెట్టుకొని కుబ్జ యింటికి వెళ్ళాడు. భగవంతుని చూస్తూనే కుబ్జ సంతోషం పట్టలేకపోయింది. పరుగు పరుగున ఎదురు వెళ్ళి భగవంతుని ఇంట్లోకి ఆహ్వానించింది. ఆసనం పైన కూర్చోబెట్టింది. ఉద్ధవుడు మాత్రం శ్రీకృష్ణుడు కూర్చున్న ఆసనానికి నమస్కరించి ప్రక్కనే నేలపైన కూర్చున్నాడు. కుబ్జ చక్కగా అలంకరించుకొని వచ్చింది. తన వద్ద ఉండే విలువైన అనులేపనాలన్నింటినీ పూసుకుంది. అందంగా అలంకరించుకుని సిగ్గులొలికిస్తూ వచ్చి శ్రీకృష్ణుని ప్రక్కన నిలబడింది. శ్రీకృష్ణుడామెను దగ్గరకు తీసుకొని బాహువులలో బంధించి ఆమెను సంతోషపెట్టాడు.

మ॥ సరసాలోకన వృష్టి పైఁ గురియుచున్ సమ్యగ్వచో వైఖరిం
గరగంజేసి సువర్ణ కంకణ సమగ్రంబైన సైరంధ్రి కేల్
కర పద్మంబునఁ బట్టి తల్పమున కాకర్షించి గంభీరతం
బరిరంభాదుల నాన పుచ్చి మరుసంభావించుచున్ వేడుకన్

కుబ్జ మన్మథ తాపం ఉపశమించిన తర్వాత “ ఓ ప్రియతమా! ఇంకా కొన్నాళ్ళు నీతో సుఖించాలని ఉన్నది” అన్నది. అందుకు భగవంతుడు ఆమె కోరికను మన్నించి కొన్ని రోజులక్కడే ఉన్నాడు. అయితే కుబ్జ వంటి నిర్భాగ్యురాలు మరొకరుండరు. ఎందువల్లనంటే సర్వేశ్వరుడైన మహావిష్ణువును ఆరాధించి ఆయనను కేవలం విషయ సుఖాలను కోరేవాడు మిగుల తుచ్ఛుడు. కానీ గోపికలు అట్లా కాదు. శ్రీకృష్ణుని సేవను మాత్రమే కోరారు.

అనంతరం కొన్ని రాచకార్యాలు చక్కపెట్టేందుకు ఉద్ధవుని వెంటబెట్టుకొని అక్రూరుని ఇంటికి వెళ్ళారు. అక్రూరుడు వారిని భక్తిపూర్వకంగా ఆహ్వానించి పూజించాడు. అక్రూరుడు శ్రీకృష్ణుని పాదాలు తన తొడపై ఉంచుకొని మెల్లగా నొక్కుతూ “దేవా! పాపాత్ముడైన కంసుని చంపి జగత్తునంతా సంతోషపెట్టావు. యాదవులు కూడా తిరిగి మధురానగరానికి వచ్చి సుఖంగా జీవిస్తున్నారు. ఈ కార్యకారణాలన్నీ మీకు తప్ప మరెవ్వరికీ బోధపడవు.

పంచభూతాలు వివిధ జీవుల్లో చేరి అనేక రూపాలుగా కనిపించేట్లుగానే నువ్వు కూడా నర, పశు పక్ష్యాది శరీరాల్లో ఉంటూ బాల్యం, యౌవనాది అవస్థల్ని వెల్లడిస్తూ ఉంటావు. సత్వరజస్తమో గుణాలతో ఈ జగత్తుకు సృష్టి స్థితి లయాదులనేవి నీకొక క్రీడ. అయినా నువ్వు గుణాలచేతగాని, కర్మల చేతగాని బంధించబడవు. నువ్వు జ్ఞాన స్వరూపుడవు కాబట్టి జీవులవలె బంధితుడవు కావడంలేదు. అయినా బద్ధుడవైనట్లు కనిపిస్తావు. జీవుల అవిద్యే అందుకు కారణం. జ్ఞానోదయం కాగానే అవిద్య (భ్రాంతి) తొలగిపోతుంది. అప్పుడు నీ నిజతత్త్వం బోధపడుతుంది" అన్నాడు. మరలా స్వామీ! ఆత్మకు ఎన్నడూ బంధంగాని, ముక్తిగాని ఉండవు. అజ్ఞానంతో వాటిని నీకు ఆరోపిస్తారు. నిత్యుడవైన నీకు అనిత్యాలు ఎట్లా సంభవిస్తాయి? దురాచారులు కొందరు జన్మించి పురాణాలకు, వేదమార్గాలకు హాని కలిగిస్తూ ఉంటారు. అప్పుడు లోకహితం కోసం నువ్వు సత్త్వగుణాన్ని స్వీకరించి అవతరిస్తూ ఉంటావు. దేవా! నీ పాదాలు కడిగిన నీరు పవిత్ర గంగ అయి ముల్లోకాలను పవిత్రుల్ని చేస్తోంది. నీ పాదాలు కడిగిన నీటికే అంతటి ప్రభావం ఉంటే నీ ప్రభావాన్ని గాని, నీ పాదాల ప్రభావాన్ని గాని నేను వర్ణించగలనా? దేవా! నువ్వు భక్త సులభుడవు. గోరంత భక్తికి కొండంత ఫలాన్నిస్తావు. నీ దర్శనం కోసం యోగేశ్వరులే ప్రాకులాడుతూ ఉంటారు. అట్టి నిన్ను కాదని మరొకర్ని ఆశ్రయించడం కన్నా దరిద్రం మరొకటి ఉంటుందా?" అన్నాడు.

శ్రీకృష్ణుడు "అక్రూరా! నువ్వు మాకు గురువు వంటి వాడవు. వరసకు పినతండ్రివి. మేము నీ పుత్రులతో సమానం. దేవతల కన్నా యోగ్యుడవు. దేవతలు స్వార్థపరులు. కానీ, నువ్వు దేవతలకన్నా యోగ్యుడవు. నువ్వు దర్శన మాత్రం చేతనే పవిత్రుల్ని చేస్తావు. నువ్వు నా బంధువులందర్లోకీ శ్రేష్ఠుడవు.

చ॥ కొలుతురు మర్త్యు లిష్టములు గోరి శిలామయ దేవ సంఘమున్
జలమయ తీర్థ సంఘమును సంతతము న్నటు వారు గొల్వఁగా
వల దనరాదు గాక భగవత్పద భక్తుల రైన మీ క్రియన్
సొలయక దేవతీర్థములు చూచిన యంతనే కోర్కులిచ్చునే?

అందువల్ల నువ్వు హస్తినాపురానికి వెళ్ళిరా. అక్కడ పాండవులు ధృతరాష్ట్రుని ఆశ్రయంలో ఎట్లా నివసిస్తున్నారో తెలుసుకొనిరా. తండ్రిపోయిన తర్వాత వారంతా మిక్కిలి దుఃఖాలు అనుభవిస్తూ ఉంటారు. కుంతీదేవిని, పాండవుల్ని ధృతరాష్ట్రుడు హస్తినాపురం తీసుకొని వచ్చాడని విన్నాను. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు. ఇతరులపైన ఆధారపడి జీవించేవాడు. అంతేకాకుండా దుర్మార్గులైన దుర్యోధనాదుల్ని కాదని నిర్ణయాలు తీసుకోలేడు" అని శ్రీకృష్ణ బలరాములు తమ గృహాలకు వెళ్ళారు.

ద్వారకాపుర నిర్మాణము

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 50వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

అస్తి, ప్రాప్తి అన్న వాళ్ళిద్దరూ కంసుని భార్యలు. జరాసంధుని పుత్రికలు. జరాసంధుడు కుమార్తెల వైధవ్యానికి దుఃఖిస్తూ అందుకు కారకుడైన శ్రీకృష్ణునే కాకుండా యావత్తు యాదవకులాన్ని నిర్మూలం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. 23 వేల అక్షౌహిణీల సైన్యంతో యాదవుల రాజధాని అయిన మధురానగరాన్ని ముట్టడించాడు. మధుర చుట్టూ సైన్యం సముద్రంలా వ్యాపించి ఉండటంతో మధురావాసులంతా కాలుతీసి కాలుపెట్టలేక ఇబ్బందులపాలయ్యారు. ఇది భూభారాన్ని తగ్గించేందుకు సరైన సమయమని శ్రీకృష్ణుడు భావించాడు. అందులో తనవారు చిక్కుకోరాదని శ్రీకృష్ణుడు "మగధసైన్యం భూమికి భారంగా ఉంది. ఈ సైన్యాన్నంతా నాశనం చేసి జరాసంధుణ్ణి మాత్రం విడిచి పెడ్తాను. ఎందువల్లనంటే, అతడు జీవించి ఉంటేనే పగతో మళ్ళీ మళ్ళీ సైన్యాన్ని సమకూర్చుకుంటాడు. దుష్టుల్ని దుష్టుడు త్వరగా ఆకర్షిస్తారు గదా! అందుమూలంగా దేశంలో ఉండే దుష్టులంతా అతడి సైన్యంలో చేరుతూ ఉంటారు. అప్పుడు నేను కూర్చున్నచోటు నుండే వాళ్ళందర్నీ సులభంగా సంహరించగలుగుతాను. అనగా నేను ఒక్కొక్క దుష్టుణ్ణి వెతుక్కుంటూ పోవాల్సిన అవసరం ఉండదు. ధర్మాన్ని కాపాడేందుకు, అధర్మాన్ని నిర్మూలం చేసేందుకే కదా నేనీ మానవ శరీరాన్ని ధరించాను" అని తలపోశాడు.

శ్రీకృష్ణుడీవిధంగా ఆలోచిస్తూ ఉండగానే ఆకాశంలో దివ్యరథాలు రెండు ప్రత్యక్షమయ్యాయి. ఆ రథాలకు సారథులు, ధనుర్బాణాలుకూడా సిద్ధంగా ఉన్నాయి. ఆ రథాల్ని చూడగానే శ్రీకృష్ణుడు బలరామునితో "అన్నా! పూజనీయా! జరాసంధుని సైన్యాన్ని చూసి యాదవులంతా భయపడుతున్నారు. నువ్వు ఒక రథాన్నెక్కి శత్రు సైన్యాన్ని సంహరించు. దుర్జనుల్ని సంహరించడం సాధువుల్ని రక్షించడమే కదా మన అవతార ఫలం. కావున 23 వేల అక్షౌహిణీల మేరకు సైన్యాన్ని సంహరించి భూభారాన్ని తగ్గించు.

శా॥ *కంటే రామ! రథంబు లాయుధము న్ గాఢప్రకాశంబులై*
మింటన్ వచ్చెను, వీనిఁ గైకొని సురల్ మెచ్చన్ నృపశ్రేణులన్
బంటింపం బనిలేదు చంపుము; ధరాభారంబు వారింపు; మీ
వెంటన్ నీ యవతారమున్ సఫలమౌ; వేవేగ లె మ్మాజికిన్.

రామకృష్ణులీవిధంగా ఆలోచించి ఇద్దరూ చెరో రథాన్ని అధిరోహించి కొద్దిపాటి సైన్యాన్ని వెంటబెట్టుకొని చెరోప్రక్కకూ వెళ్ళారు. శ్రీకృష్ణుడి రథానికి దారకుడే సారథ్యం వహించాడు. శ్రీకృష్ణుడు పాంచజాన్యాన్ని పూరించగానే శత్రుసేనల పై ప్రాణాలు పైనే పోయాయి.

జరాసంధుడు రామకృష్ణులను చూసి "పురుషాధమా! కృష్ణా! నువ్వు బాలుడివి. బాలురతో యుద్ధం చెయ్యను. అంతేకాదు. చాలా పిరికివాడివి. చాలాకాలం అక్కడా ఇక్కడా తలదాచుకొని బ్రతికావు. అంతేకాకుండా నువ్వు సొంత బంధువుల్నే సంహరించిన పాపాత్ముడవు. నువ్వు వచ్చిన

దారినేపో. నీతో యుద్ధం చెయ్యను. బలరామా! నీకు నాతో పోరాడగల ధైర్యం ఉంటే నిలబడు. ఇప్పుడే నిన్ను స్వర్గానికి పంపుతాను" అన్నాడు.

జరాసంధుని మాటలు విన్న శ్రీకృష్ణుడు "రాజా! వీరులైన వారు పరాక్రమాన్ని ప్రదర్శిస్తారు కాని ప్రగల్భాలు పలుకరు. చాతకాని వాడే తన్ను తాను పొగుడుకుంటాడు. నువ్వు వట్టి వాచాలుడవు. చావబోయేవాడి మాటల్ని నేను లెక్కచేయను" అన్నాడు.

అంతట జరాసంధుని సైన్యం రామకృష్ణుల రథాల్ని పూర్తిగా ఆవరించేశాయి. మేఘాలు సూర్యుణ్ణి కప్పేసినట్లు ధూళి అగ్నిని కప్పేసినట్లు రామకృష్ణుల రథాలు కనుమరుగయ్యాయి. యుద్ధం ఉద్ధృతంగా సాగుతోంది. జరాసంధుని సైన్యం ముందు యాదవ సైన్యం అనామకంగా కనిపించింది. అయితే శ్రీకృష్ణుడు బాణాల్ని నలువైపులా గుప్పించాడు. ఆ బాణాలు సూటిగా పోయి ఏనుగుల కుంభస్థలాలకు తాకి నేలకూలుతున్నాయి. గుర్రాల తలలు శరీరాలనుండి వేరై రక్తం ఏరులైపారింది. సైనికుల కాళ్ళు చేతులు తెగిపడ్డాయి. ఎక్కడ చూసినా మృతదేహాలే. సైన్యం చెల్లాచెదరైపోయింది. జరాసంధుడు నిస్సహాయుడై ఒంటరిగా నిలచిపోయాడు. బలరాముడతణ్ణి బంధించాలనుకున్నాడు. కానీ శ్రీకృష్ణుడు "అతణ్ణి వదిలెయ్యి. అతడితో కావలసిన పనులు ఇంకా ఎన్నో ఉన్నాయి" అన్నాడు. బలరాముడతణ్ణి వదిలేశాడు.

రామకృష్ణుల దయాదాక్షిణ్యాలతో ప్రాణాలు దక్కించుకోవడం జరాసంధునికి తలకొట్టేసినట్లయింది. వైరాగ్యంతో అడవుల్లోకి పారిపోయాడు. తపస్సు చెయ్యాలనుకున్నాడు. కానీ తోటి రాజులతనికి ఉపశమన వాక్యాలు పలికి మగధకు తీసుకొని వెళ్ళారు.

రామకృష్ణుల విజయానికి దేవతలు పూల వర్షం కురిపించారు. యుద్ధంలో మరణించిన యోధానుయోధుల ఆభరణాల్ని తెచ్చి ఉగ్రసేన మహారాజుకు కానుకగా ఇచ్చారు. కొంతకాలం అణిగిమణిగి ఉన్న జరాసంధుడు తిరిగి పెద్దపెట్టున సైన్యాన్ని సమకూర్చుకొని రామకృష్ణులపై యుద్ధానికి దిగాడు. అయితే ఓడిపోయాడు. ఈ విధంగా మధురపైన పదిహేడు పర్యాయాలు దండెత్తి ఓడిపోయాడు.

ఆ రోజుల్లో కాలయవనుడనే యవనుడొకడు మూడుకోట్ల మందిసైనికులతో ప్రత్యర్థి కోసం వెదకసాగాడు. అప్పుడు నారదుడు అతడి వద్దకు పోయి "నాయకా! నువ్వు ఒక్క యాదవుల్ని జయిస్తే లోకంలో ఉండే రాజులందర్నీ జయించినట్లే. కనుక నువ్వు మధురపై దండెత్తు" అని ప్రోత్సహించాడు. అదే సమయంలో జరాసంధుడు కూడా పదునెనిమిదవ పర్యాయం మధురపై దండెత్తే ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఈ సందర్భంలో శ్రీకృష్ణుడు బలరాముడితో "అన్నా! ఇన్నాళ్ళూ మనపైకి జరాసంధుడొక్కడే దండెత్తే వాడు. అతణ్ణి ఓడించి పంపడం మనకూ అలవాటైంది. కానీ ఇప్పుడు కాలయవనుడనే వాడొకడు మూడు కోట్ల మంది సైనికులతో మనపైకి లంఘించేందుకు సిద్ధపడుతున్నాడు. కాబట్టి మనం మానవులు చొరబడలేని దుర్గాన్నొకటి నిర్మించుకోవలసిన అవసరం ఏర్పడింది."

శ్రీకృష్ణుడు ఈ విధంగా ఆలోచించి సముద్రం లోపల పన్నెండు యోజనాల విస్తీర్ణంలో అద్భుతమైన నగరాన్నొకటి నిర్మించాలి అని సంకల్పించాడు. వెంటనే విశ్వకర్మను పిలిపించి వాస్తు ప్రకారం పన్నెండు యోజనాల విస్తీర్ణంలో ఒక నగరాన్ని నిర్మించమని ఆదేశించాడు. క్షణాల్లో ఆ నగరం నిర్మించబడింది. వీథులకు రెండువైపులా మహావృక్షాలు కొలువుతీరాయి. ఉద్యానవనాలు, ఆకాశాన్నంటే భవనాలు, భవనాలన్నింటికీ శిఖరాలు, శిఖరాలన్నింటిపైనా మణులు తాపడం చెయ్యబడ్డాయి. నాలుగు వర్ణాలవారికి నివాస గృహాలు విడివిడిగా నిర్మించబడ్డాయి. రాజులకు రాజవంశీయులకూ దుర్గంలోపలే నివాసాలేర్పడ్డాయి. అదే ద్వారకానగరం.

అంతట శ్రీకృష్ణుడు బలరాముని వెంటబెట్టుకొని యోగమాయ సహాయంతో మధురా నగరాన్నంతా ద్వారకా నగరానికి మార్చివేశాడు. వారితోపాటు గోవులు, గోవత్సాలు ఇతర పశుపక్ష్యాదులన్నీ ద్వారకకు చేర్చబడ్డాయి. బలరాముడు వారందరికీ రక్షకుడుగా నిలబడ్డాడు. శ్రీకృష్ణుడు పీతాంబరధారియై శ్రీవత్స, కౌస్తుభ వనమాలల్ని ధరించి మేఘశ్యామ శరీర ఛాయతో ఊరిశివార్లలో నిరాయుధుడై నడచి వస్తూ ఉండటం కాలయవనుడు చూశాడు.

కాలయవనుడు భస్మమగుట

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 51వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు నిరాయుధుడై మధురానగరం నుండి బయటకు పోవడం కాలయవనుడు చూశాడు. అతడి ఆకారం, ధరించిన ఆభరణాలు, వస్త్రాలంకరణం అన్నీ పరిశీలించి చూడగా నారదుడు వర్ణించిన శ్రీకృష్ణుడేనని అనుకున్నాడు. ఇతడు నాకు భయపడి పారిపోతున్నాడని అతడి దురదృష్టంచేత నాకంట పడ్డాడని భావించాడు. ఏది ఏమైనా అతడిని వెంబడించి అతగాడి అంతు తేల్చాలని అనుకున్నాడు. అతడు నిరాయుధుడై వెళ్తున్నప్పుడు తాను ఆయుధాలతో వెంబడించడం ధర్మం కాదని కాలయవనుడు కూడా ఆయుధాలు లేకుండానే వెంబడించాడు. ఒకవేళ అతడు కాళ్ళూ చేతుల్తో పోరుకు తలబడితే తానూ అందుకు సిద్ధమేనని కాలినడకనే వెంబడించాడు.

సీ॥ *నీలజీమూత సన్నిభ శరీరము వాఁడు తామరసాభనేత్రముల వాఁడు*
పూర్ణేందుబింబంబుఁ బోలెడి మోమువాఁ డున్నత దీర్ఘబాహువులవా డు
శ్రీవత్స లాంఛనాంచిత మనో హరమువా డు కౌస్తుభమణి పతకంబు వాఁడు
శ్రీకర పీతకౌశేయ చేలమువా డు మకరకుండల దీప్తి మలయువాఁడు

ఆ॥ *రాజయింతింతవాఁ డనరాని వాఁడు । మఱసి దిక్కులనెల్లను మెఱయువాఁడు*
తెలిసి యేవేళలందైనఁ దిరుగువాఁడు । పట్టనేర్చినఁగాని లోఁబడనివాఁడు.

– బమ్మెరపోతనామాత్యుడు.

కాలయవనుడు ఈ విధంగా శ్రీకృష్ణుని వెంబడిస్తూ ఉంటే ఒకప్పుడు చిక్కినట్లే చిక్కేవాడు. మళ్ళీ అంతలోనే కనిపించకుండా పోయేవాడు. ఒకానొక సమయాన కాలయవనుడు విసుగుపుట్టి

"కృష్ణా! నువ్వు యదువంశంలో పుట్టావు. నన్నీ విధంగా తిప్పలు పెట్టడం తగదు" అని అంటూ ఉండగా శ్రీకృష్ణుడు ఓ గుహలో ప్రవేశించాడు. కాలయవనుడు శ్రీకృష్ణుని అనుసరించి గుహలో ప్రవేశించాడు. కానీ శ్రీకృష్ణుడెక్కడా కనిపించలేదు. అయితే అక్కడో వ్యక్తి పడుకుని నిద్రపోవడాన్ని చూశాడు. శ్రీకృష్ణుడే తన్ను మోసం చేయాలనే ఉద్దేశంతో పడుకుని నిద్రపోతున్నట్లు నటిస్తున్నాడని భావించాడు. అతణ్ణి కాలితో తన్నసాగాడు. కొంతసేపటికా వ్యక్తి మేలుకొని కళ్ళు తెరచి కాళ్ళతో తన్నుతున్న కాలయవనుణ్ణి చూశాడు. అంతే ఆ మహాత్ముని దృష్టిపడగానే కాలయవనుడు కాలి బూడిదైపోయాడు.

ఆ గుహలో నిద్రిస్తున్న వ్యక్తి పేరు ముచుకుందుడు. అతడు ఇక్ష్వాకు వంశానికి చెందినవాడు. మాంధాత కుమారుడు. అతడు సంత్యసంధుడని ప్రసిద్ధి చెందాడు. దేవతలకు రాక్షసులకు జరిగిన యుద్ధాలన్నింట్లోను దేవతలకు రక్షకుడుగా నిలచాడు. అతడు భార్యపుత్రుల్ని, రాజ్యాన్ని త్యాగం చేసి దైవకార్యంకోసం ఎన్నో యుగాలు పాటుపడ్డాడు. కార్తికేయుడు దేవతలకు సర్వసేనాని అయిన తర్వాత ముచుకుందుడు విశ్రాంతి కోరాడు. దేవతలు ఆయన అభీష్టాన్ని గౌరవించి ఏదైనా వరం కోరుకోమన్నారు. అయితే ముచుకుందా! మోక్షాన్ని మాత్రం కోరకు. ఎందువల్ల నంటే శ్రీమహావిష్ణువు ఒక్కడే మోక్షాన్ని ప్రసాదించగలడని అన్నారు.

అంతట ముచుకుందుడు "దేవతలారా! ఇంతకాలం మీ రక్షణ భారం వహించి అలసిపోయాను. నిద్రకు కరువయ్యాను. కావున నన్ను నిద్రపోనివ్వండి అయితే ఎవరైనా నా నిద్రకు భంగం కలిగిస్తే వాడు నా కంటి చూపు పడగానే మాడి బూడిద అయిపోవాలి" అని పలికి ఈ గుహలో ప్రవేశించాడు. ఇదీ ముచుకుందుని పూర్వ చరిత్ర.

కాలయవనుడు కాలిబూడిదై పోగానే శ్రీకృష్ణుడు ముచుకుందునికి తన నిజరూపాన్ని ప్రదర్శించాడు. భగవానుని దర్శించిన ముచుకుందుడు "శ్రేష్ఠా! నీ తేజస్సు చూసేందుకు నా శక్తి చాలడం లేదు. నీ తేజస్సును బట్టి నువ్వే శ్రీమహావిష్ణువని భావిస్తున్నాను" అన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు "రాజా! నాకు వేలకొద్దీ జన్మలు, పేర్లూ ఉన్నాయి. ఏ పేరని చెప్పను? అందువల్ల ప్రస్తుత అవతారాన్ని గూర్చి చెబుతాను విను. రాక్షసుల ప్రభావం చేత భూమిమీద భారం పెరిగిపోయింది. ఆ భారాన్ని తగ్గించమని బ్రహ్మ నన్ను ప్రార్థించాడు. అందువల్ల నేను యదువంశంలో వసుదేవుని ఇంట్లో అవతరించాను. అందువల్ల నన్ను జనులు వాసుదేవుడని అంటారు. ఇంతవరకు కాలనేమి, కంసుడు, ప్రలంబుడు మున్నగు రాక్షసుల్ని సంహరించాను. శ్రీమహావిష్ణువునైన నేను నిన్ను అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదించేందుకే ఇక్కడకు వచ్చాను" అన్నాడు. అందుకు ముచుకుందుడు "పరమేశ్వరా! శరీరాలు కుండలవంటివి. అటువంటి జడపదార్థాలకు "నేను రాజును" అన్న అభిమానాన్ని పెంచుకుంటా. ఎప్పుడైతే అభిమానం తలెత్తిందో నాలో వివేకం నశించింది. వివేకం కోల్పోగానే లోభం వచ్చి చేరింది. లోభం వల్ల తృప్తి నశించింది. తృప్తి లేనివాడికి సుఖమెక్కడిది? మనశ్శాంతి ఎక్కడనుండి లభిస్తుంది? ఇంతలోనే కాలస్వరూపుడవైన నువ్వు శరీరాన్ని నాశనం చేస్తావు. ఏ శరీరం అయితే బంగారు ఆభరణాలు ధరించి రథాల్లో ఊరేగుతుందో ఆ శరీరం కాస్తా కుక్కలు, నక్కలకు

ఆహారమవుతుంది. మానవుడు ఈ సత్యాన్ని తెలుసుకోలేక మాయలో పడి మైథునమే పరమ సుఖమని క్రీడామృగంలా ప్రవర్తిస్తాడు.

దేవా! కొందరు రాజులు సంపదలన్నింటినీ వదిలేసి అడవులకు పోయి నిష్ఠతో తపస్సు చేస్తారు. ఇంకొందరు కఠోరమైన బ్రహ్మచర్యాన్ని అవలంబించి నిన్ను ధ్యానిస్తారు. కానీ నా విషయంలో అటువంటి నిష్ఠలేవీ లేకుండానే సాధించాను. అందుకు నీ అనుగ్రహమే కారణం గాని నా సంకల్ప బలం ఎంత మాత్రం కాదు. దేవా! వరం కోరుకోమన్నావు. నిరంతరం నీ పాద సేవ చేసే భాగ్యం కలిగించు. నీ సేవాభాగ్యం కన్నా కోరదగిందేమీ లేదు. పరమేశ్వరా! త్రిగుణ సంబంధమైన కోరికలూ, విషయాలూ పూర్తిగా నన్ను వదిలిపోయేట్లుగా అనుగ్రహించు. అద్వైతుడవు, నిర్గుణుడవు, సచ్చిదానంద విగ్రహుడవు, అక్షరుడవు, పరమ పురుషుడవు అయిన నిన్ను శరణు పొందుతున్నాను. దైవానుగ్రహం చేత సత్యము, అభయము, శోకము లేకుండా నీ పాదపద్మాల్ని శరణు పొందాను. ఆపదలో చిక్కుకున్న నన్ను రక్షించు" అని అన్నాడు.

ముచికుందునితో శ్రీకృష్ణుడు "రాజేంద్రా! నీ బుద్ధి పూర్తిగా నిర్మలమైంది. బలం చేకూరింది. నిన్ను వరాలిస్తానని ప్రలోభపరచినా నీ బుద్ధి వాసనలకు లొంగలేదు. అయినా నేను నీకిచ్చే వరాల వలన నీకు ఎటువంటి చెడు జరుగదు. ఎందువల్ల నంటే ఏకాంత భక్తులను విషయాలచే ప్రలోభపెట్టాలని చూసినా వారు ఆసక్తి చూపరు. రాజా! భక్తిలేని యోగులు, జ్ఞానుల మనస్సు ఎప్పుడైనా విషయాల వైపు మొగ్గవచ్చు. కానీ నీకు ఏకాంత భక్తి సిద్ధించింది. అందువల్ల మనస్సు నాపైన ఉంచి నువ్వు స్వేచ్ఛగా భూమిపై సంచరించు. నీకు నాయందు ఎప్పుడూ పరాభక్తి ఉండేట్టు అనుగ్రహిస్తున్నాను. రాజా! నువ్వు క్షత్రియ ధర్మాన్ననుసరించి చాలా ప్రాణుల్ని హింసించావు. వచ్చే జన్మలో సర్వ ప్రాణుల హితాన్నీ కోరే బ్రాహ్మణ జన్మ పొందు. నా అనుగ్రహం చేత నీవా పాపాలన్నింటినీ పోగొట్టు కుంటావు. ఇతర విషయాలపైన నీ మనస్సు ఆసక్తి చూపదు.

ఉ॥ *మంచిది నీ బుద్ధి నృపమండన! నీవు పరార్థ మెట్లు వ*
వర్తించిన నైనఁ గోరికల దిక్కునఁ జిక్కవు మేలు; నిర్మలో
దంచిత వృత్తినన్ గొలుచు ధన్యు లబద్ధులు నెట్లు నీకు ని
శ్చంచల భక్తి గల్గెడిని సర్వము నేలుము మానవేటికిన్.

ముచుకుందుడు శ్రీకృష్ణుని అనుగ్రహానికి పాత్రుడై గుహనుండి బయటకు వచ్చాడు. చుట్టూ కలియచూశాడు. వృక్షాలు, జంతువులు మనుష్యులు ఆయన కంటికి మరగుజ్జుల్లా కనిపించారు. దాన్ని బట్టి కలియుగం ప్రవేశించిందని గ్రహించాడు. తపస్సు చేసుకోవడానికి ఉత్తర దిక్కున ఉన్న గంధమాదన పర్వతాలకు వెళ్ళాడు. అక్కడ నరనారాయణుల ఆశ్రమంలో శీతోష్ణాలకు, సుఖదుః ఖాలకు సహించి శ్రీహరిని మనస్సులో ధ్యానిస్తూ తపస్సు చేశాడు.

శ్రీకృష్ణుడు ముచుకుందుని అనుగ్రహించి మధురానగరాన్ని చేరుకొని యవన సేనలన్నింటినీ సంహరించాడు. మధురలోని సంపదలన్నింటినీ ద్వారకకు తరలించాడు. శ్రీకృష్ణుని మనుష్యులను, గోవుల్ని ధనాన్ని జరాసంధుని సైన్యాలు అడ్డుకున్నాయి.

రామకృష్ణులు జరాసంధుని సైన్యాల్ని చూసి భయపడుతున్నట్లుగా నటిస్తూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ముందుకు నడిచారు. వారావిధంగా పోతూ ఉంటే జరాసంధుని సైన్యానికి దూరం తెలియలేదు. అయితే వారెన్నో యోజనాల దూరం వెంబడించారు. పోయి పోయి వారు ప్రవర్షణ అనే పర్వత శిఖరాన్ని చేరుకున్నారు. అప్పటికే వాళ్ళంతా బాగా అలసిపోయారు. రామకృష్ణుల జాడ కనిపెట్టలేకపోయారు. విసుగుపుట్టింది. చివరకు ఆ పర్వతానికి నిప్పు పెట్టారు. మంటలు ఆకాశాన్నంటాయి. రామకృష్ణులు తప్పక ఆ మంటల్లో మరణించి ఉంటారని అనుకొని సైన్యమంతా వారి దేశానికి వెళ్ళారు.

అప్పుడు రామకృష్ణులు పదకొండు యోజనాల ఎత్తున్న ఆ పర్వతం పైనుండి దూకి ద్వారకకు చేరుకున్నారు.

రుక్మిణీ సందేశం

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 52వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

బ్రహ్మ తానే పౌరోహిత్యం చేసి బలరామునికి అనర్త దేశాధిపతి అయిన రైవతుని కుమార్తె రేవతి నిచ్చి వివాహం జరిపించాడు.

భీష్మకుని కుమార్తె అయిన రుక్మిణి సాక్షాత్తూ లక్ష్మీదేవి అంశతో జన్మించింది. శ్రీకృష్ణుడు శిశుపాలుని, అతడి పక్షాన వచ్చిన సాల్వుడు మున్నగు వారందర్నీ ఓడించి రుక్మిణిని గాంధర్వ పద్ధతిలో వివాహం చేసుకున్నాడు.

భీష్మకుని పుత్రిక అయిన రుక్మిణిని గాంధర్వ విధిన వివాహం చేసుకోవాల్సిన పరిస్థితులు ఎట్లా వచ్చాయని పరీక్షిన్మహారాజు ప్రశ్నించగా శుకమహర్షి ఈ విధంగా తెలిపాడు.

"రాజా! భీష్మకునికి రుక్మి, రుక్మధుడు, రుక్మ బాహువు, రుక్మ కేశుడు, రుక్మమాలి అనే అయిదుగురు పుత్రులు జన్మించారు. రూపవతియైన రుక్మిణి వీరికి సోదరిగా జన్మించింది. రుక్మిణి చిన్నతనం నుండి శ్రీకృష్ణుని లీలలు గాథలు అనేకం విన్నది. శ్రీకృష్ణుని రూప, గుణ, బలాదులు గూర్చి నారదమహర్షి చెప్పగా విన్నది. అప్పటి నుండి శ్రీకృష్ణునే భర్తగా పొందాలని మనస్సులో ధ్యానిస్తూ వచ్చింది. అట్లాగే శ్రీకృష్ణుడు కూడా రుక్మిణి రూపలావణ్యాలు, బుద్ధికుశలత, ఉదార స్వభావాలన్నీ విని మోహితుడయ్యాడు. ఆమెనే వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు.

క॥ ఆ లలన రూపు బుద్ధియు, శీలము లక్షణము, గుణముఁ జింతించి దగన్
బాలారత్నముఁ దన కి, ల్లాలుగఁ జేకొందు ననుచు హరియుం దలఁచెన్.

రుక్మిణి తల్లిదండ్రులు కుమార్తె మనోభావాల్ని తెలుసుకొని శ్రీకృష్ణునికిచ్చి ఆమె వివాహం చెయ్యాలనుకున్నారు. కానీ ఆమె సోదరుడు రుక్మి మాత్రం అందుకు ససేమిరా అంగీకరించనన్నాడు. పైపెచ్చు శిశుపాలుడికిచ్చి వివాహం చేస్తానని పట్టుబట్టుకొని కూర్చున్నాడు. అన్నగారి పట్టుదలకు రుక్మిణి ఎంతోదుఃఖించింది. తల్లిదండ్రులు ఎంత చెప్పినా రుక్మి తనపట్టు విడువలేదు. అప్పుడు రుక్మిణి అత్యంత మనోవేదనతో ఒక బ్రాహ్మణుని శ్రీకృష్ణుని వద్దకు పంపింది. బ్రాహ్మణుడు ద్వారకకు

చేరుకొని శ్రీకృష్ణుని దర్శనం సంపాదించాడు. రుక్మిణి మనోభావాల్ని ఏకాంతంలో విన్నవించుకున్నాడు. రుక్మిణి వ్రాసిన లేఖ కూడా శ్రీకృష్ణునికి సమర్పించుకున్నాడు.

రుక్మిణి వ్రాసి పంపిన లేఖలోని అంశాలిట్లా ఉన్నాయి. “భువనసుందరా! అచ్యుతా! నీ లీలలు, గాథలు వినేవారి శరీరతాపాన్ని తగ్గిస్తాయి. చెవులకు విందునిస్తాయి. రాచపుత్రికనై యుండికూడా చనువు తీసుకొని ఇట్లా వ్రాసినందుకు అన్యథాభావించవద్దు. నిన్ను గూర్చి విన్న దివ్యమైన కథలచే మోహితురాలనయ్యాను. ఇక నీ రూపాన్ని గూర్చి, శీలాన్ని గూర్చి, నీ విద్య, తేజస్సు వంటి సుగుణాలను నారదమహర్షియే పూర్తిగా చెప్పలేకపోయాడు. అట్టి మహాత్ముడవైన నిన్ను వరించడం కన్యలకు ధర్మమే గదా! అందువల్లనే నిన్ను వరించి నన్ను నీకు సమర్పించుకుంటున్నాను. నీకు అర్పించుకున్న నన్ను తీసుకుపోయి శిశుపాలుడికి కట్టబెట్టాలని నా అన్న రుక్మి పట్టుబడుతున్నాడు. కావున నువ్వు వెంటనే వచ్చి నన్ను తీసుకొని పొమ్ము. నన్ను ఏ విధంగాను శంకించవద్దని మరోసారి ప్రార్థిస్తున్నాను.

సీ॥ ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక దేహతాపంబులు దీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల కఖిలార్థ లాభంబు గలుగుచుండు
నే నీ చరణ సేవ లేప్రొద్దుఁ జేసిన భువనోన్నతత్త్వంబు బొందగలుగు
నే నీ లసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు
కం॥ నట్టి నీ యందు నా చిత్తమనవరతము, నచ్చియున్నది నీ యాన నాన లేదు,
కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి! శ్రీయుతాకార! మానినీ చిత్తచోర!

దేవా! నేను పూర్వజన్మలో ఎన్నో దానాలు చేసి ఉంటాను. తీర్థాలు దర్శించి ఉంటాను. వ్రతాలాచరించి ఉండాలి. దేవ బ్రాహ్మణ గురు జనులెందరికో అర్చనలిచ్చి శ్రీహరి భగవానుని ధ్యానించి ఉంటాను. అందువల్లనే నీ యెడల నాకు ఏకాంత భక్తి ఏర్పడింది. కావున ఓ పరమేశ్వరా! శిశుపాలాది వ్యక్తులకు నేను దక్కకుండా చెయ్యి. నువ్వే స్వయంగా వచ్చి నా చెయ్యిపట్టుకొని వెంటతీసుకొనిపో!

అజితుడా! రేపే శిశుపాలుడితో నా వివాహం నిశ్చయమైంది. నువ్వు స్వయంగా వచ్చి శిశుపాల జరాసంధాదుల బారినుండి కాపాడి నీ దాన్ని చేసుకో. అనగా నన్ను రాక్షస విధిన పెళ్ళాడు.

నేను అంతఃపురంలో ఉన్నప్పుడు నన్ను తీసుకొని వెళ్ళాలని ప్రయత్నం చేస్తే బంధువధకు దారితీయవచ్చు. అందువలన నేనో ఉపాయం చెప్తున్నాను. విను. వివాహానికి ముందే నన్ను పెళ్ళికూతురుగా అలంకరించి మా కులదేవత అయిన సర్వమంగళాదేవి ఆలయానికి తీసుకొని వెళ్తారు. ఇది మా కులాచారం. నేను కాలినడకన వెళ్తాను కాబట్టి నువ్వు నన్ను మార్గమధ్యంలోనే గ్రహించి నీ రథంలో తీసుకొని వెళ్ళు.

పద్మనాభా! నువ్వు నా కోరికను మన్నించకపోతే, నిరసన వ్రతాన్నాచరించి నిన్నే ధ్యానం చేస్తూ ప్రాణాలు విడుస్తాను.

తే॥ లోపలి సౌధంబులోన వర్తింప గఁ దేవచ్చునే నిన్నుఁ దెత్తునేనిఁ

గావలి వారలఁ గల బంధువులఁ జంపి కాని తేరాదని కమలనయన!
భావించితేని నుపాయంబు సెప్పెద నాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్క బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు

తే॥ *నెలమి మావారు పంపుదు రేనునట్లు, పురము । వెలువడి యేతెంచి భూతనాథు*
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు, । వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత!

అంతట బ్రాహ్మణుడు "యదుదేవా! నేనీ రహస్య సమాచారాన్ని నీకు అందజేశాను. ఆ తర్వాత నీ ఇష్టం" అని ఊరుకున్నాడు.

రుక్మిణికి శ్రీకృష్ణుని సమాధానం

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 53వ అధ్యాయం నుండి గ్రహించబడింది.):

రుక్మిణీ సందేశాన్ని విన్న శ్రీకృష్ణుడు ఆప్యాయంగా ఆ బ్రాహ్మణుని చేతులలోకి తీసుకొని ఇట్లా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా! నా మనస్సు కూడా రుక్మిణినే గాఢంగా కోరుకుంటోంది. ఆమె జ్ఞాపకాలతో నాకు రాత్రిళ్ళు నిద్ర కరువైపోతోంది. రుక్మి ఒక్కడే నేనంటే వ్యతిరేకంగా ఉన్నాడని నేనెరుగుదును. మా వివాహానికి అడ్డువచ్చిన వారందర్నీ తొలగించి ఆమెను వివాహం చేసుకుంటాను. అని

ఉ॥ *కన్నియ మీఁద నాతలఁపు గాఢము; కూరుకు రాదు రేయి నా*
కెన్నఁడు; నా వివాహము సహింపక రుక్మి దలంచు కీడు నే
మున్నె యెఱుంగుదున్; బరులమూఁక లడంచి కుమారిఁ దెత్తు వి
ద్వన్నుత! మ్రాను ద్రచ్చి నవవహ్ని శిఖన్ వడిఁ దెచ్చు కైవడిన్.

అంతట శ్రీకృష్ణుడు దారకుని రథం సిద్ధం చెయ్యమని చెప్పి, బ్రాహ్మణుని కూడా తన రథంలోనే ఎక్కించుకొని రాత్రంతా ప్రయాణం చేసి ఉదయానికల్లా విదర్భ చేరుకున్నారు.

విదర్భ రాజధాని అయిన కుండిన నగర రాజవీధులన్నీ చక్కగా శుభ్రం చేసి నీళ్ళు చల్లారు. రంగు రంగుల పతాకాలు ఎగురవేశారు. స్త్రీ పురుషులంతా వివిధములైన వస్త్రాలతోను, ఆభరణాలతోను అలంకరించుకొని నగర వీధులలో కనిపించారు. రాజు బ్రాహ్మణులందరికీ విరివిగా బంగారాన్ని, గోవుల్ని, తిలలను, వస్త్రాలను దానం చేస్తున్నాడు.

చేది రాజ్యాధిపతి అయిన దమఘోషుడు, అతడి కుమారుడైన శిశుపాలునికి శుభకర్మలన్నీ శాస్త్రీయంగా చేయించాడు. దానధర్మాలు చేయించాడు. విదర్భ రాజధాని ఎటుచూసినా గుర్రాలు, ఏనుగులు, రథాలు, పదాతి దళాలతో క్రిక్కిరిసి పోయింది. భీష్మకుడు ఎదురు వెళ్ళి దమఘోషుణ్ణి సాదరంగా ఆహ్వానించి వారి విడిదికై ఏర్పాట్లన్నీ ఘనంగా చేయించాడు. ఆ వివాహానికి సాళ్వుడు, జరాసంధుడు, దంతవక్త్రుడు, విదూరథుడు, పౌండ్రకుడు మొదలైన వాళ్ళంతా శిశుపాలుడి పక్షాన పెళ్ళిపెద్దలై వచ్చారు.

శ్రీకృష్ణుడు బలరామాదులతో వచ్చి రుక్మిణిని అపహరించుకు పోతాడేమోనని సందేహించి పెద్దపెట్టున సైన్యాన్ని వెంటబెట్టుకొని వచ్చారు.

శ్రీకృష్ణుడు రుక్మిణీ దేవిని వివాహానికి ఒక్కడే వెళ్ళాడని తెలుసుకున్న బలరాముడు ఆందోళన చెందాడు. అందువల్ల వెంటనే చతురంగ బలాన్నీ సమకూర్చుకొని తానుకూడా విదర్భకు బయలుదేరాడు.

చ॥ హరి యొకఁ డేగినాఁడు మగధాదులు చైద్యహితానుసారులై
నరపతు లెందఱేనిఁ జనినారు కుమారికఁ దెచ్చుచోట సం
గర మగుఁ; దోడు గావలయుఁ గంసవిరోధికి నంచు వేగఁ దా
నరిగె హలాయుధుండు గమలాక్షుని జూడ ననేక సేనతోన్.

అక్కడ రుక్మిణి తాను పంపిన బ్రాహ్మణుడు ద్వారకకు చేరాడో లేదో తెలియదు. శ్రీకృష్ణుని జాడ ఎక్కడా కనిపించడంలేదు. వివాహానికేమో ముహూర్తం దగ్గరపడుతోంది. రుక్మిణీదేవి మనస్సంతా వికలమై పోయింది. తన దురదృష్టాన్ని అనేక విధాలుగా నిందించుకుంటోంది.

శా॥ ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో? నడుమ మార్గ శ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుం డిది దప్పుగాఁ దలచెనో? విచ్చేసెనో? యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో? యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో? నా భాగ్యమెట్లున్నదో?

అంతలోనే మళ్ళీ ధైర్యం తెచ్చుకునేది. శ్రీకృష్ణుని శౌర్య ప్రతాపాలపై నమ్మకం పెంచుకునేది. తానదివరకు విన్న దివ్యకథలన్నింటినీ గుర్తు చేసుకునేది. దాంతో కొంత ఊరట కలిగేది. దానికి తగినట్లుగానే ఎడమ తొడ, ఎడమ కన్ను అదిరాయి, ఈ శుభ సూచకాలతో మళ్ళీ కొండంత ధైర్యం కలిగేది. ఇట్లా మథన పడుతూ ఉండగానే ఆ బ్రాహ్మణుడు ఎదురుగా కనిపించాడు. ఆయన ముఖాన తాండవించే ఆనందం చూడగానే అంతా శుభంగానే జరిగిందని గ్రహించింది.

అంతట ఆ బ్రాహ్మణోత్తముడు కలసి వివాహ విషయంలో శ్రీకృష్ణుడు చేసిన ప్రతిజ్ఞను తెలిపాడు. దాంతో ఆమెలో ఉన్న భయం, ఆందోళనలన్నీ మటుమాయమయ్యాయి. మనస్సు ఆనందంతో నాట్యం చేసింది. ఆ బ్రాహ్మణునికి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించింది. భీష్మక మహారాజు బలరామకృష్ణులు వివాహ వేడుకలు చూసేందుకే వచ్చారని అనుకున్నాడు. వాళ్ళిద్దర్నీ సాదరంగా ఆహ్వానించి విడిది సౌకర్యాలన్నీ ఏర్పాటు చేయించాడు. విదర్భ వాసులంతా శ్రీకృష్ణుడు వచ్చాడని విని ఆయన నివాసానికి పోయి దర్శనం చేసుకున్నారు.

విదర్భ ప్రజలు శ్రీకృష్ణునితో "ప్రభూ! నువ్వే రుక్మిణికి తగిన వాడివని, మా రుక్మిణి కోసమే నువ్వు పుట్టావని మేమంతా అనుకుంటూ ఉండేవాళ్ళం. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మా రాకుమారినే వివాహమాడి అందర్నీ సంతోషపెట్టాలని" కోరారు.

రుక్మిణి శ్రీకృష్ణునే మనస్సులో ధ్యానం చేస్తూ చెలికత్తెలు వెంటరాగా అంతా కలసి సర్వమంగళాదేవి ఆలయానికి కాలినడకనే బయలుదేరారు. ఎవరికీ ఎటువంటి సంశయాలు లేకపోవడం వలన రక్షక భటులు కూడా నామమాత్రంగానే వారి వెంట నడిచారు.

ఉ॥ *నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్*
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుగదమ్మ! మేటి పె
ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతి సేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ!

అనంతరం రుక్మిణీ సర్వమంగళాదేవిని ఆరాధించి శ్రీకృష్ణునే పతిగా ప్రసాదించమని మనసారా కోరుకుంది. పూజముగించుకొని చెలికత్తెలతో కలసి ఆలయం నుండి బయటకు వచ్చింది. అప్పుడు మేఘాల మధ్య దాగి ఉన్న మెరుపుతీగవలె శ్రీకృష్ణుని దర్శనమైంది.

మెరుపుతీగ వలె శ్రీకృష్ణుడు రుక్మిణిని రథంలో కూర్చోబెట్టుకొని వేగంగా రథాన్ని ముందుకు సాగించాడు. క్షణకాలం అంతా అయోమయం నెలకొంది. ఏం జరుగుతుందో ఎవరికీ అంతుపట్టలేదు. తోటి రాజులంతా తెల్లబోయారు. జరసంధాది వీరులంతా ఆగ్రహంతో ఊగిపోతూ "ఏమీ! సింహం వేటాడిన దాన్ని నక్కలు ఎత్తుకుపోవడమా! రాజద్రవ్యాన్ని గొడ్లకాపరులు దొంగిలించుకుపోవడమా? మన కీర్తి యశస్సు ఏమై పోవాలి? ఇంతకన్నా అవమానం మరొకటి లేదు.

జరాసంధాదులంతా శిశుపాలునితో "రాజా! దుఃఖించకు. సుఖదుఃఖాలు స్థిరంగా ఉండేవి కావు. తోలు బొమ్మలకు స్వతంత్రం ఉండదు. అవి ఆడించేవాడి ఇష్ట ప్రకారం ఆడుతూ ఉంటాయి. అట్లాగే భగవంతుడి ఆధీనంలో ఉండే జీవులకు కూడా స్వతంత్రం ఉండదు. ఆయన ఇష్ట ప్రకారమే సుఖదుఃఖాలు వస్తూ పోతూ ఉంటాయి. శ్రీకృష్ణుడిపై పదునేడు పర్యాయాలు దండెత్తి ఓడిపోయాం. చివరకు పదునెనిమిదవ పర్యాయం గెలువగలిగాం. అందువల్ల ప్రపంచమంతా అదృష్టం వల్లా, కాలంచేత నడుపబడుతోంది. అందువల్ల మేమెవ్వరం దుఃఖించడం లేదు, సంతోషించడమూ లేదు. వీరాధి వీరులందరికీ నాయకత్వం వహిస్తున్న నేను యాదవుడైన శ్రీకృష్ణుడి చేతిలో ఓడిపోవడానికి ఏమని సమాధానం చెప్పను? ఇప్పుడు కాలం మనకు వ్యతిరేకంగా ఉండటం వలన వాళ్ళు విజయం పొందగలిగారు. అట్లాగే కాలం ఎప్పుడైతే మనకు అనుకూలిస్తుందో అప్పుడు వాళ్ళు ఓడిపోతారు" అన్నాడు.

ఈ విధంగా జరాసంధాది రాజులంతా భీష్మకుణ్ణి, రుక్మిని, శిశుపాలుణ్ణి ఓదార్చి వాళ్ళ రాజ్యాలకు వాళ్ళు వెళ్ళిపోయారు. శిశుపాలుడు కూడా తన రాజ్యానికి తిరిగి పోయాడు. కానీ రుక్మి మాత్రం ఈ అవమానాన్ని జీర్ణించుకోలేకపోయాడు. సైన్యాన్ని వెంటబెట్టుకొని శ్రీకృష్ణుని వెంబడించాడు. యుద్ధంలో శ్రీకృష్ణుని సంహరించిగాని తిరిగి నగరంలో ప్రవేశించనని ప్రతిజ్ఞ చేశాడు. రుక్మి ఆవేశపరుడే గాని, శ్రీకృష్ణుని బలాన్ని గూర్చి బొత్తిగా తెలియదు. కొంతదూరం పోగానే శ్రీకృష్ణుని రథం కనిపించింది. రథాన్ని చూడగానే "మూఢుడా! నిలు! నిలు! ఒక క్షణంలో నిన్ను అంతం చేస్తాను. హవిస్సును కాకి ఎత్తుకుపోయినట్లు నా సోదరిని అపహరించి పారిపోతున్నావు. నీ మాయలు వ్రేపల్లెలో చెల్లుతాయేమోగాని నావద్ద సాగవు. నేను బాణప్రయోగం చెయ్యకముందే నా సోదరిని విడిచి పెట్టు" అంటూ శ్రీకృష్ణుని పై మూడు బాణాలు ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు వాడి మాటలకు చిరునవ్వు నవ్వుతూ ఆ బాణాల్ని మధ్యలోనే త్రుంచి వేశాడు. ఆ తర్వాత వాడి బాణాలను ప్రయోగించి రథాన్ని,

గుర్రాల్ని, సారథిని హతమార్చాడు. ఈలోగా మరిరెండు బాణాలు అతడి ఛత్రాన్ని ధనుస్సునూ ఛేదించాయి. అంతట రుక్మి మరో ధనస్సును ధరించగా శ్రీకృష్ణుడు దాన్నీ ఖండించాడు. ఆ తర్వాత రుక్మి వరుసగా పరిఘ, పట్టిసము, శూలము, చర్మము, అసి, శక్తి ఆయుధాల్ని శ్రీకృష్ణునిపై ప్రయోగించాడు. వాటన్నింటినీ శ్రీకృష్ణుడు ఖండించాడు. దాంతో రుక్మి బలం క్షీణించసాగింది. అయినా పట్టుదల విడువకుండా ఖడ్గాన్ని తీసుకొని శ్రీకృష్ణునిపై ఎగబడ్డాడు. శ్రీకృష్ణుడు కూడా రుక్మిని ఎదిరించడానికి ఓ పదునైన ఖడ్గాన్ని తీసుకున్నాడు. అప్పుడు రుక్మిణి మెరుపులా శ్రీకృష్ణుని పాదాలపై పడి అన్నగారి ప్రాణాలు కాపాడమని "యోగీశ్వరా! అప్రమేయా! దేవదేవా! జగన్నాథా! మంగళమయా! నా సోదరుని చంపకు" అని ప్రార్థించింది.

మత్త॥ నిన్ను నీశ్వర దేవదేవుని నిర్ణయింపఁగ లేక యో
సన్ను తామరకీర్తి శోభిత! సర్వలోక శరణ్య! మా
యన్న యీతఁడు నేడు చేసె మహాపరాధము నీ యెడన్
నన్ను మన్నన చేసి కావు మనాథనాథ! దయానిధీ!

శ్రీకృష్ణుని ఉగ్రరూపం చూసి రుక్మిణీదేవి శరీరం కంపించింది. నోరు తడారిపోయింది. కంఠం మూగబోయింది. శ్రీకృష్ణుని పాదాలు పట్టుకొని వలవలా ఏడ్చింది. ఆమెపై గల జాలితో రుక్మిని చంపకుండా వదిలేశాడు. అయితే ఎత్తిన కత్తిని దింపకుండా రుక్మి వస్త్రాల్ని చింపేశాడు. తలా, మీసాలు అక్కడక్కడా కత్తిరించి కురూపినిగా చేసి వదిలాడు. ఇంతలో బలరాముడు అక్కడకు వచ్చి "కృష్ణా! నువ్వితడి తల, మీసాలు కత్తిరించావు. ఇది యాదవులకు తగిన పనిగాదు. ఎందువల్లనంటే, అతడు ఎంత దుర్మార్గుడైనా రుక్మిణికి అన్నగారు. ఆ కారణంగా మనం అతణ్ణి గౌరవించాలి. బంధువుల్ని, స్నేహితుల్ని వికృత రూపుల్ని చెయ్యడం అంటే చంపడంతో సమానమే. నువ్వు చేసిన పనికి రుక్మిణి ఎంత బాధ పడుతుందో ఆలోచించావా?" అన్నాడు.

క॥ తల మనక భీష్మనందను, । తలయును మూతియును గొఱిగఁ దగవే! బంధుం
దలయును మూతియు గుఱుగుట । తల దఱుగుట కంటె దుచ్ఛతరము మహాత్మా!

అంతట బలరాముడు రుక్మిణిని ఓదారుస్తూ "సాధ్వీ! జీవులు వారి ప్రారబ్ధ కర్మ ననుసరించి కర్మఫలాలను అనుభవించక తప్పదు. జీవులు పొందే శుభాశుభాలకు ఇతరులు కేవలం నిమిత్తమాత్రులే తప్ప బాధ్యులు కారు. కావున నీ అన్నకు కలిగిన అవమానానికి మాపై ఆగ్రహించకు" అన్నాడు.

శా॥ తోడంబుట్టిన వాని భంగమునకున్ దుఃఖించి మా కృష్ణు నె
గ్గాడం జూడకు మమ్మ! పూర్వభవ కర్మాధీనమై ప్రాణులన్
గీడున్ మేలును జెందు; లేఁ డొకఁడు శిక్షింపంగ రక్షింప నీ
తోడంబుట్టువు కర్మశేష పరిభూతుండయ్యె నేఁ డియ్యెడన్.

బలరాముడు శ్రీకృష్ణుడితో "కృష్ణా! రాజ్యము, భూమి, స్త్రీ, మానము, తేజస్సు వంటివన్నీ మదం అహంకారాలకు కారణాలవుతాయి. దీనికి మూలమేమంటే మానవులు స్వధర్మాన్ని వదలిపెట్టడం. దానికి కారణం అజ్ఞానం. అనగా దేహమే ఆత్మ అన్న భ్రమతో స్వధర్మాన్ని వదలి పెట్టడం. వీటి

వలన ఇతరులకు హాని కలుగుతుంది కాబట్టి అటువంటి అజ్ఞానుల పట్ల సానుభూతి చూపడం కన్నా ఏమి చెయ్యగలం?" అన్నాడు. మళ్ళీ రుక్మిణితో "సాధ్వీ! అజ్ఞానం చేత శరీరాన్నే ఆత్మ అని భావిస్తూ ఉంటారు. కానీ ఆత్మ శాశ్వతం. శరీరాలు పుడుతూ ఉంటాయి. నశిస్తూ ఉంటాయి. దేహాలలో ఉండే తేడాలను ఆత్మతో ముడిపెట్టడం వల్ల ఈ వ్యక్తి నాకు బంధువని, ఈ వ్యక్తి నాకు శత్రువని మాయ చేత ఏర్పడుతూ ఉంటాయి. నిజానికి జీవాలన్నింట్లో ఉండే పరమాత్మ ఒక్కడే! ఆకాశంలో ఉండే చంద్రుడొక్కడే. అయితే అనేక నీటి కుండల్లో అనేక చంద్రులుగా కనిపిస్తున్నాడు. అట్లాగే ఆత్మ ఒకటే. వివిధ దేహాల్లో అనేకంగా అనిపిస్తుంది. తత్త్వ వేత్తలు అశాశ్వతమైన దేహం కోసం శోకించారు. శోకం వల్ల మోహం కలుగుతుంది. మోహం వల్ల జ్ఞానం మరుగున పడిపోతుంది. కావున నువ్వు ప్రశాంతంగా ఉండు" అని బోధించాడు.

బలరాముని మాటలు రుక్మిణిలో ఉండే మోహాన్ని తొలగించాయి. మనస్సు కుదుట పరచుకొంది. రుక్మి తను చేసిన ప్రతిజ్ఞ ప్రకారం తిరిగి నగరానికి పోకుండా అక్కడే భోజకటకమనే పురాన్ని నిర్మించుకొని స్థిరపడిపోయాడు.

అంతట శ్రీకృష్ణుడు రుక్మిణిని ద్వారకకు తీసుకొనిపోయి వివాహం చేసుకున్నాడు. ద్వారకలో ప్రతి ఇంట్లోను రుక్మిణీ కల్యాణమని పండుగ చేసుకున్నారు. స్త్రీ పురుషులంతా నూతన వస్త్రాలు ధరించారు. వధూవరులకు విలువైన కానుకలు సమర్పించారు.

శమంతకమణి కథ

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 56వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ఆ రోజుల్లో ద్వారకా నగరంలో సత్రాజిత్తు అనే యాదవ శ్రేష్ఠుడుండేవాడు. అతడు సూర్యోపాసకుడు. సూర్యభగవానుని ధ్యానించి ఆయన అనుగ్రహంతో శమంతకమణి అనే రత్నాన్ని కానుకగా పొందాడు.

క॥ *సత్రాజిత్తు నిశాచర, శత్రువునకుం గీడు సేసి సద్వినయముతోఁ*
బుత్త్రి స్యమంతకమణి యను, మైత్రిం గొని తెచ్చి యిచ్చె మనుజాధీశా.

రత్నం రెండో సూర్యుడా అన్నట్లు ప్రకాశిస్తుంది. అతడు ఆ రత్నాన్ని మెడలో ధరించి తపోవనం నుండి ద్వారకా నగరానికి తిరిగి వచ్చాడు. ఆ రత్న కాంతి వలన ప్రజలంతా సత్రాజిత్తును గుర్తు పట్టలేక శ్రీకృష్ణుణ్ణి చూసేందుకు సూర్యభగవానుడే తమ నగరానికి వస్తున్నాడని పరుగు పరుగున పోయి శ్రీకృష్ణునకా విషయాన్ని "నారాయణా! చక్రధరా! దామోదరా! అరవిందాక్షా! గోవిందా! యదునందనా! నీకు నమస్కారము. భూమిపైన నీ జాడ తెలుసుకోలేక సతమతమై పోతున్నారు. కానీ నువ్వు సూర్యభగవానుని కన్ను కప్పలేవు గదా? నీ జాడ తెలుసుకొని ఆయనే నిన్ను చూసేందుకు స్వయంగా వస్తున్నాడని" తెలిపారు. వారి మాటలకు శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ "నగరవాసులారా! ఆ వ్యక్తి సూర్యభగవానుడు కాదు. మన సత్రాజిత్తే! సూర్య వరప్రసాదమైన శమంతకమణి ప్రభావంచేత

ఆ రత్నాన్ని ధరించిన సత్రాజిత్తే సూర్యునివలె ప్రకాశిస్తున్నాడు" అని తెలిపాడు.

అంతట సత్రాజిత్తు ఇంటికిపోయి బ్రాహ్మణులను పిలిపించి మంత్ర పూర్వకంగా ఆ మణిని పూజామందిరంలో ప్రతిష్ఠించాడు. ఆ మణి రోజుకు ఎనిమిది బారువుల బంగారాన్నిస్తుంది. ఆ మణి ఉన్న దేశంలో దుర్భిక్షం గాని, అకాల మరణాలు గాని, ఉపద్రవాలుగాని ఉండవు. సర్పభయాలుండవు. అశుభాలుండవు. శారీరక మానసిక వ్యాధులుండవు.

క॥ *ఏ రా జేలెడు వసుమతి, నా రత్నము పూజ్యమాన మగు నక్కడ రో*
గారిష్ట సర్పమాయిక, మారీ దుర్భిక్ష భయము మాను నరేంద్రా!

ఒకరోజున శ్రీకృష్ణుడు శమంతకమణిని పొంది నందుకు అభినందించాలని అతడింటికి వెళ్ళాడు. "సత్రాజిత్తూ! నువ్వు దివ్యమణిని సూర్య భగవానుని అనుగ్రహంతో పొందావు. అటువంటి దివ్యమణి ఉగ్రసేన మహారాజు అధీనంలో ఉండటం క్షేమం" అన్నాడు. శ్రీకృష్ణుడు ఊరికే సలహా చెప్పడనీ అందులో ఏదో పరమార్థం ఉండవచ్చనీ భావించకుండా, కేవలం ఆమణి నుండి వచ్చే బంగారాన్ని పొందాలనే కోరికతోనే అడిగాడని భావించి అతడి కోరికను తిరస్కరించాడు.

ఒకరోజున సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడనే వాడు వేటకుపోతూ ఆ మణిని మెడలో ధరించి వెళ్ళాడు. అడవిలో ఓ సింహం ఆ రత్నాన్ని చూసి అదొక మాంసఖండమని భావించి అది ప్రసేనుని వధించి మణిని నోటకరచుకుపోయింది. సింహం నోట ప్రకాశిస్తున్న మణిని చూసి జాంబవంతుడనే ఎలుగుబంటి సింహాన్ని చంపి ఆ రత్నాన్ని తీసుకొని పోయి తన కుమార్తె జాంబవతికి ఆట వస్తువుగా ఇచ్చాడు.

వేటకు పోయిన ప్రసేనుడు ఎన్ని రోజులైనా తిరిగి రాకపోవడం చేత శ్రీకృష్ణుడే ఆ రత్నాన్ని అపహరించాలనే దురుద్దేశంతో తన తమ్ముని చంపాడని ప్రచారం చేశాడు. శ్రీకృష్ణుడు తనపై పడిన అపనిందను పోగొట్టుకోవాలని తనతో కొంతమంది యాదవుల్ని తీసుకొని ప్రసేనుని వెదికేందుకు అడవులకు వెళ్ళాడు. మొదట ప్రసేనుని మృతకళేబరాన్ని చూశారు. కొంతదూరంలో చచ్చిపడున్న సింహాన్ని అటుపిమ్మట ఓ ఎలుగుబంటి అడుగుల్ని చూశారు. ఎలుగుబంటి అడుగుజాడల్ని అనుసరిస్తూ పోగా వారంతా ఒక గుహ వద్దకు చేరుకున్నారు. తనతో వచ్చిన వారందర్నీ గుహద్వారం వద్దనే నిలిపి తానొక్కడే గుహలో ప్రవేశించి చూడగా ఓ బాలిక ఆ రత్నంతో ఆడుకుంటోంది. శ్రీకృష్ణుని చూసిన ఆ బాలిక పెద్దగా కేకలు పెడుతూ ఏడ్చింది. ఆ బాలిక ఏడుపు విన్న జాంబవంతుడక్కడకు పరుగు పరుగున వచ్చి శ్రీకృష్ణునిపై విరుచుకు పడ్డాడు. వారిద్దరూ ఎనిమిది రాత్రిళ్ళు ఎనిమిది పగళ్ళు అనేక రీతుల్లో యుద్ధం చేశారు. తొమ్మిదో నాటికి జాంబవంతుని బలం క్షీణించింది. వెంటనే ఇతడు సామాన్య మానవుడు కాడని, సాక్షాత్తూ పరమాత్ముడే తన్ను ఉద్ధరించేందుకు ఈ రూపంలో వచ్చాడని గ్రహించాడు.

శా॥ *స్పష్టాహంకృతు లుల్లసిల్ల హరియున్ భల్లూకలోకేశు డున్*
ముష్టాముష్టి నహర్నిశంబు జయసమ్మోహంబునం బోరుచోఁ

బుష్టిం బాసి ముకుంద ముష్టిహతులం బూర్ణశ్రమోపేతుఁడై
పిష్టాంగోరు శరీరుఁడై యతఁడు దా భీతాత్ముఁడై యిట్లనున్.

ప్రభూ! నువ్వు కన్నెర్ర చేసినంత మాత్రం చేతనే సముద్రుడే భయకంపితుడై లంకకు పోయేందుకు నీకు దారి వదిలాడు. అయినా నువ్వు నిన్నొక సామాన్య మానవునిగానే ప్రకటించుకున్నావు. సేతువును బంధించి లంకకు చేరుకున్నావు. రావణుని వధించిన శ్రీరామచంద్రుడుగా తెలుసుకున్నాను. ఇదే నీకు సాష్టాంగ నమస్కారము. శ్రీకృష్ణుడు అతడి మాటలకు సంతోషించి జాంబవంతుణ్ణి ఆప్యాయంగా కౌగలించుకొని శరీరమంతా తడిమాడు. దాంతో అతడి శరీరబాధలన్నీ మటు మాయమయ్యాయి. అంతట శ్రీకృష్ణుడు "జాంబవంతా! నేనీ శమంతకమణి కోసం వెదుకుతూ నీ గుహలోకి వచ్చాను. నేనే ఈ మణిని అపహరించానని నాపై అపనింద పడింది. అది తొలగించుకోవడానికి నేనే స్వయంగా బయలుదేరాను. కావున నాకీ మణినిచ్చి నాకు సాయపడు" అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న జాంబవంతుడు ఆ మణితోబాటు తన కుమార్తె జాంబవతిని కూడా ఇచ్చి వివాహం చేశాడు.

గుహద్వారం దగ్గర ఉన్న యాదవులంతా పది పన్నెండు రోజుల పాటు శ్రీకృష్ణుని కోసం చూసి, చూసి ఇక తిరిగి రాడేమోనని తిరిగి ద్వారకకు చేరుకున్నారు. జరిగిందంతా దేవకీ వసుదేవులకు తెలిపారు. వారంతా శ్రీకృష్ణుని కోసం దుఃఖించి ఇదంతా సత్రాజిత్తు వల్లనే జరిగిందని అతణ్ణి నిందించారు. శ్రీకృష్ణుని క్షేమంగా ద్వారకకు చేర్చమని చంద్రభాగ అనే దుర్గాదేవిని ఆరాధించారు. ఆ దేవి వారి మొర ఆలకించింది. అంతలోనే శ్రీకృష్ణుడు శమంతకమణిని, జాంబవతిని వెంటబెట్టుకొని ద్వారకకు చేరుకున్నాడు. శ్రీకృష్ణుని రాకతో ద్వారక అంతా పండుగ చేసుకున్నారు.

ఆ తర్వాత శ్రీకృష్ణుడు సత్రాజిత్తును రాజసభకు పిలిపించి, జరిగిందంతా వివరించి ఆమణి నాతడికిచ్చి వేశాడు. సత్రాజిత్తు సిగ్గుతో తలవంచుకున్నడు. ఆ మణిని తీసుకొని ఇంటికి వెళ్ళాడు. బలరామకృష్ణులు సహజంగానే బలశాలురు. వారి చిన్ననాటి లీలలు ఇంకా మనస్సులో మెదులుతూనే ఉన్నాయి. అదీకాకుండా రాజుకు అతి దగ్గరి బంధువులు. ఇన్ని కారణాల మూలంగా శ్రీకృష్ణుడితో విరోధం కొని తెచ్చుకోవడానికి ఇష్టపడలేదు. చివరకు విలువైన రత్నాన్ని, దానితో పాటు తనకుమార్తె అయిన సత్యభామను కూడా శ్రీకృష్ణునికి సమర్పించుకోవడమొక్కటే తనకు తరుణోపాయమని తీర్మానించుకున్నాడు. అంతట తన కుమార్తె అయిన సత్యభామనిచ్చి వివాహం జరిపించాడు. పుత్రికతో పాటు శమంతకమణిని కూడా బహుమానంగా సమర్పించుకున్నాడు.

ఉ॥ *తామరసాక్షుఁ డచ్యుతుఁ డుదార యశోనిధి పెండ్లి యాడె నా*
నా మనుజేంద్రవందిత గుణస్థితిలక్షణ సత్యభామ ను
ద్ధామ పతివ్రతా త్వనయ ధర్మ విచక్షణతా దయా యశః
కామను సత్యభామను ముఖద్యుతినిర్జితసోమ నయ్యెడన్.

అంతట శ్రీకృష్ణుడు సత్రాజిత్తుతో "రాజా! సూర్య వరప్రసాదమైన శమంతకమణి సూర్య భక్తుడవైన నీవద్దనుండటమే మంచిది. నేనెప్పుడు ఈ రత్నాన్ని కోరుకోలేదు" అన్నాడు.

శమంతకమణిని అపహరించటం :

కుంతి, పాండవులు లక్క ఇంటిలో కాలి చనిపోయారని తెలిసి లోకమర్యాదను పాటిస్తూ ధృతరాష్ట్రాదుల్ని పరామర్శించటానికి రామకృష్ణులు హస్తినాపురానికి బయలుదేరారు. కానీ పాండవులు ఆ ఇంట్లో కాలి చనిపోలేదని శ్రీకృష్ణునికి తెలుసు. అయినా భీష్మ ద్రోణ కృపాచార్యులను గాంధారిని కలసి పరామర్శించారు.

ఒకప్పుడు సత్రాజిత్తు తన కుమార్తె సత్యభామను కృతవర్మ బంధువైన శతధన్వునికిచ్చి వివాహం చెయ్యాలనుకున్నాడు. తర్వాత పరిణామాల కారణంగా ఆ పిల్లను శ్రీకృష్ణునికిచ్చి వివాహం చెయ్యాల్సి వచ్చింది. అందువల్ల, కృతవర్మ, అక్రూరుడు సత్రాజిత్తును ద్వేషించడం మొదలుపెట్టారు. వాళ్ళిద్దరూ శతధన్వుని వద్దకుపోయి "సత్రాజిత్తు శమంతకమణిని, ఆ మణి సంపాదించి పెడుతున్న బంగారాన్ని చూసుకొని మిడిసిపడుతున్నాడు. ఆ ధన గర్వంతో నీకిచ్చి వివాహం చేస్తానన్న పిల్లను తీసుకుపోయి శ్రీకృష్ణునికి కట్టబెట్టాడు. అతడి పొగరు అణచాలంటే అతణ్ణి చంపి ఆ మణిని సొంతం చేసుకో. దాంతో అతడికి తగిన శాస్తి చేసినట్లవుతుంది. అదీకాకుండా ఇప్పుడు రామకృష్ణులిద్దరూ హస్తినాపురం వెళ్ళారు. వాళ్ళిద్దరూ ద్వారకలో లేని సమయంలోనే అతణ్ణి హతమార్చేందుకు సరైన సమయమని నూరిపోశారు. అసలే పాపాత్ముడు, దుర్జనుడు అయిన శతధన్వునికి వీరి దుర్బోధలు మరింత బలాన్నిచ్చాయి. వెంటనే శతధన్వుడు కత్తి తీసుకొని యజ్ఞపశువును చంపినట్లుగా సత్రాజిత్తు తల నరికి శమంతకమణిని తీసుకొనిపోయాడు.

తండ్రి మరణానికి సత్యభామ ఎంతగానో విలపించింది. వెంటనే హస్తినాపురం నుండి రమ్మని రామకృష్ణులకు కబురు పంపింది. రామకృష్ణులీవార్త అప్పుడే వింటున్నట్లుగా నటిస్తూ సంప్రదాయానుసారంగా సత్రాజిత్తు మరణానికి దుఃఖించారు.

అంతట శ్రీకృష్ణుడు శతధన్వుని వధించి మణి తెచ్చి ఇస్తానని సత్యభామను ఊరడించి రామకృష్ణులిద్దరూ బయలుదేరారు.

శ్రీకృష్ణుని ప్రతిజ్ఞ విన్న శతధన్వుడు ప్రాణభయంతో కృతవర్మను సహాయం చెయ్యమని కోరాడు. అందుకు కృతవర్మ "భగవంతుడైన శ్రీకృష్ణుని ఎదిరించే శక్తి నాకులేదు. నీ వినాశనాన్ని నువ్వే కొని తెచ్చుకున్నావు. శ్రీకృష్ణుని ద్వేషించిన కంసునికి పట్టిన గతి మనమంతా చూశాం గదా. ఒక్క కంసుడేనా? జరాసంధుడి మాటేమిటి? పదిహేడు పర్యాయాలు దండెత్తి ఓడిపోయాడు. ఈ విషయంలో నీకెటువంటి సహాయం చెయ్యలేను.

ఉ॥ *అక్కట! రామకృష్ణులు మహాత్ములు వారల కెగ్గు సేయఁగా*
నిక్కడ నెవ్వఁ డోపు? విను మేర్పడఁ గంసు డు బంధు యుక్తుఁడై
చిక్కఁడె? మున్ను మాగధుఁడు సేనతోఁ పదియేడు తోయముల్
దిక్కులఁ బాఱఁడే! మనకు దృష్టము, వారల లావు వింతయే?

ఆ తర్వాత శతధన్వుడు అక్రూరుని సహాయం చెయ్యమని కోరాడు. "శతధన్వా! శ్రీకృష్ణుడంటే శ్రీమహావిష్ణువు యొక్క అవతారమని తెలుసుకో. అతడు ఏడు సంవత్సరాల బాలుడుగా ఉన్నప్పుడే గోవర్ధన పర్వతాన్ని ఎడమచేతి చిటికిన వ్రేలుపై నిలిపి తన భగవత్తత్త్వాన్ని నిరూపించుకున్నాడు. ఆయన మాయా విలాసం చేతనే విశ్వాన్నంతా సృష్టించి, రక్షించి, ఉపసంహరిస్తున్నాడు. ఆయన లీలలు ఎవరికీ అంతుబట్టేవి కావు. అనంతుడు, అనాది, నిర్వికారుడు, సర్వాంతర్యామి అయిన శ్రీకృష్ణునికి నమస్కరిస్తున్నాను. అటువంటి భగవంతునితో యుద్ధం చెయ్యలేను" అని చెప్పాడు.

సీ॥ *ఎవ్వఁడు విశ్వంబు నెల్ల సలీలుఁడై పుట్టించు రక్షించుఁ బొలియఁజేయు;*
నెవ్వని చేష్టల నెఱుఁగరు బ్రహ్మాదు, లెవ్వని మాయ మోహించు భువన,
మేడేండ్ల పాపఁడై యే విభుఁ డొక చేత గోరక్షణమునకై కొండనెత్తె,
నెవ్వఁడు కూటస్థుఁ డీశ్వరుఁ డద్భుత కర్ముఁ దనంతుండు గర్మసాక్షి,

ఆ॥ *యట్టి ఘనునకు శౌరికి ననవరతము, మ్రొక్కెదముగాక! విద్వేషమునకు నేము*
వెఱుతు మొల్లము నీవొండు వెంటబొమ్ము, చాలు పదివేలు వచ్చె నీ సఖ్యమునకును.

అక్రూరుడి మాటల్తో శతధన్వుడు విలవిల్లాడిపోయాడు. ఏంచెయ్యాలో కాలూ చెయ్యీ ఆడలేదు. ఆ మణిని అక్రూరుడి వద్దనే ఉంచమని తానోరథాన్నెక్కి వేగంగా ఉత్తర దిశగా పోయాడు. రామకృష్ణులా వార్త తెలుసుకొని అతణ్ణి వెంబడించారు. అతడు మిథిలానగరం చేరాడో లేదో అతడి గుర్రాలు పరుగెత్తలేక నిలిచిపోయాయి. వాటినక్కడే వదిలేసి ప్రాణ భయంతో కాలినడకనే పారిపోయాడు. పారిపోతున్న శతధన్వుని శ్రీకృష్ణుడు బాణంతో కొట్టాడు. ఆ బాణం దెబ్బకు అక్కడికక్కడే నేలకూలి ప్రాణాలు విడిచాడు. రామకృష్ణులు మణికోసం అతడి శరీరమంతా వెదికారు. మణి ఎక్కడా కనిపించలేదు. అంతట బలరాముడు శ్రీకృష్ణునితో "కృష్ణా! నేను మిథిలాధిపతి అయిన జనకుడితో కొంతకాలం ఉండివస్తాను. నువ్వు ద్వారకకు పోయి సత్యభామను ఓదార్చు" అని బలరాముడు జనకుని భవనానికి వెళ్ళాడు.

బలరాముని చూస్తూనే జనక మహారాజు ఎదురువెళ్ళి సాదరంగా ఆహ్వానించి భక్తితో పూజించాడు. అక్కడే కొన్ని సంవత్సరాలుండి దుర్యోధనునికి గదా యుద్ధాన్ని నేర్పాడు.

శ్రీకృష్ణుడు ద్వారకకు తిరిగి వచ్చి జరిగిందంతా సత్యభామకు తెలిపి ఆమెను ఓదార్చి సత్రాజిత్తుకు అంత్యక్రియలు పూర్తి చేశాడు. శ్రీకృష్ణుడు శతధన్వుని చంపి ద్వారకకు తిరిగి వచ్చాడన్న వార్త విన్న కృతవర్మ, అక్రూరులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. అంతేకాదు శతధన్వుని మరణానికి పరోక్షంగా తాము కారణమయ్యామే అన్న వేదనతో వారిద్దరూ ద్వారక విడిచిపెట్టి పోయారు.

అక్రూరుడు ద్వారక విడిచిపెట్టి పోయిన తర్వాత ద్వారకావాసులంతా శారీరక, మానసిక, బాధలకు లోనయి నానాకష్టాలు పడుతున్నారు. వాటికి ఆధ్యాత్మిక, ఆది దైవిక బాధలు కూడా తోడయ్యాయి. అక్రూరుడు దేశం విడిచి పోవడం వల్లనే ప్రజలు కష్టపడుతున్నారని వయోవృద్ధులు కొందరు గట్టిగా నమ్మారు. ఒక రోజున వారంతా కలసి శ్రీకృష్ణుని వద్దకు పోయి "కృష్ణా! పూర్వం కాశీరాజ్యంలో చాలాకాలం వర్షాలు కురవలేదు. అప్పుడు ప్రజలంతా రాజువద్దకు పోయి "రాజేంద్రా!

శఫల్గుని పిలిపించండి. అతడు ఉన్నచోట వర్షాలు కురుస్తాయి. దేశం సుభిక్షం అవుతుందని" సలహా ఇచ్చారు. అప్పుడు రాజు వాళ్ళు చెప్పినట్లే శఫల్గుని కాశీ రాజ్యానికి పిలిపించాడు. ఆ తర్వాత రాజ్యమంతా వర్షాలు కురిశాయి. అనంతరం రాజు తన కుమార్తె అయిన గాధిని శఫల్గునికిచ్చి వివాహం చేసి అల్లుణ్ణి తన రాజ్యంలోనే ఉంచుకున్నాడు. శఫల్గుని కుమారుడే ఈ అక్రూరుడు. నువ్వతన్ని తిరిగి ద్వారకకు రప్పిస్తే ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని" సలహా ఇచ్చారు.

భగవానుడు వారి మాటలు విన్నాడు. వాళ్ళ అజ్ఞానానికి నవ్వుకున్నాడు. వాళ్ళతో "పురప్రముఖులారా! అక్రూరుడు దేశం విడిచి వెళ్ళడం వల్ల అనర్థాలు జరగడం లేదు. శమంతకమణి ఉన్నట్లుండి మాయం కావడం వల్లనే ఈ అనర్థాలు జరుగుతున్నాయని భావిస్తున్నాను. అయినా మీరు విచారించకండి. నేను అక్రూరుని పిలిపిస్తాను" అని వాళ్ళకు నచ్చచెప్పి పంపేశాడు. ఆ తర్వాత దూతలను పంపి అక్రూరుని ద్వారకకు పిలిపించాడు. అక్రూరుడు ద్వారకకు రాగానే అతణ్ణి ఘనంగా సన్మానించాడు. ఉల్లాసంగా మాట్లాడి హాస్యోక్తులతో కడుపుబ్బ నవ్వించాడు. చివరకు "అక్రూరా! శతధన్వుడు శమంతకమణిని నీవద్ద దాచడం నాకు తెలుసు. సత్రాజిత్తుకు సత్యభామ ఒక్కర్తె పుత్రిక కాబట్టి ఆమే పిండ ప్రదానాది క్రియలన్నీ జరిపింది. కావున ఆ మణి కూడా ఆమె ధరించడం న్యాయం. ఆ మణిని ఇతరులెవ్వరూ ధరించలేరు. అయినా ఆమణి నీవద్దనే ఉండనిమ్ము. అయితే నాకు మా అన్నగారి మధ్య ఒక వివాదం ఏర్పడింది. నేను శతధన్వుని చంపి ఆ మణిని నేనెక్కడో దాచి ఉంచానని అనుమాన పడుతున్నాడు. కావున నువ్వా మణిని సభకు తీసుకొని వచ్చి అందరికీ చూపించి, జరిగిందంతా చెప్పి నువ్వామణిని తీసుకొని పోవచ్చును. దీనివల్ల బంధువులలో ఏర్పడ్డ కలతలు తొలగిపోతాయి. నువ్వే కాపాడాలి. ఎందువల్ల ఇంతగా చెబుతున్నానంటే నువ్వు స్వర్ణవేదిమయమైన యజ్ఞాన్నొకటి తలపెట్టావు. శమంతకమణి సహాయం లేకుండా నువ్వా యజ్ఞాన్ని తలపెట్టలేవు. కావున మణి నావద్ద లేదని కూడా చెప్పలేవు" అన్నాడు.

శ్రీకృష్ణుడు లౌక్యంగాను, నర్మగర్భంగాను తేనెలొలికే పలుకులు పలుకుతూ ఉండగానే అక్రూరుడు వస్త్రంలో దాచి ఉంచిన మణిని తీసి శ్రీకృష్ణుని పాదాల వద్ద ఉంచాడు. శ్రీకృష్ణుడా మణిని తీసుకొని సభాసదులకు చూపిస్తూ తన పైన వచ్చిన అపోహను తొలగించుకున్నాడు. తిరిగి ఆ మణిని అక్రూరునికి ఇచ్చి వేశాడు.

క॥ *ఘనుఁడు భగవంతుఁ డనఘుఁడు మరి దెచ్చి యిచ్చినట్టి కథనమున్*
వినినన్ బఠించినఁ దలఁచిన, జనులకు దుర్యశముఁ బాప సంఘముఁ దొలఁగున్

శ్రీకృష్ణుడు యశోదా నందులకు ఉపదేశించటం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం నుండి గ్రహించబడింది)

రుక్మిణీ కళ్యాణం అయిపోయింది. ఆ తర్వాత సత్యభామాది ఎనమండుగురు భార్యల్ని పొంది శ్రీకృష్ణుడు సుఖంగా కాలం గడుపుతున్నాడు. బ్రహ్మాదులంతా శ్రీకృష్ణ తత్త్వాన్ని తెలుసుకోలేనివారై తర్జన భర్జన పడుతున్నారు. ఉపనిషత్తులన్నీ నేతి నేతి అని చతికిల పడుతున్నాయి. మహర్షులు, యోగీశ్వరులంతా పరమాత్ముని పాదపద్మాలను హృదయంలో నింపుకొని ధ్యానిస్తున్నారు. రాధాదేవి అజ్ఞాతంగా నిన్ను కొలుస్తూ ఉంటే, రుక్మిణి మొదలైన వారంతా నిన్ను అంటిపెట్టుకు తిరుగుతున్నారు. భక్తులు, ద్వారకావాసులంతా నిన్ను సగుణ పరబ్రహ్మంగా దర్శించి తరిస్తున్నారు.

ఒకానొక రోజున నందుడు యశోద శ్రీకృష్ణుని దర్శనార్థం ద్వారకకు వెళ్ళారు. శ్రీకృష్ణుడు ఎదురు వెళ్ళి వారిని సాదరంగా ఆహ్వానించి ఆసనాలపై కూర్చోబెట్టాడు. యశోద శ్రీకృష్ణునితో, "కృష్ణా! నేను సంసార సాగరంలో చిక్కుకుని ఒడ్డుకు చేరలేక పోతున్నాను. నువ్వు నీ తండ్రికి జ్ఞానబోధ చేశావు. మరి తల్లినైన నన్ను కూడా జ్ఞానవంతురాల్ని చెయ్యవా? నువ్వు తప్ప నాకు దిక్కెవరు? నువ్వు గొప్ప నావికుడవు. భక్తుల్ని సంసార సాగరం నుండి ఒడ్డుకు చేర్చేందుకు కంకణం కట్టుకున్నావు. నువ్వు భూభారాన్ని తగ్గించేందుకే అవతరించినా భక్తజనోద్ధరణమంటేనే నీకు ఎక్కువ ప్రీతి. నువ్వు కరుణామయుడవు. దీనురాలనైన నాకు జ్ఞానోపదేశం చేసి నన్ను కాపాడు" అని ప్రార్థించింది.

తల్లి మాటలు విన్న శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు: "తల్లీ! జ్ఞానం మూడు విధాలు. యోగాత్మకమూ, విషయాత్మకము, భక్త్యాత్మకము. వీటిలో భక్తి మార్గమే ఉత్తమం. యోగమార్గంలో, ఆకలి దప్పికలు లేకుండా విచారణ ద్వారా కుండలినీ యుక్తుడైన సర్వేశ్వరుణ్ణి ధ్యానించాలి. ఆ తర్వాత ఇంద్రియాల్ని నియంత్రిస్తూ లోభం వంటి గుణాలన్నింటినీ నిర్మూలించుకోవాలి. సిద్ధులు, షట్చక్రాలను సాధించి తమ అభీష్టాల్ని సాధించుకుంటారు. అయితే ఈ మార్గం స్త్రీలకు బోధించరాదు. సామాన్యులు కూడా దీన్ని సాధించలేరు. యోగీశ్వరులకు మాత్రమే ఈ మార్గం సులువైనది. ఇక రెండవది విషయాత్మక జ్ఞానం. దీన్ని ముప్పది నాలుగు విషయాల్ని సాధించి తెలుసుకోవాల్సి ఉంటుంది. దీనికి మోక్షమే పరమ లక్ష్యం. దీన్నే మోక్షజ్ఞానాత్మక మార్గమని కూడా అంటారు. ఇది నివృత్తి మార్గం కాబట్టి భక్తులు ఈ మార్గాన్ని కోరుకోరు. ఇక మూడవది. భక్తి మార్గం. వీరు భక్తితో కూడిన జ్ఞానాన్నే కోరుకుంటారు. నీకు ఆ భక్తి జ్ఞానాన్ని రాధాదేవి బోధిస్తుంది. ఆమె కేవలం ఒక మానవస్త్రీ అని భావించవద్దు. ఆమె యెడ భక్తి శ్రద్ధలు కలిగి ఆమె ఆజ్ఞలను శిరసావహించండి" అని వినయంతో తెలిపి యశోదానందులను నందగోకులానికి పంపాడు.

బృందావనంలోనే ఒక మూల కదళీవనం ఉంది. అందులో రాధాదేవి నివసిస్తూ ఉంది. యశోదా నందులు సరాసరి ఆ కదళీవనానికి వెళ్ళారు. వారు వెళ్ళే సమయానికి రాధాదేవి

నిద్రపోతోంది. ఎంతోకాలంగా ఆహారం లేకపోవడం వలన దేహం కృశించి ఉంది. పూపొదలన్నీ విరగబూసి ఆ సువాసనల్ని వనమంతా వెదజల్లుతున్నాయి. కళ్ళుమూసుకొని శ్రీకృష్ణుని పాదాలనే ధ్యానిస్తూ ఉండటం వలన ఆమెకు బాహ్య జ్ఞానం లేదు. ఆమె కంటున్న కలల్లో అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతోంది. ఆ దేవి చెలికత్తెలు వందల సంఖ్యలో సపర్యలు చేస్తున్నారు. అటువంటి స్థితిలో ఉన్న రాధాదేవికి యశోదానందులు సాష్టాంగ నమస్కారం చేశారు.

యోగ నిద్రనుండి లేచిన రాధాదేవికి ఎదురుగా యశోదా నందులు కంటబడ్డారు. వారిని చూడగానే దిగ్గున లేచి కూర్చుని "ఆర్యా! ఏమిటి ఇట్లా వచ్చారు? నాతో ఏమైనా పని ఉండి వచ్చారా? నేనిప్పుడు విషయ ప్రపంచంలో లేను. నాకిప్పుడు నీటికి, నిప్పుకు, రాత్రి పగళ్ళకు, స్త్రీ పురుషులన్న భేదం తెలియడంలేదు. మనుషులతో మాట్లాడాలనిపించడంలేదు" అన్నది. రాధాదేవి మాటలు విన్న యశోదానందులు ఆశ్చర్యపోయారు. భయపడుతూనే దగ్గరకు పోయి కూర్చున్నారు. "అమ్మా! రాధా! దుఃఖించకు. త్వరలోనే నువ్వు నీ భర్తను పొందగలవు. అంతవరకు నువ్వీ దేహాన్ని కాపాడుకోవాలి. నువ్వీ భూలోకాన అవతరించడం వలన ఈ భూమండలమంతా పవిత్రమైంది. గోపికలంతా మహాపుణ్యవంతులయ్యారు. నీ కీర్తి ముల్లోకాల వాళ్ళూ గానం చేస్తున్నారు. పురాణాలు, వేదాలన్నీ నీ కీర్తిని వేనోళ్ళా పొగుడుతున్నాయి.

"ఓ రాధా! నేను యశోదను. ఈయన నందుడు. నువ్వు వృషభానుని పుత్రికవు. అమ్మా! మేమిద్దరం శ్రీకృష్ణుని దర్శించి ద్వారక నుండి యిప్పుడే వస్తున్నాం. నీకో శుభవార్త చెప్తాం. విను. సుధాముని శాపం మూలంగా నువ్వీ వియోగదుఃఖాన్ని అనుభవిస్తున్నావు. త్వరలోనే ఆ శాపం నుండి విముక్తి పొందుతావు. నాకు భక్తి జ్ఞానాన్ని ఉపదేశించి మమ్మల్ని ధన్యుల్ని చెయ్యి. ఆ ముహూర్తానికి శ్రీకృష్ణుడు కూడా నీ చెంతనే ఉండగలడు" అని ప్రార్థించింది.

అంతట రాధాదేవి శ్రీకృష్ణుని ఆజ్ఞను శిరసావహించి నామాన్ని స్మరించి ఆ శుభముహూర్తాన్నే లౌకిక భక్తిని ఉపదేశించడానికి ఉపక్రమించింది.

యశోదకు భక్తిజ్ఞానాన్ని ఉపదేశించటం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం నుండి గ్రహించబడింది)

యశోదా! భగవంతుడే జ్ఞానాత్మకుడు. ఆ పరాత్పరుడే బ్రహ్మాది దేవతలందరికీ పూజ్యుడు. అటువంటి శ్రీకృష్ణుడు తాను ఉపదేశించకుండా నా వద్దకు పంపాడంటే నాకూ సంతోషమే కాని, నేనేం ఉపదేశించగలను? వేదాలు, మహానుభావులైన మహర్షులే జ్ఞానతత్త్వాన్ని తెలుసుకోలేక పోతున్నారు. ఇక స్త్రీనైన నేను ఉపదేశించగలనా? నిజానికి నేను జ్ఞానవంతురాలనే అయినా, ఆ పరమేశ్వరుని వియోగదుఃఖంచేత కృంగిపోయి ఉన్నాను. అట్టి నేను ఏం ఉపదేశించగలను? అయితే భగవంతుని చేరే మార్గాల్లో భక్తియే ఉత్తమ మార్గం. సాక్షాత్తూ భగవంతుడే మిమ్మల్ని నా వద్దకు

పంపాడు కాబట్టి ఆయన ఆజ్ఞను శిరసావహిస్తాను. విను. ఓ పవిత్ర చిత్తురాలా! యశోదా! శ్రీకృష్ణ పరబ్రహ్మమే నీకు అభయమిచ్చినప్పుడు ఇంకా నీకు భయం ఎక్కడ నుండి వస్తుంది? కాబట్టి అన్నీ మరచిపో. పరమేశ్వరుణ్ణే నమ్ముకో. దుఃఖమయమూ అశాశ్వతమూ అయిన సంసారాన్ని విడిచిపెట్టు. శ్రీకృష్ణుడు నీ పుత్రుడన్న భావాన్ని విడిచిపెట్టు. అతడే సగుణ పరబ్రహ్మమని నమ్ము. భూలోకంలోని క్షేత్రాలన్నింట్లోకీ బృందావనం ఉత్తమమైనది. అందలి యమునా నదిలో స్నానం చేస్తే ముల్లోకాల్లో స్నానం చేసినంత పుణ్యం వస్తుంది. భక్తితో ఆ నదిలో స్నానం చెయ్యి. మనసులో అష్టదళ పద్మాన్ని నిర్మించుకో. పరిశుద్ధమైన మనస్సుతో గర్గాచార్యులు ఉపదేశించిన విధంగా ధ్యానం చెయ్యి. పరాత్పరుని పూజించి బ్రహ్మపదాన్ని చేరుకో. కర్మలన్నింటినీ నిర్మూలం చేసుకొని గోలోకాన్ని చేరుకోండి. హరి భక్తులతో కలసి జీవించు. విష్ణు భక్తులు కానివారితో మాట్లాడవద్దు. అట్టివారు తాము నశిస్తూ, ఇతరులను కూడా నశింపజేస్తారు. యశోదా దేవీ! నీ కుమారుడని అనుకుంటున్న ఆ సగుణ పరబ్రహ్మాన్ని రామ, నారాయణ, అనంత, ముకుంద, మధుసూధన, కృష్ణ, కేశవ, కంసారి, హరి, వైకుంఠ, వామన అను పదకొండు నామాలతో జపించు. నీ ప్రక్క నున్న వారిచేతకూడా జపించేట్లు చెయ్యి.

ఏకాదశ నామాల నిర్వచనం :

రామ నామ నిర్వచనం : 'రా' అనగా విశ్వమని, 'మ' అనగా ఈశ్వర వాచకం. కాబట్టి విశ్వమునకు ఈశ్వరుడు అని చెప్పబడింది.

నారాయణ నామం : నార అనగా ముక్తి అని చెప్పబడింది. యనము గలవాడు కాబట్టి నారాయణుడు.

అనంత నామం : భగవంతుడు అంతము లేనివాడని వేదాలు, పురాణాలు చెప్తున్నాయి. కనుక అనంతుడన్న పేరు కలిగింది.

ముకుంద నామం : ముకు అన్న శబ్దం మోక్ష వాచకము. దాన్ని గ్రహించే వాడు కాబట్టి ముకుందుడన్న పేరు చెప్పబడింది. అంతేకాదు ముకు అన్న శబ్దంలో భక్తి ప్రేమ ఇమిడి ఉంటాయి. కనుక భక్తులకు భక్తిని ప్రసాదించేవాడు కాబట్టి అతడికా పేరు సార్థకమైంది.

మధుసూదన నామం : మధు అనే దానవుణ్ణి సంహరించాడు కాబట్టి ఆ పేరు వచ్చింది. మధువు అన్న పదం నపుంసక లింగం. ఇప్పపూల నుండి తీస్తే మద్యమన్నది సామాన్యార్థం. విశేషార్థం ఏమంటే, ఆ శబ్దాన్నే కర్మ అని కూడా అంటారు. ఆ కర్మలు పుణ్య కర్మలు కావచ్చు లేదా పాపకర్మలు కావచ్చు. అటువంటి కర్మలన్నింటికీ సదనం లాంటి వాడు కాబట్టి భగవంతునికి మధుసూదనుడు అన్న పేరు కూడా వర్తిస్తుంది. అంతేకాకుండా పరిణామావస్థ యందు శుభాల్ని కలిగించి వాటిని మధురంగా చేస్తాడు కాబట్టి మధుసూదనుడయ్యాడు. అట్లాగే అశుభకర్మలు చేసే వాళ్ళ భ్రాంతిని తొలగించి శుభకర్మల వైపు మళ్ళించేవాడు కాబట్టి మధుసూదనుడని అనవచ్చని కొందరు వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

కృష్ణ నామం : కృషి అన్న పదం పరమానందాన్ని తెలియజేస్తుంది. 'ణ' కారం దాస్య భావాన్ని తెలుపుతుంది. ఆ రెంటినీ ప్రసాదించేవాడు భగవంతుడే కాబట్టి కృష్ణ నామంతో ఆయన్ను కీర్తిస్తారు. అంతేకాదు ఈ కృష్ణ శబ్దం కోటి జన్మల పాపాల్ని ప్రక్షాళన చేస్తుంది. అందువల్ల కృష్ణ నామం శ్రేష్ఠమైనదని కొందరి అభిప్రాయం. సహస్ర నామాన్ని నూరు సార్లు పారాయణం చేస్తే ఏ ఫలం లభిస్తుందో, కృష్ణ అన్న నామాన్ని ఒక్కసారి పలికితే అంతే ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. కృష్ణా! కృష్ణా! అంటూ ఎవరు రోజూ స్మరిస్తారో వారు భూమిని ఛేదించుకొని మొలక ఎట్లా పైకి వస్తుందో అదేవిధంగా ఎంతటి పాపి అయినా నరకాన్ని ఛేదించుకొని శ్రీకృష్ణుని పాదారవిందాలను చేరుకుంటారు.

కేశవ నామం : కిం అనే శబ్దం నీరు అనే అర్థాన్నిస్తూ సమస్త జీవరాసుల్లోనూ ఉండేది కాబట్టి కేశవుడన్న పేరు వచ్చిందని వైదికులంటారు. అందువల్ల భగవంతుణ్ణి కేశవుడుగా ధ్యానిస్తారు.

కంసారి నామం : కంస అన్న శబ్దం పాతకాన్ని తెలియజేస్తుంది. ఇది ఎక్కువగా దానవులయందు, శోకంలోను, కష్టాల్లోను ఉంటూ ఉంటుంది. అటువంటి దాన్ని నాశనం చేస్తాడు కాబట్టి భగవంతుడికి కంసారి అన్న పేరు వచ్చింది.

హరి నామం : రుద్రుడు విశ్వాలన్నింటినీ హరించినట్లు భగవంతుడు భక్తుల పాపాలన్నింటినీ ధ్వంసం చేస్తున్నాడు కాబట్టి ఆయనకా నామం సార్థకమే అవుతుంది.

బ్రహ్మస్వరూపిణి అయిన మహాప్రకృతినే శక్తి అని, నారాయణి అనీ, విష్ణుమాయ అనీ ఇంకా ఎన్నో పేర్లతో పిలుస్తూ ఉంటారు. అట్టి భగవంతుడు భూదేవికి ధవుడు కాబట్టి మాధవుడని అంటారు. అట్టి పరమేశ్వరునకు బ్రహ్మాది దేవతలంతా నమస్కరిస్తూ ఉంటారు. సనకాది మహాత్ములంతా ధ్యానిస్తూ ఉంటారు. అటువంటి శ్రీకృష్ణుని శరణుకోరు. వేదాలు, పురాణాలే అతణ్ణి పరమేశ్వరుడని నిరూపిస్తూ ఉంటే ఇక పాలు పెరుగు వెన్నలు దొంగిలించటాలు ఎక్కడి మాట? నువ్వా పరమ పురుషుణ్ణి కట్టి పడేయడమా? యోగులు, సిద్ధులు, మునీంద్రులకే పట్టుబడని ఆ పురుషోత్తముణ్ణి నువ్వు రోటికి కట్టేశానన్న భ్రమనుండి బయట పడు. తల్లీ! కుమారుడన్న భ్రాంతి విడిచిపెట్టు. భక్తితో స్తోత్రాలు పఠించు. పూజించి అతని అనుగ్రహాన్ని సంపాదించుకో. ఈశ్వరుడైన శ్రీకృష్ణుణ్ణి ధ్యానించు. తల్లీ! ఆ మహనీయుడు తప్పక నిన్ను దరిచేరుస్తాడు. నువ్వు కూడా కోరదగిన వరాన్ని కోరుకో. తప్పకుండా అనుగ్రహిస్తాడు" అని రాధ చెప్పగా యశోద రాధానామాన్ని గూర్చిన నిర్వచనం చెప్పమని ప్రార్థించింది. రాధ ఇలా చెప్పింది.

రాధానామం : ఓ యశోదా! పూర్వం ఖాండీర వనంలో నందుడికి నా వృత్తాంతం అంతా చెప్పాను. అయినా నీకు మళ్ళీ చెప్తాను. విను. " "రా" శబ్దం మహావిష్ణు వాచకం. ఎవని కుక్షిలో లోకాలన్నీ అణిగి ఉంటాయో అతడే శ్రీమహావిష్ణువు. 'ధా' అన్న శబ్దంలో ముల్లోకాలు, సమస్త ప్రాణికోటిని ధరిస్తూ ఉండేదని అర్థం. అనగా ఆ ధరించే ధాత్రి అనే మాతృ వాచకాన్ని నేనే. కనుక జగజ్జనని అన్నా, మూలప్రకృతి అన్నా, మహా శక్తి అన్నా నేనే. శ్రీహరి దేవతలు, పండితులు నాకు

రాధా నామాన్ని ప్రదానం చేశారు. అప్పటినుండి నా పేరు రాధగా ప్రసిద్ధి చెందింది. అటువంటి నన్ను సుధాముడు శపించాడు. ఆ శాప ఫలంగా నేను నూరు సంవత్సరాలు వృషభానుని కుమార్తెగా ఉండాల్సి వచ్చింది. నా తల్లి కళావతి. ఆమె పితృదేవతలకు మానస పుత్రిక. ఆమె, నేను కూడా అయోని సంభూతులమే. శాపకాలం పూర్తికాగానే మనమందరం తిరిగి గోలోకానికి వెళ్తాం. ఓ యశోదా! నువ్వు నందుడు మీ వ్రజకు వెళ్ళండి. భూలోకంలో ఉన్నంత కాలం శ్రీకృష్ణుని పరబ్రహ్మంగా తెలుసుకొని ఆయన్నే ధ్యానిస్తూ కాలం గడపండి. నీకు ఉపదేశించడం వలన నేనూ శ్రీకృష్ణ ధ్యానం చేసిన దాననయ్యాను" అని చెప్పగా యశోదా నందులు వ్రజమునకు ప్రయాణమయ్యారు. రాధా పరివారం కూడా వారి వారి పనుల్లో మునిగిపోయారు.

శ్రీకృష్ణుణ్ణి జ్ఞానబోధ చెయ్యమని యశోద అడగడం, భగవంతుడు అందుకు అంగీకరించడం యశోదను రాధా మందిరానికి పంపడం, అక్కడ రాధాదేవి భక్తియోగాన్ని ఉపదేశించడం ఇదంతా లోకవిరుద్ధం కాదా? అని అడిగే వాళ్ళుంటారు. కాదు. ఎందువల్లనంటే ముమ్మందుగా నందుడికి జ్ఞానోదయం అయ్యింది. అప్పుడు యశోదకు జ్ఞానం కలుగలేదు. అందువల్ల నందుడికి మాత్రమే ఉపదేశించాడు. రుక్మిణీ కళ్యాణం అయిన తర్వాత భగవంతుని అమానుష శక్తిని తెలుసుకోగలిగింది. అనగా శ్రీకృష్ణుడు తన కుమారుడు మాత్రమే కాదు, తన్ను ఉద్ధరించడానికి వచ్చిన పరమేశ్వరుడేనని తెలుసుకోగలిగింది. ఆ జ్ఞానం కలుగగానే భగవంతుణ్ణి ప్రార్థించింది. నిజానికి యశోదకు కూడా శ్రీకృష్ణుడు భగవంతుడేనన్న జ్ఞానం అప్పుడప్పుడూ కలుగుతూనే వచ్చింది. అయినా శ్రీకృష్ణుడే దాన్ని తన మాయతో కప్పివేస్తూ వచ్చాడు. ఇప్పుడా మాయను కొద్దిగా సడలించాడు. ఎవరెన్ని చెప్పినా కృష్ణమాయను దాటడం ఎవరి వల్లా కాదు.

"దివ్య మాతను చూడటం ఎవరివల్లా కాదు. ఎందువల్ల? ఆమె తెరవెనుక నుండి అన్ని కార్యాలు నిర్వహిస్తూ ఉంటుంది. ఇతరులు కంటపడకుండా తాను మాత్రం అందర్నీ చూస్తూ ఉండే ఉత్తమ కులస్త్రీల వలె ఉంటుంది. ఆమె నిజభక్తులు మాత్రం ఆమె మాయాతెరను తొలగించుకొని ఆమె సమీపానికి పోయి ఆమెను దర్శించుకుంటూ ఉంటారు." **– శ్రీ రామకృష్ణ పరమహంస.**

దీన్ని బట్టి పురుష ప్రయత్నంచేత ఎవ్వరూ మాయను దాటలేరు. ఎవరు భగవంతుని శరణుకోరుతారో వారు మాత్రమే మాయను దాటగలరన్నదే సారం. కనుక ముందుగా ప్రకృతినే ఆశ్రయించాలి. అందుల్లనే భగవంతుడు తన ఇచ్ఛా శక్తి అయిన రాధాదేవి వద్దకు పంపాడు. రాధాదేవి కూడా పదకొండు శ్రీకృష్ణ నామాల్ని చెప్పి భక్తితో జపం చెయ్యమంటుంది. అందువల్లనేనేమో శ్రీకృష్ణ పరమాత్మకూడా యజ్ఞాలన్నింట్లోకీ జపయజ్ఞమే ఉత్కృష్టమైనదని తెలిపాడు గదా! భర్తృహరి కూడా తన వైరాగ్య శతకంలో "హరిభక్తిలేనివాడు పశువుతో సమానం" అంటాడు. కలియుగంలో మనం కూడా రాధికాదేవి ఉపదేశించినట్లు జపయజ్ఞాన్నే ఆశ్రయించి తరించడం శ్రేయస్కరం, ఉత్తమం కూడా.

దుర్వాసుడు శ్రీకృష్ణుని దర్శించటం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 112వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

యశోదా నందులు రాధిక వద్ద ఉపదేశం పొంది వ్రజలో కొన్నాళ్ళు సుఖంగా కాలం గడిపారు. ఆ తర్వాత వాళ్ళిద్దరికీ శ్రీకృష్ణుని సమక్షంలో ఉండాలనిపించింది. వెంటనే ద్వారకకు వెళ్ళి ప్రతిరోజూ శ్రీకృష్ణ దర్శనాన్ని పొందుతూ ఆనందంగా గడిపారు. అయితే వారనుభవించే ఆనందం శాశ్వతమైనది కాదు. మానవ రూపం ఉన్నంతవరకే ఆ ఆనందం ఉంటుంది. అందువల్లనే యోగీశ్వరులు తేజోరూపంలో ఉపాసిస్తారు.

ఒకరోజున దుర్వాసమహర్షి తన శిష్య గణాన్ని వెంటబెట్టుకొని ద్వారకకు వెళ్ళాడు. ఈ వార్త విన్న ఉగ్రసేన మహారాజు పురోహితుల్ని, శ్రీకృష్ణ బలరాముల్ని, వసుదేవుణ్ణి, అక్రూరుణ్ణి వెంటబెట్టుకొని మహర్షికి ఘనంగా స్వాగతం పలికాడు. అతిథులందరికీ రాజప్రాసాదంలో చక్కటి వసతులేర్పాటు చేశారు. మహర్షికి సేవలకై ఏకాంశ అనే కన్యకను కూడా నియమించారు. కొంతకాలం సుఖంగా ఉన్న మహర్షికి శ్రీకృష్ణుడు తన పట్టమహిషులతో కలసి ఎట్లా సంసారయాత్ర సాగిస్తున్నాడో చూడాలనిపించింది.

మహర్షి ముందుగా రుక్మిణీ సదనానికి పోయి చూశాడు. అక్కడ ఆమె వింజామరతో విసురుతూ భక్తుల గూర్చి ముచ్చటిస్తూ ఉంటే కృష్ణుడు శ్రద్ధగా వింటున్నాడు. సత్యభామ ఇంటికిపోయి చూస్తే ఆమె తాంబూలం చిలకలు కట్టి నోటి కందిస్తూ ఉంటే తాంబూల చర్వణం చేస్తూ ఆమె వంక తమకంగా చూస్తున్నాడు. అక్కడనుండి కాళింది గృహానికి పోగా ఆమె శ్రీకృష్ణుని పాద పద్మాలను వత్తుతోంది. ఇంకొకామె ఇంటికి పోయి చూడగా అక్కడ శ్రద్ధగా పురాణ శ్రవణం చేస్తున్నాడు. ఇంకో సతీమణి ఇంటికి పోగా అక్కడ జరుగుతున్న సంతర్పణను స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు. ఇంకొక భార్య ఇంట్లో పిల్లల్ని ఆడిస్తున్నాడు. ఈ విధంగా శ్రీకృష్ణుడు గృహస్థాశ్రమ ధర్మాల్ని ఒక్కొక్క ఇంట్లో ఒక్కొక్క విధంగా ఏకకాలంలో నిర్వర్తిస్తూ ఉంటే మహర్షి చూసి నిశ్చేష్టుడయ్యాడు.

శ్రీకృష్ణుడు రుక్మిణీ మందిరంలో ఉన్నప్పుడు ఈ విధంగా స్తుతించాడు. "జగన్నాయకా! నువ్వు నిర్గుణుడవు, నిరీహుడవు, నిర్లిప్తుడవు. సత్యమే నీ స్వరూపం, నీ ఇష్టా ఇష్టాల్ని తెలుసుకోవడం ఎవరి తరమూ కాదు. ఏ రోజు కారోజే నిత్య వినూతనంగా కనిపిస్తూ ఉంటావు. సనాతనుడవైన నిన్ను వేదాలు వర్ణించి చెబితే తప్ప ఎవరూ తెలుసుకోలేరు. బ్రహ్మజ్యోతి స్వరూపుడవన్న పేరు నీకే చెల్లుతుంది. అట్టి మహనీయుడవైన పరమేశ్వరునికి నమస్కరిస్తున్నాను" అన్నాడు. మహర్షి చేసిన స్తుతి వాక్యాలను ఆలకించిన శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

"ఓ బ్రహ్మమునీ! నువ్వు శివాంశచే జన్మించి నా గురించిన జ్ఞానం తెలిసికూడా తెలియనట్లు మాట్లాడుతున్నావు. అయినా చెప్తాను విను. సర్వలోకాలను, జీవరాసుల్ని పుట్టించేవాడను నేనే. పుట్టించిన బ్రహ్మాండాలన్నింటినీ నడిపేవాడినీ నేనే. అన్ని జీవుల్లోనూ ఆత్మ రూపంగా ఉంటూ ఉంటాను. నేను ఏ జీవినుండి నిష్క్రమిస్తానో ఆ ప్రాణిలో కళ ఉండదు. శవమై పోతుంది. అన్ని జీవరాసుల్లో ఉండేదీ

నేనొక్కడినే అయినా వివిధరూపాల్లో అనేక జాతులుగా ఉంటాను. ఎవడు భోజనం చేస్తాడో వాడి ఆకలి మాత్రమే తీరుతుంది. ఇతరులకు తృప్తి కలుగదు. పూర్ణుడనైన నేను గోలోకంలోను, రాసమండలంలోనూ విహరిస్తూ ఉంటాను. రాధాదేవి శ్రీధాముడి శాపం వల్ల నన్ను పొందలేకుండా ఉంది. అందువల్ల కళ తప్పి ఉంటోంది. రుక్మిణీ మందిరంలో నాలోని ఒక అంశము, తక్కిన భార్యల యందు ఒక్కొక్క కళ ప్రకాశిస్తూ ఉంటుంది. అట్లాగే ప్రతిమల్లో కూడా నా అంశ ఉంటూ ఉంటుంది" అని చెప్పి శ్రీకృష్ణుడు అంతఃపురంలోనికి వెళ్ళగా దుర్వాసుడు తన ప్రియురాలిని వదలి తపోవనానికి వెళ్ళిపోయాడు.

ఈ భాగంలో మనం తెలుసుకోదగిన విశేషం ఏమంటే, దుర్వాసుడికి గోరంత అహంకారం ఉంది. అది ఉన్నంతవరకు జ్ఞానం నిర్మలంగా ఉండదు. కనుక మహర్షి చిత్తవృత్తి ఎరిగిన వాడవటం వలన శ్రీకృష్ణుడు అతడికో కన్యకనిచ్చి పెళ్ళిచెయ్యాలన్న సంకల్పాన్ని ఉగ్రసేన మహారాజులో ప్రేరేపింప జేశాడు. ఆ మునికూడా నాకెందుకీ కన్య అని అనుకోకుండా గ్రహించి ఆమెతో కాపురం చేశాడు. కొంత కాలమైన తర్వాత తను చేసిన పనేమిటో అతడికి తెలిసి వచ్చింది. దాంతో తాను చేసిన తపోఫలం చేత జ్ఞానోదయమై భగవంతుని ఆశ్రయించాడు. మహర్షి శ్రీకృష్ణుని స్తుతించగానే, తాను కొన్ని చోట్ల అంశతోను, కొన్ని చోట్ల కళమాత్రంగా ప్రకాశిస్తూ ఉంటానని తెలిపాడు. తక్కిన తావులన్నింట్లోనూ తన కళ అంతంత మాత్రంగానే ఉంటుందని తెలిపాడు. భగవత్కళ లేని చోట్లు కూడా ఉంటాయా? అని అడిగేవారుంటారు. శ్రీకృష్ణ భగవానుడే గీతా శాస్త్రంలో "ఏ వస్తువు తేజోవంతంగా ఉంటుందో వాటన్నింట్లోనూ నా అంశ ఉంటుందని" తెలుసుకొమ్మంటాడు. దీన్ని బట్టి మనం గ్రహించాల్సిందేమంటే, ఎవడైతే పుణ్య కర్మలు ఎక్కువగా చేస్తూ ఉంటాడో అతడిలో భగవదంశ ఎక్కువగా ఉంటుందని ఇందులో భావం. దేవాలయాల్లో గాని, పుణ్య తీర్థాల్లో గానీ, కూర్చుని జపం చేసేవాళ్ళకు త్వరగా మంత్రసిద్ధి కలుగుతూ ఉండటం మనమంతా ఎరిగిందే. అనగా భగవత్కళ అధికంగా ఉండే చోట్లన్నీ పరమ పవిత్రమైనవని సాధకుడికి ఆ స్థల మహిమ వలన మనస్సు నిశ్చలమై ఉంటుందని గ్రహించాలి. అంతేకాదు భగవద్భక్తులు, సాధువులు తపస్సు చేసే ప్రదేశాలన్నీ కూడా పరమ పవిత్రమైనవేనని మనం తెలుసుకోవాలి. శిలా విగ్రహాలు కూడా కొన్నే ఎంతో ప్రకాశవంతంగా ఉండటం మనం చూస్తూ ఉంటాం. కొన్నింట్లో కళాకాంతులసలే కనిపించవు. అందువల్లనే మన పూర్వీకులు అనేక దేవాలయాలు కట్టించారు. పుణ్య తీర్థాలను ఏర్పాటు చేశారు.

పార్వతి శ్రీకృష్ణుని మహిమను తెలుపుట

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 113వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

శ్రీకృష్ణుని వద్ద శలవు తీసుకొని దుర్వాసుడు శిష్యులందర్నీ వెంటబెట్టుకొని ద్వారక నుండి కైలాసానికి వెళ్ళాడు. అక్కడ పరమ శివుడు పార్వతీదేవితో కలసి వటవృక్షఛాయన కూర్చొని ఉండగా దుర్వాసుడు పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించి ద్వారకానగరంలో జరిగిందంతా పూసగుచ్చినట్లు వివరించాడు. దాపరికం లేకుండా తను భార్యను వదలి వైరాగ్యం కలిగి పార్వతీ పరమేశ్వరుల దర్శనార్థం వచ్చానని విన్నవించుకున్నాడు. పరమేశ్వరుడూ అక్కడే ఉన్నా పల్లెత్తు మాటైనా మాట్లాడలేదు. అయితే పార్వతీదేవియే ఇలా అంది.

మునీంద్రా! ధర్మతత్త్వం నలుసంతైనా తెలుసుకోకుండానే ధర్మిష్ఠుడనని నువ్వు అనుకుంటున్నావు. వివాహం చేసుకొని భార్యను సంతానవతిని చెయ్యకుండా తప్పించుకొని ఎక్కడికిపోతావు? పోయి ఏం సాధిస్తావు? నువ్వు బ్రహ్మ చర్య వ్రతం ఆచరించినా, ఏకాంతంగా ఎంత తపస్సు చేసినా, ఎన్ని తీర్థయాత్రలు చేసినా నీకు ఫలితం మాత్రం దక్కదు సుమా. అంతేకాదు నువ్వు చేస్తున్న పని వలన ధర్మ హానికూడా సంభవిస్తుంది. నీ భార్య దుఃఖమే నీకు శాపంగా పరిణమిస్తుంది. అందువల్ల ఇహంలో నీ కీర్తి నశిస్తుంది. మరణానంతరం నరకానికి పోక తప్పదు. కాబట్టి నా మాట విను. బుద్ధిగా భార్యతో కలసి గృహస్థ ధర్మాలు ఆచరించు. సనక సనందాదులు శంకరుని పాదాలనాశ్రయించినట్లు నువ్వు కూడా శ్రీకృష్ణుని పాదాలనాశ్రయించి తరించు. నువ్వీవిధంగా వైరాగ్యమన్న పేరుతో పరుగెత్తుకొని రావడం ఎట్లా ఉందంటే మనోహరమైన అమృతాన్ని కాలదన్నుకొని బురదనీళ్ళల్లో పడి దొర్లినట్లుంది. శ్రీకృష్ణ మహిమను గూర్చి చెప్తాను విను.

ఏ మానవుడైనా శ్రీకృష్ణుని పాదారవిందాలను స్వప్నంలో పూజించినా కూడా అతడి జన్మజన్మల పాపాలన్నీ పటాపంచలై పోతాయి. ఎవడు శ్రీకృష్ణుని పాదారవిందాలను దర్శించగలుగుతాడో అటువంటి వాడు జీవన్ముక్తుడవుతాడు. శ్రీకృష్ణుని సేవ జన్మ రాహిత్యాన్ని చేకూరుస్తుంది. శ్రీకృష్ణ భక్తిలేనివాడు ఎన్ని వేద వేదాంగాలు అభ్యసించినా వ్యర్థమే. శ్రీకృష్ణునికి అర్పించిన ప్రసాదాన్ని ఎవడు భుజిస్తాడో అతడే నిజమైన బ్రాహ్మణుడు. అగ్ని కన్నా పరిశుద్ధుడు. అతడు ముల్లోకాల్ని పవిత్రం చెయ్యగలవాడవుతాడు. అటువంటి శ్రీకృష్ణ సేవాభాగ్యం లభించికూడా ఎందువల్ల నువ్విట్లా పారిపోతున్నావు? నువ్వు చేసే తపస్సు ఫలిస్తుందని ఎట్లా అనుకుంటున్నావు? గురువైన వాడు శిష్యునికి శ్రీకృష్ణునిపై భక్తి కుదిరేట్లుగా బోధించాలి. అట్లా కానియెడల అతడు గురువు కాలేడు. పరమ శత్రువే అవుతాడు.

పార్వతీదేవి చేసిన ఉపదేశాన్నంతా పరమశివుడు శ్రద్ధగా విని ఆమెను మెచ్చుకున్నాడు. దుర్వాసమహర్షికి కూడా జ్ఞానోదయం కలిగి శ్రీకృష్ణుని వెతుక్కుంటూ ద్వారకకు ప్రయాణమయ్యాడు. శ్రీకృష్ణుని దర్శనం చేసుకొని బహువిధాలుగా ఆయనను కీర్తించాడు. అటుపిమ్మట ఇంటికిపోయి

భార్యతో సుఖంగా కాలం గడిపాడు.

విశేషార్థం : ఇందులో విశేషం ఏమంటే, శంకరుడు ప్రక్కనే ఉన్నాకూడా ఒక్కమాట కూడా మాట్లాడలేదు. పార్వతి మూలంగానే బోధించాడు. ఎందువల్ల? శంకరుడు ముక్తి ప్రదాత. అతడు ముక్తి మార్గాన్నే చూపుతాడు గాని సంసార మార్గాన్ని చూపడు. మహర్షి సంసారం వదలి ముక్తిని పొందే సమయం ఇంకా రాలేదు. అందువల్ల ప్రవృత్తి మార్గాన్ని చూపమని తన శక్తి అయిన పార్వతీ దేవికి అనుజ్ఞ ఇచ్చాడు. మహా ప్రకృతి అయిన పార్వతి మహర్షికి కర్తవ్యాన్ని బోధించింది. దుర్వాసుడిప్పుడు భక్తుడయ్యాడు. సేవ్య సేవక ధర్మాన్ని గ్రహించాడు. ఇదే భక్తి లక్షణం. దీన్నే వైష్ణవ సంప్రదాయంలో శరణాగతి అంటారు. దీన్నే ప్రవృత్తి మార్గమని కూడా కొందరంటారు. ఇటువంటి స్థితికి చేరుకున్న జీవుడు కర్మలన్నీ చేస్తూనే ఉండాలి. కానీ కర్మ ఫలాన్ని కోరుకోకూడదు. దుర్వాసుడిప్పుడు వివాహితుడు. కాబట్టి గృహస్థుకు చెప్పిన అగ్నిహోత్రాది కర్మలన్నీ నిర్వర్తించాలి. గృహస్థు విహిత కర్మలన్నీ చెయ్యాలని శ్రుతి ఘోషిస్తోంది. నిత్యకర్మలన్నీ చెయ్యదగినవే. కానీ ఫలాపేక్షతో చేస్తే బంధవిముక్తి కలుగదని శ్రీశంకరాచార్యులవారు కూడా బోధించారు. పార్వతీదేవి ఉపదేశ సారాంశం కూడా ఇదే. ఓ మహర్షీ! ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుని వదలి శంకరుని గూర్చి తపస్సుచేసేందుకు ఇక్కడికెందుకు వచ్చావని మందలించింది. అప్పుడు మహర్షి అజ్ఞానానికి సిగ్గుపడి తిరిగి ద్వారకకు వెళ్ళిపోయాడు.

శ్రీకృష్ణ పరమాత్మకూడా గీతా శాస్త్రంలో ఈ మాటే చెప్పారు. "ఎవడైతే నన్ను అన్నిటియందును, సర్వమును నాయందును చూస్తాడో అతడు నా దృష్టినుండి తప్పించుకోలేడు. ఉన్నదంతా ఒక్కటే నని నమ్మి సమస్త భూతాల్లోను నన్ను దర్శించేవాడే యోగి. అతడు ఏ స్థితిలో ఉన్నా నా వద్దనే ఉన్నవాడవుతాడు, వాస్తవమైన జ్ఞానం కలవాడు ఈశ్వరుడు ఎక్కడో దూరాన ఉన్నాడని భావించడు. తన హృదయంలోనే కొలువుదీరి ఉన్నాడని భావిస్తాడు. ఈశ్వరుడు అందరి యందు ఉన్నాడు కాబట్టి వెదికే వాళ్ళకి వారియందే కనిపిస్తూ ఉంటాడు." **– శ్రీ రామకృష్ణ పరమహంస.**

అందువలన క్షేత్ర ప్రభావాలతో పనిలేదు. పూర్వ జన్మల పుణ్య ఫలంచేత మనోదారుఢ్యం కుదిరింది. కావున తీర్థయాత్రాదులన్నీ యోగం సిద్ధించని వారికి చంచలాత్ములకు మాత్రమేనని మనం గ్రహించాలి. యోగం సిద్ధించిన వారు కర్మలాచరించినా అవి లోకులకు మార్గం చూపేందుకేనని మన మీ కథాంశం నుండి గ్రహించాల్సిన సారాంశం.

నరకాసుర వధ

(ఈ భాగం బ్రహ్మ పురాణం, హరివంశం, శ్రీభాగవతం, విష్ణుపురాణాల నుండి గ్రహించబడింది)

నరకాసురుడు ప్రాగ్జ్యోతిషపురాన్ని రాజధానిగా చేసుకొని పాలిస్తూ ఉండేవాడు. త్వష్ట కుమార్తెను వివాహం చేసుకొని స్వేచ్ఛగా విహరిస్తూ ఉండేవాడు. దేవ దానవ, మానవాది జాతుల్లోని 1600 మంది సుందరీమణుల్ని చెరబట్టి తీసుకొచ్చాడు. వారికోసం మణిపర్వతమనే నగరాన్నొకటి నిర్మించి అక్కడ చెరసాలలో బంధించి ఉంచాడు. ముర అనే రాక్షసుడొకడు ఇతడికి ప్రాణ స్నేహితుడు.

అతడికి పదిమంది కుమారులు. వారంతా నరకునికి విధేయులై ఉంటూ ఉండేవారు. ఆ పదిమందిని మణిపర్వత నగరాన్ని రక్షించేందుకు నియమించాడు.

ఒకానొక రోజున ఇంద్రుని తల్లి అదితి చెవికుండలాలు ఎంతో విలువైనవని విన్నాడు. వాటికోసం ఇంద్రుడిపై దండెత్తి అదితి కుండలాల్ని సంగ్రహించుకుపోయాడు. అంతేకాదు, ఆ నరకాసురునికి అనేక మంది భార్యలున్నారు. వారందరికీ అనేక మంది పుత్రులున్నారు. వారుకూడా నరకాసురుడంతటి పరాక్రమవంతులు. క్రూరాత్ములు. వారంతా ఏదో ఒక సాకు చూపి దేవలోకంపై దండెత్తి దేవతల్ని హింసిస్తూ ఉండేవారు. పుణ్యాత్ముల్ని బాధించడమే వృత్తిగా పెట్టుకున్నారు. తపస్వులంతా వాళ్ళని చూస్తూనే ప్రాణాలు వదిలేవారు.

ఇటువంటి క్రూరాత్ముణ్ణి వధించడానికే శ్రీ మహావిష్ణువే మానవ రూపంలో శ్రీకృష్ణుడుగా అవతరించాడు. రుక్మిణి మొదలైన అష్టమహిషులు, మిగిలిన భార్యలందరితో ద్వారకానగరంలో సుఖంగా ఉంటూనే ఈ భూభారాన్ని తగ్గించేందుకు ఇంకా ఏమేమి కార్యాలు చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో సుగంధాలు వెదజల్లుతూ చల్లటి గాలి వీయసాగింది. ఆకాశం అంతా కిలకిలా రావములతో నిండిపోయింది. దివ్య కాంతుల మధ్య ఒక తేజస్సు విచిత్రంగా ప్రకాశించింది. ఆ తేజస్సులో నుండి ఒక దివ్య పురుషుడు సవారీ కట్టిన తెల్లటి ఏనుగుపై కూర్చుని రావడం కనిపించింది. అట్లావస్తున్న ఇంద్రుణ్ణి బలరామకృష్ణులు, ఉగ్రసేన మహారాజు చూసి ఎదురుగా వెళ్ళి స్వాగతం పలికారు. ఉగ్రసేన మహారాజు అర్ఘ్యపాద్యాది లాంఛనాలతో ఇంద్రుణ్ణి ఆహ్వానించి పూజించారు. కుశల ప్రశ్నలైన తర్వాత ఇంద్రుడు, శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "మధుసూధనా! నువ్వు కష్టాల్లో ఉన్న వాళ్ళను అక్కున చేర్చుకునేవాడవు. నేను వచ్చిన పనేమిటో వివరిస్తాను విను. నరకుడనే రాక్షసుడొకడు వర బలముచే దేవతల్ని, మహర్షుల్ని నానావిధాలుగా బాధిస్తున్నాడు. ఎట్లాగో సహిస్తూ వచ్చాం. మొన్నటికి మొన్న దేవమాత అని అయినా చూడకుండా అదితి చెవికుండలాల్ని ఊడబెరుక్కుని పోయాడు. అంతేకాదు వరుణుని ఛత్రాన్ని కాస్తా కాజేశాడు. మలయాద్రికి అలంకారంగా ఉండే మణి శిఖరాల్ని పగులగొట్టాడు. వీడి ఆగడాలకు అంతులేకుండాపోతోంది. కావున అతణ్ణి వధించి లోకాలను ఉద్ధరించు. గరుత్మంతుడొక్కడే నిన్ను ఆ రాక్షసుని వద్దకు క్షేమంగా తీసుకొని పోగలడు. ఇతడు తప్ప అతడి వద్దకు మరే జీవి అతడి వద్దకు పోయేందుకు సాహసించదు. జనార్ధనా! ఇప్పుడు వాడి కన్ను నా ఐరావతం పైన పడిందని వింటున్నాను. కనుక నువ్వు ఇక ఎంతమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఈ లోకకంటకుణ్ణి సంహరించు."

ఇంద్రుని దీనాలాపాలను విన్న శ్రీకృష్ణుడు, "దేవనాయకా! మహేంద్రా! భయపడకు. వాడిని తప్పక వధించి నీకు మనశ్శాంతి చేకూరుస్తాను. నువ్వు అమరావతికి పోయి నిశ్చింతగా ఉండు" అన్నాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు సత్యభామ అంతఃపురంలో ఉన్నాడు. సత్యభామకు విష్ణుమాయ ఆవహించేట్లు చేసి, యుద్ధానికి తానూ వస్తానని పట్టుపట్టేట్లుగా ప్రేరేపించాడు. ఎందువల్లనంటే, పూర్వం భూదేవికి నీ అనుమతి లేకుండా నీ కుమారుడైన నరకాసురుణ్ణి చంపనని వాగ్దానం చేశాడు. ఆ భూదేవి అంశతోనే ఇప్పుడు సత్యభామగా జన్మించింది. కనుక సత్యభామ అనుమతితో నరకుణ్ణి

చంపితే భూదేవి అనుజ్ఞ తీసుకున్నట్లవుతుందన్నదే శ్రీకృష్ణుని ఆశయం.

(పోతన మహాకవి సత్యభామ యుద్ధానికి వస్తానన్నట్లుగానూ, శ్రీకృష్ణుడు యుద్ధరంగంలో ఉండే కష్టాల్ని వల్లించి వద్దని వారించినట్లు, అయినా సత్యభామ జంకకుండా తన పట్టునెగ్గించుకొన్నట్లు ఎంతో మనోహరంగా పెంచి వ్రాశారు. ఈ భావాలన్నీ మూలంలోనే కాదు మరే పురాణంలో కూడా కనబడవు.)

శ్రీకృష్ణ సత్యభామలు గరుడ వాహనంపై యుద్ధానికి బయలుదేరారు. ప్రభువు ఆజ్ఞ లేదు కాబట్టి సేనాధిపతులెవ్వరూ శ్రీకృష్ణుని అనుసరించే సాహసం చెయ్యలేదు. ప్రాగ్జోతిషపురం ఒక గిరిదుర్గం కాబట్టి ఆకాశమార్గంమొక్కటే సాధనం. అందుకు గరుడవాహనం ఎంతో సముచితంగా ఉంది. వారా అపురూప దుర్గాన్ని ఆకాశమార్గాననే తిలకిస్తూ ఆ నగర సౌందర్యానికి ఆశ్చర్యపోయారు. అటువంటి ప్రాగ్జోతిషపురాన్ని ముర దానవుడు రాత్రింబవళ్ళు కళ్ళలో వత్తులు వేసుకొని పరిరక్షిస్తూ ఉంటాడు. వాడి దగ్గర ఎన్నో మయోపాయాలున్నాయి. శత్రువులు ఎంతటి వారైనా వాడి మాయల్లో చిక్కుకోవాల్సిందే. ఎందువల్లనంటే ముర దానవుడే ఆ నగరాన్ని నిర్మించాడు. అవన్నీ చూస్తున్నప్పుడు శ్రీకృష్ణుడి మనస్సులో ఒక వింత ఆలోచన చోటు చేసుకుంది.

శ్రీకృష్ణుడు వెయ్యిమంది సూర్యుల తేజస్సుతో గరుడ వాహనం పైనుండి ధనుస్సు చేతిలోకి తీసుకొని నారి బిగించి గోటితో ఒక విచిత్రమైన శబ్దాన్ని చేశాడు. ఆ ధ్వని మురదానవుడి చెవిన పడింది. సాక్షాత్తూ విష్ణువే యుద్ధానికి వచ్చాడని అర్థమైంది. దాంతో అతడి క్రోధం రెట్టింపయింది. కళ్ళు ఎర్రగా చింత నిప్పులయ్యాయి. వాడో పెద్ద మాయల ఫకీరు. అందువల్ల వాడి జోలికి పోయేందుకు ఎవరూ సాహసించరు. అటువంటి మురదానవుడు నిద్రలేచాడు. శ్రీకృష్ణునిపై యుద్ధానికి సంసిద్ధుడయ్యాడు. వాడు ఎదిరించే లోపలే శ్రీకృష్ణుడు గదలతో పర్వత దుర్గాలన్నింటినీ పిండి పిండి చేశాడు. వాడియైన నారాచ బాణాల్ని ప్రయోగించి, మిగిలిన దుర్గాలన్నింటినీ నాశనం చేశాడు. సుదర్శనాన్ని ప్రయోగించి వాయు, జల దుర్గాలను నామ రూపాల్లేకుండా చేశాడు. అంతేకాకుండా గదను ప్రయోగించి ప్రాకారాల్లో అమర్చిన యంత్ర సాధనాల్నింటినీ విరగకొట్టాడు. అటుపిమ్మట ప్రాణులన్నీ మూర్ఛపోయేట్లుగా శంఖనాదాన్ని చేశాడు.

పాంచజన్య నాదం వినగానే ముర దానవుడి ఒళ్ళుమండిపోయింది. వెంటనే శక్తి ఆయుధాన్ని తీసుకొని శ్రీకృష్ణుడిపై ప్రయోగించాడు. అది ఆకాశం నుండి రాలిపడే ఉల్కలాగా ప్రకాశిస్తూ వేగంగా శ్రీకృష్ణుడిపైకి వస్తోంది. శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ దానిపైన ఓ నారాచ బాణాన్ని విడిచి దాన్ని రెండు ముక్కలు చేశాడు. అయితే రెండు ముక్కలైన ఆ శక్తి ఆయుధం రెండు శక్తులై శ్రీకృష్ణుడి వైపు ప్రయాణం చేశాయి. అప్పుడు శ్రీకృష్ణుడు అయిదు బాణాల్ని ప్రయోగించి ఆ రెంటినీ పొడిపొడి చేశాడు. శక్తి ఆయుధం నిర్వీర్యం కావడంతో ఆ దానవుడు బంగారు పొన్నులున్న గదను ప్రయోగించాడు. శ్రీకృష్ణుడా గదపైన అర్ధచంద్రాకారపు బాణాన్ని ప్రయోగించగా గదముక్కలై నేలపై పడింది. ఈ విధంగా ముర దానవుడు తనకు తెలిసిన యుక్తులన్నీ ప్రయోగించి చూశాడు. ఇక వాడి ఆయువు

తీరిందని గ్రహించిన శ్రీకృష్ణుడు వాడి శిరస్సు ఛేదించాడు. తండ్రి మరణానికి కృద్ధులైన మురుడి కుమారులంతా శ్రీకృష్ణుడితో భీకరంగా యుద్ధంచేసి హతులయ్యారు.

ఈ విధంగా మురాది రాక్షసులందర్నీ సంహరించి శ్రీకృష్ణుడు ప్రాగ్జోతిష పురానికి చేరుకొని పాంచజన్యాన్ని పూరించగా దిక్కులన్నీ పిక్కటిల్లాయి. ఆ శంఖనాదానికి నరకుడు అదిరిపడ్డాడు. ఎనిమిది చక్రాలతో కూడుకున్న మహారథాన్ని అధిరోహించి శ్రీకృష్ణుణ్ణి ఎదిరించడానికి బయలుదేరాడు. మహా బలాఢ్యులు, క్రూరులు అయిన రాక్షస సేనాధిపతులంతా నరకుని అనుసరించారు. వారంతా రకరకాలైన మారణాయుధాల్ని ధరించి శ్రీకృష్ణునిపై యుద్ధానికి సిద్ధపడ్డారు. వారిని చూస్తూనే శ్రీకృష్ణుడు ధనుష్టంకారం చేయగా ఆ శబ్దం ఆకాశపుటంచుల్ని తాకింది. ధనుస్సునుండి వడివడిగా లక్షలాది బాణాల్ని సంధిస్తూ ఉంటే భూమ్యాకాశాలు నిండిపోయాయి. సూర్యరశ్మి నేలపై పడక అంధకారం అలముకొంది. శ్రీకృష్ణుడి బాణాల తాకిడికి చావగా మిగిలిన రాక్షస సైన్యమంతా నలుమూలలకు పరుగులు తీశారు.

తన సేననంతా పొట్టన పెట్టుకున్నాడని విన్న నరకాసురిడికి శ్రీకృష్ణునిపై క్రోధంతో కళ్ళు చింత నిప్పులయ్యాయి. ముందుగా శ్రీకృష్ణుణ్ణి అంతం చెయ్యాలనుకున్నాడు. ఆ తర్వాత దుర్భేద్యమైన గిరి దుర్గానికి చేరవేసిన గరుత్మంతుణ్ణి ఖండ ఖండాలుగా చెయ్యాలని సంకల్పించాడు. నరకాసురుడు ఎన్నో దివ్యాస్త్రాల్ని శ్రీకృష్ణునిపై సంధించాడు. ఆ అస్త్రాలన్నింటినీ సుదర్శన చక్రం ముక్కలు ముక్కలుగా చేసి పడేస్తోంది. ఇకపైన సహించరాదని తలచిన పరమేశ్వరుడు నరకుని రథాన్ని, ధ్వజాన్ని సారథిని, గుర్రాల్ని ఒక్కొక్కరిపై పడేసి బాణాల్ని వదలి నిర్వీర్యుల్ని చేశాడు. ఆ తర్వాత నరకుని కవచాన్ని విరగ్గొట్టి నేలపై పడేశాడు. రథాన్ని, సారథిని, కవచాన్ని నష్టపోయినా కూడా ఆ దానవుడు లెక్క చేయలేదు. తోక త్రొక్కిన త్రాచువలె శ్రీకృష్ణునిపై లంఘించాడు. అగ్ని జ్వాలలు క్రక్కే లోహంతో చేసిన శూలాన్ని విసిరాడు. సాదా సీదా మనుషులైతే ఆ దండాన్ని చూస్తూనే యమదండంగా భావిస్తారు. అటువంటి దండాన్ని పరమేశ్వరుడు గడ్డి పరకను త్రుంచినట్లుగా రెండు ముక్కలు చేశాడు. ఇట్లా కొంతకాలం భీకరమైన యుద్ధం సాగిన తర్వాత అతడికి సమయం దగ్గర పడిందని భగవంతుడు గ్రహించాడు. వెంటనే సుదర్శనాన్ని ప్రయోగించి ఆ దానవాధముణ్ణి నేలకూల్చాడు. ఈ భీకర యుద్ధాన్ని తిలకిస్తున్న దేవతలు, మహర్షులు హర్షం తెలిపారు. శ్రీకృష్ణుని వలన ముల్లోకాలకు సుఖశాంతులు లభించాయని సంతోషించారు. దీంతో నరకాసుర వధ పూర్తి అయ్యింది. పైన చెప్పిన పురాణాలన్నింట్లోనూ ఈ నరకాసుర వధ ఒకే మాదిరిగా ఉంది. కానీ సత్యభామ యుద్ధంలో పాల్గొన్నట్లు ఏ పురాణమూ చెప్పలేదు. మహాకవి పోతనగారు మాత్రం ఈ భాగంలో పెంచి తన కవితా ప్రాభవాన్ని చాటుకున్నారు. మచ్చుకు కొన్ని పద్యాలు తిలకించి ఆనందించండి.

వ॥ కనికలహంబునకు నరకాసురుండు గమకింపం దమకింపక విలోకించి సంభ్రమంబున,

శా॥ *వేణిం జొల్లెము పెట్టి సంఘటిత నీవీబంధయై భూషణ*
శ్రేణిం దాల్చి ముఖేంద్రు మండల మరీచీజాలముల్ పర్వఁగాఁ
బాణిం బయ్యెదఁ జక్కఁగాఁ దుఱిమి శుంభద్వీరసంరంభయై

యేణీలోచన లేచి నిల్చెఁ దన ప్రాణేశాగ్రభాగంబునన్.

కII జన్యంబుల దనుజుల దౌ। ర్జన్యము లుడుపంగఁ గోరి చనుదెంచిన సౌ
జన్యవతిఁ జూచి యదురా। జన్య శ్రేష్ఠుండు సరస సల్లాపములన్.

కII లేమా దనుజుల గెలువఁగఁ। లేమా నీవేల కడఁగి లేచితి విటురా
లే మాను మానవేనిన్। లేమా విల్లందుకొనుము లీలంగేలిన్.

సీII సౌవర్ణ కంకణ ఝుణఝుణ త్కారంబు శింజినీరవముతో జెలిమి చేయఁ
దాటంకమణిగణ ధగధగదీప్తులు గండమండల రుచిఁ గప్పు కొనఁగ
ధవళ తరాపాంగ ధళధళ రోచులు బాణ జాల ప్రభా పటలినడఁప
శరపాత ఘుమఘుమ శబ్దంబు పరిపంథి సైనిక కలకల స్వనము నుడుప

తేII వీరశృంగార భయరౌద్ర విస్మయములు। కలిసి భూమిని యయ్యెనో కాక యనగ
నిషువుఁ దొడుగుట తివుచుట యేయుటెల్ల। నేఱుఁగ రాకుండ నని చేసె నిందువదన.

మII పరుఁ జూచున్ వరుఁజూచు నొంప నలరింపన్ రోషరాగో
దయా, విరత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృం
గారమున్ జరగం గన్నులఁ గెంపు సొంపుఁ బరఁగం జండాస్త్ర
సందోహమున్, సరసాలోక సమూహమున్ నెఱపుచుం జంద్రాస్య హేలాగతిన్

సీII బొమ్మ పెండ్లిండ్లకుఁ బోనొల్లనను బాల రణరంగమున కెట్లు రాఁదలంచె
మగవారిఁ గనినఁ దా మఱుఁగుఁ జేరెడు నింతి పగవారిఁ గెల్వ నేపగిదిఁ జూచెఁ
బసిఁడి యుయ్యెల లెక్క భయమందు భీరువు ఖగపతి స్కంధమే కడింది నెక్కె
సఖుల కోలాహల స్వరము లోర్వని కన్య పటహభాంకృతుల కెబ్భంగి నోర్చె

ఆII నీల కంఠములకు నృత్యంబు గఱపుచు। నలసితలఁగి పోవు నలరుఁ బోడి
మే విధమున నుండె నెలమి నాలీఢాది। మానములను రిపుల మానమడఁప.

సీII వీణెజక్కఁగఁ బట్టు వెఱ వెఱుఁగని కొమ్మ బాణాసనం బెట్లు పట్ట నేర్చె
మ్రొఁకునఁ దీఁగెఁగూర్పంగ నేరని లేమ గుణమునే క్రియ ధనుః కోటిఁ గూర్చె
సరవి ముత్యముఁ గ్రువ్వఁ జాలనియ బలయే నిపుణత సంధించె నిశిత శరముఁ
జిలుకకుఁబద్యంబుఁ జెప్పనేరని తన్వి యస్త్ర మంత్రము లెన్నఁ డభ్యసించెఁ

ఆII బలుకమనినఁ బెక్కు పలుక నిముగదయే। గతినొనర్చె సింహ గర్జనములు
ననఁగ మెఱసెఁ ద్రిజగదభిరామ గుణధామ। చారు సత్యభామ సత్యభామ.

సీII రాకేందు బింబమై రవిబింబమై యొప్పు నీరజాతేక్షణ నెమ్మొగంబు
కందర్ప కేతువై ఘనధూమకేతువై యలరుఁ బూఁబోడి చేలాంచలంబు
భావజు పరిధియై ప్రళయార్కు పరిధియై మెఱయు నాకృష్టమై మెలఁత చాప
మమృత ప్రవాహమై యవల సందోహమై తనరారు నింతి సందర్శనంబు

ఆII హర్షదాయియై మహారోషదాయియై। పరఁగుముద్దరాలి బాణవృష్టి
హరికి నరికిఁ జూడ నందంద శృంగార। వీర రసములోలి విస్తరిల్లె.

శ్రీకృష్ణుడు రణరంగానికి సత్యభామనే ఎందుకు తీసుకొని వెళ్ళాడు? రుక్మిణిని ఎందువల్ల తీసుకొనిపోలేదు? అన్న సందేహాలు రావచ్చు. అందుకే కాబోలు వ్యాఖ్యాతలు ఇలా వ్యాఖ్యానించారు. నరకుడు పుట్టినప్పుడే భూదేవి నీ కుమారుణ్ణి నువ్వే సంహరించవద్దని కోరుకుంటుంది. అందుకు శ్రీహరి ఇతడు లోకకంటకుడై ప్రజల్ని పీడిస్తూ ఉంటే నువ్వే ఇతణ్ణి సంహరించమని అడిగే వరకూ సంహరించనని వరదానం చేస్తాడు. భూమి అంశతో జన్మించినదే సత్యభామ. అందువల్ల రణరంగంలో సత్యభామే "వీణ్ణి సంహరించు" మని శ్రీకృష్ణుణ్ణి అడిగేట్లు చేస్తాడు. ఆమెకు ఆనందం కలిగించడం కోసమే నరకుణ్ణి సంహరిస్తాడు. ఆ తర్వాత జరుగబోయే పారిజాతాపహరణ కథకిది నాందీ ప్రస్తావనమని వ్యాఖ్యాతలు భావించారు.

భూదేవి శ్రీకృష్ణుని స్తుతించుట :

నరకాసురుడు నేల కూలగానే భూదేవి స్త్రీరూపాన్ని ధరించి శ్రీకృష్ణుణ్ణి పరిపరివిధాలుగా కీర్తించింది. నరకుడు ముల్లోకాలను పీడించి తెచ్చిన అమూల్యములైన వస్తుసంపదనంతా శ్రీకృష్ణుని ముందుంచింది. అందులో ఇంద్రుణ్ణి జయించి తెచ్చిన అదితి కుండలాలు, వరుణుణ్ణి చావగొట్టి కాజేసిన శ్వేత ఛత్రము, వైజయంతి అనే మణిని ఇంకా ఎన్నో అమూల్యమైన వస్తువుల్ని శ్రీకృష్ణునికి సమర్పిస్తూ ఇలా స్తుతించింది.

"దేవదేవేశ్వరా! నువ్వు భక్తుల కోరిక మేరకు రూపాల్ని ధరిస్తూ ఉంటావు. ఇట్టి నీకు నమస్కారము. పంకజ నేత్రుడవు, పంకజ పాదుడవు, వాసుదేవుడవు, శ్రీమహావిష్ణువవు, ఆది బీజుడవు, పురుషోత్తముడవు, ఆది అంతములేని వాడవు. గోవిందా! ఈ నరకుణ్ణి నువ్వే ప్రసాదించావు. నీ చేతుల్లోనే సంహరించబడ్డాడు. ఏది ధర్మమో, ఏది లోక హితమో అదే చేస్తావు. నీకు హితులు లేరు. శత్రువులు లేరు. ఇట్టి సర్వ కర్తవగు నీకు నమస్కారము. జగన్నాయకా! పూర్వం నేను నీళ్ళల్లో పడి ఉంటే వరాహరూపంలో వచ్చి నన్ను ఉద్ధరించావు. అప్పుడు నీ స్పర్శ చేత నాకు కలిగిన వాడే ఈ నరకుడు. ఇతడు అజ్ఞానంతో తెచ్చిన అదితి కుండలాల్ని స్వీకరించి, ఇతడి సంతానాన్ని అనుగ్రహించు. నువ్వే కర్తవు. అవ్యయుడవు. జగత్స్వరూపుడవైన నిన్ను నేను ఏమని పొగడగలను? నువ్వు సర్వవ్యాపివి. సర్వ భూతాత్మకుడవు. ఇట్టి నిన్ను నేనేమని పొగడగలను? నిన్ను కొందరు ఆత్మ అంటారు. మరికొందరు పరమాత్మ అంటారు. ఇంకొందరు భూతాత్మ అంటారు. ఇట్టి నిన్ను నేనేమని పొగడగలను? నరకుడు చేసిన పాపాలన్నింటినీ క్షమించు. అతడి అపరాధాలకు ప్రాయశ్చిత్తంగా అతడి పుత్రుణ్ణి నీ పాదాల వద్ద ఉంచుతున్నాను. నీ శరణు కోరుతున్నాడు. నువ్వు ఆర్తత్రాణ పరాయణుడవు. కనుక ఇతడిని కరుణించు" అని ప్రార్థించింది.

ఈ విధంగా భూదేవి ప్రార్థనను విన్న పరమేశ్వరుడు ఆమె భక్తికి మెచ్చి ఆమె కోరినట్లే అభయమిచ్చాడు. నరకాసురుని అంతఃపురంలోకి ప్రవేశించాడు. అక్కడ 16వేల మంది రాజకన్యలు చెరసాలలో బంధించబడి ఉన్నారు. శ్రీకృష్ణుడు వారియందు కరుణ చూపి వారందర్నీ విడిపించాడు. ఆ రాజకన్యలంతా శ్రీకృష్ణుణ్ణే నాథుడు కావాలని కోరుకున్నారు. వారి కోరిక మేరకు వారందర్నీ

భార్యలుగా స్వీకరించాడు. ఆ తర్వాత కోశాగారానికి వెళ్ళాడు. నరకుడు కొల్లగొట్టుకొని వచ్చిన వివిధములైన రత్నాలు, బంగారం ఇంకా ఎన్నో విలువైన ధనరాసులు కనిపించాయి. అక్కడే ఆ ధనరాసులన్నింటినీ శ్రీకృష్ణునికి అర్పించారు. శ్రీకృష్ణుడు వారి ప్రార్థన మన్నించి ఉత్తమమైన వస్తువులు కొన్నింటిని ద్వారకకు తరలించేందుకు అంగీకరించాడు. వరుణుని ఛత్రాన్ని గరుడుడిపై ఉంచగా దానితో గరుడుడు రెట్టింపు ప్రకాశంతో వెలిగిపోయాడు. అంతట నరకుని పుత్రుని పిలిచి అభయమిచ్చి ధర్మబద్ధంగా రాజ్యపాలన చెయ్యమని ఆజ్ఞాపించి భూదేవిని తృప్తి పరచాడు. అక్కడనుండి మణి పర్వతానికి పోయి అమూల్యములైన వజ్ర వైడూర్యాలను తిలకించాడు. అక్కడి తోరణాలు, పతాకాలు కూడా రత్నాలతో అలంకరించబడ్డాయి. అక్కడ విశాలమైన ప్రాసాదాలు అనేకం ఉన్నాయి. ఆ భవనాల్లో పదహారు వేలమంది దేవగంధర్వ కాంతలుంటున్నారు. వారంతా నరకాసురుని చేత బలవంతంగా తెచ్చి బంధించబడ్డవారే! వారిని కాపాడేందుకు సాయుధులైన రక్షక భటులు నియోగించబడ్డారు. ఆ కన్యలందర్నీ అంతఃపుర కాంతల్లా సుఖంగా ఉండేట్లు చూసేవాడు. అయితే వారిని ఎంత సుఖసంతోషాలతో ఉండేట్లుగా ఎన్ని ప్రయత్నాలు చేసినా వారంతా దిగులుతోనే కాలం గడిపేవారు. నామమాత్రంగా బ్రతుకులు వెళ్ళదీస్తూ, కాషాయ వస్త్రాలను ధరించి జీవితం పట్ల తమ నిరాసక్తతను తెలియబరచేవారు. వ్రతాలు, జపతపాలతో చేస్తూ ఇంద్రియాల్ని నిగ్రహిస్తూ, శ్రీకృష్ణ దర్శనం కోసమే ప్రాణాల్ని నిలుపుకుంటున్నారు. అటువంటి సుందరీమణులంతా శ్రీకృష్ణుని దర్శనం కాగానే వారి ఆనందం కట్టలు తెంచుకొని ప్రవహించింది. శ్రీకృష్ణుని చుట్టుముట్టి కీర్తించారు, నృత్యాలు చేశారు. ఇంతవరకు వీరికి కాపలాదారులుగా ఉంటున్న రక్షక భటులందరికీ పరిస్థితి అర్థమైంది. శ్రీకృష్ణుడికి చేతులెత్తి నమస్కరించారు. శ్రీకృష్ణుడు వారందరికీ అభయమిచ్చి మనశ్శాంతిని ప్రసాదించాడు.

ఆ సుందరీమణులంతా అందచందాలకు వీర్య పరాక్రమాలకు మహేంద్రుణ్ణి గూర్చియే విని ఉన్నారు. శ్రీకృష్ణుని చూడగానే వాళ్ళ అభిప్రాయాలన్నీ మార్చుకోవాల్సి వచ్చింది. వారంతా చేతులు జోడించి శ్రీకృష్ణునితో ఇలా విన్నవించుకొన్నారు. "మహానుభావా! పూర్వం వాయుదేవుడు, నారదమహర్షి మా వద్దకు వచ్చి మమ్మల్నందర్నీ ఓదార్చి, ఇలా అన్నారు "ఓ కన్యకల్లారా! త్వరలోనే శ్రీమహావిష్ణువే శ్రీకృష్ణుడుగా అవతరించి ఈ నరకాసురుణ్ణి సంహరిస్తాడు. అనంతరం ఆ మహానుభావుడు, మిమ్మల్నందర్నీ వివాహం చేసుకొని మీ జన్మల్ని చరితార్థం చేస్తాడు. అంతవరకు మీకీ కష్టాలు తప్పవు. కనుక శ్రద్ధా భక్తులతో ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మాన్నే ధ్యానిస్తూ ఉండండి" అని. కావున "కృష్ణా మా కష్టకాలం తీరిపోయిందనే భావిస్తున్నాం. నీ దర్శన భాగ్యంతో పునీతులమయ్యాం" అన్నారు. భగవంతుడు ఆ సుందరీమణుల ప్రార్థనలన్నీ విని చిరునవ్వు నవ్వుతూ వారందరికీ అభయమిచ్చి సేవకులను పిలచి వారందరినీ వారి వారి ప్రదేశాలకు చేర్పించే ఏర్పాటు చేశాడు.

పారిజాతాపహరణము :

భగవంతుడు కాలస్వరూపుడు. కాలం నిరాకారమైనా కూడా సాకారం లాగానే కనిపిస్తూ ఉంటుంది. అట్లా భగవంతుడు నిరాకారుడై కూడా సాకారుడు వలె కనిపిస్తాడు. నిర్వికారుడైనా సవికారుడై ప్రపంచాన్ని నడుపుతూ ఉంటాడు. గీతాచార్యుడైన శ్రీకృష్ణ పరమాత్మ ఇలా అంటాడు.

"కాలరూపుడైన పరమేశ్వరుడు సృష్టి స్థితి లయ కార్యములను తానొక్కడే మూడు రూపాల్లో నిర్వహిస్తూ ఉంటాడు. ఆ కాలమే జీవులన్నింటికీ కర్మఫలాల్ని అనుభవించేట్లు చేస్తుంది. ఆ కర్మానుభవం నుండి ఎంతటి వాడైనా తప్పించుకోలేడు. చివరకు భగవంతుడైనా సరే ఏమీ చెయ్యలేడు. అయితే కర్మలు ఈశ్వరార్పణ బుద్ధితో ఎవరైతే చేస్తారో వారీ వలయంలో చిక్కుకోరు. సామాన్యంగా జీవులు చేసే కర్మలు కూడా సాత్త్విక రాజస తమో భేదాలతో కూడి ఉంటాయి. వాటి ఫలాలు కూడా ఆయా కర్మలకు తగ్గట్లుగానే ఉంటాయి. అట్లాంటి కర్మల్ని చేసినవారు ఆయా కర్మ ఫలాల్ని అనుభవిస్తూ ఉంటే చూస్తూ ఉండటం తప్ప వాటిని ఆపే శక్తి ఎవరికీ ఉండదు.

ఆయా సుందరీ మణులంతా ఎన్నడో చేసుకున్న చెడు కర్మల ఫలాన్ని నరకుని చెరసాలలో ఉంటూ అనుభవించారు. ఆ కర్మ ఫలం తీరగానే పుణ్యకర్మల ఫలం ప్రారంభమైంది. వెంటనే భగవంతుని దర్శనమైంది. దుఃఖాలన్నీ తీరాయి. అట్లాగే నరకాసురుడు కూడా ఆదితి కుండలాల్ని ఎంతకాలం ధరించే పుణ్యకర్మలు చేశాడో అంతకాలమే ధరించ గలిగాడు.

అట్లాగే నరకాసురుడు చెరసాలలో నిర్బంధించిన 16వేల మంది సుందరీమణులు అతడిని కోరుకోలేదు. వారంతట వారు కోరుకునే వరకూ నరకుడు కూడా నిర్బంధించి ఉంచాడే గాని చెరచలేదు. శ్రీకృష్ణ దర్శనం అయిన తర్వాత వారంతా శ్రీకృష్ణునే మనసారా కోరుకున్నారు. రాజకులంలో పుట్టిన శ్రీకృష్ణునికి ఇంతమంది కన్యల్ని వివాహం చేసుకోవడం ఎంతమాత్రం నేరం కాదు. హరివంశంలో వారందర్నీ పల్లకీలలో పంపాడని ఉంది. కొంతమంది ద్వారకా నగరానికే పంపాడని అర్థం చెప్పారు. అయితే వారంతా కాషాయ వస్త్రాలు ధరించి, ఇంద్రియ నిగ్రహం గలవారై శ్రీకృష్ణ దర్శనం కొరకే ఎదురు చూస్తున్నారు. భగవంతుణ్ణి చూడగానే నమస్కరించి "దర్శనేన కృతార్థాహి వయమద్య మహాత్మనః" అని ప్రార్థించారు.

అందుకు బదులుగా శ్రీకృష్ణుడు వారందర్నీ మర్యాదపూర్వకంగా "యథార్హతః పూజయిత్వా సమాభాష్య చ కేశవః" అని హరివంశంలో చెప్పబడింది. దీనిని బట్టి వారంతా తన్ను కామించిన కాంతలు కారని, తన భక్తులేనని అర్థమవుతోంది. అటువంటి వారిని మర్యాదపూర్వకంగా పూజించాడని చెప్పడం సబబుగానే ఉంటుంది. అంతేకాని వారంతా ఆయన ప్రియురాళ్ళని చెప్పడం బుద్ధిమంతుల లక్షణం కాదు. అంతేకాకుండా వారంతా మణిపర్వత మందిరంలో తన కొరకు తపస్సు చేస్తున్న దేవకాంతలు. అందువల్లనే వారిని రక్షించి పల్లకీలలో ఎక్కించి వారి వారి ప్రదేశాలకు పంపాడు. దీనిని బట్టి విచారించగా కర్మానుభవం తీరిన తర్వాత భగవంతుడు తానే ఉద్ధరిస్తాడని, కర్మానుభవాన్ని మీరడడం ఎవరితరమూ కాదని స్పష్టమవుతోంది. శ్రీభాగవతంలో కూడా భూదేవి శ్రీకృష్ణుని ఇట్లా స్తుతించినట్లుంది.

"భక్తేచ్ఛోపాత్తరూపాయ పరమాత్మన్నమో7 స్తుతే " అని ఉంది. అనగా భక్తుల ఇష్టమైన నామరూపాలతో భగవంతుడు రూపాన్ని దాల్చి దర్శనమిస్తాడని. కావున దేవకాంతలంతా నారదుని ఉపదేశానుసారం శ్రీకృష్ణుని ఉపాసిస్తూ అదే రూపంలో దర్శించారు.

పారిజాత మహిమ

(ఈ భాగం హరివంశం, బ్రహ్మ పురాణం, విష్ణుపురాణముల నుండి గ్రహించబడింది)

శ్రీకృష్ణుడు నందవ్రజంలోను, మధురానగరం నుండి ప్రదర్శించిన అద్భుతాలను మనం చదువుకొన్నాం. ఈ ప్రస్తుత కథాంశం ద్వారకనుండి ప్రదర్శించబడింది.

ఒకానొక రోజున రుక్మిణీదేవి ఉపవాస వ్రతం ఆచరించింది. విధి ప్రకారం ఉపవాసం తర్వాత సంతర్పణ చేయాల్సి ఉంది. అందుకోసం శ్రీకృష్ణుడు రుక్మిణీదేవిని వెంటబెట్టుకొని రైవత పర్వతానికి వెళ్ళాడు. ఆయనతో పాటు పుత్రులు, బ్రాహ్మణులు, బంధువులు ఇంకా లెక్కకు మించిన స్త్రీ పురుషులెందరో ఆయన్ను అనుసరించి వెళ్ళారు. బ్రాహ్మణులకు, స్తుతి పాఠకులకు, వందిమాగధులకు, వైతాళికులకు, ఇంకా ఎందరో పుర ప్రముఖులకు తృప్తిగా దానాలిచ్చి విందుచేసి సంతోషపెట్టాడు. వ్రతం యథావిధిననుసరించి పరిసమాప్తం కావడంతో రుక్మిణీ దేవి కూడా ఎంతో సంతోషించింది.

ఇట్లా అంతా రైవత పర్వతం పైన సంతోషంగా సంబరాలు జరుపుకుంటూ ఉండగా దేవలోకం నుండి నారదుడు వచ్చాడు. శ్రీకృష్ణుడా మునికి విధివిహితంగా అతిథి సత్కారాలు చేసి పూజించాడు. అందుకు సంతోషించిన ముని భగవంతునితో ఇలా అన్నాడు. "భగవంతుడా! నువ్వు సత్పురుషుల్లో అగ్రగణ్యుడవు. పూజ్యులందరిలో ప్రథముడవు. కనుక అపూర్వమైన ఈ పారిజాత పుష్పాన్ని నీకు సమర్పించుకుంటున్నాను. కృష్ణా! కల్పవృక్షాలని చెప్పబడే ఐదింటిలో పారిజాతం ఉత్కృష్టమైనది. శచీదేవికి ప్రాణంతో సమానం. అందువల్ల ఇంద్రుడు కూడా దాన్ని ప్రాణప్రదంగానే చూసుకుంటూ ఉంటాడు. పారిజాత పుష్పం కోరిన వారి కోరికలన్నింటినీ తీర్చి పెట్టే పెన్నిధి. అందువల్లనే ఈ పుష్పం ముల్లోకాల్లోనూ ప్రసిద్ధి చెందింది. అందువల్లనే ఎంతో శ్రమపడి తెచ్చిన ఈ దేవపుష్పాన్ని భగవంతునికి సమర్పిస్తున్నాను. భగవంతుడుకూడా తనకు ప్రియాతిప్రియమైన ప్రియురాలికిచ్చి తన ప్రేమను ప్రకటించమని" వేడుకున్నాడు. అంతట శ్రీకృష్ణుడా పుష్పాన్ని ప్రక్కనే ఉన్న రుక్మిణీదేవి శిరస్సున తానే స్వయంగా అలంకరించాడు. ఆ దేవకుసుమం ధరించగానే రుక్మిణీదేవి తేజస్సు రెట్టింపయ్యింది. చూసిన వాళ్ళంతా రుక్మిణీదేవి సౌభాగ్యాన్ని వేనోళ్ళ పొగిడారు.

నారదమహర్షి రుక్మిణీ దేవితో ఇలా అన్నాడు. "పతివ్రతా శిరోమణీ! భీష్మక రాజ పుత్రికా! పుష్పాలన్నింటిలోను ఈ పారిజాత పుష్పం తలమానికం వంటిది. భగవంతుని ప్రియాతి ప్రియమైన ప్రియురాలవు. ఈ పుష్పాన్ని నువ్వు ధరించడమే ఎంతో సమంజసం. ఈ పుష్పాన్ని ధరించడం వలన నువ్వు మరింత పూజ్యురాలుగా పరిగణించబడతావు. పుణ్యవతులంతా నీ అదృష్టాన్నే శ్లాఘిస్తారు. నువ్వీ వ్రతం చేసి ముగించావో లేదో పారిజాతరూపంలో నీకు ఫలం లభించింది. నీ భర్త అనురాగాన్ని సంపాదించుకున్న వాళ్ళల్లో ప్రథమురాలవయ్యావు. నీ ఆధిక్యాన్ని నిలుపుకుంటావు. ఇంకా దీని మాహాత్మ్యాన్ని చెప్తాను విను. శీతోష్ణాలను నువ్వు కోరుకున్నట్లుగా సమకూరుస్తూ ఉంటుంది. మనస్సులో నీ కోరిక మెదలటమే ఆలస్యం, వెంటనే నీకది సిద్ధిస్తుంది. దీని పరిమళం శాశ్వతం. అట్లాగే నీ సౌభాగ్యం కూడా అంతే శాశ్వతం. కష్టాలు నీ దగ్గరకు రావడానికే భయపడతాయి. అశుచిగాని

అశుభ్రంగాని నీకు ఆమడ దూరాన ఉంటాయి. దీని ప్రభావం చేత దీపం లేకపోయినా ప్రకాశం వెదజల్లుతూ ఉంటుంది. ఆకలి దప్పికలుండవు. కోరిన సంగీతం మనోహరంగా వినిపిస్తుంది. అయితే రుక్మిణీ! ఈ సౌభాగ్యమంతా ఒక్క సంవత్సరంపాటు మాత్రమే సుమా! సంవత్సరం కాగానే తిరిగి ఆ వృక్షాన్ని చేరుకుంటుంది. పరమశివుని భార్య పార్వతీదేవి, శచీదేవి, దేవమాత అదితి ఈ పుష్పాన్ని ఎల్లప్పుడూ ధరిస్తూ ఉంటారు.

ఇట్టి పారిజాత పుష్పాన్ని శ్రీకృష్ణుడు పట్టమహిషివైన నీకే కట్టబెట్టడంతో నీ ఆధిక్యత మరోసారి ఋజువైంది. శ్రీహరి ప్రియా! నువ్వు ధన్యురాలవు.

సత్యభామ అలుక :

నారద మహర్షి శ్రీకృష్ణుడి ఎదుటే, యథార్థమే అయినా, రుక్మిణీదేవిని పొగడ్తలతో ఆకాశానికెత్తేశాడు. మరి ఆ మాటలు వింటున్న సత్యభామ చెలికత్తెల చెవులకు ఇంపుగా ఉండవు కదా. మహర్షి పొగడ్తలతో రగిల్చిన అగ్నిలో ఆజ్యం పోశారు. మహర్షి మాటలకు మరిన్ని కలిపి సత్యభామ వద్దకు చేరవేశారు. వారెన్ని విధాలుగా సత్యభామ మనసు విరిచేశారో ముక్కుతిమ్మన గారు తమ పారిజాతాపహరణ కావ్యంలో ఇలా వర్ణించారు.

ఉ॥ *అందరిలోనఁ బెద్దమహిమాన్విత రుక్మిణి గానఁ బూవు*
గో, విందుఁడు దానికిచ్చెఁ దగ వేయని లక్ష్మణ యోర్చె
సైఁచెఁ గా,ళింది శమించె భద్రయవు లెమ్మని యూఱ
డిలెన్ సుదంతలోఁ, గుందుట మానె జాంబవతి
కోప బడంచెను మిత్రవిందయున్.

శ్రీకృష్ణునికి ముద్దుల ప్రియురాలు, జగదేకసుందరి అయిన సత్యభామ తన సవతి అదృష్టాన్ని చూసి సహించలేకపోయింది. తన సౌభాగ్యాన్నే చూసి ముల్లోకాలు ఈర్ష్య పడాలని కలలు కన్నది. ఇప్పుడు తానే ఈర్ష్య చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని కవి ఎంత సొగసుగా చెప్పాడో చూడండి.

తే॥ *వారి లోపల సౌందర్యవతియు మాన । వతియు మహనీయ సౌభాగ్యవతియునైన*
సత్య యంతట, నేమొకో శౌరి కడకుఁ ।బోయి రాదయ్యె జెలిప్రొద్దు పోయెననుచు.

వ॥ *అనుకొనుచుండు నంతలోఁ జెలివచ్చి*

క॥ *అమ్మా యేమని చెప్పుదు । నెమ్మిన్ నీవిభుఁడు రుక్మిణీ సతిమణి సౌ*
ధమ్మున నుండఁగ సురముని । గ్రమ్మఱ నాకస్మికమ్ముగా నచ్చటికిన్.

క॥ *చనుదెంచి యమ్మురారికి । ననఘమ్మమరైక యోగ్య మతి సౌఖ్యకర*
మ్మని తర సులభమ్మిది యని । కొనియాడుచు నొక్క దివ్య కుసుమమ్మొసఁగెన్.

ఉ॥ *ఎంతకు నేఁడు నారదమునీంద్రుఁడు శౌరి వినంగ రుక్మిణీ*
కాంత వినంగ నేను వినఁగాఁ బలికెం బతి గూర్చుదాన నా
యంతటి వారు లేరని యహంకృతి నెప్పుడు విఱ్ఱవీఁగుచు
న్వంతున వచ్చు సత్యగరువంబిఁక జెల్ల దటంచు మానినీ.

కII ఆరణ భోజనుమతకము । లారుక్మిణి నటన లాముర్తాంతకు చెయ్వుల్
చేరి కనుంగొనుచో నె । వ్వారికిఁ గోపంబు రాదు వారిజనేత్రా

చెలికత్తెలు మోసుకొచ్చిన సమాచారాన్నంతా విన్న సత్యభామ మనస్సు వికలమైపోయింది. భర్త అనురాగాన్ని పొందలేని నా సౌందర్యం ఎందుకు? అని విరక్తి చెంది ఆభరణాలన్నీ తీసి విసిరికొట్టింది. పట్టుపీతాంబరాల్ని విసర్జించి చిరిగిపోయిన తెల్లని వస్త్రాల్ని ధరించింది. కోపగృహానికి పోయి కటిక నేలపై పడుకుంది. ఈ భాగంలో ముక్కు తిమ్మనగారు ఎలా స్పందించారో చూడండి.

చII అన విని వ్రేటుపడ్డ యుర గాంగనయుం బలె నేయి వోయభ
గ్గన దరికొన్న భీషణ హుతాశనకీల యనంగ లేచి హె
చ్చిన కనుదోయి కెంపు దన చెక్కులఁ గుంకుమ పత్రభంచగ సం
జనిత నవీన కాంతి వెదచల్లఁగ గద్గద భిన్న కంఠయై.

శాII ఏమేమీ కలహాశనుం డచటికై యేతెంచి యిట్లాడెనా
యా మాట ల్చెవి యొగ్గి తావినియెనా యాగోపికావల్ల భుం
డేమేమాడెను రుక్మిణీ సతియు నీ వింకేటికిన్ దాఁచె దే
నీ మాటలు మాని నీరజ ముఖీనిక్కం బెఱింగింపవే.

చII అతుల మహానుభావమని యవ్విరిఁదా నొక పెద్ద చేసియ
చ్యుతునకు నిచ్చకం బొదవి సూడిద యిచ్చిననిచ్చెగాక తా
నతఁడు ప్రియంబు కల్గునెడ కర్ణణ చేసినఁ జేసెగాక యా
మతకరి వేలుపుందపసి మమ్ము దలంపఁగ నేల యచ్చటన్.

కII పలుదెఱఁగు ముళ్ళ మాటలు । కలహమె కల్యాణమని జగంబుల వెంటన్
మెలఁగెడు మౌనికి సహజము । వలదని వారింప వలదె వల్లభుఁ డతనిన్.

కII ముని యేమి చేయు రుక్మిణి । గొనఁ గారణమేమి ధూర్త గోపాలుఁడుచే
సిన చెయిద మేమి చెప్పుదు । మన మెరియదె ప్రాణమైన మగఁ డిట్లయినన్.

ఉII ఇన్నిదినంబులున్ సవతులిందఱలోఁ గడుగారవంబునం
గన్నియ నన్ను వల్లభుఁడు గన్నుల గప్పుకొనంగ నుండియా
వన్నెయు వాసియుం దఱిఁగి వారు ననుం దలలెత్తి చూడగా
సన్నలఁ జాయలంబలుక సైతునె ప్రాణము లింత తీపాకో.

చెలికత్తెల మాటలకు సత్యాదేవి కోపంతో చిందులు వేసింది. తలంతా విరబోసుకుంది. చిరిగిపోయిన చీరకట్టుకుంది. కోపగృహంలోకి పోయి నేలపై పడుకుంది. తన సవతి రుక్మిణికి పట్టిన వైభోగానికి కడుపుమండి పోయింది. దానికి కారకుడు, మగడు అయిన శ్రీకృష్ణుణ్ణి నిలువునా మ్రింగివెయ్యాలన్నంత కోపం వచ్చింది. ఈ సందర్భంలో ముక్కుతిమ్మనగారేమన్నారో చూడండి.

ఉII మాసిన చీరఁ గట్టుకొని మౌనముతోడ నిరస్త భూషయై
వానెన కట్టుకట్టి నిడు వాలికగస్తురి పట్టుపెట్టి లోఁ

గాసిలి చీకటింటికడ కంకటిపై జలదాంత చంద్ర రే
ఖాసదృశాంగియై పొరలె గాఢ మనోజ విషాద వేదనన్.

అట్లా కటిక నేలపై పడుకుందేగాని మనసు కలవర పెడ్తూనే ఉంది. పూర్వం భర్త తనతో జరిపిన ప్రేమ ఘట్టాలన్నీ ఒకటి తర్వాత ఒకటి గుర్తుకు రాసాగాయి. దాంతో దుఃఖం ఇంకా వృద్ధి చెందుతోందే గాని తరగడం లేదు. చెలికత్తెలు చెప్పిన ఒక్కొక్కమాట గుర్తుకొచ్చినప్పుడల్లా చాకుల్లాగా గుండెల్లో గుచ్చుకుంటున్నాయి. అయినా ఎందుకో చెలికత్తెల మాటలు నమ్మబుద్ధిపుట్టడంలేదు. నన్ను ఎంతగానో ప్రేమించిన భర్త సవతి ముందు నన్ను ఇంతగా చులకన చేశాడంటే నమ్మశక్యం కావడంలేదు. అయినా నారద మహర్షి కూడా అక్కడే ఉన్నాడంటున్నారే! మరి నమ్మకుండా ఎట్లా ఉండటం? ఆ మాటలే నిజమయితే నా భర్త మళ్ళీ నా ముఖం చూస్తాడా? అయినా మగవారిని నమ్మడం ఎలా? అని ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతూ దుఃఖంలో కటిక నేలపైనే పడి దొర్లసాగింది.

శ్రీకృష్ణుడు సత్యభామను ఊరడించటం

(ఈ భాగం హరివంశం, బ్రహ్మ పురాణాలనుండి గ్రహించబడింది)

శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు కాబట్టి రుక్మిణీ గృహంలో నారదుడు జరిపిన నాటకం వల్ల తాను సత్యభామ ఇంట్లో ఎటువంటి కష్టాలు ఎదుర్కోబోతున్నాడో ముందుగానే పసిగట్టాడు. కొంతసేపటికి సత్యభామా మందిరానికి వెళ్ళగా అక్కడ అంతా నిశ్శబ్దం తాండవం చేస్తోంది. నెమ్మదిగా అడుగుల్లో అడుగు వేసుకుంటూ అంతఃపురం లోపలి భాగానికి చేరుకున్నాడు. ఎక్కడా వెతికినా సత్యభామ జాడే కనిపించలేదు. చివరగా కోపగృహం లోకి ప్రవేశించాడు, ఒక మూలనుండి వేడి నిట్టూర్పులు వస్తున్నాయి. నెమ్మదిగా ఆ దిక్కుగా వెళ్ళాడు. అక్కడ సత్యభామ నేలపై పడుకుని ముఖం చేతుల్లో కప్పుకొని దుఃఖిస్తూ ఉండటం చూశాడు. నెమ్మదిగా ప్రక్కన చేరి వింజామరతో విసురుతున్న చెలికత్తెను పంపి తానే విసరడం మొదలుపెట్టాడు. శ్రీకృష్ణుని చేతినుండి వెలువడుతున్న పారిజాతపు ఘుమఘుమలు వింజామరల గాలితో కలసి గదంతా వ్యాపించాయి. సత్యభామ ఈ క్రొత్తగా వస్తున్న పరిమళాన్ని గుర్తించింది. శ్రీకృష్ణుని రాకను గుర్తించింది. దిగ్గున లేచి కూర్చుంది. పరిమళాలు వస్తున్న గదినంతా కలియచూసింది. భయం నటిస్తూ వింజామరతో విసురుతున్న శ్రీకృష్ణుణ్ణి చూసింది. దుఃఖం ముంచుకొచ్చింది. కన్నీరు మున్నీరుగా విలపిస్తూ నాథా నీకిది తగునా అంటూ బావురుమంది. ముక్కుతిమ్మనగారు ఈ ఘట్టాన్ని ఎలా వర్ణించారో చూడండి.

ఉ॥ *ఈ లలితాంగి చంద మొక యించుక చూచెద నంచు*
ధూర్తగో, పాలుఁడు తాలవృంత మొక భామిని సత్య
పిఱుందనుండి మం, దాలస లీలమై విసర నాదటఁ గైకొని
వీచె దద్వపుః, కీలిత పంచసాయక శిఖిందరికొల్పుచు నున్న కైవడిన్.

ఉ॥ *అంతటఁ బారిజాతకుసుమాగతన దివ్య వాసనల్*
వింతలు చేయఁ దావి యది విస్మయమంచు ముసుంగు
ద్రోచి య, క్కాంత గృహంబు నల్గడలు,

అని చమత్కరించారు.

శ్రీకృష్ణుని చూడగానే సత్యభామలోని దుఃఖమంతా కోపంగా మారింది. దాంతో ముఖం ప్రక్కకు త్రిప్పుకోగా కన్నులనుండి నీరు తామరతూడునుండి జాలువారే మంచుబిందువుల్లా జారిపడ్తున్నాయి. ఆ కన్నీటితో ఆమె వక్షఃస్థలమంతా తడిసి ముద్దయింది. ఆ కన్నీటిని తుడిచే నెపంతో శ్రీకృష్ణుడు ఆమె వక్షోఃభాగాన నిలచిన నీటినంతా తుడిచి శుభ్రం చేశాడు. ప్రియురాలిని బుజ్జగిస్తూ ఇలా ఊరడించాడు. సుందరీ! నిరంతరం జలపాతంలా ప్రవహిస్తున్న నీ కన్నీరంతా మానస సరోవరమై నీ వక్షఃస్థలాన్ని నింపివేస్తోంది. సుందరాంగీ! ప్రాతఃకాలంలోని పూర్ణ చంద్రుడిలా చల్లగాను, మధ్యాహ్నపు సూర్యునిలా ప్రకాశవంతంగాను ఉండటం నీ స్వభావం. అటువంటిది ఈనాడు నీ మోము వెలవెలబోతోంది. కాంతిహీనవై ఉంది. అందుకు కారణం ఏమిటి? నిన్ను అంతగా కలవరపరచిందెవరు? ఇది దేవపూజా సమయం కాదు కదా! ఈ సమయంలో తెల్లటి చీర ధరించావేమి? కువలయాక్షీ! ముత్తైదువులు ఏయే సమయాల్లో ఏ రంగు వస్త్రాలు ధరించాలో శాస్త్రం చెబుతోంది గదా? మరి ఎందువలన సమయం కాని సమయంలో ఈ తెల్లచీర ధరించావు? ఈ ఘట్టాన్ని తెలుగులో ఎలా చిత్రించారో చూడండి.

ఉ॥ ఇందునిభాస్యమై తొడవు లేల ధరింపవు నున్నగావు లీ
వెందును మానలేవు తెలు పేటికిఁ గట్టితి వీటికారుచుల్
కెందలిరాకు మోవిఁ దులకింపఁగ జేయక యున్కి యేమి నీ
దందము వింత యయ్యెఁడు నిజంబుగ నాకెఱుఁగంగ జెప్పుమా.

చ॥ *మనమరయందలంచి యొక మార్గము పన్నితొ నవ్వులాటకో*
నను తెఱపించెదో యకట నాయెడ నిక్కము దప్పుగల్గెనో
వనజదళాయతాక్షి పగ వా డనె నన్నిటు లేల చూడ వొ
క్కనిమిషమైన నీవు దయఁ గన్గొనకుండిన నిల్వనేర్తునే.

అంటూ ఓ పంకజాక్షీ! దేవతారాధన సమయాల్లో ధరించాల్సిన శ్వేతవస్త్రాల్ని కోపగృహంలో ఎందుకు ధరించావని అడిగాడు. అది అట్లా ఉంచు, అసలీ అలకాగృహంలోకి ఎందుకు ప్రవేశించావు? పోనీ ఏదో నామీద కోపం వచ్చి నన్ను ఏదో సాధించాలనుకున్నావు. అందుకు ఎన్ని మార్గాలు లేవు? అందుకోసం ఆభరణాలన్నీ తీసివేసి కళాకాంతులు లేకుండా ఈ చీకటి గదిలో శుష్కించి పోతావా? నువ్వు పడుతున్న బాధ చూస్తూ ఉంటే నా కడుపు తరుక్కుపోతోంది. నన్ను ఓరకంటితోనైనా చూడనంటున్నావు. నేనంత కాని పని ఏంచేశానో చెప్పు. నీ మనస్సుకు ఏది నచ్చుతుందో ఆ విధంగానే నడచుకుంటానని మాట ఇస్తున్నాను. ఇకనైనా నీ అలుక మాను. నన్ను కటాక్షించు. ముల్లోకాలు వెదికినా నీకన్నా దగ్గర బంధువులు నాకెవ్వరూ ఉండరు. భూమికి క్షమాగుణం ఎంత

సహజమో. ఆకాశానికి శబ్దగుణాన్ని నిలుపుకోవడం ఎంత సహజమో నాకు నీపట్ల ఉండే స్నేహం అంత శాశ్వతమైనది. ఈ భావాన్నే తెలుగులో అనువదించిన మహాకవి ఇలా వర్ణించి చెప్పారు.

చ॥ *మనముల మాటలం గ్రియల మన్నన లీనొకనాఁడు నెట్టికా*
మినులకు గారవంబు మెఱ మెచ్చులకై పచరింతుఁగాని పా
యని యనురక్తి నీ యెడన యగ్గలమై కనుపట్టు నాకు నీ
పనిచిన పంపు చేయుటయ ప్రాభవమౌ టది నీవెఱుంగవే.

ఈవిధంగా ప్రాధేయపడుతున్న ప్రాణనాథుణ్ణి ఓరగంట కసిగా చూస్తూ ఇలా అన్నది. ప్రాణేశ్వరా! ఇన్నాళ్ళూ నేనే నీకు అత్యంత ప్రియురాలననే నమ్మకంతో ఉన్నాను. అదంతా వట్టి భ్రమేనని తెలుసుకున్నాను. నీవన్నీ తేనె పలుకులు మాత్రమే. అంతరంగంలో నాపైన నీకు నలుసంత ప్రేమకూడా లేదు. నేను గ్రహించిన ఈ నిజం నాకు రెండవ జన్మను ప్రసాదించినట్లైంది. ఇంక నాకు ప్రేమ పైన, స్నేహంపైన విశ్వాసమే పోయింది. ఇది నాకు మరణం కన్నా ఎక్కువ బాధ కలిగిస్తోంది. పురుషోత్తమా! నీ భక్తురాలనైన నన్ను చక్కగా అవమానపరచావు. తడిగుడ్డతో గొంతుకొయ్యడమంటే ఇదేనని తెలిసి వచ్చేట్లుచేశావు. ఇంతకాలం మోసపోయిందేదో మోసపోయాను. ఇకనైనా నీ అనుగ్రహానికి పాత్రురాలను కానని భావిస్తే గ్రహించు. లేని యెడల తపస్సు చేసుకుంటూ కాలం గడిపేస్తాను. వ్రతమైనా, తపస్సైనా భర్త అనుమతితోనే కదా చెయ్యాలి. కనుక నాకు అనుజ్ఞనిమ్మని కోరింది.

విశేషార్థం : రుక్మిణీదేవి ఓ వ్రతాన్ని ఆచరించింది. ఆ వ్రతం ఆమెకు అవసరమా? అనవసరమా? ఎందుకు ఆచరించింది? అన్నది ప్రశ్నకాదు. ఆమె లోకులకు ఓ సదాచారాన్ని బోధించేందుకే ఈ వ్రతాన్ని ఆచరించింది. రుక్మిణీదేవి వ్రత సమాప్తి చేస్తూ జ్ఞానధనులను తృప్తి పరచింది. అన్ని పదార్థాల్లోకీ జీవుడు అన్నరసమంటేనే ఎక్కువ తృప్తి చెందుతాడు. అన్నరసంచేత శరీరంలోని అంగాలన్నీ తృప్తి చెందుతాయి. దానివలన మనశ్శాంతి కలిగి పుణ్యకార్యాలు చేసేందుకు ప్రోత్సహిస్తుంది. పుణ్యకార్యాల వలన భక్తి దృఢమవుతుంది. భక్తి భగవత్కరుణకు దారితీస్తుంది. జీవికి అంతకుమించిన పరమార్థం ఏముంటుంది? అందువల్లనే అన్నదానానికి మించిన దానం లేదని శాస్త్రాలన్నీ చెబుతున్నాయి. అయితే జీవులన్నింటికీ ఫలం సమానం కాదు. శక్తిని పొందిన జీవుడు పాపకర్మలు చేస్తే పాపఫలాన్ని అనుభవిస్తాడు. సత్కర్మల్ని ఆచరించే జీవుడికి పుణ్యఫలాలు లభిస్తాయి. ఆయా ఫలాల్లో అన్నదాతకు కూడా భాగం ఉంటుంది. అందువల్లనే పాత్రత యెరిగి దానాన్ని చెయ్యాలి.

కనుకనే రుక్మిణీదేవి జ్ఞానధనులందరికీ అన్నదానం చేసింది. చివర్లో నారదమహర్షి వచ్చి పారిజాత పుష్పాన్ని బహూకరించాడు. ఓ చెట్టుకు పూసిన పుష్పానికి ఇన్నేసి మహిమలు ఉంటాయా అని అడిగేవారుంటారు. ఇది భూలోకంలో పూసిన సాధారణ పుష్పంకాదు. దేవలోకంలో పూచిన అత్యద్భుత పుష్పం. ఒకానొక మూలికను సేవించినంత మాత్రానే ఆరుమాసాల పాటు నిద్రాహారాల అవసరం ఉండదని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది. ఇటువంటి పుష్పాల మహిమలను మహాకవి కాళిదాసు తన మేఘసందేశకావ్యంలో (2 స 13) తెలిపారు. వృక్ష మాహాత్మ్యాన్ని గూర్చి అనేక

స్మృతులు కూడా ఘోషిస్తున్నాయి. బృహత్సంహితలో వరాహమిహిరాచార్యులు వృక్షాలు దివ్య ఫలాలనిస్తాయని, సత్పురుషులు వాటిని పూజించాలని తెలిపాడు. అంతేకాదు కొన్ని వృక్షాలు మాట్లాడుతాయి. కొన్ని వరాలు కూడా ఇస్తాయి. గార్గిమహర్షి వృక్షముల మాహాత్మ్యాన్ని తెలుసుకోవడం మానవులకు సాధ్యంకాదన్నారు. అందువలన దేవలోకం నుండి తెచ్చిన పారిజాతానికి దివ్యమహిమలు అనేకం ఉంటాయని చెప్పడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అటువంటి దివ్య పుష్పాన్ని తెచ్చిన నారదమహర్షి రుక్మిణీదేవిని పొగుడుతూ సత్యభామకన్నా నీవే అదృష్టవంతురాలవన్నాడు. మహాకవి భవభూతి అన్నట్లు "మహాత్ముల మాటల ననుసరించి కర్మ పరుగెడుతూ ఉంటుంది." అని అనగా నారదమహర్షి సిద్ధ సంకల్పుడు. నారదుడీ మాట అనడానికి కారణం లోకకళ్యాణం కోసమేనని మనం గ్రహించాలి. నారదముని ఈ నాటకం నడిపించడంలో సత్యభామ విఖ్యాతి ముల్లోకాల్లోనూ చాటడం, తద్ద్వారా పరమాత్ముని చేతిలో చావదగిన వారందరికి మోక్షాన్ని కలిగించడం, దేవతలకు గర్వభంగం వంటి వెన్నో విషయాలు ఇందులో ఇమిడి ఉన్నాయి.

ఈ ఉదంతం జరగటానికి రుక్మిణీ సదనంలో జరిగినా ఈ విషయం మిగిలిన పట్టమహిషు లందరికీ తెలిసిపోయింది. అంతా ఎలాగో ఒకలాగున సరిపెట్టుకున్నారు. కానీ సత్యభామ అట్లా సరిపెట్టుకోలేకపోయింది. అంతమాత్రాన ఆమెను అహంకారి అనరాదు. మహా పతివ్రత. శ్రీమహావిష్ణువుకు అంత్యంత ప్రియురాలు. సాక్షాత్తూ భూదేవి అంశయే. అయినా సౌభాగ్యం విషయంలో గర్వించడం స్త్రీలకు ధర్మమేనని శాస్త్రం చెబుతోంది. ఇక్కడ గర్వం అంటే నాకన్నా అందగత్తె లేదన్న భావమని, మదం అంటే భర్తను నా సౌందర్యంతో కట్టి పడేసుకోగలనన్న అర్థాన్ని కాళిదాస వాక్యంలో చెప్పబడింది.

భార్యభర్తల ధర్మాల్ని చెబుతూ ఇంకా ఎన్నో స్మృతులు బోధిస్తున్నాయి. ప్రస్తుత కథాభాగంలో సత్యభామ కోపావేశంలో ఉన్నట్లు భగవంతునికి తెలుసు. నిరంజనుడు, నిష్కాముడు అయిన భగవంతుడు భార్యను అనునయించి సంతోషపెట్టడం భర్తకు విహితమని లోకులకో సదాచారాన్ని నేర్పాడు.

స్త్రీలకు యోగ్యమైన వస్త్రధారణ గూర్చి అనేక విషయాలు శాస్త్రబద్ధంగా ఆయుర్వేద గ్రంథాల్లో చెప్తూ ఆ విషయాల్ని పాటించకుండా స్వేచ్ఛగా ప్రవర్తించడం శాస్త్రవిహితం కాదు. ఈనాటి దేశకాల పరిస్థితుల ననుసరించి ఆ వివరాల్లోకి లోతుగా వెళ్ళవలసిన అవసరం లేదని ఇంతటితో సరిపెట్టున్నాం.

(ఈ భాగం హరివంశం, విష్ణుపర్వం నుండి గ్రహించబడింది)

కోపగృహంలో కటికనేలపై పడుకొని దుఃఖిస్తున్న సత్యభామను శ్రీకృష్ణుడు అనేక విధాలుగా ఊరడించే ప్రయత్నం చేశాడు. భర్త దిగివచ్చినందుకు ఒక ప్రక్క సంతోషిస్తున్నా అంత త్వరగా బయట పడకూడదనుకొంది. ముందుగా భర్తతో అనాల్సిన మాటలు నాలుగూ అని మనస్సు కడిగేసుకోవాలనుకుంది. ఇలా అంది.

ప్రాణేశా! నారదముని పారిజాతాన్ని తెచ్చి నీ చేతిలో పెట్టి నీ ప్రియమైన వాళ్ళ కిమ్మన్నాడు. నువ్వూ నా సవతి తలలో తురిమి నీ ప్రేమను చాటుకున్నావు. దానికి నేనేమీ బాధ పడటం లేదు. ఆ

నారదుడు నీ ఎదుటే రుక్మిణీదేవిని పొగిడి ఆకాశానికెత్తుతూ ఉంటే నువ్వూ ఒళ్ళుమరచి ఆనందించావు. అందుకే నా కెక్కువ బాధగా ఉంది. అందుకేనేమో, మొగుడు కొట్టినందుకు కాదు తోటికోడలు నవ్వినందుకే ఏడుస్తున్నానన్నదట నావంటి అభాగ్యురాలు. ఆహా! నా దురదృష్టానికి ఒకరిని అని ఏం ప్రయోజనం. మొదట్లో నాపైన ఒలకపోసిన ప్రేమ అంతా నటనేనని తేలిపోయింది. ఇక నాకిక్కడ ఏం మిగిలింది. భర్త ఆదరాన్ని కోల్పోయాను. సవతుల మధ్య అవమానాలతో బ్రతకటం కన్నా పోయి తపస్సు చేసుకుంటాను. అనుజ్ఞ ఇవ్వు. ఈ పరిస్థితుల్లో నా మీద నాకే అసహ్యం కలుగుతోంది. ఒకప్పుడు సాధుమతులు మర్యాద కోసమే బ్రతుకుతారని చెప్పావు. ఇప్పుడు నా మర్యాదకు హాని కలిగింది. ఇక నేను జీవించి ఏమి ప్రయోజనం. ఏ నాథుడి రక్షణలో నేనింతకాలం నిశ్చింతగా ఉన్నానో నాకిప్పుడా నాథుని రక్షణే కరువయింది. నా దుర్గతిని ఎవరికి చెప్పుకోను? కొంతకాలం నీకు ప్రియాతి ప్రియమైన ప్రియురాలుగా ఉండేదాన్ని. ఇప్పుడు నీకు నాపై మోజు తీరిపోయింది. నన్ను ఎట్లా వదిలించుకోవాలా అని చూస్తున్నావు. మళ్ళీ నేను ఏ ముఖం పెట్టుకొని రైవత పర్వతంపై కాలు మోపగలను? ఒకవేళ వెళ్ళినా నీతో గడిపిన జ్ఞాపకాలే నన్ను వెంటాడి వేధిస్తాయి. ఇంతకు పూర్వం సాత్రాజితీ! అందరిలోకీ నువ్వే నాకు అత్యంత ప్రియురాలవని చెబుతూ ఆకాశపు అంచులవరకు తీసుకొనిపోయి ఈ రోజున అక్కడినుండి పాతాళానికి తోసేశావు. నీ కపటం తెలుసుకోలేక నువ్వు చెప్పిన కల్లబొల్లి మాటలన్నీ నమ్మేశాను. ఇక ఎవరికి నా ముఖం చూపగలను? ఇక తపస్సు చేసుకోవడమొక్కటే శరణ్యం. నా మీద దయ తలచి అనుజ్ఞ ఇవ్వు. నువ్వు నన్ను మన్నించినంతకాలం నా అత్త యశోద నన్ను కన్నతల్లిలా చూసుకొనేది. నువ్వు చేసిన అవమానానికి ఆమె కూడా ఇకపైన నా ముఖం చూడదు. అందరికి అన్నీ ఇచ్చి నెత్తిన పెట్టుకొని పూజిస్తావు. నన్ను మాత్రం మాటలతో తృప్తిపరుస్తూ ఉంటావు. ప్రాణప్రియుడా! నువ్వింత ధూర్తుడవని కలలోనైనా ఊహించలేదు. నీరు పల్లమెరిగినట్లు నీ మనస్సెప్పుడూ రుక్మిణి మీదనే ఉంటుంది. తేనె పూసిన కత్తి వంటి వాడవు. తియ్యగా మాట్లాడుతూనే మోసం చేసే శఠుడవు అంటూ కన్నీరు మున్నీరుగా విలపించిన విధానాన్ని ముక్కుతిమ్మన గారి హరివంశంలో ఎంత మనోహరంగా వర్ణించారో చూడండి.

ఉ॥ *ఈనయగారవుంబ్రియము లీపస లీమొగమిచ్చుమాట లే*
లా నిను నమ్మియుండిన ఫలం బిదె తోడనె కల్గె నాకు నీ
యాన సుమీ ననుం జెనకి యాఁటిడిఁబెట్టిన నువ్వు వారలం
గాన లెఱుంగునే పసుల గాపరి భావజమర్మకర్మముల్.

ఉ॥ *ఇంకిట నిన్ను నమ్మనను నేమిటికిం గెరలించె దెంతయున్*
బొంకము గాని యీవలని బొంకులు మా చవిగావు రుక్మిణీ
పంకజ పత్త్ర నేత్రకును బ్రాణప్రదంబులు గాని వల్లవీ
కింకర! చాలుఁజాలు నుడికింపకు నింపకు లేనికూరుముల్.

చ॥ *మునిపతి వచ్చి పూవొసఁగి మోదముతోడ భవత్ప్రియాం*
గనన్, వినుతి యొనర్పఁగా వినిన వీనుల మాచవిగాని మా

టలన్, వినవలసెంగదా యిపుడు నీవిట వచ్చుట పారిజా
తవా, సనఁ బ్రకటించి నాకు నెకసక్కము సేయునకాదె చెప్పుమా.

తే॥ *తనదు కొడంద్రలోనఁ బెద్దయుగ నన్ను । దేవకీదేవి మన్నించు నీవు నాకుఁ*
జనవు లిచ్చుటఁ జేసి యా సాధ్వి సేవ । చేయబోవంగ నాకిఁక సిగ్గుగాదె.

సవతి వల్ల కలిగిన పరాభవానికి సత్యభామ కంటతడి పెట్టుకున్నదన్న మూలంలోని ఒక్కమాటకు ముక్కుతిమ్మనగారు తెలుగులో ఎంత మనోహరంగా చిత్రించారో చూడండి.

ఉ॥ *ఈసు నఁబుట్టి డెందమున హెచ్చిన శోక దవానలంబు చే*
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రీసఖమైన మోము పయిఁజేల చెఱంగిడి బాలపల్లవ
గ్రాసకషాయ కంఠ కలకంఠ వధూకలకాకలీ ధ్వనిన్.

సత్యభామ నిష్ఠూరంగా మాట్లాడాల్సిన మాటలన్నీ మాట్లాడి ప్రక్కకు తిరిగి పడుకుంది. శ్రీకృష్ణుడు ఎక్కడలేని ఓర్పు తెచ్చుకొని మెల్లగా ఇలా అన్నాడు. ప్రాణేశ్వరీ! నువ్వు పూర్వాపరాలు తెలుసుకోకుండా నాపై ఇంతలేసి నిందలు వేయడం ఏమైనా బాగుందా? అసలు జరిగింది జరిగినట్లు చెప్తాను. నా మీద ప్రేమలేకపోతే పోయింది. దయ అయినా చూపి నేను చెప్పే మాటలు నాలుగు విను. నారదమహర్షి నన్ను చూడాలని స్వర్గం నుండి కష్టపడి వచ్చాడు. వస్తూ నన్ను సంతోషపెట్టాలని ఓ పారిజాత పుష్పాన్ని కూడా పట్టుకువచ్చాడు. ఆ పుష్పాన్ని నా చేతుల్లో పెట్టి నీకు ప్రియమైన వాళ్ళకిమ్మన్నాడు. అటువంటి పరిస్థితుల్లో నాకు ఏం చెయ్యాలో తోచలేదు. ఎదురుగా రుక్మిణి ఉంటే దాచి నీకోసం తేవాలంటే చూసే వాళ్ళేమనుకుంటారోనని మొమాటం చేత ఆ పుష్పాన్ని రుక్మిణికి ఇవ్వక తప్పింది కాదు. అదే అదనుగా తీసుకొని నారదముని రుక్మిణి సౌభాగ్యాన్ని ఆకాశానికెత్తేస్తూ పొగిడాడు. ఇందులో నా ప్రమేయం ఏమీ లేదు. అంతేకాదు నిన్ను అవమానించాలనే భావం నాకెంత మాత్రమూ లేదు. త్రికరణ శుద్ధిగా చెప్తున్నాను. నా మాట నమ్ము! అంతేకాకుండా ఒక పుష్పం కోసం నీవింతగా దుఃఖించడం తగునా? నీకెన్ని పుష్పాలు కావాలంటే అన్ని పుష్పాలు తెచ్చి ఒళ్ళో పోస్తాను. సత్యం పై శపథం చేసి చెప్తున్నాను. దేవేంద్రుడి ఉద్యానవనంలో ఉండే పారిజాత వృక్షాన్నే పెకలించి తీసుకొని వచ్చి నీ పెరట్లో నాటిస్తాను. ప్రేయసీ! సందేహపడకు. నా మాట నమ్ము. ఇక కోపం వదులు. నన్ను అనుగ్రహించు. ఈ భావాన్నే ముక్కుతిమ్మన గారి మాటల్లో వినండి.

తే॥ *వామలోచన నీకేళి వనములోనఁ । జలువ వెదచల్లు చెంగల్వ కొలని కెలన*
సరస కర్పూర కదళికా తరుల నడుమఁ । బెరటి చెట్టుగ నాటింతుఁ బెంపుగనుము.

శ్రీకృష్ణుడీవిధంగా సత్యంపైన ప్రమాణం చేసి చెప్పగానే సత్యభామ కోపం చల్లారింది. ముఖాన చిరునవ్వులు వెలిశాయి. భర్తతో ఇలా అంది. నాథా! నువ్వు సత్యం మీద ప్రమాణం చేసి చెప్తున్నావు కాబట్టి నాకిప్పుడు ఎవరిమీదా కోపం లేదు. అయితే నువ్వు అన్నట్లే ఆ పారిజాత వృక్షాన్ని వెంటనే

నా పెరట్లో నాటించు. దాంతో నా క్రోధం తగ్గిపోవడమే కాకుండా సవతులలో నేనే అధికురాలనన్న ఖ్యాతి నిలబడుతుంది. ముల్లోకాలు నా అధిక్యతను గుర్తిస్తాయి. ప్రాణేశా! ముందు ఆ పారిజాతాన్ని తెప్పించే ప్రయత్నం చెయ్యి అన్నది.

జగన్నాథుడు సర్వ వ్యాపియే అయినా లోకాచారాన్ననుసరించి అక్కడే స్నానం చేసి విశ్రమిస్తూ నారద మహర్షి తన వద్దకు రావాలని మనసులో సంకల్పించాడు. వెంటనే ముని సత్యభామ ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు. విధి విహితంగా అర్ఘ్య పాద్యాలతో ఆ మునిని పూజించి నమస్కరించారు. దేవముని మూడు కాలల్లోనూ నువ్వే శ్రీకృష్ణునికి అత్యంత ప్రీతి పాత్రురాలవు కమ్మని దీవించాడు. అంతట నారదమహర్షి వారివద్ద శలవు తీసుకొని పార్వతీ పరమేశ్వరులను సేవించేందుకు కైలాసానికి వెళ్ళాడు.

శ్రీకృష్ణ నారద సంవాదము

(ఈ భాగం హరివంశం విష్ణు పర్వంనుండి గ్రహించబడింది.)

పారిజాత వృక్షాన్నే తెచ్చి నీ పెరట్లో నాటిస్తానని శ్రీకృష్ణపరబ్రహ్మం సత్యభామకు వాగ్దానం చేశాడు. అందుకు గాను నారదుని మహేంద్రుని వద్దకు రాయబారం పంపాలని నిశ్చయించుకొని నారదమునితో ఇలా అన్నాడు. "మునీంద్రా! ఇంద్రుడు నాకంటె పెద్దవాడు. నాకతనిపై అత్యంత గౌరవం ఉంది. దేవమాత అదితి మహేంద్రుని ఇల్లాలైన శచీదేవి ప్రతిరోజూ భక్తి శ్రద్ధలతో ఆ పారిజాత వృక్షాన్ని పూజిస్తున్నారన్న విషయం నేనెరుగుదును. అయితే నేనా వృక్షరాజాన్ని తెచ్చి ఇస్తానని సత్యభామకు వాగ్దానం చేశాను. ఈ విషయం బయటకు పొక్కినా మిగిలిన భార్యలందరికీ తెలిసిపోయింది. ఏదో విధంగా నేనా వృక్షాన్ని తెచ్చి సత్యకివ్వకపోతే నా పరువు గంగలో కలసి పోవడమే కాకుండా అసత్యమాడానన్న అప్రతిష్ఠ కూడా వస్తుంది. నేను అసత్యం పలికితే అంతటితో పోదు గదా. లోకులంతా అదే పాటిస్తారు. దాంతో లోకంలో ధర్మ హాని కలుగుతుంది. కనుక నువ్వే మహేంద్రుణ్ణి నయానో భయానో ఒప్పించి అతడా వృక్షాన్ని నాకిచ్చేట్లు నీ శక్తి వంచన లేకుండా ప్రయత్నం చెయ్యి".

అందుకు నారదమునీంద్రుడు శ్రీకృష్ణుని మాటల్లోని చాతుర్యానికి సంతోషిస్తూ ఇలా అన్నాడు. "యాదవేంద్రా! నీ అంతటి వాడు ఈపాటి చిన్న కోరిక కోరితే మహేంద్రుడు కాదనడు. అయినా అతడు నీమాట నిరాకరిస్తే మరో ఉపాయం చెప్తాను విను. పూర్వం క్షీరసాగరాన్ని మధించే రోజుల్లో దేవేంద్రుడు పార్వతీపరమేశ్వరుల వద్దకు పోయి చేతులు జోడించి శచీదేవిని ఆనందపరచేందుకు పారిజాత వృక్షాన్ని స్వర్గానికి తీసుకుపోయేందుకు అనుమతి కోరాడు. అందుకా ఆదిదంపతులు అంగీకరించి కొంతకాలమైన తర్వాత తిరిగి ఆ వృక్షాన్ని మందర పర్వతం పై ప్రతిష్ఠించమని అదేశించారు. అయితే శచీదేవికి ఎక్కడ అసంతృప్తి కలుగుతుందోనని దేవేంద్రుడు ఆ వృక్షాన్ని తిరిగి శంకరునకు ఇవ్వనేలేదు. శ్రీకృష్ణా! శంకరుడు పార్వతీదేవిని సంతోషపెట్టడానికి ఓ చిత్రమైన గుహను నిర్మించాడు. ఆ గుహ పొడవు రెండు క్రోసుల దూరం ఉంది. అందులో సూర్యచంద్రులే కాదు గాలి

కూడా చొరబడే ధైర్యం చెయ్యలేదు. ఇక చీమలు దోమల సంగతి వేరే చెప్పనక్కరలేదు. ఆ గుహ లోపల మనసులోని ఊహల్ని బట్టి శీతోష్ణాలు సమతుల్యంగా మారుతూ ఉంటాయి. ఆ గుహ శంకరుని దివ్య తేజస్సు చేతనే వెలిగిపోతూ ఉంటుంది. ఆ గుహ లోపలే అనేక వనాలు, తటాకాలు, విహార స్థలాలు ఏర్పరచబడ్డాయి. ఆ వనంలో దివ్య పారిజాత వృక్షాలు కూడా నాటబడ్డాయి. మనస్సులోని కోరికల్ని అనుసరించి ఆ పారిజాత వృక్షాలు ఫలితాల్నిస్తూ ఉంటాయి. దేవలోకంలో ఉండే పారిజాతం కన్నా ఈ గుహలో వెలసిన పారిజాతాలు అనేక వేల రెట్లు అధిక ఫలాలనిస్తాయి. అట్టి పారిజాతములంటే పార్వతీదేవికి అత్యంత ప్రీతిపాత్రములు.

ఒకానొక రోజున మధాంధుడు, అత్యంత బలశాలి అయిన అంధకుడనే రాక్షసుడు ఆ గుహలో ప్రవేశించాడు. శంకరుడు ఆ దానవాధముణ్ణి అక్కడికక్కడే సంహరించాడు. ఈ అంధకుడనే రాక్షసుడు వృత్రాసురుడికన్నా పదింతలు బలశాలి. అయినా పారిజాత ప్రభావంచేత శంకరుడా రాక్షసుణ్ణి ఒక దెబ్బతోనే నేల కరిపించాడు. పారిజాత మహిమను గూర్చి నీకు చెప్పడానికే నేనీ కథ చెప్పాల్సి వచ్చింది. నువ్వు అడిగితే దేవేంద్రుడు కాదనడు. తప్పక ఆ వృక్షాన్ని నీకివ్వగలడు. అందులో నాకెటువంటి సందేహమూ లేదు అని నారదుడు చెప్పగా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

"మునీంద్రా! మహేంద్రుడు నేనడిగితే కాదనడు. తప్పక ఇస్తాడన్నావు. అయితే శచీదేవి ఆనందానికి అంతరాయం రావడానికి ఇష్టపడని నా అన్నగారు శంకరుడికే ఇంతవరకు ఆ వృక్షాన్ని తిరిగి ఇవ్వలేదు. నాపైన ఎంత ప్రేమ ఉన్నా శచీదేవిని అడ్డం పెట్టుకొని నాకు కూడా ఇవ్వనంటాడేమో! కావున ఓ మునీంద్రా! నేను గదాయుద్ధం చేసి అయినా ఆ వృక్షాన్ని పెకలించుకు పోతానేకాని నా మాట అసత్యం కావడానికి అంగీకరించనని నా మాటగా చెప్పు" అన్నాడు.

విశేషార్థం : ఈశ్వరుడు పార్వతికి ఆనందం కలిగించేందుకు మందర పర్వతంపై ఓ గుహను నిర్మించి అందులో పారిజాతాన్ని నిర్మించాడని గదా. దీని భావమేమంటే, నిరంజనుడైన శంకరుడు ప్రకృతితో కలసి బ్రహ్మాండాల్ని నిర్మిస్తూ ఉంటాడు. ఆయన చేసే ప్రతి పని ప్రకృతి కొరకే గాని తన సొంత లాభానికి చెయ్యడన్నది నిర్వివాదాంశం. అట్లాగే శ్రీకృష్ణ పరబ్రహ్మంకూడా తాను నిర్గుణుడైనా కూడా తన యోగమాయ సత్యాదేవిని సంతోషపెట్టేందుకే పారిజాతాన్ని తెచ్చి ఇస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అంతేకాదు లోకాచారాన్ని పాటిస్తానని కూడా చెప్పాడు. ఎవరైనా సాధించాలే కాని వదలిపెట్టి ఊరుకోగూడదు. అది రాజధర్మం కాదు. అట్లా ఉదాసీనంగా ఊరుకుంటే పౌరుషశక్తియే నశించిపోతుంది. దానివలన లోకానికి హాని కలుగుతుంది. అందువల్లనే ఇంద్రుడితో గదాయుద్ధం చేసి అయినా సాధించుకొస్తానని గదా శ్రీకృష్ణ భగవానుడు ప్రతిజ్ఞ చేశాడు. ఆ తర్వాత గీతా శాస్త్రకారుడై గీతా శాస్త్రంలో

"నా ప్రకృతికి దయ కలిగించి, ఆ ప్రకృతి వశమై ఉన్న సమస్త ప్రాణికోటిని నేను మళ్ళీ మళ్ళీ సృష్టిస్తూ ఉంటాను. కర్మల యందు ఆసక్తి లేని నన్ను అవేవీ బాధించవు. నా పరతత్త్వాన్ని గాని, నేను ప్రాణులన్నింటికి ఈశ్వరుడని గాని తెలుసుకోలేని మూఢులు నన్నే మానవ మాత్రుడుగానే భావిస్తూ అవమానిస్తూ ఉంటారు" అంటాడు. – గీత 9 అధ్యా 8–11

"నేను అన్నది తొలగిపోతే దుఃఖమంతా తొలగిపోతుంది. అంతా ఈశ్వర కృపచేతనే నడుస్తోంది. అన్న భావం స్థిరంగా నిలస్తే మానవుడికి ఈ జన్మలోనే ముక్తి లభిస్తుంది."

– శ్రీరామకృష్ణ పరమహంస.

మందర పర్వతంలో సూర్య చంద్రులు, వాయువు కూడా ప్రవేశించలేని గుహనొకటి పరమశివుడు పార్వతి కోసం నిర్మించాడంటే నమ్మకపోగా నవ్వే వాళ్ళుండవచ్చు. లోతుగా ఆలోచిస్తే అదేమంత అసాధ్యమైందేమీ కాదని తెలుస్తుంది. కానీ సూర్యచంద్రుల్నే సృష్టించిన ఆ పరాత్పరుడికి ఒక రహస్య గుహ నిర్మించడం అసాధ్యం ఎలా అవుతుంది? సర్పాలంటే అందరికీ తెలుసు. వాటిలో కొన్ని జాతులకు పక్షుల్లాగే రెక్కలుండి ఎగురుతూ ఉంటాయి. వాటిని చూడనంత మాత్రాన అసలలాంటి జాతులే ఉండవని చెప్పగలమా? సర్వ చరాచర సృష్టినంతా సృజించిన ఆ దేవదేవుడికి అటువంటి గుహనొకదాన్ని నిర్మించడం అసాధ్యమేమీ కాదు. మానవ మేధస్సుతో భగవంతుణ్ణి తెలుసుకోవడం సాధ్యంకాదు. "మేం నమ్మం" అంటారు. వాళ్ళు నమ్మనంతమాత్రాన జరిగే నష్టమేమీ ఉండదు. అంతేకాకుండా వీళ్ళల్లో చాలామంది భగవద్గీతను ప్రమాణంగా స్వీకరించేవారుంటారు. శ్రీకృష్ణ భగవానుడు (10వ అధ్యా - 40-41 లో) ఇలా అంటాడు. "పరంతపా! నా దివ్య విభూతులకు అంతేలేదు. మహిమ, అందము, శక్తి మొదలైనవన్నీ నా తేజస్సునుండే సంభవిస్తాయని తెలుసుకో."

శ్రీరామకృష్ణ పరమహంస ఇలా బోధించారు, "ఈశ్వరుని పూర్తిగా తెలుసుకోవడం ఎవరితరమూ కాదు. నిజానికి ఆయనను పూర్తిగా తెలుసుకోవలసిన అవసరం కూడా లేదు. అతణ్ణి దర్శించి అతడొక్కడే సత్యమని తెలుసుకుంటే చాలు. పుణ్యనది అయిన గంగానదిలో స్నానంచెయ్యాలంటే ఏదో ఒక తీర్థంలో స్నానం చేస్తే చాలు. అంతేకాని గంగోత్రి నుండి గంగాసాగరం వరకూ ప్రయాణం చెయ్యనక్కరలేదు."

భగవంతుడు తానెన్నడూ అబద్ధం చెప్పలేదని, తను చెప్పింది అబద్ధమైతే లోకంలో ధర్మమే నశిస్తుందని అందువల్ల నాకా పారిజాతవృక్షాన్నిమ్మని మహేంద్రుడితో గట్టిగా చెప్పమని నారదమహర్షి ద్వారా చెప్పి పంపుతాడు. ఎందువల్ల? సత్యమే నా స్వరూపం. కావాలనే ఈ నామరూపాల్ని గ్రహించాను. అవతరించిన తర్వాత అందుకు తగిన రీతిలో నడచుకోవాలిగదా. అట్లా కాకుండా నేనే ధర్మ మార్గంనుండి భిన్నంగా ప్రవర్తిస్తే ధర్మ విప్లవం రాదా? ఆ ధర్మాన్ని ప్రతిష్ఠించేందుకే గదా నేనవతరించింది అని గదా భగవంతుని సందేశంలోని తాత్పర్యం. కనుక భగవంతుడైనా ఇష్టానుసారం వ్యవహరించడని తేటతెల్లమవుతుంది. దీన్నిబట్టి అబద్ధం పాపహేతువని, సత్యాన్ని ఆశ్రయిస్తే భగవంతుని ఆశ్రయించినట్లేనని మనం తెలుసుకోవాలి.

ఇంద్రనారద సంవాదం

(ఈ భాగం హరివంశం, విష్ణుపర్వంలో 69వ అధ్యాయం నుండి గ్రహించబడింది)

నారదమహర్షి శ్రీకృష్ణుని వద్ద అనుమతి తీసుకుని దేవలోకానికి ప్రయాణమై వెళ్ళాడు. అక్కడ దేవలోకంలో పరమశివుని మహేంద్రుడు పూజించే ఉత్సవాన్ని దర్శించేందుకు నాగులు, యక్షులు, సిద్ధులు, బ్రహ్మర్షులు గుంపులు గుంపులుగా వచ్చారు. వీరుగాక శివభగవానునితో కలసి వచ్చిన స్కందుడు, అగ్ని, గంగాదేవి, తుంబురుడు, మొదలైన వారెందరో వచ్చి దేవేంద్రుని సత్కారాలందుకున్నారు. గంధర్వాధిపతి అయిన చిత్రరథుడు తన గాన మాధుర్యంతో పరమశివుని మెప్పించాడు. ఆత్మ తత్త్వమెరిగిన శంకరుడు మహేంద్రుని పూజలకు సంతృప్తుడై కైలాసానికి ప్రయాణమయ్యాడు. అంతట మహేంద్రుడు నారదుని విధి ప్రకారం అర్ఘ్యపాద్యాలతో పూజించి ప్రక్కన కూర్చోబెట్టుకోగా నారదుడు ఇలా అన్నాడు.

"మహేంద్రా! శ్రీమహావిష్ణువు దూతగా నీ వద్దకు వచ్చాను. ఆ మహాత్ముడు నీ వద్దనుండి ఒక చిన్న పనిమీద నన్ను నీ వద్దకు పంపాడు. దేవేంద్రా! నీ తమ్ముడైన శ్రీకృష్ణుణి చూచేందుకు ద్వారకానగరానికి వెళ్ళాను. అప్పుడా మహనీయుడు రుక్మిణీ మందిరంలో ఉన్నాడు. నా చేతిలో ఉన్న పారిజాత పుష్పాన్ని ఆ పురుషోత్తమునికి సమర్పిస్తూ ఆ దేవ పుష్పం యొక్క గుణగణాల్ని వర్ణించి చెప్పాను. శ్రీకృష్ణ భగవానుడు ఆ పారిజాత వృక్షాన్నొకటి సత్యభామకిస్తానని వాగ్దానం చేశాడు. శ్రీకృష్ణుడు నీకు తమ్ముడు కనుక నీకు నమస్కారం తెలుపమన్నాడు. నీ ధర్మ పత్ని శచీదేవికి ఆ పుష్పమంటే ప్రాణమని అతడెరుగు. ఆమె దేవ కార్యాలన్నింటికీ ఆ పుష్పరాజంతోనే పూజిస్తూ ఉంటుంది. నువ్వు త్రిలోకాధిపతివి గదా. మానవలోకం కూడా ఆ పుష్పంతో దేవపూజలు చేసే భాగ్యం నావలన కలుగ చెయ్యమని శ్రీకృష్ణుడు నీతో మరీ మరీ చెప్పమన్నాడు. ఇవన్నీ శ్రీకృష్ణుని వాక్యాలేనని భావించు" అని నారదుడు తెలుపగా మహేంద్రుడు ఇలా అన్నాడు.

నారదమహర్షీ! శ్రీకృష్ణునితో నామాటగా ఇలా చెప్పు. "శ్రీకృష్ణా! నువ్వు ముల్లోకాలు పాలింపదగిన వాడవు. భూభారాన్ని తగ్గించే నెపంతో తాత్కాలికంగా నువ్వు భూలోకానికి వెళ్ళావు. అది నీ యథార్థ స్థానం కాదుగదా. దేవకార్యం కాగానే నువ్వు తిరిగి త్రిలోకాధిపత్యాన్ని చేబడతావు. అప్పుడు స్వర్గం కూడా నీ అధీనంలోనే కదా ఉంటుంది. ఈలోగా స్వర్గ మర్యాదను కాదని ఈ దేవవృక్షాన్ని మానవ లోకానికి తీసుకొని వెళ్ళడం దేవ మర్యాద కాదు. నువ్వు అవతారం ముగించుకొని వచ్చినప్పుడు నీ ఇష్టం వచ్చినట్లే ఈ పారిజాత వృక్షాన్ని సత్యభామకివ్వగలవు. స్వర్గంలోని వస్తువులేవీ భూలోకానికి తీసుకొని పోరాదన్న నియమం నీకు తెలియంది కాదు. నువ్వే దేవ మర్యాదను కాలరాచి ఈ వృక్షాన్ని మానవలోకానికి తీసుకొనిపోతే దేవతలంతా నిన్ను వేలెత్తి చూపరా? ఏయే లోకాల్లో ఏయే ధర్మాలుండాలో బ్రహ్మయే నిర్ణయించి చెప్పాడు. అట్టి బ్రహ్మ వాక్కును ఆయన పుత్రులమైన మనమే అతిక్రమించ వచ్చునా? మనమే మీరి ప్రవర్తిస్తే దైత్యులు పేట్రేగిపోరా? అదీకాక బ్రహ్మ ఈ ధర్మాన్ని కాపాడమని నన్ను శాసించాడు. నేను ధర్మానికి హాని కలిగిస్తే దేవతలంతా నాపై తిరుగుబాటు

చెయ్యరా? సోదరా! మానవులకు అర్హమైన భోగీయ వస్తువులన్నింటినీ బ్రహ్మయే సృష్టించి వారి కందించాడు. వారా సుఖాలనుభవించి, ఇంకా ఎక్కువ భోగాలు కావాలనుకుంటే స్వర్గానికి వచ్చి అనుభవించిపోవచ్చును. అంతేకాని స్వర్గానికి చెందిన వస్తువుల్ని భూలోకానికి తీసుకొని పోవడానికి బ్రహ్మ శాసనం అంగీకరించదు. పట్టుబట్టి పారిజాతాన్ని తీసుకొనిపోతే శ్రీకృష్ణుడు ఒక స్త్రీకి లోబడి ఈ పనిచేశాడని అంతా నిన్ను నిందిస్తారు. అది నీ కీర్తికి కళంకం కాదా? కాదు కూడదని పట్టుబట్టి నా మెడలు విరిచి తీసుకుపోయినట్లైతే దేవతల ముందు నాకు తల కొట్టేసినట్లవుతుంది. అదీ నా తమ్ముడి మూలంగా జరిగిందంటే నా దుఃఖానికి అంతే ఉండదు సుమా? మనమంతా ధర్మార్థకామాలను బ్రహ్మ అభీష్టం మేరకే అనుభవించడం నీతి. ఇదే సాధుమార్గం. అట్లాకాదని ఈ పారిజాతాన్ని భూలోకానికి పంపినట్లైతే ఇకపైన నన్ను శచీదేవి కూడా గౌరవించదు. అంతేకాదు కల్పతరువైన ఈ పారిజాతం మూలంగా స్వర్గసుఖాలన్నీ భూలోకంలోనే లభిస్తే ఎవరూ స్వర్గాన్ని కోరుకోరు. ఇక దేవతల ఆధిక్యం ఎక్కడ నిలుస్తుంది. మానవులు చేసే సత్కర్మ ఫలాల్నే స్వర్గంలో అనుభవిస్తూ ఉంటారు. అవన్నీ భూలోకంలోనే లభిస్తే ఇక సత్కర్మలు చేసే వాళ్ళే ఉండరు. యజ్ఞయాగాదులుండవు. జపతపాలు అసలే చెయ్యరు. దాంతో మాకు హవిస్సులే కరువైపోతాయి. దాంతో మా తేజస్సే నశిస్తుంది. కృష్ణా స్వర్గం నుండి విలువైన రత్నహారాల్ని, మణులను, చందనాది విచిత్ర వస్తువుల్ని ఇంకా ఏమేమి వస్తువులు కావాలో అవన్నీ తీసుకొనిపోయి సత్యభామను సంతృప్తి పరచు." నారదా! శ్రీకృష్ణునితో నా మాటగా చెప్పు. నా తమ్ముడు అంగీకరించేట్లుగా సమయానుకూలంగా మాట్లాడి ఒప్పించు. ఇందుకు నువ్వే సమర్థుడవు, అని నారదుణ్ణి సమాధానపరచి పంపాడు.

విశేషార్థం : ఈ కథలో నేర్చుకోదగిన విషయాలు అట్టే లేకపోయినా ఇంద్రుడి స్వభావం మరొకసారి బయటపడింది. అదికూడా పరమేశ్వరుడి విషయంలో. ఇంద్రుడి దృష్టి ఎంతసేపూ కార్యసాధనపైనే ఉంటుంది. కపటం అతడికి వెన్నతో పెట్టిన విద్య. నరకాసురుడితో తాను పడుతున్న బాధల్ని వెళ్ళబోసుకున్నప్పుడు శ్రీకృష్ణ పరబ్రహ్మంతో మాట్లాడిన తీరు, ఇప్పుడు పారిజాత వృక్షాన్ని కోరినప్పుడు చూపిన రాజనీతి ఇందుకు అద్దం పడుతున్నాయి. నారదుడు శ్రీకృష్ణ సందేశాన్ని చెబుతూ "రుక్మిణీ సహితం వీరం స్తువంతం వృషభ ధ్వజం" అన్నాడు. దీనిని బట్టి నారదుడు వెళ్ళే సమయానికి శ్రీకృష్ణుడు రుక్మిణీ సమేతుడై శంకర భగవానుణ్ణి స్తుతిస్తున్నాడని హరివంశం చాటుతోంది. అంటే శ్రీకృష్ణుణ్ణి, శంకరుడు, శంకరుణ్ణి శ్రీకృష్ణుడు పరస్పరం స్తుతించుకుంటూ ఎంతో ఆదర్శప్రాంగా ఉంటూ ఉంటారని అనేక పురాణాలు కూడా చాటుతున్నాయి. అంటే వారిరువురికీ భేదం లేదు. పరస్పరం ధ్యానించుకోవడమంటే తన్నుతాను ధ్యానించుకున్నట్లే నని మనం గ్రహించాలి. ధ్యానించడానికి రెండవ వస్తువేదీ వారికి లేదనే దీని తాత్పర్యం. కార్యాన్ని బట్టి వేరువేరుగా కనిపిస్తున్నారే గాని "ఏకో నారయణః" అని శ్రుతి చెబుతోంది. కనుక ఈ భాగం శివకేశవ అభేదాన్నే తెలుపుతోంది.

నారదుని హితోపదేశం

(ఈ భాగం హరివంశం విష్ణు పర్వం 70వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

నారదమహర్షి ధర్మ పక్షపాతి కనుక ఇట్లా అన్నాడు. మహేంద్రా! నేను నీ మంచి కోరేవాడిని కాబట్టి యథార్థం చెప్పకుండా ఉండలేకపోతున్నాను. నువ్వా పారిజాత వృక్షాన్ని తిరిగి ఇచ్చేస్తానని శంకరుని ఉద్యానవనం నుండి తెచ్చావు. తీరా శంకరుడు అడగ్గానే కుంటిసాకులెన్నో చెప్పి తప్పించుకున్నావు. ఇప్పుడు శ్రీకృష్ణుడు నీకంటే చిన్నవాడు. నీవతడడిగింది ప్రేమతో ఇచ్చి ఉండవచ్చు. కానీ ఇవ్వకుండా తప్పించుకునేందుకు కుంటి సాకులెన్నో చెప్పావు. నువ్వు ఎన్ని చెప్పినా శ్రీకృష్ణుని మనమెవ్వరం ఒప్పించలేం. మధుసూదనుడు చివరగా ఓ మాట చెప్పమని చెప్పాడు. మళ్ళీ ఒకసారి చెప్తాను విను. "నారదా! ఇంద్రుడు పారిజాతవృక్షాన్ని ఇవ్వడానికి అంగీకరించకపోతే దేవగంధర్వాదులు ఎంతమంది అడ్డునిలచినా నా ప్రతిజ్ఞనుండి మరల్చలేరు. చివరకు ఇంద్రుణ్ణి గదాయుద్ధంచేత మట్టి కరిపించి అయినా నేనా పారిజాత వృక్షాన్ని తీసుకొని పోతానని చెప్పు" అన్నాడు. కావున ఓ మహేంద్రుడా! వయస్సులో నీకన్నా చిన్నవాడు, శక్తి సామర్థ్యాలలో నీకంటే ఎన్నోరెట్లు అధికుడైన శ్రీకృష్ణ పరబ్రహ్మం కోరినట్లు చేయడమే నీకు ఉచితం. ఆ తర్వాత నీ ఇష్టం అన్నాడు.

నారదుని హితోపదేశం దేవేంద్రునికి నచ్చక ఇలా అన్నాడు "నారదా! పెద్దవాడినని అయినా చూడకుండా శ్రీకృష్ణుడు నా విషయంలో అనేక సార్లు అవమానించాడు. అయినా చిన్నవాడు లెమ్మని సహిస్తూ వచ్చాను. ఖాండవదహన విషయంలో ఏం చేశాడు? అర్జునుడి కోసం ఆ మంటల్ని ఆర్పేందుకు పంపిన మేఘాలన్నింటినీ చెదరగొట్టించాడు. అట్లాగే గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టుకొని నానోటితో చెప్పలేనంత అపకారం చేశాడు. నేను వృతాసురుణ్ణి చంపడానికి వెళ్తూ అతగాడి సహాయాన్ని కోరితే నాకు భూతాలన్నీ సమానమేనని చెప్పి తప్పించుకున్నాడు. అప్పుడు నేనే అతగాణ్ని సంహరించాను. పూర్వం అనేక సందర్భాల్లో దేవదానవులకు యుద్ధాలు జరిగాయి. ప్రతిసారి తనకు ఏదితోస్తే అదిచేశాడే గాని పెద్దవాడినన్న గౌరవం నాపైన ఎంతమాత్రం చూపలేదు. చివరకు దేవతలకే మేలు చేశాడనుకో. అది వేరే విషయం. ఇన్ని మాటలెందుకు. నారదా! అతగాడు ఏంచెయ్యాలనుకుంటే అది చెయ్యమను. నేనూ దీటుగా ఎదుర్కోగలను. దీనికంతా నువ్వే సాక్షివిగా ఉండాలి సుమా! నాతండ్రి కశ్యపుడు నా తల్లి అదితి ఆనందం కోసం ఈ వృక్షాన్ని తెచ్చి నాటాను. వారేది చెప్తే అట్లా చేస్తాను. అంతేగాని చిన్నవాడైన కృష్ణునిపైన నేనుగా చెయ్యి చేసుకోను. నాతండ్రి శ్రీకృష్ణుని గూర్చి ఇలా అన్నాడు. "కుమారా! నీ సోదరుడు శ్రీకృష్ణుడు జితేంద్రియుడు కాడు. రజస్తమోగుణాలకు లోబడి స్త్రీ లోలుడయ్యాడు. వారు ఎట్లా ఆడిస్తే అట్లా ఆడుతున్నాడు. ఆ స్త్రీలను నిందించి ఏమి ప్రయోజనం? రజోగుణం ఎంత నీచమైనదో దీనినిబట్టే తెలుస్తోంది గదా. ఆడదాన్ని సంతోషపెట్టడం కోసం నన్ను ఇంతలేసి మాటలన్నాడుగదా. ఆహా! నేటికి కశ్యప వంశానికి ఎంత అప్రతిష్ట వాటిల్లిందో నువ్వే చూస్తున్నావు గదా. తనకన్నా వయసులో పెద్దవాణ్ణి, త్రిలోకాధిపతినని కూడా ఆలోచించకుండా స్త్రీలోలుడైన శ్రీకృష్ణుడు కయ్యానికి కాలుదువ్వు తున్నాడు. పూర్వం బ్రహ్మ నాతో మాట్లాడుతూ నీ సోదరుడు జ్ఞాన సంపన్నుడు. సదాచారాలకు పుట్టినిల్లని పొగిడాడు. నా తల్లి, కశ్యప ప్రజాపతి

కూడా ఆ మాటే అన్నారు. వారి మాటలు నమ్మి దానవులతో తగవు పెట్టుకొని భంగపడ్డాను. ఇదేనా సదాచారాల్ని పాటించడం. అంతేకాదు. ఇంకో రహస్యం గూడా నీకు చెబుతాను మనసులో పెట్టుకో.

పూర్వం ఒకానొక ఘోరమైన విపత్తు సంభవించినప్పుడు విష్ణువు శిరస్సు తెగిపోయింది. నేనా మొండాన్ని రక్షించాను. ఆ తర్వాత రుద్ర తేజస్సుతో తెగిన శిరస్సును మొండెమునకు అతికించి విష్ణువు ప్రాణాలు కాపాడాను. అప్పుడు విష్ణువు నన్ను ఎంతగానో మెచ్చుకొన్నాడు. అందరిలోకి నువ్వే ఉత్తముడవన్నాడు. ఇంతకాలం నా తల్లి తండ్రుల ముఖం చూసి, తమ్ముడే గదా అన్న ప్రేమ పాశం చేత అన్నీ సర్దుకుపోతున్నాను. నేను ప్రభువునే అయినా కూడా అన్ని యుద్ధాల్లోనూ నేనే ముందుండి నడిపించాను. నా తమ్ముణ్ణి కాపాడేందుకు నా ప్రాణాలనే అడ్డువేస్తూ వచ్చాను. ఎంతైనా అతడికి నా యెడల భక్తి విశ్వాసాలున్నాయనే నమ్మకంతో ఇన్నాళ్ళూ అతణ్ణి కాపాడుకుంటూ వస్తున్నాను. చిన్నవాడని, నా పుత్రుడు వంటివాడని ప్రేమిస్తూ వచ్చాను. అందువల్లనే అతడెన్ని తప్పులు చేసినా చూసీ చూడకుండా పోయాను. అయితే ఈరోజున నాపైనే కత్తి పట్టాడు. బహిరంగంగా యుద్ధాన్ని ప్రకటించాడు. నా తల్లిదండ్రులు కూడా ఇతణ్ణి ఓ గర్వపోతుగానే భావిస్తూ వచ్చారు. అతడిక్కూడా తానొక సర్వజ్ఞుడనని, శూరుడనని చెప్పుకొంటూ తన్ను తానే గౌరవించుకుంటూ ఉంటాడు. మునీంద్రా! ఇన్ని మాటలెందుకు? అతడే ముందుగా కయ్యానికి కాలు దువ్వుతున్నాడు. భార్య చెప్పుడుమాటలకు లొంగి ముందుగా అతణ్ణే నన్నో దెబ్బవేయమను. ఆ తర్వాత నేను అతణ్ణి ధనస్సుతో ఎదుర్కోవాలో? గదా యుద్ధం చెయ్యాలా? లేక ముష్టి యుద్ధమా? అన్నది నిర్ణయించుకుంటాను. కనుక ఓ మునిపుంగవా! నీవిప్పుడే ద్వారకానగరానికిపోయి నన్ను ఓడించకుండా అతడికి పారిజాతపు ఆకునైనా దక్కనివ్వనని చెప్పు. ఇవన్నీ నామాటలుగా మాధవునికి చెప్పు.

నారదుడు ద్వారకకు బయలుదేరుట

(ఈ భాగం హరివంశం విష్ణుపర్వంలో 71,72వ అధ్యాయాల నుండి గ్రహించబడింది.)

ఇంద్రుని మాటలు విన్న నారదుడు ఇంద్రుని సభనుండి ఒక రహస్య మందిరానికి తీసుకొని పోయి మరల ఈవిధంగా ఉపదేశం చేశాడు. మహేంద్రా! రాజులకెప్పుడూ హితవచనాలనే చెప్పాలి. అయితే సమయం అనుకూలంగా లేనప్పుడు సజ్జనుడైన వాడు ప్రియమైన హితాన్నే చెప్పాలి. అయితే నీతి శాస్త్రం తెలిసిన పండితుడు, వినేవాడికి కీడు కల్గించేదయితే అటువంటి ప్రియమైన హితాన్ని కూడా చెప్పడు. ఇప్పుడు నువ్వు నన్ను సలహా అడుగుతున్నావు కాబట్టి నాకు తోచినది, ధర్మబద్ధమైనది ఒకమాట చెప్తాను విను. నిజంగా నీ స్నేహం కోరే మిత్రుడైతే నువ్వు అడగక పోయినా నీకు మేలు కలిగించే ఆలోచనే చెబుతాడు. అందువల్ల జరుగబోయే ఆపదగూర్చి గాని, పరాభవాన్ని గూర్చిగాని ఆలోచించక ధర్మ సమ్మతమైన ఆలోచన చెబుతాడు. అట్లా అయితే గాని స్నేహం చిరకాలం వర్ధిల్లదని పండితుల అభిప్రాయం. ధర్మానికి హాని కలిగే సమయంలో సాధుమతి అయినవాడు ఎదుటివాడు తనకు ప్రభువే అయినా ధర్మాన్నే మాట్లాడాలి. అంతేకాదు నష్టం కలిగించేదయితే అది ప్రియమైనదైనా

ఆ విషయాన్ని చెప్పకూడదు. ఇది సజ్జనుల అభిమతం. కావు నీకు చెప్పవలసిన మాట ఒకటి చెప్పి వెళతాను. ఆపైన నీకు ఇష్టమైతే ఆచరించు. లేదంటే వదిలెయ్యి.

ఇద్దరు సోదరుల మధ్య మాటా మాటా పెరిగి విరోధం ఏర్పడితే దాన్ని మిత్రుడైన వాడు సహించలేడు. అయితే శత్రువుకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఏపని చేస్తే ముందు ముందు ఆపదలు కలుగుతాయో అటువంటి పనుల జోలికి పోకూడదు. అందువల్ల రాబోయే కాలంలో దుఃఖించాల్సిన పనిఉండదు. ముందు ముందు పరాభవం పొందే పనికి నువ్విప్పుడు పునాది వేస్తున్నావు. దీనివల్ల నువ్వు చివర్లో విపరీతమైన నష్టాన్ని పొందుతావు. ఎందువల్లనో చెప్తాను విను. జగత్కారణమైన మహా ప్రకృతికి కూడా అతీతుడైన వాడే శ్రీమహావిష్ణువు. ఆ మహావిష్ణువే శ్రీకృష్ణుడుగా అవతరించాడు. ఆ మహావిష్ణువే పరమాత్మ. ఆ మహాప్రకృతియే ఉమ అన్న పేరుతో శంకరుని పత్నిగా ప్రసిద్ధి చెందింది. అనగా పరమాత్ముని సంకల్పమే స్త్రీరూపాన్ని పొందిన ప్రకృతి అయింది. అటువంటి అవ్యక్త పరమాత్మ ప్రథమ గుణమే రుక్మిణీ మొదలైన వారంతా స్త్రీ రూపంలో వెలిశారు. అవ్యయురాలైన ప్రకృతినే దేవి అంటారు. మహేశ్వరుణ్ణే దేవుడంటారు. కావున శంకరునకు విష్ణువుకు భేదం లేదు. విష్ణువు సర్వ కర్త, లోకరక్షకుడు. మహేశ్వరుని భోక్త అంటారు. శ్రీమహావిష్ణువు బ్రహ్మాదిదేవతలను సృష్టించాడు. మహాదేవుడు ప్రజాపతి గణాలను సృష్టించాడు. ఈవిధంగా శ్రీమహావిష్ణువని, దేవతలందరిలోకీ అగ్రగణ్యుడని కీర్తించబడుతున్నాడు. అతడి మహిమ అచింత్యము, అప్రమేయము, గుణాతీతము, అదితి శ్రీమహావిష్ణువును గూర్చి తపస్సు చేసి నీవంటివానిని తనకు పుత్రుడుగా జన్మించమని వరం కోరుకుంది. అందుకు శ్రీమహావిష్ణువు "అమ్మా! నాకంటే ఉత్తముడైన పురుషుడు ఏ లోకంలోను కనిపించడు. అందువల్ల ఒక అంశతో నీయందు జన్మిస్తానని వరమిచ్చి అంతర్థానమయ్యాడు.

ఆ మహావిష్ణువే అదితి కడుపున ఉపేంద్రుడుగా అవతరించాడు. ఆ పరాత్పరుడే అనేక రీతులలో అనేక లోకకళ్యాణ కార్యాలను చేస్తూ ఇప్పుడు శ్రీకృష్ణుడన్న పేరుతో మానవుడుగా అవతరించాడు. ఆ పరాత్పరుడే సర్వత్రా వ్యాపించి ఉంటూ ఆయా రూపాలను ధరించి సృష్టి స్థితి లయములను నిర్వర్తిస్తున్నాడు. అట్టి శ్రీహరి దేవతలందరికీ పూజ్యుడు. ఆ శ్రీహరియే భూభారాన్ని తగ్గించి, ధర్మ రక్షణ కోసం అవతరించి ఇప్పుడు ద్వారకలో శ్రీకృష్ణుడుగా పిలువబడుతున్నాడు. అతడే యజ్ఞస్వరూపుడని వేదవేత్తలంటారు. ఆ పరాత్పరుడే కృతయుగంలో శ్వేత వర్ణంలోను, త్రేతాయుగంలో రక్తవర్ణంలోను, ద్వాపరయుగంలో పీతవర్ణంలోను, కలియుగంలో కృష్ణ వర్ణంలోను ఉంటాడు. హిరణ్యాక్షుని వధించి భూమిని ఉద్ధరించినది శ్రీహరియే. జగత్కళ్యాణానికై వరాహరూపాన్ని ధరించింది కూడా శ్రీమన్నారాయణమూర్తియే. వామనరూపం ధరించి త్రిలోకాధిపత్యాన్ని నీకు ప్రసాదించింది కూడా ఈ శ్రీహరియే. పాలసముద్రం నుండి పుట్టిన అమృతాన్ని దేవతలకు పంచినదెవరు? నీకోసం దానవ సంహారం చేసి నీ అధిపత్యాన్ని నిలబెట్టినదీ ఈ శ్రీమహావిష్ణువే సుమా. రామావతారం ధరించి రావణుణ్ణి వధించాడు. అటువంటి శ్రీమహావిష్ణువే ఇప్పుడు మానవరూపంలో ఉంటున్న శ్రీకృష్ణుడని తెలుసుకో. లోకకళ్యాణానికై అటువంటి శ్రీకృష్ణుడు పారిజాత వృక్షాన్ని తప్పకుండా ద్వారకా నగరానికి తీసుకొనిపోబోతున్నాడు. నేను నీకు చేసిన ఈ

హితోపదేశమంతా ముమ్మాటికీ నిజం. నువ్వు నీ పెద్దరికాన్ని నిలబెట్టుకొని ఆ మహాత్ముణ్ణి ఆదరించి పంపితే నీకు యశస్సు కలుగుతుంది. కాదని మూర్ఖిస్తే పరాభవం తప్పదు. నీ మంత్రుల్ని కూడా సంప్రదించి ఓ మంచి నిర్ణయం తీసుకో.

నారదుని మాటలు విన్న దేవేంద్రుడు ఇలా అన్నాడు. మునీంద్రా! నేనిట్లాంటి స్తుతి వాక్యాలు చాలాసార్లు విన్నాను. ఆయన అంతటి మహనీయుడే అయితే గోరంత విషయాల్ని ఎవరైనా కొండంత చేస్తారా? నేను పారిజాత వృక్షాన్ని ఇవ్వనుగాక ఇవ్వను. రానీవ్వండి. ఆయన ప్రభావం ఎట్లాంటిదో నేనే స్వయంగా చూస్తాను. నారదా! ఇంకొక మాట కూడా విని వెళ్ళు. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడన్న గర్వంతో అన్నగారైన నాపైన కయ్యానికి కాలుదువ్వితే సజ్జనులు, జ్ఞానులు హర్షించరు. నాతల్లికి ఏవిధంగా అభయం ఇచ్చాడో అదేవిధంగా జ్యేష్ఠుడనైన నావిషయంలో ఇట్లా నోరు పారేసుకోవడాన్ని నేను సహించి ఊరుకున్నా పెద్దలెవ్వరూ హర్షించరు. నేను పెద్దల విషయంలో అణకువతో ఉంటానన్నది ముల్లోకాల వారికి తెలుసు. అతడికి ఉపేంద్రత్వాన్నిచ్చిన నాపై కూడా అతడు వినయవిధేయతలు చూపవద్దా? ఒకవేళ తన దురుసుతనంతో నాకంటే పెద్దవాడు కావాలన్న కోరిక ఉంటే అట్లాగే తీసుకోమను. నేను మాత్రం గాజులు తొడిగించుకొని కూర్చునేది లేదు. అతడు కయ్యానికే సిద్ధపడితే అతణ్ణి ధీటుగా ఎదుర్కొని తగిన బుద్ధి చెప్తాను. ఇంద్రుని సందేశాన్ని తీసుకొని నారదుడు సూటిగా ద్వారకానగరానికి ప్రయాణమయ్యాడు.

ఆకాశమార్గంలో నారదమహర్షి వస్తూ ఉండటం శ్రీకృష్ణభగవానుడు చూశాడు. అప్పుడు శ్రీకృష్ణుడు సత్యభామా మందిరంలో ఉన్నాడు. త్వరత్వరగా మహర్షికి ఎదురువెళ్ళి అర్ఘ్యపాద్యాది ఉపచారాలన్నీ చేసి పారిజాతాన్ని గూర్చి దేవేంద్రుని అభిప్రాయమేమని కుతూహలంతో ప్రశ్నించాడు. నారదుడు ఇంద్ర భవనంలో జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. శ్రీకృష్ణుడు ఆసాంతం శ్రద్ధగా విని ఇలా అన్నాడు. మహర్షీ! నువ్వు వెంటనే అమరావతికి వెళ్ళాలి. ఇంద్రునితో నామాటగా చెప్పు. "మహేంద్రా! పారిజాతం విషయంలో నా నిర్ణయానికి తిరుగులేదు. నేను యుద్ధంచేసి నిన్ను ఓడించి మరీ పారిజాతాన్ని తీసుకొని పోతాను. ఇది నిశ్చయము. నువ్వు యుద్ధ ప్రయత్నంలో ఉండ" మని నా చివరి మాటగా చెప్పు అని నారదుని అమరావతికి పంపితాను క్షీరసముద్రానికి పోయి విశ్రాంతి తీసుకున్నాడు.

అంతట మునీంద్రుడు అమరావతికి పోయి శ్రీకృష్ణుని దృఢసంకల్పాన్ని తెలిపాడు. ఆ మాట విన్న ఇంద్రుడు బృహస్పతిని సంప్రదించాడు. ఆ దేవగురువు ఇంద్రునితో ఇలా అన్నాడు. దేవేంద్రా! నేను బ్రహ్మదేవుని సందర్శించడానికి వెళ్ళాను. ఇంతలో నువ్వు తొందరపడి నిర్ణయాలు తీసుకున్నావు. త్రిలోకాధిపతిగా నువ్వో భయంకరమైన నిర్ణయం తీసుకున్నావు. మేమంతా అందుకు కట్టుబడి ఉండాల్సిందేకదా. నువ్వూ యుద్ధానికి కావలసిన ఏర్పాట్లు చేసుకో. నాకు చాతనయినంతవరకు సహాయం చేస్తానని అంటూ తపోసమాధిలో ఉన్న కశ్యపుని వద్దకు వెళ్ళి ఇలా అన్నాడు. మహాత్మా! నేను బ్రహ్మలోకానికి పోయిన సమయంలో నీ కుమారుడు దేవేంద్రుడు ఓ భయంకరమైన నిర్ణయం తీసుకున్నాడు. ఓ పారిజాతం కోసం సాక్షాత్తూ శ్రీకృష్ణ పరబ్రహ్మంతోనే యుద్ధానికి తలబడ్డాడు. అని

తెలిపాడు. అందుకు కశ్యపముని ఇలా అన్నాడు. నారదా! కర్మము నుండి ఎవరూ తప్పించుకోలేరు గదా. పూర్వం ఇంద్రుడు దేవశర్మ భార్యను పెండ్లాడాలని ప్రయత్నించాడు. ఇంద్రునికా దోషం అంటరాదని తలచి అతడి శ్రేయస్సుకోరి శాంతి పరిహారం చేస్తున్నాను. నేను, అదితి కలసి ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తాం అన్నాడు. వెంటనే క్షీరసాగరం లోపలి భాగానికి పోయి సౌమ్య రూపుడైన మహాదేవుని గూర్చి స్తుతించాడు. వేద వేద్యుడవనియు, వేదాంత గమ్యుడవనియు, సృష్టి స్థితి సంహారములన్నింటికీ ఒక్కడే కర్తవనియు, అతడే యజ్ఞము, యజ్ఞకర్త, భోక్త అనియు, పరమ పురుషుడనియు, వేద స్వరూపుడనియు, వేదమయుడన్నదే ఆ స్తుతిసారం.

విశేషార్థం : కశ్యప మహర్షి వామనుని తండ్రి. ఇంద్రుని ఆపద నుండి రక్షించేందుకు శివుణ్ణి ప్రార్థిస్తున్నాడు. ఇందులోని అంతరార్థం ఏమిటి? సామాన్యంగా మానవులందరిదీ తమోగుణం. వీరికి సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను అనిపిస్తూ ఉంటుంది. కావున వీరికి మత భేదాలుంటూ ఉంటాయి. కానీ కశ్యపునిది సత్త్వగుణ ప్రధానం. శివకేశవ భేదాన్నెరుగడు. కశ్యపుని ప్రార్థనలకి ఆ మహేశ్వరుడు సంతోషించి ప్రత్యక్షమయ్యాడు. ప్రసన్న ముఖంతో ఇలా అన్నాడు. ఓ కశ్యపుడా! నువ్వు నన్ను గూర్చి ఎందుకు తపస్సు చేస్తున్నావో నాకు తెలుసు. ఇంద్రుడు దేవశర్మ భార్యను కోరుకోవడం వలన అతడా కర్మను అనుభవించేకాలం సమీపించింది. అతడా పరాభవాన్ని ఉపేంద్రుడివలన పొందాల్సి ఉంది. ఈ అశాంతి అంతా తాత్కాలికమేనని తెలుసుకో. అని శంకరుడు పలుకగా కశ్యపుడు మనశ్శాంతి కలిగిన వాడై అదితితో కలసి స్వర్గానికి చేరుకున్నాడు.

ఈ కథ వలన మనం గ్రహించాల్సిన నీతి ఏమంటే ఇతరుల భార్యలను కోరుకోవడం పాపమని, ఇంద్రుడైనా ఆ పాపాన్నుండి తప్పించుకోలేడని లోకులకో సదాచారం బోధించబడింది. యాజ్ఞవల్క్య స్మృతి ప్రాయశ్చిత్త కాండం కూడా ఈ నీతినే తెలుపుతోంది. మనకు గీతాశాస్త్రం 3వ అధ్యాయంలో కూడా మనస్సు చేత చేసిన కర్మలకు ఫలం అనుభవించక తప్పదని శాసిస్తోంది. ఎందువల్ల నంటే మనోవాక్కాయములలో మనస్సే కదా ప్రధానం! సత్కర్మల్ని వదలడం పాపమే గదా. పాపం చెయ్యడం దుష్కర్మే అవుతుంది కాబట్టి దుష్కర్మ ఫలం పొందకుండా ఉండాలంటే సత్కర్మల్ని విడవకుండా చేస్తూనే ఉండాలన్నదే ఇందులోని సారం.

ఇంద్ర - ఉపేంద్రుల యుద్ధం

(ఈ భాగం హరివంశం విష్ణుఖండం 73వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు ఇంద్రునిపై యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. తాను సాత్యకి గరుడ వాహనాన్ని అధిరోహించారు. రుక్మిణీ తనయుడైన ప్రద్యుమ్నుని మరొక రథంలో తనతో యుద్ధానికి తీసుకొని బయలుదేరాడు. ముగ్గురూ రైవత పర్వతానికి చేరే సమయానికి సూర్యోదయమైంది. రథసారథి అయిన దారుకుణ్ణి అక్కడే ఉండి రథాన్ని, అశ్వాల్ని జాగ్రత్తగా చూసుకుంటూ నేను వచ్చే వరకు వేచి ఉండమని ఆజ్ఞాపించాడు. తాను సాత్యకి గరుడవాహనం పైన, ప్రద్యుమ్నుని వేరొక రథంపై కూర్చోబెట్టి ముగ్గురూ ఆకాశమార్గాన స్వర్గానికి ప్రయాణం చేశారు. వారు నందనోద్యానానికి చేరే ముందే సాయుధులైన

వేలాది మంది యోధులు పారిజాతాన్ని కాపలా కాస్తూ కనిపించారు. వాళ్లు చూస్తూ ఉండగానే పారిజాతాన్ని పీకి గరుడుడిపై ఉంచాడు. అంతట శ్రీకృష్ణుడు పారిజాతంతో సహా అమరావతి నగరానికి మూడు ప్రదక్షిణలు చేశాడు. ఈలోగా దేవతలంతా పోయి శ్రీకృష్ణుడు పారిజాతాన్ని అపహరించుకో పోయాడని దేవేంద్రునికి నివేదించారు.

శ్రీకృష్ణుడు పారిజాతాన్ని అపహరించుకు పోయాడని వినగానే ఇంద్రుడు ఐరావతమెక్కి జయంతుణ్ణి కూడా వెంటబెట్టుకొని బయలుదేరాడు. ఇంద్రుడు వచ్చే సమయానికి శ్రీకృష్ణుడు తూర్పుద్వారం వద్ద ఎదురు పడ్డాడు. గరుడుని పై నున్న శ్రీకృష్ణుడు దేవేంద్రునితో ఇలా అన్నాడు. "అన్నా! నీమరదలికిచ్చిన వాగ్దానం చెల్లించేందుకీ పారిజాతాన్ని తీసుకొని వెళ్తున్నాను" అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న ఇంద్రుడు "కృష్ణా! యుద్ధం చెయ్యకుండా స్వర్గం నుండి వస్తువులేవీ తీసుకొని పోరాదు. అందువల్ల ముందుగా నువ్వే నాపై బాణాల్ని ప్రయోగించు. ఆపైన నీతో దీటుగా యుద్ధంచేసి నిన్ను ఓడిస్తాను. స్వర్గ వస్తువైన పారిజాతాన్ని రక్షించుకుంటాను. ఇంద్రుని సవాలు స్వీకరించిన శ్రీకృష్ణుడు వాడి అయిన బాణంను వేసి ఐరావతాన్ని నొప్పించాడు. అప్పుడు ఇంద్రుడు వాడి అయిన బాణాలను గరుడునిపై వేయగా ఆ బాణాలు గరుడిని తాకకముందే శ్రీకృష్ణుడు వాటన్నింటినీ త్రుంచి వేశాడు. అట్లాగే శ్రీకృష్ణుడి వాడి బాణాలు ఐరావతానికి తగలకుండా ఇంద్రుడు కూడా జాగ్రత్త పడ్డాడు. ఈవిధంగా ఇంద్ర–ఉపేంద్రుల మధ్య యుద్ధం భీకరంగా సాగింది. స్వర్గ వాసులంతా మూర్ఛ పోయారు. జయంత, ప్రద్యుమ్నుల మధ్య యుద్ధం వాడిగా వేడిగా జరిగింది. ఒకరినొకరు తీవ్రంగా నొప్పించుకున్నారు. దేవతలు, మునులు ఆ యుద్ధాన్ని కళ్ళప్పగించి చూస్తున్నారు. ఇంతలో ప్రవరుడనే దేవేంద్రుని భటుడు పారిజాతాన్ని చేజిక్కించుకు పోయే ప్రయత్నం చేశాడు. అది కనిపెట్టిన శ్రీకృష్ణుడు అతడిపై బాణాలను సంధించమని సాత్యకితో చెప్తూ ఇలా అన్నాడు. సాత్యకీ! ఇతడు జంబూ ద్వీపం నుండి బ్రహ్మను ఉపాసించి తపస్సు చేసి మరణం లేకుండా వరాలు పొందాడు. ఇతడు ఇంద్రుడికి అత్యంత ఆప్తుడు. అరిందముడు. మహా అస్త్రవేత్త. ఇతడు బ్రాహ్మణుడు కావున తీవ్రంగా నొప్పించకు అని హెచ్చరించాడు. అతడిపై ప్రయోగించిన బాణాలకు కోపించిన ప్రవరుడు సాత్యకితో ఇలా అన్నాడు.

ఓ సాత్యకీ! నీకులధర్మాన్ననుసరించి ప్రవర్తించు. యాదవులు అపరాధం చేస్తే బ్రాహ్మణులు సహించరు. నేను పరశురాముని శిష్యుణ్ణి, దేవేంద్రునికి మిత్రుడను అని అంటూ ప్రవరుడు సాత్యకిపై అనేక అస్త్రాల్ని ప్రయోగించి బాధ పెట్టాడు. వారి మధ్య జరిగిన మహాసంగ్రామానికి వృక్షాలన్నీ ఊగిపోయాయి. సాత్యకి ప్రయోగించిన బాణాలతో ప్రవరుడి చేతిలో విల్లు విరిగి క్రిందపడింది. రెండో ధనుస్సు చేతబట్టి నేర్పుతో బాణాల్ని ప్రయోగించి సాత్యకిని బాధించాడు. ఆ తర్వాత కొంతసేపు గదాయుద్ధం, ఆ పిమ్మట ఖడ్గంతోను యుద్ధం చేసుకుంటూ ఉండగా ప్రద్యుమ్నుడు దివ్య ఖడ్గాన్ని సాత్యకికి అందించాడు. ఇది గ్రహించిన ప్రవరుడు శక్తి ఆయుధంతో ఆ దివ్యఖడ్గాన్ని ముక్కలయ్యేట్లు విసిరేసి సింహనాదం చేశాడు. ప్రవరుని ఆలోచన గ్రహించిన గరుత్మంతుడు ప్రవరుని రథాన్ని విరగ్గొట్టి విప్రుడు క్రిందపడిపోయేట్లు చేశాడు. జయంతుడు వచ్చి ప్రవరునికి శైత్యోపచారాలు చేయగా ప్రద్యుమ్నుడు

సాత్యకికి ఉపచారాలు చేసి స్వాంతుణ్ణి చేశాడు. పారిజాతానికి ఒక ప్రక్కన ప్రద్యుమ్నుడు, మరొక ప్రక్క సాత్యకి ఉంటూ ప్రవరుణ్ణి జయంతుణ్ని ఎదుర్కొన్నారు. ఇంద్రుడు శ్రీకృష్ణుడితో వీరోచితంగా యుద్ధం చేస్తున్నాడు. మహేంద్రుడికి గరుత్మంతుని బలపరాక్రమాలు బాగా తెలుసు. అందువల్ల శ్రీకృష్ణుడితో యుద్ధం చేస్తూనే గరుత్మంతుడికి దగ్గరగా పోవద్దని ప్రవరుని, జయంతుణ్ణి హెచ్చరించాడు. కొంతసేపు గరుడుడు ఐరావతము భీకరంగా యుద్ధం చేశాయి. ఉగ్రుడైన గరుడుడు ఐరావతం కుంభస్థలంపై గట్టిగా కొట్టాడు. దాంతో ఐరావతం విలవిల్లాడి పోయింది. ఇంద్రునికి ఐరావతంపై పుత్ర వాత్సల్యం. ఆ ప్రేమతో ఇంద్రుడు ఆ గజరాజుపైనే కూర్చుని శైత్యోపచారాలు చేశాడు. దేవేంద్రుని పరిచర్యలతో ఐరావతం తేరుకొని లేచి నిలబడింది. ఇంద్రుడు గరుత్మంతునికి బుద్ధి చెప్పాలని వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. పక్షిరాజు అమిత బలశాలి. వజ్రాయుధాన్ని లెక్కచెయ్యలేదు. అయినా ఆ దివ్యాయుధానికి మర్యాద పూర్వకంగా ఒక్కొక్క దెబ్బకు ఒక్కొక్క ఈకను రెక్కలనుండి రాల్చింది. అయినా అప్పుడు శ్రీకృష్ణుడు ప్రద్యుమ్నుని ద్వారకకు పంపి మరో దివ్య రథాన్ని తెప్పించి యుద్ధం కొనసాగించి గరుత్మంతునికి విశ్రాంతి నిచ్చాడు. ప్రద్యుమ్నుడు తెచ్చిన దివ్యరథం నుండి దేవేంద్రుని ఓడించి పారిజాతాన్ని స్వంతం చేసుకున్నాడు.

(ఈకథ ఒక్క హరివంశంలో మాత్రమే కనిపిస్తుంది. మిగిలిన పురాణాలు దేంట్లోనూ ఈవిధంగా కథ చెప్పలేదు. శ్రీభాగవతంలోను బ్రహ్మ పురాణంలోను సత్యభామతో కలసి నందనోద్యానవనానికి వెళ్ళి పారిజాతాన్ని తీసుకొని ద్వారకకు చేరినట్లుంటుంది. నిజానికి శ్రీకృష్ణునికి పారిజాతాన్ని పొందేందుకు ఇంత శ్రమ పడాల్సిన అవసరం లేదు. ఇటువంటి పారిజాతాలను వెయ్యి సృష్టించగలడు. వెయ్యిమంది ఇంద్రులను కంటిచూపుతో పాదాక్రాంతుల్ని చేసుకోగలడు. అయినా హరివంశంలో చెప్పిన తీరుకూడా పాఠకులకు తెలియాలనే ఈకథ వ్రాయడం జరిగింది.)

దారుకుడు తెచ్చిన రథాన్ని అధిరోహించిన శ్రీకృష్ణుడు ఇంద్రునితో యుద్ధానికై ఎదురుచూస్తున్నాడు. ఇంతలో ఇంద్రుడు ఐరావతము నెక్కి రేవత పర్వతం భూమిలో కృంగిపోయి ఉండటం, శ్రీకృష్ణుడు గరుడుని వదలి మరో రథాన్ని అధిరోహించి తనకై ఎదురు చూస్తున్నట్లు గమనించాడు. ఆ ప్రక్కనే పారిజాతాన్ని వీపుపై పెట్టుకొన్న గరుడుడు, మరో రథంపై సాత్యకి ప్రద్యుమ్నుల్ని చూశాడు. ఇంద్రునితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. ఓ దేవరాజా! గరుడుని దెబ్బకు నీ ఐరావతం బాగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. దానిపై నుండి నువ్విక యుద్ధం చెయ్యలేవని అనిపిస్తోంది. అదీగాక సూర్యాస్తమయం కూడా అయింది. కనుక నువ్వు నీ ఐరావతమూ ఈ రాత్రికి విశ్రాంతి తీసుకొని రేపు ఉదయాన్నే రండి. పోరుసాగిద్దాం. ఇంద్రుడు కూడా అదేమంచిదని తలచి ఇంటిముఖం పట్టాడు. రేవత పర్వతం భూమిలో కృంగి ఉండటాన పర్వతమంతా సమతలంగా ఉండి శ్రీకృష్ణుడు అతడి పరివారానికి నివాసయోగ్యమైంది. అటుపిమ్మట శ్రీకృష్ణుడు గంగానదిని స్మరించగా గంగ ప్రత్యక్షమైంది. శ్రీకృష్ణాదులు ఆ దేవనదికి నమస్కరించి అందులో స్నానాదులు చేసి ఆచమనం చేసి బిల్వ పత్రంపైన ఈశ్వరుణ్ణి ఆవాహన చేసి పూజించాడు. అంతట శంకరుడు ఆ గంగానదీ జాలాలపైన దర్శనమిచ్చాడు. అప్పుడు శ్రీకృష్ణుడు శంకరుని పారిజాత పుష్పాలతో పూజించి ఇలా స్తోత్రం చేశాడు.

రుద్రాది నామాలన్నీ పరమ పవిత్రమైనవని, లోకులు ఆనామాలను స్మరించినంత మాత్రానే సకల పాపాలు నశిస్తాయన్నదే ఆ స్తోత్ర సారాంశం. సృష్టి స్థితిలయ కారకుడు శంకరుడనియు, బ్రహ్మాండాలన్నింటినీ సృష్టించి, పోషించి, సంహరిస్తాడనియు, వేదాలన్నీ శంకరుడే భగవంతుడని స్తుతిస్తున్నాయని, యజ్ఞము, యజ్ఞకర్త, యజ్ఞఫలము ఆ శివుడేననియు ఈ స్తుతి సారాంశం.

శ్రీకృష్ణుని స్తోత్రానికి పరమశివుడు సంతోషించి శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. నారాయణా! నీకోరిక నెరవేతుంది. పారిజాతాన్ని సాధించి తీసుకొని పోగలవు. పూర్వం మైనక పర్వతం పై నుండి నాగూర్చి తపస్సు చేశావు. అప్పుడే నీకీ వరాన్నిచ్చానని గ్రహించు. నువ్వు అవధ్యుడవని, నన్నుమించిన పరాక్రమ శాలివని ఆనాడే చెప్పాను. గుర్తుతెచ్చుకో. ఓ విష్ణూ! యుద్ధంలో విజయుడవవుతావు. నువ్వే సర్వోత్తముడవని పూజలందుకుంటావు. ఇప్పుడు నన్ను బిల్వపత్రంపై ఆవాహన చేసి నన్ను పూజించడం వల్ల ఇకపైన బిల్వేశ్వరుడన్న పేరుతో ఈ శివలింగం ప్రసిద్ధి చెందుతుంది. ఎవరైతే ఈ క్షేత్రానికి వచ్చి నన్ను అర్చిస్తారో వారికి తప్పక విజయం లభిస్తుంది. అట్లాగే గంగాస్నాన ఫలంకూడా వారికి దక్కుతుంది.

కృష్ణా! ఈ పర్వతానికి దిగువన షట్పురమనే నగరమొకటి ఉంది. ఆనగరం క్రూర దానవులకు ఆవాసం. వారంతా దురాత్ములే. బ్రహ్మచే అనేక వరాలు పొంది ఎవరికీ కనబడకుండా మాయోపాయాలతో జగత్తులన్నింటినీ పీడించుకు తింటున్నారు. దేవతలెవ్వరూ వారిని సంహరించలేకపోతున్నారు. నువ్వు మానవ రూపంలో ఉన్న శ్రీమహావిష్ణువువే కనుక నువ్వా దానవులందర్నీ సంహరించు. అని చెప్పి అంతర్ధానుడయ్యాడు. ఇంతలో సూర్యోదయమైంది. శ్రీకృష్ణుడు ఆ పర్వతరాజుతో ఇలా అన్నాడు. పర్వతవర్యా! బ్రహ్మ వరాల్ని పొందిన అసురులు నీ పర్వతానికి అడుగుభాగన ఉన్న వారందర్నీ ఇప్పుడే సంహరిస్తాను. ఆ దురాత్ములనుండి విడుదల అయిన నీ శిఖరాన నేనుండటం వలన, నువ్వు పరమ పవిత్రుడవవుతావు. తపస్వులంతా నీ పర్వత శ్రేణుల్లో తపస్సు చేసుకుంటూ హిమాలయ పర్వతాలకుండే పవిత్రత నీకూ కలుగుతుంది. ఎవడైతే ఈ పర్వతంలో నుండి ఒక శిలను తీసుకొని నారూపంగా భావించి భక్తితో పూజిస్తాడో అతడికి వైకుంఠం ప్రాప్తిస్తుంది. అని ఆ పర్వతానికి వరదానం చేశాడు. అంతట శ్రీకృష్ణుడు ఆ దానవులందర్నీ సంహరించి లోకానికి దేవతలకు మహోపకారం చేశాడు.

ద్వారకకు పారిజాతాన్ని తెచ్చుట

(ఈకథాభాగం హరివంశం, విష్ణుపర్వం 77వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శంకరుడు అంతర్ధానమైన తర్వాత శ్రీకృష్ణుడు రథాన్ని అధిరోహించి యుద్ధానికి సంసిద్ధుడయ్యాడు. అదే సమయానికి దేవేంద్రుడు కూడా మరో రథంపై శ్రీకృష్ణుడితో పోరుకు సిద్ధపడ్డాడు. యుద్ధం చాలా వేడిగా వాడిగా సాగింది. ఒకరినొకరు బాధించుకున్నారు. ఆ ప్రదేశమంతా దుమ్ము ధూళితో ఆకాశాన్ని కప్పేసింది. పర్వత శిఖరాలన్నీ గజగజలాడాయి. వాటిపైనుండే వృక్షరాజాలన్నీ ఊగిపోయాయి. వాటి నాశ్రయించుకొని బ్రతుకుతున్న పక్షులన్నీ ప్రాణాలరచేతిలో

పెట్టుకొని ఎగిరిపోయాయి. ఈ ఘోర యుద్ధం సమాప్తమై శాంతి నెలకొనాలని బ్రాహ్మణులంతా శాంతి మంత్రాలు పఠించారు. యుద్ధం ఈవిధంగా జరుగుతూ ఉండగా బ్రహ్మలోకం నుండి బ్రహ్మ, స్వర్గం నుండి అదితి కశ్యపులు వచ్చారు. తల్లి దండ్రులను చూడగానే ఇంద్ర – ఉపేంద్రులిద్దరూ యుద్ధాన్ని ఆపి వారి పాదాలకు నమస్కరించారు. బ్రహ్మ దేవునికి కూడా అభివాదం తెలిపారు. వారితో కశ్యపుడు ఇలా అన్నాడు. నాయనలార! మీ ఇద్దరూ అన్నదమ్ములు. కేవలం ఓ చెట్టుకొమ్మ కోసం ఇంతగా తగాదాలు పడటం ఏమీ బాగాలేదు. మీవంటి సర్వజ్ఞులు చెయ్యాల్సిన పని కాదు. వెంటనే సమాధానపడి యుద్ధాన్ని ఆపండి. మామీద ఏ మాత్రం గౌరవం ఉన్నా మీరిద్దరూ పూర్వం వలె ఆదరాభిమానాలతో మెలగండి. ఇచ్చి పుచ్చుకొనే ధోరణిని అవలంభించండి.

అప్పుడు దేవేంద్రుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా! నువ్వు సర్వలోకాధిపతివి. అందులో మూడు లోకాల్ని పాలించమని నన్ను అభిషిక్తుణ్ణి చేసింది కూడా నువ్వే. నాకు పెద్దరికాన్నిస్తూ జ్యేష్ఠత్వాన్ని నిలబెట్టూ వచ్చావు. ఇప్పుడు మన తల్లిదండ్రులు పవిత్ర గంగానదిలో స్నానం చేసి వచ్చారు. అట్టి తల్లిదండ్రుల్ని కలుసుకున్న ఈ ప్రదేశం పరమ పవిత్రమవుతుంది" అన్నాడు. ఆ సమయానికే దేవతలంతా గుమికూడారు. అంతట శ్రీకృష్ణుడు దేవేంద్రునికి అభయదానం చేశాడు. దేవతలు మునులు, అంతా సంతోషించారు. ఇంద్ర – ఉపేంద్రులు తల్లి దండ్రులతో కలసి విమానం పై స్వర్గానికి ప్రయాణమయ్యారు. స్వర్గంలో దేవేంద్రుని సౌధంలో కశ్యపునికి, అదితికి, శ్రీకృష్ణునికి శచీదేవి సకల మర్యాదలు చేసింది. ఆ రాత్రి అక్కడే గడిపారు. మర్నాడు అదితి శ్రీకృష్ణునితో ఇలా అంది, "కృష్ణా! నువ్వు కోరుకున్నట్లుగానే ఈ పారిజాతాన్ని ద్వారకకు తీసుకొని పోయి సత్యకు బహూకరించు. కొంతకాలం పోయిన తర్వాత మళ్ళీ ఈ పారిజాతాన్ని నందనవనానికి చేర్చు" అన్నది. శ్రీకృష్ణుడు తల్లికి అట్లాగే జరుగుతుందని వాగ్దానం చేసి పారిజాతంతో సహా ద్వారకకు చేరుకున్నాడు. శ్రీకృష్ణుని రాకను తెలుపుతూ ముందుగా సాత్యకి ద్వారకా వాసులకు కబురు పంపగా ద్వారకానగరమంతా చక్కగా అలంకరించి శ్రీకృష్ణునికి స్వాగతం పలికారు. ఆ వృక్షరాజాన్ని చూడటానికి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. వారావృక్షాన్ని సమీపించగానే ఆవృక్షం యొక్క దివ్య మహిమచేత వారి మనస్సుల్లోని కోరికలన్నీ ఫలించాయి.

శ్రీకృష్ణుడు ద్వారకా నగరానికి చేరగానే ముందుగా దేవకీ వసుదేవులకు, బలరాముడికి నమస్కరించి పూజించాడు. ఆ తర్వాత ఆ వృక్షాన్ని సత్యభామ సౌధంలో నాటించాడు. తను కోరుకున్న ఆ దివ్య వృక్షం తన పెరటికి వచ్చి చేరడంతో సత్యభామ ఎంతో సంతోషించి శ్రీకృష్ణుని కీర్తించింది. ఈ సందర్భంగా సత్యాదేవి పుణ్యకవ్రతాన్ని ఆచరించాలనుకుంది. ఆ పుణ్యక వ్రతంలో దానాన్ని గ్రహించేందుకు నారదుడే తగినవాడని శ్రీకృష్ణుడు నిర్ణయించాడు. ఆ వ్రతానికి అవసరమయ్యే సంబారాలన్నింటినీ జంబూద్వీపంలో అన్ని మూలలనుండి సేకరించి తెప్పించారు.

ఈ కథయే ఇంచుమించుగా బ్రహ్మ పురాణంలోను, గర్గసంహితలో కూడా ఉన్నది. కొద్దిపాటి తేడాలు ఇలా కనిపిస్తాయి. శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరించి, అదితి కవచ కుండలాలను ఇచ్చేందుకు సత్యభామతో కలసి స్వర్గానికి వెళ్తాడు. తిరిగి వస్తూ సత్యభామ ముచ్చట తీర్చేందుకు నందనవనంలో

నుండి పారిజాత వృక్షాన్ని పెకిలించి గరుడినిపై ఉంచి ద్వారకకు ప్రయాణం అవుతూ ఉండగా దేవతలడ్డుకుంటారు. శ్రీకృష్ణుడు వారందర్నీ హతమార్చగా, ఇంద్రుడే స్వయంగా యుద్ధానికి వస్తాడు. ఆ యుద్ధంలో ఇంద్రుణ్ణి కూడా ఓడించి పారిజాతంతో కలసి ద్వారకకు చేరుకుంటాడు. ఈ తేడా తప్పిస్తే మిగిలిన పురాణాలకు హరివంశంలో చెప్పిన కథకు పెద్దగా తేడాలేమీ లేవు.

లోకం దృష్టిలో సత్యభామ ప్రధానంగా శృంగార నాయిక, జ్ఞాన శూన్యురాలని కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇవన్నీ పామరులు మాట్లాడే మాటలు. భగవంతుడు గుణాన్ని ప్రేమిస్తాడేగాని రూపాన్ని కాదు. అంతేకాకుండా అజ్ఞాని, అహంకారిని భగవంతుడు ప్రేమిస్తాడా? శ్రీకృష్ణునికి భార్య కాగలదా; "నా దేవీ పూజయామాస ప్రహృష్టా వాసవానుజమ్" అన్న వాక్యాన్ని పరిశీలించి చూడండి. పారిజాతాన్ని తీసుకువచ్చానని చెప్పగానే ఎగిరి గంతెయ్యలేదు. పోయి కౌగిలించుకోలేదు. శ్రీకృష్ణుని పూజించింది. పారిజాతం తన పెరట్లో నాటగానే తపస్సు చేసుకోవడానికి అనుమతించమని శ్రీకృష్ణుని ప్రార్థించింది. కేవలం కాముకయే అయితే తపస్సు చేసుకునేందుకు అనుమతి కోరుతుందా? అంతేకాదు, భూదేవియే సత్యభామగా అవతరించిందని పురాణాలన్నీ చెబుతున్నాయి. కావున రుక్మిణి గొప్పదా? లేక సత్యభామ గొప్పదా? అన్న ప్రశ్నయే ఉదయించదు. భగవంతుని యెడల ఒక్కొక్కరికి ఒక్కొక్క తీరున భక్తి ఉంటుందని మనం గ్రహిస్తే బాగుంటుంది.

అంధకాసుర వృత్తాంతం

(ఈ భాగం హరివంశం విష్ణుపర్వం 76,77,78వ అధ్యాయాల నుండి గ్రహించబడింది.)

ఈ అంధకాసుర వృత్తాంతాన్ని జనమేజయునకు వైశంపాయనుడు ఈవిధంగా తెలిపాడు. దైత్యులనకు తల్లి, కశ్యపునికి రెండవ భార్య అయిన దితి. షట్పురంలో దానవులందర్నీ ఒక విష్ణువే సంహరించాడని విని తల్లడిల్లి పోయింది. దేవతలందర్నీ వధించగల పుత్రుణ్ణి కని అందుకు తగిన ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంది. అందుకు ప్రత్యక్ష దైవమైన భర్తయే గతి అని నమ్మింది. భర్తకు శుశ్రూషలు చేస్తూ, సకాలంలో తపస్సు చేస్తూ భర్తను సంతృప్తి పరచి వశం చేసుకుంది. సంతోషించిన కశ్యపుడు ఆదరంతో దితిని దగ్గరకు తీసుకొని వరమేదైనా కోరుకోమన్నాడు. తన కోరిక ఫలించే రోజు రానే వచ్చిందని సంతోషించిన దితి భర్తతో "నాథా! దేవతలందర్నీ జయించగల బలశాలిని నాకు పుత్రుడుగా ప్రసాదించు. అంతేకాకుండా నాకు కలగబోయే పుత్రుడు ఎవరిచేతిలోనూ మరణం లేనివాడై ఉండాలని కూడా కోరింది." అందుకు కశ్యపుడు "దేవీ! నువ్వు కోరుకున్నట్లే నీకు పుత్రుణ్ణి ప్రసాదిస్తాను. అతడు విష్ణువుచేతగానీ, దేవతల చేతగాని మరణించకుండా ఉండేట్లుగా అనుగ్రహిస్తున్నాను. కానీ దేవదేవుడైన శంకరునికి ఆగ్రహం కలిగిస్తే మాత్రం అతణ్ణి ఎవరూ కాపాడలేరు. కావున అతడి మరణం అతడి చేతిలోనే ఉన్నదని తెలుసుకో అన్నాడు.

అటుపిమ్మట దితి ఒక మగశిశువుకు జన్మనిచ్చింది. అతడికి వేయి శిరస్సులు, రెండు వేల చేతులు, రెండువేల కన్నులు, రెండువేల పాదములు ఉన్నాకూడా అతడు నడుస్తూ ఉంటే గుడ్డివాడు

నడుస్తున్నట్లే నడిచేవాడు. అందువల్ల అతణ్ణి అంతా అంధకుడని పిలిచేవారు. తనకు మరణం లేదన్న గర్వంతో అంధకుడు లోకులందర్నీ బాధించేవాడు. పరస్త్రీలను చెరపట్టేవాడు. పరుల ధనాన్ని కొల్లగొట్టుకొచ్చేవాడు. తపస్వుల్ని, మునుల్ని క్రూరంగా హింసించేవాడు, ఈవిధంగా ముల్లోకాలకూ ఆ అంధకుడు కంటకుడయ్యాడు. అప్పుడు దేవేంద్రుడు కశ్యపుని వద్దకు పోయి తండ్రీ! తమ్ముడి దుష్కృతాలు మితిమీరిపోయాయి. చావురాదన్న అహంకారంతో తపస్వుల్ని, బ్రాహ్మణులను కూడా హింసిస్తున్నాడు. మీరే అతడికి మంచిమాటలు చెప్పి సరిదిద్దాల్సిందని ప్రార్థించాడు. ఇంద్రుని మాటలు విన్న కశ్యపుడు, "ఇంద్రా! విచారించకు. నేను పిలచి అతణ్ణి వారిస్తాను. నువ్వు వెళ్ళిరా" అని పంపేశాడు. ఆ తర్వాత అంధకుణ్ణి పిలచి ఇకపైన ఇటువంటి దుష్కృతాలు చెయ్యవద్దని వారించాడు. తల్లి దితికూడా అతడికి నయాన భయాన నచ్చ చెప్పి పంపింది. అంధకుడు తల్లిదండ్రుల మాట కాదనలేక బ్రాహ్మణులను, తపస్వుల్ని బాధించడం మానుకున్నాడు. అయితే అడవిలో ఉండే మహావృక్షాలన్నింటినీ పడగొట్టి పశుపక్ష్యాదులకు భీతి కలిగించాడు. దేవతల అశ్వమైన ఉచ్చైశ్వాన్ని అపహరించుకు వచ్చాడు. దేవలోకం నుండి రత్న రాసుల్ని కొల్లగొట్టుకొచ్చాడు. యాగశాలలకు పోయి యజ్ఞాలకు విఘ్నం కలిగించాడు. ఇక అతడు చెయ్యని దుష్కార్యం అంటూ ఏదీ మిగల్లేదు. తపస్వులంతా తపస్సు చేయాలంటేనే భయపడిపోతున్నారు. బ్రాహ్మణులు యజ్ఞాలు చెయ్యడం మానుకున్నారు. దాంతో దేవతలకు హవిస్సులు అందకుండా పోయాయి. ఇక సూర్య చంద్రులు, వాయువు కూడా తమ ధర్మాల్ని నిర్వర్తించలేకపోతున్నారు. దేవతలంతా పోయి దేవేంద్రునితో మొరపెట్టుకున్నారు. ఇంద్రుడు బృహస్పతితో ఆలోచించాడు. బృహస్పతి దేవతా సమూహంతో ఇలా అన్నాడు. దేవతలారా! అంధకాసురుడు బ్రహ్మనుండి అనేక వరాలు పొందాడు. విష్ణువు కూడా అతణ్ణి సంహరించలేడు. ఒక శంకరుడు మాత్రమే అంధకుణ్ణి నిరోధించగలడు. కావున మనం ఆ మహాదేవుడికి మన కష్టాల్ని చెప్పుకుందాం అన్నాడు. అప్పుడే సభలోకి ప్రవేశిస్తున్న నారదుని చూసి దేవేంద్రుడు, నారదా! నువ్వే ఈ సమస్య పరిష్కరించాలి. మాకు మార్గాన్ని చూపండి అని వేడుకున్నాడు.

నారదమహర్షి దేవతల కష్టాల్ని అర్థం చేసుకున్నాడు. ఒక్క శంకరుడు తప్ప అంధకుణ్ణి మరెవ్వరూ అంతం చెయ్యలేరని గ్రహించాడు. వెంటనే కైలాస శిఖరంపై ఉన్న వృషభధ్వజుణ్ణి దర్శించాడు. అక్కడొక రాత్రి నిద్ర చేసి శంకరుని వద్ద శలవు తీసుకొని స్వర్గానికి బయలుదేరాడు. అట్లా స్వర్గానికి బయలుదేరుతున్న నారదుని మెడలో పరమశివుడు ఒక మందార మాలను వేసి సత్కరించాడు. ఆ మందారమాలా పరిమళాలు పారిజాతపుష్పాల పరిమళాలకన్నా ఎన్నో వేల రెట్లు పరిమళాల్ని అధికంగా వెదజల్లాయి. ఆ మాలను ధరించి నారదుడు ముందుగా అంధకుని వద్దకు వెళ్ళాడు. అంధకుడు ఆ పరిమళాన్ని ఆస్వాదిస్తూ మంత్రముగ్ధుడై ఇలా అన్నాడు. "మునీంద్రా! ఈ పుష్పాల పరిమళం అద్భుతంగా ఉంది. నేనింతవరకు ఇంత పరిమళాలు వెదజల్లే పుష్పాల్ని చూడలేదు. మీరు ఎక్కడనుండి వీటిని సంపాదించారు. ఈ పుష్పాలు ఎక్కడ దొరుకుతవో చెప్పండి. స్వర్గంలోనా? అయితే స్వర్గాన్ని జయించి ఈ పుష్పాల్ని స్వంతం చేసుకుంటాను." అన్నాడు. అందుకు నారదుడు ఇలా అన్నాడు. "దానవేశ్వరా! మందర పర్వతం పై సాంబశివుని ఉద్యానవనంలో తప్ప ఈ పుష్పాలు

మరెక్కడా లభించవు. ఆ వనంలో శివుడి ఆజ్ఞలేకుండా చీమైనా ప్రవేశించదు. ప్రమథులు అనేక మంది ఆయుధాలు ధరించి ఆ వనాన్ని రాత్రింబవళ్ళు కాపలా కాస్తూ ఉంటారు. సదాశివుని అనుగ్రహం చేతనే ఎవరైనా ఈ పుష్పాల్ని పొందగలుగుతారు. ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా ఎవరు ఆవనంలో ప్రవేశించినా మరణం తప్పదు. ఆ వనంలో ఎన్నో చిత్ర విచిత్రములైన వృక్షరాజములున్నాయి. అందులో కొన్ని తరువులు రత్నాల్ని ప్రసాదిస్తే మరికొన్ని స్త్రీ రత్నాల్ని ప్రసాదించగలవు. కొన్ని తరువులు సుగంధాల్ని వెదజల్లుతాయి. కొన్ని భక్ష్య భోజ్య లేహ్య చోష్యపేయములను ప్రసాదిస్తాయి " అని చెప్తూ అంధకునిలో ఉత్సుకతను రెచ్చగొట్టాడు.

నారదుని మాటలు విన్న అంధకుడిలో ఆ మందార పుష్పాల్ని స్వంతం చేసుకోవాలన్న కోరిక రెట్టింపయింది. ప్రాణాలకు తెగించి మందర పర్వతాన్ని చేరుకున్నాడు. అక్కడ ఆ పర్వతంపై సిద్ధులు కనిపించారు. చందనాది వృక్షాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆ పర్వతం అంతా రకరకాలైన ధాతువులకు పుట్టినిల్లు. పక్షుల కిల కిలారావములే గంధర్వగానాల్లాగా వినిపించాయి. హంసలు ఒక కొలనులోనుండి మరొక సరస్సులోకి బారులుగా వెళ్తూఉంటే అప్సరసల సమూహాల్లా అనిపించింది. అక్కడ క్రూరజంతువులు సాధు జంతువుల్ని బాధించడం లేదు. అంధకుడు ఆ పర్వత రాజుతో ఇలా అన్నాడు. ఓ మందర పర్వత రాజా! నేను అంధకుడనే దానవుడను. బ్రహ్మ వరదానం చేత నాకు మరణం రాదు. ముల్లోకాల్లోనూ నన్నెదిరించగల బలాఢ్యుడెవ్వడూ లేడు. నీ పర్వతం పైన మందారాలు, పారిజాతాల వనం ఉన్నదట. నాకా వనాన్ని చూపించు. తనివితీరా అనుభవించాలని వచ్చాను. నాకా వనాన్ని చూపు. లేదా నేను బలప్రయోగం చేసి అయినా ఆ వన విహారం చేస్తానే గాని ఊరికే తిరిగి వెళ్ళను అని అన్నాడు. అతడి మాటలు వినగానే పర్వతరాజు అంతర్ధానమయ్యాడు.

ఇంతసేపూ మాట్లాడుతునే ఉన్న పర్వతరాజు అంతర్ధానుడు కావడంతో అంధకుడికి కోపం వచ్చి పర్వత శిఖరాలన్నింటినీ విరగకొట్టాడు. వాటి క్రింద పడి అంధకుడి సైనికులు కొందరు నశించారు. దాంతో కోపించిన అంధకుడు మళ్ళీ శిఖరాల్ని విరుగ కొట్టాడు. వాటి క్రిందపడి మరికొందరు రాక్షసులు చనిపోయారు. ఇంతలో ఈశ్వరానుగ్రహం చేత ఆ శిఖరాలన్నీ తిరిగి యథాస్థానంలో మళ్ళీ క్రొత్త శిఖరాలు మొలిచాయి. అంధకుడు కోపంతో ఇలా అన్నాడు, "ఓ పర్వతమా! నువ్వు మోసం చేసి నా సైన్యాన్నంతా చంపుతున్నావు. నీవు పరాక్రమ వంతుడవైతే నాతో యుద్ధానికి రా" అని ఆహ్వానించాడు. అతడి ఆహ్వానాన్నందుకొని పరమశివుడు శూలాన్ని ధరించి వృషభవాహనంపై వాడి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. అతడి వెనకాలే ప్రమథగణాలు కూడా ఉన్నాయి. శంకరుడు త్రిశూలంతో అంధకుడి గుండెల్లో గట్టిగా పొడిచాడు. ఆ తేజస్సుకే అంధకుడి శరీరం భస్మమైంది. ప్రమథగణాలన్నీ రాక్షస సేనల్ని సమూలంగా సంహరించాయి. అంధకుడి మరణంతో లోకాలన్నీ శివతేజస్సులో వెలిగిపోయాయి. దేవతలే కాదు సర్వభూతాలు శంకరుని స్తోత్రం చేశారు.

ఈ కథలో షట్పుర రాక్షసులందర్నీ శ్రీకృష్ణుడు సంహరించగా, బ్రహ్మ వరదానం పొందిన అంధకుడు మాత్రం శివుని చేతిలో మరణం పొందాడు. ఈకథలో మనం గ్రహించాల్సిన నీతి ఏమంటే భగవంతుని ఎదిరించి ఎవరూ బ్రతుకలేరు. అట్లాగే శివకేశవులకు భేదం ఉండదు.

భానుమతీ రక్షణము

(ఈ కథాభాగం హరివంశం విష్ణుపర్వం 90వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు బంధువర్గంతో కలసి సముద్రవిహారం చేస్తూ ఉండగా నికుంభుడనే రాక్షసుడు భానుని పుత్రిక అయిన భానుమతిని మాయోపాయంతో హరించి తీసుకొని పోయాడు. నికుంభుని సోదరుడు వ్రజనాభుడు. అతడి కుమార్తె అయిన ప్రభావతిని ప్రద్యుమ్నుడు మోహించాడు. ఆ ప్రభావతి కూడా ప్రద్యుమ్నుని గాఢంగా కోరుకుంది. అయితే వ్రజనాభుడు వీరి వివాహానికి అంగీకరించలేదు. అందువల్ల ప్రద్యుమ్నుడు వ్రజనాభుణ్ణి సంహరించి ప్రభావతిని అపహరించుకుపోయాడు. తన సోదరుణ్ణి చంపినవానిపై పగబట్టిన నికుంభుడు భానుమతిని మాయోపాయం చేత అపహరించుకుపోయాడు. భానుమతిని రక్షించేందుకు శ్రీకృష్ణుడు అర్జునుని, ప్రద్యుమ్నుణ్ణి వెంట బెట్టుకొని నికుంభుడిపై దండెత్తి వెళ్ళారు.

కృష్ణార్జున ప్రద్యుమ్నులు ముగ్గురూ తనపైకి దండెత్తి వస్తున్నారని తెలుసుకున్న నికుంభుడు తన శరీరాన్ని మూడు భాగాలుగా చేసి ముగ్గురితోనూ ధీటుగా యుద్ధం చేశాడు. అర్జునుడు నికుంభునిపై వాడియైన బాణాల్ని ప్రయోగించాడు. ఆ రాక్షసుడా బాణాల ధాటికి తట్టుకోలేక భానుమతిని తీసుకొని అక్కడ నుండి అదృశ్యమయ్యాడు. ప్రద్యుమ్నుడు మాయోపాయములు తెలిసినవాడు కావడం వలన నికుంభుడున్న చోటును కనిపెట్టి కృష్ణార్జునులతో కలసి నికుంభుడున్నచోటికి చేరుకున్నారు. అర్జునుడు వాడి అయిన బాణాలను నికుంభుడిపై సంధించాడు. ఆ ధాటికి తట్టుకోలేక ఆ దానవుడు ప్రాణరక్షణలో పడి భానుమతిని విడిచిపెట్టి గోకర్ణ పర్వతం పైకి చేరుకున్నాడు. ఆ పర్వతంపైకి దేవతలు దానవులు కూడా అడుగుపెట్టలేరు. ఎందువల్ల నంటే ఆ పర్వత శిఖరాలన్నీ శంకరుని తేజస్సుచే రక్షించబడుతూ ఉంటాయి. దుర్భేద్యమైన ఆ పర్వత శిఖరాల్ని ఎవరూ చేరుకోలేరని నిర్భయంగా ఉన్న సమయంలో ప్రద్యుమ్నుడు భానుమతిని తీసుకొని పోయి ద్వారకానగరంలో ఉంచి తాను తిరిగి కృష్ణార్జునులున్న పర్వత శిఖరాన్ని చేరుకున్నాడు.

ఆ సమయాన కృష్ణార్జునులు నికుంభుని ఒక గుహలో బంధించి ఒక పెద్ద పర్వత శిఖరాన్ని పెళ్ళగించి ఆ బిలద్వారానికి అడ్డుగా ఉంచారు. మహాబలశాలి అయిన ఆ దానవుడు బలంగా ఆ కొండ శిఖరాన్ని కొట్టగా అది విరిగి అర్జునుని హృదయాన్ని తాకింది. దాంతో అర్జునుడి హృదయంపై గాయం అయి పడిపోగా వాడిపైకి ప్రద్యుమ్నుడు విజృంభించాడు. నికుంభుడు తిరిగి ప్రద్యుమ్నుణ్ణి కూడా గదతో గట్టిగా మోది మూర్ఛపోయేట్లు చేశాడు. అర్జున ప్రద్యుమ్నులిద్దర్నీ మూర్ఛపోయేట్లుగా కొట్టడంతో శ్రీకృష్ణుడు కౌమోదకమనే తనగదతో నికుంభుని ఎదుర్కొన్నాడు. శ్రీకృష్ణ నికుంభాసురల యుద్ధం చూసేందుకు దేవేంద్రుడితో సహా దేవతలంతా ఆకాశంలో బారులు తీరి చూస్తున్నారు. దేవతలందరికీ కనువిందు అయ్యేట్లుగా శ్రీకృష్ణుడా కౌమోదకముతో నికుంభుని శిరస్సు వెయ్యి ముక్కలు అయ్యేట్లుగా కొట్టాడు. ఆ దెబ్బకు నికుంభుడు నేలపై పడి మూర్ఛపోయాడు. అయితే ఆ దానవుడు మూర్ఛనుండి తేరుకొని శరీరాన్ని విడిచి మాయోపాయంతో అక్కడనుండి పారిపోయాడు. నికుంభుడు

ప్రాణాలతో పారిపోయాడని గ్రహించి కృష్ణార్జున ప్రద్యుమ్నులు ముగ్గురూ అతణ్ణి వెంబడించారు. ఆ సమయంలో లక్షలాది నికుంభులు ఆకాశం నుండి ఊడిపడ్డారు. వారంతా కృష్ణార్జున ప్రద్యుమ్నుల్ని చుట్టుముట్టారు. ఒక్కొక్క నికుంభుణ్ణి ఛేదిస్తే ఇద్దరేసి నికుంభులు పుట్టుకొచ్చారు. పిమ్మట శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగించి ఆ నికుంభుని సమూలంగా నిర్మూలించాడు. శ్రీకృష్ణుడు అర్జున, ప్రద్యుమ్నులతో కలసి ద్వారకా నగరాన్ని చేరుకున్నారు. వారికి నారదుడు ఎదురు వచ్చి శ్రీకృష్ణునికి స్వాగతం పలికాడు. నారదుడు ఇలా అన్నాడు. భానూదయా! పూర్వం నీకుమార్తె రైవత పర్వతంపై విహరిస్తూ దుర్వాసుని యెడల అపచారం చేసింది. అందుకు దుర్వాసమహర్షి ఆగ్రహించి నీకుమార్తెను శపించాడు. అప్పుడు నేను కూడా అక్కడే ఉన్నాను. నేనూ, ఇతర మునులంతా కలసి దుర్వాసుని స్తోత్రం చేసి ఆ బాలికను అనుగ్రహించమని వేడుకున్నాం. అప్పుడా ముని కరుణించి ఇలా అన్నాడు. నా వాక్కు వ్యర్థం కాదు. అయినా ఈ బాలిక ఒక దుష్టుడికి చిక్కినా నిష్కళంకగా బయట పడుతుంది. తగిన వరుణ్ణి పొంది బహు సంతానవతి అవుతుంది అని అనుగ్రహించాడు. కావున ఈ కన్యను సహదేవునికిచ్చి కళ్యాణం చెయ్యి. అతడు పాండురాజు పుత్రుడు. ధర్మశీలుడు అని చెప్పాడు. భానుమతి తండ్రి అయిన భానువు శ్రీకృష్ణుని అనుమతితో భానుమతిని సహదేవునికిచ్చి వివాహం జరిపించాడు. అంతట భానుమతి సహదేవునితో కలసి హస్తినాపురానికి పోయి చాలాకాలం సుఖంగా జీవించింది.

రుక్మిణీ శ్రీకృష్ణ సంవాదం

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 60వ అధ్యాయం నుండి గ్రహించబడింది. ఇతర పురాణాల్లో కూడా ఈ కథాభాగం ఇదే విధంగా ఉంటుంది. ఇందులోని విశేషార్థాలను వీరరాఘవీయ వ్యాఖ్యానం నుండి గ్రహించబడింది.)

భానుమతీ పరిణయం తర్వాత కొంతకాలం శ్రీకృష్ణుడు ద్వారకలోనే ఉన్నాడు. భగవంతుడు పనీ పాటా లేకుండా వృథా కాలక్షేపం చెయ్యడు గదా. అయితే అతడి మనస్సులో ఏముందో ఎవరికీ తెలియదు. నిర్వ్యాపారంగా ఉన్నట్లు నటిస్తాడు. అంతే. ఉన్నట్లుండి రుక్మిణీ దేవి మనస్సులోని భావాలేమిటో ఆమె నోటిమీదగానే వినాలని సంకల్పించాడు.

రుక్మిణీ దేవి జగదేక సుందరి. అయినా ఆమె అమూల్యమైన రత్నాల్ని, ఆభరణాల్ని ధరించి మరింత దేదీప్యమానంగా ప్రకాశించింది. అంతటి సౌందర్య రాశికి ఈ అలంకారాలు అవసరమా? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. మనుష్యులు, చెట్లు, పుట్టలూ పుణ్యం చేసుకున్నట్లే రత్నాలు ఆభరణాలు కూడా పుణ్యం చేసుకొని ఉంటాయి. అవి ఎంతటి పుణ్యం చేసుకుంటాయో అంతటి యోగ్యమైన శరీరంపైన అలంకరించబడతాయి. భగవంతుడు అవతరించినప్పుడల్లా శ్రీదేవి అవతరిస్తుంది. వారిద్దరూ ఒకరిని విడిచి మరొకరుండరు. వారి సౌందర్యానికి సమానమైనది మరొకటి లేదు. వారిద్దరూ కలసి ఉన్నప్పుడే జగత్తులన్నీ సుఖసంతోషాలతో ఉంటాయి. భగవస్సాన్నిధ్యంలోనే ఆమె ప్రకాశిస్తూ ఉంటుంది. చెలికత్తె చేతిలో నుండి వింజామర తీసుకొని రుక్మిణీ దేవి తానే స్వయంగా స్వామికి సేవ చేస్తోంది.

రుక్మిణీ దేవి సేవలకు పరమ ప్రీతి చెందిన పరమేశ్వరుడు ఆమె కర్ణాభరణాలను, ముంగురుల్ని చూసి మురిసి పోతున్నట్లుగా నటిస్తూ రుక్మిణి దేవితో ముచ్చటలాడాడు. పోతనామాత్యులు ఎలా స్పందించారో చూడండి.

శ్రీకృష్ణుడు:

మ॥ పతియే రూపము దాల్చినందదనురూ7 పంబై సరూపంబుతో
పతి తా నుండెడు నట్టి రూపవతి నా7 చంద్రాస్య నాలక్షి నా
సుతనున్ రుక్మిణి నాయనన్యమతి నా7 శుద్ధాంతరంగం గళా
చతురత్వంబున శౌరి యిట్లనియె జం7 చన్మందహాసంబుతోన్.

సామాన్యార్థం : శ్రీకృష్ణుడు, రుక్మిణీ దేవితో అన్నమాటలివి. ఓ రాజకుమారీ! ఇంద్రుని వంటి ఐశ్వర్యం కలిగినవారు, కీర్తి ప్రతిష్టలు గలవారు, రూపవంతులు, ఔదార్యం గలవారు అయిన రాజాధిరాజులెందరో నిన్ను వివాహం చేసుకోవడానికి ఉవ్విళ్లూరారు. జగదేక సుందరుడైన శిశుపాలుణ్ణి కాదని నాలో ఏమి చూసి నన్ను వరించావు? అని అడిగాడన్నది సామాన్యార్థం.

విశేషార్థం : రుక్మిణీ దేవిగాను, రాజపుత్రికగాను అవతరించిన ఓ లక్ష్మీ! నీ తండ్రి, అన్నగారు నీ బాహ్య సౌందర్యాన్ని మాత్రమే చూసి నీకు తగిన వాడు శిశుపాలుని వంటి రాజులను ఎంపిక చేశారు. నన్ను కేవలం ఓ మానవ మాత్రునిగాను ఓ యాదవునిగానే గుర్తించారే గాని నన్ను పరమాత్మునిగాను, నిన్ను శ్రీమహాలక్ష్మి గాను గుర్తించలేక మోసపోయారు. నువ్వు మాత్రమే నా నిజస్వరూపాన్ని గ్రహించావు. శ్రీమహాలక్ష్మివైన నువ్వు తప్ప మరెవ్వరు నన్ను గుర్తించగలరు? అందువల్లనే తుచ్ఛమైన రాజ్యభోగాల్ని కాదని నన్నే వరించావు. నువ్వు కూడా నీ నిజస్వరూపాన్ని ఎరిగిన దానవు కాబట్టే నన్ను కోరుకున్నావు.

శ్రీకృష్ణుడు : ఓ రుక్మిణీ! జరాసంధుని వంటి రాజులకు భయపడి రాజ్యాన్ని వద్దనుకొని పోయి సముద్రంలో తలదాచుకున్న వాళ్ళం. ఇటువంటి నాబోటి సామాన్యుణ్ణి తెలిసో తెలియకనో వివాహమాడావు గదా! అన్నది సామాన్యార్థం.

విశేషార్థం : రాజభ్యః అభిచ్యాతః అని పద విభాగం చెయ్యడం వల్ల సుభ్రు అన్న పదానికి కరుణించే చల్లని చూపులుగల దానవని తెలుపబడుతోంది. అటువంటి నువ్వు సామాన్య రాజాధములకు భయపడేదానవా? అన్నట్లుందా సంభోదన. అదీకాకుండా నీవివాహ సమయంలో వారి ప్రతాపాలేమిటో నా తేజస్సు ఎటువంటిదో చూపనే చూపాను గదా. వాళ్ళల్లో ఒక్కరైనా నా ఎదుట నిలబడగలిగారా? ఇక సముద్రంలో పోయి తలదాచుకోవడమంటారా? క్షీరసముద్రమే గదా నీకు పుట్టినిల్లు. అందువల్ల క్షీరసాగరంలో పోయి నీ తండ్రిని ఇబ్బంది పెట్టకుండా నీకు ప్రియమైన చోటు గదా అని మరో సముద్రంలో నివాసం ఏర్పాటు చేశాను. అదీకాకుండా నా స్వస్వరూపాన్ని విచారిస్తే నాస్వస్థలం నీళ్ళల్లోనే గదా. అంతేకాని జరాసంధాదులకు భయపడి పారిపోయేవాడిని కానేకాదు. నిజానికి ఇంద్రియ బలాన్ని బలంగా చెప్పుకోవడం అజ్ఞానం. అట్టి ఇంద్రియాలకు లోబడిపోయే వారంటే జితేంద్రియులు కారనే గదా అర్థం. అటువంటి వారికి మేము భయపడ్డామనడం అజ్ఞానం కాదా?

సింహాసనాన్నధిష్ఠించడం తుచ్ఛమైన విషయంగా మేము భావిస్తాం. అందువల్లనే తప్పని సరి అయితే తప్ప ఏ అవతారంలోను మేము సింహాసనాన్ని కోరుకోలేదు.

శ్రీకృష్ణుడు : *శ్లో॥ "అస్పష్ట వర్తమానం--------------యోషితః"*

సామాన్యార్థం : సుందరీ! శాస్త్రస్వరూపం తెలుసుకోకుండా అశాస్త్ర పథంలో నడిచేవారిని ఆశ్రయించుకున్న స్త్రీలు సాధారణంగా దుఃఖాల పాలవుతూ ఉంటారు ఇది సామాన్యార్థం.

విశేషార్థం : వసుదేవుని కుమారుణ్ణయితే క్షత్రియుణ్ణి. నందుని పుత్రుణ్ణయితే వైశ్యుడను. ఈ విషయంలో లోకులకు పలు సందేహాలున్నాయి. కావున నాజాతిని నిర్ణయించడం అంత సులభమైన విషయం కాదు. జాతిని నిర్ణయించి చెప్ప లేనప్పుడు మా ఆచారాలిట్లాంటివని ఎట్లా చెప్పగలం? ఎంతటి వారికైనా ఇది సాధ్యం కాదుసుమా! నేను లోకులు అనుసరించే కర్మ మార్గాన్ని అనుసరించేవాణ్ణి కాదని తెలుసుకో. అటువంటి మమ్ము ఆశ్రయించే స్త్రీలు కష్టాలపాలవుతారు. ఎంతో కృషి చేస్తేనే గాని తెలుసుకోలేరు. "పుంసామస్మాకమ్" అని అన్వయించుకోవాలి. అయినా మళ్ళీ మళ్లీ అటువంటి కష్టాలను పొందరని సారం.

శ్రీకృష్ణుడు : *శ్లో॥ నిష్కించనా ----------సుమధ్యమ్."*

సామాన్యార్థం : మేము బీదవాళ్ళం కనుకనే బీదవాళ్ళంతా మమ్మల్ని ఆశ్రయిస్తారు. ధనవంతులు మా చుట్టు ప్రక్కలకు కూడా రారు.

విశేషార్థం : భోగాలను అనుభవించని వారిని నిష్కించనులు అని అంటారు. అటువంటి వారే మమ్మల్ని ఆశ్రయిస్తారు. కులం చేతగాని, ధనంచేతగాని మదించిన వాళ్ళెవరూ మా దగ్గరకు రారు. అనగా సుఖానుభవాల్నే కోరుకునేవారు మమ్మల్ని ఆశ్రయించరు. అనగా కోరికలన్నీ తీరిపోయి, వైరాగ్యం కలిగిన వాళ్ళే మమ్మల్ని ఆశ్రయిస్తారని భావం.

శ్రీకృష్ణుడు : *శ్లో ॥ యయోరాత్మ సమం -------------క్వచిత్ "*

సామాన్యార్థం : రుక్మిణీ! లోకంలో కులం, ధనం, చక్కదనం అన్నీ సమృద్ధిగా ఉన్నవాళ్ల మధ్యనే వివాహాలు అనుకూలంగా ఉంటాయి. అట్లాకాకుండా వారికన్నా ఉత్తములైనా, అధములైనా ఆ వివాహ బంధం సుఖంగా నడవదు.

విశేషార్థం : ఓ రుక్మిణీ! వియ్యానికైనా కయ్యానికైనా సమ ఉజ్జీలుగా ఉండాలంటారు. అందువల్ల శిశుపాలాదులతో వివాహం నీకు తగింది కాదు. లోకులు నన్ను భగవంతునిగా గుర్తించలేకపోయినా, నీ పూర్వ జన్మల సుకృత ఫలాల వలన నువ్వు నన్నే కోరుకున్నావు. ఈ భావాన్ని గ్రహించిన పోతనగారిలా వ్రాశారు.

సీ॥ లోకుల నడవడిలోని వారము కాము పరులకు మాజాడ బయట పడదు
బలమదోపేతులు పగ గొంద్రు మాతోడు రాజపీఠములకు రాము తఱచు
శరణంబు మాకు నీ జలరాశి సతతంబు నిష్కించనుల మేము నిధులు లేవు
కలవారు చుట్టాలు గారు నిష్కించన జన బంధులము ముక్త సంగ్రహులము

ఆ॥ *గూఢ వర్తనులము గుణహీనులము భిక్షు । లైన వారిcగాని నా్రశయింప*
మిందుముఖులు దగుల లిటువంటి మముబోcటి । వారినేల దగల వారిజాక్షి

క॥ *సిరియను వంశము రూపును । సరియైన వివాహ సఖ్య సంబంధమ్ముల్*
జరుగును సరికాకున్నను । జరుగవు లోలాక్షి మెట్టి సంసారులకున్

శ్రీకృష్ణుడు :

శ్లో॥ వైదర్భ్యేతదలిజ్ఞాయా ------------------భిక్షుభిశ్ల్యాఘితాముధా"

సామాన్యార్థం : రుక్మిణీ! నేను ధనహీనుణ్ణి కాబట్టి సామాన్యులెవరూ నన్ను గౌరవించరు. గుణహీనులు భిక్షువులు మాత్రమే నా చుట్టూ చేరుతారు. అట్టి నాలో ఏంచూసి వరించావు.

విశేషార్థం : "త్వయా దీర్ఘ సమీక్షాయా" అని పద విభాగం. విదర్భీ! నువ్వు మూల ప్రకృతివని తెలుసుకోలేని శిశుపాలాదులు నిన్ను కోరుకున్నారు. పుట్టుక చేత మాత్రమే నువ్వు మానవ కాంతగా పరిగణించబడుతున్నావేగాని, ఆత్మ చేతకాదు. అందువల్లనే మానవావతారంలో ఉన్న నన్ను పరమాత్మగా గుర్తించగలిగావు. నిరాకారుడనైన నాకు రూపాన్నిచ్చి లోక కళ్యాణం చెయ్యాలని సంకల్పించావు. నువ్వే ప్రక్కన లేకపోతే నేను ఏమీ చెయ్యలేను. నువ్వు ప్రక్కన ఉంటేనే గుణాతీతుడనైనా నీతో కలసి సగుణుడిగా ఉంటాను. ఈ కారణంగానే నారదాది మహర్షులంతా నన్ను కీర్తిస్తూ ఉంటారు. వారట్లా కీర్తించడంలో ఫలాపేక్ష ఏమీ ఉండదు. అందువల్లనే వారంతా జ్ఞానులయ్యారు.

శ్రీకృష్ణుడు : *శ్లో॥ అథ్మానో7 ------------------ లప్స్యసే "*

సామాన్యార్థం : రుక్మిణీ! అయిందేదో అయిపోయింది. ఇప్పుడైనా నీకు తగిన వాణ్ణి చూసి ఎన్నుకో. అందుమూలంగా నువ్వు ఇహ పరసుఖాలన్నీ పొందగలుగుతావు.

విశేషార్థం : వీరరాఘవీయంలో "పురుషర్షభామ్" అన్న చోట "క్షత్రియర్షభమ్" అని గ్రహించారు. రుక్మిణీ! నీకు సర్వాధికారాలు ఇచ్చి నేను నీకు లోబడి ఉన్నాను. అనగా సృష్టి స్థితి లయములందు నువ్వే సర్వాధికారివని భావం. నువ్వే మూల ప్రకృతివన్న మాట గుర్తు పెట్టుకొని పురుషోత్తముడనైన నన్నే సేవిస్తూ ఉండు. ఇహలోకంలో నాతో కలసి ఉంటూ ప్రళయకాలంలో నాలో ఐక్యమై పో.

శ్రీకృష్ణుడు : శ్లో॥ చైద్య సాల్వ జరాసంధ ------------సతామ్ "

సామాన్యార్థం : ఓ రుక్మిణీ! చైద్య, సాల్వ జరాసంధ, దంతవక్రుడు మొదలైన వారంతా నన్ను ద్వేషిస్తూ ఉంటారు. ధనబల మదాంధుడైన నీ అన్న రుక్మి కూడా నన్ను ద్వేషిస్తాడు. తమకన్నా బలాఢ్యులు లోకంలో ఎవరూ లేరని అనుకుంటూ ఉంటారు. వాళ్ళ అహంకారం అణచాలనే నిన్నిక్కడకు తీసుకొని వచ్చాను. దుర్మార్గుల్ని శిక్షించడమే కదా నాపని.

విశేషార్థం : శిశుపాలాదులంతా ధర్మాన్ని కాలదన్ని ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు. లోకంలో ఇటువంటి వారంతా ఎక్కువై భూభారం పెరిగి పోతోంది. వీరంతా అజ్ఞానంతో కళ్ళుమూసుకు పోయి ప్రవర్తిస్తున్నారు. వీళ్ళంతా నన్ను ద్వేషించడమే పనిగా పెట్టుకొని రాత్రింబవళ్ళు నన్నే స్మరిస్తూ ఉంటారు. అటువంటి వారందర్నీ హతమార్చి వారందర్నీ నాలో విలీనం చేసుకోవడానికే అవతరించాను.

చివరగా వారిని తుదముట్టించి వారందర్నీ నాలో విలీనం చేసుకోవడమే నా ధ్యేయం. నువ్వు నా ప్రక్కన ఉంటేనే నేనీ పనులన్నీ చెయ్యగలుగుతాను. అందువల్లనే నేను నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చాను.

శ్రీకృష్ణుడు : *శ్లో॥ ఉదాసీనా ---------------క్రియాః"*

సామాన్యార్థం : రుక్మిణీ! వనితా విత్తాల్లో గానీ మరే ప్రలోభాలపైన గాని మాకు ఆశలేదు. ఆత్మ లాభమే నా తత్త్వం. **తేజస్సు వలె క్రియాశూన్యుణ్ణి.**

విశేషార్థం : దేహభ్రాంతి గాని, మరే ఇతరములపైన ఆసక్తి లేని వాడిని. ఉదాసీనంగా అంటీముట్టనట్టుంటాను. దీపం తన వెలుతురు చేత కార్యాలు చేయిస్తుందే కాని తానుగా చెయ్యదు. సాక్షీభూతుణ్ణి. ఆత్మానుభవం చేత పూర్ణుడను. ఏకోరికలు లేనివాడను. నా సాన్నిధ్యంలో నువ్వు చేసే ప్రతిపనీ సాక్షిగా చూస్తూ ఉంటాను. జ్యోతి స్వరూపుణ్ణి అని చెప్పడమే ఇందులోని సారాంశం.

పై సంభాషణల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఇందులో ఒక్క వాక్యం కూడా కాముక పరమైనది కనిపించదు. సంభాషణ మంతా రుక్మిణియే లక్ష్మీదేవి అని, మహా ప్రకృతి అని మనం తెలుసుకోవాలి. శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని జారుడని, చోరుడని అనడం కన్నా పెద్ద పాపం మరొకటి ఉండదు. ఈ మాటల్నే ప్రేమతోను, భక్తితోను అంటే కృష్ణ భక్తులు ఆనందిస్తారు. కృష్ణ భక్తులు ఆనందిస్తే కృష్ణుడు ఆనందించినట్లే గదా.

శ్రీకృష్ణుడు మాట్లాడిన అప్రియములైన మాటలన్నీ రుక్మిణి శ్రద్ధగా విన్నది. ఆశ్చర్యపోయింది. శ్రీకృష్ణుడు త్రిభువన నాయకుడు. ఆత్మేశ్వరుడు. అటువంటి జగన్నాథుడు ఇటువంటి మాటలు ఎన్నడూ అనలేదు. తాను వినలేదు. దాంతో రుక్మిణీ దేవి దుఃఖంతో శరీరం అంతా వణికిపోయింది. కళ్ళవెంట నీరు ధారలు కట్టింది. ఇంతకాలం శ్రీకృష్ణుడు తనను ప్రేమగా లాలించడం జగన్మాతగా గుర్తించి గౌరవించడమే ఎరుగును. గాని ఇటువంటి మాటలు శ్రీకృష్ణుని నోట వినాల్సి వస్తుందని కలలోనైనా ఊహించలేదు.

అంతట శ్రీకృష్ణుడు దుఃఖంతో విలపిస్తున్న రుక్మిణిని దగ్గరకు తీసుకున్నాడు. ముంగురుల్ని సరిదిద్దాడు. కన్నీటితో తడిసి ముద్దయిన వక్షఃస్థలాన్నంతా తుడిచి శుభ్రం చేశాడు. ఊరడింపు మాటలు చెప్పి స్త్రీలను 'స్వాంతన పరచడంలో దిట్ట అయిన శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. విదర్భ రాజకుమారీ! నా పై కోపగించుకోవద్దు. నువ్వు నన్నెంత గాఢంగా ప్రేమిస్తున్నావో నేనెరుగుదును. నాపై నీకేపాటి అనురాగం ఉందో నీనోటితోనే వినాలనే కుతూహలంలో అలా అన్నానే గాని, నిన్ను శంకించిగాదు. ప్రణయ కలహాల్లో స్త్రీలు కనుబొమలు ముడిచి, గుండెలెగసి పడేట్లు ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని విడుస్తూ, గోముగా క్రీగంట చూస్తూ ఎంతో మనోహరంగా కనిపిస్తారు. అటువంటి అనుభవం పొందాలనే కాంక్షతోనే నిన్ను ఈమాత్రంగా నొప్పించాల్సొచ్చింది. ఈ పాటి ప్రణయ కలహాలు గృహస్థులకు పరమ లాభమని రసికులంటారు. మన ఇద్దరి మనోభావాలు ఒక్కటే నని నేనెరుగుదును. కావున దుఃఖం మాని నన్ను అనుగ్రహించు.

పరమేశ్వరుడీవిధంగా ఓదార్చగా భర్త మనస్సును అర్థం చేసుకుంది. దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వింది. హృదయం అలలా ఆనందంతో నిండిపోయింది. అయినా సిగ్గు పడుతూ తాను కూడా పరమేశ్వరునికి దీటుగా ఇలా అంటోంది.

రుక్మిణి : *శ్లో॥ నన్వేత దేవ -----------గుణ ప్రకృతిరజ్ఞగృహీ తపాదా"*

సామాన్యార్థం : కలువ రేకుల వంటి కన్నులు గలవాడా! ఏ విషయంలోను నీతో సరితూగని నన్నెందుకు వరించావు? అని నిలదీసి అడిగావు గదా? అవును ఆ మాట నిజమే. బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే సృష్టించిన వాడవు. నీ స్వంత తేజస్సుతో వర్ధిల్లే అద్వితీయుడవు. అటువంటి నువ్వెక్కడ? అవిద్యాపరురాలను, గుణాతీతురాలనైన నేనెక్కడ?

విశేషార్థం : "త్ర్యధీశః " అనగా త్రిలోకనాయకుడా! అని. "గుణ ప్రకృతిః" అనగా నీ గుణాలను అనుసరించి నడచుకునే స్వభావం గలదానను అని వీరరాఘవ వ్యాఖ్యానంలో అర్థం చెప్పారు. కమలరేకులవంటి నేత్రములు గలవాడా! చక్కటి మాటలు చెప్పావు. గుణాల విషయానికొస్తే నీకు నాకూ తూర్పు పడమరలకున్నంత వ్యత్యాసం ఉంది. నువ్వేమో నిర్గుణుడవు. నేనా సగుణను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడా ప్రకృతికి అధీనులే. అనగా నాకు లోబడినవారు. మరినువ్వో స్వాత్మారాముడవు. ఎప్పుడూ ఆత్మానందం అనుభవిస్తూ ఉండే అద్వైత పరబ్రహ్మానివి. నువ్వేమో ఆజ్ఞాపించేవాడవు. నీ ఇచ్ఛాశక్తినైన నేనేమో నీ ఆజ్ఞల్ని పాలించేదానను. అనగా సృష్టి స్థితి లయములను నీ ఆజ్ఞానుసారం చేస్తూ ఉంటాను. అజ్ఞానులు సగుణనైన నన్ను ఆరాధిస్తూ ఉంటారు. నువ్వో గుణాతీతుడవు. కావున నేను నీతో ఏ విషయంలోను సమానురాలను కాను.

రుక్మిణి : *శ్లో॥ సత్యం భయాదివ ---------విధుతం తమోంధమ్ "*

సామాన్యార్థం : మదబలాంధులైన రాజులకు భయపడి సముద్రంలో తల దాచుకున్నానని అన్నావు. ఆ మాట నిజమే. ఎందువల్ల నంటే, నీ భక్తులైన వారెవ్వరూ తుచ్ఛమైన రాజ్యాన్ని కోరుకోరు. అటువంటిది నువ్వు కోరుకుంటావా? అగనా చైతన్య ప్రభువువై ఆత్మస్వరూపుడవై అగాధములైన సాగర జలాల్లో ఉంటూ ఉంటావు.

విశేషార్థం : "సముద్రము పలంఛన మాత్ర ఆత్మా" అని వీర రాఘవీయ వ్యాఖ్యానంలో వ్రాశారు. కృష్ణా! నువ్వు ఎప్పుడూ ఏ పని ఎందుకు చేస్తావో తెలుసుకోవడం ఎవరితరమూ కాదు. శబ్దాలకు అతీతంగా నిశ్చల సముద్రంలో ఉండేందుకు నువ్వే సంకల్పించుకున్నావు. అనగా నిశ్చల ప్రకాశకుడవని, చైతన్యముచే ఘనమైన ఆత్మగలవాడవని భావం. భక్తులు నీకొక రూపాన్ని కల్పించుకొని ధ్యానిస్తూ ఉంటారే కాని నీకొక రూపమెక్కడిది? కన్ను మిన్ను కానక బలబదాంధకారంతో విర్రవీగే రాజ్యపదాన్ని ఇంద్రియ నిగ్రహులైన నీభక్తులైన వారెవ్వరూ కోరుకోరు. అనగా నీ దాస్యాన్నే కోరుకుంటారు. కావున నీవు అన్న ఈ మాట నిజమేనని రుక్మిణీ దేవి భావం.

రుక్మిణి : *శ్లో॥ త్వత్పాదపద్మ ------------ భవంతమ్*

సామాన్యార్థం : పరమేశ్వరా! నీ పాద దాస్యం పొందిన నీ భక్తులు కూడా నీ తత్త్వాన్ని అర్థం చేసుకోలేరు. ఇక మానవ మాత్రులకు సాధ్యమా?

విశేషార్థం : "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః " అని శ్రుతి వాక్యం. సర్వత్రా వ్యాపించి ఉండే నీతత్త్వం నీ భక్తులైన మహర్షులకే సాధ్యంకాదు. ఇక పశుప్రాయులైన మానవులకు సాధ్యమా? ఆచార స్వరూపమేమిటో తెలియనివారు, అశాస్త్రీయంగా బానిస బ్రతుకులు వెళ్ళదీసే సామాన్య స్త్రీలు కష్టాలతో జీవితం వెళ్ళదీస్తారని నీవు అన్నమాట యదార్థమేనని రుక్మిణీ దేవి భావం.

రుక్మిణి : *శ్లో॥ "నిష్కించనో -------- తుభ్యం "*

సామాన్యార్థం : నువ్వు ధనహీనుణ్ణని అన్నావు. మహాత్మా! నీకంటే రెండో వస్తువు లేదు కాబట్టి నువ్వన్న మాట నిజమే. లోకులందరిచే పూజలందుకునే బ్రహ్మాది దేవతలే నీకన్నా వేరే దైవం లేదని నిన్ను సేవిస్తూ ఉంటారు. అయితే శక్తి సంపన్నులమని విర్రవీగే ఇంద్రియ లోలురు మాత్రం నిన్ను గూర్చి అణువంత కూడా తెలుసుకోలేరు.

విశేషార్థం : "పూర్ణ మిదః -----------పూర్ణమే వావశిష్యతే " అని శ్రుతి వాక్యం. అనగా నువ్వు కానిది ఈ లోకంలో ఏదీ లేదు. కావున నువ్వు నిష్కించన స్వరూపుడవే. బ్రహ్మాది దేవతలంతా నీకిష్టులే. అట్లాగే వారందరికీ నీవు ఇష్టుడవు. అందువలన నిన్ను నీవు "నిష్కింజన ప్రియుడన" ని చెప్పుకోవడం సబబుగానే ఉంది. ఇంకోమాట. ధనికులు నిన్ను పూజించరన్నావు. అదీ నిజమే. ఎందువల్ల నంటే ధనమదాంధులు కావడం వలన నీ అంతరంగాన్ని తెలుసుకోలేరు. అటువంటి నువ్వు నిష్కించనుడవు కాక ధనవంతుడవెలా అవుతావు?

రుక్మిణి : *శ్లో॥ "త్వం వై ------------- స్సుఖ దుఃఖినోర్న "*

సామాన్యార్థం : సర్వేశ్వరా! నువ్వు పురుషార్థాలన్నింటికి ప్రభువ్వి. సర్వఫలాలను ప్రసాదించేవాడవు. పండితులైన వారు నీకోసం సర్వాన్ని త్యాగం చేస్తారు. పురుషులు నీతో పెట్టుకొనే సంబంధమే ఉత్కృష్టమైనది. లౌకికమైన సుఖదుఃఖాలతో, పరస్పర సంబంధాలతో మునిగిపోయిన స్త్రీపురుషులకు నీతో సంబంధాలుండవు.

విశేషార్థం : "ఏతస్యై ----------వ్యజానాత్" అని శ్రుతి వాక్యం ప్రకారం నువ్వే ఫలాత్మకుడవు. సౌందర్యరూపుడవు. పురుషార్థాలనిచ్చేవాడవు. పురుషార్థాలన్నీ నీ వికారాలే అని రుక్మిణి భావం. నీ దాస్యాన్ని కోరిన బుద్ధిబంతులు సర్వాన్ని త్యాగం చేస్తారు. ప్రభూ! నీకు అటువంటి వారితోనే సేవ్య సేవక సంబంధాలుంటాయే కాని సంసార కూపంలో మునిగి తేలే వారితో కాదు. అటువంటి సేవకుల్లో నేనొకర్తెను. అందువల్లనే నీతో నాకు సంబంధం కుదిరింది. మన ఈసంబంధం ఈనాటిది కాదు. అనాదిగి వస్తోందని రుక్మిణి మనోగతం.

రుక్మిణి : *శ్లో॥ త్వం న్య ------------కుతో7 న్యే "*

సామాన్యార్థం : నువ్వు జగత్తులన్నింట్లోను అంతర్యామిగా ఉండేవాడివి. నిన్ను ఎవరైతే సేవిస్తారో వారికి ఆత్మార్పణం చేసుకుంటావు. దండాన్ని విసర్జించిన సన్యాసులందరికీ నీ మాహాత్మ్యం తెలుసు. నశించే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు మున్నగు దేవతలందర్నీ కాదని నిన్ను వరించాను.

విశేషార్థం : పరమేశ్వరా! నువ్వు గుణహీనులు, భిక్షువులచే మాత్రమే గౌరవించబడుతానని అన్నావు గదా. అవును అది సత్యమే. నువ్వు లోకాలన్నింటికీ ఆత్మ స్వరూపుడవు. ఆత్మలను ప్రసాదించేవాడవు. అనగా బ్రహ్మాండాలన్నింటిలోనూ ఉంటూ ఉంటావు. సకల భూతాత్మకుడవని సారం. కనుకనే సంసారాన్ని త్యజించిన సన్యాసులు మాత్రమే నీ దాస్యాన్ని కోరుకుంటారు. అంతటి మహితాత్ముడవని గ్రహించాను కాబట్టే నువ్వు కావాలని కోరి వివాహం చేసుకున్నాను. బ్రహ్మాది ముక్కోటి దేవతలుండగా నన్నే ఎందుకు వరించావని అడుగుతావేమో? నువ్వు కనురెప్ప వేసేంతకాలంలోనే వారు వారి యశస్సు కూడా నశించిపోతాయి. అటువంటి అల్పుల్ని ఆశ్రయించిన వారిగతేమవుతుందో వేరే చెప్పాలా? అంతేకాకుండా మనకున్న సంబంధం అనాదిగా వస్తోంది. అన్నీ తెలిసికూడా నన్నెందుకు ఇట్లా పరీక్షిస్తున్నావు? ఇదీ రుక్మిణీదేవి మనోగతమని మనం గ్రహించాలి.

రుక్మిణి : *శ్లో॥ జాడ్యం ---------------ప్రసన్నః"*

సామాన్యార్థం : కృష్ణా! సింహం ఇతర ప్రాణుల్ని సంహరించినట్లు నీ ధనుస్సు వింటినారి చేసిన శబ్దానికే జరాసంధాదులందర్నీ పారద్రోలి నన్ను తీసుకొని వచ్చావు గదా. అటువంటిది, ఆ అల్పులకు భయపడి సముద్రంలో తలదాచుకున్నాననడం ఏమైనా బాగుందా? ఈ ఘట్టంలో పోతనగారు ఇలా వ్రాశారు.

చ॥ నిను వరియించినం బెలుచనీరజ లోచన శార్ఙ్గ సాయకా
సనని సదంబులన్ సకల శత్రు ధరాపతులన్ జయించి బో
రనఁ బసుకోటిఁ దోలు మృగరాజు నిజాంశము భూరి శక్తిఁ గై
కొనిన విధంబునన్ నను నకుంఠిత శూరతఁ దెచ్చి తీశ్వరా.

విశేషార్థం : పరమేశ్వరా! నువ్వు జరాసంధాది రాజులకు భయపడి సముద్రంలో దాక్కున్నావనే వాళ్ళంతా అజ్ఞానులు. ఏకఛత్రాధి పత్యమైన సామ్రాజ్యాలన్నింటినీ తృణప్రాయంగా విడిచిపెట్టి నీ పాదసేవయే పరమ భాగ్యమని వచ్చిన పృదు చక్రవర్తి, భరతుడు, యయాతి, గయుడు మొదలైన భూపాలురంతా ముక్తి పథాన్ని పొందారే గాని కీడు పొందలేదే? సాధువులు, మహర్షులు నిన్ను కీర్తించి ముక్తిని పొందలేదా? కాబట్టి ఇహపరాలలో కోరికలన్నీ తీర్చగల జగదీశ్వరుడవని నమ్మి, నిన్ను కోరి వివాహం చేసుకున్నాను. మహాత్మా! నువ్వు చెప్పిన శిశుపాలాది రాజులందరూ ఐహిక సంపదలకు ప్రాధాన్యమిచ్చేవారే. వారిని కోరుకునే స్త్రీలు కూడా అదే కోవకు చెందిన వారవుతారు. కావున ఓ కమలాక్షా! నాపై కరుణించి నీ పాద పద్మాలపై నాకు అనురాగం ఎల్లప్పుడూ ఉండేట్లుగా అనుగ్రహించు. లోకకళ్యాణానికే నీవు రజోగుణాన్ని ఆపాదించుకొని నన్ను తీసుకొని వచ్చిన రోజే నాపై నీకు అనుగ్రహం కలదని గ్రహించాను.

రుక్మిణీ దేవి మాటలు విన్న శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. సాధ్వీమణీ! ఈ రహస్యార్థాలన్నీ నీ నోట వినాలనే నిన్నావిధంగా పరిహాసం చేశాను. నేను ఎన్నెన్ని పరుషవాక్యాలు పలికినా నీకుగల భర్తృవాత్సల్యం కొంచెం కూడా తరిగిపోలేదు. పైపెచ్చు ఇంకా దృఢతరమైంది. నీ పాతివ్రత్యం స్పష్టమైంది.

సుభద్రా పరిణయం

(ఈభాగం శ్రీమహాభారతం ఆది పర్వం నుండి గ్రహించబడింది)

పాండవులు హస్తినాపురంలో ఉన్నంత కాలం కౌరవులు వారికి ఏదో ఒక కష్టాన్ని కలిగిస్తూనే వచ్చారు. అయితే విదురుడు భీష్ముడు వారిని కంటికి రెప్పలా కాపాడేవారు. ద్రోణ, ద్రౌణి కృపాదులు కూడా నిష్పక్షపాతంగా ఉన్నట్లు నటిస్తున్నా సమయం వచ్చినప్పుడల్లా పాండవ పక్షపాతుల్లాగానే వ్యవహరించే వారు. భీష్ముడు కౌరవ పాండవుల మధ్య జ్ఞాతి వైరం చల్లారేట్లుగా లేదని గమనించాడు. అందువల్ల పాండవుల్ని ఇంద్ర ప్రస్థ పురానికి తరలించి ధర్మరాజునా ప్రాంతానికి రాజుగా చేశాడు. ధర్మరాజు తమ్ములతో కలసి ప్రజారంజకంగా పరిపాలించాడు. కొంతకాలం ఈవిధంగా సాగిపోయింది. పాండవులు అట్లాగే సుఖసంతోషాలతో గడిపేస్తూ ఉంటే ఇక వారి అవతారానికి ప్రయోజనం ఏముంటుంది. పాండవులు కష్టాలు అనుభవించేందుకు తద్వారా భూభారాన్ని తగ్గించి ధర్మాన్ని కాపాడటమే వారి అవతార ఫలం. ధర్మం నిలబడితేగాని సాధుజనులు నిలువలేరు. లోకంలో సాధుజనుల సంఖ్య అధికమైతేగాని అదిలోకమని అనిపించుకోదు. భగవంతుడు కూడా ధర్మాన్ని పరిరక్షించేందుకే తన నిర్గుణ తత్త్వాన్ని విడిచిపెట్టి సగుణుడవుతాడు. అదే ధర్మానికున్న మహిమ, ఔన్నత్యం, సామర్థ్యం.

"యదా యదాహి ---------- మావేతి సోఽర్జున "

అన్న పై గీతావాక్యాలు కూడా ఈ అర్థాన్నే బోధిస్తున్నాయి. అనగా ధర్మం ఎప్పుడెప్పుడు నశించి అధర్మం పెచ్చు పెరిగి పోతుందో అప్పుడల్లా నన్ను నేను సృష్టించుకుంటాను. సాధువుల్ని రక్షించేందుకు, దుష్టుల్ని శిక్షించేందుకు, ధర్మాన్ని స్థాపించేందుకు నేను ప్రతియుగంలోనూ అవతరిస్తూనే ఉంటాను. అర్జునా! నా ఈ యథార్థ తత్త్వాన్ని ఎవడు తెలుసుకుంటాడో అతడు మరణానంతరం పునర్జన్మ పొందడు. ముక్తిని పొందుతాడని భావం.

ధర్మరాజు ఈవిధంగా రాజ్యం పాలిస్తూ ఉండగా పిలువని పేరంటంగా నారదుడు వచ్చాడు. ధర్మరాజాదులు ఆయన్ను గౌరవించి, సత్కరించి యోగక్షేమాలు విచారించాడు. మహాభారత కథకు నారదుడు ఇక్కడే నాందీ ప్రస్థావన పలికాడని పెద్దలంటారు. నారదుని వంటి మహాత్ములు ఎన్నడూ చుట్టం చూపుగా రారు కదా. నారదమహర్షి రాక విని ద్రౌపది కూడా వచ్చిమునికి నమస్కరించి వెళ్ళింది. ఆమె వెళ్ళిన తర్వాత ధర్మరాజుతో నారదుడు ఇలా అన్నాడు.

శ్లో ॥ పాంచాలీ భవతా ----------నీతిర్విధీయతామ్ "

ధర్మరాజా! మీ ఐదుగురికీ ఈమె ఒక్కతే కదా ధర్మపత్ని. ఈమె విషయంలో మీలో మీకు ఇప్పటికిప్పుడు ఏవిభేదాలు ఉండకపోవచ్చు. కానీ ముందు ముందు రావని ఎవరు చెప్పగలరు? అందువల్ల మీలో మీరే ఏదో ఒక కట్టుబాటు పెట్టుకోండి. ఆ నియమాన్ని ఎవరూ అతిక్రమించ రాదని అట్లా మీరితే దానికి తగిన ప్రాయశ్చిత్తం "ఇది" అని ఒకమాట అనుకోండి. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలుకదా. నారదుని మాటలు ధర్మరాజుకు న్యాయ సమ్మతంగా ఉన్నాయనిపించింది. అన్నదమ్ములందర్నీ పిలిచి ద్రౌపది ఒక్కరి ఇంట్లో ఒక్కొక్క సంవత్సరం ఉంటుందని,

ఆ సమయంలో మిగిలిన వాళ్ళెవరూ ఆ యింటికి పోరాదని, అట్లా పోయినట్లైతే ఒక సంవత్సరం పాటు తీర్థయాత్రలు చేసిరావాలని నిర్ణయించుకున్నారు.

శ్లో॥ "సమక్షం తస్య ------ఇష్టదేశం మహామునిః"

(మహాభారతం - ఆది పర్వం, 203వ అధ్యాయం 29,30శ్లోకాలు, ఈ శ్లోకంలో పన్నెండు సంవత్సరాలని ఉండగా, నన్నయ గారు పన్నెండు నెలలు తీర్థయాత్రలు చెయ్యాలని వ్రాశారు.)

ఉపదేశం చేసి నారదముని తనదారిన తాను వెళ్ళాడు. ఒకానొక రోజున ఒక బ్రాహ్మణుడు రోదిస్తూ అర్జునుని వద్దకు వచ్చి "రాజా! నా గోవును ముష్కరుడెవడో దొంగిలించుకొని పోతున్నాడు. బ్రాహ్మణుని గోధనం దొంగిలించబడుతూ ఉంటే రాజు ఉపేక్షించి ఊరుకోరాదు. వెంటనే ఆ దొంగను శిక్షించి నా గోవును నాకు ఇప్పించు" అని వేడుకున్నాడు. అర్జునుడు వెంటనే వెళ్ళి గాండీవాన్ని తీసుకునేందుకు ఆయుధాగారానికి వెళ్ళాడు. వెళ్ళే దారిలో అప్పుడు ద్రౌపది ఉంటున్న ఇంటిమీదుగా వెళ్ళాల్సి వచ్చింది. దొంగను శిక్షించి వచ్చి అర్జునుడు గోవును బ్రాహ్మణునికి ఒప్పచెప్పాడు. ఆ తర్వాత ధర్మరాజు వద్దకుపోయి ఇలా అన్నాడు. ధర్మరాజా! బ్రాహ్మణుని గోధనాన్ని కాపాడేందుకు గాండీవం కోసం వెళ్ళాను. ఆ సందర్భంలో మీరు, ద్రౌపది ఉన్న ఇంటిని దాటి వెళ్ళాల్సి వచ్చింది. అందువల్ల మన ఒప్పందం ప్రకారం పన్నెండు నెలలు తీర్థయాత్రలు చేసి వస్తాను. అనుమతి ఇవ్వవలసింది." అన్నాడు. అందుకు ధర్మరాజు "అర్జునా! నువ్వు కావాలని ఒప్పందాన్ని అతిక్రమించలేదు. ఒక బ్రాహ్మణుని కాపాడేందుకే అట్లా చేశావు. అది పుణ్య కార్యమేగదా. అందువల్ల నువ్వా నియమం పాటించాల్సిన అవసరం లేదు. తీర్థయాత్రల ఆలోచన విరమించుకో" అన్నాడు. అందుకు అర్జునుడు "ధర్మరాజా! మనమే నియమ భంగం చేస్తే లోకులకు అధర్మం నేర్పినట్లుకాదా? అందువల్ల నేను నియమాన్ని పాటించక తప్పదు" అన్నాడు.

ఈవిధంగా అన్నగారి అనుమతి తీసుకొని అర్జునుడు తీర్థయాత్ర చేస్తూ గోకర్ణ క్షేత్రంలో కొన్నాళ్ళుండి మహాదేవుని ఆరాధించాడు. ఆతర్వాత పశ్చిమ దేశయాత్రలు చేస్తూ ద్వారకానగర సమీపానికి చేరుకున్నాడు. అక్కడకు చేరుకోగానే శ్రీకృష్ణుని దర్శించుకుపోవాలనే కోరిక కలిగింది. దాంతోపాటే సుభద్ర కూడా అతడి మనస్సులో మెదిలింది. ఆమె అందచందాలన్నీ స్మృతి పథంలోకి వచ్చాయి. ద్వారకను సందర్శించాలన్న కోరిక దృఢతరమైంది. వెంటనే శ్రీకృష్ణుని మనస్సులోనే ప్రార్థించాడు. ద్వారకలో తన్నెవరూ గుర్తించకుండా ఉండేందుకు వేషం మార్చి పోవాలనుకున్నాడు. యాదవులంతా యతీశ్వరులంటే ప్రాణం ఇస్తారు. అందువల్ల కాషాయ వస్త్రాలు ధరించి యతి రూపంలో ద్వారకలో ప్రవేసించాలనుకున్నాడు.

సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడీ విషయాన్ని తెలుసుకున్నాడు. ప్రియమిత్రుడికి సహాయం చేసేందుకు ప్రభాస తీర్థానికి వెళ్ళాడు. పరమాత్ముని చూడగానే అర్జునుడు తనకోరిక నెరవేరిందని ఆనందంతో శ్రీకృష్ణునికి నమస్కరించి ఇలా అన్నాడు. కృష్ణా! మా అన్నదమ్ములం చేసుకున్న నియమాన్ని నేను ఉల్లంఘించాల్సి వచ్చింది. అందువల్ల నేనిప్పుడు తీర్థయాత్రలు చేస్తూ నిన్ను చూడాలనిపించింది.

అట్లాగే సుభద్రను కూడా చూసి పోవాలని నిన్ను స్మరించానో లేదో నీ దర్శనమైంది." అన్నాడు. అర్జునుని మాటలకు శ్రీకృష్ణుడెంతో సంతోషించాడు. తనవెంట ద్వారకకు తీసుకొని పోయి రైవత పర్వతం పైన బస ఏర్పాటు చేశాడు. ఇంటికి పోయి బలభద్రాదులకు ఎవరో యతి వచ్చి రైవత పర్వతంపై విడిది చేసి ఉన్నాడని తెలిపాడు. అంతట బలభద్రుడు బంధువులందర్నీ వెంటబెట్టుకొని రైవత పర్వతానికి పోయి యతీశ్వరునికి నమస్కరించాడు. వర్షాకాలం వెళ్ళేంత వరకు ఇక్కడే బస చేయమని ప్రార్థించాడు. అతడికి కావలసిన సదుపాయాలన్నీ ఏర్పాటు చేస్తూ సుభద్రను ఆ యతి సపర్యలకై నియోగించాడు. శ్రీకృష్ణుడు ఒక్క సుభద్రకు మాత్రం ఆ యతీశ్వరుడి నిజస్వరూపాన్ని తెలిపాడు. దాంతో ఆమె కూడా యతిసేవలు అతి ఉత్సాహంగా చేయసాగింది. ఇట్లా కొన్నాళ్ళు గడిచాయి. ఒకనాడు శ్రీకృష్ణుడు ఒక ఉత్సవాన్ని కల్పించి యాదవులందర్నీ ఆ ఉత్సవాన్ని తిలకించేందుకు పంపాడు. తాను రుక్మిణితో కలసి బృహస్పతి ప్రోక్త లగ్నమందు సుభద్రార్జున కళ్యాణం జరిపించి సుభద్రను తీసుకొని ఇంద్రప్రస్థానికి పొమ్మని అర్జునుని ఆదేశించాడు. అర్జునుడు సుభద్రతో వెళ్తూఉండగా రక్షక భటులు అడ్డుకున్నారు. సవ్యసాచి వారందర్నీ చితకబాది సుభద్రను తీసుకొని ఇంద్రప్రస్థాన్ని చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న బలరాముడు మండిపడ్డాడు. శ్రీకృష్ణుడు అన్నగారికి సర్దిచెప్పి అందర్నీ కలుపుకొని ఇంద్రప్రస్థానికి ప్రయాణమయ్యాడు. ఈ బంధుత్వంతో కృష్ణార్జునుల స్నేహబంధం మరింత బలపడింది. కొంతకాలానికి సుభద్ర ఒక మగశిశువును కన్నది. అతడి జాతక సాముద్రిక లక్షణాలను పరిశీలించి పెద్దలు అభిమన్యుడని పేరు పెట్టారు.

శ్రీకృష్ణుడు జగన్నాటక సూత్రధారి కావడం వలన ఏయే కార్యాలు ఎవరెవరు చెయ్యాలో ముందే నిర్ణయిస్తాడు. అందులో భాగంగానే అభిమన్యుడికి కావలసిన శక్తులన్నింటినీ తానే దగ్గరుండి సంస్కారలన్నీ చేశాడు. కురుక్షేత్ర యుద్ధంలో ఇతడి పాత్రను చక్కగా తీర్చిదిద్దాడు. కార్యాలన్నీ తమంతట అవి సాగిపోతూ ఉంటాయి. ఆయా వీరులు ఆయా సమయాల్లో, నిమిత్త మాత్రులై, నడిపిస్తూన్నట్లు నటిస్తారు. ఈ శ్రీకృష్ణ తత్త్వాన్ని ఎరిగిన వారెవరూ ధుర్యోధనాదులు దుర్మార్గులని దూషించరు. ఇందులో గెలిచేవారూ ఓడే వారూ అంటూ ఎవరూ లేరు. ఇదంతా మహా మాయచే కల్పించబడిన భగవత్తంత్రమే. ఇదే పరమేశ్వరుని చమత్కారం.

ఖాండవ దహనం

(ఈభాగం శ్రీమహాభారతం ఆది పర్వం 122వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు తాను కార్యాలను చేస్తూ ఇతరులచేత చేయిస్తూ ఆ కర్మలనంటకుండా సాక్షీభూతుడుగా ఉంటాడు. అందువల్ల మిగిలిన అవతారాల కంటే కృష్ణావతారం విశిష్టమైనదని ఆయన తత్త్వాన్ని తెలుసుకొన్న వారందరికీ తెలుస్తుంది. కృష్ణార్జునులిద్దరూ ఇంద్రప్రస్థంలో కొంతకాలం సుఖంగా ఉన్నారు. రాబోయే కాలాన్ని, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఒకనాడు శ్రీకృష్ణుడు బంధువులందరితో కలసి వనవిహారం చేద్దామని ప్రేరేపించాడు. అందుకు అంతా అంగీకరించారు. వన విహారంలో కథా కాలక్షేపాలతో కాలక్షేపం చేస్తూ ఉండగా వృద్ధ బ్రాహ్మణుడొకడు కృష్ణార్జునుల వద్దకు వచ్చాడు. వారిద్దరూ ఆ బ్రాహ్మణునికి ఉపచారాలన్నీ చేసి "బ్రాహ్మణోత్తమా! నువ్వు బాగా అలసి పోయినట్లు కనబడుతున్నావు. మానుండి ఏమైనా పొందాలన్న కోరికతో వచ్చావా? చెప్పు. నీకోరిక ఎట్లాంటిదైనా తీర్చి నిన్ను సంతృప్తుణ్ణి చేస్తాం" అన్నారు. అందుకా బ్రాహ్మణుడు ఇలా అన్నాడు. 'మహాత్ములారా! నేను అగ్నిదేవుడను. ఈ ఖాండవము ఇంద్రునిది. అజీర్తితో బాధపడుతూ పూర్వం ఈ ఖాండవాన్ని తగుల బెట్టాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా ఇంద్రుడు నాపై ఎడతెగని వర్షాన్ని కురిపించి నాకు అడ్డుతగులుతూ వచ్చాడు. దాంతో నాలోని సర్వశక్తులు నీరసించి పోయాయి. తేజస్సు చచ్చిపోయింది. పాలిపోయి, అజీర్ణవ్యాధితో బాధపడుతున్నాను' అన్నాడు. అగ్నిదేవునికి ఈ వ్యాధి రావడానికి గల కారణాలేమిటో చెప్తాను. వినండి.

పూర్వం శ్వేతకి అనే మహారాజు నూరు సంవత్సరాల సత్ర యాగం చెయ్యాలని సంకల్పించాడు. అందుకు కావలసిన పదార్థాలన్నీ సమకూర్చుకొని ఋత్విజుల్ని పిలిచి యాగం చేయించమని కోరాడు. అందుకా ఋత్విజులు, రాజా! నువ్వు సమర్థుడవు కాబట్టి నూరు సంవత్సరాలకు యాగానికవసరమయ్యే వస్తువులన్నీ సమకూర్చుకోగలిగావు. కానీ అంత దీర్ఘకాలం యాగం చేయించడం మానవులకు సాధ్యం కాదు. కాబట్టి నువ్వ శంకరుని ఋత్విజునిగా నియమించుకో మన్నారు. శ్వేతకి మహారాజు శివుని గూర్చి తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై రాజా! యజ్ఞయాగాదుల్ని చేసేందుకు బ్రాహ్మణులకే అధికారం ఇచ్చాను. అందువల్ల స్వయంగా నేను యాగాన్ని చేయించలేను. నువ్వు బ్రహ్మ చర్యం వహించి మరో పన్నెండు సంవత్సరాలు తపస్సు చేయమని చెప్పి అంతర్ధాన మయ్యాడు. అంతట రాజు మరల 12 సంవత్సరాలు తపస్సు చేశాడు. కొంతకాలనికి శంకరుడు ప్రత్యక్షమై రాజా! నువ్వు దుర్వాసుని ఋత్విజునిగా పెట్టుకొని యాగాన్ని చెయ్యమని చెప్పి అంతర్ధానమయ్యాడు.

శంకరుని ఆదేశాన్ననుసరించి దుర్వాసుడు మిగిలిన మునుల సహాయంతో యాగాన్ని ప్రారంభించి పూర్తి చేశాడు. నూరు సంవత్సరాలపాటు విడువకుండా నేతితో హోమాలు చెయ్యడం వలన నా తేజస్సు తగ్గింది. విపరీతమైన దాహం కలిగింది. దాంతో బ్రహ్మ వద్దకు పోయి నా బాధలు వెళ్లబోసుకున్నాను. అప్పుడా బ్రహ్మ "అగ్నిహోత్రుడా! దీన్ని అజీర్తి వ్యాధి అంటారు. ఇంతటి దీర్ఘవ్యాధిపోవాలంటే దివ్యౌషధాలకు పుట్టినిల్లయిన ఖాండవ వనాన్ని దహించు" అని సలహా చెప్పాడు.

ఆ వనాన్ని ఇంద్రుడు ఎల్లవేళలా వెయ్యి కళ్ళతో కనిపెట్టుకొని ఉంటాడు. నేను ఈవనాన్ని దహించడం ప్రారంభించగానే పెద్దపెట్టున వర్షాలు కురిపించి నా ప్రయత్నాలన్నీ భగ్నం చేస్తూ వచ్చాడు. ఈవిధంగా ఒకసారి రెండుసార్లు కాదు. ఏడు పర్యాయాలు ప్రయత్నంచేశాను. తిరిగి బ్రహ్మ వద్దకు పోయి తనకొచ్చిన కష్టాన్ని వివరించి చెప్పగా బ్రహ్మ ఇలా అన్నాడు. అగ్నిదేవుడా! విచారించకు. కొంతకాలానికి నరనారాయణులు భూమిపై అవతరిస్తారు. వారిని ఆశ్రయించు. వారీ మేఘాల బాధ నుండి తప్పించి నువ్వు ఖాండవాన్ని నిర్విఘ్నంగా దహించే ఏర్పాటు చేస్తారు అని అన్నాడు. అప్పటి నుండి మీ కొరకు కాచుకొని కూర్చున్నాను. అన్నాడు.

అగ్నిహోత్రుడు చెప్పినదంతా విని అర్జునుడు ఇలా అన్నాడు. అగ్నిదేవా! ప్రస్తుతం నావద్ద ధనస్సు, అస్త్రాలు లేవు. అయితే వాటిని ఉపయోగించే నైపుణ్యం కోకొల్లలుగా ఉంది. అస్త్ర శస్త్ర విద్యలలో ఒక్క దేవేంద్రుడే కాదు ముల్లోకాల్లో ఎవరూ నా ముందు నిలబడలేరు. నువ్వు నిర్భయంగా నిరాటంకంగా ఈ ఖాండవాన్ని దహించి నీ అజీర్ణ వ్యాధినుండి బయటపడవచ్చును. అందుకు గాను వెంటనే నాకో ధనుస్సు, అక్షయ తూణీరాలను ఏర్పాటు చెయ్యి. అట్లాగే ఒక మంచి అశ్వాలతో కూడుకున్న రథాన్ని ఏర్పాటు చేయించి నువ్వు వెంటనే దహించడం ప్రారంభించు. నీకు అండగా నేనుంటాను అన్నాడు.

వెంటనే అగ్నిదేవుడు వరుణుని మనస్సులోనే స్మరించాడు, వరుణదేవుడు సాక్షాత్కరించాడు. ఓ వరుణదేవా! పూర్వం సోముడు నీకు ప్రసాదించిన ధనుస్సు అక్షయ తూణీరాలతో అంబుల పొదినీ, అట్లాగే దివ్యాశ్వాల్ని పూన్చిన రథాన్ని అర్జునునకు, చక్రాన్ని శ్రీకృష్ణునకిమ్మని ప్రార్థించాడు. వరుణుడు వెంటనే వాటిని కృష్ణార్జునులకిచ్చి అదృశ్యుడయ్యాడు. అగ్నిహోత్రుడు కృష్ణార్జునులతో ఇలా అన్నాడు. ఆర్యా! ఈ ధనుస్సు పేరు గాండీవము. దీని తేజస్సు ముందు ఎటువంటి ధనుస్సైనా నిర్వీర్యమవుతుంది. అట్లాగే అస్త్రాలు కూడా శత్రువును తుదముట్టించి తిరిగి అంబులపొదిలోకి వచ్చి చేరుకుంటాయి. ఈ శరముల ముందు ఎటువంటి వారైనా తలవంచాల్సిందే. కృష్ణా! ఈ చక్రము నువ్వు మాత్రమే ధరించదగినది. నువ్వు దీన్ని ప్రయోగించి శత్రువుల శిరస్సులు ఛేదించి తిరిగి వచ్చి నీచేతిలో నిలుస్తుంది. దీని శక్తికి మించిన ఆయుధం మరొకటి లేదు. ఇది సాక్షాత్తూ కాలచక్రమేనని తలంచు.

కృష్ణార్జునులు ఆయుధాలను భక్తితో స్వీకరించి దివ్యరథాన్ని అధిరోహించారు. ఇక ఖాండవాన్ని నీ ఇష్టం వచ్చినట్లు దహించమని అగ్నిదేవునికి అభయమిచ్చారు. అంతట అగ్ని తేజోరూపాన్ని ధరించి ఖాండవదహనం కార్యాన్ని ప్రారంభించాడు. అగ్నిదేవుని దహనకాండ విస్తరించింది. ఖాండవవనంలో నిక్షేపించబడిన ఓషధులన్నీ అగ్నిపాలవుతున్నాయి. పశుపక్ష్యాదులన్నీ భీతి చెంది ప్రాణాలు కాపాడుకోలేక మరణిస్తున్నాయి. అగ్ని దాహక శక్తి దట్టమైన పొగరూపంలో ఆకాశాన్ని కప్పేసింది. వృక్షాలు విరిగిన శబ్దాలు, జంతువుల ఆక్రందనలు నాలుగుమూలలకు వ్యాపించాయి. దేవతంతా పోయి ఇంద్రునితో జరుగుతున్న భీభత్సాన్నంతా ఓ ప్రళయంగా వర్ణించి చెప్పారు. దేవేంద్రుడు వెంటనే దేవతా గణాలను, మేఘాలన్నింటినీ వెంటబెట్టుకొని ఖాండవవనాన్నంతా తడిసి ముద్దయ్యేట్లు వర్షించమని ఆజ్ఞాపించాడు.

మేఘాలు ఇంద్రుని అనుమతితో వాటి పని అవి ప్రారంభించాయి. ఇదంతా గమనిస్తున్న అర్జునుడు గాండీవం నుండి శరపరంపరను ఆకాశంపై వదిలాడు. అవన్నీ ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఖాండవవనానికి ఒక కప్పుగా ఏర్పడ్డాయి. మేఘాలు కురిపించే వర్షధారలన్నీ ఆ కప్పుపై పడి జారిపోతున్నాయేగాని ఖాండవవనంలో ఒక్క చుక్క అయినా జారిపడటం లేదు.

ఆ ఖాండవ దహన కాండలో తక్షకుని కుమారుడైన అశ్వసేనుడు తల్లిని ఆ ప్రళయాగ్ని నుండి కాపాడే ప్రయత్నం చేశాడు. ఇది కనిపెట్టిన అర్జునుడు అశ్వసేనుడిపై బాణ ప్రయోగం చేశాడు. ఆ బాణం అశ్వసేనుణ్ణి చేరేలోపుగనే ఇంద్రుడు మోహిని అనే మాయను ప్రయోగించి అశ్వసేనుణ్ణి అతడి తల్లినీ స్వర్గానికి చేర్చాడు. తక్షకుడు ఈ దావాగ్నిలో పడి ఎక్కడ మరణించాడోనని దేవేంద్రుడు భయపడి కృష్ణార్జునులపైన యుద్ధాన్ని తీవ్రతరం చేశాడు. ఆ సమయంలో అశరీరవాణి ఇలా వినిపించింది.

శ్లో॥ న తే సఖా --------------పురాణావృషి సత్తమ"

దేవేంద్రా! వీరిద్దరూ పురాణ పురుషులు. నరనారాయణులు. వీరితో యుద్ధం చేసి గెలువలేవు. పూర్వం దేవదానవ సంగ్రామంలో నీకు సహాయపడిన శ్రీమహావిష్ణువే నరనారాయణులుగా అవతరించారు. నీ ప్రియమిత్రుడైన తక్షకుడు దహనకాండకు ముందే కురుక్షేత్రానికి వెళ్ళాడు. అనగా తక్షకుడు క్షేమంగానే ఉన్నాడని తెలుసుకో. ఇంకోమాట, నువ్వీ కృష్ణార్జునులను గెలువలేవు. నువ్వు భయపడుతున్నట్లుగా మయునికి ఎట్టి ఆపదా కలుగలేదు. మయుడు శరణాగతికోరగా భగవంతుడాతడికి అభయమిచ్చి కాపాడాడు. కావున వీరిని సన్మానించుమని పలికింది. అగ్నిదేవుడు కూడా తన దహన కాండను పూర్తిచేసుకొని కృష్ణార్జునులను దీవించి వెళ్ళిపోయాడు. అంతట దేవేంద్రుడు దేవతా గణంతో కలసి కృష్ణార్జునుల ముందు ప్రత్యక్షమయ్యాడు. కృష్ణార్జునులు వారికి నమస్కరించారు. దేవేంద్రుడు వారిని ఆశీర్వదిస్తూ అర్జునునికి ఆగ్నేయాది దివ్యాస్త్రాలెన్నో ప్రసాదించాడు. అర్జునుని ప్రాణస్నేహితుడుగా చూస్తూ కంటికి రెప్పలా కాపాడుతూ ఉండమని శ్రీకృష్ణుని ప్రార్థించి తాను స్వర్గానికి చేరుకున్నాడు. కృష్ణార్జునులు ఇంద్రప్రస్థానికి చేరుకున్నారు. ధర్మరాజుకు జరిగిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పారు. ధర్మరాజుకూడా పరమానంద భరితుడయ్యాడు.

మనమీ భాగం చదువుకుంటున్నప్పుడు కొన్ని అనుమానాలు వ్యక్తం కావచ్చు. అగ్నిహోత్రునకు అజీర్ణవ్యాధి ఎట్లా వచ్చింది? ఖాండవదహనం వలన అనేక జీవరాసులు కాలి బూడిదై పోవడాన్ని పరమేశ్వరుడైన శ్రీకృష్ణుడు అంగీకరించవచ్చునా? పరమాత్ముడైన శ్రీహరికి చక్రాన్ని అగ్ని బహూకరించడమా? అనేవి ముఖ్యాంశాలు.

శ్లో॥ కాలోస్మి ------------ భవ సవ్యసాచిన్ "

అని భగవంతుడే చెప్పాడు. అనగా భూభారం తొలగించడమే భగవదవతారానికి ప్రధానాంశాలలో ఒకటి. అందుకు రాబోయే కురుక్షేత్ర యుద్ధాన్ని దృష్టిలో ఉంచుకొనే అర్జునునికి అవసరమయ్యే దివ్యాస్త్రాల్ని, దివ్య రథాన్ని సమకూర్చి పెట్టడమే ఇందులోని ఆంతర్యం. ఇందులో అగ్ని, అర్జునుడు కేవలం నిమిత్తమాత్రులు మాత్రమే. మహాభారత యుద్ధానికి ఇక్కడే నాందీ ప్రస్థావన జరిగింది.

మయునికి ప్రాణదానం చెయ్యడం వలన అతడు కృతజ్ఞతతో ధర్మరాజుకు లోకాతీతమైన సభనొకటి నిర్మించి పెట్టాడు. ధర్మరాజు తలపెట్టబోయే రాజసూయానికి ఈ మయసభయే వేదిక అవుతుంది. రాజసూయ యాగానికి వచ్చిన దుర్యోధనుడు ఈ సభ చూసే ఈర్ష్యాళువు అవుతాడు. దాన్ని దృష్టిలో ఉంచుకొనే భగవంతుడు ఈ ఖాండవ దహనమనే నాటకాన్ని చిత్రించాడు. ఇక ప్రాణికోటి అకాల మరణానికి వస్తే, భగవంతుడే కాల స్వరూపుడు. ఏయే ప్రాణులు, ఏయే విధంగా, ఏయే సమయంలో వాటి కర్మ ఫలానుసారం మరణించాల్సి ఉందో వాటన్నింటినీ ఒక చోటకు కాలమే చేర్చింది. మారు మాట లేకుండా కర్మఫలానుభవాన్ని పొందారు. ఇన్ని కార్యాలూ ఒకేసారి జరగాలని భగవత్సంకల్పం. నేనే ఖాండవవనాన్ని దహించానన్న భావన కలిగితే గాని అగ్నికా బాధపోయిన నమ్మకం కలుగదు. వీటన్నింటికీ కాలమొక్కటే కారణం. కాలం కూర్చిన దండలో ఇవన్నీ గుచ్చి ఖాండవ దహనమనే మాలగా చెయ్యబడింది. ఎంతటి వారైనా కాలం ఆడుమన్నట్లు ఆడవలసిందేగదా. వీటన్నింటికీ సూత్రధారుడా ముకుందుడే.

ఇక సుదర్శన మంటారా? అది శ్రీహరిని విడిచి ఎన్నడూ ఉండదు. స్మరించి నంత మాత్రానే ఎదుటకు వచ్చి నిలుస్తుంది. కావున అగ్ని ఇచ్చినది చక్రమే గాని, సుదర్శనం కాదు. భారతాది యుద్ధాల్లో చాలామంది రాజులు చక్రాలు ధరిస్తూ ఉంటారు. అయితే వరుణుడిచ్చిన చక్రం మిగిలిన వారు ధరించే చక్రాల కన్నా శ్రేష్ఠమైనదని మనం గ్రహించాలి.

మయసభ

(ఈ భాగం మహాభారతం సభాపర్వం నుండి గ్రహించబడింది.)

కృష్ణార్జునులచే ఖాండవదహన కాలంలో రక్షించబడిన మయుడు అర్జునునితో ఇలా అన్నాడు. మహాత్మా! నువ్వు నాకు ప్రాణదానం చేశావు. అందుకు ఏదైనా ప్రత్యుపకారం చెయ్యాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. నేను దానవుల శిల్పిని. నాపేరు మయుడు. విశిష్ఠమైన శిల్పాలు నిర్మించడంలో నేర్పరిని. చంద్రునికో నూలుపోగు అన్నట్లుగా మీకేదైనా ఓ శిల్పాన్ని నిర్మించి ఇవ్వాలని ఉన్నది. నా ప్రార్థన మన్నించి నన్ను అనుగ్రహించాల్సింది అన్నాడు. మయుడి మాటలు విన్న అర్జునుడు శ్రీకృష్ణుని ముఖంలోకి చూశాడు. శ్రీకృష్ణుడు మయుడితో ఇలా అన్నాడు. ఆర్యా! కురువంశానికి ప్రభువైన ధర్మరాజు భూలోకంలోని రాజులందర్నీ ఆహ్వానించి ఒక సభ జరపాలని అనుకుంటున్నాడు. కావున రాజులు సుఖంగా కూర్చుని చర్చించేందుకు ఏదైనా ఒక సభామంటపాన్ని నిర్మించి ఇవ్వు. దానివలన లోకానికి మేలు కలుగుతుంది. నీకు కూడా విశ్వ విఖ్యాతి లభిస్తుంది అని అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న మయుడు పరమానందంపడి సభానిర్మాణానికి నడుం కట్టాడు.

పూర్వం వృషపర్వుడనే దానవరాజు కోసం ఓ సభను నిర్మించాలని అందుకు కావలసిన సామాగ్రినంతా సమకూర్చడం జరిగింది. కారణాంతరాల చేత ఆ నిర్మాణం ఆగిపోయింది. ఇప్పుడా పరికరాలన్నీ ఉపయోగించి ధర్మరాజున కోసభ నిర్మించాడు. అట్లాగే భౌమాదిత్యుడనే రాజర్షిచే

నిర్మించబడిన గదను భీమసేనుడికి, దేవదత్తమనే శంఖాన్ని అర్జునునకు మయుడు వినయంతో సమర్పించుకున్నాడు. అట్లాగే ధర్మరాజు కూడా మయుని విధి ప్రకారం ఘనంగా సన్మానించాడు. అంతట శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోయాడు.

మయుడు తాను నిర్మించిన సభకు హిమాలయాలలోని బిందు సరోవరం నుండి వెలలేని రత్నాలను తీసుకొని వచ్చి సభలో వివిధములైన చోట్ల తాపడం చేశాడు. ఆ మణుల ప్రభావం చేత నిర్జలాలున్న చోట్ల నీరు అలలతో ముంచెత్తుతున్నట్లు గాను, నీరు సమృద్ధిగా ఉన్న సరోవరాల్లో నీరేలేని సమ ప్రదేశాల్లాగాను భ్రమ కలిగించేట్లు నిర్మించాడు. రాజసూయం చూడటానికి వచ్చిన రాజులు ఆ సభలోని వింతలు, చమత్కారాలు చూసి ముక్కున వేలేసుకున్నారు. మయుణ్ణి అతడి చాతుర్యాన్ని వేనోళ్ళ పొగిడారు. అనేక విలువైన కానుకలను ధర్మరాజుకు సమర్పించి తమ ప్రభు భక్తి చాటుకున్నారు. ఎనిమిది వేల మంది రాక్షసులు రాత్రింబవళ్ళు పనిచేస్తూ పదునాలుగు నెలల కాలంలో పూర్తి చేశారు. ఈ ఘట్టంలో శ్రీమహాభారత మూలంలో అనేక శ్లోకాలలో వర్ణించబడింది. అందులోని సారాన్నంతా గ్రహించిన నన్నయ భట్టారకుడు ఈ ఒక్క పద్యంలో ఇమిడ్చి వ్రాసి తమ పాండిత్యాన్ని చాటుకున్నారు.

మ॥ మద మాతంగ తురంగ కాంచనల సన్మాణిక్యగాణిక్య సం
పదలోలిం గొనివచ్చి యిచ్చి ముదమొప్పం గాంచి సేవించి ర
య్యుద యాస్తా చలసేతు శీత నగ మధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణ ప్రతాపోదయున్.

ఆ విధంగా మహేంద్రుడిలా వెలిగిపోతున్న ధర్మరాజును చూసేందుకు మార్కండేయుడు మొదలైన ముని సముదాయం అంతాకలసి వచ్చారు. ధర్మరాజు వారందరిని విధియుక్తంగా ఆహ్వానించి అతిథి మర్యాదలు చేసి పూజించాడు. అదే సమయాన స్వర్గం నుండి నారదమహర్షి కూడా వచ్చి రాజేంద్రా! ఇటువంటి సభను నేను ముల్లోకాల్లోనూ చూడలేదు. ఇప్పుడే మొదటి సారిగా చూస్తున్నాను. దేవేంద్రుని సభగాని, వరుణుని సభగాని, కుబేరుని సభగాని ఈ సభయందు దిగతుడుపేనని అభినందించి ఇలా అన్నాడు. ధర్మనందనా! వైవస్వత సభలో నీ తండ్రి పాండురాజును చూశాను. నీతో చెప్పమని చెప్పిన నాలుగు మాటలు చెప్తాను. విను.

"మునీంద్రా! నా పుత్రులంతా దైవాంశ సంభూతులు. అందులో పెద్దవాడైన ధర్మరాజును రాజసూయ యాగం చెయ్యమని చెప్పు. మిగిలిన పుత్రులు నలుగురూ అమిత బలాఢ్యులు. లోకంలో రాజులందరినీ ఓడించి ధర్మరాజుని సార్వభౌమునిగా చేయగల సమర్థులు. ఆయాగ ఫలంగా నేను ఊర్థ్వ లోకాలను చేరుకుంటాను." అని చెప్పమన్నాడు. కావున "ఓ ధర్మరాజా! నువ్వు వెంటనే రాజసూయ యాగానికి ప్రయత్నాలు ప్రారంభించు. నీ తండ్రి కోరిక తీర్చు. నువ్విట్లా చేస్తే నీ తండ్రి ఆశీస్సులు పొంది నీకు అఖండ కీర్తి సంపదలు చేకూరుతాయి. నీతమ్ములను దిగ్విజయ యాత్రకు పంపు. వచ్చిన ధనంతో యాగం చెయ్యి. బ్రాహ్మణులను సత్కరించు. నాలుగు వర్ణాల వారిని ఆదరించు. సార్వభౌముడవు కమ్ము. ధర్మజా! ఇంకోమాట రాజసూయం అంత సులభంగా చేసే యాగం కాదు.

అనేక విఘ్నాలు ఎదురవుతాయి. నువ్వు వాటినన్నింటినీ అధిగమించి యాగాన్ని నిర్విఘ్నంగా పూర్తి చెయ్యి. దీనికి సాటి అయిన యజ్ఞం భూలోకంలో మరొకటి లేదని తెలుసుకో. కావున నీ సోదరులతో ఆలోచించి చెయ్యి."

నారదుని ఉపదేశం ధర్మరాజుకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. సోదరులందర్నీ పిలిపించి, ధౌమ్యాది మునుల సమక్షంలో ఇలా అన్నాడు. "సోదరులారా! తండ్రిగారు తమ కోరికను నారదుని ద్వారా వినిపించారు. తండ్రి కోరిన కోరికను నెరవేర్చడం పుత్రులకు విధి. ఈ యాగం చేయడం వలన రాబోయే కాలంలో ఒక మహాయుద్ధమే సంభవిస్తుందట. తండ్రిగారి కోరిక నెరవేర్చాలని ఉన్నది. రెండో ప్రక్క అశేష జన నష్టం కూడా కలుగుతుందే అని ఆలోచిస్తున్నాను. ఏం చెయ్యాలో తోచడం లేదు." అని. అందుకు అక్కడే ఉన్న ధౌమ్యాది మునులంతా "రాజేంద్రా! రాజసూయం చెయ్యి. సోదరుల్ని నలుమూలలకు పంపు. వారు చెయ్యలేని పని అంటూ ముల్లోకాల్లో ఏదీ లేదు. రాజులందర్నీ జయించి సంపదలు భారీగా సమకూరుస్తారు. చెయ్యగల సామర్థ్యం ఉన్న వారు రాజసూయం చెయ్యకుండా ఉండకూడదు" అని ప్రోత్సహించారు.

అంతట సోదరులతో "సోదరులారా! మనమెంత సమర్థులమైనా శ్రీకృష్ణుని సహాయ సహకారాలు లేకుండా మనమీ యాగం పూర్తి చెయ్యలేం. అందువల్ల ఈరోజే ద్వారకకు రథాన్ని పంపండి." అన్నాడు.

శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థానికి చేరుట :

ధర్మరాజు పంపిన రథం ద్వారకకు చేరగానే శ్రీకృష్ణుడు అందులో హస్తినాపురానికి చేరుకున్నాడు. ధర్మరాజు శ్రీకృష్ణుని ఆప్యాయంగా ఆదరించి ఇలా ప్రార్థించాడు. మహాత్మా! నా తండ్రి పాండురాజు నన్ను రాజసూయ యాగాన్ని చెయ్యమని నారదుని ద్వారా ఆజ్ఞాపించాడు. రాజసూయాన్ని చేయించగల సామర్థ్యం భగవంతుడవైన నీకు తప్ప మరెవరికి ఉంటుంది. నేను నిన్నే నమ్ముకున్నాను. ధౌమ్యాదులు కూడా రాజసూయం చెయ్యమని ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యభారాన్ని నువ్వు భరిస్తానంటేనే నేను తలపెడతాను. నువ్వు ఎట్లా ఆజ్ఞాపిస్తే దాన్నే శిరసావహిస్తాను అన్నాడు. ధర్మరాజు చేసిన విన్నపాన్ని ఆలకించిన శ్రీకృష్ణుడు తన అవతార ఫలం సిద్ధించడానికి ఈ రాజసూయం చక్కగా ఉపయోగపడుతుందని మనసులో తలచి ఇలా అన్నాడు. ధర్మరాజా! నువ్వు సర్వ నీతిజ్ఞుడవు. రాజసూయం చేసేందుకు అవసరమైన సుగుణాలన్నీ నీలో ఉన్నాయి. పైగా బలపరాక్రమవంతులు, యోగ్యులు అయిన తమ్ములున్నారు. పూర్వం ఈ రాజసూయాన్ని నైల వంశస్థులు, ఇక్ష్వాకు వంశస్తులనే రెండు వంశాల వారు మాత్రమే చేశారు. ఈ రెండు వంశాల్లో ఒక వంశం మాత్రమే వర్ధిల్లింది. ప్రస్తుతం లోకంలోని క్షత్రియులందర్నీ జయించిన జరాసంధుడున్నాడు. అతడి పౌరుషం, శక్తి సామర్థ్యాలు అపారం. పైగా జరాసంధుణ్ణి చేది రాజు బలపరుస్తూ ఉంటాడు. సమస్త మాయలు తెలిసిన హంసడింభకులు కౌశిక, చిత్రసేనులన్న మారుపేర్లతో జరాసంధునికి ఆప్త మిత్రులై మెదలుతున్నారు. వీళ్ళేకాకుండా పశ్చిమ దేశానికి రాజైన భగదత్తుడు వరుణుడంతటి బలశాలి. ఒకప్పుడితడు పాండురాజుకు మిత్రుడే అయినా, ఇప్పుడు జరాసంధుడికి భయపడి అతడి పక్షానే పనిచేస్తున్నాడు.

వీరే కాక ఇంకా అనేక మంది రాజులీ జరాసంధుని అడుగులకు మడుగులొత్తుతూ ఉంటారు. ఇక నా విషయానికి వస్తే, నేను కంసుణ్ణి చంపడం మూలంగా అతడి కుమార్తెలంతా విధవలయ్యారు. ఆ కారణంగా నామీద పగబట్టి మధురపై పలుసార్లు దండెత్తి వచ్చాడు. అతడు పెట్టే బాధలు పడలేక సముద్రంలో తలదాచుకున్నాను. యదు, వృష్ణి, భోజ, అంధకులు కూడా జరాసంధుని చేత చాలాసార్లు అవమానించబడ్డారు. హంసడింభకులు మాత్రం మరణించారు. ఇంకా ఎంతో మంది రాజులు జరాసంధుని నిర్బంధంలో మ్రగ్గిపోతున్నారు. ఇతడి అరాచకాలు ఒకటా రెండా? కావున ఈ జరాసంధుణ్ణి వధించకుండా రాజసూయాన్ని ప్రారంభించడం మంచిది కాదు. ముందుగా భీమార్జునుల్లో ఎవరో ఒకరు అతడితో యుద్ధం చేసి హతమార్చినప్పుడే భూలోకంలో ఉండే రాజులంతా నీవశం లోకి వచ్చినట్లవుతుంది అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న ధర్మరాజు ఇలా అన్నాడు.

కృష్ణా! జరాసంధుడికి ఇంతటి అద్భుత శక్తులు ఎలా వచ్చాయి? ఇతడి వృత్తాంతం అంతా చెప్పవలసింది అని అడిగాడు. శ్రీకృష్ణుడిలా చెప్పాడు. ధర్మరాజా! బృహద్రధుడనే రాజు మగధను పాలించేవాడు. అతడు అమిత బలాఢ్యుడై దేశంలో ఉన్న రాజులందర్నీ జయించాడు. కాశీరాజపుత్రికలిద్దర్నీ వివాహమాడినా సంతానం కలుగలేదు. సంతానం కలుగలేదన్న వేదనతో రాజు అడవులకు పోయి ఒక మామిడి చెట్టుక్రింద తపస్సు చేసుకుంటున్న గౌతముడనే మునీంద్రుణ్ణి చూశాడు. ఆ క్షణం నుండి అతి భక్తి శ్రద్ధలతో ఆ మునికి సపర్యలు చేశాడు. ఒక రోజున రాజుచేస్తున్న సపర్యలకు సంతోషించి గౌతమముని ఏదైనా వరం కోరుకోమన్నాడు. అందుకా బృహద్రధుడు, మహాత్మా! నేను మగధ దేశాధిపతిని. నాకు సర్వసంపదలు ఉన్నాయి కానీ పుత్ర సంతానం కలుగలేదు. కావున నన్ను అనుగ్రహించమని ప్రార్థించాడు. అందుకాముని జ్ఞాన దృష్టితో అతడి వృత్తాంతాన్నంతా గ్రహిస్తూండగా ఆ చెట్టునుండి ఓ పండు రాలి అతడి ఒడిలో పడింది. ఆ మామిడి పండును మంత్రించి రాజుకిచ్చాడు. రాజా! ఈ పండును నీ భార్యలకిమ్ము. వారికి పుత్ర సంతానం కలుగుతుందని దీవించి పంపాడు. బృహద్రధుడు ఆ పండును తెచ్చి భార్యలిద్దరికీ సమానంగా ఇచ్చాడు. వారా పండును తిని గర్భవతులయ్యారు. కాల క్రమంలో ఇద్దరూ సగభాగమే ఉన్న శిశువుల్ని ప్రసవించారు. అనగా ఒక్కొక్క శిశువుకు ఒక కన్ను, ఒక చెవి ఇట్లా శరీరం అంతా రెండు భాగాలుగా జన్మించారు. అటువంటి శిశుఖండాల్ని చూసి రాణులు భయపడి ఆశిశు ఖండాల్ని బయట పారేసి రమ్మని దాసీలకు చెప్పారు. ఆ దాసీలు ఆ రెండు శిశు ఖండాల్ని బయట పారేసి వచ్చారు. అక్కడే ఉన్న జర అనే రాక్షసి ఈ రెండు శిశు ఖండాల్ని గట్టిగా అదిమి పట్టుకొంది. వెంటనే ఆ బాలుడు ఒకటిగా అయ్యి కెవ్వున ఏడ్చాడు. ఆ ఏడుపు విన్న అంతఃపుర దాసీలు పరిగెత్తుకొని వచ్చి ఆ బాలుడు జరచేతిలో ఉండటం చూశారు. అంతట రాజుకూడా వచ్చి జర చేతిలోని బాలుణ్ణి చూసి నీవెవ్వరని అడిగాడు. అందుకా జర "రాజా! నేను జర అనే రాక్షసిని. నేను ఈ ప్రాంతంలోనే నివసిస్తూ ఉంటాను. ఎంతోకాలంగా నీకేదైనా మేలు చెయ్యాలనుకుంటున్నాను. నేటికి ఈ రూపంలో నాకోరిక తీరింది" అని అన్నది. జర మాటలు విన్న బృహద్రధుడు, జరా! నువ్వు రాక్షసివి కాదు. నాకు పుత్ర భిక్షపెట్టి నా వంశం నిలబెట్టిన నా కులదేవతవు. అంటూ ఎంతో ప్రశంసించి గౌరవించాడు. ఈ బాలుడి

రెండు శకలాల్ని జరచేత ఒకటిగా చేయబడ్డాయి కాబట్టి ఆ బాలుడికి జరాసంధుడు అని నామకరణం చేశాడు. ఆ బాలుడు దిన దిన ప్రవర్ధమానుడవుతూ గొప్ప బలపరాక్రమాల్ని సంతరించుకున్నాడు. ఒకానొక రోజున పుత్రదానం చేసిన గౌతమముని రాజాస్థానానికి వెళ్ళాడు. రాజు ఆ మునిని భక్తితో పూజించి తన పుత్రుని ఆయనకు చూపిస్తూ అతడి జన్మ వృత్తాంతమంతా తెలిపాడు. అదివిన్న ముని రాజా! ఇతడి జన్మ వృత్తాంతం అంతా నాకు ముందే తెలుసు. ఇతడు గొప్ప శివభక్తుడవుతాడు. కుమారస్వామి అంత బలశాలి అవుతాడు. ఇతడు భూతలంపై ఉండే రాజులందర్నీ జయిస్తాడు. అని చెప్పి వెళ్ళిపోయాడు. కొంతకాలానికి బృహద్రధుడు జరాసంధునికి రాజ్యాభిషేకం చేసి తాను అడవులకు పోయి తపస్సుచేసుకున్నాడు.

జరాసంధుడు రాజ్యాభిషేకం అయిన నాటి నుండి కొందరు రాజులను కలుపుకొని తిరుగులేని ప్రతాపాన్ని ప్రకటించుకున్నాడు. ధర్మనందనా! ఈశ్వరానుగ్రహం చేత జరాసంధుడు మల్లయుద్ధంలో అందె వేసిన చెయ్యి. ఈ విద్యలో అతడిని ఎదిరించగలవారీ భూమండలంలో లేరు. ఒక్క భీమసేనుడు మాత్రమే అతడి ముష్టి ఘాతాలకు తట్టుకోగలడు. అయినా నువ్వు భయపడాల్సిందేమీ లేదు. ఎందువల్లనంటే, అర్జునుని దివ్యాస్త్ర బలం, భీముని బాహుబలం, నా నీతి నీ అధీనంలో ఉండగా నువ్వు సాధించలేనిదంటూ ఉంటుందా? అన్న శ్రీకృష్ణుని మాటలు ధర్మరాజులో కొండంత బలాన్నిచ్చింది. ధర్మరాజు ఇలా అన్నాడు. వాసుదేవా! నువ్వే మా ప్రక్కన ఉండి నడిపిస్తూ ఉంటే ఇంక సాధించలేనిదంటూ ఏదీ ఉండదు. ఇక నాకెటువంటి శంకలూ లేవు. తప్పక రాజులంతా బంధవిముక్తులై నాకు అండగా నిలుస్తారు. రాజసూయాన్ని చేసి తప్పక నెగ్గుకొస్తానన్న నమ్మకం నాకు కలుగుతోంది. నేను పితృ వాక్యాన్ని పరిపాలించి పుణ్యాన్ని, ఖ్యాతిని కూడా పొందుతాను. అని అన్నాడు. అంతట ధర్మరాజు భీమార్జునులను ఆశీర్వదించి శ్రీకృష్ణునితో కలసి మగధకు పంపాడు. వాళ్ళు ముగ్గురూ అనేక దేశాలను, అడవుల్ని, పర్వతాల్ని దాటుకుంటూ గిరివ్రజ పురాన్ని చేరుకున్నారు.

ఆ గిరివ్రజపురం శత్రు దుర్భేద్యంగా ఉంది. గోరథము, ఋషభము, వైహారము, ఋషిగిరి, చైత్యము అనే అయిదు పర్వత రాజముల మధ్యగా ఆ నగరం నిర్మించబడింది. అందువల్లనే ఆనగరానికి గిరివ్రజపురం అన్నపేరు సార్థకమైంది. నగరద్వారాలన్నింటినీ బలాఢ్యులైన మగధ సైనికులు కాపలా కాస్తూ ఉంటారు. శ్రీకృష్ణ భీమార్జునులు ముగ్గురూ చైత్యక పర్వతం వైపుగా నగర ప్రవేశం చేయాలనుకున్నారు. అక్కడున్న మూడు భేరుల్ని భీముడు తన బాహుబలంతో బ్రద్దలు చేసి నగరాన్ని ప్రవేశించారు. ముందుగా మాలలు కట్టేవాని వద్దకు పోయి వాడివద్దనుండి మాలల్ని బలవంతంగా లాక్కుని ధరించారు. ఆ తర్వాత చందన లేపనాలు తయారు చేసే వారిళ్ళకు పోయి బలవంతంగా వారినుండి లేపనాలన్నీ లాక్కుని ఒళ్ళంతా పూసుకున్నారు. అక్కడనుండి రాజమందిరంవైపుగా వెళ్ళి బ్రాహ్మణులు ఎంతో మంది రాజమందిరంలోకి నిరాటంకంగా వస్తూ పోతూ ఉండటం చూశారు. సైనికులెవ్వరూ వారిని అడ్డుకోవడంలేదు. అందువల్ల ముగ్గురూ బ్రాహ్మణులతో కలసి రాజమందిరం లోకి ప్రవేశించారు. జరాసంధుడు ప్రతిరోజు బ్రాహ్మణపూజ చేస్తూ ఉంటాడు. అర్థరాత్రి అయినా కూడా తన మందిరంలోకి అతిథులు వచ్చారని తెలిస్తే తానే స్వయంగా పోయి వారిని గౌరవించి,

పూజించి సత్కరించేవాడు. అందువల్ల వీరి ముగ్గుర్నీ కూడా జరాసంధుడి సమక్షానికి ఓ బ్రాహ్మణ బృందం తీసుకొని వెళ్ళింది. వెంటనే జరాసంధుడు వారికి మధుపర్కాలిచ్చే ప్రయత్నం చేశాడు. కానీ వారు తీసుకోకుండా నిరాకరించడమే కాకుండా ధిక్కార స్వరంతో మాట్లాడారు. వారు ధరించిన పూమాలలు, చందనాది పూతలు ధరించి, ధిక్కరించి మాట్లాడటం చూసిన జరాసంధుడు ఇలా అన్నాడు. "మీ అలంకారాలూ, అహంకారపు మాటలు చూస్తూ ఉంటే మీరు రాజద్వారం గుండా మందిరంలోకిప్రవేశించినట్లు లేదు. దొంగచాటుగా ప్రవేశించారు. కాబట్టి మీ ముగ్గురు బ్రాహ్మణ వేషంలో కనిపించే క్షత్రియులని తెలుస్తోంది. అందుకు బదులుగా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "జరాసంధా! బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్రులంతా స్నాతక వ్రతానికి అర్హులే. అందులో మేము క్షత్రియ స్నాతకులం. స్నేహితుల ఇళ్ళకు ముఖద్వారం గుండా వెళ్ళాలే గాని శత్రువుల ఇళ్ళకు ముఖద్వారం ద్వారా వెళ్ళరాదు. ఇది మన పూర్వుల ఆచారం. పుష్పమాలల్లోను, చందనాది లేపనాల్లోనూ శ్రీదేవి నివసిస్తుంది. అందువల్లనే మేమవి ధరించాం. క్షత్రియులు ప్రాధేయపడి పుచ్చుకోరు. కావున మేము పౌరుషాన్ని ప్రదర్శించి అలంకారాలన్నింటిని గ్రహించాం. మేము నీవద్దకు ఒక పనిమీద వచ్చాం. అందువల్ల నీవిచ్చే మధుపర్కాల్ని స్వీకరించడం లేదు" అన్నాడు. ఆమాటలు విన్న జరాసంధుడు ఇలా అన్నాడు. "మీరు నాకుగాని నేను మీకుగాని ఎటువంటి హాని చెయ్యలేదు. మరి శత్రుత్వం ఎట్లా ఏర్పడింది. నేను నిత్యం బ్రాహ్మణ అతిథి పూజలు చేస్తూ ఉంటాను. దేవతల్ని ఆరాధిస్తాను. అయినా క్షత్రియ కులాచారాలను వదిలిపెట్టలేదు" అన్నాడు. అందుకు శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. రాజా! నువ్వు క్షత్రియుడనని గర్వంగా చెప్పుకొంటున్నావే. సాధువులైన రాజులను నిర్దాక్షిణ్యంగా పశువుల్లా బంధించి క్రూరంగా హింసిస్తూ పశుపతికి పూజలు చేస్తున్నావు. నీ పూజల్ని ఆ శంకరుడు స్వీకరిస్తాడా? ప్రజలు నిన్ను మన్నిస్తారా? నువ్వు వారికి ప్రియుడవెట్లా కాగలవు? తోటి రాజులను నిర్దాక్షిణ్యంగా ఎవరు హింసిస్తారో అట్టివారు పాపాత్ములే అవుతారు. నీవంటి క్రూరాత్ముల్ని శిక్షించి రాజులందర్నీ నీ చెరనుండి విడిపించడానికే వచ్చాం. నాకంటే బలపరాక్రమాలు గలవాడీ లోకంలో ఉన్నాడా? అని విర్రవీగకు. వీరిద్దరూ పాండుపుత్రులైన భీమార్జునులు" అన్నాడు. అందుకు జరాసంధుడు "అయ్యా! పరాక్రమంతో శత్రువులనుజయించడం పాపం ఎలా అవుతుంది? నేను పరాక్రమాన్నే గౌరవిస్తాను. పూజిస్తాను. పరమేశ్వరునకు నైవేద్యంగా అర్పించేందుకు తెచ్చిన ఈ రాజుల్ని నేనెందుకు విడిచిపెట్టాలి? మీరంతా కలసి సైన్యంతో వచ్చినా సరే. లేదా మీ ముగ్గురూ నాపై తలపడినా నేను సిద్ధమే. కాదంటారా ఇద్దరితో పోరాడమన్నా పోరాడతాను. చివరగా ఒక్కర్ని ఎదుర్కోమన్నా ఎదుర్కొని వధిస్తాను. ఏ పద్ధతిలో మీరు నాతో యుద్ధం చెయ్యదలచుకున్నారో చెప్పండి. నేనందుకు నా అంగీకారాన్ని తెలియజేస్తున్నాను. అయితే మీ ముగ్గురూ కలసి నా ఒక్కడిపైనా యుద్ధం ప్రకటించడం న్యాయం కాదు" అన్నాడు. అందుకు శ్రీకృష్ణుడు రాజా! మేము ముగ్గురం నీకన్నా ఎక్కువ బాహు బలం గల వాళ్ళమే. కావున నువ్వే మాలో ఒకరిని కోరుకో. అతడొక్కడే నీతో మల్లయుద్ధం చేస్తాడు." అన్నాడు. అందుకు జరాసంధుడు భీముని చూపిస్తూ ఇతడే నాతో సమానమైన బలం కలవాడు. కావున నేను ఇతడితో మల్లయుద్ధరీతిలో ఎదుర్కొంటాను" అన్నాడు. అటుపిమ్మట జరాసంధుడు

బ్రాహ్మణులను పిలిపించి తన కుమారుడైన సహదేవునికి రాజ్యాభిషేకం చేయించి ఆ పిమ్మట మల్లయుద్ధానికి సంసిద్ధుడయ్యాడు.

జరాసంధుడు మృతి చెందుట :

భీమ జరాసంధుల పోరు కార్తీక శుక్ల పాడ్యమి నాడు ప్రారంభమై త్రయోదశి వరకు హోరాహోరీగా సాగింది. ఇద్దరిలో ఎవరూ ఎవరికీ తీసి పోని విధంగా పోరునడిచింది. అయితే చతుర్ధశి నాడు నడచిన పోరులో జరాసంధుడు బలహీనపడ్డాడు. భీముడు జరాసంధుని పైకిఎత్తి గిరగిరా త్రిప్పి నేలకేసి కొట్టి రెండుకాళ్ళూ పట్టుకొని చీల్చి పారేశాడు. దాంతో జరాసంధుడు మరణించాడు. జరాసంధుని కుమారుడు సహదేవుడు శ్రీకృష్ణుని శరణుకోరి అనేక రత్న రాసులిచ్చి, చెరలో ఉన్న రాజులందర్నీ విడిపించగా శ్రీకృష్ణుడు వారికి ప్రాణభిక్ష పెట్టాడు. వారంతా శ్రీకృష్ణునికి కృతజ్ఞత తెలుపుకొని వారి వారి రాజ్యాలకు వెళ్ళిపోయారు. శ్రీకృష్ణుడు సహదేవుణ్ణి పిలిచి జరాసంధుని వద్ద ఉన్న దివ్య రథాన్ని తెమ్మని ఆజ్ఞాపించాడు. పూర్వం తారకాసుర సంహార సమయంలో ఇంద్రుడు యుద్ధం చేసిన రథాన్ని వసువనే రాజుకిచ్చాడు. ఆ వసువు బృహద్రధునికివ్వగా అతని నుండి జరాసంధునికి సంక్రమించింది. శ్రీకృష్ణుడు ఇప్పుడా రథాన్ని తెప్పించి దానిపై భీమార్జునులను కూర్చోబెట్టుకొని ఇంద్రప్రస్థానికి చేరుకున్నాడు.

ఈ కథమూలంగా కర్మము అన్నింటికన్నా బలవత్తరమైనదని ఉదాహరణ పూర్వకంగా ఋజువైంది. జరాసంధుడు తన కర్మము చేతనే చంపబడ్డాడు. భీముడు నిమిత్తమాత్రుడు మాత్రమే. శ్రీకృష్ణ పరమాత్మ గీతలో "నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్" అంటాడు. జరాసంధుడికి మరణం భీముడి చేతిలో ఉంది. జరాసంధుడు మధురపై పదిహేడుసార్లు దండయాత్ర చేశాడు. బలరాముడు ఎన్నిసార్లు చంపాలని ప్రయత్నించినా అశరీరవాణి అతణ్ణి చంపవద్దని వారించింది. శ్రీకృష్ణుడు తాను జరాసంధుణ్ణి చంపగల సమర్ధుడే అయినా, చంపకుండా తాను మధురను వదలి ద్వారకకు వెళ్ళిపోయాడు. ఎందువల్ల? తన సిద్ధాంతాలని తానే మీరరాదు గదా. అందువల్లనే భీముణ్ణి స్వయంగా వెంటబెట్టుకొని వెళ్ళి జరాసంధుణ్ణి చంపించాడు. కావున ఉపకారంగాని అపకారం గాని వారి వారి కర్మానుసారమే జరుగుతుందన్నది సిద్ధాంతం. అందుకు ఒకడు నిమిత్తమాత్రంగా నిలబడతాడు. భగవంతుడు తాను సాక్షిగా ఉండి చూస్తూ ఉంటాడు. అందువల్లనే భగవంతునికి సర్వ సాక్షి అన్న పేరు సార్థకమైంది.

ధర్మరాజు రాజసూయం చేయటం

(ఈ భాగం మహాభారతంలో సభాపర్వం 27వ అధ్యాయం నుండి,
అట్లాగే భాగవతం దశమ స్కంధం 74వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

జరాసంధుని చెరనుండి విడిపించిన రాజులందరూ ధర్మరాజు వద్ద అనుమతి పొంది వారి వారి రాజ్యాలకు వెళ్ళారు. శ్రీకృష్ణుడు కూడా ద్వారకకు వెళ్ళగా ధర్మరాజు తమ్ములతో కలసి రాజసూయానికి చెయ్యాల్సిన ఏర్పాట్ల గూర్చి చర్చించాడు. దిగ్విజయ యాత్రకు ముహూర్తం నిర్ణయమైంది. అర్జునుడు ఉత్తర దిక్కుకు, భీముడు తూర్పు దిక్కుకు, సహదేవుడు దక్షిన దిక్కుకు, నకులుడు పడమర దిక్కుకు బయలు దేరారు. ఎదిరించిన రాజులందర్నీ జయించి కప్పం పుచ్చుకున్నారు. ఎదిరించని వారందరి వద్దనుండి యాగానికి కానుకలు గ్రహిస్తూ యాగానికి ఆహ్వానించారు. రత్నాలు రాసులు రాసులుగా వసూలయ్యాయి. కోశాగారంలో రత్నరాసులముందు బంగారు వెండిరాసులు వెల వెలపోయాయి. ఇంతేకాకుండా ఏనుగులు, గుర్రాలు, రథాలు ఇతర వస్తు సామాగ్రి అశేషంగా సమకూరాయి. వాటన్నింటినీ ఇంద్రప్రస్థానికి చేర్చారు. నేల నాలుగు మూలల నుండి లభించిన విజయలక్ష్మి వలన ధర్మరాజు ప్రఖ్యాతికి మించిన విఖ్యాతి మరెవ్వరికీ ఉండబోదని లోకులంతా చెప్పుకున్నారు. స్వర్గంలో కూడా నారదాది మహర్షులు పాండవుల పరాక్రమాన్ని వేనోళ్ళ కొనియాడారు.

అంతట ధర్మరాజు యజ్ఞవాటికకు స్థలాన్ని నిర్ణయించి పెద్ద నగరాన్ని నిర్మించాడు. అందులో వివిధములైన రాజులకు వారి అంతస్తులకు తగినట్లుగా వసతి గృహాలు ఏర్పాటు చేశారు. యాగానికి కావలసిన సంబారాలన్నీ యజ్ఞవాటికకు చేర్చబడ్డాయి. ఋత్విక్కులంతా వచ్చి చేరారు. మహర్షులే ఆ యాగాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అంతా యాగంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారే గాని ఈ యాగానికి పుట్టు పూర్వోత్తరాలేమిటో ఎవరికీ తెలియదు. ఒక శ్రీకృష్ణునికి, భీష్మ ద్రోణ వ్యాసాదులకు మాత్రమే తెలుసు. శ్రీకృష్ణుడు ద్వారకనుండి బంధుమిత్రులతో కలసి ఇంద్ర ప్రస్థానికి చేరుకున్నాడు. ధర్మరాజు సోదరులందరితో కలసి ఎదురు వెళ్ళి ఘనంగా స్వాగతం పలికాడు. శ్రీకృష్ణుని సంప్రదించి ఎవరెవరు ఏయే కార్యభారాన్ని నిర్వహించాలో నిర్ణయించారు. యాగం నడపాల్సిన విధి విధానాలన్నింటినీ ధౌమ్యాదులకు ఒప్పగించారు.

యాగానికి దేశం నలుమూలలనుండి రాజులు వచ్చారు. విరాట ద్రుపదులు, శిశుపాల, గాంధార, నాయకులు భగదత్తుడు, శకసాల్వ బృహద్బల చంద్రసేన సముద్ర సేన కుంతిభోజ పౌండ్రక వాసుదేవులు, వసుదేవ బలరామ ప్రద్యుమ్న శూరసేనులు మున్నగు అనేకమంది ప్రముఖులు విచ్చేశారు. భీష్మ ద్రోణ, ద్రౌణి కృపాచార్య ధృతరాష్ట్ర విదుర సోమదత్త కర్ణులు భూరిశ్రవాది ప్రభృతులు ధర్మరాజుచే సత్కరించబడ్డారు. ధర్మరాజు చేతులొగ్గి వారందర్నీ ఏవిధంగా ఆహ్వానించాడో నన్నయగారి మాటల్లోనే వినండి.

ఆ॥ *మీయనుగ్రహమునఁ జేయంగఁ గడఁగితి । నిమ్మహాధ్వరంబు నెమ్మితోడ*
దీని నందఱును సమానంబుగాఁ బూని । పెంపుమెఱసి నిర్వహింపవలయు.

ఆ వచ్చిన పెద్దలంతా ధర్మజుని వినయ సంపత్తిని వేనోళ్ళ మెచ్చుకొంటూ అట్లాగే ఇది మా ఇంట్లో కార్యం అనుకొని నిర్వహిస్తామని మాట ఇచ్చారు. వాళ్ళు అన్నట్లుగానే కృపాచార్యుడు దాన ధర్మాల విషయాల్లోను, భీష్మద్రోణులు విధివిధానాలను నిర్ణయించే బాధ్యతల్ని, వస్తువాహనాల నియంత్రణను విదురుడు, వివిధ రాజుల నుండి వచ్చిన రత్నరాసులను, ధనకనక వాహనాలను దుర్యోధనుడు స్వీకరించేట్లుగాను, విందువినోదాల బాధ్యతలన్నింటినీ దుశ్శాసనుడు స్వీకరించారు. యాగానికి విధి నిషేధాల విషయాలన్నీ ధౌమ్యాదులు దగ్గర ఉండి చూసుకుంటున్నారు. యజ్ఞవాటిక అంతా వేదఘోషలతోను, ఆశీర్వాద వచనాలతోను మారుమ్రోగిపోతోంది. హవ్యాలను, కవ్యాలను స్వీకరించి దేవతలు సంతృప్తి చెందారు. యాజ్ఞికులందరికీ దక్షిణలు విరివిగా ముట్టజెప్పారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ యాగానికి వచ్చిన వారిలో తృప్తి చెందని వాడంటూ లేడంటే అతిశయోక్తి కానేకాదు. ఈ విధంగా ఆ రాజసూయం వేదోక్తంగా సాగిపోయింది.

సభాపూజ

(ఈభాగం భాగవతం, మహాభారతముల నుండి గ్రహించబడింది. భాగవతంలో శ్రీకృష్ణుని పూజించాలని సహదేవుడు ప్రతిపాదించినట్లు ఉండగా భారతంలో భీష్ముడు ప్రతిపాదనపై సహదేవుడు ఆ అర్ఘ్యాన్ని తెచ్చినట్లుంది. ఈ భేదం తప్ప మిగిలిన కథ ఎటువంటి భేదమూ లేదు.)

రాజసూయం పూర్తి అయింది. పెద్దలంతా కలసి ఒక సభచేసి సభా పూజ ఎవరికి చెయ్యాలన్న విషయంపై చర్చించారు. ఆ సమయంలో నారదాది మహర్షులంతా ఆ సభలోనే ఉండటం వలనను, త్రికాలజ్ఞులవడం వల్లను, భగవంతుడు భూభారాన్ని తగ్గించేందుకు యదువంశంలో అవతరించాడని స్మరించారు.

అంతట సహదేవుడు పూజాపాత్రను తెచ్చి సభలో ఉంచుతూ, సకల లోకాలకు పూజ్యుడు సర్వ దేవాది దేవుడు, సర్వకర్త, సర్వ రక్షకుడు అయిన శ్రీమన్నారాయణుని పూజించాలని తెలిపాడు. సభాసదులంతా సహదేవుని పలుకులను వేనోళ్ళ కొనియాడారు. ఈ ఘట్టంలో పోతనామాత్యులు ఎలా స్పందించి వ్రాశారో చూడండి.

ఉ॥ కాలము దేశముం గ్రతువుఁ గర్మముఁ గర్తయు భోక్త
యున్ జగ, జ్జాలము దైవమున్ గురువు సాంఖ్యము మంత్ర
ము నగ్నియాహుతుల్, వేళలు విప్రులున్ జనన వృద్ధుల
యంబుల హేతుభూతముల్, లీలలు దానయై తగ వెలింగెడు నెక్కటి తేజ మీశుఁడున్.

చ॥ ఇతఁడె యితండు కన్ను లొక యించుక మోడ్చిన నీచరాచర
స్థిత భువనంబు లన్నియు నశించు నితం డవి విచ్చి చూచినన్,
వితతములై జనించుఁ బ్రభ విష్ణుఁడు నైన విష్ణుఁడుయట్టి యీ
క్రతు ఫలముల దుండుగా కొరుఁడొకండెటులర్హుఁడు విశిష్ట పూజకున్.

ఉ॥ ఈ పురుషోత్తమున్ జనదధీశు ననంతుని సర్వ శక్తుఁ జి,
ద్రూపకు నగ్రపూజఁ బరితోషితుఁ జేయ సమస్త లోక
ముల్, వేపరితుష్టిఁ బొందుఁ బృథివీ వర కావున నీవు
కృష్ణునిన్, శ్రీపతిఁ బూజ చేయు మెడ సేయక మాటలు వేయి నేటికిన్.

సహదేవుని మాటలకు ధర్మరాజు కలత చెందాడు. ఎందువల్లనంటే సభలో ఇంతమంది ఉన్నారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క మనస్తత్త్వం గదా. భగవంతుడని మాకు తెలుసు. కానీ తెలియని వాళ్ళు బంధుత్వం చేత ఇంతగా పొగుడుతున్నామని అనుకోవచ్చుగదా. అందువల్ల సభలోని పెద్దలెవరైనా సహదేవుని సమర్థిస్తే బాగుండునని ఆందోళన చెందాడు. అయితే ఒక్కరూ నోరు మెదపలేదు. భీష్ముడొక్కడే ధర్మరాజు మనోవేదనను అర్థం చేసుకున్నవాడు. అందువల్ల భీష్ముడు లేచి ఇలా అన్నాడు "రాజా! సభాముఖంలో కొందరే పూజ్యులని శాస్త్రాలు చెపుతున్నాయి. స్నాతకుడు, ఋత్విజుడు, గురువు, సర్వజనులకు ఇష్టమైన వాడు (ఇష్టుడు), రాజు, సంయమీంద్రుడు అనే ఆరుగురూ పూజించదగినవారు. కావున ఇక్కడున్న సభాసదుల్లో ఇన్ని గుణాలు ఉన్నవారెవరో అతడినే పూజించు" అని చెప్పగా, ధర్మరాజు భీష్మునితో, "మహాత్మా! అటువంటి వానిని నువ్వే చెప్పు" వలసిందని ప్రార్థించాడు. ధర్మరాజు అభ్యర్థనను మన్నించి భీష్ముడు సంతోషించి భగవంతుని మనస్సులో ధ్యానించి "రాజా! విను.

సీ॥ రోదసీ కుహరంబు రుచి రాంశుతతిఁజేసి యర్కుండు వెలిఁగించు నట్టు లమృత
సందోహనిష్యంద చంద్రికఁ జేసి శీ తాంశుఁ డానందించు నట్టు సకల
జనులకుఁ దనదైన సదమల ద్యుతిఁ జేసి తనరంగఁ దేజంబుఁ దనుపుఁ దాన
చేయుచు నున్న సత్సేవ్యుండు పుండరీ కాక్షుండు కృష్ణుఁ డనాది నిధనుఁ

ఆ॥ డబ్జనాభుఁ డుండ నర్ఘ్యంబునకు నిందు । నర్హులొరులు గలరె యజ్ఞపురుషు
నఖిల లోక పూజ్యు నచ్యుతుఁ బూజింపు । మధిప! యదియ చూవె యజ్ఞఫలము.

అని భాగవన్మహిమను తెలుపుతూ అట్టి శ్రీకృష్ణుని పూజించక మరొకర్ని తలచనైనా తలచరాదని నొక్కి చెప్పాడు. భీష్ముడి మాటలకు సభాసదులెవ్వరూ వ్యతిరేకం చెప్పకపోగా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. దాంతో ధర్మరాజు మనస్సు కుదుట పడింది. అర్ఘ్యాన్ని శ్రీకృష్ణునకు అర్పించి కృతకృత్యుడయ్యాడు. శ్రీకృష్ణుడు అర్ఘ్యాన్ని స్వీకరించి ఇక తన అవతారఫలం చూపాల్సిన సమయం దగ్గర పడుతోందని గ్రహించాడు. సుదర్శనాన్ని మనస్సులో స్మరించాడు. ఇంతలో శిశుపాలుడు తన దుష్కర్మ ఫలం చేత ప్రేరేపించబడ్డాడు. చివాలున సభా మధ్యంలో నిలబడి శ్రీకృష్ణుని ఇలా దూషించడం మొదలు పెట్టాడు. ధర్మనందనా! ఈ సభలో అనేకమంది రాజులున్నారు. పెద్దలున్నారు. సద్బ్రాహ్మణులున్నారు. నువ్వు భీష్ముని దురాలోచనకు దాసుడవై శ్రీకృష్ణుని పూజించావు. దానితో నీ అజ్ఞానం బయట పడింది. ధర్మరాజా! ఒక్కసారి వివేకంతో ఆలోచించి చూడు. లోకంలో ధర్మ తత్త్వం పూర్తిగా తెలిసిన వారెక్కడా ఉండరు. ఈతడు నీక్షేమాన్ని కోరేవాడుగా నటిస్తూ (భీష్ముని చూపిస్తూ) నీచేత శ్రీకృష్ణునికి పూజ చేయించాడు. భీష్ముడికి ధర్మ సూక్ష్మాలేం తెలుసు? వయస్సులో

పెద్దవాడే గాని అవివేకి. ఈ యాదవుడు నీకు బంధువు గదా అని భీష్ముడు చెప్పగానే అతడికి పూజ చేశావు. నీ బంధువును సత్కరించే కోరిక ఉంటే నిలువెత్తు ధనం ఇవ్వు. లేదా ఇంకేమైనా ఆ కోరిక తీర్చి సంతోషపెట్టు. అంతేగాని పవిత్రులైన బ్రాహ్మణులు, పండితులు, పెద్దలు నిష్కళంకమైన రాజేంద్రులు ఈ సభలో ఎంతోమంది ఉండగా వారందర్నీ కాదని మర్యాదకు ఎంత మాత్రం నోచుకోని ఈ కృష్ణునికి పూజచేసి పెద్ద అపచారం చేశావు. ధర్మనందనా! ఇతడు ఏ విషయంలో పూజించదగ్గవాడో చెప్పగలవా? వయస్సులో పెద్దవాడైన వసుదేవుడు లేడా? ఋత్విజుల్లో పూజ్యుడైన వ్యాసుడు లేడా? ఆచార్యులలో పూజ్యులైన ద్రోణకృపాచార్యులు లేరా? ఏ విషయంలో ఘనుడని ఈ కృష్ణుని పూజించావు. యాదవులకు కనీసం రాజ్యాధికారం కూడా లేదే. భీష్ముడు నిన్ను వంచన చేశాడు. నీ బుద్ధి అంతా బుగ్గిపాలైంది. ఇక్కడున్న రాజులంతా నువ్వు సభామర్యాదలు తెలిసినవాడవని నమ్మి నువ్వు పిలువగానే వచ్చారు. అపాత్రుణ్ణి గౌరవించి అందర్నీ అవమానం చేశావు. ధర్మరాజా! నువ్వు ఒకవేళ తెలియక అర్ఘ్యం ఇచ్చావనే అనుకో. కృష్ణుడు తగుదునమ్మా! అంటూ ఎట్లా స్వీకరించాడో అర్థం కావడంలేదు. నువ్వు చూపిన మర్యాద ఎట్లా ఉన్నదంటే, నపుంసకుడికి వివాహం చేసినట్లుంది. చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లుంది. అంధుడికి అందాన్ని గూర్చి వర్ణించి చెప్పినట్లుంది. ఈ భావాలనే పోతనగారెట్లా వర్ణించి చెప్పారో చూడండి.

సీ॥ *గురుదేవశూన్యుండు కులగోత్ర రహితుండు తలిదండ్రు లెవ్వారొ తడవఁగాన*
మప్పులఁ బొరలెడు నాది మధ్యావసా నంబులం దరయ మానంబు లేదుఁ
బహురూపియై పెక్కు భంగుల వర్తించు వా వివర్తనములు వరుసలేవు
పరికింప విగత సంబంధుండు తలపోయ మానిమిత్తంబున మానినయ్యెఁ.

తే॥ *బరఁగ మున్ను యయాతి శాపమునఁజేసి । వాసి కెక్కద యీ యదు వంశమెల్ల*
బ్రహ్మ తేజంబు నెల్లఁ గోల్పడిన యితఁడు । బ్రహ్మ ఋషి సేవ్యుఁ డగునె గోపాలకుండు.

క॥ *జారుఁడు జన్మావధియును । జోరుఁడు ముప్పోకలాఁడు సుమహిత పూజా*
చార క్రియలకు నర్హుఁడె । వారక యితఁడనుచు నశుభ వాక్య స్ఫూర్తికిన్.

శిశుపాలుడు ఈ విధంగా మాట్లాడి, ధర్మరాజా! నువ్వు నన్ను పిలిచి మరీ అవమానం చేస్తున్నావు. అవమానం జరిగిన చోట క్షణం కూడా నిలువరాదని సభనుండి వెళ్ళిపోయాడు. అర్థాంతరంగా శిశుపాలుడు కోపగించుకొని పోవడం ధర్మరాజుకు బాధకలిగింది. శిశుపాలుని వెంట వెళ్లి బ్రతిమాలుతూ ఇలా అన్నాడు. ఆర్యా! నీవంటి పెద్ద మనుషులు ఇట్లా పరుషమైన మాటలు మాట్లాడరాదు. పరుషమైన మాటలు విషం కన్నా భయంకరమైనవి. కావున శాంతించు. శ్రీకృష్ణుడు సామాన్య మానవుడు కాడని తెలుసుకో. దేవతలకే పితామహుడైన బ్రహ్మను పుట్టించిన శ్రీమహావిష్ణువే ఈ కృష్ణుడు. వేద వేదాంగాలన్నీ ఏ మహాపురుషుని ప్రశంసిస్తాయో అట్టి శ్రీహరియే ఈ శ్రీకృష్ణుడు. లోకాలన్నింట్లోనూ శ్రీకృష్ణుడే పరమపూజ్యుడని ఎరిగిన వాడు కావడం వల్లనే కురుపితామహుడు శ్రీకృష్ణుడొక్కడే పూజార్హుడని తెలిపాడు. శిశుపాలా! నువ్వింకా చిన్నవాడివి. శ్రీకృష్ణుని తత్త్వం భీష్ముడికి తెలిసినంతగా నీకు తెలియదు. నీకంటే పెద్దవారైన రాజులంతా కూడా శ్రీకృష్ణుని పూజించడాన్ని

హర్షించారు. అటువంటి శ్రీకృష్ణుని నువ్వింత దారుణంగా మాట్లాడటం తగదు. అని పరిపరివిధాలుగా శాంతి వచనాలతో శిశుపాలుణ్ణి తృప్తి పరచే ప్రయత్నం చేశాడు.

ధర్మరాజు ఈ విధంగా శిశుపాలుణ్ణి కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలడం భీష్ముడికి ఇష్టం లేదు. అందువల్లనే, యుధిష్ఠిరా! శిశుపాలుడు మూర్ఖుడు. ఇటువంటి వాణ్ణి ప్రాధేయపడడం నీవంటివాడికి తగదు. వీడికి ధర్మమూ తెలియదు, ధర్మ స్వరూపమూ తెలియదు అని అన్నాడు. ఆ పిమ్మట శిశుపాలుడితో ఇలా అన్నాడు. శిశుపాలా! నువ్వొక మూర్ఖుడవు. నిన్ను వెనకేసుకొస్తున్న వాళ్ళంతా కూడా నీకన్నా మూర్ఖులు. ఇట్టి మూర్ఖులైన మీబోటి వారికి కూడా ముక్తిని ప్రసాదించే పరమేశ్వరుడీ శ్రీకృష్ణుడేనని తెలుసుకో. నువ్వు అడిగావు కాబట్టి ఇక్కడ నీకో ధర్మం చెప్తాను. విను. ఎవరికైతే ఉత్తమ జ్ఞానం కలుగుతుందో అట్టివాడు బాలుడైనా కూడా సద్బ్రాహ్మణులందరికీ పూజ్యుడు. అమిత పరాక్రమం గలవాడు బాలుడైనా క్షత్రియులందరికీ పూజ్యుడే. ఈకారణం చేత శ్రీకృష్ణుడే ఈ అర్ఘ్యానికి అర్హుడు. అంతేకాదు ఈ శ్రీకృష్ణుడే సకలలోకాలకూ పూజ్యుడైన శ్రీహరి అని తెలుసుకో. ఇతని కన్నా వృద్ధులు ఈ సభలో ఉండవచ్చు. కాని బుద్ధి విశేషం చేతను, సర్వజ్ఞుడు కావడం వల్లనూ శ్రీకృష్ణుడే పూజ్యుడని నిర్ణయించాం. ఎవరిని పూజిస్తే ముల్లోకాలు సంతృప్తి చెందుతాయో అట్టి శ్రీకృష్ణునే పూజించాం. పూజించ తగని వాడిని పూజించినట్లైతే లోకాలన్నీ దుఃఖిస్తాయి. ఇదే శాస్త్రమర్యాద. అందువల్లనే సభాపూజ్యుడు ఈశ్రీకృష్ణుడేనని పెద్దలు చెప్పినట్లే ఈ అర్ఘ్యాన్నిచ్చాము. ఎవరైతే నాకు ఎదురు చెప్తారో వాడి శిరస్సు ఖండిస్తాను. జాగ్రత్త! అన్నాడు. భీష్ముని మాటల్ని సభాసదులంతా నిశ్శబ్దంగా విన్నారు. మారు మాట్లాడకుండా కూర్చున్నారు. భీష్ముని మాటలకు ఆకాశం నుండి దేవతలు పుష్ప వర్షం కురిపించారు. నారదుడు భక్త్యావేశంతో నాట్యం చేశాడు.

భీష్ముని మాటలకు శిశుపాలుడు క్రోధంతో యుద్ధాన్ని ప్రకటించాడు. సేనానాయకుడైన సునీంధుడికి సేనలను సిద్ధం చెయ్యమని ఆజ్ఞాపించాడు. తనతో కలసి వచ్చే రాజులందరితో కలసి జట్టుకట్టాడు. యజ్ఞశాల ఎక్కడ రణరంగంగా మారుతుందోనని ధర్మరాజు భయపడిపోయాడు. యుద్ధమే గనుక అనివార్యమైతే యజ్ఞం నాశనమైపోతుందని తలచి భీష్ముని వద్దకు పోయి ప్రార్థించాడు. భీష్ముడిలా అన్నాడు. యుధిష్ఠిరా! నీయజ్ఞం ధ్వంసమై పోతుందేమోనని దిగులు పడకు. యజ్ఞాన్ని ధ్వంసం చెయ్యడం ఎవరితరమూ కాదు. ఎందువల్ల నంటే, యజ్ఞపురుషుడైన శ్రీకృష్ణుడే ఈ యజ్ఞాన్ని కాపాడుతాడు. ఇప్పుడు శిశుపాలుణ్ణి సమర్థించి యుద్ధ ప్రేలాపనలు చేస్తున్న రాజులందరూ మరికొద్ది సేపట్లో నశించి బూడిదై పోతారు. వీధి కుక్కలకు మదపుటేనుగు భయపడుతుందా? అని ఓదార్చాడు. భీష్ముని మాటలు శిశుపాలుడి చెవులకు ములుకుల్లా గుచ్చుకున్నాయి. భీష్ముడితో శిశుపాలుడిట్లా అన్నాడు. పితామహా! నువ్వు ముసలి వాడివై పోయావు. ముసలితనంతో పాటు మతిస్థిమితం కూడా తప్పింది. అందువల్లనే ఈ యాదవుణ్ణి పట్టుకొని శ్రీమహావిష్ణువు అంటున్నావు. ధర్మ తత్త్వం నీకు పాండవులకు మాత్రమే తెలుసునని అహంకారంతో మాట్లాడుతున్నావు. నీతో కలవడం వల్ల ధర్మరాజు తనకున్న మర్యాదను కూడా పోగొట్టుకున్నాడు. తోటి రాజులను అవమానించాడు. కృష్ణుడు భగవంతుడని భీష్ముడు ఏవేవో కట్టుకథలు చెప్పి సభాసదుల్ని నమ్మించాలని ప్రయత్నం చేస్తున్నాడు. చిన్నప్పుడు

ఎప్పుడో పూతనను చంపాడట, గోవర్ధన పర్వతాన్ని ఎత్తి పట్టుకున్నాడట. గాంగేయా! కృష్ణుణ్ణి పొగుడుతూ నువ్వు నమ్మించాలని చెప్పిన ఈ పాపపు పొగడ్తలకు నీ నాలుక వెయ్యిముక్కలుగా ఖండించినా పాపం రాదు. నువ్వొక అయోగ్యుడవు కాబట్టే, అంబను తన ప్రియుడి నుండి వేరు చేసి బలవంతంగా తీసుకొని వచ్చావు. నీ తమ్ముడు విచిత్రవీర్యుడా అంబను వదిలేశాడు. ఈ విధమైన నింద్య కార్యాలు చేసిన నువ్వు ధర్మం చెప్పడం ఎంతైనా ఆశ్చర్యంగా ఉంది. నువ్వు భగవంతుడని చెప్తున్న ఈ శ్రీకృష్ణుని జరాసంధుడు పదిహేడుసార్లు యుద్ధంలో మట్టికరిపించాడు. అట్టి జరాసంధుణ్ణి తాను ఏమీ చెయ్యలేక భీమార్జునుల్ని వెంట తీసుకొని పోయి చంపించాడు. ఇటువంటి వాని ప్రతాపాలు నా వద్ద ఎందుకు చెప్తావు? అని అంటూ ఉండగా భీముడు శిశుపాలునిపై లంఘించబోగా భీష్ముడు వారించాడు.

శిశుపాలుని జన్మ వృత్తాంతం :

శిశుపాలుడు చేది వంశంలో దమఘోషుడికి సాత్వతికి జన్మించాడు. ఇతడు పుట్టుటయే నాలుగు చేతులతోను, మూడు నేత్రాలతోను జన్మించాడు. ఇతడి వికృతాకారం చూసి తల్లితండ్రులు భీతి చెందారు. ఏంచెయ్యాలా? అని దుఃఖిస్తూ ఉండగా అశరీర వాణి ఇలా పలికింది. "రాజా! భయపడకు. ఏ అస్త్రాలు ఇతణ్ణి చంపలేవు. ఇతణ్ణి చంపగలవాడు ఇప్పటికే పుట్టి పెరుగుతున్నాడు. కావున మీరు ఇతణ్ణి నిర్భయంగా పెంచి పెద్దవాణ్ణి చెయ్యండి. ఎవరైతే ఈ పిల్లవాణ్ణి ఒడిలో పెట్టకొనగా ఇతడిపై రెండుచేతులు, మూడవ నేత్రం మాయమై పోతాయో అతడి చేతిలోనే మరణిస్తాడని తెలుసుకోండి." అని పలికింది. ఆ దంపతులిద్దరికీ పిల్లవాడికి మృత్యుకారకుడెవరో తెలుసుకోవాలన్న ఉత్కంఠ పెరిగింది. అందువల్ల వచ్చిన ప్రతివాళ్ళను బిడ్డను ఎత్తుకొని లాలించమని అడిగేవారు. ఈ వింత శిశువును గూర్చి లోకంలో అందరికీ తెలిసిపోయింది. బలరామకృష్ణులు కూడా మేనత్త కొడుకైన ఈ వింత బాలుణ్ణి చూడాలని వచ్చారు. శ్రీకృష్ణుడు ఈ పిల్లవానిని ఒడిలో పడుకోబెట్టుకోగానే ఇతడి పైరెండు చేతులు, మూడవ నేత్రం అదృశ్యమయ్యాయి. ఈ దృశ్యం చూడగానే సాత్వతికి అశరీర వాణి పలికిన పలుకులు జ్ఞాపకానికి వచ్చాయి. తన కుమారుడు శ్రీకృష్ణుని చేతిలో మరణించడం తథ్యమని తెలుసుకుంది. మేనల్లుడైన శ్రీకృష్ణునితో చేతులు జోడించి ఇలా అంది. మహాత్మా! నా కుమారుడు ఏ కారణం చేతనైనా నీకు నూరు అపరాధాలు చేసేవరకు చంపనని వరమివ్వమని ప్రార్థించింది. శ్రీకృష్ణుడు ఆ వరదానం చేశాడు. అందువల్లనే శ్రీకృష్ణుడు అతడి అపరాధాలన్నింటినీ సహిస్తూ వస్తున్నాడు. నూరు అపరాధాలు పూర్తికాగానే ఆ శ్రీకృష్ణ పరమాత్మయే శిశుపాలుని అంతం చేస్తాడు. కావున భీమసేనా నువ్వు తొందరపడాల్సిన అవసరం లేదు అని తెలిపాడు.

భీష్ముడు ఈ విధంగా శిశుపాలుని జన్మవృత్తాంతాన్ని తెలిపి భీముని శాంతపరుస్తూ ఉండగానే శిశుపాలుని పాపాలు పండాయి. శ్రీకృష్ణునితో శిశుపాలుడు ఇలా అన్నాడు. గోపాల బాలకా! నువ్వు సన్మానానికి అర్హుడవని మతిస్థిమితంలేని ముదుసలి భీష్ముడు అనడం, తగుదునమ్మా అంటూ అర్ఘ్యాన్ని స్వీకరించేందుకు ముందుకురావడం ఎంతో శోచనీయంగా ఉంది. శిశుపాలుడి మాటలు విన్న శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "కొంతకాలం క్రిందట మేమంతా ప్రాగ్జ్యోతిషపురంలో భగదత్తునిపై

యుద్ధం ప్రకటించిన సందర్భంలో నువ్వు ద్వారకా నగరానికి నిప్పు పెట్టావు. బాలలు, వృద్ధుల్ని ఎన్నో విధాలుగా హింసించావు. ఇంకో సందర్భంలో భోజరాజులు తమ భార్యలతో కలసి రైవత పర్వతంపై విహరిస్తూ ఉంటే వాళ్ళందర్నీ చాటుగా వచ్చి వధించావు. అట్లాగే వసుదేవుడు తలపెట్టిన అశ్వమేధంలో యాగాశ్వాన్ని అపహరించుకు పోయావు. పరమ పాపాత్ముడవై బ్రభు భార్యను అపహరించి వివాహమాడావు. ఇట్లా అనేక అపరాధాలు చేశావు. ఇవి చాలదన్నట్లు అనేక పర్యాయాలు అకారణంగా నన్ను అవమానించావు. నాకు అత్త అయిన నీతల్లి నూరు అపరాధాల వరకు నిన్ను క్షమించమని ప్రార్థించింది. నేనందుకు అంగీకరించాను. ఇప్పుడు నువ్వు అకారణంగా నన్ను నిందించి నాతో విరోధాన్ని కోరుకుంటున్నావు" అన్నాడు. అందుకు శిశుపాలుడు ఇలా అన్నాడు. "గోపాలా! నువ్వు నా తల్లిపైన చూపుతున్న కపట ప్రేమ ఇకచాలు. నిన్ను నువ్వు ఎంతో ఉత్తముడిగా చెప్పుకుంటున్నావు. నాకోసం నిర్ణయమైన రుక్మిణిని దొంగతనంగా అపహరించుకు పోయింది నువ్వు కాదా? ఇంకా సిగ్గులేకుండా ఏముఖం పెట్టుకొని మాట్లాడుతున్నావు?" అంటూ అనేక విధాలుగా శ్రీకృష్ణుని కఠినమైన మాటలతో అవమానించి మాట్లాడాడు. శిశుపాలుడి వాక్ప్రవాహం ఇంకా కొనసాగుతూనే ఉండగా శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్ని స్మరించాడు. అది సరాసరి వచ్చి శ్రీకృష్ణుని చూపుడు వేలుకు అతుక్కుపోయింది. అప్పుడు శ్రీకృష్ణుడు సభాసదులతో ఇలా అన్నాడు. రాజేంద్రులారా! నేను అత్తకు ఇచ్చిన మాట ప్రకారం శిశుపాలుని నూరు అపరాధాల్ని సహించాను. ఇకపైన ఉపేక్షిస్తే ఇతడు లోకానికి కంటకుడవుతాడు. కావున ఇప్పుడే ఇతడి శిరస్సును ఛేదిస్తున్నాను అని సుదర్శన చక్రాన్ని ప్రయోగించగా అతడి శిరస్సు తెగి నేలపైన పడింది. సభాసదులంతా చూస్తూ ఉండగానే అతడిలోనుండి తేజస్సొకటి బయటకు వచ్చి శ్రీకృష్ణునిలో లీనమైంది.

అంతట శ్రీకృష్ణుడు శిశుపాలుని కుమారుణ్ణి చేది రాజ్యానికి అధిపతిని చేశాడు. ధర్మజుడు తలపెట్టిన యాగం నిర్విఘ్నంగాను సంపూర్ణంగాను నెరవేరింది. ధర్మరాజు జ్ఞాతులందర్నీ తగురీతిగా సత్కరించి పంపాడు. శ్రీకృష్ణుడు కూడా ద్వారకకు బయలుదేరగా ఇంకా కొన్ని రోజులు ఇంద్రప్రస్థంలోనే గడపమని పాండవులంతా ముక్తకంఠంతో ప్రార్థించారు. వారి కోరికను సున్నితంగా తిరస్కరించి తాను ద్వారకకు బయలుదేరాడు. పోతూ పోతూ తాను ద్వారకలో ఉన్నా మిమ్మల్నందర్నీ కంటికి రెప్పలా కాపాడుతానని వాగ్దానం చేశాడు.

విశేషార్థం : కర్మము బలవత్తరమని ఈ కథ మరొకసారి ఋజువు చేస్తోంది. కర్మమంటే పరబ్రహ్మమే కదా. శిశుపాలుడు జయ విజయులలో ఒకడు. ఇతడికిది మూడవ జన్మ. మొదటి జన్మలో హిరణ్యాక్ష, హిరణ్య కశిపులుగాను, రెండవ జన్మలో రావణ కుంభకర్ణులుగాను, మూడవ జన్మలో శిశుపాల దంతవక్త్రులు గా జన్మనెత్తారు. ఇదే చివరి జన్మ. దీనితో వీరికి శాపవిముక్తి లభించి మరల విష్ణుపార్షదులై భగవత్సేవా లాభాన్ని పొందుతారు. శిశుపాలుడికి శాపవిముక్తి సమయం దగ్గర పడింది. ఇకపైన ఒక క్షణమైనా అతణ్ణి కష్టపెట్టడానికి భగవంతుడు అంగీకరించలేదు. కావున దానికి తగినట్లుగా రాజసూయం, ఆయాగంలో సభాపూజా విధానాన్ని ప్రవేశపెట్టి శిశుపాలుణ్ణి కర్మముచే ప్రేరేపించి భగవంతుణ్ణి దూషించేట్లు చేసింది. శిశుపాలుడి దోషాలన్నీ లెక్కకట్టి ఎత్తి చూపిన శ్రీకృష్ణుడు

తన సుదర్శన చక్రం చేత శిరచ్ఛేదన చేసి ఆ తేజస్సు తనలో ఐక్యం చేసుకున్నాడు. అంతేకాని సభలో తనను ఇతడు అవమానించాడని చంపలేదు. జయవిజయులే ఎక్కువ కాలం భగవత్సేవనుండి దూరమై ఉండలేమని తలచి మూడు జన్మల్లోనే భగవత్సాన్నిధ్యానికి ప్రార్థించారు. అందుకిది సమయం కాబట్టి భగవంతుడు సుదర్శనాన్ని ప్రయోగించాడు. భగవంతుడికి పుణ్యాత్ములయందు అనుగ్రహం కాని పాపాత్ములయందు ఆగ్రహం గాని ఉండదు గదా. ఈ శిశుపాలుని కథ భగవంతుని మహిమ సర్వతోముఖంగా తెలుపుతోంది. ఆయన కరుణే ముక్తి దాయకము.

సాల్వుడు ద్వారకపై దండెత్తుట

(ఈ భాగం భాగవతం దశమ స్కంధం 76,77వ అధ్యాయాల నుండి గ్రహించబడింది.)

భగవంతుడు ఎవరెవరికి ముక్తిని ప్రసాదించాలో వారందర్నీ కృతార్థుల్ని చెయ్యడం గూడ అవతారఫలమే గదా. రుక్మిణీ కళ్యాణ సమయంలో శిశుపాలుని వెనకేసుకొని వచ్చిన వారిలో సాల్వుడొకడు. అప్పుడు శ్రీకృష్ణునిచే పరాభవం పొందినా శ్రీకృష్ణునిపై పగపట్టి ఉన్నాడు. దేశంలో ఉండే యావులందర్నీ సంహరించాలని అతడి ఆశయం. అందుకు భగవదనుగ్రహం లేకుండా తానుగా సాధించలేడని నమ్మాడు. పరమశివుని ధ్యానించి చాలాకాలం తపస్సు చేశాడు. ఇతడిలో మెదలుతున్న పాపపుటాలోచనలు శివభగవానుడెరుగును. అందుకే చాలాకాలం ఉదాసీనం వహించాడు. అయితే భక్తుడు ఆర్తితో తపస్సు చేస్తూఉండటం వలన భగవానుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. సాల్వుడు శంకరునికి సాష్టాంగ నమస్కారం చేసి, దేవ దానవ గంధర్వాది శక్తులేవీ అడ్డుకోలేని వాహనాన్నొకటి నాకు ప్రసాదించమని ప్రార్థించాడు. భగవంతుడు అట్లే అగుగాక అని ఆశీర్వదించాడు. పిమ్మట మయుని పిలచి అట్టి రథాన్నొకటి నిర్మించి సాల్వునికిమ్మని అంతర్థానుడయ్యాడు.

శంకరుని ఆజ్ఞననుసరించి మయుడు లోహంతో "సౌభమ" నే దివ్యరథాన్ని నిర్మించి ఇచ్చాడు. సాల్వుడు ఆ దివ్యరథాన్ని చూసి పరమానందభరితుడయ్యాడు. ఈ సౌభమనే రథంలో కూర్చున్న వాళ్ళెవరూ ఇతరులకు కనిపించరు. కానీ వారు అందర్నీ స్పష్టంగా చూడగలుగుతారు. వెంటనే శ్రీకృష్ణునిపై తనకున్న ద్వేషం అంతా బయటకు వచ్చింది. వెంటనే ఆరథాన్ని అధిరోహించి ద్వారకపై దండయాత్రకు బయలుదేరాడు. ఆకాశంలో నుండి ద్వారకపై రాళ్ళవర్షం కురిపించాడు. నగరవాసులంతా భయపడి శ్రీకృష్ణుని మందిరానికి పరుగెత్తారు. అప్పుడు నగరన్ని కాపాడుతున్న ప్రద్యుమ్నుడు పెద్ద సైన్యాన్ని తీసుకొని సాల్వునిపై యుద్ధానికి బయలుదేరాడు. సాల్వుడు తన మాయాబలంతో యాదవ సేనకు కనిపించకుండా యుద్ధం చేస్తున్నా ప్రద్యుమ్నుడు సాల్వుడున్న దిశకు వేలాది బాణాలను గురిచూసి వదిలాడు. ఆధాటికి తట్టుకోలేక సాల్వుడు తన రథాన్ని వేలాది రథాలుగా కనిపించేట్లు చేశాడు. అంతలోనే ఒక్కరథమే కనిపించేట్లు చేస్తూ ప్రద్యుమ్నుణ్ణి చీకాకు పరచాడు. సాల్వుడు గదను గిరగిరా త్రిప్పి ప్రద్యుమ్నుడిపై విసరగా అతడి వక్షః స్థల కవచం పగిలిపోయింది. ప్రద్యుమ్నుడు మూర్ఛపోయాడు. ఇది కనిపెట్టిన సారథి రథాన్ని దూరంగా తీసుకు పోతాడు. కొంత సేపటికి

తెప్పరిల్లిన ప్రద్యుమ్నుడు తాను యుద్ధరంగానికి బయట ఉండటం చూసి సారథితో ఇలా అన్నాడు. ఓ సూతుడా! నన్ను యుద్ధభూమి నుండి తప్పించి రథాన్ని ఎందుకు ఇంత దూరంలో నిలిపావు? నువ్వ చేసిన పనివల్ల నన్ను పిరికి వాడిగా జమకట్టి మాట్లాడరా? ఎందుకు చేశావీపని? నా తండ్రి పెత్తండ్రులైన శ్రీకృష్ణ బలరాములు ఏమంటారో ఆలోచించావా? పిరికివాడవై ప్రాణాలు కాపాడుకున్నావా? అని నన్నడుగరా? నా సోదరులంతా ఈ వృత్తాంతం తెలుసుకొని నన్ను హేళన చేయ్యరా? తోటి వారిముందు తలెత్తుకొని తిరుగగలనా? అని అడిగాడు. అందుకు సూతుడిలా అన్నాడు. రాజకుమారా! నేను అనేక యుద్ధాల్లో సారథ్యం వహించాను. యుద్ధ ధర్మాలన్నీ నాకు బాగా తెలుసు. యజమాని ఆపదలో ఉన్నప్పుడు తెలివైన సారథి యుద్ధరంగం నుండి వెలుపలకు తీసుకొని వచ్చి, తేరుకున్న తర్వాత తిరిగి యుద్ధభూమికి తరలిస్తాడు. నేనా ధర్మాన్ని తెలిసిన వాడిని కాబట్టే నీకు ప్రాణాపాయాన్ని తప్పించాను. మరల మనం ఇప్పుడు యుద్ధరంగంలో ప్రవేశించవచ్చు. ఇందులో దోషం ఎంత మాత్రం లేదు. ఈవిషయంలో నిన్నెవరూ వేలెత్తి చూపరు. అన్నాడు. అంతట ప్రద్యుమ్నుడు రథాన్ని ద్యుమంతుని ఎదుట నిలుపమన్నాడు. వెంటనే ఎనిమిది నారాచ బాణాలను ప్రయోగించి నాలుగు బాణాలతో ప్రత్యర్థి గుర్రాలను, ఒక బాణంతో సారథిని, మరొక బాణంతో ధ్వజాన్ని పడగొట్టాడు. రెండు బాణాలతో ద్యుమంతుడి శిరస్సునూ ఖండించాడు. ఇంతలో సాత్యకి, సాంబుడు కూడా తోడై శత్రు సైన్యాన్నంతా చెండాడారు.

ఆ సమయంలో శ్రీకృష్ణుడు రాజసూయ యాగానికని ఇంద్రప్రస్థానికి వెళ్ళాడు. ఇదే సరైన సమయమని ఎంచిన సాల్వుడు యాదవులందర్నీ ఊచకోత కొయ్యాలనే దురాలోచనతో ద్వారకపై దండెత్తాడు. శిశుపాలుని పక్షం వారు ద్వారకపై దండెత్తి ఉండవచ్చునని శ్రీకృష్ణుడు అభిప్రాయ పడ్డాడు. ఆమాటే దారుకుడితో అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న దారకుడు రథాన్ని వేగంగా ద్వారకవైపు నడిపించాడు. వస్తూనే ద్వారక ఒక రణరంగంగా మారి ఉండటం చూశాడు. గరుడధ్వజంతో కూడిన శ్రీకృష్ణుని రథాన్ని చూసి సాల్వుడి పై ప్రాణాలు పైనే పోయాయి. శ్రీకృష్ణుడు ద్వారకలో లేని సమయం చూసి యాదవులందర్నీ మట్టుపెట్ట వచ్చునని దురాలోచన చేశాడు. అయినా ధైర్యాన్నంతా కూడగట్టుకొని భయంకరమైన శక్తి ఆయుధాన్ని శ్రీకృష్ణునిపై ప్రయోగించాడు. శ్రీకృష్ణుడా శక్తిని నూరుముక్కలు చేశాడు. ఆపైన సాల్వుడిపై ఆరు బాణాలను సంధించి, దిగ్బంధం చేశాడు. సూర్యచంద్రుల్లా వెలిగిపోతున్న ఆ రథాన్ని చేదించాడు. ఆ రథం నేలకూలగా ముల్లోకాలూ హాహాకారాలు చేశాయి. సాల్వుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. మూర్ఖుడా! సభలో నా మిత్రుణ్ణి చంపావు. నా మిత్రుడి కొరకు నిర్ణయించిన కన్యను అపహరించావు. ఇప్పుడు నా చేతికి చిక్కావు. ఇక నిన్ను వదలిపెట్టడం అనేది అసంభవం. నీ మరణం నా చేతిలో రాసి పెట్టి ఉంది. కాచుకో. అన్నాడు. సాల్వుని మాటలు విన్న శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. ఓరీ! మందమతీ! నేను నీ మృత్యువునై నీ ఎదుట నిలచాను. నన్ను గుర్తించలేక అధిక ప్రసంగాలు చేస్తున్నావు. శూరులు ప్రతాపాన్ని చూపిస్తారే గాని మాటలతో కాలం వృథా చెయ్యరు అని అంటూ ఉండగానే సాల్వుడు అదృశ్యుడైపోయాడు. కొంతసేపైన తర్వాత దూత ఒకడు శ్రీకృష్ణుని వద్దకు వచ్చి ప్రభూ! సాల్వుడు వసుదేవుని బంధించి తీసుకుపోయాడు. ఈమాట మీకు చెప్పిరమ్మని దేవకీదేవి నన్ను పంపింది అని అన్నాడు. దూత మాటలు విన్న శ్రీకృష్ణుడు కలత చెందాడు. ఇది ఎట్లా జరిగింది.

ఇంటి దగ్గర అందరూ బలరాముడి సంరక్షణలో ఉన్నారు గదా. ఈ సాల్వుడికి బలరాముని ఓడించే సామర్థ్యం ఎక్కడి నుండి వచ్చింది? విధి బలీయమంటే ఇదేనేమో అని అనుకుంటూ ఉండగా సౌభ విమానంలో నుండి సాల్వుడు వసుదేవుని (పోలిన) వ్యక్తిని బంధించి తనవెంట తీసుకొని వచ్చాడు. కృష్ణా! నువ్వు బ్రతికుండగానే నీ తండ్రిని రక్షించుకోలేని దుస్థితిలో పడిపోయావు. చూస్తూ ఉండు ఇతణ్ణి నీ కళ్ళముందే సంహరిస్తాను. నీ తండ్రినెలా కాపాడుకుంటావో చూస్తాను అంటూ ఆ (మాయా) వసుదేవుని శిరస్సు ఖండించి అదృశ్యుడై పోయాడు. అంతలో కొందరు మహర్షులు అక్కడ ప్రత్యక్షమై శ్రీకృష్ణునితో మహాత్మా! ముల్లోకాల్లోనూ సంసార దుఃఖాల్లో సతమతమై పోతున్న జనులంతా నీ నామాన్ని స్మరించినంతమాత్రానే ఉద్ధరించబడుతున్నారు. అటువంటిది నువ్వు దుఃఖానికి లోనవడం తగునా? అని చెప్పి అంతర్ధానమయ్యారు. అంతట శ్రీకృష్ణుడు కోదండాన్ని తీసుకొని బాణాలతో ఆకాశాన్నంతా కప్పివేశాడు. సాల్వుని ధనస్సును కవచాన్ని ఛేదించాడు. శ్రీకృష్ణుడు గదను త్రిప్పి సౌభముపై విసరగా అది ముక్కలై సముద్రంలో పడింది. సాల్వుడు పాలిపోయిన ముఖంతో దిక్కుతోచక నిలబడ్డాడు. అంతలో శ్రీకృష్ణుని చక్రం అతడి శిరస్సును ఖండించింది.

దంతవక్త్రుని వధ :

సాల్వుడి మరణం శిశుపాలుడి శిబిరంలో దావానలంలా వ్యాపించింది. సాల్వుడు ఈశ్వర కటాక్షంతో శ్రీకృష్ణుని పరిమార్చి వస్తాడని దంతవక్త్రుడు ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. సాల్వుడి మరణ వార్త విని దంతవక్త్రుడు తానే శ్రీకృష్ణునిపై యుద్ధానికి స్వయంగా బయలుదేరాడు. శ్రీకృష్ణునితో తలపడి గదను గిరగిరా త్రిప్పుతూ కృష్ణా! నా అదృష్టంకొద్దీ ఈ రోజు యుద్ధంలో నువ్వే స్వయంగా నా కంట పడ్డావు. అనగా నీ ఆయుర్దాయం తీరినట్లే లెక్కవేసుకో. నువ్వు మిత్రద్రోహులలో మొదటివాడవు. ఇంతవరకు నా గదా ప్రహరణం పాలిట పడి బ్రతికి బట్టకట్టినవాడు లేడు. ఇప్పుడు నీకు అంత్యకాలం రావడం వల్లనే నా ఎదుటకు వచ్చావు. కాచుకో. అంటూ గదను శ్రీకృష్ణునిపైకి విసిరాడు. ఆ గద శ్రీకృష్ణుని చేరేలోపలే శ్రీకృష్ణుడు తన కౌమోదకాన్ని ప్రయోగించాడు. ఆ కౌమోదకి సూటిగా దంతవక్త్రుని తలకు తగిలి తలనూరు ముక్కలై రక్తపు మడుగులో పడింది. అతడి శరీరంలో నుండి ఒక తేజస్సు బయటకు వచ్చి శ్రీకృష్ణునిలో విలీనం అయింది. చూస్తున్న వాళ్ళందరికీ ఇదేదో అద్భుతంగా అనిపించిందే గాని అందులోని ఆంతర్యమేమిటో ఎవరూ తెలుసుకోలేకపోయారు. దంతవక్త్రుని మరణాన్ని అతడి సోదరుడు జీర్ణించుకోలేక పోయాడు. వెంటనే కత్తి తీసుకొని శ్రీకృష్ణునిపై లంఘించాడు. శ్రీకృష్ణుడు ఎంతమాత్రం ఆలస్యం చెయ్యకుండా సుదర్శన చక్రాన్ని ప్రయోగించి అతడి శిరస్సును ఛేదించాడు.

శ్రీకృష్ణుడు ఈ విధంగా శిశుపాల, సాల్వ, దంతవక్త్ర, విదూరథాదుల్ని సంహరించి వారందరికీ విష్ణుపదాన్ని ప్రసాదించాడు. ప్రజాకంటకులంతా సంహరించబడి భూభారం తగ్గటంతో దేవతలంతా సంతోషించి పూలవాన కురిపించారు.

అర్జున గర్వభంగం

(ఈ కథాభాగం హరివంశం విష్ణుపర్వం నుండి, మరియు ఇతర పురాణములనుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు శిశుపాల దంతవక్త్రాదులను సంహరించి కొంతకాలం ద్వారకలో విశ్రాంతి తీసుకుంటూ ఉండగా జాంబవతి సాంబుని ప్రసవించింది. యాదవులంతా శ్రీకృష్ణుని ఆరాధిస్తూ నివసించారు. ద్వారకయే వైకుంఠముగా తేజరిల్లింది. కొంతకాలానికి దుర్యోధనుడు ఒక యాగాన్ని తలపెట్టాడు. ఆ యాగానికి రాజులందర్నీ ఆహ్వానించాడు. రాజులంతా హస్తినాపురంలో యాగాన్ని తిలకించిన పిదప ద్వారకానగర వైభవాన్ని కన్నులారా చూడాలని అనుకున్నారు. ద్వారక శత్రుదుర్భేద్యమని, సముద్ర జలాల మధ్య నిర్మించబడిన మహానగరమని వాళ్ళందరికీ తెలుసు. అంతేకాకుండా సాక్షాత్తూ లక్ష్మీదేవియే ద్వారకలో నివసిస్తోందని, అట్టి లక్ష్మీ వైభవాన్ని కన్నులారా చూసి తరించాలనుకున్నారు. అట్లా ద్వారకకు బయలుదేరిన వాళ్ళల్లో పాండవులు, కౌరవులు, ద్రుష్టద్యుమ్నాది పాంచాల రాజకుమారులు, పాండ్య, చోళ, కళింగ బాహ్లిక మున్నగు రాజులంతా వారి వారి సేనలతో కలసి సముద్రతీరాన గల రైవత పర్వతాన్ని చేరుకున్నారు.

శ్రీకృష్ణుడు వారందరికీ ఎదురు వెళ్ళి స్వాగతం పలికి ద్వారకకు తీసుకొని వెళ్ళాడు. వారందరితో కలసి సభచేసి యాదవులతో ఇష్టాగోష్ఠి ప్రసంగాలు జరిపించాడు. ఆ సభ దేవేంద్రుని సభను తలపింపజేసింది. ఆ సభ అట్లా జరుగుతూ ఉండగానే నారద మహర్షి దేవ లోకం నుండి దిగి వచ్చి ఇలా అన్నాడు. "కృష్ణా! నువ్వు పురుషోత్తముడవు. దేవతలకు ఆద్యుడవు. నిన్ను కొలిచిన వారంతా ధన్యాత్ములవుతారు" నారదుని పలుకుల్ని విన్న శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ "అవును, ఆశ్చర్య భూతుడను నేనే. దక్షిణలతో కూడిన ధన్యుడను నేనే" అని అన్నాడు. అక్కడున్న సభాసదులెవ్వరికీ శ్రీకృష్ణుని మాటల్లోని అంతరార్థమేమిటో అర్థంకాలేదు. ఆమాటే పరమేశ్వరుణ్ని "కృష్ణా! ఆశ్చర్యమని, ధన్యమని రెండుమాటలన్నావు. ఈ మాటలకు అర్థమేమో నువ్వే వివరంగా చెప్పి మమ్మల్ని కృతార్థుల్ని చెయ్యి" అన్నారు. అందుకు శ్రీకృష్ణుడు "నారదమునీంద్రా! రాజుల సందేహాన్ని విన్నావు గదా! నువ్వే వారికి వివరంగా చెప్పి వారి సందేహం తీర్చు. ఎందువల్లనంటే ఆ పదాలకు యథార్థమైన అర్థాన్ని నువ్వే స్వయంగా తెలుసుకున్నావు. నీ అనుభవం వారితో చెప్పి వారి సందేహం తీర్చు" అన్నాడు.

పరమేశ్వరుని ఆదేశం ప్రకారం నారదమహర్షి వారితో ఇలా తెలిపాడు. "రాజ ప్రముఖుల్లారా! శ్రీకృష్ణుడే పరబ్రహ్మం. ఆయనను గూర్చి ఎవరికీ పూర్తిగా తెలియదు. అయితే నేను తెలుసుకున్నంత వరకూ మీకు చెప్తాను. వినండి. ఒక రోజున నేను గంగాతీరంలో విహరిస్తున్నాను. అప్పుడు నేనొక్కణ్ణే ఉన్నాను. ఇంకా సూర్యాస్తమయం కాలేదు. ఆ సమయంలో గంగా జలాల నుండి పెద్ద తాబేలొకటి (కూర్మం) బయటకు వచ్చింది. దాని ఆకారం పర్వతమంత ఉంది. దానిలో ఇంద్రధనుస్సులోని రంగులన్నీ కనిపించాయి. పైగా ఎంతో తేజోవంతంగా కనిపించింది. నేనప్పుడా కూర్మంతో "నువ్వు నిశ్చింతగాను, నిర్భయంగాను ఈ విశాల గంగా జలాల్లో సంచరిస్తున్నావు. నువ్వు ధన్యురాలవు అని

ప్రశంసించగా, అందుకా కూర్మం మనుష్య భాషలో, "మునీంద్రా! నన్నెందుకు ధన్యజీవినని ప్రశంసిస్తున్నావు? నాకన్నా గూడా ఈగంగాజలాలే ధన్యమైనవని భావిస్తున్నానని" పలికింది. అప్పుడు నేను ఆ కూర్మం మాటలకు ఆశ్చర్యపోయి గంగానది ధన్యురాలు అన్నాను. ఆ నది స్త్రీరూపందాల్చి నాకన్నా సముద్రుడు ధన్యుడుకాడా? అని ప్రశ్నించింది. అంతట నేను సముద్రుణ్ణి ప్రస్తుతించగా సముద్రుడు ప్రత్యక్షమై తనకన్నా భూమి ధన్యమైనదన్నాడు. భూమిని ప్రస్తుతించగా తనకన్నా పర్వతాలు ధన్యమైనవని తెలిపింది. ఎందువల్లనంటే నన్ను కూడా ఈ పర్వతాలే భరిస్తున్నాయి కనుక అన్నది. నేను పర్వతాలను ప్రశంసించగా అవన్నీ ముక్త కంఠంతో మమ్మల్నందర్నీ సృష్టించిన ప్రజాపతి అయిన బ్రహ్మయే ధన్యుడని పలికాయి. పితామహుడైన బ్రహ్మకు నమస్కరించి ఓ పంకజ సంభవా! సమస్త భూతాలకు, స్థావర జంగమాలకు, దేవ గంధర్వులకు సకల బ్రహ్మాండాలకు సృష్టికర్తవు. ఆది పురుషుడవైన నువ్వే ధన్యుడవన్నాను. అందుకు బ్రహ్మ, "నారదా! నేను, నీ ప్రశంసలకు యోగ్యుణ్ణి కాదు. వేదాలే నాకు కారణభూతం. అందువల్ల వేదాలే ధన్యమైనవి" అని తెలిపాడు. అంతట నేను, వేదస్వరూపులారా! యజ్ఞ స్వరూపులైన మీరే ధన్యులు. పుణ్య స్వరూపాలన్నీ మీరే. మీరే అందరికన్నా ధన్యులని బ్రహ్మ ప్రశంసించాడు" అన్నాను. అందుకు వేదాలు ఇలా అన్నాయి. మహర్షీ! ధన్యత్వమనేది ఆశ్చర్యకరమైన శబ్దం. ఆ శబ్దం విష్ణువు ఒక్కడికే చెల్లుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అగ్నిదహించగల వస్తువులన్నీ విష్ణువుకు చెందినవే నని తెలుసుకో. అందువల్లనే విష్ణు స్వరూపుడైన ఈ శ్రీకృష్ణ పరబ్రహ్మాన్ని దర్శించుకుపోదామని స్వర్గం నుండి వచ్చాను. మీ మధ్యను కూర్చుని మీతో పిచ్చాపాటీ మాట్లాడుతున్నది ఆ విష్ణుభగవానుడేనని మీరు తెలుసుకోలేకుండా ఉన్నారు. అందువల్లనే పరమేశ్వరుడు తన వైభవాన్ని నా నోటిద్వారా చెప్పమని ఆదేశించాడు అని అన్నాడు. సభాసదులంతా దిగ్భ్రాంతి చెందారు. దాంతో శ్రీకృష్ణ తత్త్వాన్ని ఇంకా తెలుపమని మహర్షిని ప్రార్థించారు. అందుకా మహర్షి సభాసదులారా! పూర్వం జనమేజయుడు వైశంపాయనుణ్ణి మీలాగే కుతూహలంతో అడిగాడు. ఆ కథ మీకు జరిగింది జరిగినట్లు చెప్తాను వినండి అన్నాడు.

వాసుదేవ మాహాత్మ్యం :

జనమేజయుడు, శ్రీకృష్ణుని మహత్త్వాన్ని గూర్చి తెలుపమని అడుగగా వైశంపాయనుడిలా తెలిపాడు. రాజా! శ్రీకృష్ణుని గూర్చి పూర్తిగా ఎవరికీ తెలియదు. ఎవరూ చెప్పలేరు. అయినా పూర్వం అర్జునుడు ధర్మరాజుకు చెప్పిన విషయాలనే మళ్ళీ నీకు చెప్తాను విను అన్నాడు.

అర్జునుడు : అన్నా ఒక పర్యాయం బంధువులను చూడాలని ద్వారకకు వెళ్ళాను. అక్కడ భోజ, వృష్ణి, అంధకాది వంశస్థులంతా నాయందు ఎంతో మర్యాద చూపి నన్ను పూజించారు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఒక వ్రతం చేపట్టి దీక్షలో ఉన్నాడు. ఇంతలో ఓ బ్రాహ్మణుడు ఆర్తనాదం చేస్తూ రక్షించమని శ్రీకృష్ణుని వేడుకుంటూ వచ్చాడు. శ్రీకృష్ణుడు ఆ బ్రాహ్మణునకు అభయం ఇచ్చి కూర్చో బెట్టి 'నీకొచ్చిన కష్టమేమిటో' చెప్పమని అడిగాడు. అందుకా బ్రాహ్మణుడు 'స్వామి! ఇంతవరకు నాకు ముగ్గురు పిల్లలు పుట్టారు. వాళ్ళందర్నీ ఏదో భూతం వచ్చి ఎత్తుకుపోయింది. ఇప్పుడు నా భార్య నాలుగో శిశువును ప్రసవించేందుకు సిద్ధంగా ఉంది. మళ్ళీ ఆ భూతం వచ్చి ఈ బిడ్డను

కూడా ఎత్తుకు పోతుందేమోనని భయపడి నీ శరణు కోరి నా బిడ్డను రక్షించుకునేందుకు వచ్చాను. నాబిడ్డను నువ్వే కాపాడాలి." అని దీనంగా ప్రార్థించాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు నాతో "అర్జునా! బ్రాహ్మణుల్ని రక్షించడం రాజుగా మన బాధ్యత. నేనేమో వ్రత దీక్షలో ఉన్నాను. నువ్వు వెళ్ళి ఆ బ్రాహ్మణుని రక్షణ భారాన్ని స్వీకరించు" అన్నాడు. వెంటనే ధనుస్సు చేతబట్టుకొని అర్జునుడు బ్రాహ్మణుని వెంట వెళ్ళి పురిటి ఇంటిని భూతం బారి నుండి కాపాడే ప్రయత్నం చేశాడు. అయితే ఆ భూతం అర్జునుని కన్నుగప్పి ఆ శిశువును హరించుకుపోయింది. ఆ శిశువు ఏడుపైతే వినిపిస్తోంది కానీ, ఆ భూతం ఎక్కడా కంటికి కనబడలేదు. దాంతో బ్రాహ్మణుడు లబోదిబోమంటూ అర్జునుణ్ణి నానా దుర్భాషలాడాడు. "ధనుంజయా! నా పిల్లవాడిని రక్షిస్తానని డంబాలు పలికావు. రక్షించలేక పోయావు. ఇక్కడ శ్రీకృష్ణుడే ఉండి ఉంటే ఆ భూతం మాయోపాయాలు సాగనిచ్చేవాడు కాదు. అంతేకాదు ప్రజల్ని రక్షిస్తూ ధర్మాన్ని కాపాడే రాజు ప్రజల పుణ్యాల్లో నాలుగోవంతు పొందుతాడు. అట్లా రక్షించలేని పక్షంలో నాలుగో వంతు పాపాన్ని మూటకట్టుకుంటాడు. నీవంటి చేతగాని వాడికి గాండీవం కేవలం అలంకారమే గాని ఎందుకూ పనికిరాదుకదా. నీ పరాక్రమమంతా వ్యర్థం. నీ యశస్సు అంతా ఇప్పుడే అంతరించిపోతుంది" అంటూ దూషించాడు. నీతో పెట్టుకుంటే నాపని కాదు. మళ్ళీ వెళ్ళి అతణ్ణే వేడుకుంటాను అని శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఇంకా వ్రత దీక్షలోనే ఉన్నాడు. అందువలన ప్రద్యుమ్నుడు బ్రాహ్మణుని ఊరడించి "బ్రాహ్మణోత్తమా! దుఃఖించకు. నేను వైష్ణవీ మాయను ధరించి ఆ భూతం ఎక్కడున్నా వెతికి పట్టుకొని నీ పిల్లవాడిని నీకు ఒప్పగిస్తాను" అని బయలుదేరాడు. ప్రద్యుమ్నుడు స్వర్గమంతా వెతికాడు. పాతాళమంతా గాలించాడు. మిగిలిన బ్రహ్మాండాలన్నీ తిరిగినా ఎక్కడా బాలుడి జాడ కనిపించలేదు. అవమానంతో ప్రద్యుమ్నుడు అగ్ని ప్రవేశం చేయబోగా శ్రీకృష్ణుడతనిని వారించి తానే వెతికి ఆ బాలుణ్ణి బ్రాహ్మణునకు ఒప్పగిస్తానని ధైర్యం చెప్పాడు.

శ్రీకృష్ణుడు బ్రాహ్మణ బాలుని వెదకి తెచ్చుట

(ఈ భాగం హరివంశం విష్ణుపర్వం 113వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు ప్రద్యుమ్నుణ్ణి బ్రాహ్మణుని ఓదారుస్తూ సారథి అయిన దారకుణ్ణి పిలచి రథానికి సుగ్రీవ శైబ్య వలాహక మేఘపుష్పమనే నాలుగు మేలుజాతి గుర్రాలను పూన్చి తెమ్మన్నాడు. దారకుడు తెచ్చిన రథంలో మేమంతా కూర్చుని ఉత్తర దిక్కుగా ప్రయాణం సాగించాం. కొంత దూరం పోయిన తర్వాత ఎన్నో పర్వతాలను, దాటుకుంటూ, ఓ మహాసాగరాన్ని చేరుకున్నాం. శ్రీకృష్ణుని చూడగానే సాగరుడు మానవ రూపంలో వచ్చి శ్రీకృష్ణునకు అర్ఘ్య పాద్యాదులిచ్చి పూజించాడు. మహాపురుషా! ఏమి ఆజ్ఞ అని అర్థించాడు. అంత శ్రీకృష్ణుడు నేను రథంలో సముద్రాన్ని దాటి పోవలసి ఉంది. కనుక నేను సముద్రాన్ని దాటే ఏర్పాటు చెయ్యమని అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న సముద్రుడు "దేవా! దర్పంతోను, అహంకారంతోను జనులు నీలో ప్రవేశించి నన్ను దాటే ప్రయత్నంచేస్తారని, వారందర్నీ అడ్డుకొని ఎవరికీ ప్రవేశం లేకుండా చెయ్యమని నువ్వే నన్ను ఆజ్ఞాపించావు. అప్పటి

నుండి నీ ఆజ్ఞ పాలిస్తూనే వచ్చాను. ఇప్పుడు కూడా నీ ఆజ్ఞను మీరిపోలేను. కనుక ఇప్పుడున్న పరిస్థితుల్లో నన్ను ఏం చేయమంటావో ఆజ్ఞాపించు" అని నమస్కరించాడు. శ్రీకృష్ణుడు సముద్రుడి మాటలకు ఎంతో సంతోషించి ఇలా అన్నాడు. సముద్రుడా! నువ్వు నీ జలాన్నంతా నిశ్చలం చెయ్యి. ఆ నిశ్చల జలాలపైనే ఒక మార్గం ఏర్పడుతుంది. నీ గర్భంలో ఉండే మణుల కాంతితో ఆ మార్గం సుస్థిరమవుతుంది. అప్పుడు నేను రథాన్ని నడుపుకుంటూ పోతాను. నేను వెళ్ళిన తర్వాత నీవు యథాప్రకారం అలలను సృష్టించుకో" అన్నాడు. అంతట శ్రీకృష్ణుడు రథాన్ని ఉత్తరాన ఉన్న గంధమాదము, జయంతము, వైజయంతము, నీలము, రజతాద్రి, మహామేరువు, కైలాసము, ఇంద్రకూటము అనే ఏడు పర్వత పంక్తులను చేరుకున్నాడు. ఆ పర్వత సమూహ మంతా మానవరూపంలో శ్రీకృష్ణునికి ఎదురు వెళ్ళి అర్ఘ్య పాద్యాదులిచ్చి పూజించాయి. శ్రీకృష్ణుడు వారి పూజలన్నీ అందుకొని 'పర్వత శ్రేష్ఠులారా! నా రథం వెళ్ళేందుకు మార్గాన్ని సృష్టించండి అంతేచాలు" అన్నాడు. ఆ పర్వతాలిచ్చిన మార్గం వెంట చాలాదూరం పోయి లోకాచలాన్ని అధిగమించారు. ఆ తర్వాత అంతా గాఢాంధకారం అలముకొంది. కళ్ళుపొడుచుకున్నా దారి కనిపించడం లేదు. గుర్రాలు ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేకపోయాయి. అప్పుడు శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్ని స్మరించగానే ఆ చక్రం గాఢాంధకారాన్ని తరిమివేసింది. అప్పుడు రథచక్రాలకు మార్గం ఏర్పడింది. అట్లా ఆకాశమార్గాన పోతూ ఉండగా ఒక రూపం కనపడింది. అది సర్వలోకాలను ఆవరించి ఒక పురుషాకారంగా కనిపించింది. అర్జునుడు, బ్రాహ్మణుడు రథంలోనే ఉండగా శ్రీకృష్ణుడు ఆ తేజోనిధిలోనికి ప్రవేశించాడు. ఒక ముహూర్త కాలంలో శ్రీకృష్ణుడు బ్రాహ్మణ కుమారులు నలుగుర్నీ వెంటబెట్టుకొని వచ్చాడు. మేమంతా బ్రాహ్మణకుమారులతో కలసి తిరిగి ద్వారకకు చేరుకున్నాం. పిమ్మట బ్రాహ్మణునికి కొంత ధనమిచ్చి పంపాడు.

శ్రీకృష్ణార్జున సంవాదం

(ఈ భాగం హరివంశం విష్ణుపర్వం 114వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

బ్రాహ్మణుడు పిల్లలను వెంటబెట్టుకొని వెళ్ళిన తర్వాత అర్జునుడు తనలో కలిగిన సందేహాలన్నింటినీ శ్రీకృష్ణుని ముందు వెళ్ళబోసుకున్నాడు.

అర్జునుడు : కృష్ణా! నువ్వు అడుగగానే సముద్రజలాలు స్తంభించి నీకు మార్గాన్నిచ్చాయి. కన్నుపొడుచుకున్నా కనపడని గాఢాంధకారంలోకి ప్రకాశవంతమైన తేజస్సు ఎట్లా వెలువడింది. ఆ తోజోనిధి బ్రాహ్మణ బాలుల్ని ఎందుకు అపహరించాడు? మనమంతా ఇంతదూరాన్ని ఛేదించి ఒక్క క్షణంలో ఎట్లా చేరుకోగలిగాం? ఇదంతా నాకు ఆశ్చర్యంగా ఉంది. కృష్ణా! నీ తత్త్వాన్ని తెలిపితే గాని నేనీ విషయాలేవీ అర్థం చేసుకోలేను.

శ్రీకృష్ణుడు : అర్జునా ఆ తేజోమూర్తి నా దర్శనాన్ని కోరి ఆ బాలకుల్ని అపహరించాడు. నువ్వు చూసిన ఆ బ్రహ్మతేజోమూర్తిని నేనే. నేనే ఆ తేజస్సు. ఆ తేజస్సే నేను. అది సనాతనమని

తెలుసుకో. అదే మూల ప్రకృతి. వ్యక్తావ్యక్త స్వరూపిణి. ఆ పరశక్తిని ప్రవేశించగానే ముక్తి కలుగుతుంది. సాంఖ్యులైనా, యోగులైనా, తపోధనులైనా వారికి ఆ పరాశక్తియే ముక్తిపదం. జగత్తుల్ని, పరబ్రహ్మాన్నీ ఆ శక్తియే విభజిస్తుంది. ఆ తేజస్సు కూడా నా స్వరూపమేనని తెలుసుకో. స్తంభించిపోయిన సముద్రుడను నేనే, స్తంభింపజేసిన వాడను నేనే. సప్త పర్వతాలను నేనే. సమస్త భూతాలను సంహరించే సమయంలో నేనే కాలస్వరూపాన్ని ధరిస్తాను. సూర్య చంద్రులు, పర్వతాలు, సముద్రాలు, నాలుగు దిక్కులు నా ఆత్మలే. నాలుగు జాతుల్ని సృజించిందీ నేనే. నాలుగు వర్ణాలను నిర్మించిందీ నేనేనని తెలుసుకొమ్మని అర్జునునకు బోధించాడు.

అర్జునుడు : మహాత్మా! నీ తత్త్వాన్ని తెలిపావు. నాకు నీ మహిమను కూడా తెలుపు.

శ్రీకృష్ణుడు : అర్జునా! నువ్వంటే నాకు చాలా ఇష్టం. నాకు మిత్రుడవు. నువ్వు నాకు ఏకాంత భక్తుడవు. అందువలన నీకు ఏదీ దాపరికం లేకుండా చెప్తాను. విను. బ్రహ్మము, బ్రాహ్మణులు, సత్యము, తపస్సు ఉత్కృష్టమైనవి. అవన్నీ నావల్లనే తెలుపబడ్డాయి. నాలుగు వేదాలు, ఋషులు, దేవతలు, యజ్ఞాలు, నా తేజస్సును చాటేవే. పృథివ్యప్తేజోవాయురాకాశాలనే పంచభూతాలు, సూర్యచంద్రులు అహోరాత్రాలు, పక్ష, మాస, తిథి, ఋతువులు, క్షణాలు, నెలలు, సంవత్సరాలు, సకల శాస్త్రాలు, మంత్రాలు, తంత్రాలు నావల్లనే ఉద్భవిస్తున్నాయి. ఆత్మ అనాత్మ విద్య అవిద్య నేనే.

శ్రీకృష్ణుని ఉపదేశం వలన అర్జునుడు ధన్యుడయ్యాడు. తనయందు భగవంతునికి కలిగిన కరుణకు సంతోషించాడు. భగవంతుడి మహత్త్వము ఇట్టిదిగదా అని తాను తెలుసుకొని ధర్మరాజాదులకు తెలిపాడు. ఆవిధంగా పాండవులంతా శ్రీకృష్ణుని పట్ల భక్తియుక్తులై పూజించారు.

అర్జునునికి తానే గొప్ప వీరుడనన్న గర్వం ఉండేది. దాన్ని సమూలంగా తొలగించి అర్జునునిలో భక్తిబీజాలు బలంగా నాటాలని భగవంతుడు సంకల్పించాడు. అందువల్లనే అర్జునుడుండే సమయం చూసి బ్రాహ్మణుడు వచ్చేట్లు చేశాడు. బ్రాహ్మణుడొచ్చే సమయానికి వ్రతం పేరుతో అర్జునుడికి తన శక్తి ఎంతో తానే తెలుసుకునేట్లు చెయ్యాలని ఈకథంతా నడిపాడు.

ఉషాపరిణయం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం, బ్రహ్మ పురాణం, హరివంశం, విష్ణుపురాణం భాగవతములనుండి గ్రహించబడింది.)

బాణాసురుడు బలిచక్రవర్తి కుమారుడు, అతడికి వెయ్యి చేతులుండేవి. మహా బలాఢ్యుడు. దేవతల్ని ఇంద్రుణ్ణి, అనేక సార్లు జయించి బలగర్వంతో సంచరించేవాడు. అతడికి ఈశ్వరానుగ్రహం మెండుగా ఉండేది. ఇతడు బలిచక్రవర్తి నూరుగురు పుత్రుల్లో పెద్దవాడు. లోకాలన్నీ విహరిస్తూ ఉండగా ఒకనాడు కుమారస్వామి ఆడుకుంటూ ఉండటం చూశాడు. ఆ పిల్లవాడిపైన మక్కువ పడ్డాడు. తనక్కూడ అటువంటి పిల్లవాడు కావాలన్న కోరిక బలంగా కలిగింది. వెంటనే శంకరుణ్ణి ధ్యానించి తీవ్రంగా తపస్సు చేశాడు. కొంతకాలానికి శంకరుడు ప్రత్యక్షమై దానవరాజా! నీ భక్తికి సంతోషించాను. నీకేమి వరం కావాలో కోరుకో ఇస్తాను అన్నాడు. శంకరుణ్ణి చూడగానే బాణుడు

పరమానంద భరితుడయ్యాడు. సాష్టాంగ నమస్కారం చేసి పరమేశ్వరా! నాకు కూడా కుమారస్వామి వంటి పుత్రుణ్ణి ప్రసాదించమని ప్రార్థించాడు. శంకరుడు అతడు కోరుకున్నట్లే ఒక పుత్రుణ్ణి ప్రసాదించి కుమారస్వామి పుట్టిన ప్రదేశంలోనే ఒకనగరం నిర్మించుకొని సుఖంగా నివసించమని అనుగ్రహించాడు. కుమారస్వామికది జన్మస్థలం కనుక ఆ నగరానికి శోణితపురమని పేరుపెట్టుకొమ్మని తానా నగరాన్ని సర్వదా రక్షిస్తూ ఉంటానని శంకరుడు అనుగ్రహించాడు.

శంకరుని అనుజ్ఞచేత బాణాసురుడు శోణిత పురాన్ని నిర్మించుకొని సుఖంగా ఉంటున్నాడు. ముల్లోకాల్లోని రాజుల్ని జయించి తిరుగులేని చక్రవర్తిగా వర్ధిల్లాడు. దేవతలు ఇతడి పేరు చెబితేనే గడగడ వణికిపోతున్నారు. కుమారస్వామితో స్నేహం చేసుకొని అతడి నుండి ధ్వజాన్ని, నెమలి వాహనాన్ని సంపాదించాడు. వీటికితోడు శంకరానుగ్రహం కూడా లభించడంతో యుద్ధంలో ఇతడి ముందు ఎవరూ నిలబడి ఎదిరించలేకపోయేవారు. ఒకరోజున సభలో ఉండగా ఈ విషయాలన్నీ కుంభాండుడనే రాక్షసుడితో ముచ్చటించాడు.

కుంభాండుడు : రాజేంద్రా! ఇప్పుడు నువ్వు ఎన్నో అద్భుత విషయాలు చెప్పావు. అందువల్ల నాకు ఎంతో సంతోషం, ఆశ్చర్యం కలిగాయి. అయితే నేనొక విషయం నీనుండి తెలుసుకోవాలని కోరుతున్నాను. నువ్వసలు శంకరుని కోరిన వరం ఏమిటి? శంకరుడు, కుమారస్వామి వలన నీకు ఎటువంటి కొరత ఉండదు కదా. అటువంటప్పుడు శంకరుడు నీకు త్రిలోకాధిపత్యాన్ని కూడా ప్రసాదించాడా? అదే నిజమయితే కొందరు రాక్షసులు విష్ణువుకు భయపడి నీళ్ళల్లో తలదాచుకుంటున్నారు. వారంతా నీ అండ చూసుకొని నిర్భయంగా తిరుగగలుగుతున్నారు. ఇంద్రుడు కూడా నీకు భయపడే పాతాళంలో దాక్కున్నాడని అనుకుంటున్నారు. అయితే ఇక ఇంద్రుని వలన, విష్ణువు వలన రాక్షసులకు భయం పూర్తిగా తొలగిపోయినట్లేనా? పూర్వం శ్రీమహావిష్ణువు నీ తండ్రిని బంధించిన మాట నీకు తెలుసు. ఇప్పుడైనా బంధవిముక్తుడయ్యాడా? లేదా? తిరగి మేము బలిచక్రవర్తి చేత పరిపాలించబడే రోజు వస్తుందా? ఈశ్వర కృపచేతను కార్తికేయుని చేయూతతో మేమంతా నీ ఏలుబడిలో సుఖసంతోషాలతో ఉండాలని ఎదురు చూస్తున్నాం.

బాణాసురుడు : కుంభాండుడా! ఒకరోజున నేను శంకరుని దర్శించి ఇలా విన్నవించుకున్నాను. స్వామి! నాతో ఎవరూ యుద్ధం చేయలేమని వెనక్కుపోతున్నారు. దగ్గరకు వెళ్ళకముందే శాంతి పతాకాన్ని ఎగరేసి సంధిప్రయత్నాలు మొదలుపెడుతున్నారు. అందువల్ల నాకు యుద్ధకాంక్షతీరడం లేదు. పైగా యుద్ధమంటే నిర్లిప్తత కూడా ఏర్పడుతోంది. అటువంటప్పుడు నాకు మొలచిన వెయ్యిచేతులు బరువై పోతున్నాయి. ఏదైనా మార్గం తెలుపమని ప్రార్థించాను. అందుకు పరమేశ్వరుడు రాజేంద్రా! త్వరలోనే కనీవినీ ఎరుగనంత మహాయుద్ధం జరుగబోతోంది. నీయుద్ధకాంక్ష తప్పక తీరుతుంది. ఎప్పుడైతే నీ మయూర ధ్వజం నేలకొరిగి పోవడాన్ని చూస్తావో అప్పుడే ఆ మహాయుద్ధం ప్రారంభమవుతుందని తెలుసుకో." అన్నాడు. ఆహా! ఇంతకాలానికి నాకు మళ్ళీ యుద్ధంచేసే అవకాశం కలుగుతోంది గదా అని సంతోషించాను. అందువల్లనే ఆ సంతోషాన్ని పంచుకోవాలని సరాసరి నీ వద్దకే వచ్చాను.

కుంభాండుడు : మిత్రమా! నువ్వు చెప్పిన మాటలు వింటూ ఉంటే సంతోషం కన్నా విచారమే ఎక్కువ కలుగుతోంది. ఠీవిగా ఆకాశంలో నిలబడిన మయూర ధ్వజం నేలకూలడం ఏమంత శుభశకునం కాదు. పైగా అట్టి దుశ్శకునం తర్వాత కనీవినీ ఎరుగని మహాయుద్ధం జరుగబోతోందన్నావు.

వారిద్దరూ అట్లా మాట్లాడుకుంటూ ఉండగానే భటుడు వచ్చి మయూరధ్వజంపై పిడుగు పడి నేలకూలిందని చెప్పాడు. ఆవార్తవిని బాణాసురుడు యుద్ధం ముంచుకొస్తోందని గ్రహించాడు. ఇంతలోనే ఎక్కడో పిల్లి గర్జించడం వినపడింది. ఆకాశం నుండి శోణిత పురమంతా రక్తపు వర్షం కురిసింది. ఇది దేవేంద్రుడి పనే అయి ఉంటుందని బాణాసురుడు భావించాడు. ఇది చాలదన్నట్లుగా ఆకాశం నుండి ఉల్కలు రాలిపడ్డాయి. ఇట్లాంటివి భయంకరమైన దుశ్శకునాలెన్నింటినో చూడాల్సి వచ్చింది. ఇన్ని అపశకునాలు ఎదురైనా బాణాసురుడు అణువంతైనా విచారించలేదు. కుంభాండుడు మహాబలుడే కాదు, గొప్ప తత్త్వ వేత్త కూడా. అందువల్ల ఈ దుశ్శకునాలకు ఎంతో విచారించాడు. ఇవన్నీ అమంగళాన్నే సూచిస్తున్నాయని తలచి మిత్రునితో ఇలా అన్నాడు.

కుంభాండుడు : రాజేంద్రా! మేమంతా నీ సేవకులం. మా మనస్సు ఎప్పుడూ నీ క్షేమాన్నే కోరుకుంటూ ఉంటుంది. మయూరధ్వజం పడిపోయిందంటే నా మనస్సు ఏదో కీడు శంకిస్తోంది. ముల్లోకాలనూ జయిస్తావని శంకరుడు నీ కిచ్చిన వరం ఈనాటితో నిర్వీర్యమైనట్లుగా నేను భావిస్తున్నాను. నువ్వు యుద్ధాన్నే కోరుకుంటే మనకు నాశనం తప్పదనిపిస్తోంది.

కుంభాండుడి మాటల్ని బాణాసురుడు లెక్క చెయ్యలేదు. ఉత్తమమైన మద్యాన్ని తెప్పించి సేవించాడు. కుంభాండుడు మాత్రం రాజుకు ప్రమాదం ఏ మూలన పొంచి ఉందోనని కలవరపడ్డాడు.

ఉషకు పార్వతి వరదానం చెయ్యడం :

ఒకానొక సమయాన పార్వతీ పరమేశ్వరులు జల క్రీడలకై మనోహరమైన సరస్సుకు వెళ్ళగా, వారితో పాటు అనేక మంది భవానీ శంకరులను సేవించుకున్నారు. ఆ నదీతీరమంతా అనేక పుష్పవనాలతో మనోహరంగా ఉంది. అదే సమయానికి బాణాసురుని పుత్రిక ఉష కూడా ఆ సరస్సుకు వచ్చి పార్వతి పరమేశ్వరులను తన ఆటపాటలతో అలరించింది. పార్వతీదేవి ఉష యెడల ప్రసన్నురాలై ఉషను దగ్గరకు తీసుకొని తల నిమురుతూ కుమారీ! నువ్వు కూడా భర్తతో కలసి నాకు మల్లే విహరిస్తూ ఆనందిస్తావని దీవించింది. ఆ దీవెనకు సంతోషించిన ఉష మనస్సులో ఇక ఆ ముచ్చట ఎన్నటికో గదా? అని నిట్టూర్చింది. ఆ బాలిక మనస్సు అర్థం చేసుకున్న జగజ్జనని కుమారీ! వైశాఖ శుద్ధ ద్వాదశి నాటి రాత్రి నీకో స్వప్నం వస్తుంది. ఆ స్వప్నంలో నీ ప్రియుడితో కలసి విహరిస్తావు. అతడే నీకు భర్త కాగలడు అని తెలిపింది. ఉషాకన్య మనస్సు దూదిపింజలా అయిపోయింది. గెంతుతూ పాడుతూ చెలికత్తెలతో కలసి ఇంటికి చేరుకుంది. కానీ ఆనాటి నుండి ప్రియుడి ఆలోచనలతో రాత్రిళ్ళు నిద్ర కరువైంది. పగలు అన్నంతిన బుద్ధి పుట్టడం లేదు. ఇక ఆటపాటలు అసలే లేవు. లేడిపిల్లలా చెంగుచెంగున ఎగిరిపడుతూ ఉండే ఉష నిర్లిప్తంగా ఉండటంతో చెలికత్తెలంతా భయపడిపోయారు. వెళ్ళి రాణికి విషయం చెప్పారు. తల్లి వచ్చి ఉషను నయానభయానా అడిగి చూసింది. ఉషమాత్రం తన మనసులో మాట బయటపెట్టలేదు. ఆకలి లేదంది.

ఉషా స్వప్న వృత్తాంతం

(ఈ కథాభాగం హరివంశం విష్ణుపర్వం 118వ అధ్యాయం నుండి మరియు భాగవతాది గ్రంథముల నుండి గ్రహించబడింది.)

చెలికత్తెలు ఉపచారాలు చేస్తూనే ఉన్నారు. కానీ అందువల్ల గుణం ఏమీ కనిపించడం లేదు. ఉషతల్లి కూడా కాలుకాలిన పిల్లిలా ఉషచుట్టూ తిరుగుతూనే ఉంది కాని ఉషమనసులో మాట బయటపెట్టలేదు. ఇట్లాఉండగా వైశాఖ మాసం రానే వచ్చింది. ద్వాదశి నాటి రాత్రి చెలికత్తెల కన్నుగప్పి గాఢనిద్రలో ప్రియుణ్ణి చూడనే చూసింది. కలలో కనిపించిన రాకుమారుడు మనస్సంతా దోచుకున్నాడు. వనాంతరాలలోకి విహారానికి తీసుకుపోయాడు. అతడు చిరకాల పరిచితుడి లాగానే అనిపించాడు. అతడి పొందులో తపించి పోతూ ఉన్న తరుణంలో మెలకువ వచ్చి స్వప్నమంతా చెదిరిపోయింది. కానీ జ్ఞాపకాలు మాత్రం విడిచిపెట్టి పోలేదు. దాంతో సర్వం పోగొట్టుకున్నదానిలా విలపించింది. ఈఘట్టాన్ని పోతనగారు ఎలా చిత్రించారో చూడండి.

చ॥ *కలగని యంత మేలుకని కన్నుల బాష్పకణంబు లొల్కఁ*
గాఁ గలవలెఁ గాక నిశ్చయముగాఁ గమనీయ విలాస విభ్ర
మా, కలిత తదీయరూపము ముఖంబున వ్రేలినయట్లు
తోఁచినం, గలవలమందుచున్ బిగియఁ గౌఁగిటిచేబయలప్పళించుచున్.

చ॥ *సరసమృదూక్తులున్ గుసుమ సాయక కేళియు శాటికాక చా*
కరషణముల్ నఖ క్రియలుఁ గ్రమ కపోల లలాట మేఖలా
కర కుచ బాహుమూలములుఁ గైకొనియుండుట లాదిగాఁద
లో దరి మది గాఢమై తగిలె దర్పకుఁ డచ్చున నొత్తినట్లయై

సీ॥ *కలికిచేష్టలు భావగర్భంబులైనను బ్రియుమీఁది కూరిమి బయట పఱుపఁ*
బిదపిదనై లజ్జ మదిఁ బద నిచ్చినఁ జెలిమేనఁ బులకలు చెక్కులొత్త
మదనాగ్ని సంతప్తమానస యగుటకు గురుకుచహార వల్లరులు కందఁ
జిత్తంబు నాయకాయత్తమై యుంటకు మాఱుమాట లాడంగ మఱపుగదుర

తే॥ *నతివ మానమున సిగ్గుమోహించి భయము*
బొడమ ననుమంచు నెత్తమ్మిఁ బొదువు మాడ్కి
బ్రభమ చింతా భరంబునఁ బద్మ నయన
కోరి తలచీర బాటింప నేరదయ్యె.

ఈ పోతనగారి భావానికే హరివంశంలో శంభుదాసుడు వ్రాసిన ఒక పద్యాన్ని మచ్చుకు చూడండి.

సీ॥ కలలోన నయ్యింతిఁ గదిసి మోమున నవ్వు గడలొత్తఁ దీయని పలుకు పలికి
కెంగేలితోఁగేలు కీలించి నెమ్మేను మేనను బెరయించి మెలపుతోడ
చిగియారఁ గౌఁగిట సొగియించి మనసులు రెండును గరఁగి యొక్కండ కాఁగ
నే కోర్కు లేమిటి కెలసి వానికి వేగ చుబ్బన చూఱలై చొప్పడంగఁ

తే॥ జతుర సంభోగరసములు చవుల వెంట । నిర్గఱును గ్రొత్తగాఁ గని యేపు మిగుల
నట్టి చందంబుఁ గావించి యాత్మమూర్తి । యబల తలఁపున నచ్చొత్తి నట్లుచేసి.

ఉషకు అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది. కల చెదిరిపోయింది. మధుర భావాల విరహాగ్ని తట్టుకోలేక బిగ్గరగా ఏడ్చింది. చిత్రలేఖ ఉషకు ప్రాణ స్నేహితురాలు. మహా మంత్రి కుంభాండుని కుమార్తె. ఉషను అనేక విధాలుగా అనునయించి ధైర్యం చెప్పింది. పిరికి దానివలె దుఃఖించ వద్దంది. నువ్వు సాక్షాత్తూ బలిచక్రవర్తి మనుమరాలివి. నీ తండ్రి ముల్లోకాలనూ జయించాడు. త్రిలోకాధిపతి అయిన ఇంద్రుడు నీ తండ్రి పక్కన నిలబడేందుకే భయపడతాడు. అటువంటి నీకు భయమెక్కడిది? భయమే నిన్ను చూసి భయపడాలి అన్నది.

చిత్రలేఖ ఓదార్పు మాటలు ఉషకు కొద్దిగా ఊరట కలిగించాయి. తనలోని దుఃఖాన్ని కొద్దిగా దిగమింగుకొంది. మనసులోని బాధను మరొకళ్ళతో పంచుకోవాలనిపించి చిత్రలేఖతో సఖీ! నాకు స్వప్నంలో కనిపించిన పురుషుడు అతిలోక సుందరుడు. నన్ను వేయి విధాలుగా అలరించి ఆనందసాగరంలో ముంచి మోసం చేసి పారిపోయాడు. దూర్తుడే అయినా అతడితో గడిపిన మధురక్షణాల్ని మరువ లేకుండా ఉన్నాను. చెలీ! నా తండ్రి ఎంత బలశాలి అయితే నాకేమి లాభం? దేవ దానవుల్ని ఎన్నిసార్లు జయించినా నా కొరిగేదేముంది? నాకు కంటిమీద కునుకు లేకుండా చేసిన స్వప్న ప్రియుణ్ణి మరువ లేకుండా ఉన్నాను. ఇంతటి విరహ బాధననుభవిస్తూ ఏ కన్య జీవించి ఉండగలదు? నావల్ల కులానికి కళంకం ఏర్పడింది గదా? వంశగౌరవం మంట కలిసింది. అట్టి కన్య ఎవరైనా జీవించాలని కోరుకుంటుందా? అంటూ వలవలా ఏడ్చింది. చెలికత్తెలు ఎంత సముదాయించినా ఉషకు దుఃఖం ఆగడంలేదు. చివరకు చిత్రలేఖ ఇలా అంది. కళ్యాణీ! విచారించకు దుఃఖాన్ని దిగమ్రింగు. వ్రత లోపమేమీ జరుగలేదు. స్వప్నంలో జరిగే వ్యభిచారం వలన పాతివ్రత్యానికేమీ భంగం రాదని పెద్దలంటారు. పైగా స్వప్నంలో సంభవించే దోషాలేవీ దోషాలు కావు. మనోవాక్కాయ కర్మల చేత దోషం చేసే స్త్రీ మాత్రమే పాపాత్మురాలని వేదవేత్తలైన బ్రహ్మర్షులంటారు. నువ్వు ఈ మూడింటిలో ఏ ఒక్కటీ చెయ్యలేదు. మరెందుకు మనస్సుపాడు చేసుకుంటావు? ఏ యువతి మేలుకొని ఉండగానే బుద్ధిపూర్వకంగా దోషాన్ని చేస్తుందో అటువంటి స్త్రీయే కులట అని ఆర్యుల అభిప్రాయం. అందువల్ల నువ్వు దుఃఖాన్ని విడిచిపెట్టు.

చిత్రలేఖ ఓదార్పు మాటలు ఉషలో ఏమీ మార్పు కనిపించకపోవడంతో చిత్రలేఖ రహస్యంగా ఉషతో ఇలా అంది. విశాలాక్షీ! నామాట విను దుఃఖాన్ని విడిచిపెట్టు. నీకు పూర్వం పార్వతీ దేవి చెప్పనే చెప్పింది గదా? వైశాఖ ద్వాదశినాడు నీకో పురుషుడు స్వప్నంలో కనిపిస్తాడనీ, అతడే నీకు భర్త కాగలడని. నువ్వు కాబోయే భర్తతోనే స్వప్నంలో విహరించడం వల్ల నీకెటువంటి దోషమూ

కలుగదు. పార్వతీదేవియే అనుగ్రహించిన భర్త సామాన్యుడు కాదు గదా. మహాశూరుడు, శత్రుసంహారియే కాగలడు అని చెప్పగానే ఉషకు పూర్వం తనకు పార్వతీదేవి చెప్పిన మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. దాంతో దుఃఖం పటాపంచలయ్యింది. మళ్ళీ చిత్రలేఖ ఇలా అంది. కన్యకామణీ! నీకు స్వప్నంలో కనిపించిన వాడు శూరుడే కావచ్చు. రసికుడే కావచ్చు. కానీ అతడి కులం ఏమిటో? అతడే వంశస్థుడో తెలుసుకోకుండా అతణ్ణి గురించి ఊహించుకుంటూ ఏం సుఖపడగలవు? అతడు ఎంత నేర్పరి అయిన దొంగ కాకపోతే కట్టుదిట్టంగా ఉన్న అంతఃపురంలో దూరి నీ మనస్సును కాస్తా కాజేసి రెండో కంటి వాడికి తెలియకుండా పారిపోయాడు. ఆహా! అతడు ఎంత నేర్పరి అయిన దొంగో నువ్వే ఆలోచించు. సామాన్యులకు ఈ పని సాధ్యం కాదు? ఇంతటి ఘనుడు నీకు భర్త కావడం వలన నీ జన్మ ధన్యమైందని తెలుసుకో.

చిత్రలేఖ మాటల వలన ఉషలో దుఃఖం నశించి మోహం వృద్ధి అయి ఇలా అంది. సఖీ! అతడి వంశం గురించిగాని, కులం గురించి గాని, తెలుసుకోవాలని నా మనస్సు ఉబలాటపడుతుంది. తామెంత మేధావులయినా స్వంత విషయానికొస్తే బుద్ధి బొత్తిగా పనిచెయ్యదు. కాబట్టి అతడి పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకునే ఉపాయమేదో నువ్వే ఆలోచించాలి అని ప్రాధేయపడింది. నా ప్రాణాలు నిలబెట్టమని వేడుకుంది. ఉష బాణాసురిడి పుత్రిక. రాకుమార్తె. తనొక మంత్రి కుమార్తె మాత్రమే. కేవలం దాసీతో సమానం. అటువంటి నన్ను ఇంత దీనాతిదీనంగా బ్రతిమిలాడుతూ ఉంటే చిత్రలేఖ మనస్సు విలవిల్లాడిపోయింది.

ఉష దీనాలాపాలను విన్న చిత్రలేఖ ఇలా అంది. రాకుమారీ! దేవ దానవ యక్ష గంధర్వాది పురుషుల చిత్రపటాలన్నీ నీ ముందు ఉంచుతాను. నువ్వు వారిలో నీ స్వప్న ప్రియుడెవరో గుర్తించు అన్నది. చిత్రలేఖ ఏడు రోజుల పాటు రాత్రింబవళ్ళు కష్టపడి అనేక వేల చిత్రపటాల్ని లిఖించి ఉష ముందుంచింది. బాణపుత్రీ! ఈ వరుసలో ఉన్నవారంతా దేవతలలో ప్రముఖులు. వీరంతా దానవుల్లో ఉత్తములు. ఈ వరసలోని వారంతా కిన్నెర, ఉరుగ, రాక్షసుల్లో ప్రధానమైనవారు. వీరంతా మానవుల్లో ప్రముఖులు. నీకోసం ఏడు రాత్రుళ్ళు ఏడు పగళ్ళు కష్టపడి చిత్రించి తెచ్చాను. వీళ్ళల్లో నీ ప్రియుడెవరో గుర్తుపట్టు అన్నది. ఆ చిత్రపటాలన్నింటినీ చూస్తూ ఆ ఉషాకుమారి యాదవుల చిత్రాల్ని చూస్తూ వాళ్ళల్లో అనిరుద్ధుణ్ణి చూసి ఎగిరి గంతేసింది. చిత్రలేఖా! వీడే ఆ దొంగ. నన్ను మోసం చేసి పారిపోయిన వాడు. సఖీ! ఇతడే నా ప్రియుడు. ఇతణ్ణి గూర్చి నీకు తెలిసిందంతా నాకు చెప్పు అన్నది.

ఉషా! నీ ప్రియుడు చాలా అందంగా ఉన్నాడు. ఇతణ్ణి గురించి నాకు తెలిసిందంతా చెప్తాను విను. ఇతడు జగన్నాథుడైన శ్రీకృష్ణుని మనుమడు. ఇతడి పేరు అనిరుద్ధుడు. గొప్ప పరాక్రమశాలి. ఓ పర్వతాన్ని పెళ్ళగించి మరో పర్వతం పైన వెయ్యగల దిట్ట అని చెప్పింది. ఆ మాటలు వింటూనే ఉష మనస్సు దూది పింజలా తేలికయింది. మనస్సులో ఉన్న దుఃఖమంతా మాయమైంది. చిత్రలేఖతో సఖీ! నాకు ప్రాణదానం చేశావు. నువ్వు తప్ప నాకీ సహాయం మరెవ్వరూ చెయ్యలేరు. ఈ కష్టసమయంలో నువ్వే నాకు దిక్కయ్యావు. నువ్వు కామరూపిణివి గదా. మాయోపాయాలు పన్నడంలో నీకు నువ్వే

సాటి. ఏదో ఒక ఉపాయం చేత ఈ అనిరుద్ధుణ్ణి నా ఏకాంత మందిరానికి తీసుకొనిరా. కష్టాల్లో ఎవరైతే ఆదుకుంటారో అతడే నిజమైన మిత్రుడని పెద్దలంటారు. నేనిప్పుడు కామార్తినై ఉన్నాను. నా ప్రాణాలు నిలబెట్టు అన్నది. అందుకు చిత్రలేఖ కళ్యాణీ! నేను చెప్పేమాటలు శ్రద్ధగా విను. మన ఈ బాణా నగరం ఏ విధంగా రాత్రింబవళ్ళూ రక్షించబడుతూ ఉంటుందో, అక్కడ ద్వారకా నగరం కూడా అట్లాగే రక్షించబడుతూ ఉంటుంది. పైగా ఆ నగరం సముద్రం మధ్యలో నిర్మించబడింది. ఎంత మాత్రం అజాగ్రత్తతో మెలగినా నీకూ, నాకూ, నీతండ్రికి కూడా ప్రాణాపాయమేనని తెలుసుకో అంది.

చిత్రలేఖా! నువ్వు మాయోపాయాలలో దిట్టవు. యోగ మహిమలు తెలిసినదానవు. నువ్వు తలచుకుంటే ద్వారకానగరంలో ప్రవేశించడం ఏమంత కష్టం కాదు. అదీకాకుండా నన్ను ప్రాణాలతో నిలపాలంటే నువ్వు కొద్దో గొప్పో సాహసం చెయ్యాలి. అనిరుద్ధుని నా వద్దకు చేర్చి పుణ్యం కట్టుకో. ఇవి చేతులు కావు కాళ్ళనుకో అంటూ కాళ్ళమీద పడ్డంత పనిచేసింది. దాంతో చిత్రలేఖ పక్కున నవ్వింది. బాణపుత్రీ! ప్రియసఖీ! నీమాటలు వింటుంటే నువ్వెంత కామోద్రేకంతో సతమతమవుతున్నావో తెలుస్తోంది. నీకోసం ఏమైనా చేస్తాను. ఇప్పుడే ద్వారకకు బయలుదేరుతున్నాను. నీ ప్రియుణ్ణి తెచ్చి నీ ముందుంచుతాను. నువ్వు నిశ్చింతగా ఉండు అంటూనే అంతర్ధానమై ద్వారకా నగరాన్ని చేరుకుంది.

చిత్రలేఖ ద్వారకానగరం చేరుకునే సమయానికి నారదమహర్షి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. చిత్రలేఖ మహర్షికి నమస్కరించింది. మునీంద్రా! నేనొక దూతగా ఈ ద్వారకలో అడుగుపెట్టాను. అనిరుద్ధుణ్ణి శోణిత నగరానికి తీసుకొనిపోయి ఉషతో చేర్చడమే నా రాకకు ముఖ్యకారణం. ఉష ఎవరో కాదు. బాణాసురుడనే రాక్షసరాజు, కుమార్తెయే. ఆమె స్వప్నంలో అనిరుద్ధుణ్ణి చూసి మోహించింది. భవానీ వర ప్రసాదం చేతనే ఉషకు అనిరుద్ధుడు నియమించబడ్డాడు. అనగా ఇదంతా భగవత్ప్రేరణయేనని పురుష విలాసం కాదని మీకు మనవి చేస్తున్నాను. అనిరుద్ధుణ్ణి ఉష ప్రక్కకు చేర్చడం దైవనిర్ణయమేనని ఈ పనికి పూనుకున్నాను.

నేను అనిరుద్ధుణ్ణి తీసుకుపోయిన తర్వాత నువ్వీ విషయాన్ని శ్రీకృష్ణుల వారికి తెలియజెయ్యి. ఇందువల్ల బాణాసురుడితో తప్పక యుద్ధం ఏర్పడుతుంది. మహావీరుడైన అనిరుద్ధుడు బాణుని ఎదిరించగలడు కానీ అతడికి శంకరుని వరదానం ఉండటం చేత శ్రీకృష్ణుడే బాణుని దర్పమణచాల్సి ఉంది. కావున ఓ మహర్షీ! నేను వచ్చిన కార్యం సిద్ధించేట్లు అనుగ్రహించు అని ప్రార్థించింది.

చిత్రలేఖ యుక్తియుక్తంగా మాట్లాడిన మాటలకు నారదమహర్షి సంతోషించి చిత్రలేఖా! నీ కార్యం సిద్ధిస్తుంది. భయపడకు. బాణునితో యుద్ధం అనివార్యం అయితే, నన్ను స్మరించు నాకా యుద్ధం చూడాలని కుతూహలంగా ఉంది. నీకు సర్వలోక సమ్మోహినీ మంత్రాన్ని ఉపదేశిస్తున్నాను. స్వీకరించు. దీనివలన నీదేవి కృతకృత్యురాలవుతుంది. అని అనగానే చిత్రలేఖ ఆ మంత్రాన్ని గ్రహించింది. అనిరుద్ధుని అంతఃపురంలోకి పోయి తన్ను తాను పరిచయం చేసుకుంటూ, రాకుమారా! నాదేవి బాణాసురుని కుమార్తె. నిన్ను స్వప్నంలో చూసి నీపై మనసు పారేసుకుంది. నిన్నామె వద్దకు తీసుకుని వెళ్ళాలని వచ్చాను. నువ్వు రానంటే నా దేవి ప్రాణాలు విడుస్తుంది. నీతో వివాహం జరుగుతుందని పార్వతీదేవి నా దేవికి

వరమిచ్చింది. కనుక నువ్వు నాతోపాటే వచ్చి నా దేవి పరితాపాన్ని చల్లార్చు. నీదాన్ని చేసుకో. నా దేవి గుణశీలాల గూర్చి, ఆమె పుట్టు పూర్వోత్తరాల గూర్చి కూడా చెప్తాను.

బలిచక్రవర్తి కుమారుడు బాణాసురుడు. అతడు శోణిత పురానికి ప్రభువు. అతడి కుమార్తె అయిన ఉషయే ఇప్పుడు నిన్ను వరించింది. ఆమె నిన్నెంతగా ప్రేమిస్తోందంటే నువ్వు తప్పమరెవ్వరినీ భర్తగా అంగీకరించనంటోంది. అందుకు ఇంకో కారణం కూడా ఉంది. అదేమంటే, వైశాఖ శుద్ధ త్రయోదశినాడు ఎవరైతే స్వప్నంలో నీతో విహరిస్తారో అతడే నీకు భర్త కాగలడని పార్వతీదేవియే స్వయంగా నా దేవితో చెప్పింది. ఆ పార్వతీ దేవి చెప్పినట్లే నువ్వు మా చెలికత్తె స్వప్నంలో కనిపించి అలరించావు. అందువల్లనే నిన్ను నాతో తీసుకొని వెళ్ళేందుకు వచ్చాను అన్నది. అంతట అనిరుద్ధుడు కూడా "చిత్రలేఖా! నా స్వప్నంలో కూడా ఈ ఉషా కన్యయే కనిపించింది. అప్పటినుండి నేను కూడా నిద్రాహారాలు మాని ఈ ఉషాకన్య పైనే ప్రాణాలు నిలుపుకున్నాను. నీతో పాటు నా స్వప్న సుందరి సమక్షంలో వాలేందుకు నేను కూడా తహతహలాడుతున్నాను. ఇంక ఎంత మాత్రం ఆలస్యాన్ని సహించలేను. వెంటనే నన్ను నాప్రియురాలి వద్దకు చేర్చు" అన్నాడు.

అనిరుద్ధుని మాటలతో చిత్రలేఖ ఏనుగునెక్కినంత సంతోషపడింది. వెంటనే నారదుని వద్దనుండి పొందిన తామసీ విద్యా సహాయంతో అనిరుద్ధుణ్ణి శోణితపురానికి ఆఘమేఘాలమీద చేర్చింది. అనిరుద్ధుడు కంటపడగానే ఉష అర్ఘ్య పాద్యాదులతో పూజించింది. చిత్రలేఖను కౌగలించుకొని కృతజ్ఞతలు తెలిపింది. అయితే మనస్సులో తండ్రి జ్ఞాపకం రాగానే భయంతో వణికిపోయింది. చెలికత్తెతో "చిత్రలేఖా! నువ్వింత కార్యసాధకురాలవని ఊహించలేదు. అయితే సఖీ! ఈ రహస్యం రహస్యంగా ఉన్నంతకాలం మనకు అంతా ఆనందమే. కానీ ఈ రహస్యం బయటపడిందంటే మనమెవ్వరం ప్రాణాలతో ఉండం అంటూ భయంతో విలవిల లాడింది. అందుకు చిత్రలేఖ ఇలా ధైర్యం చెప్పింది. "రాకుమారీ! ధైర్యంగా ఉండు. ప్రియుడితో కలసి సంతోషంగా విహరించు. నేను మాయాశక్తి చేత అతడిని ఇక్కడకు తీసుకొని వచ్చాను. ఈవిషయం నరమానవుడికి తెలిసే ఆస్కారం లేదు. అంతేకాకుండా పార్వతీదేవి ఆశీస్సులు నీకు సంపూర్ణంగా ఉన్నాయి. కనుక దిగులు పడకు" అని నచ్చ చెప్పింది. అంతట చిత్రలేఖ దగ్గరుండి వారిద్దరికీ గాంధర్వ విధి ననుసరించి వివాహం నడిపించింది. ఆ పిమ్మట వారిద్దరూ చిలకాగోరింకల్లా ఎంతో అన్యోన్యంగా జీవించసాగారు. వీరెంత రహస్యంగా వివాహం చేసుకొని స్వేచ్ఛగా జీవిస్తున్నా ఉషలో వస్తున్న శారీరక మార్పులను అంతరంగిక చెలికత్తెలు కనిపెట్టారు. ఈ విషయం మహారాజుకు చెప్పినా, చెప్పకపోయినా కూడా ప్రాణాపాయమే. అందువల్ల బాణుడికి చెప్పడానికే నిశ్చయించుకున్నరు. భయపడుతూనే బాణాసురుడివద్దకు పోయి చేతులు జోడించి నమస్కరిస్తూ జరిగిందంతా చెప్పారు.

పిడుగులాంటి మాటలు విన్న బాణుడు చండశాసనుడయ్యాడు. సైనికుల్ని పిలచి అంతః పురంలో ప్రవేశించిన ఆ దుర్మార్గుణ్ణి హతమార్చమని ఆజ్ఞాపించాడు. ఆహా! ఈనాడు ఉష చేసిన పనికి నా వంశమంతా అప్రతిష్ట పాలయింది గదా అని వాపోయాడు. నా అనుమతి లేకుండా గాంధర్వ విధిన వివాహమాడాడట. ఎంత ధైర్యం. ఎంత కండకావరం. ఎంత గుండెలు తీసిన

బంటు కాకపోతే నాకన్నుగప్పి నా నగరంలో నా అంతఃపురంలోనే కాపురం పెడతాడా? అంటూ పళ్ళు పటపటాకొరికాడు. సైనికులంతా ఒక్కపెట్టున పోయి అనిరుద్ధుణ్ణి నల్లిని నలిపినట్లు నలిపెయ్యాలనుకున్నారు. చీమల బారుల్లా వస్తున్న సైనికుల్ని చూసి ఉష బావురుమని ఏడ్చింది. అనిరుద్ధుడు ఆమెను శతవిధాల ఓదార్చాడు. ఊరడిల్లమని బోధించాడు. భయపడవద్దని ధైర్యం చెప్పాడు. బాణాసురుని సైన్యమే కాదు, బాణాసురుడే స్వయంగా వచ్చినా నన్నేమీ చెయ్యలేరు. నీకిప్పుడే నా ప్రతాపాన్ని చూపుతాను. చూడు అంటూ ఆ సైనికులపై విరుచుకుపడ్డాడు. అదే సమయంలో చిత్రలేఖ నారదుణ్ణి స్మరించింది. వెంటనే మహర్షి క్షణకాలంలో అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఆకాశం నుండే మహర్షి నీకు జయమగుగాక అని అనిరుద్ధుని ఆశీర్వదించాడు. క్రిందకు దిగి అనిరుద్ధుడు సైనికులతో యుద్ధంచేయడం చూశాడు. సైనికులంతా బాణాలతోను, గదలతోను, శక్తి ఆయుధాలతోను అనిరుద్ధుని చుట్టుముట్టారు. వారెవ్వరూ అనిరుద్ధుని శౌర్యం ముందు నిలబడలేకపోయారు. చచ్చినవారు చావగా మిగిలిన వాళ్ళు పారిపోయారు. బాణాసురుడు వారిని చూసి మీకు భయాన్ని కల్పించిందెవరని గద్దించి అడిగాడు. మీరిన్ని యుద్ధాలు చేసి శత్రుభయంకరులైన మిమ్మల్ని భయపెట్టిందెవరు? వీరోచితంగా పోరాడి చావనైనా చావాలేగాని ఇట్లా పారిపోయి రావడం మీకు దగదని దండించాడు. శూరులు మహాక్రూరులు అయిన మెరికల్లాంటి రాక్షస సైనికుల్ని పిలిచి ఆరాజ ద్రోహిని హతమార్చమని పంపాడు. వారంతా మదించిన ఏనుగుల్లా ఘీంకరిస్తూ అనిరుద్ధునిపై విరుచుకు పడ్డారు. అనిరుద్ధుడు వారిలో కొందర్ని చంపి వారివద్దనుండి ఆయుధాల్ని లాక్కుని మిగిలిన వాళ్ళనందర్నీ తరిమికొట్టాడు. ఆయుద్ధాన్ని చూస్తున్న నారదమహర్షి పులకించిపోయాడు.

చివరకు కుంభాండుని రథంలో ఎక్కించుకొని బాణుడే స్వయంగా యుద్ధానికి బయలుదేరాడు. అతడి వెయ్యిచేతుల్లోనూ వెయ్యిరకాలైన ఆయుధాలున్నాయి. భయంకరాకారుడైన ఆ బాణాసురుడు సింహనాదం చేశాడు. అనిరుద్ధుడు హిరణ్యకశిపుని ఎదిరించిన నరసింహుని వలె బాణునిపై లంఘించాడు. శత్రుసేనలన్నింటినీ, బాణుని కుంభాండుని అనిరుద్ధుడు ఒక్కడే ఎదుర్కొన్నాడు. బాణుడు ఎంతటి యుద్ధనిపుణుడైనా అతడి దర్పం క్షీణిస్తూ ఉండట చేత అనిరుద్ధుని తేజస్సు ముందు నిలువలేకపోయాడు. చివరగా మయాబలంతో అనిరుద్ధుని మూర్ఛ పోయేట్లు చేశాడు. అతణ్ణి బంధించి కారాగారంలో ఉంచమని సైనికులను ఆదేశించి తాను అంతఃపురంలోకి వెళ్ళాడు. ఈ యుద్ధమంతా స్వయంగా చూస్తున్న నారదుడు ఈ విషయాన్ని శ్రీకృష్ణునికి తెలిపేందుకు ద్వారకానగరానికి ఆకాశమార్గాన బయలు దేరాడు. బంధితుడైన అనిరుద్ధుని చూసి ఉష విలపించింది. శ్రీకృష్ణుడు వచ్చి తన్ను విడిపించగలడని చెప్పి ఉషను ఓదార్చాడు.

ప్రతి జీవి పూర్వజన్మ కర్మఫలాలను అనుభవించాల్సిందేగదా. ఆయా కర్మలను బట్టి శుభాశుభఫలాలు కలుగుతూ ఉంటాయి. చేసే కర్మలకు కర్తవ్యం తన పైనే వేసుకొని చేస్తున్నప్పుడు ఆ కర్మఫలం కూడా వాడే అనుభవించాలి. ఎంతటివాడైనా దానినుండి తప్పించుకోలేడు. కాలం తీరిన వాడికి తాడే పామై కరుస్తుందనడం యథార్థమేకదా. అట్లాగే ఎవరు ఎవరి చేతుల్లో ఏవిధంగా మరణించాల్సి ఉందో ఆకాలపురుషుడే నిర్ణయిస్తాడు. ఆకాలమే అందర్నీ ప్రేరేపించి ఒకచోటకు చేర్చి

మరణాన్ని అమలుపరుస్తుంది. ఇదే కదా సత్యము. అందువల్ల మరణానికి భయపడి యుద్ధానికి పోకుండా ఇంట్లో కూర్చోవడం పిరికితనం కాదా? అటువంటి జీవితం వ్యర్థం కాదా? యుద్ధంలో జయిస్తే లోకంలో కీర్తి లభిస్తుంది. ఒకవేళ మరణిస్తే స్వర్గం లభిస్తుంది. పరమేశ్వరా! గణేశ కుమారస్వాములిద్దరూ నా నగరాన్ని కాపాడుతున్నారు. పార్వతీ పరమేశ్వరులు రక్షిస్తున్న నా నగరానికి ఎవడో బయటనుండి వచ్చి నాకుమార్తెను చేబట్టాడు. ప్రాణాలపైన తీపి ఉన్న వాడెవడైనా ఇటువంటి అఘాయిత్యం చేస్తాడా? నేను నిండు సభలో ఉండగా చెలికత్తెలు వచ్చి నీ కుమార్తె గర్భవతి అని చెప్పి వెళ్ళారు. ముందుగా అనిరుద్ధుణ్ణి హతమారుస్తాను. ఆ పిమ్మట నా కుమార్తెను దండిస్తాను. అట్లాకాని పక్షంలో నా శరీరరం అగ్నికి ఆహుతి చేస్తాను.

పార్వతి : వత్సా! నువ్వు తల్లినైన నామాట వినాలి. పిల్లలు మూర్ఖులైతే అది తల్లిదండ్రులకే వ్యథ. నా మాట సావధానుడవై విను. నీకుమార్తెను ఒకడు వివాహమాడాడు. ఆమె ఇప్పుడు గర్భవతి. అట్టి నీకుమార్తెను ఇంకొకడికి కట్టబెట్టలేవు గదా. పోనీ నీ కుమార్తెను చేపట్టినవాడు శ్రీకృష్ణుని మనుమడే కాని సామాన్యుడు కాడు. అతణ్ణే అల్లుడుగా అంగీకరిస్తే నీ వంశమంతా పవిత్రమౌతుంది. నువ్వు కాదు కూడదని మూర్ఖిస్తే శ్రీకృష్ణుని సుదర్శన చక్రం ఒక్క క్షణంలో నీ శిరస్సును ఖండిస్తుంది. అప్పుడు నిన్ను రక్షించే వారెవరూ ఉండరు.

బాణాసురుడి కాలం తీరింది. పార్వతీ పరమేశ్వరుల మాటలు రుచించలేదు. రథమెక్కి వేగంగా అనిరుద్ధుడున్న అంతఃపురానికి బయలుదేరాడు. శంకరుని వరదానం చేత కుమార స్వామి కూడా అతణ్ణి అనుసరించి వెళ్ళాడు. అష్ట భైరవులు, ఏకాదశ రుద్రులు కూడా తమ ఆయుధాల్ని తీసుకొని అనుసరించారు. బాణునికంటే ముందుగా పార్వతీదేవి పంపిన వార్తాహరుడు వచ్చి అనిరుద్ధుడితో యుద్ధానికి సన్నద్ధం కమ్మని హెచ్చరించిపోయాడు. దాంతో అనిరుద్ధుడు సాయుధుడై బాణుడు రాగానే ఆయుధంతో పోరుకు సిద్ధంగా నిలబడ్డాడు. బాణుని పుత్రిక ఉష భర్త క్షేమం కోరి పార్వతీదేవిని ప్రార్థించింది. భయంతో విలవిల్లాడిపోయింది. యుద్ధానికి సిద్ధంగా నిలబడ్డ అనిరుద్ధుని చూస్తూ నిప్పులు కక్కాడు బాణాసురుడు.

బాణుడు : ఓరీ దుష్టుడా! నీ తండ్రి శంబరుణ్ణి చంపి అతడికి నిశ్చయించిన కన్యను అపహరించాడు. నువ్వు అదే దారిలో ప్రయాణం చేస్తున్నావు. ఇతరులకై నిశ్చయించిన కన్యలను అపహరించి వివాహం చేసుకోవడం మీ కులాచారం అయింది. నువ్వు నీకులమంతా నీచులు. దుష్టుడవు. నీతి శాస్త్రం అంటే మీకు బొత్తిగా మర్యాదలేదు. నీతాత గారైన వాసుదేవుడు మధురానగరాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు మాత్రం క్షత్రియుడనని చెప్పుకుంటాడు. నిజానికి గోకులంలో అతడొక వైశ్యుడి కుమారుడు. బృందావనంలో గోవుల్ని కాచుకొనే యాదవుడు. గోకులంలో గోపికలందర్నీ చెరచినవాడు. పరమ దుష్టుడు. స్త్రీ లంపటుడు. పూతనను చంపి స్త్రీహత్యా పాపం మూటకట్టుకున్నాడు. మధురానగరం వచ్చి కురూపి అయిన కుబ్జతో కులికాడు. పరమ స్త్రీలోలుడు. నరకాసురుణ్ణి చంపి వేలాది స్త్రీలను స్వంతం చేసుకున్నాడు. భీష్మకుణ్ణి, రుక్మిని కన్నుగప్పి రుక్మిణిని లేవదీసుకొని పోయాడు. సత్రాజిత్తు కష్టపడి సూర్యుని గూర్చి తపస్సు చేసి శమంతకమణిని సంపాదించుకొని వస్తే

మాయోపాయంతో ఆ మణిని, సత్యభామను కూడా కాజేశాడు. ధర్మరాజు రాజసూయ యాగాన్ని అడ్డంపెట్టుకొని శిశుపాల దంతవక్త్రుల వంటి వాళ్ళందర్నీ పొట్టన పెట్టుకున్నాడు. భార్య మాటలకు బానిస అయి అన్నగారని కూడా చూడకుండా ఇంద్రుడితో తగాదాపడ్డాడు. నీ వంశస్తులు అక్రమాలను గూర్చి ఎన్నని చెప్పను. నువ్వు అదేదారిలో పోతున్నావు.

బాణాసురుడి మాటలకు అనిరుద్ధుడు మండిపడ్డాడు. అతడికి దీటైన సమాధానం ఇలా చెప్పాడు.

అనిరుద్ధుడు : రాక్షసరాజా! ముందు వెనకలు తెలుసుకోకుండా నోటికి వచ్చినట్లల్లా మాట్లాడుతున్నావు. నా తండ్రిని గూర్చి నీకేం తెలుసని వదరుతున్నావు. ఆయన కామదేవుడు. బ్రహ్మ పుత్రుడు. శివుని కోపాగ్నికి భస్మమై ఇప్పుడు శ్రీకృష్ణ పరబ్రహ్మమునకు పుత్రుడుగా జన్మించాడు. మహాపతివ్రత అయిన రతీదేవి కారణాంతరాలవల్ల శంబరాసురుని ఇంట్లో బందీ అయింది. అయినా తన పాతివ్రత్యాన్ని కాపాడుకుంటూ తపోనిష్టలో ఉంది. అప్పుడు నా తండ్రి ఆ శంబరాసురుణ్ణి చంపి తన ప్రియురాలిని ద్వారకకు తీసుకొని వచ్చి వివాహమాడాడు. ఇందుకు సూర్యచంద్రులే సాక్షులు. ఇక వాసుదేవుడంటావా? ఆయనే నా తాతగారు. వాసు అంటే బ్రహ్మాండాలని అర్థం. అట్టి బ్రహ్మాండాలకు దేవుడు కావడం వలన వాసుదేవుడని ప్రసిద్ధి చెందాడు. ఆయనను పరమ యోగులే తెలుసుకోలేక సతమతమై పోతున్నారు. ఇక నీవంటి మూఢులు తెలుసుకోగలుగుతారా? నీకు అంతగా తెలుసుకోవాలని ఉంటే నీ పరమదైవమైన శంకరుణ్ణడిగి తెలుసుకో.

ఇక నా తాత గారికి గోకులంలో వైశ్యత్వాన్ని ఆపాదించావు. విను. పూర్వం ద్రోణుడనే ప్రజాపతి ఉండేవాడు. అతడి దర్మపత్నియే ధరాదేవి. వారిద్దరూ పరమాత్మను తమకు పుత్రుడుగా పుట్టమని ప్రార్థించారు. ఆ ద్రోణుడే ఈ నందుడు, వైశ్యరాజయ్యాడు. ఆ ధరాదేవియే యశోద. వృషభానుని కుమార్తెయే రాధ. సుదాముడామెను శపించినందువల్ల ఆమె భూలోకంలో వృషభానుని ఇంట్లో రాధ గాపుట్టి పెరిగింది. తన భార్యయే అయిన రాధతో విహరించడాన్ని జారత్వం అనడం నీచాతి నీచం. రాధకృష్ణుల వివాహానికి బ్రహ్మయే పురోహితుడని తెలుసుకో. నందవ్రజంలో ఉన్న కోట్లాది గోపికలంతా గోలోకం నుండి వచ్చినవారే. గోపికల వేషంలో ఉన్న వారంతా శ్రీకృష్ణాంశతో జన్మించారు. పార్షదులతో సమానం. పూతన అంటావా? ఆమె బలిచక్రవర్తి కుమార్తె. నీకుతోబుట్టువు. ఆమెయే పూర్వజన్మలో వింధ్యాంబికగా ఉన్నప్పుడు వామనమూర్తిపై పుత్ర భావాన్ని పెంచుకొని ఇటువంటి కొడుకును పొంది అక్కున చేర్చుకొని ముద్దాడి పాలివ్వాలని కోరుకుంది. భగవంతుడు ఆమె మనసులోని భావనను కనిపెట్టి నీకోరిక కృష్ణావతారంలో తీరగలదని వరమిచ్చాడు. ఆమెయే పూతనగా అవతరించింది. బాలకృష్ణుని ముద్దాడి పాలిచ్చి కృష్ణునిచే చంపబడి గోలోకాన్ని చేరుకుంది. ఈవిషయం తెలుసుకోలేని నువ్వు భగవంతుణ్ణి ఆక్షేపిస్తున్నావు. అట్లాగే కుబ్జ ఎవరనుకుంటున్నావు, రామావతారంలో రావణుని చెల్లెలు శూర్పణఖ. శ్రీరాముణ్ణి కామించింది. ఆ అవతారంలో శ్రీరాముడు ఏకపత్నీ వ్రతుడు కావటాన కృష్ణావతారంలో నీ కోరిక తీరగలదని భగవంతుడు వరదానం చేశాడు. ఆ శూర్పణఖయే ఇప్పుడు కుబ్జగా పుట్టి కృష్ణుని పొంది గోలోకాన్ని చేరుకుంది. అట్లాగే నరకాసురుడు కూడా పూర్వజన్మ కర్మఫలాన్నే అనుభవించి శ్రీకృష్ణుని చేతిలో మరణం పొందాడు. అతడి చెరలో

ఉన్న రాజకన్యల కోరిక మేరకు సూర్యచంద్రుల సాక్షిగా వివాహమాడాడు. రాక్షసరాజా! భీష్మక రాజపుత్రి రుక్మిణి ఎవరోకాదు. సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మియే. అనగా ఆయన భార్యను ఆయనే వివాహం చేసుకున్నాడు. అడ్డుగా ఉన్నవాళ్ళందర్నీ తొలగించాడు. శిశుపాల దంతవక్త్రులుకిది చివరిజన్మ. అందువల్లనే వారిలోని తేజస్సు శ్రీకృష్ణునిలో ఐక్యమై తిరిగి పార్షదులై వైకుంఠానికి చేరుకున్నారు. అని అనిరుద్ధుడు దీటుగా సమాధానం చెప్పి యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు.

రతీ ద్రౌపదుల వృత్తాంతం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 116వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

బాణాసురుడు అనిరుద్ధుణ్ణి హతమార్చేందుకు మందీమార్బలంతో యుద్ధానికి తయారై వచ్చాడు. వస్తూనే ముందుగా మాటలతో తూటాలు పేల్చాడు. అనిరుద్ధుడు కూడా అతడికి దీటుగానే సమాధానం చెప్పాడు. అనిరుద్ధడి జన్మవృత్తాంతం వింటూ, అనిరుద్ధుడా! శంకరుని వరంచేత నీతల్లి ఐదుగురు భర్తల్ని పొందుతుందన్నావు. ఈమాట వింటానికి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ముందు నాకావృత్తాంతం చెప్పు. ఆ తర్వాతనే నీతో యుద్ధం ప్రారంభిస్తాను అన్నాడు.

అనిరుద్ధుడు : బాణాసురా! ఆ వృత్తాంతమంతా వివరంగా చెప్తాను. విను. పూర్వం సీతారామలక్ష్మణులు పంచవటిలో ఉంటూ ఉండగా తన వద్దనున్న ఆహారాన్ని శ్రీరాముడు ముందుగా సీతకు, తర్వాత లక్ష్మణునికి ఇచ్చి చివరగా తాను భుజించేవాడు. అయితే లక్ష్మణుడు మాత్రం తన కిచ్చిన ఆహారాన్ని తినకుండా అట్లాగే చేతిలో పెట్టుకొని ఉండేవాడు. ఎందువల్లనంటే రాబోయే కాలంలో రావణాసురిని కుమారుడైన మేఘనాథుణ్ణి వధించాలంటే నిద్రాహారాల్ని వదలినవాడు మాత్రమే వధించగలడని నియమం ఉంది. అందువల్లనే మేఘనాథుణ్ణి వధించేవరకు లక్ష్మణుడు నిద్రాహారాల్ని వదిలేశాడు.

శ్రీరాముడు పంచవటిలో ఉండే రోజుల్లోనే అగ్నిహోత్రుడు బ్రాహ్మణ రూపంలో వచ్చి శ్రీరాముడితో ఇలా అన్నాడు. రామచంద్రా! మరో ఏడు రోజుల్లో దుర్మార్గుడైన రావణుడు సీతను అపహరించే నెపంతో నీ ఆశ్రమానికి రాబోతున్నాడు. సీతను అతడి బారినుండి తప్పించాలంటే ఆమెను నా సంరక్షణలో ఉంచు. సమయం వచ్చినప్పుడు ఆమె తిరిగి నిన్ను చేరుకుంటుంది అన్నాడు. ఓ మహానుభావా! ఎంతటి వారైనా ప్రారబ్దకర్మ ఫలాల్ని అనుభవించాల్సిందే. తప్పించుకోవడం బ్రహ్మతరం కూడా కాదు అన్నాడు. అంతట శ్రీరాముడు ఆ బ్రాహ్మణుని మాటలు విశ్వసించి సీతను తీసుకొని పొమ్మన్నాడు. ఎన్నడూ శ్రీరాముని విడిచి ఉండలేని సీత తాను అగ్నిదేవునితో వెళ్తూ తన ఛాయను శ్రీరాముని వద్ద ఉంచి వెళ్ళింది. ఆ ఛాయా సీతయే నిజమైన సీత అని నమ్మి రావణుడు అపహరించుకొని పోయాడు. రావణ సంహారం తర్వాత సీత తన పాతివ్రత్యాన్ని రుజువు చేసుకోవడానికై అగ్ని ప్రవేశం చేసినప్పుడు అగ్ని నిజసీతను రామునికి ఒప్పజెప్పగా ఆ సీతతో శ్రీరాముడు అయోధ్యకు చేరుకుంటాడు. అంతవరకు రావణుని వద్ద ఉన్న ఛాయాసీత నారాయణ సరోవరం వద్ద నూరు

సంవత్సరాలు శంకరుణ్ణి ధ్యానించి తపస్సు చేసింది. మహాదేవుడు సంతృప్తుడై ప్రత్యక్షమయ్యాడు. అప్పుడా మాయాసీత భర్తృవియోగంతో దుఃఖిస్తున్నదై ఆ దుఃఖంతోనే భర్తను ప్రసాదించమని ఐదుసార్లు వేడుకుంటుంది. శంకరుడామెకావరాన్ని అట్లాగే ప్రసాదించాడు. అందువల్ల ఆమె హరి అంశతో జన్మించిన ఐదుగురు ఇంద్రుల్ని భర్తగా పొందుతుంది. ఆమెయే యజ్ఞకుండంలో ద్రౌపదిగా జన్మించి పంచపాండవుల్ని భర్తగా పొందుతుంది. ఆమెయే కృతయుగంలో వేదవతిగాను, త్రేతాయుగంలో సీతగాను, ద్వాపరయుగంలో ద్రౌపదిగాను జన్మించి కృష్ణ అనే నామంతో కూడా పిలువబడుతుంది. శంకరుడు మన్మథుణ్ణి శపించి బూడిద చేసినప్పుడు వలవలా ఏడుస్తున్న రతీదేవిపైన శివుడు దయతలచి ఓ రతీ! నువ్వు తిరిగి నీ భర్తను చేరుకునేంతవరకు శంబరాసురుడనే రాక్షసుడి ఇంట్లో ఉంటావు. అయితే నువ్వు దానవుడి ఇంట్లో ఉన్నా నీ పాతివ్రత్యానికి ఎటువంటి భంగము వాటిల్లదు. ఓ బాణాసురా! ఈ వృత్తాంతమంతా దేవతలకు తెలుసు. అయినా దీన్ని అతి రహస్యంగా ఉంచుతూ వచ్చారు.

బాణాసురుడు అనిరుద్ధుడు మాట్లాడుకుంటూ ఉండగా సుభద్రుడనే దానవుడు (ఇతడు కుంభాండుని సోదరుడు) అనిరుద్ధునిపై శక్తి ఆయుధాన్ని ప్రయోగించాడు. ఇది గ్రహించిన అనిరుద్ధుడు రథం పైనుండి వైష్ణవాస్త్రాన్ని ప్రయోగించి సుభద్రుణ్ణి, అతని రథాన్ని సారథిని, ఒకేసారి నేలకూల్చాడు, సుభద్రుడు నేలకూలడంతో బాణాసురుడు కోపంతో నూరు బాణాలను అనిరుద్ధునిపై ప్రయోగించాడు. అనిరుద్ధుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించి ఆనూరు బాణాలను నిర్వీర్యం చేశాడు. అంతట బాణుడు అనిరుద్ధునిపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అందుకు బదులుగా అనిరుద్ధుడు కూడా మంత్రించిన మరో బ్రహ్మాస్త్రాన్ని విడిచాడు. అంతట బాణుడు పాశుపతాస్త్రాన్ని ప్రయోగించబోతూ ఉండగా అనిరుద్ధుడు బాణునిపై నిద్రాస్త్రాన్ని ప్రయోగించి బాణుని మత్తులో పడిపోయేట్లు చేసి అతణ్ణి ఖడ్గంతో పొడిచి చంపాలనుకున్నాడు. కుమారస్వామి వద్దని వారించినా వినకపోవడంతో అనిరుద్ధునిపై గదా ప్రయోగం చేసి అనిరుద్ధుని రథాన్ని పొడిపొడి చేశాడు. ఆ తర్వాత మన్మథ పుత్రుడైన అనిరుద్ధుడు కూడా గదాయుధాన్ని ధరించి కుమారస్వామిపై దండెత్తి వెళ్ళాడు. వాళ్ళిద్దరి మధ్య యుద్ధం భీకరంగా సాగింది.

శంకర గణపతుల సంవాదం

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 117వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

అనిరుద్ధుని ప్రతాపం, కుమారస్వామి బాణాసురులతో భీకరంగా పోరాడుతున్న వైనాన్ని గణపతి శివునికి తెలిపాడు, అంతావిన్న శివుడు పక్కున నవ్వి ఇలా అన్నాడు. గజాననా! బ్రహ్మాండాలు అసంఖ్యాకం. వాటన్నింటికీ కారణము కార్యమూ రెండూ శ్రీకృష్ణుడే అని తెలుసుకో. శ్రీకృష్ణుడే సనాతనుడు. అనగా గడ్డిపోచనుండి బ్రహ్మాండం వరకు అన్నీ శ్రీకృష్ణుడే. గోలోకనాథుడు, రాధా మనోహరుడు అయిన శ్రీకృష్ణుడు ఇప్పుడు బాలుని రూపంలో గోపాలుడుగా ఉన్నాడు. భూలోకాన్ని పవిత్రం చెయ్యడానికే పనిగట్టుకొని గోలోకం నుండి దిగివచ్చి అవతరించాడు. గోవులన్నీ గోపికలుగా

అవతరించాయి. శ్రీకృష్ణుని పాదస్పర్శతో బృందావనమంతా పవిత్రమయింది. అటువంటి శ్రీకృష్ణుని పుత్రుడే ప్రద్యుమ్నుడు (మన్మథుడు) బ్రహ్మశాప కారణంగా తన్ను తాను తెలుసుకోలేకుండా ఉన్నాడు. ఆ మన్మథుని పుత్రుడే ఈ అనిరుద్ధుడు. మహా పరాక్రమవంతుడు. బాణాసురుణ్ణి కాపాడమని నేనే కుమార స్వామిని పంపాను. లేకపోతే ఈపాటికి బాణుడు మరణించి ఉండేవాడే. అయితే పరాక్రమంలోగాని తేజస్సులోగాని కుమార, అనిరుద్ధులు సమాన బలంగలవారు. అనిరుద్ధుడు బ్రహ్మాంశా సంభూతుడు. దేవతలంతా కలసి వచ్చినా అనిరుద్ధుణ్ణి జయించలేరు. శ్రీకృష్ణుడు సాక్షాత్తూ భగవంతుడే. మహా ప్రకృతి అతడి ఇచ్ఛా శక్తియే. బలరాముడు శేషుడు శ్రీకృష్ణ పరబ్రహ్మాంశలే. స్వల్పకాలంలో శ్రీకృష్ణుడే సుదర్శన చక్రాన్ని ధరించి రాబోతున్నాడు. నువ్వు శుభ స్వరూపుడవు. విఘ్నాల్ని తొలగించేవాడవు. ఆ సుదర్శనాన్ని శ్రీకృష్ణుడు ప్రయోగించకముందే నువ్వు వెళ్ళి ఆ బాణాసురుణ్ని రక్షించు అని గణపతికి తెలిపి తన ప్రయత్నంలో తానున్నాడు.

శ్రీకృష్ణుడు బాణాసురునిపై దండెత్తుట

(ఈ భాగం శ్రీకృష్ణ జన్మఖండం 118వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శంకర భగవానుడు గణపతిని పంపి అంతఃపురంలోనికి వెళ్ళగా దుర్గ, భైరవి, భద్రకాళి మున్నగు వారంతా పరమేశ్వరుని దర్శనానికై వేచి ఉన్నారు. ఇంతలో మణిభద్రుడు ఇలా అన్నాడు.

మణిభద్రుడు : మహాదేవా! అసంఖ్యాకమైన యాదవ సేనలు శోణిత పురానికి చేరుకున్నాయి. ఆసేన వెనకాలే బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు, మొదలైన అతిరథులు, మహారథులు ఉన్నారు. శ్రీకృష్ణుడు చక్రాన్ని ధరించి కోటి సూర్యుల తేజస్సుతో వెలిగిపోతున్నాడు. ఆయనకు ఇరు ప్రక్కలా విష్ణు పార్షదులున్నారు. గరుత్మంతుడు ఆకాశమార్గాన విహరిస్తూ శోణిత పురాన్ని ఎప్పుడెప్పుడు మ్రింగేద్దామా అని తహతహలాడుతున్నాడు.

శివ భగవానుడు : మణిభద్రా! ఊరడిల్లు. గోలోకనాయకుడైన శ్రీకృష్ణుడు బ్రహ్మాండాలన్నింటినీ త్రుటిలో పేల్చివేయగలడు. అట్టి శ్రీహరికి శోణిత పురంగాని, బాణాసురుడుగాని ఎంత? అయినా మీరంతా బాణుని రక్షణ భారాన్ని స్వీకరించాలి. బాణుని కుమారస్వామి, అన్నివిధాలా కనిపెట్టి ఉంటాడు. బాణుని ఎల్లవేళలా గణపతినే స్మరిస్తూ ఉండమని నామాటగా చెప్పండి. భైరవులు, నందీశ్వరుడు, మహాకాలుడు, వీరభద్రుడు మొదలైన వారంతా బాణుని అన్నివైపులనుండి కాపాడుతూ ఉంటారు. దుర్గములన్నింటినీ నాశనం చేసే దుర్గ బాణుని కాపాడుగాక. శ్రీకృష్ణుని ఇచ్ఛా శక్తియే దుర్గ. అందువల్లనే ఆమెను నారాయణి అని లోకాలన్నీ స్తుతిస్తూ ఉంటాయి. విష్ణుమాయ అన్నా, జగన్మాత అన్నా, సర్వమంగళ ప్రదాయిని అన్నా దుర్గయేనని తెలుసుకోండి చక్రాయుధ జ్వాలలనుండి బాణుని కాపాడగల శక్తివంతురాలు ఒక్క దుర్గయే కావున దుర్గాదేవి పాదధూళిని బాణుని శిరస్సున ఉంచండి. ఆమె పాదరజస్సును నగరమంతా చల్లండి.

శంకరుని మాటలు విన్న జగజ్జనని దుర్గ బాణునితో ఓ బాణాసురా! నీవద్దఉండే మణులు,

రత్నాలు ఇంకా విలువైన వస్తువులన్నింటితో పాటు నీకుమార్తె ఉషను కూడా అనిరుద్ధునికిచ్చి వివాహం చెయ్యి. ముందుగా నువ్వు ఉషను వెంటబెట్టుకొని పోయి శ్రీకృష్ణుని శరణు కోరు. అప్పుడే నువ్వు బ్రతికి బట్టకట్టగలుగుతావు. నీ నగరమంతా సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. శ్రీకృష్ణుడితో వైరం పెట్టుకోవడమంటే నీతో నువ్వే వైరం పెట్టుకొన్నట్లు. ఎట్లాగంటే, ఎవరు శరీరాన్ని విడిచిపెట్టి పోతే ప్రాణాలు పోతాయో అతడే జీవుడు. అతడే ఇంద్రియాలకు అధిపతి. నేను భగవంతుని ఇచ్ఛా శక్తిని. ఆయన మనస్సే బ్రహ్మ. శివుడే ఆయనకు జ్ఞానం. భగవంతుడు నిత్య సత్య స్వరూపుడు. శ్రీకృష్ణుడు నీ అత్మయేనని తెలుసుకో. తిరిగి శివభగవానునితో జగన్మాత ఇలా అంది.

మహాదేవా! స్కంధ గణపతులెట్లాగో బాణుడుగాని నీభక్తకోటిగాని అందరూ నీకు సమానులే. నీ సేవకులందర్లోకి బాణుడు నీకు ఇష్టుడని నాకు తెలుసు. అయితే శ్రీకృష్ణుని కన్నా ఇష్టుడు కాదు గదా? గోలోకంలో రాధనైనా, వైకుంఠంలో లక్ష్మినైనా, కైలాసంలో గౌరినైనా, బ్రహ్మలోకంలో సరస్వతి అన్నా నేనే. పూర్వం దక్షునికి పుత్రికనై దుష్ట రాక్షసులందర్నీ సంహరించాను. నిన్ను దక్షుడు అవమానించినప్పుడు ప్రాణాలు విడిచి హిమవంతునికి పుత్రికనై పార్వతిగా పిలువబడ్డాను. రక్తబీజుడ్ని సంహరించేందుకు కాళీ అన్న పేరు ధరించాను. ఇంకా ఇంతకన్నా ఏం చెప్పను? మీరు చెప్పినట్లే బాణుని ప్రాణాలకు రక్షణ కల్పిస్తాను.

బలిచక్రవర్తి శోణిత నగరానికి వచ్చుట

(ఈభాగం ఒక్క శ్రీకృష్ణ జన్మఖండంలోనే కనిపిస్తుంది. మిగిలిన పురాణాల్లో ఉండదు.)

దుర్గాంబ చెప్పిందంతా వేదార్థమేనని శంకరునికి తెలుసు. ఆమెయే జ్యోతి స్వరూపిణి అనీ, మూలప్రకృతి అనీ, ఎరుగు. అందువల్లనే బాణాసురునికి తగువిధంగా హితబోధ చేశాడు. భగవంతుడితో యుద్ధానికి సిద్ధమవడం అవివేకమని పరిపరివిధాల బోధించాడు. అయినా మూర్ఖంగా యుద్ధానికే సిద్ధమవుతానని అంటే, సర్వనాశనం తప్పదని హెచ్చరించాడు. అయినా బాణుడు ససేమిరా అన్నాడు. నేను హిరణ్యకశిపుని సంతతి వాడిని. విష్ణువుతో వియ్యానికి అంగీకరించనని కుండపగులకొట్టినట్లు చెప్పాడు.

ఆ సమయంలో మహాధార్మికుడని ప్రసిద్ధి చెందిన బాణుని తాత గారైన బలిచక్రవర్తి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అక్కడున్న శివభగవానుని, స్కంధ గణపతులు మున్నగు దేవతలందరికీ నమస్కరించాడు. దేవ గణం కూడా బలిచక్రవర్తికి గౌరవ సూచకంగా లేచి నిలబడ్డారు. పరమశివుడు ఇలా అన్నాడు.

శంకరుడు : పరమ ధార్మికుడా! సంపదలన్నీ భగవంతునికర్పించి శరణాగతి పొందిన పరమభక్తుడవు. నీ సమక్షం విష్ణు భక్తులందరికీ పరమ లాభం. బ్రాహ్మణుడే పూజనీయుడంటే విష్ణుభక్తుడైన బ్రాహ్మణుడు పరమ పూజ్యుడవుతాడు.

బలిచక్రవర్తి : మహాదేవా! పరమేశ్వరా! నేను నీ సేవకుణ్ణి. నన్నెందుకు స్తుతిస్తావు. దుర్లభమైన ఐశ్వర్యాలన్నీ నువ్వే నాకు ప్రసాదించావు. జగన్నాథా! నువ్వే నన్ను పాతాళానికి అధిపతిని చేశావు. ఇంద్రునికి సకలైశ్వర్యాల్ని నాద్వారా ఇప్పించావు. వామన రూపంలో వచ్చి నన్ను ఉద్ధరించిన వాడవు నీవే కదా. బాణాసురుడు నాకుమారుడు. ఎంతో అల్లారుముద్దుగా పెంచాను. అయినా అతడికి నీయందే పరమభక్తి. కావున నువ్వే అతడికి మార్గదర్శకుడవు కావాలి. ఎవరైనా ఆత్మతో వైరం పెట్టుకుంటారా? అంటూ శంకరుని శతసహస్ర వందనాలర్పిస్తూ శ్రీకృష్ణుని ఈ విధంగా కీర్తించాడు. భగవంతుడతని ధ్యానానికి సంతోషించి దర్శన మిచ్చాడు. భగవద్దర్శనంతో బలి ఒళ్ళంతా ఆనందంతో పొంగిపోయింది. కళ్ళ వెంట నీరు ధారలుగా ప్రవహించాయి. బలిచేసిన స్తుతికి శ్రీకృష్ణుడు పరమానందం చెంది ఇలా అన్నాడు. వత్సా! బలిదానవేంద్రా! భయపడకు. నీకుమారుణ్ణి రక్షిస్తాను. ఎందువల్లనంటే పూర్వం ప్రహ్లాదుడికి నీ వంశం వాళ్ళనెవరినీ సంహరించనని వరమిచ్చాను. నీ విషయంలో కూడా నీ దర్పం అణిగేట్లుగా పాతాళానికి పంపాను. అట్లాగే కుమారుడి విషయంలోకూడా అతడి దర్పమణిగేట్లు చేస్తానే కాని సంహరించను. అంతేకాదు అతడికి జ్ఞానాన్ని ప్రసాదిస్తాను. నువ్విప్పుడు నన్ను గూర్చి చేసిన స్తోత్రం సామవేద ప్రతిపాదితం. దీన్ని పూర్వం బ్రహ్మ సనత్కుమారునికి ఉపదేశించాడు. ఈ స్తోత్రాన్నే పార్వతీదేవి గౌతమునికి, కుమారస్వామి భృగుమహర్షికి ఉపదేశించింది. పరమ పవిత్రమైన ఈ స్తోత్రాన్నిప్పుడు నీకుమారుడైన బాణాసురుడికి ఉపదేశించు. అతడీ స్తుతి చేయడం వలన పవిత్రుడై నా అనుగ్రహానికి పాత్రుడవుతాడు. అంతేకాదు ఈ స్తోత్రం పఠించేవారికి సర్వసంపదలు చేకూరుతాయి. ముక్తి కరతలామలకమవుతుంది. అని శ్రీకృష్ణ పరబ్రహ్మం అదృశ్యుడయ్యాడు.

బాణాసురుడు శ్రీకృష్ణునితో యుద్ధము చేయుట

(ఈ కథాభాగం అన్ని పురాణాల్లోనూ కనిపిస్తుంది. కొన్ని విశేషాల్ని మాత్రం బ్రహ్మ వైవర్తము నుండి గ్రహించబడినవి.)

యాదవసేనలన్నీ శోణిత పురాన్ని ముట్టడించాయి. బలరాముని, ఉద్ధవుని సంప్రదించి శ్రీకృష్ణుడు శంకరుని వద్దకు దూతను పంపాడు. ఆ దూత పోయి శివపార్వతులకు స్కంధగణపతులకు నమస్కరించి ఇలా అన్నాడు. శంకరా! శ్రీకృష్ణుడు బాణాసురునితో యుద్ధానికి సిద్ధమై వచ్చాడు. బాణాసురుడు శరణు జొచ్చినట్లైతే ఉషను అనిరుద్ధుడితో వివాహం జరుపమను. లేనిచో యుద్ధానికి సిద్ధం కమ్మను. యుద్ధానికి రమ్మంటే ఎవడైతే పిరికి పందలా వెనుతిరుగుతాడో అతడు, అతడి పూర్వీకులు కూడా నరకానికి పోతారు అన్నాడు. దూత మాటలు విన్న పార్వతి శంకరుని అనుమతితో ఇలా అన్నది. బాణాసురా! నీ మనస్సు కుదుట పరచుకొని వెంటనే నీ కుమార్తెను అనిరుద్ధునకిచ్చి వివాహం చెయ్యి. శ్రీకృష్ణుని శరణుకోరు. శ్రీకృష్ణుడు పరమదయాళువు. భక్తుల పాలిట కల్పతరువు. శరణాగత రక్షకుడు. కావున శ్రీకృష్ణుని శరణుకోరు అన్నది. పార్వతి మాటలకు అక్కడున్న దేవతలంతా హర్షధ్వానాలు చేశారు.

బాణాసురునికి మాత్రం పార్వతీదేవి మాటలు రుచించలేదు. కళ్ళు చింతనిప్పులయ్యాయి. రుసరుసా లేచి నిలబడ్డాడు. ధనస్సు చేత పుచ్చుకొని శంకరునికి నమస్కరించి యుద్ధానికి బయలుదేరాడు.

రాక్షసవీరులంతా అతణ్ణి అనుసరించారు. శ్రీకృష్ణుడు శంకరుని పార్వతిని కలసి కొద్దిసేపు ఇష్టాగోష్ఠి జరిపాడు. అంతట బాణాసురుడు శంఖనాదం చేసి శంకరుని ప్రదక్షిణ నమస్కారం చేసి ముందుగా సాత్యకిని ఎదుర్కొన్నాడు. బాణుడు వరుసగా అంజనాస్త్రాన్ని, వాయువ్యాస్త్రాన్ని, ఆగ్నేయాస్త్రాన్ని, వారుణాస్త్రాల్ని ప్రయోగించాడు. సాత్యకి వాటన్నింటినీ ఎదుర్కొని నిర్వీర్యం చేశాడు. బాణుడు మహేశ్వరాస్త్రాన్ని ప్రయోగిస్తే సాత్యకి వైష్ణవాస్త్రాన్ని ప్రయోగించాడు. ఈవిధంగా బాణుడు నాగస్త్రాన్ని, పాశుపతాస్త్రాన్ని వేయగా సాత్యకి వాటిని గరుడాస్త్రంతోను, దుర్గాస్తవంతోను తిప్పికొట్టాడు. అట్లాగే గుహుడు ప్రద్యుమ్నుడితో తలబడ్డాడు. అటుపిమ్మట బాణుడు బలరామునిపై తలపడ్డాడు, బాణుడు శైవజ్వరాన్ని ప్రయోగించగా బలదేవుడు వైష్ణవ జ్వరాన్ని ప్రయోగించాడు. ఆ రెండూ భీకరంగా పోరాడి శైవ జ్వరం ఓడిపోయింది. ఓడిపోయిన శైవ జ్వరం శ్రీకృష్ణుని పరిపరివిధాలుగా స్తుతించి శరణుజొచ్చింది. అప్పుడు శ్రీకృష్ణుడా వైష్ణవ జ్వరాన్ని ఉపసంహరించి శైవజ్వరాన్ని కాపాడాడు. అంతట బాణుడు శ్రీకృష్ణునితో తలపడి పాశుపతాస్త్రాన్ని ప్రయోగించగా శ్రీకృష్ణుడు చక్రాన్ని పంపిదాన్ని వారించాడు. పాశుపతం పోయి శంకరుని వద్దకు చేరుకుంది. దాంతో బాణుడు శరీరమంతా గాయాలై నేలపై పడిపోయాడు. అప్పుడు మహాదేవుడు సాక్షాత్కరించి బాణుని శ్రీకృష్ణుని వద్దకు వెంటబెట్టుకొని వెళ్ళాడు. శంకరుడు, బాణాసురుడు కూడా శ్రీకృష్ణుని వేదోక్తంగా స్తుతించి ప్రసన్నుణ్ణి చేసుకున్నారు. ఉషాకుమారిని కూడా అక్కడికే రప్పించి అనేక రత్న కానుకలతో అనిరుద్ధునకిచ్చి వివాహం జరిపించారు. శ్రీకృష్ణుడు ప్రసన్నుడై బాణుని అనుగ్రహించాడు. అంతట నూతన వధూవరులను తీసుకొని ద్వారకకు వెళ్ళి శ్రీకృష్ణుడు బంధువుల దుఃఖాన్ని నివారించాడు. ద్వారకానగరంలో ప్రజలందరూ ఉత్సవం చేసుకున్నారు.

అయితే ఈ కథ భాగవతంలో కొద్దిపాటి తేడాలతో కనిపిస్తుంది. బాణాసురుడు అనిరుద్ధుణ్ణి నాలుగు మాసాలపాటు నిర్బంధంలో ఉంచినట్లు, ఈ వృత్తాంతం అంతా శ్రీకృష్ణుడు నారదుని వలన తెలుసుకొని బాణునిపై దండెత్తి వెళ్ళినట్లు ఉన్నది. యుద్ధంలో బాణుడు ప్రాణాపాయ స్థితిలో ఉండగా అక్కడ శంకరుడు శ్రీకృష్ణుని స్తుతించగా ప్రసన్నుడైన శ్రీకృష్ణుడు బాణుని చంపకుండా వదిలిపెట్టినట్లు ఆపిమ్మట బాణుని ఆమోదంతో ఉషాఅనిరుద్ధుల వివాహం జరిగి ద్వారకకు వెళ్ళినట్లుగా చెప్పబడింది.

విష్ణు, బ్రహ్మ పురాణాల్లో కూడా కథా విధానంలో స్వల్పమైన భేదాలు కనిపిస్తాయి. హరివంశంలో ఈవిధంగా చెప్పబడింది.

బాణాసురుడు అనిరుద్ధుని యుద్ధంలో ఓడించలేక కొంతకాలం మాయా యుద్ధం చేసినట్లు, ఆ యుద్ధంలో కూడా సఫలీకృతుడు కాలేక చివరగా నాగపాశం చేత బంధించి చెరసాలలో ఉంచినట్లుంది. అట్టి స్థితిలో దుర్గాంబను శోణపురాధి దేవతను ప్రార్థించగా దుర్గాంబ ప్రత్యక్షమై అనిరుద్ధుణ్ణి పాశవిముక్తుని చేసి అనిరుద్ధా! నీ తాతగారైన శ్రీకృష్ణుడు త్వరలోనే వచ్చి బాణాసురుని వెయ్యిచేతులను ఖండించి నిన్ను చెర నుండి విముక్తుణ్ణి చేస్తాడు. నిర్భయంగా ఉండమని ఓదార్చి అంతర్ధానమవుతుంది.

నారదుడు బాణుని వృత్తాంతాన్ని శ్రీకృష్ణునికి తెలుపుట

(ఈ భాగం హరివంశం, విష్ణుపర్వంలోని 121వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ద్వారకానగరంలో అంతఃపుర స్త్రీలందరూ అనిరుద్ధుడు కనిపించకపోవడంతో కలవరపడి శ్రీకృష్ణునితో ఇలా విన్నవించుకున్నారు. నాథా! సర్వలోక శరణ్యుడవైన నువ్వు మమ్మల్నందర్నీ రక్షిస్తూ ఉండగా అనిరుద్ధుడు కనిపించకుండా పోయాడు. నువ్వుండగానే మమ్మల్నందర్నీ అనాథల్ని చేసే ధైర్యం ఎవరికుంటుంది? ఒకవేళ పారిజాత వృక్షాన్ని తెచ్చావన్న కోపంతో దేవేంద్రుడే ఇటువంటి పాపానికి ఒడిగట్టాడా? అని అనేక విధాలుగా దుఃఖించారు. శ్రీకృష్ణుడు కూడా తనకేమీ తెలియదని నమ్మబలికాడు. వెతికించే ఏర్పాట్లు చేస్తానని ధైర్యం చెప్పి పంపాడు.

ఇంతలో సాత్యకి వచ్చి అనిరుద్ధుని వెతికేందుకు దూతల్ని పంపాపనని తెలిపాడు. కృష్ణా! నువ్వు నరకాసురుణ్ణి వధించడం మూలంగా రాక్షసులెవ్వరో నీపై పగపట్టి ఈ అఘాయిత్యం చేసి ఉంటారన్నాడు. సేనాపతి భయపడుతూనే ఇది ఇంద్రుడు పనే అయి ఉంటుందని అన్నాడు. వారందరి మాటలు విన్న శ్రీకృష్ణుడు సేనాపతీ! దేవతలు నీచకార్యాలకు పూనుకోరు. అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న అక్రూరుడు, ప్రభూ! మనం చేసింది కూడా దేవకార్యమే గదా? వాళ్ళకు మనం సహాయం చేసినప్పుడు వాళ్ళు మనకెందుకు అపకారం తలపెడ్తారు? పైగా దేవకార్యం కొరకే గదా మనం మానవ రూపంలో అవతరించాం?" అన్నాడు. అక్రూరుని మాటలకు శ్రీకృష్ణుడు, "అక్రూరా! దేవ గంధర్వ యక్షుల్వెరూ ఈ పనిచేసి ఉండరు. అనిరుద్ధుని ముగ్ధ మనోహర రూపాన్ని మోహించిన పుంశ్చలెవ్వరో హరించుకొనిపోయి ఉంటారు." అన్నాడు.

శ్రీకృష్ణుని మాటలు యాదవులందరికీ కొండంత ధైర్యాన్నిచ్చాయి. కానీ కాలం దొర్లి పోతోంది. దూతలెవ్వరూ అనిరుద్ధుని జాడ తెలుసుకోలేకపోయారు. యాదవులంతా శ్రీకృష్ణుని వద్దకుపోయి మంతనాలు చేస్తుండగా, ఇంతలో నారదుడు శ్రీకృష్ణుని దర్శనం కోరి సభలోకి ప్రవేశించాడు. అంతా లేచి మహర్షికి స్వాగతం పలికారు. అర్ఘ్యపాద్యాదులతో అతిథి మర్యాదలన్నీ అయిన తర్వాత సభాసదులందర్నీ చూస్తూ నారద మహర్షి ఇలా అన్నాడు. "మహాశయులారా! మిమ్మల్ని చూస్తూ ఉంటే దుఃఖ సముద్రంలో మునిగినట్లు కనిపిస్తున్నారు. మిమ్మల్ని ఇంతగా బాధిస్తున్న సమస్య ఏమిటో తెలుసుకోవచ్చునా? అని అడిగాడు. అందుకు శ్రీకృష్ణుడు "మునీంద్రా! మా అనిరుద్ధుడు గాఢనిద్రలో ఉండగా ఎవరో ఎత్తుకుపోయారు. ఇంతవరకు అతడి జాడ తెలియక మేమంతా మథన పడ్తున్నాం" అన్నాడు. మహర్షి పక్కున నవ్వి మధుసూదనా! మహా బలశాలి అయిన బాణాసురుడు అనిరుద్ధుడు యుద్ధంలో తలపడాల్సిన పరిస్థితులేర్పడ్డాయి బాణాసురుని ఏకైక పుత్రిక ఉష అనిరుద్ధుడిపై మనసు పడింది. ఆమె కోరిక తీర్చేందుకు చెలికత్తె అయిన చిత్రలేఖ మాయోపాయంతో అనిరుద్ధుణ్ణి ఉష వద్దకు చేర్చింది. వారిద్దరూ గాంధర్వ విధిన వివాహమాడారు. ఈ విషయం బాణుడికి తెలిసి మండిపడ్డాడు. అనిరుద్ధుణ్ణి హతమార్చమని సైన్యాన్ని పంపాడు. అనిరుద్ధుని ప్రతాపం ముందు సైన్యం నిలువలేకపోయింది. అంతట బాణుడే స్వయంగా యుద్ధానికి వెళ్ళి అనిరుద్ధుణ్ణి నాగపాశంతో బంధించాడు.

నారదుని మాటలు విన్న శ్రీకృష్ణుడు సైన్యాన్ని సిద్ధం చెయ్యమని ఆజ్ఞాపించాడు. మందీమార్బలంతో యుద్ధానికి బయలుదేరాడు. అప్పుడు నారదమహర్షి కృష్ణా! శోణిత పురం ఇక్కడ నుండి పదకొండువేల యోజనాల దూరంలో ఉంది. అక్కడేమో అనిరుద్ధుడు నాగపాశ బద్ధుడై ఉన్నాడు. కావున నువ్వు గరుడవాహనం పై వెళ్ళడమే సమంజసంగా ఉంటుంది అని అన్నాడు. శ్రీకృష్ణుడు గరుత్మంతుని స్మరించగానే గరుడుడు ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. గరుడవాహనంపై శ్రీకృష్ణబలరాములు సాత్యకి మొదలైన వారు శోణిత పురానికి చేరుకోగా, అంతకు పూర్వమే బయలుదేరిన సైన్యంకూడా బాణుని నగరాన్ని చుట్టుముట్టారు. బాణాసురుడి సేనలతో పోరాడారు. శ్రీకృష్ణ సైన్యం ముందు దానవ సేనలు నిలబడి యుద్ధం చేయలేక పలాయనం చిత్తగించాయి. కుంభాండుడు దానవ సైన్యం మధ్యన నిలబడి దానవులారా! బాణాసురుడే స్వయంగా యుద్ధరంగంలో ప్రవేశించాడు. మీరూ ధైర్యంగా పోరాడండి. మనకు అండదండగా శివభగవానుడున్నాడు. గణపతి కుమారులున్నారు. మరచిపోకండి. అంటూ ధైర్యం చెప్పాడు. అయినా శ్రీకృష్ణుడంటే ఏర్పడిన భయం తొలగిపోలేదు. పలాయనం చిత్తగిస్తూనే ఉన్నారు. అంతట కుమారస్వామి నందీశ్వరుడు, శంకరుడు శ్రీకృష్ణుడున్న చోటుకు వచ్చి శంఖనాదం చేశారు. శ్రీకృష్ణుడు వారి ముగ్గుర్నీ గరుడుడి పైనుండే చూశాడు. శివుడు విడిచిన నారాచ బాణాలు తనవైపు చొచ్చుకు వస్తుంటే శ్రీకృష్ణుడు వారుణాస్త్రాన్ని ప్రయోగించి నివారించాడు. ఇరువురి మధ్య సమరం భీకరంగా సాగింది. అప్పుడు బ్రహ్మ దేవతాగణాల్ని వెంటబెట్టుకొని వచ్చి వారినడుమ నిలిచాడు. బ్రహ్మ హరిహరులను స్తుతిస్తూ, రుద్రుడికన్నా విష్ణువు అధికుడు. విష్ణువు కన్నా రుద్రుడు అధికుడు. శివుడు లేక విష్ణువు లేదు. విష్ణువు లేక శివుడు లేదు. అని భక్తి పూర్వకంగా నమస్కరించాడు. అప్పుడే వచ్చిన మార్కండేయముని ఓ హరిహర రూపధరా! పరమేశ్వరా! నీకు నమస్కారము అంటూ భక్తి పరవశుడై స్తుతించాడు.

బాణుని శ్రీకృష్ణుడు అనుగ్రహించుట

(ఈ భాగం హరివంశం విష్ణుపర్వంలోని 122వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

మహాదేవుడు యుద్ధరంగం నుండి నిష్క్రమించడంతో కుంభాండుడు, బాణాసురులే యుద్ధరంగంలో ప్రవేశించారు. సింహనాదం చేసి వేలాది బాణాల్ని శ్రీకృష్ణ బలరాములపై సంధించారు. వారు సంధించే అస్త్రాలన్నింటినీ త్రిప్పికొట్టారు. కుమారస్వామి రంగ ప్రవేశం చేసి బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ప్రయోగించగా శ్రీకృష్ణుడు దానిని చక్రంతో నివారించాడు. స్కంధుని రక్షించేందుకు కోటలీదేవి దిగంబరంగా వచ్చి శ్రీకృష్ణునికి స్కంధునికి మధ్య నిలచింది. శ్రీకృష్ణుని ఆజ్ఞమేరకు ఆదేవి కుమారస్వామిని తీసుకొని శివునివద్దకు చేర్చింది. దాంతో బాణుడే శ్రీకృష్ణుని ఎదుర్కొన్నాడు. బాణుడు బ్రహ్మ నిర్మితమైన అస్త్రాన్నొకటి శ్రీకృష్ణునిపై ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు వారుణాస్త్రాన్ని ప్రయోగించి ఆ తాపాన్ని చల్లార్చాడు. అంతట శ్రీకృష్ణుడు బాణుని కవచాన్ని ఛేదించగా బాణుడు మూర్ఛపోయాడు. బాణుడు తేరుకొని లేచి కూర్చునే వరకు వేచిఉండి పిదప శ్రీకృష్ణుడిలా అన్నాడు. ఓ బాణాసురుడా! లేచి పురుషుడిలా ప్రవర్తించు. నాతో యుద్ధం చెయ్యి. అంటూ చక్రాన్ని చేతిలోకి తీసుకున్నాడు. అంతట పార్వతి బాణుణ్ణి రక్షించేందుకై శ్రీకృష్ణుని ఎదుట నిలచి "ఓ కృష్ణా! నేనీ

దానవుడికి చిరకాలం జీవించమని వరమిచ్చాను. కావున నువ్విప్పుడితడిని వధించడం భావ్యంకాదు. నామాట సత్యం కావాలి. నువ్వు చక్రం చేతిలోకి తీసుకున్నావు కావున ఇతడికి రెండు చేతులుంచి మిగిలిన చేతులన్నీ కొట్టెయ్యి. దాంతో అతడి గర్వమణుగుతుంది. ఇంతకాలం వెయ్యి చేతులతో నాట్యం చేస్తున్నాడు. ఇప్పుడు నువ్వా బాహువుల్ని తొలగిస్తే అతడికి అవమానం మరణంతో సమానమవుతుంది" అంది.

పార్వతి ప్రార్థన విన్న శ్రీకృష్ణుడు బాణుడితో ఇలా అన్నాడు. దానవా! ఇదుగో పార్వతి దీవెన వలన బ్రతికిపోయావు. ఇప్పుడే సుదర్శన చక్రాన్ని ప్రయోగిస్తున్నాను. నీకు రెండు చేతులంచి మిగిలిన వాటినన్నింటినీ ఖండిస్తుంది. కాచుకో అంటూ చక్రాన్ని ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్నీవిధంగా ఆదేశించడంతో పార్వతీ దేవి సంతోషించింది. బాణుని మదమణిగి శ్రీకృష్ణుని పరబ్రహ్మంగా తెలుసుకున్నాడు. అనేక రీతులతో శ్రీకృష్ణుని స్తుతించి, ప్రాణప్రదాత అయిన శివుని యెదుట నృత్యం చేసి శివుని మెప్పించాడు. అంతట శివుడు ఓ బాణుడా! నువ్వు నాకు అత్యంత ప్రియుడవు. నా ప్రమథ గణాల్లో మహాకాలుడనే పేరుతో మరణం లేనివాడివై వర్ధిల్లు అని దీవించి అదృశ్యుడయ్యాడు.

ఉష అనిరుద్ధుల వివాహం :

శివభగవానుని వరదానం చేత బాణుడు మహాకాలత్వాన్ని పొందాడు. అంతట నారదుడు దారిచూపగా శ్రీకృష్ణుడు బలరామాదులతో కలసి అనిరుద్ధుని వద్దకు పోయి నాగపాశవిముక్తుణ్ణి చేశాడు. అనిరుద్ధుడు స్వస్థుడై ఉషాకన్యతో కలసి శ్రీకృష్ణ బలరామాదులకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి నిలబడ్డాడు. అప్పుడు నారదమహర్షి వచ్చి ఉషానిరుద్ధులకు వివాహం జరిపించమని శ్రీకృష్ణుని ప్రార్థించగా శ్రీకృష్ణుడు దగ్గరుండి వివాహం జరిపించాడు. అంతలో కుంభాండుడు వచ్చి శ్రీకృష్ణునికి చేతులొగ్గి నమస్కరిస్తూ అనేక విధాలుగా స్తుతించాడు. సంతృప్తి చెందిన శ్రీకృష్ణుడు ఆ కుంభాండుని రాజుగా చేసి ద్వారకకు ప్రయాణమయ్యాడు. శ్రీకృష్ణుని వెంట దేవతలంతా ద్వారకకు ప్రయాణమై వెళ్ళారు. ద్వారకావాసులంతా శ్రీకృష్ణునికి ఘనస్వాగతం పలికారు.

నృగరాజు చరిత్ర

(ఈ భాగం భాగవతం 64వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ఒకరోజున సాంబుడు, ప్రద్యుమ్నుడు, చారుడు, గదుడు, మొదలైన వాళ్ళంతా శ్రీకృష్ణునితో కలసి విహారానికి దగ్గరలో ఉండే వనాలకు వెళ్ళారు. కొంతసేపు తిరిగిన తర్వాత వాళ్ళందరికీ దాహం వేసింది. చుట్టు ప్రక్కల నీళ్ళకోసం వెదుకుతూ ఉండగా వాళ్ళకో పాడుపడిన బావి కనిపించింది. అందులో ఒక్క చుక్కైనా నీళ్ళు లేవు. కానీ అడుగున ఒక అద్భుతమైన ఊసరవెల్లి కనిపించింది. అడవిలో ఉండే తీగల్ని లతల్ని త్రాడుగా పేని దాన్ని బయటకు తీసే ప్రయత్నంచేసారు. కానీ వాళ్ళకది సాధ్యంకాలేదు. అంతాపోయి శ్రీకృష్ణునికి ఆ విచిత్రమైన ప్రాణిని గూర్చి చెప్పారు. శ్రీకృష్ణుడు వాళ్ళతో

కలసి వెళ్ళి ఆ ప్రాణిని చిటికిన వ్రేలుతో తాకాడు. వెంటనే ఆ ప్రాణి దివ్యాభరణాలతో అలంకరించుకున్న పురుషుడుగా మారిపోయాడు. శ్రీకృష్ణుడికి ఆ ప్రాణి వృత్తాంతం అంతా తెలుసు. అయినా అతడి నోటనే పలికించాలనుకున్నాడు. అందుకే మహాత్మా! నువ్వెవరవు? నీకీ రూపం ఎలా వచ్చింది? తిరిగి నీ పూర్వ రూపాన్ని ఎలా పొదగలిగావో చెప్పమని అడిగాడు.

నృగ మహారాజు : దేవా! నేను ఇక్ష్వాకుని పుత్రుణ్ణి. నన్ను నృగరాజు అంటారు. లోకంలో దానధర్మాలు విరివిగా చేసేవాళ్ళల్లో నేనే అగ్రగణ్యున్నిగా ఉండేవాణ్ణి. మంచి ఆరోగ్యంగా ఉన్నవి, పాలిచ్చేవి, కొమ్ములకు బంగారంతో తాపడం చేయించిన గోవుల్ని కోట్లాది మంది సద్బ్రాహ్మణులకు దానాలు చేసాను. ఒక్క గోవుల్ని మాత్రమే కాదు భూముల్ని, బంగారాన్ని, ఉత్తమములైన బ్రాహ్మణులకు దానాలు చేసేవాడిని. ప్రజల సౌకర్యం కోసం బావులు, చెరువులు త్రవ్వించాను.

ప్రభూ! ఒకానొక రోజున ఒక బ్రాహ్మణునికి దానం ఇచ్చిన గోవు ఒకటి వచ్చి నాగోవుల మందలో కలసిపోయింది. నేనావిషయాన్ని తెలుసుకోకుండా ఆ గోవును మరొక బ్రాహ్మణునికి దానం చేశాను. అతడు ఆ ఆవును తోలుకొని పోతుండగా మొదట దానం తీసుకున్న బ్రాహ్మణుడు దాన్ని చూసి ఇది నా గోవు అని ఆ బ్రాహ్మణ్ణి అడ్డగించాడు. రెండోసారి దానం తీసుకున్న బ్రాహ్మణుడు "కాదు కాదు ఇది నా ఆవు. నృగమహారాజు నాకు ఇప్పుడే దానం ఇచ్చాడు" అన్నాడు. వాళ్ళిద్దరూ తగాదాపడి న్యాయం చెప్పమని నా దగ్గరకు వచ్చారు. నేను వారి వాదనంతా విని జరిగిన పొరపాటు గ్రహించాను. ఆ బ్రాహ్మణులిద్దరిలో ఒకరు తమ వాదనను ఉపసంహరించుకుంటే ఒక గోవుకు బదులుగా నా రెండు లక్షల గోవుల్నిస్తానన్నాను. అయినా వారు తమ పట్టు విడువలేదు. ఈ పాపానికి నాకు నరకం తప్పదు కనికరించమని ప్రాధేయపడ్డాను. అయినా వాళ్ళు ససేమిరా అన్నారు. ఇంతలో యమదూతలు రానే వచ్చారు. నన్ను యముడి ముందు దోషిగా నిలబెట్టారు. అప్పుడు యమధర్మరాజు రాజా! నువ్వు ముందుగా పాప ఫలాన్ని అనుభవించాలనుకుంటున్నావా? లేక పుణ్యఫలమా? అని అడిగాడు. నేను పాపఫలాన్నే ముందుగా అనుభవిస్తానని చెప్పగా వెంటనే నన్ను ఊసరవెల్లి గా మార్చి నన్నీ బావిలో పడేశాడు.

కృష్ణా! నేను నీ భక్తుణ్ణి. నాజీవితమంతా బ్రాహ్మణుల్ని సేవిస్తూ వచ్చాను. ఆ కారణంగా నా పూర్వ జన్మ జ్ఞానం నశించలేదు. దేవా! యోగీశ్వరులకు మాత్రమే నీ దర్శన భాగ్యం లభిస్తుందంటారు. అటువంటి నాబోటి సామాన్యుడికి నీ దర్శనం ఎట్లా కలిగిందో తలచుకుంటే ఆశ్చర్యం కలుగుతోంది. దేవ దేవా! నారాయణా! గోవిందా! పురుషోత్తమా! జగన్నాథా! హృషీకేశా! నా మనస్సు ఎల్లప్పుడూ నీ పాద పద్మాలపైనే లగ్నమయ్యేట్లు అనుగ్రహించు. నాకు నీ దర్శనంతో పాపఫలం నుండి విముక్తి లభించింది. నాకు స్వర్గానికి పోయేందుకు అనుమతి ఇవ్వు అని అంటూ ఉండగానే స్వర్గంనుండి విమానం వచ్చింది. నృగరాజుకు అనుమతి ఇచ్చి శ్రీకృష్ణుడు తన పరిజనానికి ఇలా ఉపదేశించాడు.

సీ॥ నరనాథకుల కాననము దహించుటకును నవనీసురుల విత్త మగ్ని కీల
జన నాయకుల నిజైశ్వర్యాబ్ధి నింకింప బ్రాహ్మణ క్షేత్రంబు బాడబంబు
పార్థివోత్తముల సంపచ్ఛైలములఁ గూల్ప భూసుర ధనము దంభోళి ధార

జగతీవరుల కీర్తి చంద్రిక మాప వి ప్రోత్తము ధనము సూర్యోదయంబు

తే॥ విప్రతతి సొమ్ముకంటెను విషము మేలు ।
గరళమునకును బ్రతికృతి కలదు గాని
దానిమాన్పంగ భువి నౌషధములు లేవు ।
గాన బ్రాహ్మస్వములు గొంట గాదు పతికి.

క॥ ఎఱుఁగమినైనను భూసుర ।
వరుల ధనంబపహరింప వలవదుపతికిన్
మఱపున ననలము ముట్టిన ।
దరికొని వెసఁ గాల్చకున్నె తను వెరియంగన్.

శ్రీకృష్ణుడు : హాలాహలానికైనా విరుగుడుంటుంది. అందువల్ల దాన్ని నేను విషమని అనను. ఒకవేళ విషం తిన్నా కూడా ఆ విషం తిన్నవాడే చనిపోతాడు. కానీ బ్రాహ్మణ ధనాన్ని అపహరించినవాడు, కర్రనుండి పుట్టిన అగ్ని ఆ కర్రనే కాల్చివేసినట్లు, అతడి వంశాన్నే కాల్చివేస్తుంది. బ్రాహ్మణ సొమ్మును తెలియకుండా అపహరిస్తే నరకంతో సరిపోతుంది. కానీ తెలిసి అతడి అనుమతి పొందకుండా అపహరిస్తే అటుపదితరాలు ఇటు పది తరాల వాళ్ళను బాధిస్తుంది. అదే రాజులు బలాత్కారంగా లాక్కుంటే అతడి వంశం వారంతా నశిస్తారు. ఒక్కమాటలో బ్రాహ్మణ సొమ్ము అపహరించడమంటే నరకాన్ని కోరి తెచ్చుకున్నట్లే. దరిద్రుడైన బ్రాహ్మడి సొమ్ము అపహరిస్తే అతడి కన్నీళ్ళు ఎన్ని ధూళికణాల్ని తడుపుతుందో అన్ని సంవత్సరాలు అపహరించిన వాడు కుంభీపాక నరకంలో పడి ఉంటాడు. సామాన్య మానవులు బ్రాహ్మణ ధనాన్ని అపహరిస్తే అల్పాయుష్కులవుతారు. రాజులు చేస్తే రాజ్యాన్ని పోగొట్టుకుంటారు. సర్పాలై జన్మించి ఇతరుల్ని భయభ్రాంతుల్ని చేసే జన్మ పొందుతారు. ఈ ఘట్టంలో పోతనగారు ఎలా స్పందించారో తిలకించండి.

సీ॥ నరాధకుల కాననము దహించుటకును నవనీ సురుల విత్తమగ్ని కీల
జననాయకుల నిజైశ్వర్యాబ్ధి నింకింప బ్రాహ్మణ క్షేత్రంబు బాడబంబు
పార్థివోత్తముల సంపచ్ఛైలములఁగూల్ప భూసురధనము దంభోళిధార
జగతీవరుల కీర్తి చంద్రికమాప విప్రోత్తము ధనము సూర్యోదయంబు

తే॥ విప్రతతి సొమ్ముకంటెను విషము మేలు । గరళమునకును బ్రతికృతి కలదు గాని
దానిమాన్పంగ భువి నౌషధములు లేవు । గాన బ్రహ్మస్వములు గొంట గాదు పతికి.

కావున బంధువులారా! బ్రాహ్మణుడు ఎంతపెద్ద అపరాధం చేసినా అతణ్ణి దండించవద్దు. మీరు మాత్రం వినయంతో నమస్కరించండి. మీరు కాదని నామాట మీరితే నేనే మిమ్మల్ని శిక్షిస్తాను. తెలియక బ్రాహ్మణుని యెడల అపరాధం చేసిన ఈ నృగరాజు వలె బాధలు పడాల్సివస్తుంది.

పౌండ్రక వాసుదేవుని వధ

(ఈ భాగం భాగవతం దశమస్కంధం 66వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

కరూర దేశాన్ని వాసుదేవుడనే పౌండ్రుడు పాలిస్తూ ఉండేవాడు. అతడి చుట్టూ కొంతమంది స్వార్థపరులు, అజ్ఞానులు చేరి నువ్వే నిజమైన వాసుదేవుడవు. నువ్వే భగవంతుడివి. ఒక గొల్ల కాపరి నీపేరు పెట్టుకొని జనాన్ని మభ్యపెడుతున్నాడని రెచ్చగొట్టేవారు. లోకంలో వాసుదేవుడు ఒక్కడే ఉండాలని అందుకు తగినట్టుగా కార్యరంగంలోకి దూకవలసిందని చెవిలో ఇల్లుకట్టుకొని పోరేవారు. పౌండ్రుక వాసుదేవునికి భట్రాజుల స్తుతివాక్యాలు తలకెక్కాయి. ఒకరోజున తనదూతలను శ్రీకృష్ణుని వద్దకు పంపి ఇలా చెప్పించాడు. "నేను లోకకల్యాణం కోసం వాసుదేవుడనై అవతరించాను. నువ్వు కేవలం గొల్ల కాపరివి. నాపేరు పెట్టుకొని లోకాన్ని మోసం చేస్తున్నావు. కనుక ఈనాటి నుండి శంఖ చక్రగదాది చిహ్నాల్ని విడిచిపెట్టు. వాసుదేవుడనే పేరు కూడా మార్చుకో. ఎందువల్లనంటే లోకంలో ఒక్కడే వాసుదేవుడుండాలి. అట్లాకాదంటావా? యుద్ధానికి సిద్ధంగా ఉండు! " అని చెప్పించాడు. ఇందుకు పోతనగారు

ఆ॥ *ఇంతనుండిమైన నెదిరిఁ దన్నెఱింగి నా। చిన్నెలెల్ల విడిచి చేరి కొలచి*
బ్రదుకు మనుము కాక పంతంబులాడెనా। యెదురు మనుము ఘోరకదనమునను.

శ్రీకృష్ణుడు దూతలకు ఈవిధంగా సమాధానమిచ్చిపంపాడు. ఓరీ మూఢుడా! నువ్వు నా చిహ్నాలైన శంఖ చక్రగదాదుల్ని నాటకంలో వేషధారులు ధరించినట్లు ధరించి కులుకుతున్నావు. నీ వందిమాగధులు చేసే స్తోత్రాలకు పొంగిపోయి నాతో కయ్యానికి కాలుదువ్వు తున్నావు. నేను నా సహజ చిహ్నాలైన శంఖ చక్ర గదాదుల్ని ధరించి సైన్యంతో కలసి వస్తున్నాను. కాచుకొమ్మని దూతల్ని పంపాడు. పిమ్మట శ్రీకృష్ణుడు సైన్య సమేతంగా వెళ్ళి పౌండ్రక వాసుదేవుడితో యుద్ధం ప్రకటించాడు. ఆ యుద్ధంలో కాశీరాజు కూడా పౌండ్రకునికి అండగా నిలబడ్డాడు. యుద్ధరంగంలో పౌండ్రకుని చూస్తూ శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. ఓ పౌండ్రకా! నన్ను శంఖచక్రాది ఆయుధాల్ని విడిచి పెట్టమని దూత ద్వారా కబురు చేశావు. నువ్వు కోరుకున్నట్లే ఆ ఆయుధాల్ని నీపైనే విడుస్తాను. నీ ప్రాణాలు హరించిన తర్వాత నా ఆయుధాలు నా వద్దకే వస్తాయి. కాచుకో అన్నాడు. పోతనగారీ ఘట్టంలో

మ॥ *మనుజేంద్రాధమ! పౌండ్రభూపసుత! నీ మానంబు బీరంబు నేఁ*
దనిలో మాపుదు, నెద్దు క్రొవ్వి పెలుచన్నాఁబోతుపై ఱంకె వై
చిన చందంబున దూత చేత నను నాక్షేపించి వల్దన్న పే
రును జిహ్నంబులు నీపయిన్ విడుతు నర్భుల్ పర్వనేఁడాజిలోన్.

శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని ప్రయోగించి పౌండ్రుని శిరస్సు ఖండించాడు. కాశీరాజు శిరస్సు కూడా బాణాలతో ఖండించగా దేవతలు పూలవర్షం కురిపించారు. ద్వేషంతోనైనా పౌండ్రకుడు రాత్రింబవళ్ళు హరినామాన్ని స్మరించడం చేతను, శ్రీమహావిష్ణువు చిహ్నాలను విడవకుండా ధరించడం వల్లను మోక్షాన్ని పొందాడు.

కాశీరాజు కుమారుడు సుదక్షిణ మహాదేవుడు తండ్రిని చంపిన శ్రీకృష్ణుణ్ణి వధిస్తానని శపథం చేసి శివుని గూర్చి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై నీకోరిక నెరవేరాలంటే 'అభిచార' విధాన్ననుసరించి దక్షిణాగ్నిని సేవించు. నేను ప్రమధ గణాలతో వచ్చి నీ కోరిక తీరుస్తానని అంతర్ధానమయ్యాడు.

సుధక్షిణ మహాదేవుడు ఋత్త్విక్కులను, బ్రాహ్మణులను సంప్రదించి అభిచారిక మార్గంలో యజ్ఞం చెయ్యగా యజ్ఞకుండంలోనుండి భయంకరమైన వ్యక్తి శూలాన్ని త్రిప్పుతూ బయటకు వచ్చాడు. అతడి వెంటనే ప్రమథ గణాలు ద్వారకపైపు బయలుదేరాయి. వాళ్ళను చూసిన ద్వారకా వాసులేకాదు జంతుజాలం కూడా భయపడి పరుగులు తీశాయి. అంతా పరుగున పోయి శ్రీకృష్ణునితో మొరపెట్టుకున్నారు.

అంతట శ్రీకృష్ణుడు ఈ గణాలన్నీ మహేశ్వరునిచే ప్రేరేపించిబడ్డవని తెలుసుకొని సుదర్శన చక్రాన్ని స్మరించాడు. వెంటనే చక్రం ప్రత్యక్షమయింది. ఆ భయంకర పురుషుణ్ణి వధించమని ఆజ్ఞాపించాడు. చక్రం తేజస్సుకు నిలువలేని ఆ పురుషుడు తిరిగి కాశీనగరానికిపోయి యజ్ఞకర్త అయిన సుదక్షుణ్ణి యాగాన్ని చేయించిన ఋత్త్విక్కుల్ని బ్రాహ్మణుల్ని కాల్చి బూడిద చేసి అంతర్ధానుడయ్యాడు. ఆ తర్వాత సుదర్శనం కాశీనగరంలో ప్రవేశించి పురద్వారాల్ని, రథశాలల్ని, అశ్వరక్షకుల్ని, ఇంకా కాశీ నగరాన్ని భస్మం చేసి తిరిగి శ్రీకృష్ణుని వద్దకు చేరుకుంది. ఇందులోని నీతి ఏమంటే, నాకంటే గొప్పవాడు మరొకడు లేడన్న అహంకారమున్నవాడు తప్పక నశిస్తాడు. ఇటువంటి వైదిక కర్మలలో దేవతారాధన బలం శాంతమేగాని భూత హింసకాదు. అందువలన ఉపాస్యదేవతలు ఆభిచారిక విధిప్రకారం కర్త కోరిక ప్రకారం శత్రుసంహారం చేసినా విధికి లోబడే అట్లాచేస్తారేగాని హింస దేవతల ప్రవృత్తి కాదు. అందువల్లనే కర్త చేసే కర్మల్లో దోషాలుంటే ఆ కర్తనే హరిస్తాయి. అదేకర్త శాంతిని కోరియాగాది క్రతువులు వ్రతం తలపెట్టినప్పుడు లోపాలున్నా ఫలాన్నివ్వవు కాని కర్తను హరించరు. అందువల్ల సర్వనాశన ప్రయత్నాలు చెయ్యరాదు.

బలరాముడు ద్వివిదుడుని సంహరించుట

(ఈ భాగం భాగవతం దశమ స్కంధం 67వ సర్గం నుండి గ్రహించబడింది.)

నరకాసురుడికి మైందుడు, ద్వివిదుడు అని ఇద్దరు స్నేహితులుండేవారు. వాళ్ళు జన్మచేత వానరులు. వాళ్ళల్లో ద్వివిదుడనే వాడు సుగ్రీవుడి దగ్గరమంత్రిగా ఉండేవాడు. అతడు మహాబలశాలి. తన మిత్రుడైన నరకాసురుణ్ణి శ్రీకృష్ణుడు వధించాడని విని శ్రీకృష్ణునిపై పగపట్టాడు. ఎట్లాగైనా శ్రీకృష్ణుని తగిన శాస్తి చెయ్యాలనుకున్నాడు. ఒకరోజున పెద్ద పర్వతాన్నెత్తి శ్రీకృష్ణుని నగరాల్లో ఒకటైన అనర్త దేశంపై విసిరేశాడు. మరోరోజున సముద్రం దిగి పర్వతాల్లాంటి చేతులతో సముద్రాన్ని అతలాకుతలం చేశాడు. దాంతో ద్వారకా నగరంలోని గ్రామాలన్నీ నీటమునిగాయి. ఇంకోరోజు వృక్షాలన్నింటినీ పెకలించి ముని ఆశ్రమాలన్నీ ధ్వంసం చేశాడు. ద్వారకలో యజ్ఞాలు చేసే చోటుకు పోయి రక్తమాంసాలు, మలమూత్రాలు కుమ్మరించేవాడు. స్త్రీలను చెరపట్టి పర్వత గుహల్లో బంధించేవాడు.

ఒకరోజున బలరాముడు తన స్త్రీలతో కలసి వనవిహారం చేస్తుండగా ద్వివిదుడు అక్కడకు చేరుకున్నాడు. బలరాముడితో సహా అతడి స్త్రీలంతా (ద్వివిదుడ్ని) పర్వతమంత పెద్దకోతిని చూసి ఆశ్చర్యపోయారు. దాని చేష్టలు చూసి పగలపడి నవ్వారు. వీళ్ళంతా నన్ను అవమానిస్తున్నారు. వీళ్ళకు తగిన విధంగా బుద్ధి చెప్పాలని ద్వివిదుడు ఆ స్త్రీలతో అసభ్యంగా ప్రవర్తించాడు. మొదట్లో వినోదం అనిపించినా వాడి చేష్టలు మితిమీరడంతో బలరాముడు అదిలించి బెదిరించాలని చూశాడు. కానీ ఆ మర్కటం వాళ్ళు పెట్టుకున్న మద్యకలశాన్ని ఎత్తుకుపోయి త్రాగేశాడు. ఆ మత్తులో స్త్రీల విషయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. అక్కడితో ఆగకుండా వృక్షాలను, కొండరాళ్ళను బలరాముడిపై విసిరాడు. దాంతో కోపించిన బలరాముడు హలాయుధంతో ద్వివిదుడి తల పగిలేట్లు కొట్టాడు. దాంతోవాడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. నెత్తురు మడుగులో పడిఉన్న ద్వివిదుణ్ణి చూస్తున్న దేవతలంతా హర్షంతో చప్పట్లు చరిచి పూలవాన కురిపించారు. దేవతలు, సిద్ధులు జయజయ ధ్వానాలు చేశారు.

శ్రీకృష్ణలీలలు

(ఈ కథ భాగవతం దశమ స్కంధం 69వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు నరకాసురుణ్ణి సంహరించి, అతడు చెరబట్టిన వేలాది రాకుమార్తెలను వివాహం చేసుకొని సుఖంగా కాపురం చేశాడు. ఇంతమంది భార్యలతో శ్రీకృష్ణుడు ఎట్లా నెగ్గుకొస్తున్నాడో నారదుడికి చూడాలనిపించింది. అట్లా అనుకుంటూనే శ్రీకృష్ణుడి అంతఃపురంలో ప్రవేశించాడు. ఆ భవన సముదాయమంతా విశ్వకర్మ చేత నిర్మించబడ్డది.

నారద మహర్షి ఒకానొక ఇంట్లో ప్రవేశించాడు. శ్రీకృష్ణుడు విలాసంగా ఒక శయ్యపై పడుకొని ఉండగా రుక్మిణీ దేవి వింజామరతో విసురుతోంది. మహర్షిని చూడగానే చివాలున లేచి ఎదురుగా వెళ్ళి మునీంద్రునికి ఆప్యాయంగా స్వాగతం పలికాడు. అర్ఘ్య పాద్యాదులతో అతిథి మర్యాదలు చేసి కూర్చోబెట్టాడు. పవిత్రమైన గంగానదియే ఎల్లవేళలా భగవంతుని పాదాలు కడుగుతూ ఉంటుంది. అటువంటి భగవంతుడే మహర్షి పాదాలు కడిగాడు. అనగా తాను స్వయంగా అతిథి ధర్మాన్ని ఆచరించి లోకులకు ఉపదేశం చెయ్యాలన్నది శ్రీకృష్ణుడి అభిమతం.

నారదమహర్షి : దేవా! దుష్టుల్ని శిక్షించడం, సాధువుల్ని రక్షించడం వంటి కార్యాలన్నీ నీకు సర్వసామాన్యం. అదే నీ అవతార ఫలం. నువ్వు దుష్టుల్ని శిక్షించినా వారి యందు నీకు ఎటువంటి శత్రుభావము ఉండదు. ఈ మాటల్నే పోతనామాత్యులు ఎలా పలికారో చూడండి.

తే॥ అఖిల లోకైక పతివి దయార్ద్రమతివి । విశ్వసంరక్షకుండవు
వెలయనే పనియైనఁగావింతు ననోట । యార్త బంధుండవిది నీకు నద్భుతంబె.

తే॥ అబ్జ సంభవ హరదేవతార్చనీయ । భూరి సంసార సాగరోత్తారణంబు
నవ్యయానంద మోక్షదాయకమునైన । నీపదధ్యాన మాత్మలో నిలువన నీవె.

దేవా! బ్రహ్మాది దేవతలు కూడా నీ పాదపద్మాలనే ధ్యానిస్తూ ఉంటారు. అట్లాగే సంసారకూపంనుండి బయట పడటానికి తాపత్రయపడే ఏకాంత భక్తులు కూడా నీ పాదాలనే ఆశ్రయిస్తారు. నేడు అటువంటి పాదపద్మాలను దర్శించడం మూలంగా నా జన్మ ధన్యమైంది. అని అంటూ, మరో ఇంట్లో ప్రవేశించాడు. ఆభవనంలో భగవానుడు భార్యతో పాచికలాడుతున్నాడు. ఉద్ధవుడు కూడా అక్కడే ఉన్నాడు. మందిరంలోకి వస్తున్న మహర్షిని చూస్తూనే "మహర్షీ! ఇదేనా రావటం? నువ్వు మహాజ్ఞానివి. నేనా సామాన్య గృహస్థుడను. నీకు ఏయే సేవలు చేస్తే తరిస్తానో చెప్పి పుణ్యం కట్టుకో అన్నాడు. భగవానుడు మాటలు విన్న నారదుడి నోటమాట రాలేదు.

కొంతసేపైన తర్వాత మహర్షి మరో ఇంట్లోకి వెళ్ళాడు. అక్కడ శ్రీకృష్ణుడు పిల్లల్ని ఒళ్లో పడుకోబెట్టుకొని ఆడిస్తున్నాడు. అక్కడ నుండి ఇంకో ఇంట్లోకి వెళ్ళాడు. అక్కడ అగ్ని హోత్రము ముందు కూర్చుని హోమం చేస్తున్నాడు. ఇంకో గృహానికి వెళ్ళగా అక్కడ బ్రాహ్మలకు సంతర్పణ చేస్తూ తానే స్వయంగా వడ్డిస్తున్నాడు. ఇంకో ఇంట్లో బ్రాహ్మణుల భోజనం అయిన తర్వాత వారు తినగా మిగిలిన అన్నాన్ని ప్రసాదంగా స్వీకరిస్తూ కనిపించాడు. ఇంకోచోట గాయత్రి జపం చేస్తూ ఉంటే మరో ఇంట్లో గుర్రాలకు మాలీసు చేస్తున్నాడు. మరొక చోట శయనించి ఉంటే వందిమాగధులు స్తుతిపాఠాలు వల్లిస్తున్నారు. ఇంకోచోట ఉద్ధవుడు మొదలైన వారితో మంతనాలు చేస్తున్నాడు. ఇంకోచోట భార్యాపిల్లలతో కలసి జలక్రీడలు చేస్తున్నాడు. మరోచోట దూడలతో సహా పాలిచ్చే ఆవుల్ని దానం ఇస్తున్నాడు. ఇంకో ఇంట్లో ప్రియురాలితో కలసి శృంగార సరాగాలు చేస్తున్నాడు. ఇట్లా చెప్పుకుంటూ పోతే ఒకటా రెండా, వేలల్లో చెప్పుకుపోవాలి. ఈ ఘట్టానికి పోతనగారు ఎలా స్పందించారో చూడండి.

సీ॥ *ఒకచోట నుచిత సంధ్యోపాసనా సక్తు నొకచోటఁ బౌరాణికోక్తి కలితు*
నొకచోటఁ బంచయజ్ఞోచిత కర్ముని నొకచోట నమృతో పయోగలోలు
నొకచోట యజ్ఞనోద్యోగానుషక్తుని నొకచోట దివ్య భూషోజ్జ్వలాంగు
నొకచోట ధనుదానోత్కలితాత్ముని నొకచోట నిజసుత ప్రకరయుక్తు

తే॥ *నొక్కచోటను సంగీత యుక్త చిత్తు। నొక్కచోటను జలకేళియుత విహారు*
నొక్కచోటను సన్మంచకోపయుక్తు। నొక్కచోటను బలభద్రయుక్త చరితు

సీ॥ *సకలార్థ సంవేది యె యింటిలోపలఁ జెలితోడ ముచ్చటల్ చెప్పుచుండు*
విపుల యశోనిధి వేరొక్క యింటిలో సరసి జాననుఁగూడి సరసమాడుఁ
బుండరీక దళాక్షుఁ డొండొక యింటిలోఁ దరుణికి హారవల్లరులు గ్రుచ్చుఁ
గరుణా పయోనిధి మరియొక యింటిలోఁ జెలిఁ గూడి విడియము చేయుచుండు

ఆ॥ *వికచకమల నయనుఁ డొక యింట నవ్వుచుఁ*
బ్రవిమలాత్ముఁ డొకటఁ బాడుచుండుఁ
యోగిజన విధేయుఁ డొకయింట సంఖగోష్టి
సలుపు ననఘ డొకటఁ జెల!గచుండు

మానవ రూపంలో ఉన్నాకూడా శ్రీకృష్ణుని లీలలు కన్నులారా చూసి “యోగేశ్వరా! మహా యోగులకు కూడా సాధ్యంకాని నీ యోగమాయ విలాసాలను చూడగలిగాను. ఇక నీ లీలా విశేషాల్ని పాడుకుంటూ ముల్లోకాల్లోను సంచరిస్తూ ఉంటాను. నా జన్మ ధన్యమైంది. అనుమతిస్తే శలవు తీసుకుంటాను. అంతట శ్రీకృష్ణ భగవానుడు “మహాత్మా! నేను ధర్మాన్ని బోధిస్తాను. ఆచరిస్తూ ఉంటాను. లోకులందరికీ బోధించడ”మే కదా నా అవతార ఫలం.

కుచేలోపాఖ్యానము

(ఈకథా భాగం దశమ స్కంధం 80,81వ అధ్యాయాల నుండి గ్రహించబడింది.)

పరీక్షిన్మహారాజు అంతరంగంలో భక్తి భావం సంపూర్ణంగా నాటుకుంది. శ్రీకృష్ణుని మహిమల్ని చెప్పే కథలు ఎన్ని విన్నా ఇంకా వినాలన్న కోరిక పెరుగుతోంది. ఎంతటి విషయలోలుడైనా ఒక్కసారి శ్రీకృష్ణుని చరిత్ర వింటే ఇక సంసార లంపటంలో చిక్కుకోడు. పశుపక్ష్యాదులకు మానవులకు ఒక్క విషయంలోనే భేదం ఉంది. అదేమంటే, చేతులతో భగవంతునికి సేవలు చేయగలగడం, చెవులతో భగవానుని పుణ్య గాథల్ని వినడం, శిరస్సు వంచి ఆయనకు పాద పద్మాలకు నమస్కరించడం. కన్నులతో ఆయన దివ్య మంగళవిగ్రహాన్ని దర్శించగలగడం, భక్తుల పాదోదకాన్ని గ్రహించడం, ఒక్కటేమిటి, ఈ విధంగా అంగాంగం భగవంతునికై వినియోగించగలగడమే మానవ జన్మకు సాఫల్యం. ఎవరు భగవంతుడిచ్చిన అవయవాల్ని భగవత్సేవకు వినియోగించడో అతడు పాపాత్ముడు, కృతఘ్నుడు అవుతాడు. కావున ఓ మునీంద్రా! నా చివరి ఘడియల వరకు శ్రీహరి సేవలోనే గడపాలని ఉంది. కావున ఆయన లీలల్ని నాకు తనివితీరా చెప్పు. వినాలని ఉంది అని అంటాడు. ఈ భావాలనే పోతనగారు

చ॥ హరి భజియించు హస్తములు హస్తము; లచ్యుతుఁ గోరి మ్రొక్కు త
చ్ఛిరము శిరంబు; చక్రధరుఁ జేరిన చిత్తము చిత్త; మిందిరా
వరుఁ గనుదృష్టి; మురవైరి నుతించిన వాణి వాణి; య
క్షరు కథలాను కర్ణములు కర్ణములై విలసిల్లు భో భువిన్.

పరీక్షిన్మహారాజు మాటలకు శుకమహర్షి ఇలా బదులిచ్చాడు. రాజా! శ్రీకృష్ణుడితోపాటు గురుకులంలో విద్యాభ్యాసం చేసిన చిన్ననాటి స్నేహితుల్లో సుదాముడనే వాడొకడున్నాడు. సాందీపుని వద్ద విద్యాభ్యాసం కాగానే ఇంటికిపోయి వివాహం చేసుకొని వేదాధ్యయనం చేస్తూ అగ్నిహోత్రాది కర్మలతో కాలం గడిపేవాడు. అయాచితంగా లభ్యమయ్యే ద్రవ్యంతో తృప్తి పడి జీవించేవాడు. ఒంటినిండా గుడ్డకు, కడుపునిండా తిండికి కూడా ముఖం వాచి ఉండేవాడు. దానికి తోడు గంపెడు పిల్లలు, భార్య అనుకూలవతి. పతివ్రత. భర్తను అది కావాలి, ఇది కావాలని వేధించేది కాదు. అందువల్ల జీవితం చాలా సంతోషంగా ఉండేది. అయినా పిల్లలకు కడుపునిండా పట్టెడన్నంకూడా పెట్టలేకపోతున్నామే అని బాధపడేది. అట్లా బాధపడుతూ ఒకరోజున భర్తతో ఇలా అంది. “మహాత్మా!

కుటుంబ పోషణ రోజురోజుకు భారమై పోతోంది. పెద్దవాళ్ళం మనం ఆకలి బాధకు తట్టుకున్నా పిల్లలు ఆకలితో అలమటించి పోతున్నారు. నాకో ఆలోచన వచ్చింది. అదేమంటే, మీకు చిన్ననాటి స్నేహితుడైన శ్రీకృష్ణ పరమాత్మ ఇప్పుడు రాజయ్యాడు కదా. అదీకాకుండా ఆయన సాక్షాత్తూ లక్ష్మీదేవికి భర్త. ఆయనకు భక్తులన్నా, బ్రాహ్మణులన్నా తనకన్నా ఎక్కువగా ప్రేమిస్తాడని విన్నాం. మీరిప్పుడు పోయి ఆయన పాదపద్మాలనాశ్రయించి మన దారిద్ర్యాన్ని గూర్చి ఆయన చెవిలో పడేస్తే మనకు అంతో ఇంతో సహాయం చెయ్యకపోడు" అంది ఈ ఘట్టంలో పోతనగారి స్పందన

చ॥ వరదుఁడు సాధుభక్తజన వత్సలుఁడార్త శరణ్యుఁడిందిరా,
వరుఁడు దయాపయోధి భగవంతుఁడు కృష్ణుఁడు దాఁ గుశ
స్థలీ, పురమున యాదవ ప్రకరముల్ భజయింపఁగ నున్న
వాడు, నీ, వరిగిన నిన్నుఁజూచి విభుడప్పుడ యిచ్చు ననూనసంపదల్.

మ॥ కలలోనం దను మున్నెఱుంగని మహాకష్టాత్ముఁ డైనట్టి
దు, ర్బలుఁడాపత్సమయంబునన్ నిజపదాబ్జాంతంబు ఉల్లం
బులోఁ, దలఁపన్ దోడన మెచ్చి యార్తి హరుఁడై తన్నై
ననిచ్చున్ సుని, శ్చల భక్తిన్ భజియించువారి కిడఁడే సంపద్విశేషోన్నతుల్.

భార్యమాటలు విన్న కుచేలుడు (సుదాముడు) ఇలా అన్నాడు. "కల్యాణీ! నువ్వు చెప్పిందంతా బాగానే ఉంది. ఎప్పుడో చదువు కండే రోజుల్లో నాకు స్నేహితుడే గానీ, ఈనాడు అతడు రాజయ్యాడు. ప్రభువును దర్శించాలంటే ఏదైనా కానుక లేకుండా ఒట్టి చేతుల్తో వెళ్ళేబాగుంటుందా? ప్రభువుకు సమర్పించుకోదగిన కానుకేదైనా ఉంటే వెతికి తీసుకొనిరా! నువ్వు చెప్పినట్లే వెళ్ళి దర్శనం చేసుకొని వస్తాను" అన్నాడు. భర్త అంగీకరించినందుకే పరమానందం చెందిన అతగాడి భార్య ఏదైనా దొరక్కపోతుందా అని చుట్టు ప్రక్కల బ్రాహ్మణుల ఇళ్ళకు వెళ్ళి యాచించింది. ఒకరింట్లో నాలుగు పిడికిళ్ళ అటుకులు దొరికాయి. వాటిని భర్త పైపంచెకొంగున కట్టి ద్వారకకు సాగనంపింది.

కుచేలుడు కొన్నాళ్ళకు కాలినడకన ద్వారకకు చేరుకున్నాడు. బ్రాహ్మణులతో కలసి అంతః పురంలో మూడు ద్వారాలు దాటాడు. ఆ తర్వాత పదహారు వేలమంది భార్యల భవనాల్ని దాటుకుంటూ రుక్మిణీదేవి నివాసానికి చేరుకోగలిగాడు. అప్పుడు శ్రీకృష్ణుడు పట్టుపాన్పుపై పవళించి ఉండగా రుక్మిణీదేవి పాదాలు వత్తుతోంది. కుచేలుణ్ణి అల్లంత దూరాన్నుంచే గుర్తుపట్టి చివాల్న లేచి ఎదురువెళ్ళి తన పట్టు పాన్పుపైన కూర్చోబెట్టుకున్నాడు. కుచేలుడికిది కలోనిజమో తెలుసుకోలేక కళ్ళవెంట ఆనంద బాష్పాలు కారుతూ ఉంటే శ్రీకృష్ణుడే చేత్తో తుడిచాడు. పూజా ద్రవ్యాలు తెప్పించి పాదాలు కడిగి నెత్తిన చల్లుకున్నాడు. రుక్మిణీదేవి వింజామర విసురుతూ ఉంటే కుచేలుడి ప్రక్కన కూర్చుని చిన్ననాటి ముచ్చట్లన్నీ గుర్తు చేసుకుంటున్నారు. ఇదంతా చూస్తున్న పరిచారికలు అవాక్కయ్యారు. "ఆహా! ఈ దరిద్రుడు చిరిగిపోయిన గుడ్డలతో అడుక్కుతినే వాడిలా ఉన్నాడు. ఇతడు ఎన్నెన్ని జన్మల్లో ఎన్నెన్ని పుణ్యకర్మలు చేశాడో గదా? లేకపోతే శ్రీకృష్ణుని పట్టుపాన్పుపైనే కూర్చోవడం, రుక్మిణీ దేవి అతడికి వింజామర విసరడం ఎన్నడూ చూడలేదు, వినలేదు" అని ముక్కున

వేలేసుకున్నారు.

ఉ॥ ఏమి తపంబు చేసెనొకొ! యీ ధరణీ దివిజోత్తముండు తొ
ల్జామున! యోగి విస్ఫుర దుపాస్యకుఁడై తనరారు నీ జగ
త్స్వామి రమాధి నాథు నిజతల్పమునన్ వసియించి యున్న వాఁ
డీ మహనీయ మూర్తి కెనయే మునిపుంగవు లెంత వారలున్?

-- బమ్మెర పోతనామాత్యుడు.

శ్రీకృష్ణుడు : మిత్రమా! మనం గురుకులంలో ఉన్నంతకాలం ఒకళ్ళను విడిచి ఒకళ్ళం ఉండేవాళ్ళం కాదు. గురుదక్షిణ సమర్పించుకొని ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయాం. ఆ తర్వాత జరిగిన విషయాలన్నీ చెప్పు వినాలనుంది. వివాహం చేసుకున్నావా? చూస్తే గృహస్థులాగానే కనిపిస్తున్నావు. అయినా విషయభోగాలేవీ నిన్ను బాధిస్తున్నట్లుగాలేదు. వివాహం అయినాకూడా విరక్తితో ఎట్లా జీవించగలుగతున్నావు. కొంతమంది గృహస్థులు కర్మలు చేస్తున్నా స్వార్థంతో చెయ్యరు. లోకహితం కోసమే చేస్తూ ఉంటారు. వాళ్ళంతా నన్నే ఆదర్శంగా పెట్టుకుంటారు.

విప్రశ్రేష్ఠుడా! సంసారంలో చిక్కుకోకుండా ఉండాలంటే అందుకు గురుకృపకావాలి, నిజానికి మానవుడికి ముగ్గురు గురువులుంటారు. మొదటిగురువు జన్మనిచ్చిన తండ్రి. రెండవ గురువు ఉపనయనం చేయించి వేదవిద్యకు అర్హత కల్పించేవాడు. ఇక మూడవ గురువు జ్ఞాన ప్రదాత. అతడు సర్వోత్తముడు. అనగా నా ప్రతిరూపమే. అట్టి గురువు ఉపదేశాన్ని ఎవరు త్రికరణ శుద్ధిగా ఆచరించి సంసారాన్ని అధిగమిస్తారో అతడే నిజమైన పండితుడు.

పండితుడా! గురువులందరికీ గురువునైన నేను జగద్గురువును. అందువల్లనే గురుసేవ అన్ని సేవల్లోకి ఉత్తమమైనది. యజ్ఞయాగాల వంటి క్రతువులకన్నా కూడా గురుసేవా తత్పరుణ్ణే నేను ఎక్కువగా ఇష్టపడతాను. గురుసేవ అంటే నేను చెప్పిన ధర్మాల్ని తుచ తప్పకుండా ఆచరించడమే.

క॥ భూసురులకెల్ల ముఖ్యుఁడ । నై సకల కులాశ్రమంబులందును నెపుడున్
ధీసుజ్ఞాన ప్రదుఁడన । దేశికుఁడన నొప్పుచుందు ధృతి నెల్లెడలన్.
తే॥ అట్టి వర్ణాశ్రమంబుల యందు నర్థ । కుశలులగువారు నిఖిలైక గురుఁడనైన
నాదు వాక్యంబుచే భవార్ణవము పెలుచ । దాఁటుదురు మత్పదాంబుజధ్యానపరులు.

మిత్రమా! ఒకరోజు గురుపత్ని మనిద్దర్నీ అగ్నిహోత్రానికి సమిధలు(కట్టెలు) తెమ్మని అడవికి పంపింది. మనం వెళ్ళిన ఆ అడవి అతి భయంకరమైనది. మనం కట్టెలు కొడుతూ ఉండగా కారుమబ్బులు క్రమ్మి కుండపోతగా వర్షం కురిసింది. కన్నుపొడుచుకున్నా కనిపించని గాఢాంధకారంలో మనం దారి తప్పాం. ఒక ప్రక్కన ఆకలి. మరొక ప్రక్కన భయం. బిక్కుబిక్కుమంటూ ఒకరిచేతులోకళ్ళం పట్టుకొని రాత్రంతా అడవిలోనే గడిపాం. మన గురువు సాందీపులవారు మనల్ని వెదుక్కుంటూ అడవి అంతా గాలించారు. మనం కంటపడగానే "నాయనలారా! ప్రాణులన్నింటికీ దేహం మిక్కిలి విలువైన వస్తువు. మీరిద్దరూ అటువంటి దేహాన్ని కూడా లెక్కచెయ్యకుండా నాకోసం ఇన్ని కష్టాలకు ఓర్చుకున్నారు. గురువుకు తన సర్వ సంపదల్నే కాకుండా నిస్వార్థంగా శరీరాన్ని కూడా అర్పించడమే

నిజమైన గురుదక్షిణ. మీరు నాపై చూపిన ప్రేమకు ఎంతో సంతోషించాను. మీరు నావద్ద నేర్చుకున్న విద్య ఈ లోకంలోను పరలోకంలో కూడా మేలు చేస్తుంది" అని మనల్నిద్దర్నీ ఆశీర్వదించాడు. సుదామా! నీకా సంఘటన గుర్తుందా? ఇంకా ఇట్లాంటివి ఎన్నో జరిగాయి.

కుచేలుడు : జగద్గురూ! దేవదేవా! భక్తుల కోరికల్ని తీర్చే వాడివైన నీతో గురుకులంలో ఉండటం నా పూర్వ జన్మల పుణ్యఫలమని భావిస్తాను. నా జన్మ ధన్యమైంది.

కుచేలుడు ఐశ్వర్యవంతుడు కావడం :

సర్వ ప్రాణులందు అంతర్భూతుడుగా ఉంటూ బ్రాహ్మణ హితాన్నే కోరే శ్రీకృష్ణ పరమాత్మ కుచేలుడితో ఆమాటా ఈమాటా చెప్తూ కుచేలుడిలో ఉండే బెరుకునంతా పోయేట్టు చేశాడు. చివరకు "మిత్రమా! నువ్వు ఎంతో దూరం నుండి వచ్చావు. వస్తూ నాకేదైనా తీసుకొని వచ్చావా? నువ్వు ప్రేమతో ఇచ్చింది పత్రమైనా, ఫలమైనా, పుష్పమైనా కనీసం ఉద్ధరిణెడు నీళ్ళిచ్చినా సరే సంతోషిస్తాను. కానీ ప్రేమ లేకుండా వస్తువు ఎంత విలువైనదైనా నన్ను సంతోషపెట్టలేదు సుమా.

క॥ దళమైనఁ బుష్పమైనను । ఫలమైనను సలిలమైనఁ బాయని భక్తిం
గొలిచిన జనులర్పించిన । నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్

పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుడన్న ఈ మాటలు కుచేలుణ్ణి సిగ్గుతో మరీ క్రుంగదీశాయి. అప్పుడు శ్రీకృష్ణడే చొరవ తీసుకొని అతడి చిరుగుల పై పంచెలో కట్టి ఉంచిన మూటను సుతారంగా విప్పాడు. అందులో ఉన్న అటుకుల్ని చూసి బ్రహ్మానందంగా "ఆహా! ఏమి నాభాగ్యం. నా కోసం అటుకులు కానుకగా తెచ్చాడు. తను ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నా ఇంతవరకు నోరు విప్పి నన్నేమి కోరలేదు. పతివ్రత అయిన భార్య మాటలు విని పిల్లల ఆకలి ఏడ్పులు చూడలేక నావద్దకు వచ్చాడు. ఇప్పుడితడికి సర్వ సంపదల్ని ప్రసాదిస్తాను" అని మనస్సులో అనుకొని గుప్పెడు అటుకులు తీసుకొని నోట్లో పోసుకున్నాడు. రెండో గుప్పెడు తీసుకోబోతుండగా రుక్మిణీ దేవి చెయ్యి పుచ్చుకొని ఆపుతూ "నాథా! నువ్వు నోట్లో పోసుకున్న ఒక గుప్పెడు అటుకులకే నా సర్వ సంపదలు అతడి పరమయ్యాయి. ఇక రెండవ గుప్పెడు కూడా తింటే నేను కూడా ఇతగాడి అధీనంలో ఉండాల్సి వస్తుంది" అని అన్నది.

క॥ మురహరుఁడు పిడికెఁడటుకులు । గర మొప్పఁగ నారగించి కేతూహలియై
మఱియును బిడికెఁడు గొనఁద । త్కర మప్పుడు పట్టెఁ గమల కరకమలములన్

-- మహాకవి పోతన.

కుచేలుడా రాత్రి శ్రీకృష్ణుని తోనే గడిపాడు. శరీరం గాలిలో తేలిపోతున్నట్లనిపించింది. బ్రహ్మానందాన్ని అనుభవించాడు. మరునాడు తన గ్రామానికి ప్రయాణం అయ్యాడు. శ్రీకృష్ణుడు కూడా అతడితో ఆమాటా ఈమాటా మాట్లాడుతూ ఊరి చివరిదాకా సాగనంపి వచ్చాడు. కానీ ఆ బ్రాహ్మణుడు శ్రీకృష్ణుని ఎటువంటి సహాయాన్నీ కోరలేదు. శ్రీకృష్ణుని దర్శనమే పరమ భాగ్యమనుకున్నాడు. పైగా "ఆహా! ఎల్లవేళలా లక్ష్మీదేవిని వక్షఃస్థలంలో నిలుపుకొనే భగవంతుడు

నన్ను ఆలింగనం చేసుకున్నాడు గదా. దరిద్రుడనైన నేనెక్కడ? పరబ్రహ్మమైన శ్రీకృష్ణుడెక్కడ? తాను రుక్మిణీదేవితో కలసి శయనించే శయ్యపైన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. అంతేకాదు. సాక్షాత్తూ రుక్మిణీదేవియే నాకు వింజామర విసిరింది. శ్రీకృష్ణుని పాదపద్మాలను సేవించేవారికి ముక్తి లభిస్తుంది. అటువంటిది, ఔరా! శ్రీకృష్ణుడంతటివాడు నాకాళ్ళు కడిగి నెత్తిన చల్లుకొని పవిత్రుడైనట్లు సంతోషపడిపోయాడు. శ్రీకృష్ణుడు తన్ను కొలిచిన వారందరికీ సర్వైశ్వర్యాలను ప్రసాదించి పంపుతాడు. నావంటి దరిద్రునికి సంపదలిస్తే తన్ను ఎక్కడ మరచిపోతానోనని నా మేలుకోరి ఉత్తిచేతుల్లో ఇంటికి పంపుతున్నాడ" నుకున్నాడు.

కుచేలుడు ఈవిధంగా ఆలోచిస్తూ ఇంటికి చేరుకున్నాడు. ఇంటిముందు సూర్య చంద్రుల్లా వెలిగిపోతున్న విమానాలు నిలబెట్టి ఉన్నాయి. తమ పూరిపాక స్థానంలో ఒక పెద్ద భవనం వెలసింది. ఇంటి ముందు పెద్ద ఉద్యానవనం, ఖరీదైన దుస్తుల్ని ధరించిన స్త్రీ పురుష నౌకర్లు ఇంటినిండా బిలబిలా తిరుగుతూ పనిపాటల్లో మునిగిపోయారు. వారంతా కుచేలుణ్ణి గుర్తుపట్టారు. యజమానికి చెయ్యాల్సిన మర్యాదలన్నీ చేశారు. కుచేలుడికి అంతా అయోమయంగా ఉంది. తాను ద్వారకకు పోయేటప్పుడు పూరిపాక స్థానంలో పెద్ద భవనం వెలిసింది. నౌకర్లంతా సంగీత వాద్యాలతో బ్రాహ్మణునికి స్వాగతం పలికారు.

ఇంతలో భార్య ఎదురు వచ్చింది. ఆమె అలంకారాలతో సాక్షాత్తూ లక్ష్మీదేవిలా ఉంది. భార్యను చూసి ఇంకా ఆశ్చర్యపోయాడు. ఇల్లంతా భోగ్య వస్తువులతో నిండిపోయింది. ఇదంతా శ్రీకృష్ణుని మహిమేనని అర్థమైంది. వానదేవుడు సమయం వస్తే అడక్కుండానే వర్షిస్తాడు. అట్లాగే శ్రీకృష్ణుడు పట్టెడు అటుకులు తిని ఇంతటి భాగ్యాన్ని ప్రసాదించాడు గదా అని అనుకుంటూ శ్రీకృష్ణుని మనసులోనే అనేక విధాలుగా స్తోత్రం చేశాడు.

కుచేలుడు ఈ విధంగా ఆలోచిస్తూ మనస్సును శ్రీకృష్ణుని యందే స్థిరంగా నిల్పి విషయలంపటుడు కాకుండా భార్యబిడ్డలతో సుఖంగా జీవించాడు. సకల బ్రహ్మాండనాయకుడైన శ్రీకృష్ణుడు బ్రాహ్మణుల యెడల దైవీభావం కలిగిఉండేవాడు. బ్రాహ్మణుల కన్నా పరమదైవం మరొకడు లేడని శ్రీకృష్ణ పరబ్రహ్మ లోకానికి చాటి చెప్పాడు.

ఆ॥ దేవదేవుఁ డఖిల భావజ్ఞుఁ డాశ్రిత । వరదుఁ డైన హరికి ధరణి సురులు
దైవతములు గాన ధారణీ దివిజుల । కంటె దైవమొకఁడు గలడె భువిని.

ఈవిధంగా కుచేలుడు సకల భోగాలు అనుభవిస్తున్నా ఏభోగంపైనా కోరిక లేనివాడై శ్రీకృష్ణ పాదపద్మాలనే ఆశ్రయించి పరమ భక్తుడై భగవద్ధాశ్యాన్ని పొందగలిగాడు.

బలరామ కృష్ణులు గ్రహణ స్నానం చేయుట

(ఈ భాగం భాగవతం దశమ స్కంధం 83వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ఒకరోజున సంపూర్ణ సూర్య గ్రహణం వచ్చింది. ఆ రోజున ప్రవహించే నదిలోగానీ, సముద్రంలోగాని స్నానం చెయ్యడం సంప్రదాయం. అట్లాగే కురుక్షేత్రం కూడా పవిత్ర స్థలాల్లో ఒకటి. పరశురాముడు రాజులందరి రక్తంతో అయిదు మడుగులు నిర్మించాడు.

వాటినే స్వమంత పంచకం అంటారు. వసుదేవుడు, అక్రూరుడు, బలరామకృష్ణులు భార్యలతో కలసి గ్రహణ స్నానాలకు వచ్చారు. వాళ్ళతో పాటు సాంబుడు, గదుడు, ప్రద్యుమ్నుడు మొదలైన వాళ్ళంతా కూడా వెళ్ళారు. అనిరుద్ధుణ్ణి, కృతవర్మను ద్వారకలో దుర్గరక్షణకై ఉంచారు. సూర్య గ్రహణ పర్వదినాన తర్పణలిచ్చి పూజను చేసి భోజనాలై విశ్రమించారు. అట్లాగే గోకులం నుండి నందుడు, వేలాదిమంది గోపికలు, గోపకులు కూడా వచ్చారు. వారంతా శ్రీకృష్ణ బలరాములను చూసి ఆనందంతో ఒకరినొకరు కౌగలించుకున్నారు. వాళ్ళంతా శ్రీకృష్ణ లీలల్ని గుర్తుచేసుకొని ఆనందభాష్పాలు కార్చారు. ఆ సమయంలో కుంతి వచ్చి వసుదేవునితో ఇలా అంది.

కుంతి : సోదరా! దైవానుకూలం లేకపోవడం వల్ల అనేక కష్టాల్ని ఎదుర్కొన్నాం. మళ్ళీ అదే దైవ కృపచేతనే వాటన్నింటినీ అధిగమించి తట్టుకొని నిలబడ్డాం. అయిన వాళ్ళెక్కరూ మాకు సహాయం చేసిన పాపాన పోలేదు.

వసుదేవుడు : సోదరీ! మనమంతా భగవంతుడి చేతిలో కీలుబొమ్మలం. ఆయన ఎట్లా ఆడిస్తే అట్లా ఆడవలసిందే. మేము కూడా కంసుని చేతిలో పడరాని పాట్లు పడ్డాం. నువ్వా కథల్ని వినేఉంటావు. ఇప్పుడే కొద్దిగా స్థిమిత పడి ప్రశాంతంగా బ్రతుకుతున్నాం. దైవం ఆరోజు అట్లా ఆడించాడు. ఈరోజు ఇట్లా ఆడిస్తున్నాడు.

ఆ సమయంలో భీష్ముడు ద్రోణుడు, ధృతరాష్ట్రుడు, గాంధారి ఇంకా పాండవ పక్షాన పోరిన అనేక మంది రాజులు వచ్చారు. వారంతా భగవంతుడైన శ్రీకృష్ణుని చూసి పరమానందం చెంది ఉగ్రసేన మహారాజుతో ఇలా అన్నారు. "ఉగ్రసేన మహారాజా! మీరు మీ యాదవ వంశస్థులంతా ముల్లోకాల్లోను పూజించదగినవారు. ఎందువల్లనంటే, గొప్ప యోగీశ్వరులకు కూడా దుర్లభమైన శ్రీకృష్ణ సందర్శనాన్ని మీరు ప్రతిరోజు పొందగలుగుతున్నారు. శ్రుతులు శ్రీకృష్ణుని స్తుతించి పవిత్రమయ్యాయి. భగవంతుని పాదాలు కడిగి గంగ పవిత్రురాలైంది. అటువంటి శ్రీకృష్ణ పరబ్రహ్మంతో ఆడుతున్నారు, పాడుతున్నారు, కలసి మాట్లాడుతున్నారు కలసి భోజనం చేస్తున్నారు. భగవంతుడైన శ్రీకృష్ణుడు మీతో స్వయంగా జీవిస్తున్నాడు. ముల్లోకాల్లో ఇంతటి భాగ్యం గలవారు ఎక్కడైనా ఉంటారా? మీ జన్మ ధన్యమైంది.

బలరామ కృష్ణులు గ్రహణ స్నానానికి వస్తున్నారని తెలుసుకొని నందుడు యశోద కూడా వచ్చారు. రామకృష్ణులు యశోదా నందులకు నమస్కరించి స్వాగతం పలికారు. యశోదతో దేవకీ దేవి ఇలా అన్నది.

దేవకీదేవి : వ్రజేశ్వరీ! నందరాజా! లోకంలో ఉన్న సంపదలన్నీ ఇచ్చినా మీరు చేసిన ఋణం తీర్చుకోలేం. కనురెప్ప కళ్ళను కాపాడినట్లు మీరు రామకృష్ణుల్ని కాపాడారు. కళ్ళుతెరువని పసిగుడ్డుగా ఉన్నప్పటి నుండి పెంచి పెద్ద చేశారు. వారి ఆలనాపాలనా అంతా మీరే చూశారు. కన్నది నేనే అయినా వాస్తవానికి మీరే నిజమైన తల్లిదండ్రులు. ఉత్తములైన వారికి తనవారని పరాయివారన్న తేడాలుండవు.

ఆ తర్వాత గోపికలంతా శ్రీకృష్ణుని చుట్టు ముట్టి ఆలింగనం చేసుకున్నారు. శ్రీకృష్ణుడు కూడా వారందర్నీ పేరుపేరునా పిలిచి ఆదరించాడు. వాళ్ళతో పరాచకాలాడాడు. ఒక్కొక్కళ్ళను చాటుకు తీసుకుపోయి ముద్దులాడాడు. వారితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు : సఖులారా! మీదగ్గర్నుండి కొన్ని రాచకార్యాలు చక్కబెట్టడానికి మధురకు వెళ్ళాల్సి వచ్చింది. ఇప్పుడు శత్రుసంహారం జరిగింది. నాసంగతి అట్లా ఉంచండి. నేనసలు మీకు గుర్తు ఉన్నానా? ఎప్పుడైనా నన్ను తలచుకుంటూ ఉంటారా? లేదా మోసం చేసి పారిపోయాడని తిట్టుకుంటున్నారా? నిజానికి పరమాత్ముడే జీవులన్నింటినీ ఒకచోటుకు చేరుస్తూ ఉంటాడు. మళ్ళీ వాళ్ళను విడదీస్తూ ఉంటాడు. అంతేకాని నన్ను తప్పుపట్టకండి. సుడిగాలి వచ్చినప్పుడు దుమ్ము, ధూళి, చెత్తా చెదారమంతా ఒకచోట జేరడం లేదా? అట్లాగే ఈ సంయోగవియోగలాన్నింటినీ ఆ సృష్టికర్తే కలిగిస్తూ ఉంటాడు.

చ॥ *మనజదళాక్షులా! బలవద్రిపు వర్గములన్ జయింపఁగాఁ*
జని తడవయ్యె దీనికి భృశంబుగ మీమది నల్లకుందుఁడీ
యనయము దైవమిట్లు సచరాచర జాలము నొక్కవేళఁ గూ
ర్చును నొకవేళఁ బాపును మరుద్ధత తూల తృణంబులం బలెన్.

గోపికలారా! వియోగంతో ప్రేమ పెరుగుతుంది. ఆ ప్రేమ ఫలాన్ని, వాళ్ళు కలుసుకోగానే, అందుకుంటారు. నిజానికి ప్రేమ ఇంద్రియాలకు పరిమితమైనది కాకుండా ఆత్మకు ఆనందాన్ని కలిగించేట్లైతే దాన్ని భక్తి అంటారు. భక్తితో మాత్రమే నన్ను చేరుకోగలుగుతారు. భక్తులకు భక్తే ఆహారం. మీరంతా నాయెడల అటువంటి పరాభక్తిని వృద్ధి చేసుకున్నారు. ఇదేమీ సామాన్యమైన విషయం కాదు. భౌతిక పదార్థాలన్నీ నశించేవే. తేనెలో మాధుర్యం ఎట్లా కలసిపోయి ఉంటుందో అట్లాగే నేను జీవులలో లోపలా బయటా వ్యాపించి ఉంటాను. భౌతిక పదార్థాలన్నీ పంచభూతాల్లో ఉన్నాయి. ఆ పంచభూతాలు కూడా తమకు కారణభూతాలైన సూక్ష్మ భూతాల్లో ఉన్నాయి. కానీ అవి ఆత్మయందులేవు. భూత భౌతిక రూపమైతే భోగ్యానికి ఆత్మ భోక్తగా ఉంటుంది. అయితే ఈ భోగ్యము, భోక్త రెండూ నాలోనే ఉన్నాయి. అందువల్లనే నేను పూర్ణుడను. దీనినే ఆధ్యాత్మ విద్యాజ్ఞానమంటారు.

గోపికలు : ఈశ్వరా! కృష్ణా! యోగులు, జ్ఞానులు కూడా సంసారంలో నుండి బయట పడేందుకు నీ పాదాల్నే ఆశ్రయిస్తారు. జ్ఞానం అనగా నీ తత్త్వాన్ని తెలుసుకొని నిన్ను చేరుకునే మార్గం మాత్రమే. అంటే నిన్ను సదాసేవిస్తూ ఉండటమే. కావున నీపై భక్తి పెంచుకోవడానికి ఎటువంటి ఆటంకాలు కలుగకుండా మమ్మల్ని అనుగ్రహించు.

శ్రీకృష్ణుని మహర్షులు దర్శించుట

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 84వ సర్గము నుండి గ్రహించబడింది.)

కురుక్షేత్రంలో ఓ గ్రహణ సమయాన అటు యాదవులు ఇటు పాండవులు, కురువృద్ధులంతా ఒకచోట చేరి మాట్లాడుకుంటున్నారు. వీళ్ళే కాకుండా వ్యాసుడు, విశ్వామిత్రుడు, శతానందుడు, భరద్వాజుడు, గౌతముడు, వసిష్ఠుడు, భృగువు, మార్కండేయుడు వంటి మహాత్ములంతా అక్కడకు చేరుకున్నారు. పాండవులు, బలరామకృష్ణులు ఎదురువెళ్లి ఆ మహాత్ములందర్నీ వినయపూర్వకంగా నమస్కరించి ఆహ్వానించారు. అతిథి పూజలు చేశారు. వారితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు: మహర్షులారా! మీరంతా దేవతలకన్నా పూజనీయులు. మీంటి యోగేశ్వరుల దర్శన భాగ్యం కలగాలంటే పూర్వజన్మల్లో ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలి. అందువల్ల మేమంతా ధన్యులమని భావిస్తున్నాను.

లోకంలో మట్టితో చేసినవి గాని, కర్రతో చెక్కినవిగాని, శిలలతో చేసిన విగ్రహాలను గాని దేవతా మూర్తులుగా భావించి పూజిస్తూ ఉంటారు. ప్రవహించే నదుల్ని, జలాశయాలను తీర్థాలని సేవిస్తారు. అయితే విగ్రహాల్ని పూజించినా, ఎన్ని తీర్థాల్లో మునకలు వేసినా మానవులు తరించాలంటే చాలాకాలం పడుతుంది. కానీ మీవంటి సాధువుల్ని దర్శించినంత మాత్రానే తరిస్తారు. కాబట్టి నిజానికి మీరే మానవుల మధ్యన తిరిగే దేవతలు, ప్రవహించే తీర్థాలు, కొంతమంది సూర్య చంద్రుల్ని, నీరు నిప్పువంటి పంచభూతాల్ని, మనస్సు వాక్కు వంటి జ్ఞానేంద్రియాల్ని ఆరాధిస్తూ ఉంటారు. అటువంటి ఉపాసనలన్నీ భేదబుద్ధినే సూచిస్తాయి. కాబట్టి అజ్ఞానాన్ని తొలగించలేవు. అజ్ఞానం నశిస్తే గాని భేదబుద్ధి పోదు. భేదభావం తొలగిపోతే గానీ బుద్ధి ఏకాగ్రం కాదు. బుద్ధి ఏకాగ్రమైతే గాని ముక్తి లభించదు. బుద్ధి ఏకాగ్రం కావాలంటే సాధు సందర్శనం, సాధు సేవలు ఎంతైనా మేలు చేస్తాయి. మహర్షులారా! దేహాలకు వాతపిత్త శ్లేష్మాదుల ప్రభావం ప్రకృతి వల్ల కలుగుతాయి. అవన్నీ నాశనమయ్యేవే. అట్లాగే ప్రకృతి చేత చెయ్యబడే వస్తువులు గాని స్వభావాలు గాని నాశనం అయ్యేవే. అటువంటి దేహాలన్నింట్లోను 'నేను' అన్న భావం పాతుకొని పోయి ఉంటుంది. ఆ దేహాలు అనుభవించే భోగ్యవస్తువులన్నీ 'నావి' అని కర్తవ్యం తమపైన వేసుకుంటాయి. మట్టితోను, రాతితోను చేసిన విగ్రహాల్ని దేవతలనీ, జలాశయాల్ని తీర్థాలనీ పామరులు ఆరాధిస్తారే గాని, జ్ఞానులను సేవించి తరించాలనుకోరు. వాళ్ళంతా నాలుగు కాళ్ళ జంతువుల్లో గాడిదల్లాంటివారు.

శ్రీకృష్ణుని మాటలు విన్న మునులు "దేవా! మమ్మల్ని తత్త్వజ్ఞుల్లో ఉత్తములని శ్లాఘించావు. నిజానికి మేమందరం కూడా నీ మాయా వలయంలో చిక్కుకునే ఉంటాం. నువ్వు నీ నిజస్వరూపాన్ని కప్పి పుచ్చుకొని మానవ మాత్రుడిగా నటిస్తూ ఉంటావు. అందువల్ల మరీచుడు మొదలైన వారంతా ప్రజాపతులు, తత్త్వజ్ఞులు, అధిపతులు అయినా కూడా నీ మాయకు మోహితులవుతూనే ఉన్నారు. నీ లీలలన్నీ తెలుసుకోవడం ఎవరితరం?

దేవా! కుండలు, మూకుళ్ళు మొదలైనవన్నీ వేరు వేరు వస్తువులే అయినా అవన్నీ మట్టితో చేసినవే. అట్లాగే నువ్వు అనేక రూపాల్లో కనిపించినా నువ్వు ఒక్కడివే సుమా! నీకు కోరికలు లేవు. కోరికలు లేకపోతే కర్మలుండవు. కర్మలే లేకపోతే కర్మ ఫలాలెక్కడనుండి వస్తాయి? అటువంటి నువ్వు వివిధ నామరూపాలతో ఈ విశ్వాన్ని సృష్టించి, పాలించి ఉపసంహరిస్తున్నావు. అట్టి నువ్వు పూర్ణ స్వరూపుడవు. మిగిలిన వన్నీ లీలలే గాని సత్యంగాదు.

దేవా! నువ్వొక్కడివే వర్ణాశ్రమ ధర్మాన్ని రక్షించేవాడవు. భక్తుల్ని రక్షించాలన్నా దుష్టుల్ని శిక్షించాలన్నా ఆయా సమయాల్లో శుద్ధ సత్త్వమైన శరీరాల్ని ధరిస్తూ ఉంటావు. నీ లీలలచేత ధర్మమార్గాన్ని రక్షిస్తూ ఉంటావు.

దేవా! నువ్వెప్పుడూ బ్రాహ్మణులను పూజిస్తూ ఉంటావు. ఎందువల్లనంటే వేదాలే నీ మతం, నీ ధర్మం. నీ మతధర్మాలను బ్రాహ్మణుల ద్వారా ప్రవచింప జేస్తూ ఉంటావు. అందువల్ల నువ్వు సదా బ్రాహ్మణులను పూజిస్తున్నావు. అంతేకాదు నువ్వెప్పుడూ భూలోకంలో అవతరించినా వేదమార్గాల్నీ, సదాచారాలను స్వయంగా ఆచరించి లోకులకు సదాచారాల్ని బోధిస్తూ ఉంటావు.

దేవా! ఈ రోజు నీతో కలసి ఉండటం వలన మా తపస్సు ధన్యమైంది. మా విద్యకు సార్థకత చేకూరింది. మా కన్నులకు పండుగ, జన్మకు సాఫల్యత సిద్ధించాయి. ఓ కృష్ణా! నీ యోగాన్ని గాని, మహత్త్వాన్ని గాని తెలుసుకోలేము. సర్వాంతర్యామి, పరమ పురుషుడవైన నీకు నమస్కరిస్తున్నాము.

దేవా! నువ్వు మాయ అనే తెరచే కప్పబడి ఉండటం చేత నీతోబాటు సంచరించే రాజులు గాని, యాదవులుగాని, నీ నిజస్వరూపాన్ని తెలుసుకోలేకపోతున్నారు. కారణమేమంటే, ప్రజల దృష్టి అంతా మాయా శక్తిచేత నువ్వు సృష్టించే చిత్ర విచిత్రాలను ఆసక్తితో చూస్తున్నారేగాని నీ నిజస్వరూపాన్ని చూడటం లేదు. దేవా! పరమ పవిత్రమైన నీ పాదపద్మాలను కళ్ళారా చూడగలిగాం. నీ పాదభక్తి మాకు ఎన్నడూ తరగకుండా ఉండాలి. నిన్ను పొందాలంటే నిర్మలభక్తి ఒక్కటే మార్గం. అందువల్ల మాలో ఉండే జ్ఞానశక్తి క్రియాశక్తి నీకోసమే వినియోగమయ్యేట్లు మమ్మల్ని అనుగ్రహించు" అన్నారు.

వసుదేవుడు మహర్షులతో "మహర్షులారా! దేవతాస్వరూపులారా! మీకు నమస్కరిస్తున్నాను. లోకంలో కర్మలచేత కర్మబంధాలు ఎట్లా నశిస్తాయో తెలియజేయండి" అని ప్రార్థించాడు. అందుకు నారదమహర్షి "లోకంలో గంగాతీరాన నివసిస్తూ పుణ్యం సంపాదించుకోవాలని తీర్థాలన్నీ తిరుగుతూ ఉంటారు. అట్లాగే ఈ వసుదేవుడు శ్రీకృష్ణుని ఇంట్లో ఉంచుకొని తత్త్వాన్ని బోధించమని మనల్ని అడుగుతున్నాడు. ఇందుకు మనం ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఎందువల్లనంటే పెరటి మొక్క వైద్యానికి పనికిరాదన్నట్లుగా శ్రీకృష్ణుని తన పుత్రుడుగా భావిస్తున్నాడే గాని పరమాత్ముడని తెలుసుకోలేకుండా ఉన్నాడు. దోసపాదు వంటి మొక్కలు కొద్దిరోజుల్లోనే ఎండిపోతాయి. అట్లాగే ఈ ప్రపంచం సృష్టిలయాలయందు నశిస్తుంది. ఆకాశంలో మెరిసే మెరుపులు తమంతట తామే నశిస్తాయి. పాలు తోడుకొని పెరుగైనట్లు, కొన్ని దేహాలు రూపాంతరం చెందుతాయి. అట్లాకాకుండా ఎటువంటి కాలంలోనూ మార్పు చెందకుండా, మరుగులేకుండా ఎవడైతే ఉంటాడో అట్టి భగవానుని సామాన్య మానవుడనుకోవడం ఎంత విచారకరం? అయితే అది అతడి తప్పుకాదు. మంచుచేతగాని, మబ్బుచేత

గాని, రాహుకేతువుల చేతగాని కప్పబడినప్పుడు సూర్యుడు కనిపించనట్లుగా భగవంతుడు కూడా ప్రాణాదుల చేత కప్పబడి నిజస్థితిలో కనిపించడు గదా.

వసుదేవా! మానవులు యజ్ఞం ద్వారా యజ్ఞేశ్వరుడైన శ్రీహరిని ఆరాధించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. దాన్నే కర్మ ద్వారా కర్మబంధాల్ని నశింపజేసే సాధనమని నిర్వచించాయి. ఈ విష్ణుయాగం ఆత్మప్రీతి. అనగా మనస్సునకు ఉపశమనం కలిగించేదని చెప్పబడింది. అట్లాగే ఈ యజ్ఞాన్ని న్యాయంగా సంపాదించిన ధనంతో, కోరికలు లేకుండా శ్రీహరిని ఆరాధించమని గృహస్థులనాదేశించబడింది.

వసుదేవా! మానవులు యజ్ఞ యాగాదుల ద్వారా ధనాన్ని, భార్యాబిడ్డల్ని, భోగాల్ని సమకూర్చుకోవడానికి, మరణానంతరం స్వర్గభోగాల్ని కోరుతూ చెయ్యడాన్ని 'ఏషణత్రయ' మన్నారు.

ఈ కోరికలతో యజ్ఞాలు చెయ్యడం వలన దేవతలకు కూడా మేలు కలుగదు. కావున బుద్ధిమంతులు అటువంటి మమకారాల్ని వదలి భగవదర్పణ బుద్ధితో ధర్మాలన్నింటినీ ఆచరిస్తారు.

వసుదేవా! మానవులు ముఖ్యంగా బ్రాహ్మణులకు మూడు విధాలైన ఋణాలుంటాయి. అవే, పితృ ఋణం, ఋషి ఋణం, దేవ ఋణం, ఈ మూడు పుట్టుకతోనే వస్తాయి. సంతానాన్ని వృద్ధి చేసి పితృ ఋణాన్ని, వేదాధ్యయనం చేసి ఋషి ఋణాన్ని, యజ్ఞం చేసి దేవతా ఋణాన్ని తీర్చుకోవాలి. వీటిని ఆచరించకపోతే పతనం తప్పదు.

వసుదేవా! నువ్వు సంతానోత్పత్తి ద్వారా పితృ ఋణాన్ని తీర్చావు. అధ్యయనం ద్వారా ఋషి ఋణాన్ని తీర్చావు. ఇక యజ్ఞం చేసి దేవ ఋణం తీర్చాలి. ఆ తర్వాత వానప్రస్తానికి పో. నువ్వు పరమ భక్తితో శ్రీహరి భగవానుని ఆరాధించడం వల్లనే ఈ పరమాత్ముడు నీకు పుత్రుడుగా జన్మించాడు." అని చెప్పి ముగించాడు.

అంతట వసుదేవుడు ఆ మహర్షుల్నే ఋత్విక్కులుగా ఉండమని ప్రార్థించాడు. ఋషులాయన కోరికను మన్నించి ఆయన్ను దేవ ఋణం నుండి విముక్తుణ్ణి చేసేందుకు అంగీకరించారు. ఆయనకు, పద్దెనిమిది మంది భార్యలతో కలసి దీక్షనిప్పించారు. వసుదేవుడు ప్రకృతికములు, వికృతికములు అనే రెండు రకాలైన యజ్ఞాల్ని ఆచరించాడు. ఆ తర్వాత అవభృధ స్నానం చేశారు. ధృతరాష్ట్రుడు, విదురుడు, భీష్ముడు, ద్రోణుడు, పాండవులు కుంతి మొదలైన వారంతా హస్తినాపురానికి బయలుదేరారు. పిమ్మట నారదాది మహర్షులంతా సత్యలోకానికి వెళ్ళారు.

వసుదేవుడు నందగోపునితో "సోదరా! స్నేహపాశం అన్నది భగవత్సంకల్పం. ఎంతటి వారైనా దాన్ని తెంచుకోలేరు. నువ్వు నిస్వార్థంగా నాయెడల చూపిన స్నేహం మరువరానిది. సోదరా! పూర్వం పరిస్థితులు బాగాలేక నిన్ను ఆదరించలేకపోయాను. ఇప్పుడేమో అధికారం, ధనమదం చేత మా కన్నులు మూసుకుపోయాయి. బంధువుల్ని, సజ్జనుల్ని చూడనీయడం లేదు. నీ ఉపకారాన్ని మాత్రం జన్మ జన్మలకూ మరచిపోలేను. మనమధ్య స్నేహం చిరకాలం ఉండాలని కోరుకుంటున్నాను" అని నందమహారాజును పూజించాడు. ఆ తర్వాత కొన్నాళ్ళు ఆనందంగా అక్కడే గడిపి వారంతా మధురకు ప్రయాణమయ్యారు.

వసుదేవుడి తత్త్వ విచారం

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 85వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ఒకరోజున రామకృష్ణులిద్దరూ వసుదేవుని పాదాలకు నమస్కారం చెయ్యడానికి వచ్చినప్పుడు వారితో వసుదేవుడిట్లా అన్నాడు. "మహాయోగీ! శ్రీకృష్ణా! సంకర్షణా! ఈ సృష్టికి కారణమైన ప్రకృతి పురుషులకు మీరే కారణమని తెలుసుకున్నాను. కుండలు, మూకుడు, వంటి వస్తువులన్నీ ఏ ప్రదేశాల్లో, ఏవిధంగా, ఎవరిద్వారా, ఎవరివలన, ఎవరిని ఉద్దేశించి పుడుతున్నాయో అట్టి ప్రకృతి పురుషులందు కూడా నువ్వే అయి ఉన్నావు. కృష్ణా! కార్యము కారణం రెండూ నువ్వే. కుండలు చేసేందుకు మట్టి ఉపాదాన కారణం. సారె మొదలైన వన్నీ నిమిత్త కారణాలు. అట్లాగే ఈ ప్రపంచానికి ఉపాదాన కారణం, నిమిత్త కారణం కూడా నువ్వే.

అధోక్షజా! పరమాత్మా! అజుడా! ప్రతి వస్తువుకు ఉత్పత్తి, స్థితి వంటివి ఆరు కారణాలుంటాయి. కానీ నీకివేవీ లేవు. నీ సంకల్పం చేతనే నీ మాయా శక్తి ఈ ప్రపంచాన్నంతా సృష్టిస్తుంది. నీ జ్ఞాన శక్తి అందులో ప్రవేశించి, ప్రాణ రూపంతోను, జీవరూపంతోను పోషిస్తున్నావు. బాణంలో ఉండే శక్తి దాన్ని ప్రయోగించే పురుషునిదైనట్లు, ప్రపంచానికి కారణాలైన సమస్త వస్తువులకు అంతర్గతమైన శక్తివి నీవే. గాలివలన గడ్డి కదులుతున్నట్లు పరమేశ్వరుని శక్తి వలన ప్రణాది పదార్థాల చైతన్యం కనిపిస్తుందేగాని, వాటికి స్వతంత్ర శక్తి లేదు. జీవుల సంసారానికి కారణమైన ప్రకృతి లోని రూపాలన్నీ నీవే.

గాలికి	– ఓజస్సు, బలం, వేగం, గమనం
జలానికి	– జీవన శక్తి, రస స్వరూపం
దిక్కులకు	– తన్మాత్రమైన నాదము, ఓంకారము
ఇంద్రియాలకు	– అధిష్ఠాన దేవతల శక్తి
భూతాలకు	– కారణమైన తమసాహంకారం
ఇంద్రియాలకు	– కారణమైన రాజసాహంకారము

వైకల్పిక దేవతలకు – కారణమైన సాత్త్వికాహంకారము అన్నీ నీ రూపాలే.

దేవా! ప్రకృతిలో పుట్టిన వన్నీ నశించాల్సినవే. అవన్నీ నీ రూపాంతరాలే. అయినా నువ్వు శాశ్వితుడవు. ఎలాగంటావా? మట్టితో కుండ, బంగారంతో నగలు చేస్తారు. నగలను కరిగిస్తే అవి కనిపించకుండా పోతాయే గాని బంగారం నశించదు గదా? అట్లాగే నీ సంకల్పంచే నిర్మించిన ప్రపంచం, వస్తువులు కనిపించకుండా పోతాయే గాని నువ్వు మాత్రం శాశ్వతంగా ఉంటావు. నీ సంకల్పంచేత నిర్మించబడ్డ వస్తువులు మాత్రం ఎందుకు నశించాలి అంటే, అవన్నీ సత్త్వరజస్తమో గుణాలతో చెయ్యబడ్డాయి. కావున అవి మిథ్యా కల్పితాలు. మిథ్యాకల్పితాలకు శాశ్వతత్త్వం అసంభవం కదా!

దేవా! పరమార్థ దృష్టిలో చూసినట్లైతే నువ్వు నిర్వికల్పునిగానే ఉంటావు. కానీ గుణత్రయ ప్రభావం చేత నీకంటే వేరైన దేదో (ప్రపంచం) ఉన్నదనే భ్రమలో పడి రకరకాలైన కర్మలను చేస్తూ ఉంటారు. కర్మ ఫలాన్ని అనుభవించేందుకే జీవులు జనన మరణ చక్రంలో పడి కొట్టుకుపోతూ ఉంటారు.

దేవా! జన్మలన్నింట్లోకీ దుర్లభమైనది మానవజన్మ. అటువంటి జన్మను పొందికూడా ఆత్మార్థాన్ని తెలుసుకోకుండా జీవితమంతా వ్యర్థంగా గడిపేశాను. దేహాలన్నీ నాశనమయ్యేవే. అట్టి దేహమందు 'నేను' 'నావి' అనే భావాన్ని పెంచి పోషించాను. భార్య పిల్లల పట్ల మమకారంతో స్నేహ పాశంతోను బంధించబడ్డాను. అదంతా నీ మాయా ప్రభావమే. నువ్వు జన్మించినప్పుడే నీ తత్త్వాన్ని చెప్పావు.

నువ్వు నిజంగా జన్మలేనివాడవే అయినా, నీకు నువ్వుగా విధించుకున్న సదాచారాలను కాపాడేందుకే ప్రతి యుగంలోను జన్మించడం అనే లీల ప్రదర్శిస్తూ ఉంటావు. నువ్వు జన్మించకముందే నాకు దేవకీ దేవికి నీ తత్త్వాన్నంతా చెప్పావు. నీ విభూతి రూపమైన మాయ మమ్మల్ని కప్పేసింది" అన్నాడు.

శ్రీకృష్ణుడిలా అన్నాడు. "తండ్రీ! నీ పుత్రులమైన మాకు తత్త్వాన్ని చక్కగా బోధించావు. నువ్వు చెప్పినవన్నీ సత్యాలే. నేను, నా అన్న బలరాముడు, నా తల్లి దండ్రులైన మీరు, ఈ ద్వారకావాసులు, మరియు ఈ సృష్టి అంతా బ్రహ్మమే. ఆకాశం మొదలైన పంచభూతాలన్నీ నీళ్ళలో ప్రతిబింబాన్ని చూసుకున్నట్లుగా, పరబ్రహ్మము తనచే సృష్టించబడిన దేహాదులన్నీ అనేక రూపాల్లో కనిపిస్తున్నాయి. చావు పుట్టుకలు గాని, ఎక్కువ తక్కువలు గాని ఒకేరూపంతోనో అనేక రూపాల్లోనో భగవంతుని లీలలేనన్న పరమార్థ తత్త్వాన్ని తెలియజేస్తాయని గ్రహించాలి. ఈ రహస్యాన్ని తెలుసుకొని, భేదబుద్ధి లేకుండా ఉన్నవారికి అఖండమైన సంతోషం కలుగుతుంది" అన్నాడు.

శ్రీకృష్ణుని మాటలు విన్న దేవకీదేవి "రామా! కృష్ణా! మిమ్మల్ని బ్రహ్మాది సృష్టి కర్తలకు ప్రభువువని, పరమ పురుషుడవని భావిస్తున్నాను. లోకంలో ధర్మం అతిక్రమించిన రాజుల వల్ల భూమికిభారం పెరిగిపోతోంది. ఆ భారం తగ్గించేందుకే ఆది పురుషుడవైన మీరిద్దరూ నా గర్భాన జన్మించారని నువ్వే చెప్పావు. ఆది పురుషుని అంశగనే పురుషుడు ఏర్పడుతున్నాడు. అతడి అంశగా మాయ, మాయ అంశగా త్రిగుణాలు, త్రిగుణాల అంశతో ప్రపంచం సృష్టి అవుతున్నాయి. అట్టి పరమ పురుషులైన మిమ్మల్ని ఆశ్రయిస్తున్నాను.

తల్లులకు పిల్లలపైన మమకారం అధికంగా ఉంటుంది. ఎందరు బిడ్డలున్నా తల్లికి బరువుకాదు. నాకు మొదటగా పుట్టిన వారందర్నీ కంసుడు చంపాడు. వారిని తలచుకోని క్షణం లేదు. నువ్వు మీ గురువుగారికి ఎప్పుడో చనిపోయిన పుత్రుణ్ణి తెచ్చి గురుదక్షిణగా ఇచ్చావని విన్నాను. అప్పటి నుండి నేను కూడా నా చనిపోయిన పుత్రుల్ని చూపమని అడగాలనుకుంటున్నాను. అదిమీకు అసాధ్యం కాదు" అన్నది. తల్లి కోరిక విన్న రామకృష్ణులు యోగమాయను ఆశ్రయించి సుతలంలో ప్రవేశించారు. అక్కడ బలిచక్రవర్తి రామకృష్ణులను చూసి పరమానందభరితుడయ్యాడు. ఎదురేగి నమస్కరించి పూజించాడు. కాళ్ళు కడిగిన నీటిని తలపై చల్లుకొని ఇలా అన్నాడు. "మహాదేవుడైన అనంతునికి

నమస్కరిస్తున్నాను. సంఖ్యా శాస్త్రాన్ని విస్తరించిన వాడును, సర్వాంతర్యామియు, బ్రహ్మ స్వరూపుడునూ అయిన శ్రీకృష్ణ భగవానునికి నమస్కరిస్తున్నాను.

దేవా! ప్రాణులకు నీ దర్శనం దుర్లభం. వైరభావంతో శిశుపాలుని వంటివారు, భక్తి భావంతో గోపికలవంటి వారు నీ సాన్నిధ్యాన్ని పొందారు. బ్రహ్మాది యోగేశ్వరులు కూడా నీ తత్త్వాన్ని తెలుసుకోలేరు. దానవుడనైన నేనెట్లు నిన్ను తెలుసుకోగలను?

దేవా! సంసార సుఖాలపై విసుగుపుట్టింది. కోరికలున్నంతకాలం నీ దర్శనం లభించదు. కాబట్టి అడవుల్లో ఓ చెట్టు క్రింద ఉంటూ కందమూలాదులు తింటూ నిన్ను ధ్యానించే భాగ్యం కలిగించు. మానవులు నీ ఆజ్ఞలు శ్రద్ధతో పాటించి ముక్తులవుతున్నారు. అటువంటి నడవడిక ఏం చేస్తే లభిస్తుందో, అది ఎలా ఆచరించాలో నాకు ఉపదేశించు" అన్నాడు.

బలిచక్రవర్తి మాటలకు శ్రీకృష్ణుడు "రాక్షసరాజా! స్వాయంభువ మన్వంతరంలో మరీచికి ఊర్ణయందు ఆరుగురు పుత్రులు కలిగారు. బ్రహ్మ తన పుత్రిక అయిన సరస్వతీ దేవితో సంభోగించినందుకు వారంతా నిరసించారు. తండ్రిని నిరసించిన పాపానికి హిరణ్యకశిపుని పుత్రులుగా జన్మించారు. ఆ తర్వాత వారే దేవకీదేవి గర్భాన జన్మించి కంసుని చేత చంపబడ్డారు. దేవకీ దేవి వారిని తన పుత్రులుగా భావించి వారికై శోకిస్తోంది. కావున వారిని నా వెంట తీసుకొని పోవడానికి వచ్చాను. స్మతుడు, ఉద్గీథుడు, పరిష్వంగుడు, పతంగుడు, క్షుద్రభుత్తు, గృహణీయుడు అను ఈ ఆరుగురు మా అనుగ్రహం చేత శాపవిముక్తులై దేవలోకానికి వెళ్తారు" అన్నాడు. అంతట రామకృష్ణులు ఆ బాలురు ఆరుగురినీ ద్వారకకు తీసుకొని పోయారు. బాలురను చూడగానే దేవకిలో మాతృప్రేమ పెల్లుబికి స్తనములనుండి పాలుకారాయి. అంతట ఆమె వారందర్నీ కౌగలించుకొని ముద్దాడింది.

భగవానుని యోగమాయ చేత మోహిత అయిన దేవకి ఆ పిల్లలందరికీ స్తన్యమిచ్చింది. శ్రీకృష్ణుడు త్రాగగా మిగిలినవి వారు త్రాగటం చేత, అనగా శ్రీమన్నారాయణుని స్పర్శ వలన, వారంతా వారి వారి నిజరూపాల్ని పొంది దేవలోకానికి వెళ్ళారు.

పూజ్యురాలైన దేవకీదేవి చనిపోయిన తన పుత్రులు జీవించి రావడం, తిరిగి వారంతా దేవలోకానికి వెళ్ళడం శ్రీకృష్ణుని యోగమాయయేనని తెలుసుకుంది. ఎందువల్లనంటే భగవానుని శక్తి అనంతం. అట్టి భగవానుని లీలలు కూడా అనంతమే. అట్టి శక్తిమంతుని ఆశ్రయించడం కంటే మేలైనదేముంటుంది?

సుభద్రా పరిణయం

(ఈ భాగం శ్రీభాగవతం దశమస్కంధం 86వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

అర్జునుడు త్రిదండాన్ని చేతబుచ్చుకొని సన్యాసవేషాన్ని ధరించి తీర్థయాత్ర చేస్తూ ప్రభాసతీర్థాన్ని చేరుకున్నాడు. బలరాముడు సుభద్రను దుర్యోధనునికిచ్చి వివాహం చెయ్యాలని, అందుకు శ్రీకృష్ణుడు సుముఖంగా లేడని తెలుసుకున్నాడు. అర్జునుడు సన్యాసి రూపంలోనే ద్వారకలో ప్రవేశించి సుభద్ర అభిప్రాయమేమిటో తెలుసుకోవాలని ద్వారకానగరంలో అడుగుపెట్టాడు. బలరామాదులు ఎదురువెళ్ళి ఆ కపట సన్యాసిని పూర్ణకుంభంతో ఆహ్వానించి అంతఃపురానికి తీసుకొని వెళ్ళారు. ఆ యతీశ్వరునికి కావలసిన సౌకర్యాలన్నీ కల్పించారు. ఆయనకు సపర్యలు చేసేందుకు సుభద్రను నియమించారు. దాంతో అర్జునునికి సుభద్ర మనసులో మాట తెలుసుకునే అవకాశం కలిగింది. సుభద్ర మనస్సులో తానే ఉన్నట్లు అర్జునుడు గ్రహించాడు. దాంతో వాళ్ళిద్దరూ అన్యోన్యంగా మెలిగే అవకాశం కలిగించినట్లైంది. ఇది ఇట్లా ఉండగా ఒకరోజున రైవత పర్వతంపైన దేవాలయంలో రథోత్సవ వేడుకల్ని చూసేందుకు నగరవాసులంతా తరలి వెళ్ళారు. ఆ సమయంలో శ్రీకృష్ణ వసుదేవుల అనుమతి పొందిన అర్జునుడు సుభద్ర రథాన్ని దారి మళ్ళించి ఖాండవప్రస్థ పురానికి తీసుకొని వెళ్ళాడు. విషయం తెలుసుకున్న బలరాముడు ఉగ్రుడయ్యాడు. అర్జునుని చంపి సుభద్రను ఇంటికి తీసుకొని రావాలని బయలుదేరాడు. కానీ శ్రీకృష్ణ వసుదేవులు అతణ్ణి శాంతపరచి సుభద్ర ఇష్టం మేరకే అర్జునుడిట్లా చేశాడని నచ్చజెప్పారు. దాంతో బలరాముడు శాంతించి దగ్గరుండి వారిద్దరి వివాహం జరిపించాడు.

బహుళాశ్వ - శ్రుతదేవుల వృత్తాంతం

(ఈ భాగం శ్రీభాగవతం దశమస్కంధం 86వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

పూర్వం మిథిలా నగరాన్ని బహుళాశ్వుడనే రాజు పాలించేవాడు. అతడు కృష్ణ భక్తుడు. ఆనగరంలోనే శ్రుతదేవుడనే బీద బ్రాహ్మణుడు నివసించేవాడు. అతడు విద్వాంసుడు, శాంత స్వభావం గలవాడు. అనాయాసంగా లభించిన ఆహారంతోనే కుటుంబపోషణ చేసుకుంటూ కాలం గడిపేవాడు. అతడు కూడా గొప్ప కృష్ణ భక్తుడు.

శ్రీకృష్ణుడు వారిపట్ల ప్రసన్నుడయ్యాడు. ఒకరోజున మునులందర్నీ వెంటబెట్టుకొని మిథిలా నగరానికి వెళ్ళాడు. అప్పుడు శ్రీకృష్ణునితో పాటు నేను (శుకమహర్షి), నారదుడు, అత్రి, వాసుదేవుడు, భార్గవుడు, అసితుడు, అరుణి, బృహస్పతి, కణ్వుడు, మైత్రేయుడు, చ్యవనుడు మొదలైన వారంతా ఉన్నాం. మిథిలానగరం చేరుకోగానే బహుళాశ్వుడు, శ్రుతదేవుడు భక్తి ప్రపత్తులతో శ్రీకృష్ణునికి నమస్కరించి తమ ఆతిథ్యం స్వీకరించమని ప్రార్థించారు. భగవానుడు వారి ప్రార్థనను మన్నించాడు. శ్రీకృష్ణుడు తను కూడా ఉన్న మహర్షులందర్నీ వెంట బెట్టుకొని ఇద్దరి ఇళ్ళకు ఒకే సమయాన వెళ్ళాడు.

భగవానుడే స్వయంగా తన ఇంటికి వచ్చాడని బహుళాశ్వుడు చాలా సంతోషించాడు. భక్తిశ్రద్ధలతో యథావిధిగా పూజించి ఇలా అన్నాడు. "దేవా! నువ్వు ప్రాణులన్నింటికీ చైతన్యం కలిగించేవాడవు, ప్రకాశ స్వరూపుడవు. నేను ప్రతిరోజు నీ పాదపద్మాలను పూజించడం చేతనే ఈరోజు నాకు నీ దర్శన భాగ్యం కలిగింది. దేవా! లక్ష్మీదేవి కన్నా, బంధువులకన్నా ఏకాంత భక్తులంటేనే నీకు ఎక్కువ ప్రేమ అని చెప్పావు. నువ్వీరోజున అది యథార్థమని రుజువు చేశావు. సంసార తాపంలో చిక్కుకున్న నాబోటి వాళ్ళందర్నీ ఆ తాపం నుండి తప్పించేందుకే యదువంశంలో అవతరించావు. నీకు రాజుపేద అన్న భేదాలుండవు. అందుకు నీచుట్టూ కౌపీనధారులైన ఈ మునీశ్వరులే సాక్ష్యం. అట్టినీకు నమస్కరిస్తున్నాను. ఈ మహాత్ములందరితో నా ఇంట కొన్నాళ్ళుండి నా వంశాన్ని పావనం చెయ్యుదని ప్రార్థించాడు. మిథిలాధిపతి ప్రార్థనను అంగీకరించిన భగవానుడు కొన్నాళ్ళపాటు అతడి అంతఃపురంలోనే నివశంచాడు. అక్కడ శ్రుతదేవుడు కూడా శ్రీకృష్ణునికి పాదపూజ చేసి కాళ్ళు కడిగి నెత్తిన జల్లుకున్నాడు. భగవానుడికి నేరేడు పండ్లు, వట్టివేరు నీరు, తులసి, కలువలు వంటి సాత్త్వికాహారంతో విందు చేశాడు. భగవానుడితో పాటు మునులంతా కూడా సుఖంగా కూర్చుని ఆహారాన్ని ప్రీతితో ఆరగించారు. శ్రుతదేవుడు భార్యా సమేతంగా భగవానుడి పాదాలొత్తుతూ సేవించుకున్నాడు. భగవంతునితో శ్రుతదేవుడు "దేవా! నువ్వు ఏనాడైతే నీ మాయా శక్తిచేత ఈ జగత్తును సృష్టించావో ఆనాడే నువ్వు మావాడి వయ్యావు. కానీ నేను మాత్రం నిన్ను ఈరోజే సేవించుకుంటున్నాను. మానవుడు స్వప్నంలో అనేక విషయాల్ని దర్శిస్తాడు. అట్లాగే మేము కూడా నిన్ను అదేవిధంగా దర్శిస్తున్నాం. దేవా! నీగురించి నిత్యమూ శ్రవణం, కీర్తనం, దర్శనం, వందనం చేసేవారి హృదయంలో నువ్వు నివసిస్తున్నా కూడా వారు నిన్ను దర్శించలేరు. నువ్వు ఎక్కడో దూరాన ఉన్నావనుకుంటారు. కర్మలన్నింటికీ నువ్వే కర్తవు, భోక్తవనుకునే వారికి మాత్రం ప్రక్కనే ఉంటావు. దేవా! మా క్లేశాలన్నీ నీ దర్శనం లభించేంతవరకే. నీ దర్శనం కాగానే అవన్నీ పటా పంచలైపోతాయి. అట్టి నీకు నమస్కరిస్తున్నాము" అన్నాడు.

శ్రుతదేవుని ప్రార్థన విన్న శ్రీకృష్ణుడు "విప్రోత్తమా! బ్రాహ్మణులకన్నా నాకు ఈ చతుర్భుజ రూపం ప్రియమైంది కాదు. ఎందువల్లనంటే బ్రాహ్మణుడు వేదమయుడు. నేనూ వేద స్వరూపుడనే. కావున నేను బ్రాహ్మణ రూపంలో ఉన్న గురువును. ఈ రహస్యం తెలియని వారు బ్రాహ్మణుల యెడల ద్వేషభావం వహిస్తారు. అనగా నాపైన ఈర్ష్య పడటమేనన్నమాట. మహత్తత్త్వాలన్నీ నా రూపాలేనని విశ్వసించి ఎవరైతే సమదర్శియై జీవిస్తాడో అతడే నిజమైన బ్రాహ్మణుడు. ఈ బ్రహ్మర్షులంతా అటువంటి బ్రాహ్మణులే. వీరిని నిత్యం పూజించి ఆరాధించితే నన్ను ఆరాధించినట్లే" అని చెప్పి ఇరువురు ఏకాంత భక్తుల ఇళ్ళల్లోను ఒకే సమయంలో సంతృప్తుల్ని చేసి వారికి వేదమార్గాన్ని ఉపదేశించి ద్వారకకు వెళ్ళాడు.

శివకేశవులు

(ఈ భాగం శ్రీభాగవతం దశమ స్కంధం 88వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

పరీక్షిన్మహారాజు శుకమునీంద్రునితో "మునీంద్రా! విష్ణుమూర్తి లక్ష్మీదేవికి భర్త అయిఉండి కూడా ఆయన భక్తులంతా దరిద్రులై కష్టాలు పడుతూ ఉంటారు. మరి శివభగవానుడేమో స్వయంగా ఇల్లూ వాకిలీ లేనివాడు, భిక్షాటన చేస్తూ జీవించేవాడు అయినా కూడా ఆయన భక్తులంతా భోగభాగ్యాలనుభవిస్తున్నారు. ఈ విరుద్ధ స్వభావాలకు కారణమేమిటి?" అని అడిగాడు.

అందుకు శ్రీశుక మహర్షి "పరీక్షిన్మహారాజా! శివుడు ఎప్పుడూ మాయతోను, మాయాజనితమైన త్రిగుణాత్మక అహంకారంతో కలసి ఉంటాడు. అట్టి అహంకారం నుండి పంచేంద్రియాలు, పంచభూతాలు, మనస్సు పుట్టాయి. స్త్రీసంబంధమైనవి, జిహ్వకు సంబంధించినవి, మానసిక సంబంధమైన సుఖాల్ని కోరుకునే శివభగవానుని ఆరాధించి వారి కోరికల్ని తీర్చుకుంటారు. కానీ శ్రీహరి ప్రకృతికి అతీతుడు. గుణాతీతుడు. పురుషోత్తముడు. కావున శ్రీహరిని ఆశ్రయించేవారు కూడా గుణాతీతులే. శివుడు అంటే పరమశుభమని అర్థం. అట్లాగే విష్ణువు అంటే సర్వవ్యాపకుడు అని అర్థం. కావున శుభాలను ఆశించే శివభక్తులు విషయసుఖాల్ని పొందుతున్నారు. ముక్తిని కోరే విష్ణుభక్తులు సర్వవ్యాపకానిలో అంతర్లీనమవుతున్నారు.

పరీక్షిన్మహారాజా! అశ్వమేధయాగంచేసే సందర్భంలో నీ తాతగారైన ధర్మరాజు కూడా ఇదే ప్రశ్న అడిగాడు. అప్పుడు శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానాన్నే నీకు యథాతథంగా చెప్తాను. విను.

శ్రీకృష్ణుడు : ధర్మరాజా! నేను అనుగ్రహం చూపాలనుకున్న భక్తుని సర్వ సంపదలు హరిస్తాను. ఒకవేళ ఆ భక్తుడు బంధువుల బలవంతం చేత ధనం సంపాదన వైపు మొగ్గు చూపితే అతడి ప్రయత్నాలన్నీ భగ్నంచేస్తాను. అందువల్ల బంధువులంతా అతడు ధనహీనుడని వదిలేస్తారు. అప్పుడతడు నాకృపచేత నా భక్తులతో స్నేహం చేస్తూ, సత్యము, చిన్మయము, అనంతము అయిన బ్రహ్మ వస్తువును తన ఆత్మరూపంగానే తెలుసుకుంటాడు. ముక్తుడై వైకుంఠాన్ని చేరుకుంటాడు. అనగా సంసార బంధాల నుండి పూర్తిగా విముక్తుడవుతాడు. ఎవరు విషయసుఖాలపై ఆసక్తి కలిగి ఉంటారో అట్టివారు నా అనుగ్రహాన్ని పొందలేరు. అందువల్లనే ఇతరదేవతల్ని ఆశ్రయిస్తూ ఉంటారు. వాళ్ళంతా ఆయా దేవతల అనుగ్రహం పొంది రాజ్యము సంపదలు పొంది గర్వపోతులై సాధువుల్ని, బ్రాహ్మణుల్ని, అవమానిస్తూ ఉంటారు" అన్నాడు.

అంతట శుకమహర్షి పరీక్షిన్మహారాజుతో "రాజా! బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ముగ్గురూ వరాలివ్వడానికి, శాపాలివ్వడానికీ సమర్థులే. అయితే బ్రహ్మ శివుడు మాత్రం అల్ప సంతోషులు కావడం వలన భక్తుల్ని ఎటువంటి పరీక్షలకు లోనుకాకుండా అడిగిన వరాలిచ్చి పంపుతూ ఉంటారు. కానీ శ్రీహరి అట్లాకాదు.

రాజా! వృకాసురుడనే రాక్షసుడొకడు నారదుని కలుసుకోవడం జరిగింది. అప్పుడా దానవుడు "మునీంద్రా! బ్రహ్మాది దేవతల్లో ఎవరిని గూర్చి తపస్సు చేస్తే త్వరగా సంతుష్టులవుతారో చెప్పమ"ని

ప్రార్థించాడు. అందుకు నారదుడు "వృకాసురా! ఆ ముగ్గురి దేవతల్లో శివుణ్ణి గూర్చి ఆరాధిస్తే నిన్ను త్వరగా అనుగ్రహించి వరాలిస్తాడు. పూర్వం రావణాసురుడు శివుని అనుగ్రహం చేత కైలాసాన్నే పెళ్ళగించాడు. అట్లాగే బాణాసురుడు శివుని అనుగ్రహం పొంది కైలాసానికే అధిపతి అయ్యాడు" అన్నాడు. నారదుని మాటలు విని పరమ సంతుష్టుడైన వృకాసురుడు కేదార క్షేత్రానికిపోయి శివుణ్ణి గూర్చి ఘోరంగా తపస్సు చేశాడు. చివరకు ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డాడు. అప్పుడు శివ భగవానుడు ప్రత్యక్షమై "వృకాసురా! నీ తపస్సుకు మెచ్చాను. ప్రాణత్యాగం చేసుకోవద్దు. నీకేం వరం కావాలో కోరుకో" అన్నాడు. అంతట ఆ వృకాసురుడు శివుని పాదాలపై పడి నమస్కరించి "దేవా! నాకు ప్రాణుల్ని హింసించడం సుతరామూ ఇష్టం ఉండదు. నేను ఎవరి నెత్తిన చెయ్యిపెడితే వారు కాలి బూడిదైపోవా" లని వరం కోరాడు. అతడి కోరిక విన్న పరమ శివుడు లోపల ఇష్టం లేకపోయినా "అట్లే అగుగాక" అన్నాడు. ఆవిధంగా పరమశివుడు వరాన్ని అనుగ్రహించగానే, వృకాసురుడు ఆ వరాన్ని పరీక్షించి చూడాలన్నాడు. శివుడి నెత్తినే చెయ్యి పెట్టబోయాడు. వృకాసురుని దురాలోచన పసిగట్టిన శివుడు భయంతో పారిపోగా వృకాసురుడు వెంటబడ్డాడు. బ్రహ్మాది దేవతలంతా శివుని కాపాడేందుకు అశక్తులయ్యారు. చివరగా పరమశివుడు వైకుంఠానికిపోయి శ్రీహరిని శరణుకోరాడు. శ్రీహరి శివునికి ఎదురువెళ్ళి సాదరంగా ఆహ్వానించి ప్రక్కనే కూర్చోబెట్టుకొని కుశల ప్రశ్నలు అడిగాడు. శివుని దురవస్థ తెలుసుకున్న శ్రీహరి వెంటనే బ్రహ్మచారి వేషాన్ని ధరించాడు. జింకచర్మం, దండము, అక్షమాల ధరించి చేతిలో దర్భలు పట్టుకొని వృకాసురునికి ఎదురు వెళ్ళి అతడి శిష్యునివలె వినయంగా వంగి నమస్కరించాడు.

శ్రీహరి వృకాసురునితో "శకుని నందనా! వృకాసురా! నువ్వు బాగా అలసిపోయావు. నువ్వే పనిమీద ఇంత దూరం వచ్చావు? ముందు కొద్దిగా విశ్రాంతి తీసుకో. ఎందువల్లనంటే పురుషుల శరీరం చాలా విలువైనది. కనుక దానిని అన్నివిధాలా రక్షించుకోవాలి. నువ్వేం పనిమీద వచ్చావో వినదగినదైతే చెప్పు. నాకు చేతనయిన సహాయం చేస్తాను. లోకంలో బుద్ధిమంతులు ఇతరుల నుండి సహాయం పొందుతూ తమ పనులు చక్కబెట్టుకుంటారు" అన్నాడు.

శ్రీహరి మధురమైన మాటలకు నటనకు లొంగిపోయి వృకాసురుడు కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాడు. ఆ తర్వాత తన వృత్తాంతమంతా చెప్పాడు. అప్పుడు శ్రీహరి "దానవేశ్వరా! దక్షుని శాపం చేత శివుడు, ప్రేత, పిశాచాలకు ఆధిపత్యం వహిస్తున్నాడు. అతడికి వరాలిచ్చే శక్తి ఉన్నదని నేనను కోవడం లేదు. నువ్వు అతడి మాటలు నమ్మవద్దు. ఇప్పుడే నీ తలపై చెయ్యిపెట్టుకొని చూడు. నీకేమీ కాదు. శివుడిచ్చిన వరం వ్యర్థమైనదని నువ్వే తెలుసుకుంటావు. అతడి వరం అసత్యమని తేలితే ముల్లోకాల్లో అతడు ఎక్కడున్నా వెతికి పట్టుకొని నాశనం చెయ్యాల్సిందే" అన్నాడు.

శ్రీహరి మధురమైన మాటలు వృకాసురుడికి నచ్చాయి. మోహవశుడై వృకాసురుడు తనచేతిని తలపై పెట్టుకోగానే బూడిదైపోయాడు. వృకాసురుడి మరణంతో దేవతలంతా హర్షధ్వానాలు చేశారు.

శ్రీహరి పరమశివుని ప్రక్కన కూర్చోబెట్టుకొని ఆప్యాయంగా "జగద్గురూ! మహాదేవా! శంకరా! దుర్మార్గుడైన ఈ రాక్షసుడు తను చేసుకున్న పాపఫలంచేతనే కాలిబూడిదయ్యాడు. ఈశ్వరా! మహాత్ములకు కీడు తలపెట్టిన వాడెవ్వడూ బ్రతికి బయట పడడు. శుభాల్ని పొందడు" అని పరమశివుని కైలాసానికి సాగనంపాడు.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు

(ఈ భాగం శ్రీభాగవతం దశమస్కంధం 89వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

పూర్వం ఒకప్పుడు సరస్వతీ నదీ తీరాన మహర్షులంతా కలసి సత్రయాగాన్ని చేశారు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో సర్వ శ్రేష్ఠుడెవరన్న మీమాంస తలెత్తింది. ఆ విషయాన్ని తెలుసుకొని తమకు తెలుపవలసిందని భృగుమహర్షిని కోరారు.

అంతట భృగుమహర్షి ముందుగా బ్రహ్మలోకానికి వెళ్ళాడు. వెళ్ళినవాడు వెళ్ళినట్లుగానే బ్రహ్మను స్తుతించనైనా స్తుతించకుండా తిరిగి వచ్చేశాడు. అక్కడ నుండి కైలాసానికి వెళ్ళాడు. పరమశివుడు భృగుమహర్షిని ఆదరంగా ఆహ్వానించినా "నువ్వు వేదనిందకుడవు. అందువల్ల నన్ను తాకవద్దు" అని దూరంగా తప్పుకొని వెళ్ళిపోయాడు. పరమశివుడు తనకు జరిగిన అవమానానికి క్రుద్ధుడై శూలంతో భృగుమహర్షిని పొడిచి చంపబోయాడు. పార్వతీ దేవి అడ్డు పోయి భృగుమహర్షి ప్రాణాల్ని కాపాడింది. మహర్షి అక్కడనుండి వైకుంఠానికి వెళ్ళాడు. అక్కడ శ్రీహరి లక్ష్మీదేవి ఒళ్ళో తలపెట్టుకొని పడుకున్నాడు. "భృగుమహర్షి కోపంతో శ్రీహరి వక్షఃస్థలంలో కాలితో తన్నాడు. ఆ దెబ్బతో శ్రీహరి చివాలున లేచి నిలబడి మహర్షి పాదాలకు నమస్కరించాడు. మహాత్మా! నేను లక్ష్మీదేవితో ఏకాంతాన ఉండటం చేత మీరాక తెలుసుకోలేకపోయాను. ఎన్నో పుణ్యతీర్థాలు సేవించిన తమ పాదాలతో నా వక్షఃస్థలాన్ని తాకారు. నేను పవిత్రుడనయ్యాను. మీరాక వలన వైకుంఠం పావనమైంది అన్నాడు.

భగవానుని మాటలు మహర్షి చెవులకు అమృతంలా సోకాయి. పరమానందం చెందాడు. భృగువు కన్నుల నిండా ఆనందబాష్పాలు నిండగా భక్తి భావంతో మౌనంగా నిలబడ్డాడు. పిమ్మట భగవానుని అనుజ్ఞపొంది తిరిగి యజ్ఞశాలకు పోయి మహర్షులలో తన అనుభవాల్ని వివరించి చెప్పాడు.

మునులంతా భృగువు చెప్పినదంతా విన్నారు. శాంతి, అభయము, ధర్మము, జ్ఞానము, వైరాగ్యము అణిమాది అష్టైశ్వర్యాలు, యశస్సు, రాగద్వేషశూన్యుడు, సమబుద్ధి కలిగిన వాడు, శాంతచిత్తుడు అయిన శ్రీహరి భగవానుడే ముగ్గురులోకి శ్రేష్ఠుడని తీర్మానించుకున్నారు.

మరణించిన బ్రాహ్మణ బాలురు తిరిగి వచ్చుట

ఒకప్పుడు ద్వారకలో ఒక బ్రహ్మణ దంపతులకు పుట్టిన బిడ్డలంతా మరణిస్తూ ఉండేవారు. ఆనాడు చనిపోయిన బాలుడి శవాన్ని భుజాన వేసుకొని కోట గుమ్మం దగ్గరకు తీసుకొని పోయి బిగ్గరగా ఇట్లా అరిచారు. "రాజు ధర్మపరుడైతే రాజ్యమంతా సుఖంగా ఉంటుంది. రాజే కనుక పిసినారి, బ్రాహ్మణ ద్వేషి అయితే రాజు యొక్క దోషం ప్రజలకు పట్టుకొంటుంది. అటువంటి దోషం రాజు యందు ఉండటం చేతనే నా బిడ్డలందరూ పుట్టగానే చనిపోతున్నారు. ఈ బాలుడు తొమ్మిదవవాడు" అంటూ విలపించాడు. అంతఃపురంలో ఉన్న అర్జునుడీ మాటలు విన్నాడు. గాండీవాన్ని చేతపట్టుకొని బ్రాహ్మనుని కెదురుగా నిలబడి "నన్ను అర్జునుడంటారు. నేను సంకర్షణుడు, అనిరుద్ధుడు, కృష్ణునికన్నా గూడా సమర్థుణ్ణి. నేను సదాశివుణ్ణి మెప్పించి అనేక అస్త్రాల్ని సంపాదించాను. నీ

పుత్రుడు ఏలోకాన ఉన్నా తీసుకొని వస్తాను. నా మాట నమ్ము" అన్నాడు. అందుకా బ్రాహ్మణుడు అర్జునుని మాటలకు సంతృప్తి చెంది ఇంటికి పోయాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకు ఆ బ్రాహ్మణుడు వచ్చి అర్జునునితో "అర్జునా! మృత్యువు నుండి నా సంతానాన్ని కాపాడు" అని ప్రార్థించాడు. అంతట అర్జునుడు గాండీవాన్ని తీసుకొని, పరమేశ్వరునికి నమస్కరించి బ్రాహ్మణుని ఇంటికి పోయి ఇంటిచుట్టూ బాణములతో కప్పివేసి తానూ ఆ ఇంటి చుట్టూ కాపలా ఉన్నాడు. అయినా ఆ బ్రాహ్మణుని భార్య ప్రసవించి, ఆ శిశువు ఆకాశమార్గాన పోయి మాయమైంది. అప్పుడా బ్రాహ్మణుడు అర్జునునితో "ఆహా! అర్జునుని ప్రగల్భాలకు అంతులేదు. బలరామకృష్ణులు, అనిరుద్ధ ప్రద్యుమ్నుల వల్ల కానిది ఈ నపుంసకుని వల్ల అవుతుందని నమ్మి మోసపోయాను. నా సంతానాన్ని కాపాడుతానని మాట ఇచ్చి తప్పాడు. వీడి గాండీవం పనికి రాకుండా పోయింది" అన్నాడు. బ్రాహ్మణుని పలుకులు అర్జునునికి ములుకుల్లా గుచ్చుకున్నాయి. తన విద్యాబలం చేత యమపురికి పోయి వెదికాడు. ఎక్కడా కనిపించలేదు. ఇంద్ర, అగ్ని, సోమ, నర్ఋతి, వరుణ, వాయు, పాతాళ, స్వర్గలోకాలన్నీ గాలించాడు. కానీ ఆ మృతబాలుడి జాడ తెలుసుకోలేక పోయాడు. అభయమిచ్చి నిలబెట్టుకోలేక పోయానే అని అర్జునుడు పశ్చాత్తాపంతో అగ్ని ప్రవేశానికి సిద్ధపడ్డాడు. అప్పుడు శ్రీకృష్ణుడు "అర్జునా! ప్రాణత్యాగం చెయ్యకు. ఆ బాలుడుండే చోటు నేను చూపుతాను. నిన్ను నిందించిన వారంతా నిన్ను నెత్తిన పెట్టుకునేట్లు చేస్తాను. నాతోరా" అని ఊరడించాడు.

అర్జునుని తన రథంలో కూర్చోబెట్టుకొని సప్తద్వీపాలు, అనేక పర్వతాలు దాటి కన్ను పొడుచుకున్నా కనిపించని గాడాంధకారంలోకి ప్రవేశించారు. ఆ చీకట్లో గుర్రాలు పరుగెత్తలేక పోతున్నాయి. అప్పుడు శ్రీకృష్ణుడు తన చక్రాయుధాన్ని రథానికి ముందు నడిపించాడు. ఆ సుదర్శన చక్రకాంతిలో రథం ముందుకు సాగిపోయింది. కొంత దూరం పోయిన తర్వాత ప్రచండ వేగంతో కూడిన జలప్రవాహాన్ని దాటారు. ఆ తర్వాత మహామణులు దారిపొడుగునా రాసులుగా పోసి ఉన్నాయి. వాటి కాంతిలో ఒక పురాన్ని చేరుకున్నారు. ఆ పురంలో ఆదిశేషువు మహాపర్వంలాగా పడి ఉండటం చూశారు. ఆదిశేషునికి పడగల నిండా రెండువేల మణులున్నాయి. కంఠం ఓ పెద్ద నీలమణిలా ప్రకాశించింది. అట్టి ఆదిశేషువుపైన ఓ పురుషుడు పడుకొని ఉన్నాడు. ఆయన శరీరం నీలిమేఘచ్ఛాయ కలిగిఉంది. పట్టుపీతాంబరాలు ధరించాడు. అతడి కిరీటం మణిమాణిక్యాలతో మెరిసిపోతోంది. కుండలాలు, ఇంకా ఎన్నో దివ్యాభరణాలు అలంకరించుకున్నాడు. ఎనిమిది చేతుల్లోనూ ఎనిమిది రకాల ఆయుధాల్ని ధరించాడు. నగుమోముతో ఉండే ఆ మూర్తి ముఖంలో దయారసం ఉట్టి పడ్తోంది. ఆయన చుట్టూ పార్షదులున్నారు. శ్రీదేవి, పుష్టి, మాయ, సమృద్ధి మొదలైన వారంతా ఆయనకు సేవలు చేస్తున్నారు.

"కృష్ణార్జునులారా! నేను మీ ఇద్దర్నీ ఇక్కడకు రప్పించేందుకే బ్రాహ్మణ బాలుణ్ణి ఇక్కడకు తెచ్చాను. భూలోకంలో ధర్మ రక్షణ కోసం నా అంశతో మీరిద్దరూ మానవ రూపంలో జన్మించారు. అధర్మ పరులైన రాజులందర్నీ సంహరించి భూభారాన్ని తగ్గించి తిరిగి వచ్చి నాలో కలసిపోండి. మీరిద్దరూ నరనారాయణులన్న పేర్లతో మెలగండి. పూర్ణకాములైన మీకు కావలసిందంతా నానుండి

పొందుతారు. మీకెప్పుడేది కావాలన్నా మీకు అన్నీ సమకూరుస్తాను. ధర్మాన్ని ఆచరించండి. లోకరక్షణ చెయ్యండి" అన్నాడు.

అర్జునునికి శ్రీకృష్ణుని ప్రభావమేమిటో పూర్తిగా అర్థమైంది. జీవులందరి పౌరుషం శ్రీకృష్ణుని అనుగ్రహమేనని తెలుసుకున్నాడు. ఆయన కృపలేనినాడు గడ్డి పరకనైనా కదల్చలేడన్న సత్యాన్ని గ్రహించాడు.

శ్రీకృష్ణుడు ద్రౌపదిని కాపాడటం

(ఈ భాగం మహాభారతం సభాపర్వం నుండి గ్రహించబడింది.)

రాజసూయ యాగంలో శిశుపాలవధ జరిగింది. అక్కడనుండి ద్వారకకు వచ్చిన శ్రీకృష్ణుడు దంతవక్త్రుడు, సాల్వుడు మొదలైన వాళ్ళందర్నీ హతమార్చాడు. రాజసూయానికి వచ్చిన దుర్యోధనుడు మయునిచే నిర్మించబడిన మయసభను చూసి విస్తుపోయాడు. ఇంతగొప్ప సంపద పాండవులకు దక్కిందే అని అసూయ పడుతూ ఉండగానే మయసభలో కాలుజారి పడ్డాడు. భంగపడిన తన్ను చూసి నకుల సహదేవులు ద్రౌపది పకపకా నవ్వారు. నిజానికి వాళ్ళు అట్లా నవ్వే వారు కాదు. శ్రీకృష్ణ పరమాత్మ ఈ సంఘటననే మహాభారత యుద్ధానికి నాందిగా తీసుకోవాలనుకున్నాడు. అందువల్లనే తన మాయా శక్తిని ప్రేరేపించి వారు నవ్వేట్లు చేశాడు. అదే సమయంలో దుర్యోధనుని హృదయంలో అసూయ, ద్వేషాలు కలిగించి మహాభారత యుద్ధానికి బీజాలునాటాడు.

అవమాన భారంతో దుర్యోధనుడు హస్తినాపురానికి చేరుకున్నాడు. తనకు పట్టిన దురవస్థను మేనమామ శకుని వద్ద చెప్పుకొని దుఃఖించాడు. శకుని మేనల్లుణ్ణి ఓదారుస్తూ "పాండవుల్ని జూదక్రీడకు ఆహ్వానించు ఆ తర్వాత కథ నేను నడిపిస్తానని" దుర్యోధనుని ఓదార్చాడు. దుర్యోధనుడు తండ్రి వద్దకు పోయి పాండవుల్ని జూదక్రీడకు ఆహ్వానించమని కోరాడు. ధృతరాష్ట్రుడు, విదురుడు, జ్ఞాతుల మధ్య జూదక్రీడ అనర్థాల్ని తెచ్చి పెడుతుందని అనేక విధాలుగా చెప్పి చూశారు. దుర్యోధనుడు తన పట్టు విడువకపోగా, తండ్రి తన కోరిక తీర్చకపోతే అగ్ని ప్రవేశం చేస్తానని బెదిరించాడు. ధృతరాష్ట్రుడు విధిలేక జూదక్రీడకు అంగీకరించి, విదురుణ్ణే స్వయంగా పోయి ఆహ్వానించి తీసుకొని రమ్మని పంపాడు. విదురుడు ఇంద్రప్రస్థానికి పోయి ధృతరాష్ట్రుని ఆహ్వానాన్ని ధర్మరాజుకు తెలిపాడు. ధర్మరాజు ధర్మవేత్తయే అయినా జూదక్రీడకు రానని చెప్పలేదు. పెదతండ్రి ఆహ్వానానికి తన అంగీకారాన్ని తెలిపి విదురుణ్ణి సాగనంపాడు. జూదానికి సమయం, కాలం నిర్ణయమైంది. ధర్మరాజు, సోదరులు, ద్రౌపదిని వెంటబెట్టుకొని హస్తినాపురానికి వెళ్ళారు. జూదానికి కావలసిన ఏర్పాట్లన్నీ సిద్ధం చేశారు.

జూదమాడటం అధర్మమని, దానివలన సర్వ సంపదలు నశిస్తాయని ధర్మరాజు, దుర్యోధనునితో ఎంతగానో నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. అందుకు దుర్యోధనుడు ఎక్కడ మెత్తబడతాడో నని శకునియే ముందుకు వచ్చి "ధర్మజా! జూదమన్నది ఒక వ్యసనం కాదు. ఒక కళ. అరవై నాలుగు కళల్లో జూదమూ ఒకటి. బుద్ధి మంతులెవ్వరూ జూదాన్ని నిరసించరు. ఒకవేళ నువ్వు జూదంలో ఓడిపోతానేమోనన్న భయం నీ మనస్సులో ఏమూలనైనా ఉంటే నిర్మొహమాటంగా చెప్పు. ఈ

జూదక్రీడను ఇంతటితో ఆపేద్దాం" అన్నాడు. ఇంతలోనే దుర్యోధనుని పక్షాన జూదం చూడటానికి వచ్చిన సౌబలుడు మొదలైన రాజులు "దుర్యోధనా! జూదక్రీడ చూసేందుకు రమ్మని మమ్మల్నందర్నీ ఆహ్వానించి ఇప్పుడీ ధర్మ చర్చ ప్రారంభించారేమిటి? త్వరగా ఆట ప్రారంభించండి" అన్నారు.

అంతట కర్మచే ప్రేరేపించబడిన ధర్మరాజు చిత్రసేనుడు, వికర్ణుడు మొదలైన వారిని చూసి "మీలో ఎవరు నాతో జూదమాడదలచరాని" అడిగాడు. అందుకు దుర్యోధనుడు "ఆర్యా! నా కొరకు నా మేనమామ శకుని జూదమాడుతాడు. అతడు కాచే పందాలన్నింటినీ నేను చెల్లిస్తాను" అన్నాడు. ఆ ప్రతిపాదన ధర్మసమ్మతం కాకపోయినా విధి ధర్మరాజు నోటిని కట్టేసింది. మారు మాట్లాడకుండా జూదానికి సిద్ధపడ్డాడు. ఆడిన ఆటలన్నింట్లోనూ ధర్మరాజు ఓడిపోవడం శకుని గెలవడం జరిగాయి.

భీష్మ, ద్రోణ, అశ్వత్థామ, ధృతరాష్ట్రాదులంతా ఆ జూదం ధర్మబద్ధంగానే జరుగుతోందన్న నమ్మకంతోనే చూసేందుకు కూర్చున్నారు. అయితే అది అధర్మ జూదమయింది. ఆ పాచికలు మాయా పాచికలు. అందువల్లనే ప్రతిఆటలోను ధర్మరాజు ఓడిపోవడం, శకుని గెలుస్తూ ఉండటం జరిగింది. ఇంతవరకు జరిగిన ఆటలన్నింట్లోను ధర్మరాజు రత్న రాసుల్ని, గజాశ్వాదుల్ని పందెంగా ఒడ్డి ఓడిపోయాడు. ఇదంతా చూస్తున్న విదురుడు మాత్రం ధృతరాష్ట్రునితో "రాజా! నీ పెద్ద కొడుకు దుర్యోధనుడు పుట్టినప్పుడు అనేక దుశ్శకునాలు కలిగాయి. ఇంతవరకు నీతివంతంగా వస్తున ఈ కురువంశం పాపభూయిష్ఠం కాబోతోంది. ఒక్కడి మూలంగా వంశమే నాశనమవుతున్నప్పుడు, అతడు ఎంత ప్రియమైన వాడైనా అతడిని వదిలించుకొని వంశాన్ని నిలబెట్టుకోవాలి. అదే ధర్మం, అని శుక్రనీతి చెప్తోంది. ఈ నీతిని అనుసరించే యాదవులు పాపాత్ముడైన కంసుని సంహరించి వంశాన్ని నిలుపుకున్నారు. కావున నువ్వు కూడా అదే శుక్రనీతిని ఆశ్రయించి జూదం ఆపించు. దుర్యోధనుని కట్టడి చెయ్యి. వంశాన్ని నిలబెట్టు. అప్పుడే నీకు నిర్మలమైన ఖ్యాతి లభిస్తుంది" అని ఎన్నో విధాలుగా నచ్చ చెప్పాడు. కానీ భగవంతుని ఆశయం మరోవిధంగా ఉంది. అందువల్ల విదురుని నీతి వాక్యాల్ని ధృతరాష్ట్రుడు పెడచెవిన పెట్టాడు. అయినా విదురుడు ఊరుకోకుండా దుర్యోధనునితో "యువరాజా! నువ్వు న్యాయమార్గాన్ని విడిచిపెట్టావు. శకునిని నీకు బదులుగా జూదానికి నిలబెట్టావు. అధర్మ మార్గంలో పాండవుల సంపదలన్నింటినీ కొల్లగొట్టావు. లోకంలోని ధర్మపరులెవ్వరూ నిన్ను మెచ్చుకోరు. భుజ పరాక్రమం చేత భూమిపైన ఉండే రాజులందర్నీ ఓడించిన పాండవుల్ని మాయా జూదం పేరుతో ఓడించావు. ఇటువంటి అధర్మాన్నెవరైనా హర్షిస్తారా!" అని నిష్ఠూరంగా ఉన్నదున్నట్లు అడిగేశాడు. విదురుని మాటలువిన్న దుర్యోధనుడు ఆగ్రహావేశంతో "విదురా! నువ్వు నా ఆశ్రయంలో నేను పెట్టిన తిండి తిని బ్రతుకుతున్నావు. అయినా ఎంతమాత్రం విశ్వాసం లేనివాడవై ఎదుటి పక్షం వారిని కీర్తిస్తూ ఉంటావు. నన్ను నావాళ్ళను నిందించడమే నీకు ఆనందం. నిన్ను పోషించడమంటే ఒడిలో పామును పెట్టుకున్నట్లేనని నాకు తెలుసు. ఒళ్ళు అలవకుండా లోకంలో శత్రురాజుల సంపదల్ని స్వంతం చేసుకోవడం లోకధర్మమే కాని విరుద్ధంకాదు. అది రాజలక్షణమేనని తెలుసుకో. ధర్మరాజుకు జూదం ఆడటానికి ఇష్టం లేకపోతే మేమెవ్వరం అతణ్ణి అడ్డుపెట్టలేదుగదా? అనగా అతడే ఇష్టపడి మా సంపదల్ని కొల్లగొట్టాలని మాతో జూదమాడాడు. అది మా తప్పు ఎట్లా అవుతుంది? తప్పు

ధర్మరాజుపై ఉండగా నువ్వు నన్ను ఎందుకు తప్పు పడుతున్నావు? నామీద అపరాధం లేకపోయినా నన్నీ విధంగా ఎత్తి పొడుపు మాటలతో బాధించడం నీకు న్యాయం కాదు. నీ పనేదో నువ్వు చూసుకో. మా జోలికి రావద్దు. నీ దగ్గిర నేనేమీ బుద్ధులు నేర్చుకోవాల్సిన పనిలేదు" అని తిరస్కార భావంలో అన్నాడు.

దుర్యోధనుని మాటలకు విదురుడు ఖిన్నుడై, "దుర్యోధనా! లోకంలో పైకి తియ్యగా మాట్లాడుతూ లోలోపల గోతులు తీసే వారినే మిత్రులుగా పరిగణిస్తారు. అందువల్లనే శకుని మొదలైన వారిమాటలన్నీ నీకు వినసొంపుగా ఉన్నాయి. కానీ వారంతా నీకు కీడు చేసేవారని గ్రహించలేక పోతున్నావు. వారి మాటల్ని మన్నించిన నువ్వు వాటి దుష్ఫలితాలు అనుభవించే రోజున తెలుసుకుంటావు. అప్పుడు అంతా చెయ్యి దాటిపోతుంది. నిస్సహాయుడవై, ఒంటరివాడవై వీథిన పడతావు.

నేను నీ యశస్సు, వంశం శ్రేయస్సు కోరుకునే వాడిని. నామాటలు వినేందుకు కఠినంగా ఉండవచ్చునేమో కానీ, నీకు హితాన్ని చేకూర్చేవేనని తెలుసుకో. నీమేలు కోరిన నన్ను పదిమందిలో దూషించావు. నా మాటల పెడచెవిన పెట్టావు. ఇందుకు తగిన దుష్ఫలం అనుభవించే రోజున నువ్వే తెలుసుకుంటావు" అన్నాడు.

ఎవరెన్ని మాట్లాడినా జూదం యథావిధిగా ప్రారంభమై సాగిపోతోంది. ఆ జూదంలో ధర్మరాజు దేవ బ్రాహ్మణ వృత్తుల్ని తప్ప మిగిలిన వృత్తులన్నింటినీ ఓడిపోయాడు. ఆక్రమంలోనే సోదరులందర్నీ కూడా శత్రుపరం జేశాడు. ఇక పందెంలో ఒడ్డేందుకేమీ లేదని ధర్మరాజు ఆలోచిస్తూ ఉండగా శకుని ధర్మరాజును చూసి "యుధిష్ఠరా! ధనం లేదని ఎందుకు వెనకాడుతున్నావు? పాంచాలి ధనము కాదా? ఆమెను పందెంలో ఎందుకు ఒడ్డరాదు? నీ అదృష్టం బాగుంటే నువ్వు పోగొట్టుకున్నదంతా తిరిగి పొందవచ్చును గదా?" అని ప్రోత్సహించాడు. అప్పుడు ధర్మరాజు పాంచాలినికూడా ఫణంగా పెట్టి ఓడిపోయాడు. చివరకు ఆమెకూడా దుర్యోధనుని దాసి కావలసి వచ్చింది.

"భీష్మ, ద్రోణ విదురాది మహాత్ములంతా విధికి తలవంచి నోరు మెదపకుండా కూర్చుండి పోయారు. అయితే సదస్యులు మాత్రం ఇది అధర్మ జూదమని కన్నీరు మున్నీరుగా విలపించారు. అయినా వారి దుఃఖమంతా అరణ్యరోదనే అయింది. పాండవులంతా తన దాసులయ్యారన్న సంతోషంతో దుర్యోధనుడు పాంచాలిని సభకు తీసుకొని రమ్మని విదురుని ఆజ్ఞాపించాడు. అప్పుడు విదురుడు "దుర్యోధనా! ఇటువంటి అన్యాయమైన కార్యానికి నాబోటి వాడిని పంపటం న్యాయమా? దురాలోచనతో ఇతరుల సొమ్ము అపహరించే వాడి సంపదలు త్వరలోనే హరించిపోతాయి. పాండవులు అజేయులని తెలిసికూడా వారినీవిధంగా అవమానించి కోరి వైరాన్ని తెచ్చుకుంటున్నావెందుకు? జూదంలో మాయోపాయంతో పాండవుల సంపదలు అపహరించానని సంతోషపడకు. నీ దుష్ఫలాలన్నింటికీ ఈ జూదమే కారణం కాబోతోందని తెలుసుకో" అని హెచ్చరించాడు. విదురుడు పాండవ పక్షపాతి అని తలచి ప్రాతికాముని పిలిచి "నువ్వు ఇప్పుడే పోయి పాంచాలిని సభకు తీసుకొని రమ్మ" ని ఆజ్ఞాపించాడు. ప్రాతికామ పాంచాలి వద్దకు పోయి వినయంగా "తల్లీ! ధర్మరాజు దుర్యోధనునితో జూదమాడి సర్వము కోల్పోయాడు. చివరకు నిన్ను కూడా పణంగా పెట్టి ఓడిపోయాడు.

ఇప్పుడు నువ్వు దుర్యోధనుని అధీనమయ్యావు. కనుక ఆ సార్వభౌముడు నిన్ను సభకు తీసుకొని రమ్మని నన్ను పంపాడు" అని ప్రార్థించాడు. అందుకు పాంచాలి ఇలా అన్నది. "ఓ ప్రాతికామీ! ఏ యుగంలోనైనా భార్యను పణంగా పెట్టి జూదమాడిన భర్త ఉన్నాడా? ధర్మరాజంతటి వాడు అట్లా చేస్తాడని నేను అనుకోవడం లేదు. అయినా నిన్ను ఒక్కమాట అడుగుతాను. ముందుగా తాను ఓడిపోయి ఆ పిమ్మట నన్ను పణంగా పెట్టాడా? లేకపోతే నన్ను ఓడిపోయిన తర్వాతనే తాను ఓడిపోయాడా? నీకు తెలిస్తే చెప్పు. లేనిచో ధర్మరాజునే అడిగి తెలుసుకొనిరమ్మ"ంది. అంతట ఆ ప్రాతికామి ధర్మరాజునా ప్రశ్న అడుగగా అన్యమనస్కుడై ఉన్న ధర్మరాజు బదులు చెప్పలేదు. అప్పటికే అసహనంతో రగిలిపోతున్న దుర్యోధనుడు కోపంతో 'ఓ ప్రాతికామీ! ఈ ప్రశ్న ఎంతో సందిగ్ధమైనది. ఆ సమాధానాన్ని సభాసదులంతా వింటారు. వారితో పాటు తాను వినవచ్చు పోయి వెంటనే పాంచాలిని ఇక్కడకు తీసుకొనిరమ్మ" ని కన్నెర్ర చేసి పంపాడు.

దుర్యోధనుని మదహంకారం, ధర్మజుని మౌనం పాంచాలిలో కలవరం కలిగించింది. చేసేది లేక, ఏక వస్త్ర అయి ఉండి కూడా కడివెడు దుఃఖంతో సభకు తీసుకొని రాబడింది. మూర్తీభవించిన దుఃఖదేవతగా సదస్యులందరి ముందు నిలబడిన పాంచాలిని చూడలేక సభలోని పెద్దలంతా తలలు దించుకున్నారు. పాండుతనయులంతా అవమానభారంతో తలలు వంచుకున్నారు. దుర్యోధనుడు దుశ్శాసనునితో "సోదరా! పాంచాలిని నా వద్దకు ఈడ్చుకొనిరా. ప్రాతికామీ భీముని చూసి భయపడి ఈ పని చెయ్యడానికి వెనుకాడవచ్చు. అందువల్ల నువ్వు ఈ పనికి సమర్థుడవు" అని ఆజ్ఞాపించాడు. దుర్యోధనుని మాటలకు పాంచాలి చిగురుటాకులా వణికిపోయి గాంధారి వద్దకు పరుగెత్తింది. దుశ్శాసనుడు పాంచాలి వద్దకు పోయి "ఓ పాంచాలీ! మా మేనమామ నిన్ను జూదంలో గెలుచుకున్నాడు. ఇకపైన నువ్వు నీ భర్తలు మాకు దాస్యం చేస్తూ జీవించాలి. మమ్మల్ని తప్పించుకొని ఎక్కడకు పోతావు" అంటూ కర్కశంగా మాట్లాడాడు. అతడి మాటలకు భయపడిపోతూ "అయ్యా! రజస్వలనై ఏక వస్త్రనై ఉన్న నన్ను తాకవద్దు" అని ప్రార్థించింది. అయినా ఆమె దీనాలాపాలు అతడి మనస్సును కరిగించలేకపోయాయి. జుట్టు పట్టుకొని ఆమెను సభముందుకు ఈడ్చుకొని వచ్చాడు. అంతట పాంచాలి దుఃఖంతో "ఓ కురువృద్ధులారా! పరమ దుర్మార్గుడైన ఈ దుశ్శాసనుడు దౌర్జన్యంగా నా శిరోజాలు పట్టుకొని సభలోకి ఈడ్చుకొని వచ్చాడు. మీలో ఒక్కరైనా నోరు విప్పి అతణ్ణి మందలించలేకపోయారు. ఇది న్యాయవిరుద్ధమని చెప్పలేకపోయారు గదా. నన్నీవిధంగా అవమానించాడు. ధర్మ సంపదలో తులతూగాల్సిన ఈ కురువంశం నేడు అధర్మ సంపదతో నిండిపోయింది గదా" అని దుఃఖించింది.

కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ద్రౌపదిని చూస్తున్న భీమసేనుడు ధర్మరాజుతో "యుధిష్ఠిరా! నీకున్న సంపదల్ని సోదరులమైన మమ్మల్ని పణంగా పెట్టి ఓడిపోవడం ఒకరకంగా ధర్మ సమ్మతమేనని ఒప్పుకుంటాను. కానీ ద్రౌపదిని పణంగా పెట్టి జూదమాడే అధికారం నీకెవరిచ్చారు? శకుని మోసాలు చెయ్యడంలో దిట్ట అని తెలిసికూడా అతడితో జూదానికి దిగడం నీ తప్పుకాదా? ఇటువంటి అధర్మమైన పని చేసినందుకు ముందుగా నీ చేతులు రెండింటినీ ఖండించినా పాపంలేదు" అన్నాడు. భీముని

మాటలకు అర్జునుడు "పవననందనా! ధర్మ నందనుడే కనుక ధర్మం తప్పి ఉంటే భూలోకమంతా దద్దరిల్లకుండా ఉంటుందా? యుద్ధానికి పిలిచినా, జూదానికి ఆహ్వానం అందినా రాలేనని చెప్పడం క్షత్రియధర్మం కాదు. విధి మనకు వ్యతిరేకంగా ఉంది. అందువల్ల మనం ఎన్నుకొని ఏమి లాభం?" అన్నాడు. సభాసదులంతా వినేట్లుగా వికర్ణుడు ఇలా అన్నాడు.

సభాసదులారా! ఈ సభలో కురువృద్ధులైన భీష్మాదులున్నారు. వారంతా ద్రౌపది అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. లేకపోతే వారూ ఈ పాపంలో పాలు పంచుకోవాల్సి ఉంటుంది. మీరంతా మౌనం పాటిస్తున్నారు. అందువల్ల నేనే నాకు తోచిన విధంగా సమాధానం చెప్తున్నాను. వినండి. జూదం, మద్యపానం, వేట, మితిమీరి తినడం వంటి వన్నీ దుర్వ్యసనాలేనని పెద్దలంటారు. ఈ వ్యసనాలకు పాల్పడిన వారంతా పాపులుగానే పరిగణించాల్సి ఉంటుంది. ధర్మరాజును ఈ మాయాజూదానికి ఆహ్వానించారు. జూదమాడారు. ద్రౌపది ఒక్క ధర్మరాజు సొత్తు మాత్రమే కాదు గదా. మిగిలిన నలుగురికీ ఆమె పై అధికారమున్నది. ఆమెను జూదంలో పణంగా పెట్టడం అధర్మం కాదా? రజస్వలయై ఏకవస్త్రగా ఉన్న ఈమెను ఇక్కడకు ఈడ్చుకొని రావడం అన్యాయం కాదా?" అని అడిగాడు. అందుకు కర్ణుడు "వికర్ణా! నువ్వు చిన్న పిల్లవాడివి. ఇక్కడున్న పెద్దలకు తెలియని ధర్మాలు నీకు మాత్రమే తెలుసనుకుంటున్నావా? ఇంతమంది పెద్దల ముందు పిల్లవాడివి నువ్విట్లా మాట్లాడటం సభ్యత కాదు. ద్రౌపదిని అధర్మంగా గెలుచుకున్నారని గదా నీ అభియోగం? సభలో పెద్దలందరి ముందే ధర్మరాజు ఆమెను పణంగా పెట్టి ఓడాడు. ద్రౌపది అతడికి కూడా పత్నియే కదా. లేకపోతే మిగిలిన నలుగురూ ఎట్లా అంగీకరించారు? వాళ్ళు అప్పుడే అభ్యంతరం చెప్పి ఉండేవాళ్ళే గదా? లోకంలో స్త్రీకి దైవసమానుడైన భర్త ఒకడే ఉంటాడు. కానీ ఈ పాంచాలి పంచభర్తృక. అందువల్ల ఈమెను 'బంధకి' అనాల్సి ఉంటుంది. కావున ఇట్టి బంధకిని వస్త్రహీనగా తీసుకొని వచ్చినాకూడా అది ధర్మానికి విరుద్ధం కాదు" అని వికర్ణుని వాదనను నిర్వీర్యం చేశాడు.

అంతట దుర్యోధనుడు దుశ్శాసనుని పిలిచి ఈ పాండవుల దేహం పైనుండే వస్త్రాలన్నింటినీ తొలగించమని ఆజ్ఞాపించాడు. ధర్మవర్తనులైన పాండవులు పాపాత్ముడు తమ వద్దకు రాకపూర్వమే వస్త్రాలు ఆభరణాలన్నీ తీసి ప్రక్కన పెట్టాశారు. అంత దుశ్శాసనుడు పాంచాలి వద్దకు పోయి తాను చెయ్యదగని కార్యం చేస్తున్నానేమోనన్న ఆలోచన కొంచమైనా లేకుండా ద్రౌపది కట్టుకున్న వస్త్రాల్ని చేత్తో పట్టుకొని బరబరా లాగేశాడు. ఆ సమయంలో తన భర్త లెవ్వరూ నోరు మెదపక పోవడం, వృద్ధులంతా సిగ్గుతో తలలు దించుకోవడం చూసింది. తన అసహాయ స్థితిని తలచుకొని పరమాత్ముడైన శ్రీకృష్ణుడొక్కడే తన్ను రక్షించగల సమర్థుడని తలచింది. వెంటనే భక్తి పారవశ్యంతో "ఈ లోకమంతా వ్యాపించి ఉన్న శ్రీకృష్ణ పరమాత్మా నన్ను కాపాడుము. నా మానం, ప్రాణం అన్నీ నువ్వేనని నమ్ముకొని నిన్ను శరణు వేడుకుంటున్నాను. గోవిందా! ద్వారకానాథా! కృష్ణా! గోపీజనప్రియా! కౌరవులు నన్ను అవమానిస్తున్నారు. అయినా నువ్వు ఏమీ తెలియనట్లు ఊరకే ఉన్నావేమీ? జగన్నాథా! రమానాథా! వ్రజేశ్వరా! కౌరవ సాగరంలో మునిగి ఉన్నాను. నన్ను ఉద్ధరించు. జనార్దనా! శ్రీకృష్ణా! యోగేశ్వరా! విశ్వాత్మకా! విశ్వభావనా! కష్టాలలో చిక్కుకొని పరితపిస్తున్నాను. నన్ను ఉద్ధరించు" అని భోరున ఏడ్చింది.

శ్రీకృష్ణ పరమాత్మ వెంటనే అక్కడ అదృశ్య రూపంలో ప్రత్యక్షమయ్యాడు. దుశ్శాసనుడు ఒక చీర లాగుతూ ఉంటే ఆస్థానంలో మరో చీర ద్రౌపది శరీరంపై ఉంటోంది. ఇట్లా ఒక చీర తొలగిస్తే మరో చీర మొలుచుకొస్తోంది. అక్కడ ప్రోగైన వస్త్రాలు ఒక పర్వతమంతయ్యాయి. సభాసదస్యు లంతా ఈ అద్భుతం చూసి విస్తుపోయారు. ద్రౌపది పాతివ్రత్యాన్ని కొనియాడారు. దుశ్శాసనుణ్ణి మనస్సులోనే తిట్టిపోశారు. నిజానికి ఇది అతడికి, కౌరవులందరికీ జరిగిన అవమానమని భావించారు.

మ॥ *కురు వృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ చూచుచుండన్*
మదోద్ధురుఁడై ద్రౌపది నిట్లు చేసిన ఖలున్ దుశ్శాసనున్
లోకభీ, కరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైలరక్తౌఘుని
ర్ఘరముర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతును గ్రాకృతిని.

– నన్నయ భట్టు.

ఈ ఘట్టాన్నే కవిరాజ కృష్ణమూర్తి శాస్త్రిగారు వ్రాసిన తీరు చూడండి.

మ॥ *వినుడో క్షత్రియులారా మీరిపుడిటం వీక్షించుచుండం గమా*
వనితన్ ముట్టి పరాభవించె ఖలుఁడీపాపాత్ముని౦ బట్టి నే
వనిలో నెల్లరు జూచుచుండ నురమున్ హాహాయనం జీల్చిత
జ్జనితానంత కవోష్ణ రక్తమును నాస్వాదింతు నుగ్రుండనై

సభాసదులనందర్నీ ఉద్దేశించి విదురుడు "సభాసదులారా! ఈ వికర్ణుడు వయస్సులో చిన్నవాడైనా ధర్మ శాస్త్రాన్నంతా మదించి, న్యాయబద్ధమైన ప్రశ్నలడిగాడు. వీడా ధర్మం చెప్పేవాడని నిర్లక్ష్యం చేయకండి. ధర్మం చిన్నపిల్లవాడు చెప్పినా వినాల్సిందే. ఎవరైనా సభలోకి వచ్చి ధర్మం చెప్పమని అడిగినప్పుడు లోభం చేతగాని, పక్షపాతం చేతగాని, చాంచల్యం చేతగాని, ధర్మాన్ని మరుగున పరచి మాట్లాడితే వారు తప్పక అసత్యం చెప్పిన దోషాన్ని పొందుతారు. మీరంతా దుర్యోధనునిపై గల భయంతో నోరు మెదపకుండా కూర్చున్నారు. మీకు తప్పక ఆ దోష ఫలం అనుభవించాల్సి ఉంటుందని అన్నాడు.

సభాసదులందర్నీ ఉద్దేశించి ద్రౌపది మళ్ళీ ఇలా అన్నది. "రాజులందరి సమక్షంలో దుశ్శాసనుడు నన్ను అవమానించాడు. పాండవులకు పత్నిని, శ్రీకృష్ణునికి సోదరినైన నేను నిండు సభలో ఈవిధంగా అవమానించబడ్డాను. ఇది అన్యాయం కాదా? నేనిప్పుడు దుర్యోధనునికి దాసీగా ఉండాలా? మీరే నిర్ణయించి చెప్పండి" అన్నది. అందుకు భీష్ముడు ఇలా అన్నాడు. "తల్లీ! ఆ ధర్మ సూక్ష్మాన్ని చెప్పగల సమర్థుడు యుధిష్ఠిరుడొక్కడే. నీకు జరిగిన అన్యాయానికి ఈ కురువంశస్థులంతా త్వరలోనే అనుభవిస్తారు" అన్నాడు. వెంటనే కర్ణుడు లేచి "ఇంతీ! జూదంలో నిన్ను ఓడిపోయే భర్తలు అయిదుగురుండటం కన్నా ధీరుడైన ఒక భర్త ఉండటం మేలుకాదా?" అని పరిహాసం చేశాడు. దుర్యోధనుడు ద్రౌపదిని చూస్తూ "వచ్చి తన తొడలపై కూర్చోమని" సంజ్ఞ చేశాడు. ఆ కనుసైగ చూసిన భీముడు పట్టరాని కోపంతో "ఓరీ దురాత్ముడా! రాజ్యసంపద చేత మదమెక్కిన నువ్వు ఏ తొడలపై కూర్చోమని సంజ్ఞ చేశావో, నేనా తొడలను నా గదా ప్రహరం చేత పగుల గొడ్తాను" అని

శపథం చేశాడు. భీముని ప్రతిజ్ఞ విన్న భీష్మ ద్రోణ విదురాది ప్రభృతులంతా "భీమసేనా! ప్రశాంతంగా ఉండు. ఇది కోపాన్ని ప్రదర్శించటానికి తగిన సమయం కాదు" అని హితవు పలికారు. ఆ తర్వాత అనేక దుశ్శకునాలను భీష్మాదులు చూశారు.

ఇదంతా విన్న గాంధారి విదురుడితో కలసి ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళింది. పాండవులు కపట జూదంలో ఓడిపోవడం, ద్రౌపదీ పరాభవం, భీష్మాదులు చూసిన దుశ్శకునాలను గూర్చి భర్తకు తెలిపింది.

దుర్యోధనాది పుత్రుల్ని బంధువుల్ని పిలిపించి హితోక్తులెన్నో తెలిపింది. ఆ తర్వాత ద్రౌపదిని పిలిపించుకొని ఇలా అన్నది. "అమ్మా! నా కోడళ్ళందరిలోకి నువ్వు పూజ్యురాలవు. నీకు సంతోషాన్ని కలిగించాలనుకుంటున్నాను. నీకేం వరం కావాలో కోరుకో" అన్నది. అంతట పాంచాలి ఇలా అన్నది. "అత్తా! మామా! నాకు మీరు సంతోషం కలిగించాలనుకుంటే నా భర్త ధర్మరాజును దాస్య విముక్తుణ్ణి చెయ్యి. ఈ ఒక్క కోరికే నాకు సంతోషాన్ని కలిగిస్తుంది" అన్నది. అంతట ధృతరాష్ట్రుడు "అమ్మా! మరొక వరం కోరుకో" అన్నాడు. అప్పుడు ద్రౌపది మిగిలిన పాండవులను కూడా ఆయుధాలతో సహా దాస్యవిముక్తుల్ని చెయ్యమని కోరింది. మళ్ళీ ధృతరాష్ట్రుడు మరో కోరికను కోరుకోమని అడిగాడు. అప్పుడు ద్రౌపది ఇలా అన్నది. "మామా! వైశ్య స్త్రీ ఒక్క వరాన్నే కోరుకోవాలని, క్షత్రియ స్త్రీ రెండువరాలకన్నా కోరుకోరాదని, శూద్ర స్త్రీ మాత్రమే మూడు వరాలు కోరుకోవచ్చని ధర్మ శాస్త్రం చెబుతోంది. కావున నేనిక మూడో వరాన్ని కోరుకునేందుకు అర్హురాలను కానని" అన్నది. అంతట ధృతరాష్ట్రుడు ధర్మరాజును పిలిపించి "వత్సా! పూర్వం వలెనే నువ్వు నీ రాజ్యాన్ని పాలిస్తూ సుఖంగా ఉండు. నీకన్నీ శుభాలే కలుగుతా" యని ఆశీర్వదించి పంపాడు.

ద్రౌపది వలన దాస్య విముక్తి, రాజ్యము సంప్రాప్తించాయన్న మాట భీమసేనుణ్ణి కలచి వేసింది. అయినా ధర్మరాజు భీముని వారించి పెదతండ్రిగారి వద్ద సెలవు తీసుకొని, ఇంద్రప్రస్థానికి బయలుదేరి వెళ్ళాడు.

ఈకథనుండి మనం తెలుసుకోవాల్సిన ముఖ్య విశేషాలేమంటే, ప్రధానంగా పరమేశ్వరుడు ఆర్తత్రాణ పరాయణతత్త్వమే. రెండవది పాతివ్రత్య ప్రభావం. భర్తల బలపరాక్రమాలపై ఆమె గర్వం తొలగిపోయింది. భగవంతుడొక్కడే ఆమెను కాపాడగలడని పరిపూర్ణ విశ్వాసం కుదిరింది. అతిరథులు, మహారథులు, తపస్వులు నీతికోవిదులు ఎంతమంది ఉన్నా ఆమెకు సాయం చేసే వాళ్ళే కరువయ్యారు. ఆ క్షణంలో శ్రీకృష్ణుని ధ్యానించింది. అదే యోగం. యోగగమ్యుడే పరాత్పరుడు.

శ్రీకృష్ణ రాయబారం

(ఈ భాగం శ్రీమహాభారతం ఉద్యోగపర్వం 72వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

పాండవులు అరణ్య వాసం చేస్తూ అనేక కష్టాలు అనుభవించారు. అయినా శ్రీకృష్ణుని అనుగ్రహం వల్ల అన్నీ తట్టుకొని గడువు పూర్తి చేయగలిగారు. ఇక మిగిలిందల్లా అజ్ఞాతవాసం. ఆ సంవత్సరకాలం విరాట మహారాజు కొలువులో తలదాచుకుంటూ గడపాలనుకున్నారు. అక్కడా ఎన్నో అవమానాలు కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అట్లా అజ్ఞాతవాసం గడువుకూడా పూర్తి అయిన తర్వాత యుద్ధం అనివార్యమైతే ఎవరెవర్ని మిత్రులుగా చేసుకొని తమ పక్షాన్ని బలోపేతం చేసుకోవాలో శ్రీకృష్ణునితో ఆలోచించారు. ఎవరెవరికి మరణ కాలం దగ్గరపడిందో వారంతా అటు కౌరవ పక్షానో, ఇటు పాండవ పక్షానో చేరేందుకు కుతూహల పడుతున్నారు. నిజానికి వారందరినీ ఆడించేది వారికర్మమే. ఆ రహస్యం తెలియని వారు తామే ముందుండి యుద్ధాన్ని నడిపిస్తున్నామని అనుకుంటూ ఉంటారు. అందువల్లనే భగవంతుడు అందరికీ అహంకార కర్తృత్వాలను కలుగజేశాడు.

శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన చేరేందుకే నిశ్చయించుకున్నాడు. అయినా లోకాచారాన్ని పాటించి బలరామాదులందర్నీ వెంటబెట్టుకొని అభిమన్యుని వివాహానికి వెళ్ళి కొంతకాలం పాండవులతోనే ఉండిపోయాడు. పాండవులంతా ఆపదల్లో ఉన్నారని గ్రహించిన ధృతరాష్ట్రుడు సంజయుని వారివద్దకు రాయబారిగా పంపాడు. సంజయుడు పాండవుల మాటలన్నింటినీ యథాతథంగా వచ్చి ధృతరాష్ట్రునకు తెలిపాడు.

సంజయరాయబారం విఫలం అయిన తర్వాత పాండవులు సంధి ప్రయత్నాలు చెయ్యమని శ్రీకృష్ణుని పంపాలనుకున్నారు. ధర్మరాజు తమ్ములందర్నీ వెంటబెట్టుకొని శ్రీకృష్ణుని మందిరానికి వెళ్ళి "మహాత్మా! మహానుభావా! జగద్గురూ! మా తండ్రి పాండురాజు మా చిన్నతనంలోనే చనిపోయాడు. ఆయన పోతూ శ్రీకృష్ణుడొక్కడే మీ కష్టాలన్నీ తీర్చి మీకు సర్వ సంపదలు చేకూర్చి పెట్టగల సమర్థుడని నీ చేతుల్లో పెట్టి పోయాడు. కావున ఓ కృష్ణా! మాకు అన్ని విధాలా సంరక్షకుడవు నీవే. ఎందువల్లనో యుద్ధానికి నా మనస్సు అంగీకరించడం లేదు. అట్లాగని రాజ్యం వదలుకోవడానికీ ఇష్ట పడటం లేదు. ఎందువల్లనంటే బంధువుల్లో మాకది అవమానం గదా. నా మనస్సులో ఉన్నదున్నట్లు నీకు విన్నవించుకుంటున్నాం. ఆపైన నువ్వే మాకేది యోగ్యమో నిర్ణయించి రాయబారం నడుపు అని ప్రార్థించాడు.

ఈ ఘట్టంలో తిక్కన సోమయాజి ఎట్లా వ్రాశారో మచ్చుకు ఒక పద్యాన్ని తిలకిద్దాం.

క॥ *ఆపద గడవం బెట్టఁగ । నోపి శుభంబైన దాని నొడఁగూర్పఁగ మా*
కీ పుట్టువునకుఁ బాండు । క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా!

ధర్మనందనుని ప్రార్థనను మన్నించి సంధి ప్రయత్నాలు చేసేందుకు శ్రీకృష్ణుడు అంగీకరించాడు. తాను సర్వజ్ఞుడే అయినా, సంధి ప్రయత్నాలు ఫలించవని, దండోపాయమే శరణ్యమని తెలిసికూడా

లోకాచారాన్ని పాటించి రాయభారం చెయ్యడానికి అంగీకరించాడు. ఈసంధి ప్రయత్నాలకు భీమసేనుడు సుముఖంగా లేడని తెలుసుకున్న పరమాత్మ, అతడితో మాత్రం సంధి నామ మాత్రమే నని, నువ్వు యుద్ధ ప్రయత్నాలలో ఉండవచ్చని ప్రోత్సహించాడు. అంతట పరమాత్మ సాత్యకిని వెంటబెట్టుకొని హస్తినకు ప్రయాణమయ్యాడు. శ్రీకృష్ణుడు రాయబారం నెరపడానికి వస్తున్నాడని తెలుసుకున్న ధృతరాష్ట్రుడు ఆయన ఆతిధ్యానికి ఏర్పాట్లు ఘనంగా ఉండాలని చెప్పాడు. అప్పుడు విదురుడు "మహారాజా! శ్రీకృష్ణుడు ఒక్క భక్తి చేతనే సంతృప్తి చెందుతాడే గాని, ఇతర పదార్థాలేవీ ఆయన్ను సంతృప్తి పరచలేవ" ని నొక్కి చెప్పాడు.

శ్రీకృష్ణుడు సాత్యకిని వెంటబెట్టుకొని హస్తినాపురాన్ని చేరుకున్నాడు. ఆ మహానుభావుణ్ణి ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించి ఆసీనున్ని చేశారు. కుశల ప్రశ్నలన్నీ అయ్యాయి. ఇంతలో దుర్యోధనుడు శ్రీకృష్ణుని విందుకు ఆహ్వానించాడు. అందుకు శ్రీకృష్ణుడు సున్నితంగా త్రోసిపుచ్చుతూ ఇలా అన్నాడు. "దుర్యోధనా! నా యెడల నీకు సద్భావం లేదు. కావున నువ్వు ఏర్పాటు చేసిన విందు నాకు సంతోషాన్నివ్వదు. అదీకాకుండా నేనిప్పుడు రాచకార్యం పై వచ్చాను. అనగా నీ ప్రత్యర్థులకు దూతగా వచ్చాను. కావున నువ్వు నన్ను పగవానిగానే చూడవచ్చు. పగవాడింట్లో అమృతం వంటి పదార్థాలు భుజించినా అవి అనుమానానికి తావిచ్చేవే అవుతాయి. కావున పగవానికి భోజనం పెట్టవద్దని, తినవద్దని పెద్దలంటారు. విదురుడు నాకు పరమ భక్తుడు. నేను అతడింట్లోనే భోజనం చేస్తాను. అక్కడే విశ్రమిస్తాను" అని చెప్పి తాను ధృతరాష్ట్రుని చూసేందుకు బయలుదేరాడు.

ధృతరాష్ట్రుడు, విదురుడు మొదలైన వారంతా శ్రీకృష్ణుని సాదరంగా ఆహ్వానించారు. కుశల ప్రశ్నలన్నీ అయిన తర్వాత శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "రాజేంద్రా! నీకు తెలియని ధర్మాలు లేవు. అట్లాగే నేను వచ్చిన పనికూడా నీకు తెలుసు. అయినా చెప్పడం నా విధి. నేను చెప్పే మాటలు లోకానికంతటికీ సుఖసంతోషాల్ని కలిగించేవి. అందువల్ల పాండవులు కౌరవులు పాలు నీళ్ళవలె కలసి మెలసి ఉండాలన్నదే నా కోరిక. నువ్వు కూడా ఆ విధంగానే ఆలోచించు. ఎందువల్లనంటే మీ వంశం ఎంతో ప్రఖ్యాతి చెందినది. ఆ ప్రఖ్యాతిని కాపాడే భారం నీపైన ఉంది. కీడైనా మేలైనా నువ్వు తీసుకునే నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. నీ నిర్ణయం లోకులంతా హర్షించే విధంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఇంతవరకు వచ్చింది కనుక నిర్మొహమాటంగా నీకోమాట చెప్పాలనుకుంటున్నాను. దుర్యోధనాదులంతా చెడుసావాసాల కలవాటు పడ్డారు. వాళ్ళంతా ధర్మమార్గాన్ని విడిచి అన్నీ చెడ్డపనులే చేస్తున్నారు. కుల మర్యాదగాని, లోకమర్యాదగాని పాటించడంలేదు. అందుమూలంగా వాళ్ళు చేస్తున్న భయంకరమైన కార్యాలవల్ల బంధువులంతా కష్టాల్లో కూరుకుపోతున్నారు. ఇప్పటికైనా నువ్వు జోక్యం చేసుకోకుండా ఉదాసీనంగా ఉండకూడదు. నీ పుత్రులు, పాండవులు కలసి ఉంటే విశ్వవిఖ్యాతి కలుగుతుంది. లేకపోతే భరతవంశమే నాశనమై పోతుంది. భీమార్జునులతో సరితూగే బలవంతులీ భూమిమీద ఎవరైనా ఉన్నారా? అట్లాగే భీష్మ ద్రోణులకు సాటి అయినవారున్నారా? వీళ్ళంతా కలసి నీ చెప్పుచేతల్లో ఉంటే నీకెంతటి ఖ్యాతి కలుగుతుందో ఊహించు. ఈ లోకంలోని రాజులంతా నీ పాదాక్రాంతులు కాకుండా ఉంటారా? అట్లాగే యుద్ధమే తప్పని సరి అయిందనుకో, వీరిద్దర్లో ఎవరు

ఓడిపోయినా అది నీకే ఎక్కువ కష్టాన్ని కలిగిస్తుంది. ఈ విధంగా తాను చెప్పదలచిందంతా చెప్పి పాండవులు చెప్పమన్నది కూడా తెలిపి సభాసదుల మన్ననలందుకున్నాడు. పాండురాజు రాజ్యం అర్థభాగం ఇమ్మని ఎంతగానో హితవు పలికాడు. మహర్షులంతా దుర్యోధనునికి ఎన్నోనీతులు బోధించారు. కాదంటే జరగబోయే ఆపదల్నీ వివరించి చెప్పారు. భీష్ముడు న్యాయశాస్త్రానుసారం దుర్యోధనునికి ఎన్నో నీతులు బోధించాడు. ఎవరెన్ని చెప్పినా దుర్యోధనుని మనసు మారలేదు. సభ్యులంతా ఇక యుద్ధం తప్పదని, కౌరవులకు వినాశకాలం దగ్గర్లోనే ఉన్నదని భావించారు.

అంతట ధృతరాష్ట్రుడు గాంధారితో దుర్యోధనునికి నచ్చ చెప్పమని పంపాడు. ఆమె కూడా నయానా భయానా ఎన్నో విధాలుగా చెప్పి చూసింది. అయినా దుర్యోధనుడు ఆమె మాటలు పెడచెవిన పెట్టాడు. కర్ణ శకుని మొదలైన మిత్రులందర్నీ వెంటబెట్టుకొని సభనుండి బయటకుపోయాడు. వాళ్ళతో ఇలా అన్నాడు, "భీష్మాదులంతా కలసి నాపై కుట్ర పన్నుతున్నారు. ఈ కృష్ణుడు పూర్వం కంసుని చంపిన విధమంతా మళ్ళీ వాళ్ళకు వినిపించాడు. కాబట్టి మనమంతా కలసి ఇక్కడొక్కడినీ బంధిస్తే పాండవుల ఆటలన్నీ కట్టాయి. మనకూ మేలు జరుగుతుంది. ఒకవేళ యుద్ధమే వచ్చినా కృష్ణుడులేని పాండవులు కోరలు తీసిన పాముల వలె పడి ఉంటారు" అన్నాడు.

దుష్టచతుష్టయం అంతా కలసి కట్టుగా బయటకుపోవడం, వారు ఒకరితో ఒకరు కనుసైగల ద్వారా మాట్లాడుకోవడం సాత్యకి కనిపెట్టాడు. వెంటనే కృతవర్మను బయటుండి తగు జాగ్రత్తలు తీసుకొమ్మని చెప్పి తాను శ్రీకృష్ణుని వద్దకు పోయి దుర్యోధనుని దురాలోచన గూర్చి తెలిపాడు. శ్రీకృష్ణుని అనుమతితో సభాసదులతో ఇలా అన్నాడు. "దురాత్ముడైన దుర్యోధనాదులు శ్రీహరికి అపకారం తలపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. అగ్నిహోత్రాన్ని కొంగున ముడివేసుకోవడం సాధ్యమా? వాళ్ళ దురాలోచనలు, తలపెట్టే దుష్కార్యాలు, వాళ్ళ వినాశనానికే నని తెలుసుకోండి" అన్నాడు. వారి మాటలు విన్న విదురుడు ధృతరాష్ట్రుని వద్దకు పోయి "రాజా! నీ పుత్రులు శ్రీకృష్ణుని బంధించే ప్రయత్నాలు చేస్తున్నారు. వాళ్ళు శ్రీకృష్ణునిపై దాడి చెయ్యడం అగ్నిహోత్రం పైకి మిడుతలు దండెత్తినట్లే ఉంటుంది" అని తెలపాడు. ఆ మాటలు విన్న శ్రీకృష్ణుడు "రాజా! నాపైన కోపంతో నీ కుమారులు ఇటువంటి ప్రయత్నం చెయ్యడం మంచిదే. నాకూ పరమానందమే. ఇక నాకు అనుమతి ఇవ్వు. ప్రయాణమై వెళ్తాను" అన్నాడు.

శ్రీకృష్ణుని మాటలు విన్న ధృతరాష్ట్రుడు భీతి చెంది దుశ్శాసనాది పుత్రులందర్నీ తీసుకొని రమ్మని కబురు చేశాడు. దుర్యోధనాదులతో ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు. "దురాత్ములారా! మీ శక్తి ఎంతో మీరు తెలుసుకోలేకుండా ఉన్నారు. లోకాధినాథుడైన శ్రీకృష్ణునికి కీడు తలబెట్టాలని చూస్తున్నారు. మీరంతా కలసినా అతణ్ణి ఎదుర్కొనే శక్తి లేదు. వర్షం మహావృక్షాన్ని కదల్చగలదా? మీకు వినాశకాలం దాపురించింది" అన్నాడు. అంతట విదురుడు "సుయోధనా! దేవతలు, బ్రహ్మాదులు, మహర్షులు కూడా పట్టుకోలేని భగవంతుణ్ణి మీరు పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారా? ఇది నీ వినాశకాలాన్నే సూచిస్తోంది. మీరు చేస్తున్న ఈ దుష్కార్యం వల్ల క్షణకాలంలో మీరంతా బూడిదై పోతారు" అని హెచ్చరించాడు. ఎవరెన్ని విధాలుగా వారించినా దుర్యోధనుడు తన పట్టువిడువలేదు. అప్పుడు శ్రీకృష్ణుడు

దుర్యోధనునితో "దుర్యోధనా! నన్ను ఒక్కణ్ణి చేసి పట్టుకోవాలని చూస్తున్నావా? ఎందరు ఎన్ని విధాలుగా వారించినా నువ్వు నా శక్తి తెలుసుకోలేకుండా ఉన్నావు. నీ అంతటి తెలివితక్కువ వాడు మరెక్కడా ఉండబోడు సుమా" అని తన విశ్వరూపాన్ని చూపాడు.

విశ్వరూప సందర్శనం :

వాసుదేవుడు మందహాసం చేస్తూ ఒక అద్భుత రూపంగా మారాడు. ఆ రూపంలో ఈ బ్రహ్మాండమంతా ఇమిడి ఉంది. ఒక్కొక్క అవయవంలో బ్రహ్మ నుండి చీమ వరకు గల ప్రాణులన్నీ కనిపించాయి. పాండవులు, కౌరవులు, సేనలు నానావిధాలైన ఆయుధాల్ని ధరించి యుద్ధానికి సిద్ధంగా ఉండటం కనిపించింది. ఇన్ని మాటలెందుకు, బ్రహ్మాండాలన్నీ అప్పుడతడి శరీరంలో ఇమిడి పోయాయి. అదే విశ్వరూపం అదే భగవంతుని నిజస్వరూపం. ఆరూపాన్ని కళ్ళప్పగించి చూస్తూ, చేష్టలుడిగి పోయారు. భీష్మ ద్రోణా విదురులకు మాత్రం దివ్య దృష్టిని ప్రసాదించాడు. దాంతో వారుమాత్రమే ఆ మహానందాన్ని అనుభవించగలిగారు. ఆకాశం నుండి పుష్ప వర్షం కురిసింది.

ధృతరాష్ట్రునికి సభలోని కలకలం వింటూ ఇది శ్రీకృష్ణుని మహామాయేనని భావించి, చేతులు జోడించి నమస్కరిస్తూ, "మహాత్మా! పురుషోత్తమా! నాపై కరుణ చూపించు. నా అజ్ఞానాన్ని క్షమించు. నిన్నే శరణు వేడుకుంటున్నాను. నీ పాదపద్మాలను సేవించే భాగ్యం కలిగించు" అని నిండు భక్తితో ప్రార్థించాడు. భగవంతుడతడి ప్రార్థనను ఆలకించి ఆ పుట్టు గ్రుడ్డికి దివ్య దృష్టిని ప్రసాదించాడు. ధృతరాష్ట్రుడు ఆ దివ్యరూపాన్ని దర్శించి, "పరమ పురుషా! నీ దివ్య రూపాన్ని దర్శించ గలిగాను కృతార్థుడనయ్యాను. నీ దివ్య రూపం చూసిన ఈ కళ్ళతో ఇతరులెవర్నీ చూడలేను. కావున నువ్విచ్చిన ఈ దృష్టిని ఉపసంహరించు" అని ప్రార్థించాడు. సభాసదులంతా ధృతరాష్ట్రుని విశాల నయనాలను చూసి ఆశ్చర్య చకితులయ్యారు. అ తర్వాత పుండరీకాక్షుడా విశ్వరూపాన్ని ఉపసంహరించాడు. శ్రీకృష్ణుడు కుంతి ఇంటికి పోయి జరిగినదంతా ఆమెకు తెలిపాడు. అక్కడి నుండి ఇంద్రప్రస్థానికి ప్రయాణమయ్యాడు. భీష్మ ద్రోణాదులంతా యుద్ధం అనివార్యమని తలచి తమ చేతుల్లో ఏమీ లేదని మౌనంగా ఉండిపోయారు. దుర్యోధనుడు మాత్రం తన పంతమే నెగ్గిందని సంతోషపడ్డాడు.

శ్రీకృష్ణుడు కర్ణునికి కర్తవ్యాన్ని ఉపదేశించడం :

శ్రీకృష్ణుడు హస్తినాపురం నుండి బయలుదేరేముందు కర్ణుని కలుసుకొని ఇలా అన్నాడు. "కర్ణా! నువ్వు సూర్యభగవానుని అనుగ్రహం చేత కుంతికి పుట్టినవాడవు. అనగా ధర్మరాజుకన్నా కూడా జ్యేష్ఠుడవు. ఈ రహస్యం పాండవులకు కూడా తెలియదు. పాండవుల్ని ఒప్పించి రాజ్యలక్ష్మిని నీకు దక్కేట్లు చూస్తాను. నేనే దగ్గరుండి నీ పట్టాభిషేకాన్ని జరిపిస్తాను. ధర్మరాజు నీ ప్రక్కన నిలబడి వినయంగా వింజామరలు విసురుతాడు. భీముడు శ్వేతఛత్రాన్ని పుచ్చుకొని నిలబడతాడు. అర్జునుడు నీ రథానికి సారథ్యం చేస్తాడు. నకుల సహదేవులు నీ కనుసన్నలలో మెలుగుతారు. ఆ విధంగా నువ్వీ భూమండలాన్నంతా ఏలవచ్చు. ఇంకోమాట, ద్రౌపది కూడా నిన్ను భర్తగా అంగీకరిస్తుంది. కావున ఇంకా ఏమీ ఆలోచించకుండా నే చెప్పినట్లు పాండవులకు జ్యేష్ఠుడవు కమ్ము. నువ్విట్లా

చెయ్యడం వల్ల యుద్ధం ఉండదు. దాని మూలాన జరిగే జననష్టమూ ఉండదు. పైగా బంధువులంతా సంతోషిస్తారు" అని హితోపదేశం చేశాడు. అందుకు కర్ణుడు ఇలా బదులు చెప్పాడు.

మహాపురుషా! నా జన్మ వృత్తాంతమంతా వారూ వీరూ అనుకుంటూంటే నేనూ విన్నాను. నన్ను కన్న కుంతి దయలేకుండా నదిలో వదిలేసిపోయింది. నన్ను సూతుడు తీసుకొని పోయి భార్య అయిన రాధకివ్వగా ఆమే నన్ను పెంచి పెద్ద చేసింది. ప్రేమతో విద్యాబుద్ధులు నేర్పించింది. ఇంతకాలం నన్ను తన కుమారుడిగా చూసుకుంటూ వచ్చిన వారిని వదలి ఈ రోజున కుంతిని తల్లిగా స్వీకరించడం ధర్మమేనా? లోకంలో అది మర్యాద పెంచేదిగా ఉంటుందా? రాధిక, సూతులే నాకు జాతక కర్మ సంస్కారలన్నీ ఆ కులానికి తగిన రీతిలోనే జరిపించారు. తల్లిదండ్రులకు సేవలు చెయ్యకుండా ఈ రోజున వాళ్ళను వదలి రావడం న్యాయం కాదు. వీడు సూత పుత్రుడని అంతా నన్ను నిరసిస్తూ ఉంటే దుర్యోధనుడు నన్ను తన పుత్రులకన్నా, సోదరులకన్నా ఎక్కువగా గౌరవించి నన్ను రాజును చేశాడు. అటువంటి దుర్యోధనుని వదలి పాండవులతో చేరడం ఉత్తమ కార్యమనిపించుకోదు. నేను అర్జునుని ఎదిరించి యుద్ధం చేయడాన్ని చూడాలని ఉవ్విళ్ళూరుతున్న జనులంతా నవ్విపోరా? అంతేకాదు నేను పాండవుల్లో చేరినందువల్ల అర్జునునకు అపకీర్తే కాని కీర్తి కలుగదు. కృష్ణా! నాకు తెలిసినదంతా చెప్పాను. నీ ఉపదేశాన్ని స్వీకరించలేనందుకు నన్ను క్షమించు. నా జన్మ రహస్యాన్ని గుండెల్లోనే దాచుకో. ఎందువల్ల నంటే, ధర్మరాజు నాకన్నా చిన్నవాడని తెలిస్తే రాజ్యాధికారాన్ని అంగీకరించడు. అటువంటి ధర్మాత్ముడే రాజ్యానికి నాథుడు కావాలేగాని, నావంటి కులహీనుడు కాదు. ధర్మరాజు, అర్జునుల కీర్తి శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నాను. కార్యములన్నింటినీ నడిపే నీవుపద్రష్టవు. ఈ రణయజ్ఞంలో కురుపుత్రులంతా యజ్ఞపశువుల్లా సంహరించబడతారు. ధర్మరాజు సోమయాజి కావాలి. ఇట్టి మహాయజ్ఞం చేత పుణ్యభూమి అయిన కురుక్షేత్రంలో మా బోటి వారందరికీ సద్గతులు కలగాలి. కావున ఓ కృష్ణా! నువ్వీ కార్యానికి విఘ్నం కలిగించకు" అన్నాడు.

కర్ణుని మాటలు విన్న పుండరీకాక్షుడు "కర్ణా! కేవలం దుర్యోధనునిపట్లగల విశ్వాసం చేత నువ్వు నా ఉపదేశాన్ని స్వీకరించనంటున్నావు. అర్జునునితో యుద్ధం చేస్తానని ఉవ్విళ్ళూరుతున్నావు. అందువల్ల నీకు అపజయమేగాని జయం కలుగదు. ఈ యుద్ధంవల్ల ఎంతోమంది మరణించక తప్పదు. అందువల్ల నీ మనస్సుకు అశాంతియే మిగిలేది" అన్నాడు. అందుకు కర్ణుడు "కృష్ణా! యుద్ధము తప్పక జరుగబోతోందని తెలిపే శకునాలు అనేకం కనిపిస్తున్నాయి. పాండవులే గెలుస్తారని కూడా నాకనిపిస్తుంది. ఈ యుద్ధానికి నేను, దుశ్శాసనుడు, శకుని కారణభూతులం. దేవదేవా! నేనీ మహా సముద్రాన్నీదుకుంటూ ఊర్ధ్వలోకంలో నిన్ను దర్శించుకుంటాను. ఈ వరం మాత్రం కాదనకు." అని ప్రార్థించాడు.

కురుక్షేత్రానికి ప్రయాణం

(ఈ భాగం శ్రీమహాభారతము భీష్మ పర్వం నుండి గ్రహించబడింది.)

కౌరవ పాండవుల మధ్య యుద్ధం అనివార్యమయింది. ఇరుపక్షాల వారు దేశంలో ఉన్న రాజులందర్నీ యుద్ధంలో తమకు సహాయం చెయ్యమని కోరుకుని వారి వారి పక్షాల్ని బలోపేతం చేసుకుంటున్నారు. అట్లాగే అర్జునుడు, దుర్యోధనుడు ఒకే సమయాన శ్రీకృష్ణుని సహాయం అర్థించేందుకు ద్వారకకు వెళ్ళారు. వాళ్లు వెళ్లిన సమయానికి శ్రీకృష్ణుడు నిద్రపోతున్నట్లు నటించాడు. చేసేది లేక దుర్యోధనుడు శ్రీకృష్ణుడి తల ప్రక్కగా ఉన్న ఆసనం పైన కూర్చున్నాడు. అర్జునుడు మాత్రం ఎంతో వినయ విధేయతలతో శ్రీకృష్ణుని పాదాలచెంత కూర్చున్నాడు. కొద్దిసేపటికి శ్రీకృష్ణుడు నిద్రలేచాడు. ఇద్దరూ లేచి నిలబడ్డారు. దుర్యోధనుడు "కృష్ణా! మాకూ పాండవులకు యుద్ధం తప్పేట్లు లేదు. అందుకు నీ సహాయం కావాలి" అన్నాడు. అర్జునుడు కూడా ఆమాటే చెప్పి ఊరుకున్నాడు. శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ "నేను ఒక్కణ్ణి ఒకరి పక్షాన ఉంటాను. అయితే ఆయుధం పట్టను. యుద్ధం చెయ్యను. నాకు తోచిన సలహా ఏదైనా ఉంటే చెప్తాను. ఇక నా సైన్యం అశ్వాలు, గజాలు, రథాలు సర్వ సంపదలు రెండో పక్షాన ఉంటాయి. మీలో ఎవరికేది కావాలో అది కోరుకోండి. అయితే ఒక్కమాట నేను నిద్రలేవగానే పాదాలవద్దనున్న అర్జునుణ్ణి ముందుగా చూశాను. ఆ తర్వాతనే తల ప్రక్కన కూర్చున్న దుర్యోధనుణ్ణి చూశాను. కనుక ముందుగా అర్జునుడేది కోరుకుంటాడో అదిపోను మిగిలిందంతా నువ్వు తీసుకో, అంతేకాదు, అర్జునుడు చిన్నవాడు, లోకాచారాన్ననుసరించి ధర్మరాజుకు అణిగి నడచుకోవాల్సినవాడు. ఇక నువ్వంటావా? అందరికన్నా పెద్దవాడవు. పైగా రారాజువి" అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు అర్జునునికి అమృత ధారల్లా అనిపించాయి. "కృష్ణా! నువ్వొక్కడివీ మా పక్షాన ఉండు. చాలు. అదే మాకు పదివేలు" అన్నాడు. అందుకు శ్రీకృష్ణుడు "అర్జునా! నువ్వు పొరపాటు పడటంలేదు గదా. నేను ఆయుధం పట్టుకోను. యుద్ధం అసలే చెయ్యను. ఈ విషయం నువ్వు బాగా గుర్తుంచుకున్నావా?" అని రెట్టించి అడిగాడు. అయినా అర్జునుడు తొణకలేదు, బెణకలేదు. "కృష్ణా! నువ్వు నిరాయుధుడవైనా సరే. యుద్ధం చెయ్యకపోయినా సరే. నువ్వు మాత్రం మాపక్షాన ఉంటేచాలు" అన్నాడు. దుర్యోధనుడు అర్జునుని అజ్ఞానానికి నవ్వుకున్నాడు. "కృష్ణా! నువ్వు తప్ప మిగిలిన వీరులను, గజాశ్వ రథాలను నాకు ఇవ్వు" మని అడిగాడు. భగవంతుడు సంతోషించాడు. వారు కోరుకున్నట్లే అనుగ్రహించి పంపాడు. అయితే బలరాముడు మాత్రం ఎవరి పక్షాన పోరాడనని నిక్కచ్చిగా చెప్పేసి తీర్థయాత్రలకై వెళ్ళిపోయాడు.

శ్రీకృష్ణుని వద్ద అనుమతి పొందిన పాండవ సేనలన్నీ కురుక్షేత్రానికి చేరుకున్నాయి. అందరికీ తగిన రీతిలో శిబిరాలు ఏర్పాటయ్యాయి. పాండవుల పక్షాన ఏడు అక్షౌహిణీల సేన సిద్ధంగా ఉంది. వారికి ధృష్టద్యుమ్నుడు సర్వసేనాధిపతిగా నియమితుడయ్యాడు. కౌరవుల పక్షాన పదకొండు అక్షౌహిణీల సైన్యం సిద్ధమయింది. వీరుకాక ఇంకా ప్రాణాలర్పించేందుకు అనేక వీరులు సిద్ధమయి వచ్చారు. వాళ్ళముఖాల్లో ఎక్కడా దైన్యం కనిపించడంలేదు. నిరుత్సాహమన్నది మచ్చుకైనా కనిపించడంలేదు.

మృత్యుదేవత మాత్రం నోరు తెరచుకొని వీళ్ళందర్నీ మ్రింగేందుకు సిద్ధంగా ఉంది. అక్కడున్న మహర్షులంతా ఈ భీభత్సాన్ని చూడలేక దూరంగా అడవుల్లోకి వెళ్ళిపోయారు. శ్రీకృష్ణుడు సర్వసాక్షి కనుక ఎంతమాత్రం కలత చెందక అందరికీ ఉత్సాహాన్ని కలిగిస్తున్నాడు. కృష్ణావతారానికి ఫలం ఈ కురుక్షేత్ర సంగ్రామమేనన్న విషయం మనం ముందు ముందు తెలుసుకోగలుగుతాం.

కౌరవ సేనలు కూడా అత్యుత్సాహంగా కురుక్షేత్రంలో కొలువు తీరాయి. భీష్ముడాసేనలకు సర్వ సేనాధిపతి. భీష్మ, ద్రోణ, కృపాచార్య, అశ్వత్థామలు దుర్యోధనునికి అనేక విధాలుగా ధర్మ బోధ చేశారు. అయినా అతడు అందరి మాటల్నీ పెడచెవిన పెట్టాడు. అదే ధర్మబోధను ధృతరాష్ట్రుడికూడా చెప్పి చూశారు. అయినా విధి మాత్రం మరోవిధంగా ఉండటం చేత అతడికి ఆ హితబోధలేవీ రుచించలేదు. కొడుకు మాటలకే కట్టుబడి పోయాడు. విదురుడు ధర్మోపదేశం చేసినప్పుడు మనస్సు మెత్తపడినా దుర్యోధనుడు రాగానే మనస్సు రాయి చేసుకుంటున్నాడు.

కురుక్షేత్రంలో యుద్ధానికి అన్నీ సిద్ధమయ్యాయి. రెండు పక్షాలవారూ వారి వారికి నిర్దేశించిన ప్రదేశాల్లో శిబిరాలు ఏర్పాటయ్యాయి. జ్ఞాతుల మధ్య వైరం వల్ల కౌరవ వంశం సర్వ నాశనమై పోతుందని సంజయుడు ఎంతచెప్పినా ధృతరాష్ట్రుని చెవికెక్కలేదు. అప్పుడే త్రికాలజ్ఞుడైన వ్యాసభగవానుడు వచ్చి ఇలా ఉపదేశించాడు. "ధృతరాష్ట్రా! రాజులందరికీ ఆయుర్దాయం నిండింది. యుద్ధంలో సర్వనాశనం కావడానికి ఇంకా ఎంతో సమయం లేదు. నువ్వా సర్వ నాశనాన్నంతా కళ్ళారా చూడాలని కోరుకుంటున్నావా? నువ్వు కోరుకుంటే నీకు దివ్య దృష్టిని ప్రసాదిస్తాను" అన్నాడు. అందుకు ధృతరాష్ట్రుడు "మునీంద్రా! జ్ఞాతులు ఒకరినొకరు చంపుకొంటూ ఉంటే చూడలేను. అయితే యుద్ధంలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసు కోవాలనుకుంటున్నాను. నువ్వు నాయెడల కనికరం చూపాలనుకుంటే యుద్ధవార్తలు ఎప్పటికప్పుడు నాకు తెలిసేట్లు చెయ్యి అన్నాడు. అందుకు వ్యాసభగవానుడు సంజయునకా దివ్యదృష్టిని ప్రసాదిస్తానని అందువలన అతడు రాత్రింబవళ్ళు జరిగే వృత్తాంతాన్నీ తెలుసు కోగలుగుతాడు. అంతేకాదు రెండు పక్షాల వారి మనసుల్లో మెదిలే ఆలోచనలు కూడా సూతుడు గ్రహించగలుగుతాడు. యుద్ధరంగంలో యధేచ్ఛగా సంచరించినా శస్త్రాస్త్రాలేవీ ఇతణ్ణి బాధించవు. ఎంతెంత దూరాలు ప్రయాణం చేసినా ఇతడి దేహం అలసిపోదు. రణరంగంలోని వార్తలన్నింటినీ నీకు కళ్ళకు కట్టినట్టు చెప్పగలుగుతాడు.

రాజా! విపరీతంగా జననష్టం అయ్యే సమయం దగ్గర పడుతోంది. ఇందుకు ఎవరూ విచారించాల్సిన పనిలేదు. దీన్ని ఆపగల శక్తి కూడా ఎవరికీ లేదు. ఈ యుద్ధంలో ధర్మం జయిస్తుంది. అధర్మం నశిస్తుంది. అందువల్ల నువ్వు నిశ్చింతగా ఉండు. కురుపాండవుల కీర్తి చిరకాలం ఉండేట్లు చేస్తాను. రాజా! ఎటు చూసినా దుశ్శకునాలే కనిపిస్తున్నాయి. పశు పక్ష్యాదుల చేష్టలు కూడా భయంకర జన నష్టాన్నే సూచిస్తున్నాయి. అనగా భూభారం తగ్గే సమయం దగ్గరపడింది. ధృతరాష్ట్రా! మనస్సు కుదుట పరచుకో. దైవనిర్ణయాన్ని మార్చడం ఎవరితరమూ కాదు. ఈ సంజయుడికి దివ్య దృష్టిని ప్రసాదించాను. అతడు ఎప్పటికప్పుడు రణరంగంలో జరిగేదంతా పూసగ్రుచ్చినట్లు చెబుతాడు. నువ్వు దుఃఖాన్ని తట్టుకోలేని సమయాల్లో నన్ను తలచుకో. నేను వచ్చి నీకు ఉపశమనాన్ని కలిగిస్తాను.

రాజా! నీ కొడుకులకు విజయం చేకూరేట్లు కనిపించడంలేదు. కౌరవ సేనల్లోని ఆయుధాలనుండి మంటలు కనిపిస్తున్నాయి. నాయకుల పతాకాల నుండి పొగలు వస్తున్నాయి. ఇంకా ఎన్నో లెక్కకు మించిన దుర్నిమిత్తాలు కనిపిస్తున్నాయి. నీ పుత్రులంతా అధర్మమార్గంలోనే నడుస్తున్నారు. పాండుపుత్రులంతా ధర్మాన్ని వదలకుండా ఆచరిస్తున్నారు. కావున వారిద్దర్నీ పిలిపించి యుద్ధాన్ని ఆపగలిగితే ఆ ప్రయత్నం చెయ్యి. మానవ ప్రయత్నం ఉండాలి గదా. అది ఫలిస్తుందా లేదా అన్నది నీవు నిర్ణయించేదికాదు. నాబోటి వాళ్ళందరూ లోక హితాన్నే కోరుకుంటాం" అని ఉపదేశించాడు.

వ్యాసభగవానునితో ధృతరాష్ట్రుడు "మునీంద్రా! మా వంశక్షేమాన్నాశించి మీరు చేసిన ఉపదేశాలన్నింటినీ అర్థం చేసుకున్నాను. ఇంతవరకు నేను చెయ్యగలిగింది, చెయ్యవలసిందంతా చేశాను. నా ప్రయత్న లోపం ఎంతమాత్రం లేదు. నయాన భయాన ఎంత చెప్పినా దుర్యోధనుడు నా మాటల్ని లెక్కజెయ్యలేదు. యుద్ధానికే కాలు దువ్వాడు. ఇప్పుడింక నేను చెయ్యగలిగిందేమీ లేదు. యుద్ధవిశేషాల్ని సంజయుడి ద్వారా తెలుసుకునేందుకు నాకు వరం ప్రసాదించు" అన్నాడు. అంతట వ్యాసమహర్షి సంజయుడికి దివ్యదృష్టిని ప్రసాదించి అదృశ్యుడయ్యాడు.

భీష్ముడు కౌరవ పక్షానికి సర్వ సేనాధిపత్యం వహించాడు. వీరులందర్నీ సమావేశపరచి ఈవిధంగా ఉద్బోధించాడు. "ఓ క్షత్రియ వీరులారా! మీకోసం నిర్ణయించబడిన స్వర్గద్వారాలు ఇప్పుడు తెరచుకున్నాయి. ఈ మార్గం ఎంతో విశాలమైనది. ఈ ద్వారం గుండా స్వర్గానికి వెళ్ళవచ్చు, బ్రహ్మలోకానికి వెళ్ళవచ్చు. ఈ మార్గం నిన్న మొన్నటిది కాదు. మీ పూర్వులకు పూర్వులకు పూర్వులు నిర్ణయించారు. కలత చెందని మనస్సుతో మీరా మార్గాన్ని అనుసరించండి. అయితే రోగంతో గానీ, మరే ఇతర కారణాల చేతగానీ తీసుకుంటూ మరణించే వారికీ ద్వారాన ప్రవేశం ఉండదు. యుద్ధం చేసి వీర మరణం పొందిన వారికే ఈ మార్గం తెరచుకుంటుంది. మీరు కూడా ఈ మార్గాన్నే ఎంచుకోండి. పూర్వం నాభాగుడు, యయాతి, మాంధాత, నహుషుడు, నృగుడు మొదలైన రాజులంతా ఈ మార్గానే ప్రయాణం చేశారు. కనుక ఈ మార్గం సనాతన మైనది. అనగా ఇదే సనాతన ధర్మం" అన ఉద్బోధించాడు.

ఇక అటు పాండవ పక్షానికి దృష్టద్యుమ్నుడు సర్వసేనాధిపతి. ఇరుపక్షాల సేనలు ధర్మరాజుకు అనంత సేనా సాగరంలా కనిపించింది. మనస్సు కలత చెందింది. అర్జునుడు ధర్మరాజును ఊరడించి విజయం మనదే నని ధైర్యం చెప్పాడు. అర్జునుని బోధతో ధర్మరాజు మనస్సు కాస్త కుదుట పడింది. అటు భీమసేనుడు కూడా యుద్ధం ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతుందా? అని ఎదురుచూపులు చూస్తున్నాడు. పాండవ సేనకు మధ్యగా శ్రీకృష్ణుడు తన రథాన్ని నిలిపి అర్జునునికి సారథ్యం వహించేందుకు సిద్ధంగా ఉన్నాడు. రథ ధ్వజంపై కపిరాజు చత్రంతోపాటు రెపరెపలాడుతున్నాడు. దివ్యాస్త్రాలు, శస్త్రము లన్నీ రథంలో సమకూర్చారు. అప్పుడు భగవంతుడైన శ్రీకృష్ణుడు "ధనుంజయా! మనకెదురుగా భీష్మాచార్యుల రథం నిలచి ఉంది చూశావా? అతడు పరశురామునే ఓడించిన మహాశూరుడు. అతడితో పోరు సామాన్యమైనది కాదు. కావున నువ్వు దుర్గాదేవిని స్తోత్రం చెయ్యి. ఆ దేవి నుండి అభయం పొందు. దాంతో విజయం నీవశమవుతుంది" అన్నాడు.

ఈ ఘట్టంలో మనం తెలుసుకోదగిన విషయాలు రెండున్నాయి. ఒకటి భీష్ముడు వీరులనుద్దేశించి చేసిన ఉద్బోధ. భీష్ముడు కేవలం సర్వసేనాధిపతియే కాదు. సకల ధర్మవేత్త, శాశ్వత బ్రహ్మచర్య నిష్ఠుడు. కారణాంతరాలచేత భగవదంశతో భూలోకంలో అవతరించాడు. గొప్ప భగవద్భక్తుడు. అందువల్లనే క్షత్రియులందరికీ న్యాయ సమ్మతమైన ఉద్బోధ చేశాడు. క్షత్రియులకు యుద్ధంలో మరణించడమే వీరోచితమైనదని, అనాదిగా వస్తున్న ఆచారమన్నదే ఈ ఉపదేశ సారం. అయితే ఇతర వర్ణాలకు ఈ మార్గం ప్రధానం కాదని స్పష్టంచేసి చెప్పాడు. ఎందువల్లనంటే ఒక్కొక్క జాతికి ఒక్కొక్క ధర్మం శ్రేష్ఠమైనదని విధి శాసిస్తోంది. అనగా వర్ణాశ్రమ ధర్మాల్ని తప్పక పాటించడం శుభదాయకమని భీష్ముని అభిప్రాయం కావున ఉత్తమ గతులు కోరుకునే వారు శాస్త్రోక్తమైన కులాచారాల్ని తప్పక ఆశ్రయించాలని గ్రహించాలి. ఇక రెండవ విషయమేమంటే, శ్రీహరి సర్వ కర్తయే అయినా విజయం పొందేందుకు దుర్గాదేవిని ప్రార్థించమని అర్జునునికి ఉపదేశించడం. ఎందువల్ల? శ్రీకృష్ణుడు సర్వసాక్షి, పరమేశ్వరుడు దుర్గాంబయే మహామాయ. భగవదిచ్ఛననుసరించి లోకాలన్నీ సృష్టించి పోషించి, హరించేది ఆమెయే. బ్రహ్మవిష్ణుమహేశ్వరులు కూడా ఆమె అధీనంలోనే ఉంటారు. కావున బ్రహ్మాండాలన్నింటికీ నాయిక మహామాయయే. భగవంతుడు అవతరించినప్పుడు ఆమెయే పరమాత్మునికి బాసటగా నిలుస్తుంది. తానే కార్యాలన్నింటినీ నిర్వహిస్తుంది. అందువల్లనే అర్జునుని దుర్గాంబను స్తోత్రంచేసి ఆమె అభయాన్ని పొందమని శ్రీకృష్ణుడు దుర్గాంబ స్తోత్రాన్ని ఉపదేశించాడు. దుర్గాంబ అంటే సామాన్య దేవతగా భావించరాదు. ఆమె పరదేవత అని, భగవదిచ్ఛా స్వరూపిణి అని, సకల బ్రహ్మాండ నాయకి అని, కార్యాలన్నీ ఆమెయే నిర్వహిస్తుందని తెలుసుకోవాలి.

అర్జునుడీవిధంగా రథాన్నధిరోహించి యుద్ధరంగాన్నంతా ఒక్కసారి కలియజూశాడని సంజయుడు చెప్పచిగా ధృతరాష్ట్రుడు “సంజయా! వ్యాసభగవానుని అనుగ్రహంచేత నీకు అన్ని విషయాలు కరతలామలకమై ఉంటాయని నాకు తెలుసు. అయితే భీష్ముడు యుద్ధానికి సారథ్యం వహించిన విశేషాలన్నీ నాకు చెప్పవలసింది” అని అడిగాడు. అందుకు సంజయుడు ఇలా బదులు చెప్పాడు.

1

అర్జున విషాదయోగం

భారతదేశాన్ని పాలించిన రాజవంశాలలో కురువంశం ఉత్కృష్టమైనది. ఆ వంశం చివరి రోజుల్లో ధృతరాష్ట్రుడు, పాండురాజు అనే ఇద్దరు అన్నదమ్ములు పరిపాలించారు. వారిలో ధృతరాష్ట్రుడు పుట్టుకతోనే గ్రుడ్డివాడు. అందువల్ల అతడు రాజుగా వ్యవహరించినా రాజ్యపాలన అంతా పాండురాజే నిర్వహించేవాడు.

ధృతరాష్ట్రుడి భార్య గాంధారి. వారికి నూరుగురు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. వీరందర్నీ కౌరవులు అని అంటారు. వాళ్ళంతా చిన్నతనం నుంచే అధర్మపరులయ్యారు. వీళ్ళలో పెద్దవాడు దుర్యోధనుడు. మిగిలిన వాళ్ళంతా ఇతడి చెప్పుచేతల్లో ఉంటూ ఇతడు చేసే దుర్మార్గపు పనుల్లో చేదోడువాదోడుగా ఉండేవారు. ధృతరాష్ట్రుడు తన పుత్రులంతా అధర్మపరులయ్యారని తెలిసినా సంతానంపైన పెంచుకున్న గ్రుడ్డిప్రేమ వలన వాళ్ళని మందలించేవాడు కాదు. దాంతో వాళ్ళాడింది ఆట పాడింది పాటగా సాగిపోయేది. దుర్యోధనాదులు తండ్రిలేని పాండవులకు కష్టాలు కలిగిస్తూ ఆనందించేవాళ్ళు.

రెండవవాడు పాండురాజు. ఇతడికి ఇద్దరు భార్యలు. పెద్దభార్య కుంతి, రెండవ భార్య మాద్రి. వీరికి ఐదుగురు పుత్రులు కలిగారు. వారే ధర్మరాజు, భీమసేనుడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు. ఈ అయిదుగురిని పాండురాజు పుత్రులు కనుక పాండవులు అని పిలిచేవాళ్ళు. వీళ్ళ చిన్నతనంలో తండ్రి (పాండురాజు) చనిపోయాడు. ఆయనతోపాటు రెండవ భార్య మాద్రి సహగమనం చెయ్యడం వల్ల పిల్లలందర్నీ కుంతియే పెంచి పెద్ద చేసింది. ఈమె వసుదేవుని సోదరి. అంటే శ్రీకృష్ణునికి మేనత్త అవుతుంది. దీంతో పాండవులు శ్రీకృష్ణుడి మేనత్త మేనమామ బిడ్డలయ్యారు. పాండవులందరూ దైవాంశతో పుట్టారు. అందువల్ల ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని విడిచిపెట్టే వాళ్ళు కాదు. అందువల్ల ధర్మమే వారిని రక్షిస్తూ ఉండేది.

శ్రీకృష్ణుడు శ్రీమహావిష్ణువు అవతారం. భగవంతుడు ఎప్పుడూ ధర్మం పక్షానే ఉంటాడు గదా! అందువల్ల భగవంతుడైన శ్రీకృష్ణుడు పాండవుల పక్షానే ఉండేవాడు. కౌరవులంతా కలసి పాండవులకు అనేక కష్టనష్టాలు కలిగించేవారు. మాయోపాయం చేత వారి రాజ్యాన్నంతా లాకున్నారు.

వాళ్ళ రాజ్యం వాళ్ళ కిప్పించాలని శ్రీకృష్ణుడు చేసిన సంధి ప్రయత్నాలేవీ ఫలించలేదు. పాండవుల్ని యుద్ధంచేసి వాళ్ళ రాజ్యాన్ని సంపాదించుకోమని దుర్యోధనుడు తెగేసిచెప్పాడు. ధృతరాష్ట్రుడు కూడా దుర్యోధనుడికి ఎదురు చెప్పలేక యుద్ధానికి అంగీకరించాడు. ఆ యుద్ధంలో శ్రీకృష్ణుడు అర్జునుడి రథానికి సారథిగా ఉన్నాడు.

యుద్ధానికి సమయం నిర్ణయమైంది. కురుక్షేత్రంలో యుద్ధం జరగాలని పెద్దలు నిశ్చయించారు. దేశంలో ఉండే అధర్మపరులైన రాజులంతా దుర్యోధనుడి పక్షాన చేరారు. ధర్మపరులంతా పాండవుల పక్షాన చేరారు. రెండు పక్షాల సేనల్ని కురుక్షేత్రంలో ఎదురెదురుగా నిలబెట్టారు. అర్జునుడు రథసారథి అయిన శ్రీకృష్ణుణ్ణి తన రథాన్ని రెండు సేనలకు మధ్యన నిలబెట్టమన్నాడు. శ్రీకృష్ణుడు అట్లాగే నిలబెట్టారు.

అర్జునుడు ఎదురు పక్షాన ఉండే రాజులందర్నీ చూశాడు. తన పరాక్రమం తనకు తెలుసు. యుద్ధంలో వీరందర్నీ సంహరించి తాను రాజ్యాన్ని పొందగలడు. కానీ ఆ క్షణంలో అతడి మనస్సు కలత చెందింది. ధనుస్సు విల్లంబులు క్రిందపారేశాడు. రథం దిగి నిలబడ్డాడు. శ్రీకృష్ణుడు కూడా రథం పైనుండి దిగాడు. అర్జునుడు అమాంతం శ్రీకృష్ణుడి పాదాలపై పడి వలవలా ఏడుస్తూ "కృష్ణా! ఎదుటి పక్షంలో ఉన్నవాళ్ళందరూ నాకు తాతలు, తండ్రులు, బంధువులు, విలువిద్య నేర్పిన గురువులు. నేను వీళ్ళందర్నీ చంపి సంపాదించే రాజ్యాన్ని, ఆ నెత్తుటి కూడు తినాలా? బంధువుల్ని చంపి తినే నెత్తుటి కూడు కన్నా అడుక్కుతినడం మేలుగదా! కాబట్టి నేనీ అధర్మాన్ని చెయ్యలే"నని మొరపెట్టుకున్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి సముదాయించి చెప్పిన మాటల్నే 'శ్రీకృష్ణార్జున సంవాదమని', 'బ్రహ్మవిద్య'అనీ, 'యోగశాస్త్ర'మని ప్రసిద్ధి చెందిన భగవద్గీత అయింది.

ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు కావడం వలన యుద్ధరంగానికి పోలేదు. పోయినా ప్రత్యక్షంగా చూడలేదు. అందువల్ల ఎప్పటికప్పుడు జరిగింది జరిగినట్లుగా (మనం టెలివిజన్‌లో చూసినంత వివరంగా) సంజయుడు చూసి ధృతరాష్ట్రుడికి చెప్తూ ఉండేవాడు. దాని సారమే ఈ భగవద్గీత. శ్రీకృష్ణ పరమాత్మ చేసిన జ్ఞానబోధ ఒక్క అర్జునుడికి మాత్రమే కాదు, మానవాళి యావత్తుకూ. సదాచారాల్ని బోధించడమే ఆ పరమాత్ముని ఆశయం. అంతేకాదు. భగవద్గీత వృద్ధాప్యంలో మాత్రమే చదువుకోవాల్సిన గ్రంథమన్న అపోహ చాలామందిలో ఉంటుంది. నిజానికి ఇది విద్యార్థి దశ నుండి చదివి, ఆకళింపు చేసుకుంటే ఉత్తమ పౌరుడవుతాడు. ఉత్తమ పౌరులంతా కలసింది ఉత్తమ సమాజమవుతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అదే ఈ సమాజ వికాసానికి పరమ లక్ష్యం అందుకు మా వంతు కృషి మేం చేస్తున్నాం. విద్యార్థులారా! ఇక మిగిలిందంతా మీ చేతుల్లోనే ఉంది.

లోకంలో అనేక సందర్భాల్లో చేదు అనుభవాలు తారసపడడం కద్దు. అసమర్థత, వైఫల్యం, పిరికితనం, భయం–వీటి కారణంగా జనించే వైరాగ్యం కారణంగా విషాదం ఆవరించడం మనం చూడవచ్చు. అటువంటి సమయంలో మన గోడును మనలో కొలువై ఉన్న భగవంతునికి మొరపెట్టుకుంటే అది విషాదయోగం అవుతుంది.

లోకానుభవాలు వెగటు పుట్టినప్పటికీ మనిషి దృష్టి భగవంతుని వైపుకు పోవడం కష్టమే. కాని ఒక్కసారి భగవదభిముఖంగా తిరిగితే, అతడు ఆధ్యాత్మిక జీవితానికి శ్రీకారం చుట్టినట్లే అవుతుంది.

కురుక్షేత్ర సంగ్రామంలో మొదటి నుంచి జరిగింది ఏమిటో ఆవేదనతో ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి ప్రశ్నించడంతో భగవద్గీత ప్రారంభమవుతుంది.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ!

ధృతరాష్ట్రుడు : సంజయా! ధర్మభూమి అయిన కురుక్షేత్రంలో కౌరవ పాండవ సేనలు సంసిద్ధమయ్యాయి గదా. ఆ తర్వాత ఏం జరుగుతోందో చెప్పు.

సంజయుడు : రాజా! దుర్యోధనుడు ద్రోణాచార్యుల వారితో ఇలా అంటున్నాడు: "ద్రోణాచార్యా! పాండవ సైన్యానికి కావలసిన వ్యూహాన్నంతా ద్రుపద రాజకుమారుడైన ధృష్టద్యుమ్నుడు రచించాడు. మనకు ఎదురుగా పాండవ సైన్యాలు మోహరింపబడి ఉండటం చూస్తున్నారుగదా. వారి సైన్యంలో ధనుర్విద్యలో ప్రావీణ్యం కలిగిన శూరులు అనేకమంది ఉన్నారు. వాళ్ళల్లో యుధామన్యుడు, విరాటుడు, ద్రుపదుడు మొదలైన వారెందరో ఉన్నారు. వారంతా మహారథులు. అట్లాగే మన ప్రక్కన ఉండే యోధులను గూర్చి కూడా చెప్తాను వినండి.

"యుద్ధంలో అపజయమంటే ఏమిటో ఎరుగని భీష్మపితామహుడున్నాడు. కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ వంటి మహాయోధులు ఇంకా ఎందరో ఉన్నారు. వీరంతా నాకోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధంగా ఉన్నారు. వీరుకాక ఇంకా ఎంతో మంది మన పక్షంలో ఉన్నారు. మన వ్యూహాన్ని పితామహుడైన భీష్ముడు రచించాడు. భీష్ముడే మన సైన్యానికంతటికీ ఏకైక రక్షకుడు. అట్లాగే పాండవ పక్షం అంతా భీముడి సంరక్షణలో భద్రంగా ఉంది. మీరిప్పుడు చేయవలసిందల్లా వ్యూహానికి ముఖద్వారం దగ్గర ఉంటూ భీష్మునికి అండగా నిలవడమే!"

దుర్యోధనుడు ద్రోణాచార్యులతో మాట్లాడుతూ ఉండగానే, దుర్యోధనుడి సంతోషం కోసం భీష్మాచార్యుల వారు సింహగర్జన చేస్తూ శంఖాన్ని పూరించారు. ఆ శంఖారావం అతిభయంకరంగా యుద్ధరంగమంతా మారుమ్రోగింది. **1-13**

భీష్మాచార్యుల శంఖనాదానికి బదులుగా పాండవ సైన్యం నుండి అర్జునుడు దేవదత్తాన్ని, శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని, ధర్మరాజు అనంత విజయాన్ని, భీమసేనుడు పౌండ్రమనే శంఖాన్ని, నకులుడు సుఘోషమును, సహదేవుడు పుష్పకమనే శంఖాన్ని పూరించారు. ఈ శంఖనాదాలన్నీ కలసి మహా ఘోషగా ఏర్పడి ధృతరాష్ట్రుని సేనలను కలవరపరచాయి. ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు కౌరవసేనలన్నింటినీ పరికించి చూసి శ్రీకృష్ణునితో ఇలా అంటున్నాడు. **14-20**

"కృష్ణా! నా రథాన్ని రెండు సేనలకు మధ్యన నిలుపు. అందుమూలంగా నేను ఎవరెవర్ని ఎప్పుడెప్పుడు ఎదుర్కోవాలో నిశ్చయించుకుంటాను. దుర్యోధనుడి పక్షాన ఎవరెవరు చేరారో కూడా నాకు స్పష్టంగా తెలుస్తుంది గదా" అన్నాడు. **21-23**

ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు కోరినట్లుగానే శ్రీకృష్ణుడు భీష్మద్రోణులకు ఎదురుగాను, మిగిలిన రాజులంతా కనిపించే విధంగా రథాన్ని నిలపాడు. అప్పుడు అర్జునుడు ఎదురుగా తాతగారైన భీష్ముణ్ణి, ఇంకా ఎంతో మంది సన్నిహితులైన బంధువర్గాన్ని చూశాడు. ఆ ప్రక్కనే గురువు ద్రోణాచార్యులవారిని చూశాడు. వీరు కాకుండా మేనమామ శల్యుడు కనిపించాడు. సోదరులైన దుర్యోధనాధు లున్నారక్కడ. వారి ప్రక్కనే పుత్ర సమానులైన లక్ష్మణకుమారుడివంటి వాళ్ళెందరో ఉన్నారు. గురుపుత్రుడు అశ్వత్థామ ఇంకా అనేకమంది స్నేహితులు బంధువులు కనిపించారు.

వీరందర్నీ చూస్తున్న అర్జునుడిలో మోహం ఆవహించింది. వారందరిపైనా ప్రేమ పెల్లుబికింది. దుఃఖం ఆపుకోలేకపోయాడు. శ్రీకృష్ణుడితో ఇలా అంటున్నాడు. "కృష్ణా! యుద్ధం చేద్దామని ఎంతో ఉత్సాహంతో వచ్చాను. ఇక్కడకువచ్చి ఈ బంధువర్గాన్నంతా చూసి వారితో యుద్ధం చెయ్యటానికి ఎందుకింత ఉత్సాహపడుతున్నానా? అని నాపై నాకే జుగుప్స కలుగుతోంది. పిడచకట్టుకుపోయి నోట మాటరావడం లేదు. చేతుల్లో జవసత్త్వాలు క్షీణించి ధనుస్సు చేతిలో నుండి జారి పడిపోయింది. రథంపై నిలబడలేక పోతున్నాను. మనస్సంతా వికలమై పోయింది. ఓ కేశవా! నా మనస్సులో అపశకునాలు చోటుచేసుకుంటున్నాయి. నా సొంత బంధుజనాన్ని చంపి నా గొప్పదనాన్ని చాటుకోవాలని లేదు. ఇటువంటి రాజ్యాన్నిగానీ, అందువల్ల లభించే సుఖాల్ని గానీ కోరుకోవడం లేదు. ఓ గోవిందా! ఇటువంటి రాజ్యం వల్ల నేను ఎటువంటి పురుషార్థాల్నీ సాధించలేను. ఇక బ్రతికి ఉండటం వలన ఏం ప్రయోజనం సాధించగలుగుతాను. నేను రాజ్యాన్ని పొందేది ఎందుకు? తల్లిదండ్రుల్ని, తాతగారైన భీష్ముణ్ణి, విద్యనేర్పిన గురువుల్ని, స్నేహితులను బంధువుల్ని సుఖపెట్టేందుకేగదా! వారందర్నీ యుద్ధంలో చంపిన తర్వాత రాజ్యభోగాలు అనుభవించేందుకు ఎవరూ మిగిలి ఉండరుగదా. అటువంటి అల్పమైన ఈ రాజ్యాన్ని నేను కోరుకోవడం లేదు. ఓ జనార్దనా! దుర్యోధనాదులు ఆకతాయిలే కావచ్చు. అయినా వాళ్ళను చంపడం వలన మాకు పాపమే వస్తుంది. ఎట్లాగంటావా? ఓ మాధవా! దుర్యోధనాదులు ఎంతటి దురాత్ములైన వాళ్ళంతా నా జ్ఞాతులే. గదా. వాళ్ళను చంపడంవల్ల వంశం నశిస్తుంది. తెలిసి తెలిసి ఈ వంశ నాశనానికి కారకుణ్ణి కాలేను. కులాన్ని నాశనం చేయడం వల్ల కులధర్మం నాశనమవుతుంది. కులధర్మం నశిస్తే అధర్మం వ్యాప్తి చేసినట్లే గదా. కృష్ణా! అధర్మం ఎప్పుడైతే వ్యాపిస్తుందో అప్పుడు కులస్త్రీల పాతివ్రత్యం మంటకలసిపోతుంది. పాతివ్రత్యం నశిస్తే జాతులు కలసిపోయి వర్ణ సంకరం ఏర్పడుతుంది. ఇంతకన్నా మహాపాపం ఇంకొకటి ఉంటుందా? అంతే కాదు వీరు చేసే శ్రాద్ధ కర్మలు, పిండప్రదానాలు, ఉదక తర్పణాలు పితృదేవతలకు చేరవు. అందువల్ల వారుకూడా నరకానికి పోతారు. రాజ్యసుఖాలు పొందాలనే కుతూహలంతో మన మీ మహాపాపానికి ఒడిగట్టాం. నిరాయుధుడనైన నన్ను దుర్యోధనాదులు చంపే ప్రయత్నం చేసినా కూడా నేను వారిని అడ్డుకోను" అన్నాడు.

ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు ఆ విధంగా దుఃఖంలో కంపించిపోయి చేతులోని ఆయుధాల్ని క్రింద పారవేసి రథం దిగి నేలపై నిలబడ్డాడు. **24-47**

2

సాంఖ్యయోగం

సాంఖ్యం అంటే జ్ఞానం.

సంజయుడు: రాజా! అర్జునుడు యుద్ధభూమిలో తనవాళ్ళందర్నీ చూశాడు. వాళ్ళంతా తనవల్ల చనిపోతారనే భావన అతణ్ణి కుదిపేసింది. దుఃఖంతో కళ్ళ నీళ్ళుపెట్టుకున్నాడు. అతని స్థితి చూసిన శ్రీకృష్ణుడు ఇలా అంటున్నాడు.

శ్రీకృష్ణుడు : అర్జునా! శాస్త్రజ్ఞానం లేనివాళ్ళే యుద్ధం చెయ్యడం పాపమని అందువల్ల స్వర్గం పొందరని భావిస్తారు. కానీ నీవంటి ఉత్తమ క్షత్రియుడు యుద్ధం చెయ్యనంటే అందువల్ల అపకీర్తి పాలవుతాడు. పండితులు నిన్ను నిందిస్తారు. అయినా యుద్ధానికి సిద్ధమయి వచ్చిన తర్వాత చివరి ఘడియలో ఎందుకు మోహానికి లొంగుతున్నావు? **1-3**

పాలల్లో నానబెట్టిన అటుకుల్లాగా, మెత్తగా ఉండేవాడు ఎందుకూ పనికిరాడు. అతడు అప్రయోజకుడు. స్థిరత్వం కలవాడే వీరుడు. వీరుడైనవాడు అన్నీ సాధించగలడు.

- శ్రీరామకృష్ణ పరమహంస.

అర్జునుడు : ఓ కృష్ణా! వయోవృద్ధుడు, తాతగారు అయిన భీష్మణ్ణి ఇన్నాళ్ళూ పూలతో పూజిస్తూ ఉండేవాడిని. నాకు అస్త్ర విద్యలన్నీ నేర్పిన ద్రోణాచార్యులను, ఇంకా ఎంతో మంది పెద్దల్ని ఎదుటి పక్షంలో చూస్తున్నాను. అటువంటి వారిపైన బాణాలు వేసి ఎట్లా బాధించగలను? ఇంతకు పూర్వం ఎన్నడూ వారిని గట్టిగా ఎదిరించి మాట్లాడలేదు. లోకంలో ఏ పని చేస్తూ జీవనం చేస్తూ ఉంటామో అవన్నీ ఫలాన్ని ఆశించి చేసేవే కాబట్టి పాపకర్మలనే అనిపిస్తోంది. యుద్ధం చెయ్యడం క్షత్రియుడికి ధర్మమే అయినా విద్యచెప్పిన గురువును చంపటం వల్ల జీవనోపాధికి అవసరమయ్యే రాజ్యం లభిస్తుంది. ఆ రాజ్యంతో భోగాలను అనుభవించడమే క్షత్రియుడి లక్ష్యమా? కనుక పాపహేతు అవుతుంది. అంటే గురువును, బంధువులను చంపి రాజ్యాన్ని పొందటం కన్నా భిక్షాటన చేసి బ్రతకడం మేలనిపిస్తోంది.

యుద్ధం చేసి పాపం సంపాదించుకోవటమా, భిక్షాటన చేసి జీవయాత్ర సాగించడమా? ఈ రెండింటిలో ఏది మేలో, ఏది కీడో తెలుసుకోలేకుండా ఉన్నాను. యుద్ధంలో విజయం సాధిస్తామని చెప్పలేం. జయాపజయాలు దైవాధీనాలుగదా! నేను ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నాను. నేను నీకు శిష్యుడను. శరణాగతుడనవుతున్నాను. నా పట్ల దయవుంచి కర్తవ్యం బోధించు. ఇప్పుడు నేను

అనుభవిస్తున్న దుఃఖం శత్రువులు లేని ముల్లోకాధిపత్యాన్ని నాకు కట్టబెట్టినా నాలో కలిగిన దుఃఖాన్ని, తాపాన్ని తొలగించలేవు.

సంజయుడు : "ఓ ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు తాను యుద్ధం చెయ్యలేనని శ్రీకృష్ణుని శరణాగతి కోరుతున్నాడు. యుద్ధరంగంలో రెండు సేనల మధ్యన నిలబడి దుఃఖిస్తున్న అర్జునుని చూసి శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు : ఓ అర్జునా! ఎవరి గురించి అయితే దుఃఖించరాదో వారిని గూర్చి దుఃఖిస్తున్నావు. నువ్వు చెప్తున్న భీష్మద్రోణాదులందరూ ఆత్మరూపం చేత అంటే నిత్యులే. చావులేనివారే. నామరూపాలన్నీ దేహానికి చెందినవే. అంటే నశించేవే. అటువంటి నశించే దేహాలను గూర్చి దుఃఖించడం అవివేకమే.

నువ్వూ నేను మనమందరం ఆత్మస్వరూపులమే. ఆత్మకు మరణం ఉండదు. అంటే ఈ శరీరాలు నశించినా మనం(ఆత్మ) ఉంటాం. అంటే ఆత్మ భూత భవిష్యద్వర్త మానకాలాలు మూడింట్లోనూ ఉంటుంది. ఆత్మ పుట్టేది కాదు నశించేదీ కాదు. కనుక ఆత్మ నిత్యం. నేను నువ్వు వాడు అన్న నామరూపాలన్నీ శరీరానికి సంబంధించినవి.

ఈ దేహంతో సంబంధం ఉన్న జీవునికి శరీరంలో కలిగే బాల్యం, యౌవనం, వృద్ధాప్యం వంటి మార్పులు ఎంత సహజమో, మరణం తర్వాత మరో దేహాన్ని ఆశ్రయించడం కూడా అంతే సహజం. అంటే పాత శరీరంలో ఉన్న జీవుడు ప్రస్తుతం కొత్త శరీరాన్ని ఆశ్రయించి ఉన్న జీవుడు ఒక్కడే కావడం వలన జీవుడు నిత్యుడు. అతడికి మరణం ఉండదు. పామరులకు పాత శరీరాన్ని విడిచినప్పుడు దుఃఖం, కొత్త శరీరాన్ని ఆశ్రయించినప్పుడు మోహం కలుగుతూ ఉంటాయి. ఓ అర్జునా! నువ్వు అటువంటి శోక మోహాల్ని విడిచిపెట్టి ధీరుడవు కమ్ము.

ఓ కౌంతేయా! ఇంద్రియాల అనుభవం వలన శరీరానికి శీతోష్ణాల వంటి ద్వంద్వాల అనుభవం వస్తూ పోతూ ఉంటుంది. అంటే చర్మానికి మంచుగడ్డ తాకినప్పుడు చల్లగాను వేడితాకినప్పుడు దుఃఖాన్ని కలిగిస్తాయి. అంటే ఇంద్రియాలకు కలిగే ఈ అనుభవం శాశ్వతం కాదు. కాబట్టి ఓ భరత వంశీయుడా! నువ్వు ఇటువంటి ద్వంద్వాలను భరించేందుకు సిద్ధంగా ఉండు. అట్లా కానివాడు మోక్షానికి అర్హుడు కాదు.

ఈ జగత్తు అంతా మాయాకల్పితం. అంటే శాశ్వతమైనది కాదు. అటువంటి కల్పిత జగత్తులో ఏర్పడే శీతోష్ణాల వంటి ద్వంద్వాలు కూడా అశాశ్వతాలే. జగత్తు అశాశ్వతమైనదైతే ఆత్మ అందుకు భిన్నంగా శాశ్వతమైనది. అంటే సద్రూపమైనది. ఆత్మ ఏ విధమైన వికారాన్ని చెందేది కాదు కాబట్టి అదొక్కటే నిత్యమైనది. అందువల్ల శీతోష్ణాలవల్ల కలిగే హర్షాన్నిగాని దుఃఖాన్నిగానీ సమభావంతో స్వీకరించాలి.

సద్రూపమైన ఆత్మ పరబ్రహ్మమై ఈ జగత్తు అంతా వ్యాపించి ఉంటుంది. అట్టి ఆత్మకు వృద్ధిక్షయాలుండవు. ప్రళయ కాలంలో కూడా ఆత్మ, పరమాత్మ అవినాశి (నాశనం కానిది)గా ఉంటాయి.

ఒక గురువు బ్రహ్మము మాయ రెండని చెప్పడానికి రెండు వేళ్ళు చూపాడు. ఆ తర్వాత ఒక వేలును మడచి, మాయ మాయమైన తర్వాత ఇక బ్రహ్మం తప్ప ఇంకేమీ ఉండదని బోధించాడు. - శ్రీరామకృష్ణ పరమహంస

ఓ అర్జునా! ఆత్మ–జీవుడు (జీవాత్మ) నశించేది కాదు కనుక యుద్ధం చెయ్యి. నువ్వు చెప్తున్న భీష్మద్రోణాదుల దేహాల్ని మాత్రమే నువ్వు యుద్ధంలో చంపుతున్నావు. ఆ శరీరం ఎప్పుడైనా నశించాల్సిందే. వారి జీవాత్మల్ని చంపడం ఎవరితరమూ కాదు.

అటువంటి ఆత్మను చంపుతున్నాను అన్నవాడు, చంపబడుతున్నానని అనుకునేవాడు ఇద్దరూ అజ్ఞానులే. అంటే ఆత్మ స్వరూపం తెలియనివారే.

ఆత్మను అవినాశి అనో నిత్యమైనదనో అంటున్నారు. అంటే పూర్వం లేకుండా వర్తమానంలో కనిపించేదాన్ని పుట్టుట అంటాం. కానీ ఆత్మ పూర్వమూ ఉంటుంది. ఇప్పుడూ ఉంటుంది, భవిష్యత్తులోనూ ఉండేదే కాబట్టి దాన్ని అవినాశి అని నిత్యమైనదని అంటున్నాం. నశించే శరీరానికుండే ఆరు పరిణామాలు ఆత్మకుండవు. అవేవంటే పుట్టడం, ఉండటం, వృద్ధి చెందటం, విపరిమాణం చెందటం, క్షీణించడం, నశించడం. కనుక ఆత్మ అవినాశి.

ఆత్మస్వరూపం తెలుసుకున్న వానికి అజ్ఞానం తొలగి పోతుంది. అజ్ఞానం తొలగిపోయిన వారికి రాగద్వేషాలుండవు. అటువంటి స్థితిలో నేను చంపుతున్నానన్న భావం గానీ నన్ను చంపుతున్నారన్న భావంగానీ కలుగవు. కనుక ఎవరూ ఎవరినీ చంపలేడు, చంపేందుకు ప్రేరేపించనూ లేడు. **18-21**

ఒక సాధువును దుష్టుడొకడు చచ్చేట్టు కొట్టాడు. తోటి సాధువులు అతనికి సపర్యలు చేశారు. కొద్ది సేపటికి అతడికి స్పృహ వచ్చింది. తోటి సాధువులు నిన్ను కొట్టిన దెవరని అడిగారు. అందుకా సాధువు "ఈ శరీరాన్ని కొట్టిన చేతులే ఇప్పుడు శుశ్రూష చేస్తున్నా" యన్నాడు. కావున నిజమైన జ్ఞానికి కొట్టిన వాడు కొట్టబడినవాడు అన్న వ్యత్యాసం తెలియదు. - శ్రీరామకృష్ణ పరమహంస.

మానవులు ఎలా చిరిగిపోయిన వస్త్రాల్ని విడిచేసి కొత్త వస్త్రాల్ని ధరిస్తున్నారో అదే విధంగా ఆత్మ జీర్ణించి పోయిన శరీరాన్ని వదలి కొత్త శరీరాన్ని, పొందుతుంది. అందువల్ల ఆత్మకు ఎటువంటి వికారాలూ ఉండవు. **22**

పాము దాని కుబుసము రెండూ ఒకటి కాదు. వేరువేరైనవి. అట్లాగే ఆత్మశరీరం కూడా వేరయినవి. - శ్రీరామకృష్ణ పరమహంస.

ఆత్మను అగ్ని కాల్చలేదు. నీరు తడపలేదు. అస్త్రాలు ఛేదించచలేవు. వాయువు తాకలేదు. ఎందువల్ల? ఆత్మకు అవయవాలుండవు కనుక. మార్పు అనేది అవయవాలకే ఉంటుంది కానీ ఆత్మకు కాదు. **23**

ఆత్మ దేనికీ సంబంధించినది కాదు. సుఖదుఃఖాల వంటి ద్వంద్వాలేవీ దాన్ని అంటవు. కానీ శరీరం తాను అని అనుకునేవాడిని తాకుతున్నాయి. పొగ వ్యాపించి ఉన్న చోట

(ఆకాశంలో) మసికాదు. అదే గోడను తాకితే మసిగా మారుతుంది.

- శ్రీరామకృష్ణ పరమహంస.

అర్జునా! ఆత్మ ఇంద్రియాలకు కనిపించేది కాదు. అది మనస్సుకు కూడా చిక్కేది కాదు. నిత్యమైన ఆత్మకోసం దుఃఖించడం అజ్ఞానమే. ఒకవేళ శరీరంతో పాటు ఆత్మకూడా పుడుతూ నశిస్తూ ఉంటుందని అనుకున్నా దాని కోసం దుఃఖించరాదు. ఎందువల్లనంటే ఈ జననమరణాలు సహజంగా జరిగేవే కాబట్టి దుఃఖించాల్సిన పనిలేదు.

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాద పరి హార్యేర్థే న త్వం శోచితు మర్హసి.

పుట్టిన వానికి మరణం తప్పదు. మరణించిన వానికి పుట్టుక తప్పదు. ఇటువంటి అనివార్యమైన వాటిని గూర్చి దుఃఖించడం తగదు. ఒకవేళ ఈ భీష్మ ద్రోణాదులు యుద్ధంలో మరణించకపోతే శాశ్వతంగా జీవించి ఉంటారని అనుకుంటున్నావా? నేడో రేపో పోవలసిన వాళ్ళే. అట్టి వారి కోసం దుఃఖించడం తగదు. **24-25**

బ్రహ్మం ఎటువంటిది అంటే ఎవరూ మాటల్లో చెప్పలేరు. సముద్రాన్నే చూడని వాడికి దాన్ని గురించి ఏమని వివరించి చెప్తావు. అఖండమైన జలాశయం అంటావు. లేదా పెద్దపెద్ద అలలు వస్తాయంటావు. లేదా హోరున శబ్దం వస్తూ ఉంటుందని చెప్తావు. అంతేకాని సముద్రం యొక్క స్వరూపాన్ని చెప్పలేవు. - శ్రీరామకృష్ణ పరమహంస

ఈ సృష్టిలోని జీవులన్నీ మొదట్లో కనబడకుండా మధ్యలో కనిపించి నశించిన తర్వాత కనిపించకుండా పోతున్నాయి. అటువంటప్పుడు దుఃఖించడం అవివేకం కాదా? అంటే ఈ శరీరాలన్నీ పంచభూతాలచే నిర్మించబడ్డాయి. మరణించిన తర్వాత మళ్ళీ ఆయా భూతాల్లో కలిసి పోతున్నాయి. పుట్టుకకు మరణానికీ మధ్యలో మాత్రమే కనిపిస్తూ ఉంటాయి. కనుక ఈ శరీరాలన్నీ కూడా ఒక స్వప్నం లాంటివే. స్వప్నంలో కనిపించిన వస్తువుల కోసం మేలుకున్న తర్వాత వాటి కోసం ఎవరైనా దుఃఖిస్తారా?

కొందరికి ఆత్మ అద్భుతమైనది అనిపిస్తుంది. కొందరు అద్భుతంగా వర్ణించి చెప్తారు. ఇంకొందరు ఆత్మనుగూర్చి చెప్పేదంతా అద్భుతంగా వింటారు. అయితే ఆత్మ అనేది ఇంద్రియాలకు పట్టుబడేది కాదు. అందువల్ల ఆత్మను గూర్చి విన్నా తెలుసుకున్నా చెప్పినందువల్ల ఆత్మ సాక్షాత్కారాన్ని పొందలేదు. **26-29**

వేదములు, పురాణాలు, తత్త్వశాస్త్రం వంటివన్నీ ఎంగిలికూడువంటివనే చెప్పాల్సి ఉంటుంది. ఎందువల్లనంటే అవన్నీ మానవులు నోటితో ఉచ్చరిస్తున్నారు కనుక.

అఖండ స్వరూపమైన బ్రహ్మం ఎన్నటికీ ఎంగిలి కాదు. కారణమేమంటే ఇంతవరకు పరబ్రహ్మాన్ని గూర్చి మాటల్లో చెప్పడం ఎవరికీ సాధ్యంకాదు. - శ్రీరామకృష్ణ పరమహంస.

కనుక ఓ అర్జునా! దేహంలో ఉండే దేహి(జీవుడు) ఎన్నడూ చంపబడదు. కాబట్టి ఏ జీవిని గూర్చీ దుఃఖించాల్సిన పనిలేదు. **30**

ఒకడు తనని కత్తితో నరికినట్లు కలగన్నాడు. భయంతో లేచి కూర్చున్నాడు. అయినా అతడి గుండె దబదబా కొట్టుకుంటూనే ఉంటుంది. ఎందువల్లనంటే అది మానవులకు దేహంపై ఉండే అభిమానం వల్ల. - శ్రీరామకృష్ణ పరమహంస.

క్షత్రియునికి యుద్ధం చేయడం స్వధర్మం. కాబట్టి నువ్వు వెనుకడుగు వెయ్యాల్సిన పనేలేదు. ఏ కులానికి ఏది ధర్మమో దాన్ని స్వధర్మం అంటారు. వారా ధర్మాన్ని ఆచరించి తీరాలి. క్షత్రియునికి యుద్ధం చెయ్యడం స్వధర్మం. **31**

ఓ అర్జునా! రాజులకు యుద్ధం చెయ్యడానికి అవకాశం కలిగించాడంటే స్వర్గానికి తలుపులు తెరిచినట్లేనని తెలుసుకో. ఎందువల్లనంటే, యుద్ధంలో గెలిస్తే కీర్తివస్తుంది. ఒకవేళ వీరమరణం పొందితే స్వర్గం ప్రాప్తిస్తుంది. ఏ విధంగా చూసినా క్షత్రియుడు యుద్ధం కోరుకో దగినదే. **32**

అర్జునా! క్షత్రియుడవైన నీకు యుద్ధం చెయ్యడం స్వధర్మం. నువ్వా స్వధర్మాన్ని పాటించకపోతే అపకీర్తి పాలవుతావు. అర్జునుడు రణరంగం నుండి పారిపోయాడన్న అపకీర్తి శాశ్వతంగా ఉండిపోతుంది. అంతా నిన్ను హేళనచేస్తూ చులకనగా చూస్తారు. అపకీర్తికన్నా మరణం మేలు గదా. అంతేకాదు పాపాన్ని కూడా పొందుతావు. **33-34**

దుర్యోధనుడి పక్షంలో ఉండే మహారథులందరికీ నువ్వు మహా వీరుడవని తెలుసు. నువ్వేమో ఆ పక్షాన యుద్ధం చేస్తున్నవారి ప్రాణాల మీద దయతో యుద్ధం మానేస్తానంటున్నావు. నువ్వు ఏ కారణం చెప్పినా లోకం మాత్రం అర్జునుడు యుద్ధమంటే భయపడిపారిపోయాడనే అంటుంది. అంతేకానీ నీలో, సమయం కాని సమయంలో పుట్టిన కరుణ అని మాత్రం అనుకోరు. దుర్యోధనాదులు నీ గురించి చులకనగా మాట్లాడుకోవడం కన్నా అవమానం ఇంకేముంటుంది. కాబట్టి యుద్ధం మానేస్తానని అనొద్దు. అపకీర్తికన్నా దుఃఖం మరొకటి ఉండదు. **35-36**

అర్జునా! నువ్వు కర్ణుడువంటి వీరులతో యుద్ధం చేస్తూ మరణిస్తే స్వర్గం లభిస్తుంది. అట్లా కాకుండా నువ్వే కౌరవ సేనల్ని జయిస్తే రాజ్యాన్ని పొంది భోగాలనుభవిస్తావు. రెండిటిల్లో నీకు ఏది లభించినా లాభమే. యుద్ధం కూడా యాగం లాగా స్వధర్మమే అవుతుంది. ఎందువల్లనంటే యాగంలో కూడా పశుహింస ఉంటుంది. **37**

నువ్వు సమభావాన్ని అలవాటు చేసుకో. అంటే సుఖదుఃఖాలు, జయాపజయాలు రాగద్వేషాల వంటి ద్వంద్వాలన్నింటినీ సమదృష్టితో చూడు. అప్పుడు నీకు ఏ పాపమూ అంటదు. కాబట్టి యుద్ధానికి సంసిద్ధుడవు కమ్ము. **38**

ఓ పృథ కుమారా! ఇంత వరకు నీకు సాంఖ్య యోగాన్ని అనుసరించి (పరమార్థికాన్ని) బోధించాను. ఇకపైన కర్మబంధం తొలగేందుకు సాధనమైన కర్మయోగాన్ని బోధిస్తాను. విను. ఈ మార్గం వల్ల

నష్టంగాని లాభంగాని పెద్దగా ఉండవు. పురోగతి మాత్రం అతి తక్కువగా ఉంటుంది. ఏ పాటి కొద్దిగా అనుష్ఠించినా జననమరణాల గూర్చిన భయం తొలగిపోతుంది. వేదవిహితమైన కార్యాలను పరమేశ్వరార్పణ బుద్ధితో చేస్తే మోక్షానికి దారి తీస్తుంది. **39**

ఓ కురునందనా! వివేకం లేనివారి బుద్ధి పరిపరి విధాలుగా పోతూ ఉంటుంది. ఇప్పుడు నేను ఉపదేశించిన సాంఖ్యబుద్ధిగాని, ఇకమీదట చెప్పబోయే కర్మయోగంగానీ నిన్ను స్థిర చిత్తుణ్ణి చేస్తుంది. అంటే బుద్ధిని ఒకే మార్గం పైన కేంద్రీకరించేటట్టు చేస్తుంది. విపరీత భావాలన్నీ తొలగిపోయి మనస్సు నిశ్చలమవుతుంది. **40-41**

ఓడ ఏ వైపు ప్రయాణం చేస్తున్నా దిక్సూచి మాత్రం ఉత్తర దిక్కునే చూపుతూ ఉంటుంది. అట్లాగే నిశ్చలమైన మనస్సు గలవారు ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యంపైనే దృష్టి సారిస్తారు.

-శ్రీరామకృష్ణ పరమహంస.

ఫలాపేక్షతో కర్మలు చేసేవారంతా వేద వాక్యాలకు విపరీతార్థాలనిస్తూ ఉంటారు. స్వర్గాన్ని కోరి చేసే కర్మల కన్నా మానవునికి పరమ లక్ష్యం ఉండదని తియ్యటి మాటలు చెప్తూ ఉంటారు. వారంతా అవివేకులనే అనాలి. వాళ్ళెట్లాంటివారంటే మోదుగపూల వంటివారు. మోదుగపూలు చెట్టునిండా చూడటానికి అందంగానే ఉంటాయి గానీ వాటివల్ల కాయగాని పండుగాని లభించదు. కోరికలు పెట్టుకొని కర్మలు (కామ్య కర్మలు) చేసేవారు, భోగాలు, ఐశ్వర్యాల పట్ల మనస్సు లగ్నమై ఉన్నవారిని బహిర్ముఖులు అంటారు. అటువంటివారు ఎన్నటికీ అంతర్ముఖులు కాలేరు. అటువంటివారి వివేక విజ్ఞానమంతా కప్పబడి ఉంటుంది. అటువంటి మూఢులకు యోగబుద్ధి, సాంఖ్యబుద్ధి కలుగదు.

42-44

రాబందులు ఆకాశంలో ఎంతో ఎత్తున ఎగురుతున్నా వాటి దృష్టి అంతా నేలపైనే కుళ్ళిపోయిన శవాల మీదనే ఉంటుంది. అట్లాగే వేద వేదాంగాల్లో ఎంత పాండిత్యం ఉన్నా మనస్సు కోరికలతో నిండి ఉన్నవారు భగవంతుణ్ణి దర్శించలేరు.

- శ్రీరామకృష్ణ పరమహంస.

వేదాలు కర్మల్ని గూర్చి తెలుపుతున్నాయి. కర్మలన్నీ సత్త్వరజస్తమో గుణాలతో కూడుకున్నవే. అట్టి కర్మలన్నీ పాపపుణ్యాల గూర్చి, వాటి వల్ల కలిగే ఫలాల గూర్చి చెబుతాయి. నువ్వు అటువంటి కామ్య కర్మలు చెయ్యద్దు. నువ్వు శీతోష్ణాలు, కష్ట సుఖాల వంటి ద్వంద్వాలకు అతీతంగా ఉండు. అప్రమత్తుడై ఉన్నవాడే సత్త్వ గుణం గలవాడై ద్వంద్వాలకు అతీతుడవుతాడు. సత్త్వ గుణం వల్ల నిష్కాముడవుతాడు. నిష్కాముడి మనస్సు నిశ్చలంగా ఉంటుంది. అందువల్ల శ్రేయస్సు లభిస్తుంది. **45**

ప్రపంచమంతా నీటిమయమై ఉన్నప్పుడు బావితో అవసరం ఏముంటుంది? అట్లాగే జ్ఞానికి వేద కర్మలతో పని ఉండదు. అంటే జ్ఞానం పొందేంతవరకు కర్మలు చేస్తూనే ఉండాలి. **46**

రాజానుగ్రహం ఉన్న పనివాడు వీధిలో బిచ్చమెత్తేవాడిని కన్నెత్తైనా చూడడు. అదే విధంగా ఈశ్వరానుగ్రహం వల్ల పరమానందాన్ని పొందే ఆత్మ అల్పమైన ప్రాపంచిక సుఖాలను ఆశించదు. *- శ్రీరామకృష్ణ పరమహంస.*

అర్జునా! కర్మ చెయ్యడానికి మాత్రమే నీకు అధికారం ఉంది. కానీ కర్మ ఫలాన్ని ఆశించే అధికారం నీకు లేదు. కర్మ ఫలాన్ని ఆశిస్తే నువ్వు కర్తవు కావాల్సి ఉంటుంది. కర్తవ్యం నీపైన వేసుకొని కర్మలు చేస్తే జనన మరణ వలయంలో చిక్కుకోవాల్సి వస్తుంది. అందువల్ల ఫలాన్ని ఆశించకుండా కర్మలు చెయ్యి. అట్లాగని కర్మలు చెయ్యడం మానరాదు. **47**

పడవ నీళ్ళల్లో ఉండవచ్చు కానీ నీళ్ళు పడవలో ఉండరాదు. అదే విధంగా మనిషి ప్రపంచంలో జీవించవచ్చుగానీ ప్రాపంచిక వ్యామోహాలు అతడి హృదయంలో ప్రవేశించకూడదు. - శ్రీరామకృష్ణ పరమహంస.

ఓ ధనంజయా! నిరాసక్తుడవై జయాపజయాలలో ఆసక్తి లేనివాడివై సమదృష్టిగలవాడవై కర్మలు చేస్తూండు. అటువంటి సమబుద్ధినే యోగమంటారు. అప్పుడే అంతఃకరణం శుద్ధి అయి జ్ఞాన ప్రాప్తి కలుగుతుంది. దాన్నే సిద్ధి లేక యోగం అంటారు. **48**

ధనవంతుల ఇంట్లో తోటమాలి ఉంటాడు. అతడు పెంచే తోట, తోటలోని మొక్కలు అన్నీ తనవనే భావనతో పనిచేస్తాడు. అందరితో నా తోట, నా తోటలోని మొక్కలని అంటూ ఉంటాడు. కానీ ఏ కారణం చేతనైనా అతణ్ణి యజమాని పనిలో నుండి తొలగిస్తే అన్నీ వదులుకొని పోయేందుకు సిద్ధంగా ఉండాలి. అట్లాగే ఈ ప్రపంచం నుండి నిష్క్రమించేందుకు సాధకుడు సిద్ధంగా ఉండాలి. కనుక నిష్కామ కర్మల్నే చేస్తూ ఉండాలి. - శ్రీరామకృష్ణ పరమహంస.

ఓ ధనంజయా! ఈశ్వరారాధన కొరకు సమభావంతో చేసే కర్మలే ఉత్కృష్టమైనవి. కామ్య కర్మలన్నీ జనన మరణాలకు కారణమయ్యేవే. కామ్యకర్మల్ని ఆచరించేవారిని దీనులు అని అంటారు. కనుక అర్జునా నువ్వు అటువంటి దీనుడవు కావద్దు. కాబట్టి సాంఖ్య బుద్ధిని అలవర్చుకో. పరమార్థజ్ఞానాన్ని తద్ద్వారా మోక్షాన్ని పొందు. **49**

నిశ్చలమైన మనస్సు కలిగి, సమబుద్ధిని అలవరచుకొన్నవాడు ఈ జన్మలోనే పాపపుణ్యాల నుండి విముక్తి పొందుతున్నాడు. కర్మల్ని నేర్పుగా చెయ్యడాన్నే యోగం అంటారు. నువ్వు అటువంటి యోగాన్ని ఆశ్రయించు. **50**

చంచల బుద్ధిగల యోగి ఒకడు పర్వత గుహలో తపస్సు చేసుకుంటున్నాడు. అదే సమయంలో చర్మకారుడొకడు బజారులో ఏకాగ్రతతో చెప్పులు కుట్టుకుంటున్నాడు. వీరిద్దరిలో చంచలమనస్కుడైన యోగికన్నా ఏకాగ్రతతో చెప్పులు కుట్టుకునే చర్మకారుడే గొప్పవాడు. - స్వామి వివేకానంద.

సమత్వ బుద్ధి కలిగిన జ్ఞానులు కర్మఫలాన్ని కోరుకోకుండా జనన మరణ బంధాల నుండి విముక్తి పొందుతున్నారు. అంటే ముక్తిని పొందుతున్నారు. **51**

"అనిత్యం ద్వారా నిత్యాన్ని పొందు."

- శ్రీరామకృష్ణ పరమహంస.

ఓ అర్జునా! నీ బుద్ధి మోహమనే కాలుష్యాన్ని ఎప్పుడు దాటుతుందో అప్పుడు లోగడ విన్న శాస్త్రాల విషయంలోను, ఇకముందు వినాల్సిన శాస్త్రాలయందు కూడా వైరాగ్యభావం కలుగుతుంది. అంటే యోగాభ్యాసం వల్ల అంతఃకరణం శుద్ధి అవుతుంది. దానివల్ల బుద్ధి మోహమనే కాలుష్యాన్ని అతిక్రమిస్తుంది. అటువంటి స్థితిలో శాస్త్రాలన్నింటిపైనా మనస్సు విముఖత చూపుతుంది. అనాత్మ విషయాలన్నీ వ్యర్థమైనవేనని గ్రహించి వైరాగ్యం జనిస్తుంది. **52**

అనేక విషయాలు తెలుసుకున్న నీ మనస్సు కలత చెందకుండా ఎప్పుడైతే పరమాత్మయందే స్థిరంగా నిలిచి ఉంటుందో అప్పుడు యోగసిద్ధిని పొందగలవు. **53**

మొదట ఈశ్వరానుగ్రహాన్ని సంపాదించి తర్వాత ప్రాపంచిక భోగాలను వెతుకు. అంతేగాని ఇందుకు భిన్నంగా చెయ్యకు. అట్లాగే ఆత్మజ్ఞానం పొందిన తర్వాత ప్రాపంచిక భోగాలు అనుభవించినా మనస్సు చంచలం కాదు. - శ్రీరామకృష్ణ పరమహంస.

కేశవా! సమాధి స్థితిలో ఉండే స్థితప్రజ్ఞుని లక్షణాలు ఎట్లా ఉంటాయి? అతడు ఎట్లా మాట్లాడతాడు? ఎట్లా సంచరిస్తాడు?

అతడు పూర్తిగా కోరికలన్నీ నశించిన వాడై ఉంటాడు. అంటే భార్యా బిడ్డలు, ధనంపై కోరికలను విడిచిపెట్టిన వాడని అర్థం. ఎవడైతే ఆత్మయందు ఆత్మతృప్తి చెందుతూ ఉంటాడో అతడినే స్థిత ప్రజ్ఞుడు అంటారు. అంటే ఆత్మానాత్మ వివేకం కలిగి, విషయ సుఖాలపై కోరిక లేనివాడై ఆత్మారాముడై సంతృప్తిచెంది ఉండేవాడని భావం. **54-55**

జీవించి ఉన్నప్పుడే మరణించిన వానివలె ఆశాపాశములు నశించినవాడే నిజమైన ఆత్మజ్ఞాని అవుతాడు. - శ్రీరామకృష్ణ పరమహంస.

దుఃఖం కలిగినప్పుడు దిగులు చెందనివాడును, సుఖము కలిగినప్పుడు పొంగిపోని వాడును, రాగము, భయము లేనివాడిని స్థితప్రజ్ఞుడు అని చెప్పవలయును. అటువంటివానిని ముని అని, జ్ఞాని అని అంటారు. దేహం మీద, జీవితం మీద కోరికలేనివాడు. శుభాశుభ ఫలాలను పొందినప్పుడు సంతోషించడు, ద్వేషించడు. అటువంటి ముని వివేకం చేత కలిగే ప్రజ్ఞ వలన మోక్షాన్ని పొందుతాడు.

56

నీ కోరికల్ని జయించేందుకు ప్రయత్నించు. నువ్వా ప్రయత్నంలో విజయాన్ని సాధిస్తే నీ శరీరంలో గొప్ప మార్పు కలుగుతుంది. ఆ మార్పు ఏమిటయ్యా అంటే, ఇంద్రియాల్ని ఆత్మ స్వరూపంలో లీనం చేసే మేధానాడి పెరుగుతుంది. ఆ నాడి పెరిగిన తర్వాత ఆత్మజ్ఞానం లభిస్తుంది. - శ్రీరామకృష్ణ పరమహంస.

ఎవడు విషయాలన్నింటి పట్లా ఆసక్తి లేకుండా ఉంటాడో, ఇష్టమైన వాటిపై అభిమానం, ఇష్టం లేనివానిపై ద్వేషాన్నీ పొందకుండా ఉంటాడో అటువంటి వానిని, జ్ఞాని అంటారు. **57**

కొండ శిఖరంపై నుండి చూసే వారికి భూమిపై ఉండే గడ్డిపోచ, మహావృక్షం రెండూ సమానంగానే కనిపిస్తాయి. బ్రహ్మసాక్షాత్కారం పొందిన పిదప అన్నీ సమానంగా తెలుస్తాయి. అప్పుడు మంచి చెడ్డ గొప్ప బీదా అన్న తేడాలుండవు.- శ్రీరామకృష్ణ పరమహంస.

తాబేలు తన అవయవాలను లోపలకు ముడుచుకున్న రీతిలో ఏ యోగి ఇంద్రియాల్ని విషయవాంఛల నుండి మరల్చగలుగుతున్నాడో అట్టివానిలో జ్ఞానం సుస్థిరంగా ఉంటుందని చెప్పాలి. అంటే ప్రజ్ఞా స్థిరత్వం పొందాలంటే ఇంద్రియాల్ని జయించడం అతి ముఖ్యం. **59**

పాము విష జంతువు. దాన్ని ఎవరైనా పట్టుకొంటే కాటువేస్తుంది. అదే పాములవాడు పామును పట్టుకోవడమే కాదు దాన్ని ఆభరణంగా మెడలో వేసుకుంటాడు. అట్లాగే ఆత్మజ్ఞానం గలవానికి ఇంద్రియ వాంఛలు ఎట్టి ఆపదనూ కలుగజేయవు.

- శ్రీరామకృష్ణ పరమహంస

ఇంద్రియాల్ని బలవంతంగా అదుపులో ఉంచుకున్నందువల్ల విషయ అనుభవాలైతే ఉండవు కానీ విషయ వాసనలు విడిచిపెట్టిపోవు. పరమాత్మ దర్శనం అయిన తర్వాత ఆ విషయ వాసనలు కూడా నశించిపోతాయి.

అంటే చెరసాలలో ఉండే ఖైదీలకు విషయభోగాలు అనుభవించే అవకాశం ఉండదు. కానీ వాటిని అనుభవించాలన్న కోరిక మాత్రం వారిని విడిచిపెట్టదు. సాధకుల మొదటి స్థితి ఇట్లాగే ఉంటుంది. ఇంద్రియ వాసనలు బాధిస్తూనే ఉంటాయి. ఉడకపెట్టిన ధాన్యం మొలకెత్తవు. రసమన్నా ఆశ అన్నా వాసనలన్నా ఒకటే అర్థం. ఈ వాసనలను ఉడకపెట్టి మళ్ళీ మొలకెత్తకుండా చెయ్యాలి. అందుకు మార్గం ఏమిటంటే ఇహలోకంలో దొరికే సుఖాలన్నీ పరమాత్మ స్వరూపాలే అని తెలుసుకున్నవాడు వాటిపై ఆశ పెట్టుకోడు, భయమూ పెట్టుకోడు. మీదు మిక్కిలి వాటన్నింటినీ భగవత్స్వరూపాలుగా పూజిస్తాడు.

ఓ అర్జునా! ఇంద్రియాలు మహా శక్తిమంతమైనవి. ప్రజ్ఞావంతులైన వారిని కూడా ఇంద్రియాలు వశపరచుకుంటూ ఉంటాయి. **60**

విషసర్పాలు తిరిగే ఇంట్లో నివసించేవారు ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. అట్లాగే ప్రపంచంలో జనులు కూడా కోరికలకు, ధనానికి, ప్రలోభాలకు లోనుకాకుండా జాగ్రత్తపడాలి.

- శ్రీరామకృష్ణ పరమహంస

ఇంద్రియాలను వశపరచుకున్న సాధకుడు స్థిరబుద్ధితో సర్వాంతర్యామి అయిన పరమాత్మను నేనే అన్న నిశ్చయబుద్ధితో అభ్యాసం చెయ్యాలి. ఇట్లా సాధనను తీవ్రతరం చేసిన తర్వాత వాని ఇంద్రియాలు అతడి ఆధీనంలో ఉంటాయి. అతణ్ణే స్థితప్రజ్ఞుడు అంటారు. **61**

ఇంట్లో ఆత్మీయుడైన వ్యక్తి మరణించినప్పుడు ఎవరి మనసైనా శారీరక భోగాలపైకి పోతుందా? ఎందువల్ల మనస్సంతా దుఃఖంతో నిండి ఉంటుంది. అదే విధంగా మనస్సు

పూర్తిగా ఈశ్వరునిపై లగ్నమై ఉన్నప్పుడు అతడు ఇంద్రియ సుఖాల గూర్చి ఆలోచించడు. ఇంద్రియాలన్నీ వాటంతట అవే అణగారిపోయి ఉంటాయి. - శ్రీరామకృష్ణ పరమహంస

విషయాలను గూర్చి అదే పనిగా ఆలోచించేవానికి అనురాగం అధికమై అదే కోరికగా మారుతుంది. ఆ కోరికే చివరకు క్రోధంగా రూపొందుతుంది. క్రోధం వల్ల వివేకం నశిస్తుంది. ఇందువల్ల జ్ఞాపకశక్తి నశిస్తుంది. అంటే గురూపదేశం చేత కలిగిన జ్ఞానాన్నే జ్ఞాపకశక్తి అని అర్థం చేసుకోవాలి. గురూపదేశాన్ని నష్టపోయిన వాడు మోక్షానికి అయోగ్యుడవుతాడు. **62-63**

రాగద్వేషాదులు లేనివాడు ఇంద్రియాలను స్వాధీన పరచుకొన్నప్పటికీ కొన్ని విషయ సుఖాలు పొందుతున్నప్పటికీ అంతఃకరణం అతడి వశంలో ఉండటం వలన మనశ్శాంతిని కోల్పోడు. అట్టి అంతఃకరణం గలవాని బుద్ధి ఆకాశంలాగా సర్వత్రా ఆత్మ స్వరూపంలో నిశ్చలమై ఉంటుంది. అట్టివానికి బాహ్యప్రపంచం కష్టాలతో కూడుకున్నదిగా అనిపించదు. ఈశ్వర స్వరూపాన్నే దర్శిస్తాడు. ఈ విధంగా ప్రశాంతమైన మనస్సుకు ఆత్మస్వరూపం గోచరిస్తుంది. **64-65**

తోడు పెట్టిన పాలు పెరుగు కావాలంటే నిశ్చలంగా ఒకే చోట ఉంచాలి. అట్లాగే దైవత్వాన్ని కోరుకునే మనస్సు నిశ్చలంగా ఉండాలి. - శ్రీరామకృష్ణ పరమహంస

ఇంద్రియనిగ్రహం లేనివాడు వివేకం నశించి ఆత్మను గూర్చి ఆలోచించడు. ఆత్మ చింతన చెయ్యనివానికి శాంతి లభించదు. శాంతి లేనివాడికి సుఖమెక్కడిది? **67**

పచ్చిమట్టితో కుమ్మరి కుండల్ని తయారుచేస్తాడు. ఒకసారి అవి కాల్చిన తర్వాత మళ్ళీ ఆ కాల్చిన పెంకులతో వేరే కుండలను చెయ్యలేడు. అదే విధంగా విషయభోగాలనే నిప్పులో కాలిపోయిన మానవుని మనస్సులో ఉత్తమమైన భావాలు జనించవు. కనుక దానికి ఒక చక్కటి ఆకారాన్నివ్వడానికి సాధ్యంకాదు. - శ్రీరామకృష్ణ పరమహంస

నీళ్ళల్లో ప్రయాణం చేసే నావ పెనుగాలులు వీస్తున్నప్పుడు గమ్యాన్ని చేరుకోదు. పెడదారులు పడుతుంది. అట్లాగే ఇంద్రియాల్ని అనుసరించి పోయే మనస్సు వివేకాన్ని కోల్పోతుంది. **67**

ఇంద్రియ సుఖాలు తామర (చర్మవ్యాధి) వంటిది. ఆ వ్యాధి ఉన్నవాడికి గోకినకొద్దీ సుఖంగా ఉంటుంది. కానీ అట్లా గోకడం వలన తామర ఇంకా ఎక్కువ మేర వ్యాపిస్తుంది. అట్లాగే ఇంద్రియ సుఖాలను అనుభవించే కొద్దీ మనస్సు గొప్పతనాన్ని కోల్పోతుంది.
- శ్రీరామకృష్ణ పరమహంస.

గొప్ప బాహువులు గల ఓ అర్జునా! విషయముల యందు ఆసక్తి కలిగి ఉండటం ఇంద్రియాల స్వభావం. విషయాలంటే రూప శబ్ద స్పర్శ రస గంధములు. ఎవరి ఇంద్రియాలైతే ఈ ఐదు విషయాల పట్ల ఆసక్తి చూపకుండా ఉంటాయో అటువంటి వానికి ఆత్మ సాక్షాత్కారానికి సంబంధించిన తత్త్వం, ప్రజ్ఞ లభించి సుస్థిరమవుతుంది. ఆత్మజ్ఞానం కోరుకునేవారు తప్పనిసరిగా ఇంద్రియాలను వశంలో ఉంచుకోవాలి. **68**

మచ్చికకాని గుర్రాలు, నోళ్ళకు కళ్ళెం తగిలిస్తే గాని పరుగెత్తడం నేర్చుకోవు. అట్లాగే కోరికల్ని అదుపులో ఉంచుకోకపోతే భగవంతుని దర్శించలేరు. కనుక జ్ఞాన మార్గంలో సాధన చేసేవారు కోరికల్ని తప్పకుండా అదుపులో ఉంచుకోవాలి. అంటే మొదట ఇంద్రియనిగ్రహం, పిదప భగవద్దర్శనం. - శ్రీరామకృష్ణ పరమహంస

ప్రాణులన్నీ నిద్రపోతున్నప్పుడు (రాత్రిగా ఉన్నప్పుడు) ఇంద్రియాల్ని జయించిన యోగి మేలుకొని ఉంటాడు. ప్రాణులన్నీ మేలుకొని పనిపాటల్లో తిరిగేటప్పుడు తత్త్వజ్ఞానికి రాత్రిగా అనిపిస్తుంది. అంటే ఆత్మజ్ఞానం కలిగిన తత్త్వవేత్తకు అవిద్య నశించటమే అట్లా అనిపించడానికి కారణం. **69**

భగవద్దర్శనమైన వానికి ఈశ్వరుడే జీవుడుగాను (విద్య) జగత్తుగాను (అవిద్య) కనిపిస్తుంది. అటువంటి వానికి తన పిల్లలంతా బాలకృష్ణుల్లా కనిపిస్తారు. తల్లితండ్రుల్లోనే భగవంతుణ్ణే దర్శించి పూజిస్తూ ఉంటాడు. అట్టివాడు భార్యతో శారీరక సంబంధాలు పెట్టుకోకుండా భగవదారాధనలోనే కాలం గడుపుతాడు. ప్రాణులన్నింటిలోనూ భగవంతుణ్ణే దర్శించి పూజిస్తాడు. - శ్రీరామకృష్ణ పరమహంస

సముద్రంలోనికి నదుల నీళ్ళన్నీ వచ్చి కలుస్తున్నా సముద్రుడు పెరగడం లేదు. అట్లాగే సూర్య తాపానికి ఆవిరైపోతున్నా సముద్రుడు తరిగి పోవడం లేదు. అంటే ఎటువంటి మార్పూ లేకుండా సముద్రం నిర్వికారంగా ఉంటోంది. అట్లాగే కోరికలు గాని, విషయాలుగాని యోగీశ్వరుని స్వభావం మార్చలేవు. అటువంటివాడే ముక్తిని పొందుతాడు. **70**

సముద్రంలో అట్టడుగున ఎత్తైన కొండలు, లోతైన లోయలు ఉంటాయి. అయినా అవన్నీ పైకి కనిపించడంలేదు. అట్లాగే సమాధిలో ఉండే యోగికి సచ్చిదానంద సాగరమే కనిపిస్తూ ఉంటుంది. అప్పుడు 'నేను' అనే స్థితిని మరచిపోతాడు. - శ్రీరామకృష్ణ పరమహంస

ఎవడైతే అహంకార మమకారాల్ని వదిలేస్తాడో, కోరికల పట్ల ఎటువంటి ఆసక్తి లేకుండా ఉంటాడో అటువంటి వాడే శాంతిని పొందగలుగుతాడు. **71**

ఒక మేకను తెచ్చి దాని తలను నరికేస్తే ఇంకా కొంతసేపటి వరకు అది కదులుతూనే ఉంటుంది. అంటే ప్రాణం ఇంకా పూర్తిగా విడిచిపోలేదని తెలుస్తుంది. అట్లాగే సంపూర్ణ సమాధిలో జ్ఞాని యొక్క అహంకారం నశించినా, శరీర సంబంధమైన విషయాల్ని గమనించడం కోసం 'నేను' అన్న భావన కొద్దిగా మిగిలి ఉంటుంది. అయినా ఆ యోగిని ప్రపంచ బంధాలు బంధించలేవు. - శ్రీరామకృష్ణ పరమహంస

పార్థా! ఇంత వరకు చెప్పిందంతా బ్రహ్మీ స్థితి. దీన్నే బ్రహ్మనిష్ఠ అంటారు. ఆ స్థితిలో ఉన్నవాడు మోహాన్ని పొందడు. ప్రాణం పోయే చివరి క్షణాల్లో ఆ స్థితి కలిగినా అతడు మోక్షాన్ని పొందుతాడు. **72**

కొత్తగా పెళ్ళయిన పిల్ల ఇంటి పనులన్నీ తానే చేస్తుంది. ఒక బిడ్డ పుట్టగానే పనుల్లో శ్రద్ధ కొద్దిగా తగ్గుతుంది. ఎందువల్లనంటే తన శ్రద్ధనంతా బిడ్డను చూసుకోవడానికే పరిమితం చేస్తుంది. అట్లాగే అజ్ఞాని పనులన్నీ తానే స్వయంగా చేస్తూ ఉంటాడు. ఆత్మసాక్షాత్కారం అయిన తర్వాత ఆ పనులన్నీ మరచిపోతాడు. మనస్సంతా ఈశ్వరసేవయందే లగ్నమై ఉంటుంది. ఆ తర్వాత ఈశ్వరానుభవం వల్ల కలిగే పరమానందం తప్ప మరేమీ కోరుకోడు.
- శ్రీరామకృష్ణ పరమహంస

ఈ అధ్యాయంలో :

1. ఆత్మ లక్షణాలు :

ఆత్మ అనేది దేహంకన్నా భిన్నమైనది. అట్టి ఆత్మను అవినాశి అని, దేహద్రష్ట అని, నిత్యమని, విభువు అని చెప్పుకున్నాం. అనగా ఆత్మను ఎవరూ చంపలేరు. అది చంపబడేది కాదు.

2. శోకం :

దేహాన్నే ఆత్మగా భావించడం వల్ల శోకం కలుగుతోంది. అందువల్ల శోకాన్ని మిథ్యే అని చెప్పబడింది.

3. స్థితప్రజ్ఞుని లక్షణాలు :

కర్మ నిష్ఠ (యోగనిష్ఠ), జ్ఞాననిష్ఠ (బ్రహ్మనిష్ఠ)ల గూర్చి వివరిస్తూ జ్ఞానం పొందేందుకు కర్మలు సాధనమని చెప్పారు. బ్రహ్మనిష్ఠ గల వాడిని స్థితప్రజ్ఞుడని చెప్తూ స్థిత ప్రజ్ఞునికి ఉండే లక్షణాలన్నీ వివరంగా చెప్పారు. బ్రహ్మస్థితి మరణించే ముందు చివరి క్షణంలో కలిగినా మోక్షం సిద్ధిస్తుందని చెప్పారు.

3

కర్మయోగం

అర్జునుడు : జనార్ధనా! కర్మకంటే జ్ఞానమే గొప్పదని నీ అభిప్రాయమైతే నన్ను ఇటువంటి భయంకరమైన కర్మ చెయ్యమని ఎందుకు ప్రోత్సహిస్తున్నావు? నువ్వు రెండు మార్గాలు ఒకేసారి చెప్పి నన్ను అయోమయంలోకి నెట్టివేస్తున్నావు. నేను ఎటూ నిర్ణయించుకోలేక పోతున్నాను. నాకు శ్రేయస్సు కలిగించే మార్గమేదో తేల్చిచెప్పు.

శ్రీకృష్ణుడు : ఆత్మానాత్మ వివేకం కలిగిన సన్న్యాసులకు జ్ఞాన యోగం చేతను, చిత్త శుద్ధి కలిగిన యోగీశ్వరులకు కర్మమార్గం ద్వారా మోక్షం లభిస్తుందని ఈ సృష్టి ప్రారంభం అయినప్పటి నుండి నేను చెప్తూనే ఉన్నాను. కర్మలను ఆచరించనంత మాత్రాన కర్మలకు అతీతుడై ఆత్మసాక్షాత్కారాన్ని పొందలేరు. అట్లాగని కేవలం సన్న్యసించినంత మాత్రాన కూడా ముక్తిని పొందలేరు.

ఇందులో ఉండే రహస్యమేమిటంటే, కర్మలు చెయ్యగా చెయ్యగా జ్ఞానం అనే ఫలం లభిస్తుంది. నైష్కర్మ్యమన్నా, సిద్ధి అన్నా ఒక్కటే. అది ఎట్లాగంటే, ముందు పిందెగా ఉంటుంది. అది కాయగా మారే ప్రక్రియను నైష్కర్మ్యమంటారు. ఆ కాయయే ఫలమవడాన్ని సిద్ధి అంటారు. అంటే ఫలం పిందెకు చెందినదే. **1-5**

"వేదాంతాన్ని కొంగున ముడి వేసుకొని సాధనల యందు మనస్సు లగ్నం చెయ్యి. అంటే పరమాత్మను చేరడమే లక్ష్యంగా పెట్టుకొని వేదోక్తమైన కర్మలు చేస్తూ ఉండు"

- శ్రీరామకృష్ణ పరమహంస.

ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతిజీవి కర్మలు చేస్తూ ఉండాలి. అట్లా కర్మలు చెయ్యకుండా ఉండటం ఎవరికీ సాధ్యం కాదు. ఎందువల్లనంటే ప్రకృతిలో స్పందన లేనిదేదీ ఉండదు. అణువు నుండి అండం వరకు అన్నీ మార్పు చెందేవే. అంతేకాదు ప్రకృతి అంటే గుణాత్మకం. అంటే సత్త్వరజస్తమోగుణాలతో నడుస్తోంది. దీనిని బట్టి తినడం శ్వాస పీల్చడం గుండెకొట్టుకోవడం కూడా కర్మలే. రోగిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చినప్పుడు అతడు వ్యాధి నయం అయ్యేంత వరకూ అక్కడే ఉంటూ వైద్యం చేయించుకోవాలి. వ్యాధి నయం అయిన తర్వాత ఆసుపత్రిలో ఉండాల్సిన పనిలేదు. అట్లాగే అజ్ఞానమనే వ్యాధితో పీడించబడే వాళ్ళు ప్రకృతి అనే ఆసుపత్రిలో ఉండి తీరాలి.

ఆసుపత్రిలో ఉన్నంత కాలం కర్మలు చేయడం అనే చికిత్సకు లోబడి ఉండాల్సిందే."

- శ్రీరామకృష్ణ పరమహంస

కర్మేంద్రియాల్ని నిగ్రహిస్తూనే, మనస్సులో మాత్రం విషయాలనే స్మరించేవాడు మూఢుడేకాదు కపటి కూడా. జీవాత్మ ప్రకృతికి లోబడి ఉన్నంత వరకు మనస్సు పనిచేస్తూనే ఉంటుంది. సంకల్పాలు కలిగించడం మనస్సు యొక్క స్వభావం. బాహ్యేంద్రియాలు మాత్రం ఆ సంకల్పాలను నిరోధిస్తూ ఉంటాయి. ఉదాహరణకు రైలింజను ఆవిరి సహాయంతో నడుస్తుంది. నడిచే రైలు బండిని ఆపాలంటే ముందుగా ఆవిరిని సరఫరా కాకుండా నిలిపెయ్యాలి. అట్లాకాకుండా నిలిపే ప్రయత్నం చేస్తే రైలింజను పాడైపోయే ప్రమాదం ఉంది. అట్లాగే మనిషి మనస్సును నిగ్రహించడకుండా ఇంద్రియాల్ని అణచిపెట్టడం వల్ల తన స్వభావంలో మార్పు చోటుచేసుకుంటుంది. దాన్నే కాపట్యం అంటారు. అజ్ఞానంలో ఉన్నవారు కర్మల్ని వదిలేసినట్లు నటించడం కపటవేష మవుతుంది. అదే దురాచారం. ఓ అర్జునా! ఎవడైతే మానసికంగా ఇంద్రియాల్ని నిగ్రహిస్తూ కర్మేంద్రియాలతో కర్మలు చేస్తాడో అటువంటివాడే మిథ్యాచారుని కంటే ఉత్తముడు. **6-7**

మనిషి చేసే పాపపుణ్యాలు అతను చేసే పనులను బట్టి కాకుండా తన మనోభావాల్ని బట్టి నిర్ణయించబడుతాయి. ఇద్దరు స్నేహితులు కలసి పోతున్నారు. దారిలో ఒకడు భాగవత కాలక్షేపం జరిగే చోటుకు వెళ్ళికూర్చున్నాడు. రెండోవాడు "భాగవత కాలక్షేపంలో ఏం మజా ఉంటుంది? ఆ సమయాన్ని నేను వేశ్య దగ్గరకుపోయి సుఖపడ్తాను" అని వేశ్య వద్దకు వెళ్ళాడు. వేశ్య దగ్గరకు పోయినవాడు "అయ్యో! నా స్నేహితుడు భాగవతం వింటూ బోలెడు పుణ్యం సంపాదించుకుంటున్నాడు. నేను ఎరక్కపోయి వేశ్య వద్దకు వచ్చాను" అని బాధపడ్డాడు. అక్కడ భాగవత కాలక్షేపానికి పోయినవాడి మనస్సంతా వేశ్యాగృహంలో తన స్నేహితుడు అనుభవిస్తున్న సుఖాల గూర్చి ఆలోచిస్తూ ఉంది. వేశ్యా గృహానికి వెళ్ళినవాడు మనస్సులో భాగవతాన్ని గూర్చి ఆలోచిస్తూ ఉండటం చేత పుణ్యం సంపాదించుకున్నాడు. భాగవతం వినటానికి వెళ్ళినవాడి మనస్సంతా వేశ్యాసాంగత్యంలో నిండి ఉండడం చేత పాపాన్ని మూట కట్టుకున్నాడు. - శ్రీరామకృష్ణ పరమహంస.

అర్జునా! శాస్త్రం చెప్పిన నిత్య కర్మల్ని చేస్తూ ఉండాలి. అట్లా చెయ్యక పోవడం వల్ల నీ శరీరాన్ని కాపాడుకోలేవు. భోజనం చెయ్యడం, నిద్రించడం వంటివన్నీ నిత్యకర్మలే. వీటిని చెయ్యను, నిగ్రహిస్తానంటే శరీరం నిలువదు. మానవుడు లక్ష్యాన్ని సాధించాలంటే శరీరం అవసరం. కనుక శరీరాన్ని తప్పకుండా కాపాడుకోవాలి. కర్మ సన్న్యాసం చేసిన మూఢుడి కన్నా, మోక్ష సాధనంగా మంచి కర్మలు చేసేవాడిని వివేకి అంటారు. ఆత్మ తత్త్వాన్ని తెలుసుకోకుండా కర్మ సన్న్యాసం చెయ్యడం వల్ల 1. పాపం వస్తుంది. 2. ఆ పాపానికి ఫలం నరకమవుతుంది. 3. దుష్టమైన జన్మలు కలుగుతాయి. 4. మోక్షాన్ని పొందలేడని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. **8**

ఓ కుంతీ కుమారా! పరమేశ్వరార్పణ బుద్ధితో కాకుండా చేసే కర్మలు సంసార బంధాలకు కారణాలవుతాయి. కనుక నువ్వు నిష్కామ బుద్ధితో కర్మలు చెయ్యి. స్వార్థచింతన లేకుండా లోకహితాన్ని

కోరుకొని చేసే కర్మలన్నింటినీ యజ్ఞాలనే అంటారు. ప్రజాక్షేమం కోరి యుద్ధం చేసినా, వ్యవసాయం చేసినా మరోవిధంగా చేసినా వాటన్నింటినీ యజ్ఞాలనే అంటారు. ఇటువంటి కర్మలు సంసార బంధంలో ఇరికించవు. ఎందువల్లనంటే శ్రీమహావిష్ణువు యజ్ఞస్వరూపుడు కనుక. 9

దుర్లభమైన మానవజన్మ పొందిన పిదప ఈ జన్మలోనే భగవంతుని తెలుసుకొనే ప్రయత్నం చెయ్యనివాడి జన్మ నిరర్థకం. - శ్రీరామకృష్ణ పరమహంస.

సృష్టి ప్రారంభంలోనే బ్రహ్మ ఇలా అన్నాడు: "మీరు యజ్ఞాలు చేస్తూ అభివృద్ధి పొందండి. ఆ కర్మలే మీరు కోరే కోరికల్ని తీరుస్తాయి. ఈ విధమైన యజ్ఞాలచే దేవతల్ని తృప్తి పరచండి. సంతృప్తులైన దేవతలు వర్షాదులిచ్చి మీకు అభివృద్ధి కలిగిస్తారు. యజ్ఞం చేయడం వలన లాభం పొందిన దేవతలు మీరు కోరిన భోగాలనిస్తారు. వారిచ్చే భోగాలను అనుభవిస్తూ కూడా ప్రతి ఫలం ఇవ్వనివాడు దొంగ అవుతాడు." అంటే ఈ యజ్ఞాన్ని కోరికలతో చేస్తే స్వర్గాన్ని పొందుతారు. ఒకవేళ నిష్కామ కర్మలు చేస్తే మోక్షాన్ని పొందుతారు అని భావం. ఆ విధంగా దేవతలకు, మనుష్యులకు పరస్పరం వృద్ధి చెందేట్లుగా అనుగ్రహించాడు. **10-12**

యజ్ఞాలన్నీ భగవంతునికి సమర్పించగా మిగిలిన దాన్నే భుజించేవారిని సజ్జనులంటారు. అందు మూలంగా వారి పాపాలన్నీ తొలగి అటువంటి అన్నం (యజ్ఞశేషం) అమృతంతో సమానం అవుతుంది.

ఎవరైతే భగవంతునికి సమర్పించకుండా తామే తింటారో వారు పాపాన్నే భుజించినట్లవుతుంది. అంటే వండిన అన్నాన్ని దేవతలకు, తోటి మానవులకు, ఇతర జీవులకు, పరమాత్మకు అర్పించకుండా తినరాదు. మానవుడు పంచమహాయజ్ఞాల్ని ఆచరించాలి. అవి దేవ, పితృ, మనుష్య, భూత, బ్రహ్మ యజ్ఞాలు. **13**

యజ్ఞం వల్ల వర్షాలు కురుస్తాయి. వర్షాల వల్ల ధాన్యాలు సమృద్ధిగా పండుతాయి. ఆ ధాన్యాలే సమస్త ప్రాణులకు ఆహారమవుతుంది. ఆహారం వల్ల ప్రాణులన్నీ పుడ్తాయి.

అందువల్ల యజ్ఞాలు తప్పక చెయ్యాలి. మనం తినే అన్నం రక్తంగాను రేతస్సుగాను మారి సంతానం కలగటానికి కారణభూతమవుతుంది. అట్టి వర్షం పుణ్యం వల్ల కలుగుతుంది. పుణ్యం (అపూర్వం) యజ్ఞం (కర్మ వల్ల) కలుగుతుంది. **14**

సత్కర్మ వేదం నుండి పుట్టింది. వేదం పరమాత్మ నుండి పుట్టింది. కాబట్టి సర్వవ్యాపి అయిన పరబ్రహ్మం యజ్ఞమునందే స్థిరంగా ఉంటాడు. అందువల్లనే భగవంతుణ్ణి యజ్ఞస్వరూపుడని కూడా అంటారు. **15**

పార్థా! చక్రమనే ఈ జగత్తునంతా నేనే నడుపుతున్నాను. జగత్తు అనే చక్రాన్ని ఎవడు అనుసరించడో వాడు ఇంద్రియలోలుడై పాపజీవి అవుతాడు.

అట్టివాడి జీవితమే వ్యర్థంగా గడుపుతున్నట్లవుతుంది. ఒక విద్యార్థి ఉన్నాడనుకోండి. అతడు బడికి వెళ్ళినంత మాత్రాన విద్యావంతుడు కాలేడు. అట్లాగే ఎవరైనా ఒక ఊరికి వెళ్ళాడనుకోండి. అతడా పనిని పూర్తి చేసుకొని వస్తే గాని ఆ ప్రయాణానికి సార్థకత ఉండదు. అట్లాగే భగవానుని

జగత్చక్రాన్ననుసరించి యాగాలు చెయ్యాలి. విధివిహితమైన కర్మలు చెయ్యాలి. అప్పుడే మానవ జన్మ ఎత్తినందుకు సార్థకత లభిస్తుంది. అట్లా కాకుండా భోగాలకే పరిమితం చేస్తే జీవితం వ్యర్థం అవుతుంది. **16**

ఎవడైతే ఆత్మయందే ఆనందం అనుభవిస్తూ ఆత్మయందే తృప్తిని అనుభవిస్తూ ఉంటాడో అటువంటి జ్ఞానికి ఇంకా చెయ్యాల్సిన కర్మలేవీ మిగిలి ఉండవు. ఇక్కడ మనం తెలుసుకోదగిన ముఖ్యమైన విషయం ఏమంటే, మనస్సు ప్రాపంచిక సుఖాలను ఇంద్రియాల ద్వారా అనుభవిస్తుంది. అప్పుడు కర్మ అధికరిస్తుంది. అదే ఆత్మ ద్వారా ఆనందాన్ని అనుభవిస్తే అదే కర్మ సమసిపోతుంది. కాబట్టి ఆత్మ సంయమనం అనేదే ఆఖరి కర్మ. ఆత్మ ఆనంద స్వరూపమైనది కనుకనే మనస్సు ఆత్మను చేరేటప్పుడు శాశ్వతానందం కలుగుతుంది. ఇందుకో ఉదాహరణ చెప్తాను. నది సముద్రాన్ని చేరేంతవరకు కర్మచేస్తూ ఉంటుంది. సముద్రంలో చేరగానే దాని కర్మలన్నీ సమసిపోతాయి. అట్లాగే ఆత్మతో కలిసేంతవరకే కర్మలుంటాయి. ఆ పిదప మనస్సుకు కర్మలే ఉండవు. **17**

గడియారంలో చిన్నముల్లు, పెద్దముల్లు విడివిడిగా తిరుగుతూ ఉన్నా గంటకోసారి రెండూ కలుస్తూ ఉంటాయి. అట్లాగే సందర్భం వచ్చినప్పుడల్లా జీవాత్మ పరమాత్మను చేరాలి.

- శ్రీరామకృష్ణ పరమహంస.

అటువంటి ఆత్మజ్ఞాని కర్మలు చెయ్యడం వల్ల వచ్చే లాభంగాని, చెయ్యకపోతే కలిగే నష్టంగానీ ఏమీ ఉండదు. ఎందువల్లనంటే వారికి ఎటువంటి కోరికా ఉండదు; అటువంటి కర్మల వల్ల ఒరిగే ఫలం వారు కోరుకోరు. కనుక నీ కర్తవ్యాన్ని ఫలాపేక్ష లేకుండా చెయ్యి. నిష్కామ కర్మలు చేయడం వల్లనే మోక్ష ప్రాప్తి కలుగుతుంది. **18-19**

యోగికి ఈశ్వరదర్శనం అయినందువల్లనే తనలోతానే బ్రహ్మానందాన్ని పొందగలుగుతున్నాడు. సముద్ర ఉపరితలాన అలలతో అల్లకల్లోలంగా ఉన్నా కూడా అట్టడుగున ఉండే చోట నీరు నిశ్చలంగా ఉంటుంది. - శ్రీరామకృష్ణ పరమహంస.

జనకుడు మొదలైన వారంతా కర్మల్ని సక్రమంగా ఆచరించడం వల్లనే ముక్తి పొందారు. లోకానికి సదాచారాలు బోధించడానికైనా నువ్వు కర్మలు చేస్తూ ఉండాలి.

ఇంకో విశేషం ఏమంటే, గ్రుడ్డివాడు మరో గుడ్డివానికి దారి చూపించలేడు. కళ్ళు ఉన్నవాడు మాత్రమే దారి చూపగలడు. అట్లాగే జ్ఞానదృష్టి ఉన్న వాడే కర్మలు చేయడానికి అధికారి. కర్మల్ని పొందవలసిన మానవాళికి అభివృద్ధి కర్మాచరణల ద్వారానే సాధ్యమవుతుంది. ఈ పనిని జ్ఞాన దృష్టి గలవారు మాత్రమే చెయ్యగలరు. కనుక ఆ బాధ్యత కోసమైనా కర్మల్ని ఆచరించాలి. **20**

ఉత్తములు దేన్ని ఆచరిస్తారో ఇతరులు కూడా దాన్నే ఆచరిస్తారు. ఉత్తములు దేన్ని ప్రమాణంగా అంగీకరిస్తారో లోకులు కూడా ఆ ప్రమాణాల్నే అనుసరిస్తారు. **21**

వ్యాధితో బాధ పడుతున్న పిల్లవాణ్ణి తీసుకొని అతడి తండ్రి ఒక సాధువు వద్దకు వెళ్ళాడు. ఆ సాధువు పిల్లవాణ్ణి మర్నాడు తీసుకొని రమ్మన్నాడు. మరుసటి రోజు వెళ్ళినప్పుడు "నీ

బిడ్డకు తీపి పదార్థాలు పెట్టకు. త్వరగా నయమవుతుంది" అన్నాడు. అందుకా వ్యక్తి "స్వామీ! ఈ మాట నిన్ననే చెప్పి ఉండవచ్చునుగదా" అన్నాడు. అందుకా సాధువు "అయ్యా! నిన్ననే చెప్పేవాడిని, కానీ అప్పుడు నా ముందు తీపి పదార్థాలున్నాయి. అప్పుడే చెప్పి ఉంటే నీ పిల్లవాడు 'ఈ సాధువు తానే తీపి పదార్థాలు తింటూ నన్ను తినవద్దంటున్నాడనుకొని నాపై అతడికి గురికుదిరేది కాదు. అందువల్లనే నిన్న చెప్పలేదు" అన్నాడు. కనుక ప్రపంచానికి మార్గదర్శులుగా ఉండేవాళ్ళు సదాచారాల్ని ముందు తాము ఆచరించి లోకులకు బోధించాలి. - శ్రీరామకృష్ణ పరమహంస.

పార్థా! ముల్లోకాల్లోనూ నేను చెయ్యాల్సినదంటూ ఏదీ లేదు. అట్లాగే నాకు పొంద తగినదిగాని, పొందాల్సిందిగాని ఏదీ లేదు. అయినా కర్మలు చేస్తూనే ఉన్నాను. అర్జునా! నేనే సదాచారాల్ని పాటించకపోతే ప్రజలంతా నా మార్గాన్నే అనుసరిస్తారు. నేనే జాతి భ్రష్టత్వానికి కారకుణ్ణవుతాను. ప్రజలు వర్ణాశ్రమ ధర్మాల్ని వదిలేస్తారు. కనుక నేనైనా, నీవైనా ఎవరైనా సరే లోకహితాన్ని కోరి సత్కర్మలు చెయ్యాల్సిందే. పార్థా! ఫలాపేక్షతో పామరులు కర్మల్నెట్లా చేస్తూ ఉంటారో అదే విధంగా పండితుడైనవారు ఫలాపేక్ష లేకుండా లోకకల్యాణం కోరి కర్మలు చేస్తూనే ఉండాలి. జ్ఞాని అయినవాడు తాను సమస్త కర్మల్నీ చేస్తూ నేర్పుగా పామరుల చేత కూడా చేయించాలి.

లోకంలో పనులన్నీ సత్త్వరజస్తమో గుణాల వల్లనే జరుగుతూ ఉంటాయి. కానీ అహంకారంతో కూడిన పామరులు తామే కర్తలమని అనుకుంటూ ఉంటారు. అయితే జ్ఞాని మాత్రం ఈ మూడు గుణాలూ ప్రకృతి పరమైనవని తెలుసుకుంటాడు. అందువల్ల కర్తవ్యాన్ని తనపైన వేసుకోడు. కర్మలపై ఆసక్తి లేనివాడై ప్రవర్తిస్తాడు. ఓ మహాశూరుడా! అర్జునా! పండితుడైనవాడు గుణ విభాగాన్నీ, కర్మ విభాగాన్నీ బాగా తెలుసుకొని ప్రవర్తిస్తాడు. గుణాలంటే – దేహం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి. కర్మలంటే – మమకారానికి కారణాలైన పై నాలుగు గుణాల వ్యాపారులని అర్థం. తత్త్వవేత్త అయినవాడు ఈ యథార్థాన్ని చక్కగా తెలుసుకొని ప్రవర్తిస్తాడు. అంటే గుణకర్మలకు ఆత్మకు ఉన్నతేడా తెలుసుకొంటాడు. అందువల్ల కర్మలు చేసేటప్పుడు కర్తృత్వాన్ని తనపైన వేసుకోకుండా పరమేశ్వరార్పణ బుద్ధితో చేస్తాడు. **22-28**

పామరులకు పైన చెప్పిన గుణ–కర్మల గూర్చి ఏమీ తెలియదు. దేహేంద్రియాల చేత మోహింపబడతారు. కాబట్టే ఫలాన్ని ఆశించి కర్మలు చేస్తూ ఉంటారు. అంటే దేహాన్నే ఆత్మ అని భ్రమిస్తూ ఉంటారు. వారంతా ఆత్మజ్ఞాన శూన్యులు. అందువల్ల వారిని కర్మలు మానమని పండితులైనవారు సలహాచెప్పి అయోమయంలో పడెయ్యకూడదు. **29**

అర్జునా! నువ్వు ఆచరించే కర్మల నన్నింటినీ నాకు సమర్పించు. ఇట్టి నిష్కామ కర్మల వలన నీకు జ్ఞానం కలుగుతుంది. అహంకారం లేనివాడివై యుద్ధం చెయ్యి.

అంటే సర్వమూ జగన్నాథమని భావించి కేవలం కర్మలు చెయ్యడ మొక్కటే కర్తవ్యమని అర్జునుని ద్వారా లోకానికి భగవానుడు బోధిస్తున్నాడు. ఎవరైతే అసూయాద్వేషాలు లేకుండా శ్రద్ధగలవారై నా ఈ

బోధను అనుసరిస్తారో వారందరూ కర్మ బంధాల నుండి విముక్తులవుతారు. ఏ పని చేస్తున్నా దానియందు శ్రద్ధ వహించాలి. శ్రద్ధ అనే ఒక్కమాటలో వినయం, విశ్వాసం, అణకువ అనే భావనలన్నీ ఇమిడి ఉంటాయి. **30-31**

విద్యాగర్వమున్నవారు కొందరిని మూఢభక్తి అని, తప్పుదారిన పోతున్నారని విమర్శిస్తూ ఉంటారు. కానీ నిజమైన భక్తుడు అంతా తన మేలుకొరకే జరుగుతోందని నమ్మి ఈశ్వరుని భక్తితో ప్రార్థిస్తూ ఉండాలి. అటువంటి వాడు కొంతకాలం తప్పు త్రోవలో నడిచినా ఫరవాలేదు. అతడికి కావలసిందేదో ఈశ్వరునికి తెలుసు. కనుక ఈశ్వరుడే ఆ భక్తుని కోరిక తీరుస్తాడు. అది ఎట్లాగంటే కాశీకి పోవాలనుకున్నవాడు తెలియక దక్షిణదిక్కుగా ప్రయాణం చేస్తూ ఉంటాడు. దారిలో ఎవరో ఒకరు నువ్వు పోవలసింది ఉత్తరదిక్కున అనీ దక్షిణం వైపు ప్రయాణం చేస్తున్నావని సరిదిద్ది ఉత్తర దిక్కుగా వెళ్ళేందుకు అతడికి సహాయపడతాడు. - శ్రీరామకృష్ణ పరమహంస.

ఎవరైతే నా ఈ మతాన్ని ద్వేషిస్తూ అసూయతో అనుసరించరో వాళ్ళు బుద్ధిహీలని, జ్ఞానశూన్యులని తెలుసుకో. నిప్పులో చేయి పెడితే కాలుతుంది. అదే నిప్పును సరైన మార్గంలో వాడుకుంటే అన్నం వండుకొనితినవచ్చు. దీన్ని ఎరుగనివారు నష్టపోతారు. అట్లాగే ఆత్మతత్త్వాన్ని బోధించినా గ్రహించలేని వారు నష్టపోతారు. **32**

జ్ఞాని తన స్వభావాన్ని అనుసరించియే నడచుకుంటున్నాడు. అట్లాగే ప్రాణులన్నీ కూడా తమతమ స్వభావాల ప్రకారమే నడచుకుంటూ ఉంటాయి. ఇక జ్ఞాని నిగ్రహం వలన ప్రయోజనమేమున్నది? **33**

“ఒక రోజున శ్రీరామకృష్ణ పరమహంసల వారి వద్దకు ఒక పండితుడు వచ్చి తనకు ధ్యానంపై మనస్సు నిశ్చలం కావడం లేదని విన్నవించాడు. అందుకు శ్రీరామకృష్ణులు అతనితో “నీకు ప్రపంచంలో అత్యంత ఇష్టులైన వారెవరు?” అని అడిగాడు. అందుకతను తాను ఎవర్నీ ప్రేమించడంలేదని అయితే తాను పెంచుకుంటున్న కుక్క పిల్ల అంటే పంచప్రాణాలు అని చెప్పాడు. అయితే ఆ కుక్క పిల్లనే భగవంతుడని తలచి ధ్యానం చెయ్యి అని ఉపదేశించారు. అతడు అట్లే చేసి ముక్తి పొందాడు.”

అంటే ఒక్కొక్క మానవునికి ఒకొక్క స్వభావం ఉంటుంది. ఆ స్వభావాన్ని అనుసరించడమే శ్రేయోదాయకం. అందువల్ల స్వభావాలకు విరుద్ధంగా శాసించరాదు.

ప్రతి ఇంద్రియ విషయంలోనూ రాగద్వేషాలుంటాయి. తమకు తామే శత్రువులు కాబట్టి కర్మయోగి వాటికి వశం కాదు. **34**

“కామ క్రోధాలను, ఆశాపాశాలను లౌక్యవిషయాలపై లగ్నం చేసినంతకాలం అవి మనకు శత్రువులే అవుతాయి. కానీ వాటిని సర్వేశ్వరునిపైనే ఉంచితే ఆశాపాశాలే మానవుని పాలిట మంచి మిత్రులవుతాయి. అవే భగవంతుని వద్దకు చేరుస్తాయి. లౌకిక కోరికల్ని పరమేశ్వరునిపై కోరికగా మార్చుకోవాలి. కోపిష్ఠి తనకు ఇంకా ఎందుకు దర్శనం ఇవ్వలేదని

భగవంతునిపై కోపం చూపాలి. ఆశాపాశాల్ని భగవంతునిపై మళ్ళించ వచ్చునేగాని పోగొట్టలేం." - శ్రీరామకృష్ణ పరమహంస.

చక్కగా ఆచరించే పరధర్మం కన్నా కొంతపాటి గుణలోపం ఉన్నా స్వధర్మమే మేలు. అంటే పరధర్మంలో జీవించడం కన్నా స్వధర్మంలో ఉంటూ మరణించడమే మంచిది. స్వధర్మాన్ని విడవడం వల్ల పాపం తప్పదు. **35**

"వరుసగా కొన్ని సంవత్సరాలు వర్షం లేకపోయినా తరతరాలుగా వ్యవసాయాన్నే నమ్ముకొని జీవించేవాడు వ్యవసాయాన్ని వదలిపెట్టిపోలేడు. అదే క్రొత్తగా వ్యవసాయం మొదలు పెట్టినవాడిలో వ్యాపార స్వభావం ఉంటుంది. ఒక సంవత్సరం వర్షాలు కురవకపోయినా వ్యవసాయాన్ని మానుకొని వేరే వృత్తి చేబడతాడు. అట్లాగే జీవితమంతా భగవద్భక్తి కలిగిన భక్తుడు భగవద్దర్శనం పొందలేక పోయినా ఎన్నటికీ నిరుత్సాహం చెందడు.

- శ్రీరామకృష్ణ పరమహంస.

అర్జునుడు *:* ఓ కృష్ణా! తనకు ఇష్టం లేకపోయినా పురుషుడు ఎవరి ప్రోద్బలం చేత ఈ పాపం చేస్తున్నాడు?

శ్రీకృష్ణుడు *:* అర్జునా! జీవునికి కోరిక వల్లనే అనర్థాలన్నీ సంభవిస్తున్నాయి. ఎప్పుడైతే తన కోరిక ఈడేరడంలేదో అతనికి క్రోధం వస్తోంది. ఆ క్రోధం కూడా కామమే. కామానికి రజోగుణం తల్లిలాంటిది. లోకంలో ఉండే ధనం, బంగారం, స్త్రీ, పంట వంటివి ఎన్ని ఇచ్చినా కామాన్ని అణచలేవు. కనుక ఈ జీవుల పాపాలన్నింటికీ కామమే కారణం. కనుక ఈ కామాన్నే మహాశత్రువుగా తెలుసుకో. **36-37**

కామాన్ని, లోభాన్ని పొందేందుకు ఎన్నెన్ని అవమానాలు పొందినా మానవులు వాటిని వదలి ఈశ్వర ధ్యానం చెయలేకుండా ఉన్నారు. - శ్రీరామకృష్ణ పరమహంస.

పొగ చేత అగ్ని, మురికి చేత అద్దము, మావి చేత శిశువు ఎట్లా కప్పిబడి ఉంటారో అట్లాగే కామం చేత జ్ఞానం కప్పబడుతుంది. కుంతీకుమారా! కామం జ్ఞానికి నిరంతర శత్రువు. ఈ కామం అనేది అగ్నివలె తృప్తిలేనిది. ఆశ చేతనే జ్ఞానం కప్పబడుతోంది. **38-39**

"మేఘం సూర్యుని కప్పివేస్తున్నట్లుగానే మాయ ఈశ్వరుని కప్పివేస్తోంది. ఎట్లాగైతే మేఘం తొలగిపోగానే సూర్యుడు ప్రకాశిస్తున్నాడో అట్లాగే మాయ తొలగిపోగానే ఈశ్వర దర్శనం కలుగుతుంది."

త్రాసులో ఏ ప్రక్క బరువు ఎక్కువగా ఉంటుందో సూచి ఆ ప్రక్కకు ఒరుగుతుంది. అట్లాగే ఆశ వలన కాంతాకనకాల బరువుకు మనస్సు ఈశ్వరాధన నుండి తొలగిపోతుంది."

- శ్రీరామకృష్ణ పరమహంస.

ఆశకు ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఆశ్రయమిస్తూ ఉంటాయి. అందువల్ల ఇది జ్ఞానాన్ని కప్పివేసి మనిషిని మోహానికి గురి చేస్తోంది. కనుక ఓ భరత వీరుడా! నువ్వు ముందుగా ఇంద్రియాల్ని నిగ్రహించి

ఈ ఆశను పూర్తిగా విడిచిపెట్టు. లేకపోతే ఇది నీ జ్ఞాన విజ్ఞానాల్ని నాశనం చేస్తుంది.

విరోధి కోటలో ఎక్కడ నివసిస్తూ ఉంటాడో కనిపెడితే శత్రువును ఎదుర్కోవడం సులభం. ఆశకు స్థానం ఇంద్రియాలు బుద్ధి మనస్సు కాబట్టి వాటిని సులభంగా జయించవచ్చు. **40-41**

"మనస్సు చెడుత్రోవలు పట్టడం అంటే ఏమిటో తెలుసా? సంపన్నుడు మురికివాడలో కాపురం ఉండటం వంటిది. అట్లాగే జ్ఞాన విజ్ఞానాలంటే ఏమిటో తెలుసా? పాలు తెల్లగా ఉంటాయి. అవి త్రాగిన వానికి పుష్టిని కలిగిస్తుందని తెలుసుకోవడమే జ్ఞానం. అట్టి పాలను త్రాగి శరీరానికి పుష్టిని చేకూర్చుకోవడాన్నే విజ్ఞానం అంటారు. అంటే శాస్త్రజ్ఞానాన్ని ఆచరించడమన్న మాట." - శ్రీరామకృష్ణ పరమహంస.

శరీరం కంటే ఇంద్రియాలు గొప్పవి. ఇంద్రియాల కంటే మనస్సు గొప్పది. మనస్సు కంటే బుద్ధి గొప్పది. బుద్ధి కంటే ఆత్మ గొప్పది. ఓ మహా బాహువులు కలిగిన అర్జునా! ఈ విధంగా అన్నింటికన్నా గొప్పదైన ఆత్మను అణచిపెట్టే బద్ధశత్రువులైన ఆశను నిర్మూలించుకో. **42-43**

"మామిడి పండులో తోలు గుజ్జు టెంక ఉంటాయి. అందులో గుజ్జు మాత్రమే రుచికరమైనది - పుష్టికరమైనది. పండులోని గుజ్జే ఆత్మస్వరూపం".

"దొంగను కనుక్కోగానే పరిగెత్తుతాడు. అట్లాగే మాయ యొక్క స్వభావాన్ని కనుక్కోగానేఅది నీ వద్ద నుండి తప్పించుకొని పారిపోతుంది." - శ్రీరామకృష్ణ పరమహంస.

4

జ్ఞానయోగం

శ్రీకృష్ణుడు : సృష్టి ప్రారంభం అయినప్పటి నుండి జగత్తులన్నింటినీ పరిపాలించే సామర్థ్యం కోసం భగవంతుడే కర్మయోగాన్ని క్షత్రియులకు మూలపురుషుడైన సూర్యునికి బోధించాడు. ఆ సూర్యుడు మనువుకు, మనువు ఇక్ష్వాకునికీ గురుపరంపరగా ఈ విద్య ఉపదేశించబడింది. శత్రువులను తరింపజేసే ఓ అర్జునా! ఈ విధంగా పరంపరగా వస్తున్న ఈ విద్యను రాజర్షులంతా తెలుసుకున్నారు. మానవుల్ని అనుసరించి నీడ ఎట్లాగైతే వస్తుందో అట్లాగే రాజర్షుల ననుసరించి వారు రచించిన ప్రణాళికలు కూడా వస్తూ ఉంటాయి. ఓ అర్జునా! నువ్వు నా భక్తుడవు, మిత్రుడవు. సనాతనమైన ఈ యోగం మరుగునపడిపోవడం వల్ల మళ్ళీ నీకిప్పుడు చెప్తున్నాను. "కృష్ణా! నువ్వు నిన్న మొన్న పుట్టిన వాడవుగదా? మరి సనాతనుడైన సూర్యునికి ఎట్లా ఉపదేశించావు? ఇది సాధ్యమా?" అని నువ్వు అడుగవచ్చు. ఓ అర్జునా నీకు, నాకు అనేక జన్మలు గడిచిపోయాయి. అయితే వాటన్నింటినీ నే నెరుగుదును. కానీ నీకు తెలియదు. **1-5**

ప్రపంచంలో అవతరించిన భగవదవతారాలన్నీ ఆ ఈశ్వరునివే. ఆ పరబ్రహ్మమనే సముద్రంలో మునిగి ఉంటూ ఒక్కొక్క చోట తేలుతూ ఉంటాడు. అట్లా తేలిన పరబ్రహ్మం ఒకసారి కృష్ణుడని, మరొకచోట తేలినప్పుడు క్రీస్తు అని పిలువబడుతూ ఉంటాడు."

- శ్రీరామకృష్ణ పరమహంస

నేను చావుపుట్టుకలు లేనివాడిని. సమస్త ప్రాణులకూ ఈశ్వరుణ్ణి. అయినా కూడా నా ప్రకృతిని అధీనంలో ఉంచుకొని ఆత్మ మాయచే ఆవరించి ఉంటాను. **6**

యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య త దాత్మానం సృజామ్యహం ॥

ఓ భరతకుల శ్రేష్ఠుడా! ఎప్పుడెప్పుడు ధర్మం నశించి అధర్మం పెచ్చుపెరిగి పోతుందో అప్పుడల్లా నన్ను నేను సృష్టించుకుంటూ ఉంటాను. అంటే అవతరిస్తూ ఉంటాను. **7**

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

సజ్జనుల్ని రక్షించేందుకు దుర్జనుల్ని శిక్షించేందుకు, ధర్మాన్ని తిరిగి సంస్థాపించేందుకు అవసరమైనప్పుడల్లా (ప్రతియుగంలోను) అవతరిస్తూనే ఉంటాను. అర్జునా! నన్ను గూర్చి, నా అవతార ఫలాన్ని గూర్చి యథార్థంగా తెలుసుకున్నవాడికి పునర్జన్మ ఉండదు. అంటే మరణానంతరం ముక్తిని పొందుతారు. **8-9**

"గోవు పవిత్రమైనదే అయినా, అతి పుష్టికరమైనది అతి విలువైన వస్తువు ఆవు పాలు మాత్రమే. అట్లాగే దివ్య ప్రేమ అనే పాలు మనకు ఈశ్వరారాధన వల్లనే లభ్యమవుతుంది."
- శ్రీరామకృష్ణ పరమహంస.

అనురాగం - భయం క్రోధాలను వదలి నన్నే మనస్సులో నిలుపుకొని ఆశ్రయించిన సత్పురుషులంతా జ్ఞానయోగం చేత పరిశుద్ధులై నా సాన్నిధ్యాన్ని చేరుకున్నారు. బురద నీటిలోని బురదను వేరుచేస్తే మంచినీరవుతుంది.

అట్లాగే మనస్సులో పేరుకుపోయిన పై దుర్లక్షణాల్ని పోగొట్టగలిగితే ఈశ్వర సాన్నిధ్యం పొందవచ్చు. ఇది ఎట్లా సాధ్యమంటే, అగ్ని కాల్చిన ఇనుము తాను కూడా అగ్ని అయిపోవడం లేదా? ఆ విధంగా పరిశుద్ధమైన కొద్దీ జీవుడు పరబ్రహ్మ స్వరూపాన్ని దర్శించగలడు. ఈ మార్గం మానవుని శాశ్వతంగా పరిశుద్ధుని చేస్తుంది. 10

"ఈశ్వరుని యందు విద్య, అవిద్య రెండూ ఉంటాయి. విద్యామాయ ఈశ్వరుని వద్దకు చేరుస్తుంది. అవిద్యామాయ ఈశ్వరుణ్ణుండి దూరం చేస్తుంది. భక్తి, జ్ఞానం, వైరాగ్యం, భూతదయ వంటివన్నీ విద్యామాయ రూపాలు. వీటి సాయంతో మానవుడు పరమేశ్వరుణ్ణి చేరగలుగుతాడు."
- శ్రీరామకృష్ణ పరమహంస.

నన్ను ఎవరెవరు ఏయే విధంగా తెలుసుకోవాలని అనుకుంటారో నేను వారికి ఆ విధంగా అనుగ్రహిస్తూ ఉంటాను. కనుక పార్థా! మానవులంతా నన్నే అనుసరిస్తూ ఉంటారు.

ఇక్కడ ఈశ్వరుడంటే పరమాత్మ అనే అర్థం. ఆయన అందరికీ మోక్షాన్నే ఇవ్వడు. మోక్షాన్ని కోరినవారికి మోక్షాన్ని, స్వర్గాన్ని కోరినవారికి స్వర్గాన్ని, ఇతర భోగాలు కోరినవారికి ఆయా భోగాలు ఇస్తాడు. అంటే వారికి గల యోగ్యతను (అధికారాన్ని) బట్టి ఆయా ఫలాలుంటాయి. 11

ఈ లోకంలో మానవులు ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల్ని పూజించి త్వరగా పొందగలిగే స్వల్ప ఫలాల్ని కోరుకుంటున్నారు. మోక్షం పొందాలంటే దీర్ఘకాలం తపస్సు చెయ్యాలి. అంటే అనేక జన్మల పర్యంతం శ్రమించాలి. అందువల్ల పరమేశ్వరార్పణ బుద్ధితో నన్ను శరణు వేడుకోకుండా ఇతర దేవతల్ని ప్రార్థించి స్వల్ప ఫలాన్ని పొందుతున్నారు. 12

గుణ కర్మలను బట్టి నాలుగు వర్ణాలను నేనే సృష్టించాను. ఈ సృష్టికంతా కర్తను నేనే

అయినప్పటికీ పరమార్థ దృష్టితో కర్తను నేను కాదని తెలుసుకో. నన్ను నాశనం లేనివాడిగాను, మాయకు అతీతుణ్ణిగాను తెలుసుకో. **13**

నాకు అహంకార మమకారాలుండవు. అందువల్ల దేహధారుల్ని బంధించినట్లు కర్మలు నన్ను బంధించవు. అంతే కాకుండా ఆ కర్మ ఫలం పొందాలన్న కోరిక కూడా నాకు లేదు. అంటే దేహధారణ చేసిన వారిలో సహజంగా ఉండే కర్మల యందు అభిమానంగాని, కర్మఫలంపైన కోరికగాని నాకు ఉండవు. **14**

దేహాదులు కర్మలందు ఆసక్తి గలవారై కర్మ ఫలాన్ని కోరుకుంటూ ఉంటారు. అందువల్లనే జన్మ తర్వాత జన్మ ఎత్తుతూ ఉంటారు. నేను కర్తను కానని, కర్మఫలం నాకు వద్దని ఎవరైతే అనుకుంటారో అటువంటివాడిని కూడా కర్మలు బంధించలేవు. ఎందువల్ల? అతడు అహంకార మమకారాదులు లేని జ్ఞాని కాబట్టి. అతడి కర్మలన్నీ లోకకల్యాణానికే చేస్తాడు.

ప్రాచీన కాలంలో మహర్షులందరూ "నేను కర్తను కాను. నాకు కర్మఫలం వద్దు" అనే కర్మలు ఆచరించారు. కనుక నువ్వుకూడా ఆ విధంగానే కర్మలు చెయ్యి. చేసే కర్మలన్నీ చిత్తశుద్ధి కోసం చెయ్యాలి. లోకకల్యాణం కోసం చెయ్యాలి. అంతేతప్ప కర్మ సన్న్యాసం చెయ్యరాదు. **15**

ఏది కర్మ? ఏది అకర్మ? అన్న విషయాన్ని జ్ఞానులే తెలుసుకోలేరు. కర్మాకర్మలను గూర్చి తెలుసుకున్న వారంతా సంసారాన్నుండి విముక్తి పొందుతారు. కాబట్టి నీ కర్మ స్వరూపాన్ని చెప్తాను, విను. **16**

శాస్త్ర సమ్మతమైన కర్మల గూర్చి తెలుసుకోవాలి. ఏది కర్మ, ఏది వికర్మ, ఏది అకర్మ అన్నవాటి తత్త్వం తెలుసుకోవడం చాలా కష్టం. **17**

కర్మల్లో అకర్మను, అకర్మల్లో కర్మను చూడగలిగినవాడు మేధావి. అతణ్ణి యోగి అని అంటారు. **18**

కర్మ అనేది ప్రకృతి స్వభావం. అకర్మ అన్నది ఆత్మ స్వరూపం. ఈ రెండింటికీ తేడా తెలియక విచారిస్తూ ఉంటారు.

శంకరాచార్యుల భాష్యసారం :

మనం రైల్లో ప్రయాణం చేస్తూ ఉంటాం. ప్రక్క నుండే చెట్లన్నీ కదుల్తూన్నట్లుంటాయి. అంటే అజ్ఞానం చేత కదలలేని స్థావరాలు కదుల్తున్నట్లనిపిస్తుంది. అట్లాగే సముద్రం ఒడ్డు నుండి దూరాన ఉండే ఓడ కదలిక లేకుండా ఆగిపోయినట్టనిపిస్తుంది. ఆకాశంలో సంచరించే చంద్రుడూ అంతే. ఇక్కడ కూడా అజ్ఞానం చేత కర్మము అకర్మములా కనిపిస్తుంది. కాబట్టి ప్రకృతిలో ఎప్పుడూ కర్మ కర్మముగాను, అకర్మము అకర్మముగానే ఉంటుందని చెప్పలేము. మాయ చేత ఒకదాని స్వభావం మరొకదానిలో కనిపిస్తుంది. అట్లాగే అజ్ఞాని దేహం తానేనని అనుకుంటాడు. "నేనిప్పుడు పని చేస్తున్నాను" "నాకు మంచి నిద్రపట్టింది" అని ప్రకృతి యొక్క కర్మను ఆత్మకు ఆరోపిస్తున్నాడు. ఇటువంటి వాడు ఎటువంటి కర్మ చెయ్యకుండా ఊరకే కూర్చున్నా కూడా అహంకారం, కర్తృత్వాన్ని తనపైన వేసుకొన్నంతవరకు అతడు కర్మ చేస్తున్నట్లే చెప్పుకోవాలి. ఈ అజ్ఞానాన్నే అకర్మ యందు కర్మము అని

అంటారు. ఆత్మ స్వరూపాన్నెరిగిన జ్ఞానికి ఈ అహంకారం ఉండదు. అతడి శరీరం కర్మల్ని చేస్తున్నా ఆత్మ సాక్షిగా మాత్రమే ఉంటుంది. అది ఎటు వంటి కర్మలతోను సంబంధాన్ని కల్పించుకోదు. రైలు బండిలో నిద్రిస్తూ ప్రయాణం చేసేవాడు నడిచి వెళ్ళడం లేదు. అదే సమయంలో నిద్ర చెడినవాడూ కాదు. ఈ విధంగా శరీరం చేసే కర్మలేవీ ఆత్మను అంటడం లేదు. ఇదే కర్మయందు అకర్మమనే గొప్ప స్థితి. అట్టి స్థితి జ్ఞానులకు, మాత్రమే సాధ్యం.

శ్రీరామానుజాచార్యుల వారి భాష్యం నుండి

కర్మము = శరీరంతో చేసే పనులన్నీ కర్మలే.

అకర్మము = జ్ఞానము.

మానవుడు ఆహారాన్ని వండటం అనేది ఒక కర్మ. కాలక్రమంలో అదే వంటలో నిపుణత్వాన్ని సంపాదించడాన్ని జ్ఞానం అంటారు. దీన్ని బట్టి కర్మల యందు అకర్మను చూడటం జరుగుతుంది. ఏ కార్యాన్నైనా పట్టుదలతో సక్రమంగా చేస్తూ ఉండటం వలన జ్ఞానం కలుగుతుందని అనుభవపూర్వకంగా తెలుస్తోంది. వండడాన్ని గూర్చిన జ్ఞానం వచ్చిన తర్వాత ఇంకా నైపుణ్యాన్ని చూడటం చూస్తున్నాం. ఇక్కడ అకర్మ యందు కర్మను చూస్తున్నాం. ఈ విధంగా కర్మము జ్ఞానాభివృద్ధికి తోడ్పడుతోంది. జ్ఞానాభివృద్ధి ద్వారా నిపుణత్వంతో పనులు చేయడం జరుగుతోంది. ఉత్తమ జీవితం అనే కర్మ ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తోంది. ఆత్మజ్ఞానం పొందినవాడు జీవితాన్ని ఉత్తమమైనదిగా మలచుకుంటాడు.

శ్రీమధ్వాచార్యుల భాష్యం నుండి

కర్మము = జీవులు ఆచరించే వృత్తి.

అకర్మము = 'అ' అనగా విష్ణువు కనుక ఇది విష్ణువు యొక్క కర్మము.

జీవుడు చేసే కర్మలనన్నింటికీ అతడే కర్త అని భావిస్తాడు. కానీ నిజానికి ఆ కర్మలన్నింటికీ శ్రీమహావిష్ణువే కర్త. కనుక స్వప్నంలో చేసే కర్మలకు తాను కర్తకాలేని జీవుడు అకర్మమునందే నిలిచి ఉంటాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు కర్మయే జరుగుతోందని తెలుసుకుంటాడు. మానవుడు అహంకారం చేత కర్మలన్నీ తాను చేస్తున్నానని అనుకున్నా, నిరహంకారియై చేసే కర్మలు కూడా శ్రీమహావిష్ణువు యొక్క కర్మలే అవుతున్నాయి. ఈ సత్యాన్ని తెలుసుకున్నవాడు బుద్ధిమంతుడు.

శ్రీధరుల భాష్య సారం

జీవుని బంధించడం కర్మల స్వభావం. నిష్కామ కర్మల్ని ఈశ్వరార్పణ బుద్ధితో చేసే కర్మలు మానవుణ్ణి బంధించవు. నిష్కాములుగా చేసే కర్మము పాత బంధాల్ని కూడా తొలగిస్తోంది. కనుక కర్మయందు అకర్మను చూడటం అంటే, బంధాల్ని కలిగించే కర్మలే బంధవిముక్తుణ్ణి చేస్తున్నప్పుడవి అకర్మలవుతాయి. బద్ధహీనులై మంచి పనులు చెయ్యకపోతే బంధితుడై హానికి గురి అవుతున్నాడు. అంటే మంచి పనులు చేయకుండా ఉండడం అకర్మ అవుతుంది. ఈ విధంగా అకర్మము నందు కర్మను చూడటం బుద్ధిమంతుని లక్షణం.

స్వామి వివేకానంద ఉపదేశం

కర్మము నందు అకర్మము = యుద్ధం చేస్తున్నా అటువంటివి, ఇంకే విధమైన కర్మలు చేస్తున్నా మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవడాన్ని అకర్మలంటారు.

అకర్మమునందు కర్మము= బయటకు కర్మలు చేస్తున్నట్లు కనిపించకపోయినా, గుహలో కూర్చుని తైలధారలాగా సదా స్మరణ చేసే కర్మను అకర్మ అంటారు.

కొందరు ఏకాంత జీవితానికి అలవాటు పడి ఉంటారు. అటువంటివారు నగర జీవితంలో ఇమడలేరు. అట్లాగే క్రియాశీల జీవితం గడపిన వారు ఏకాంత జీవితానికి అలవాటుపడలేరు. వీరిద్దర్నీ అసంపూర్ణులనే చెప్పాలి. ఈ రెండు విధాలైన జీవితానికి అలవాటు పడ్డవాడినే ఉత్తముడని అనాలి.

శ్రీరామకృష్ణుల ఉపదేశం

ఒక చేత్తో స్తంభాన్ని పట్టుకు గిరగిరా తిరిగే బాలుడికి ఎటువంటి భయమూ ఉండదు. అట్లాగే ఈశ్వరునిపై నిశ్చలమైన మనస్సును నిలిపి నీ పనులు నువ్వు చేస్తూ ఉండు. అప్పుడు నీకెటువంటి భయంగాని అపాయంగాని కలుగవు.

ఎవరి కర్మలైతే కోరికలేనివై ఉంటాయో, ఎవని కర్మలు జ్ఞానమనే అగ్నిచే కాల్చబడి ఉంటాయో అటువంటి వానిని విద్వాంసుడని పండితులంటారు. మనం పూలు కట్టేందుకు దారాన్ని వాడతాం. అదే దారాన్ని కాల్చినప్పుడు (ఆకారం అట్లాగే ఉన్నా) పూలు కట్టెందుకు ఉపయోగపడదు. అట్లా కర్మలు ఆశచేత ప్రేరేపించబడ్డప్పుడు అట్టి కర్మ మానవుని బంధిస్తోంది. అట్లా కాకుండా తాను చేసే కర్మలు పరమేశ్వరుని స్వరూపాలేనని భావించి చేస్తే, అవి అగ్నిలో ఆహుతిగా అర్పించబడుతున్నాయన్న భావనతో చేస్తే అందులో అహంకారం ఉండదు. అందువల్ల కర్మలు యథావిధిగా చేస్తే బంధవిముక్తుడవుతాడు. **19**

కర్మఫలాలపైన ఆసక్తి లేకుండా, తృప్తి కలిగినవాడై కర్మలు చేస్తున్నప్పటికీ కర్మలు చెయ్యనివాడే అవుతున్నాడు. పోస్టుమాన్ బట్వాడా చేసే ఉత్తరాల్లో ఒకరికి సంతోషాన్ని కలిగించే ఉత్తరాన్ని అందిస్తాడు. మరొకరికి దుఃఖాన్ని కలిగించే ఉత్తరాన్ని అందిస్తాడు. అయితే పోస్టుమాన్ ఆయా సుఖ దుఃఖాలతో ఆసక్తి లేనివాడై ఉంటాడు. అట్లాగే తాను చేసే కర్మలన్నీ సర్వేశ్వరునికి చేసే ఆరాధనేనన్న భావనతో చేస్తాడు. వాటి యందు అనాసక్తుడై నిత్య సంతృప్తుడుగా ఉంటాడు. అట్లాగే కర్మఫలము నందు ఆసక్తి లేకపోవటం వలన ఎవరి దయాదాక్షిణ్యాలను కోరుకోడు. ఇటువంటి వాడు చేసే కర్మలన్నీ అకర్మలే. **20**

ఒకప్పుడు గోపికలు యమునానది దాటాల్సి వచ్చింది. నదిని దాటించేందుకు పడవ ఎక్కడా కనిపించలేదు. నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆ సమయాన వ్యాస మహర్షి యమునానది ఒడ్డునే ఉన్నాడు. గోపికలంతా పోయి ఆయన్ను నదిదాటే ఉపాయం చూపమని ప్రార్థించారు. అప్పుడు మహర్షి "నాకు బాగా ఆకలిగా ఉంది. తినేందుకేమైనా

పెట్టండి. ఆ తర్వాత సంగతి ఆలోచిస్తాను" అన్నాడు. గోపికలు తమ వద్ద ఉన్న పెరుగు, వెన్న మహర్షికి సమర్పించారు. ఆ తర్వాత మహర్షి నది ఒడ్డుకు పోయి, "ఓ యమునాదేవీ! నేను ఈ రోజంతా ఉపవాసంతో గడపడమే నిజమైతే, నాకు దారి ఇవ్వు" అని అడిగాడు. యమునానది రెండుగా విడిపోయి మహర్షికి దారి ఇచ్చింది. మహర్షితో పాటు గోపికలంతా నదిని దాటారు. నదిని దాటిన తర్వాత గోపికలు మహర్షిని ఇలా అడిగారు. "స్వామీ! మా వద్ద ఉన్న పెరుగు వెన్న అంతా తిన్నారు. 'నేను ఉపవాసం ఉంటే దారి ఇవ్వు' అని ఎట్లాచెప్పారు" అని అడిగారు. అందుకు మహర్షి 'మీరిచ్చిన పెరుగు వెన్న తిన్నది నాలో ఉన్న ఈశ్వరుడేగాని వ్యాసుడుకాడు' అని చెప్పాడు. అంటే వ్యాసుడికి తనలో ఉన్న పరమాత్మపై అంతటి విశ్వాసం ఉంది. - శ్రీరామకృష్ణ పరమహంస.

ఆశలేనివాడికి, ఇంద్రియ నిగ్రహం గలవాడికి శరీరంతో చేసే కర్మల వల్ల పాపం అంటదు. అప్రయత్నంగా లభించినదాంతో తృప్తి పడేవాడు, సుఖదుఃఖాల వంటి ద్వంద్వాలన్నింటినీ సమదృష్టితో చూసేవాడు, అసూయ లేనివాడు చేసే కర్మల వల్ల పాపం అంటదు. అంటే బాధ్యతలన్నింటినీ ఒక యజ్ఞంలా చెయ్యాలి. **21-23**

"ముందుగా చేతికి చమురు రాసుకొని పనసపండు ఒలిస్తే చేతికి జిగురు అంటుకోదు. అట్లా ముందుగా పరమాత్మను తెలుసుకొని, ఆ జ్ఞానాన్ని రక్షగా చేసుకున్న తర్వాత లౌకిక కర్మలు చేసినా భోగభాగ్యాల మధ్య జీవించినా అతడు వాటికి వశుడు కాడు."
- శ్రీరామకృష్ణ పరమహంస.

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥

హోమద్రవ్యాలైన నెయ్యి మొదలైనవన్నీ బ్రహ్మము. అట్టి బ్రహ్మం అగ్నిలో హోమం చేయబడుతూ బ్రహ్మానికే అర్పించబడుతోంది. బ్రహ్మమగు కర్మయందు మనస్సు లగ్నం చేసినవానికి బ్రహ్మమే లభిస్తుంది. కొందరు అహంకారంతో యాగానికి కర్తవ్యాన్ని తమపైనే వేసుకొని యజ్ఞాలు చేస్తారు. అంటే తాను వేరు అగ్ని వేరు, దేవతలు వేరు, హోమద్రవ్యాలు వేరు అన్న భేదబుద్ధితో యజ్ఞాలు చేస్తారు. కానీ యజ్ఞం చేసేవారు సమస్తం బ్రహ్మమే అన్న భావనతో చెయ్యాలి. ఆహారం తీసుకోవడం జ్ఞానికి నిత్య కర్మ. అట్టి నిత్య కర్మనే అతడు జ్ఞానయజ్ఞంగా చేస్తున్నాడు. అంటే భుజించే ఆహారం బ్రహ్మము, భుజించడమనే కర్మకూడా బ్రహ్మమే. భోజనం చేసేవాడు బ్రహ్మమే, దాన్ని ఆరగించే జఠరాగ్నీ బ్రహ్మమే. ఈ విధంగా బ్రహ్మనిష్ఠ యందు స్థిరంగా ఉండేవాడు బ్రహ్మాన్ని తప్పక పొందుతాడు. **24**

కొందరు యోగులు దేవతల ప్రీతి కోసం యాగం చేస్తూ ఉంటారు. కొందరు బ్రహ్మమనే అగ్నిలో ఆత్మను ఆత్మచేత హోమం చేస్తున్నారు. **25**

బ్రహ్మ బుద్ధిలేని కొందరు ఇంద్రాది దేవతల్ని ఉపాసించి హోమాలు చేస్తున్నారు. బ్రహ్మవిలుష్టులైనవారు ఆత్మను ఆత్మచేత హోమం చేస్తున్నారు. నది సముద్రంలో కలసిన తర్వాత నది

తన రూపాన్ని కోల్పోతుంది. అట్లాగే దేహంలో ఉండే జీవాత్మ అఖండ సచ్చిదానందమైన పరమాత్మకు ఆహుతిగా సమర్పించబడుతోంది. అప్పుడు జీవుడు ఉనికిని కోల్పోయి పరమాత్మలో ఐక్యమవుతున్నాడు. దీన్నే జ్ఞానులు చేసే జ్ఞానయజ్ఞమంటారు.

కొందరు చెవి మొదలైన 'నిగ్రహము' అనే అగ్నిలో హోమం చేస్తున్నారు. మరి కొందరు శబ్దవంటి విషయాలను 'ఇంద్రియాలనే' అగ్నిలో హోమం చేస్తున్నారు. **26**

ఇంద్రియాలెప్పుడు ఇంద్రియార్థములపై ఆసక్తి కలిగి ఉంటాయి. ఈ పంచేంద్రియాల్ని నిగ్రహించినట్లైతే కొంతకాలానికి అవి పని చెయ్యడం మానేస్తాయి. ఇదీ ఒక విధమైన యాగమే. ఇందువలన ఒక్కొక్క ఇంద్రియము ఈశ్వర సంబంధమైన విషయాలపైన ఆసక్తి చూపిస్తూ ఉంటాయి. అంటే కళ్ళు భగవత్సం బంధమైన రూపాల్నే చూస్తూ ఉంటాయి. చెవి భగవత్సంబంధమైన విషయాన్నే వింటూ ఉంటాయి. అట్లాగే తక్కిన ఇంద్రియాలు కూడా. ఇందువలన ఇచ్చే నష్టం ఏమీ ఉండదు. ఈ విధమైన యజ్ఞాన్ని కూడా జ్ఞానయజ్ఞమనే అంటారు.

మరికొందరు ఇంద్రియ కర్మల్నీ, ప్రాణ కర్మల్నీ (స్పర్శరూప శ్రవణ రస గంధాదుల్ని) ఆధ్యాత్మిక వాయువు యొక్క (శ్వాస లోపలకు పీల్చడం, బయటకు వదలడం) కర్మలను మనోనిగ్రహమనే జ్ఞానాన్ని 'యోగ'మనే అగ్నిలో హోమం చేస్తున్నారు. దీపంలో నూనె పొయ్యడం వలన దాని ప్రకాశం పెరుగుతుంది. అట్లాగే వివేకం ఉదయించినప్పుడు జ్ఞానదీపం ప్రకాశవంతంగా వెలుగుతుంది. **27**

మనస్సును ఆత్మజ్ఞానం అనే అగ్నిలో హోమం చెయ్యడం వలన ఉజ్వలంగా మండే అగ్నిలా ఉంటుంది. మనస్సు ఆత్మ స్వరూపంలో చేరడానికే ఇంద్రియకర్మలు, ప్రాణకర్మలన్నీ చెడు మార్గాన్ని వదలి ఆత్మ స్వరూపంగా మారుతున్నాయి. అంటే అల్పబుద్ధులైన ఇంద్రియ ప్రాణ కర్మలు గొప్ప బుద్ధిగా మారడాన్నే యాగమంటారు. ప్రాణ కర్మలంటే శరీరమంతా వ్యాపించి ఉండే జీవశక్తియే.

కొంత మంది పుణ్యతీర్థాల్లో యజ్ఞ బుద్ధితో బియ్యం, వస్త్రాలు, ధనం వంటివి దానం చేస్తారు. దీన్ని ద్రవ్యయజ్ఞం అంటారు. కొంతమంది యజ్ఞ బుద్ధితో తపస్సు చేస్తారు. దీన్ని తపోయజ్ఞం అంటారు. కొంత మంది యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులనే అష్టాంగ యోగాన్ని యజ్ఞబుద్ధితో చేస్తారు. దీన్ని యోగ యజ్ఞం అంటారు. కొంతమంది గురువు వద్దకు పోయి నియమంతో యజ్ఞ బుద్ధితో వేదాధ్యయన చేస్తారు. వారిది స్వాధ్యాయయజ్ఞం అంటారు. కొంతమంది శాస్త్రాధ్యయనం చేసి ఆ పరిజ్ఞానంతో వేదార్థాన్ని యజ్ఞబుద్ధితో చేస్తారు. దీన్ని జ్ఞాన యజ్ఞం అంటారు. కొంతమంది యతులు వ్రతాచారణంతో సంయమనం ఆచరిస్తారు. అట్టి వారది నిశిత వ్రతయజ్ఞం అంటారు. **28**

కొంత మంది ప్రాణాయామంలో (ప్రాణాలను నిరోధిస్తూ) తత్పరులై అపాన వృత్తి యందు ప్రాణ వృత్తిని హోమం చేస్తూ ఉంటారు. అట్లాగే ప్రాణవృత్తియందు అపాన వృతిని హోమం చేస్తూ ఉంటారు. ఇంకొందరు ప్రాణాపాన వృత్తులు రెండింటినీ నిరోధించి కుంభకం అనే ప్రాణాయామం చేస్తున్నారు. **29**

మరికొందరు పవిత్రమైన ఆహారాన్ని తక్కువ తీసుకుంటూ తాము పూర్వం జయించిన ప్రాణవాయువును ఆ ప్రాణ వాయువులలోనే హోమం చేస్తారు. ప్రాణుల్ని ప్రాణాలతో హోమం చెయ్యడమంటే ఇదే. అంటే ఆయా ప్రాణాల స్థానాన్ని తెలుసుకొని యోగులు వీటిని వశపరచుకునేందుకు ఆచరించే యోగ పద్ధతులకు చెందినది. ప్రాణయజ్ఞం వలన వీరి పాపాలన్నీ నశించిపోతాయి. **30**

ఓ కురుకుల శ్రేష్ఠా! యజ్ఞం చెయ్యగా మిగిలిన అన్నాన్ని అమృతం అంటారు. ఈ అమృతాన్ని సేవించేవారు నాశరహితమైన బ్రహ్మాన్ని పొందుతున్నారు. కనుక పైన చెప్పిన యజ్ఞాల్లో ఏ ఒక్కటైనా చెయ్యనివారు పరలోకాన్ని పొందలేరు. అంటే ఉత్తమ లోకాలు పొందరని భావం. **31**

పైన చెప్పిన యాగాలన్నీ వేదాల ద్వారా వ్యాప్తిలోకి వచ్చాయి. అంటే బ్రహ్మ, వేదం, ప్రకృతి మూడూ ఒకే వస్తువు. ఈ యాగాలన్నీ కర్మ సంబంధమైనవి. నేను మాత్రం నిష్క్రియుడనని, సాక్షీభూతుణ్ణి మాత్రమేనని తెలుసుకో. కర్మ సంబంధమైన ఈ యజ్ఞాలన్నీ అనాత్మరూపాలు. ఆత్మ వ్యాపార శూన్యమన్న జ్ఞానం కలిగితే ముక్తుడవుతాడు. **32**

ఓ అర్జునా! బాగా ఆలోచించి చూడగా ధనంతో కూడుకొన్న ఈ యజ్ఞాల కంటే జ్ఞానయజ్ఞమే అన్ని విధాలా శ్రేష్ఠమైనది. ఎందువల్లనంటే అన్ని కర్మల, కర్మ ఫలాలకు గమ్యం జ్ఞానమే కనుక. **33**

"ధనం ఎవరికి బానిసగా ఉంటుందో అతడే నిజమైన మానవుడు. ధనాన్ని ఎట్లా వినియోగించాలో తెలియనివాడిని మానవుడని అనలేం" - శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునా! అటువంటి జ్ఞానం పొందే మార్గం చెప్తాను విను. బ్రహ్మసాక్షాత్కారం పొందిన జ్ఞానుల వద్దకు వెళ్ళి వినయంగా సాష్టాంగ నమస్కారంచేసి వారికి శుశ్రూషలు చేస్తూ, వారిని ప్రసన్నులను చేసుకొని మీ సందేహాలన్నీ తీర్చుకుంటూ వారు చేసే జ్ఞానోపదేశాన్ని గ్రహించాలి. తన గురువు కేవలం మానవ మాత్రుడని తలచే శిష్యునికి ఒరిగేదేమీ ఉండదు. శిష్యుడు పరిపక్వ దశకు చేరుకోగానే గురువే ఈశ్వరుడుగా మారి ఈశ్వర రూపాన్ని చూపిస్తాడు. గురువు మానవుడైతే మహామంత్రాన్ని నీ చెవిలో ఉపదేశిస్తాడు. అదే దేవగురువు అయితే ఆత్మయందు దివ్యచైతన్యాన్ని ప్రవేశింపజేస్తాడు. **34**

"ఈశ్వర రహస్యాలను తెలుసుకోవాలన్న కాంక్ష తీవ్రమైనప్పుడు, ఆ ఈశ్వరుడే నీ వద్దకు సద్గురువును పంపుతాడు. కనుక ఓ భక్తుడా! నువ్వు గురువును అన్వేషిస్తూ పోవాల్సిన అవసరం లేదు." - శ్రీరామకృష్ణ పరమహంస

పాండవా! అటువంటి జ్ఞానాన్ని నువ్వు పొందితే ఇటువంటి మోహానికి గురికావు. పిపీలికాది బ్రహ్మపర్యంతం ఆ ప్రత్యగాత్మ స్వరూపాన్ని నీలోను, నాలోను సర్వభూత ములందూ చూడగలుగుతావు. ఆత్మజ్ఞానం కలిగినప్పుడు అన్ని వస్తువుల్లోను, అన్ని ప్రాణుల్లోనూ ఒకే పరమాత్మ లీనమై ఉన్నట్లు తెలుసుకొంటావు. **35**

"ఒకటే అన్నీ తెలుసుకొనుట జ్ఞానం. పలువిధాలుగా చూడటం అజ్ఞానం."

- శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునా! నువ్వు పాపాత్ములందరికంటే గొప్ప పాపివైనప్పటికీ జ్ఞానమనే తెప్పను ఆధారం చేసుకొని పాపాలన్నింటి నుండీ బయట పడవచ్చు. అంటే ధర్మాధర్మ రూపమైన పాపమనే సముద్రాన్ని సాధకుడు తెప్ప సాయంతో దాటగలుగుతాడు. ఓ అర్జునా! బాగామండిన అగ్ని కర్రల్ని ఎట్లా భస్మం చేస్తుందో అట్లాగే జ్ఞానం కూడా పాపాన్ని భస్మం చేస్తుంది. కాలిపోయిన విత్తనాలు ఆకారంలో మార్పు లేకపోయినా, వాటిని నాటితే మొలకెత్తవు. అట్లాగే జ్ఞానాగ్ని చేత కర్మలు కాలిపోతాయి. అయితే ప్రారబ్ధ కర్మము మాత్రం నశించదు. అది పనిచేస్తూనే ఉంటుంది. అయితే ఆ కర్మకు అంత వేగం ఉండదు. స్వప్నంలో భయపడిన వాడి గుండె వేగంగా కొట్టుకుంటుంది. అయినా మేలుకున్న తర్వాత అతడికి ఎటువంటి హాని కలుగదు. అట్లాగే జ్ఞాని అయిన వాడి ప్రారబ్ధ కర్మము అతడిని బాధించదు. **36-37**

ప్రపంచంలో జ్ఞానంతో సమానమైనది, పవిత్రమైనది మరొకటి ఉండదు. యోగ స్థితిని పొందినవాడు తనయందే ఈ జ్ఞానాన్ని పొందుతాడు. ఒకడు స్వప్నంలో తనకు దెబ్బలు తగిలినట్లు దుఃఖిస్తూ ఉంటాడు. కానీ మెలకువరాగానే తనను గూర్చిన నిజమైన జ్ఞానాన్ని పొందుతున్నాడు. తన్ను ఎవరూ కొట్టలేదని, నిజానికి తాను దుఃఖించడం లేదని తెలుసుకుంటాడు. నిద్ర మేలుకోవడం అనేది అజ్ఞాన మలము నుండి పరిశుద్ధునిగా చేస్తోంది. మానవుడు ఈ విధంగా తన స్వస్వరూపాన్ని తెలుసుకొని జనన మరణాల నుండి బయటపడుతున్నాడు. అందువల్లనే మనిషిని పరిశుద్ధునిగా చెయ్యాలంటే జ్ఞానాన్ని మించింది లేదు. **38**

శ్రద్ధగలవాడు, ఇంద్రియ నిగ్రహం గలవాడు, తదేక నిష్ఠతో ఉపాసన చేస్తే తప్పక జ్ఞానాన్ని పొందగలడు. జ్ఞానం వలన అతి త్వరలో పరమశాంతిని పొందగలడు. జ్ఞానహీనుడు, శ్రద్ధలేనివాడు, సందేహాలు గలవాడు వినాశనాన్నే పొందుతాడు. **39-40**

"నమ్మకం ఉంచడంలో శిశువులాగా ఉంటేగాని ఈశ్వర దర్శనం లభించదు. అతడు నీ సోదరుడు అని తల్లి చెప్తే ఆ బిడ్డ తల్లి మాటపై నూరుశాతం విశ్వాసం ఉంచుతాడు. ఇటువంటి బిడ్డ విశ్వాసాన్ని ఎవడైతే ఈశ్వరుడిపై ఉంచుతాడో అటువంటి వాడికి భగవంతుని కరుణాకటాక్షాలు సిద్ధిస్తాయి. ప్రతి విషయంలో లాభనష్టాల్ని చూసే స్వభావంగల వానికి ఈశ్వరానుగ్రహం పొందటం అసాధ్యం." - శ్రీరామకృష్ణ పరమహంస

ధనంజయా! యోగం చేత కర్మలన్నీ వదిలిపెట్టి, జ్ఞానం చేత సందేహాలన్నీ నివృత్తిచేసుకొని, ఆత్మ స్వరూపాన్నే దర్శిస్తూ ఉన్నవానిని కర్మలు బంధించలేవు.

ప్రపంచంలో ఉంటూ కర్మలు చేస్తున్నా వాటి పట్ల అనురక్తిలేని వానిని యోగి అంటారు. ప్రపంచ (ప్రకృతి) రహస్యాలన్నీ ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకున్నవాడికి సందేహాలు తొలగిపోయి శ్రద్ధ పెరుగుతుంది. అట్టి శ్రద్ధ కలుగగానే అన్నీ పరమేశ్వరుని స్వరూపాలేనని తెలుసుకుంటాడు. ఈ ఆత్మ ప్రబోధం కలిగినవాడు సంపూర్ణ మానవుడవుతాడు. అట్టి మానవుడు కర్మలు చేసినా బాధించబడడు. **41**

కనుక అజ్ఞానం నుండి ఉదయించిన నీ సంశయాలన్నింటినీ జ్ఞానమనే ఖడ్గంతో ఛేదించు. యోగాన్ని ఆచరించేందుకై లెమ్ము. **42**

సూర్యుడు ఉదయించగానే వెలుగు వస్తోంది. ప్రాణులకు మెలుకువ వస్తోంది. కర్మలు చేసే ఆసక్తి కలుగుతుంది. అట్లాగే ఆత్మజ్ఞానం ఆత్మబోధాన్ని, కర్మలు చేయడంలో నిపుణత్వం కలిగిస్తోంది. సీతను వెదికేందుకు ఆంజనేయుడు దక్షిణ దిక్కున వెళ్ళడానికి సముద్రతీరాన్ని చేరగానే సంశయం కలిగి విచారిస్తూ ఉంటాడు. అప్పుడు ఆంజనేయుని శక్తి సామర్థ్యాలను జాంబవంతుడు గుర్తు చేశాడు. వెంటనే ఆంజనేయుడికి ఆత్మబోధం కలిగింది. అతని సందేహాలన్నీ తొలగిపోయాయి. గొప్పకార్యం చెయ్యడానికి అధికారి అయ్యాడు.

5

కర్మసన్న్యాస యోగం

మనమింతవరకు కర్మ, జ్ఞాన యోగాల గూర్చి తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో కర్మ సన్న్యాసాన్ని గూర్చి చెబుతున్నారు. వారివారి యోగ్యత, అధికారాన్ని బట్టి కర్మ మార్గాన్నిగాని, జ్ఞాన మార్గాన్నిగాని ఆశ్రయించవచ్చని చెప్పారు. జ్ఞాన కర్మలు రెండూ వెలుగు చీకటి వంటివి. అంటే పరస్పర విరుద్ధాలు. కర్మ ఒక్కటే జ్ఞానానికి మార్గం అనడానికి వీలులేదు. ఎందువల్లనంటే అజ్ఞానం లాగానే కర్మకూడా స్వతంత్రమైనది కాదు కాబట్టి. అంటే అజ్ఞానాన్ని కర్మనాశనం చెయ్యలేదు.

పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకొని సంసారాన్ని దాటుతాడని శ్రుతి చెప్తోంది. కాబట్టి మోక్షానికి జ్ఞానమే మార్గం అని తేలిపోతోంది. అయితే రెండూ ఒక్కరే ఆచరించవచ్చునా? కర్మమార్గం, జ్ఞానమార్గాలలో ఏది గొప్పది? ఏ మార్గాన్ని అనుసరిస్తే రెండో మార్గానికి సహాయకారిగా ఉంటుంది? ఏ మార్గానికి ఎవరు అధికారులు? ఈ విషయాలన్నీ ఉపదేశించేందుకే ఈ అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారు.

అర్జునుడు *:* ఓ కృష్ణా! ఒకసారి కర్మ త్యాగాన్ని గూర్చి చెప్తున్నావు. మరొకసారి కర్మయోగాన్ని గూర్చి చెప్పావు. ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠమైనది? **1**

శ్రీకృష్ణుడు *:* కర్మ, కర్మత్యాగం రెండూ మోక్షానికి సాధనాలే. ఈ రెండిటిలో కర్మానుష్ఠానం శ్రేష్ఠమైనది. **2**

కర్మల అనుష్ఠానాన్ని కర్మయోగం అంటారు. కర్మల్ని త్యాగం చెయ్యడాన్ని కర్మ సన్న్యాసమంటారు. రెండూ మోక్షానికి సాధనాలే. శ్రేష్ఠము లేక శ్రేయస్సు అంటే ముక్తి అని అర్థం. కాశీ క్షేత్రానికి విమానంలో వెళ్ళవచ్చు. లేదా రైలులో వెళ్ళవచ్చు. రైలులో వెళ్ళేవారు ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంటాయి. ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణం చెయ్యవచ్చు. విభిన్న సంస్కృతుల్ని అధ్యయనం చెయ్యవచ్చు. ఈ వెసులుబాటు విమానంలో వెళ్ళే వారికి లభించదు. అందువల్ల కర్మయోగమే మంచిది.

గొప్ప బాహువులుగల ఓ అర్జునా! రాగద్వేషాలులేనివాడిని నిత్య సన్న్యాసి అంటారు. అంటే ఎవడైతే దుఃఖాన్నిగాని, ఆ దుఃఖానికి కారణమైన దాన్ని గాని ద్వేషించడో, సుఖాన్ని గాని ఆ సుఖానికి కారణమైన దాన్ని గాని కోరడో అట్టి కర్మయోగి కర్మలు చేస్తున్నా అతణ్ణి 'నిత్య సన్న్యాసి' అంటారు. **3**

అజ్ఞానులు కర్మసన్న్యాసాన్ని, కర్మయోగాన్ని వాటి ఫలాలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయంటారు. జ్ఞానులు మాత్రం ఈ రెంటిలో ఏదో ఒకదాన్ని సాధనచేసి మోక్షాన్ని పొందుతారు. మోక్షమే ఈ రెండింటికీ ఫలం. ఇక్కడ సాంఖ్యం అంటే ఆత్మ సమీక్షకు తగినట్టి కర్మసన్న్యాసం అని అర్థం చెప్పుకోవాలి. యోగం అంటే కర్మ యోగమని అర్థం. **4**

సాంఖ్యులు ఏ స్థానాన్ని పొందుతున్నారో యోగులు కూడా అదే స్థానాన్ని పొందుతున్నారు. ఈ రెంటినీ ఒకటిగా చూసేవాడు సత్యాన్ని దర్శిస్తాడు. **5**

గొప్పబాహువులు గల ఓ అర్జునా! కర్మలు చేయకుండా వదిలేసినంత మాత్రాన మోక్షాన్ని పొందలేవు. కర్మయోగం చెయ్యడం ద్వారానే ముని అయిన వాడు సత్వరమే బ్రహ్మాన్ని పొందుతాడు. **6**

కాయ చెట్టుకు ఉన్నంత వరకు ఆ కాయ చెట్టు నుండి సారాన్ని గ్రహిస్తూ కాలక్రమంలో రుచికరమైన పండు అవుతుంది. ఆ తర్వాత దాన్ని చెట్టు నుండి వేరుచేసినా ఏమీ నష్టం ఉండదు. అట్లాగే యోగి అయినవాడు క్రమపద్ధతిలో కర్మయోగం చేస్తూ ఉంటే ప్రకృతి నుండి పొందాల్సిన అనుభవాలన్నీ పొంది ఆ జ్ఞానం వల్ల ఆత్మజ్ఞానం పొందుతున్నాడు. కనుక అందరూ కర్మయోగాన్ని ఆచరించాలి.

కర్మయోగవిష్టుడు, పరిశుద్ధమైన మనస్సుగలవాడు, శరీరాన్ని ఇంద్రియాల్ని జయించినవాడు గడ్డి పోచ నుండి బ్రహ్మవరకు సమస్త జీవరాసుల్ని ఆత్మస్వరూపంగా చూడగలిగినవాడు కర్మలు చేసినా అట్టి కర్మలచే బంధించబడడు. నిత్యనైమిత్తిక కర్మలు ఆచరించడం వల్ల మనస్సు పరిశుద్ధమవుతుంది. రజస్తమోగుణాలచేత కలుషితం కాదు. అహంకారమమకారాలు లేనివాడై ఇంద్రియాల్ని జయించ గలుగుతాడు. కనుక అటువంటి వానికి జీవరాసులన్నీ ఆత్మస్వరూపంగానే కనిపిస్తాయి. **7**

ఆత్మతత్వాన్ని తెలుసుకున్న జ్ఞాని, వింటున్నా, చేత్తో తాకినా, వాసనచూస్తున్నా, తింటున్నా, శ్వాస తీసుకొంటున్నా విడుస్తున్నా, కళ్ళు తెరచినా మూసుకున్నా ఇంద్రియాలు వాటి పని అవి చేసుకుంటున్నాయని తెలుసుకొని 'నేను ఏమీ చేయడం లేదు" అని అనుకుంటాడు. **8-9**

> *"పరుసవేది తాకటంచేత ఇనుప ఖడ్గం బంగారంగా మారిపోతుంది. ఆకారంలో ఎటువంటిమార్పు లేకపోయినా నరకటానికి మాత్రం పనికిరాదు. అట్లాగే ఆత్మజ్ఞానం పొందినవాడు నిత్య నైమిత్తిక కర్మలు చేస్తున్నా అవి అతణ్ణి బంధించవు. అతడికి అహంకారం ఉన్నా అది ఇతరులను బాధించదు."*
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

ఫలాపేక్ష లేకుండా బ్రహ్మార్పణ బుద్ధితో కర్మలను ఆచరిస్తూ తామరాకుపై నీటి బొట్టువలె ఎవడు ఆచరిస్తాడో అతడికి పాపం అంటదు. **10**

సేవకుడు యజమాని కోసం కర్మలు చేస్తున్న విధంగా ఎవడైతే కర్మలను ఈశ్వర ప్రీతికోసం చేస్తాడో అట్టివాడు కర్మబంధములకు చిక్కడు.

నిష్కామకర్మ యోగులు సంగభావాన్ని వీడి కేవలం శరీర, మనో, బుద్ధి ఇంద్రియాలతో మాత్రమే కర్మలు చేస్తారు. **11**

యోగి హృదయం నుండి అహంకారం పూర్తిగా నశించిపోతోంది. అంత రేంద్రియాలు, బహిరేంద్రియాలు తమతమ పనులను అవి చేస్తూ ఉంటాయి. కానీ కోరిక అనే వేగం అతడికి రావడం లేదు. పెట్రోలుతోగాని, ఆవిరితో గాని ఇంధనంగా ఉంటూ బండ్లు నడుస్తూ ఉంటాయి. ఇంధనాన్ని ఆపుచేసినా ఆ వేగానికి ఆ బండి కొంత దూరం నడుస్తుంది. అట్లా అంతఃకరణాలు ఆశ అనే ఇంధనం లేకపోయినా కొంతకాలం అవి పనిచేస్తాయి. అందువలన చిత్త శుద్ధి కలుగుతుంది.

యోగి అయిన వాడు కర్మఫలంపైన ఆసక్తి లేనివాడై శాంతిని పొందుతున్నాడు. కర్మఫలమందు ఆసక్తి గలవాడు యోగి కాలేడు, కర్మబద్ధుడవుతున్నాడు. **12**

యోగికి, యోగికానివాడికీ కూడా కర్మ ఆచరించే తీరు ఒకే విధంగా ఉంటుంది. భగవదర్పణ బుద్ధితో చేసే కర్మలన్నీ యోగికి నిష్ఠ అవుతుంది. అందువల్ల అతడికి స్థిర బుద్ధి ఏర్పడి ఎటువంటి దుఃఖాన్ని పొందటం లేదు. శాంతి కలిగినవాడై జ్ఞానాన్ని పొందుతున్నాడు. యోగికానివాడు ఆశాపాశాలకు దాసుడై కర్మఫలాన్ని కోరుకుంటున్నాడు. అందువల్ల అతణ్ణి కర్మలు బాధిస్తూ ఉంటాయి.

ఇంతవరకు పరిశుద్ధాంతఃకరణం కానివానికి కర్మ సన్న్యాసం కంటే కర్మ యోగం మంచిదని ఉపదేశించాడు. ఇప్పుడు పరిశుద్ధమైన అంతఃకరణము గలవానికి సర్వకర్మ సన్న్యాసమే మేలని చెపుతున్నారు.

ఇంద్రియ నిగ్రహం గలవాడు కర్మలన్నింటినీ వివేకంతో వదిలేసి తాను ఏమీ చెయ్యకుండా, చేయించనివాడై తొమ్మిది ద్వారాలు గల దేహమనే నగరంలో దేహి సుఖంగా ఉంటున్నాడు. **13**

దేహాన్ని నవ ద్వారాల నగరంగా చెప్తూ ఉంటారు. అట్టి నగరానికి ఆత్మ రాజువలె ఉంటాడు. అహంకారం, బుద్ధి, మనస్సు ప్రాణం ఇంద్రియాలు మొదలైనవి ప్రారబ్ధ కర్మము ననుసరించి తమ తమ పనులు చేస్తూ ఉంటాయి. ఇటువంటి కర్మలన్నింటికీ తానే కర్తనని యోగి అయినవాడు తలచడు.

యోగి అయినవాడు అంతా ఈశ్వరేచ్ఛ అని భావించి కర్తృత్వాన్ని తనపైన ఉంచుకోడు.

కర్తృత్వము, కర్మ, కర్మఫలం మొదలైనవన్నీ భగవంతుడు సృష్టించినవి కావు. ప్రకృతే వీటిని సృష్టించింది. **14**

పరమాత్మ స్వరూపమైన ఆత్మ, చిత్తశుద్ధి చేత మోక్షాన్ని పొందిన సన్న్యాసులను ఫలానా పని చెయ్యమని ఆదేశించదు. తనకు ఇష్టాఇష్టాలు ఉండవు కాబట్టి, తనకు ఇష్టమైన వాటిని సృజిస్తాడనడం సరికాదు. ఆయనకు కర్తృత్వం భోక్తృత్వం రెండూ ఉండవు. అయితే మరి ఈ లోక వ్యవహారాలన్నీ ఎట్లా జరుగుతున్నాయన్న ప్రశ్న రావచ్చు. భగవత్సంకల్పాన్ని మహామాయ ప్రకృతిపరంగా జరుపుతుంది. ఈ జీవ స్వభావాలన్నీ ఆ ప్రకృతివే. అంటే ప్రకృతి అంటే ఆత్మ స్వరూపం కన్నా భిన్నమైన అవిద్యయేనని మనం గ్రహించాలి. కర్తృత్వాన్ని కారణరూపంగా ప్రవర్తిస్తోంది. అంటే స్వభావమే (అవిద్యయే) లోక వ్యవహారాలైన కర్మలకు కారణమవుతోంది. కర్మలున్నప్పుడు కర్మఫలాలూ ఉంటాయి కదా! ఇక్కడ ప్రకృతి, మాయ, మిథ్య, అవిద్య, స్వభావం, అజ్ఞానం అన్న పదాలన్నీ ఒకే అర్థాన్నిస్తాయని గ్రహించాలి.

పరమాత్మ ఎవరి పాపపుణ్యాలను స్వీకరింపడు. జ్ఞానం అజ్ఞానం చేత కప్పబడి ఉంటుంది. అందువల్లనే ప్రాణులన్నీ మోహం చెందుతున్నాయి. పంచభూతాల్లో ఆకాశం అంతటా వ్యాపించి ఉంటుంది. భూమి, నీరు, అగ్ని, గాలి వంటి భూతాలు ఎన్ని అల్లకల్లోలాలు సృష్టించినా అవి ఆకాశాన్ని బాధించవు. అట్లాగే ప్రకృతిలో ఉండే బాగోగుల్ని పరమాత్మ గ్రహించడం లేదు. **15**

పరమేశ్వరుడు ఆనంద స్వరూపి. పరిపూర్ణుడు. కార్యకారణాలతో ఆయన ఎటువంటి సంబంధాన్ని పెట్టుకోడు. ప్రకృతి భగవంతుని ఛాయగా ఉండటంచేత అతిశక్తిమంతంగా ఉంటోంది. జీవుడు ప్రకృతితో సన్నిహితంగా మెలగడం వలన బంధితుడవుతున్నాడు. ఎప్పుడైతే ప్రకృతి నుండి దూరమవుతాడో అప్పుడు బంధాల నుండి విముక్తుడవుతున్నాడు. ఇదే వేదాంత సారం.

> *"వెలుగు నివ్వడం దీపం యొక్క స్వభావం. దాని సహాయంతో కొందరు భాగవతం చదువుకుంటారు. మరికొందరు తప్పుడు పత్రాలు సృష్టిస్తూ ఉంటారు. దీపం సాక్షిభూతంగానే ఉంటుంది. అట్లాగే కొందరు భక్తితో భగవన్నామ సంకీర్తనం చేస్తారు. మరి కొందరు చెవులు మూసుకుంటారు. అంతమాత్రాన భగవంతుడు అశుద్ధముకాడు; ఆయన ఎన్నటికీ పరిశుద్ధుడే. - శ్రీరామకృష్ణ పరమహంస*

ఎవరి అజ్ఞానం, ఆత్మజ్ఞానం చేత నిర్మూలించబడుతుందో అతడికి ఆ జ్ఞానం సూర్యునివలె ప్రకాశించి పరమార్థ తత్త్వాన్ని చూపుతుంది. **16**

సూర్యుడు ఉదయించగానే చీకటి నశించిపోతుంది. అట్లాగే జ్ఞానోదయం కాగానే అజ్ఞానం నశించిపోతుంది. సూర్యుని వెలుగు ప్రపంచాన్నంతా ఎట్లా ఉన్నదున్నట్లుగా చూపుతుందో, అదే విధంగా ఆత్మజ్ఞానం పరబ్రహ్మాన్ని స్పష్టంగా చూపుతుంది. ఆత్మజ్ఞానమన్నా, బ్రహ్మజ్ఞానమన్నా ఒక్కటేనని గ్రహించాలి.

బ్రహ్మమునందే బుద్ధి నిలిపి, తామే బ్రహ్మమన్నవారూ, బ్రహ్మమునందే దృఢ నమ్మకం గలవారూ, దానినే ఆశ్రయించినవారూ జ్ఞానం చేత పాపాలన్నిటి నుండి విముక్తి పొంది జన్మరాహిత్యాన్ని పొందుతున్నారు. **17**

సూర్యుడు ఎక్కడకు వెళ్ళి వెదికినా చీకటి అతడికి కనపడదు. ఆ ప్రదేశాలన్నీ ప్రకాశవంతంగానే ఉంటాయి. అట్లాగే బ్రహ్మజ్ఞానం పొందినవాడు మనస్సులోను బయటా కూడా బ్రహ్మ స్వరూపాన్నే చూస్తాడు. ఎందువల్లనంటే అతడు పొందింది బ్రహ్మసాక్షాత్కారమే కనుక. అందువల్లనే అతడు బ్రహ్మజ్ఞాని అవుతున్నాడు. అతడే బ్రహ్మస్వరూపంగా ఉంటున్నాడు కనుక ఇక పునర్జన్మ ఉండదు.

> *"యుక్తి చేత పొందే జ్ఞానం ఒక రకమైందిగాను, ధ్యానం చేత పొందే జ్ఞానం మరొక రకమైనదనీ, ఈశ్వర దర్శనం చేత వాటన్నింటికన్నా ఉత్కృష్టమైన జ్ఞానోదయం అవుతుందని నేను ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. - శ్రీరామకృష్ణ పరమహంస*

విద్యావినయ సంపన్నులైన బ్రాహ్మణుల యెడలను, గోవు, ఏనుగు, కుక్క, నక్క మాంసంతినే చండాలుడి యందును పండితులు సమదృష్టి కలిగి ఉంటారు. **18**

సూర్యుని వెలుగు అన్ని వస్తువులపైనా సమానంగానే పడుతుంది. ఇది గంగ అనిగాని, ఇది మురుగు కాలువ అని గానీ భేదభావం సూర్యుడికి ఉండదు. అట్లాగే బ్రహ్మజ్ఞాని బ్రహ్మాన్ని సర్వత్రా చూస్తున్నాడు. పుస్తకాలు చదివినంత మాత్రాన పండితుడు కాడు. బ్రహ్మసాక్షాత్కారం పొందినవాడే పండితుడు. లోకుల దృష్టిలో వినయ విద్యాసంపన్నుడైన బ్రాహ్మణుడు ఉత్తముడైతే , కుక్క మాంసం తినేవాడు అధముడు. తామస స్వభావంగల ఏనుగు వంటి జీవులన్నింట్లోను తారతమ్యాలు కనిపిస్తాయి. కానీ బ్రహ్మజ్ఞాని మాత్రం ఈ జీవులన్నింటినీ భేదభావం లేకుండా చూస్తున్నాడు.

"భేదబుద్ధి ఇచ్చేది అజ్ఞానం, సమబుద్ధినిచ్చేది జ్ఞానం" - *శ్రీరామకృష్ణ పరమహంస*

మనస్సును సమభావమందు నిలిపినవాడు ఈ జన్మలోనే ప్రకృతిని జయించ గలుగుతాడు. ఎందువల్లనంటే బ్రహ్మము సమభావం కలిగినట్టిది; దోషం లేనిది. కనుక అట్టివారు బ్రహ్మమునందు స్థిరంగా నిలచి ఉంటారు. **19**

అద్దం మిట్ట పల్లాలుగా ఉంటే అందులో కనిపించేవస్తువులు కూడా ఎగుడుదిగుడిగా కనిపిస్తాయి. అదే అద్దం సమంగా ఉన్నట్లయితే అందులో చూసే వస్తువు కూడా సమంగా కనిపిస్తుంది. మనస్సు వృద్ధి అనెడి వేగంతో కూడి ఉండటంచేత జనన మరణాలకు కారణమైన ప్రపంచాన్ని చూస్తోంది. అట్లా కాకుండా మనస్సు సమబుద్ధితో దృఢంగా ఉండగలిగితే, ఎల్లప్పుడూ సమంగా ఉండే (చలనం లేని) బ్రహ్మంగా దర్శిస్తుంది. పెరగడం, తరగడం, మారడం వంటివి బ్రహ్మానికి ఉండవు. అది దోషం లేనది. సమబుద్ధితో ఉన్నవారు దానినే దర్శించి, దానియందే నిలుపగలుగుతారు. అందువల్లనే బ్రహ్మజ్ఞానులకు దుఃఖం ఉండదు.

మాయ, బ్రహ్మము అన్నది కదిలేపాము, కదలకుండా నిశ్చలంగా ఉండే పామును పోలి ఉంటాయి. క్రియా శక్తి మాయ అయితే నిష్క్రియా, శక్తి బ్రహ్మమవుతుంది.

- శ్రీరామకృష్ణ పరమహంస

బ్రహ్మాన్ని తెలుసుకున్నవాడు, బ్రహ్మమందే నిలకడ గలవాడును, స్థిరమైన బుద్ధి గలవాడును, మనః క్లేశాలులేని బ్రహ్మజ్ఞాని ఇష్టమైన దానిని పొందినప్పుడు సంతోషపడడు. ఇష్టములేని దానిని పొందినప్పుడు దుఃఖపడడు. **20**

ఆసక్తి - అనాసక్తి; సుఖం-దుఃఖం వంటి ద్వంద్వాలన్నీ శరీరానికి సంబంధించి నవని ఎవడైతే తెలుసుకోడో అతణ్ణి చంచలమైన మనస్సుగలవాడంటారు. బ్రహ్మదృష్టి గలవానికి ఇటువంటి చాంచల్యం ఉండదు.

"కామము, లోభము మనస్సును వీడినప్పుడు, ఆత్మ యందు ఇంకొకటేదీ నిలచి ఉండదు. బ్రహ్మానంద మొక్కటే అక్కడ ఉంటుంది." - *శ్రీరామకృష్ణ పరమహంస*

బాహ్యసుఖాలపై ఆసక్తిలేనివాడు ఆత్మయందు అక్షయమైన సుఖాన్నే అనుభవిస్తూ ఉంటాడు. బాహ్యసుఖాలంటే ఇంద్రియాల ద్వారా అనుభవించేవి. హృదయమునందు శుద్ధమైన అంతఃకరణం ఆత్మానందాన్నే అనుభవిస్తుంది. **21**

"చక్రవాక పక్షి ఎప్పుడూ ఆకాశంలోనే ఎగురుతూ ఉంటుంది. దానికి ఎంతదాహం వేసినా సముద్రంలో నీటినిగాని గంగవంటి పవిత్ర నదుల్లోని నీరుగాని త్రాగదు. వర్షం నీరు మాత్రమే త్రాగుతుంది. అట్లాగే వీరుకూడా భగవంతుని గూర్చిగాని, భగవద్విషయాలను గూర్చి మాత్రమే ఆలోచిస్తూ ఉంటారు. ఇతర విషయాలను వినిపించుకోరు.

- శ్రీరామకృష్ణ పరమహంస

ఓ కుంతీకుమారా! ఇంద్రియాల వలన పొందే సుఖాలే అన్ని దుఃఖాలకూ కారణాలు. జ్ఞాని అయిన వాడు నశించే వస్తువులను కోరుకోవడంలేదు.

అంటే మధ్యలో మెరుపువలె వచ్చే ఈ సుఖాలన్నీ ఒక దుఃఖానికి మరో దుఃఖానికి మధ్యన ఉండే చిన్న వంతెనలాంటివి. ఆ సుఖానుభవం క్షణికమే. వంతెన దాటగానే మళ్ళీ దుఃఖాల్లో పడిపోతాడు.

22

"పామును చూసిన జనులు 'ఓ మానసదేవీ! నువ్వు మాకు నీ తోకను మాత్రం చూపించి నీ దారిన నువ్వుపో' అని చెప్పుకొంటారు. అట్లాగే ఇంద్రియ సుఖాల్ని ప్రేరేపించే విషయములకు దూరంగా ఉండాలి. ముందు వాటిపై ఆసక్తి చూపి ఆ తర్వాత దుఃఖాల పాలవడం కన్నా వాటి సహవాసమే వద్దని దూరంగా ఉండటం ఉత్తమం"

- శ్రీరామకృష్ణ పరమహంస

ఎవడు కామ క్రోధాదుల వలన పుట్టిన ఉద్వేగాన్ని బ్రతికి ఉండగానే నిగ్రహించుకో గలుగుతాడో అట్టివాడు జీవించి ఉండగానే ఇంద్రియ నిగ్రహం వల్ల యోగియై సుఖపడుతున్నాడు. **23**

మరణ సమయంలో కూడా కామక్రోధాదులు పుడుతూనే ఉంటాయి. సంతోషాన్ని కలిగించే విషయాలపై ఇంద్రియముల ద్వారా అనుభవించడం వలన కోరిక పుడుతుంది. దుఃఖాన్ని కలిగించే విషయాన్ని వినడం ద్వారా క్రోధం కలుగుతోంది. బాహ్య సుఖాలు కలిగినప్పుడు శరీరానికి పులకరింత, ఉల్లాసాల్ని కలిగిస్తోంది. అదే మనస్సులో దుఃఖం కలిగినప్పుడు శరీరమంతా చెమటలు పట్టి వణికిపోతుంది. ఇటువంటి ఇష్టాయిష్టములను జయించిన వాడే యోగి.

"స్త్రీ యెడల కలిగే కామము, లోభము ప్రపంచాన్నంతటినీ పాపంలో ముంచేస్తోంది. అట్లాకాకుండా స్త్రీలను జగన్మాతగా భావించిన యెడల నీకు వారి వలన ఎటువంటి హాని కలుగదు" - శ్రీరామకృష్ణ పరమహంస

ఏ జ్ఞాన యోగి తన ఆత్మయందే సుఖాన్ని అనుభవిస్తూ, ఆత్మయందే క్రీడిస్తూ ఆత్మ ప్రకాశం గలవాడై ఉంటాడో అట్టి యోగి జీవించి ఉండగానే ఆత్మానందాన్ని పొందుతాడు. జీవన్ముక్తుడవుతాడని భావం. **24**

జ్ఞాన ప్రకాశం కోరేవాడు ఇంద్రియముల ద్వారా బాహ్య ప్రపంచంలో పొందకుండా, ఆత్మయందే దానిని పొందుచున్నాడు. అంటే తాను కోరుకున్న సమస్తమూ తనలోనే ఉందన్న సుఖానుభవం పొందటం. అట్టి యోగి తానే బ్రహ్మ స్వరూపమై ముక్తిని పొందుతున్నాడు.

"జీవితేచ్ఛ, ఆసక్తి ఎక్కువగా ఉన్న మానవుడికి జ్ఞానం లభించదు. ఎంతవరకు ఈ ఆసక్తిని తగ్గించుకుంటాడో అందుకు తగినట్లుగా జ్ఞానాభివృద్ధి పొందుతాడు."

- శ్రీరామకృష్ణ పరమహంస

పాపాలన్నింటినీ పోగొట్టుకొని, సందేహాలన్నింటినీ నివృత్తి చేసుకొని, ఇంద్రియాలను నిగ్రహించి, క్షేమాన్ని కోరుకుంటూ ఆనందాన్ని అనుభవించే ఋషులు బ్రహ్మనిర్వాణాన్ని పొందుతున్నారు. **25**

కామక్రోధాదుల నుండి బయటపడి, మనోనిగ్రహం కలిగి ఆత్మ జ్ఞానాన్ని పొందే సన్న్యాసులందరూ మోక్షాన్నే పొందుతారు. **26**

ఎవడైతే శబ్దము మొదలైన విషయాల్ని శరీరం లోపలకు చొరనీయకుండా, దృష్టి అంతా కనుబొమల మధ్యనే నిలిపి ఉచ్ఛ్వాస నిశ్వాసాలను నిరోధించి మనస్సు, బుద్ధి అనే ఇంద్రియాల్ని తన స్వాధీనంలో ఉంచుకుంటూ, కోరిక, భయము, క్రోధము మున్నగు వాటిని విడిచి మోక్షాన్ని కోరుకుంటాడో అటువంటి వాడు తప్పక మోక్షాన్ని పొందుతాడు. **27-28**

యజ్ఞము తపస్సుల భోక్తగా, లోకాలన్నింటి ప్రభువుగా సర్వభూత మిత్రునిగా నన్ను తెలుసుకున్న వ్యక్తి శాంతిని పొందుతాడు. **29**

6

ధ్యానయోగం

ఫలాన్ని ఆశించకుండా చేసే కర్మలను భగవదారాధనా భావంతో చేసేవాడే సన్న్యాసి. అతడే యోగి. అగ్నిహోత్రాదుల్ని చెయ్యకుండా వదిలెయ్యడం వలన మాత్రమే సన్న్యాసి కాలేడు. ధ్యాన యోగానికి కర్మయోగం ఒక సాధనం. కర్మలు చెయ్యడం వదలక పోయినా కర్మఫలాన్ని వదిలి కర్మల నాచరించేవాడిని కూడా సన్న్యాసి లేక యోగి అనే అంటారు. కర్మ యోగి అయిన వాడు చిత్తశుద్ధిని జ్ఞానాన్ని పొంది మోక్షాన్ని పొందుతాడు. **1**

కర్మ ఫలాన్ని గూర్చి మనస్సులో మెదిలే భావాలనే సంకల్పమంటారు. అంటే తాను చేసే కర్మలకు రాదగిన ఫలాలను గూర్చి ఎదురు చూస్తూ ఉండడం. ఈ సంకల్పాలు ఒకటి తర్వాత మరొకటి వస్తూనే ఉంటాయి. ఈ కోరికల వేగానికి అనంతకోటి ఆలోచనలు పుడుతూ ఉంటాయి. వాటినే సంకల్పాలంటారు. ఈ సంకల్పాల వల్ల మనస్సు నిశ్చలం కాక చంచలమవుతుంది. మనస్సుకు చంచలత్వమున్నంత వరకు యోగి కాలేడు. కాబట్టి సన్న్యాసంతో సంకల్పాలన్నీ వదిలెయ్యబడుతవి. సంకల్పాల్ని త్యాగం చెయ్యడం వలన యోగం స్థిరమవుతోంది. అది ధ్యానానికి దోహదపడుతుంది. **2**

ధ్యాన యోగమందు అభివృద్ధి పొందాలని కోరుకునే మునికి కర్మలు సాధనమవుతాయి. అట్లాగే ధ్యాన సిద్ధిని పొందిన వానికి కర్మల్ని వదిలెయ్యడమే సాధన మవుతుంది. **3**

ధ్యాన యోగంలో అభివృద్ధి సాధించాలనుకునే మునికి కర్మలు సాధనంగా ఉపయోగపడతాయి. అట్లాగే ధ్యానంలో అభివృద్ధి సాధించిన యోగి కర్మల్ని విడిచెయ్యాల్సి ఉంటుంది. అంటే ఒక్కడే అవస్థా భేదాన్ని బట్టి కర్మయోగం, కర్మ సన్న్యాసం కూడా చెయ్యాల్సి ఉంటుంది.

ధ్యానం చెయ్యాలని ఆసక్తి ఉన్నవానిని ముని అంటారు. అట్టివాడు నిష్కామకర్మల్ని ఉత్సాహంగా చెయ్యాలి. నిష్కామ కర్మల వల్ల మనస్సు నిర్మలమై ధ్యానం బాగా కుదురుతుంది. నిర్మలమైన మనస్సుకు ధ్యానం దానంతట అదే వస్తుంది. చిత్తశుద్ధి అన్నా నిర్మల హృదయమన్నా ఒక్కటే. సమత్వం, సత్యము, క్రమశిక్షణ, శీలము, దృఢత్వము, అహింస, కర్మబంధ విమోచనం వంటి సద్గుణాలన్నింటికీ మూలాధారం. అంటే ఈ లక్షణాలన్నీ మానవునికి గొప్ప సంపద. శీలమంటే మనోవాక్కాయముల చేత ప్రాణులన్నింటికీ మేలు చెయ్యడమే.

ఈ లోకంలో పొందే సుఖాల్ని ఆశించిగాని, స్వర్గనరకాది లోకాల్లో ఫలాల్ని కోరిగాని కర్మలు చెయ్యాలనే సంకల్పాన్ని విడిచిపెట్టాలి. అట్లాగే నిత్య నైమిత్తిక కర్మలందు, శబ్ద స్పర్శ రూప రస గంధాదుల యందుగాని ఆసక్తి వదలి వేసిన వారిని 'యోగారూఢులు' అని అంటారు. వీరినే సర్వకర్మ సన్న్యాసులని కూడా అంటారు. **4**

ప్రాణం పోతే ఇంద్రియాలన్నీ ఎట్లా నశిస్తాయో, అట్లాగే సంకల్పం లేకపోతే కోరికలు కర్మలు కూడా నశిస్తాయి. ఇందుమూలంగా యోగారూఢుడైనప్పుడు సంసార దుఃఖాల్ని వదలి ఆత్మను ఉన్నత స్థితికి తీసుకొని పోగలుగుతున్నాడు.

"కోరికలనెడి తుపాను చిత్తమనే ఆకాశాన్ని కల్లోల పరుస్తుంది. అప్పుడు ఈశ్వరుని ప్రకాశాన్ని చూడలేము. శాంతంగా ఉండే మనస్సులోనే భగవంతుని దివ్యదర్శనం కలుగుతుంది." - శ్రీరామకృష్ణ పరమహంస.

తన్నుతాను కించపరచుకోరాదు. ఎందుకంటే ఆత్మయే తనకు పరమబంధువు. కనుక తన్నుతానే ఉద్ధరించుకోవాలి. **5**

మానవుడు బాగుపడాలన్నా చెడిపోవాలన్నా తనకుతానే కారణమవుతాడు. కనుక సంసార సాగరంలో మునిగిపోతున్న ఆత్మను ఆత్మచేతనే ఉద్ధరించి పైకి లేవదీయాలి. అంటే యోగారూఢమైనదానిగా చెయ్యాలి. ఆత్మను జననమరణ పరంపరలో మునిగిపోనివ్వరాదు.

అందువల్ల ఆత్మకు ఆత్మయే బంధువని (తనకుతానే బంధువని) ఆత్మకు ఆత్మయే శత్రువని (తనకు తానే శత్రువని) గ్రహించాలి. కనుక మన కష్టాలకు ఇతరులు కారణం అని నిందించడం కంటే, ఆత్మ విమర్శ చేసుకొని ఆత్మను ఉద్ధరించే ప్రయత్నం చెయ్యాలి.

ఎవడు తన శరీరాన్నీ ఇంద్రియాల్నీ స్వాధీనంలో ఉంచుకుంటాడో అటువంటివాడు తనకుతానే బంధువు. ఎవడు అందుకు వ్యతిరేకంగా ఉంటాడో అతడు తనకుతానే శత్రువవుతున్నాడు. **6**

బంధము, ముక్తి రెండూ మనస్సుకు సంబంధించినవే. నేను ముక్తాత్మను, నేను పరమేశ్వరుని పుత్రుడను, నన్ను ఎవరూ బంధించలేరు అని నిన్ను నువ్వు నమ్మగలిగితే నువ్వు ముక్తాత్మవు కావడం నిశ్చయం. ఎవర్నైనా పాము కాటేసిందనుకోండి. అతడు ఆ పాములో విషం లేదు, ఆ పాము కాటు నన్ను ఏమీ చెయ్యలేదని గట్టిగా నమ్మితే అట్టి విషం వలన అతడికి ఎటువంటి ప్రమాదము ఉండదు." - శ్రీరామకృష్ణ పరమహంస

చిత్తాన్ని ఇంద్రియాల్ని వశంలో ఉంచుకొని ప్రశాంతమైన అంతఃకరణం గల సన్న్యాసి ఆత్మ భావంతో ఉంటాడు. శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాల యందు సమభావం కలిగి ఉంటాడు. **7**

"విషయ సుఖాలయందు కొంచమైనా సంబంధం పెట్టుకోని మనస్సు ఈశ్వరుని యందు లీనమవుతుంది. అట్లాగే బంధం నుండి కూడా ఆత్మ విముక్తి పొందుతుంది. అందుకు విరుద్ధమైతే ఈశ్వరుని వద్దకు వెళ్ళే దారికి అడ్డుపడే ఆత్మ బంధాల్లో చిక్కుకుంటోంది" - శ్రీరామకృష్ణ పరమహంస

జ్ఞాన విజ్ఞానములందు పూర్తిగా సంతృప్తి చెంది, ఇంద్రియాల్ని జయించి, నిశ్చల చిత్తము గలవాడు మట్టిబెడ్డను బంగారాన్ని సమభావంతో చూస్తాడు. **8**

శాస్త్రాలను అధ్యయనం చేసి తెలుసుకున్న విషయాలను జ్ఞానం అంటారు. స్వానుభవంచేత అనుభవించినప్పుడు దానిని విజ్ఞానమంటారు. ఏది మార్పులు చెందకుండా ఆకాశంవలె నిశ్చలంగా ఉంటుందో దాన్ని కూటస్థం అంటారు. ఇంద్రియార్థముల చేత బాధించబడక ఆత్మయందు లీనమై మనోపరిపక్వం పొందిన వానిని కూటస్థుడు అంటారు. అన్నింటికీ మూలకారణమైన మనస్సు స్వాధీనంలో ఉంటే ఇంద్రియాలన్నీ అణిగి ఉంటాయి. కాబట్టి యోగి అయినవాడు మనస్సును అదుపులో పెట్టుకొని ఇంద్రియాల్ని స్వాధీనంలో ఉంచుకోవాలి. మట్టి బంగారం రెండూ పంచభూతాలచే సృష్టించబడినవే నని తెలుసుకొని సమభావాన్ని అలవాటు చేసుకుంటాడు.

"భోగములందు ఆసక్తి ఉన్నవారు ఉపయోగంలేని వస్తువుల్ని సమకూర్చుకుంటున్నారు. అనాసక్తమైన శుద్ధాత్ములు ఈశ్వరుని నమ్ముకొని సర్వకాల సర్వావస్థలయందు అతనినే ధ్యానిస్తున్నారు" - శ్రీరామకృష్ణ పరమహంస

శ్రేయస్సు కోరేవారు, మిత్రులు, శత్రువులు, ఉదాసీనులు, మధ్యస్థులు, ద్వేషించేవారు, బంధువులు, సత్పురుషులు, పాపాత్ములు మొదలైనవారందరి యందు సమభావం కలిగి ఉన్నవాడే శ్రేష్ఠుడు. 9

"నేలపై నుండి చూసినప్పుడు గడ్డిపోచకన్నా మహావృక్షం ఎంతో ఎత్తుగా ఉన్నట్లు తెలుస్తుంది. అదే విమానంలో పోతూ చూస్తే రెండూ సమానంగానే కనిపిస్తాయి. అట్లాగే లౌకిక దృష్టితో చూసినప్పుడు ఒకడు రాజని, మరొకడు సేవకుడని, ఒకడు తండ్రి అని మరొకడు కుమారుడని అంతస్తులు, బంధుత్వాల్లో తారతమ్యాల్ని చూస్తాం. కానీ భగవద్దర్శనం అయిన తర్వాత అంతా ఒకటిగానే తెలుస్తుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

యోగి అయినవాడు ఎవరి కంటా పడకుండా ఏకాంత ప్రదేశంలో ఒంటరిగా ఉంటాడు. మనస్సును శరీరాన్ని తన స్వాధీనంలో ఉంచుకుంటాడు. దేనిమీదా ఆశపెట్టుకోడు. ఎవరి నుండీ ఏమీ ఆశించడు. ఇతరులు ఏమైనా ఇచ్చినా స్వీకరించడు. తన కొరకని ఏదీ దాచుకోడు. ఎల్లప్పుడూ మనస్సును ఆత్మయందే నిలుపుకొని ఉంటాడు. **10**

మిట్ట పల్లాలు లేని పరిశుభ్రమైన ప్రదేశంలో దర్భలు, వస్త్రము, జింకతోలు ఒకదానిపై ఒకటి పేర్చి ఆసనాన్ని సిద్ధం చేసుకోవాలి. అట్టి ఆసనంపై కూర్చుని మనస్సును, బాహ్యవిషయాలపై పోకుండా, స్థిరం చేసుకొని, ఇంద్రియాల్ని నిగ్రహించి చిత్తశుద్ధి కోసం యోగాల్ని ఆచరించాలి. **11-12**

"పాలల్లో నీళ్ళు పోస్తే కలసిపోతాయి. కానీ పాల నుండి వెన్నను వేరుచేసి నీళ్ళల్లో వేస్తే అది కలసిపోదు. నీళ్ళపైన తేలుతుంది. అట్లాగే ప్రారంభంలో ఒంటరిగా కూర్చుని ధ్యానం చెయ్యకపోతే మనస్సు బాహ్య విషయాలపై ఆసక్తి చూపుతుంది. ఏకాగ్ర చిత్తాన్ని సాధించిన తర్వాత ప్రపంచంలో తిరిగినా మనస్సు మలినపడదు." - శ్రీరామకృష్ణ పరమహంస

శిరస్సు, శరీరము, కంఠము సమంగా నిలిపి కదలకుండా స్థిరంగా నాసికాగ్రభాగాన్నే స్థిరంగా చూస్తూ ఉండాలి. గుడ్డు మీద కూర్చుని పొదుగుతున్న పక్షికి బాహ్య విషయాలపై దృష్టి ఉండదు. యోగి దృష్టి కూడా అటువంటిదే. **13**

"ధ్యానంలో కూర్చున్న వ్యక్తికి ప్రగాఢమైన ఏకాగ్రత కలుగుతుంది. అతడి శరీరంపై పాము ప్రాకుతున్నా అతడు తెలుసుకోలేడు. అట్లాగే పాము కూడా తానొక మనిషి శరీరంపై ప్రాకుతున్నానని అనుకోదు. ఏదో బండరాయిపై ప్రాకుతున్నట్లు భావిస్తుంది."

- శ్రీరామకృష్ణ పరమహంస

యోగి అన్నవాడు ప్రశాంతమైన హృదయం కలిగి, భయంలేనివాడై, బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తూ, చిత్తమును నాయందే నిలిపి నన్నే పరమగతి అని నమ్ముకొని ధ్యానం చెయ్యాలి. **14**

"పన్నెండు సంవత్సరాలు బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తే 'మేధానాడి' శరీరంలో ఉత్పత్తి అవుతుంది. ఆ నాడి వలన ఆ యోగి అన్ని విషయాలను గ్రహించగలుగుతాడు. అతి సూక్ష్మమైన విషయాల్ని కూడా అతి సులభంగా గ్రహించే శక్తి ఏర్పడుతుంది. అట్టి జ్ఞానం చేత అతడు పరిశుద్ధమైన జ్ఞానం కలిగి భగవంతుని సాన్నిధ్యాన్ని పొందుతాడు."

- శ్రీరామకృష్ణ పరమహంస

ఈ విధంగా మనస్సును ఎల్లప్పుడూ ధ్యానమునందే నిలిపి మనోనిగ్రహం కలిగిన యోగి నాయందు మాత్రమే లభించే పరమ శాంతిని పొందుతాడు. దానినే ముక్తి అంటారు. **15**

భుజించడం వలన ఆకలి తగ్గుతున్న విధంగా, పైన చెప్పినట్లు యోగ సాధన చేస్తే మనోనిగ్రహం కలిగి సహజమైన శాంతి లభిస్తుంది అగ్నిలో వేడి కలిగి ఉన్న విధంగా పరమేశ్వరుని యందు శాంతి నెలకొని ఉంటుంది. అట్టి శాంతిని పొందినవాడు ముక్త పురుషుడవుతున్నాడు. భగవంతుని చేరడమన్నా, శాంతిని పొందటమన్నా, ముక్తి పొందటమన్నా ఒక్కటే ఫలం.

"నగరానికి క్రొత్తగా వచ్చిన వాడు ముందుగా రాత్రి బస చేసేందుకు విడిదిని చూసుకోవాలి. తన వస్తువులన్నీ భద్రపరచుకొని ఆ పిమ్మట నగరంలో వింతలు చూడటానికి వెళ్ళవచ్చు. అట్లా చెయ్యకపోతే రాత్రి నిద్రపోయేందుకు చోటులేక ఇబ్బంది పడాల్సివస్తుంది. అట్లాగే ఈ ప్రపంచంలోకి క్రొత్తగా వచ్చినవాడు ఈశ్వరుడనే నివాస స్థలాన్ని వెతుక్కొని ఆ తర్వాత నిర్భయంగా ఈ లోకంలో తిరుగుతూ తన కర్తవ్యాన్ని నిర్వహించవచ్చు. లేకపోతే మరణం అనే భయంకరమైన చీకటి ఆవహించునప్పుడు అనేక కష్టాలు అనుభవించాల్సి ఉంటుంది." *- శ్రీరామకృష్ణ పరమహంస*

అర్జునా! అతిగా భుజించే వాడికి యోగం లేదు. అట్లాగే అతి తక్కువగా భుజించినా యోగం ఉండదు. అదేవిధంగా అతిగా నిద్రపోయేవాడికిగాని, రాత్రిపూట నిద్రపోకుండా మేలుకొనే వాడికి గాని యోగం లభించదు. **16**

వీణలోని తీగల్ని ఎక్కువగా బిగిస్తే తెగిపోతుంది. బిగించకుండా ఉంటే సంగీతం రాదు. అట్లాగే శరీరం కూడా వీణ వంటిదే. ఎక్కువగా తింటే సోమరితనం, తక్కువగా తింటే బలహీనత ఏర్పడుతాయి.

కడుపులో అర్ధభాగం ఆహారం, పాతిక భాగం నీరు, పాతిక భాగం గాలి ఉండాలి. అట్లాగే నిద్ర కూడా శరీరానికి విశ్రాంతి నిచ్చి ఉత్సాహపరుస్తోంది. అదే నిద్ర ఎక్కువ తక్కువలైతే తమోగుణాన్ని పెంచుతుంది. అందువల్ల ధ్యానానికి ఆటంకం కలుగుతుంది.

"పగటి పూట తృప్తిగా భుజించు. కానీ రాత్రి యందు మాత్రం ఆహారం తక్కువగాను, తేలికైనదిగాను ఉండనిమ్ము." - శ్రీరామకృష్ణ పరమహంస

మితంగా భుజిస్తూ తగిన వ్యాయామం చేసేవానికి, కర్మలందు మితమైన నడతగలవాడై మితమైన నిద్ర మెలకువ గలవాడైన వానికి యోగం దుఃఖాన్ని పోగొడుతుంది. ధ్యానం చెయ్యడం సులభమవుతుంది. క్రమశిక్షణను పాటించే యోగి జీవితంలో దేహ జ్ఞానమే లేని వాడవుతున్నాడు. అందువల్లనే యోగి దుఃఖములేని వాడై అభివృద్ధిని పొందుతున్నాడు. కోరికలన్నింటినీ నివృత్తి చేసుకొని నిగ్రహంతో మనస్సును ఆత్మయందే నిలిపి యున్నప్పుడు యోగ సిద్ధిని పొందుతున్నాడు. తుపాను వచ్చినప్పుడు సముద్రం అల్లకల్లోలం అవుతుంది. అట్లాగే కామమనే తుపాను గాలులు వీచినప్పుడు చిత్తం కూడా అల్లకల్లోలమవుతుంది. మనస్సులో పేరుకున్న కోరికలచేత శాంతిని పోగొట్టుకుంటుంది మనస్సు నిర్మలంగాను, నిశ్చలంగాను ఉన్నప్పుడే యోగం సిద్ధిస్తుంది. స్థిరమైన మనస్సు గలవాడు యోగమునందు ఉన్నత స్థితిని పొందుతున్నాడు. **17-18**

"చిరిగిపోయిన మూటలోని ఆవాలు నిలవ్వు నలువైపులకు చెదరిపోతాయి. అట్లాగే ప్రాపంచిక విషయాలపై మనస్సును ఏకాగ్రం చేయలేం. మనస్సును ఏకాగ్రం చెయ్యడాన్నే ధ్యానమంటారు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఆత్మధ్యానాన్ని అభ్యసిస్తున్న యోగి యొక్క నిగ్రహ చిత్తం గాలి లేనిచోట నిశ్చలంగా ఉండే దీపంతో పోల్చి చెప్పబడింది. ధ్యాన సిద్ధిని పొందినవాడు తానే జ్యోతి స్వరూపుడని, శుద్ధ చైతన్యమని భావిస్తాడు. **19-20**

"ధ్యానమందు సిద్ధి పొందిన వానికి ముక్తి సమీపంలో ఉంటుందని ఒక సామెత ఉంది. పరిపక్వత చెందిన యోగి ధ్యానానికి కూర్చోగానే ఒక దివ్య తేజస్సు అతణ్ణి ఆక్రమిస్తుంది. అతడి ఆత్మ ఈశ్వరుని యందు ఐక్యమవుతుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

ఏ స్థితిలో యోగి ఇంద్రియ నిరపేక్షమూ, బుద్ధి గ్రాహ్యమూ, అతీంద్రియమూ అయిన అనంత సుఖాన్ని అనుభవిస్తాడో, ఏ స్థితిలోని యోగి ఆత్మతత్త్వం నుండి అణుమాత్రమైనా చలించకుంటాడో, ఏ స్థితిని పొందిన యోగి ఇతరములైన లాభాలను తలచడో, దేని యందు ఉంటూ మహాదుఃఖాల చేత కూడా చలించడో, దుఃఖానికి అత్యంతిక నివృత్తి కలుగడం అనే స్థితిని యోగమని గ్రహించు. విసుగులేని చిత్తంతో పట్టుదల వహించి ఆ యోగాన్ని అభ్యసించు. **21-23**

సుఖమన్నది బయట దొరికేది కాదు. అది ఆత్మ స్వరూపమునందే ఉన్నది. ఆత్మయందున్న దానిని ఇంద్రియాలు గ్రహించలేవు. నిశ్చలమైన బుద్ధియే దాన్ని గ్రహిస్తోంది. అది ఆత్మ సుఖం కావడం వల్ల అంతం లేనిది.

ఆత్మ స్వరూపంలో ఉన్న యోగి నీళ్ళలో పడేసిన చేపలాంటివాడు. అంటే చేప నీళ్ళల్లో నుండి నేలపైకి రావడానికి ఇష్టపడదు. నీళ్ళల్లో ఎంతసేపు ఉన్నా విసుగు అనిపించదు. అట్లాగే యోగి కూడా ఆత్మానందాన్ని అనుభవిస్తూ విసుగుపుట్టించే విషయానందాన్ని కోరుకోడు.

చేతికందని వస్తువు అతి విలువైనదిగా కనిపిస్తుంది. అది చేతికందగానే మనస్సు అంత కంటే విలువైన మరో వస్తువుపైకి మళ్ళుతుంది. ప్రపంచానికన్నా పరబ్రహ్మం అత్యంత విలువైనది. అంతకన్నా విలువైన వస్తువు మరొకటి ఎక్కడుంటుంది? నదిలో నుండి సముద్రంలోకి చేరిన చేప అంతకన్నా పెద్ద జలాశయానికి చేరడం ఎట్లా సాధ్యం? బ్రహ్మానందంలో నివసించే యోగికి దేహస్పృహ ఉండదు. యోగిని దేహం నీడలా అనుసరిస్తూ ఉంటుంది. ఎవరైనా నీడను కత్తితో నరికే ప్రయత్నం చేసినా అది ఆ మనిషిని బాధించదు. అట్లాగే దేహాన్ని హింసించినంత మాత్రాన ఆత్మ జ్ఞానికి ఎంతమాత్రమూ బాధకలగడం లేదు.

"నిజమైన సమాధిని పొందినప్పుడు యోగి తన సహజమైన సచ్చిదానంద సాగరంలో మునిగిపోతాడు. అతడి ఇంద్రియాలన్నీ నిగ్రహించబడి ఉంటాయి"

- శ్రీరామకృష్ణ పరమహంస.

"శరీరం అనుభవించే సుఖదుఃఖాలు ఎటువంటివైనా, నిజమైన భక్తుడి జ్ఞానం, భక్తి, శక్తి ఎన్నటికీ తరిగిపోవు. పాండవులు ఎన్ని దుర్భరమైన కష్టాలు అనుభవించినా వారి జ్ఞాన ప్రకాశం ఒక్క క్షణమైనా క్షీణించలేదు." *- శ్రీరామకృష్ణ పరమహంస*

మానవుడు సహజంగా సుఖస్వరూపి. బుద్ధిలేనివాడై దుఃఖాల్ని కొనితెచ్చుకుంటాడు. అట్టి దుఃఖాల నుండి బయట పడగలిగితే తన నిజస్వరూపాన్ని తెలుసుకుంటాడు. ఇది ఎట్లాంటిదంటే, నిద్రలో దుఃఖిస్తున్న వాడిని లేపి జాగ్రదావస్థలోకి తీసుకొని వచ్చి యోగం చేయించడం వంటిది. యోగం అంటే ఇక్కడ ఒకటిగా చేర్చడమని అర్థం. ఏ కారణం చేత దుఃఖించినా అతడు యోగానికి అర్హుడు కాడు. ఆత్మానందంతోను ఉత్సాహంతోను యోగ సాధన చేసినవానికే ఆత్మానందం లభిస్తుంది. అదే వారి నిజ స్వరూపం.

"క్రింద మంట ఉన్నంత వరకు పాలు పొంగుతూనే ఉంటాయి. మంట తీసివెయ్యగానే పాలు ఇక పొంగవు - అట్లాగే సాధన చేస్తూన్నంత కాలం సాధకుని మనస్సు కుతూహలంతో పొంగుతూనే ఉంటుంది." *- శ్రీరామకృష్ణ పరమహంస*

సంకల్పాలందు పుట్టిన కోరికలన్నింటినీ పూర్తిగా విడిచిపెట్టి, మనస్సుచేత ఇంద్రియాల్ని అన్ని కోరికల నుండి నిగ్రహించి, దృఢమైన బుద్ధితో మనస్సును ఆత్మయందు నిలుపు. ఇతర విషయాల వైపుకు మనస్సును పోనీయకుండా క్రమంగా శాంతిని పొందు. **24-25**

సంకల్పం అంటే మనస్సులో పుట్టే కోరిక. అది విత్తనం లాంటిది. ఆశ చెట్టు వంటిది. మనస్సులోని ఆశ ఏ కొంచెం మిగిలి ఉన్నా కాలక్రమంలో పేరాశగా పరిణమిస్తుంది. అదే పెద్ద మంటగా మారి మొత్తం నాశనమవుతుంది. కనుక ఆశను మొదలంటా నాశనం చెయ్యాలి. శీలబద్ధమైన జీవితం

ద్వారానే దృఢత్వం వస్తుంది. దర్భమొన సూది కన్నా సన్నగా ఉంటుంది. కానీ అది కుట్టడానికి పనికిరాదు. అట్లాగే పండితులైన వారు కుశాగ్ర బుద్ధి ఉన్నా విషయ వాంఛలు కలిగి ఉండటం చేత ఏది నిత్యమైనదో, ఏది అనిత్యమైనదో తెలుసుకోలేకుండా ఉన్నారు. మనోదారుఢ్యం, ధైర్యంతో కూడుకున్న బుద్ధి ఉన్నవారికే అది సాధ్యం. మనస్సు ఆత్మయందు నిలిపిన వానికి విషయాలపై ఆసక్తి ఉండదు. ఈశ్వరారాధనకు కొద్ది కొద్దిగా వృద్ధి చేసుకుంటూ పోవాలి.

"పొగతో మసిబారిన ఇంట్లో ప్రవేశిస్తే శరీరానికి ఏ కొద్దిగానైనా మసి అంటుకోకుండా పోదు. అదే విధంగా ఎంత జాగ్రత్తగా ఉన్నా ఇంద్రియాలతో సహవాసం చేసినవానికి కొంతైనా కామేచ్ఛ కలుగక తప్పదు." - శ్రీరామకృష్ణ పరమహంస

"మనస్సే సర్వం. అది స్వేచ్ఛను పోగొట్టుకుంటే నువ్వూ స్వేచ్ఛను పోగొట్టుకుంటావు. మనస్సు స్వేచ్ఛగా ఉంటే నువ్వూ స్వేచ్ఛగా ఉంటావు. తెల్లని వస్త్రాన్ని ఏ రంగులోనైనా ముంచవచ్చు. ఇంగ్లీషు భాషలో మాట్లాడేవారు ఎంతని నిగ్రహించుకుందామన్నా ఆంగ్ల పదాలు దొర్లుతూనే ఉంటాయి. అట్లాగే సంస్కృత పండితుడు కూడా. దుర్మార్గులతో సావాసం చేసేవాడి మాట, మనస్సు కలుషితమై ఉంటాయి. అట్లాకాకుండా సాధువులతో సాంగత్యం చేస్తే ఈశ్వరుని గూర్చిన సంభాషణలే ఉంటాయి. సహవాసానికి తగినట్లుగా మనస్సు యొక్క స్వభావం మారుతూ ఉంటుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

చంచలత్వం మనస్సు యొక్క స్వభావం. అది ఏయే చోట్ల సంచరిస్తోందో గమనించి, దాని వద్ద నుండి మళ్ళించి ఆత్మకు వశమయ్యేట్లు చెయ్యి. **26**

"ఆవగింజంత కోరిక మిగిలి ఉన్నా ఈశ్వర దర్శనం సాధ్యం కాదు. కనుక ఆధ్యాత్మికపరమైన చిన్నచిన్న కోరికల్ని నీలో ఉంచుకో. నీలో దాగివున్న అక్రమమైనవి, విషయాలకు సంబంధించినవి అయిన పెద్దపెద్ద ఇచ్ఛలను వివేకం చేతను, విచారణ చేతను పోగొట్టుకోవాలి." - శ్రీరామకృష్ణ పరమహంస

ప్రశాంతమైన చిత్తము గలవాడును, రజోగుణ వికారాలు లేనివాడును, ఎటువంటి దోషాలు లేనివాడును అయిన బ్రహ్మరూపుడైన యోగికే పరమానందం లభిస్తోంది. **27**

"తన సేవకుని ఇంటికి అతిథిగా వెళ్ళే యజమాని ముందుగా తనకు స్వాగతం పలికేందుకు, తనకు ఉపచారాలు చక్కగా చెయ్యడం కోసం కావలసిన ఆసనాలు, ఆభరణాలు, ఆహారం వంటి సామాగ్రినంతా తన ఇంటి నుండే ఆ సేవకుని ఇంటికి పంపుతాడు. అట్లాగే ఈశ్వరుడు తన భక్తుని వద్దకు వెళ్ళే ముందుగా ప్రేమ, భక్తి, శ్రద్ధ మొదలైన వాటన్నింటినీ భక్తుని హృదయంలో ప్రవేశ పెట్టి ఆశీర్వదిస్తాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఈ విధంగా మనస్సును ఆత్మయందు నిలిపి పాపరహితుడైన యోగి బ్రహ్మజ్ఞానం చేత జనించిన పరమానందాన్ని అనుభవిస్తున్నాడు. **28**

"నీళ్ళలో ముంచిన పాత్ర లోపల బయట నీరే నిండి ఉంటుంది. అట్లాగే ఈశ్వరుని యందు మునిగి ఉన్న ఆత్మ లోపలా బయటా అంతటా సర్వవ్యాపకమైన చైతన్యాన్నే చూస్తోంది." - శ్రీరామకృష్ణ పరమహంస

యోగి యోగంలో ఐక్యమై అన్నిటి యందు సమదృష్టిని కలిగి ఉంటున్నాడు. తనను అన్ని ప్రాణుల్లోను, అన్ని ప్రాణులలో తననూ చూసుకుంటూ సమదృష్టి గలవాడై ఉన్నాడు. **29**

యోగంలో పరిపక్వత చెందిన వాడు ఇది ఉచ్చము, ఇది నీచము అన్న భేద భావం లేకుండా గడ్డిపరక నుండి బ్రహ్మ వరకు అన్ని వస్తువుల పట్లా సమభావం కలిగి ఉండటం అతని స్వభావం.

"నేను ప్రత్యేకమైన జీవుడనని చెప్పుకోవడం ఎట్లా ఉంటుందంటే గంగా ప్రవాహానికి ఒకచిన్న భాగానికి అడ్డుకట్టకట్టి, ఆ కట్ట లోపల ఉండే నీటినంతా తన గంగ అని చెప్పుకోవడంలా ఉంటుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

ఎవరు నన్ను అన్నింటియందును, అన్నింటి యందు నన్నూ చూస్తున్నాడో, అతడు నన్ను తప్పక దర్శించగలుగుతాడు. అట్లాగే అతడు నా దృష్టి నుండి తప్పించుకోలేడు. **30**

ఆత్మజ్ఞానం కలిగినవాడు ఆభరణాలు ఎన్ని విధాలుగా ఉన్నా అవన్నీ బంగారంతో చేసినవేనని తెలుసుకుంటాడు. అట్లాగే ప్రాణులన్నీ పరమాత్మ నుండి వచ్చినవేనన్న జ్ఞానం కలుగుతుంది.

"ఒకే వస్తువైన చక్కెరతో చిలక, పిల్లివంటి అనేక రూపాలతో బొమ్మలు చెయ్యవచ్చు. అట్లాగే ఆనంద స్వరూపి అయిన భగవంతుడు అనేక నామరూపాలతో విలసిల్లుతున్నాడు. అనేక కాలాల్లో అనేక దేశాలలో ఆరాధించబడుతున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఉన్నదొక్కటేనని, సర్వభూతాలలోను నన్ను దర్శించే యోగి ఎక్కడున్నా, ఏ స్థితిలో ఉన్నా నా వద్దనే ఉన్న వాడవుతాడు. **31**

చెరసాల నుండి విడుదలైన వాడు తన్నుతాను గదిలో బంధించునప్పటికీ తాను చెరసాలలో లేనని అతడికి బాగా తెలుసు. బ్రహ్మమే అన్నింటికీ మూలాధారమని తెలుసుకున్న వాడు బ్రహ్మమునే అంతటా చూస్తున్నాడు. అతడు బ్రహ్మభావంలో ఉండటం చేత అతడు చేసే పనులన్నీ బ్రహ్మార్పణమే అవుతున్నాయి. సర్వధా అనగా ధ్యానావస్థ అని అర్థం.

"వాస్తవమైన జ్ఞానం కలిగినవాడు భగవంతుడెక్కడో దూరాన ఉన్నాడని అనుకోడు. ఎక్కడో దూరంగా ఉన్నట్లు "అతడు" అని అనకుండా "ఇది" అని తన హృదయంలోనే అతిదగ్గరలో ఉన్నాడని తెలుసుకొంటాడు. భగవంతుడు అందరిలోనూ ఉన్నాడు కనుక వెదికే వారికి వారి హృదయాల్లోనే కనిపిస్తున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఓ అర్జునా! తననే ఉదాహరణగా చేసుకొంటూ సుఖదుఃఖాల్ని సర్వత్రా సమానంగా చూసుకొనే వాడిని యోగి అంటారు. **32**

మానవుడు తన శరీరంలో ఉండే అవయవాలన్నింటినీ తారతమ్యాలేకుండా సమానంగా చూస్తున్నాడు. అట్లాగే ఉచ్చనీచాలు కూడా చూడటం లేదు. ఆయా అవయవాల మూలంగా కలిగే

సుఖదుఃఖాలు కూడా సమష్టిగా తనవి అని అనుకుంటున్నాడు. సామాన్యమానవుడు ఎట్లాగైతే తాను వేరు, తన అవయవాలు వేరు అని ఎట్లా అనుకోవడం లేదో అట్లాగే ఉత్తమ యోగి అయినవాడు తానే ప్రపంచమని, ప్రపంచమే తానన్న గాఢ విశ్వాసంతో ఉంటాడు.

"ఒక గ్రామంలో ఒక మఠం ఉంది. ఆ మఠంలోని సన్న్యాసులంతా గ్రామంలో భిక్షాటనచేసి జీవిస్తూ ఉంటారు. ఒక సన్న్యాసి ఒక ఇంటికి భిక్షాటనకై వెళ్ళినప్పుడు ఆ ఇంటి యజమాని తన సేవకుణ్ణి చావకొడుతున్నాడు. హృదయం ద్రవించిన ఆ సన్న్యాసి యజమాని వద్దకుపోయి అట్లా కొట్టవద్దని వేడుకున్నాడు. ఆ యజమాని కోపావేశంలో ఆ సాధువును కూడా చితకబాదాడు. దాంతో ఆ సాధువు స్పృహతప్పి పడిపోయాడు. తోటి సాధువులు అతణ్ణి మఠానికి చేర్చి సపర్యలు చేశారు. కొద్దిగా తేరుకున్న తర్వాత ఒక గ్లాసుడు పాలిచ్చి త్రాగమన్నారు. పాలు త్రాగుతూ ఉండగా "నిన్నింతగా కొట్టిందెవరు?" అని తోటి సాధువులు అడిగారు. అందుకా దెబ్బలు తిన్న సాధువు "ఇప్పుడు నాకు పాలిచ్చినవాడే నన్ను చితకబాదాడు" అని చెప్పాడు. దీనిని బట్టి ఈశ్వర సాన్నిధ్యాన్ని పొంది లాభనష్టాలు, పాపపుణ్యాలు, మేలు కీడులు వంటి వాటన్నింటినీ అధిగమించినట్టి ఆత్మకు దెబ్బలు కొట్టిన వాడికి దెబ్బలు తిన్నవాడికి భేదం తెలియదు." - శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునుడు : ఓ మధుసూదనా! నువ్వు ఇంత వరకు బోధించిన సమభావం అన్న యోగం స్థిరంగా ఉండేదని నా కనిపించడం లేదు. బహుశా! నా మనస్సు చంచలం కావడం వల్లనేమో? **33**

సమంగా చూడటమంటే ఆటంకాలు లేకుండా ఏకాగ్రం చేయడం అని భావం. అలలలేని సముద్రంలాగా చలనంలేని మనఃస్థితి విక్షేపములులేని మనఃస్థితి అవుతోంది.

ఓ కృష్ణా! మనస్సు చంచలమైనది. పైగా ఈ మనస్సు శరీరాన్ని ఇంద్రియాల్నీ వికారం చెందించి క్షోభింపజేస్తుంది. దాన్ని నిగ్రహించడం ఎవరి తరమూ కాదు. అది ఛేదించబడదు. అటువంటి బలవంతమైన మనస్సును నిగ్రహించడమంటే గాలిని బంధించడంకన్నా కష్టమైనదని నా భావం. **34**

శ్రీకృష్ణుడు : గొప్పబాహువులు కలిగిన ఓ అర్జునా! మనస్సును నిగ్రహించడం కష్టం. అది చంచలమైనదనడంలో సందేహం లేదు. అయితే ఓ కుంతీకుమారా! అభ్యాసం చేతను, వైరాగ్యం చేతను దాన్ని నిగ్రహించవచ్చు. **35**

అభ్యాసం అంటే అలవాటు. అలవాటును మనకు అనుకూలంగా మార్చుకోవచ్చు. స్వభావాల్ని బట్టి అలవాట్లు వస్తూ ఉంటాయి. అభ్యాసం చేత ఎంతటి మొండి అలవాట్లనైనా మార్చుకోవచ్చు. ఒక లక్ష్యాన్ని సాధించాలనే కాంక్షగాని, దైవారాధనగాని ఈ అభ్యాసానికి తోడ్పడుతాయి. ఈశ్వర ధ్యానం క్రమపద్ధతిలో చేయడం అన్నది అభ్యాసం. ధ్యానమంతా ఈశ్వరుడిపైనే ఉంటే బాహ్య విషయాలపైన ఆసక్తి తగ్గుతుంది.

వైరాగ్యమంటే రాగం లేకుండా ఉండటమే. ఇంద్రియాలపై ఆసక్తి లేకుండా ఉండటమే వైరాగ్యం. ఎట్లాగంటే మనం ఏ వస్తువుపైన అయినా మనస్సు ఉంచితే అది చంచలం అవుతుంది. ఇంద్రియ విషయాలలో దాగి ఉన్న నష్టాల్ని మనస్సుకు జ్ఞాపకం చేసి వాటి నుండి బయటకు తెచ్చేదే వైరాగ్యం.

ఈత రానివాడు అభ్యాసం చేత ఈత నేర్చుకొని సముద్రాన్నే ఈదగలుగుతున్నాడు. అట్లాగే బ్రహ్మమనే సముద్రంలో ఈదాలని ఆశించేవాడు ముందుగా అనేక ప్రయత్నాలు చెయ్యాలి. నిరుత్సాహపడకుండా ఫలితం సాధించే వరకూ ప్రయత్నం చేస్తూనే ఉండాలి. అప్పుడే బ్రహ్మమనే సముద్రంలో ఈదగలిగిన శక్తి కలుగుతుంది.

"విషం కలిగిన ఒక రకమైన సాలెపురుగు ఉన్నది. అది కరిస్తే ఎన్ని మందులు వేసినా నయంకాదు. పసుపు కొమ్ముతో గంధాన్ని చేసి ఆ కరచిన చోట పట్టీ వేసిన తర్వాత ఏ మందులు వాడినా ప్రయోజనం ఉంటుంది. అట్లాగే కామము, లోభము అనే సాలెపురుగు కరచిన వానికి వైరాగ్యం అనే మానసిక శక్తి అతనిలో కలగాలి. ఆ తర్వాతనే అతడు ఆత్మసాధనకు అధికారి అవుతాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

మనోనిగ్రహం లేనివాడు యోగాన్ని పొందలేడు. మనోనిగ్రహం కలిగి ఉపాయం చేత ప్రయత్నించినప్పుడే యోగాన్ని సాధించగలుగుతాడు. **36**

"నేను పూర్వం ధ్యానం చేసే రోజుల్లో నా మనస్సులోని చెడు భావాలు, కోరికలు మొదలైన వాటన్నింటినీ శుభ్రం చేసుకున్నట్లుగా భావన చేసేవాడిని. ఆ తర్వాత పరిశుభ్రం చేసిన నా మనస్సులో భగవంతుణ్ణి ప్రతిష్ఠ చేసుకునే వాడిని. కనుక నా బిడ్డలారా! మీరూ అట్లాగే చెయ్యండి." - శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునుడు *:* భుజపరాక్రమము కలవాడా! ఓ కృష్ణా!

1. శ్రద్ధగలవాడైనా ప్రయత్నలోపం జరిగి యోగం నుండి మనస్సు చలించినవాడు ఎటువంటి గతిని పొందుతున్నాడు?

2. యోగి కర్మ మార్గం నుండీ, యోగమార్గం నుండి కూడా భ్రష్టుడైతే నిరాశ్రయుడై రెంటికీ చెడ్డ రేవడి కావటం లేదా? అట్లాగైతే చెదిరిపోయిన మేఘంలాగా నశించిపోతాడు గదా?

3. ఈ ఉభయభ్రష్టత్వం గూర్చి నా సందేహాన్ని తీర్చగల సమర్థుడవు నీవొక్కడవే సుమా! అంటే ఈశ్వరుడొక్కడే జగద్గురువని భావం. **37-39**

"అవతార పురుషునికి సాధ్యం కానిదంటూ ఏమీ ఉండదు. జీవుని గురించిగాని, ఆత్మను గురించిగాని సూక్ష్మమైన ప్రశ్నలన్నింటికీ అతడు సులభంగా జవాబు చెప్పగలడు. అతడు చేసే బోధల్ని పసిపిల్లలు కూడా అర్థం చేసుకోగలుగుతారు. యుగయుగాలుగా పేరుకు పోయిన అజ్ఞానాన్ని తొలగించగల కోటి సూర్యుల ప్రకాశం అతడి వద్ద ఉన్నది."

- శ్రీరామకృష్ణ పరమహంస

శ్రీకృష్ణుడు *:* పార్థా! మంచి పనులు చేసేవాడికి ఎన్నడూ దుర్గతి పట్టదు. ఇహంలోగాని పరంలోగాని వినాశం పొందదు. **40**

"మనిషి ఆలోచనలకు కృషికి తగినట్లుగా అతనికి ఫలం లభిస్తుంది. భగవంతుడు అంటే భక్తులు కోరుకున్నదంతా ఇచ్చే కల్పతరువే." - శ్రీరామకృష్ణ పరమహంస

పార్థా! యోగాన్నుండి భ్రష్టుడైనవాడు మరణానంతరం పుణ్యలోకాలలో అనేక సంవత్సరాలుండి అటుపైన భూలోకంలో శ్రీమంతుల ఇంట్లో పుడుతున్నాడు. లేదా జ్ఞానవంతులైన యోగీశ్వరుల వంశంలో జన్మిస్తాడు. ఇటువంటి జన్మ సామాన్యులెవ్వరకీ లభించదు. కురునందనా! ఇందుమూలంగా పూర్వజన్మలో యోగ సాధన ద్వారా లభ్యమైన జ్ఞానాన్నంతా పొందుతున్నాడు. అతడు పూర్వజన్మలో మోక్ష సాధనను ఎక్కడైతే విడిచిపెట్టాడో, మళ్ళీ సాధనలు అక్కడ నుండీ ప్రారంభిస్తాడు. 41-44

ఆ యోగికి తాను పూర్వ జన్మలలో అభ్యసించిన మహత్తరమైన అలవాట్లు సంస్కార రూపంలో సంక్రమించడం వల్ల ఈ జన్మలో యోగ స్వరూపాన్ని తెలుసుకునేందుకు మనస్సును లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ సంస్కారంతోనే వేద ప్రతిపాదితాలైన కర్మఫలాలను తేలికగా విడిచిపెట్ట గలుగుతున్నాడు. (అనగా మార్చి 31వ తేదీన ఉండే నిలువలే ఎప్రిల్ ఒకటో తేదీ నుండీ ప్రారంభం అవుతాయి)

పట్టుదలతో ప్రయత్నించే యోగికి సమస్త పాపాలు నశించిపోతాయి. ప్రతి జన్మలోను అతడు కొద్ది కొద్దిగా సంపాదించుకున్న యోగానికి సంబంధించిన సంస్కారాలు క్రమంగా వృద్ధి చెందుతాయి. ఇట్లా జన్మజన్మల సంస్కారాలు వెంటరాగా చివరకు యోగసిద్ధుడై సర్వోత్కృష్టమైన మోక్షాన్ని పొందుతాడు.

45

పాండిత్యంగాని, సంపదలుగాని ఒకటి రెండు రోజుల్లో సంపాదించుకోలేరు. తరగని పట్టుదలతో శ్రమించగా శ్రమించగా విద్యావంతుడవుతాడు. అట్లాగే సంపన్నుడవుతాడు. అటువంటిది అనేక జన్మల నుండి సంపాదించుకొన్న యోగం అటువంటి ఫలాన్నివ్వడంలో ఆశ్చర్యమేముంటుంది? ఇట్లా ప్రయత్నం చేసే వానినే యోగి అంటారు.

"కొత్తగా పుట్టిన లేగదూడ కాలు నిలదొక్కుకోవడానికి ముందు అనేకసార్లు పడి లేస్తుంది. అట్లాగే సాధకుడు కూడా చివరగా గెలిచే ముందు అనేకసార్లు ఓడిపోవాల్సి ఉంటుంది."

- శ్రీరామకృష్ణ పరమహంస

తపస్వుల కంటే కూడా యోగి గొప్పవాడు. జ్ఞానులకన్నా పండితులకన్నా కూడా యోగి గొప్పవాడు. కర్మలు చేసేవారందరి కన్నా యోగి గొప్పవాడు. కనుక అర్జునా! నువ్వు యోగివి కమ్ము. **46-47**

తపస్సు చేసే వారికంటే యోగి గొప్పవాడని చెబుతున్నాడు. ఎందువల్ల? వారంతా ఏదో ఫలాన్ని ఆశించే ఆయా కర్మలు చేస్తున్నారు. వారు అష్టకష్టాలు పడి యజ్ఞయాగాదులు చెయ్యడం వల్ల వారు కోరుకునే ఫలం స్వర్గప్రాప్తి వంటివే. యోగంలో భ్రష్టుడైన వారు కూడా అట్టి ఫలాన్ని ప్రయత్నం లేకుండానే పొందుతున్నాడు. ఎందువల్ల? నిరాశయందు నిలచు వాడు యోగి. కోరిక లేని మనస్సుకు శక్తి ఎక్కువ అవుతుంది.

ఎక్కువ శక్తిమంతుడైన యోగి పరిపూర్ణత చెందకమునుపే ఆశగల వాడైతే 'యోగభ్రష్టు'డవుతున్నాడు.' అప్పటికే అతడి మనస్సు శుద్ధి పొంది ఉండటం చేత అతడు కోరుకున్నకోరిక వెంటనే నేరవేరుతోంది. యోగ సాధన చేత మనస్సు ఎంతెంత శుద్ధి చెందుతుందో

అతడి మనస్సులో ఉదయించే కోరికలు కూడా అంతంతగా నెరవేరుతాయి. యోగభ్రష్టునికి ఇహపరాలు రెండింటిలోనూ గొప్ప పదవి, భోగములు సులభంగా లభిస్తాయి. రాజకుమారుడు రాజు కాలేకపోయినా ఇతర ఉద్యోగుల కంటే గొప్పవాడే కదా? అట్లాగే యోగభ్రష్టునికి ఇహపరాలు రెండింటిలోను గొప్ప భాగ్యం లభిస్తోంది. కనుక యోగమును సాధించడమే పరమలక్ష్యంగా పెట్టుకోవాలి.

"ఒక లౌకికుడు గొప్ప జ్ఞానివలె జ్ఞానాన్ని, బుద్ధికుశలతను కలిగి ఉండవచ్చు. అతడు యోగివలె సాధనల యందు ఎక్కువ శ్రమ పడి ఉండవచ్చు. లేక ఒక సన్న్యాసివలె ఆడంబరం లేని జీవితం గడుపుతూ ఉండవచ్చు. అయినా అతడి ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనాలే. ఎందువల్లనంటే అతడు ఈ ప్రయత్నాలన్నీ ఈశ్వరుని పొందుటకు కాక, గౌరవము, అంతస్తు, సంపద పొందడానికే చేస్తున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

7

జ్ఞాన విజ్ఞానయోగం

మొదటి ఆరు అధ్యాయాల్లోను జీవుని గురించి చెప్పారు. జీవుడు కర్మ ప్రధానుడని చెప్తూ కర్మల యందు భేదాలు, కర్మలు ఎలా ఉండాలో, ఏయే కర్మలకు ఏయే ఫలాలుంటాయో చెప్పారు. నిష్కామ కర్మను అందులోని యోగ స్వరూపాన్ని అందుకు అవసరమయ్యే ధ్యాన యోగాన్ని గూర్చి తెలిపారు. ఈ అధ్యాయంలో పరమాత్మను గురించి నిరూపిస్తూ పరబ్రహ్మోపాసన, దానివల్ల కలిగే ఫలాల్ని చెప్పబోతున్నారు. ఎవని యందు భక్తి భావం కలిగి ఉండాలో అటువంటి భగవత్స్వరూపాన్ని నిరూపించేందుకే ఈ జ్ఞాన విజ్ఞానమనే అధ్యాయం. సంశయం, అసంభావన, విపరీత భావన అనేవి జ్ఞానానికి ప్రతిబంధకాలు. వీటివల్ల జ్ఞానం లభించదు. దీన్నే శాస్త్రజన్యజ్ఞానం అంటారు. ఈ ప్రతిబంధకాల్ని తొలగించిన తర్వాత విచారణ చేత కలిగిన జ్ఞానం ఫలాన్నిస్తుంది. దీన్నే అపరోక్ష జ్ఞానం అని లేక విజ్ఞానం అని అంటారు. విచారణ చేత జనించిన జ్ఞానం కాబట్టి దీన్ని విజ్ఞానం అన్నారు. అటువంటి విజ్ఞానాన్ని కలిగించడానికే ఈ అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారు.

శ్రీకృష్ణుడు : ఓ అర్జునా! నాయందు ఆసక్తి గలవాడవై, నన్నే ఆశ్రయించినవాడవై సంపూర్ణంగాను, నిస్సందేహంగాను ఎట్లా తెలుసుకోగలవో నీకు వివరంగా చెప్తాను. విను. నేను నీకు చెప్పబోయేది పరోక్షమైనది కాదు; పరమేశ్వరునికి సంబంధించినది. దీన్ని అపరోక్షం అంటారు. స్వానుభవంతో కూడినదని తాత్పర్యం. అటువంటి జ్ఞానాన్ని నీకు సంపూర్ణంగా తెలుపుతాను. నేను చెప్పబోయేది కనుక తెలుసుకుంటే ఇంకా తెలుసుకోవాల్సింది ఏదీ ఉండదు. వేలాది పురుషుల్లో ఎవడో ఒకడు మాత్రమే మోక్షం కొరకు ప్రయత్నిస్తాడు. అట్లా ప్రయత్నించిన వారంతా సిద్ధులే. మళ్ళీ ఆ సిద్ధుల్లో ఎవడో ఒకడే యథార్థంగా నన్ను తెలుసుకుంటాడు. అపరోక్ష జ్ఞానం ఎంత దుర్భరమైనదో తెలుస్తోందిగదా? అందువల్లనే శ్రద్ధగా వినమంటున్నాను. **1-3**

"కాశీలో అన్నపూర్ణ దేవాలయంలోకి ప్రవేశించిన వారు ప్రసాదం తీసుకోకుండా బయటకురాలేరు. కొందరికి వెంటనే ప్రసాదం లభిస్తుంది. కొందరికి ఆలస్యంగా లభిస్తుంది. ఇంకొందరికి బాగా ప్రొద్దుపోతుంది. కానీ ప్రసాదం దొరకనివారంటూ ఉండనే ఉండరు. అట్లాగే జన్మమెత్తిన వారందరికీ ముక్తి లభిస్తుంది. కొందరు ఈ జన్మలోనే ముక్తిని

పొందుతున్నారు. ఇంకొందరు రెండుమూడు జన్మల తర్వాత ముక్తి పొందుతున్నారు. మరికొందరు లెక్కలేనన్ని జన్మలు ఎత్తాల్సి ఉంటుంది. కనుక ముందు వెనకనే అందరికీ ముక్తి లభిస్తుంది."
- శ్రీరామకృష్ణ పరమహంస

భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం మనస్సు, బుద్ధి, అహంకారం అనే ఎనిమిదిగా నా మాయాశక్తి విభజించబడింది. నిర్గుణుడైన పరమాత్మ ఈ ప్రకృతి గుణం వలన సుగుణు డవుతున్నాడు. ఈ ప్రకృతే సృష్టి స్థితిలయముల కారణత్వ మందు ఉపాధి అవుతోంది. పంచతన్మాత్రమైన గంధము, రసం, రూపం, స్పర్శ, శబ్దం అనేవి పంచభూతాల యొక్క సూక్ష్మావస్థలు. మనస్సుకు కారణమైనది అహంకారం. అహంకారానికి కారణమైనది బుద్ధి (మహత్తత్వం) **4**

ఇది నా అల్ప ప్రకృతి. దీనికన్నా వేరైనది, జీవాధారమైనది అయిన మరొక గొప్ప ప్రకృతి ఉంది. ఈ జగత్తంతయు దీనిచేతనే ధరించబడుతోంది. **5**

పంచభూతాలు, అంతఃకరణము కలసి ఒక రూపాన్ని దాల్చాయి. అల్ప ప్రకృతి అనేది మరొకటి ఉన్నది. దీనిని ఒక ఉపమానం ద్వారా చెబితేగాని సరిగా బోధ పడదు. అగ్ని మండుతోంది. దానిలో నుండి పొగ వస్తోంది. పొగ నిప్పు యొక్క అల్ప ప్రకృతి. అందులో నుండి నిప్పురవ్వలు పైకి ఎగురుతున్నాయి. నిప్పురవ్వలో శ్రేష్ఠమైన (ప్రకృతి) అగ్ని స్వరూపం ఉంది. నిప్పుచేసే కర్మయే పొగగా కనిపిస్తుంది. పొగ నిప్పు యొక్క తటస్థ లక్షణం. రవ్వను గూర్చి తెలుసుకుంటే నిప్పును గూర్చి తెలుసుకున్నట్లే. శుద్ధచైతన్యమైన పరమాత్మ యొక్క స్వభావం జీవునియందు చాలా వరకు ఉంది. నిప్పురవ్వ నిప్పు నుండి కొద్దిగా దూరంలో ఉంది. కానీ జీవుడు పరమాత్మ నుండి వేరుగాలేడు. సముద్రంలో అలలవలె పరమాత్మ యందే అది ఉపాధితో కలసి ఉంది.

జీవప్రకృతి లేక క్షేత్రజ్ఞుడు జడ ప్రకృతిని తన శరీరంగా చేసుకొని దానికి ఆధారంగా ఉన్నది. ఆకాశం ఎట్లా తక్కిన నాలుగు భూతాలకు ఆధారంగా ఉందో అట్లాగే జీవాత్మ చైతన్యము జడప్రకృతికి ఆధారంగా ఉన్నది.

సమస్త ప్రాణులకు ఈ రెండు ప్రకృతిలే ఆధారం. నేనే ప్రపంచ ఉత్పత్తంతటికీ కారణభూతుడనని తెలుసుకో. **6**

శరీరము ప్రాణము కలిసినప్పుడే జీవితం ఏర్పడుతుంది. ప్రాణంలేని శరీరం శవం మాత్రమే. ప్రాణంలేని శరీరం కర్మల్ని చేసే శక్తిని కోల్పోతుంది. అంటే జీవము, దేహము (క్షేత్రజ్ఞుడు క్షేత్రము) కలిసినప్పుడే జీవితం సాధ్యమవుతోంది. ఈ ప్రపంచంలో కనిపించే వస్తువులన్నీ ఈ రెండు ప్రకృతుల సహకారమే. మేఘం ఆకాశమందు పుట్టి, ఆకాశంలో సంచరిస్తూ ఆకాశలోనే మాయమవుతోంది. అట్లాగే ఈశ్వరుడు జగత్తుకు, జీవుడికి మూలకారకుడవుతున్నాడు. జగత్తు కూడా అతని యందే ఐక్యమవుతోంది.

"మాయను చూడాలనిపించింది. అప్పుడు నేనొక దృశ్యాన్ని చూశాను ఒక చిన్న నీటి బిందువు కొద్ది కొద్దిగా పెద్దదవుతూ ఒక బాలిక అయింది. ఆ బాలిక యువతి అయి,

స్త్రీగామారి ఒక శిశువును ప్రసవించింది. ప్రసవించగానే ఆ శిశువును మింగేసింది. ఈ విధంగా ఆమెకు పుట్టిన పిల్లలందర్నీ తానే మ్రింగేసింది. అప్పుడామె మాయ అని తెలుసు కున్నాను." - శ్రీరామకృష్ణ పరమహంస

ఓ ధనంజయా! (పరమేశ్వరుడనైన) నా కంటే శ్రేష్ఠమైన వస్తువు మరొకటి లేదు. దారంలో మణుల్ని గుచ్చినట్లు ఇవన్నీ నాలోనే ఇమిడి ఉన్నాయి. **7**

ప్రపంచంలోని సకల జీవరాసుల జననమరణాలకు మూలకారణం ఈశ్వరుడే. అందువల్ల అతని కంటే శ్రేష్ఠమైన వస్తువు మరొకటి ఉండదు. రత్నాల్ని ఏ విధంగా దారంలో కూరుస్తారో అదే విధంగా అండములన్నీ సర్వేశ్వరుడనే దారానికి కూర్చబడుతున్నాయి. అందువల్లనే అతన్ని 'సూతాత్మ' అని పిలుస్తారు. అంటే గుణభేదములు గలిగిన జీవులను, జడపదార్థాలను ఒకటిగా కలిపి ఉంచే చైతన్యం ఒక్కటే. అతడే ఈశ్వరుడు.

"సచ్చిదానంద బ్రహ్మం ఇట్లా ఉంటుందని ఎవరూ చెప్పలేరు. అందువల్లనే పరమేశ్వరుడు సగం పురుషుడుగాను, సగం స్త్రీగానూ ఉంటూ అర్ధనారీశ్వరుడుగా రూపాన్ని దాల్చాడు. ప్రకృతి పురుషులు ఒక్కటే అని చెప్పడమే అందులోని రహస్యం. అదే సచ్చిదానంద స్వరూపుడైన భగవంతుడు. భక్తులను అనుగ్రహించే నిమిత్తం ఇంకనూ అనేక నామరూపాలతో విలసిల్లుతున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఓ కుంతీకుమారా! నీళ్ళలో ఉండే రుచిని నేనే. సూర్య చంద్రుల్లో ఉండే తేజస్సును నేనే. వేదాల్లో చెప్పిన ఓంకారాన్నీ నేనే. మానవుల్లో ఉండే పురుషత్వాన్నీ నేనే. **8**

పంచదారతో ఎన్ని పదార్థాలు చేసినా వాటి రుచి మాత్రం తీపియే. అట్లాగే నీటి సహాయం లేకుండా రుచుల్ని తెలుసుకోలేవు. అంటే ఏది కంకరరాయో, ఏది పటిక బెల్లమో తెలుసుకోలేం. అట్లాగే మనం ఆకారాన్ని చూడాలంటే కాంతి కావాలి. అటువంటి వెలుగు జగత్తంతా వ్యాపించి ఉన్నది సూర్య చంద్రుల వల్లనే. ఆకాశమనే భూతానికి చిహ్నం శబ్దం. మాట్లాడుకునేందుకు వీలుగా మలచుకోవడం వల్లనే భాష ఏర్పడింది. ఆ ప్రణవమే ఓంకారమైంది. ఈ ఓంకారమే భాషలన్నింటికీ మూలం. అందువల్లనే ఓంకారాన్ని శబ్ద బ్రహ్మ మంటారు. వేదాలన్నింటికీ ఓంకారమే బీజమంత్రమైంది. శబ్దమే లేకపోతే శాస్త్రాలు. విజ్ఞానం మనకు దక్కేవేకావు. మానవ జన్మ ఎత్తినంత మాత్రాన ఎవడూ గొప్పవాడు కాలేడు. అతడు చేసే ప్రతి కార్యంలోనూ పురుషత్వం కనిపించాలి. అంటే అరుదైన గొప్ప కార్యాన్ని తలపెట్టాలి, సాధించాలి. అవి సంఘానికి ఉపయోగపడేవిగా ఉండాలి. నిజానికి ఈ మంచి పనులన్నీ దైవానికి చెందినవే. మంచి పనులను గుర్తించి గౌరవించడమంటే భగవంతుని కీర్తించినట్లే అవుతుంది.

భూమి యందు గంధాన్ని నేనే. అగ్నిలో ఉండే వేడి (తేజస్సు) నేనే. ప్రాణులన్నింట్లోనూ ఉండే ప్రాణాన్ని నేనే. తపస్సుల్లో ఉండే తపస్సును నేనే. పార్థా! ప్రాణులన్నింట్లో ఉండే శాశ్వతమైన బీజాన్ని (జీవుడు) నేనే. ధీమంతులలోని బుద్ధిని నేనే. తేజస్సుల యొక్క తేజస్సును నేనే. ఓ భరతకుల శ్రేష్ఠుడా! తన వద్దలేని విషయాలపై ఆసక్తిని కోరిక లేక కామం అంటారు. అట్టి కామాన్ని నేనే. అటువంటి

కామాన్ని (రాగాన్ని) వదిలిపెట్టే సామర్థ్యం కలవారిలో ఉండే సామర్థ్యాన్ని నేనే. ధర్మాన్ని నేనే. దేహధారులు కోరుకునే అన్నపానాదుల విషయంలో ఉండే కోరికను నేనే. అంటే జితేంద్రియులు, వర్ణాశ్రమ ధర్మాల నాచరించే వారంతా నాలోనే ఉన్నారు. **9-11**

"ధ్యానంలో ఉన్నవాడి మనస్సు ఎందుకు ఏకాగ్రత చెందటంలేదు. ఎందుకు చంచలమవుతుంది. ఈగలు తినుబండారాలపైనా వాలుతాయి, అశుద్ధంపైనా వాలుతాయి. కానీ తేనెటీగ తేనె కొరకు పుష్పాలపైననే వాలుతుంది కానీ పైన చెప్పిన విషయాలపై వాలదు. అట్లాగే విషయాసక్తి ఉన్నవారు ఈగవంటివారు. దైవప్రార్థన చేసి ఆనందాన్ని కొంతసేపు అనుభవించినా పాతవాసనలచేత వారు అల్పమైన ఇంద్రియ సుఖాలనే మలమును వెతుక్కుంటూ పోతున్నారు. పరమహంసలైన మహానుభావుల మనస్సు ఎల్ల వేళలా భగవంతునిపైనే లగ్నమై ఉంటుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

సత్త్వరజస్తమో గుణాలు కలిగిన వస్తువులన్నీ నా నుండి ఉత్పత్తి అయినవే. అయితే నేను వాటి యందుండను. అవన్నీ నాలో ఉంటాయి. **12**

త్రిగుణాలతో కూడిన ప్రపంచమంతా నానుండే వచ్చింది. పాలు పెరుగైనట్లుగా అతడు ప్రపంచంగా మారడు. త్రాడు పాములాగా కనిపించే విధంగా తన మాయాశక్తి చేత అతడే ప్రపంచమన్నట్లు భ్రమ కలిగిస్తున్నాడు.

మానవులంతా ఈ మూడు గుణాలచేత సృష్టించబడిన వస్తువుల చేత మోహించ బడి వీటికన్నా గొప్పవాడిని నాశరహితుడనైన నన్ను తెలుసుకోలేకపోతున్నారు. **13**

"మానవరూపంలో అవతరించేవాడు ఈశ్వరుడే. అతడు ఒక గారడీ వాడి వంటివాడు. జీవము, జగత్తు మొదలైన మాయా రూపాలన్నీ అతగాడి గారడీ విద్యలు. గారడీ వాడు మాత్రమే నిజం. వాని విద్యలన్నీ మాయయే." - శ్రీరామకృష్ణ పరమహంస

త్రిగుణాత్మకమైన నా యీ మాయను దాటడం చాలా కష్టం. ఎవరు నన్ను శ్రద్ధగలవారై శరణు కోరుకుంటారో వారు మాత్రమే ఈ మాయను దాటగలరు. **14**

శ్రీమహావిష్ణువుకే మహామాయ అని మరొక పేరు. మాయను ఉపయోగించి ప్రపంచాన్ని మోహింప జేయటంలో గొప్పవాడు. తన నిజ స్వరూపాన్ని మాయచేత కప్పి ఉంచుతాడు. అయితే తనను ఎవరైతే శరణు కోరుతారో వారికి మాత్రం తన నిజస్వరూపాన్ని చూపుతూ ఉంటాడు. అప్పుడు మాయా ప్రభావం ఆ భక్తుడిపై ఉండదు. త్రాడును చూసినప్పుడు పాము అనే భ్రమ తొలగిపోతుంది.

జగన్మాతను మనం ఎందువల్ల చూడలేక పోతున్నాం? మాయ అనే తెర వెనక నుండి అన్ని కార్యాలు నడిపిస్తూ ఉంటుంది. తను ఎవరికీ కనిపించదు. సంపన్నుల ఇళ్ళల్లోని స్త్రీలు పరదా వెనుక నుండి అన్నింటినీ చూస్తున్నట్లుగా జగన్మాత కూడా తాను అన్నింటినీ చూస్తూ ఉంటుంది. ఆమె నిజమైన భక్తుడు మాత్రం తెరను దాటి ఆమె దర్శనం చేసుకుంటున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

పాపాత్ములు, మూఢులు, మాయచేత జ్ఞానాన్ని అపహరించబడినవారు, అసుర స్వభావం గలవారు, నన్ను పొందలేరు. **15**

దైవత్వాన్ని అణచిపెట్టి అసురత్వాన్ని ప్రకటించే కఠినాత్ముల్ని అసురులంటారు. భగవంతుని మహిమలను గూర్చిన వివేకం లేనివారిని మూఢులు అంటారు. వివేకం నశించినవాడు నశించడం తథ్యం. అట్టివాడిని నరాధములంటారు. వీరందరి జ్ఞానము మాయచేత కప్పబడి ఉంటుంది. ప్రపంచమంతా భగవంతుని స్వరూపమేనన్న సత్యాన్ని వారు గ్రహించలేరు. కనుక వారంతా అధములే అవుతున్నారు.

సన్నటి ధ్యానాన్ని విడిచిపెట్టి ముతకగా ఉండే కుప్పవంటి పదార్థాలను నిలుపుకోవడం జల్లెడ స్వభావం. అట్లాగే మంచిని విడిచి చెడును మాత్రం ఆచరించడం దుర్మార్గుల స్వభావం."
- శ్రీరామకృష్ణ పరమహంస

భారతకుల శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! నాలుగు రకాలైన పుణ్యాత్ములు నన్ను భజిస్తున్నారు. వారు, దుఃఖాల్లో ఉన్నవారు, జ్ఞానాన్ని కోరుకునే సాధకులు, ధనాన్ని కోరుకునేవారు, జ్ఞానులు. **16**

దేహాన్ని ధరించిన తర్వాత ఏదో ఒక దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. ఆ దుఃఖాల నుండి విముక్తి కోరి భగవంతుని ప్రార్థిస్తున్నాడు. సత్యపరిశోధకులు పరమాత్మను గురించి సత్యాన్ని తెలుసుకోవాలన్న తపనతో నన్ను ధ్యానిస్తున్నారు. వివేకానంద శ్రీరామకృష్ణ పరమహంసచే అనుగ్రహించబడడానికి ముందు ఇటువంటి జిజ్ఞాసిగానే ఉన్నారు. తెలుసుకోవాలన్న జ్ఞానతృష్ణ అందరిలో ఉండటం లేదు. లోకంలో సుఖాలనిచ్చేది ద్రవ్యమే కాబట్టి ధనం కావాలని భగవంతుని ప్రార్థిస్తూ భక్తుడవుతున్నాడు. శుకబ్రహ్మ, తిరుజ్ఞాన సంబంధర్ వంటివారు పుట్టుక నుండీ జ్ఞానులుగా ఉన్నారు. వీరి మనోభావాలన్నీ పూర్వజన్మల పుణ్యఫలం చేతనే కలుగుతున్నాయి. కనుక భగవంతుని అనుగ్రహంతో పురుషార్థాలను వెదికేవాడు ధన్యుడు.

"ఒకటి అనే అంకె తర్వాత సున్నాలు చేరిస్తే వాటి విలువ పెరుగుతుంది. ఆ ఒకటి అంకెను తప్పిస్తే మిగిలేవి సున్నాలే. భగవంతుడే 'ఒకటి' అనే సంఖ్య. ప్రపంచంలో ఉండే వస్తువులన్నీ అతనితో చేరని సున్నాలు. వాటికంటూ విడిగా విలువ ఉండదు."
- శ్రీరామకృష్ణ పరమహంస

పై నలుగురిలో సంపూర్ణ జ్ఞానం కలిగి ఎల్లప్పుడూ భక్తితో సేవలు చేసేవారు అత్యంత శ్రేష్ఠుడు. ఎందువల్లనంటే నేనతనికి అత్యంత ప్రియుడను. అట్లాగే అతడు కూడా నాకు ప్రియాతి ప్రియమైన భక్తుడు. **17**

"భగవద్దర్శనం పొందిన తర్వాత, అతడు తానే దైవాంశ సంభూతుడవుతున్నాడు."
- శ్రీరామకృష్ణ పరమహంస

వీరంతా మంచి వాళ్ళే అయినా జ్ఞానియే నా ఆత్మ స్వరూపమని నా ఉద్దేశం. ఎందువల్లనంటే యోగమందున్న జ్ఞాని పరమగతి అయిన నన్నే ఆశ్రయిస్తున్నాడు. **18**

"మనస్ఫూర్తిగా సేవలు చేసే సేవకుని యెడల యజమాని నుండి అత్యంత ఆదరం లభిస్తుంది. సేవకుని పరిశుద్ధమైన సేవలకు తృప్తి చెందిన వాడై తన స్థానంలోనే ఉంచుతాడు. భగవంతుడు తన భక్తుల విషయంలో కూడా అట్లాగే చేస్తున్నాడు."

- శ్రీరామకృష్ణ పరమహంస

అనేక జన్మల తర్వాత సర్వమూ వాసుదేవ స్వరూపమని జ్ఞాని నన్ను ఆశ్రయిస్తున్నాడు. అటువంటి మహాత్ములు లోకంలో ఎక్కడో కోటికి ఒక్కడుంటాడు. **19**

అనేక జన్మలు చేసిన పుణ్యకర్మల వల్ల సంక్రమించే సద్బుద్ధులన్నీ 'వాసన'ల రూపంలో సంక్రమిస్తాయి. అటువంటి వాసనకు ఆశ్రయాలైన జన్మలు అనేకం ఎత్తగా ఎత్తగా చివరి జన్మలో వాసుదేవ పరబ్రహ్మము యొక్క నిజస్వరూపమైన ప్రత్యగాత్మను ప్రత్యక్షంగా కలుసుకోగలుగుతాడు. సర్వాత్మనైన నన్ను తెలుసుకున్నవాడే మహాత్ముడు. అటువంటివారికి సమానుడెవడూ ఉండడు.

'భేద బుద్ధిని ఇచ్చేది అజ్ఞానం. ఐక్యబుద్ధినిచ్చేది జ్ఞానం"

- శ్రీరామకృష్ణ పరమహంస

అనేక కోరికలతో సతమతమవుతూ బుద్ధి కుశలతను కోల్పోయి వారివారి స్వభావాన్ననుసరించి దేవతలను ఉపాసిస్తున్నారు. **20**

ఇతర దేవతలనగా పరమేశ్వరుని స్వల్పమైన అంశలు కలిగినవారని అర్థం చేసుకోవాలి. వారంతా స్వల్ప లాభాల్ని ఇచ్చేవారే. వారికా అల్పవస్తువులే గొప్పగా కనిపిస్తాయి.

"నీచ స్వభావం గలవారు మాత్రమే వ్యాధుల్ని నయం చేయడం, వ్యాజ్యాన్ని గెలిపించడం, నీటిపై నడవడం మొదలైన సిద్ధుల కోసం పరుగులు పెడుతున్నారు. నిజమైన భక్తులు ఈశ్వరుని పాదారవిందములు తప్ప వేరేమీ కోరుకోరు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఏయే భక్తుడు ఏయే దేవతా మూర్తులను ఆశ్రయిస్తాడో, అతడి శ్రద్ధను స్థిరపడేట్లు చేస్తాను. ఆ విధంగా అతడాదేవతా మూర్తులను ఆరాధించి తను కోరిన వాటిని పొందుతున్నాడు. నిజానికి కోరికలన్నింటినీ మన్నించి ప్రసాదించే వాడిని నేనే (చెరువులోను, నదిలోను బావి మొదలైన వాటన్నింటిలో నీరు వర్షం వల్ల వచ్చి చేరిందే ఆ వర్షాన్ని అనుగ్రహించేది ఆ భగవంతుడే) 21-22

డాబాలపైన పడే వర్షం నీరు పోయేందుకు గొట్టాలు అమరుస్తారు. ఆ గొట్టాలకు చివర పులి, ఆవు, సింహం వంటి తలలు అమరుస్తారు. వర్షం నీరు పడేటప్పుడు ఆ జంతువుల నోటిలో నుండి పడుతున్నట్లుగా అనుభూతి కలుగుతుంది. నిజానికి ఆ నీరంతా మానవుని సౌకర్యం కోసం వర్షం ద్వారా భగవంతుడు చేకూర్చేదే. అట్లాగే ఉత్తమముల నోటి నుండి వచ్చే మాటలు కూడా ఈశ్వరుడు పలికించేవే". - శ్రీరామకృష్ణ పరమహంస

కానీ, అల్పమైన బుద్ధి గలవారు అల్పమైన ఫలాలనే ఆయా దేవతల ద్వారా పొందుతున్నారు. నా భక్తులు నన్నే పొందుతున్నారు. **23**

శాశ్వతానందానికి, తాత్కాలికమైన ఆనందానికి తేడా తెలియనివారు అల్పబుద్ధులు. గంధం చెట్లు ఉన్న అడవిలో చిన్నచిన్న పుడకలను ఏరుకుని బ్రతికేవారు అల్ప బుద్ధులే గదా. సర్వేశ్వరుని వదలి చిన్నచిన్న దేవతల్ని ఆరాధించడం కూడా అటువంటిదే.

నాశనం లేనిది, ఉత్తమమైనది అయిన నా స్వరూపాన్ని తెలుసుకోలేని బుద్ధిహీనులు నన్ను పంచభూతములచే నిర్మించబడిన వానినిగా భావిస్తున్నారు. **24**

సామాన్య మానవులు కర్మ ఫలాలను అనుభవించేందుకే పాంచభౌతిక శరీరాన్ని ధరిస్తారు. కానీ అవతార పురుషులు అట్లాకాదు. అవతార పురుషులు మానవజన్మనెత్తినా దానికి బంధితులు కారు. గొప్ప ధర్మదాత ఏదైనా వ్రతధర్మాన్ని ఆచరించడం కోసం వస్త్రధారణ అర్ధనగ్నంగా ఉండవచ్చు. అంతమాత్రాన అట్టి దాతను గుడ్డలైనా లేని పేదవాడని అనరాదు. ఒకవేళ అన్నా అతడికి వచ్చే నష్టం ఏమీ ఉండదు. అవతార పురుషుడు మానవ శరీరాన్ని దాల్చినా అతడిది పరమాత్మ స్వరూపమే అవుతుంది. ఈ రహస్యం తెలియనివాడు భగవదుపాసనకు అర్హుడు కాడు.

యోగమాయచే ఆవరించబడి ఉన్న నన్ను అంతా గుర్తించలేకుండా ఉన్నారు. నేను జనన మరణములు లేనివాడనని ఈ లోకానికి తెలియదు. **25**

ఎంతటివారూ ఎదురుపడలేని సూర్యుణ్ణి మేఘాలు అడ్డుకోగలుగుతున్నాయి. అయినా అతడి ప్రకాశం చేతనే మేఘాలు కనిపిస్తున్నాయి. అట్లాగే సర్వేశ్వరుని యోగమాయ కప్పి వేస్తోంది. అందువల్ల పామరులు ఆయనను సామాన్య మానవుడని భావిస్తారు.

అర్జునా! భూత భవిష్యద్వర్తమాన కాల మందలి ప్రాణులన్నింటినీ నేనెరుగుదును. కానీ నన్ను ఎవరూ ఎరుగరు. **26**

మాయ అనగా భగవంతుని సంకల్పమే. అయినా సృష్టి కార్యాలన్నీ మాయయే జరుపుతుంటుంది. కాలం మాయా స్వరూపమే. అతడు సర్వజ్ఞుడు కాబట్టి మూడు కాలాలు అతడికి క్షుణ్ణంగా తెలుసు.

"పాలను నీటినీ హంస మాత్రమే వేరు చెయ్యగలదు. ఇతర పక్షుల కాశక్తి లేదు. ~~ఈశ్వరుడు~~ మాయతో కలిసి ఉన్నాడు. పామరులు ఆయనను మాయ నుండి వేరుచేసి చూడలేరు. పరమహంసలు మాత్రమే మాయను తొలగించి పరమాత్మను దర్శించగలరు."

- శ్రీరామకృష్ణ పరమహంస

శత్రువులను తపింపజేయునట్టి ఓ భారతా! రాగద్వేషముల నుండి పుట్టిన ద్వంద్వ మోహాల చేత, పుట్టినప్పుడే ప్రాణులన్నీ సమ్మోహం చెందుతున్నాయి. **27**

ద్వంద్వమోహాలంటే మంచీ చెడులని అర్థం. ఈ రెండూ ఎప్పుడూ కలిసిమెలసే ఉంటాయి. ఈ రెండు స్వభావాలు మనిషికి మంచి చేస్తున్నట్లు కనిపిస్తున్నా కూడా చెడునే చేస్తున్నాయి. రాగద్వేషాల్ని తొలగించుకొని సమభావం గలవారు మాత్రమే భగవంతుని గూర్చిన స్పృహ కలిగిన వారవుతున్నారు. కనుక రాగద్వేషాలనే శత్రువును జయించేందుకు ప్రతి జీవుడూ ప్రయత్నించాలి.

ఏ మానవుడికి పాప కర్మలు నశించి పుణ్యకర్మలు మాత్రమే మిగిలి ఉంటాయో వారు ద్వంద్వ వ్యామోహాల నుండి విముక్తులవుతారు. దృఢమైన మనస్సు గలవారై నన్ను కోరుకుంటారు. **28**

"త్రుప్పు పట్టిన ఇనుమును అయస్కాంతం ఆకర్షించదు. త్రుప్పు లేకుండా శుభ్రం చేసిన తర్వాత ఆకర్షిస్తుంది. అట్లాగే రాగద్వేషాలనే త్రుప్పు పట్టిన చిత్తమునందు భక్తి ఉదయించదు. మనస్సు పరిశుద్ధమైన పిదప మాత్రమే భక్తి ఉదయిస్తుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

జరామరణాల నుండి విముక్తులయ్యేందుకు ఎవరైతే నన్ను ఆశ్రయించి గట్టి ప్రయత్నం చేస్తారో వారు బ్రహ్మము, అధ్యాత్మికము, కర్మమును పూర్తిగా తెలుసుకున్నవారవుతారు. **29**

ద్వంద్వ మోహములు కలవారు జీవితంలో వచ్చే మార్పులు తెలుసుకోగలుగుతారు. ఎట్లాగంటే, వృద్ధాప్యాన్ని, మరణాన్ని ఎవరూ కోరుకోరు. వీటిని విచారించి తెలుసుకొని జీవిత తత్త్వాన్ని తెలుసుకోవటానికి మరణం ఉపయోగపడుతోంది. అందువల్ల వృద్ధాప్యాన్ని, మరణాన్ని పరిశోధించి తెలుసుకున్నవారు సత్యాన్ని గ్రహించగలుగుతారు. కనుక బ్రహ్మాన్ని గూర్చి ఆత్మను గూర్చి కర్మల యొక్క అంతాన్ని అందరూ తెలుసుకొని తీరాలి.

"బిల్వ ఫలంలో పెంకు, విత్తనాలు, గుజ్జు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కదాన్ని మాత్రమే బిల్వ ఫలమని చెప్పలేం. ఎందువల్లనంటే పెంకు ఫలం కాదు; విత్తనాలు ఒక్కటే ఫలంకాదు; అట్లాగే గుజ్జు మాత్రమే ఫలం కాదు. కనుక పెంకు, విత్తనాలు, గుజ్జులు కలిసి ఉన్నదాన్ని మాత్రమే బిల్వఫలం అంటారు. అట్లాగే గుణభేదాలు లేని నిరాకారరూపమైన భగవంతుని సాక్షాత్కారం అయిన తర్వాత నిత్యమైన పరబ్రహ్మమే, లీలారూపమై, ఈ ప్రపంచంగా పరిణామం చెంది ఉంటుందని తెలుసుకోగలుగుతున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఎవరైతే నన్ను అన్ని భూతాలలో ఉండే వానినిగా (ఆధిభూతునిగా) అందరి దేవతల్లోనూ ఉండే వానినిగా (ఆధిదైవతంగా) అన్ని యజ్ఞాలలోనూ ఉండే వానినిగా (ఆధియజ్ఞునిగా) తెలుసుకుంటారో, అట్టివారు మరణ సమయంలో కూడా నన్ను తెలుసుకుంటారు. **30**

మరణ కాలంలో మానవులకు మనస్సు ఆందోళన కలగటం సహజం. కానీ యోగులకు అటువంటి ఆందోళనలుండవు. ప్రకృతిని, దాని ఔన్నత్యాన్ని, అందులో సంభవించే సంఘటనల్ని క్రమంగా తెలుసుకునే వారికి దైవభక్తి మరింత అధికమవుతుంది. భక్తి, జ్ఞానం అధికం కావడం వలన మరణ కాలంలో సహాయ పడుతుంది. ఆ సమయాన భగవంతుని స్వరూప జ్ఞానం మరింత ఎక్కువవుతుంది.

8

అక్షర పరబ్రహ్మయోగం

అర్జునుడు : కృష్ణా! ఓ పురుషోత్తమా! నువ్వు చెప్పిన పరబ్రహ్మమేది? అధ్యాత్మం అంటే ఏమిటి? కర్మ అంటే ఏది? ఆధిభూతం ఏది? ఆధిదైవం అంటే ఏమిటి? ఈ దేహంలో ఉండే ఆధియజ్ఞం ఏది? అది ఈ దేహంలో ఎట్లా ఉంది? ఆ ఆధియజ్ఞుని ఎట్లా తెలుసుకోవడం? మనోనిగ్రహం గలవారు మరణ సమయంలో నిన్ను తెలుసుకోగలుగుతారని అన్నావు గదా! అది ఎట్లాగో చెప్పు. **1-2**

1. తెలుసుకోదగిన బ్రహ్మము శరీరంతో కూడినదా? శరీరం లేకుండా ఉంటుందా? సగుణమా? లేక నిర్గుణమా?

2. అధ్యాత్మ మంటే ఏమిటి? ఇంద్రియ రూపంలో ఉండేదా? లేక చైతన్య స్వరూపమా?

3. కర్మమంటే వేదోక్తమైన యజ్ఞాలా? మరొకటా?

4. ఆధిభూతం అంటే పంచభూతాలతో కూడుకున్నదా?

5. ఆధిదైవం అంటే ధ్యానమా? లేక సర్వవ్యాప్తమై ఉండే చైతన్యమా?

6. ఆధియజ్ఞం అన్న దేవతా రూపమా? లేక పరబ్రహ్మమా?

7. అంత్యకాలంలో ఇంద్రియాలన్నీ వ్యాకులపాటుతో ఉంటాయిగదా? అట్టి స్థితిలో నిన్ను ఎట్లా తెలుసుకోగలుగుతాడు?

ఇవన్నీ శ్రీకృష్ణుడు వాడిన పదజాలమే. వేదాలలో శాస్త్రాలలో సాధారణంగా వాడే పారిభాషికపదాలే. ఇవన్నీ అర్జునుడిలో గూడుకట్టుకున్న సందేహాలు. తన సందేహాల్ని తీర్చమని శ్రీకృష్ణుని ప్రార్థిస్తున్నాడు.

శ్రీకృష్ణుడు : సర్వోత్తమమైనది, నాశనంలేనిదీ పరబ్రహ్మం. దాని స్వభావాన్ని అధ్యాత్మమంటారు. ప్రాణుల్ని సృష్టించడం, దేవతల్ని ఉద్దేశించి చేసే హోమద్రవ్యాన్ని త్యాగం చెయ్యడాన్ని కర్మ అంటారు. **3**

బ్రహ్మ అనేది సంపూర్ణమైన ఆధిదైవం. దానికి మొదలు చివర అనేవి ఉండవు. ఒక కాలంలో

పుట్టడం మరో కాలంలో మరణించడం ఉండదు. అంటే అన్ని కాలాల్లోనూ ఉంటుంది. ఆ పరబ్రహ్మంలో మార్పులుండవు. దేశకాలాలకు, అతీతమైనది. అందువల్లనే దానిని 'అక్షర' అంటారు. ఇంద్రియాలకు అతీతమైనది కావడం వలన 'పరమ' అని చెప్పబడుతుంది. బ్రహ్మాండాలన్నీ పరబ్రహ్మమునకు నివాసస్థానాలే.

ఒకడికి బాగా కోపం వస్తుంది. అది అతడి స్వభావం. ఇంకొకడు అందర్నీ ప్రేమిస్తూ ఉంటాడు. అది అతడి స్వభావం. అట్లాగే లెక్కలేనన్ని జీవాత్మలను సృష్టించడం భగవంతుని స్వభావం. ఆ స్వభావాన్నే అధ్యాత్మం అంటారు. ప్రతి శరీరంలో జీవాత్మగా ఉంటూ 'నేను' అని అనిపించుకుంటూ ఉంటాడు. అలలన్నీ సముద్రంలో కలసినట్లుగా జీవాత్మలన్నీ పరమాత్మలో కలసిపోతూ ఉంటాయి. ప్రపంచంలో జరిగే పనులన్నింటినీ కర్మలనే అంటారు. మానవుని అభివృద్ధికి ఈ కర్మలే కారణం. కర్మల చేత అన్నింటినీ పొందవచ్చునని పూర్వమీమాంసాగ్రంథం చెబుతోంది.

దేహధారులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! సృష్టించబడే ప్రతి వస్తువూ అధిభూతమే. భూతాలన్నింటికీ శక్తిని ప్రసాదించే శక్తియే పురుషుడు. యజ్ఞాది కర్మలకు ప్రవర్తకుణ్ణి నేనే. యజ్ఞాధిష్ఠాతను నేనే. యజ్ఞ ఫలాన్నిచ్చే వాడిని నేనే. **4**

"ఎవరు తన శరీరాన్ని, మనస్సునూ సంపూర్ణంగా ఈశ్వరునికే అర్పిస్తున్నాడో, అతడే నిజమైన సాధువు. అతడు సర్వకాల సర్వావస్థల యందు ఈశ్వర చింతనలోనే గడుపుతూ ఉంటాడు. అన్ని జీవరాసుల్లోనూ ఉంటూ నడిపించేది ఆ పరమేశ్వరుడేనని గ్రహించి అందరికీ సేవలు చేస్తూ ఉంటాడు. ఇవే నిజమైన సాధనకు లక్షణాలు."

- శ్రీరామకృష్ణ పరమహంస

మరణ కాలంలో ఎవడైతే నన్ను స్మరిస్తాడో అతడు నా స్వరూపాన్నే పొందుతాడు. అంటే ముక్తి లభిస్తుందని భావం. ఇందులో సందేహం లేదు. ఓ కుంతీ కుమారా! మరణ సమయంలో ఎవడైనా దేనిని గూర్చి ఆలోచిస్తూ శరీరాన్ని విడుస్తాడో, మరుజన్మలో అతడు దానినే పొందుతున్నాడు. **5-6**

జీవిత కాలమంతా దేన్ని గూర్చి ఆరాటపడతాడో మరణ సమయంలో కూడా ఆ విషయాలపైనే మనస్సు లగ్నమై ఉంటుంది. అంటే కేవలం పూజించడం చేత మాత్రమే ఆ రూపాన్ని పొందడు. నిరంతరం అదే ధ్యానం చేస్తూ ఉండాలి. అంత్యకాలంలో అతని స్మృతికి కారణమవుతుంది.

కనుక అర్జునా! సర్వదా నన్ను ధ్యానిస్తూనే యుద్ధం చెయ్యి. మనస్సు బుద్ధి మాత్రం నాపైన నిలుపు. నిస్సందేహంగా నన్నే పొందగలవు.

అంటే శరీరంతో కర్తవ్యాలను నిర్వహిస్తూనే మనస్సు భగవంతునిపై నిలుపుకోవాలన్నదే శ్రీకృష్ణుని సిద్ధాంతం.

"వీథుల్లో పాటలు పాడుకుంటుండే బిచ్చగాడు ఒక చేత్తో ఒకరకమైన సాధనాన్ని మీటుతూనే ఉంటాడు. మరో చేత్తో డోలు వాయిస్తాడు. నోటితో పాటలు పాడుతూ ఉంటాడు. అట్లాగే మానవులు ప్రపంచ బంధాలకు లోబడి కర్తవ్యం నిర్వహిస్తున్నా మనస్సులో మాత్రం

భగవన్నామం స్మరిస్తూనే ఉండాలి." - *శ్రీరామకృష్ణ పరమహంస*

పార్థా! మనస్సును వృధాగా పోనీయకు. అభ్యాసంతో నింపు. యోగంతో కూడిన మనస్సుగల వాడివై తేజోమయుడైన ఆ పరాత్పరుని గూర్చి చింతించేవాడు ఆ పరమ పురుషుణ్ణే పొందుతున్నాడు. **8**

ఎవరినైతే జీవిత కాలమంతా క్రమం తప్పకుండా ధ్యానం చేస్తామో దానినే అభ్యాసయోగ మంటారు. అట్టివాడు సూర్యునివలె స్వయంప్రకాశ తేజోమయ పురుషుడవుతున్నాడు. అతడు 'పురి' అనే దేహము నందు దేహధారి అయి ఉంటాడు. ప్రతిరోజూ విడవకుండా అతనినే ధ్యానించడం వలన దేహభావం తగ్గిపోతుంది. అంటే బాగా పండిన కొబ్బరి టెంక నుండి కొబ్బరి విడిపోతోంది. కొబ్బరి కురిడీ అవుతోంది. అట్లే పరిపక్వత పొందిన యోగి మరణకాలంలో నన్నే దర్శిస్తున్నాడు.

సర్వజ్ఞుడు, పురాతనమైనవాడు, జగత్తులన్నింటినీ శాసించేవాడు, ఆయా ప్రాణులకు కర్మ ఫలాల్ని పంచేవాడు, ఊహింప శక్యంకాని రూపం గలవాడును, అణువు కంటే సూక్ష్మమైనవాడు, సూర్యుని వలె ప్రకాశించేవాడు, అజ్ఞానమనే అంధకారాన్ని ప్రారద్రోలేవాడు, అయిన పరమాత్మను ఎవడు భక్తితో, దృఢమైన మనస్సుగలవాడై యోగబలంతో, కనుబొమల మధ్యన ప్రాణాన్ని స్థిరంగా నిలిపి మరణకాలంలో ధ్యానిస్తూ ఉంటాడో అతడు దివ్యపురుషుని పొందుతున్నాడు. **9-10**

ఇటువంటి ఉన్నత స్థానమందు మనస్సును ప్రాణాన్ని నిలిపి శరీరాన్ని వదిలేవాడు పరమాత్మలో ఐక్యం పొందటం తథ్యం. అందుకొరకు అభ్యాస యోగాన్ని దృఢమయ్యేందుకు ప్రతిరోజూ ధ్యానించే ఇష్టదైవం యొక్క ఎనిమిది గుణాలు ఇక్కడ వివరించబడ్డాయి.

వేదవేత్తలు దేన్నైతే నాశనం లేనిదిగా చెప్పారో, వైరాగ్యం కలిగిన సన్యాసులు ఏ పరబ్రహ్మాన్ని పొందుతున్నారో, దేన్ని కోరి వారు బ్రహ్మచర్యాన్ని అనుష్ఠిస్తున్నారో అట్టి స్థితిని గూర్చి నీకు సంగ్రహంగా చెప్తాను. విను : **11**

ప్రకృతి అనే వేదాన్ని నిశితంగా పరిశీలించాలి. తత్త్వవేత్తలు బోధించిన వేద శాస్త్రాలను చక్కగా అనుష్ఠానం చెయ్యాలి. అప్పుడే మనకాసత్యం బోధపడుతుంది. నశించిపోయే ఈ ప్రపంచానికి ఆధారభూతమైనది, శాశ్వతమైనది అయిన ఒక వస్తువును గూర్చి మనం తెలుసుకోగలుగుతాం. అదే నిర్గుణ నిరాకార పరబ్రహ్మం.

అద్దం వెనుక రసాయనం పూసినప్పుడే ముఖాన్ని అద్దంలో స్పష్టంగా చూడగలుగుతాం. అట్లాగే బ్రహ్మచర్యాన్ని చక్కగా ఆచరించేవారి హృదయమందు ఆ జ్ఞానం ప్రతిబింబిస్తుంది. నిష్ఠతో కూడిన బ్రహ్మచర్య వల్ల ఒకనాడి ఏర్పడుతుంది. దాన్ని మేధానాడి అంటారు. అది బ్రహ్మజ్ఞానాన్ని కలిగిస్తుంది. ఆత్మసాధకుడు స్త్రీల చిత్రపటం వైపైనా చూడరాదు." - *శ్రీరామకృష్ణ పరమహంస*

ఇంద్రియ ద్వారాలన్నింటినీ అరికట్టి మనస్సును హృదయంలో నిలపాలి. ప్రాణాన్ని శిరస్సు పైభాగానికి (మెదడు) తీసుకొనిరావాలి. అప్పుడు యోగసాధన చేస్తూ 'ఓం' అన్న బ్రహ్మమంత్రాన్ని జపిస్తూ నన్ను స్మరిస్తూ శరీరాన్ని విడిచిపెట్టాలి. అట్టి యోగి పరమగతిని పొందుతున్నాడు. **12-13**

నది సముద్రంలోకి ప్రవేశిస్తున్నట్లు యోగి యొక్క జీవాత్మ, పరమాత్మను చేరుతోంది. అంటే ప్రపంచంతో సంబంధాలుండే కన్ను, ముక్కు, చెవి వంటి ఇంద్రియాలను గూర్చిన ఆలోచనలు యోగికి కలగడంలేదు. అనగా నిద్రపోతున్న వాడి ఇంద్రియాలు అణిగిపోయినట్లు అణిగిపోతాయి. అట్టి యోగి మనస్సు కూడా, సాయంత్రం కాగానే పక్షులు గూటికి చేరునట్లుగా, హృదయంలో చేరిపోతుంది. అంటే ఇకపైన ప్రపంచ విషయాలపై ఆసక్తి ఉండదు. శరీరంలో వేడి అంతరించి చల్లబడిపోతుంది. అంటే ప్రాణం ఒక్కొక్క అవయవం నుండి బయటకు వచ్చేస్తోందన్నమాట. ప్రయాణీకులు రైల్వే స్టేషనుకు చేరుకున్నట్లుగా, ప్రాణం శిరస్సుపై భాగానికి వచ్చి చేరుకుంటుంది. కనుక ఆ ప్రాంతాన మాత్రం వేడి ఉంటుంది. పామరులకైతే ప్రాణం ముక్కు ద్వారానో లేక నోటి ద్వారానో పోతుంది. ఈశ్వర చింతన అధికమైన యోగి నుండి 'ఓం' అన్న శబ్దం మాత్రమే వినిపిస్తూ ఉంటుంది. 'ఓం' అనే ప్రణవనాదానికి రూపమైన పరమాత్ముని దివ్యరూపం ప్రకాశవంతమైన జ్యోతిగా కనిపిస్తుంది. అప్పుడు ఇతరులవలెనే యోగి శరీరం కూడా శవం అవుతోంది – యోగిమాత్రం మోక్ష పథాన్ని పొందుతున్నాడు.

"ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టిపోయే సమయంలో జీవుడు దేన్ని గురించి తలుచుకుంటాడో, దానికి అనువైన శరీరాన్నే మళ్ళీ జన్మలో పొందుతున్నాడు. కనుక భక్తి సాధన అత్యవసరం. నిరంతర అనుష్ఠానం వలన విషయ సుఖాలు మనస్సులో చోటు చేసుకోవు. ఈశ్వర చింతనయే ఆత్మయందు స్థిరపడుతుంది. మరణ సమయంలో అదిమాత్రం స్థిరంగా నిలచి ఉంటుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

పార్థా! ఏ యోగి అయితే ఏకాగ్ర చిత్తంతో నన్నే ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉంటాడో అటువంటి యోగికి నేనే సులభంగా లభిస్తాను. **14**

"భగవంతుని చూచి మనం ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన పది అడుగులు ముందుకు వేసి మన వద్దకు వస్తాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఉత్తమమైన ఫలాన్ని (ముక్తిని) పొందిన మహాత్ములు నన్ను చేరిన పిదప మళ్ళీ ఈ ప్రపంచంలో జన్మించడం లేదు. అర్జునా! బ్రహ్మలోకం వరకు ఉన్న లోకాలన్నీ మళ్ళీ (భూలోకానికి) వచ్చే స్వభావంగలవే. కానీ కుంతీపుత్రా! నన్ను పొందిన వానికి మళ్ళీ జన్మించడమన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. **15-16**

"ఉడికించిన వడ్లను నాటితే మొలకెత్తవు. అట్లాగే సిద్ధుడుగా మారినవాడు మరణించిన యెడల అతడికి మళ్ళీ జన్మ ఉండదు." - శ్రీరామకృష్ణ పరమహంస

బ్రహ్మకు వేయి యుగాలు ఒక పగలని, వేయి యుగాలు ఒక రాత్రి అని ఎవరైతే తెలుసుకుంటారో వారందరూ రాత్రింబవళ్ళ తత్త్వం తెలిసిన వాళ్ళవుతారు. **17**

యుగాలు నాలుగని, అవే కృత, త్రేతా ద్వాపర కలియుగాలని అందరికీ తెలిసిందే. ఇటువంటివి 4 వేల యుగాలు బ్రహ్మకు ఒక పగలని, మరొక నాలుగు వేల యుగాలు రాత్రని, ఇట్లాంటివి 365 రోజులైతే బ్రహ్మకు ఒక సంవత్సరమని అటువంటి నూరు సంవత్సరాలు ఆయన ఆయుర్దాయమని

తెలుసుకున్న వారికి ఈ ప్రపంచంగాని, మానవుని ఆయుర్దాయంగాని ఎంత అల్పమైనదో తెలుస్తుంది. బ్రహ్మదేవుని పగలు ప్రారంభమైనప్పుడు అవ్యక్తం నుండి సమస్త చరాచర ప్రాణులన్నీ పుడుతున్నాయి. రాత్రి కాగానే అవన్నీ ఆయనలో లీనమై పోతున్నాయి. **18**

పైన చెప్పిన విధంగానే జీవుడు నిద్రించేటప్పుడు అతడి ప్రపంచం అంతా అతడి మనస్సులో లీనమైపోతోంది. అట్లాగే అతడు నిద్రలేవగానే అతడి ప్రపంచం విశాలమవుతోంది. అట్లాగే బ్రహ్మదేవుని నిద్రయందు బ్రహ్మాండాలన్నీ అతడిలో లీనమవుతున్నాయి. మెలకువరాగానే పుడుతున్నాయి. వీటినే సృష్టి, సంహారాలంటారు. ఒక బ్రహ్మకు ఈ విధంగా నూరు సంవత్సరాలు నిండిన తర్వాత అతడు కూడా ముక్తి పొందుతున్నాడు. ఒక బ్రహ్మ ముక్తి పొందిన తర్వాత ఆ పదవికి అర్హత కలిగిన వాడు ఆ స్థానాన్ని పొందుతున్నాడు.

అర్జునా! ఈ ప్రాణికోటి అంతా మళ్ళీ పుట్టి రాత్రి కాగానే తనవశం కాకపోవడం వలన కలసి (లీనమై) పోతోంది. పగలు కాగానే మళ్ళీ పుడుతున్నాయి. **19**

ప్రాణులన్నీ కర్మబద్ధులు కావడంచేత తమ వశంలో ఉండలేవు. ఆ జీవులన్నీ కల్పాంతంలో లీనమై వాటి వాటి కర్మ ఫలాల ననుసరించి కల్పాంతమున ఉదయిస్తున్నాయి. అంటే ఈ విధంగా ఎన్నెన్ని కల్పాలు మారినా జీవుల కర్మయే వారిని అనుసరించి వస్తోంది.

ఈ అవ్యక్తంకంటే మేలైనది, శాశ్వతమైన అవ్యక్తం మరొకటి ఉంది. ప్రాణులన్నీ నశించినప్పటికీ, అది నశించకుండా ఉంటుంది. **20**

అవ్యక్తం అంటే పుట్టుక గలవన్నీ (బ్రహ్మం నుండి చీమ వరకు) పుట్టుకలేని స్థితికి పోవడం అని అర్థం. నీరు ఆవిరి అయ్యేటప్పుడు కళ్ళకు కనిపించడం లేదు. అట్లాగే బ్రహ్మసృష్టి చేసేటప్పుడు కూడా ఇంద్రియాలు తెలుసుకోలేకపోతున్నాయి. ఇది అవిద్యతో కూడుకున్నది. ఇది కాకుండా ఇంకో అవ్యక్తమున్నది. అది పరమమై సనాతనమై ఉన్నది. సృష్టించబడిన వస్తువులన్నీ నశించాల్సినవే. కానీ ఈ సనాతన అవ్యక్తమునకు ఇటువంటి రాకపోకలు (జననమరణాలు) ఉండవు. అది ఎన్నటికీ తన్మయంగానే ఉంటుంది.

అవ్యక్తము, అక్షరము అన్న దానినే పరమగతి అని కూడా అంటారు. ప్రాణులు దేనిని పొందిన తర్వాత తిరిగి రారో దాన్నే పరమపదం అంటారు. **21**

పరబ్రహ్మం ఇంద్రియాలకు అతీతమై ఉంటుంది. నాశనం లేనిది. కనిపించని ప్రకృతిని అవ్యక్తం అంటారు. కనుక పరబ్రహ్మం అవ్యక్తమే. ప్రకృతి "క్షరము" అంటే నాశనమయ్యేదని అర్థం. అట్లాగే పరబ్రహ్మము 'అక్షరుడు' అంటే నాశనం లేనివాడు. కనుక పరబ్రహ్మంలో లీనమయ్యే వానికి మళ్ళీ జన్మ ఉండదు. బ్రహ్మమునకు సాటి అయినది మరొకటి లేదు. అదే పరమపదం.

అర్జునా! ప్రాణులన్నీ ఎవరి యందున్నాయో, ఎవరి సంకల్పం చేత ఇవన్నీ వ్యాపించబడ్డాయో అట్టి పరమపురుషుని అనన్య భక్తిచేత మాత్రమే పొందవచ్చును. **22**

'అనన్య భక్తి' అనగా వేరెవ్వరి యందూ మనస్సు పెట్టక అతని యందే భక్తి కలిగి ఉండటం. దీన్నే 'ఆత్మ స్వరూప అనుసంధాన' మని కూడా అంటారు. సముద్రాల్లో పర్వతాలున్నాయిగానీ,

పర్వతాల్లో సముద్రం ప్రవహించడం లేదు. ఆకాశంలో మిగిలిన భూతాలన్నీ (భూమి, నీరు, నిప్పు, గాలి) కలసి ఉన్నాయి గానీ, ఈ భూతాలన్నింట్లోనూ ఆకాశం లేదు. అంటే ఈ భూతములందు ఆకాశం పూర్తిగా వ్యాపించి ఉంటుంది. అట్లాగే చిదాకాశమైన పరమ పురుషుని యందు చరాచరములన్నీ (కదిలేవి, కదలలేనివి) నిక్షిప్తమై ఉన్నాయి. మరియు ఆ చిదాకాశ మొక్కటే అన్ని వస్తువుల్లోనూ వ్యాపించి ఉంటుంది.

"భగవంతుడు అందరిలోనూ ఉన్నాడు. కానీ అందరూ భగవంతుని యందు లేరు."
- శ్రీరామకృష్ణ పరమహంస

భారతకుల శ్రేష్ఠుడా! ఎటువంటి సమయంలో యోగులు శరీరాన్ని వదలి ముక్తి పొందుతున్నారో, మళ్ళీ జన్మలు ఎత్తేవారు మరణించే సమయం ఎటువంటిదో చెప్తాను, విను. **23**

అర్జునా! అగ్ని, ప్రకాశం, పగటిపూట, శుక్లపక్షం, ఉత్తరాయణ కాలం (ఆరు మాసాలు) ఈ త్రోవన పయనించి బ్రహ్మజ్ఞానులు బ్రహ్మమునే పొందుతున్నారు. **24**

పొగ, రాత్రిపూట, కృష్ణ పక్షం, దక్షిణాయనం (ఆరు మాసాలు) ఈ త్రోవన పయనించి యోగి చంద్రజ్యోతిని పొంది, మళ్ళీ మళ్ళీ జన్మిస్తున్నారు. **25**

ప్రకృతిలో రాత్రింబవళ్ళు మార్చి మార్చి వస్తూనే ఉంటాయి. వాటిలో ఒకటి (పగటి) జన్మరాహిత్యానికి దారిచూపుతూ ఉంటే మరొకటి (చీకటి) పునర్జన్మకు కారణమవుతోంది. **26**

చనిపోయిన తర్వాత జీవులు రెండుమార్గాల్లో ప్రయాణం చేస్తారు. ఒకటి దేవ యానం, రెండవది పితృయానం మొదటి దానినే జ్యోతి మార్గమని, రెండవ దానిని ధూమ్రమార్గమని కూడా అంటారు. మొదటి మార్గం వెలుగు నింపుకొని ఉంటే రెండో మార్గం చీకట్లు కమ్ముకొని ఉంటుంది. మొదటి మార్గం జీవుణ్ణి ఉన్నత స్థితికి తీసుకుపోతే, రెండవది నీచ స్థితిలో చాలా కాలం పడేసి ఉంచుతుంది. అట్లాగే ఉత్తరాయణం, దక్షిణాయన కాలాలలో మరణించేవారి స్థితిలో కూడా ఇట్లాగే ఉంటుందని తెలుసుకోవాలి. అనేక జన్మలలో ఇంకా అధికంగా క్రమక్రమంగా ఆత్మ ప్రకాశాన్ని పొందేవారు ఉత్తములని, తక్కినవారు అధములని ఇందులోని అంతరార్థం.

ఈ రెండు మార్గాలను తెలుసుకున్న యోగి మోహం చెందటం లేదు. కనుక ఓ అర్జునా! ఎల్లప్పుడూ యోగాన్నే నమ్ముకొని ఉండు. **27**

"ఓడ ఏ దిశన ప్రయాణం చేస్తున్నా అందులో ఉండే దిక్సూచి మాత్రం ఉత్తర దిక్కునే చూపుతూ ఉంటుంది. అట్లాగే మానవుడు ఏ పని చేస్తున్నా అతడి మనస్సు మాత్రం ఎల్లప్పుడూ పరమేశ్వరుని యందే నిలచి ఉండాలి." *- శ్రీరామకృష్ణ పరమహంస*

ఈ రహస్యం తెలుసుకున్న యోగి వేదము, యాగము, తపము, దానము మొదలైన వాటి ఫలాన్ని ఆశించకుండా ఆ ఫల ప్రదాత అయిన పరమాత్మనే పొందుతున్నాడు. **28**

క్రమపద్ధతిలో వేదాధ్యయనం చేసి, యాగములు, తపస్సుల నాచరించి, దానాలు చేస్తూ వాటివల్ల వచ్చే ఫలాన్ని (స్వర్గం వంటివి) ఆశించకుండా అంతకన్నా ఉత్కృష్టమైన బ్రహ్మపదాన్ని పొందుతున్నాడు.

9

రాజవిద్యా రాజగుహ్యాయోగం

శ్రీకృష్ణుడు : దేన్ని గూర్చి తెలుసుకుంటే అశుభం నుండి విముక్తి పొందగలవో అనుభవంతో కూడిన అపారమైన జ్ఞానాన్ని, అసూయలేని నీకు బోధిస్తాను. విను. **1**

అశుభం అంటే ప్రపంచ విషయాలచేత జీవితంలో కలిగే దుఃఖాల్నే అశుభం అంటారు. అజ్ఞానమే అన్నింటికీ మూల కారణం. స్వానుభవంతో పొందే జ్ఞానం మాత్రమే దుఃఖాల నుండి విముక్తుణ్ణి చెయ్యగలదు. అసూయ మనిషి మనస్సులో వ్యాధిగా ప్రవేశించి అతడి గొప్పతనాన్నంతా నాశనం చేస్తుంది. ఇహపరాల్లో అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుంది. అర్జునుడి మనస్సులో అసూయకు కొద్దిగా కూడా చోటులేదు. అందువల్ల జ్ఞానవిజ్ఞానాలకు అర్హత కలిగి ఉన్నాడు.

ఈ జ్ఞానం విద్యలన్నింట్లోకీ శ్రేష్ఠమైనది. రహస్యాలన్నింట్లోకీ అతి రహస్యమైనది. ప్రత్యక్షంగా తెలుసుకోదగ్గది. ధర్మసమ్మతమైనది ఆచరించేందుకు చాలా సులువైనది. నాశనం లేనిది. **2**

విద్యలన్నింట్లోకీ బ్రహ్మవిద్య ఉత్తమమైనది కాబట్టి దీన్నే రాజయోగమని అంటారు. రాజమార్గంలో వెళ్ళేందుకు అందరికీ హక్కు ఉన్నట్లే, రాజయోగాన్ని తెలుసుకోవడానికి జీవులన్నింటికీ హక్కు ఉంది. అయితే అసూయ మొదలైన అవలక్షణాలుండి మనస్సు పరిపక్వం కానివారికి మాత్రం అతిరహస్యమైనదిగా ఉంచదగింది. కాబట్టి దాచిపెట్టాల్సింది. నీళ్ళలో శరీరాన్ని శుభ్రం చేసుకున్నట్లే బ్రహ్మజ్ఞానం మానవుని పవిత్రుణ్ణి చేస్తోంది.

శత్రువులను తపింప జేయువాడా! ఈ ధర్మమందు శ్రద్ధ లేనివారు నన్ను పొందలేరు. మళ్ళీ మళ్ళీ సంసారంలో పడి అనేక జన్మలెత్తాల్సి ఉంటుంది. **3**

నీళ్ళలో నుండి నేలపైన పడ్డ చేప గిలగిలా కొట్టుకొంటుంది. ఆ ప్రక్కనే నీళ్ళున్నా తెలుసుకోకపోతే అక్కడే గిలగిలా కొట్టుకొంటూ చస్తుంది. అట్లాగే మానవుడి దుఃఖాలన్నీ తొలగిపోయే జ్ఞానము శ్రద్ధతో ఆచరించాలని. అట్లా ఎవరైతే ప్రయత్నం కూడా చెయ్యరో వారంతా సంసారంలో పడి దుఃఖాలనుభవిస్తారు.

అవ్యక్తమూర్తినైన నేను ఈ జగత్తునంతా వ్యాపించి ఉన్నాను. ప్రాణులన్నీ నాలోనే ఉన్నాయి. కానీ నేను వాటిలో ఉండను. **4**

అలలన్నీ సముద్రంలో అణిగి ఉన్నట్లుగా బ్రహ్మ నుండి గడ్డిపోచ వరకు సమస్తం పరమాత్మ యందే నిక్షిప్తమై ఉన్నాయి. ఆకాశంలాగా వ్యాపించి సర్వవ్యాపి అయి ఉన్నాడు.

నేను అసంగుడనే అయినా (పంచ) భూతాలన్నీ నాలో లేవు. నా యోగ మహిమను చూడు. ఈశ్వర సంబంధమైన మరొక ఆశ్చర్యాన్ని చూడు. నేనాభూతాలన్నింటినీ సృష్టించి రక్షించే వాడినే అయినా వాటిని అంటకుండా కేవలం సాక్షీభూతుడుగానే ఉంటాను. **5**

ఎక్కడపడితే అక్కడ స్వేచ్ఛగా సంచరించే వాయువు ఆకాశంలోనే నిలిచి ఉన్నట్లుగా, ప్రాణులన్నీ నాయందే నిలచి ఉన్నాయని తెలుసుకో. **6**

వాయువు, మరియు ఇతర భూతములు ఆకాశంలో ఉన్నా అవి ఆకాశంలో కలసిపోవడం లేదు. అట్లాగే ఎటువంటి మార్పులూ పొందటంలేదు. అట్లాగే బ్రహ్మము మాయా కార్యాలన్నీ, మాయలన్నీ బ్రహ్మమునందే నిలిచి ఉన్నాయి. అయినా బ్రహ్మంలో ఎటువంటి మార్పూ కలగడం లేదు. ఆకాశ తత్త్వాన్ని తెలుసుకుంటే బ్రహ్మతత్త్వం చక్కగా బోధపడుతుంది.

"గాలి సువాసనను, దుర్వాస నను రెండింటినీ వ్యాపించేట్లు చేస్తుంది. కానీ గాలికి అవేవీ అంటవు. పరమాత్మ కూడా గాలి వంటివాడే." *- శ్రీరామకృష్ణ పరమహంస*

కుంతీ కుమారా! ప్రాణులన్నీ ప్రళయ కాలంలో నాలో లీనమవుతున్నాయి. తిరిగి యుగం ప్రారంభం కాగానే వాటిని నేనే సృష్టిస్తున్నాను. **7**

బ్రహ్మకు రాత్రి అయినప్పుడు ప్రళయం సంభవిస్తుంది. అతడు పగలు ప్రారంభించగానే సృష్టి మొదలవుతోంది. త్రిగుణాత్మకమైన ప్రపంచమంతా ప్రకృతే. నా సంకల్పమే అవిద్యారూపమైన నా మాయ శక్తి. ప్రకృతిని నా స్వాధీనంలో ఉంచుకుంటూ (పంచ) భూతాలన్నింటినీ సృజిస్తున్నాను. ఈ భూతాలన్నీ స్వతంత్రమైనవి కావు. అటువంటి ఈ భూత సముదాయాన్నంతా మళ్ళీ మళ్ళీ సృజిస్తూ ఉండటం నా స్వభావం. **8**

భగవంతుడు ఈ విధంగా భూతాలను సృష్టించడం భోగార్థం కాదు. సృష్టి అంతా మాయామయం; మిథ్యం. పరమాత్మ మాయావియై సంకల్ప మాత్రం చేతనే సృష్టిస్తున్నాడు.

ధనుంజయా! సృష్టి స్థితి లయాలనే కర్మలు నన్ను బంధించవు. కర్మఫలములందు ఆసక్తి లేనివాడిని. నేను చేస్తున్నానన్న అభిమానం కూడా లేనివాడిని. కాబట్టి ఆ కర్మలు నన్ను బంధించవు. **9**

"నేను అన్న భావన తొలగిపోతే దుఃఖాలన్నీ తొలగిపోతాయి. ఈశ్వర కృపచేతనే అన్నీ చెయ్యబడుతున్నాయి. నేను నిమిత్తమాత్రుణ్ణే అన్న భావన మనస్సులో స్థిరంగా నాటుకుంటే మానవునికి ఈ జన్మలోనే ముక్తి లభిస్తుంది." *- శ్రీరామకృష్ణ పరమహంస*

కుంతీపుత్రా! నా మాయా శక్తి అయిన ప్రకృతి స్థావరజంగమాలతో కూడుకున్న ప్రపంచాన్నంతా సృష్టిస్తోంది. ఆ కారణం చేత జగత్తంతా ముందుకు సాగిపోతోంది. **10**

ప్రపంచ పోకడకు భగవంతుడు సాక్షిగా మాత్రమే ఉంటున్నాడు. మాయా శక్తి పరమాత్ముని ప్రక్కనే ఉంటూ ఈ బ్రహ్మాండాలన్నింటినీ నడిపిస్తోంది. పరమాత్ముడు ప్రక్కనే ఉండటం వల్లనే ప్రకృతి ప్రాణికోటిని సృజించగలుగుతోంది.

నేను ఈశ్వరుణ్ణే అయినా, సమస్త భూతాలను నియంత్రిస్తున్నా, నన్ను తెలుసుకోలేని మూఢులు మాత్రం నన్ను మానవమాత్రునిగానే భావిస్తున్నారు. నా యెడల తిరస్కార భావం చూపి అవమానిస్తున్నారు. **11**

"ఏనుగులకు బయటకు కనిపించే దంతాలని, లోన ఉండే దంతాలని రెండు రకాలుగా ఉంటాయి. అట్లాగే శ్రీకృష్ణ పరమాత్మ వంటి అవతార పురుషులు సాధారణమైన బాహ్యరూపం కలిగి సామాన్య మానవునిలా కనిపిస్తూ ఉంటారు. కాని వారూ కర్మలకు కర్మ ఫలాలకూ అతీతులు. పరమశాంతి యందు నిలకడగల పరబ్రహ్మమై ఉన్నారు."

- శ్రీరామకృష్ణ పరమహంస

వ్యర్థమైన ఆశలు కలవారై, వ్యర్థమైన జ్ఞానం కలిగిన వివేకహీనులు రాక్షసులై అసుర స్వభావం పొందుతున్నారు. **12**

అశాశ్వతమైన శరీరాన్ని శాశ్వతమని భావిస్తూ భోగాలను అనుభవించడమే లక్ష్యంగా పెట్టుకొని మోహంలో చిక్కుకుంటున్నారు. అందుకోసం వారు చేసే యుక్తులేవీ ఆత్మ లాభానికి ఉపయోగపడేవి కావు. విలువైన కాలాన్నంతా వృథా చేస్తున్నారు. వీళ్ళంతా రజోగుణంతో కూడిన రాక్షసులు, తమోగుణం కలిగిన అసురులు అవుతున్నారు.

పార్థా! మహాత్ములు ప్రాణులన్నింటికీ నేనే కారణభూతుణ్ణని తెలుసుకొని దైవత్వ భావాన్ని కలిగి ఉంటున్నారు. నేనే నాశనం లేనివాడినని తెలుసుకుంటున్నారు. నేను నిరాసక్తుడనని ఎరిగి నన్నే ధ్యానిస్తున్నారు. నిత్య యోగులై నన్ను ఉపాసిస్తున్నారు. **13-14**

మనస్సు దేనిని కోరుకుంటుందో దానికి వశమవుతుంది. ఏ పని మీద మనస్సుపెట్టి పని చేస్తుందో ఆ కార్యాన్ని సాధించేంత వరకు విశ్రాంతి తీసుకోదు. దేన్ని కోరుకొని ప్రార్థిస్తుందో దాని స్వభావాన్నే పొందుతుంది. ఇన్ని విధాలుగా భక్తులు మనస్సును భగవంతునిపై కేంద్రీకరించడం చేత వారంతా నిత్య యోగులవుతున్నారు. భగవంతుని సేవా భాగ్యాన్ని పొంది సుఖపడుతున్నారు.

జ్ఞాన యజ్ఞం చేత పూజించే మరికొందరు భక్తులు నన్ను ఒక్కడిగాను, అనేక నామరూపాలతోను ఉపాసిస్తున్నారు. **15**

పరమాత్మ ఒక్కడే (ఏకం) అన్న భావన చేసుకునేవారు తమను ఆయనకే అర్పణ చేసుకుంటున్నారు. అట్లా అర్పించుకోవడాన్ని జ్ఞాన యజ్ఞమని అంటున్నారు. తాను వేరు, భగవంతుడు వేరు అని భావన చేసుకుంటున్న వారు ద్వైత భావంతో ఆరాధిస్తున్నారు. అనేకములైన అనేక అంగములన్నీ ఆ భగంతునివేనన్న విశిష్టద్వైత భావనలో ధ్యానం చేస్తున్నారు. ఎవరెన్ని విధాలుగా ఆరాధించినా అవన్నీ ఆ పరమ పురుషునికే చెందుతున్నాయి.

క్రతువనే వైదిక కర్మను నేనే, యజ్ఞాన్నీ నేనే, స్వధావశుచున్నదీ నేనే, ఔషధాన్నీ నేనే, మంత్రాన్నీ నేనే, ఆజ్యాన్నీ నేనే, అగ్నినీ నేనే, ఆహుతినీ నేనే. **16**

ఈ జగత్తు యొక్క తల్లి, తండ్రి తాత అయిన వాడును, కర్మ ఫలాన్నిచ్చే వాడును, తెలుసుకోదగిన వాడును, పవిత్రుడను, ఓంకారము, నాలుగు వేదాలూ నేనే. **17**

ప్రపంచానికంతటికీ కారణభూతుడు ఈశ్వరుడు కాబట్టి తల్లి, తండ్రి, తాత అవుతున్నాడు. ప్రాణులన్నింటికీ కర్మ ఫలాల్ని ఇచ్చేవాడు ధాత. ఎవర్ని తెలుసుకుంటే రహస్యాలన్నీ తెలుస్తాయో అట్టివాడు ఈశ్వరుడు. తమను ఆశ్రయించిన వాటన్నింటినీ పవిత్రం చేయడం భూమి, అగ్ని, గాలి, మొదలగువాటి స్వభావం. అయితే ఈ భూతాలచేత పవిత్రం కాబడినా కూడా మళ్ళీ మలినపడుతూ ఉంటాయి. కానీ భగవంతుని ఆశ్రయించి పవిత్రులైనవారు ఇక మళ్ళీ మలిన పడరు. వేదాలన్నీ శబ్దం ద్వారా ఓంకారంలో అణిగి ఉన్నాయి. ఓం అన్నది మంత్రాలన్నింటికీ మూలం.

"భగవానుడు, భాగవతము, భక్తులు - ఇవన్నీ ఒక్కటే." - శ్రీరామకృష్ణ పరమహంస

లక్ష్యము, భర్త, ప్రభువు, సాక్షి, నివాస స్థలము, ఆశ్రయము, మిత్రుడు, పుట్టిన చోటు, ఉండే నివాసం, అంతమయ్యే చోటు, నిక్షేపము, నశించలేని బీజము, నేనే. **18**

కర్మ ఫలానన్నుసరించి చేరేచోటును 'లక్ష్యం' అంటారు. ఆహారం మొదలైనవి సమకూర్చిపెడుతూ పెంచి పోషించేవాడు 'భర్త'.

'ప్రభువు' అంటే స్వామి, నాయకుడు లేక భగవంతుడు. ప్రాణులు చేసే రకరకాలైన కర్మలన్నింటినీ నిశితంగా గమనిస్తూ ఉండేవాడు 'సాక్షి'. ప్రాణులు నివసించేందుకు ఆశ్రయాన్ని కల్పించిన వాడు. ప్రతి ఫలం ఆశించకుండా సహాయం చేసేవాడు మిత్రుడు. రాబోయే కాలంలో ప్రాణులు అనుభవించేందుకు చేర్చిపెట్టిన నిధి లేక నిక్షేపము. భూమిలో నాటిన విత్తనం మొలకెత్తి వృక్షమయ్యేదాన్ని బీజము అంటారు. కానీ బ్రహ్మము అనే విత్తనం ఎటువంటి మార్పూ ఉండదు. జీవ జగత్తులన్నీ తన నుండి ఉత్పత్తి అయ్యేందుకు దోహద పడుతుంది.

అర్జునా! వేడినిచ్చే వాడిని నేనే. వర్షం కురిపించేవాడిని నేనే. దేవతల అమృతాన్ని నేనే. ప్రాణుల్లో మృత్యువును నేనే, మృత్యురాహిత్యాన్ని నేనే. సత్, అసత్ రెండూ నేనే. **19**

సూర్యుని ద్వారా లోకానికి వేడిని ఇస్తున్నాను. సూర్యరశ్మి చేత సముద్రాలలో నీటిని ఆవిరి రూపంలో తపింపజేసి మేఘాల ద్వారా వర్షాన్నిస్తున్నాను. కర్మఫలానుసారం దేవతలకు అమృతాన్ని, ప్రాణులకు మృత్యువును కల్పిస్తున్నాను. కర్మలు కార్యరూపం దాల్చడం వలన ప్రాణుల్లో ఏర్పడే రూపం సత్ అని అరూపం అసత్ అని చెప్పబడుతోంది. ఇక్కడ అసత్ అంటే శూన్యం అని అర్థం.

మూడు వేదాలు పఠించినవారు యోగం చేత నన్ను పూజించి, సోమపానం చేసి, పాపవిముక్తులై స్వర్గాన్ని పొందుతున్నారు. వారంతా దేవేంద్రుని లోకానికి పోయి భోగాలు అనుభవిస్తున్నారు. 20

వేదాలలో చెప్పిన కామ్య కాండాన్ననుసరించి నూరు యాగాలు చేసినవాడు దేవేంద్ర పదవిని పొందుతున్నాడు.

వారంతా స్వర్గలోకంలో సుఖాలనుభవించి పుణ్యఫలం క్షీణించగానే తిరిగి భూలోకంలో జన్మిస్తున్నారు. ఈ విధంగా మూడు వేదోక్త ధర్మాలననుసరించి స్వర్గభోగాలను అనుభవించిన వారంతా మరణాన్నే పొందుతున్నారు. **21**

సంపదలున్నంత వరకు భూలోకంలో గౌరవమర్యాదలు లభించినట్లు, స్వర్గంలో పుణ్య ఫలం ఉన్నంత వరకు భోగాలు అనుభవిస్తారు. అది క్షీణించగానే తిరిగి భూలోకంలో జన్మిస్తారు.

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ 22

అన్యభావములు లేనివారై, నన్నే చింతిస్తూ, ఎడతెగక నన్నే ధ్యానించే నిత్య యోగుల యోగ క్షేమాలను నేనే వహిస్తాను. **22**

అనన్యము = పరమాత్మ తమకు పరాయివాడు కాదు.

యోగము = కావలసినదాన్ని పొందటం

క్షేమం = పొందిన దానిని కాపాడుకోవడం.

ఏ యోగులు నన్ను అద్వైత దృష్టితో ఉపాసిస్తారో అటువంటి నిత్యజ్ఞాన సంపన్నుల్ని, వారి యొక్క యోగక్షేమాలను నేను వహిస్తాను. గర్భంలో ఉన్న శిశువు తల్లికి పరాయిది కాదు. అట్లాగే అనన్యభక్తుడు కూడా భగవంతునికి పరాయి వాడు కాదు. తల్లి శిశువును సంరక్షించిన దాని కన్నా ఎన్నోరెట్లు ఎక్కువగా నేను నా అనన్య భక్తుని కాపాడుకుంటాను. ఎవరైనా ధనాన్ని కోరుకుంటే ఆ ధనానికి ఎదుగు బొదుగులుండవచ్చునేమోగాని, నా అనుగ్రహం పొందిన భక్తునికి నా కృపాకటాక్షాలు నిరంతర తైలధారలా లభిస్తాయి. జ్ఞాని నాకు ప్రియతముడు. జ్ఞానులంతా నా ఆత్మ సంభూతులు. ఇతర భక్తులు వారి యోగక్షేమాలను కోరుకుంటారు. కానీ జ్ఞానులు తమకోసం ఏదీ కోరుకోరు. కాబట్టి భగవంతుడే తన ఆత్మసంభూతులైన జ్ఞానుల యోగక్షేమాలను కనిపెట్టి ఉంటాడు.

కుంతీ కుమారా! శ్రద్ధతో కూడిన భక్తులు ఇతర దేవతలను ఆరాధించేటప్పుడు విధిలేక నన్నే ఆరాధించాల్సి వస్తోంది. **23**

ఎవరు భక్తి విశ్వాసాలతో ఇతర దేవతలను పూజిస్తూ ఉంటారో వారంతా వారికి తెలియకుండానే నన్ను పూజిస్తున్నారని తెలుసుకో. అంటే వారి అజ్ఞానం చేత నేనే అన్ని భూతాలలోనూ ఉన్నానని తెలుసుకోలేక ఆయా దేవతల్ని ఊహించుకొని పూజిస్తున్నారు. వారు నన్ను తెలుసుకోకుండా పూజించినా ఆ పూజలు నాకే చెందుతున్నాయి; నేను వారిని అనుగ్రహిస్తూనే ఉంటాను.

నేనే యజ్ఞాలన్నింటికీ భోక్తను, ప్రభువును, కానీ ఇతర దేవతల్ని కొలిచేవారు నిజానికి నన్ను తెలుసుకోలేకపోతున్నారు. కాబట్టి వారు తప్పనిసరిగా మరో జన్మ ఎత్తాల్సివస్తోంది. 24

యథార్థానికి యజ్ఞాలన్నింటికీ నేనే దేవతను కనుక భోక్తనవుతున్నాను. నేనే ప్రభువుని కాబట్టి ఫలాన్ని నేనే అవుతున్నాను. కానీ వీరెవరూ బ్రహ్మార్పణ బుద్ధితో యాగాన్ని చెయ్యకపోవడం వలన నాకు దూరమై పోతున్నారు. అంటే పరమార్థం నుండి దూరమవుతున్నారు. అందువల్ల మళ్ళీ జన్మఎత్తాల్సి వస్తోంది.

దేవతలను ఆరాధించేవారు దేవతలనే పొందుతున్నారు. పితృదేవతల్ని ఆరాధించేవారు పితృదేవతల్ని పొందుతున్నారు. భూతములను ఆరాధించేవారు భూతములందే లీనమవుతున్నారు. నన్ను పూజించేవారు నన్నే పొందుతున్నారు. **25**

దేవతలు మానవుల కంటే ఉత్తములు. భూతములు దేవతలకన్నా తక్కువ మానవుల కన్నా ఎక్కువ స్థితిలో ఉంటారు. దేవతలతోగాని, భూతాలతోగాని సమానం కావాలన్న తపనతో చేసేవి ఆరాధనలు. నీళ్ళ టాంకును బాగా ఎత్తగా అమరిస్తే అందులో నుండి వచ్చే నీటిశక్తి అధికంగా ఉంటుంది. అదే తక్కువ ఎత్తులో అమరిస్తే నీరు తక్కువగా వస్తుంది. అట్లాగే దేవతల్ని ఆరాధించే వాడు దేవతల్ని పొందుతున్నారు. భగవంతుని ఆరాధించేవాడు భగవంతుణ్ణే పొందుతున్నాడు.

"ఒకడు వస్త్రాలకు రంగులు అద్ది ఇస్తున్నాడు. అతడి వద్ద ఒక తొట్టి ఉంది. మనమిచ్చే వస్త్రాన్ని ఆ తొట్టిలో ముంచి మనం కోరుకున్న రంగు అద్ది ఇచ్చేవాడు. అయితే అందులో ఏం తంత్రం ఉందో ఎవరికీ తెలియదు. ఒక తెలివైనవాడు అద్దకపువాని వద్దకు వచ్చి "మిత్రమా! నా వస్త్రాన్ని నీకే ఇస్తున్నాను. నాకు ఏ రంగు నచ్చుతుందో నా బదులు నువ్వే ఆలోచించి నాకు అటువంటి రంగు అద్ది ఇవ్వు" అని అడిగాడు. అంటే ఆ బాధ్యతనంతా అతడి నెత్తిమీదపెట్టాడు. మన మనస్సు వస్త్రం లాంటిది. ఈశ్వరుడే పనివాడు, రంగుతొట్టి కూడా అయివున్నాడు. మనం పోయి కావలసిన రంగుని అడగటం కన్నా, మనల్ని అతనికే సమర్పించుకుంటే మంచిది. అప్పుడతడు తననే మనకు సమర్పించుకుంటున్నాడు."

- శ్రీరామకృష్ణ పరమహంస

పత్రం పుష్పం ఫలం తోయం యో మేభక్త్యా ప్రయచ్ఛతి।
తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః ॥ **26**

ఎవరు నాకు పత్రంగాని, పుష్పంగాని ఫలంగాని, లేక నీరైనా సరే భక్తితో సమర్పించుకొంటారో, అట్టి పవిత్రమైన మనస్సుతో సమర్పించే వాటిని నేను ప్రీతితో ఆరగిస్తాను. **26**

కుంతీకుమారా! నువ్వు ఏ పనిచేసినా, దేన్ని భుజించినా, ఏ యజ్ఞాన్ని చేసినా, ఏ వ్రతాన్ని, తపస్సును ఆచరించినా, ఏ దానాన్ని చేసినా దానినంతా నాకు అర్పించేందుకే చెయ్యి. **27**

జీవితంలో ఏ కార్యం చేసినా ఈశ్వరార్పణ బుద్ధితో చెయ్యాలి. దీనివల్ల జీవబోధము నశించి పరబోధము వృద్ధి పొందుతుంది. "అమ్మా! నేను ఒక యంత్రాన్ని; నువ్వు యంత్రాన్ని నడిపేదానవు. నేను ఒక గృహాన్ని; నువ్వు ఆ గృహంలో నివసించే దానవు. నేను ఒక ఒరను; నువ్వు అందులో ఉంచే ఖడ్గానివి. నేను రథాన్ని; నువ్వే రథసారథివి. నువ్వు ఎట్లా మాట్లాడిస్తావో అట్లా మాట్లాడుతాను. నేను చేస్తున్న పనులన్నీ నాలో ఉన్న నువ్వే చేయిస్తున్నావు. 'నేను' అన్నది లేనేలేదు. ఉన్నదంతా 'నువ్వే'.

- శ్రీరామకృష్ణ పరమహంస

ఈ విధంగా పాపపుణ్యాలిచ్చే కర్మ బంధాల నుండి నువ్వు విడుదల కాగలవు. సన్న్యాస యోగమునందు దృఢ చిత్తుడవుకమ్ము. అప్పుడు నన్ను పొందగలుగుతావు. **28**

శుభాశుభ ఫలాలంటే పుణ్యపాప ఫలాలు. సమస్తమూ పరమేశ్వరునికి అర్పించడాన్నే సన్న్యాసమంటారు. అట్టి సన్న్యాసయోగంతో కూడినవాడు ప్రారబ్ధకర్మ తీరిపోగానే (అంటే మరణానంతరం) ముక్తిని పొందుతాడు.

నేను ప్రాణులన్నింట్లోనూ సమానంగా ఉన్నాను. నాకు శత్రువుకాని మిత్రుడకానీ ఉండరు. నన్ను భక్తితో పూజించేవారు నాయందుంటారు. నేను కూడా వారియందుంటాను. **29**

సూర్యరశ్మి మంచి చెడు అన్న భేదం లేకుండా అన్నివస్తువులపైనా సమానంగానే ప్రసరిస్తుంది. అయితే అద్దంపైన పడినంత ప్రకాశం ఇతర వస్తువుల పైన తెలియదు. కొంతవరకు ఈశ్వర సాన్నిధ్యం కూడా ఇటువంటిదే. అట్లాగే ఇంద్రియ నిగ్రహం కలిగిన భక్తునిలో భగవానుడు కొలువై ఉంటాడు.

మిక్కిలి దురాచారవంతుడే అయినా, అనన్యమైన భక్తిగలవాడైతే తన పాపాలకు తగిన ప్రాయశ్చిత్తం చేసుకొని నన్ను భజిస్తే అతడు పూర్వం ఎన్ని దురాచారాలు చేసినా అతణ్ణి భక్తుడనే చెప్పుకోవాలి. ఎందుకంటే అతడిలో స్థిరమైన మనోనిశ్చయముంది. **30**

పూర్వం ఎన్ని దురాచారాలు చేసినా వారు బాగుపడేందుకు ఒక మార్గం ఉంది. అల్పత్వానికి, ఔన్నత్యానికి మనస్సు కారణం. ఆ మనస్సు భగవంతుని యెడల భక్తి భావాన్ని పెంపొందించుకుంటే కొంతకాలానికి పాపాలను గూర్చి, విషయముల యెడల ఆసక్తి నశించిపోతుంది. భగవంతుని గూర్చిన ఆలోచనలే స్థిరంగా నిలుస్తాయి. దీపాలు వెలిగే ఇంట్లోకి దొంగ ఎట్లా ప్రవేశించడో అట్లాగే భగవద్ధ్యానం చేసే మనస్సులోకి పాపపు ఆలోచనలు రావు. విడవకుండా భగవంతుణ్ణే భజిస్తూ ఉంటే దుర్మార్గుడు కూడా సాధువుగా మారుతున్నాడు.

అట్టి భక్తుడు ధర్మాత్ముడవుతున్నాడు. నా భక్తుడు ఎన్నటికీ నశించడు. ఈ విషయాన్ని అందరికీ చాటి చెప్పు. **31**

పార్థా! ఎటువంటి నీచకులంలో పుట్టిన వారైనా, స్త్రీలైనా, వైశ్యులైనా, శూద్రులైనా నన్ను ఆశ్రయించి నిశ్చయంగా పరమగతిని పొందుతున్నారు. **32**

పూర్వజన్మల కర్మ ఫలంచేత అధమమైన జన్మలెత్తినా భక్తికి అడ్డురావు. నదుల్లో నీరు సముద్రంలో కలుస్తోంది. మురికి కాలవల్లో నీరు సముద్రంలో కలుస్తోంది. సముద్రాన్ని చేరాక అవన్నీ ఒకే పదవిని పొందుతున్నాయి. అట్లాగే భగవంతుని ధ్యానించే భక్తులంతా భగవంతునియందే లీనమైపోతున్నారు. అంటే భగవంతుని పొందకూడని వారంటూ ఎవరూ ఉండరు.

"సుడిగాలి వీచేటప్పుడు మర్రిచెట్టుకు, మామిడి చెట్టుకు వ్యత్యాసం తెలుసుకోలేం. అట్లాగే భక్తి అనే సుడి గాలి వీచినప్పుడు పూర్వం అతడు ఉత్తమ జాతికి చెందినవాడా? లేక అధమజాతికి చెందినవాడా? అని తెలుసుకోలేం." - *శ్రీరామకృష్ణ పరమహంస*

పుణ్యాత్ముల గూర్చిగాని, బ్రాహ్మణుల గూర్చిగాని, రాజర్షుల గూర్చిగాని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ ప్రపంచం అశాశ్వతమైనది. సుఖశాంతులు లేనిది. అట్టి ఈ ప్రపంచాన్ని వదలి నువ్వు నన్నే భజించు. **33**

అజ్ఞానులు అశాశ్వతమైన ఈ ప్రపంచాన్ని శాశ్వతమని భ్రమపడుతున్నారు. ప్రకృతిలో పుట్టిన వస్తువులన్నీ నశించేవే. పెరుగుతున్న యువకుడు మరణం వైపుగా పరుగులు తీయడం మనం చూస్తూనే ఉన్నాం. నిన్న లేత ఆకుగా ఉన్నది నేడు ముదిరి రేపు పండి రాలిపోవడం లేదా? అణువు నుండి అండం వరకూ అన్నిటి స్థితీ ఇంతే. వాటిలో కలిగే మార్పులే సంతోషాన్ని దుఃఖంగా మారుస్తోంది. కనుక అనిత్యమైన ఈ లోకంలో మానవజన్మ లభించినందు వలన కలిగే లాభం ఒక్కటే. అది ఏమంటే, వీటన్నింటినీ నిర్లక్ష్యం చేసి సర్వేశ్వరుని సేవించడం మాత్రమే! అదే మానవుడు చేయగలిగిన పని.

"బిడ్డ ఆటవస్తువులతో ఆడుకుంటున్నంతసేపు తల్లి ఇంటిపని వంటపని చూసుకుంటూ ఉంటుంది. కానీ ఆటవస్తువులు బిడ్డ ఆకలిని తీర్చవుగదా! ఆకలెయ్యగానే కెవ్వున ఏడుస్తుంది. ఆ ఏడుపు విన్న తల్లి ఎక్కడపని అక్కడే వదిలేసి బిడ్డ వద్దకు పరుగెత్తి పాలిచ్చి ఆకలి తీరుస్తుంది. అట్లాగే భగవంతుడు కూడా తన భక్తుని ఆకలి తీర్చే ప్రయత్నం చేస్తాడు."
- శ్రీరామకృష్ణ పరమహంస

మనస్సు నాయందుంచి నాపై భక్తి కలిగి నాకు యాగముచేసి నన్నే పూజించు. నన్నే దృఢచిత్తంతో లక్ష్యంగా పెట్టుకుంటే తప్పక నన్ను పొందగలవు. **34**

భగవంతుని పొందటమే లక్ష్యంగా చేసుకొని భక్తితో పూజించాలి. అట్లా చేయడం వలన హృదయంలో యోగం దృఢమవుతుంది. త్రుప్పు వదిలిన ఇనుమును అయస్కాంతం ఆకర్షించేట్లు మనస్సు భక్తితో పరిపక్వం చెందితే చిత్తము భగవానునితో ఐక్యమవుతుంది.

10

విభూతి యోగం

7,8,9 అధ్యాయాల్లో చెప్పిన సగుణ నిర్గుణ తత్త్వాన్ని భగవానుడు మళ్ళీ చెప్తున్నాడు. కరిగించి వస్తువుగా చేసిన బంగారాన్ని ద్రావకంలో శుద్ధిచేస్తే వన్నె పెరుగుతుంది. అట్లాగే భగవద్విభూతుల్ని సమీక్షించిన కొద్దీ ఉపాసన హెచ్చవుతూ పోతుంది. భక్తి వృద్ధి చెందుతుంది.

శ్రీకృష్ణుడు : ఓ బాహుబలశాలీ! నేను చెప్పిన విషయాన్నంతా శ్రద్ధగా వింటున్నావుగదా! నేను చెప్పేది నీకు సంతోషాన్ని కలిగిస్తోంది కాబట్టి నీ హితాన్ని కోరి చెప్తున్నాను. విను. బ్రహ్మ ఇంద్రుడు మొదలైన దేవతలకు గాని, మహర్షులకు గాని నా పుట్టుక తెలియదు. ఎందువల్లనంటే వారందరి పుట్టుకకు నేనే కారణం కాబట్టి. **1-2**

> *"బ్రహ్మమనే సముద్రం నుండి వీచే గాలి అది స్పృశించే ప్రతి హృదయాన్ని వికసించేట్లు చేస్తుంది. నారదుడు దూరం నుండి ఆ సముద్రాన్ని చూసినంత మాత్రానే ఉన్మత్తుడై శ్రీహరిని స్తుతిస్తూ దేశాలన్నీ తిరుగుతున్నాడు. జగద్గురువైన మహాదేవుడు ఆ సముద్రజలాలను మూడు దోసిళ్ళు త్రాగటం చేత దివ్యానందంతో మైమరచి శవమై పడి ఉన్నాడు. ఈ మహాసముద్రము యొక్క లోతునుగాని అపూర్వ శక్తినిగాని ఎవరూ కనిపెట్టలేరు. - శ్రీరామకృష్ణ పరమహంస*

ఎవడు నన్ను అనాది రూపుడుగాను, పుట్టుకేలేనివానిగాను లోకాలన్నింటికీ అధిపతినని తెలుసుకుంటున్నాడో అతడు మనుష్యులలో అజ్ఞానం లేనివాడై సమస్త పాపాల నుండి విముక్తుడవుతున్నాడు. **3**

ప్రకృతిలో వస్తువులన్నీ ఒక దానిలో నుండి మరొకటి ఉత్పత్తి అవుతున్నాయి. చెట్టు నుండి విత్తనం పుడుతుంది. మళ్ళీ విత్తనం నుండి చెట్టు పుడుతుంది. ఇట్లా ప్రపంచమంతా కార్యకారణమయంగా కనిపిస్తుంది. దేవ ఋషి గణాలన్నీ పరమాత్మ నుండి ఉత్పత్తి అయితే, మరి ఆ పరమాత్మ ఎవరి నుండి ఉత్పత్తి అయ్యాడు? ఎవరికీ తెలియదు. అందువల్లనే 'అనాది' అంటున్నాడు. అశాశ్వతులైన మానవులకు శాశ్వతమైన వస్తువును గూర్చి తెలియదు. భక్తి సాధన చేత భగవంతుని

మహిమలు కొంత తెలుసుకోగలుగుతారు. అది ఎట్లాగంటే, అఖండమైన ఆకారాన్ని ఓ చిన్న రంధ్రం ద్వారా చూసి తెలుసుకున్నట్లు. ఇదంతా అతడి 'అప్రాకృత విభూతి' అంటే ప్రకృతికి అతీతమైనదని అర్థం.

బుద్ధి, జ్ఞానం, నిర్మోహత్వం, ఓర్పు, సత్యం, అణకువ, శాంతం సంతోషం, దుఃఖం, జననం, భయం, ధైర్యం, అహింస, సమత్వం, తృప్తి, మనస్సు, దానం, కీర్తి, అపకీర్తి మొదలైన గుణాలన్నీ జీవులకు నా వల్లనే వస్తున్నాయి. **4-5**

విద్యుచ్ఛక్తి వలన పంకా, యంత్రాలు, దీపము మొదలైన పరికరాల్ని మన అవసరాలకు తగినట్లుగా వాడుకోవచ్చు. అట్లాగే జీవులందరూ ఈ విభూతులన్నీ ఈశ్వరుని వద్ద నుండి వారివారి కర్మానుసారం గ్రహిస్తున్నారు.

సప్త మహర్షులు, పూర్వపు మనువులు నలుగురు, నా సంకల్పం చేతనే జన్మించారు. ఈనాటి ప్రజలందరూ వారి సంతతియే. **6**

సప్తర్షులు : భృగువు, మరీచి, అత్రి, పులస్త్యుడు, పులహుడు, అంగిరసుడు, క్రతువు.

మనువులు, పదునాలుగురు. వారిలో నాలుగురు ముఖ్యులు. స్వారోచిషు, స్వాయంభువు, రైవతుడు, ఉత్తముడు.

నాయొక్క నా ఈ సృష్టి రహస్యాలను, యథార్థంగా తెలుసుకొన్నవాడు నిశ్చయంగా యోగంతో కూడుకొని ఉంటాడనడంలో ఎటువంటి సందేహమూ లేదు. **7**

భగవంతుడే ఇన్ని విధాలుగా ప్రకటితమవుతున్నాడు. కాబట్టి అవన్నీ సృష్టి రహస్యాలనే చెప్పాలి. ఇన్ని రీతులుగా వ్యక్తమైవున్న తర్వాత వాటితో పరమాత్మ ఎటువంటి సంబంధాలు కలిగి ఉన్నారో పరిశీలించి చూస్తే ఆయన యోగమును గూర్చిన యథార్థాలు తెలుస్తాయి. నిప్పు కాలుతుందని తెలిసిన వాడెవ్వడూ చెయ్యి పెట్టడు, వంటకు వాడుకొనే ప్రయత్నం చేస్తాడు. అట్లాగే భగవంతుని విభూతులను తెలుసుకున్న జ్ఞానులు ఆయన యందు నిశ్చలమైన భక్తిని పెంపొందించుకుంటారు.

"నూనె లేకపోతే దీపం వెలుగదు. అట్లాగే ఈశ్వరుడు లేకపోతే మానవుడు జీవించలేడు." – శ్రీరామకృష్ణ పరమహంస

సమస్తానికి ఉత్పత్తి స్థానాన్ని నేనే. నా వల్లనే అవన్నీ చైతన్యంతో ఉన్నాయి. ఈ సత్యాన్నెరిగిన జ్ఞానులు నన్నే పరిపూర్ణ భక్తితో కొలుస్తున్నారు. **8**

పంటలకు మూలకారణం భూమి అని తెలుసుకున్న వ్యవసాయదారుడు నేలను చక్కగా చదును చేసి పంటల్ని పండించుతున్నాడు. అట్లాగే సృష్టికంతటికీ మూల కారణం భగవంతుడేనని తెలుసుకున్న జ్ఞానులు భగవంతుని ప్రేమతో ఆరాధిస్తున్నారు. వృక్షాలు భూమిని పట్టుకొని ఉన్నట్లుగా భక్తులు భగవంతుని గట్టిగా పట్టుకొని ఉండడం వలన నిశ్చలంగా ధ్యానాదులు చెయ్యగలుగుతున్నారు.

మనస్సు నాయందే నిశ్చలంగా నిలిపి, ప్రాణాన్ని నా సొంతంచేసి, నన్నే స్తుతిస్తూ, నన్ను గూర్చిన విచారణనే చేస్తూ తృప్తితోను సంతోషంతోను వారు జీవిస్తున్నారు. **9**

పిల్లలు తమకు కావలసినవన్నీ తల్లిదండ్రుల నుండి పొందుతూ పెరిగి పెద్దవారవుతారు. పిల్లలు పెద్దవారైన తర్వాత తనకు అన్నీ సమకూర్చి పెద్దచేసిన తల్లితండ్రుల కోసం ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధపడతారు. అట్లాగే భక్తులు కూడా తమకు అన్నీ సమకూర్చిన భగవంతునిపై అవ్యాజ ప్రేమ చూపుతారు. అవసరమైతే ప్రాణాలైనా అర్పిస్తారు. ఆ విధంగా భక్తులు భగవంతుని గుణగణాలను కీర్తిస్తూ ఆనందిస్తారు. ఈ ఆనందాన్ని శరీరం పొందే ఆనందంతో పోల్చరాదు. ఎందువల్లనంటే శారీరక ఆనందం చివరలో దుఃఖాన్నే మిగులుస్తుంది.

నిరంతరం యోగాన్ని ఆచరిస్తూ, నా యందు ప్రేమగలవారికి బుద్ధి యోగాన్ని అనుగ్రహిస్తున్నాను. దీనితో వారు నన్ను దర్శించగలుగుతున్నారు.

బుద్ధియోగమంటే – పంచదార తియ్యగా ఉంటుందని తెలుసుకొని, ఆ పంచదారను ఉపయోగించి ఎన్నెన్ని తీపి పదార్థాలు చెయ్యవచ్చునో తెలుసుకోవడాన్నే బుద్ధియోగమంటారు. బుద్ధియోగాన్ని ఉపయోగించుకొని దృఢమైన భక్తితో యోగాన్నాచరిస్తే భగవంతుని గూర్చి కొద్దికొద్దిగా తెలుసుకోవడం ప్రారంభమవుతుంది. అందువల్ల ఉత్సాహం పెరుగుతూ యోగం ఉద్ధృతమవుతుంది. అట్లాగే భగవంతుడు ప్రసాదించిన బుద్ధియోగం సహాయంతో ఆయన స్వరూపాన్ని తెలుసుకున్న భక్తుడు ఇంకా అధికంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు. బుద్ధి యోగం మూలంగా భక్తివృద్ధి అవుతుంది.

"ఒకచిన్న రంధ్రం గుండా సూర్యరశ్మి గదిలో పడుతుంది. ఆ కిరణం ప్రసరించినంత వరకే ఆ వెలుతురు ఉంటుంది. అదే గదిలోని కిటికీ తలుపులు తెరిస్తే వెలుతురు ఇంకా ఎక్కువగా వస్తుంది. అప్పుడా గదిలో వెలుతురు ప్రకాశవంతంగా ఉంటుంది. కానీ ఆరుబయటకు వచ్చి నిలబడిన వాడు పూర్తిగా వెలుగులో ఉంటాడు. అట్లాగే భక్తుల స్వభావానికి, శక్తికి తగ్గినట్లుగా ఈశ్వరుడు తనను చూసే అనుగ్రహాన్ని కలిగిస్తూ ఉంటాడు." *- శ్రీరామకృష్ణ పరమహంస*

అటువంటి భక్తులను నేను దయతలచి వారి అంతఃకరణంలో కొలువై ఉంటాను. అతడికి ఆత్మజ్ఞాన ప్రకాశాన్ని కలిగించి అంధకారాన్ని నశింపజేస్తాను. **10-11**

"పోలీసు తన వద్ద ఉన్న టార్చ్ లైటును ఎవరిపై వెలుగుపడేట్లు త్రిప్పుతాడో వారిని మాత్రమే చూడగలుగుతాడు. కానీ ఆ దీపాన్ని తనవైపు త్రిప్పుకునేంత వరకు అతణ్ణి ఎవరూ చూడలేరు. అట్లాగే ఈశ్వరుడు తనను చూపించేంతవరకు ఎవరూ ఆయనను చూడలేరు." – శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునుడు *:* కృష్ణా! నువ్వే పరబ్రహ్మవని, పరమపవిత్రుడవని దేవర్షి అయిన నారదుడు, నువ్వు నిత్యుడవని, దివ్య పురుషుడవని, సర్వవ్యాపివని అసితుడు, దేవలుడు, వ్యాసమహర్షి అంటున్నారు. నువ్వూ ఆమాటే చెప్తున్నావు. **12-13**

కేశవా! నువ్వు చెప్పిందంతా యథార్థమని నమ్ముతున్నాను. భగవాన్ నీ నిజ స్వరూపాన్ని దేవతలుగాని, అసురులుగాని ఎరుగరుగదా. **14**

భగవాన్ అంటే ఎవరియందైతే బలము, ధర్మము, ఐశ్వర్యము, వీర్యము, వైరాగ్యము, తేజము నిక్షిప్తమై ఉంటాయో అతణ్ణే భగవాన్ అంటారు.

"సూర్యగోళం భూమికన్నా చాలా పెద్దదే అయినా, చాలా దూరంలో ఉండటం వలన చిన్నదిగా తెలుస్తోంది. అట్లాగే ఈశ్వరుడు అంతులేని మహిమ కలిగి ఉన్నా మనకు ఆయనకు మధ్యనున్న దూరం వలన మనం ఆయన నిజమైన మహాత్మ్యాన్ని తెలుసుకోలేకపోతున్నాం." - *శ్రీరామకృష్ణ పరమహంస*

పురుషోత్తమా! సమస్త ప్రాణుల్నీ సృష్టించేవాడా! సకల జీవులకు దైవమా! దేవదేవా! జగన్నాథా! నిన్ను నువ్వు మాత్రమే యథార్థంగా తెలుసుకోగలవు. **15**

"ఒకడు ఓ వజ్రాన్ని అమ్మేందుకు బజారుకు వెళ్ళాడు. మొదటగా ఒక కూరగాయల వ్యాపారి నడిగాడు. అతడారాయికి ఓ గంపెడు వంకాయలిస్తానన్నాడు. ఆ తర్వాత బియ్యం వ్యాపారి వద్దకు వెళ్ళాడు. అతడో అరబస్తా బియ్యం ఇస్తానన్నాడు. చివరగా వజ్రాల వ్యాపారి వద్దకు వెళ్ళాడు. అతడు దీనికి నేను వెలకట్టలేను, అయితే తన శక్తిని బట్టి లక్షరూపాయలిస్తానన్నాడు. అట్లాగే పరబ్రహ్మమును వారివారి జ్ఞానాన్ని బట్టి విలువ కడుతూ ఉంటారు. కనుక బ్రహ్మమే బ్రహ్మమును గూర్చి పూర్తిగా ఎరుగు." - *శ్రీరామకృష్ణ పరమహంస*

నువ్వు ఏయే విభూతులతో భూలోకాన వ్యాపించి ఉన్నావో, అటువంటి దివ్య విభూతులన్నింటినీ నువ్వే వర్ణించి చెప్పు. **16**

సంగీతంలో ఉండే మాధుర్యాన్ని సంగీత విద్యాంసుడే తెలుసుకోగలడు. రాజుకుండే సంపదలన్నీ రాజుకు మాత్రమే తెలుస్తాయి. అట్లాగే ఈశ్వర విభూతులన్నీ ఈశ్వరుడే చక్కగా వివరించి చెప్పగలడు.

"ఈశ్వరుడు తన కృపచేత అవతారాన్ని దాలుస్తూ ఉంటాడు. అతడు జ్ఞాన సూర్యుడు. అతడి ఒకే ఒక్క కిరణమే లోకాలన్నింటికీ జ్ఞాన ప్రకాశాన్ని ప్రసాదిస్తుంది. అతడు తన ప్రకాశాన్ని తన దివ్యమైన ముఖంవైపు త్రిప్పుకుంటాడు. అప్పుడే మనమూ ఆయన్ను చూడగలం." - *శ్రీరామకృష్ణ పరమహంస*

యోగేశ్వరా! నేను ఎల్లప్పుడు నిన్నే ధ్యానిస్తూ, నిన్ను ఎట్లా తెలుసుకోవడం? భగవాన్! ఏయే రీతులుగా నిన్ను ధ్యానించాలి? **17**

తల్లికి తన బిడ్డ ఆటవస్తువులను చూసినప్పుడు ఆ బిడ్డ జ్ఞాపకాలు వస్తాయి. అట్లాగే నాకుకూడా ఈ ప్రపంచాన్ని, ఇంద్రియాల ద్వారా చూస్తున్నప్పుడు నీ ఆలోచనలే వస్తూ ఉంటాయి. నీ విభూతుల్ని చూసేందుకేదైనా మార్గం చూపు.

"బొమ్మ ఏనుగు, బొమ్మ పండు నిజమైన ఏనుగును, పండును తలపింపజేస్తాయి. అట్లాగే ఆరాధించే విగ్రహాలు నిత్యుడు, నిరాకారుడు అయిన ఈశ్వరుని జ్ఞప్తికి తెస్తూ ఉంటాయి." - శ్రీరామకృష్ణ పరమహంస

జనార్దనా! నీ యోగమహిమ, విభూతి వివరం మరొకసారి తెలియజెయ్యి. ఎందుకంటే నీ నోటి నుండి వచ్చే అమృత వాక్కుల్ని మళ్ళీ మళ్ళీ వినాలని ఉంది. **18**

ఇక్కడ యోగం అంటే అన్నిటినీ గ్రహించేది అని అర్థం చేసుకోవాలి. విభూతులంటే ఏయే వస్తువుల మూలంగా ఆయన్ను ఉపాసించగలమో అవన్నీ విభూతులే. చేప బురద గుంటలో నుండి నూతిలోకి, నూతిలో నుండి తటాకంలోకి మారినప్పుడల్లా తన స్వభావాన్ని ఇంకా దృఢతరం చేసుకుంటుంది. అట్లాగే జీవుడు కూడా ఈశ్వరుని విభూతుల్ని మనస్సులో నిలుపుకొని ఔన్నత్యాన్ని పొందుతున్నాడు.

"ఈశ్వరునికి, మానవునికి గల సంబంధం అయస్కాంతానికి ఇనుముకు గల సంబంధం వంటిది." - శ్రీరామకృష్ణ పరమహంస

శ్రీకృష్ణుడు : కురుకుల శ్రేష్ఠా! మంచిది. నువ్వు కోరినట్లే నా విభూతిలోని మహిమల్ని చెప్తాను, విను : **19**

"గ్రంథాలు చదివినంత మాత్రాన ఈశ్వరుని వర్ణించడానికి చేసే ప్రయత్నం ఎట్లాంటిదంటే, దేశపటంలో కాశీ పట్నాన్ని చూసి ఆ క్షేత్రాన్ని గురించి ఇతరులకు వివరించడం వంటిది." - శ్రీరామకృష్ణ పరమహంస

గుడాకేశా! సమస్త ప్రాణుల్లో ఉండే ఆత్మను నేనే. ప్రాణుల ఆది, అంతం కూడా నేనే. **20**

"నా తల్లి పరాశక్తి ఒక్కతే అయినా అనేక రూపాలలో అవతరిస్తుంది. అత్యంత శక్తిమంతమైన ఆమె జీవునిగాను, జగత్తుగాను, శరీరం, బుద్ధి, సన్మార్గం, ఆత్మార్థం మొదలైన వేరువేరు శక్తులు గలదానిగా కనిపిస్తోంది. ఈ శక్తియే వేదాంతమందు చెప్పబడిన బ్రహ్మమే గాని వేరు కాదు. నేత్రాలకు కనిపించని బ్రహ్మం యొక్క ప్రత్యక్ష స్వరూపమే పరాశక్తి." - శ్రీరామకృష్ణ పరమహంస

ఆదిత్యులలో నేను విష్ణువును. ప్రకాశించే వాటిలో కిరణాలుగల సూర్యుడను. మరుత్తులలో మరీచిని. నక్షత్రాలలో చంద్రుడను. **21**

తయారయ్యే వస్తువులన్నీ భూమికి సంబంధించినవే. వాటిలో ముఖ్యమైన విభూతులను మాత్రమే భగవానుడు ప్రత్యేకంగా చెప్పియున్నాడు.

విష్ణువు : విష్ణు సహస్ర నామంలోని 258వ నామం కదిలే స్వభావం చేత అతడు విష్ణువు అని పిలువబడుతున్నాడు. విష్ణువునే సూర్యభగవానుడని కూడా అంటారు. అందువల్లనే సూర్యుని 'సూర్యనారాయణుడు'అని అంటారు.

మరీచి : 47 మంది మరుత్తులలో మరీచి అనువాడే భగవంతుడు.

చంద్రుడు : పగటి పూట ప్రకాశించే వాటిలో సూర్యుడు ప్రధానుడు. రాత్రిపూట ప్రకాశించే వాటిలో చంద్రుడు ముఖ్యుడు. చంద్రుడు నక్షత్రం కాకపోయినా నక్షత్రంగా చెప్పారు. ఎందువల్లనంటే మనం పొందే ఉపయోగాల్ని బట్టి అలా శ్రేష్ఠంగా చెప్పబడింది. కనుక సూర్యచంద్రులు భగవత్స్వరూపులుగా చెప్పబడుతున్నారు.

వేదములలో సామవేదము, దేవతలలో ఇంద్రుడు, ఇంద్రియాలలో మనస్సు, ప్రాణులందు చైతన్యములన్నీ నేనే. **22**

ఏకాదశ రుద్రుల్లో శంకరునిగాను, యక్షరాక్షసుల్లో కుబేరునిగాను, వసువులలో అగ్నిహోత్రునిగాను, పర్వతాలలో మేరు పర్వతంగాను నేను ఉన్నాను. **23**

పార్థ! పురోహితులందు శ్రేష్ఠుడైన బృహస్పతిని నేనే. సేనాపతులలో కుమార స్వామిని నేనే. సరస్సులలో సముద్రమును నేనే. **24**

మహర్షులందు నేను భృగు మహర్షిని. వాక్కులలో ఏకాక్షరమైన ప్రణవము నేనే. యజ్ఞములందు జపయజ్ఞాన్ని నేనే. స్థావరాల్లో హిమాలయాలు నేనే. **25**

వృక్షములందు నేను రావిచెట్టుగా ఉంటాను. దేవర్షులలో నేను నారదుడను. గంధర్వుల్లో చిత్రరథుడను, సిద్ధులలో కపిలమునిగా ఉన్నాను. **26**

అశ్వములలో ఉచ్చైశ్రవము నేనే. ఏనుగులలో ఐరావతాన్ని నేనేనని తెలుసుకో. **27**

ఆయుధాలలో నేను వజ్రాయుధాన్ని. పశువులలో కామధేనువును. పుట్టించే వారిలో మన్మథుడను. పాములలో నేను వాసుకిని. **28**

నాగులలో అనంతుడను నేనే. జలదేవతలలో వరుణుడను నేనే. పితృదేవతల్లో ఆర్యముడను నేనే. నియమించి పాలించే వాళ్ళల్లో యముడను నేనే. **29**

దైత్యులలో నేను ప్రహ్లాదుడను. గణించువారిలో కాలుడను, జంతువులలో సింహాన్ని, పక్షులలో గరుత్మంతునిగా నేనున్నాను. **30**

పవిత్రతలో గాలిని, ఆయుధములు పట్టిన వారిలో శ్రీరాముణ్ణి, చేపలలో మకరముగాను, నదులలో గంగను అయి ఉన్నాను. **31**

అర్జునా! సృష్టించబడే ప్రతి వస్తువుకు మొదలు చివర నేనే అయి ఉంటాను. విద్యలో ఆత్మ విద్యను, తార్కికులలో తర్కము నేనే అయి ఉన్నాను. **32**

భగవంతుని విభూతి విశేషాలను గూర్చి చెబుతూ శ్రీరామకృష్ణ పరమహంస ఈ విధంగా బోధించారు.

"మూలమైన దానిని ఒక దానిని బాగా తెలుసుకో. ఆ తర్వాత అన్నీ నీకే తెలుస్తాయి. ఒకటి అన్న అంకెకు సున్నాలను చేరిస్తే విలువ పెరుగుతూ పోతుంది. కానీ 'ఒకటి' అన్న అంకెను చెరిపేస్తే మిగిలేవన్నీ సున్నాలే. ఆ ఒక్కటి అన్న అంకె ఈశ్వరుడు. ఆ తర్వాతవన్నీ జీవుడు : ప్రపంచము."

అక్షరములందు నేను 'అ'కారంగాను, సమాసములందు ద్వంద్వ సమాసంగాను ఉన్నాను. అక్షయ కాలం నేనే. జీవులకు కర్మఫలాలనిచ్చేది నేనే. **33**

అన్నింటినీ సంహరించే మృత్యువును నేనే. ధనవంతుల సంపద నేనే. స్త్రీత్వమునందు కీర్తి, సంపద, వాక్కు ,స్మృతి, బుద్ధి, ధైర్యం, ఓర్పు నేనే అయి ఉన్నాను. **34**

"మాయయే బ్రహ్మమును ఉత్పత్తి చేస్తోంది. మాయ లేకపోతే బ్రహ్మమును తెలుసుకోవడం ఎవరితరం? ఈశ్వరుని శక్తిని తెలుసుకోకపోతే అతనిని గ్రహించలేము." సామాలలో బృహత్సామం – నా స్వరూపమే. ఛందస్సులందు గాయత్రిని నేనే. మాసాలలో మార్గశిర మాసాన్ని, ఋతువులలో వసంత ఋతువును నేనే. **35**

వంచకుల జూదాన్ని నేనే. తేజస్సులలో తేజాన్ని నేనే. జయము, ప్రయత్నము సత్త్వగుణం, నేనే అయి ఉన్నాను. **36**

వృష్ణివంశస్థులలో వాసుదేవుణ్ణి నేనే, పాండవులలో ధనుంజయుడను నేనే, మునులలో వ్యాసుడను నేనే. కవులలో శుక్రుడను నేనే అయి ఉన్నాను. **37**

దండించే వారి దండాన్ని, జయము నాశించే వారి యందు నీతిని, రహస్యమందు మౌనాన్ని, జ్ఞానులందు జ్ఞానాన్ని నేనే అయి ఉన్నాను. **38**

అర్జునా! సమస్త ప్రాణికోట్లకు ఏది బీజమో అది నేనే, స్థావర జంగమాల యందు జీవించేది నేను తప్ప మరేదీ లేదు. **39**

ఈశ్వరుని పూర్తిగా తెలుసుకోవడం ఎవరితరం? ఆ భాగ్యం మనకులేదు. మనం అతనిని సంపూర్ణంగా తెలుసుకోవాల్సిన పనిలేదు. అతనిని దర్శించి, అతడొక్కడే సత్యమని తెలుసుకుంటే చాలు.

శత్రువులను తపించువాడా! నా దివ్య విభూతులకు అంతం లేదు. నా విభూతుల వివరణను కొంత వరకే చెప్పాను. **40**

పవిత్ర గంగానదిలో స్నానం చెయ్యాలంటే గంగోత్రి నుండి గంగా సాగరం వరకు ప్రయాణం చేస్తామా? ఏదో ఒకచోట నదిలో దిగి స్నానం చేస్తే చాలు. అట్లాగే భగవంతుని ఒక విభూతి తెలుసుకున్నాచాలు." మహిమ, అందము, శక్తిగలది ఏది ఉంటుందో అదంతా నా యొక్క తేజస్సులోని అంశమేనని తెలుసుకో. **41**

భగవంతుని సాకారమంటే రూపంతో కూడిన స్థితి ఎట్లా ఉంటుందో నీకు తెలుసా? నీటిపై కనిపించే బుడగల వంటిదే అది. చిదాకాశంలో అనేక రకాలైన రూపాలు కనిపిస్తూ ఉంటాయి. భగవంతుని అవతారం ఆ రూపాల్లో ఒకటి.

అర్జునా! విస్తారంగా తెలుసుకోవడం వలన నాకు కలిగే ప్రయోజనం ఏముంది? ఒకే ఒక్క అంశం చేత ప్రపంచాన్నంతా ఆక్రమించి ఉన్నాను. **42**

భగవంతునికి రూపం ఉండదు. కానీ రూపంతో ఉన్నాడు. అందువల్ల అతడు రూపరూపాలకు అతీతుడని తెలుసుకోవాలి. నిజానికి అతడి రూపమేదో అతడికి మాత్రమే తెలుసు.

11

విశ్వరూప దర్శన యోగం

వెనుకటి అధ్యాయంలో భగవంతుని విభూతులను గూర్చి తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో పరమేశ్వరుడొక్కడేనని, అదే పరమేశ్వరుని ఆత్మస్వరూపమనీ చెప్పబడుతోంది. అట్టి ఆత్మ సాక్షాత్కారానికి ఏం చెయ్యాలో అర్జునుడు అడిగి తెలుసుకుంటున్నాడు.

అర్జునుడు : నన్ను అనుగ్రహించడానికి, నన్ను ధన్యుణ్ణి చెయ్యడానికి నా మీద అనుగ్రహంతో చెప్పిన అధ్యాత్మమైనది, పరమరహస్యమైనది అయిన ఆత్మానాత్మ వివేకానికి సంబంధించిన విషయాలెన్నో చెప్పావు. అట్టి నీ పలుకుల చేత అజ్ఞానం పూర్తిగా తొలగిపోయింది. **1**

ఓ కమలపత్రాక్షా! ప్రాణుల జనన మరణాల గూర్చి నువ్వు చెప్పిందంతా విన్నాను. దాని వల్ల నీ అనంతమైన మహిమలు కూడా తెలిశాయి. **2**

పరమేశ్వరా! నిన్ను గూర్చి నువ్వు చెప్పినదంతా యథార్థమే. ఇకపైన నీ ఈశ్వరరూపాన్ని దర్శించాలని కుతూహలంగా ఉంది. **3**

ప్రభూ! అట్టి దివ్యరూపాన్ని దర్శించే యోగ్యత నాకున్నదని భావిస్తే యోగేశ్వరా! నాశనంలేని నీ విశ్వరూపాన్ని చూపించు. **4**

శ్రీకృష్ణుడు : పార్థా! దివ్యమైనది, అనంతమైనది, అనేక విధాలుగా ఉండేదీ, అనేక వర్ణాలు, ఆకారాలు కలిగి ఉండేదీ అయిన నా దివ్యరూపములను చూడు. **5**

"ప్రతి వస్తువూ నారాయణుడే. మానవుడు నారాయణుడు. ఋషీ నారాయణుడే. పోకిరీ వాడూ నారాయణుడే. ప్రపంచంలో ఉండే సమస్తమూ నారాయణుడే. నారాయణుడు అనేక రూపాలతో విహరిస్తూ వినోదిస్తాడు. అనేక వస్తువులు వివిధ రూపాలు అతని ప్రభావం యొక్క ఆకారాలుగా ఉన్నాయి."

- శ్రీరామకృష్ణ పరమహంస

పార్థా! ఆదిత్యులను, రుద్రులను, వసువులను, అశ్వినీ దేవతలను, మరుత్తులను చూడు. అంతే కాదు, నువ్వు ముందెన్నడూ చూడని ఆశ్చర్యకరమైన విషయాలన్నింటినీ చూడగలుగుతావు. **6**

నిద్రను జయించిన వాడా! అర్జునా! ఇంతేకాదు, స్థావరజంగమాలతో కూడుకున్న జగత్తునంతటినీ ఈ నా ఒక్క దేహంలో చూడు. అంతేకాక, ఈ నా శరీరంలోనూ, ఏయో వస్తు విశేషాల్ని చూడాలనుకుంటున్నావో వాటన్నింటినీ చూడు. **7**

కౌరవులు జయిస్తారా! పాండవులమైన మేము జయిస్తామా? అనే నీ సందేహానికి సమాధానాన్ని కూడా చూడమని సూచించాడు. నిద్రారూపమైన స్వరూపాన్ని చూచి, జాగ్రదవస్థలో కలిగేటువంటి ఈ విశ్వరూపాన్ని చూడు, అనే అభిప్రాయంతోనే గుడాకేశా అని సంబోధించాడు.

అర్జునా! విశ్వరూపాన్ని ధరించిన నన్ను నీవు ఈ పాకృతమైన కన్నులతో చూడలేవు. కాబట్టి నా యీ విశ్వరూపాన్ని చూడటానికి సమర్థమైన దివ్యచక్షువుల్ని, అలౌకిక దృష్టిని నీకు ప్రసాదిస్తున్నాను. ఆ దివ్య చక్షువులతో నా దివ్యరూపాన్ని చూడు. **8**

సంజయుడు : ధృతరాష్ట్ర మహారాజా! మహా యోగేశ్వరుడైన శ్రీహరి ఇట్లా అంటూ దివ్యమైన తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. **9**

రాజా! ఆ రూపం అనేక ముఖాలను, నేత్రాలను, అనేక అద్భుత దృశ్యాలను కలిగి ఉంది. అనేక దివ్యాభరణాల్ని ధరించి ఉంది. దివ్యాయుధాలు అనేకం కలిగివుంది. **10**

దివ్యమైన పుష్ప మాలలతోను, దివ్యమైన గంధాలేపనాలతోను, అందరికీ అన్ని విధాలా ఆశ్చర్యం కలిగించేట్లు గాను, అనంతమైన స్వరూపాలతో కూడుకున్న విశ్వరూపాన్ని అర్జునునకు చూపించాడు. **11**

ఆ సమయంలో ఆ దివ్యపురుషుని కాంతి ఆకాశంలో కోటి మంది సూర్యులు ఒక్కసారిగా ప్రకాశిస్తున్నట్లుంది. **12**

అప్పుడు అర్జునుడు తనకు చూపించిన విశ్వరూపంలో, శ్రీకృష్ణుని శరీరం అనేక విధాలుగా విభజించబడి ఉన్నప్పటికీ, ఒకే ఆధారాన్ని కలిగి ఉన్నట్లుగా ఉంది. అంటే దేవ, మనుష్య, పితృ, తిర్యగాది భేదాలతో కూడి ఉన్నా కూడా ఇవన్నీ ఒకే దేహంలో ఇమిడి ఉండటం చేత ఐక్యమత్యాన్ని తెలుపుతున్నది. **13**

అప్పుడు ధనంజయుడు ఆశ్చర్యంతోను, సంతోషంతోను పులకించిపోయాడు. దేవదేవుడికి చేతులు జోడించి నమస్కారం చేస్తూ ఇలా అన్నాడు. **14**

అర్జునుడు : దేవదేవా! నీ దేహంలో సమస్త దేవతల్ని, సమస్త భూతాలను, పద్మాసనం వేసుకొని కూర్చున్న బ్రహ్మను, ఋషులను, దేవ సర్పములను చూస్తున్నాను. **15**

ఓ విశ్వేశ్వరా! విశ్వరూపా! అనేక బాహువులు, అనేకమైన ఉదరాల్ని, అనేకమైన ముఖాల్ని, నేత్రాలతో అనంతమైన రూపాల్ని నీలో చూస్తున్నాను. ఓ జగత్ప్రభూ! నీ ఆది మధ్య అంతాలను నేను గుర్తించలేకపోతున్నాను. **16**

కిరీటాన్ని ధరించి, గదాయుధుడైన, చక్రధారివై, కాంతిపుంజముగాను, ప్రజ్వరిల్లే సూర్యాగ్నుల్లాగాను, మితిలేని నీ దివ్యరూపాల్ని అంతటా ప్రదర్శిస్తున్నావు. **17**

ఓ పరమాత్మా! నువ్వు ముముక్షువులచేత తెలుసుకోదగినట్టి వాడవు. నాశరహితమైన పరబ్రహ్మ స్వరూపానివి. ఈ జగత్తు కంతటికీ ఆశ్రయాన్నిస్తున్నవాడవు. అవ్యయుడవైన నీవు సనాతన ధర్మరక్షకుడవు. అంతేగాక నిన్ను పురాణ పురుషునిగా తెలుసుకొంటున్నాను. **18**

ఓ పరమేశ్వరా! నువ్వు ఆది మధ్య అంతములు లేనివాడిగాను అనంత పరాక్రమం కలవాడిగాను, అనంతమైన బాహువులు గలవాడిగాను, సూర్యచంద్రులే నేత్రాలుగా గలవాడిగాను, ముఖం ప్రజ్వరిల్లే అగ్నిహోత్రుడిగాను, నీ తేజస్సు చేత లోకాలన్నింటినీ తపింపజేస్తున్న వాడిగాను చూస్తున్నాను. **19**

ఓ మహాత్మా! భూమి, ఆకాశం, మధ్య నుండే దిక్కులన్నింటి యందు నీవొక్కడివే వ్యాపించి ఉన్నావు. అటువంటి నీ భయంకర రూపాన్ని చూసి ముల్లోకాలు గడగడ వణికిపోతున్నాయి. **20**

(అర్జునుని మనస్సులో తాము జయిస్తామా? లేక కౌరవులు జయిస్తారా? అన్న సంశయం ఉంది. అతడి మనస్సులోని సంశయాన్ని పసిగట్టిన భగవంతుడు, పాండవులే జయిస్తున్నట్లుగా చూపాడు.)

ఈ యుద్ధ వీరులంతా భూభారాన్ని తగ్గించేందుకు మనుష్య రూపంలో అవతరించిన, వస్వాది దేవతలు. వారంతా త్వరత్వరగా పరిగెత్తుకుంటూ వచ్చి నీలో లీనమవుతున్నట్లు చూస్తున్నాను. అంటే వారు యుద్ధంలో చనిపోతున్నారని తాత్పర్యం. వీరిలో కొందరు క్షతగాత్రులై పారిపోవడానికి కూడా శక్తి లేనివారై ఉన్నారు. భయంతో దోసిలొగ్గి నమస్కరిస్తూ నిన్ను కీర్తిస్తున్నాను. యుద్ధం తప్పని సరి అయినట్లు తెలుస్తోంది. సర్వనాశనానికి శకునాలు తెలుస్తున్నాయి. జగత్తుకు శుభం కలగాలని మహర్షులు, సిద్ధులు నిన్ను స్తుతిస్తున్నారు. **21**

ఏకాదశ రుద్రులు, ద్వాదశ ఆదిత్యులు, అష్ట వసువులు, సాధ్యులు, త్రయోదశ విశ్వేదేవతలు, అశ్వనీదేవత లిద్దరు, మరుద్గణాలు నలభై తొమ్మండుగురు, పితృదేవతలు, హాహా, హూహూ మొదలైన గంధర్వులు, సిద్ధ సముదాయం, కుబేరాది యక్షులు, విరోచనాది అసురులు, కపిలాది సిద్ధులు, మొదలైన వారంతా ఆశ్చర్యంతో నిన్ను చూస్తున్నారు. **22**

ఓ మహావీరుడా! అనేకమైన ముఖాలు, నేత్రాలు, బాహువులు, ఉదరములు, పాదాలు కలిగి అనేకమైన కోరలతో మిక్కిలి భయంకరంగా ఉన్న నీ రూపాన్ని చూసి ముల్లోకాల్లోని ప్రాణులన్నీ భయకంపితలవుతున్నాయి. **23**

ఓ మహావిష్ణు! ఆకాశాన్నంటే రంగులతో ప్రకాశించే, నోళ్ళు తెరుచుకొని నిప్పులు కురిపించే కళ్ళతో ఉన్న నిన్ను చూస్తుంటే నా అంతఃకరణం కలత చెందుతోంది. ధైర్యం చచ్చిపోయింది. మనః స్థిమితం తప్పింది. కాంతి మసకబారింది. **24**

నీ కళ్ళు ప్రళయకాలంలో భయంకరంగా ప్రజ్వరిల్లే అగ్ని కణికల్లా ఉన్నాయి. అట్టి నీ ముఖం వంక చూడాలంటేనే భయం కలుగుతోంది. కళ్ళు చీకట్లు క్రమ్ముతున్నాయి. దిక్కులు తెలియడంలేదు. ఓ దేవదేవా! అట్టి నీ విశ్వరూపాన్ని దర్శిస్తున్నాను. నీ విశ్వరూపం దర్శించడం చేత నాకు సుఖశాంతులు కలిగేటట్లు అనుగ్రహించు. **25**

ఓ భగవంతుడా! ధృతరాష్ట్ర సంతతి వారంతా ఒక్కొక్కరే నీలో ప్రవేశిస్తూ ఉండటం చూస్తున్నాను. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మాత్రమే కాకుండా మనపక్షంలోని కొంతమంది మహావీరులు కూడా నీలో ప్రవేశిస్తున్నారు. **26**

వీరంతా భయంకరమైన కోరలు కలిగిన నీ నోట్లోకి ప్రవేశిస్తున్నారు. అందులో కొందరి శిరస్సులు నీ నోట్లో ప్రవేశించే ముందు పిండిపిండిగా మారిపోతున్నాయి. మాంసం ఖండ ఖండాలుగా పళ్ళ మధ్యన ఇరుక్కుంటోంది. **27**

నదులు వేగంగా సముద్రంలో కలుస్తున్నట్లుగా, ఈ మహావీరులైన భీష్మాదులంతా ప్రజ్వరిల్లే నీ నోట్లో ప్రవేశిస్తున్నారు. **28**

మిడుతల సమూహం నశించి పోయేందుకు ప్రజ్వరిల్లే అగ్ని గుండంలో ప్రవేశిస్తున్నట్లుగా, ఈ ప్రాణులన్నీ మహావేగంగా నీ నోట్లోకి ప్రవేశిస్తున్నాయి. **29**

ఓ విష్ణూ! మండుతున్న నీ ముఖాలతో సమస్త లోకాల్ని మ్రింగి ఆస్వాదిస్తున్నావు. అట్టి భయంకరము, తీక్షమైన నీ ముఖాలు జగత్తులన్నీ వ్యాపించి ఉన్నాయి. లోకాలన్నీ తపించిపోతున్నాయి. **30**

ఓ ఉగ్రస్వరూపుడా! నువ్వెవరవో నాకు చెప్పు. నీకు నమస్కారం అర్పిస్తున్నాను. దేవదేవా! కరుణించు. నీ ప్రవృత్తిని తెలుసుకోలేకుండా ఉన్నాను. నన్ను అనుగ్రహించు. **31**

శ్రీకృష్ణుడు : ఓ అర్జునా! లోకాలన్నింటినీ సంహరించే కాలుడను. అంటే కాలస్వరూపుడను; సర్వ సంహార కర్తను. ప్రాణులన్నింటినీ సంహరించాలని సంకల్పించాను. నువ్వు చంపకపోయినా భీష్మద్రోణాది వీరులెవ్వరూ జీవించి ఉండలేరు. **32**

కనుక యుద్ధం సలుప లేచి, యశస్సు పొందు. శత్రువులను జయించి నిష్కంటకమైన రాజ్యాన్ని అనుభవించు. ఇప్పటికే వారు నాచే చంపబడ్డారు. అర్జునా, నువ్వు నిమిత్తమాత్రుడవుగా ఉండు. **33**

తాను చూసిన దృశ్యాలన్నీ భ్రాంతియా? లేక నిజంగా వీరంతా యుద్ధంలో మరణించబోతున్నారా? అన్న సందేహం అర్జునునకు కలుగవచ్చని భగవానుడు ఊహించి ఇలా చెప్తున్నాడు.

అర్జునా! భీష్మ ద్రోణ కర్ణాదులను యుద్ధంలో నువ్వు నా ఆయుధంగా ఉండి సంహరించు. భయపడకు. నువ్వు తప్పక యుద్ధంలో జయిస్తావు. లేచి యుద్ధం చెయ్యి. **34**

భీష్మ ద్రోణాదులను చంపడం ధర్మ విరుద్ధం కాదని ముందే చెప్పాడు. అయినా వారిని చంపగలనా, నాకా శక్తి ఉన్నదా? అని అర్జునుడు సందేహిస్తున్నాడు. ఎందువల్లనంటే, భీష్ముడు తాను

కోరుకుంటేగాని మరణించదు. అంటే ఇచ్ఛామరణాన్ని పొందేవరం పొంది ఉన్నాడు. ఇక ద్రోణుడు దైవాంశతో కూడిన అస్త్ర శస్త్రాల్ని కలిగి ఉన్నాడు. అదీ కాకుండా ఆయన తనకు గురువు. ఇక జయద్రధుడున్నాడు. అతణ్ణి ఎవరు చంపితే వారి శిరస్సు పగిలి ముక్కలై పోతుంది. కావున జయద్రధుని చంపడం సాధ్యం కాదు. ఇక కర్ణుడు. ఇతడు అర్జునుని చంపడానికే శక్తి ఆయుధాన్ని వరంగా పొందాడు. ఆ ఆయుధం ఎవరి మీద ప్రయోగించినా వ్యర్థం కాదు. కనుక భగవానుడే వారందర్నీ సంహరించేందుకు కంకణం కట్టుకున్నాడు. వేటగాని చేతిలో బాణం ఎట్లాగో, భగవానుని చేతిలో అర్జునుడు కూడా ఒక ఆయుధం మాత్రమే.అయినా జయించాడన్న కీర్తి మాత్రం అర్జునుడికే దక్కుతోంది.

సంజయుడు : ఓ ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణుని మాటలు విన్న అర్జునుడు భయంతో వణకిపోతూ ఇలా అన్నాడు. **35**

అర్జునుడు : ఓ హృషీకేశా! నీ నామ సంకీర్తనం చెయ్యడం వల్లనే లోకాలన్నీ సుఖశాంతులతో ఉన్నాయి. రాక్షసులకు భయంతో నిద్రపట్టడం లేదు. సిద్ధ సమూహాలన్నీ నిన్నే ప్రార్థిస్తున్నాయి. **36**

"దైవత్వము పొందిన ఋషులు ఈశ్వరుని ఆత్మబంధువుల వంటివారు. అంటే వారాయనకు హితులు. సాధారణ మనుష్యులంతా భగవంతుని దూరపు బంధువుల వంటివారు. వారు కేవలం ఈశ్వర సృష్టి మాత్రమే." - శ్రీరామకృష్ణ పరమహంస

ఓ మహానుభావా! జగత్తులన్నింటికీ సృష్టి కర్త అయిన బ్రహ్మదేవునికి సైతం నువ్వే కారణం. అటువంటి నీకు సిద్ధులు, మహర్షులు ఎందుకు నమస్కరించరు? సర్వదేవతలకు ప్రభువైన వాడా! అంతములేని వాడా! అక్షర స్వరూపుడవు నీవే. నువ్వే పరబ్రహ్మవు. **37**

స్థూలంగా కనిపించే జగత్తునంతా 'సత్తు' అంటారు. అట్లాగే కంటికి కనిపించని సూక్ష్మావస్థలో ఉండే జగత్తును 'అసత్త'ని అంటారు. అక్కడకు సామాన్యులెవ్వరూ వెళ్ళలేరు. అట్లాగే వర్తమాన జగత్తును సత్తని, భూత భవిష్యత్ జగత్తును అసత్తని అంటారు. కనుక సత్, అసత్ రెండింటికీ అతీతమైన దాన్ని పరము అంటారు. భగవంతుడు ఇవన్నీ అయి ఉండడం చేత అతనిని స్తుతించడం కన్నా వేరే మార్గం లేదు. శ్రేష్ఠమైన దాన్ని కీర్తించే వాడు శ్రేష్ఠుడే అవుతున్నారు.

అనంతరూపా! ఆదిదైవమా! నువ్వు సమస్త జగత్తులకు దేవతలకు ప్రభువ్వి కాబట్టి ఆదిదేవుడవు. పురాణ పురుషుడవు. ప్రళయంలో విశ్వాలన్నీ నీలో లీనమై ఉంటాయి. కాబట్టి నీవు సమస్త జగత్తులకు విధానుడవు. నీదైన వేద సముహాన్ని తెలుసుకున్నవాడవు నీవే. వైష్ణవమైన పరమ ధామ స్వరూపుడవు నువ్వే. అనంతమైన స్వరూపాలు కలవాడా! లోకాలన్నింట్లోనూ నువ్వు వ్యాపించి ఉన్నావు. **38**

సర్వము అతడిలో ఉదయించడం వలన అతడు ఆదిదేవుడు. ప్రపంచమనే పురంలో నివస్తూ ఉంటాడు కనుక పురుషుడు. అతడికన్నా పెద్దవారెవరూ లేకపోవడం వలన పురాణుడు. మహాప్రళయంలో జీవరాసులన్నీ ఆయనలో ప్రవేశించడం వలన అతడు 'నిదాన'మగుచున్నాడు.

వాయువు, యముడు, అగ్ని, జలాధిపతియైన వరుణుడు, చంద్రుడు, కశ్యపుడు, మొదలైన వారంతా నీవే. నీకు నమస్కారము. నీకు మళ్ళీ మళ్ళీ నమస్కరిస్తున్నాను. **39**

కాశ్యపుడు మొదలైన వారికి ప్రజాపతులని పేరు. బ్రహ్మ ఈ లోకాలన్నింటికీ తండ్రి అవుతున్నాడు. బ్రహ్మకు తండ్రి శ్రీమహావిష్ణువు. కనుక ముత్తాత అన్నా కూడా శ్రీమహావిష్ణువే. అనేక పర్యాయాలు నమస్కరించడం భక్తి ప్రవాహాన్ని తెలియజేస్తోంది.

నా సర్వస్వమా! నీ పుర్వాపరములకు నమస్కారము. అన్ని వైపులకూ నమస్కారము. అంతులేని సామర్థ్యాన్ని, అపరిమిత పరాక్రమాన్ని కలిగి ఉండే నువ్వు అంతటా వ్యాపించి ఉన్నావు. కనుక నీవే సర్వమూ అయి ఉన్నావు. **40**

ఓ భగవానుడా! నీ మాహాత్మ్యం తెలియని వాడిని కాబట్టి, నా స్నేహితుడవని తలచి, చనువు చేతను, అలక్ష్యంతోనో ఏవేమో మాట్లాడి ఉంటాను. నన్ను క్షమించు. అచ్యుతా! ఆహార విహారాల్లోను, ఆసనశయ్యాదులందును, ఏకాంతంలోగాని, ఇతరుల సమక్షంలోగాని, నేను అవహేళనతో అవమానించి ఉంటే నన్ను క్షమించు. **41-42**

సాటిలేని ప్రభావము గలవాడా! నువ్వు చరాచర లోకాలన్నింటికీ తండ్రివి; పూజ్యుడవు; గురువులకు గురువుగా ఉంటావు. ముల్లోకాల్లోనూ నీతో సమానమైన వారెవరూ లేరు. **43**

కనుక దేవా! నేను సాష్టాంగంగా నమస్కరిస్తున్నాను. ఈశ్వరుడవైన నీ అనుగ్రహాన్ని వేడుకుంటున్నాను. పుత్రునికి తండ్రిలాగా, చెలికానికి చెలునివలె, ప్రియురాలికి ప్రియునివలె నన్ను క్షమించు. **44**

> *"పరాభక్తి యందు ఈశ్వరుని తనకు అత్యంత ఆత్మీయునిగా తలుచుకుంటూ ఉంటాడు. అది గోప స్త్రీలకు శ్రీకృష్ణుని యందుండే భక్తి వంటిది. వారు ఆయనను ఎల్లప్పుడూ తమకు ప్రియుడని అనుకున్నారేగాని జగన్నాథుడనుకోలేదు."*
>
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

దేవదేవా! ఇంతకు పూర్వం ఎన్నడూ చూడని వానిని ఇప్పుడు చూస్తున్నాను. ఒక ప్రక్క సంతోషంగా ఉన్నా మరో ప్రక్క భయంతో వణకిపోతున్నాను. నాకు నీ సౌమ్యరూపాన్నే చూపు. దేవేశా! జగన్నివాసా! కరుణించు. **45**

ఓ భగవానుడా! పూర్వం వలెనే కిరీటాన్ని, గదను, చక్రాన్ని ధరించిన నీ దివ్య విగ్రహాన్నే చూడాలని కోరుకుంటున్నాను. వేయి చేతులు గల విశ్వమూర్తీ! నిన్ను చతుర్భుజునిగా చూడాలనే నా మనస్సు కోరుకుంటోంది. ఆ రూపంలోనే దర్శనమివ్వు. **46**

శ్రీకృష్ణుడు : ఓ కురువంశ శ్రేష్ఠుడా! అర్జునా! నీ యందలి అనుగ్రహంచేత, నా స్వకీయ యోగమహిమచేత ప్రకాశవంతమైనది, అంతములేనిది, అయిన నా యీ విశ్వరూపాన్ని నీకు చూపించాను. దీనిని నువ్వు తప్ప ఇది వరకు ఎవరూ చూడలేరు. **47**

కురుకులశ్రేష్ఠుడా! మానవలోకంలో నువ్వు తప్ప మరెవరైనా నా యీ విశ్వరూపాన్ని దర్శించాలనుకున్నా దర్శించలేరు. వేదాధ్యయనం చేసినా, యజ్ఞవిజ్ఞానాన్ని సంపాదించినా, దాన ధర్మాలు ఎన్ని ఆచరించినా, ఎన్ని శ్రౌత కర్మలు చేసినా, ఎన్ని కఠినమైన తపస్సులు చేసినా నా ఈ విశ్వరూపాన్ని చూడలేరు. అటువంటి రూపాన్ని నీకు చూపాను. **48**

> *"కొందరికి మద్యం కొద్దిగా పుచ్చుకొంటేనే మత్తు కలుగుతోంది. మరికొందరికి ఇంకా ఎక్కువ మద్యం పుచ్చుకుంటేగాని మత్తు కలగటం లేదు. అయితే ఇద్దరూ పొందే ఆనందం మాత్రం ఒక్కటే. అట్లాగే ఈశ్వర మహిమను ఆవగింజంత పొందినంత మాత్రం చేతనే ఆనందం కలుగుతోంది. మరి కొందరికి ఈశ్వర సన్నిధానాన్ని సూటిగా పొందితే గాని అట్టి ఆనందం కలగడం లేదు. అయినా ఇద్దరూ పొందే దివ్యానందం మాత్రం ఒక్కటే."* - శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునా! నా యీ భయంకరమైన రూపాన్ని చూసి భయపడకు. నీకు దిగ్భ్రమ కలుగకుండా ఉండుగాక! మనస్సులో సంతోషం కలిగి ఉండు. నీకు ఇష్టమైన చతుర్భుజాలతోకూడుకున్నది, శంఖచక్రగదాయుధాల్ని ధరించినదీ అయిన నా వాసుదేవరూపాన్నే చూపుతున్నాను. ఊరడిల్లు. **49**

సంజయుడు: ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణ భగవానుడు అర్జునునితో ఇట్లా అంటూ, వాసుదేవ పుత్రునిగాను, ప్రసన్న వదనంతోను మళ్ళీ దర్శన మిచ్చాడు. భయపడుతున్న అర్జునుని ఊరడించాడు. **50**

అర్జునుడు *:* జనార్దనా! ప్రసన్నమైనదీ, నాకు స్నేహితుడుగా మెలిగినదీ అయిన మానవ రూపాన్ని చూపావు. ఆ రూపాన్ని చూసి నా మనస్సు ఎంతో ఆనందంతో నిండిపోయింది. నేను మామూలు స్థితికి వచ్చాను. **51**

శ్రీకృష్ణుడు *:* అర్జునా! మానవులెవ్వరికీ చూడశక్యం కాని నా రూపాన్ని చూశావు. నా యీ రూపాన్ని చూడాలని దేవతలంతా ప్రతినిత్యమూ తహతహలాడుతూ ఉంటారు. కానీ వారెవ్వరూ నీలాగా చూడలేదు. ఇకముందుకూడా వారు చూడలేరు. **52**

అర్జునా *:* నువ్వు నన్ను ఏ విధంగా దర్శించావో ఆ విధంగా వేదముల చేతగాని, తపస్సు చేతగాని, దానము చేతగాని, దర్శించడం సాధ్యం కాదు. **53**

శత్రువులను తపింపజేయు ఓ అర్జునా! నన్ను ఈ రీతిగా యథార్థంగా తెలుసుకోవాలంటే అనన్య భక్తిచేత మాత్రమే సాధ్యపడుతుంది. **54**

> *"భగవంతుని చర్మ చక్షువులతో చూడలేము. అనన్యభక్తి కలిగినప్పుడు ప్రేమమయమైన శరీరం ఒకటి మనస్సులో ఏర్పడుతుంది. ఆ శరీరానికి ప్రేమమయమైన కన్నులు, చెవులు పుడతాయి. వాటిచే నువ్వు భగవంతుని చూడగలవు. వినగలవు."* - శ్రీరామకృష్ణ పరమహంస

పాండవా! ఎవడు నా కోసం శ్రోతాది కర్మల్ని చేస్తూ ఉంటాడో, ఎవడు నన్నే లక్ష్యంగా పెట్టుకుంటాడో, ఎవడు అన్ని విధాలా ఉత్సాహంతో నన్నే భజిస్తాడో, ఎవడు నా భక్తుడై భార్యా బిడ్డలపై ఆసక్తి లేకుండా ఉంటాడో, ఎవడైతే అపకారం చేసిన వారి యెడల వైరభావాన్ని ప్రదర్శించడో, ఎవడు సమస్త జీవులయందు ఆత్మభావం కలిగి ఉంటాడో అట్టి నా భక్తుడు నన్ను పొందుతాడు. అట్టి వాడికి ముక్తి లభిస్తుంది. **55**

"ఈశ్వరుని యందు మనకెంత తీవ్రమైన భక్తి ఉండాలో నీకు తెలుసా? ఒక పతివ్రతకు తన భర్తపై ఉండే ప్రేమ, లోభికి ధనంపైగల ఆశ, భోగలాలసుడికి విషయాసక్తిపై గల వాంఛ. ఈ మూడూ కలసి ఏకమై ఈశ్వరుని పై చూపగలిగితే నువ్వు నిజంగా భగవంతుని పొందగలవు."

- శ్రీరామకృష్ణ పరమహంస

12

భక్తియోగం

తొమ్మిదో అధ్యాయం రాజవిద్యారాజగుహ్య యోగంలో పరమాత్మ తన్ను ఉపాసించవలసిందిగా తెలిపాడు. ఉపాసించాలంటే ఉపాసనా స్వరూపం తెలియాలి. అందుకు సంబంధించిన జ్ఞానం ఉండాలి. పదవ అధ్యాయంలో తన విభూతులన్నింటినీ తెలిపాడు. అధికారి అయిన వాడు సర్వవ్యాపకుడైన ఈశ్వర స్వరూపాన్ని ఉపాసించమని ఆదేశించారు. పదకొండవ అధ్యాయంలో అర్జునుని కోరికను మన్నించి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ఆ రూపాన్ని ధ్యానించినవాడు తప్పక పరమపదాన్ని చేరుతాడని అభయం ఇచ్చాడు. ఇక్కడ పన్నెండవ అధ్యాయంలో సగుణ నిర్గుణ తారతమ్యాలను చెప్తూ, సగుణోపాసకులు తన్ను ఉపాసించదగిన సాధనాన్ని వివరిస్తున్నాడు.

అర్జునుడు : కృష్ణా! ఇంత వరకు చెప్పిన విషయాన్ని బట్టి అక్షర పరబ్రహ్మమును ఉపాసించడం శ్రేష్ఠమా? లేక సగుణోపాసన శ్రేష్ఠమా? **1**

అంటే, నిరంతరం నిన్నే నమ్ముకొని భగవత్కార్యాలనే చేసుకుంటూ నీ మీదే మనస్సు నిలుపుకొని ధ్యానించే భక్తులు శ్రేష్ఠులా? లేకపోతే భార్యా పిల్లల్ని వదలేసి, కర్మలన్నింటినీ విసర్జించి అక్షరబ్రహ్మమైన నిన్నే ఆశ్రయించడం శ్రేష్ఠమా? ఈ ఇద్దరిలో ఎవరు ఉత్తమమైన యోగాన్ని ఎరిగినవారు?

శ్రీకృష్ణుడు : నాయందే మనస్సు లగ్నం చేసి యోగమునందే నిలచి శ్రద్ధతో ఎవరు నన్ను ఉపాసిస్తారో అటువంటివారే ఉత్తమ యోగులని నా అభిప్రాయం. **2**

> *"భగవంతుని నిరాకారునిగా ధ్యానించడం మంచిదే. కానీ అది మాత్రమే యథార్థం, మిగిలిన మార్గాలన్నీ అసత్యాలని చెప్పకు. అతడిని సాకారునిగా ధ్యానించడమూ సమంజసమే, అట్లాగే. కానీ నువ్వు భగవంతుని దర్శించేంత వరకు నీ నమ్మకాన్ని విడిచిపెట్టకు. ఆ తర్వాత అంతా నీకే తెలుస్తుంది."* - శ్రీరామకృష్ణ పరమహంస

ఇంద్రియ నిగ్రహం కలవారై, ప్రాణులన్నింటి యందు సమభావం కలిగి, శీతోష్ణాది ద్వంద్వాల యందు సమబుద్ధి కలిగినట్టి భక్తులు మాటలతో చెప్పలేనిది, వ్యక్తముకానిది, మనస్సుకు అతీతమైన, సర్వవ్యాపకమైనది, మార్పులేనిది, చలనములేనిది, నిత్యమైనది, నాశనం కానిది, అయినట్టి బ్రహ్మమును శ్రద్ధగా ఉపాసిస్తారో అట్టి వారు నన్నే పొందుతారు. **3-4**

నిర్గుణ పరబ్రహ్మాన్ని గూర్చి మాటలతో చెప్పలేం. ఇంకో వస్తువుతో పోల్చిచెప్పలేం. ప్రపంచంలోని వస్తువులన్నీ ఉత్పత్తి అయినప్పుడు కనిపిస్తున్నాయి. కొంతకాలానికి అదృశ్యమవు తున్నాయి. కానీ బ్రహ్మము అట్లాంటిది కాదు. సముద్రంలో వేసిన మంచుగడ్డను ఎట్లా గుర్తించలేమో బ్రహ్మాన్ని కూడా అట్లాగే గుర్తించలేము. ఇది అంతటా వ్యాపించి ఉండే పరిపూర్ణ వస్తువు. చంచలమైన ప్రపంచానికి నిశ్చలమైన బ్రహ్మమే ఆధారం. అందువల్లనే దాన్ని కూటస్థం అంటారు. గాలి చంచలం. ఆకాశం కదలడంలేదు. ప్రళయ కాలంలో రెండూ నశించి పోయేవే కానీ బ్రహ్మం అట్లాంటిది కాదు. అది శాశ్వతమైనది; శుద్ధచైతన్యం దేశకాలాలచే బాధించబడేది కాదు కాబట్టి అది 'అక్షరం', నాశనరహితం. ఇట్టి పరబ్రహ్మాన్ని ఉపాసించాలంటే సమబుద్ధి అవసరం. ఇంద్రియ నిగ్రహం గలవాడే ఈ ఉపాసనకు అధికారి. కష్ట సుఖాల్ని సమభావంతో స్వీకరించగలగాలి. ప్రాణులన్నింటినీ బ్రహ్మ స్వరూపంగా భావించి, జీవుల మేలు కోరి వాటికి సేవ చెయ్యాలి. నూనెధారలాగా వారి మనస్సు ఎప్పుడూ భగవంతుని యందే లగ్నమై ఉండాలి.

"గంటమ్రోగించేటప్పుడు వచ్చే శబ్దాలన్నీ విభిన్నంగా ఉంటాయి. ఒక్కొక్క శబ్దం ఒక్కొక్క ఆకారంలో ఉన్నట్లనిపిస్తుంది. గంట కొట్టడం ఆపేస్తే కొంతసేపటి వరకు వినిపిస్తూనే ఉంటుంది. ఆ తర్వాత మెల్లమెల్లగా తగ్గిపోతుంది. అట్లా తగ్గుతూ వినబడే శబ్దానికి ఆకారం లేనట్లనిపిస్తుంది. గంటానాదం లాగానే భగవంతుడు రూపంతోను, రూపం లేకుండా కూడా ఉన్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

నిర్గుణ పరబ్రహ్మాన్ని ఆరాధించేవారు ఎక్కువ ప్రయాసపడాల్సి ఉంటుంది. ఎందుకంటే దేహధారులకు నిర్గుణ పరబ్రహ్మంపై బ్రహ్మనిష్ఠకుదరడం చాలా కష్టం. **5**

ఈ రెండింటి లక్ష్యం ఒక్కటే. అయితే దేహాభిమానం గలవారికి సగుణోపాసనే మంచిది. నిర్గుణోపాసకుడు దేహాభిమానాన్ని పూర్తిగా వదిలెయ్యాలి. అంటే పిందెగా ఉంటూనే కాయగా మార్పుచెంది, పండుగా పరిణామం చెందిన తర్వాత పై తొక్క నుండి పండు విడిపోతుంది. అట్లాగే జ్ఞానం సిద్ధించిన తర్వాత దేహాభిమానం దానంతట అదే తొలగిపోతుంది. అయితే దేహధారులకు సగుణోపాసనే మేలు. ఈ మార్గాన్ననుసరించి అభివృద్ధి సాధించేందుకు ఎక్కువ శ్రమ పడాల్సిన అవసరముండదు.

జ్ఞానయోగి తానే బ్రహ్మాన్నన్న భావనతో ఉంటాడు. కానీ శరీరాన్నే ఆత్మగా భావించే వాడు ఎటువంటి పురోభివృద్ధినీ సాధించలేరు. అటువంటి వాడు ఇతరులను మోసం చెయ్యడమే కాకుండా తన్నుతానే మోసగించుకుంటున్నాడు" - శ్రీరామకృష్ణ పరమహంస

అయితే ఎవరు కర్మలన్నింటినీ నాకు సమర్పించి నన్నే పరమావధిగా తలచి ఏకాగ్ర చిత్తంతో నన్నే ధ్యానం చేస్తారో అట్టి వారిని జనన మరణ సాగరం నుండి కడ తేరుస్తాను. **6-7**

"భక్తి ఎవరియందు పొంగి పొరలుతుందో అటువంటివానికి శీఘ్రంగా ఈశ్వర దర్శనం కలుగుతుందని తెలుసుకో." - శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునా! విశ్వరూపుడవైన నా యందు సంకల్ప వికల్పాలతో కూడిన నీ మనస్సును స్థిరంగా నిలుపు. నిశ్చలమైన నీ బుద్ధిని కూడ నాయందే నిలుపు. ఆ విధంగా చేస్తే మరణానంతరం తప్పక నాయందే నివసిస్తావు. ఇందులో సందేహం ఎంతమాత్రమూ లేదు. **8**

మనస్సుకు భావావేశాలుంటాయి. బుద్ధికి మాత్రం నిర్ణయాలు తీసుకునే శక్తి ఉంటుంది. ఈ రెండూ అంతఃకరణానికి సాధనాలు. ఒక వ్యక్తి నివసించే స్థలాన్ని బట్టి అతడి మానసిక స్థితిని నిర్ణయించలేం. అంటే అతడి బుద్ధి మనస్సు ఎట్టి ఆలోచనలు చేస్తూ ఉంటాయో అతడు కూడా అక్కడే ఉన్నట్లు లెక్క. కొందరు నరకంలో ఉన్నట్లు దుఃఖంతో కుమిలిపోతూ ఉంటారు. మరికొందరు స్వర్గంలో ఉన్నట్లు సంతోషంగా ఉంటారు. అట్లాగే శరీరం ఇక్కడే ఉన్నా, చిత్తమును ఈశ్వరునిపైన నిలిపితే అతడి సన్నిధిలో ఉన్నవాడవుతున్నాడు. అంటే మనస్సు ననుసరించే దేహం ఉంటుంది. కనుక మనస్సును భగవంతునిపై లగ్నం చేస్తే అతడు భగవంతునితో నివసిస్తున్న వాడవుతాడు. అందుకు అతడి మనోభావాలే మూలం.

"మనిషి పుట్టేటప్పుడు అతడిలో విద్యాగుణం, అవిద్యాగుణం రెండూ ఉంటాయి. విద్యాగుణం ముక్తిని కలిగిస్తుంది. అవిద్య మానవునిలోని ప్రపంచాసక్తిని వృద్ధి చేస్తుంది. పుట్టినప్పుడు త్రాసులో పెట్టి తూకం వేస్తే రెండూ సమానంగానే ఉంటాయి. త్వరలో ప్రపంచ సుఖాలు (అవిద్యా పళ్ళెంలోను) ఒక వైపున, ఆత్మ విషయాలు (విద్యా పళ్ళెంలో) ఒక వైపు నా సమానంగా చేరుకుంటాయి. మనస్సు ప్రపంచ సుఖాలున్న పళ్ళెం వైపు మొగ్గు చూపితే ఆ పళ్ళానికి బరువు ఎక్కువై క్రిందకు దిగుతుంది. అట్లా కాకుండా మనస్సు ఆత్మ విషయాల యందు ఆసక్తి చూపితే ఆ పళ్ళెం ఈశ్వరుని వైపు బరువు ఎక్కువై క్రిందకు దిగుతుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

ధనంజయా! ఒకవేళ నీ మనస్సు నా యందు స్థిరంగా నిలవడం సాధ్యంకాక పోతే అభ్యాస యోగం చేత నన్ను పొందే ప్రయత్నం చెయ్యి. **9**

"ఒకడు ఒక కుక్కను ఎంతో ప్రేమగా పెంచుకుంటున్నాడు. అతడి ఆటపాటలన్నీ ఆ కుక్కతోనే. తన పిల్లలకన్నా ఆ కుక్కనే ఎక్కువ గారాబం చేసేవాడు. ఇట్లా ఉండగా ఒక సాధువు వచ్చి కుక్కతో అంత సన్నిహితంగా ఉండటం మంచిది కాదని సలహా చెప్పాడు. అతడి సలహా విన్న దగ్గర నుండి అతడా కుక్కను దగ్గరకు రాకుండా జాగ్రత్త పడుతూ వచ్చాడు. యజమాని మనస్సు మారిపోయిన విషయం ఆ కుక్కకు తెలియదు. అతడికి దగ్గరగా మసలేందుకు ప్రయత్నించింది. కానీ ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా యజమాని మనస్సులో మార్పు రాలేదు. అతడు దాన్ని కసురుకోవడం, కొట్టడం చేస్తూవుంటే కుక్క అతడి దగ్గరకు రావడం మానేసింది.

మనస్సు స్థితి అటువంటిదే. మనస్సులో ఇంత వరకూ ఉండే ఆశలు కోరిక అనే కుక్కను నువ్వు వదిలించుకోవాలన్నా అది నిన్ను సులభంగా వదిలిపెట్టదు. అయినా నువ్వు స్థిరమనస్కుడవై దానిని తిట్టి కొట్టి తరిమేసినట్లే కోరికల్ని కూడా అభ్యాసం చేత తరిమెయ్యాలి." - శ్రీరామకృష్ణ పరమహంస

ఒకవేళ అభ్యాసం చేయడం కుదరకపోతే, నాకు సంబంధించిన కర్మలు చెయ్యడమే లక్ష్యంగా పెట్టుకో. నువ్వావిధంగా నా సంబంధమైన కర్మలు చేస్తూవున్నా కూడా తప్పక నన్ను చేరుకోగలుగుతావు. **10**

నువ్వు ఆసక్తితోనే కర్మలు నీకోసం కాకుండా ఈశ్వరారాధనగా చెయ్యి. అట్లా చేసిన భక్తుడు ఈశ్వరుని చేతిలో ఆయుధంగా మారిపోతున్నాడు. ఆయుధానికి ప్రత్యేకంగా ఎటువంటి స్వతంత్రమూ ఉండదు. అంటే సాధకుడు తన్ను భగవంతుని చేతిలో ఆయుధంగా తలచి కర్మలు చెయ్యడం వల్ల చిత్తశుద్ధి కలిగి జ్ఞానవంతుడై పక్వమగుచున్నాడు. ఈ విధంగా కర్మలు భగవంతునికి కైంకర్యం చేస్తూండటం వలన జీవబోధము తొలగిపోయి పరబోధము స్థిరపడుతుంది.

"అన్నీ ఈశ్వరుని ఆజ్ఞ చేతనే నడుస్తున్నదనీ, తాను ఈశ్వరుని చేతిలో కేవలం ఆయుధం మాత్రమేనన్న భావం ఎవరి మనస్సులో స్థిరంగా ఉంటుందో అతడు జీవించి ఉండగానే ముక్తుడవుతున్నాడు. ఈశ్వరా! ఈ కార్యం నీ కోసం నువ్వే చేస్తున్నావు. అయితే ఆ కార్యాన్ని 'నేను చేస్తున్నాను' అని జనులు చెప్పుకుంటున్నారు." -శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునా! పైన చెప్పినట్లుగా నీకు సమర్థత లేకపోతే నన్ను శరణుకోరి నువ్వు చేసే కర్మల ఫలాన్ని కూడా నాకే అర్పించేట్లయితే, ఈశ్వరార్పణ బుద్ధితో కర్మల్ని చెయ్యి. **11**

"నువ్వు కర్మలు చెయ్యకుండా ఉండలేవు. వారివారి స్వభావం వారిచేత కర్మలు చేసేందుకు ప్రోత్సాహాన్నిస్తూ ఉంటుంది. కాబట్టి కర్మలు చేస్తూనే ఉంటావు. అయితే ఆ చేసే కర్మలన్నింటినీ ఆసక్తి లేకుండా చెయ్యి. అనాసక్తితో చేసే కర్మల ఫలమంతా భగవంతునికే అర్పితమవుతుంది. అంటే ఇహపరాలకై చేసే కర్మలన్నీ అనాసక్తితో చెయ్యడం వల్ల లభించే పాపపుణ్యాలు గాని, రాగద్వేషాలు గాని నీకు అంటవు. ఇటువంటి భావనతో చేసే కర్మలన్నీ చివరకు భగవత్సాన్నిధ్యానికి చేర్చే మార్గమే అవుతుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

అభ్యాసం కన్నా జ్ఞానం శ్రేష్ఠం. జ్ఞానం కంటే ధ్యానం శ్రేష్ఠం. ధ్యానం కన్నా కర్మఫల త్యాగం శ్రేష్ఠం. ఈ త్యాగం వలన మనశ్శాంతి లభిస్తుంది. **12**

"ఒక గ్రద్ద ముక్కుతో ఒక చేపను పట్టుకుంది. ఆ చేపకోసం కొన్ని కాకులు గ్రద్దలు ఆ గ్రద్ద వెంటపడ్డాయి. వాటిని తప్పించుకొని ఆ చేపను దక్కించుకోవాలని ఆ గ్రద్ద వాటికి అందకుండా వేగంగా ఎగురుతోంది. ఇలా కొంతసేపు ఎగిరిన తర్వాత గ్రద్ద

ముక్కున ఉన్న చేపకాస్తా జారి క్రిందపడింది. దాంతో ఈ కాకులూ గ్రద్దలూ ఈ గ్రద్దను వదిలిపెట్టిపోయాయి. ఆ తర్వాత ఆ గ్రద్ద ఒక చెట్టుకొమ్మపైన కూర్చుని విశ్రాంతి తీసుకుంది. ఇలా శాంతంగా కూర్చున్న గ్రద్దను చూస్తూన్న అవధూత దానికి నమస్కరించి ఓ గ్రద్దా! నువ్వు నాకు గురువువు. ప్రపంచాసక్తి అనే బరువు క్రింద పారేసే వరకూ మానవుడు చంచలత్వం నుండి తప్పించుకోలేడు. అతడికి సమాధానం లభించదు. ఆ సత్యాన్ని నువ్వు నాకు నేర్పావు అన్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ప్రాణులన్నిటి యెడల ద్వేషం లేనివాడై, స్నేహము కరుణ కలిగి అహంకార మమకారాలను విడచిపెట్టి, సుఖదుఃఖాలను సమదృష్టితో చూస్తూ, ఓర్పుగలవాడై ఎల్లప్పుడూ సంతోషంతో ఉండే దృఢనిశ్చయంతో నా యందు మనస్సు నిలిపే భక్తుడు నాకు అత్యంత ప్రీతిపాత్రుడవుతున్నాడు. **13-14**

ద్వేషం భేదభావాన్ని కలిగిస్తుంది కాబట్టి ద్వేషం ఉండకూడదు. ప్రాణులన్నింటిపైనా ప్రీతి ఉండటమే స్నేహభావం. తనకు నష్టాన్ని కష్టాన్ని కలిగించినా సరే ఎదుటివారిపై కరుణ చూపుతూ ఉండాలి. 'నాది' అన్న భావనే అహంకార మమకారాలకు బీజమవుతోంది. కనుక ఇట్టి దేహాభిమానాన్నే అహంకారమన్నారు. భక్తునిలో కరుణా భావం పెంపొందితే అహంకారం నశించిపోతుంది. తన వస్తువులు, తన దేహము, తన జీవితము అన్నవాటిని లెక్కచేయకుండా జీవించిన వాడు సుఖదుఃఖాల్లో భేదం తెలియని వాడవుతాడు. అట్టివాడు ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. ఈ గుణాలన్నీ అలవరచుకొని అణకువ, క్రమశిక్షణ నేర్చుకుంటే అతడు యోగి అవుతున్నాడు. అటువంటివాడికి పారమార్థిక విషయాల యందు సంశయాలుండవు. సందేహాలు లేని వాడు దృఢ చిత్తం గలవాడవుతాడు. ఈ విధంగా భగవానుని యెడల భక్తిగలవాడై భగవంతునికి ప్రియసఖుడవుతున్నాడు.

"మానవుడు సమర్పించే ఈ సంపదలకు భగవంతుని దృష్టిలో విలువ ఉంటుందా? ఉండనే ఉండదు. ఎవడు నిర్మలమైన భక్తి శ్రద్ధలను సమర్పించు కుంటున్నాడో అతని యెడల మాత్రమే భగవంతునికి కృప కలుగుతోంది. తనకై అర్పించే భక్తి ప్రేమలను, వివేక వైరాగ్యాలను మాత్రమే ఈశ్వరుడు శ్లాఘించి కొనియాడుచున్నాడు."

- శ్రీరామకృష్ణ పరమహంస

ఎవరిని చూసి లోకం భయపడదో, లోకాన్ని చూసి ఎవడు భయపడడో మరియు, సంతోషం, క్రోధం, భయం, మనోవ్యాకులత మొదలైన వాటి నుండి ఎవడు విముక్తుడవుతున్నాడో అట్టివాడు నాకు అత్యంత ప్రీతిపాత్రుడవుతున్నాడు. **15**

ఉపాధ్యాయుడు విద్యార్థిని దండించడం వలన, వైద్యుడు రోగికి శస్త్ర చికిత్స చేయడం వలన, ధర్మయుద్ధంలో ఎదుటవాడికి కష్టం కలిగించడం వలన లోకానికేమీ కష్టం కలిగించడం లేదు. తాత్కాలికంగా వారికి బాధ కలిగించినా అతడు క్లేశమొందటంలేదు. ఎటువంటి అభ్యాసం వలన ఇటువంటి మనోస్థితి ఏర్పడుతుందన్న సంశయం కలుగవచ్చు. ఆనందం కలిగినప్పుడు, దుఃఖం

కలిగినప్పుడు కూడా హృదయం వశమైపోతుంది. అట్లాకాకుండా సుఖ దుఃఖాలను క్రమంగా గ్రహించే దృఢ చిత్తాన్ని అలవాటు చేసుకోవాలి. అట్లాగే కోపం ఎక్కువైనప్పుడు మనస్సు బలం తగ్గిపోతోంది. దృఢంగా ఉండి మ్రాను అయిన వృక్షం గాలికి కదలడం లేదు. బలహీనమైన తీగ కదులుతోంది. కాబట్టి క్రోధాన్ని తట్టుకునేది, సుఖదుఃఖాలను సమంగా చూసుకోగలదీ అయిన దృఢమైన మనస్సు కొరకు అభ్యాసం చెయ్యాలి. భయంలేని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. కదిలే నీళ్ళల్లో బింబం కలిపించడంలేదు. స్వచ్ఛమైన నీటిలోనే బింబాన్ని చూడగలం. అట్లాగే కలత చెందిన మనస్సులో ఆత్మస్వరూపం కనిపించదు.

"ఇతరుల సంతోషం గూర్చి మాట్లాడేవాడు తన కాలాన్ని వృథా చేసుకుంటున్నాడు. అట్లా కాకుండా అదే కాలాన్ని తన గూర్చి గాని భగవంతుని గూర్చిగాని ఆలోచించకుండా ఇతరుల కొరకు వ్యర్థం చేస్తున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఎవడు కోరికలు లేనివాడై, శుచియై, కార్యదక్షుడై, పక్షపాతం లేనివాడై, నిశ్చలత గలవాడై, కామ్యకర్మల్ని వదిలిపెట్టి, నాయందే నిశ్చల భక్తిగలవాడై ఉంటాడో అతడు నాకు అత్యంత ప్రీతి పాత్రుడగుతున్నాడు. **16**

ఇంద్రియాల వల్ల కలిగే సుఖాలపై అపేక్షలేనివాడు అనపేక్షుడగుచున్నాడు. ఆశను విడిచి పెట్టినవాడు శుచి అవుతున్నాడు. అంటే మలినము లేకుండా ఉంటమే శుచి. శుచి అయినవాడు చేసే కార్యాలు సామర్థ్యం కలిగి ఉంటాయి. పక్షపాతం లేకుండా న్యాయంగా ప్రవర్తించేవాడు 'ధర్మకాతా' లాంటివాడు. కనుక అతడే నిజమైన భక్తుడు భగవానుడికి ప్రీతి పాత్రుడవుతున్నాడు.

"తన మనస్సును ఎవడు మోసం చేసుకోడో, అట్టివాడే భగవంతుని సాన్నిధ్యాన్ని పొందగలడు. అంటే కల్మషం లేకుండా నిజమైన ప్రేమతో మాత్రమే పరమాత్ముని ప్రీతికి పాత్రుడవుతున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

సంతోషించడం, ద్వేషించడం, దుఃఖించడం, కోరడం వంటివన్నీ లేకుండా శుభాశుభాలన్నింటినీ పరిత్యాగం చేసిన భక్తుడే నాకు ప్రియమైనవాడు. **17**

అమాయకమైన శిశువుకు పాపపుణ్యాలు తెలియవు. అట్లాగే భక్తి పారవశ్యం గల భక్తుడు, హితాహితాలు రెండింటినీ మరచిపోతున్నాడు.

"ఇష్టాయిష్టాలు, భయం, ఉండే చోటుకు భగవంతుడు రావడంలేదు."

- శ్రీరామకృష్ణ పరమహంస

మానావమానాలుగాని, శత్రువు మిత్రుడు అభేదభావంగాని, శీతోష్ణాలు, సుఖ దుఃఖాలవంటి ద్వంద్వాలపై భేదభావం లేనివాడు, అనాసక్తుడు, నిందాస్తుతులను అంగీకరించే మౌని, ఉన్నదాంతో తృప్తిపడేవాడు, తలదాచుకోవడానికి గూడు వెతుక్కోనివాడు, దృఢచిత్తుడైన భక్తిపరుడు నాకు అత్యంత ప్రీతిపాత్రుడు. **18-19**

అందరూ ఈశ్వరుని బిడ్డలేనని గ్రహించినవానికి మిత్రులు శత్రువులు ఉండరు. దేహాభిమానంగలవానినే చలిగాని వేడిగాని బాధిస్తాయి. భక్తుడు భగవంతుని సేవలోనే మునిగి ఉండటం చేత అతడిని వేడి చలి బాధించవు. భగవంతుని దర్శనం కోసం పరితపిస్తూ ఏడ్చే వానిని చూసి లోకం పిచ్చివాడని పరిహాసం చేస్తుంది. అందుకతడు చింతించడు. భక్తుడు భగవంతుని లీలల్ని గానం చేస్తూ ఉంటాడు. భగవంతుని మహిమ చేతనే తాను పాడగలుగుతున్నానని భావిస్తాడు. లోకుల పొగడ్తలు అతడికి అవసరం ఉండదు. భగవద్విషయాలు తప్ప మరేవిషయాలూ మాట్లాడడు. అట్లాగే తన సొంత ఊరికి తిరుగు ప్రయాణం అయ్యేవాడు దారిలో ఎన్ని ఇబ్బందులు పడ్డా లెక్కచెయ్యడు. అట్లాగే భక్తుడు తన తల్లిదండ్రులైన భగవంతుని కొరకు చేసే ప్రయాణంలో కష్టాలు ఎదురైనా లెక్కచేయడు. ఇటువంటి మనోభావాలు గలవాడే భగవంతునికి ప్రియమైన భక్తుడవుతున్నాడు.

> *"ప్రాపంచిక విషయాలకు సంబంధించిన ఆలోచనలకు, బాధలకు నీ మనస్సులో చోటిచ్చి కలత చెందకు. చెయ్యాల్సిన పనులన్నీ సకాలంలో చేస్తూ ఉండు. అయినా నీ మనస్సు ఎల్లప్పుడూ భగవంతుని యందే లగ్నమయ్యేట్లు చెయ్యి."*
>
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

శ్రద్ధా భక్తులు కలిగిన ఏ భక్తులు నన్నే పరమగతి అని నమ్మి అమృతంవంటి ఈ ధర్మాన్ని ఇప్పుడు చెప్పిన రీతిలో అనుష్ఠిస్తారో వారే నాకు అత్యంత ప్రీతి పాత్రులు. **20**

సాధనాలన్నీ శ్రద్ధతో చెయ్యాల్సినవే. శ్రద్ధను భక్తితో చేర్చి చెప్పడం వలన, భగవంతుని పరమగతిగా నమ్ముకోవడం భక్తుని లక్షణమని అర్థం చేసుకోవాలి. కరుణతో కలిగే ముక్తి అనే గొప్పపదవి ధర్మం నుండి వస్తూ ఉండటం వల్ల ఇక్కడ ధర్మాన్నే అమృతంగా చెప్పారు. అంటే ప్రేమ, భక్తి, ధర్మం ఎవరికున్నాయో అతడు భగవంతునికి ప్రియతముడగుచున్నాడు.

> *"భక్తి యందు 'వైధీభక్తి' అనేది ఒకటున్నది. అంటే శాస్త్రాల్లో చెప్పినట్లు భక్తిని ఆచరించడం, భగవన్నామాన్ని జపం చెయ్యడం, ఉపవాసాలుండటం, తీర్థయాత్రలు చెయ్యడం, పూజాసామగ్రిని సమకూర్చడం, శాస్త్రోక్తంగా పూజలు చెయ్యడం, మొదలైనవన్నీ వైధీ భక్తి క్రిందకు వస్తాయి. ఈ సాధన చెయ్యగా చెయ్యగా భక్తి మార్గంలో అత్యుత్తమమైనదిగా చెప్పబడే 'రాగభక్తి'కి దారి తీస్తుంది. అన్నింటికీ ప్రేమయే ముఖ్యం. ఇహసుఖాలపై వ్యామోహం పూర్తిగా నశించి మనస్ఫూర్తిగా ఈశ్వరుని ఆరాధించాలి. అప్పుడే అతనిని పొందవచ్చు. రాగభక్తి లేనిదే అతనిని పొందలేము."*
>
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

13

క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగం

అర్జునుడు : కేశవా! ప్రకృతి అంటే ఏమిటి? పురుషుడు అంటే ఎవరు? క్షేత్రము అంటే ఏది? క్షేత్రజ్ఞుడు అని ఎవరిని అంటారు? జ్ఞానం అంటే ఏమిటి? జ్ఞేయము అంటే ఏమిటి? ఈ విషయాలన్నీ నాకు తెలుపు.

శ్రీకృష్ణుడు : ఓ కుంతీ పుత్రా! ఈ శరీరాన్నే క్షేత్రము అని అంటారు. ఈ సత్యాన్ని తెలుసుకున్నవాడు క్షేత్రజ్ఞుడని జ్ఞానులు చెబుతున్నారు. **1-2**

> *"మానవశరీరం ఒక మట్టిపాత్ర వంటిది. మానవ శరీరంలో మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు ఎట్లాంటివో, మట్టిపాత్రలో ఉండే నీరు, బంగాళాదుంపలు, బియ్యం వంటివి కూడా అట్లాంటివే. వీటన్నింటితో కూడిన మట్టి పాత్రను మంటపైన ఉంచితే అవన్నీ చక్కగా ఉడుకుతాయి. అట్లా ఉడికే పదార్థాల్లో చెయ్యి పెడితే కాలుతుంది. అయితే ఆ వేడి కుండకు సంబంధించింది కాదు. అట్లాగే బంగాళాదుంపలు, నీరు, బియ్యాలకు సంబంధించింది కూడా కాదు. అట్లాగే మానవుని శరీరంలో ఉండే బ్రహ్మము యొక్క శక్తి చేతమాత్రమే అతడి మనస్సు బుద్ధి, ఇంద్రియాలన్నీ వాటి పనులు అవిచేస్తున్నాయి."* - *శ్రీరామకృష్ణ పరమహంస*

అర్జునా! క్షేత్రములన్నింట్లోను నన్ను క్షేత్రజ్ఞునిగా గుర్తించు. క్షేత్రము క్షేత్రజ్ఞుని గురించిన జ్ఞానమే యథార్థమైనదని నా అభిప్రాయం. **3**

క్షేత్రం అంటే ప్రకృతి. క్షేత్రజ్ఞుడు అంటే పురుషుడు, అనగా నేనే. క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అన్న ఈ రెండింటికీ సంబంధించిన జ్ఞానం అంటే ఆత్మ అనాత్మలకు సంబంధించిన జ్ఞానం. ప్రకృతితో కలసి ఉండడం చేత ప్రకృతి యొక్క భాగాలన్నింటినీ తనవిగా స్వీకరించినప్పుడు అతడిని జీవాత్మ అంటారు. స్ఫటికానికి ప్రక్కనే ఒక పువ్వు ఉంచితే, ఆ పుష్పం రంగు స్ఫటికంపై ప్రతిబింబిస్తుంది. అంతమాత్రాన స్ఫటికానికి రంగు అంటదు. అట్లాగే ప్రకృతి అనేక విధాలుగా ప్రకటితమైనట్లే జీవాత్మలు కూడా అనంతమే. ప్రకృతి సంబంధంచేత ఉపాధులు ఏర్పడుతున్నాయి. ఆ ఉపాధులన్నీ ఆత్మతో కూడి ఉన్నప్పటికీ ఆత్మ ప్రకృతి స్వభావాన్ని గ్రహించడం లేదు. అంటే ఆత్మ ప్రకృతి పరమైన ఉపాధిగా

ఉంటున్నా, ఉపాధి ఆత్మను బంధించలేదు. అట్టి ఆత్మకే ఈశ్వరుడని పేరు. అతడొక్కడే ప్రాణులన్నింటిలో అంతర్యామిగా ఉంటున్నాడు. జగత్తులోని జీవులెవ్వరూ అతడి కన్నా భిన్నమైనవారు కారు. అందువల్లనే అతడా క్షేత్రాలన్నింటికీ క్షేత్రజ్ఞుడుగా ఉన్నాడు. ఇక జ్ఞానం అంటే, 1. క్షేత్రము–క్షేత్రజ్ఞుడు; 2. ప్రకృతి; పురుషుడు అన్న ఈ రెండు తత్త్వాల్ని తెలుసుకోవడాన్నే జ్ఞానం అంటారు. క్షేత్రాన్ని గూర్చి తెలిపేది అపరవిద్య. క్షేత్రజ్ఞుని గూర్చి తెలిపేది పరవిద్య అని చెప్పబడుతోంది. వేదాలు, వ్యాకరణం భూత భౌతిక శాస్త్రాలన్నీ అపరవిద్యలు. బ్రహ్మ జ్ఞాన మొక్కటే పరవిద్య. అపర విద్యలతో ప్రారంభించి, పరవిద్యను చేరుకోవవడాన్నే జ్ఞానం అంటారు.

"ఇంటి నిండా దీపాలు వెలుగుతున్నప్పుడే ధనవంతుని ఇల్లు ప్రకాశిస్తూ ఉంటుంది. ధనహీనుడు ఇంట్లో దీపాలుండవు; అంధకారంలో జీవిస్తాడు. అట్లాగే, ఈ శరీరం భగవంతుని ఆలయం. అందులో ఎప్పుడూ జ్ఞానదీపం వెలుగుతూనే ఉండాలి. ప్రతి ఒక్కరూ జ్ఞానాన్ని పొందవచ్చు. పరమాత్మ విశాలమైనది. దాన్ని కుదిస్తే ఆత్మ అవుతోంది. లేదా జీవాత్మలన్నీ పరమాత్మకు సంబంధించినవేనని తెలుసుకోవాలి. ఇది ఎట్లాగంటే, ప్రతి ఇంట్లోనూ విద్యుత్తు దీపాలు వెలుగుతూనే ఉంటాయి. వీటన్నింటికీ విద్యుత్తు మాత్రం పవర్ హౌస్ నుండి సరఫరా అవుతుంది. పరజ్ఞానమన్నది నిన్ను, నీ శరీరాన్ని మాత్రమే కాకుండా దైవాన్ని గూర్చి కూడా చెబుతుంది."
- శ్రీరామకృష్ణ పరమహంస

ఆ క్షేత్రమేదో, దాని స్వభావాలు, వికారాలు దేని నుండి ఉత్పత్తి అయ్యాయి? ఆ క్షేత్రజ్ఞుడు ఎవరు? అతడి మహిమ ఎట్టిదో నీకు వివరించి చెప్తాను. విను. **4**

ఈ విషయం నానావిధములైన ఛందస్సుల చేత ఋషులు కీర్తించారు, బ్రహ్మసూత్ర వాక్యాలన్నింటినీ గానం చేశారు. **5**

వేద వేదాంతాలను, పూర్వం ఋషులు, ప్రజల మనోభావాలు, జ్ఞానం బుద్ధికి తగినట్లుగా వృద్ధి చేశారు. అందుకు హేతువాదం, సంగీతం, సాహిత్యం కూడా తోడ్పడ్డాయి.

"నారద మహర్షి జ్ఞానాన్ని, భక్తిని కలిపి గానం చేశాడు. అంటే జ్ఞానంతో కూడిన భక్తి సాధకునికి తప్పని సరిగా అవసరమని భావం." *- శ్రీరామకృష్ణ పరమహంస*

అయిదు సూక్ష్మభూతాలు, అహంకారం, బుద్ధి, మూలప్రకృతి, అయిదు కర్మేంద్రియాలు, అయిదు జ్ఞానేంద్రియాలు, మనస్సు, ఇంద్రియ గోచరాలైన శబ్ద స్పర్శ రూపరస గంధాలు అయిదూ కలసి మొత్తం ఇరవై నాలుగు. వీటినే 24 తత్త్వాలంటారు. **6**

పంచభూతాలు : ఆకాశం, వాయువు, అగ్ని, భూమి, పృథ్వి. ఈ అయిదూ సూక్ష్మంగా ఉంటూ సర్వత్రా వ్యాపించి ఉండటం చేత వీటిని పంచ మహాభూతాలు అంటారు.

అహంకారం : ఇది పంచభూతాలకు కారణభూతమవుతోంది. 'నేను' 'ఉన్నాను' అన్న భావన కలిగించడమే దీని స్వభావం.

బుద్ధి : నిర్ణయాలను ఇదే తీర్మానిస్తుంది. అందువల్లనే దీన్ని నిర్ణయాత్మకము అని అంటూ ఉంటారు.

అవ్యక్తము : అనగా మూల ప్రకృతి అని అర్థం. ఇది కంటికి కనిపించేది కాదు కాబట్టి దీనికి వికారాలుండవు. ఇవన్నీ ఈశ్వర శక్తులే.

దశేంద్రియాలు : కన్ను, ముక్కు, మొదలైన అయిదు జ్ఞానేంద్రియాలు, చేతులు మొదలైన అయిదు కర్మేంద్రియాలు కలసి పది.

మనస్సు : ఇది సంకల్ప వికల్పాలతో కూడుకున్నది. ఇది పై పది ఇంద్రియాలతో కలసి పనిచేస్తుంది.

ఇంద్రియార్థములు : శబ్ద స్పర్శ రూప రస గంధాలు. వీటిని పంచేంద్రియాలకు తన్మాత్రలంటారు.

సాంఖ్యదర్శనం : వీటినే ఇరవై నాలుగు తత్త్వాలంటారు.

ఇచ్ఛాద్వేషములు : ఇవి ఆత్మ యొక్క గుణాలు. ఇవన్నీ తెలుసుకోదగినవే. వీటిని తెలుసుకోవడం వలన క్షేత్రాన్ని గురించిన జ్ఞానం వృద్ధి అవుతుంది. అందువల్లనే భగవానుడు క్షేత్రాన్ని గూర్చి చెప్తున్నాడు.

ఇచ్ఛ : అంటే కోరిక. ఆనందాన్నిచ్చే వస్తువుల్ని మళ్ళీ మళ్ళీ కావాలని కోరుకుంటుంది. ఇది అంతఃకరణము యొక్క ధర్మం.

ద్వేషం : అంటే ఇష్టం లేకపోవడం.

సుఖం : అంటే ఆనందం. శాంతిని చేకూర్చి సత్త్వ గుణాన్ని పెంచేది.

దుఃఖం : ప్రతికూలంగా ఉండి అశాంతిని కలిగించేది.

సంఘాతము : వేరువేరు అవయవాలను, ఇంద్రియాల్ని కలిపి ఉంచేది. ఇదే శరీరం లేక క్షేత్రం.

చేతనము : అనుభవాన్ని వ్యక్తం చెయ్యడాన్నే చేతనమంటారు. శరీరంలో ఇటువంటి చేతనం ఉండటం వల్లనే దానిని క్షేత్రమన్నారు.

ధృతి : దృఢత్వము లేక స్థిరత్వము. ఇచ్ఛ మొదలుకొని ధృతి వరకు ఇవన్నీ అంతఃకరణము యొక్క వికారాలే. ఈ శరీరమే క్షేత్రం.

> *"ఈ శరీరం ఉపయోగం లేనిదని, నశించేదే అయితే, ఆత్మజ్ఞానులు దాన్నెందుకు కాపాడుకుంటున్నారు? వ్యర్థంగాను, ఖాళీగా ఉన్న పెట్టెను ఎవరైనా జాగ్రత్తగా దాస్తారా? ఖరీదైన ఆభరణాలు, డబ్బు ఉన్న పెట్టెనే జనులు జాగ్రత్తగా కాపాడుతారు. అట్లాగే భక్తులు ఈశ్వరుడు నివసిస్తున్న ఈ శరీరాన్నే జాగ్రత్తగా చూసుకుంటారు. దీన్ని అలక్ష్యంగా వదిలెయ్యలేరు. మన శరీరాలన్నీ ఈశ్వరుడనే సంపదలున్న పెట్టెవంటివే."*
>
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

తన్నుతాను పొగుడుకోకుండా ఉండటం, దంబం లేకుండా ఉండటం, హింసలు చెయ్యకుండా ఉండటం, ఓర్పు కలిగి ఉండటం, ఋజువర్తన, గురుసేవ, శుచిత్వము, పట్టుదల, ఆత్మనిగ్రహము–**7**

విషయములయందు ఆసక్తి లేకపోవడం, అహంకారం లేకపోవడం, జనన మరణాలు ముసలితనం, వ్యాధులు వలన కలిగే దుఃఖాలను – **8**

అన్న ఈ గుణాలన్నీ జ్ఞాన హేతువులు కాబట్టి జ్ఞానమనే చెప్పాలి. జన్మాదులన్నీ దుఃఖాలు కాకపోయినా దుఃఖానికి కారణాలు కావడం వలన వాటిని గూర్చి కొంత తెలుసుకోవాలి.

జన్మదుఃఖం : గర్భవాసంలో మలమూత్రాదుల మధ్య తొమ్మిది నెలలపాటు ఉండటం.

మరణదుఃఖం : ఇంద్రియాలు పని చెయ్యకుండా ఉండటం, నరాలన్నీ బిగుసుకుపోవడం, మరణ తాపం, వాటిని గూర్చిన ఆలోచన.

జరాదుఃఖం : కర్మేంద్రియాలు శిథిలమైపోవడం. వార్ధక్య బాధలు.

వ్యాధి *దుఃఖం :* దేహతాపం, జ్వర అతిసారం వంటి వ్యాధులెన్నో.

ఈ దుఃఖాలన్నింటినీ మళ్ళీమళ్ళీ ఆలోచిస్తూ ఉండటం వల్ల వివేకవంతునికి వైరాగ్యం కలిగి మోక్షంపై కోరిక బలమవుతుంది. ఇవన్నీ జ్ఞానాన్ని వృద్ధిచేసేవే కాబట్టి దీన్నికూడా జ్ఞానమనే అంటారు.

"ఇంద్రియ విషయాల యందు ఎంత వరకు ఆసక్తి తగ్గుతుందో అంతకంతా భగవంతునిపై భక్తి అధికమవుతుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

భార్యాపుత్రులందు, గృహాదులందు తమ సొంతమన్న ఆసక్తి లేకుండా ఉండటం. శుభాశుభ విషయాల్లో మనస్సును బుద్ధితో కలసి ఉండేట్లు చెయ్యడం – **9**

భార్యాపుత్రులు, ఇల్లు వాకిళ్ళు, పొలంపుత్రవంటి వాటిపైన గాఢాభిమానం కలిగి ఉండటం వలన ఎల్లప్పుడూ వాటిపై మనస్సు ఆసక్తి చూపకుండా ఉండటాన్ని అవభిష్వంగం అంటారు. ఈ ఆసక్తి లేకుండా ఉండటం అనేది జ్ఞానం కోసమే కాబట్టి అవి కూడా జ్ఞానమే. అంటే నిత్యమూ సమబుద్ధిని కలిగి ఉండటం కూడా జ్ఞానమే.

"నీ ఆశకు పాత్రమైన వాటియందు నీ ఇష్టదైవాన్ని చూడగలిగితే, సులభంగా మనస్సు భగవంతుని వెతుక్కుంటూ వెళ్ళడం నువ్వు గమనిస్తావు." - శ్రీరామకృష్ణ పరమహంస

నా యందు నిత్యమైన అనన్య భక్తి, ఏకాంతవాసంపై కోరిక, సామాన్య జనులతో కలసి మెలసి ఉండాలనే కోరిక లేకపోవడం – **10**

భగవంతునితో సమానమైనదేదీ లేదని దృఢమైన నమ్మకం కలిగి ఉండటం, మనస్సు ఆయన యందే పూర్తిగా లగ్నం చేసి ఉంచడం, అత్యవసరం. లౌకిక జనాలతో కలసి మెలసి ఉండేందుకు ఇష్టపడక పోవడం. అంటే అది పూర్తిగా భగవంతునికే సొంతం అన్న భావన కలిగి ఉండటం. ఇవన్నీ కూడా జ్ఞానాభివృద్ధికే దారితీస్తాయి.

"దీపాన్ని చూడగానే కీటకాలు పరుగెత్తుకొస్తున్నాయి. పంచదార పాకాన్ని పసిగట్టగానే

చీమ బారులు తీరి అందులో పడి చావడానికైనా ఇష్టపడుతున్నాయి. కానీ వెనుతిరగడం లేదు. అట్లాగే భక్తుడు నిరంతరం భగవద్ధ్యానం చేస్తూ ఉంటాడేకాని ఇతర విషయాలపై ఆసక్తి చూపడు." - శ్రీరామకృష్ణ పరమహంస

నిరంతరం ఆత్మజ్ఞానం కలిగి ఉండటం, తత్త్వ జ్ఞానం యొక్క ప్రయోజనాన్ని పరిశోధించి తెలుసుకోవడం కూడా జ్ఞానమే అవుతుంది. **11**

"ఈశ్వరుడు సర్వత్రా వ్యాపించి ఉన్నవాడైతే మనం ఎందువల్ల చూడలేక పోతున్నాం? కొలనుగట్టు పై నుండి చూస్తే కొలనంతా దట్టంగా పాచితో కప్పేసి ఉండటం చూస్తాం. నీరు ఎక్కడా కనిపించదు. నీటిని చూడాలంటే పైనున్న పాచిని తొలగించాలి. అట్లాగే మన నేత్రాలన్నీ మాయ అనే తెరచేత మూయబడి ఈశ్వరుని చూడనీయడం లేదు. అందువల్ల ఈశ్వరుని చూడాలంటే ముందుగా నీ కళ్ళకు పట్టిన మాయ అనే పొరను తొలగించు. అప్పుడు ఈశ్వరుని సర్వవ్యాప్తుని చూస్తావు."

- శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునా! తెలుసుకోదగిన దేదో దానిని గూర్చి చెప్తున్నాను, విను. దేనిని గురించి తెలుసుకోవడం వలన మోక్షం కలుగుతుందో దానిని చెప్తున్నాను. అనాదియైనట్టి, ఉత్పత్తిని గూర్చి తెలియనట్టి పరబ్రహ్మమే తెలుసుకోదగినది, అజ్ఞేయమైనట్టి పరబ్రహ్మను సత్తు అనడానికి వీల్లేదు అసత్తు అనడానికీ వీలులేదు. **12**

"అఖండ పరబ్రహ్మమును సమాధియందు మాత్రమే తెలుసుకోగలం. ఆ తర్వాత అంతా మౌనమే; జీవుడు జగత్తు వీటి గురించిన పరిశోధనలు, జ్ఞానము, అజ్ఞానము అనే పదాలన్నీ మరుగున పడిపోతున్నాయి. ఇక్కడ స్వరూపం తప్ప రెండోది ఉండదు. నిజానికి ఉప్పు బొమ్మ సముద్రంలో మునిగిన తర్వాత తన అనుభవాల్ని చెప్పేందుకు బయటకు రావడంలేదు. ఇదే బ్రహ్మజ్ఞానం." - శ్రీరామకృష్ణ పరమహంస

అనంతమైన బ్రహ్మమే అంతటా కాళ్ళు చేతులూ కలిగి, నేత్రాలు శిరస్సులు ముఖాలు గలదై సర్వత్రా వ్యాపించి ఉంది. **13**

ప్రాణుల యొక్క ఇంద్రియాల రూపంగాను, ఉపాధుల ద్వారాను క్షేత్రజ్ఞుని అస్తిత్వం తెలుస్తోంది. క్షేత్రం అనే ఉపాధి కారణంగానే అజ్ఞేయమైన వాడు క్షేత్రజ్ఞుడని తెలుపబడుతున్నాడు. క్షేత్రమనే ఉపాధి చేతులు, కాళ్ళు, కళ్ళు వంటి భేదాలతో అనేక విధాలుగా విభక్తమై ఉంది. నిజానికి ఉపాధుల భేదంతో క్షేత్రానికి చెప్పి భేదాలన్నీ క్షేత్రజ్ఞుని విషయంలో మిథ్యయే. అందుచేత వాటన్నింటినీ తొలగించి అజ్ఞేయం అయిన బ్రహ్మ సత్తు అనడానికి వీల్లేదు. జ్ఞేయమైన బ్రహ్మానికి కాళ్ళు చేతులు వంటి ఇంద్రియాలన్నీ ఆరోపించడం వల్ల నిజంగానే బ్రహ్మకు ఇంద్రియాలున్నాయన్న భ్రమ కలుగుతోందేమోనన్న–

"అహంకారం నాలో ఉన్నంత వరకు జీవునిగాను, జగత్తుగాను, వేరువేరు రూపాలతో తనను ప్రదర్శించుకునే ఈశ్వరుడు నా ముందున్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

పరమేశ్వరుడు ఇంద్రియాలన్నింటికీ మూలాధారుడైనా కూడా ఇంద్రియాలులేని వాడే. అతడు జీవులందర్నీ పోషించేవాడే అయినా ఆసక్తి లేనివాడు. అతడు ప్రకృతి గుణాలకు అతీతుడు. **14**

సూర్యరశ్మి సహాయంతో వస్తువుల్ని చూడగలుగుతున్నాం. అయితే ఈ వస్తువులన్నీ సూర్యరశ్మిలో లేవు. సూర్యరశ్మి ఆయా వస్తువులు కనిపించేందుకు సహాయపడుతుందే గాని ఆయా వస్తువుల్లో లేదు. అట్లాగే ఆత్మ చైతన్యం ఇంద్రియములందు ఇటువంటి అనాసక్తినే కలిగిస్తోంది.

"ఆకారంతోను, నిరాకారంతో కూడా భగవంతుడొక్కడే. మొదటి దాన్ని నమ్మితే రెండోదీ నమ్మినట్లే అవుతుంది. ప్రకాశించే శక్తిలేని అగ్ని, అగ్నిలేని ప్రకాశమూ ఉండవు. అట్లాగే కిరణాలు లేని సూర్యుడు, సూర్యుడులేని కిరణాలు ఉండవు. అట్లాగే గుణ స్వరూపుడైన ఈశ్వరుడు లేని నిర్గుణ స్వరూపుడు గాని, నిర్గుణ స్వరూపుడు లేని గుణ స్వరూపుణ్ణి గురించి గాని ఊహించలేము." - శ్రీరామకృష్ణ పరమహంస

అది ప్రాణులకు లోపలా బయటా ఉండేది, చలనం లేనిది, చలనం ఉండేదీ, అతి సూక్ష్మమైనది, దూరంగాను, దగ్గరగాకూడా ఉండేదీ. **15**

సముద్రంలో తేలే మంచు గడ్డకు లోపలా బయటా ఉన్నది నీరే. అటువంటి పరమాత్మ సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. సముద్రం పైభాగాన అలలతో కదులుతున్నా అట్టడుగున కదలకుండా నిశ్చలంగా ఉంటుంది. పరమాత్మ గుణాలతో కూడి ఉన్నాడు. ప్రకృతిగా ఉన్నాడు. గుణములు లేని చోట నిశ్చలంగా ఉన్నాడు. అట్లాగే శుద్ధ చైతన్యమైన పరమాత్మ చైతన్యమగు నిర్గుణ బ్రహ్మము జ్ఞాన స్వరూపుడైనా పరిపక్వం చెందని పామరులకు కనిపించడం లేదు.

"సమాధి స్థితి యందుండి బయటి ప్రపంచంలో ప్రవేశించిన వానికి అహంకారం కొద్దిగా ఉంటుంది. అందువల్ల తనను, జీవులను, జగత్తును విడివిడిగా చూస్తాడు. నీకంటూ ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉన్నంతవరకు అంటే నీయందు అహంకారం ఉన్నంత వరకు ఈశ్వరుడు రూపం కలవాడన్న భావన తప్పించి ఎంతమాత్రం అతనిని ధ్యానించడంలో గాని, చూడటానికి గాని నీకు సాధ్యం కాదు. అంత వరకు అఖండ నిర్గుణ బ్రహ్మమును నీవు లోపల బయట కూడా సగుణ బ్రహ్మంగా మాత్రమే చూడగలవు. సగుణ బ్రహ్మము యొక్క ఈ రూపములు అసత్యములు కానేరవు. శరీరము మనస్సు ప్రపంచం వీటన్నింటికీ అతీతమైంది." - శ్రీరామకృష్ణ పరమహంస

ప్రతి దేహంలో ఉండే చైతన్యం బ్రహ్మమే. అయినా ప్రతి దేహంలోనూ ఆకాశంలాగా అవిభక్తంగాను, ఏకంగాను ఉన్నట్లు ఉంటుంది. అయితే విభిన్న ప్రాణులందు వేరేవేరుగా ఉన్నట్లుగాను, విభజించబడి ఉన్నట్లుగాను అనిపిస్తుంది. **16**

ఆకాశం సర్వత్రా వ్యాపించి ఉంది. అది ఒక్కొక్క ప్రాణియందు విడివిడిగా ఉన్నట్లు అనిపిస్తుంది. అట్టి వస్తువులన్నిట్లోను ఆకాశం వ్యాపించి ఉంటుంది. పరమాత్మ కూడా అట్లాంటివాడే. భూమి, వాయువు, అగ్ని, నీరు అనే భూతాలకు ఆకాశం ఎట్లా ఆధారంగా ఉంటోందో అదే రీతిగా బ్రహ్మం కూడా జీవుడు, జగత్తు వంటి వస్తువులన్నింటికీ ఆధారంగా ఉన్నాడు. ప్రళయ కాలంలో ఇవన్నీ పరమాత్మలో లీనమైపోతాయి. సృష్టి సమయంలో ఇవన్నీ ఆత్మయందే ఉద్భవిస్తాయి. మళ్ళీ ప్రళయ కాలంలో అన్నీ ఆత్మలోనే లీనమవుతున్నాయి. సముద్రంలో నుండి పుట్టే అలలు మళ్ళీ సముద్రంలోనే కలసిపోతున్నాయి.

"నిర్మలమైన ఆకాశంలో దట్టంగా మబ్బులు క్రమ్ముతాయి. గాలి వాటన్నింటినీ దూరంగా తోసేయడం చూసిన ఒక పరమహంస సంతోషంతో గంతులు వేస్తూ, ఈ జగత్తు కూడా ఇట్లాంటిదే. కానీ ఇప్పుడు కనిపించడం లేదు. బ్రహ్మమే నిర్మలాకాశం వలె మొదట్లో జగత్తును వస్తువుల్ని సృష్టించింది. తర్వాత అదే బ్రహ్మం అనే గాలి చేత చెదరగొట్టబడుతోంది' అన్నాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ప్రకాశాలన్నింటికీ ప్రకాశాన్నిచ్చే ఆ వస్తువు, అంధకారానికి అతీతమైనది, జ్ఞానమైనది, జ్ఞేయమైనది, జ్ఞానం చేత మాత్రమే తెలుసుకోదగ్గది అయినది, జీవుల హృదయాలన్నింట్లోను నెలకొని ఉన్నది. **17**

వెలుగునిచ్చేది సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు మొదలైనవి. అవన్నీ కూడా ప్రళయకాలంలో తమ వెలుగును కోల్పోతున్నాయి. ఆత్మ నుండి గ్రహించిన భావాలను బుద్ధి కోల్పోతుంది. కానీ ఆత్మ మాత్రం తన ప్రకాశాన్ని పోగొట్టుకోదు. జడపదార్థాలకు కలిగే వెలుగు చీకట్లు ఆత్మ చైతన్యాన్ని బాధించవు.

"హృదయంలో ఈశ్వరుని చూసేవాడు బయట కూడా చూస్తున్నాడు. తనలో ఉన్న పరమేశ్వరుని చూడలేనివాడు బయట కూడా అతనిని చూడలేడు. కనుక దేవాలయంలో దైవాన్ని చూసేవాడు అఖిలాండమునందు కూడా అతడిని చూడగలడు." - శ్రీరామకృష్ణ పరమహంస

క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయములని క్లుప్తంగా చెప్పబడింది. దీన్ని తెలుసుకున్న భక్తుడు నన్ను చేరేందుకు అర్హుడై ఉంటాడు. **18**

"ఈశ్వరుని దర్శించినవాడే జ్ఞాని. అతడు శిశువు వంటి స్వభావాన్ని కలిగి ఉంటాడు. పసిబిడ్డకు ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉన్నప్పటికీ అది వాస్తవమైనది కాదు. బాహ్యరూపం వంటిదే అతడి స్వభావం కూడా. అంటే యుక్తవయస్కుల బాహ్యరూపం వంటిది కాదు." - శ్రీరామకృష్ణ పరమహంస

ప్రకృతి పురుషులు ఆదియే లేని వారని తెలుసుకో. అట్లాగే వికారాలు గుణాలు ప్రకృతి వల్ల కలిగినవేనని కూడా తెలుసుకో. **19**

బుద్ధి మొదలుకొని దేహేంద్రియాల వరకుగల వికారాలు సుఖదుఃఖరూపమైన గుణాలు, ఇవన్నీ ప్రకృతి వల్ల కలిగేవే. అంటే ఈశ్వరుని యొక్క మాయా శక్తి వల్ల కలిగేవేనని తెలుసుకో. వికారాలకు గుణాలకు ప్రకృతే కారణం అని చెప్పడం వల్ల పురుషుడైన ఆత్మ నశించేది కాదని, కర్తృత్వం లేనిదని, గుణాలకు అతీతమైనదని తెలుస్తోంది.

"సముద్రజలాలు కొన్ని సమయాల్లో ప్రశాంతంగాను, మరికొన్ని సమయాల్లో అల్లకల్లోలంగాను విజృంభించినట్లే, బ్రహ్మము, మాయా ఉన్నాయి. అలలతో విజృంభించే సముద్రం మాయ, నిశ్చలంగా ఉండే సముద్రం బ్రహ్మము."

- శ్రీరామకృష్ణ పరమహంస

శరీరానికి, ఇంద్రియాలకు కారణం ప్రకృతి. సుఖదుఃఖాలు అనుభవించడానికి కారణం జీవుడు. **20**

శరీరం కార్యం. దానిలో ఉండే పది ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం అన్న ఈ పదమూడూ కరణాలు. ఇందుకు కారణం ప్రకృతి. ఈ కార్య, కరణాలను ఉత్పత్తి చేసే కర్తృత్వ భావాన్నే, కార్యకరణ కర్తృత్వం అంటారు.

ఇక పురుషుడు, జీవుడు, క్షేత్రజ్ఞుడు, భోక్త అనే పదాలన్నింటికీ అర్థం ఒక్కటే. సుఖదుఃఖాల భోక్తృత్వం జీవునికి ఎట్లా వస్తోంది? భోగ్యరూపమైన ప్రకృతితో, పురుషునికి అవిద్యారూపమైన సంయోగం కలగడంతో భోక్తృత్వ భావం వస్తోంది. ఈ విధంగా ప్రకృతికి కార్యకారణ కర్తృత్వం, పురుషునికి సుఖదుఃఖ భోక్తృత్వం సంభవిస్తున్నాయి.

"బ్రహ్మజ్ఞాన ప్రాప్తి, పరమానంద భోగము మొదలైనవన్నీ మనకు మాయ ద్వారా లభిస్తున్నాయి. కనుక మాయ నుండియే ద్వైతము, తక్కిన వ్యవహారములు ఉత్పత్తి అవుతున్నాయి. మాయకు అవతల భోగి, భోగము అనేవి ఉండవు."

- శ్రీరామకృష్ణ పరమహంస

పురుషుడు (జీవుడు) ప్రకృతి యందు పుట్టి, ప్రకృతి యందు ఉంటూ ప్రకృతి గుణాలను అనుభవిస్తున్నాడు. అతడికి మంచి చెడు జన్మలు కలగడానికి గల కారణం అతడికి ఇటువంటి గుణములందు ఆసక్తి ఉండటం వల్లనే. అందువల్ల అతడు ఉత్తమ అధమ జన్మలను పొందుతున్నాడు. **21**

ఎండలో నిలబడ్డవాడు ఎండవేడిని అనుభవిస్తున్నాడు. మంచులో ఉన్నవాడు చలిని అనుభవిస్తున్నాడు. అట్లాగే జీవాత్మ ప్రకృతిలో ఉన్నప్పుడు ప్రకృతి గుణాల్ని అనుభవిస్తున్నాడు. అంటే జీవాత్మ ప్రకృతి యందున్నందువల్ల 'నేను సంతోషంగా ఉన్నాను' 'నేను దుఃఖంలో ఉన్నాను' 'నేను మైకంలో ఉన్నాను' 'నేను స్పృహలో ఉన్నాను' అన్న భావాలు గుణముతో కూడి ఉండటం చేత కలుగుతున్నాయి. ఇటువంటి అనురక్తే మళ్ళీ జన్మలెత్తేందుకు కారణం. గొప్ప భావములందు అనురక్తి గలవాడు దేవతలతో సమానమైన ఉత్తమ జన్మలు పొందుతున్నాడు. నీచమైన ఆలోచనలు చేసినవాడు

నీచమైన జన్మలు పొందుతున్నాడు. అంటే గుణములందు ఆసక్తి కలిగి ఉండటమే మానవ జన్మ లెత్తేందుకు కారణం.

అయినా, ఈ దేహంలోనే దివ్యపురుషుడు, యజమాని, సాక్షి, అనుభవించేవాడు, మహేశ్వరుడు, అని పరమాత్మునిగా తెలియబడేవాడు అయిన దివ్య భోక్త మరొకడున్నాడు. **22**

శరీరంలో ఎన్నెన్నో కర్మలు నడుస్తూ ఉండగా అజ్ఞానంలో ఉండే జీవుడు తానే వీటన్నింటికీ కర్త అని అనుకుంటూ ఉంటాడు. ఆ జీవ చైతన్యం పరమాత్ముని అంశయే అయిఉన్నది. (మనలో) ఉన్న ఉత్తముడు ఎట్లాంటివాడంటే,

ఉపద్రష్టా : దగ్గరుండి చూస్తూ ఉండేవాడు. లేక సాక్షి, మనస్సుకు సాక్షిగా ఉండే పరమాత్మ శరీరంలో జరిగే వాటన్నింటినీ చూస్తూనే ఉంటాడు.

అనుమంతా : అనుమతినిచ్చేవాడు. లేక అంగీకారాన్ని తెలిపేవాడు. ఏమీ తెలియని పామరునికి మంచిని గ్రహించడంగాని చెడును తిరస్కరించడం గాని తెలియదు. అదే జ్ఞాని అయితే అతడికి మంచిచెడుల జ్ఞానం స్పష్టంగా ఉంటుంది. కనుక పరమాత్ముడు ఈ విధంగా అనుమతించేవాడుగా ఉన్నాడు.

భర్తా : ఆటలాడేందుకు అనుమతి ఇవ్వడం గాని, ఆటల్ని చూడటం గానీ అంతా సులభంగా చెయ్యొచ్చు. కానీ ఆ క్రీడలకయ్యే ఖర్చు భరించేవాడే అందరి కన్నా గొప్పవాడు. అటువంటి వానినే భర్తా అంటున్నారు. అంటే భరించేవాడని అర్థం. సినిమాను సినిమా తెర భరిస్తున్నట్లుగా భగవంతుడు ప్రకృతిని భరిస్తున్నాడు.

భోక్తా : సినిమా తెర ఆ సినిమాను భరిస్తున్నప్పటికీ, ఆ సినిమాను చూసి ఆ తెర ఆనందించలేదు. ఎందువల్ల? తెర జడపదార్థం కావడం చేతనే. భర్త భార్యతో కలసి దాంపత్య జీవితాన్ని అనుభవిస్తున్నట్లే చిన్మయరూపుడు, ఆనంద స్వరూపుడు అయిన పరమ పురుషుడు ప్రకృతికి భోక్తగా ఉన్నాడు.

మహేశ్వరుడు : భార్యతో కలిసి దాంపత్య జీవితాన్ని అనుభవించవచ్చు. అంతమాత్రం చేత భార్య అతడు చెప్పినట్లు నడుచుకోకపోవచ్చు. కానీ పరమ పురుషుడు అట్లాంటివాడు కాదు. రాజుకు సేవకులంతా విధేయులై ఉన్నట్లుగా మహేశ్వరుని పాలనకు ప్రకృతి (క్షేత్రం) పూర్తిగా బద్ధమై ఉన్నది. అతడి ఆజ్ఞను మీరలేదు.

> *"ప్రకృతీ పురుషుల మూలంగానే ప్రపంచం పుట్టింది. అది ఎట్లాగంటే, గృహ యజమాని ఇంట్లో కూర్చుని అందరిపైనా అధికారం చెలాయిస్తున్నాడు. గృహిణి హడావిడిగా తిరుగుతూ పనులన్నీ చక్కబెడుతోంది. చురుగ్గా పనులు చేస్తూనే ఇంటి కొచ్చిన వారికి మర్యాదలు చేస్తోంది. మధ్యమధ్యలో భర్త దగ్గరకుపోయి జరిగిందంతా చెప్పి*

జరగబోయే పనులను గూర్చి అడిగి తెలుసుకుంటోంది. భర్త సమయానుకూలంగా సలహాలు చెప్తూ ఆమెకు సహాయపడుతున్నాడు. ప్రకృతీ పురుషుల పనితీరు కూడా అట్లాగే ఉంటుంది." - శ్రీరామకృష్ణ పరమహంస

ప్రకృతీ పురుషుల పనితీరును ఈ విధంగా తెలుసుకొన్నవాడు ఏ విధంగా జీవిస్తున్నా అతడు మళ్ళీ తిరిగి జన్మించడం లేదు. **23**

అద్దంలో చూస్తే వాడి రూపురేఖలన్నింటినీ యథాతథంగా చూపిస్తుంది. అందువల్ల అద్దానికొచ్చే నష్టం ఏమీ ఉండదు. అట్లాగే ప్రకృతి వికారము చేత బ్రహ్మానికి ఏమీ నష్టం ఉండదు. బ్రహ్మము నెరిగిన వాడు బ్రహ్మమవుతున్నాడు. ప్రారబ్ధకర్మ చేత అతడి శరీరానికి కలిగే కష్టనష్టాలేవీ అతణ్ణి బాధించవు. ప్రకృతి యొక్క రూపాన్ని ఆరాధించినప్పటికీ అతడికి ఏ విధమైన ఆసక్తీ ఉండదు. అట్లాగే ప్రకృతి ఎండమావిలాంటిదని ఎరిగి నిర్లక్ష్యం చెయ్యడంవల్ల అతడికొచ్చే నష్టం ఏమీ ఉండదు.

అంటే జ్ఞాని అయినవాడు వీటి మధ్య జీవన్ముక్తుడుగా ఉంటున్నాడు. దేహం విడిచిన తర్వాత అతడికి జన్మ ఉండదు.

"పచ్చి కుండ పగిలితే కుమ్మరి మళ్ళీ ఆ మట్టితో క్రొత్త కుండను తయారు చేస్తాడు. కానీ కాల్చిన కుండపగిలితే ఆ మట్టి మళ్ళీ కుండను చేసేందుకు పనికిరాదు. అట్లాగే అజ్ఞానిగా మరణించినవాడే మళ్ళీ మళ్ళీ పుడుతున్నాడు. కానీ బ్రహ్మజ్ఞానం పొందినవానికి మళ్ళీ జన్మ ఉండదు." - శ్రీరామకృష్ణ పరమహంస

కొందరు ధ్యానయోగం చేత ఆత్మను ఆత్మయందే గ్రహిస్తున్నారు. మరికొందరు జ్ఞానయోగం చేతను, ఇంకొందరు కర్మ యోగం చేతను చూస్తున్నారు. **24**

ధ్యానం *:* శబ్దం వంటి విషయాలనుండి చెవి మొదలైన ఇంద్రియాల్ని మరల్చి మనస్సును పరమాత్మ యందు లగ్నం చెయ్యడం.

జ్ఞానయోగం *:* సత్వరజస్తమో గుణాలకు అతీతుడిగా ఉంటూ పరమాత్మను ధ్యానం చెయ్యడం. అంటే తాను సాక్షిని మాత్రమేనని తలచి ప్రకృతికి బద్ధుడు కాకుండా ఉండటం.

కర్మయోగం *:* ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేయడం.

ఇంకొందరు పై మూడు విధాలూ అనుష్ఠించలేకపోయినా పెద్దలు నడిచిన మార్గంలో నమ్మకం కలిగి, ఆ మార్గాన్నే అనుసరించి మరణాన్ని అతిక్రమిస్తున్నారు. **25**

ఈ మార్గాన్నే భక్తి యోగమంటారు. వీరికి శాస్త్రజ్ఞానం ఉండదు. గోకులంలోని గోపికలంతా ఇట్లాంటివారే. పరిశుద్ధమైన భక్తి చేత వారంతా శ్రీకృష్ణుని పొందగలిగారు.

"భగవద్భక్తిని ఒక పులితో పోల్చవచ్చు. పులి మృగాల్ని భుజించినట్లుగా భక్తులు కోరికల్ని చంపి ఆకలి తీర్చుకుంటారు. ఒకసారి భగవద్భక్తి పైన మనస్సు లగ్నమైతే వారిలో నుండి కామక్రోధాది శత్రువులన్నీ నశించిపోతాయి. బృందావనంలో గోపస్త్రీలు

శ్రీకృష్ణుని యందు ఇటువంటి తీవ్రభక్తిని కలిగి గోలోకాన్ని పొందారు."

- శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునా ! స్థావర జంగమాల వంటి ఎటువంటి అల్పమైన వస్తువులైనప్పటికీ క్షేత్రజ్ఞ సంయోగం వల్లనే జన్మిస్తున్నాయని తెలుసుకో. **26**

తెరపైన సినిమాను చూస్తున్నాం. తెరమీద పడే నీడా వెలుతురుల కలయికయే దృశ్యాలకు కారణమవుతున్నది. కదలికలేని తెరపై కదిలే బొమ్మల్ని చూస్తున్నాం. రంగుల కలయికచేత తెరమీద మంటల్ని చూస్తున్నాం. అట్లాగే చిదాకాశమనే తెరపైన మూడు గుణాలతో కూడుకున్న క్షేత్రం ఆరోపించబడుతోంది. ఈ విధమైన క్షేత్ర, కేత్రజ్ఞుల కలయిక చేత జడపదార్థమైన క్షేత్రం బుద్ధిశాలివలె తెలుస్తోంది. నిజానికి అట్లా తెలుసుకునేది ఆత్మయే. జనన మరణాలు లేని ఆత్మ జననమరణాలు ఉన్నట్లు కనిపిస్తోంది. ఇది ఆత్మకే జరుగుతోందన్న మిథ్యాజ్ఞానం పరులకు కలుగుతోంది. తెర మీద ప్రమాదం జరిగితే తగలబడటం లేదు గదా. ప్రపంచమందలి సృష్టి స్థితి లయములు కూడా ఇటువంటివేనని జ్ఞాని తెలుసుకుంటాడు. క్షేత్రక్షేత్రజ్ఞులను విభజించి యథార్థాన్ని తెలుసుకోవడమే జ్ఞానం.

"నువ్వు వ్యక్తి స్వరూపివిగా ఉన్నంత వరకు, అంటే జీవుడుగా ఉన్నంత వరకు వెన్న, మజ్జిగ రెండింటినీ అంగీకరించాలి. అంటే ఈశ్వరుడు జగత్తు అనే రెండింటినీ అంగీకరించాలి. పై ఉపమానాన్ని వివరించి చెప్పాలంటే, పాలే సమాధి మూలంగా తెలుసుకున్న బ్రహ్మము. వెన్నయే ఈశ్వరుడు. మజ్జిగ, ఇరవై నాలుగు తత్త్వాలతో కూడిన ప్రపంచం." *- శ్రీరామకృష్ణ పరమహంస*

జీవులన్నింటి యందు సమబుద్ధి కలిగినవాడును, నశించే సమస్త జీవులలో తానుంటున్నా కూడా తాను నశించనివాడును అయినట్టి పరమేశ్వరుని ఎవరైతే చూడగలుగుతున్నాడో అతడే నిజమైన దృష్టి గలవాడు. **27**

సినిమాలు ఎన్ని మార్చిమార్చి వేస్తున్నా తెరమాత్రం స్థిరంగా ఉంటోంది. అట్లాగే సినిమాలో దృశ్యాలు కూడా కనిపించి అదృశ్యమవుతున్నాయి. కానీ తెరయందు ఎటువంటి మార్పులేక స్థిరంగా ఉంది. అట్లాగే చిదాకాశమనే తెరపైన జగత్తు అనే చిత్రం ప్రదర్శించబడి తిరిగి మాయమవుతోంది. సినమా జీవంలేనిది. జగత్తు అనే చిత్రం జీవమున్నది. ఎందువల్లనంటే అది పరమాత్మ నుండి చైతన్యాన్ని పొందుతోంది. తెర లేకుండా చిత్రం ఎట్లాగైతే ఉండదో అట్లాగే పరమేశ్వరుడు లేని ప్రపంచం ఉండదు.

"సూర్యుడు ప్రపంచానికంతటికీ వెలుగునిస్తున్నా చిన్న మేఘమొకటి అతడిని కనిపించకుండా చేస్తోంది. అట్లాగే మాయ అనే తెర భగవంతుని మన కంటికి కనిపించకుండా చేస్తోంది. అయితే మాయను తొలగించి చూసే వాడు సర్వం సచ్చిదానంద స్వరూపంగా తెలుసుకుంటాడు." *- శ్రీరామకృష్ణ పరమహంస*

సమస్త జీవులలోనూ అంతర్గతంగా ఉండే ఈశ్వరుని చూడగలిగిన వాడు తనను తాను నాశనం చేసుకోలేడు. అంటే పరమగతిని పొందుతున్నాడు. **28**

మానవుడు చేసే దుష్టకార్యాలన్నింటికీ కారణం అజ్ఞానమే. ఒక్కొక్క జన్మలోనూ మరణించి మళ్ళీ జన్మెత్తుతున్నాడు. అజ్ఞానం చేత అనేకసార్లు జననమరణాలకు గురి అవుతున్నాడు. ఇతర ప్రాణులన్నీ తన కంటే వేరైనవని భావిస్తున్నాడు. వాటికి హాని కలిగిస్తున్నాడు. బ్రహ్మజ్ఞాని మాత్రం అట్లా చెయ్యడం లేదు. అతడికి ప్రపంచమంతా బ్రహ్మ స్వరూపంగా కనిపిస్తోంది. అందువల్లనే అతడు పరమగతిని పొందుతున్నాడు.

"పిచ్చిక గూడు నాశనమైతే ఆ పిచ్చుక ఆకాశంలోకి ఎగిరిపోతుంది. అట్లాగే శరీర భ్రాంతి ఉన్నవాడు మనస్సును వదిలేసిన జీవాత్మ అయింది. పరమాత్మ అనే ఆకాశంలోకి ఎగిరి వెళ్ళి సమాధి యందు ఐక్య మవుతోంది."

- శ్రీరామకృష్ణ పరమహంస

కర్మలన్నీ ప్రకృతే చేస్తోందని, ఆత్మ చెయ్యడం లేదని ఎవడు చూస్తున్నాడో అతడే చూసేవాడనబడతాడు. **29**

సూర్యుడున్న చోట వెలుగుంటుంది. అగ్ని ఉన్న చోట వేడి ఉంటుంది. అట్లాగే బ్రహ్మము ఉన్న చోట శక్తి ఉంటుంది. శక్తి లేక ప్రకృతి మూలంగా కార్యాలన్నీ జరుగుతూ ఉంటాయి. బ్రహ్మజ్ఞాని అయినవాడు శరీరంతో ఎన్ని కర్మలైనా చెయ్యవచ్చు. కానీ ఆ కర్మలు అతడి మనఃస్థితిని ఎంతమాత్రమూ ప్రభావితం చెయ్యలేవు.

జీవరాసులన్నీ ఒకే వస్తువు నుండి వచ్చాయని, ఆ వస్తువు నుండే అవన్నీ విస్తరించి ఉన్నాయని ఎవరైతే చూస్తాడో అతడే బ్రహ్మమవుతున్నాడు. **30**

కెరటము, నీటి బిందువు, నురుగు వేరువేరు వస్తువులే అయినా సముద్రం కన్నా భిన్నమైనవి కావు. అన్నీ సముద్రమనే ఒకే వస్తువు నుండి ఉత్పత్తి అయ్యాయి. సముద్రమే తన శక్తిచేత అన్ని రూపాలు దాలుస్తోంది. అట్లాగే అనేక వస్తువులుగా సృష్టించింది ఆ పరబ్రహ్మమేనని తిరిగి అవన్నీ ఆ పరబ్రహ్మమందే లీనమవుతున్నాయి. ఆ మాయాశక్తి ప్రభావం చేత అనేక జీవులుగా సృష్టించబడుతున్నాయి.

"నిశ్చలమైన బ్రహ్మము, చలనంగల శక్తి ఒక్కటే. అఖండ సచ్చిదానంద స్వరూపి ఎవరో అతడే సర్వశక్తి. సర్వానందము, సర్వజ్ఞానము, వీటన్నింటినీ పొంది జగన్మాతగా దర్శనమిస్తున్నాడు; నిప్పు దాని వేడి వలె బ్రహ్మము శక్తి ఒక్కటే.

- శ్రీరామకృష్ణ పరమహంస

కుంతీపుత్రా ! ఆది అంటే కారణం అని అర్థం. అనాది అంటే కారణంలేనిది. అనాది భావమే అనాదిత్వం. పరమాత్మ అనాది అయినందువలన అవ్యయము. అంటే క్షయంలేనివాడు లేదా అవయవ రహితుడు అని. పరమాత్మ నిర్గుణుడు. గుణాలతో కూడుకున్న వస్తువైతే ఆ గుణాలకు క్షయం ఉంటుంది. ఆత్మగుణాలకు అతీతుడు కాబట్టి క్షయం లేదు. అయితే ఆత్మయొక్క ఉనికి శరీరాల్లో

ఉంటుంది కాబట్టి శరీరస్థుడు అంటున్నాం. పరమాత్మ స్వరూపంతో శరీరంలో ఉన్నా కూడా అవ్యయుడు, అనాది, నిర్గుణుడు, నిర్వికారి. కనుకనే తాను కర్మలను చెయ్యడు. అసంగుడు కాబట్టే దేహేంద్రియాది కర్మల వల్ల కలిగే దోషం అతడికి అంటదు. **31**

"బ్రహ్మము ఎట్టిది? బ్రహ్మమునకు గుణాలుండవు. చలనం ఉండదు. రాక పోకలు (జననమరణాలు) లేనిది; మహామేరు పర్వతంలాగా స్థిరమైనది."

- శ్రీరామకృష్ణ పరమహంస

సర్వత్రా వ్యాపించి ఉండే ఆకాశం సూక్ష్మంగా ఉండటం వలన ఎట్లా కళంకం ఉండదో అట్లాగే దేహమంతా నిండియున్న ఆత్మ కళంకం చెందటం లేదు. **32**

నీరు గడ్డకడితే మంచుగాను, నీరుగాను, ఆవిరిగాను మూడు స్థితులు కలిగి ఉంటోంది. అది సూక్ష్మ స్థితిలో ఉన్నా కూడా కళంకాన్ని ఆపాదించలేము. పంచభూతాల్లో ఆకాశం అతి సూక్ష్మమైనది. దానిని ఇతర భూతాలేవీ కళంకం చెయ్యడం లేదు. ఇక ఆత్మకన్నా సూక్ష్మమైనది ఇంకొకటి లేదు. అట్లాగే ఆత్మ అన్ని శరీరాల్లోనూ ఉన్నా కూడా శరీరాలను అంటకుండా ఉంటుంది.

"జ్ఞానము, అజ్ఞానము, కీడుమేలు, ధర్మాధర్మాలు వంటి ద్వంద్వాలన్నింటికీ అతీతంగా, ఉన్నతంగా బ్రహ్మమున్నది." *- శ్రీరామకృష్ణ పరమహంస*

ఓ అర్జునా! ఒక్క సూర్యుడు ప్రపంచాన్నంతా ఎట్లా ప్రకాశింపజేస్తున్నాడో అట్లాగే పరమాత్మ ప్రపంచమంతా ప్రకాశింపజేస్తున్నాడు. **33**

"బ్రహ్మము ఒక దీపం యొక్క వెలుగువంటిది. ఆ వెలుగులో నువ్వు భాగవతం చదువుకోవచ్చు, లేదా చెడు పనులూ చెయ్యవచ్చు, లేదా దొంగ పత్రాలూ సృష్టించవచ్చు. అందరికీ బుద్ధి అనే వెలుగునిచ్చేది బ్రహ్మము. అయితే అతడు మంచి చెడులతో సంబంధం పెట్టుకోడు." *- శ్రీరామకృష్ణ పరమహంస*

దేహము, దేహయజమాని అయిన ఆత్మ, పరమాత్మ అనే మూడు అంశాల మధ్య ఉండే భేదాన్ని తప్పక తెలుసుకోవాలని చెప్పడమే ఈ అధ్యాయ సారాంశం. **34**

వ్యాధిని, రోగిని (వ్యాధిగ్రస్తుని) బాగా ఎరిగిన వైద్యుడు వ్యాధిని తప్పక నయం చెయ్యగలుగుతాడు. ఈ రెంటిలో ఏ ఒక్కదాన్ని తెలుసుకోలేకపోయినా చికిత్స చురుగ్గా సాగదు. అట్లాగే పురుషుడు ప్రకృతి రెంటినీ యథార్థంగా తెలుసుకోవాలి. ఏది పురుషుడో, ఏది ప్రకృతో తెలుసుకునే సామర్థ్యాన్ని సంపాదించుకోవాలి. దీన్ని యథార్థమైన జ్ఞాన దృష్టి చేతనే తెలుసుకోగలుగుతాడే కానీ శాస్త్ర జ్ఞానం పనికి రాదు.

"ప్రపంచము మాయ అని చెప్పడం తేలికే. కానీ దాని అర్థమేమిటో తెలుసా? అది కర్పూరం వెలిగించడం లాంటిది. అంటే శేషం ఏమీ మిగలనిది. బూడిద మాత్రమే మిగిల్చే కట్టెవంటిది కాదు. విచారణ అంతమయ్యేటప్పుడు పరిపూర్ణ సమాధి కలుగుతుంది. అప్పుడు నేను, నువ్వు అన్న భావనలేవీ మిగిలివుండవు."

- శ్రీరామకృష్ణ పరమహంస

14

గుణత్రయ విభాగయోగం

ప్రకృతి వికారాలు ఎలా ఉంటాయో స్పష్టంగా గ్రహించకపోతే పురుషుడు వాటి బంధం నుంచి విడివడలేడు. కార్యకారణ సంబంధం వలన మార్పులు చెంది గుణాలను విశ్లేషించి వాటి వికారాలను, పురుషుణ్ణి వ్యామోహంలో పడవేసే విధానాలను ఈ అధ్యాయం వివరిస్తుంది. అందుకే దీనిని గుణత్రయ విభాగం అని పేర్కొన్నాను.

శ్రీకృష్ణుడు : దేనిని తెలుసుకొని మునులందరూ పరమ సిద్ధిని పొందారో అటువంటి ఉత్తమమైన దివ్య జ్ఞానాన్ని మళ్ళీ నీకిప్పుడు చెప్తాను. **1**

బ్రహ్మజ్ఞానం పొందిన వారు ఇంకా తెలుసుకోవలసింది ఏమీ ఉండదు. వారికి అన్నీ సులభంగా తెలుస్తాయి. అయితే పామరులకు మాత్రం ఇది చాలా కష్టసాధ్యమైనది. పరిపక్వత పొందని వారికి కఠినంగా ఉంటుంది. బ్రహ్మజ్ఞానం పొందిన మహర్షులు సంసార జీవితాన్ని లోపభూయిష్ఠమైనదిగా భావిస్తారు. అంటే శరీర లోపాలను పురుషుని లోపంగా తలచరాదు. ఈ శరీరాన్ని విడిచిన తర్వాత బ్రహ్మజ్ఞానులు పరమాత్మని యందు లీనమవుతున్నారు. దానికి తగిన జ్ఞానాన్ని ఇంకొక రీతిలో భగవానుడు బోధిస్తున్నాడు.

> *"ఈశ్వరుని తెలుసుకునే విద్యయే పరమవిద్య, శాస్త్రాలు, వ్యాకరణం, తర్కం మొదలైనవన్నీ మనస్సును తికమక పెట్టేవే. గ్రంథాలన్నీ గ్రంథులతో (ముడులు) కూడుకున్నవే. పరమవిద్యను బోధించినప్పుడే ప్రయోజనం చేకూరుతుంది."*
>
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

ఈ జ్ఞానాన్ని అనుసరించి నా స్వరూపాన్ని తెలుసుకున్నవారు మళ్ళీ జన్మ ఎత్తరు. ప్రళయకాలంలో నశించరు. **2**

సముద్రంలో వేసిన ఉప్పు బొమ్మ తన వ్యక్తిత్వాన్ని కోల్పోతోంది. సముద్రంలో కలిసిపోతోంది. సముద్ర స్వరూపాన్నే పొందుతోంది. జ్ఞాని స్థితి కూడా అట్లాంటిదే. బ్రహ్మ స్వరూపంలో ఏకమైపోతున్నాడు.

"ఉడికించిన వడ్లు నాటితే మొలకెత్తవు. అట్లాగే సిద్ధుడు తాను సిద్ధుడయ్యేంతవరకూ ఎన్నో జన్మలెత్తాడు. సిద్ధుడైన తర్వాత ఇక జన్మలుండవు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఓ భరత వంశీయుడా! బ్రహ్మంగా పిలువబడే మహత్తు సృష్టికంతకు ఆధారమై ఉన్నది. జీవులన్నింటికి జన్మనిస్తూ ఆ బ్రహ్మమందు బీజరూపమై ఉన్నాను. **3**

ప్రకృతినే బ్రహ్మమని కూడా అంటారు. చతుర్ముఖ బ్రహ్మకూడా అతడే. అది త్రిగుణాలతో కూడినది. చరాచరములన్నింటికీ ఉపాదాన కారణంగా ఉంది. కనుక అది మహద్బ్రహ్మ అని చెప్పబడుతోంది. భూమి యందు విత్తనము నాటుతున్నాం. ఇక్కడ భూమియే యోని. విత్తనమే గర్భముగా మారుతోంది. ప్రసవమైన తర్వాత ప్రకృతి తత్త్వాలు స్త్రీత్వంగాను, పురుషత్వంగాను అవుతున్నది. ఇదే విధంగా మూల ప్రకృతి అనే యోని యందు ఆత్మచైతన్యమనే గర్భాన్నుంచినప్పుడు క్షేత్ర క్షేత్రజ్ఞుల కలయిక కలుగుతోంది. ప్రకృతితో కలసి ప్రకాశించే పురుషుని హిరణ్యగర్భుడు అంటున్నారు. అతడి అనేక కిరణాలే ప్రాణులై ఉన్నాయి. జీవులను క్షేత్రజ్ఞులని పిలుస్తున్నారు. అవిద్య వల్ల కలిగే ఉపాధులకూ, కామానికి, కర్మకీ తగినట్లుగా అనేక జీవాత్మలు ఉత్పత్తి అవుతున్నాయి. కనుక వాటి స్వభావాలు కూడా అనేకంగా ఉన్నాయి.

కుంతీ పుత్రా! జీవసముదాయమంతా భౌతిక ప్రకృతి యందు జన్మించటం చేత నేనే వాటికి బీజ ప్రదాతనై ఉన్నాను. నన్నే తండ్రిగా తెలుసుకొనుము. **4**

గర్భాశయములు లేక యోనులు అనేకం. దేవతలుగాను మానవులుగాను, మృగ క్రిమికీటకాలుగాను, స్థావరములుగాను వాటివాటికి తగిన యోనుల నుండి ఉత్పత్తి అవుతున్నాయి. మూలప్రకృతే వీటన్నింటికీ తల్లి. ఆమెను మహద్బ్రహ్మ అని పిలుస్తున్నారు. వీరందరికీ పరమాత్మయే తండ్రి.

ఓ మహాబాహు! అర్జునా! భౌతిక ప్రకృతి అనేది సత్త్వరజస్తమో గుణాలు మూడు కలిగి ఉన్నది. నిత్యుడైన జీవుడు ప్రకృతితో సంసర్గం పొందినప్పుడు పై మూడు గుణాలచేతా బంధితుడవుతాడు. **5**

ప్రకృతి అంటే సర్వత్రా వ్యాపించి ఉండేది. అట్లాగే ప్రకృతి గుణాలైన సత్త్వరజస్తమోగుణాలు కూడా సర్వత్రా వ్యాపించి ఉంటాయి. కాబట్టి బయట విషయాల రూపంలోను, అంతర్గతంగా రాగద్వేషాది రూపంగాను, శమదమాలతోను, సత్యాహింస, దయ దాక్షిణ్యాల రూపంగాను ఉంటున్నాయి. బంధించబడని ఆత్మ జ్ఞానం చేత బంధితుడైనట్లు భ్రమ కలిగిస్తుంది. నీళ్ళు కదులుతున్నప్పుడు నీటిలో బింబం కూడా కదులుతుంది సూర్యుడు కూడా కదులుతున్నట్లుగా బింబం కనిపిస్తుంది. నిజానికి బింబం కదలడం లేదు. అట్లాగే ఆత్మ బంధించబడకపోయినా బంధించబడ్డట్లు కనిపిస్తుంది.

ఓ పాపరహితుడా! సత్త్వగుణం మిగిలిన రెండు గుణాలకన్నా పవిత్రమైనది. మానవుని పాపఫలాల నుండి విముక్తుణ్ణి చెయ్యగల సామర్థ్యం గలది. ఈ గుణం కలవారు సుఖభావన చేతను, జ్ఞానభావన చేతను బద్ధులై ఉంటారు. **6**

అద్దం స్పష్టంగా ఉంటుంది కాబట్టి దాన్ని సత్త్వగుణంతో పోలుస్తూ ఉంటారు. పరిశుభ్రమైన అద్దంలో బింబం స్పష్టంగా తెలుస్తుంది. అట్లాగే స్వచ్ఛమైన స్ఫటికం గుండా సూర్యరశ్మి చక్కగా ప్రసరిస్తుంది. అదే విధంగా సత్త్వగుణం ఆత్మ ప్రకాశాన్ని వెలిబుచ్చుతుంది. అట్లా యథార్థంగా గ్రహించడాన్నే జ్ఞానం అంటారు.

అంతఃకరణము యొక్క స్వభావాలైన సుఖము, జ్ఞానముల భ్రాంతినే సంగం అంటారు. 'నేను తెలుసుకున్నాను' 'నేను సుఖపడ్డాను' అన్నదే ఆ సంగం యొక్క ఆకారంగా ఉంటుంది. ఇటువంటి విపరీతమైన అభిమానంతో సత్త్వగుణం ఆత్మను బంధిస్తోంది. జ్ఞానమంటే సుఖసాహచర్యం వల్ల క్షేత్రమైన అంతఃకరణం యొక్క ధర్మమే. ఆత్మ ధర్మం కాదు. ఆత్మ ధర్మమే అయితే సంగానికి దానివల్ల కలిగే బంధానికి తావే ఉండదు.

కుంతీ కుమారా! రజోగుణం ఆశారూపమైనది. తృష్ణను ఆసక్తిని కలిగిస్తుంది. ఇది దేహిని కర్మ ప్రవృత్తియందు ఆసక్తుణ్ణి చేసి బంధిస్తుంది. **7**

రజోగుణం ఆశతో కూడుకున్నది. ప్రవృత్తిని ఉత్పత్తి చేస్తూనే ఉంటుంది. తెల్లటి వస్త్రానికి రంగు వేసే మూలికలాంటిది. అట్లాగే రజోగుణం ఆత్మకు రంగువేసే ప్రయత్నం చేస్తుంది. తృష్ణ అంటే లభించని దానికోసం ప్రాకులాడటం. అసగజము అంటే బంధము. అంటే పొందిన వస్తువును భద్రపరచుకునేందుకు తపన చెందటం, బాహ్య ప్రపంచంలో లభ్యమయ్యే విషయాలపై ఆసక్తి, పరముపైన కూడా ఆసక్తి కలగడం అన్నవి రజోగుణ ప్రభావం చేత ఆత్మకు వస్తున్నాయి. కట్టెపుల్లలను ఎగత్రోసి మంటను అధికం చేసేట్లు రజోగుణం కర్మల యందు అనురక్తిని పెంచుతోంది. కర్మలే చెయ్యని ఆత్మను కర్తగా చేస్తోంది. రజోగుణం ఉన్నంత వరకు తానే కర్త అన్న భావన ఆత్మయందు ఉంటూనే ఉంటుంది.

ఓ భరత వంశీయుడా! తమోగుణం అజ్ఞానం వల్ల పుడుతోంది. దేహధారుల మోహానికి ఇదే కారణం. బుద్ధి లేకుండా ప్రవర్తించడం, సోమరితనం, నిద్రవంటివన్నీ తమోగుణ లక్షణాలే. **8**

అర్జునా! సత్త్వగుణం మానవుల్ని సుఖములందు బంధిస్తుంది. రజోగుణం కోరికలతో కూడిన కర్మలందు బంధిస్తుంది. తమోగుణం జ్ఞానాన్ని కప్పివేస్తుంది. తద్ద్వారా బుద్ధిహీనత ఏర్పడుతుంది. **9**

అర్జునా! సత్త్వము రజస్సును, రజస్సు తమస్సును అణచి వేస్తున్నాయి. రజస్సు సత్త్వాన్ని, తమస్సును అణగద్రొక్కుతుంది. అట్లాగే తమస్సు సత్త్వాన్ని రజస్సును అణగద్రొక్కుతుంది. **10**

ప్రతి దేహియందు ఈ మూడు గుణాలు ఉంటాయి. వాటిలో ఏ ఒక్క గుణం పైకి వచ్చినా మిగిలిన రెంటినీ అణగత్రొక్కుతుంది. ఎవరైతే అప్రమత్తంగా ఉంటారో, మనస్సును ప్రశాంతంగా ఉంచుకుంటారో వారిలో సత్త్వగుణం అధికంగా ఉంటుంది. అప్పుడా మనిషిలో జ్ఞానం వృద్ధి చెందుతుంది. రజోగుణం అధికంగా వచ్చినప్పుడు మనిషి కర్మలు చెయ్యడానికి ఆసక్తి చూపుతాడు. తమోగుణం వృద్ధి అయినప్పుడు మనిషి జ్ఞానాన్ని కోల్పోతాడు. సోమరితనం పెరుగుతుంది. ఈ విధంగా ఈ మూడు గుణాలు ప్రతిరోజూ మారుతూనే ఉంటాయి.

దేహంలో ఉండే ఇంద్రియాలన్నింట్లో ఎప్పుడైతే జ్ఞానం ప్రకాశిస్తుందో అప్పుడు సత్త్వగుణం వృద్ధి చెందుతోందని గ్రహించవచ్చు. **11**

అనేక రంగులుగల అద్దాలతో చేసిన పెట్టెలో ఒక దీపాన్నుంచితే అన్ని అద్దాల గుండా దాని వెలుతురు ప్రసరిస్తుంది. దీపకాంతికి తగినట్లు దాని వెలుగు ప్రసారం ఉంటుంది. అట్లాగే మానవ శరీరం కూడా అటువంటి పెట్టె వంటిదే. కన్నుముక్కు వంటి ఇంద్రియాలన్నీ ఆ పెట్టెకు ద్వారాల వంటివి. గుణ భేదానికి తగినట్లుగా ఆత్మ ప్రకాశం ఇంద్రియాల ద్వారా వెలువడుతుంది. అందులో సత్త్వగుణం ఎక్కువగా ఉన్నప్పుడు ఆత్మ ప్రకాశం నిర్మలంగాను కాంతివంతంగానూ తెలుస్తుంది. అట్టి స్థితిలో ఉన్నవానిలో సత్యజ్ఞానం బాగా వృద్ధి చెందుతుంది.

భరతకుల శ్రేష్ఠా! రజోగుణం వృద్ధి చెందేటప్పుడు లోభము, కోరికలతో కూడుకున్న కర్మలు (కామ్య కర్మలు), ఆచరణకు సాధ్యం కాని కోరికలు, వాటి కోసం తీవ్ర ప్రయత్నం, తపన అనే లక్షణాలు వృద్ధి చెందుతాయి. **12**

పేరాశ అంటే ఇతరుల వస్తువులన్నింటినీ తనవిగా చేసుకోవాలనుకోవడం. దీన్నే లోభం అని కూడా అనవచ్చు. బయట ప్రపంచంలోని విషయాలన్నింటినీ ఆసక్తితో ప్రారంభించడం దీని ప్రవృత్తి. అట్లా ప్రారంభించిన కార్యాలకు సత్ఫలితాలొస్తే సంతోషించడం, ఓటమి కలిగినప్పుడు దుఃఖంతో కుమిలిపోవడం వల్ల మనశ్శాంతి లోపిస్తుంది. ప్రారంభించిన కర్మలకు మెరుగులు దిద్దాలన్న ఆకాంక్షనే కర్మాసక్తి అంటారు. ఇవన్నీ రజోగుణం వృద్ధిలో ఉన్నప్పుడు కనిపించే లక్షణాలు.

కురువంశ నందనా! తమోగుణం వృద్ధి పొందేటప్పుడు మనిషి అంధకారంలో ఉన్నట్లుంటాడు. సోమరితనం, బుద్ధిహీనత, భ్రాంతి, అతడిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. **13**

భ్రాంతి అంటే తనకు కార్యాల్ని సాధించే సామర్థ్యం ఉన్నా కూడా అటువంటి ప్రయత్నాలేవీ చెయ్యడు. పనులు నియమబద్ధంగా కూడా చెయ్యడు. ఆ సమయానికి ఎట్లా తోస్తే అట్లా చేస్తూ ఉంటాడు.

సత్త్వగుణంలో మరణించేవాడు మహర్షులు పొందే పావన లోకాల్ని పొందుతాడు. దేహమును వదిలే సమయంలో మనస్సులో ఏ కోరిక మెదలుతుందో దానికి తగినట్లుగా పునర్జన్మ కలుగుతుందని భావం. సత్త్వగుణం వృద్ధియైన జీవికి దైవచింతన అధికంగా ఉంటుంది. అందువల్ల బ్రహ్మలోకం వంటి పుణ్యలోకాలు కలుగుతాయి. **14**

రజోగుణంతో మరణించేవాడు కామ్యానురక్తుల మధ్యన (కర్మయోగుల) జన్మిస్తాడు. తమోగుణంతో మరణించేవాడు జంతు జాలముల మధ్యన జన్మిస్తాడు. **15**

పుణ్య కర్మలకు ఫలంగా సత్త్వగుణం, రజోకర్మల ఫలంగా దుఃఖం, తమోగుణ ఫలంగా అజ్ఞానమూ కలుగుతాయి. **16**

వేదోక్తమైన పుణ్యకర్మలను సుకృతాలంటారు. ఇవి సత్త్వగుణ ప్రాబల్యం చేత జరిగేది కాబట్టి సత్త్వగుణం వృద్ధిలో ఉంటుంది. రాజస కర్మల్ని చేసేవారికి పాపపుణ్య కర్మల మిశ్రమ ఫలం ఉంటుంది. అందువల్ల వీరు దుఃఖాల్ని అనుభవిస్తారు.

సత్త్వగుణం నుండి వాస్తవజ్ఞానం వృద్ధి చెందుతుంది. రజోగుణం వల్ల లోభం వృద్ధి చెందగా తమోగుణం నుండి అజ్ఞానం, బుద్ధిహీనత భ్రాంతి అనేవి వృద్ధి చెందుతాయి. **17**

సత్త్వ గుణం గలవారు క్రమంగా ఊర్ధ్వలోకాల్ని పొందుతున్నారు. రజోగుణమందుండేవారు భూలోకంలో నివసిస్తారు, తమోగుణమున ఉన్న వారు అధోలోకాలను, నరకాన్ని పొందుతున్నారు. **18**

జీవికి కర్తృత్వ భోక్తృత్వాలు కల్పించడం అజ్ఞానంతో కూడినవి. ప్రకృతి యొక్క మాయాశక్తియే మూడు గుణాల చేత కర్తృత్వం కలుగుతుందని గ్రహించాలి.

సర్వ కర్మలందును 'ప్రకృతి' పరమైన త్రిగుణాలు ఉన్నా కూడా వీటికి అతీతుడైన వ్యక్తి ఇంకొకడు ఉన్నాడని, అతడిని ఎరుగగలిగినప్పుడే ఆ దివ్యభావాన్ని పొందగలుగుతారు. **19**

"మానవుని హృదయమునందు ఈశ్వరుడు ఉంటాడనడానికి గుర్తు ఏమిటి? సూర్యుడు ఉదయించే సమయంలో కనిపించే చిహ్నాలే సూర్యోదయం కాబోతోందని తెలుపుతుంది. అట్లాగే ఈశ్వరుడు హృదయంలో ఉదయించడానికి ముందు పరిశుద్ధత, స్వార్థం లేకుండా ఉండటం, సన్మార్గం వంటి గుణాలు ఉదయిస్తాయి."

- శ్రీరామకృష్ణ పరమహంస

దేహాదారి అయిన జీవుడు, దేహంతో కూడి ఉండే ఈ త్రిగుణాలను దాటగలిగినప్పుడు జనన మరణ వార్ధక్యాల నుండి, మరియు దుఃఖాల నుండి బయట పడి ఈ జన్మలోనే అమృతత్వాన్ని పొందుతాడు. **20**

ఇక్కడ బ్రహ్మ స్వరూపాన్ని పొందటం గూర్చి చెబుతున్నారు. జీవుడు గుణముల చేత ఉత్పత్తి అయిన దేహంలో నివసిస్తున్నాడు. అయినా అతడు దేహంతో సంబంధం పెట్టుకోవడం లేదు. అంటే దేహానికి జనన, మరణ, వృద్ధాప్య, వ్యాధుల వంటి దుఃఖాలు జీవన్ముక్తుని అంటడం లేదు. ఈ దేహంలోనే అతడు (జీవన్ముక్తుడు) బ్రహ్మానందాన్ని పొందుతున్నాడు.

"శరీరము పుడుతోంది, నాశనమవుతుంది. కానీ. ఆత్మ నశించడం లేదు. పెద్ద వక్కవలె శరీరము ఆత్మ ఉన్నాయి. వక్క ముదిరిన తర్వాత గింజ వేరుగా తొక్కవేరుగా విడిపోతున్నాయి. కాయ పచ్చిగా ఉన్నప్పుడు గింజను విడదీయలేము. అట్లాగే ఈశ్వర దర్శనం కలిగిన తర్వాత ఆత్మ వేరు, శరీరం వేరు అన్న జ్ఞానం కలుగుతుంది." *- శ్రీరామకృష్ణ పరమహంస*

అర్జునుడు : ప్రభూ! ఈ త్రిగుణాలకు అతీతమైన వాడిని తెలుసుకోగలగడం ఎట్లా? అతడి ప్రవర్తన ఎట్లా ఉంటుంది? ప్రకృతి గుణాలను అతడు ఏ విధంగా అధిగమిస్తున్నాడు? **21**

శ్రీకృష్ణుడు : అర్జునా! త్రిగుణాలకు అతీతుడైన వాడు సత్త్వస్వభావమైనట్టి ప్రకాశంగాని, రజోగుణ కార్యమైనట్టి ప్రవృత్తిగాని, తమోగుణ కార్యమైన నివృత్తిగాని ఉత్పన్నమైనప్పుడు అవి దుఃఖ స్వరూపాలే అయినా ద్వేషించడు. ఆ గుణాలు నివృత్తమవుతున్నప్పుడు అవి సుఖ స్వరూపాలే అయినప్పటికీ వాటిని కోరుకోడు. ఆ గుణాల యొక్క కార్యాలన్నీ స్వప్నంలాగా మిథ్య అనే భావిస్తాడు.

ఈ విధంగా రాగద్వేషాలు లేనివాడిని గుణాతీతుడు అని అంటారు. అయితే ఈ గుణాతీత లక్షణం స్వాత్మకు మాత్రమే ప్రత్యక్షమవుతుంది కాబట్టి రాగం ఉండడం గాని ఉండకపోవడంగాని, ద్వేషం ఉండటంగాని లేకపోవడంగాని ఇతరులు తెలుసుకోలేరు. **22**

"జీవన్ముక్తులు ప్రపంచంలో జీవించడం ఎట్లా? నీటి బుచ్చిగాడు అనే ఒక రకమైన పక్షి చేపల్ని తింటూనే జీవిస్తుంది. చేపల్ని వేటాడటం కోసం నీళ్ళల్లో లోనకు గూడా పోతూ ఉంటుంది. అయినా దాని రెక్కలకు ఎక్కడా తడి అంటదు. ఎక్కడైనా ఒకటి రెండు నీటి బిందువులు అంటుకున్నా శరీరాన్ని విదుల్చుకొని దానిని వదిలించుకుంటుంది." - *శ్రీరామకృష్ణ పరమహంస*

అర్జునుని మొదటి ప్రశ్నకు సమాధానంగా– ఎవడు సాక్షీభూతంగా నిలచి గుణములచేత చలించడో, గుణాలు మాత్రమే ప్రవర్తిస్తున్నాయనే స్థిర భావంతో ఆత్మయందు స్థిరంగా నిలచి ఉంటాడో, **23**

సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించేవారు, మట్టి, బంగారం, రాయి వంటి వాటన్నింటినీ సమభావంతో చూసేవాడు, ప్రియులైనవారిని అప్రియమైనవారిని కూడా ఒకటిగా భావన చేసేవాడు, దూషణ భాషణాలను సమంగా స్వీకరించేవాడు, ధీరచిత్తము గలవాడూ, **24**

మానావమానాలను సమంగా చూసేవాడు, శత్రువుల్ని మిత్రుల్ని సమంగా చూసేవాడు, కామ్య కర్మలు లేనివాడు ఎవడో వాడే గుణాతీతుడు. **25**

అచంచలమైన భక్తి యోగం చేత నన్నెవడు ఉపాసిస్తాడో అతడే గుణాలను పూర్తిగా అధిగమించి బ్రహ్మస్వరూపమయ్యేందుకు అర్హుడవుతున్నాడు. **26**

"భక్తునికి ఈశ్వరుడు అనేక రూపాలతో దర్శనమిస్తున్నాడు. కానీ సమాధి యందు బ్రహ్మజ్ఞానం పొందినవాడు ఆయనను అఖండ నిరాకార నిర్గుణ బ్రహ్మంగా తెలుసుకుంటాడు, ఇక్కడే జ్ఞానము భక్తి సంగమిస్తున్నాయి."

- *శ్రీరామకృష్ణ పరమహంస*

నాశరహితమైనది, మోక్షసాధనమైనది అయిన బ్రహ్మానికి, శాశ్వతమైన ధర్మానికి, అలవికాని సుఖానికి నేనే ఆశ్రయంగా ఉన్నాను. **27**

"ఒకడు ఒక అడవి మార్గాన పోతున్నాడు. అతడికి ముగ్గురు దొంగలు ఎదురుపడ్డారు. మొదటివాడు 'వీణ్ణి ప్రాణాలతో వదలడం క్షేమం కా'దని కత్తి తీసుకొని పొడవబోయాడు. రెండోవాడు 'వృథాగా వీణ్ణి చంపడం దేనికి? ఓ చెట్టుకు కట్టేసి పోదాం' అన్నాడు. మూడోవాడు కట్లు విప్పి అడవిలో తోడుగా ప్రయాణంచేసి ఇలా అన్నాడు. 'అదుగో అదే మీ గ్రామం. ఆ కనిపించేదే నీ ఇల్లు. జాగ్రత్తగా పో' అన్నాడు. అప్పుడు బాటసారి 'అయ్యా! నువ్వు నాకు గొప్ప ఉపకారం చేశావు. నాతోపాటు మా

ఇంటికి వచ్చి ఆతిథ్యం తీసుకొని వెళ్ళు' అన్నాడు. అందుకా దొంగ 'అయ్యా! మీతో నేను రాలేను. నేను ఊళ్ళోకి వస్తే పట్టుబడతాను' అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఈ ప్రపంచమే ఆ అడవి. సత్త్వరజస్తమోగుణాలే ఆ దొంగలు. ఆ బాటసారే జీవుడు. ఆత్మజ్ఞానమే అతడివద్ద ఉన్న సొమ్ములు. రజస్తమోగుణాలే అతణ్ణి తాళ్ళాలతో బంధించింది. సత్త్వగుణమే అతణ్ణి బంధాల నుండి తప్పించింది. సత్త్వగుణాన్నాశ్రయించిన జీవుడు తమస్సు, రజస్సుల నుండి వాటి ఫలాలైన కామక్రోధాల మాయల నుండి విడుదల పొందుతున్నాడు. జీవుణ్ణి కడతేర్చేదే అయినా సత్త్వం కూడా ఒక దొంగే. పరమ పదానికి వెళ్ళే దారి చూపించి "అదుగో నీ గమ్యం" అని చెప్పి మాయమైపోతుంది. సత్త్వగుణం కూడా పరమపదానికి దగ్గరగా పోలేదు."

- శ్రీరామకృష్ణ పరమహంస

15

పురుషోత్తమ యోగం

గుణాలలో చిక్కుకున్న వాడు పురుషుడు. గుణాలకు అతీతంగా బ్రహ్మాండానికి ఆధారమైన వాడు పురుషోత్తముడు. ఆయన బ్రహ్మాండానికి ఎలా ఆధారంగా ఉన్నాడో గ్రహించి, కృతకృత్యుడవడం ఎలాగో ఈ అధ్యాయంలో పొందుపరచబడింది.

వేర్లు పైన కొమ్మలు క్రిందుగాను ఉండే రావిచెట్టు వంటి సంసారాన్ని నాశరహితమైనదని తెలుపుతున్నాను. వేదములే ఆ వృక్షానికి ఆకులు. ఈ వృక్షాన్ని గూర్చి తెలిసిన వాడు వేదములను తెలుసుకున్నవాడవుతున్నాడు. **1**

అశ్వత్థమంటే రావిచెట్టు. రావి చెట్టన్నా మర్రిచెట్టన్నా ఒకే జాతికి చెందినవి. సంసార వృక్షాన్ని రావిచెట్టుతో పోల్చి చెప్తున్నారు. మామూలుగా చెట్ల వ్రేళ్ళు భూమిలో నుండి సారాన్ని గ్రహించి కొమ్మలకిస్తూ ఉంటాయి. కానీ ఈ వృక్షం అందుకు విరుద్ధంగా సారాన్ని కొమ్మల నుండి గ్రహించి భూమి కందిస్తోంది. 'అశ్వత్థము' అంటే శాశ్వతం కానిది అని అర్థం. అంటే ఇవ్వాళ ఉండి రేపు పోయేదని భావం. సంసారమనే జగత్తు కూడా అట్లాంటిదే. మాయచే నిర్మితమైన ఈ జగత్తు కూడా పైన పరమాత్మ నుండి సారాన్ని గ్రహించి ప్రకృతిగా పరిణమిస్తోంది.

ఈ ప్రపంచమంతా ఈ రావి మానుతో పోల్చి చెప్పబడుతోంది. ఆకులు లేకుండా వృక్షం జీవించలేదు. అట్లాగే ప్రకృతి అనే ఈ వృక్షంలో వేదాలే ఆకులుగా ఉన్నాయి. అంటే ఈ జగత్తు కంతటికీ విజ్ఞానాన్ని బోధించే వేదాలే ఆకులుగా ఉన్నాయి. అంటే ఈ జగత్తు కంతటికీ విజ్ఞానాన్ని బోధించే గ్రంథాలన్నింటినీ కలిపి వేదాలంటున్నారు. సాధారణంగా చెప్పే నాలుగు వేదాలే కాకుండా రసాయన శాస్త్రం, ప్రకృతి శాస్త్రం వంటి గ్రంథాలు ఏ భాషలో ఉన్నా వాటన్నింటినీ కూడా వేదాలనే చెబుతున్నారు. మంచి చెడులను గూర్చి చెప్పేవే వేదాలు. వాటిని పొందే మార్గాలన్నీ వేదాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. వీటిల్లో నుండి చదివి చెప్పేవాడు వేదవిత్తు కాలేదు. శాశ్వతమైన బ్రహ్మజ్ఞానం పొందినవాడే వేదాల నెరిగిన వాడవుతున్నారు.

"సంతలోని దుకాణాలకు చాలా దూరంగా ఉన్నప్పుడు శబ్దాలేవీ వినబడవు. కానీ సంతలో ప్రవేశించగానే దుకాణదారుల అరుపులు కేకలు వినిపిస్తాయి. వాళ్ళతో జనులు బేరసారాలు చేస్తూ ఉండటం చూస్తాం. అట్లాగే ఈశ్వరుని వద్ద నుండి చాలా దూరంలో ఉన్నప్పుడు దినకృత్యాల్లో సతమతమవుతూ ఉంటాడు. కానీ అతడు ఈశ్వరుని సమీపానికి చేరుకోగానే శబ్దాలన్నీ అణిగిపోతాయి. దైవ రహస్యాలన్నీ బాగా బట్ట బయలవుతాయి." - *శ్రీరామకృష్ణ పరమహంస*

ఆ వృక్షానికి ఉండే కొమ్మలు గుణాలచే వృద్ధి చెందాయి. విషయాలనే చిగుళ్ళు తొడిగాయి. మానవాళినంతా కర్మల్లో ముంచెత్తుతూ క్రిందకు పైకి వ్యాపించి ఉన్నాయి. దాని వ్రేళ్ళు భూమిలోకి స్థిరంగా పాతుకున్నాయి. **2**

సంసార వృక్షానికి శాఖల లాంటివైన దేహాలు కర్మ ఫలాలచేత లభిస్తాయి. ఈ దేహాలన్నీ త్రిగుణాలచేత వృద్ధి పొందుతున్నాయి. అవి మళ్ళీ మళ్ళీ కర్మలు చేస్తున్నాయి. కర్మవాసనలనే కర్మానుబంధాలని అంటారు. ఆ కామ్యకర్మలే జన్మలకు కారణాలు. అంటే విషయవాసనలు, కర్మవాసనలే అవాంతర కారణాలన్నమాట. ముఖ్య కారణం బ్రహ్మమైతే, ఈ అవాంతర కారణం వలన భూలోకంలో ధర్మాధర్మాలతో కూడుకున్న కర్మల్ని చేయిస్తూ ఉంటాయి.

ఈ సంసార వృక్షానికి ఇది మొదలనిగాని, ఇది అంతం అనిగాని ఎవరూ చెప్పలేకుండా ఉన్నారు. ఈ అశ్వత్థ వృక్షాన్ని సర్వకర్మఫల సన్న్యాసం అనే ఖడ్గంతో సమూలంగా నరికి, **3**

"గొంగళి పురుగు తాను కట్టుకున్న గూటిలో చిక్కుకుంటోంది. అట్లాగే ప్రపంచాసక్తి గల ఆత్మ, దాని ఆశలనే వలలో చిక్కుకుంటోంది. అయితే ఆ పురుగు అందమైన సీతాకోక చిలుకలాగా మారుతున్నప్పుడు వాటిని ఛేదించుకొని బయటకు వచ్చి గాలి వెలుతురు స్వేచ్ఛగా అనుభవిస్తోంది. అట్లాగే వివేక వైరాగ్యాలనే రెండు రెక్కల సాయంతో ప్రపంచం యెడల ఆసక్తి చూపే ఆత్మ మాయ అనే గూటిని ఛేదించుకొని బయటకురావాలి." - *శ్రీరామకృష్ణ పరమహంస*

ఎట్టి పరమపదాన్ని పొంది మళ్ళీ జన్మ ఎత్తడం లేదో, అట్టి పరమ పదమని వ్యవహరించబడే ఆది పురుషుని 'నేను పొందుతున్నాను' అనే దృఢవైరాగ్యంతో సమస్తాన్ని త్యజించి ఆ పరమపదాన్ని పొందాలి. వేదాంత వాక్య విచారణ చేత వెదకాలి. బలంగా పెరిగే ఈ సంసారాన్ని జయించడానికి బ్రహ్మజిజ్ఞాస, కర్మ సన్న్యాసములే సాధనాలు. ఆ సాధనాల ద్వారా బ్రహ్మన్ని పొందాలి. **4**

"దొంగను కనిపెట్టగానే పారిపోతున్నాడు. అట్లాగే మాయ యొక్క స్వభావాన్ని నువ్వు పరిశోధించి తెలుసుకున్న తర్వాత అది నీవద్ద నుండి పారిపోతుంది."

- *శ్రీరామకృష్ణ పరమహంస*

అహంకారం అవివేకం లేనివారు, ఆసక్తి లేకుండా ఉండగలిగేవారు, భగవంతుని యెడల తీవ్రమైన భక్తిని కలిగివుంటారు కనుక సాధకుడు సాధనలు కొనసాగిస్తే తప్పక అతడు పరిపక్వతను పొందగలడు. అంతేకాదు వారు తప్పక పరమపదాన్ని చేరుకోగలరు. **5**

సాధకుడు పరిపక్వతను సాధించాలంటే ఒక వైపున మనస్సుకు పట్టిన మాలిన్యాలన్నింటినీ తొలగించుకోవాలి. రెండో వైపున భగవంతుని యెడల అకుంఠిత భక్తి భావాన్ని పెంచుకోవాలి. ఈ సాధనల వలన అతడు పరిపూర్ణ పరిపక్వతను పొందటమే కాకుండా పరమ పదాన్ని కూడా చేరగలడు.

"కట్టుబడిన ఆత్మ మనిషితో సమానమే; మాయను గొలుసులతో బంధించగలిగే ఆత్మయే ఈశ్వరుడగుచున్నాడు." – శ్రీరామకృష్ణ పరమహంస

ఎక్కడకు వెళ్ళిన వాళ్ళు తిరిగి రారో, ఎక్కడ సూర్యచంద్రుల ప్రకాశం ప్రసరించదో అదే నా పరంధామము. **6**

సముద్రంలో కలసిన నది సముద్రమే అవుతోంది. అట్లాగే పరమును చేరిన మానవుడు పరంధాముడే అవుతున్నాడు. దాన్నే చిదాకాశం అంటారు.

"కర్పూరాన్ని వెలిగిస్తే పూర్తిగా కాలిపోతుంది. అందులో మిగిలేదేదీ ఉండదు. వివేకం నశించి మహోన్నతమైన సమాధి స్థితిని పొందితే, అప్పుడిక 'నేను' అన్నదిగాని 'నీవు' అన్నదిగాని, ప్రపంచంగాని ఉండవు. ఎందువల్లనంటే, ఈ మనస్సు, మమకారాలన్నీ విశుద్ధ బ్రహ్మమందు లీనమై పోతున్నాయి." - శ్రీరామకృష్ణ పరమహంస

సనాతనమైన నా అంశయే జీవుడై జీవులన్నింట్లోనూ ఉంటూ ప్రకృతి స్వభావాలైన మనస్సు ఆరు ఇంద్రియాలను (భోగాలను) ఆకర్షిస్తోంది. **7**

ఇక్కడ సనాతనం అంటే ఎప్పుడూ ఉండేది. లేక ఎప్పుడు పుట్టిందో తెలియనిది. జీవుడు అంటే అదీ పరమాత్మ స్వరూపమే. జీవుడు ప్రకృతితో కలసి తాను బద్ధుడైన వానిగా భావిస్తున్నాడు. అతడు (జీవుడు) ప్రకృతితో చేరడం వలన అతడికి ఇంద్రియాలు ఏర్పడుతున్నాయి. ఆ ఇంద్రియాల ద్వారా భోగాలనుభవిస్తూ భోగి అవుతున్నాడు. భోగి అయిన జీవుడు భోగాల చేత బంధించబడి భోగిగా ఉన్నంతవరకు జీవలోకంలో ఉంటూనే ఉంటాడు. కొందరే ఇంద్రియాల్ని నిగ్రహించి యోగి అయి పరమును చేరుతున్నారు.

జీవాత్మ పరమాత్మల సంబంధం ఎట్లా ఉంటుందంటే, ఘటంలో (కుండ) ఆకాశం ఉంది. దాన్ని ఘటాకాశం అందాం. ఘటానికి బయటా ఆకాశం ఉంది. దాన్ని మహాకాశం అందాం. అయితే ఘటాకాశం మహాకాశానికి అణగే ఉంటుంది. కుండను పగుల కొడితే ఘటాకాశానికి వచ్చేనష్టం ఏమీ ఉండదు. దాన్ని ఘటాకాశమన్న పేరుతో పిలిచినా కూడా అది ఆకాశంలో భాగమే అయి ఉంది.

జీవుడు ప్రకృతితో కలసి ఉన్నప్పుడు కర్త అని భోక్తని చెప్పబడుతున్నాడు. కర్త భోక్త అన్న ఉపాధిని తొలగిస్తే ఆత్మయొక్క నిజ స్వరూపం తెలుస్తుంది. జీవాత్మగా ఉన్నప్పుడు పరమాత్మ అంశమై ఉంది. జీవుడన్న భావాన్ని తొలగిస్తే మిగిలేది పరమాత్మ మాత్రమే.

"జీవుని యొక్క నిజస్వభావం సచ్చిదానందమే. ఈ ఉపాధులన్నీ అహంకారం వల్ల కలిగాయి. కనుక జీవుడు తన నిజ స్వభావాన్ని మరచిపోయాడు."

- *శ్రీరామకృష్ణ పరమహంస*

వాయువు గంధాన్ని మోసుకొని పోతున్నట్లే, జీవుడు తనతో ఇంద్రియాల్ని వివిధ భావాలను ఒక దేహం నుండి మరొక దేహానికి తీసుకొనిపోతూ ఉంటాడు. అదే విధంగా అతడు ఒక దేహాన్ని గ్రహించి, మళ్ళీ ఇంకొక దేహాన్ని పొందేందుకై మొదటి దేహాన్ని విడిచేస్తూ ఉంటాడు. **8**

జీవుడు ఒక దేహం నుండి మరో దేహానికి, ఒక లోకం నుండి మరో లోకానికి వెళ్ళేటప్పుడు తనతో మనస్సు చర్మం, కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక అనే ఆరు ఇంద్రియాలను తీసుకుపోతాడు. ఇవి మన కంటికి కనిపించే అవయవాలు కావు. వాటి సూక్ష్మాంశలను తన వెంట తీసుకుపోతాడు. తాను మళ్ళీ శరీరాన్ని పొందేటప్పుడు ఈ ఆరు ఇంద్రియాల్ని కల్పిస్తాడు. గాలి తాను పోయే చోటుకల్లా గంధాన్ని తీసుకుపోతున్నట్లు జీవుడు కూడా ఈ ఆరు ఇంద్రియాల్ని వెంట తీసుకుపోతాడు. జీవుడు ముక్తుడయ్యేంత వరకు ఇంద్రియాలతో సహా లోకాంతరాలకు, జన్మాంతరాలకు వస్తూ పోతూనే ఉంటాడు.

జీవుడు పై ఆరు ఇంద్రియాలను తనవిగా చేసుకొని విషయాలను అనుభవిస్తూ ఉంటాడు. **9**

జీవుడి దేహం ఒక కోట లాంటిది. ఆ కోటకు పంచేంద్రియాలు అయిదు కిటికీలు (ద్వారములు) వంటివి. ద్వారాలు లేని ఇంట్లో బంధిస్తే అతడు మరణించవచ్చు. అందువల్ల బాహ్య ప్రపంచంతో సంబంధం కలిగి ఉన్నప్పుడే నీరు, గాలి, వెలుతురు, ఆహారం వంటి వాటిని పొంది జీవించ గలుగుతాడు. ఆ విధంగా అతడు పంచేంద్రియాల ద్వారా పంచభూతాలతో సంబంధం పెట్టుకుంటాడు. అంటే అగ్ని స్వభావమైన ప్రకాశాన్ని చూసేందుకు కన్నులు, వాయు స్వభావమైన స్పర్శను చర్మమూ, నీటి స్వభావమైన రుచిని నాలుక, భూమి స్వభావమైన వాసనను (గంధాన్ని) ముక్కు గ్రహిస్తున్నాయి. మనస్సు ఈ అయిదింటినీ సమన్వయపరచే పనిలో ఉంటుంది. శరీరమనే కోటలో ఉండే జీవుడు ఈ పంచేంద్రియాలను అనుభవించేందుకు మనస్సును వంతెనగా వాడుకుంటాడు.

జీవుడు శరీరంలో ఉన్నప్పుడుగాని, శరీరంలో ఉంటూ అనుభవిస్తున్నప్పుడు గాని, శరీరాన్ని విడిచేటప్పుడుగాని, త్రిగుణాలతో కలసి ఉన్నప్పుడుగాని మూఢులతన్ని తెలుసుకోలేరు. జ్ఞాననేత్రాలున్నవారు మాత్రమే తెలుసుకోగలుగుతారు. **10**

"మానవులు దిండుగలీబు లాంటివారు. గలీబులు అనేకమైన రంగుల్లో ఉన్నప్పటికీ వాటి లోపల ఉండే దిండు (దూది) ఒక్కటే. అట్లాగే మానవులు అందంగా ఉన్నా, అందవికారంగా ఉన్నా, ఒకడు మంచివాడుగా ఉన్నా, మరొకడు చెడ్డవాడుగా ఉన్నా, అందరి లోపల నివసించేది ఈశ్వరుడే." - *శ్రీరామకృష్ణ పరమహంస*

జ్ఞాన సిద్ధి కోసం ప్రయత్నించే యోగులు ఆత్మను తమ యందే చూడగలుగుతున్నారు. ప్రయత్నం చెయ్యనివారు, చిత్తశుద్ధి లేని అవివేకులు వారిలోనే ఉండే ఆత్మను చూడలేకపోతున్నారు. **11**

"నీటి కుండ అడుగున చిన్న రంధ్రం ఉంటే దాంట్లో ఉండే నీరంతా కారిపోతుంది.

అట్లాగే సాధకుని హృదయంలో ప్రపంచాసక్తి ఏ కొద్దిగా ఉన్నా అతడి ప్రయత్నాలేవీ ఫలించవు." *- శ్రీరామకృష్ణ పరమహంస*

సూర్యుడి వెలుగుచేత ప్రపంచమంతా ప్రకాశిస్తున్నా, అగ్ని, చంద్రుడు, వెలుగు ఇస్తున్నా ఇవన్నీ నాలో నుండి వచ్చినవేనని తెలుసుకో. **12**

రెండు గదుల్లోనూ సూర్యరశ్మి ప్రసరిస్తోంది. ఒక గదిలో ఎవరూ లేరు. అక్కడ వెలుతురున్నదని చెప్పేందుకు ఎవరూ లేరు. అంటే 'నేను ఉన్నాను' అని చెప్పే ప్రజ్ఞ ఆ వెలుతురుకు లేదు. కాబట్టి ఆ గదిలో వెలుతురు ఉన్నా లేకపోయినా ఒకటే. రెండో గదిలో ఓ మనిషి ఉన్నాడు. వెలుతురు ఉన్నదని చెప్పడానికి అతడు సాక్షిగా ఉన్నాడు. సూర్య చంద్రాదులకు ఈశ్వరుని వద్ద నుండి వచ్చిన ప్రకాశాన్ని ఈశ్వరుడేనని ఆత్మ ప్రకాశం తెలుసుకోగలుగుతోంది. తెలుసుకున్నవాని జ్ఞానమే తెలుసుకోదగిన వస్తువును తెలుపుతోంది. అంటే సూర్యుడు, చంద్రుడు, అగ్ని మొదలైనవన్నీ తెలుసుకోదగిన వస్తువులే.

నేను ప్రతి గ్రహంలోనూ ప్రవేశిస్తాను. నా శక్తి చేతనే అవన్నీ తమ కక్ష్య యందు నిలచి ఉంటాయి. నేనే చంద్రుడినై ఓషధులన్నింటినీ సమకూరుస్తున్నాను. **13**

జీవుల యందుండే జఠరాగ్నిని నేనే. ప్రాణ అపానవాయువులతో కలసి నాలుగు విధాలైన అన్నాలను (భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య రూపాల్లో) జీర్ణమయ్యేట్లు చేస్తున్నాను. **14**

సమస్త ప్రాణుల హృదయాల్లో ఉండే వాడిని నేనే. జ్ఞాపకశక్తి, జ్ఞానం వాటి మరపు కూడా నా వల్లనే కలుగుతున్నాయి. వేదాల్లో చెప్పే వస్తువును నేనే. వేదాంత కర్తను నేనే. వేదములన్నీ తెలిసినవాడను నేనే. **15**

అందరి హృదయాల్లోనూ జ్ఞాన స్వరూపుడుగా ఈశ్వరుడున్నాడు. ముందు చేసిన వాటి గురించి జ్ఞాపకం పెట్టుకునే శక్తి నిచ్చేవాడు; వాటి అవసరం లేనప్పుడు మరపు కలిగించే శక్తి ఆ ఆత్మ చైతన్యం మాత్రమే. వేదం అనగా పరమాత్మ, ప్రకృతి స్వభావాలొక్కొక్కటే వాటి స్వభావానికి తగినట్లుగా ఈశ్వరుని మహిమలను చాటి చెప్పేది. నాశనమయ్యే వస్తువుల మూలంగా అతడి నాశరహిత స్వభావాన్ని చూపేది.

ప్రపంచంలో క్షరుడని, అక్షరుడని ఇద్దరే పురుషులు ఉన్నారు. దేహధారులందరూ క్షరులే. కూటస్థుడైన జీవుడే అక్షరుడని చెప్పబడుతున్నాడు. **16**

"ఫలము పై తోలు, గుజ్జు, గింజలు అన్నీ ఒకే చెట్టు యొక్క ఒకే మూల విత్తనం నుండి వస్తున్నాయి. అట్లాగే ఒకే ఈశ్వరుని నుండి జీవ, జడ, చిత్, అచిత్ అనే సర్వ సృష్టి కలుగుతోంది." *- శ్రీరామకృష్ణ పరమహంస*

ఇక ఈ అన్నింటికీ అవ్యయమైనవాడు పురుషోత్తముడు. ఈశ్వరుడు నిర్వికార పరమాత్మ అని పిలువబడుతున్నాడు. అతడు ముల్లోకాల్లోనూ వ్యాపించి భరిస్తున్నాడు. **17**

"శరీరంలో ఈశ్వరుడు ఏ విధంగా నివసిస్తున్నాడు? నీటి గొట్టంలోని నీరులాగా

అతడు శరీరంలో నివసిస్తున్నాడు. అంటే శరీరంలో ఉన్నప్పటికీ ఆ శరీరంతో ఎట్టి సంబంధములేనివాడై ఉన్నాడని అర్థం." *- శ్రీరామకృష్ణ పరమహంస*

క్షరము నతిక్రమించి, అక్షరము కంటెను నేను శ్రేష్ఠుడనై ఉండటం వలన ప్రపంచంలోను, వేదమందును, పురుషోత్తముడని ప్రసిద్ధి చెందాను. **18**

క్షరము అంటే నాశనమయ్యే ప్రపంచం. అక్షరమంటే ప్రపంచానికి మూల కారణమైన మూల ప్రకృతితో కలసి ఉండే ఈశ్వరుడు. ఈ వస్తువునే చిత్ శక్తిగా భావించినప్పుడు పరమేశ్వరి అన్న పేరుతో వ్యవహరించబడుతుంది. పరమేశ్వరుని యందు జీవాత్మలన్నీ అణగి ఉంటాయి. నిర్గుణ నిరాకారంగా ఉండేవాడే పరబ్రహ్మము. భక్తులు, కవులు, అందరూ అతనిని పురుషోత్తముడని అనడానికి కారణం అతడి శ్రేష్ఠత్వమే.

భరతా! ఎవడు అజ్ఞానం లేనివాడై, నన్నీ విధంగా పురుషోత్తముడనని తెలుసుకుంటున్నాడో, సర్వము ఎరిగిన అట్టివాడు సంపూర్ణ మనస్కుడై నన్ను భజించుచున్నాడు. **19**

వస్తువు ఒక్కటే. అజ్ఞానంలో ఉండే వారికి అది ప్రపంచంగా కనిపిస్తుంది. అజ్ఞానం తొలగిన తర్వాత పరమాత్మ అని తెలుసుకుంటాడు. భగవంతుని దర్శించిన వాడు సర్వము తెలుసుకున్న వాడవుతున్నాడు. అతడి మనోభావాలన్నీ మారిపోతాయి. అతడు ఏ స్థితిలో ఉన్నా భగవంతునే భజిస్తూ ఉంటాడు.

"ఈశ్వర దర్శనం పొందిన పిదప ఈశ్వరుడు సర్వత్రా అన్ని వస్తువుల్లోనూ ఉన్నట్లు భక్తుడు తెలుసుకుంటాడు. కానీ ఈశ్వరుని శ్రేష్ఠమైన రూపం మానవుల యందు కనిపిస్తోంది. దాని కంటెను శ్రేష్ఠమైన రూపము శుద్ధ సాత్విక భక్తులందున్నది."
- శ్రీరామకృష్ణ పరమహంస

పాపరహితుడా! అతి రహస్యమైన ఈ శాస్త్రమును నీకు చెప్పాను. అర్జునా! దానిని చక్కగా గ్రహించినవాడు జ్ఞానవంతుడై కృతార్థుడుకాగలడు. **20**

"పొందటానికి లభ్యంకాని ఈ మానవ జన్మ పొందినవాడు ఈ జన్మలోనే ఈశ్వరుని తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. లేకపోతే అతని జన్మ వ్యర్థమవుతోంది."
- శ్రీరామకృష్ణ పరమహంస

16

దైవాసుర సంపద్విభాగ యోగం

జీవునిలో మిగిలి ఉన్న వాసనల తత్త్వాన్ని గుర్తించడం మూలంగానే వాటిని నశింపజేయగలం. ఈ వాసనల్లో దైవసాన్నిధ్యానికి తోడ్కొని వెళ్ళడానికి ప్రేరణ కల్పించే వాటిని దైవీసంపదగా, తద్విరుద్ధమైన వాటిని అసుర సంపదగా గ్రహించాలి.

శ్రీకృష్ణుడు : నిర్భయత్వము, అంతఃకరణశుద్ధి, జ్ఞానంలోను, యోగమునందును నిష్ఠ కలిగి ఉండటం, దానశీలము, బాహ్యేంద్రియ నిగ్రహం, యాగము, శాస్త్రాధ్యయనం, తపస్సు, ఋజువర్తనం, కలిగి ఉండటం. 1

నిర్భయత్వం : భయం ఉండేవాడు పిరికివాడు. నిర్భయత్వం ఉత్తమ స్థితిని తెలియజేస్తుంది.

అంతఃకరణ శుద్ధి : వంచన, అసత్యం లేకుండా ఉండటం. అందరితో సత్సంబంధాలు కలిగి ఉండటం.

జ్ఞానం : నిత్య, అనిత్య వస్తువుల్ని స్పష్టంగా తెలుసుకోవడం జ్ఞానం.

యోగం : తెలుసుకున్న జ్ఞానాన్ని ఆచరిస్తూ జీవించడమే యోగం.

దానం : తమకు ఉపయోగపడే వస్తువుల్ని ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో, వినయంగాను, ప్రీతితోను ఇవ్వడాన్నే దానం అంటారు

దమము : దీన్నే ఇంద్రియ నిగ్రహం అంటారు. బాహ్య విషయాలపై ఆసక్తిని తగ్గించుకోవడం (అణుచుకోవడం).

యాగము : భగవదర్పణ బుద్ధితో పనులు చెయ్యడం; దైవారాధనలన్నీ యాగాలే.

స్వాధ్యాయం : పారమార్థిక విషయాల్ని బోధించే శాస్త్రాలను భక్తి శ్రద్ధలతో పఠించడం.

తపస్సు : మనస్సును కట్టుబాట్లలో ఉంచుతూ ఉత్తమ గుణాలను వృద్ధి చేసుకోవడం.

ఆర్జవము : మనో వాక్కర్మల యందు వక్రబుద్ధి లేకుండా సక్రమ మార్గంలో నడుచుకోవడం.

అహింస, సత్యము, క్రోధం లేకుండా ఉండటం, త్యాగము, శాంతము చాడీలు చెప్పకుండా ఉండటం, ప్రాణుల యందు దయ, ఇతరుల సొత్తు ఆశించకుండా ఉండటం, మృదుత్వం, సిగ్గు చంచల స్వభావం లేకుండా ఉండటం, **2**

ఇవన్నీ దైవీ స్వభావంతో పుట్టే వారిలో ఉంటాయి. మనలో ఏయే గుణాలు, ఏయే పాళ్ళల్లో ఉన్నాయనే విషయాన్ని విమర్శించుకొని ఆయా గుణాలను వృద్ధి చేసుకునే ప్రయత్నం చెయ్యాలి.

అర్జునా! ధైర్యం, ఓర్పు, స్థిరత్వం, నిర్మలత్వం, వంచన లేకుండా ఉండటం, గర్వం లేకుండా ఉండటం మొదలైనవి దైవసంపదతో పుట్టిన వారియందుదే లక్షణాలు. **3**

పార్థా! అసుర సంపదతో జన్మించిన వారు దంబము, దర్పము, దురహంకారము, కోపము, కఠినత్వము, అజ్ఞానాలను కలిగి ఉంటాడు. **4**

"తినుబండారాల పైపొర బియ్యపు పిండితో చేస్తారు. వాటి లోపల పదార్థాలన్నీ వేరువేరుగా ఉంటాయి. లోపల ఉండే పదార్థాలకు తగినట్లు మధురంగా ఉండేవి, మధురంగా ఉండనివి కూడా ఉంటాయి. అట్లాగే మానవ శరీరాలన్నీ ఒకే విధంగా కనబడుతున్నా చిత్తశుద్ధికి తగినట్లుగా మనుష్యుల్లో తేడాలుంటాయి." – శ్రీరామకృష్ణ పరమహంస

పాండవా! దైవ సంపద మోక్షాన్నిస్తుంది. అసుర సంపద బంధానికి హేతువవుతుంది. నువ్వు దైవసంపదతోనే పుట్టావు. అందువల్ల నువ్వు విచారించాల్సిన పనిలేదు. **5**

పూర్వ జన్మలలో మానవులు చేసే ప్రయత్నాలు వృథా అయిపోవడం లేదు. పుణ్య కర్మఫలం సంసార బంధాల నుండి విముక్తుణ్ణి చేసేందుకు కారణమవుతోంది. అసుర గుణాలు జనన మరణాలకు కారణమై బంధితుణ్ణి చేస్తాయి. అర్జునునికి సందేహం కలగకుండా ఉండేందుకే "దైవసంపద కలిగిన నువ్వు ముక్తికి అర్హుడవు" అని చెప్పాడు.

పార్థా! ఈ సృష్టిలో దైవత్వమని, అసురత్వమని రెండు విధాలైన జన్మలున్నాయి. దేవగుణం గలవారి జన్మల గూర్చి నీకు చెప్పాను. ఇప్పుడు అసుర గుణముతో కూడుకున్న జీవుల గూర్చి చెప్తాను విను. **6**

సృష్టిలోని స్థావర జంగమాల్లో ఎక్కువ భాగం అసురగుణంలో చేరినవే అయి ఉంటాయి. దైవ సంపద కలిగిన వారి సంఖ్య అతి తక్కువగా ఉంటుంది.

అసుర గుణాలు గలవారు చేయవలసినదేదో, చేయలేనిదేదో తెలుసుకోలేరు. శుచిత్వంగాని సదాచారాలుగాని సత్యంగాని వారిలో మచ్చుకైనా కనిపించదు. **7**

ప్రవృత్తి అంటే ధర్మాన్ని చెప్పే విధివాక్యాలు. నివృత్తి అంటే అధర్మాన్ని నిషేధించే నిషేధవాక్యాలు అని ఒక అర్థం ఉంది. మరొక అర్థం ఏమిటంటే అభ్యుదయ సాధనమైన వైదిక ధర్మాన్ని ప్రవృత్తి అని, మోక్ష సాధకమైన వైదిక ధర్మాన్ని నివృత్తి మార్గమనీ అంటారు. అసుర స్వభావం గలవారు అటు ప్రవృత్తి మార్గాన్నిగానీ ఇటు నివృత్తి మార్గాన్ని గానీ అవలంబించరు. శుచి శుభ్రాలు అసలే ఉండవు. ఇక

సత్యాన్ని మాట్లాడటం, సదాచారాలను పాటించడం వారికి సుతరామూ ఇష్టముండదు.

ఈ జగత్తు యావత్తు అసత్యమని, ధర్మప్రతిష్ఠ లేదని, భగవంతుడే లేడని కామం కొరకే స్త్రీ పురుష సంబంధాలు ఏర్పడుతున్నాయని, ఇవి తప్ప వేరే కారణం ఏమీలేదని వీరంటారు. **8**

ఇట్లా చెప్పడం వల్ల ఈ జగత్తు విషయంలో చార్వాకుల (లోకాయతికుల) అభిప్రాయాల్ని, వారి సిద్ధాంతాల్నీ చెప్పినట్లైంది. పరోక్షంగా వారిని అసుర సంపత్తి గలవారని చెప్పడం జరిగింది.

> *"సమయానుష్ఠానములందు విరక్తి చెందడం వలన అతడు లౌకికుడని మనం గుర్తించవచ్చు. భగవన్నామం ఉచ్చరించాలన్నా, భక్తిపాటలు పాడుకోవాలన్నా, వినాలన్నా, అతడి కిష్టముండదు. ఇతరులు అట్లా చేస్తున్నా కూడా వారిని అడ్డగిస్తాడు. స్తోత్రాలు చేసే వారిని నిందించడం, ధర్మాత్ములను, ధర్మ స్థాపన చేసే వాళ్ళను హేళన చెయ్యడం లౌకికులకు సహజ లక్షణం." - శ్రీరామకృష్ణ పరమహంస*

ఇటువంటి అల్పబుద్ధులు ఆత్మ నష్టాన్ని పొంది, క్రూర కర్మలు వేస్తూ లోకకంటకులై లోకవినాశనానికే పుడుతూ ఉంటారు. **9**

వీరంతా విపరీతమైన కామాన్ని ఆశ్రయించి మదంగలవారై ఉంటారు. ఆడంబరంతో మోహం గలవారై చెడు ఆలోచనలు చేస్తూ, అపవిత్రమైన పనులకు పూనుకుంటూ ఉంటారు. **10**

ఇటువంటి మూఢులు జీవించినంతకాలం కామ భోగాలపైనే మనస్సులో ఆలోచనలు చేస్తూ ఉంటారు. అదే జీవితానికి పరమావధి అని తలపోస్తూ ఉంటారు. ఇంతకు మించిన ఆనందం మరెక్కడా దొరకదని నమ్ముతారు. **11**

"ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నా లోకులకు బుద్ధి రావడంలేదు. ఒంటెకు ముళ్ళ కంచె తినడమంటే ఇష్టం. అట్లా తినేటప్పుడు నోరంతా పుండయి రక్తం కారుతూ ఉంటుంది అయినా ముళ్ళను తినడం మానదు. అట్లాగే లోకులు ఎట్టి కష్టాలు ఎదురైనా, ఎంతమంది చేత మోసపోయినా మరుక్షణంలోనే మరిచిపోతున్నారు. తిరిగి వారి మనస్సు విషయాల మీదకే పోతోంది. ఒకడికి భార్య చనిపోతే వెంటనే మరో వివాహం చేసుకుంటాడేగాని భగవంతునిపై దృష్టి పెట్టడు. పిల్లలను సంరక్షణ చేయలేకపోయినా, ఏటా పిల్లల్ని కంటూనే ఉంటారు. ఏమి ఆశ్చర్యము!" – శ్రీరామకృష్ణ పరమహంస

వందలాది ఆశాపాశాలచే బంధించబడ్డవారై, కామక్రోధాలకు బద్ధులై, కోరికలను తీర్చుకోవడానికి, భోగాలు అనుభవించడం కోసం అధర్మ మార్గాల్లో ధనం సంపాదించేందుకు పూనుకుంటున్నారు. **12**

> *"మానవులు రెండు విధాలు." మానవులు అని పేరుకు మాత్రమే గలవారై జీవించేవారు మానవులు. జ్ఞానంతో ప్రకాశిస్తూ, ఈశ్వరుని పొందాలన్న ఏకైక లక్ష్యంతో ఉండేవారు రెండో తెగకు చెందినవారు. కామము, లోభము, పేరాశ కలిగి ఉండే వారు కేవలం పేరుకు మాత్రమే మానవులని పిలిపించుకుంటున్నారు." - శ్రీరామకృష్ణ పరమహంస*

అసుర స్వభావం గలవాడు ఇలా అనుకుంటాడు. ఈనాడు నా వద్ద ఇంత ధనమున్నది. నేను దీన్ని మరింతగా వృద్ధి చేస్తాను. ఇదంతా నాదే. **13**

అతడు నా శత్రువు. అతణ్ణి నేను చంపాను. ఇతర శత్రువుల్ని కూడా చంపేస్తాను. నేనే దీని కంతకు ప్రభువుని. **14**

నేనే భగవంతుణ్ణి. నేను ఉత్తమ వంశంలో జన్మించాను. నాతో సమానమైన వాడెవ్వడూ లేడు. అందరికంటే గొప్ప యజ్ఞ యాగాలు చేస్తాను. నన్ను స్తోత్రం చేసే వారికి ధనమిచ్చి సత్కరిస్తాను. అట్లా నన్ను పొగుడుతూ ఉంటే నాకు ఆనందంగా ఉంటుంది. **15**

వారు ఈ విధమైన అనేక చిత్త భ్రాంతులతో కలత చెందుతూ ఉంటారు. మాయచే మోహింపబడి ఇంద్రియ భోగాలకు బానిసలవుతూ నరకాన్ని అనుభవిస్తున్నారు. **16**

ఆత్మస్తుతి చేసుకుంటూ, వినయం లేనివారై, ధనమదంతో, యాగాలను నామ మాత్రంగా చేస్తుంటారు. వారు చేసే యాగాలలో ఆడంబరమే ఎక్కువగా ఉంటుంది. విధికి వ్యతిరేకంగా యాగాలు చేస్తారు. **17**

అహంకారం, బలం, దర్పం, కామం, క్రోధం, మొదలైన దుర్గుణాలన్నీ కలిగిన వారు వారి దేహంలోను, ఇతరుల దేహంలోనూ, ఉన్న నన్ను గుర్తించక ద్వేషించి అవమానిస్తున్నారు. **18**

నన్ను ద్వేషించే వారిని, క్రూరులను, అధములను, నీచ స్వభావం గలవారిని, జనన మరణ రూపమైన సంసారంలో బంధించి మళ్ళీ మళ్ళీ పుడుతూ చస్తూ ఉండేట్లుగా నీచజన్మలో పడేస్తాను. **19**

కుంతీ కుమారా! మూఢులు అనేక జన్మలలో అసుర యోనులలో పుడుతూ నన్ను చేరుకోకుండానే అధోగతిని పొందుతున్నారు. **20**

కామక్రోధ లోభము అనే మూడు విధాలైన ద్వారములుగల నరకం మూఢులైన జీవుల్ని నాశనం చేస్తుంది. కనుక ఈ మూడింటినీ అవశ్యం విడిచిపెట్టెయ్యాలి. **21**

అర్జునా! అజ్ఞాన కారణాలైన ఈ మూడు నరక ద్వారాల నుండి విముక్తుడైనవాడు ముందుగా ఆత్మ శ్రేయస్సును ఆచరిస్తూ ఆ తర్వాత మోక్షాన్ని పొందుతున్నాడు. **22**

కామానికి వశుడై శాస్త్రాన్ని విస్మరించి ప్రవర్తించేవాడు ఎన్నటికీ పరిపూర్ణుడు కాలేడు. సుఖించలేడు. చివరగా మోక్షాన్ని పొందలేడు. **23**

కనుక నువ్వు చేసేది, చేయగలిగినది ఇదేనని నిశ్చయించుకో. అందుకు నీకు శాస్త్ర ప్రమాణాలు తోడుగా ఉన్నాయి. నువ్విక్కడ శాస్త్రం యొక్క ఆదేశాన్ని పాటించి కర్మలు చెయ్యి. **24**

"మీరు ఏ శాస్త్రాన్ని అనుసరిస్తున్నారు" అని నన్నొక భక్తుడు అడిగినప్పుడు నేనిట్లా జవాబు చెప్పాను : "నేను ఏ శాస్త్రాన్నీ అనుసరించడం లేదు. నా హృదయంలో నివసిస్తున్న దైవం వద్ద అనుమతి తీసుకొని జీవితాన్ని గడుపుతున్నాను. అందువల్ల నేను దారి తప్పడంలేదు. నా జీవితం ఏ శాస్త్రానికి వ్యతిరేకంగా ఉండదు."

17

శ్రద్ధాత్రయ విభాగయోగం

అర్జునుడు : హే కృష్ణా! ఎవరైతే శ్రద్ధగా నిన్ను ఆరాధిస్తున్నా శాస్త్ర విధిని అతిక్రమిస్తూ ఉంటారో వారి నిష్ఠ ఎట్లాంటిది? అంటే వారి శ్రద్ధ సత్త్వంతో కూడుకున్నదా? లేక రజస్సుతో కూడుకుందా? లేక తమస్సుతో కూడుకున్నదా? **1**

శ్రీకృష్ణుడు : సామాన్యంగా దేహధారుల్లో మూడు విధాలైన శ్రద్ధ కలుగుతూ ఉంటుంది. వాటిని గూర్చి వివరంగా చెప్తాను. విను. **2**

పూర్వ జన్మలలో చేసిన కర్మ ఫలాలు సంస్కారాలుగా మనస్సులో స్థిరపడతాయి. ఆ తర్వాత జన్మలో ఆ సంస్కారాలే జీవుని స్వభావం అవుతోంది. ఆ స్వభావానికి తగినట్లు ఈ నూతన జన్మలో కర్మలు చేస్తూ ఉంటాడు. అంటే అతడి స్వభావాన్ని బట్టి అతడి గుణాన్ని కనుక్కోవచ్చు.

భారతా! జీవుల మనోభావాలకు తగినట్లుగా శ్రద్ధ కుదురుతుంది. మానవుడు ఎవడు ఎట్టి శ్రద్ధ గలవాడై ఉంటాడో ఆ శ్రద్ధకు అనుగుణంగానే సాత్వికుడో, రాజసికుడో, తామసుడో అవుతున్నాడు. అతడి శ్రద్ధను బట్టే అతడి నిష్ఠనుకూడా తెలుసుకోవాలి. **3**

శ్రద్ధ అంటే మనస్సులో ఉత్సాహాన్ని నింపుకొని కర్మలు చెయ్యడం. చేస్తున్న కర్మల్లో ఆనందం, నమ్మకం కలిగిస్తే కలిగేదే శ్రద్ధ. అతడి శ్రద్ధను బట్టి అతడు పొందబోయే ఫలాన్ని తెలుసుకోవచ్చు. ఆకాశంలోకి ఓ రాయి విసిరితే వేగానికి తగినట్లుగా ఎత్తుకుపోతుంది. అట్లాగే వృక్షంలోని సారాన్ని బట్టి ఎత్తు పెరుగుతోంది. అట్లాగే మానవుని యందుండే శ్రద్ధను బట్టి అతడు శ్రేష్ఠుడవుతున్నాడు.

సాత్వికులు దేవతల్ని ఆరాధిస్తున్నారు. రజోగుణంగలవారు యక్ష రాక్షసుల్ని ఆరాధిస్తున్నారు. తామస గుణం గలవారు భూత ప్రేతాలను ఆరాధిస్తున్నారు. **4**

డంబము, అహంకారము కలిగి, కామము, రాగము బలంగా ఉన్నప్పుడు ఏ అవివేకి అయితే ఇంద్రియాలను, హృదయంలో నివసిస్తున్న నన్నూ హింసిస్తాడో అతడు అసుర స్వభావం గలవాడవుతున్నాడు. అతడు చేసే కఠినమైన తపస్సంతా శాస్త్ర విరుద్ధమవుతుందని తెలుసుకో. **5-6**

అసుర గుణాలు గలవాళ్ళు చేసే తపస్సు వారికే సుఖానివ్వడం లేదు. అది ఎట్లాగంటే, ఒంటికాలిపై నిలబడి ఉండడటం, సూర్యుని తదేక దృష్టితో చూస్తూండటం వంటివి చూసేవారికి కూడా కలత కలిగిస్తూ ఉండటమే కాకుండా ఇంద్రియాల్ని హింసిస్తున్నారు. దంబం, దర్పంతో కూడుకున్న వీరి తపస్సు ఈశ్వర సాన్నిధ్యానికి చేర్చడం లేదు. మనస్సాక్షిగా ఉన్న సర్వేశ్వరుని నిర్లక్ష్యం చేస్తున్నారు. సుఖదుఃఖాలకు అతీతుడైన ఆ పరమాత్ముడు బాధించబడిన వానివలె కనిపిస్తున్నాడు. కనుక ఇది శాస్త్ర సమ్మతం కాదు. ఇటువంటి గుణంగలవారు అసురులవుతున్నారు.

త్రిగుణముల ననుసరించి మనుష్యులు భుజించే ఆహారం మూడు విధాలుగా ఉంది. అట్లాగే యజ్ఞము, దానము, తపస్సులు కూడా మూడు విధాలు. ఇప్పుడు వాటిలోని భేదాలు చెప్తాను. విను. **7**

ఆయుస్సు, మనోబలం, దేహబలం, ఆరోగ్యం, సుఖం, రుచులను వృద్ధి పొందించేవని, రసముగలవి, చమురుగలవి శక్తి నిచ్చేవని, మనోహరములైన ఆహారాలు సాత్త్వికులైనవారికి ప్రియమైనవి. **8**

ప్రీతి అయినవి అంటే ఆకలిని కలిగించేవని, స్థిరమైనదిగా ఎక్కువ సేపు ఉండేదని అర్థం. సారంలేని ఆహారం త్వరగా జీర్ణమైపోతుంది. అటువంటి ఆహారం శరీరానికి బలాన్నివ్వదు. అంతేకాదు. జీర్ణం కాని కఠినమైన పదార్థాలు జీర్ణకోశాన్ని బాధిస్తాయి. కనుక ఆయుస్సు తగ్గిపోతుంది. ఈ ఆహారం కాలానికి, స్థలానికి తగినట్లుగా మారుతూ ఉంటుంది. ఉదయం పూట తీసుకునే ఆహారం తేలికగా ఉండాలి. రాత్రిపూట తీసుకునే ఆహారం నిద్రపోయే లోపుగానే జీర్ణమయ్యేట్లుండాలి. శీతల ప్రదేశాల్లో ఉష్ణాన్ని కలిగించేది, ఉష్ణ ప్రాంతాల్లో చలవచేసే పదార్థాలు తీసుకోవాలి.

"పగటి పూట కావలసినంత ఆహారం తీసుకో. కాని రాత్రిళ్ళు మాత్రం ఆహారాన్ని తగ్గించి తీసుకో." *- శ్రీరామకృష్ణ పరమహంస*

చేదు, పులుపు, ఉప్పు, మిక్కిలి వేడి, కారం, ఎండినవి, మంట పుట్టించేవి దుఃఖము, వ్యాకులత, రోగము కలిగించే ఆహారాలు రజోగుణం గల వానికి ఇష్టమైనవిగా ఉంటాయి. **9**

జాము దాటిన తర్వాత, రుచిలేనివి, దుర్గంధం కలిగినవి, పాతబడినవి, ఎంగిలి పడినవి, అశుచిగా ఉండే ఆహారాలు తమోగుణంగలవానికి ఇష్టమైనవై ఉంటాయి. **10**

శాస్త్రం నిర్దేశించినట్లు, అట్లా చెయ్యడం తమ విధి అని తలచి, ఫలాన్ని ఆశించకుండా చేసే యజ్ఞాన్ని సాత్త్విక యజ్ఞం అంటారు. **11**

శిశువును పోషించే తల్లి, ప్రతిఫలాన్ని ఆశించకుండానే సేవ చెయ్యడం తన కర్తవ్యమనుకొని చేస్తుంది. అట్లాగే సత్పురుషులకు భగవదారాధన చెయ్యడం కూడా సహజస్వభావమై ఉంటుంది.

భారత కులవీరుడా! ఫలాన్ని కోరిగాని, ఆడంబరం కోసంగాని, చేసే ఆరాధన రాజసమైనదని తెలుసుకో. **12**

తనకు కావలసిన వస్తువును డబ్బిచ్చి కొనుక్కున్నట్లుగా కోరికలతో భగవదారాధన చెయ్యడం

మంచిది కాదు.

శాస్త్ర ప్రకారం చెయ్యనిది, అన్నదానం లేనిది, మంత్రహీనమైనది, దక్షిణలేనిది, బొత్తిగా శ్రద్ధలేనిది అయిన యజ్ఞాన్ని తామస యజ్ఞమంటారు. **13**

చేసే ఆరాధనలో లోపాలుంటే అది శాస్త్ర విధిని అనుసరించనిదని అంటారు. ప్రాణులన్నింటికీ సంబంధాన్ని కల్పించడం కోసం దైవారాధనలో అన్నదానం ఉండాలి. చేసే ఆరాధన మంచి ఉద్దేశంతో చెయ్యకపోవడాన్నే మంత్రహీనమంటారు. అంటే సదుద్దేశాలు లేని ఆరాధన యాంత్రికమవుతుంది. పురోహితునికి, జ్ఞానవంతులకు, సత్ప్రవర్తనగలవారిని సన్మానించడాన్నే దక్షిణ అంటారు. కనుక దక్షిణలేని ఆరాధన అట్టి వారిని అలక్ష్యం చేసేదవుతుంది. కనుక అది శ్రేష్ఠంకాదు. ఇన్ని లోపాలతో చేసే ఆరాధన శ్రేష్ఠమైనది కాదని చెప్పబడుతోంది.

దేవదేవుని, బ్రాహ్మణులను, ఆధ్యాత్మిక గురువు, తల్లిదండ్రులు, మొదలైన వారిని పూజించడం, శుచిత్వం, సరళత్వం, బ్రహ్మచర్యం, అహింస అనేవి శారీరక తపస్సని చెప్పబడింది. **14**

తపః అంటే కొలిమిలో కాల్చుట అని అర్థం. భూమిలో త్రవ్వి తీసిన ధాతువుల్ని కాల్చి శుద్ధిచేస్తున్నాం. అట్లాగే తపస్సు చేత మానవుడు మనస్సును (తననుతాను) పక్వం చేసుకుంటున్నాడు. మనోవాక్కాయ కర్మలనే మూడింటినీ పరి పక్వం చేసేది మనస్సు.

పరబ్రహ్మం యొక్క వేరువేరు రూపాలే దేవతలు. పారమార్థిక జీవనంలో ఉత్తమ స్థితికి ఎదిగిన వారు బ్రాహ్మణులు. జీవితాన్ని ఆదర్శప్రాయంగా గడుపుతూ నిజవస్తువును తెలుసుకున్నవారు జ్ఞానులు, గురువులు. వీరిని పూజించడం ద్వారా ఉత్తమ ప్రాప్తిని పొందేందుకు స్నానాదులు చేసి శుచిగా ఉండాలి. శరీరంలో చేసే పనులన్నీ శీలంగలవై ఉండాలి. అప్పుడే దాన్ని ఋజుత్వం గలదంటారు. సంభోగానికి శరీరం ఒక ఆయుధంగా పని చేస్తుంది. ఇంద్రియాల ద్వారా కలిగే సుఖాలన్నీ తర్వాత దుఃఖంగా పరిణమిస్తున్నాయి. కనుక భోగమనే సుఖాన్ని ఆశించి నశించడం కన్నా పరిపూర్ణమైన శాంతినిచ్చే యాగాన్ని చెయ్యడం మంచిది. ఇంద్రియాల నుండి తన్నుతాను కాపాడుకోవడాన్నే బ్రహ్మచర్యం అంటారు. శరీరధారులు తోటి శరీరధారుల్ని హింసించకుండా ఉండటాన్నే అహింస అంటారు. ఇవన్నీ దైహిక తపస్సులు. ఇతరుల్ని బాధపెట్టని సత్యము, ప్రీతితో కూడినది మేలు చేకూర్చే తియ్యటి మాట (వాక్కు) మరియు వేదాధ్యయనం వంటివన్నీ వాచిక తపస్సులు.

మనస్సును మాటలతో బాధపెట్టడం శరీరాన్ని హింసించడం కన్నా ఎక్కువ కీడు కలుగజేస్తుంది. కాబట్టి తపస్వి అయినవాడు ఎదుటి వారి మనస్సును నొప్పించకూడదు. కొన్ని సమయాల్లో నిజం చెప్పడం వల్ల కష్టనష్టాలు అధికంగా ఉండవచ్చు. అట్లాగని అబద్ధము చెప్పకూడదు. కనుక చెప్పే సత్యం ఎదుటి వారిని బాధించేదిగా ఉండకూడదు. జ్ఞానధనులు ఉప్పొంగిపోయి స్తుతించిన స్తోత్రాలే వేదాలని చెప్పబడుతున్నాయి. దీన్నే వేదాంతాలని కూడా అంటారు. వేద వేదాంతాలు ఎవరు చెప్పినా అవి

భగవంతుని కరుణనే వర్ణించి చెబుతాయి. అటువంటి శాస్త్రాలను అధ్యయనం చెయ్యడం వలన వాక్కు శుద్ధమవుతుంది. పైన చెప్పబడినవన్నీ చక్కగా ఆచరిస్తే అదే వాచిక తపస్సు అవుతోంది.

నిర్మలమైన మనస్సు, ప్రసన్నంగా ఉండటం, ఆత్మనిగ్రహం, పరిశుద్ధమైన స్వభావం, ఇవన్నీ మానసిక తపస్సుగా పరిగణింపబడుతున్నాయి. **16**

అలసిపోని మనస్సు కలత చెందనిది, శాంతముగా ఉండేదాన్నే నిర్మలమైన మనస్సని అంటారు. ఉన్నతమైన ఆలోచనలనే చెయ్యడం, చెడు విషయాల గూర్చి ఆలోచించకుండా ఉండటం, ఎల్లప్పుడూ దైవచింతనే చేస్తూ ఉండడాన్ని మనోనిగ్రహం అంటారు.

ఈ మూడు విధములైన తపస్సులను ఫలాపేక్ష లేనివారు, యోగమందు మనస్సు నిలిపినవారు, చేసినప్పుడు అది సాత్వికమైన తపస్సని చెప్పబడుతోంది. **17**

ఫలాపేక్షను ఆశించే కర్మలేవైనా పవిత్రతను కోల్పోతాయి. ఫలాపేక్ష కోరని కర్మల వలన స్థిర చిత్తమేర్పడుతోంది. అట్లా చెయ్యడం సాత్త్వికుల లక్షణం. వారు త్రికరణ శుద్ధిగా పాటుపడుతూ ఉంటారు. అట్టి వారు చేసే తపస్సు ఏనాటికీ ఓటమిని చవిచూడదు.

సత్కారము, గౌరవము, ఆడంబరంతో కూడిన తపస్సు, తాత్కాలికమైనదని, రాజసమైనదని చెప్పబడుతోంది. **18**

బాహ్యాడంబరాలతో చేసే పూజలు తాత్కాలికంగానే పనిచేస్తాయి. క్రమంగా శ్రద్ధ తగ్గిపోతుంది. అటువంటి ప్రయత్నాలు ప్రపంచంలో నామమాత్రంగానే పేరు ప్రతిష్ఠల్ని సంపాదించి పెడతాయి.

మూర్ఖపు పట్టుదల, తన్నుతాను హింసించుకోవడం, లేదా ఇతరులను నాశనం చెయ్యాలనే తలంపుతో చేసే తపస్సును తామస తపస్సంటారు. **19**

వివేకశూన్యులు తపస్సులోని అంతరార్థాన్ని గ్రహించలేకపోతున్నారు. తపస్సుకు వ్యతిరేకార్థాలు కల్పించుకుంటున్నారు. ఉపవాసాలుంటూ శరీరాన్ని శుష్కింపజేసుకుంటున్నారు. క్రమంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అజ్ఞానాంధకారంతో చేస్తున్న ఈ తపస్సునే తామస తపస్సని అంటారు.

ప్రతి ఫలాపేక్ష లేకుండా సరైన ప్రదేశంలో మరియు సరైన సమయంలో తగినవానికి స్వధర్మమనే భావనతో చేసే దానం సత్త్వగుణంతో కూడినదని తెలుసుకో. **20**

శాస్త్రం చెబుతోంది కాబట్టి ఈ దానం తప్పకుండా చెయ్యాల్సిందేనని మనస్సులో నిశ్చయించుకొని సరైన ప్రదేశంలో అంటే కాశీరామేశ్వరం కురుక్షేత్రం వంటి పుణ్యక్షేత్రాలలో, సరైన సమయంలో అంటే సంక్రమణ కాలంలోగాని, గ్రహణ కాలంలో, తగినవానికి అంటే సద్బ్రాహ్మణులకు, తపోధనులైన వారికి దానం ఇవ్వాలి. అట్లా దానం పుచ్చుకునే వారికి ప్రత్యుపకారం చేసే శక్తి లేకపోయినా, ఒకవేళ ప్రత్యుపకారం చేయగల శక్తి గలవారే అయినా ప్రతిఫలాపేక్ష లేకుండా చేయబడే దానాన్నే సాత్త్విక దానం అంటారు.

మరియు ప్రతిఫలాన్ని ఆశించియో, అయిష్టంతోగాని చేసే దానం రాజసదాన మనిపించుకుంటుంది. **21**

సమయం వచ్చినప్పుడు ప్రత్యుపకారం చెయ్యకపోతాడా? అనో, ఇట్లాంటి దానం వల్ల నాకు పుణ్యం వస్తుందనో, మరుజన్మల్లో లాభిస్తుందనో అయ్యో! ఈ దానాల వల్ల చాలా డబ్బు ఖర్చయి పోతోందే అన్న వ్యథతోనో చెయ్యడం వంటివన్నీ రాజసిక దానాలవుతాయి. వీరిలో కొద్దోగొప్పో వ్యాపార దృక్పథం కనిపిస్తుంది.

దేశకాలములందు దానానికి తగని వారికి (అపాత్రులకు) శ్రద్ధా, గౌరవం లేకుండా చేసే దానాన్ని తామసదానమంటారు. **22**

పునీతంకానిది, ప్రయోజనం ఉండని దానాన్నే తగని ప్రదేశము అని చెప్పబడుతోంది. నిద్రపోయే సమయం, మనస్సు శరీరం ఇతర కార్యాలపైన లగ్నమై ఉన్నప్పుడు చేసేదానని 'అకాల'మంటారు. అట్లాగే శీలం లేనివారు, అణకువలేనివారు, డబ్బు వృథాగా ఖర్చుచేసేవారు దానానికి అర్హులు కారు. సంతోషంగా స్వాగతం చెప్పనివారు, మర్యాద లేకుండా చులకన భావంతో చేసే దానాన్ని తామసదానమంటారు.

సృష్టి ప్రారంభం అయినప్పటినుండి ఓం, తత్, సత్ అనే మూడు పదాలు పరతత్త్వాన్ని చెబుతూ వాడబడ్డాయి. వేద మంత్రాలను ఉచ్చరించడానికి, పరబ్రహ్మ ప్రీతి కొరకు, యజ్ఞం చేస్తున్నప్పుడూ ఈ మూడు పదాలు ఋత్విక్కుల చేత ఉపయోగించ బడుతూ ఉండేవి.

ఈ మూడు ఆది శబ్దాలుగా పరిగణించబడుతున్నాయి. శబ్దం నుండే ప్రపంచం పుడుతోంది కాబట్టి, దానిని నాదబ్రహ్మమన్నారు. 'ఓం' అన్నది బ్రహ్మాండాలన్నింట్లోను, కార్య స్వరూపమై విరామం లేకుండా ధ్వనిస్తూనే ఉంటుంది. దీనినే ప్రణవమని అంటారు. కాబట్టి పరబ్రహ్మము ఓంకార స్వరూపుడని చెప్పవచ్చును. జ్ఞానులు బ్రహ్మమును గూర్చి చెప్పాల్సివచ్చినప్పుడల్లా 'అది' అని చెప్తూ వస్తున్నారు. "అది" అనగా 'తత్' అని అర్థం చేసుకోవాలి. వేదంగూడా పరబ్రహ్మమును పేరుతో పిలవకుండా 'తత్' అనే పదాన్నే ఉపయోగిస్తోంది. అట్లాగే ఏది సత్యమైన వస్తువో అది "సత్" అని చెప్పుడుతోంది. దేశ కాలాలచేత బాధించబడనిది బ్రహ్మమే కాబట్టి, అట్టి బ్రహ్మం 'సత్' అని పేరు పొందింది. కనుక ఓం తత్ సత్ అంటే ఓంకార శబ్దరూపమైన ఆ బ్రహ్మమే సత్యమైనదని అర్థం.

కనుక వేదము తెలిసినవారు వేదోక్తంగా చేసే యజ్ఞ, దాన, తపః క్రియలన్నింటినీ 'ఓం' అనే ఉచ్చారణతో ప్రారంభిస్తారు. **24**

కర్మలు చేస్తూ ఉంటే అంతో ఇంతో లోపాలు లేకుండా ఉండవు. అంతమాత్రం చేత కర్మలు మానరాదు. అట్టి లోపాల్ని సరిదిద్దేందుకే ప్రతికర్మ ముందు 'ఓం' కార నామ ఉచ్చారణతో ప్రారంభం అవుతుంది. ప్రకృతి మానవాళి శ్రేయస్సు కోసం కొన్ని కట్టుబాట్లను నియమించింది. కనుక కర్మలన్నీ ఆ కట్టుబాట్లకు లోబడి చేస్తూ ఉండాలి. అప్పుడే అభివృద్ధి సాధించగలుగుతాం. కట్టుబాట్లతో కూడిన ఈ కర్మలే కాలక్రమంలో విఘ్నేశ్వర పూజగా రూపొందింది. అంటే ఆచరించే కర్మల్లోని లోపాల వలన విఘ్నాలు కలుగకుండా ఉండేందుకు వినాయకుడు తోడ్పడుతూ ఉంటాడు.

'తత్' అని బ్రహ్మను గుర్తించే పదాన్ని ఉచ్చరించి ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా

సాధకులు నానా విధములైన యజ్ఞాలు, తపస్సులు, దానాల వంటివి ఆచరిస్తూ ఉంటారు. **25**

'తత్' అని ఆ పరబ్రహ్మాన్ని ధ్యానించి ఈ తపస్సు దాన యజ్ఞ కార్యాలన్నీ అతడి సొత్తే నన్న భావంతో చెయ్యడం. కర్మలు ఎంత ఉత్తమమైనవైనా స్వప్రయోజనం కోసం చేసేవైతే కొద్దోగొప్పో లోపాలుంటూనే ఉంటాయి. అదే, ఆ చేసే కర్మలన్నీ ఈశ్వరుడే చేయిస్తున్నాడని దేవతారాధనా భావంతో చెయ్యాలి. అట్లా చేసినప్పుడు కర్మ ఫలం తనది కాదన్న భావం వ్యక్తమవుతుంది. దాని వలన ముముక్షుత్వం కలుగుతుంది. తర్వాత యజ్ఞము, దానము, తపస్సు దానికి సాధనాలుగా ఉపకరిస్తాయి.

అర్జునా! సత్ అనే పదానికి 'కలదు' అని ఒక అర్థం, 'మంచి'అని మరొక అర్థం ఉన్నాయి. ఓం, తత్, సత్ అనే మూడు పదాలు పరబ్రహ్మాన్నే చెబుతున్నాయి. **26**

ఈ ప్రపంచం దోషంతో కూడుకున్నది, అసత్యమైనది అయినా కూడా, ఈ ప్రపంచ జీవనాన్ని నిత్యమైనదని, మంచిదన్న భావనతో పూర్తిగా ప్రయోజనాన్ని పొందాలి. అట్లా భావిస్తేనే జీవితంలో సుఖంగా ఉండగలుగుతాం. కనుక సత్ అనే పదం అటువంటి భావనను కలిగిస్తోంది.

యాగము, తపస్సు, దానములందు స్థిరమైనది సత్, అని చెప్పబడుతోంది. అంతేకాదు, బ్రహ్మం కోసం చేసే కర్మలన్నీ సత్ అనే చెప్పబడుతున్నాయి. **27**

యాగము, తపస్సు, దానములను క్రమ పద్ధతితో చేసినప్పుడు అవన్నీ సహజంగానే సత్‌నే లక్ష్యంగా పెట్టుకొని చేసినట్లవుతుంది. మనం ఒక ఇల్లు కడుతున్నాం అనుకోండి. కొంత ఎత్తు కట్టిన తర్వాత ఆపైన పనివాడికి అందదు. అందుకోసం సారం (రీబీజీబీచీ నీళిజిఖిరిదీవీ) కట్టుకొని దానిపై నిలబడి ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేస్తాడు. ఇల్లు స్థిరంగా ఉండే వస్తువు. సారం కట్టడమన్నది అస్థిరమైనది. అస్థిరమైన దాన్ని కట్టుకోవడం వల్లనే స్థిరమైన ఇంటిని కట్టుకోగలుగుతున్నాం. ఇల్లు కట్టం పూర్తి అయిన తర్వాత సారం విప్పదీసేస్తున్నాం. అట్లాగే యాగం, తపస్సు, దానం అన్నవి అస్థిరమైనవే అయినా శాశ్వతమైన దైవాన్ని పొందటం కోసం చేసే కర్మల్నే 'సత్' కర్మలని అంటున్నారు. ఏదైనా పని చేసేటప్పుడు క్రమం తప్పుతూ ఉంటే 'సత్' అనే మంత్రాన్ని ఉచ్చరిస్తూ చెయ్యడం వల్ల వాటిలో ఉండే దోషాలు తొలగిపోతాయి. కాలక్రమంలో అవే మంచివవుతున్నాయి.

శ్రద్ధలేక చేసే యాగము, దానము, తపస్సు ఇతర కర్మలు అసత్ అనబడుతున్నాయి. అర్జునా! అటువంటి కర్మలు పరానికి ఉపయోగపడవు. ఇహానికి పనికిరావు. **28**

యాగం, దానం, తపస్సులను సక్రమంగా చేసినట్లయితే పరబోధాన్ని పెంచుతుంది. దాని వల్ల జీవ బోధం నశిస్తుంది. స్వార్థంతో చేసినట్లయితే జీవబోధము మరింత పెరుగుతుంది. పరబోధం బహుదూరమై పోతుంది. ప్రాపంచిక సుఖాల్ని అనుభవించాలంటే జీవబోధం అవసరమై ఉంటుంది. పరమాత్మ వల్ల కలిగే పరమానందాన్ని అనుభవించాలంటే పరబోధం కావాల్సి ఉంటుంది. శ్రద్ధ లేనివానికి పరబోధమూ ఉండదు, జీవబోధమూ ఉండదు. శ్రద్ధతో చేసే కర్మలన్నీ మేలునే చేస్తాయి. శ్రద్ధతో చేసేటప్పుడు ఓం, తత్, సత్ అన్న మంత్రాల్ని ఉచ్చరిస్తూ కర్మలు చేస్తే కర్మల్లో ఉండే సహజ దోషాలు తొలగిపోతాయి. పరమ పదాన్ని పొందేందుకు అదే తగిన ఉపాయం.

18

మోక్ష సన్న్యాస యోగం

అర్జునుడు : హృషీకేశా! మహాబాహో! సన్న్యాసము యొక్కయు, త్యాగము యొక్కయు తత్త్వములను వేరు వేరుగా తెలుపు. **1**

ఇంత వరకు చెప్పిన సిద్ధాంతాలన్నీ మరొకసారి సమీక్షింపబడుతున్నాయి. పూర్వం చెప్పిన వాటన్నింటినీ కలిపి చెప్పిన శాస్త్రాన్ని యోగ శాస్త్రమంటారు. ఈ అధ్యాయంలో ఆ శాస్త్రం పూర్తి అవుతుంది.

శ్రీకృష్ణుడు : కామ్యకర్మల్ని వదలడమే సన్న్యాసమని పెద్దలంటారు. సర్వ కర్మల ఫలాన్నీ వదలడమే త్యాగమని పండితుల అభిప్రాయం. **2**

కామ్య కర్మలంటే సిరి సంపదలు, భార్యా పిల్లల క్షేమం, కీర్తి ప్రతిష్ఠలు, స్వర్గ ప్రాప్తిని ఆశించడం వంటివి. ఇటువంటి ఆశ లన్నింటిని వదిలి పెట్టడాన్నే సన్న్యాసమంటారని పెద్దలంటారు. కానీ సంధ్యావందనం, అగ్నిహోత్రం వంటి నిత్యనైమిత్తిక కర్మల్ని వదలడాన్ని కర్మత్యాగమని పండితుల అభిప్రాయం.

> *"సత్త్వగుణం గలవారికి కర్మలు చేయాల్సిన పని ఉండదు. కర్మలే వారిని వదిలేస్తాయి. బలవంతంగా చేద్దామన్నా చెయ్యలేరు. భగవంతుడే వారిని చెయ్యనివ్వడు. సత్త్వగుణం గల మానవుడు ప్రపంచంలో చెయ్యాల్సిన పనులన్నీ చేస్తూనే ఉండాలి. అది ఎట్లాగంటే, ఒక ధనవంతుని వద్ద తనో సేవకుడనని భావించుకుంటూ సేవలు చేస్తూ ఉండాలి. దీన్నే కర్మయోగమంటారు. ఈ విధంగా తాను చెయ్యవలసిన కర్మలన్నీ పరిత్యాగ బుద్ధితో చేస్తూనే, విడిచి పెట్టకుండా భగవన్నామాన్ని మననం చేస్తూ ఉండాలి. దాంట్లోనే కర్మయోగం యొక్క సారమంతా అణగి ఉంది."* - *శ్రీరామకృష్ణ పరమహంస*

కర్మలన్నీ దోషాలతో కూడుకున్నవే కాబట్టి వాటిని వదిలెయ్యాలని ప్రాజ్ఞుల అభిప్రాయం. అయితే, యాగము, దానము, తపస్సు వంటి కర్మల్ని విడువరాదని మరికొందరి అభిప్రాయం. **3**

కర్మలన్న తర్వాత వాటివల్ల గుణదోషాలు రెండూ ఉంటాయి. కనుక దోషాలను గుర్తించి అట్టి కర్మల్ని వదిలెయ్యమని కొందరి అభిప్రాయం. అయితే గులాబీకి ముళ్ళుంటాయని పెంచడం మానేస్తే గులాబీలోని అందాన్ని, సువాసనను పోగొట్టుకుంటాం. వర్షం వల్ల నేల పదునై వ్యవసాయానికి ఉపయోగపడుతోంది. అదే వాన వలన ఇళ్ళులేని జంతువులు తడిసి బాధపడుతున్నాయి. అందువల్ల వర్షాన్ని నివారించగలమా? పాములో ఉండే విషం ప్రాణాన్ని నిమిషంలో తీసేస్తుంది. అదే విషాన్ని ఔషధంగా మలిస్తే ఎన్నో ప్రాణాల్ని రక్షించ గలుగుతాం. కనుక ఇటువంటి కర్మల్ని విడువరాదని విజ్ఞుల అభిప్రాయం.

భరతకుల శ్రేష్ఠుడా! త్యాగాన్ని గూర్చి నేను చెప్పే సిద్ధాంతాన్ని శ్రద్ధగా విను. త్యాగం మూడు విధాలుగా చెప్పబడుతోంది. **4**

సన్న్యాసమన్నా, త్యాగమన్నా ఒక్కటే అర్థం. త్యాగమే జీవితానికి పట్టుకొమ్మ అని భగవానుని అభిప్రాయం. సుఖం పొందడానికి త్యాగం ఒక ఉపాయం.

తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను వదలి బయటకు పోవడం విద్యార్థి చేస్తున్న త్యాగమే. అంటే జీవితాంతం పాఠశాలలోనే గడపడం అతడి లక్ష్యం కాదు. అట్లాగే నవమాసాల పాటు బిడ్డను కడుపులో పెట్టుకొని పోషించిన తల్లి పదిమాసాల తర్వాత త్యాగం చేస్తోంది. అట్లా చెయ్యక పోతే తల్లి బ్రతకదు, బిడ్డా బ్రతకదు. కనుక వారిద్దరూ సుఖంగా జీవించాలంటే బిడ్డను వదిలెయ్యాల్సిందే. ఇలా అనేకం.

యజ్ఞము, దానము, తపస్సు, మొదలైన కర్మలు విడిచిపెట్టదగినవి కావు. ఎందువల్లనంటే ఈ కర్మలు బుద్ధిమంతునికి పవిత్రతను కలుగజేస్తాయి. **5**

గొంగళి పురుగు గూడు కట్టుకొని తన్నుతానే బంధించుకుంటోంది. చాలా కాలం అందులో బందీగా ఉంటోంది. అందువల్ల ఆ పురుగుకు కొంత లాభం కలుగుతోంది. కొంత కాలానికి తను కట్టుకున్న గూటిని తానే ఛేదించుకొని అందమైన సీతాకోక చిలుకగా మారి ప్రకృతి అందాల్ని చూడగలుగుతోంది. తాను కట్టుకున్న గూటిని తానే ఛేదిస్తోంది. ప్రారంభంలో గూడు ఎంత అవసరమో, చివరకు తను కట్టుకున్న గూటిని ఛేదించడం కూడా అంతే అవసరం. అట్లాగే మానవునికి కామ్య కర్మలన్నవి గూటిని కట్టుకోవడం వంటిది. అతడికి పరిపక్వత కలిగేందుకు తోడ్పడుతోంది. గొంగళి పురుగు గూటిని ఛేదించినట్లే ఆత్మ సాధకుడు యజ్ఞ దాన తపాలను త్యాగం చేస్తున్నాడు. యాగదాన తపస్సులు చేయడం వలన లోకక్షేమం కలుగుతోంది. కావున ఆయా కర్మలను చెయ్యవలసిందే. వీటి వలన బుద్ధిమంతులకు పవిత్రత ఆపాదింపబడుతోంది.

పార్థా! ఈ కర్మలన్నింటినీ ఫలాపేక్ష లేకుండాను, ఆసక్తి లేకుండానే చెయ్యాలి. ఇదే నా నిశ్చితాభిప్రాయం. **6**

బిడ్డకు కావలసిన పాలు తల్లి నుండి ఉత్పత్తి అవుతున్నాయి. బిడ్డ క్షేమం కోసం తాను పథ్యాలు చేస్తుంది. నిద్రాహారాలను వదిలేస్తుంది. ఈ కర్మలో తల్లికి స్వార్థం లేదు. ఈ ప్రాపంచిక కార్యాలను

కూడా ఒక యజ్ఞంలా చేసిన వానికి ఈ ప్రపంచమే పరలోకంగా కనిపిస్తుంది. యాగము తపస్సు దానములకు అర్థం కూడా ఆ కర్మల్లోనే నిక్షిప్తమై ఉన్నాయి. ప్రపంచ శ్రేయస్సుకు ఇదే తగిన సిద్ధాంతమని భగవంతుని అభిప్రాయం.

"ఈశ్వరుని పొందాలనుకునేవారు, సాధన మార్గమందు అభివృద్ధిని కోరుకునేవారు ఆశ అనే వలలో చిక్కుకోకుండా తమనుతాము కాపాడుకోవాలి. లేనిచో వారు ఎన్నటికీ పరిపూర్ణులు కాలేరు" *- శ్రీరామకృష్ణ పరమహంస*

మరియు నిత్య కర్మలను విడిచిపెట్టడం సమంజసం కాదు. బుద్ధిహీనత చేత దానిని త్యజించడం తామసమని చెప్పబడుతుంది. **7**

ఆయా ఋతువుల్లో చెట్ల నుండి మనం ఫలాలను పొందుతున్నాం. పువ్వు నుండి, కాయ, కాయ నుండి పక్వమైన పండును తయారుచేసి మానవులకు అందించడం ఆ వృక్షానికి నిత్యకర్మ. అది ఆ వృక్షానికుండే త్యాగబుద్ధి. వృక్షం యొక్క త్యాగాన్ని (ఫలం కాకముందే) ముందుగానే పొందాలని పక్వంకాని కాయను ఏ బుద్ధిహీనుడైనా కోస్తే, అది ఫలం కాదు. పక్వంకాని ఆ కాయలోని విత్తనం విత్తినా మొలకెత్తదు. ఇది వృక్షం చేత బలవంతంగా త్యాగం చేయించడమవుతోంది. అట్లాగే మానవుని పరిపక్వతను బట్టి నిత్యకర్మలుంటాయి. తినడం, నిద్రపోవడం బుద్ధిహీనునికి నిత్యకర్మలు. యజ్ఞం, దానం, తపస్సు వివేకం గలవానికి నిత్యకర్మలు. శరీరం ఉన్నంత వరకు నిత్య కర్మలుంటూనే ఉంటాయి. కనుక శరీరం నుండి నిత్య కర్మల్ని విడదీయలేవు.

"మనస్సు సచ్చిదానందయందు లయమయ్యేంత వరకు, భగవన్నామాన్ని స్మరిస్తూనే ఉండటం, లోక వ్యవహారాలు చేస్తూ ఉండటం అనే రెండూ చేస్తూనే ఉండాలి."

– శ్రీరామకృష్ణ పరమహంస

శరీరానికి దుఃఖం కలిగిస్తూందనో, అసౌకర్యంగా ఉంటుందనో తలచి కర్మల్ని చేసేవాడి త్యాగం రాజసత్యాగమని అనిపించుకుంటుంది. అందువల్ల అతడు త్యాగఫలాన్ని పొందడం లేదు. **8**

బడికి వెళ్లడం ప్రయాస అని విద్యార్థి బడిని త్యాగం చేస్తే అతడు చదువు పూర్తి చెయ్యలేడు. చదువు వల్ల కలిగే ఫలాన్ని అతడు పొందలేడు. యుద్ధరంగానికి వచ్చిన అర్జునుడికి ఉన్నట్లుండి త్యాగబుద్ధి వస్తోంది. బంధువుల్ని చంపాల్సివస్తోందన్న దుఃఖంతో యుద్ధాన్ని త్యాగం చెయ్యాలనుకుంటున్నాడు. దీన్నే రాజసత్యాగమని చెపూ్త భగవానుడు ఈ త్యాగానికి సమ్మతించుట లేదు.

అర్జునా! అనురక్తిని, ఫలాపేక్షను వదిలి చెయ్యదగిందే సాత్త్వికమైనదని తలచి ఎవడు నిత్య కర్మలు చేస్తున్నాడో, అట్టి త్యాగమే సాత్త్విక త్యాగమని అంగీకరించబడింది. **9**

తామస రాజస త్యాగములలో కర్మలు చేయకుండా వదిలేస్తున్నారు. కానీ సాత్త్విక త్యాగంలో కర్మలు చేస్తూనే ఉన్నారు. నిత్య కర్మలతోపాటు కర్మలన్నింటికీ ఫలం ఉంటుంది. సాత్త్విక సాధకుడు కర్మలందు తానే కర్తనని అనుకోడు. కర్మఫలంపైన ఆసక్తే చూపడు. అటువంటి కర్మలు చెయ్యడం తన

కర్తవ్యమని భావిస్తాడు. అటువంటి భావనయే శాంతిని చిత్తశుద్ధిని కలుగ చేస్తుంది.

సత్త్వగుణాలతో కూడిన వాడును, ప్రజ్ఞాశాలియు, సంశయాలన్నీ తొలగి పోయినవాడు అయిన త్యాగశీలి దుఃఖాన్ని కలిగించే కర్మల్ని ద్వేషించడు. సుఖాలనిచ్చే కర్మలందు ఆసక్తి చూపడు. **10**

శ్రీశంకరాచార్యుల వ్యాఖ్య : నిష్కామముగా కర్మచేసేవాడు చిత్తశుద్ధిని, చిత్తశుద్ధి వలన జ్ఞానాన్ని, జ్ఞానం వలన మోక్షాన్ని పొందుతున్నాడు.

శ్రీరామానుజుల వ్యాఖ్య : బ్రహ్మజ్ఞాని అయిన ఇట్టివానికి అనిష్టాలు కలుగుతాయి. అవి ఎట్లాగంటే, అతనికి బుద్ధిపూర్వకంగా కలుగవు. అతడి ప్రయత్నం లేకుండానే అనిష్టాలు కలుగవచ్చు. అట్లా సంభవించిన వాటి వలన తనకు కీడు కలిగిందని తలంచడు.

దేహధారి అయిన జీవుడు కర్మల్ని పూర్తిగా విడిచిపెట్టలేడు. కానీ కర్మఫలాలను త్యాగం చేసినవాడెవడో అతడే త్యాగి అని చెప్పబడుతున్నాడు. **11**

దేహమున్నంత వరకు కర్మలు చేస్తూనే ఉండాలి. శ్వాస పీల్చడం, ఆహారం తీసుకోవడం వంటివన్నీ కర్మలే. నేను కర్మల్ని విడిచేశానని ఎవరైనా అంటే తనను తాను మోసం చేసుకొన్నట్లే. అంతే కాకుండా కర్మల్ని అనాసక్తంగా చెయ్యాలి. వారివారి వివేకాన్ని బట్టి అనాసక్త కర్మలుంటూ ఉంటాయి.

ప్రయాణీకుడు విమానంలో ప్రయాణం చేస్తూ ఉంటాడు. విమానం మేఘాల్ని ఛేదించుకుంటూ పోతుంది. భయంకరమైన పర్వతాలపై నుండే ప్రయాణం చేస్తుంది. లోతైన సముద్రాల మీదుగా ప్రయాణం చేస్తుంది. కానీ లోపలున్న ప్రయాణీకుడు ఆయా సమయాల్లో భయంగాని, ఆసక్తిగాని చూపకుండా తన పని తాను చేసుకుంటూ కూర్చుంటాడు. శరీర జీవితమనే ప్రయాణంలో ఆత్మకూడా ఇట్లాగే ఉండాలి.

కర్మ ఫలాన్ని త్యాగం చెయ్యనివానికి ఫలాలు మూడు విధాలుగా ఉంటాయి. ఒకటి ఇష్టమైనవి, రెండు ఇష్టం లేనివి, మూడు ఈ రెండూ కలసినవి. అయితే ఫలాపేక్ష లేకుండా కర్మలు చేసే వారు ఆ మూడింట్లో ఏ ఒక్కటీ పొందరు. **12**

ఇష్టమైన జన్మలంటే స్వర్గ ప్రాప్తి వంటివి. ఇష్టం లేని జన్మలంటే పశు పక్ష్యాది జన్మలు, నరక ప్రాప్తివంటివి. ఇక రెండూ కలిసిన జన్మలంటే భూలోకంలో మానవ జన్మ అని మనం తెలుసుకోవాలి.

త్యాగి కానివాడు వచ్చే జన్మలో ఎటువంటి జన్మ ఎత్తుతాడో ఈ జన్మలోనే తెలుసుకోవచ్చు. అది ఎట్లాగంటే, ఒకడు నిద్రించే ముందు దుర్మార్గుడుగా ఉంటాడు. నిద్రలేచిన తర్వాత కూడా దుర్మార్గుడుగానే ఉంటాడు. అంటే నిద్ర అన్నది మరణంతో సమానం. నిద్రలేవడమంటే మరో జన్మ ఎత్తినట్లుగా అర్థం చేసుకోవాలి.

ఈ జన్మయే చివరి జన్మ. ఇకపైన ఇతడికి జన్మలుండవని ఎట్లా తెలుసుకో గులుగుతామంటే, అటువంటి జీవన్ముక్తులు ఎల్లప్పుడూ ఆత్మ సంతృప్తులై ఉంటారు. శరీరం వారిని నీడవలె అంటిపెట్టుకొని ఉంటుంది. కర్మలు వాటంతట అవే జరిగిపోతూ ఉంటాయి. కానీ జీవన్ముక్తులు వాటిని

లెక్క చెయ్యరు.

భుజబల పరాక్రమవంతుడా! వేదాంతాన్ననుసరించి కర్మలు సిద్ధించడానికి అయిదు కారణాలున్నాయి. చెప్తాను విను. **13**

శాస్త్ర విహిత కర్మగాని, నిషిద్ధ కర్మగాని, ఏ కర్మ అయినా పూర్తి కావాలంటే ఈ చెప్పబోయే అయిదు కారణాలు ఉండాలి.

కర్మ సిద్ధికి సాంఖ్యులు చెప్పిన అయిదు కారణాలు ఇవి :

1. అధిష్ఠానము 2. కర్త 3. కరణములు 4. వివిధ చేష్టలు 5. దైవము. **14**

ఒక మోటారు బండి పరుగెత్తాలంటే వివిధములైన వస్తు సామాగ్రి అవసరం. ఇనప చట్రం, బోల్టులు, నట్టులు, రేకులు వంటివి. రబ్బరు చెట్లపాల నుండి రబ్బరు టైర్లు తయారు చేసుకోవాలి. భూమిలో నుండి పెట్రోలు బయటకు తీసి ఇంధనంగా వాడుకోవాలి. భూమిపై నుండే నీరు అవసరం. ఆకాశంలో నుండి గాలిని సమకూర్చు కోవాలి. ఇట్లా సమకూర్చుకున్నప్పుడే మోటారు బండి నడుస్తుంది.

ఇట్లా తయారు చేసుకోవడానికి ఉపయోగపడే కర్మాగారాన్నే అధిష్ఠానం అంటారు. దానికి యజమానిగా ఉన్నవాడిని కర్త అంటారు.

దాన్ని నడిపే సాధనాలన్నీ దాని కరణముగా (ఇంద్రియాలు) ఉన్నాయి దానికి శక్తిని నిచ్చే పెట్రోలే ప్రాణం. దానిని నడిపే వాడే దైవం.

ఈ పద్ధతిలోనే శరీరం కూడా ఏర్పడుతుంది.

ఇష్టాయిష్టాలు సుఖదుఃఖాలు, జ్ఞానము మొదలైన వాటికి స్థానంగా ఉండేదే శరీరం. కనుక దీన్ని అధిష్ఠానమంటున్నారు. వాటిని అనుభవించే అహంకారమే కర్త అనబడుతోంది. జ్ఞానేంద్రియాలు అయిదు, కర్మేంద్రియాలు అయిదు కలసి వేరు వేరు ఇంద్రియాలనబడుతున్నాయి. ప్రాణము, అపానము మొదలగు వాటి యొక్క రకరకాలైన చేష్టలు అటు పిమ్మట గుర్తించబడుతున్నాయి. ప్రాణం యొక్క సహాయం లేకుండా ఏ పనీ జరుగదు. అంతరాత్మ అయిన దైవమే ఇంద్రియాలకు అధిష్ఠాన దైవంగా ఉంటోంది.

శరీరంతో, వాక్కుతో, మనస్సుతో మానవుడు చేసే కర్మలన్నింటికీ ఈ అయిదు మాత్రమే కారణాలవుతున్నాయి. **15**

ఈ దేహాన్ని ధర్మక్షేత్రమని అంటూ ఉంటారు. చేసే కర్మలన్నింటికీ ఈ అయిదు కారణాలచేతనే ఈ శరీర జీవితం ఉపయోగపడుతోంది. ఇదే దేహాన్ని దేవాలయంగా భావిస్తూ సత్కర్మలు చేసే వాళ్ళూ ఉన్నారు. వారు చేసే కర్మలన్నీ ధర్మబద్ధమైనవి, న్యాయమైనవి. అట్లాగే ఈ దేహాన్ని వాడుకుంటూ అధర్మపరమైన పనులు చెయ్యడానికి కూడా ఈ అయిదు కారణాలే సహాయపడుతూ ఉంటాయి. కనుక ఈ అయిదు కారణాల సహాయం లేకుండా మంచి, చెడు పనులేవీ జరగడం లేదు.

కనుక ఈ అయిదు అంశములను ఎవడు గుర్తించకుండా తననే కర్తగా భావించుకుంటాడో

అతడు నిశ్చయముగా బుద్ధిహీనుడు. అటువంటి మూఢుడు యథార్థ దృష్టితో చూడలేడు. **16**

ఎవరికి అహంకారంలేదో, ఎవని బుద్ధి బంధములందు ఆసక్తి చూపడం లేదో, అతడు జీవులను చంపినా, చంపడం లేదు. బంధించబడటంలేదు. **17**

నాటకంలో ఒకడు హత్య చేసినట్లు నటిస్తాడు. ఇంకొకడు హత్య చెయ్యబడ్డట్లుగా నటిస్తాడు. వీరిలో ఎటువంటి అహంకార మమకారాలు ఉండవు. కర్తృత్వాన్ని తనపై వేసుకోరు. అదే నిజ జీవితంలో నిజంగానే హత్య చేస్తాడు. అతడి హృదయంలో హత్యానేరం దృఢంగా నాటుకుంటుంది. అయితే జ్ఞాని విషయంలో ఈ రెండూ కలిసి ఉంటాయి.

యుద్ధ రంగంలో అర్జునుడు తన తాతగారైన భీష్ముణ్ణి చంపాడు. కానీ తానే హంతకుడని భావించడం లేదు. ఎందువల్ల? ఆసక్తి, అహంకారం అతడి మనస్సును ఎప్పుడో విడిచిపెట్టేశాయి. భీష్ముడు కూడా తాను చంపబడ్డ వానిగా భావించడంలేదు. ధరించిన వస్త్రాన్ని బలవంతంగా చించేసినట్లుగా అతడు శరీరాన్ని వదిలేశాడు.

"పురుషుడు ఎటువంటి కార్యాలు చెయ్యకుండా, చలనం లేనివాడై ఉన్నాడనీ, ప్రకృతియే కార్యాలన్నీ చేస్తోందనీ, పురుషుడు కేవలం సాక్షీభూతంగా మాత్రమే ఉంటాడని సాంఖ్య దర్శనం చెబుతోంది. మరియు ప్రకృతి పురుషుడు లేకుండా ఏ పనినీ చేసే శక్తి తమకు లేదని తెలుపుతోంది" – శ్రీరామకృష్ణ పరమహంస

తెలివి, తెలియదగు వస్తువు, తెలియనివాడు అని కర్మకు హేతువులు మూడు విధాలుగా ఉన్నాయి. **18**

తెలివి అంటే బుద్ధి లేక జ్ఞానం. తెలియదగిన వస్తువు అంటే ప్రాపంచిక వస్తువులు. తెలియనివాడు లేక పరిజ్ఞాత అనగా దేహాల్లో ఉండే జీవుడు. ఈ మూడింటినీ త్రిపుటి అంటారు. ఈ మూడింట్లో ఏ ఒక్కటి ఉన్నా మిగిలిన రెండూ ఉన్నట్లే. తెలుసుకునే వాడు ఉన్నచోట తెలివి, తెలుసుకోదగిన వస్తువు ఉంటాయి. అట్లాగే మిగిలిన రెండూ. ఆయుధము, క్రియ, కర్త అనేవి మరో విధంగా ఉన్నాయి. ఈ మూడూ కలిసి ఉండటం వలన మనస్సు, వాక్కు, కామము యొక్క కర్మలు జరుగుతున్నాయి. కర్మలలో మంచిదేది, చెడ్డదేది అన్న విభాగం త్రిపుటి వలన కలుగుతోంది.

ఆయుధమునందు అంతఃకరణమని, బాహ్యకరణమని రెండు విధాలు. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అన్నవి అంతఃకరణ ఆయుధాలు. శరీరము, వాక్కు, కన్ను, ముక్కు, చెవులు అనే అయిదూ బాహ్యకరణ ఆయుధాలు. ఇవి జ్ఞానేంద్రియాలు అయిదు, కర్మేంద్రియాలు అయిదు అని చెప్పబడుతున్నాయి. కర్మలు చేసే జీవుడే కర్త అవుతున్నాడు. ఈ విధంగా జ్ఞానం, కర్మ జీవునిలో అంతర్భాగమై ఉన్నాయి. జీవాత్మను పక్వపరిచేందుకు జ్ఞానము, కర్మము ఎంతో అవసరం, ఎట్లాగంటే విద్యార్థికి చదువుతో పాటు ఆటలు కూడా ఉంటేనే అతడి మనస్సు శరీరం కలిసి పెరుగుతాయి. అట్లాగే జీవాత్మ జ్ఞానానుభవం ఉన్నంతవరకు కర్మల్ని చక్కగా చేస్తూంటాడు.

జ్ఞానము, కర్మమూ, కర్త గుణభేదముల చేత మూడు విధాలని సాంఖ్య శాస్త్రంలో చెప్పబడుతోంది. వాటిని గూర్చి కూడా వివరంగా చెప్తాను. విను. **19**

"అధికార భేదము" అనేది ఒక ముఖ్యమైన సిద్ధాంతం. ఉత్తమ విద్యార్థి అని, మధ్యమ విద్యార్థి అని, అధమ విద్యార్థి అని అధికారి భేదాల్ని వివరించారు. ఉత్తమ అధికారికి కొద్దిగా బోధించినా వాస్తవాన్ని గ్రహించగలుగుతాడు. అధమ విద్యార్థి మంద బుద్ధి గలవాడు. బోధించేవాని శక్తి సామర్థ్యాన్ని బట్టి మందబుద్ధి అయిన అధికారికి కూడా కొంతవరకు సత్యమును బోధించవచ్చు.

జీవులు అసంఖ్యాక రూపములుగా విభజింపబడినా వారి యందు అవిభక్తమై ఉన్న ఏకమైన అధ్యాత్మిక భావం ఏ జ్ఞానం వలన దర్శించ వచ్చునో అట్టి జ్ఞానం సత్వగుణ ప్రధానమైనదని తెలుసుకో. **20**

ప్రకృతి అనేక భాగాలుగా విభజించబడి ఉన్నది. అవన్నీ మాయచేత సృష్టించబడ్డవే. వీటన్నింటికీ ఆధారమైనది పరమాత్మ. అది ఒకే వస్తువు. పరమాత్మ అంటే ఆకాశంవలె విభజించలేనిది. జగత్తు ఆ ఏకవస్తువు నుండే ఉద్భవించినా కూడా ఏకత్వానికేమీ భంగం కలగడంలేదు. ఎందువల్లనంటే అది అఖండ వస్తువు; హెచ్చుతగ్గులు లేనిది; నాశరహితమైనది. ఉదాహరణకు కుండలలో ఆకాశం ఉంటోంది. అయినా ఆకాశం ఛేదించబడలేదు. అట్లాగే నేను సర్వ భూతములలో ఆత్మగా ఉంటున్నా వేరువేరు ఆత్మలుగా రూపొందడం లేదు. ఈ ఆత్మను ద్వైతభావం లేకుండా యథాతథంగా గ్రహించడాన్నే సాత్విక జ్ఞానమంటారు.

"గాలి సువాసనను, దుర్వాసనను కూడా గ్రహించి వీస్తున్నప్పటికీ ఆయా వాసనల చేత వికారం చెందడం లేదు. పరమాత్మ కూడా ఈ గాలి వంటిదే."

- శ్రీరామకృష్ణ పరమహంస

ఏ జ్ఞానం చేత భిన్న శరీరములందు భిన్న జీవులున్నట్లు మనుజుడు తెలుసుకుంటాడో అట్టి జ్ఞానమే రజోగుణ సంబంధమైనదని తెలుసుకొమ్ము. **21**

ఒక్కొక్క దేహంలో ఒక్కొక్క ప్రత్యేకమైన ఆత్మ ఉంటోందనీ, వాటికి వేరువేరు లక్షణాలుంటాయని తెలుసుకోవడాన్ని రాజస జ్ఞానమంటారు. ఇది ఎట్లాగంటే, బంగారం భూమిలో నుండి అనేక దేశాల్లో లభిస్తోంది. ఆయా దేశాల్లో దాన్ని కప్పి ఉంచిన మట్టి ఇతర మలినాలు వేరువేరుగా ఉండవచ్చు. ఆ మలినాలన్నింటినీ శుభ్రం చేసి బంగారాన్ని వేరుచేస్తే, అన్ని దేశాల్లో లభిస్తున్న బంగారం ఒకే విధంగా ఉంటుంది. ఇది ఈ దేశపు బంగారమనో, అది మరో దేశపు బంగారమనో భేదాలన్నీ తొలగిపోతున్నాయి. అట్లాగే ఉపాధి భేదాల చేత ఆత్మలు అనేకంగా కనిపించవచ్చు. ఇట్లా ఉపాధులకు ప్రాముఖ్య మిచ్చేది రజోగుణజ్ఞానం. ఉపాధులనే మలినాన్ని తొలగిస్తే మిగిలింది శుద్ధ చైతన్యమే. దాన్నే ఆత్మ స్వరూపమంటారు.

ఏ జ్ఞానం ద్వారా మానవుడు అల్పమైనట్టి ఒకానొక కార్యమునే సమస్తము అని తలచి, యథార్థం తెలుసుకోలేనివాడై ఉంటాడో అట్టి జ్ఞానం తామస జ్ఞానం అని చెప్పబడును. **22**

పంచ భూతాలచే నిర్మించబడిన ఈ దేహాన్నే ఆత్మ అని భావించే వాళ్ళు, భగవంతుని ఆరాధించేందుకు రాతితోగాని, కలపతోగానీ విగ్రహాలను తయారు చేసుకొని వాటినే భగవంతుడని నమ్మి ఆరాధిస్తూ ఉంటారు. పొరపాటున ఆ విగ్రహాలకు కాలో చెయ్యో విరిగితే భగవంతుడి కాలో చెయ్యో విరిగినట్లు విలవిల్లాడి పోతారు. పైన చెప్పినట్లు ఒకానొక కార్యాన్నే సమస్తము అని నమ్మేవారికిదో ఉదాహరణగా చెప్పవచ్చు. ఇటువంటి మందబుద్ధికి తాను దేహంకన్నా ఉత్తముడనని, భగవంతునికి నామరూపాలుండవని వారికి తెలియదు. అల్పజ్ఞానం గల వాళ్ళు ఈ యథార్థాన్ని అర్థం చేసుకోలేరు కూడా. తామసులకుండే ఈ జ్ఞానం వాస్తవానికి చాలా దూరంలో ఉంటుంది. అటువంటి అల్ప జ్ఞానం వలన ఎట్టి మేలూ జరగడం లేదు. అందువల్లనే అది అల్పమని చెప్పబడింది.

ఫలాపేక్షయందు ఆసక్తి, సంగము, రాగద్వేషాలు లేకుండా నియమబద్ధమైన ఏ కర్మము చేయబడుతుందో అది సాత్వికమైనదిగా గోచరిస్తోంది. **23**

శ్వాస పీల్చడం జీవించేందుకు తప్పని సరిగా చెయ్యాల్సిన కర్మము. అది రాగ ద్వేషాలు లేకుండా చెయబడుతోంది. ఒకని కోసం నియమించబడిన కర్మమే అతడికి నిత్యకర్మ అవుతోంది. నిత్యకర్మలు మనః పరిపక్వానికి తగినట్లుగా మారుతూ ఉంటాయి. అప్పుడే బళ్ళో చేరిన బాలునికి కూడికలు తీసివేతలు నేర్చుకోవడం నిత్యకర్మ అవుతోంది. అతడే ఉన్నత పాఠశాలకు ఎదిగిన తర్వాత అతడు నేర్చుకోవాల్సిన లెక్కలు అతడి తరగతికి తగినట్లుంటున్నాయి. అవి నేర్చుకోవడమే అతడి నిత్యకర్మ. అతడిక కూడికలు, తీసివేతలు నేర్చుకోవడం ఇప్పుడతడికి నిత్య కర్మ కానేరదు. అట్లాగే వారివారి పరిపక్వతకు తగినట్లుగా సంఘంలో అందరికీ కర్తవ్యాలున్నాయి. ధర్మయుద్ధం చేసి చెడుని తొలగించడం, క్షత్రియుడిగా అర్జునునికి కర్తవ్యం. మనకు కూడా అటువంటి కర్తవ్యాలుంటాయి. వాటిని సక్రమంగా చెయ్యాలి. అనాసక్తుడుగా ఉండేవాడు తాను ఏ కర్మకూ కర్తనని అనుకోవడం లేదు. తాను కేవలం భగవంతుని చేతిలో పరికరమని భావిస్తాడు. అది సాత్వికమైన కర్మగా ఉంది.

"సాత్విక స్వభావం గలవాడు తాను చేసే సాధనలన్నీ రెండో కంటివాడికి తెలియకుండా నిరాడంబరంగా చేస్తూ ఉంటాడు. ఒంటరిగాను, వీలైనంత వరకు అంతా నిద్రపోయిన తర్వాత రాత్రులందు చేస్తూవుంటాడు." - శ్రీరామకృష్ణ పరమహంస

ఫలాపేక్ష ఆశించేవాని చేత, లేక అహంకారం గలవాడి చేత వ్యయ ప్రయాసలతో చేసే కర్మలు రాజసమైన కర్మలు. **24**

దేహాన్ని ధరించి ఉండటమే ఓ అహంకారం. దాన్ని అందంగా తీర్చి దిద్దుకోవడం, తరచూ దాని ధ్యాసలోనే ఉంటూ ఉండటం కూడా ఓ అహంకారమే. ఈ అహంకారం వల్ల దుర్లభమైన మానవజన్మ వృథా అయిపోతోంది. శరీరం ఈశ్వరుని ఆలయం అన్న భావనతో దానిని జయించాలి. ఆశ రెండు రకాలుగా ఉంటుంది. పైన చెప్పినవన్నీ ఆశల్లో మొదటి రకం. ఇక రెండవ రకమైన ఆశ జ్ఞానతృష్ణ, శీలత్వము, పరోపకార చింతన మొదలైనవి పెంచుకోవాల్సిన ఆశలు.

ప్రపంచ బంధాలలో మరింతగా బంధించే నీచమైన ఆశల్ని తొలగించుకోవాలి. దుష్ట

అహంకారం అంటే ఏమిటి? నేనెవరో తెలియదా? నా వద్ద ఉన్నంత సంపదమరెవరి దగ్గరా లేదు. నా కంటే మంచి వారెక్కడుంటారు? అని చెప్పుకునే అహంకారాన్నే దుష్ట అహంకారం అంటారు." - *శ్రీరామకృష్ణ పరమహంస*

కర్మ ఫలాన్ని, నష్టాన్ని, దుఃఖాన్ని తన సామర్థ్యమన్న అహంభావమే మోహంతో, ఏయే కర్మలు ఆరంభించబడుతున్నాయో అవన్నీ తామస కర్మలనబడతాయి. **25**

"కఠినమైన తపస్సు తర్వాత మాత్రమే మానవులు కల్లాకపటం లేనివారుగాను, దయాగుణం గలవారుగాను అవుతున్నారు. కల్లాకపటం లేనివారికే ఈశ్వర దర్శనం లభిస్తుంది. కల్లాకపటం లేనివాడిగా ఉండాలేగాని మూఢుడుగా ఉండరాదు. ప్రతినిత్యము నిత్యమైన సత్యవస్తువు నుండి అసత్యాన్ని, నిత్యము నుండి అనిత్యాన్ని తొలగించేందుకు ఆత్మ విచారణ చేస్తూ ఉండాలి. అటుపైన అనిత్యాన్ని తొలగించిన తర్వాత నిత్యమైన వస్తువుపై మనస్సును స్థిరంగా ఉంచాలి."

- *శ్రీరామకృష్ణ పరమహంస*

ఆసక్తిని విడిచినవాడు అహంకార రహితుడు. ధైర్యము, ఉత్సాహము గలవాడిని జయాపజయాలు బాధించవు. **26**

కనిపించే రూపాలన్నీ ఈశ్వర స్వరూపాలేనని, చర్యలన్నీ ఈశ్వర చర్యలేనన్న భావన సాధకుడి మనస్సులో స్థిరంగా ఉండాలి. అప్పుడు అతడిలో సంగము తొలగి అనాసక్తుడవుతాడు. దేహం తనదనే భావం లేకుండా అది ఈశ్వరుని ఆలయమన్న భావన సాధకుడిలో స్థిరంగా ఏర్పడినప్పుడు, 'ఈ దేహం ద్వారా జరిగే కర్మలన్నింటికీ తాను బాధ్యుణ్ణి కాదని, ఈశ్వరుడే బాధ్యుడని స్థిరంగా నమ్మేవాడిలో అహంకారం నశిస్తుంది. కానీ తాను చేస్తున్న కర్మలన్నీ ఈశ్వర సేవగా చేస్తున్నానని చేసే కర్మల్లో అతడికి దృఢత్వం, ఉత్సాహం రెట్టింపవుతున్నాయి.

"కపటం లేని మనస్సుతో ఈశ్వరుని సులభంగా పొందవచ్చు. నేల పదును చేసి నాటిన విత్తనాలు సత్ఫలితాలనిస్తున్నట్లు, కల్లాకపటం లేని మనస్సు నందు ఆధ్యాత్మిక ఉపదేశములు సులభంగా ఫలితాలిస్తాయి." - *శ్రీరామకృష్ణ పరమహంస*

అనురాగం గలవాడు, కర్మఫలాన్ని ఆదేశించేవాడు, లోభియు, హింసా స్వభావం గలవాడు, అశుచిగా ఉండేవాడు. సుఖదుఃఖాలు అనుభవించేవాడు అయిన కర్త రాజసిక కర్త అని చెప్పబడుతున్నాడు. **27**

"వ్యర్థంగా కోపం కలిగి ఉండటం నీచస్వభావం. కాకినే తీసుకోండి. తన సామర్థ్యానికి తానే మురిసిపోతుంది. వేటగాడి వలలో అది ఎన్నటికీ చిక్కుకోదు. ఆపదను ముందుగానే పసిగడుతుంది. అయితే ఆహారం విషయానికొస్తే అక్కడా ఇక్కడా దొంగిలించి తింటూ ఉంటుంది. అయినా దాని స్వభావమైన మలమును తినడం

మాత్రం మానుకోవడం లేదు. ఎక్కువ సామర్థ్యం కలిగి ఉండి మాత్రం ప్రయోజనమేముంది?"
- శ్రీరామకృష్ణ పరమహంస

యోగమునకు పనికి రాని మనస్సు గలవాడు, పామర స్వభావం గలవాడు, వినయంలేనివాడు, వంచకుడు, మోసగాడు, సోమరిపోతు, ఎల్లప్పుడూ దిగులుతో ఉండేవాడు, అనవసరంగా కాలయాపన చేసేవాడు. ఇటువంటి కర్తను తామసకర్త అంటారు. **28**

తాత్కాలికంగా దుఃఖవశుడైన అర్జునుని తట్టి లేపేందుకే గీతోపదేశం చెయ్యడం జరిగింది. ఒక రోజులో చెయ్యాల్సిన పనిని ఒక నెలరోజుల పాటు పొడిగించిన వాడు కాలాన్ని వ్యర్థం చేసిన వాడవుతున్నాడు. అందువల్ల అతడి జీవిత ప్రయోజనం తగ్గిపోతోంది.

"ఒక బెస్తవాడు నదిలో చేపలు పట్టేందుకు వల విసిరాడు. అందులో అనేక చేపలు చిక్కుకున్నాయి. అందులో కొన్ని వలలో నుండి తప్పించుకొనే ప్రయత్నమైనా చెయ్యలేదు. మరికొన్ని బయటపడే ఉద్దేశంతో త్రుళ్ళి త్రుళ్ళి పడుతున్నాయి. అయినా బయటపడలేకపోతున్నాయి. ఇంకొన్ని చేపలు ఏవేవో ప్రయత్నాలు చేసి బయట పడ్డాయి. ప్రపంచంలో మానవుడు కూడా ఇట్లాగే ఉంటున్నాడు. వారుకూడా మూడు విధాలై ఉంటున్నారు. 1. ముక్తిని పొందేందుకు ప్రయత్నమైనా చెయ్యకుండా బంధితులై ఉన్నారు. 2. ముముక్షువులై ప్రయత్నాలు చేస్తున్నారు కానీ సిద్ధిపొందలేక పోతున్నారు. 3. ముక్తులై ప్రపంచ బంధాల నుండి బయట పడుతున్నారు."

- శ్రీరామకృష్ణ పరమహంస

ధనంజయా! బుద్ధియందు, ధైర్యమందు గుణాలనుబట్టి ఉండే భేదాలు మూడు విధాలు. అవి ఏమిటో చెప్తాను విను : **29**

చేయదగినది ఏది? చేయరానిది ఏది? అని నిర్ణయించే స్వభావాన్ని బుద్ధి లేక జ్ఞానము అని అంటారు. అటువంటి బుద్ధి మూడు విధాలుగా ఉంది.

"ఉప్పు, వస్త్రము, రాతితో చేసిన మూడు విధాలైన బొమ్మల్ని నీళ్ళల్లో ముంచితే మొదటి బొమ్మ కరిగి పోతుంది. రెండవ బొమ్మ ఆకారం చెడదుగానీ నిండా నీరు పీల్చుకుంటుంది. మూడవ బొమ్మలోకి నీళ్ళు చొరబడలేవు. మొదటి బొమ్మ పరమాత్మలో ఐక్యమై పోయిన మానవులు వంటివారు. రెండవ బొమ్మ దివ్యజ్ఞానం కలిగి దివ్యానందాన్ని పొందిన భక్తుని పోలి ఉన్నది. మూడవ బొమ్మ జ్ఞానమనేది మచ్చుకైనా లేని కఠినాత్ములై, ప్రాపంచిక ఆసక్తి గలవారిని పోలి ఉంటుంది."

- శ్రీరామకృష్ణ పరమహంస

పార్థా! ప్రవృత్తి నివృత్తి; చేయదగినది చేయదగనిది, భయము నిర్భయము; బంధము మోక్షములను తెలుసుకునే బుద్ధి సాత్త్విక బుద్ధి. **30**

ప్రవృత్తి అంటే, ప్రపంచంలో జీవుని బంధించి జనన మరణాలలో చిక్కుకునేట్లు చేసే

కర్మమార్గం. మోక్షానికి కారకాలైన కర్మమార్గాన్ని నివృత్తి మార్గమంటారు. దీనినే అకర్మమని, సన్న్యాసమని కూడా అంటారు. దేశకాల వర్తమానముల ననుసరించి దేనిని చేస్తే మానవులకు మేలు కలుగుతుందో వాటిని చేయదగిన కర్మలంటారు. దేన్ని చేస్తే కీడు కలుగుతుందో దానిని చేయదగని కర్మలని అంటారు. కనుక మానవుడు తగని కర్మల్ని చెయ్యడానికి భయపడాలి. భయం అన్నది పేరులో మాత్రమే ఉన్నది. కానీ నిజానికది ధీరత్వమనే చెప్పాలి. ఎందుకంటే విష సర్పంతోగాని, పులి వంటి క్రూర మృగాలతోగాని మనం స్నేహం చెయ్యడం లేదుగదా! అదే విధంగా ప్రవృత్తియు. చేయదగని కర్మలు బంధాన్ని కలిగిస్తాయని భయపడాలి. నివృత్తి తగిన కర్మలు అభయాన్ని కలిగించి మోక్షాన్ని కలిగిస్తాయి. అజ్ఞానం చేత బంధం ఏర్పడుతోంది. జ్ఞానం మోక్షాన్నిస్తుంది. సాత్విక బుద్ధి వీటన్నింటినీ విశదంగా తెలుపుతుంది.

ఓ పార్థా! ధర్మము మరియు అధర్మము మధ్యన ఉండే భేదాన్ని గాని, చేయవలసిన కార్యము మరియు చేయదగని కార్యాల మధ్య నుండే భేదాన్ని గాని తెలుసుకోలేని బుద్ధిని రాజసిక బుద్ధి అంటారు. **31**

కదిలే నీళ్ళల్లో చంద్రబింబాన్ని చక్కగా చూడలేము. అట్లాగే రాజసిక బుద్ధి ఉన్నవాడు శాస్త్రోక్తమైన ధర్మాన్ని ఎరుగడు. కార్యాన్ని శాస్త్రోక్తంగా చెయ్యడు. కౌరవులు జూదమాడటం న్యాయమేనని ఎంచి ధర్మరాజును అందులో చేర్చారు. తమది కాని రాజ్యాన్ని తమదని లాక్కుని పాండవుల్ని యుద్ధానికి సంసిద్ధుల్ని చేశారు. రజోగుణంగల వాని బుద్ధి కఠినమైన శ్రమ పడేందుకు సంసిద్ధుల్ని చేస్తుంది. కానీ అందులో న్యాయం ఉండదు. ఇతరులకు మేలు కలిగిస్తున్నట్లు పైకి కనిపిస్తూ లోలోపల వారికి కీడును చేస్తూ ఉంటారు. చెడు మార్గంలో అతడు సంసాదించిన ధనమంతా చెడు మార్గంలోనే ఖర్చవుతుంది. రజోగుణం గల బుద్ధి అన్నీ ఇటువంటి పనులనే చేయిస్తుంది.

పార్థా! అజ్ఞానము మరియు భ్రాంతి కారణంగా అధర్మాన్ని ధర్మంగాను, ధర్మాన్ని అధర్మంగాను భావిస్తాడు. ఎప్పుడూ తప్పు త్రోవలలోనే పోయే బుద్ధి తామసగుణాలతో కలిసి ఉంటుంది. 32

మంచిని చెడుగాను, చెడును మంచిగాను తలచే విపరీత బుద్ధిని తామస బుద్ధి అంటారు. రోగంతో బాధపడే వాడు మూర్ఖంగా మందు త్రాగకుండా వ్యాధిని పెంచుకుంటున్నాడు. వ్యాధిని అధికం చేసే ఆహారాన్ని తీసుకుంటే ఏమవుతుందో అదే తామస బుద్ధి కలవానికి కూడా అవుతుంది. అవివేకి అయిన పిల్లవాడు చెడు సావాసాలు చేసి బడికి వెళ్ళడం లేదు. బడికి వెళ్ళడం చెడుపనిగా భావిస్తాడు. చెడు సావాసాలు చెయ్యడమే మంచిదనుకొంటాడు. పెద్దవాళ్ళుకూడా ఏ పనీ చెయ్యకుండా సోమరిపోతులై పోతున్నారు. కష్టపడి పనిచేసేవారిని చూసి వీరికి సుఖపడటం తెలియదంటారు. వేదాంత చర్చ చెయ్యరు. దీన్ని వృద్ధాప్యంలో చూసుకోవచ్చులే అంటారు. తామస బుద్ధి గల వారు చేసే పనులన్నీ ఇట్లాగే ఉంటాయి.

ఓ పృథుకుమారా! అవిచ్ఛిన్నమైనది, యోగాభ్యాసం చేత స్థిరంగా కొనసాగేదీ ఆ కారణంగా ఇంద్రియ, మనో, ప్రాణముల కార్యాలను నియమించేదీ సత్త్వగుణ ప్రధానమైనది. **33**

ధృతి అంటే దృఢత్వం. దారం సూదిలో దూరాలంటే దానిలోని పోగులన్నీ ఒకటిగా కలసి ఉండాలి. అప్పుడే సులభంగా ఎక్కించడానికి వీలవుతుంది. ఒకవేళ సూదిలో ఏదైనా మలినం ఉన్నప్పుడు, దారం కలసి ఉన్నా కూడా సూదిలోకి ఎక్కదు; వంగి పోతుంది. ఎందువల్ల? దారంలో దృఢత్వం లేదు. దాన్నే ధృతి అంటారు. యోగి అయినవాని మనస్సు కలసివున్న దారంవలెను, పదునైనది, స్థిరమైనది అయిన సూది మొనవలె ఉంటుంది. అటువంటి పక్వమైనది, ధృతియైనట్టిది పరమాత్మకే అర్పించబడుతోంది. అందులో ఇతరులెవ్వరికీ భాగం ఇవ్వడంలేదు. దిక్సూచి ఎప్పుడూ ఉత్తరాన్నే చూస్తున్నట్లు ధృతి ఎప్పుడూ పరమాత్మ కొరకే అర్పించబడుతుంది. ఇటువంటి ధృతి సాత్త్వికమైనది. అది మానవుని శ్రేష్ఠునిగా చేస్తుంది.

ఓ అర్జునా! మరియు ఏ నిశ్చయ బుద్ధితో మానవుడు ధర్మము, అధర్మము, కామమునందలి ఫలముల యెడల ఆసక్తి కలిగి ఉంటాడో అట్టివాని బుద్ధి రాజసిక మైనట్టిది. **34**

పురుషార్థాలు నాలుగు. సాత్త్విక ధృతి మోక్షాన్ని కోరుకుంటుంది. ప్రాపంచిక సుఖాల్ని కోరుకునే ధృతి ధర్మ, అర్థ, కామాలను కోరుకుంటుంది. జీవులన్నీ సుఖాలనే కోరుకుంటాయి. సుఖాల్ని పొందటానికే అవి ఈ ప్రాపంచిక జీవితాన్ని కోరుకుంటాయి. అవి చేసే ప్రయత్నాలన్నీ కోరికలు తీర్చుకోవడానికే. జీవుడికి ఎందులో సుఖం అనిపిస్తే దాన్ని పొందేందుకే అధిక ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ధనాన్ని కలిగిఉండటం, ధనాన్ని సంపాదించడం, సుఖాల్ని పొందటం వంటి ప్రాపంచిక సుఖాలకై జీవుడు రాత్రింబవళ్ళు కృషి చేస్తూ ఉంటాడు. ఈ విధంగా ఇహమునకు హేతువులైన ధర్మం, అర్థం, కాములందు మిక్కిలి ఆసక్తిని చూపడం రజోగుణ స్వభావం. ఈ మూడింటినీ అనుసరించి ఉండే ధృతి రాజసికమైనట్టిది.

"విపరీతమైన జ్వరంతో బాధపడేవాని వద్ద చల్లటినీళ్ళు, తీపి తినుబండారాలు ఉంచితే తినకుండా ఉంటాడా? అట్లాగే కోరికలనే జ్వరంతో బాధించబడి, దైహిక సుఖములందు ఆసక్తి కలిగిన ప్రపంచాసక్తి గలవాడు రూపలావణ్యాలనే ఆకర్షణలకూ, సంపదపై ఉండే ఆకర్షణలకూ లోనైతే అతడు తన ఆశను నిగ్రహించుకోలేడు. అతడు భక్తి మార్గాన్ని విడిచిపెట్టి పెడమార్గాన పోవడం ఖాయం." – శ్రీరామకృష్ణ పరమహంస

ఓ పార్థా! నిద్రను, భయాన్ని దుఃఖాన్ని, దిగులును వదలలేని బుద్ధిహీనుని ధైర్యం తామసప్రదమైనట్టిది. **35**

ప్రపంచంలో పెద్దలు సంపాదించిన సంపదల్ని చూసుకుంటూ జ్ఞానం సంపాదించే ప్రయత్నాలేవీ చెయ్యరు. తినడం, నిద్రపోవడం వారికి ముఖ్యమైన కర్మలుగా ఉంటాయి. తమకు దక్కిన సంపదను కాపాడుకొనే ప్రయత్నంగాని, వృద్ధిచేసే ప్రయత్నంగాని చెయ్యరు. కాబట్టి ఆ ఉన్న కాస్తా ఎక్కడ చెయి జారిపోతుందోనని భయపడుతూనే ఉంటారు. ఆ సంపదలో కొంత నష్టపోయిన తర్వాత వారికి విషయం బోధపడుతుంది. అప్పుడు వారు దుఃఖానికి లోనవుతూ ఉంటారు. ఇట్టి మనోవ్యాకులతే మూలంలో విషాదమని చెప్పబడింది. మొదటి అధ్యాయంలో అర్జునుడు కూడా విషాదానికి

తాత్కాలికంగా గురి అయి వ్యాకులత చెందాడు. అయితే తమోగుణ ధృతిగలవారు శాశ్వతంగానే విషాదానికి గురి అవుతారు. ఎందువల్లనంటే వారి జీవితం బురదలో కట్టిన ఇల్లు వంటిది. అది ఎప్పుడుపడితే అప్పుడు కూలిపోతూనే ఉంటుంది. ఇది తమోగుణంలో పుట్టిన ధృతి.

ఓ భరతకుల శ్రేష్ఠుడా! దేన్ని అభ్యాసం చేస్తే మానవుడు సుఖాన్ని పొందుతున్నాడో, దుఃఖాల నుండి బయట పడుతున్నాడో అట్టి స్థితి యొక్క మూడు విభాగాల్ని గూర్చి చెబుతాను విను. 36

జీవితానికి ఉత్సాహానిచ్చేది సుఖప్రాప్తి. సుఖం కోసం జీవుడు చేసే ప్రయత్నాలకు అంతులేదు. అయితే ఆ సుఖ ప్రాప్తి అన్నది చిల్లు పాత్రల్లో పోసిన నీటివలె నిలవడంలేదు. మెరుపువలె వచ్చి పోతోంది.

అభ్యాసం జీవితాన్ని కావలసిన మార్గంలో నడపగలదు. శరీరానికి అభ్యాసం ఉన్నట్లే మనస్సుకు కూడా ఉంటుంది. పూర్వ జన్మల నుండి వచ్చే అభ్యాసాలే వాసనల రూపంలో వస్తూ ఉంటాయి. అభ్యాసాన్ని మార్చుకుంటే వాసనలూ మారవచ్చు. అయితే ఈ అభ్యాసం అన్నది ఒకటి రెండు రోజుల్లో అయ్యేపనికాదు. దుఃఖాన్ని తొలగించి సంతోషాన్నివ్వగలిగేది అభ్యాసం మాత్రమే.

ఏ సుఖం ప్రారంభంలో విషంలా ఉంటుందో అది చివర్లో అమృతమవుతోంది. అటువంటి సుఖాన్ని సాత్త్విక సుఖమంటారు. ఆత్మనిష్ఠ, నిర్మలమైన బుద్ధి అందుకు తోడ్పడుతున్నాయి. **37**

> *"పూర్వం జైపూర్‌లోని గోవింద ఆలయంలో పనిచేసే పూజారులు వివాహం చేసుకోకుండా నైష్ఠిక బ్రహ్మచర్యాన్ని అవలంబించేవారు. అందువల్ల వారిలో ఆత్మశక్తి బలంగా ఉండేది. ఒక రోజున రాజుగారు వారిని తన వద్దకు రమ్మని కబురు పంపారు. వాళ్ళు వెళ్ళకుండా "మాతో మాట్లాడాలంటే రాజునే ఇక్కడకు వచ్చి మాట్లాడిపొమ్మని" కబురు పంపారు. వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత రాజు వారికోసం కబురు పెట్టాల్సిన పని లేకుండా పోయింది. తమంతట తామే అంతఃపురానికి పోయి "మహారాజా! మేము నిన్ను ఆశీర్వదించేందుకే వచ్చాం" అంటూ స్వామికి అర్చించిన పూలమాలలు ఇచ్చేవారు. ఎందువల్లనంటే వారి ఆర్థిక పరిస్థితులే వాళ్ళు తరచుగా రాజు వద్దకు వెళ్ళేట్లు చేశాయి. బిడ్డకు అన్నప్రాసన అనో, అమ్మాయికి వివాహమనో, ఇల్లు కట్టుకోవాలనో, ఈ విధంగా తరచుగా వాళ్ళకు డబ్బు అవసరం కలిగేది. అందు కోసం వెళ్ళి రాజును యాచిస్తూ ఉండేవాళ్ళు. అట్లాగే ఇతరులకు బానిసలుగా పనిచెయ్యాల్సి రావడం వల్ల కలిగే పరిణామాల్ని మీరే గ్రహించగలరు. ఇంగ్లీషు చదువులు నేర్చుకొని విదేశీ పాలకుల వద్ద బానిసలుగా పనిచేస్తూ వారు కొట్టే దెబ్బలన్నీ నిశ్శబ్దంగా భరిస్తున్నారు. తాము పొందుతున్న అవమానాలన్నీ ఎందువలన భరిస్తున్నారు? వాటన్నింటికీ పునాదిగా ఉన్న తమ 'స్త్రీల పై మమకారము, ఆశయే అందుకు కారణము.'*
>
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

ఇంద్రియ సంయోగం చేత ప్రారంభంలో అమృతం వలె ఉన్నా కూడా చివరకది విషంగా మారే

సుఖాన్ని రాజస సుఖమంటారు. **38**

యువతీ యువకులు కలసినప్పుడు ఆమెను తదేకంగా చూస్తూ ఉన్నా, తాకినా, ఆమెతో సుఖాలు పొందటం వలన ఇంద్రియాలు యువకుని ప్రేరేపిస్తూ ఉంటాయి. మొదట్లో ఇవన్నీ సంతోషాన్ని కలిగించినప్పటికీ, చివరికతణ్ణి దుఃఖాల్లోకి నెడుతున్నాయి. అటువంటి సుఖాలను రజోగుణముతో కూడిన సుఖాలని అంటారు.

నిద్ర, సోమరితనం, భ్రాంతి మొదలైన వాటి వల్ల పుట్టే ఏ సుఖం ఆరంభం నుండి చివరిదాకా భ్రాంతిని కలుగజేస్తోందో అట్టి సుఖం తామసమైనదని చెప్పబడుతోంది. **39**

ఏదో ఒక విధంగా సుఖానుభూతి పొందాలన్న ఆశతో బుద్ధిహీనుడు ఎదురుగా ఏది కనిపిస్తే దాన్లోనే ఆనందాన్ని వెదుకుతూ ఉంటాడు. చివరకది మోహమై దుఃఖాన్నే మిగులుస్తోంది. ఉదాహరణకు మధుపానం వల్ల సంతోషం కలుగుతుందని దానికి అలవాటు పడుతున్నారు. చివరకతడి వివేకాన్నే నశించేట్లు చేస్తోంది. ఆరోగ్యం చెడగొట్టుకొని, సంఘంలో హేళనకు గురి అయి దుఃఖాన్నే మిగులుస్తోంది.

"ఒంటె ముళ్ళ మొక్కల్ని ప్రీతితో తింటుంది. ముళ్ళు గుచ్చుకొని దాని నోరంతా రక్తం కారుతూ ఉంటుంది. అయినా అది ముళ్ళ పొదల్ని తినడం మానదు. విషయసుఖాలనాశించే వారి పద్ధతులు కూడా ఇట్లాగే ఉంటాయి."

- శ్రీరామకృష్ణ పరమహంస

ప్రకృతి నుండి పుట్టిన ఈ మూడు గుణాల నుండి విడుదల పొందే ప్రాణి భూలోకంలోగాని, దేవలోకంలోగాని, దేవతలలో గాని కనపించదు. **40**

గడ్డిపోచ నుండి బ్రహ్మ వరకు ప్రాణులన్నీ త్రిగుణాలకు కట్టుబడిన ఆత్మలే. అవి మానవులైనా దేవతలైనా త్రిగుణాలకు లోబడే జీవిస్తారు. అంటే బద్ధాత్ములే. గుణ భేదాల్ని బట్టి జీవులు ఉత్తమంగానో, నీచంగానో ఉంటారు. జీవులందరిలోకీ పెద్దవాడు బ్రహ్మ. ఆయన కది పదవి మాత్రమే; ముక్తి కాదు. అంటే ఆయన కూడా త్రిగుణాలకు బంధితుడే. లేకపోతే సృష్టి కార్యాన్ని చెయ్యలేడు. ఆయన ప్రకృతి, లయ అనే గొప్ప పదవిలో ఉంటాడు. అయితే ఈయనకు మళ్ళీ జన్మ ఉండదు. ఇక కల్పం అయిన తర్వాత ఆయన ముక్తి పొందుతున్నాడు. అంటే త్రిగుణాలకు అతీతుడవుతున్నాడు.

"ఒకడు నీచ స్వభావంతో ఎక్కువ కాలం పోరాడినప్పటికీ ఆత్మజ్ఞానం పొందుటకు ఎంత శ్రమించినా సమాధి స్థితిని పొందినప్పుడు అహంకారం పూర్తిగా తొలగిపోతుంది. కానీ సమాధి స్థితిని చేరడమే మిక్కిలి కష్టం. త్రిగుణముల నుండి పుట్టిన అహంకారం త్వరలో వదలి పోవడం లేదు. కావున మనమే ప్రపంచంలో మళ్ళీ పుట్టి దుఃఖాల్ని అనుభవిస్తున్నాం." *- శ్రీరామకృష్ణ పరమహంస*

శత్రువులను తపింప జేయువాడా! బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్రుల యొక్క కర్మలన్నీ వారి

స్వభావం నుండి పుట్టిన గుణములకు తగినట్లుగా విభజించబడుతూ ఉంటాయి. **41**

స్వభావమనేది ఈశ్వరుని ప్రకృతి. లేదా మాయ. అది మూడు గుణాలతో కూడుకున్నది. గుణాలకు తగినట్లుగా కర్మము, కర్మకు తగ్గట్లుగా సంస్కారము, దానికి తగ్గట్లుగా స్వభావం మారుతోంది. అంటే కర్మము స్వభావాలను విడదియ్యలేం. స్వభావాన్ని బట్టే వర్ణము (కులము) కూడా మారుతుంది. అంటే స్వభావాన్ని బట్టి, కర్మల్ని బట్టి అతడి వర్ణాన్ని నిర్ణయించవచ్చు.

శాంతి, ఇంద్రియ నిగ్రహం, తపస్సు, పవిత్రత, సహనము, నిజాయితీ, జ్ఞానము, విజ్ఞానము, ధార్మిక చింతన అనే సహజ లక్షణాలతో బ్రాహ్మణులు కర్మలు చేస్తూ ఉంటారు. **42**

శౌర్యము, తేజస్సు, ధృతి, చాతుర్యము, యుద్ధం నుండి వెనుకంజ వెయ్యకుండా ఉండటం, దానం, పరిపాలనా దక్షత మొదలైనవి క్షత్రియుల కర్మములుగా తెలుపబడుతున్నాయి. **43**

వ్యవసాయం, గోరక్షణ, వాణిజ్యం, వైశ్యులకు సహజమైన కర్మలై ఉన్నాయి. అట్లాగే చెప్పిన పనిని పూర్తి చెయ్యడం శూద్రుని కర్మగా ఉన్నది. **44**

తన స్వభావ సిద్ధమైన కర్మల యందు ఆసక్తి గల మానవుడు సంపూర్ణత్వాన్ని పొందుతున్నాడు. స్వభావ సిద్ధమైన కర్మల్ని ఆచరించేవాడు ఏ విధంగా అభివృద్ధి సాధిస్తున్నాడో చెప్తాను. విను. **45**

ఎవని యందుండి జీవులు ఉత్పత్తి అవుతున్నాయో, ఎవరైతే ఈ ప్రపంచమంతా వ్యాపించి ఉంటాడో అటువంటి ఈశ్వరుని తన స్వధర్మంతో ఆరాధించే మానవుడు ఉత్తమ సిద్ధిని పొందుతున్నాడు. **46**

ఈ ప్రపంచమంతా సక్రమంగా నడిపించేది ఈశ్వరుడే. ఒక్కొక్క జీవుడు వానివాని వృత్తిని సక్రమంగా చేస్తూ ప్రకృతికి తోడ్పడుతున్నాడు. కావున జ్ఞానం కలవాడు తాను ఏ కర్మను చక్కగా చెయ్యగలడో దాన్నే ఈశ్వరారాధనంగా చెయ్యాలి. దానివల్ల అతడు పరిపక్వతను పొందుతున్నాడు. ఉదాహరణకు కొబ్బరికాయలో పీచు, టెంక కొబ్బరి ఉన్నాయి. పెచ్చు తీసి, పెంకును పగుల కొట్టడం దేవతారాధనతో సమానం. దాని ద్వారా దైవం అనే కొబ్బరి మనకు లభిస్తోంది.

పరధర్మాన్ని స్వీకరించి దానిని సక్రమంగా ఆచరించడం కన్నా అరకొరగా చేసినా స్వధర్మాన్ని ఆచరించడమే మేలు. గుణాన్ననుసరించి నిర్దేశించబడిన స్వధర్మాన్ని ఆచరించిన వాడు పాపాన్ని పొందడు. **47**

సహజంగా కలిగి ఉండే కర్మమే స్వధర్మమని చెప్పబడుతోంది. ఒక వైద్యుడు తనకు వాదనా పటిమ ఉన్నదని వైద్యవృత్తిని మాని న్యాయవాదిగా పోకూడదు. న్యాయవాద వృత్తి అతడి స్వధర్మం కాదు. అర్జునునకు యుద్ధం చేసే నైపుణ్యం ఉంది. దుష్టులు లోకంలో ఎక్కువైపోయినప్పుడు వారితో యుద్ధం చేసి వారిని శిక్షించాల్సి ఉన్నప్పుడు అడవులకు పోయి తపస్సు చేసుకుంటాను అనరాదు. అట్లా అనడం తన స్వధర్మాన్ని విస్మరిస్తున్నట్లే అవుతుంది.

కుంతీపుత్రా! స్వభావ సిద్ధమైన కర్మ దోషంతో కూడుకున్నదైనా దాన్ని విడిచి పెట్టరాదు.

పొగచేత అగ్ని ఆవరించబడి ఉన్నట్లు కర్మలన్నింట్లోనూ దోషాలుంటాయిగదా. **48**

ఆత్మ నిగ్రహం కలవాడు, అనాసక్తుడు, భౌతిక సుఖాల్ని త్యాగం చేసేవాడు, అయిన మనుష్యుడు సన్న్యాసం ద్వారా కర్మఫల విముక్తి చేత ఉత్తమమైన పూర్వ సిద్ధిని పొందుతున్నాడు. **49**

సముద్రంలో కెరటాలున్నట్లే మనస్సులో భావాలు కూడా ఒకదాని వెనుక మరొకటి అంతరాయం లేకుండా వస్తూనే ఉంటాయి. మానవుల హృదయం కూడా ఒక సముద్రం లాంటిదే. అయితే యోగి యొక్క హృదయం మాత్రం అలలు లేని సముద్రంలాంటిది. యోగి మనోభావం కూడా అటువంటిదే. ఎందువల్లనంటే అతడు కోరికలు లేనివాడు. కర్మాతీతమైన బ్రహ్మమునందతడు నిలచి ఉంటాడు. కర్మాతీతమన్నా పరబ్రహ్మమన్నా ఒక్కటే అవుతుంది.

కుంతీ కుమారా! సిద్ధిని పొందినవాడు జ్ఞానము యొక్క ఉత్తమ స్వరూపమైన బ్రహ్మాన్ని ఎట్లా పొందుతున్నాడో క్లుప్తంగా చెప్తాను విను. **50**

సిద్ధి పొందటమన్నా పరిపక్వత పొందటమన్నా ఒక్కటే. ప్రకృతి యందు నిర్విరామంగా జరిగే కర్మలన్నీ పరిపక్వతను పొందుతున్నాయి. చేతనాచేతనములన్నీ పరిపక్వతను పొందుతూనే ఉన్నాయి. భూమిలో బొగ్గు నిక్షిప్తమై ఉంది. కాలక్రమంలో ఆ బొగ్గే ప్రకాశవంతమైన వజ్రంగా మారుతుంది. దీన్నే బంగారు ఆభరణాల్లో పొదిగి మానవులు ధరిస్తూ ఆనందిస్తారు. ఈ పరిపక్వత రావడానికి ఎన్ని సంవత్సరాలు పట్టింది? అట్లాగే మామిడి పండు తిని ఎంతో ఆనందిస్తాం. అది పొందిన సిద్ధియే మనకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఆ సిద్ధి కోసం మామిడి చెట్లకు ఎండావాన, గాలి, నీరు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఈ విధంగా ప్రతి ప్రాణి సిద్ధి కోసం తనదైన రీతిలో పాటుపడుతూనే ఉంటుంది. వీటిల్లో మానవుని ప్రయత్నం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. మానవుల పరిపక్వత మనస్సులో కలిగేది. అనేక జన్మల నుండి ఆ సంస్కారాలు వచ్చి చేరుతూ ఉంటాయి. యోగ సాధనలన్నీ మనస్సును స్థిర పడేందుకే. స్థిరమైన మనస్సుగల వాడే సిద్ధుడవుతాడు.

నిశ్చలమైన బుద్ధి గలవాడును, మనస్సును దృఢంగా నిగ్రహించిన వాడును, ఇంద్రియ విషయాలకు దూరమై, రాగద్వేషాలను పరిత్యజించి, **51**

ఏకాంతంలో ఉంటూ, మితంగా భుజిస్తూ, మనోవాక్కాయములను నిగ్రహించి నిత్యము ధ్యాన యోగ పరాయణుడై **52**

అహంకారాన్ని బలము, దర్పము, కామము, క్రోధము, మమకారములు లేకుండా శాంత స్వరూపుడైన వాడు బ్రహ్మమగుచున్నాడు. **53**

నిర్మలం అంటే అందులో రెండోవస్తువేదీ ఉండరాదు. పరిశుద్ధమైన బుద్ధి కూడా అట్లాంటిదే. అంటే బుద్ధి సందేహము, కల్మషము లేనిదై ఉండాలి. ధైర్యంగాను, దృఢంగాను మనస్సును శరీరాన్ని నిగ్రహించేవాడే ఉత్తముడు. ఆ వస్తువునందతడు రాగద్వేషాలు లేనివాడై ఉండాలి.

విషయ సుఖాలపై ఆసక్తి గలవానికి ఏకాంతంలో (ఒంటరిగా) ఉంటే పిచ్చెక్కుతుంటుంది. అదే

యోగి అయిన వానికి ఆనందం కలుగుతుంది. ఆహారం శరీరాన్ని ఎట్లా పోషిస్తుందో అదే విధంగా ఏకాంతం మనస్సును పరిపక్వత చెందేందుకు ఉపయోగపడుతుంది. మితిమీరి తింటే ఒంటికి కొవ్వు చేరుతుంది. అసలే తినకపోతే శరీరం నీరసించిపోతుంది. అందువల్ల మితంగా భుజించినవాని మనస్సు ఉత్సాహంగాను, నిర్మలంగాను ఉంటుంది. పనికిరాని మాటలు వ్యర్థంగా మాట్లాడకుండా వాక్కును నిగ్రహించుకోవాలి. సాధకుని మనస్సు కుదటపడ్డప్పుడు శరీరం కూడా కదలకుండా నిశ్చలంగా ఉంటుంది. ఆత్మ స్వరూపంలో నిశ్చలంగా మనస్సు ఉంచడాన్నే ధ్యానమంటారు. ప్రపంచ విషయాల్లో మనస్సు నిలపడం సామాన్యునికి ఎంత సహజమో, యోగికి ధ్యానంపై మనస్సు నిలపడం అంత సహజం. అట్లాగే వైరాగ్యం అన్నది. అనాసక్త స్థితి. ఇహపరమైన విషయాలపై ఆసక్తి లేకుండా ఉండటమే యోగానికి ఉపాయం.

మానవుడు, అతడు ధరించే వస్త్రాలు వేరువేరుగా ఉన్నాయి. కానీ వస్త్రాన్నే తన స్వరూపంగా చూసుకుంటూ సుఖదుఃఖాలకు లోనవుతూ ఉంటాడు. అది ఒక విధమైన అహంకారం. జన్మ జన్మల నుండి సంక్రమిస్తున్న దేహాభిమానమనే గుణమే జన్మలకు కారణమైన అహంకారమవుతోంది. ఆత్మను తెలుసుకోవడానికి అవసరమయ్యే శక్తిని పెంచుకోవాలి. ఈ శక్తినే బలం అంటారు. అటువంటి బలం లేనివాడు ఆత్మను పొందలేడు. అట్లాగే కోరికలకుండే వేగం కూడా నశించాలి. అనుకున్న పనులు అనుకున్నట్లు నెరవేర్చుకోవాలనుకోవడం, అందుకు తగినంత శరీర బలముందన్న గర్వంతో అధర్మాల్లో పాల్గొంటున్నారు. అటువంటి స్వభావాన్ని దర్పము లేక గర్వము అంటారు. తప్పులు చెయ్యడానికి ఇదే ముఖ్యమైన కారణం అవుతోంది. ఇంద్రియాలు విషయాల్లో చిక్కుకున్నప్పుడు కలిగే కోరికల్నే కామము అంటారు. ఈ కోరికకు ఎవరైనా అడ్డువస్తే వారిపై క్రోధం కలుగుతుంది. శరీర పోషణకు ధనం అవసరమే. కానీ నేను ధనవంతుడనన్న భావం కలుగనీయరాదు. ఆత్మ సాధనకు ధర్మానుష్ఠానానికి ఇది ఆటంకాన్ని కలిగిస్తుంది.

బ్రహ్మ రూపాన్ని పొందిన వాడు, నిర్మలమైన మనస్సుగలవాడు దేనినీ కోరుకోవడంలేదు; దేని కోసమూ దుఃఖించడం లేదు. ప్రాణులన్నింటిపైనా సమబుద్ధి కలిగి ఉండే అతడు, నా యందు సద్భక్తిని పొందుచున్నాడు. **54**

బ్రహ్మజ్ఞానం పొందిన వానిలో ఈశ్వర భక్తి పొంగి పొరలుతూ ఉంటుంది. ప్రాణులన్నింట్లోనూ ఈశ్వరుడే అనేక రూపాల్లో ఉన్నాడని గ్రహించి సమస్త ప్రాణుల్ని సమభావంతో చూస్తాడు. ఈశ్వర భావంలో ఉన్నవానికి తనకేదైనా నష్టం కలుగుతుందేమోనన్న దుఃఖం ఉండదు. పొందవలసింది పొందలేకపోతామేమోనన్న ఆతురత ఉండదు. ఏడో అధ్యాయంలో పదిహేనవ శ్లోకంలో చెప్పిన ఉన్నతమైన భక్తినే మరొకసారి స్మరించుకోవాలి.

నేను ఎటువంటి వాడినో, ఎంతటి వాడిననీ, పరా భక్తి చేత మానవులు నన్ను యథార్థంగా తెలుసుకుంటున్నారు. ఎప్పుడైతే నన్ను సంపూర్ణంగా తెలుసుకుంటున్నారో అట్టి వారు నన్ను వెంటనే పొందగలుగుతారు. **55**

పరాభక్తి చేతనే తత్త్వజ్ఞుడైన యోగి పరమాత్మ యొక్క సాకార నిరాకార రూపాలను తెలుసుకో గలుగుతాడు. అంటే సాకారుడే నిరాకారుడుగాను, నిరాకారుడే సాకారునిగాను ఎట్లా అవుతాడో తెలుసుకో గలుగుతాడు. అటువంటి వానికి ఇంకా తెలుసుకోవలసిందేదీ ఉండదు. అట్టివాడు వెంటనే నాలో లీనమైపోతాడు, నన్నే పొందుతాడు.

ఎప్పుడూ కర్మలు చేస్తూనే ఉండే వాడయినా, నన్నే ఆశ్రయించిన వాడైతే నా అనుగ్రహానికి పాత్రుడై శాశ్వతమైనది, నాశనములేనిది అయిన మోక్షాన్ని పొందుతున్నాడు. **56**

పరిపూర్ణమైన స్థితి యందు జ్ఞానము భక్తి ఎట్లా ఏకమై ఉంటాయో అట్లాగే జ్ఞానము కర్మము కూడా ఒకటై ఉంటాయి. సత్త్వ గుణంతో ఉన్నవాడు కర్మల్ని విడిచిపెట్టడం లేదు. తాను కర్త అనే భావనతో చెయ్యడం లేదు. అందువల్ల అతడెన్ని కర్మలు చేసినా అలసి పోవడం లేదు. దీనికి మనస్సే కారణం. ఈశ్వర భావంతో కర్మలు చేస్తూ తన్ను గూర్చి మరచిపోతున్నాడు. నది సముద్రంలో కలవనంత వరకే తనకో వ్యక్తిత్వం ఉంటుంది. సముద్రంలో కలసి పోయిన తర్వాత ఆ నది కూడా సముద్రమే అయిపోతోంది. ఈశ్వరానాగ్రహం పొందిన జీవుని స్థితి కూడా అట్లాంటిదే. శరీరమనే ఆకారం నిలచి ఉన్నా కూడా అందులో ఉండే ప్రజ్ఞ అంతా పరబోధమే అవుతుంది.

> *"కర్మల నాచరించడమే జీవితాశయం కాకూడదు. అది ఒక మార్గం మాత్రమే. అట్టి కర్మలనే అనాసక్తితో చేసినచో అదే జీవిత లక్ష్యమై భగవంతుని వద్దకు తీసుకుని పోతుంది. మార్గమే అంతమని భావించరాదు. ఒక ఊరికి పోయే దారియే ఆ ఊరు కాదని తెలుసుకోవాలి."*
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

కర్మలన్నీ నియమబద్ధంగా చేస్తూన్న నా శుద్ధ భక్తుడు నా రక్షణలో ఉంటాడు. శాశ్వతము, అవ్యయము అయిన నా పరమ పదాన్ని నా అనుగ్రహం చేత పొందుతాడు. **57**

బుద్ధి యోగాన్ని అవలంబించేవాడు భగవంతుని ఆజ్ఞలన్నింటినీ యథావిధిగా నెరవేరుస్తాడు. వివేకం గలవాడై తాను చేసే కర్మలందు ఆసక్తి లేకుండా చేస్తాడు. తాను చేస్తున్నవన్నీ భగవత్కార్యాలేనని ఎరిగి చేస్తూ ఉంటాడు. జీవుడందుకు సహకరించినా సహకరించకపోయినా భగవంతుని పనులు జరిగిపోతూనే ఉంటాయి. ఈశ్వరుని కర్మలు ఈశ్వరుని కొరకు చెయ్యడాన్నే సన్న్యాసమంటారు. పరమాత్మ యందు శరణు పొందడం కన్నా జీవునికి వేరే మార్గం లేదు. అందువల్ల తన మనస్సును పూర్తిగా భగవంతునిపైననే లగ్నం చెయ్యాలి.

> *"భగవంతుడే నీకు ప్రత్యక్షమైతే ఏం కోరుకుంటావు? ఆసుపత్రులు, పాఠశాలలు మొదలైనవి స్థాపించమని కోరుకుంటావా? ఇవన్నీ భగవంతుని దర్శనం అయ్యేంత వరకూ గొప్ప విషయాలు కావచ్చు. సాక్షాత్కారం అయిన తర్వాత ఇవన్నీ శాశ్వతమైనవి కావని, స్వప్నం వంటిదని తెలుసుకుంటావు. ఆయనను జ్ఞానం కోరుతూ ప్రేమ కోరుతూ ప్రార్థించాలి. ఆయన యెడల ప్రేమ భక్తి కలిగి ఉంటే, మనం మానవత్వం నుండి దైవత్వాన్ని పొందుతాం. జ్ఞానానికి, ఆనందానికి పుట్టినిల్లు భగవంతుడేనని,*

మనమంతా ఆయన బిడ్డలమన్న సత్యం అప్పుడు బోధపడుతుంది."

- శ్రీరామకృష్ణ పరమహంస

చిత్తము నాయందుంచినట్లైతే నా అనుగ్రహంతో ఆటంకాలన్నీ అధిగమించి వెళ్ళగలవు. అట్లా కాకుండా అహంకారంతో వినకపోతే నాశనమైపోతావు. **58**

విఘ్నాలన్నీ బయట ప్రపంచంలో లేవు. అన్నీ మానవుడి మనస్సులోనే ఉన్నాయి. చిత్తమును శివుని యందుంచిన యెడల భక్తునికి కలిగే ఆటంకాలన్నీ ఈశ్వరుని చర్యలుగానే తెలుస్తుంది. దుఃఖాలన్నీ అహంకారం వల్లనే కలుగుతున్నాయి.

"ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఈశ్వరకృప లేకపోతే నువ్వు ఏమీ పొందలేవు. అయితే ఈశ్వరకృప అంత తేలికగా లభిస్తుందని అనుకోకు. నీ హృదయంలో ఉండే అహంకారం పూర్తిగా నశించాలి. నేను 'కర్త'ను అన్న భావం నీ మనస్సులో ఉన్నంత కాలం ఈశ్వరుని పొందలేవు." *- శ్రీరామకృష్ణ పరమహంస*

పనికిమాలిన అహంకారంతో 'యుద్ధం చెయ్యన'ని నువ్వనుకుంటే, నీ ధైర్యమంతా వ్యర్థమైపోతుంది. నీ క్షత్రియస్వభావమే నీచేత యుద్ధం చేయిస్తుంది. **59**

అర్జునా! నువ్వు ఇంత వరకు పొందిన శిక్షణ గౌరవము క్షత్రియ స్వభావానికి తగినట్టివి. చెడును ఎదిరించి పోట్లాడటం నీ స్వభావం. **59**

చెడు నీ కన్నెదురుగా తాండవమాడుతూ ఉంటే చూస్తూ ఊరుకోవచ్చా? నిద్రలో దోమకుడితే ఊరుకుంటున్నారా? ఆ దోమను కొట్టి తరమడం లేదా? అట్లాగే నీ స్వభావమే నీ చేత యుద్ధం చేయిస్తుంది. నువ్వు అందుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే నీ ఆత్మ శక్తిని కించపరచినట్లవుతుంది. ఆలోచనలు క్రియలుగా మార్చుకోకపోతే మానవజన్మ వృథా అయినట్లే. చెడును తొలగించాలన్న ఆలోచనలు నీ మనస్సు నిండా ఉన్నాయి. అయినా ఈ దేహంతో కర్మలు చెయ్యనని భీష్మించుకొని కూర్చుంటున్నావు. రజోగుణం చేత నీలో ఉదయించిన వ్యర్థమైన అహంకారమే ఇందుకు కారణం. దానికి వశుడవై నీ పరమార్థాన్ని విడిచిపెట్టకు.

"అహంకారం కలిగి ఉన్నంత వరకు జ్ఞానము ముక్తి లభించవు. జనన మరణాలు తొలగించబడవు." *- శ్రీరామకృష్ణ పరమహంస*

కుంతీపుత్రా! మోహం చేత నువ్విప్పుడు నా ఆదేశాన్ని పాటించకుండా ఉన్నావు. కానీ, ఓ కౌంతేయా! నీ స్వభావం వలన పుట్టిన కర్మచే బంధించబడిన నువ్వు దానిని చెయ్యలేవు. **60**

"వెల్లుల్లి రసం పోసిన పాత్రను ఎన్నిసార్లు కడిగినా ఆ దుర్వాసన పోదు. అట్లాగే అహంకారమంత మొండిపట్టుదల కలిగిన అజ్ఞానం మరొకటి ఉండదు. ఎంత శ్రమ పడినా దానిని పూర్తిగా పోగొట్టలేము." *- శ్రీరామకృష్ణ పరమహంస*

ఓ అర్జునా! ఈశ్వరుడు ప్రాణుల శరీరాన్నే యంత్రంగా చేసుకొని అందులో కూర్చుని తన

మాయచేత ఆడిస్తూ ఉంటాడు. **61**

> *"పాము కోరలందు విషం ఉన్నా ఆ విషం దానిని బాధించడం లేదు. కానీ అది ఇతరులను కాటువేస్తే అదే విషం, కాటు వేయబడిన వానిని మరణించేట్లు చేస్తోంది. ఇదే విధంగా ఈశ్వరుని యందు మాయ ఉన్నది. కానీ అది ఆయనను బంధించడంలేదు. తన మాయచేత జగత్తులన్నింటినీ తన వశంలో ఉంచుకుంటున్నాడు."* - శ్రీరామకృష్ణ పరమహంస

అర్జునా! సమస్త భావములందును అతనినే శరణుపొందుము. అతని అనుగ్రహం చేత సర్వోత్తమమగు శాంతిని, శాశ్వతమైన మోక్షాన్ని పొందగలవు. **62**

సమస్త భావములందును అతనిని శరణు పొందుట అన్నది జీవాత్మ యొక్క కర్తవ్యం. దేహాన్ని తన సొంత మనుకొంటూ, తన కర్మలన్నింటికీ తానే కర్తనని అనుకుంటూ, సంఘంలో తనకొక ప్రత్యేకమైన స్థానం కలదని అనుకోవడం జీవబోధాన్ని పెంచుతోంది. దాన్ని శరణాగతి అని అనరు. సముద్రంలో ఉండే అలల వలె జీవాత్మలన్నీ పరమాత్మలో ఉన్నాయి. నీరు అలలకు స్వంతంకాదు. కానీ అలలన్నీ నీటికే స్వంతం. అట్లాగే దేహం జీవునికి స్వంతం కాదు. అలలు సమయానుకూలంగా తగిన రూపాన్ని దాలుస్తున్నాయి. దేహాలకు కలిగే రూపాలు కూడా ఇటువంటివే. అలల యొక్క చర్య నిజానికి సముద్రము యొక్క చర్యయే. సముద్రం లేకుండా అలలు ఉండవు. జీవుని చర్యలన్నీ ఈశ్వరుని చర్యలే. ఈశ్వరుడులేక జీవుడు లేదు. ఇటువంటి ఉత్తమమైన భావం కలిగి ఉండటాన్నే శరణాగతి అంటారు.

రహస్యాలన్నింట్లోకీ పరమ రహస్యమైన జ్ఞానం నీకు చెప్పాను. నువ్వా జ్ఞానాన్ని బాగా జీర్ణించుకున్న తర్వాత నీకు తోచిన విధంగా చెయ్యి. **63**

అర్థం కాని దాన్ని రహస్యం అంటారు. ప్రకృతిలో అంతర్భాగమై ఉన్న అనేక విషయాలు మనకు తెలియవు. అవన్నీ రహస్యంగా దాగి ఉంటాయి. ఈనాడు ప్రకృతిని గూర్చి మనం తెలుసుకున్న అనేక విషయాలు కొన్ని సంవత్సరాలకు పూర్వం వరకు దాగి ఉన్నవే. ఉదాహరణకు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే విధానం మనకిప్పుడు తెలుసు. కానీ ప్రకృతిలో ఇంతకు పూర్వమే అది దాగి ఉంది. మనకిప్పుడది బహిర్గతమైంది. దాన్ని ఉత్పత్తి చేసే విధానాలు తెలిపేది శాస్త్రం. ఇట్లాంటి శాస్త్రాలు ప్రకృతిలో దాగి అనేకం ఉన్నాయి. అట్లాగే మానవ జీవితానికి సంబంధించిన శాస్త్రం కూడా ఒకటి ఉంది. అదే బ్రహ్మ విద్య అనే యోగ శాస్త్రం. ఆ శాస్త్రం మనకు రెండు విధాలుగా బోధిస్తుంది. 'ఇది చెయ్యి' ఇది చెయ్యవద్దు అని ఆజ్ఞాపిస్తుంది. తగిన కారణాలు చెప్తూ బోధిస్తోందే కాని, గ్రుడ్డిగా నమ్మమనడం లేదు. ఎవరెన్ని చెప్పినా ముక్తికీ, అనుభవానికీ తగినట్లుండే సిద్ధాంతాన్నెవరూ కదిలించలేరు.

రహస్యాతి రహస్యమైనది, అతి శ్రేష్ఠమైనది అయిన నా వాక్కును మళ్ళీ చెప్తాను. నువ్వు నాకు చాలా ఇష్టమైనవాడవు కాబట్టి నీ హితం కోరి మళ్ళీ చెప్తున్నాను. **64**

బయట ప్రపంచంలోని వస్తువులు అనేకం రహస్యంగా ఉండి పోయినట్లే మనస్సులో ఉండే

దైవత్వం కూడా రహస్యంగా ఉంటోంది. ప్రాణులందరిలో దాగి ఉన్న సుగుణాలే భగవంతుడు. ప్రకృతిలో జరిగే చర్యలన్నీ చివరకు 'ఆ' ఒక్క కార్యాన్నే నెరవేరుస్తోంది ఉదాహరణకు పనికిమాలిన వెదురుముక్క పిల్లన గ్రోవిగా మారి తన గాన మాధుర్యంతో ముల్లోకాలను ఓలలాడిస్తోంది. జడ పదార్థములందు ఆయన చేసే లీల అటువంటిది. అట్లాగే జీవుని కూడా తన వానినిగా చేసుకొనుచున్నది. ప్రపంచమనే పెద్ద కర్మాగారంలో శ్రేష్ఠమైన ఈ కర్మ విరామం లేకుండా జరుపబడుతోంది.

> *"నిజమైన భక్తుడొకడు ఈశ్వరుని ఏ విధంగా చూస్తున్నాడు? బృందావనంలోని గోపికలు శ్రీకృష్ణ పరమాత్మను జగన్నాథునిగా చూడక తమ ప్రియునిగాను, గోపీనాథుడుగాను చూశారు. అట్లాగే భక్తుడు ఈశ్వరుని తన ఆత్మబంధువుగా, ప్రియాతి ప్రియమైన వానిగా చూస్తున్నాడు."* - *శ్రీరామకృష్ణ పరమహంస*

అర్జునా! మనస్సు నాయందే లగ్నంచేసి, నాయందు భక్తి కలిగి నన్నే ఆరాధించు. నాకు నమస్కరించు. నువ్వు తప్పక నన్నే పొందుతావని ప్రతిజ్ఞ చేస్తున్నాను. నువ్వు నాకు ప్రియమైనవాడవు.
65

మనమొక బండిలో ఊరికి ప్రయాణం చేస్తున్నాం. బండి పోయేది మార్గం. ఊరిని చేరుకోవడమన్నది గమ్యం. భగవంతుని విషయంలో మార్గము, గమ్యమూ ఒక్కటే. అనగా ఆయన్ను తోడుగా చేసుకొని ఆయన్నే చేరుకుంటున్నాం. ఆయన పాదాలకు నమస్కరించడం కూడా ఆయన కృపయే. ఆయన కృపచేతనే ఆయన్ను పొందుతున్నాం.

> *"నీటి యందు మునిగి పోయినవాడు శ్వాస పీల్చేందుకు తపన చెందుతాడు. అట్లాగే ఈశ్వరుని దర్శించే ముందు, ఆయన దర్శనానికై భక్తుడి మనస్సు పరితపించాలి."*
> - *శ్రీరామకృష్ణ పరమహంస*

ధర్మాలన్నింటినీ పరిత్యజించు. నన్నొక్కడినే శరణు కోరుకో. నిన్ను సమస్త పాపాల నుండి విముక్తుణ్ణి చేస్తాను. చింతంచకు.
66

భక్తుని ప్రయత్నాలేవీ ఫలించనప్పుడు, భగవంతునికి తన్ను తానర్పించుకొని ఆయన సహాయాన్ని అర్థించడాన్ని శరణాగతి అంటారు. జీవుడు చేసే కర్మలన్నింట్లోను ఆఖరు కర్మయే శరణాగతి. చిన్ననది పెద్దనదిలో కలసి సముద్రాన్ని చేరడం వంటిదే శరణాగతి. జీవుని యొక్క ఇచ్ఛా, స్వాతంత్ర్యమంతా ఈశ్వర సంకల్పంలో లీనమవుతున్నాయి. ఈశ్వరుని చర్యలు సముద్రపు చర్మల వంటివి. జీవుని చర్యలేమో అలల చర్యల వంటివి. అలలు సముద్రం కన్నా భిన్నమైనవి కాదు గదా. కనుక జీవుని చర్యలే భగవంతుని చర్యలవుతున్నాయి. కర్మయోగం జీవుని ఇటువంటి స్థితికి తీసుకొని వస్తోంది.

యోగి, భక్తుడు, జ్ఞాని ఈ ముగ్గురూ పొందే శరణాగతి ఒక్కటే. అయితే అవి మూడు విధాలుగా ఉంటాయి. సత్స్వరూపంలో యోగి లీనమవుతున్నాడు. చిత్ స్వరూపంలో జ్ఞాని లీనమవుతున్నాడు.

ఆనంద స్వరూపంలో భక్తుడు లీనమవుతున్నాడు.

> *"పరిపూర్ణ శరణాగతి యొక్క లక్షణాలెట్లా ఉంటాయి? ఆనాటి పనులన్నీ పూర్తి చేసుకొని పడక కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చుకుంటూ ప్రశాంతం అనుభవించే ఆనందంలా ఉంటుంది. అందులో దుఃఖానికి గాని, కష్టాలకు గాని ఎక్కడా చోటుండదు."* - శ్రీరామకృష్ణ పరమహంస

నీకు బోధించిన ఈ గీతా శాస్త్ర సిద్ధాంతమును తపస్సు లేనివానికి గాని, భక్తిలేని వానికిగాని, సేవ చెయ్యని వానికిగాని, నన్ను దూషించే వానికి గాని నువ్వు చెప్పవద్దు. **67**

జీవిత తత్త్వాలన్నీ భగవద్గీతలో ఉన్నాయి. క్రమంగా అంతా తెలుసుకోవాలన్నదే భగవంతుని ఉద్దేశం. వీటిని కొద్ది మందికి చెప్పవద్దని హెచ్చరిస్తున్నాడు. ఎందువల్లనంటే, కళ్ళు లేనివాడికి అందమైన చిత్రాలు చూపించి ఏం ప్రయోజనం? సక్రమమైన పద్ధతిలో జీవితం గడపనివాడు, తపస్సు లేనివానికి ఈ గీతోపదేశం ఫలించదని హెచ్చరిస్తున్నాడు. తపస్సు మాత్రం ఉంటే చాలదు. దానితోపాటు భక్తి కూడా ఉండాలి. ఎందువల్లనంటే తపస్సుకు ఫలం భక్తి; భక్తికి ఫలం సేవ చెయ్యాలనే అభిలాష కలగడం ప్రాణులన్నింటినీ ప్రేమించే వాడే సేవ చెయ్యగలుగుతాడు.

నా పట్ల పరమభక్తి కలిగి, అతిగోప్యమైన ఈ శాస్త్రాన్ని నా భక్తులకు బోధించే వాడు నిస్సంశయంగా నన్నే చేరుతాడు. **68**

మానవులలో నా భక్తులు నా కత్యంత ప్రియులు. అట్టి భక్తులలో ఎవడైతే ఈ గీతా శాస్త్రాన్ని ప్రచారం చేస్తాడో అతడికంటే ఆప్తుడు మరొకడుండడు. ఈ గీతాశాస్త్ర సంప్రదాయ ప్రచారకుని కంటే ఈ భూమి మీద నాకు ప్రియమైనవాడు పుట్టబోడు. **69**

లోకంలో కర్మలన్నీ భగవంతుని కర్మలే. ప్రకృతి బోధించేదంతా భగవన్మహిమయే. భగవంతుడు చేసిన ఉపదేశాలన్నింట్లోకీ గీతా శాస్త్రానికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రకృతి రహస్యాలన్నింటినీ ఈ శాస్త్రం బోధిస్తోంది. జీవిత తత్త్వాన్నంతా వివరిస్తోంది. వీటన్నింటికీ మూలవిరాట్టు ఎవరో తెలుపుతోంది. పరవిద్య, అపర విద్య రెండూ ఇందులోనే ఉన్నాయి. అనగా భగవంతుని పొందేమార్గం, లోకంలో ధర్మబద్ధంగా జీవించే విధానం అన్నమాట. ఈ గీతాతత్త్వాన్ని వంట పట్టించుకున్నవాడు శ్రేష్ఠుడుగా ఎన్నబడుతున్నాడు.

> *"ఇంటి కప్పుపై నుండి వర్షపు నీళ్ళు పోయే గొట్టాలకు చివర పులి తల ఆకారాన్ని అమరుస్తున్నారు. చూసే వాళ్ళకు ఆ నీరు పులి నోట్లో నుండి వస్తువున్నట్లు కనిపిస్తుంది. నిజానికి అది ఆకాశంలో నుండి పడే వర్షపు నీరే. అట్లాగే దైవత్వం పొందిన మానవులు చేసే ఉపదేశాలు కేవలం మానవులే బోధిస్తున్నట్లుంది. నిజానికి ప్రబోధాలన్నీ భగవంతుని వద్ద నుండి వచ్చినవే."* - శ్రీరామకృష్ణ పరమహంస

ధర్మబద్ధమైన మన ఈ సంభాషణను ఎవడు ప్రతిరోజూ పారాయణ చేస్తాడో అట్టి వాడు

జ్ఞానయజ్ఞం చేత నన్ను ఆరాధించినట్లే భావిస్తాను. ఇది నిశ్చయము. **70**

ఈ నీతి శాస్త్రం ధర్మ సంబంధమైనది. దాన్ని పారాయణం చెయ్యడం, మనస్సుతో చేసిన యజ్ఞం అవుతుంది. అటువంటి జ్ఞాన యజ్ఞం చేత పూజించబడిన పరమాత్మ యజ్ఞఫలాన్నిస్తాడు.

శ్రద్ధ కలిగిన వాడై, అసూయ లేనివాడై ఈ నీతి శాస్త్రాన్ని ఏ మానవుడైతే వింటున్నాడో అతడు పాపవిముక్తుడై, పుణ్యకార్యాలు చేసినవారు పొందే పుణ్యలోకాలను పొందుచున్నాడు. **71**

గీతా శాస్త్రాన్ని శ్రద్ధతో తెలుసుకున్న వానికి అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ఈ శాస్త్రాన్ని ఇతరులకు బోధించడం మూలంగా దాన్ని బోధించే వారి మనస్సులో గాఢంగా నాటుకుంటోంది. అది విన్న వారిలో కూడా భక్తి విశ్వాసాలు వృద్ధి చెందుతున్నాయి. ఇందుమూలంగా ఇద్దరూ గీతాశాస్త్రాన్ని ఎరిగినవారే అవుతున్నారు. మనస్సుకు పట్టించుకునే విషయాలే సంస్కారాలవుతాయి. భగవంతునికి సంబంధించిన విషయాలు కావడం వలన ఉత్తమ సంస్కారాలు చోటు చేసుకుంటాయి. కనుక ఈ శాస్త్రాన్ని విన్నవారు. బోధించినవారు కూడా సమస్త పాపాల నుండి విముక్తులవుతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పార్థా! పరమ రహస్యమైన ఈ గీతా శాస్త్రాన్ని ఏకాగ్ర చిత్తంతో వింటున్నావా? ధనంజయా! నీ అజ్ఞాన జనితమైన అవివేకము నశించిందా? **72**

ఏ విషయాన్నైనా గ్రహించాలంటే ఏకాగ్ర చిత్తం చాలా ముఖ్యం. ఉపదేశించే వాడు ఎంత సమర్థుడైనా చెదిరిపోయిన మనస్సు ఆ ఉపదేశాల్ని గ్రహించలేదు. వినేవాడికి అటువంటి లాభం చేకూరాలని ఉపదేశించే వాడు ఆశిస్తాడు. ఏకాగ్ర చిత్తమే జ్ఞానానికి అనుకూలమైనది. జ్ఞాన ప్రకాశం, అజ్ఞానాంధకారం రెండూ ఒకటిగా కలసి ఉండలేవు. జ్ఞాన ప్రకాశంలో వస్తువులు యథావిధిగా కనిపిస్తాయి. అటువంటి నిర్మల చిత్తము అర్జునునికి వచ్చిందా? అని భగవానుడు ప్రశ్నిస్తున్నాడు.

అర్జునుడు : అచ్యుతా! నా అవివేకం తొలగిపోయింది. నీ దయ వలన నాకు జ్ఞానోదయం అయింది. నా సందేహాలన్నీ తొలగిపోయాయి. నేనిప్పుడు స్థిర చిత్తుడనై ఉన్నాను. నీ ఆజ్ఞ శిరసావహిస్తాను. **73**

ముందు అర్జునుడు యుద్ధం చెయ్యలేనని రథం నుండి క్రిందకు దిగి ధనస్సును క్రింద పడేశాడు. అటువంటి వాడు పరమాత్ముని ఉపదేశం విన్న తర్వాత శ్రీకృష్ణ పరమాత్ముని యెడల శరణాగతి పొందాడు. శ్రీకృష్ణునికి శిష్యుడయ్యాడు. ఇకపైన వెనుకంజ వెయ్యనని ప్రతిజ్ఞ చేస్తున్నాడు.

> *"కప్ప పిల్ల తోక మాయమైన తర్వాత అది నీళ్ళల్లోను, భూమి మీదా కూడా తిరుగగలదు. అజ్ఞానమనే తోక మనిషిలో నుండి మాయమైపోతే అతనికి ముక్తి కలుగుతుంది. అప్పుడతడు భగవంతుని యందు ప్రపంచమందు కూడా సుఖంగా జీవించగలడు."*
> - శ్రీరామకృష్ణ పరమహంస

సంజయుడు : ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధంగా వాసుదేవునికి మహాత్ముడైన అర్జునునికి జరిగిన సంవాదాన్నంతా నీకు చెప్పాను. వినేవారందరికీ ఒళ్ళు గగుర్పొడిచే ఈ సంభాషణము

అద్భుతమైనది. **74**

సామాన్యంగా హృదయం బాగా స్పందించినప్పుడు శరీరం పులకరిస్తుంది. మంచి చెడూ రెండింటికీ శరీరం పులకిస్తుంది. ఇక్కడ పలికినవాడు శ్రీకృష్ణుడు, విన్నవాడు అర్జునుడు, పలికించిన విషయం గీతాతత్త్వం. ఈ మూడు కలసినప్పుడు సంజయుని శరీరం పులకించడంలో ఆశ్చర్య మేముంటుంది? సంజయుడు అర్జునుని మహాత్ముడని సంబోధించాడు. అనగా వారి ప్రక్కవారంతా న్యాయంగా నడచుకునేవారని అర్థం.

వ్యాస భగవానుని అనుగ్రహం చేత, ఉత్కృష్టమైనదీ, అతిరహస్యమైనదీ అయిన ఈ యోగ శాస్త్రమును స్వయముగా అర్జునునికి చెప్పుచున్న యోగేశ్వరుడైన శ్రీకృష్ణుని వలన ప్రత్యక్షంగా నేను విన్నాను. **75**

సంజయునికి జ్ఞాన దృష్టిని కలిగించినవాడు వ్యాసభగవానుడు. అందువల్లనే శ్రీకృష్ణుని దివ్యదర్శనాన్ని, విశ్వరూపదర్శనాన్ని తిలకించేందుకు ఆయన చేసిన బోధనంతా యథాతథంగా సంజయుడు వినేందుకు సాధ్యపడింది. వరిపైరుకు పెట్టిన నీరు కలుపు మొక్కలకు కూడా పారునట్లు, తాను ఎంతటి భాగ్యశాలియో సంజయుడు చెప్తున్నాడు.

ధృతరాష్ట్ర మహారాజా! కృష్ణార్జునుల ఈ సంభాషణం పావనమైనది, ఆశ్చర్య కరమైనది. ఇందుమూలంగా నేను మాటిమాటికీ ఆనందాన్ననుభవిస్తున్నాను. **76**

ఓ మహారాజా! శ్రీహరి యొక్క అద్భుత రూపం తలచుకున్న కొద్దీ నాకు ఎంతో ఆశ్చర్యం కలుగుతోంది. ఆ విశ్వరూపమే నాకళ్ళ ముందు కదలాడుతోంది. **77**

యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారి అయిన అర్జునుడు ఎక్కడ ఉంటారో అక్కడల్లా సంపదలు, విజయము, ఐశ్వర్యము దృఢంగా ఉంటాయని నా అభిప్రాయం. **78**

> *"భగవద్భక్తి కలిగిన పరిశుద్ధమైన భక్తుల కోసమే భగవానుడు ప్రపంచమందు అవతారములను ధరించుచున్నాడు. అవతార పురుషులతో కలసి వచ్చే వారంతా నిత్యముక్తులవుతారు. లేదా అదే ఆఖరు జన్మ అయి ఉంటుంది."*
>
> *- శ్రీరామకృష్ణ పరమహంస*

భారత యుద్ధంలో శ్రీకృష్ణుని పాత్ర

గీతోపదేశం తర్వాత అర్జునుని ఆలోచనలలో గొప్ప మార్పు వచ్చింది. ఈ యుద్ధంలో తాను కర్తను కానని, భగవంతుడే సర్వమూ నడిపిస్తున్నాడనియు, తనతో పోరాడే వారంతా తమ కర్మలకు తగిన ఫలం అనుభవిస్తున్నారనియు, తాను నిమిత్తమాత్రుడనేనన్న స్థిర చిత్తం ఏర్పడింది. శ్రీకృష్ణ పరమాత్ముడెంతగానో సంతోషించాడు.

అర్జునుడు యుద్ధానికి సంసిద్ధుడై రథమెక్కి దేవదత్తాన్ని పూరించాడు. కౌరవ పాండవ సేనలన్నీ యుద్ధం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో అర్జునుని సింహనాదం వాళ్ళందరిలో ఉత్సాహాన్ని రేకెత్తించింది. ధర్మరాజు సోదరులు, శ్రీకృష్ణునితో కలసి నిరాయుధులై భీష్మ ద్రోణాదుల వద్దకు కాలినడకన పోయి వినయపూర్వకంగా నమస్కరించి యుద్ధం ప్రారంభించేందుకు అనుమతి తీసుకున్నారు. తిరిగివచ్చి తమ రథాలను అధిరోహించారు. యుద్ధం ప్రారంభమైంది. ఒక్కొక్కరు ఎదుటివాడిని చంపాలన్నదే పరమ ధ్యేయంగా సాగిందాయుద్ధం. భీష్ముడు తన పరాక్రమాన్ని పక్షపాతం లేకుండా ప్రదర్శిస్తున్నాడు. సాయంకాలానికి యుద్ధం ఆపేశారు. ఆ విధంగా మొదటిరోజు యుద్ధం ముగిసింది. యుద్ధవీరులంతా సాయంకాలపు నిత్య కర్మానుష్ఠానాలకు సిద్ధమయ్యారు.

ఆ రాత్రి ధర్మరాజు సోదరులందర్నీ వెంట బెట్టుకొని శ్రీకృష్ణుని శిబిరంలో సమావేశమయ్యారు. ధర్మరాజు చేతులు జోడించి "కృష్ణా! భీష్ముని ప్రతాపం తలచుకుంటే గుండె పగిలిపోతుంది. యముణ్ణి, అగ్నిని, కుబేరుణ్ణి, వాయు దేవుడినైనా గెలువవచ్చునేమోగాని, భీష్ముని మాత్రం గెలవడం సాధ్యం అయ్యేట్లులేదు. మన సైనికులు ఆయనపైకి వెళ్తూ అగ్నిపైకి దూకే శలభాల్లాగా మాడిపోతున్నారు. ఇంకా కొద్దిరోజుల పాటు ఈ భీష్ముడు ఇట్లాగే విజృంభిస్తే మన సైన్యంలో ఒక్కడు కూడా మిగిలేట్లు లేరు" అని తన బాధనంతా వెళ్ళబోసుకున్నాడు. ధర్మరాజు మాటల్ని విన్న శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "ధర్మనందనా! ఎందుకంతగా కలత చెందుతున్నావు. నిశ్చింతగా ఉండు. నీ తమ్ములు ముల్లోకాలనూ జయించగల సమర్థులు. ఇక నీ ప్రతాపాన్ని గూర్చి ప్రత్యేకంగా చెప్పాలా? మీరు కాకుండా ఇంకా ద్రుపదాదులెంతో మంది నీకై ప్రాణాలర్పించేందుకు సిద్ధంగా ఉన్నారు. నువ్వు నిశ్చింతగా ఉండు" అని నచ్చ చెప్పాడు.

రెండవనాడు యుద్ధం ప్రారంభమయింది. అర్జునుడు భీష్ముని ఎదిరించాడు. భీముడు మొదలైన వీరులంతా వీరోచితంగా పోరాడి ధర్మరాజును సంతోషపెట్టారు. ద్రోణాచార్యులు దృష్టద్యుమ్నుని ఎదుర్కొన్నాడు. ద్రోణాచార్యుని బ్రహ్మతేజస్సు దృష్టద్యుమ్నుని కలవర పెట్టింది. ఎవరెవరి కర్మల ననుసరించి మరణించాల్సి ఉందో వారంతా మరణించారు. ఇంతలో సూర్యాస్తమయం అయింది. ఎవరి శిబిరాలకు వాళ్ళుపోయి నిత్యకర్మానుష్ఠానములో నిమగ్నులయ్యారు.

మూడవనాడు యుద్ధం పోటాపోటీగా సాగుతోంది. దుర్యోధనుడు తగుదునమ్మా అంటూ భీముడిపై తలపడ్డాడు. భీముని గదా ప్రహారానికి మూర్ఛపోయాడు. నెమ్మదిగా తేరుకొని భీష్ముని

వద్దకు పోయి "కురుపితామహా! పాండవులీవిధంగా పరాక్రమం చూపిస్తూ ఉంటే అది మీ మర్యాదకు భంగం అని భావించడంలేదా? మీరు పాండవులపైన దయ చూపడం వల్లనే వాళ్ళు విజృంభిస్తున్నారు. మీరే నిజంగా మీ తేజస్సును ప్రదర్శిస్తే పాండవసేనలు నిలబడగలవా? నేను మిమ్మల్నే నమ్ముకొని కర్ణుని కూడా కాదన్నాను. ఇకనైనా విజృంభించండి" అని కఠినంగా మాట్లాడాడు. భీష్ముడాతని మాటలకు చిరునవ్వు నవ్వుతూ "కుమారా! ఇంద్రుడే దిగివచ్చినా పాండవుల్ని జయించలేరని చిలక్కు చెప్పినట్లు చెప్పాను. నువ్వు నామాటలు వినలేదు. కోరి ఈ యుద్ధాన్ని ఆహ్వానించావు. అది అట్లా ఉండనివ్వు. నేను పండుముసలి వాడినే అయినా పాండవులకు ఏవిధంగా గుణపాఠం చెప్తానో చూస్తూ ఉండు" అని నచ్చ జెప్పి దుర్యోధనుని పంపి, తిరిగి యుద్ధానికి ఉపక్రమించాడు. గాంగేయుడు కౌంతేయులకు తన ప్రతాపాన్ని చూపాలనుకున్నాడు. అదే సమయంలో ఇటు కౌరవులకు కూడా తన కృతజ్ఞత తెలిపినట్లవుతుందని భావించాడు. భీష్ముడా విధంగా పేట్రేగి పోతుంటే అతడి ముందు ఒక్కరైనా నిలబడలేక పోతున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునునితో "అర్జునా! ఇంతవరకు ఎన్నో సార్లు ప్రగల్భాలు పలికావు. ఇప్పుడు నీ ప్రతాపాన్ని ప్రదర్శించే సమయం వచ్చింది. కావున ఇక క్షణమైనా ఆలోచించకుండా భీష్మునిపై నీ ప్రతాపాన్ని చూపు" అని ప్రేరేపించాడు.

శ్రీకృష్ణుడు భీష్ముని రథం వైపు వెళ్ళుట

అర్జునుడు రథాన్ని భీష్ముని వైపు నడిపించమని శ్రీకృష్ణునితో చెప్పాడు. అర్జునుడు తన వైపు రావడం భీష్ముడు చూశాడు. విజయుడి మనస్సులో ఆలోచన పసిగట్టి తానే ముందుగా సింహనాదం చేశాడు. భీష్ముని సింహనాదానికి ప్రతిగా అర్జునుడు కూడా సింహనాదం చేసి పోరు సాగించాడు. మిగిలిన వారంతా కొద్దిసేపు యుద్ధాన్నాపి వారిద్దరి పోరును వేడుకగా చూడసాగారు. వారి పోరులో హెచ్చుతగ్గులను చూడలేకపోయారు. ఒక సమయంలో అర్జునుడు భీష్మునిముందు నిలువలేకపోయాడు. అర్జునుడు భీకరంగా ప్రయోగించే బాణాలన్నీ భీష్మునికి నువ్వు గింజల్లా వచ్చి తగులుతున్నాయి. భీష్ముడు తన బాణాలకు పదును పెంచాడు. ఆ పదునైన బాణాలు శ్రీకృష్ణుని శరీరాన్ని తాకి నెత్తురు కారింది. తన్ను తాను రక్షించుకోవడం చేతకాని అర్జునుడు శ్రీకృష్ణుని రక్షంచలేకపోతున్నాడని అర్థమైపోయింది. శ్రీకృష్ణుడు విషయం చెయ్యి దాటిపోతుందని గ్రహించి, భీష్ముణ్ణి కట్టడి చెయ్యాలని అనుకున్నాడు. సోదరుడైన సాత్యకితో "సోదరా! ప్రాణాలకు భయపడి పారిపోయే వాళ్ళను పోనివ్వు. నేనే ఈ భీష్ముని ప్రతాపాన్ని అణచి ధర్మరాజును పట్టాభిషక్తుని చేస్తాను. చూడు" అంటూ సాత్యకిని వారించి చక్రాయుధాన్ని స్మరించాడు.

శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని స్మరించగానే వచ్చి దక్షిణ హస్తాన్ని అలంకరించింది. వెంటనే రథం పైనుండి దూకి, మదపుటేనుగుపై లంఘించిన కొదమసింహమువలె, భీష్మునివైపు పరుగెత్తాడు.

చక్రాన్ని ధరించి భీష్మునిపైకి పరుగెత్తుతున్న శ్రీకృష్ణుని భీకరాకారం చూసి భూతాలన్నీ భీతి

చెందాయి. అయిపోయింది. భీష్ముడు మరణించాడనే అంతా అనుకున్నారు. కానీ పరమ భక్తుడు, సకల శాస్త్రవేత్త, జ్ఞాననిధి అయిన గాంగేయుడు భయపడ్డాడా? చిరునవ్వులు చిందించాడు. భీష్ముని ముఖంలో భక్తి శూరధర్మం రెండూ ఒకే సమయంలో కనిపించాయి. "ఓ జగన్నాథా! జనార్ధనా! నన్ను నీ పాదారవిందాలకు నమస్కరించనీ. నన్నీ యుద్ధంలోనే చంపు. నీ చేతిలో చచ్చే భాగ్యాన్ని నాకు కలిగించి ముక్తిని ప్రసాదించు. త్వరగా రమ్ము" అని అర్థించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు "గంగానందనా! నువ్వు ధర్మ మార్గాన్ని వదలిపెట్టావు. లోక కంటకుడైన దుర్యోధనుని నిలబెట్టాలని చూస్తున్నావు. రాజు అధర్మ మార్గాన పోతుంటే బుద్ధిమంతులైన మంత్రులతణ్ణి వారించవద్దా?" అన్నాడు. అందుకు భీష్మ పితామహుడు "దేవా! దుర్యోధనుడు కులనాశనానికే కంకణం కట్టుకున్నాడు. మంచి బోధించినా వినడు. పూర్వం యాదవులు కూడా కంసునికి హితం చెప్పి చెప్పి విసిగిపోయి వదలిపెట్టి వెళ్ళిపోయారు. చేటుకాలం దగ్గర పడ్డవాళ్ళు మేలుకోరే వారి మాటలు వినరు. అంతా అయిపోయిన తర్వాత దుఃఖిస్తారు. నీకు తెలియని విషయాలేముంటాయి" అని అంటూ ఉండగా అర్జునుడు వచ్చి శ్రీకృష్ణుని తీసుకొని వెళ్ళాడు.

మహాశయులారా! శ్రీకృష్ణుడు ఆయుధం పట్టనని ముందే ప్రతిజ్ఞ చేశాడు. ఇప్పుడు ఆయుధాన్ని ధరించడం అసత్యమే కదా? అని అడిగేవాళ్లుంటారు. కానీ, శ్రీకృష్ణుని ఆంతర్యమేమిటో తెలుసుకుంటే అతడు అసత్యమాడాడని ఎవరూ అనరు. పరమభక్తుడైన భీష్మునికి యుద్ధరంగంలో తన నిజరూపంలో దర్శనమిచ్చాడని తెలుసుకోవాలి. సాత్యకి మొదలైన వారందరికీ శ్రీకృష్ణుడు రథసారధిగనే కనిపించాడు. చక్రాయుధం వచ్చి శ్రీకృష్ణుని దక్షిణ హస్తాన్ని అలంకరించగానే, ఒక్క భీష్మునికి మాత్రమే చతుర్భుజాలతో పీతాంబరధారియై దర్శనమిచ్చాడు. అందువల్లనే గాంగేయుడు "చాపఖడ్గ గదాపాణీ" అని సంబోధించాడు. చక్రంతో మెరిసిపోతున్న భగవద్రూపం చేతిలో మరణించడం కన్నా గొప్ప శ్రేయస్సు ఏముంటుందని ప్రశ్నించాడు. భీష్ముడు ఎంతమాత్రం భయపడలేదు. చలించలేదు. తన ప్రతాపాన్ని చూసి తన్ను ప్రశంసించడానికే వచ్చాడని అనుకున్నాడు. మహాత్మా! రమ్ము, రమ్ము అని అనడమే కాకుండా, జగన్నివాసా రమ్మని ఆహ్వానించడం చేత భీష్ముడు పరమాత్ముని విశ్వరూపాన్నే దర్శించాడని తెలుస్తోంది. మేమందరం నీవారమేనంటాడు. అంటే అర్థం ఏమిటి? మేమంతా నీలో ఉండేవారమేనని. అనగా నాయందు, అర్జునుని యందు కూడా నీకు సమభావమేననియు పక్షపాతానికి తావేలేదని తేటతెల్లమవుతోంది. నిజంగానే భీష్ముణ్ణి చంపడానికే చక్రాయుధన్ని ధరించి ఉంటే రథం పైనుండే చక్రాన్ని ప్రయోగించి ఉండేవాడు. కానీ భక్తుణ్ణి కరుణించడానికే నిజస్వరూపంలో దగ్గరకు వెళ్ళి విశ్వరూపదర్శనాన్ని కల్పించాడు. అర్జునుని ప్రార్థనను మన్నించి తిరిగి రథసారధ్యం వహించాడు. అర్జునుడు ఆగ్నేయాస్త్రాన్ని సంధించి శత్రుసేనలన్నింటినీ భయభ్రాంతుల్ని చేశాడు.

నాలుగవ రోజున మళ్ళీయుద్ధం ప్రారంభమయింది. ఆరోజు భీముడు, సాత్యకి, అభిమన్యుడు వారి ప్రతాపాలను ప్రదర్శించారు. కౌరవసేనలు వారి ధాటికి నిలువ లేకపోయాయి. ఆరోజు రాత్రి దుర్యోధనుడు భీష్ముని శిబిరానికిపోయి జరిగిన నష్టానికి, అవమానానికి వేదన చెందాడు. భీష్ముడతణ్ణి

మందలిస్తూ నరనారాయణుల మాహాత్మ్యం తెలుసుకోలేక మాట్లాడుతున్నావని మందలించి పంపేశాడు. ద్రోణాది శూరులంతా మహోగ్రంగా తమ శౌర్యాన్ని ప్రదర్శించారు. అట్లాగే ఆరవ దినం, ఏడవదినం కూడా యుద్ధం భీకరంగా సాగింది. దుర్యోధనుడు తన పక్షాన శూరులు అనేక మంది మరణించడంతో భీష్ముని తప్పుపట్టాడు. నిందించాడు. అందుకు భీష్ముడు "దుర్యోధనా! వారిని కృష్ణార్జునులుగా చూడకు. వారే నరనారాయణులని తెలుసుకో. నీలోని రుగ్మతలన్నీ తొలగిపోతాయి" అని హితబోధ చేసి పంపేశాడు. తొమ్మిదవ రోజున అభిమన్యుడు పరాక్రమించాడు. ద్రోణాచార్యులు అర్జునునితో తలపడ్డారు. ఇద్దరూ సమఉజ్జీలయ్యారు. ఎవరి పక్షాన గెలుపు ఓటములు లేకుండా గడచిపోయింది. దుర్యోధనుని మనస్సుకు ఆనందం కలిగించాలని భీష్ముడానాడు చెలరేగి యుద్ధం చేశాడు. పాండవసేనలు నిలువలేక చెల్లాచెదరయ్యాయి. శ్రీకృష్ణుడు రథాన్ని ఆపి అర్జునునితో "అర్జునా! బయట గొప్పలు చెప్పుకుంటే సరిపోదు. నీ సామర్థ్యాన్ని రణరంగంలో చూపాలి. చూడు భీష్ముని ప్రతాపం ముందు నీ సేనలు ఎట్లా చెల్లా చెదరైపోతున్నాయో" అన్నాడు. అందుకు అర్జునుడు సిగ్గుపడుతూ "కృష్ణా! రథం ముందుకు నడుపు. రాజ్యం సాధించడమో, లేక వీరమరణాన్ని పొందటమో ఈరోజే తేల్చుకుంటాను. నీమాటే నాకు వేదం. రథాన్ని పోనివ్వు భీష్మునితో సహా శత్రువులందర్నీ సంహరిస్తాను" అన్నాడు.

శ్రీకృష్ణుడు అర్జునుని మనోభావం తెలుసుకొని భీష్మునివైపుగా రథాన్ని నడిపాడు. భీష్ముడు అర్జునుని పై పదునైన బాణాలతో కప్పేశాడు. శ్రీకృష్ణుడు ఎంతో చాకచక్యంతో ఆ బాణాలబారిన పడకుండా రథాన్ని నడుపుతున్నాడు. అర్జునుడు ఎంత పరాక్రమాన్ని ప్రదర్శించినా అది భీష్ముని ముందు దిగతుడుపే అవుతోంది. అప్పటికే సూర్యాస్తమయం అయింది. ఎవరి శిబిరాలకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఆరాత్రి ధర్మరాజు సోదరులతో కలసి శ్రీకృష్ణుని శిబిరంలో కలుసుకొని, "కృష్ణా! భీష్ముని పరాక్రమం రోజురోజుకు వృద్ధి చెందుతోందే గాని తరగడంలేదు. ఆయన ప్రళయాగ్నిలా ప్రజ్వరిల్లుతూ ఉంటే మనసేనలన్నీ శలభాల్లాగా మాడిపోతున్నారు. ఈవిధంగా అందర్నీ చంపుకోవడం కన్నా యుద్ధాన్ని నిలిపేసి అరణ్యవాసానికి పోవడమే మేలనిపిస్తోంది" అన్నాడు. అందుకు శ్రీకృష్ణుడు "ధర్మనందనా! పూర్వం నువ్వు భీష్ముని కలిసినప్పుడు ఆ మహాత్ముడు నీతో ఏమన్నాడో గుర్తు తెచ్చుకో" అన్నాడు. అందుకు ధర్మరాజు "కృష్ణా! పూర్వం నేను కురుపితామహుణ్ణి కలసినప్పుడు 'ధర్మరాజా! నేను దుర్యోధనుని పక్షాన యుద్ధం చెయ్యక తప్పదు. అయితే విజయం మాత్రం నిన్నే వరిస్తుంది. సమయం వచ్చినప్పుడు నన్ను కలుసుకో. నీకు న్యాయం జరిగేట్లు చూస్తాను. ఇప్పటికింతే. వెళ్ళిరా' అని సాగనంపాడని" తెలిపాడు. అందుకు శ్రీకృష్ణుడు "కౌంతేయాగ్రజా! నీ సమయస్ఫూర్తి ఎంతైనా మెచ్చదగింది. దేవవ్రతుని యుద్ధంలో ఓడించడం ఎవరితరమూ కాదని తేలిపోయింది. ఆయన మరణ రహస్యమేదో ఆయనకు తప్ప మరెవ్వరికీ తెలిసిఉండదు. అందువల్ల, నిన్ను సరయిన సమయంలో కలుసుకోమనడంలో ఏదో పెద్ద రహస్యమే ఉండిఉంటుంది. ఇప్పుడా సరయిన సమయం రానేవచ్చిందని తెలుసుకో. నువ్వూ, నీ తమ్ములు కలసి ఆయన్ను శరణు వేడుకోవటమొక్కటే మార్గంగా కనిపిస్తోంది. ఇక ఆలశ్యం చెయ్యకుండా వెళ్ళి కలుసుకొమ్మని" సలహా ఇచ్చాడు.

అంతట ధర్మరాజు శ్రీకృష్ణుని, తమ్ములను వెంట బెట్టుకొని భీష్మపితామహుని కలుసుకొని పాదాలకు నమస్కరించి శరణు కోరారు. అందుకా భీష్ముడు "వత్సా! నీ మనస్సులోని కోరిక తప్పక నెరవేరుతుంది. నా చేతిలో అస్త్రం ఉన్నంత వరకూ నన్ను ఎవరూ జయించలేరు. నేను అస్త్ర సన్యాసం చేస్తే నన్ను ఎవరైనా పడగొట్టగలరు. నేను స్త్రీపుర్వునితో యుద్ధం చెయ్యను. ఇది నా ప్రతిజ్ఞ. ఇది అందరూ ఎరిగినదే. అటువంటి శిఖండి ఇప్పుడు మీ అధీనంలోనే ఉన్నాడు. యుద్ధంలో నాకు అతడు ఎదురుపడితే నేను అస్త్ర సన్యాసం చేస్తాను. అతడు నాపై అస్త్రప్రయోగం చేసినా నేను అతడిపై బాణం సంధించను. ఆవిధంగా నన్నతడు పడగొట్టగలడు. కావున విజయం మీకే దక్కుతుంది" అని సలహా చెప్పాడు. వారంతా పితామహునికి మరొకసారి నమస్కరించి వారి వారి శిబిరాలకు వెళ్ళిపోయారు.

పదవనాటి యుద్ధం

పదవనాడు కూడా మిగిలిన రోజుల్లాగే యుద్ధం ప్రారంభమయింది. అంతా వారి ప్రతాపాలను చూపుతున్నారు. అర్జునుడు మాత్రం తన రథంపై శిఖండి నుంచుకొని అతడి వెనుక నుండి బాణవర్షాన్ని భీష్మునిపై కురిపించాడు. శిఖండి అడ్డుగా ఉండటం వలన భీష్ముడు తిరిగి బాణప్రయోగం చెయ్యలేదు. అర్జునుడు వేసిన పదునైన బాణాలతో భీష్ముడు పడిపోయాడు. అర్జునుడు వదిలిన బాణాలపైనే శయనించాడు. భీష్ముడు పడిపోయాడన్న వార్త రణరంగాన్నంతా కుదిపేసింది. అంతా ఆ కురు పితామహుణ్ని చూడటానికి వచ్చారు. అలా వచ్చిన వారిలో కర్ణుడున్నాడు. పితామహుడు కర్ణుడితో నీవు పాండుపుత్రుడవేనని తెలిపాడు. కర్ణుడు కూడా తనకు నరునిచేతిలో మరణం రాసి ఉన్నదని అంగీకరించాడు. అయినా నేను నాకర్తవ్యాన్ని విస్మరించనన్నాడు.

భీష్ముడు తన కర్తవ్యాన్ని నిర్వర్తించి భగవదాజ్ఞననుసరించి నేలపైనో, శయ్యపైనో పడుకోకుండా శరీరాన్ని బాణాలపైనే పడిఉండేట్లు చేసుకున్నాడు. బాణాలపైన పడిఉంటే శరీరానికి బాధగా ఉండదా? అని అడిగేవాళ్ళుండవచ్చు. శరీరానికి కలిగే కష్టసుఖాలన్నీ మనస్సు పైనే ఆధారపడి ఉంటాయి. ఇష్టమైన కార్యం చెయ్యడానికి గాని, కష్టమైన పని చెయ్యకుండా ఉండటానికి గాని శరీరానికి స్వతంత్రం ఉండదు. కావున భీష్ముడు శరీరాన్ని శరతల్పముపై (బాణాలపై) ఉంచి మనస్సు మాత్రం శ్రీకృష్ణుని పాదాలపై నిలిపినప్పుడు ఆ మహానుభావునకు కావలసిందేముంటుంది? అనగా మనస్సు భగవంతుని యందు ఐక్యమైనప్పుడీ లోక సంబంధమైన విషయాలేవీ బాధించవని భావం.

ఆనాటి రాత్రి కౌరవులు అంతా దుఃఖసముద్రంలో మునిగిపోయారు. భీష్ముని స్థానంలో ద్రోణాచార్యుల వారు సేనాధిపతిగా నియమితులయ్యారు. ద్రోణుడు జన్మచేత బ్రాహ్మణుడు. (స్వజాతి జీవనం సాగనప్పుడు ఇతర జాతి వృత్తివలన జీవనం సాగించవచ్చని మనుస్మృతి 10వ అధ్యాయం 50-52 తెలుపుతోంది) కావున ద్రోణాచార్యుడు క్షత్రియ వృత్తిని ఆశ్రయించాడు. అశ్వత్థామ కూడా ఇదే రీతిన క్షత్రియ వృత్తిని ఆశ్రయించాడు. ఆ విధంగా వారు క్షత్రియోపాధ్యాయులయ్యారు. కావున ద్రోణాచార్యుని సర్వసేనాధిపతిని చెయ్యగానే ధర్మరాజును పట్టి నీకు సమర్పిస్తానని దుర్యోధనునికి

ప్రతిజ్ఞ చేశాడు. ద్రోణుని ప్రతిజ్ఞ విన్న పాండవులంతా కలవరం చెందారు. వారంతా ధర్మరాజును కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ద్రోణుడావిధంగా ఐదు రోజుల పాటు యుద్ధం చేశాడు. మొదటి రెండు రోజులూ విజృంభించి యుద్ధం చేసి పాండవ పక్షాన అనేక మంది వీరుల్ని హతమార్చాడు.

భగదత్తునితో పోరాటం

భీముడు దుర్యోధనుడు తమ ప్రాణాలనే పణంగా పెట్టి యుద్ధం చేస్తున్నారు. ఆ యుద్ధంలో దుర్యోధనుడి బలం క్షీణించడం భగదత్తుడు గ్రహించాడు. ఏదోవిధంగా తన ప్రభువైన దుర్యోధనుని కాపాడుకోవాలని అతడివద్ద 'సుప్రదీక' మనే మదపుటేనుగును భీమునిపై ఉసిగొలిపాడు. ఆ సుప్రతీకం భీమునిపై విజృంభించింది. భీముని మట్టుపెట్టేటంతలో భీమసేనుడు దానినుండి తప్పించుకున్నాడు. సాత్యకి, అభిమన్యుడు మొదలైన వారందరూ ఆ సుప్రతీకాన్నెదుర్కొనేందుకు అనేక రీతులలో ప్రయత్నించాడు. కానీ ఎవరూ దాన్ని అణచలేకపోయారు. శ్రీకృష్ణుడు ఆ ఏనుగువలన చావ వలసిన వాళ్ళంతా చచ్చేవరకూ నిరీక్షించాడు. దాని కాలం దగ్గరపడగానే అర్జునుని దృష్టి ఆవైపు పడేట్లుగా చేశాడు. తన వారంతా భయంతో పరుగులు పెట్టడం చూశాడు. అప్పుడు "కృష్ణా! ఇదేమిటి మనసేనలన్నీ పారిపోతున్నాయి. ఏంజరిగింది? ఎవర్ని చూసి భయపడి వీరంతా పరుగులు తీస్తున్నారు. రథాన్ని ఆ ప్రక్కకు తీసుకొనిపో" అన్నాడు. శ్రీకృష్ణుడు రథాన్ని తీసుకొని పోయి భగదత్తుని ముందు నిలిపాడు. వారిరువురి మధ్య పోరు భీకరంగా సాగింది. చివరకు భగదత్తుడు తనవద్దనున్న వైష్ణవాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రం అస్త్రాలన్నింట్లోకీ భయంకరమైనది. దానిని ఎదుర్కొనడానికి గాని, త్రిప్పి కొట్టగల మరో ఆయధంగాని అర్జునుని వద్దలేదు. ఆ వైష్ణవాస్త్రమేగనుక అర్జునుని తాకడం జరిగితే అతడు మరణించడం తథ్యం. ఆవిషయం అర్జునునికి తెలియదు. ఆ అస్త్రం తన ప్రభావమేనని శ్రీకృష్ణునికి తెలుసు. అందువల్ల అర్జునుని మరుగుపరుస్తూ నిలబడి ఆ వైష్ణవాస్త్రాన్ని స్వీకరించాడు. ఆ అస్త్రం శ్రీకృష్ణుని తాకగానే అది ఒక పూలమాలగా మారి శ్రీకృష్ణుని మెడలో అలంకరించబడింది. ఈ విషయం తెలియని అర్జునుడు శ్రీకృష్ణునితో "కృష్ణా! నువ్వు చెప్పినమాటను అప్పుడప్పుడూ తప్పుతున్నావు. నీకిది అపఖ్యాతి తెచ్చి పెట్టదా?" అని ఆవేదనతో అన్నాడు. అయితే అర్జునుడా సమయంలో "నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్" అన్న గీతా ఉపదేశాన్ని మరచాడు. మాయా ప్రభావం చేత తానే కర్తనని భావిస్తున్నాడు. అంతటితో ఊరుకోకుండా "కృష్ణా! నా శక్తి నీకు తెలియదా? నేను ధనుస్సు చేత పట్టుకొని నిలబడితే ముల్లోకాలు నాముందు నిలబడలేవన్న యథార్థం నువ్వెరుగవా?" అన్నాడు. అర్జునుని మాటలకు శ్రీకృష్ణుడు నవ్వుకున్నాడు. "అర్జునా! నీకో రహస్యం చెప్తాను విను. లోకసంరక్షణ కోసం నేను నాలుగు రూపాలతో అవతరించాను. అందులో ఒక రూపం భూలోకంలో తపస్సు చేస్తూ ఉంటుంది. రెండో రూపం ప్రాణుల మంచిచెడుల్ని కనిపెట్టి ఉంటుంది. మూడవ మూర్తి మనుష్యులు చేయదగిన కార్యాలేమిటో, చేయదగని కార్యాలేమిటో ఉపదేశిస్తుంది. ఇక నాలుగవది యోగనిద్రలో వెయ్యి దివ్య సంవత్సరాలు గడుపుతుంది. నేను యోగనిద్ర నుండి మేల్కొన్నప్పుడు

భూదేవి నా వద్దకు వచ్చి సురాసురులను జయించగల పుత్రుని ప్రసాదించమంది. అప్పుడు నరకాసురుని రక్షణకై ఈ వైష్ణవాస్త్రాన్నిచ్చాను. ఆ వైష్ణవాస్త్రం వలన నరకాసురుడు అజేయుడై జీవించాడు. ఆతడి తర్వాత ఆ అస్త్రాన్ని భగదత్తునికి ఉపదేశించాడు. భగదత్తుడిప్పుడా వైష్ణవాస్త్రాన్ని నీపై ప్రయోగించాడు. అది నీకు తగిలి ఉంటే నువ్వు జీవించి ఉండేవాడవుకావు. నేనా రహస్యాన్ని తెలిసిన వాడిని కాబట్టి నీకు అడ్డుగా నిలచి నిన్ను కాపాడుకున్నాను. అంతేగాని నీ ప్రతాపాన్ని చిన్నబుచ్చడానికి కాదు. ఈ వైష్ణవాస్త్రాన్ని రెండవసారి ప్రయోగించినా అది ఫలించదు. కావున ఇప్పుడు ఈ భగదత్తుని సంహరించు" అన్నాడు. అంతట అర్జునుడు భక్తి ప్రపత్తులతో శ్రీకృష్ణునికి నమస్కరించి భగదత్తుని మదపుటేనుగును సంహరించాడు.

అభిమన్యుని వధ

ద్రోణాచార్యుడు ధర్మరాజును పట్టి ఇస్తానని దుర్యోధనునికి వాగ్దానం చేశాడు. ఆ వాగ్దానాన్ని ఎంత త్వరగా నెరవేర్చాలా అని ఆలోచించి, ఆ రోజున పద్మవ్యూహాన్ని రచించాడు. ఈ పద్మవ్యూహం కేవలం ధర్మరాజును బంధించేందుకు చేసిన ఏర్పాటే. ఆ ఏర్పాటులో భాగంగా కొందరు అర్జునుని ప్రేరేపించి యుద్ధానికి పద్మవ్యూహానికి దూరంగా తీసుకొనిపోయారు. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు. జరుగబోయేదేమిటో ఎరుగు. అయినా అర్జునుడు దూరంగా పోవాల్సి వచ్చినా, అందుకతడేమీ అడ్డుచెప్పలేదు. ఇక ద్రోణాచార్యుల కార్యం సులువైంది. ఆ వ్యూహ కర్త ద్రోణాచార్యుడు. చివరగా అతణ్ణే ఎదుర్కోవాలి. అతణ్ణి ఓడించే యోధుడు పాండవులలో ఎవరూ లేరు. ధర్మరాజును ద్రోణుని ముందు వదలడానికి వారిష్టపడలేదు. అట్లా అని యుద్ధానికి ఎవరూ లేరంటే అంతకన్నా అవమానం మరొకటి ఉండదు. ఇక ధర్మరాజును తప్పిస్తే మిగిలిందల్లా అభిమన్యుడొక్కడే. అతడికీ వ్యూహంలో ప్రవేశించడమే తెలుసుగాని, అందులో నుండి బయటపడే మార్గాలతడికి తెలియదు. కావున విధిలేక అభిమన్యునే ద్రోణుడు పన్నిన పద్మవ్యూహంలోకి ప్రవేశపెట్టారు. అతడితో పాటు అనేక మంది వీరులు ప్రవేశించే ప్రయత్నం చేశారు. కానీ కృపాచార్యుని వంటి వీరులు వారందర్నీ అడ్డుకున్నారు. చివరకు అభిమన్యుడొక్కడే ప్రవేశించి కర్ణుని వంటి వీరాధివీరులతో పోరాడాడు. ఎవ్వరూ అతని ముందు నిలువలేకపోయారు.

ఆ సమయంలో అభిమన్యునితో పాటు సాత్యకి, మిగిలిన పాండవులంతా కూడా పద్మవ్యూహంలో ప్రవేశించే ప్రయత్నం చేశారు. కానీ సైంధవుడు మొదలైన వారు వారి ప్రవేశాన్ని నిరోధించి యుద్ధాన్ని మరోవైపుకు మరల్చారు. సైంధవునికి పాండవుల్ని ఎదిరించేటంతటి బలపరాక్రమాలు లేకపోయినా, అభిమన్యునికి సహాయపడకుండా అడ్డుకోగలిగాడు. ఆ విధంగా పాండవులనుండి ఎటువంటి సహాయం అందకపోవడం వలన అభిమన్యుడొక్కడే వ్యూహంలో చిక్కుకొని మరణించాడు. అభిమన్యుని మరణవార్త కౌరవుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. అభిమన్యుని మరణం పాండవులందర్నీ క్రుంగదీసింది. ధర్మరాజు దుఃఖానికి అంతేలేదు. ధర్మరాజును ఓదార్చేందుకు వేదవ్యాసుడే స్వయంగా వచ్చాడు. ఆ కారణం చేత వ్యాసుడు పాండవ పక్షపాతి అని చాలామంది వ్యాసుని తూలనాడారు. నిజానికి

వ్యాసుడు ధర్మ పక్షపాతి అనడం సబబుగా ఉంటుంది.

అంతట అర్జునుడు తన్నెదిరించిన వారిలో చంపదగినవారు చావగా మిగిలిన వారు పారిపోయారు. అంతట అతడి దృష్టి తనవారిపై పడింది. వాళ్ళను చూడగానే వారి ముఖాలన్నీ దుఃఖం చేత కళతప్పి ఉన్నాయి. వారిని చూస్తున్న అర్జునుడు శ్రీకృష్ణునితో "కృష్ణా! ఇక్కడ వీళ్ళందర్నీ చూస్తూంటే జరగరానిదేదో జరిగినట్లు నా మనస్సు శంకిస్తోంది" అన్నాడు. ఆమాటలు విన్న శ్రీకృష్ణుడు ఏమీ ఎరుగనివాడిలా ముఖం పెట్టి రథాన్ని ధర్మరాజు ముందు నిలబెట్టాడు. ధర్మరాజుకు అర్జునుణ్ణి చూడగానే దుఃఖం అధికమైంది. అర్జునునికి జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. దీనికంతకూ ఆ సైంధవుడే కారణమని చెప్పాడు. మమ్మల్నెవర్నీ అభిమన్యునితో కలసి ప్రవేశించకుండా అడ్డుకున్నాడని చెప్పాడు. ఈ మాటలు వినగానే క్రోధావేశంతో ఒళ్ళుమరచి అంతా వింటుండగా "ఆ సైంధవుణ్ణి రేపు సూర్యుడస్తమించేలోపుగా సంహరిస్తానని, అట్లా చెయ్యలేకపోతే అస్త్రసన్యాసం చేసి అడవులకు పోతా" నని శపథం చేశాడు. అర్జునుని ప్రతిజ్ఞతో అంతా సైంధవుని వెదకి పట్టుకోవడానికి బయలుదేరారు. కౌరవ గూఢచారుల వలన అర్జునుని ప్రతిజ్ఞను సైంధవుడు తెలుసుకున్నాడు. అర్జునుడు ప్రతిజ్ఞ వ్యర్థంకాదు. కోరి అర్జునుని కోపానికి గురికావలసి వచ్చిందే అని విచారించి, మర్నాడు పగలంతా తాను యుద్ధరంగంలో కనిపించకుండా ఉండటం మేలని భావించాడు. దుర్యోధనుని వద్దకు పోయి సెలవడిగాడు. సైంధవుని మాటలు విన్న దుర్యోధనుడు "ఓ సింధురాజా! ఎందుకట్లా పిరికి మాటలు మాట్లాడుతావు? రాజధర్మాలు చక్కగా తెలిసినవాడవు. కర్ణ ద్రోణాది మహావీరులెందరో నిన్ను రక్షిస్తూ ఉంటే నీవంక చూసేందుకైనా ఎవరికీ ధైర్యముండదు. కావున భయం వదలిపెట్టు" అని అభయమిచ్చాడు. దుర్యోధనుని మాటలతో మనోధైర్యాన్ని పుంజుకున్నాడు. వెంటనే సైంధవుణ్ణి వెంటబెట్టుకొని ద్రోణాచార్యుల వద్దకు పోయి జరిగిందంతా చెప్పాడు. ఆమాటలు విన్న ద్రోణాచార్యులు "ఓ సింధురాజా! మేమిద్దరమూ ధనుర్విద్యలో దిట్టలమే. కానీ అర్జునుడు ఎన్నో కష్టాలకు ఓర్చుకొని తపస్సు చేసి ఎన్నో దివ్యాస్త్రాల్ని సంపాదించాడు. అయినా నువ్వు భయపడటానికేమీ లేదు. నేను నీకు అభయం ఇస్తున్నాను. రేపటి యుద్ధం అతి భీకరంగా ఉంటుంది. రేపు అర్జునుడు ఛేదించలేని వ్యూహాన్ని నీకోసం పన్నుతాను. ధర్మమార్గాన్ని విడువకుండా సదాచారములను పాటిస్తూ నిర్భయుడవై ఉండు. సైంధవా! వేదశాస్త్రాలను అభ్యసించి, యజ్ఞయాగాలు చేసి, లోకాచారాలన్నీ పాటిస్తూ గొప్ప కీర్తి సాధించావు. అట్టి నీవు చావుకు భయపడవచ్చునా? లోకంలో ఉండే భోగాలన్నీ అనుభవించేశావుగదా? పుట్టిన ప్రతిప్రాణి గిట్టకమానదు. ఈ కౌరవులు, పాండవులు, యాదవులు, నువ్వూ, నేనూ అందరం పరలోకానికి పోయేందుకు సిద్ధంగా ఉన్నవారమే. ఇప్పుడు నేను చెప్పినవన్నీ నీకు తెలిసినవే కాని క్రొత్తవేమీ కాదు. భయపడకు. సుఖంగా ఉండు" అని సైంధవుడికి ధైర్యం చెప్పి పంపాడు.

ఆ రాత్రి కృష్ణార్జునులు ఆ ప్రతిజ్ఞ ఆచరించే విధి విధానాలను గూర్చి ఆలోచించారు. సుభద్రను ఊరడించి శ్రీకృష్ణుడు తన శిబిరానికి చేరుకున్నాడు. అర్జునుడు ప్రతిజ్ఞను ఎట్లా నెరవేర్చటమా అని

తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. భగవత్సహాయం లేకుండా తానా ప్రతిజ్ఞను నెరవేర్చలేనని తీర్మానించుకున్నాడు. భగవంతుడైన శ్రీకృష్ణుడు కూడా సమయంకోసం ఎదురు చూస్తున్నాడు.

శ్రీకృష్ణార్జునులు స్వప్నంలో కైలాసానికి వెళ్ళుట

అర్జునుడు ఈవిధంగా ఆలోచిస్తూ ఉండగా కంటిపై కునుకు పట్టింది. కునుకు పట్టిందో లేదో అతడికో స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో పుండరీకాక్షుడు ప్రత్యక్షమయ్యాడు. ఉచితరీతిన ఆదరించి సపర్యలు చేసి విచారంతో తలవంచుకొని ఎదుట నిలబడ్డాడు. అప్పుడు శ్రీకృష్ణుడు "ధనుంజయా! భూతములన్నింటినీ బంధించేది కాలమే. దానినుండి ఎవరూ తప్పించుకోలేరు. కష్టసుఖాలు కలిగించేది కూడా ఆ కాలమే. అందువల్ల దుఃఖించి ప్రయోజనం లేదు" అన్నాడు. అందుకు అర్జునుడు "మహాత్మా! సింధురాజును సూర్యాస్తమయం లోపుగా చంపుతానని ప్రతిజ్ఞ చేశాను. నా ప్రతిజ్ఞను తెలుసుకున్న కౌరవులు ఆ సైంధవుణ్ణి కడుపులో పెట్టుకొని కాపాడుతున్నారు. రేపటి రోజున సూర్యుడస్తమించడం అనగా నేనూ అస్తమించినట్లే. ఈ గండం నుండి ఎట్లా బయటపడటమా? అని మథన పడుతున్నాను" అన్నాడు. శ్రీకృష్ణుడు అతడి శోకాన్ని తెలుసుకున్నవాడై "విజయా! పాశుపతాస్త్రాన్ని ప్రయోగించి ఒక్క క్షణంలో నువ్వా సైంధవుణ్ణి అంతమొందించగలవు గదా? అందువల్ల నువ్వా పరమ శివుని మనసారా ప్రార్థించు. ఆ మహాదేవుడే నీ మార్గాన్ని సుగమం చేస్తాడు" అన్నాడు. వాసుదేవుడు అన్నదే తడవుగా ఆచమించి మహాదేవుని మనస్సులో ధ్యానించాడు. వెంటనే ఆ పరమశివునిపై భక్తి ఏకాగ్రమైంది. అంత పుండరీకాక్షునితో కలసి కైలాసానికి పోయి పరమేశ్వరుని దర్శించాడు. ఇద్దరూ పరమేశ్వరునికి సాష్టాంగ నమస్కారం చేసి అనేక విధాలుగా కీర్తించారు. శరణు వేడుకున్నాడు. అప్పుడా మహేశ్వరుడు నరనారాయణులను చూసి, ప్రసన్న హృదయుడై, మందహాసం చేస్తూ "నరనారాయణులారా! మీ మనసులోని కోరిక గ్రహించాను. పూర్వం నేను అనేకమంది రాక్షసుల్ని సంహరించిన పాశుపతాస్త్రాన్ని ధనస్సును అమృత సరస్సులో భద్రపరచాను. మీరుపోయి దానిని తీసుకొని రండి" అని చెప్పగానే వారిద్దరూ శివపార్షదులు వెంటరాగా ఆ సరస్సుకుపోయి అచమనం చేసి దోసిలొగ్గి శతరుద్రీయమును పఠించగానే సర్పరూపాలను వదలి ధనుర్బాణములుగా కనిపించాయి. భక్తి భావంతో వాటిని గ్రహించి మహదేవుని వద్ద ఉంచారు. వెంటనే ఒక బ్రహ్మచారి వచ్చి ధనస్సు నారి సారించి బాణాన్ని ఎక్కుపెట్టి చూపగా అర్జునుడా విధానాన్ని తెలుసుకొని శంకరప్రోక్త మంత్ర సహితంగా ఆ ధనుస్సు గ్రహించి, శంకర సంధాన పద్ధతిని అలవాటు చేసుకున్నాడు. అటు పిమ్మట ఆ ధనుర్బాణాలను యథాస్థానంలో ఉంచి శంకరుని వద్ద అనుమతి తీసుకొని శ్రీకృష్ణునితో కలసి తమ శిబిరానికి చేరుకున్నారు. అర్జునునకు ఈవిధంగా స్వప్నంరాగా, శ్రీకృష్ణుడు దారకునితో మాట్లాడుతూ ఉండగానే సూర్యోదయం అయింది.

ధర్మరాజు - సత్యము

మరునాడు యథాప్రకారం యుద్ధం ప్రారంభమైంది. ద్రోణుడు ఆ రోజున విజృంభించి తన

ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. మధ్యాహ్నాని కల్లా ద్రోణుని ఎదుట ఎవరూ నిలబడలేకపోతున్నారు. కర్ణాశ్వత్థామాదులంతా వారి వారి స్థావరాల్లో విజృంభించి యుద్ధం చేస్తున్నారు. ద్రోణుని ప్రతాపానికి ధర్మజ, భీమాదులంతా వణికిపోయారు. ద్రోణుడు మృత్యుదేవతై విహరించాడు. నిశ్చేష్టులైన పాండవుల్ని చూసి శ్రీకృష్ణుడు "వీరులారా! ధనుర్ధారి అయిన ఈ ఆచార్యుని ముందు మీరే కాదు దేవేంద్రుడు కూడా నిలబడలేడు. ద్రోణుడు అస్త్ర సన్యాసం చేస్తే గాని మీకు విజయం లభించదు. అందుకు ఒకటే ఉపాయం ఉంది. ద్రోణాచార్యులకు అశ్వత్థామ ప్రాణం కన్నా అధికం. కావున అశ్వత్థామ మరణించాడని చెబితే గాని ద్రోణుడు అస్త్ర సన్యాసం చెయ్యడు. ఇందుకు అర్జునుడు అంగీకరిస్తే గాని ధర్మరాజు అంగీకరించడు. ధర్మరాజు నోటివెంట ఈ వార్త వింటేగాని ద్రోణుడు విశ్వసించడు" అని సలహా చెప్పాడు. అంతకుమునుపే భీముడు మాళవాధిపతి అయిన ఇంద్రవర్మ ఏనుగును తన గదతో మోది చంపాడు. యాదృచ్ఛికంగా ఆ గజరాజు పేరు కూడా అశ్వత్థామయే అయింది. అందువల్ల "అశ్వత్థామ చనిపోయాడని' ద్రోణుడు వినేట్లుగా పెద్దగా ధర్మరాజు అరిచాడు. ఆ తర్వాత 'గజరాజ' మని మెల్లగా అన్నాడు. ఇందుమూలంగా ధర్మరాజు అసత్యం చెప్పినట్లూ కాలేదు. దాంతో ద్రోణుని మనస్సు వికలం చెందింది. ముందు నమ్మలేదు. అశ్వత్థామ పరాక్రమమేమిటో ఆయనకు తెలుసు. అందువల్ల తిరిగి యుద్ధాన్ని కొనసాగిస్తూ దృష్టద్యుమ్నుని అనేక విధాలుగా బాధించాడు.

మహర్షులు ద్రోణునికి హితము చెప్పట

రణరంగంలో ద్రోణాచార్యుడొక్కడే ఉన్న సమయం చూసుకొని అత్రి, గౌతమ, విశ్వామిత్ర, వసిష్ఠ, జమదగ్ని, భరద్వాజ మొదలైన ఋషులంతా ఆకాశమార్గాన వచ్చి ద్రోణునితో "భారద్వాజా! బ్రాహ్మణకులంలో పుట్టావు. వేదాలు నేర్చావు. సత్య ధర్మ మార్గాలేమిటో క్షుణ్ణంగా తెలుసుకున్నావు. ఇటువంటి నువ్వు అధర్మ పరుడవయ్యావు. క్రోధంతో యుద్ధం చేస్తూ హింసకు పాల్పడుతున్నావు. ఇప్పటికైనా మా మాటవిని ఆయుధాల్ని వదలిపెట్టు. శాశ్వత సుఖాన్నిచ్చే పరమ పదం గూర్చి ఆలోచించు. అడవులకు పోయి తపస్సు ప్రారంభించు. నీకాలం కూడా దగ్గిర పడుతోంది" అని అనేక విధాలుగా హితబోధ చేసి అంతర్ధానమయ్యారు.

ద్రోణుడు చెవిలో మహర్షుల మాటలే మారుమ్రోగుతున్నాయి. రెండో ప్రక్క ధర్మరాజు అన్న మాటలు మాటిమాటికీ వినిపిస్తున్నాయి. ధర్మరాజు అందరిలాంటి వాడుకాడు. అతడు సత్యాన్నే పలుకుతాడు. కాబట్టి అతడు అశ్వత్థామ మరణించాడని ధృవీకరిస్తే నమ్ముతానన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో "ధర్మజా! ఈ సమయంలో నువ్వు మౌనంగా ఉంటే మన సేనల్లో ఒక్కడు కూడా మిగలడు. సర్వమూ నాశనమైపోయే సమయంలో అసత్యం చెప్పినా పాపం రాదు. బ్రాహ్మణుల్ని, గోవులను, స్త్రీలను, వివాహాన్ని రక్షించేందుకు అసత్యమాడినా పాపం రాదు. అంతేకాకుండా నీకు అసత్యం చెబుతున్నాననే భీతి లేకుండా ఉండటం కోసం భీముడు చంపిన అశ్వత్థామ అనే ఏనుగు పేరును కూడా చేర్చిచెప్పు" అని వత్తిడి పెంచాడు. అప్పుడు ధర్మరాజు ద్రోణునికి దగ్గరగా పోయి "అశ్వత్థామ హతః కుంజరః" అన్నప్పుడు కుంజరః అన్న మాట వినిపించీ వినిపించకుండా అంటాడు.

దాంతో విరక్తి చెందిన ద్రోణుడు ధనుస్సును పారేసి అస్త్ర సన్యాసం చేసి యోగబలం చేత దేహత్యాగం చేశాడు.

సంజయుడు : ధృతరాష్ట్ర మహారాజా! ఆవిధంగా ద్రోణుని శరీరం నుండి వెలువడిన తేజస్సు ఆకాశమార్గాన ప్రవేశించి ఇద్దరు సూర్యులా అన్నట్లు ప్రకాశించింది. రాజా! ఆ తేజస్సును నేను, నరనారాయణులు, ధర్మరాజు, కృపాచార్యుడు మాత్రం చూడగలిగాం. పిమ్మట అతడి శవాన్ని దృష్టద్యుమ్నుడు ఖండించాడు.

అశ్వత్థామ పరాక్రమించుట

ద్రోణుడావిధంగా బ్రహ్మపదాన్ని పొందగా కురుసేనలన్నీ కన్నీరు మున్నీరుగా విలపించాయి. ఎక్కడో దూరాన యుద్ధం చేస్తున్న అశ్వత్థామ హుటాహుటిన దుర్యోధనుని వద్దకుపోయి యథార్థం తెలుపమని అర్థించాడు. దుర్యోధనునికి దుఃఖ భారంచేత నోటమాట పెగలలేదు. అప్పుడా క్రమమంతా కృపాచార్యుడు తెలిపాడు. తండ్రి మరణ ఉదంతాన్ని విన్న అశ్వత్థామ కోపంతో మండిపడి "యుద్ధంలో మరణించడం ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. కానీ లోకంలో ధర్మపరుడని సత్యవాక్పరిపాలకుడని పేరు పొందిన ధర్మరాజు ఇంత నీచానికి ఒడిగట్టాడే అని బాధపడుతున్నాను. ఇందరు వీరులు చూస్తూ ఉండగా, నేను జీవించే ఉన్నానని తెలిసికూడా మాయోపాయంతో నా తండ్రిని చంపిన వారిని విడిచిపెట్టను. శ్రీకృష్ణునితో సహా పాండవులందర్నీ చంపుతాను. నారాయణాస్త్రాన్ని ప్రయోగించి హతమారుస్తాను. ఆ నారాయణాస్త్రాన్ని నిరోధించే శక్తి ఎవరికీ లేదు" అని చేతిలోకి నీళ్ళు తీసుకొని నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ నారాయణాస్త్రం పాండవసేనలను కాల్చి బూడిద చెయ్యసాగింది. నారాయణాస్త్ర ప్రభావం శ్రీకృష్ణునకు తెలుసు కనుక పాండవుల్ని, పాండవసేనలను, దృష్టద్యుమ్నుని ఆయుధాలన్నీ క్రిందపారేసి, రథాలపైనుండి దిగి ఆ అస్త్రానికి నమస్కరించమని ఆదేశించాడు. వారంతా అట్లా చేయడం వలన ఆ అస్త్రం శాంతించి అణగిపోయింది. నారాయణాస్త్రం వ్యర్థమై పోయినందుకు చింతించిన అశ్వత్థామ ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అస్త్ర ప్రభావం చేత ఒక్క క్షణంలో పాండవసేనలో ఒక అక్షౌహిణీసేన ధ్వంసమైపోయింది. శస్త్రాస్త్రములలో దిట్ట అయిన అర్జునుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి ఆగ్నేయాస్త్రాన్ని శాంతింపజేశాడు. తన అస్త్రం కృష్ణార్జునులకు ఎటువంటి కీడు చేయకుండా శాంతించడంతో విరక్తుడై ఆయుధాలు పారేసిన అశ్వత్థామకు వ్యాసభగవానుడు ప్రత్యక్షమయ్యాడు. అశ్వత్థామ ఆ మునీంద్రునికి నమస్కరించి "మునీంద్రా! ఆగ్నేయాస్త్రం ఎందువలన కృష్ణార్జునులను దహించలేదు. నావలన ఏదైనా అపచారం జరిగిందా?"" తెలుపమని ప్రార్థించాడు. అందుకు వ్యాసమహర్షి "ద్రోణనందనా! విష్ణువు ధర్ముని పుత్రుడై నారాయణుడన్న పేరుతో జన్మించాడు. హిమవత్పర్వతంపైన ఆకాశాన్ని చూస్తూ చేతులు పైకెత్తి గాలిని మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ 60వేల సంవత్సరాలు శంకరుని గూర్చి తపస్సు చేశాడు. అతడి తపస్సుకు మెచ్చి సదాశివుడు ప్రత్యక్షమయ్యాడు. నారాయణుడు శివునికి సాష్టాంగ నమస్కారం చేసి అనేక విధాలుగా స్తోత్రం చేశాడు. సదాశివుడు మెచ్చి "నారాయణా! దేవ గంధర్వులెవ్వరూ నిన్ను జయించలేరు. ఎంతటి

శక్తివంతమైన శస్త్రాలుగాని, అస్త్రాలు గాని నిన్ను బాధించవు. అజేయుడుగా ఉండిపోతావు. ఈ చరాచర ప్రపంచంలో నీకు శ్రమ అన్నదే కలుగదు. యుద్ధంలో నిన్ను ఎదిరించి ఎవరూ గెలువలేరు" అని వరమిచ్చాడు. ఆ నారాయణుడే ఈ కృష్ణుడు. అతడి సఖుడే నరుడు. ఆ నరుడే ఈ అర్జునుడు. వాళ్ళిద్దరూ లోకహితం కోరి ప్రతి యుగంలోను జన్మిస్తూ ఉంటారు. వారే ఈ యుగంలో శ్రీకృష్ణార్జునులుగా జన్మించారు. అశ్వత్థామా! నువ్వు కూడా జగత్తులన్నీ ఈశ్వరమయమని నమ్మి పార్థివలింగమును ధ్యానించి తపస్సుచేశావు. నీ పూజలకు మెచ్చిన శివభగవానుడు నీకు జన్మ కర్మములు కలిగేట్లు అనుగ్రహించాడు. అంతట నరనారాయణులు సకల స్వరూపభవుడని శివుని పరమభక్తితో పూజించి లింగార్చకులయ్యారు. ఆకారణంగా వారు నీకంటే ఎక్కువగా శివభగవానునికి ప్రీతిపాత్రులయ్యారని వ్యాసభగవానుడు తెలిపాడు. అంతట పరమ శివ భక్తుడైన అశ్వత్థామ పులకిత గాత్రుడై శివభగవానునికి హృదయపీఠంపై నిలిపి ధ్యానించి నమస్కరించాడు. ఆ పిమ్మట శ్రీకృష్ణునికి వ్యాసునుకి నమస్కరించి తిరిగి యుద్ధరంగంలో ప్రవేశించాడు.

వ్యాసమహర్షి అర్జునునకు హితముపదేశించుట

కౌరవులు, పాండవులు సూర్యాస్తమయానికి యుద్ధం ముగించి వారి వారి శిబిరాలకు వెళ్ళారు. వ్యాసమహర్షి అర్జునునకు దర్శన మివ్వగా విజయుడా మునీంద్రుని పూజించాడు. "మునీంద్రా! నేను యుద్ధం చేస్తున్నప్పుడు ఒక మహాత్ముడు త్రిశూలాన్ని ధరించి నాకు ఎదురుగా నిలబడి ఎదుటి పక్షం వారిని వధిస్తూ ఉంటాడు. ఆ తర్వాతే నాబాణాలు పోయి వారికి తగుల్తున్నాయి. ఆ మహానుభావుడెవరు? అతడు భూమిపై కాలుపెట్టకుండానే దావాగ్ని వలె తన త్రిశూలాన్నుపయోగిస్తూ ఉంటే ఆ త్రిశూలంలోనుండి వేలాది త్రిశూలాలు పుట్టుకొస్తున్నాయి. ఒక సమయాన శత్రుపక్షంలోని వేలాది వీరులు మరణిస్తున్నారు. ఆ మహానుభావుడెవరో నాకు తెలుపుడు" అని ప్రార్థించాడు. అందుకు వ్యాసమహర్షి "పాండునందనా! సృష్టి కర్తలలో ప్రథముడు, పూజ్యుడు, జ్ఞానులకే తెలియనివాడు. అణిమాది సిద్ధులకు మూలమైన వాడు, భూతేశ్వరుడు, నీలకంఠుడు అయిన అష్టమూర్తి. చంద్ర కళాధరుడు, పార్వతీ నాథుడు, వృషవాహనుడు, అయిన ఆ మహేశ్వరుణ్ణి గూర్చి ఏమని వర్ణించను. వేదాలే అతణ్ణి కీర్తించలేమన్నాయి. ఆ మహాత్ముడే శంకరుడు. నీమీద ఉండే ప్రేమకొద్దీ నీ శత్రువుల్ని ఆయనే ముందు చంపుతున్నాడు. వాళ్ళంతా మహేశ్వరుని చేతిలో మరణించాలని అనేక జన్మల నుండీ తపస్సు చేశారు. అందువల్ల ఆయనచే చంపబడ్డ తర్వాతనే నీ బాణాలు పోయి వారిని తాకుతున్నాయి.

ద్రోణుని మరణానంతరం కర్ణుని సర్వసేనాధిపతిగా అభిషేకించారు. ఆనాడు కర్ణుడు, అర్జునుడు భీకరంగా పోరాడారు. అందులో ఎవరినీ ఎక్కువ తక్కువ చేసి మాట్లాడే వీలు లేకపోయింది. కొంతసేపైన తర్వాత కర్ణుడు తాను ఎంతోకాలంగా ఉపాసిస్తున్న సర్పముఖబాణాన్ని మంత్రించి అర్జునునిపై సంధిస్తూ ఉండగా సారథి అయిన శల్యుడు అతడి ఏకాగ్రతను పాడు చెయ్యాలన్న దురుద్దేశ్యంతో "కర్ణా! నీ గురి సరిగా లేదు. అదిపోయి అర్జునుని కంఠాన్ని ఛేధించేట్లులేదు. గురిని మరొక సారి సరిచూసుకో" అన్నాడు. దాంతో కర్ణుడికి బాగా కోపం వచ్చి, నావంటి శూరుడికి

సలహా చెప్పే యోగ్యత నీకు లేదని కసిరి కొట్టాడు. "అర్జునా! కాచుకో. ఈ బాణం నుండి నువ్వు బ్రతికి బయటపడలేవు. ఇంతటితో నీకథను అంతం చేస్తున్నాను" అని బాణాన్ని వదిలాడు. అర్జునునికి ఆ బాణమును త్రిప్పికొట్టే సామర్థ్యం లేదని శ్రీకృష్ణుడు తెలుసుకున్నాడు. అంతే తన నైపుణ్యమంతా ఉపయోగించి రథం క్రుంగేట్లు చేశాడు. దాంతో ఆ బాణం అర్జునుని కిరీటాన్ని మాత్రం ఛేదించుకొని పోయింది. ఆ సర్పముఖ శరము, కిరీటంతో సహా నేలపై పడి, మళ్ళీ అర్జునుని మీదకు రావడం చూసిన శ్రీకృష్ణుడు అర్జునుని హెచ్చరించాడు. అప్పుడు అర్జునుడు ఆ సర్పముఖ శరాన్ని ఆరు బాణాలతో కొట్టి ఆ బాణాన్ని నాశనం చేశాడు. ఆతర్వాత శాపకారణంగా కర్ణుని రథం నేలలోకి కృంగిపోయింది. తన సర్పముఖ బాణం వ్యర్థం కావడం, వెంటనే తన రథ చక్రాలు నేలలో క్రుంగిపోవడం వల్ల కర్ణుడు చేతులెత్తి చూపుతూ "ధర్మాన్ని నమ్ముకున్న వారిని ధర్మం రక్షిస్తుందంటారు. నా విషయంలో అట్లా అనిపించడంలేదు. కాబట్టి ధర్మం కూడా భక్తుల్ని కాపాడదని తెలుస్తోంది" అని తన ఆవేదనను వ్యక్తంచేశాడు. ధర్మాన్ని నిందిస్తూ ఉండగా రథం మరింత భూమిలోకి క్రుంగింది. అప్పుడు కర్ణుడు అర్జునునితో "పార్థా! దైవానుకూలం లేక నా రథచక్రాలు భూమిలోకి క్రుంగిపోయాయి. నేను రథాన్ని తిరిగి భూమిపైకి తెచ్చేంతవరకు నాపై బాణాలు ప్రయోగించవద్దు. నేను నేలపై ఉన్నాను. నువ్వు రథంపై నుండి యుద్ధం చేస్తున్నావు. కనుక నువ్వట్లా యుద్ధం చేస్తే అది ధర్మయుద్ధం కాదుసుమా. నీకు యుద్ధ ధర్మాలన్నీ బాగా తెలుసు. జుట్టు విరబోసుకున్నవాడిని, యుద్ధం వదలి పారిపోయేవాడిని, కవచం లేనివానిని, భగ్నాయుధుని శూరులు కొట్టకూడదు. నువ్వు శూరులలో ఉత్తముడవు. సాధువృత్తి కలవాడవు. పండితుడవు. వేదాంత జ్ఞానం కలవాడవు. దివ్యాస్త్ర వేత్తవు. పరిపక్వమైన ఆత్మ గలవాడవు. యుద్ధం చెయ్యడంలో కార్తవీర్యునితో సమానమైన వాడవు. కావున నేను నా రథచక్రాన్ని ఎత్తేటంతవరకు యుద్ధాన్ని నిలుపు. ఇప్పుడు నేను వికలాయుధుడను. నేనిట్లా మాట్లాడటం కేవలం నీకు ధర్మాన్ని చెప్పడానికే గాని, నీకూ శ్రీకృష్ణునికి భయపడి కాదని గుర్తుంచుకో" అన్నాడు.

అందుకు శ్రీకృష్ణుడు కర్ణునితో "కర్ణా! న్యాయం, ధర్మం ఈనాడే పుట్టినట్లు మాట్లాడుతున్నావు. పరమ ధర్మపరులైన పాండవులు పొందని అవమానం లేదు. పడని కష్టంలేదు" అంటూ దుర్యోధనాదులు మొదటినుండి చేసిన అన్యాయాలు, అధర్మాలు, ఏకరువు పెట్టాడు. కృష్ణుని మాటలతో అర్జునునికి నైతికబలం పెరిగినట్లయి నిశితమైన బాణాలను కర్ణునిపై ప్రయోగించాడు. కర్ణుడు కూడా తగిన రీతిలో అర్జునుని ఎదుర్కొన్నాడు. ఈవిధంగా కొంతసేపు ఒకరినొకరు బాణాలతో నొప్పించుకొనగా, అర్జునుడు ఒక దివ్యాస్త్రాన్ని సత్యంపైన ఒట్టుపెట్టి కర్ణుని పై సంధించాడు. ఆ బాణం పోయి కర్ణుని శిరస్సును ఛేదించింది. సూర్యాస్తమయం కాక ముందే కర్ణుడు నేలకొరిగాడు. అతడి దేహం నుండి ఒక దివ్య తేజస్సు సూర్యబింబంలో ప్రవేశించింది.

ఈ సందర్భాన్ని తిక్కన సోమయాజిగారు ఎలా చిత్రించారో చూడండి.

క॥ ఏను దపశ్చరణంబున । దానంబున గురుజనాభి దర్పణమున ని

త్సానూన వ్రత శీలుండ। నేనియుఁ గర్ణుతలఁ ద్రుంచు నీ శరమని యెన్

కర్ణుని మరణం దుర్యోధనుణ్ణి కృంగదీసింది. అతడిలో ఉన్న యుద్ధోత్సాహం అంతా నీరు కారిపోయింది. అయినా పాండవులపైన క్రోధం పెరిగిందేగాని తరగలేదు. కృపాచార్య, కృతవర్మ అశ్వత్థామలతో కలసి ఆరాత్రంతా సరస్వతీ నదీ తీరానే గడిపారు. కృపాచార్యుడు చేసిన హితబోధలేవీ అతడి తలకెక్కలేదు. కర్ణుని స్థానంలో శల్యుడు సర్వసేనాధిపతిగా నియమితుడయ్యాడు. శల్యుని చంపుతానని ధర్మరాజు పూర్వం ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. అందువల్ల, శల్యునిపై యుద్ధానికి ధర్మరాజునే నిలబెట్టారు. ఆనాడు మూడవ జాముకల్లా ధర్మరాజు శల్యుణ్ణి హతమార్చాడు.

శల్యుడు మరణించగానే సంజయుడు యుద్ధభూమికి వచ్చి దుర్యోధనుణ్ణి ఓదార్చాడు. దుఃఖంతోను, అవమానంతోనూ, రగిలిపోతున్న దుర్యోధనుడు "సంజయా! నేనెవర్నయితే నమ్ముకొని యుద్ధానికి కాలుదువ్వానో వారంతా నన్నువిడిచిపెట్టి వెళ్ళిపోయారని నా తండ్రి ధృతరాష్ట్రునితో చెప్పు. ఏది ఏమైనా నాలో కొనఊపిరి ఉన్నంతవరకు పోరాడి పాండవులందర్నీ అంతం చేస్తానని నా తండ్రికి ధైర్యం చెప్పు" మని సంజయుణ్ణి పంపేశాడు.

సంజయుడు వెళ్ళిన తర్వాత కృపాచార్యుడు, కృతవర్మ, అశ్వత్థామ వచ్చి దుర్యోధనుని ఓదార్చారు. దుర్యోధనుణ్ణి 'ద్వైపాయన' మనే మడుగులో తలదాచుకోమని చెప్పి వాళ్ళుముగ్గురూ మరోచోటుకు పోయి విశ్రాంతి తీసుకున్నారు. దుర్యోధనుడు ఒంటరివాడై ఓ మడుగులో తలదాచుకున్నాడని శ్రీకృష్ణుడు తెలుసుకొని ధర్మరాజును వెంటబెట్టుకొని ఆ మడుగు వద్దకు వెళ్ళాడు. శ్రీకృష్ణుడు దుర్యోధనునికి పౌరుషం వచ్చేట్లుగా ధర్మరాజుచేత మాట్లాడించాడు. ఆ అవమానాన్ని భరించలేక దుర్యోధనుడు మడుగులోనుండి బయటకు వచ్చేట్లుగా "ఓ దుర్యోధనా! రారాజుగా బ్రతికి ఇన్నాళ్ళూ మమ్మల్ని భయపెడుతూ వచ్చావు. ఈరోజున నువ్వు మాకు భయపడి ప్రాణాలపై తీపితో ఈ మడుగులో తలదాచుకున్నావు" అంటూ ఇంకా ఏవో అంటూ ఉండగానే ఆ అవమానం భరించలేక మడుగులో నుండి దుర్యోధనుడు బయటకు వచ్చాడు. అతడితో ధర్మరాజు "దుర్యోధనా! నువ్వు మాలో ఏ ఒక్కరినైనా జయించి నట్లుయితే మమ్మల్నందర్నీ జయించినట్లే భావిస్తాం. మా ఓటమిని అంగీకరిస్తాం. నువ్వు ఓడితే నీ ప్రాణాలు తీస్తాం" అని సవాలు విసిరాడు. కర్మము చేత ప్రేరేపించబడిన దుర్యోధనుడు భీమసేనుడితో మల్ల, గదాయుద్ధాలకు సిద్ధపడ్డాడు. దుర్యోధన భీమసేనులిద్దరూ మల్లయుద్ధాన్ని, గదాయుద్ధాన్ని బలరాముని వద్ద శిక్షణ పొందారు. అందువల్ల ఆ సమయానికి బలరాముడు కూడా అక్కడకు చేరుకున్నాడు. దుర్యోధనుడు ప్రాణాలకు తెగించి భీకరంగా పోరాడాడు. భీముని శక్తి క్షీణించ సాగింది. ఇక సమయం చెయ్యిదాటిపోతోందని గ్రహించిన శ్రీకృష్ణుడు తన తొడలను చేత్తో చరుస్తూ దుర్యోధనుని తొడలు విరగ్గొట్టమని సంజ్ఞ చేశాడు. భీమసేనుడు శ్రీకృష్ణుడు చెప్పినట్లే సమయం చూసి దుర్యోధనుని తొడలు విరిగేట్లుగా గదతో కొట్టాడు. ఆ దెబ్బకు దుర్యోధనుడు మొదలు నరికిన వృక్షంలా పడిపోయాడు. దీనంగా పడిఉన్న దుర్యోధనుని చూస్తూ బలరాముడు ఇది అధర్మ యుద్ధమని హలాయుధాన్ని తీసుకొని భీమునిపై లంఘించాడు. శ్రీకృష్ణుడు బలరాముని

శాంతింపజేశాడు. పాండవులంతా సంతోషంగా శిబిరాలకు వెళ్ళగా, దుర్యోధనుడు దీనంగా నేలపై పడిఉన్నాడు.

పిమ్మట సంజయుడు దుర్యోధనుణ్ణి పరామర్శించడానికి కురుక్షేత్రానికి వెళ్ళగా "సంజయా! యుద్ధంలో అధర్మం గెలిచింది" అన్నాడు. ఆ తర్వాత అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ వచ్చి దుర్యోధనుని దీనావస్థకు తల్లడిల్లిపోయారు. వారితో దుర్యోధనుడు "అశ్వత్థామా! మానవుల సమబుద్ధిని పరీక్షించేందుకు రణరంగం ఒక చక్కటి ప్రదేశం. ఎంతటివారైనా ధర్మాన్ని ప్రక్కన పెట్టి విజయానికే పెద్దపీట వేస్తారు. శ్రీకృష్ణుడు భీముని చేత ఆ పనే చేయించాడు" అన్నాడు. దుర్యోధనుని మాటలు అశ్వత్థామ హృదయంలో మంటలు రేపాయి. క్రోధంతో ఊగిపోయాడు. ఆ సమయంలో తండ్రికూడా జ్ఞాపకానికి వచ్చాడు. దుర్యోధనునితో "రాజేంద్రా! పాండవుల్ని, పాంచాలీ పుత్రుల్ని ఇంకా వారి బంధువులందర్నీ సంహరిస్తాను. పాండవ వంశాన్నే సర్వ నాశనం చేస్తానని" ప్రతిజ్ఞ చేశాడు. దుర్యోధనుడు ఆ క్షణానే కృపాచార్యుని చేత మంత్ర జలాన్ని తెప్పించి అశ్వత్థామను సర్వ సేనాధిపతిగా నియమించాడు.

అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు పాండవ శిబిరానికి వెళ్ళారు. అంతా మంచి నిద్రలో ఉన్నారు. ఇదే సరైన సమయం, వీళ్ళందర్నీ ఇప్పుడే సంహరిస్తానన్నాడు. కృపాచార్యుడు ఎంత వారించినా వినలేదు. కృపాచార్య కృతవర్మలను బయటనే ఉండమని తానొక్కడే శిబిరంలోకి వెళ్ళి అన్ని చోట్లా వెదికాడు. ఎక్కడా పాండవుల జాడ తెలియలేదు. అప్పుడు ఒక మహాభూతం అశ్వత్థామ ఎదుట నిలబడింది. ఆ భూతం మహా భయంకరంగా ఉంది. ఆ భూతంలో నుండి మహాతేజస్సొకటి బయటకొచ్చింది. ఆ తేజస్సు లోనుండి వేలాది హృషీకేశులు బయటకు వచ్చారు. ఆ దృశ్యం చూస్తున్న అశ్వత్థామ తన హృదయపీఠంపై పరమ శివుని నిలిపి ధ్యానం చేశాడు. అతడట్లా ధ్యానం చేస్తూ ఉండగా ఎదురుగా పెద్ద అగ్ని కుండాన్నీ, అందులోనుండి బయటకు వచ్చిన పరమశివుణ్ణి దర్శించాడు. శంకరుడు అశ్వత్థామతో "అశ్వత్థామా! నీ భక్తికి సంతృప్తుడనయ్యాను. పాంచాలి పుత్రులందరికీ మరణకాలం దగ్గర పడింది. ఇదుగో ఈ ఖడ్గాన్ని తీసుకొని వారందర్నీ సంహరించు. ఆయువు తీరిన వారింకా అనేక మంది ఉన్నారు. నువ్వు వారందర్నీ సంహరించి, నువ్వు తలపెట్టిన కార్యం పూర్తి చేసుకొనిపో" అన్నాడు. అశ్వత్థామ శివ తేజస్సునుండి ఖడ్గాన్ని గ్రహించి చంపదగిన వారందర్నీ చంపాడు. అతడు ఎంత వెతికినా పాండవులు గాని, శ్రీకృష్ణుడు గాని కనిపించలేదు. ఇక విసిగిపోయి కృతవర్మ, కృపాచార్యులను వెంటబెట్టుకొని దుర్యోధనుని వద్దకు పోయి పాంచాలీ పుత్రుల్ని, బంధువుల్ని చంపానని చెప్పి దుర్యోధనుని సంతోషపెట్టాడు. పాండవుల జాడ తెలుసుకోలేకపోయానని చెప్పి తన ఆవేదనను వెళ్ళబోసుకున్నాడు.

ఆరాత్రి నదీతీరాన గడిపి ధర్మరాజు, సోదరులు, సాత్యకి, శ్రీకృష్ణులతో కలసి తమ శిబిరాలకు చేరుకున్నారు. అంతలో దృష్టద్యుమ్నుని సారథి పరుగు పరుగున వచ్చి ఉపపాండవుల్ని, దృష్టద్యుమ్నుని ఇతర వీరులెందర్నో అశ్వత్థామ హతమార్చి పారిపోయాడని చెప్పాడు. ద్రౌపది దుఃఖానికి అంతేలేదు. ద్రౌపది అశ్వత్థామను శిక్షించమని ప్రోత్సహించగా భీమసేనుడు అశ్వత్థామను వెంబడించగా, శ్రీకృష్ణునకు

భీమసేనుని శక్తి తెలుసినందువలన అర్జునుని వెంటబెట్టుకొని తనుకూడా భీముని అనుసరించి వెళ్ళాడు. శ్రీకృష్ణ భీమార్జునులు తన్ను వెంబడించడాన్ని తెలుసుకున్న అశ్వత్థామ పాండవులను పాండవ పత్నుల గర్భస్థ శిశువులను ఉద్దేశించి బ్రహ్మశిరోనామాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రం ప్రపంచాన్నంతా కాల్చి బూడిద చేస్తూ భీమార్జునుల వైపు రాసాగింది. అప్పుడు అర్జునుడు కూడ అదే అస్త్రాన్ని ప్రయోగించి ఆ అస్త్రాన్ని శాంతింపజేశాడు. అప్పుడు నారదుడు, వ్యాసమహర్షి వచ్చి అటువంటి అస్త్రాన్ని మానవులపైన వేయవచ్చునా? అని అశ్వత్థామను మందలించి ఆ అస్త్రాన్ని ఉపసంహరించ మన్నారు. అశ్వత్థామకు ఉపసంహరణ మంత్రం తెలియకపోవడం వలన ఉపసంహరించేందుకు అశక్తుడయ్యాడు. అంతట శ్రీకృష్ణుడు పాండవ గర్భస్థ శిశువులలో ఏదో ఒక శిశువుపై ప్రయోగించి మిగిలిన వారిని కాపాడమన్నాడు. మునీశ్వరులు కూడా శ్రీకృష్ణుడు చెప్పినట్లు చెయ్యమని అశ్వత్థామను కోరారు. అతడందుకు నిరాకరిస్తూ, నీకు చాతనైతే ఉత్తర గర్భాన్ని కాపాడుకొమ్మని సవాలు విసిరాడు. అర్జునుడు అశ్వత్థామను పట్టి బంధించి అతడి శిరోమణిని తీసుకొని, గురుపుత్రుడన్న గౌరవంతో, ప్రాణాలతో వదిలిపెట్టాడు. అంతట శ్రీకృష్ణుడు ఉత్తర గర్భాన్ని ఆ అస్త్రం నుండి కాపాడాడు.

శివ ప్రభావమును శ్రీకృష్ణుడు ఉపదేశించుట

పుత్రులంతా ఒకేసారి చనిపోవడం వల్ల ధర్మరాజు మనస్సు వికలమై శ్రీకృష్ణునితో "మహాత్మా! మహా పరాక్రమశాలురైన ఉప పాండవులను, దృష్టద్యుమ్నుని అశ్వత్థామ ఎట్లా సంహరించగలిగాడు" అని అడిగాడు. అందుకు శ్రీకృష్ణుడు "కుంతీనందనా! ద్రోణ పుత్రుడు శంకరుని గూర్చి తపస్సుచేసి శివుని మెప్పించాడు. దయార్ద్రహృదయుడైన పరమేశ్వరుడు దివ్య ఖడ్గాన్నొకటి ప్రసాదించాడు. ఆ దేవ దేవుని వర ప్రభావంచేత అశ్వత్థామ శిబిరంలో ప్రవేశించి అక్కడున్న వారందర్నీ సంహరించాడు. ధర్మనందనా? శంకరుడు ప్రసన్నుడైతే అమరత్వం లభిస్తుంది. దేవేంద్రాదుల్ని కూడా గెలువ గల శక్తి లభిస్తుంది. అటువంటి శంకరుని అనుగ్రహం పొందిన అశ్వత్థామ శిబిరంలో వారిని చంపగలగడంలో ఆశ్చర్యమేముంది? ఒకమాట చెప్తాను. శ్రద్ధగా విను. శంకరుని శక్తి ఎట్లాంటిదో నీకే తెలుస్తుంది. ఆ మహానుభావుడు ప్రపంచాన్ని సృష్టించి, పెంచి, సంహరించగల సమర్థుడు. మనస్సులో సంకల్పం చేసినంత మాత్రానే బ్రహ్మాండాలు సృష్టించబడతాయి. అంతటి శక్తి మంతుడు భక్తునికి దాసుడై ఉంటాడు. శంకరుడి లీలలన్నింటినీ నేను చెప్పలేను గాని, ఒకటి రెండు చెప్తాను. విను.

బ్రహ్మదేవుడు సృష్టి ప్రారంభించాలన్న తలంపుతో శంకరుని ఆశ్రయించాడు. ఏ కార్యం చెయ్యాలన్నా తపస్సే ముఖ్యమని బోధించి బ్రహ్మను పంపేసి తాను అఖండ జలాలలో ఉండిపోయాడు. బ్రహ్మ చాలాకాలం తపస్సు చేసి దక్షుని సృజించాడు. అటుపైన సృష్టి ప్రారంభించమని బ్రహ్మ దక్షుని ఆదేశించాడు. అందుకు దక్షుడు నాకన్నా పెద్దవారెవరైనా ఉంటే నేనందుకు సమర్థుణ్ణి కాలేనన్నాడు. అంతట బ్రహ్మ, నీకన్నా పెద్దవాడొకడున్నాడు. అతడు అఖండ జలాలలో యోగనిద్రలో ఉన్నాడు. కావున నువ్వు సృష్టి ప్రారంభించమని ఆదేశించాడు. అంతట దక్షుడు అనేక భూతాలను సృజించాడు. ఆ భూతాలన్నీ ఆకలి బాధకు ఓర్చుకోలేక దక్షునే మ్రింగపోయాయి. అప్పుడు బ్రహ్మ ఓషదుల్ని,

ఫలాలను మూలాలను సృష్టించి ఆ భూతాలకు ఆహారం కావాలని సంకల్పించాడు. అంతేకాకుండా బలిష్ఠమైన భూతములకు బలహీనమైన భూతములు ఆహారమవుతాయని ఆజ్ఞాపించాడు. ఆ ఆహారాన్ని తింటూ ఆ భూతాలన్నీ వృద్ధి చెందాయి. అట్లా చాలాకాలం గడచిన తర్వాత శంకరుడు జలాలనుండి బయటకు వచ్చి భూతాలను చూసి ఆగ్రహించి లింగాకారాన్ని ధరించి నేలపై నడుస్తూ ఉండగా ఆ భూతాలన్నీ నశించసాగాయి. బ్రహ్మ శంకరుని స్తోత్రం చేసి ఎందువల్ల నువ్వీ భూతాలన్నింటినీ నాశనం చెయ్య పూనుకున్నావని ప్రార్థించగా ఆ మహాదేవుడు ఇలా అన్నాడు.

పంకజాననా! భూత ప్రేతములను సృష్టించేందుకే నీళ్ళలో ఉంటూ తపస్సు చేశాను. తపస్సు ఫలించింది. భూత సృష్టికే ఈ లింగమును సృష్టించాను. భగవానుడు ఆవిధంగా చెప్పి మాల్యవంత పర్వతానికి పోయి మళ్ళీ తపస్సు ప్రారంభించిన ఆ లింగము మనోహరంగా ప్రకాశించింది. దేవతలంతా అనేక ద్రవ్యాలతో యజ్ఞంచేసి ఆరాధించారు. రుద్రుని ప్రభావం తెలియనివారు యజ్ఞంలో రుద్రునికి భాగం కల్పించలేదు. అందుకు శంకరుడు కోపగించి బాలభానుని వంటి దీపస్థంబంలో ఉండే ధనస్సునొకటి నిర్మించి అందుకు యజ్ఞాంగములనే అల్లెత్రాడుగా చేసిన ఆకృత్తి వాసుదు యజ్ఞం చేస్తున్న దేవతల వద్దకు పోయాడు. శంకరుని చూసిన దేవతలంతా భయంతో వణికి పోయారు. శంకరుడు బాణప్రయోగం చేయబోతూ ఉండగానే దేవతలంతా భయంతో పారిపోయారు. శంకరుడు వారిపై అనుగ్రహం చూపాడు. తన కోపాన్నంతా జలాశయంలో వదలగా అందులోనుండి ఒక ఆకారం బయటకు వచ్చింది. వారంతా ఆ ఆకృతిని శివుడని గ్రహించారు. అప్పుడు దేవతలు పార్వతీ వల్లభునికి యజ్ఞంలో భాగం కల్పించారు. కావున ధర్మరాజా! శంకరుడాగ్రహిస్తే లోకాలు నిలవ్వు. అతలాకుతలమైపోతాయి. ఆ మహానుభావుడు అనుగ్రహించిన వారంతా సుఖపడతారు. మహాదేవుని ఆగ్రహానికి గురి అయిన అశ్వత్థామ మన శిబిరంలో ప్రవేశించి ఇటువంటి నీచకార్యాన్ని చేశాడు. అంతట ధర్మరాజు దుఃఖాన్ని వదలిపెట్టి శివుని స్తోత్రం చేసి ఆయన అనుగ్రహానికి పాత్రుడయ్యాడు.

శ్రీకృష్ణుడు శివుని మహత్త్వాన్ని తనెరుగుదునని చెప్తూ అన్నింటికీ ఆ శివభగవానుడే కర్త అని ధర్మరాజుకు ఉపదేశించాడు. దీన్నిబట్టి శైవులు తబ్బిబ్బు కానక్కరలేదు. ఎందువల్లనంటే విష్ణువు శివుణ్ణి, శివుడు విష్ణువును ఎక్కువ చేసి చెప్తూ ఉంటారు. అదివారి స్వభావం. మేమిద్దరం ఒక్కటేనని చెప్పడమే అందులోని సారం.

భూభారాన్ని తొలగించాలన్నదే శ్రీకృష్ణుని అవతారలక్ష్యం. ఆ కార్యాన్ని అర్జునుని ద్వారా చక్కబెట్టాడు. ధర్మరాజాదుల ఘనవిజయానికి అభినందించాడు. ద్రౌపదిని ఓదార్చాడు. అశ్వత్థామ బ్రహ్మశిరోనామాస్త్రాన్నుండి ఉత్తర గర్భస్థ శిశువును రక్షించి ఆమెకు మనశ్శాంతిని కలిగించాడు. అక్కడనుండి అంతా కలసి హస్తినాపురం పోయి ధృతరాష్ట్రాదులను, విదురుని ఓదార్చి మనశ్శాంతి కలిగేలా మాట్లాడారు. అంతా శాంతించారు కానీ గాంధారికి మనశ్శాంతి కలుగలేదు. తన కుమారులందర్నీ చంపిన ధర్మరాజును శపించాలనుకున్నది. అప్పుడే వ్యాసమహర్షి ప్రత్యక్షమై ధర్మరాజును శపించవద్దని కోడలికి (గాంధారికి) హితబోధ చేశాడు. ఆమె ధర్మరాజును శపించకుండా ఉండేట్లు చేయగలిగాడు.

గాంధారి శ్రీకృష్ణుని శపించుట

గాంధారీ ధృతరాష్ట్రులు చనిపోయిన పుత్రుల శరీరాలపై బడి దీనాతిదీనంగా రోదించారు. అప్పుడు శ్రీకృష్ణుడు, ధర్మరాజాదులు కూడా అక్కడే ఉన్నారు. గాంధారి శ్రీకృష్ణుని దగ్గరకు రమ్మని పిలిచి "పద్మనాభా! నా కొడుకులు, పాండవులు తమలో తాము పోట్లాడుకుంటూ ఉంటే నువ్వెన్నడూ వారికి సర్దిచెప్పలేదు. సమస్త కార్యాలు చెయ్య సమర్థుడవై ఉండికూడా ఉపేక్షించి ఊరుకున్నావు. నా కొడుకులందర్నీ చంపాలనే దురుద్దేశంతోనే రాయబారం నడిపావు. రాజులందర్నీ యుద్ధానికి ప్రేరేపించారు. రాజ్యాలన్నీ పాడైపోయాయి. కృష్ణా! ఉత్తమ జ్ఞాతులను తమలో తాము వైరం పెంచుకొని చంపుకునేట్లు చేశావు. నీపాపం ఊరికే పోదు. కావున నీ జ్ఞాతులు కూడా తమలో తామే కొట్టుకొని చస్తారు. నేటి నుండి 36 సంవత్సరాల తర్వాత ఇదే రోజున ఇదేచోట దిక్కులేని చావు చస్తావు. నీ భార్యలు కూడా నాకోడండ్రలాగానే నిన్ను తలచుకొని తలచుకొని ఏడుస్తారు" అని శపించింది.

మహాఘోరంగా శపించిన గాంధారిని చూస్తూ చిరునవ్వు చిందిస్తూ "అత్తా! ఇంతకు పూర్వమే మునులు ఈ శాపాన్నిచ్చారు. మళ్ళీ నువ్వూ అదే శాపాన్నివ్వడం వలన ఒరిగేదేమీ ఉండదు. యాదవులందరికీ నాశనం తప్పదు. శాపకారణంగా వాళ్ళల్లో వాళ్ళే కొట్టుకొని చస్తారు. కావున ఓ గాంధారీ! చనిపోయిన వారికి చెయ్యాల్సిన అగ్ని కార్యాలవంటివన్నీ చెయ్యండి" అని ఆమెకు కర్తవ్యాన్ని బోధించాడు. ధృతరాష్ట్రుడు, ధర్మరాజాదులంతా తిలోదకాలిస్తూ ఉండగా కౌరవుల శవాలన్నీ కుప్పగా చేసి వేదోక్తంగా అగ్ని క్రియను నిర్వర్తించారు. అంతట ధర్మరాజు పెదతండ్రిని మిగిలిన బంధుజనాన్ని తీసుకొని పోయి గంగాస్నానం చేసి తిలోదకాలిచ్చారు. అప్పుడు కుంతీదేవి అక్కడకు వచ్చి ధర్మరాజుతో "వత్సా! ఎవరి బలం చూసుకొని కౌరవులు యుద్ధానికి సాహసించారో, మీరంతా ఎవరి పౌరుషానికి భయపడుతూ ఉండేవారో, దేవతలెవరి యుద్ధనైపుణ్యాన్ని చూడాలని ఉవ్విళ్ళూరే వారో అట్టి కర్ణుని అంతా రాధేయుడని పిలిచేవారు. మీరుకూడా అతణ్ణి సూతనందనా అనేవాళ్ళు. నిజానికి ఆ మహనీయమూర్తి నా పెద్దకొడుకే సుమా! మీ అందరికన్నా పెద్దవాడు. సూర్యుని వరప్రసాదం చేత సహజ కవచ కుండలాలతో జన్మించాడు. కావున నా పెద్దకొడుక్కి కూడా తిలోదకాలివ్వు" అన్నది. ఆమె మాటలు విన్న పాండుపుత్రులంతా శోక సముద్రంలో మునిగిపోయారు. ధర్మరాజు తల్లితో "అమ్మా! ఎంతపనిచేశావు? మమ్మల్నందర్నీ రణరంగంలో చికాకు పరిచాడు. మా పక్షాన యుద్ధం చేస్తున్న రాజులందర్నీ భయభ్రాంతుల్నిచేశాడు. ఒక్క అర్జునుడు తప్ప అతణ్ణి ఎదిరించే శూరుడు ముల్లోకాల్లోనూ లేడు గదా. అమ్మా! ఆ కర్ణుని మొదటి బిడ్డగా ఎట్లాకన్నావు? అభిమన్యుడు మరణించినప్పుడు కూడా మేమింత శోకం అనుభవించలేదు" అని భోరున ఏడ్చాడు.

ధర్మరాజు పట్టాభిషేకము

పాండవులు, శ్రీకృష్ణుడు గంగాతీరంలో ఒకచోట సమావేశమయ్యారు. చాలామంది మహర్షులు కూడా ఆ సమయానికి అక్కడకు చేరుకున్నారు. ధర్మరాజు తనకు రాజ్యం వద్దని పట్టుబట్టాడు.

భీమాదులంతా ఎంతో చెప్పి చూశారు. చివరకు ద్రౌపది కూడా ఎన్నోవిధాల నచ్చచెప్పింది. అయినా అతడికి తల్లి మీద ఆగ్రహం తగ్గలేదు. ఆమె మీద కోపంతో లోకంలో స్త్రీలెవ్వరూ రహస్యాన్ని దాచుకోరాదని శపించాడు. శ్రీకృష్ణుడు, వ్యాసమహర్షి కూడా ధర్మరాజును పట్టాభిషేకానికి ఒప్పించే ప్రయత్నం చేశారు. కుంతి చేసిన పనిలో ఎంతమాత్రం దోషం లేదని అనేక ధర్మాలు ఉదహరించారు, చివరకు అంగీకరించాడు.

పట్టాభిషేకానికి కావలసిన ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోయాయి. విధి విహితంగా సద్బ్రాహ్మణులు ధర్మజుని వెంటబెట్టుకొని ఉన్నతాసనంపై కూర్చోబెట్టారు. ధర్మరాజుకు ఎడమ ప్రక్కన ద్రౌపదిని కూర్చోబెట్టారు. హోమాది తంత్రాలన్నీ యధావిధిగా ముగిశాయి. సుముహూర్త సమయాన శ్రీకృష్ణుడు పవిత్ర జలాలను తన శంఖంలో నుండి ధర్మరాజు శిరస్సు అభిషేకించి భూపతివి కమ్మని ఆశీర్వదించాడు. ధృతరాష్ట్రుడు కూడా మంత్రజలాలను ధర్మరాజు శిరస్సున అభిషేకించాడు. ఇంకా అనేకమంది రాజులు స్వయంగా ఆ రాజ్యాభిషేకంలో పాలు పంచుకున్నారు. అభిషేక మహోత్సవం కాగానే ధర్మరాజు లేచి శ్రీకృష్ణునికి నమస్కరించి "మహాత్మా! భగవంతుని దయవలన ఆపదలన్నింటినీ అధిగమించి యుద్ధంలో విజయం సాధించి రాజు నయ్యాను. కృతార్థుడనయ్యాను. కృష్ణా! నీ మహిమలను ఉన్నదున్నట్లుగా చెప్పగల సామర్థ్యం మాకెక్కడుంది? ఆది పురుషుడవని వేదాలు చెప్తున్నాయి. పాపాల్ని నాశనం చెయ్యాలన్నా, శుభాల్ని కలిగించాలన్నా నీ నామాలు జపించడమొక్కటే మార్గం. కృష్ణా! నీ అనుగ్రహం చేతనే రాజునయ్యాను. నువ్వు మెచ్చేట్లుగానే రాజ్యపాలన చేస్తాను. ఇంతవరకు మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడినట్లే ఇక ముందు కూడా కాపాడమని అర్థిస్తున్నాను" అని ముగించాడు. రాజ్యాభిషేకం అయిన తర్వాత భీమునికి దుర్యోధనుని సౌధము, అర్జునునకు దుశ్శాసనుని సౌధము, దుర్మర్షణ దుర్ముఖుల ప్రాసాదాల్ని నకుల సహదేవులకు నివాసాలుగా నియమించాడు. శ్రీకృష్ణుడు కూడా ధర్మజుని మాటలకు పరమ సంతుష్టుడయ్యాడు.

భీష్ముడు ధర్మరాజుకు ఉపదేశించుట

(ఈ భాగం శ్రీమహాభారతము భీష్మ పర్వం నుండి గ్రహించబడింది.)

రాధాదేవి శాపవిముక్తురాలైంది. అయినా శ్రీకృష్ణుడు ఇంకా కొంతకాలం రాధాదేవితో కలసి భూలోకంలోనే ఉంటూ తాను చెయ్యాల్సిన కార్యాలు జేస్తూ, ఇతరులు చెయ్యాల్సిన కార్యాలను ప్రేరేపిస్తూ, వారిచేతకూడా కొన్ని కార్యాలు చేయించాలని సంకల్పించాడు. అందులో భాగంగానే ఒకరోజున ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధర్మనందనా! భీష్ముడు అంపశయ్యమీద శయనించి ఉన్నాడు. అతడు సకల ధర్మసంపన్నుడు. అతడు జీవించి ఉండగానే ఏవైనా ధర్మ సందేహాలుంటే తీర్చుకో" అన్నాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజు తమ్ములందర్నీ వెంటబెట్టుకొని భీష్ముడున్న చోటుకు వెళ్ళాడు. అప్పుడు భీష్ముడు శ్రీకృష్ణుని చూసి నమస్కరిస్తూ ఇలా అన్నాడు. "కృష్ణా! పరమేశ్వరుడవైన నీ కృపవలన నాకు శరీరబాధలన్నీ తొలగిపోయాయి. మనస్సు నిర్మలంగా ఉంది. వేదవిద్యా వైభవమంతా మళ్లీ పొందగలుగుతున్నాను. అందుమూలంగా పరతత్త్వ విషయాలన్నీ చక్కగా నాకు స్మృతిపథంలోకి వస్తున్నాయి. నీ దర్శనం కూడా అయింది. నా మనస్సు ఇంకా ఆనందంగా ఉంది" అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు "గాంగేయా! ధర్మరాజు యుద్ధంలో పితామహుడైన భీష్మణ్ని, గురువులైన ద్రోణ, కృపాచార్యులను, పెద్దలను లక్షలాది ప్రజల్ని చంపానని దుఃఖిస్తున్నాడు. కనుక అతడికి ధర్మోపదేశం చేసి సందేహాలు తీర్చి కృతార్థుణ్ణి చెయ్యి. నువ్వు సర్వ ధర్మ పారంగతుడవు" అన్నాడు.

అందుకు భీష్ముడు "కృష్ణా! నీవు సాక్షాత్తూ భగవంతుడివి. పాండవులంటే నీకు ప్రాణం. నీకు తెలియని ధర్మాలున్నాయా? అయినా ధర్మనందనుని సందేహాల్ని నన్నే తీర్చమని ఎందుకు అడుగుతున్నావు? నీ అంతరంగమేమో నాకు చెప్పు" అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు "గాంగేయా! నాకు పాండవులంటే ఇష్టం అన్నమాట నిజమే. నాకు తెలియని ధర్మాలు లేవు. ఇప్పుడీ ధర్మరాజు సందేహాలు తీర్చడం వలన నాకు క్రొత్తగా వచ్చే కీర్తి ఏమీ ఉండదు. నిరుపమానమైన యశస్సు నీకు కలగాలన్నదే నా ఆకాంక్ష. ఇప్పుడు నువ్వు చెప్పే ధర్మాలవలన నీ కీర్తి భూమి ఉన్నంత వరకు ఉంటుంది. నీ ఉపదేశం వలన మిగిలిన రాజులంతా కూడ కృతార్థులవుతారు. నీవు చెప్పే ధర్మసూక్ష్మాలు తెలుసుకొన్న జనులు కూడా ఇహపరాల్లో సుఖపడ్తారు" అన్నాడు.

అంతట భీష్ముడు "దేవా! నీ ఆజ్ఞను శిరసావహిస్తాను. నాకు తెలిసినంతవరకు ధర్మాలన్నీ ధర్మరాజుకు బోధిస్తాను. ఈ రోజు సూర్యాస్తమయం అవుతోంది. అంతా రేపు రండి" అన్నాడు.

మర్నాడు శ్రీకృష్ణుడు, పాండవులు, నారదుడు, వ్యాసుడు ఇంకా అనేకమంది భీష్ముడి వద్దకు వెళ్ళారు. ధర్మరాజు భీష్ముని దగ్గరకు వెళ్ళి శిరస్సు భీష్ముని పాదాలమీద ఉంచి నమస్కరించాడు. భీష్ముడు ధర్మరాజును ఆశీర్వదించి ఇలా అన్నాడు. "యుధిష్ఠిరా! విప్రులకు జప,తప హోమాది కర్మలన్నీ

విధివిహిత కర్మలు. అట్లాగే క్షత్రియులకు యుద్ధంలో నెత్తురు నీళ్ళలా ప్రవహించేట్లు యుద్ధం చెయ్యాలి. ఆ రక్తంలో కేశాలన్నీ నాచులా విస్తరించాలి. అది రాజులకు కర్తవ్యం. ఈ విధినిర్వహణలో రాజుల మనస్సులో బంధువుల్ని పెద్దల్ని, గురువుల్ని, పుత్రపౌత్రుల్ని చంపాల్సొచ్చిందే నన్న కరుణ ఉండరాదు. ఇది రాజులకు ధర్మం" అన్నాడు.

అప్పుడు ధర్మరాజు చేతులొగ్గి నమస్కరిస్తూ "పితామహా! సూర్యోదయం రాగానే చీకట్లు తొలగిపోయినట్లు, నీ ఉపదేశం విన్నతర్వాత నా సందేహాలన్నీ తొలగిపోయాయి" అన్నాడు. ఆ రోజుకు వ్యాసాది మహర్షులంతా భీష్మునివద్ద శలవు తీసుకొని ఇళ్ళకు వెళ్ళారు.

దుర్వాసుడు శ్రీకృష్ణుని పరీక్షించుట

(ఈ భాగం మహాభారతం అనుశాసనిక పర్వం 119వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ఒక రోజున ధర్మోపదేశ సమయంలో ధర్మరాజు భీష్మునివద్దకుపోయి, నమస్కరించి, విప్రప్రభావాన్ని గూర్చి తెలుపమని అడిగాడు. అప్పుడు భీష్ముడు "నాయనా! ధర్మరాజా! సూర్యుడు దక్షిణాయనం చివరి ఘడియలలోకి వచ్చాడు. దేహత్యాగం చేసే సమయం దగ్గరపడుతోంది. నీ ప్రశ్నకు శ్రీకృష్ణుడు సమాధానం చెప్తాడు. విను" అన్నాడు. భీష్ముడు శ్రీకృష్ణుని వైపు తిరిగి "మహాత్మా! ధర్మరాజుకు విప్ర మాహాత్మ్యాన్ని గూర్చి చెప్పు" అన్నాడు.

అంతట శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు. "ధర్మనందనా! పూర్వం ప్రద్యుమ్నుడు నన్ను ఈ ప్రశ్న వేశాడు. నేనానాడు అతడికి చెప్పిందే మళ్ళీ నీకు చెప్తాను" విను.

లోకంలో మోక్షం పొందాలన్నా, ఏ కర్మలు చేయాలన్నా, గృహస్థ వైవాహిక సుఖాలు పొందాలన్నా విప్రులను ఆశ్రయించాల్సిందే. వాళ్ళకి కోపతాపాలు ఎక్కువ. వారితో కొంచెం ఎక్కువైనా కష్టమే, కొంచెం తక్కువైనా కష్టమే. వారితో వేగడమంటే కత్తిమీద సాము చెయ్యడం వంటిది. ఈ విషయంలో నా అనుభవమొకటి చెప్తాను విను.

పూర్వం ఒకసారి దూర్వాసమహర్షి నా ఇంటికి వచ్చి కొంతకాలమున్నాడు. 'నాకిక్కడ చాలా సుఖంగా ఉంది' అంటాడు. ఆ మరుక్షణంలోనే కోపమొచ్చి తాటి చెట్టంత ఎత్తుకు ఎగిరిపడతాడు. మెత్తగా పట్టుపరుపులతో పక్క ఏర్పాటు చేస్తే నాకు సుఖాలు అలవాటు చేసి భ్రష్టుణ్ణి చేద్దామనుకుంటున్నావా? అంటాడు. పోనీ లెమ్మని చాపపరచి పడుకోవయ్యా అంటే 'నేనేం గతిలేక వచ్చానా? పెద్దవాణ్ణయ్యాను. కూర్చుంటే లేవలేను. నన్నుపోయి నేలమీద పడుకోమంటున్నావు. నువ్వుమాత్రం సుఖంగా పట్టుపరుపులపైన పడుకుంటావా? నీ ఇంటికొచ్చాను గదా! అని చులకనగా చూస్తున్నావు' అనేవాడు.

ఒకరోజున మహర్షి నాకు పాయసం కావాలన్నాడు. రుక్మిణి ఓ పాత్రనిండా పాయసం తెచ్చింది. మహర్షి త్రాగినంత త్రాగాడు. మిగిలిన పాయసాన్నంతా తన ఒంటికి నన్ను పట్టించమన్నాడు. నేను

మారుమాట్లాడకుండా ఆయన చెప్పినట్లే చేశాను. రుక్మిణి ఇదంతా విడ్డూరంగా చూస్తూ నిల్చుంది. పాయసమంతా ఒంటికి పట్టించుకొని రుక్మిణిని చేత్తోపుచ్చుకొని బరబరా లాక్కుపోయి రథాన్నెక్కమన్నాడు. రుక్మిణి ఆయన చెప్పినట్లే చేసింది. రథాన్ని తానే నడుపుతూ చర్నాకోలుతో రుక్మిణిని కొడ్తూ రథాన్ని నడిపాడు. నేనేమీ కోపగించుకోలేదు. ఆ చోద్యమంతా చూస్తూ నిలబడ్డాను. కొంత సేపైన తర్వాత రుక్మిణితో సహా వచ్చాడు. వస్తూనే నా కాళ్ళపైన పడి "మహాత్మా! నన్ను క్షమించు. ఓ కృష్ణా! మిమ్మల్ని ఎంతో కష్టపెట్టాను. అయినా నువ్వు కోపాన్ని జయించావు. నువ్వు మహానుభావుడవు. నిన్ను పూర్తిగా అనుగ్రహిస్తున్నాను. లోకాలన్నీ నిన్ను పూజిస్తాయి. నీ కీర్తి ముల్లోకాల్లోనూ వ్యాపిస్తుంది. ఈ పాయసాన్ని నా ఒళ్ళంతా పూశావు కానీ నా పాదాలకు రాయలేదు. అందువల్ల నీ మృత్యువు అరికాల్లో ప్రాప్తిస్తుంది. నీకది పరమ శోభను చేకూరుస్తుందేకాని అశుభం కాదు. కృష్ణా! నువ్వు నాపై చూపిన భక్తిభావాన్నే లోకంలో విప్రులందరిపైనా చూపు. అనినాకు ఉపదేశించి, రుక్మిణితో ఇలా అన్నాడు. "సాధ్వీ! సౌందర్యానికి, సౌభాగ్యానికీ నీకుసాటి ఎవరూఉండరు. శ్రీకృష్ణుడికుండే పదహారువేలమంది అంతఃపుర కాంతలలో నువ్వే మాననీయురాలివై ఉంటావు" అని ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు.

కావున ఓ ధర్మనందనా! బ్రాహ్మణుల ప్రభావం అంత గొప్పది. అందువల్ల నువ్వు కూడా వారియెడల భక్తియుక్తుడవై ఉండు, అని ఉపదేశించాడు.

విశేషార్థం : ధర్మరాజు విప్రుల మాహాత్మ్యాన్ని చెప్పమని భీష్ముడ్నడిగితే ఆయన చెప్పకుండా శ్రీకృష్ణునే చెప్పమన్నాడు. ఎందువల్ల? ఈ ప్రశ్నకు శ్రీకృష్ణుడు సమాధానం చెప్తేనే బాగుంటుందని భీష్ముడు కూడా అభిప్రాయ పడ్డాడు. శ్రీకృష్ణుడు కూడా పూర్వం తాను ప్రద్యుమ్నుడికి చెప్పిన వృత్తాంతాన్నే మళ్ళీ ధర్మరాజుకు తెలిపాడు. ఇంతవరకు బాగానే ఉంది. శ్రీకృష్ణుడు భగవంతుడన్న విషయం దుర్వాసుడికి తెలియదా? తెలిసీ భగవంతుణ్ణే ఎట్లా పరీక్షిస్తాడు. అన్నదే ప్రశ్న.

శ్రీహరి భగవంతుడన్న విషయం మహర్షికి తెలుసు. అయినా లోకానుగ్రహం కోసమే పరీక్షించాడు. అనగా తాము ఐశ్వర్యగర్వాన్ని కోపతాపాల్ని ప్రక్కనపెట్టి భక్తిభావంతో విప్రుల్ని పూజిస్తే అటువంటి యశస్సు శాశ్వతంగా ఉంటుందని, లోకంలో ఉండే పామరులకు దృష్టాంత పూర్వకంగా చెప్పడం జరిగింది.

భగవంతుడు కూడా భక్తుల్ని పరీక్షించిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. భార్యాపిల్లలకు కష్టాలు కలిగిస్తాడు, సంపదల్ని పోగొడ్తాడు ఇంకా ఎన్నెన్నో కష్టాల్ని కలిగించడం మనం విన్నాం. అన్నింటినీ ఓర్చుకొన్న వారికే ముక్తి లభిస్తుంది. భగవద్భక్తి కలిగిన భక్తులు ఇటువంటి కథల్నే చదివి వారిలో ఓర్పును పెంచుకోవాలి. భగవద్భక్తియే ప్రధానమన్నదే ఇందులోని సారం.

శ్రీకృష్ణుడు శివమాహాత్మ్యమును తెలుపుట

(ఈ భాగం మహాభారతం అనుశాసనికపర్వం 16వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ధర్మరాజు శ్రీకృష్ణునికి నమస్కరించి ఇలా అడిగాడు. "మహానుభావా! దుర్వాసుడు శంకరుడికి జన్మించాడంటారు. గదా. నాకా శంకరుని మాహత్మ్యాన్ని గూర్చి తెలుపు" అని అడిగాడు.

అందుకు శ్రీకృష్ణుడు "ధర్మనందనా! శివుని మాహత్మ్యాన్ని చెప్పాలంటే వెయ్యిజన్మలెత్తినా చాలవు. శతరుద్రీయానికి అధిపతి అతడే. నేను ప్రతిరోజు శతరుద్రీయాన్ని పారాయణం చేస్తాను. త్రిమూర్తులలో అతడే ముఖ్యుడు. అతడి కోపానికి లోకాలే భస్మమైపోగలవు. అతడు అనుగ్రహించగలడు. నిగ్రహించనూ గలడు. ధర్మవిరుద్ధంగా ప్రవర్తించే వారిని బూడిద చేస్తాడు. ఎవరైతే అతణ్ణి భక్తితో ప్రార్థిస్తారో వారందర్నీ కాపాడి భోగభాగ్యాలిస్తాడు. పూర్వం త్రిపురాసురులు లోకాలన్నింటినీ బాధిస్తుంటే దేవతలంతా శివుణ్ణి ప్రార్థించారు. అప్పుడా పశుపతి ఒక బాణాన్ని తీసుకొని తొడపై ఉంచుకున్నాడు. కొంతసేపటికా బాణం ఒక బాలుడయ్యాడు. ఆ బాలుడే ఈ దుర్వాసుడు. ఆ దుర్వాసుడే పూర్వం మా ఇంటికి వచ్చిన ముని.

ధర్మరాజు : కృష్ణా! ఆ పరమేశ్వరుడి ముఖ్యమైన నామాలు చెప్పు. కరుణిస్తే భోగభాగ్యాలిస్తాడని చెప్పావు కదా. వాటిని చెప్పు.

శ్రీకృష్ణుడు : ధర్మనందనా! మహాదేవుని గుణగణాలు చెప్పాలంటే ఎన్ని జన్మలెత్తినా సరిపోవు. అయినా నువ్వడిగిన ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే భాగ్యాన్ని నాకు కలిగించావు. చెప్తాను విను.

శివుడికి రెండు దేహాలున్నాయి. ఒకటి ఉగ్రరూపం. అది కోటి సూర్యాగ్నులకన్నా అధికమైన తేజస్సు గలది. రెండోది శాంతరూపం. బ్రహ్మచర్యాది నియమాల రూపంలో ఉంటాయి.

ఏదైతే ఉగ్రరూపాన్ని, ప్రతాపాన్ని ప్రదర్శిస్తుందో అట్టి రూపాలన్నీ 'రుద్ర' నామాలు కలిగి ఉంటాయి. దేవతలలో మహత్తరుడవటం చేత మహాదేవుడయ్యాడు. ధూమ్రరూపాత్మకమై జటలుండటం చేత ధూర్జటి నామధేయుడయ్యాడు. సత్కర్మలన్నింటికీ శుభాలనిచ్చేవాడు కాబట్టి శివుడయ్యాడు. అనేక నేత్రాలు గలవాడవడం వలన సర్వ శతశ్చక్షుడన్న పేరు సార్థకమైంది. భూతాలకు, పశువులకు అధిపతి కావడం వలన పశుపతి అన్న నామం కలిగింది. శివపూజలన్నింట్లోకీ లింగార్చన ప్రశస్తమైనది. అటువంటి పూజలకు సంతృప్తుడైన శివభగవానుడు భక్తులకు వశుడవుతాడు. రాజా! ఇన్నిమాటలెందుకు, ధర్మ కార్యాలన్నింటికీ ఆ మహాదేవుని భజించుటయే శ్రేష్టమని నమ్మి నేను చేస్తున్నట్లే ఎల్లవేళలా శివపూజలు చేస్తూ ఉండు.

భీష్ముడు దేహత్యాగము చేయుట

(ఈ భాగం శ్రీమహాభారతం అనుశాసనిక పర్వం 161వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

భీష్ముడు సకల నీతులు, ధర్మములు, పురాణ కథలను వినిపించి ధర్మరాజాదులకు, మహర్షులకు దుఃఖాన్ని తొలగించి కృతార్థుల్ని చేశాడు. ఆ రోజు మాఘమాసం, శుక్ల పక్షం, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించింది. ధర్మరాజుకు హస్తినాపురం వెళ్ళి ధృతరాష్ట్రాదులందర్నీ పిలుచుకొని రమ్మని పంపాడు. ధృతరాష్ట్రాదులంతా అల్లంత దూరానే రథాలను నిలిపి అణకువతో గాంగేయుదున్న చోటుకు కాలినడకన చేరుకున్నారు.

ధర్మరాజు దగ్గరగా వెళ్ళి "అనఘా! గంగానందనా! నేను ధర్మరాజును. కావలసిన సంభారాలన్నీ తెచ్చాను. అగ్నులను, ఋత్విజులను వెంటతీసుకొని వచ్చాను. ఒక్కసారి కళ్ళుతెరచి వీళ్ళందర్నీ చూడు" అని ప్రార్థించాడు. ఆ మాటలు చెవిన పడగానే గంగాతనయుడు ధర్మరాజు చేతులు పట్టుకొని 'నాయనా! చాలా సంతోషంగా ఉంది. నాకు అవసరమయ్యేవన్నీ ఏర్పాటు చేశావు. నీవు నా ప్రక్కనే ఉండటం నా అదృష్టంగా భావిస్తాను అని అంటూ ధృతరాష్ట్రుని దగ్గరకు పిలిచి ఇలా అన్నాడు. "ధృతరాష్ట్ర మహారాజా! నువ్వు వేదవేదాంగాలన్నీ చక్కగ చదువుకున్నావు. పెద్దలను సేవించావు. ధర్మసూక్ష్మాలన్నీ ఎరిగిన వాడవు. వ్యాసమహర్షి దేవ రహస్యాలెన్నింటినో నీకు తెలిపాడు. నిష్కళంక మనీషుడవు. కనుక జరిగిన విషయాలను మనస్సులో పెట్టుకొని దుఃఖించకు. పాండురాజు పుత్రుల్ని నీ పుత్రులుగానే స్వీకరించు. వాళ్ళుచేసే శుశ్రూషలు నీ మనస్సుకు ఊరట నిస్తాయి. నీ పుత్రులంతా అధర్మపరులు. క్రూరులు. అట్టివారిని తలచుకొని దుఃఖించవద్దు" అని ఉపదేశించి శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "దేవదేవా! ముకుందా! త్రివిక్రమా! ఇదే నీకు నమస్కరిస్తున్నాను. శంఖచక్రగదాధరా! సర్వలోకాధీశుడవు నీవే! విరాట్టువు. త్రిమూర్తి స్వరూపుడవు. నీకు పరమ భక్తుడనై, అవివాహితుడనైన నన్ను కాపాడు. పుండరీకాక్షా! పురుషోత్తమా! నిత్యము నిన్నే నమ్మి ఉన్నాను. ఆలు బిడ్డలు లేనివాడను. కనుక అధిక కారుణ్యంతో కాపాడు. దేహత్యాగానికి అనుమతించు. ఈ పాండు కుమారులకు మార్గదర్శకుడవు కమ్ము. దుర్మార్గుడైన దుర్యోధనునికి నయానా భయానా చెప్పి చూశాను. ఎక్కడ పుండరీకాక్షుడుంటాడో అక్కడే ధర్మముంటుందని నెత్తిన నోరు పెట్టుకొని చెప్పాను. చివరకు విజయం ఆ ధర్మాన్నే గదా వరించింది? వాడు నామాటలు పెడచెవిన పెట్టాడు. నరనారాయణుల మహత్త్వము నేనెరుగుదును. ఆ ఆది మునులే ఈ కృష్ణార్జునులని నారదముని నాకు ముందుగానే తెలిపాడు. మహానుభావా! అట్టి నువ్వు నాకు దేహత్యాగానికి అనుజ్ఞ ఇస్తే నాకు పరమగతి కలుగుతుంది" అని ప్రార్థించాడు.

శ్రీకృష్ణుడు భీష్ముని ఊరడిస్తూ ఇలా అన్నాడు. "సత్యనిరతా! నీకనుజ్ఞ ఇస్తున్నాను. ఈ దేహాన్ని విడిచిపెట్టు. పూర్వం వలె వసువులను చేరుకొనుము. నువ్వింత సుదీర్ఘమైన జీవితం గడిపినా అందులో నలుసంతైనా పాపం లేదు. మహాతేజశ్శాలివి. పితృభక్తి కలవాడవు. రెండవ మార్కండేయుడవని

లోకాలన్నీ నిన్ను శ్లాఘిస్తాయి. ఏ భక్తి వలన మృత్యువు నీకు భృత్యువయ్యిందో అదే భక్తి నీకు తోడుగా నీడగా వస్తుంది" అని శ్రీకృష్ణుడనగా భీష్ముడు సంతోషించి బంధువులందర్నీ దగ్గరకు పిలిచి కౌగలించుకొని వీడ్కోలు చెబుతూ ధర్మరాజుతో ఇలా అన్నాడు "ఆర్యా! బ్రాహ్మణులంతా పూజించదగినవారు. పూజ్యులు. ఋత్విజుల్ని, ఆచార్యులను విశేషించి పూజనీయులని మరువవద్దు" అన్నాడు.

అంతట శంతనుడు యోగాభ్యాస బలంతో వాయువును నిరోధించి ఊర్ధ్వగమనం చేసి ఆత్మ శిరస్సును ఛేదించుకొని ఒక నక్షత్రంలా ఆకాశం వైపు ప్రయాణం కొన్ని క్షణాల్లో అదృశ్యమైపోయింది. దేవతలు దుందుభులు మ్రోగించారు. ఆకాశం నుండి పూలవర్షం కురిసింది.

విశేషాలు : ఈ వృత్తాంతంలో తెలుసుకోదగిన అంశాలు రెండు.

1. శివకేశవులకు అభేదమన్న విషయం: ఈ విషయం అనేక పురాణాలలో చర్చించబడింది. కావున అది చర్చించదగినది కాదు.

2. భీష్ముని స్వచ్ఛంద మరణము : తమ ఇష్టం వచ్చినప్పుడే దేహాన్ని విడిచిపెట్టే శక్తి ఎవరికైనా ఉంటుందా? అన్న సందేహం కలుగవచ్చు. యోగాభ్యాసం చేసే వారందరికీ ఈ శక్తి ఉంటుంది. దాన్నే ప్రాణాయామం అని కూడా అంటారు.

అటువంటి వారి శరీరంలోకి భయంకర విషం ఎక్కించినా కూడా అది శరీరంలో వ్యాపించదు. ఎందువలన. శరీరంలో అంతటా వాయువుతో నిండి ఉండటమే కారణమని 'త్రిపురాసుర సముచ్ఛయం" లో చెప్పబడింది.

పతంజలి యోగశాస్త్రంలో కూడా అటువంటి స్థితిలో ఉన్న యోగి ఆహారాన్ని కోరదని చెప్పబడింది. అమృతధారలు ద్విసప్తతి సహస్ర నాడీ మార్గంలో వెదజల్లుచూ అమృతధారలు వర్షిస్తూ ఉంటుందని సారం.

అట్లాగే యోగీసూత్ర వృత్తిలో కూడా యోగి స్వేచ్ఛగా మృతి చెందగలడని తెలుపబడింది.

శ్రీకృష్ణభగవానుడు కూడా "కర్మభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున" అని అర్జునుడికి ఉపదేశించారు.

దీనిని బట్టి స్వచ్ఛంద మరణం యోగులందరికీ సాధ్యమైనప్పుడు గాంగేయునివంటి మహాత్ములకు స్వేచ్ఛామరణం పొందే శక్తి ఉండటంలో ఆశ్చర్యమేముంది?

శ్రీకృష్ణుడు అర్జునునకు తత్త్వజ్ఞానము బోధించుట

(ఈ భాగం మహాభారతం అశ్వమేధ పర్వం, 6 నుండి 56వ అధ్యాయాలనుండి గ్రహించబడింది.)

అర్జునుడు : యుద్ధసమయంలో నా మనస్సు కలత చెందింది. నేను క్రుంగి పోయి ఉన్నప్పుడు నువ్వు కొన్ని ఆత్మబోధకమైన వాక్యాల్ని చెప్పావు. ఆ మాటల సారాంశాన్ని మనస్సులో పదిలపరచుకోలేకపోయాను. కృష్ణా! ఆ వాక్యాల్ని మళ్ళీ మరోమాటు చెప్పు. వినాలని ఉంది. (యుద్ధసమయంలో అర్జునుడు విషాదంలో "నాకు రాజ్యమూ వద్దు, రాజ్య సుఖాలు వద్ద" న్నప్పుడు శ్రీకృష్ణుడు భక్తి జ్ఞాన కర్మలను, మనుష్యతత్త్వాన్ని, పరమేశ్వర విభూతిని, గుణశ్రద్ధత్రయాలను బోధించి నిష్కామ కర్మ చెయ్యడం ద్వారా శోకాన్ని దాటవచ్చుని బోధించి యుద్ధం చెయ్యమని ప్రోత్సహించాడు. ఏ ఫలాపేక్షా లేకుండా కర్మ చేసినప్పుడు అది యోగమవుతుందని చెప్పినా, అర్జునుడు ఆనాడు అప్పటికప్పుడు కొద్దిగా తెలిసినట్లనిపించినా ఆ తత్త్వాన్ని ఆ తర్వాత మరచిపోయాడు. అయినా ఏదో కొద్దిగా లీలగా జ్ఞాపకముంది. మళ్ళీ దాన్ని గుర్తు చేసుకునే ప్రయత్నం చేశాడు.)

శ్రీకృష్ణుడు : (నవ్వుతూ) అర్జునా! 'నీకు బుద్ధి, శ్రద్ధ రెండూ లేకుండా పోయాయి. మహా పరాక్రమశాలీ! ఆనాడు చెప్పిన మహావాక్యాలు బ్రహ్మపదసాధకాలు. ఆ వాక్యాల అర్థాన్ని నువ్వు మనస్సులో నిలుపుకోలేక పోయావు. మళ్ళీ ఆ మహావాక్యాలు చెప్పాలంటే వీలవుతుందా? (మహావాక్యాలు అట్లా తమకు తాముగా బయట పడాలేగాని మాటిమాటికీ చెప్పాలంటే వీలుకానివి.)

బ్రహ్మపదప్రాప్తికి సంబంధించిన కథ ఒకటున్నది. చెప్తాను విను. నావద్దకు కాశ్యపుడనే బ్రాహ్మణుడొకడు వచ్చాడు. నేనతడిని "అయ్యా! నాకు తత్త్వజ్ఞానం బోధించండి" అని అడిగాను. అప్పుడా బ్రాహ్మణుడు తానొక చోట ఒక సిద్ధుణ్ణి చూశానని, ఆ సిద్ధుడు ఇంద్రియాల్ని జయించినవాడని, జ్ఞానం విజ్ఞానం రెండూ తెలిసిన వాడని, సంసారాన్ని, భార్యను వదిలేసిన వాడని, మహాజ్ఞానులు కూడా ఆయన్ను సేవిస్తారని చెప్పాడు. ఆ కాశ్యపుడికి ఆ సిద్ధుడు బోధించిన వాక్యాలను నాకు చెప్పాడు. ఆ వాక్యాలనే నేనిప్పుడు నీకు చెప్తాను. శ్రద్ధగా విను.

(శ్రీకృష్ణుడు వేదాంతం చెప్పమని కాశ్యపుడనే బ్రాహ్మణుని అడిగాడు. ఆ కాశ్యపుడికి సిద్ధుడు బోధించిన వాక్యాల్ని శ్రీకృష్ణుడికి చెప్పాడు. ఆ వాక్యాల్నే శ్రీకృష్ణుడిప్పుడు అర్జునునికి చెప్తున్నాడు.

జ్ఞానం లోకనీతికి సంబంధించింది. దాన్నే లోకజ్ఞానం అంటారు. అనేక ధర్మాలు, న్యాయపద్ధతులు, ఆర్థిక, సామాజిక పరిజ్ఞానం అంతా లోకజ్ఞానం క్రిందకే వస్తాయి. విజ్ఞానం అంటే విశేషజ్ఞానం. ఇది మనోజగత్తుకు సంబంధించింది. దీన్ని మించినదే ప్రజ్ఞానం. దీన్నే బ్రహ్మపదమంటారు. ఇది "ప్రజ్ఞానం బ్రహ్మ" అని వేదోక్తి లోనుండి పుట్టింది. సిద్ధుడు యోగికాడు. అవధూత కాడు. కేవలం సాధకుడు. అందుకే ఇంద్రియాల్ని వశంలో ఉంచుకొని ఇంటిని, ఇల్లాలిని వదలి జ్ఞానుల సంపర్కంలో నివసిస్తూ ఉంటాడు. ఇతడు 'బోధకుడు' గా తగినవాడు. అందకే అతడు చెప్పిన కథను శ్రీకృష్ణుడు అర్జునునికి వినిపిస్తున్నాడు.)

భక్తిగా తనను ఆశ్రయించి ఉపదేశం పొందేందుకు వచ్చిన వాడున్నూ, పరమ పవిత్రుడున్నూ,

వినయ శీలి అయిన బ్రాహ్మణుని చూసి సిద్ధుడు ఇలా అన్నాడు.

సిద్ధుడు : బుద్ధిమంతుడా! పుణ్యం కలిగించే కార్యాలను చేయడం వలన కోరుకున్న ఐహిక సుఖాలన్నీ పొందాను. గొప్ప ప్రయత్నం చేసి అటువంటి స్వర్గాన్ని పొందిన తర్వాత ఒకే ఒక్క క్షణంలో భ్రష్టుడనై జారిపడిపోయి కామక్రోధాది ఎన్నో అపరిశుభ్రతలకు లోనై జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉండిపోయాను. ఎంతమంది తల్లిదండ్రుల్ని, అన్నదమ్ముల్ని, కొడుకుల్ని చూశానో, ఎన్నెన్ని జాతులలో పుట్టానో లెక్కలేదు. ఎన్ని రకాల చనుబాలు త్రాగానో, ఎంతమంది స్నేహితుల్ని పోగొట్టుకున్నానో, ఎంత ధనాన్ని పోగొట్టుకున్నానో చెప్పలేను. ఎన్నో దుర్దశల్ని అనుభవించాను.

శారీరక, మానసిక బాధలన్నీ నరకానికి పోకుండా ఇక్కడే అనుభవించాను. ఎన్నోసార్లు చిత్రహింసలకు గురి అయ్యాను. అన్నిరకాల సుఖదుఃఖాల్ని అనుభవించాను. అనేక అవమానాలు పొందాను. ఎన్నో సార్లు చచ్చిపుట్టాను. ఈ విధంగా కష్టసుఖాల్ని అనుభవిస్తూ విసుగుపుట్టి లోకవ్యాపారాలన్నీ పూర్తిగా వదిలేశాను. ఆ తర్వాతనే జ్ఞానోదయమై ఆత్మ లాభం చేత 'సిద్ధ సమాధి స్థితి' ఏర్పడింది. సాక్షీభూతంగా ఉంటూ మనుషులతో సంబంధాలు పెట్టుకోకుండా ఉన్నంతకాలం అంతా మంచే జరుగుతుంది. కనుక ఇక ముందు కూడా ఇంతకన్నా ఉన్నతమైన దశలనే పొందుతాను. చివరగా బ్రహ్మానంద స్థితిని చేరుకోవడం కూడా ఏమంత కష్టం కాబోదు సుమా!

ఓ బ్రాహ్మణోత్తమా! నీలో వినయం ఉంది. ఆత్మ శోధన ఉంది. అందుకే నన్ను గురువుగా గుర్తించి వచ్చావు. నువ్వు నాకు నచ్చావు. ప్రసన్నుడనయ్యాను. నిన్ను శిష్యుడిగా స్వీకరించాను. నానుండి ఏం పొంద దలచుకున్నావో స్పష్టంగా చెప్పు. అది నీకు దక్కేట్లు చేస్తాను.

బ్రాహ్మణుడు : ఓ మహాత్మా! నువ్వు గొప్ప కరుణా సముద్రుడవు. నాకు పరతత్త్వాన్ని గూర్చి తెలిపి ధన్యుణ్ణి చెయ్యి. జనన మరణ బంధాల నుండి నాకు విముక్తి కలిగేట్లు అనుగ్రహించు.

సిద్ధుడు : ఓ బ్రాహ్మణోత్తమా! నీకు పరతత్త్వాన్ని బోధిస్తాను. నువ్వు ముక్తుడవయ్యేందుకు అవసరమైనవన్నీ బోధిస్తాను. అయితే ఇవన్నీ ఒక క్రమంలో చెబుతాను.

పుణ్యాత్మా! ధర్మసాధన చెయ్యాలంటే శరీరం గొప్ప సాధనం. ధర్మాన్నాచరిస్తే విశిష్టమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. కనుక మానవుడు ఎట్టి పరిస్థితుల్లోనైనా శరీరాన్ని కాపాడుకోవాలి.

ఇక నీకు ఏమరుపాటు పొందే పద్ధతులను వివరిస్తాను. విను. మూర్ఖుడు కాలనియమాన్ని పాటించకుండా ఆహారం తింటూ ఉంటాడు. తినే ఆహారం తన శరీరానికి పడుతుందా! పడదా అన్న విచక్షణ లేకుండా కనిపించిందల్లా తింటూ ఉంటాడు. అతివృష్టి అనావృష్టి అన్నట్లు తింటే అతిగా తింటాడు, లేదంటే ఉపవాసాలుంటాడు. తిన్న వెంటనే మళ్ళీ తింటాడు. తిన్నంత తిని నిద్రపోతాడు. మైథునంలో ఎక్కువ పరవశుడవ్వాలనే ప్రయత్నంలో నీరసించిపోతాడు. అటువంటి వ్యక్తిని వాతపిత్త శ్లేష్మాలు పట్టుకొని పీడిస్తాయి.

శ్లేష్మాది రోగ వికారాలు

ఓ పుణ్యాత్మా! మనిషి దేహాన్ని కాపాడుకోవడానికి ఏయే పనులు ఎప్పుడెప్పుడు చెయ్యాలో అట్లాగే చెయ్యాలి. లేకపోతే కామక్రోధాలు విజృంభించి దేహాన్ని నశించేట్లు చేస్తాయి. అనగా పైత్య వికారాదులు పుట్టి నియంత్రించలేని స్థితికి దారి తీస్తాయి. అటువంటి స్థితిలో వాటిని నివారించడం అసాధ్యమై ప్రాణాల్నే తీసేసే ప్రమాదం ఉంది. వికారాలు విజృంభిస్తే వాటి ప్రభావం మర్మస్థానాలపై పడి ప్రాణాలు తీస్తాయన్నదే దీని సారం.

రోగవికారాల్లో 'శ్లేష్మం' అనేదొకటుంది. అది కళ్ళె మొదలైన రూపాల్లో ఇంద్రియాల్ని లోపల బయట కప్పివేస్తుంది. క్రమంగా గొంతులోకి వ్యాపించి ఊపిరి తీసుకోవడానికి అడ్డుపడుతుంది. దాంతో జీవుడు ఎగశ్వాస, దిగశ్వాస లతో బాధపడి, ఇక ఆ దేహంలో ఉండలేక బయటకు వెళ్ళిపోతాడు. కనుక శ్లేష్మం ప్రాణాలు తీసే రోగవికారంగా గుర్తుంచుకోవాలి. కాళ్ళు చేతులు మొదలైన అవయవాలన్నీ బుద్ధి చేత ప్రేరేపించబడి ముక్కు, నోరు, చెవులు వంటి నవరంధ్రాల ద్వారా విషయసుఖాల్ని అనుభవిస్తూ ఉంటుంది. ఎప్పుడైతే కళ్ళె ఈ నవరంధ్రాలకు అడ్డుపడుతుందో అప్పుడు ఇంద్రియాలు వాటి శక్తిని కోల్పోతాయి. దాంతో అన్ని అవయవాలు తమ కార్యకలాపాల్ని స్థంభింపజేస్తాయి.

ఇక వాతం వల్ల కలిగే దోషాల్ని చెప్తాను. మహాత్మా! వాతం క్రొవ్వును కరిగించి సంధిస్థానాల్ని బలహీనం చేస్తుంది. కీళ్ళ వాతం, పక్ష వాతం, వంటి రోగాలకు తల్లి వంటిది. వాత గుణ ప్రసార ధర్మాలు సరిగా ఉన్నప్పుడే నాలుకను తరచుగా కదల్చగలుగుతారు. తరచుగా కాళ్ళూ చేతుల్ని ముడుచుకోవడం, చాచుకోవడం వంటి పనులు సక్రమంగా చేసుకో గలుగుతారు. ఒక్కొక్కటిగా ఉండే ఈ వాత దోషాలన్నీ ఒక చోటకు చేరితే సన్నిపాతం అంటారు. బాలింతలకు వచ్చే సంధి లేదా మూర్ఛ, మానసిక దౌర్బల్యం వంటి రూపాల్లో బయటపడుతుంది. చివరకు ప్రాణాల్ని తీస్తుంది.

ఈ విధంగా బయటపడ్డ జీవుడు తాను ఇంతకు పూర్వం చేసిన కర్మ ఫలాలకు తగిన గతులను (సుఖదుఃఖాలను) ఆయా సమయాల్లో పొందుతాడు. (జీవం అంటే ప్రాణం. జీవాన్ని ధరించేవాడు జీవుడు. దేహం వేరు, జీవుడు వేరు. జీవుడు దేహంలో ఉండటం వలన వాడు 'మనిషి' అవుతున్నాడు. జీవుడు వెళ్ళిపోగానే ('దేహం') శవం మాత్రం మిగులుతోంది.

ఓ పాపరహితుడా! విను. జీవుడు తాను చేసిన పాపపుణ్య కర్మల ఫలాన్ని అనుభవించడానికి యోగ్యమైన జన్మను పొందుతాడు. మళ్ళీ మళ్ళీ ఇట్లాగే జనన మరణాలు సంభవిస్తూ ఉంటాయి. (జీవాత్ముడు అన్నా జీవుడే. ఒక నిర్దుష్టమైన దేహాన్ని పొందినప్పుడు ఆత్మను జీవాత్మ అంటారు. సర్వాంతర్యామియై ఉండే ఆత్మను పరమాత్మ అంటారు. గతం అంటే పోయినది లేక మరణం. అగతం అంటే జననం లేక వచ్చినది. అనగా ఒక శరీరం పోయి మరొక శరీరం వస్తుంది. దీన్నే జనన మరణాలని అంటారు.)

ఈ విధంగా (విధి నియామకం చేత) పాపం చేసిన వారు నరకాన్ని, పుణ్యం చేసిన వారు స్వర్గాన్ని పొందుతున్నారు. అనగా ఎటువంటి బంధాలు లేనిది (జనన మరణాలు లేనిది) అయిన

మోక్షాన్ని పొందలేరు.

బుద్ధిమంతుడా! స్వర్గ నరకాలే కాకుండా ఇంకా కొన్ని ఊర్ధ్వలోకాలు కూడా ఉన్నాయి. ధర్మపరులుగా బ్రతికిన వారు నక్షత్ర మండలం, చంద్రమండలం, సూర్య మండలాల్లో నివసిస్తారు. అక్కడా మంచి చెడూ అనే తేడాలుండటం వలన ఆ లోకాలు కూడా శాశ్వతమైనవి కావు. (ఉదాహరణకు దేవ గురువైన బృహస్పతికి అసూయ వంటి గుణాలు పోలేదు. అట్లాగే ధర్మరాజుకు కూడా అసూయ నశించలేదని స్వర్గారోహణ పర్వంలో చెప్పడం జరిగింది.)

ఓ బ్రాహ్మణుడా! చేసిన పుణ్యం ఎంతకాలం ఉంటాయో అంతవరకే జీవుడు ఆయాలోకాల్లో భోగాలు అనుభవిస్తాడు. ఆ తర్వాత ఆ లోకం నుండి బయటకు పంపేస్తారు. అటువంటి స్థానాన్ని శాశ్వత స్థానమని చెప్పలేం గదా. అనగా మోక్షం తప్ప మిగిలినవేవీ శాశ్వత పథాలు కావు.

ఓ విప్రోత్తమా! గర్భం ఎట్లా వస్తుందో చెప్తాను, విను. నేను లేక అహంభావం నుండి క్రోధం, దుఃఖం వంటి భావాలన్నింటికీ దాసుడై (మన్యువు అంటే ఇదే) జీవుడు శుభాశుభఫలాల మిశ్రమ కర్మఫలాలను తప్పక అనుభవిస్తాడు. ఈ ఫలానుభవమే పుట్టుకకు కారణం.

ఇక గర్భం ఎట్లా సంభవిస్తుందంటే, శుక్ల శోణితాలు తగినట్లుగా కలసి స్త్రీ గర్భంలో బీజంగా ఒకచోట నిలుస్తాయి. అట్లా కలవడం బ్రహ్మకుండే సృష్టి (శక్తి) సామర్థ్యం. అట్లా శుక్ల శోణితాలు కలసి పిండంగా వృద్ధి చెందుతాయి. ఆ పిండం కాలక్రమంలో అవయవాల్ని ఏర్పరుస్తుంది. (శుక్ల శోణితాల కలయికతో ఏర్పడిన జీవశక్తియే పిండంలో ప్రాణశక్తిగా ఇమిడి ఉంటుంది. అందువల్లనే విగ్రహాల్ని పూజచేసేటప్పుడు ఆ ప్రాణశక్తిని ఆవాహన చేస్తాం. కనుక దేహం వేరు ప్రాణం వేరు. అట్లాగే పిండం వేరు, పిండం లోని జీవశక్తి వేరు. దానినే బ్రహ్మ శక్తిగా చెప్పబడింది.)

గర్భంలోనుండి బయట పడిన జీవుడు తన పూర్వజన్మ కర్మ ఫలాలకు తగినట్లుగా జీవనం సాగిస్తాడు. ఆ కర్మ ఫలానుభవం పూర్తి కాగానే మరణించి మళ్ళీ తన కర్మ ఫలాలకు తగిన విధంగా జన్మిస్తాడు. (కర్మఫలం అనుభవించకుండా మిగిలి ఉండటమే జన్మకు కారణమని, కర్మానుభవం పూర్తికాగానే మరణానికి కారణమని, దీనినే జనన మరణ చక్రభ్రమణమని అంటారు.)

కనుక మానవుడు ఉత్కృష్టమైన మోక్ష స్థానాన్ని పొందేవరకు ఈ చావు పుట్టుకలు ఉంటూనే ఉంటాయి. కాబట్టి ముక్తిని ఎలా సాధించాలో చెప్తాను, విను. దానం, శమం, దమం, బ్రహ్మచర్యం, దయ, పరధనాన్ని గాని, పరస్త్రీని గాని కోరకుండా ఉండటం, ఇంద్రియాల్ని నిగ్రహించడం, తల్లిదండ్రులను పూజించడం, గురువులను పూజించడం, దేవతల్ని, అతిథుల్ని పితృదేవతల్ని పూజించడం, సత్యవాక్పరిపాలన, శుచిగా ఉండటం, శుభ కార్యాల విషయంలో నిష్ఠ కలిగి ఉండటం, ధృతి కోల్పోకుండా ఉండటం, క్రూరత్వాన్ని నిరసించడం అనే ఈ గుణాలన్నీ పుణ్య చరిత్రకు నిదర్శనాలు. ఈ విధమైన జీవితాన్ని సాధన చేస్తే మోక్షాన్ని పొందేందుకు ప్రయత్నించ గలుగుతాడు.

ఇంకో ముఖ్యమైన సాధన ఉన్నది. అదే ధర్మాన్ని ఆచరించడం. ఈ ధర్మాచరణ గురువునుండి నేర్చుకున్న విద్యను చక్కగా ఆకళింపు చేసుకోవాలి. ఈ విధమైన ధార్మిక జీవనాన్ని ఒక వ్రతంలా గడుపుతూ, కేవలం బ్రహ్మను ఉపాసించడంలోనే నిష్ఠ కలిగిన మానవుడికి అగ్ని, యాగము, సమిధలు,

నీరు మంత్రము ఉపద్రష్ట అంతా బ్రహ్మమే. బ్రహ్మపథంలో పయనించడం అంటే ఇటువంటి సత్కర్మల్ని ఆచరించడమే. సంతోషం దుఃఖం అనే పెనుగాలుల చేత దెబ్బలు తినడు. దట్టమైన మోహమనే చీకటికి భయపడడు. కాలక్రమంలో ఆ మహాపురుషుడు సంసార బంధవిముక్తిని పొందగలుగుతాడు.

తత్త్వజ్ఞాన విశేష ప్రదర్శనము

పూర్వం బ్రహ్మ సృష్టి ప్రారంభించే ముందు "ప్రధాన" అనే తత్త్వాన్ని కల్పించి ప్రాణం పోశాడు. దాన్నే 'క్షర' మంటారు. దానికి అతీతమైన తత్త్వాన్ని 'అక్షర' మంటారు. ఈ రెండూ తత్త్వాల వల్లనే భూతముల పుట్టుకకు బీజం ఏర్పడుతుంది. ఈ విషయాన్ని వేదాలు కూడా ప్రతిపాదించాయి. ఈ విధంగా జీవులన్నింటికి బ్రహ్మ చావు పుట్టుక నిర్దేశించడం వలన బీజం నిరంతరం జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటుంది. అట్లా సంసార చక్రంలో తిరుగుతున్న జీవుడు పుణ్యకర్మఫలం చేత సుఖదుఃఖాలు అశాశ్వతమని, దేహం అపవిత్రమైనదని, కనిపించే పదార్థాలన్నీ నశించేవని, కర్మలో నిరంతరం కూరుకొని పోయి ఉండటం ఒక రోగమని ఆత్మజ్ఞానం చేత తెలుసుకొంటాడు. అట్లా తెలుసుకున్న వాడు తన్ను ఆవేశిస్తున్న మోహాన్ని (అజ్ఞానాన్ని) ప్రక్కకు నెట్టి, మోక్షం పొందాలన్న తీవ్ర ఆకాంక్షతో సంసార చక్రంలో బంధితుడు కాకుండా జాగ్రత్త పడతాడు. పుట్టుక, రోగం, ముసలితనం, చావు వంటివన్నీ ప్రకృతి కరణములేనని తెలుసకోవడం వలన శాశ్వతపదమైన మోక్షం కోసం ప్రయత్నిస్తాడు.

ఎవరు ఎట్లాంటివారో గుర్తించి విజృంభించే ఆలోచనల్ని అణచివేసే వాడిని "సంయమి" అంటారు. అందరిలోను సమానమైన మిత్రత్వాన్ని పాటించి, శమము పాటించే వాడిని, కామోద్రేకాల్ని జయించిన వాడిని "సమదర్శి" అంటారు. మానావమానాల వంటి ద్వంద్వాలన్నింట్లోను ఆత్మను దర్శించగలిగినవాడు 'ఆత్మజ్ఞాని' ఈ ముగ్గురూ (సంయమి, సమదర్శి, ఆత్మజ్ఞాని) ముక్తి స్థానాన్ని అందుకుంటారు. (ఈ మాటే శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఇంద్రియ జయం, సమదర్శనం, ఆత్మజ్ఞానం అన్న ఈ మూడు యోగి లక్షణాలని, యోగులే ముక్తిని పొందగలరని, అయితే మార్గాలు భిన్నంగా ఉంటాయని బోధించాడు. భగవద్గీతలో బోధించిన విషయాల్నే శ్రీకృష్ణ పరమాత్మ ప్రతినిధిగా సిద్ధుడు ఇక్కడ చెబుతున్నాడు.)

శాశ్వతమైన మోక్షాన్ని పొందగలిగే వారు నలుగురుగా పెద్దలు చెబుతారు. 1. సుఖదుఃఖాల వంటి ద్వంద్వాలన్నింటినీ ఎవడు సమంగా చూస్తాడో, 2. అటు ధర్మలోలత్వంగాని, ఇటు ధర్మ శీలత్వం గాని ఎవడిలో ఉండవో 3. ఎవడైతే ధర్మార్థ కామాలను సంపూర్ణంగా వదిలేస్తాడో, 4. ఎవడు తాను కర్తను కాదన్న భావన, తాపత్రయం లేకుండా ఉంటూ, సుస్థిరమైన వైరాగ్యం కలిగి ఉంటాడో అట్టివారు నలుగురూ మోక్షానికి అర్హులవుతారు.

(ఈ చెప్పిన వన్నీ ద్వంద్వాలపై మోహాన్ని విడనాడటం, సమదర్శనం, నిష్కామకర్మ, అకర్తృత్వ భావన, వైరాగ్య భావనలో సుస్థిరత్వం వంటి అంశాలన్నీ భగవద్గీతలో బోధించబడ్డవే.)

కుమారా! ఏ ఆధారము లేకుండా నిలబడేదీ, శబ్దం చేత బోధించబడనిది, రస గంధ స్పర్శ

రూపములు లేనట్టిది, నిర్గుణమైనది, ప్రకాశించడమే లక్షణంగా గలది అయిన ఆ కాంతి స్థానాన్ని యోగాభ్యాస నిష్ఠుడైన "ఒక్కడు" మాత్రమే పొందగలుగుతాడు. (ఎందరో యోగులు ప్రయత్నిస్తే వారిలో ఎవడో 'ఒకడు' మాత్రమే ఆ పరమాత్మ తత్త్వాన్ని పూర్తిగా గుర్తిస్తాడని, తక్కిన వారంతా ఆ మహాప్రస్థానంలో ఏదో ఒక స్థాయిలో ఆగిపోతారు, లేదా వెనక్కు తిరిగి పోతారని గీతాకారుడు స్పష్టం చేశాడు.)

సంకల్పాలన్నింటినీ విసర్జించి, పరమశాంతిని స్థిరంగా మనస్సులో నిలిపుకొని, ఎవడు సాధన చేస్తాడో అటువంటి వాడు కర్ర, చమురు మొదలైన సాధనాలు లేకుండానే ప్రజ్వరిల్లే అగ్నివలె మోక్షస్థానాన్ని పొందగలుగుతాడు. ఈ విధమైన యోగులు పొందే స్థానం ఏదో ఇప్పుడు చెప్తాను. యోగసాధకాలు ఆ పదాన్ని పొంది ఆత్మానందాన్ని పొందుతారు. ఆ విషయం చెప్తాను విను. (యోగి పొందే ఆత్మ దర్శనమే పరమాత్మ దర్శనం. పరమాత్మనే ఉపనిషత్తులు బ్రహ్మమన్నాయి.)

మహాత్మా! ముంజ గడ్డిలోని అతి సూక్ష్మమైన ముల్లును ఎట్లా చూస్తామో ఆత్మను కూడా అట్లాగే చూడాలి. యోగులైన వారు ఈ దేహాన్ని ముంజగాను, ఆత్మను అందులోని సూక్ష్మాతి సూక్ష్మమైన పరకలుగా వేరుచేస్తారు.

(మంత్రపుష్పంలో 'నీవార శుకవత్తన్వీ పీతాభా స్వస్తి 'జాపమః' అన్న మంత్రంలో నీవారమంటే వడ్లగింజ. శూక అంటే మొన. వడ్లగింజ మొనను చూడడం ఎంత కష్టమో ఆత్మస్వరూపుణ్ణి తెలుసుకోవడం కూడా అంతే కష్టమని అర్థం. ముంజలోని పొరలు విషయమూ అంతే, ఉపనయనంలో బ్రహ్మచారికి కడ్తారు. అది సూక్ష్మమైన ముంజ పరకల్ని వేరుచేయడం ద్వారా ఒక "సూక్ష్మ గ్రాహిత, బుద్ధి కుశలత" ఏర్పడతాయి. మనిషిలో కూడా అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలనే పంచకోశాలను "శారీరకాలు" గా గుర్తిస్తారు. స్థూల, సూక్ష్మ, కారణ అనే మూడు శరీరాల్ని వరుసగా విశ్వ, తైజస, ప్రజ్ఞానమని వ్యష్టి దశలోనూ, విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులని సమిష్టి దశలోనూ పిలుస్తారు. ముంజలోని పరకలతో పోలిక కూడా ఇట్లాంటిదే.)

శరీరం నుండి జీవుడిని వేరుచెయ్యడం నేర్చుకున్న యోగి, సాధన పండిన తర్వాత అదే పద్ధతిలో తనలోని పరమాత్మను కూడా చూడడం నేర్చుకొని, జనన మరణ చక్రం నుండి బయటపడతాడు. అట్టి యోగికి రోగం, ముసలితనం, వంటి బాధలుండవు. నిత్య బ్రహ్మచర్యం వలన అబ్బిన అనుగ్రహ శక్తితో ఉత్తమ భక్తులకు పరమ పదాన్ని ప్రసాదించడానికి సమర్థుడవుతాడు.

(భగవానుడు తనకు జ్ఞానులకు తేడా లేదని భగవద్గీతలో చాలా సార్లు చెప్పాడు. అనగా తామూ స్వయంగా తరించిన వారు కాబట్టి ఇతరులను కూడా తరింపజేయగలరని భావం.)

ఈ శరీరం అశాశ్వతమని గుర్తించి ఎవరు ఆత్మ విషయంలో శ్రద్ధ కలిగి యోగసాధన చేస్తారో అతడు ఆత్మ నిష్ఠుడు కాగలుగుతాడు. అనగా వారు చేసే కర్మలన్నీ ఆత్మాభిముఖంగా ప్రసరిస్తాయి. అందువల్ల భయరాగద్వేషాదులన్నీ శరీరానికి సంబంధించినవి కాబట్టి యోగి వాటినుండి కూడా విముక్తుడవుతాడు.

యోగి అయిన వాడిని శస్త్రాలుగాని, అగ్ని గాని, నీరుగాని, బాధించవు. అటువంటి యోగి ఇంద్ర పదవిని కూడా ఆశించడు.

(శస్త్రాలకు దెబ్బతినడం, నీటిచే తడప బడటం, అగ్నిచే కాల్చబడటం వంటివన్నీ శాస్త్ర పరిభాషలో వికారాలు అంటారు. అనగా ప్రకృతి సంబంధమైన కార్యాల్ని వికారాలంటారు. అది లేనివాడు కాబట్టి యోగి 'నిర్వికారి'. ఇంద్రపదవి శాశ్వతమైనది కాదు కాబట్టి యోగి దానిని ఆశించడు.)

యోగి అంతర్ముఖుడై తననే చూసుకుంటూ గడపడం అంత తేలికైన పనేమీ కాదు. అట్లాంటి యోగికి ఎక్కడా సుఖం ఉండదు. ఆ స్థితిలో అనుష్టానం ద్వారా విసుగు చెందకుండా నడచుకోవాలి. ఆ అనుష్ఠానం ఎట్లాంటిదంటే, తనకు తెలిసిన మార్గంలో మనస్సును అంతర్ముఖం చేసి, అది ఎక్కడ దారిలో పడుతుందో అక్కడే స్థిరంగా నిలబడేట్లు అభ్యాసం చెయ్యాలి. అది ఎట్లాగంటే, మనస్సు లోపలకు పోయి దంతాలు, నాలుక, గొంతుక, హృదయాలలో దేనిపైన నిలుస్తుందో అక్కడే కదలకుండా నిలపాలి.

ఆ బ్రాహ్మణుడు నాతో ఇలా అన్నాడు. ఓ కృష్ణా! ఆ సిద్ధుడను నేనే. నీకు తెలియందేమున్నది? ఆ కాశ్యపుడు అడిగిన ప్రశ్నకు నా సమాధానం చెప్పి పంపాను. అతణ్ణి అటుపంపి నీ దర్శనం చేసుకోవడానికి వచ్చాను అని చెప్పి బ్రాహ్మణుడు మాయమై పోయాడు.

ఓ అర్జునా! పరమహితాన్ని కలిగించే ఈ వాక్యాలన్నీ విన్నావు గదా? ఆనాడు యుద్ధభూమిలో, విషాదంలో ఉన్నా నీకు ఆ బ్రహ్మ పదప్రాప్తిని గూర్చి నేను చెప్పాను. గుర్తున్నదా? ఎవడైతే మమతానుబంధాలను పూర్తిగా విడిచిపెట్టి, ఇంతవరకు బోధించిన మార్గంలో మోక్షపదవిని గురించి ఉపాసిస్తాడో అతడు మోక్షలక్ష్మిని తప్పక వరిస్తాడు. నేను చెప్పగలిగినదంతా చెప్పాను. దీన్ని గురించి ఇంతకుమించి చెప్పగలవారెవ్వరూ లేరు. నియమపాలన గల శుద్ధాత్మునికి ఆరు నెలల్లోనే సంపూర్ణ యోగం సిద్ధిస్తుంది.

బ్రాహ్మణ గీతలు

అర్జునునిపై శ్రీకృష్ణునికి గల అవ్యాజమైన ప్రేమ చేత వెనుక చెప్పిన విషయాల్నే మళ్ళీ చెప్పాలని భావించాడు. అందుకొరకు ఓ ఉపాఖ్యానం ద్వారా ఇట్లా తెలిపాడు.

శ్రీకృష్ణుడు : ఓ అర్జునా! పూర్వం ఇద్దరు భార్యా భర్తల మధ్య నడచిన 'అభయ' అన్న సంవాదాన్ని గూర్చి చెప్తాను విను.

ఒక ఊళ్ళో ఒక ఆత్మజ్ఞాని అయిన బ్రాహ్మణుడుండేవాడు. అతడు ఏకాంతవాసం చేస్తూ భగవంతుణ్ణి ఉపాసించాలని భావించాడు. మహా పతివ్రత అయిన అతడి భార్య ఆ సమయంలో భక్తితో ఆ బ్రాహ్మణునికి నమస్కరించి ఇలా అన్నది. "స్వామి! నాకు ఆత్మ జ్ఞానాన్ని బోధించి నన్ను తరింప చెయ్యండి" అని. అందుకా బ్రాహ్మణుడు చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు.

బ్రాహ్మణుడు : ఓ ధీర స్వభావురాలా! ఒక స్త్రీ ఇంత గొప్ప ఆలోచన చేసినందుకు నాకెంతో ఆనందంగా ఉంది. నాకు తెలిసినంతవరకు, తెలిసిన రీతిలో చెప్తాను, విను. వినడం, చూడటం, చేయడం ద్వారా చేసే పనులన్నింటినీ కర్మలంటారు. కర్మను నమ్ముకున్నవారు కర్మలద్వారా సమస్త

సిద్ధుల్ని పొందవచ్చని భావిస్తారు. అది అజ్ఞానం. నిజానికి ప్రపంచంలో కర్మలు చెయ్యకుండా ఉండే స్థితి (నిష్కర్మ) ఉండనే ఉండదు. ఒకవేళ ఎవరైనా నిష్కర్మ స్థితిని పొందగలిగితే అదే అత్యున్నతమైన స్థితి అవుతుంది. దాన్నే బ్రహ్మలక్షణం అంటారు. నేను ఎల్లవేళలా ఆత్మలో బ్రహ్మోపాసన చేస్తాను. ఆ బ్రహ్మతత్త్వం నిష్కళంకమూ, నిష్కర్మమూ అయి ఉంటుంది. ఈ స్థితిని మినహాయిస్తే ఉండే మిగిలిన జగత్తు అంతా క్రియాత్మకమే. అగ్నితో సోముడు (శివుడు) కలసిన సంగమ ధర్మంతో జగత్తులను నడిపిస్తూ ప్రాణులన్నీ సృష్టించబడుతున్నాయి. బ్రహ్మాది దేవతలంతా ఇంద్రియాల్ని జయించి, పరమ పవిత్రులై అక్షరతత్త్వోపాసనతో నిరంతరం నిమగ్నులై ఉంటారు. (లోకంలోని కర్మలన్నీ అజ్ఞానంతో కూడుకున్నవి.) ఇంద్రియాలు చేసే పనులు కూడా అట్లాంటివే. ఎందువల్లనంటే అవన్నీ కామంతో (కోరికలతో) కూడుకున్నవి. యోగి ఇంద్రియాల్ని జయించిన వాడు కావటం వలన అతడు ఆచరించే కర్మలన్నీ నిష్కామమైనవి. దాన్నే 'శాంత' స్థితి అంటారు. అక్కడ ఎటువంటి అలజడులూ ఉండవు. అటువంటి కర్మను 'బ్రహ్మకర్మ' అంటారు. బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ కాదు. 'పరబ్రహ్మం'.

"అగ్ని సోమాత్మకం బీజం రామనామే ప్రతిష్ఠితమ్" అని రామ శబ్దాన్ని నిర్వచించారు. ర కారం అగ్ని బీజమని మ కారం సోమబీజమని నిర్వచించి చెప్పారు. స+ఉమ=సోమ అనగా పార్వతితో కూడిన ఈశ్వరుడు అని. అగ్ని శివపార్వతుల సమాగమాన్ని భంగం చేసి శివతేజస్సును గ్రహించగా కుమారుడు పుట్టాడు. ఈ కుమారుడు విశ్వకుమారుడు. (అనగా ప్రపంచంలో ప్రతి కుమారుడి పుట్టుక ఈ కథలోనే ఇమిడి ఉన్నదని అగ్ని-సోముల కలయిక ప్రస్తావన సూచిస్తోంది. ప్రాణుల హృదయాల్లో ఉండేవాడు ఈశ్వరుడు. కనుక చంద్రాగ్నుల కలయికతో జగద్బీజం ఏర్పడుతోందని తాత్పర్యం. ఇది కూడా కర్మమే అయినా, జ్ఞానంతో కూడుకున్న నిర్వికార కర్మ, జగత్తును రక్షించేందుకు పాటు పడే నిష్కామ కర్మ కాబట్టి కర్మ, అకర్మ, నిష్కర్మల్ని గుర్తించడం ద్వారా మనిషికి జ్ఞానం లభిస్తుందని బ్రాహ్మణుడు భార్యకు బోధిస్తున్నాడు.)

నీకిప్పుడు అక్షర పరబ్రహ్మ తత్త్వాన్ని గూర్చి వివరిస్తాను, విను. స్పర్శ, రస, రూప, శబ్ద, గంధాలు లేనిది కావడం వలన చర్మంతో గాని, నాలుకతోగాని, కంటితోగాని, చెవి, ముక్కులతోగాని గుర్తించడానికి సాధ్యం కాదు. అక్షర తత్త్వాన్ని పవిత్రమైన బుద్ధి విశేషం చేత మాత్రమే తెలుసుకుంటాడు. పంచవాయువులు ఆ అక్షర తత్త్వం లోనే పుట్టి తిరిగి ఆ తత్త్వం లోనే లీనమవుతున్నాయి. పంచవాయువుల గూర్చి అనగా హృదయంలో ప్రాణవాయువు, గుద స్థానంలో అపానవాయువు, నాభిలో సమాన వాయువు, కంఠంలో ఉదాన వాయువు, వ్యానం దేహమంతటా వ్యాపించి ఉంటుందని వేదం ప్రతిపాదిస్తోంది. ఈ పంచ ప్రాణులకు నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనుంజయాలని పేరు.

నోటి ద్వారంలో నాగం, కంటి రెప్పల్లో కూర్మం, తుమ్ములో కృకరం, ఆవులింతలో దేవదత్తం, మనిషి చనిపోయినా కూడా ధనుంజయం అనే ప్రాణులు ఉంటాయి.

ఓ పద్మలోచనా! జీవుడు ప్రాణాపానాలలో ఉండి నిద్రపోయినప్పుడు సమాన వ్యానాలు కలసిపోతాయి. ఓ వనితా! బాగా విను. ఉదానంలో నిద్రిస్తే ప్రాణాపానాలు ఆ జీవుడిని వదిలిపెట్టవు.

యోగుల దృష్టి ఇలాంటిది.

అంతర్యాగ విధానం

బ్రాహ్మణుడు : చేసే ప్రతి పని 'యాగమే'. ఆత్మ సాక్షీభూతుడైన 'ఉపద్రష్ట'. అందువల్ల అతడికి సకర్మ ఫలమూ అంటదు. కానీ కర్మలన్నీ అతడే చేయిస్తాడు. ఇంద్రియాలు తాము చేస్తున్న పనిని 'బ్రహ్మకర్మ' అన్న భావనతో చేస్తే అది అంతర్యాగమవుతుంది. బంధమోక్షానికి హేతువవుతుంది. అట్లా కాకుండా కేవలం ఒక పనిగా చేస్తే అది బంధహేతువవుతుంది. ఇక వైశ్వానరుడనే అగ్ని గూర్చి కొంత చెప్పాలి. అంతర్యాగం చెయ్యడానికి ఆత్మ చైతన్య రూపంలో 'అగ్ని' గా నిరంతరం పనిచేస్తూ ఉంటుంది.

(భగవద్గీతలో భగవానుడు ఇలా ఉపదేశించాడు. "ప్రాణుల దేహాల్లో నేను వైశ్వానరుడనే అగ్ని రూపంలో ఉంటూ ప్రాణాపానాలతో కూడిన వాడనై భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలనబడే నాలుగు విధాలైన ఆహారాన్ని పచనం చేస్తూ ఉంటాను.)

ఓంకారం మొదలైన మంత్ర రూపంగా వాక్కు పుడుతుంది. దానిని అనుసరించి పురుషార్థాన్ని సాధించడం కోసం మనస్సు పరుగెడుతుంది.

భార్య : పుణ్యాత్మా! మనస్సు ప్రేరేపిస్తేనే గదా వాక్కు పుడుతుంది. అటువంటప్పుడు వాక్కు ననుసరించి మనస్సు ఎట్లా పరుగెడుతుంది?

బ్రాహ్మణుడు : ఓ వనితా! ఆత్మ ప్రేరణతో మనస్సు ఉదానవాయువుతో కలసి వాక్కును బహిర్గతం చేస్తుంది. ఇట్లాగే అంతా భావిస్తారు. అయితే కొన్ని ప్రత్యేకమైన కార్యాలు చెయ్యాల్సి వచ్చినప్పుడు మనస్సు వాక్కును అనుసరించే ప్రవర్తిస్తుంది. మనస్సు, వాక్కు ప్రవర్తించే రీతుల్ని గుర్తించడమే మోక్షానికి మూలమవుతుంది. మనస్సు ప్రశాంతతను పొందటమే ముక్తికి కారణమవుతుంది.

కర్మేంద్రియాలకన్నా జ్ఞానేంద్రియాలు, వాటికంటే మనస్సు, మనస్సుకన్నా బుద్ధి, వాటన్నింటికన్నా ఆత్మ ఎట్లా ఉన్నతస్థానాన్ని ఆక్రమిస్తుందో తెలుసుకోవడం ద్వారా బ్రహ్మతత్త్వాన్ని సులభంగా తెలుసుకోవచ్చు.

ఇంద్రియములు, మనస్సు పరస్పరం వాదించుకొనుట

బ్రాహ్మణుడు భార్యతో ఇలా అన్నాడు. పూర్వం మనస్సుకు ఇంద్రియాలకు పెద్ద గొడవ జరిగింది. ఇంద్రియాలన్నీ మనస్సుతో ఇలా అన్నాయి. మేమూ నీలాంటి ఇంద్రియాలమే గదా? మరి నువ్వెందుకు మా మీద అధికారం చెలాయిస్తావు? అని నిలదీశాయి. అప్పుడు మనస్సు వారితో ఇలా అంది. "మీరిట్లా ఎదురు తిరిగి మాట్లాడటం బాగా లేదు. నా సహాయం లేకుండా ముక్కు వాసన తెలుసుకోలేదు,

నాలుక రుచి చూడలేదు. ఆట్లాగే మిగిలిన అవయవాలూను. నేను లేకపోతే మీ రూపాలన్నీ ఆరిపోయిన నిప్పులా నిస్తేజాలయిపోతాయి" అన్నది. అందుకు ఇంద్రియాలిలా అన్నాయి "ఓ మనసా! ఊరికే గొప్పలు చెప్పకు. ముందుగా మేము అనుభవించాకనే విషయసుఖాల్ని నువ్వు అనుభవించేది? అందుచేత నువ్వనుభవిస్తున్నది ఎంగిలి మాత్రమే. ఇప్పుడు చెప్పు నీ ఆధిక్యత ఏమిటో?" అన్నాయి.

బ్రాహ్మణుడు : ఒకప్పుడు వాయువులన్నీ కలసి బ్రహ్మ దగ్గరకు పోయి మాలో ఎవరు గొప్ప వారో చెప్పమని అడిగాయి. అప్పుడు బ్రహ్మ వారితో "మీలో ఎవరు అణిగి పోతే మిగిలిన వారంతా అణగిపోతారో, ఎవరు పనిచెయ్యడం మొదలుపెడితే మిగిలిన వాళ్ళంతా తమ తమ పనులు మొదలు పెడ్తారో అట్లాంటివారే గొప్పవారు. ఇక మీ దారిన మీరు వెళ్ళండి" అన్నాడు. అయినా వాళ్ళెవరూ తిరిగిపోలేదు. మిగిలిన వాళ్ళంతా తన వల్లనే పనిచేస్తున్నారని అంతా అనుకున్నారు. వాళ్ల భావాల్ని కనిపెట్టి బ్రహ్మ ఇలా అన్నాడు " ఏ సమయంలో ఏ వాయువు వలన ఆ పని కావాల్సి ఉందో ఆ సమయానికి ఆ వాయువు గొప్పది. ఆ విధంగా ఒక్కొక్క సమయానికి ఒక్కొక్కరికి ఆధిక్యత కలుగుతూ ఉంటుందని చెప్పి, వాయువులన్నింటినీ అన్యోన్యంగా ఉండమని ఉపదేశించి" పంపాడు.

ఇంకొక సమయంలో దేవమతుడనే బ్రాహ్మణుడు నారదమహర్షిని దర్శించి నమస్కరించి ఇలా అడిగాడు. "ఓ కరుణానిధీ! ఐదు ప్రాణవాయువుల్లోను, జన్మించబోయే ప్రాణిలో మొట్టమొదట ఏ వాయువు పనిచెయ్యడం మొదలుపెడుతుందో తెలుపవలసింది" అని ప్రార్థించాడు. అప్పుడు నారదుడు "నాయనా! ఏ వాయువు ప్రాణిని గర్భసంవాసానికి ప్రేరేపిస్తుందో, ఆ జంతువు పుట్టే సమయంలో దాని తరువాత ఉన్న వాయువుతో పని చెయ్యడం ప్రారంభిస్తుంది. సమాన వాయువు పురుషుడిలో వీర్యాన్ని, వ్యానమనే వాయువు స్త్రీలోని రజస్సును ప్రభావితం చేస్తాయి. ఆ విధమైన శుక్ర శోణితాల కలయిక గర్భంగా మారుతుంది. ఆ కలయిక పూర్తిగా దైవలీల. అప్పటికప్పుడు తాజాగా తయారైన రజస్సులో గట్టిపడ్డ వీర్యం కారణంగా అందులో ప్రాణుడు ప్రవేశిస్తాడు. అప్పుడు ప్రాణుడు అధోముఖంగాను, అపానుడు ఊర్ధ్వముఖంగాను ప్రసరిస్తారు. అప్పుడా రెండు వాయువుల్లో 'అగ్ని' శక్తితో నిండిన ఉదాన, వ్యాన, సమానులు ప్రసరిస్తారు. ఆ ప్రాణాగ్ని తత్త్వం తెలిసిన పండితులు దేవతలందరిలోనూ వ్యాపించి ఉండేటువంటి, ప్రాణాపానాల నడుమ వెలిగే పుణ్యమూర్తి అయిన అగ్ని ఉదాన రూపుడుగా గుర్తిస్తారు.

ఇంకా ఈ ప్రాణ తత్త్వం ఎట్లాంటిదో విను. రాత్రింబవళ్ళు, సుఖదుఃఖాలు వంటి ద్వంద్వాలన్నీ ప్రాణాపానాలకు మారుపేర్లే. ఆ రెండింటి మధ్యలో వర్ధిల్లే అగ్నినే ఉదానం అంటారు. అగ్నితత్త్వాన్ని వాయుతత్త్వాన్ని రెంటినీ కలిగినదైన అద్వైత స్థితిని అంతర్యాగ విద్యానిపుణులు మాత్రమే గుర్తించగలరు. పరమశాంతి అనీ, బ్రహ్మమనీ పిలువబడే ఆ తత్త్వంలో ఏ భేదపరగణా సాధ్యం కాదు. దాన్నే ఉదాన తత్త్వమని సాక్షాత్తూ ఆ బ్రహ్మదేవుడే చెప్పగా మేమంతా విన్నాం" అని చెప్పాడు.

జీవాత్మ స్వరూప నిరూపణము

ప్రపంచమంతా కారక త్రయంలో నిండి ఉంటుంది. కరణం, కర్మ, కర్తలే ఆ కారక త్రయాలు. ముక్కు మొదలైనవి కర్మేంద్రియాలు. మనస్సు బుద్ధి కరణ హేతువులు. ఆలోచించదగింది, తెలుసుకోదగ్గది ఏవైతే ఉన్నాయో అవన్నీ కర్మహేతువులు. వీటి సాయంతో జీవుడు ఏడు పనులు చేయగలుగుతాడు. అవే, తినడం, వాసన చూడటం, తాకడం, వినడం, ఆలోచించడం, నిర్ణయాలు తీసుకోవడం. వీటి ద్వారానే కర్మలు చేయడం జరుగుతాయి. తలచుకుంటే జీవుడు ఈ విషయ సుఖాల్ని తరిమి కొట్టగలడు. అట్లా తరిమి కొట్టడంతో పాటు శ్రద్ధ, నిష్ఠ కూడా అలవడితే మోక్షాన్ని కలిగిస్తాయి.

పై కారక త్రయంతో కూడుకున్న జీవుడు తానే కర్తనన్న (అనుభవిస్తున్నాననే భావం) భావాన్ని వదిలి పెడితే, వివిధ విషయసుఖాలతో కూడుకున్న హవిస్సుల్ని, ఉదాన మనే కొయ్య గరిటలో (స్రుక్కు) లో వేసి, హోమం చేస్తే, ఆత్మ స్వరూపమైన అగ్ని చక్కగా మండుతుంది. అట్లా ప్రజ్వరిల్లుతున్న అగ్నిలో "అవిద్య" అనే పొగలేకుండా ప్రకాశిస్తుంది. ఇదే మోక్షాన్ని అందుకునే విధానం. అట్లాకాదని భోక్తను నేనే నన్న భావనతో చేస్తే ఆ విషయానుభవమే బంధానికి కారణమవుతుంది. ఓ వనితా! నేనిప్పుడు బంధవిముక్తికి మూల కారణమైన యోగ యజ్ఞంలో తలమునకలుగా ఉన్నాను. బంధాల్ని వదిలెయ్యడమే ఆ యజ్ఞానికి 'దక్షిణ'. అప్పుడే సర్వ వ్యాపి అయిన శ్రీమన్నారాయణుడు సంతోషించి జీవుణ్ణి తనలో ఐక్యం చేసుకుంటాడు. దానినే మోక్షం లేక ముక్తి అంటారు.

సాధ్వీ! శాసించే వాడు ఒక్కడే. నేను అతడి శాసనాన్నే అనుసరిస్తాను. గురువు ఒక్కడే. నేను గురూపదేశాన్నే ఆచరిస్తాను. శత్రువు వంచినట్లల్లా వంగుతూ ఓర్పుతో ఆపదలన్నింటినీ దాటుతాను. తరించే మార్గమేదో పెద్దలనుండి తెలుసుకొన్నాను. ఇంకో మాట కూడా విను. ఒకప్పుడు దేవతలు బ్రహ్మ దగ్గరకు పోయి "మాకు శ్రేయో మార్గం చెప్పండి" అని అడిగారు. అందుకాయన అక్షరోపాసనే అందుకు సరైన మార్గమని వారికా మార్గాన్ని బోధించాడు. ఓ సాధ్వీ! నేను కూడా ఆ మార్గానే వెళ్తున్నాను. కాబట్టి సంసారమనే దుర్గమారణ్యాన్ని దాటగలను. నేను ఇంతకు ముందే కోపం, లోభం, కోరికలనే కోటలోనుండి బయటపడి అడవిలోకి ప్రవేశించాను.

భార్య : ఓ పుణ్యాత్మా!ఆ అడవి ఎట్లాంటిది?

బ్రాహ్మణుడు : ఇంద్రియాలు నేర్పుగా లొంగదీసుకుంటాయి. దానివలన ఏర్పడే చింత, భయం వంటివేవీ అక్కడ ఉండవు. చిన్నా పెద్దా వంటి ద్వంద్వాలుండవు. అనగా కర్తవ్య భావన ఉండదు. ఇవేవీ లేని మనిషి నిశ్చింతగా ఉంటాడు. అప్పుడతడు నిర్భయుడవుతాడు. దాన్నే ధృతి అంటారు. అటువంటి ధీరుడికి 'నర్వృతి' సులభంగా లభిస్తుంది. అదే అక్షర తత్త్వం.

ఆ అడవిలో చెట్లు కూడా దీక్షలో ఉంటాయి. అనగా అతిథుల్ని తృప్తి పరుస్తాయి. అవన్నీ సాక్షాత్తూ బ్రహ్మ స్వరూపులు. ఆ వనంలో ఋషులంతా బ్రహ్మానందాన్ననుభవిస్తూ ఉంటారు. అక్కడ దిక్కులకు గాని, ఆకాశానికి గాని హద్దులుండవు. ఆ అడవి కంతా సూర్యుడే యజమాని. కాబట్టి

అక్కడ ఎప్పుడూ ప్రకాశవంతంగానే ఉంటుంది.

ఆ అడవిలో మహానిష్ఠాపరులైన తపోధనులే నివసిస్తారు. వారు బ్రహ్మచర్యాది వ్రత నిష్ఠల వలన ఓర్పు, వైరాగ్యం పొంది సుస్థిరాత్ములై ఆనందంతో ఉంటారు.

బంధానికి కారణం సంకల్పం. దానివల్లనే ఇష్టము, అయిష్టము అనే భావాలు ఏర్పడతాయి. అందువల్లనే ఆ విప్రుడు దాన్ని జయించడానికి నిష్కామ సంకల్పంతో పని ప్రారంభించడం మొదలు పెట్టాడు. అనగా నేను కర్తను కానన్న వైరాగ్య భావం. వైరాగ్య భావం వలన భారం దైవం మీద వదలి తాను నిష్కర్ముడు అవుతాడు. అనగా మంచిగాని, చెడుగాని జరుగవలసింది ఎట్లాగూ జరుగుతుందన్న నిర్లిప్త జ్ఞానం కలిగి ఉండటం.

(అనగా ఓ అర్జునా! నువ్వు యుద్ధంలో లక్షలాది శత్రువుల్ని అవలీలగా చంపావు. కనుక ఈ సాధన నీకేం కష్టమైంది కాదు. మొదలు పెట్టు అని.)

సాధుమతీ! ఒక యాజ్ఞికుడికి, ఒక యతికి జరిగిన సంవాదం చెపుతాను విను. ఒక యాజ్ఞికుడు ఒక బలిపశువును మంత్ర జలాలు చల్లి బలికి సిద్ధం చేస్తూ ఉండగా, ఉన్నట్లుండి ఒక యతి అక్కడకు వచ్చి "ఇట్లా చెయ్యడం పాపం కాదా?" అని అడిగాడు.

యాజ్ఞికుడు : అయ్యా! మీకు వేద వాక్యాలలో నమ్మకముంటే ఇట్లా మాట్లాడరు. ఈ మేక చావడం లేదు. ఊర్ధ్వ లోకాలకు వెళుతుంది. యతీశ్వరా! సామాన్యంగా పంచభూతాలు, పంచేంద్రియాలు ఆయా యోనులలో చేరి జన్మను పొందుతాయి. కానీ యజ్ఞంలో బలి అయ్యే జీవుడు తిరిగి పిండరూపాన్ని పొందదు. యజ్ఞ ప్రభావం వలన గొప్పదైన స్వర్గాన్ని చేరుకొని స్వర్గసుఖాన్ని పొందుతాడు.

యతీశ్వరుడు : ఓ యాజ్ఞికుడా! నువ్వు చెప్పినట్లే ఆ మేక స్వర్గానికే వెళ్తుందని అనుకుందాం. దానివలన నీకొచ్చే లాభం ఏమిటి?

యాజ్ఞికుడు : యతీశ్వరా! బలిపశు విధానంతో శాస్త్రోక్తంగా యాగం చేస్తే స్వర్గాది సౌఖ్యాలు లభిస్తాయని వేదాలు చెప్తున్నాయి. నువ్వూ వేదాలు చదువుకున్న వాడివే కదా? దీన్ని కాదంటావా?

యతీశ్వరుడు : నేను కూడా ఆ వేద వాక్యాలను ప్రమాణంగా చేసుకునే చెప్తున్నాను. 'హింస మహా పాపం కాదా?" అని.

యాజ్ఞికుడు : ఓ యతీ! నువ్వు సమాధిలో వాయువులు బంధించి మనస్సును అంతర్ముఖం చేస్తూ ఉంటావు. ఆ తర్వాత యోగంలో స్థిరపడుతున్నావు. బాగా ఆలోచించి చూస్తే ఇందులో మాత్రం హింస లేదా?

యతీశ్వరుడు : చేసిన తపస్సు పండి, జ్ఞానానంద స్వరూపం కలిగిన అక్షరోపాసన చేత, ప్రకృతి గుణాలతో కూడిన ఈ శరీరాన్ని ఆశ్రయించుకున్న క్షర తత్త్వాన్ని వివేక సమగ్రత ద్వారా నశింపజేసి, అద్వైతానంద స్థితిని పొంది వ్యర్థమైన విషయ సుఖాల లోకి మనస్సు జారకుండా నియంత్రించడాన్ని, హింస అనడం అజ్ఞానం కాదా?

యాజ్ఞికుడు : స్వామీ! పెద్దల మాటల్ని పాటించిన వాడే మంచి చెడుల్ని గుర్తించగలుగుతాడు. నేను పశుసంప్రోక్షణ చేసి బలి ఇచ్చే సమయంలో నువ్వు వచ్చి జ్ఞానాజ్ఞానాలను బోధించి ఇంతసేపూ ఏ 'అక్షర' 'క్షర' తత్త్వాన్ని ఉపదేశించావో ఆ తత్త్వాన్ని దర్శించగలుగుతున్నాను. కనుక నాకు హింస చేసిన పాపమేదీ అంటదు. నేను యజ్ఞం చేస్తాను. ఉత్తమ గతిని పొందుతాను.

యతీశ్వరుడు : పుణ్యాత్మా! పశు యజ్ఞంకన్నా తపోయజ్ఞం మేలు కనుకనే నీతో ఇంతగా వాదించాను. ఇక దీనిని గూర్చి తర్జన భర్జన లెందుకు?

అని యతీశ్వరుడు చెప్పగా ఆ యాజ్ఞికుడు అంగీకరించి పశు హింస మానాడు. ఓ సాధ్వీ! ఈ విషయాన్ని వివరించే మరో కథ ఉంది అదీ చెప్తాను విను.

పూర్వం వెయ్యి చేతులున్న కార్తవీర్యార్జునుడు రాజులందర్నీ జయించి భూమండలాన్నంతా పాలించి చివరకు పరశురాముడికి కీడు తలపెట్టాడు. దాంతో పరశురాముడు పదునైన గొడ్డలితో, విశాలమైన వృక్షానికున్న శాఖలన్నింటినీ ముక్కలు ముక్కలుగా నరికినట్లు, కార్తవీర్యుని అవయవాలన్నింటినీ నరికి చంపాడు. దాంతో కార్తవీర్యుడి కొడుకులు రెచ్చిపోయి పరశురాముడి తండ్రి అయిన జమదగ్ని మహామునిని చంపేశారు. దాంతో కృద్ధుడైన పరశురాముడు రాజులందర్నీ వరుసపెట్టి ఇరవై ఒక్కసార్లు తన గొడ్డలితో నరికి చంపాడు. చివరకు అతడి పితృదేవతలు వచ్చి "పరశురామా! నువ్వు బ్రాహ్మణుడవు. రాజుల్ని చంపడం వంటి చెడ్డపని ఎందుకు చేస్తున్నావు? ఇకనుంచైనా మానెయ్యి" అని సలహా ఇచ్చారు. అందుకు పరశురాముడు "మీరు ఆ దృష్టితో చూడకండి. నేనిది యజ్ఞంగా భావిస్తున్నాను. నా దృష్టిలో ఈ రాజులంతా యజ్ఞపశువులు. మీరు దారికి అడ్డురాకండి" అన్నాడు. అప్పుడు పితృదేవతలు "ఓ పరశురామా! యజ్ఞాలన్నింట్లోకీ జపయజ్ఞం చాలా శ్రేష్ఠమైనది. ఇదే పట్టుదలతో నువ్వా జపయజ్ఞం చెయ్యి. ఈశ్వరుడు నిన్ను కరుణిస్తాడు. నీకూ విశ్రాంతి దొరికినట్లు అవుతుంది.

ఓ పరశురామా! పూర్వం అలర్కుడనే రాజు మనస్సు చేత అపవిత్రం చెయ్య బడిన ఇంద్రియాల్ని జయించడానికి తన దగ్గరున్న భయంకరమైన ఆయుధాల్ని ప్రయోగించాడు. అప్పుడా ఇంద్రియాలు నవ్వి అలర్కుడితో ఇలా అన్నాయి. 'ఓ రాజా! సమర్థుడవైతే తపస్సు చేసి సాధించిన అస్త్రాలుంటే ప్రయోగించు, అంతేగాని నీ దగ్గరున్న ఆయుధాల్తో మేము చావం" అని ఉపదేశించాయి. అప్పుడు అలర్కుడు కోపాన్ని విడిచిపెట్టి యోగాభ్యాసం చేత శాంతిని పొంది ఆ ఇంద్రియాలకు అనుగుణమైన తపోమయ దివ్యాస్త్రాల్ని ప్రయోగించి వాటిని అదుపులోకి తెచ్చుకున్నాడు. అట్లాగే నువ్వు కూడా తపస్సుతో లోపలి శత్రువులను జయించి ఆత్మానందాన్ని అనుభవించు. బయటి శత్రువుల్ని జయించినంత మాత్రాన విజయం సాధించానని అనుకోవద్దు. అని చెప్పాడు. వారి ఉపదేశాన్ని పొంది ఆ పుణ్యమూర్తి శాంతిని పొందాలన్న కోరికతో తపస్సుచేత ఉత్తమ గతిని పొందాడు."

అంతట బ్రాహ్మణుడు భార్యతో ఇలా అన్నాడు. "సాధ్వీ! గుణాలు తొమ్మిది. స్థిరత్వం, ఆత్మగౌరవం, సంతోషం, అనేవి సాత్వికాలు. కోపం, ఉద్రేకం, దుఃఖం అనేవి రాజసాలు. భ్రాంతి,

బడలిక, నిద్ర అనేవి తామసాలు. ఇవన్నీ లోపల ఉండే శత్రువులే. వీటిని జయించడానికి ఏ అస్త్రం ప్రయోగిస్తే జయించగలవో అట్టి అస్త్రాన్ని ప్రయోగించాలి. ఆ తర్వాత ఇంద్రియాలైదింటితోనూ మనస్సును జయించి, ప్రశాంత స్థితిని పొంది మోక్షానికి ప్రయత్నం చెయ్యాలి. ఈ మార్గంలో ముఖ్య శత్రువు ఎవరో నిర్ణయించేందుకు పనికి వచ్చే అంబరీష గీతలున్నాయి. వాటిని గూర్చి చెప్తాను విను."

అంబరీషుడనే రాజు గొప్ప రాజనీతి పరుడు. మహా చక్రవర్తి. శత్రువులందర్నీ చంపి, రాజ్యపాలన చేస్తూ ఒక రోజున తన ఆస్థాన పండితులతో ఇలా అన్నాడు. "శత్రువులను జయించినా నాలో పగ నశించలేదు. కనుక నేను సంపూర్ణంగా విజయం సాధించానని అనుకోవడం లేదు." ఎవడైతే పగను జయించలేడో అట్టివాడు ముసలితనం, వ్యాధి, మరణాలకు లోనవుతాడు. కనుక ఆ దురాశను జయించి నిశ్చింతుడై రాజ్యపాలన చేస్తూ సుఖశాంతుల్ని పొందాడు.

జనకునికి యమధర్మరాజుకు జరిగిన సంవాదము

అంబరీషుని వృత్తాంతం తెలిపిన పిదప బ్రాహ్మణుడు తన భార్యకు జనక-యముల మధ్య జరిగిన సంవాదాన్ని ఇలా చెప్పాడు. ఒక రోజున జనక మహారాజు కళ్ళెదటే ఒక బ్రాహ్మణుడు ఒక అనుచితమైన కార్యాన్ని చేశాడు. అందుకు కోపించిన జనకుడు ఆ బ్రాహ్మణుని తన దేశం నుండి వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించాడు. అప్పుడా బ్రాహ్మణుడు వినయంగా జనకుడితో ఇలా అన్నాడు. "ఓ పుణ్య చరిత్రుడా! నీ రాజ్యం ఎంతవరకు విస్తరించి ఉందో తెలిపితే నేను వెంటనే మరో రాజ్యానికి వెళ్ళిపోతాను" అన్నాడు. బ్రాహ్మణుని మాటల్లోని ఆంతర్యం గ్రహించిన జనకమహారాజు మతిపోయింది. నిస్థాణువై మూర్ఛపోయినంత పనయింది. చాలా సేపు మౌనంగా ఉండిపోయాడు. తేరుకొని ఇలా అన్నాడు. "అయ్యా! ఈ రాజ్యం నా తండ్రి తాతల కాలం నుండి మా వంశస్థులకు వస్తోంది. అందువల్ల ఇది నాది అనే భావన నాకు ఎన్నడూ కలుగలేదు. కనుక ఇది నా రాజ్యమని నేను చెప్పలేను. విప్రోత్తమా! నేనెప్పుడూ మిథిలలో ఉంటాను. అయినా ఇది నా నగరమని చెప్పడానికి వీలు కాదు. కనుక ఇది నా రాజ్యం అని చెప్పలేక పోవడం వలన నీతో అలా ఎందుకన్నానా? అని బాధపడుతున్నాను" అన్నాడు. అప్పుడా బ్రాహ్మణుడు రాజు ముఖంలోకి చూస్తూ "రాజా! నువ్వు ఉంటున్న నగరమిది. నువ్వు పాలిస్తున్న రాజ్యమిది. ఈ రెండింటి విషయంలోను 'నాది' అన్న భావన లేకుండా ఏదో ఇతరుల సొత్తు వాడుకొంటున్నట్లు అనాసక్త భావనతో ఎట్లా ఉండగలుగుతున్నావు? దయచేసి నాకు చెప్పు అన్నాడు. అందుకు జనకుడిట్లా అన్నాడు. "అయ్యా! ఈ రాజ్యం, ధనం మొదలైనవన్నీ ఎప్పటికైనా నశించేవే. అనగా కనిపించేవేవీ శాశ్వతమైనవి కావు. అందువల్ల నాది ఏదీ లేదనే నా భావన. విప్రవర్యా! అసలు నాది అనే వస్తువేదైనా ఉన్నదా? ఎట్లాగంటే ముక్కు మొదలైన ఇంద్రియాలు వాసనను తెలుసుకో గలిగినవే అయినా, అవన్నీ నశించే స్వభావం కలిగినట్టివే. అవి నావి కాదు అని అనుకోవడం వల్లనే భూమి మొదలైన పంచభూతాలు నన్ను బంధించడం లేదు. పైగా నేను చెప్పినట్లు ప్రవర్తిస్తున్నాయి" అన్నాడు. అప్పుడా బ్రాహ్మణుడు నవ్వుతూ "నాయనా! నేను నిన్ను పరీక్షించడానికి బ్రాహ్మణ రూపంలో వచ్చాను. నేను యమధర్మరాజును. వివేకం కలిగిన

ఓ జనకమహారాజా! పక్వమైన నీ హృదయం శాశ్వతంగా, శాంతి ప్రదాయకమై, గాఢమై, స్థిరమై నిలచుగాక" అని ఆశీర్వదించాడు.

ఈ విధంగా యమధర్మరాజు జనకమహారాజుకు వరమిచ్చి మాయమయ్యాడు. అని చెప్పి బ్రాహ్మణుడు భార్యతో ఇలా అన్నాడు.

బ్రాహ్మణుడు : ఓ సాధ్వీ! నేను సంసారబంధాల్ని వదిలేసి ఇక్కడ ఏకాంతంగా ఆత్మానందం అనుభవిస్తున్న సమయంలో నువ్వు దొంగలాగా వచ్చినా వైరాగ్యాన్ని చెడగొట్టాలన్న తలంపుతో 'ఆత్మజ్ఞానాన్ని బోధించు' అని నాదగ్గరకు వచ్చావు. నాకు నీ అంతరంగం తెలిసినా ఏమీ తెలియనట్లు నటిస్తూ నీకు వేదాంత విద్యనంతా నేర్పాను. ఓ వనితా! ఇకపైన నేను లోక వ్యవహారాల్లో తలదూర్చను. నిజమైన బ్రహ్మచారి నయ్యాను. అనగా జీవన్ముక్తుడనయ్యాను. నన్ను సాధారణ బ్రాహ్మణునిగా భావించకు. నా సాధన విషయం నీకు తెలియదు. నేను ప్రపంచమంతా నిండి ఉన్నాను. ఇప్పుడు నేనున్న స్థితికి ముల్లోకాల్నీ ఏలే ఇంద్రాదులు కూడా నాతో సమానులు కాలేరు. నా ఈ వైరాగ్య బుద్ధియే నా సంపద. కొయ్యలన్నింట్లోను అగ్ని దాగి ఉన్నట్లు జీవులన్నింట్లోనూ భగవదంశ ఉంటుంది. నదులన్నీ సముద్రంలో కలుస్తున్నట్లు అంతా బ్రహ్మపదాన్నే చేరుకుంటారు. అయితే ఈ మార్గాన్ని వివేకంతో అధిగమించాలే గాని శరీరంతో కాదు. కర్మలకు మొదలు చివర ఉంటాయి. శరీరం కర్మ బంధాల్ని కలిగిస్తుందని నాకు తెలుసు కాబట్టి జనన మరణ సంసారమంటే నాకు భయం లేదు. కనుక నేనింత వరకు చెప్పిన ఆధ్యాత్మిక వాక్యాలన్నింటినీ జీర్ణించుకొని 'భావనా' నిష్ఠురాలవై ఉండు. నావలె నువ్వు కూడా సిద్ధి పొందుతావు. భయపడకు.

భర్త చెప్పిన మాటల్ని శ్రద్ధగా విని భర్తకు సాష్టాంగ నమస్కారం చేసి చేతులు జోడించి ఇలా అన్నది.

బ్రాహ్మణుని భార్య : ఆర్యా! నువ్వింత వరకు చెప్పిన మహావాక్యాలన్నింటినీ శ్రద్ధగా విన్నాను. సాధన లేనివారికి అవన్నీ ఆచరించడం కష్టం. అంతేకాదు అన్ని విషయాలు ఒకేసారి వినడం వలనగాని, మరోకారణం చేతగాని మరచిపోయే ప్రమాదం ఉంది. కనుక అటువంటి జ్ఞానాన్ని కలిగించే ఉపాయం ఏదైనా బోధించి నన్ను కృతార్థురాలిని చెయ్యి.

బ్రాహ్మణుడు : బ్రాహ్మణుడి దక్షిణ ఆరణి, గురువు గారి ఉత్తర ఆరణి కలసి మధించినప్పుడు అగ్ని పుట్టినట్లు, విప్రుడి తపస్సు, గురువు గారి వేదం అనే రెండు కొయ్యల్ని మధించగా పుట్టేది జ్ఞానం. అదే ముక్తి సాధకం.

(యాగాగ్నిని రెండు కొయ్యలచేత పుట్టిస్తారు. ఆరణులంటే ఒక విధమైన కర్రలు. క్రింద ఉండే కర్రను అధరారణి అనీ, పైనుండే కర్రను ఉత్తరారణి అనీ అంటారు. ఆ రెంటినడుమ ప్రత్తిని ఉంచి వేగంగా మధించడం వలన అగ్ని పుట్టి ప్రత్తికి అంటుకుంటుంది. అట్లా రగిలిన అగ్నిని యాగంలో వాడతారు.)

బ్రాహ్మణుని భార్య : స్వామీ! బ్రాహ్మణుడంటే క్షేత్రజ్ఞుడన్నారు. ఆ మాట సరిగా బోధపడలేదు. బ్రాహ్మణుని ఆరణిగా గుర్తించే ముందు బ్రాహ్మణుడంటే ఎవరో తెలుపండి.

బ్రాహ్మణుడు : ఓ కాంతా! ఇతడు బ్రాహ్మణుడు అని ఎవరూ నిర్వచించి చెప్పలేరు. అవయవాలచేత అతణ్ణి తాకలేము. అతడికి ఏ లక్షణాలు ఉండవు. నిర్గుణత్వమే అతడి ధర్మం. అహంకారం లేకపోవడమే అతడి లక్షణం. ఈ విధంగా అతణ్ణి కొంతవరకు గుర్తించవచ్చు. నువ్వు కూడా ప్రయత్నించు.

అప్పుడా స్త్రీ పరమ శాంతిని పొందిందని శ్రీకృష్ణుడు చెప్పాడు. అప్పుడు అర్జునుడు 'ఆ బ్రాహ్మణ దంపతులు అంత గొప్పవారా? వారు ఎక్కడి వారు? అని అడిగాడు. శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "ఓ అర్జునా! నా మనస్సే బ్రాహ్మణుడు. నా బుద్ధియే బ్రాహ్మణి. ఇంద్రియాల చేత కొలవడానికి వీలుకాని పరమాత్మ స్వరూపమైన నిర్మల వస్తువునూ నేనే" అన్నాడు.

గురు శిష్య సంవాదము

అర్జునుడు : స్వామీ! నీ అనుగ్రహంతో నా బుద్ధి స్వచ్ఛమైంది. సూక్ష్మగ్రాహిణి అయింది. ఉత్కృష్టమైన బ్రహ్మతత్త్వమేదో, ఎట్లా తెలుసుకోవాలో దయతో తెలుపు.

శ్రీకృష్ణుడు : అర్జునా! గురు శిష్య సంవాదమని ఒక ఇతిహాసం ఉంది. అది నీ ప్రశ్నకు సరైన సమాధానమవుతుంది. అర్జునా! ఇప్పుడు నువ్వడిగినట్లే, పూర్వం అత్రి, విశ్వామిత్రుడు మొదలైన మహర్షులు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి నమస్కరించి "బ్రహ్మదేవా! ఏది హితం? దానిని పొందటానికి మార్గం ఏది? చెప్పు" అని అడిగారు.

బ్రహ్మదేవుడు : ఋషులారా! ప్రాణులన్నీ సత్త్వంలో పుడతాయి. అందులోనే పెరిగి అందులోనే లయమవుతాయి. మూడు గుణాలతో కూడిన సత్త్వ చరిత్ర ఇదే. ఆ సత్త్వమునే వేదమని, తపమని, ప్రజాపతి అని కూడా పిలుస్తారు. కాబట్టి యోగసాధన కోరుకునే పుణ్యాత్ములు కామక్రోధాల్ని పూర్తిగా విడిచిపెట్టాలి. అనగా ఎల్లప్పుడూ సత్త్వాన్నే ఉపాసిస్తారు. ఆ శ్రేయస్సును అందుకోవడానికి ఉత్తమ మార్గాన్ని చెప్తాను వినండి.

నాలుగు ఆశ్రమాలు నాలుగు పాదాలుగా, అన్ని వర్ణాలవారూ ఆచరిస్తున్న సనాతన ధర్మమే మోక్షసాధనకు సులభ మార్గం. నాలుగు ఆశ్రమాలలోని వారెవరైనా ఆత్మ విద్యను పొందకుండా మోక్షాన్ని పొందలేరు. అనగా ఇరవైనాలుగు తత్త్వాలు వాటి తత్త్వాన్ని గురించి తెలుసుకోగలిగి ఉండటమని అర్థం. చివరకు బ్రహ్మదేవుడికైనా ఆధ్యాత్మిక దర్శన మార్గం మాత్రం ఇదే.

జనన మరణాలకు సంబంధించిన జ్ఞానం కలిగి స్థిరమైన బుద్ధి కలిగి ఈ 24 తత్త్వాల స్వభావాన్ని గ్రహిస్తే సంసార బంధరూపమైన భ్రాంతి నశిస్తుంది. పవిత్రుడైన ఆ యోగి పరతత్త్వాన్ని గూర్చి తెలుసుకోగలుగుతాడు.

(అదెట్లాగంటే, మాటల కందనిది, అవ్యక్తమైనది, స్థిరమైనది, శాశ్వతమైనది, అంతటా వ్యాపించి ఉండే శక్తి గలదీ, త్రిగుణాల శక్తి కలిగిందీ, అయిన ఈ తొమ్మిది ద్వారాల నగరాన్ని జయించడం చాల కష్టతరమైనది.)

ఋషిశ్రేష్ఠులారా! త్రిగుణాలు అందరికీ తెలిసినవే. ఆ మూడూ ఒక దానితో ఒకటి కలసి

పనిచేస్తాయి. ఒకదానితో మరోటి ఆశ్రయించి ఉంటాయి. కానీ వాటి ప్రవృత్తిని మాత్రం గుర్తించలేం. తమోగుణం అధికంగా ఉన్నప్పుడు మిగిలిన రెండూ దాన్ని బట్టి సర్దుకొని ఉంటాయి. సత్త్వం అణగిపోవడం అంటే తమస్సు బయటకు వస్తుంది. అనగా లోభం, శోకం, భ్రాంతి, నిద్ర, భయం, వికారం, దురభిమానం, మంకుతనం, పాపకార్యాలు చెయ్యడం వంటివన్నీ తమస్సులో పుట్టే దుర్గుణాలే. అనగా ఒక మనిషి మంచిగా, చెడుగా, మూర్ఖంగా ప్రవర్తించడానికి కారణం ఈ మూడు గుణాలే.

ఋషులారా! వినండి. ఆ గుణాల తత్త్వాన్ని గ్రహించి ఆయా పనుల్లో ఆసక్తుడు కాకుండా ఉండేవాడు ఆ పనుల వలన బాధించబడడు. అతడే కర్మలన్నింటినీ తన నియంత్రణలో ఉంచుకోగలడు.

పుణ్యాత్ములారా! ఈ గుణాలేవీ వేరు వేరుగా ప్రవర్తించవు. ఒకదానితో ఒకటి కలిసే ఉంటాయి. ఈ మూడు కలిసే మానవుల సంసారయాత్రను నడిపిస్తాయి. వీటిలో వేటి ప్రభావం అధికంగా ఉంటే దానిని బట్టి మిగిలినవి దాని నుండి పుట్టడం జరుగుతుంది. అజ్ఞానం పూర్తిగా ప్రకటితమైనప్పుడు తమోగుణం పుడుతుంది. అప్పుడు రజోగుణం మనిషిని అధోగతికి ఈడుస్తుంది. సత్త్వం ఉండీ లేనట్లుగా ఊగిసలాడుతుంది.

జీవితం ఒక నదీ ప్రవాహంలాంటిది. అందుకే 'స్రోతస్సు' అంటారు. ఎవరెవరి గుణాలనుబట్టి వారు జీవితాన్ని నడుపుకోవడానికి దశలను, దిశలను, మార్గాలను సాధనాలను వెతుక్కుంటారు. అన్నింటికీ గుణభేధమే ప్రధానం. సాత్త్వికుడైనవాడు భగవదనుగ్రహం పొందటాన్ని ధ్యేయంగా పెట్టుకుంటాడు. దాన్నే 'దిశ' అంటారు. భక్తిని మార్గంగా ఎన్నుకుంటాడు. దాన్నే 'దశ' అంటారు. అతడు జీవితస్రోతస్సును పూజాపునస్కారాలను 'సాధనాలు'గా ఎంచుకుంటాడు. మిగిలిన గుణాల వారు కూడా వాళ్ళు చెయ్యాల్సిన పనులను వారే నిర్ణయించుకుంటారు. ఏమైనా, ఈ మూడు గుణాలు కూడా బంధహేతువులే అవుతాయి.

ప్రాణమే సత్త్వమని, అపానమే రజోగుణమని, ఉదానమే తమోగుణమని వేదాలు చెప్తున్నాయి. దానం, జపం, యజ్ఞం చేసేవారి మనస్సులు సత్త్వాది గుణాలచేత ప్రేరణ పొందినప్పుడు అవి మూడు దారులు పడ్తాయి. వాటిలో సత్త్వమే ఉత్తమమైనది.

మనస్సు, బుద్ధి, అహంకారాలు వాటి తత్త్వ నిర్ణయము

బ్రహ్మదేవుడు : ఋషులారా! అవ్యక్తలో నుండి మహత్తు పుడుతుంది. ఆ మహత్తునే బుద్ధి అని, మతి అని, ధృతి అని, సంవిత్తు అని, ఉపలబ్ధి అని అనేక నామాలతో పిలుస్తారు. సృష్టిలో జరిగే పనులన్నింటినీ చూసేది, వినేది జరిపేది అదే. అందువల్లనే దాన్ని సృష్టికి ప్రభువు అంటారు. దానినుండి అహంకార తత్త్వం పుడుతుంది. లోకంలో ఇన్ని రకాలైన కర్మలు ప్రవర్తిల్లడానికి అహంకారమే కారణం. ఈ లోకంలో ఉండే ఆకర్షణ తత్త్వమంతా కూడా వర్ధిల్లడానికి కారణం అహంకారమే. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు చేసే అధ్యయనం, వ్రతాలు, యజ్ఞం, తపస్సు అన్నీ అహంకారం చేతనేనన్నది స్పష్టం.

ఈ అహంకార తత్త్వం నుండియే పృథ్వి, వాయు, తేజో, వాయురాకాశాలనబడే పంచభూతాలు పుడుతున్నాయి. ఆ పంచ భూతాల గుణాలే గంధరస రూప స్పర్శశబ్దాలు. ఈ గుణాల ప్రభావానికి (విషయ సుఖాలకు) ఏ ప్రాణి అయితే బానిస అవుతుందో అట్టి ప్రాణి మోహంలో చిక్కుకుంటుంది. (జ్ఞానానికి వివేకం, అజ్ఞానానికి మోహం ప్రధాన ధర్మాలు) సాధారణంగా ప్రాణులన్నీ ఈ మోహాంధకారంలో కూరుకు పోయేవే! పుణ్యాత్ములు, జ్ఞానులు మాత్రం తమ ఆత్మ బలం చేత ఆ మోహంలో పడిపోకుండా జాగ్రత్త పడతారు.

విషయసుఖాలన్నీ అశాశ్వితాలు. నశించేవే కనుక విషంతో సమానం. మోహాన్నీ, లోభాన్ని కలిగిస్తాయి. మంచి ఆలోచనలను కూడా చెడు ఆలోచనలుగా మార్చి మనిషిచేత పాపకార్యాలు చేయిస్తాయి.

పంచప్రాణాలను, వాక్కు, మనస్సు, బుద్ధి అనే ఈ ఎనిమిదింటినీ 'అంతరాత్మ' అంటారు. కావున ఈ అంతరాత్మయే ఈ లోకానికి ఉపాదాన కారణమవుతున్నది. (కుండ తయారు చెయ్యడానికి మట్టి ఉపాదాన కారణమవుతుంది. అట్లాగే ఈ లోకం ఏర్పడటానికి ప్రాణాదులు కారణమవుతున్నాయి. అందువల్లనే 'ఆత్మ'ను ఉపాదాన కారణమని చెప్తున్నారు.)

అంతట బ్రహ్మదేవుడు ఆధ్యాత్మిక విషయాలను గూర్చి ఈ విధంగా తెలియజేస్తున్నాడు.

(ప్రకృతిని గూర్చి తెలిపేదంతా అవిద్య. ఆత్మ సంబంధమైన వేదోపనిషద్విద్య మాత్రమే 'విద్య' అని, అది బంధవిముక్తి కలిగిస్తుందని భారత సంప్రదాయం చెప్తోంది.)

వరుసగా ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి ఈ అయిదింటినీ పంచభూతాలంటారు. ఆధ్యాత్మాదులన్నీ ఈ పంచభూతాలను ఆశ్రయించి ఉంటాయి. ఆధ్యాత్మ, ఆధిభూత, ఆధిదైవతాలు చెందే మార్పులు ఇలా ఉంటాయి.

ఆధ్యాత్మము	**ఆధిభూతము**	**ఆధిదైవతము**
చెవి	శబ్దం	దిక్కు
చర్మం	స్పర్శ	విద్యుత్తు
కన్ను	రూపం	సూర్యుడు
నోరు	రసం	చంద్రుడు
ముక్కు	గంధం	వాయువు

ఇవి జ్ఞానేంద్రియాల స్వరూపం. ఇక ఆధ్యాత్మికమైన కర్మేంద్రియాలకు కూడా ఆధిభూతాలు, బభ్రుమిత్రాది ఆధిదైవతాలు ఉన్నాయి.

అధ్యాత్మము	**అధిభూతము**	**అధిదైవతము**
కర్మేంద్రియాలు :		
వాక్కు	మాట్లాడటం	అగ్ని
పాణి	పనిచెయ్యడం	శుక్రుడు
పాదం	నడవడం	బభ్రు

పాయు	విసర్జనం	మిత్రుడు
ఉపస్థ	శుక్రం	ప్రజాపతి
అహంకారం	అభిమానం	రుద్రుడు
మనస్సు	ఆలోచించడం	చంద్రుడు
బుద్ధి	తెలుసుకోవడం	బ్రహ్మం

కర్మేంద్రియాలు చేసే పనులకు మాత్రమే కాకుండా, అహంకారాది అంతరింద్రియ వ్యాపారాలకు కూడా ఆధిదైవతాలు ఉన్నారని తెలుసుకోవడం ద్వారా మనిషి కర్తృత్వ భావాన్ని ఎట్లా తొలగించుకోవాలో ఇలా వివరిస్తున్నారు.

ఈ విధంగా జ్ఞానం పొంది ఇంద్రియాల్ని, వాటి విషయాల్ని పైకి తీసి చెదిరిపోకుండా మనస్సులో పదిలపరచుకోవడమే జన్మరాకుండా చేసుకొనే మోక్షమార్గం.

బ్రహ్మదేవుడు ఆత్మరహస్య భావాన్ని పొందడానికి, శుభాన్ని అందుకోవడానికి అవసరమైన నివృత్తి మార్గాన్ని ఇలా తెలిపాడు.

తాబేలు తనకు అనుకూల పరిస్థితులు లేనప్పుడు తన అవయవాల్ని ఎట్లా లోపలకు తీసుకుంటుందో అదే విధంగా పండితుడు కోరికల్ని వెనక్కు మళ్ళిస్తాడు. ఎవడైతే కోరికల్ని అదుపులో పెట్టగలడో అతడే ధీరుడు. ఇంద్రియాల్ని నియంత్రించడం సులభం కాదు. ఇంద్రియాల్నే కట్టెలుగా చేసుకొని ఆత్మ అనే అగ్ని ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. సమస్త భూతాలను తన ఆత్మలో దర్శించగలిగిన వానికి సూక్ష్మతత్త్వ దర్శనం కలుగుతుంది. ఈ శరీరంతో సముద్రాన్ని దాటడం కష్టం. ఎందువల్లనంటే ఇంద్రియాల వల్ల కలిగే సుఖం అల్పంగాను, రోగాది బాధలతో కలిగే దుఃఖం అధికంగాను ఉండేదే ఈ సంసారం. దీనికి క్రోధము, కోరికలు ప్రభువులు. వీళ్ళిద్దర్నీ జయించినప్పుడే సముద్రాన్ని దాటగలుగుతాం.

ఓ ఋషులారా! ఒక్కొక్క తత్త్వానికి ఒక్కొక్క లక్షణం ఉంటుంది. ఆ లక్షణాన్ని గుర్తిస్తే వీటికి అతీతమైన తత్త్వం ఎట్లా ఉంటుందో తెలుస్తుంది.

తత్త్వం	–	లక్షణం
ధర్మం	–	అహింస
అధర్మం	–	హింస
దేవతలు	–	ప్రకాశత్వం
మానవులు	–	కర్మ
ఆకాశం	–	శబ్దం
వాయువు	–	స్పర్శ
జ్యోతిస్సు	–	రూపం
జలం	–	రసం
పృథ్వి	–	గంధం

భారతి	–	సత్యం
మనస్సు	–	చింత
బుద్ధి	–	వ్యవసాయం
మహత్తు	–	ధ్యానం
అవ్యక్తం	–	సాధుత్వం
యోగం	–	ప్రవృత్తి
జ్ఞానం	–	సన్యాసం

అవ్యక్త నామ తత్త్వ నిరూపణ

ఏయే తత్త్వాలలో ఏది ప్రధానమో తెలుసుకోవడం బ్రహ్మజ్ఞాన సాధనకు తోడ్పడుతుంది. అన్ని పదార్థాలు విరుద్ధమైన కార్య కారణ సంబంధాన్ని కలిగి ఉంటాయి. నశించడం కోసమే పెరుగుతాయి. బాగా వృద్ధి చెందడం క్షీణించడానికే. దగ్గరకావడం అంటే విడిపోవడానికే. సుఖాలన్నీ దుఃఖాలతోనే ముగుస్తాయి. ఈ రెండింటినీ సమంగా చూడటమే 'యోగం'.

జ్ఞానం అట్లా కాదు. అది ఎన్నటికీ నశించదు. జ్ఞానం వలన అహంకార మమకారాలు తొలగి మనిషి శాంత చిత్తం పొందుతాడు. శాంత చిత్తం గల మనిషి మోక్షమార్గాన్ని అన్వేషిస్తాడు. బ్రహ్మ అట్లా ఉపదేశించి ఇకపైన ఆశ్రమ విధానాన్ని గూర్చి ఇలా తెలిపాడు.

బ్రహ్మచర్యం :

ఈ ఆశ్రమంలో ఉండే వాడినే బ్రహ్మచారి అంటారు. అతడు గురువును పుత్రుడువలె సేవిస్తూ వేదాధ్యయనం చేస్తాడు. భిక్షమెత్తి తెచ్చిన ఆహారాన్నే తింటాడు. మూడు వేళల్లోను సంధ్యావందనం చేస్తూ నిష్ఠతో పవిత్రుడుగా జీవిస్తాడు. జంధ్యం, మొలత్రాడు ధరిస్తాడు. అధికంగా మాట్లాడటం గాని, నిద్రించడం గాని, కూర్చోవడం గాని, తిరగడం గాని లేకుండా శాస్త్రం చెప్పిన విధంగా నడచుకుంటాడు. సత్య ధర్మాలు పాలిస్తూ శాంత ప్రవృత్తి కలవాడై రెండు పూటలా అగ్నిహోత్రం నిర్వహిస్తాడు. పాపకార్యాల జోలికి పోడు.

గృహస్థుడు :

లోక వ్యవహారాలు, ధర్మం రెంటినీ పాటిస్తాడు. భార్య యెడల అనురాగం కలవాడై ఉంటాడు. నిర్మలమైన ప్రవర్తన కలిగి ఉంటాడు. పంచయజ్ఞ నిష్ఠ కలిగి ఉంటాడు. అతిథికి పెట్టగా మిగిలిందే తింటాడు. శక్తిని బట్టి దానం చేస్తాడు. ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకుంటాడు. అందరితో స్నేహంగా మెలగుతాడు. వేదాధ్యయనం చేస్తూ, ఉత్తమమైన వ్రతాల్ని చేస్తాడు. ఉత్తములిచ్చే దానాన్నే గ్రహిస్తాడు. శత్రుమిత్రభావం లేనివాడై సమభావంతో వ్యవహరిస్తాడు. పాపకార్యాలకు దూరంగా ఉంటాడు.

వానప్రస్థాశ్రమం :

ఈ ఆశ్రమంలో ఉన్నవాడు గ్రామాన్ని వదలిపెట్టి అడవుల్లో ఉంటూ పర్ణశాలల్లో నివసిస్తాడు. రెండు పూటలా స్నానం చేస్తూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తాడు. తృణధాన్యాలు, కందమూలాలు, పండ్లు

ఆహారంగా తీసుకుంటాడు. నారచీరలు ధరిస్తాడు. నేలమీదనే పడుకుంటాడు. అతిథుల్ని ఆదరించి ఆహారాన్ని అందరితోనూ పంచుకుంటాడు. అధ్యయనం, అగ్నిహోత్రం చేస్తూ ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకొని వానప్రస్థుడు పవిత్ర జీవితం గడుపుతాడు.

సన్యాసాశ్రమం :

ప్రాణులన్నిటి పట్లా ప్రేమ, దయ కలిగి ఉంటాడు. గతించిన విషయాల్ని గూర్చి చింతించడు. రాబోయే వాటిని గూర్చి కలలు కనడు. భిక్ష చేస్తూ అప్పటికి లభించిన దాన్నే తింటూ దేహాన్ని రక్షించుకొంటాడు. తాబేలు తన అవయవాల్ని లోపలకు లాక్కున్నట్లుగా తన ఇంద్రియాల్ని నియంత్రిస్తాడు. అన్నవస్త్రాలు తప్ప మరిదేన్నీ స్వీకరించడు. రోజు కొకసారి మాత్రమే భుజిస్తాడు. నమస్కారంగాని, స్నేహాన్నిగాని, ప్రశంస గాని ఎదురుచూడకుండా యతి జ్ఞానమయమైన జీవితాన్ని గడుపుతాడు. అసూయ, కోపతాపాలు లేకుండా ఉంటూ ఇంద్రియాల్ని నియంత్రించడం, బ్రహ్మచర్యం అవలంభించడం, ఋజువర్తన, సత్యపాలన, లోభగుణం లేకుండా ఉండటం, హింస చేయకుండా ఉండటం సన్యాసికి ముఖ్యమైన దీక్షలు. సన్యాసి ఏ చెట్టు నీడనో, నది ఒడ్డునో, అడవుల్లోనో, దేవాలయాల్లోనో ఒంటరిగా నివశిస్తాడు. దుర్మార్గంతోగాని, కుయుక్తులతో గాని ఏ వస్తువుల్నీ సేకరించుకోడు. ఈ విధంగా యతి సంచరిస్తూ ఉంటాడు. తన గొప్పదనాన్ని ఎవరికీ చాటుకోకుండా, ఎదుటివారు తన్ను ఉపేక్షాభావంతో చూసేట్లుగా ఏ సన్యాసి అయితే నడచుకొంటాడో అతడు బంధాలన్నింటి నుండి విముక్తి పొందిన వాడని గ్రహించవచ్చు. సన్యాసమంటే తపస్సు చేయడమే. ఏకత్వం, అనేకత్వం అనే రెండు లక్షణాలు కలిగిన ఆత్మ వస్తువు ప్రాణులన్నింట్లోనూ ప్రకాశించడం మొదలవుతుంది. అటువంటి జ్ఞాని ద్వంద్వ మోహాలను అధిగమించి ముక్తిని పొందుతాడు. యోగ సాధన మూలంగా తన లోని జీవాత్మను ఒక నిమిషం పాటైనా దర్శించగలిగితే ముక్తి స్థానాన్ని పొందగలుగుతాడు.

ఇంతవరకు చెప్పిన అవ్యక్త ఆత్మజ్ఞానం పుణ్యప్రదం, సాత్త్వికం, పాపహరం, ఇంద్రియాతీతమైన ఆత్మతత్త్వదర్శనానికి జ్ఞానం పాకుడు తీగవలె పనికి వస్తుంది.

ఋషులు : బ్రహ్మదేవా!ధర్మాలు అనేక రీతుల్లో ఉంటాయి. వీటిలో ఎవడు వాటిని పాటిస్తే వాడు మేలుపొందుతాడు. మా బుద్ధి పలురకాలుగా ప్రసరిస్తోంది. అందువల్ల నిశ్చయజ్ఞానం లేకుండా ఉన్నాం. ముఖ్యంగా అనుష్ఠించాల్సిన పద్ధతి ఏదో బోధించండి. సత్త్వానికి పురుషుడికీ ఉన్న సంబంధమేదో స్పష్టంగా చెప్పండి.

సత్త్వం తప్పక అనుష్ఠించాల్సిందని నిరూపించుట

బ్రహ్మదేవుడు : పుణ్యాత్ములారా!ధర్మాలన్నింట్లోనూ అహింస గొప్పది. దీనివలన ఉత్తమ జ్ఞానం లభిస్తుంది. కోరికతో పనులు చేసేవాడు జనన మరణ బంధాలలో చిక్కుకుంటాడు. ఫలితాన్ని

ఆశించకుండా చేసే కర్మల వలన ముక్తి లభిస్తుంది. పురుషునికి విషయాలకు – సత్త్వానికి ఉండే సంబంధమే భోక్తకు, భోజ్యానికి మధ్యన ఉండే సంబంధం వంటిది.

పరతత్త్వాన్ని దర్శించడానికి సత్త్వం దీపం లాంటిది. కనుక సత్త్వాన్ని వాహనంగా స్వీకరించాలి. దూరప్రయాణాలు చేసేవాడు వాహనం వలన ప్రయోజనాన్ని పొందుతాడు. నదిని దాటాలంటే నావను సహాయంగా గ్రహించిన వాడు క్షేమంగా దాటగలుగుతాడు. ఏ సాధనమూ లేని పురుషుడు బేల అవుతాడు.

జప్రయాణం అంటే 'మహాప్రస్థానం'. చివరకు పొందే ఫలమే 'అభ్యుదయం', నావ అనేది సత్త్వం. నావికుడు 'పురుషుడు'. నావ లేని వాడు బేల. నదిని దాటే వరకు నావను ఆశ్రయిస్తాం. ఆ తర్వాత దానిని విడిచిపెడతాం. అట్లాగే 'పురుషుణ్ణి' దర్శించేంతవరకు సత్త్వాన్ని అవలంభించి, ఆ తర్వాత దాన్ని కూడా విడిచిపెట్టాలి. (అనగా 'ఏరు దాటాక తెప్ప తగలెయ్యడమన్న' నానుడి ఇక్కడ వర్తించదు). శ్రీరామకృష్ణులు సత్త్వాన్ని ఇలా ఉపదేశించారు. "ఈ దారి కాశీకి చేరుస్తుంది. కానీ ఈ దారి కాశీ కాదు" అన్ని

సముద్రంలో అలలు మాటిమాటికీ ఎట్లా పుడుతూ ఉంటాయో, అట్లాగే దేవతలు, మానవులు, వృక్షాదులన్నీ అవ్యక్తం నుండి పుట్టి అవ్యక్తంలోనే లయమవుతున్నాయి. అనగా ఈ వ్యక్తమైన ప్రపంచమంతా అవ్యయుడైన ఆ మహాపురుషుడు ఆధారంగానే పుట్టి పెరుగుతున్నాయి. ఈ రహస్యాన్ని గ్రహించిన పుణ్యాత్ముడు మోహబంధాలనుండి విముక్తుడవుతాడు.

పుణ్యాత్ములారా! ప్రజాపతులు మహాతపస్సు చేసి ఈ విధంగా సృష్టి కర్మలు చెయ్యగలుగుతున్నారు. మరే ఇతర మార్గాల వలన పొందలేని ఉత్తమ గతులను తపస్సు వలన పొందవచ్చు. అహంకారం లేని తపస్సు వలన మునీశ్వరుడు ప్రజాపతి సమీపంలో నివసిస్తాడు. మమతాహంకారాల్ని విడిచి పవిత్రము, అచంచలము అయిన ధ్యానంతో కూడిన తపస్సు చేసిన ఋషి ముక్తి పథాన్ని చేరుకుంటాడు.

అవ్యక్తంలో లీనమయ్యే ప్రతిపనీ 'అవిద్య' కారణంగా బంధహేతువవుతుంది. అదే పూర్తిగా నిర్మలత్వంతో కూడిన పనులైతే 'అమృత' మవుతుంది.

కర్మ యోగులు కర్మ ముఖ్యమంటారు. జ్ఞానులు జ్ఞానమే అన్నింటికీ చివరిమెట్టు అంటారు. కర్మలు పదహారు వికారాలతో కూడిన 'మూర్తి'ని సృష్టించగా, జ్ఞానం వికార రహితుడైన పురుషుణ్ణి ప్రకాశింపజేస్తుంది. సూక్ష్మంగా పరిశీలిస్తే కర్మ లేకపోవడం, జ్ఞానమయుడు కావడం అన్నది ఆ 'పురుషుడి' సహజ స్వభావమని వేదాలు ఏనాడో చెప్పాయి.

"శిష్యా! ఈ కథను మనస్సులో ఉంచుకో. నువ్వు కూడా బ్రహ్మవాక్కును స్థిరంగా మనస్సులో నిలుపుకొని అత్యున్నతమైన సమాధిని సాధించు" ఈ విధంగా గురువు ఉపదేశించగా శిష్యుడు ఆ ఉత్తమ మార్గాన్ని ఆచరించి ముక్తిని పొందాడు.

ఈ విధంగా శ్రీకృష్ణుడు ఆదరంతో బోధించగా, విని అర్జునుడు అంత సంస్కారం గల ఆ

గురు శిష్యులెవరో చెప్పమని అడిగాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు "అర్జునా! నేనే ఆ గురువును. నా మనస్సే ఆ శిష్యుడు" అన్నాడు.

విశేషార్థం : భగవంతుడు అర్జునునకు గీతాశాస్త్రాన్ని విపులంగానే బోధించాడు. అయినా అర్జునుడు మళ్ళీ ఆ బోధను మరొక సారి అనుగ్రహించమని కోరాడు. దాని పర్యవసానమే ఈ అనుగీత. అజ్ఞానం చేత నువ్వు నా బోధను మరచిపోయావని భగవంతుడు అర్జునుని నిందించాడు. అనగా ఆ ఉపదేశం వలన నీ మనస్సు (వైరాగ్యానికి) పరిపక్వం కాలేదని బోధపడుతోందని అన్నాడు. మళ్ళీ అదే రీతిలో ఉపదేశించడం కష్టమని తేల్చి చెప్పాడు. అంత మాత్రం చేత భగవంతుడికి మళ్ళీ చెప్పే శక్తి లేదని అనుకోగూడదు.

ఆనాడు, అర్జునుని మూలంగా ఇంకా కావలసిన పనులు అనేకం ఉన్నాయి. అందువల్ల అర్జునునికి వైరాగ్యం కలగడం భగవంతునికి ఇష్టంలేదు. అందువల్ల కర్మ మార్గాన్నే బోధించాడు. యుద్ధం అయిన తర్వాత భీష్ముని చేత ధర్మాలన్నింటినీ పలికించాడు. అర్జునుని వలన కావాల్సిన కార్యాలు నెరవేరాయి. ఇకపైన అర్జునునికి ఏది అవసరమో తెలుసుకొని భగవంతుడు ఈ అనుగీతను బోధించాడు.

భగవద్గీతకు, ఈ అనుగీతకు ఉన్న తేడా ఏమిటి? అనుగీతలో ప్రధానంగా ఇంద్రియ నిగ్రహాన్ని గురించే బోధించాడు. బహిర్యాగం కన్నా అంతర్యాగం ఉత్తమమని తెలిపాడు. అట్లాగే శాస్త్రాలన్నింట్లోకీ అహింసయే ప్రధానమని చెప్పబడింది.

భగవద్గీతలో మొదటినుండి కర్మనే ప్రతిపాదిస్తూ వచ్చాడు. 18వ అధ్యాయంలో అర్జునా! శత్రువుల్ని వధించమని బోధించాడు. అట్లాకాకుండా నిజంగా ఆనాడే వైరాగ్యాన్నే బోధించి ఉంటే అర్జునుడు యుద్ధం చేసేవాడే కాదు. అర్జునుడు మందమతి కాదు. భగవంతుడు అతడికి ఆ సమయంలో ఏది కావాలో అదే బోధించాడు.

ఆనాడు అర్జునుడు యుద్ధం చెయ్యడానికి వెనుకాడాడు. యుద్ధం తప్పక జరిగి భూభారం తగ్గ వలసి ఉంది. కనుకనే ఆనాడు యుద్ధభూమిలో కర్మమార్గాన్ని ఉపదేశించి, వైరాగ్యం కలగకుండా ఉండేట్లు చేశాడు. ఫలాన్ని ఆశించకుండా నువ్వు ఆచరించాల్సిన ధర్మాన్ని ఆచరించమన్నాడు. కర్తను 'నేను' అన్న అభిమానాన్ని విడిచి పెట్టమన్నాడు. నువ్వు చెయ్యనన్నా ప్రకృతి నిర్బందించి నీచేత చేయిస్తుంది.

శ్రీకృష్ణుడు ఉదంకుని ఆశ్రమానికి ప్రయాణమగుట

వైశంపాయనుడు : ఓ జనమేజయ మహారాజా! శ్రీకృష్ణుడు అర్జునుడికి ఆధ్యాత్మిక విద్యను బోధించి ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు : అర్జునా!నేను ద్వారకను విడిచి చాలా కాలం అయింది. నా తండ్రి వసుదేవుడిని చూసి పాదాభివందనం చెయ్యాలని మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. అట్లాగే బలదేవుణ్ణి మిగిలిన బంధువుల్ని కూడా చూడాలని ఉంది. మీరంతా ఒప్పుకుంటే వెంటనే బయలుదేర్తాను.

అర్జునుడు : కృష్ణా! మనం వెంటనే ఇంద్రప్రస్థం నుండి హస్తినకు వెళ్దాం. ధర్మరాజుతో నువ్వే ఈ ప్రతిపాదన చెయ్యి. నేను కూడా అందుకు తగినట్లు మాట్లాడుతాను.

వెంటనే రథాల్ని సిద్ధం చేసి కృష్ణార్జునులు పరివారంతో కలిసి హస్తినకు పోయి ముందుగా ధృతరాష్ట్రుని గాంధారిని చూసి వారిని సంతోషపెట్టారు. అక్కడనుండి కుంతి ఇంటికి వెళ్ళి ఆమెను పలకరించి, అక్కడ నుండి ధౌమ్యుణ్ణి, విదురుణ్ణి, యుయుత్సుని సంజయుడిని దర్శించారు. ఆ రోజు అర్జునుని గృహంలోనే ఉండి మర్నాడు కొలువు తీరి ఉన్న ధర్మరాజుతో అర్జునుడు ఇలా అన్నాడు.

అర్జునుడు : అగ్రజా! శ్రీకృష్ణుడు చాలాకాలం నుండి హస్తినాపురంలోనే ఉన్నాడు. ద్వారకకు పోయి వసుదేవుణ్ణి బలరాముణ్ణి ఇతర బంధువుల్ని చూసి, ద్వారకా వాసుల్ని అనుగ్రహించాలనుకొంటున్నాడు. ద్వారకలో ఎక్కువ కాలం ఉండకుండా త్వరలోనే హస్తినకు వస్తానంటున్నాడు.

ధర్మరాజు : కృష్ణా! అక్కడ ద్వారకలో చెయ్యాల్సిన పనులన్నీ చక్కబెట్టుకొని, బంధుమిత్ర సపరివారంగా అశ్వమేధయాగానికి రమ్ము.

ఈ విధంగా ధర్మరాజు అనుజ్ఞ పొంది శ్రీకృష్ణుడు ధర్మరాజుకు నమస్కరించి బయలు దేరాడు. ద్రౌపదితోను, కుంతితోను వెళ్ళివస్తానని చెప్పగా వారు సంతోషంగా సమ్మతించారు. శ్రీకృష్ణుడు అర్జునుని వద్ద మిగిలిన బంధువులందరి వద్ద శలవు తీసుకొని ద్వారకకు బయలుదేరాడు. అతడి వెనుకనే చిన్న రథంలో సుభద్ర కూర్చుంది.

శ్రీకృష్ణుడు ఉదంకుని ఆశ్రమం చేరుట

శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళేదారిలో ఉదంకుడి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ ముని శ్రీకృష్ణుని ఆదరపూర్వకంగా ఆహ్వానించి అతిథి మర్యాదలు చేసి ఇలా అన్నాడు.

ఉదంకుడు : శ్రీకృష్ణా! పక్షపాత పాపం అంటని నువ్వు ప్రజలంతా సంతోషించేట్లుగా కౌరవ పాండవులను సమాధాన పరచావు గదా! ఎవరి రాజ్యం వాళ్ళు అనుభవించేట్లు చేసి బంధుత్వాన్ని పదిల పరచావు గదా.

ఉదంకుడు ఏమీ ఎరగనట్లు వ్యంగ్యంగాను నింద వ్యక్తమయ్యేటట్లుగాను పరామర్శ చేశాడు. శ్రీకృష్ణుడు అతడి మాటల్లోని వ్యంగ్యాన్ని కనిపెట్టి అంతకన్నా నంగనాచిలా ఇలా బదులు చెప్పాడు.

శ్రీకృష్ణుడు : మహర్షీ! సంధి చెయ్యాలనే వెళ్ళాను. ఎంతో సామరస్యంగానే మాట్లాడాను. వాళ్ళు వినక పోతే గద్దించి మాట్లాడాను. సంధికి అంగీకరించకపోతే పరిణామాలు ఎంత భయంకరంగా ఉంటాయో భయం కొల్పేట్లుగా చెప్పి చూశాను. నేను ఎన్ని విధాలుగా ప్రయత్నం చేసినా దుర్యోధనుణ్ణి అతడి తమ్ముల్ని ఒప్పించలేక పోయాను. భీష్మ ద్రోణాదులు కూడా నా మాట వినమని ఎంతగానో బ్రతిమిలాడాడు. ఎంత చెప్పినా వినక పోవడంతో యుద్ధం అనివార్యమయింది. ఆ యుద్ధంలో కౌరవులంతా వీరమరణం పొంది స్వర్గాన్ని చేరుకున్నారు. ఇటు పాండవులైదుగురు తప్ప మిగిలిన

వారందరికీ కౌరవులకు పట్టిన గతే పట్టింది. కర్మఫలాన్ని ఎంతటి వారైనా అనుభవించాల్సిందే కదా.

ఉదంకుడు : (ఉదంకుడు ఉగ్రుడైపోయాడు.) నువ్వు పక్షపాతంతో వ్యవహరించావు. నీకిప్పుడే శాపం పెడుతున్నాను కాచుకో.

శ్రీకృష్ణుడు : మహర్షీ! నేను చెప్పేది సాంతం విను. సావధానంగా ఆలోచించు. ఆ తర్వాత నువ్వు ఏమైనా చెయ్యి.

మునీశ్వరా! మునికి కోపం క్షేమం కాదు. కోపాన్ని దిగమ్రింగు. శాంతుడవు కమ్ము. నా విన్నపాన్ని ఆలకించు. నేను అల్ప తపస్వుల శాపానికి భయపడను. నువ్వు శపిస్తే నీకున్న కాస్త పుణ్యం పోతుంది. ఆవేశంలో నన్ను శపించడం వలన సుస్థిరమైన నీ బ్రహ్మచర్యమంతా వ్యర్థం కాదా?

ఉదంకుడు : నువ్వు చెప్పే న్యాయమేదో చెప్పు. శాంతంగానే వింటాను. నువ్వు చెప్పేది నాకు న్యాయమనిపిస్తే నిన్ను శపించకుండా వదిలేస్తాను.

శ్రీకృష్ణుడు : (చిరునవ్వు నవ్వి) ఉదంకా! సత్త్వ రజస్తమో గుణాలు మూడూ నాలోనే ఉంటాయి. మరుత్తులు, వసువులు మొదలైన దేవతలందరూ నానుండే పుట్టారు. నేనే సృష్టిఅంతా వ్యాపించి ఉంటాను. సృష్టి అంతా నిశ్చలంగా నాలోనే ఉన్నది. చిత్తూ, అచిత్తూ అనే తత్త్వాలు రెండూ నేనే. ఓంకారంతో సహా నాలుగు వేదాలు, నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలు వాటికి సంబంధించిన విధులు, స్వర్గము, మోక్షము నా రూపాలే నని తెలుసుకో. యజ్ఞాలు చేసే వారంతా నన్ను స్తుతించి పుణ్య ఫలాన్ని పొందుతారు. పాపులు కూడా ప్రాయశ్చిత్త కర్మలు చేసి నన్ను స్తుతించి దోషవిముక్తులవుతారు. ఓ తపస్వీ! నా మనస్సున జన్మించిన యముడు నా పెద్ద కొడుకని తెలుసుకో. నేనే బ్రహ్మనై సృష్టిని, విష్ణువునై స్థితిని, శివుడినై లయాన్ని సునాయాసంగా చేస్తూ ఉంటాను. ధర్మానికి హాని కలిగినప్పుడు నేనే పూనుకొని శిష్టుల్ని రక్షిస్తూ, దుష్టుల్ని శిక్షిస్తూ లోకాల్ని కాపాడతాను. దుష్టులైన కౌరవుల్ని శిక్షించకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే పాండవులతో కలసి మెలసి ఉండేట్లు చేయడానికి ఎంతగానో ప్రయత్నం చేశాను. నేను చేసిన ప్రయత్నాలన్నింటినీ బ్రహ్మజ్ఞాన సంపన్నులైన వ్యాసాది మహర్షులంతా మెచ్చుకొన్నారు. అధర్మ పరులైన కౌరవులంతా ధర్మపరులైన పాండవుల చేతిలో మరణించారు. ఇప్పుడు నాకు నువ్వు ఏ శాపం పెడతావో పెట్టు.

ఉదంకుడు : పరమేశ్వరా! పరిపూర్ణుడవైన నీ దయ చేత నువ్వు చెప్పిన విషయాలన్నీ నాకిదివరకే తెలుసు. కానీ ఇంతకు ముందు కోపంతో కూడిన గర్వం గలవాడినై నా మనస్సు మూసుకుపోయింది. అమృత తుల్యమైన నీ వాక్కులు నన్ను నిర్మలుణ్ణి చేశాయి. కృష్ణా! నీ అనుగ్రహానికి పాత్రుడనయితే, నా మనో నేత్రాలు ఆనందించేట్లుగా నీ విశ్వరూపాన్ని చూపించు.

శ్రీకృష్ణుడు విశ్వరూపమును చూపుట

ఉదంకుడీ విధంగా కోరగా, దయామయుడైన శ్రీకృష్ణుడు పూర్వం అర్జునునకు చూపిన

విశ్వరూపాన్నే చూపాడు. ఆ మునీశ్వరుడు ఆశ్చర్యపోతూ చేతులు జోడించి నమస్కరిస్తూ, తొట్రుపడ్డ గొంతుతో ఇలా అన్నాడు.

సీ॥ పుండరీకాక్షా! యీ పుడమి యంతయును భ వత్పాద పంక్తి సంవ్యాప్త మయ్యె;
నంబరంబెల్లను నావృతమయ్యె నీ మహిత సముజ్జ్వల మస్తకముల;
నంతరిక్షము 'దావకాద్భుత కుక్షిదే శంబులచేత సంభన్న మయ్యె;
భవదీయ మహనీయ చామార్గళానిచ యాపిహితములయ్యె నన్నిదిశలు

తే॥ బహుచరణముల, బహుశిరోభాగములను ।
బహు జఠరముల, మహు భుజపరాక్రములను
దేవ! యిట్లు సర్వంబును నీవయైత ।
నర్చిః తిది నాదు కన్ను మనంబుఁ దనిపి

పద్మనేత్రా! పరమాత్మా! భూమినంతా నీ పాదాలు కప్పివేశాయి. ఆకాశాన్నంతా నీ శిరస్సులు కప్పేశాయి. భూమ్యాకాశాల మధ్య నుండే ప్రదేశాన్నంతా నీ ఉదరం ఇతర భాగాలు ఆక్రమించాయి. నీ భుజాలు నాలుగు దిక్కుల్ని ఆక్రమించాయి. అనేక పాదాలు, శిరస్సులు, ఉదరాలు, చేతులతో నీవే ప్రపంచమంతా వ్యాపించావు. దేవా! నీ విశ్వరూపం నా కన్నులను మనస్సు తృప్తి పరచింది. మహాత్మా! నీ ఈ రూపాన్ని ఉపసంహరించు.

శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని ఉపసంహరించి ఉదంకుని వరం కోరుకోమన్నాడు.

ఉదంకుడు : ఆశ్రిత రక్షకా! నీ విశ్వరూపం చూసిన తర్వాత కూడా ఇంకా ఏమైనా కోరికలుంటాయా? నీ విశ్వరూప దర్శనమే అన్నింటికన్నా పెద్దవరం. అయినా వరం కోరుకోమన్నావు కాబట్టి అడుగుతున్నాను. ఓ దేవా! ఇదంతా నిర్జల ప్రదేశం. అందువల్ల ఈ ప్రాంతం అంతా నీరు లభించేట్లు అనుగ్రహించు.

శ్రీకృష్ణుడు : ఓ మహర్షి! నువ్వు కోరినట్లే నీరు కావాలన్నప్పుడల్లా నన్ను స్మరించు, నీరు లభిస్తుంది. ఇక నేను ద్వారకకు వెళ్తున్నాను.

ఇట్లా ఉండగా ఒకరోజున ఉదంకుడు అడవిలో వెళ్తూ ఉండగా బాగా దాహం వేసింది. వెంటనే శ్రీకృష్ణుని స్మరించాడు. ఇంతలో ఒక చండాలుడు నాలుగు కుక్కల్ని వెంట బెట్టుకొని ఎదురు వస్తున్నాడు. అతడి శరీరం మురికిగా ఉంది. గోచీ తప్ప ఒంటిమీద నూలు పోగైనా లేదు. అతడి శరీరం నుండి నిర్మలమైన నీరు కారుతోంది. అప్పుడొక కడజాతివాడు "ఓ ఉదంకుడా! నీకు దప్పికగా ఉంటే నా శరీరం నుండి స్రవించే నీటి ధారల్ని త్రాగు. నీ దప్పిక తీర్చుకో. ఆలోచించకు" అన్నాడు. అయినా ఆ నీరు త్రాగేందుకు ఉదంకుడి మనస్సు అంగీకరించలేదు. ఆ విధంగా తటపటాయిస్తున్న ఉదంకుణ్ణి చూసి ఆ కడజాతి వాడు "ఓ మహర్షీ! బాగా దాహంగా ఉందన్నావు. తీరా నీరు పట్టుకువస్తే త్రాగనంటావేమిటి? నీకు శ్రేయస్సు కలుగుతుందని మాట ఇస్తున్నాను వెంటనే త్రాగు" అన్నాడు. దాంతో ఉదంకుడు కోపంతో ఆ కడజాతి వాణ్ణి గట్టిగా గద్దించాడు. దాంతో భయపడి ఆ కడజాతి

వాడు మాయమయ్యాడు. అప్పుడు ఉదంకుడు తనలో 'ఇదంతా మాయగా ఉన్నద'ని అనుకుంటూ శ్రీకృష్ణుని స్మరించాడు. శ్రీకృష్ణుడక్కడ ప్రత్యక్షమయ్యాడు. మహర్షి శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

ఉదంకుడు : ఓ మహాగుణా! నిన్ను స్మరిస్తే లభించే నీరు ఇటువంటిదా? నేను ప్రాణం పోయినా అంగీకరిస్తాను గానీ, ఆ కడజాతి వాడి శరీరం నుండి వస్తున్న నీటిని మాత్రం త్రాగను. నువ్విచ్చింది తుచ్ఛమైన వరమని ఇప్పుడు తెలుసుకున్నాను.

శ్రీకృష్ణుడు : ఓ మునీంద్రా!నీకు మేలు చెయ్యాలని ఇంద్రుని వద్దకు వెళ్ళి నీకు అమృతాన్నిమ్మని అడిగాను. అతడు మానవులకు అమృతం ఇవ్వడానికి వీలు కాదని నా కోరికను త్రోసి పుచ్చాడు. అప్పుడు నాకు కూడా కోపం వచ్చి 'ఓ దేవేంద్రుడా! నువ్వు నేను ఇంతగా ప్రార్థించినా ఆ బ్రాహ్మణుడికి అమృతం ఇవ్వనని అంటున్నావు. నువ్వు ఇట్లాంటి వాడివని తెలియక నిన్ను ప్రార్థించి నన్ను నేను కించపరచుకొన్నాని నిష్ఠూరంగా మాట్లాడాను. అప్పుడు దేవేంద్రుడు నాతో "కృష్ణా! నువ్వు కోరినట్లే ఆ బ్రాహ్మణునికి అమృతం ఇస్తాను. అతడే వద్దంటే నన్ను తప్పు పట్టకు" అన్నాడు. నేను సరే అని అతడి వెనకాలే వస్తున్నాను. ఇంతలోనే అతడు కడజాతి వాడి వేషంలో వచ్చి నిన్ను అమృతం స్వీకరించమని అడగడం, నువ్వు నిరాకరించడం, అతడు అంతర్ధానమవ్వడం అన్నీ చకచకా జరిగిపోయాయి. ఉదంకుడా! ఈ విధంగా నేను చేసిన ప్రయత్నం అంతా వ్యర్థమైంది. దొరికిన మంచి అవకాశాన్ని చేయి జార్చుకున్నావు. ఎవరూ పొందలేని భాగ్యం కాస్తా తప్పిపోయింది.

అయినా, ఓ ఉదంకుడా! నేను నీకిచ్చిన వరం వృథా కాకుండా ఏడాది పొడుగునా నీకు నీళ్ళు దొరికేట్లుగా చేస్తాను. పుణ్యాత్మా! సదాచార సంపన్నా! నీటి చుక్కయినా దొరకని ఈ నిర్జల ప్రాంతంలో నువ్వు కోరుకున్నప్పుడు మేఘాలు వర్షిస్తాయి. అంతేకాదు. నీ పేరు చిరస్థాయిగా ఉండేట్లు, వీటికి ఉదంక మేఘాలని పేరు కలుగుతుంది. ఆ మేఘాలన్నీ ఇక్కడే ఆకాశంలో వ్యాపించి ఉంటాయి. ఇకపైన నన్ను నిందించకు అని అదృశ్యుడయ్యాడు.

వైశంపాయనుడు : ఓ జనమేజయ మహారాజా! ఆ ఉదంక మేఘాలు ఆయా పుణ్య తిథుల్లో నియమం తప్పకుండా ఆ నిర్జల ప్రదేశంలో వర్షాలు కురుస్తూ ఉంటాయి.

జనమేజయుడు : ఓ మహర్షీ! ఉదంకుడు శ్రీకృష్ణుని శపించడానికి పూనుకున్నాడు కదా! అతడికంత శక్తి ఎట్లా వచ్చింది?

ఉదంకుని చరిత్ర

వైశంపాయనుడు : జనమేజయా! గురుకృప వలన ఉదంకుడికి అటువంటి మహిమ కలిగింది. అతడు చాలా కాలం తన గురువైన గౌతమునికి నియమబద్ధంగా సేవలు చేశాడు. గౌతముడు శిష్యులందరికీ వరాలిచ్చి పంపేశాడు. కానీ ఉదంకుడిని మాత్రం అనుగ్రహించలేదు. అయినా అతడు మహానిష్ఠతో గురువుకు శుశ్రూషలు చేస్తూ ఉండేవాడు. ఒక రోజున అడవిలో కట్టెలు కొట్టి ఆశ్రమానికి చేరే సమయానికి మెడలు నొప్పి పుట్టి కట్టెల్ని అమాంతం నేలమీద పడేశాడు. ఆ కట్టెలతో పాటు తలలో నుండి కొన్ని జటలు తెగి కనిపించాయి. వాటిని చేతిలోకి తీసుకొని పరీక్షగా చూశాడు.

అవన్నీ తెల్లగా వెండిలా మెరిసిపోయాయి. వాటిని చూసుకొని ఉదంకుడు ఈ విధంగా దుఃఖించాడు. "అయ్యో! నాకు వయస్సు గడిచిపోయింది. తనతోటి వారంతా గురువు నుండి వరాలు పొంది వెళ్ళిపోయారు. గురువుకు నా పైన ఇంకా అనుగ్రహం కలుగలేదు గదా" అని కన్నీరు పెట్టుకున్నాడు. అప్పుడు గౌతముడు కూతుర్ని పంపి ఆ కన్నీటిని దోసిట్లోకి పట్టుకొని తెమ్మన్నాడు. ఆమె ఆ కన్నీటిని దోసిట్లోకి తీసుకొని ఆ వేడి భరించలేక నేలపైన వదిలేసింది. ఆ వేడికి తట్టుకోలేక భూమి క్షోభించింది. అప్పుడు గౌతముడు ఉదంకుడి వద్దకు పోయి ఎందుకు దుఃఖిస్తున్నావని అడిగాడు. అందుకు ఉదంకుడు "మహర్షీ! ఎంతోకాలం గడిచినప్పటికీ మీకు ఇతర శిష్యులపైన ఉన్న దయ నాపైన లేక పోయింది గదా" అని దుఃఖిస్తున్నాను అన్నాడు.

గౌతముడు : మహాత్మా! విచారించకు. నీకు యవ్వనాన్ని ప్రసాదిస్తున్నాను. దానితో పాటు నా కుమార్తెను కూడా సమర్పిస్తున్నాను. సంతోషంగా ఆమెను వివాహం చేసుకొని సుఖంగా ఉండు. మహర్షీ! ఈమె తప్ప మరెవ్వరూ నీ తేజస్సును భరించలేరు. ఆమెకు నూతన శరీరం ప్రాప్తించేట్లు చేస్తాను. ఆ శరీర ప్రాప్తి చేత ఆమెకది రెండవ జన్మ అవుతుంది. కనుక నువ్వు ఎటువంటి అనుమానాన్నీ పెట్టుకోకుడా ఆమెను స్వీకరించు. యౌవ్వనవంతుడివై నా కుమార్తెను పెండ్లి చేసుకో. అప్పుడు మీ ఇద్దరికీ ఈడు జోడు చక్కగా కుదురుతుంది. ఇది అధర్మం కాకుండా ఉండే వరమిస్తున్నాను.

మహర్షి ఆ మాటలు పలుకగానే కుమార్తె శరీరం తీగవలె అందంగా తయారైంది. ఉదంకుడూ యవ్వన వంతుడయ్యాడు. తర్వాత గురు పుత్రికను వివాహం చేసుకున్నాడు. పిమ్మట గౌతముడికి నమస్కరించి "గురువర్యా! గురుదక్షిణగా మీకిష్టమైనది కోరుకోండి" అని ప్రార్థించాడు. అప్పుడు గౌతముడు పుణ్యాత్మా! నీ నడవడికకే సంతృప్తుడనయ్యాను. ప్రత్యేకంగా గురుదక్షిణ ఏమీ వద్దు" అన్నాడు. ఉదంకుడు వినకుండా గౌతముని భార్య అయిన అహల్య వద్దకు వెళ్ళి వినయంతో గురుదక్షిణ కోరమని ప్రార్థించాడు. అందుకామె "నాయనా! నువ్వు మాకు పరాయి వాడవా? గౌతముల వారు చెప్పిన మాటలు మనస్సులో పెట్టుకొని నడచుకో" అన్నది. అయినా ఉదంకుడు పట్టు విడువలేదు. అప్పుడామె "తమ్ముడా! మిత్రహుడి దేవేరి చెవి పోగులు తెచ్చిపెట్టు" అన్నది. ఆమె నోట మాట రావడమే తడవుగా ఉదంకుడు ఆ పనిమీద వెళ్ళిపోయాడు. గురువు వద్దంటాడన్న భయంతో గురువాజ్ఞను గురుపత్ని నుండే పొందాడు. తర్వాత గౌతముడు "ఉదంకుడు ఎక్కడా కనిపించడం లేదు! ఏమైనాడు" అని భార్యనడిగాడు. అప్పుడు అహల్య ఉదంకుడు వెళ్ళిన పని చెప్పింది. గౌతముడు కలత చెంది భార్యతో ఇలా అన్నాడు. "అయ్యో! నాకు ముందుగా చెప్పి వెళ్తే బాగుండేది. ఆ సౌదాసుదు రాక్షస ప్రవృత్తి కలవాడు. ఒకానొక శాపం వలన నరమాంసం తినడానికి అలవాటు పడ్డాడు. ఆ విషయం ఉదంకుడికి తెలియదు. ఏమి జరుగబోతోందో గదా" అన్నాడు. ఆ మాటలు విన్న అహల్య భయపడుతూ ఉదంకుడికి కీడు జరుగకుండా రక్షించమని భర్తను ప్రార్థించింది. అప్పుడు గౌతముడు "భయపడకు, అతడికి ఏ ఆపదా రాకుండా కాపాడుతాను" అని భార్యకు ధైర్యం చెప్పాడు.

ఉదంకుడు ప్రయాణం చేస్తూ ఒక నిర్జనారణ్యంలో సౌదాముణ్ణి చూశాడు. అతడి ఒళ్ళంతా

రక్తమాంసాలు దుర్వాసన కొడుతూ అసహ్యంగా కనిపించాడు. అతడి కళ్ళు ఎర్రని చింతనిప్పుల్లా మండిపోతున్నాయి. ఉదంకుడు ధైర్యంగా అతడి వద్దకు వెళ్ళాడు. సౌదాముడు ఇలా అన్నాడు. "ఓ మానవుడా! నాకు బాగా ఆకలిగా ఉంది. ఈ పూటకు తిండి ఎక్కడ దొరుకుతుందా? అని ఆలోచిస్తున్నాను. సమయానికి నువ్వు వచ్చావు. నాకు చాలా సంతోషంగా ఉంది. అతడితో ఉదంకుడు ఇలా అన్నాడు. "రాజా! గురువు గారి పనిమీద నీవద్దకు వచ్చాను. గురువు పనిమీద వచ్చిన వాళ్ళను చంపడం న్యాయంకాదు" అని అనగా సౌదాముడిలా అన్నాడు. "ఉదంకుడా! ప్రతిరోజు రాత్రి రెండో జామున నేను తిండి తినేందుకు దేవతలు నిర్ణయించారు. ఇదే నాకు తినే సమయం. నాకు ఆకలితో కడుపు మండిపోతోంది. నిన్నిప్పుడు తింటేగానీ నా ఆకలి మంట చల్లారదు" అన్నాడు. అప్పుడు ఉదంకుడు "రాజా! నేను గురు కార్యం పూర్తి చేసుకొని వెంటనే తిరిగి వస్తాను. అప్పుడు నువ్వు నన్ను తిని ఆకలి తీర్చుకో. నా మాటనమ్ము. నేను గురుదక్షిణ చెల్లిస్తానని ప్రతిజ్ఞ చేసి వచ్చాను. యాచకులు అడిగింది నువ్వు తప్పక ఇస్తావన్న నమ్మకంతో నీ దగ్గరకు వచ్చాను" అన్నాడు. అప్పుడు సౌదాముడు "అయితే నానుండి నువ్వు ఏమి కోరుకుంటున్నావు?" అని అడిగాడు. అప్పుడు ఉదంకుడు "పుణ్యాత్మా! నీ భార్య చెవి కుండలాల్ని గురుపత్ని ప్రీతితో కోరింది. వాటిని ఇప్పించు" అన్నాడు. ఓ ఉదంకుడా! పరాయి వాళ్ళ సొమ్మును ఎవరైనా దానం చేస్తారా? కనుక కుండలాలు తప్ప మరేదైనా కోరుకో. ఇస్తాను అన్నాడు. ఉదంకుడిలా అన్నాడు. "ఓ రాజా! నువ్వు నన్ను పరీక్షించేందుకే ఏదో వంక పెట్టి తప్పించుకోవాలని చూస్తున్నావు. నాకు కుండలాలే కావాలి. మరే వస్తువూ వద్దు" అన్నాడు. అంతట సౌదాముడు "ఓ ఉదంకా! నువ్వు నా రాణి వద్దకు పోయి నేను చెప్పానని చెప్పి ఆమె కుండలాల్ని తీసుకొని పో" అన్నాడు. అప్పుడు ఉదంకుడు సౌదాముడి దేవేరి మదయంతి వద్దకు పోయి సౌదాముడు చెప్పినట్లే చెప్పాడు. అప్పుడామె "మునీశ్వరా! నీవు చెప్పిన మాటను నేను ఎట్లా నమ్మగలను. రాజువద్దనుండి ఏదైనా గుర్తు తీసుకొనిరా" అన్నది. అప్పుడు ఉదంకుడు రాజువద్దకు పోయి అతడి దేవేరి చెప్పినట్లే చెప్పాడు. ఆ మాటలు విన్న సౌదాముడు "ఓ ఉదంకుడా! నేనిప్పుడు చెప్పే మాటలే ఆమెకు చెప్పు. నా మాటలే ఆమె కోరే గుర్తు. 'ఈ విధంగా క్షేమం కలుగుతుందని నిశ్చయంగా చెప్పలేము. దీనిని వదిలితే గతీ లేదు' అని" చెప్పమన్నాడు. తిరిగి సౌదాముని భార్య వద్దకు పోయి అతడు చెప్ప మన్న మాటల్నే చెప్పాడు. అప్పుడా మదయంతి ఇలా అన్నది.

దమయంతి : ఓ గురుహితాభిలాషీ! నా భర్త ఆజ్ఞ ప్రకారం కుండలాలిస్తాను. ఈ కుండలాల కోసం దేవతలు, గంధర్వులు, నాగులు ఎన్నో విధాల ఎదురు చూస్తున్నారు. ఎంగిలి అంటుకున్నా, నువ్వు మైమరచి నిద్రపోయినా నేలమీద పెట్టినా వాళ్ళు దొంగిలిస్తారు. వీటిని శ్రద్ధగా పూజించి ధరించిన వారికి ఆకలి దప్పిక ఉండవు. అగ్ని భయంగాని, విషం వలన గానీ, భయం ఉండదు. భూత ప్రేత పిశాచాల పీడ ఉండదు. వీటిని పిల్లలు ధరించినా, పెద్దలు పెట్టుకున్నా కొలతలు పెట్టి చేయించినట్లు సరిగ్గా సరిపోతాయి. గురువులు నిన్ను మెచ్చుకొందురు గాక.

ఉదంకుడు మదయంతి నుండి కుండలాలు గ్రహించుట

మహా పతివ్రత అయిన మదయంతి భక్తి పూర్వకంగా కుండలాల్ని తీసి ఉదంకుడికిచ్చి

నమస్కరించింది. ఉదంకుడామెను ఆశీర్వదించి సంతోషంగా సౌదాముడి వద్దకు వెళ్ళి, "ప్రభూ! నా కోరిక నెరవేరింది. అయితే నువ్వు నీ దేవేరితో చెప్పమన్న వాక్యంలోని భావాన్ని నేను అర్థం చేసుకోలేకుండా ఉన్నాను. నేను తెలుసుకోదగిన వాడనని తలిస్తే చెప్పు" అన్నాడు. అప్పుడా సౌదాముడు ఇలా అన్నాడు.

సౌదాముడు : లోకులచే పూజించబడే వాడా! రాజులు బ్రాహ్మణుల్ని పూజిస్తారు. నేను బ్రాహ్మణుల్ని పూజించే వాడిని. ఒక చిన్న తప్పుకు బ్రాహ్మణుడి శాపం వల్ల ఇట్లా అయ్యాను. నా పాపం పోగొట్టు కోవడానికి వేరే ఉపాయం లేదు. అందువల్లనే బ్రాహ్మణ పూజ చాలా కష్టమైనదని అర్థమైంది. అందుకే అట్లా అన్నాను. "దీని వలన మేలు కలుగుతుందని చెప్పలేను. అట్లాగని మేలు కలిగించే వేరే మార్గమూ లేదు" అని నా భార్య మదయంతికి అర్థమయ్యేట్లుగాను, గోప్యంగాను చెప్పాను. అనగా కుండలాలు నీకివ్వడం వలన నాకేదైనా మేలు జరిగినా జరుగవచ్చునేమో నని అభిప్రాయపడ్డాను.

ఉదంకుడు : రాజా! నీ దయ వలన నా కోరిక నెరవేరింది. నేను వెళ్తున్నాను. 'కేవలం రెండు మాటలు మాట్లాడి నంత మాత్రాననే స్నేహం సిద్ధిస్తుందని' జ్ఞానవృద్ధులంటారు. కుండలాలు గురుపత్ని కిచ్చి నేను మళ్ళీ నీ వద్దకు వస్తానని నీతో చెప్పాను. అసత్యవాదిని కాకుండా మళ్ళీ నీ వద్దకు వస్తాను.

ఉదంకుడితో మాట్లాడటం వలన సౌదాముడిలో పూర్వజ్ఞానం, దానితో పాటే తెలివి కలిగాయి. ఉదంకుడి మాటల వలన సౌదాముడి మనస్సు దయతో నిండిపోయింది. మునీశ్వరుడి కళ్ళల్లోకి చూస్తూ ఇలా అన్నాడు. "ప్రాణాలు తీసే నా దగ్గరకు ఎవరైనా వస్తారా? వద్దు. వెళ్ళి సుఖంగా ఉండు."

ఉదంకుడు : రాజా! మంచి మనస్సు గల వారికి ఆపదలు కలిగినా అవి తొలగిపోతాయి. నీలోని మంచి గుణాలే నిన్ను పుణ్యాత్ముణ్ణి చేస్తాయి. కీర్తి సంపన్నుడైన గౌతమ మహర్షి నిన్ను నిండు మనస్సుతో ఆశీర్వదిస్తున్నాడు. అందువల్లనే నీలో దయ మంచితనం, వంటి నీ పూర్వ గుణాలన్నీ మేల్కొన్నాయి. నువ్వు పూర్వ వైభవాన్ని పొంది సుఖసంతోషాలతో వర్ధిల్లు. పూర్వపు ఔన్నత్యాన్ని పొందు అంటూ ఉదంకుడు ప్రేమతో అతడి శరీరాన్నంతా చేతులతో తడవి ఆనందాన్ని కలిగించాడు. సౌదాముడు కూడా భక్తి వినయాలతో ఆ మహర్షిని స్తుతించి నమస్కరించి వీడ్కోలు పలికాడు. ఉదంకుడు కుండలాల్ని లేడితోలులో మూటకట్టుకొని గౌతముని ఆశ్రమానికి బయలుదేరాడు. దారిలో ఒకచోట బిల్వ వృక్షాలనిండా పండ్లు వ్రేలాడుతూ ఉండటం చూశాడు. ఆకలి తెలిసొచ్చింది. కుండలాలున్న మూటను చెట్టుకు తగిలించి తాను చెట్టెక్కి బిల్వ ఫలాల్ని కోసుకు తింటూ ఉండగా గాలికి చెట్టుకు కట్టిన కుండలాలున్న మూట నేలపైన పడింది. అది చూసిన ఒక పాము ఆ కుండలాల్ని తీసుకొని పోయి ఒక పుట్టలో దూరింది. ఉదంకుడు వెంటనే క్రిందకు దూకి ఆ పామును వెంబడించి తన దగ్గరున్న కర్రతో పుట్టను త్రవ్వడం ప్రారంభించాడు. అప్పుడు ఇంద్రుడు బ్రాహ్మణ

రూపంలో వచ్చి "మునీశ్వరా! నీ దగ్గరున్న కర్రతో త్రవ్వి ఎన్ని రోజులకు పాతాళానికి చేరుకుంటావు? పాతాళం ఇక్కడనుండి వెయ్యి ఆమడల దూరంలో ఉంది. నీ కుండలాలు దొంగిలించుకు పోయిన పాము ఐరావతుడి కొడుకు అన్నాడు. అప్పుడు ఉదంకుడు "బ్రాహ్మణోత్తమా! పాతాళం ఎంత దూరంలోనైనా ఉండనిమ్ము. దొంగిలించిన వాడు ఎంత గొప్పవాడైనా కానిమ్ము. నేను వెంటనే వెళ్ళి తీసుకొని వస్తాను. నా ప్రాణాలైనా విడుస్తాను గాని, కుండలాలు లేకుండా పోను" అన్నాడు.

ఇంద్రుడికి ఉదంకుడి పట్టుదల తెలుసుకొని అతడి చేతిలో కర్రను తీసుకొని వజ్రాయుధానికుండే వాడిని, గట్టి తనాన్ని అందులో ప్రవేశపెట్టి వెళ్ళిపోయాడు. భయంతో భూమి కూడా బయపడి దారి ఇచ్చింది. వెంటనే ఉదంకుడు నాగలోకాన్ని చేరుకున్నాడు. ఉదంకుడక్కడ రకరకాల రత్నకాంతులతో ప్రకాశిస్తున్న భవనంలోకి ప్రవేశించాడు. ఆ భవనంలో ఓ గుర్రం కనిపించింది. దాని ముఖం ఎర్రగా ఉంది. శరీరం నల్లగా ఉంది. తోక తెల్లగా ఉంది. ఆ గుర్రం మానవ భాషలో ఉదంకుడితో ఇలా అంది. "ఓ తపోధనా! వెడల్పుగా ఉన్న నా గుదస్థానాన్ని గట్టిగా ఊదు. సంకోచించకు. అసహ్యించుకోకు. చెప్పినట్లు చెయ్యి. గౌతముడి ఆశ్రమంలో నువ్వు చేసిన సేవలు మరచిపోలేదు. అందువల్లనే సంతోషించి, దొంగిలించబడిన కుండలాల్నిప్పించి నీకు మేలు చెయ్యాలని నీకీ ఉపాయాన్ని చెప్పాను" అన్నది. ఆ మాటలు విన్న ఉదంకుడు ఆశ్చర్యంతో "నిన్ను నేను ఎరుగను. నిన్ను నేను సేవించడం ఎలా సంభవించింది?" అని అడిగాడు. అప్పుడా గుర్రం అతడితో "నేను నీ గురువుకు గురువును. అగ్నిదేవుడను. నువ్వు పరిశుద్ధుడవై భక్తితో ప్రతిరోజు నన్ను సేవించేవాడవు" అన్నది. అప్పుడా ఉదంకుడు గుర్రం ఉపదేశించినట్లే చేశాడు. అంతట ఆ అశ్వం రోమ రంధ్రాలన్నిట్లోనుండి దట్టమైన పొగపుట్టి పాతాళమంతా చుట్టేసింది. ఐరావతుడు కుటుంబం అంతా వీధిన పడింది. ఆ నాగరాజు ఉదంకుడి దగ్గరకు వచ్చి భక్తితో పూజించి ఆ కుండలాలు తెచ్చి ఇచ్చాడు.

ఉదంకుడు కుండలాలనిచ్చి గురుపత్నిని సంతోషపరచుట

ఉదంకుడు నాగులందర్నీ ఆశీర్వదించి పంపేశాడు. ఆ తర్వాత ఆ అశ్వానికి భక్తి పూర్వకంగా ప్రదక్షిణ నమస్కారం చేసి వేగంగా గౌతముని ఆశ్రమానికి వచ్చి చేరాడు. గురుపత్ని అయిన అహల్యకు కుండలాలనిచ్చి ఆమె చేతిలో పెట్టి సాష్టాంగ నమస్కారం చేశాడు. అనంతరం అహల్య, గౌతములు ఉదంకుని దీవించారు. కుండలాల్ని సంపాదించుకు రావడంలో ఎదురైన కష్టాలన్నీ వారికి తెలిపి, గౌతముడితో ఇలా అన్నాడు. "గురువర్యా! నీ కృప చేతనే ఈ కుండలాలను తెచ్చి గురుపత్నికి సమర్పించగలిగాను. అంతేగాని అందులో నా శక్తి సామర్థ్యాలు అణువంతైనా లేవని" వినయంతో మనవి చేశాడు. ఉదంకుడి మాటలకు ఆ దంపతులిద్దరూ పరమ సంతృప్తులై ఇలా అన్నారు.

గౌతముడు : ఓ ఉదంకుడా! నీ స్వభావం ఆశ్చర్యం కలిగించేది. మిత్రసాహుడి (సౌదాముడు) హీన స్థితినుండి ఉద్ధరించావు. పాము దొంగిలించిన కుండలాల్ని నేర్పుతో గురుపత్నికి చేర్చగలిగావు. నీ తపస్సుకు మెచ్చి, ఇంద్రుడు, అగ్ని నీకు చేదోడు వాదోడుగా నిలిచారు. ఈ కార్యాన్ని నువ్వు తప్ప

మరొకరు ఇంత సమర్థవంతంగా చేయలేరు. ఇది నిజం.

వైశంపాయనుడు : జనమేజయుడా! ఇదీ ఉదంకుని చరిత్ర. గురుపత్నికి కుండలాలు సాధించి తెచ్చిన ఉదంతాన్ని చెప్పాను.

జనమేజయుడు : మునిశ్రేష్ఠా! మహాత్ముడైన ఉదంకునికి వరమిచ్చి శ్రీకృష్ణుడు వెళ్ళిపోయాడు గదా. ఆ తర్వాత శ్రీకృష్ణ భగవానుడు ఏం చేశాడో చెప్పు.

విశేషార్థం : భగవంతుడు ఆర్తత్రాణమునే కోరుకుంటాడు. భక్త రక్షణకే ప్రయత్నిస్తాడు. అది ఆయన ప్రధాన కర్తవ్యంగా భావిస్తాడు. అట్లాగే ఉదంకుని ఆశ్రమానికి తనకు తానుగా వెళ్ళాడు. ఎందువల్ల? అతడు పరిపక్వ జీవుడే అయినా కొద్దిపాటి గర్వం ఉంది. అది తపోనిష్ఠకు భంగం కదా? కావున ఆ గర్వాన్ని అణచి అతణ్ణి కృతకృత్యుణ్ణి చెయ్యాలన్నదే భగవంతుని సంకల్పం. అంతేకాకుండా ఆ ప్రాంతమంతా మరుభూమి. నీటి వసతి లేనిది. ఉదంకుడి సుకృతం చేత ఆ ప్రాంతమంతా జలసమృద్ధి అయ్యే సమయం దగ్గర పడింది. ఆ కీర్తి ఉదంకుడికే దక్కాల్సి ఉంది. అందువల్లనే ద్వారకకు వెళ్తూ, అతడు పిలవకపోయినా ఆ ముని ఆశ్రమానికి వెళ్ళాడు.

భగవంతుని చూడగానే మనస్సులో శ్రీకృష్ణుడు పక్షపాత బుద్ధితో వ్యవహరించాడని శపించే ప్రయత్నం చేశాడు. శ్రీకృష్ణుడు ఇతడి గర్వాన్ని అణచాలని, పరిశుద్ధాంతఃకరణుని చెయ్యాలని భావించి తన స్వరూపాన్ని తెలియజేశాడు. దానివలన కలిగిన ఫలమేమంటే, మునిలో ఉండే అహంకారం, దానికి సంబంధించిన రజోగుణం నశించడమే. అందువల్లనే భగవంతుడు 'అల్ప తపస్వులకు నేను భయపడను' అన్నాడు. అనగా అర్థమేమి? నువ్వు చేసిన తపస్సు అల్పము. ఆ బలం చేత నన్ను శపించలేవు అనే కదా? కౌరవుల పాపాలు పండబట్టే సర్వనాశనమయ్యారు. ధర్మాన్ని స్థాపించేందుకు, అధర్మాన్ని నాశనం చెయ్యడానికే గదా నేను అవతరించేది. నేను ఏయే అవతారాలు దాలుస్తానో దానికి తగినట్లుగా ప్రవర్తిస్తూ ఉంటాను. ఎప్పుడైతే భగవంతుడీ మాటలు అన్నాడో అప్పుడే ఉదంకుడు తన శక్తి ఏమిటో తెలుసుకున్నాడు. త్రిమూర్తులూ నేనే. ఆయా పనుల కోసం ఆయా నామరూపాల్ని ధరిస్తానని భగవంతుడన్నాడు. వీరిలో ఒకరు అధికుడు మరొకడు అల్పుడు అనడం అజ్ఞానం. తమోగుణం వృద్ధి అయినప్పుడు దృష్టి మందగిస్తుంది. అది దాని స్వభావం. అది ఎప్పుడు వదుల్తుందో అప్పుడు జ్ఞానం ఉదయిస్తుంది.

ఉదంకుడికి జ్ఞానోదయం కాగానే విశ్వరూపం చూపమని ప్రార్థించాడు. అతడు నిర్మలమైన అంతఃకరణము కలవాడు కావడం వలన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. దానితో అతడికి సర్వమూ బ్రహ్మ స్వరూపమేనని తెలిసింది. ఆ తేజస్సు భరించరానిది. అంతో ఇంతో తపశ్శక్తి కలవాడు కాబట్టే చర్మచక్షువులతో చూడగలిగాడు. ఆ తేజస్సు భరించలేక "మహాత్మా! ఉపసంహరించు" అని వేడుకున్నాడు. అనగా దీని అర్థమేమి? భగవంతుడు తేజోరూపుడనియే గదా! తేజోరూపాన్ని ఉపాసించేవారే యోగులు. అంతర్దృష్టికి కనిపించే యజ్ఞమంటే ఏమిటి? అగ్ని పూజయే గదా. మరి అగ్ని తేజస్సు కాదా? మరిదాన్ని ఉపాసించడం కూడా ముక్తి పదమే గదా. కొందరు కర్మఫలాలు

అల్పమైనవంటారు. అది పొరపాటు. అల్పత్వం, బృహత్త్వమనేవి భావనలో ఉన్నదే గాని తత్త్వంలో కాదు. అగ్ని భగవత్స్వరూపమే గదా. దానినే పరమేశ్వరుడుగా భావించి సత్కర్మలాచరిస్తే ముక్తి లభిస్తుంది.

ఆ తర్వాత వరములిచ్చి భగవంతుడు ద్వారకకు వెళ్ళాడు. దాహం చేత ఆ ముని భగవంతుని స్మరించాడు. ఇతడి పుణ్యమేపాటిదో పరీక్షించాలనుకున్నాడు. కుక్కల్ని వెంటబెట్టుకొని, ఒళ్ళంతా నీరు కారుతూ ఉండడగా ఉదంకుని ఈ నీటిని త్రాగమని అడిగాడు. ఉదంకునిలో భేదభావం పోలేదు. పరమహంసత్వాన్ని పొందలేదు. తాను బ్రాహ్మణుడనని, అవతలి వాడు చండాలుడని, అతడి దేహమంతా మలినంగా ఉన్నదని, అట్టి శరీరం నుండి జాలువారే నీరు అపవిత్రమైనదని భావించి ఈసడించుకున్నాడు. ఎంతచెప్పినా వినలేదు. ఈ చండాల రూపంలో వచ్చిన వాడెవరై ఉండవచ్చునోనన్న ఊహ కూడా కలుగలేదు. అనగా అమృతాన్ని పొందేపాటి పుణ్యం అతడు చేసుకోలేదని. ఆ తర్వాత శ్రీకృష్ణుడే వర్షాన్ని కురిపించి అతడి దాహాన్ని తీర్చాడు. దీనిని బట్టి మనకు ఏమి తెలుస్తుందంటే, అనుభవించేపాటి పుణ్యం చేసుకోని వారు అందుబాటులో ఉన్న వస్తువును కూడా అనుభవించలేరని మనం గ్రహించాలి.

శ్రీకృష్ణుడు ద్వారకకు చేరుట

వైశంపాయనుడు : జనమేజయ మహారాజా! శ్రీకృష్ణుడు ఉదంకునికి వరాలనిచ్చి ద్వారకకు చేరుకున్నాడు. ద్వారకావాసులంతా శ్రీకృష్ణునికి ఘనంగా స్వాగతం పలికారు.

వసుదేవుడు : కృష్ణా! భారత యుద్ధాన్ని గూర్చి వారూ వీరు చెప్పుకుంటూ ఉంటే అరకొరగా విన్నాను. నువ్వు వివరంగా చెప్తే వినాలని ఉంది.

శ్రీకృష్ణుడు : తండ్రీ! భారత యుద్ధ కథ చాలా పెద్దది. అది చెప్పాలంటే చాలా రోజులు పడుతుంది. కనుక ముఖ్యమైన వీరులు చేసిన యుద్ధాన్ని చెప్తాను విను.

వసుదేవా! కౌరవుల సైన్యం పదకొండు అక్షౌహిణులు. వాళ్ళకు సర్వ సేనాని భీష్ముడు. అతడు పదిరోజులు యుద్ధం చేశాడు. పాండవుల సైన్యం ఏడు అక్షౌహిణులు. పాండవులు శిఖండిని ముందు పెట్టుకొని యుద్ధం చేసి భీష్మణ్ణి పడగొట్టారు. ఆ మహాత్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకు మరణించకుండా అంపశయ్య మీదనే పడుకొని ఉన్నాడు.

ఆ తర్వాత ద్రోణాచార్యుడు అయిదు రోజులు భయంకరంగా యుద్ధం చేశాడు. ధృపదుడి కొడుకైన ధృష్టద్యుమ్నుడు నేను చెప్పిన ఉపాయంతో, అర్జునుడి అండవలన ద్రోణాచార్యుడిని చంపగలిగాడు.

కర్ణుడు రెండు రోజులు యుద్ధం చేశాడు. అర్జునుడి బాణాల వేడికి తట్టుకోలేక దగ్ధమయ్యాడు.

ద్రోణుడు మరణించిన మర్నాడు శల్యుడు మహాపరాక్రమంతో యుద్ధం చేశాడు. కానీ ఒకపూట గడిచిన తర్వాత ధర్మరాజు చేతిలో మరణించాడు. అప్పుడు శకుని సైన్యానికి సారధ్యం వహించాడు. వెంటనే సహదేవుడు అతణ్ణి చంపాడు. దాంతో దుర్యోధనుడు ఆత్మాభిమానం లేనివాడై, తమ్ములంతా

భీముని చేతిలో చచ్చిపోయినా, గదను చేతబట్టుకొని పారి పోయి ఒక చెరువులో దాక్కున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పాండవులు చెరువు చుట్టూ చేరి ఉరిపోసుకొని చచ్చేట్లుగా నిందించి అవమానించారు. ఆ నిందలు అవమానం భరించలేక దుర్యోధనుడు చెరువులోనుండి బయటకు వచ్చి భీముడితో గదా యుద్ధం చేసి అతడి చేతిలో మరణించాడు. ఈ విధంగా పాండవులు జయించారు.

ఆ రాత్రి విజృంభించి పాండవ శిబిరంలో ప్రవేశించిన అశ్వత్థామ గుర్రాల్ని, ఏనుగుల్ని, సైనికుల్ని ఊచకోత కోశాడు. నేను పాండవులు అక్కడ లేకపోవడం వలన ఈ ఘోరకార్యం జరిగిపోయింది. నేను, పాండవులైదుగురు, సాత్యకి తప్ప మిగిలిన పాండవ పక్షం వారంతా మరణించారు. కౌరవ పక్షంలో అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ మాత్రం బ్రతికి బయట పడ్డారు. యుయుత్సుడు మాత్రం ముందుగానే పాండవుల పక్షంలో జేరడం వలన చావు తప్పించుకున్నాడు. సూక్ష్మంగా ఇదీ భారత యుద్ధం నడచిన తీరు.

సుభద్ర : అన్నా! నీ మేనల్లుడైన అభిమన్యుడు మరణించిన విషయం కూడా నీ తండ్రికి వినబడేట్లుగా చెప్పు.

అప్పుడు వసుదేవుడు మొదలైన యాదవులంతా అభిమన్యుడి మరణానికి ఆక్రోశించారు. శ్రీకృష్ణుడు వారందర్నీ ఓదార్చాడు.

శ్రీకృష్ణుడు : తండ్రీ! అభిమన్యుడి మరణానికి చిన్నా పెద్దా అంతా తల్లడిల్లి పోయారు. హస్తినాపురంలో సుభద్ర, ఉత్తర అభిమన్యుడి కోసం ఘోరంగా విలపిస్తూ ఉంటే కుంతి వారిద్దర్నీ ఓదార్చింది. పాండవులు అభిమన్యుడి కోసం బ్రాహ్మణులకు గోవుల్ని, మణుల్ని, బంగారం మొదలైన విలువైన వస్తువులెన్నింటినో దానం చేశారు. అంతే కాకుండా అనేక చోట్ల అభిమన్యుడి జ్ఞాపకార్థం తటాకాలు త్రవ్వించారు. ఇంకా ఎన్నో ప్రజాహిత కార్యాలు చేశారు. అభిమన్యుడు తన పరాక్రమంతో దుర్యోధన, ద్రోణాది మహావీరులందర్నీ కలత పెట్టాడు. అనేక మంది రాజులను యమలోకానికి పంపాడు. దేవతలంతా శ్లాఘించారు. ఉత్తమలోకాల్ని పొంది సుఖంగా ఉన్నాడు. అటువంటి వానికొరకు దుఃఖించకూడదు.

వ్యాసుడు పాండవులను అశ్వమేధయాగము చేయుమనుట

వైశంపాయనుడు : జనమేజయ మహారాజా! మిగిలిన బంధువులంతా ఒకరి తర్వాత ఒకరు అభిమన్యుడి పరాక్రమాన్ని వర్ణించి చెప్తుంటే ఉత్తరకు దుఃఖం అధికమైంది. ఆమె దుఃఖం చూడలేక దయామయుడైన వ్యాసభగవానుడు ఆమెను తగిన విధంగా ఓదార్చి ఊరడించాడు. అట్లాగే అశ్వమేధ యాగ సంస్కారాలను వివరించి చెప్పి వెంటనే ఆ యాగం చెయ్యమని ఆదేశించి అదృస్యుడయ్యాడు.

జనమేజయుడు : పుణ్యాత్మా! ధర్మరాజు అశ్వమేధ యాగం చేసిన విధం తెలుపు.

వైశంపాయనుడు : వ్యాసమహర్షి ఉపదేశం ధర్మరాజులో క్రొత్త ఉత్సాహాన్ని నింపింది.

తమ్ములందర్నీ పిలిచి “సోదరులారా! వ్యాసమహర్షి చెప్పింది విన్నారు గదా!” అన్నాడు.

భీముడు : అన్నా! ఈ రోజున భూమండలమంతా గాలించినా చిల్లి గవ్వైనా లభించదు. ధనమంతా ఖర్చయి పోయింది. ఇప్పుడు మనం బ్రాహ్మణులు దాచిపెట్టిన బంగారు నిధి కోసం ప్రయత్నం చెయ్యాలి. కనుక మనమంతా హిమాలయాలకు పోయి శివుని నియమబద్ధంగా పూజించి ఆయన అనుగ్రహం పొంది బ్రాహ్మణులు దాచిపెట్టిన నిధిని తీసుకొని వద్దాం.

(మరుత్తుడు షోడశ మహారాజుల్లో ఒకడు. ఆ రాజు సంవర్తనుణ్ణి ఉపద్రష్టగా చేసుకొని హిమవత్పర్వతం పైన యజ్ఞం చేసి, బంగారాన్ని రాసులుగా తెప్పించి బ్రాహ్మణులకు దానం చేశాడు. బ్రాహ్మణులంతా ఆ బంగారాన్ని తీసుకొని వెళ్ళగలిగినంత తీసుకొని పోతూ మిగిలిన బంగారమంతా అక్కడే నిధిగా ఉంచి “ఈ నిధిని కాలాంతరంలో చూసిన వారికి చెందుతుందని” కట్టడి చేశారు.)

అర్జునుడు, నకుల సహదేవులు కూడా భీముడు చెప్పినదే బాగుందన్నారు.

వారి మాటలకు సంతోషించి ధర్మరాజు అశ్వమేధ యాగం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. ముందుగా, ధృతరాష్ట్రుడి దగ్గరకు వెళ్ళి వ్యాసమహర్షి పలికిన మాటలు చెప్పి అశ్వమేధయాగం చెయ్యడానికి అనుమతి కోరాడు. ధృతరాష్ట్రుడికి, గాంధారికి పాదాభివందనం చేశాడు. ధర్మరాజు మాటలు విన్న ధృతరాష్ట్రుడికి పెద్దకొడుకు జ్ఞాపకం వచ్చి విలపించాడు. తర్వాత ధర్మరాజు తల్లి అయిన కుంతి దగ్గరకు వెళ్ళాడు. ఆమె ఎంతో సంతోషించింది. ఆమె పాదాలకు నమస్కరించి అక్కడనుండి సభామండపానికి వెళ్ళి యుయుత్సుణ్ణి పిలిపించి ‘మేము వచ్చేవరకూ నగరాన్ని రక్షిస్తూ ఉండు, విదురుడు నీకు తోడుగా ఉంటాడు” అని చెప్పి తగినంత సైన్యాన్ని తీసుకొని సిద్ధంగా ఉండమని సేనాధిపతుల్ని ఆదేశించాడు. పిమ్మట ఇంద్రాది దేవతల్ని, పితృదేవతల్ని నిష్ఠతో పూజించాడు. రకరకాలైన ద్రవ్యాలతో అగ్నిని పూజించి, ధౌమ్యునికి ప్రదక్షిణ నమస్కారం చేసి బయలుదేరాడు.

ధర్మరాజు తమ్ముళ్ళను వెంట బెట్టుకొని చతురంగ బలాలతో ప్రయాణం చేస్తూ ఉండగా వివిధ దేశాల రాజులు వారి వారి సేనలతో వచ్చి కలిశారు. ఆ విధంగా వారంతా కొండలు, నదులు, అడవులు దాటి హిమవత్పర్వతాన్ని చేరుకున్నారు. ధౌమ్యుడు మొదలైన పురోహితులు నిర్దేశించిన ప్రదేశాల్లో విడిది చేశారు.

వ్యాసుడు వారి వద్దకు వచ్చుట

ఆ విధంగా ప్రత్యక్షమైన వ్యాసభగవానునికి భక్తి పూర్వకంగా నమస్కరించి ధర్మరాజు “మహర్షీ! మేము ఏం చెయ్యాలో ఆజ్ఞాపించండి” అని ప్రార్థించాడు.

వ్యాసుడు : ధర్మనందనా!నువ్వూ మిగిలిన వారంతా ఈ రాత్రి నియమ నిష్ఠలతో దర్భలు పరచుకొని పడుకోండి. రేపు ఉదయాన్నే శివపూజ చెయ్యండి.

ఆ విధంగా పాండవులు ఆ రాత్రి గడిపి, వేకువ జాముననే వ్యాసుడి అనుజ్ఞ పొంది, ధౌమ్యాది పురోహితుల మంత్ర తంత్రముల నడుమ దర్భలతో సంస్కరించిన చోట శివభగవానుని నిలిపి ధూప

దీప గంధ పుష్పాలతో పూజించి, మహా నైవేద్యాలను ఆ దేవ దేవుడికి అర్పించారు. ఆ తర్వాత ముఖ్య ప్రమథులను, వారి అనుచరుల్నీ, కుబేరుణ్ణి, మణిభద్రుణ్ణి, యక్షులను, సమస్త భూతాలను మంత్ర పూర్వకంగా ఆవాహన చేసి పూజించారు.

రక్షణ కలిగించే మంత్రాలను ధౌమ్యుడు పఠిస్తుంటే ధర్మరాజు, తమ్ములు వ్యాసభగవానుని అనుసరించి నడిచారు. నిధులున్న చోటుకు పోయి ఎర్రని గంధ పుష్పాలతోను, మాంసంతోను అప్పాలతోను, పేలాలతోను, నివేదన చేసి భూతాలను తృప్తి పరచి మహా బలాఢ్యులైన సేవకులు త్రవ్వడం ప్రారంభించారు. కొంతసేపటికి నిధులు బయటపడ్డాయి. ఆ బంగారు కాంతులతో నలు దిక్కులూ ప్రకాశించాయి. భీమార్జున నకుల సహదేవులు పరమ సంతృప్తులు కాగా ధర్మరాజు ఆ నిధులను పూజించాడు. ధర్మరాజు వ్యాసమహర్షికి సాష్టాంగ నమస్కారం చేసి చేతులు జోడించి నిలబడ్డాడు.. ఆ మహర్షి ధర్మరాజును కౌగలించుకొని దీవించి అదృశ్యుడయ్యాడు.

అంతట వేలకొలది బళ్ళమీద, గాడిదల మీద, ఒంటెల మీద, గుర్రాల మీద, ఏనుగుల మీద ఆ బంగారాన్నంతా ఎత్తి పదిల పరచారు. అంతే కాకుండా బరువులు మోయగల బలాఢ్యులందరూ బంగారంతో చేసిన వివిధ పాత్రల్ని, మంచాలు, రోళ్ళు రోకళ్ళు మొదలైన వాటిని మోస్తూ ఉండగా వారి ప్రయాణం హస్తిన వైపుగా సాగింది.

ఓ జనమేజయ మహారాజా! పెద్ద పెద్ద బరువులు మోసే వారి సౌకర్యం కోసం రెండు కోసుల కొక మజిలీ ఏర్పాటు చేసి అక్కడ వారికి ఆహారం, విశ్రాంతి దొరికేట్లు ఏర్పాటు చేశాడు. ఆ విధంగా తరలి పోతున్న బంగారపు నిధిని చూస్తున్న దేవతలు ఆశ్చర్యపోయారు. శత్రువులు భయపడిపోయారు.

శ్రీకృష్ణుడు బంధువులతో కలసి హస్తినకు చేరుట

ధర్మరాజు అశ్వమేధ యాగం చేసే ప్రయత్నంలో ఉన్నాడని తెలుసుకున్న శ్రీకృష్ణుడు సంతోషించి బలరాముడు, సాత్యకి మొదలైన యాదవులను వెంటబెట్టుకొని సుభద్రతో కలసి హస్తినాపురానికి వచ్చాడు. ముందుగా ధృతరాష్ట్రుడు, గాంధారికి వినయంగా నమస్కరించి మధురమైన మాటలతో వారిని సంతోష పెట్టాడు. అక్కడనుండి కుంతీ ఇంటికి వెళ్ళాడు. శ్రీకృష్ణుని చూడగానే కుంతి కౌగలించుకొని దీవించింది. కుంతిని చూడవచ్చిన సుభద్రను ఆదరించి అంతఃపురంలోకి పంపింది.

ఈ విధంగా వాళ్లంతా పండుగ చేసుకుంటూ ఉండగా నీ తండ్రి పరీక్షిత్తు పుట్టాడని వృద్ధాంగనలు వచ్చి బయట జనానికి చెప్పారు. వాళ్ళంతా సంతోషంతో కేకలు పెట్టారు. ఇంతలోనే ఆ పిల్లవాడు చచ్చిపోయి పుట్టాడన్న వార్త చెప్పారు. దాంతో ఇంట్లో వాళ్ళంతా దుఃఖంలో మునిగి పోయారు. ఆ సమయంలో ఏడుపులు, పెడబొబ్బలు వ్యాపించాయి. శ్రీకృష్ణుడీ వార్త విని ఎంతో దుః ఖించాడు. సాత్యకి వెంటరాగా శ్రీకృష్ణుడు కుంతి, ద్రౌపది, సుభద్ర ఉన్న చోటుకు వచ్చారు. పెద్దపెట్టున ఏడుస్తున్న వారందర్నీ చూసి అతడి మనస్సు కూడా దుఃఖంతో కలత పడింది.

పరీక్షిత్తును బ్రతికించమని శ్రీకృష్ణుని ప్రార్థించుట

కుంతి : ఓ కృష్ణా! నాకూ నా కొడుకులకు నువ్వే దిక్కు. అశ్వత్థామ ప్రయోగించిన ఇషీకాస్త్రం నుండి పుట్టిన అగ్నిచేత నీ మేనల్లుడి కొడుకు చనిపోయాడు.

(ఇషీక అంటే రెల్లు పుడక. అశ్వత్థామ ఒక రెల్లు పుల్లను తీసుకొని మంత్ర పూర్వకంగా బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ప్రవేశపెట్టి ప్రయోగించగా గర్భవతియై ఉన్న ఉత్తరకు తాకింది. ఆమె బిడ్డను తప్పక బ్రతికిస్తానని శ్రీకృష్ణుడు ప్రతిజ్ఞ చేశాడు. ఈ కథంతా విపులంగా సౌప్తిక పర్వంలో వస్తుంది.)

కృష్ణా! నువ్వా బాలుని రక్షించు. భయంకరమైన బ్రహ్మ శిరాన్ని అశ్వత్థామ ప్రయోగించి నప్పుడు "నేను తప్పకుండా ఉత్తర కడుపున పుట్టే బిడ్డను కాపాడుతానని" ప్రతిజ్ఞ చేశావు. ఈ బాలుడు బ్రతికితేనే నేను బ్రతుకుతాను. లేకపోతే నేను, సుభద్ర, ద్రౌపది, పాండవులు అంతా మరణిస్తాం. దాంతో ఈ వంశంలో నీళ్ళు వదలడానికి గాని, పిండాలు పెట్టడానికి గాని ఎవరూ మిగలరు. ఒకప్పుడు ఉత్తరను ఓదార్చావు. ఇప్పుడా మాట నిలబెట్టుకో. దేవా! ఈ భరత వంశాన్ని నిలిపిన వాడవు నీవే. అట్లాగే ఈ శిశువును కూడా బ్రతికించు.

దేవా! అశ్వత్థామ బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ప్రయోగించినప్పుడు నువ్వతడితో "నీచుడా! నీ అస్త్రాన్ని పనికి రాకుండా చేస్తాను." అన్నావు. అప్పుడు మా ప్రాణాలు కుదుట పడ్డాయి. ఎందువల్లనంటే నీ మహిమ మాకు తెలుసు కాబట్టి భయపడలేదు. సత్యము, దయ, ఆశ్రిత రక్షణ నీకు సహజ గుణాలు. నాయనా! శిరస్సు వంచి వేడుకుంటున్నాము. పాండవుల వంశాన్ని కాపాడు.

భక్త వత్సలా! లోకంలో ఉన్న ప్రాణులన్నీ ఒక్కసారే మరణించినా వారందన్నీ కాపాడే శక్తి నీకుంది. అట్టి నువ్వు నీ మేనల్లుడి కొడుకు చావగా చూస్తూ ఊరుకుంటావా?

కుంతి, సుభద్రలు ఈ విధంగా పలికేటప్పటికి శ్రీకృష్ణుడిలో దయ, దుఃఖం ఎక్కువయ్యాయి. కంఠస్వరం కఠినమైంది. మేఘంలా గర్జిస్తూ "ఈ పసికందును బ్రతికిస్తాను" అని అందర్నీ సంతోషపెట్టాడు.

కుంతి మొదలైన వాళ్ళు వెంటరాగా శ్రీకృష్ణుడు పురిటింటికి వెళ్ళాడు. అక్కడ ద్రౌపది సొమ్మసిల్లి పడి ఉన్న ఉత్తరతో "అమ్మా! కృష్ణుడు వచ్చాడు. వినయంగా నమస్కరించు" అన్నది. అప్పుడు ఉత్తర ఇలా ప్రార్థించింది.

ఉత్తర : దేవా! భక్తుల దుఃఖం తొలగిస్తానని నువ్వు నాకు ప్రతిజ్ఞ చేశావు. దయామయుడవై తిరిగి ఆ శిశువును బ్రతికించు. భర్తనే కాకుండా పుత్రుణ్ణి కూడా పోగొట్టుకున్న పాపాత్మురాలను. ఇంకానేనెట్లా బ్రతుకగలను.

కృష్ణా! అభిమన్యుడు యుద్ధంలో మరణించినప్పుడే సహగమనం చేస్తానని ఆయనకు మాట ఇచ్చాను. మాట తప్పాను. ఇప్పుడు వెళ్తే నన్ను దగ్గరకు తీస్తాడా? నా కొడుకు చనిపోతాడని ముందుగా తెలిస్తే అప్పుడే సహగమనం చేసే దాన్ని. వాగ్దాన భంగం చేసిన దుర్గతి నాకు తప్పేది.

ఓ శిశువా! శ్రీకృష్ణుడు వచ్చినప్పుడు నిన్ను అతడి పాదాల మీద ఉంచి మ్రొక్కిద్దామని గంపెడాశ పెట్టుకున్నాను. అశ్వత్థామ నా ఆశల్లో నీళ్ళు పోశాడు. లోకములకు తండ్రి, నీకు తాతగారు అయిన శ్రీకృష్ణుడు వచ్చి నిలబడినా నువ్వు నమస్కారం చెయ్యలేకపోతున్నావు. ఇది అధర్మమని ఎరుగవా? తండ్రీ! చిరునవ్వులు చిందిస్తూ కుంతిని చూడు. నన్ను చూడు. ద్రౌపదిని చూడు. మీ నాయనమ్మ సుభద్రను చూడు.

ఈ విధంగా ఉత్తర ఏడ్చి ఏడ్చి నేలమీద కుప్పకూలిపోయింది. చూస్తున్న వాళ్ళందరి కళ్ళూ వర్షించాయి. కొంతసేపటికి ఉత్తర ఎక్కి ఎక్కి ఏడుస్తూ శ్రీకృష్ణుని చూస్తూ 'రక్షించు' 'రక్షించు' అంటూ రోదించింది.

శ్రీకృష్ణుడు భయపడవద్దని ఉత్తరకు అభయమిచ్చాడు. కాళ్ళుకడుక్కుని ఆచమనం చేసి ఆ శిశువు శవాన్ని మంచంపై ఉంచమని ఆజ్ఞాపించాడు.

శ్రీకృష్ణుడు మృతుడైన పరీక్షిత్తును బ్రతికించుట

శ్రీకృష్ణుడు : నేను ఎన్నడూ అసత్యాన్ని పలుకను. మీరంతా చూస్తూ ఉండగానే ఈ శిశువు బ్రతికి కేరింతలు కొడతాడు. పాండవులంతా సంతోషిస్తారు.

బ్రాహ్మణ జాతి పట్ల నాకు అత్యధిక ప్రేమ ఉన్నట్లయితే, నేను ధర్మాసక్తి గలవాడనైతే ఈ ఉత్తర కొడుకు జీవిస్తాడు గాక! నేను శత్రువుల విషయంలోనైనా అసత్యం పలుకని వాడినైతే, ఇప్పుడే ఈ శిశువు బ్రతుకు గాక. నేను ఏనాడు అర్జునుని పట్ల వైరం లేనివాడనవడం నిజమైతే ఈ శిశువు శరీరంలోకి ప్రాణం చేరుగాక. కంసాది దుర్మార్గుల్ని నేను సంహరించడం ధర్మబద్ధమైతే ఈ శిశువు పంచప్రాణాలు తిరిగి పొందుగాక. మహా సత్యమూ, ఉత్కృష్ట ధర్మము, అస్కలిత బ్రహ్మచర్యము, నాయందు చక్కగా ప్రకాశిస్తూ ఉంటే ఈ బిడ్డకు ప్రాణం ఇప్పుడే వచ్చుగాక.

శ్రీకృష్ణుడీవిధంగా అనగానే ఆ బాలుడిలో ప్రాణాలు వచ్చి చేరాయి. చిన్న చిన్న అవయవాలన్నీ కదలడం మొదలైంది. కౌరవ స్త్రీలంతా పరమానంద భరితులయ్యారు. ఉత్తర సంతోషంతో బిడ్డను ఎత్తుకొని శ్రీకృష్ణుడి పాదాలపైన నుదురు మోపి నమస్కరించింది. శ్రీకృష్ణుడామెను అనురాగంతో ఓదార్చాడు. జనులంతా వింటూ ఉండగా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. “తన వంశం అంతా నశించి పోయినప్పుడు జన్మించాడు కాబ్టి ఈ అభిమన్యుడి పుత్రుడికి పరీక్షిత్తు అన్నపేరు బావుంటుందని” అన్నాడు.

వైశంపాయనుడు : ఓ జనమేజయ మహారాజా! శ్రీకృష్ణుడు పాండవ సంతతిని నిలిపాడు. ఆ పరమాత్ముడి చేత తిరిగి బ్రతికిన నీ తండ్రి ఒక నెల నిండగానే ఒకరోజున, ధర్మరాజాదులు సువర్ణ రాసులు తీసుకొని హస్తినాపురాన్ని చేరుకున్నారు. ఆ విధంగా నీ తాతలంతా బంగారు నిధులన్నింటినీ మందుంచుకొని నగర ప్రవేశం చేశారు.

విశేషార్థం : ప్రాణికోటి కంతటికీ ఆయుర్ధాయం ముందుగానే నిర్ణయించబడుతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. దాన్ని మార్చడం ఎవరితరమూ గాదు. అయితే పరీక్షిత్తు ఎట్లా బ్రతికాడు? కర్మఫలాన్ని బట్టి ఆయుర్ధాయముంటుంది. భగవంతుడు కూడా తాను ఏర్పరచిన నియమాన్ని తానే ఉల్లంఘించడు. ఆ సర్వేశ్వరుడు, “శృతి స్మృతి మమై వాజ్ఞేయస్తే ఉల్లంఘ్య వర్తతే” అన్న తన ప్రతిజ్ఞను ఎన్నడూ మరువడు.

ఏ కార్యాన్నైనా చెయ్యడానికి చెయ్యకుండా ఉండేందుకు గాని, మరో విధంగా చేయడానికి గాన భగవంతుడు సర్వ శక్తి సమర్థుడు. జన్మనిచ్చేటప్పుడే ఆయుర్ధాయం ఇంతకాలమని వారి కర్మమే నిర్ణయిస్తుంది. ఇది భగవంతుడికి తెలియని విషయమేమీ కాదు. అయితే అపమృత్యువు అనే దొకటున్నది. దాన్ని మార్చవచ్చు. దాన్ని తొలగించే మార్గాల్లో భగవదారాధనను ఒకటిగా చెప్పబడింది. ఔషధాల వలన కూడా ఈ అపమృత్యువు నుండి బయట పడవచ్చు.

అపమృత్యువును మాత్రం ఎందుకు మార్చాలి? అని అడుగకూడదు. ఎందువల్లనంటే, ప్రత్యక్షంగా ఫలాన్ని పొందితే గాని భక్తి కుదరదు. భక్తి కుదిరితే గాని భగవంతుని ఆరాధించాలనే

ఉద్దేశ్యం దృఢం కాదు. కావున అపమృత్యువు నుండి తప్పించుకునే మార్గాలు అనేకం ఉన్నాయి.

ప్రస్తుత విషయాన్ని పరిశీలిస్తే పాండవులు, వారి భార్యలు, వారి కోడలైన ఉత్తరయు దుఃఖమును అనుభవించాల్సిన కర్మలు చేసి ఉన్నారు. కనుక వారినా కర్మనుండి ఎవరూ తప్పించలేరు. కారణం లేకుండా కార్యం ఉండదు కదా. ఈ సిద్ధాంతాన్ననుసరించి అశ్వత్థామ కారణభూతుడయ్యాడు. శ్రీకృష్ణుడు తనయందు లోకులకు భక్తి కుదరటం కోసం, పరీక్షిత్తును బ్రతికిస్తానని శపథం చేసాడు. భగవంతుడు కేవలం కీర్తి సంపాదించడానికి ప్రతిజ్ఞ చెయ్యలేదు. చనిపోయిన శిశువును బ్రతికించాడు కాబట్టి శ్రీకృష్ణుడు భగవంతుడని నమ్మి, తన తత్త్వాన్ని తెలుసుకొని లోకులు కృతార్థులు కావాలన్నదే భగవంతుని ఆశయం.

భగవంతుని ప్రతిజ్ఞ నొకసారి పరిశీలించండి. అనృతము నేనెన్నడూ చెప్పకుండా ఉండటం నిజమే అయితే, యుద్ధంలో వెనుకంజ వేయని స్వభావం నాకుండటం నిజమైతే, ధర్మమునందు బ్రాహ్మణులయందు నేను ఎక్కువ ప్రీతి గలవాడనై ఉండటం నిజమైతే, కంసుడు మున్నగు దానవులను ధర్మయుక్తంగా చంపడం నిజమైనచో, ఈ కారణాలన్నీ సత్యాలైతే ఈ శిశువును బ్రతికించు అని గదా శ్రీహరి అన్నమాటలు. వీటి అర్థమేమిటి? ధర్మం ఆశ్రయించ దగిందని, సద్బ్రాహ్మణుల యందు ప్రీతి కలిగి ఉండాలని, అసత్యం పలుకకుండా ఉండటం ఉత్తమ మార్గమని, రణరంగం నుండి వెనుకంజ వెయ్యకూడదని మిత్రుని యందు ప్రీతి కపటం లేనిదిగా ఉండాలని, లోకులకు తెలుపుతూ వారినట్లు నడచుకొమ్మని బోధించడమే తప్ప మరొకటి కాదు. ఈ ప్రతిజ్ఞలన్నీ చెయ్యకుండా కూడా శ్రీకృష్ణుడు లేచి కూర్చోమంటే శిశువు లేచి కూర్చునేదే. కానీ లోకులకు ఈ సత్య, ధర్మముల యందు ఆదరం పెంచడమే శ్రీకృష్ణుని అభిప్రాయం. శ్రీకృష్ణుడు ఏ విషయాన్నీ డాంభీకం కోసం బోధించడు. ఏ కార్యం చేసినా, ఏ మాట చెప్పినా దాన్ని ఆచరించిన వారు కృతార్థులవుతారు. అంతేగాని లోకుల్ని వంచించాల్సిన అవసరం పరాత్పరుడికి లేదు.

సత్కర్మల నాచరించి, అహంకారం లేనివారై నిశ్చల భక్తిగల వారైతే కృతార్థులవుతారని లోకులకు బోధించాడని మనమీ కథనుండి గ్రహించాలి.

వ్యాసుడు పాండవుల వద్దకు వచ్చుట

ధర్మరాజాదులు ముందుగా ధృతరాష్ట్ర, గాంధారిలను, తర్వాత కుంతిని దర్శించారు. విదురుణ్ణి, యుయుత్సుణ్ణి పిలిపించి విశేషంగా గౌరవించారు. అంతా కలసి శ్రీకృష్ణుని ప్రక్కన పెట్టుకొని ఒక సుందర మంటపంలో కొలువుతీరారు. ఆశ్చర్యకరమైన పరీక్షిత్తు జన్మ వృత్తాంతాన్నంతా విపులంగా చెప్పారు. ధర్మరాజాదులు శ్రీకృష్ణుని అనేక విధాలుగా స్తుతించారు. ఇంతలో వ్యాసమహర్షి అక్కడకు వచ్చాడు. అప్పుడు ధర్మరాజాదులంతా శ్రీకృష్ణుని వెంటబెట్టుకొని వ్యాసమహర్షికి నమస్కరించి ఆహ్వానించారు.

ధర్మరాజు : మహర్షీ! మీ దయ వలన పొందిన ఈ ధనాన్నంతా అశ్వమేధ యాగానికి

వినియోగించాలని అనుకుంటున్నాను. నీ అనుమతి కోరుతున్నాను.

వ్యాసుడు : చంద్రవంశ శ్రేష్ఠా! అశ్వమేధం సర్వపాపాల్ని నాశనం చేస్తుంది. నువ్వు మంచి దక్షిణలిచ్చి ఆ యాగాన్ని చేసి పరిశుద్ధుడవై ప్రకాశించు.

ధర్మరాజు : ఓ కృష్ణా! దయానిధీ! శుభప్రదమైన అశ్వమేధ యాగాన్ని శాస్త్రోక్తంగా చెయ్యమని ఆజ్ఞాపించు. మాకు తల్లి అయినా, తండ్రి అయినా, గురువు అయినా నువ్వే. సాటిలేని నీ ఆలోచన లోకానికంతటికీ రక్ష.

శ్రీకృష్ణుడు : వ్యాస భగవానుడు ఆజ్ఞాపించినట్లు నియమ సంపన్నులమై ఈ అశ్వమేధ యాగం చేద్దాం. దాంతో నువ్వు ధన్యుడవై, నీ మనస్తాపాలన్నింటినీ పోగొట్టుకో. ఈ యాగం వలన కలిగే పుణ్యం ధర్మాలన్నింటికన్నా శ్రేష్ఠం.

ఓ కౌరవ శ్రేష్ఠుడా! ఈ అశ్వమేధ యాగాన్ని చెయ్యమని చెప్పిందే నేను గదా. అటువంటప్పుడు ప్రత్యేకంగా నా అనుమతి ఎందుకు? నువ్వే నన్ను ఆజ్ఞాపించు. ఈ యాగ నిర్వహణలో నన్ను ఏం చెయ్యమని ఆజ్ఞాపిస్తే నేనా పని చేస్తాను. నేనూ, నీ తమ్ములూ కలసి నీకు తృప్తి కలిగేట్లుగా పనులు పూర్తి చేస్తాం. నువ్విక యాగాన్ని ప్రారంభించు.

శ్రీకృష్ణుడి మాటలు విని ధర్మరాజు పరమానందం పొందాడు. వ్యాసుడితో "యజ్ఞదీక్షకు ముహూర్తం నిర్ణయించి, ఆ యాగ నిర్వహణ బాధ్యత మీరు స్వీకరించండి" అని ప్రార్థించాడు. అప్పుడా మహర్షి యజ్ఞవల్క్యుడిని, పైలుడితోను ఆలోచించి, ఈ మాసమే (చైత్రమాసం) పూర్ణిమనాడు యజ్ఞానికి పనికి వచ్చే గుర్రాన్ని వెదికేందుకు అశ్వశాస్త్రజ్ఞుణ్ణి నియమించు. ఆ గుర్రం భూమండలమంతా తిరిగి నీ కీర్తిని వ్యాపింపజేస్తుంది" అన్నాడు.

ధర్మరాజు అశ్వ శాస్త్రజ్ఞుల్ని పిలిపించి మనకున్న గుర్రాలలో ఉత్తమ లక్షణాలున్న దాన్ని తెమ్మని ఆజ్ఞాపించాడు. వ్యాసుడు గుర్రాన్ని చూసి చాలా సంతోషించి "ఇది యజ్ఞానికి తగినది. దీన్ని శాస్త్రోక్తంగా వదులుదాం" అన్నాడు. పెద్దలంతా కలసి అశ్వాన్ని రక్షించడానికి అర్జునుడు తగిన వాడని నిర్ణయించారు. నకులుడు భీముడు దేశరక్షణ భారాన్ని స్వీకరిస్తారు. సహదేవుడు ఇంటి పనులు నిర్వహిస్తాడు.

ధర్మరాజు అర్జునుని అశ్వ రక్షకుడుగా నియమించుట

ధర్మరాజు : అర్జునుడా! అనఘా! పూజించిన ఈ గుర్రం నడుస్తూ ఉంటే నువ్వు అప్పుడప్పుడూ రాజులతో "నేను అశ్వమేధ యాగ దీక్ష వహించాననీ" చెప్పు. ఆటంకం లేకుండా ఈ గుర్రాన్ని నడిపించు. భీముడు నకులుడు దేశరక్షణ చేస్తారు. సహదేవుడు మన కుటుంబాలన్నింటినీ కనిపెట్టూ ఉంటాడు.

ధర్మరాజు ఈ విధంగా పనులన్నింటికీ తగిన వారిని నియమించి కుంతి, ధృతరాష్ట్రుని గాంధారుల నుండి అనుజ్ఞ పొందాడు. ద్రౌపదిని ఒప్పించాడు.

జనమేజయుడు : ఓ వైశంపాయనుడా! ధార్మికశ్రేష్ఠుడైన ధర్మరాజు మనోహరమైన ఆ యజ్ఞాన్ని ఎట్లా చేశాడు?

బ్రహ్మాది దేవతలు ద్వారకకు వచ్చుట

(ఈ భాగం శ్రీ భాగవతం పదకొండవ స్కంధం, ఆరవ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీశుకమహర్షి : పరీక్షిన్మహారాజా! దేవర్షియగు నారదుడు వసుదేవునకు భాగవత ధర్మముల నుపదేశించి వెళ్లిన పిదప బ్రహ్మ, శంకరుడు, ఇంద్రుడు మున్నగు దేవతలంతా ద్వారకకు విచ్చేశారు. వారంతా భగవానుని పరిపరివిధములుగా స్తుతించారు.

దేవతలు : దేవా! ఏ పాదారవిందాలను తలచినంత మాత్రముననే కర్మబంధాలన్నీ నాశనమైపోతాయో అట్టి నీ పాదపద్మాలకు సాష్టాంగ నమస్కారము చేస్తున్నాము. ఈ జగత్తును నీ మాయాజనితమైన త్రిగుణాలచేత నీయందే సృష్టించి పాలించి ఉపసంహరిస్తున్నావు. అయినా గూడా నీవు గుణాతీతుడవు, రాగాదులు లేని వాడవు. అందువల్ల నీకు కర్మబంధాలు అంటవు. నీవు ఎల్లప్పుడూ ఆనందమూర్తివై అలరారుతూ ఉంటావు. కావున కర్మలు నిన్ను బంధించలేవు.

ప్రభూ! ముముక్షువులు శుభముల కోరి ఎవరిని హృదయమున స్మరిస్తారో, ఆశ్రితులైన భక్తులు నీతో సమానమైన ఐశ్వర్యాలను కోరి చతుర్వ్యూహ రూపంగా (వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు) ఎవనిని ఆరాధిస్తారో, జితేంద్రియులైన వారు స్వర్గాన్ని కాదని వైకుంఠ పదమును పొందుటకై వేనిని అర్చిస్తారో అట్టి నీ పాదపద్మములు మా విషయ వాసనలను కాల్చి వేయు గాక!

దేవా! వాసుదేవా! నీవు భక్త వత్సలుడవు. భక్తులు సమర్పించిన వనమాల వాడిపోయినా దాన్ని విడువవు. ధరించేయున్నావు. ఆ వనమాలను చూసి లక్ష్మీదేవి ఈర్ష్యపడుచున్నది. ఆమె నీ వక్షస్థలాన నివసించియున్ననూ, ఈ వనమాల సవతివలె దాపురించినదని శ్రీదేవి బాధపడుచున్నది. అయినా భక్తులు సమర్పించిన వనమాలయే నీకు ప్రియాతిప్రియమైనది.

దేవా! వామనావతారమున బలి చక్రవర్తి యిచ్చిన భూమిని కొలిచేందుకు నీ పాదాలు ముల్లోకాలనూ వ్యాపించి, ఆ పాదాలనుండి సర్వ పాపాలను నాశనము చేయు రెండు నదులను ప్రవహింపచేసితివి. ఒకటి అమృతమయమైన నీ కథామృతము. దీనితో మానవులు మనస్సును పావనము చేసుకొనుచున్నారు. రెండవది పవిత్ర గంగానది, భక్తుల దేహములను పవిత్రం చేయుచున్నది అని శంకర భగవానుడు స్తుతించెను.

దేవా! దేవతలు రాక్షసులు ఎల్లప్పుడూ కలహించుకుంటూనే ఉంటారు. వారి జయాపజయాలన్నీ కాలపురుషుడవైన నీ చేతుల్లోనే ఉన్నాయి. వారెన్నటికీ స్వతంత్రులు కారు. జగత్తు యొక్క ఉత్పత్తికి, స్థితి లయాలకు నీవే కారణభూతుడవు. ప్రకృతి పురుషుల మహత్తత్త్వాన్ని నిర్దేశించే కాలపురుషుడవైన నీకు నమస్కరించుచున్నాము. బ్రహ్మాదులను కూడా పశువుల వలె ముకుత్రాడు పోసి నియంత్రిస్తావు.

దేవా! నీ వలన పురుష శక్తులకు సంయోగం కలిగి మహత్తత్త్వం పుట్టి హిరణ్యాండకోశాన్ని

కలుగజేసింది. అందులో నీవు లోపలా బయటా ఆత్మరూపంలో ఆవరించి ఉంటావు. అందువల్ల నిన్ను స్థావర జంగమాలన్నింటికీ ఈశ్వరుడవంటారు. ఇంద్రియాలన్నీ నీ మాయచే ఏర్పడి వృత్తుల రూపంలో ప్రాప్తించిన విషయాలను సేవిస్తావు. అయినా నీవా విషయములందు ఆసక్తుడవు కావు.

దేవా! రుక్మిణీ దేవి మున్నగు పదునారువేల మంది సుందరీ మణుల క్రీగంటి చూపులు, కామ కళలు నీకు మనోవికారాన్ని కలిగించలేవు.

బ్రహ్మ : లోకేశ్వరా! మా ప్రార్థన మన్నించి, మానవ రూపాన అవతరించి భూభారాన్ని తగ్గించావు. నీవు అవతరించి నూట ఇరవై యేడు సంవత్సరాలైంది. నీ దర్శనానికై వైకుంఠం ఎదురు చూస్తూ ఉంది. యదుకులం కూడా నాశనమయ్యే సమయం దగ్గర పడింది. ఇక వైకుంఠానికి బయలుదేరవలసింది. లోకపాలకులమైన మమ్ము, మా లోకాలను కాపాడు.

శ్రీకృష్ణుడు : బ్రహ్మదేవా! నీవు సత్యమే పలికావు. నేను మీరు కోరినట్లుగానే భూభారమును తొలగించాను. ప్రస్తుతము యాదవులు కూడా బలసంపన్నులై మదించి ఉన్నారు. వీరిని కూడా సంహరింపక నేను తిరిగి నా ధామమునకు చేరినచో, వీరి వలన లోకనాశనము కాగలదు. కావున బ్రాహ్మణ శాపము వలన ఈ యదువంశము కూడా నాశనము కానున్నది. ఆ కార్యము పూర్తియైన పిదప వైకుంఠమునకు వెళ్ళెదను.

శుకమహర్షి : రాజా! శ్రీకృష్ణ భగవానుడిట్లు చెప్పగా బ్రహ్మాది దేవతలు భగవానునికి నమస్కరించి వారి స్థానములకు వెళ్ళారు. అనంతరము ద్వారకలో ఎన్నో అపశకునాలు కనబడ్డాయి. వాటిని చూచి, యదుకులంలోని పెద్దలతో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుడు : పెద్దలారా! మన వంశమునకు బ్రాహ్మణులు శాపమిచ్చిన సంగతి మీరెరుగుదురు. దానికి తగినట్లుగానే, దుశ్శకునములు కూడా కనబడుతున్నాయి. కావున మనమంతా పవిత్రమైన ప్రభాస క్షేత్రానికి వెళ్దాం.

ప్రభాస క్షేత్రం పరమ పవిత్రమైనది. పూర్వము దక్షుని శాపము వలన చంద్రుడు క్షయరోగగ్రస్థుడయ్యాడు. అప్పుడు చంద్రుడీ క్షేత్రమునకు పోయి స్నానము చేసిన తర్వాత స్వస్థుడై కళావృద్ధి చెందాడు. కావున మనం కూడా ప్రభాస క్షేత్రమునకు పోయి స్నానాలు చేద్దాం. అక్కడ దేవతలకు, పితృదేవతలకు తర్పణాలిచ్చి, బ్రాహ్మణులకు విరివిగా దక్షిణలిద్దాం. బ్రాహ్మణులకు పిండివంటలతో భోజనం పెట్టి తృప్తి పరుద్దాం. ఓడల నిండుగా సామానులన్నీ నింపి వెంటనే ప్రయాణమునకు సిద్ధము కండు.

శుకమహర్షి : రాజా! శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞను శిరసావహించి యాదవులందరూ ప్రభాస క్షేత్రానికి వెళ్ళారు.

ఉద్ధవుడు శ్రీకృష్ణ భగవానునికి సేవకుడు, పరమ భక్తుడు, ద్వారక యందలి అపశకునములను చూసి భగవానుని ఆదేశమును వినెను. భగవానునితో ఇలా అన్నాడు.

ఉద్ధవుడు : యోగేశ్వరా! దేవాదిదేవులు, జీవులు నీ లీలలు విన్నంతమాత్రానే పవిత్రులవుతారు. నీవే సర్వశక్తులకు పరమేశ్వరుడవు. నువ్వు తలచుకొంటే బ్రాహ్మణుల శాపమును తొలగించగలవు.

కానీ నువ్వట్లా చేయడం లేదు. అనగా యదువంశాన్ని హరింపజేసిగానీ, నువ్వీ లోకాన్ని విడిచిపెట్టి పోవడానికి ఇష్టపడటం లేదని భావించుచున్నాను. కేశవా! నేను నిన్ను విడిచి ఉండలేను. నన్ను కూడా నీ ధామమునకు తీసుకొని పొమ్మని ప్రార్థించాడు.

బద్ధ జీవులు - ముక్త జీవులు

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 11వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! నా మాయ చేత నిర్మించబడిన దేహముల వలన ఆత్మకు బంధమున్నట్లుగా భ్రమ కలుగుతోంది. నిజమునకు ఆత్మకు బంధము లేదు, ముక్తియును లేదు. నా అధీనంలో ఉండే మాయయే బంధము, మోక్షములనే నాటకానికి సూత్రధారి, పాత్రధారి కూడా అవుతోంది.

మనుషులకు వచ్చే స్వప్నాలన్నీ మనస్సుచే ప్రేరేపింపబడ్డవే అయినట్లు, దేహానికి కలగే సుఖదుః ఖాల వంటి ద్వంద్వాలన్నీ కూడా నా మాయా ప్రేరితాలే. నిజానికి ఈ ద్వంద్వాలన్నీ అవాస్తవాలే.

విద్య, అవిద్యలు రెండూ నా అధీనంలోనే ఉంటాయి. ఇవే బంధానికి, మోక్షానికి కారణాలు. జీవులన్నిటికీ అవిద్య వలననే బంధము, విద్యవలననే ముక్తి కలుగుతున్నాయి.

ఉద్ధవా! ఒకే శరీరంలో విరుద్ధమైన రెండు ధర్మాలుండే బద్ధ, ముక్త జీవుల లక్షణాలను వర్ణించి చెప్తాను. విను.

దేహమనే వృక్షంపై హృదయమనే గూడు ఒకటుంది. అందులో జీవుడు, ఈశ్వరుడు అనే రెండు పక్షులు కాపురముంటున్నాయి. వీరిద్దరూ ఒకే దేహంలో ఉంటున్నాకూడా దేహమున కన్నా వేరుగా ఉంటున్నారు. జీవరూపంలో ఉన్న పక్షి ఆ వృక్షము యొక్క (దేహము) ఫలములను అనుభవిస్తున్నాడు. ఈశ్వరరూపంలో ఉంటున్న పక్షి ఫలముల ననుభవించకుండా నిత్యానందమును అనుభవిస్తూ ఉంటుంది.

ఉద్ధవా! ఈశ్వరునకు తన స్వరూపము, జీవుని స్వరూపము రెండూ తెలుసు. కానీ జీవుడికి తన స్వరూపం, ఈశ్వరుడి స్వరూపం రెండూ తెలియవు. జీవుడు అవిద్యా స్వరూపుడు కావటం వలన బద్ధుడగుచున్నాడు. ఈశ్వరుడు విద్యా స్వరూపం కావటం వలన అనాదిగా ముక్తుడే అయి ఉన్నాడు. కావున ముక్తుడైన పురుషుడు దేహమందు ఉన్నా గూడా, స్వప్నం నుండి లేచిన వాని వలె దేహమునకు సంబంధించిన సుఖదుఃఖాలను అనుభవింపడు. సమదర్శియై ఉంటాడు.

రాగ ద్వేషములను జయించిన వాడు ఇంద్రియముల నాకర్షించే విషయాల్ని దర్శించినా గూడా 'నేను దర్శించుచున్నా'నని అహంకరించడు. వాటన్నిటియందునూ పరమాత్మనే దర్శిస్తాడు. అటువంటి పుణ్య పురుషునికి అర్పణబుద్ధి సిద్ధించినదని గ్రహించాలి. ఎవరికి అర్పణబుద్ధి కలుగుతుందో అట్టివాడు అనన్య భక్తితో భగవానుని ఆరాధిస్తాడు. అజ్ఞాని అయిన వాడు 'నేను కర్తను' అని భావించి దేహాదులలో బంధించ బడుతున్నాడు.

భగవత్ప్రీతిని పొందగోరే భక్తుడు మనస్సును నిగ్రహించాలి. భగవద్గుణాలను కీర్తిస్తూ, ఆసక్తి లేనివాడై చరించాలి.

ఉద్ధవా! వైరాగ్యయుక్తుడైనవాడు శమనము, ఉపవేశము, భ్రమణము, స్నానము, దర్శనము, స్పర్శ, ఘ్రాణము, భోజనము, శ్రవణము మున్నగు ఇంద్రియములచే అనుభవించిననూ తాను వాటి చేత బద్ధుడు గాడు.

భగవత్ప్రీతిని పొందగోరువారు వివేకము చేత మనస్సును నిగ్రహింపవలెను. పిమ్మట మనస్సును భగవత్కీర్తనాదుల యందు లగ్నమొనర్చి ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, భూమి, సూర్యచంద్రులు, ప్రాణులు, దిక్కులు, నదులు, వృక్షములు, సముద్రములన్నియు పరమాత్ముని శరీరమేనని భావించి నమస్కరించవలెను.

ముక్తభక్తులు లోకవ్యవహారములందు తామరాకుపై నీటి బొట్టువలె అంటీ అంటకుండా ఉంటారు. ఎప్పుడేది అయాచితంగా లభిస్తే దానితోనే తృప్తి చెందుతారు. ఏదీ దొరకని రోజున నిరాశ చెందరు. ముక్తునికి కోరికలే ఉండవు. ఫలాపేక్ష ఉండదు కాబట్టి అతను చేయవలసిన పనులు గాని, పొందవలసిన ఫలంగానీ ఉండదు. ఏమి ఇచ్చినా గ్రహించడు. చూసే వాళ్ళకి పిచ్చివాడిలా కనిపిస్తాడు. ఏవైనా కర్మలంటూ (పనులు) చేస్తే అవీ భగవంతుని ప్రీతి కోసమే చేస్తాడు కానీ, స్వప్రయోజనాన్ని ఆశించి చేయడు.

ఉద్ధవా! లోకోపకారం కోసం చేయాల్సిన పనులన్నీ వేదాల్లో చెప్పబడ్డాయి. వేదాలు సంపూర్ణంగా వల్లించడం సాధ్యమూ కాదు, దానివల్ల ఫలితమూ ఉండదు. వేదాల్లో చెప్పిన తత్త్వాన్ని గ్రహించాలి. ఎవరికి ఎంత వరకూ అన్వయిస్తుందో తెలుసుకొని అంతవరకే అధ్యయనం చేసి ఆచరించాలి. దీన్నే అనుష్ఠానం అంటారు. పాలివ్వని ఆవును పెంచడం, వ్యభిచారిణి అయిన స్త్రీ, దుర్మార్గుడైన పుత్రుడు, యోగ్యుడైన వానికి దానం చేయని ధనమూ ఏ విధంగా పనికి రానివో అదే విధంగా అనుష్ఠానం లేని వేదాధ్యయనం కూడా పనికి రాకుండా పోతుంది.

ఉద్ధవా! భగవంతుని యందు మనస్సు లగ్నము చేసి, సృష్టి, స్థితి లయకారకుడనైన నన్ను ఆరాధించాలి. నా లీలలను కీర్తించాలి. రామ, కృష్ణ మున్నగు అవతారాల్ని స్తుతించాలి. నా గుణగణములను గానం చెయ్యాలి.

ఉద్ధవా! భగవంతునిపై అనన్యమైన ప్రేమ కలుగక, మనస్సును స్థిరముగా ఉంచలేని యెడల, సత్సంగము చెయ్యాలి. నా కథలను శ్రద్ధతో విని, నా అవతార లీలల్ని తరచూ గానం చెయ్యాలి. నన్నాశ్రయించవలెను. నన్నాశ్రయించిన వారికి అనన్య ప్రేమ భక్తి కలుగుతుంది. అట్టి భక్తుడు సత్సంగము వలన నాయందు భక్తి కలిగి ధ్యానయోగముచే నా స్వరూపమును పొందుతాడు. సత్సంగము కొద్దిగా లభించినా సర్వసిద్ధులు ప్రాప్తిస్తాయి.

ఉద్ధవుడు : దేవా! నీ కీర్తిని ఎందరో గానము చేస్తారు. వారిలో సాధువులెవరో ఎట్లా తెలుసుకోవడం? ఎటువంటి భక్తిని నీయందు చూపవలెను?

దేవా! నీవు పురుషశ్రేష్ఠుడవు.నీవు ప్రకృతికతీతుడవు. ఆకాశము వలె నిర్లిప్తుడవు. శరణాగతుడను. నాకు వివరించి, పావనుణ్ణి చెయ్యి.

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! నా భక్తుడు దయగలిగిన వాడై ఉంటాడు. ఏ ప్రాణిపైనా విరోధ భావముండదు. ఎన్ని కష్టాలు వచ్చినా సంతోషంగా స్వీకరిస్తాడు. సమదర్శియై ఉంటాడు. విషయవాసనలతో అతడి బుద్ధి కలుషితమై ఉండదు. మధురమైన స్వభావం కలిగి ఉంటాడు. లౌకిక వ్యవహారములందు ఆసక్తి చూపడు. మితంగా భోజనం చేస్తాడు. మితభాషి, శాంతుడు, స్థిరచిత్తం కలిగిన వాడై ఉంటాడు. మననశీలుడు. అతని వలన ఎవరికీ ఎట్టి ప్రమాదమూ వాటిల్లదు. ఆకలి, దప్పిక, శోకము, మోహము, జననము, మరణము అనే ఆరు గుణాలు అతడికి చెప్పుచేతల్లో ఉంటాయి. అతడు ఇతరులను గౌరవిస్తాడే గాని, తనకు ఎటువంటి సన్మానాలను కోరుకోడు. స్నేహశీలి, అన్నిటినీ మించి నా తత్త్వాన్ని బాగా ఎరిగినవాడు.

ఉద్ధవా! ఎవరైతే తన ధర్మములను విడిచి నేను ఉపదేశించిన భాగవత ధర్మములను ఆచరించుచూ నన్ను సేవించునో అట్టివాడు సత్పురుషుడు. నన్ను సచ్చిదానందాది గుణ విశిష్టునిగాను, సర్వాంతర్యామిగాను తెలుసుకొని ఏకాంత భావంతో సేవించిన యెడల ఉత్తమ భక్తుడని కీర్తించబడతాడు.

ఉద్ధవా! నా ప్రతిమను, నా భక్తులను దర్శించాలి, స్తుతించాలి, నమస్కరించాలి. నా గుణాలను లీలలను కీర్తించాలి. ఆనందంతో పండుగ జరుపుకోవాలి. గీత, వాద్య, నృత్య, గోష్ఠుల ద్వారా ఉత్సవాలు జరుపుకోవాలి. జన్మదినము వంటి పర్వదినాలలో నన్ను ప్రతిష్ఠించిన ప్రదేశాలకు పోయి ఉత్సవాలు జరుపవలెను. ఆహారము, ఉపహారాదులతో పూజించాలి. ఆలయము నిర్మించి నా మూర్తులను ప్రతిష్ఠించాలి. ఒకరివల్ల కానిచో సామూహికంగా చెయ్యాలి. నాకోసం ఉద్యానవనాలు, పుష్పవనాలు, క్రీడాస్థానాలు, నగరాలు, ఆలయాలు నిర్మించాలి. ఆ ప్రదేశాలన్నిటిలోనూ న్యూనత లేకుండా సేవకభావంతో ఊడవటం, శుభ్రం చేయటం, ముగ్గులు వేయటం వంటి పనులన్నీ నేర్చుకోవాలి. నిరాడంబరంగా ఉండాలి. గొప్పలు చెప్పుకోరాదు, మంచి పనులు చేసినిప్పుడు ప్రచారం చేసుకోకూడదు. నాకు సమర్పించే దీప కాంతిలో మీ పనులు చక్కబెట్టుకోగూడదు. ఇతర దేవతలకు సమర్పించినవేవీ నా ఆరాధనకు ఉపయోగించరాదు. నీకు అత్యంత ప్రియమైన వస్తువును నాకు సమర్పించుము. దీని వలన నీవు పొందే ఫలం అనంతంగా ఉంటుంది.

ఉద్ధవా! సూర్యుడు, అగ్ని, బ్రాహ్మణుడు, గోవు, వైష్ణవులు, ఆకాశము, వాయువు, జలము, పృథివి, ఆత్మ, ఇవికాక మిగిలిన ప్రాణులన్నీ కూడా నా పూజాస్థానాలే.

ఉద్ధవా! వేదమంత్రాలతో సూర్యుని యందు నన్ను పూజించాలి. హవిస్సులచేత అగ్నిలోను, ఆతిథ్యము చేత బ్రాహ్మణుని, పచ్చిగడ్డిచేత గోవును ఆతిథ్యమిచ్చి నన్ను పూజించాలి. ఈ విధముగా ఏకాగ్ర చిత్తముతో ఇష్టకర్మల ద్వారా నన్ను పూజించువారికి భక్తి నిశ్చలమగును. నేను సత్పురుషుల యందు నివసింతును. అందువలన సత్సంగము వలన భక్తి యోగమే మానవులను సంసారమునుండి తరింపజేయు సాదనము.

భక్తియోగ మహిమ - ధ్యానయోగము

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 14వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ఉద్ధవుడు : కృష్ణా! నీవు ఉపదేశించిన భక్తియోగముచే చిత్తము నీయందే లగ్నమగును. అట్టి నిష్కామ భక్తియోగము సర్వ సమ్మతమా? లేక నీ ఒక్కనికే సమ్మతమా?

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! ప్రళయకాలమున వేదవాణి అంతా నష్టమైపోయినది. తిరిగి సృష్టి ఆరంభమునందు బ్రహ్మకు ఉపదేశించితిని. ఆయన నుండి స్వాయంభువ మనువు, వాని నుండి భృగువు, అంగిరసుడు, మరీచి, పులహుడు, అత్రి, పులస్త్యుడు, క్రతువు అను ఏడుగురు మహర్షులు గ్రహించిరి. వారి నుండి వారి సంతానమైన దేవతలు, దానవులు, గుహ్యకులు, మానవులు, సిద్ధులు, గంధర్వులు మున్నగు వారందరూ దానిని గ్రహించిరి.

జీవుల స్వభావాలన్నీ (వాసనలు) సత్త్వరజస్తమో గుణాల ననుసరించి ఉంటాయి. ఈ వాసనలు దేవతల యందు, రాక్షసులయందు, మనుష్యుల యందు భిన్నభిన్నముగా యుండును. వారి వారి వాసనల ననుసరించి వారి వేద వ్యాఖ్యానాలు మారుతూ ఉంటాయి. వ్యాఖ్యానాల ననుసరించి వారి బుద్ధిలో గూడా తేడాలుంటాయి. కొందరు వేదాధ్యయనం చేయకుండానే పరంపరగా పెద్దలనుండి విన్నదానినే ప్రమాణంగా స్వీకరించేవారు. మరి కొందరు వేదాలను నిర్లక్ష్యం చేసి పాషండ మతాన్ని అవలంభించేవారు.

ఉద్ధవా! మానవులలో కొందరు ధర్మమును కోరి, కొందరు యశస్సును కోరి, మరికొందరు సంపదలను కోరి, ఇంకొందరు సత్యము, దమము, శమనమును కోరి కర్మలు చేస్తున్నారు. కొందరు యజ్ఞము, తపస్సు, వ్రతము మున్నగునవి శ్రేయస్సును చేగూర్చేవని చెప్పుచున్నారు. ఈ కర్మలన్నీ గూడా దుఃఖాన్ని, మోహాన్ని కలిగించేవి కావటం వల్ల క్షుద్రమైనవి, హీనమైనవి, శోకముతో కూడినవి అవుతున్నాయి.

అట్లాకాకుండా నాయందే మనస్సు నిలిపి, విషయభోగాలను త్యజించి, నా పరమానంద స్వరూపాన్ని తెలుసుకుంటారు. వీరికి కలిగే సుఖానుభూతి విషయాసక్తులైనవారికెట్లు కలుగును?

ఉద్ధవా! నాపై మనస్సు నిలిపినవాడు, బ్రహ్మపదాన్ని, ఇంద్రపదవిని, పాతాళలోకాధిపత్యానికి గాని, అణిమాది సిద్ధులను కట్టబెట్టినా కూడా అంగీకరించడు. భక్తులు నాకు అత్యంత ప్రియులు. వారు నన్ను తప్ప మరి యితరములైన వేవీ ఆశించరు. శాంతచిత్తులై శమ, దమదాది గుణాలు కలిగి ఉంటారు.

ఉద్ధవా! నీవు నాకు అత్యంత ప్రియతముడవు. నేను నిన్ను ప్రేమించునట్లుగా, నా కుమారుడైన బ్రహ్మను గాని, నా స్వరూపుడైన శివభగవానుని గాని, సోదరుడైన బలరామునిగాని, భార్య అయిన లక్ష్మీదేవిని కూడా ప్రేమించుటలేదు. ఇన్ని మాటలెందుకు సర్వమంగళకరమైన నా రూపమే నా కిష్టము కాదు. నేను భక్తుల పాదధూళి ద్వారా బ్రహ్మాండములను పవిత్రము చేయుదును.

భక్తులు ఏకాంత చిత్తముతో నన్నే ధ్యానింతురు. విషయవాంఛలకు లొంగరు. భక్తికి నేను వశుడైనంతగా, యోగమునకు గాని, సాంఖ్యమునకు గాని, తపస్సునకు గాని, దానాదులకు గాని వశము కాను. వారి ఏకాంత భక్తికి నేను పూర్తిగా లభ్యమయ్యేదను. ఇట్టి అనన్య భక్తులు చండాలురను కూడా పవిత్రులను చేయుదురు.

కొందరు ప్రాణుల యెడల దయ కలిగి ఉంటారు. కొందరు సత్యమునే పలుకుదురు. కొందరు తపస్సు చేయుదురు. కానీ భగవంతుని యందు భక్తి లేనిచో మనస్సు పవిత్రము కాజాలదు. మండుచున్న అగ్ని కట్టెను కాల్చివేయునట్లు, భక్తి సమస్త పాపములను కాల్చి బూడిద చేయును. నిప్పులో కాల్చిన బంగారంలోని మాలిన్యాలన్నీ పోయినట్లుగానే మానవుల మనస్సు గూడ భక్తి చేత పవిత్రమై వాసనలను పోగొట్టి శాంతపరచును. శాంత భక్తులను భగవంతుడు క్షణమైనా విడిచి ఉండడు. భగవానుని గుణగణాలు విన్నంతనే, శరీరము పులకితము కానంతవరకు, చిత్తము ద్రవించి గద్గదము కానంతవరకు, కళ్ళనుండి ఆనందాశ్రువులు ప్రవహించనంత వరకు భక్తి జనించదు. భక్తి కలగనిదే చిత్తము శుద్ధికాదు.

నాయందు భక్తి గలవాని వాక్కు గద్గదమవుతుంది. మనస్సు కరిగి పోతుంది. మాటి మాటికీ ఏడుస్తూ, నవ్వుతూ, పాడుతూ నృత్యం చేస్తూ ఉంటాడు. అటువంటి నా భక్తుడు మూడు లోకాలను పవిత్రం గావిస్తాడు.

కాటుక వలన నేత్రములందలి దోషములు పోయి చిన్న చిన్న వస్తువులను గూడా చూచే శక్తి కలుగునట్లు, నా లీలలను వినటం గానీ, కీర్తించటం గానీ చేస్తే మనస్సులోని మాలిన్యాలన్నీ పోతాయి.

విషయములను గూర్చి ఆలోచించే మనస్సు ఎప్పుడూ విషయాలమధ్యనే తిరుగుతూ ఉంటుంది. అదే నన్ను గురించి ఆలోచించే వాని మనస్సు పరబ్రహ్మమైన నాయందే లగ్నమై ఉంటుంది.

వివేకవంతుడు స్త్రీతో స్నేహం చేయరాదు. స్త్రీతో స్నేహం చేసేవారితో కూడా స్నేహం చేయక ఏకాంతమున నన్నే ధ్యానించవలెను. స్త్రీ సాంగత్యం వల్ల, స్త్రీలంపటుల సాంగత్యం వల్ల జీవుడు ఎన్నో బంధములు, దుఃఖంములు క్లేశాలు పొందుతాడు.

ఉద్ధవుడు : పుండరీకాక్షా! సాధకులు నిన్ను ఏ విధముగా, ఏ రూపములో, ఏ భావముతో ధ్యానించెదరో వివరించగోరుచున్నాను.

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! భక్తుడు ముందుగా ఎత్తు పల్లాలు లేని సుఖమైన ఆసనం పై కూర్చోవాలి. చేతులు రెండూ ఒడిలో ఉంచుకొని, దృష్టిని ముక్కు కొనపైన నిలుపవలెను. ప్రాణాయామాన్ని అభ్యాసం చేస్తూ క్రమంగా పెంచుకుంటూ పోవాలి.

మూలాధారం నుండి తామర నూలిపోగులవలె శిరస్సు వరకు విచ్ఛిన్నం కాకుండాయున్న హృదయమునందలి ఘంటారావం వంటి ఓంకారమును పన్నెండు అంగుళముల వరకు ప్రాణవాయువుతో కూడ పైకి తీసుకొని వెళ్ళి ఆ ఓంకారాన్ని స్వరములో కలుపవలెను. ఈ విధంగా ప్రతిరోజు మూడు కాలములందు ఓంకారంతో కూడి ప్రాణాయామం అభ్యసించిన ఒక నెల రోజులలో ప్రాణక్రియ స్వాధీనమవుతుంది.

అనంతరం శరీరంలో పద్మాకారంలో ఉన్న హృదయమునందు భగవానుని ధ్యానించవలెను. భగవానుని అవయవాలన్నిటిపైనా మనస్సును లగ్నంచేసి నిగ్రహముతో ధ్యానించవలెను. ఇంద్రియములు మనస్సు ద్వారా, ఆ ఇంద్రియ విషయములనుండి మరల్చి బుద్ధి అనే సారథి ద్వారా సర్వాంగ సుందరుడైన నాపై మనస్సు దృఢముగా నిలుపవలెను.

ఈ విధంగా భగవానుని అవయవాలన్నిటి యందు మనస్సు నిలుపటాన్ని 'ధారణ' అంటారు. వదనారవిందమనే ఒకే అంగమును ధ్యానించడాన్ని ధ్యానం అంటారు. మనస్సు ధ్యానమునందు లగ్నమై ఉన్నప్పుడు, మనస్సు సంకల్పములకు (ఆలోచనలకు) దూరమగును. దీన్నే ధ్యానచిత్తమంటారు. ఈ స్థితిలో ధ్యానము చేయువాడు పరమాత్మతో ఏకమగును. అనగా ప్రపంచ విషయాలన్నీ మరచి మనస్సు భగవానునియందు లగ్నమగును. పిమ్మట తాను పరమాత్మయందే ఉండును. పరమాత్మ తనయందుండును. అదే 'అద్వయ చైతన్యము, అమృతానుభవము' గా మారును.

ఈ విధంగా సాధన చేసిన పురుషుడు జ్యోతి యందు మరొక జ్యోతి వలె బ్రహ్మ స్వరూపుడనైన నన్ను గాంచును. నాయందు తనను గాంచును. ఈ విధంగా ఎవరు తీవ్రమగు ధ్యానయోగము ద్వారా నా యందు మనస్సును లగ్నము చేయుదురో అట్టివారు ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికములనెడి మూడు విధములైన భ్రాంతుల నుండి విముక్తులగుదురు.

వర్ణాశ్రమ ధర్మములు

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 17వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ఉద్ధవుడు : దేవా! నీవు ఇంతవరకు భక్తి రూపమగు ధర్మములను వివరించావు. ఎట్టి స్వధర్మములను ఆచరించుట ద్వారా అట్టి భక్తి కలుగునో వివరించి చెప్పు.

మధుసూదనా! ఈ ధర్మములకు ప్రవర్తకుడవు, రక్షకుడవు, వక్తవు నీవే. నీవు ఈ భూమిని విడిచి అవతారము పరిత్యజించబోవుచున్నావు. ఈ ధర్మములను పిదప ఎవరు వివరింతురు? మనుష్యులలో ఈ భక్తి లక్షణ ధర్మాన్ని ఎవరు ఏ విధంగా ఆచరించాలో వివరించి చెప్పు.

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! మొదట కృతయుగంలో మానవులకు 'హంస' అనే వర్ణమొక్కటే ఉండేది. ఆ యుగమునందు జనులు పుట్టుక తోనే భక్తి పరాయణులై ఉండేవారు. జన్మ చేతనే జనులు కృతకృత్యులవడం మూలంగా ఆ యుగాన్ని 'కృతయుగం' అన్నారు.

ఆ కాలంలో వేదం ఒక్కటిగానే ఉండేది. (అవిభక్తముగ) వేదమే ప్రమాణంగా ఉండేది. అప్పుడు నేను సత్యము, దయ, శౌచము, తపస్సు అను నాలుగు పాదములతో కూడి వృషభరూపం ధరించి ధర్మమై ఉండేవాడిని. ఆకాలమందు యజ్ఞయాగాదుల వంటి కర్మలేవీ ఉండేవి కావు. తపస్సు చేసుకునే వారంతా నన్ను హంస రూపంలో ధ్యానించేవారు.

మహాభాగా! తరువాత త్రేతాయుగం వచ్చింది. నా హృదయం నుండి, ప్రాణము నుండి ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదమను మూడు వేదములు ఆవిర్భవించినవి. వాటినుండి హౌత్ర, అధ్వర్యవ, ఔద్గాత్రము అను మూడు విధములైన యజ్ఞరూపములను ధరించితిని.

పిమ్మట విరాట్పురుషుని ముఖము నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు ఆవిర్భవించిరి. అట్లాగే నా జఘన ప్రదేశము నుండి గృహస్థాశ్రమము, హృదయము నుండి నైష్ఠిక బ్రహ్మచర్యము, వక్షస్థలము నుండి వానప్రస్థాశ్రమము, శిరస్సునుండి సన్న్యాసాశ్రమము పుట్టినవి. అందువలన వర్ణాశ్రమము లందలి మానవుల స్వభావాలు గూడా వారి ఉత్పత్తి స్థానాలను బట్టి యుండును. వారి స్వభావాలను బట్టి వర్ణాలు ఈ విధంగా ఉంటాయి.

శమము, దమము, తపస్సు, శౌచము, సంతోషము, క్షమ, సరళత్వము, నా యందు భక్తి, దయ, సత్యము మొదలైనవి బ్రాహ్మణుని స్వభావములని తెలుసుకొనుము.

తేజస్సు, బలము, శౌర్యము, ఐశ్వర్యము, ధైర్యము, ప్రభావము, సహిష్ణుత, ఔదార్యము, ఉద్యమము, స్థైర్యము, బ్రాహ్మణుని మేలుకోరుట మున్నగునవన్నీ క్షత్రియుని స్వభావములు.

ఆస్తిక్యము, దానశీలత, దంభము లేకుండుట, బ్రాహ్మణ సేవ, ధన సంపదల యందు తృప్తి లేకుండుట మున్నగునవి వైశ్యుని స్వభావములు.

నిష్కపట భావముతో బ్రాహ్మణులను, గోవులను సేవించుట, దేవతల నారాధించుట, లభించిన దానితో తృప్తి చెందుట మున్నగునవన్నీ శూద్ర వర్ణ ధర్మములు.

అశౌచము, అసత్యము, చౌర్యము, నాస్తికత్వము, వృథాకలహము, కామము, క్రోధము, విషయతృష్ణ మున్నగునవన్నీ అంత్యజాతి స్వభావములు. అహింస, సత్యము, అస్తేయము, కామము లేకుండుట, క్రోధము లేకుండుట, లోభము లేకుండుట, అన్ని భూతముల యందు ప్రేమ కలిగి ఉండటం మున్నగునవన్నీ సర్వమానవ ధర్మములు.

బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్రులు ఉపనయనమను రెండవ జన్మను పొంది, గురుకులము నందుండి, ఆచార్యునిచే మంత్రోపదేశము పొంది ఇంద్రియములను జయించి వేదమును అధ్యయనం చేయవలెను. గురుకులంలో ఉంటూ జడలను, మేఖలను, అజినమును, దండమును, అక్షమాలను, యజ్ఞోపవీతాన్ని, కమండలమును ధరించవలెను. పండ్లు తోముకొన రాదు. వస్త్రములను ఉతకరాదు. రంగు వేసిన ఆసనంపై కూర్చొనరాదు. స్నాన, భోజన, హోమ, జపములు చేయునపుడును, మలమూత్రములు విడిచునపుడు మౌనముగా నుండవలయును. కక్ష్యప్రదేశములందును, ఉపస్థ ప్రదేశములందు రోమములను ఖండించరాదు. నఖములను కూడా ఖండించరాదు.

బ్రహ్మచారి బుద్ధి పూర్వకముగా వీర్యమును వ్యర్థము చేయరాదు. స్వప్నాదులయందు వీర్యము వ్యర్థమైనచో చన్నీటితో స్నానము చేసి ప్రాణాయామమును చేయవలెను. పిమ్మట గాయత్రిని జపించవలెను.

బ్రహ్మచారి పవిత్రంగా జీవిస్తూ మూడు పూటలయందు సంధ్యావందనము, గాయత్రిని జపించవలెను. అగ్నిని, సూర్యుని, ఆచార్యుని, గోవును, బ్రాహ్మణుని, గురువును, వృద్ధులను దేవతలను పూజించవలెను. గురువు నా స్వరూపమేనని తెలుసుకొనవలెను. గురువును ఎట్టి పరిస్థితులలోనూ

అవమాన పరచరాదు, దోషదృష్టితో చూడరాదు. ఉదయాన, సాయంత్రం, సంధ్యా సమయాల్లో లభించే భిక్షను గురువుకు సమర్పించి, ఆయన అనుజ్ఞతో ఆ పదార్థాన్ని స్వీకరించాలి.

గురుసేవలో ఉన్న బ్రహ్మచారి, గురువు ఎక్కడకు వెళితే అక్కడకు వెనుకనే సేవకునివలె అనుసరించి వెళ్ళవలెను. ఆయన నిద్రించే సమయాలలో ఆయనకు దగ్గరలో, అప్రమత్త భావంతో నిద్రించవలెను. ఆయన విశ్రాంతి తీసుకునే సమయాల్లో పాదములు, కాళ్లు నెమ్మదిగా వత్తవలయును. ఆయన కూర్చుని ఉన్నప్పుడు సావధానుడై ఆయన ఆదేశాలకై వేచి ఉండాలి. ఈ విధంగా గురువును ఒక్క క్షణమైనా విడువకుండా ఆరాధించవలెను.

వేదాధ్యయనం పూర్తి అయ్యేంత వరకు పై విధంగా నియమాలను పాటిస్తూ, గురుకులమందు ఉంటూ అఖండ బ్రహ్మచర్యాన్ని ఆచరించాలి. నైష్ఠిక బ్రహ్మచారి మహర్లోకమునకు, అచ్చట నుండి బ్రహ్మలోకమునకు వెళ్లదలచిన యెడల, జీవిత కాలమంతా వేదాధ్యయనం చేస్తూ గురు సేవలో గడపవలెను. అతడు బ్రహ్మ తేజస్సంపన్నుడు, పాపరహితుడునై అగ్ని యందును, గురువు నందును, తన యందును, సర్వ భూతముల యందు సమబుద్ధి కలిగి నన్ను ఉపాసించవలెను. బ్రహ్మచారి స్త్రీలతో అతిగా మాట్లాడరాదు. పొరపాటున కూడా తాకరాదు, పరిహాసములాడరాదు. ఈ కర్మానుష్ఠానముల వలన అంతఃకరణము శుద్ధి పొంది భక్తి జనించును. ఆచారవంతుడే ఆత్మవిద్యను పొందగలడు.

అట్లుగాక, గృహస్థాశ్రమమున ప్రవేశించదలచిన బ్రహ్మచారి వేదాధ్యయనాన్ని పూర్తిచేసుకొని, గురువుకు దక్షిణనిచ్చి ఆయన అనుమతితో గృహస్థాశ్రమాన్ని స్వీకరించవచ్చును.

గృహస్థాశ్రమంపై కోరిక గల బ్రహ్మచారి తనకంటే చిన్నది సవర్ణయు అయిన కన్యను వివాహం చేసుకొనవలెను. ప్రేమలో పడి (కామవశుడై) యితర వర్ణాలలోని కన్యను వివాహమాడదలచినచో, తమకంటే తక్కువ వర్ణముల వారిని చేసుకొనవలెను.

ఉద్ధవా! శౌచము, ఆచమనము, స్నానము, సంధ్యోపాసనము, విష్ణుపూజ, తీర్థసేవనము, జపము, అస్పృశ్యులను తాకకుండుట, నిషేధవస్తువులను తినకుండుట, తగనివారితో మాట్లాడుట, అన్ని జీవరాసులయందు అంతర్భూతముగా నేనే ఉన్నానని తెలిసికొనుట, మనస్సు, వాక్కు, దేహములను అదుపులో ఉంచుకొనుట అను నియమములు అన్ని ఆశ్రమముల వారు పాటింపదగినవి.

సకాముడైనచో బ్రహ్మచర్యమునుండి గృహస్థాశ్రమమును స్వీకరించ వచ్చును. గృహస్థాశ్రమ మందు కోరిక లేని యెడల వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించవచ్చును. లేదా సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించవలెను. అట్లుకాదేని, క్రమముగా ఒక ఆశ్రమము నుండి మరొక ఆశ్రమమునకు వెళ్ళ వచ్చును. నా భక్తుడైన వాడు ఈ నియమాలను ఉల్లంఘించడు.

ఉద్ధవా! యజ్ఞ యాగాదులును, అధ్యయనమును, దానము చేయు అధికారము బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణముల వారికి సమానముగా యున్నది. ప్రతి గ్రహణము, అధ్యయనము, యజనము అను మూడు వృత్తులు కేవలం బ్రాహ్మణ ధర్మాలై ఉన్నాయి. దానము తీసుకొనుట అనువృత్తి తేజస్సు,

యవస్సును నాశనము చేయునని భావించిన యెడల ఉపాధ్యాయ వృత్తిని గాని, యాజమానములను వృత్తిగా స్వీకరించవచ్చును. ఈ రెండు వృత్తులు గూడా సరిపడనిచో శిలా వృత్తి (ధాన్యము కోసిన పిదప పొలములో పడిన గింజలను ఏరుకొనుట) చే జీవింపవలెను.

ఉద్ధవా! శిలావృత్తి ద్వారాగానీ, ఉంఛవృత్తి ద్వారా గానీ, సంతృప్తి పడి నిష్కామ భావంతో నాయందు మనస్సు నిలిపి అతిథ్యము మున్నగు ఉత్తమ దర్మముల నాచరించిన బ్రాహ్మణుదు గృహస్థాశ్రమము నందే మోక్షమును పొందగలుగును.

దారిద్ర్యము మున్నగు కష్టములలో చిక్కుకొనిన నా భక్తుని నేను అన్ని రకములైన ఆపదలనుండి రక్షించెదను.

బ్రాహ్మణ వృత్తి చేత జీవించలేక దారిద్ర్యముతో బాధపడు బ్రాహ్మణుడు, వైశ్యవృత్తిని గానీ, క్షత్రియ వృత్తిని గాని స్వీకరించవచ్చును. కానీ నీచ వృత్తికి పాల్పడరాదు.

వైశ్యునికి వైశ్య వృత్తి చేత ఆపదలు కలిగినచో క్షత్రియ వృత్తిని చేపట్టవచ్చును.

క్షత్రియుడు ఆపదలలో చిక్కుకున్నప్పుడు వైశ్య వృత్తి గాని, వేటద్వారా గానీ, ఉపాధ్యాయ (బ్రాహ్మణ) వృత్తి చేతగాని జీవించవచ్చును. కానీ హీనవృత్తి స్వీకరింపరాదు.

గృహస్థు ప్రతిదినము వేదాధ్యయనము చేయుచూ ఋషులను, స్వధామంత్రములచేత పితృదేవతలను, స్వాహా మంత్రములచేత దేవతలను, ఉపహార వస్తువులచేత భూతములను, అన్నోదకములచేత మనుష్యులను ఆరాధించవలెను.

అనాయాసముగా లభించిన దానిచేతగాని, సొంతవృత్తిచే సంపాదించిన ధనముతో యథాశక్తిగా యజ్ఞయాగాదుల నాచరించవలెను.

భక్తుడైనవాడు భార్యాపిల్లలపై ఆసక్తుడు కాక, ఎల్లప్పుడూ భగవద్ధ్యాన మందే మనస్సు నిలుపవలెను. స్వర్గాది సుఖములు, ఇహలోక సుఖములు కూడా అశాశ్వతమైనవేనని తెలుసుకొనవలెను. పుత్రులు, భార్య, ఆప్తులు, బంధువులంతా చలివేంద్రములలో కలుసుకోనే బాటసారుల వంటివారని తెలుసుకొన వలెను. వారి కలయిక క్షణికం. ఈ విధంగా ఆలోచించి, అనాసక్త భావంతో వ్యవహరించుచూ, అహంకారాన్ని విడిచే వాడు గృహస్థ ధర్మాలకు బద్ధుడు కాడు. అటువంటి గృహస్థుడు, ఇంట్లో ఉంటూనే నన్నారాధించవచ్చును. లేదా అడవులకు పోయి తపస్సు చేయవచ్చును. లేదా సన్న్యాసమును స్వీకరించవచ్చును.

స్త్రీలోలుడు, వివేక శూన్యుడు, మూఢుడు, భార్యాపిల్లలయందాసక్తుడైనవాడు, అహంకార, మమకారములచే బద్ధుడగును.

భక్తి, జ్ఞాన, యమ, నియమాది సాధనములు

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 19వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! ఆత్మ తత్త్వజ్ఞుడైనవాడు ఈ ప్రపంచమంతా మాయ అనియు, జ్ఞానులు కోరుకునే స్వర్గాపవర్గములు నేనేననియు తెలుసుకొనును. కావున నా చరణారవిందములే శ్రేష్ఠములుగా భావించెదరు.

ఉద్ధవుడు : దేవా! సంసార మార్గమున దుఃఖములలో మునిగియున్న మాబోటి జీవులకు నీ పాదపద్మములే శరణ్యము. సంసార కూపమున పడియున్న క్షుద్రమైన సుఖములను కోరుకునే నా వంటి జీవులను ఉద్ధరించి మోక్షబోధ చేయుము. వైరాగ్య విజ్ఞాన పూరితమైన నీ జ్ఞాన సంపదను, మహత్తరమైన భక్తియోగమును వివరించి చెప్పుము.

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! పూర్వము ధర్మరాజు కురుక్షేత్ర యుద్ధమందు జ్ఞాతులందరినీ పోగొట్టుకొని శోకముతో భీష్మపితామహుని వలన ఎన్నియో ధర్మములను తెలుసుకొనెను. ధర్మరాజుకు భీష్ముడు తెలిపిన మోక్షధర్మములను నీకు యిప్పుడు చెప్పెదను, వినుము.

బ్రహ్మ మొదలు స్థావరముల వరకు ప్రాణుల యందు, ప్రకృతి పురుషులు, మహత్తత్త్వము, అహంకారము, పంచతన్మాత్రలు, కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, మనస్సు, పంచమహా భూతములు, సత్త్వరజస్తమోగుణాలు, ఇరవైయెనిమిది తత్త్వాలను చూపుతూ వీటన్నిటిలోనూ ఉండే బ్రహ్మతత్త్వమును ఏది తెలుపుచున్నదో అట్టి జ్ఞానమును నేను ఇష్టపడతానని తెలుసుకొనుము.

ఉద్ధవా! ఒకే వస్తువును అనేక రూపాలుగా చూడకుండా, ఆ రూపాలన్నీ పరమాత్మేయని తెలుసుకోవటమే విజ్ఞానం.

సృష్టి స్థితి లయములకు ఏది కారణమై ఉందో, ప్రళయ సమయాలలో ఏది మిగిలి ఉన్నదో, అదియే 'సత్తు' అని తెలుసుకొనుము. మిగిలినవన్నీ ఈ ప్రపంచమున మాయా రూపముగా తెలియుచున్నది.

ఉద్ధవా! ఈ ప్రపంచం ఎలా అనిత్యమో, అట్లాగే స్వర్గ సౌఖ్యాలు అనిత్యములే. స్వరసౌఖ్యాలను చేకూర్చిపెట్టే యజ్ఞయాగాదులు కూడా అనిత్యాలే. అమంగళకరము, శోకపూరితము అయిన కర్మఫలాలన్నీ కూడా అనిత్యమేనని ఎవరు తెలుసుకుంటాడో అతడి వివేకము స్థిరమైనది.

అనఘా! నీకు ఇంతకు పూర్వమే భక్తి యోగమును గూర్చి చెప్పితిని. ఇప్పుడు అట్టి భక్తిని పొందే సాధనలను వర్ణించెదను.

నా భక్తిని పొందదలచినవాడు అమృతమయములైన నా కథలను శ్రద్ధతో వినవలెను. నా గుణములను, లీలలను, నామములను కీర్తించవలెను. నిష్ఠతో నన్ను పూజించవలెను. స్తోత్రములచే నన్ను స్తుతించవలెను. ప్రేమతో నా సేవ చేయవలెను. నాకు సాష్టాంగ ప్రణామము చేయవలెను. అన్ని ప్రాణులయందు నన్ను దర్శించవలెను. శారీరకంగాను, మానసికంగాను, వాక్కుచేతను నన్నే కీర్తించవలెను. కోరికలను జయించి మనస్సు నాయందు లగ్నము చేయవలెను.

నా కొరకు ధనాన్ని, భోగాలను, సుఖములను వదులుకోవాలి. యజ్ఞము, దానము, హోమము, జపము, వ్రతము, తపస్సులను నా కొరకే చేయవలెను.

ఉద్ధవా! ఈ ధర్మాలన్నీ ఆచరించుచూ, నాకై ఆత్మనివేదన చేసే మానవుని హృదయమందు నా పట్ల ప్రేమ, భక్తి కలుగుతాయి. నాపై భక్తి ప్రేమ కుదిరిన తర్వాత అతడు ఇంకా పొందవలసింది ఏమీ ఉండదు.

సత్త్వ గుణము కూడిన నడవడికను, శాంతమైన మనస్సును పరమాత్మనైన నాకు అర్పించినప్పుడు, అట్టి పురుషునకు ధర్మజ్ఞాన వైరాగ్యములతో కూడిన ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తాను.

రజోగుణ సంపన్నుని మనస్సు శరీరం పైన, ఇల్లు వాకిళ్ళపైనా, యితర అనిత్యమైన వస్తువులపైనా లగ్నమై ఉంటుంది. అటువంటి వాడు అజ్ఞానంతోను, అధర్మంతోను, మోహము చెంది ఉంటాడు.

ఉద్ధవుడు: దేవా! యమ నియమము లెన్ని విధములు? శమ మనగా నేమి? దమ మనగానేమి? తితిక్ష ధృతి యనగానేమి? దానము, తపస్సు, శౌర్యము, సత్యము, ఋణము, త్యాగము, ఇష్టము, ధనము, యజ్ఞము, దక్షిణ యనగానేమి? పురుషుని బలమెట్టిది? లాభమనగా నెట్టిది? ఉత్తమ విద్య, లజ్జ, శ్రీ, సుఖదుఃఖములనగానేమి? పండితుని లక్షణములెట్టివి? మూర్ఖుడనగా ఎవరు? సన్మార్గ దుర్మార్గ లక్షణము లెట్టివి? స్వర్గ నరకము లెట్టివి? బంధువులనగా ఎట్టివారు? గృహమనగా నేమి? ధనవంతుడనగా ఎట్టివాడు? దరిద్రుడనగా ఎట్టివాడు? కృపణుడనగా ఎట్టివాడు? ఈశ్వరుడని ఎవరినందురు? దేవా ఈ ప్రశ్నలకు సమాధానము తెలుపుము. అట్లే వీటికి వ్యతిరేక భావములను కూడా తెలుపుము.

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! వీనిని ఉపాసించుట చేత ఉపాసకులు వారి వారి కోరికల ననుసరించి భోగములుగాని, మోక్షమును గాని, అభ్యుదయమునుగాని పొందెదరు.

శమము : బుద్ధి నాయందు లగ్నము చేయుటయే శమము.
దమము : ఇంద్రియములను నిగ్రహించుటయే దమము.
తితిక్ష : దుఃఖములను సహించుటయే తితిక్ష.
ధైర్యము : జిహ్వను, జననేంద్రియమును జయించుటయే ధైర్యము.
దానము : ఎవరికీ ద్రోహము చేయకుండుటయే దానము.
తపస్సు : కోరికలను త్యాగము చేయుటయే తపస్సు.
శౌర్యము : వాసనలను నిరోధించుటయే శౌర్యము.
సత్యము : బ్రహ్మ విషయకమగు విచారణయే సత్యము.
ఋతము : సత్యము, ప్రియమైన వాక్కులను ఋతమని చెప్పిరి.
శౌచము : కర్మలయందు ఆసక్తుడై యుండుటయే శౌచము.
సన్న్యాసము: కోరికలను త్యజించుటయే సన్న్యాసము.
ధర్మము : మానవులు కోరదగిన ధనము.

యజ్ఞము : నేనే యజ్ఞమును.
దక్షిణ : జ్ఞానము నుపదేశించుటయే దక్షిణ.
బలము : ప్రాణాయామమే శ్రేష్ఠమైన బలము.
భగము : నా ఐశ్వర్యమే భగము.
లాభము : నాయందు శ్రేష్ఠమైన భక్తియే లాభము.
విద్య : ఆత్మయందు భేద భావమును తొలగించుటయే విద్య.
లజ్జ (హ్రీ): కర్మలయందు అనాసక్తను ప్రకటించుటయే లజ్జ.
శ్రీ : నిపేక్షతాది గుణములే శ్రీ.
సుఖము : సుఖదుఃఖములను అతిక్రమించుటయే సుఖము.
దుఃఖము : విషయ భోగములను కోరుటయే దుఃఖము.
పండితుడు: బంధ, మోక్షముల తత్త్వమును తెలిసినవాడే పండితుడు.
మూర్ఖుడు: శరీరాదులయందు 'నేను' అనే భావమును కలిగియుండు వాడే మూర్ఖుడు.
స్వర్గము : ప్రపంచమునుండి మనస్సును మరలించి, నన్ను పొందించు మంచి మార్గమే స్వర్గము. మరియు సత్త్వ గుణమును వృద్ధి పొందించునది. ప్రవృత్తి మార్గము.
నరకము : తమోగుణము వృద్ధి చెందుటయే నరకము.
బంధువు : జగద్గురువైన 'నేనే' బంధువును.
గృహము : మానవ శరీరమే గృహము.
ధనవంతుడు : గుణవంతుడైన పురుషుడే ధనవంతుడు.
దరిద్రుడు : సంతృప్తి లేని వాడే దరిద్రుడు.
కృపణుడు : ఇంద్రియములను జయించని వాడే కృపణుడు.
స్వతంత్రుడు : విషయ భోగములందు ఆసక్తుడు కాని వాడే స్వతంత్రుడు.
అస్వతంత్రుడు : విషయ భోగములందు ఆసక్తుడైనవాడు.

ఉద్ధవా! నీ వడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానము చెప్పితిని. గుణ దోషములను గూర్చి ఆలోచించుటయే దోషమనియు, అట్లు కాకుండా ఉండటమే గుణమని తెలుసుకొనుము.

గుణదోషములు

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 21వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! ఇంతవరకు నేను చెప్పిన భక్తి జ్ఞాన కర్మ మార్గాలను వదలి తుచ్ఛములైన ఇంద్రియ సుఖములను అనుభవించుచూ సంసార చక్రమున తిరుగుచున్నారు. ఇంద్రియములు చంచలములని, దుఃఖపూరితమైనవని వారెరుగరు.

ఉద్ధవా! ఎవరి ధర్మాన్ని వారు ఆచరించడమే గుణము. అట్టి స్వధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించడమే దోషమగును. ఈ గుణదోషాలనేవి వ్యక్తిని బట్టి చెప్తామే గాని వస్తువుకు చెందినవి కావు. అది ఎట్లనిన వస్త్రమునకు మాలిన్యము అంటుకొన్నచో ఉతికి శుభ్రము చేయవచ్చును. పాత్రకైనచో

తోముకొని శుభ్రపరచ వచ్చును. అట్లాగే మనుష్యులు గూడా స్నానము, దానము, తపస్సు, ఉపనయనం వంటి సంస్కారాల వల్ల శుద్ధి చేసుకొని కర్మలాచరించవచ్చును. మనువుల రూపమున నేనే ఈ ధర్మముల ఆచారమును చూపించితిని.

బ్రాహ్మణులు వాక్కుచే పవిత్రుడు, మిగత విషయములలో అపవిత్రము.

పుష్పములు ప్రోక్షణ చేత పవిత్రములు, వాసన చూడటం వంటి వాటి వలన అపవిత్రం.

అంత్యజులు తాకినా పెద్ద పెద్ద జలాశయాలు పవిత్రాలే, అదే చిన్న చిన్న మడుగులలో, గుంటలలోని నీరు అపవిత్రం.

కొన్ని చోట్ల గుణములు దోషములగును. కర్మలయందు మంచి చెడులు, గుణదోషములు దేశ కాలాదులను బట్టి మారుతూ ఉంటాయి. దీని వలన గుణదోషములు కల్పితమని చెప్పవచ్చును.

సురాపానం వంటి కర్మలను క్రొత్తగా ఎవరైనా చేస్తే వారు పతితులౌతారు. అట్లా కాకుండా, చాలా కాలం నుండీ మద్యం తాగేవాడు మరల పతనం అవటమనేది జరుగదు. మొదటనే నేలపై పడుకున్న వాడు ఇక పడుట ఎట్లుండును?

ఏ విషయముల నుండి మానవుడు విరక్తి చెందునో ఆయా విషయముల నుండి విముక్తి పొందును. ఈ నివృత్తి ధర్మ లక్షణం అందరికీ శోక, మోహ, భయాలను నిర్మూలించి పరమ సుఖాన్నిస్తుంది.

ఉద్ధవా! విషయములందు విరక్తి అంటే సుఖప్రాప్తికి మొదటి మెట్టు. అట్లాగే విషయాసక్తి అంటే దుఃఖానికి కారణమవుతున్నాయని తెలుసుకో. ఆసక్తి చేత కోరిక పుడుతుంది. కోరికల వల్ల కలహాలు వస్తాయి. కలహాల వల్ల క్రోధం పుడుతుంది. క్రోధం చేత మోహము కలుగును. మోహంలో చిక్కుకున్నవాడు సత్యాన్ని దర్శించలేడు. భ్రష్టుడగును. స్వార్థము నుండి పురుషార్థము నుండి కూడా భ్రష్టుడగును. అటువంటి పురుషుడు కొలిమలో తిత్తి వలె శ్వాస తీసుకుంటూ విడుస్తూ బ్రతికి ఉన్నా మరణించిన వాడితో సమానం.

ఉద్ధవా! కర్మల వలన కలిగే స్వర్గాది సౌఖ్యాలు పురుషార్థాన్ని చేకూర్చేది కాదు. తండ్రి బుజ్జగించి, ఏదో ఆశ చూపి పిల్లవాడి చేత మందు త్రాగించినట్లుగా, మోక్షరూపమగు పరమ శ్రేయస్సును గూర్చి చెప్పటానికి వేదశాస్త్రాలు జీవునికి కర్మల యందు రుచిని కలిగించును.

మానవులు తమకు పతనాన్ని చేకూర్చే ఇంద్రియాలు, బలము, వీర్యము, పుత్రాదులు, పశుసంపద మున్నగు వాని యెడల ఆసక్తులై ఉంటారు. హింసాపరులైన కర్మవాదులు, నన్ను తెలుసుకొనలేనివారై స్వర్గాది సౌఖ్యములను పొందవలెననే కోరికతో యజ్ఞమునందు వధించిన పశుమాంసమును దేవతలకు, పితృదేవతలకు, భూతములకు అర్పించుచున్నారు. అటువంటి మందబుద్ధులు, ఇహలోకాన రాజ్య సుఖాలను, పరలోకాన స్వర్గసుఖాలనూ కోరుచున్నారు. అటువంటి వారు, ఎక్కువ ధనము సంపాదించాలనే దురాశపరులైన సముద్ర వ్యాపారుల వలె ఎక్కువగా ధనాన్ని ఖర్చు చేసి రెండు విధాలా నష్టపోయెదరు. రజస్తమో గుణములు గల ఇంద్రాది దేవతలను ఆరాధించి,

గుణాతీతుడైన నన్ను ఆరాధించడం లేదు. ఇట్టి మానవులు 'యజ్ఞములు చేసి, దేవతలను మెప్పించి స్వర్గసుఖములను పొందెదరు. పుణ్య ఫలము క్షయమైనా గూడా మరల భూమిపై రాజవంశములందు జన్మింతుము' అని తలచి, నా కథా శ్రవణములందు ఆసక్తి చూపరు.

ఉద్ధవా! వేదములలో మూడు కాండలున్నవి. 1. కర్మకాండ 2. ఉపాసనా కాండ 3. జ్ఞాన కాండ. ఈ మూడింటిలోనూ బ్రహ్మమే ఆత్మయని చెప్పబడినది. ఋషులు గూడా ఈ విషయాన్నే పరోక్షంగా ప్రతిపాదించారు. నేను గూడా ఇట్లా గుప్తంగా ఉండటానికే ఇష్టపడతాను. అంతఃకరణ శుద్ధి కలిగిన వారే ఈ పరోక్ష విధానాన్ని బాగుగా తెలుసుకుంటారు; అధికారులయ్యెదరు.

ఉద్ధవా! శబ్ద బ్రహ్మము వేదమే. దాని స్వరూపం గాని, అర్థం గాని తెలుసుకోలేరు. ప్రాణాయామము, ఇంద్రియమయము, మనోమయమునైనది. అనంతము, అపారము, గంభీరమగు సముద్రము వలె అంతుబట్టనిది. అనంత శక్తిమంతుడను, సర్వవ్యాపకుడను, అంతర్యామినగు నాచే ప్రాణులందు శబ్ద రూపంలో విలసిల్లు చున్నది.

ఉద్ధవా! కర్మ కాండము విధి వాక్యములచే చెప్పబడినది, ఉపసాన కాండ మంత్ర వాక్యము చేత ప్రకాశితమైనది, జ్ఞానకాండమందు నిషేధార్థముగను చెప్పబడిన యీ వేదవాక్యములు నాకు తప్ప మరెవ్వరికీ తెలియదు.

భిక్షు గీత

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 23వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! లోకంలో దుర్జనులు కఠినమైన మాటలతో బాధపెడ్తారు. అటువంటి మాటలు విని కలత చెందని మానవులుండరు. వారి మాటలు పదునైన బాణములకన్నా ఎక్కువ బాధిస్తాయి. ఈ విషయంలో పెద్దలు ఒక కథ చెప్పారు. నీకా వృత్తాంతాన్ని చెప్పెదను వినుము.

పూర్వము ఒక భిక్షకుని (ముష్టివానికి) దుర్జనులు నానావిధాలుగా హింసించేవారు. అతడు వాటిని శాంతంగా సహించుచూ, అదంతా తన పూర్వజన్మ కర్మ ఫలమని భావించి ఈ విధంగా గానం చేశాడు.

'మాలవ దేశంలో ఒక ధనవంతుడైన బ్రాహ్మణుడుండేవాడు. అతడు వాణిజ్య వ్యాపారాలను బహునైపుణ్యంతో చేసి బాగా ధనం సంపాదించాడు. ధనంతోపాటు వచ్చే దుర్గుణాలు గూడా అతణ్ణి చుట్టుముట్టాయి. ఫలితంగా, కాముకుడయ్యాడు. కోప స్వభావంతో పాటు క్రూరత్వం తోడైయింది. భార్యాపిల్లలను బాధించేవాడు. అతిథులను, బంధువులను పరుషవాక్యాలతో హింసించేవాడు.

దుశ్శీలుడు, లోభియగు ఆ బ్రాహ్మణుని భార్యా పుత్రులు, బంధువులు అతడిని పట్టించుకోకుండా వదిలేశారు. ధర్మకార్యాలు, దైవకార్యాలను విసర్జించుట వలన వాని పుణ్యభాగము క్షీణించి పోయింది. కష్టపడి సంపాదించిన ధనమంతా నష్టమై పోయింది. అతడి ధనంలో కొంత భాగం బంధువులు హరించారు. కొంత భాగము దొంగలు దోచుకుపోయారు. కొంత భాగము పన్నుల రూపమున రాజు

సం|గహించాడు. కొంత భాగము దైవవశమున నష్టమైనది. ఈ విధంగా ధనమంతా నష్టపోయిన ఆ బ్రాహ్మణుడు అయిన వారందరికీ దూరమయ్యాడు. ధననాశనము చేతను, బంధు నిరాదరణ చేతను మిక్కిలి దుఃఖించిన ఆ బ్రాహ్మణునకు గొప్ప వైరాగ్యము కలిగినది.

బ్రాహ్మణుడు : ఆహా! ఎంతో కష్టపడి కూడబెట్టిన ధనమంతా అపహరింపబడింది. ధనమున్న రోజుల్లో ధర్మబుద్ధిలేక పోయినది. నా ధనమంతయు ధర్మకార్యాలకు వినియోగించక వ్యర్థమైంది. ధనసంపాదనకై దేహమును ఎంతో కష్టపెట్టాను. ఇప్పుడు కష్టాలన్నీ ఒక్కసారి చుట్టుముట్టాయి. లోభికి సంపదలు సుఖప్రదములు కానేరవు. కుష్టువ్యాధి సుందరమైన రూపాన్ని పాడు చేసినట్లు లోభగుణం నిర్మలమైన కీర్తిని, మంచి గుణాలను నాశనం చేస్తుంది.

ధనమును సంపాదించుటలోను, వృద్ధి పరచుటలోను, రక్షించుటలోను, ఖర్చుచేయుటలోను, అనుభవించుట యందును మానవులు శ్రమ, బాధ, భయము, భ్రాంతిని పొందుతారు. మానవులకు ధనమువలన పదునైదు విధములైన అనర్థములు సంభవించును, అవి, చౌర్యము, హింస, అసత్యము, దంభము, కామము, క్రోధము, విస్మయము, గర్వము, భేదబుద్ధి, వైరము, అవిశ్వాసము, స్పర్థ, స్త్రీ, జూదము, మద్యము. అందువలన శ్రేయస్సును కోరుకునే వ్యక్తి (ధనమునకు) వీటికి దూరముగా నుండవలెను. ధనం మూలంగా సోదరులు, భార్య, తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులతో శత్రుత్వమేర్పడును.

అతి దుర్లభమైన బ్రాహ్మణ జన్మ నెత్తి గూడా ఆత్మ జ్ఞానమును పొందే ప్రయత్నం చేయకుండా పతనం పొందుచున్నారు. స్వర్గము, మోక్షము పొందదగు మానవజన్మ పొందియూ ధనార్జనకై ప్రాకులాడి పతితులగుచున్నారు. యక్షునివలె ధనరక్షకుడైన వ్యక్తి ఋషులకు, పితృలకు, దేవతలకు వారి భాగమీయక అధఃపతితుడగుచున్నాడు.

వివేకులైనవారు అర్థాదుల చేత సిద్ధిని పొందుచుండగా, నేను అవివేకినై ధనార్జనయందు ఆసక్తుడనై కూడబెట్టిన ధనమును, వయస్సును, బలాన్ని పోగొట్టుకున్నాను. ఇప్పుడు ముసలితనము ప్రాప్తించింది. ఇక ఇప్పుడు ఏమి చేయగలను? మృత్యు ముఖంలో ఉన్న మానవునికి ధనం వల్ల సంప్రాప్తమయ్యే విషయసుఖాలవల్ల ఏమి లాభం కలుగుతుంది? జన్మల నిచ్చే కర్మలవల్ల ఏం లాభం చేకూరుతుంది?

ఎవరి దయవలన నేను ధనాన్నంతా పోగొట్టుకొని వైరాగ్యాన్ని సంప్రాప్తించుకున్నానో అట్టి శ్రీహరి భగవానుడు నేను సంసార సముద్రాన్ని దాటేందుకు నౌకా స్వరూపమున వచ్చి నన్ను కాపాడుగాక! ఈ విషయంలో ముక్కోటి దేవతలు నాపై అనుగ్రహము చూపుదురు గాక, వారి దయవలన పూర్వము ఖట్వాంగరాజు క్షణ కాలములోనే వైకుంఠ పదాన్ని పొందెను. అట్లే నాకు గూడా ఈ స్వల్ప కాలం లోనే పరమ పద ప్రాప్తి కలిగింతురు గాక!

శ్రీకృష్ణుడు : అవంతి వాసుడైన ఆ బ్రాహ్మణుడు ఇట్లు తలచి, అహంకార మమకారములను వదలి శాంతముగలవాడై సన్న్యసించెను. ఏ విషయమునందూ ఆసక్తి లేనివాడై దీనభావముతో భిక్షాటన చేయుచూ దేశాటన చేయుచుండెను.

ఉద్ధవా! మురికి దేహముతో దేశమంతా తిరుగుచున్న ఆ వృద్ధుని జూచి జనులు అనేక విధములుగా అవమానించేవారు. కొందరు భిక్షాపాత్రను పగుల గొట్టారు. ఇంకొందరు త్రిదండమును లాక్కున్నారు. కొందరు జపమాలను, కొందరు కమండలమును లాక్కొని పీడించారు. లభించిన కొద్ది ఆహారమును నది ఒడ్డుకు పోయి తినుచుండగా అందులో మలమూత్రాలు పోశారు. ముఖాన ఉమ్మి వేశారు. కొందరు దొంగని త్రాళ్ళతో కట్టి పడేశారు.

ఈ విధముగా ఆ సన్న్యాసి భౌతికము, దైహికము, దైవికములచే సంప్రాప్తమయ్యే కష్టాలన్నీ దైవనిర్ణయమని తలచి అనుభవించుటకే నిశ్చయించుకొన్నాడు.

బ్రాహ్మణుడు : ఈ జనులు గాని, దేవతలు గాని, ఆత్మ గాని, గ్రహములు గాని, కర్మలు గాని, కాలము గాని నా సుఖదుఃఖములకు కారణము కాదు. నా మనస్సే అన్నిటికీ కారణమై నన్నీ సంసార చక్రమున తిప్పుచున్నది. మనస్సే గుణాలను సృష్టిస్తోంది. ఆ గుణముల నుండి విలక్షణమైన కర్మలు పుదుతున్నాయి. ఆ కర్మల వల్ల దేవతిర్యఙ్మనవాది గతులు కలుగుతున్నాయి.

దానము, స్వధర్మము, నియమము, యమము, శ్రుతము, సద్వ్రతములు, సత్కర్మలు మున్నగునవన్నియు మనోనిగ్రహానికి పరమోపాయములు, మనస్సు అన్ని ఇంద్రియాలను వశపరచుకొనియున్నది. మనస్సు బలవంతుని కంటెనూ బలమైనది. పరమయోగులకు గూడ మనస్సు భయంకరమైనది. దీనిని వశము చేసుకొనిన వాడు ఇంద్రియములన్నిటినీ జయించినట్లే యగును.

ఇతరులతో వ్యర్థముగా కలహించి కొందరిని శత్రువులని, కొందరిని మిత్రులని తలచేవారు మూర్ఖులు. ఎందువల్ల నంటే, వాగాది వేగములతో కూడి, శరీరాన్ని, హృదయాన్నీ, మర్మస్థానాలను గూడా బాధించునట్టి మనస్సు అనే శత్రువు తనలోనే ఉన్నదని గ్రహించలేడు.

సుఖదుఃఖాలకు మానవుడే కారణమైన, అందులో ఆత్మకెట్టి సంబంధముండును? నాలుక, పళ్ళమధ్య పడి నలిగినప్పుడు మానవుడు ఎవరిపై కోపగించును? ఒకవేళ దేవతలే ఆ కష్టానికి కారకులైతే ఆత్మకేమి నష్టము కలుగును? కర్తృత్వ భోక్తృత్వాలు ఇంద్రియాల అధిష్ఠాన దేవతలకు సంబంధించినవి. ఈ దేవతలు అందరి శరీరాలలోనూ ఒకే విధంగా ఉందురు. శరీరంలోని ఒక అవయవం వలన మరొక అవయవానికి దెబ్బ తగిలితే ఎవరిపై కోపగించును? పోనీ ఆత్మయే ఈ సుఖదుఃఖాలకు కారణమైతే, ఇతరులను ఎందుకు నిందించాలి? ఇది ఆత్మ స్వభావమే కదా! ఆత్మకంటే వేరైన దేదీ లేదు. ఉన్నచో అది మిథ్యయే యగును. సుఖముగాని, దుఃఖముగాని లేనిచో క్రోధమెచ్చట నుండి వచ్చును?

సుఖదుఃఖములకు గ్రహములు కారణమైతే జన్మలేని ఆత్మకేమి హాని కలుగుతుంది? దాని ప్రభావము జనన మరణములు పొందు దేహముపై ఉండవచ్చును. ఆకాశంలో ఉండే గ్రహాల ప్రభావం దేహంలో ఉండే గ్రహాలపై ఉంటుందని పెద్దలు చెప్పుచున్నారు. అందువలన దేహముకన్నా దేహము నావరించియున్న గ్రహములకంటె భిన్నుడైన ఆత్మపై కోపమెందుకు చూపవలెను?

కర్మలే సుఖదుఃఖాలకు కారణమన్నచో దీనివలన ఆత్మకెట్టి ప్రయోజనమూ ఉండబోదు. ఎందువల్లనంటే, దేహమేమో జడము. ఆత్మయేమో శుద్ధజ్ఞాన స్వరూపము. అందువలన సుఖదుః ఖములకు మూలభూతమైన కర్మయే లేనప్పుడు ఎవరిపై కోపించవలెను?

కాలమే సుఖదుఃఖాలకు కారణమైతే దాని ప్రభావము ఆత్మపై ఉండదు. ఎందుకంటే, ఆత్మకూడా కాలము వలెనే ఆది, అంతములు లేనిది. అగ్నికి తాపము, మంచుకు చైతన్యము ఉండవు. అట్లాగే ఈ పురుషునికి సుఖదుఃఖాలు లేవు. కావున ఎవరిపై కోపము చూపాలి?

సంసార సంబంధమైన అహంకారమునకు సుఖదుఃఖములుండును కానీ, ప్రకృతికతీతమైన ఆత్మకు సుఖదుఃఖములుండవు. ఈ విషయం తెలుసుకుంటే మానవుడు భూతములకు భయపడడు. అందువలన నేను ప్రాచీనులైన మహర్షులచే ఉపదేశించిన పరమాత్మ జ్ఞానాన్ని పొంది శ్రీకృష్ణ పాదపద్మముల సేవ చేసుకుంటూ ఈ సంసారమును దాటెదను.

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! ధనాన్నంతా పోగొట్టుకొని భేదభావాన్ని విడిచి, వైరాగ్యం పొందిన ఆ ముని, దేశాలన్నీ తిరుగుచూ, జనులచేత అవమానింపబడుచూ, స్వధర్మాన్ని విడువక తన పూర్వగాథనంతా వివరించాడు.

ఉద్ధవా! జీవునకు సుఖదుఃఖములను కలుగజేయు వారెవ్వరూ లేరు. అట్లుండుట వారి చిత్తభ్రమ. ఈ సంసారము అజ్ఞాన కల్పితం. కావున ఉద్ధవా! నాయందు సంపూర్ణముగా బుద్ధినుంచి, మనస్సును నిగ్రహింపుము. ఇదియే యోగసారము. భిక్షుకునిచే గానము చేయబడిన యీ బ్రహ్మజ్ఞానతత్త్వము వినిననూ, వినిపించిననూ, పఠించిననూ, మానవుడు సుఖదుఃఖములకు వశుడు కాడు.

త్రిగుణములు - స్వభావములు

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 25వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీకృష్ణుడు : ఉద్ధవా!పురుషుడు ఏఏ గుణముల వలన ఏఏ రూపములనుండునో, వాని స్వభావరీతులను చెప్పెదను, వినుము.

సత్త్వగుణ వృత్తులు :

శమము, దమము, తితిక్ష, ఈక్ష, తపస్సు, సత్యము, దయ, స్మృతి, సంతోషము, త్యాగము, వైరాగ్యము, శ్రద్ధ, దయ, సద్గుణములు, ఆత్మరతి మున్నగునవి.

రజోగుణ వృత్తులు :

కామము, ప్రయత్నము, మదము, తృష్ణ, గర్వము, భేదబుద్ధి, సుఖము, మదము చేత యుద్ధములందు ఆసక్తి కలిగియుండుట, కీర్తి యందు అభిలాష, పరిహాసము, పరాక్రమము, పట్టుబట్టి సాధించుట, దేవతలనుండి ధనము కోరుట మున్నగునవి.

తమోగుణ వృత్తులు :

క్రోధము, లోభము, అసత్యము పలుకుట, హింస, యాచన, దంభము, శ్రమ, కలహము, శోకము, విషాదము, ఆర్తి, నిద్ర, ఆశ, భయము జాడ్యము మున్నగునవి.

ఉద్ధవా! ఇంతవరకు గుణములు వాటి వృత్తులు తెలిపితిని. ఇప్పుడు గుణాలు మిశ్రమమై ఉన్నప్పుడు గుణవృత్తుల గూర్చి తెలిపెదను.

త్రిగుణములు - మిశ్రమము :

1. నేను, నాది అనే భేదబుద్ధి మూడు గుణాలకు సంబంధించినది.
2. పురుషుడు ధర్మార్థ కామ విషయములందు ఆసక్తుడై ఉన్నప్పుడు వానికి శ్రద్ధను రతిని, ధనమును కలిగించును.
3. ప్రవృత్తి లక్షణములు కలిగి ఉండటం, కామ్య కర్మలందు ఆసక్తి ఉండటం, గృహస్థాశ్రమంలో ఉండటం, స్వధర్మములను ఆచరిస్తూ ఉండటం వంటివి.
4. ద్రవ్యము, దేశము, ఫలము, కాలము, జ్ఞానము, కర్మ, కర్త, శ్రద్ధ, అవస్థ, ఆకృతి, నిష్ఠ మొదలైన భావానలన్నీ త్రిగుణాత్మకాలే.
5. చూడబడేవి, వినబడేవి, ఆలోచించబడేవి, ప్రకృతి పురుషాధిష్ఠితములు మొదలైన భావములన్నీ త్రిగుణమయములే.

సత్త్వ గుణ ప్రకృతి :

1. ఫలాపేక్ష లేకుండా నన్నే సేవించుచూ కర్మలు చేసే స్త్రీ పురుషులు.
2. శమ దమాది లక్షణములుండు పురుషుని సత్త్వగుణయుక్తునిగా గుర్తించుము.
3. ప్రకాశము, శాంతము, స్వచ్ఛము కలిగి రజస్తమో గుణములను జయించి సుఖధర్మజ్ఞానాదులతో కూడియుండును.
4. నిర్మల చిత్తము, ప్రశాంతమైన ఇంద్రియములు, దేహభయము లేకుండుట, విషయముల సాంగత్యం లేకుండుట, నన్ను పొందాలనే తీవ్ర ఆకాంక్ష కలిగిన పురుషునిలో సత్త్వము ఉద్రిక్తమైనదని తెలుసుకొనుము.
5. సత్త్వగుణము వృద్ధియై దేవతలకు బలము పెరుగును.
6. సత్త్వగుణము ఉద్రిక్తమైనప్పుడు జీవులకు జాగరణము కలుగును.
7. వేదాభ్యాస తత్పరులగు బ్రాహ్మణులు సత్త్వగుణముచే బ్రహ్మలోకమునకు వెళ్ళుదురు.
8. ఫలాపేక్ష లేకుండా, నాకు ప్రీతి కలిగించే ఉద్దేశంతో చేయు కర్మలు సాత్త్విక కర్మలు.
9. ఆత్మ విషయకమగు జ్ఞానము కలిగి ఉండటం సాత్త్వికం.
10. తపస్సుకై వనవాసానికి ఇష్టపడటం సాత్త్వికం.
11. అనాసక్త భావంతో కర్మల నాచరించడం సాత్త్వికం.
12. శాస్త్రోక్తమైన ఆధ్యాత్మిక శ్రద్ధ సాత్త్వికం.
13. పరిశుద్ధము, రుచికరము, సునాయాసంగా లభించే ఆహారాన్ని పొందటం సాత్త్వికం.
14. ఆత్మానుభవం వల్ల కలిగే సుఖము సాత్త్విక మవుతుంది. నన్ను కీర్తించుట వలన కలిగే సుఖాన్ని నిర్గుణమంటారు.

రాజస గుణ ప్రకృతి :

1. విషయ భోగాల వల్ల కలిగే సుఖం రాజసమనిపించుకుంటుంది.
2. ఇంద్రియములకు రుచులను కలుగజేసే పులుపు, వగరు, ఉప్పు కలిగిన వస్తువులన్నీ రాజసాలే.

3. కర్మకాండలయందు శ్రద్ధ కలిగి ఉండటం రాజసం.
4. రాగాంధుడై కర్మలు చేయువాడు రాజసికుడు.
5. గ్రామంలో నివసించేందుకు ఇష్టపడటం రాజసమనిపించుకుంటుంది.
6. దేహమునకు సంబంధించిన విషయ జ్ఞానం కలిగి ఉండటం రాజసికం.
7. ఫలాపేక్షతో చేసే కర్మలు రాజసికాలు.
8. రజోగుణము వృద్ధియై మరణించినచో నరకమునకు పోయెదరు.
9. రజోగుణ యుక్తులగు వ్యక్తులు మానవలోకమందే జన్మించెదరు.
10. రజోగుణ ఉద్రిక్తమైనప్పుడు స్వప్నములు వచ్చును.
11. రజోగుణము వృద్ధిలో యున్నచో అసురులకు బలము పెరుగును.
12. కర్మలచే వికృతుడు, విక్షిప్తచిత్తుడునగు పురుషుని బుద్ధీంద్రియములు అసంతుష్టిని, కర్మేంద్రియాలు వికారమును, మనస్సు చాంచల్యాన్ని పొందును. ఈ కారణముల వలన రజోగుణము ఉద్రిక్తమైనదని తెలుసుకొనవలెను.
13. సంగహేతువు, భేదహేతువు, ప్రవృత్తి భావము గల రజోగుణము సత్త్వ, తమోగుణాలను జయించినప్పుడు మానవుడు దుఃఖముతోను, కర్మల వలన యశస్సు, శ్రీని పొందుదురు.

తమోగుణ - ప్రవృత్తులు :

1. మూఢము (వివేకము నాశనము చేయునది), లయము (ఆవరణము కలది), జడము (ప్రయత్నము లేనిది) అగు తమోగుణము సత్త్వరజోగుణములను జయించినప్పుడు మానవుడు శోకము, మోహము, నిద్ర, హింస, ఆశ మున్నగు గుణములతో కూడియుండును.
2. సంకల్పాత్మకమగు మనస్సు కూడా లీనప్రాయమగును. చిత్తము కలత చెంది అసమర్థమగును. అజ్ఞానము విషాదము వృద్ధియగును. అప్పుడు తమోగుణము వృద్ధియైనదని తెలుసుకొనుము.
3. తమోగుణము వృద్ధియైనప్పుడు సుషుప్తి కలుగును.
4. తమోగుణము కలిగిన వ్యక్తులు స్థావర పర్యంతం అధోగతిని పొందెదరు.
5. తమోగుణము గలవారు మరణించినప్పుడు నరకమునకు బోవుదురు.
6. హింసాదియుక్తములు – దంభమాత్సర్యాది కృత్యములు కర్మలు తామసములు.
7. ప్రాకృత జ్ఞానము తామసము.
8. జూదగృహములందుండుట తామసము.
9. పూర్వాపర విచారముచే కర్మలు చేయువాడు తామసికుడు.
10. అధర్మమందు శ్రద్ధ చూపువాడు తామసికుడు.
11. దైన్య కరములు, అపవిత్రములు నగు పదార్థములు తామసములు.
12. మోహము, దైన్యములచేత కలుగు సుఖము తామసము.

నిర్గుణములు :

1. నన్ను కీర్తించుట వలన కలిగే సుఖము నిర్గుణము.

2. నాకు నివేదించినవి నిర్గుణములు.
3. నన్ను సేవించుటలో శ్రద్ధ నిర్గుణము.
4. నన్నాశ్రయించి కర్మలు చేయువాడు నిర్గుణుడు.
5. పరమేశ్వరనిష్ఠ, జ్ఞానము నిర్గుణమని చెప్పబడును.
6. నిర్గుణులు జీవితకాలమందే నన్ను పొందెదరు.
7. పై మూడు అవస్థలలో ఆత్మతత్త్వాన్ని పొందే అవస్థనే తురీయావస్థ యందురు.

ఉద్ధవా! పురుషునకు సంసార భావము గుణ కర్మల వలన కలుగును. ఈ గుణములను జయించిన వాడు భక్తి యోగముచే నాయందు నిష్ఠగలవాడై మోక్షమును పొందగలడు. అందువలన పురుషులు మానవ దేహాన్ని పొంది గుణములందు ఆసక్తి లేక నన్ను సేవింపవలెను.

వివేకము గల వ్యక్తి జితేంద్రియుడు, అప్రమత్తుడు, విషయాసక్తి శూన్యుడై నన్ను సేవించవలెను. శాంతచిత్తుడగు వ్యక్తి సత్త్వ గుణాలతో గూడి, మిశ్రమ సత్త్వగుణమును జయింపవలెను. గుణత్రయ విముక్తుడై నన్ను పొందవలెను.

ఉద్ధవుడు బదరికాశ్రమమునకు వెళ్ళుట

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 29వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

ఉద్ధవుడు : కృష్ణా! నీవు చెప్పిన విషయములు ఆచరించుటలో యోగీశ్వరులు, ఋషులైనవారు కూడా సఫలీకృతులు కాలేకపోవుచున్నారు. ఇక సామాన్య మానవులు మనస్సు నిగ్రహించుకొనుట సాధ్యమగునా? కావున అనాయాసంగా, ఉత్కృష్టమైన సిద్ధిని పొందే మార్గాన్ని బోధింపుము.

అచ్యుతా! బ్రహ్మాది దేవతలు, రాజాధి రాజులు, చక్రవర్తులు నీ పాదపద్మముల నాశ్రయించెదరు. రామావతారంలో వానరములతో స్నేహం చేశావు. కృష్ణావతారంలో నందగోపుని ఇంట్లో పెరుగతూ, గోపికలకు ప్రియాతిప్రియుడవయ్యావు. బలి, ప్రహ్లాదుడు మున్నగు దాసులకు అధీనుడవైనావు. నీవు ప్రేమ స్వరూపుడవు. కరుణామయుడవు. అట్టి నీ పాదముల నాశ్రయించిన మాకు లభింపని దేమి యుండును?

దేవా! నీవు బయట నుండి జగద్గురువుగాను, లోపల అంతర్యామిగాను ఉంటూ జీవుల విషయవాసనలను నాశనము చేసి నీ నిజరూపమును చూపుచున్నావు. అందుచేత నీయందు భక్తి వృద్ధియై బ్రహ్మ జ్ఞాన సంపన్నులైనారు. జీవులు నీ ఉపకారమును స్మరించుకొనుచూ నీ ఆనందమును కల్పాంతము వరకు అనుభవించెదరు. భక్తులంతా నీ రుణమునుండి విముక్తులు కాలేరు.

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! భక్తుడు శాంతము గలవాడై ఉండవలెను. మనస్సు నాయందు నిలిపి నేను బోధించిన ధర్మములను ఆచరించవలెను. వర్ణాశ్రమ ధర్మముల ననుసరించి ఎల్లప్పుడూ నన్నే ధ్యానించుచూ కర్మలు చేయవలెను. సాధువులు నివసించు ప్రదేశములందు నివసించవలెను. నా ప్రీతి కొరకు నృత్య గీత వాద్యములతో, ఒంటరిగా గానీ, సామూహికంగా కానీ ఉత్సవాలు జరపాలి.

ఆకాశము వలె నిర్మలమైన మనస్సు కలవాడై, సమస్త జీవరాసులందూ నన్ను దర్శించాలి.

ఉద్ధవా! సములు, ఉత్తములు, హీనులు అనే భేదభావాన్ని, అహంకారం, స్పర్థ, అసూయ, తిరస్కారమ మున్నగునవి విడువవలెను. కుక్క, గోవు, చండాలుడు, బ్రాహ్మణుడను భేదము లేక సాష్టాంగ దండ ప్రణామం చేయవలెను. బంధువులు పరిహాసం చేస్తారని గాని, తాను ఉత్తముడనని గాని సిగ్గుపడకూడదు. ఉపాయములన్నింటిలోనూ మనోవాక్కాయ వృత్తులచేత సర్వభూతముల యందు నన్నే చూడగలగడం ఉత్తమమైన ఉపాయం.

ఉద్ధవా! సర్వ ప్రాణులయందు భగవద్భావన కలుగునంత వరకు మనోవాక్కాయముల ద్వారా నన్నుపాసించవలెను. ఆ విధంగా ఉపాసించిన వ్యక్తి సర్వమూ బ్రహ్మాత్మకమే అని భావించి ఏ విధమైన సంశయాలు లేకుండా అన్ని క్రియల నుండి విరక్తుడు కావాలి.

ఉద్ధవా! నిష్కామంతో భాగవత ధర్మాన్ని ఆచరించే వారికి ఏ విధమైన గుణదోషాలూ ఉండవు. ఎందువల్లనంటే సర్వజ్ఞుడనైన నేను నిర్గుణ భావమగు ధర్మమును చక్కగా నిరూపించితిని. ఈ ధర్మానికి ఏ విధమైన హాని కలుగదు.

ఉద్ధవా! భయము, శోకము వలన కలిగే పలాయనం గాని, ఆక్రందన గాని పరమాత్మనైన నన్ను ఉద్దేశించి నిష్కామ భావంతో చేసినట్లయితే, అవి ధర్మ స్వరూపాలే కాగలవు.

ఉద్ధవా! పండితుల పాండిత్యంగాని, చతురుల చాతుర్యంగాని, ఈ శరీరం ద్వారా వినాశ రహితమై, సత్యము అయిన నా తత్త్వాన్ని పొందుట కొరకే అయి ఉన్నది.

దేవతలకు గూడా దుర్లభమైన ఈ బ్రహ్మవాద సంవాదాన్ని నీకు క్లుప్తంగాను, విస్తారంగాను కూడా చెప్పితిని.

విస్పష్టము, యుక్తాయుక్తము నగు జ్ఞానము కూడా నీకు పూర్తిగా వివరించాను. ఇది తెలుసుకొన్న పురుషుని సందేహాలన్నీ తీరిపోతాయి. ముక్తిని పొందును.

నీ ప్రశ్నను, నా సమాధానాన్ని పరిశీలించిన వాడు వేదరహస్యము, సనాతనము నగు పరబ్రహ్మమును పొందును.

ఉద్ధవా! పరమ పవిత్రము, పరచిత్త శోధకము నగు ఈ తత్త్వమును బిగ్గరగా పఠించిన వాడు జ్ఞాన దీపికతో అందరినీ పవిత్రులను చేస్తూ తానుకూడా పవిత్రుడగును. శ్రద్ధతో విన్నవాడు నా యందు భక్తి కలిగి కర్మలచే బద్ధుడు కాడు.

మిత్రుడా! నీకీ బ్రహ్మతత్త్వము చక్కగా బోధపడినదా? మోహము, శోకము తీరినదా? ఈ జ్ఞానమును దాంభికునికి, నాస్తికునికి, మోసగానికి ఆసక్తి లేనివానికి, భక్తిలేని వానికి ఉపదేశించవద్దు. ఇట్టి దోషములు లేని బ్రాహ్మణ భక్తుడు, శుచియైన వాడు, సాధు స్వభావియగు వానికి ఉపదేశింపుము. నాయందు భక్తి కలిగిన శూద్రునికి, స్త్రీలకి గూడ ఉపదేశింపవచ్చును. అమృతమును పానము చేసిన వానికి యిక త్రాగుట కేమీ ఉండనట్లే, ఈ తత్త్వాన్ని తెలుసుకొన్న వానికి ఇక తెలుసుకోవలసిన విషయమేమీ ఉండదు.

ఉద్ధవా! మానవులకు జ్ఞానము, కర్మ, యోగము, వాణిజ్యము, దండనీతి మున్నగు వానిచేత ధర్మార్థ కామ మోక్ష రూపమగు ఫలములు సిద్ధించును. అన్ని కర్మలూ వదలి నాయందు ఆత్మ సమర్పణ చేసిన వాడు నా అనుగ్రహం చేత యోగుల కంటెను, జ్ఞానుల కంటెను, మిక్కిలి జ్ఞాన సంపన్నుడగును. పిమ్మట నాలో లీనమగును.

ఉద్ధవుడు : దేవా! మోహమనే అంధకారంలో పడి ఉన్న నేను నీతో చాలాకాలం కలసి ఉన్నాను. సూర్యునితో ఉండే వానికి చలివల్లగాని, చీకటివల్లగాని, భయముండదు గదా? మాయ వలన విజ్ఞాన మయమైన స్వరూపజ్ఞాన దీపాన్ని పోగొట్టు కొంటిని. నీవు దయగల వాడవై తిరిగి ఈ సేవకునికి ప్రసాదించితివి. ఇంత సహాయాన్ని చేసిన నీ పాదపద్మాలను విడచి వేరెవ్వరినీ ఆశ్రయించలేను. యోగీశ్వరా! నేను నిన్ను శరణుజొచ్చితిని. నీ పాదపద్మములయందు అనన్య భక్తి కలుగునట్లు అనుగ్రహింపు.

శ్రీకృష్ణుడు : ఉద్ధవా! నీవు బదరికా వనమందలి నా ఆశ్రమమునకు వెళ్ళుము. అచ్చట పవిత్ర గంగా జలములందు స్నానమాచరించుము. పవిత్రుడవయ్యెదవు. నార చీరలు ధరించి, కందమూలములు తింటూ, విషయసుఖములందు ఆసక్తుడవు కాక ఉండుము.

శీతోష్ణాది ద్వంద్వములయందు సమభావము కలిగి, శాంతుడుగను, జితేంద్రియునిగను, సుశీలుడవుగను, జ్ఞాన విజ్ఞానమయునిగను ఉండి, నేను ఉపదేశించిన భక్తి, వైరాగ్యాదులను ఏకాంతమున సాధన చేయుము. మనోవాక్కులను నాయందుంచి, నా ధర్మమునందాసక్తుడవై ఉండుము. త్రిగుణాత్మకమైన గతులను దాటి గుణాతీతుడనైన నన్ను పొందెదవు.

శ్రీశుక మహర్షి : పరీక్షిన్మహారాజా! ఆ విధముగా శ్రీకృష్ణుని ఆదేశములను పాటించి, ఆయనకు ప్రదక్షిణము చేసి ప్రేమతో కౌగలించుకొని ఉద్ధవుడు కన్నీటితో భగవానుని పాదముల నభిషేకించెను. భారమైన మనస్సుతో విడువలేకపోయెను. బహు కష్టముతో బదరికాశ్రమమునకు వెళ్ళెను.

అనంతరము పరమ భాగవతుడైన ఉద్ధవుడు బదరికాశ్రమమున శ్రీకృష్ణ భగవానుని మనస్సు నందు నిలుపుకొని, తపస్సు నాచరించెను. పిమ్మట భగవత్సామీప్యమును జేరుకొనెను.

యదుకుల సంహారము

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 30వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

పరీక్షిన్మహారాజు : మహర్షీ! ఉద్ధవుడు బదరికాశ్రమమునకు వెళ్ళిన పిదప శ్రీకృష్ణ భగవానుడు ద్వారకయందు చేసిన కర్మలను వివరించి చెప్పుము.

బ్రాహ్మణ శాపము వలన యదువంశ వినాశనాన్ని శ్రీకృష్ణ భగవానుడు ఏ విధంగా గౌరవించెను? భగవానుడు తన శరీరమును త్యజించిన విధమును నాకు చెప్పుము.

శ్రీశుక మహర్షి : రాజేంద్రా! శ్రీకృష్ణ భగవానుడు స్వర్గమున, ఆకాశమున, భూమండలమున, అంతరిక్షమున అనేక మహోత్పాతములను చూచెను. పిమ్మట 'సుధర్మ' యను సభను ఏర్పాటు చేసి అందు పెద్దలందరినీ సమావేశ పరచి వారితో యిట్లు పలికెను.

శ్రీకృష్ణుడు : యదుపుంగవులారా! ద్వారకయందు దుశ్శకునములు అనేకం కనిపిస్తున్నాయి. యమ పతాక సదృశములైన చిహ్నాములు కూడా కనిపించుచున్నవి. ఘోరమైన మహోత్పాతములు బయటపడుచున్నవి. ఆకాశమున ఇంద్రధనుస్సు, తోక చుక్కలు ఉదయించినవి. అపూర్వమైన చరాచర వస్తువులు, దుఃఖ రోగ ప్రదములను సూచించుచున్నవి. అందువలన మనము ఇచ్చట ఒక్క క్షణం కూడా ఉండరాదు. ఆబాల గోపాలురం అంతా బయలు దేరి సరస్వతి నదీ తీరాన గల ప్రభాస క్షేత్రమునకు పోయెదము. అచ్చట పవిత్ర స్నానాదులు చేసి, దేవతలను పూజింతుము.

బ్రాహ్మణులు మనకై శాంతికర్మలు చేయుదురు. మనము కూడా గోవులు, భూములు, బంగారము, వస్త్రములు, ఏనుగులు, అస్త్రములు, రథములు మున్నగునవి దానములిచ్చి వారిని సత్కరించెదము. దేవతల నారాధించుట, దాన ధర్మముల జేయుటయే మన తక్షణ కర్తవ్యము.

ఇట్లు శ్రీకృష్ణుని పలుకులు వినిన యాదవ వృద్ధులందరూ తమ ఆమోదమును తెలిపిరి.

యాదవులంతా ప్రభాస క్షేత్రమున పరమ భక్తితో మాంగలికములు మున్నగునవెన్నియో శ్రేయస్సునుజేగూర్చు కర్మలను చేసి బ్రాహ్మణులకు విరివిగా దానములు చేసిరి. ఆ త్రాగిన మత్తులో (కృష్ణ మాయా మోహితులై) పరస్పరం దూషించుకొన్నారు. అటు పిమ్మట ఆకతాయిలగు యాదవవులు ఒకరితోనొకరు యుద్ధం చేశారు. బాణములు, అసి, భల్లము, గద, తోమరము, ఈటె మున్నగు మారణాయుధములతో యుద్ధం చేస్తూ రథములపైన కొందరు, ఏనుగులపైన కొందరు, గుర్రములు, ఒంటెలు, గాడిదలు మున్నగు జంతువులపైనుండి యుద్ధం చేసి ఒకరినొకరు చంపుకున్నారు.

ప్రద్యుమ్నుడు, సాంబుడు, అక్రూరుడు, భోజుడు, అనిరుద్ధుడు, సాత్యకి, సుభద్రుడు, సంగ్రామజిత్తు, గదుడు, సుమిత్రుడు, సురథుడు మున్నగు వారంతా ఒకరిపై ఒకరు యుద్ధం చేసి క్రూరంగా చంపుకున్నారు. పుత్రులు తండ్రులను చంపారు. మేనమామలు మేనల్లుళ్ళను, తాతలు మనుమలను, పినతండ్రలను, పెదతండ్రులను, మిత్రులను జ్ఞాతులను విచక్షణ లేనివారై చంపుకొనసాగారు.

బాణములన్నీ అయిపోయాయి. ధనుస్సులు విరిగిపోయాయి అస్త్రముల శస్త్రములన్నీ విరిగిపోయినవి. పిమ్మట రథములు, వాహనములను వదలి నేలపై నుండి ఒకరినొకరు పిడికిళ్ళతో గుద్దుకున్నారు. శ్రీకృష్ణుడు సర్ధిచెప్దామని వారి మధ్యకు పోగా, శ్రీకృష్ణుడినే కొట్టారు.

కురునందనా! అంతట రామకృష్ణులు కూడా పరిఘలను ధరించి యుద్ధరంగమున ప్రవేశించి శత్రువులను సంహరించారు. వెదురు పొదలయందు పుట్టిన అగ్ని ఆ పొదనంతా కాల్చివేసినట్లు, కృష్ణమాయ చేత ఆవరించబడి, బ్రాహ్మణ శాపగ్రస్తులైన యాదవులు తమ వంశనాశనానికి కారకులయ్యారు. ఈ విధంగా తన వంశమంతా నాశనం కాగా, మిగిలిన "భూభారము తగ్గింది గదా!" యని శ్రీకృష్ణుడు సంతోషించాడు. బలరాముడు సముద్ర తీరాన పరమాత్మ యందు మనస్సు నిలిపి దేహత్యాగం చేశాడు. బలరాముని నిర్యాణమును తిలకించిన శ్రీకృష్ణ భగవానుడు ఒక అశ్వత్థ వృక్షమునకు ఆనుకొని కాలుపై కాలు ఉంచుకొని పడుకున్నాడు. వెనుకనుండి ఆయన పాదమును

చూసిన బోయవాడు అది యొక దుప్పి తలయని భ్రమ చెందాడు. ముసలములో మిగిలిన ఇనుప ముక్కతో 'జర' యను బోయవాడు శ్రీకృష్ణుని బాణంతో కొట్టాడు.

పిమ్మట ఆ బోయవాడు నాలుగు భుజములతో, దివ్యాభరణములతో, పరుండిన పరమ పురుషుని చూసి, భయపడినవాడై శ్రీకృష్ణుని పాదములపై పడి ఇలా విలపించాడు.

బోయవాడు : అనఘా! ఉత్తమ శ్లోకుడా! మధుసూదనుడా అజ్ఞానముచేత మహాపరాధము చేసాను. నా పాపకార్యాన్ని క్షమించు.

విష్ణుదేవా! నా వలన మరే సాధువుకు అపకారం జరుగకుండుటకై నన్ను వెంటనే వధింపుము. జీవుల అజ్ఞానాన్ని నశింపజేసి ముక్తిని ప్రసాదించు దేవదేవుడవైన నీయెడల అపరాధము చేసాను.

దేవా! బ్రహ్మ ఆయన పుత్రులైన రుద్రుడు మున్నగు వారే నీ మాయారహస్యాన్నెరుగరు. ఇక నావంటి అధమ జాతికి చెందిన వాడు నీ మాయను అధిగమించగలడా?

శ్రీకృష్ణుడు : వ్యాధుడా! లెమ్ము. నేను ఏది కోరుచున్నానో, నీవు అట్టి కార్యమునే చేసావు. ఇప్పుడు నిన్ను అనుగ్రహించి పుణ్యలోకములకు పంపుచున్నాను. పోయి సుఖింపుము.

పిమ్మట ఆ వ్యాధుడు శ్రీకృష్ణునికి మూడుసార్లు ప్రదక్షిణము చేసి విమానమెక్కి స్వర్గమునకు వెళ్ళాడు.

అంతట శ్రీకృష్ణుని రథసారధియైన దారుకుడు అచ్చటకు వచ్చాడు. శ్రీకృష్ణుని చూచినంతనే రథము నుండి దిగివచ్చి పొంగివచ్చే దుఃఖముతో ఆయన పాదములపై పడి ఇలా విలపించాడు.

దారుకుడు : దేవా!ఆకాశమున చంద్రుడు లేని యెడల అంధకారములో జనులు దిక్కులనే తెలుసుకొనలేరు. అట్లే నీ పాద పద్మములను దర్శించలేని నా దృష్టి కూడా నశించి అంధకారమైనది.

శుకమహర్షి : రాజేంద్రా! దారుకుడు ఇట్లు పలుకుచుండగనే, గరుడధ్వజంతో ఉన్న రథము, దానికి కట్టియున్న గుర్రములతో సహా ఆకాశమున ఎగిరి పోయాయి. శంఖము, చక్రము, మున్నగు ఆయుధములు ఆ రథమును అనుసరించి వెళ్ళాయి.

శ్రీకృష్ణుడు : ఓ సూతుడా! నీవు వెంటనే ద్వారకకు వెళ్ళుము. యాదవులందరూ పరస్పరం కలహించుకొని మరణించినారని చెప్పు. బలరామ నిర్యాణము, నా దురవస్థ వారికి తెలియజేయుము. నేను లేని ద్వారకలో వారు నివసించలేరు. సముద్రమున ద్వారక మునిగి పోవును. మీరెవ్వరూ ద్వారకలో నివసించవద్దు.

నా తల్లిదండ్రులను, మిగిలిన యాదవులను ఇంద్రప్రస్థమునకు పోయి అర్జునుని సంరక్షణలో ఉండమని చెప్పుము. నీవు కూడా నా భక్తి ధర్మముననుసరించి జ్ఞాన నిష్ఠుడవు కమ్ము. ఉదాసీనుడవై ఇదంతా నా లీలగా తెలుసుకొని శాంతిని పొందుము.

పిమ్మట దారుకుడు శ్రీకృష్ణునకు ప్రదక్షిణము చేసి పాదపద్మములను తన శిరస్సున ఉంచుకొని మాటిమాటికీ నమస్కరించుచూ దుఃఖించుచూ ద్వారకకు వెళ్ళాడు.

శ్రీకృష్ణ భగవానుడు వైకుంఠమునకు చేరుట

(ఈ భాగం శ్రీభాగవతం పదకొండవ స్కంధం, 31వ అధ్యాయం నుండి గ్రహించబడింది.)

శ్రీశుక మహర్షి : పరీక్షిన్మహారాజా! పిమ్మట శంకరుడు, బ్రహ్మ, పార్వతి, చంద్రుడు, సనకాదిమునులు, ప్రజాపతులు మున్నగు వారంతా శ్రీకృష్ణుని వద్దకు వచ్చారు. ఆకాశమంతా వారి విమానములతో నిండిపోయింది. అంతట భగవానుడు చిత్తమును పరమాత్మయందు నిలిపి పద్మములవంటి కన్నులు మూసుకొని, అగ్ని సంబంధమైన యోగధారణ చేత తన ధామమునకు వెళ్ళెను. సత్యము, ధర్మము, ధృతి, శ్రీ కీర్తియను గుణములన్నియూ పృథివిని వదలి శ్రీకృష్ణుని అనుసరించెను.

రాజేంద్రా! యమలోకము నుండి గురుపుత్రుని తీసుకొని వచ్చి మరల తల్లిదండ్రుల వద్దకు జేర్చెను. బ్రహ్మాస్త్రం చేత మృతుడవైన నిన్ను కాపాడి రక్షించినాడు. అంతటి సమర్థుడైన భగవానుడు తన్ను తాను రక్షించుకొనలేడా? సృష్టి స్థితి లయ కారుడైన భగవానుడు మానవదేహములో చేయదలచిన పనులన్నీ పూర్తి అయినవని తలచి మానవదేహమును ఉపసంహరించుకొనెను. ఎవరు ప్రాతఃకాలానే లేచి శ్రీకృష్ణుని యీ దివ్య ప్రయాణాన్ని కీర్తించెదరో అట్టివారు అత్యుత్తమ గతిని పొందెదరు.

రాజా! కృష్ణుని సారథియైన దారుకుడు ద్వారకకు తిరిగివచ్చి వసుదేవ, ఉగ్రసేనుల పాదములను కన్నీళ్ళతో తడుపుచూ, యాదవుల మరణము, బలరాముని నిర్యాణము, శ్రీకృష్ణుని నిర్యాణములను వివరించెను.

పిమ్మట బలరాముని భార్యలు, ఆయన దేహమును, వసుదేవుని భార్యలు వసుదేవుని దేహమును, శ్రీకృష్ణుని కోడళ్ళు, ఆయన కొడుకుల దేహములను ఆలింగనము చేసికొని చితిపేర్చుకొని అగ్నియందు ప్రవేశించిరి. రుక్మిణీ దేవి మున్నగు శ్రీకృష్ణుని పత్నులు అగ్నిలో ప్రవేశించిరి.

ఈ విషాదమునంతయు చూచిన అర్జునుడు దుఃఖ సముద్రమున మునిగిపోయెను. పిమ్మట కురుక్షేత్రమందు శ్రీకృష్ణుడు బోధించిన ఉపదేశమును గుర్తు చేసికొని తన్ను తాను ఓదార్చుకొనెను. మరణించిన వారికి ఔర్ధ్వదైహిక శ్రాద్ధ క్రియలు జరిపించెను.

రాజా! శ్రీకృష్ణుడు ద్వారకను విడువగనే, ఆయన నివసించిన ప్రదేశములను మినహాయించి, మిగిలిన ద్వారకనంతయు సముద్రుడు ముంచి వేసెను. చనిపోగా మిగిలిన బాలురు, వృద్ధులను, అర్జునుడు ఇంద్రప్రస్థమునకు తీసుకొనిపోయి తన సంరక్షణయందుంచుకొనెను. అనిరుద్ధుని కుమారుడగు వజ్రుని రాజుగా జేసెను.

దేవదేవుడైన శ్రీకృష్ణభగవానుని లీలలను జన్మ విశేషాలను శ్రద్ధాసక్తులతో కీర్తించువారు ఉపద్రవములనుండి రక్షితులై ముక్తిని పొందెదరు.

ఓం శాంతి శాంతి శాంతిః